కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 14

ఆనుశాసనిక పర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ శలాక రఘునాథశర్మ
శ్రీ ముదివర్తి కొండమాచార్యులు
డా॥ యం.కులశేఖరరావు

ప్రధానసంపాదకుడు
డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Anusasanika parvamu of Tikkana Somayaji
Vol. XIV.

Commentary by
Dr. Tummapudi Koteswara Rao - 1,2 Cantos
Dr. Salaka Raghunatha Sarma - 3,4 Cantos
Sri Mudivarthi Kondamacharyulu, Dr. M. Kulasekhara Rao - 5th Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.613
First Edition : August 2006

Second Edition: 2013
Copies : 5,000

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వైయస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్‌సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్-ఇన్-చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

ఆంధ్రమహాభారతంలో ఆనుశాసనిక పర్వం పదమూడవ పర్వం. ఇది మహాభారతవ్యాఖ్యానసంపుటాల్లో పదునాల్గవది. శాంతి పర్వంలో కథా వస్తువు ధర్మ వివేచన. అది ఈ పర్వంలోను ధారావాహికంగా ముందుకు సాగుతుంది. భీష్ముడు కురుక్షేత్ర సంగ్రామంలో పదిరోజులు చెలరేగి శత్రుసంహారం చేసి, ఆవల శరతల్పమున పవళించి శరీరత్యాగానికి ఉత్తరాయణ పుణ్యకాలానికై ఎదురుచూస్తూ తాను అవగాహన చేసుకొనిన ధర్మసూక్ష్మాలను ముందుతరం వారికై ధర్మరాజుకు ఉపదేశం చేయడం ఈ పర్వంలోని వృత్తాంతం. ఇది అయిదు ఆశ్వాసాలలో సాగిన కథనం అనడం కంటే ధర్మవిశ్లేషణ, ధర్మ సూక్ష్మ వివరణలకు ఆకరం అనడం బాగుంటుంది. ఈ పర్వంలో కథా కథనం కంటే ప్రశ్న ప్రతివచనాల మూలంగా పలు ధార్మిక విషయాలు తేటతెల్లంగా తెలుపబడ్డాయి.

ఈ ఆనుశాసనిక పర్వంలోని ఐదు ఆశ్వాసాలకు వ్యాఖ్యాతలు నలుగురు. వీరు తిక్కన హృదయాన్ని ఆకళింపు చేసుకొన్న పెద్దలే. డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు, డా॥ శలాక రఘునాథశర్మ, డా॥ ఎమ్. కులశేఖరరావు, శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యుల వారు – వీరంతా ఎంతో ప్రతిభాపాటవాలతో కూడిన పాండిత్య ప్రకర్షతో ఈ పర్వానికి వ్యాఖ్యానాన్ని సమకూర్చారు. దేవస్థానం తరపున వీరికి అభినందనలు తెలుపుతున్నాను. ఈ సంపుటానికి ప్రధాన సంపాదకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు. వీరికి మా శుభాభినందనలు.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం – ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో – అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు – రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 –' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి – ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది;

'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) – అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' – అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నందూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ – భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట– ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో

సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో – సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయతల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను."

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి– వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్వురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో – 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ" కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశా స్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము – మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశా స్త్రిగారి గృహంలో 1991 జులై 3వ తేదీన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక"ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యవంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం– అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు – వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన – కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉట్టంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య – ఆ యా రచయితలు వ్రాసి పంపనందున – దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం – సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing) లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పంద్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) – అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	**శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు**
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	**డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య**
డా॥ కె.జె. కృష్ణమూర్తి	**డా॥ కే. సర్వోత్తమరావు**

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	**డా॥ బిరుదురాజు రామరాజు**
అన్నమాచార్యప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే.	**డా॥ ఎం. కులశేఖరరావు**
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	**డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు**
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమ సంపుటం– ఆదిపర్వం

(రెండు భాగాలు), ద్వితీయ సంపుటం – సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి.సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్., గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణ ప్రణాళికను ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది, సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2 భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యాన సహిత ప్రకటనా ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాల లోపల యుద్ధపంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగుచూడాలనీ నిర్ణయించడం జరిగింది. 2004 కృష్ణాపుష్కరాల సమయంలో ఉద్యోగ, భీష్మ, ద్రోణపర్వాలు వెలువడ్డాయి. తరువాత కర్ణపర్వం ఒక సంపుటంగాను, తరువాతి పర్వాలైన శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు మూడింటిని కలిపి ఒకే సంపుటంగాను, శాంతి పర్వాన్ని రెండు సంపుటాలుగాను ముద్రించాము. ఇవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారి చేతులమీదుగా విడుదల అయ్యాయి. ఆ తరువాత అనుశాసనికపర్వం (ఐదు ఆశ్వాసాలు) ఒక సంపుటంగాను, మిగిలిన ఐదుపర్వాలను (అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థాన, స్వర్గారోహణపర్వాలు) ఒక సంపుటంగాను ప్రచురించాలని నిర్ధారణచేసి త్వరితగతిని ఉపక్రమించినప్పటికి అనుకోని ఆటంకాలు ఏర్పడి జాప్యం జరిగిన సంగతి నిజం. అపుడు మనలను ఆదుకున్నవారు ఎడిటోరియల్‌సెల్‌లో సభ్యులైన శ్రీముదివర్తి కొండమాచార్యులువారు. ఆయన కష్టపడి కునుకువేయక తుదిమెరుగుల వరకు పనిచేసి ఇస్తేకాని గట్టు ఎక్కలేకపోయాము.

ఈ మధ్యకాలంలో అంటే మహాభారత వ్యాఖ్యాన ప్రచురణ యజ్ఞం చివరిదశలో ఉండగా సంచాలకులైన సప్తగిరి సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తిగారు పదవీ విరమణ చేయడం జరిగింది. 1994 సం॥లో సప్తగిరి సంపాదకుడిగా పదవి స్వీకరించిన నాటినుండి మహాభారత వ్యాఖ్యాన ప్రచురణ భారాన్ని భుజానవేసుకొని సమర్థంగా అన్ని ఆటంకాలను అధిరోహించి ఆంధ్రదేశం గర్వించతగ్గ ఒక మహా గ్రంథాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ఆయన చేసిన కృషి అభినందనీయము.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి అధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. లోగడ తి.తి.దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వున్న శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహానికి కృతజ్ఞతాభివందనాలు. ఈ మహాగ్రంథం పూర్తిగా వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.పి.వి.ఎన్. శర్మ

ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి సాహిత్య ప్రియులూ ఐన శ్రీ ఎన్.ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్., గారు మరింత ప్రోత్సాహం ఇచ్చి ప్రాజెక్టు పనిని వేగవంతం చేశారు. దీనికోసం ప్రతిరోజు నిరంతరాయంగ పని జరిగేటట్లు చూడడమే కాకుండ వారానికొక 'నివేదిక'ను అడిగి తగు మార్గదర్శనాన్ని చేసినవారు ఆయన. వారికి గౌరవాదరాలతో కృతజ్ఞతలు తెలుపటానికి సంతోషిస్తున్నాము.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన శ్రీ కె.రాంపుల్లారెడ్డి, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి– వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన– వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారికి– నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉప సంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆమేరకు పండితవరేణ్యులు డా॥ కే. సర్వోత్తమరావు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం అద్వితీయమై మరువరానిది. వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో వీరు పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే తక్కిన పర్వాలను త్వరితంగా గుణాత్మకంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖ పాత్ర వహించిన కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దికకృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు ఉప–సంపాదకులు డాక్టర్ కే.రాధారమణ, డాక్టర్ అల్లాడి సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ ఉప–సంపాదకులు శ్రీ బి.ఎన్.శ్రీనివాసన్‌గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగసుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ.జి.వెంకటేశ్వరరావుగారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూఉన్న ఈ 'వ్యాఖ్యానసహిత

కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

సి.శైలకుమార్
కన్వీనర్
సంపాదకుడు – సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
ఆను.	–	ఆనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభవిక్రీడితం
శా.	–	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

ఇ

పీఠిక

[**పీఠిక - విషయసూచిక :** (1) ముగ్గురు మహాపురుషులు - పు.1* (2) ధర్మజుడు జిజ్ఞాసువే కాని ముముక్షువుకాడు - పు.2* (3) పర్వ ప్రబంధ ధ్వని - పు.2* (4) పర్వ పరిమాణం పు.3.* (5) ధర్మజుడి చిత్తపరిపాకాన్ని పెంచిన దానధర్మాల ప్రశస్తి - పు.4* (6) ఉత్తమ ధర్మ నిర్దేశం పర్వవస్తు ప్రత్యేకత - పు. 5* (7) తిక్కన చేసిన సంగ్రహరచన - పు 7* (8) సంవాదాలు: ఉపాఖ్యానాలు- పు. 7* (9) సంవాదరచనా శిల్పం - పు. 8* (10) ఉపాఖ్యాన రచనా వైభవం - పు. 10* (11) భీష్మ నిర్యాణం- పు. 16* (12) హరిహరనాథతత్త్వం- పు. 18* (13) కవిత్రయమహాభారతం: వ్యాఖ్యానం - పు.36* (14) కథాసారం - పు.38*]

తే. 'దేవదేవ! జీవాత్మక! దేవవంద్య!
శంఖచక్ర గదాపద్మ చారుహస్త!
వాసుదేవ! త్రివిక్రమ! వరద! పరమ
పురుష! ప్రణుతి యొనర్చెదఁ గరుణఁ జూడు!' (అను.5.461)

1. ముగ్గురు మహాపురుషులు :

కురుక్షేత్రంలో మహాయుద్ధం ముగిసింది. మహాజ్ఞాన యజ్ఞం మొదలయింది. దేవర్షులు, మహర్షులు, మహీపతులు, మేధావులు, జిజ్ఞాసువులు అసంఖ్యాకంగా గుమిగూడి శాంతనవుడు ప్రబోధించే ప్రజ్ఞాపూర్వక వాక్యాలను వాఙ్మయ వేదాలుగా వింటున్నారు. ఆ విజ్ఞాన పరిషత్తులో త్రేతాగ్నులవలె వెలుగుతున్నారు ముగ్గురు మహాపురుషులు. ఆ ముగ్గురూ మూడు ప్రవృత్తులకు ముచ్చటైన ప్రతినిధులవలె ప్రకాశిస్తున్నారు.

అంపశయ్యమీద పరున్న కురువృద్ధుడు భీష్ముడు - ఆచార్య (బోధక) స్థానీయుడు, మరొకడు జ్ఞానపిపాసతో ప్రశ్న లడుగుతున్నాడు. జిజ్ఞాసువు ధర్మరాజు సాధన స్థానీయుడు. ఇంకొకడు పరమాత్మ స్వరూపుడు శ్రీకృష్ణుడు - సర్వజ్ఞుడు. సర్వసాక్షీభూతుడు. భీష్ముడు కర్మయోగి. అపూర్వ సాహసి. తాను చేపట్టిన ప్రతిజ్ఞయే, పరమధర్మమని భావించే పట్టుదల కలవాడు. గురుభక్తి, దైవభక్తి కలవాడైనా యుద్ధప్రియుడు. అపార విజ్ఞానఖని. తండ్రి కొరకు భీష్మ ప్రతిజ్ఞలు చేసి అతడి దయవలన తాను కోరుకొన్నప్పుడే చనిపోయే 'ఇచ్ఛామరణ'మనే అపూర్వ వరాన్ని పొందినవాడు. శిఖండితో యుద్ధం చేయనన్న వ్రతంతో యుద్ధంలో అర్జునుడు తన శరీరంలో నింపిన బాణాలను శయ్యగా ఏర్పరచుకొన్న యోగి. ఉత్తరాయణకాలం వచ్చేంతవరకు తనువును బాణశయ్యపై ఉంచుకొని జీవించిన ఘోరకర్మశీలి. అతడు చనిపోతే సమకాలీన జ్ఞానకోశం ఒకటి కనుమరుగైపోయినట్లే అని శ్రీకృష్ణాదులు భావించి, అతడి చేత ధర్మరాజునకు ధర్మనీతి బోధలు చేయించారు. భీష్ముడు ధర్మరాజునకు తగిన గురువు. ఆ గురువుకు తగిన శిష్యుడు ధర్మరాజు. ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేంతవరకు అంపశయ్యమీద ఒంటిగా యోగవృత్తిలో ఉండాలని అనుకొన్న కర్మయోగి లక్షణం - అతడిలో పురుషకారప్రవృత్తికి గల ప్రాధాన్యాన్ని తెలుపుతుంది. భీష్ముడు పురుషకారానికి ఇచ్చిన ప్రాముఖ్యాన్ని దైవానుకూల్యానికి ఇచ్చినట్లు కానరాడు. అందువలననే జీవితంలో అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తిన్నాడు. శ్రీకృష్ణుడి కరుణకొరకు భక్తితో ప్రార్థనలు చేసిన ఘట్టాలు కూడా కనపడతాయి. హస్తినాపుర సింహాసన రక్షణకే అంకితమైపోయి కౌరవుల పక్షాన యుద్ధం చేసిన రణకర్మశూరుడు అతడు. ప్రవృత్తి విద్యకు సంబంధించిన విజ్ఞానం అపారంగా గడించి, నివృత్తి జ్ఞాన సంస్కారాన్ని పండించుకొన్న పండితుడు అతడు.

అతడికి మోక్షకాంక్ష ఉన్నట్లు లేదు. ధర్మకర్మనిర్వహణ వలన కలిగే సహజ స్వర్గసుఖమే అతడు కోరుకొన్నాడు. అతడు నేర్చిన విజ్ఞానమే ధర్మజుడికి సజాతీయంగా ఉంటుందని వాసుదేవుడు భావించి భీష్ముడి ప్రబోధానికి శ్రోతగా అతడిని నియోగించాడు.

భీష్ముడు ఇప్పటికే ధర్మరాజుకు శాంతిపర్వ విశేషాలను వినిపించాడు. అందులో ప్రధానంగా రాజధర్మాలూ, ఆపద్ధర్మాలూ వినిపించిన తరువాత వేటిని తెలిసికొంటే సర్వజ్ఞానసంపన్ను లౌతారో అటువంటి మోక్షధర్మాలను కూడా వినిపించి అతడి జ్ఞానతృష్ణను తీర్చటానికి యత్నించాడు. కాని అన్నీ విన్న ధర్మరాజుకు బంధుజన సంహారం వలన కలిగిన పాపభీతివలన మనశ్శాంతి కుదరలేదు. మరల విషాదాన్ని ప్రకటించాడు. భీష్ముడు సర్వధర్మ నిశ్చయ జ్ఞానం కలిగే విశేషాలూ, దానవిధులు, తీర్థసేవలూ, ఆచారవిధులు మొదలైన అంశాలు వివరించి చెప్పి, ధృతరాష్ట్రాదులకు హితవు పలికి, ఉత్తరాయణపుణ్యకాలం వచ్చిన తరువాత స్వర్గస్థ డయ్యాడు. ఈ ధర్మాలు చెప్పే భాగంగా ఆనుశాసనికపర్వం మహాభారతంలో పదమూడవపర్వంగా ఒప్పారుతున్నది.

2. ధర్మజుడు జిజ్ఞాసువే కాని ముముక్షువు కాడు :

కొందరు ఆనుశాసనిక పర్వాన్ని శాంతిపర్వంలో భాగంగానే పరిగణిస్తారు. కాని, దీనిని ప్రత్యేక పర్వంగా పరిగణించటమే వ్యాసహృదయం. అయితే, శాంతిపర్వంలో మోక్షధర్మాలను అడిగి తెలిసికొన్న ధర్మరాజు మరల ఈ పర్వంలోని లౌకికధర్మాలను, వర్ణాశ్రమ ధర్మాలను, దాన తీర్థాది విశేషాలను విరివిగా అడిగి తెలిసికొనటంలోని తాత్పర్యమేమై ఉంటుందని కొందరు విచారించారు. అడిగింది ధర్మరాజు కాబట్టి, ఆ ప్రశ్నల వెనుక అతడి చిత్తవృత్తి, వ్యక్తిత్వ స్వభావాలు ఎక్కువగా ప్రతిఫలిస్తాయి. ధర్మజుడు ముముక్షువయితే లౌకికధర్మాలమీద, ప్రవృత్తి ధర్మాలమీదా అనురక్తి ఎక్కువగా ఉండేది కాదు. అతడు మౌలికంగా కర్మయోగి. పుణ్యవ్రతశీలి, ధర్మనీతి వర్తనుడు కాబట్టి అతడు వినే మోక్షధర్మాలన్నీ వ్యుత్పత్తిని మాత్రం కలిగిస్తాయనీ, అతడి సహజ ధర్మప్రవృత్తి లౌకిక ధర్మాలయందే రమిస్తుందనీ పండితులు భావించారు. ఉదాహరణకు శ్రీయల్లంరాజు శ్రీనివాసరావుగారి మాటలు కొన్ని గమనిద్దాం. "మోక్షధర్మాలు శ్రవణం చేసినా జిజ్ఞాసువై చేశాడేకాని, ముముక్షువై చేయలేదు ధర్మరాజు. అంచేత అది జీవిత లక్ష్యంగా పెట్టుకోలే దాయన. పెట్టుకొన్న జీవితలక్ష్యం ధర్మమే. ధర్మం తప్పకుండా నడవడమే సర్వస్వ మాయనకు. అందుకే దానిఫల మేదో అదే అనుభవానికి వచ్చింది. ఏమిటి ధర్మాచరణకు ఫలం? స్వర్గం. స్వర్గమే ప్రాప్తించింది గాని ధర్మరాజుకు మోక్షం కాదు. మహాప్రస్థానం చేసి పరివ్రాజకుడై చివర కాయన గడించింది స్వర్గఫలమే. స్వర్గారోహణంతోనే పరిసమాప్తమయింది జీవితయాత్ర. ఆయన జీవితమే కాదు. ఆ మాటకు వస్తే భారతవీరులందరి జీవితాలూ అంతే'' (మహాభారత వైభవము - పుట 485) అందువలన శాంతిపర్వంలోగాని, ఆనుశాసనిక పర్వంలోగాని ధర్మరాజు సహజంగా రమించేది మోక్షధర్మాలు కావు. ప్రవృత్తి ధర్మాలే. అందుకే ఆనుశాసనికపర్వం లోకధర్మ విజ్ఞానసర్వస్వంగా వెలువడింది. ఇందులో మోక్షధర్మ ప్రసక్తికూడా ఉన్నది. అది విన్న తరువాత కూడా ధర్మరాజుకు శాంతి కలుగలేదు. తేలిన తాత్పర్య మేమిటంటే - చెప్పిన వక్త ముముక్షువు కాడు. విన్న శ్రోత కూడా ముముక్షువు కాడు. శాంత్యనుశాసనిక పర్వాలలోని ప్రబోధమంతా ధర్మరాజులో శాస్త్రజ్ఞానంగా వెల్లివిరిసిందే కాని, ప్రజ్ఞానంలో అనుభవజ్ఞానంగా పల్లవించలేదు.

3. పర్వప్రబంధధ్వని:

స్థూలంగా పరిశీలిస్తే శాంతిపర్వంలోని ధర్మాల కథనానికీ, ఆనుశాసనిక పర్వంలోని ధర్మాల కథనానికీ భేదం కొంత కానవస్తుంది. శాంతిపర్వంలోని ధర్మాలు విశ్వజనీనంగా ధర్మపరులైన రాజులందరికీ పనికివచ్చే సామాన్య ధర్మాలుగా గోచరిస్తాయి. ఆనుశాసనికపర్వంలోనివి విశేషధర్మాలవలె స్ఫురిస్తాయి. ఎట్లాగంటే - ఒకరాజు ప్రజాపాలన చేస్తున్నపుడు అతడు ధర్మాసనం మీద కూర్చుండి చెప్పవలసిన తీరులు ఎన్నో ఉంటాయి. ప్రజల జీవన విధానంలో అనుశాసించ వలసిన లౌకికధర్మాచరణ పద్ధతులు మరెన్నో ఉంటాయి. మరొక విధంగా చెప్పాలంటే - నిత్యజీవితంలో రాజు ప్రజల సమస్యలపై ఇవ్వవలసిన ధార్మికమైన న్యాయబద్ధమైన, సాంస్కృతికమైన తీర్పులకు సంబంధించిన విషయాలు ఎన్నో ఉంటాయి. వాటికి సంబంధించిన అనుశాసనాలను ధర్మరాజు ఈ పర్వంలో తెలిసికొన్నాడని స్పష్టమౌతుంది.

దీనివలన కథాపరమైన ప్రయోజనం కూడా ఏర్పడింది. ధర్మరాజు ప్రభువైన తరువాత చేసిన ప్రజాపరిపాలన విశేషాలను గురించికాని, తీర్చిన ప్రజల న్యాయ, ధర్మ సమస్యలను గురించిగాని, ఏర్పడిన ధర్మసంఘర్షణలు, ధర్మసంశయాలు, వాటి నివారణల గురించిన వివరాలుగాని, కథాసందర్భాలుగాని ప్రధానేతివృత్తంతో మనకు కానరావు. వాటన్నిటికి బదులు ఆనుశాసనిక పర్వంలో ధర్మరాజు అడిగిన ప్రశ్నలే సమస్యల పరిష్కారాలుగా సూచింపబడ్డాయి. హస్తినాపుర సింహాసనం రక్షణతోపాటు, హస్తినాపురంలోని ధర్మరక్షణకు తోడ్పడే అనుశాసనాన్ని అందించి భీష్ముడు ధర్మసంప్రదాయ పరిరక్షకుడైనాడు. భీష్మానుశాసనాన్ని తన పరిపాలనలో రాజానుశాసనంగా ధర్మజుడు ప్రవర్తిల్లచేసికొన్నాడు అన్నది ఈ పర్వంలో అందించే ప్రబంధధ్వనిగా గ్రహించవచ్చును.

4. పర్వ పరిమాణం:

ఆనుశాసనికపర్వం పన్నెండువేల శ్లోకాల పరిమాణం కలిగిందని నన్నయ పర్వసంగ్రహపర్వంలో పేర్కొన్నాడు. కాని, చిత్రశాల ప్రతిలో ఎనిమిదివేల శ్లోకాలే ఉన్నాయి. భండార్కరుసంస్థవారి ప్రతిలో 6700 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. అయితే, పి.పి.యస్.శాస్త్రి ప్రతిలో మాత్రం 12వేల శ్లోకాలని పేర్కొనబడింది. కాబట్టి నన్నయాదులు ఉత్తరాది ప్రతులకంటె దాక్షిణాత్య ప్రతులనే అనుసరించారని, వీటిలో దాదాపు నాలుగువేల శ్లోకాలు ప్రత్యక్షంగా చేరి ఉన్నాయని స్పష్టమౌతున్నది. ఉదాహరణకు ఆంధ్రమహాభారతంలోని ఆనుశాసనికపర్వంలోని చతుర్థాశ్వాసంలో హరసంపత్కుమారపర్వం ఉత్తరాదిప్రతులలో కానరాదు. ఇట్లాగే గోవులను గూర్చి బ్రాహ్మణమాహాత్మ్యాన్ని గురించి చెప్పిన అంశాలు తెలుగులో విస్తారంగా చేరాయి. సంస్కృత భారతంలో ఆనుశాసనికపర్వంలో 146 అధ్యాయాలు ఉన్నట్లు చిత్రశాలా ప్రతిలో ఉండగా అది 168 అధ్యాయాల గ్రంథంగా విస్తరించింది. ఆయాకాలాలలో ప్రజలు జీవిత ధర్మాలలో వస్తున్న పరిణామాలను, అప్పటి అవసరాలను అనుసరించి, ఈ పర్వంలో లౌకిక ధర్మాలను గురించిన అనేకాంశాలు చేర్పబడుతూ ఉండి ఉండవచ్చును. పంచమవేదంలో చెప్పబడిన ధార్మికాంశాలను అనుశాసనాలుగా ప్రామాణికాలుగా భావించడం ఈ విస్తృతికి కారణం కావచ్చును.

ప్రక్షిప్తాలుగా భావించబడే అంశాలమీద కొందరు విమర్శకులకు ఉదాత్తమైన అభిప్రాయం కూడా లేదు."ఇట్లు చేర్చబడిన యంశము లన్నియు ఉదాత్తములైనవి, కథాహితము లైనవి అని చెప్పుటకు వీలులేదు. అవి కొన్ని మిక్కిలి పేలవములు. శిశుప్రాయములు. ఉదాహరణకు పిత్రుకార్యములందు ఉపానత్తులు, ఛత్రము ఈయవలెనని చెప్పుదురు. దీని భావ మేమని ధర్మరాజు అడుగును. వృద్ధుడగు గాంగేయుడు శ్రద్ధతో సమాధానము చెప్పును. సర్వసర్వంసహా చక్రవర్తి యగు పాండవాగ్రజు డిట్టి చొప్పదంటు ప్రశ్న వేసె నేమి? యని పైకి అనిపించును. పంచమవేదమునందు వివరించవలసిన యంశమేనా ఇది? యని తోచును. మహాభారతము కేవలము కథాకావ్యము కాదు. అది ప్రాచీన విజ్ఞాన సర్వస్వము. మానవ నాగరకతా యాత్రయందలి మజిలీలన్నియు దానియందు వింతగా పరిస్ఫురించును. ఒకప్పుడు మానవునకు ఉపానత్తులు - పాదరక్షలు లేక చెప్పులు, గొడుగు - వీని ప్రయోజనము తెలియకుండెను. ఎండకును, చలికిని అతడు బాధపడుచుండెను. ప్రాచీన సంఘమందలి యొక బుద్ధిమంతుడు చెప్పులు, గొడుగు - వీనిని బుద్ధికుశలతచే కల్పించగల్గెను. ప్రాక్తన మానవుని దృష్టిలో ఇది యొక అద్భుతకల్పనమేకదా! అతడు సంతోషము చెంది దాని కొక కథారూపమును కల్పించినాడు. ఆ కథయు మహాభారతమున కందమే అయినది. (చూడు కథాసారం. ప్రశ్న 60కి ఉత్తరం - సూర్యజమదగ్ని సంవాదం అనే ఇతిహాసం)... ఇది పసిబాలురకు చెప్పవలసిన 'అనగనగా' కథవంటిది అయినను విపులముగా పరిశీలించినచో ప్రాచీన సంఘము యొక్క సంస్కృతి విశేషములు దీనియందు గోచరించును. ప్రాచీన మహర్షులు వీరవ్రతులు. వారు శరాసన విద్యను చక్కగా నేర్చుచుండిరి. జనసమ్మర్దము లేని మైదానమునందు వారు అస్త్రసాధన చేయుచుండిరి. కర్ణుడు దీనికి భిన్నముగా ప్రవర్తించి ఒక బ్రాహ్మణుని గోవును బాణముతో కొట్టుటచే శాపగ్రస్తు డాయెను. రాజులవలె మహర్షులు సంపన్నులు కాకపోవుటచే వారికి పరివారము లేకుండెను. జమదగ్నికి అతని కుటుంబమే పరివారము. ఆమె యాతని యమ్ములపొదులను మోసి తెచ్చెను. దూరమున పడిన బాణములను ఏరి తెచ్చుచుండెడిది. తపోనిష్ఠులయ్యును మునిజనులు తమ స్త్రీ జనమునందు అనురాగము కలిగి యుండిరి. ఎండనుండియు, అమితమైన చలినుండియు తనదేహమును కాపాడుకొనుట ప్రాచీన మానవునకు ఒక

సమస్యగానే యుండెను. చెట్టు నీడ నిచ్చుటను అతడు చూచెను. చెట్టును మోసికొని పోకుండ నీడను వెంటగొని పోవుటెట్లు? అనునది కొంతకాలము మానవునకు సమస్యగానే యుండెను. బుద్ధిశాలి యొక్కడు గొడుగు కల్పించెను. ఇది నేడు మనకు అత్యంత పరిచితమైన వస్తువగుటచే అద్భుతమును గొల్పదు. దానిని ఇతివృత్తముగా చేసిన కథ ఈ కాలమున వెలువడదు. అట్లే చెప్పులును, పాదములకు శీతాతపములు సోకకుండుటకై రక్షణ అవసర మనిపించెను. నేర్పరియైన మానవుడు శుష్కకాష్ఠమును, చర్మమును శీతోష్ణవాహకములు కావని (నాన్ కండక్టర్స్) కొంతకాలమునకు కనిపెట్టెను. మొదట ఎండుకట్టెతో పావకోళ్ళు నిర్మించుకొనెను. సన్న్యాసులు పావకోళ్ళనే ధరింతురు. వివాహాదులయందు కూడ వీనినే ధరింప చేయుదురు. కావున కట్టెతో నిర్మించిన పాదరక్షలే మొదటి దశయని చెప్పవలెను. చర్మ నిర్మితమైన పాదరక్షలు ఎక్కువ సుఖకరము లైనను తోలు అంటుటకు మహర్షులంతగా సమ్మతించి యుండరు. చర్మకాష్ఠములు విద్యుద్వాహకములు కూడ కావని ఇటీవల శాస్త్రజ్ఞులు కనిపెట్టినారు. మహాభారతమునందు సూర్య జమదగ్ని సంవాదమువంటి చిట్టి కథలును కలవు. అహింసాతత్త్వ బోధకమైన సక్తుప్రస్థుని వృత్తాంతమువంటి గొప్పకథలును కలవు. అందుచేతనే మహాభారతము విశ్వజనీనమని నన్నయభట్టు ఉచితముగ ప్రశంసించెను (ఆది. 1.32)'' - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనము - (ఆనుశాసనికపర్వ పీఠిక -(ఉస్మానియాప్రతి). పుట.11-12)

5. ధర్మజుడి చిత్తపరిపాకాన్ని పెంచిన దానధర్మాల ప్రశస్తి:

ఆనుశాసనికపర్వంలో దాదాపు మూడవవంతు ప్రశ్నలు దానధర్మాలను గురించి తెలుసుకొనటానికి ధర్మరాజు అడిగాడు. (చూడు. వివరాలకు కథాసారంలో ప్రశ్నోత్తరాల సంఖ్యలు : 21-25; 40-50; 54, 59, 60, 63, 64, 77, 80 మొదలుగునవి). దానితో ఈ పర్వం దానధర్మాలకు ప్రాధాన్య మున్నదానిగా భావించటం కొంతమందికి పరిపాటి అయిపోయింది కూడా. అయితే అట్టి దానధర్మప్రబోధం సార్థకమని భావించే పండితులే ఎక్కువమంది కనపడతారు. వారందరి అభిప్రాయాలకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. శ్రీ యల్లంరాజు శ్రీనివాసరావుగారి మాటలు "భారతానుశాసనిక పర్వంలో భీష్ముడు దానా లెన్ని ఉన్నవో అన్నీ ఏకరువు పెడతాడు. గోదానమే కాదు, భూదానమే గాదు, హిరణ్యదానమే గాదు, మాషయవగోధూమ తండులాది దానాలే కాదు. తుదకు పాదుకాఛత్ర చామరాది దానాలే కాదు, ఏదంటే అది. ఎవ రడిగితే వారికి ఆఖరుకు శిబిచక్రవర్తి లాగా - దధీచిలాగా తన ప్రాణా లడిగినా దానం చేయవలసి వస్తుంది. భౌతికంగా ఇవన్నీ చేయాలని చేస్తేనే గొప్ప అనీ కాదు మన మర్థం చేసుకోవలసింది. అలా చేసే బుద్ధీ, సంసిద్ధతా - కలిగి ఉండాలి మానవుడు, క్రియ గాదు, బుద్ధి, అంతరమైన ఆ బుద్ధికి బాహ్యమైన ప్రతీకలే భీష్ముడు వర్ణించిన కథలన్నీ. అన్నీ ఈ సిద్ధాంతాని కుదాహరణలే. నిజంగా ఆ కథలలో చెప్పిన వన్నీ జరిగాయనీ, చేశాయనీ, అలాగే జరగాలనీ కాదు. చారిత్రకంగా జరిగితే జరగవచ్చు. లేకుంటే లేదు. మానసికంగా అలవరచుకోవలసిన ఒకానొక భావన ఇది. త్యాగభావన త్యాగక్రియ గాదు. ద్రవ్యత్యాగంతో నిమిత్తం లేదు. త్యాగభావ ముంటే జ్ఞానికి పూచికపుల్ల అయినా సరే. ఇది నా దగ్గర ఉంటే బాగుంటుందనుకొంటే ఆమేర కది బంధమే మానవుడికి. జ్ఞాన ప్రవాహానికి ప్రతిబంధమే. నిరాఘాటంగా జ్ఞానం నిలవాలంటే ఈ మమత్వబుద్ధి అనేది ఉండరాదు. అంటే అంతా 'మమే'. లేకుంటే ఏదీ 'మమ' కాదనే దృష్టి ఏర్పడాలి. ఇదీ జ్ఞానానికి పరాయణం.''

"ఇంతకూ పశ్చాత్తప్తుడైన మానవుడు గురూపసదనం చేసి, సకల ధర్మాలూ శ్రవణం చేయగలిగితే, అందులో ప్రవృత్తి ధర్మం సత్త్వాన్ని శుద్ధిచేసి, నివృత్తిరూపమైన మోక్షధర్మానికి దారితీస్తే - అది కదలకుండా నిలకడ చెంది మోక్షసుఖాన్నే మన కందివ్వటానికి త్యాగసన్న్యాస వైరాగ్యాపర పర్యాయమైన దానగుణాన్ని పూర్తిగా అలవరచుకోవాలి. అప్పుడే మనకు కలిగిన ఆత్మ జ్ఞాన మనుభవంగా మారగలదు. మారితే అదే పరిపూర్ణత జీవితానికి. ఇలాంటి పరిపూర్ణతను ప్రసాదించడానికే రాజధర్మాలు మొదలుకొని దానధర్మాలవరకూ ఈ చతుర్విధ ధర్మాలనూ ఈ వరుసలో బోధించాడు పితామహుడు.'' (మహాభారత వైభవము పుట.419-420)

ఆనుశాసనిక పర్వంలో బోధగా జాలువారిన దానధర్మసంస్కారం అశ్వమేధ పర్వంలో ధర్మరాజు అఖండ స్వర్ణదానం చేయటానికీ, చివరకు సర్వ సామ్రాజ్యాన్ని వేదవ్యాసుడికి దక్షిణగా ఇవ్వటానికీ తగిన చిత్తపరిపాకాన్ని కలిగించింది.

6. ఉత్తమ ధర్మ నిర్దేశం పర్వవస్తు ప్రత్యేకత:

ధర్మరాజు అనేక విశేషాలను, వివరాలను భీష్ముడిని అడిగి తెలిసికొంటూనే ఆయా అంశాలలో శ్రేష్ఠములైనవి, గొప్పవి, ఉత్తమములైనవి, ఏవి? అని అడగటం ఒక విశేషం. 'రత్నహారీ తు పార్థివ' అనే కాళిదాసోక్తి స్ఫురణకు వస్తుంది. లోకానికి వివిధ ధర్మాలలో వస్తుసముదాయాలలో తరతమ బేధం తెలియవస్తుంది. ఈ పర్వంలో అటువంటి ప్రశ్నలు 12కు మించే ఉండటం గమనార్హం. (వివరాలు చూడు కథాసారం, మచ్చుకు కొన్ని అంశాలు.

రాజులకు కర్తవ్యాలు ఎన్నో ఉంటాయి. కాని, వాటిలో ప్రధానకృత్యం ఏమిటి? అన్నది ధర్మరాజు ప్రశ్న. (చూడు ప్రశ్న 32) బ్రాహ్మణపూజ మూర్ధాభిషిక్తుల ప్రథమ కర్తవ్యమని భీష్ముడు చెప్పి విప్రసేవ కల్పవృక్ష సేవవంటిదని పేర్కొని, శంబరాది రాక్షసులు సైతం బ్రాహ్మణసేవవలన అపార సంపదలు గడించారని వివరించాడు.

దానాలలో గోదానం గొప్పదనీ, భూదానం ఉత్తమమనీ, ఇట్లా వివరాలన్నీ విన్న ధర్మరాజు అన్నిటికంటె గొప్పదాన మేది? అని ప్రశ్నించాడు. (ప్రశ్న 41). యాచకుడు కోరిన దానిని ప్రేమతో ఇచ్చినదాని కంటె గొప్పదానం మరొకటి లేదని భీష్ముడు ఘంటాపథంగా చెప్పాడు. దానాలను గురించి ఇన్ని విశేషాలు విన్నా అడిగిన దానిని ఇచ్చే సత్త్వగుణం దానగుణ శిఖరం.

గోవులలో కపిలగోవు గొప్పదని తెలిసికొన్న తరువాత, సమస్త లోకాలనూ సృష్టించిన బ్రహ్మలోకంకంటె గోలోకం ఉన్నతంగా ఉండటానికి కారణం అడిగాడు ధర్మరాజు. (ప్రశ్న 52) బ్రహ్మ సృష్టించిన సురభి మార్తాండుల ఇతిహాసాన్ని వినిపించి, వారికి పుట్టిన గోవులు బ్రహ్మలోకం కంటె పై భాగాన ఉండి క్షీరాల నిస్తాయని పేర్కొన్నాడు భీష్ముడు. గోమహిమలను తెలిపే ఇతిహాసాలు తెలిపాడు. (చూడు ప్రశ్న 52 సమాధాన వివరాలు)

పుణ్య తీర్థాలనుగురించి అడిగి తెలిసికొన్న ధర్మరాజు ఆ తీర్థాలన్నింటిలో ఎక్కువ పవిత్రత కలిగిన దేది? అని భీష్ముడిని ప్రశ్నించాడు. (ప్రశ్న 73 కథాసారం) భీష్ముడు భౌతిక తీర్థాలకంటె అంతస్తీర్థాలు గొప్పవని తెలిపాడు. మానస తీర్థం మేలైనది అన్నాడు. దానిపేరు 'సత్యం' అని చెప్పి, దాని విశేషాలు వివరించాడు. దమము, తపస్సు, శమము - అనే గుణాలు కూడా తీర్థాలే. భౌతిక తీర్థాలకంటె ఆధ్యాత్మికగుణాలే తీర్థాలని వివరించి నదులలో ఊరికే స్నానాలు చేసినదానికంటె, దొరకని వాటికై తాపత్రయ పడకుండా, దొరికినవాటితో తృప్తిపడి, ఆశకు దూరంగా ఉంటూ జీవించే సత్పురుషులే నిజమైన పుణ్యతీర్థా లని ప్రబోధించాడు.

విద్య, తపస్సు, దానం - ఈ మూడింటిలో ఏది గొప్పది? అని అడిగాడు ధర్మరాజు (ప్రశ్న.77). భీష్ముడు 'వ్యాసమైత్రేయ సంవాదం' అనే ఇతిహాసాన్ని వినిపించాడు. తపస్సు విద్య మొదలైన ధర్మాలన్నింటిలో దానం గొప్పదనీ, దానాలలో అన్నదానం గొప్పదని వ్యాసుడు మైత్రేయుడికి చెప్పాడు. విద్య తపస్సును వృద్ధి చేస్తుంది. తపస్సు, విద్యా, దాన మహిమతో పెంపొందుతాయి- అని వివరించాడు.

ఆచారాలను గురించి ఎన్నో వివరాలు విన్న ధర్మరాజు 'సర్వశాస్త్ర సారమైనదీ, సర్వశ్రేష్ఠమైనదీ అయిన ఆచరణ (ఆచారం) ఏది? అని భీష్ముడిని అడిగాడు. పితామహుడు 'నారదపుండరీక సంవాదం' అనే ఇతిహాసాన్ని వినిపించాడు. ఇరువది నాల్గవ తత్త్వమైన ప్రకృతికి తరువాతి తత్త్వం జీవాత్మ, అతడు సర్వభూతాల స్వరూపం అయినవాడు. అతి

వ్యవహారనామం 'నరుడు' అతివలన ఏర్పడిన తక్కిన తత్త్వాలన్నీ నారములు. అతడు నారములు స్థానంగా కలవాడు కాబట్టి నారాయణుడు. ఆ ప్రభువు విశ్వాన్ని సృష్టిస్తూ మరల తనలోనే లీనం చేసికొంటూ 'విభుడు' ఔతున్నాడు. ఆ నారాయణుడే పరబ్రహ్మం, పరతత్త్వం, పరమపదం, ఈశ్వరుడు, విష్ణువు - అనే పేర్లతో పిలువబడుతూ ఉంటాడు. అతడు వాసుదేవుడు. ఆత్మ - అనే పేర్లతో ఉపనిషత్తులు పిలుస్తాయి. ఆ పేర్లు నరుడికి కూడా వర్తిస్తాయి. సర్వశాస్త్రాల వాక్యాలనూ పరిశీలించి నిర్ణయించిన తాత్పర్యమిది. కాబట్టి ఎల్లవేళలా నారాయణుడిని స్మరించాలి. మరణకాలంలో 'నమో నారాయణాయ' అనే మంత్రాన్ని పలికితే నరులు ప్రణవానికి అర్థమైన పరమపదాన్ని పొందుతారు' అని నారదుడు చెప్పాడు. విష్ణువును సేవించుమని భీష్ముడు ధర్మరాజుకు హితవు చెప్పాడు. అదే ఉత్తమ ఆచారమని బోధించాడు.

పాపాలన్నింటినీ పారదోలే ప్రాచీన గాథను వినిపించుమని ధర్మజుడు భీష్ముడిని కోరాడు. ఆయన 'ఉమామహేశ్వర సంవాదం' అనే ఇతిహాసాన్ని వినిపించాడు. ఈ పర్వంలో ఉన్న ఇతిహాసాలన్నింటిలో పెద్దదీ, సకల పుణ్యప్రదమూ అయిన ఇతిహాస మిది.

ఆనుశాసనిక పర్వాంతంలో ధర్మరాజు ఆధ్యాత్మికమైన ప్రశ్నలను పుంఖానుపుంఖాలుగా వర్షించాడు. ఉదాహరణకు కొన్ని. దారిద్ర్యం, దుఃఖం పోగొట్టే జపం ఏది? లోకాల కన్నిటికీ మహనీయమై ఆశ్రయించి అనుభవించగల దైవం ఎవరు? అర్చనతో, స్తుతితో ఎవరిని కొలిస్తే జనులు శుభాన్ని పొందుతారు? అనేక ధర్మాలలో ఉత్తమమైన అభిమతాన్ని చూరగొనేది ఏది? జపాలన్నింటిలో ఉత్తమ జపం ఏది? తనను జపించేవారికి జన్మమూ, సంసార బంధాలను పోగొట్టేది ఏది? కర్మ యోగులకూ, ధర్మసాధకులకూ తరణోపాయాలుగా భాసించే ఈ ప్రశ్నలు ఈ పర్వానికి భరత వాక్య తుల్యాలుగా ప్రకాశిస్తూ ఉన్నాయి.

"ఓం నమో భగవతే వాసుదేవాయ, నమః పురుషోత్తమాయ, నమ స్సర్వలోక గురవే, నమ స్సర్వలోక పిత్రే, నమ స్సర్వలోక పితామహాయ, నమ స్సర్వలోక ప్రపితామహాయ, నమ స్సర్వలోకేశ్వరాయ, నమ స్సర్వలోక విశిష్టాయ, నమ స్సర్వలోకసుఖప్రదాయ, నమ స్సర్వలోక కర్త్రే, నమ స్సర్వలోక భర్త్రే, నమ స్సర్వలోక హర్త్రే, నమ స్సర్వలోక నిధయే, నమ స్సర్వలోక విధానాయ, నమ స్సర్వలోక హితాయ, నమ స్సర్వలోక హితకరాయ, నమ స్సర్వలోక ధ్రువాయ, నమ స్సర్వలోకోద్భవకరాయ, నమో విష్ణవే, ప్రభవిష్ణవే" అని జపించటమే మహాజపం.

సమస్త జగత్తులకు ప్రభువు, దేవదేవుడు, అనంతుడు, పురుషోత్తముడు అనే పేరుగలవాడి సహస్రనామాలను నిరంతరం స్తుతిస్తూ, జాగృత మనస్కుడై యజ్ఞకర్తను, అవ్యయుడైన అతడిని అర్చనం చేస్తూ అచంచల ధ్యానంతో నమస్కరిస్తూ, ఆద్యంతాలు లేని ఆ విష్ణుదేవుడిని, సర్వలోకాధ్యక్షుడిని, బ్రహ్మణ్యుడిని, త్రిలోక కీర్తి వర్ధనుడిని, సర్వ ధర్మాలూ తెలిసిన వాడిని, దయామయుడిని, లోకనాథుడిని, పంచభూతాల ఉత్పత్తికి కారకుడైన వాడిని నమ్మి భక్తితో సేవిస్తే అతడు దుఃఖాల నన్నింటినీ తొలగదోస్తాడు. పుండరీకాక్షుడిని స్తుతిస్తూ పరమభక్తితో పూజించటమే నా మతం. ధర్మరాజా! ధర్మా లన్నింటికంటే ఉత్తమధర్మం ఇదే అని తెలిసికొనుము. పరబ్రహ్మమైన ఆ విష్ణుదేవుడి సహస్రనామ సంకీర్తనం పాపాలను, భయాలను పోగొట్టుతుంది. సకల సంపదలను సమకూరుస్తుంది. 'విశ్వంబు, విష్ణుండు, వషట్కారుండు, భూతభవిష్యత్ప్రభు' మొదలైన నామాలతో మొదలుపెట్టి, 'రథాంగపాణి, అక్షోభ్యుడు, సర్వప్రహరణాయుధుడు' అనే నామాలు తుదిగాగల సహస్రనామాలను భీష్ముడు ఉపన్యసించాడు. తరతరాలుగా ఆ సహస్రనామాలు ప్రసిద్ధి కెక్కాయని తెలిపాడు. విష్ణు సహస్రనామాలను నిత్యం పఠించిన మనుష్యుడు ఇహపరశుభాలను పొందుతాడు. చతుర్వర్ణాలవారికీ బహువిధలాభాలు కలుగుతాయి. చతుర్విధ పురుషార్థ ఫలసిద్ధి కలుగుతుంది. సర్వవిధాల అరిష్టాలకూ, దుఃఖాలకూ దూరమై పరమపదం పొందుతాడు. విష్ణువొక్కడే మహాభూతం, భూతము లెన్ని ఉన్నా త్రిలోక వ్యాప్తుడుగా విస్తరించి ఈ విశ్వాన్ని అనుభవిస్తాడు. ధర్మరాజా! వ్యాసవిరచితమైన విష్ణుసహస్రనామాలను పఠించి శుభాలు, సుఖాలు అనుభవించుమని బోధించాడు.

ధర్మరాజు అడిగిన ప్రశ్నలు గమనిస్తే - అవి ఒక వ్యక్తికి కలిగిన సంశయాలుగా మాత్రమే కాకుండా ఒక సమాజంలో జీవనయాత్ర సాగిస్తున్న మానవులు ఎదుర్కొంటున్న వివిధ ధార్మిక జీవన సమస్యల సమాహారంగా గోచరిస్తాయి. ధర్మరాజు ఒక వ్యక్తిగా గాక ఒక సమాజానికి జిజ్ఞాసువైన ప్రతినిధిగా గోచరిస్తాడు. అందుకే ఈ పర్వం విశ్వజనీనంగా పరిగణించబడుతుంది.

7. తిక్కన చేసిన సంగ్రహ రచన:

ఆనుశాసనిక పర్వంలో తిక్కన సోమయాజి పాటించిన రచనా ప్రణాళికను గురించి ప్రసిద్ధ విమర్శకులు కీ॥శే॥ కురుగంటి సీతారామయ్యగారు చెప్పిన మాటలు గమనార్హాలు. "తిక్కన భారతమును, యథామాతృకముగా భాషాంతరీకరించలేదని మీ కిదివరకే తెలియును. తిక్కన యొక్కడే కాదు నన్నయ కూడ తన యిచ్ఛవచ్చినట్లు కుదించుట, పెంచుట చేసెను. సంస్కృతమునకుఁ జేయు భాషాంతరీకరణమునందును దెనుఁగులోఁ జేయునది సరియై, మాతృక ననుసరించిన యెడలఁ దప్పక మాతృక కంటె విస్తరించు ననుట నిజము. తిక్కన కృతి మాతృక కంటెఁ గొన్ని మడుగుల పరిమితిలో న్యూనము. దాదాపు మూడవవంతుండవచ్చునని నా యూహ... ఈ కుదింపు చేసిన తెరువుకూడ దిఙ్మాత్రముగా నుల్లేఖింతును."

"ఆనుశాసనిక పర్వమునందును సంగ్రహకథనము గలదు. సుదర్శనోపాఖ్యానమును సంగ్రహించినను మిక్కిలి రసవంతముగాఁ జేసినాడు. గరుత్మంతుని చరిత్రమును మిక్కిలి రసవంతము చేసెను. కాని, యిది మాతృకలోఁ గాన రాదు. శివమాహాత్మ్యమును విడిచివైచెను. అష్టావక్రచరిత్రముతో నానుశాసనిక ద్వితీయాశ్వాస మారంభమగును. ఈ పర్వమున దాన తీర్థ మాహాత్మ్యము లనేకములు కలవు. వానిలో ననేకాధ్యాయముల నెగురగొట్టెను. తన విషయ వివేచనాశక్తి నుపయోగించి రసవంతములుగా నుండు ఘట్టముల నేరి రచించెను. మూడధ్యాయములలో నున్న విపులోపాఖ్యానమును 38 పద్యములలో ముగించెను. కాని, మాతృకలో కంటె రసవంత మొనర్చెను. చ్యవనోపాఖ్యానమును సంగ్రహించిన వెనుక నౌద్దాలిక పుత్ర చరిత్రముతో ద్వితీయాశ్వాసము ముగియును. ఆరంభమైన గోదాన మహిమాదికము తృతీయాశ్వాసములోని కనువృత్తములయ్యెను. శ్రాద్ధ ప్రకరణమును స్పృశించి వదలెననియే చెప్పవలెను. గోదానములతోఁ జతుర్థాశ్వాస మారంభమగును. ఇది మాతృకయందు 100వ అధ్యాయము. హస్తికూటాధ్యాయమును రసవంతముగా 30 పద్యముల సంతరించెను. ఈ యుపాఖ్యానమును మిక్కిలి సరళముగను సులభగ్రాహ్యముగను నొనరించెను. ఉమామహేశ్వర సంవాదముతోఁ, జతుర్థాశ్వాసము ముగిసి తదనంతర సంభాషణ మంతయుఁ బంచమాశ్వాసములోని కనువృత్త మగుచున్నది. శివపార్వతీ సంవాదమున విష్ణుసహస్రనామములు తిక్కన తన మామూలు ననుసరించి విడచివైచెను. మిగిలిన యీ యాశ్వాసమంతయు శివపార్వతీ సంవాదమే యనవచ్చును. భీష్ముడు మఱికొన్ని ధర్మములను దెలిపి, ధర్మజు నొడంబఱచి హస్తిపురికిఁ బోవ ననుజ్ఞ నిచ్చును. మరల ధర్మజుడు కృష్ణసహితముగాఁ బితామహుని యంత్యకాలమునఁ గురుక్షేత్రమునకు వచ్చిన తదుపరి శ్రీకృష్ణుని యనుజ్ఞను గొని భీష్ముడు శరీరమును జాలించును. ఆయన యంత్యక్రియలు జరిగిన వెనుక గంగను గృష్ణుడు సమాశ్వాసము చేయుటతో నానుశాసనికము ముగియును."

"ఇది తిక్కనార్యుని సంగ్రహకథన పద్ధతి. పాఠకులకు విసుగు జనించకుండ తాత్త్విక భాగములను మిక్కిలి కుదించిన స్థలములోఁ గూడ రసమునకు గొఱవడకుండ రచించుటయుఁ, గథయుఁ గాక, యేమియుఁ గాక, నామపుంజములగు సహస్రనామములను వదలుటయు మొదలగు పద్ధతులచే నాంధ్రమహాభారతమును సర్వజన పఠనీయముగాను, మహాకావ్యముగాను తిక్కనార్యుడు సంతరించెను. దీనినే నాయన రచించిన భాగము ప్రబంధమండలి యయ్యెను."

(ఆంధ్ర మహాభారతోపన్యాసములు, పుట. 212. 215,216)

8. సంవాదాలు, ఉపాఖ్యానాలు:

ఆనుశాసనికపర్వంలో భీష్ముడు చెప్పిన సమాధానాలు స్థూలంగా మూడు విధాలుగా ఉంటాయి. 1. ప్రశ్నలకు తగిన అంశాలకు సూటిగా భీష్ముడే సమాధానాలు చెప్పినవి. 2. అడిగిన ప్రశ్నలకు అనువైన పూర్వప్రముఖుల సంవాదాలను

ఇతిహాసాలుగా వినిపించి విషయాలు వివరించినవి. 3.పృచ్ఛకు డడిగిన ప్రశ్నలోని పరమార్థాన్ని తెలుపగల కథనుగాని, ఉపాఖ్యానాన్ని గాని ఇతిహాసంగా వినిపించి తాత్పర్యాన్ని తేటపరచినవి. ఇతిహాస కథనంలో ఈ మూడూ ముచ్చట కొలిపే రచనా శిల్పాలే. వాటి స్థూల స్వరూప స్వభావాలు తెలియటానికి ఈ పర్వకథాసారంలో ప్రశ్నోత్తర మాలికగా వాటిని ప్రదర్శించటం జరిగింది. పఠితలు వాటిని ప్రాతిపదికలుగా స్వీకరించ ప్రార్థన. ధర్మరాజు వేసిన ప్రశ్నలు మొత్తం మీద 95గా గుర్తించటం జరిగింది. (ఇది రమారమి మాత్రమే) వాటిలో 62 ప్రశ్నలకు సూటి సమాధాలున్నాయి. దాదాపు 19 ప్రశ్నలకు సంవాదాలను దృష్టాంతాలుగా పేర్కొనబడిన ఉత్తరాలున్నాయి. (ప్రశ్నసంఖ్యలు 1, 13, 16, 38, 39, 50, 53, 60, 61, 62, 65, 67, 71, 72, 77, 78, 79, 81, 86); దాదాపు 15 ప్రశ్నలకు ఉపాఖ్యానాలను ఉదాహరించి సమాధానాలు చెప్పినవి ఉన్నాయి. (ప్రశ్నల సంఖ్యలు 2, 4, 5, 8, 10, 14, 18, 49, 51, 52, 54, 59, 66, 88) సంవాదాలలో - గౌతమీలుబ్ధక సర్పమృత్యుకాల సంవాదము ప్రశ్న 1, ఇంద్రమతంగ సంవాదం. (ప్ర.3); సనత్సుజాత నారదసంవాదం (ప్ర.16); చ్యవన నహుష సంవాదం (ప్ర.38); చ్యవన కుశికసంవాదం (ప్ర.39); బృహస్పతి మాంధాతృ సంవాదం (ప్ర.50); గో శ్రీ సంవాదం (ప్ర.53); సూర్యజమదగ్ని సంవాదం (ప్ర.60); పరాశర శిష్య సంవాదం (ప్ర.61); భూదేవీ విష్ణుదేవుల సంవాదం (ప్ర.62); శుక్రబలిసంవాదం (ప్ర.65); గౌతమదేవేంద్ర సంవాదం (ప్ర.67); అంగీరస భీష్మసంవాదం (ప్ర.71); హరసనత్కుమార సంవాదం (ప్ర.72); వ్యాసమైత్రేయ సంవాదం (ప్ర.77); సుమనాశాండిలీసంవాదం (ప్ర.78); శారదపుండరీక సంవాదం (ప్ర.79); ఉమామహేశ్వర సంవాదం (ప్ర.81); పవనార్జున సంవాదం (ప్ర.86); ముఖ్యమైనవి. ఉపాఖ్యానాలలో ప్రసిద్ధమైనవి - సుదర్శన కథ (ప్ర.2); ఋచీకుడి కథ (ప్ర.4); వీతహవ్యుడి కథ (ప్ర.5); చిలుక కథ (ప్ర.8); గరుత్మంతుడి కథ (ప్ర.10); భంగాస్వనుడి కథ (ప్ర.14); అష్టావక్రవృత్తాంతం (ప్ర.18); నచికేతుడి కథ (ప్ర.49); కపిల ధేనువు కథ; సౌదాసుడి కథ (ప్ర.51); సుమిత్రుడి కథ (ప్ర.52); పరశురాముడి స్వర్ణదాన కథ (ప్ర.54); ఇంద్రసప్తర్షుల కథ (ప్ర.59); క్షత్రబిందు కథ (ప్ర.66); దుర్వాసుడి కథ (ప్ర.88); వీటిని సంగ్రహంగా రచించినా తిక్కన సోమయాజి శిల్పసుందరంగా రసవంతంగా తీర్చిదిద్దాడు.

9. సంవాద రచనా శిల్పం:

శాంతి పర్వ కథార్థాలు విన్న ధర్మరాజు మనస్సుకు శాంతి కుదరలేదు. దానికి ముఖ్యకారణం బంధువధవలన, రాజవధ వలన కలిగిన పాపభయం. దానికి హేతువులుగా అతడు భావించినది - దుర్యోధన ధర్మజులు ఇరువురూ రాజ్యం పంచుకొని అనుభవించటానికి అంగీకరించని లోభక్రోధగుణాలు. అందువలన అతడికి పశ్చాత్తాపం తప్పలేదు. దానిని నివారించటానికి భీష్ముడు ఒక ఇతిహాసం చెప్పాడు. అది సంవాద ప్రధానమైనది. అందులో గౌతమి, బోయవాడు, సర్పం, మృత్యువు, కాలపురుషుడు పాత్రలు. వీరి మధ్య సాగిన సంభాషణమే అందులో కథ. సంభాషణ ఫలితాంశమే ఇతిహాస బోధ. గౌతమి కొడుకును పాము కరిచింది. బాలుడు చనిపోయాడు. తల్లి రోదిస్తుంది. అతడి మృతికి పాము కారణమని భావించి అర్జునకుడు అనే బోయవాడు ఆ పామును తాడుతో కట్టి చంపబోయాడు. గౌతమి పామును చంపటంవలన బాలుడు బ్రతకడని భావించి కిరాతకుడిని వారించింది. క్రూరజంతువును చంపటం పాపం కాదని బోయవా డన్నాడు. ఆ మాట విని పాము తాను మృత్యుదేవత పంపగా వచ్చిన సాధనమే కాని, బాలుడి మృతికి తాను ప్రత్యక్ష కారణం కాదని వాదించింది. మృత్యువు కూడా అక్కడకు వచ్చి తాను యముడు పంపగా తన కర్తవ్యాన్ని నిర్వహించాననీ, అతడి మరణానికి తాను కర్త కాదని వాదించాడు. అప్పుడు యముడు అక్కడకు వచ్చి తా మెవ్వరూ బాలుడి మరణానికి కర్తలం కామనీ, అతడి కర్మయే అతడి చావుకు కారణమనీ, జీవుడు కర్మఫలాన్ని తప్పించుకొనలేడనీ, కాబట్టి పామును వదలిపెట్టుమనీ కిరాతుడిని కోరాడు. అతడు తత్త్వాన్ని గ్రహించి పామును వదలిపెట్టాడు.

ఈ కథలో ఆయువుపట్టు యముడి సందేశం. తిక్కన ప్రబోధాన్నీ, తత్త్వాన్నీ పఠిత హృదయానికి సూటిగా హత్తుకొనటానికి అనువుగా కందాన్ని ఎన్నుకొనటం ఒక రచనాశిల్పం. ఈ కథలో సంభాషణలు చాలావరకు కందాలలో సాగాయి. కందాన్ని స్పష్టతకూ, నాటకీయతకూ, సారళ్యానికి, సార్థకశబ్ద ప్రయోగానికీ శక్తిమంతమైన సాధనంగా తిక్కన వాడుకొన్నాడు. ఈ కథాప్రాణం ఈ క్రింది కందంలో నిక్షిప్తం.

క. 'విను; కర్మం బొనరించును । జననము మరణంబు; నదియ సౌఖ్యము దుఃఖం
బును గావించుం; దన చే । సినదానం బడకపోవ శివునకు వశమే!'' **(అను.1.34)**

సంస్కృతంలో అనుష్టుప్పులకు వలె తెలుగులో కందపద్యాలకు ధారణానుకూల్యం ఉన్నదన్న సత్యాన్ని గుర్తించి, దానికి ఆ శక్తి నిచ్చి, నీతికీ, బోధకూ, తత్త్వానికీ, భాషణకూ దానిని సరళవాహికగా సాగించిన సవ్యసాచి తిక్కన సోమయాజి. బంధువుల మరణానికి, ధర్మరాజుగానీ, దుర్యోధనుడుగానీ కర్తలు కారు. వారి కర్మలే వారి మరణానికి కారణాలని తెలిసికొంటే ధర్మరాజు మనస్సుకు శాంతి లభిస్తుం దని ఈ సంవాద సారాంశం! సందేశం!

ఆధ్యాత్మికం, అధిదైవం, అధిభూతం అనే మూడు తత్త్వాలకు ఆధారమై, వాటిలో తానూ జీవిస్తూ కర్తా, భర్తా, హర్తా అయిన భగవంతుడిని గురించి సనత్సుజాతుడు వివరించి, నారదుడికి చెప్పిన అంశాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు అందించి, భీష్ముడు ముగింపుగా చెప్పిన ఈ పద్యం భక్తిజ్ఞాన ప్రదీపిక!

ఉ. 'ఇంతకు మూలమై యిరువదేనవ తత్త్వ మనంగ వేద వే
దాంతపురాణవేద్యుఁ డగు నప్పురుషుండు వెలుంగు; వాఁడ కా
లాంతకుఁ డైన యచ్యుతుఁ డనంతుఁడు యోగిజనాంతరంగ వి
శ్రాంతుఁడు విష్ణుఁ డద్వయుఁ డసంగుఁడు గౌరవవంశదీపకా!' **(అను.1.336)**

కృష్ణభక్తుడైన భీష్ముడి నోట పలికించిన ఈ పద్యం తిక్కనలో పోతన ఆవేశించి పలికించిన భక్తికవితవలె భాసించింది. ముక్తిపథాన్ని చూపించే తాత్త్విక వచనాలలో భక్తిరసాన్ని చిలికించే రచనా శిల్పం తిక్కన కవితా కళ!

అధ్యాత్మ విద్యా వివరణం కలిగించే మహిమాన్వితవాక్యాలకు రత్నాకరం వంటిది - 'హరసనత్కుమార సంవాదం'. సనత్కుమారుడు మహాజ్ఞాని. ఆయనవద్దకు మహాశివుడే వచ్చి ఆధ్యాత్మిక తత్త్వాలను అడిగి తెలిసికొన్న అపూర్వ సంవాదం ఉత్తరాదిప్రతులలో లేదు. దక్షిణాది ప్రతులలో కానవస్తున్నది. సంస్కృత వేదాంత పరిభాషనూ, తార్కిక క్లిష్టతనూ తెలుగులో దూరం చేసి తేటతెలుగులో వివరించి విజ్ఞత ప్రకటించాడు తిక్కన సోమయాజి. హరసనత్కుమార సంవాదం వచనంలో వ్రాస్తుంటే, అసంకల్పితంగా అది ఛందోగతి నాశ్రయించిందా అన్నట్లు తిక్కన రచన గోచరిస్తుంది. కందం, తేటగీతి, ఆటవెలది - అనే దేశి వృత్తాలు తిక్కన రచనకు భావవాహికలుగా పరిఢవిల్లాయి. మచ్చుకు ఆ మూడు పద్యాలలో చెప్పిన మూడు ఆధ్యాత్మికాంశాలు గమనించండి.

క. 'జలమున మీను, నుదుంబర । ఫలమున మశకములుఁ బోలెఁ బ్రకృతిం దా ని
మ్ముల నునికి దెలిసి, వేర్పా । టలవఱచిన పురుషుఁ డవ్యయత్వముఁ బొందున్.'

తే. 'కమలదళమున నున్న జలమువిధమునఁ । బ్రకృతి నుండి తదీయ సంబంధవికృతి
లేని తనుఁ గని వెలుఁగు నిర్లేపనిశ్చ । లాజరామర పదవి జీవాప్త్యయుండు.'

ఆ. 'ప్రకృతి నిట్లు వాసి పంచవింశుండు ష । డ్వింశభావ మొంది విమలశివ ని
రంజన స్వరూపుఁ డై వెలుఁగొందు న । త్తెఱఁగు ముక్తి యంద్రు దేవదేవ!'

(అను.4.232-234)

సనత్కుమారుడు రుద్రుడికి తెలిపిన సాంఖ్యయోగవిధానం తెలుగున పారాయణ పర్వంగా తిక్కన సోమయాజి సంతరించాడు.

క. 'సంగము బంధ; మఖిలని । స్సంగత మోక్షంబు; బహువిచారము లేలా?
పింగజటాజూట కలిత । గంగాబాలేందు మహిత ! గౌరీసహితా!' **(అను.4.238)**

అనే ముగింపు పద్యం వేదాంత సూత్రం కందార్థంగా జాలువారి తెలుగువారి గళంలో గేయంగా రూపొందినట్లు రక్తికట్టింది. తిక్కన రచన తెలుగుదనపు పూదోట!

విద్య, తపస్సు, దానం - అనే మూడింటిలో దానమే గొప్పదని నిరూపించేది వ్యాసమైత్రేయ సంవాదం. ఆకలి గొన్న వ్యాసుడికి మైత్రేయుడు అతిథి సత్కారంతోపాటు మృష్టాన్న మిచ్చి తృప్తుడిని చేశాడు. వ్యాసమహర్షి దానాలలో అన్నదానం మిన్న అని ప్రతిపాదించాడు. ఆ వాదం మొత్తం నాలుగు పద్యాల పరిమాణంలో ఉంటుంది. వాదం మూడు కందాలు. ఫలితాంశం ఒక ఉత్పలమాల. సముచిత ఛ్ఛందశ్శిల్పం.

క. 'దానార్హ వస్తువులలో । మానిత మన్నంబ ; యన్నమయము లసువులున్
మేనుఁ దదీయ బలంబును । గాన బుధులు దానిఁ దర్దఁ గైకొంద్రు మదిన్.'

క. 'తప ముల్లము కల్మషముల । నపగతములఁ జేయు విద్య కాస్పద మగు నా
తపసి మహితదానంబున । నుపచిత మగు విద్య దపము నుత్కర్షించున్.'

క. 'కాన తపంబును విద్యయు । దానౌదాత్త్య ప్రవర్ధితంబులు విద్యా
నూనత్వం బచ్యుతుఁ గను । దానికి దీపంబు సద్వ్రత ప్రవణులకున్!'

ఉ. 'కావున నన్నదానమునఁ గా కెటులుండు మహాప్రమోద మ
త్యావిలచిత్తుఁ డైనను మహత్తర దానమునన్ విశుద్ధస
ద్భావత నొందు నిక్క' మని పల్కె నరేంద్ర! తపంబు విద్యయున్
దైవత పూజనీయములు; దానము వానికిఁ బోషకం బగున్.' **(అను.4.350-353)**

సర్వశాస్త్ర సారరూపమైనదీ, సర్వశ్రేష్ఠమైనదీ ఏది? అని ధర్మరాజు అడిగితే భీష్ముడు నారద పుండరీక సంవాదం తెలిపాడు. నారదుడు చెప్పిన పరమార్థాన్ని పుండరీకుడికి చెప్పాడు. తిక్కన ఆ పరమార్థ సారాన్ని ఒక ఆటవెలదిలో తెలుగువారి కందించాడు.

ఆ. 'సర్వశాస్త్ర వాక్య సమితి నాలోకించి । మఱియు దృఢవిచార మహిమఁ దెలిసి
నిశ్చయింపఁ బడియె నిష్ఠ నారాయణు । నెపుడుఁదలఁప వలయు నిది యొకండ.' **(అను.4.368)**

ఈ ఒక్క పద్యం చాలు - ఆచారాల కన్నింటికీ ఆచార్యకం!

సంవాదా లన్నింటికీ శిఖరప్రాయం 'ఉమామహేశ్వర సంవాదం'. భూలోకంలో ధర్మరాజు భీష్ముడిని అడిగినట్లుగానే ఎన్నో యుగాల పూర్వం పార్వతి శివుడిని అడిగింది. పరమేశ్వరతత్త్వం నుండి పరమలౌకిక విషయాల వరకూ ఆమె అడిగిన ప్రశ్నల పరంపర ఒక మహా విజ్ఞాన జిజ్ఞాస సంప్రదాయానికి ఇతిహాసగౌరవాన్ని కలిగించింది. తిక్కన తెలుగులో ఆ వెలుగుబాటను ఆనుశాసనిక పర్వం నిర్వహణ రంగంగా నిలిపి నిండుదనం కలిగించాడు.

10. ఉపాఖ్యాన రచనా వైభవం:

ఉపదేశానికి ఉపాఖ్యానం ఊతకర్రగా ఉపయోగిస్తుంది. ప్రబోధానికి బలవర్ధకంగా పనిచేస్తుంది. ప్రతిపాద్యాంశానికి ప్రమాణంగా పనికివస్తుంది. జీవిత సత్యానికి అనుభవచిత్రంగా అన్వయిస్తుంది. వర్తమానానికి కర్తవ్యాన్ని బోధించే ఇతిహాస స్మృతిగీతిగా వినిపిస్తుంది. ఉపాఖ్యానం కావ్యార్థాలకు రసవత్తర వ్యాఖ్యానం. ఆనుశాసనిక పర్వం దాదాపు నూరు ప్రశ్నలకు

ఉత్తరాలు చెప్పే చర్చావేదిక. వాటిలో దాదాపు 15 ప్రశ్నార్థాలకు ఉపరంజనాత్మకమైన ఉపాఖ్యానాలు రమణీయ రసోల్లాసాన్ని కలిగించాయి.

సుదర్శనోపాఖ్యానం : (ప్రశ్న - 2)

గృహస్థాశ్రమంలో ఉండికూడా మృత్యుభయం పోగొట్టుకొన వచ్చునా? అనే ప్రశ్నకు సమాధానంగా ధర్మానికి స్థిరంగా నిలబడగలిగితే గృహస్థుడు సశరీర స్వర్గాన్ని, ముక్తిని సాధించవచ్చునని చెప్పే కథ ఇది. ఈ కథలో రెండు కథలున్నాయి. ఒకటి దుర్యోధనుడనే రాజుకూ నర్మదానదికీ పుట్టిన సుందరాంగి సుదర్శన అనే కన్య కథ. రెండవది ఓఘవతిని వివాహమాడిన సుదర్శనుడి చరిత్ర. నిజానికి గృహస్థాశ్రమధర్మానికి నిలబడిన దంపతులు ఓఘవతీసుదర్శనులు. వారికి ధర్మదేవత సశరీరస్వర్గాన్ని ప్రసాదించాడు. ఈ కథా నిర్మాణంలో ఒక చక్కని ధర్మ మర్మం ఇమిడి ఉన్నది. అపూర్వ సౌందర్యవతి అయిన సుదర్శనను తండ్రి దుర్యోధనుడు అగ్నిహోత్రుడి సేవలో నియుక్తురాలినిగా చేశాడు. ఆమె నిష్ఠతో గృహంలోని అగ్నిని ఆరాధిస్తున్నది. కాని, ఆమె సౌందర్యానికి అగ్ని ముగ్ధుడై ఆమె మీద మరులు గొన్నాడు. అగ్ని మదనాగ్నికి వశుడై పోయిన వింతపోకడలను తిక్కన ప్రబంధశైలిలో శృంగార రసపోషకంగా ఇట్లా వర్ణించాడు.

సీ. 'అర్చించునప్పు డయ్యంగన కెంగేలి । జిగి సొంపు చిత్తంబు దిగిచికొనఁగ
నరసి కన్గొనునప్పు డయ్యింతి కనుఁగవ । పొలపంబు రాగంబు వొదలఁ జేయ
నన్యులఁ బనిఁ బంచునప్పు డమ్ముద్దియ । పలుకులతీపు గోర్కులఁ గెరల్ప
నల్లన యూఁదెడు నప్పు డక్కొమ్మ వా । తెఱతావి ధైర్యంబు ద్రిప్పుకొలుప

తే. మరుఁడు దోడ్తోడఁ దేకువ మాలి కదిసి । తూపుగముల క్రొవ్వాఁడిమి సూప నంత
కంత కగ్గల మగు వలవంతఁ దూలి । పోయెఁ బావకుఁ డేమి సెప్పుదు నరేంద్ర!' **(అను.1.48)**

అర్చించేటప్పుడు ఎర్రని ముంజేతులు దగ్గరకు వచ్చేవి కావు. అవి అగ్నిదేవుడి హృదయాన్ని దగ్గరకు లాగుకొనేవి; అగ్నిని పరిశీలించి చూస్తున్నపుడు ఎర్రబడ్డ కన్నుగవ హృదయంలో అనురాగాన్ని పెంచేది. ఇతరులకు పనులను పురమాయించేటప్పుడు ఆమె మాటల తియ్యనిదనం హృదయంలో తియ్యని రాగాల వలపు భావాలను రేకెత్తించేది. అగ్నిని వెలిగించేటప్పుడు ఆమె ఊదేది. అప్పుడు ఆమె పెదవుల సుగంధం అగ్నిదేవుడి మనోధైర్యాన్ని దూరం చేసేది. మన్మథుడు విడువకుండా వరుసగా బాణాలు వేయటంవలన అగ్నికి వలపులవేడి ఎక్కువ అయి నిలువరించుకొనటం సాధ్యం కాకపోయింది. ఇందులో చేష్టాగతమైన విరహం భావోన్మీలనం వలన ప్రదర్శితమైనట్లు మనోహరంగా చిత్రించబడింది. మనస్సు లగ్నం కావటం, రాగోదయం కావటం, వలపుకోర్కెలు, రేగటం, మనోధైర్యం పోవటం, వలపు వేడి పొంగటం అనే మదనదశా వికాసం పైసీసంలో పరమరమణీయంగా వర్ణించబడింది.

మదనావేశపరుడైన అగ్ని ఏకాంతంలో ఆమెకు తన మనసులోని మాటను మధుర మధురంగా బైట పెట్టాడు. తిక్కన రచనలో మరొకవలపుతీగ వంటిసీసం అల్లుకొని వచ్చింది.

సీ. 'చిగురుటాకుల గాసిసేయు నీ యడుగుల । చెలువంబు సూడ్కులఁ జేర్చికొనియె;
మారేడుపండులగారాము సెఱుచునీ । యొలచన్నుఁగవ వేడుకలఁ బొనర్చె;
నునుఁదీవఁ జీరికిఁ గొనని నీ మైఁదీప । మురిపంబు డెందంబు మరులు కొలిపె
నెఱచందురుని సిగ్గువఱుపంగఁ జాలు నీ । నెమ్మోము దాలిమి వమ్ము సేసె;

తే. నాతి! నీకునై పెక్కుబన్నములు వడితి । నంగజుని చేత; వల్లభ వగుము నాకు'
నావుడును సిగ్గు గదిరి యాననము వాంచి । యలఁతి యెలుఁగున నిట్లను నాలతాంగి.' **(అను.1.50)**

నాయికా సౌందర్యాన్ని పొగడుతూ, దానివలన తాను పొందిన మదనావస్థలను మనసుకు హత్తుకొనేటట్లు చెప్పే వలపుమాటల చమత్కారం ఈ పద్యంలోని శృంగార రసోల్లాసం. చిగురుటాకులను ధిక్కరించే ఆమె అడుగుల కోమలత్వ సౌందర్యం ఆయన చూపులను ఆకర్షించింది. మారేడుపండ్ల పొంకాన్ని కాదనే ఆమె చన్నుగవ పొంకం అతడిలో ఆసక్తిని రేకెత్తించింది. లేత తీవ అందాన్ని లెక్కచేయని ఆమె మైదీవ లావణ్యం మనసులోని విరహాన్ని విరజిమ్ముతున్నది. పూర్ణచంద్రబింబాన్నే అవమానించగల ఆమె అందమైన ముఖం అతడి ధైర్యాన్ని వమ్ముచేసింది. మన్మథుడు పెట్టే బాధలన్నీ అగ్నిదేవుడు పొందాడట! ఆ బాధ లన్నీ తీరాలంటే సుదర్శన ఆయనను వివాహమాడి ఇల్లాలిగా మారాలి - అని కోరుకొన్నాడు.

అగ్నిదేవుడు పొందిన విరహవేదన ఆ సుందరాంగిని భోగించటానికి పడిన వలపుల వంత కాదు. అతడు శృంగారాన్ని ఒలకపోసినా శృంగార నాయకుడిగా కాక ధర్మబద్ధమైన వివాహం చేసికొనటానికి సిద్ధమైన ఉదాత్తుడిగా గోచరించాడు. ఈ కథలోని కీలకం ఇదే. శృంగారం ధర్మబద్ధమైనప్పుడు మాత్రమే గృహస్థులకు ఆదర్శజీవితాన్ని అందించగలుగుతుంది.

అగ్నిదేవుడి కోరికను సుదర్శన తిరస్కరించలేదు. అతడి మాటలు విని కోపగించుకొనలేదు. సిగ్గు లొలకపోసింది. తలవంచి లజ్జను అభినయించింది. సన్నని గొంతుతో బదులుపలికి సౌముఖ్యాన్ని ప్రకటించింది. అయితే, క్షత్రియ వనిత కదా అని గాంధర్వ వివాహానికి ముందుకు రాలేదు. కులకన్యల ధర్మాన్ని పేర్కొని తన తండ్రియొక్క గృహస్థాశ్రమ గౌరవాన్ని నిలువబెట్టింది.

క. కులకన్యకలకు వేడుకఁ । దలవీడులఁ బరులతోడి తగుమాటలకుం
దులకొనఁ దగునే? గురుజన । ముల కా కత్తెఱఁగు వారు పురుషార్థ నిధీ!' **(అను.1.51)**

ఈ మాటలు సుదర్శనా సౌందర్యానికి శీలసౌందర్యాన్ని కలిగించిన అమృతవాక్కులు. అగ్నిదేవుడు గంభీరుడు. తన కోర్కెను సుదర్శనకు తెలియజెప్పాడు. ఆమె అతడిమాటను తిరస్కరించలేదు. కాని, పెద్దల అనుమతి కావాలని భావించింది. పెద్దలతో ఎవరు చెప్పాలి? ఆమెయే తండ్రికి చెప్పి ఒప్పింపచేస్తుందని అగ్నిదేవుడు భావించాడు. కాని, అది జరుగలేదు. అందువలననే యజ్ఞంలో బ్రాహ్మణవేషంలో కనపడి కన్యను అడిగిన అగ్నిదేవుడి కోర్కెను రాజు తిరస్కరించాడు. అప్పుడు తన కోర్కెను బయటపెట్టటం అగ్నికి ఔచిత్యం కాదని తెలిసింది. యజ్ఞంలోనుండి రూపాన్ని ఉపసంహరించుకొన్నాడు. ఋత్విక్కులు యజ్ఞభంగం ఔతుందని భయపడి అగ్నిఋక్కులు చదివారు. అప్పుడు అగ్ని తన మనసులోని మాట వారికి చెప్పుకొన్నాడు. రహస్యంగా వారు రాజుకు చేరవేశారు. అతడు సంతోషించి తన కుమార్తె నిచ్చి అగ్నికి వివాహం చేశాడు. యజ్ఞం సక్రమంగా ముగిసింది.

ఈ కథలో కేంద్ర బిందువు కులకన్య సుదర్శన. ఆమె తన తండ్రికి గృహస్థగౌరవానికి దివ్యజ్యోతివలె నిలిచింది. దైవస్వరూపుడయిన అగ్నిని తాను వరించా నని కాని, అతడు వరిస్తే తాను అంగీకరించానని గాని ఎక్కడా బయటికి పొక్కనీయలేదు. అట్లని అగ్నిసేవలు ఉపసంహరించుకొనలేదు. వివాహానికి ముందు కన్య తండ్రి యొక్క రక్షలో ఉంటుంది. అగ్ని తనను అడిగినట్లే, తన తండ్రిని అడిగి అనుమతి పొందాలని ఆమె ఆకాంక్ష! ఆ మాట వ్యంగ్యంగా సూచించింది. మౌనంగా ఉండిపోయింది. అగ్నియే అన్నిపనులూ తానే ముగించి తన గౌరవాన్నీ, కులకన్య మర్యాదనూ, గృహస్థధర్మాన్నీ నిలువబెట్టి, గృహస్థాశ్రమం ఒక పవిత్ర యజ్ఞ కర్మవంటిది అన్న సత్యాన్ని తన ప్రవర్తనం ద్వారా లోకానికి తెలిపాడు.

సుదర్శనకూ అగ్నిదేవుడికీ కలిగిన సంతానంలో ఒకడు సుదర్శనుడు. అతడి భార్య ఓఘవతి. ఆమె పతివ్రత. పతిమాట జవదాటని ఇల్లాలు. సుదర్శనుడు గృహస్థాశ్రమ ధర్మనిష్ఠాపరుడు. నిరంతరం అతిథిపూజ చేయటం, గృహస్థ ధర్మాలలో ఉత్తమమని భావించి త్రికరణశుద్ధిగా దానిని ఆచరించ నారంభించాడు. ధర్మపత్నిని కూడా ధర్మాచరణంలో నిమగ్నురాలినిగా చేశాడు. ఆమె కిట్లా బోధించాడు.

క. 'అతిథిజనులు దమతమ వాం । ఛితము లనుభవించునట్లు సేయం గనినం
గృతకృత్యతఁ బొందరె గృహ । పతియును గృహిణియును ధర్మభారమువలనన్.'

క. 'అతిథి నినుఁ గోరె నేనియు । మతిఁ గింకిరిపడక యోలమాసగొనక నీ
వతనికిఁ బ్రియంబు సల్పుము । సతికిం బతిపనుపు సేయఁ జను నెల్లదియున్.' **(అను.1.67, 68)**

అతిథి సత్కారం పరమధర్మమే అయినా, సతిశీలదానం ధర్మవిరుద్ధం కాదా? అనే ధర్మసందేహం కలుగుతుంది. ఆ నియమం సుదర్శనుడు గృహస్థ ధర్మంగా ప్రకటించాడు. ధర్మదేవతకే అది ప్రశ్నార్థక మయింది. ఆ నియమానికి పరీక్ష పెట్టాడు. సుదర్శనుడు ఇంట లేనప్పుడు ధర్మదేవత అతిథిగా వచ్చి ఓఘవతిని కోరాడు. ఆమె ధర్మపథాన్ని తెలిపి వారించ యత్నించింది. అతడు మదనాతురుడై ఆమెను కోరాడు. ఆమె భర్త ఆనతిని మనసులో తలంచి అతిథికోర్కెను తీర్చటానికి వెనకాముందూ ఆడి జంకుతూ సంకట పడింది. కాని, పతి మాటకు తలయొగ్గి అతిథికి సుముఖురా లయింది. ఆత డామెను మరుగునకు తీసికొని వెళ్ళాడు. అంతలో సుదర్శనుడు వచ్చి భార్యను పిలిచాడు. ఆమె మాట్లాడలేదు. అతడు పెద్దగా ఎలుగెత్తి పిలిచాడు. ఆమె అతిథి సేవలో ఉన్నదనీ, కోపగించవద్దనీ లోనినుండి ధర్మదేవత పలికాడు. ఆ మాటలు విని సుదర్శనుడు త్రికరణశుద్ధిగా సంతోషించి, తన భార్యను అతిథి సేవకు పురికొల్పాడు. అప్పుడు సుదర్శను డిట్లా ప్రకటించాడు.

ఉ. 'నా వచనంబు నట్టుల మనంబును; దీనికి సాక్షు లుర్వియుం
బావకుఁడున్ జలంబును నభంబును వాయువుఁ జంద్రసూర్యులున్'
నావుడు మ్రోసె నాకసమునన్ విశదంబుగ దివ్యవాణి సం
భావితుఁ డీతఁ డీవిభునిపల్కు నిజంబని కౌరవేశ్వరా!' **(అను. 1.78)**

'ధర్మో రక్షతి రక్షితః' అన్న న్యాయం ప్రకారం ధర్మదేవత గృహస్థ ధర్మరక్షణం చేశాడు. ఆ దేవుడు సాకారుడై ప్రత్యక్షమై మాట తప్పితే సుదర్శనుడిని చంపటానికి మృత్యువు అతడి వెనువెంటనే వేచి ఉన్నాడనీ, కాని, ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా పాటించిన ఆ దంపతులకు సశరీరస్వర్గసుఖాన్ని ఇస్తున్నాననీ ప్రకటించాడు. ఓఘవతి తన పుణ్యంలోని సగభాగంతో పుణ్యనదిగా ప్రవహించి లోకులను ఉద్ధరిస్తుందనీ, మిగిలిన సగంతో పతిని సేవిస్తుందనీ వరమిచ్చాడు. ఇది పుణ్యకథగా, ఇతిహాసంగా ప్రసిద్ధికెక్కింది.

ఆ. 'అతిథిపూజఁ గడచినట్టి ధర్మువు గృహ । స్థులకు నొండు లేమి దెలుపుచున్న
యది; సమస్త కిల్బిషావహ మీయితి । హాస మిచ్చు నెల్ల యభిమతములు.' **(అను.1.84)**

అని ఫలశ్రుతి పలికాడు పితామహుడు. తిక్కన ఈ చిన్న ఇతిహాసాన్ని స్వయంసమగ్రమైన ప్రబంధంగా తీర్చిదిద్దాడు.

సౌపర్ణోపాఖ్యానము : (ప్రశ్న : 10)

గరుత్మంతుడు మహాత్ముడని ధర్మరాజు విన్నాడు. దాని తాత్పర్యం వివరించు మని భీష్ముడిని అడిగాడు. భీష్ముడు ఆ ప్రశ్న వెనుక ఉన్న రహస్యాన్ని భావించి శ్రీకృష్ణుడి వైపు మొగం త్రిప్పి 'స్వామీ! నీవే ఆ గరుత్మంతుడవై పుట్టావని విన్నాను' అని అడిగాడు. శ్రీకృష్ణుడు నవ్వి 'అడుగుతున్నవాడి అభిప్రాయాన్ని గమనించి కథను సాగించు' మని సూచించాడు. భీష్ముడు కథ చెప్పాడు.

సౌపర్ణోపాఖ్యానం ఆదిపర్వం ద్వితీయాశ్వాసంలో ఒకసారి చెప్పబడింది. నాగమాత కద్రువ తన కొడుకుకు శాప మెందు కిచ్చింది? అనే ప్రశ్నకు సమాధానంగా ఆదిపర్వంలో కథ చెప్పబడింది. ఈ పర్వంలో గరుత్మంతుడి మాహాత్మ్య లక్షణాలను నిరూపించటానికి కథ చెప్పబడింది. కథా ప్రయోజనాన్ని బట్టి కథాకథనం, దానిశిల్పం మార్పు చెందటం సహజం. ప్రస్తుత కథా ప్రణాళికలో ఆ మార్పు కనబడుతుంది. స్థూలంగా గోచరించే అంశా లివి:

1. ఇందులో కథా కాలక్రమ పద్ధతి ననుసరించి సాగదు. కార్యకారణ క్రమపద్ధతి ననుసరించి సాగుతుంది. అందువలన కథలో కద్రువకు సర్పాలు పుట్టిన తరువాత వినత అసూయతో తన మొదటి అండాన్ని పగులకొట్టుతుంది. అందులోనుండి సగం శరీరంతో అరుణుడు పుట్టి, తల్లి తొందరపాటుకు కోపించి, ఆమె కద్రువకు దాసి అయ్యేటట్లు శపించాడు. ఇది పూర్వకథకంటె భిన్నమైన కల్పన.

2. ఆ తరువాత అయిదువేల సంవత్సరాలకు మహాబలవంతుడు పుట్టి స్వేచ్ఛగా అంతరిక్షంలో తిరుగుతూ బ్రహ్మ సూచించిన ఆహారాన్ని తింటూ ఉంటాడు. అరుణుడే గరుత్మంతుడు తల్లి దాస్యాన్ని తొలగిస్తాడని సూచించాడు. ఇది పూర్వకథకంటె విలక్షణంగా ఉన్నది. గరుత్మంతుడు పుట్టి స్వేచ్ఛగా తిరుగుతూ తల్లిని పట్టించుకొనకపోవడం విశేషం. నారదుడు చెప్పేంతవరకు అతడికి తల్లి సవతికి దాస్యం చేస్తున్నదని తెలియకపోవటం ఈ కథలో విశేషం.

3. కద్రువా, వినతలు సముద్ర తీరానికి పోయి, ఉచ్చైశ్శ్రవాన్ని చూచి, దాని తోక నల్లగా ఉన్నదా లేదా? అన్నదాని మీద శపథాలు చేసికొని, మరునాడు కద్రువ కపట వర్తనంవలన వినత మోసపోయి సవతికి దాసిగా దైన్యజీవితాన్ని గడుపుతూ ఉన్న కథను గరుత్మంతుడి జన్మకథ తరువాత చెప్పటం ఈ కథలో విశేషం. వినతాదాస్యం గరుత్మంతుడి మహాపురుష లక్షణాన్ని నిరూపించటంలో ప్రాధాన్యం వహించలేదు కాబట్టి కార్యకారణసంబద్ధమైన కథన శిల్పం పాటించబడింది.

4. తల్లి సవతికి దాస్యం చేస్తున్న విషయం గరుత్మంతుడికి నారదుడివలన తెలియటం ఈ కథలో విశేషం. కద్రువ వినతాదాస్య విముక్తికి అమృతం తేవాలి అన్న నియమం పెట్టింది. దాని ప్రకారం గరుత్మంతుడు అమృతభాండాన్ని తెచ్చి చూపించి, వెంటనే దానిని దేవేంద్రుడికి ఒప్పచెప్పుతాడు. ఈ కల్పన ఈ కథకే ప్రత్యేకం. మిగిలిన కథంతా సామాన్యమే.

5. చివరకు ఇంద్రుడు గరుత్మంతుడు సాక్షాత్ విష్ణువుగా పేర్కొని కీర్తించాడు. 'అతండు సాక్షాద్విష్ణుండు; కృష్ణుండన శూరుఁ డను యాదవ ధాత్రీశునకుఁ బౌత్రుండై లోక హితార్థంబుగాఁ జరియింపంగలవాఁ; డీమూర్తియు విడువండు; వివిధవర్తనంబుల వినోదించుచుండు ననియె' (ఆను.1.269). గరుత్మంతుడు మహాత్ము డనటానికి ఈ అంశం పరాకాష్ఠ. దీనితో కథముగియటం ఈ ఇతిహాస వైశిష్ట్యం. ఈ ఇతిహాసానికి తిక్కన తన వర్ణనా సామర్థ్యంతో ప్రబంధ గౌరవాన్ని కలిగించాడు. గరుత్మంతుడి వర్ణనం.

చ. ఘనతరకంధరుండు, దృఢకాయుఁడు, దీప్తముఖుండు, రక్తలో
చనుఁడు, మహోత్తమాంగకుఁడు, చారుసుసంగత పక్షసారమం
డనుఁడు, పరిస్ఫుర ద్యుతి విడంబిత బాలదివాకరుండు, లో
కనయన పర్వనిర్వహణకారి సుపర్ణుఁడు పుట్టె భూవరా! **(ఆను.1.177)**

ఇందులో వాడిన ప్రతి విశేషణమూ కథతో ముడిపడి ఉండటం సార్థక్యం. సముద్రతీర వర్ణనం కావ్యోచితరీతిలో సాగి ఉపాఖ్యానానికి అందాన్ని చేకూర్చింది.

సీ. చంచలఁ జిగురాకుఁ జించియాడుచు నలి । నెలుఁగించు గండుఁగోయిలలసొంపు,
నలరుఁ దేనియఁ గ్రోలి, యన్ను సోలంబుల । మురియు తేఁటుల నునుమ్రోఁత యింపుఁ,
దమిఁ బండ్ల రసమాని తమలోనఁ జెలఁగుచుఁ । బలికెడు రాచిల్క పటురవంబు,
గొలఁకుల కెలఁకులఁ గూడి క్రీడించుచుం । డెడు నంచతండంబు నడబెడంగుఁ,

తే. దరఁగఁ దేలుచుఁ, బూఁదీవఁ దగులఁ బడుచు । వచ్చు చిఱుగాలి సోఁకును, మెచ్చి మెచ్చి,
తగిలి కొనియాడుచును, వినతయునుఁ గద్రు । వయును మున్నీటి చేరువ వనమునందు. **(ఆను.1.181)**

ఉత్ప్రేక్షాలంకారంలో ఉచ్చైశ్శ్రవ వర్ణనం ఉజ్జ్వలం!

చ. కరువునఁ బోసిరో విధుని కాంతి సుధాబ్ధి తరంగఁ దెచ్చి గం
డరు వొనరించిరో! హరుజటాస్థలికిం దొడ వైన యేటి పె
న్నురువునఁ జేసిరో! యన మనోజ్ఞ సితచ్ఛవి నుల్లసిల్లు సుం
దర తురగోత్తమంబు దవుదవ్వులఁ గాంచిరి చారులోచనల్. **(ఆను.1.183)**

ఈ ఉపాఖ్యానం మహాపురుష ప్రశస్తితో ముగిసినట్లు రచించిన తిక్కన ప్రబంధ రచనా ప్రతిభను ప్రదర్శించాడు. గమనించండి.

సీ. 'అజుఁ డుపలాలింప నద్దేవు కావించు । వరభోజనంబులఁ బెరిఁగె నితఁడె!
ఘనకాయజవసత్త్వ గజకచ్ఛపముల నొ । క్కత్తున లీలమై నెత్తె నితఁడె!
విపులభూరుహశాఖ విఱిగిన మునిహితా । ర్థంబుగాఁ జంచునఁ దాల్చె నితఁడె!
సురసేనతోఁ బురందరుని నిర్జించి యు । ద్దీప్తుఁడై యమృతంబుఁ దెచ్చె నితఁడె!

తే. తల్లిదాస్యంబు దనబాస దప్పకుండఁ । బాపి యాసుధ మరల నప్పాకశాస
నునకు దయ నిచ్చె నీతఁడె యనుచు సిద్ధ । సాధ్యు లగ్గింప గరుడుఁడు సనియె మగిడి'. **(ఆను.1.270)**

పునరుక్తమైనా ఈ ఉపాఖ్యానం పునరుద్భవ గౌరవం పొందింది.

అష్టావక్రుడి చరిత్ర : (ప్రశ్న.18)

ఈ పర్వంలో చాలామంది దృష్టిని ఆకర్షించే ఉపాఖ్యాన మిది. కన్యాదానానికి ఎటువంటి వరుడు కావాలి? అన్నది ధర్మజుడి ప్రశ్న. అస్ఖలిత బ్రహ్మచారి అని సమాధానం. ఆ అంశాన్ని నిరూపించే వ్యక్తి అష్టావక్రుడు. వదాన్యుడనే ముని తన కూతురైన సుప్రభను వివాహమాడుతానని కోరుకొన్న అష్టావక్రుడిని పరీక్షించిన కథ ఇది. శ్రీ కురుగంటి సీతారామయ్య గారీ ఉపాఖ్యానాన్ని గురించి ఇట్లా సమీక్షించారు. "మూడధ్యాయముల కథను 30 పద్యములలో (తిక్కన) సంతరించెను. స్త్రీ స్వభావము మాతృకలో నతివిపులముగా నున్నది. దానినంతను తిక్కన యొక్క పద్యములో ముగించినాడు. దీని వెనుకటి ఘట్టము అనఁగా భంగాస్వన చరిత్రము కూడ స్త్రీ స్వభావ వర్ణనమునకు సంబంధించినదే.

సీ. 'వనితలు కామార్తి వశతఁ బొంది

తే. వంశహానిఁ దలంపరు వరుస కలుక
రాత్మజులఁ జూడ రగ్రజు ననుజుఁ గొనరు' **(ఆను.2.17)**

అని కొంచె మతిశయోక్తిగఁ గనఁ బడినను నిందు లోకవృత్త మెఱింగినవారికి సత్య మున్నదని తోఁచును. సోదరీమణులు నన్ను మన్నింతురు గాక! అష్టావక్రపాత్రము మిక్కిలి యుదాత్తమైన ఘట్టము. స్వచ్ఛంద యగు నుత్తరదిశయు, స్వచ్ఛుఁ డగు నష్టావక్రుఁ డును విరుద్ధ స్వభావములు గల పాత్రలు. వారి పరస్పర సంభాషణము మిక్కిలి హృదయంగమము. ఒకరి నొకరు జయింప నుద్దేశింతురు. కానఁ దుదకు సుశీలమే గెలిచెను. అష్టావక్ర పాత్రపోషణమును ఒరవడిగాఁ గొని ప్రవరపాత్రను దీర్చి దిద్దినాడు పెద్దన యని నాయూహ. చూడుఁడు.

క. పదపడి నయమున మెయిమెయిఁ । గదియించి లతాంగి చిక్కఁ గౌఁగిటఁ జేర్పం,
గదలని చిత్తము గలిగియు, । మద మేమియు లేక, యతఁడు మ్రానై యుండెన్. **(ఆను.2.14)**

కౌఁగిలించిన కాంతను ద్రోసి పడవేసిన ప్రవరునికంటె నితని ప్రవర్తన యెక్కువ చిత్త స్థైర్యమును దెల్పుట లేదా? 'మెయిమెయి' యనునుడికారము రెండు శరీరముల సామీప్యమును జెప్పక చెప్పుచున్నది. "అశిథిల పరిరంభము"ను జెప్పఁ

దలఁచి 'మెయి' శబ్ద పునరుక్తితోఁ గార్యమును సంతరించినాడు తిక్కన. 'మ్రాన్నై యుండెన్' అని వెనుకటి పరిరంభము యొక్క వైఫల్యమును దెలిపినాఁడు. అందులకై 'కదలని చిత్తము' 'మదము లేకపోవుట' యను కారణములను దెల్పు కావ్యార్థములతో గార్యమును సాధించినాఁడు. అష్టావక్రపాత్ర మాదర్శబ్రహ్మచారి పాత్రము. తాను ప్రేమించిన కన్యయెడల నతని కెంత గాఢరతియున్నదో తెల్పినాఁడు''. (ఆంధ్ర మహాభారతోపన్యాసములు. పు.232-233)

ప్రతి ఉపాఖ్యానంలోనూ ఏదో ఒక ప్రత్యేకత కానరావటం తిక్కన రచనా శిల్ప విశేషం. ఆనుశాసనిక పర్వంలో ఎన్నో సూక్తులు తెలుగువారి నాల్కలకు రుచులు కలిగిస్తూ ఉన్నాయి. మచ్చుకు కొన్ని.

తే. 'బాల్యమునఁ దండ్రి, యౌవనప్రాప్తి మగఁడు, । వార్ధకంబునఁ దనయుఁడు, వామనయన
నరసి నడపన కా కెందు నంగనలకు । వలసినట్టులు సేయఁగా వచ్చు నెట్లు? **(అను.2.22)**

క. పరమజ్ఞానుల యొద్దను । బరఁగిన నజ్ఞుఁడును బోధభరితుఁడగు నిరం
తర మేరుసమీపస్థితి । హిరణ్యరుచిఁ గాక మెసక మెసఁగిన పగిదిన్. **(అను.3.325)**

ఆ. 'దంతియడుగు లోనఁ దక్కిన జంతుచ । యంబు నడుగు లెల్ల నడఁగి యుండు
నట్ల ధర్మకోటు లన్నియు లోనగు । నిద్ధగుణ! యహింస కింత నిజము. **(అను.4.383)**

తే. క్రోధకామాదులైన దుర్గుణము లెల్ల । వాయుహతి మేఘపటలంబు వాయు పగిది
శ్రుతముచేఁ బాయు; నరులలో సురల కరణి । శ్రుతయుతులు దేజరిల్లుదు రతిశయిల్లి. **(అను.5.148)**

ఆనుశాసనిక పర్వం అక్షరాలా సూక్తి రత్నాకరం!

11. భీష్మ నిర్యాణం:

ఆనుశాసనిక పర్వం భీష్మ నిర్యాణంతో ముగుస్తుంది. అది ఒక ఉజ్జ్వలమైన నిర్వహణ. భీష్మ డెంతటి మహావీరుడో అంతటి కృష్ణభక్తుడు. శ్రీకృష్ణుడిలో పరమాత్మ తత్త్వాన్ని దర్శించిన అంతర్యోగి. పాండవులు అతడిని దివ్యపురుషుడిగా భావించి సేవించారు. భీష్ముడు ఆయన దైవమని ధ్యానించాడు. ఉత్తరాయణపుణ్యకాలం రాగానే ఆయన ఎదుట శ్రీకృష్ణుడు నిలిచాడు. విష్ణువును దర్శించినట్లు భీష్ముడు తన్మయుడయ్యాడు. ఆ దేవదేవుని దివ్యనామాలతో స్తుతించాడు. సంకల్పమరణం తన ఆధీనంలో ఉన్నా స్వర్గగమనానికి శ్రీకృష్ణుడి అనుమతిని కోరాడు. మానుష సంకల్పంకంటె దైవసంకల్పం గొప్పదని నమ్మి దేవదేవుడిని మనసారా ప్రార్థించాడు.

ఆ. 'బలము నీవ నాకు, భక్తుండ నీయెడ, । నాలుబిడ్డ లేని యట్టివాఁడఁ,
గావు నన్ను నధిక కారుణ్యమున నిమ్మ । నుజ్జఁ గమలదళమనోజ్ఞనయన!' **(అను.5.463)**

అల్పాక్షరాలలో అనల్పార్థ రచన ఇది. బ్రతికినన్నాళ్ళు ఎదురులేని వీరుడుగా బ్రతికాడు భీష్ముడు. అతడి బలం అతడి అహంకారానికి చిహ్నం. ఇప్పుడు ఆ బలం పరమాత్మ శక్తిగా భావిస్తున్నాడు. దీనితో అతడు సాధించిన విజయాలన్నీ బ్రహ్మార్పణమైనట్లే అయింది. సర్వధర్మాలను పరిత్యజించి అంపశయ్యమీద ఉన్న భీష్ముడు శ్రీకృష్ణుడినే శరణు వేడుతున్నాడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ!' అన్న భగవానుడి వాక్యాన్ని అక్షరాలా పాటించాడు. 'ఆలు బిడ్డలు లేనియట్టివాఁ

డన్' అనే వాక్యం వినేవారికి కన్నీరు పెట్టిస్తుంది. పున్నామ నరకాన్ని తప్పించే పుత్రులు కాని, ఆ సంతానాన్ని ఇవ్వగల భార్య గాని లేని భీష్ముడు నరకలోకం పొందక తప్పదనీ దాని నుండి భీష్ముడిని కాపాడే భారం బాధ్యత శ్రీకృష్ణుడిదే అనే అర్థం ఒకటి. పెండ్లాంబిడ్డలు లేని బ్రహ్మచారి కాబట్టి అతడికి సద్గతుల కొరకు అపరకర్మలు చేసే పుత్రులు లేరనీ ఒక భావం. సంసారబంధం లేకపోవటంచేత స్వర్గాది ఉత్తమ లోకాలను ఇవ్వటం శ్రీకృష్ణుడికి కష్టం కాదనీ అర్థాలు ఏర్పడతాయి. ఏమైనా అధిక కారుణ్యబుద్ధి లేకపోతే భీష్ముడిని రక్షించి ఉత్తమగతి కల్పించటం కష్టమని అతడి బాధ. ప్రాణత్యాగానికి విష్ణుమూర్తి (కమలాక్షుడు) అయిన శ్రీకృష్ణుడి అనుజ్ఞ కోరుతున్నాడు. ఆర్తితో కూడిన అనన్య భక్తికి ఈ పద్యం అక్షరోదాహరణం.

శ్రీకృష్ణుడు 'యోగక్షేమం వహామ్యహమ్' అన్నట్లు అభయ మిచ్చి అనుజ్ఞ ఇచ్చాడు.

ఆ. 'కీ డొకప్డు లేదు; కృతపుణ్యుఁ డవు, తండ్రి । వలని భక్తి పెంపు గలవు; దానఁ
గాదె బంటుఁ బోలె గాంగేయ! మృత్యువు । నీవశమున నిలిచె నిర్భరముగ'!

వ. 'నీకు నే ననుజ్ఞ యిచ్చితి; వసువులం బొందుము'
అన్నాడు. భీష్ముడి జన్మ కృతార్థ మయింది. (అను.467,468)

భీష్మపితామహుడి వ్యక్తిత్వాన్ని గురించి డా॥ వేదాంతం సంపత్కుమారాచార్యగారు పలికిన ఈ క్రింది వాక్యాలు ఆ అద్భుతమూర్తికి అక్షర నీరాజనాలు.

"నిశిత శరశయ్యపై శయనించి ఏబది యెనిమిది దినము లుండి ఉత్తరాయణ పుణ్యకాలములో మాఘ శుక్ల అష్టమి నాడు తన యిచ్ఛ ననుసరించి మరణించిన మహితాత్ముడు భీష్ముడు. ముప్పదిమూడుకోట్ల దేవతలకు మూల దేవతలు ముప్పది ముగ్గురు మాత్రమే. ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, అశ్వినీదేవతలు ఇద్దరు. అష్టవసువులలో ద్యౌ అను ఎనిమిదవవాడు వసిష్ఠుని శాపముచే భూలోకమున సిద్ధపురుషుడైన శాంతనవునకు త్రిలోకపావనియైన గంగవలన పుత్రుడై జన్మించి దేవవ్రత (ప్రభాసుడు అనియు అందురు) నామధేయుడై తండ్రికొరకు భీషణ ప్రతిజ్ఞ గావించి భీష్ముడై, ఆజన్మబ్రహ్మచర్య నియమ నిష్ఠుడై అప్రతిహత పరాక్రమ సమన్వితుడై నిష్కపటవర్తనుడై, కూలంకష విజ్ఞానఖనియై, శ్రీకృష్ణపరమాత్మ యందు అనన్య భక్తుడై వేదతుల్యమగు అమృతోపదేశములు ధర్మజున కుపదేశించిన లోకోత్తర మహావ్యక్తియై విరాజిల్లుచున్నాడు. శ్రీకృష్ణుడే అనినట్లు మానవులలోనే కాదు దేవతలయందు కూడా ఇంతటివాడు లేడనుట అతిశయోక్తి కానేరదు.

శ్రీకృష్ణుని మహత్త్వమునకు ప్రభావమునకు సంబంధించిన జ్ఞానము ఆ కాలములో భీష్మునియం దున్నంతగా ఇతరులయందు లేదు. అనేక పర్యాయములు ధృతరాష్ట్రునకు దుర్యోధనునకు శ్రీకృష్ణుని మహత్త్వము తెలియజెప్పెను. రాజసూయయాగములో అగ్రపూజకు అర్హుడెవరను ప్రశ్న తలయెత్తినపుడు నిండుసభలో శ్రీకృష్ణుడు మాత్రమే సర్వవిధముల పాత్రుడని స్పష్టపరచి, అతని మహత్త్వమును ఉగ్గడించి సాక్షాత్తు భగవంతుడని తెలియజేసెను. అర్జునుని రక్షణము కోరి సుదర్శనమును చేత బూని తనవైపు పరుగిడి వచ్చువేళ భీష్ముడు ఆ పరమపురుషుని చేతిలో మరణము తన భాగ్యవిశేషముగా భావించి శరసముదాయముతో పూజింపనెంచి సంతోషముతో శ్రీకృష్ణునకు ఆవాహనము తెలిపెను. యుధిష్ఠిరున కుపదేశించిన విష్ణుసహస్రనామస్తోత్రములో ప్రత్యక్షరములోను భీష్ముడి భగవద్భక్తి భగవత్తత్త్వపరిజ్ఞానము ప్రతిబింబిత మగుచుండును. శ్రీకృష్ణ పరమాత్మ భీష్ముని అవసానసమయమున దర్శనమును ప్రసాదించి కృతకృత్యుని గావించెను. ఏ విధముగా పరిశీలించినను భీష్ముడు మనకు పరమాదర్శమూర్తి. అపుత్రకుడై మరణించినను హిందువులలో మూడు వర్గములవారు ఈ నాటికి పితృతర్పణ లిచ్చువేళ భీష్మునకు తర్పణలు అర్పించుచుండుటకు ఆ మహనీయునిలోని విశిష్టతయే హేతువు.

అర్థ కామములకు హేతువులైన కామినీ కాంచనములు త్యాగము చేసి కేవలము ధర్మము మాత్రము స్వీకరించిన భీష్మపితామహుని గురించి శాంతి పర్వము ద్వితీయాశ్వాసమున తిక్కన గారిచే చెప్పబడిన పద్యమిది.

ఉ. 'రాజటె! రాగహీనుఁ డటె! రాజిత సుందరమూర్తి యట్టె! వి
భ్రాజిత సంపదున్నతి విభాసితవర్తనుఁ డట్టె! కామినీ
రాజిమనోజ్ఞభంగి చతురత్వధనుండటె! బ్రహ్మచర్య దీ
క్షాజిత మన్మథుండు నటె! జన్మము లిట్టివి యెందుఁ గల్గునే!'' **(శాంతి. 2.103)**

12. హరిహరనాథతత్త్వం :

విష్ణుశివ సహస్రనామాలను వర్ణించి హరిహరతత్త్వాలను వ్యాసుడు ఈ పర్వంలో కీర్తించాడు. తిక్కన హరిహరనాథ తత్త్వాన్ని ఉపాసించి ఆ దేవుడికి తాను రచించిన ఆంధ్ర మహాభారతం పదునేను పర్వాలను అంకితం చేశాడు. ఆ హరిహర నాథ తత్త్వాన్ని గురించి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు రచించిన వ్యాసాన్ని కృతజ్ఞతలతో ఇక్కడ పొందుపరచు కొంటున్నాను. (చూడు.ఆంధ్రమహాభారత సంశోధితముద్రణము. 8వ సంపుటము, పు.43-64)

"కవిబ్రహ్మ తిక్కనసోమయాజి ఆంధ్రమహాభారతమున హరిహరినాథదేవుని సంబోధించి చెప్పిన విషయము సర్వజనవిదితము. ఈ హరిహరనాథ భావన అతని కెట్లు కలిగెను? ఇది యాతడు క్రొత్తగా కల్పించిన దేవతాస్వరూపమా? ఇట్టికల్పనచే అతడు సాధింపదలచిన ప్రయోజనమేమి? ఈ మొదలైన ప్రశ్నలు స్ఫురించును. విమర్శకలోకమునందు దీనిని గూర్చి ఎక్కువ వివేచనము జరిగినట్లు కాన్పింపదు. సామాన్యపాఠకు లీసమస్యచే నాకర్షింపబడరు. వారు కథామాత్రసంతృప్తులు గనుక భారతమందలి ఆశ్వాసారంభ, ఆశ్వాసాంతపద్యముల జోలికిపోరు. పోయినను వారి కవి ఒక పట్టాన అర్థము కావు. అందును తిక్కనసోమయాజి హరిహరనాథ సంబోధన పద్యములు విద్వాంసులను కూడా చిక్కుపెట్టునవిగా ఉన్నవి. అర్థము మాట యటుంచి వాని పదచ్ఛేదము కూడ క్లిష్టతరముగనే యున్నది. సరియైన పదచ్ఛేదము కుదిరిన గాని అర్థనిర్ణయము చేయుటకు వీలులేదు. కొన్ని కొన్ని సంబోధనములు కష్టము మీద మూర్తస్థితికి వచ్చినను, పెక్కుసంబోధనములు అమూర్తములుగనే నిలిచిపోవుచున్నవి. అవి గంభీరార్థమహితములు, యోగ, సాంఖ్య, అద్వైతవేదాంతముల నిగూఢభావములు తెలిసిన కాని ఆ సంబోధనములు తమయర్థపీయూషమును స్రవింపజేయవు. కావున తిక్కనసోమయాజి హరిహరనాథ సంబోధనములు ప్రగాఢ పాండితీమండితులకు మాత్రమే ఉపగమ్యము లగుచున్నవి. పోనిండు. "వాని నుపేక్షింపరాదా. కథావగతి కవి ఏ విధముగను తోడ్పడవు'' అనవచ్చును. కాని, హరిహరనాథసంబోధనముల నుపేక్షించుట మహాకవి అంతర ప్రభాప్రపంచమును ఉపేక్షించుటయే యగును. ఆతని బాహ్యప్రతిభా సంపత్తితో మాత్రమే తృప్తిపడినట్లగును. తిక్కనసోమయాజి కవితాశిల్పము గొప్పదే. కాని యాతని యాంతరవిజ్ఞానము ఇంకను గొప్పదిగా తోచును. అతడు శబ్దార్థ శిల్పియే కాదు. వాని వెనుక నున్న స్ఫోటకబ్రహ్మోపాసకుడు. కావుననే అతడు లోకోత్తరుడును, కాలాతీతుడును అగుచున్నాడు.

హరిహరనాథసంబోధనమునందు కవి యొక పద్ధతి నవలంబించెను. ఆశ్వాసారంభమున ఒక కందపద్యము, ఆశ్వాసాంతమందు మూడు పద్యములు. వీనిలో మొదటిది ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూలము - వీనిలో ఒకటిగా నుండును. దీనికి కొంత యపవాదము కలదు. సౌప్తిక పర్వము ప్రథమాశ్వాసము చివర మహాస్రగ్ధరయు, ద్వితీయాశ్వాసము అంతమున స్రగ్ధరావృత్తమును కూర్పబడినవి. ఇట్లే స్త్రీ పర్వము ప్రథమాశ్వాసము చివర శిఖరిణీ వృత్తమును, రెండవ యాశ్వాసము కడపట మందాక్రాంతా వృత్తమును ఉన్నవి. రెండవపద్యము కందముగను మూడవది మాలినీ వృత్తముగను ఉన్నవి. ఆద్యంతముల నివి యిట్లే ఉన్నవి. తాను వ్రాసిన 46 యాశ్వాసముల చివరను తిక్కనసోమయాజి మాలినీ వృత్తమునే ఏల యాదరించెనో ఛందశ్శిల్పము తెలిసినవారు ఊహింపదగియున్నది. హరిహరనాథున కిది అక్షరరూపమైన మాలగా నాతడు భావించెనేమో! సంబోధన పద్యములు ఆద్యంతములందు ఆశ్వాసమునకు నాలుగు చొప్పున 46 యాశ్వాసములకు 184 పద్యములను, షష్ఠ్యంతములు ఐదున్ను, కథాప్రారంభమునకు ముందు మూడున్ను, వెరసి 129 పద్యము లగుచున్నవి. విరాటపర్వము ప్రస్తావన భాగమంతయు హరిహరనాథ విషయకమే. కావున ఇంచుమించు 200 పద్యముల గ్రంథమును హరిహరనాథుని ఆరాధనమునకు తిక్కనసోమయాజి వినియోగించె నని చెప్పవచ్చును.

ఈ పద్యములను పదచ్ఛేదము చేయుట యందు అంత్యానుప్రాస నియమము మార్గబోధకముగా కన్పించును. సంబోధనాత్మక రచనయందు అనుప్రాసము శ్రుతిసుభగముగ నుండును. తిక్కనసోమయాజి యీ యుద్దేశ్యముతోనే సమాసాంతములందు వర్ణ సామ్యమును కూర్చియుండును.

+క్రమపరిణతమూర్తీ! శ్రౌతశాఖాగ్రవర్తీ! (4-1-335)
పరమకృపా విధేయ! నిరుపాధికచిన్మయకాయ!
గాఢవిస్తర నిగమైక వేద్య! గుణతత్త్వవికారనియత్యభేద్య!
సంస్మరణ నిరస్తతాప! ఘనసంసృతి సంతమసప్రదీప!
(సంసారమను చీకటికి దీపమువంటివాడా!)

నిష్ఠురభుజసార దానవ నిషూదన! భక్తజన ప్రమోదనా! (4-2-363)
భూరికృపానుషంగ! మునిపుంగవ చిత్తసరోజభృంగ!

సంసారదవప్రవర్ష! సురసంస్తుత దివ్యగుణప్రకర్ష! (5-1-383)

ఒక్కొక్కప్పుడు పద్యపాదమంతయు సమాసముగా చేసి దానిమీద అంత్యవర్ణ సామ్యమును పాటించుట కవికి సమ్మతము.

తపస్స్వాధ్యాయాదిక్షపితమల చిత్తప్రకలితా!
విపజ్జాల జ్వాలా విరమణ సుఖా వృష్టిలలితా! (11-1-187)

పరమ మునీంద్ర సంయమన పక్వవివేక విభూతరమ్య!
విస్తరమహనీయ తార్కిక వచః కలనానభిగమ్య! (12-4-455)

ధర్మాధర్మవిదూర నీతి పరవిద్వచ్చిత్తయోగీ!
జగన్నిర్మాణస్థితి తంత్రసంహరణ ధూర్నిర్వాహరాగీ! (13-2-476)

ఒక్కొక్క సందర్భమున మహాకవి ప్రౌఢరచనా ప్రీతిచేత కాబోలు పద్యము మూడు పాదము లాక్రమించు సమాసము కూర్చి దానికి నాల్గవపాదములో అంత్యానుప్రాస ఘటించును. ఇట్టివి నక్కత్తుగనే ఉన్నవి.

కమల భవాది దైవత ముఖస్ఫుట నిర్గళితప్రశస్త వా
గమృత రస ప్రసార కలితాంచిత నైకవిధిప్రకర్ష సం
గమ సముదీరితోల్లసన కందళిత ప్రహసద్దయాలతా!
సుమహదుపాశ్రయ ప్రమద శోభిత విశ్వజగన్మధువ్రతా! (5-4-426)

బ్రహ్మమున్నగు దేవతల ముఖనిర్గళితములగు స్తోత్రములను జలసేచనముచేత పుట్టినదై చిగుళ్ళు దాల్చిన కృపాగుణమను లతకు ఆలవాలమైనవాడా! గొప్ప ఆశ్రయము లభించుటచేత సంతోషభరితమైన జగత్తను తుమ్మెద కలవాడా! అని యర్థము భాసించును. ఇట్టి దీర్ఘ సమాన కల్పనా చణత్వము స్త్రీ పర్వము రెండవ యాశ్వాసము 184వ పద్యము నందును కన్పించును.

వీణానాద ప్రతిమ నిగమావిర్భవత్సారపుణ్య
శ్రేణీసంపాదిత విమలతాస్థేమ నిర్లేప చిత్త
త్రాణక్రీడాకలన సతతోత్సాహవద్దివ్యభావా!
ప్రాణాపానా హరణ నిపుణ ప్రాపణీయానుభావా!

+ పద్యసంఖ్యానిచ్చుటలో మొదటిది పర్వసంఖ్యను, రెండవది ఆశ్వాస సంఖ్యను, మూడవది పద్యసంఖ్యను తెలుపును.

(సుస్వరయుక్తమై వీణానాద సదృశమగు వేదపఠనముచే సంపాదింపబడిన పుణ్యాబాహుళ్యముచేత నిర్మలచిత్తము గలవారిని రక్షించుటయందు సంతతోత్సాహము కలవాడా! వాయు నిరోధనమునందు నిపుణులైన యోగులచేత కుద్దాలింపదగిన అనగా తెలుసుకోదగిన అనుభావము కలవాడా! స్వరయుక్తమైన వేదపఠనమునందు తిక్కన సోమయాజికి గల ప్రత్యయము దీనివలన తెల్లమగుచున్నది. హరిహరనాథుడు 'వైదిక ధ్యాయిత కిచ్చమెచ్చు' వాడని గ్రంథారంభమునందే కవి వాక్రుచ్చెను.

సంబోధనమునందు అంత్యానుప్రాసము ఇంపుగా నుండు నని మహాకవి తలచినను దీనిని ఎల్లయెడలను వాడలేదు.

మర్దిత తాప సంకలన మంజులనామ; దురంత దుర్దశా
కర్దములేప నిర్హరణకారి కృపామృతపూర; కర్మస
మ్మర్ద నిరాసకర్మఠ; సమత్వ పరిస్ఫుట రూపభావనా;
నిర్దళితారివర్గ; మహనీయ మనోరమణీయవైభవా! (6-3-453)

కర్ణపర్వము ప్రథమాశ్వాసము 320 పద్యముకూడ ఈ విధమైన రచనకు ఉదాహరణము కాగలదు. అరుదుగ ఈయన ముక్తపదగ్రస్తమును కూడా ఆదరించినట్లు కనబడును.

బాంధవ శాత్రవాకలిత భావభవా; భవపాశబంధ (4-1-333)

ఇట్లు కొన్ని మెలకువలతో క్లిష్టాన్వయము గల ఈ సంబోధన పద్యములను అన్వయింపవలెను. శ్రద్ధాళువులకు గాని తత్త్వవిషయములను చెప్పకూడదను పెద్దల సంప్రదాయమును పాటించుటకై కవిబ్రహ్మ వీనియందు గ్రంథ గ్రంథులను కావలెననియే కూర్చెనేమో. లేనిచో సాధారణముగా ప్రసన్నమగు నాతని కవిత్వమునం దివి గులకరాళ్ళవలె నుండును.

మన మిదివరలో వేసికొన్న ప్రశ్నలకు సమాధానము లరయుదము. హరిహరనాథ కల్పనము తిక్కనసోమయాజి క్రొత్తగా చేసెనా? అంతకుముందే యున్నదా? ఈ భావము తిక్కన మనస్సునందు కొంతకాలమునుండియు మెదలుచుండెననుటకు విరాటపర్వారంభము నందలి స్వప్నవృత్తాంతమే తార్కాణము, కొమ్మనామాత్యుడు కవికి స్వప్నసాక్షాత్కార మిచ్చి ఇట్లు పలికెను. " కి మస్థిమాలాం కిము కౌస్తుభం వా । పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్ । కిం కాలకూటః కిమువా యశోదాస్తన్యం తవస్వాదు వద ప్రభో మే॥" అని నీవు తొల్లి రచించిన పద్యంబు గాఢాదరంబున నవధరించి భక్తవత్సలుం డగు హరిహరనాథుండు నిన్నుం గృతార్థుంజేయ విజయం చేయుచున్నవాడు. ("ఓ దేవా! నీకు ఎముకలపేరు సమ్మతమా? కౌస్తుభము సమ్మతమా?, కాలకూట విషము నీకు రుచికరమా?, యశోదాస్తన్యమా?" అని పద్యభాగము,) ఆదియు తొల్లి రచించిన పద్యము. అనగా మహాభారత రచనాకాలమునకు చాలాముందుగనే హరిహరాభేదభావము తిక్కన మనస్సులో రూఢమయ్యెను. నిర్వచనోత్తరరామాయణమునందు 'మహేశ్వరాంఘ్రి కమలధ్యానైక శీలుండ' అని అతడు చెప్పుకొనినను కొట్టరువు వారిది స్మార్తులు పాటించు సామాన్యశైవమే కాని వేదమును గర్హించిన తీవ్రశైవము కాదు. ఈ కాలమునకే అతని మనస్సు అద్వైత ప్రవణముగా నుండినట్లు సూచన కలదు. నిర్వచనోత్తర రామాయణమునందు మనుమసిద్ధి తాతనుగూర్చి చెప్పుచు అతడు ధర్మాద్వైతమూర్తి యని వర్ణించెను. ఈ ధర్మాద్వైత పదమే విరాటపర్వమునందు తిరిగి వచ్చినది. 'ధర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యమ్నాయమున్' (4-1-3) పురుషార్థములలో ధర్మమునకును వేదాంతములలో అద్వైతమునకు ప్రాధాన్యము కలుగునట్లు కృష్ణద్వైపాయనుడు మహాభారతమును రచించెనని సోమయాజి నిశ్చితాభిప్రాయముగ కన్పించుచున్నది. అద్వైతము, ఘనిష్ఠమైన తత్త్వచింతనము. అది జీవేశ్వర అభేదమూలకము. సామాన్యజనుల భావనకు అందుబాటులోనికి రానిది. సామాన్యజనులకు కూడా నానాత్వమునందు ఏకత్వమును బోధించుటకై ప్రాచీనులు "శివాయ విష్ణురూపాయ - శివరూపాయ విష్ణవే । శివస్యహృదయం విష్ణుః । విష్ణోశ్చ హృదయగ్ం శివః" అను మంత్రమును దర్శించిరి. ఇంతకు ముందే 'ఏకం సద్విప్రా బహుధా వదంతి - ఇంద్రం యమం వరుణం మాతరిశ్వాన మాహుః' అను ప్రాచీన ఋక్కు వెలువడినది. 'అగ్నిశ్చమే ఇంద్రశ్చమే సోమశ్చమ ఇంద్రశ్చమే' అను యజుస్సు కూడా సర్వదేవతలను

ఇంద్రస్వరూపమని సూచించుచున్నది. విష్ణుపారమ్యమును చెప్పు వాక్యములును రుద్రపారమ్యమును చెప్పు వాక్యములును వేదములందు కలవు. తిక్కనసోమయాజి ఈ యుభయ దైవముల అభేదమును భావనచేసి లోకమునకు చాటినవాడు.

హరిహరభావము అమూర్తస్థితినుండి మూర్తస్థితికి తిక్కనకు ముందే వచ్చినట్లు కన్పించును. హరిహరదేవునిపేర గుళ్ళును, విగ్రహములును వెలసెను. తూర్పుచాళుక్య వంశీయుడగు మొదటి శక్తివర్మ (క్రీ.శ.999-1012) పెన్నేరు (పెనికేరు) శాసనమునందు పిణ్ణెయ భట్టారకుడను బ్రాహ్మణవీరుని ప్రశంస వచ్చినది. ఈయన జైనుడుగ తోచును. అట్లయ్యును ఈ భట్టారకుడు హరిహరభక్తుడని కూడా వర్ణింపబడినది. దీనిని బట్టి తిక్కనసోమయాజికి రెండువందల ఏబది సంవత్సరములకు పూర్వమే ఆంధ్రదేశమునందు హరిహరనాథ సంప్రదాయము ప్రవర్తిల్లెనని చెప్పవీలగుచున్నది. పిణ్ణెయ భట్టారకుడు జినభక్తుడును హరిహరనాథ భక్తుడునుకూడా అగుట విశేషము. నెల్లూరు పట్టణమునందు తిక్కన సోమయాజి కాలమున ఇప్పటి రంగనాథస్వామి ఆలయ స్థానమునందు హరిహరనాథాలయముండెనని కొందరు ఊహించుచున్నారు. కన్నడదేశమునందు హరిహర అనుచోట హరిహరనాథాలయము ప్రసిద్ధమై యున్నది. ఈ ఆలయమునందలి ఒక శాసనములో హొయసల రెండవనరసింహునకు సేనాపతియైన పోలాళ్వ దండనాథుడు క్రీ.శ.1220 ప్రాంతమున హరిహరాలయమును జీర్ణోద్ధారము చేసినట్లు చెప్పబడి యున్నది. అనగా ఈ దేవళము అంతకుముందే ఉండెననియు, దాని నాతడు మరమ్మత్తు చేయించె ననియు ఊహింపవచ్చును. అక్కడ హరిహరేశ్వర విగ్రహము 6 అడుగుల ఎత్తుగలిగి వామపార్శ్వమున శంఖచక్రచిహ్నితమై విష్ణుని యర్ధరూపమును, దక్షిణభాగమున అక్షమాలయు త్రిశూలము గల హరరూపము చెక్కబడెనని తెలియుచున్నది. విష్ణుని యర్ధమున కిరీటమును, శివుని సగమున జడలును చంద్రవంకయు కన్పించును. కాని, కన్నడకవులలో ప్రసిద్ధులైన వారెవరును హరిహరదేవుని ప్రశంసయైన చేయలేదు. 13వ శతాబ్దమునందలి కన్నడకవులలో ముఖ్యులైనవారు కవిచక్రవర్తి జన్న, అండయ్య, కేశిరాజు, చౌండరసు మున్నగువారు. వీరిలో మొదటిముగ్గురును జైనులు. చౌండరసు తన కావ్యమును పండరిక్షేత్రమునందలి విఠోభాదేవున కంకితము ఇచ్చెను. ఆ కాలపు శివకవులలో ముఖ్యులు హరిహరుడు, రాఘవాంకుడు, కెరెయపద్మరసు మొదలైనవారు. వీరెవ్వరును కవిబ్రహ్మ తిక్కన సోమయాజివలె అద్వైతామృతమును సేవించినవారు కారు. ఆంధ్ర కన్నడదేశములు సంస్కృతియందు అక్కచెలియళ్ళవంటివి. కావున తెలుగుదేశమునందును హరిహరనాథభావనయు, ఆ దేవునకు గుళ్ళుగోపురములును వెలసియుండును. ఈ యంశమునకు పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్ర మనకు తార్కాణము.

పాల్కురికి సోమనాథుడు అచ్చపు శివారాధకుడు, మహావిద్వాంసుడు, మహాకవి. ఈతడు తిక్కన సోమయాజికి పూర్వుడని పూర్వ విమర్శకులు కొందరు భావించిరి. పండితారాధ్య చరిత్రము వాదప్రకరణమునం దీతడు హరిహరదేవప్రశంస తెచ్చి ఆ భావమును దీర్ఘముగను తీవ్రముగను ఖండించినాడు. అవహేళనమును చేసినాడు. ఇంతవిపులముగ హరిహరనాథ కల్పనను ఖండించుట కాతనిని ప్రేరేపించినది తిక్కనసోమయాజి మహాభారతమే కావలెను.

ఇది సత్యమైనచో పాల్కురికి సోమనాథుడు తిక్కనకు సమకాలికుడో అనంతరుడో కావచ్చునను విశ్వాసము బలపడుచున్నది. సోమనాథుడు హరిహరరూపమున ఒక దైవము ఉండుటకే వీలులేదని పెక్కు ఉక్తిప్రత్యుక్తులతో వాదము సాగించెను. హరిని ఒక సందర్భమున సంహరించుటచే శివుడు హరిహరుడయ్యెనని వ్యుత్పత్తి కల్పించెను. 'శివాయ విష్ణురూపాయ' అను సూక్తి ప్రక్షిప్తమని త్రోసి పుచ్చెను. హరిహరనాథుని ఆరాధించినవారు ముఖముమీద ఒక వంక విభూతియు మరొకవంక తిరుచూర్ణముతో నామములను దిద్దుకొనవలదా? అని అవహేళన చేసెను. హరిహరనాథుని గుళ్ళమీద నందియు పందియు చెక్కవలదా? అని యాక్షేపము తెల్పెను. హరిహరనాథుని సేవించువారికి హరిహరలోకమను పుణ్యలోక మెక్కడ ఉన్న? దని ప్రశ్నించెను. ఇటువంటి కల్పనలో అనౌచిత్యమున్నదని వాదించెను. హరియున్న దేహమున పార్వతి యుండునా? హరుడున్న దేహమున లక్ష్మీదేవి ఎట్లు నిలుచును? హరియు హరుడును సమానులు తుల్యులు కారని ఆవేశముతో చర్చించెను. హరి పంచవింశకుడనియు (అనగా సాంఖ్యులు చెప్పు చతుర్వింశతి తత్త్వములకు ఒక మెట్టుపై వాడనియు) హరుడు షడ్వింశకుడు (అనగా పంచవింశకుని కంటె అధికుడు) అనియు వేదాంతపరముగ అన్వయించి హరిహరులు సమానులు కారని స్థాపించి, హరిహరనాథుడను ఏకరూపముండుటకే వీలులేదని గర్జించెను.

తక్కిన యాక్షేపము లెట్లున్నను పాల్కురికి సోమనాథుడు చూపిన ఒక యాక్షేపణ గణింపదగియున్నది.

"హరి గొన్నయర్ధంబు నద్రిజ గొనునె?
హరి యద్రిసుత గొన్నయర్ధంబుఁ గొనునె"? (పండితారాధ్య చరిత్ర)

లోకసామాన్యదృష్టికి ఇది గొప్ప యనౌచిత్యమే. దీనిని తిక్కనసోమయాజి యెట్లు వారించుకొనెను? అను ప్రశ్న కలుగును. దీనికి సమాధానము కొంత విరాటపర్వాదియందలి 'శ్రీయన గౌరి నాఁబరఁగు చెల్వకు' అనుపద్యమునందే కలదు. శ్రీయనియు గౌరియనియు వ్యవహారమునందు వేర్వేరు స్త్రీమూర్తులైనను, పరమార్థదృష్టితో వారిద్దరును ఒక్కతత్త్వమే. భిన్నతత్త్వములు కావు. కావుననే మహాకవి 'గౌరినాఁబరఁగు చెల్వకు చిత్తము పల్లవింప' అని వారినిద్దరిని ఉద్దేశించి ఏకవచనమునే ప్రయోగించెను. అనగా లక్ష్మీపార్వతులకు నామభేదమే కాని వ్యక్తిభేదము లేదు. అట్లే హరిహరనాథ శబ్దమును ఏకవచనముగనే కవి ఎల్లయెడలను ప్రయోగించెను. ఇంద్రాగ్నులు, మిత్రవరుణులు మున్నగు దేవతాద్వంద్వముల వంటివి కావు, హరిహరశబ్దము. విడిగా నాత డెక్కడను హరిహరులు అని వాడలేదు. ఎప్పుడును హరిహరనాథుడనియే. శివకేశవులకంటె పరుడైన పరబ్రహ్మము అనియే తిక్కన భావముగా స్ఫురించును. హరిహరనాథుడును, లక్ష్మీపార్వతులును ప్రకృతి పురుషులకు ప్రతీకలు. వీరికి నామభేదమే కాని వస్తుభేదము లేదు. శ్రీ గౌరులు వ్యావహారిక సత్యములే కాని పారమార్థిక సత్యములు కారు. వారు తత్త్వములే కాని వ్యక్తులు కారని తిక్కన సోమయాజి యొక సందర్భమున వ్యక్తము చేసెను.

గౌరీత్వోజ్జ్వల తత్త్వ భాస్వర! నిజగారాత్మకత్రీశ్వరా!- 17-1-77

లక్ష్మీపార్వతు లను ఉజ్జ్వలతత్త్వము చేత ప్రకాశించువాడా! అని సంబోధనము. కావున అనుచిత స్త్రీ పురుష సంబంధమును హరిహరనాథకల్పనకు ఆరోపించుట నిర్హేతుకమనియు భ్రాంతిమూలకమనియు చెప్పదగియున్నది.

హరిహరనాథభావనచే తిక్కనసోమయాజి సాధింపదలచిన మహాప్రయోజన మేమి? ఒకటి వైయక్తికమైనది. రెండవది సాంఘికమైనది. అతడు సాధారణ శైవుల కుటుంబమున జనించినను యౌవనమునుండియు అతనియందు శివకేశవ అభేదభావము విరూఢమగుచుండెను. దీనికి తార్కాణము 'కిమస్థిమాలాం' అను భావగర్భితమైన శ్లోకమే. ఈ కాలమున తిక్కన భావనచేయుచున్న హరిహరనాథైక్యరూపమైన పరతత్త్వము ద్వంద్వాతీతము. ఆ తత్త్వమునందు అన్ని రుచులును ఒకటే. అది సుందరము. బీభత్సము, క్రమముగా ఆయన మనస్సునందు అద్వైతభావన నెలకొని స్థిరపడజొచ్చెను. కావుననే మహాభారతమునందు ముఖ్యవేదాంతము అద్వైతమైనట్లు గ్రంథారంభముననే సూచించెను. "ధర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్' (4-1-3)' తిక్కన యాధ్యాత్మిక జీవితమునందు నాలుగు ప్రధాన సూత్రములు భాసించుచున్నవి. (1) వేదములందు పూజ్యభావన (2) వైదిక మార్గమునందు అనగా కర్మమార్గమునందు అవిరళ నిష్ఠ (3) అభేదభక్తి (4) అద్వైతసాధన. దీనిలో మొదటిమెట్టు శివకేశవ అభేదచింతనము. పై మెట్టు జీవేశ్వర అభేదమననము. ఈ క్రమముయొక్క ఫలితము మోక్షసాధనము. అది జననమరణ దుఃఖరూప సంసారతరణము. పునర్జన్మ లేకుండుట. ఈ భావములన్నియు హరిహరనాథుడు స్వప్న దర్శన మొసగినప్పుడు వివృతమైనవి.

'నీ కరుణ నిట్లు పదస్థుఁడ నైతి నింక జన్మాంతర దుఃఖముల్ దొలఁగు నట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే॥(4-1-21)

అని యుపలాలితుండగు డింభకుండు తన కొలంది యెఱుంగక మహాపదార్థంబు వేఁడు విధంబున బ్రహ్మానందస్థితిం గోరి సర్వాంగాలింగితమహీతలం బగు నమస్కారంబు సేసిన నజ్జగన్నాథుండు.

జనన మరణాదులైన సంసారదురిత
ములకు నగపడ కుండంగఁ దొలఁగు తెరువు

గను వెలుంగు నీ కిచ్చితి ననిన లేచి (4-1-22, 23)

హరిహరాభేదభావముచే తిక్కన సాధింపదలచిన మరియొక మహాప్రయోజనము లోక కల్యాణము. సమకాలిక సంఘోద్ధరణము. ఇది మొదటి దానివలె విస్పష్టముగా విస్తరింపబడలేదు. ఒక్క చిన్న వాక్యములో మాత్రమే ఇది సూచితమైనది.

కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁ గ్రోలి యాంధ్రావళి మోదముంబొరయునట్లుగ - (4-1-30)

గ్రంథరచన చేయుట ఆయన సంకల్పము. మునిమాన్యుడైన పారాశర్యుడు కూడ లోకకల్యాణము నుద్దేశించియే పంచమవేదమును కూర్చెనని తిక్కన ఇదివరలో చెప్పియున్నాడు.

'కృష్ణద్వైపాయనుఁ డర్థి లోకహిత నిష్ఠం బూని కావించె' (4-1-8)

ఇక్కడ మిక్కిలి సంక్షిప్తముగా సూచింపబడిన ఆ లోకకల్యాణము, లోకహితనిష్ఠ ఏ రూపమైనదో మనము సమకాలిక పరిస్థితులనుబట్టి ఊహింపవలెను. ఆంధ్రదేశమునందును పరిసర దేశములందును కూడా మతవిషయికమైన కల్లోలము తీవ్రముగా నుండెను. చార్వాకులనువారు తప్ప మిగిలిన వారందరును భగవంతుడున్నాడని దృఢముగా నమ్మి, అతనిని చేరుటకు తమకు తోచిన మార్గములు అభినివేశముతో ప్రచారమొనర్చినవారే. పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్యచరిత్ర వాదప్రకరణమునందు తనకాలమున ఉండిన వివిధసమయములవారిని గూర్చి విపులమైన పరిజ్ఞానమును మనకు కలిగించినాడు. అతడు వీరిని గూర్చి దూషణవాక్యకలితముగా వ్రాయక, కొంచెము సహనమును, సంయమనమును ప్రదర్శించినచో సోమనాథుడు మనకు గొప్ప ఉపకారము చేసినవాడయి యుండును. ఏమయిన క్రీ.శ.12వ శతాబ్దమునందు దేశమును చైతన్యవంతమొనర్చిన ఆస్తికశాఖలను గురించి సోమనాథుడు చెప్పకున్నచో మనకు ఆ యుగము అంధకార భూయిష్ఠముగా నిలిచిపోవును. పాల్కురికి కవి గుర్తించిన వివిధ మతశాఖ లీరీతిగ నున్నవి. బౌద్ధులు, జైనులు, సన్న్యాసులు, అద్వైతవాదులు, బ్రహ్మవాదులు, అవేదవాదులు (వేదప్రమాణము నంగీకరింపనివారు కావచ్చును), పాంచరాత్రులు, అంతరాలికులు, ఏకాత్మవాదులు, అభేదవాదులు, శూన్యవాదులు, కాలవాదులు, కర్మవాదులు, నాస్తికులు, చార్వాకులు, ప్రకృతివాదులు, మాయావాదులు, శబ్దబ్రహ్మవాదులు, పురుషత్రయైకవాదులు (నన్నయ భట్టారకుడు త్రిపురుషులను గ్రంథారంభమున స్తుతించెను. ఇది యాతనిమీద విసురుకావచ్చును), ద్విపురుషైక కలితవాదులు, మూర్త్యైకవాదులు (కాళిదాసు అష్టమూర్తియైన శివుని స్తుతించెను); స్మార్తులు, యోగశాస్త్రభ్రమితులు, రసమంత్రవాద సిద్ధులు, షట్తర్కవిదులు, కౌటిల్యశాస్త్రప్రబుద్ధులు (అర్థశాస్త్రవేత్తలు కావచ్చును), నక్షత్రపాఠకులు; ఈ విధముగ లెక్కలేనన్ని శాఖలవారిని సోమనాథుడు నిరసనవాక్యములతో పేర్కొనెను. అద్వైతులను నీతివర్జితులనియు, పాంచరాత్రులను భ్రాంతచిత్తులనియు, శూన్యవాదులను జఘన్యచరిత్రులనియు, మాయావాదరతులను ప్రచ్ఛన్న బౌద్ధనిబద్ధులనియు ఈ విధముగా ఒక్కొక్కరికి ఒక్కొక్క దూషణ విశేషములను సోమనాథుడు జతపరిచెను. అతడు పేర్కొన్న వారందరను ప్రత్యేకశాఖలు కాకపోవచ్చును. మాయావాదము, శూన్యవాదము, బ్రహ్మవాదము (సర్వంఖల్విదం బ్రహ్మ నేహనా నాస్తి కించన) ఏకాత్మవాదము ఇవన్నియు అద్వైత వాదమందలి అవాంతరభావములే కాని విభిన్నశాఖలు కాకపోవచ్చును. ఎట్లైనను ఇంత విస్తృతమైన మత విశ్వాససంపద ఆనాడు ఉండెననుట గమనింపదగినది.

పైని పేర్కొన్న పెక్కు సమయములలో చెప్పుకోదగిన అనుయాయివర్గము కలవారు బౌద్ధులు, జైనులు, అద్వైతులు, పాంచరాత్రులు, కర్మవాదులు. పాల్కురికి సోమనాథుడు పతిత వర్గమునకు అతీతమని భావించిన శివపారమ్యవాదులును వీరిలో చేర్చదగినవారే. క్రమముగ రాజాదరణము కోల్పోవుటచే బౌద్ధజైన శాఖలు ప్రక్షీణములగుచుండెను. శైవులును, పాంచరాత్రులును ప్రజాహృదయమున జైన బౌద్ధులు పోగొట్టుకొనిన స్థానమును ఆక్రమించుకొనుచు, ఆధిక్యమునకై అఱ్ఱులుసాచుచుండిరి. మొదట శైవులదే పైచేయిగా నుండెను. అప్పు డాంధ్రదేశమునంతను పాలించిన కాకతీయులు పరమమాహేశ్వరులై యుండుటచే శైవమునకు రాజాదరణము విస్తారముగా లభించెను. కానైతే కాకతీయులు వీరశైవులు కారు.

బసవేశ్వరుని ఉపజ్ఞా ఫలితముగ శైవము వీర శైవముగా మారి పరసమయములను సహింపక వానిపై ధ్వజమెత్తు పరిణామమునకు లోనయ్యెను. పాల్కురికి సోమనాథుని రచనలయందు తీవ్రవైఖరియే ప్రత్యక్షమగును.అప్పటి వైష్ణవమింకను వీరశైవమునకు ప్రతిద్వంద్వి కాదగినస్థితిలో లేకుండవచ్చును. సోమనాథుడు విష్ణువుపేరు పేర్కొని ఆ దైవము శివునితో సమానుడు కాజాలడని నిరూపించుటకు వాదప్రకరణమున చాలగా రచించెను. అయినను అతడు వైష్ణవమును పేరెత్తి చెప్పక పాంచరాత్రులను ఉదాహరించెను. వారైనను ఉపేక్షణీయులని కాబోలు ఒక్క తిరస్కార వాక్యముతో 'భ్రాంత చిత్తులు' అని త్రోసిపుచ్చెను. అద్వైతమునుండి సోమనాథుడు వీరశైవమునకు ఎక్కువ ప్రతిఘటనమును ఎదురుచూచి యుండవచ్చును. అభేదవాదులైన వీరు గోడమీదిపిల్లివంటివారని యాతని భావము. కావుననే కాబోలు అద్వైత సిద్ధాంతమునకు చెందిన వేర్వేరు భావములను ప్రత్యేకశాఖలుగా పరిగణించి వానిని ఆగ్రహముతో తెగడెను.

దేశమునందు చెలరేగుచున్న మతసంబంధకమైన అసహనమును ద్వేషమును ఉపశమిల్లునట్లు చేయుటకు కవిబ్రహ్మ సంకల్పించెను. హరిహరనాథ కల్పన మాతనికి ఈ సదుద్దేశమునందు మిక్కిలి సహకారి అయ్యెను. సామాన్య జనులకు హరిహర అభేదమును బోధించి వారిని శాంతచిత్తులను చేసెను. వ్యుత్పన్నమతులైన వారికి జీవేశ్వరాభేదరూపమైన వేదాంతమును ప్రతిపాదించెను. సాంఖ్య, యోగ సిద్ధాంతములను అద్వైతమునకు బాసటగా స్వీకరించెను. వీని కన్నిటికిని భక్తియోగమును మూలకందముగా గ్రహించెను.

హరిహరనాథతత్త్వపటము నందలి కొన్ని ముఖ్య తంతువులను గుర్తింతము.

1. వేదప్రామాణ్యము, వేదములు ఈశ్వరుని నిశ్వసితములు. అవి భగవంతుని రూపమును ప్రతిపాదించును.
2. కర్మప్రాధాన్యము, కర్మలు మనస్సును నిర్మలము చేయు సాధనములు. ఫలాభిసంధిలేని కర్మాచరణము మోక్షహేతువు.
3. వేదవ్యాససంస్తుతి, వేదవ్యాసుడు వేదవిభజనము చేసెను. బ్రహ్మసూత్రకర్త, విజ్ఞానఖని.
4. హరిహరుల అభేద సంకలనము, ఏకతా నిరూపణము.
5. సామాన్యస్తుతి, భగవంతునిలీలలు, పరతత్త్వమహత్త్వము, భక్తపోషణము, రాక్షససంహారము.
6. యోగము, యమనియమాదులు, షట్చక్రములు, కుండలినీసంచారము.
7. సాంఖ్యము, ప్రకృతిపురుషులు, చతుర్వింశతి తత్త్వములు.
8. అద్వైతము, మాయావాదము, జీవేశ్వరాభేదము.

హరిహరనాథ సంబోధన పద్యములం దీ అష్టసూత్ర విధానమును తిలకింతము. క్రింద నీయబడిన ఉదాహరణములు? సూచనప్రాయములే కాని సమగ్రవ్యవస్థను సందర్శించునవికావు.

1. వేదప్రామాణ్యము :

శ్రౌతశాఖాగ్రవర్తీ 4-1-335; గాఢవిస్తర నిగమైకవేద్య 4-2-363; నిగమకుసుమ గంధోన్మేష భూతాభిధానా 4-6-407; పదనసముత్థితవేదా 7-2।382; తపస్స్వాధ్యాయాదిక్షపితమల చిత్తప్రకలితా 11-1.187; వేదపరిషత్సంస్తుత్య 12-1-398; నిగమాంత స్ఫీత హర్మ్యాగ్ర సంచరణ ప్రౌఢమయూర 12-2-447;; (వేదములను హర్మ్యాగ్రములందు సంచరించు నెమలియైనవాడా అనుట) వేదవిద్యా విభావ్యా 12-3-531; వేదజలద శ్రేణీమయూరా 11-5-630; సుతపస్స్వాధ్యాయ సద్మా 13-2-476, వేదసభైక నాయకా 14-3-226; ప్రణవైకభావ్య 17-1.78.

2. కర్మప్రాధాన్యము :

వైదికమార్గనిష్ఠమగు వర్తనము 4-1-15; యజ్ఞాత్మకరూప 4-3-239; కర్మసమ్మర్ద నిరాసకర్మఠ 6-3-454; యజనవిధిఫలత్వవ్యాప్త 8-2-401; కరణఫలపరిత్యాగ ప్రవోదాత్తచేతః పరిణత సుఖపీఠ భ్రాజమానా (కర్మఫలత్యాగముచే

ఉదాత్తమైన చేతస్సనుపీఠమందు ప్రకాశించువాడా అనుట); 8-3-401; (కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన అను గీతావాక్యభావము; కర్మ ప్రాధాన్యము చెప్పుచు ఫలత్యాగబుద్ధిని ప్రశంసించుచున్నది) సాయం ప్రాతర్హుత ప్రజ్వలిత హుతవహస్వైర నిర్ధూత జాడ్య । స్వాయచ్చేతః ప్రసాదప్రస్పమర విమలప్రౌఢ బోధానుమోదీ (ఉదయాస్తమయములందు వేల్చబడిన ప్రజ్వలితుడైన అగ్నిదేవునిచేత స్వేచ్ఛగనే పోగొట్టబడిన అజ్ఞానరూపమైన జాడ్యము కలదగుటచేత వికాసము నొందిన మనస్సు యొక్క ప్రసాదత్వముచేత వ్యాపించు స్వచ్ఛమైన ఆత్మజ్ఞానమును అనుమోదించువాడా అనుట. విధ్యుక్తకర్మానుష్ఠానముచే మనస్సు నిర్మలమై అజ్ఞాన దూరమయి బ్రహ్మాత్మజ్ఞానము ప్రకాశించుననుట) 10-2-134; మఖతతి హ్యాతినిర్మాణ సంపాద్యమానా 10-2-134; హవ్యకవ్య ప్రసాద్యా 12-4-457.

3. వేదవ్యాస సంస్తుతి :

తిక్కన సోమయాజికి వేదవ్యాసమహర్షియందు గాఢ ప్రత్యయము కలదు. ఆ మునీంద్రుడు చేసిన కార్యములును అసాధారణములు. ఆయన వేదవిభజనము చేసెను. బ్రహ్మసూత్రముల నిర్మించెను. మహాభారతమును పెక్కుపురాణములను గ్రథించెను. శుకయోగీంద్రుని తండ్రి, భారతవంశవివర్ధనుడు, అద్వైత సిద్ధాంత ప్రతిపాదనమునందు తిక్కన సోమయాజి తనకు మిక్కిలి సన్నిహితుడైన ఆచార్యశంకరుని ఎచ్చటను పేర్కొనలేదు. వ్యాసమహర్షియే సర్వవేదాంత విజ్ఞానమునకు మూలకందముగా తిక్కన గ్రహించెను. 'విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు' 4-1-3; ప్రాంశు పయోదనీలతను భాసితు 6-1-71 మున్నగు పద్యములందు తిక్కనసోమయాజి తనకు బాదరాయణమునీంద్రుని యెడ గల గౌరవతాత్పర్యములను చక్కగా ప్రకటించెను. హరిహరనాథ సంబోధన పద్యములందు వ్యాసమునీంద్రుని ప్రస్తావనము తరచు వచ్చును.

వ్యాసాదిముని ప్రోక్తమ । హా సందర్భాప్రమేయతారూఢగుణో । ల్లాసా 5-2-333; సాత్యవతేయ భారతీప్రోక్త 5-3-413; సాత్యవతేయ వాఙ్మయ విశాల గృహస్ఫురిత ప్రదీపితా 7-1-395; జనవినుత బాదరాయణ మునీంద్ర వాగమృతనిధి సముద్భూతాహ్లా దనకీర్తిసుధాకిరణ 7-5-433; వేదవ్యాస వచోవిభవలక్ష్య 12-1-1; వ్యాసచేతోనివాసీ 12-4-457; వేదవ్యాస వచోవిభవవేద్య 15-1-1.

4. హరిహరుల అభేదసంకలనము :

హరిహరాత్మకమైన ఏకరూపమును కవిబ్రహ్మ బహుధా భావన చేసి బహుభంగుల, బహుచమత్కృతులతో తీర్చి మనకు ప్రత్యక్షము చేసినాడు. తన ప్రశస్తకవితానైపుణినంతను హరిహరనాథ చిత్రణమునందు వ్యక్తీకరించినాడు. ఇదియంతయు హరిహరనాథుని సాకారరూపమును భక్తులు భావనచేయుటకు వీలుగా వర్ణించుట. ఆయన ఆంతరము, నిరాకారము అయిన రూపము యోగ, సాంఖ్య, అద్వైత భావములతో నిండియున్నది. ఆరంభమునందే హరిహరనాథుడు కలలో తనకు ప్రత్యక్ష్యమైనప్పుడు ప్రదర్శించిన ప్రసన్నరూపమును తిక్కన వర్ణించినాడు.

కరుణారసము వొంగి తొరఁగెడు చాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువాఱ 4-1-12.

ఈ మొదటి పద్యమునందే హరిహరనాథుని మూర్తమైన రూపమును చిత్రించుటలో తానవలంబింపబోవు పద్ధతులకు కవిబ్రహ్మ బీజావాపము చేసినాడు. శశిరేఖ నమృతంబు జాలువార అనుటచే శంకరుని ఒక పంక్తిలో సూచించి, 'నాభిధవళపంకజము మెఱయ' అనుటచే రెండవ పంక్తియందు నీలమేఘశ్యాముడైన విష్ణువును సూచించినాడు. మూడవ పంక్తియందు 'గళంబుచాయ' అనుటచే కాలకంఠుని సూచించి, ఉరమ్మునఁ గౌస్తుభరత్న మొప్ప అనుటచే విష్ణువును జ్ఞప్తికి తెచ్చినాడు. గీతపాదద్వయమునందు సితాసిత దేహకాంతులు గల శివకేశవులను రూపొందించినాడు. హరిహరనాథుడు అసంతశక్తిమంతుడు. విశ్వాకారుడు. సూర్యచంద్రులాయనకు నయనములు అను మహాభావమును తనదక్షిణనేత్రమును, సుధారోచియ కా నను వింతలేక చూచి, 4-1-14 అను వాక్యమునందు వ్యంజింపజేసినాడు.

షష్ఠ్యంతములు మొదటి నాలుగు పద్యములలో గంభీరవేదాంతార్థములను ప్రతిపాదించినాడు. ఇవి హరిహరనాథుని అమూర్తస్వభామునకు సంబంధించినవి. 'ఆ దేవుడు ఓంకారవాచ్యుడు. అహంకారరహితమైన భావనచేతమాత్రమే తెలుసుకొనబడువాడు. మంత్రశాస్త్రము ఆయనకు అలంకారమైనది. అది హ్రీంకారమయము, హరిహరనాథుడు పాంచభౌతికమైన జగత్తంతను నిండియున్నాడనియు, విశ్వమంతయు ఆయనలో ఇమిడియున్న దనియు చెప్పుటకు అర్థవంతమైన రూపకములను కల్పించినాడు. ముల్లోకములను చిలుకకు ఆయన దృఢపంజరమైనవాడు. త్రిభువనముల కుబుసము హరిహరనాథుడను భుజంగమపతిని కప్పియుండును. ఆయన శ్రుతి సీమంతమణి, ఆశ్రితుల వాంఛలను పూర్తి చేయుటయందు చింతామణి. అజ్ఞానమను చీకటికి సూర్యుడు, శమనిరతులైన సంయమీంద్రుల మనస్సులను కుముదములను వికసింపజేయును ఆయన చరణనఖచంద్రికలు. ఇంతలో కవికి ఆ భగవంతుని మూర్తరూపము జ్ఞప్తియందు వెలసి ఇట్లు చమత్కారముగా పలికినాడు. హరిహరనాథునకు మందాకినీనది పాదభూషణము, శిరోవేష్టనము. అనగా విష్ణురూపుడైన ఆ దేవునకు సురనది పాదములందు పుట్టినది. శివరూపుడైన ఆయనకు జటాభూషణమైనది. హరిహరనాథమూర్తియందు భిన్నవస్తువులు సమన్వయించుట ఆయన అవలంబించిన యొక రమ్యమార్గము. 'వనమాలికా భుజంగాభరణా' (ఆభరణములలో వైచిత్రి. ఒకరికి తులిసిమాలయు, ఒకరికి పాములును భూషణములు, ధనుస్సమన్వయము) 4-1-38; అజగవశార్ఙ్గాలంకృత (ఒకే వస్తువు ఒకరికి ఒక విధముగను మరొకరికి మరొకవిధముగ ఉపకరించుట మరొకవైచిత్రి) 4-1-39. భుజగ సమాచరితశయన భూషణకృత్యా. (సర్పము విష్ణువునకు శయ్య, శివునకు ఆభరణము, ఒకచో అనంతుడు, మరొకచో వాసుకి, శివకేశవుల అత్తవారిండ్లు వేర్వేరు) 4-1-39, జలనిధిహిమవద్భూధర, కలిత జననకేళికౌతుక.. స్త్రీసనాథ (వారి స్త్రీ జనము వ్యక్తావ్యక్త లలితసౌందర్యము కలవారు. వారు లోకసామాన్య వనితలు కారు. ప్రకృతిస్వరూపిణులు) అనుట 4-1-40. సృష్టికార్యమునకు పూర్వముండునది అవ్యక్తరూపము సృష్టియనంతరము వ్యక్తరూపము. మహాకవి గూఢవేదాంతార్థములను ఇట్లు వ్యంజితము చేయుచుండును.

ఈ దేవతామూర్తిని మహాకవి పాదములనుండి మౌళివరకును ఆయావిశేషణములతో స్తుతించును. నిర్వృతిపణ్యాపణపదారవింద వికాసా (పరమశాంతియను వెలగల వస్తువునకు ఆపణమైన పదారవిందము కలవాడు) 4-2-364; పునర్భవ పరిహార హారి పదపద్మయుగ 8-1-320; సురమకుట ఘటితరత్న స్ఫురితచరణ 12-5-631; జరామరణనోదక పదస్మరణా 12-5-631; మహాశర్మాపాదన పాదపద్మ 13-2-476; వినుత చతుర్వర్ణక సంజనక ముఖభుజోరుపాద (చాతుర్వర్ణ్యమునకు సంభవకారణమైన ముఖాద్యంగములు కలవాడా) 14-2-227; అజరామరపదకరపదభజనా 14-4-286.

హరిహరనాథుని పరిధానము :

1. పరిధాన ప్రావరణీకరణాదృత పీతవసనగజచర్మ 7-3-309.
2. పీతస్ఫీత సామాజగత్వగ్వసనా 15-1-185

వక్షశ్శోభ :

1. శ్రీమత్తులసీపల్లవ దామచ్ఛవిలబ్ద మరకతప్రతిమత్వోద్దామప్రభాస్థిమాలా శ్యామాయిత విపులవక్ష (తద్గుణాలంకారము) 5-4-1.
2. భసిత పరభాగ హేలాలసిత శ్రీవత్సలలిత లాంఛన 6-3-454.
3. వనమాలికోరగహార పరిష్కారసార 7-3-1
4. తులసీదళదామ కపాలమాలికాభావిభవాభిరామ 18-1-95.

భుజములు :

నిష్ఠుర భుజసార 4-2-363; కరఖేలచ్చక్రశూలా 10-1-338; స్మయభయదర్పిత క్షుభిత సామజమర్దన రక్షణక్రియాశ్రయణ విలాస భాసురభుజా 12-3-529; (గర్వముచేత దర్పితమైనట్టియు భయము చేత క్షుభితమైనట్టియు సామజములను

మర్దించుట రక్షించుట అనుక్రియలకు ఆశ్రయమైన భుజవిలాసము గలవాడు. క్రమాలంకారము. శివునిగజాసుర సంహారమును విష్ణువు గజేంద్రమోక్షణ వృత్తాంతమును స్మరింపవలెను.)

నేత్రములు :

రవిశశిమయనేత్రా 4-3-415; దివాకరచంద్ర కృశానులోచనా (త్రిలోచన వైభవము); 8-3-3939; దేవతాసుర పరిరక్షణోన్మథనశోభి కటాక్షవిహార - (క్రమాలంకారము) 12-4-455, లసదపాంగోత్సార్యమాణాశ్రితార్తీ - 13-2-478.

మౌళి :

పింఛ ప్రసృమరరుచి శబలోరగ విసృమర దీధితి కలాపవేష్టితమౌళీ 6-3-454 సరిద్వరా బర్హి బర్హ చారుశిరస్కా 10-2-135; పింఛదామ భుజగాభరణా 12-5-631; సోమపింఛాభిరామా 13-3-347.

కేతనములు :

ద్విజపతి వృషభాంకోదీర్ణ 8-2-401; తార్క్ష్యశాక్వరమహామూర్తిస్ఫురత్కేతనా 12-1-398; గరుడ వృషపతాకా 13-1-388.

వాహనములు :

సముద్ధురవాహనీకృతోజ్జ్వల గరుడ వృషభ 7-3-309

లక్ష్మీపార్వతుల యాలంబనముచే నైన హరిహరనాథుని మూర్తి సౌందర్యమును మహాకవి పెక్కువిధముల ప్రత్యక్షీకరించును.

శ్రీగౌరి పల్లవపుటయోగాశ్రయమంజరీ సముజ్జ్వల మూర్తీ 5-1-1;
లక్ష్మీరమణత్వ శివాప్రియతా సమవాయాలంబ్యమాన సౌందర్యనిధీ 8-1-321;
శ్రీ గిరిజా సమవాయ మహాగురుతర సుభగ సంపదాలంబ 9-1-1.

గమనిక : లక్ష్మీపార్వతులకు హరిహరనాథునితో నుండు సంబంధము సమవాయసంబంధ మని తిక్కనసోమయాజి సూచించినాడు. సంబంధము రెండువిధములు. సంయోగసంబంధము, సమవాయ సంబంధము. సమవాయము నిత్య సంబంధము 'నిత్యసంబంధ స్సమవాయః' లక్ష్మీపార్వతులు ప్రకృతి స్వరూపిణులు. ప్రకృతికి పురుషునితో నిత్యసంబంధమును వేదాంతము చెప్పును. లక్ష్మీపార్వతులు తత్త్వమూర్తులే కాని లౌకికవనితలు కారని క్రింది సంబోధనమున కవి చెప్పుచున్నాడు.

మా గౌరీత్వోజ్జ్వల తత్త్వభాస్కర 17-1-77. దీనిని బట్టి పాల్కురికి సోమనాథుని వంటివారు చేసిన ఆక్షేపణలు పేలవము లనియు పారమార్థికములు కావనియు నిశ్చితమగుచున్నది. ఆ దేవునకు మిత్రులును లేరు. శత్రువులును లేరు. మన్మథు డాయన కొకప్పుడు కుమారుడు. ఒకప్పుడు వైరి. క్రింది సంబోధనములలో నిది సూచితమగుచున్నది.

రతిపతి హితాహితాక్షా 5-1-384; సంజనిత సముపసంహృత మదనా 13-1-387; "పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతామ్" అను గీతావాక్యముమేరకు భగవంతునకు దుష్టవర్తనులే శత్రువులు. శిష్టవర్తనులే ఆప్తులు. ఈ భావము హరిహరనాథసంబోధనములందు ఎడనెడ వచ్చుచునే యుండును. ఆ దేవుడు సంహారకారకుడు.

దానవ నిషూదన 4-2-363

చక్ర త్రిశూల ధారణరక్షో భీకర 7-2-1

దుర్దమ దనునూను సంచయవిదారణ 7-5-431

చక్రపరశుచ్ఛిన్నాసురానీక 15-1-184

(భగవంతుడు ధర్మమునకు కవచము. భక్తపరాధీనుడు)

భక్తి నిగమానుభవోజ్జ్వల దివ్యవర్మ 4-5-405

భక్తసంపోషణశాలీ.... సదవనపరచిత్తా 14-2-228

ధర్మసరోజాసీన 6-2-1; ధర్మశీలానురక్తా 7-1-240

ధర్మపాలనా 13-1-368

శ్రీధర్మ కామహృదయ సమాధానాధాన కారకాంఘ్రియ సరోజా 16-1-1

దుశ్శీలాంతఃకరణావిభావ్య 16-1-224

(హరిహరనాథుని మార్గము సచ్చిదానందపథము. అది సరళమార్గము)

సమయ బహుత్వారణ్య పరిశ్రామ్యదంతరంగ నితాంతోత్తమ సరళమార్గదర్శన సమర్థ! - పెక్కుమతములను అరణ్యామార్గముల సంచరించి మిక్కిలి శ్రమగొన్న మనస్సునకు ఉత్తమ సరళమార్గమును చూపగల తెరువరి హరిహరనాథదేవుడు. 5-4-427 'గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే' అను శివానందలహరీ శ్లోకభావము ననువదించుట.

శశ్వదాహ్లాదవర్మా 7-2-383

శాశ్వతానందమూర్తీ 7-5-438

వైభవానందదీపా 11-1-189

భాస్వదానందమార్గా 12-6-624

నిష్కలానందమూర్తీ 13-5-484

దర్శితానందవర్మా 14-4-287

హరిహరనాథలీలలు - మహిమలు :

లోకామయ నిర్హరణ నిపుణ 4-2-1

శ్రీవాగ్విభవారోగ్య ప్రావీణ్య ప్రాభవానుభావమహిత సౌఖ్యావహ పదస్మరణ 5-3-1

(భగవంతుని పాదస్మరణము సమస్త వైభవముల నిచ్చునది అనుట)

ఘోర సంసార దురామయా పదవసాయక 6-2-408

జననమరణ దుఃఖోత్సారి 7-1-397

జగజ్జనిస్థితి ప్రలయవిధానకేళి పరిపాటి వికస్వర 7-2-381

(హరిహరనాథుడు సృష్టిస్థితి సంహారకారకు డనుట)

రసాత్మక 8-1-320

'రసోవైసః' అని యుపనిషత్తు.

నిరవధి పరిణాహా 8-3-401.

భణన మనన దూరస్ఫార విస్తారసీమా - 9-1-405

'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని యుపనిషత్తు. విస్తర మహనీయ తార్కిక వచః కలనానభిగమ్య 12-4-455. తర్కకౌశలముచే సాధింపబడదు అనుట. భక్తిగమ్యుడు.

అకలుష హృదయాంతర్యాగ సంసిద్ధమూర్తీ 13-2-478

అంతర్యాగముచే సిద్ధించువాడనుట. దంభపూరిత బహిర్యాగములచే కాదనుట.

పాపకబహుదివ్యనామ 13-5-482

కాలస్వైరవిహార భంజన కళాకౌతూహల స్తవ్య 16-1-224. కాలము మహాప్రభావము కలది. అది ఎట్టివారికిని దుర్వార్యము, హరిహరనాథుడు కాలముయొక్క స్వైరవిహారమునకు అతీతుడు కాడు అనుట. ఈ భావమునే కవీంద్రుడు మరియొకచోట ఇట్లు ప్రకటించెను.

నవతాదూర, పురాణతానుపగతా, నానాత్వ సంశోభితా 4-4-275 అతడు నవ్యుడు పురాణపురుషుడు అనుట. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అనుభావమును మహాకవి ఇట్లు ప్రదర్శించెను.

సూక్ష్మతర సంభాసా, మహాస్థూలమూర్తి విశేషా 4-4-275

వ్యాస సమాసైకరూప 4-5-1.

ఇట్లు బహుముఖములుగా హరిహరనాథుని మూర్తరూపమును సాధారణభక్తుల కర్థమగునట్లు చిత్రించి శివకేశవుల యభేదము వారిమనస్సులకు హత్తుకొనునట్లు తిక్కనసోమయాజి కావించినాడు. లోకమునందు ముగ్ధభక్తులును ఉన్నారు. 'నీటికొలది తామరసుమ్మీ, యన్నట్లు ఎవరి అధికారమునకు తగినట్లు వారికి పరతత్త్వనిర్దేశము చేయవలెను. 'యే యథా మాం ప్రపద్యంతే, తాం స్తథైవ భజామ్యహమ్' అని భగవంతుని వాక్యము. హరిహరనాథుని అమూర్తరూపమును అందుకొనుటకు యోగము, సాంఖ్యము, వేదాంతము మొదలగు జ్ఞానమాత్రసాధ్యములైన దుర్గమపథములు కలవు. అధిగతపరమార్థుడైన తిక్కనసోమయాజికి అవియును సుపరిచితములు. ఇక ముందు వాని వెంట పాఠకుని గొనిపోవుచున్నాడు.

యోగము :

'యోగ శ్చిత్తవృత్తినిరోధః' అని మనోవ్యాపారములను అరికట్టుటచే అది క్షుద్రలౌకిక వృత్తులనుండి మరలి భగవంతునకు ఉన్ముఖ మగునని యోగులు భావింతురు. మనస్సు అతిచంచలము. 'చంచలం హి మనః కృష్ణ!' అని అర్జునుడు నిర్వేదముతో పలికినాడు. అట్టి మనస్సును నియమించుటకు ఏర్పడిన కట్టుత్రాళ్ళు యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన

ధారణా సమాధులు. దీనినే అష్టాంగ యోగమందురు. యోగము రెండు విధములు. అభ్యాసయోగము, క్రియాయోగము. యమనియమాదు లభ్యాసయోగము, రెండవది జ్ఞానయోగము. దీనినే రాజయోగమనియు చెప్పుదురు. అభ్యాసయోగమున యమనియమాసన ప్రాణాయామములు పూర్వయోగము. ప్రత్యాహార ధ్యానధారణాసమాధులు ఉత్తరయోగము. రేచక పూరక కుంభకములు ప్రాణయామాంగములు. దేహాభ్యంతరమున ఆరు నాడీకేంద్రములు కలవు. వీనిని షట్చక్రము లందురు. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రములు బ్రహ్మదండియనబడు వెన్నెముక వెంటనుండును. బ్రహ్మదండినంటియే మూడు ప్రధాననాడులు దేహమునందు ఊర్ధ్వముఖముగ ప్రసరించును. అవి ఇడా, పింగళ, సుషుమ్న యనబడును. ఇడా, పింగళలు సుషుమ్నకు ఉభయపార్శ్వముల చెలగును. ఇడా పింగళలకు పితృయాన దేవయానములను సంకేతము కలదు. ప్రాణాయామముచే కుండలిని యను పరాశక్తిమూలాధారమునుండి ఊర్ధ్వాభిముఖముగా సంచరించి షట్చక్రముల తాకుచు సహస్రారమనబడు బ్రహ్మరంధ్రము పర్యంతము విజృంభించుననియు, అచ్చటినుండి యమృతము స్రవించుననియు యోగజ్ఞులు చెప్పుదురు. యోగమునందు నాదబిందుకళలను త్రిపుటికి విశేషప్రాధాన్యము కలదు. నాదమనగా ప్రణవము నుండి యుద్భవించినది. యోగసిద్ధులు మాత్రమే దీనిని ఆకర్ణింపగలుగుదురు. బిందువనగా జీవుడనియు, అన్నమయాదిపంచకోశములలో నొక్కటైన విజ్ఞానకోశమనియు, ఇచ్చట బుద్ధి యుండుననియు, బుద్ధియే బిందుస్థానమనియు చెప్పబడుచున్నది. కళ యనగా విజ్ఞానకోశము నందు ప్రతిఫలించు ఆనందకోశము యొక్క తేజోంశము. ఆనందమయకోశము బ్రహ్మస్థానము. కావున బ్రహ్మము జీవునియందు ప్రతిబింబించుట కళ యనదగును. అట్లే హంసశబ్దమునకును యోగశాస్త్రమునందు గొప్ప ప్రమేయము కలదు. హకారము బ్రహ్మమనియు, సకారము మాయాస్థానమనియు ఈ రెండింటినడుమ నున్న బిందువే జీవుడనియు యోగవేత్తలు భావింతురు. ఇట్లు గహనమైన యోగసాధనచే చిత్తవృత్తులు శమించి బ్రహ్మసాక్షాత్కారమగునని యోగతంత్రజ్ఞులు విశ్వసింతురు. క్లేశబహుళమైన అభ్యాసయోగముకన్న జ్ఞానయోగము మేలని కొందరు తలతురు. తిక్కనసోమయాజి యోగవిద్యానిపుణుడని ఆయన చేసిన ప్రసంగములవలన విశదమగును. హరిహరనాథుని చేరుటకు యోగము మహత్తర సాధనమని యాతని మతము. షట్ప్రమాణ పరమ దూర 4-3-238

ప్రత్యక్షాది ప్రమాణ సాధ్యుడు కాడనుట. భగవంతుడు విపుల తర్కవాక్యముల కందడని ఇదివరకే చెప్పనైనది.

దేవపితృ పథప్రవర్తన 4-3-238 ఇడా పింగళా నాడులు పితృయాన దేవయానములు.

నిర్భరనిష్ఠా మర్దిత వివిధ వికారామల చేతోనివాస 4-4-1

అవగమిత రహస్యాష్టాంగ సమ్యక్ప్రకారోత్సవ గురు కరుణా విస్తార 5-4-428. గురువు కరుణా విస్తారముచేతనే రహస్యమైన అష్టాంగయోగము సుసాధ్యమనుట.

నాసాగ్ర నివాసరసిక, నాదామృత ధారాసారరూప 6-1-1

యోగానుభావ్యా 6-1-306

హంస నాదైక వేద్యా 6-2-410

నాదాంతస్సార; వాదవిదూరా 7-1-396 లలిత చతుర్దళాఢ్యకమల ప్రసవ ప్రసరత్సరస్వతీ విలసన సౌరభోద్గమ నివిష్ట 7-2-381. మూలాధారచక్రము చతుర్దళకమలము. అచ్చటినుండి సరస్వతీవాహిని ప్రసరించును. సుషుమ్నానాడికి సావిత్రి సరస్వతియను సంకేతములు కలవు. ఇడా పింగళలు గంగాయమునలు - బ్రహ్మము సుషుమ్నయందు నివిష్టమై యుండుననుట.

బిందు చిదాత్మనాదమయపీఠ చతుష్కలసద్విహార 7-4-34

శమదమ పరివర్తీ 7-5-433

అవిరళ దర్శన స్థిర మహాముని మానసవాస ఖేలనోత్సవరసికా 8-1-320

హంసభావైకగమ్యా 8-1-322

పశ్చిమ నాడీసరణ 9-1-404. పశ్చిమనాడి యనగా పింగళనాడిగా తోచును. అది దేవయానసంజ్ఞికము. భరిత వికసనాంతః పద్మనిశ్రేణికా - ఇత్యాది 9-2-422. పద్యమునందు యోగసిద్ధాంత క్రమమంతయు సంగ్రహరమ్యముగా చెప్పనైనది. అంతః పద్మములు షట్చక్రస్థానములు - బ్రహ్మదండి నిశ్రేణిక. కుండలినీ శక్తి ప్రాణాయామబలముచే మేల్కని షట్చక్రములను నిచ్చెనమీదుగా ఎక్కి సహస్రారమను చంద్రబింబమునుండి స్రవించు అమృతమును గ్రహించి ఆనందరూపమున పర్యవసించును.

యమనియమాద్యష్టాంగ క్రమాభ్యసన నిర్మథిత వికార సుచేతః కమలామోదమయాత్మా 12-2-448

యోగభావ్యైకరమ్యా 12-5-632

పవన విజయలీలా ప్రౌఢ చేతోనివాసా 14-1-233

సతతాభ్యాస వికాసి సమాధి సమాసాదిత శాంతిలోల 14-2-1

పశ్చిమనాళ నందితా 14-2-226

మాన్యయోగప్రతోషీ 14-2-228

పాశ్చాత్యనాడికార్ద్రవ్యజనా 14-4-286 పశ్చిమనాడి పింగళనాడియైనచో యమునాసంకేతముగల ఈ నాళము హరిహరనాథునకు చల్లనితాళవృంత మగుట యుక్తముగానే యున్నది.

యమనియమాది ప్రావీణ్యాపూర్ణమిత్ర 18-1-1 యోగశక్తి విశదాద్భుత ఖేలన 18-1-95

సాంఖ్యము :

సాంఖ్యము ప్రాచీనదర్శనము. సృష్టినిర్మాణమునందలి వివిధ తత్త్వములను సాంఖ్యులు నిపుణతతో పరిశీలించి ప్రదర్శించిరి. వీరు ఇరువదియైదు తత్త్వములను ప్రతిపాదించిరి. అందు రెండు అత్యంత ప్రధానములు. పురుషుడు చేతనుడు. ప్రకృతి జడము. తత్కారణముగా దానినుండి ప్రభవించిన సమస్త పదార్థజాతమును జడము. పురుషుడు జీవులకు మూలము. జీవులు అనంతము. పురుషుడు నిష్క్రియుడు. అసంగుడు. స్వతఃశుద్ధుడు. తామరాకును నీరు అంటని విధమున సుఖదుఃఖము లితనిని అంటనేరవు. అయినను అవి బుద్ధియందు ప్రతిఫలించుటచే పురుషుడు బుద్ధితో తాదాత్మ్యమును పొంది సుఖదుఃఖములను తాను అనుభవించుచున్నట్లు భావించి మోదవిషాదముల నొందును. జడప్రకృతి సంసర్గముచే ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, అధిదైవికములైన త్రివిధ దుఃఖములకు పాల్పడును. ఈ విధముగ పురుషుడును, ప్రకృతియు, కుంటివాడును, గుడ్డివాడును కలిసి పయనించినట్లు సృష్టిలీలను నిర్వహింతురు. బుద్ధితాదాత్మ్యముచే గలిగిన బంధమునుండి పురుషుడు విడివడుటయే కైవల్యము. దీనికి జ్ఞానము ఆవశ్యకము.

సాంఖ్యులు ఇరువదినాలుగు తత్త్వములను పరిగణించి చెప్పిరి. సృష్టిక్రియ కంతకును ఆద్యమైనది మూలప్రకృతి. అది దేనికిని వికృతి కాదు. దానినుండి మహత్తు(బుద్ధి), దానినుండి అహంకారము జనించును. అందుండి పంచతన్మాత్రలు (శబ్దస్పర్శ రూపరస గంధములు) ఉద్భవించినవి. ఇవి ఏడును ప్రకృతివికృతులు. అనగా నివి మీదితత్త్వములకు వికృతులు. క్రింది తత్త్వములకు ప్రకృతులు. కేవలవికృతులు పదునారు. పంచమహాభూతములు జ్ఞానేంద్రియకర్మేంద్రియములు, మనస్సు,

ప్రకృతి క్రియాశీలము, పురుషుడు తటస్థుడు, ప్రకృతి త్రిగుణాత్మకమైనది. మూలప్రకృతియందు సత్త్వరజస్తమోగుణములు సామ్యావస్థయందుండును. సత్యము సుఖమును, రజస్సు దుఃఖమును, తమస్సు మోహమును జనింపజేయును. గుణత్రయమునందలి సామ్యావస్థ పరిత్యజింప బడుటచే ఆయావస్తుసృష్టి జరుగుచున్నది. కారణమగు మూల ప్రకృతియందు గుణత్రయ ముండుటచే కార్యములైన సృష్టిపదార్థము లన్నింటను గుణవ్యవస్థ సంక్రమించినది. మట్టివిత్తనమునందు వటవృక్షమువలె కార్యమగు జగత్తు కారణమగు ప్రకృతియందు లీనమైయున్నది. మట్టి, నీరు గాలితో సంబంధం కల్గినప్పుడు విత్తనమునుండి వటవృక్షము అభివ్యక్తమగుచున్నది. లేని పదార్థమునుండి ఉన్న పదార్థము పుట్టుట అసంభవము గనుక జగన్నిర్మాణకారణమైన ప్రకృతి అసత్తు అనుటను సాంఖ్యులు అంగీకరింపరు. వేదాంతులు చెప్పినట్లు జగత్తు మిథ్య యనుట వీరికి సమ్మతము కాదు. సాంఖ్యులు ఈశ్వరతత్త్వమును అంగీకరింపరు. జగదావిర్భావమునందు ఈశ్వరునకు ప్రసక్తియే లేదని వీరి మతము. ప్రకృతియే అంతయు నిర్వహించునని వీరి విశ్వాసము. కావున ప్రాచీన సాంఖ్యము నిరీశ్వరమను ఖ్యాతిని పొందెను. అయినను సాంఖ్యులు వేదప్రమాణము నంగీకరింతురు. పునర్జన్మయందు వీరికి విశ్వాసము ఉన్నది. కావున సాంఖ్యము ఆస్తిక దర్శనములలోనే పరిగణింపబడుచున్నది.

అద్వైతము :

వేదాంతులు సాంఖ్యదర్శనమునందలి భావములన్నిటిని గ్రహించి దానికి ఈశ్వరుని చేర్చి, తమ సిద్ధాంతమును ప్రతిపాదించిరి. మహాభారతమునందు కేవలసాంఖ్యము ప్రతిబింబించదు. ఈశ్వరసహితముగనే సృష్టిక్రమమంతయు వివరింపబడును. సాంఖ్యులు పురుషునితో కలిపి పంచవింశతితత్త్వములను ప్రతిపాదింపగా వేదాంతులు షడ్వింశుని కూడా చేర్చి ఇరువదియారు తత్వములను గ్రహించిరి. జడ మగు ప్రకృతి, ఈశ్వరచైతన్యము గల జీవుడు లేక ప్రత్యగాత్మ. జీవుని అధిగమించి సచ్చిదానంద లక్షణములు గల పరమాత్మ - ఇది వీరి తత్త్వక్రమము. "క్షరః సర్వాణి భూతాని, కూటస్థోఽక్షర ఉచ్యతే, ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపిచోత్తమః అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః" పంచదశాధ్యాయమున గీతావాక్యము. సర్వభూతములు క్షర మనబడును. కూటస్థుడు (జీవాత్మ) అక్షరుడు అనబడును. వీరిని మించిన తత్త్వము పరమాత్మ యనబరగుచున్నది. ఇది ముల్లోకములను ఆవరించి భరించుచున్నది. అక్షర తత్త్వమునకు పురుషుడు అను వ్యవహారము కూడా నుండుటచే సర్వాతిశాయియైన పరతత్త్వమును పురుషోత్తముడు అందురు.

శ్రుతివాక్యములను భిన్నప్రస్థానముల వారు భిన్నరీతుల అన్వయించిరి. ద్వైతులు జీవేశ్వరులకు భేదమునే నమ్ముదురు. విశిష్టాద్వైతులు బ్రహ్మము సగుణము, అనంతకల్యాణగుణయుక్తము అని భావింతురు. అద్వైతులు జీవేశ్వరుల కభేదమును నిశ్చయించిరి. వీరు జడపదార్థమైన ప్రపంచము కూడా బ్రహ్మాభిన్నమనియే చెప్పుదురు. అద్వైతుల దృష్టియందు సత్పదార్థమంతయు ఒక్కటే. అదియే బ్రహ్మము. వీరు 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా నేహనా నాస్తికించన సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ తత్త్వమసి' ఇత్యాది శ్రుతివాక్యముల నాశ్రయించి తమ ఆధ్యాత్మికవిచారణను సాగించిరి. జీవాత్మ బ్రహ్మచైతన్యమునకు మారురూపమని వీరి మతము అయినచో జీవుడు సంసారగతుడై సుఖదుఃఖములు పొంద నేల? అను ప్రశ్న రాగా, అవిద్యచే నాతడు ప్రకృతి కధీనుడై దేహాత్మ భ్రాంతి కలిగియున్నాడని వీరి సమాధానము. అవిద్య తొలగగనే జీవగతాత్మ శుద్ధమై తాను పరమాత్మ అంశమే కాని జడమైన ప్రకృత్యంశము కాదని తెలిసికొనును. అవిద్యావరణచ్ఛేదమే మోక్షహేతువు.

సృష్టివిధానమును అద్వైతులు ఇట్లు అన్వయింతురు. బ్రహ్మముకంటె జగత్తు వేరు కాదు. అదియు బ్రహ్మపదార్థమే ఇది యెట్లు? ప్రకృతి శుద్ధజడము పూర్ణచైతన్యము బ్రహ్మమూ, జడమూ చైతన్యమని యెట్లు చెప్పనగును? అను ప్రశ్నకు వీరిట్లు సమాధానము చెప్పుదురు. సృష్టికి బ్రహ్మమే ఉపాదానకారణము. కార్యమైన జగత్తు కారణమైన బ్రహ్మము కన్న వ్యతిరిక్తముగా ఉన్నది కదా యన్నచో ఇది వివర్తోపాదానమే అని అన్వయింతురు. ఉపాదానము రెండు విధములు.

పరిణామోపాదానము, వివర్తోపాదానము. క్షీరము దధిగా మారుట పరిణామోపాదనమునకు ఉదాహరణము. శుక్తిరజత భ్రాంతి వివర్తోపాదానమునకు ఉదాహరణము. వివర్తోపాదానమునకు మూలము భ్రాంతి లేక మోహము అని చెప్పవచ్చును. ముత్యపుచిప్పయందు వాస్తవముగా వెండి లేకున్నను ఉన్నట్లు భాసించి సంతోషమును కలిగించుచున్నది. అట్లే జగత్తు మిథ్యాపదార్థమైనను సత్యమువలె భాసించి మోహకారణమగుచున్నది. జగత్సృష్టికి మూలమైన ఈశ్వరశక్తిని అద్వైతులు మాయ అని వ్యవహరింతురు. ఈ మాయయొక్క తత్త్వము తెలియరాదని చెప్పుదురు. 'మమ మాయా దురత్యయా' అని గీతయు నుడువుచున్నది. ఈశ్వరగతమైనప్పుడు మాయ యనియు జీవగతమైనప్పుడు అవిద్య యనియు దీనికే సంకేతములు. ఇవి తొలగినప్పుడు జీవాత్మ వాస్తవముగ తాను పరమాత్మ సంబంధియనియు, ప్రకృతి కాదనియు పరమార్థమును తెలిసికొనును. వేదాంతులుకూడ సాంఖ్యులు గుణవాదమును అంగీకరింతురు. బ్రహ్మము మాత్రము గుణాతీతమని వారి భావన. మాయతో కూడిన బ్రహ్మ పరాంశమే సృష్టికార్యము నిర్వహించు ననియు వాస్తవముగా బ్రహ్మము నిష్క్రియ మనియు వారు ప్రతిపాదింతురు.

తిక్కనసోమయాజి బాదరాయణ మహర్షి ప్రోక్తమైన అద్వైతమునందు పరమ ప్రమాణబుద్ధి కలవాడు. మధ్యమాధికారులకు హరిహరనాథరూపమును మూర్తముగ చిత్రించి చెప్పినను వేదాంతదృష్టితో ఆయన నిర్గుణ నిష్క్రియ శుద్ధ పరబ్రహ్మమనియే బహుధా ప్రపంచించి స్తుతించెను. తిక్కన మతములో మోక్షసిద్ధికి కేవలజ్ఞానము చాలదు. హరిహరాభేద జ్ఞానము కాని బ్రహ్మైక్యజ్ఞానము కాని భక్తి సహితమైనప్పుడే ఫలము నిచ్చును. భక్తిరహితమైన శుష్కజ్ఞానము ఫలసిద్ధి కావింపదని సోమయాజి నిశ్చయము. కావుననే గ్రంథారంభ పద్యమందే 'భక్తజనంబు వైదికధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్' అని ప్రకటించినాడు. వైదికధ్యాయిత ఆయనకిష్టమే కాని అది భక్తజన సంబంధియైనచో భగవంతునకు ఎక్కువ కూర్చునని సోమయాజి సందేశము. ఈ భావమునే 'వైదికమార్గ నిష్ఠమగు' అను పద్యమున విశదము చేసినాడు. హరిహరనాథుడు తిక్కనసోమయాజి 'భేదము లేని భక్తిని' అనుగ్రహముతో ప్రశంసించినాడు. భక్తి సూచకముగా తిక్కన చేసిన స్తుతులు అసంఖ్యాకములు. నిరీశ్వరమైన సాంఖ్యమునకు ఆయన సుముఖుడు కాడు గనుక సేశ్వర సాంఖ్యమునే ఆశ్రయించి హరిహరనాథుని స్తుతించును. వేదాంతమునందు ఆయనకు అభిమతమైన మార్గము అద్వైతపథము. క్రింద నీయబడు ఉదాహరణములలో భక్తి, సేశ్వరసాంఖ్యము అద్వైతముల ఉజ్జ్వల వర్ణకిర్మీరము శోభిల్లును.

భవపాశబంధ సంబంధ విరామరామ; పరిపక్వవివేక నిరూఢ భక్తహృద్గ్రంథి విభేదనా 4-1-333.

అన్నమయత్వాది విరామోన్నతః జగదాధారా 4-1-334

గుణతత్త్వవికార నియత్యభేద్య 4-2-363

శ్రీత్వ శివాత్వాలంబన 4-3-1 అను ఈ చిన్న కందపద్యములో అద్వైత వేదాంతమంతయు ఇమిడ్చినాడు. హరిహరనాథ రూపబ్రహ్మము వాస్తవముగా కర్తృత్వరహితము. ఐనను స్వేచ్ఛచేతనే ఆయన లక్ష్మి పార్వతి యను తత్త్వాశ్లేషముచేత శబలితుడై జగత్కర్తృత్వాది లక్షణము కలవాడగుచున్నాడు. అనగా నిష్క్రియుడు క్రియాశీలి అయినవాడు. ప్రకృతి రూపములైన లక్ష్మీ పార్వతీతత్త్వమునుండి మహదహంకారము లుద్భవించుచున్నవి. మహదహంకారాది వికృతుల కతీతుడైన యాశుద్ధ బ్రహ్మమే స్వలీలచేత వాటితో కూడినట్లు భాసించుచున్నాడు.

నిరుపాధికా, గుణమయా, నిష్క్రియా 4-4-275

అంతఃకరణ చతుష్టయ శాంతిసముద్య ద్వివేక సంపద్వేద్యా 4-4-276

పురుషత్రయతా వివృతస్వభావ 4-5-405

దుర్వహ పటుతాపత్రయ నిర్వాపణకరణ 4-5-406

సాక్షిత్వ నానా జగదవనపిధానస్థైర్య దత్తావధానా 4-5-407

యోగీంద్ర సంతతాంతర్యాగ పరీపాకరూప 5-1-1

ఇద్ధమాయావిలాసా 5-1-385

నిత్యానిత్య వివేకవైభవ సమున్నిద్రాంత రంగస్ఫుట ప్రత్యక్షా 5-2-332

నైర్గుణ్య సముద్భాసి రహస్యానుభావ 5-2-333

గుణవర్జన, నిష్కల, నిత్యపుష్కలా 5-3-413

వికారవిదూర విలాసభాస్వరా 6-1-304

దూరాంతిక దుర్గమవిస్తార 6-1-305

(దూరస్థం చాంతికే చ తత్ - భగవద్గీత)

కర్మ సమ్మర్దనిరాసకర్మఠ 6-3-452

క్షరణ రహితవృత్తి 6-3-454

వివిక్త యుక్త జనకౌశలభావిత 7-1-395

మూల విద్యానవద్యా 7-2-383

నిరుపమ గుణరాశీ - నిర్గుణత్వ ప్రకాశీ 7-3-310

ఈ పద్యమంతయు అన్వయ వ్యతిరేకములచేత హరిహరనాథ బ్రహ్మమును ప్రతిపాదించుచున్నది. ఆయన గుణరాశి. నిర్గుణుడు. నిర్మాణకార్యము నిర్వహించువాడు. అయ్యును నైష్కర్మ్యధుర్యుడు. ఆయన స్ఫురిత బహుశరీరుడు అయ్యును శుద్ధవైరూప్యసారుడు.

మోహవ్యతికరతిమిర ప్రధ్వంసనాదీపరూపా 7-4-337

వీతరాగాదిగమ్యా 7-5-433

సత్త్వనలినగంధరూప; నిత్యనిష్క్రియా 8-2-399

ప్రమితివిదూరా 8-2-400

కేవల సత్త్వసద్మ మాయా వ్యవధూత్యేకాయనగమ్యా 9-2-1 (మాయానిరసనమను ఏక మార్గముచేత పొందదగినవాడు అనుట).

మాయా వ్యాపారదూరా 10-2-134

ప్రకృతి వికృతి భావప్రాప్త సాంఖ్యప్రదీప్తా 10-2-136

'మూలప్రకృతి రవికృతిర్మహదాద్యాః ప్రకృతి వికృతయః' అని సాంఖ్యవేత్తల భావము.

సత్యత్వానంతత్వ నిరత్యయ శుభసారమయ సమగ్ర వికాసా 11-1-188 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అని శ్రుతి.

సదసదనభిషిక్తా 11-1-189 'నసత్తన్నా సదుచ్యతే' గీతావాక్యము.

త్వంతాహంతా నిరసన శాంతాంతః కరణయోగి జనవిజ్ఞేయా 11-2-186 తత్వమసి, అహంబ్రహ్మాస్మి మున్నగు మహావాక్యముల సారము.

నివృత్తి లంపటచిత్తోల్లాసన దక్షా 12-1-1

మాయా వినిర్ముక్త ద్యోతన 12-1-398

ప్రకృతి పురుషయోగీ 12-1-400 ఇది అచ్చుపుసాంఖ్యభావన, వేదాంతమునందు రెండవదశ.

వీతకారణా 12-4-455

కామదూరానుభావ్యా; యమనియమ వికాసీ 12-4-457

జరామరణనోదక పదస్మరణా 12-5-631

సంగనిర్ముక్త భావ్యా 12-5-632

వ్యామోహవిదూర 13-1-1

మనోంతర్ముద్రా లతికాఫలత్వలసితా 13-2-476

ప్రమద విషాదాదిద్వంద్వ మలావిహితాంతరంగవాసా 13-2-477 స్థితప్రజ్ఞుడు ద్వంద్వాతీతుడని గీతలో బహుధా చెప్పనైనది.

వికృతిదశక షట్క స్వీకృతి ప్రౌఢవర్తీ 13-2-478 షోడశవికారములు సాంఖ్యభావన అపగత కామరోషహృదయాంతరఖేలన కల్య (13-3-345) (అరిషడ్వర్గ నిరసనము).

సత్వాధిష్ఠాన; తత్త్వంపదార్థరూపా 13-3-346 త్రుటితాపత్వ సమున్నతాశ్రితజనా 13-4-449

గుణసమతాను భూతిహృతికోవిద సార వివేక భవ్య 14-1-231

సృష్టికి పూర్వము మూలప్రకృతియందు గుణసమత్వముండునని సాంఖ్యులు.

నవ్యత్వపురాణత్వ దశావ్యపనయ దుర్నిరూప సౌందర్యా 14-1-232

అనపేక్షిత ఫలతాశోభన మహనీయక్రియా విపాకాత్మక 14-3-227

ఫలాభినంది లేని మహనీయుల క్రియాపరిణామమైనవాడు. అనగా హరిహరనాథుడు ఫలాపేక్షలేని కర్మచేత అభిగమ్యుడు. ఫలాపేక్షతో చేసిన కర్మకు స్వర్గాదులు గమ్యము కావచ్చును. జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత - శ్రుతి

తరుణ జరఠభావద్రావణోదారమూర్తీ 14-3-228 (భగవంతుడు నిత్యతరుణుడు. నిత్యవృద్ధుడు అనుట.)

ఆశాపాశవిమోచనోపకరణవ్యాకోచహృద్ధామ 15-1-184 (ఆశాపాశమును విడుచుటయను సాధనముచే వికసించిన హృదయమునందు వసించువాడు)

విద్యావిద్యాఘనచింతాంతిక దూరలసన 15-1-185 విద్యతో కూడిన చింతనకు సమీపమందును అవిద్యాచింతనకు దూరమునందును ప్రకాశించువాడు హరిహరనాథదేవుడు. క్రమాలంకారము.

గత సంకల్పాంతరంగస్థితిస్మేరాకార 15-2-174

నానాగమక్షీరోద్యన్నవనీతతాలసిత 15-2-174

(ఆగమ క్షీరములనుండి ఉద్భాసించు నవనీతము హరిహరనాథుడు)

సమదవిమదదూరాసన్నరక్షాప్రసన్నా 15-2-176 (క్రమాలంకారము)

సంగిగాఢ త్రితాపా 16-1-226 (సంగము కలవారికి అనగా విషయాసక్తులకు గాఢమైన తాపత్రయము కలిగించువాడా అనుట.)

విస్తారోదారగుణత్రయ స్ఫుటవిశేషా; నిర్గుణాశ్లేష 17-1-77 సృష్టి నిర్మాణదశయందు గుణత్రయ విశిష్టుడు. సృష్టి పూర్వదశయందు నిర్గుణుడు.

జన్యసకలద్రవ్యా 17-1-78 (సర్వపదార్థములు హరిహరనాథజన్యము.)

మహావిద్యోన్మేషగాత్ర 18-1-1

సాంఖ్య విద్యావహ 18-1-95

హరిహరనాథ! సర్వభువనార్చిత! నన్ దయఁజూడు మెప్పుడున్ 18-1-94,,

13 కవిత్రయ మహాభారతం : వ్యాఖ్యానం

తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం అవతరించి వెయ్యేళ్ళు కావస్తున్నా, ఇంతవరకు దానికి సమగ్ర వ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమానదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మ ప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమ వేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలరాయడు మాత్రమే చేపట్టి ధర్మరక్షణ కళా ప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమదయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు వ్యాఖ్యానించిన పదునెనిమిది పర్వాల ఈ దివ్యప్రబంధమండలిని పరిష్కరించి, సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్యజనులకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుడి పక్షాన బాధ్యత వహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు మహనీయులు టి.టి.డి.బోర్డు ఛైర్మన్; సభ్యులూ, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వారి సహకారులూ, సంపాదకులూ, సంపాదక సలహామండలి సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్ సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికారులూ, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన ఆరణ్యపర్వం మూడవ సంపుటిగా, రెండు భాగాలుగా ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం, రెండవభాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన ఆరణ్యపర్వశేషం. ఈ విధంగా ఆరణ్యపర్వం విభజించబడి ప్రచురించటం తెలుగులో ఇది ప్రథమం. నాల్గవ, అయిదవ, ఆరవ, ఏడవ, ఎనిమిదవ సంపుటాలుగా విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు వెలువడ్డాయి. తొమ్మిదవ సంపుటిగా శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు వెలశాయి. పదవసంపుటిగా శాంతిపర్వం రెండు భాగాలలో వెలువడింది. పదకొండవ సంపుటిగా ఈ ఆనుశాసనిక పర్వం వెలువరించటం జరుగుతున్నది.

ఆనుశాసనిక పర్వంలోని మొదటి రెండాశ్వాసాలకూ వ్యాఖ్యానం రచించారు ప్రసిద్ధ విమర్శకులూ కవులూ అయిన డాక్టర్ తుమ్మపూడి కోటేశ్వరరావుగారు, తృతీయ చతుర్థాశ్వాసాలకు వ్యాఖ్యను సంతరించారు ప్రసిద్ధ సాహిత్యాచార్యులు డాక్టర్ శలాక రఘునాథశర్మగారు, పంచమాశ్వాసానికి వ్యాఖ్య రచించిన వారు ప్రసిద్ధ పరిశోధకులు, కవులు

డాక్టర్ యం.కులశేఖరరావుగారూ,
ప్రముఖ కవులూ, విద్వన్మణులూ శ్రీ ముదివర్తి కొండమాచార్యులుగారు. ఈ పర్వానికి సంపాదకుడుగా నేను పీఠికను సంతరించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తున్నాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు, విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుం జయరావుగారికి, శ్రీ సత్యరామ్ ప్రసాదుగారికి, శ్రీ జి.రాధాకృష్ణగారికి, శ్రీమతులు సుశీలా, లక్ష్మీవిద్యానాథులకూ, డాక్టర్ వి.యన్.లక్ష్మికీ నా కృతజ్ఞతలు.

పరమ కల్యాణభద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి వేదవేద్యులు, వేదాంతగమ్యులు, పరతత్త్వరూపులు. అయినా భక్తసులభులు, సాహిత్య సంగీత కళాప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ, వ్యాఖ్యానం సుగంధ పరిమళసేవ; విశేషాంశాలు ఉజ్జ్వలాలంకారసేవ; పీఠిక ఆ విరాణ్మూర్తికి మంగళ నీరాజనసేవ, ఈ పర్వం శ్రీ స్వామివారికి సారస్వతమైన అక్షరార్చన.

సత్య శివ సుందర రూపులైన శ్రీ స్వామివారి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యాన సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజకు సుమమంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని స్వామివారిని వేడుకొంటున్నాను.

హైదరాబాదు
15-8-2005

ప్రధాన సంపాదకుడు
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం.

ఆనుశాసనిక పర్వ కథాసారం

ప్రశ్నోత్తర మాలిక:

ధర్మరాజు భక్తి వినయాలతో అడుగుతూ ఉండగా భీష్ముడు అతడి ప్రశ్నలకు తగిన సమాధానాలు ఈయనారంభించాడు.

ధర్మరాజు :

ప్రశ్న 1 : పితామహా! మునులు కూడా గౌరవించే పుణ్యమూర్తివి నీవు. ఎన్నో నీతులను, ధర్మాలను దయతో నాకు బోధించావు. అయినా నాకు శాంతి కలగలేదు. పట్టుదలతో చుట్టాలను పక్కాలను చంపుకొన్నాను. నీపై కోపంతో క్రూరకర్మ చేసి నిన్ను పడగొట్టాను. ఈ రెండూ నా మనస్సును తీవ్రంగా బాధిస్తున్నాయి. లోభి అయిన దుర్యోధనుడు రాజ్యం పంచుకొని అనుభవించటానికి అంగీకరించలేదు. నేను కూడా కోపం మాని అతడిని రాజ్యం అనుభవించనీయలేదు. మా ఇద్దరివలన ఇంతటి కీడు పుట్టింది. ఏ విధంగా కూడా నాకు పశ్చాత్తాపం తప్పటంలేదు.

భీష్ముడు : ధర్మరాజా! చంపటానికి మనుజుడు కర్త కాడు. దీనికి ఉదాహరణగా ఒక ఇతిహాసం చెప్పుతాను వినుము. గౌతమి అనే పేరుగల బ్రాహ్మణ వనిత ఉండేది. ఆమె శాంత స్వభావురాలు. ఆమె కొడుకు విధివశాన పాము కరిచి చనిపోయాడు. ఆమె దుఃఖిస్తూ ఉండగా, ఒక కిరాతుడు పామును తాడుతో కట్టి తెచ్చి దాని తలను నరకబోయాడు. గౌతమి అతడిని వారించింది. 'విధి వశాన పాము కరిచింది. దీనికి అల్పులు బాధపడతారు. పామును చంపితే బిడ్డ బ్రతుకుతాడా?' అని వారించింది. అర్జునకుడు అనే ఆ బోయవాడిని పేరుకు తగినట్లు ప్రవర్తించుమన్నది. శత్రువునైనా తనచేత చిక్కినప్పుడు చంపటం న్యాయం కాదన్నది. కిరాతుడు ఆమె మాటలను అంగీకరించలేదు. క్రూరజంతువును చంపటం పాపం కాదని వాదించాడు. ఆ మాటలు విన్న పాము 'తాను మృత్యుదేవత పంపగా వచ్చిన సాధనమే కాని స్వయంగా కర్తను కా'నని వాదించింది. అంతలో మృత్యువు అక్కడికి వచ్చి తనను యముడు పంపగా వచ్చాననీ, బాలుడి చావుకు తాను కారణం కాననీ పేర్కొన్నది. కాని, బోయవాడు వారిద్దరూ పాపానికి వశమైన మనస్సుతో వ్యవహరించారు కాబట్టి బాలుడి మరణానికి వారే బాధ్యులని వాదించాడు. అంతలో యమధర్మరాజు అక్కడికి వచ్చి బోయవాడితో ఇట్లా అన్నాడు. 'నేనూ, పామూ, మృత్యువూ ఈ బాలుడి చావుకు కారణాలు కాము. అతడి కర్మయే దానికి కారణం. జీవుడు తన కర్మఫలాన్ని తప్పించుకొనలేడు. కాబట్టి పామును వదలిపెట్టుము, అన్నాడు. కిరాతుడికి జ్ఞానోదయమై పామును వదలి పెట్టాడు.

కాబట్టి ధర్మరాజా! నీవూ దుఃఖాన్ని వదలిపెట్టుము. యుద్ధంలో బంధువులు మరణించటానికి కారణం వారి కర్మలే కాని నీవు కాని, దుర్యోధనుడు కాని కాదు. ఈ సత్యం తెలిసికొని శాంతిని పొందుము.

ప్రశ్న 2 : గృహస్థాశ్రమంలో ఉండికూడా మృత్యుభయం పోగొట్టుకొనవచ్చునా ?

ఉత్తరం : ధర్మానికి స్థిరంగా నిలబడగలిగితే గృహస్థుడు ముక్తిని పొందగలడు. దీనికి ఒక కథ చెప్పుతాను వినుము. పూర్వం మనువంశంలో దుర్యోధనుడు అనే అందమైన రాజు ఉండేవాడు. అతడి సౌందర్యాన్ని చూచి

నర్మదానది మోహించి స్త్రీ రూపం తాల్చి వివాహమాడింది. వారిరువురికీ సుదర్శన అనే సుందరాంగి పుట్టింది. ఆ రాజు ఆ కన్యను అగ్ని సేవకు నియోగించాడు. అగ్నిదేవుడు ఆ కన్య సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను కోరాడు. ఆమె పెద్దల నడిగి తనను వివాహమాడుమని చెప్పింది. దుర్యోధనుడు ఒక మహాయజ్ఞం చేస్తూ విప్రులకు దానాలిచ్చే సందర్భంలో అగ్ని బ్రాహ్మణ వేషంతో సుదర్శనను తన కిచ్చి వివాహం చేయుమని రాజును కోరగా పేదబాపడికి కన్యనివ్వటానికి దుర్యోధనుడు ఇచ్చగించలేదు. దానితో అగ్ని కోపించి యజ్ఞంలో తన తేజస్సును ఉపసంహరించుకొన్నాడు. ఋత్విక్కులు దానికి భయపడి మంత్రాలను పఠించటం మొదలుపెట్టారు. అగ్ని తన మనసులోని మాటను వారికి చెప్పాడు. దుర్యోధనుడు సంతోషించి సుదర్శనను అగ్నిదేవుడి కిచ్చి వివాహం చేశాడు. అగ్ని సంతోషించి మరల తన తేజస్సును ప్రకాశింపజేసి యజ్ఞాన్ని సఫలం చేశాడు. వారిరువురికి సుదర్శనుడు అనే కొడుకు పుట్టాడు. అతడు పెద్దవాడై రాజ్యభారాన్ని వహించి నిర్వహించాడు. అతడికి ఓఘవంతుడు, అతడికి ఓఘరథుడు, ఓఘవతి అనే కొడుకు, కూతురు పుట్టారు. ఓఘవతిని సుదర్శనుడి కిచ్చి పెండ్లి చేశాడు. అతడు గృహస్థాశ్రమాన్ని పాటిస్తూ మృత్యువును జయించాలని నిశ్చయించాడు. ఓఘవతితో కలిసి కురుక్షేత్రంలో ఒక ఆశ్రమం కట్టుకొని నివసించాడు. అతిథిపూజను నిత్యవ్రతంగా స్వీకరించాడు. అతిథులు ఎవరి ఇంట్లో తమ కోరికలన్నీ తీర్చుకోగలుగుతారో ఆ యజమానుడూ, యజమానురాలూ కృతార్థులౌతారని ఆ దంపతులు విశ్వసించారు. అతిథి యజమానురాలిని కోరినా జుగుప్సపడకుండా అతడిని సంతోషపెట్టాలని నిశ్చయించారు. ఒకనాడు సుదర్శనుడు సమిధల కొరకు అడవికి పోగా ధర్మదేవత బ్రాహ్మణ రూపంలో అతిథి అయి వచ్చి ఆమెను కోరాడు. గృహస్థధర్మాలు అతడికి తెలియజెప్పినా అతడు ఆమెను వాంఛించాడు. భర్త నియమాన్ని మనస్సులో భావించి ఆమె అంగీకరించింది. అతిథి ఆమెను చాటుకు తీసుకొని వెళ్ళాడు. అంతలో సుదర్శనుడు వచ్చి భార్యను పిలిచాడు. ఆమె పలుకలేదు. ఆమె తనను సేవిస్తున్నదని అతిథి పలికాడు. త్రికరణశుద్ధిగా ఆమె చర్యకు సుదర్శనుడు హర్షించాడు. అప్పుడు ధర్మదేవత సంతోషించి, తన తేజోమయరూపాన్ని ప్రదర్శించి అతడిని ప్రశంసించాడు. ప్రతిజ్ఞకు లోపం జరిగితే చంపటానికి మృత్యువు వెన్నంటే ఉన్నదనీ, దానిని సుదర్శనుడు జయించాడనీ ధర్మదేవత ప్రకటించాడు. ఆ భార్యాభర్తలకు బొందితో స్వర్గాన్ని ప్రసాదించాడు. ఓఘవతి తన మనస్సులోని సగభాగంతో పుణ్యనదిగా ప్రవహిస్తుందనీ మిగిలిన సగంతో భర్తను సేవిస్తుందనీ అనుగ్రహించాడు. ధర్మరాజా! అతిథి పూజాధర్మంతో గృహస్థు మృత్యువును జయించవచ్చునని ఈ కథవలన తాత్పర్యం గ్రహించుము.

ప్రశ్న 3 : క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల వారికి గుణ కర్మలతో బ్రాహ్మణత్వం సిద్ధిస్తుందా?

ఉత్తరం : బ్రాహ్మణత్వం కడు దుర్లభం. ఎన్నో జన్మల ఫలం. ఈ సంగతి 'ఇంద్ర మతంగ సంవాదం' అనే ఇతిహాసంవలన స్పష్టమౌతుంది. మతంగు డనే బ్రాహ్మణ బాలుడు తండ్రి పంపున ఒక యజ్ఞానికి పోతూ దారిలో ఒక గాడిద పిల్లను కర్రతో కొట్టాడు. అది బాధతో తల్లిగాడిదతో చెప్పింది. ఆ తల్లిగాడిద ఆ బాలుడిని 'చండాలుడా'! అని తిట్టింది. ఆ తిట్టుకు కారణ మడిగి తెలిసికొని తన తల్లికి ఒక మంగలివలన పుట్టినట్లు గ్రహించి, ఆ సంగతి తండ్రికి చెప్పి, తపస్సుచేత బ్రాహ్మణత్వాన్ని పొందుతానని చెప్పి ఇంద్రుడిని గురించి తపస్సు చేయ మొదలు పెట్టాడు. ఇంద్రుడు ప్రత్యక్షమై బ్రాహ్మణత్వం ఇతర జాతులకు లభించేది కా దని చెప్పినా వినక మతంగుడు ఘోర తపస్సు చేయసాగాడు. ఎంత తపస్సు చేసినా శరీరం శుష్కించిందే కాని బ్రాహ్మణత్వం సిద్ధించలేదు.

ప్రశ్న 4 : విశ్వామిత్రు డెట్లా బ్రాహ్మణత్వాన్ని పొందగలిగాడు ?

ఉత్తరం : జహ్నుడి కులంలో గాధి జన్మించాడు. అతడి కూతురు సత్యవతి. ఆమెను భృగుకులంలో పుట్టిన ఋచీకుడు

భార్యగా నిమ్మని గాధిని కోరాడు. అతడికి ఇష్టం లేక ఒక చెవి నల్లగా ఉన్న వేయి తెల్లని గుర్రాలను శుల్కంగా అడిగాడు. ఋచీకుడు వరుణుడిని యాచించాడు. అతడు కరుణించి 'ఎక్కడ కోరితే అక్కడ అటువంటి గుర్రాలు పుట్టగల'వని వరమిచ్చాడు. అతడు గంగానది ఉత్తరతీరంలో నియమంతో సంకల్పించగా నేలనుండి వేయి గుర్రాలు పుట్టాయి. ఆ స్థలానికి అశ్వతీర్థమనే పేరు కలిగింది. ఋచీకుడు ఆ గుర్రాలను గాధికి శుల్కంగా సమర్పించాడు. గాధి సత్యవతి నిచ్చి అతడికి వెంటనే పెండ్లి చేశాడు. ఋచీకుడు సంతానం కావాలనుకొని భావించి బ్రాహ్మణత్వం గల కొడుకు నిచ్చే ఒక చరువును కల్పించాడు. బ్రాహ్మణ కుమారుడి నిచ్చే చరువును తన భార్యను, క్షత్రియత్వంగల కొడుకు నిచ్చే చరువును ఆమె తల్లిని తీసికొని ఋతుకాలంలో భార్యను మేడిచెట్టును, అత్తను రావిచెట్టును కౌగలించుకొనేటట్లు నిర్దేశించాడు. కాని, దైవవశాత్తు తల్లీకూతుళ్ళు వాటిని వ్యత్యాసంగా చేసి గర్భాలు తాల్చారు. దానిని గ్రహించిన ఋచీకుడు భార్యకు ఆ సంగతి తెలియచెప్పాడు. సత్యవతి దుఃఖించి తనకు బ్రాహ్మణత్వం గల కొడుకు కలిగేటట్లు వరమిమ్మని కోరింది. ఋచీకుడు దయామయుడై ఆమెకు బ్రాహ్మణుడు పుట్టుతాడనీ, అతడి కొడుకు రాజలక్షణాలు కలిగి ఉంటాడనీ వరమిచ్చాడు. దానివలన సత్యవతికి జమదగ్ని బ్రాహ్మణ తేజస్సుతో పుట్టాడు. అతడికి పరశురాముడు క్షత్రియ తేజస్సుతో కలిగాడు. గాధి భార్యకు విశ్వామిత్రుడు పుట్టాడు. చరుతరుగుణాల తారుమారువలన అతడిలో బ్రాహ్మణత్వ స్ఫురణ, తపశ్శక్తి ఎక్కువగా కలిగాయి.

ప్రశ్న 5 : వీతహవ్యుడనే రాజు బ్రాహ్మణత్వాన్ని పొందాడని వింటాం. ఆ సంగతి తెలుపుము.

ఉత్తరం : మను వంశజుడైన హైహయుడికి (ఇతడికే వీతశర్ము్యడనే మరొక పేరుండేది) పదిమంది భార్యలవలన వందమంది వీరపుత్రులు పుట్టారు. వారందరు కలిసి కాశీరాజైన హర్యశ్వుడిని యుద్ధంలో చంపారు. ఆ తరువాత అతడి కొడుకు సుదేవుడినీ చంపారు. అతడి కొడుకు దివోదాసుపై కూడా దాడి చేసి ఓడించారు. అతడు భరద్వాజ మహర్షిని ఆశ్రయించి హైహయులనుండి తన వంశ రక్షణాన్ని కోరాడు. ఆ మహర్షి యజ్ఞంనుండి ప్రతర్దనుడు అనే పుత్రుడిని సృష్టించి రాజుకు ఇచ్చాడు. అతడు ఆ నూరుగురు హైహయులను చంపి వీతహవ్యుడి మీదకు పోయాడు. అతడు భయపడి భృగుమహర్షిని ఆశ్రయించాడు. అతడు తన ఆశ్రమంలోని శిష్యులలో ఆ రాజును దాచాడు. ప్రతర్దనుడు భృగుమహర్షి వద్దకు వెళ్ళి, వీతహవ్యుడిని తనకు వశం చేయుమని కోరాడు. అప్పుడు భృగుమహర్షి తన ఆశ్రమంలో అందరూ బ్రాహ్మణులే ఉన్నారని పలికాడు. ఆ మహర్షి మాటవలన వీతహవ్యుడు బ్రాహ్మణుడయ్యాడు. ప్రతర్దనుడు సంతోషించి వెళ్ళిపోయాడు. వీతహవ్యుడు అనేకమంది బ్రాహ్మణ పుత్రులను కన్నాడు. ఆ వంశానికి అతడే మూలపురుషు డయ్యాడు.

ప్రశ్న 6 : దైవం, పౌరుషం ఈ రెండింటిలో ఏది గొప్పది?

ఉత్తరం : పురుషకారం చేను, దైవం బీజం. ఈ రెండింటిని కలిపే ప్రయత్నం చేస్తే మానవుడు ఫలాన్ని పొందుతాడు. దైవం సహకరించకపోతే పురుషకారం ఫలం పొందలేదు. అగ్ని కొంచెమైనా గాలితో పెరిగి ప్రకాశించినట్లు మంచిపనులు చేయటంవలన దైవానుకూల్యం పెరుగుతుంది. నేయి తగ్గిపోతే దీపకాంతి తగ్గినట్లే పురుషకారంలో పవిత్రత లోపిస్తే దైవానుకూల్యం కూడా లోపిస్తుంది. కాబట్టి దైవ పౌరుషాలు రెండూ సమానమే.

ప్రశ్న 7 : సత్కర్మవలన కలిగే ఫలాలు ఎట్లా ఉంటాయి?

ఉత్తరం : సత్కర్మలకూ, దుష్కర్మలకూ తగిన సమయాలలో వాటికి తగిన ఫలితాలు కలుగుతాయి. లోకానురక్తులకు పాప పుణ్య కర్మలు దుఃఖాన్ని కలిగిస్తాయి. విరక్తులకు ఆ ఫలాలు కలుగవు.

ప్రశ్న 8 : తమ జీవితాలకు ఆధారమైన యజమాని పట్ల ఆశ్రితులు ఎట్లా నడచుకొనాలి ?

ఉత్తరం : తనను కాపాడిన యజమాని ఆశ్రితులు రక్షిస్తారు. ఉదాహరణకు ఒక కథ. కాశీదేశంలో ఒక వేటగాడు విషబాణాన్ని ఒక లేడిపై ప్రయోగించగా అది గురితప్పి ఒక ఫలవృక్షాన్ని తాకింది. దాని ప్రభావం వలన ఆ చెట్టు ఎండిపోయింది. ఆ చెట్టు తొర్రలో ఒక చిలుక నివసిస్తూ ఉన్నది. ఎండిపోయిన చెట్టును వీడిపోకుండా చిలుక ఆ చెట్టుతొర్రలోనే ఉండసాగింది. ఇంద్రుడు ఆ చిలుకను మరొక ఫలవృక్షాన్ని ఆశ్రయించుమని సలహా ఇచ్చాడు. కాని, చిలుక 'చెట్టు పండినపుడు ఉండటం, ఎండినపుడు విడిపోవటం కృతఘ్నత కదా' అని సమాధానం చెప్పింది. ఇంద్రుడు సంతోషించి చిలుకను వరం కోరుకొను మన్నాడు. వెంటనే చిలుక 'స్వామీ! ఈ చెట్టుకు పూర్వవైభవాన్ని అనుగ్రహించుము' అని కోరింది. ఆ విధంగా ఆశ్రితురాలివలన ఆ చెట్టుకు మేలు జరిగింది. ఇది ఆశ్రిత లక్షణం.

ప్రశ్న 9 : యజమానులు ఆశ్రితులలో ఎవరిని ఎట్లా ఆదరించాలి ?

ఉత్తరం : రాజు బ్రాహ్మణుడిని కొడుకువలె కాపాడాలి. గురువువలె గౌరవించాలి. అగ్నివలె పూజించాలి. అతడిని అవమానిస్తే ఆపద కలుగుతుంది. వ్యాసమహర్షి శల్యుడితో జ్ఞానాలలో ఉత్తమ జ్ఞానమేది? అనే అంశాన్ని వివరిస్తూ యజ్ఞమూర్తి విష్ణువు, అతడిని తెలియటమే ఉత్తమ జ్ఞానం. ఆ విష్ణువే శ్రీకృష్ణుడు. ఆశ్రితుడైన శ్రీకృష్ణుడే నీవు ఆశ్రయించదగిన పరమజ్ఞానమని తెలియటం ఉత్తమ జ్ఞానం. అదియే బ్రాహ్మణత్వ సిద్ధికి ఫలం అని చెప్పాడు.

ప్రశ్న 10 : గరుత్మంతుడు మహాత్ముడని విన్నాను. అతడి కథను చెప్పుము.

ఉత్తరం : భీష్ముడు శ్రీకృష్ణుడిని చూచి 'స్వామీ! నీవు ఆ గరుత్మంతుడవని విన్నాను' అన్నాడు. శ్రీకృష్ణుడు నవ్వి అడుగుతున్న ఆ రాజు కోర్కెను తీర్చుమని' అన్నాడు. భీష్ముడు చెప్పటం ప్రారంభించాడు.

కశ్యప ప్రజాపతికి కద్రువ, వినత అనేవారు ఇద్దరు భార్యలు. భర్త వలన కద్రువ వేయిమందినీ, వినత ఇద్దరినీ కొడుకులను వరాలుగా పొందారు. 1500 సంవత్సరాలు గడచిన తరువాత కద్రువ పెట్టిన గ్రుడ్లనుండి వేయి పాములు పుట్టాయి. వినత గ్రుడ్లు పిగలలేదు. ఆమె అసూయతో ఒక గ్రుడ్డును పగులగొట్టింది. అందులోనుండి సగం శరీరం గల అరుణుడు పుట్టి, తల్లి తొందరపాటుకు కోపించి, ఆమె కద్రువకు దాసి అయ్యేటట్లు శపించాడు. ఆ తరువాత అయిదువేల సంవత్సరాలకు రెండవ అండం నుండి మహా బలవంతుడు పుట్టి, తల్లికి దాస్యవిముక్తి చేస్తాడని అనుగ్రహించాడు. గరుత్మంతుడు మహాబలశాలిగా పుట్టి స్వేచ్ఛగా అంతరిక్షంలో తిరుగుతూ బ్రహ్మ సూచించిన ఆహారాన్ని గ్రహిస్తూ ఉన్నాడు. అరుణుడు సూర్యుడిని సేవించటానికి వెళ్ళాడు.

ఒకనాడు కద్రూ వినతలు విహారార్థం సముద్రతీరానికి పోయి అక్కడ ఉచ్చైశ్రవాన్ని చూచారు. ధవళకాంతులతో వెలుగొందుతున్న ఆ ఇంద్రాశ్వాన్ని చూచి వినత ఆశ్చర్యాన్ని ప్రదర్శించింది. కద్రువ ఆ గుర్రం తోక నల్లగా ఉన్నది కదా! అని అన్నది. వినత దానికి అంగీకరించలేదు. తోక నల్లగా ఉంటే వినత కద్రువకు దాస్యం చేసేటట్లు పందెం వేసికొన్నారు. ఆనాడు పతిసేవకు సమయం కావటంతో ఇంటికి వెళ్ళి, మరునాడు ఉదయం వచ్చి సత్యాసత్యాలు నిరూపించుకొనాలని నిశ్చయించుకొన్నారు. ఆ రాత్రి కద్రువ కుటిలబుద్ధితో తన కొడుకులతో కుతంత్రం చేసింది. కొడుకులను తోకకు వ్రేలాడి అది నల్లగా తోచేట్లు చేయండని అడిగింది. చాలామంది అది అన్యాయమని భావించి తల్లి ఆనతిని తిరస్కరించారు. వారిని జనమేజయుడు చేయబోయే

సర్పయాగంలో హతులయ్యేట్లు కద్రువ నిర్దాక్షిణ్యంగా శపించింది. ఆ శాపానికి భయపడిన కొందరు నాగులు తల్లి మాటను పాటించి ఉచ్చైశ్రవ వాలానికి నల్లగా వ్రేలాడి నిలిచారు. వినత కద్రువకు దాసిగా ఉండవలసి వచ్చింది. సవతిని హీనంగా చూస్తూ దాస్య వృత్తిని చేయించుకొనేది కద్రువ. వినత గరుత్మంతుడివలన తనకు దాస్య విముక్తి కలుగుతుందని ఆశతో కాలం గడపసాగింది.

ఒకనాడు నారదుడివలన ప్రబోధితుడై గరుత్మంతుడు మాతృదాస్యాన్ని తొలగించటానికి పూనుకొని కద్రువ వద్దకు వచ్చి వేడుకొన్నాడు. అమృతాన్ని తెచ్చి మాతృదాస్య విముక్తి చేసికొమ్మని కద్రువ గరుత్మంతుడిని ఆజ్ఞాపించింది. అమృతాన్ని తెస్తానని శపథం చేసి గరుత్మంతుడు వెంటనే కశ్యప ప్రజాపతి వద్దకు వెళ్ళి ఉపాయాన్ని కోరుకొన్నాడు.

ఇంద్రుడు అమృతాన్ని భద్రంగా రక్షిస్తుంటాడు. జలం మధ్య అగ్ని మండుతూ ఉండగా తీవ్రమైన ఆయుధాలతో భయంకర రాక్షసులు రక్షిస్తుండగా ఇనుప వలలో అమృతం సురక్షితంగా ఉంటుంది. దానిని సాధించటం దేవతలకైనా సాధ్యం కాదు. దానిని సాధించాలంటే గరుత్మంతుడు తూర్పు సముద్రం చెంత ఉండే మహా పర్వతం మీద రెండు మహా గజ కచ్ఛపాలున్నాయి. ఆ రెండూ పూర్వకాలంలో మధుకైటభులు. పరస్పరం ఘర్షణపడుతుంటాయి. ఆ సందర్భంలో ఆ రెండింటినీ పట్టి భక్షిస్తే కలిగే బలంవలన గరుత్మంతుడు అమృతాన్ని హరించగలడని కశ్యపుడు సూచించాడు. గరుత్మంతుడు తన వాడి గోళ్ళతో ఆ గజ కచ్ఛపాలను పట్టి ఆకాశానికి ఎగిరి, ఐదు యోజనాల పొడవున ఉన్న ఒక మహావృక్షశాఖ మీద వాలాడు. ఆ బరువుకు ఆ కొమ్మ విరిగింది. ఆ కొమ్మ మీద మహామునులు తపస్సు చేసుకుంటున్నారు. అందువలన ఆ కొమ్మ కిందపడకుండా ముక్కుతో పట్టుకొని గరుత్మంతుడు ఎగిరాడు. మునులు ఆ మహాత్ముడి మహిమను చూచి కొమ్మనుండి దిగిపోయారు. ఆ కొమ్మను దురాచారంతో అపవిత్రమైన కులింద దేశ సముద్ర ప్రాంతంతో వదలుమని చెప్పారు. గరుత్మంతు డాపని చేసి, ఒక మహాగిరి శిఖరం మీద విశాల ప్రాంతంలో గజకచ్ఛపాలను భక్షించి మహాబలోపేతుడై అమృతమున్న స్థానానికి చేరాడు. దానిచుట్టూ మండుతున్న అగ్నిని దాటటానికి ఉపాయం కొరకు బ్రహ్మను ఆశ్రయించాడు. కొండంత వెన్నను అగ్నిపై ఉంచుమని పితామహుడు ఉపాయం చెప్పాడు. సప్రయత్నంగా వెన్నను సంపాదించి అగ్నిపై ఉంచి దాని ఉద్ధృతి తగ్గటంతో అమృతభాండంపై లంఘించాడు. ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించినా అది విఫలమై పోవటంతో అతడు విముఖుడయ్యాడు. గరుత్మంతుడు అమృతాన్ని తెచ్చి కద్రువ ముందుపెట్టి తల్లి దాస్యానికి విముక్తి కలిగించాడు. అమృతం తేవటమే నియమం కాబట్టి తెచ్చి కద్రువకు చూపించి, మరల ఆ అమృతాన్ని ఇంద్రుడికి ఒప్పగించి గరుత్మంతుడు దేవతల మన్ననలను పొందాడు. పాములపై పగ సాధించాడు. ఇంద్రుడు గరుత్మంతుడిని సాక్షాద్ విష్ణువుగా కీర్తించి, భవిష్యత్కాలంలో యదువంశంలో శ్రీకృష్ణుడుగా అవతరించి లోకకల్యాణం నిర్వహిస్తాడని ప్రకటించాడు. ధర్మరాజా! ఈ గరుత్మంతుడి కథ ముక్తికి సోపానం. నీవు విని ధన్యుడవైనావు.

ప్రశ్న 11 : బ్రాహ్మణుడికి ఏదైనా ఇస్తానని మాట ఇచ్చి ఇవ్వనివాడు ఏ గతి పొందుతాడు?

ఉత్తరం : పూర్వజన్మలో బ్రాహ్మణుడికి ఇస్తానన్నది ఇవ్వకపోవటంవలన నక్కగా పుట్టి పీనుగు మాంసం తినే గతి పట్టిన నక్క కోతి కథనం భీష్ముడు వినిపించాడు.

ప్రశ్న 12 : గొప్పగుణాలున్న హీనవర్ణుడికి మంత్ర తంత్రాదులు బోధించటం ధర్మమా? కాదా?

ఉత్తరం : బ్రాహ్మణుడు మూడు కులాలవారికి మాత్రమే పరీక్షించి మంత్ర తంత్రాదులు చెప్పాలని ఒక కథ భీష్ముడు తెలిపాడు.

ప్రశ్న 13 : లక్ష్మీదేవి ఎక్కడెక్కడ నివసిస్తుందో తెలుపుము.

ఉత్తరం : ఒకసారి లక్ష్మీదేవి రుక్మిణీదేవితో తన నివాస స్థానాలను గురించి ఇట్లా చెప్పింది. నిత్యసత్యులు, శౌచనిరతులు, గురుభక్తులు, అప్రమత్తులు, దక్షులు, నిర్మలమతులు, సత్కర్మపరులు, విజ్ఞానం, తపం, దానం, బ్రహ్మచర్యం, శమం మొదలైన గుణాలు కలవారు లక్ష్మీ నివాసస్థానాలు. క్రూరులు, నాస్తికులు, కృతఘ్నులు, దుష్టబుద్ధుల పాలిట లక్ష్మి ఉండదు. గృహనీతి గల స్త్రీలయందు లక్ష్మి ఉంటుంది. పతి వ్యతిరేకులు, కఠిన చిత్తులు, అధిక నిద్రాసక్తలు అయిన స్త్రీలయందు లక్ష్మి ఉండదు. సరస్సులలో, పూల తోటలలో లక్ష్మి నివసిస్తుంది.

ప్రశ్న 14 : స్త్రీ పురుషుల రతిలో ఎవరికి ఎక్కువ సుఖ ముంటుంది?

ఉత్తరం భంగాస్వనుడు అనే రాజు ఇంద్రుడికి ఇష్టం లేని యజ్ఞం చేసి నూరుగురు కొడుకులను పొందాడు. అతడు ఒకసారి వేటకు వెళ్ళినపుడు ఒక కొలనులో దిగి నీరు త్రాగి స్త్రీగా మారిపోయాడు. ఆశ్చర్యంతో అతడు నగరానికి తిరిగి వచ్చి, మంత్రులకు, బంధువులకు జరిగింది తెలియచెప్పి, కొడుకులకు రాజ్యం కట్టబెట్టి, అతడు అడవికి వెళ్ళి మునులతో కలిసి నివసించాడు. స్త్రీ రూపంలో ఉన్న అతడిని ఒక ముని ప్రేమించి వరుసగా ఆమెయందు నూరుగురు కొడుకులను పొందాడు. రాజు ఆ కొడుకులను కూడా పూర్వ పుత్రులతో చేర్చి, రాజ్యసుఖాలను కలిగించాడు. ఇంద్రుడు ఆ శుభ పరిణామాలకు అసూయపడి రాకుమారుల నడుమ కలతలు రేపి, వారిని యుద్ధంలో చనిపోయేటట్లు చేశాడు. స్త్రీ రూపంలో ఉన్న ఆ రాజు రోదించాడు. ఇంద్రుడు కరుణించి కొందరు కొడుకులను బ్రతికిస్తానన్నాడు. స్త్రీ రూపంలో ఉన్న ఆ రాజు తాను స్త్రీగా ఉన్నప్పుడు కలిగిన కొడుకులను బ్రతికించుమని కోరాడు. ఇంద్రుడు దానికి కారణమడిగాడు. తల్లికి బిడ్డల మీద ప్రేమ ఎక్కువ అని అతడు సమాధానం చెప్పాడు. ఇంద్రుడు సంతోషించి అతడికి పోయిన మగతనాన్ని కూడా ఇస్తానన్నాడు. అప్పుడు ఆ రాజు తనను స్త్రీగానే ఉండనిమ్మని ఇంద్రుడిని కోరాడు. దానికి ఇంద్రుడు ఆశ్చర్యపడి కారణం అడుగగా 'రతిలో పురుషులకంటె స్త్రీలకు సుఖమెక్కువ కాబట్టి నేను స్త్రీగానే ఉండి సుఖించాలని కోరుకొంటున్నాను' అని అన్నాడు. ధర్మజా! ఈ తాత్పర్యం తెలిసికొమ్ము.

ప్రశ్న 15 : సంసార చక్రంలో పడి తిరుగకుండా ముక్తిని కలిగించే విష్ణుభక్తిని బోధించుము.

ఉత్తరం : శాశ్వత సుఖం పేరే మోక్షం. అదే నిర్వాణం. పురుషాతీతంగా ప్రకృతి ఉంటుంది. దానిని నిరూపించటం కష్టం. అదే సంసార చక్రం. దానిని త్రోసివేయటమే మోక్షం. అది పొందాలంటే కామక్రోధాలను జయించి మనస్సును సత్త్వగుణ భరితం చేసికొనుము. అదే వైష్ణవ ధర్మం. దానిని అనుసరించి సంసార భయాన్ని జయించుము.

ప్రశ్న 16 : ఆధ్యాత్మికం, అధిదైవం, అధిభూతం అనే మూడు తత్త్వాలకు ఆధారమై, వాటిలో తానూ జీవిస్తూ కర్తా, భర్తా, హర్తా అయిన భగవంతుడిని గురించి చెప్పుము.

ఉత్తరం : సనత్సుజాతుడు నారదుడికి చెప్పిన తత్త్వసారం వినుము. అవ్యక్తమైన విష్ణువు తన స్వరూపంతో తానుంటాడు. అతడు పదివేల యుగాలు నిద్రపోయి లేచి బ్రహ్మను సృష్టించి దాని కతడిని భర్తగా నియమించాడు. అతడు అహంకారాన్ని పొంది పంచభూతాలనూ, గుణాలనూ సృష్టించాడు. వాటన్నిటిలో అహంకారం వ్యాపించి ఉంటుంది. అవన్నీ అవ్యక్త సముద్రంలో మునిగి తేలుతూ ఉంటాయి. ఈ సమస్త సృష్టి స్థితి లయాలకు ప్రభువై విష్ణుమూర్తి శుభాశుభాలను కల్పిస్తూ ఈ సంసార చక్రాన్ని త్రిప్పుతూ వినోదిస్తూ ఉంటాడు. ఆధ్యాత్మమంటే అనుభవించే జీవుడు. తాను ద్రష్ట చూచేవాడు. అధిభూతమంటే ద్రష్ట - అనుభవించే పరార్థ సృష్టిలోని గుణం దృశ్యం.

అధిదేవత అంటే దృక్కు. చూచే శక్తి తేజస్సు. ఈ కెరటాలు వ్యక్తమయ్యే దానిని సృష్టి అంటారు. పంచభూతాలే దేవతలు. వాటి గుణాలే అధిభూతం. అనుభవించే నేనే అధ్యాత్మంగా చెప్పబడుతున్నాము.

ప్రశ్న 17: నియమంతో అగ్నులను తమలో ఆవహింపజేసికొని మహాత్ములు పరమాత్ముడిని ఎట్లాంటి వాడినిగా భావిస్తారు?

ఉత్తరం : గరుత్మంతుడికి విష్ణువు తన తత్త్వాన్ని ఇట్లా బోధించాడు. నా స్వరూపం దేవతలకూ తెలియదు. సమస్తం నాలో పుట్టి, జీవించి, మరణించినా నేనా సంసార చక్రంలో బంధితుడను కాను. కాని, వాటికి లోబడి అన్నింటిలోనూ ఉంటాను. నా తత్త్వం జడులు కానివారూ, అహింసా ప్రవృత్తి కలవారూ, కామం లేనివారూ, అహంకారం లేనివారూ, దానంగా దేనినీ స్వీకరించనివారూ, కోపం లేనివారూ, స్వచ్ఛమైన జ్ఞానం కలవారూ, నిత్యతృప్తులూ, శాంతీ, భక్తీ కలవారూ, నిష్ఠ కలవారూ, తమలో అగ్నిని సన్నిహితం చేసికొంటే నన్ను పొందగలరు. రజస్తమస్సులతో మలినం కాని కేవల సత్త్వగుణాన్నే స్థిరంగా చేసికొన్న జ్ఞానంతో నన్ను ధ్యానించటమే ముక్తిమార్గం. నానా విధాలైన సంకల్పాలు, యజ్ఞాలు, విడిచిపెట్టి ఆత్మలో అగ్నిని ప్రతిష్ఠించుకొని విరక్తుడై విష్ణువులో మనస్సును లయం చేసినవాడు ముక్తిని పొందుతాడు.'

ప్రశ్న 18 : కన్యాదానానికి ఎట్లాంటి వరుడు కావాలి?

ఉత్తరం : దీనికి ఒక ఇతిహాసం చెప్పుతాను వినుము. వదాన్యుడనే మునికి సుప్రభ అనే కుమార్తె ఉన్నది. అష్టావక్రుడు ఆమెను వివాహమాడగోరి వదాన్యుడిని అడిగాడు. ఆయన రూపగుణవర్తనాలలో యోగ్యుడైన అష్టావక్రుడికి కూతురి నిస్తానని మాట ఇచ్చి, అతడిని ఉత్తరదిశగా పయనించి పార్వతి శివుడికొరకు తపస్సు చేసిన ప్రాంతం దాటి కదంబవనంలో ప్రవేశించి, అక్కడ నివసించే ఒక పవిత్ర ప్రౌఢ వనితను దర్శించి తిరిగి రమ్మని కోరాడు. ఆ వెంటనే వివాహం చేస్తానన్నాడు. అష్టావక్రుడు దానికి అంగీకరించి ఆ రాత్రి బాహుదానదీతీరంలో ఆగి, మరునాడు కుబేర నగరానికి పోయి ఆయన కల్పించిన వినోదాలను వీక్షిస్తూ నిశ్చల మనస్సుతో ఏడాది గడిపి, ఈశ్వరుడి క్రీడా క్షేత్రాలను దర్శించి, కడిమి చెట్ల వనం చేరి బంగారు మేడలో నివసించే ఒక పవిత్ర వనితను దర్శించాడు. ఆమె అతడికి ఎన్నో అతిథి సత్కారాలను చేసింది. రాత్రి శయ్యపై అతడితో శయనించి భోగించుమని కోరింది. అష్టావక్రుడు తనను తాకకుండా ఉంటే ఉంటానని లేకపోతే వెంటనే వెళ్ళిపోతానని అంటాడు. ఆ రోజు మిన్నకుండి మరునాడు రాత్రి మరల అతడిని కోరింది. అష్టావక్రుడు ఇట్లా అన్నాడు. స్త్రీని పసితనంలో తండ్రి, వివాహమైన తరువాత భర్త, ముసలితనంలో కొడుకు రక్షిస్తారు తప్ప ఆమె స్వతంత్రంగా ఏమీ చేయతగదు కాబట్టి నిన్ను నేను స్వీకరించను' అన్నాడు. ఆమె ఎన్ని విలాసాలు ప్రదర్శించినా చలించలేదు. అప్పు డామె సంతోషించి, తాను ఉత్తరదిశా కన్యనని, వదాన్యుడి ఆనతితో అతడిని పరీక్షించానని చెప్పి అభినందించి పంపింది. అష్టావక్రుడు తిరిగి వచ్చి వదాన్యుడి అభినందనలతో పాటు, సుప్రభను భార్యగా పొంది సుఖించాడు. కాబట్టి కన్యాదానానికి అర్హుడు ఉత్తమ బ్రహ్మచారి.

ప్రశ్న 19 : మునులవలన శూద్ర స్త్రీలకు కలిగిన వారు బ్రహ్మర్షులు ఎట్లా ఔతారు? ఆ రహస్యం తెలుపుము.

ఉత్తరం : మునులకు, రాజులకు కలిగిన సంతానం బీజ ప్రధానమే. వసిష్ఠుడు, ఋశ్యశృంగుడు, అగస్త్యుడు, వ్యాసమహర్షి, మందపాలుడి సంతానం, ద్రోణుడు, కృపుడు మొదలైనవారు దీనికి ఉదాహరణప్రాయులు.

ప్రశ్న 20 : బ్రాహ్మణుడు దాన యోగ్యుడు కావటం అతడి వృత్తి వలననా లేక విరక్తుడై బ్రతకటం వలననా?

ఉత్తరం : తన కులానికి తగిన ఆచార వ్యవహారాలతో బ్రతుకుతూ, మనస్సులో సర్వ బాహ్య చిహ్నాలకు అతీతుడైతే అతడు దానయోగ్యుడు.

ప్రశ్న 21 : శ్రద్ధతో జను లిచ్చే భూరిదానాలు పాపం పొందవు కదా?

ఉత్తరం : పవిత్రులు, శ్రద్ధకలవారు, ఆదరంతో చేసిన దానం పాపపరిహారం చేస్తుందే కాని పాపం కలిగించదు.

ప్రశ్న 22 : దేవ పితృ కార్యాలలో బ్రాహ్మణుడిని పరీక్ష చేసికొని దానాదు లివ్వాలా?

ఉత్తరం : అవును.

ప్రశ్న 23 : అపూర్వమైన దైవ సంబంధం గల పండితులు, సోమయాజులు, తపస్వులు - వీరిలో ఎవరు దానయోగ్యులు?

ఉత్తరం : అందరూ దానయోగ్యులే. ఎవడు ధర్మపన్నాలు చెప్పుతూ వాటిని ఆచరించడో వాడు అయోగ్యుడు. అతడికి దానమిస్తే నరకమే ఫలం.

ప్రశ్న 24 : ధర్మార్థ కామాలను ఆచరించే కాలాలు ఏవి ?

ఉత్తరం : అర్థం తెల్లవారు జామున, ధర్మం పగటివేళ, రాత్రివేళ కామం ఆచరించాలి. అర్థ కామాలపై ఆసక్తి మంచిది కాదు. ధర్మాచరణ శ్రేష్ఠం.

ప్రశ్న 25 : దానయోగ్యు లెవరు ?

ఉత్తరం : ధర్మం చేసేవారు, కోపం లేనివారు, సత్యం పలికేవారు, దాంతులు, ధీరులు, నిజకర్మలు చేసేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, భూతదయ కలవారు, లోభం లేనివారు, శుచులు, దానయోగ్యులు, వేదవేదాంగాలు చదివి షట్కర్మలు చేసే బ్రాహ్మణులు, మేధాశక్తి, ఉత్తమశీలం, ప్రవర్తన కలవారు దానయోగ్యులు.

ప్రశ్న 26 : దేవ పితృ మనుష్య పూజల కాలాలను తెలుపుము.

ఉత్తరం : ఉదయం దేవతలను, సాయంకాలం పితృదేవతలను, మధ్యాహ్నం మనుష్యులను పూజించాలి.

ప్రశ్న 27 : దైవ, పితృ కార్యాలలో దానం ఇవ్వటానికి ఉత్తమ యోగ్యులు ఎవరు?

ఉత్తరం : భోజనం పెట్టి తృప్తి పరిచేవాడు, దొంగలవలన అంతా పోగొట్టుకొన్నవాడు. వ్రతోద్యాపన కోరి యాచించేవాడు, గురువు, తల్లి, తండ్రి, భార్యా పుత్రులపై ఆధారపడి బ్రతికేవాడు, దీర్ఘవ్యాధిని పోగొట్టుకొనాలనుకొనేవాడు ఎప్పుడూ భిక్షాటనతో జీవించే పుణ్య బ్రాహ్మణుడు - ఈ ఆరుగురూ ఉత్తమ దానయోగ్యులు.

ప్రశ్న 28 : బ్రహ్మహత్యతో సమానమైన కర్మ లేవి ?

ఉత్తరం : దీనుడైన వేదబ్రాహ్మణుడిని ఆహ్వానించి అన్నం పెట్టకపోవటం, విప్రుడి జీవనాధారమైన వృత్తిని చెడగొట్టి వాడి నోరుకొట్టటం, నీరు త్రాగటానికి వచ్చిన ఆలమందలను తరిమి కొట్టటం, చెవిటి, కుంటి, గ్రుడ్డి వారి డబ్బు దొంగిలించటం, వేద శాస్త్రాదులను నిందించటం, కోపంతో నగరానికీ, ఊరికీ, తోటకూ నిప్పు పెట్టటం, పాపస్వభావంతో అబద్ధమాడి బ్రాహ్మణుడికి దుఃఖం కలిగించటం, యోగ్యుడైన వరుడికి పిల్లనీయకుండా ఉండటం బ్రహ్మహత్యతో సమానం.

ప్రశ్న 29 : పితామహా! పుణ్యతీర్థాల విశేషాలు చెప్పుము.

ఉత్తరం : భీష్ముడు పూర్వం అంగిరసుడు గౌతముడికి చెప్పిన పుణ్యతీర్థవిశేషాలను వివరించాడు. (చూడు. 2.79-90) కామక్రోధ విరహితమైన మనస్సుతో తీర్థాలను సేవించాలి. దూరదూర తీర్థాలను భక్తితో స్మరిస్తే చాలు పాపాలు తొలగిపోతాయి.

ప్రశ్న 30 : తాతా! ఏ ఊళ్ళు, కొండలు, ఏళ్ళూ మాహాత్మ్యం కలవో చెప్పుము.

ఉత్తరం : యోగి బ్రాహ్మణుడికి చెప్పిన గంగామాహాత్మ్యాన్ని భీష్ముడు వివరించాడు. (చూడు. 2.101-129) గంగ ఏ దేశంలో ప్రవహిస్తుందో ఆ దేశంలో ఉన్న ప్రతి వస్తువు పవిత్రమైనదే. గంగలో మునిగితే పాపాలన్నీ పోతాయి. దేవతలకు అమృతం ఎట్లాగో నరులకు నదులలో గంగనీరు అట్లాంటిది. గంగను చూడనివాడు గొడ్డుతో సమానుడు. సాగరులను స్వర్గానికి పంపిన గంగమాహాత్మ్యం స్మరణీయం. గంగ దివ్య గుణాలను లెక్కించటం సముద్రంలో నీటి బొట్లను లెక్కించటం వంటిది.

ప్రశ్న 31 : లోకంలో ఎవ్వరు సర్వజన పూజ్యులు ?

ఉత్తరం : వాసుదేవ నారద సంవాదం దీనికి చక్కని తార్కాణం. దాని తాత్పర్యమిది - వరుణాది దేవతలు, వేదవేత్తలు, తపోధనులు, ధనధాన్య భూములను గోవులను దానం చేసేవారు, అతిథి పూజాపరులు, పితృదేవతలను పూజించేవారు, భిక్షాన్నంతో తృప్తిపడే శాంతస్వభావులు, సత్యవ్రతులు, ధర్మార్థకామ సేవనులు, అహంకార మమకార రహితులు, వ్యామోహ రహితులు, సత్ప్రవర్తనులు, జ్ఞానులు - పూజించదగినవారు.

ప్రశ్న 32 : రాజులకు కర్తవ్యాలు ఎన్నో ఉంటాయి. వాటిలో ప్రధాన కృత్యం ఏమిటి?

ఉత్తరం : రాజ్యాభిషిక్తుడైన రాజు చేయదగిన ముఖ్య కర్తవ్యం బ్రాహ్మణ పూజ. పూజ పాపాలను తొలగిస్తుందని భూదేవి వాసుదేవుడికి చెప్పింది. ఆత్మోపాసనం, ధర్మబుద్ధితో పరబ్రహ్మను ఉపాసించటం బ్రాహ్మణధర్మ మని బ్రహ్మదేవుడు పేర్కొన్నాడు. విప్రసేవ కల్పవృక్ష సేవ వంటిది. శంబరాది రాక్షసులు బ్రాహ్మణ సేవవలన అధిక సంపదలు పొందారు.

ప్రశ్న 33 : అపూర్వులు, చిరకాలం నుండి ఆశ్రయించుకొన్నవారు, దూరంనుండి వచ్చినవారు - వీరిలో ఎవరు ఉత్తములు?

ఉత్తరం : ఈర్ష్యాసూయాదులు లేని స్నేహితులు, చుట్టాలు, ఋత్విజులు, పురోహితులు యోగ్యులు. విద్యావంతులూ ఆచారవంతులైతే దూరం నుండి వచ్చినవారుకూడా పూజార్హులే.

ప్రశ్న 34 : పాపాలన్నింటికి మూలం స్త్రీలంటారు నిజమేనా? వారిని ఎట్లా కాపాడుకొనాలి ?

ఉత్తరం : పూర్వం స్త్రీలు సాధువులై పవిత్రలై ఉండేవారు. వారి మనస్సులు పవిత్రంగా ఉండేవి. మాయామర్మాలు లేని ఆ రోజులలో పురుషులంతా కావలసినప్పుడు దైవత్వాన్ని పొందేవారు. స్త్రీ రక్షణను గురించి కథ చెప్పుతాను వినుము. దేవశర్మ అనే మునికి రుచి అనే పేరుగల భార్య ఉండేది. ఆమె అపూర్వ సౌందర్యవతి. ఇంద్రుడు ఆమెను పొందాలని ఉవ్విళ్ళూరుతుండేవాడు. దేవశర్మ రుచిని కాపాడుకొంటూ ఉండేవాడు. ఒకసారి దేవశర్మ ఒక యజ్ఞాన్ని నిర్వహించటానికి పోతూ తన భార్యను ఇంద్రుడి దృష్టినుండి రక్షించే బాధ్యత తన శిష్యుడైన విపులుడికి ఒప్పజెప్పాడు. విపులుడు తన యోగశక్తితో రుచిని ఆవహించాడు. విపులుడి ఆత్మ రుచిలో

ప్రవేశించింది. ఆమె చైతన్యం జడంగా మారింది. అప్పుడు ఇంద్రుడు సుందరరూపంతో ఆమెను సమీపించి ఆమెను వలపుమాటలతో వశం చేసికొనటానికి యత్నించాడు. అప్పుడు ఆమె శరీరంలో ఉన్న విపులుడు ఇంద్రుడిని 'నీవు ఇక్కడికి రావలసిన పని ఏమిటి?' అని ప్రశ్నించి, రుచిని సొమ్మసిల్లచేసి, తన ఆత్మను తన శరీరంలో ఉంచుకొని ఇంద్రుడిని ముఖాముఖి మందలించాడు. ఇంద్రుడు సిగ్గుపడి అదృశ్యుడయ్యాడు. తరువాత విపులుడు రుచిని మేల్కొల్పి, గురువు వచ్చిన తరువాత జరిగిన సంగతి తెలియచెప్పి, అతడివలన వరం పొంది తపస్సుకు వెళ్ళాడు. రుచి దేవశర్మలు సుఖంగా జీవించారు. పతివ్రతకూ దైవానికీ భేదం లేదు. సద్భార్యవలన పురుషుడికి పురుషార్థసిద్ధి కలుగుతుంది.

ప్రశ్న 35 : వధువును ఎన్నుకొనే పద్ధతిని తెలియపరచుము.

ఉత్తరం : కులం, శీలం, విద్య కలవాడిని పిలిచి ప్రీతితో కన్యనివ్వటం బ్రాహ్మవివాహం. కన్యా వరుడూ పరస్పరం కోరుకొని వివాహమాడటం క్షాత్రం.కన్నె తాను కోరుకొన్నవాడితో వివాహమాడటం గాంధర్వం. కట్నంతో చేసికొనేది ఆసురం. బంధువులను చంపి, కన్నెను బలవంతంగా ఎత్తుకొనిపోయి వివాహమాడటం రాక్షసం. ఈ అయిదు రకాలలో మొదటి మూడూ ధర్మవివాహాలు. మిగిలినవి ధర్మాలు కావు. బ్రాహ్మణుడు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వర్గాలలోని కన్యను వివాహం చేసికొనవచ్చును. శూద్ర స్త్రీ యందు సంతానం కనటం నిషేధం. రాజు క్షత్రియకన్యను, వైశ్యకన్యను శూద్రుడు శూద్రకన్యను, వైశ్యుడు వైశ్య శూద్ర కన్యలను వివాహమాడవచ్చును. బ్రాహ్మణుడు శూద్రస్త్రీని వివాహమాడవచ్చునని కొన్ని సందర్భాలలో చెప్పబడింది.

ప్రశ్న 36 : బ్రాహ్మణుడివలన నాలుగు వర్ణాల స్త్రీలకు సంతానం కలిగితే వారందరికి ఆస్తిపాస్తు లెట్లా పంచాలి? మిగిలిన వర్ణాలవారికి విభాగం ఎట్లా ఉంటుంది?

ఉత్తరం : బ్రాహ్మణుడి ఆస్తి 10 భాగాలు చేసి అందులో 4 పాళ్ళు బ్రాహ్మణస్త్రీవలన పుట్టినవాడికి, 3 పాళ్ళు క్షత్రియ సంతానానికి, 2 పాళ్ళు వైశ్యస్త్రీ సంతానానికి, 1 పాలు శూద్ర సంతానానికి ఇవ్వాలి. క్షత్రియుడి ఆస్తి 8 భాగాలు చేసి అందులో 4 భాగాలు క్షత్రియ స్త్రీ సంతానానికి, 3 వైశ్యస్త్రీ సంతానానికి, 1 శూద్ర స్త్రీ సంతానానికి ఇవ్వాలి. శూద్రుడు తన సంతానానికి ఆస్తి సమంగా పంచి ఇవ్వాలి. వైదిక కర్మలు చేసే అర్హత బ్రాహ్మణ స్త్రీలకే ఉంటుంది.

ప్రశ్న 37 : కొడుకులు బహువిధా లంటారు వారి విధం తెలపండి.

ఉత్తరం : ధర్మపత్నియందు ధర్మబద్ధంగా పుట్టిన కొడుకు ఔరసుడు. కూతురి కొడుకును దత్తత తీసికొంటే వాడు దౌహిత్రుడు. ధర్మమార్గంలో తన భార్యను ఇతరుల కర్పించగా అతడివలన కలిగినవాడు క్షేత్రజుడు. తల్లిదండ్రులు జలధార పూర్వకంగా దానం చేయగా దక్కినవాడు దత్రిముడు; అనాథ బాలుడిని కొడుకుగా గ్రహిస్తే అతడు కృత్రిముడు. అజ్ఞాతంగా ఎవరివలన కలిగినా, పరభార్యకు పుట్టినా, భార్య కలవాడికి అతడు గూఢజుడు. తల్లిదండ్రులు వదలివేసిన వాడిని కొడుకుగా స్వీకరిస్తే అతడు అపవిద్ధుడు. కన్యగా స్త్రీ కన్నకొడుకు కానీనుడు. పెండ్లికాకముందే గర్భవతియై వివాహానంతరం స్త్రీ కన్నకొడుకు సహోఢుడు. భర్తను విడిచిన భార్య, భార్యను విడిచిన భర్త, విధవ-ఎవడి వలన కొడుకును కంటారో ఆ కొడుకు కన్నవాడికే కొడుకు. అతడి పేరు పౌనర్భవుడు. తనను తాను ఇతరులకు దానం చేసికొన్నవాడు స్వయందత్తుడు. తల్లిదండ్రులు అమ్మగా కొనబడినవాడు క్రీతుడు. ఈ పన్నెండుమంది పుత్రులలో ఔరసుడు శ్రేష్ఠుడు. వైదికకర్మలకు తగినవాడు. ఔరసుడితో కూతురుకొడుకు (దౌహిత్రుడు) సమానుడని పండితుల అభిప్రాయం. వేదకర్మలను, శాస్త్రవిధులను పాటించి ఉభయ కులాలను ఉద్ధరిస్తే ద్వాదశపుత్రులూ యోగ్యులే.

ప్రశ్న 38 : కలిసి ఉండటం (సహవాసం) వలన, దర్శనం (చూడటం) వలన పుట్టే స్నేహాలు ఎట్లాంటివి? గోవుల మాహాత్మ్యం ఎటువంటిది?

ఉత్తరం : ఈ సందేహాన్ని చ్యవన నహుష సంవాదం తీరుస్తుంది. చ్యవనమహర్షి గంగాయమునల సంగమ తీర్థంలో మునిగి తపస్సు చేస్తూ ఉండగా అతడి శరీరాన్ని చేపలు తాకుతూ ఉండేవి. వాటిమీద స్నేహంతో (సహవాసంతో) పన్నెండేళ్ళు తపస్సు చేశాడు. ఒకసారి జాలరులు చేపలు పట్టుతూ, చేపలతో పాటు ఆ మునినీ వలలో బంధించి ఒడ్డుకు లాగారు. ఋషిని చూచి జాలరులు భయపడి క్షమాపణ వేడి, చేసిన పనికి ప్రాయశ్చిత్తం చెప్పుమని కోరారు. చ్యవనుడు చేపలమీద ప్రేమతో - వాటితోపాటు తనను కూడా తగిన వెలకు అమ్ముకొనండని సూచించాడు. ఆ మాట విని బోయలు భయపడి నహుషుడనే రాజు వద్దకు వెళ్ళి చ్యవనుడి వృత్తాంతం చెప్పారు. అతడు తొట్రుపాటుతో ఋషివద్దకు వచ్చి క్షమాపణ కోరుకొన్నాడు. చ్యవనుడు తన శరీరం ధర నిర్ణయించి బోయల కిమ్మన్నాడు. రాజు సంతోషించి వేయి మాడల నుండి సర్వరాజ్యంవరకు వెల నిశ్చయించినా, చ్యవనుడు సమ్మతించక 'న్యాయం తెలిసి వెల నిర్ణయించు' మనేవాడు. చివరకు ఆ రాజును మంత్రులతో మంతనం చేసి వెల నిర్ణయించుమని సూచించాడు. రాజు అట్లాగే చేశాడు. అప్పుడక్కడికి గవిజాతుడనే ముని వచ్చి 'రాజా! గోవూ, బ్రాహ్మణుడూ ఒకటేకులం. కాకపోతే బ్రహ్మ రెండుగా సృష్టించాడు. గోవు హవిస్సుకూ, బ్రాహ్మణుడు మంత్రాలకూ ఆధారం. సర్వవేదాలకూ మూలమైన బ్రాహ్మణుడి వెలను శివుడు కూడా నిర్ణయించలేడు. గోవుకు కూడా అంతే. కాబట్టి చ్యవనుడికి వెలగా గోవును ఇవ్వటం న్యాయం' అని నిర్ణయించాడు. ఆ ప్రతిపాదనకు చ్యవనుడు సంతోషించి అంగీకరించాడు. 'గోవు అగ్నిమయం, అమృతమయం, యజ్ఞవిధానానికి పవిత్ర ప్రవాహం. స్వర్గానికి గోవు నిచ్చెన. దేవతలకైనా గోవు పూజ్యమే' అని ప్రశంసించి గోవును తనకు వెలగా ఇమ్మన్నాడు. బోయలు ఆ గోవును స్వీకరించి, చ్యవనుడికి దానం చేశారు. సహవాసంవలన చేపలమీదా, దర్శనంవలన బోయలమీదా స్నేహం ఏర్పడటంవలన చ్యవనుడు వారిరువురికీ బొందితో స్వర్గాన్ని ప్రసాదించాడు. గవిజాతుడు, చ్యవనుడు కలిసి రాజుకు ధర్మ పరాయణత్వాన్ని, ఇంద్రైశ్వర్యాన్నీ వరాలుగా ఇచ్చారు.

ప్రశ్న 39 : మహత్తరమైన బ్రాహ్మణశక్తి గల భృగువంశంలో విచిత్రమైన క్షత్రియ శీలం గల పరశురాము డెట్లా జన్మించాడు? మహోత్తమమైన క్షాత్రశక్తితో ప్రకాశించే కుశికవంశంలో బ్రాహ్మణ తేజస్సుగల విశ్వామిత్రు డెట్లా పుట్టాడు? ఇదివరకు కొంత విన్నా సంశయం తీరలేదు. వివరించుము.

ఉత్తరం : చ్యవన కుశిక సంవాదం దీనికి తగిన సమాధానం. వినుము. కుశికుడివలన తనవంశం సంకరమౌతుందని తెలిసికొని చ్యవనుడు కుశికవంశానికి ఆపద కలిగించాలని భావించి కుశికుడి ఇంటికి అతిథిగా పోయాడు. కుశికుడు సతీసమేతంగా చ్యవనుడికి అతిథిపూజలు చేశాడు. రాజ్యా న్నిచ్చి దాస్యం చేయటానికి పూనుకొన్నాడు. చ్యవనుడు తనకు రాజ్యకాంక్ష లేదనీ, ఒక వ్రతాన్ని పూర్తిచేసికొనాలని ఉన్నదనీ, కుశికుడి ఇంటనుండి ఆ వ్రతాన్ని పూర్తి చేసికొంటాననీ పేర్కొన్నాడు. కుశికుడు దాని కంగీకరించి ఒక దివ్య భవనాన్ని చ్యవనుడికి విడిదిగా ఇచ్చాడు. చ్యవనుడు ఒక శయ్యపై పవళించి కుశిక దంపతులను తాను నిద్రలేచేంతవరకు పాదాలను ఒత్తుతుండండని కోరాడు. వా రట్లాగే చేస్తూ ఉండగా ఇరవై ఒక్కరోజులు ఒకే ప్రక్క పడుకొని నిద్రపోయి, ఆ మరునాడు లేచి నగరం దాటిపోయి మాయమయ్యాడు. రాజ దంపతులు తిరిగివచ్చి భవనంలో చూస్తే శయ్యమీదనే మరొకవైపు తిరిగి పడుకొన్నాడు. వారు ఆశ్చర్యపోయి అతడి పాదాలు ఒత్తుతూ ఉండగా మరొక 21 రోజులు అట్లాగే పరుండి నిద్రలేచి తలంటి నీరు పోయుమన్నాడు. వారు సుగంధతైలంతో తలంటుతుండగా వారిని తెగ తిట్టి మాయమయ్యాడు. రాజదంపతులు అన్నపానీయాలు లేకపోయినా, అలసటతో నీరసించినా కోపతాపాలకు గురికానందుకు సంతోషించి వారిచేత స్నానం చేయించుకొన్నాడు. భోజనానికి వస్తానని రాక

ఎక్కడికో వెళ్ళాడు. రాజదంపతులు భోజనాలు మాని అట్లాగే ఉండిపోయారు. చ్యవనుడు తెల్లవారిన తరువాత వచ్చి ఒక రథం మీద తనను కూర్చుండబెట్టి రాజూ రాణీ దానిని లాగుతూ తీసికొని వెళ్ళాలని కోరాడు. అలసటతో ఉన్న ఆ రాజదంపతులు అలజడిపడక రథాన్ని లాగుతూ ఉండగా వారిని ముల్లుగఱ్రలతో పొడిచి బాధించాడు. అయినా వారు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగటం చ్యవనుడు సంతోషించి రథం దిగి వారిని కరుణించి వారి శరీరాలకు శ్రమలేకుండా చేసి, నవయౌవనాన్ని ప్రసాదించి, తాను తపోవనానికి వెళ్ళాడు. మరునాడు ఉదయం రాజదంపతులు ఆ తపోవనానికి పోగా అక్కడ స్వర్గలోక భోగాలు కానవచ్చాయి. ఆ తరువాత చ్యవనుడు తపోవనంలో మునివృత్తిలో గోచరించాడు. చ్యవనుడు ఆ దంపతుల ఇంద్రియ నిగ్రహానికి ఆశ్చర్యపడి ప్రశంసించాడు. భృగు వంశసాంకర్యం ఏర్పడుతుందని బ్రహ్మలోకంలో విని, కుశిక వంశాన్ని నాశనం చేద్దామని వచ్చాననీ, కాని ఆ దంపతుల నిష్కాప్రపత్తులను చూచి సంతోషించి, రాచరికంమీదకంటె బ్రాహ్మణత్వం మీద ఉన్న మక్కువను గమనించి హర్షించాననీ పేర్కొన్నాడు. కుశికుడి మనుమడు బ్రహ్మతేజోమయు డౌతాడని వరమిచ్చాడు. దానిని వివరిస్తూ చ్యవనుడి వంశంలో ఋచీకుడు జన్మించి కుశిక వంశంలోని గాధి కూతురును పెళ్ళాడతాడనీ, వారిరువురికి జమదగ్ని జన్మిస్తే అతడు విలువిద్యను పొందేటట్లు చేస్తాడనీ, ఆ ధనుర్విద్య అతడికొడుకు పరశురాముడిలో ఫలిస్తుందనీ పేర్కొన్నాడు. పరశురాముడు సకల క్షత్రియ కులనాశనం చేస్తాడనీ తెలిపాడు. దైవఘటనవలన ఋచీక, గాధి వధువుల అనుష్ఠానాలు మార్పు చెంది జమదగ్నికి క్రూరభావంకల క్షత్ర ధర్మంతో పరశురాముడు జన్మిస్తాడు. గాధికి బ్రాహ్మణ తేజోనిధి అయిన విశ్వామిత్రుడు జన్మిస్తాడు - అని వివరించి చ్యవనుడు తీర్థయాత్రలకు పోయాడు. రాజదంపతులు రాచనగరుకు తిరిగి వచ్చారు.

ప్రశ్న 40 : పితామహా! దాన విశేషాలను తెలుపుము.

ఉత్తరం : కన్య, గృహం, భూమి, నీరు, వస్త్రం ఇట్లాంటి వాటికంటె గోదానం గొప్పది. గోవు కెన్ని రోమా లుంటాయో అన్ని దివ్య సంవత్సరాలు గోదానంవలన స్వర్గంలో ఉంటారు.

ప్రశ్న 41 : అన్నింటికంటె గొప్పదాన మేది?

ఉత్తరం : యాచకుడు కోరిన దానిని ప్రేమతో ఇవ్వటం అన్నింటికంటె గొప్పదానం. వీరశయనం అన్నిటికంటె గొప్పదానం. మిగిలినవి అసలు దానాలే కావు. అన్ని పుణ్యవ్రతాలలోనూ అదే గొప్పది.

ప్రశ్న 42 : అడిగినవాడికి దానం చేయటం మంచిదా? అడగనివాడికి దానం చేయటం మంచిదా?

ఉత్తరం : అడిగినవాడికంటె అడగనివాడికి ఇవ్వటమే శ్రేష్ఠం.

ప్రశ్న 43 : దానాలలో ఉత్తమ దాన మేది?

ఉత్తరం : దానాలలో భూదానం శ్రేష్ఠం. (వివరాలకు చూడు 2.350-366)

ప్రశ్న 44 : దానం చేయటానికి తగిన వస్తువు లేవి ?

ఉత్తరం : అన్నం, బంగారం, పానీయాలు మొదలైనవి ఎన్నో ఉన్నాయి. వాటిలో అన్నదానం విశిష్టం. (వివరాలకు చూడు. 2.367-376)

ప్రశ్న 45 : ఏ నక్షత్రంలో ఏ దానం చేస్తే పుణ్యమో చెప్పుము.

ఉత్తరం : వివరాలకు (2.377-379)

ప్రశ్న 46 : స్వర్ణాది దానాల వివరణ.

ఉత్తరం : వివరాలకు (2.381-396) గోదాన మహిమ (2.379-404), అన్న పానీయాది దాన మహిమ (2.405-407) తిలదాన మహిమ (2.408-413) గోమహిమ (2.414-445)

ప్రశ్న 47 : గోదానంవలన కలిగే విశేషఫలం వినాలని ఉన్నది చెప్పుము.

ఉత్తరం : ఉద్దాలకుని కొడుకు ఔద్దాలకి. అతడి కొడుకు నాచికేతుడు. ఒకనాడు ఔద్దాలకి ఏటిరేవులో కుశలు, సమిధలు, కమండలువు, పూలూ - అన్నీ మరచిపోయి ఇంటికివచ్చి వాటిని నాచికేతుడిని తీసికొని రమ్మని పంపాడు. అతడు ఏటివద్దకు పోయేసరికి ఏరు పొంగి వాటిని తనలో కలుపుకొన్నది. నాచికేతుడు వాటిని కానక ఇంటికి తిరిగివచ్చి తండ్రితో ఆ సంగతి చెప్పాడు. ఔద్దాలకి కోపంతో కొడుకును 'యముడి వద్దకు పొమ్మ' (చావుము) అని తిట్టాడు. నాచికేతుడు తండ్రిని క్షమించుమని కోరుతూ ఉండగానే నేలపై పడి ప్రాణాలు కోల్పోయాడు. దానిని గమనించి ఔద్దాలకి పుత్రుడి శవంమీద పడి కన్నీరు మున్నీరుగా దుఃఖించసాగాడు. ఒక పగలు రాత్రి అట్లా గడచిపోయాయి. తండ్రి కన్నీటితో తడిసిన కొడుకు శవం ఆ తరువాత చైతన్యవంతమైనది. అతడి శరీరం సుగంధయుతమై ఇంపుగొలిపింది. కొడుకు బ్రతికేసరికి తండ్రి ఆహ్లాదంతో అతడిని జరిగిన సంగతిగురించి అడిగాడు. నాచికేతుడు తండ్రికి నమస్కరించి ఇట్లా చెప్పాడు. 'నీ ఆనతితో నేను అందమైన యముడి పట్టణానికి వెళ్ళి సమున్నత సింహాసనం మీద ఉన్న యమధర్మరాజును దర్శించాను. ఆయన నేను చావలేదనీ, నీ ఆజ్ఞప్రకారం యముడిని దర్శించాననీ, తిరిగి వెళ్ళుమనీ తెలిపాడు. నేను ధర్మమూర్తి అయిన ఆయనను పుణ్యలోకాలను చూపుమని అడిగాను. ఆయన ప్రీతితో ఒక రథంమీద నన్ను ఎక్కించుకొని పుణ్యలోకాలన్నీ దర్శింపజేశాడు. 'ఈ పుణ్యలోకాలు ఎవరికి లభిస్తాయి?' అని నేను అడుగగా 'అవన్నీ గోదానంవలన కలిగే ఫలా'లని పేర్కొన్నాడు. గోవులు అంటే సూర్యకిరణాలు కాబట్టి గోదానం చేసినవారు సూర్యుడివలె ప్రకాశిస్తారన్నాడు. నన్ను తిరిగి పంపాడు' అని చెప్పి తండ్రికి పరమానందాన్ని కలిగించాడు. నాచికేతుడు.

ప్రశ్న 48 : గోదానం చేసినవారు ఏ లోకాలకు పోతారో చెప్పుము.

ఉత్తరం : పూర్వం ఇదే ప్రశ్నకు బ్రహ్మ ఇంద్రుడి కిచ్చిన సమాధానం చెప్పుతాను వినుము. ఆ లోకంలో కాలక్రమముండదు. ఋతువులుండవు. దప్పి, రోగాలు, ముసలితనం లేవు. ఆ ప్రశస్తలోకం నాశనం లేనిది. స్వచ్ఛమైన ఆనందాన్ని కలిగించేది. దానిపేరు గోలోకం. గోలోకాన్ని మించిన పుణ్యలోకంగాని, గోదానాన్ని మించిన శుభమైన ధర్మంగాని లేవు.

ప్రశ్న 49 : తాతా! శ్రద్ధతో చేయదగిన పను లేవో చెప్పుము.

ఉత్తరం : నియమం, వేదపఠనం వాటిని ధారణచేయటం, దమము, వేదాలను ఇతరులకు నేర్పటం, దానాలు పట్టకపోవటం, స్వీయకర్తవ్య నిష్ఠ, ఇంద్రియాలను జయించటం, సత్యనిరతి, చదవటంలో ఆసక్తి చూపటం, బ్రహ్మచర్యం, తల్లిదండ్రులను గురువులను సేవించటం, దయకలిగి ఉండటం, గోవ్రతాలను విరివిగా చేయటం - ఇవి శ్రద్ధతో చేయదగిన పనులు.

ప్రశ్న 50 : గోవులను దానమిచ్చే పద్ధతిని గురించి తెలుపుము.

ఉత్తరం : బృహస్పతి మాంధాతకు చెప్పిన గోదానవిధిని గురించిన విశేషాలు సంగ్రహంగా చెప్పుతాను వినుము. ఒక మంచిరోజు ఉపవాసముండి గోశాలకు పోయి రోజల్లా నిష్ఠతో గడిపి, మరునాడు సంగవముహూర్తంలో బ్రహ్మ చెప్పిన ఈ వాక్యాన్ని స్మరించాలి. 'ఆవు నా తల్లి. ఎద్దు నా తండ్రి. వీటికి గర్భప్రదేశం స్వర్గం. అది నిలిచిన తావే నాకు తగిన స్థలం' - అని చదివి యోగ్యుడు, పండితుడు అయిన బ్రాహ్మణుడికి దానం చేయాలి. గోదానానికి ఆశ్వయుజమాసంలోని కృష్ణపక్షంలో అష్టమి మొదలు మూడు రోజులు మంచివి. భరత, దిలీపాది మహారాజు లెందరో గోదానాలు చేసి పుణ్యలోకాలు పొందారు. ఆవులలో కపిలగోవు శ్రేష్ఠమైనది. దానిని దానం చేస్తే పాపాలన్నీ పోతాయి.

ప్రశ్న 51 : కపిల గోవుకు ఆ విశేషం ఎట్లా కలిగింది?

ఉత్తరం : దేవతలకు ఆకలివేసి బ్రహ్మవద్దకు పోయారు. ఆయన వారికి అమృతాన్ని అందించాడు. ఆ అమృతపు వాసనలకు కామధేనువు పుట్టింది. దానికి ఆవులు పుట్టాయి. ఒకప్పుడు ఆవులు హిమాలయ పర్వత పై భాగాన తిరుగుతున్నాయి. ఒక లేగదూడ తల్లిపాలు త్రాగుతూ ఉండగా పాలనురుగు గాలివాటానికి ఎగిరి శివుడి శిరస్సుమీద పడింది. దానికి ఆయన కోపించి మూడవ కన్ను తెరిచాడు. ఆ మంటకు ఆవులు ఎర్రబడిపోయాయి. బ్రహ్మదేవుడు శివుడివద్దకు వచ్చి ఆవుపాలు అమృతంవంటివని ప్రశంసించి ఆయనను ప్రసన్నుడిని చేసికొన్నాడు. శివుడు గోవులకు ఎక్కడైనా తిరిగే వరమిచ్చాడు. తన కంటి మంటకు ఎర్రబడిన ఆవులు శ్రేష్ఠమైనవని పేర్కొన్నాడు. దానితో కపిలగోవులను దానం చేయటం ఉత్తమమైనదనే ప్రశస్తి ఏర్పడింది. కపిలగోవుల కథ పుణ్యప్రదమైనది. ధర్మరాజాదులు ఈ కథ విని కపిలగోదాన వ్రతులయ్యారు. భీష్ముడు ధర్మరాజుకు గోదాన మహిమలు తెలిపే సౌదాసుడి కథను (3.28-41) వ్యాసుడు శుకుడికి తెలిపిన గోప్రభావాన్నీ (3.42-51) వివరించాడు.

ప్రశ్న 52 : బ్రహ్మ సమస్త లోకాలకూ ప్రభువు కదా! గోలోకం ఆయన లోకానికి పైన ఉంటుందని విన్నాను. దానికి కారణం ఏమి ?

ఉత్తరం : పూర్వం బ్రహ్మ అపూర్వ సౌందర్యరాశి అయిన సురభి అనే కన్యను, మార్తాండు డనే మగవాడిని సృష్టించి, వారిరువురకు కలిగే సంతానం యాగాలకూ, మోక్షానికీ పనికివచ్చే పాలను సృష్టించి, బ్రహ్మలోకానికి పైభాగాన ఉండేటట్లు వరమిచ్చాడు. వారికి పుట్టిన ఆవులు క్షీరము లిచ్చాయి. ఆవులకు ముందు వారికి ఏకాదశ రుద్రులు జన్మించారు. ఆవుల శరీరాంగాలలో దేవతలు వెలసి ఉండేవారు. గోమహిమ తెలిపే ఒక ఇతిహాసం ఉన్నది. భృగువంశంలో పుట్టిన సుమిత్రు డనే ముని గోశర్కర అనే పదార్థ ప్రభావంతో గోగణాన్ని పొందాడు. ఆ ఆవుల మందను శ్రద్ధతో పెంచి పోషించాడు. దూడలు పాలుత్రాగేటప్పుడు ఏర్పడే నురుగును ఆ ముని త్రాగుతూ ఫేనపుడు అనే పేరుతో ప్రసిద్ధి పొందాడు. ఒకనాడు కామరూపధారులైన గోవులు స్త్రీరూపాలను ధరించి కొలనులో స్నానం చేస్తుండగా మిగిలిన గోవులు వారిని వరాలు అడిగాయి. హవ్యకవ్యాలకూ, అతిథిపూజలకూ, ఆహారానికి తగిన క్షీరాల నివ్వటంవలన మునులు వరా లిచ్చారనీ, దానివలన గోలోకానికీ కూడా పోగలమనీ ఆ ఆవులు తెలిపి, మిగిలిన గోవులు కూడా రంతిదేవుడు చేసే వేయేండ్ల యజ్ఞంలో బలి అయితే గోలోకం సిద్ధిస్తుందని సూచించాడు. కొన్ని గోవులు ఆ విధంగా గోలోకాన్ని సంపాదించాయి. కొన్ని గోవులు కొమ్ములతో ఫేనపుడిని చంపి అతడిని గోలోకానికి పంపాయి. భీష్ముడు ధర్మరాజు కోరికపై గోమహిమలను గురించి

మరెన్నో విశేషాలను వివరించి చెప్పాడు. (చూ.3.89-109). బ్రాహ్మణులు, గాయత్రి, వసంతకాలం, సత్యం, గోవులు, బంగారం అనేవి ఒకదాని నుండియే పుట్టాయి. కాబట్టి భూమీ, బంగారమూ, ఆవూ దానమివ్వదగిన వస్తువు లన్నింటికంటె గొప్పవి.

ప్రశ్న 53 : ఆవుపేడలో లక్ష్మి ఉంటుందంటారు. దానికి కారణం ఏమిటి?

ఉత్తరం : దీనికి తగిన సమాధానం గో శ్రీసంవాదం అనే పూర్వగాథ. దానిని వినుము. ఒకసారి లక్ష్మీదేవి గోవులమందలోనికి వెళ్ళి వాటి మధ్య ఉండటానికి అభిలషించింది. కాని, లక్ష్మి చంచల స్వభావురాలు కాన అవి ఆమె కోర్కెను మన్నించలేదు. ఆవులు తిరస్కరిస్తే లోకం గౌరవించదని పలికి లక్ష్మి గోవులను ప్రార్థించింది. గోవులు తమ మలమూత్రాలు పరమ పవిత్రమైనవని వేదం పేర్కొన్నది కాబట్టి వాటిలో వసించుమని అనుమతించాయి. లక్ష్మి దానికి ఆమోదించి వాటియందు వసించింది. అందువలన వాటి మహిమ పెరిగింది. మరొకసారి బ్రహ్మ కామధేనువు చేసే తపస్సుకు మెచ్చి గోలోకాన్ని వరంగా ప్రసాదించాడు. ఆ విధంగా బ్రహ్మలోకంకంటె గోలోకం ఉన్నతంగా నిలిచింది. గోమాహాత్మ్యం తెలిపే కథలు వినినవారికి ఆయువు, సంపద, అధికారం, కీర్తి, సద్గతి కలుగుతాయి.

పశ్న 54 : స్వర్ణదాన మహిమాతిశయం వినగోరుతాను.

ఉత్తరం : భీష్ముడు తాను పితృకార్యం నిర్వహిస్తున్నప్పుడు పితృదేవతలు స్వర్ణదానమహిమను గురించి చెప్పగా అతడు బంగారం దానం చేసి ధన్యుడైన అంశం వివరించాడు. పరశురాముడు వసిష్ఠుడి ప్రబోధంవలన స్వర్ణదానమహిమను తెలిసి, ఆచరించిన కథను కూడా వివరించి చెప్పాడు. పార్వతీపరమేశ్వరులు కలిసి ఉన్నప్పుడు పరమేశ్వరుడి వీర్యం వెలువడింది. అతడు ఆ వీర్యాన్ని అగ్నియందు నిలిపాడు. తారకాసురుడిచేత బాధితులైన దేవతలు బ్రహ్మ వద్దకు వచ్చి మొరపెట్టుకొనగా, ఆ పితామహుడు వారిని అగ్నిని వేడుకొండని ఆదేశించాడు. అగ్ని పాతాళంలో దాగి ఉండగా కప్ప ఆ రహస్యాన్ని దేవతలకు తెలిపింది. దానికి కోపించి అగ్ని కప్ప నాలుక కదలకుండా ఉండాలనీ, రుచులు తెలియరాకుండా ఉండాలనీ శపించాడు. దేవతలు కరుణించి కప్పలు ఎండలకు బొరియలలో ఎండిపోయినా నీరు రాగానే అవి జీవించి బెకబెకలాడుతాయని వరమిచ్చారు. అగ్ని రావిచెట్టులో దాగి ఉండగా ఏనుగు సైగ చేసి దేవతలకు తెలిపింది. అగ్ని కోపించి ఏనుగులకు నాలుక తిరుగబడాలని శపించాడు. దేవతలు ఏనుగులకు నాలుకలు తిరగబడినా రుచులు కలిగేటట్లు వరమిచ్చారు. అగ్ని జమ్మిగర్భంలో దాగి ఉండగా చిలుక ఆ రహస్యాన్ని దేవతలకు తెలిపింది. అగ్ని కోపించి చిలుక నాలుక తిరుగబడేటట్లు శపించాడు. దేవతలు చిలుకకు పలుకులు వచ్చే వరమిచ్చారు. చివరకు అగ్ని దేవతలకు కనిపించి, తారకాసుర వధను గురించిన వారి కోర్కెను తెలిసికొని దానిని తీర్చగలనని మాట ఇచ్చి వారిని పంపాడు. అగ్ని తనలో ఉన్న శివరేతస్సును గంగలో గర్భరూపంగా వదిలాడు. అది చాలా పెద్దదిగా పెరగటంవలన గంగ భరించలేక మేరుపర్వతం ఒడ్డున ఉన్న రెల్లుతోటలో దానిని నిలిపింది. అది బంగారు వన్నెతో మిలమిలలాడుతూ బాలుడి రూపం తాల్చింది. ఆ బాలుడిని కృత్తికలు ఆరుగురూ తమకొడుకుగా భావించి లాలించారు. ఆరుగురు తల్లుల లాలనను అందుకొనటానికి ఆ బాలుడు ఆరు మొగాలవాడయ్యాడు. ఆ విధంగా అగ్నిపుత్రుడు గంగాపుత్త్రుడూ, కృత్తికాపుత్రుడూ అయ్యాడు. బ్రహ్మాదులు అతడిని పూజించి దేవసేనకు నాయకుడిని చేశాడు. అతడు తారకాసురుడిని సంహరించి దేవతలకూ, మునులకూ సంతోషాన్ని కలిగించాడు. ఆ కుమారస్వామి బంగారమే స్వరూపంగా కలవాడు కావటం, అతడు శివరూపుడు కావటం, అగ్ని హిరణ్యరేతుడు కావటం, శివుడు వహ్నిరేతుడే కావటంవలన బంగారం జాతరూపమనే పేరుతో ప్రసిద్ధి చెందింది. పరశురాముడు స్వర్ణమహిమను తెలిసి దానిని విపులంగా దానం చేసి కృతార్థుడయ్యాడు.

కాబట్టి ధర్మరాజును కూడా స్వర్ణదానం చేసి సంసార సముద్రాన్ని దాటుమని హితవు చెప్పాడు భీష్ముడు.

ప్రశ్న 55 : తాతా! పితృయజ్ఞం ఎట్లా చేయాలో చెప్పుము.

ఉత్తరం : దేవతలు కూడా పితృదేవతలను పూజిస్తారు కాబట్టి దేవపూజకంటె పితృదేవతల పూజ శ్రేష్ఠం. అమావాస్యనాడు పిండప్రదానంతో శ్రద్ధతో చేసిన పితృపూజ నిత్యశ్రాద్ధం చేసిన ఫలితాన్ని ఇస్తుంది. పాడ్యమి మొదలైన తిథులలో కృత్తిక మొదలైన నక్షత్రాలలో శ్రాద్ధకర్మలు ఆచరిస్తే ఆయా విశేష ఫలాలు ఏర్పడుతాయి. కృష్ణపక్షం, అపరాహ్ణం శ్రాద్ధానికి తగిన సమయాలు.

ప్రశ్న 56 : శ్రాద్ధం ఏ వస్తువులతో చేస్తే ఎక్కువ ఫలం వస్తుంది?

ఉత్తరం : నువ్వులు, పాయసం, నేయి శ్రాద్ధాలకు మేలైన వస్తువులు. ఆవులనుండి ఏర్పడేది ఏదైనా గొప్ప ఫలాన్ని ఇస్తుంది. చేపలు, మాంసం, అందులోనూ గొర్రె, ఖడ్గమృగం, గండభేరుండం, మేక మాంసాలు శ్రేష్ఠాలు.

ప్రశ్న 57 : పితృదేవతల ఆరాధనకు యోగ్యులు ఎవరు?

ఉత్తరం : కులవయోరూపశీలవిద్యలలో ఉదాత్తులయినవారు ఆరాధనకు యోగ్యులు. జూదరులు మొదలైనవారు పంక్తిదూషకులు, పగవారిని శ్రాద్ధంలో భోక్తలుగా నియోగించరాదు. అత్రి మహాముని నిమికి శ్రాద్ధక్రియా విశేషాలను తెలిపాడు. (3.184-202) శ్రాద్ధం అగ్నిపూజతో కలిపి చేస్తే ఎంతో ప్రశస్తం.

ప్రశ్న 58 : ఉపవాసవ్రతాన్నే తపస్సని పెద్దలంటారు. అదేనా లేక మరొకటి ఉన్నదా? చేవగల తపస్సు పద్ధతిని నాకు తెలుపుము.

ఉత్తరం : పస్తులుండటం తపస్సు కానేకాదు. అది ఆత్మను హింసించటం. కనుక దానివలన నరుడు తపస్వి కాజాలడు. సత్యం, బ్రహ్మచర్యం, నిత్య పవిత్రత, మౌనం, సాటిలేని నిష్ఠ, భూతదయ, శుద్ధత్యాగం - అనేవి తపస్సంపదయొక్క ఆకారాలని తత్త్వవేత్త లంటారు.

ప్రశ్న 59 : దాన శీలుడి విశేషమూ, దానం పుచ్చుకొననివాడి ప్రత్యేకతా ఎట్టివో నాకు తెలుపుము.

ఉత్తరం : సప్తర్షులు, అరుంధతి, గండ, పశుసఖు డనే పదిమంది తపస్సు చేసికొంటూ భూమిమీద తిరుగుతూ ఉండేవారు. ఒకసారి భయంకరమైన అనావృష్టి ఏర్పడి తినటానికి పదార్థాలేవీ దొరకక బాధపడ్డారు. శిబి కొడుకు యాజ్యుడనేవాడు తన కొడుకైన నీలుడిని ఋత్విక్కులకు యజ్ఞదక్షిణగా ఇచ్చాడు. అతడు కాలంతీరి చనిపోగా, అతడి శవాన్ని తినటానికి సప్తర్షులు సిద్ధమయ్యారు. అప్పుడు వృషాదర్భి అనే రాజు వారికి అగ్రహారాలతోపాటు ఆహారధాన్యాలను ఇస్తానని పిలిచాడు. వారు రాజునుండి దానం పుచ్చుకొనే ఆచారం తమకు లేదని అతడి దానాన్ని తిరస్కరించారు. అతడు కోపించి యజ్ఞంచేసి 'కృత్య'ని సృష్టించి వారిని చంపటానికి పురికొల్పి పంపాడు. సప్తర్షులకు తోడుగా శునస్సఖుడనే సన్న్యాసి వారితో కలిసి తిరుగ నారంభించాడు. వా రొకసారి సరోవరంలోని తామరతూండ్లను తిని బ్రతుకుదామని భావించగా కృత్య వారిని వారించింది. శునస్సఖుడు ఆమెను మంత్రదండంతో భస్మం చేశాడు. ఋషులు తామరతూండ్లను త్రెంచుకొని కట్టకట్టి ఒడ్డున పెట్టి స్నానాదులు ముగించుకొని వచ్చేసరికి తామరతూండ్ల కట్ట మాయమైపోయింది. ఋషులు ఒకరిపై మరొకరు అనుమానపడ్డారు. అప్పు డా పదిమంది తామరతూండ్లను దొంగిలించలేదని ఘోరప్రతిజ్ఞలు చేశారు. శునస్సఖుడు చివరకు తాను తీశానని ఒప్పుకొని

వారి చిత్తవృత్తులను పరీక్షించటానికే అట్లా చేశానని పేర్కొని, తాను ఇంద్రుడనని ప్రకటించుకొని, కృత్యనుండి వారిని కాపాడిన సంగతి చెప్పి, ఎన్ని కష్టాలు వచ్చినా లోభగుణానికి లోనుకాని వారి చిత్తవృత్తులకు మెచ్చుకొని, వారికి శాశ్వతలోకాలను సిద్ధింపజేశాడు. ఈ ఇతిహాసాన్ని వినినవారికి ఆయువూ, సంపదా, ధర్మమూ, దొడ్డ కీర్తీ పుష్కలంగా కలుగుతాయి. అతడిని పితృదేవతలు సర్వదా రక్షిస్తారు.

ప్రశ్న 60 : శ్రాద్ధాదులలో గొడుగులు, చెప్పులు దానం చేస్తారు ఎందుకు?

ఉత్తరం : సూర్యజమదగ్ని సంవాదమనే పూర్వేతిహాసం నీ ప్రశ్నకు తగిన సమాధానం. జమదగ్ని ఒకనాడు బయలుప్రదేశానికి వెళ్ళి బాణప్రయోగం సాధన చేస్తున్నాడు. అతడు వదలిన బాణాలు అతడి భార్య రేణుక తెచ్చి ఇస్తూ ఉండేది. మధ్యాహ్నమయింది. రేణుక సూర్యరశ్మికి నేల కాలుతూ ఉంటే త్వరగా రాలేక చెట్లనీడలలో నిలిచి రావటంవలన ఆలస్యమయింది. అందుకు జమదగ్ని సూర్యుడిపై కోపించి, అతడిపై బాణప్రయోగం చేసి నేలపై కూలనేయబోయాడు. అంతలో సూర్యుడు బ్రాహ్మణవేషంలో అతడి వద్దకు వచ్చి తనను ఎరిగించుకొని శరణు వేడాడు. జమదగ్ని సంతోషించి అప్పుడు సూర్యుడు సంకల్పమాత్రంచేత గొడుగూ చెప్పులూ సృష్టించితెచ్చి అతడి దగ్గర ఉంచి 'ఇవి పూర్వం లేవు. ఈ గొడుగువలన నావేడి శరీరానికి తాకదు. ఈ చెప్పులవలన కాళ్ళకు తాకదు. వీటిని దానం చేస్తే నరులకు ఇహపరలోకసుఖాలు కలుగుతాయి' అని తెలిపాడు. సూర్యుడు మనస్సుతో సృష్టించినవీ, మహర్షి మన్నించినవీ అయిన ఈ మంచి వస్తువులు విలువైనవి. వీటిదానంవలన పుణ్యలోకాలు లభిస్తాయి.

ప్రశ్న 61 : శూద్రుడు ఎటువంటి నడవడితో ఇహపరసుఖాలనూ, పరమసౌఖ్యాన్నీ పొందుతాడు?

ఉత్తరం : పూర్వం పరాశరుడు శిష్యులకు అందరూ అనుసరించదగిన ధర్మాలను పెక్కింటిని చెప్పాడు. వాటి తాత్పర్యం చెప్పుతాను వినుము. శూద్రుడు ఇంద్రియాలపై పట్టుగలిగి, కామాదులైన అంతశ్శత్రువులను గెలిచి, గర్వం వదలి తక్కిన మూడు వర్ణాలపట్ల భక్తికలిగి వారికి సేవలు చేస్తే, ఉభయలోక సుఖాలనూ పొందగలడు. బహిరంగ స్థలాలలో మలమూత్రాదులు వదలరాదు. ఆ పనులకూ, వాటి శుద్ధి పనులకూ మరుగుతావులు ఉండాలి. శూద్రుడు ఏ విధంగానైనా శుచిత్వాన్ని నిష్ఠతో సాధించి సేవాభావంతో విద్వాంసులయెడ వినయంగా మెలగాలి. బ్రాహ్మణుడికి జపమే యజ్ఞం. అధ్యయనమే బ్రదుకుతెరువు. తపస్సు శోభ నిస్తుంది. క్షత్రియుడికి ప్రయత్నం యజ్ఞం. దండనీతి బ్రతుకుతెరువు. పాలన శోభ తెస్తుంది. వైశ్యుడికి హవ్యం యజ్ఞం. అమ్మకం బ్రదుకుతెరువు. ఆతిథ్యం శోభ తెస్తుంది. శూద్రుడికి సేవ లందించటం యజ్ఞం. సేవలే అతడి బ్రతుకుదెరువు. పనిలో సామర్థ్యం అతడికి వన్నె తెస్తుంది. యతిపట్ల భక్తితో సేవ చేయటం కర్తవ్యం. అది అతడికి సుగతిని కలిగిస్తుంది. పరాశరుడు సర్వవర్ణ సామాన్య ధర్మాలు కూడా చెప్పాడు. (చూడు.2.296-327)

ప్రశ్న 62 : దేవతలుకూడా మ్రొక్కదగిన నరులు ఉంటారని వింటుంటాను. అట్టివారి నడవడి ఎట్లా ఉంటుందో తెలియజెప్పుము.

ఉత్తరం : ధర్మార్థ కామ పురుషార్థాలను ధర్మం తప్పక ఆచరించేవారూ, సుందరాంగులు స్వయంగా కోరినా కామాన్ని వదలి మెలిగేవారూ, విద్యాగర్వం, ధనగర్వం, ప్రభుత్వగర్వం మొదలైనవి లేనివారూ, ఇంద్రియ నిగ్రహం కలవారూ, స్వీయ భార్యలతో తృప్తిపొందేవారూ, దృఢమైన పట్టుదలతో తపోధనాన్ని కూడబెట్టే మహాత్ములూ, సత్యనిష్ఠ కలవారూ, అంతర్బహిశ్శుద్ధి కలవారూ, గుట్టుగా ధర్మాన్ని ఆచరించేవారూ, సన్న్యాస ధర్మాలను నేర్పుతో పాటించేవారూ దేవతలకు కూడా నమస్కార యోగ్యులు.

పశ్న 63 : చెరువు త్రవ్వించటం అనే ధర్మంలోని గొప్పతనం తెలుపుము.

ఉత్తరం : చెరువు దేవతలకు, పశువులకు, పక్షులకు, రాయి రప్పలవంటి స్థావరాలకు నెలవైనది. అంతే కాదు. అందులో నీరు త్రావి ఆవులమందలు దానిని త్రవ్వించినవారి కులాన్నంతటినీ పుణ్యలోకాలకు పంపుతాయి. ఈ లోకంలో గొప్ప సంపదనూ, చెడని కీర్తినీ కలిగిస్తాయి. వానాకాలంలో, చలికాలంలో, ఎండకాలంలో చెరువులో నీళ్ళుంటే మహాయజ్ఞాలు చేసిన ఫలం ఆ తటాకకర్తకు లభిస్తుంది. కట్టమీద తగిన చెట్లు నాటితే పక్షులు మొదలైన ప్రాణికోటికి నిలువనీడ నిచ్చి సుఖం కూర్చినవాడు కనుక అతడికి ఇహపరసుఖాలు కలుగుతాయి. పితృదేవతలు తమ వంశంవాడు చెరువులు త్రవ్విస్తే పరమానందం పొందుతారు. దానివలన తమకు ఉత్తమ లోకాలకు పోయే వీలు కలుగుతుందని దాని నెప్పుడూ కోరుతూ ఉంటారు. చెరువుగట్లమీదిచెట్లు నీడతో అతిథులకూ, పూవులతో దేవతలకూ, పండ్లతో పితృదేవతలకూ పరమానందం కలిగిస్తాయి.

ప్రశ్న 64 : గృహస్థ ధర్మపరిజ్ఞానం నాకు సమగ్రంగా కలిగేటట్లు ఉపదేశించుము.

ఉత్తరం : పూర్వం విష్ణువుకు భూదేవి తెలిపిన విశేషాలు తెలుపుతాను వినుము. గృహస్థుడు అగ్నిని ఆరాధనం చేయాలి. పూర్ణభక్తితో భూతబలి చేయాలి. దానివలన దేవతలు ఆనందిస్తారు. అన్నం, పాలు, దుంపలు, చల్లని నీరు - వీటిలో దేనితోనైనా ప్రతిదినమూ పితృదేవతలకు తర్పణం చేయాలి. వైశ్వదేవం తప్పనిసరిగా నిర్వహించాలి. ఆ తరువాత శక్తిమేరకు దానాలు చేయాలి. బిచ్చమెత్తుకొనే విద్యావంతులైన బ్రాహ్మణులకొరకు ఎదురు చూచి భిక్షలివ్వాలి. భోజన సమయానికి అతిథులు రాకపోతే వండిన పదార్థాలలో ముందుభాగాన్ని హోమకుండంలోనైనా వేయాలి. తరువాత మిత్రులకు, చుట్టాలకు, అతిథులకు, గురువులకు అన్నం పెట్టి తృప్తిపరచాలి. పిదప బలికార్యం చేయాలి. ఇది గృహస్థధర్మం. ఈ పద్ధతిని సాగించి విప్రుడు భోజనం చేయాలి. అట్టివాడు ఇహపర సుఖాలను పొందుతాడు. కాబట్టి ధర్మరాజా! నీవు కూడా గృహస్థధర్మాన్ని చక్కగా నిర్వహించుము. గృహస్థధర్మం పాపాలను పటాపంచలు చేస్తుంది. శుభాలను కలిగిస్తుంది. కీర్తి సంపదలను ప్రసాదిస్తుంది. పుణ్యలోకాలను పొందిస్తుంది.

ప్రశ్న 65 : పూలనూ, ధూప దీప నైవేద్యాలనూ పూజా సాధనాలని వాటితో దేవతలను పూజిస్తారు. వాటి విశేష మేమిటో తెలియ చెప్పుము.

ఉత్తరం : ఈ విషయాన్ని పూర్వం శుక్రుడు బలికీ, అతడు మనువుకూ, అతడు సువర్ణుడనే తపస్వికీ, ఆతడు నారదుడికీ, ఆ మహర్షి నాకూ తెలియచెప్పారు. దాని తాత్పర్యాన్ని చెప్తుతాను వినుము. ఓషధులు అమృతంవంటివి. పూలు పూచే చెట్లు శ్రేష్ఠమైనవి. పూలతో పూజించేవారికి మంచి మనస్సు కలుగుతుంది. అందుకే పూలను 'సుమనస్సులు' అంటారు. పూలతో పూజించే మానవుల కోర్కెలను దేవతలు మంచి మనస్సుతో తీరుస్తారు. అందుకే వారికి 'సుమనస్కులు' అనే పేరు వచ్చింది. పూలవాసనలతో దేవతలు, వాటి దర్శనంతో యక్షులూ, వాటి అనుభవంతో పాములూ, ఆ మూడు పద్ధతులతో మానవులూ ప్రీతి పొందుతారు. పూలపూజలతో దేవతలు వెంటనే భక్తుల కోర్కెలు తీరుస్తారు. ధూపంవలన భక్తుడు పుష్టినీ, ఆయువునూ పొందుతాడు. దీపం వెలిగించటమంటే వెలుగును ప్రసాదించటం. దీపారాధనంవలన భక్తుడి హృదయం పరమాత్మ ధర్మాలను చూచే స్వభావం కలది ఔతుంది. బాటలోని చావడిలో, దేవాలయంమీదా, కొండమీదా దీపం పెట్టినవారికి ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. ఆవునేయితో దీపం వెలిగించి దానంచేస్తే జ్యోతిర్లోకసిద్ధీ, కులప్రకాశం, మహాజ్ఞాన వికాసం కలుగుతాయి. దేవతలకు మొదట నైవేద్యం ఇచ్చి తరువాత భక్తుడు భుజించాలి. లేకపోతే బుద్ధిహీనుడూ,

రాక్షసుడూ కావటం తథ్యం. నివేదనతో అర్పించే వ్యక్తికి గృహదేవతలు సకల శుభాలు కలిగిస్తారు. నహుషుడు ధూపదీప దానాదులు చేయటంవలననే ఇంద్రపదవి పొందాడు. బ్రహ్మసభకు సొంత ఇంటికి వెళ్ళినట్లు వెళ్ళాడు. దానాలన్నిటిలో దీపదానం శ్రేష్ఠమైనది.

ప్రశ్న 66 : విప్రుడి సొమ్ము దొంగిలించినవాడి గతి ఏమిటి?

ఉత్తరం : బ్రహ్మజ్ఞానం కలవాడి సంపదను దొంగిలిస్తే కులనాశనం జరుగుతుంది. మరుజన్మలో చండాలు డయ్యే గతి పట్టుతుంది. దీనికి ఒక ఇతిహాసం ఉన్నది చెప్పుతాను వినుము. క్షత్రబంధు డనే రాజు ఒకనాడు బ్రాహ్మణుడి పొలంపై నుండి గాలికి రేగిన దుమ్మును తప్పించుకొని పోతున్న దుఃఖితుడైన ఒక మాలవాడిని చూచాడు. కారణ మడిగాడు. ఆ మాలవాడు పూర్వజన్మలో బ్రాహ్మణబాలుడు. బ్రహ్మచారిగా భిక్షమెత్తుకొని పోతుండగా బ్రాహ్మణుడి పొలం నుండి రేగిన దుమ్ము వానిపై పడింది. అతడు దానిని తిన్నాడు. ఆ పాపఫలితంగా చండాలజన్మ నెత్తాడు. ఒకనాడు కలలో ఆ బ్రాహ్మణుడు కనపడి క్షత్రబంధు సంవాదం వినిపించి, దానితో అతడి దుఃఖం నశించి పోతుందని చెప్పాడు. ఆనాటితో అతడి దుఃఖం తీరింది. పూర్వపుణ్యఫలంగా ఆ బ్రహ్మచారి ఉత్తమగతి పొందాడు.

ప్రశ్న 67 : స్వర్గం ఒకేరకమైన ఆనందం కలిగిస్తుందా? పెక్కు రీతుల ఆనందం కలిగించేదై ఉంటుందా?

ఉత్తరం : పుణ్యకర్మలు పెక్కు తీరులై ఉండటంవలన, ఆయా కర్మలకు తగిన భోగాలను అందించే పెక్కుతావులు కలదై స్వర్గం దుఃఖం లేనిదీ, అమితమైన సుఖాన్ని కలిగించేదీ అయి ఎంతో ఒప్పారుతూ ఉంటుంది. గౌతమ దేవేంద్ర సంవాదం అనే ఇతిహాసం ఈ ప్రశ్నకు సమాధానంగా తోడ్పడుతుంది. దాని సారాంశ మిది - ఒక అరణ్యంలో గౌతముడనే బ్రాహ్మణుడు తపస్సు చేసికొంటూ ఉండగా తల్లిని కోల్పోయిన ఒక పిల్లఏనుగు కనుపించింది. దానిని పుత్రవాత్సల్యంతో పెంచి పెద్దచేశాడు. ఒకనాడు దేవేంద్రుడు ధృతరాష్ట్రుడు అనే రాజు రూపంలో వచ్చి ఆ ఏనుగును తనకు కావాలని కోరాడు. గౌతముడు ఆ ఏనుగు తనకు చేసేసేవలు పేర్కొని పుత్రుడివంటి దానిని ఈయజాలనని అన్నాడు. 'మునులకు ఏను గెందుకు? వెలలేని ఆవులను ఇస్తాను, మిక్కుటమైన బంగారాన్ని ఇస్తాను. ఏనుగు నిమ్మ'ని ధృతరాష్ట్రుడు పట్టుపట్టాడు. గౌతముడు వాత్సల్యంతో ఏనుగును ఇవ్వలేనన్నాడు. రాజునకు ఏనుగు యోగ్యమైనది కావున దాని నిమ్మని ధృతరాష్ట్రుడు బెదిరించాడు. గౌతముడు భయం వదలి యమలోకంలోగాని, గంగా ఒడ్డునగాని, మేరుపర్వతంలోగాని, నారద వనంలోగాని, ఉత్తర కురుభూములలోగాని, చంద్రుడివద్దగాని, సూర్యుడివద్దగాని, వరుణుడి నగరంలోగాని, ఇంద్రుడి పట్టణంలోగాని, బ్రహ్మలోకంలోగాని, గోలోకంలోగాని ఏనుగు నిస్తాను తీసుకొనుమని వరుసగా అడిగాడు. ఆయా లోకాలలో ఆయా పుణ్యకర్మలకు ఫలాల ననుభవించే వారిని ధృతరాష్ట్రుడు చెప్పి వాటికి అంగీకరించలేదు. గౌతముడు దానిని గమనించి ధృతరాష్ట్ర రూపంలో ఉన్నది దేవేంద్రుడని భావించాడు. ఆయా లోకాలన్నీ తిరిగినవాడు కావటంచేత ఆయా సుఖాల భేదాలను తెలిసికొనగలిగాడని గుర్తించాడు. దేవేంద్రుడు దానికి సంతోషించి గౌతముడికీ, ఏనుగుకూ స్వర్గలోక సౌఖ్యాన్ని ప్రసాదించాడు.

ప్రశ్న 68 : మహాత్మా! మీరు తపస్సును సారమైన ధర్మంగా నొక్కి చెప్పుతూ ఉంటారు. దానికి మించిన ధర్మం మరొకటి లేదా?

ఉత్తరం : తపస్సులన్నీ కొనియాడదగినవే. తపస్సుకు దీటైన ధర్మం మరెక్కడ ఉన్నది? తపస్సు అనగా నియమంగా

భోజనం చేయటం. ఈ సంగతి బ్రహ్మ భగీరథుడనే రాజుకు చెప్పాడు.

ప్రశ్న 69 : వేదం పురుషుడికి ఆయువు నూరేళ్ళని చెప్పుతున్నది. కాని, చిన్నతనంలోనే కొందరు మృతి పొందుతున్నారు. దేనిచేత ఆయువు వృద్ధి పొందుతుంది? దేనిచేత తరిగిపోతుంది?

ఉత్తరం : ఆచారం ఆయువును పెంచుతుంది. అంతే కాదు సంపదను, కీర్తిని కలిగిస్తుంది. దురాచారం ఆయువును క్షీణింప చేస్తుంది. ఉత్తమపురుషులు ఆచరించే మార్గాన్ని తెలిసికొని నడచుకొనటం ఆచారం. అది వర్ణ ధర్మాలకు, ఆశ్రమ ధర్మాలకు అనుగుణంగా ఉంటుంది. (వివరాలకు చూ. 4.90-126) ఆచారాన్ని తప్పనిసరిగా నడిపించాలి. అది ధర్మానికి కుదురు. ధర్మం ఆయువును పెంచుతుంది. సంపదను కీర్తిని వృద్ధి చేస్తుంది. ఆచారాలన్నిటిలో సర్వభూతదయ మిన్న అయినదని ఆదిమును లంటారు. కాబట్టి అన్ని వర్ణాలవారూ దయకలిగి ఉండటం ఉత్తమం.

ప్రశ్న 70 : అన్నదమ్ము లే విధంగా తమలో తాము పొందిక కలిగి ఉండాలి?

ఉత్తరం : తమ్ములు అన్నయెడ భయభక్తులు కలిగి అతడిని ఆరాధించాలి. అన్న తమ్ములను మన్నిస్తూ ఉండాలి. తమ్ముడొకడు బుద్ధిహీనుడైనా ప్రమాదం లేదు కాని అన్న కార్యదక్షత లేనివాడైతే తమ్ముళ్ళు ఇబ్బందుల పాలౌతారు. అన్నదమ్ములు కలతలు లేని బుద్ధితో సంపదను పంచుకొని అనుభవించాలి. అప్పుడు లోకులు వారిని మెచ్చుకొంటారు. సంపద కూడా క్రమంగా వృద్ధి పొందుతుంది. అట్లా కాక ఒకడు అత్యాశతో ఎక్కువ భాగాన్ని ఆపేక్షిస్తే ప్రాణాంతకపు పనులు ఏర్పడుతాయి. తండ్రి తరువాత అన్నయే తమ్ములందరికీ తండ్రి. తల్లి చనిపోయిన తరువాత వదినయే తల్లి. అన్నగాని, తమ్ముడుగాని న్యాయం తప్పి అన్నదమ్ములకు కీడు చేస్తే రాజువలన శిక్షార్హుడౌతాడు. అక్కను, పెంచిన తల్లిని తల్లితో సమానంగా చూడాలి. ఉపాధ్యాయుడికంటె తండ్రి పదిరెట్లు ఎక్కువ మాన్యుడు. తండ్రికంటె తల్లి పదిరెట్లు గౌరవంలో మిన్న. తల్లిదండ్రులవలన కలిగిన జన్మ దేహసంబంధి. ఆచార్యుడివలన కలిగిన జ్ఞానజన్మ జరామరణాలు లేనిది. గౌరవంలో ఆచార్యుడు అందరికంటె మిన్న.

ప్రశ్న 71 : ఉపవాసవిధికి యోగ్యత, దాని గొప్ప ఫలం - అనేవాటిని గురించి వినగోరుతాను.

ఉత్తరం : అంగిరసు డనే ముని ఈ విషయంలో నాకు చెప్పిన వివరాల సారాన్ని వినిపిస్తాను. బ్రాహ్మణ క్షత్రియులు మూడు రోజులు ఉపవాసం చేయవచ్చును. వైశ్యులు శూద్రులు నాలుగు భోజనాలు మానవచ్చును. ఏక భుక్తంతో నెలరోజులు ఉపవసిస్తే శుభాలు కలుగుతాయి. ఉపవాసాలు పెరిగినకొద్దీ శుభాలు కూడా పెరుగుతాయి. మహాత్ములు తల్లిని మించిన గురువూ, వేదాన్ని మించిన శాస్త్రమూ, ధర్మాన్ని మించిన లాభమూ, అట్లాగే ఉపవాసాన్ని మించిన తపస్సూ లేదంటారు. దేవతలు, ఆదిమునులు ఉపవాసనియమం చేతనే గొప్ప ప్రభావం కలవారయ్యారు. విశ్వామిత్రుడు వెయ్యేళ్ళు ఏకభుక్తంతో బ్రాహ్మణత్వాన్ని పొందగలిగాడు. అర్థబలమూ, అంగబలమూ లేకున్నా ఏ లోపమూ లేకుండా చేయదగినది ఉపవాస వ్రతమని అంగిరసుడు చెప్పాడు. ఉపవాస వ్రతంలో తేలిక పద్ధతి ఉన్నది. పగలు ఒకమారూ, రాత్రి ఒకమారూ నీటితో తృప్తిగా భుజిస్తూ మధ్యలో మరేమీ తినకుండా హోమకార్యం తగిన విధంగా చేస్తూ ఉంటే పుణ్యలోకాలు సులభంగా లభిస్తాయి.

ప్రశ్న 72 : 'ఎవరిని తెలిసికొంటే తెలియదగిన విషయాలన్నీ తెలుస్తాయో అట్టివాడు శ్రీకృష్ణుడు' అని వేదవ్యాసుడు తనను ఆశ్రయించినవారందరికీ తెలియ చెప్పాడు. కాబట్టి ఆధ్యాత్మిక వాక్యాలకు ఆతడే గమ్యం. మహామహిమకు

గమ్యం శ్రీకృష్ణుడు. నేను ఆ మహిమాన్విత వాక్యాలను వినగోరుతాను. ఇంకా నాకు ఆధ్యాత్మ విద్యావరణం కలిగించే వాక్యాలు వినిపించుము.

ఉత్తరం : 'హరసనత్కుమార సంవాదం' అనే విషయం వింటే పరమార్థ విద్యకు ఉపకరించే అంశాలు తెలుస్తాయి. సంగ్రహంగా చెప్పుతాను వినుము. ఒకసారి శివుడు సనత్కుమారుడివద్దకు వచ్చాడు. మహర్షి మహేశ్వరుడికి అతిథిసత్కారాలు చేశాడు. 'పుణ్యాత్మా! ధ్యానంలో చూడదగిన వస్తు వేది? చక్కగా భావించదగిన తత్త్వాలు ఎన్ని? జ్ఞానమూ, యోగమూ ఏ విధంగా ప్రవర్తిల్లుతాయి?' అని శివుడు అడిగాడు. మరికొన్ని ఆధ్యాత్మ విశేషాలు చెప్పు'మన్నాడు. సనత్కుమారుడు శివుడితో ఇట్లా చెప్పాడు. 'తత్త్వాలు ఇరవైమూడని కొందరు పామరులంటారు. ఇరవైనాలుగని కొందరు అంటారు. నా దృష్టిలో తత్త్వాలు ఇరవైఅయిదు. ఇరవైఅయిదవ తత్త్వం 'అధిష్ఠానం' రూపంలో ఉంటుంది. అది మిగిలిన ఇరవైనాలిగింటికీ ఒక స్థితిని కలిగిస్తుంది. తనయందే లీనమయ్యేటట్లు చేస్తుంది. కాబట్టి అది ఉండటమూ, లేకపోవటమూ రెండూ సంభవమే. కాబట్టి 24 తత్త్వాలను వివరిస్తాను. అవి 5 భూతాలు, 5 వాటి గుణాలు, 10 ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం, ప్రకృతి - మొత్తం 24 తత్త్వాలు. వీటిని దేహమని జ్ఞానులు భావిస్తారు. కట్టెలో నిప్పువలె అందులో 'పురుషుడు' ఉంటాడు. అతడే 'నేను'. పురుషతత్త్వాన్ని వేదం 'అమృతార్థతత్త్వ'మనీ, 'బ్రహ్మ' మనీ తెలియజేస్తుంది. ఇది అన్ని తత్త్వాలకంటె అతీతమైనది. ఇదే ఈశ్వరం, అనీశ్వరం, సత్యపాకం, అతిరహస్యం. దానిని దర్శిస్తే మృత్యువువలననుండి తప్పుకొన్నట్లే. బ్రహ్మతత్త్వం ఓంకారంచేత మాత్రమే చెప్పదగింది. అనహంకార నిరూఢ భావనారాధ్యం. ఏ మాలిన్యం లేనిది. ద్వంద్వాతీతమైనది. సర్వం శుభమయమైనది. అది అప్రమేయం, అవిజ్ఞేయం, పుండరీకాక్షం, అనక్షయవిషయం, అచ్యుతం, సదసత్తుల సమైక్యభావంతో ప్రకాశించేది. ఆ పరతత్త్వం మొదట నారాయణుడి కొక్కడికే తెలిసింది. అతడివలన దేవతలు, మునులు, సిద్ధులు, సాధ్యులు మొదలగువారికి అందింది. అది బంధవిముక్తులకే దర్శనమౌతుంది. అహంకారం వదలిన జీవుడిలో దశేంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ లీనమైపోతాయి. ఆ జీవుడు పరతత్త్వంలో లీనమైపోతాడు. యోగనిష్ఠ కలవాడు ఆ తత్త్వాన్ని అందుకొని దుఃఖాలన్నింటిని తొలగించుకొని, చావు, ముదిమి లేని తావులలో శాశ్వతంగా ఉంటాడు. అణిమాది సిద్ధుల సంపదలతో విహరిస్తూ ఉంటాడు. యోగసాంఖ్యాలు రెండూ ఒకటే అనే భావంతో సంసార సముద్రాన్ని దాటుతాడు. చైతన్యం గల 'పురుషుడు' అనే తత్త్వాన్ని ఆశ్రయించి, చైతన్యం లేని ప్రకృతి పుష్టికలది ఔతుంది. తక్కిన తత్త్వాలు ఆ తత్త్వమహాసముద్రంలోని తరంగాలు. పురుషుడికి ఏ గుణాలూ లేవు. ప్రకృతియే గుణాలకు ఏవైనా గుణాలను ఇస్తుంది. దానిచేత తక్కిన తత్త్వాలు గుణాలు కలవై గుణాలు లేని పరమాత్మకు గుణాలు కలిగిన స్థితిని కలిగిస్తాయి. వీటినన్నంటిని సత్పదార్థానికి వేరైనవిగా తెలిసికొని, ప్రకృతిని జయించి తనకు తానే కాని మరొకటి ఏమీ లేదని గుర్తించినపుడు సాధకుడైన పురుషుడు పొగ లేని నిప్పువలె ప్రకాశిస్తాడు. పురుషుడు సత్త్వాన్ని, తత్త్వాన్ని ఆశ్రయించి, ఆ రెండింటిని చక్కగా తెలిసికొని, వాటితో కలియక చైతన్యవంతుడౌతాడు. పెక్కులు కావటం అజ్ఞానంవలన కలిగినస్థితి. ఒక్కటికావటం జ్ఞానంవలన కలిగే స్థితి. పండితులు దీనినే అవిద్య, విద్య అంటారు. ఈ రెండూ ఇరవై అయిదవ తత్త్వమైన జీవుడి దశలు. పరికించగా విద్యయే స్వరూపంగా గల ఇరవై ఆరవ తత్త్వం. వాడు విద్య, అవిద్య అనే దశలు లేనివాడు. ముసలితనం లేనివాడు. మొట్టమొదటివాడు. అంతం లేనివాడు. ఏ విధమైన మార్పులేనివాడు. అనంతుడు, అచ్యుతుడు, అద్యతనుడు, అనాది, కేవలాత్మకుడు. నీటిలో చేపా, మేడిపండులో పురుగులూ ఉన్నట్లుగా తాను ప్రకృతిలో ఉన్నానని తెలిసికొని, దానినుండి వేరుకావటం అభ్యాసం చేసి, సిద్ధిపొందిన పురుషుడు అమృతత్వస్థితి పొందుతాడు. జీవుడు తామరాకుమీది నీటి బిందువువలె ప్రకృతియందు ఉండి కూడా దానికి సంబంధించిన వికారాలు లేకుండా వెలుగొందుతాడు. ఈ విధంగా ప్రకృతిని వదలి పరమాత్మస్థితిని పొందటమే ముక్తి. ఈ జ్ఞానాన్ని

కపిలమహర్షి లోకానికి అనుగ్రహించాడు. దివ్యమును లెందరో దీనిని మన్నించారు. జీవుడు ప్రకృతితో అంటిపెట్టుకొని ఉండటం బంధం. దానినుండి పొందిన విముక్తియే మోక్షం.

ప్రశ్న 73 : ఎక్కువ పవిత్రతను కలిగించగల తీర్థం ఏదో తెలుపుము.

ఉత్తరం : తీర్థాలన్నీ మేలైనవే. మానవ తీర్థం ఒకటి ఉన్నది. దానిపేరు 'సత్యం'. అదే మిక్కిలి పవిత్రత కలిగిస్తుంది. 'ధృతి' అనే మహాజలాశయంలో అది విరాజిల్లుతూ ఉంటుంది. తమస్సు, రజస్సు అనే రెండు గుణాలను దూరంగా తొలగించుకొంటూ, సత్యాన్ని ఊతకర్రగా తీసికొని దానిలోనికి ప్రవేశించి స్నానం చేసినవాడు పరిశుద్ధతతో ప్రకాశిస్తాడు. రాగద్వేషాలు వదలి, ఇంద్రియాలు వికారాలను తొలగించుకొని, ఏ మాత్రమూ సడలని వ్రతం పాటిస్తూ వివేకం కలిగిన మహాత్ములు కూడా గొప్ప నిర్మలతీర్థాలే. వినయపూర్వకంగా ఆశ్రయించటం కూడా తీర్థాలవలన కలిగే సిద్ధిని కలిగిస్తుంది. దమము, తపము, అహింస, శమము కూడా తీర్థాలే. వాటివలన ఎక్కువ శుద్ధత కలుగుతుంది. ఊరకే నీటిలో స్నానంచేస్తే పరిశుద్ధత కలుగదు. దొరకని వాటిని కోరక, దొరికినవాటియందు తృప్తి పొందక ఆశను విడనాడి బ్రదికే నరులు పవిత్రులు. వారికి వేరైన తీర్థాలు అవసరం లేదు.

ప్రశ్న 74 : ఎట్టి ప్రవర్తనతో మానవుడు, ఉత్తమపదం చేరుకొంటాడు? మరణించినవాడు దేహాన్ని వదలి ఏది తోడుగా వెళ్ళుతాడు?

ఉత్తరం : 'నీవడిగిన గూఢమైన అంశాన్ని బృహస్పతి చెప్పగలడు' అని భీష్ము డనగా బృహస్పతి అక్కడకు వచ్చి అతిథిపూజలు స్వీకరించి ధర్మజుడి ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. 'మేలు తొలుత ధర్మం మీద ఆధారపడి ఉంటుంది. చచ్చినవారికి ధర్మమే తోడుగా వస్తుంది. ధర్మం చేయనివాడు నరకానికి పోతాడు. నరుడు తాను చేసిన పుణ్యాలకు తగిన విధంగా సుఖమయ సంసారంలోనూ, పాపాలకు అనుగుణంగా దుఃఖమయ సంసారంలోనూ ప్రవేశిస్తాడు. పుణ్యపాపాలకు అనుగుణంగానే ఆయా జన్మ లెత్తుతాడు. (చూడు.4.258-270). పాపాలు దానాలతో నశిస్తాయి. దానాలలో అన్నదానం మిన్న. (4.271-277). ధ్యానం, ఇంద్రియనిగ్రహం, అహింస, గురుసేవ, నిత్యకర్మాచరణం, తపస్సు - అనే వాటిలో అహింస పవిత్రమైనది. ఏ ఉత్తమ ధర్మాలనైనా ప్రకాశింపజేస్తుంది.

ప్రశ్న 75 : దేవతలూ, బ్రాహ్మణులూ, మునిశ్రేష్ఠులూ అహింసను ప్రశంసిస్తూ ఉంటారు. దాని తీరును తెలియజెప్పుము.

ఉత్తరం : ఏనుగు అడుగులో జంతువుల అడుగులన్నీ ఇమిడి ఉండే తీరుగా అహింస అనే ధర్మంలో సర్వధర్మాలూ ఇమిడి ఉంటాయి. ఇది సత్యం. ఆవుకు నాలుగు కాళ్ళున్నట్లుగానే అహింసకు కూడా నాలుగు తీరులుంటాయి. అవి - మనసుచేత, మాటచేత, దేహంచేత హింస చేయటం, మాంసం తినటం అనేవి. మాంసభోజనం హింసను కలిగిస్తుంది. కనుక అది మహాదోషం. పై నాలుగు తెరగుల హింసమానటం అహింస. మాంసం పితృదేవతలకు కూడా ఇష్టమని శ్రాద్ధవిధులలో చెప్పారని అనుమానం రావచ్చును. మాంసభోజనం వదలటం అశ్వమేధయాగంకంటె కూడా పూజనీయం అంటారు. చంపటం, చంపించటం పాపాలన్నింటికంటె గొప్పపాపం. శ్రాద్ధాలలో, యజ్ఞాలలో వేదవిధులలోని హింసవలన దోషం కలుగబోదు కాని మాంసపు రుచి మరగి తినటానికై ప్రాణులను చంపటంవలన పాపం కలుగుతుంది. మాంసం తనను నమిలినవాడిని నమలుతుంది అని ఆగమాలు అంటున్నాయి. మాంసాహారం మానటం తపస్సుతో సమానం - అని మహర్షులు చెప్పారు. దానం, ధర్మం, తపస్సు, యజ్ఞం, పరిశుద్ధత, మంత్రం, అనుష్ఠానం, సత్యం - ఇవన్నీ అహింసారూపాలే కాబట్టి అహింస ఉంటే సంపదలన్నీఉన్నట్లే.

ప్రశ్న 76 : కురుక్షేత్రయుద్ధంలో చచ్చినవారు ఎక్కడికి పోతారో తెలుపుము. బ్రతుకు సుఖాన్నిచ్చేదనీ, చావు దుఃఖాన్ని కలిగిస్తుందనీ ప్రాణులు భావిస్తారు. ప్రాణాలను వదలుకొనటం చాలా అరుదు. అందుకు అడుగుతున్నాను.

ఉత్తరం : కురుక్షేత్రంలో అద్భుతభయంకర యుద్ధంలో దేహాలు వదలిన రాజులకు అనంత సుఖాలు గల గతులు కలగటంలో అనుమానం లేదు. వారందరూ ఉత్తమలోకాలను పొందినవారే. (అని చెప్పి బ్రతుకు సుఖాన్ని, చావు దుఃఖాన్ని గురించిన శంకను నివారించే ఒక ఉదంతం - కీటకానికీ వేదవ్యాసుడికీ జరిగిన సంవాదాన్ని వినిపించాడు (చూడు 4.314-343)

ప్రశ్న 77: విద్య, తపస్సు, దానం - అనే వాటిలో ఏది గొప్పది ?

ఉత్తరం : వ్యాసమైత్రేయ సంవాదం నీ ప్రశ్నకు మంచి సమాధానం. వినుము. ఒకనాడు వ్యాసుడు కాశీక్షేత్రానికి వెళ్ళాడు. అంతకుముందే ఆ నగరంలో ఉన్న మైత్రేయుడి ఇంటికి గుట్టుగా వెళ్ళాడు. మైత్రేయుడు ఆ మహర్షిని గుర్తుపట్టి భోజనం పెట్టి సంతుష్టిపరచాడు. వ్యాసుడు పరమానందంతో ఇట్లా అన్నాడు. 'తపస్సు, విద్య మొదలైన ధర్మాలన్నింటిలో దానం గొప్పది. దానాలలో అన్నదానం గొప్పది. ప్రాణాలూ, దేహమూ, దాని బలమూ అన్నం స్వరూపాలే. తపస్సు మనస్సులోని మాలిన్యాల నన్నింటిని తొలగించి వేస్తుంది. విద్యకు అవకాశం కలిగిస్తుంది. ఆ తపసి చేసిన గొప్పదానం వలన విద్య పెంపొందుతుంది. ఆ విద్య తపస్సును వృద్ధి చేస్తుంది. కాబట్టి తపస్సూ, విద్యా, దాన మహిమచేత పెంపొందుతాయి. విద్య వ్రతనిష్ఠాపరుడికి పరమాత్మను చూపించే దీపం వంటిది. కాబట్టి అన్నదానం చేత పరమానందం కలుగుతుంది.

ప్రశ్న 78 : కులస్త్రీ ప్రవర్తన గురించి తెలియపరచుము.

ఉత్తరం : కేకయరాజపుత్రి సుమన అమరావతిలో శాండిలిని చూచి 'కాంతా! ఇంత శ్రేష్ఠమైన దేవలోకనివాసం నీకు ఏ నడవడివలన కలిగింది?' అని అడిగింది. శాండిలి ఇట్లా చెప్పింది. 'నేను అత్తమామలకు ఎదురు చెప్పను. దేవపూజలు శ్రాద్ధములు, అతిథిసపర్యలు చేయటంలో ఎడమొగం పెట్టను. మంచి నడవడితో ఉంటాను. వీధివాకిలి దాటను. పకపకా నవ్వను. విద్య గలవారికి నిర్మలబుద్ధితో భిక్షపెట్టుతూ తక్కిన పనులు చూచుకొంటూ ఉంటాను. భర్త ఇంటికి వచ్చినప్పుడు కాళ్ళకు నీళ్ళు ఇవ్వటం మొదలైన సపర్యలు అనుకూలభావంతో చేస్తాను. బిడ్డలను అలసట లేకుండా తీర్చిదిద్దుతాను. భర్త ఇష్టపడే వంటలు చేసి పెట్టుతూ ఉంటాను. ఏ పనిమీదనైనా భర్త పొరుగూళ్ళకు పోతే, తిరిగివచ్చేంతవరకు పూలు, మైపూతలు, మంచి చీరలు, నగలు, విందులు ఆదరించను. ధాన్యాన్నీ, అన్నాన్నీ వ్యర్థపరచను. బంధువులను తగిన విధంగా గౌరవిస్తాను. ఆవులు మొదలైన పాడిపశువుల సుఖజీవనాన్ని పరీక్షించి సాగిస్తాను. భర్తహృదయం కలతపడే విధంగా ఒక్కమాట కూడా పలకను. భర్త నిత్యాగ్నిహోత్రి అయితే ఆ అగ్నిని ఓపికతో కాపాడుతూ ఉంటాను. రహస్యాన్ని బయటపెట్టను. కడుపుతో ఉన్నప్పుడు బిడ్డ కేవి మేలు చేస్తాయో వాటినే భుజిస్తాను' అని చెప్పింది. ఈ విధంగా ప్రవర్తించిన ఉత్తమ వనిత ఇహపరలోకాలు రెండింటిలో శాశ్వతసుఖం పొందుతుంది. ఆ ఇల్లాలు అరుంధతివలె ప్రశంస కెక్కుతుంది.

ప్రశ్న 79 : సర్వశాస్త్రసారం, సర్వశ్రేష్ఠం అయిన ఆచరణ ఏది?

ఉత్తరం : 'నారద పుండరీక సంవాదం' చెప్పుతాను వినుము. నీ వడిగిన విషయం తేటతెల్లమౌతుంది. తీర్థయాత్రాశీలి అయిన పుండరీకుడు నారదుడు నీవు అడిగిన ప్రశ్ననే అడిగాడు. నారదుడు ఇట్లా చెప్పాడు. బ్రహ్మ చెప్పిన పరమ ధర్మం ఒకటి ఉన్నది. దానిని వినుము. ఇరువదినాలుగవ తత్త్వమైన ప్రకృతికి తరువాతి తత్త్వం, జీవాత్మ.

అతడు సర్వభూతాల స్వరూపం అయినవాడు. అతడి వ్యవహార నామం 'నరుడు'. అతడివలన ఏర్పడిన తక్కిన తత్త్వాలన్నీ నారములు. అతడు నారములు స్థానంగా కలవాడు కాబట్టి నారాయణుడు. ఆ ప్రభువు విశ్వాన్ని సృష్టిస్తూ మరల తనలోనే లీనం చేసికొంటూ 'విభుడు' ఔతున్నాడు. ఆ నారాయణుడే పరబ్రహ్మం, పరతత్త్వం, పరమపదం, ఈశ్వరుడు, విష్ణువు - అనే పేర్లతో పిలువబడుతూ ఉంటాడు. అతడే వాసుదేవుడు. ఆత్మ అనే పేర్లతో ఉపనిషత్తులు పిలుస్తాయి. ఈ పేర్లు నరుడికి కూడా వర్తిస్తాయి. సర్వశాస్త్రాల వాక్యాలను పరిశీలించి నిర్ణయించిన తాత్పర్యమిది. కాబట్టి ఎల్లవేళలా నారాయణుడిని స్మరించాలి. మరణకాలంలో 'నమో నారాయణాయ' అనే మంత్రాన్ని పలికితే నరులు ప్రణవానికి అర్థమైన పరమపదాన్ని పొందుతారు అని చెప్పాడు. ధర్మరాజా! నీవు కూడా పరమ భక్తితో విష్ణువును సేవించుము.

ప్రశ్న 80 : దానం, ప్రియభాషణం - ఈ రెండింటిలో ఏది ఎక్కువ ప్రీతి కలిగిస్తుంది?

ఉత్తరం : రెండూ ప్రీతి కలిగించేవే. దానం ప్రీతికరమైనదని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ప్రియభాషణంకూడా ప్రీతికరమైన దనటానికి ఒక పురాతన కథ ఉన్నది. చెప్పుతాను వినుము. మాటకారి, బుద్ధిశాలి అయిన ఒక బ్రాహ్మణుడు జనసంచారంలేని అడవికి పోయాడు. ఒక రాక్షసుడు అతడి మాంసం తినగోరి అతడిని పట్టుకొన్నాడు. అతడు కలతపడకుండా ఆ రక్కసుడి మొగంవైపు చూస్తూ ఉండిపోయాడు. ఆ రక్కసుడు ఆశ్చర్యపోయి 'నా ప్రశ్నకు సమాధానం చెప్పితే నిన్ను వదలుతాను' అని 'నా శరీరం కృశించిపోవటానికీ, పాలిపోవటానికీ కారణం ఏమిటి?' అని అడిగాడు. ఆ బ్రాహ్మణుడు తొందరపడక నిబ్బరంగా, అనుకూలభావంతో ఇట్లా చెప్పాడు. 'చుట్టాలు నీ దుష్టస్వభావంతో విసిగి వదలి తరువాత బాధపడటం, దారిద్ర్యం కలిగినప్పుడు అపూర్వ గౌరవాలు కోరటం, ఇతరులు పెట్టిన బాధలను నీవు మొగమాటంవలన అనుభవించగా వారు జయించామని పొంగిపోవటం, జాలి తలచి నీవు మేలు చేయగా ఆ మేలు పొందినవాడు అది తన పరాక్రమమే అని చెప్పటం, బుద్ధి కలవారు నిన్ను పొగడుతూ ఉంటే సిగ్గుపడుతూ పండితుల మెప్పుకొరకు చూస్తూ ఉండటం, నీవు న్యాయంగా పలికిన దానిని జనసభ అంగీకరించకపోవటం, నీ తప్పు నీ భార్యకు తెలిసి ఆమె కుమిలిపోతూ ఉంటే ఆమెను నీవు సముదాయించ లేకపోవటం, నీ సొమ్మును కొట్టివేయాలని ఇతరులు కనిపెట్టుకొని ఉంటే దానికి ఏది దిక్కు అని నీవు ఆలోచిస్తూ ఉండటం, దుర్మార్గుడు చాటున నిన్ను గూర్చి చేసిన నిందలను నీ బంధువులు వినాలని భావించటం, నీవు గొప్ప పనులు చేస్తూ ఉంటే నీ స్నేహితులు నిన్ను మాయలవాడిగా భావించటం, నీ మనసులో ఉన్న పెనువగపును బయట పెట్టుకొనలేకపోవటం, భార్య, కొడుకు, అల్లుడు మంచి నడవడిలేనివారై త్రిప్పలు పెట్టటం, తండ్రి, తల్లి, అన్నదమ్ములు రోగాదులచేత కృశించటం, పూర్వజన్మలో బ్రాహ్మణుడి ఆవును చంపటం, పనికిమాలినవాడిని పనిలో పెట్టుకొని పేరు పాడుచేసికొనటం, ఎంతోకాలం ఎన్నో ప్రయత్నాలు చేసి ఒక కొలికికి తెచ్చిన పనిని నీచుడైన పగవాడు పాడుచేయటం - వీటిలో ఒకదానిచేత మానవుడు కృశిస్తాడు. పాలిపోతాడు' అని అన్నాడు. ఆ మాటలు విని రాక్షసుడు అతడిని వదలిపెట్టాడు. మంచిమాటల తీరు ఇట్లా ఉంటుంది.

ప్రశ్న 81 : మహాత్మా! సంసార సముద్ర తీరాన్ని చేర్చగల ఓడ నీ దయా విశేషమే. పాపాలన్నింటినీ పారద్రోలే ఒక ప్రాచీనగాథను వినిపించుము. శ్రీకృష్ణుడు మునులతో, మహారాజులతో కలిసి నీవు చెప్పే గాథను వినాలని వేడుకతో ఉవ్విళ్ళూరు తున్నారు. నేనూ నా తమ్ముళ్ళూ పరమానందంలో తేలియాడే విధంగా మంచి కథను చెప్పుము.

ఉత్తరం : ధర్మరాజా! కరుణానిధీ, సర్వలోకశరణ్యుడూ అయిన శ్రీకృష్ణుడు వింటూ ఉండగా పుణ్యేతిహాసాన్ని చెప్పే

అదృష్టాన్నీ, పుణ్యాన్నీ పొందాను. వ్యాసాదిమహర్షులూ, రాజవంశంవారూ వినటంవలన నా గౌరవం పెరిగింది. ఇదే ఒక పరమపదం. నీవడిగినదానికి 'ఉమామహేశ్వర సంవాదం' అనే ఇతిహాసం ఉన్నది. అది ప్రవర్తిల్లటానికి కారణమైన కథను ముందుగా చెప్పి ఆ తరువాత దానిని చెప్పుతాను' అని శ్రీకృష్ణుడికి నమస్కరించి ధర్మరాజుతో చెప్పనారంభించాడు.

శ్రీకృష్ణుడు పుత్ర సంతానార్థి అయి రుక్మిణితో కలిసి హిమవత్పర్వతానికి వెళ్ళి పన్నెండేళ్ళు వ్రతం చేసి కృశించి ఉన్నాడు. అప్పుడు నారదాది మహర్షులు శిష్యసమూహంతో వచ్చి శ్రీకృష్ణుడిచుట్టూ కూర్చుండి పుణ్యగోష్ఠి చేస్తూ ఉండగా అతడి ముఖం నుండి ఒక మహాగ్ని వెలువడి ఆ పర్వతవనాలను కాల్చివేసింది. ఆ తరువాత శ్రీకృష్ణుడు తన సౌమ్యదృష్టితో ఆ మంటను చల్లార్చి అడవిని మునుపటివలెనే సవ్యంగా ఉండేటట్లు చేసి, అందరినీ ఆశ్చర్యంలో ముంచి ఎత్తాడు. వారి ప్రార్థన మేరకు ఆ అగ్నిని గురించి శ్రీకృష్ణుడు వివరించి చెప్పాడు. 'ఒక రాక్షసుడు నా వరంవలన అస్త్రవిద్యతో అద్భుతశక్తి పొంది, అహంకరించి లోకకంటకుడయ్యాడు. అతడిని సంహరించగల కొడుకును పొందటానికి ఈ మహావ్రతాన్ని చేపట్టాను. నా ఆత్మ అగ్నిగా మారి, నా ముఖం నుండి వెలువడి బ్రహ్మదగ్గరకు వెళ్ళింది. ఆ మహానుభావుడు మన్మథుడిని నా కుమారుడిగా పంపి, ఆ అగ్నిని మరలించాడు. అది తిరిగిపోతూ ఈ అడవిని కాల్చింది. నేను కరుణించి మరల దానికి మొదటిరూపు కల్పించాను' అని అగ్ని కథ చెప్పి ఋషులను 'నా కొక ఉత్తమ ఇతిహాసాన్ని చెప్పి నా కోరిక తీర్చండి' అని కోరాడు. ఋషులు ఆ పనికి సమర్థుడు నారదుడే అని పేర్కొని, అతడిని 'కథ చెప్పు'మని ప్రార్థించారు. అతడు 'ఉమామహేశ్వర సంవాదం' అనే ఇతిహాసాన్ని శ్రీకృష్ణుడికి వినిపించాడు. దానిని నీకు చెప్పుతున్నాను.

నారదుడు : నేను లోక సంచారంచేస్తూ హిమవత్పర్వతంమీద ఒక సుందర దివ్యోద్యాన వనాన్ని చూచాను. ఆ ఉద్యానంలో శార్దూల చర్మధారి, భుజగాభరణుడు, విభూతి సుందరుడు అయిన మహాదేవుడు సురసిద్ధ విద్యాధరమునిగణ, భూతగణ పరివృతుడై ఉండగా ఆ సభలో నేనుకూడా చేరి స్వామిని సేవిస్తూ ఉన్నాను. అంతలో సపరివారంగా పార్వతీదేవి వచ్చి తన కరకమలాలతో పరమేశ్వరుడి కన్నుదోయిని విలాసంగా మూసింది. దానితో లోకంలో సూర్యచంద్రుల కాంతి లోపించి కారుచీకటి వ్యాపించింది. లోకాలు భీతిల్లగా పరమేశ్వరుడు మూడవ కంటిమంటతో వెలుగులు ప్రసాదించాడు. పార్వతి భీతిల్లి పరమేశ్వరుడి పాదాలకు ప్రణమిల్లింది. స్వామి కరుణతో చూడగా మంటలు చల్లారి కొండ చల్లబడింది. అప్పుడు పార్వతి ఇట్లా అడిగింది.

పార్వతి : సర్వేశా! నొసటికన్ను తెరవటానికి గల కారణ మేమిటి?

శివుడు : ఈ లోకాలన్నీ నా స్వరూపాలే. నా కేది కలిగితే లోకాలకు కూడా అది కలుగుతుంది. నీవు నా కన్నులు మూశావు. లోకాలలో చీకటి వ్యాపించింది. భూతాలు భయపడ్డాయి. నీ చేతులు తొలగించకుండా చీకటి పోగొట్టటానికి నా ఫాలనేత్రం తెరవవలసి వచ్చింది.

పార్వతి : స్వామీ! నీకు నాలుగు మొగా లెందుకు ఉన్నాయి?

శివుడు : సుందోపసుందులనే మహాబలవంతులైన రాక్షసులను చంపటానికి విశ్వకర్మ తిలోత్తమను సృష్టించి నా వద్దకు పంపాడు. ఆమె దేవకార్య నిమిత్తమై నా చుట్టూ ప్రదక్షిణాలు చేసింది. నేనే ఆమెను రక్షించటానికై నాలుగు దిక్కులా చూచాను. అప్పుడు నాలుగు మొగాలు మొలిచాయి.

పార్వతి : జగదీశా! నీ కంఠంలో నలుపెందుకు కలిగింది?

శివుడు : క్షీరసాగర మథన సమయంలో వెలువడిన కాలకూటాన్ని లోక సంరక్షణార్థమై నా కంఠంలో ధరించాను. బ్రహ్మాదు లందుకే నన్ను నీలకంఠుడని పిలుస్తారు.

పార్వతి : స్వామీ! నీకు పినాక మనే ఆయుధం మీద ఎక్కువ మక్కువ ఎందుకు?

శివుడు : కృతయుగంలో కణ్వుడు అనే మహర్షి మహాతపస్సు చేశాడు. అతడిమీద పెద్ద పుట్ట, దానిమీద మిక్కిలి పొడవూ వెడల్పూ గల వెదురు మొలిచింది. బ్రహ్మ ఆ మహర్షికి ప్రత్యక్షమై వరమిచ్చి ఆ వెదురును తీసికొని, లోకశ్రేయస్సును కాంక్షించి దానిని మూడు ముక్కలు చేసి మూడవ ముక్కతో పినాకాన్ని నిర్మించి నా కిచ్చాడు. రెండవ ముక్కతో శార్ఙ్గమును నిర్మించి విష్ణువుకు ఇచ్చాడు. మొదటి తునుకతో గాండీవాన్ని కల్పించి తాను తీసికొనిపోయాడు. అందువలన నేను పినాకాన్ని అభిమానిస్తాను.

పార్వతి : నంది వాహనాన్ని ఎందుకు ఆదరిస్తారు?

శివుడు : నేను హిమవత్పర్వతంమీద తపస్సు చేసికొంటున్నప్పుడు ఆవులు నా చుట్టూ నిర్భయంగా తిరుగుతూ కష్టపెట్టాయి. నేను కోపించి చూడగా అవి బాధపడ్డాయి. బ్రహ్మ, దేవతలు నా వద్దకు వచ్చి ప్రార్థించి నా కొక ఎద్దును కానుకగా ఇచ్చి 'గోపతి' అని పేరుపెట్టి గోవుల బాధ తీర్చారు. అది మొదలు నేను ఆ ఎద్దును వాహనంగా, ధ్వజంగా చేసికొని సంచరిస్తున్నాను.

పార్వతి : నీవు మనోహరమైన నెలవులను వదలి అశుచి అయి, కేశాస్థికపాల దుర్గంధ దుర్దర్శన మైన శ్మశానంలో ఉండటానికి కారణమేమి?

శివుడు : క్రూరభూతాలు జనులను ఘోరంగా వధ చేయటం గమనించి బ్రహ్మ నన్ను ఆ విపత్తును తొలగించుమని ప్రార్థించాడు. మోక్షమందు ఆసక్తి కలవారు నిర్జనమైన శ్మశానాన్ని పవిత్రస్థానంగా భావిస్తారు. కాబట్టి నేను వల్లకాటిలో ఉండటానికి ఇష్టపడతాను. అక్కడే ఉండి లోకరక్షాకార్యాన్ని నిర్వహిస్తాను.

పార్వతి : బూదిపూత, ఎముకల, పాముల సొమ్ములు, గొడ్డలి, శూలం - అనే ఆయుధాలతో భయంకరమైన రూపం ఎందుకు ధరించావు?

శివుడు : జగత్తంతా సౌమ్యం, ఆగ్నేయం అనే రెంటి కలయికతో కూడి ఉన్నది. సౌమ్యమైన దానిని విష్ణువూ, ఆగ్నేయమైన దానిని నేనూ భరిస్తూ ఉంటాము. ఈ రెంటిని కలిపి ఈ విశ్వాన్ని నేను వహిస్తున్నాను. అందువలన అగ్నిసంబంధ భావంతో కూడుకొనిన ఆకారాన్ని లోకహితంకొరకు తాల్చాను.

పార్వతి : నీవు చంద్రుడిని ప్రేమతో తలపై ధరించటానికి కారణం ఏమిటి?

శివుడు : దక్షయజ్ఞంలో నేను ఆగ్రహించినప్పుడు దేవతలందరినీ హింసించాను. ఆ సందర్భంలో చంద్రుడి దేహాన్ని అడ్డదిడ్డంగా త్రొక్కివేశాను. అతడు నన్ను శరణు కోరాడు. జాలిపడి చేసిన కీడు తొలగటానికి అతడిని తలపై ధరించాను.

పార్వతి : శివా! వర్ణాశ్రమ ధర్మాలను చక్కగా తెలియజెప్పుము.

శివుడు : లోకహితం కొరకు బ్రహ్మ ముఖంనుండి బ్రాహ్మణులను, భుజాలనుండి క్షత్రియులను, తొడలనుండి వైశ్యులను, పాదాలనుండి శూద్రులను సృష్టిచేశాడు. ఆయా వర్ణాలవారికి విధులను, ధర్మాలను నిర్దేశించాడు. బ్రాహ్మణులు లోకానికి ఆధారమైనవారు. వారిని అవమానించటంగాని, అగౌరవపరచటం కాని తగదు. వారికి దానాలు చేయటంవలన శుభాలు కలుగుతాయి. బ్రాహ్మణనింద ఈశ్వరనిందవంటిది వేదాధ్యయనం చేయటం. యజ్ఞాలు

చేయటం, తగినవారికి దానాలు చేయటం, వేదాలు శిష్యులకు నేర్పటం, యజ్ఞాలలో దానాలు స్వీకరించటం, క్రోధాదులు లేని చిత్తంతో భగవద్ధ్యానం చేయటం, మనోవాక్కాయకర్మలలో శుచిగా ఉండటం, సత్యవాక్యపాలనం బ్రాహ్మణవిధులు. తపస్సు యొక్క గొప్పతనాన్ని సాధించటానికీ, ధర్మానికి పునాదిగా ఉండటానికీ, బ్రహ్మ బ్రాహ్మణులను సృష్టించాడు. క్షత్రియులు రాజ్యాన్ని పాలిస్తూ బ్రాహ్మణులను పరిరక్షించాలి. ధనుర్వేదం, నీతిశాస్త్రం, రాజనీతి మొదలైన విద్యలను నేర్పటం, యజ్ఞయాగాది కర్మలు చేయించటం, దానాలు యోగ్యులకు చేయటం, సాధువులను పండితులను రక్షించటం, దుష్టులను శిక్షించటం, ఆయుధ జీవులు కావటం, వ్యవసాయంలోనూ వ్యాపారంలోనూ ఆరవభాగం పన్నుగా గ్రహించటం, ప్రజలను ధర్మంగా న్యాయంగా పాలించటం క్షత్రియుల విధులు. వైశ్యులు లోకులకు ఉపకారం చేసేవారు. వ్యవసాయం, వ్యాపారం, పశుపోషణ వారి ప్రధాన విధులు. వీరికి ద్విజత్వం ఏర్పడింది. విద్యార్జన, యజ్ఞాలు చేయటం, గోభూదానాలు చేయటం తగిన పనులు. అతిథిసత్కారం అవశ్య కర్తవ్యం. శూద్రులకు సేవాధర్మం ముఖ్యమైనది. బ్రహ్మ క్షత్రియ వైశ్యులకు సేవలు చేసి ప్రత్యుపకారం పొందాలి. వినయంతోనూ, సాధు స్వభావంతోనూ వ్యవహరించాలి. వర్ణధర్మాలు ఆచరిస్తే సమాజంలో సుఖశాంతులు కలుగుతాయి. ఇక ఆశ్రమ ధర్మాలు చెప్పుతాను. బ్రహ్మచర్యాశ్రమంలో బ్రహ్మచర్యం, గురుసేవ, విద్యాభ్యాసం, నిత్యాగ్నిహోత్రం అవశ్యకర్తవ్యాలు. గృహస్థాశ్రమం అన్నింటిలో ముఖ్యమైనది. పంచయజ్ఞాలు ఆచరించటం, స్వీయభార్యను పాలించటం, దానాలు చేయటం, బంధువులను గౌరవించటం గృహస్థాశ్రమ ధర్మాలు. అడవిలో నివసించటం, కందమూలాలు భుజించటం, స్త్రీ సంగమం వర్జించటం, జడలు ధరించి జింకచర్మాన్ని కట్టుకొనటం, వానప్రస్థాశ్రమ ధర్మాలు. కోపగించుకోకుండా ఉండటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం, ఓర్పు వహించటం, బ్రాహ్మణులతో కలిసి జీవించటం, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, శుచిగా, శుభ్రంగా ఉండటం, సద్వ్రతనిష్ఠ. భిక్షాభోజనం, నేలపై మాత్రమే శయనించటం, దయాస్వభావం కలిగి ఉండటం, సదా తత్త్వచింతనతో, యతి ధర్మాలతో జీవించటం సన్న్యాసాశ్రమ విధులు. ఇవి వేదాలు సమ్మతించిన విధులు.

పార్వతి : ముని జనులు చేసే తపస్సుయొక్క విధానం తెలియజెప్పుము.

శివుడు : తపమంటే సామాన్యంగా వానప్రస్థులు చేసే ధర్మాలు. ఇంద్రియ నిగ్రహం, యోగాభ్యాసం, ఫలాభిరహిత కర్మాచరణం, పంచాగ్ని మధ్య తపస్సు మొదలైనవి చేసి స్వర్గం పొంది సుఖించేవారు తపస్వులు. భార్యాయుతులై తపస్సు చేసేవారు అహింస, దయ మొదలైన గుణాలు కలిగి, సర్వభూత సమభావంతో వర్తిస్తారు. ఉపవాసం, మౌనం, భూతలశయనం మొదలైన వానప్రస్థాశ్రమ నియమాలు తపస్వులు పాటిస్తారు.

పార్వతి : దేశ ద్రిమ్మరులైన విరాగులను గురించి చెప్పుము.

శివుడు : వీరు యాయావరులు, పుణ్యతీర్థాలను సేవిస్తూ నిరాహారవ్రతాలను పాటిస్తుంటారు. బక్కచిక్కిన శరీరాలతో నియమనిష్ఠలతో జీవించి స్వర్గం చేరతారు.

పార్వతి : వైఖానసుల పద్ధతి తెలపండి.

శివుడు : వైఖానసులు కఠిన వ్రతాలు పాటిస్తారు. రాళ్ళతో, నివ్వరిధాన్యాలను దంచుకొని వానిని మాత్రమే నమలుతారు. కొందరు గాలి, నీరు మాత్రమే స్వీకరిస్తారు.

పార్వతి : గృహస్థాశ్రమ ధర్మాలను తెలపండి.

శివుడు : గృహస్థాశ్రమంలో కామం ధర్మప్రధానమై ఉండాలి. ఆత్మనిగ్రహం, భూతదయ, శాంత స్వభావం, అతిథి సత్కారం, మిగిలిన ఆశ్రమవాసులను గౌరవించటం గృహస్థాశ్రమ ధర్మంలో ముఖ్యం. స్త్రీకి పతిని సేవించటం ప్రధాన విధి. గృహస్థుడు నిజభార్యయందే రమించాలి. ఆహారనియమం పాటిస్తే ముక్తి మార్గం సులభం.

పార్వతి : రాజు అందరివలెనే శరీరం కలిగి, భోజనాదులు చేస్తూ ఉండి కూడా అందరిచేత నమస్కరించబడతాడు. నిగ్రహాను గ్రహాలలో సమర్థుడౌతాడు. సర్వాధిపత్యంతో శోభిల్లుతాడు. దీనికి కారణం ఏమిటి?

శివుడు : రాజార్హత తపస్సువలన లభిస్తుంది. అందువలననే ఇతరులకు నమస్కార యోగ్యుడౌతాడు. నిగ్రహానుగ్రహ సమర్థు డౌతాడు. తాను నీతిపరుడై ఇతరులను నీతిపరులుగా చేస్తాడు. అవసరం వస్తే శిక్షిస్తాడు. కామాది అంతశ్శత్రువులను జయించి సప్తాంగాలను శాసిస్తాడు. ధర్మాన్ని రక్షిస్తాడు. చారచక్షువై లోకాన్ని గమనిస్తాడు. ధర్మాన్ని రక్షిస్తాడు. అధర్మాన్ని శిక్షిస్తాడు. అకారణంగా యుద్ధం చేయడు. న్యాయబద్ధంగా యుద్ధానికి పూనుకొంటాడు. యజ్ఞాలు దానాలు చేస్తాడు. ఈ నీతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే రాజుకు పాపం కలుగుతుంది. ప్రజలను బిడ్డలవలె కాపాడి సంపదను, పేరు ప్రఖ్యాతులను గడిస్తాడు. చివరకు స్వర్గసుఖాలను పొందుతాడు.

పార్వతి : ధర్మరహస్యం వినగోరుతాను.

శివుడు : ధర్మాలన్నింటిలో అహింస సూక్ష్మమైన ధర్మం.

పార్వతి : లోకులకు హింసను వదలటం సాధ్యం కాదు. మరి అహింస అంటే ఏమిటి?

శివుడు : శాంతగుణంతో తపస్సు చేసికొనేవారు అహింసావ్రతం పాటించేవారు. లోకులు తమ కర్తవ్యాలు చేస్తూ ఉండగా కొన్ని ప్రాణులు చనిపోతాయి. అప్పుడు వారికి చంపే బుద్ధి ఉండదు. పాపపుణ్యాలకు బుద్ధి ప్రధానం. యుద్ధాలలో మరణించటం, యుద్ధాలలో సంహరించటం హింస కాదు. స్వర్గప్రాప్తికి హేతువులు కూడా. వేటాడటం హింస కాదు. వేదమంత్రయుతంగా యజ్ఞంలో పశువిశసనం హింస కాదు. శిక్షకు తగినవాడిని శిక్షించటం కూడా హింస కాదు.

పార్వతి : జనులు జీవించే విధానాన్ని గురించి చెప్పుము.

శివుడు : మనుష్యజన్మం కర్మభూమి. సుఖదుఃఖాలకు మూలం ధనం. అందువలన ధనసంపాదన మార్గాలు మానవుడు యోచిస్తాడు. అయితే అవి ధర్మపథంలో సాగాలి. కర్మలలో మోసం ఉండకూడదు. ఉపాయంతో పనులు చేయాలి. ఇతరుల ధనాన్నీ, వనితలనూ దొంగిలించరాదు. తల్లిదండ్రులను, అతిథులను, దేవతలను గౌరవించి పూజించాలి. ఇవి అందరూ ఆచరించదగిన జీవన విధానం.

పార్వతి : నాలుగు వర్ణాలవారు చేసే కర్మలు ఏ విధంగా ఫలిస్తాయి?

శివుడు : చాతుర్వర్ణ్యములవారు తమ తమ వర్ణాలకు తగిన పనులు పద్ధతి తప్పక నిర్వహిస్తే స్వర్గసుఖం లభిస్తుంది. మంచి పనులు చేస్తే ఉత్తమ పదాలు లభిస్తాయి.

పార్వతి : లోకంలో కొందరు మానవులు సంపదలతో సుఖిస్తారు. కొందరు పేదరికంతో బాధపడతారు. దీనికి కారణం ఏమిటి?

శివుడు : దైవానికి ఒకరిమీద కోపంగానీ, ఒకరిమీద ప్రేమకాని ఉండవు. పూర్వజన్మలో చేసిన కర్మలయొక్క ఫలితాలు క్రమంగా అనుభవంలోకి వస్తాయి. సమయాన్ని బట్టి కష్టసుఖాలు, సంపదలు, పేదరికాలు ఏర్పడుతాయి. (చూడు. వివరాలకు 5.86-126)

పార్వతి : పసివారు మరణించటానికి, ముసలివారు చాలాకాలం జీవించటానికి కారణ మేమి?

శివుడు : శరీరం శిథిలమౌతున్నది కాని వృద్ధులకు చావు త్వరగా రావటం లేదన్నావు. మృత్యువు నరుడిని చేరినప్పుడు చావు కలుగుతుంది. పూర్వజన్మలో చేసిన కర్మలు మానవుడికి ఆయుస్సును వృద్ధి చేస్తాయి. తగ్గిస్తాయి కూడా. దానివలన బ్రతుకు చావులు సంభవిస్తూ ఉంటాయి.

పార్వతి : ఆయుస్సు ఏమి చేయటంవలన అధికమౌతుంది? దేనివలన తగ్గిపోతుంది?

శివుడు : క్షమ, సత్యం, కృప, శౌచం, గురుభక్తి - ఆయుస్సును వృద్ధి చేస్తాయి. అసత్యభాషణం, క్రౌర్యం, అశుభ్రత, గురువిరోధం ఆయుస్సును తగ్గిస్తాయి. బ్రహ్మచర్యవ్రతం, హితమితాశనం, జరావ్యాధులు పోగొట్టే ఔషధాలను సేవించటంచేతను ఆయుస్సు పెరుగుతుంది. శక్తికి మించిన పనులు చేయటం, తగనటువంటి, అనుసరణీయం కానటువంటి పదార్థాలు తినటం చేతను ఆయుస్సు తగ్గిపోతుంది. ఇవన్నీ పూర్వజన్మలో చేసిన కర్మలవలననే సంభవిస్తాయి.

పార్వతి : స్త్రీ పురుష భేదంతో ఉన్న మానవులలో జీవుడు వర్తించే విధం వివరించుము.

శివుడు : తాత్త్వికంగా జీవుడికి పురుష స్త్రీత్వాలు లేవు. అహంకారం కారణంగా కర్మానుభవం కలిగి భావించిన విధంగా జరుగుతుంది. ఆత్మ శరీరానికి అతీతమైనది. కర్మలకు ఆత్మ కర్త కాదు. అతడి త్రిగుణాత్మక చైతన్యం శరీరాన్ని పొంది కర్తృత్వం వహిస్తుంది. మనుష్యులు చేసే కర్మలను బట్టి ఫలితాలు కూడా కలుగుతాయి. జంతువులలో మానవుడు శ్రేష్ఠుడు. అతడికి గొప్పతనం కలిగించేది విద్య. విద్యవలన అజ్ఞానంవలన, సంసారంవలన కలిగే కష్టనష్టాలు తొలగిపోతాయి. వేదాలవలన జ్ఞానం కలుగుతుంది. వేదవిజ్ఞానంవలన మానవుడిలోని అంతశ్శత్రువులు గాలికి మేఘాలు విచ్చి పోయినట్లుగా తొలగిపోతాయి. విద్యావంతులు దేవతలవలె ప్రకాశిస్తారు.

పార్వతి : స్వప్న మంటే ఏమిటి?

శివుడు : స్వప్నమంటే నిద్రించేవారి మనశ్చేష్ట. అది భవిష్యత్తులో జరుగబోయే శుభాశుభాలను కూడా తెలియజేస్తుంది.

పార్వతి : కర్మాచరణంలో దైవం ముఖ్యమా? మానవుడి ఉత్సాహం ముఖ్యమా?

శివుడు : పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితమే ప్రయత్నం వలన మానవుడు పొందుతాడు. దానికి దైవసహాయం తప్పక కావాలి. కాబట్టి కర్మఫలానికి రెండూ కావాలి. అందులో సందేహం లేదు.

పార్వతి : గర్భంలో ప్రాణి ఏ విధంగా ప్రవేశిస్తాడు?

శివుడు : రతిలోని పురుషుడి శుక్లంవలన, స్త్రీ రజస్సువలన, దైవానుగ్రహంవలన ఆత్మ గర్భప్రవేశం చేస్తుంది. జీవుడు మాయారహితుడైనా అహంకారంవలన పుట్టుకకు గురి ఔతున్నాడు.

పార్వతి : నరులకు పునర్జన్మ ఉన్నదా? లేదా?

శివుడు : దేవతలకే ఆ సంగతి తెలియదు. ఇక నరులకు సాధ్యమా? పునర్జన్మ నరులకు ఉంటుంది. కాని, దానిని తెలిసికొనటం కష్టం. వేదవిజ్ఞానంవలన దానిని తెలిసికొనవచ్చును.

పార్వతి : మరణించినవారు ఆకారం లేకుండా ఉంటారు. వారిని యమభటులు బంధించి తీసికొనిపోవటం ఏమిటి? యముడు శిక్షించటం ఏమిటి?

శివుడు : మరణం ఆసన్నమైనపుడు శరీరాన్ని విడిపించి, మనుష్యులను అదృశ్య శరీరం వహించే విధంగా చేసి యమదూతలు తీసికొని వెళ్ళతారు. వారిలో ధార్మికులను సువాసన భరితంగానూ, సుకుమారంగా ఉండే మార్గంలో కొనిపోతారు. ధర్మాధర్మాలను మిశ్రమంగా చేసినవారిని బాధలు లేనిదారిలో తీసికొనిపోతారు. అధర్మపరులను కఠినం, మలినం అయిన దారిలో నడిపిస్తారు. యమధర్మరాజు వారికి తగిన శిక్షలను విధిస్తాడు.

పార్వతి : నరకం ఎటువంటిది? ఏ విధంగా ఉంటుంది? పాపాత్ములను యముడు ఏ విధమైన బాధలతో శిక్షిస్తాడు?

శివుడు : నరకాలు అయిదు. అవి: రౌరవం, మహారౌరవం, కంటకావనం, అగ్నికుండం, పంచకష్టం. జీవులు చేసిన పాపాలను బట్టి ఆయా నరకాలకు యముడు పంపుతాడు. యమభటులు వారికి కాల్చటం, కత్తిరించటం, కట్టివేయటం, కొట్టటంవంటి శిక్షలు విధిస్తారు. ఆ పాపాత్ములను కుక్కలు కరుస్తాయి. కీటకాలు తొలుస్తాయి. గ్రద్దలు ముక్కుతో పొడుస్తాయి. ఇటువంటి అనేక దుఃఖాలు అనుభవించి పురుగులుగానూ, పక్షులుగానూ, జంతువులుగానూ, మనుష్యులుగానూ జన్మిస్తారు. ఇనుమును వేడిచేసినప్పుడు తుప్పు తొలగిపోయినట్లు, యమ శిక్షలతో పాపాలు తొలగిపోతాయి.

పార్వతి : పాపాలు ఎటువంటివి ?

శివుడు : మానసములనీ, వాచికములనీ, కాయికములనీ పాపాలు మూడు రకాలు. అన్యుల ద్రవ్యాన్ని ఆశించటం, పాపకృత్యాలకు పాల్పడటం, ధర్మాన్ని ద్వేషించటం మొదలైనవి మానసాలు. అసత్యమాడటం, కఠిన సంభాషణం మొదలైనవి వాచికాలు. హత్యచేయటం, ఇతరులను బంధించటం, మద్యపానం అనేవి కాయికాలు. అన్నిటిలో మద్యపానం మహాపాపం. దానిని వదలి యశస్సు, సంపద, సౌఖ్యం, పుణ్యగతి పొందవచ్చును.

పార్వతి : పుణ్యాలంటే ఎటువంటివి?

శివుడు : పుణ్యకర్మలు లోకంలో మూడురకాలు: 1.ఔపమికం, 2.నిరుపకరణం, 3.సోపకరణం. ఔపమికమంటే పాపాన్ని తొలగించేది. నరకభయంతో పాపాలు చేయకుండా ఉండటం. దీనివలన స్వర్గం లభిస్తుంది. నిరుపకరణం అంటే శుచిగా ఉండటం, నిజం మాట్లాడటం, అహింసను పాటించటం, వ్రతదీక్ష, ఉపవాసం. స్త్రీ సంగమ వర్జనం, పుణ్యతీర్థ సేవనంవంటి నియమాలు పాటించటం. దానాదులు చేయటం సోపకరణం.

పార్వతి : దానం చేయదగిన వస్తువు లేవి?

శివుడు : జంతువు లన్నింటికి అన్నం, నీరు, ప్రాణంవంటివి కాబట్టి వాటిని దానంచేయటం దానాలలో శ్రేష్ఠం. ఆ తరువాత బంగారం, గోవు, భూమి, కన్య, విద్య, తిలలు, గొడుగు, దాసదాసీజనం, దీపం, ఔషధం, ఆశ్రయం మొదలైనవి ఉత్తమగతులు కలుగజేస్తాయి.

పార్వతి : యజ్ఞం చేసే పద్ధతిని తెలుపుము.

శివుడు : యజ్ఞవిధులు వైదికాలనీ, లౌకికాలనీ రెండు విధాలు. ఆయావర్ణాలకు తగినట్లుగా ధనధాన్యాలను గ్రహించి వేదవిధులతో దేవతలకు అర్పించేది వైదికం. దేవతలకు ఉత్సవాదులు నిర్వహించటం లౌకికం. దాన ధర్మాలు వ్రతాలు యజ్ఞాలతో సమానం కావు. యజ్ఞం శ్రద్ధతో చేయాలి. హవ్యాలను దేవతలకు అర్పించాలి.

పార్వతి : పితృసంబంధమైన విధులను తెలియపరచుము.

శివుడు : పితృకార్యాలు గయ, కురుక్షేత్రం, గంగ మొదలైన పుణ్యక్షేత్రాలలో చేయటం శ్రేష్ఠం. మాసాలలో మాఘం, భాద్రపదం మేలైనవి. తిథులలో అమావాస్య, ద్వాదశి, నవమి శ్రేష్ఠాలు. పితృదేవతలకు దర్భలు, మినుములు, నువ్వులు ప్రీతి ప్రదాలు. వేదవిదులు భోక్తలుగా పనికివస్తారు. వారికి భోజనం పెట్టి పిండప్రదానం చేయటం పితృకార్యవిధి. దానివలన శివుడు మెచ్చుకొంటాడు.

పార్వతి : మరణించినవారు వారి పుణ్యాల ననుసరించి పునర్జన్మ పొందుతారు కదా! అప్పుడు భూలోకంలో వారి బంధువులు పితృపూజ ఎవరికి చేయాలి? దానివలన ఎవరికి మేలు కలుగుతుంది?

శివుడు : ఈ సందేహం సరైనదే. ఇది చాలా రహస్యమైనది. పితృదేవతలూ ఇతర దేవతలవంటివారే. దేవతలు ఉత్తరదిక్కులో ఉంటే పితృదేవతలు దక్షిణదిక్కులో ఉంటారు. దేవతల కిచ్చేవి హవ్యములు, పితృదేవతల కిచ్చేవి కవ్యములు. మరణించిన తల్లిదండ్రులకు, బంధువులకు శ్రాద్ధకర్మలు చేస్తే పితృదేవతలు సంతోషించి, కర్తకు ఆయురారోగ్యైశ్వర్యాదులే కాక మోక్షం కూడా ప్రసాదిస్తారు. పితృదేవతలు దేవతలవలెనే రాక్షసులకు, గరుడులకు, యక్షులకు కూడా పూజనీయులు.

పార్వతి : ధర్మం అనేకవిధాలుగా ఉంటుంది. దానిని గురించి చెప్పండి.

శివుడు : జాతినిబట్టి, దేశాన్నిబట్టి, కులాన్నిబట్టి, గుణాన్నిబట్టి చేసే ధర్మాలనీ, ఆపద్ధర్మాలనీ ధర్మాలు అయిదు విధాలు.

పార్వతి : స్వర్గంలో లభించే సౌఖ్యాలు ఏ విధంగా ఉంటాయి?

శివుడు : స్వర్గంలో పుష్పాలు వాడవు; కల్పవృక్షం సువాసన ద్రవ్యాలను అందిస్తుంది. వారి ఆహారం అమృతం. శుభ్రమైన దుస్తులూ, అపూర్వాభరణాలు వారికి సహజం. ద్వేషాదిభావాలు లేక మైత్రితో ఉంటారు. ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు.

పార్వతి : ధర్మాలలో శ్రేష్ఠమైన ధర్మాలు ఏవి?

శివుడు : ధర్మార్థకామాలకంటె మోక్షధర్మం ఉత్తమమైనది. మానవుడు ఇంద్రియాలను నిగ్రహించటం ద్వారా మోక్షాన్ని పొందగలుగుతాడు. ఎంత ద్రవ్యం ఉన్నా, ఎన్ని దానాలు చేసినా, ఎంత తపస్సు చేసినా, అశ్వమేధాలు రాజసూయాలు చేసినా ముసలితనాన్నీ, మరణాన్నీ నివారించలేవు. మోక్షకాంక్ష ఒక్కటే వాటిని జయించగలదు. వైరాగ్యమే శాంతినీ, మోక్షాన్నీ కలిగిస్తుంది. సాంఖ్యమనే యోగవిశేషం సంసారమనే రోగానికి వైద్యంవలె ఉపయోగిస్తుంది. (వివరాలకు చూడు. 5.244-263)

పార్వతి : భక్తులు ఏ పరిచర్యలవలన నీ సాయుజ్యాన్ని పొందుతారు?

శివుడు : నేను దేవతలకూ, మనుషులకూ అచింత్యుడను. యోగసాంఖ్యాలు నేను చేసినవే. నేను ఈశ్వరుడను, సనాతనుడను, అవ్యయుడను, సత్యాత్ముడను. పంచాక్షరీత్యాది మంత్రాలతో, స్మరణంచేత, నమస్కారంచేత, వివిధ సేవలచేత నియమంతో నన్ను సేవించాలి. చతురాశ్రమాలను పాటించే వారికి పాశుపతవ్రతాన్ని బోధించాను. శివలింగారాధనం, భస్మరుద్రాక్షధారణంవలన పరిశుద్ధులై అభిషేకాదులతో నన్ను ఆరాధిస్తే నా సాయుజ్యాన్ని పొందుతారు.

శివుడు : పార్వతీ! నీవు నారీ శిరోమణివి. నీవలన స్త్రీధర్మాలను వినవలెనని నా కోరిక. వాటిని నీవు నాకు తెలుపుము.

పార్వతి : ప్రభూ! మీరు సర్వజ్ఞులు. మీకు చెప్పేటంతటిదానిని కాను. అయినా మీ ఆజ్ఞను పాటించి నా నేర్చినంత చెప్తుతాను అని పార్వతి గంగాది నదులతో సంప్రదించి పతివ్రతాధర్మాలను చెప్పటం ప్రారంభించింది. కన్యాదానం జరిగిన తరువాత స్త్రీకి భర్త అధికారి. ఆమె భర్తను దైవంగా భావించాలి. అతడి అభిప్రాయాన్ని అనుసరించి దైవపితృకార్యాలు చేయాలి. భర్తకు మేలే చేయాలి. ఆమెను పతివ్రత అంటారు. ఆమెకు ఇహపరలోక సుఖాలు లభిస్తాయి. స్త్రీ గృహనీతి విద్యకు ఆచార్యకం. వంటచేయుటం, కాపురం చేయటం ఆమె కర్తవ్యం. భర్త ఎటువంటివాడైనా, ఎట్టి స్థితిలో ఉన్నా అతడిని ఆమె గౌరవించాలి. జంతువులకు బలి, బీదవారికి భిక్షం తప్పక ఇయ్యాలి. భార్యకు భర్తయే గతి. అక్రమంగా ప్రవర్తించే స్త్రీలు మూడురకాలు. 1.ఆసురి, 2.పైశాచి, 3.రాక్షసి. ఆసురి చంచల మనస్సుతో ధనవ్యయం చేస్తుంది. పైశాచికి కోపం అధికం. రాక్షసి కలహప్రియ. వీరు భర్తవంశంవారిని పాడుచేసి తాము పాపలోకానికి పోతారు. ఈ ముగ్గురూ పశ్చాత్తాపంతో ధర్మమార్గంలో నడిస్తే పాపాలు పోగొట్టుకొని భర్తతో కలిసి స్వర్గానికి పోతారు. సతికి పతితో సహగమనం స్వర్గాన్ని కలిగిస్తుంది. సంతానవతికి సహగమనం ధర్మం కాదు.

శివపార్వతుల సంవాదం విన్నవారికి సర్వశుభాలు కలుగుతాయని పరమేశ్వరుడు ప్రకటించాడు. నారదుడు చెప్పిన ఈ అద్భుత వృత్తాంతాన్ని భీష్ముడు ధర్మరాజుకు వినిపించాడు.

ప్రశ్న 82 : మోక్షం ఎట్లా కలుగుతుంది?

ఉత్తరం : విష్ణుమూర్తిని మనస్సులో మననం చేయుటంవలన, పుష్పాదులతో అర్చించటంవలన, కీర్తనంచేయటంవలన, అతడి పుణ్యకథలు వినటంవలన మోక్షం కలుగుతుంది. అంతేకాక పండితులను, విద్వాంసులను కాపాడుటచేత పుణ్యం లభిస్తుంది.

ప్రశ్న : దారిద్ర్యం, దుఃఖం పోగొట్టే జపం ఏది?

ఉత్తరం : ఓం నమో భగవతే వాసుదేవాయ, నమః పురుషోత్తమాయ, నమ స్సర్వలోక గురవే, నమ స్సర్వలోక పిత్రే, నమ స్సర్వలోక పితామహాయ, నమ స్సర్వలోక ప్రపితామహాయ, నమ స్సర్వలోక ప్రధానాయ, నమ స్సర్వలోకేశ్వరాయ, నమ స్సర్వలోక విశిష్టాయ, నమ స్సర్వలోక సుఖప్రదాయ, నమ స్సర్వలోక కర్త్రే, నమ స్సర్వలోక భర్త్రే, నమ స్సర్వలోక హర్త్రే, నమ స్సర్వలోక నిధయే, నమ స్సర్వలోక నిధానాయ, నమ స్సర్వలోక హితాయ, నమ స్సర్వలోక హితకరాయ, నమ స్సర్వలోకోద్భవాయ, నమ స్సర్వలోకోద్భవకరాయ, నమో విష్ణవే, ప్రభవిష్ణవే" అని (విష్ణుసహస్ర నామాలు జపించటమే మహాజపం. (వివరాలకు చూడు. 5.314)

ప్రశ్న 84 : లోకాలన్నిటికీ మహనీయమై ఆశ్రయించి అనుభవించదగిన దైవం ఎవరు? అర్చనతో, స్తుతితో ఎవరిని కొలిస్తే జనులు శుభాన్ని పొందుతారు? అనేక ధర్మాలలో ఉత్తమమైన అభిమతాన్ని చూరగొనేది ఏది? జపాలన్నిటిలో ఉత్తమజపం ఏది? తనను జపించేవారికి జన్మనూ, సంసార బంధాలనూ పోగొట్టేది ఏది?

ఉత్తరం : సమస్త జగత్తులకు ప్రభువు, దేవదేవుడు, అనంతుడు, పురుషోత్తముడనే పేరుగలవాడి సహస్రనామాలను నిరంతరం స్తుతిస్తూ, జాగృతమనస్కుడై యజ్ఞకర్తను, అవ్యయుడైన అతడిని అర్చనం చేస్తూ, అచంచల ధ్యానంతో నమస్కరిస్తూ, ఆద్యంతాలు లేని ఆ విష్ణుదేవుడిని, సర్వలోకాధ్యక్షుడిని, బ్రహ్మణ్యుడిని, త్రిలోకకీర్తివర్ధనుడిని, సర్వధర్మాలు తెలిసినవాడిని, దయామయుడిని, లోకనాథుడిని, పంచభూతాల ఉత్పత్తికి కారకుడైనవాడిని నమ్మి భక్తితో సేవిస్తే అతడు దుఃఖాలనన్నింటిని తొలగదోస్తాడు. పుండరీకాక్షుడిని స్తుతిస్తూ పరమభక్తితో పూజించటమే నా మతం. ధర్మజా! ధర్మా లన్నింటికంటె ఉత్తమ ధర్మం ఇదే అని తెలిసికొనుము. పరబ్రహ్మమైన ఆ విష్ణుదేవుడి సహస్రనామ సంకీర్తనం, పాపాలను, భయాలను పోగొట్టుతుంది. సకల సంపదలను సమకూరుస్తుంది. 'విశ్వంబు, విష్ణుండు, వషట్కారుండు, భూత భవ్యభవత్ప్రభుడు' మొదలైన నామాలతో మొదలుపెట్టి 'రథాంగపాణి, అక్షోభ్యుడు, సర్వప్రహరణాయుధుడు' అనే నామాలు తుదిగాగల సహస్రనామాలను భీష్ముడు ఉపన్యసించాడు. తరతరాలుగా ఆ సహస్రనామాలు ప్రసిద్ధికెక్కాయని తెలిపాడు. విష్ణుసహస్ర నామాలను నిత్యం పఠించిన మనుష్యుడు ఇహపర శుభాలను పొందుతాడు. చతుర్వర్ణాల వారికీ బహువిధ లాభాలు కలుగుతాయి. చతుర్విధ పురుషార్థ ఫలసిద్ధి కలుగుతుంది. సర్వవిధ అరిష్టాలకూ దుఃఖాలకూ దూరమైనవారు పరమపదం పొందుతారు. విష్ణు వొక్కడే మహాభూతం. భూతములెన్ని ఉన్నా త్రిలోకవ్యాప్తుడుగా ఆయన విస్తరించి ఈ విశ్వాన్ని అనుభవిస్తాడు. ధర్మరాజా! వ్యాసవిరచితమైన విష్ణు సహస్రనామాలను పఠించి శుభాలు సుఖాలు అనుభవించుము.

ప్రశ్న 85 : పూజా నమస్కార గౌరవాలు ఎవరికి చేయాలి? ఎవరికి చెడు చేస్తే కీడు కలుగుతుంది? ఎవరు సంతోషిస్తే శుభాలు కలుగుతాయి?

ఉత్తరం : పూజా నమస్కారాలకు బ్రాహ్మణులు తగినవారు. వారికి అశుభం కలిగితే ఇంద్రుడికి కూడా కీడు కలుగుతుంది. వారికి సంతోషం కలిగితే అన్ని శుభాలు కలుగుతాయి.

ప్రశ్న 86 : బ్రాహ్మణులలో మెచ్చుకొనదగిన ప్రవర్తన ఏమున్నది?

ఉత్తరం : ఈ ప్రశ్నకు పవనార్జున సంవాదం అనే ఇతిహాసం చక్కని ఉదాహరణం. వేయిభుజాలుగల కార్తవీర్యార్జునుడు సప్తద్వీపాలకు అధిపతి అయి తనంత వారెవ్వరూ లేరని గర్వించాడు. ఒక భూతం బ్రాహ్మణుల అధిక్యాన్ని గురించి అతడికి చెప్పింది. బ్రాహ్మణులు రాజులను ఆశ్రయించి జీవిస్తారని అతడు ఆ ప్రతిపాదనను తిరస్కరించాడు. ఆ సమయంలో వాయువు చొరవతీసుకొని బ్రాహ్మణశక్తివలననే రాజులు ప్రజలను రక్షిస్తున్నారనీ, బ్రాహ్మణులను మించినవారు లేరనీ పేర్కొన్నాడు. గౌతముడు, భృగుమహర్షి, ఉచథ్యుడు, అగస్త్యుడు, వసిష్ఠుడు, అత్రి, భార్గవచ్యవనుడు, దత్తాత్రేయుడు మొదలైనవారి మహిమలు చెప్పి బ్రాహ్మణులను దైవస్వరూపులుగా భావించి వారి నీడలో ప్రకాశించటం శుభమని వాయువు హితవు చెప్పాడు. కార్తవీర్యార్జునుడు వాయువు మాటలలోని సత్యాన్ని గ్రహించి బ్రాహ్మణులను గౌరవించాడు.

ప్రశ్న 87 : పితామహా! బ్రాహ్మణ ప్రభావాన్ని ఇంకా వివరించుము.

ఉత్తరం : సూర్యుడు దక్షిణగోళం చివర ఉన్నాడు. నాకు దేహానికి, మనస్సుకు, మాటకు బలం తగ్గుతున్నది. నీవు శ్రీకృష్ణుడిని కోరితే అతడు బ్రాహ్మణుల గొప్పతనాన్ని గురించి వివరిస్తాడు. నేను శ్రీకృష్ణుడిని బాగా ఎరుగుదును. ఆదివరాహ రూపంలో భూమిని ఉద్ధరించిన విష్ణువు అతడే. అతడి లీలలవలననే పంచభూతాలు ఉద్భవించాయి. అతడి నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మ ఈ లోకాలను సృష్టించాడు. శ్రీకృష్ణుడి లీలలు సామాన్యమైనవి కావు. ధర్మాలకు రాక్షసులవలన గ్లాని కలిగితే తాను అవతరించి అసురులను సంహరించి ధర్మాన్ని, ధర్మాత్ములను కాపాడుతాడు. శ్రీకృష్ణుడు శుచి, సర్వవ్యాపి, శివుడు. అతడే దిక్పాలకుడు, విశ్వనాథుడు, కాలస్వరూపుడు, దిక్కులు మొదలైన సమస్తం అతడే, అతడు యజ్ఞపురుషుడు, సర్వమంత్ర తంత్రగమ్యుడు, ఋగ్వేదం శ్రీకృష్ణుడి మాహాత్మ్యాన్ని కీర్తించింది. సర్వవేదాలూ అతడి తత్త్వాన్నే ప్రతిపాదిస్తాయి. యజ్ఞంలో అగ్నీ, యజమానుడూ, ఆహుతులూ, యాగఫలం కూడా కృష్ణుడే. సూర్యచంద్ర నక్షత్రాలలోని వెలుగు అతడే. అతడే పరంజ్యోతి. స్వర్గం, అమృతం, వేదాంత వేద్యుడు అతడే.

ప్రశ్న 88 : శ్రీకృష్ణా! బ్రాహ్మణ మాహాత్మ్యాన్ని వివరించ కోరుతున్నాను.

ఉత్తరం : నే నిదివరలో ప్రద్యుమ్నుడికి చెప్పినట్లు నీకు వివరిస్తాను. వేదత్రయ విజ్ఞానాన్ని సంపాదించాలన్నా, మోక్షాన్ని సాధించాలన్నా, పితృదేవతల దయ పొందాలన్నా, ఐహిక సుఖాలు గడించాలన్నా బ్రాహ్మణులను ఆశ్రయించాలి. ఆయురారోగ్య యశస్సంపదలు వారివలన లభిస్తాయి. కోరితే వారు వరాలు ఇవ్వగలరు. కోపిస్తే భస్మం చేయగలరు. వారికి ఉన్నదానిలో దానం చేసివారిని తృప్తిపరిస్తే ఇహపరసుఖాలు కలుగుతాయి. నీ కొక ఆశ్చర్యకరమైన వృత్తాంతాన్ని చెప్పుతాను వినుము. స్వతంత్రవర్తనుడైన దుర్వాసుడు ఒకసారి మా ఇంటికి వచ్చాడు. చిత్రవిచిత్రంగా వ్యవహరించాడు. ఒకసారి ఒంటినిండా పాయసాన్ని పూయించుకొన్నాడు. రథానికి రుక్మిణిని కట్టి లాగించి బాధించాడు. ఆమె మూర్ఛపోగా రథాన్ని వదలి వెడలిపోయాడు. నేను అతడివెంట వెళ్ళి అనునయించి ప్రార్థించాను. అతడు ప్రసన్నుడై 'అందరూ తమను తాము ఎంత ప్రేమించుకొంటారో అంతగా నిన్నుకూడా ప్రేమించి పూజిస్తా' రని వరం ఇచ్చాడు. పాయసం అరికాలికి పూయలేదని చెప్పి దానివలన నాకు ప్రమాదముంటుందని సూచించాడు. రుక్మిణికి అపూర్వ సౌందర్యాన్నీ, భర్తృవాల్లభ్యాన్నీ ప్రసాదించాడు. కాబట్టి బ్రాహ్మణులపట్ల భక్తి కలిగి ఉండడంవలన శుభాలు చేకూరుతాయి. (అని ప్రద్యుమ్నుడికి వలెనే ధర్మరాజుకు కూడా శ్రీకృష్ణుడు బ్రాహ్మణ మాహాత్మ్యాన్ని ప్రబోధించాడు).

ప్రశ్న 89 : దుర్వాసుడు శివాంశసంభూతు డని వింటూంటాం. శివుడి మహిమను గురించి వివరించుము.

శ్రీకృష్ణుడు : ఎవరు శివుడిని మనస్సులో నిలుపుకొని శతరుద్రీయ మంత్రాన్ని జపిస్తారో వారు ఇహపరసుఖాలు పొందుతారు. శివుడు మహాదేవుడు. దానికి మించిన పేరు మరొకటి లేదు. అతడి మూడవ కంటిమంట ధర్మవిరోధులను కాల్చివేస్తుంది. దక్షాధ్వరధ్వంస వృత్తాంతం ప్రసిద్ధం కదా! త్రిపురాసుర సంహారం ఆ దేవుని ప్రతాపానికి చిహ్నం. త్రిపురాసురులను సంహరించిన అస్త్రాన్ని, ఆ దేవుడు ఒడిలో పెట్టుకొనగా, అది బాలుడుగా మారింది. ఆ బాలుడే దుర్వాసుడు.

ప్రశ్న 90 : శివుడి ప్రధాన నామాలు స్తుతిస్తే భోగమోక్షాలు కలుగుతాయి అంటారు. వాటి వ్యుత్పత్తిని తెలిపి నాకు బోధించుము.

శ్రీకృష్ణుడు : శివనామాలన్నీ చెప్పి వివరించటానికి నాకు గానీ, బ్రహ్మకుగానీ సాధ్యం కాదు. కానీ, నీ వడిగావు కాబట్టి నేను ఎరిగినంతవరకు చెప్పుతాను. శివుడు సార్థకనాముడైన మహేశ్వరుడు. ఉగ్రత్వము, ఉన్నత ప్రతాపం ఉండటంచేత

రుద్రు డయ్యాడు. దేవతలలో కెల్ల గొప్పవాడు కావున మహాదేవు డయ్యాడు. సత్కర్మఫలాలైన శుభాలు కలిగినవాడు కావటం చేత శివుడయ్యాడు. సుస్థిర తేజస్సుతో వెలుగొందటంవలన స్థాణు డయ్యాడు. స్థావర జంగమాత్మక రూపాలనన్నింటిని పొందటంచేత బహురూప నామధారి అయ్యాడు. పొగరంగువంటి జటలు కలిగినవాడు కావటంచేత ధూర్జటి అయ్యాడు. విశ్వులనే దేవతలు అతడియందు పుట్టారు కాబట్టి అతడు విశ్వరూప నామధేయు డయ్యాడు. తన శరీరంలో బహునేత్రా లుండటంవలన సర్వతశ్చక్షువనే నామంతో ఒప్పుతున్నాడు. భూతములన్నీ పశువులై తాను వాటికి పతి కావటంచేత పశుపతి అయ్యాడు. నందివాహనుడు కావటంచేత వృషవాహను డయ్యాడు. ప్రాణులను సమభావంతో పాలిస్తాడు కాబట్టి మృత్యువయ్యాడు. ఇవన్నీ వేదాలలో చెప్పిన శివనామాలు. ఇంకా ఎన్నో పేర్లు శివుడికి ఉన్నాయి. వేదవేత్తలు వాటిని తెలిసి శివానందులై విహరిస్తారు. శివనామావళిని భక్తితో చదివినా, విన్నా సౌఖ్యానందాలు జనులు పొందుతారు. వ్యాసమహర్షి లోకహితం కొరకు శివస్తుతిని పఠనీయంగా అందించాడు. దాని భావ మిది - సర్వజగత్తుకు నిత్యసాక్షి, లోకైక శుభావహమూర్తి, నిరామయుడు, పంచభూతాలకు మూలమైనవాడు, ఉదాత్తభూతము, శివుడు, ఫాలాక్షుడు. తనను భక్తితో సేవించేవారికి భవబంధమోక్షాన్ని కలిగించేవాడు. తన పదములపై మనస్సు నిలిపేవారికి ఉత్తమ పదాలను ప్రసాదించేవాడు ఆ మహాదేవుడు. ఈ స్తుతిని చేసేవారికి శివుడు ఆయురారోగ్యైశ్వర్యాదులను ప్రసాదిస్తాడు.

ప్రశ్న 91 : పితామహా! ధర్మాలు అనేక విధాలుగా ఉంటాయి. వాటిలో ఆచరించదగిన ఉత్తమ ధర్మం ఏది?

భీష్ముడు : ధర్మవేత్తలు ధర్మమంటే ఏమిటో చెప్పుతారు. కాలం గడచిన కొద్దీ మరొక విధంగా మారుతుంది. ఒక్కొక్కసారి అధర్మమే ధర్మంగా మనసుకు స్ఫురిస్తుంది. నిశిత పరిశీలనం లేకపోవటంవలన ధర్మానికి సంబంధించిన విశేషాలు తప్పుగా చెప్పటంచేత ధర్మం మార్గం తప్పుతుంది. దానివలన దోషం ఏర్పడుతుంది. దానివలన ధర్మాచరణ పరులు కష్టాలకు లోనౌతారు. కాబట్టి ధర్మం సూక్ష్మ ప్రకారం కలది. వేదవిదులైన సజ్జనులనుండి వివరాలను తెలిసికొనాలి.

ప్రశ్న 92 : వేదాలలో చెప్పబడిందీ, ఎదుట కనబడేదీ, ఆచరణలో ఉన్నదీ - అని ధర్మం వేరువేరుగా ఉండి చీకాకు కలిగిస్తుంది. ధర్మసూక్ష్మతతో ఈ మూడింటిలో సరి అయినది ఏదో తెలియటం కష్టంగా ఉన్నది.

ఉత్తరం : ఈ మూడువిధాలూ ధర్మవిశేషాన్ని తెలిసికొనటంలో మూడు దశలు. ధర్మరాజా! అహింస, దానం, సత్యం, క్రోధపరిత్యాగం అనేవి ఉత్తమ ధర్మాలు. ఇది ధర్మానికి పరసీమ. దీనిని మనస్సులో నిలుపుకొమ్ము.

ప్రశ్న 93 : ఎవరు ధర్మంపట్ల ఈర్ష్య వహిస్తారు? ఎవరు దానిని ఉపాసిస్తారు? ఈ ఇరు తెగలవారూ పొందే గతులు ఎటువంటివి?

ఉత్తరం : రజస్తమోగుణ వికారాలు గల మనస్సున్నవారు ధర్మాన్ని ద్వేషిస్తారు. వారు నరకానికి వెళ్ళుతారు. సత్యవ్రతులు ధర్మాన్ని ఉపాసిస్తారు. వారు ఊర్ధ్వలోకాలకు పోతారు.

ప్రశ్న 94 : సాధులు, అసాధులు - అనేవారు ఎట్టివారు?

ఉత్తరం : అసాధువులు తమంత తాము తెలిసినవారు కారు. ఇతరులు బోధించిన సదుపదేశాలను గ్రహించలేరు. సాధువులు అట్లా కాదు. వారు స్వయంగా తెలిసినవారు; ఇతరులు మంచి చెప్పగా స్వీకరిస్తారు. వారు శిష్టులతో కలిసి భుజిస్తారు. తగినవారికి దారి ఇచ్చి గౌరవిస్తారు. తగనిచోట్ల మలమూత్రాలు విడువరు. సత్యాన్ని,

ఋజుమార్గాన్ని అనుసరిస్తారు. రక్షణకోరిన వారిని కాపాడుతారు. సరసభోజనం, భార్యాసంభోగం, గురువులను గౌరవించటం, నిర్మలహృదయాలను, నిత్య సంతోషాన్ని కలిగి ఉండటం వారి లక్షణాలు. వారు విషయ చాపల్యాన్ని వదలుతారు. పాపాలకు ప్రాయశ్చిత్తం చేసికొంటారు. ధర్మాన్ని అప్రకాశంగా ఆచరిస్తారు. భూతదయను ప్రదర్శిస్తారు.

ప్రశ్న 95 : లోకంలో కొందరికి ప్రయత్నం లేకుండానే ధనం లభిస్తుంది. ధర్మాన్ని ఆచరించేవారు, నీతి తెలిసినవారు పెక్కు మంచి పద్ధతులతో ధనాన్ని కోరినా అది లభించదు. కొందరికి అది లభించినా అది వారి సౌఖ్యానికి ఉపయోగపడదు. గురుబోధ ఎక్కువగా లేకపోయినా కొందరికి విద్య అలవడుతుంది. కొందరు బోధ పొందికూడా దుర్విద్యులౌతున్నారు. కొందరు రోగాలపాలబడి దెబ్బలు తినకుండా చావరు. కొందరు గడ్డిపరక తగలటంచేతకూడా మరణిస్తారు. ఇట్లా జరగటానికి గల కారణ మేమి?

ఉత్తరం : విత్తు లేకుండానే చెట్టు మొలుస్తుందా? అట్లాగే పూర్వజన్మలో చేసిన కర్మ ఈ జన్మలో ఫలాన్నిస్తుంది. గతంలో దానాలవంటి సత్కార్యాలు చేస్తే ఈ జన్మలో ప్రయత్నం లేకుండానే కోరికలు ఫలిస్తాయి. పూర్వజన్మలో తపస్సులు చేసే ఈ జన్మలో అనేక సౌఖ్యాలూ, గురుసేవ చేస్తే విద్యాబలం, అహింస పాటిస్తే నిండు సుఖజీవితం లభిస్తాయి. అటువంటివి పూర్వజన్మలో చేయకపోతే ఈ జన్మలో అనేక కష్టాలు కలుగుతాయి. ఎల్లప్పుడూ ధర్మం మీద నిష్ఠ కలవాడికి కాలమే ధర్మరహస్యాన్ని కలిగిస్తుంది. ధర్మసాధనవలన మానవుడు ఇహలోకంలో శాంతినీ, పరలోకంలో ఆనందాన్నీ పొందుతాడు. మోక్షాన్ని సాధిస్తాడు.

ధర్మరాజా! వేదవ్యాస మునీంద్రుడు నీకు మార్గదర్శి. శ్రీకృష్ణుడు నీకు ఆశ్రయం. అందుచేత చింత విడనాడి శాంతవృత్తితో ప్రజలను పాలించుము. నీకు సర్వత్రా విజయం లభిస్తుంది.

వేదవ్యాసుడు :భీష్మా! ధర్మరాజుకు జ్ఞానం కలిగింది. ఆ జ్ఞానం అమృతంవంటి నీ ఉపదేశంవలన సిద్ధించింది. అతడి సోదరులు, కృష్ణుడు, ఆప్తులైన రాజులు, ధృతరాష్ట్రుడు నిన్ను తగినట్లుగా గౌరవించి నీ దయకు పాత్రులయ్యారు. ఇతడికి ఇక సెలవిమ్ము, సమయం వచ్చినప్పుడు అతడు నీ వద్దకు తిరిగి వస్తాడు.

భీష్ముడు : (ఆర్ద్రమైన కన్నులతో) ధర్మరాజా! నీవు పట్టణానికి వెళ్ళుము. సర్వశుభాలూ నిన్ను పొందుగాక! నీ బుద్ధి ధర్మంలో మాత్రమే నిష్ఠమై ఉండుగాక! యయాతివలె సమగ్ర దక్షిణలతో యజ్ఞాలు నిర్వహించుము. రాజధర్మాలతో ప్రజలను రంజింపజేయుము. ఫలవృక్షాన్ని పక్షులు చేరి సుఖించేటట్లుగా నీ బంధువులు, స్నేహితులు నిన్ను ఆశ్రయించి సుఖిస్తారు గాక! సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించటం తెలిసికొని నా వద్దకు రమ్ము. ఇక వెళ్ళుము. నీవూ, నీ తమ్ములూ, ధృతరాష్ట్రుడూ సుఖంగా ఉండండి.

ధర్మరాజు పులకితుడై, ఆనందంతో దండప్రణామం చేసి 'అట్లే చేస్తాను' అని అనుమతి తీసికొని కృష్ణాదులందరితో కూడి హస్తినాపురం చేరాడు. భీమాదులు తనను సేవిస్తూ ఉండగా ధర్మరాజు పట్టాభిషేక సమగ్ర రాజ్యాధికారాన్ని పొంది మనస్సులో ఊరటచెంది ఆనందించాడు. సమగ్రరాజ్యాన్ని స్వీకరించి, ప్రజలు మెచ్చుకొనేటట్లు పాలిస్తూ ఏభైదినాలు గడచిన తరువాత సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించాడని తెలిసికొని భీష్ముడిని దర్శించటానికి బయలుదేరాడు.

భీష్మ నిర్యాణం:

గాంధారీ, ధృతరాష్ట్రుడూ, కుంతీ ముందు నడువగా, శ్రీకృష్ణాది బంధువర్గం, ధౌమ్యాది పురోహితవర్గం వెంట నడువగా భీష్ముడు శయనించి ఉన్న అంపతల్పం వద్ద ధర్మరాజు చేరాడు. ధ్యానమగ్నుడై ఉన్న భీష్ముడికి తన రాకను,

బంధువుల రాకను ఎరిగించాడు. మాఘమాసం శుక్లపక్షం వచ్చినదని భీష్ముడు సంతోషించాడు. అందరినీ ఆదరంగా చూచాడు. ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'ధృతరాష్ట్రా! నీవు వేదశాస్త్రాలు చదివావు. వ్యాసాదులు బోధించిన ధర్మాలు విన్నావు. పాండవులను పుత్రప్రేమతో పాలించుము. ధర్మరాజు నీ పట్ల భక్తి ప్రేమలు కలవాడు. అవినీతులై దుర్యోధనాదులను గురించి విచారింపకుము.'

ఆ తరువాత శ్రీకృష్ణుడివైపు చూచి భక్తితో ఇట్లా పలికాడు. 'దేవదేవ! జీవాత్మక! దేవవంద్య! శంఖచక్ర గదాపద్మ చారుహస్త! వాసుదేవ! త్రివిక్రమ! వరద! పరమపురుష! ఇవే నా ప్రణతులు. కరుణించుము. నీవే నాకు బలం. నేను నీ భక్తుడను. ఆలుబిడ్డలు లేనివాడను, మిక్కిలి దయతో కాపాడి నాకు అనుజ్ఞనిమ్ము! మాధవా! పాండవులకు నీవే దిక్కు. శ్రీకృష్ణ డే పక్షంలో ఉంటే ఆ పక్షంలో విజయం తథ్యమని నేను దుర్యోధనుడికి చాలాసార్లు చెప్పాను. కాని, అతడు వినలేదు. తనవారిని నశింపజేసి, తానూ నశించాడు. నీ వెవరో నాకు తెలుసు. నరనారాయణులు లోకరక్షణార్థం అవతరించి భూతలంమీద తిరుగుతారని వ్యాసనారద మహర్షులు నాతో చెప్పారు' అని అన్నాడు.

శ్రీకృష్ణుడిని భీష్ముడిని అత్యాదరంతో చూచి ఇట్లా పలికాడు. 'శాంతనవా! నీయం దే దోషమూ లేదు. పైగా పితృభక్తితో మరణాన్ని సైతం నీ అదుపులో పెట్టుకొనగలిగావు. నీకు నేను అనుజ్ఞ ఇచ్చాను. నీతోడివారైన వసువులను కలిసికొనుము' అన్నాడు.

భీష్ముడు సంతోషించి పాండవులను, ధృతరాష్ట్రుడు మొదలైనవారిని చూచాడు. 'మీరుకూడా ఆజ్ఞ ఇచ్చినట్లే కదా!' అని అడిగాడు. అందరినీ ఆలింగనం చేసికొన్నాడు. క్రౌర్యం మాని, సత్యాన్ని నిత్యం పాటించండని పలికాడు. బ్రాహ్మణులను గౌరవించుమనీ, యజ్ఞాలు చేయుమనీ ధర్మరాజుతో పేర్కొని మౌనం తాల్చాడు. ధారణ అనే యోగ విశేషం చేత సమాధిలోనికి వెళ్ళి ప్రాణవాయువులను శరీరంనుండి వెడలించాడు. శరీరంలో ఉన్న బాణాలు రాలిపోయాయి. అది చూచి అందరూ ఆశ్చర్యపడ్డారు. భీష్ముడి ఆత్మ అతడి కపాలాన్ని చీల్చికొని నక్షత్రంవలె ఎగిరిపోయింది. దేవతలు పూలవాన కురిపించారు. వాద్యాలు మ్రోగించారు. భీష్ముడిని స్తుతించారు. ఈ విధంగా భీష్ముడు స్వర్గగతు డయ్యాడు.

పాండవులూ, ధృతరాష్ట్రుడూ రాజలాంఛనాలతో చందన కాష్ఠాలతో కూర్చిన చితిపై భీష్ముడి శరీరాన్ని ఉంచి దహన సంస్కారం చేశారు. గంగను చేరి తిలోదకా లిచ్చారు. గంగాదేవి పుత్రశోకంతో విలపించింది. భీష్మ వ్యక్తిత్వాన్ని కీర్తించింది. శ్రీకృష్ణుడూ, కృష్ణద్వైపాయనుడూ ఆమెను ఓదార్చారు.

'అతని శిఖండి యేల? యమరాధిపుఁడున్ సమయింపఁ జాలునే?
యతఁడు నిజేచ్ఛఁ జేసి నరునంచిత దివ్యశరంబు లంగ సం
గతములు చేసి పొన్పుగ సుఖస్థితి మృత్యువు మాన్చియుండి కీ
ర్త్యతిశయ మొంది తా వలచినప్పుడు పోయె; విషాద మేటికిన్?' (ఆను.5.480)

అని శ్రీకృష్ణుడు భీష్మచరిత్రకు భరతవాక్యం పలికాడు.

శ్రీమదాంధ్ర మహాభారతము
ఆనుశాసనిక పర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

ద్వితీయాశ్వాసము

తృతీయాశ్వాసము

చతుర్థాశ్వాసము

పంచమాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ మత్కటాక్షరోచి । స్తో్సమ సముల్లాస విహిత సుస్థిర లక్ష్మీ
భూమానందిత భక్త! వ్యామోహ విదూరయుక్త! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= విష్ణు శివస్వరూపుడవైన ఓ పరబ్రహ్మమా! శ్రీమత్=మంగళకరమైన, శోభాజనకమైన; కటాక్షరోచిస్= కడగంటిచూపుల వెలుగులయొక్క; స్తోమ= సముదాయంయొక్క; సముల్లాస= వికసనంచేత; విహిత= కలిగించబడిన; సుస్థిర= మిక్కిలి శాశ్వతమైన; లక్ష్మీ= సంపత్తియొక్క; భూమ= అతిశయంచేత; ఆనందిత భక్త!= సంతోషపరచబడిన భక్తులు కలవాడా!; వ్యామోహవిదూర= అజ్ఞానమునకు దూరగు లెవ్వరో వారితో; యుక్త!= కూడినవాడా!

తాత్పర్యం: దేవా! హరిహరనాథా! మంగళకరములైన నీ దయాదృక్కులు తమమీద పొలయుటచేత నీ భక్తులు సుస్థిర లక్ష్మీ సంపన్నులై పరమానంద భరితులవుతారు. స్వామీ! నీవు వ్యామోహరహితులైన జ్ఞానులతో కూడిఉంటావు.

విశేషం: 1. పై రెండూ హరిహరనాథుడికి సంబోధనలు. మొదటిది భగవంతుడి నేత్ర సౌందర్యాన్ని వర్ణిస్తుంది. ఆ నేత్ర సౌందర్యమే భక్తులకు జ్ఞాన ప్రదాయకమై వారి వ్యామోహాన్ని దూరంగా తొలగిస్తున్నది. మొదటి సంబోధన భగవంతుడి సగుణ రూపాన్ని వర్ణిస్తే, రెండవ సంబోధన ఆయన కేవలం ఆనంద స్వరూపుడని నిర్గుణ తత్త్వాన్ని వర్ణిస్తున్నది.

2. "ఈ పర్వమునకు సంస్కృత ప్రతులన్నిటిలోను 'అనుశాసన పర్వము' అనియే వ్యవహారము. వి.వి.శాస్త్రి ప్రతియందు 'అనుశాసన', ఆనుశాసనిక' - అను రెండు పేర్లును గలవు. నన్నయభట్టు 'ఆనుశాసనిక' మనియే వాడినాడు" (1-1-33 & 60)' (ఉస్మానియా సంశోధిత ముద్రిత ప్రతి పుట 1.)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు దివ్యజ్ఞాన దేదీప్యమానుండైన దేవవ్రతుండు వివరింప వివిధంబులగు ధర్మంబు లాకర్ణించి, యజాతశత్రుం డతనికి సభక్తిక ప్రణామం బాచరించి, వినయ విశేష విభూషితుండై. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా (తిక్కన తాను చెప్పే తెనుగు భారతాన్ని హరిహరనాథుడికి విన్నవిస్తున్నాడు. దీని కాయన శ్రోత. ఈ భారతాన్ని సంస్కృతంలో వ్యాసుడు వ్రాసినదాన్ని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు) వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; దివ్యజ్ఞాన= భగవంతుడిచ్చిన జ్ఞానంచేత; దేదీప్యమానుండు+ఐన= ప్రకాశిస్తున్నవాడైన; దేవవ్రతుండు= యావజ్జీవితమూ దేవతల కనుగుణంగా వ్రతంగా బ్రతికినవాడు - భీష్ముడు; వివరింపన్= చెప్పగా; వివిధంబులు+అగుధర్మంబులు+ఆకర్ణించి= అనేక ధర్మాలు విని; అజాతశత్రుండు= మనస్సులో ఎవరిపైనా శత్రుత్వ భావన లేనివాడు - ధర్మరాజు; అతనికిన్= భీష్మునకు; సభక్తిక ప్రణామంబు= భక్తితో కూడుకొన్న నమస్కారం; ఆచరించి= చేసి; వినయ విశేషభూషితుండు+ఐ= వినయమన్న విశిష్టమైన అలంకారంతో అలంకరించబడినవాడై.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా అన్నాడు. ఆ విధంగా దివ్యజ్ఞానంతో ప్రకాశిస్తున్న భీష్ముడు వివరించగా అనేక ధర్మాలను విని ధర్మరాజు భీష్ముడికి భక్తితో నమస్కరించి వినయంతో శోభించి.

సీ. 'అనఘ! నాదగు చిత్తమునకు శమంబు గా । వించుటకై నీవు వివిధ విశద
భంగులఁ బరమ కృపానిరతుండ వై । సకల ధర్మోపదేశములుఁ జేసి;
తిమ్మెయిఁ జెప్పఁగా నించుక యేనియు। శమము లేకున్నది; చలముకొని య
నేక బంధుల వధియించితి; నది యొక్క । తలయు, నీ కలిగిన దారుణత్వ

ఆ. మొక్కతలయు నైన యుగ్రకర్మంబులు । చిత్తవృత్తిఁ దగిలి, యుత్తలంబుఁ
జేయ, శాంతి యెట్లు సిద్ధించు మునిమాన । నీయ! యింక నేమి సేయువాఁడ? 3

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! నీవు; నాదగు చిత్తమునకున్= నా మనస్సుకు; శమంబు కావించుటకై= ఓదార్పు పొందించటానికి; వివిధ విశద భంగులన్= అనేకంగా విస్తారమైన పద్ధతులతో; పరమకృపా నిరతుండవు+ఐ= మహాదయగల వాడవై; సకల ధర్మోపదేశములున్+చేసితి(వి)= సకలధర్మాలు చెప్పావు; ఈ+మెయిన్ చెప్పఁగాన్= ఇంతగా చెప్పినా; ఇంచుక+ఏనియున్= కొంచెం కూడా; శమము లేకున్నది= ఊరట లభించటం లేదు (నేను); చలముకొని= పట్టుదలతో; అనేకబంధులన్= చాలామంది చుట్టాలను; వధియించితిన్= చంపితిని; అది ఒక్క తలయున్= అదొక ఎత్తూ; నీకున్+అలిగిన= నీపై కోపగించి నీ కొనర్చిన; దారుణత్వము+ఒక్క తలయున్= క్రూరత్వమొకెత్తూ; ఐన= అయిన; ఉగ్రకర్మంబులు= క్రూర కర్మలు; చిత్తవృత్తిన్+తగిలి= మనస్సు నంటుకొని; (వృత్తి= కదలిక, చేష్ట); ఉత్తలంబున్ చేయన్= కలతపెట్టగా; శాంతి= మనశ్శాంతి; ఎట్లు సిద్ధించున్?= ఏ విధంగా లభిస్తుంది; ముని, మాననీయ!= మునులకు కూడా గౌరవించ దగినవాడా!; ఇంకన్+ఏమి చేయువాఁడన్?= ఇంక ఏమి చేయగలను?

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడితో ఈ విధంగా అన్నాడు; 'మునులు కూడా నిన్ను గౌరవిస్తారు. నీవు పుణ్యమూర్తివి. ఎన్నో ధర్మాలు చెప్పావు. ఎన్నో నీతులు బోధించినావు. ఎంతో దయతో మన్నించి ఎన్నో రీతులుగా చెప్పినా నా మనస్సు శాంతి పొందటం లేదు. పట్టుదలతో చుట్టాలను ఎందరినో చంపుకొన్నాను. అదొక ప్రక్కా, నీపై కోపం వహించి నిన్ను పడగూల్చిన క్రూరకర్మ మొక ప్రక్కా నా మనస్సును బాధిస్తున్నవి. నా మనశ్శాంతికి మార్గమేదయ్యా? ఏం చేసేది? చెప్పుము.

విశేషం: పద్యమంతా మాటమీద మాటగా ఎడతెగకుండా అల్లబడింది. వాక్యంలో సాఫీదనం లేదు. మనశ్శాంతి లేనివాడు పడే బాధంతా పద్య, వాక్యరచన తెలియజేస్తున్నది.

వ. దుర్యోధనుం డతి లోభంబున నాతోఁ బంచి కుడువ నొడంబడండ; యేనును నాగ్రహంబున నతనికి, రాజ్యం బిచ్చి, తొలంగి నిలువను; మా యిద్దఱ కతంబున నింత పుట్టెం; బశ్చాత్తాపం బెప్పాటనుం ద్రోపువడ దయ్యెడు'.4

ప్రతిపదార్థం: దుర్యోధనుండు= దుర్యోధనుడు; అతిలోభంబునన్= మిక్కిలి లోభగుణంతో; నాతోన్; పంచి కుడువన్= రాజ్యం పంచుకొని తినటానికి; ఒడంబడండు+అ= ఒప్పుకోడయ్యె; ఏనును= నేను కూడా; ఆగ్రహంబునన్= పట్టుదలతో;

అతనికిన్; రాజ్యంబు+ఇచ్చి= రాజ్యం కట్టబెట్టి; తొలంగి= తప్పుకొని; నిలువను= ఉండను; మా ఇద్దఱ కతంబునన్= మా ఇరువురి కారణంగా; ఇంతపుట్టెన్= ఇంత జరిగింది; పశ్చాత్తాపంబు= తర్వాతి బాధ; ఏ+పాటనున్= ఏ విధంగానూ; త్రోపు పడదయ్యెడున్= త్రోసి పారేయటానికి వీలు పడనిదయింది.

తాత్పర్యం: దుర్యోధనుడు పరమ లోభి కనుక రాజ్యం చెరిసగం పంచుకొని తిందామంటే కుదరనివ్వలేదు. పోనీ, నేనైనా కోపంలేకుండా సరే పోనివ్వు వాడినే తిననిమ్మని ఊరకున్నా పోయేదేమో! మా ఇద్దరి వలన ఇంత చేటు పుట్టింది. ఈ పశ్చాత్తాపాన్ని త్రోసి వేయటం సాధ్యం కావటం లేదు'.

విశేషం: ధర్మరాజు తనకూ యుద్ధంలో బాధ్యత ఉందనటంలోనే ఆతని మంచితనం వ్యక్త మౌతున్నది

గౌతమీ లుబ్ధక సర్ప మృత్యుకాల సంవాదము (సం. 13-1-9)

చ. అనవుడు భీష్ముఁ డిట్టు లను నాతనితో 'నకటా! వధింపఁగా
మనుజుఁడు గర్త గాఁడు, వినుమా! యితిహాస మొకండు సెప్పెదన్;
మనుజవరేణ్య! గౌతమి యనంగ శమాన్విత యొక్క భూసురాం
గన యురగంబుచే సుతుఁడు గాలవశత్వముఁ బొంది యుండఁగన్. 5

ప్రతిపదార్థం: అనవుడున్= ధర్మజు డిట్లా అనగా; భీష్ముఁడు; అతనితోన్= ధర్మజుడితో; ఇట్టులనున్= ఇట్లు చెప్పుతున్నాడు; అకటా!= అయ్యో! వధింపఁగాన్= చంపుటకు; మనుజుఁడు= మనిషి, కర్తకాఁడు= చేసే వాడు కాడు; ఇతిహాసము+ఒకండు= ఒక పురాణకథ; చెప్పెదన్= చెప్పుతాను; వినుమా!= జాగ్రత్తగా ఆలకించుము; మనుజవరేణ్య!= మానవులలో గొప్పవాడా!, రాజా!, గౌతమి అనంగన్= గౌతమి అనే పేరుగల; శమ+అన్విత= శాంతంతో కూడుకొన్నది; ఒక్క; భూసుర+అంగన= బ్రాహ్మణ స్త్రీ; ఉరగంబు చేన్= పామువలన; సుతుఁడు= తన కొడుకు; కాలవశత్వమున్= మృతిని (కాలానికి లోబడిన దశ); పొంది ఉండఁగన్= పొందగా.

తాత్పర్యం: అయ్యో! రాజా! మనిషి దేనికీ కర్త కాడయ్యా. (కర్త ననుకొనటంతోనే ఇబ్బందులన్నీ) ఒక పూర్వ కథ చెప్పుతాను వినుము. (చాలా ప్రసిద్ధమైనదని భావం). గౌతమి అన్న పేరుగల ఒక బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె కోపతాపాది భావాలను అదుపులో పెట్టుకొన్న మహాత్మురాలు. ఆమె కుమారుడు పాము కరచినందున మరణించాడు.

విశేషం: పుణ్యాత్మురాలికికూడా బాధ తప్పదనటానికి ఆమె శమాన్విత అని చెప్పటం. బుద్ధదేవుని జీవితచరిత్రలో కూడా కిసగౌతమికి (క్షీరగౌతమి= పాలమ్ముకొనే స్త్రీ) తన కుమారు డిట్లాగే పాము కాటుచేత మరణిస్తే బుద్ధదేవుడిని ఆశ్రయిస్తుంది. బుద్ధదేవుడంటాడు 'తల్లీ! ఇది కాల నియతి. దాని నేమీ చేయలేము. మృత్యు తరణోపాయమే శరణ్య' మంటాడు. బహుశః రెండు కథ లొకటే.

చ. వగచుచుఁ జూడ నయ్యురగవల్లభు రజ్జునఁ గట్టి తెచ్చి య
మ్మగువకుఁ జూపి 'దీనిఁ దల ద్రుంచఁగ మోఁదెదఁ గోల నొండె, రెం

డుగ నెఱగత్తి వ్రేసెదఁ; గడుం జెడు గీపాడపాఁప పుర్వు, నే

మిగతి వధింతు?' నంచు నొక మేటి కిరాతుఁడు రోషదీప్తుఁడై. 6

ప్రతిపదార్థం: ఒక మేటి కిరాతుఁడు = ఒక గొప్ప అడవిజాతివాడు; రోషదీప్తుఁడు+ఐ= కోపంతో మండిపోతున్నవాడై; ఆ+ఉరగవల్లభున్= ఆ పెద్దపామును; రజ్జునన్= త్రాటితో; కట్టి తెచ్చి; వగచుచున్+చూడన్= దుఃఖిస్తూ చూడగా; (మరణించిన కొడుకుకై) ఆ+మగువకున్= ఆ తల్లికి; చూపి= కిరాతుడు పామును చూపి; దీనిన్, కోలన్= కఱ్ఱతో; తల వ్రుందఁగన్+మోఁదెదన్= తలను చితకబాదుతాను; ఒండెన్= లేదా; నెఱకత్తిన్= వాడి కత్తితో; వ్రేసెదన్= నరుకుతాను; కడున్= మిక్కిలి; చెడుగు= చెడ్డది; ఈ పొడ పాఁప పుర్వు= ఈ పొడలుగల నికృష్టమైన పాము; ఏమిగతిన్ వధింతున్?= ఏ విధంగా చంపుమంటావు? అంచున్= అంటూ (ఆ కిరాతు డడుగగా)

తాత్పర్యం: కొడుకు చావును చూచి దుఃఖిస్తూ ఉన్న తల్లి దగ్గర కొక అడవిజాతివాడు, పామును త్రాడుతో కట్టి దెచ్చి, కోపంతో అన్నాడు; 'తల్లీ! ఇది చాలా దుష్టసర్పం. దీని తలను కఱ్ఱతో చితక గొట్టేదా? లేక కత్తితో దీనిని నరికేదా? ఏం చేయుమంటావో చెప్పుము' అన్నాడు.

క. ఉన్నఁ గని యప్పడఁతి 'యో । యన్న! విడువు భుజగనాథు' ననవుడు నతఁ 'డీ

పిన్నాతని ప్రాణంబులు । గొన్నది యిది, దీనియుసుఱు గొనియెద' ననియెన్. 7

ప్రతిపదార్థం: ఉన్నన్+కని= పై విధంగా అంటూ ఉండగా (వాడిని) చూచి; ఆ+పడఁతి=ఆ స్త్రీ; ఓ+అన్న!= ఓ అన్నా! (ప్రేమతోడి పిలుపు); భుజగనాథున్= పెద్దపామును; విడువు= వదలిపెట్టుము; అనవుడున్= అనగా; అతఁడు= ఆ కిరాతుడు; ఇది= ఈ పాము; ఈ పిన్న+ఆతని= ఈ పసివాడి; ప్రాణంబులు కొన్నది= ప్రాణాలు తీసింది; దీని ఉసుఱు= దీని ప్రాణం; కొనియెదన్= తీస్తాను; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'అన్నా! ఈ సర్పరాజును వదలి పెట్టుము' అని ఆ తల్లి కిరాతుడితో అన్నది, ఆ మాటకు ఆతడు ఇట్లా అన్నాడు. 'ఈ పసివాడి ప్రాణాన్ని తీసిన ఈ పాము ప్రాణం తీస్తాను.

విశేషం: ఆ సందర్భంలో - లోకంలో ఏ తల్లీ పామును పోనివ్వు అనదు.కానీ ఈ కథ కాల స్వభావమే మనిషి జీవన్మరణాలకు కారణమని చెప్పటానికి చెప్పుతున్న ఉపాఖ్యానం కనుక - ఇట్లా వ్రాయవలసి వచ్చింది.

వ. అనిన నక్కోమలి యక్కిరాతుం జూచి. 8

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+కోమలి= ఆ సుకుమారి (స్త్రీ); ఆ+కిరాతున్+చూచి= ఆ బోయవాడిని జాలిగా చూచి.

తాత్పర్యం: ఆమె కిరాతుడిని జాలిగా చూచి.

విశేషం: ఇక్కడ మగువ, పడతి ఇట్లా స్త్రీ పర్యాయ వాచకాలేవీ వాడకుండా కోమలి అనటం ఆమె మెత్తని మనసు కలదని చెప్పటం కొరకే.

క. 'విధివశమున వచ్చిన కీ । డధములు గొనియాడి వెడఁగులై, విపులభవాం

బుధి మునుఁగుదురు; మునుంగరు । సధర్మలగు నుత్తములు, ప్రశాంతిఁ జులుకనై. 9

ప్రతిపదార్థం: విధి వశమునన్= దైవవశంగా వచ్చిన; కీడు= ఆపద, అధములు= క్షుద్రస్వభావం కలవారు; వెడఁగులు+ఐ= బుద్ధిలేనివారై; కొనియాడి= పెద్దగా చేసి; విపుల= విస్తారమైన; భవ+అంబుధిన్= సంసార సముద్రంలో; మునుఁగుదురు= మునిగిపోతారు; సధర్ములు+అగు+ఉత్తములు= ధర్మబుద్ధి గలవారైన మహనీయులు (మాత్రం) ప్రశాంతిన్= మనశ్శాంతి కలవారైనందున; చులుకన్+ఐ= తేలికగా; మునుంగరు= సంసార సముద్రంలో మునుగరు.

తాత్పర్యం: 'అన్నా! (రహస్యం చెప్పుతున్నాను వినుము) ఆపదలు మన పూర్వజన్మ కర్మానుసారంగా వస్తాయి. (వాటిని వేరే ఎవడూ నీ మీద కోపంతో సృష్టించటం లేదు) కనుక అధములైన వారు తల్లడిల్లి సంసార సముద్రంలో మునిగిపోతున్నారు (విచారించటం లేదు). ఉత్తములు మాత్రం అట్లాకాక ధర్మవేత్తలు కనుక (సృష్టి నడతలోని క్రమాన్ని చూచినవారు కనుక) శాంతి పొంది సంసార సాగరాన్ని దాటిపోతున్నారు. (కనుక పాము విధి ఆజ్ఞతో కరిచింది. కనుక వదలిపెట్టుము)

విశేషం: ఈ పద్యంలో వెడఁగులై అని ఉన్నదానికి 'వ్రేఁగులై' అనే పాఠాంతరం ఉన్నది. అది దీనికంటె బాగైన పాఠమని తోస్తుంది. వ్రేఁగులై= బరువైనవారై - వారు బరువైనవారు కనుకనే భవాంబుధిలో మునిగిపోతారు. ఉత్తములు ప్రశాంతిచే చులుకనై= తేలికైనవారై - వారు తేలికైనవారు కనుకనే మునిగిపోరు అనే స్వారస్యం లభిస్తుంది.

వ. అదియునుం గాక! 10

తాత్పర్యం: అంతేకాక (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఈ పాముఁ జంప బ్రదుకునె । నా పుత్త్రుఁడు? విడువు మర్జునక!' నావుడు 'వాఁ
డీ పేద మాట లెల్లను । గోప వివశుఁడైన నాకుఁ గొలుపవు, ముగ్ధా!' 11

ప్రతిపదార్థం: ఈ పామున్+చంపన్= ఈ పామును చంపితే; నాపుత్త్రుఁడు= నా కొడుకు; బ్రదుకునె?= బ్రతుకుతాడా? (ఆలోచించు); అర్జునక!= కిరాతుడా!; విడువుము= పామును వదిలిపెట్టుము; నావుడున్= అనగా; వాఁడు= కిరాతుడు; ఈ పేదమాటలు= ఈ పనికిరాని మాటలు; ఎల్లను= అన్ని; కోప= కోపంతో; వివశుఁడు+ఐన= పరవశుడ నైన; నాకున్; కొలుపవు= నచ్చవు; ముగ్ధా!= అమాయకురాలా!

తాత్పర్యం: 'అర్జునకా! దీనిని చంపితే నాబిడ్డ బ్రతుకుతాడా? వదలుము' అన్న దామె. అతడు 'నీవు తెలివి తక్కువదానివి కనుక (ముగ్ధ అని ఇందుకే అన్నాడు) పామును వదలు మంటున్నావు. నేను కోపంతో మైమరచి ఉన్నాను. కనుక నీ మాటలు నాకు నచ్చవు' అన్నాడు.

విశేషం: అర్జునక! అని ఆమె సంబోధన. పేడి మాట ముగ్ధ. ఈ మాటలు చాటున కవి విశేషార్థాన్ని దాచాడు. ముగ్ధ= తెలివి తక్కువదానా - అని. పసిపిల్లవాడిని చంపిన పామును వదలమంటా వేమిటి? పిచ్చితల్లీ - అని ఈతడి సంబోధన.

ఉ. కావున నెట్లుఁ జంపుదున; కాని భుజంగముఁ బోవ నీను జూ
నావుడు; నింతి యర్జునక నామము నీ కవదాత భంగికిం
గావలదే? మహీసురులు గా దను చొప్పునఁ దత్సహాయులుం
బోవరు గాదె! యేల నినుబోఁటికిఁ గ్రూరత నాదు సన్నిధిన్? 12

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఎట్లున్= తప్పక; భుజంగమున్= పామును; చంపుదున కాని= చంపుతానే తప్ప; పోవనీను= వదలిపెట్టను; చూ+ చుమ్ము; నావుడున్= అనగా; ఇంతి= (ఆ) స్త్రీ; నీకున్, అర్జునక నామము= అర్జునుడన్న పేరు; అవదాత= స్వచ్ఛత (తెల్లని); భంగికిన్= పద్ధతికి; కావలదే= కావద్దా!; మహీసురులు= భూదేవతలు (బ్రాహ్మణులు); కాదను చొప్పునన్= కాదన్న పద్ధతిలో; తత్సహాయులున్= వారికి సాయపడేవారు (స్నేహితులు) కూడా; పోవరుకాదె!= పోరుకదా!; నినుబోఁటికిన్= నీవంటి వాడికి; క్రూరత= క్రూరత్వం; నాదు సన్నిధిన్= నా మ్రోల; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: నీ వెన్నైనా చెప్పుము. ఈ పామును చంపకుండా పోనివ్వ' నని ఆ కిరాతు డంటే, ఆమె ఇట్లా అన్నది 'నీ పేరు అర్జునకుడు. అంటే స్వచ్ఛమైనవాడని కదా! ఆ పేరునకు అర్థం మహాత్ములు కాదనేటట్లుగా వారి స్నేహితులు ప్రవర్తించరు కదా! నీ వంటి వాడికి నా సాన్నిధ్యంలో ఈ క్రూరమైన మనస్సేమిటి?

విశేషం: ఆమె శమాన్విత కనుక ఆమె సన్నిధానంలో ఎవరూ ఆమె మాటను కాదని ఒక అంగుళమైనా పోలేరు. మహీసురులు కాదనే మార్గాన్ని వారికి తోడ్పడేవారు అనుసరించరు గదా! అట్లాంటప్పుడు నా ముందు నీ వంటివారు ఈ క్రూరబుద్ధిని ప్రదర్శించవచ్చునా? అని ఆమె ఆశ్చర్యపడుతున్నది.

సీ. హింసకు నొడఁబడ నే నెట్లు? 'ననవుడు, । 'జనబాధకము లైన జంతువులను
జంపినఁ బాపంబు సమకూర' దని పల్కె । బోయ; 'పట్టిన రిపుఁ బొరిగొనంగ
వల' దని చెప్పె నవ్వనిత; వాఁ డహిఁ దెగఁ । జూచి జనంబులఁ గాచు టుఱదె?
వృత్రుఁ జంపఁడె దేవవిభుఁడు? యజ్ఞధ్వంస । నము సేయఁడే? ఫాలనయనుఁ డట్ల

తే. కావె? ధర్మువు హింసలు నీవు దీని । కియ్యకొను' మని తఱిమె; నట్లెంత దఱిమి
నను దయావతి యైన యన్నాతి పాప । మునకుఁ జొరదయ్యెఁ; బోయ కిట్లనియెఁ బాము. 13

ప్రతిపదార్థం: నేను; ఎట్లున్= ఏ విధంగానూ; హింసకున్= క్రూరకర్మకు; ఒడంబడన్= ఒప్పుకోను; అనవుడున్= అని ఆమె అనగా; బోయ=కిరాతుడు; జనబాధకములు+ఐన= జనులను పీడించే; జంతువులను= మృగాలను; చంపినన్= చంపితే; పాపంబు= పాపం; సమకూరదు= రాదు; అని పల్కెన్= అని కిరాతు డన్నాడు; ఆ+వనిత= ఆ స్త్రీ; పట్టినరిపున్= బంధించిన శత్రువును; పొరిగొనంగన్ వలదు= చంపవలదు; అని చెప్పెన్, వాఁడు= బోయ; అహిన్= పామును; తెగన్+చూచి= చంపి; జనంబులన్= మనుష్యులను; కాచుట= రక్షించటం; ఉఱదె!= మంచిదికాదా; దేవవిభుఁడు= దేవేంద్రుడు; వృత్రున్= వృత్రుడన్న రాక్షసుడిని; చంపఁడు+ఎ= సంహరించ లేదా?; ఫాలనయనుఁడు= లలాటంలో కన్ను కల శివుడు; యజ్ఞధ్వంసనము= దక్షయజ్ఞ నాశనం; చేయఁడే= చేయలేదా; అట్ల కావె!= అట్లా కాదా!; హింసలు= క్రూరకర్మలు; ధర్మువు= ధర్మం; నీవు= తల్లీ నీవుకూడా; దీనికిన్= ఈ పామును చంపటానికి; ఇయ్యకొనుము= అంగీకరించుము అని; తఱిమెన్= ఒత్తిడి చేశాడు; అట్లు; ఎంతతఱిమినను= ఎంతగా ఒత్తిడి చేసినా; దయావతి= దయకలది; ఐన; ఆ+నాతి= ఆ స్త్రీ; పాపమునకున్= హింసకు; చొరదయ్యెన్= అంగీకరించలేదు; (అప్పుడు) పాము; బోయకున్= బోయవాడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: (ఈ పద్యమంతా స్త్రీకి, కిరాతుడికి జరిగిన సంభాషణ) ఆమె 'హింస కంగీకరించ' ననగా, వాడు 'మనుష్యులకు బాధ కలిగించే జంతువులను చంపటంలో పాపం లేదమ్మా!' అని చెప్పాడు. దాని కామె 'శత్రువైనా సరే మన చేత చిక్కినపుడు చంపరాదురా నాయనా' అన్నది. వాడు దాని కంగీకరించక 'పూర్వం దేవేంద్రుడు వృత్రాసురుడిని చంపలేదా? శివుడు దక్షుడి యజ్ఞాన్ని నాశనం చేయలేదా? ఈ హింసలు ధర్మమే కదా! కనుక దీనిని

చంపనిమ్ము' అని వా డెంత బలవంతం చేసినా ఆమె అంగీకరించలేదు. ఇదంతా వింటూ ఉన్న పాము బోయతో అన్నది.

క. 'ఏ నేమి తప్పు సేసితిఁ? గానవు । నెఱి నీవు లెస్సగా, మృత్యుపరా
ధీనత బాలునిఁ గఱచితిఁ । గాని, వినుము! లేవు రోషకామాదు లెదన్'. 14

ప్రతిపదార్థం: ఏను= నేను; ఏమితప్పు= ఏ దోషం; చేసితిన్?= చేశాను; నీవు; నెఱిన్= న్యాయం; లెస్సగాన్= చక్కగా; కానవు= తెలియవు; మృత్యు పరాధీనతన్= మృత్యుదేవతకు లోబడి; బాలునిన్= పసివాడిని; కఱచితిన్= కాటువేశాను; కాని= అంతేకాని; వినుము; రోష+కామ+ఆదులు= కోపం, కోరిక మొదలైనవి; ఎదన్= నా మనసులో; లేవు.

తాత్పర్యం: 'నా దేమి తప్పున్నది? నేను మృత్యుదేవత ఆజ్ఞకు లోనై బాలుడిని కరచాను అంతే, కానీ నాకు కోపం కానీ, కోరిక కానీ ఏమీ లేవు. ఈ రహస్యం నీకు తెలియదు'.

వ. అనుటయు నతండు 15

తాత్పర్యం: అని పాము పలుకగా ఆ బోయవాడు (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'విను! మృత్యువునకుఁ దగు సా । ధనమ వగుటఁ జేసి నిన్ను దండింపంగాఁ
జను' నవవుడుఁ' గుమ్మరికో । లను సారెం బోలితిం దలఁచి చూడు మెడన్. 16

ప్రతిపదార్థం: విను= (నాకు విషయం తెలియదన్నావు కనుక నేను చెప్పుతాను) బాగా వినుము; మృత్యువునకున్= మృత్యుదేవతకు; తగు= తగిన; సాధనమవు+అగుటన్+చేసి= (నీవు) పనిముట్టువైనావు కనుక; నిన్నున్; దండింపంగాన్+చనున్= శిక్షించి తీరాలి; అనవుడున్= అనగా (పామన్నది); కుమ్మరికోలన్= కుమ్మరివాని చేతి కర్రను; సారెన్+పోలితిన్= సారెవలెనైనాను; ఎడన్= మనస్సులో; తలఁచి= ఆలోచించి; చూడుము.

తాత్పర్యం: 'నీవు మృత్యువు చేతిలో పనిముట్టువైనావు కనుక నిన్ను చంపి తీరవలసిందే' అని కిరాతు డనగా, పామన్నది 'అయ్యా! కొంచె మాలోచించి చూడుము. కుండలు చేసేవాడు చేతికర్రతో సారెను త్రిప్పుతాడు కదా! తిరిగే సారెది దోషమా? కర్రతో త్రిప్పిన కుమ్మరిదా దోషం?

విశేషం: అలం: ఉపమ. ఈ పోలిక వేదాంత శాస్త్రంలోనిది. భగవంతుడు కుమ్మరివంటివాడు. కుండను చేయటానికి మట్టి - సారె - కోల అవసరం. ఇవి బాహ్యసాధనాలు. మట్టి కుండగా పరిణమింప చేసే సృజనాత్మక క్రియ, దానివెనుక నున్న భావం - భగవంతుడి సంకల్పంలోనివి. చేతి సాధనాలు అచేతనాలు. సృష్టి చేసే సామర్థ్యం అతడిదే. అట్లాగే మట్టి - కోల-సారెలు కావు కుండను చేసింది. అవి కేవలం సాధనాలు.

వ. ఈ క్రియ నావశం బగునే? యని పల్కినం బాముున కర్జునకుం డిట్లనియె. 17

ప్రతిపదార్థం: ఈ క్రియ= ఈ చంపటమన్న పని; నా వశంబు+అగునే?= నాకు శక్యమా?; అని పల్కినన్= అని చెప్పగా; పామునకున్= పాముతో; అర్జునకుండు= కిరాతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'అయ్యా! చంపేశక్తి నాకెక్కడిది? అని పామనగా కిరాతు డా పాముతో ఇట్లా అన్నాడు.

విశేషం: పాము కరిస్తే చాలామంది బ్రతకటం లోకంలో ఉన్నది కనుక చంపే శక్తి తనకు లేదని పామన్నది.

తే. **'ఏయువాఁ డుండ, న మ్మేమి సేయు । ననక, యోపి తత్ఖండనముసేఁత పాప మండ్రె?**
యెవ్వరేఁ బంపఁ; గఱతు గా కేమి? క్రూరు । నిన్ను గీటడఁగించిన నింద రాదు. 18

ప్రతిపదార్థం: ఏయువాఁడు+ఉండన్= బాణం వేసే విలుకాడుండగా; అమ్ము= బాణం; ఏమిచేయున్= ఏం చేస్తుంది; అనక= ఆనకుండా; ఓపి= శక్తి గలిగి; తత్ ఖండనము= దానిని నరకటం; పాపము+అండ్రె?= పాపమంటారా? ఎవ్వరేన్= ఎవరైనా; పంపన్= పంపిస్తే; కఱతుకాక ఏమి?= కరుస్తావా; క్రూరున్= క్రూరుడవైన; నిన్ను; గీఁటు+అడఁగించినన్= చంపినందువలన; నింద= అపకీర్తి; రాదు= నాకు రాదు.

తాత్పర్యం: 'విల్లు ఎక్కు పెట్టి విలుకాడు శత్రువుపై బాణమేస్తే, అదేం చేస్తుంది లెమ్మని ఊరుకొనకుండా నడుమనే దానిని విరుగగొట్టినందువలన పాప మంటారా ఎవరైనా? ఎవరో పంపించారని నీ వాబాలుడిని కరుస్తావా? నిన్ను నరికినా పాపం లేదు'.

విశేషం: నేను మృత్యువు చేతిలో సాధనాన్ని అని పామన్న దానికిది కిరాతుడు చెప్పిన సమాధానం. చాలా తెలివిగా ఉన్నది.

తే. **అదియుఁ గాక, విశేషించి యరయ బుద్ధి । గలుగునట్టి సాధనములు గారె మీరు**
మృత్యువున? కట్లు గావున మెలఁగ మిడుక । నీక, పొరిగొనవలయు; మి మ్మెల్లభంగి.' 19

ప్రతిపదార్థం: అదియున్+కాక= అంతే కాకుండా; విశేషించి= ప్రత్యేకించి; అరయన్= ఆలోచిస్తే; మీరు= మీవంటివారు; మృత్యువునకున్= మృత్యుదేవతకు; బుద్ధికలుగు+అట్టి= మనస్సున్నట్టి; సాధనములు కారె?= పనిముట్లు కాదా? అట్లు కావునన్= కాబట్టి; మెలఁగన్= తిరుగుటకు; మిడుకనీక= కిక్కురుమన నివ్వకుండా; మిమ్మున్= మిమ్ములను; ఎల్లభంగిన్= సర్వవిధాలా; పొరిగొనన్ వలయున్= చంపితీరవలసిందే.

తాత్పర్యం: అంతేకాకుండా; ప్రత్యేకంగా ఆలోచిస్తే మీరు మృత్యువు చేతిలో మనస్సున్న సాధనాలు. కనుక ఇకముందు మిమ్మల్ని తిరగనివ్వకుండా అన్నివిధాలా చంపటమే మంచిది'.

విశేషం: 'కుమ్మరి కోలకు సారె వంటి దాన్ని మృత్యువు చేతిలో నే నన్న పై పద్యంలోని మాట' కిది సమాధానం. కోలా, సారె మనస్సు లేనివి. పాము అట్లా కాదు. అది బుద్ధి ఉన్నట్టి జీవి; అని. ఇక్కడ బుద్ధి అన్నమాట ప్రతి తెలుగువాడూ వాడేదే.

వ. **అనిన విని బోయకు భుజంగం బిట్లనియె.** 20

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; భుజంగంబు= పాము; బోయకున్= కిరాతుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అనగా విని కిరాతుడితో పాము ఇట్లా అన్నది.

తే. **'బుద్ధి గల్గు సాధనముల పో హవిస్సు, లరసి వేల్తురు బుుత్విజు, లా ఫలంబు**
గాంచు నధ్వరకర్తయ । కాక వారి కేమి పని?' యనఁగా మృత్యు వేఁగుదెంచె. 21

ప్రతిపదార్థం: ఋత్విజులు= యజ్ఞం చేయించే పురోహితులు; బుద్ధి కల్గు= మనస్సున్న; సాధనములపో!= సాధనాలే కదా!; అరసి= (మంత్రాలను చక్కగా) విచారించి; హవిస్సులు= అగ్నియందు హోమంచేసే నేయి మొదలైనవి; వేల్తురు= హోమం చేస్తారు; ఆ ఫలంబు= ఆ యజ్ఞఫలం; అధ్వరకర్తయ= యజ్ఞం చేసే యజమానుడే; కాంచున్= పొందుతాడు; కాక= అట్లా కాకుండా; వారికిన్+ఏమిపని?= ఋత్విజుల కేమిఫలం?; అనఁగాన్= అన్నంతలో; మృత్యువు= ఆ దేవత; ఏఁగుదెంచెన్=వచ్చింది.

తాత్పర్యం: 'నీ వన్నట్లు బుద్ధి గలుగు సాధనాలు కదా యజ్ఞం చేయించే పురోహితులు. వారు చేయించే హోమాల ఫలితం యజమానుడికి వస్తున్నది తప్ప పురోహితులకు వస్తున్నదా? అట్లాగే బుద్ధి ఉన్న సాధనాలమైన మా పని కూడా అంతే' అని పామన్నంతలో మృత్యుదేవత వచ్చింది.

విశేషం: ఈ చర్చ చాలా తర్కంతో కూడుకొన్నది. తెలివితేటలే కాకుండా విషయం తెలిసిన పండితుల చర్చగా ఉన్నది. ఇక్కడ యజ్ఞ మన్న దృష్టాంతా న్నివ్వటం చాలా ప్రజ్ఞావంతమైనది.

క. చనుదెంచి పామునకు ని । ట్లను 'నిను నేఁ గోరి పనిచినట్టుల, నన్నున్
బనిచెం గాలుం; డీ చా । వున కీవును నేను హేతువులు గా మనఘా! 22

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; పామునకున్= పాముతో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; అనఘా!= పాపంలేనివాడా! (ఇది పామునకు సంబోధన); నినున్= నిన్ను; నేను; కోరి= చెప్పి; పనిచినట్టులన్= పంపినట్లుగానే; కాలుండు= కాలస్వరూపుడైన యముడు; నన్నున్= నన్నూ; పనిచెన్= పంపించాడు; ఈ చావునకున్= ఈ బాలుడి మృతికి; ఈవును, నేనున్= ఇద్దరమూ; హేతువులు కాము= కారణం కాము.

తాత్పర్యం: 'పాపం లేనివాడా! నిన్ను నేను చెప్పి పంపినట్లుగానే నన్ను యముడు పంపించాడు. అందువలన అతడి ఆజ్ఞనే నీకు వినిపించాను. కనుక మన మీ బాలుడి చావునకు కారణం కాము.

విశేషం: అనఘా! అన్న సంబోధన వలన ఈ మృతికి పాము కారణం కాదని చెప్పబడింది.

క. ఇన, శశి, పావక, భూమి, గ । గన, జల, పవనాది వస్తుగతు లెల్లను గా
లుని యఱచేతి వనినఁ ద । క్కిన పని సెప్పంగ నేటికిని భుజగేంద్రా! 23

ప్రతిపదార్థం: భుజగ+ఇంద్రా!= పాములలో గొప్పవాడా!; ఇన= సూర్యుడు; శశి= చంద్రుడు; పావన్= అగ్ని; భూమి= నేల; గగన= ఆకాశం; జల= నీరు; పవన= గాలి; ఆది= మొదలైన; వస్తుగతులు= వస్తువుల నడకలు; ఎల్లను= అన్నీ; కాలుని= యముడి; అరచేతివి= అరచేతిలోనివి (వశమున ఉన్నట్టివి); అనినన్= అనగా; తక్కిన= మిగిలిన; పని= కార్యం; చెప్పంగన్= చెప్పటం; ఏటికిని?= ఎందుకు?

తాత్పర్యం: ఓయీ! పాములరేడా! సూర్యచంద్రాగ్నులు, నేల, ఆకాశం, నీరు, గాలి మొదలైనవి (ఇవి 7 జీవుడు-జీవాత్మ= యజమానుడు= కలిసి 8. వీరే అష్టమూర్తులు= శివుడి శరీరంగా చెప్పారు). వస్తువుల కదలికలన్నీ కాలస్వరూపుడైన ఆ దేవుడి చేతిలోని పనులు. ఇంతకంటె ఇంకా ఏమి చెప్పాలి?

విశేషం: ఇక్కడ యముడే విశ్వానికి అధిపతిగా, సర్వకర్తగా చెప్పబడింది. ఇదే కఠోపనిషత్తు వంటి చోట్ల మిక్కిలిగా వివరించబడినది. కాలుడు కూడా పరబ్రహ్మ స్వరూపుడే.

క. విను మిట్లగు టేర్పడ నెఱిఁ । గిన నాపై నిడుదు వెట్లు, కిల్బిషముం గా

లుని చెయిది నన్ను దూఱిన । నిను దూఱుట' యుఁ॒అదె నాదు నిర్మాణమునన్. 24

ప్రతిపదార్థం: వినుము= వినుము; ఇట్లు+అగుటన్= విషయమిట్లాంటిదని; ఏర్పడన్= స్పష్టంగా; ఎఱిఁగినన్= తెలిస్తే; నాపైన్= నామీద; ఎట్లు= ఏ విధంగా; కిల్బిషమున్= పాపమును; ఇడుదువు?= మోపగలవు?; కాలుని= యముడియొక్క; చెయిది= చేష్ట (ఇది); నన్నున్= నన్ను; దూఱినన్= నిందిస్తే; నాదు= నాయొక్క; నిర్మాణమునన్= నిర్మించటంలో; పనిలో; నినున్= నిన్ను; దూఱుట= నిందించటం; ఉఁ॒అదె= తగదా.

తాత్పర్యం: విషయ మిట్లాంటిదని తెలిసిన తరువాత నాపై పాపాన్ని మోపటమంటే నీపై నీవే మోపుకొనటం కదా! నేను నిన్ను ఈ పనికి నియోగించినట్లు నన్నాయన నియోగించినాడు కనుక మన ఇద్దరిదీ పాపం కాదు'.

ఆ. అనిన భుజగ మిట్టులను 'నీవలన నేను । గుణము సెప్ప, దోష గణన సేయ

నన్నుఁ బనిచె నంటి, నామీఁది దోషంబుఁ । బాపి కొనుట నాకుఁ బాడి గాదె? 25

ప్రతిపదార్థం: అనినన్= అనగా; భుజగము= పాము; ఇట్టులు+అనున్= ఈ విధంగా అంటున్నది; నీవలనన్= నీయందు; ఏను; గుణము= గుణాన్ని, చెప్పన్= చెప్పగా; దోషగణన= తప్పు లెక్కించటం; చేయన్= చేయగా; నన్నున్; పనిచెను= పంపెను; అంటిన్= అంటివి; నామీది దోషంబున్= నాపై తప్పు; పాపికొనుట= పోగొట్టుకొనటం; నాకున్= నాకు; పాడి= న్యాయం; కాదె= కాదా?

తాత్పర్యం: పై రీతిగా మృత్యువనిన తరువాత పామంటున్నది; 'నీమీద నేను గుణాన్ని ఆరోపించి మాట్లాడితే నీ వేమో నన్ను పంపావని, నా దేదో తప్పున్నట్లు చెప్పుతున్నావు. ఆ తప్పు పోగొట్టుకొనటంకొరకే నేనట్లా అన్నది.

క. విను మటు కాలుని దెసనై । నను దోషము కలిమి లేమి, నా కాడంగాఁ

బని యేమి? దోష గతిచిం । తన భాషణములకు నేను దగుదునె యనఘా!' 26

ప్రతిపదార్థం: అనఘా!= పాపం లేనివాడా!; వినుము; అటు= ఆ ప్రక్క; కాలునిదెసన్= యముడి పక్షాన; ఐనను= ఐనప్పటికిని; దోషము= తప్పు; కలిమి= ఉండటం; లేమి= లేకపోవటం; నాకున్; ఆడంగాన్= చెప్పగా; పని ఏమి= ఏమిపని; దోష= పాప; గతి= పాటు; చింతన= ఆలోచన; భాషణములకున్= తర్కించటానికి, మాట్లాడటానికి; నేను; తగుదునె?= అర్హుడనా?

తాత్పర్యం: అయ్యా! నీ దే పాపం లేదు వినుము. యముడిపై తప్పు మోపటానికి గానీ, తప్పు లేదనటానికి గానీ నే నెవడను? ఆ విధంగా పాపగతిని గురించి ఆలోచించటానికి గానీ, మాట్లాడటానికి గానీ నాకు సత్తా ఎక్కడున్నదసలు?

వ. అని పలికి పాము బోయమొగంబు సూచి. 27

ప్రతిపదార్థం: అని పలికి= ఈ విధంగా అని; పాము= పాము; బోయ= బోయవాడి; మొగంబు చూచి= ముఖం చూచి.

తాత్పర్యం: పాము ఈ రీతిగా పలికి బోయవాడి ముఖం చూచి (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'వింటే, మృత్యువు మాటలు? గంటే నామీఁదఁ దప్పు గలిగించెద; వి
ట్లంటం గట్టం దగునే? యంటకు । నగి, బోయ యిట్టు లనియె, నరేంద్రా! 28

ప్రతిపదార్థం: మృత్యువు మాటలు= మృత్యుదేవత చెప్పినవన్నీ; వింటే?= ఆలకించావా?; నా మీఁదన్= నాపై; తప్పున్= దోషాన్ని; కలిగించెదవు= కలిగిస్తున్నావు; కంటే?= (విషయమంతా) చూచావా?; ఇట్లు= ఈ విధంగా; అంటన్+కట్టన్ తగునే?= అంటగట్టటం తగదుకదా!; అంటకున్= అట్లా పాము అనటానికి; నగి= నవ్వి; బోయ= కిరాతుడు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; నరేంద్రా!= ధర్మరాజా! (భీష్మ డతడితో చెప్పుతున్నాడు)

తాత్పర్యం: పాము బోయతో అంటున్నది; 'నీవు మృత్యువు మాటలు విన్నావు. విషయమంతా స్పష్టంగా చూచావు కదా! కనుక ఈ పాపం నాకంటగట్ట దగదు'. అప్పుడు బోయ నవ్వి అన్నాడయ్యా! ధర్మరాజా!

క. నీవును, మృత్యువుఁ బాప స । మావేశితమతుల రొఱగ నాడినయంతం
బోవునె మీపై దోషము, లే । వెఱతునె యిట్టు లనిన యింతన మీకున్'. 29

ప్రతిపదార్థం: నీవును= నీవూ; మృత్యువున్= మృత్యువూ; పాప= పాపం వల్ల; సమ్+ఆవేశిత= చక్కగా ఆవేశించబడిన; మతులరు= మనస్సు కలవారు; ఒఱగన్+ఆడిన+అంతన్= ఒరిగేటట్లుగా చెప్పినంత మాత్రంచేత; మీపైన్ దోషములు= మీమీదనున్న పాపాలు; పోవునె= పోతాయా? ఇట్టులు+అనిన ఇంతన్+అ= ఈ విధంగా చెప్పినంత మాత్రాన; ఏన్= నేను; మీకున్= మీకు; వెఱతునె?= భయపడతానా?

తాత్పర్యం: బోయ పాముతో అన్నాడు - 'నీవూ, మృత్యువూ ఇద్దరూ పాపానికి వశమైన మనస్సు కలవారు కనుక మీరెంత చెప్పినా మీ మీదనున్న దోషాలు తొలగిపోతాయా? ఇందులో ఒరిగే దేమీ లేదు. మీరట్లా అన్నంత మాత్రాన నే నేమీ జడిసేది లేదు'.

వ. అనిన మృత్యువునుం బామును. 30

ప్రతిపదార్థం: అనినన్= అనగా; మృత్యువును= మృత్యువూ; పామును= పామూ.

తాత్పర్యం: అని అనగా మృత్యువూ, పామూ (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'ఘనుఁ డగు కాలుని వశమునఁ । జనియెడుమా, కరయ దోష సంగతి గలదే?'
యనునెడఁ గాలుం డచటికిఁ । జనుదెంచెం, బ్రీతి ధర్మ సంశయ ముడుపన్. 31

ప్రతిపదార్థం: ఘనుఁడు+అగు= గొప్పవాడైన; కాలుని= యముడి; వశమునన్= లోనై; చనియెడు= నడుస్తున్న; మాకున్= మాకు; అరయన్= చూడగా; దోష=తప్పుయొక్క; సంగతి= కూడిక; కలదే?= ఉన్నదా?; అను+ఎడన్=అనే సమయంలో; కాలుండు= యముడు; అచటికిన్= అక్కడకు; ప్రీతిన్= ప్రేమతో; ధర్మ= ధర్మసంబంధమైన; సంశయము= సందేహమును; ఉడుపన్= పోగొట్టటానికి; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: 'మాదేమున్నది? తప్పు మాది కాదు. అంతా కాలానికి లోబడి నడుస్తుంది' అని వారిద్ద రన్నంతలో యముడు ధర్మసందేహాన్ని పోగొట్టటానికి అక్కడికి ప్రేమతో వచ్చాడు.

వ. చనుదెంచి యర్జునకు నాలోకించి. 32

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; అర్జునకున్= కిరాతుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: వచ్చి కిరాతుడిని చూచి.

క. 'పామును, మృత్యువు, నేనును । గా మీదారకుని మృతికిఁ గారణ, మీతం
దేమేఁ గర్మముఁ జేసెం దా । మృతిఁ బొందించె నదియ, తలకొని, యితనిన్. 33

ప్రతిపదార్థం: పామును= పామూ; మృత్యువున్= మృత్యువూ; ఏనును= నేనూ; ఈ దారకుని= ఈ పసివాడి; మృతికిన్= చావుకు; కారణము= హేతువు; కాము; ఈతండు= ఈ పిల్లవాడు; ఏమేన్= ఏమేమి; కర్మమున్= పాప పుణ్య సంబంధమైన చేష్ట; చేసెన్= చేసెనో; అదియ= అదే; తాన్= తానే; తలకొని= పూనుకొని; ఇతనిన్= ఇతడిని; మృతిన్= చావును; పొందించెన్= కలిగించింది.

తాత్పర్యం: యము డీ విధంగా పలికాడు; 'నేనూ, పామూ, మృత్యువూ ఈ పసివాడి చావుకు కారణం కాము. మరేమిటంటే - వీడి కర్మే పూనుకొని వీడి కా చావును తెచ్చిపెట్టింది.

క. విను కర్మం బొనరించును । జననము, మరణంబు, నదియ సౌఖ్యము, దుఃఖం
బును గావించుం, దనచే । సిన దానిం బడకపోవ శివునకు వశమే?' 34

ప్రతిపదార్థం: విను= వినుము; కర్మంబు= తాను చేసిన కర్మ; జననమున్= పుట్టుకను; మరణంబున్= చావును; పొనరించును= చేస్తుంది; అదియ= అదే, కర్మే, సౌఖ్యమున్= సుఖాన్ని; దుఃఖంబున్= దుఃఖాన్ని; కావించున్= కలిగిస్తుంది; తన=తాను; చేసిన దానిన్= చేసిన దానిచేత; పడకపోవన్= వశపడకుండా పోవటం; శివునకున్= శివుడికి కూడా; వశము+ఏ?= శక్యమా?

తాత్పర్యం: ఉన్న విషయ మేమంటే, చెప్పుతాను వినుము. జీవుడు తాను చేసిన కర్మవలననే పుట్టుక చావూ పొందుతున్నాడు. అదే సుఖ దుఃఖాలకూ కారణమౌతున్నది. తాను చేసిన కర్మను తప్పుకొనిపోవటం శివుడికి కూడా సాధ్యం కాదు'. (అంటే ఇక మనిషెంత?)

విశేషం: పద్యంలో నాల్గవ పాదం ఒక జాతీయం.

వ. అని చెప్పి. 35

తాత్పర్యం: ఈ విధంగా పలికి

క. 'కావున, నిందఱు, నుడుగుం డీ । వాదం' బనుడు, బోయ కిట్లను, ధరణీ
దేవాంగన దన యెఱుకయు । దేవాలాపములు నొక్క తెరువై యున్నన్. 36

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఇందఱున్= మీరంతా; ఈ వాదంబు= ఈ చర్చ; ఉడుగుండు= మానండి; అనుడున్= అనగా; ధరణీదేవ= భూసురుడి, బ్రాహ్మణుడి; అంగన= స్త్రీ (బ్రాహ్మణ స్త్రీ); తన ఎఱుకయున్= తన జ్ఞానం; దేవ=దేవుడి; ఆలాపములు= మాటలు; ఒక్క= ఒకే; తెరువై= విధంగా; ఉన్నన్= ఉండగా; బోయకున్= కిరాతుడితో, ఇట్లు+అనున్= ఈరీతిగా అన్నది.

తాత్పర్యం: 'కాబట్టి మీరంతా ఈ చర్చ మానండి' అనేటప్పటికి ఆ బ్రాహ్మణ స్త్రీ తన జ్ఞానం, యము డన్నమాట లొకే రకంగా ఉన్నందున బోయవాడితో ఇట్లనింది.

ఆ. ఇట్టి వనటఁ బొందునట్టి పాపము సేసి । వనిత లిట్ల యగుదు రనఘ! యివ్వి
ధంబు మరణ మొందఁ దగు కిల్బిషంబున । బాలు రిట్ల పోదు రేల కలఁగ.' 37

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; ఇట్టి= ఇట్లాంటి; వనటన్= దుఃఖమును; పొందునట్టి= పొందినటువంటి; పాపముచేసి= పాపం చేసి; వనితలు= స్త్రీలు; ఇట్ల అగుదురు= ఇట్లాగే ఔతారు; ఈ+విధంబు= ఈ పద్ధతి; మరణము= చావు; ఒందన్+తగు= పొందదగిన; కిల్బిషంబునన్= పాపాన; బాలురు= పిల్లలు; ఇట్లు+అ= ఇదే విధంగా; పోదురు= పోతారు; కలఁగన్= కలతపడటం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: పాపం లేనివాడా! అర్జునకా! ఇట్లాంటి దుఃఖం మన పాపంవలననే వస్తుంది. ఈ విధంగా పిల్లలు చచ్చిపోవటానికి వారి పాపకర్మే కారణం తప్ప ఎవరూ కారు'.

వ. అని వెండియు. 38

ప్రతిపదార్థం: అని; వెండియున్= మరల.

తాత్పర్యం: అని మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'సకల జనంబులుఁ గర్మము । నకు ననుగుణమైన తెరువునం బోదురు దీ
నికి రోష విషాదము లే । టికి విడువుము పాము, సంఘటింపుము శమమున్. 39

ప్రతిపదార్థం: సకలజనంబులు= జనులంతా; కర్మమునకున్= కర్మకు; అనుగుణంబు+ఐన= తగిన, తెరువునన్= బాటలో; పోదురు= పోతారు; దీనికిన్= దీనికొరకు; రోష= కోపం; విషాదము= దుఃఖం, ఏడ్పూ; దేనికి?= ఎందుకు?; పామున్= పామును; విడువుము= వదలిపెట్టుము; శమమున్= శాంతిని; సంఘటింపుము= పొందుము.

తాత్పర్యం: 'కర్మానుగుణంగానే మనుషులంతా ప్రవర్తిస్తారు. దీనికొరకు కోపం, ఏడ్పూ దేనికి? పామును వదలిపెట్టి శాంతిని పొందుము'.

క. అన విని తెలిసి విడిచె, న । ర్జునకుఁడు భుజగము, నపాస్తరోషుం డగుచుం
జని రెలమిఁ బొంది, కాలుం । డును, మృత్యువుఁ గావునను విడువు మీ వడలున్. 40

ప్రతిపదార్థం: అనన్= అని ఆమె చెప్పగా; విని= ఆలకించి; తెలిసి= విషయ మెరిగి; అర్జునకుఁడు= కిరాతుడు; అపాస్త= పోయిన; రోషుండు= కోపం కలవాడు; అగుచున్= అవుతూ; భుజగమున్= పామును; విడిచెన్= వదలిపెట్టాడు; కాలుండును= యముడును; మృత్యువున్= మృత్యుదేవత; ఎలమిన్= సంతోషం; పొంది= పొంది; చనిరి= వెళ్ళిపోయారు; కావునన్= కాబట్టి; ఈవున్= ధర్మరాజా! నీవు కూడా; అడలున్= దుఃఖాన్ని; విడువుము= విడిచిపెట్టుము.

తాత్పర్యం: అంతా విన్న తరువాత జ్ఞానోదయమైన కిరాతుడికి కోపం పోగా పామును వదలిపెట్టాడు. మృత్యువూ, కాలుడూ సంతోషంతో వెళ్ళిపోయారు. కాబట్టి ధర్మరాజా! నీవూ దుఃఖాన్ని పరిత్యజించుము'.

తే. కారు దుర్యోధనుఁడు నీవుఁ గారణములు । బాంధవుల రణ మరణ సంప్రాప్తి కనఘ!

వారు, దమతమ కర్మముల్ కారణములు । గాఁగ నిట్లయి; రేల శోకంబు నీకు ? 41

ప్రతిపదార్థం: అనఘా! దోషరహితుడవైన, ధర్మరాజా!; దుర్యోధనుఁడున్= సుయోధనుడుకానీ; నీవున్= నీవుకానీ; బాంధవుల= చుట్టాలయొక్క; రణ మరణ= యుద్ధంలోని చావులు; సంప్రాప్తికిన్= పొందటానికి; కారణములు= కారణాలు; కారు; తమ తమ= వారి వారి; కర్మముల్= కర్మలే; కారణములు= కారణాలు; కాఁగన్= అయినందున; ఇట్లు+అయిరి= ఈ విధంగా యుద్ధంలో మరణించినవారు అయ్యారు; నీకున్= నీకు; శోకంబు= దుఃఖం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: నాయనా ధర్మరాజా! యుద్ధంలో చుట్టాలంతా అట్లా మరణించటానికి కారణం వారి కర్మలే కాని నీవు కానీ, దుర్యోధనుడు కానీ కారణం కారు. కనుక దుఃఖం విడిచిపెట్టుము.

వ. గౌతమీ, లుబ్ధక, భుజంగ, మృత్యు, కాల, సంవాదం బను నియ్యితిహాసంబు తాత్పర్యంబు మనంబునం బట్టుకొలిపి, యా పుట్టిన కలంకం దొలంగ జడిసి శమంబున సుఖివి గ' మ్మనం, గౌంతేయాగ్రజుండు సంతసిల్లి శాంతనవునితో ని ట్లనియె. 42

ప్రతిపదార్థం: గౌతమీ= గౌతమి అనే ఆ బ్రాహ్మణస్త్రీ; లుబ్ధక= కిరాతుడు; భుజంగ= పాము; మృత్యు= మృత్యువు; కాల= కాలుడు అనువారి; సంవాదంబు= సంభాషణ; అను= అన్న; ఈ ఇతిహాసంబు= ఈ పురాణకథయొక్క; తాత్పర్యంబు= భావం, రహస్యం; మనంబునన్= మనస్సులో; పట్టుకొలిపి= నిలుపుకొని; ఆ పుట్టిన= నీకు కలిగిన ఆయొక్క; కలంకన్= కలతను; తొలంగన్ జడిసి= పోగొట్టుకొని; శమంబునన్= శాంతితో; సుఖివి కమ్ము= సుఖం పొందుము; అనినన్= అనగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ పుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; సంతసిల్లి= సంతోషించి, శాంతనవునితోన్= శంతనుడి కుమారుడైన భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ గౌతమి, మృత్యువు, కాలుడు, బోయ, పాము వీరి సంభాషణ రూపమైన పురాణకథ యొక్క భావాన్ని మనస్సులో పెట్టుకొని నీకు కలిగిన దుఃఖాన్ని తొలగించుకొని శాంతిని పొంది సుఖించుము' - అనగా ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఈ కథలో పాత్రలు అయిదుగురు. కథ సంభాషణ రూపంలో చెప్పబడింది. అది సంవాదం. ఇతిహాసమంటే పరంపరగా జనం చెప్పుకొనే పురాణకథ. ఈ కథ తాత్పర్య మిది - 'నీకు కలిగిన కష్టనష్టాలకు సుఖదుఃఖాలకు కారణం నీ కర్మతప్ప ఎవరూ కాదు'. ఈ దృష్టితో బ్రతకటమే భక్తి, జ్ఞానం. దీనివలననే శాంతి లభిస్తుంది. సంఘంలో ఘర్షణలు లోపించిపోతాయి. ఇది భారతీయ సంస్కృతి.

అగ్నిదేవుఁడు సుదర్శన యను కన్యకను వివాహంబు సేసికొనుట (సం.13-2-12)

చ. 'అనఘ! గృహస్థధర్మమునయందుఁ జరించి నరుండు మృత్యు సం
జనితభయంబు పాపికొనఁ జాలునొ చాలఁడొ?' యన్న నా సరి
త్తనయుఁడు 'దానికిం దగు విధంబు దిరం బగు నేనిఁ జాలు న
య్యను వొడగూడునట్టి యితిహాసము విన్ము నరేంద్ర! చెప్పెదన్. 43

ప్రతిపదార్థం: అనఘ!= (భీష్ముడికి సంబోధన) పాపం లేనివాడా!; నరుండు= మనిషి; గృహస్థ ధర్మమునఅందున్= గృహస్థాశ్రమ ధర్మంలో; చరించి= ప్రవర్తించి; మృత్యుసంజనిత= చావువలన పుట్టే; భయంబు= భయం; పాపికొనన్= పోగొట్టుకొనుటకు; చాలునొ?= సమర్థుడగునా?; చాలఁడొ?= సమర్థుడు కాడా!; అన్నన్= అని ప్రశ్నించగా; ఆ సరిత్+తనయుఁడు= ఆ (గంగా) నది కొడుకు భీష్ముడు; నర+ఇంద్ర!= ప్రజలను పాలించే రాజా!; దానికిన్+తగు విధంబు= దానికి తగిన పద్ధతి; తిరంబు=స్థిరం; అగున్+ఏని= అయితే; చాలున్= సమర్థమే; ఆ+అనువు= ఆ ఉపాయం; ఒడన్+కూడునట్టి= కలిగించే; ఇతిహాసము= పూర్వకథ; చెప్పెదన్= చెప్పుతాను; విన్ము= వినుము.

తాత్పర్యం: 'పుణ్యాత్ముడా! మనిషి గృహస్థాశ్రమంలో ఉండి మృత్యుభయం పోగొట్టుకొనగలడా?' అని ధర్మరాజు ప్రశ్నిస్తే తాతగారైన భీష్ముడు 'ధర్మానికి స్థిరంగా నిలబడగలిగితే ముక్తి పొందగలడు. దాని కొక కథ ఉన్నది చెప్పుతాను వినుము.

విశేషం: 1. పాపమంటే బ్రతుకులో ఎటువీలైతే అటు నడుస్తూ పోవటం. ధర్మానికి కట్టుబడి నడవటం పుణ్యం. 2. మృత్యువంటే చావు కాదు. ధర్మం, భగవంతుడు, ఆత్మవిచారం లేకుండా బ్రతికే వట్టి గొడ్డు బ్రతుకు. మామూలు జీవితం. 3. ఇతి+హ+అస్= ఇది ఇట్లా ఒకప్పుడు ఉన్నది. ఒకప్పుడు ఇట్లా జరిగిందని జన పరంపర చెప్పుకొనే ప్రాచీన కథ. కథ జరిగిందని చెప్పినా ఆ పద్ధతిగా జీవిస్తే ఇప్పటికీ జరుగుతుందని చెప్పేది. కనుక మూడు కాలాలకూ అన్వయించే కథ.

మ. మనువంశంబునఁ బుట్టి, సర్వజనతామందారమై నేలయె
ల్లను బాలించి, జగత్త్రయీప్రణుతలీలం బొల్చె దుర్యోధనుం
డను రా జవ్విభు నొప్పు నర్మదకుఁ గామావేశముం జేసినన్
వనితారూపము దాల్చి పొందె నతనిన్ వైదగ్ధ్య హృద్యంబుగన్. 44

ప్రతిపదార్థం: దుర్యోధనుండు= దుర్యోధనుడు; అనురాజు= అనే పేరు గల ఒకానొక రాజు (పూర్వం జరిగిన కథలో రాజు); మనువంశంబునన్= మనువుతో ప్రారంభమైన వంశంలో; పుట్టి= జన్మించి; సర్వజనతా= అందరు మనుషులకూ; మందారము+ఐ= కల్పవృక్షమై; నేల ఎల్లను= భూమినంతా; పాలించి= ఏలి; జగత్త్రయీ ప్రణుతలీలన్= మూడులోకాలచేత మిక్కిలి స్తుతించదగ్గ విధంగా; పొల్చెన్= ఒప్పారెను; ఆ+విభు= ఆ రాజుయొక్క; ఒప్పు= అందం (దేహసౌందర్యం, మనస్సౌందర్యం); నర్మదకున్= నర్మద అనే నదికి; కామ+ఆవేశమున్= ప్రేమోత్సాహం; చేసినన్= కలిగించగా; వనితారూపము= స్త్రీరూపం; తాల్చి= పొంది; వైదగ్ధ్య= నేర్పుతో; హృద్యంబుగన్= మదికి ఇంపుకాగా; అతనిన్= ఆ రాజును; పొందెన్= వివాహం చేసికొన్నది.

తాత్పర్యం: పూర్వం మనువంశంలో దుర్యోధను డనే రాజు పుట్టి ముల్లోకాలచేత మిక్కిలి స్తుతించబడేటట్లు పాలించాడు. అతడి అందాన్ని చూచి నర్మదానది ప్రేమావేశం పొంది స్త్రీరూపం ధరించి అతడిని పెండ్లి చేసుకొన్నది.

విశేషం: భారతంలో చాలాచోట్ల నదులు స్త్రీలై వచ్చి రాజులను పెండ్లి చేసుకొన్న కథలు చాలా ఉన్నాయి. ఈ కథ చెప్పే భీష్ముడే గంగకు శంతనుడికి పుట్టినవాడు కదా! ప్రపంచ ఇతిహాస వాఙ్మయంలో ఇట్లాంటి కథలు చాలా ఉన్నాయి.

తిక్కనగారు 'ఆంధ్రావళి మోదముం బొరయ' ఆంధ్రులంతా సంతోషించే విధంగా వ్రాస్తానన్నారు కనుక తెలుగు మాటలలోనే తన రచనను చేశాడనటానికి ప్రతిపద్యమూ ఉదాహరణమే - 'నేలయెల్లను' అననక్కరలేదు. భూమిలేదా రాజ్యమెల్లను అనవచ్చునుకదా! ఈ పద్యం ప్రారంభించటం, ముగించటం, యతి, ప్రాస అంతా చాలా గొప్పగా నిర్మించిన శిల్పమయమైన పద్యం.

ఇతిహాసాన్ని ఎట్లా చెప్పాలో ఆ పద్ధతి కిదొక నమూనా.

క. ఆ రమణికి నతనికిఁ గ । న్యారత్నం బుద్భవించె నమరపురంధ్రీ
శ్రీరామణీయకము ని । స్సారం బగునట్లు గాఁగ జగతీనాథా! 45

ప్రతిపదార్థం: జగతీ= లోకానికి, నాథా!= పాలకుడా!; ఆ రమణికిన్= ఆ నర్మదానదీదేవతకు; అమరపురంధ్రీ= దేవతా స్త్రీలయొక్క; శ్రీరామణీయకము= శోభావంతమైన అందం; నిస్సారంబు= సారంలేనిది; అగునట్లు= అయ్యేటట్లు; కాఁగన్= కాగా; కన్యారత్నంబు= శ్రేష్ఠురాలైన కూతురు; ఉద్భవించెన్= పుట్టింది.

తాత్పర్యం: అందమైన ఆ నర్మదకూ ఆ రాజుకూ దేవతాస్త్రీల అందాలను తిరస్కరించగలిగేటటువంటి అందమైన కూతురు పుట్టింది.

విశేషం: ముందుకథలో అగ్నిదేవు డీమె అందం చూచి పెండ్లి చేసికోబోతున్నాడు కనుక దేవతాస్త్రీల అందాలను తలదన్నే అందం కల రత్నంవంటి కూతు రన్నాడు కవి. దానికొరకే ఆ సమాసం. మహాకవి దీర్ఘసమాసం వాడితే ఇట్లా విశేషార్థాలు భావించాలి.

వ. విను! దానికిఁ బేరు సుద । ర్శన, యన్నరనాయకుండు సంప్రీతి మెయిం
బెనిచి, తన యగ్నిహోత్రం । బున పరిచర్యలకుఁ బనిచె బుజ్జవ మొప్పన్. 46

ప్రతిపదార్థం: విను= వినుము; దానికిన్= ఆ కూతురుకు; పేరు; సుదర్శన= అందమైన రూపం కలది; ఆ+నరనాయకుండు= ప్రజాపాలకుడు; సంప్రీతిమెయిన్= మిక్కిలి ప్రేమతో; పెనిచి= పెంచి; అగ్నిహోత్రంబున= అగ్నిని పూజించేశాలలో; పరిచర్యలకున్= సేవలకు; బుజ్జవము= లాలన, వాత్సల్యం; ఒప్పన్= ప్రకాశించగా, స్పష్టపడగా; పనిచెన్= నియోగించాడు.

తాత్పర్యం: ఆ కన్యకు సుదర్శన అని పేరు పెట్టి, ప్రేమతో పెంచి, తండ్రి తన అగ్నిశాలలో అగ్ని పరిచర్యల నిమిత్తం ఆమెను నియోగించాడు.

విశేషం: సుదర్శన అనే పేరు నాటి స్త్రీలకు పెట్టుకొనే రివాజుండేది. క్రీ.పూ. నిర్మించిన భారత్ బౌద్ధస్తూపం మీద సుదర్శన అనే యక్షిణి బొమ్మ ఉన్నది. కనుక అందమైన స్త్రీకి ఆ పేరు పెట్టే ఆచారముండేది.

వ. పనిచిన నప్పాలంతి యప్పనులవెంట మెలంగుచుండె; నట్టియెడ. 47

ప్రతిపదార్థం: పనిచినన్= నియోగించగా; ఆ+పాలంతి= ఆ స్త్రీ; ఆ+పనులవెంటన్= ఆ పనుల ననుసరించి; మెలంగుచున్+ఉండెన్= మెలగుతున్నది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: తండ్రి ఆ విధంగా నియోగించగా ఆమె ఆయా పనులను తప్పక చేస్తూ ఉన్న సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. అర్చించునప్పు డయ్యంగన కెంగేలి । జిగిసొంపు, చిత్తంబు దిగిచి కొనఁగ,
నరసి కన్గొనునప్పు డయ్యింతి కనుఁగవ । పొలపంబు రాగంబు వొదలఁజేయ,

నన్యులఁ బని పంచునప్పు డమ్ముద్దియ । పలుకుల తీపు గోర్కులఁ గెరల్ప

నల్లన యూఁదెడు నప్పు డక్కొమ్మ వా ।తెఱతావి ధైర్యంబు ద్రిప్పుకొలుప.

తే. మరుఁడు దోడ్తోడఁ దేఁకువ మాలి కదిసి । తూపుగముల క్రొవ్వాఁడిమి సూప నంత

కంత కగ్గల మగు వలవంతఁ దూలి । పోయెఁ బావకుఁ; డేమి సెప్పుదు నరేంద్ర! 48

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా!; పావకుఁడు= అగ్ని; అర్చించునప్పుడు= పూజించేవేళ; ఆ+అంగన= ఆ స్త్రీ యొక్క; కెంగేలి- కెంపు+కేలి= ఎర్రని చేయియొక్క; జిగి= కాంతి; సొంపు= అందం; చిత్తంబు= మనస్సును; తిగిచికొనఁగన్=లాగగా, ఆకర్షించగా; అరసి= నిగాతో, ఏకాగ్రంగా; కన్గొనునప్పుడు= చూస్తున్న సమయంలో; ఆ+ఇంతి= ఆ స్త్రీ యొక్క; కనుఁగవ= కన్నులజంట; పొలపంబు= అందం; రాగంబు= ప్రేమను; పొదలన్+చేయన్= పెంపొందించగా; అన్యులన్= ఇతరులను; పనిన్= ఆయా పనులకు; పంచునప్పుడు= పంపేవేళ; ఆ+ముద్దియ= ఆ ముద్దులాడి (తియ్యగా మాట్లాడేది); పలుకుల= మాటల; తీపు= తియ్యదనం; కోర్కులన్= కోర్కెలను; వాంఛలను; కెరల్పన్= రెచ్చగొట్టగా; అల్లన= నెమ్మదిగా; ఊఁదెడునప్పుడు= (మండించే ప్రయత్నం చేసేవేళ) ఊదేవేళ; ఆ+కొమ్మ= ఆ స్త్రీ, ఆ యౌవనవతి యొక్క; వాతెఱ= పెదవి; తావి= వాసన; ధైర్యంబు= గుండె నిబ్బరాన్ని; త్రిప్పుకొలుపన్= కలతపెట్టగా; మరుఁడు= మరులు కొల్పేవాడు; మన్మథుడు; తోడ్తోడన్= వెన్వెంటనే; తేఁకువ= ధైర్యం; మాలి= కోల్పోయి; కదిసి= సమీపించి; తూపు= అమ్ముల (బాణాల); గములన్= సమూహంతో; క్రొత్త+వాఁడిమి= క్రొత్తపదును; చూపన్= చూపగా; అంతకంతకున్= క్రమక్రమంగా; అగ్గలము+అగు= ఎక్కువయైన; వలపువంతన్= మన్మథబాధతో - విరహంతో; తూలిపోయెన్= ధైర్యం కోల్పోయాడు; ఏమిచెప్పుదున్?= ఇంకేమి చెప్పేది?

తాత్పర్యం: ఏమి చెప్పేది? చిత్రంగా అగ్నిదేవుడు కూడా ఆమెపట్ల ఆకర్షితుడై క్రమంగా ఆమెయందు అనురక్తుడయ్యాడు. తనను పూజించేటప్పుడు ఆ సుదర్శన ఎర్రని వ్రేళ్ళ కాంతికి అతడి మనస్సు ఆకర్షించబడింది. పరిచర్య చేస్తూ ఆమె ఏకాగ్రంగా చూచేటప్పుడు కళ్ళ అందం ప్రేమను గిల కొట్టింది. ఇతరులను ఆయా పనులకు పురమాయించేటప్పుడు ఆ ముద్దులాడి తీపిమాట లాయనలో కోర్కెలను రెచ్చగొట్టేవి. నెమ్మదిగా పొయ్యిని ఊదేటప్పుడు ఆమె పెదవి వాసన అతడి ధైర్యాన్ని తూలిపోయేటట్లు చేసేది. దీనితోపాటుగా మరుడు భయం వీడి, అగ్నిని సమీపించి, తన పంచబాణాల పదను చూపించగా క్షణక్షణానికి విరహవేదన ఎక్కువ కాగా అగ్ని ధైర్యాన్ని పోగొట్టుకొన్నాడు.

విశేషం: ఈ నేపథ్యంలో శృంగార రసవర్ణన చాలా మృదువుగా, నాగరికంగా చేయబడింది. నాయికావర్ణనలో ఎక్కడా ఔచిత్యం కోల్పోలేదు. వ్రేళ్ళు, కళ్ళు, మాటా, వాతెఱతావీ ఇవే చెప్పిన అవయవాలు. ఇది తిక్కనగారు ప్రదర్శించిన ఔచిత్యం. ఈ పద్యం కవి చేసిన వర్ణన.

వ. ఇట్లు మదనాగ్ని నుదిలకొని యగ్నిదేవుం డక్కాంతతో నేకాంతంబున నిట్లనియె. 49

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మదన+అగ్నిన్= మన్మథతాపంతో; ఉదిలకొని= చలించిపోయి; అగ్నిదేవుండు; ఆ+కాంతతోన్= ఆ అందమైన స్త్రీతో; ఏకాంతంబునన్= ఒంటరిగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అగ్నిదేవుడు మదనాగ్ని ప్రభావంతో చలించిపోయి ఆ స్త్రీతో ఒంటరిగా ఈ విధంగా పలికాడు.

సీ. 'చిగురుటాకుల గాసి సేయు నీ యడుగుల । చెలువంబు సూడ్కులఁ జేర్చికొనియె,
మారేడు పండుల గారాము సెఱుచు నీ । యెలచన్నుఁగవ వేడుకలఁ బొనర్చె
నునుఁదీవఁ జీరికిఁ గొనని నీ మైఁదీవ । మురిపంబు డెందంబు మరులుకొలిపె,
నెఱచందురుని సిగ్గువఱుపంగఁ జాలు నీ । నెమ్మోము దాలిమి వమ్ముసేసె.

తే. నాతి నీకునై పెక్కుబన్నములు వడితి । నంగజునిచేత; వల్లభ వగుము, నాకు'
నావుడును సిగ్గు గదిరి, యాననము వాంచి । యలఁతి యెలుఁగున నిట్లను నా లతాంగి. **50**

ప్రతిపదార్థం: నాతి!= ఓ అమ్మాయి!; చిగురు+ఆకుల= లేత ఆకుల; గాసిచేయు= బాధించే (తిరస్కరించే); నీ+అడుగుల= నీ పాదాల; చెలువంబు= అందం; చూడ్కులన్= చూపులను; చేర్చికొనియెన్= తమలో లీనం చేసికొన్నాయి; మారేడుపండుల= మారేడుపండ్ల యొక్క; గారాము= గోము, ముగ్ధసౌందర్యం; చెఱుచు= చెడగొట్టు; నీ; ఎల= లేత; చన్నుఁగవ= చనులజంట; వేడుకలన్= పండుగలను, ఉత్సవాలను; పొనర్చెన్= చేసింది; నును+తీవన్= లేతతీగను; చీరికిన్= లెక్కకు; కొనని= గ్రహించని (లెక్కచేయని); నీ; మై= శరీరమన్న; తీవ= తీగయొక్క; మురిపంబు= సౌకుమార్యం; డెందంబున్= మనస్సును; మరులు కొలిపెన్= మోహింపజేసింది; నెఱ= నిండు; చందురుని= జాబిల్లిని; సిగ్గుపఱుపంగన్+చాలు= సిగ్గులపాలు చేసే; నీ; నెఱ+మోము= అందమైన ముఖం, తాలిమిన్= నా ధైర్యాన్ని; వమ్ము చేసెన్= నాశనం చేసింది; నీకునై= నీ కోసమై; అంగజుని చేతన్= మన్మథుడి చేత; పెక్కు= అనేకమైన; బన్నములు= కష్టాలు; పడితిన్= పడ్డాను; నాకున్= నాకు; వల్లభవు= భార్యవు; అగుము= కమ్ము; నావుడును= అనగా; ఆ+లతాంగి= తీగవంటి శరీరం కల ఆ సుదర్శన; సిగ్గు కదిరి= లజ్జ తొణికిసలాడగా; ఆననము వాంచి= తలను వంచుకొని; అలఁతి= సన్నని; ఎలుఁగునన్= స్వరంతో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: 'సుదర్శనా! చిగురాకులను తృణీకరించే నీ పాదాల సొగసు నా చూపులను తనలో లీనం చేసికొన్నది. మారేడుపండ్ల అందాన్ని కాదనే నీ చనులజంట నాకు నేత్రోత్సవాన్ని కల్పించింది. లేత తీగలను కాలదన్నే నీ శరీరమన్న తీగ నాకు మరుల తీగైనది (అడవిలో ఉండే ఈ తీగను త్రొక్కిన బాటసారులు దారి తప్పిపోతారట). నిండు జాబిల్లిని సిగ్గుపరిచే నీ గుండ్రని ముఖం నా గుండె దిటవును కూల్చివేసింది. ఇవి నాకు మన్మథుడు పెట్టిన బాధలు. కనుక నాకు రాణివి కమ్ము' అని అనగా, విని ఆమె ముఖం కొంచెం వంగి సిగ్గుతో సన్నని గొంతుతో ఇట్లా అన్నది.

విశేషం: ఇందులో వర్ణించబడిన అవయవాలు, పాదాలు, చనుగవ, శరీరం, ముఖం, క్రిందినుండి పైకి వర్ణించబడ్డాయి. పై పద్యంలో చెప్పిన అవయవాలు వేరు. ఆమె ముఖం వాల్చటం, అలతి యెలుఁగు - ఇవన్నీ ఆమె కన్యాత్వాన్ని స్థాపించే మాటలు. అగ్ని ఔచిత్యం మరిచిపోకుండా తన ప్రేమను నాజూకుగా తెలియచేశాడు.

క. 'కులకన్యకలకు వేడుకఁ । దలవీడులఁ బరులతోడి తగుమాటలకుం
దలకొనఁ దగునే? గురుజన । ముల కా కత్తెఱఁగువారు పురుషార్థనిధీ!' **51**

ప్రతిపదార్థం: పురుష+అర్థ= ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు; నిధీ!= స్థానమైనవాడా! పురుషార్థాలను ఇచ్చేవాడా!; కులకన్యకలకున్= ఉత్తమకులంలో పుట్టిన కన్యలకు (లోకం తెలియని అమాయికలకు); వేడుకన్= కోర్కెతో; తలవీడులన్= సమీప ప్రదేశంలో;

పరులతోడి= ఇతరులతో, పరపురుషులతో; తగుమాటలకున్= వయస్సుకు తగినమాటలకు; తలకొనన్= పూనుకొన; తగునే?= తగునా? - తగదు; ఆ+తెఱఁగువారు= ఆ విధంగా మాట్లాడదగినవారు; గురుజనముల కాక= పెద్దలే అగుదురు.

తాత్పర్యం: 'పురుషార్థప్రదాతవు నీవు. కులకన్యలు తలవాకిట్లో బయటివారితో ఇష్టానుసారంగా మాట్లాడుతారా? అట్లా మాట్లాడతగినవారు పెద్దలే కదా!

వ. అనిన విని హుతవహుం 'డట్లకాక' యనియె; నా సమయంబున. 52

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; హుతవహుండు= వేల్చినవాటిని మోసికొనిపోయి దేవతలకిచ్చేవాడు- అగ్ని; అట్ల కాక= సరేలే, అట్లాగే; అనియెన్= అన్నాడు; ఆ సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: సుదర్శన ఆ విధంగా అనగా అగ్ని విని సరే అన్నాడు. ఆ తరువాత.

ఉ. ఆ నరనాయకుం డొక మహాధ్వర మెంతయుఁ వేడ్కఁ జేయఁగాఁ
బూని, మహీసురావళికిఁ బూజ లొనర్పఁగఁ దాను బ్రాహ్మణుం
డై నయ మారఁగా ననలుఁ డాతని పాలికి వచ్చి 'నాకు నీ
వే నృప! నీదుపుత్రిఁ గృప యేర్పడ దానము గాఁగ' నావుడున్. 53

ప్రతిపదార్థం: ఆ+నరనాయకుండు= ఆ ప్రజలను పాలించే రాజు (దుర్యోధనుడు); ఒక= ఒకానొక; మహా=గొప్ప; అధ్వరము= యజ్ఞం; ఎంతయున్= ఎంతో; వేడ్కన్= కోర్కెతో; చేయఁగాన్= చేయటానికి; పూని= పూనుకొని; మహీసుర= భూదేవతల (బ్రాహ్మణుల); ఆవళికిన్= సమూహానికి; పూజలు= అర్చనలు; ఒనర్పఁగన్= చేయగా; తాను= తానుగా వచ్చి; అనలుఁడు= అగ్ని; బ్రాహ్మణుండు+ఐ= బ్రాహ్మణవేషాన్ని ధరించినవాడై; అతనిపాలికిన్= అతడి వద్దకు; వచ్చి= వచ్చి; నయము= ప్రేమ; అరఁగాన్= నిండగా; నృప!= రాజా!; నాకున్= నాకు; నీదు= నీయొక్క; పుత్రిన్= కుమార్తెను; దానముకాగన్= దానంగా; కృప= దయ; ఏర్పడన్= స్పష్టంకాగా; ఈవే?= ఈయవయ్యా!

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు ఒక మహాయజ్ఞం చేయాలని తలపెట్టి, బ్రాహ్మణుల కనేక దానాలు చేస్తూ ఉండగా, అగ్నికూడా వాళ్ళల్లో ఒక బ్రాహ్మణుడై వచ్చి రాజును అతడి కూతురును తనకు దానం చేయుమని అర్థించాడు.

వ. అ వ్విభుండు. 54

ప్రతిపదార్థం: ఆ+విభుండు= ఆ రాజు

తాత్పర్యం: ఆ రాజు

తే. 'అన్యవర్ణుండు, దీనుఁ డీయనకు నెట్లు । గూఁతు నీవచ్చు?' నని మదిఁ గుత్స పుట్టి,
యీఁడ ప్రార్థన మఫల మై యేఁగి యజ్ఞ । సమయమున నగ్ని తనమూర్తి సంహరించె. 55

ప్రతిపదార్థం: అన్యవర్ణుండు= ఇతర కులంవాడు (క్షత్రియుడు కానివాడు); దీనుఁడు= పేదవాడు; ఈయనకున్= ఇతడికి; ఎట్లు= ఏ విధంగా; కూఁతున్= కుమార్తెను; ఈవచ్చున్= ఇయ్యవచ్చును; అని; మదిన్= మనస్సులో; కుత్స= అసహ్యం; పుట్టి=

జనించి; ఈడు+అ= ఇవ్వడు కదా!; అగ్ని= అగ్నిదేవుడు; ప్రార్థనము= తన అభ్యర్థన, వేడుకోలు; అఫలము+ఐ= ఫలించకపోగా; ఏఁగి= పోయి; యజ్ఞసమయమునన్= యజ్ఞం చేసేవేళ; తనమూర్తిన్= తన తేజస్సును; సంహరించెన్= కన్పించకుండా చేశాడు.

తాత్పర్యం: రాజు ఇట్లా తనలో తా ననుకొన్నాడు. 'ఇతడు వేరే కులంవాడు. పైగా పేదవాడు. ఇతడికెట్లా కూతురు నివ్వగలను?' అని మనస్సులో అనుకొని ఇవ్వలేకపోయాడు. అగ్ని తన ప్రార్థన ఫలవంతం కాకపోగా, వెళ్ళి యజ్ఞ సమయంలో తన తేజస్సును ఉపసంహరింపజేశాడు. (అగ్ని మండలేదు)

క. కని యజ్జనపతి ఋత్విజు । లును, దానును, వెఱఁగుపడి, 'విలోపము వాటి
ల్లెనొకో! కర్మగతుల' నని । మనమున నూహించి, భవ్యమంత్రముఖరులై. 56

ప్రతిపదార్థం: ఆ+జనపతి= ఆ ప్రజాపాలకుడు, రాజు; కని=చూచి; ఋత్విజులును= పురోహితులును; తానును= తానూ; వెఱఁగుపడి= విస్తుపోయి; కర్మగతులన్= యజ్ఞవిధులలో; విలోపము= పెద్దలోపం; వాటిల్లెన్+ఒకో!= ఏర్పడినదా!; అని; మనమునన్= మనస్సులో; ఊహించి= ఆలోచించి; భవ్య= శ్రేష్ఠమైన; మంత్ర= మంత్రాలను; ముఖరులై= ఉచ్చరిస్తూ.

తాత్పర్యం: రాజూ, పురోహితులూ చూచి విస్తుపోయారు. ఇదేమిటి అగ్ని మండటంలేదని, కర్మలోపంవలన ఇట్లా జరిగి ఉంటుందని భావించి, ఇంకా గొప్ప మంత్రాలను ఉచ్చరిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం)

వ. పావకునిం బ్రస్తుతించుచుండ నద్దేవుం డా భూదేవతలకు నల్లన తనతెఱం గెఱింగించిన. 57

ప్రతిపదార్థం: పావకునిన్= అగ్నిని; ప్రస్తుతించుచున్+ఉండన్= పొగడుతుండగా; ఆ+దేవుండు= ఆ అగ్నిదేవుడు; ఆ భూదేవతలకున్= ఆ పురోహిత బ్రాహ్మణులకు; అల్లన= నెమ్మదిగా; తన తెఱంగు= తన విషయం; ఎఱింగించినన్= తెలుపగా.

తాత్పర్యం: భవ్యమంత్రాలతో స్తుతిస్తుండగా ఆ అగ్ని వారితో తన విషయం చెప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. వార లాన్నృపుతోఁ జెప్ప, గారవంబు । సంతసముఁ దలకొనఁగ నయ్యింతిఁ బెండ్లి
సేసె, విప్రకుమారుఁ డై చెన్ను మెఱసి । యగ్ని వరియించె నచ్చెరువంద జనులు. 58

ప్రతిపదార్థం: వారలు= ఋత్విజులు; ఆ నృపుతోన్= ఆ రాజుతో; చెప్పన్= చెప్పగా; గారవంబు= గౌరవం; సంతసమున్= సంతోషం; తలకొనఁగన్= కలుగగా; ఆ+ఇంతిన్ పెండ్లి చేసెన్= తన పుత్రికా వివాహం జరిపించాడు; అగ్ని; విప్రకుమారుఁడు+ఐ= బ్రాహ్మణపుత్రుడై; చెన్ను= అందం; మెఱసి= ప్రకాశించగా; జనులు= ప్రజలు; అచ్చెరువందన్= ఆశ్చర్యపడగా; వరియించెన్= పెండ్లాడాడు.

తాత్పర్యం: ఆ పురోహితులు అగ్ని కోర్కెను రాజుతో చెప్పగా అతడు గౌరవంతో, సంతోషంతో కుమార్తె పెండ్లి చేశాడు. అగ్ని అందమైన బ్రాహ్మణ కుమారుడై ఆమెను వరించాడు. ఇది చూచి ప్రజలు ఆశ్చర్యపడ్డారు.

వ. ఇట్లు సుదర్శనా వివాహోత్సవం బనుభవించి విభావసుండు విభాప్రభాసమానుం డగుచు హుతంబులు
పరిగ్రహింప దుర్యోధను యాగంబును సుప్రయోగం బై చెల్లెఁ; బదంపడి. 59

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సుదర్శనా వివాహ+ఉత్సవంబు= సుదర్శన పెండ్లివేడుక; అనుభవించి= పొంది; విభావసుండు= అగ్ని; విభా= కాంతితో; ప్రభాసమానుండు+అగుచున్= వెలుగొందుతూ; హుతంబులు= యజ్ఞంలో వేల్చబడిన ద్రవ్యాలను; పరిగ్రహింపన్= స్వీకరించగా; దుర్యోధను యాగంబును= రాజు యజ్ఞం కూడా; సుప్రయోగంబు+ఐ= చక్కగా నెరవేర్చబడినదై; చెల్లెన్= సమాప్తమయింది; పదంపడి= తర్వాత.

తాత్పర్యం: ఈ విధంగా తాను కోరిన సుదర్శన పెండ్లివేడుక లనుభవించి ఆనందంతో ఉపసంహరించుకొన్న రూపాన్ని ఉజ్జ్వలంగా ప్రకాశింపచేసి అగ్నిదేవుడు దుర్యోధనుడి యజ్ఞ పరిసమాప్తిని చేయించాడు. తరువాత.

విశేషం: 'విభావసుండు విభాప్రభాసమానుండై' - సామాన్యంగా తిక్కనగారు ఇటువంటి సమాసాలు వాడడు. ఇక్కడ పెండ్లికొడుకు ఆనందాన్ని చెప్పటానికి వాడాడు. ఇది ఆయన రచనాశిల్పం.

క. అనలునకు సుదర్శనకును । జనియించె నుదాత్తగుణవిశాలుండు, సుద
ర్శననామధేయుఁ డాన్నృపుఁ । డనూనధర్మమునఁ దాల్చె నవనీభరమున్. **60**

ప్రతిపదార్థం: అనలునకున్= అగ్నికి; సుదర్శనకును= ఆ పేరుకల అగ్ని భార్యకు; ఉదాత్తగుణవిశాలుండు= ఉన్నతగుణాలతో పేరుపడ్డవాడు (విశాలబుద్ధి); సుదర్శన నామధేయుఁడు= (తల్లిపేరే కుమారునకు పెట్టారన్నమాట) సుదర్శనుడన్న పేరుకలవాడు; జనియించెన్= పుట్టాడు; ఆ నృపుఁడు= ఆ రాజు; అవనీభరమున్= భూభారాన్ని; అనూన= గొప్ప; ధర్మమునన్= ధర్మంతో; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: భార్యాభర్తలకు గొప్ప గుణాలు కల కొడుకు పుట్టాడు. అతడికి సుదర్శనుడు అని తల్లిపేరే పెట్టారు. అతడు పెద్దవాడై రాజ్యభారాన్ని ధర్మదృష్టితో మోయటం మొదలుపెట్టాడు.

విశేషం: తల్లిపేరు పెట్టడం అతి ప్రాచీన సమాజపు అలవాటు.

వ. ఆ సమయంబున. **61**

తాత్పర్యం: ఆ వేళలో.

ఆ. అతని కోఘవంతుఁ డనువాఁడు జనియించె । నుదితయశుఁడు; వాని కోఘరథుఁడు,
నోఘవతియు ననఁగ నుదయించి; రయ్యోఘ । వతికి నా విభుండు వరుని నరసి. **62**

ప్రతిపదార్థం: అతనికిన్= సుదర్శనునకు; ఉదితయశుఁడు= కీర్తిశాలి; ఓఘవంతుఁడు= ఓఘవంతుడనే పేరుకలవాడు; అనువాఁడు; జనియించెన్= పుట్టాడు; వానికిన్= ఆ ఓఘవంతుడికి; ఓఘరథుడు, ఓఘవతియున్; అనఁగన్= అన్న పేర్లుకల కొడుకు, కూతురు; ఉదయించిరి= జన్మించారు; ఆ+ఓఘవతికిన్= ఆ కుమార్తెకు; ఆ విభుండు= ఆ రాజు; వరునిన్= పెండ్లి కుమారుడిని; అరసి= వెదకి.

తాత్పర్యం: ఆ సుదర్శనునకు ఓఘవంతుడు, ఇతడికి ఓఘరథుడు, ఓఘవతి జన్మిస్తే ఆ తండ్రి కుమార్తెకు వరుడిని వెదకుతుండగా. (ఈ పేర్లన్నీ నదీ ప్రవాహమన్న అర్థాన్నిచ్చేవే. తల్లి తల్లి నర్మదానది కనుక మాతృవంశాన్ని సూచించే నామాలే వారు ధరిస్తూ వచ్చారన్నమాట.)

వ. ఒరుల మెచ్చక. **63**

తాత్పర్యం: ఇతరులను అంగీకరించక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఆ లేమ సుదర్శనునకు । నాలింగా నిచ్చె, నద్దహననందనుఁడున్
లోలతఁ గైకొని, పరిణయ । కేలి నడపి, విమలబుద్ధిఁ గృతనిశ్చయుఁడై. **64**

ప్రతిపదార్థం: ఆ లేమన్= ఆ కన్యను; సుదర్శనునకున్= తాతగారైన అగ్నికొడుకునకు; ఆలిన్+కాన్= భార్యగా; ఇచ్చెన్= ఇచ్చెను; ఆ+దహన నందనుఁడున్= అగ్నికొడుకును; లోలతన్= ఆసక్తితో; కైకొని= గ్రహించి; పరిణయకేళిన్= వివాహోత్సవమును; నడపి= చేసి; విమలబుద్ధిన్= స్వచ్ఛమైన బుద్ధితో; కృత= చేయబడిన; నిశ్చయుఁడు+ఐ= నిశ్చయం కలవాడై.

తాత్పర్యం: తండ్రి ఓఘవతిని సుదర్శనుడికిచ్చి పెండ్లి చేశాడు. ఆ అగ్నికొడుకు ఆమెను ప్రేమతో వివాహం చేసికొని స్వచ్ఛమైన మనస్సుతో ఒక నిశ్చయానికి వచ్చాడు.

విశేషం: తాత మనుమరాలిని పెండ్లి చేసుకొనే ఆచారం ఉండేది. దానినిబట్టి ఇది జరిగింది.

వ. 'గృహస్థ ధర్మానుష్ఠానంబునన మృత్యువు జయింతు' నని ప్రతిజ్ఞ చేసి యోఘవతియునుం దానును గురు క్షేత్రంబునకుం జని, యందు రమణీయ ప్రదేశంబున విశాలమగు పర్ణశాల కావించుకొనియుండె; నట్టియెడ న య్యెలనాగతో నతం డిట్లనియె. **65**

ప్రతిపదార్థం: గృహస్థధర్మ+అనుష్ఠానంబునన్= గృహస్థుడి ధర్మాలను అనుసరించటంవలననే; మృత్యువున్ జయింతును= ముక్తి నొందుతాను; అని= ఆలోచించి; ప్రతిజ్ఞచేసి= ప్రతినపూని; ఓఘవతియునున్+తానును= భార్యతోపాటుగా తానూ, కురుక్షేత్రంబునకున్= ఆ పేరుగల పుణ్యప్రదేశానికి; చని= పోయి; అందున్= అక్కడ; రమణీయ= చక్కని; ప్రదేశంబునన్= స్థలంలో; విశాలము+అగు= పెద్ద; పర్ణశాల=పూరిగుడిసె (ఆకులతో కప్పిన చిన్ని గుడిసె); కావించుకొని= నిర్మించుకొని; ఉండెన్= ఉన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+ఎలనాగతోన్= ఆ స్త్రీతో (భార్యతో) అతండు= భర్త; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'గృహస్థాశ్రమధర్మాన్ని పాటిస్తూ మృత్యువును జయిస్తాను' అని శపథంచేసి ఓఘవతీ తానూ కలిసి కురుక్షేత్రానికి వెళ్ళి, అందు అందమైన ప్రదేశంలో విశాలమైన పర్ణశాలను కట్టుకొని ఉన్నాడు. ఆ సమయంలో అతడు భార్యతో ఇట్లా అన్నాడు.

విశేషం: గృహస్థుడై ఉంటూనే మోక్షం పొందవచ్చును. ఒక్క సన్న్యాసమే కాదు ముక్తిమార్గ మనటానికి చెప్పిన కథ కనుక ఆ విషయ మిక్కడ స్పష్టం చేస్తున్నాడు కవి. మృత్యువు, అమృతము అనే రెండు మాటలు; ఈ లోకం, పరలోక మన్న అర్థాలలో వైదిక వాఙ్మయంలో వాడబడినవి. అంతేకాని చావు అని కాదు. ఇది ప్రతి జీవికీ తప్పదు కనుక. కురుక్షేత్రం ధర్మక్షేత్రమని గీత వర్ణిస్తుంది. కనుక అది తపోయోగ్యమైన ప్రదేశమని భారతంలో చాలాచోట్ల దీని ప్రసక్తి వస్తుంది.

తే. 'అతిథిఁ బూజించువేడ్క, నాకగ్గలంబు । వెలఁది । నీవును, ననుకూలవృత్తిఁ దాల్చి
సొలయ కప్పని నడపఁగా వలయుఁబూని । యే నిచట నున్న యప్పుడు, లేనియపుడు. **66**

ప్రతిపదార్థం: నాకున్= నాకు; అతిథిన్= అతిథిని; పూజించు= అర్చించే; వేడ్క= కోరిక; అగ్గలంబు= ఎక్కువ; వెలఁది!= గృహిణీ! (స్త్రీ); నీవును= నీవు కూడా; అనుకూలవృత్తిన్= నాకు అనుకూలమైన ప్రవర్తనను; తాల్చి= వహించి; సొలయక= విసుగు కొనక; ఆ+పనిన్= ఆ అతిథి పూజా కార్యమును; ఏను= నేను; ఇచటన్= ఇక్కడ - పర్ణశాలలో; ఉన్న అప్పుడు= ఉన్నప్పుడు; లేనిఅపుడు= లేనప్పుడు; పూని= ఎట్లాగైనా సరే, ప్రయత్నంతో; నడపఁగాన్వలయున్= జరిగేటట్లు చూడాలి.

తాత్పర్యం: 'ఇల్లాలా! నాకు అతిథి పూజ చాలా ఇష్టం. కనుక నే నింట్లో ఉన్నా లేకున్నా నీవు నా కనుకూలంగా ఆ కార్యం జరిగేటట్లు చూడాలి.

విశేషం: గృహస్థాశ్రమంలో స్వార్థముంటుంది కనుక దానిని జయించటానికి అతిథిపూజ ఒక పూజ. అదే తపస్సు. పేదలను ఆదరించటం - వారూ తనవంటి వారేనని ధర్మదృష్టితో పూజించటం ప్రతికావ్యమూ వర్ణించింది. ఈనాటి సమాజంలో దీనికి చాలా ప్రాశస్త్యమున్నది. కావ్యం ధర్మబోధ చేస్తుందనటాని కిదొక ఉదాహరణ.

క. అతిథిజనులు దమతమ వాం । ఛితము లనుభవించునట్లు సేయం గనినం
గృతకృత్యతఁ బొందరె? గృహ । పతియును గృహిణియును ధర్మభారమువలనన్. 67

ప్రతిపదార్థం: అతిథిజనులు= చెప్పా పెట్టకుండా తిథివారనక్షత్రాలతో పనిలేకుండా వచ్చేవారు; తమ తమ వాంఛితములు= తమతమ కోరికలు; అనుభవించునట్లు చేయన్+కనినన్= అనుభవించేటట్లు చేయగలిగితే; గృహపతియును= యజమానుడు; గృహిణియును= యజమానురాలునూ; ధర్మభారమువలనన్= ధర్మమును మోయటంవలన; కృతకృత్యతన్= చరితార్థతను; పొందరె!= పొందరా? తప్పక పొందగలరు.

తాత్పర్యం: అతిథులు ఎవరి ఇంట్లో తమ కోరికల నెల్ల తీర్చుకొనటానికి వీలు కల్పించబడుతుందో ఆ ఇంటి యజమానుడు; యజమానురాలు ఆ ధర్మాచరణవలన కృతార్థు లౌతారు.

క. అతిథి నినుఁగోరెనేనియు । మతిఁ గింకిరి పడక, యోలమాస గొనక, నీ
వతనికిఁ బ్రియంబు సల్పుము । సతికిం బతిపనుపు సేయఁ జను నెల్లదియున్. 68

ప్రతిపదార్థం: అతిథి= ఆ వచ్చినవాడు; నినున్= నిన్ను; కోరెనేనియున్= కోరుకొన్నా; మతిన్= మనస్సులో; కింకిరిపడక= అసహ్యించుకొనక; ఓలమాసగొనక= చాటున దాగుకొనకుండా; నీవు= నీవు; అతనికిన్= అతిథికి; ప్రియంబు= ఇష్టం; సల్పుము=చేయుము; సతికిన్= భార్యకు; పతిపనుపు= భర్త ఆజ్ఞ; ఎల్లదియున్= ప్రతిదీ; చేయన్చనున్= విధిగా చేయాలి.

తాత్పర్యం: అతిథి నిన్ను కోరినా మనస్సులో జుగుప్స వహించి చాటుకుపోయి దాక్కొనకుండా అతడి కోర్కె తీర్చాలి. పతి చెప్పిన మాట ప్రతిదానినీ సతి నెరవేర్చక తప్పదు'.

విశేషం: ఈ ఆచారం అతి ప్రాచీన కాలంలో ఉండేది. మన పురాణాల్లో చాలాచోట్ల ఇది కన్పిస్తుంది. ఆ నా డిది ధర్మంగానే పరిగణించబడి ఉండాలి కదా!

సుదర్శను నింటికి ధర్మదేవత యతిథియై వచ్చుట (సం.13-2-48)

క. అని యూఁది చెప్పి, యొకనాఁ । డనఘ! యతం డిధ్మములకు నటవీస్థలికిం
జనినయెడ నతిథి యొక్కఁడు । సనుదెంచిన నాసనాది సంభావనలన్. 69

ప్రతిపదార్థం: అనఘ!= దోషరహితుడా (ధర్మరాజా); అని; ఊఁదిచెప్పి= ఆ విధంగా నొక్కి చెప్పి; ఒకనాఁడు= ఒకరోజున; అతండు= సుదర్శనుడు; ఇధ్మములకున్= సమిధలకు; అటవీస్థలికిన్= అరణ్యప్రదేశానికి; చనిన+ఎడన్= వెళ్ళిన సమయంలో; అతిథి+ఒక్కఁడు= ఒక అతిథి; చనుదెంచినన్= రాగా; ఆసన+ఆది= పీఠమిడుట మొదలైన; సంభావనలన్= మర్యాదలతో.

తాత్పర్యం: ఆ విధంగా అతడు చెప్పి సమిధలకొరకు అడవికిపోగా ఒక అతిథి అతడి పర్ణశాలకు వచ్చాడు. ఆ ఓఘవతి అతడికి ఆసన మొసగటంవంటి మర్యాదలతో (తరువాతి పద్యంతో అన్వయం)

క. అతివినయంబున సమ్మా ।నితుఁ జేయఁగ నా లతాంగి నెమ్మోమునఁ జూ
పతఁడు నిలిపి, కామాతుర । మతి నైతిం ; బ్రియ మొనర్పు మానిని! నాకున్. 70

ప్రతిపదార్థం: ఆ లతాంగి= తీగవంటి శరీరంకల ఆ ఇల్లాలు; అతి వినయంబునన్= మిక్కిలి నమ్రతతో; సమ్మానితున్ చేయఁగన్= పూజించగా; అతఁడు; (ఆమె); నెమ్మోమునన్= నిండుముఖంమీద; చూపు నిలిపి= చూపులు ప్రసరించి; మానిని!= గృహిణీ!; కామ= కామంతో; ఆతురమతిన్= త్వరపడే మనస్సుకలవాడను; ఐతిన్= అయినాను; నాకున్=నాకు; ప్రియము= ఇష్టం; ఒనర్పుము= చేయుము.

తాత్పర్యం: ఆ గృహిణి అతివినయంతో సపర్యలు చేయగా, అత డామె ముఖం చూస్తూ 'ఓఘవతీ! నీపై మరులుకొన్నాను. నా కోరిక తీర్చుము అన్నాడు.

విశేషం: లతాంగి అన్నమాట ఆమె అందాన్ని చెప్పేది. మానిని అన్నమాట ఆమె గౌరవమర్యాదలు కలదని చెప్పేది.

వ. 'గృహస్థధర్మ ప్రకారంబు నీయెఱుంగనియదియే! యని' పలికిన, నప్పరమపతివ్రత, వేఱొండు దెఱంగుల నభ్యర్థనీయంబు లయిన వస్తువుల నుపన్యసించిన, నతం డవి యెవ్వియు' నొల్ల ననుటయు. 71

ప్రతిపదార్థం: గృహస్థ= గృహయజమాని; ధర్మంబు= విధినిర్వహణ; ప్రకారంబు= పద్ధతి; నీ+ఎఱుంగని+అదియే!= నీకు తెలియనిదా?; అని పలికినన్= అని చెప్పగా; ఆ+పరమ పతివ్రత= ఆ గొప్ప సతి; వేఱు+ఒండు= మరొక; తెఱంగులన్= తీరుల; అభి+అర్థనీయంబులు= మిక్కిలి కోరదగిన; వస్తువులన్= పదార్థాలను; ఉపన్యసించినన్= పేర్కొనగా; అతండు= ఆ అతిథి; అవి+ఎవ్వియున్= అవి ఏవికూడా; ఒల్లను= అంగీకరించను; అనుటయున్= అనగా.

తాత్పర్యం: గృహస్థ ధర్మవిధులు నీకు తెలిసినవే కదా! అని చెప్పగా ఆ సతి కోరదగిన వేరే వస్తువులు కోరుకొమ్మన్నది. అత డవేమియు నాకు అక్కర్లే దన్నాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. సతి దనపతి వచనంబులు। మతిఁ జొనుపుం దెంపు మాను, మాన వెఱచు, న
య్యతిథి పనుపు సేయక త్రో । చు తలంపలవఱచుఁ, జేయఁ జూచుం, దలరున్. 72

ప్రతిపదార్థం: సతి= పతివ్రత; తన= తనయొక్క; పతివచనంబులు= భర్తమాటలు; మతిన్= మనస్సులో; చొనుపున్+ ప్రవేశపెట్టుతుంది (ఆలోచిస్తుంది); తెంపు= సాహసము; మానున్= వదలిపెట్టుతుంది; మానన్ వెఱచున్= తెగించకుండా ఉండటానికి భయపడుతుంది; ఆ+అతిథి= ఆ అతిథియొక్క; పనుపు= ఆనతి (కోరిక); చేయక= చేయకుండా; త్రోచు= వదలే; తలంపు= ఆలోచన; అలవఱచున్= మనస్సులో ఊహిస్తుంది; చేయన్ చూచున్= చేద్దామని అనుకొంటుంది; తలరున్= చేయడానికి భయపడుతుంది.

తాత్పర్యం: ఆ పతివ్రత భర్త మాటలను గురించి ఆలోచిస్తుంది. తెంపు చేద్దామనుకొని, మరలా చేయలేక, అతిథి కోరికను చెల్లించాలనుకొంటుంది కొంచెం సేపు. మరలా (శీలం పోతుందని) భయపడుతుంది.

విశేషం: ఈ పద్యం ఆమె మనస్సులో పడుతున్న ఆవేదన, ఆలోచన, ఆమె ఆలోచనలోని సుడులు, ఏదీ తేల్చుకోలేని పరిస్థితిని చాలా గొప్పగా చిత్రిస్తున్నది. తిక్కనగారి కవిత్వంలో ఒక గొప్ప నేర్పు ఇట్లా మానసిక పరిస్థితులను చిత్రించటం.

తే. ఇట్టు లురియాడు చిత్తంబు నెట్టకేని । నాథు చెప్పిన ధర్మంబునకుఁ జొరంగ
నూలుకొల్పి, నిర్ణయమునఁ గీలుకొన్న । లజ్జవ్రేగునఁబోలె వ్రాలంగ మోము. 73

ప్రతిపదార్థం: ఇట్టులు= ఈ విధంగా; ఉరియాడు= ఉయ్యాలలూగే (ముందు వెన్కల ఆలోచనలతో); చిత్తంబును= మనస్సును; ఎట్టకున్+ఏని= చిట్టచివరకు; నాథు చెప్పిన; ధర్మంబునకున్= పెనిమిటిచెప్పిన విధి నిర్వహణకు; చొరంగన్= పూనుకొనుటకు; నూలుకొల్పి= అంగీకరింపజేసి, ఉత్సహింపచేసి; నిర్ణయమునన్= నిశ్చయంలో; కీలుకొన్న= పూనుకొన్న; లజ్జవ్రేగునన్= సిగ్గుబరువున; పోలెన్= అన్నట్లుగా; మోము= ముఖం; వ్రాలంగన్= వంగిపోగా.

తాత్పర్యం: ఈ విధంగా వివిధాలోచనలతో ఉయ్యాల లూగే మనస్సును ఎట్లాగో చివరకు ఒప్పించి భర్త మాటను నెరవేర్చాలనే నిర్ణయానికి వచ్చిందా, అన్నట్లుగా సిగ్గు బరువున ముఖం వంచింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. తెఱవ యొడఁబాటు మాటం । బఱివోయిన గొంకుతోడ బ్రాహ్మణుఁ గొని, క
న్మఱుఁ గగునెడకు నరిగె; న । త్తఱి వచ్చె సుదర్శనుండు ధరణీనాథా! 74

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ధర్మరాజా!; తెఱవ= స్త్రీ; ఒడఁబాటు= అంగీకారం; మాటన్= మాటచేత; పఱిపోయిన=తీరిపోయిన; కొంకుతోడన్= సందేహంతో; బ్రాహ్మణున్= బ్రాహ్మణుని; కొని;= తీసికొని; కన్మఱుఁగు= కంటిచాటు; అగు= అయిన; ఎడకున్= చోటుకు; అరిగెన్= వెళ్ళింది; ఆ+తఱిన్= ఆ సమయంలో; సుదర్శనుండు= భర్త; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: సిగ్గుతో ముఖాన్ని వ్రాల్చటం ద్వారా ఆమె అంగీకారం తెలిపింది. జంకుమాని బ్రాహ్మణునితో రహస్య స్థలానికి వెళ్ళినంతలో భర్త వచ్చాడు.

ఆ. వచ్చి, పర్ణశాలవాకిట నిల్చి, య । త్తన్విఁ బిల్చె; నతిథి దాని నల్ల
నూరకుండు మనియె; నువిదయు భూసుర । శాపభీతి నెలుఁగు సూపకుండె. 75

ప్రతిపదార్థం: వచ్చి= సుదర్శనుడు అరుదెంచి; పర్ణశాల= పూరిల్లు; వాకిటన్= వాకిట్లో; నిల్చి= నిలబడి; ఆ తన్విన్= ఆ స్త్రీని; పిల్చెన్= పిలిచాడు; అతిథి; దానిని= ఓఘవతిని; అల్లన్ ఊరకుండుము+అనియెన్= మాట్లాడక ఉండుమని చెప్పాడు; ఉవిదయున్= ఆమెకూడా (స్త్రీ); భూసుర= బ్రాహ్మణుడియొక్క; శాపభీతిన్= శాప (శపిస్తాడేమోనన్న) భయంతో; ఎలుఁగు= గొంతును; చూపక= విప్పక, మాట్లాడక; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: భర్త పర్ణశాల వాకిట్లోకి వచ్చి భార్యను పిలిచాడు. అతిథి ఆమెను మాట్లాడవద్దన్నాడు. ఆమెకూడా అతిథి శపిస్తాడేమోనన్న భయంతో మాట్లాడలేదు.

విశేషం: పై పద్యంలో బ్రాహ్మణశబ్దం వచ్చింది. ఓఘవతి క్షత్రియ సంతానం. వచ్చిన అతిథి ఎవ్వడో? కవి ముందుగా చెప్పలేదు. కనుక ఇవి వర్ణవాచకాలు కావు. ఒక ఆధ్యాత్మిక ధర్మాన్ని అవలంబించే మనస్తత్వం కలవాడు బ్రాహ్మణు డవాలి.

సీ. పేర్కొని, పలుమాఱుఁ బలిచి, యో! యనుట లే । కున్న నయ్యింటిలోఁ గన్ను వఱపి,
వల్లభఁ గానక, వహ్నితనూజుండు । దలఁకొంది ప్రేముడి పలుకు వలుక,
నతని నుద్దేశించి యతిథి 'నాకాతిథ్య । మొనరించుచున్నది వనిత, నీవు
గృహధర్మవిధుఁడవు; కినియకుమయ్య మ' । మ్మనుడు, నప్పరమపుణ్యాత్మకుండు

తే. 'నీదుకతమున నేను సమ్మోదమగ్న । మానసుఁడ నైతి, నతిథులు మహితపూజ
నములు గాంచిన గృహములు విమల తరము । లండ్రు బుధు లింత యెఱుఁగుదు; నట్ల నడతు'. 76

ప్రతిపదార్థం: వహ్నితనూజుండు= అగ్నికొడుకు; పేర్కొని= పేరున; పలుమాఱు= పెక్కుసార్లు; పిలిచి; ఓ యనుట= ఓహో యన్న సమాధానం; లేక+ఉన్నన్= లేకపోగా; ఆ+ఇంటిలోన్= ఆ ఇంటిలోపల; కన్నున్= నేత్రమును; వఱపి= ప్రసరింపచేసి; వల్లభన్= భార్యను; కానక= చూడక; తలఁకు+ఒంది= భయపడి; ప్రేముడిపలుకు= ప్రేమవాక్యం; పలుకన్= పలుకగా; అతిథి= ఇంటికి వచ్చినవాడు; అతనిన్= భర్తను; ఉద్దేశించి= గురించి; వనిత= (నీ భార్య) స్త్రీ; నాకు; ఆతిథ్యము+ఒనరించుచున్+ఉన్నది= ఆతిథ్యం చేస్తున్నది; నీవు; గృహధర్మవిదుఁడవు= గృహస్థధర్మం తెలిసినవాడవు; అయ్య= ఆర్యా!; మమ్మున్= మా ఇద్దరను; కినియకుము= కోపింపకుము; అనుడున్= అనగా; ఆ+పరమ= ఆ శ్రేష్ఠ; పుణ్య+ఆత్మకుండు= పుణ్యజీవి; నీదుకతమునన్= నీవలన; నేను= నేను; సమ్మోద= సంతోషంలో; మగ్న= మునిగిన; మానసుఁడన్+ఐతిన్= మనస్సు కలవాడనైనాను; బుధులు= పండితులు; అతిథులు= ఆతిథ్యంకొరకు వచ్చినవారు; మహిత= గొప్ప; పూజనములు= పూజలు; కాంచిన= పొందిన; గృహములు= ఇళ్ళు; విమలతరములు= నిర్మలములు; అంద్రు= అంటారు; ఇంత ఎఱుఁగుదున్= ఇంత మాత్రం నాకు తెలుసు; అట్లన్=అట్లాగే; నడతున్= నడచుకొంటాను.

తాత్పర్యం: అగ్ని కొడుకు ఆ విధంగా భార్యను పేరెత్తి ఎంత పిలిచినా పలుకకపోయేసరికి లోపలికి చూచి ప్రేమతో మాట్లాడేసరికి (భార్య నుద్దేశించి ప్రేమతో కొన్ని మాటలు అనేటప్పటికి) అతిథి ఇట్లా అన్నాడు; 'నీభార్య నాకు ఆతిథ్య మిస్తున్నది. నీవా ధర్మం తెలిసినవాడవు. కనుక మమ్మ కోపించవద్దయ్యా!' అని. ఆ మాటలు విన్న భర్త 'అట్లాగా! సంతోషం. ఎవరి ఇంట్లో అతిథులు కోరినది పొందుతారో ఆ ఇల్లే పవిత్రం. కనుక నీవన్నట్లే నడచుకుంటాను'.

వ. అని పలికి వెండియు. 77

తాత్పర్యం: ఆ విధంగా అని మరలా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'నావచనంబునట్టుల మనంబును; దీనికి సాక్షు లుర్వియుం,
బావకుఁడున్, జలంబును, నభంబును, వాయువుఁ, జంద్ర సూర్యులున్'
నావుడు మ్రోసె నాకసమునన్ విశదంబుగ దివ్యవాణి 'సం
భావితుఁ డీతఁ; డీ విభుని పల్కు నిజం' బని కౌరవేశ్వరా! 78

ప్రతిపదార్థం: నా వచనంబునట్టుల= నా మాటలవలెనే; మనంబును= నా మనస్సుకూడా; దీనికిన్= ఇందుకు; సాక్షులు= చూచేవారు; ఉర్వియున్= భూమీ; పావకుఁడున్= అగ్నీ; జలంబును= నీళ్ళూ; నభంబున్= ఆకాశం; వాయువున్= గాలీ; చంద్రసూర్యులున్= చంద్రుడూ, సూర్యుడూ (నేనన్న దానికి సాక్షులు); నావుడున్= అనగా; కౌరవ+ఈశ్వరా!= ధర్మరాజా!; ఆకసమునన్= అంతరిక్షంలో; దివ్యవాణి= దేవతా వాక్కు (అదృశ్యవాక్కు); విశదంబుగన్= స్పష్టంగా; ఈతఁడు= ఇతడు; సంభావితుఁడు= సన్మానించదగినవాడు; ఈ విభునిపల్కు= ఈ రాజుమాట; నిజంబు+అని= నిజమేనని; మ్రోసెన్= విన్పించింది.

తాత్పర్యం: 'నా మాట ఎంతో మనస్సూ అంతే. దీనికి పంచభూతాలు అనగా నీరూ, నిప్పూ, ఆకాశం, భూమీ, గాలీ, సూర్యచంద్రులూ అంతా సాక్షులే'. అన్నంతనే ఆకాశంనుండి ధర్మరాజా! దివ్యవాణి ఇట్లా విన్పించిందయ్యా! స్పష్టంగా 'ఈ యజమాను డన్న మాట నిజం' అని.

ఆ. అప్పు డతిథి ప్రీతి నతని సన్నిధి కేఁగు । దెంచి, దుర్నిరీక్ష్యతేజ మడర,
తనదుమూర్తి యధికతర సమున్నతిఁ బొలు । పెసఁగ నిల్చి, యతని కిట్టు లనియె. 79

ప్రతిపదార్థం: అతిథి= ఆ యింటికి వచ్చినవాడు; అప్పుడు= భర్త ఆ విధంగా అన్న తర్వాత; ప్రీతిన్= సంతోషంతో; అతని సన్నిధికిన్= అతడి దగ్గరకు; ఏఁగుదెంచి= వచ్చి; దుర్‌నిరీక్ష్య= చూడటానికి వీలులేని; తేజము= కాంతి; అడరన్= వ్యాపించగా; తనదు= తనయొక్క; మూర్తి= రూపం; అధికతర= మిక్కిలి; సమ్+ఉన్నతిన్= గొప్పగా; పొలుపు ఎసఁగన్= అంద మెక్కువ కాగా; నిల్చి= ఎదుటగా నిలబడి; అతనికిన్= అతడితో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అప్పు డతడి దగ్గరకు వచ్చి, చూడటానికి వీలు లేనంత కాంతితో శరీరం ప్రకాశించగా అతిథి అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: వచ్చిన అతిథి ధర్మదేవత కనుక దేవతా రూపాన్ని ధరించాడన్నమాట.

సీ. 'ధర్మదేవత నేను; దగ నీదుచిత్తంబు । నారయ వచ్చితి ననఘ! నీవు
నిశ్చలవ్రతుఁడవు, నీప్రతిజ్ఞకు హాని గలిగినఁ । దెగఁజూడఁ దలఁచి, తిరుగు
వెనువెంట మృత్యువు, విను జయించితి దానిఁ । గామరోషాదివికారసహిత
ముగ నంతరంగంబు మున్ను గెల్చితి, భవ । త్సతియుఁ బవిత్ర, యస్ఖలితచరిత.

తే. యొడలితోడ నీకు నూర్ధ్వ లోకమునకు । నరుగవచ్చు నెప్పుడరుగు తలఁపు
దోఁచె నప్పు డిదియుఁ దోడిదయై ప్రీతి । నరుగుదెంచు' ననియెఁ గురువరేణ్య! 80

ప్రతిపదార్థం: కురువరేణ్య!= ధర్మరాజా!; ఏను= నేను; ధర్మదేవతన్= ధర్మమూర్తియైన దేవతను; అనఘ!= పాపంలేనివాడా!; తగన్= ఒప్పిదంగా; నీదుచిత్తంబు= నీ మనస్సు; అరయన్= చూడగా; వచ్చితిన్= వచ్చాను; నీవు నిశ్చలవ్రతుఁడవు= నీవు చెదరని వ్రతం కలవాడవు; నీ ప్రతిజ్ఞకున్= నీ శపథానికి; హాని= లోపం; కలిగినన్= కలిగితే; తెగన్+చూడన్+తలఁచి= చంపాలనుకొని; మృత్యువు= మృత్యుదేవత; వెనువెంటన్= నీ వెన్నును అంటుకొని; తిరుగున్= తిరుగుతున్నది; విను= వినుము; దానిన్= మృత్యువును; జయించితి(వి)= గెలిచావు;కామ= కామం; రోషం= కోపం; ఆది= మొదలైన (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములు ఆరుగురు అంతశ్శత్రువులు); వికార సహితముగన్= దోషాలతోపాటు (వికారం=

సహజతకు విరుద్ధమైన కదలిక); అంతరంగంబు= మనస్సు; మున్న= ముందే; గెల్చితి(వి)= జయించితివి; భవత్= నీ; సతియున్= భార్యయు; పవిత్ర= పావనురాలు; అస్ఖలిత= (ధర్మమునుండి) చలించని; చరిత= నడవడి కలది; నీకున్= నీకు; ఎప్పుడు= ఏ సమయంలో; ఒడలితోడన్= శరీరంతో; ఊర్ధ్వలోకమునకున్= పై లోకానికి; అరుగుతలఁపు= వెళ్ళాలన్న ఆలోచన; తోఁచెన్= కలిగిందో; అప్పుడు= ఆ వేళ; ఇదియున్= ఈ భార్యకూడా; తోడిద+ఐ=నీతో కూడినదై; ప్రీతిన్= సంతోషంతో; అరుగుదెంచున్= వస్తుంది.

తాత్పర్యం: 'నేను ధర్మదేవతను. నీ వ్రతాన్ని పరీక్షించటానికి వచ్చాను. నీ ప్రతినకు ఎప్పుడు లోపం కలుగుతుందో అప్పుడు నిన్ను చంపుదామని మృత్యువు నీ వెన్నంటే తిరుగుతున్నది. దానిని జయించావు. కామక్రోధాది షట్ శత్రువులున్న మనస్సును పూర్వమే జయించావు. నీ భార్యకూడా నీవంటిదే. గొప్ప ధర్మచరిత్ర కలది. నీ కెప్పుడు పైలోకాలకు పోవా లనిపిస్తుందో అప్పుడు నీ భార్యతో పాటుగా సశరీరంగా పోవచ్చు' నని ఆ దేవత వరమిచ్చింది ధర్మరాజా!'

విశేషం: దేవత అంటే మూలభావం. ప్రతిభావానికీ ఒక మూలరూప ముండాలి. చెట్టుకు గింజవలె. దాని పేరు దేవత. (ధర్మస్వరూపం) అది రూపధారణం కూడా చేయగలదు. ఇది వేదకాలం నాటి భావన.

వ. అని వెండియు. **81**

తాత్పర్యం : ఆ విధంగా చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. నరవర! పొల్చు నోఘవతి నా నదియై, జనపావనాకృతిం
బరమతపంబులోని, సగపాలను నియ్యమ యున్న సామునన్
వెరవునఁ దొంటిమై నిలిచి నీకుఁ దగం బరిచర్య సేయు; ని
చ్చరితము మీకు నిర్మలయశంబు నొనర్చుట కే నొనర్చితిన్'. **82**

ప్రతిపదార్థం: నరవర!= రాజా! (సుదర్శనుడు); ఇయ్యమ= ఈ+అమ= ఈమె; పరమ తపంబులోని= గొప్ప తపస్సులో; సగపాలను= అర్ధభాగంతో; ఓఘవతినాన్= ఓఘవతిఅన్నపేరుతో; నది+ఐ= ఏరై; జనపావన= మనుష్యులను పవిత్రం చేసే; ఆకృతిన్= రూపంతో; ఉన్న= ఉన్నట్టి; సామునన్= సగంలో; వెరవునన్= ఉపాయంతో; తొంటిమైన్= పూర్వదేహంతో; నిలిచి= ఉండి; నీకున్= నీకు; తగన్= తగునట్లుగా; పరిచర్య= సేవ; చేయున్= చేస్తుంది; ఈ+చరితము= ఈ చరిత్ర; మీకున్; నిర్మల యశంబు= స్వచ్ఛమైన కీర్తి; ఒనర్చుటకున్= ఒడగూర్చి పెట్టటానికి; ఏను= నేను; ఒనర్చితిన్= చేశాను.

తాత్పర్యం: మీ తపస్సులోని సగభాగంతో నీ భార్య ఓఘవతి అనే పేరుగల ఏరై మానవజాతిని పూతం చేస్తూ ప్రవహిస్తుంది. మిగిలిన తపశ్శక్తితో పూర్వం వలెనే నీకు పరిచర్యలు చేస్తూ ఉంటుంది. ఈ కథంతా నేనే మీకు కీర్తి కల్గించటం కొరకు, మీ కొరకే కల్పించాను'.

విశేషం: ఈ కథ నర్మదానదీ సంతానం కథ కనుక - దానితోనే ప్రారంభమై ఆ వంశంలోని మరొక స్త్రీ నదిగా ప్రవహించటంతో ముగిసింది. ఈ విధంగా కథ మొదలూ చివరా ఒకే రకంగా ఉండేటట్లు నిర్మించటం కథ చెప్పటంలో ఒక అందం.

వ. అని చెప్పి ధర్ముండు ధవళహయసహస్రంబుపూనిన మాననీయ రథంబునం జనియె నోఘవతి యద్దేవుని చెప్పినట్ల వర్తిల్లె; సుదర్శనుండును బరమసంతోష భరితుండయ్యెఁ; బాండవాగ్రజా! నీ మనంబున నెక్కొలుపు మిక్కథయభిప్రాయంబు. 83

ప్రతిపదార్థం: అని చెప్పి= ఆ విధంగా చెప్పి; ధర్ముండు= ధర్మదేవత; ధవళ= తెల్లని; హయ= గుర్రాల, సహస్రంబు= వేయి; పూనిన= కట్టిన; మాననీయ= గౌరవించదగిన, (మహత్తరమైన); రథంబునన్= రథంమీద; చనియెన్= వెళ్ళాడు; ఓఘవతి= ఆ గృహిణి; ఆ+దేవునిచెప్పినట్ల= ఆ దేవుడు చెప్పినట్లుగానే; వర్తిల్లెన్= నడుచుకొన్నది; సుదర్శనుండు= రాజు; పరమ= గొప్ప; సంతోష= సంతోషంతో; భరితుండు= నిండినవాడు; అయ్యెన్= అయ్యాడు; పాండవ+అగ్రజా!= ధర్మరాజా! (పాండవులలో పెద్దవాడా!); నీ మనంబునన్= నీ మనస్సులో; ఇక్కథ= ఈ కథయొక్క; అభిప్రాయంబు= సారాంశమును; నెక్కొలుపుము= భావించుము, నిలుపుకొమ్ము.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి ధర్మదేవత వేయిగుర్రాలు కట్టిన రథంమీదెక్కి వెళ్ళిపోయాడు. తర్వాత ఓఘవతి కూడా ఆ దేవుడు చెప్పినట్లుగా ప్రవర్తించింది. (సగం తపస్సుతో నదిగా లోకాన్ని పావనం చేయటం, సగం తపస్సుతో భర్తను సేవించటం) ఆమె భర్త కూడా సంతోషభరితుడైనాడు. నాయనా! ధర్మరాజా! ఈ కథాసారాంశాన్ని మనస్సున నిలుపుకొమ్ము.

ఆ. అతిథిపూజఁ గడచినట్టి ధర్మువు గృహ । స్థులకు నొండు లేమిఁ దెలుపుచున్న
యది; సమస్త కిల్బిషాపహ మీ యితి । హాస; మిచ్చు నెల్లయభిమతములు'. 84

ప్రతిపదార్థం: గృహస్థులకున్= గృహస్థాశ్రమాన్ని స్వీకరించినవారికి; అతిథిపూజన్= ఆతిథ్యమన్న పూజను; కడచినట్టి= మించిన; ధర్మువు= ధర్మం; ఒండు= మరొకటి; లేమిన్= లేకపోవటాన్ని; ఈ+ఇతిహాసము= ప్రాచీనకథ; తెలుపుచున్న+అది= తెలుపుతున్నది, సమస్త, కిల్బిష+అపహము= పాపాలన్నిటినీ పోగొట్టేది; ఎల్ల= సమస్త; అభిమతములు= కోర్కెలను; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: గృహస్థులకు అతిథిపూజకంటె గొప్ప ధర్మం లేదని ఈ పవిత్రమైన ప్రాచీనకథ చెప్తుతున్నది. ఇది సమస్త పాపాలను పోగొట్టి కావలసిన కోర్కెలను తీరుస్తుంది.

విశేషం: ఈ మాటలు భీష్ముడివి. ధర్మరాజు ప్రశ్న కీ కథ సమాధానంగా చెప్పబడింది కనుక వక్త తన సమాధానాన్ని ముగిస్తూ చివరిమాటగా అన్నాడు.

ఆశ్రమాలు 4. 1.బ్రహ్మచర్య, 2.గృహస్థ, 3.వానప్రస్థ, 4.సన్న్యాస ఆశ్రమాలు. నరుడికి నాల్గంచెలు (అంశలు) అని ఒక సామెత. ఈ నాల్గాశ్రమాలే మనిషి 100 ఏళ్ళ పూర్ణజీవితానికివి నాల్గు మెట్లు. మొదటిది విద్యార్థి దశ. గురువు దగ్గరుండి ఇహలోక పరలోక జీవితాలకు సంబంధించిన విద్య (తెలిసికొనదగినది కనుక విద్య) నభ్యసించిన తర్వాత గృహస్థు అవుతున్నాడు మనిషి. ఇక్కడ తాను, భార్య, సంఘం మూడు విషయాలకు ముడి ఉన్నది. మొదటి రెండు కుటుంబం. ఇదే ప్రాచీనకాల సంఘానికి పునాది కనుక సంతానానికి శిక్షణాలయం గృహమే. తానూ ఉన్నాడు; సంఘంతో సంబంధమూ ఉన్నది. దీనికి సూచనమే అతిథి మర్యాదలివన్నీ. మూడవ దశలో సంఘాన్ని వదలి భార్యా తానూ వనవాసం, ఆశ్రమజీవితం జీవిస్తాడు. చివరిది సన్న్యాసం. తానొక్కడే మరలా వచ్చిన చోటికి పోయే మార్గం. దీనితో నూరేళ్ళ జీవితం గట్టెక్కింది. ఇది సంపూర్ణజీవితం. ప్రాచీన ఇతిహాసాలు భారతం - రామాయణం ఈ పూర్ణ మానవ జీవితాన్ని చెప్పినందువలననే మనకు పవిత్రగ్రంథాలై

మానవాళికి మార్గదర్శకాలుగా మిగిలిపోయాయి. ఈ నాల్గింటిలో గృహస్థధర్మాన్ని చెప్పిన కథ ఇది. మనిషికి తాను సంపాదించిన దానిమీద ఒక హక్కు, మమకారం ఉంటాయి. ఈ విషయాలలో ముఖ్యమైన వ్యక్తి భార్య. ఆమె ఉన్న స్వత్వాన్ని కూడా దానం చేయటం - పరులకు ఇవ్వటం ధనాదులవలె - ఈ త్యాగం చాలా గొప్పదని ఈ కథ చెప్పుతున్నది. పురుషునకు భార్యకంటె ప్రియమైన దేమీ లేదు. కనుకనే వానప్రస్థంలో ఆమె తనకు తోడుగానే వస్తున్నది. మను వన్నాడు 'స్త్రీ పూజింపబడ్డ చోట దేవత లానందిస్తున్నారు. ఆమె పురుషునకు జీవనసముద్రం దాటే నౌక' అని. కనుకనే ఆమె లేకుండా ఏ కర్మా చేయటానికి వీలులేదన్నారు. అయితే ధర్మదేవత ఆమెను, అతడిని పరీక్షించాడే తప్ప ఆమె శీలాన్ని అపహరించలేదని కథలో చెప్పబడింది. ఈ ధర్మాన్ని - సర్వాన్ని త్యజించే బుద్ధి - ఇతరులకు దానం చేయటం - నీవూ అలవరచుకొమ్ము అన్నది భారతం - నీవు అంటే ప్రతి పాఠకుడున్నూ.

క. అనినఁ బితామహుతో న । జ్జనపతి 'బ్రాహ్మణ్య మవులజాతులు మూఁటన్
జనియించినవానికి దొర । కొనునొకొ? యతివిమలకర్మ గుణయోగమునన్'. 85

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+జనపతి= ఆ రాజు (జనులకు పాలకుడు); పితామహుతోన్= తాతతో; అవులజాతులు= బ్రాహ్మణుడు కాక మిగిలిన జాతులు; మూఁటన్= మూడిటిలో; జనియించిన= పుట్టిన; వానికిన్= వాడికి; బ్రాహ్మణ్యము= బ్రాహ్మణత్వం; అతివిమల కర్మగుణ యోగమునన్= మిక్కిలి నిర్మలమైన కర్మములయొక్కయు గుణములయొక్కయు కూడికచేత; దొరకొనునొకొ?= సంభవిస్తుందా?

తాత్పర్యం: ఆ విధంగా తాత చెప్పగా ధర్మరాజిట్లా అన్నాడు. 'బ్రాహ్మణేతరమైన మూడు వర్ణాలవారికీ గుణకర్మలతో బ్రాహ్మణత్వం సంభవిస్తుందా?'

విశేషం: గీత చెప్పుతున్నది - "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః" - అని త్రిగుణాల విభాగం చేత కర్మల విభాగం చేత నాల్గువర్ణాలను నేనే సృజించాను. కర్మలు= వేదం చెప్పిన విధులు, మనిషి తప్పక చేయవలసినవి.

వ. అని యడిగిన నతం డతని కిట్లనియె. 86

తాత్పర్యం: అని అడుగగా భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'బ్రాహ్మణత్వంబు గడుదుర్లభం; బనేక । జన్మములఁ బొంది తిరుగంగ సంభవించి
నపుడు గనునది; యున్నతమైన యప్ప । దంబు విను మెఱిఁగించెద దాని తెఱఁగు. 87

ప్రతిపదార్థం: బ్రాహ్మణత్వంబు= బ్రాహ్మణపదం, స్థితి; కడున్= మిక్కిలి; దుర్లభంబు= లభించటం కష్టం; అనేక= చాలా; జన్మములన్= పుట్టుకలను; పొంది= పడసి; తిరుగంగన్= మరలా; సంభవించినపుడు= పుట్టినపుడు; ఉన్నతము+ఐన= గొప్పదైన, మహత్తరమైన; ఆ+పదంబు= ఆ స్థితి; కనునది= పొందదగినది; దాని తెఱఁగు= దాని విషయం; ఎఱిఁగించెదన్= చెప్పుతాను; వినుము= వినుము.

తాత్పర్యం: 'బ్రాహ్మణుడుగా పుట్టటం చాలా కష్టం. ఎన్నో ఎన్నో జన్మలు ఎత్తితే తప్ప ఆ జన్మ సంభవించదు. దాని సంగతి చెప్పుతాను వినుము.

ఇంద్రమతంగసంవాదం బను నితిహాస ప్రకారము (సం. 13-3-8)

వ. అది యింద్రమతంగ సంవాదం బను నితిహాసం బాకర్ణించిన నెఱుంగ నగుం గావున నక్కథ యుపన్యసించెద; నొక్క విప్రుని కొడుకు మతంగుం డనువాఁడు యజ్ఞార్థంబైన పనికిం దండ్రిపనుపునం బోయి. 88

ప్రతిపదార్థం: అది= ఆ సంగతి; ఇంద్ర, మతంగ సంవాదంబు+అను= ఇంద్రుడికీ, మతంగుడికీ మధ్య జరిగిన సంభాషణం అనే పేరుగల; ఇతిహాసంబు= పూర్వకథను; ఆకర్ణించినన్= వింటే; ఎఱుంగన్+అగున్= తెలియవచ్చును; కావునన్=కాబట్టి; ఆ+కథ; ఉపన్యసించెదన్= చెప్పుతాను; ఒక్క విప్రుని కొడుకు= ఒక బ్రాహ్మణుడి కుమారుడు; మతంగుండు+అనువాఁడు= మతంగుడు అనే పేరుకలవాడు; యజ్ఞ+అర్థంబు+ఐన పనికిన్= యజ్ఞం కొరకైన పనిమీద; తండ్రిపనుపునన్= తండ్రి ఆజ్ఞతో; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: ఆ సంగతి ఇంద్రమతంగ సంవాదం అనే ఇతిహాసం వింటే స్పష్టం అవుతుంది. కాబట్టి ఆ కథ వినిపిస్తాను. మతంగుడు అనే పేరుగల ఒక బ్రాహ్మణపుత్రుడు తండ్రి పంపగా ఒక యజ్ఞం కొరకు పోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మదమునఁ బెలుచన యొకగా । డిద కొదమం గోల గొని యడిచె, నడిచిన నొ
వ్వొదవి, తనతల్లిఁ జేరఁగ । నది సని, నన్నీతఁ డడిచె నని చెప్పుటయున్. 89

ప్రతిపదార్థం: మదమునన్= మదంతో; పెలుచన= అధికంగా, గట్టిగా; ఒక గాడిదకొదమన్= ఒక గాడిద పిల్లను; కోలకొని= కర్ర తీసికొని; అడిచెన్= కొట్టాడు; అడిచినన్= కొట్టగా; అది= ఆ కొదమ; నొవ్వు= బాధ; ఒదవి= కలిగి; తనతల్లిన్= తనయొక్క తల్లిని; చేరఁగన్ చని= సమీపించి; నన్నున్= నన్ను; ఈతఁడు=వీడు; అడిచెన్= కొట్టాడు; అని చెప్పుటయున్= అని చెప్పగా.

తాత్పర్యం: వాడు దారిన పోతూ పోతూ ఒక గాడిదపిల్లను కర్రతో గట్టిగా కొట్టగా అది బాధతో తల్లి దగ్గరకు పోయి ఆ సంగతి చెప్పగా. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. ఆ గార్దభి తన కొదమతో 'వీఁడు చండాలుండు ప్రచండస్వభావుండు గాకుండునే?' యనినం, బూర్వజన్మకర్మ విశేషంబునం దిర్యగ్జాతి భాషావిదుండగుట నవ్విప్రపుత్త్రుం డప్పల్కులు విని, 'యిది దూషణ భాషణంబు గాదు; నిరూపణాలాపంబై యున్నది; యట్లు గావున మాలతనంబు గలుగనేర్చు'నని నిశ్చయించి యగ్గాడిద కడకుం బోయి. 90

ప్రతిపదార్థం: ఆ గార్దభి= ఆ ఆడగాడిద; తన కొదమతోన్= తన పిల్లతో; వీడు చండాలుండు= వీడు క్రూరజన్మకలవాడు; ప్రచండ= భయంకరమైన; స్వభావుండు= స్వభావం కలవాడు; కాకుండునే!= కాకుండా ఎట్లా పోతాడు? (తప్పక వాడే); అనినన్= అనగా; పూర్వజన్మ కర్మ విశేషంబునన్= పూర్వజన్మలో చేసిన పనుల విశేషంతో; ఆ+విప్రపుత్రుండు= ఆ బ్రాహ్మణకుమారుడు; తిర్యక్‌జాతి= పశుపక్షిజాతి; భాషావిదుండు= భాష తెలిసినవాడు; అగుటన్= కావటంచేత; ఆ+పల్కులు= ఆ మాటలు; విని; ఇది దూషణభాషణంబు కాదు= ఇది తిట్టుకాదు; నిరూపణ= (నా జన్మవిశేషాన్ని గుర్తించి) వ్రేలెత్తి చూపే; ఆలాపంబు+ఐ= సంభాషణ; యై ఉన్నది; అట్లు కావునన్= కాబట్టి; మాలతనంబు= చండాలస్వభావం; కలుగనేర్చున్= కలుగవచ్చును; అని నిశ్చయించి= అని భావించి; ఆ+గాడిదకడకున్= ఆ గాడిద దగ్గరకు; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: ఆ తల్లిగాడిద పిల్లగాడిదతో ఇట్లా అన్నది. 'వీడు చండాలుడు, క్రూరస్వభావుడు కనుకనే ఇట్లా చేశాడు' అని. అది విని ఆ బ్రాహ్మణబాలుడు పూర్వజన్మలో చేసికొన్న పుణ్యకర్మల ప్రభావంచేత పశు పక్ష్యాదుల భాషలు తెలిసినవాడుకావటంవలన 'ఈ గాడిద మాట నన్ను గూర్చిన నిందావచనం కాదు. నా జన్మవిశేషం తెలిసి అన్నట్లున్న' దని ఆ గాడిద దగ్గరకు పోయి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ప్రతిజీవికీ ప్రత్యేక భాష ఉన్నది. చెట్టు, పిట్ట, జంతువూ అన్నీ సంభాషించేవే. అక్కడ మన భాషవలె అక్షరరూపమైనది కాకపోవచ్చును కాక సంజ్ఞకూడా భాషే. పూర్వకాలం మనిషి ప్రకృతిమధ్య, చెట్లు జంతువుల మధ్య ఎక్కువ జీవించినవాడు కావటం వలన వాడి కా భాష తెలుసు. పశు సంజ్ఞలు రైతుకు తెలుసు. తేనెటీగలు పెంచేవారికి వాటి భాష తెలుసునని చాలామంది వ్రాశారు. కనుక ఇది సంభవమే.

క. తనకుం జండాలత వ । చ్చిన కారణ మడిగి, దానిచేతం గంద
ర్పుని చెయిది మంగలికి నిజ । జననికిఁ బొందగుట విని విషాదముతోడన్. 91

ప్రతిపదార్థం: తనకున్= తనకు; చండాలత= చండాల జన్మ; వచ్చిన= కలిగిన; కారణము= హేతువు; అడిగి= అడిగి; దానిచేతన్= గాడిదవలన; నిజజననికిన్= తన తల్లికీ; మంగలికిన్= మంగలివాడికీ; కందర్పుని= మన్మథుడి; చెయిదిన్= చేష్టవలన; పొందు= సంభోగం; అగుట విని= కావటం తెలిసికొని; విషాదముతోడన్= దుఃఖంతో.

తాత్పర్యం: 'మన్మథుడి ప్రేరణవలన తన తల్లి మంగలితో సంగమిస్తే తాను పుట్టినట్లు ఆ గాడిదవలన విని దుః ఖంతో (తరువాతి వచనంతో అన్వయం.)

వ. తనపోయెడు పనికిం బోవక, మరలి సదనంబునకుం జని, జనకున కత్తెఱం గెల్ల నెఱింగించి, యతనితో 'శూద్రబీజంబున బ్రాహ్మణియందు జన్మించినవాఁడు చండాలుం డగుటకు సందియం బేమి? గార్దభి శాపజాత గానోపు నది యున్నరూపపలికె; బ్రాహ్మణ్యంబు దపంబున సంపాదించెదం గాక' యని పల్కి, వీడ్కొని వనంబునకుం బోయి. 92

ప్రతిపదార్థం: తన పోయెడు పనికిన్= తానుపోతున్న పనికి; పోవక= పోకుండా; మరలి= వెనుకకు తిరిగి; సదనంబునకున్= ఇంటికి; చని= పోయి; జనకునకున్= తండ్రికి; ఆ+తెఱంగు= ఆ విషయం; ఎల్లన్= అంతా; ఎఱింగించి= చెప్పి; అతనితోన్= తండ్రితో; శూద్రబీజంబునన్= శూద్రుని బీజంతో; బ్రాహ్మణియందున్= బ్రాహ్మణస్త్రీకి; జన్మించినవాఁడు= పుట్టినవాడు; చండాలుండు+అగుటకున్= చండాలుడు కావటానికి; సందియంబు= సందేహం; ఏమి?= ఏమున్నది?; గార్దభి= ఆ ఆడగాడిద; శాపజాత= శాపంవలన (అట్లా) పుట్టింది; కానోపున్= కాబోలు; ఉన్నరూప= ఉన్నమాట; పలికెన్= అన్నది; బ్రాహ్మణ్యంబు= బ్రాహ్మణత్వం; తపంబునన్= తపస్సు చేతనే; సంపాదించెదన్ కాక= పొందుతాను సుమా!; అని; వీడ్కొని= తండ్రిని వదలి; వనంబునకున్= అడవికి; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: యజ్ఞం పనిమీద పోతున్నాడుకదా! అది వదలి ఇంటికి తిరిగిపోయి ఆ గాడిద చెప్పినదంతా తండ్రికి చెప్పి, 'నా జన్మ బ్రాహ్మణ బీజానికి కలిగింది కాదు కనుక ఆ బ్రాహ్మణత్వం తపస్సుచేత సాధిస్తా' నని పలికి తండ్రిని వదలిపెట్టి అడవికి పోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పరమ తపమాచరింపఁగ । సురపతి వొడచూపి యడుగు సువ్రత! నీకున్
వర మిచ్చెద' ననిన; 'ధరా । మరత్వ మి' మ్మనియె; నతఁడు మది ముద మొదవన్. 93

ప్రతిపదార్థం: పరమ= గొప్ప; తపము= తపస్సు; ఆచరింపఁగన్= చేయగా; సురపతి= దేవతలరాజు, ఇంద్రుడు; పొడచూపి= కన్పించి (పొడ-నీడ-తనపొడ గిట్టదని సామెత); సువ్రత!=మంచి తపస్సు చేసినవాడా!; నీకున్; వరము+ఇచ్చెదన్= వరమిస్తాను; అడుగు; అనినన్= అనగా; అతఁడు= వాడు; మదిన్= మనస్సులో; ముదము= సంతోషం; ఒదవన్= కలుగగా; ధరా+ అమరత్వము= భూమిపై దేవతాత్వము - భూదేవత అంటే బ్రాహ్మణుడు కనుక బ్రాహ్మణత్వమని భావం; ఇమ్ము= ఇవ్వు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: గొప్ప తపస్సు చేయగా ఇంద్రుడు ప్రత్యక్షమై 'సువ్రతా! నీకేమి వరం కావాలో కోరుకొమ్ము' అని అడుగగా అతడు సంతోషంతో 'నాకు బ్రాహ్మణత్వ మి' మ్మన్నాడు.

చ. అనవుడు 'బ్రాహ్మణత్వము మహత్త్వ మెఱుంగవ? యన్యజాతి కం
దునె యది? యొండు వేఁడు; మది దోఁచిన మే' లనియెన్ బలారి; వాఁ
'డనితరసాధ్య మైన తప మస్ఖలితంబుగఁ జేయుచుండెదం;
జనుము మహాత్మ! నీ' వనిన, సస్మితుఁడై యతఁ డేఁగె; నేఁగినన్. 94

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; బల+అరి= బలుడన్న రాక్షసుడిని చంపినవాడు - ఇంద్రుడు; బ్రాహ్మణత్వము మహత్త్వము= బ్రాహ్మణస్థితి గొప్పతనం; ఎఱుంగవె?= తెలియవా?, అన్యజాతికిన్= మరొకవర్ణంలో పుట్టినవాడికి; అది= ఆ బ్రాహ్మణ్యం; అందునె?= అందుతుందా? (అందదు); ఒండు= మరొకవరం; వేడుము= కోరుకొమ్ము; అది= మరొక కోరిక; తోఁచినన్= తోస్తే; మేలు= మంచిది (నీ మనస్సులో మరొక కోరిక తోస్తే అది చెప్పుము మంచిది); అనియెన్= అన్నాడు; వాఁడు= మతంగుడు; మహాత్మ!= (దేవతలకు రాజువైన) స్వామీ!; అనితర సాధ్యము+ఐన= ఇతరులకు సాధ్యం కాని; తపము= తపస్సు; చేయుచున్= చేస్తూ; ఉండెదన్= ఉంటాను; నీవు; చనుము= వెళ్ళుము; అనినన్= అంటే; అతఁడు= ఇంద్రుడు; స+స్మితుఁడు+ఐ= నవ్వుతో కూడినవాడై; ఏఁగెన్= వెళ్ళాడు; ఏఁగినన్= అట్లా వెళ్ళగా.

తాత్పర్యం: మతంగు డట్లా చెప్పగా ఇంద్రుడు ఇట్లా అన్నాడు. 'బ్రాహ్మణత్వం ఇతర జాతులకందేది కాదు. మరొకవరం కోరుకొమ్ము' అని.కాని అతడు 'మహాత్మా! నీవు వెళ్ళుము. నా కోరిక ఫలించేంతవరకు నే నిట్లా ఇతరులకు సాధ్యం కాని తపస్సు చేస్తూనే ఉంటాను' అని చెప్పగా అతడు వెళ్ళిపోగా. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: బ్రాహ్మణత్వ మన్నది పుట్టగానే ఎవరికీ దక్కేది కాదు. అది తపస్సుచేత సాధ్య మన్నమాట.

వ. మతంగుం డేకపాదంబున నూఱేండ్లు తపంబు సేసిన నింద్రుండు గ్రమ్మఱ వచ్చి. 95

ప్రతిపదార్థం: మతంగుండు= చండాలుడు (క్రూరకర్మలు చేసేవాడు); ఏకపాదంబునన్= ఒకేపాదంమీద (నిలిచి); నూఱు+ఏండ్లు= నూరు సంవత్సరాలు; తపంబు= తపస్సు; చేసినన్= చేయగా; క్రమ్మఱన్= మళ్ళీ; ఇంద్రుండు వచ్చి.

తాత్పర్యం: మతంగుడు ఒంటికాలి మీద నిలిచి నూరేళ్ళు తపస్సు చేయగా మళ్ళీ ఇంద్రుడు ప్రత్యక్షమై.

తే. 'ఏను వలదని చెప్పిన మాన వెట్లు? । పరమదుర్లభ పద మాసపడి, కరంబు
మేలితప మాచరించి చండాలు డిట్టి । దాన నశియించు; నిది నీకుఁ దగదు, విడువు. 96

ప్రతిపదార్థం: ఏను= నేను; వలదు= వద్దు; అని చెప్పినన్= అని చెప్పినప్పటికీ; మానవు= వదలవు; ఎట్లు?= ఎట్లాగా?; పరమ= మిక్కిలి; దుర్లభ= లభించని; పదము= స్థితి; ఆసపడి= కోరి; కరంబు= మిక్కిలి; మేలితపము= గొప్ప తపస్సు; చండాలుఁడు= మతంగుడు; ఆచరించి= చేస్తే; ఇట్టిదానన్= ఇట్లాంటి దానివలన; నశియించున్= నశిస్తాడు; ఇది నీకున్= ఇది నీకు; తగదు= మంచిదికాదు.

తాత్పర్యం: 'నేను వద్దని చెప్పినా నీవు వినకుండా ఉన్నావు. చండాలుడు ఇట్లాంటి తపస్సు చేస్తే చస్తాడు తప్ప మేలు పొందడు. కాబట్టి నీకు ఈ తపస్సు తగదు.

వ. విను మిత్తెఱంగుతపంబునకుఁ బదిమడుంగులు సేసి చండాలుండు శూద్రుండగు; నూఱుమడుంగు లనుష్ఠించి శూద్రుండు వైశ్యుండగు; వేయిమడుంగు లాచరించి వైశ్యుండు క్షత్రియుం డగు; నప్పుణ్యాచరణంబునకుఁ బదివేలు మడుంగులు నిర్వర్తించి క్షత్రియుండు దుర్బ్రాహ్మణుం డగు; నా నియమంబునకు లక్షమడుంగులు సల్పి శమదమ సత్యాహింసల సమాత్సర్యంబున నార్య బ్రాహ్మణహృదయంబులు సదయంబులు గావించి దుర్బ్రాహ్మణుండు సద్బ్రాహ్మణుం డగు; నిట్లు బ్రాహ్మణ్యం బలఁతులం బడయవచ్చునే; పడసియు, నది సెడకుండ నడప శక్యంబగునే? యనేక జన్మంబుల నొకప్పుడు బ్రాహ్మణజన్మంబు నొందియుం గొందఱు ధనవాంఛా విషయ లౌల్యాదులం దదాచారంబు దిగవిడిచి చెడుదు; రిట్టి మహాపదంబు గోరి నిన్ను నీవ యేల వినాశంబు నొందించుకొనియెద? వీ తపోనిష్ఠ సాలించి, తగునది యొక్క వరంబు వేఁడు' మనియె, ననిన వాఁడూరకున్న నాఖండలుం డరిగె; వెండియు. 97

ప్రతిపదార్థం: వినుము= విను; ఈ తెఱంగు తపంబునకున్= ఇటువంటి తపస్సునకు; పదిమడుంగులు= పదిరెట్లు; చేసి= ఆచరించి; చండాలుండు= కడజాతివాడు; శూద్రుండు= నాలుగవజాతివాడు; అగున్= అవుతాడు; నూఱు మడుంగులు= వందరెట్లు; అనుష్ఠించి= శ్రద్ధతో చేసి; శూద్రుండు= శూద్రుడు; వైశ్యుండు= మూడవవర్ణంవాడు; అగున్= అవుతాడు; వేయి మడుంగులు= వేయిరెట్లు; ఆచరించి= చేసి; వైశ్యుండు= వైశ్యవర్ణంవాడు; క్షత్రియుండు= క్షత్రియవర్ణంవాడు; అగున్= అవుతాడు; ఆ+పుణ్య+ఆచరణంబునకున్= ఆ పుణ్యమైన పనికి; పదివేలు మడుంగులు= పదివేలరెట్లు; నిర్వర్తించి= చక్కగా ఆచరించి; క్షత్రియుండు= రెండవవర్ణంవాడు; దుర్(బ్రాహ్మణుండు= చెడ్డబాపడు; అగున్= అవుతాడు; ఆ నియమంబునకున్= అటువంటి నిష్ఠకు; లక్షమడుంగులు= లక్ష రెట్లు; చల్పి= చేసి; శమ, దమ, సత్య+అహింసలన్= లోపలియింద్రియాలను కట్టడి చేయటం, వెలుపలి ఇంద్రియాలను జారిపోనీకుండటం, అబద్ధాలాడకపోవటం, ఎవరికీ దేనికీ బాధ కలిగించకుండటం అనేవాని చేతనూ, అమాత్సర్యంబునన్= ఇతరుల మేలును చూడలేకపోవటం అనే స్వభావం లేకపోవటం చేతనూ; ఆర్య, బ్రాహ్మణ హృదయంబులు= ఉత్తమ స్వభావం కల బ్రాహ్మణుల హృదయాలను; సదయంబులు= రక్షించాలి అనేభావన కలవిగా; కావించి= చేసి; దుర్(బ్రాహ్మణుండు= పుట్టుకచేత మాత్రమే బ్రాహ్మణుడైనవాడు; సత్+బ్రాహ్మణుండు= ఉత్తముడైన విప్రుడుగా; అగున్= అవుతాడు; ఇట్లు= ఈ విధంగా; బ్రాహ్మణ్యంబు= బ్రాహ్మణుడు కావటం; అలఁతులన్= తక్కువతీరు కర్మలచేత; పడయన్+వచ్చునే= పొందనగునా? పడసియున్= పొందికూడా; అది= ఆ బాపనితనం; చెడక+ఉండన్= చెడిపోకుండా; నడపన్= ప్రవర్తింపజేయటం; శక్యంబు+అగునే= సాధ్యం అవుతుందా? అనేక జన్మంబులన్= పెక్కు పుట్టుకల తరువాత;

ఒక+అప్పుడు= ఒకపుట్టుకలో; బ్రాహ్మణజన్మంబున్= బ్రాహ్మణుడుగా పుట్టటం; ఒందియున్= పొందికూడా; కొందఱు= కొంతమంది; ధనవాంఛా విషయ తౌల్య+ఆదులన్= ధనం మీది కోరిక, ఇంద్రియాలకు సంబంధించిన శబ్దముమొదలైనవాని యందలి చపలత్వం మొదలైనవానిచేత, తత్+ఆచారంబున్= ఆ బ్రాహ్మణుని నడవడిని; దిగన్+విడిచి= పూర్తిగా వదలివైచి; చెడుదురు= పాడైపోతారు; ఇట్టి మహా పదంబున్= ఇటు వంటి గొప్పస్థితిని; కోరి= కాంక్షించి; నిన్నున్= నిన్ను; నీవు+అ= నీవే; ఏల= ఎందుకు; వినాశంబున్= పాడగుటను; ఒందించుకొనియెదవు= చేసుకుంటావు; ఈ తపస్+నిష్ఠన్= ఈ తపస్సునందలి మిక్కిలిశ్రద్ధను; చాలించి= ఆపివేసి; తగు+అది= యోగ్యమైనదైన; ఒక్క వరంబున్= ఒక్కవరాన్ని; వేడుము= కోరుకో; అనియెన్= అన్నాడు; అనినన్= అట్లు పలికినా; వాఁడు= ఆ చండాలుడు; ఊరక+ఉన్నన్= బదులు చెప్పక ఉంటే; ఆఖండలుండు= దేవేంద్రుడు; అరిగెన్= వెళ్లి పోయాడు; వెండియున్= తరువాత.

తాత్పర్యం: ఇటువంటి తపస్సునకు పదిరెట్లు తపస్సు చేసి చండాలుడు శూద్రుడౌతాడు. అతడు వందరెట్లు తపస్సు చేస్తే కాని వైశ్యుడు కాడు. అతడు వేయిరెట్లు చేస్తే క్షత్రియుడౌతాడు. అతడు పదివేల రెట్లు చేస్తే దుర్బ్రాహ్మణుడు ఔతాడు. అతడు లక్షరెట్లు చేస్తే కాని బ్రాహ్మణుడు కాడు. కనుక ఆ మహాపదవి అల్పులకు పొందరాదు. ఒకవేళ పొందినా నిలుపుకొనటం కష్టం. కొందరు వేలజన్మల తర్వాత బ్రాహ్మణులై పుట్టి కూడా ధనలోభాదులవలన చెడిపోతున్నారు. కనుక నీ తపస్సు వదలిపెట్టుము' అని చెప్పి ఇంద్రుడు వెళ్ళిపోయాడు. తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అంగుష్ఠ మొకటి మోపి, మ । తంగుఁడు నూఱేండ్లు సేసెఁ దపము నియతిమై.
నంగము తో లస్థులతో । సంగతముగఁ దోఁప, వెక్కసముగా నరముల్. 98

ప్రతిపదార్థం: మతంగుఁడు; అంగుష్ఠము= కాలిబొటనవ్రేలు; ఒకటి మోపి= ఒకదానిపై నిలిచి; నూఱు= వంద; ఏండ్లు= సంవత్సరాలు; నియతిమైన్ = నియమంతో; అంగము= అవయవం; తోలు= చర్మం; అస్థులతోన్= బొమికలతో; నరముల్= నరాలు; సంగతముగన్= అంటుకొన్నట్లు; వెక్కసముగాన్= కంటికిబరువుగా, భయంకరంగా; తోఁపన్= కన్పించగా, తపము చేసెన్= తపస్సు చేశాడు.

తాత్పర్యం: నూరేళ్ళు కాలిబొటనవ్రేలిపై నిలిచి, శరీరంలో తోలు, ఎముకలు, నరాలు తప్ప ఏమీ మిగులకుండు నంతగా భయంకరంగా కన్పించేంత వరకు తపస్సు చేశాడు.

విశేషం: ప్రతి పద్యంలోనూ తిక్కనగారు కావాలని తెలుగు పదాలు వాడటం గమనించాలి. ఉదా; తోలుకు బదులు చర్మం వాడవచ్చు. కాని అది సంస్కృతం. తపస్సు చేసి చిక్కి శల్యమైన బుద్ధవిగ్రహాలు మనదేశంలో వచ్చాయి. పోల్చుకొనవచ్చును.

ఆ. ఇట్లు సేసి శక్తి యెల్లను గడచన్న । నతఁడు, నేల వ్రాలె; నతిరయమున
వచ్చి, యమరఁ బట్టి వాసవుఁ 'డక్కట! నీకుఁ జెప్పనయ్య! నెమ్మి నేను. 99

ప్రతిపదార్థం: ఇట్లు చేసి= ఈ విధంగా చేసి; శక్తియెల్లను= ఓపిక అంతా; కడచన్నన్= వట్టిపోగా; (కడ=చివరకు; చన్నన్= పోగా); అతఁడు= మతంగుడు; నేలన్= భూమిపై; వ్రాలెన్= పడ్డాడు; వాసవుఁడు= ఇంద్రుడు; అతిరయమునన్= మిక్కిలి వేగంతో; వచ్చి; అమరన్= చక్కగా; పట్టి= పట్టుకొని; నేను; నీకున్; నెమ్మిన్= ప్రేమతో; చెప్పనయ్య!= అయ్యా! చెప్పనా? (ఇదివరకే చెప్పాను కదా!)

తాత్పర్యం: ఇట్లా తపస్సు చేసి అతని శరీరం శుష్కించి శక్తి అంతా క్షీణించిపోగా నేలపై కుప్పకూలిపోయాడు. (అప్పుడు) మిక్కిలివేగంతో ఇంద్రుడు వచ్చి అతడిని పడకుండా చక్కగా పట్టుకొని, అయ్యా! నే నిదివరకే చెప్పలేదా?

వ. క్షత్రియాదులచేతనుం బట్టువడని బ్రాహ్మణశార్దూలంబుతోడి మేలంబు దక్కుము; నీకు నొక్కవరం బిచ్చెదం
గైకొను' మని పల్కుటయు, నతం డొడంబడినం బరమాదరంబున. 100

ప్రతిపదార్థం: క్షత్రియ+ఆదులచేతనున్= రాజులు మొదలైనవారికి కూడా; పట్టువడని= లభించని; బ్రాహ్మణశార్దూలంబు= బ్రాహ్మణత్వమన్న పులికి; తోడి= సంబంధించిన; మేలంబు= ఆట, నవ్వులాట; తక్కుము= వదలిపెట్టుము; నీకున్= నీకు; ఒక్క వరంబు= ఒక్క వరాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; కైకొనుము= తీసికొనుము; అని; పల్కుటయున్= చెప్పగా; అతండు= ఆ మతంగుడు; ఒడంబడినన్= అంగీకరించగా; పరమ= గొప్ప; ఆదరంబునన్= ప్రేమతో.

తాత్పర్యం: క్షత్రియుడికి కూడా లభించని ఆ బ్రాహ్మణత్వమన్న పులితో ఆటలాడటం మానివేస్తే నీకొక వరమిస్తా' నని ఇంద్రుడంటే అతడూ సరే నన్నాడు. అప్పుడు ఇంద్రుడు ప్రేమతో. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. చండదేవుఁ డనఁ బ్రశస్తి వహించి, సు । స్త్రీలు, పూజనంబు సేయఁ, గామ
రూపధారివై, నిరూపింప విహగభా। వంబుగల్గి, ప్రమదవర్తి వగుము'. 101

ప్రతిపదార్థం: చండదేవుఁడు+అనన్= ఆ పేరుతో; ప్రశస్తి= కీర్తి; వహించి= మోసి; సు స్త్రీలు= మంచి ఆడువారు; పూజనంబు= పూజలు; చేయన్= చేస్తూ+ఉండగా; కామరూపధారివి+ఐ= ఇష్టం వచ్చిన రూపాన్ని ధరించగలవాడివై; నిరూపింపన్= అందరు గుర్తించేటట్లుగా; విహగభావంబు= ఆకాశంలో ఎగిరే పక్షి స్వభావం; కల్గి= పొంది; ప్రమద= సంతోషంతో; వర్తివి= చరించేవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: చండదేవుడనే పేరుతో కీర్తిశాలివై స్త్రీల పూజలందుతూ కామరూపంతో పక్షిభావం పొంది సంతోషంతో విహరించుము'.

క. అని వరమిచ్చి, మహేంద్రుఁడు । సనియె' ననిన విని, యజాతశత్రుఁడు గాంగే
యునితో 'బ్రాహ్మణ్యము పెఱ । జనులకుఁ బొందంగ ని ట్ల శక్యం బేనిన్. 102

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; వరము+ఇచ్చి= కోరిన కోరిక తీర్చి; మహేంద్రుఁడు= ఇంద్రుడు; చనియెన్= వెళ్ళాడు; అనినన్= చెప్పగా; విని; అజాత= పుట్టని, లేని; శత్రుఁడు= శత్రువులు కలవాడు (శత్రువు లేనివాడు ధర్మరాజు); గాంగేయునితోన్= గంగాతనయుడైన భీష్ముడితో; పెఱ= ఇతర; జనులకున్= వర్ణాలవారికి; బ్రాహ్మణ్యము= బ్రాహ్మణత్వం; పొందంగన్= పొందటం; ఇట్లు= ఈ విధంగా; అశక్యంబు+ఏనిన్= సాధ్యం కాకపోతే.

తాత్పర్యం: అని వరమిచ్చి ఇంద్రుడు వెళ్ళాడని విన్న ధర్మరాజు భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు. 'ఇతరుల కీ విధంగా బ్రాహ్మణత్వం పొందరానిదే అయితే. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అజాతశత్రువు అంటే ఇతడిని దుర్యోధనాదులు శత్రువుగా చూచారు తప్ప ఇతడు వారి నట్లా చూడలేదని అర్థం. ఎవడి మనస్సులో ద్వేషం, విరోధం లేవో వా డజాతశత్రువు. అశోకుడు, గాంధీ, బుద్ధులూ ఇట్టివారే.

విశ్వామిత్రునకు బ్రాహ్మణ్యంబు గలిగిన తెఱంగు (సం. 13-3-1)

వ. విశ్వామిత్రుం డెట్లు వొందె? నత్తెఱం గెఱింగింపవే!' యని యడిగిన నన్నరదేవునకు దేవవ్రతుం డిట్లనియె.103

ప్రతిపదార్థం: విశ్వామిత్రుండు= విశ్వానికంతా స్నేహితుడైన ఋషి; ఎట్లు= ఏ విధంగా, పొందెన్= బ్రాహ్మణత్వాన్ని పొందాడో; ఆ+తెఱంగు= ఆ పద్ధతి; ఎఱింగింపవే= తెల్పవే; అని; అడిగినన్= అడుగగా; ఆ నరదేవునకున్= ఆ రాజునకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: బ్రాహ్మణత్వం ఇతరవర్ణాలవారికి లభ్యం కాదన్నావు కదా! మరి విశ్వామిత్రు డెట్లా పొందగలిగాడో చెప్పుము' అని అడిగిన ధర్మరాజుతో భీష్ము డిట్లా అన్నాడు.

సీ. 'జాహ్నవీదేవికి జనకుఁడై వెలసిన । జహ్నుని కులమున సంభవించె
గాధినాఁ బ్రకట భూకాంతుఁ ; డాతనిపుత్రి । యగు సత్యవతిఁ దన కాలి గాఁగ
నిమ్మని యర్థించె నమ్మహీశ్వరు ఋచీ । కుం డనుముని; భృగుకులవరేణ్యుఁ
డతని కీ నొల్ల కప్పతి దనకూఁతున । కుంకువగాఁ, జెప్పెనొక్క కర్ణ

తే. మసితమై తెలుపారెడు హరులు వేయి । మానియై భార్గవుఁడు దేరఁబూని వరుణుఁ
గానఁ జని యవ్విధము ఘోటకముల వేఁడె । నాతఁ డిచ్చుట కొడఁబడి యతనితోడ. 104

ప్రతిపదార్థం: జాహ్నవీదేవికిన్= గంగాదేవికి; జనకుఁడు+ఐ= తండ్రి అయి; వెలసిన= ప్రకాశించిన; జహ్నుని కులమునన్= జహ్నుడన్న ముని వంశంలో (జహ్నుడి కూతురు కనుక జాహ్నవి అని పేరు వచ్చింది); గాధినాన్= గాధి అన్న పేరు కలవాడుగా; ప్రకట= అందరకు తెలిసిన; భూకాంతుఁడు= రాజు (భూమికి పాలకుడు); సంభవించెన్= జన్మించాడు; అతని పుత్రి= అతడి కుమార్తె; అగు; సత్యవతి= సత్యవతి అనే పేరుగలది (సత్యం కలది); తనకున్= ఋచీకు డన్న మునికి; ఆలికాఁగన్= భార్యకాగా; ఋచీకుండు+అనుముని; భృగుకులవరేణ్యుఁడు= భృగుకులంలో శ్రేష్ఠుడు; ఆ+మహీశ్వరున్= ఆ రాజైన గాధిని; అర్థించెన్= కోరాడు; తనకూఁతును= తన కుమార్తెను; అతనికిన్= ఋచీకునకు; ఈన్= ఇవ్వటానికి; ఒల్లక= ఇష్టపడక; ఉంకువగాన్= ఓలిగా, శుల్కం కాగా; ఒక్క కర్ణము= ఒక చెవి; అసితము+ఐ= నల్లనిదై; తెలుపు+ఆరెడి= స్వచ్ఛమైన తెలుపుగల; హరులు= గుర్రాలు; వేయి= సహస్రం; చెప్పెన్= ఋచీకుడికి గాధి ఆ విధంగా చెప్పాడు; మాని+ఐ= పౌరుషంగలవాడై; భార్గవుఁడు= భృగు కులంలో పుట్టిన ఆ ఋచీకుడు; తేరన్= తెచ్చుటకు; పూని= పూనుకొని; వరుణున్= వరుణదేవుని; కానన్= చూడగా; చని= వెళ్ళి; ఆ విధము= అలాంటి; ఘోటకములన్= గుర్రాలను; వేఁడెన్= ప్రార్థించెను; ఆతఁడు= ఆ వరుణుడు; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; ఒడఁబడి= అంగీకరించి; అతని తోడన్= ఋచీకుడితో.

తాత్పర్యం: జాహ్నవీదేవికి తండ్రి అయిన జహ్నుడికులంలో గాధి అనేవాడు జన్మించాడు. అతడి కూతురు సత్యవతి. ఆమెను భృగుకులంలో పుట్టిన ఋచీకు డనేవాడు భార్యగా నిమ్మని ఆమె తండ్రి గాధిని కోరాడు. గాధికి ఇష్టం లేదు. అందుకని ఒక చెవి నల్లగా ఉన్న తెల్లని వేయి గుర్రాలను శుల్కంగా తెస్తే, ఇస్తా నన్నాడు. అభిమాన ధనుడైన ఋచీకుడు వరుణుడి దగ్గరకు వెళ్ళి యాచించాడు. ఆయన ఇవ్వటానికి ఒప్పుకొని ఈ క్రింది విధంగా అన్నాడు.

విశేషం: ఆ రోజులలో ఓలి ఇచ్చి వివాహం చేసికొనే ఆచార ముండేది.

క. 'నీ వలసినప్పు డట్టి హ । యావలి ప్రభవించు నెచటనైన' ననవుడున్
దీవించి యరిగి యమ్ముని । దేవతటిని యుత్తరంపుఁ దీరమునఁ దగన్. 105

ప్రతిపదార్థం: నీ= నీకు; వలసినప్పుడు= అవసరమైనప్పుడు; (నీకు అవసర మేర్పడినపుడు); అట్టి= అట్లాంటి; హయ+ఆవలి= గుఱ్ఱాల సమూహం; ఎచటన్+ఐనన్= నీవు కోరినచోట; ప్రభవించున్= పుట్టుతాయి; అనవుడున్= అనగా; ఆ+ముని= ఆ ఋచీకుడు; దీవించి= ఆశీర్వదించి; అరిగి= పోయి; దేవతటిని= గంగానది (దేవతా నది); ఉత్తరము+తీరమునన్= ఉత్తరదిక్కున ఉన్న ఒడ్డున; తగన్= చక్కగా

తాత్పర్యం: 'నీ వెక్కడ కోరితే అక్కడ అట్లాంటి గుఱ్ఱాలు పుట్టుతాయి' అని వరుణు డన్నాడు. సంతోషించి ఆ ఋచీకుడు వరుణుడిని ఆశీర్వదించి గంగానది ఉత్తరపుటొడ్డున.

వ. నియతుండై తలఁచిన తత్క్షణంబ గాధి చెప్పిన చందంబగు గుఱ్ఱంబులు వేయునుం బుడమిఁ బొలిచి నిలిచె; దానం గన్యాకుబ్జంబున కనతిదూరం బగు తత్ప్రదేశం బశ్వతీర్థం బనం బరఁగె; నమ్ముని కుమారుం దత్తురంగంబుల నిచ్చిన, నచ్చెరువును సంతోషంబును శాపభయంబును హృదయంబున ముప్పిరిగొనం దనపుత్రికి నుంకువగా నియ్యకొని. 106

ప్రతిపదార్థం: నియతుండు+ఐ= నియమం కలవాడై; తలఁచిన= అనుకొనగానే; తత్క్షణంబు+అ= వెనువెంటనే; గాధి చెప్పిన చందంబు+అగు= గాధి చెప్పినటువంటి; వేయునున్= వేయీ; పుడమిన్= భూమిపై; పొలిచి= సంభవించి; నిలిచెన్= నిలిచాయి; దానన్= అందువలన; కన్యాకుబ్జంబునకున్= ఆ పేరున్న దేశానికి; అనతి దూరంబు+అగు= కొంచెం దూరంలో ఉన్న; తత్ప్రదేశంబు= ఆ చోటు (గుఱ్ఱాలు పుట్టిన స్థలం); అశ్వతీర్థంబు= గుఱ్ఱాలు పుట్టిన పవిత్రస్థలం; అనన్= అన్నపేరున; పరఁగెన్= వ్యాప్తి చెందెను; ఆ+ముని= ఆ ముని; కుమారుండు=కొడుకు; ఆ+తురంగంబులన్= ఆ గుఱ్ఱాలను; ఇచ్చినన్= ఇవ్వగా; అచ్చెరువును= ఆశ్చర్యం; సంతోషంబును= ఆనందమూ; శాపభయంబును= శపిస్తాడేమోనన్న భీతి; హృదయంబునన్= మనస్సునందు; ముప్పిరిగొనన్= ముప్పేటలు పడగా (మూడు పిరము - త్రాడు మూడు పేటలుగా పేనటం); తన పుత్రికిన్= తన కూతురునకు; ఉంకువగాన్= శుల్కంగా (ఓలిగా); ఇయ్యకొని= అంగీకరించి, ఒప్పుకొని.

తాత్పర్యం: నియమంతో సంకల్పించగానే వెంటనే గాధి చెప్పినవిధంగా వేయి గుఱ్ఱాలు నేలనుండి పుట్టి ఎదుట నిలిచాయి. దానివలన కన్యాకుబ్జానికి కొద్దిదూరంలో ఉన్న ఆ ప్రదేశం అశ్వతీర్థమని ప్రసిద్ధి కెక్కింది. ఋచీకుడు ఆ గుఱ్ఱాలను ఇచ్చాడు. గాధి సంతోషంలోనూ, ఆశ్చర్యంలోనూ, శాపభయంలోనూ మునిగిపోయాడు. ఆ ముప్పేటభావంతో కూతురుకు ఆ గుఱ్ఱాలను శుల్కంగా అంగీకరించాడు.

తే. గాధి యమ్మునిపుత్త్రు శీఘ్రమునఁ బెండ్లి । సేసె; నిట్లు, వరించి ఋచీకుఁ డధిక
సమ్మదమున గృహస్థ ధర్మమ్ము నడపు । చుండి, సంతాన కాంక్ష, నయ్యువిదతోడ. 107

ప్రతిపదార్థం: గాధి= గాధిరాజు; ఆ+మునిపుత్రున్= ఆ ఋచీకుడికి; శీఘ్రమునన్= వెంటనే; పెండ్లిచేసెన్= వివాహం చేశాడు; ఋచీకుఁడు= మునికొడుకు; ఇట్లు వరించి= ఈ విధంగా సత్యవతిని పెండ్లి చేసుకొని; అధిక= ఎక్కువ; సమ్మదమునన్= సంతోషంతో; గృహస్థ ధర్మమ్ము= గృహస్థుడి విధులను; నడపుచున్+ఉండి= నిర్వహిస్తూ; సంతానకాంక్షన్= సంతానంమీద కోర్కెతో; ఆ+ఉవిదతోడన్= భార్యతో.

తాత్పర్యం: రాజు ఋచీకుడికి తన కూతురు సత్యవతి నిచ్చి వెంటనే పెండ్లి చేశాడు. ఆ ముని గృహస్థాశ్రమాన్ని సంతోషంతో నడుపుతూ, సంతానం కావాలనుకొని భార్యతో (అన్నాడు).

వ. 'నీకుం బుత్రోత్పత్తి గావింపం జాలు చరువు సంపాదించెద ననియెఁ; దొల్లి దానితల్లి దనయల్లుని మహానుభావం బెఱుంగుటంజేసి, యా సత్యవతితో 'నాకుం దనయుండు గలుగ, దయసేయునట్లుగాఁ బుణ్యకర్తయగు నీభర్తం బ్రార్థింపు' మనినయది గావున నమ్మాట యమ్ముద్దియ యతనికిం జెప్పిన నప్పరమధర్మపరుండు. 108

ప్రతిపదార్థం: పుత్ర+ఉత్పత్తి= కుమారుడి పుట్టుకను; కావింపన్+చాలు= కలిగించగలుగు; చరువు= హవ్యము, హోమం చేసే అన్నం; సంపాదించెదను= తెస్తాను; అనియెన్= అన్నాడు; తొల్లి= పూర్వం; దానితల్లి= సత్యవతి తల్లి; తన అల్లుని= తన అల్లుడియొక్క; మహానుభావంబు= మాహాత్మ్యం, ఎఱుంగుటన్+చేసి= తెలియటంచేత; ఆ సత్యవతితోన్= సత్యవతితో; నాకున్= నాకు; తనయుండు+కలుగన్= కుమారుడు పుట్టేట్లు; దయచేయు+అట్లుగాన్= అనుగ్రహించేటట్లుగా; పుణ్యకర్త+అగు= పుణ్యకార్యాలు చేసేవాడైన; నీ భర్తన్= నీ పెనిమిటిని; ప్రార్థింపుము= నాకు మారుగా వేడుము; అనిన+అది= అని అడిగింది; కావునన్= కాబట్టి; ఆ+మాట= ఆ పలుకు; ఆ+ముద్దియ= ఆ ముగ్ధ (నూతన వధువు); అతనికిన్ చెప్పినన్= అతడికి చెప్పగా; ఆ+పరమ= ఆ గొప్ప; ధర్మపరుండు= ధర్మబుద్ధి కలవాడు.

తాత్పర్యం: ఋచీకుడు (క్రొత్తగా కాపురానికి వచ్చిన) భార్యతో ఇట్లా అన్నాడు. 'నీకు సంతానా న్నివ్వగల చరువును సంపాదిస్తాను' అన్నాడు. అంతకుముందే సత్యవతి తల్లి - గాధి భార్య - తన అల్లుడు మహానుభావుడన్న సంగతి తెలిసినది కాబట్టి కూతురుతో చెప్పింది 'నాకు కొడుకును అనుగ్రహించుమని నీ భర్తతో చెప్పు' మని. ఆమె భర్తతో ఆ మాట చెప్పింది. ఆ ధర్మమూర్తి (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. రెండు చరువు లొనర్చి, యొక్కండు బ్రాహ్మ । ణత్వ మత్యుజ్జ్వలముగ నొనర్ప, నొకటి
రాజభావంబు నధిక తీవ్రముగఁ జేయఁ । జాలునట్లుగ నిజతపశ్శక్తిఁ జేసి. 109

ప్రతిపదార్థం: నిజ= (ఋచీకుడు) తనయొక్క; తపః= తపస్సుయొక్క; శక్తిన్+చేసి= శక్తితో (తపశ్శక్తివలన); రెండు చరువులు= రెండు హవ్యములు; ఒక్కండు= ఒకటి; అతి+ఉజ్జ్వలముగన్= మిక్కిలి వెలిగేటట్లుగా; బ్రాహ్మణత్వము= బ్రాహ్మణలక్షణం; ఒనర్పన్= చేయగా; ఒకటి= మరొకటి; రాజభావంబు= రాజత్వం; అధిక= మిక్కిలి; తీవ్రముగన్= తీవ్రంగా; చేయన్+చాలునట్లుగన్= చేయగలిగేటట్లు; చేసెన్= (రెండు చరువులను) నిర్మించాడు.

తాత్పర్యం: ఒకటి గొప్పగా వెలిగే బ్రాహ్మణత్వం కల కుమారుడి నిచ్చేదీ, మరొకటి తీవ్రమైన రాజభావం కల కొడుకును కల్పించేదీ అయిన రెండు చరువులను ఋచీకుడు నిర్మించాడు.

వ. ఇట్లు గావించి, యా రెంటిని సత్యవతికిం జూపి, తత్ప్రభావంబు వేఱువేఱ యుపన్యసించి, క్షాత్రంబైన చరువు మీతల్లి కిచ్చి, బ్రాహ్మం బయిన దాని నీవు పుచ్చికొనుము. ఋతుకాలంబున నీతల్లి యశ్వత్థంబును, నీ వుదుంబరంబును నాలింగనంబు సేసి భక్తితో మీమీ చరువు లుపయోగించునది' యని నియోగించె; వారి యుపయోగంబు సమయంబున విధివశంబునంజేసి. 110

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కావించి= ఏర్పాటుచేసి; ఆ రెంటినిన్= ఆ రెండింటినీ; సత్యవతికిన్= సత్యవతికి; చూపి= చూపించి; తత్ ప్రభావంబు= వాని గొప్పశక్తిని; వేఱు, వేఱు+అ= విడివిడిగా; ఉపన్యసించి= వివరంగా చెప్పి; క్షాత్రంబు= క్షత్రియ సంబంధం; ఐన= అయిన; చరువున్= హవ్యమును; మీతల్లికిన్= మీ అమ్మకు; ఇచ్చి= ఒసంగి; బ్రాహ్మంబు= బ్రాహ్మణసంబంధం; అయినదానిన్= అయినచరువును; నీవు= నీవు; పుచ్చికొనుము= తీసుకో; ఋతుకాలంబునన్= నెలసరి ఋతువుకాలంలో; నీతల్లి= మీ అమ్మ; అశ్వత్థంబును= రావిచెట్టును; నీవు= నీవు; ఉదుంబరంబును= మేడిచెట్టును; ఆ లింగనంబు+చేసి= కౌగిలించుకొని; భక్తితోన్= గౌరవంతో; మీమీ చరువులు= మీయిరువురకు విడిగా ఏర్పాటయిన హవ్యములను; ఉపయోగించునది= పుచ్చుకోండి; అని; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; వారి ఉపయోగంబు సమయంబునన్= వారు అవి పుచ్చుకొనే వేళలో; విధివశంబునన్+చేసి= దైవం నిర్ణయం ప్రకారం.

తాత్పర్యం: భార్య కా రెండు చరువులను చూపించి, 'ఇది బ్రాహ్మణ కుమారుడిని, ఇది క్షత్రియుడైన కొడుకును ఇస్తుందని, దేని కది చెప్పి నీ తల్లికి క్షత్రియ చరువు నిచ్చి, నీవు బ్రాహ్మణ చరువును తీసికొని ఋతుకాలంలో నీవు మేడిచెట్టును, నీతల్లి రావిచెట్టును కౌగలించుకోవాలని చెప్పాడు. తరువాత వారుపయోగించేవేళ దైవవశాత్తుగా.

క. చరువులు, నమ్ముని చెప్పిన । తరువులు, వీడ్వడియె సుతకుఁ దల్లికి; నట్ల
య్యిరువురు నుపయోగింపఁగఁ । గరువులు దత్తత్ప్రకార కలితము లయ్యెన్. 111

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆ ఋచీకుడు; చెప్పిన= చెప్పినటువంటి; చరువులున్= అన్నములు; తరువులున్= చెట్లూ; సుతకున్= కూతురుకు; తల్లికిన్= జననికిన్; వీడ్వడియెన్= మారిపోయాయి, తారుమారయ్యాయి; అట్లు= ఆ విధంగా; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు; ఉపయోగింపఁగన్= వాడుకోగా; కరువులు= గర్భాలు; తత్+ప్రకార= ఆయా విధంగా; ముని చెప్పినట్లుగా; కలితములు= కూడినవి; అయ్యెన్= అయినవి.

తాత్పర్యం: ఋచీకుడు చెప్పిన చరువులూ చెట్లూ తల్లీ కూతుళ్ళకు మారిపోగా, ఆ ఇద్దరకు గర్భాలు కూడా ఆ విధంగానే తారుమారయ్యాయి.

వ. దివ్యబోధ మహనీయుండు గావున. 112

ప్రతిపదార్థం: దివ్య= దేవతాసంబంధమైన; బోధ= జ్ఞానం చేత; మహనీయుండు= మహానుభావుడు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: ఆ ముని దివ్యజ్ఞానం కల మహాత్ముడు కనుక. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. చ్యవననందనుండు సత్యవతీ గర్భ । భంగి సూచి, 'యకట! బ్రాహ్మణుండు
గాఁడు, తరుణి! నీదు కడుపులోపలి బిడ్డ । క్రూరుఁడైన రాచకొడుకు గాని.' 113

ప్రతిపదార్థం: చ్యవన నందనుండు= చ్యవనుడి కొడుకు (ఋచీకుడు); సత్యవతీ= సత్యవతియొక్క; గర్భభంగి= గర్భపద్ధతి; చూచి= పరీక్షించి; తరుణి!= సత్యవతీ! (స్త్రీ); నీదు= నీయొక్క; కడుపులోపలి= కడుపులో ఉన్న; బిడ్డ= పిండం; బ్రాహ్మణుండు కాఁడు; క్రూరుఁడు+ఐన= కఠినుడైన; రాచకొడుకుగాని= క్షత్రియకుమారుడు తప్ప.

తాత్పర్యం: ఋచీకుడు తన భార్య గర్భపద్ధతిని పరీక్షించి 'తరుణీ! నీ కడుపులో పెరిగే బిడ్డ దుర్మార్గుడైన రాచకొడుకు తప్ప బ్రాహ్మణ కుమారుడు కాడు'.

వ. అని పలికి, చరుతరువ్యత్యాసంబున నట్లగుట దేటపడం జెప్పిన, నబ్బోటి యత్యంత విషాదవేదనాదూయమాన మానసయై. 114

ప్రతిపదార్థం: అని; పల్కి= చెప్పి; చరు, తరు, వ్యత్యాసంబునన్= చరువు, చెట్టు తారుమారు కావటం వలన; అట్లు= ఆ విధంగా; అగుటన్= కావటం; తేటపడన్= స్పష్టంగా; చెప్పినన్= చెప్పగా; ఆ+బోటి= ఆమె (బోటి = స్త్రీ); అత్యంత= మిక్కిలి; విషాద= దుఃఖంతో; దూయమాన= బాధపడుతున్న; మానస+ఐ= మనస్సు కలదై.

తాత్పర్యం: చరువులు, చెట్లు తారుమారు కావటంవలన ఇట్లా జరిగిందని చెప్పటం విని ఆమె దుఃఖంతో బాధపడుతున్న మనస్సు కలదై.(తరువాతి పద్యంతో అన్వయం)

క. 'నీకుం బుట్టెడు కొడుకు వి । వేకనిధీ! బ్రాహ్మణత్వ విరహితుఁ డైనన్
లోకము మెచ్చునె? యట్టులు । గాకుండఁగఁ జేయు తపము గౌరవ మొప్పన్. 115

ప్రతిపదార్థం: వివేకనిధీ!= దివ్యజ్ఞానవంతుడా!; నీకున్= నీవంటిమునికి; పుట్టెడు= జన్మించే; కొడుకు; బ్రాహ్మణత్వ విరహితుఁడు+ఐనన్= బ్రాహ్మణజాతిలక్షణాలు లేనివాడైతే; లోకము మెచ్చునె?= జనం మెచ్చుకొంటుందా? అట్టులు= ఆ విధంగా; కాకుండఁగన్= కాని విధంగా; తపము= నీ తపస్సు; గౌరవము= గురుత్వం, గొప్పతనం; ఒప్పన్= వెల్లడి కాగా; చేయు= చేయుము.

తాత్పర్యం: నీవు జ్ఞానసంపన్నుడవు. నీకు పుట్టే కొడుకు బ్రాహ్మణత్వం కోల్పోయినవాడైతే లోకం మెచ్చుకోదు. కనుక నీవు తపస్సు, గొప్పతనం స్పష్టపడేటట్లుగా అట్లా కాకుండా చేయుము!

తే. నాకు నివ్వర మి 'మ్మని నమ్ర యగుడు, । 'వీడు బ్రాహ్మణుఁ డగుఁ గాక, వీని కొడుకు
నందు రాజత్వ సంపద యతిశయిల్లు' । ననియెఁ గరుణార్ద్రచిత్తుఁడై యత్తపస్వి. 116

ప్రతిపదార్థం: ఈ+వరము= ఈ వరం; నాకున్ఇమ్ము+అని= నాకు ఇమ్మని; నమ్ర= నమస్కరించుటకై వంగినది; అగుడున్= కాగా; ఆ తపస్వి= ఆ ఋషీకుడు; కరుణా= దయతో, ఆర్ద్ర= మెత్తబడిన; చిత్తుఁడు+ఐ= మనస్సు కలవాడై; వీఁడు= నీ కొడుకు; బ్రాహ్మణుఁడు+అగున్+కాక!; వీని కొడుకు= నీ కొడుకు యొక్క కొడుకు; రాజత్వ సంపద= రాజలక్షణాల సమూహంతో; అతిశయిల్లున్= ప్రకాశిస్తాడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'నాకు ఈ వరం ప్రసాదించు'మని నమస్కరించగా ఆ ముని దయతో ఇట్లా అన్నాడు. 'వీడు బ్రాహ్మణుడౌతాడు. కాని వీడికొడుకు రాజలక్షణాలు కలవా డౌతాడు' అని వరమిచ్చాడు.

వ. అ ట్లమ్ముని యావహించుట కతంబున సత్యవతీ పుత్త్ర పౌత్త్రులైన జమదగ్ని పరశురాములు గ్రమంబున బ్రహ్మక్షత్త్ర తేజోవిరాజితు లయిరి; గాధి భార్యకు జనియించి విశ్వామిత్త్రుండు. 117

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఆ+ముని= ఆ ఋషీకుడు; ఆవహించుట= ఆవరించటం; కతంబునన్= కారణంగా; సత్యవతీ పుత్త్రపౌత్త్రులైన= సత్యవతికి కొడుకు, మనుమలైన; జమదగ్ని పరశురాములు; క్రమంబునన్= వరుసగా; బ్రహ్మ క్షత్త్ర= బ్రాహ్మణ, క్షత్రియ; తేజోవిరాజితులు= తేజస్సుతో ప్రకాశించినవారు; అయిరి= అయ్యారు; గాధిభార్యకున్ జనియించి= గాధి భార్యకు పుట్టి; విశ్వామిత్రుండు.

తాత్పర్యం: ఆ విధంగా ఆ ముని ఆనతిచ్చిన విధంగా సత్యవతికి బ్రాహ్మణుడైన జమదగ్ని కొడుకుగా, క్షత్రియ తేజస్సుతో పరశురాముడు మనుమడై పుట్టాడు. గాధిభార్యకు విశ్వామిత్రుడు జన్మించాడు.

విశేషం: విశ్వామిత్రకథ కిది మొదలు. అతడు రాజై బ్రాహ్మణత్వం పొందటానికి హేతువుగా చెప్పబడిన పూర్వకథ. ఆవహించటమంటే తన తేజస్సుతో సంతానాన్ని ఆవరించి వారి భవిష్యత్తులు తారుమారు చేయటం. 113వ పద్యంలో చెప్పిన క్రూరుడైన రాచకొడుకును మనుమడిగా మార్చటం.

క. నరనాథుండై యుండియుఁ, । జరు తరు గుణ సంక్రమమున సద్బ్రాహ్మణతా
స్ఫురణంబు వడసెఁ, దపమును । గరమధికం బతనియందుఁ గలిగెఁ గుమారా!'. 118

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా! (ధర్మరాజా!); నరనాథుండు+ఐ= రాజై (ప్రజలకు పాలకుడై), ఉండియున్= ఉండికూడా; చరు= చరువుయొక్క; తరు= చెట్టుయొక్క; గుణసంక్రమమునన్= గుణాల తారుమారుచేత; సత్=మంచి; బ్రాహ్మణతా= బ్రాహ్మణత్వంయొక్క; స్ఫురణంబు= స్ఫురణ (మనస్సును ప్రేరేపించే సూక్ష్మస్వభావం); పడసెన్= పొందాడు; అతనియందున్= అతడిలో; తపమును= తపస్సుకూడా; కరము= మిక్కిలి; అధికంబు= ఎక్కువ; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: ధర్మరాజా! రాజై కూడా చరుతరు గుణాల తారుమారుచేత అతడిలో బ్రాహ్మణత్వ స్ఫురణ, తపశ్శక్తి మిక్కిలి ఎక్కువగా కలిగాయి'.

విశేషం: రాజు కావటం రాజుకొడుకైనందున, ఋషి కావటం ఋచీకుడి వరంవలన. ఇది లోపల స్ఫురణ. బూడిదలో నిప్పురవ్వవలె గాలికి మండి మంటలైనట్లు అణగిఉన్న స్ఫురణ క్రమంగా ఋషిత్వంగా పరిణమించింది.

ఇంతటితో ఈ కథ త్రెంచివేయటం జరిగింది. తర్వాతి కథ రామాయణంలో, భారతంలో ఇతర పర్వాలలో చెప్పబడింది. ఏ కథ ఎంతవరకు, ఎక్కడ చెప్పాలో కవి చేసికొన్న పథకాన్ని అనుసరించి ఉంటుంది. వ్యాసమహర్షి భారత రచనా ప్రణాళికలో ఇట్లాంటి విశేషాలు చాలా కన్పిస్తాయి.

వీతహవ్యుం డనురాజునకు బ్రాహ్మణత్వంబు గలిగిన ప్రకారము (సం. 13-8-1 (కుంభ)

వ. అనిన విని, ధర్మజుండు 'వీతహవ్యుం డనురాజు బ్రాహ్మణత్వంబుఁ బడసె నని విందు; నత్తెఱం గెఱింగింపు' మనవుడు నతనికి శంతనునందనుం డిట్లనియె; 'మనుసంభవుఁడైన శర్యాతి యన్వయంబున హైహయుండను నొక్క జనపతి జనియించి వత్సదేశాధీశుండై పొలిచె, నాతనికి వీతహవ్య నామంబునుం గలిగియుండుఁ; దదీయభార్యలు పదుండ్రు; వారలు వీరులుం బ్రబలులు నగు పుత్త్రుల నూర్వురఁ గాంచి; రమ్మహారథులు విక్రమ కుతూహలంబున. 119

ప్రతిపదార్థం: అనినన్ విని= అని భీష్ముడు పలుకగా ఆలకించి; ధర్మజుండు; వీతహవ్యుండు+అనురాజు= వీతహవ్యుడనే నరపాలుడు; బ్రాహ్మణత్త్వంబున్= బ్రహ్మణుతనమును; పడసెన్= పొందెను; అనివిందున్= అని విన్నాను; ఆ+తెఱంగు= ఆ విధం; ఎఱింగింపుము= తెలుపుము; అనవుడున్= అని ధర్మజుడు అడిగినమీదట; అతనిన్= ధర్మపుత్రునకు; శంతనునందనుండు= శంతనుని కొడుకు భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు; మనుసంభవుఁడు+ఐన=

మనువు వలన జన్మించిన; శర్యాతి= శర్యాతి అనువానియొక్క; అన్వయంబునన్= వంశంలో; హైహయుండు+అను= హైహయుడనే; ఒక్కజనపతి= ఒకరాజు; జనియించి= పుట్టి; వత్సదేశ+అధి+ఈశుండు+ఐ= వత్సదేశమునకు రాజై; పొలిచెన్= కీర్తి పొందాడు; అతనికిన్= ఆ హైహయునకు; వీతహవ్యనామంబునున్= వీతహవ్యుడనే పేరు కూడా; కలిగి ఉండున్= లభించి ఉండేది; తదీయ భార్యలు= అతనియొక్క పెండ్లాలు; పదుండ్రు= పదిమంది; వారలు= ఆ వీతహవ్యుని పెండ్లాలు; వీరులున్= శూరులూ; ప్రబలులున్+అగు= మిక్కిలి బలము గల్గిన; నూర్వురన్+పుత్త్రులన్= వందమంది కొడుకులను; కాంచిరి= పొందిరి; ఆ+మహారథులు= ఆ గొప్పవీరులు; విక్రమ కుతూహలంబునన్= శౌర్యోత్సాహంతో;

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'వీతహవ్యు డనేరాజు బ్రాహ్మణత్వాన్ని పొందా డని వింటాం. ఆ సంగతి తెలుపుము' అని అడుగగా అతడితో భీష్ముడిట్లా అన్నాడు. మనువుకు పుట్టిన శర్యాతివంశంలో హైహయుడు అనే రాజు పుట్టి, వత్సదేశాధీశుడై వెలుగొందాడు. అతడికి వీతహవ్యుడు అనే మరొకపేరు కూడా ఉండేది. అతడి పదిమంది భార్యలు వీరులైన నూరుమంది పుత్రులను కన్నారు. ఆ మహారథులు పరాక్రమ ప్రదర్శన కుతూహలంతో.(తరువాతి పద్యంతో అన్వయం)

సీ. హర్యశ్వుఁ గాశీశు నాజికిఁ బిలిపించి, । యొక్క యుమ్మడి లావు నుక్కు మెఱయఁ
బొదివి చంపిరి, వానిపుత్త్రుండు పట్టంబు । గట్టె, సుదేవుండు గ్రమ్మఱంగ
నురవడి నరిగి, యద్ధరణీశు ననిఁ దెగఁ । జూచి, రాహైహయసుతులు గడిమి,
నాతని నందనుఁ డగు దివోదాసుండు । రాజైన నమ్మహీరమణుమీఁద

తే. నడచి, వారు ఘనరణం బొనరించి సై । న్యంబుఁ ద్రుంచి,రోడి యతఁడు వాఱి,
ప్రకటసంయమిని భరద్వాజ మునిఁ గని । యధికభక్తి నతని నాశ్రయించి. 120

ప్రతిపదార్థం: హరి+అశ్వన్= ఆ పేరుగలరాజును (పచ్చని గుర్రాలు కలవాడు); కాశీ+ఈశున్= కాశీరాజును; ఆజికిన్= యుద్ధానికి; పిలిపించి= పిలిపింపజేసి; ఒక్క ఉమ్మడిన్= ఒకేసారి హఠాత్తుగా; లావున్= బలం; ఉక్కు= శక్తి; మెఱయన్= ప్రకాశించగా; పొదివి= క్రమ్ముకొని, మీదపడి; చంపిరి; వానిపుత్త్రుండు= వాడి కొడుకు; సుదేవుండు= సుదేవుడు; పట్టంబున్= రాజ్యపాలనను; కట్టెన్= కట్టుకొన్నాడు; క్రమ్మఱంగన్= మరల; ఆ హైహయసుతులు= ఆ హైహయుడి కొడుకులు; ఉరవడిన్= వేగంగా; అరిగి= వెళ్ళి; ఆ+ధరణీ+ఈశున్= ఆ భూమికి పతిని, సుదేవుడిని; అనిన్= యుద్ధంలో; కడిమిన్= మగతనంతో, పౌరుషంతో; తెగన్= చచ్చేటట్లు; చూచిరి= చేశారు (తెగఁజూచిరి= చంపారు); ఆతని= సుదేవుడి; నందనుఁడు= కొడుకు; అగు= అయిన; దివోదాసుండు= ఆ పేరుగలవాడు; రాజు+ఐనన్= రాజు కాగా; ఆ+మహీ+రమణుమీఁదన్= ఆ భూమికి పతిఅయిన వాడిమీద; వారు= ఆ హైహయసుతులు; నడచి= దండెత్తి; ఘన= గొప్ప; రణంబు= యుద్ధం; ఒనరించి= చేసి; సైన్యంబున్= సేనను; త్రుంచిరి= చంపారు; అతఁడు= ఆ దివోదాసుడు; ఓడి= ఓడిపోయి; పాఱి= పారిపోయి; ప్రకట= గొప్ప; సంయమినిన్= ప్రసిద్ధుడైన మునిని (ఇంద్రియనిగ్రహం కలవానిని); భరద్వాజమునిన్= భరద్వాజుడన్న మునిని; కని= దర్శించి; అధిక భక్తిన్= గొప్పభక్తితో; అతనిన్+ఆశ్రయించి= ఆతని ఆశ్రయం పొంది.

తాత్పర్యం: కాశీరాజైన హర్యశ్వుడిని యుద్ధానికి పిలిపించి ఒకేసారి అందరూ పైబడి పరాక్రమంతో చంపారు. అతడి తరువాత అతడి కొడుకు, సుదేవుడనే వాడు పట్టం కట్టుకోగా, మరల అతడినీ చంపారు. అతడి కొడుకు దివోదాసు డనేవాడు రాజైనాడు. వాడి మీదకు పోయి మరల వాడినీ ఓడించగా వాడు పారిపోయి ప్రసిద్ధమునీశ్వరుడైన భరద్వాజమునిని ఆశ్రయించాడు.

క. తనకులము వీతహవ్యుని । తనయులచేఁ ద్రుంపఁబడుట దగ నెఱిఁగింపన్
విని, యతఁ 'డోడకు, నీ కొక । తనయునిఁ గల్పింతు రిపువిదారణ నిపుణున్'. 121

ప్రతిపదార్థం: తనకులము= తన వంశమంతా; వీతహవ్యుని తనయులచేన్= వీతహవ్యుని కొడుకులచేత; త్రుంపన్+పడుటన్= చంపబడటం; తగన్= స్పష్టంగా; ఎఱిఁగింపన్= తెలుపగా; అతఁడు= ఆ భరద్వాజుడు; విని= ఆలకించి; ఓడకు= భయపడకు; నీకున్= నీకు; ఒక తనయునిన్= ఒక కొడుకును; రిపు= శత్రువులను; విదారణ= చంపటంలో; నిపుణున్= నేర్పరిని; కల్పింతున్= సృష్టిస్తాను.

తాత్పర్యం: తన వంశాన్ని వీతహవ్యుడి కొడుకులు చంపటం విన్పించగా ఆ భరద్వాజముని విని 'భయపడకుము. నీకొక శత్రుసంహారిఅయిన కొడుకును సృష్టిస్తాను'. (అన్నాడు)

వ. అని పుత్రకామేష్టి సేసినం బ్రభవించిన పుత్త్రుం డప్పుడ పదుమూఁడేండ్ల ప్రాయంబువాఁడయ్యెఁ బ్రతర్దన నామధేయుం డక్కుమారుం డమ్మహాత్ముని యనుగ్రహంబున వేదంబులు ధనుర్వేదంబును వేగంబ యధిగమించి. 122

ప్రతిపదార్థం: అని= అనిపల్కి; పుత్రకామ+ఇష్టి= పుత్రులను కోరిచేసే యజ్ఞం; చేసినన్+చేయగా; ప్రభవించిన= పుట్టిన; పుత్త్రుండు; పదుమూడేండ్ల ప్రాయంబువాఁడు= పదమూడుసంవత్సరాల వయసు కలవాడు; అయ్యెన్; ప్రతర్దన= ప్రతర్దనుడన్న; నామధేయుండు= పేరుగలవాడు; ఆ+కుమారుండు= ఆ పుత్రుడు; ఆ+మహాత్ముని= ఆ మహానుభావుడి; అనుగ్రహంబునన్= దయతో; వేదంబులు= వేదాలు; ధనుః+వేదంబును= విలువిద్యను; వేగంబు+అ= త్వరగా; అధిగమించి= అభ్యసించి (పొంది).

తాత్పర్యం: అని పుత్రుడిని కలిగించే యజ్ఞం చేసి ప్రతర్దనుడనే పేరుగల కొడుకును సృష్టించాడు. అతడు పుట్టటం తోటే పదమూడేళ్ళవాడుగా పుట్టి వేదాలను, విలువిద్యను నేర్చాడు.

చ. మునికృప నావహింపఁగ సముజ్జ్వల తేజముఁ బొంది ప్రీతిమై
జనకుఁడు యౌవరాజ్యపద సంగతుఁ జేసినఁ బేర్చి యవ్విభుం
డనుమతి సేయ నెత్తి చని, యాజిముఖంబున వీతహవ్య నం
దనతతి నెల్ల గీటడఁచె దర్ప మెలర్పఁగ నశ్రమంబునన్. 123

ప్రతిపదార్థం : ముని కృపన్= ముని దయతో; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; తేజమున్= ప్రకాశం, తేజస్సు; ఆవహింపఁగన్= ఆవరింపగా (క్రమ్ముకొనగా); పొంది= లభ్యమైన దానిని తీసికొని; జనకుఁడు= తండ్రి; ప్రీతిమైన్= ప్రేమతో, సంతోషంతో; యౌవరాజ్య పదసంగతున్= యువరాజపట్టస్థితి కలవాడినిగా; చేసినన్= చేయగా; పేర్చి= విజృంభించి; ఆ+విభుండు= ఆ రాజు (తండ్రి); అనుమతిచేయన్= ఆజ్ఞాపించగా; ఎత్తి= దండెత్తి; చని= పోయి; ఆజిముఖంబునన్= యుద్ధరంగంలో; వీతహవ్య= వీతహవ్యుడి యొక్క; నందన= కుమారుల; తతిన్= సమూహాన్ని; ఎల్లన్= అందరినీ; దర్పము= గర్వం; ఎలర్పఁగన్= ప్రకాశించగా; అశ్రమంబునన్= తేలికగా; గీటడఁచెన్= చంపాడు.

తాత్పర్యం: మునిదయతో ఆవరించిన తేజస్సును పొంది, తండ్రి తనను యువరాజును చేసి ఆజ్ఞాపించగా దండెత్తి పోయి వీతహవ్యుడి కొడుకుల నందరినీ అవలీలగా శౌర్యంతో చంపాడు.

క. తనయులఁ దెగటార్చి వడిం । దనమీఁదం గవిసినం బ్రతర్దను శౌర్యం
బున కలికి వీతహవ్యం । డనయము వెసఁ బాఱె భృగువునాశ్రమమునకున్. 124

ప్రతిపదార్థం: తనయులన్= కొడుకులను; తెగటార్చి= చంపి; వడిన్= వేగంగా; తనమీఁదన్= తనమీదకు; కవిసినన్= దూకగా; వీతహవ్యుండు= రాజు; ప్రతర్దను శౌర్యంబునకున్= ప్రతర్దనుని విక్రమమునకు; అలికి= భయపడి; అనయమున్= మిక్కిలి; వెసన్= వేగంగా; భృగువు నాశ్రమమునకున్= భృగుమహర్షి ఆశ్రమానికి; పాఱెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: ప్రతర్దనుడు కొడుకులనందరినీ చంపి వీతహవ్యుడి మీదకు దూకగా, అతడు భయపడి భృగుమహర్షి ఆశ్రమానికి పారిపోయాడు.

ఆ. పాఱి, భీతి దోఁపఁబల్క, నమ్ముని తన । దైన శిష్య సమితి లోన నునిచె
నతనిఁ, గాశిరాజసుతుఁడును, వెనువెంటఁ । దగిలి యచటి కరిగి, తగువిధమున. 125

ప్రతిపదార్థం: పాఱి= పరుగెత్తి; భీతి= భయం; తోఁపన్= స్పష్టపడేటట్లు; పల్కన్= పలుకగా; ఆ+ముని= ఆ ముని; అతనిన్= వీతహవ్యుడిని; తనదైన= తనయొక్క; శిష్యసమితిలోనన్= శిష్య సమూహం లోపల; ఉనిచెన్= దాచాడు; కాశిరాజసుతుఁడును= కాశీరాజు కొడుకు ప్రతర్దనుడు కూడా; వెనువెంటన్= అతని వెనుకనే; తగిలి= వెంబడించి; అచటికిన్= ఆ భృగుని ఆశ్రమానికి; అరిగి= వెళ్ళి; తగువిధమునన్= తగిన పద్ధతిగా.

తాత్పర్యం: పారిపోయి భయం తోపగా పలికినంతనే ఆ ముని అతడిని తన శిష్య సమూహంలో దాచాడు. కాశీరాజు కొడుకు కూడా వెన్నంటి ఆశ్రమానికి వచ్చి తగురీతిగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. మునిపతికిని వినయము సే । సిన నిట రాకకుఁ గతంబు సెప్పు మనియె న
జ్జనవంద్యుఁ డక్కుమారుం । 'డనఘా! మధ్యస్థవృత్తివై వినవలయున్'. 126

ప్రతిపదార్థం: మునిపతికిని= మునిరాజునకు; వినయముచేసినన్= నమస్కరించగా; ఆ+జనవంద్యుఁడు= ఆ జనులకు నమస్కరించ దగిన మునిరాజు; ఇట రాకకున్= ఇచటికి వచ్చుటకు; కతంబు= కారణం; చెప్పుము+అనియెన్= చెప్పుము అన్నాడు; ఆ+కుమారుండు= ఆ కాశీరాజు కొడుకు; అనఘా!= పాపం లేనివాడా!; మధ్యస్థవృత్తివై= నడుమసాక్షివై; వినవలయున్= వినాలి.

తాత్పర్యం: మునిశ్రేష్ఠుడికి నమస్కరించినంతనే ఆయన 'నీ విక్కడకు వచ్చిన కారణ మేఁ?'మని అడిగాడు. ఆ రాజకుమారుడు 'మహాత్మా! నీవు మా మధ్య సాక్షివై వినాలి'.

వ. అని పలికి, తమకులంబు వీతహవ్యుని కొడుకులచేత నశించిన విధంబును, దాను వారల నందఱ ద్రుంచుట యును, వీతహవ్యం డాహవంబునం దనకు నోడి పాఱుటయును జెప్పి, 'మునీంద్రా! యారా జిటవచ్చె; నాతనిం బొలియించుటకై వచ్చితి' ననిన నత్తపోధనసత్తముండు. 127

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; తమకులంబు= తమ వంశం; వీతహవ్యుని కొడుకులచేతన్= వీతహవ్యుని కుమారులచేత; నశించిన విధంబును= నాశనమైన పద్ధతిని; తాను= ప్రతర్దనుడనే పేరుగల తాను; వారలన్+అందఱన్= వారినందరినీ; ద్రుంచుటయును= చంపటాన్నీ; వీతహవ్యుండు= వీతహవ్యుడు; ఆహవంబునన్= యుద్ధంలో; తనకున్= తనకు; ఓడి=

పరాజయం పొంది; పాఱుటయును= పారిపోవటాన్నీ; చెప్పి= తెలియజేసి; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడైనవాడా! ఆరాజు= ఆ వీతహవ్యుడనే నరపతి; ఇటన్= ఇచటికి; వచ్చెన్= వచ్చాడు; ఆతనిన్= అతనిని; పొలియించుటకై= రూపుమాపటానికై; వచ్చితిని= వచ్చాను; అనినన్= అని చెప్పగా; ఆ తపస్+ధన, సత్తముండు= తపస్సే ధనంగా గల గొప్పవాడైన ఆ భృగుమహర్షి.

తాత్పర్యం: అని చెప్పి తన వంశమంతా వీతహవ్యుడి కొడుకులచేతిలో నాశనం కావటం, తాను వాళ్ళ నందరినీ చంపటం, వీతహవ్యుడు యుద్ధంలో తనచేత ఓడిపోయి పారిపోవటం చెప్పి 'మునీంద్రా! ఆ రాజిక్కడ దాక్కున్నాడు కనుక అతడిని చంపటానికై వచ్చాను' అని చెప్పగా విని ఆ మునిశ్రేష్ఠుడు (అన్నాడు).

క. 'విను మిచ్చట నృపకుల సం । జనితుఁడు, లేఁ; డింతయుం బ్రశస్త మహీదే
వ నికాయమ; కనుఁగొను'మని । తన శిష్య ప్రతతిఁ జూపె దయ చిగురొత్తన్. 128

ప్రతిపదార్థం: వినుము= (విషయం చెప్పుతాను జాగ్రత్తగా) వినుము; ఇచ్చటన్= ఇక్కడ; నృపకుల= రాజవంశంలో; సంజనితుఁడు= పుట్టినవాడు; లేఁడు; ఇంతయున్= వీరంతా; ప్రశస్త= శ్రేష్ఠమైన; మహీదేవ= భూదేవతల, బ్రాహ్మణులయొక్క; నికాయము+అ= సమూహమే; కనుఁగొనుము= చూడుము; అని= అట్లాచెప్పి; దయ= కారుణ్యం; చిగురు+ఒత్తన్= పల్లవించగా, చిగురించగా; తన శిష్య= తన శిష్యులయొక్క; ప్రతతిన్= సమూహాన్ని, చూపెన్= చూపించాడు.

తాత్పర్యం: 'చెప్పుతున్నాను వినుము. ఇక్కడ రాజవంశీయు డెవడూ లేడు. ఉన్న వారంతా బ్రాహ్మణులే. చూడు' మని దయతో వీతహవ్యుడితో కూడియున్న తన శిష్యులను చూపించాడు.

వ. చూపినం జూచి. 129

తాత్పర్యం: అలా చూపించగా తాను పరీక్షగా చూచి.

ఆ. అతఁడు నగుచు, భృగుని యడుగుల కెఱఁగి, మ । హాత్మ! దీన నేఁ గృతార్థవృత్తి
నైతిఁ బగతు నిట్లు జాతికిం బెడఁ బాపి । గాసి గాఁగఁ జేయఁగంటిఁ గాన. 130

ప్రతిపదార్థం: అతఁడు= ఆ కాశీరాజు కొడుకు; నగుచున్= నవ్వుతూ; భృగుని అడుగులకున్= భృగుమహర్షి పాదాలకు; ఎఱఁగి= నమస్కరించి; మహాత్మ!= మహానుభావా!; దీనన్= దీనితో; నేన్= నేను; కృత+అర్థవృత్తిన్+ఐతిన్= నెరవేరిన ప్రయోజనం కలవాడనైనాను; ఇట్లు= ఈ విధంగా; పగతున్= శత్రువును; జాతికిన్= తన జాతికి; పెడన్+పాపి= దూరం చేసి; గాసికాఁగన్= దుఃఖపడువానినిగా; చేయన్ కంటిన్= చేయగలిగాను; కానన్= కనుక.

తాత్పర్యం: అతడు నవ్వి మహర్షి పాదాలకు నమస్కరించి, 'మహాత్మా! నేను దేనికొరకు ఇంతకాలం ప్రయత్నించానో, ఆ ప్రయోజనం నెరవేర్చుకోగలిగాను. అదేమంటే క్షత్రియుడైన వీతహవ్యుడిని అతడి జాతికి దూరం చేసి బాధపడేట్లు చేయగలిగాను.

క. కలుగునె యమోఘ మగు నీ । పలుకున, కన్యతత్వ? మేను బనివినియెద, న
న్నలఘు కృపఁ జూడు మని తగఁ । బలికిన, ముని ప్రీతి నాన్నృపతి వీడ్కొలిపెన్. 131

ప్రతిపదార్థం: అమోఘము= వమ్ముకాని; నీపలుకునకున్= నీ వాక్కునకు; అనృతత్వము= అసత్యం; కలుగునె?= అంటునా? ఏను= నేను; పని వినియెదన్= సెలవు తీసికొంటాను; నన్నున్= నన్ను; అలఘుకృపన్= గొప్పదయతో; చూడుము= రక్షించుము; అని; తగన్= తగునట్లుగా (పెద్దలతో మాట్లాడేపద్ధతిగా); పలికినన్= పలుకగా; ముని= భృగుమహర్షి; ప్రీతిన్= ప్రేమతో; ఆ నృపతిన్= ఆ రాజును; వీడ్కొలిపెన్= పంపాడు.

తాత్పర్యం: మహాత్మా! నీ మాటకు అసత్యదోష మంటుతుందా? ఇక నేను సెలవు తీసికొంటాను. నన్ను దయతో చూడుము' అని చక్కగా (వినయంగా) చెప్పేసరికి ముని సంతోషంతో ఆ రాజును పంపాడు.

ఆ. వీతహవ్యుఁడును మహాతపస్సందీప్తుఁ । డైన యమ్మునీంద్రు నప్రతర్క్య
భంగి భాషణముల బ్రాహ్మణుఁ డై గృత్స । మద సమాఖ్యుఁ గాంచె మహితసుతుని. 132

ప్రతిపదార్థం: వీతహవ్యుఁడును= వీతహవ్యుడు కూడా (తర్వాత); మహాతపః= గొప్ప తపస్సుచేత; సందీప్తుఁడు+ఐన= ప్రకాశించే; ఆ+ముని+ఇంద్రు= ఆ మునిశ్రేష్ఠుడియొక్క; అప్రతర్క్య= తర్కించరాని; భంగి= పద్ధతిగల; భాషణములన్= మాటలతో; బ్రాహ్మణుఁడు+ఐ= విప్రుడై; మహిత= గొప్ప; సుతునిన్= కొడుకును; గృత్సమద= గృత్సమదుడన్న; సమాఖ్యున్= పేరుగలవాడిని; కాంచెన్= కన్నాడు, పొందాడు.

తాత్పర్యం: తరువాత వీతహవ్యుడు కూడా మహాతపశ్శక్తి గల ఆ మునీంద్రుడి గొప్ప మాటల ప్రభావంతో బ్రాహ్మణుడై గృత్సమదు డనే కొడుకును కన్నాడు.

వ. తత్పుత్రపౌత్త్ర క్రమంబున సుతేజసుండును, వర్చసుండును, నిహవ్యుండును, వితత్యుండును, సత్యుండును, సంతుండును, శ్రవసుండును, దమసుండును, బ్రకాశుండును, వాగీంద్రుండును, బ్రమతియును, రురుండును, సముదుండును, శునకుండును, శౌనకుండును నన మహాద్విజులు జన్మించి; రిట్లు విద్యా మౌక్తిక శ్రేణి వంశంబగు మునివంశంబునకు మూలం బయి యవ్వీతహవ్యుండు భవ్యకీర్తి వడసెఁ; బాండవాగ్రజా! యింక నెయ్యది యడిగెద వడుగు' మనుటయు, నతండు 'దైవంబును, బౌరుషంబును నను రెంటియందు నెయ్యది యధికంబు సెప్పు' మనిన నప్పురుషవరుండు 'దొల్లి' యిట్లు వసిష్ఠుండు బ్రహ్మ నడిగిన నమ్మహాత్ముం డుపదేశించిన వాక్యంబుల యర్థంబు లుపన్యసించెద నాకర్ణింపు' మని యిట్లనియె. 133

ప్రతిపదార్థం: తత్= అతడియొక్క; పుత్త్రపౌత్త్ర = కొడుకులు, మనుమల; క్రమంబునన్= వరుసలో; సుతేజసుఁడు, వర్చసుఁడు, నిహవ్యుఁడు, వితత్యుఁడు, సత్యుఁడు, సంతుఁడు, శ్రవసుఁడు, దమసుఁడు, ప్రకాశుఁడు, వాగీంద్రుఁడు, ప్రమతి, రురుఁడు, సముదుఁడు, శునకుఁడు, శౌనకుఁడు; అనన్= అన్న పేర్లుగల; మహాద్విజులు= మహాబ్రాహ్మణులు; జన్మించిరి= పుట్టిరి; ఇట్లు= ఈ విధంగా; విద్యా= విద్యలన్న (14 శాస్త్రవిద్యలు); మౌక్తిక= ముత్యాల; శ్రేణి= వరుస; సమూహం; వంశంబు= కులం; అగు= అయిన; మునివంశంబునకున్= ముని కులానికి; మూలంబు+అయి= మొదలై; ఆ+వీతహవ్యుండు= ఆ వీతహవ్యుడు; భవ్య= శ్రేష్ఠమైన; కీర్తిన్= పేరు ప్రఖ్యాతులను; పడసెన్= పొందాడు; పాండవ+అగ్రజా! పాండవులలో తొలుత పుట్టిన ధర్మజా! ఇంకన్= మరి; ఏ+అది= (ఎయ్యది)= ఏది; అడిగెదవు= చెప్పుమందువో; అడుగుము= చెప్పుము; అనుటయున్= అనిపల్కగా; అతండు= ధర్మజుడు; దైవంబును= అదృష్టం; పౌరుషంబును= మానవప్రయత్నం; (ఇది మనిషియొక్క కృషి దానిఫలితమిచ్చే దాని పేరు దైవం. అది కన్పించదు); అను రెంటియందున్= అనే రెండింటిలో; ఏ+అది(ఎయ్యది)= ఏది;

అధికంబు= గొప్పది; చెప్పుము= తెల్పుము; అనినన్= అని అడుగగా; ఆ+పురుషవరుండు= ఆ మానవశ్రేష్ఠుడు, భీష్ముడు; తొల్లి= పూర్వం; ఇట్లు= ఈ ప్రకారం; వసిష్ఠుండు= వసిష్ఠుడు; బ్రహ్మన్= బ్రహ్మదేవుని; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఉపదేశించిన= చెప్పిన; (మంత్రోపదేశమన్న మాటలో ఉపదేశం వేరు) వాక్యంబుల= మాటలయొక్క; అర్థంబులు= అభిప్రాయం, సారాంశం; ఉపన్యసించెదన్= చెపుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వీతహవ్యుడికి సుతేజసుడు మొదలుగాగల పుత్రపౌత్రు లనేకులు జన్మించారు. వారంతా మహాబ్రాహ్మణులై అనేక విద్యలనే ముత్యాలను పండించారు. ఆ వంశానికి మూలం వీతహవ్యుడే. నాయనా! పాండవాగ్రజా! ఇంకా ఏమడుగుతావో అడుగు చెప్పుతాను. అన్నంతనే ధర్మరా జడిగాడు. 'మహాత్మా! దైవం, పౌరుషం - ఇందులో ఏది గొప్పది? (కొందరు మనిషి చేతిలో ఏమున్నది అంతా దైవానిదే అంటున్నారు. మరికొందరు దేవుడు అన్నం పెట్టుతాడా? మనమే పండించుకొనాలి అంటున్నారు కనుక) అని అడిగితే ఆ మానవోత్తముడు భీష్మ డన్నాడు. 'పూర్వం నీవలెనే వసిష్ఠుడు బ్రహ్మ నడిగాడు. ఆయన చెప్పిన మాటలు నీకు చెప్పుతాను. సారాంశం గ్రహించుము' అని ఇట్లా చెప్పసాగాడు.

విశేషం: అలం: శ్లేష. విద్యామౌక్తిక శ్రేణి వంశంబు - వంశము : వెదురుపొద అని కూడా అర్థమున్నది. అది ఏ విధంగా అల్లుకుపోతుందో అలాగే కులం కూడా పుత్ర పౌత్రాది రూపంగా అధికమౌతుంది. వెదురులో ముత్యాలు పుట్టుతాయని కవిసమయం ఉన్నది. ఇక్కడ విద్యలే ముత్యాలు. అందుకని వంశమంటే రెండర్థాలలో కవిబ్రహ్మ ప్రయోగించాడని భావించాలి.

భీష్ముండు ధర్మరాజునకు దైవపౌరుషంబులతెఱం గెఱింగించుట (సం. 13-6-1)

క. క్షేత్రంబు పురుష కారము । ధాత్రీశ్వర! బీజ మరయ దైవము! రెండున్
సూత్రపడఁ గూడె నేనిం । బాత్రం బగుఁ, గర్మకరుఁడు ఫలమున కెందున్. 134

ప్రతిపదార్థం: ధాత్రీ+ఈశ్వర!= భూమికి పాలకుడైనవాడా! (ధర్మజా!); పురుషకారము= మానవప్రయత్నం, పౌరుషం; క్షేత్రంబు= భూమి (స్త్రీ); దైవము= అదృశ్య శక్తి (కన్పించని అదృష్టశక్తి); అరయన్= పరికించగా; బీజము= విత్తు; రెండున్= ఈ రెండు; సూత్రపడన్= ఒకే సూత్రానికి సరిగా; కూడెన్+ఏనిన్= కూడగలిగితే; కర్మకరుఁడు= కర్మ చేసే మనిషి (పౌరుషశక్తి); ఫలమునకున్= ఫలితానికి; ఎందున్= ఎప్పుడైనా, ఎక్కడైనా; పాత్రంబు= అర్హుడు; అగున్= కాగలడు.

తాత్పర్యం: పౌరుషం చేను. దైవం విత్తు. ఈ రెండు కలవగలిగేటట్లు ప్రయత్నించే మనిషి చక్కని ఫలం పొందగలడు.

విశేషం: దైవం+పౌరుషం = మానవజీవితం; బీజం+క్షేత్రం= పంట; మనిషి జీవితంలో ఈ రెండూ విరుద్ధశక్తులు. ఒకటి పౌరుషం మన చేతిలో ఉన్నది. ఫలమిచ్చే అదృష్టం - కన్పించని శక్తి దైవం. ఈ రెండూ కలిస్తే మానవజీవితం సఫలమౌతుంది. ఈ విధంగా భారతీయ సంస్కృతి రెంటినీ - మనిషినీ, దైవాన్నీ కలుపుకొన్నది. జీవిత సాఫల్యాని కిదే మార్గం.

క. విను, పురుషుఁడు గావింపని । పనులకు దైవ మది యెట్లు ఫల మొనరించున్?
జనములు గార్యము నడపఁగ । ననుకూలత నిచ్చుఁ గాక యయ్యైఫలముల్. 135

ప్రతిపదార్థం: విను= జాగ్రత్తగా ఆలకించుము (అన్న అర్థంలోనే ఈ క్రియను ప్రయోగిస్తాడు కవిబ్రహ్మ); పురుషుఁడు= వ్యక్తి; మనిషి (మగవాడని అర్థం లేదు. స్త్రీకూడా); కావింపని= చేయని; పనులకున్= కార్యాలకు; దైవము= అదృష్టం; అది ఎట్లు= అది ఏ విధంగా; ఫలమున్= ఫలితమును; ఒనరించున్?= చేస్తుంది?, ఇస్తుంది?; జనములు= మానవులు; కార్యమున్= పనులను; నడపఁగన్= చేయగా; అయ్యై ఫలముల్= ఆయా ఫలితాలు; అనుకూలతన్= ఆనుకూల్యంతో; ఇచ్చున్ కాక= ఇస్తాడు తప్ప.

తాత్పర్యం: మనిషి ఏ పనీ చేయకుండా కూర్చుంటే దైవం మాత్ర మేం చేస్తుంది? మనుషులు పనులు చేస్తే ఆయా ఫలాలను దైవ మిస్తుంది తప్ప. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: మనిషిలోని అలసతను, బద్ధకాన్ని పోగొట్టే సూక్తి ఇది. చాలా గొప్పది.

తే. పౌరుషమ్ము. దైవంబు తోడ్పాటు లేక । ఫలముఁ బొందంగనేరదు పార్థివేంద్ర!
విత్తు సహకారి గాకున్న రిత్తనేల । వంధ్య మగుఁ గాక, తా ఫలవంత మగునె? 136

విశేషం: పార్థివ+ఇంద్ర!= రాజులలో గొప్పవాడా!; పౌరుషంబు= పురుష ప్రయత్నం; దైవంబు= దైవముయొక్క; తోడ్పాటు లేక= సహకారం లేక; ఫలమున్= ఫలితాన్ని; పొందంగనేరదు= పొందలేదు; విత్తు= గింజ; సహకారి= తోడ్పాటు, తోడు; కాకున్నన్= కాకపోతే; రిత్తనేల= వట్టినేల; వంధ్యము= గొడ్డుబోతు (ఎడారి); అగున్+కాక= అవుతుంది తప్ప; తాన్= నేల; ఫలవంతము+అగునె!= ఫలిస్తుందా?

తాత్పర్యం: రాజులలో గొప్పవాడా! దైవం సహకరించకపోతే పౌరుషం ఫలవంతం కాలేదు. విత్తు తోడ్పాటు లేకుండా నేల బీడుపడ్డట్లు అవుతుంది తప్ప ఫలాన్ని ఇస్తుందా? (ఇవ్వదని భావం.)

తే. మేలు రెండు లోకంబుల మేల తెచ్చు; । గీడు సేసినఁ దప్పదు కీడ యగుట
కాన పురుషవర్తనమున కానుకూల్య । శీల మగు దైవ మది ఫలసిద్ధిఁ జేయు. 137

ప్రతిపదార్థం: మేలు= ఇతరులకూ తనకూ క్షేమం కోరితే; రెండు లోకంబులన్= ఈ లోకంలో పరలోకంలో; మేలు+అ, తెచ్చున్= క్షేమాన్నే కలిగిస్తుంది; కీడు+అ= ఆపద; చేసినన్= చేస్తే; కీడు+అ= కీడే; అగుట తప్పదు= కాక తప్పదు; కాన= కాబట్టి; పురుషవర్తనమునకున్= మనిషి నడవడికి; ఆనుకూల్య= అనుకూలతను కల్పించే; శీలము= స్వభావం; అగు= అయిన; దైవము= అదృష్టం; అది= ఆ దైవం; ఫలసిద్ధిన్= ఫలమును కల్గించటం; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: మేలు చేస్తే రెండు లోకాలలో మేలే. కీడు చేస్తే కీడే. కనుక మనిషి ప్రయత్నానికి అనుకూలించే స్వభావం కల దైవం పని ఏదైతే అదే ఫలితాన్నిస్తుంది. (మేలో కీడో నీవే ఎంచుకొని చేయాలి)

క. అనలం బించుక యైనఁ బ । వనుచే వెలుఁగొందు మాడ్కి వర్ధనముం బొం
దును సత్కర్మాచరణం । బున దైవము నానుకూల్యము గురుప్రవరా! 138

ప్రతిపదార్థం: కురు ప్రవరా!= కురువంశంలో శ్రేష్ఠుడా!; అనలంబు= అగ్ని; ఇంచుక+ఐనన్= కొంచెమైనా; పవనుచేన్= గాలిచేత; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; మాడ్కిన్= విధంగా; సత్కర్మ = మంచిపనులు; ఆచరణంబునన్= చేయటంవలన; దైవము= దైవముయొక్క; ఆనుకూల్యము= అనుకూలత; వర్ధనమున్= పెరుగుటను; పొందును= పొందగలదు.

తాత్పర్యం: ధర్మజా! నిప్పు కొంచెమైనప్పటికీ గాలితో పెరిగి ప్రకాశించినట్లు మంచిపనులు చేయటంవలన దైవానుకూల్యం పెరుగుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. నేయి పొలు పఱిన దీవియ । మాయుకరణిఁ, గర్మశుద్ధి మలిఁగిన హీన
త్వాయత్తంబై తానును । మాయును దైవానుకూల్య మహిమ మహీశా! 139

ప్రతిపదార్థం: మహీ+ఈశా!= రాజా!; నేయి= నెయ్యి; పొలుపు= ఉనికి; అఱిన= నశించిన; దీవియ= దీపం; మాయుకరణిన్= ఆరిపోయినట్లు; కర్మశుద్ధి= పనులలో స్వచ్ఛత్వం; మలిఁగినన్= నశించిపోగా; దైవ+ఆనుకూల్య= దైవానుకూలత్వముయొక్క; మహిమ= మహత్త్వం; తానును= తాను కూడా; మాయును= నశిస్తుంది.

తాత్పర్యం: రాజా! నేయి తగ్గిపోతే దీపకాంతీ తగ్గిపోతుంది కదా! అట్లాగే మనిషి చేసే కర్మలలో పవిత్రత లోపిస్తే దైవానుకూలత కూడా లోపిస్తుంది.

విశేషం: అలం : ఉపమ. ఈ పద్యంలో దీపం అందమైన ఉపమానం. అది నేతి దీపం. అదీ పూజలలో వెలిగించే దీపం. కనుక ఆరిపోకూడదు. మనిషి పరిశుద్ధ కర్మ నెయ్యి. దైవం అనుకూలించటం దీపం వెలగటం. ఆ వెలుగు ఇంటికి అలంకారమే కాక ఏదెక్కడ ఉన్నదో కన్పింప చేస్తుంది. అట్లాగే సత్కర్మ కూడా.

తే. పరశురాముఁడు, భృగుఁడును, బలియు, లోను । గాఁగ మహనీయ పురుషులు గర్మసూక్ష్మ
భంగిఁ గలుషితదైవప్రభావితాత్ము । లైరి; కర్మంబు దైవంబు నలఁతు లెట్లు. 140

ప్రతిపదార్థం: పరశురాముఁడు, భృగుఁడును; బలియున్= బలిచక్రవర్తి; లోనుగాఁగన్= మొదలైన; మహనీయ పురుషులు= మహానుభావులైన వ్యక్తులు; కర్మ= కర్మలయొక్క; సూక్ష్మభంగిన్= రహస్యం వలన; కలుషిత= మలినం చేయబడిన, దైవప్రభావిత= దైవ ప్రభావానికి లోనైన; ఆత్ములు+ఐరి= ఆత్మలు కలవారయ్యారు; కర్మంబు= కార్యము; దైవంబు= దైవమూ; అలఁతులు= తక్కువవి; ఎట్లు= ఎట్లాగా; ఏ విధంగా? (తక్కువ విషయాలు కావు).

తాత్పర్యం: పరశురాముడు మొదలైన వారు మహాత్ములయినా కర్మలు బహుసూక్ష్మరహస్యం కలవి కావటంచేత వారికి దైవం కలుషితమైపోయింది. దాని ప్రభావానికి వారూ లోనుకాక తప్పలేదు. కాబట్టి కర్మ, దైవం తక్కువ విషయాలుకావు.

క. విను, పౌరుషమును, దైవము । నన రెండును గార్యఫలము నందింపఁగ నె
ట్టనఁ గారణములు గావున । జననాయక! సదృశములు విచారింపంగన్' 141

ప్రతిపదార్థం: జననాయక!= ప్రజలకు నాయకుడైనవాడా!; విను= ఆలకించుము; విచారింపంగన్= ఆలోచిస్తే; పౌరుషమును= పురుష ప్రయత్నమూ; దైవమున్= దేవుడూ; అనన్= అనే; రెండును= రెండూ కూడా; కార్యఫలమును= పనికి ఫలితాన్ని, అందింపఁగన్= అందివ్వటానికి; నెట్టనన్= తప్పనిసరి అయిన; కారణములు= హేతువులు; కావునన్= కాబట్టి; సదృశములు= రెండు సమానాలే.

తాత్పర్యం: ఆలోచిస్తే ఒక పని ఫలవంతం కావటానికి దైవ పౌరుషాలు రెండూ ఉండి తీరాలి. కనుక ఆ రెండింటిలో ఎక్కువ తక్కువలు లేవు. రెండూ సమానమే'.

వ. అనిన విని ధర్మ తనయుండు 'సత్కర్మంబుల నయ్యెడు ఫలంబులు వినవలతు' ననుటయు నక్కురుసత్తమునకు నక్కురు పితామహుం డిట్లనియె. 142

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= యముడి కుమారుడు (ధర్ముఁడు= యముడు), సత్కర్మంబులన్= మంచిపనులవలన; అయ్యెడు= కలిగే; ఫలంబులు= ఫలితాలు; వినన్= వినాలని, వినటానికి; వలతున్= కోరుకొంటున్నాను, ఇష్టపడుతున్నాను; అనుటయున్= అనగా; ఆ+కురు సత్తమునకున్= కురువంశంలో ఉత్తముడైన వాడికి - ధర్మరాజుకు; ఆ+కురు పితామహుండు= కౌరవులకు తాత - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పటం విని ధర్మరాజు 'మంచి పనులకు కలిగే ఫల మెట్లా ఉంటుందో వినాలని కుతూహలంగా ఉన్న' దనగానే తాత భీష్ము డిట్లా అన్నాడు.

సీ. 'అధ్వపరిశ్రాంతుఁ డగు వింతవానికి । నన్నం బిడిన ఫల మట్టి దిట్టి
దనఁ బెద్ద యగ్ని సమారాధనమునకుఁ । బౌరుష శ్రేష్ఠత భవ్యదాన
ములకుఁ, దత్తద్వస్తువులమహామహిమలు । మౌనంబునకుఁ బరిజ్ఞానశక్తి
యతుల తపంబున కధికభోగము లహిం । సకు రూప, బల, చిదైశ్వర్య, సిద్ధి

తే. బ్రహ్మచర్యమునకుఁ బరమాయు వుపవాస । ములకుఁ జిత్తశుద్ధి ఫలజలంబు
లాహరించి యునికి కాధిరాజ్యము, పత్ర । భక్షతకు, దివంబు ఫలము లధిప! 143

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; (అధి= పైనుండి అధిష్ఠించి; ప= పాలించేవాడు); అధ్వ= బాటలో; పరిశ్రాంతుఁడు+అగు= అలసినవాడైన; వింతవానికిన్= పరాయివాడికి (దారిన పోయే వాడికి); అన్నంబు= అన్నం; ఇడినఫలంబు= పెట్టినదానికి వచ్చే ఫలితం; అట్టిది+ఇట్టిది అనన్= అట్లాంటిది, ఇట్లాంటిది, అనటానికి; పెద్ద= గొప్పది; అగ్ని= అగ్నియొక్క; సమారాధనమునకున్= చక్కని పూజకు; పౌరుషశ్రేష్ఠత= శ్రేష్ఠమైన ప్రయత్నం (ఫలం); భవ్యదానములకున్= మంచి దానకర్మలకు (మంచివారికి చేసే దానకర్మలకు); తత్ తత్= ఆయా; వస్తువుల= ద్రవ్యములయొక్క; మహా= గొప్ప; మహిమలు= మహత్త్వములు; మౌనంబునకున్= మౌన (మాట్లాడకుండా ఉండటం) వ్రతానికి; పరిజ్ఞానశక్తి= మంచిజ్ఞానశక్తి; అతుల= సాటిలేని; తపంబునకున్= తపస్సుకు; అధికభోగంబులు= గొప్పసుఖానుభవాలు; అహింసకున్= దేనినీ చంపని వ్రతానికి; రూప= మంచి ఆకారం; బల= సత్తువ, శక్తి; చిత్= జ్ఞానం; ఐశ్వర్య= ధన అధికారాలు; సిద్ధి= లబ్ది; బ్రహ్మచర్యమునకున్= బ్రహ్మచారి వ్రతానికి; పరమ= గొప్ప; ఆయువు= ఆయుష్షు; ఉపవాసములకున్= అన్నం తినకుండా; జపసంధ్యాదులు చేస్తూ భగవంతుడికి మనస్సులో దగ్గరకావటానికి (ఉప= సమీపంలో; వాసము= ఉండటం, భగవంతుడికి సమీపంగా ఉండటం); చిత్తశుద్ధి= స్వచ్ఛమైన మనస్సు (కలగటం ఫలం); ఫల= పండ్లు; జల= నీళ్ళు; ఆహరించి= తిని; ఉనికిన్= ఉండటానికి; ఆధిరాజ్యము= రాజ్యపాలనం; పత్ర భక్షతకున్= ఆకులు తినే వ్రతానికి; దివంబు= స్వర్గం; ఫలములు= ఫలితాలు.

తాత్పర్యం: అలసిపోయిన బాటసారికి అన్నం పెట్టటంకంటె గొప్ప ధర్మం లేదు. దానివల్ల వచ్చే ఫలితాన్ని ఎంచటానికి వీల్లేదు. అగ్ని ఆరాధనంవలన మంచి ప్రయత్న సిద్ధి కలుగుతుంది. మంచివారికి దానం చేస్తే ఆయా

వస్తువుల సిద్ధి (కలుగుతుంది). మౌన వ్రతానికి ఫలితం జ్ఞానశక్తి లభించటం, గొప్ప తపస్సుకు అధికభోగం, అహింసకు రూపబలజ్ఞాన ఐశ్వర్యాలు ఫలాలు. బ్రహ్మచర్య వ్రతానికి దీర్ఘాయువు ఫలం. ఉపవాసానికి ఫలం చిత్తశుద్ధి. నీళ్ళూ, పండ్లూ తింటూ బ్రతకటానికి ఫలితం రాజ్యపరిపాలన. ఆకులు మాత్రం తింటూ చేసే తపస్సుకు స్వర్గం ఫలం. (బాటసారికి అన్నదానం, అగ్ని ఆరాధన, దానకర్మ, మౌనం, తపస్సు, అహింస, బ్రహ్మచర్యం, ఉప వాసం, పండ్లు, ఆకులు తింటూ బ్రతకటం - ఇవన్నీ పవిత్ర వ్రతాలుగా చేసేవారికి ఆయా ఫలితాలు చెప్పే పద్యం.)

క. శ్రుతిపఠనమునకు, నర్థ । ప్రతి బోధంబునకు, వరుస ఫలములు సౌఖ్య
స్థితియును, సుగతియు; సత్య । వ్రతమునకు ఫలంబు ముక్తి వసుధాధీశా! 144

ప్రతిపదార్థం: వసుధా= భూమికి; అధి+ఈశా!;= అధిపతివైన రాజా!; శ్రుతి= వేదం; పఠనమునకున్= చదవటానికి; అర్థ= దాని అర్థంయొక్క; ప్రతిబోధంబునకున్= జ్ఞానానికి, చెప్పటానికి; వరుసన్= వరుసగా; సౌఖ్యస్థితియును= సుఖంగా ఉండటం; సుగతియున్= మరణానంతరం స్వర్గస్థితి; ఫలములు= ఫలితాలు; సత్యవ్రతమునకున్= సత్యం చెప్పాలన్న నియతికి; ముక్తి= మోక్షం; ఫలంబు= ఫలితం.

తాత్పర్యం: భూమికి అధిపతివైన ఓ రాజా! వేదం పఠిస్తే సౌఖ్యమూ, దానికర్థం గ్రహిస్తే సుగతీ, సత్యవ్రతానికి ముక్తి ఫలితం.

క. ద్రుమముల దళకుసుమఫలో । ద్గమములక్రియఁ గర్మముల నొదవుఁ దత్ఫలముల్
దమ తమ తఱిఁ గర్తకు భో । గ్యములై నియతిని శుభాశుభాకారములన్. 145

ప్రతిపదార్థం: ద్రుమములన్= చెట్లలో; దళ= ఆకులూ; కుసుమ= పూలూ; ఫల= పండ్లూ (వీటియొక్క); ఉత్+గమముల= పొటమరించటం, ఆకుతొడగటం, పూలు పూయటం, కాయలు కాయటం; క్రియన్= వలె; కర్తకున్= కర్మలు చేసేవాడికి; భోగ్యములై= అనుభవించ దగినవై; నియతిని= నియమం తప్పక; శుభ= శుభం; అశుభ= చెడు; ఆకారములన్= రూపాలలో; (మంచి చెడు రూపాలలో); తమ తమ = శుభ అశుభ కర్మలు; తఱిన్= సమయాలలో; తత్ తత్= ఆయా (శుభాశుభ); కర్మములన్= కర్మల వలన; ఫలితముల్= ఫలితాలు; ఒదవున్= కలుగుతాయి.

తాత్పర్యం: మనిషి చేసే మంచి పనులకు, చెడ్డ పనులకు ఆయా సమయాలలో ఆయా కర్మలవల్ల మంచి చెడు ఫలితాలు కలుగుతాయి. ఎట్లాగంటే కాలానుగుణంగా చెట్లకు ఆకులు, పువ్వులు, కాయలు, పండ్లు కలిగినట్లుగా మంచి చెడ్డ ఫలితాలుకూడా కలుగుతాయి.

విశేషం: అలం: ఉపమ. చాలా అందమైన పోలిక.

వ. అని చెప్పి. 146

తాత్పర్యం: ఆ విధంగా ఉదాహరణ పూర్వకంగా బోధించి.

చ. వినుము, జరానుబంధమున వెండ్రుకతండముఁ, బండ్లు, వీనులుం
గనుఁగవయున్, జరం బొరయుఁ గాని యొకప్పుడు దృష్ణ జీర్ణగా;

దనయముఁ బేర్చి, ప్రాణముల నన్నక పోవనిరోగ మల్పబు
ద్ధినరులు ద్రోవ లే రది, మదిం జొరనీరు సుఖార్థులై బుధుల్. **147**

ప్రతిపదార్థం: వినుము; జరా+అనుబంధమునన్= ముసలితనంయొక్కసంబంధం చేత; వెంద్రుక= జుట్టు; తండము= సమూహం; పండ్లు= దంతాలు; వీనులున్= చెవులున్నూ; కను+కవయున్= కళ్ళజంటా; జరన్= వృద్ధాప్యమును; పొరయున్= పొందుతాయి; కాని; ఒకప్పుడున్= ఏనాటికీ; తృష్ణ= కోరిక; జీర్ణగాదు= జీర్ణించదు,నశించదు; పేర్చి= ఎసరేగి, విజృంభించి; ప్రాణములన్= ప్రాణాలను; అన్నక= అణచక, చావగొట్టక; పోవనిరోగము= చచ్చినా పోనిరోగం; అల్పబుద్ధి= స్వల్పబుద్ధి కల; నరులు= మనుష్యులు, త్రోవ లేరు= త్రోసివేసికొనలేరు; అది= అట్లాంటి ఆలోచన; మదిన్= మనస్సులో; చొరనీరు= ప్రవేశించనివ్వరు; బుధుల్= పండితులున్నూ; సుఖార్థులు+ఐ= సుఖం కోరుకొన్నవారై; త్రోవలేరు= త్రోసికొనలేరు; అది= అట్లాంటి ఆలోచన; మదిన్= మనస్సులో; చొరనీరు= ప్రవేశించనివ్వరు; బుధుల్= పండితులున్నూ; సుఖార్థులు+ఐ= సుఖం కోరుకొన్నవారై.

తాత్పర్యం: ముసలితనం రాకతో జుట్టు, దంతాలు, చెవులు, కళ్ళూ ముసలివౌతాయి. కాని, కోరికకు మాత్రం ముసలితనం రాదు. ప్రాణా లున్నంతవరకూ పోని రోగ మది. అది రోగ మని కూడా అల్పబుద్ధులైన నరులు ఆలోచించరు. పండితులు కూడా సుఖాలు మరిగి, కోరిక అన్న రోగాన్ని పోగొట్టుకొందామన్న ఆలోచన మనస్సులోనికి కూడా రానివ్వరు.

క. పాపంబుఁ బుణ్యమును దృ । ష్ణా పరులకు దుఃఖసౌఖ్య సంపాదులగున్
భూపాల! వితృష్ణులు, ని । ర్లేపు లగుట వారిఁ బొందలే వా ఫలముల్. **148**

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; పాపంబున్= పాపం; పుణ్యమును= పుణ్యమూ; తృష్ణాపరులకున్= కోరికలున్నవారికి; దుఃఖ, సౌఖ్య సంపాదులు+అగున్= దుఃఖాన్ని, సౌఖ్యాన్ని కలిగిస్తాయి; వితృష్ణులు= కోరికలు లేనివారు; నిర్లేపులు= విరక్తులు; అగుటన్= అయినందువలన; ఆ ఫలముల్= ఆ సుఖదుఃఖాలు; వారిన్= నిర్లేపులను; పొందలేవు= పొందజాలవు.

తాత్పర్యం: లోకానురక్తులైన వారికి పాపపుణ్యకర్మలు దుఃఖాన్ని కలిగిస్తే, మమకారం లేనివారికి విరక్తులకు ఆ ఫలాలు కలుగవు. (వారికి సుఖదుఃఖ అనుభవం ఉండదు. రెంటినీ ఒకటిగానే చూస్తారు)

వ. అని పల్కినం, బాండునందను లందఱుం బ్రభూత హర్షోత్కర్షంబు నొందిరి; గంగానందనుండు ధర్మనందను నుద్దేశించి, యీ యర్థజాతంబు మునిప్రణీతంబయి యధిగతం బైనది, నీకు నుపదేశించితి 'నీవింక నేమి వినవల' తనవుడు, నా భూవల్లభుండు 'నిజాశ్రయంబున కాస్పదం బయిన పురుషునెడ భక్తజనంబు చరితం బెట్టిది గావలయు?' నని యడిగిన నతం డతని కిట్లనియె. **149**

ప్రతిపదార్థం: పాండు నందనులు= పాండురాజు కొడుకులు; ప్రభూత= మిక్కిలి; హర్ష= సంతోషముయొక్క; ఉత్కర్షంబున్= ఆధిక్యం; ఒందిరి= పొందినారు; గంగానందనుండు= గంగకొడుకు భీష్ముడు; ధర్మనందనున్= ధర్మరాజును; ఉద్దేశించి= లక్షించి; ఈ+అర్థజాతంబు= ఈ శాస్త్రవిషయ సమూహం; ముని ప్రణీతంబు+అయి= మునులచేత రచించబడి; అధిగతంబు+ఐనది= చదువబడినది, పొందబడినది; నీకున్; ఉపదేశించితిన్= బోధించాను; నీవు; ఇంకన్; ఏమి; వినవలతు(వు)= వినగోరెదవు; అనవుడున్= అనిన మీదట; ఆ భూ వల్లభుండు= భూమికి పతి, రాజు; నిజ= తనకు, తనయొక్క;

ఆశ్రయంబునకున్= ఆధారానికి; ఆస్పదంబు= తావు, ఆటపట్టు; అయిన; పురుషునెడన్= యజమానుడైన వ్యక్తి విషయంలో; భక్తజనంబు= భక్తులైన మానవులయొక్క; చరితంబు= నడవడి; ఎట్టిదికావలయున్= ఎట్లా ఉండాలి? అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్!

తాత్పర్యం: అని చెప్పగా పాండవులంతా బ్రహ్మానంద భరితులయ్యారు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు; 'ఈ విషయం పూర్వ మునులు చెప్పగా మనకు దక్కిన విద్య. అదే నీకూ చెప్పాను. ఇంకా ఏమి వినాలనుకొంటున్నావో చెప్పుము' అనగానే ధర్మరాజు 'తమ జీవితాలకు ఆధారమైన యజమానుని యెడల అతడి దగ్గర బ్రతికే వా రెట్లా నడచుకొనాలో చెప్పుము' అని అడుగగా భీష్మ డతడితో ఈ విధంగా అన్నాడు.

భీష్ముఁడు ధర్మజున కాశ్రయం బెప్పుడు నపరిత్యాజ్యం బని చెప్పుట (సం.13-11-1 (కుంభ))

క. 'విను, కాశీశ్వరుదేశం । బున నొక లుబ్ధకుఁడు వేఁట వోయిన చోటన్
ఘనతర విషదిగ్ధశరం । బున నేసిన మృగముఁ దప్పి భూజముఁ దాఁకెన్. 150

ప్రతిపదార్థం: కాశీ+ఈశ్వరు= కాశీరాజు; దేశంబునన్= రాజ్యంలో; ఒక లుబ్ధకుఁడు= ఒక కిరాతుడు; వేఁట పోయినచోటన్= వేటకై వెళ్ళినచోట; ఘనతర= మిక్కిలి గొప్ప; విషదిగ్ధ= విషం పూసిన; శరంబునన్= బాణంతో; మృగమున్= లేడిని; ఏసినన్= కొట్టగా; తప్పి= అది తప్పిపోయి; భూజమున్= చెట్టును; తాఁకెన్= తగిలింది.

తాత్పర్యం: కాశీదేశంలో ఒక వేటగా డున్నాడు. వా డొక రోజున వేటకు పోయి విషంపూసిన వాడి అయిన బాణాన్ని ఒక లేడిపై ప్రయోగించాడు. అది తప్పిపోయి చెట్టుకు గ్రుచ్చుకొన్నది.

క. పూవులఁ గాయలఁ బెరిగిన । యా వృక్షము శుష్క మయ్యెఁ; నవ్విధమున ధా
త్రీవర! తదీయ కోటర । మావాసము గాఁగ, నొక మహాశుక ముండున్. 151

ప్రతిపదార్థం: ధాత్రీవర!= భూపతికి పతివైనవాడా! పూవులన్= పూలతో; కాయలన్= కాయలతో; పెరిగిన; ఆ వృక్షము= ఆ చెట్టు; ఆ+విధమునన్= ఆ రీతిగా (ఉన్నదున్నట్లుగా); శుష్కము+అయ్యెన్= ఎండిపోయింది; తదీయ= ఆ చెట్టుయొక్క; కోటరము= తొఱ్ఱ; ఆవాసము= ఇల్లు, నివాసం; కాఁగన్= అవునట్లుగా; ఒక మహాశుకము= గొప్ప పేరుగల చిలుక; ఉండున్= ఉండేది.

తాత్పర్యం: పూలతో కాయలతో ఏపుగా పెరిగిన ఆ చెట్టు ఆ బాణానికి నిలువునా మాడిపోయింది. దాని తొఱ్ఱలో ఒక పెద్ద చిలుక కాపురముండేది. (గొప్ప పేరుగల అన్నమాటకు అర్థం 155వ పద్యంలో ఉన్నది)

క. అది తరువు విడిచిపోవక, । హృదయంబున భక్తి పేర్మి నెండను గాలిన్
బెదరక ధృతిమై నయ్యెడఁ । గదలకయుండె ననుజీవిగౌరవ మెసఁగన్. 152

ప్రతిపదార్థం: అది= ఆ చిలుక; తరువున్= చెట్టును; విడిచిపోవక= విడిచివెళ్ళకుండా; హృదయంబునన్= మనస్సులో; భక్తి పేర్మిన్= భక్తియొక్క అతిశయంతో; ఎండను= ఎండకు; గాలిన్= గాలికి; బెదరక= భయపడక; ధృతిమైన్ = ధైర్యంతో; ఆ+ఎడన్= అక్కడే; అనుజీవి= ఆశ్రయించిన ప్రాణియొక్క; గౌరవము= మర్యాద; ఎసఁగన్= ప్రకాశించగా; కదలక ఉండెన్= ఎటూ పోకుండా అక్కడే ఉన్నది.

తాత్పర్యం: ఆ చిలుక గాలికీ, ఎండకూ బెదరక ఎండిన ఆ చెట్టునే ఆశ్రయించుకొని ఉన్నది. ఇన్నాళ్ళు ఆ చెట్టు తన కాశ్రయ మిచ్చిందన్న గౌరవ భావమే ధైర్యం కాగా ఎటూ పోలేదు.

ఉ. దాని యుదాత్త వృత్తము శతక్రతుఁ, డాత్మ నెఱింగి వచ్చి , 'బెం
డైనది యిమ్మహీజము; మహాతరువుల్ ఫలవృద్ధి నొంది యి
క్కాన ననేకముల్ గలుగఁగా, నిటు లేటికి నిందు నిల్వ నో
మానితకీరమా!' యనియె మానుష భంగికరూప మొప్పఁగన్. 153

ప్రతిపదార్థం: శతక్రతుఁడు= ఇంద్రుడు (నూరు యజ్ఞాలు చేసినవాడు); దాని= ఆ చిలుకయొక్క; ఉదాత్త= నీతి కల గొప్ప; వృత్తము= నడవడి; ఆత్మన్= తనలో; ఎఱింగి= చూచి; ఈ+మహీజము= చెట్టు; (మహీ= భూమినుండి; జము= పుట్టినది); బెండు+ఐనది= ఎండిపోయినది; ఫలవృద్ధిన్= పండ్ల సమృద్ధి; ఒంది= పొంది; మహాతరువుల్= ఉన్నత వృక్షాలు; ఈ+కానన్= ఈ అడవిలో; అనేకముల్= చాలా; కలుగఁగాన్= ఉండగా; ఇందున్= ఈ ఎండిన చెట్టుపైనే; ఏటికిన్= ఎందుకు; ఇటులు= ఈ విధంగా; నిల్వన్= నిల్చుట; ఓ మానిత= ఓ పొగడదగిన; కీరమా!= చిలుకా!; మానుషభంగిక రూపము= మనిషివలె ఆకారం; ఒప్పఁగాన్= ప్రకాశింపగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడు చిలుక వృత్తాంతం తనంత తాను తెలిసికొని చిలుక దగ్గరకు వచ్చి 'ఓ చిలుకా! ఈ అడవిలో ఫలసమృద్ధి గల చెట్లు ఎన్నో ఉన్నాయి కదా! ఇంకా ఈ ఎండిన చెట్టునే ఆశ్రయించి దేని కున్నట్లు?' అని అన్నాడు.

వ. అనిన విని యా శుకంబు. 154

తాత్పర్యం: అనగా విని ఆ చిలుక.

చ. 'అనయము పండుచుండు నెడ నాశ్రయ మొప్పిన నిల్చి, యెండి పో
యినతఱిఁ బాసి పోక తగ వెట్లు? కృతఘ్నత గాదె యివ్విధం
బనిమిషనాథ!' యన్న నతఁ డచ్చెరువంది 'పురాకృతోప సం
జనిత విశేష మీ ఖగము జానుగ నన్ను నెఱింగె, దీనికిన్. 155

ప్రతిపదార్థం: అనయము= ఎప్పుడు; పండుచుండునెడన్= పండ్లు పండేవేళ; ఆశ్రయము= ఆధారం; ఒప్పినన్= చిక్కగా; నిల్చి= ఉండి; ఎండిపోయిన తఱిన్= ఎండినప్పుడు; పాసి= వదలి; పోక= పోవటం; కృతఘ్నతకాదె= చేసినమేలు మరవటం కదా; అనిమిషనాథ!= దేవతలకు రాజా! ఇంద్రా! (అనిమిషులు= రెప్పపాటు లేనివారు, దేవతలు); అన్నన్= అనగా; అతఁడు= ఇంద్రుడు; అచ్చెరువు= ఆశ్చర్యం; అంది= పొంది; ఈ ఖగము= ఈ పక్షి, పురాకృత= పూర్వజన్మలో చేసిన పుణ్యం వలన; ఉపసంజనిత= చక్కగా పుట్టిన; విశేషము= ఎన్నదగినది; జానుగన్= చక్కగా; నన్నున్= దేవతలకు రాజైన నన్నే; ఎఱింగెన్= గుర్తించింది; (కనుక) దీనికిన్= దీనికి.

తాత్పర్యం: 'చెట్లు పండినపుడు ఉండటం, ఎండినపుడు విడిచిపెట్టి పోవటం కృతఘ్నత కదా! మహేంద్రా!' అని చిలుక అనేటప్పటికి ఇంద్రు డనుకొన్నాడు - 'అరే! ఇది పూర్వజన్మ వాసనా విశేషంవలన నన్ను గుర్తుపట్టగలిగింది. కనుక ఈ గొప్ప పక్షికి. (తరువాతి వచనంతో అన్వయం)

వ. మే లొనర్చెదం గాక! **156**

తాత్పర్యం: శుభం చేస్తాను గాక! (నిశ్చయించటం)

క. 'అని తలఁచి నీదు పలుకులు । విని మెచ్చితి; వరము గోరు విహగోత్తమ! నీ'
వనిన, శుకంబు మహీజం । బునకుం బే రెలమి వేఁడె భూపవరేణ్యా! **157**

ప్రతిపదార్థం: భూ ప= భూమికి పతులైనవారిలో; వరేణ్యా!= మిక్కిలి శ్రేష్ఠమైనవాడా!; అని= ఈ విధంగా; తలఁచి= ఇంద్రుడనుకొని; నీదు= నీయొక్క; పలుకులు= మాటలు; విని; మెచ్చితిన్= మెచ్చుకొన్నాను; విహగ= పక్షులలో; ఉత్తమ!= గొప్పదానా!; వరమున్= శ్రేష్ఠమైన కోరికను; కోరు= కోరుకొమ్ము; నీవు; అనినన్= అనగానే; శుకంబు= చిలుక; మహీజంబునకున్= చెట్టుకు; పేరు+ఎలమిన్= గొప్ప సంతోషాన్ని; వేఁడెన్= కోరింది.

తాత్పర్యం: రాజా! ఇంద్రు డావిధంగా మనస్సులో భావించుకొని చిలుకతో 'మహా శుకమా! నీ మాటలు నాకు ఆనందాన్ని కలిగించాయి. కనుక నీ కేదైనా వరమిస్తాను కోరుకొమ్ము' అన్నాడు. వెంటనే చిలుక 'స్వామీ! ఈ చెట్టుకు పూర్వవైభవాన్ని అనుగ్రహించుము' అని అన్నది. (చూచావా ఆ చిలుక ఎంత గొప్పదో తనకు ఏ మేలూ కోరుకోకుండా చెట్టు మేలును కోరింది).

ఆ. అమరవల్లభుండు నమృతసేచనమునఁ । భూజమునకుఁ దొంటి పొల్పు కంటె
మిగుల నెలమి సేసె; మేలియాశ్రితు లిట్ల । మనుతు రధిపుఁ గురుకుమారవర్య! **158**

ప్రతిపదార్థం: కురుకుమార వర్య!= కౌరవులలో మంచివాడా!, శ్రేష్ఠుడా!; అమర= దేవతలకు; వల్లభుండు= రాజు; అమృత సేచనమునన్= అమృతాన్ని చల్లటం వలన; భూజమునకున్= భూమినుండి పుట్టినది, చెట్టునకు; తొంటి= ముందటి; పొల్పుకంటెన్= అందంకంటె; మిగులన్= ఎక్కువ; ఎలమిన్= సంతోషమును; చేసెన్= కల్గించాడు; అధిపున్= ఏలినవాడిని, యజమానుని, ఆశ్రయమిచ్చిన వాడిని; మేలి= మంచి; ఆశ్రితులు= ఆశ్రయించి బ్రతికేవారు; ఇట్లు+అ= ఇదే విధంగా; మనుతురు= రక్షిస్తారు.

తాత్పర్యం: కౌరవులలో ఉత్తముడా! ఇంద్రుడు అమృతం చల్లి చెట్టుకు పూర్వ వైభవంకంటె గొప్ప వైభవా న్నిచ్చాడు. తనను కాపాడినవారిని మంచి ఆశ్రితులు ఇట్లాగే రక్షిస్తారు'.

విభునకుం బాటింపవలయువారిని భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట (సం.13-8-1)

వ. అనిన నతం'డెవ్వరిఁ బాటించుట విభులకు వలయు'నని యడిగిన నా భూపతికి భీష్ముం డిట్లనియె. **159**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతండు= ధర్మరాజు; విభులకున్= రాజులకు, యజమానులకు; ఎవ్వరిన్= ఎవరిని; పాటించుట= ఆదరించటం; వలయును= చేయాలి; అని; అడిగినన్; ఆ భూపతికిన్= భూమికి పతియైన ధర్మజునకు; భీష్ముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'ఆశ్రితులలో ఎవరిని ఎట్లా యజమానులు ఆదరించాలి'? అని అడుగగా భీష్ముడు అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది పోషించే వారికి సంబంధించిన విషయం.

సీ. 'జననాథ! విను, తప స్స్వాధ్యాయముఖ కర్మ । కరణత నుభయలోకముల వశగ
తములఁ జేయఁగఁ జాలు ధాత్రీసురులు మన్న । నకుఁ బాత్రములు; పతి నాతి కెట్లు
రాజునకును నట్లు బ్రాహ్మణుఁ డొడయుండు । బ్రాహ్మణుం డను మాట పావనంబు,
హర్షించి శుభముల నలిగి యాపదల నిం । ద్రునికైనఁ జేయు విప్రుండు నృపతి

తే. గొడుకుఁ బోలె నరయ, గురుఁ బోలెఁ గొలువంగ । నగ్నిఁ బోలె నిష్ఠ నర్చితుఁడుగఁ
జేయవలయు విప్రుఁ జెప్పెద, వేదసం । వాద; మేకబుద్ధి నాదరింపు. 160

ప్రతిపదార్థం: జననాథ!= ప్రజలకు స్వామీ!; తపః+స్వాధ్యాయ, ముఖ, కర్మ, కరణతన్= తపస్సు, వేదము చదవటం మొదలైన పనులను చేయటం వలన; ఉభయలోకములన్= రెండులోకాలను, ఈ లోకము, పరలోకము అనేవానిని; వశగతములన్= అధీనమైనవానినిగా; చేయఁగన్+చాలు= చేయటానికి సమర్థులైన; ధాత్రీసురులు= భూదేవతలు (బ్రాహ్మణులు); మన్ననకున్= గౌరవానికి; పాత్రములు= యోగ్యులు; పతి= మగడు; నాతికిన్= స్త్రీకి; ఎట్లు= ఎట్లో; అట్లు= ఆ విధంగా; బ్రాహ్మణుఁడు= విప్రుడు; రాజునకును= ఏలికకు; ఒడయుండు= స్వామి; బ్రాహ్మణుండు+అను మాట= బ్రాహ్మణుడు పలికేమాట; పావనంబు= పవిత్రమైనది; విప్రుండు= జ్ఞానవిద్యాసంపదగల బ్రాహ్మణుడు; ఇంద్రునికిన్+ఐనన్= దేవేంద్రునకు కూడా; హర్షించి= సంతోషము పొంది; శుభములన్= మేలైన ఫలములను; అలిగి= కోపించి; ఆపదలను= కీడులను; చేయున్= చేయగలడు; నృపతి= రాజు; విప్రున్= ఉత్తమబ్రాహ్మణుని; కొడుకున్, పోలెన్= కన్నకుమారుని వలె; అరయన్ వలయున్= కాపాడాలి; గురున్+పోలెన్= జ్ఞానమును ప్రసాదించిన గురువును వలె; కొలువంగన్, వలయున్= పూజించాలి; నిష్ఠన్= చెదరని బుద్ధితో; అగ్నిన్+పోలెన్= అగ్నిదేవుని విధంగా; అర్చితుఁడుగన్= పూజలందుకొనిన వానినిగా; చేయన్, వలయన్= చేయాలి; (దీనికి ప్రమాణభూతంగా) వేద సంవాదమున్= వేదంలోని తార్కాణరూపమైన వాక్యాన్ని; చెప్పెదన్= నీకు తెలియజేస్తాను; ఏకబుద్ధిన్= చెదరని మదితో; ఆదరింపు= శ్రద్ధతో గ్రహించు.

తాత్పర్యం: రాజా! వినుము. తపస్సు, వేదాధ్యయనం వంటి కర్మలు చేయటం వలన ఉభయలోకాలను అరచేతిలో పెట్టగల బ్రాహ్మణులను గౌరవించాలి. వారు సతికి పతివలె రాజుకు యజమానులు. వారి మాటలు పావనమైనవి. ఇంద్రుడికైనా సరే! వారు హర్షిస్తే సుఖం. అలిగితే కీడు కల్పించగలరు. రాజు విప్రుడిని కొడుకువలె కాపాడాలి. గురువువలె చూడాలి. అగ్నివలె పూజించాలి. దీనికి సంబంధించిన వేద సంభాషణం చెప్పుతున్నాను. ఏకాగ్రబుద్ధివై వినుము.

విశేషం: తపస్సు అంటే ఒక విషయాన్ని గూర్చి అతిగాఢంగా భావన చేయటం. దానికోసం చేసే అతికఠినమైన దేహేంద్రియాలను వశం చేసుకొనే ప్రక్రియలన్నీ తపస్సు క్రిందికి వస్తాయి. స్వాధ్యాయం అంటే తనకు సంప్రదాయ సిద్ధంగా ఏర్పడిన వేదాన్ని లేదా వేదశాఖలను గురుముఖాన అభ్యసించటం. విప్రుడు- 'విద్యయా యాతి విప్రత్వమ్' అన్నమాటను బట్టి విద్య అంటే విముక్తిని ప్రసాదించే జ్ఞానమే కనుక అది పుష్కలంగా కలవాడు.

వ. వేదంబులు దమలోన గోష్ఠి సేయుచున్న సమయంబున. 161

తాత్పర్యం: వేదాలు తమలో తాము చర్చిస్తున్న వేళ.

సీ. బ్రాహ్మణజాతికిఁ బరిభవం బొనరింప । మున్ను చేసిన పుణ్యములు నశించు,
జపహోమముఖ కర్మసంచయంబున కధి । కతరంబు విప్రముఖమున నిడుట.
భూసురార్చన మొక మాసంబు సలిపినఁ । బాపంబులెల్లను బాసిపోవు,
నగ్రవర్ణులఁ గాంచి యాదరింపక యుండు । కంటెను, గీడొండు గలుగ దరయ,

తే. నని క్రమంబున ఋగ్వేదమును యజుస్సు । సామము నథర్వణమ్మును, సారభూత
భవ్య సంభాషణముసేఁత దివ్యమునుల । వలన విందుము, కౌరవకులపవిత్ర!' 162

ప్రతిపదార్థం: కౌరవకుల= కురువంశంలో; పవిత్ర= పావనమైనవాడా!; ఋగ్వేదం చెప్తున్నది; బ్రాహ్మణ జాతికిన్= బ్రాహ్మణ జాతికి; పరిభవంబున్= అవమానం; ఒనరింపన్= చేస్తే; మున్ను చేసిన= పూర్వం చేసిన; పుణ్యములు= పవిత్రకర్మఫలాలు; నశించున్= నశిస్తాయి; యజుర్వేదం చెప్పినది; జప, హోమ, ముఖ= జపం, హోమం చేయటంవంటి; కర్మసంచయంబునకున్= కర్మలను చక్కగా కూర్చుటకన్నను; అధికతరంబు= చాలా ఎక్కువ; విప్రముఖమునన్= బ్రాహ్మణున కెదురుగా (భక్తితో); ఇడుట= ఇవ్వటం; సామవేదమిట్లా అంటున్నది; భూసుర= భూదేవతలైన బ్రాహ్మణులయొక్క; అర్చనము= పూజను; ఒక మాసంబు= ఒక నెల; సల్పినన్= చేస్తే; పాపంబులు= అపవిత్రకర్మల ఫలాలు; ఎల్లను= అన్నీ; పాసిపోవున్= నశిస్తాయి; అథర్వణవేద మన్నది; అగ్రవర్ణులన్= పైకులంవారిని; కాంచి= చూచి; ఆదరింపక= ఆదరించకుండా; ఉండుటకంటెను= ఉండటం కంటె; అరయన్= ఆలోచించి చూస్తే; ఒండు= మరొక; కీడు= ఆపద, అశుభం; కలుగదు; అని= ఈ విధంగా; ఋగ్యజుస్సామాథర్వణ వేదాలు క్రమక్రమంబునన్= వరుసగా (గీతపద్యంలోని నాలుగు వేదాలు కర్తలు. పై నాలుగు పాదాలు వీటికి క్రమంగా అన్వయించుకొనటమే క్రమం); సారభూత= సారాంశమైన; భవ్యసంభాషణము= మేలైన వాదం; చేఁత= చేయటం; దివ్యమునులవలనన్ విందుము= దివ్యులైన మునుల ద్వారా వింటున్నాము.

తాత్పర్యం: కురువంశంలో పవిత్రమైనవాడా! మునులద్వారా వింటున్నాము. బ్రాహ్మణజాతికి అవమానం చేస్తే పూర్వం చేసిన పుణ్యం నశిస్తుందని ఋగ్వేదం చెప్పుతున్నది. విప్రులకు చేసే దానం, జపం, హోమం మొదలైన వైదిక కర్మలకంటె ఎక్కువైనదని యజుర్వేదం చెప్పుతున్నది. ఒక నెల బ్రాహ్మణులను పూజిస్తే పాపాలన్నీ తొలగుతాయని సామవేదం చెప్పుతున్నది. పై కులం వారిని చూచి ఆదరించకుండా ఉండటం కంటె ఆలోచించి చూస్తే మరొక ఆపదలేదని అథర్వణవేదం తెలుపుతున్నది'.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బరమమైన ధర్మంబు చెప్పుట (సం.13-18-1 (కుంభ))

సీ. అని చెప్పి, భీష్ముఁ డమ్మనుజేంద్రుతోఁ 'బర । మశ్రేష్ఠమైన ధర్మంబుఁ దెలియ
విను' మని పల్కి యిట్లను; మద్రనాథుండు । సత్యవతీ పుత్రచరణములకు
నెఱఁగి కేలు మొగిడ్చి, యెద్దాని నెఱుఁగుట । యెఱుకల కెల్లను నెక్కుడని, స
భక్తిక సమ్మతిఁ బ్రార్థించి యడిగిన; । నమ్మహామౌని దయ నతనిఁ జూచి

తే. విష్ణు నెఱుఁగు టధిక విమలబోధము, యజ్ఞ । మూర్తి, యజ్ఞకర్తృమూర్తి, యజ్ఞ
కలనమూర్తి, యజ్ఞ ఫలమూర్తి, విష్ణుఁ డ । తండు కృష్ణుఁ డమలతరచరిత్ర!' 163

ప్రతిపదార్థం: అని చెప్పి; భీష్ముఁడు= భీష్ముడు ఆ విధంగా పల్కి; ఆ+మనుజ+ఇంద్రుతోన్= ఆ రాజుతో - ధర్మరాజుతో; పరమ= గొప్ప; శ్రేష్ఠము= ఉన్నతం; ఐన; ధర్మంబున్= ధర్మాన్ని; తెలియన్ వినుము; అని పల్కి; ఇట్లు; అనున్; మద్రనాథుండు= మద్రదేశానికి రాజైనవాడు - శల్యుడు; సత్యవతీ పుత్ర= సత్యవతి కుమారుడైన వ్యాసుడి; చరణములకున్= పాదాలకు; కేలు మొగిడ్చి= అంజలిఘటించి; ఎఱఁగి= నమస్కరించి; ఏ+దానిన్= దేనిని; ఎఱుఁగుట= తెలియటం; ఎఱుకల కెల్లనున్= అన్ని జ్ఞానాలలోకీ; ఎక్కుడు= ఎక్కువ; అని; సభక్తిక= భక్తితో కూడిన; సమ్మతిన్= ఇష్టంతో; ప్రార్థించి= ప్రార్థనాపూర్వకంగా; అడిగినన్= అడుగగా; ఆ+మహాముని= ఆ మహర్షి; దయన్= కృపతో; అతనిన్= అతడిని; చూచి; విష్ణున్= శ్రీమహావిష్ణుని; ఎఱుఁగుట= తెలియుట; విమలబోధము= స్వచ్ఛమైన జ్ఞానం; అమలతర చరిత్ర= నిర్మలమైన నడవడి కలవాడా!; యజ్ఞమూర్తి= యజ్ఞమే ఆకారంగా కలవాడు; యజ్ఞకర్తృమూర్తి= యజ్ఞం చేసే యజమానుని స్వరూపుడు; యజ్ఞకలనమూర్తి= యజ్ఞమం దుండేవాడు; యజ్ఞఫలమూర్తి= యజ్ఞఫలమే ఆకారమైనవాడు; విష్ణుఁడు= విష్ణుమూర్తి; అతండు; కృష్ణుఁడు= ఆ కృష్ణుడే విష్ణువు;

తాత్పర్యం: అని చెప్పి మరల భీష్ము డిట్లా ధర్మరాజుతో అన్నాడు. 'నీవలెనే మద్రరాజు వ్యాసమహర్షి పాదాలకు నమస్కరించి జ్ఞానాలలో ఉత్తమజ్ఞానమే' దని అడిగితే ఆ మహర్షి చెప్పాడు; 'నిర్మలచరిత్రా! యజ్ఞమూర్తి, యజమానమూర్తి. యజ్ఞకలనమూర్తి, యజ్ఞఫలమూర్తియే విష్ణువు. అతడిని తెలియటమే ఉత్తమజ్ఞానం. ఆ విష్ణువే ఈ కృష్ణుడు.

వ. అని పల్కి యమ్మహాత్ముండు వెండియు శల్యున కిట్లనుఁ 'గృష్ణుండు వినుచుండఁ గొందఱు బ్రాహ్మణు లతని నుపలక్షించి, నాతో నిబ్బాలుండు యాదవుండైన వసుదేవునకుఁ గంసానుజయైన దేవకియందు జన్మించిన వాఁ; డితని నీవు క్రతుపురుషుండని కొనియాడుటకుఁ గతం బేమి? యని యడిగిన నన్నారాయణుండు నగుచు నన్నుఁ గన్గొని 'వీరలప్రశ్నంబునకు నుత్తరంబు దగనిత్తుగాక' యనిన నద్దేవునికిం బ్రణమిల్లి యే నిట్లంటి.164

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పల్కి= మాటాడి; ఆ+మహా+ఆత్ముండు= దొడ్డబుద్ధిగల వ్యాసమహర్షి; వెండియున్= ఇంకా; శల్యునకున్= మద్రరాజైన శల్యునకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; కొందరు, బ్రాహ్మణులు= కొందరు బ్రాహ్మణ జాతికి చెందినవారు; కృష్ణుండు= వాసుదేవుడు; వినుచుండన్= వింటూ ఉండగా; అతనిన్= ఆ శ్రీకృష్ణుని; ఉపలక్షించి= ఉద్దేశించి; నాతోన్= నాతో; ఈ+బాలుండు= ఈ పసివాడు; యాదవుండు= యదువంశంవాడు; ఐన= అయినట్టి; వసుదేవునకున్= వసుదేవుడనేవానికి; కంస+అనుజ= కంసుని చెల్లెలు; ఐన= అయిన; దేవకియందున్= దేవకి అనే స్త్రీయందు; జన్మించినవాఁడు= పుట్టినవాఁడు; నీవు; ఇతనిన్= ఇట్టి ఈ బాలుని; క్రతు పురుషుండు= యజ్ఞాత్మకుడైన వ్యక్తి; అని; కొనియాడుటకున్= పొగడటానికి; కతంబు= కారణం; ఏమి= ఏమిటి?; అని; అడిగినన్= ప్రశ్నింపగా; ఆ+నారాయణుండు= సాక్షాత్తు నారాయణుడే అయిన వాసుదేవుడు; నగుచున్= నవ్వుతూ; నన్నున్= నన్ను (వ్యాసుని) కన్గొని= చూచి; వీరలప్రశ్నంబునకున్= వీరిప్రశ్నకు; ఉత్తరంబున్= సమాధానాన్ని; తగన్= తగు విధంగా; ఇత్తు+కాక= ఇవ్వు; అనినన్= అంటే; ఆ+దేవునికిన్= దేవుడైన ఆ శ్రీకృష్ణునకు; ప్రణమిల్లి= సాష్టాంగదండ నమస్కారం చేసి; ఏను= నేను; ఇట్లు= ఈ విధంగా; అంటిన్= చెప్పాను.

తాత్పర్యం: వ్యాసమహర్షి ఇట్లా చెప్పి ఇంకా అన్నాడు; 'శల్యా! కొంతమంది బ్రాహ్మణులు ఒకసారి కృష్ణుడిని దృష్టిలో పెట్టుకొని ఆయనముందే నాతో అన్నారు. 'ఇతడు యాదవుడైన వసుదేవుడికీ, కంసుని చెల్లెలు దేవకికీ పుట్టినబాలుడు. ఇతడిని యజ్ఞపురుషుడైన విష్ణు వంటా వేమిటి?' అని. అది విని కృష్ణుడు నవ్వుతూ నాతో అన్నాడు; 'వీళ్ళ ప్రశ్నలకు సరిపోయే సమాధానం చెప్పుము' - అని అపు డా దేవుడికి నమస్కరించి నే నిట్లా అన్నాను.

వ. 'వేదమయుఁడు, వేదవేద్యుండు, వేదార్థ । విత్తమప్రియుండు, విష్ణుఁ డీతఁ
డిట్టిఁ డగుట, యాత్మ నెఱుఁగుట యుత్తమ । బ్రాహ్మణత్వసిద్ధి భవ్యులార!' 165

ప్రతిపదార్థం: భవ్యులు+ఆర!= ఉత్తములారా!; విష్ణుఁడు+ఈతఁడు= ఈ కృష్ణుడే విష్ణువు; వేదమయుఁడు= వేదములే స్వరూపంగా కలవాడు; వేదవేద్యుండు= ఆ వేదములచేతనే తెలియదగినవాడు; వేదార్థ= వేదాల అర్థాన్ని; విత్= తెలిసినవారిలో; తమ= శ్రేష్ఠులకు; ప్రియుండు= ఇష్టమైనవాడు; ఇట్టిఁడు= ఇటువంటివాడు (ఈ కృష్ణుడు); అగుటన్= కావటం; ఆత్మన్= మనసులో; ఎఱుఁగుట= తెలియటం; ఉత్తమ= గొప్ప; బ్రాహ్మణత్వ సిద్ధి= బ్రాహ్మణత్వాన్ని పొందటం.

తాత్పర్యం: 'బ్రాహ్మణత్వ సిద్ధికి ఫలమేమంటే - శ్రీకృష్ణుడే వేదమయుడు. వేదవేద్యుడు. వేదార్థం తెలిసిన పండితులకు ఇష్టుడైనవా డని తెలియటమే'.

వ. అనిన విని వారలు దద్భావనం గృతకృత్యులై 'రని చెప్పిన మద్రవిభుండు మానసంబు మాలిన్యరహితంబును బ్రసాద సహితంబును నయి చరితార్థుండయ్యెఁ; బాండవాగ్రజా! నీకు నీయర్థంబు విజ్ఞాతం బగుట యెఱుంగుదు, నైననుం బ్రజ్ఞావిశుద్ధి కరణం బాచరించితి' నని చెప్పుటయు నతం డత్యంత సంతుష్టాంత రంగుండై 'గరుత్మంతుండు మహానుభావుం డని విందు, నవ్విహగవిభుని వృత్తాంతంబు తెఱం గెఱుంగ వినవలతు వివరింపవే', యనుటయు నతం డచ్యుతునాలోకించి, 'యాసుపర్ణుండు నీవ కా వినియుండుదుం జెప్పెద' ననవుడు నప్పుండరీకాక్షుండు వికచవదనుండై 'యట్లచేయు; మిక్కురుపతి కోర్కి దీర్చుట కర్తవ్యం' బని పల్కిన, నా దేవవ్రతుండు భూవల్లభున కిట్లనియె. 166

ప్రతిపదార్థం: అనినన్; విని; వారలు= శ్రోతలు, విన్నవారు; తత్= (వ్యాసమహర్షి చెప్పిన కృష్ణ సంబంధమైన) దానియొక్క, అతడియొక్క; భావనన్= ఏకాగ్రధ్యానంచేత; కృతకృత్యులు+ఐరి= ధన్యులైరి; అని చెప్పినన్; మద్రవిభుండు= మద్రదేశరాజు, శల్యుడు; మానసంబు= మనస్సు; మాలిన్యరహితంబు= మలినం లేనిదీ; ప్రసాదసహితంబును= ప్రసన్నతతో కూడినదీ; అయి; చరిత+అర్థుండు= నెరవేరిన ప్రయోజనం కలవాడు (ధన్యుడు); పాండవ+అగ్రజా! పాండవులలో జ్యేష్ఠుడా! నీకున్= నీకు; ఈ అర్థంబు= ఈ విషయం (శ్రీకృష్ణుడే విష్ణువన్న జ్ఞానం); విజ్ఞాతంబు= తెలిసిందే; అగుట; ఎఱుంగుదున్= తెలియుదును; ఐననున్= ఐనప్పటికి; ప్రజ్ఞా= మేధాశక్తిని; విశుద్ధి కరణంబు= పరిశుద్ధం చేయటం; ఆచరించితిన్= చేశాను; అని; చెప్పుటయున్= చెప్పగా; అతండు= ధర్మరాజు; అత్యంత= మిక్కిలి; సంతుష్ట ఐ= అయి; సంతోషించిన; అంతరంగుండు= ఆత్మ కలవాడు; గరుత్మంతుండు, మహా+అనుభావుండు; అని విందున్= అని విన్నాను; ఆ+విహగ విభుని= ఆ పక్షిరాజు యొక్క; వృత్తాంతంబు= కథయొక్క; తెఱంగు= విధానం; ఎఱుంగన్= తెలిసికొనటానికి; వినన్ వలతున్= వినటానికి ఇష్టపడుతున్నాను; వివరింపవే= విశదీకరించవే (ప్రార్థన); అనుటయున్= అతండు; అచ్యుతున్= (సచ్చిదానంద స్వరూపం నుండి చ్యుతి లేనివాడు ఏమరుపాటు జారుపాటు లేనివాడు) శ్రీకృష్ణుడిని; ఆలోకించి= చూచి; ఆ సు+పర్ణుండు= ఆ గరుత్మంతుడు (గట్టి రెక్కలున్న వాడు) నీవకాన్= నీవే ఐనట్లు (నీవేనని); విని+ఉండుదున్= విని ఉన్నాను; చెప్పెదన్= తెల్పెదను; అనవుడున్= అని చెప్పినమీదట; ఆ+పుండరీక+అక్షుండు= తెల్లని తామరరేకులవంటి కన్నులున్నవాడు; వికచ= వికసించిన; వదనుండై= ముఖం కలవాడై; అట్లు+అ= ఆ ప్రకారమే; చేయుము; ఈ+కురుపతి= ఈ కౌరవరాజు యొక్క; కోర్కి+తీర్చుట; కర్తవ్యంబు= చేయవలసిన పని; అని పల్కినన్; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; భూవల్లభునకున్= భూమిపతికి, రాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని వారా భావనతో ధన్యులైనారు 'అని చెప్పగా విన్న శల్యుడు స్వచ్ఛమైన మనస్సు కలవాడై - మహామాలిన్యాలన్నీ పోగా ధన్యుడైనాడు. ధర్మజా! నీకీ విషయం తెలిసిందే ఐనా నీ మనస్సును పరిశుద్ధం చేయటానికి ఇది చెప్పాను' అని చెప్పగా విని ధర్మరాజు 'గరుత్మంతుడు మహాత్ముడని విన్నాను. అతడి కథ వినాలని ఉన్నది చెప్పవా' అని ప్రార్థించాడు. భీష్ముడు శ్రీకృష్ణుడిని చూచి 'స్వామీ! నీవే ఆ గరుత్మంతుడవని విన్నాను' అన్నాడు. ఆయన కూడా తెల్లని కన్నులు విప్పారగా ముఖం వికసింప చేసికొని, 'మంచిది. ఈ రాజు కోర్కె తీర్చటం ముఖ్యం కనుక చెప్పు' మనగా, ఆ భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మజునకు గరుత్మంతుని చరిత్రంబు చెప్పుట (సం. 13-19-1 (కుంభ))

సీ. 'కశ్యపు భార్యలు కద్రువ, వినత నాఁ। గల రాతపస్వి వారలకు వరము
గరుణ నిచ్చెద నన్నఁ గద్రువ వేవుర, । వినత యిద్దఱ, వేఁడికొనిరి సుతుల;
మునియు 'నట్లగుఁగాక' యనియెఁ; బదంపడి । యండముల్ వేయును, నండయుగము,
వరుసన, యా కద్రువకు వినతకుఁ బుట్టె, । నవి కుండముల నిడి, యరసి యుండి

తే. రహి సహస్ర మేనూఱేండ్లు నంత నుదయ । మయ్యె, నవ్వేయి గ్రుడ్డుల నధికబలముఁ
దేజమును గల్గి యా సర్పరాజి యొప్పు చుండె, నారెండు విరియక యుండె, మఱియు. 167

ప్రతిపదార్థం: కశ్యపుభార్యలు= తొమ్మిదిమంది ప్రజాపతులలో ఒకడగు కశ్యపుని యొక్క పత్నులు; కద్రువ, వినత; నాన్= అనగా; కలరు; ఆ తపస్వి= ఆ ముని; వారలకున్; వరము; కరుణన్= దయతో; ఇచ్చెదన్= ఇస్తాను; అన్నన్= అని పల్కగా; కద్రువ; వేవురన్= వేయిమందిని; వినత; ఇద్దఱన్; సుతులన్= కొడుకులను; వేఁడికొనిరి= కోరుకొన్నారు; మునియున్= కశ్యపుడును; అట్లు+అగుఁగాక= అట్లాగే అవుతుంది; అనియెన్; పదంపడి= తరువాత; అండముల్= గ్రుడ్లు; వేయునున్= వెయ్యి; అండయుగము= గ్రుడ్లయొక్క జత; వరుసన= క్రమంగా; ఆ కద్రువకున్; వినతకున్; పుట్టెన్; అవి= వాటిని; కుండములన్+ఇడి= కుండలలో పెట్టి; అరసి+ఉండిరి= రక్షించుకొంటూ ఉన్నారు. అహిసహస్రము= వేయి పాములు; ఏనూఱు+ఏండ్లు+అంతన్= ఐదువందలసంవత్సరాల తరువాత; ఆ+వేయి గ్రుడ్డులన్= ఆ వేయి గ్రుడ్లనుండి; ఉదయము+ అయ్యెన్= జన్మించాయి; అధికబలము= మిక్కిలి బలం, శరీరబలం; తేజమును+కల్గి= ప్రాణశక్తి కల్గి; ఆ సర్పరాజి= ఆ పాముల సమూహం; ఒప్పుచున్+ఉండెన్= ప్రకాశిస్తూ ఉండింది; మఱియున్= ఇంకా; ఆ+రెండున్= వినతగ్రుడ్లు రెండూ; విరియక= పిగులక; ఉండెన్= ఉన్నాయి;

తాత్పర్యం: కద్రువ, వినత కశ్యపబ్రహ్మకు భార్యలు. వారికి దయతో 'వరా లిస్తాను కోరుకొ'మ్మన్నాడు ముని. కద్రువ వేయిమంది, వినత ఇద్దరు కొడుకులు కావాలని వేడుకొన్నారు. ఆయన 'అట్లాగే జరుగుతుం దని అన్నాడు. తర్వాత కద్రువకు వేయి, వినతకు రెండు గ్రుడ్లు కలిగితే వారు వాటిని కుండలలో పెట్టి కాపాడుతున్నారు. ఐదువందలేండ్లు గతించినాక కద్రువ వేయిగ్రుడ్ల నుండి వేయి పాములు పుట్టి అధికబలము, తేజస్సుతోను పెరుగుతుండగా, వినతగ్రుడ్లు రెండు పగలనేలేదు.

క. తన సవతి యైన కద్రువఁ । గని వగపును మత్సరంబుఁ గదిరెడు మదితో
వినత గడున్ వేగిరపడి । యనీతి నొకయండ మవియ నడిచె నరేంద్రా! 168

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ప్రజలకు పతివైన రాజా!; వినత; తన సవతిన్ కద్రువన్ కని= సపత్నిఅయిన కద్రువను చూచి; వగపు= దుఃఖం (తనకు సంతానం కలుగలేదని); మత్సరంబున్= అసూయ (దానికి కలిగారని); కదిరెడు= వ్యాపించిన; మదితోన్= మనస్సుతో; కడున్= మిక్కిలి; వేగిరపడి= తొందరపడి; అనీతిన్= నీతిమాలి; ఒకఅండము= ఒక గ్రుడ్డు; అవియన్= పగులునట్లుగా; అడిచెన్= కొట్టింది.

తాత్పర్యం: రాజా! సవతి కద్రువను చూచి దుఃఖం, అసూయ కలుగగా వినత తొందరపడి ఒక గ్రుడ్డు పగులకొట్టింది. ఇది నియమాన్ని తప్పటం (సృష్టి నియమాన్ని కాదనటం. ఆ గ్రుడ్లు వాటంతటవే పిగిలి పిల్లలు పుట్టాలి తప్ప పగులకొట్టితే ఎట్లా? అది అనీతి)

వ. అడిచిన నందు. **169**

ప్రతిపదార్థం: అడిచినన్= పగులగొట్టగా; అందున్= అందులోనుండి.

తాత్పర్యం: పగులగొట్టగా అందులోనుండి.

క. పులుఁగొక్కఁడు పూర్వాంగము । గలిగి జనించుటయు, వానిఁ గని, యానతి గ
న్నుల నశ్రుకణంబులు పె । ల్లొలుకఁగ శోకమున మునుఁగు నుల్లముతోడన్. **170**

ప్రతిపదార్థం: పులుఁగు= పిట్ట; ఒక్కఁడు= ఒకటి; పూర్వ+అంగము= పై శరీరం; కలిగి; జనించుటయున్= పుట్టగా; ఆ సతి= ఆ వినత; వానిన్+కని= అర్ధశరీరం గల కొడుకును చూచి; కన్నులన్= కళ్ళనుండి; అశ్రుకణంబులు= కన్నీటిబొట్లు; పెల్లు= ఎక్కువ; ఒలుకఁగన్= కారగా; శోకమునన్= దుఃఖంలో; మునుఁగు= మునిగిన; ఉల్లముతోడన్= మనస్సుతో;

తాత్పర్యం: ఊర్ధ్వశరీరం మాత్రం కల పక్షి పుట్టింది. ఆ తల్లి ఆ కొడుకును చూచి కన్నీళ్ళు కారుస్తూ దుఃఖంలో మునిగిపోయిన మనస్సుతో (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. నివ్వెఱపడి యుండ నయ్యండజంబు. **171**

ప్రతిపదార్థం: నివ్వెఱపడి= నిశ్చేష్టురాలై; ఉండన్= ఉండగా, నిలబడి పోగా; ఆ+అండజంబు= ఆ గ్రుడ్డు నుండి పుట్టినపక్షి.

తాత్పర్యం: నిశ్చేష్టురాలై ఉండగా ఆ గ్రుడ్డునుండి పుట్టిన పక్షి.

చ. 'ఇరువుర మేము పుట్టుదు మహీనపు మేనులతో, మహాబల
స్ఫురణ వెలుంగ నప్పెనుపుఁ బొందఁగ నీ కవియించి తిట్లు మ
త్సరమునఁ జాపలంబునను దత్ఫల మందుము, నీ సపత్నికిన్
వరవుడవై చరింపు మని, వారని నెవ్వగ శాప మిచ్చినన్. **172**

ప్రతిపదార్థం: మేము; ఇరువురము= ఇద్దరం; పుట్టుదుము= పుట్టేవాళ్ళం; అహీనపు= గొప్ప, తక్కువకాని; మేనులతోన్= శరీరాలతో; మహాబల స్ఫురణ = గొప్ప బలకాంతి; వెలుంగన్= ప్రకాశించగా; ఆ+పెనుపు= ఆ అభివృద్ధి; పొందఁగ నీక= పొందకుండా; అవియించితి (వి)= పగులగొట్టావు; ఇట్లు= ఈ విధంగా; మత్సరమునన్= అసూయతో; చాపలంబునను= చాపల్యంతో; తత్= దానికి; ఫలము= ఫలితం; అందుము= గ్రహించుము; నీ; సపత్నికిన్= సవతికి; వరవుడవై= దాసివై;

చరింపుము= బ్రతుకు; అని; వారని= మళ్ళించరాని; నెఱ+వగన్, నెవ్వగన్= నిండు దుఃఖంతో; శాపము= శాపాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: మహాబలవంతులమై గొప్ప శరీరాలతో ఇద్దరం పుట్టేవాళ్ళం. ఆ పరిణతిని పొందనివ్వకుండా చేశావు. కేవలం నీ సవతిపై నున్న అసూయా, చపలత్వంవలన. కనుక దానికి ఫల మనుభవించుము. 'నీ సవతికి దాసివై బ్రతుకు' మని తీరని దుఃఖంతో శపించాడు.

క. వెలవెలఁ బాఱుచు, వడఁకుచు । నలుకుచుఁ, దనమోముఁ జూచు నయ్యంగన న
ప్పులుఁగు కృపఁ జూచి, తల్లీ! వలవ దడల నిది విధాతృ వశమయి వచ్చెన్. 173

ప్రతిపదార్థం: వెలవెల+పాఱుచున్= పాలిపోతూ (ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేకపోవటం); వడఁకుచున్= వణకుతూ; అలుకుచున్= (గాలికి చిగురాకువలె) భయంతో కంపిస్తూ; తన మోమున్= తన ముఖాన్ని; చూచు=చూస్తున్న; ఆ+అంగనన్= ఆ తల్లిని; ఆపులుఁగు= ఆ పక్షి; కృపన్= జాలితో; చూచి; తల్లీ= అమ్మా! (ప్రేమతో పిలిచిన పిలుపు;) అడలన్ వలదు= భయపడవద్దు; ఇది = ఈ శాపం; విధాతృ వశమయి= బ్రహ్మ (కర్మ) అనుసారంగా; వచ్చెన్= దాపురించింది.

తాత్పర్యం: పాపం సవతిసంతానాన్ని చూచి వాపోయి ఈ పనిచేస్తే జరిగింది. సరిగా అవయవాలు ఏర్పడకుండానే కొడుకు పుట్టాడు. తనను సరిగా పెరగనివ్వకుండా చేసిన తల్లి మాత్సర్యం, దుఃఖచాపల్యం చూచి కొడుకుకు కోపం వచ్చి శపించాడు. అట్లా పుట్టిన కొడుకును చూచి దుఃఖపడింది. ఆ తల్లి; కొడుకు శాపానికే భయపడుతుందా? ఈ సంకటంలో ఆమె తెల్లబారిపోయింది. వణికింది, భయంతో కంపించిపోయింది. అమాయకురాలైన ఆ తల్లి 'నాయనా! నన్నా శపించా' వన్నట్లు తన ముఖాన్ని చూస్తూ నిలబడిపోతే కొడుకు గుండె కరిగి నీరై పోయింది. 'అమ్మా! ఇది సృష్టికర్త సంకల్పంవలన వచ్చింది. భయపడకుము' అని ఓదార్చాడు.

విశేషం: ఒక చిన్న పద్యంలో మహాకవి ఎంత శోచనీయస్థితిని సృష్టించాడు. తల్లీ కొడుకులు ఎట్లాంటి పరిస్థితులలో చిక్కుకుపోయారు. అంత విచిత్ర పరిస్థితిని కల్పించిం దెవరు? సృష్టికర్త తప్ప. దానికి లోబడిన లోకం అనుభవించటంకంటె చేసేదేముంది? ఆ బ్రహ్మ సంకల్పం ఈ నాటకం. సుఖమూ, దుఃఖమూ కలది.

వ. అని వెండియు. 174

తాత్పర్యం: మళ్ళీ ఇంకా.

శా. 'ఏనూఱేండ్లకుఁ బుట్టు నాయనుజుఁ; డిం కీయున్న యండంబు నె
ట్లైనన్ ధైర్యము గల్గి కావుము ప్రయత్నాసక్తిమై వాఁడు ద
ర్పానూనుండు బలాభిరాముఁడు మదీయస్ఫూర్తి మన్మూర్తి నీ
కానందంబుగ నీఁగు దాస్యము త్రిలోకాశ్చర్య సంపాదియై. 175

ప్రతిపదార్థం: నా= నాయొక్క; అనుజుఁడు (అనుసరించి పుట్టేవాడు) తమ్ముఁడు; ఏనూఱు= ఐదువందలు; ఏండ్లకున్= సంవత్సరాలకు; పుట్టున్= పుట్టగలడు; ఇంకన్= ఇక; ఈ ఉన్న= ఈ మిగిలిన; అండంబున్= రెండో గ్రుడ్డును; ఎట్లు+ఐనన్=

ఎట్లాగైనా; ధైర్యము కల్గి= ధైర్యంతో; ప్రయత్న+ఆసక్తిమైన్= ప్రయత్నంతో; కోర్కెతో, ప్రయత్న పూర్వకమైన ఆసక్తి గలిగి; కావుము= రక్షించుము; వాఁడు= ఇక ఆ పుట్టబోయేవాడు; దర్ప+అనూనుండు= గొప్ప దర్పం (దర్జా) కలవాడు; బల+అభిరాముఁడు= బలంతో అందమైనవాడు; మదీయ= నా యొక్క; స్ఫూర్తిమత్= తేజస్సు కల; మూర్తి= ఆకారం కలవాడు; త్రిలోక= ముల్లోకాలకు; ఆశ్చర్య= అబ్బురపాటును; సంపాది+ఐ= కల్గించగలవాడై; నీకున్; ఆనందంబుగన్= సంతోషం కలిగేటట్లు; దాస్యమున్= బానిసతనాన్ని; ఈఁగున్= పోగొట్టును.

తాత్పర్యం: ఈ ఉన్న గ్రుడ్డునైనా జాగ్రత్తగా కాపాడుకొమ్ము. ఇంకా ఐదువందల ఏండ్లు గడచిన తరువాత నాకు తమ్ముడు జన్మిస్తాడు. ఆ పుట్టే వాడున్నాడే వాడు మహా దర్పం కలిగి గొప్ప బలశాలియై, నా తేజస్సునంతా తాను పొందిన ఆకారంతో జన్మించి, ముల్లోకాలకు ఆశ్చర్యం కలిగిస్తూ, నీకానందం కలిగిస్తూ, నీ దాస్యాన్ని పోగొట్టుతాడు.

విశేషం: పై పద్యంలో తల్లిని శపించాడు. ఈ పద్యంలో తల్లిని ఓదారుస్తున్నాడు. అందుకే పెద్ద పద్యం. పుట్టే తమ్మునిమీద ప్రేమకొద్దీ పెద్ద మాటలతో వాడిని పొగడుతున్నాడు. అట్లాంటివాడు జన్మిస్తాడు. పుట్టి తల్లికి కలిగిన దాస్యాన్ని పోగొట్టటే కాక ముల్లోకాలకు ఆశ్చర్య కారకుడౌతాడు. కనుక ఐదువందల ఏళ్ళు ఎట్లాగైనా ఓపిక పట్టుమని తల్లిని ఓదార్చటం పద్యభావం. పుట్టబోయే గరుత్మంతుడిని పరిచయం చేయటం రాబోయేపాత్రను ముందుగానే మరొక పాత్రతో పరిచయం చేసినట్లు. చాలా గొప్ప పద్యం. పై పద్యంలో దుఃఖం. ఈ పద్యంలో ఆనందం. వెరసి మానవజీవితం.

వ. అనియె; నిట్లు ప్రథమ పుత్త్రుండు వికలాంగుం డగుటకును, శాపప్రాప్తికిని, బరమనిర్వేదంబు నొంది, వినతయు నవ్విహంగంబు నిర్దేశించిన కాలంబు ప్రతీక్షించి, యయ్యండంబు రక్షించి కాచియుండం, దత్సమయ సమాగమంబున. 176

ప్రతిపదార్థం: అనియెన్= అని చెప్పాడు; ఇట్లు= ఈ విధంగా; ప్రథమపుత్రుండు= పెద్దకొడుకు; వికల+అంగుండు= సరిగా పెరగని అవయవాలు కలవాడు (కుంటివాడు); అగుటకును; శాపప్రాప్తికిని= శాపం కలిగినందుకూ; పరమ= చాలా గొప్ప; నిర్వేదంబు= దుఃఖం; ఒంది= పొంది; ఆ+విహంగంబు= ఆ పక్షి (పెద్దకొడుకు); నిర్దేశించిన= చెప్పిన; కాలంబు= ఐదువందల ఏండ్లు; ప్రతీక్షించి= ఎదురుచూచి; ఆ+అండంబున్= ఆ గ్రుడ్డును; రక్షించి= కాపాడి; కాచియుండన్= కనిపెట్టుకొని ఉండగా; తత్= ఆ, ఐదువందల ఏళ్ళ; సమయ= కాలం; సమాగమంబునన్= రాకతో.

తాత్పర్యం: ఈ విధంగా పెద్దకొడుకు వికలాంగుడు కావటం - శాపం రావటంతో గుండె చెదరిపోయిన తల్లి ఆ పెద్దకొడుకు చెప్పిన కాలంకొరకు నిరీక్షిస్తూ ఆ గ్రుడ్డును కాపాడుతూ ఉండగా, కాలం తిరిగి వచ్చింది. (ఐదువందల ఏళ్ళు గడచిపోయాయి)

చ. ఘనతరకంధరుండు, దృఢకాయుఁడు, దీప్తముఖుండు, రక్తలో
చనుఁడు, మహోత్తమాంగకుఁడు, చారుసుసంగత పక్షసారమం
డనుఁడు, పరిస్ఫుర ద్ద్యుతి విడంబిత బాలదివాకరుండు, లో
కనయన పర్వనిర్వహణకారి సుపర్ణుఁడు పుట్టె భూవరా! 177

ప్రతిపదార్థం: భూవరా!= భూమికి రాజా!, సుపర్ణుఁడు= మంచి రెక్కలు గలవాడు, గరుత్మంతుడు; ఘనతర= చాలాగొప్ప; కంధరుండు= మెడ కలవాడు, బలిసిన మెడ కలవాడు; దృఢ= బలిష్ఠమైన; కాయుఁడు= శరీరం కలవాడు; దీప్త= కాంతితో

వెలిగే; ముఖుండు= ముక్కు కలవాడు, (ముఖం కలవాడు); రక్త= నెత్తురువలె ఎర్రని; లోచనుఁడు= నేత్రాలున్నవాడు; మహా+ఉత్తమ+అంగకుఁడు= గొప్ప తల కలవాడు; చారు= అందంగా; సుసంగత= కూడిన - పొందిపొసగినట్లున్న; పక్ష= రెక్కల; సార= సారం, శక్తి; మండనుఁడు= అలంకారంగా కలవాడు; పరి= మిక్కిలిగా; స్ఫురత్= ప్రకాశించే; ద్యుతి= కాంతితో; విడంబిత= పోలిన; బాలదివాకరుండు= బాలసూర్యుడు; లోక= ముల్లోకాల; నయన= నేత్రాలకు; పర్వ= పండుగను; నిర్వహణ= నిర్వహించటం; చక్కగా మోయటం; కారి= చేసేవాడు; (పర్వ నిర్వహణకారి= పండుగను కల్పించటం చేసేవాడు;) పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! గరుత్మంతుడు (రెక్కలు కలవాడు) జన్మించాడు. (అత డెట్లా ఉన్నాడంటే) అతడు బలిసినమెడతో; బలిష్ఠమైన దేహంతో, అగ్నివలె జ్వలించే ముఖంతో, ఎర్రని నేత్రాలతో, కాంతితో ప్రకాశించే బాలసూర్యుడి వంటివాడు, సర్వలోకాల నేత్రాలకు పండుగను కల్పించేవాడు (ఆనందదాయకుడు) ఐనవాడు.

విశేషం: పద్యమంతా సుపర్ణుడి గొప్ప ఆకారాన్ని వర్ణిస్తున్నది. 175వ పద్యంలో చెప్పినట్లుగా ఒక మహాపురుషుడి ఆకార విశేషం ఇందులో వర్ణించబడింది. కనుక పద్యరచనలో ఒక సాంద్రత కన్పిస్తుంది. బిగువుగా నడుస్తుంది పద్యం. ఆ బిగువంతా మహా పురుషుడి గొప్పతనానికి సంకేతం.

క. ఆ సమయంబున నరుణో । ద్భాసిత గాత్రుండు, తొలుతపట్టి యరుణుఁ డు
ల్లాసి యగుచు రవి పరిచ । ర్యాసుఖ మెదఁ గోరి చనియె నంబరవీథిన్. 178

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సమయంలో; అరుణ= ఎర్రని కాంతితో; ఉత్+భాసిత= చక్కగా ప్రకాశించే; గాత్రుఁడు= శరీరం కలవాడు; తొలుత పట్టి= వినత మొదటి కొడుకు; అరుణుఁడు= ఆ పేరు కలవాడు; ఉల్లాసిఅగుచున్= సంతోషిస్తూ; రవి= సూర్యుడి; పరిచర్యా= సేవా; సుఖము= సుఖాన్ని; ఎదన్= మనస్సులో; కోరి= కోరుకొని; అంబరవీథిన్= ఆకాశమార్గంలో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ వేళ ఎర్రని శరీరం కల వినత మొదటి కొడుకు అరుణుడు సంతోషించి, సూర్యుడిని సేవించటానికి ఇష్టపడి ఆకాశంలో ఎగిరిపోయాడు. (తమ్ముడు పుట్టేంతవరకు తల్లిని కాపాడుకొంటూ తోడుగా ఉన్నాడని భావం.)

మ. జననిం బాసి జనించునప్డ తనయిచ్ఛం బక్షినాథుండునుం
జని, పద్మోద్భవకల్పితంబు లగు భోజ్యంబుల్ శరీరంబు వ
ర్ధన మొందింపఁగ సిద్ధసాధ్యగణముల్ దన్ ముద్దు సేయంగఁ గ్రీ
డన లోలత్వమునం జరించుఁ బరితుష్టస్వాంతుఁడై యెల్లెడన్. 179

ప్రతిపదార్థం: జనించునప్డు+అ= పుట్టినప్పుడే; పక్షినాథుండునున్= పక్షులకు రాజైనవాడు; జననిన్= తల్లిని; పాసి= వదలి; తన= తన యొక్క; ఇచ్ఛన్= ఇష్టానుసారంగా; కోర్కెతో; చని= వెళ్ళి; పద్మ+ఉద్భవ= పద్మంనుండి పుట్టిన బ్రహ్మచేత; కల్పితంబులు= సృష్టిచేయబడిన; భోజ్యంబుల్= ఆహారాలు; శరీరంబున్= దేహాన్ని; వర్ధనమున్= పెరుగుదలను; ఒందింపఁ గన్= పెంపొందింపగ చేయగా; ఎల్లెడన్= ఎల్ల యెడల; పరితుష్ట = సంతుష్టి పొందిన; (స+అంత= స్వాంతము= మనస్సు (లోపలిది)) స్వాంతుఁడై= మనస్సు కలవాడై; సిద్ధ, సాధ్య గణముల్= సిద్ధుల, సాధ్యుల (దేవతలలో జాతులు) సమూహాలు; తన్= తనను; ముద్దుచేయంగన్= ముద్దు చేస్తుండగా; క్రీడన= ఆటలపై; లోలత్వమునన్= ఆసక్తితో; చరించున్= విహరిస్తాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు పుట్టినప్పుడే తల్లిని వదలి తన ఇష్టానుసారంగా బ్రహ్మ సృష్టించిన ఆహారానికై లోకాలన్నీ క్రీడగా విహరిస్తుంటే; సిద్ధ సాధ్యులైన దేవతలందరు తనను ముద్దు చేస్తుండేవారు.

వ. అక్కాలంబున వినోదంబునకై యరిగి యొక్క యెడ. 180

ప్రతిపదార్థం: ఆ+కాలంబునన్= ఆ సమయంలో; వినోదంబునకై= ఆటకై; అరిగి= వెళ్ళి; ఒక్క ఎడన్= ఒకచోట.

తాత్పర్యం: ఆ సమయంలో ఆటకై వెళ్ళి ఒకచోట. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. చంచులఁ జిగురాకుఁ జించియాడుచు నలి । నెలుఁగించు గండుఁగోయిలలసొంపు,
నలరుఁ దేనియఁ గ్రోలి, యన్ను సోలంబుల । మురియు తేఁటుల నునుమ్రోఁత యింపుఁ,
దమిఁ బండ్ల రసమాని తమలోనఁ జెలఁగుచుఁ । బలికెడు రాచిల్క పటురవంబు,
గొలఁకుల కెలఁకులఁ గూడి క్రీడించుచుం । డెడు నంచతండంబు నడబెడంగుఁ,

తే. దరఁగఁ దేలుచుఁ, బూఁదీవఁ దగులఁ బడుచు । వచ్చు చిఱుగాలి సోఁకును, మెచ్చి మెచ్చి,
తగిలి కొనియాడుచును, వినతయును గద్రు । వయును మున్నీటి చేరువ వనమునందు. 181

ప్రతిపదార్థం: చంచులన్= ముక్కులతో, చిగురాకున్= చివురాకులను; చించి= చీల్చి; ఆడుచున్= ఆడుతూ; నలిన్= ప్రేమతో; సన్నగా; ఎలుఁగించు (ఎలుఁగు+ఇంచు)= కూసే, పాడే; గండుకోయిలల= మగకోకిలల; సొంపున్= అందాన్ని; అలరుఁదేనియన్= పూలతేనెను; క్రోలి= త్రాగి; అన్ను= అందమైన; సోలంబులన్= కుత్తుకలతో; మురియు= మురిసిపోతున్న; తేఁటుల= తుమ్మెదల; నును= సన్నని; సుకుమారమైన; మ్రోఁత= ధ్వని; ఇంపున్= అందమున్నూ; తమిన్= కోర్కెతో; పండ్లరసము= పళ్ళరసాలను; ఆని= త్రాగి; తమలోనన్= తమలో తాము; చెలఁగుచున్= ఏపురేగి, విజృంభించి; పలికెడు= పలుకుతున్న; రాచిల్క= రాజచిలుకలయొక్క; ముక్కు ఎరుపు; దేహం పచ్చదనం); పటురవంబున్= పటిష్ఠమైన స్వరం; కొలఁకులన్= చెరువులలోనూ; కెలఁకులన్= వాటిప్రక్కలా; కూడి= కూడుకొని; క్రీడించుచుండెడు= ఆడుకొంటున్న; అంచతండంబు= హంసల గుంపులు; నడ= నడకల; బెడంగున్= అందాలనూ; తరఁగన్= తరగలమీదుగా; తేలుచున్= తేలిపోతూ; పూఁదీవన్= పూలతీగలో; తగులన్‌బడుచున్= చిక్కుకుపోతూ; వచ్చు= వచ్చే; చిఱుగాలి= లేతగాలి; సోఁకునున్= స్పర్శను; మెచ్చిమెచ్చి= తెగమెచ్చుకొంటూ; తగిలి= ఆసక్తితో; కొనియాడుచున్= ప్రశంసిస్తూ; మును+నీటి= సముద్రంయొక్క; చేరువ= దగ్గరలో ఉన్న; వనమునందున్= తోటలో; వినతయును, కద్రువయును= సవతులిద్దరూ.

తాత్పర్యం: మదించిన మగ కోకిలలు ముక్కులతో చిగురాకులను చీలుస్తూ ఆడుతూ గొంతెత్తి పాడుతున్నాయి. వాటి పాటల అందాలనూ, పూల తేనెలు త్రాగిన మత్తుతో మురిసే తుమ్మెదల ఝుంకారాల అందాలనూ, పండ్లరసం త్రాగి తమలో చెలరేగుతూ అరుస్తున్న చిలుకగుంపుల ధ్వనులున్నూ, చెరువులలోనూ, వాటి చుట్టుపట్లా కూడి మాడి ఆటలాడే హంసల గుంపుల నడకల అందాలనూ, కెరటాలు కెరటాలుగా వస్తూ, తీగెలలో చిక్కుపడుతూ వచ్చే లేతగాలి స్పర్శకు ఆనందిస్తూ సముద్రతీరంలో ఉన్న చెట్ల తోపులలో వినత కద్రువలనే సవతులిద్దరూ. (క్రింది వచనంతో అన్వయం)

విశేషం: ఇది చాలా గొప్ప వర్ణన.

వ. మెలఁగుచుండి రట్టియెడ. **182**

విశేషం: విహరిస్తున్న సమయంలో.

చ. కరువునఁ బోసిరో! విధుని కాంతి, సుధాబ్ధి తరంగఁ దెచ్చి, గం
డరు వొనరించిరో! హరుజటాస్థలికిం దొడ వైన యేటి పె
న్నురువునఁ జేసిరో! యన మనోజ్ఞ సితచ్ఛవి నుల్లసిల్లు సుం
దర తురగోత్తమంబు దవుదవ్వులఁ గాంచిరి చారులోచనల్. **183**

ప్రతిపదార్థం: చారు= అందమైన; లోచనల్= కన్నులున్న కద్రూవినతలు; దవు దవ్వులన్= అల్లంత దూరంలో; విధుని కాంతి= చంద్రుడి వెలుగును; కరువునన్= మూసలో; పోసిరో?= పోసినారా!; సుధాబ్ధి తరంగన్= పాలసముద్రం అలను; తెచ్చి= తీసికొని వచ్చి; గండరువు= పడియచ్చు; ఒనర్చిరో?= చేశారా?; హరు= శివుడియొక్క; జటాస్థలికిన్= జడలప్రదేశానికి; తొడవు= అలంకారం, భూషణం; ఐన= అయినటువంటి; ఏటి= గంగయొక్క; పెన్+నురువునన్= పెద్ద నురుగుదిబ్బతో; చేసిరో!= చేశారో; అనన్= అన్నట్లుగా; మనోజ్ఞ= మనస్సును హరించే; సిత= తెల్లని; ఛవిన్= కాంతితో; ఉల్లసిల్లు= ప్రకాశించే; సుందర= అందమైన; తురగ+ఉత్తమంబు= శ్రేష్ఠమైన గుర్రాన్ని; దవుదవ్వులన్= అల్లంతదూరంలో; కాంచిరి= చూచారు

తాత్పర్యం: (పద్యమంతా అందమైన తెల్లని గుర్రం వర్ణన. ఆ తెలుపు ఎంత అందంగా ఉన్నదంటే) చంద్రకాంతిని మూసలో పోసి చేసినట్లు, పాలసముద్రపు అలను తెచ్చి శిల్పంగా చెక్కినట్లు, శివుడి జడల కలంకారమైన దేవతా గంగలోని నురుగుతో చేసినట్లు ఆశ్చర్యంగా ఉన్న ఆ గుర్రాన్ని అల్లంతదూరంలో అందమైన కళ్ళతో ఆస్వాదించారు.

విశేషం: ఇవన్నీ అందమైన ఉత్ప్రేక్షలు.

వ. నిజేచ్ఛమై వచ్చిన యుచ్చైశ్శ్రవంబు నాలోకించి. **184**

ప్రతిపదార్థం: నిజ= తనయొక్క; ఇచ్ఛమైన్ = కోర్కెతో; వచ్చిన; ఉచ్చైశ్శ్రవంబున్= ఇంద్రుడి గుర్రాన్ని; (ఉచ్చైః= పైకి నిగిడి ఉన్న; శ్రవంబు= చెవులు కలది); ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇష్టానుసారంగా వచ్చిన ఇంద్రుడి అశ్వమైన ఉచ్చైశ్శ్రవాన్ని చూచి.

క. వినత 'హయ మింత యొప్పునె । యనూన ధవళప్రభాఢ్యమై' యని పలుకన్
విని, కద్రువ 'యపరాంగం । బున నీలిమ దోఁచె' ననియె భూపవరేణ్యా! **185**

ప్రతిపదార్థం: భూప= భూమిపతులలో; వరేణ్యా!= శ్రేష్ఠుడా!; వినత; అనూన= అతిశయమైన; మిక్కిలి; ధవళ= తెల్లని; ప్రభా= కాంతితో; ఆఢ్యమై= కలిగినదై; హయము= గుర్రం; ఇంత ఒప్పునె!= ఇంత అందంగా ఉన్నదే; అని; పలుకన్= పలుకగా;; విని; కద్రువ; అపర+అంగంబునన్= చివరి అవయవంలో; తోకమీద, నీలిమ= నలుపు; తోఁచెన్= కనిపిస్తున్నది; అనియెన్= అని పలికింది.

తాత్పర్యం: వినత అన్నది: 'అబ్బా! ఇంత తెల్లని కాంతితో గుర్రం ఎంత అందంగా ఉన్నదే'? అని అంటే విని కద్రువ అన్నది; 'తోక నల్లగా ఉన్నది కదా!' అని.

చ. అనవుడు నమ్మృగాక్షి 'యిటు లాడితి, నవ్వుల కాడితో? నిజం
బునకునొ? నీదు చూపునకుఁ బోలిన భంగియొ? చెప్పు' మన్న న
వ్వనిత దరస్మితస్ఫురితవక్త్రముతో 'నిది యేటి మాట? న
ల్లనియెడ గానరాదె? తెరలం బలుకం బని యేమి? నావుడున్. 186

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా, అట్లా అంటే; ఆ+మృగ+అక్షి= ఆ లేడికన్నులవంటి కన్నులు కలది - వినత; ఇటులు= ఈ విధంగా; ఆడితి= అన్నావు; నవ్వులకున్= నవ్వులాటగా; ఆడితో(తివి+ఓ)?= అన్నావా?; నిజంబునకునొ?= నిజంగానేనా?; నీదు= నీ; చూపునకున్= దృష్టికి; పోలిన భంగియొ?= ఉచితరీతియా?, తగిన విధానమా? (నీ కళ్ళ కట్లా కన్పిస్తున్నదా?); చెప్పుము= చెప్పుము; అన్నన్= అనగా; ఆ+వనిత= ఆ స్త్రీ, కద్రువ; దర= కొంచెం; స్మిత= లేతనవ్వు; స్ఫురిత= స్ఫురించిన, కన్పించిన; వక్త్రముతోన్= ముఖంతో; ఇదిఏటిమాట?= ఇదేం మాట? నల్లని+ఎడ= నల్లనిచోటు; కానరాదె?= కన్పించదా? తెరలన్+పలుకన్= కాదనటం, అబద్ధం చెప్పటం; పని ఏమి= ఏమిపని?; నావుడున్= అనగా.

తాత్పర్యం: అట్లా అనేసరికి, వినత అన్నది 'నవ్వులాటగా అన్నావా? లేక నిజంగా నీ చూపున కట్లాగే కనిపిస్తున్నదా?' అని ప్రశ్నించగానే ఆమె చిన్నగా నవ్వుతూ 'నీవన్నమాట కాదనవలసిన అవసర మేమిటి? అదిగో నల్లగా ఉన్న ప్రదేశం కన్పించటంలేదా?' అని అనగానే. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: వినత అమాయకురాలు కనుక మృగాక్షి. లేడి అమాయక జంతువు. కనుకనే ఉన్న మాట అన్నది. కద్రువ మోసగత్తె. కనుకనే సన్నగా నవ్వింది. ఆ నవ్వు మోసగాళ్ళ లక్షణమని చెప్పటానికే కవి వ్రాశాడు.

వ. వినత తెలియం జూచి. 187

ప్రతిపదార్థం: వినత; తెలియన్= తెలిసేటట్లుగా; చూచి= మళ్ళీ చూచి.

తాత్పర్యం: ఆమె అట్లా అనేసరికి స్పష్టంగా చూచింది వినత.

ఉ. కాదని పూని పల్కుటయుఁ గద్రువ 'పన్నిద మేమి దీనికి?
న్వా దిది యేల? రిత్త' యనినన్ విని యాసతి 'నిక్కమేని నీ
వేది పణంబుగాఁ దలఁచి యేర్పడఁ జెప్పితి దాని కేను సం
వాదము సేయుదాన గరువంబుగ నొక్కటి నిశ్చయింపుమా!' 188

ప్రతిపదార్థం: కాదు+అని= వినత ఆ విధంగా చూచి నీ వన్నది కాదు అని; పూని= నిశ్చయంగా; పల్కుటయున్= అనగానే; కద్రువ; పన్నిదము+ఏమి?= ఏమి పందెం?; దీనికిన్= ఈ విషయానికి; వాదు ఇది= ఈ వివాదం; రిత్త= వ్యర్థంగా; ఏల?= ఎందుకు?; అనినన్= అనగా; ఆ సతి= ఆ వినత; విని; నిక్కము= సత్యం; ఏని= అయితే; నీవు; ఏది; పణంబుగాన్= పందెంగా; తలఁచి= ఆలోచించి; ఏర్పడన్= స్పష్టంగా; చెప్పితి(వి)= చెప్పుతావో; దానికిన్; ఏను; సంవాదము= అంగీకారం; చేయుదానన్= చేస్తాను; గరువంబుగన్= సగర్వంగా; ఒక్కటి= ఏదో ఒకటి; నిశ్చయింపుమా!= నిర్ణయించుము.

తాత్పర్యం: వినత కద్రువతో 'నీవు చెప్పినది సరికాదు' అన్నది. దానికి కద్రువ 'ఈ వివాదం వ్యర్థంగా దేనికి?

ఒక పందెం వేయుము' అన్నది. దాని కా వినత 'నీవేది పందెంగా నిర్ణయిస్తావో దానికి నేనంగీకరిస్తాను. కనుక పందె మేదో ఒకటి నిశ్చయించుము' అన్నది.

వ. అనిన విని కద్రువ వినత వదనంబునఁ జూడ్కి నిలిపి. 189

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; కద్రువ; వినత వదనంబునన్= వినత ముఖంమీద; చూడ్కి= చూపు; నిలిపి= లగ్నంచేసి.

తాత్పర్యం: అనగా విని వినత ముఖంలోకి చూచి కద్రువ. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. 'నీవు గెల్చిన దాస్యంబు నీకు నేను । జేయఁ గలదాన, నేను గెల్చినను నీవు
నాకుఁ జేయంగఁ గలదాన; వీ కడింది । పన్నిదము సఱ' మని తెగఁబాఱి పలికె. 190

ప్రతిపదార్థం: నీవు గెల్చినన్= నీవు గెలిస్తే; నీకున్ నేను; దాస్యంబు= బానిసతనం; చేయగలదానన్; నేను గెల్చినన్= నేను గెలిస్తే; నీవు నాకున్; చేయంగన్+కలదానవు= చేయాలి; ఈ కడింది= ఈ గట్టి; పన్నిదము= పందెం; చఱము= వేద్దాం; అని; తెగఁబాఱి= తెగించి; పలికెన్= అన్నది.

తాత్పర్యం: ' ఈ విషయంలో నీవు గెలిస్తే నేను దాస్యం చేస్తాను. నేను గెలిస్తే నీవు దాస్యం చేయాలి. ఈ పందెం కాద్దాం' అని పలికింది కద్రువ.

క. ఆ పొలఁతి యట్లు పలికిన । శాపము ప్రేరేఁప నరుణ జననికి నుత్సా
హోపేత మయ్యెఁ జిత్తం । బాపన్నిదమునకు; నేమి యనఁగల దధిపా! 191

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! (ధర్మరాజా!) ఆ పొలఁతి= ఆ స్త్రీ (కద్రువ); అట్లు పల్కినన్= అట్లా అనగా; అరుణ జననికిన్= అరుణుడి తల్లికి; శాపము ప్రేరేఁపన్= (అతడి) శాపం ప్రేరేపించగా; ఆ పన్నిదమునకున్= ఆ పందెమునకు; చిత్తంబు= వినత మనస్సు; ఉత్సాహ= ఉత్సాహంతో; ఉపేతము= కూడుకొన్నది; అయ్యెన్= ఐనది; ఏమి అనన్+కలదు?= ఏమనటాని కేమున్నది?

తాత్పర్యం: రాజా! కద్రువ అట్లా పందెం కాయగానే అరుణుడి తల్లికి మనస్సు ప్రేరేపించగా, పందెం అంగీకరించటానికి ఉత్సాహపడింది.

వ. ఇట్లు వినతయుం దెంపు సేసి యత్తెఱంగున కియ్యకొనియె; నయ్యిరువురుఁ బంచమహాభూతంబులు సాక్షులుగాఁ బల్కి పన్నిదంబు సఱచిరి; కద్రువ 'పతిపరిచర్యకుం గాలమయ్యెఁ; మఱివచ్చి యశ్వంబు నాలోకింత' మని నెపంబిడి యప్పటికిం జూపుఁ దప్పించె; నవ్విధంబున మగిడి యరుగుదెంచిరి; తదనంతరంబ. 192

ప్రతిపదార్థం: ఇట్లు వినతయున్= ఈ విధంగా వినత; ఆలితెంపుచేసి= తెగించి; ఆ+తెఱంగునకున్= ఆ పద్ధతికి; ఇయ్యకొనియెన్= అంగీకరించింది; పంచమహాభూతంబులు= భూమి, వాయువు, జలం, అగ్ని, ఆకాశమన్న అయిదుమహాశక్తులు; సాక్షులుగాన్= సాక్ష్యంగా; పన్నిదంబు= పందెం; చఱచిరి= వేసికొన్నారు; కద్రువ; పతిచర్యకున్= భర్తసేవకు; కాలము+అయ్యెన్= సమయమైంది; మఱి= మరలా; వచ్చి; అశ్వంబున్= గుర్రాన్ని; ఆలోకింతము అని= చూద్దాం అని; నెపంబు+ఇడి= మిష పెట్టి;

అప్పటికిన్= ఆ సమయానికి; చూపున్= చూపును; తప్పించెన్= దాటవేసింది; ఆ+విధంబునన్= ఆ రీతిగా; మగిడి= తిరిగి; అరుగుదెంచిరి= వచ్చారు; తత్+అనంతరంబు+అ= అటు తర్వాత.

తాత్పర్యం: వినత కూడా తెగించి పందెం అంగీకరించింది. ఆ విధంగా వా రిద్దరూ పంచభూతాలు సాక్షిగా పందెం వేసికొన్నారు. కద్రువ తెలివిగా 'ఇప్పుడు భర్తకు సేవ చేసే సమయమైనది కనుక రేపు వచ్చి గుర్రాన్ని చూద్దా'మని అప్పటికి చూపు తప్పించింది. వినత అమాయకురాలు. కనుక సరే అన్నది. ఆ విధంగా వారిద్దరు ఇంటికి తిరిగి వచ్చారు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. కుటిలంపుఁ దలఁపునఁ గొడుకుల రావించి । కద్రువ యిట్లనుఁ గన్నునీరు
దొరఁగఁగ వారలతో 'నబ్ధి పొంతకు । వినతయు నేనును వేడ్క నరిగి
యచ్ఛ తెల్పునఁ గడునభిరామ మగునొక్క । యశ్వంబు గాంచితి; మవ్వధూటి
గేవలధవళంబు నా విని, యొడ్డార । మునకు నే నదె నల్లదనముఁ గంటె

తే. వెనుకదెస 'నన్న వాదయ్యెఁ, గనలి పన్ని । దంబు సఱచితి; మోడిన దాస్యవృత్తి
వచ్చు సవతికి; నే నెట్లు వరవుడంబు । సేయఁ దగు?; దోఁక నల్లగాఁ జేయరయ్య! 193

విశేషం: కద్రువ; కుటిలంపుఁదలఁపునన్= కుటిలమైన ఆలోచనతో; కొడుకులన్= తన కుమారులను; రావించి= పిలిపించి; కన్ను నీరు తొరఁగంగన్= కన్నీళ్ళు కారగా; వారలతోన్= వాళ్ళతో; ఇట్లు+అనున్= ఆ విధంగా అంటున్నది; వినతయున్; నేనును; వేడ్కన్= ఉత్సాహంతో; అరిగి= వెళ్ళి; అచ్ఛ తెల్పునన్= అచ్ఛమైన తెలుపుతో; కడున్= మిక్కిలి; అభిరామము= అందమైనది; అగు= ఐన; అశ్వంబున్= గుర్రాన్ని; కాంచితిమి= చూచాము; ఆ+వధూటి= ఆమె (వినత); కేవలధవళంబు= కేవలం తెలుపు; నాన్= అనగా; విని= నేను విని; ఒడ్డారమునకున్= ప్రతిఘటనకు, ద్వేషానికి; నేను; అదె నల్లఁదనమున్ కంటె?= అదుగో నలుపును చూచావా; వెనుక దెసన్ = వెనకప్రక్క; అన్నన్= అనగా; వాదు= వివాదం; అయ్యెన్= ఐనది; కనలి= కోపగించి; పన్నిదంబు= పందెం; చఱచితిమి= వేసికొన్నాం; ఓడినన్= ఓడిపోతే; సవతికిన్= నా సవతికి; దాస్యవృత్తి= పనులు చేయవలసిన స్థితి; వచ్చున్= వస్తుంది; నేను; ఎట్లు= ఏ విధంగా; వరవుడంబు= దాస్యం; చేయన్= చేయగా; తగున్= వీలౌతుంది; తోఁకన్= తోకను; నల్లగాన్= నలుపుగా; చేయరు+అయ్య= బాబూ చేయండిరా!

తాత్పర్యం: కద్రువ కుటిలబుద్ధితో కొడుకులను పిలిచి కన్నీళ్ళు కారుస్తూ 'నేనూ వినతా సముద్రతీరానికి ఉత్సాహంగా వెళ్ళాం. అక్కడ అచ్ఛమైన తెల్లని గుర్రం కన్పించింది. వినత అది చూచి 'గుర్రమెంత తెల్లగా ఉన్నది'! అన్నది. నేను ఆమె అన్నదానిని కాదనటానికే 'తోకలో నలు పున్న' దన్నాను. కోపంతో ఇద్దరం పందెం వేసికొన్నాం. ఓడిపోతే సవతికి దాస్యం చేయాలి. నే నెట్లా చేయగలను? కనుక నాయనలారా! తోకను నలుపు చేయండిరా' అన్నది.

చ. అనవుడు వాసుకి ప్రభృతు లక్కట! ధర్మువు గాదు; నీవు సూ
చినతెరు వట్టి గెల్పు శుభసిద్ధి యొనర్చునె? యట్లుగాక య
వ్వనితయుఁ దల్లి గాదె? గరువంపుఁ దనంబునఁ జూడ మాకు ని
ట్లనఁ దగునమ్మ? యెట్లయిన నయ్యెను; బాపము సేయవచ్చునే? 194

ప్రతిపదార్థం: అనవుడున్= తల్లి అట్లా అన్నంతట; వాసుకి ప్రభృతులు= వాసుకి మొదలైన (కొడుకులు) వారు; అక్కట!=అయ్యో!; నీవు చూచిన తెరువు= నీవు చెప్పిన పద్ధతి; ధర్మువు కాదు= ధర్మం కాదు; అట్టిగెల్పు= అట్లాంటిజయం; శుభసిద్ధి, ఒనర్చునె!= శుభాన్ని కల్గిస్తుందా? అట్లుకాక= అట్లాగూ కాక; ఆ+వనితయున్= ఆమెకూడా; గరువంపుఁదనంబునన్= గౌరవబుద్ధితో; చూడన్= పరికింపగా; మాకున్= మాకు; తల్లిగాదె!= తల్లియే కదా!; ఇట్లు+అనన్+తగు+అమ్మ!= నీవు ఇట్లా అనవచ్చునా తల్లీ!; ఎట్లు అయినన్+అయ్యెను= ఎట్లా జరుగవలసింది అట్లాగే జరుగుతుంది; పాపము చేయవచ్చునే!= పాపం చేయరాదు కదా!

తాత్పర్యం: కద్రువ అట్లా అనగానే వాసుకి మొదలైన వారు అన్నారు 'అయ్యో! తల్లీ! ఇది ధర్మం కాదు. నీవు చెప్పిన పద్ధతి శుభాలను కల్గించదు. అంతేకాక ఆమె కూడా గౌరవబుద్ధితో పరికించినప్పుడు మాకు తల్లియే గదా! మమ్మా పనికి ఆదేశింపవచ్చునా? జరుగనున్నది జరుగకమానదు. మేమీ పాపకృత్యము చేయలేము.

క. ఈ విధ మెమ్మెయి నైనం । గావింపఁగ వలయు ననుట గల్గినఁ బరదే
శావాసుల మగుదుము; మము । నీ వింకం దగదు తల్లి! నిర్బంధింపన్. 195

ప్రతిపదార్థం: ఈ విధము= నీవు చెప్పిన పద్ధతినే; ఏ+మెయిన్+ఐనన్= ఏ విధంగా నైనా సరే; కావింపఁగ వలయున్+ అనుట కల్గినన్= చేయాలి అని అనటమే జరిగితే; పరదేశ= ఇతర దేశాలలో; ఆవాసులము+అగుదుము= నివసిస్తాము (కానీ); నీవు+ఇంకన్= నీవింకా; మమున్= మమ్మల్ని; తల్లి!= అమ్మా!; నిర్బంధింపన్ తగదు= నిర్బంధించటం మంచిదికాదు, బలవంతం చేయటం కూడదు.

తాత్పర్యం: అట్లాకాదు. నేను చెప్పిందే చేసి తీరాలని కనుక నీ వంటే మే మిల్లూ, ఊరూ వదలి పొరుగు దేశాలకైనా పోతాం తప్ప తల్లీ! మమ్ములను నిర్బంధించటం మంచిది కాదు.

క. అని రట్టియెడం గొందఱు । జననిఁ దొఱఁగి యెక్కడేనిఁ జని; రా భంగిం
జనిన తనూజులఁ బేర్కొని । నెనరు విడిచి, యా నెలంత నిష్ఠురమతియై. 196

ప్రతిపదార్థం: అనిరి= వాసుకి మొదలైన వారట్లా అన్నారు; అట్టి+ఎడన్= తల్లితో వాసుకి మొదలైనవారు మాట్లాడుతున్న సమయంలో; కొందఱు= మిగిలిన కొడుకులలో కొంతమంది; జననిన్= తల్లిని; తొఱఁగి= వదలి; ఎక్కడ+ఏనిన్= ఎక్కడకైనా; చనిరి= వెళ్ళారు; ఆ భంగిన్= ఆ విధంగా; చనిన= వెళ్ళిన; తనూజులన్= కొడుకులను; పేర్కొని= పేరుపేరున పిలుస్తూ; ఆ నెలంత= ఆమె (కద్రువ); నెనరున్= ప్రేమను; విడిచి= త్యజించి; నిష్ఠుర= కఠిన; మతి+ఐ= హృదయం కలదై.

తాత్పర్యం: ఆ సమయంలో కొందరు కొడుకులు మన కెందుకీ గోలంతా; అమ్మకు ముఖం తప్పించుదామని ఎక్కడికో వెళ్ళిపోయారు. వారిని గురించి తల్లి మాతృప్రేమను కూడా వదలిపెట్టి రాతిగుండె కలదై.

కద్రువ తనకొడుకులకు జనమేజయునివలన నాశంబు గల్గునట్లు శపించుట(సం.13-23-1(కుంభ))

చ. 'అమృతకరాన్వయంబున మహాముని వేడ్క నరుండు పాండుభూ
రమణుని దేవి గొంతి యుదరంబునఁ బుట్టి, ధనంజయాది నా

మముల వెలుంగు దత్సుతుని మన్మఁడు సంభృతధర్మమైన పే

ర్మి మెఱయ నేల యేలు; జనమేజయనాముఁ డరాత్యజయ్యుఁడై. **197**

ప్రతిపదార్థం: అమృతకర= అమృతమే కిరణాలుగా కల చంద్రుడియొక్క; అన్వయంబునన్= వంశంలో; మహాముని నరుండు= నరనారాయణులన్న మహా మునులలో నరుడన్నవాడు; వేడ్కన్= కోరికతో; పాండుభూరమణుని= పాండురాజుయొక్క; దేవి= భార్యయైన; గొంతి= కుంతియొక్క; ఉదరంబునన్= కడుపునందు; పుట్టి= జన్మించి; ధనంజయ+ఆదినామములన్= ధనంజయుడు మొదలైన పేర్లతో; వెలుంగున్= ప్రఖ్యాతి పొందుతాడు; తత్=అతడి; సుతుని= కొడుకు అభిమన్యుడికి; మన్మఁడు= మనుమడు, పరీక్షిత్తు కొడుకు; జనమేజయనాముఁడు= జనమేజయు డన్న పేరుగలవాడు; సంభృత= చక్కగా భరించిన; ధర్మము= ధర్మం; ఐన= కల; పేర్మిన్= పెంపున (గొప్ప ధర్మం అతిశయించగా); అరాతి= శత్రువులకు; అజయ్యుఁడు+ఐ= జయించరానివాడై; నేలన్= భూమిని; ఏలున్= పాలిస్తాడు.

తాత్పర్యం: ఆదిముని నరుడన్నవాడు కోర్కెతో చంద్రవంశీయుడైన పాండురాజునకు కుంతీదేవి కడుపున పుట్టి ధనంజయుడు మొదలైన పేర్లతో ప్రపంచ ప్రఖ్యాతుడైన వానికి మనుమడు జనమేజయుడు శత్రుభయంకరుడై రాజ్యపాలనం చేస్తాడు.

ఉ. ఆతఁడు సర్పయాగమను నధ్వరముం గుపితాత్ముఁడై పితృ

ప్రీతిగఁ జేయుఁ; దద్దహనభీకర భూరి శిఖా ప్రవేశసం

జాతదురంతతాపమునఁ జావఁగలా' రని శాప మిచ్చెఁ; ద

త్పాతన వృత్తికిన్ వెఱచి తక్కటి నాగము లా భుజంగితోన్. **198**

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ జనమేజయుడు; సర్పయాగము= ఆ పేరుగల (సర్పాలను చంపే); అధ్వరమున్= యజ్ఞమును; కుపిత+ఆత్ముఁడై= కోపం కలవాడై; పితృ= తండ్రికి; ప్రీతిగన్= సంతోషం కొరకు; చేయున్= చేస్తాడు (ముందుకాలంలో); తత్ ఆ యజ్ఞంలోని; దహన= అగ్నియొక్క; భీకర= భయంకరమైన; భూరి= పెద్ద; శిఖా= మంటలలో; ప్రవేశ= ప్రవేశించటంవలన, పడటంవలన; సంజాత= పుట్టిన; దురంత= దాటరాని; తాపమునన్= వేడికి; చావగన్‌కలారు= చావగలరు; అని; శాపము ఇచ్చెన్= శపించింది; తత్= ఆ; పాతనవృత్తికిన్= యజ్ఞకుండాలలో పడటమనే స్థితికి; వెఱచి= భయపడి; తక్కటి= మిగిలిన; నాగములు= పాములు; ఆ, భుజంగితోన్= ఆ ఆడుపాముతో, కద్రువతో.

తాత్పర్యం: ఆ జనమేజయుడు తండ్రి ప్రీతికొరకు కోపంతో సర్పయాగం చేస్తాడు. మీరంతా భయంకరమైన ఆ నిప్పు మంటలలో పడి మాడండి అని తల్లి పిల్లలను శపించింది. ఆ శాపానికి భయపడి పాములు కద్రువతో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: పద్యంలో దీర్ఘసమాసం చాలా విచిత్రార్థసముపేత మైనది. 'తద్దహన - సంతాపమునన్' తత్ దహన - ఈ ఒత్తక్షరం, భీకర-భూరి-శిఖా ప్రవేశ- సంతాప-దురంత-తాపము- ఈ దీర్ఘాక్షరాలు. సంతాప - దురంత-బిందుపూర్వక - తకరాలు - ఆమె కోపతీవ్రతను వ్యక్తపరుస్తున్నవి. చావగలారు - అని చేతులు కలుపుకోవటం - భుజంగి - ఆడుపాము - తన పిల్లలను తానే కొరికి తింటుందనటాన్ని ధ్వనిస్తుంది.

తే. నల్లగాఁ జేయువార, మే మెల్లభంగి । నాతురంగమపతివాల। మని, రయమునఁ

బోయి, వాలధి రోమముల్ పొదివి, నీల - రోమసంచయమ్మైరి కురుక్షితీశ! **199**

ప్రతిపదార్థం: కురు= కౌరవ; క్షితి= భూమికి; ఈశ!= రాజా!; ఏము= మేము; ఎల్లభంగిన్= అన్నివిధాలా; ఆ తురంగము= ఆ గుర్రాలలో; పతి= రాజుయొక్క; వాలము= తోకను; నల్లన్+కాన్= నల్లగా; చేయువారము= చేస్తాము; అని; రయమునన్= వేగంగా; పోయి= వెళ్ళి; వాలధి=తోకయొక్క; రోమముల్= వెంద్రుకలను; పొదివి= కప్పి; నీలరోమ= నల్లని వెంద్రుకల; సంచయము= గుంపు; ఐరి= అయినారు.

తాత్పర్యం: రాజా! తల్లీ నీవు చెప్పినట్లు అన్ని విధాలా ఆ ఉత్తమాశ్వం తోకను నల్లగా చేస్తామని పాములు వేగంగా వెళ్ళి గుర్రం తోకను చుట్టుకొని నల్లని వెంట్రుకల గుంపైనారు.

క. కద్రువ, గన్గొని సంతో । షద్రుతమతి యగుచుఁ బిలిచి సవతికిఁ జూపెన్
భద్రాత్మక యవ్వినతయు । దద్ద్రోహం బెఱుఁగలేమి దైన్యము నొందెన్. 200

ప్రతిపదార్థం: కద్రువ; కన్గొని= చూచి; సంతోష= సంతోషంతో కలిగిన; ద్రుత= వేగంతో కూడుకొన్న; మతి+ఐ= మనస్సు కలదై; పిలిచి; సవతికిన్= వినతకు; చూపెన్= చూపించింది; భద్ర+ఆత్మక= శుభమైన మనస్సుకల; ఆ+వినతయున్= ఆ వినత; తత్= (కద్రువయొక్క); ఆ; ద్రోహంబు= వంచన, మోసం; ఎఱుఁగలేమిన్= తెలిసికొనలేకపోవటం వలన; దైన్యమున్= దీనత్వాన్ని, దిగులు; ఒందెన్= పొందింది.

తాత్పర్యం: కద్రువ చూచి, సంతోషంతో ఆగలేక వినతను పిలిచి చూపించింది. అభం శుభం తెలియనిది కనుక వినత కూడా సవతి వంచనను గుర్తించలేక దైన్యం పొందింది.

క. నగుచుం గద్రువ 'వరవుడ । వగుము విచారంబు విడిచి' యనుడు, వినత 'య
ట్లగుఁగా' కని, లజ్జయుఁ బెను । వగయుఁ దొలఁగఁ ద్రోచి, చేసె వరవుడము దగన్. 201

ప్రతిపదార్థం: కద్రువ; నగుచున్= నవ్వుతూ; విచారంబున్= దిగులు; విడిచి= వదలి; వరవుడవు= దాసివి; అగుము= కమ్ము; అనుడున్= అనగా; వినత; అట్లు+అగున్+కాక= సరే అట్లాగే అని; లజ్జయున్= సిగ్గును; పెను= పెద్ద; వగయున్= దుఃఖం; తొలఁగన్+త్రోచి= అవతలకు నెట్టి; వరవుడము= దాస్యం; తగన్= చక్కగా; చేసెన్= చేసింది.

తాత్పర్యం: సంతోషం పట్టలేక నవ్వుతూ కద్రువ నాకు దాసివికమ్ము. ఈ దిగులు వదలిపెట్టుము. అనగానే వినత సరే లెమ్మని సిగ్గూ, దిగులూ వదలి ఆమెకు చక్కగా దాస్యం చేసింది.

వ. ఇట్లు కపట జయంబునఁ గద్రువ సత్యవినయాది గుణవతి యయిన వినతం దనకు దాసి చేసికొని, పరిహీణంబు లయిన, పరిచారికాకృత్యంబుల నిత్యంబు నలంచుచుండెం; బదంపడి యప్పరమసాధ్వి దన యగ్రతనయుం డాదేశించిన తెఱం గూహించి, రెండవ యండంబున జనియించిన తనూజుం దలంచుచు నాసపాటు గదిరిన హృదయంబుతో దాస్యం బనాలస్యంబున నడపుచుండ. 202

ప్రతిపదార్థం: ఇట్లు; కద్రువ; కపట విజయంబునన్= వంచనతో సాధించిన గెలుపుతో; సత్య, వినయ+ఆది గుణవతి= నిజం చెప్పటం; అణకువ మొదలైన గుణాలు కలది; అయిన వినతన్, తనకున్= తనకు (కద్రువకు); దాసి చేసికొని= దాసిగా చేసికొని; పరి= మిక్కిలి; హీనంబులు+అయిన= నీచములైన; పరిచారికా కృత్యంబులన్= సేవికలు చేసే పనులతో; నిత్యంబున్= ఎల్లప్పుడును; నలంచుచుండెన్= బాధ పెట్టుతున్నది; పదంపడి= తర్వాత; ఆ+పరమ= ఆ గొప్ప; సాధ్వి= పతివ్రత; తన

అగ్రతనయుండు= తన పెద్దకొడుకు అరుణుడు; ఆదేశించిన= చెప్పిన; తెఱంగు= విధానం; ఊహించి= ఆలోచించి; రెండవ అండంబునన్= రెండో గ్రుడ్డునుండి; జనియించిన= పుట్టిన; తనూజున్= కొడుకును; తలంచుచున్= తలచుకొంటూ; ఆసపాటు= ఆశ; కదిరిన= కలిగిన; హృదయంబుతోన్= మనస్సుతో; న+ఆలస్యంబునన్= అనాలస్యంబునన్= అలసతలేకుండా; దాస్యంబున్; నడపుచుండన్= సాగిస్తుండగా

తాత్పర్యం: కపట విజయంతో కద్రువ సత్యవినయాదిగుణవతి అయిన వినతను దాసిగా చేసి మామూలు పరిచారికలు చేసే పనులు చెప్పి హీనంగా బాధిస్తున్నది. మహాపతివ్రత అయిన వినతమాత్రం తన పెద్దకొడుకు చెప్పినట్లు రెండో గ్రుడ్డు పగిలి బైటపడే కొడుకును తలచుకొంటూ ఎప్పుడు తన కీ దాస్యం పోతుందా అని ఆశతో దాస్యం జాగ్రత్తగా చేస్తూ ఉన్నది.

ఉ. యౌవనదర్ప మంది, జవ మంతకు నంతకు నగ్గలింప, మై
లా వధికంబు గాఁగ, నుపలాలన సేయఁగఁ బద్మసంభవుం
డా విహగోత్తముండు హృదయంబున గర్వ మెలర్ప నుద్ధతుం
డై విహరింపఁ జూచి యొక యప్పుడు, నారదుఁ డల్లఁ జేరినన్. 203

ప్రతిపదార్థం: యౌవనదర్పము= యువకత్వంవలన కలిగిన ఔద్ధత్యం; అంది= పొంది; ఆ విహగ+ఉత్తముండు= ఆ పక్షిరాజు (విహంగము= ఆకాశంలో ఎగిరేది) జవము= వేగం; అంతకున్+అంతకున్ (అంతంతకు)= నానాటికి; అగ్గలింపన్= అతిశయించగా; మై= శరీరంయొక్క; లావు= బలం; అధికంబుకాఁగన్= ఎక్కువ కాగా, పద్మసంభవుండు= బ్రహ్మ, పద్మం నుండి పుట్టినవాడు; ఉపలాలనన్= మంచిలాలన; చేయఁగన్= చేస్తూ ఉండగా; హృదయంబునన్= మనస్సులో; గర్వము; ఎలర్పన్= తుళ్ళింతలాడగా; ఉద్ధతుండై= గర్విష్ఠిఅయి; విహరింపన్= తిరుగుతుండగా; ఒక+అప్పుడు= ఒకసారి; నారదుఁడు; అల్లన్= మెల్లగా; చేరినన్= సమీపించగా.

తాత్పర్యం: ఆ గరుత్మంతుడిని తాత బ్రహ్మ గోముతో లాలిస్తున్నాడు. పైగా యౌవనమదం. శరీరంలో క్రొవ్వు బలిసిపోతున్నది. గర్వం, దర్పం, ఔద్ధత్యం రోజురోజుకూ అతిశయిస్తుండగా లోకాలన్నిటా యథేచ్ఛగా విహరిస్తున్నాడు. ఒకరోజు నారదమహర్షి నెమ్మదిగా అతడిని సమీపించగా.

విశేషం: అక్కడ తల్లి నానా బాధలూ పడుతున్నది. ఒక కొడు కట్లా శపించి పోయాడు. వీ డేమో ఇల్లు పట్టకుండా మదించి తెగ తిరుగుతున్నాడు. ఈ సందర్భంలో నారదుడు కథలో ప్రవేశించాడు. సామాన్యంగా మన పురాణాలలో కథ మలుపు తిరిగే సమయంలో పాత్ర క్లిష్ట పరిస్థితులలో ఉండగా నారద పాత్ర ప్రవేశించి కథ నడుపుతుంది. అంటే నారదు డెవరు? దేవర్షి. ఋషి అంటే జ్ఞానశక్తికి ప్రతీక. నారదు డంటే జ్ఞానా న్నిచ్చేవాడు. జ్ఞానస్వరూపుడైన ఋషి. నీ వొక క్లిష్టపరిస్థితులలో ఏమీ దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఒక మార్గాన్ని చెప్పేవాడు బయటనుండీ రావచ్చును. లేదా నీకే తోచవచ్చును. ఆ స్ఫురణశక్తి పేరు నారదుడు.

వ. అతఁడు భక్తిం బ్రణమిల్లి నిల్చిన నప్పక్షిపుంగవునకు నమ్మునిపుంగవుం డిట్లనియె. 204

ప్రతిపదార్థం: అతఁడు= గరుత్మంతుడు; భక్తిన్= భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; నిల్చినన్= నిలువగా; ఆ+పక్షిపుంగవునకున్= ఆ పక్షిరాజునకు; ఆ+మునిపుంగవుండు= ఆ మునిరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు నమస్కరించి నిలువగా అతడితో నారదుడు ఇట్లా అన్నాడు.

తే. 'దాసియై సవతాలికిఁ దల్లి పనులు । సేసి నలఁగంగ, నద్దెసఁ జింత వంత
లేక నీ విట్లు దిరుగుట లెస్స యగునె? । యద్భుతోజ్జ్వలతేజ! కశ్యపతనూజ!' 205

ప్రతిపదార్థం: అద్భుత+ఉజ్జ్వలతేజ!= ఆశ్చర్యకరంగా ప్రకాశించే తేజస్సు కలవాడా!; కశ్యప తనూజ!= కశ్యపమహర్షి కొడుకా!; తల్లి= వినత; సవతి+ఆలికిన్= సవతి అయిన భార్యకు, సవతికి; దాసి+ఐ= దాసిగ అయి; పనులుచేసి= కద్రువ చెప్పే నీచమైన కార్యాలు చేస్తూ; నలఁగంగన్= నలిగిపోగా (మనస్సులో క్రుంగిపోవటం, శరీరదృష్టితో కృశించిపోవటం); ఆ+దెసన్= ఆ వైపున; చింత వంత= ఆలోచన కానీ, బాధ కానీ; లేక= లేకుండా; నీవు; ఇట్లు= ఈవిధంగా; తిరుగుట= విహరించటం; లెస్సఅగునె?= బాగున్నదా?

తాత్పర్యం: నాయనా! నీవు గొప్ప పరాక్రమశాలివి. కశ్యపబ్రహ్మకుమారుడవు అయి ఉండి నీ తల్లి ఒక ప్రక్క తన సవతికి నీచంగా దాస్యం చేస్తుంటే అదేమీ పట్టించుకొనకుండా ఇట్లా తిరగటం ఏం బాగుంది?

విశేషం: ఇది పెద్దవారు చీవాట్లు పెట్టే పద్ధతి. తెలుగు వాడి నోటినిండుగా అమరిన వాక్యవిన్యాసం కాకువు-తిక్కనగారి సొత్తు.

చ. అనుడు, విహంగనాథుఁడు 'మదంబకు దాస్యము రాకకుం గతం
బనఘవిచార!యెద్ది? తెలియన్ వినిపింపవె!' యన్నఁ జెప్పె న
మ్మునివరుఁ డున్నరూపు, హయముం గను టాదిగఁ గల్గు కశ్యపాం
గనల చరిత్ర మాతని కఖండ పరిస్ఫుట భాషణంబులన్. 206

ప్రతిపదార్థం: అనుడున్= అట్లా నారదముని చెప్పగా; విహంగనాథుఁడు= పక్షిరాజు; మత్= నా; అంబకున్= అమ్మకు; దాస్యమురాకకున్= దాస్యం రావటానికి; కతంబు= కారణం; ఎద్ది= ఏది?; అనఘ విచార!= పవిత్రమైన వివేకం కల స్వామీ! తెలియన్= నాకు స్పష్టపడేటట్లు; వినిపింపవె?= సవిస్తరంగా చెప్పవా!; అన్నన్= అనగా; ఆ+మునివరుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు; హయమున్= గుర్రాన్ని; కనుట ఆదిగన్= చూచింది మొదలు; కల్గు= జరిగిన; కశ్యప+అంగనల= కశ్యపుడి భార్యల; చరిత్రము= కథ; ఉన్నరూపు= ఉన్న వైఖరి; అతనికిన్= గరుత్మంతుడికి; అఖండ= పూసగ్రుచ్చినట్లుగా (ఖండము = ముక్క; అక్కడక్కడ ముక్కలు ముక్కలుగా కాకుండా ఏకధాటిగా); పరిస్ఫుట= విస్పష్టమైన; భాషణంబులన్=మాటలలో; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: నారదముని అట్లా అనగానే విన్న గరుత్మంతుడు 'అయ్యో! మా అమ్మ దాస్యం చేస్తున్నదా? ఎందుకో చెప్పుము నారదా, అని ప్రార్థించగా ఆయన స్పష్టమైన మాటలలో గుర్రాన్ని చూచింది మొదలు కద్రూ వినతల మధ్య జరిగిన కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

విశేషం: నాకు తెలిసేటట్లు చెప్పుమన్నాడు గరుత్మంతుడు. ఈయన 'అఖండ - భాషణంబులన్' చెప్పాడట. ప్రశ్నకు తగ్గ సమాధానం చెప్పాలి కనుక. తెలిసేటట్లు అనటంలోని రహస్యం 173వ పద్యంలోని అరుణుడు చెప్పిన విధాతృ వశమయివచ్చిన రీతి వివరించటం. ఆ కథ అట్లా ఎందుకు జరిగిందో ఆ సృష్టి రహస్యాన్ని వ్యాఖ్యానించటం.

చ. చెప్పినఁ, గోపమున్ వగపుఁ జిత్తమునం గదురంగ 'మేలు మే
లప్ప హితంబు సేసెఁ, జెలియల్ మనుచున్నది, పెంపుతోడ' నం
చప్పుడ వాయువేగమున నయ్యెడకుం జని, మాట యెద్దియుం
జెప్పక తల్లికిం బ్రణతి సేసె విషాద భరార్తమూర్తియై. 207

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగా; కోపమున్= కోపమూ; వగపున్= దుఃఖం; చిత్తమునన్= మనస్సులో; కదురంగన్= కలుగగా; మేలుమేలు= ఓహో, సెబాసు (కోపంతో ఎగతాళిగా అనటం); అప్ప= అక్కయ్య; హితంబుచేసెన్= మేలు చేసింది; చెలియల్= చెల్లెలు; పెంపుతోడన్= హాయిగా, సుఖంగా; మనుచున్+ఉన్నది= బ్రతుకుచున్నది; అంచున్= అంటూ; వాయువేగమునన్= గాలి వేగంతో; అప్పుడు+అ= వెంటనే; ఆ+ఎడకున్= ఆ చోటికి; చని= వెళ్ళి; మాట ఎద్దియున్= ఏ మాటా; చెప్పక= చెప్పకుండా; తల్లికిన్; విషాదభర= దుఃఖభారంతో; ఆర్తమూర్తి+ఐ= చింతయే ఆకారం కలవాడై; ప్రణతి= నమస్కారం; చేసెన్= చేశాడు. (విషాదంతో చెక్కిన ఆకారం కలవాడై, మనస్సులోని చింత, దుఃఖం బయటకు వస్తే ఎట్లా ఉంటాయో అట్లా ఉన్నాడని భావం.)

తాత్పర్యం: చెప్పగానే ఆయన మనస్సంతా కలత చెందింది. కోపం వచ్చింది. ఆ బాధతో, కోపంతో అన్నాడు; 'ఆహా! చాలా బాగుంది. అప్పగారు మేలు చేసింది. చెల్లెలు కనీసం బ్రతుకుతున్నది' అని అంటూ వెంటనే వాయువేగంతో వెళ్ళి ఏమీ మాట్లాడకుండా దుఃఖంతో తల్లికి ప్రణామం చేశాడు.

విశేషం: పద్యంలో వాక్యం - మాట - పూటంతా కోపంతో బాధలో ఉన్నవాడు ఎట్లా ఉంటాడో అట్లాగే వ్రాయడం గమనించ దగింది. పెదతల్లిమీద కోపం, తల్లి అమాయకత్వానికి జాలిపడిన పాటుకు విషాదం, తనతో చెప్పనైనా లేదే తల్లి అన్న చింతా, అనేక భావాలతో నిండిన హృదయం నుండి వచ్చిన మాట ఈ పద్యం. అందుకే ఏమీ మాట్లాడకపోవటం.

వ. కద్రువపాలికిం బోయి. 208

తాత్పర్యం: కద్రువ దగ్గరకు వెళ్ళి (గరుత్మంతుడు)

చ. పరమ వినీతిమై నెఱఁగి, బాంధవ మారఁగ నల్ల నిట్లనున్
గరుడుఁడు దారితారి వగఁ గందుచు 'నీ చెలియల్ చరించు ని
వ్వరవుడపుం జరిత్రమున వచ్చునె నీ కొక పేర్మి? యీసతిం
గరుణ యెలర్పఁగా విడువ గౌరవ సంపదఁ జేయు నెంతయున్. 209

ప్రతిపదార్థం: గరుడుఁడు= గరుత్మంతుడు; పరమ= గొప్ప; వినీతిమైన్= వినయంతో; ఎఱఁగి= నమస్కరించి; బాంధవము+ ఆరఁగన్= బంధుత్వం వెల్లివిరిసేటట్లు; తారితారి= తారట్లాడుతూ (భయంతో వినయంతో చెప్పలేక పెద్దవారిముందు చిన్నవాళ్ళు పడేపాట్లు సూచించే మాట); అల్లన్= నెమ్మదిగా; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీ చెలియల్= నీ చెల్లెలు; వగన్= దుఃఖంతో; కందుచున్= బాధపడుతూ కందిపోతూ; చరించు= చేసే; ఈ; వరవుడము+చరిత్రమునన్= దాస్య కథతో; నీకున్; ఒక పేర్మి= ఒక గొప్ప కూడా; వచ్చునే? = కలుగుతుందా? (కలగదు); ఈ సతిన్= ఈ అమాయకురాలిని; కరుణ= దయ; ఎలర్పఁగాన్= చిగురించగా; విడువన్= విడిచిపెట్టితే; గౌరవ సంపదన్= గొప్ప గౌరవాన్ని; ఎంతయున్ చేయున్= మిక్కిలి కలిగిస్తుంది.

తాత్పర్యం: మహావినయంతో నమస్కరించి తారట్లాడుతూ, బంధుత్వాల్ని త్రవ్వుతూ గరుత్మంతు డీ విధంగా అన్నాడు; 'నీ చెల్లెలు పాపం దుఃఖంతో కందిపోతూ చేసే ఈ దాస్యం కథవలన నీకు వచ్చే గొప్ప ఏమిటి? ఆ అమాయకురాలిని వదలిపెట్టుము. నీకెంతో గౌరవం దక్కుతుంది.

విశేషం: మా అమ్మను వదలిపెట్టుము. లేకపోతే ఊరుకొనేది లేదని అనవచ్చును. అట్లా అనకుండా పెదతల్లి కనుక మర్యాదతో, వినయంతో సంభాషించటం ఇందులో చెప్పుకొనదగ్గ అంశం. ఆ మాట బంధుత్వ దృష్ట్యా అన్నాడు. కనుకనే నీ చెల్లెలు అని అనటం, మా అమ్మ అనటం వేరు. ఇట్లా అనటం వేరు కదా! కనుక గరుత్మంతుడి మాటలో వ్యవహారం తెలిసినవాడి లక్షణమున్నది.

చ. నీకును నేను బుత్త్రుఁడన; నెమ్మిఁ దగన్ ననుఁ జూచియైనఁ ద
ల్లీ! కృపసేఁత పెద్దయును లెస్స; యధర్మము ధర్మమ న్వగల్
నా కవి యేల? దాస్యకృతి నా జనయిత్రికి నివ్విధంబునన్
రాకయు దైవకృత్యమ మనంబునఁ బొంగుదు విడ్పుగల్గినన్. 210

ప్రతిపదార్థం: తల్లీ!= అమ్మా!; నీకును= నీకూ; నేను; పుత్త్రుఁడన= కొడుకునే (నీ కొడుకులతోపాటు); నెమ్మిన్ తగన్= ప్రేమతో తగినట్లు, తగిన ప్రేమతో; ననున్‌చూచిఐనన్= నా ముఖం చూచి అయినా; కృపసేఁత= దయచూపించటం; పెద్దయును= చాలా; లెస్స= గొప్ప, మంచిది; నాకున్; అధర్మము, ధర్మము; అన్ వగల్= ఇది ధర్మం, అది అధర్మం అన్న వగలమాటలు (వగలాడి లోని వగలు); అవి+ఏల? అవెందుకు?; నా జనయిత్రికిన్ ధర్మము= నా తల్లికి; ఈ+విధంబునన్= ఈ విధంగా; దాస్యకృతి= దాస్యం చేసేపని; రాకయున్= రావటం కూడా; దైవకృత్యము+అ= దైవం తప్ప జూడటమే; విడ్పు= నా తల్లి విడుదల; కల్గినన్= కలిగితే; మనంబునన్= మనస్సులో; పొంగుదున్= సంతోషిస్తాను.

తాత్పర్యం: అమ్మా! నీ వేయిమంది కొడుకులతో పాటుగా నేనూ నీకు కొడుకునే. కనుక నా ముఖం చూచైనా మా అమ్మను వదలిపెట్టుము. ఇది ధర్మమా! అధర్మమా అనే వగలమాటలు నాకెందుకు? నా తల్లికి దైన్యం కలగటం కూడా దైవం పనే. కనుక విడిచిపెట్టితే నేను సంతోషిస్తాను.

విశేషం: పై పద్యంలో చెప్పినమాటకు కద్రువ ఉలకలేదు, పలకలేదు. కనుకనే నేనూ కొడుకునే కదా! నా ముఖం చూచైనా అని అన్నాడు. ధర్మాధర్మ జిజ్ఞాస నా కెందు కనకుండా వగలు అనటంలో లోకం ఆ రెండు మాటలను అట్లా వినియోగించుకొంటుంది కనుక. మనస్సులో ఏమీ లేకుండా పైకున్నట్లు నటించటం వగలు.

వ. అనిన విని మొగంబు ముఱకటించు కొనుచుఁ గద్రువ గరుత్మంతున కిట్లనియె. 211

ప్రతిపదార్థం: మొగంబు= ముఖం; ముఱకటించుకొనుచున్= మూతి ఒక ప్రక్కకు త్రిప్పి ఎగతాళితో అభినయిస్తూ; కద్రువ; గరుత్మంతునకున్= గరుత్మంతుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆమెకు ఈ మాటలు రుచించలేదు. అందుకని మూతి ఒక ప్రక్కకు తిప్పి ఎగతాళిగా గరుత్మంతుడితో ఈ విధంగా అన్నది;

మ. 'బలవంతుండవు, నేర్పు చందములఁ జెప్పంజాలి యీరిత్త ప
ల్కులఁ దేర్పం బనిలేదు; తల్లికి మదిం గూర్తేని వే పోయి లో
కులు నిన్నుం బ్రణుతింపఁ దె మ్మమృతమున్; ఘోరంపు దాస్యంబు నేఁ
దొలఁగం బెట్టెద మీ కనంతమగు సంతోషంబు సంధిల్లఁగన్. 212

ప్రతిపదార్థం: బలవంతుండవు= చాలా గొప్ప బలశాలివే (ఎగతాళి- నిజాన్ని ఎగతాళి చేయటం); ఈ రిత్తపల్కులన్= ఈ వట్టిమాటలతో; తేర్పన్= మంచి చేసికొనటం వలన; పని లేదు= పని లేదు, లాభంలేదు; తల్లికిన్; మదిన్= మనస్సులో; కూర్తు (వు)+ఏని= (ప్రేమ కలవాడవైతే; వేపోయి= వెంటనే పోయి; లోకులు= జనం; నిన్= నిన్ను; ప్రణుతింపన్= పొగడగా; అమృతమున్= సుధను; తెమ్ము= తీసికొనిరమ్ము; ఘోరంపు= ఘోరమైన; దాస్యంబున్= బానిసతనాన్ని; నేన్= నేను; తొలఁగన్ పెట్టెదన్= తొలగిస్తాను; (నే నున్నాను కదా తొలగించటానికి నీ పని త్వరగా తీసికొనిరా. ఇదీ వాక్య నిర్మాణానికి పునాది); అనంతమగు= లెక్కింపరాని; సంతోషంబు= ఆనందం; మీకున్= నీకూ, నీ తల్లికీ; సంధిల్లఁగన్= కలుగగా (నేను దాస్యాన్ని తొలగిస్తాను)

తాత్పర్యం: 'చాలా బలవంతుడవే! చాలా నేర్పుగానే మాట్లాడావు. పోరా పో! ఈ వట్టిమాటలతో ఏమి లాభం? (బంధుత్వం, చెల్లెలు, కొడుకు వంటి మాటలు) మీ అమ్మమీద నీకు నిజంగా ప్రేమంటూ ఉంటే పోయి వెంటనే అమృతం తీసికొనిరా. మీ అమ్మను నేను వదిలిపెట్టుతాను. మీకు నీ వన్నట్లు అనంత సంతోషం కలుగుతుంది.

చ. అన విని, దాని కియ్యకొని, యప్డు సుపర్ణుఁడు పోయి, కశ్యపుం
గని, తన భాషణంబులును, గద్రువ పల్కులుఁ జెప్పి, 'తెచ్చువాఁ
డ నమృత మెట్లు నే నని యొడంబడి వచ్చితి' నన్న నాతఁ డ
త్తనయునిఁ జూచి యుల్లము ముదంబును నచ్చెరుపాటు వొందఁగన్. 213

ప్రతిపదార్థం: అనన్, విని; సుపర్ణుండు= గరుత్మంతుడు (మంచి రెక్కలు గలవాడు); దానికిన్= కద్రువమాటకు; ఇయ్యకొని= అంగీకరించి; అప్డు= ఆ సమయంలో; పోయి= వెళ్ళి; కశ్యపున్= తండ్రిని; కని= చూచి; తన భాషణంబులును= తన మాటలూ; కద్రువపల్కులున్= తల్లిమాటలూ; చెప్పి= వివరించి; ఎట్లున్= ఏ విధంగానైనా సరే; నేను; అమృతమున్= సుధను; తెచ్చువాఁడను= తెస్తాను; అని; ఒడంబడి= అంగీకరించి; వచ్చితిని= మీ దగ్గరకు వచ్చాను; అన్నన్= అనగా; ఆతఁడు= కశ్యపుడు; ఆ తనయునిన్= ఆ కొడుకును; చూచి= తేరిపార చూచి (ఎంతవాడైనా డన్నట్లుగా); ఉల్లము= మనస్సు; ముదంబును= సంతోషం; అచ్చెరుపాటు= ఆశ్చర్యం; ఒందఁగన్= పొందగా.

తాత్పర్యం: కద్రువ చెప్పిన మాటలు విని వెంటనే సుపర్ణుడు తండ్రి దగ్గరకు వెళ్ళి, తనకూ, పెద్దమ్మకు జరిగిన సంభాషణ అంతా వివరించి 'ఎట్లాగైనా సరే అమృతం తెస్తానని అంగీకరించి వచ్చాను' అని చెప్పాడు. అంతా విని కొడుకును తేరిపార చూచి మనస్సులో ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ పొందాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఒక తండ్రి ప్రయోజకు డైన కొడుకును చూచి పొందే ఆనందలక్షణ మిట్లాగే ఉంటుంది.

క. 'అమృతంబు దుర్లభం, బ । య్యమరుల కేనియు నతిప్రయత్నంబున గు
ప్తము సేసి యుండు వాసవుఁ । డమలచరిత! నీకు నగునె యట్టిది తేరన్' 214

ప్రతిపదార్థం: అమల= నిర్మలమైన, మచ్చలేని; చరిత!= ప్రవర్తన కలవాడా!; అమృతంబు= అమృతం; అ+అమరులకేనియున్= ఆ దేవతలకైనా; దుర్లభంబు= లభించటం కష్టం - దొరకదు; వాసవుఁడు= ఇంద్రుడు; అతి ప్రయత్నంబునన్= చాలా జాగ్రత్తగా; గుప్తము చేసిఉండున్= దాచి ఉంచుతాడు; అట్టిది= అట్లాంటిదాన్ని; తేరన్= తేవటం; నీకున్= నీకైనా; అగునె?= సాధ్యమా?

తాత్పర్యం: నీవు నిర్మల హృదయుడవే! కానీ ఆ అమృతం వాసవుడు చాలజాగ్రత్తగా భద్రం చేస్తాడు. కనుక దేవతలకే అది చిక్కదు. మరి నీ కట్లాంటిది ఎట్లా సాధ్యం?

వ. వినుము. **215**

తాత్పర్యం: (రహస్యం చెప్పుతాను) వినుము.

చ. ఉదకము రక్షకం బగుచునుండఁగ, నుజ్జ్వలవహ్నియందునుం
బొదువఁ, గృపాణశక్తి ముఖ భూరితరాయుధహస్తులై బలో
న్మదులు, మహోగ్రకోపులు, ఘనస్థిరకాయు లనేకరాక్షసుల్
వొదిగొని కావ నిన్నవలలో నమృతంబు సురక్షితస్థితిన్. **216**

ప్రతిపదార్థం: ఉదకము= నీరు; రక్షకంబు= కాపాడేది; అగుచున్ ఉండన్= కాగా; అందునున్= అందులో, దానిమధ్యలో; ఉజ్జ్వల= మండే; వహ్ని= అగ్ని; పొదువన్= అమృతాన్ని ఆవరించి క్రమ్మగా; అనేక రాక్షసుల్= పెక్కుమంది రాకాసులు; కృపాణ=కత్తి; శక్తి= ఒక రకం బల్లెం; ముఖ= మొదలైన; భూరితర= గొప్ప; ఆయుధ= ఆయుధాలున్న; హస్తులై= చేతులు కలవారై; బల+ఉన్మదులు= బలంతో మదించినవారు; మహా+ఉగ్రకోపులు= గొప్ప తీవ్రమైన కోపం కలవారు; ఘన=పటిష్ఠమైన, పెద్ద; స్థిర= చెదరని; కాయులు= శరీరాలవారు; పొదిగొని= చుట్టూ మూగి; కావన్= కాపాడుతూ ఉండగా; ఇన్నవలలోన్= ఇనుముతో చేసిన వల లోపల; అమృతంబు= అమృతం; సురక్షితస్థితిన్= భద్రంగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: జలం రక్షిస్తుంటే దాని మధ్య అగ్ని మండుతూ ఉండగా, కత్తులతో, బల్లెంవంటి పదునైన ఆయుధాలతో మదించి, తీవ్రకోపిష్ఠులై, పెద్ద శరీరాలున్న రాక్షసు లనేకమంది కాపలా కాస్తుండగా ఇనుపవలలో అమృతం సురక్షితంగా ఉంటుంది. అందుకని అది దేవతలకైనా దుర్లభమనటం జరిగింది.

క. ఉండు నన విని, విహంగ వి । భుం డల్లన నగుచు, 'నీవు పుత్రస్నేహా
ఢ్యుండవయి పలికితే; బలి । యుండ, నుపాయజ్ఞుఁడను, మహోజ్జ్వలతేజా! **217**

ప్రతిపదార్థం: ఉండున్= ఉంటుంది; అనన్ విని; విహంగ విభుండు= పక్షిరాజు; అల్లనన్= నెమ్మదిగా; నగుచున్= నవ్వుతూ; మహా+ఉత్జ్వల= గొప్పగా పైకి అంతటా ప్రసరించే; తేజా!= కాంతికలవాడా!; నీవు; పుత్రస్నేహ= కొడుకుమీది ప్రేమచేత; ఆఢ్యుండవు+ అయి= దొడ్డవాడవై; పలికితి= అన్నావు; ఏన్= నేను; బలియుండన్= బలవంతుడిని;ఉపాయజ్ఞుఁడను= ఉపాయం తెలిసినవాడిని.

తాత్పర్యం: తండ్రి అట్లా చెప్పగా విని పక్షిరాజు నవ్వుతూ 'దివ్యతేజస్సు కల తండ్రీ! పుత్రస్నేహంతో అన్నావే తప్ప నా శక్తి తెలియదా? చాలా బలశాలిని. ఉపాయం తెలిసినవాడను (నన్ను చిన్నవాడిగా భావించవద్దు అని సూచన).

మ. అనుమానం బది యేల? తెత్తు నమృతం 'బన్నం గడుం బొంగి, యా
తనిఁ దాఁ గౌఁగిటఁ జేర్చి కశ్యపుఁడు, పుత్రా! నిశ్చయం బట్లయే
ని, నిభంబుం గమఠంబునుం గలవు; వానిం దిన్న లావెక్కు; నా
ఘనజంతు ద్వితయంబు నీకు నెరగాఁ గల్పించితిం బోవనా!' 218

ప్రతిపదార్థం: అనుమానంబు= సందేహం; అది+ఏల?= నీకెందుకు? అమృతంబున్= సుధను; తెత్తున్= తప్పక తెస్తాను; అన్నన్= అంటే; కశ్యపుఁడు= తండ్రి; కడున్= చాలా; పొంగి= ఉబ్బిపోయి; అతనిన్= అతడిని; తాన్= తాను; కౌఁగిటన్= తన సందిట్లో; చేర్చి= చేర్చికొని; పుత్రా!= కుమారా! (ప్రేమతో పొంగిపోయి పిలిచిన పిలుపు); నిశ్చయంబు= నీ నిర్ణయం; అట్లు+అ+ఏనిన్= అట్లాగే అయితే; ఇభంబున్= ఏనుగు; కమఠంబున్= తాబేలున్నూ; కలవు= ఉన్నాయి; వానిన్= వాటిని; తిన్నన్= తింటే; లావు= బలం; ఎక్కున్= ఎక్కువౌతుంది; ఆ; ఘన= గొప్ప; జంతుద్వితయంబున్= జంతువులజంటను; నీకున్; ఎరగాన్= ఆహారంగా; కల్పించితిన్= సృష్టించాను; పోవనా= పోవయ్యా!

తాత్పర్యం: నీ కనుమాన మక్కరలేదు. అమృతం తప్పక తెస్తాను'. అనేసరికి తండ్రి ఉబ్బితబ్బిబ్బైపోయి కౌగిలించుకొని 'బాబూ! నీ నిర్ణయ మంతే అయితే సరే. ఒక యేనుగూ, ఒక తాబేలూ ఉన్నాయి. అవి ఘనజంతువులు. వాటిని తింటే బలం వస్తుంది. నీకు వాటిని నీ ఆహారంగా నిశ్చయించాను. అన్నా! అవి తిని పోయిరా!'

వ. అనుటయు సంతోషించి గరుత్మంతుం 'డా గజకచ్ఛపంబు లెచ్చట నుండు? నెబ్భంగివి? యని యడిగిన నమ్మునీంద్రుం డవ్విహగేంద్రున కిట్లనియె. 219

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; సంతోషించి= ఆనందపడి; గరుత్మంతుండు= సుపర్ణుడు; ఆ గజ, కచ్ఛపంబులు= ఆ ఏనుగు, తాబేలు; ఎచ్చటన్+ఉండున్?= ఎక్కడుంటాయి; ఏ+భంగివి?= ఎట్లాంటివి?; అని అడిగినన్= అని అడుగగా; ఆ+మునీంద్రుండు= ఆ ఋషీశ్వరుడు; ఆ విహగ+ఇంద్రునకున్= ఆ పక్షిరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు, చెప్పాడు.

తాత్పర్యం: అనటంతోనే సంతోషంతో 'ఆ ఏనుగు, తాబేలు ఎక్కడున్నాయి? వాటి సంగతేమిటి?' అని కొడుకు ప్రశ్నించగా తండ్రి ఇట్లా అన్నాడు.

కశ్యపుఁడు గరుడునకు గజకచ్ఛపంబుల తెఱం గెఱింగించుట (సం.13-25-1 (కుంభ))

సీ. 'ప్రాక్పయోనిధి పొంతఁ బర్వతం బొక్కటి । ఘన శృంగ కబళితాకాశ మగుచు,
నురగనామంబున నొప్పు, నచ్చేరువ । వసియించు నొక మహావారణంబు,
దానితటంబునఁ దామరకొల నబ్ధి । ననుకరించుచు మధురాచ్ఛవారి
సంపద సొంపారు సమదలీలల నగ్గ । జం బా నగంబుపై సంచరింప

తే. మిట్టుఁ బల్లంబు గట్టును మెట్టు నొక్క । మట్టమైయది నునుపారు మహిత మైన
యక్కొలన నీరు ద్రావఁగా ననుదినంబు । నరుగు నయ్యిభవల్లభుఁ డనఘచరిత! 220

విశేషం: అనఘ చరిత= పాపరహితమైన నడవడి గలవాడా!; ప్రాక్+పయోనిధి= తూర్పు సముద్రం; పొంతన్= ప్రక్కనే; పర్వతంబు= కొండ; ఘనశృంగ= ఎత్తైన శిఖరాలతో; కబళిత= మ్రింగబడిన; ఆకాశము+అగుచున్= మిన్ను కలదై; ఉరగ నామంబునన్= ఉరగమన్న పేరుతో; ఒప్పున్= పేరొందెను; ఆ+చేరువన్= ఆ ప్రక్కనే; ఒక మహావారణంబు= ఒక పెద్ద ఏనుగు; వసియించున్= నివశిస్తుంది; దానితటంబునన్= దాని ఒడ్డునే, ఆ పర్వతం చరియలో; తామర సరస్సు= తామరపూల సరస్సు; అబ్ధిన్= సముద్రాన్ని; అనుకరించుచున్= సరి పోలుతూ; మధుర= తీయని; అచ్ఛ= స్వచ్ఛమైన; వారి= నీటియొక్క; సంపదన్= సమృద్ధితో; సొంపు+ఆరున్= అందగిస్తుంది; ఆ+గజంబు= ఆ ఏనుగు; సమదలీలన్= మదంతో కూడిన విలాసంతో; ఆ నగంబుపైన్= ఆ కొండపై; సంచరింపన్= తిరుగగా; మిఱ్ఱు= ఎత్తు; పల్లంబు= లోతు, నిమ్న ప్రదేశం; గట్టును మెట్టును= గట్టూ, మెట్టూ; ఒక్కమట్టమై= సమమై; నునుపారున్= నున్నబడుతుంది; అనుదినంబు= ప్రతిరోజూ; మహితమైన= గొప్పదైన; ఆ+కొలన నీరు= ఆ చెరువునీరు; త్రావఁగాన్= త్రాగటానికి; ఆ+ఇభవల్లభుఁడు= ఆ ఏనుగు రాజు; అరుగున్= వెళ్ళుతాడు, వెళుతుంది.

తాత్పర్యం : తూర్పు సముద్రం చెంత ఒక గొప్ప పర్వతం ఉన్నది. దాని శిఖరాలు ఆకాశాన్ని కప్పివేస్తుంటాయి. దానిపేరు ఉరగము. దాని ప్రక్కనే ఒక ఏనుగు నివసిస్తూ ఉన్నది. ఆ కొండ ప్రక్క ఒక కొలను. అందులో నీరు స్వచ్ఛంగా తియ్యగా ఉంటుంది. ఆ ఏనుగు ఆ కొండపై తిరుగాడుతూ ఉంటే ఎత్తూ పల్లాలూ, గట్టూ మెట్టూ, ఏకచదరమైపోతుంది. ఆ ఏనుగు ఆ కొలనులో నీరు త్రాగటానికి ప్రతిరోజూ వెళ్ళుతుంది.

ఉ. అందొక కచ్ఛపప్రవరుఁ, డత్యధికంబగు కాయమున్, బలం
బుం దనరన్ వసించు, జలముం గొను వాంఛ, గజంబు వోయినం
జెందఁగనీక, సంగరముఁ జేయుఁ బెనంగుచు నీరుద్రావు, గౌ
రుం దెగియుండు నిట్ల పగ రోష మెలర్పఁగ నాఁడు నాఁటికిన్. 221

ప్రతిపదార్థం: అందున్= ఆ కొలనులో; ఒక; కచ్ఛప ప్రవరుఁడు= ఒక శ్రేష్ఠమైన తాబేలు; అతి= మిక్కిలి; అధికంబు+అగు= గొప్పదైన; కాయమున్= శరీరమూ; బలంబున్= బలమూ; తనరన్= ఒప్పగా; వసించున్= నివసిస్తున్నది; గజంబు= ఏనుగు; జలమున్+కొను వాంఛన్= నీరు త్రాగాలన్న ఆసక్తితో; పోయినన్= కొలని చెంతకు పోగా; చెందఁగనీక= నీరందనివ్వకుండా; పెనంగుచున్= పెనగులాడుతూ; సంగరమున్ చేయున్= యుద్ధం చేస్తుంది; నీరుత్రావు= నీరుత్రాగే; గౌరున్= ఏనుగుకూడా; తెగి= తెగించి; నాఁడు నాఁటికిన్= రోజు రోజుకూ; పగ= వైరం; రోషము= కోపం; ఎలర్పఁగన్= ఎక్కువకాగా; ఇట్లు+అ= ఇదే రీతిగా; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: ఆ కొలనులో పెద్ద శరీరం కల బలిష్ఠమైన పెద్ద తాబేలు ఉంటున్నది. నీరు త్రాగటానికి ఏనుగు దప్పికతో వస్తే అది త్రాగనివ్వకుండా పోట్లాడుతుంది. ఆ ఏనుగుకూడా అట్లాగే పగ, రోషం రోజురోజుకూ ఎక్కువ కాగా జీవిస్తూ ఉన్నది.

క. విను, మధు కైటభు లనియెడు । దనుజేంద్రులు కచ్ఛపంబు దంతియు నై పు
ట్టినవారు దమ్మెఱుంగమిఁ । బెనఁగుదు రొండొరులతోడ భీకరభంగిన్. 222

ప్రతిపదార్థం: మధుకైటభులు+అనియెడు= ఆ పేర్లు కల; దనుజ+ఇంద్రులు= రాక్షసరాజులు; కచ్ఛపంబు= తాబేలు; దంతియున్= ఏనుగు ఐ; పుట్టినవారు= జన్మించినవారు; తమ్మున్= తమను తాము; ఎఱుంగమిన్= తెలియనందువలన; భీకరభంగిన్= భయంకర విధంగా; ఒండొరులతోడన్= ఒకరితో నొకరు; పెనఁగుదురు = పోట్లాడుకొంటారు.

తాత్పర్యం: వాళ్ళు మధుకైటభులనే రాక్షస శ్రేష్ఠులు. కానీ తాబేలు, ఏనుగులుగా పుట్టినందువలన తా మెవ్వరో తమకు తెలియనందున భయంకరంగా ఒకరితో ఒకరు కయ్యమాడుకొంటున్నారు.

క. ఒంటిమెయి నుండఁగా ము । క్కంటికి నా కచ్ఛపంబు గౌరుం బట్టం
గంట యరిది, యొకపటి నా । రెంటిం బొదువంగవలయు రే వెర వారన్. 223

ప్రతిపదార్థం: ఆ కచ్ఛపంబున్= ఆ తాబేలును; ఆ గౌరున్= ఆ ఏనుగును; ఒంటిమెయిన్= ఒంటరిగా; ఉండగాన్= ఉన్నప్పుడు; పట్టన్+కంట= పట్టుకొగలగడం; ముక్కంటికిన్= మూడు కన్నులున్న శివుడికైనా; అరిది= అసాధ్యం; ఒకపటిన్= ఒకేసారి; ఆ రెంటిన్= ఆ రెండింటినీ; రే= రాత్రివేళ; వెరవారన్= ఉపాయంతో; పొదువంగవలయున్= పొదివి పట్టుకొనాలి.

తాత్పర్యం: ఆ రెండూ విడివిడిగా ఉన్నప్పుడు శివుడైనా పట్టుకొనలేడు. రాత్రిపూట ఆ రెంటిని ఒకేసారి పట్టుకొనాలి. ఇదే ఉపాయం.

వ. అనవుడు వైనతేయుండు. 224

తాత్పర్యం: కశ్యపు డట్లా అనగా వినత కుమారుడైన గరుత్మంతుడు (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'ఒకటి గొలనిలోన నుండు నొక్కటి గొండ । మీఁద సంచరించు, మీరు రెంటి
నడఁగ నొక్కమాట యడరి పట్టుట కృత్య । మనియెదరు, వశంబె? యట్ల చేయ?' 225

ప్రతిపదార్థం: ఒకటి= తాబేలు; కొలని లోనన్ ఉండున్= చెరువులో ఉంటుంది; ఒక్కటి= ఒక్కటి; కొండమీఁదన్= పర్వతంపైన; సంచరించున్= తిరుగుతుంది కదా!; మీరు= మీరేమో!; రెంటిన్= రెండింటినీ; అడఁగన్= అణగారేటట్లు; అడరి= ఏపురేగి; ఒక్కమాటు+అ= ఒకేసారి; అడరి= విజృంభించి; పట్టుట= బంధించటం; కృత్యము= చేయదగినపని; అనియెదరు= అంటారు; అట్లు+అ= అట్లాగే; చేయన్= చేయటానికి; వశంబె?= శక్యమా?

తాత్పర్యం: మీరు రెంటినీ ఒకేసారి పొదివి పట్టుకొనాలి అంటారు. ఒకటేమో చెరువులో ఉంటుంది. మరొకటి కొండమీద తిరుగుతుంది కదా! ఇ దెట్లా వీలుపడుతుంది?

విశేషం: ఇది పాఠకుడికి కలిగే ప్రశ్న. పాత్రద్వారా కవి చెప్పిస్తున్నాడు. కథ చెప్పటంలో ఇది గడుసుతనం. మీరు అనటం తండ్రి గారిని గౌరవించటం.

వ. అనిన 'నది యట్టిద, ఉపాయంబు సెప్పెద; నాకర్ణింపు' మని యమ్మునివరుండు. 226

ప్రతిపదార్థం: అనినన్= అనగా (గరుత్మంతుడు) అది అట్టి= అది అంతే; ఆకర్ణింపుము= వినుము; ఉపాయంబు= ఉపాయం; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఆ+మునివరుండు= ఆ మునిరాజు, కశ్యపుడు.

తాత్పర్యం: అదంతే. అని ఆ మునిశ్రేష్ఠుడు 'ఉపాయం చెప్పుతాను వినుము' అని. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. 'కరిపతి నీరు ద్రావుటకుఁ గాఁ జనుదెంచినఁ గూర్మరాజు సం
గర మొనరించుచుండి తమకంబున నీళ్ళులఁ బాసి వీఁకమై

దరి నడరంగఁ బట్టునది, తత్సమయంబున రెంటిఁ గూడ నీ

వెరవున నూఁది చిత్తమున వేగిరపా టెటు లేక పొంచుమీ'! 227

ప్రతిపదార్థం: కరిపతి= ఏనుగురాజు; నీరు+త్రావుటకున్ కాన్= నీరు త్రాగటానికై; చనుదెంచినన్= రాగా; కూర్మరాజు= తాబేలు రాజు; సంగరము= యుద్ధం; ఒనరించుచుండి= చేస్తూ చేస్తూ; తమకంబునన్= పట్టుదలతో; నీళ్ళులన్= నీటిని; పాసి= వదలి; వీఁకమైన్= ఉదుటుతో; దరిన్= ఒడ్డున; అడరంగన్= విజృంభించగా; పట్టునది= పట్టుకొనేది; తత్+సమయంబునన్= అప్పుడు; రెంటిన్= రెండిటిని; కూడన్= కలిసేటట్లు కలిపి; ఈ వెరవునన్= ఈ ఉపాయంతో; ఊఁది= నొక్కి; చిత్తమునన్= మనస్సులో; వేగిరపాటు= తొందరపాటు; ఎటు లేక= ఏదీ లేకుండా; పొంచుమీ!= పొంచి ఉండాలి సుమా!

తాత్పర్యం: 'ఏనుగు నీళ్ళకు రాగానే తాబేలు పోట్లాడటం ప్రారంభిస్తూ ఒడ్డుమీదికి వస్తుంది. ఆ సమయం కొరకు నీవు ఉపాయంగా తొందరపడకుండా పొంచి ఉండాలి'.

విశేషం: చిన్న పిల్లవాడికి తండ్రి చెప్పే వైనం భావించుకొని చూస్తే కాని ఈ సంభాషణలో అందం తెలియదు.

వ. అని యుపదేశించిన వీడ్కొనుటకు వినతుం డయిన తనయు నత్యాదరంబునం గనుంగొని యత్తపోధన సత్తముండు 'నీవు గజకచ్ఛపంబుల నాహారంబుగాఁ గొనిన నీకుం ద్రిదశాహారంబు తేర దొరకొనుటకు సందేహంబు లేదను పల్కు వల్కి పరమాశీర్వాదంబు లిచ్చిన. 228

ప్రతిపదార్థం: అని ఉపదేశించినన్= అని బోధించగా; వీడ్కొనుటకున్= వదలివెళ్ళుటకు; వినతుండు+అయిన= వంగి నమస్కరించిన; తనయున్= కొడుకును; అతి+ఆదరంబునన్= మిక్కిలి వాత్సల్యంతో; కనుంగొని= చూచి; ఆ+తపోధన= ఆ తపస్సే ధనంగా కలవారిలో (అతడి ఐశ్వర్యమంతా అదే); సత్తముండు = శ్రేష్ఠుడు; నీవు; గజ= ఏనుగు; కచ్ఛపంబులన్= తాబేలులను; ఆహారంబుగాన్= అన్నంగా; కొనినన్= గ్రహిస్తే; నీకున్; త్రిదశ+ఆహారంబు= దేవతల అన్నమైన అమృతం; త్రిదశులు= బాల్య యౌవన కౌమార దశలు మూడే కలవారు; (దేవతలు. వారికి వృద్ధాప్యం లేదు); తేరన్= తేవటానికి; దొరకొనుటకున్= పూనుకొనటానికి; సందేహంబు= సంశయం; లేదు= లేదు; అనుపల్కు పల్కి= అనే మాటలు చెప్పి; పరమ= గొప్ప, మహత్తరమైన; ఆశీర్వాదంబులు= ఆశీస్సులు; ఇచ్చినన్= ఇవ్వగా (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: తండ్రి మార్గం చెప్పగానే ప్రయాణమై పోవటానికి వంగి నమస్కరించిన కొడుకును ప్రేమగా చూచి ఆ మహా తపస్వి ఇట్లా అన్నాడు; 'నీవు ఆ ఏనుగు తాబేళ్ళను ఆహారం చేసికొంటే అమృతం తెచ్చే శక్తి నీకు వస్తుంది. సందేహం లేదు' అని ఆశీర్వదించాడు.

మ. విని యుత్సాహము గందళింపఁగ వియద్వీథీగతుం డై, విమా

న నికాయంబులు దూలఁ బక్షతివితానస్ఫార దీప్తి వ్రజం

బినరశ్మి ప్రకరంబుఁ గీడ్పఱుపఁ బక్షీంద్రుండు చంచద్గతిం

జనియెం దానురగాభిధాన మగు నా శైలంబు పెంపిప్పకున్. 229

ప్రతిపదార్థం: పక్షి+ఇంద్రుండు= పక్షులరాజు; విని= ఆలించి; ఉత్సాహము= పనిమీద తొందర; కందళింపఁగన్= అంకురించగా; వియత్= ఆకాశమనే; వీథీ= మార్గం; గతుండై= పొందినవాడై; విమాన నికాయంబులు= విమానసమూహాలు; తూలన్=

చెల్లాచెదరుకాగా; పక్షతి= రెక్కల; వితాన= సమూహం యొక్క; స్ఫారదీప్తి వ్రజంబు= కదిలే కాంతుల గుంపు; ఇనరశ్మి= సూర్యకాంతి; ప్రకరంబున్= సమూహాన్ని; కీడ్పఱుపన్= కీడుపరచగా; చంచద్గతిన్= ఉత్సాహంతో చలించే నడకతో; తాను= గరుత్మంతుడు; ఉరగ+అభిధానము+అగు= ఉరగమన్న పేరుగల; ఆ= ఇదివరకే తెలిసిన; శైలంబు= కొండమీద ఉన్న; పెన్+తిప్పకున్= పెద్ద శిఖరానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు తండ్రి చెప్పినదంతా శ్రద్ధగా విని ఉత్సాహం ఉరకలు వేస్తుండగా, రెక్కల జంట నుండి వెలువడే కాంతులు సూర్యకాంతిని కప్పివేయగా, ఆకాశంలో దేవతల విమానాలు అతడి రెక్కల గాలికి చెల్లాచెదరు కాగా, ఉరగమన్న పేరున్న ఆ కొండతిప్పకు వెళ్ళాడు.

విశేషం: పద్యంలో గుంపు - అన్న అర్థంలో ఎన్ని పర్యాయపదాలు వచ్చాయో పాఠకులు గుర్తించాలి.

క. చని, యల్పశరీరుండై, తను నెఱుఁగక యుండ, మెలఁగి దానోగ్ర గజేం
ద్రునిఁ గాంచి నీరి కది పో । యిన యప్పుడు వెనుకఁ జనియె నెలమి దలిర్పన్. 230

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; అల్పశరీరుండు+ఐ= చిన్న శరీరం కలవాడై; తనున్= తనను; ఎఱుఁగక ఉండన్= ఎవ్వరూ గుర్తించకుండా ఉండునట్లు; మెలఁగి= ప్రవర్తించి; దాన+ఉగ్ర= మదజలంతో భయంకరమైన; గజ+ఇంద్రునిన్= ఏనుగులరాజును; కాంచి= చూచి; నీరికిన్= నీటికొరకై; అది= ఆ యేనుగు; పోయిన= వెళ్ళిన; అప్పుడు= ఆ సమయంలో; ఎలమి= సంతోషం; తలిర్పన్= చిగురెత్తగా; వెనుకన్ చనియెన్= వెనుకగా వెళ్ళాడు.

తాత్పర్యం: తన శరీరాన్ని చిన్నదిగా చేసికొని ఎవరికీ తెలియకుండా దాక్కొంటూ భయంకరమైన ఆ యేనుగు నీళ్ళకు బయలుదేరగా, వెన్నంటి తానూ వెళ్ళాడు.

విశేషం: అల్పశరీరం= అణిమ అన్న అష్టసిద్ధులలో ఒకటి. దాన+ఉగ్ర= మదించిన ఏనుగు దౌడల నుండి మదపువాసన గల నీరు స్రవిస్తుంది అని గజశాస్త్రం.

ఉ. దంతి సనంగ, భూరిమదధారల గాలి యెఱింగి, కూర్మ మ
త్యంత సముద్ధతిం గొలని కడ్డపడన్ వెసవచ్చె; వచ్చినన్,
దంతియు నీరువట్టున నుదగ్రపుఁ గోపము సందడింప, దు
ర్దాంతసముద్యమం బెసఁగ దాని పయిన్ గవిసెన్ మహోగ్రమై. 231

ప్రతిపదార్థం: దంతి= ఏన్గు; చనంగన్= వెళ్ళగా; భూరి= గొప్ప; మదధారల= మదజలపు ధారల; గాలి= వాసన; ఎఱింగి= తెలిసి; కూర్మము= తాబేలు; అతి+అంత= అత్యంత= చాలా ఎక్కువ; సముద్ధతిన్= గర్వంతో; కొలనికిన్= చెరువుకు; అడ్డపడన్= అడ్డపడటానికి; వెసన్= శీఘ్రముగా; వచ్చెన్= వచ్చింది; వచ్చినన్= వచ్చేటప్పటికి; దంతియున్= ఏనుగుకూడా; నీరువట్టునన్= దప్పికవలన; ఉత్+అగ్రపు= చాలా భయంకరమైన; కోపము= రోషం; సందడింపన్= ముసురుకొనగా; దుర్+దాంత= అణచరాని; సముద్యమంబు= గొప్ప ప్రయత్నం; ఎసఁగన్= అతిశయించగా; దాని పయిన్= తాబేలు మీదకు; మహా+ఉగ్రము+ఐ= మహా భయంకరంగా; కవిసెన్= దూకింది.

తాత్పర్యం: ఏనుగు చెరువును సమీపిస్తుండగానే గాలివలన దాని మదజల వాసనను పసిగట్టి తాబేలు మహోద్రేకంతో కొలను కడ్డంగా నిలబడింది. అసలే దప్పికతో ఉన్న ఏనుగుకు కోపం హద్దులు దాటింది. వెంటనే మహాభయంకరంగా తాబేలుపైకి దూకింది.

చ. కవిసి, ఖరంబులైన మునికాళ్ళను వ్రేయఁగ, సాము నీరిలో
ను వెడలకుండి కూర్మ మతను స్థిర తీవ్రనఖంబులం బదా
గ్ర విదళనంబు సేయఁగఁ గరంబున మోఁదఁగ వారణంబు దం
తివిహతి నొంపఁ గచ్ఛపము, దారుణ మయ్యె రణంబు భూవరా! 232

ప్రతిపదార్థం: భూవరా!= భూమికి భర్తవయిన ధర్మరాజా! (ఈ కథను భీష్ముడు ధర్మరాజుకు చెప్పుతున్నాడు. అని మరచిపోయిన పాఠకులకు గుర్తుచేయటం, వక్త-శ్రోత-వీరిద్దరినీ ఆశ్రయించే పురాణం వచ్చింది; కవిసి= (ఏనుగు) ఎదిరించి; ఖరంబులు+ఐన= వాడిఅయిన; మునికాళ్ళను= ముందుకాళ్ళతో; వ్రేయఁగన్= వేసికొట్టేసరికి; కూర్మము= తాబేలు; సాము= సగం; నీరిలోను= నీటిలోనుండి; వెడలక+ఉండి= బయటకు రాకుండా ఉండి; అతను = బలిష్ఠమైన; స్థిర= గట్టిగా ఉన్న; తీవ్ర= భయంకరమైన; నఖంబులన్= గోళ్ళతో; పద+అగ్ర= పాదాల పైభాగాన్ని; విదళనంబు= చీల్చటం; చేయఁగన్= చేసేసరికి; వారణంబు= ఏనుగు; కరంబునన్= తొండంతో; మోదఁగన్= గట్టిగా కొట్టగా; కచ్ఛపము= తాబేలు; దంత= పండ్ల; విహతిన్= దెబ్బతో; నొంపన్= నొప్పింపగా; రణంబు= యుద్ధం; దారుణము= భయంకరం; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: ధర్మరాజా! దప్పికతో వచ్చిన ఏనుగు అడ్డుపడిన తాబేలును తన వాడిమైన మునికాళ్ళతో త్రొక్కింది. తాబేలేమో సగం నీటిలోనే ఉంటూ తన గట్టిగోళ్ళతో ఏనుగు పాదాల పైభాగాలను చీల్చింది. ఏనుగు తొండంతో బాదింది. తాబేలు దంతాలతో కొరికింది. ఈ విధంగా యుద్ధం భయంకరంగా సాగింది.

విశేషం: తెలుగు సాహిత్యంలో జంతువుల యుద్ధవైఖరిని అద్భుతంగా చిత్రిస్తున్న పద్య మిది. ఆముక్తమాల్యదలో ఖాండిక్య కేశి ధ్వజసంవాదంలో యాగగోవును పులి చంపిన వైనం రాయలవారు చిత్రించారు. దీనికి తిక్కన్నగారి పద్యం మూలంవలె ఉన్నది. అంటే రెండూ చదివి తీరాలని భావం.

ఉ. ఇమ్మెయిఁ బోరి పోరి, మది నేపును గోపము నగ్గలింపఁ, గూ
ర్మమ్ము గడంగి, నీ ర్వెడలి మత్తకరిన్ వడి నాక్రమింపఁగా,
గ్రమ్మన రెంటినిం బొదివి, కచ్ఛపమున్ వలకాల వామపా
దమ్మున వారణంబును ముదమ్మునఁ బట్టి తగిల్చె గోళ్ళులన్. 233

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; పోరిపోరి= పోరాడి పోరాడి; మదిన్= మనస్సులో; ఏపును= విజృంభణ; కోపము= రోషం; అగ్గలింపన్= ఎక్కువకాగా; కూర్మమ్ము= తాబేలు; కడంగి= పూనుకొని; నీరు+వెడలి= నీటినుండి బైటికి దూకి; మత్తకరిన్= మదించిన ఏనుగును; వడిన్= వేగంగా; ఆక్రమింపఁగాన్= పైకి దూకేసరికి; గ్రమ్మనన్= హఠాత్తుగా; రెంటినిన్= రెండింటినీ; పొదివి= ఆక్రమించి; వలకాలన్= కుడికాలితో; కచ్ఛపమున్= తాబేటిని; వామపాదమ్మునన్= ఎడమకాలితో; వారణంబును= ఏనుగును; ముదమ్మునన్= సంతోషంతో; పట్టి= పట్టుకొని; గోళ్ళులన్= గోళ్ళకు; తగిల్చెన్= వ్రేలాడదీశాడు.

తాత్పర్యం: ఈ విధంగా రెండూ పోరిపోరి విసుగెత్తి కోపం, మదం విజృంభించగా తాబేలు నీటిలోనుండి బైటకు వచ్చి గజరాజును ఆక్రమించింది. అదను చూచి గరుత్మంతుడు తాబేలును కుడికాలితో, ఏనుగును ఎడమ కాలితో గోళ్ళకు పట్టుకార్లకు వ్రేలాడదీసినట్లు వ్రేలాడదీశాడు.

విశేషం: ఇది చాలా గొప్ప వర్ణన. రెంటినీ గరుత్మంతుడు పట్టుకొన్న వైనం చాలా గొప్పగా చిత్రం గీసి చూపించాడుకవిబ్రహ్మ.

వ. ఇట్టు వినతపట్టి పట్టిన నవి దమయంగంబులు పొరలం బడ నడిచిపడుటయు నతండు. 234

ప్రతిపదార్థం: ఇట్టు= ఈ విధంగా; వినతపట్టి= వినతకొడుకు - గరుత్మంతుడు; పట్టినన్= గోళ్ళతో పట్టుకొనగా; అవి= తాబేలూ, ఏనుగు; తమ; అంగంబులు= అవయవాలు; పొరలన్+పడన్= తిరగబడగా, బోర్లపడగా; అడిచిపడుటయున్= ఎగిరిపడగా; అతండు= గరుత్మంతుడు.

తాత్పర్యం: ఈ విధంగా గరుత్మంతుడు గోళ్ళతో పట్టుకొనగా తాబేలూ, ఏనుగూ తమ శరీరాలు తిరగబడగా ఎగిరిపడ్డాయి. అప్పు డతడు.

విశేషం: గరుత్మంతుడి గోళ్ళకు వ్రేళ్ళాడే జంతువుల స్థితిని వర్ణిస్తుంది ఈ చిన్న వచనం.

మ. పెలుచన్ గోళుల నొత్తి, యగ్గజముఁ దాఁబేలున్ వసం బేది మూ
ర్ఛల నొందన్ వెస నెత్తి, మేఘయుగళీసక్తోల్లసద్గైరికా
చలవైహాయసకేళియో యన నభస్సంచారియై, యుబ్బు న
గ్గలికన్ దవ్వుగఁ బాఱి, యొక్క ఘనవృక్షం బయ్యేడం దోఁచినన్. 235

ప్రతిపదార్థం: పెలుచన్= గట్టిగా; గోళులన్= గోళ్ళతో; ఒత్తి= అదిమి పట్టుకొని; ఆ+గజమున్= ఆ ఏనుగు; తాఁబేలున్= కచ్ఛపమున్నూ; వసంబు+ఏది= స్వాధీనత కోల్పోయి; మూర్ఛలనొందన్= మూర్ఛపోగా; వెసన్= త్వరగా; ఎత్తి= పైకిలేపి; మేఘ యుగళీ= రెండు మేఘాలతో; సక్త= కూడియున్న; ఉత్+లసత్= ప్రకాశించే; గైరిక= బంగారు; అచల=కొండయొక్క; వైహాయస కేళియోఅనన్= ఆకాశసంచారక్రీడా అన్నట్లుగా; నభః+సంచారిఐ= ఆకాశంలో ఎగురుతూ; ఉబ్బు= గర్వం యొక్క; అగ్గలికన్= ఆధిక్యంతో; దవ్వుగన్= దూరంగా; పాఱి= ఎగిరిపోయి; ఒక్క= ఒక; ఘన= పెద్ద; వృక్షంబు= చెట్టు; అయ్యేడన్= అక్కడ; తోఁచినన్= కనిపించగా.

తాత్పర్యం: ఆ రెండు జంతువులనూ గోళ్ళతో అదిమి పట్టుకొనేసరికి అవి స్వాధీనము తప్పి మూర్ఛపోయాయి. ఆ రెండింటితో ఆకాశంలోకి ఎగరటం ఎట్లా ఉన్నదంటే - రెండు మేఘాలు తనమీద వాలగా బంగారుకొండ ఆకాశంలో ఎగిరిపోతున్నట్లుగా ఉన్నది. అట్లా గర్వాతిశయంతో ఎగురుతూ దూరంగా పోయి ఒక చెట్టు కనిపించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఇందులో చెప్పిన పోలిక (అలంకారం) చాలా అందమైనదే కాక చాలా గంభీరమైనది కూడా. గరుత్మంతుడు ఎర్రనివాడు కనుక బంగారుకొండ. జంతువులు రెండు నల్లనివి కనుక మేఘాలు.

ఆ. దానిమీఁద నుండి, వాని రెంటిని భుజిం । పంగ మదిఁ దలంచి, పంచయోజ
నముల నిడువు గల్గు రమణీయశాఖపై । గరుడుఁ డెలమి నెఱఁగెఁ గురువరేణ్య! 236

ప్రతిపదార్థం: కురువరేణ్యా!= కౌరవశ్రేష్ఠుడా!; దానిమీఁదన్= చెట్టుపైన; ఉండి= కూర్చొని; వానిన్ రెంటినిన్= ఆ రెండు జంతువులను; భుజింపంగన్= తినటానికి; మదిన్= మనస్సులో; తలంచి= అనుకొని; పంచ= ఐదు; యోజనములు= యోజనమంటే సుమారు 4 క్రోసులు - ఆమడ; ఐదు యోజనములు= 20 ఆమడలు; నిడుపు= పొడవు; కల్గు= ఉన్న రమణీయ= అందమైన; శాఖపైన్= కొమ్మ మీద; గరుడుఁడు= గరుత్మంతుడు; ఎలమిన్= సంతోషంతో; ఎఱఁగెన్= వ్రాలెను.

తాత్పర్యం: ఐదు యోజనాల పొడవున్న ఆ చెట్టు కొమ్మమీద కూర్చొని ఆ రెంటిని తిందామని అనుకొని గరుత్మంతుడు సంతోషంతో దానిమీదికి వ్రాలాడు.

క. ఎఱఁగిన, యప్పెను వ్రేఁగున । విఱుగుటయును, శాఖ చూచి విహగేంద్రుఁడు గొం
దఱు మునుల నందు గన్గొని । వెఱపున నాత్మీయ చిత్తవృత్తి గలంగన్. 237

ప్రతిపదార్థం: ఎఱఁగిన= వ్రాలగా; ఆ+పెను= ఆ పెద్ద; వ్రేఁగునన్= బరువుచేత; శాఖ= కొమ్మ; విఱుగుటయునున్= విరుగగా; చూచి= కన్గొని; విహగ+ఇంద్రుఁడు= పక్షిశ్రేష్ఠుడు, గరుత్మంతుడు; అందున్= ఆ కొమ్మలో; కొందఱు మునులన్= కొంతమంది తపస్వులను; కన్గొని= చూచి; వెఱపునన్= భయంతో; ఆత్మీయ= తన; చిత్తవృత్తి= మనస్సు; కలంగన్= కలతచెందగా.

తాత్పర్యం: వ్రాలేసరికి ఆ పెద్దబరువుకు అంతకొమ్మకూడా విరిగిపోయింది. ఆ కొమ్మలో కొందరు మునులుండటం చూచిన గరుత్మంతుడి మనస్సు బాధపడి. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. అవనిఁ బడనీక, శాఖఁ జంచువునఁ బట్టి । పట్టి వారల సుస్థితుల్ పల్లటిలక
యుండ, వెరవున ధరియించి, యొయ్య నెగయఁ । జూచి యవ్వాలఖిల్యులు చోద్య మంది. 238

ప్రతిపదార్థం: అవనిన్= నేలపై; పడనీక= పడనివ్వక; శాఖన్= కొమ్మను; చంచువునన్= ముక్కుతో; పట్టిపట్టి= గట్టిగా కరచుకొని; వారల= మునుల; సుస్థితుల్= కూర్చున్నతీరు; పల్లటిలకయుండన్= చెదరిపోకుండా; వెరవునన్= నేర్పుతో; ధరియించి= ధరించి, పట్టుకొని; ఒయ్యన్= నెమ్మదిగా; ఎగయన్= ఎగరటం; చూచి; ఆ+వాలఖిల్యులు= వాలఖిల్యులనబడే ఆ మునులు; చోద్యము+అంది= ఆశ్చర్యపడి.

తాత్పర్యం: భూమిపై పడబోతున్న ఆ కొమ్మను ముక్కున పట్టుకొని ఆ మునుల కేమాత్రం స్థానభ్రంశం కాకుండా చూస్తూ నెమ్మదిగా ఎగిరేసరికి ఆ మునులు చూచి ఆశ్చర్యపడి.

విశేషం: ఆ మునులు 360 మంది సంవత్సరకాలమనీ, గరుత్మంతుడు సూర్యుడనీ, కాలస్వరూపుడనీ వేదం వర్ణిస్తుంది.

వ. వైనతేయుం డగుట మనంబుల ననుసంధించి కరుణించి. 239

ప్రతిపదార్థం: వైనతేయుండు= వినతకొడుకు; అగుట= కావటం; మనంబులన్= మనసులలో; అనుసంధించి= భావించి; కరుణించి= దయతలచి.

తాత్పర్యం: అతడు గరుత్మంతుడని మనస్సులలో భావించి దయతలచి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'ఈతఁడు దక్కఁగ, నొరులకు । నీతెఱఁగు బలంబు, వెరవు నేల కలుగు? నం
చాతరుశాఖ విడిచి చని । రాతని దీవించి యోగ్య మయ్యెడు నెడకున్. 240

ప్రతిపదార్థం: ఈతఁడు= ఈ గరుత్మంతుడు; తక్కఁగన్= తప్ప; కాక; ఒరులకు= ఇతరులకు; ఈ తెఱఁగు= ఈ విధమైన; బలంబు= బలమూ; వెరవు= నేర్పూ; ఏల కలుగున్= ఎట్లా కలుగుతాయి? అంచున్= అనుకొంటూ; ఆ తరుశాఖన్= ఆ చెట్టుకొమ్మను; విడిచి= వదలిపెట్టి; అతనిన్ దీవించి= అతడి కాశీస్సు లిచ్చి; యోగ్యము+అయ్యెడు= తగినటువంటి; ఎడకున్= చోటికి; చనిరి= పోయారు.

తాత్పర్యం: గరుత్మంతుడికి తప్ప ఈ విధమైన బలము, నేర్పూ ఇతరులకు లేవని ఆ మునులు అతడిని దీవించి ఆ చెట్టుకొమ్మను వదలిపెట్టి వాళ్ళకిష్టమైన చోటికి వెళ్ళిపోయారు.

వ. చనినన్ గరుత్మంతుండు సంతోషించెఁ; దదనంతరంబ. 241

ప్రతిపదార్థం: చనినన్= వెళ్ళగా; గరుత్మంతుఁడు= వినతకొడుకు; సంతోషించెన్= ఆనందించాడు; తత్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: వెళ్ళగా గరుత్మంతుడు సంతోషించాడు. ఆ తరువాత.

ఆ. 'విపులశాఖ నిచట విడిచిన నిచ్చటి । జంతుకులము లెల్లఁ జచ్చు; నింక
నేమి సేయువాఁడ? నే' నను నెవ్వగ । పుట్టె నవ్విహంగపుంగవునకు. 242

ప్రతిపదార్థం: విపుల= విస్తారమైన; శాఖన్= కొమ్మను; ఇచటన్= ఇక్కడ; విడిచినన్= వదలితే; ఇచ్చటి= ఇక్కడి; జంతు కులములు= జంతువుల గుంపులన్నీ; చచ్చున్= చస్తాయి; ఇంకన్= మరి; ఏమిచేయువాఁడన్? = ఏం చేసేది?; అను= అన్నటువంటి; నెఱ+వగ= నిండు దుఃఖం; ఆ+విహంగ= ఆ పక్షి; పుంగవునకున్= శ్రేష్ఠునకు; పుట్టెన్= కలిగింది.

తాత్పర్యం: 'ఈ పెద్దకొమ్మ నిక్కడ వదలిపెట్టితే ఇక్కడున్న జంతువులన్ని నలిగి చచ్చిపోతాయి. మరి ఇప్పుడేం చేయాలన్న బాధ కలిగింది ఆ గరుత్మంతుడికి.

విశేషం: ఈ ఆలోచన అతడి దయను ప్రకటిస్తుంది. గరుత్మంతుడు ఎంత మహానుభావుడో వివరించే కథ కనుక ఆయా గుణాలను చెప్పుతూ పోతాడు మహాకవి. వాటిని మనం భావించాలి.

వ. అట్టి యెడ. 243

తాత్పర్యం: అప్పుడు.

తే. 'నిందితాచార యుతము, కులింద దేశ । మంబుధి ప్రాంత; మీశాఖ యందు విడువు,
మమరవరుల పం పిది, విహగాధినాథ!' యను నెలుంగు నభంబునం దావహిల్లె. 244

ప్రతిపదార్థం: విహగ =(ఆకాశంలో ఎగిరే) పక్షులకు; అధినాథ!= అధిపతీ! రాజా!; నిందిత= అపవిత్రమైన; ఆచార= ఆచారాలతో; యుతము= కూడుకొన్నది; కులింద దేశము= ఆ పేరుగల దేశము; అంబుధిప్రాంతము= అది సముద్రప్రాంతంలో

ఉంది; ఈ శాఖ= ఈ కొమ్మను; అందున్= అక్కడ; విడువుము= వదలిపెట్టుము; ఇది; అమరవరుల= పూజించదగిన దేవతలయొక్క; పంపు= ఆజ్ఞ; అను+ఎలుంగు= అన్న కంఠధ్వని; నభంబునందున్= ఆకాశంలో; ఆవహిల్లెన్= వ్యాపించెను.

తాత్పర్యం: 'ఓయీ! పక్షిరాజా! పూజ్యులైన దేవతలు నీ కనుజ్ఞ ఇస్తున్నారు. 'దురాచారాలతో అపవిత్రమైన కులిందదేశ సముద్ర ప్రాంతంలో ఈ కొమ్మను వదలిపెట్టుము' అన్న మాటలు ఆకాశంలో వినిపించాయి.

విశేషం: అధర్మం, శిక్షించదగింది కనుక ఆ శిక్షించే అధికారులు దేవతలు కనుక వా రాజ్ఞాపించారు. ప్రపంచగతిలో సమత్వాన్ని కాపాడేవారు దేవతలు. అసమత్వాన్ని కల్పించే శక్తులు రాక్షసులు. వీళ్ళిద్దరూ వ్యక్తులు కారు. విశ్వంలో భావశక్తులు.

క. విని, సత్వరముగ నటఁ గొని । చని, యద్దేశమునఁ గల్గు జనములు మృతిఁ బొం
ద, నతం డా చక్కటి నా । ఘనశాఖయు నెమ్మనంబు కలఁకయు విడిచెన్. 245

ప్రతిపదార్థం: విని= ఆలించి, సత్వరముగన్= తొందరగా; అటన్= అక్కడకు; కొని= గ్రహించి; చని= వెళ్ళి; ఆ+దేశమునన్= ఆ ప్రాంతంలో; కల్గు= ఉండే; జనములు= ప్రజలు; మృతిన్ పొందన్= చావగా; అతండు= ఆ గరుత్మంతుడు; ఆ చక్కటిన్= ఆ ప్రదేశంలో; ఆ ఘనశాఖయున్= ఆ పెద్దకొమ్మను; నెమ్మనంబు= నిండు మనస్సులోని; కలఁకయున్= కలతను; విడిచెన్= త్యజించాడు.

తాత్పర్యం: వినీ వినగానే ఆ ప్రదేశానికి వెళ్ళి అక్కడివారు చచ్చేటట్లుగా; ఆ పెద్దకొమ్మను తన మనస్సులోని కలతతో పాటు విడిచిపెట్టాడు.

విశేషం: కొమ్మను విడవటమూ - కలతపోవటమూ ఒకేసారి జరిగాయన్నమాట.

వ. విడిచి భరితలీలంబుగా నొక్క శైలంబు విశాల తటంబునకుం బోయి. 246

ప్రతిపదార్థం: విడిచి= కొమ్మను విడిచి; భరిత= భరించబడిన; లీలంబుగాన్= విలాసంగా; ఒక్క శైలంబు= ఒక కొండయొక్క; విశాల తటంబునకున్+పోయి= విశాలమైన చదునైన ప్రదేశానికి వెళ్ళి.

తాత్పర్యం: కొమ్మను అట్లా వదలిపెట్టి చాలా విలాసంగా ఒక కొండపై ఉన్న చదరమైన మైదానానికి పోయి.

విశేషం: భరితలీలంబుగాన్= బరువు దించుకొన్న తరువాత కలిగే ఉల్లాసాన్ని సూచించే మాట.

క. కరికచ్ఛపముల పెన్నె । త్తురుఁ, గండలుఁ, గ్రొవ్వు, మెదడుఁ, దుష్టిగఁ బక్షీ
శ్వరుఁ డాని, యధికబలబం । ధురుఁడై యమృతమున కేఁగె దుర్దాంతగతిన్. 247

ప్రతిపదార్థం: కరి కచ్ఛపముల= ఏనుగు తాబేళ్ళ యొక్క; పెన్= పెద్ద; నెత్తురున్= నెత్తురును; కండలున్= కండలును; క్రొవ్వు; మెదడున్; తుష్టిగన్= సంతోషంగా; పక్షి+ఈశ్వరుఁడు= పక్షిరాజు; అని= తిని; అధిక= ఎక్కువ; బలబంధురుఁడు+ఐ= బలంతో కూడుకొన్నవాడై; దుర్+దాంత= ఆపరాని, గతిన్= నడకతో, ప్రయాణంతో; అమృతమునకున్= అమృతంకొరకు; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఏనుగూ, తాబేలూ ఆరెండింటి నెత్తురూ, కండలూ, క్రొవ్వూ, మెదడూ తృప్తిగా భుజించి సంతుష్టుడై పక్షిరాజు కావలసిన బలాన్ని పొంది, ఆపరాని వేగంతో అమృతం కొరకు వెళ్ళాడు.

వ. ఇవ్విధంబున. **248**

తాత్పర్యం: ఈ విధంగా.

క. చని, దానిచుట్టు మండెడు । ననలంబును జూచి, తన్మహత్తర జిహ్వాల్
దనికిన నెఱకలు గమరునొ । యను తలఁపున బ్రహ్మఁ గాన నరిగె రయమునన్. **249**

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; దాని= అమృతంయొక్క; చుట్టు= చుట్టూరా; మండెడు= మండే; అనలంబును= అగ్నిని; చూచి= కని; తత్= ఆ అగ్నియొక్క; మహత్తర= గొప్ప; జిహ్వాల్= నాల్కలు; తనికినన్= తాకితే; ఎఱకలు= రెక్కలు; కమరునొ= కాలునో; అను= అన్న; తలఁపునన్= ఆలోచనతో; బ్రహ్మన్= తాతగారైన బ్రహ్మదేవుడిని; కానన్= చూడటానికి; రయమునన్= వేగంగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అమృతం దగ్గరకు వెళ్ళేసరికి దానిచుట్టూ అగ్ని మండుతున్నది. ఆ మంటలు తాకితే రెక్కలు కమిలిపోతాయేమోనన్న భయంతో తాత బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు. (ఉపాయం కొరకు)

వ. అరిగి తచ్చరణ పద్మంబులకుం బ్రణతుఁడై కేలు మొగిచి. **250**

ప్రతిపదార్థం: అరిగి= వెళ్ళి; తత్= బ్రహ్మ యొక్క; చరణ= పాదాలనెడి; పద్మంబులకున్= తామరపూలకు; ప్రణతుఁడు+ఐ= వంగి; కేలు మొగిచి= చేతులు జోడించి, నమస్కరించి;

తాత్పర్యం: వెళ్ళి, ఆయన పాదపద్మాలకు వంగి నమస్కరించి.

చ. 'వినతకు దాస్య మొందె నొకవెంటఁ, దదీయ నిరాసహేతువై
యనఘవిచార! నాకు నమృతాహరణంబు విధేయ మయ్యెఁ; న
ప్పనిమెయి నగ్నిచేత నగుఁబా టగు నన్వెఱతో భవద్దయా
వననిధి నాశ్రయించుటకు వచ్చితి; నార్తశరణ్య! కావవే!' **251**

ప్రతిపదార్థం: అనఘ= పాపంలేని; విచార!= ఆలోచన కలవాడా!; ఒక వెంటన్= ఒకానొక కారణంగా; వినతకున్= మా అమ్మకు; దాస్యము+ఒందెన్= దాస్యం కలిగింది; తదీయ= దాని; నిరాసహేతువు+ఐ= పోగొట్టే కారణంగా; నాకున్= నాకు; అమృత= అమృతాన్ని; ఆహరణంబు= తేవటం; విధేయము= చేయవలసిన పని; అయ్యెన్= సంభవించింది; ఆ పనిమెయిన్= ఆ కార్యంలో; అగ్నిచేతన్= అగ్నివలన; నగుఁబాటు= అవమానం; అగున్= ఔను; అన్= అన్నట్టి; వెఱతోన్= భయంతో; భవత్=నీ; దయా= కరుణ అనే; వననిధిన్= సముద్రాన్ని; ఆశ్రయించుటకున్= శరణొందటానికి; వచ్చితిన్= వచ్చాను; ఆర్తశరణ్య!= బాధలలో ఉన్నవారికి దిక్కైనవాడా!; కావవే!= రక్షించుమా!

తాత్పర్యం: 'పవిత్రమైన ఆలోచన కలవాడా! మా అమ్మ కొక కారణంగా దాస్యం కలిగింది. దానిని పోగొట్టుకొనే నిమిత్తం నాకు అమృతం తేవలసి వచ్చింది. ఈ పనిలో నా కగ్నివలన అవమానం కలుగుతుందన్న భయంతో నీ శరణాగతుడనై వచ్చాను. దుఃఖంలో ఉన్నవారికి ఆశ్రయమైన వాడా! నన్ను రక్షించవా?' అని గరుత్మంతుడు ప్రార్థించాడు.

విశేషం: అగ్నిచేత అవమానం కలుగుతుందేమో అన్న భయంతో సముద్రాన్ని ఆశ్రయించటానికి వచ్చినాడనటం సముచితంగా ఉన్నది.

వ. అనుటయు. 252

తాత్పర్యం: అనగా.

చ. అతనికి వత్సలుం డగుట నంబుజగర్భుఁడు 'వెన్న పై పయిన్
వితతము గాఁగ జిహ్వలకు వ్రేఁగగునట్లుగఁ జాల వైచినం,
బతగవరేణ్య! మ్రక్కఁబడుఁ బావకుఁ; డయ్యెడఁ జొచ్చి నీదువాం
ఛితము ఫలింప సత్వరతఁ జేకొను మయ్యమృతంబు' నావుడున్. 253

ప్రతిపదార్థం: అంబుజ= పద్మం; గర్భుఁడు= జన్మస్థానంగా కలవాడు - బ్రహ్మ; అతనికిన్= గరుత్మంతుడిపై; వత్సలుండు= ప్రేమగలవాడు; అగుటన్= అయినందువలన; వెన్న= వెన్నను; పైపయిన్= పైన; వితతము= విస్తారంగా; కాఁగన్= అగునట్లుగా; జిహ్వలకున్= అగ్నిమంటలకు; వ్రేఁగు= బరువు; అగునట్లుగన్= అయ్యేటట్లుగా; చాలన్= ఎక్కువ; వైచినన్= వేస్తే, పతగవరేణ్య!= పక్షులలో శ్రేష్ఠుడా!; పావకుఁడు= అగ్ని; మ్రక్కఁబడున్= అణగును; అయ్యెడన్= అప్పుడు; చొచ్చి= ప్రవేశించి; నీదు= నీయొక్క; వాంఛితము= కోరిక; ఫలింపన్= నెరవేరేటట్లుగా; ఆ+అమృతంబున్= ఆ అమృతాన్ని; సత్వరతన్= శీఘ్రమే; చేకొనుము= పుచ్చుకొనుము; నావుడున్= అనగా.

తాత్పర్యం: బ్రహ్మకు గరుత్మంతుడిపైన వాత్సల్యమున్నది (మనుమడు కదా!) అందుకని చెప్పుతున్నాడు 'నాయనా! వెన్న తెచ్చి ఆ అగ్నిలో వేస్తే ఆయన దానికడుగునబడి ఆ బరువుకు తగ్గి ఉంటాడు. నీ కోరిక నెరవేరుతుంది. సమయం చూచి అమృతం తీసికొనిపొమ్ము!' అని చెప్పగా.

ఆ. ఆత్మఁ బొంగి, మ్రొక్కి యతఁ డాలమందలు । పరపులైన యెడల కరిగి యరిగి
కొండ యంత వెన్నఁ గూర్చి, వేగము కొని । పోయి, యమ్మహాగ్నిఁ బొదువవైచి. 254

ప్రతిపదార్థం: అతఁడు= ఆయన; ఆత్మన్= హృదయంలో; పొంగి= సంతోషించి; మ్రొక్కి= నమస్కరించి; ఆలమందలు= ఆవులమందలు; పరపులు= విస్తారంగా; ఐన+ఎడలకున్= ఉన్న చోట్లకు; అరిగి అరిగి=పోయి పోయి (చాలాచోట్లకు); కొండఅంత= పర్వతమంత; వెన్నన్= వెన్నను; కూర్చి= ప్రోగుచేసి; కొనిపోయి= తీసికొని వెళ్ళి; అ+మహా= ఆ గొప్ప; అగ్నిన్= అగ్నిదేవుణ్ణి; పొదువన్= కప్పేటట్లు - కన్పించకుండా; వైచి= వేసి.

తాత్పర్యం: మనస్సులో సంతోషంతో పొంగిపోయి ఆలమందలున్న చోట్లన్నీ వెదకి వెదకి కొండంత వెన్న కూర్చుకొని ఆ అగ్నిదేవుడి మీద వేశాడు.

గరుడుఁ డింద్రుని జయించి యమృతంబు దెచ్చి కద్రువకుఁ జూపుట (సం.13-28-1(కుంభ))

శా. నీరుం బాయఁగఁ జల్లి, రాక్షసుల యున్మేషంబు మర్దించి, హృ
త్సారోదారుఁ డయోమయం బయిన యజ్ఞాలంబు వే ద్రచ్చి, దు

ర్వారస్వైరవిహార మొప్ప, నమృతగ్రాహం బొడం గూడుడుం

దారావీథిఁ జనం దొడంగె మగుడన్ దర్పం బెలర్పన్ వడిన్. 255

ప్రతిపదార్థం: నీరున్= నీళ్ళను; పాయఁగన్= తొలగునట్లు; చల్లి= పారబోసి; రాక్షసులు= కాపలా ఉన్న రక్కసుల యొక్క; ఉన్మేషంబున్ = పరాక్రమాన్ని; మర్దించి= అణచి; హృద్+సార+ఉదారుఁడు= మనస్సులోని గొప్ప బలంతో ఉదారుడైనవాడు; అయోమయంబు= ఇనుపదైన; ఆ+జాలంబున్= ఆ వలను; వే= వేగంగా; వ్రచ్చి= త్రెంచి; దుర్వార= వారించటానికి; వీలులేని; స్వైర విహారము= స్వేచ్ఛతోకూడిన క్రీడ; ఒప్పన్= ప్రకాశించగా; అమృతగ్రాహంబు= అమృతస్వీకారం; ఒడన్+కూడుడున్= లభించగా; దర్పంబు= గర్వం; ఎలర్పన్= చిగుర్పగా; తారావీథిన్= నక్షత్రమార్గంలో, ఆకాశమార్గంలో; వడిన్= వేగంగా; మగుడన్= మరలా; చనన్= వెళ్ళటానికి; తొడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: అగ్ని ఆరిపోగా, చుట్టూఉన్న నీళ్ళను బయటకు చల్లి కాపలా ఉన్న రాక్షసుల విజృంభణం అణచి హృదయోల్లాసంతో ఇనుపవలను ఛేదించి, అడ్డూ అదుపు లేని స్వేచ్ఛా విహారంతో అమృతాన్ని అపహరించి నక్షత్రమార్గాన ఎగిరిపోవటం మొదలుపెట్టాడు.

వ. అంతయు నెఱింగి. 256

ప్రతిపదార్థం: అంతయున్= దానినంతా; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: దాని నంతా తెలిసికొని.

మ. అమరేంద్రుండు సముద్ధతిన్ వెడలి దేవానీకముల్ దోడ్పడన్

సమరక్రీడకుఁ జొచ్చి పక్షిపతిచే సైన్యంబు లెల్లన్ విధూ

తము లైనం గనుఁగ్రేవఁ గెం పెసఁగ రౌద్రం బైన చిత్తంబుతో

డ మహోదగ్రతఁ బొల్చు వజ్రము నవష్టంభోగ్రుఁడై వైచినన్. 257

ప్రతిపదార్థం: అమర+ఇంద్రుండు= దేవతలరాజు; సముద్ధతిన్= మిక్కిలి దర్పంతో; వెడలి= దండెత్తి; దేవ+అనీకముల్= దేవతల సేనలు; తోడ్పడన్= సహాయం కాగా; సమరక్రీడకున్= యుద్ధమన్న ఆటకు; చొచ్చి= ప్రవేశించి; పక్షిపతిచేన్= గరుత్మంతుడిచేత; సైన్యంబులు= సేనలు; ఎల్లన్= అన్నీ; వి+ధూతములు= చెదరగొట్టబడినవి; ఐనన్= కాగా; కను+క్రేవన్= కనులచివళ్ళలో; కెంపు+ఎసఁగన్= ఎర్రదనం ఎక్కువ కాగా; రౌద్రంబు=కోపం; ఐన= అయినటువంటి; చిత్తంబుతోడన్= మనస్సుతో (మనస్సు కోపంగా పరిణామం పొందగా); మహా= గొప్ప; ఉత్+అగ్రతన్= ఉద్రేకంతో; అవష్టంభ= గర్వంతో; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; వజ్రమున్= వజ్రాయుధాన్ని; వైచినన్= ప్రయోగించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: కయ్యానికని దేవేంద్రుడు సేనతో భయంకరంగా బయలుదేరి, యుద్ధంలో తన సేననంతా గరుత్మంతుడు చెల్లాచెదరు చేయగా, కోపంతో కళ్ళెర్రపడగా రౌద్రంతో మనస్సంతా నిండిపోగా ఇంద్రుడు భయంకరమైన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు.

క. అది యొకఁడుఁ జేయఁ జాలక । విదళితశైల మగు తనదు విలసన మచటం

గుదియుటఁ దనకుం దెలిసిన । మద మఱి గిరిభేదికడకు మగుడం జనియెన్. 258

ప్రతిపదార్థం: అది= ఆ వజ్రాయుధం; ఒకఁడున్= ఏమీ; చేయన్+చాలక= చేయలేక; విదళితశైలము= నరకబడ్డ కొండలు గలది; అగు= ఐన; తనదు= తనయొక్క; విలసనము= విలాసం; అచటన్= ఈ విషయంలో; కుదియుటన్= సమసిపోవటం; తనకున్= వజ్రాయుధానికి; తెలిసినన్= తెలిసేసరికి; మదము+అఱి= గర్వంపోయి; గిరిభేది కడకున్= పర్వతాలను భేదించిన ఇంద్రుడి దగ్గరకు; మగుడన్+చనియెన్= తిరిగి వెళ్ళింది.

తాత్పర్యం: ఆ వజ్రాయుధం తానేమీ చేయలేక, పర్వతాలను నరికిన తన గొప్పతనమంతా గరుత్మంతుడి విషయంలో మొక్కపోవటం తెలిసికొని ఇంద్రుడి దగ్గరకు తిరిగిపోయింది.

విశేషం: ఇవీ గరుత్మంతుడి మాహాత్మ్యం, బలపరాక్రమాలు.

క. చేయునది లేక నిర్జర । నాయకుఁడును వెఱఁగుపాటునను వ్రాన్పడుచుం
బోయెం గ్రమ్మఱి ధరణీ । నాయక! నిజపట్టణంబునకు దీనగతిన్. 259

ప్రతిపదార్థం: ధరణీనాయక!= భూమికి నాథుడా!, రాజా; నిర్జర= దేవతల; నాయకుఁడును= ఇంద్రుడుకూడా; చేయునదిలేక= చేసేది ఏమీలేనందువలన, ఏమీ చేయలేక; వెఱగుపాటునను= ఆశ్చర్యంతో (వజ్రాయుధం కూడా ఏమీ చేయలేకపోయిందేమిటని); వ్రాన్పడుచున్= నిశ్చేష్టుడగుచు; క్రమ్మఱి= తిరిగి; నిజపట్టణంబునకున్= తన నగరానికి; దీనగతిన్= దైన్యంతో; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు కూడా చేసేదేమీ లేక ఆశ్చర్యంతో నిశ్చేష్టుడై తన నగరానికి దిగులుతో తిరిగిపోయాడు.

చ. అజుని యనుగ్రహంబునఁ విహంగమవల్లభుఁ డట్లు సాలన
క్కజ మగు శౌర్యసంపద ప్రకాశతఁ బొందఁగఁ గేలి సల్పి యిం
ద్ర జయమహోత్సవంబున నుదాత్తయశః పరిపూరితంబు లై
త్రిజగములున్ వెలుంగ నలిఁ దెచ్చె సుధారసపూర్ణభాండమున్. 260

ప్రతిపదార్థం: విహంగమ= ఆకాశంలో ఎగిరే పక్షులకు; వల్లభుఁడు= రాజు; అజుని= బ్రహ్మయొక్క; అనుగ్రహంబునన్= దయతో; అట్లు= ఆ విధంగా; చాలన్= ఎక్కువ; అక్కజము= ఆశ్చర్యం; అగు= అయిన; శౌర్యసంపద= పరాక్రమ సంపద; ప్రకాశతన్= వెలుగు; పొందఁగన్= చెందగా,లోకానికి తెలియగా; కేలి= క్రీడ; సల్పి= చేసి; ఇంద్రజయ= ఇంద్రుని గెల్చుట వలన లభించిన; మహా+ఉత్సవంబునన్= గొప్ప పండుగతో; ఉదాత్త= గొప్ప; యశః= కీర్తితో; పరిపూరితంబులు+ఐ= నిండినవై; త్రిజగములున్= ముల్లోకాలూ; వెలుంగన్= వెలిగిపోగా; సుధారస= అమృతద్రవంతో; పూర్ణ= నిండిన; భాండమున్= కుండను; నలిన్= సంతోషంతో; తెచ్చెన్= తెచ్చాడు.

తాత్పర్యం: గరుత్మంతు డా విధంగా బ్రహ్మదయవలన ఆశ్చర్యకరమైన బలపరాక్రమాలు వెల్లడి కాగా, యుద్ధం చేసి ఇంద్రుడిని ఓడించి ఆ విజయమహోత్సవంతో ముల్లోకాలలో తనకీర్తులు నిండారగా అమృతభాండాన్ని తెచ్చాడు.

తే. తెచ్చి డించి, కద్రువ ప్రీతిఁ దేలఁ జూపి । తల్లి చెఱవాపికొని పొంగి చెల్లునాగ
డమున మగుడ నయ్యమృతభాండంబు దాన । పుచ్చికొని యెడఁ గలుగంగఁ బోయి నిలిచి. 261

ప్రతిపదార్థం: తెచ్చి= అమృతభాండం తీసికొని వచ్చి; డించి= క్రిందపెట్టి; కద్రువ= అతని పెద్దతల్లి; ప్రీతిన్= సంతోషంలో; తేలన్= తేలిపోవగా; చూపి= చూపించి; తల్లిచెఱ= తనతల్లి దాసాన్ని; పాపికొని= పోగొట్టుకొని; పొంగి= పొంగిపోయి; చెల్లు= సాగే; ఆగడమునన్= అల్లరితనంతో; మగుడన్= తిరిగి; ఆ+అమృతభాండంబున్= ఆ అమృతపు కుండను; తాన= తానే; పుచ్చికొని= గ్రహించి; ఎడ= దూరం; కలుగంగన్= కలిగేటట్లు; పోయి= వెళ్ళి; నిలిచి= నిలబడి.

తాత్పర్యం: అమృతభాండం తెచ్చి క్రిందపెట్టి కద్రువకు సంతోషం కలిగేటట్లు చూపించి, తనతల్లి దాస్యం చెల్లిపోయిందనిపించుకొని తిరిగి ఆ అమృతం కుండను తానే తీసికొని గడుసుదనంతో దూరంగా పోయి నిలబడి.

విశేషం: కద్రువ 212వ పద్యంలో అన్నది. 'లోకులు నిన్నుం బ్రణుతింపఁ దెమ్మమృతమున్' అని. అత డట్లాగే తెచ్చాడు. ఇందుకే 260వ పద్యం వ్రాసింది కవి. తెమ్మన్నదే కాని ఇమ్మనలేదు. అందుకని ఇవ్వలేదు.

వ. తన్ను వెఱఁగుపడి చూచుచున్న కద్రువ నుద్దేశించి. 262

ప్రతిపదార్థం: తన్నున్= గరుత్మంతుడిని; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; చూచుచున్+ఉన్న= చూస్తూ ఉన్న; కద్రువన్= పెదతల్లిని; ఉద్దేశించి= దృష్టిలో ఉంచుకొని; చూస్తూ;

తాత్పర్యం: గరుత్మంతుడిని భయపడుతున్న చూపులతో చూస్తూ ఉన్న కద్రువతో. (తరువాతి పద్యంతో అన్వయం)

మ. 'జననీ! నీ వమృతంబు తె' మ్మనిన, యా సత్యోక్తి పాటించి యేఁ
జని నానావిధ కర్మకర్మఠుఁడ నై సాధించి, వే తెచ్చితిన్
విను, నా నీయొడఁబాటు సెల్లె జనులన్ విన్పించితిం దెల్లఁగా
వినతం దోడ్కొని పోయెదన్ మనమునన్ విభ్రాంతి లే కుండుమీ!' 263

ప్రతిపదార్థం: జననీ!= అమ్మా!; నీవు; అమృతంబు= అమృతం; తెమ్ము= తేవోయి; అనినన్= అనగా; ఆ+సత్య+ఉక్తి= ఆ నిజమైన మాట; పాటించి= అంగీకరించి; ఏన్= నేను; నానావిధ= అనేకమైన; కర్మ= కార్యాలు; కర్మఠుఁడనై= చేసినవాడనై; సాధించి (అమృతాన్ని) సంపాదించి; వే= త్వరగా; తెచ్చితిన్= తెచ్చాను; విను= జాగ్రత్తగా వినుము; నా నీ= మన ఇద్దరి; ఒడఁబాటు= సంధి, అంగీకారం; చెల్లెన్= నెరవేరింది; తెల్లఁగాన్= స్పష్టంగా; జనులన్= జనానికి; విన్పించితిన్= చాటిచెప్పాను; వినతన్= మా అమ్మను; తోడ్కొని= వెంటబెట్టుకొని; పోయెదన్= పోతున్నాను; మనమునన్= మనస్సులో; విభ్రాంతి= భ్రమ; లేకుండుమీ= లేకుండా ఉండుము.

తాత్పర్యం: 'తల్లీ! నీవన్నావు! అమృతం తీసికొని రమ్ము' అని. ఆ మాటను పట్టుకొని అనేకవిధాల కష్టాలుపడి కార్యం సాధించుకొని వచ్చాను. మన ఒప్పందం చెల్లింది. జనులందరికీ ఈ విషయం స్పష్టంగా చాటి చెప్పాను. మా అమ్మను తీసికొని పోతున్నాను. నీవు ఏమీ భ్రమపెట్టుకోకు'.

విశేషం: 212వ పద్యంలో కద్రువ ఎగతాళిగా అన్నది. 'అమృతం తేరా చూద్దాం' అని. అది మత్తేభం పద్యంలో ఉన్నది. ఈ పద్యం గరుత్మంతుడి సమాధానం. ఇదీ మత్తేభమే. ఎగతాళిమాటకు తగినట్లు బుద్ధి చెప్పటం ఆయన చేసిన పని. దుర్మార్గులను శిక్షించటమే ధర్మం. కనుక గరుత్మంతుడి గొప్పతనానికి ఇదొక గుర్తు.

మ. అని ధర్మస్థితి తోఁప మాట వెర వేపారం దగం బల్కి నే
ర్పునకున్ లోకము మెచ్చఁ గద్రువకుఁ బెంపుం గీర్తియున్ మాయ సొం
పునఁ దల్లిం దనయింటి కన్పి యమృతంబుం గ్రమ్మఱన్ గ్రక్కునం
గొని, పక్షీంద్రుఁడు వోయి యింద్రుఁ డెలమిం గూరంగ నిచ్చెం దగన్. 264

ప్రతిపదార్థం: అని= పై విధంగా చెప్పి; ధర్మస్థితి= ధర్మంయొక్క ఉనికి; తోఁపన్= స్పష్టం కాగా; మాట వెరపు= మాట ఉపాయం; ఏపారన్= తెలిసేటట్లుగా; తగన్= ఉచితంగా; పల్కి= చెప్పి; నేర్పునకున్= తన తెలివికి; లోకము= జనమంతా; మెచ్చన్= మెచ్చుకొనగా; కద్రువకున్= పెదతల్లికి; పెంపున్= గొప్పతనం; కీర్తియున్= కీర్తి; మాయన్= లోపించగా; సొంపునన్= చక్కగా; తల్లిన్= వినతను; తన ఇంటికిన్= స్వగృహానికి; అన్పి= పంపి; అమృతంబున్= సుధను; క్రమ్మఱన్= తిరిగి; గ్రక్కునన్= వెంటనే; పక్షి+ఇంద్రుఁడు= పక్షిరాజు; కొని= గ్రహించి; పోయి= వెళ్ళి; ఇంద్రుఁడు= సురరాజు; ఎలమిన్= సంతోషంలో; కూరంగన్= కూరుకొనిపోగా; తగన్= ఒప్పిదముగా; ఇచ్చెన్= అర్పించాడు.

తాత్పర్యం: అని ధర్మానుగుణంగా చెప్పి తనమాట నేర్పుకు లోకం మెచ్చుకొనగా, కద్రువకు కీర్తి గొప్పతనం పోగా, చక్కగా తనతల్లిని ఇంటికి పంపి అమృతాన్ని తిరిగి ఇంద్రుడి కర్పించాడు.

విశేషం: గరుత్మంతుడు ధర్మం పాటించటమంటే పాపాత్మురాలికి అమృతం ఇవ్వకపోవటమే. ఆమెను మాటతోనే జయించాడు. అందుకని లోకం మెచ్చుకొన్నది.

వ. 'ఇవ్విధంబున నౌచిత్యంబు సంస్తుత్యంబుగా నమృతం బమృతాశన పతికి నొసంగి యెసకం బెసంగు తేజంబున విరాజితుం డయి యావృత్రవైరిని సూరెల నున్న సురలను మునులను గలయం గనుంగొని. 265

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; ఔచిత్యంబు= ఉచితత్వం; సంస్తుత్యంబుగాన్= స్తుతికి యోగ్యం కాగా; అమృతంబున్= సుధను; అమృత+ఆశన= అమృతం ఆహారంగా కలవారు దేవతలు; వారియొక్క పతికిన్= రాజుకు; ఒసంగి= ఇచ్చి; ఎసకంబు= ఆధిక్యం; ఎసంగు= ఎక్కువగు; తేజంబునన్= తేజస్సుతో; విరాజితుండు+అయి= ప్రకాశించి; ఆ వృత్రవైరిని= ఆ వృత్రాసురుడి శత్రువైన దేవేంద్రుణ్ణి; సూరెలన్= ప్రక్కల; ఉన్న= ఉన్నట్టి; సురలను= దేవతలను; మునులను= ఋషులను; కలయన్+కనుంగొని= తేరిపారజూచి

తాత్పర్యం: ఈ విధంగా ఆమెకు తగినట్లు బుద్ధి చెప్పి అమృతాన్ని ఇంద్రుడి కర్పించి అందరిచేత మన్ననలంది ఆ ఇంద్రుడిని అతడితోపాటు ఇరుప్రక్కల కొలువు దీరిన దేవతలను మునులను చూచి.

చ. 'కొడుకులఁ బంచి తెల్పెసఁగు గుఱ్ఱము వాలమునందు నల్ల గ
ల్గెడు క్రియఁ దీర్చి, పన్నిదము గెల్చిన కద్రువ నేను మాటమై
నొడిచితిఁ దల్లి దాసి యగు టోర్వక, తండ్రి యనుజ్ఞ, మీ కెదు
ర్పడిన దురుద్ధతిన్ మఱచి బాంధవసత్కృతి నాదరింపుఁడీ!' 266

ప్రతిపదార్థం: కొడుకులన్= కుమారులను; పంచి= ఆజ్ఞాపించి; తెల్పు+ఎసఁగు= తెల్లనైన; గుఱ్ఱము వాలమునందున్= గుర్రం తోకలో; నల్ల= నలుపు; కల్గెడు క్రియన్= కలిగేటట్లు; తీర్చి= చేసి; పన్నిదము= పందెం; గెల్చిన= జయించిన;

కద్రువన్= పెదతల్లిని; ఏను= నేను; మాటమైన్= మాటతోనే; ఒడిచితిన్= గెల్చాను; తల్లి= మా తల్లి వినత; దాసి అగుటకున్= దాసి కావటానికి; ఓర్వక= సహించలేక; తండ్రి= కశ్యపుడి; అనుజ్ఞన్= ఆనతితోన; మీకున్= ఇంద్రుడికి; ఎదుర్పడిన= ఎదురించిన; దురుద్ధతిన్= చెడుగర్వాన్ని; మఱచి= విస్మరించి; బాంధవ, సత్కృతిన్= బంధుప్రేమతో; ఆదరింపుఁడీ!= నన్ను ఆదరించండి

తాత్పర్యం: 'కద్రువ తన కొడుకులను ఆజ్ఞాపించి పంపి తెల్లని గుర్రం తోకను నలుపుగా చేసి, పందెంగెల్చి నా తల్లిని దాసిగా చేసికొన్నది. కనుక నేనూ నా తండ్రి ఆనతితో మా పెదతల్లిని మాటతోనే ఓడించాను. ఈ విషయంలో మిమ్మల్ని ఎదురించవలసి వచ్చింది. దానిని మరచిపోయి నన్ను బంధుప్రీతితో చూడండి'.

విశేషం: ఇవి గరుత్మంతుడికి పెద్దలయందున్న భక్తిశ్రద్ధలు. ఎక్కడా పొల్లుమాట అనడు. తూచినట్లు మాట్లాడటం, తగినట్లుగా చేయటం. ఎంతవరకుండాలో అంతవరకే ఉండటం అతడిస్వభావం. దుర్మార్గుడికి బుద్ధి చెప్పకపోతే సన్మార్గు డెట్లా ఔతాడు?

వ. అని వెండియు. 267

తాత్పర్యం: అని ఇంకా.

క. 'వినుఁ! డట్టులు పాపము సే । సిన కద్రువ సుతులఁ బొదివి చెండుదు, మత్తుం
డనితాంతోగ్ర విహారం । బునఁ దండ్రియు మీరు ధర్మమును సాక్షులుగన్'. 268

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి (కోపంతో నొక్కి చెప్పటం); అట్టులు= ఆ విధంగా (గుర్రం తెల్లని తోకను నల్లగా చేసిన); చేసిన= చేసినటువంటి; కద్రువ సుతులన్= కద్రువ కొడుకులను; పాములను; పొదివి= కాళ్ళతో తొక్కిపట్టి; తండ్రియున్= నా తండ్రి కశ్యపులు; మీరు= ఇంద్రాదులు; ధర్మమును= (లోకం సాఫీగా నడవటానికాధారమైన) న్యాయం; సాక్షులుగన్= చూస్తూండగా (స+అక్షి= కన్ను కలవాడు, చూచేవాడు) మత్= నా యొక్క; తుండ= ముక్కుయొక్క; నితాంత= అంతులేని; ఉగ్ర= భయంకరమైన; విహారంబునన్= క్రీడతో; చెండుదున్= చీల్చిచెండాడుతా.

తాత్పర్యం: ఆ విధంగా మా అమ్మను బానిసగా చేసిన పాపాన బోయిన ఆ కద్రువ సంతానాన్ని మా తండ్రి, మీరూ, ధర్మం సాక్షులుగా. నా ముక్కుతో పొడిచి ఉగ్రంగా చీల్చి చెండాడుతాను.

విశేషం: చాలా కోపంతో ఊగిపోతూ అన్నమాటలు ఇవి. సామాన్యంగా తిక్కన గారి కందపద్యం చాలా అందమైనదన్న ప్రశస్తి ఉన్నది. దాని కీ పద్యాలవంటివి సాక్ష్యంగా తీసికొనాలి.

వ. అని పలికిన నతని నందఱు నభినందించి; రమ్మునులును సురలునుం బురందరుని తోడ 'నితనికి నొక్కవరం బొసంగ వలదే!' యనిన, నతండు దలంచికొని దరహసితంబుతో వారల నాలోకించి 'మనవరంబునకు నాసపడియెడు కొలంది వాఁడు గాఁ; డతండు సాక్షాద్విష్ణుండు కృష్ణుండనఁశూరుఁ డను యాదవ ధాత్రీశునకుఁ బౌత్రుండై లోకహితార్థంబుగాఁ జరియింపం గలవాఁడీమూర్తియు విడువండు; వివిధ వర్తనంబుల వినోదించుచుండు' ననియెఁ; దదనంతరంబ సముచితప్రకారంబున నాజంభారిని వారలను దా నామంత్రితులం జేసి. 269

ప్రతిపదార్థం: అని పలికినన్= అని చెప్పిన; అతనిన్= గరుత్మంతుడిని; అందఱున్= ఇంద్రాదులు; అభినందించిరి= పొగడారు; పురందరునితోడన్= దేవేంద్రుడితో; ఆ+మునులును= ఆ మునులు; సురలునున్= దేవతలు; ఇతనికిన్= ఈ గరుత్మంతుడికి; ఒక్క వరంబున్= ఒక వరాన్ని; ఒసంగన్‌వలదే!= ఇవ్వవద్దా!; అనినన్= అనగా; అతండు= దేవేంద్రుడు; తలంచికొని= ఆలోచించుకొని; దరహసితంబుతోన్= చిరునవ్వుతో; వారలన్= మునులను, సురలను; ఆలోకించి= చూచి; అతండు= ఆయన; మన వరంబునకున్= మన వరానికి; ఆసపడియెడు కొలందివాఁడు కాఁడు= ఆశపడేటంత తక్కువవాడు కాడు; సాక్షాద్విష్ణుండు= సాక్షాత్తుగా విష్ణువు; కృష్ణుండు+అనన్= కృష్ణుడనే పేరున; శూరుఁడు అను= శూరుడనే పేరుగల; యాదవ ధాత్రీశ్వరునకున్= యాదవ రాజునకు; పౌత్రుండు+ఐ= మనుమడై; లోకహిత+అర్థంబుగాన్= లోకక్షేమంకొరకు; చరియింపన్+కలవాఁడు= విహరించగలడు; ఈ మూర్తియున్= ఈ రూపం కూడా; విడువండు= వదలిపెట్టడు; వివిధ= అనేక; వర్తనంబులన్= ప్రవర్తనలతో; చరియించుచుండున్= విహరిస్తాడు; అనియెన్= అన్నాడు; తత్+అనంతరంబ= ఆ తర్వాత; సముచిత= తగిన; ప్రకారంబునన్= విధంగా; ఆ జంభ+అరిని= ఆ ఇంద్రుడిని (జంభుడన్న రాక్షసుడిని చంపినవాడిని); వారలను= ఆ మునులను, దేవతలను; తాను= గరుత్మంతుడు; ఆమంత్రితులన్= పంపించటం; చేసి= ఆచరించి.

తాత్పర్యం: అని అనగా ఆ గరుత్మంతుడిని అందరూ ప్రశంసించారు. ఆ మునులూ, దేవతలూ ఇంద్రుడితో ఇట్లా అన్నారు. 'ఈయన కేదేనా వరమివ్వరాదా?' అని. ఆయన ఆలోచించి 'ఈయన మన వరాల కాశపడేటంత తక్కువ శక్తి కలవాడు కాడు. ఈయన సాక్షాద్విష్ణువు. భవిష్యత్తులో శూరుడనే యాదవరాజునకు మనుమడై పుట్టి కృష్ణుడన్న పేరుతో లోకకల్యాణం కొరకు అవతరించనున్నాడు. ఈ ప్రస్తుతమూర్తిలో కూడా అనేక కార్యాలు నిర్వహిస్తాడు' అని చెప్పాడు. అంతట గరుత్మంతుడు వారి నందరినీ పంపించివేసి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఈ మాటలన్నీ ఇంద్రుడు గరుత్మంతుడి మాహాత్మ్యాన్ని గురించి వివరించటాని కన్నవి. గరుత్మంతుడే అక్క డున్న కృష్ణుడు. ఇందుకే భీష్ముడు కథను ప్రారంభిస్తూనే ఇట్లా అన్నాడు కృష్ణుడితో ' ఆ సుపర్ణుండు నీవ కా వినియుండుదున్' (166 వ పద్యం) అని. కథ అదే మాటలతో ముగిస్తున్నాడు కవి.

సీ. **'అజుఁ డుపలాలింప నద్దేవు కావించు । వరభోజనంబులఁ బెరిఁగె నితఁడె!**
ఘనకాయజవసత్త్వ గజకచ్ఛపముల నొ । క్కెత్తున లీలమై నెత్తె నితఁడె!
విపులభూరుహశాఖ విఱిగిన మునిహితా । ర్థంబుగాఁ జంచునఁ దాల్చె నితఁడె!
సురసేనతోఁ బురందరుని నిర్జించి యు । ద్దీప్తుఁడై యమృతంబుఁ దెచ్చె నితఁడె!

తే. **తల్లిదాస్యంబు దనబాస దప్పకుండఁ । బాపి యాసుధ మరల నప్పాకశాస**
నునకు దయ నిచ్చె నీతఁడె!' యనుచు సిద్ధ । సాధ్యు లగ్గింప, గరుడుఁడు సనియె మగిడి'. **270**

ప్రతిపదార్థం: అజుఁడు= బ్రహ్మ; ఉపలాలింపన్= ముద్దు చేస్తుండగా; ఆ+దేవు= ఆ దేవుడు; కావించు= సృష్టించే; వర= శ్రేష్ఠ; భోజనంబులన్= ఆహారాలలో; పెరిఁగెన్+ఇతఁడె= ఇతడే పెరిగి పెద్దవాడైనాడు; ఘన= పెద్ద; కాయ= శరీరం; జవ= వేగం; సత్త్వ= బలం కల; గజ= ఏనుగును; కచ్ఛపములన్= తాబేలును; ఒక్క+ఎత్తునన్= ఒకేసారి; లీలమైన్= విలాసంగా; ఎత్తెన్= పైకి ఎత్తుకొనిపోయినది; ఇతఁడె!= ఇతడేకదా! అని ఆశ్చర్యం; విపుల= విస్తారమైన; భూరుహ= చెట్టు; శాఖ= కొమ్మ; విఱిగినన్= విరిగితే; మునిహిత+అర్థంబుగాన్= మునుల క్షేమంకోరి; చంచునన్= ముక్కున; తాల్చెన్= ధరించాడు; ఇతఁడె!= ఈయనేకదా!; ఇతఁడె= ఈయనే; సురసేనతోన్= దేవతాసైన్యంతో; పురందరునిన్= ఇంద్రుడిని; నిర్జించి= జయించి;

ఉత్+దీప్తుఁడు+ఐ= మిక్కిలి (కీర్తితో, పరాక్రమంతో) ప్రకోపించినవాడై; అమృతంబున్= సుధను; తెచ్చెన్= తెచ్చాడు; తల్లిదాస్యంబు= తల్లియైన వినత బానిసతనం; తన బాస= తన ప్రతిజ్ఞ; తప్పకుండన్= తప్పిపోకుండా; పాపి= పోగొట్టి; మరలన్= తిరిగి; ఆ సుధన్= ఆ అమృతం; ఆ పాకశాసనునకున్= ఆ ఇంద్రుడికే (పాకుడనే రాక్షసుడిని చంపినవాడు); దయన్= దయతో; ఈతఁడె= ఈయనే; ఇచ్చెన్= ఇచ్చాడు; అని=అంటూ; సిద్ధసాధ్యులు= సిద్ధులు, సాధ్యులు (దేవతలలో తెగలు); అగ్గింపన్= స్తుతించగా; మగిడి= తిరిగి; గరుడుఁడు చనియెన్= గరుత్మంతుడు వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవు డంతటి వాడు ముద్దుగా ప్రత్యేకాహార మేర్పాటుచేసి పెంచితే పెరిగినవా డీయనే కదా! అంత పెద్ద శరీర, బల వేగాలున్న గజకచ్ఛపాలను ఒకేసారి అవలీలగా పైకెత్తుకొని పోయిన బలశాలి ఈయనేకదా! అంతపెద్ద కొమ్మ విరిగితే దానిపై నున్న వాలఖిల్యులనే మునుల క్షేమంకొరకు ముక్కున ధరించినవా డీయనే కదా! దేవతా సైన్యంతో దండెత్తివచ్చిన ఇంద్రుడిని జయించి అమృతం తెచ్చిన వా డీయనే. తన మాట తప్పకుండా తల్లి దాస్యాన్ని పోగొట్టి తిరిగి తానుతెచ్చిన అమృతాన్ని ఇంద్రుడి కర్పించిన మహానుభావు డీయనే కదా!'

విశేషం: ముగింపుగా ఈ పద్యం వ్రాయటం తిక్కనగారి కథ చెప్పే నేర్పును ప్రకాశింపచేస్తుంది. ఈ పద్యంలో 5 పాదాల మీదుగా మొదటినుండి చివరిదాకా కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పటం లోకోత్తరమైన శిల్పం. తిక్కనగారు ఇలాంటి పద్యాలు ముగింపుగా వ్రాయటం చాలా చోట్ల కన్పిస్తుంది. గరుత్మంతుడు పెరగటం దగ్గరనుంచి మొదలుపెట్టి కథాంతం వరకూ చెప్పినవైనం భావించదగింది. ప్రతివాక్యం 'ఇతడె' అన్న సర్వనామంతో అంతం కావటంతో పద్యంలో మంచి శైలి ఏర్పడింది.

వ. అని చెప్పి భీష్ముండు. 271

తాత్పర్యం: ఈ విధంగా వర్ణించి భీష్ముడు.

క. 'మానవలోక కలిత బహు । ళానందకరంబు, నిష్కలావ్యయసుఖ సో
పానము నగు సౌపర్ణా । ఖ్యానము విని పుణ్యతముఁడ వైతి నరేంద్రా!' 272

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ప్రజలకు నాయకుడా! ధర్మరాజా!; మానవలోక= మనుష్య స్వభావంతో; కలిత= కూడుకొన్నది; బహుళ= విస్తారమైన; ఆనంద కరంబు= ఆనందాన్ని కలిగించేది; నిష్కల= నిర్గుణమైన; అవ్యయ= తరగని; సుఖ= ముక్తికి; సోపానము= మెట్టు; అగు= అయిన; సౌపర్ణ= గరుత్మంతుడియొక్క (సు+పర్ణ= బలిష్ఠమైన రెక్కలు కలవాడు); ఆఖ్యానము= కథ (ఆఖ్యానమంటే ప్రసిద్ధమైనదీ జరిగినదీ అయిన కథ); విని; పుణ్యతముఁడవు= పుణ్యాశాలివి; ఐతి (వి) = అయినావు.

తాత్పర్యం: ధర్మజా! నీవు గొప్ప పుణ్యాశాలివైనావు. ఎందుకంటే ఈ గరుత్మంతుడి కథ ముక్తికి సోపానం. వ్యయంకాని నిర్గుణమైన సుఖం ముక్తి కదా! ఈ కథలో మానవస్వభావ మున్నందున గొప్ప ఆనందాన్ని కలిగిస్తుంది.

విశేషం: కథలో లక్షణాన్ని చెప్పుతున్న పద్య మిది. సవతుల మధ్య తగాదాలు, వాటినుండి మనిషి బయట పడటానికి పడే తంటాలు, ఇవన్నీ కథలో ఉండటమే మానవ లోక ముండటం. ఆ దృష్టితో ఈ కథ చదువుకొమ్మని కవి మనకు సూచించటం.

వ. అనినం బాండవాగ్రజుండు సంతసించి, 'విప్రున కెద్దియేనియు నిచ్చువాఁడుగా నొడంబడి యీనివాఁ డేమి గతిం బోవం గలవాఁ? డని యడుగుటయు, నతం డతనితో నొక నిదర్శనంబున, నది యెఱింగించెద విను' మని యిట్లనియె. 273

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో జ్యేష్ఠుడు; సంతసించి=సంతోషించి; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఎద్ది ఏనియున్= ఏమైనా; ఇచ్చువాఁడుగాన్= ఇస్తానన్నవాడై; ఒడంబడి= ఒప్పుకొని; ఈనివాఁడు= ఇవ్వనివాడు; ఏమిగతిన్= ఏ గతిని; పోవన్+కలవాఁడు?= పోతాడు? అని అడుగుటయున్= అని అడుగగా; అతండు= భీష్ముడు; అతనితోన్= ధర్మరాజుతో; ఒక నిదర్శనంబునన్= ఒక ఉదాహరణతో; అది ఎఱింగించెదన్= అది తెలుపుతాను; వినుము+ అని+ఇట్లు+అనియెన్= వినుమని ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: గరుత్మంతుడి కథ విన్న తరువాత ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు 'బ్రాహ్మణున కేదైనా ఇస్తానని ఇవ్వనివా డేగతి పొందుతాడో చెప్పు'మని అడుగగా; 'ఒక ఉదాహరణంతో నీ కది స్పష్టం చేస్తాను విను' మని భీష్ము డన్నాడు.

సీ. ఒక్క సృగాలంబు, నొక వానరంబును । బ్రీతిమైఁ గూడి వర్తించుచుండుఁ,
దొలుపుట్టువున మానవులును నెచ్చెలులు నై । యుండుట గూర్చు నొండొంటి; కొక్క
యెడ, నొకనాఁ డవ్వఱడుతోడ నాక్రోఁతి । 'గటకటా! నీ కిట్లు గడును హేయ
మైన పీనుఁగునంజు డాహార మైనట్టి ' భవము వాటిల్లు టేపాపముననొ?'

తే. యనిన జాతిస్మరణవంత మగుటఁ జేసి । యది విషాదముఁ బొంది 'ధరామరునకు
నీ నొడంబడ్డ ధన మీన కాన యిట్టు । నీచతరజాతియందు జన్మింపవలసె. 274

ప్రతిపదార్థం: ఒక్క= ఒక; సృగాలంబున్= నక్క; ఒక వానరంబును= ఒక కోతియును; ప్రీతిమైన్= స్నేహంతో; కూడి= కలిసి; వర్తించుచుండున్= జీవిస్తూ ఉండేవి; తొలుపుట్టువునన్= పూర్వజన్మంలో; మానవులును= మనుషులూ; నెచ్చెలులును+ఐ= స్నేహితులు కూడా ఐ; ఉండుటన్= ఉండటంవలన; ఒండు+ఒంటికిన్= పరస్పరం, ఒకదానితో ఒకటికి; కూర్చున్= స్నేహమున్నది; ఒక్కఎడన్= ఒక సమయంలో; ఒకనాఁడు= ఒకరోజున; ఆ క్రోఁతి= ఆ కోతి; ఆ+వఱడుతోడన్= ఆ నక్కతో; కటకటా!= అయ్యో; నీకున్+ఇట్లు= నీకీ విధంగా; కడునున్= మిక్కిలి; హేయము+ఐన= నికృష్టమైన; పీనుఁగు= శవపు; నంజుడు= మాంసం; ఆహారము= తిండి; ఐనట్టి= ఐనటువంటి; భవము= జన్మ; పాటిల్లుట= కలగటం; ఏ పాపముననొ?= ఏ పాపం వల్లనొ?; అనినన్= అనగా; అది = ఆ నక్క; జాతిస్మరణవంతము= పూర్వజన్మకు సంబంధించిన స్మృతి కలది; అగుటన్ చేసి= అవటం వలన; విషాదమున్= దుఃఖాన్ని; పొంది; ధరా+అమరునకున్= భూదేవతకు - బ్రాహ్మణుడికి; ఈన్= ఇవ్వటానికి; ఒడంబడ్డ= ఒప్పుకొన్న; ధనమున్= డబ్బును; ఈన= ఇవ్వలేదు; కాన= కాబట్టి; ఇట్లు= ఈ విధంగా; నీచతర తెగయందున్= మిక్కిలి నీచమైన తెగలో; జన్మింపన్‌వలసెన్= పుట్టవలసి వచ్చింది.

తాత్పర్యం: ఒక నక్క, ఒక కోతి స్నేహంగా ఉండేవి. ఎందుకంటే పూర్వజన్మలో అవి, మనుషులూ స్నేహితులూ కావటంవలన. ఇట్లా ఉండగా ఒకరోజు కోతి నక్కతో ఇట్లా అన్నది 'ఏ పూర్వ జన్మ పాపం వలన నీ వీ జన్మలో పీనుగు మాంసం తిండిగా బ్రతకవలసి వచ్చిందో కదా!' అని. ఆ మాట విన్న నక్క పూర్వజన్మ జ్ఞానులజాతిలో పుట్టినది కావటం వలన దుఃఖం పొంది 'నేను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడి కిస్తానన్న ధన మివ్వనందువలన నాకీ నీచజన్మ వచ్చింది' అని చెప్పింది.

వ. అని తెలిపె; నట్లగుటంజేసి 'యాస గొల్పి, విప్రున కియ్యకున్కి యొప్ప' దని చెప్పిన, నప్పాండవాగ్రజుం 'డహీనగుణ వర్ణనీయుం డయిన హీనవర్ణునకు మంత్రతంత్రాదు లుపదేశించుట ధర్మవిరుద్ధం బయి యుండు నొకో?'

యని యడిగిన నయ్యనిమిష నదీనందనుం 'డీప్రశ్నంబున కుత్తరం బగునది యొక యితిహాసము గల;
దాకర్ణింపు' మని యిట్లనియె. 275

ప్రతిపదార్థం: అని తెలిపెన్= అని చెప్పింది; అట్లు+అగుటన్+చేసి= అట్లా కావటం వల్ల; ఆస+కొల్పి= ఆశపెట్టి; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఇయ్యక+ఉన్కి= ఇవ్వకపోవటం; ఒప్పదు= మంచిదికాదు; అని చెప్పినన్= అని చెప్పగా; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; అహీన= గొప్ప; గుణ= గుణాలతో; వర్ణనీయుండు= పొగడదగిన; హీన= నీచమైన; వర్ణునకున్= వర్ణంలో పుట్టినవాడికి; మంత్ర తంత్ర= మంత్రం, పూజ చేసే విధానాలు; ఆదులు= మొదలైనవి; ఉపదేశించుట= బోధించటం; ధర్మవిరుద్ధంబు= ధర్మానికి వ్యతిరేకం; అయి ఉండునొకో!= ఔతుందా? అని అడిగినన్= అని అడిగితే; ఆ+అనిమిష= ఆ దేవతల; నదీ= గంగయొక్క; నందనుండు= కొడుకు (భీష్ముడు); ఈ ప్రశ్నంబునకున్= ఈ ప్రశ్నకు; ఉత్తరంబు= సమాధానం; అగునది= అయినది; ఒక+ఇతిహాసము = ఒక ఇతిహాసం; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు; అనియెన్= చెప్పాడు

తాత్పర్యం: 'అందువలన ఆశ పెట్టి బ్రాహ్మణుడి కివ్వకపోవటం మంచిది కాదు' అని చెప్పగా విని ధర్మరాజు 'గొప్ప గుణా లున్న హీనవర్ణుడికి మంత్రతంత్రాదులు బోధించటం ధర్మమా? కాదా?' అని అడిగాడు. దానికి భీష్ము డిట్లా అన్నాడు. 'నీ ప్రశ్నకు సమాధానంగా ఒక కథ ఉదాహరణంగా చెప్పుతాను వినుము' - అని ఇట్లా చెప్పాడు.

బ్రాహ్మణుఁడు హీనవర్ణునకు వైదికమంత్రంబు లుపదేశింపఁ గూడదనుట (సం.13-10-1)

సీ. హిమగిరిమీఁద ననేకద్విజులు దప । మాచరింపంగ నయ్యాశ్రమమున
కొక్కశూద్రుండు ధర్మోపేతుఁ డేతెంచి । యమ్మునులకు గురుఁ డగు మునీంద్రుఁ
గని, 'కృప నుపదేశ మొనరింపవే తపో । వృత్తికై నా' కని వేఁడుటయును,
'జనదు వైదికము శూద్రున కుపదేశింప; । నీవు శుశ్రూషమై నిలువు' మనియె,

తే. ననుడు, వాఁడు శుశ్రూషకుఁడై వసించె । గుడిసె యొకదెసఁ గావించుకొని ముదమున
నతిథి సురపితృపూజ లత్యధిక భక్తి । తోడఁ జేయుచు నొక్కింత కీడు లేక. 276

ప్రతిపదార్థం: హిమగిరి= మంచుకొండ; మీఁదన్= పైన; అనేకద్విజులు= పలువురు బ్రాహ్మణులు; తపము+ఆచరింపంగన్= తపస్సు చేస్తుండగా; ఆ+ఆశ్రమమునకున్= ఆ ఆశ్రమానికి; ఒక్క= ఒక; ధర్మ+ఉపేతుఁడు= ధర్మాత్ముడు; శూద్రుండు= నాల్గవ కులంవాడు; ఏతెంచి= వచ్చి; ఆ+మునులకున్= ఆ ఋషులకు; గురుఁడు= గురువైన; ముని+ఇంద్రున్= మునిశ్రేష్ఠుడిని; కని= దర్శించి; కృపన్= దయతో; తపోవృత్తికై= తపస్సు చేయటానికి; ఉపదేశము= బోధ; ఒనరింపవే?= చేయవా? నాకున్+అని= నాకోసమని; వేఁడుటయునున్= ప్రార్థించగా; శూద్రునకున్= శూద్రుడైన వాడికి; వైదికము= వేద సంబంధమైన తపస్సు; ఉపదేశింపన్= బోధించటానికి; చనదు= కూడదు; నీవు; శుశ్రూషమైన్= సేవతో; నిలువుము+అనియెన్= ఉండుము అన్నాడు; అనుడున్= అనగా; వాఁడు= ఆ శూద్రుడు; శుశ్రూషకుఁడు+ఐ= సేవకుడై; ముదమునన్= సంతోషంతో; ఒక దెసన్= ఒక ప్రక్క; గుడిసెన్= పర్ణశాలను; కావించుకొని= నిర్మించుకొని; ఒక్కింత= కొంచెంకూడా; కీడు= లోపం; లేక= లేకుండా; అతిథి= అతిథులకు (తిథి లేకుండా వచ్చేవాడు); సుర= దేవతలకు; పితృ= పితృదేవతలకు; పూజలు= అర్చనలు; అతి= మిక్కిలి; భక్తితోడన్= భక్తితో; చేయుచున్= చేస్తూ; వసించెన్= నివసించాడు.

తాత్పర్యం: హిమాలయంమీద అనేకమంది బ్రాహ్మణులు తపస్సు చేసికొంటూ ఉండగా, ఆ ఆశ్రమానికి ఒక శూద్రుడు వచ్చి, గురువుగారిని ప్రార్థించాడు. 'నాకూ తపస్సును బోధించండి' అని. దాని కాయన 'శూద్రుడికి వైదికం బోధించకూడదు. నీవు మాకు సేవ చేసికొంటూ ఉండుము' అని చెప్పాడు. వాడు కూడా ఒక పర్ణశాల కట్టుకొని ఒక ప్రక్క ఉంటూ అతిథులకు, దేవతలకు, పితృదేవతలకు పూజలు చేసికొంటూ ఉండేవాడు.

క. నియతియు, వినయముఁ జూచిన । దయ పుట్టెడునట్లు గాఁగ, ధర్మనిరూఢ
క్రియ లొనరింపఁగ, మునిపతి । ప్రియమునఁ గనుఁగొనుటకై యరిగె నచ్చటికిన్. 277

ప్రతిపదార్థం: నియతియున్= నియమమూ; వినయమున్= అణకువయును; చూచినన్= చూస్తే; దయ= కరుణ; పుట్టెడునట్లు= పుట్టేటట్లు; కాఁగన్= కాగా; ధర్మనిరూఢ= ధర్మబద్ధమైన; క్రియలు= పనులు; (క్రియ=యాగం - అతిథిసుర పితృపూజలే యజ్ఞాలు); ఒనరింపఁగన్= చేస్తూ ఉండగా; ప్రియమునన్= ప్రేమతో; మునిపతి= మునిరాజు; కనుఁగొనుటకై= చూడటానికి; అచ్చటికిన్= అతడి ఆశ్రమానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: నియమంతో, వినయంతో జాలి కలిగేటట్లుగా ధర్మబద్ధుడై అతడు క్రియలు చేస్తుంటే దయతో చూడటానికని మునుల గురువు అతడి గుడిసెకు వెళ్ళాడు.

ఆ. అరిగి యతనిచేయు నయ్యనుష్ఠానంబు । లోనఁ గానివాని మానఁ జెప్పి,
'యనఘ! యిట్లు సేయు' మని యుపదేశింపఁ । గరుణపేర్మిఁ బుణ్యకర్మగతులు. 278

ప్రతిపదార్థం: అరిగి= పోయి; అతనిచేయు= అతడు చేసే; ఆ+అనుష్ఠానంబులోనన్= ఆ వైదిక కర్మాచరణంలో; కానివానిన్= పనికిరానివాటిని; మానన్= మానుకొనేటట్లు; చెప్పి; అనఘ!= పుణ్యాత్ముడా!; ఇట్లు= ఈ విధంగా; చేయుము+అని= చేసికొమ్మని; పుణ్య= పవిత్ర; కర్మ= వేదవిధుల; గతులు= పద్ధతులు; కరుణ పేర్మిన్=అధికమైన దయతో; ఉపదేశింపన్= బోధించగా.(తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: వెళ్ళి అతడు చేసే వేద కర్మానుష్ఠానం చూచి అందులో ఉన్న లోపాలు చెప్పి 'పుణ్యాత్ముడా! పుణ్యకర్మ ఇట్లా చేయాలి' అని దయతో బోధించాడు.

విశేషం: అనఘ! అన్న సంబోధన మునికి కలిగిన దయను చెప్పుతున్నది. దానికి కారణం అతడు చేసే పనుల మీద ఉన్న శ్రద్ధా భావం.

క. ఆతఁడు దానికి నతిసం । ప్రీతాత్ముం డగుచు నడపి పిదపం గాలం
బై తెగి, యొకనృపునకు సం । జాతుం డయ్యెను సమస్త సద్గుణములతోన్. 279

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ శూద్రుడు; దానికిన్= ముని చెప్పిన దానికి; అతి= మిక్కిలి; సంప్రీత= సంతోషించిన; ఆత్ముండు+అగుచున్= ఆత్మకలవాడగుతూ; నడపి= చేసి; పిదపన్= తర్వాత; కాలంబు+ఐ= కాలం సమీపించి; తెగి= మరణించి; ఒకనృపునకున్= ఒకరాజుకు; సమస్త= అన్నీ; సత్= మంచి; గుణములతోన్= గుణాలతో; సంజాతుండు+అయ్యెను= పుట్టాడు.

తాత్పర్యం: అతడు దానికి సంతోషించి అదే విధంగా ఆయా కర్మలు చేసి చివరకు కాలం సమీపించగా మరణించి, ఒకరాజునకు అన్ని సద్గుణాలు కల కొడుకై జన్మించాడు.

క. మునిపతియుం దతితోడన, । తనువు విడిచి యరిగి, యతని తండ్రి యగుడు, వి
ప్రునకుం బుట్టెన్, వేదా । ద్యనుపమ విద్యలకు నెల్ల నావాసం బై. 280

ప్రతిపదార్థం: మునిపతియున్= మునిశ్రేష్ఠుడు కూడా; తతితోడన= కాలంతోపాటు; తనువు= శరీరం; విడిచి= వదలి; అరిగి= పోయి; అతని తండ్రి= అతడికి తండ్రి; అగుడున్= కాగా; విప్రునకున్= బ్రాహ్మణుడికి; వేద+ఆది= వేదం మొదలైన; విద్యలకున్= చదువులకు; ఎల్లన్= అన్నిటికీ; ఆవాసంబు+ఐ= నిలయమై; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: మునినాథుడు కూడా కాలాంతరంలో శరీరాన్ని విడిచి, ఆ రాజకుమారుని దగ్గర, ఒక బ్రాహ్మణుడికి కుమారుడై సకల వేదవిద్యలకు నిలయంగా జన్మించాడు.

చ. పదపడి యక్కుమారకుఁడు పట్టముగట్టి, పురోహితత్వమున్
విదిత విభూతితో నొసఁగె విప్రుని పుత్త్రున; కవ్విభుండు న
వ్వొదవెడు మోముతో నతనినోరలు వాఱఁగ జూచు; నాతఁ డె
య్యది గత మొక్కొ నవ్వునకు నంచు మదిం దలపోయు భూవరా! 281

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; పదపడి= తర్వాత; ఆ+కుమారకుఁడు= ఆ రాజకుమారుడు; పట్టముకట్టి= రాజ్యానికి పట్టాభిషిక్తుడై; విప్రునిపుత్త్రునకున్= బ్రాహ్మణపుత్రుడికి; పురోహితత్వమున్= రాజపురోహితవృత్తిని; విదిత= లోకానికంతా తెలిసిన; విభూతితోన్= ఐశ్వర్యంతో; ఒసఁగెన్= ఇచ్చాడు; ఆ+విభుండు= ఆ రాజు; నవ్వు+ఒదవెడు= నవ్వు కలిగిన; మోముతోన్= ముఖంతో; అతనిన్= పురోహితుడిని; ఓరలువాఱగన్= కన్ను ఓరగా పెట్టి; చూచున్= చూచేవాడు; ఆతఁడు= ఆ పురోహితుడు; నవ్వునకున్= ఆ నవ్వుకు; ఏ+అది= ఏది; కతము= కారణం; ఒక్కొ= ఒకో; అంచున్= అంటూ; మదిన్= మనస్సులో; తలపోయున్= ఆలోచించేవాడు.

తాత్పర్యం: ధర్మరాజా! తర్వాత ఆ రాజకుమారుడు రాజై బ్రాహ్మణ కుమారుడిని పురోహితుడిగా చేసి కావలసిన సంపద నిచ్చాడు. ఆ రా జెప్పుడూ ఆ పురోహితుడిని ఓరకంట చూచి నవ్వేవాడు. అతడి కర్థం కాక ఆ నవ్వుకు కారణం ఏమిటా అని ఆలోచించేవాడు.

వ. ఒక్కనాఁడవసరంబు గాంచి, యప్పురోహితుం డా భూవరునితో 'దేవా! నన్నుం గనినప్పుడు నవ్వుదు; నావలన నేమి కీడు గలద యెఱింగింపవే! యిదియ నాకు వరం' బని వేఁడిన, నజ్జనపతి దనకు జాతి స్మరత్వంబు గలుగుటం జేసి, పూర్వజన్మంబు దెలిపి యక్కాలంబునం దన యనుష్ఠానంబున నేమేని విహితంబు లుపదేశించుట దేటవడం బలికి, శూద్రవిషయోపదేశంబునం బరమగతి దప్పి యిప్పాట రాజసేవాత్మకంబైన పౌరోహిత్యంబు నడపుటకై నీకుం బుట్టవలసె; నేను బుట్టువెఱింగి పుట్టినవాఁడ నగుటం జేసి యెఱింగి నవ్వుదు; నవ్వునకుఁ గతంబింతియ కాని, నీ వొండుకల్మషంబు గల వాఁడవే? మహాధర్మపరుండవు గురుండ;

వాదుష్కర్మంబునకుం బ్రాయశ్చిత్తంబు సేసికొ' మ్మని యనేక గోవులం గనకరాశులను నొసంగిన, నా భూసురోత్తముండు పురాతన జననకృతం బగు సుకృతంబునం జిత్తంబు నిర్మలంబై యుండుకతంబున నారాజు సెప్పినంత వట్టునుం గలవోలెఁ దనకుఁ దోఁచినం దోషితుండై దానంబులం దీర్థస్నానంబుల మఱియు జపహోమాదిపుణ్య విధానంబులం బాపంబులు వాపికొని, యీ పుట్టువును నీఁగికొని, సంయమి సంతానజాతుండై యెప్పటి యాశ్రమంబునం దపం బాచరించి మహాపదంబు నొందెఁ గావున బ్రాహ్మణ క్షత్రియవైశ్యులకుం దక్కఁ దక్కటివారికి నుపదేశించి బ్రాహ్మణుండు కల్మషభాజనంబగు బ్రాహ్మణాదులకుం బరీక్షాపూర్వకంబుగా నుపదేశింప వలయు నని చెప్పిన నప్పుడమిఱేఁడు, 'లక్ష్మియెట్టి జనంబులయందు వసియించు?' నని యడిగిన నాదేవవ్రతుం డతని కిట్లనియె. 282

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకరోజు; అవసరంబుకాంచి= సమయం చూచి; ఆ+పురోహితుండు= ఆ పురోహితుడు; ఆ భూవరునితోన్= ఆ రాజుతో; దేవా!= ప్రభూ!; నన్నున్= నన్ను; కనినప్పుడు= చూచినప్పుడెల్లా; నవ్వుదు= నవ్వుతావు కదా!; నావలనన్= నావలన; ఏమి కీడు= ఏమి లోపం; కలదు?= ఉన్నది? అది= దానిని; ఎఱింగింపవే?= తెలుపవా?; ఇది+అ= ఇదే; నాకున్ వరంబు=నాకు వరం; అని వేఁడినన్= అని ప్రార్థించగా; ఆ+జనపతి= ఆ రాజు; తనకున్= తనకు; జాతి స్మరత్వంబు= పూర్వజన్మ నెరుగుట; కలుగుటన్+చేసి= కలగటంవలన; పూర్వ జన్మంబు= తమ పూర్వజన్మం; తెలిపి= చెప్పి; ఆ+కాలంబునన్= ఆ జన్మలో; తన = తనయొక్క; అనుష్ఠానంబునన్= కర్మాచరణంలో; ఏమి+ఏని= ఏమైనా; విహితంబులు= చేయవలసినవి; ఉపదేశించుట= బోధించటం; తేటపడన్+పలికి= స్పష్టంగా చెప్పి; శూద్ర= శూద్రుడికి; విషయ+ఉపదేశంబునన్= వేద విషయాన్ని బోధించటంవలన; పరమగతి= ముక్తి; తప్పి= తొలగి; ఈ+పాటన్= ఈ విధంగా; రాజ= రాజుయొక్క; సేవా+ ఆత్మకంబు+ఐన= సేవారూపమైన; పౌరోహిత్యంబు= పురోహితత్వం; నడపుటకై= చేయటానికి; నీకున్+పుట్టవలసెన్= నీకు జన్మనెత్తవలసి వచ్చింది; నేను; పుట్టువు= జన్మ; ఎఱింగి= తెలిసి; పుట్టినవాఁడను; అగుటన్+చేసి= కావటంవలన; ఎఱింగి= తెలిసి; నవ్వుదున్= నవ్వుతాను; నవ్వునకున్= నా నవ్వుకు; కతంబు= కారణం; ఇంతియ= ఇంతే; కాని; నీవు; ఒండు= ఒక; కల్మషంబు= పాపం; కలవాఁడవే!= కలవాడివా!; మహా=గొప్ప; ధర్మపరుండవు= ధర్మాత్ముడవు; గురుండవు= గురువవు; ఆ దుష్కర్మంబునకున్= ఆ పాపకర్మకు; ప్రాయశ్చిత్తంబు= దోషంపోయే కర్మ; చేసికొమ్ము; అని; అనేక= చాలా; గోవులన్= ఆవులను; కనక= బంగారు; రాశులను= ప్రోగులను; ఒసంగినన్= ఇస్తే, ఇవ్వగా; ఆ భూసుర+ఉత్తముండు= ఆ ఉత్తముడైన బ్రాహ్మణుడు; పురాతన= పూర్వం; జనన= జన్మలో; కృతంబు+అగు= చేసిన; సుకృతంబునన్= పుణ్యంవలన; చిత్తంబు= మనస్సు; నిర్మలంబు+ఐ= స్వచ్ఛమై; ఉండుకతంబునన్= ఉన్నందువలన; ఆ రాజు; చెప్పినంతవట్టునున్= చెప్పినంతవరకు; కలపోలెన్= స్వప్నంవలె; తనకున్= తనకు; తోఁచినన్= తోచగా; తోషితుండు+ఐ= సంతోషించినవాడై; దానంబులన్= దానాల వలన; తీర్థ= పుణ్యనదుల, స్నానంబులన్= స్నానాలవలన; మఱియున్= ఇంకా; జపహోమ= జపం, అగ్నిహోత్రం; ఆది= మొదలైన; పుణ్యవిధానంబులన్= పుణ్యకార్యాలవలన; పాపంబులు= పాపాలను; పాపికొని= పోగొట్టుకొని; ఈ పుట్టువును= ఈ జన్మను; ఈఁగికొని= పోగొట్టుకొని; సంయమి= మునుల; సంతానజాతుండు+ఐ= సంతానంగా పుట్టి; ఎప్పటి= మునుపటి; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; తపంబు= తపస్సును; ఆచరించి= చేసి; మహాపదంబున్= గొప్ప స్థానాన్ని; ఒందెన్= పొందాడు; కావునన్= కాబట్టి; బ్రాహ్మణుండు= విప్రుడు; బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియలకున్+తక్కన్= ఈ మూడు కులాలవారికి దప్ప; తక్కటివారికిన్= మిగిలిన వారికి; ఉపదేశించి= బోధించి; కల్మష= దోషానికి, పాపానికి; భాజనంబు+అగున్= స్థానమవుతాడు; బ్రాహ్మణ+ఆదులకున్= బ్రాహ్మణుడు మొదలైనవారికి; పరీక్షాపూర్వకంబుగాన్= పరీక్షించి; ఉపదేశింపవలయున్= బోధించాలి; అని చెప్పినన్= అని చెప్పగా; ఆ+పుడమిఱేఁడు= ఆ భూమికిరాజు; లక్ష్మి= లక్ష్మీదేవి; ఎట్టి= ఎట్లాంటి; జనంబుల అందున్= జనాలలో; వసియించున్?= నివసిస్తుంది?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఒకనాడు సమయం చూచి ఆ పురోహితుడు ఆ రాజుతో 'ప్రభూ! నన్ను చూచినప్పుడల్లా మీరు నవ్వుతారు. నావలన ఏదయినా దోషం ఉన్నదా? ఉంటే చెప్పండి. ఇదే నాకు వరం' అని అడిగాడు. దానికి రాజు తనకు పూర్వజన్మ స్మృతి ఉండటంచేత పూర్వజన్మ తెలిపి ఆ సమయంలో తన అనుష్ఠానంలో ఏమయినా విధులను బోధిస్తానని స్పష్టం చేసి, శూద్ర విషయోపదేశం వలన పరమగతిని తప్పి, ఈ విధంగా రాజసేవాత్మకమైన పౌరోహిత్యాన్ని నడపటానికి నీకు పుట్టవలసి వచ్చింది. నేను పూర్వజన్మస్మృతి కలవాడనవటం చేత నవ్వాను. ఇంతేకాని నీవు ఒక్క కల్మషం కూడా లేనివాడవు. ధర్మపరుడవు. గురుడవు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం చేసికొమ్ము' అని పెక్కు గోవులనూ, కనకరాసులనూ ఇవ్వగా ఆ బ్రాహ్మణోత్తముడు పూర్వజన్మ పుణ్యం వలన మనస్సు నిర్మలమై ఉండటంచేత ఆ రాజు చెప్పినదంతా కలవలె తనకు తోచగా సంతుష్టుడై దానాలవలనా తీర్థస్నానాలవలనా జపహోమానుష్ఠానాలవలనా పాపాలు పోగొట్టుకొని ఆ పుట్టుకను విడిచి మునికి పుట్టి ఎప్పటి ఆశ్రమంలో తపస్సు చేసి మహాపదం పొందాడు. కాబట్టి బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు తప్ప తక్కినవారికి ఉపదేశం చేస్తే బ్రాహ్మణుడు పాపాత్ము డవుతాడు. బ్రాహ్మణాదులను కూడా పరీక్షించి మరీ ఉపదేశించాలి' అని చెప్పగా ఆ రాజు 'లక్ష్మి ఎటువంటి జనులలో ఉంటుంది?' అని అడుగగా భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

లక్ష్మీనివాసస్థానములు (సం. 13-11-1)

క. నారాయణాంకతలమున । శ్రీ రాజిల్లంగఁ జూచి, చిత్తం బతి వి
స్మేరం బై రుక్మిణి వి । స్తారరుచిరనయన యగుచు, సంభావనతోన్. 283

ప్రతిపదార్థం: రుక్మిణి= రుక్మిణీదేవి, శ్రీకృష్ణుడి భార్య; శ్రీ= లక్ష్మీదేవి; నారాయణ= (నార+అయన) నీరునివాసంగా గల్గిన విష్ణుమూర్తి యొక్క అంకతలమునన్= ఒడిలో; రాజిల్లంగన్= ఒప్పారగా (అందంగా ఉండగా); చూచి= రుక్మిణి చూచి; చిత్తంబు= మనస్సు; అతి= మిక్కిలి; విస్మేరంబు+ఐ= ఆశ్చర్యచకితమై; విస్తార= విశాలమైన; రుచిర= అందమైన; నయన= కనులు కలది; అగుచున్= ఔతూ; సంభావనతోన్= గౌరవంతో.

తాత్పర్యం: శ్రీ నారాయణుడి ఒడిలో అందంగా కూర్చుని ఉన్న లక్ష్మిని చూచి మనస్సు ఆశ్చర్యమును పొందగా రుక్మిణీదేవి విప్పారిన అందమైన కళ్ళతో చూస్తూ లక్ష్మీదేవితో భక్తితో ఇట్లా అన్నది.

వ. 'నీ వెట్టి పురుషులయందు, నెబ్భంగి భామలపాల వసియింతు?' వనిన నా దేవి మకరధ్వజమాతకుం జెప్పిన
వాక్యంబుల యర్థంబు లుపన్యసించెద; దాన నీ యడిగినయది తేటపడు; నాకర్ణింపుము. 284

ప్రతిపదార్థం: నీవు= లక్ష్మీ! నీవు; ఎట్టి= ఎట్లాంటి; పురుషులయందున్= మగవారిలో; ఏ భంగి= ఎట్లాంటి; భామలపాలన్= స్త్రీలలో; వసియింతువు= నివసిస్తావు; అనినన్= అనగా; ఆ దేవి= ఆ లక్ష్మి; మకరధ్వజ= మన్మథుడి; (జెండాపై మొసలి గుర్తుగా గలవాడు); మాతకున్=తల్లికి, రుక్మిణికి; చెప్పిన వాక్యంబుల= చెప్పినమాటల, అర్థంబులు= భావాలు; ఉపన్యసించెదన్= వివరిస్తాను; దానన్= దానితో; నీ అడిగిన అది= నీవడిగింది; తేట+పడున్= స్పష్టపడుతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'నీవెట్లాంటి మగవారిలో, ఎట్లాంటి స్త్రీలలో ఉంటావు?' అని అడిగిన రుక్మిణికి ఆ లక్ష్మి చెప్పినమాటల తాత్పర్యం నీకు వివరిస్తాను. దానితో నీ వడిగినది స్పష్టపడగలదు వినుము.

సీ. 'నిత్యసత్యులు, శౌచనిరతులు, గురుభక్తు, । ల ప్రమత్తులు, దక్షు లమలమతులు,
సత్కర్మపరులు, విజ్ఞానముఁ దపము దా । నము బ్రహ్మచర్యంబు శమముఁ గల్గు
వారలు, ప్రీతి నా వసియించు నిక్కలు । క్రూరు, నాస్తికుఁ, గృతఘ్నునిఁ, గుబుద్ధి
వర్జింతు; నెంగిలి వర్జించి, యిలువాడి । ఘటశుద్ధి గలిగిన కాంతలందు

తే. నిల్తు ; వల్లభ ప్రతికూల, నిష్ఠురాత్మ । నన్యమందిరగామిని, నధికనిద్ర
యైన మానినిఁ దొఱఁగుదు ; నబ్జినీ త । టాక తరుషండ పుష్ప వాటముల నిలుతు'. 285

ప్రతిపదార్థం: నిత్య= ఎల్లవేళలా; సత్యులు= సత్యం చెప్పేవారు; శౌచ నిరతులు= శుచిత్వం నిత్యమూ పాటించేవారు; గురుభక్తులు= చదువు చెప్పినవారికి భక్తులైనవారూ; అప్రమత్తులు= మదించనివారు; దక్షులు= నేర్పరులు; అమల= స్వచ్ఛమైన; మతులు= మనస్సు కలవారు; సత్= మంచి; కర్మపరులు= కర్మలు చేసేవారు; విజ్ఞానమున్= విశిష్టమైన జ్ఞానం; తపము= తపస్సు; దానము= దానం (జలధారా పూర్వకంగా ఇచ్చేది); బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచర్యం; శమము= అంతరింద్రియ నిగ్రహం; కల్గువారలు- కలవారు; ప్రీతిన్= ప్రేమతో; నా వసియించు= నే నుండే; ఇక్కలు= చోట్లు; క్రూరున్= కఠినమనస్కుడిని; న+అస్తికున్= (నాస్తికున్) తన యథార్థస్వరూపం తెలియనివాడిని, వేదాలను నిందించేవాడిని; కృతఘ్నునిన్= చేసిన మేలు మరచినవాడిని; కుబుద్ధిన్= చెడుబుద్ధిగలవాడిని, దుర్మార్గుడిని; వర్జింతున్= విడిచిపెడతాను; ఎంగిలి వర్జించి= ఎంగిలిని వదలి, మరొకడు తినగా మిగిలిన దానిని వదలిపెట్టి; ఇలు+పాడి= ఇలుపాడి= గృహనీతి కలిగి; ఘటశుద్ధిన్= పాత్రల శుభ్రత; కలిగిన= ఉన్న; కాంతల+అందున్= స్త్రీలలో; నిల్తున్= ఉంటాను; వల్లభ ప్రతికూలన్= మగడికి ప్రతికూల అయిన దానిని; నిష్ఠుర+ఆత్మన్= కఠినమైన మనస్సు కలదానిని; అన్య= ఇతర; మందిర= ఇళ్ళకు; గామినిన్= పోయే దానిని; అధిక= ఎక్కువ; నిద్రఐన= నిద్రపోయే; మానినిన్= స్త్రీని; తొఱఁగుదున్= వదలిపెట్టుతాను; అబ్జినీ= తామరతీగలు; తటాక= చెరువులు; తరుషండ= చెట్ల సమూహం; పుష్ప వాటములన్= పూల తోటలలో; నిలుతున్= ఉంటాను.

తాత్పర్యం: లక్ష్మి ఉండేచోట్లు, ఉండనిచోట్లు ఈ పద్యంలో చెప్పబడ్డవి. లక్ష్మి అంటే ధనమే కాదు. శుచీ, శుభ్రత, సరళత, అందం - ఇట్లాంటివన్నీ. 'నిత్యమూ సత్యం చెప్పేవారు, శుచికలవారు, గురుభక్తులు, మత్తులు కానివారు, కార్యసాధకులు, స్వచ్ఛమైన మనస్సు కలవారు, మంచి కర్మలు చేసేవారు, విజ్ఞానం, తపస్సు, దానం, బ్రహ్మచర్యం, ఇంద్రియ నిగ్రహం కలవారు - నేను నివసించేచోట్లు. నే నుండని స్థలాలు - క్రూరులు, నాస్తికులు, కృతఘ్నులు, చెడ్డబుద్ధి కలవారు (లోకంలో వీరిదగ్గర డబ్బుండటం చూస్తున్నాం. కాని లక్ష్మి అంటే డబ్బు కాదు. తృప్తి, ఆనందం, నిండుదనం, సంతోషం). ఎంగిలి కాని పాత్రశుద్ధి కలిగిన గృహనీతి కల స్త్రీల దగ్గర ఉంటాను. భర్తను ఎదిరించే స్త్రీ, కఠినమైన మనస్సుకలదీ, కొంపలవెంట తిరిగేదీ, ఎక్కువ నిద్రపోయేదీ - ఈ స్త్రీలు నాకు నచ్చరు. ఇట్లాంటివారిలో నేనుండను. తామరపూలతో నిండిన సరస్సులు, చెట్లు, పూలు కల తోటలలో ఉంటాను. (కనుక అందమున్న చోట్లు లక్ష్మికి నివాసాలు)

విశేషం: మనుషులలో పవిత్రత, ధర్మం, జ్ఞానం, సత్కర్మలుండాలి. లక్ష్మి అంటే ఇదే. కేవలం ధనం కాదు. దుర్మార్గులు, నాస్తికులు, సంఘవిద్రోహులు. వారికి డబ్బున్నా లక్ష్మి లేనివారే. స్త్రీలు గృహనీతి తప్పి చరిస్తే వారూ ద్రోహబుద్ధులే కనుక లక్ష్మి ఉండదు. ఇదంతా సాంఘికదృష్టి, వ్యక్తి ధర్మం వీటిని గురించి చెప్పినదే.

వ. అని చెప్పెఁ దత్ప్రకారంబులు బుద్ధిగతంబులు సేసికొమ్మనినం, గురుపతి 'పురుషుల పురంధ్రులసంగతి యందు సంస్పర్శ సుఖంబు నతిశయం బెవ్వరికిం గలుగు?' నని యడిగిన వియత్తటినీ తనూజుం 'డివ్విషయంబున కొక్క యితిహాసంబు గలదు; విను' మని యిట్లనియె. 286

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అట్లా చెప్పాడు; తత్= ఆయా; ప్రకారంబులు= పద్ధతులు; బుద్ధిగతంబులు= మనస్సులో నాటుకొనేటట్లు; చేసి కొమ్మనినన్= చేసికొమ్మనగా; కురుపతి= ధర్మరాజు (కౌరవవంశ శ్రేష్ఠుడు); పురుషుల= మగవారియొక్క; పురంధ్రుల= స్త్రీలయొక్క; సంగతి+అందున్= కూడిక లోపల; సం స్పర్శ= మంచి స్పర్శకు సంబంధించిన; సుఖంబు+ అతిశయంబు= ఎక్కువ సౌఖ్యము; ఎవ్వరికిన్= ఎవరికి; కలుగున్?= ఉంటుంది?; అని అడిగినన్= అని ధర్మరాజు అడుగగా; వియత్= ఆకాశ; తటినీ= నది; తనూజుండు= కొడుకు (భీష్ముడు); ఈ విషయంబునకున్= ఈ సంగతికి; ఒక్క= ఒక; ఇతిహాసంబు= పూర్వగాథ; కలదు= ఉన్నది; వినుము; అని; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: లక్ష్మీనివాస స్థానాలు చెప్పి ఆయా విషయాలు మనస్సులో నిలుపుకోవయ్యా!' అని చెప్పగా, ధర్మరాజు మరల ప్రశ్నించాడు. 'స్త్రీపురుషుల రతిలో ఎవరి కెక్కువ సుఖ ముంటుంది?' అని. దానికి గంగకొడుకు ఇట్లా అన్నాడు. 'ఒక కథ ఉన్నది చెప్పుతాను. దానివలన నీకు విషయం తెలుస్తుంది. వినుము అని కథ చెపుతున్నాడు.

భంగాస్వనుం డను రాజు స్త్రీయై కుమారులం గాంచిన ప్రకారము (సం.13-12-1)

సీ. 'అనఘ! భంగాస్వనుం డనురాజు పుత్రార్థి । యై వజ్రి కప్రియం బగుమఖంబు
సేసి, పుత్రుల సవిశేషుల నూర్వురఁ । గని, సంతసంబునఁ గ్రాలుచుండు;
నాతఁడు వేటకై యరిగినచో వజ్రి । దిగ్భ్రాంతి పుట్టించి తేరకాఁడు
సనునట్లు సేయ నజ్జనపతి యెక్కిన । తురగంబుతో నొంటి దూరమైన

ఆ. కాన కేఁగి, తృష్ణ గదిరిన, నలుగడ । నరసి, యొక్క పద్మసరసి గాంచి
వెన్ను మునుఁగ హయము నన్నీరఁ దిగిచి, తాఁ । దనివు సొంపు మిగుల మునిఁగి లేచి. 287

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; భంగాస్వనుండు; అను రాజు= ఆ పేరుగల రాజు; పుత్ర+అర్థి= కొడుకులను కోరి; వజ్రికిన్= ఇంద్రుడికి; అప్రియంబు= ఇష్టంలేని; మఖంబు= యజ్ఞం; చేసి= నిర్వహించి; సవిశేషులన్= విశేషగుణ వంతులైన; పుత్రులన్= కొడుకులను; నూర్వురన్+కని= వందమందిని కని; సంతసంబునన్+క్రాలుచున్+ఉండున్= సంతోషంతో ఉండేవాడు; ఆతఁడు= ఆ రాజు; వేటకై= వేటకొరకు; అరిగినచోన్= వెళ్ళినపుడు; వజ్రి= ఇంద్రుడు; దిక్+భ్రాంతి= దిశలు తెలియని అజ్ఞానం; పుట్టించి= కల్గించి; తేరకాఁడు= పిచ్చివాడు; చనునట్లు= వెళ్ళేవిధంగా; చేయన్= చేస్తే; ఆ+జనపతి= ఆ రాజు; ఎక్కిన= కూర్చున్న; తురగంబుతోన్= గుర్రంతో; ఒంటి= ఒంటరిగా; దూరమైన= దూరంగా ఉన్న; కానకున్= అడవికి; ఏఁగి= వెళ్ళి; తృష్ణ= దప్పిక; కదిరినన్= కలుగగా; నలుగడన్= నాలుగు దెసలు; అరసి= చూచి; ఒక్క పద్మసరసిన్= ఒక తామరలున్న చెరువును, కాంచి= చూచి; హయము= గుర్రం; వెన్ను= వీపు; మునుఁగన్= మునిగేటట్లు; ఆ+నీరన్= ఆ నీటిలో; తిగిచి= లాగి; తాన్= తానూ; తనివు= తృప్తి; సొంపు= హాయి; మిగులన్= ఎక్కువ కాగా; మునిఁగి= నీట స్నానం చేస్తూ మునిగి; తేలి= పైకి వచ్చి.

తాత్పర్యం: ఒక రాజుండేవాడు. అతడి పేరు భంగాస్వనుడు. సంతానంకొరకు తపించి యజ్ఞం చేసి నూర్గురు కొడుకులను కన్నాడు. కాని, ఆ యజ్ఞం ఇంద్రుడికి ఇష్టంలేనిది కావటం వలన రాజు వేటకు వెళ్ళినపుడు ఇంద్రుడు అతడికి ఏ దిక్కు ఎటో తెలియని మాయ కల్గించాడు. ఆ రాజు పిచ్చిగా ఎటో దూరాన అడవులలోకి పోయి అక్కడ దప్పిక కలుగగా ఒక తామరల చెరువు చూచి, గుర్రాన్ని వీపుమునిగే టట్లు నీటిలోనికి లాగుతూ, తానూ మునిగి లేచాడు.

క. భూనాథుఁడు తృష్ణ సెడం । బానక్రియ యాచరించి, భామినియై తన్
దాన కనుంగొని, విస్మయ । మూనెడుమదితోడ సరసి నొయ్యన వెడలెన్. 288

ప్రతిపదార్థం: భూ= భూమికి; నాథుఁడు= పతి - భంగాస్వనుడు; తృష్ణ= దప్పిక; చెడన్= పోగా; పానక్రియ= త్రాగటం; ఆచరించి= చేసి; భామిని+ఐ= స్త్రీ అయి; తన్+తాన= తనను తానే; కనుంగొని= చూచి; విస్మయము= ఆశ్చర్యం; ఊనెడు= కలిగే; మదితోడన్= మనస్సుతో; ఒయ్యనన్= నెమ్మదిగా; సరసిన్= చెరువులోనుండి; వెడలెన్= బయటకు వచ్చాడు;

తాత్పర్యం: ఆ చెరువులో మంచినీళ్ళు త్రాగేసరికి రాజు స్త్రీగా మారిపోయాడు. తనను తానే చూచికొని ఆశ్చర్యం పొంది బరువైన మనస్సుతో ఒడ్డుకు చేరాడు.

విశేషం: భారతంలో శిఖండి కథలోవలె - ఇక్కడా లింగ పరిణామం చెందిన విషయం చెప్పబడింది. ఇది సాధ్యమేనని ఇవ్వాళ మనం పత్రికలలో చదవటమే కాక శాస్త్రీయంగా ఇది సత్యమే ననీ తెలిసికొంటున్నాం. ప్రతి స్త్రీ పురుషులలో తల్లి అంశ సగం, తండ్రి అంశ సగం ఉంటుంది కనుక. ఇది సత్యమే. శాస్త్రీయమే.

సీ. వెడలి, చింతించి, యీ యొడలితో నే భంగిఁ । దురగంబు నెక్కుదుఁ? బురజనంబు
లేను బోయినఁ జూచి యే మని తలఁతురో? । పాలఁతు లేమను వారొ? పుత్రు లేమి
గాఁగ నూహింతురో ? కానన యుండంగ । వచ్చునే? పోవంగ వలయు నెట్లు?
నని విచారించి, పోయిన నెల్లవారును । నాశ్చర్య మందుచు నంత నంతఁ

ఆ. గనుఁగొనంగ, మంత్రిగణము రావించి దిగ్ । భ్రాంతిఁ దాను బోయి పద్మసరసి
యందు మునిఁగి వనిత యగుట యెఱింగించి । రాజ్యమునఁ దనూజరాజి నిలిపి. 289

ప్రతిపదార్థం: వెడలి = బైటకు వచ్చి; చింతించి= ఆలోచించి; ఈ ఒడలితోన్= ఈ శరీరంతో; ఏ+భంగిన్= ఏ విధంగా; తురంగంబున్= గుర్రాన్ని; ఎక్కుదున్.= ఎక్కేది?; ఏను+పోయినన్= నేను ఇట్లా వెళ్ళితే; పురజనంబులు= నగరంలోని ప్రజలు; చూచి= స్త్రీనైన నన్ను చూచి; ఏమి+అని తలఁతురో?= ఏమనుకుంటారో?; పొలఁతులు= భార్యలు; ఏమి+అనువారొ?= ఏమంటారో?; పుత్రులు=కొడుకులు; ఏమి కాఁగన్= ఎట్లా; ఊహింతురో?= ఊహిస్తారో; కానన్+అ= (అట్లా నగరానికి పోకుండా) అడవిలోనే; ఉండంగన్ వచ్చును+ఏ= ఉండవచ్చునా? ఎట్లు= ఏ విధంగానైనా; పోవంగన్ వలయున్= వెళ్లి తీరాలి; అని= ఈ విధంగా; విచారించి= తర్కించి, పోయినన్=పోగా; ఆశ్చర్యము= అబ్బురపాటు; అందుచున్= పొందుతూ; ఎల్లవారున్= అందరూ; అంతన్+అంతన్= అక్కడ కూడా బెరుకు బెరుకుగా; కనుఁగొనంగన్= తన్ను చూడగా; మంత్రిగణమున్= మంత్రిమండలిని; రావించి = పిలిపించి; దిగ్భ్రాంతిన్= దిశాజ్ఞానం లేకుండా; తాను పోయి= తాను వెళ్ళి; పద్మసరసియందున్= తామరల చెరువులో; మునిఁగి= స్నానమాడి; వనిత= స్త్రీ; అగుటన్= కావటం; ఎఱింగించి= తెలిపి; రాజ్యమునన్= సింహాసనమీద; తనూజ= కొడుకుల; రాజిన్= సమూహాన్ని (వందమంది కనుక సమూహం); నిలిపి= నియమించి.

తాత్పర్యం: ఒడ్డుకు వచ్చి ఆలోచించటం ప్రారంభించాడు. ఈ శరీరంతో గుర్రాన్ని ఎట్లా ఎక్కేది ? ఇట్లా పోతే నగరంలో ప్రజలేమనుకుంటారో? నా భార్య లేమంటారో? కొడుకు లేవిధంగా ఆలోచిస్తారో? అని భావించి అడవిలో ఎట్లా ఉండటం?; ఏ విధంగా నైనా సరే నగరానికి పోక తప్పదు అని నిశ్చయించుకొని వెళ్ళి, మంత్రులందరినీ పిలిచి, తాను దిగ్భ్రాంతినిపొందటం, చెరువులో మునగటం, స్త్రీ కావటం, అంతా చెప్పి కొడుకులకు రాజ్య మప్పగించి (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: పద్యమంతా గజిబిజి ఆలోచనలు. అనిశ్చిత స్థితి. ఆ స్థితిలో ఉన్నవాడి మానసిక పరిస్థితి ఎట్లా ఉంటుంది? పద్యం పద్యమంతా ఆ విధంగా వ్రాయటం వలన నడకపోయింది. పద్యం వచన వాక్యాలుగా విరిగిపోతున్నవి. ఆరువిధాల వాక్యాలుగా పాదాలు మలచటం శిల్పం.

ఉ. కానకు నేఁగి తాపసులఁ గాంచి, తపం బొనరింప, నం దొకం
డా నలినాక్షిఁ బొంది ప్రియుఁడై నడచెం, గ్రమవృత్తి నందనుల్
దానికిఁ బుట్టి రిద్ధబలదర్పులు నూర్వురు; వారిఁ గొంచు న
మ్మానిని పూర్వ పుత్రక సమాజము పాలికిఁ బోయి, నెమ్మితోన్. 290

ప్రతిపదార్థం: కానకున్= అడవికి; ఏఁగి= పోయి; తాపసులన్= తపస్వులను; కాంచి= దర్శించి; తపంబు= తపస్సును; ఒనరింపన్= చేయగా; అందున్= ఆ తాపసులలో; ఒకండు= ఒకడు (పేరు చెప్పకుండా ఎవడో ఒకడు అనటం); ఆ నలిన+అక్షిన్= ఆ స్త్రీని; (పద్మాలసరసిలో మునగటంవలన స్త్రీరూపం వచ్చింది కనుక తామరలవంటి నేత్రాలు కలవని అన్నాడు); పొంది= కలిసి; ప్రియుఁడై= ప్రేమకలవాడై; నడచెన్= ప్రవర్తించాడు; క్రమవృత్తిన్= క్రమపర్యాయంగా; దానికిన్= ఆ స్త్రీకి; నందనుల్= కొడుకులు; ఇద్ధ= శుద్ధమైన; బల= బలంతో; దర్పులు= గర్వించినవారు; నూర్వురు= వందమంది; పుట్టిరి= పుట్టారు; వారినిన్+కొంచున్= వారిని తీసికొని; ఆ+మానిని= ఆ స్త్రీ; పూర్వపుత్రక సమాజము= ముందు పుట్టిన కొడుకుల సమూహం; పాలికిన్= దగ్గరకు; పోయి= వెళ్ళి; నెమ్మితోన్= సంతోషంతో.

తాత్పర్యం: అడవికి పోయి అక్కడ మునుల దగ్గర తపస్సు చేస్తుండగా ఆమెను ఒకడు ప్రేమించాడు. తత్ఫలితంగా ఆమెకు గొప్ప బలవంతులు వందమంది కొడుకులుపుట్టారు. తాను రాజుగా ఉన్నప్పుడు పుట్టిన కొడుకుల దగ్గరకు వారిని తీసికొనిపోయి సంతోషంతో. (తరువాతి వచనంతో అన్వయం)

వ. తనకు నొక్క తాపసుండు ప్రియుం డగుటయు, వానివలన నత్తనయశతంబు జనియించుటయు నెఱింగించి. 291

ప్రతిపదార్థం: తనకున్; ఒక్క తాపసుండు= ఒక తపస్వి; ప్రియుండు= భర్త; అగుటయున్= కావటం వలనను; వానివలనన్= ఆ తాపసుడి ద్వారా; ఆ+తనయ శతంబు= ఆ నూర్గురు కొడుకులు; జనియించుటయున్= పుట్టటం; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: తనకు ఒక తపస్వి ప్రియుడైనాడనీ, అతడివలన ఆ నూరుగురు కొడుకులు కలిగారనీ చెప్పి.

క. 'మగతనమునాఁడు మీరున్ । మగువతనము నపుడు వీరు నాయం దుదయం
బగుటను దోడంబుట్టువు । లగుదురు; ధర వంచి కుడువుఁ డందఱు' ననుడున్. 292

ప్రతిపదార్థం: మీరున్= మీరు; మగతనమునాఁడు= నేను మగవాడుగా ఉన్నపుడు; వీరు; మగువతనమునపుడు= నేను ఆడదానిగా ఉన్నప్పుడు; నాయందున్= నాకు; ఉదయంబు+అగుటను= పుట్టటంవలన; తోడంబుట్టువులు= అన్నదమ్ములు; అగుదురు= (వీరుమీరు) అవుతారు; ధరన్= రాజ్యాన్ని; పంచి= పంచుకొని, అందఱున్= అంతా; కుడువుఁడు= అనుభవించండి; అనుడున్= అనగా.

తాత్పర్యం: నేను మగవాడుగా ఉన్న రోజుల్లో మీరు పుట్టారు. స్త్రీగా ఉన్నపుడు వీరు జన్మించారు. కనుక మీరంతా తోబుట్టువులు. అందుచేత ఈ రాజ్యాన్ని అందరూ సమానంగా పంచుకొని అనుభవించండి, అనగా.

క. భ్రాతృస్నేహము గల్గి, య। రాతులు భయమందఁగా ధరారాజ్యము సం
ప్రీతి ననుభవించిరి జను। లాతతహర్షమునఁ బొంద నందఱు నెమ్మిన్. 293

ప్రతిపదార్థం: భ్రాతృస్నేహము= అన్నదమ్ముల అనురాగం; కల్గి= పొంది; అరాతులు= శత్రువులు; భయము+అందఁగాన్= భయపడగా; జనులు= ప్రజలు; ఆతత= విస్తారంగా; హర్షమునన్; పొందన్= సంతోషించగా; అందఱున్= అంతా; నెమ్మిన్= సంతోషంతో; ధరారాజ్యము= భూసామ్రాజ్యము; ప్రీతిన్= ప్రేమతో; అనుభవించిరి= అనుభవించారు.

తాత్పర్యం: అంతా అన్నదమ్ములై కలిసి మెలిసి రాజ్యాన్ని పంచుకొని శత్రువులు భయపడేటట్లుగా, ప్రజలు సంతోషమును పొందగా, హాయిగా పాలించారు.

తే. దానిఁ గని, పాకశాసనుఁ 'డేను వీని। కహితముగఁ జేయ నిది హితమై ఘటించె
నధిక పుత్త్రసమృద్ధి రాజ్యాభివృద్ధి; నిమ్మహీపతి సమ్మదం బినుమడించె. 294

ప్రతిపదార్థం: దానిన్= ఆ విషయం లేదా ఆమెను; కని= చూచి; పాకశాసనుఁడు= పాకుడను రాక్షసుడిని చంపినవాడు - ఇంద్రుడు; ఏను= నేను; వీనికిన్= వీడికి; అహితముగన్= అశుభమని; చేయన్= చేస్తే; హితము+ఐ= శుభమై; ఘటించెన్= ఒనరింది; అధిక= ఎక్కువ; పుత్త్ర= కుమారుల; సమృద్ధి= సంపదయు; రాజ్య+అభివృద్ధి= రాజ్యం పెంపుదల కారణంగా; ఈ+మహీపతి= ఈ రాజుయొక్క; సమ్మదంబు= సంతోషం; ఇనుమడించెన్= రెట్టింపైనది.

తాత్పర్యం: జరిగిన విషయమంతా చూచి ఇంద్రు డనుకొన్నాడు. 'వీడికి అశుభం చేద్దామనుకొంటే అదంతా వీడికి మేలైనదే. రాజ్యంతోపాటుగా సంతానాభివృద్ధీ అయినది కనుక వీడికి సంతోషం రెండింతలైనది' అని.

వ. దీని విఘటింపం జేయుదు' నని భూసురాకారుండై వచ్చి పూర్వులం గాంచి. 295

ప్రతిపదార్థం: దీనిన్= ఈ సమృద్ధిని; విఘటింపన్+చేయుదును= నాశనం చేస్తాను; అని; భూసుర+ఆకారుండు+ఐ= బ్రాహ్మణ రూపంలో; వచ్చి; పూర్వులన్= మొదటి సంతానాన్ని; కాంచి= చూచి.

తాత్పర్యం: ఈ సమృద్ధిని నాశనం చేస్తాను' - అని బ్రాహ్మణరూపంలో వచ్చి, మొదటి సంతానాన్ని చూచి.

క. ఆ రాజకుమారుల మతి। నీరసము జనించునట్టు।'లెక్కడి జనకుం?
దేరికినేనియుఁ బుట్టిన। వారిం దోబుట్టువులుగ వల్వం జనునే?' 296

ప్రతిపదార్థం: ఆ రాజకుమారుల= మొదటి సంతానమైన ఆ రాజుకొడుకుల యొక్క; మతిన్= మనస్సులో; ఈరసము= అసూయ; జనించునట్టులు= పుట్టేటట్లుగా; ఎక్కడి జనకుండు= ఎక్కడ తండ్రి?; ఏరికిన్+ఏనియున్= ఎవడికో (తండ్రి ముని కనుక తర్వాతి వారికి); పుట్టిన= జన్మించిన; వారిన్= వారలను; తోఁబుట్టువులుగన్= తమ్ములుగా; వల్వన్= ప్రేమించ; చనునే?= చెల్లుతుందా? (కుదరదు).

తాత్పర్యం: ఆ రాజు మొదటి సంతానం మనస్సులో అసూయ పుట్టేట్లుగా అన్నాడు. 'ఈ పిల్లలకు తండ్రి ఎవడో? ఆ సంతానం మీకు తోబుట్టువు లనుకొనటం వెర్రికాదా?' అని.

వ. అని మఱియు, ననేక ప్రకారంబులం జెప్పి, వార లెఱుంగకుండ నపరకుమారకుల కడకు నేఁగి యితకరి మాటలమొత్తంబుల వారలచిత్తంబులను గలంచె. 297

ప్రతిపదార్థం: అని; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= అనేక రకాలుగా; చెప్పి= పూసగ్రుచ్చినట్లు చెప్పి; వారలు= మొదటి సంతానం; ఎఱుంగకుండన్= తెలియకుండా; అపర= రెండో; కుమారకుల= కొడుకుల; కడకున్= దగ్గరకు; ఏఁగి= పోయి; ఇతకరి= హితం కలిగించే, మాటల= వాక్కులయొక్క; మొత్తంబులన్= సమూహంతో; వారల= రెండో సంతానంయొక్క; చిత్తంబులను= మనస్సులను; కలంచెన్= కలతపెట్టాడు.

తాత్పర్యం: ఇంకా చెప్పవలసిన రీతులలో అనేకం చెప్పి, వారికి తెలియకుండా రెండో సంతానం దగ్గరకుపోయి చుట్టంవలె మెత్తనిమాటలతో వారి మనస్సులనూ కలతపరచాడు.

విశేషం: అనేక ప్రకారంబులన్-సామాన్యంగా వచనంలో తిక్కన గారిట్లా వ్రాస్తే, మూలంలో అనేక శ్లోకా లుంటా యని అర్థం. వాటిని పండితులు చూచుకొనవచ్చునన్న సూచనమేరకు ఇట్లా వ్రాయటం ఆ మహానుభావుడి అనువాద పద్ధతులలో ఒకటి.

క. అనిమిషవరుఁ డివ్విధమున; । జనియింపఁగఁ జేసెఁ బగ; యసంగతు లై వా
రును దెగి, యొండొరువులతో । ననిఁ బెట్టుగఁ జేసి చచ్చి రందఱు నధిపా! 298

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధర్మరాజా!; ఈ+విధమునన్= ఈ విధంగా; అనిమిషవరుఁడు= దేవతలరాజు (అనిమిషః= నిమిషం - అంటే కనురెప్పపాటు లేనివారు దేవతలు); పగ= వైరాన్ని; జనియింపఁగన్= పుట్టేటట్లు; చేసెన్= చేశాడు; వారునున్= ఆ రాజకుమారులంతా; తెగి= (కోపంతో) ఏపురేగి; అసంగతులు+ఐ= స్నేహం పోగొట్టుకొని; అనిన్= యుద్ధం; ఒండొరువులతోన్= పరస్పరం; బెట్టుగన్= తీవ్రంగా చేసి; అందఱున్= అంతా; చచ్చిరి= చనిపోయారు.

తాత్పర్యం: ధర్మరాజా! ఇంద్రుడు పెట్టిన కుంపటితో రాజకుమారులు తమ మధ్య స్నేహాన్ని పోగొట్టుకొని శత్రువులైనారు. యుద్ధం తీవ్రంగా చేసికొని, చచ్చారు.

విశేషం: లోకంలో బెట్టు అనే మాటను 'వాడు చాలా బెట్టుసరి మనిషి' అన్న పదం వాడుకలో ఉన్నది. 'వానలు లేక పొలం బెట్టు తీసింది'. అన్న ప్రయోగంలో కఠినమని అర్థం. ఈ అర్థంలో బెట్టు వేరు.

ఉ. చచ్చిన నత్తపస్విసతి సన్నులు మోమును మోదికొంచుఁ బై
వెచ్చని కన్ను నీ రదర, వీడిన వేనలితోడఁ బెల్ల వా
పుచ్చి, తనూజులం బనువఁ బొంచి కనుంగొని పోయె విప్రుఁ డై
యచ్చటికిన్ సురాధిపతి; యాతనిఁ జూచి లతాంగి వెక్కుచున్. 299

ప్రతిపదార్థం: చచ్చినన్= చస్తే; ఆ+తపస్విసతి= ఆ మునిభార్య; చన్నులున్= రొమ్ములు; మోమునున్= ముఖం; మోదికొంచున్= కొట్టుకొంటూ; పైన్= రొమ్ములపైన; ముఖానికీ పైన; వెచ్చని= వేడి; కన్నునీరు= కన్నీరు; అడరన్= వ్యాపించగా; వీడిన= చెదరిన; వేనలితోడన్= జడతో; పెల్చన్= పెద్దగా; వా= వాక్కు (ఏడ్పు); పుచ్చి= అరిచి; తనూజులన్= కొడుకులను గూర్చి; పనువన్= ఏడ్వగా; పొంచి= చాటునఉండి; కనుంగొని= చూచి; సుర+అధిపతి= దేవతల రాజు; విప్రుఁడు+ఐ= బ్రాహ్మణుడై; అచ్చటికిన్= ఆమె దగ్గరకు; పోయెన్= వెళ్ళాడు; లతాంగి= స్త్రీ; అతనిన్+చూచి= అతడిని చూచి; వెక్కుచున్= వెక్కిపడుతూ (వెక్కివెక్కిపడి ఏడ్వటం - వ్యవహారంలోమాట).

తాత్పర్యం: కొడుకులంతా చావగా తల్లి రొమ్మూ, మొగమూ బాదుకొంటూ వాటిమీద కన్నీళ్ళు కారగా, జడముడి ఊడిపోగా, పెద్ద గొంతుకతో కొడుకులను పేరుపేరున తలచుకొంటూ ఏడుస్తూ ఉండగా, చాటున నుండి చూస్తున్న ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో ఆమెను సమీపించాడు. ఆమె ఇంకా వెక్కి వెక్కి పడుతూ, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: స్వభావోక్తి. తల్లి దుఃఖవర్ణన యథార్థంగా చిత్రించబడటం చూడవచ్చును.

ఆ. కరుణ మొగమునందుఁ గనుఁగొని, తాను ము । న్నర్థి వేఁట వోవు టాదిగాఁగ
సకల సుతులు నాజిఁ జచ్చుట తుదియు గఁ । గలుగు వర్తనంబు దెలియఁ బలికె. 300

ప్రతిపదార్థం: కరుణ= జాలి; మొగమునందున్= అతడి ముఖంలో; కనుఁగొని= చూచి; తాను= భంగాస్వనుండు; మున్ను= పూర్వం; అర్థిన్= కోర్కెతో; వేఁటపోవుట= వేటకైపోవటం; ఆదికాఁగన్= మొదలుకొని; సకల, సుతులు= కొడుకులంతా; ఆజిన్= యుద్ధంలో; చచ్చుట= చావటం; తుదియుగన్= ముగింపు కాగా; కలుగువర్తనంబు= జరిగిన కథనంతా; తెలియన్ పలికెన్= అతడికి తెలిసేటట్లుగా చెప్పింది.

తాత్పర్యం: అతడి ముఖంలో తనపట్ల కనబరుస్తున్న జాలిని చూచి తాను పూర్వం రాజుగా ఉన్నపుడు వేట కేగిన దగ్గరనుండి కొడుకులంతా చచ్చినదాకా జరిగిన కథనంతా చెప్పింది.

క. విని, యతఁ 'డే నింద్రుఁడ, నా కనిష్ట మగు క్రతువుఁ జేసి; తది హేతువుగా
నినుఁ బఱచితి నిత్తెఱఁగున' । ననుటయు, సంభ్రమ సమేతమైన భయమునన్. 301

ప్రతిపదార్థం: విని= విన్నాక; అతఁడు= వాడు; ఏన్= నేను; ఇంద్రుఁడన్= దేవతలరాజును; నాకున్; అనిష్టము+అగు= ఇష్టంలేని; క్రతువున్= యజ్ఞం; చేసితి(వి)= చేశావు; అది హేతువుగాన్= అది కారణంగా; నినున్= నిన్ను; ఈ+తెఱఁగునన్= ఈ విధంగా; పఱచితిన్= పరుగెత్తించాను (కష్టాలు పెట్టాను); అనుటయున్= అనటంతోనే; సంభ్రమ= తొట్రుపాటుతో; సమేతము+ఐన= కూడిన; భయమునన్= భయంతో.

తాత్పర్యం: విని 'నేను ఇంద్రుడను. నాకిష్టం లేని యజ్ఞం చేసినందువలన ని న్నీ విధంగా కష్టపెట్టాను'. అనటంతోనే ఆమె తొట్రుపాటుతో కూడిన భయంతో. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఇలఁ జాఁగి మ్రొక్కి 'యటు తన । యులకై సమ్మోఢబుద్ధి నొనరించితిఁ ద
ప్పలఘు దయఁ జూడు; నీ కేఁ జలమునకుం బాత్రమే విశాలయశోర్థీ!' 302

ప్రతిపదార్థం: ఇలన్= నేలపై; చాఁగి= సాష్టాంగపడి; మ్రొక్కి= నమస్కరించి; తనయులకై= కొడుకులకొరకు; అటు= ఆ విధంగా; సమ్మూఢ= మూర్ఖమైన; బుద్ధిన్= ఆలోచనతో; తప్పు= దోషం; ఒనరించితిన్= చేశాను; అలఘు= గొప్ప; దయన్= కరుణతో; చూడు= చూడుము; నీకున్; ఏన్= నేను; చలమునకున్= పట్టుదలకు; పాత్రమే= తగిన వ్యక్తినా; విశాల= అనంతమైన; యశః+అర్థీ!= కీర్తిని కోరేవాడా!

తాత్పర్యం: 'గొప్పకీర్తి గల నీకు నేనా దొరికాను? కొడుకులకొరకు చేసిన తప్పునకు నా కింత శిక్ష విధించాలా? గొప్ప మనసుతో కరుణించుము'.

వ. అని రామయై యున్న రాజన్యుండు, దైన్యంబు దోఁపం బలికిన, బలసూదనుండు ప్రసన్నుండై. 303

ప్రతిపదార్థం: అని; రామఐ= స్త్రీగా ఉన్న; రాజన్యుండు= రాజు; దైన్యంబు= దీనత్వం; తోఁపన్= కన్పించేటట్లు; పలికినన్= చెప్పితే; బలసూదనుండు= బలుడన్న రాక్షసుడిని చంపిన ఇంద్రుడు; ప్రసన్నుండు+ఐ= దయ కలవాడై.

తాత్పర్యం: స్త్రీ రూపంలో రాజు ఆ విధంగా ఏడ్చేసరికి ఇంద్రుడు ప్రసన్నుడైనాడు.

ఇంద్రుఁడు భంగాస్వనునకుఁ గోరిన వరంబు లిచ్చి యనుగ్రహించుట (సం.13-12-38)

సీ. 'ఇచ్చెదఁ గొందఱ; నెత్తఱిఁ గాంచిన । తనయుల నొసఁగుదు' ననిన నతఁడు
'కాంతనై యుండి యేఁ గనిన వారల నిమ్ము । దేవ!' నావుడుఁ దొల్లి నీవు గన్న
ప్రజల నే లడుగవు? నిజము సెప్పుము నాకు' । ననియెఁ బురందరుం డవ్విభుండు
వెడసిగ్గుపాటుతోఁ 'పడఁతుల కర్మిలి । బిడ్డలదెసఁ గడుఁ బెద్ద' యనిన

తే. 'సత్యవాది వైతి సకలతనూజులు । బ్రదికి నెగడువారు భామినీత్వ
దైన్య ముడిపి పురుషతయు నిత్తు నీ' కని । పాకశాసనుండు వల్కె నధిప! 304

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; పురందరుండు= ఇంద్రుడు; కొందఱన్= కొంతమందిని; ఇచ్చెదన్= బ్రతికిస్తాను; ఎత్తఱిన్= ఏ సమయంలో; కాంచిన= కన్న; తనయులన్= కొడుకులను; ఒసఁగుదున్= ఇచ్చెదను; అనినన్= అనగా, అంటే; అతఁడు= భంగాస్వనుడు; కాంతనై ఉండి= స్త్రీనై ఉండి; ఏన్= నేను; కనిన= కన్నట్టి; వారలన్= వారిని; ఇమ్ము= ఇవ్వు; దేవ= స్వామీ!; నావుడున్= అనగా; తొల్లి= అంతకుముందు; నీవు; కన్న= కన్నట్టి; ప్రజలన్= సంతానాన్ని; ఏల?= ఎందుకు; అడుగవు= అడగలేదు; నిజము చెప్పుము= సత్యం చెప్పుము; నాకున్; అనియెన్= ఇంద్రుడన్నాడు; ఆ+విభుండు= ఆ రాజు; వెడ= కొంచెం; సిగ్గుపాటుతోన్= సిగ్గుతో; పడఁతులకున్= స్త్రీలకు; బిడ్డలదెసన్= బిడ్డలమీద; అర్మిలి= ప్రేమ; కడున్= మిక్కిలి; పెద్ద= ఎక్కువ; అనినన్= అనగా; పాకశాసనుఁడు= ఇంద్రుడు; సత్యవాదివి= నిజం చెప్పేవాడివి; ఐతి(వి)= ఐనావు; సకల తనూజులు= కొడుకులంతా; బ్రదికి= జీవించి; నెగడువారు= వర్ధిల్లగలరు; భామినీత్వదైన్యమున్= స్త్రీత్వంవలన కలిగిన దీనత్వం కూడా; ఉడిపి= పోగొట్టి; పురుషతయున్= మగతనాన్ని కూడా; నీకున్; ఇత్తున్= ఇస్తాను; అని పలికెన్= అని అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఇంద్రు డన్నాడు; 'చచ్చినవారిలో కొందరిని బ్రతికిస్తాను. ఎవరిని కోరుకొంటావో చెప్పుము' అంటే అతడన్నాడు. 'నేను స్త్రీగా ఉండి కన్నవారి నిమ్ము' అని. 'ముందరి బిడ్డల నెందు కడగలే' దని ఇంద్రుడంటే - అత డన్నాడు 'స్త్రీకి పిల్లలమీద ప్రేమ ఎక్కువ కదా! అందుకని' అని కొంచెం సిగ్గుపడుతూ అంటే- ఇంద్రుడు 'నీవు నిజం చెప్పావు. కనుక నీ కొడుకులందరినీ బ్రతికించి ఇస్తాను. అంతేకాక నీకు మగతనాన్ని కూడా ఇస్తాను' అని చెప్పాడు.

క. విని, యజ్జగతీనాథుఁడు । 'దనయుల నందఱను నీదుదయఁ బడసితి; నే
వనిత నయి యిట్ల యుండెద । ననఘా యివ్వరము నొసఁగు' మని పల్కుటయున్. 305

ప్రతిపదార్థం: ఆ+జగతీనాథుఁడు= ఆ రాజు (జగత్తు= ప్రపంచం, రాజ్యం); విని; నీదు= నీయొక్క; దయన్= దయతో; తనయులన్= కొడుకులను; అందఱన్= అందరినీ; పడసితిన్= పొందాను; నేన్= నేను; వనితన్+అయి= స్త్రీనై; ఇట్ల+ఉండెదన్= ఇదేవిధంగా ఉంటాను; అనఘా!= పుణ్యాత్ముడా!; ఈ+వరము= ఈ వరం; ఒసఁగుము= ఇమ్ము; అని; పల్కుటయున్= అనగా.

తాత్పర్యం: ఆ రాజు ఇంద్రుడి మాటలు విని 'నీ దయవలన నాకు కొడుకు లందరూ దక్కారు. కాని నన్నిట్లాగే స్త్రీగానే ఉండనిమ్ము. ఈ వరం చాలు' అని అన్నాడు.

వ. విస్మితుండై యింద్రుండు 'దీనికిం గతం బేమి? యని యడిగిన నా భంగాస్వనుం డిట్లనియె. 306

ప్రతిపదార్థం: ఇంద్రుండు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడి; దీనికిన్= నీ వడిగిన దానికి; కతంబు= కారణం; ఏమి?= ఏమిటి?; అని; అడిగినన్= అడుగగా; ఆ భంగాస్వనుండు; ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడు ఆశ్చర్యపడి ' ఈ విధంగా నీవు అడగటానికి కారణ మేమి?' టని అడిగాడు. దానికి భంగాస్వనుడు ఈ విధంగా పలికాడు.

క. 'సురతంబునఁ గడు నెక్కుడు । పురుషులకంటెను సుఖంబు పొలఁతులకు, సురే
శ్వర! యట్లగుటను నాకీ । వెరవున రమియించి నిలువ వేడుక గలిగెన్.' 307

ప్రతిపదార్థం: సుర+ఈశ్వర!= దేవతలకు రాజా!; పొలఁతులకున్= స్త్రీలకు; సురతంబునన్= రతిలో; కడున్= మిక్కిలి; సుఖంబు= సుఖం; ఎక్కుడు= ఎక్కువ; అట్లు= ఆ విధం; అగుటను= కావటంవలన; నాకున్; ఈ వెరవునన్= ఈ ఉపాయంతో; రమియించి= సుఖించి; నిలువన్= బ్రదకటానికి; వేడుక= కోరిక; ఉత్సాహం; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: 'ఇంద్రా! రతిలో పురుషులకంటె స్త్రీలకు సుఖ మెక్కువ కనుక నే నదే రీతిగా స్త్రీనై సుఖించాలని ఉత్సాహపడుతున్నాను.'

ఆ. అనిన, నట్టులేని నౌఁ గాక, యిమ్మెయి । విపుల సౌఖ్య మొంది, విహరణంబు
సలిపి నిలువు' మనుచు, శక్రుండు సనియె భం । గాస్వనుండుఁ బ్రీతి నట్ల యుండె'. 308

ప్రతిపదార్థం: అనినన్; శక్రుండు= ఇంద్రుడు; అట్టులు+ఏని= అలాగైతే; ఔన్+కాక= సరే అట్లాగే; ఈ+మెయిన్= ఈ విధంగా (స్త్రీవై); విపుల= విస్తారమైన; సౌఖ్యము+ఒంది= సుఖాలు పొంది; విహరణంబు సలిపి= విహరించి; నిలువుము= బ్రతుకుము; అనుచున్= అంటూ; చనియెన్= పోయాడు; భంగాస్వనుండున్= ఆ రాజుకూడా; ప్రీతిన్= సంతోషంతో; అట్లు+అ= అదే విధంగా; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: అని అనగా విని ఇంద్రుడు 'అట్లాగా! సరే! నీ వట్లాగే ఉండి సుఖించుము' అని దీవించి వెళ్ళిపోయాడు. భంగాస్వనుడు కూడా స్త్రీగానే ఉండిపోయాడు.

వ. అని చెప్పి భీష్ముండు 'పాండవాగ్రజా! దీన నీయడిగిన యర్థంబు దెలిసికొ' మ్మనిన, నమ్మనుజపతి 'బహువిధము లగు ధర్మంబులు భవత్ప్రసాదంబున వినుచున్నవాఁడ; నవియెల్లను జన్మ మరణాది దుఃఖంబులం బాపంజాలునే? యనేక జననీ జనకులకుం బుట్టుచు సంసార చక్రంబునం దిరుగంజాల; గర్భవాసంబన నరకంబన భేదంబు గలదె? సచరాచరంబైన యిజ్జగం బస్థిరం; బట్లుంగాక దీని విషాన్నంబు చందముగాఁ గనియెద; భవమోక్షణం బగు వైష్ణవధర్మం బుపదేశింపవే! యది యీ యుగంబునం దిరోహితం బగుట కృష్ణద్వైపాయనుండు సెప్పెఁ; మీ యనుగ్రహంబుల నెఱింగెద; భవదీయ చరణంబులు శరణంబులుగాఁ బ్రసన్నుండ నైతి' నని ప్రార్థించిన నమ్మహాత్ముండు 'పగతురం దెగటార్చి పేర్చి పూజ్యంబగు సామ్రాజ్యంబు గైకొని, తదీయంబు లగు సుఖంబు లనుభవించుచుండుట గీడుగాఁ జూడఁ గురుకుల చూడా మణియగు నీకుం జనుఁగాక, యౌవనస్థ లగు రాజ్య పదస్థుల తలంపుల చొప్పె యిది? మిథిలాపతియగు జనకుండుం బోలెం బలికెద' వని యుపలాలించి యమ్మహీపాలున కిట్లనియె. 309

ప్రతిపదార్థం: అని చెప్పి= అనివచించి; భీష్ముడు; పాండవ+అగ్రజా!= పాండవులలో పెద్దవాడా!; ధర్మరాజా!; నీ అడిగిన= నీ వడిగిన; అర్థంబు= అర్థాన్ని; దీనన్= ఈ కథ ద్వారా; తెలిసికొమ్ము= తెలిసికొనుము; అనినన్= అనగా; ఆ మనుజపతి= ఆ రాజు; బహువిధములు+అగు ధర్మంబులు= అనేక ధర్మాలను; భవత్= నీయొక్క; ప్రసాదంబునన్= దయతో; వినుచున్నవాఁడన్= వింటున్నాను; అవి ఎల్లనున్= అవన్నీ; జన్మ= పుట్టుక; మరణ= చావు; ఆది=మొదలైన; దుఃఖంబులన్= దుఃఖాలను; పాపన్+చాలునే?= పోగొట్టునా? అనేక= చాలామంది; జననీ= తల్లులకు; జనకులకున్= తండ్రులకు; పుట్టుచున్= జన్మలెత్తుతూ; సంసారచక్రంబునన్= పుట్టుక చావులతో గూడిన సంసారమనే చక్రంలో చిక్కుకొని; తిరుగన్+చాలన్= తిరగలేను; గర్భవాసంబు+అనన్= కడుపులో ఉండటం అనగా; నరకంబు= నరకము; అనన్= అంటే; భేదంబు కలదె?= భేద మున్నదా?; సచర+ఆచరంబు= కదలెడివి, కదలనివి అయిన వానితో కూడినదైన; ఈ+జగంబు= ఈ లోకం; అస్థిరంబు= స్థిరంగా ఉండనిది; అట్లుంగాక= అందువలన; దీనిన్= దీనిని; విష+అన్నంబు= విషం కలిపిన అన్నం; చందముగాన్= వలె; కనియెదన్= చూస్తాను; భవ= జన్మ; మోక్షణంబు+అగు= తప్పించునట్టి; వైష్ణవధర్మంబు= విష్ణువే దైవమని చెప్పే మార్గం; ఉపదేశింపవే!= బోధించవా!; అది= ఆ ధర్మం; ఈ యుగంబునన్= ఈ ద్వాపరయుగంలో; తిరోహితంబు= అదృశ్యం; అగుట= కావటం; కృష్ణద్వైపాయనుండు= వ్యాసమహర్షి; చెప్పెన్; మీ అనుగ్రహంబులన్= మీ దయతో; (ఇక్కడ బహువచనం లోకంలో వాడటం లేదు. కాబట్టి మిక్కిలి దయతో అని చెప్పుకొనాలి); ఎఱింగెదన్= తెలిసికొంటాను; భవదీయ= మీ; చరణంబులు= పాదాలు; శరణంబులుగాన్= దిక్కుగా; ప్రపన్నుండను= భక్తుడను; ఐతిని; అని; ప్రార్థించినన్= మిక్కలి కోరగా- వేడుకొనగా; ఆ+మహా+ఆత్ముండు= ఆ విశాలమైన హృదయం కలవాడు (ఎవడు తనను విశ్వంలో, విశ్వాన్ని తనలో దర్శించగలడో వాడే గొప్ప ఆత్మ కలవాడు); పగతురన్= శత్రువులను; తెగటార్చి= నరికి; పేర్చి= వర్ధిల్లి; పూజ్యంబు= పవిత్రమైన; సామ్రాజ్యంబు= గొప్ప రాజ్యం; కైకొని= పొంది; తదీయంబులు= దానికి సంబంధించిన; సుఖంబులు=సౌఖ్యాలు, భోగాలు; అనుభవించుచున్+ఉండుట= అనుభవించటం; కీడుగాన్= ఆపదగా; చూడన్= చూడటం; కురుకుల= కురువంశానికే; చూడామణి= తలపై పెట్టుకొనే మణి; అగు నీకున్= అయిన నీకు; చనున్గాక!= చెల్లుగాక! యౌవనస్థులు= యువకులు; రాజ్యపదస్థుల= రాజ్యపాలన అందున్నవారి (యౌవరాజ్య పట్టాభిషిక్తులైనవారి); తలంపుల చొప్పె?= ఆలోచనల పద్ధతియా? ఇది= నీవు చెప్పింది; మిథిలాపతి= మిథిలారాజ్య పాలకుడైన; జనకుండున్+పోలెన్= జనకుడివలె; పలికెదవు= చెప్పుతున్నావు; అని; ఉపలాలించి= ముద్దుచేసి; బుజ్జగించి; ఆ+మహీపాలునకున్= ఆ భూమిపతితో.

తాత్పర్యం: ఈ కథవలన నీవడిగిన అర్థం తెలిసికొనుము' అని భీష్ముడనగా విని ధర్మరా జన్నాడు. 'మహాత్మా! నీ వలన ఎన్నో ధర్మాలు వింటున్నాను. చావు పుట్టుకల చక్రంలో పడి తిరుగుతూ ఎన్నిసార్లు జన్మించాలి? నాకీ

బంధం వద్దు. తల్లి కడుపులో ఉండటమంటే నరకవాసమే కదా! కనుక విష్ణుభక్తిని బోధించుము. నీ పాదాలే నాకు దిక్కు' అని ప్రార్థించేసరికి భీష్ము డన్నాడు. 'నాయనా! నీ మాటలు చూస్తే ఎవరో జనకమహారాజు మాటలుగా ఉన్నాయిరా! లేకపోతే ఇంత సామ్రాజ్యం పొంది కూడా ఆ భోగాలు వద్దనుకొనటం సామాన్యమా? నీవు కురువంశోద్ధారకుడవయ్యా!' అని మెచ్చుకొని ఇట్లా అన్నాడు.

క. 'పురుషాతిగ యై తోఁచును, । నిరూపణము సేయ నూఁది నిర్దేశింపన్
వెరవుపడక, శాశ్వతసుఖ । భరితత, నిర్వాణ మనఁగఁబడుఁ బ్రకృతి నృపా! 310

ప్రతిపదార్థం: నృపా= రాజా!; నిర్వాణము= మోక్షం; అనఁగన్+పడు= అనబడే; ప్రకృతి= వ్యక్త, అవ్యక్త రూపిణి అయిన ప్రకృతి; పురుష+అతిగ+ఐ= పురుషుడికంటె మించినదై; తోఁచును= ప్రకాశిస్తుంది; నిరూపణము చేయన్= నిరూపించుటకు; ఊఁది= నొక్కి; నిర్దేశింపన్= వ్యాఖ్యానించుటకు; వెరవుపడక= అంతు చిక్కక; సుఖ భరితత= నశించని సుఖంతో నిండినదై.

తాత్పర్యం: శాశ్వతసుఖం పేరే మోక్షం. అదే నిర్వాణం. అది పురుషుడికంటె అధికమైన ప్రకృతి అనబడుతుంది. దానిని నిర్దేశించటానికిగానీ, 'ఇది' అని చెప్పటానికి గానీ, చూపటానికి గానీ, తర్కించటానికి గానీ వీలుపడదు.

విశేషం: ప్రకృతి, పురుషులు సాంఖ్యయోగంలోనివి. ప్రకృతి, పురుషు లనేకంగా ఉంటారని సాంఖ్యులు చెప్పారు. తర్వాత వచ్చిన వేదాంతులు దీన్ని ఖండించారు. ఈ సాంఖ్యయోగం గీతలోనూ చెప్పబడింది. ఈ సిద్ధాంత స్థాపకుడు కపిలమహర్షి. ఆయన 5000 సంవత్సరాల క్రితం వాడని చెప్తుతారు.

క. ప్రకృతులు పెః క్కన్నింటికి । నకృతి యనం జనిన యదియ యాద్యః మహీపా
లక! పురుషరూపిణియు నై । వికృతిం బొరయదు వివేకవిజ్ఞాత యగున్. 311

ప్రతిపదార్థం: మహీపాలక!= భూమిపాలకా!; ప్రకృతులు పెక్కు= ప్రకృతులు అనేకం; అన్నింటికిన్= అన్నిటికీ; ఆద్య= మూలము; అకృతి+అనన్+చనిన+అది+అ= అకృతి అని పేర్కొనదగినది; పురుషరూపిణియున్+ఐ= ఆ అకృతి పరమపురుష స్వరూపిణియై; వికృతిన్= వికారమును (పరిణామం); పొరయదు= పొందదు; వివేక= జ్ఞానముచేతనే (ఆత్మానాత్మ వివేకము చేత) విజ్ఞాత= స్పష్టంగా తెలుసుకోబడినది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! ప్రకృతులు పెక్కింటికి అకృతియే తల్లి. అది పరమపురుష రూపిణియై ఏవికృతిని పొందదు. అది జ్ఞానము చేతనే తెలియదగినది.

క. విను, సంసార పథమునకు । ననురూపతఁదోఁచుచుండఁ, నన్యప్రకృతుల్
దనతోఁపు భవనిరాసం । బునకుం గారణము, గామమునఁ బిహిత మగున్. 312

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; అన్యప్రకృతుల్= అకృతి కంటే వేరైన ప్రకృతులు; సంసార పథమునకున్= జనన మరణ రూపమైన సంసార మార్గానికి; అనురూపతన్= అనుకూలముగా; తోఁచుచుండన్= స్ఫురించుచుండగా; భవనిరాసంబునకున్= సంసార విచ్ఛేదానికి; తనతోఁపు= అకృతి యొక్క స్ఫురణ; కారణము= హేతువు; కామమున్= కామము చేత; అది= (ఆ కారణము); పిహితమగున్= కప్పబడును.

తాత్పర్యం: అకృతికంటే వేరైన ప్రకృతులన్నీ సంసార మార్గానికి అనుకూలంగా తోస్తూ ఉంటాయి. అలా తోస్తూ ఉండగా సంసార నిర్మూలనానికి కారణమైనది అకృతియొక్క స్ఫురణ మాత్రమే. అది కూడా కామము చేత కప్పబడుతున్నది.

క. కావునఁ గామక్రోధము । లావిర్భూతములు గానియట్లుగఁ దత్స
త్త్వావేశంబునఁ దనుపుము । భావం; బివ్విధము విష్ణుపరతఁ గుమారా! 313

ప్రతిపదార్థం: కావునన్= కనుక; కుమారా!= నాయనా!; కామ, క్రోధములు= కోరిక, కోపాలు; ఆవిర్భూతములు కాని అట్లుగన్= పుట్టకుండా ఉండేటట్లు; తత్= ప్రసిద్ధమైన; సత్త్వ= సత్త్వగుణం యొక్క; ఆవేశంబునన్= ఆవహించటంచేత; భావంబు= మనస్సును; ఈ+విధము= ఈ పద్ధతి; విష్ణుపరతన్= విష్ణుభక్తితో; తనుపుము= తృప్తి పొందించుము.

తాత్పర్యం: నాయనా! కాబట్టి కామక్రోధాలను అణచి మనస్సును సత్త్వగుణభరితం చేసికొమ్ము. ఇదే వైష్ణవ ధర్మమంటే.

విశేషం: సత్త్వం - రజస్సు - తమస్సు అని గుణాలు మూడు. రజస్సు ఉద్రేకం - కర్మ చేయించే స్వభావం. తమస్సు - చీకటి - అజ్ఞానం. ఏ పనీ చేయించని బద్దకం దీని లక్షణం. సత్త్వం= శుభాన్ని గూర్చే ధర్మాదులను చేయించే ఉద్రేకం లేని శాంతగుణం.

క. నృప! వైష్ణవధర్మము నీ । కుపదేశించితిఁ; బ్రసాదయుతుఁడ వగుచు సా
రపుఁ దెరు వగు నిది గనికొని, । యపగత సంసార భయుఁడ వై నడపు తగన్. 314

ప్రతిపదార్థం: నృప= రాజా!; నీకున్= నీకు; వైష్ణవ ధర్మము= విష్ణుసంబంధమైన ధర్మాన్ని; ఉపదేశించితిన్= బోధించాను; ప్రసాదయుతుఁడవు= శాంత గుణంతో కూడుకొన్నవాడవు; అగుచున్= ఔతూ; ఇది= ఈ వైష్ణవ ధర్మం; సారపు= సారవంతమైన; తెరువు= మార్గం; అగున్= ఔతుంది; కనికొని= విచారించి; అపగత= పోయిన; సంసార= జనన మరణ ప్రవాహంవలని; భయుఁడవై= భయం కలవాడవై; తగన్= చక్కగా; నడపు= జీవించుము.

తాత్పర్యం: నీ వడిగిన ధర్మం చెప్పాను. దీనితో ఉద్రేకాలు లేని మనస్సుతో సంసార భయాన్ని జయించి జీవించుము.

వ. అనిన సంప్రీతుండై ధర్మజుండు భీష్మునితోఁ 'దత్త్వంబులు నధ్యాత్మంబులు, నధిభూతంబులు, నధి దైవంబులు, ననుసర్వంబునకుం గర్తయు, భర్తయు, హర్తయు నగుచు సకల భూతంబులుం దనుపజీవింపం బెంపారు వాని నెఱింగింపవే!' యని ధర్మజుం డడుగుటయు నతనికి నమ్మహితాత్ముం డిట్లనియె. 315

ప్రతిపదార్థం: అనినన్= అనగా; సంప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; ధర్మజుండు; భీష్ముని తోన్= భీష్ముడితో; అధ్యాత్మంబులు= ఆత్మ సంబంధమైనవీ; అధిభూతంబులు= పంచభూతాలకు సంబంధించినవీ; అధిదైవంబులు= దైవాలకు సంబంధించినవీ; తత్త్వంబులు= శాస్త్రీయసత్యాలు; అను= ఈ చెప్పినవాటిని; సర్వంబునకున్= అన్నింటికీ; కర్త= చేసినవాడు; భర్త= పోషించేవాడు; హర్త= చంపేవాడు; అగుచున్; సకలభూతంబులున్= సర్వజీవులూ; తన్నున్= తనను; ఉపజీవింపన్= బ్రదికిస్తూ ఉండగా (తన ఉనికిని చాటుతుండగా); పెంపారువానిన్= పేరుగన్న వాడిని; ఎఱింగింపవే= తెలుపవే; అని;

ధర్మజుండు; అడుగుటయున్= అడుగగా; ఆ+మహిత+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మ కలవాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ఆ మాటలు విని ధర్మరాజు సంతోషించి ఆ మహాత్ముడితో అన్నాడు 'ఆధ్యాత్మికం, అధిదైవం, అధిభూత మన్న మూడు తత్త్వాలకు ఆధారమై, వాటిలో తానూ జీవిస్తూ కర్తా, భర్తా, హర్తా అయిన భగవంతుడి గురించి చెప్పవా?' అని అడుగగా; భీష్ముడన్నాడు.

క. 'సనకుఁడు, సనందనుండును, । సనత్కుమారుఁడు, సనత్సుజాతుఁడు, నలువుర్
తనయుల్ బ్రహ్మకుఁ, బంచము । డును షష్ఠుండును వసిష్ఠుఁడును, శంకరుఁడున్. 316

ప్రతిపదార్థం: బ్రహ్మకున్ = బ్రహ్మదేవునికి; సనకుఁడు, సనందనుండును, సనత్కుమారుఁడు, సనత్సుజాతుఁడు; తనయుల్= కొడుకులు; నలువుర్= నలుగురు; తనయుల్= కుమారులు; పంచముఁడును= ఐదవవాడును; షష్ఠుండును= ఆరవవాడును, (వరుసగా) వసిష్ఠుఁడును= వసిష్ఠమహర్షి, శంకరుఁడున్= శంకరుడూ (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు, వసిష్ఠుడు, శంకరుడు. ఈ ఆరుగురూ బ్రహ్మకు కొడుకులు.

ఆ. అనఘ! విను మరీచి యనఁగ, భృగుం డన, । నంగిరసుఁ డనఁగ, ననంతరంబ
యత్రి యనఁ, బులస్త్యుఁ డన, బులహుం డనఁ, । గ్రతు వనంగఁ, బుట్టు సుతచయంబు. 317

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విను= ఆలకించుము; మరీచి; అనఁగన్; భృగుండు; అనన్; అంగిరసుఁడు; అనఁగన్; అనంతరంబు+అ= తర్వాత; అత్రిఅనన్; పులస్త్యుఁడు+అనన్; పులహుండు+అనన్; క్రతువు అనంగన్; పుట్టు= జన్మించిన; సుతచయంబు= కొడుకుల సమూహం;

తాత్పర్యం: పుణ్యాత్ముడా! వినుము. ఆ తరువాత మరీచి, భృగుడు, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనే పేర్లుగల కొడుకులు పుట్టారు.

వ. ఆ సనత్సుజాతుం డంగుష్ఠ ప్రమాణమూర్తియుం, బ్రజ్వల దనలస్ఫూర్తియునయి లోకంబుల నెందునుం జరియించుచు నొక్కనాఁడు మేరు శిఖరంబున నారదుండు సన్నిహితుం డగుటయుఁ దదీయసల్లాపసౌఖ్యం బనుభవించుచున్న యెడ నిట్లపోలె నడిగిన నారదునకు నమ్మహాయోగీశ్వరుండు సెప్పిన వాక్యంబు లితిహాసరూపంబునం జెల్లునవి యుపన్యసించెద; నవి భవత్ప్రశ్నంబున కుత్తరంబగు; నాకర్ణింపుము. 318

ప్రతిపదార్థం: ఆ సనత్సుజాతుండు; అంగుష్ఠప్రమాణ మూర్తియున్= బొటనవ్రేలంత ఎత్తున్నవాడూ; ప్రజ్వలత్+అనల స్ఫూర్తియున్= మండుతున్న అగ్నివంటివాడూ; అయి=ఐ; లోకంబులన్= లోకాలలో; ఎందునున్= అన్నిచోట్లా; చరియించుచున్= సంచరిస్తూ; ఒక్కనాఁడు= ఒక రోజున; మేరు శిఖరంబునన్= మేరుపర్వత శిఖరంమీద; నారదుండు; సన్నిహితుండు+ అగుటయున్= ప్రత్యక్షం కాగా; తదీయ సల్లాప సౌఖ్యంబు= అతడితో మాట్లాడటంవలన కలిగే హాయి; అనుభవించుచున్+ ఉన్న=పొందుతూ ఉన్న; ఎడన్= సమయంలో; ఇట్లు+అ+పోలెన్= ఈ విధంగానే; అడిగినన్= అడుగగా; ఆ+మహాయోగి+

ఈశ్వరుండు= గొప్పయోగులలో గొప్పవాడైన ఆ సనత్సుజాతుడు; నారదునకున్; చెప్పిన; వాక్యంబులు= వాక్యాలు, సూక్తులు; ఇతిహాస రూపంబునన్= పూర్వగాథవలె; చెల్లున్= ప్రచారంలో ఉన్నాయి; అవి= వాటిని; ఉపన్యసించెదన్= వివరిస్తాను; అని= ఆ వాక్యాలు; భవత్+ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరంబు= సమాధానం; అగున్= ఔతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ సనత్సుజాతుండు బొటనవ్రేలంత ఎత్తున్నవాడూ, మండుతూ ఉన్న అగ్నివలె ప్రకాశించేవాడూ అయి, లోకాలన్నీ సంచరిస్తూ ఉండేవాడు. ఒకనాడు మేరుపర్వత శిఖరం మీద నారదుడు కన్పించగా అతడితో సంభాషిస్తూ ఉండగా నీవలెనే నారదు డడిగితే ఆయన చెప్పిన మాటలు లోకంలో వ్యాపించాయి. ఆ పురాతన వాక్యాలు నీ వడిగిన ప్రశ్నకు సమాధానాలు. కనుక వినుము చెప్పుతాను.

సనత్సుజాతుండు నారదున కుపదేశించిన తత్త్వప్రకారము (సం.13-38-1 (కుంభ))

క. దశకల్ప సహస్రంబులు । నిశ, యింతియ దివస, మిది సునిద్రారతికిన్.

విశదప్రబోధమునకున్ । వశగతకాలములు విష్ణునకు విమలమతీ! 319

ప్రతిపదార్థం: విమల= కల్మషంలేని; మతీ!= మనస్సు కలవాడా!; దశకల్ప సహస్రంబులు= పదివేలకల్పాలు; నిశ= రాత్రి; ఇంతియ= ఇంతే; దివసము= పగలు; ఇది= ఈ లెక్క; సునిద్రా రతికిన్= మంచి నిద్రాసుఖానికీ; విశద= స్పష్టమైన; ప్రబోధమునకున్= మేల్కొని ఉండటానికీ; విష్ణునకున్= విష్ణుదేవుడికి; వశగత= వశమైన; కాలములు= సమయాలు.

తాత్పర్యం: స్వచ్ఛమైన మనస్సు కలవాడా! నారదా! విష్ణువు చక్కగా నిద్రపోవటానికి రాత్రి పదివేల కల్పాలు. మేల్కొనే కాలమూ అంతే. ఇవి విష్ణుమూర్తికి రేయింబవళ్ళు.

క. అవ్యక్తం బనఁగాఁ దన । దివ్యాత్మన కలిగియుండు ధీసారనిధీ!

భవ్యాత్ము లభేదస్థితి । సవ్యాహతదృష్టిఁ గాంతు రయ్యమళమ్మున్. 320

ప్రతిపదార్థం: ధీ= బుద్ధి; సార= సారమునకు; నిధీ!= భండారమైనవాడా!; అవ్యక్తంబు= వ్యక్తం కానిది (వ్యక్తం ప్రపంచం= పదార్థ సృష్టి) అనఁగాన్; తన; దివ్య+ఆత్మన= దివ్యాత్మతోనే; కలిగిఉండున్= కలిగి వుంటాడు; భవ్య= శ్రేష్ఠ; ఆత్ములు= ఆత్మలు కలవారు (పండితులు); ఆ+యమళమ్మున్= ఆ జంటను (యమళము= జంట) - రేయింబవళ్ళు; అవ్యాహత= ఎదురులేని; దృష్టిన్= చూపుతో; అభేద= భేదం లేని; స్థితిన్= ఉనికిని; కాంతురు= చూస్తారు.

తాత్పర్యం: సారవంతమైన ఆలోచనకు నిధి వంటివాడా! అవ్యక్తమంటే విష్ణువు తన స్వరూపంతో తా నుండటం. మహానుభావులు వ్యక్తాన్నీ (పగలు), అవ్యక్తాన్నీ (రాత్రినీ) ఒకే విధంగా చూస్తారు. (అవి రెండూ ఒకటే)

వ, అప్పరమేశ్వరుండు. 321

ప్రతిపదార్థం: ఆ+పరమ+ఈశ్వరుండు= ఆ మహేశ్వరుడు.

తాత్పర్యం: ఉన్నతుడైన ఆ భగవంతుడు.

క. రే నిద్రించు, ప్రభాతం । బైనన్ మేల్కని సృజించు నంబువులఁ దగం

దా నం దిడుఁ దనవీర్యము । దాన మహాండ మగు హేమతాస్ఫురితంబై. 322

ప్రతిపదార్థం: రే= రాత్రి; నిద్రించున్= నిద్రపోతాడు; ప్రభాతంబు= పగలు; ఐనన్= కాగా; మేల్కని= లేచి; సృజించున్= సృష్టిస్తాడు; అంబువులన్= నీళ్ళలో; తగన్= తగునట్లుగా; తాను; అందున్= నీళ్ళలో; తన; వీర్యమున్= బీజాన్ని; ఇడున్= నిక్షేపిస్తాడు; దానన్= దానితో; హేమతా= బంగారు కాంతితో; స్ఫురితంబు+ఐ= ప్రకాశిస్తూ; మహా+అండము+అగున్= పెద్ద గ్రుడ్డు ఔతుంది.

తాత్పర్యం: రాత్రి కాగానే ఆయన నిద్రపోయి, మరలా వేకువ రాగానే లేచి సృష్టి చేస్తాడు. ఎట్లా అంటే తన బీజాన్ని నీళ్ళలో నిక్షేపించి ఉంచటంవలన. దానితో ఒక పెద్ద బంగారు గ్రుడ్డు ఏర్పడుతుంది.

విశేషం: ఇది సృష్టి విద్య. నీళ్ళంటే సృష్టి చేయటాని కాధారమైన ప్రకృతి. విష్ణువు పురుషుడు. ఇతడి వీర్యధారణ వలన ఒక బంగారు గ్రుడ్డు పెడుతుంది ఆ ప్రకృతి.

వ. తదనంతరంబ. 323

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= ఆ వెంటనే

తాత్పర్యం: దాని తరువాత.

తే. బ్రహ్మఁ గల్పించి, దానికిఁ బతిగఁ జేయు, । నమ్మహాత్ముఁ డహంకార మావహించి,
మనసుఁ బదియింద్రియములు, బుద్ధిని ఘటించి । చదలు మొదలగు భూత పంచకముఁ జేయు. 324

ప్రతిపదార్థం: బ్రహ్మన్= బ్రహ్మను; కల్పించి= సృష్టించి; దానికిన్= అండానికి; పతిగన్= భర్తగా; చేయున్= చేయగా; ఆ+మహాత్ముఁడు; అహంకారము= నేను అన్న వ్యక్తిత్వభావం; ఆవహించి= పొంది; మనసున్; పది యింద్రియములు= కర్మేంద్రియాలు 5, జ్ఞానేంద్రియాలు 5; బుద్ధిని= ఆలోచనలో మంచి చెడూ నిర్ణయించేది; ఘటించి= నిర్మించి; చదలు= ఆకాశం; మొదలు+అగు= మొదలైన; భూతపంచకమున్= పంచ(5) భూతాలు (ఆకాశం, నీరూ, నిప్పూ, గాలీ, భూమీ); చేయున్= సృష్టిస్తాడు.

తాత్పర్యం: విష్ణువు బ్రహ్మను సృష్టించి దానికి భర్తగా నియమించాడు. ఆయన 'నేను' అన్న భావాన్ని పొంది మనసు, బుద్ధి, పది ఇంద్రియాలు, ఆకాశం మొదలైన పంచభూతాలను సృష్టించాడు.

వ. అ య్యాకాశ పవనాగ్ని జలభూము లగుభూతంబు లేనింటికి గుణంబులుగా శబ్దస్పర్శరూపరసగంధంబు లావహించుం; గ్రమంబున దేవముని దానవ గంధర్వ కిన్నర నరజాతి జంతు జాలంబులం గల్పించు నన్నియు నహంకార వ్యాప్తంబు లయి యవ్యక్త సాగరంబున మగ్నోన్మగ్నంబు లగుచుండు. 325

ప్రతిపదార్థం: ఆ+ఆకాశ= ఆ మిన్ను; పవన= వాయువు; అగ్ని= నిప్పు; జల= నీరు; భూములు= నేలలు; అగు= అయిన; భూతంబులు ఏనింటికిన్= ఆ పంచభూతములకు; గుణంబులుగాన్= గుణాలుగా; శబ్ద, స్పర్శ, రూపరసగంధంబులు= శబ్దమూ, స్పర్శ, రూపమూ, రసమూ, వాసనలు; ఆవహించున్= కల్పిస్తాడు; క్రమంబునన్= వరుసగా; దేవ= దేవతలు; ముని= మునులు; దానవ= రాక్షసులు; గంధర్వ= గంధర్వులు, కిన్నర= కిన్నరులు, నర= నరులు అనే; జాతి= జాతులను; జంతు= జంతువుల; జాలంబులన్= సమూహాలను; కల్పించున్= సృజించును; అన్నియున్= అన్నీ; అహంకార= నేనన్న వ్యక్తిత్వభావం;

వ్యాప్తంబులు+అయి= వ్యాపించినవై; అవ్యక్త= వ్యక్తం కాని; ప్రధాన తత్త్వమన్న; సాగరంబునన్= సముద్రంలో; మగ్న= మునుగుతూ; ఉన్మగ్నంబులు= లేస్తూ ఉన్నవి; అగుచుండున్= అవుతుంటాయి.

తాత్పర్యం: పంచభూతాలకు గుణాలు అయిదు. ఆకాశానికి శబ్దం, గాలికి స్పర్శ, అగ్నికి రూపం, నీటికి రుచి, భూమికి వాసన అనేవి గుణాలు. క్రమంగా దేవదానవాది జాతులు సృష్టించబడ్డాయి. వీటన్నింటియందు అహంకారం వ్యాపించి ఉంటుంది. ఇవన్నీ అవ్యక్త సముద్రంలో మునుగుతూ లేస్తూ, జన్మిస్తూ, చస్తూ ఉంటాయి.

క. విభుఁ డావిష్ణుం డేతత్ । ప్రభవస్థితి విలయముల, శుభము నశుభంబుం
ప్రభువై తగఁ గాంచి, నడపి । విభవోజ్జ్వలకేలి సల్పు, వినుము, మహాత్మా! 326

ప్రతిపదార్థం: మహాత్మా= మహాత్ముడా!; వినుము; విభుఁడు= ప్రభువైన; ఆ విష్ణుండు= ఆ విష్ణువు; ఏతత్= ఈ; ప్రభవ=సృష్టి, స్థితి= ఉనికి; విలయముల= ప్రళయాలయొక్క; శుభము= మేలు; అశుభంబున్= కీడు; ప్రభువై= పాలకుడై; తగన్= చక్కగా; కాంచి= కని; నడపి= ప్రవర్తింపచేసి; విభవ+ఉజ్జ్వల= ప్రకాశించే వైభవంతో; కేలి= క్రీడ; సల్పున్= చేస్తాడు.

తాత్పర్యం: ఈ సమస్త సృష్టి స్థితి లయాలకు ప్రభువై విష్ణుమూర్తి శుభాశుభాలు కల్పిస్తూ ఈ సంసార చక్ర భ్రమణాన్ని కలిగిస్తూ గొప్ప వినోదంలో మునిగి తేలుతూ ఉంటాడు.

తే. అంబరాదిభూతములు శబ్దాది గుణము । లింద్రియంబు, లహంకార, మిద్ధతేజ!
మనము, బుద్ధి, యవ్యక్తంబు, మహితవేద । వేద్యతత్త్వంబు లీ చతుర్వింశతియును. 327

ప్రతిపదార్థం: ఇద్ధతేజ!= ప్రకాశించే తేజస్సు కలవాడా! అంబర= ఆకాశం; ఆది= మొదలుగాగల; భూతములు= పంచభూతాలు; శబ్ద= సద్దు; ఆది= మొదలుగాగల; గుణములు= గుణాలు అయిదు; ఇంద్రియంబులు= కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు ఐదు, అహంకారము= అహంకారం; మనము= మనస్సు; బుద్ధి= బుద్ధి; అవ్యక్తంబు= అవ్యక్తము; మహిత= గొప్ప; వేద= వేదవిద్య వలన; వేద్య= తెలియదగిన; తత్త్వంబులు= సత్యాలు; ఈ చతుర్వింశతియును= ఈ 24 తత్త్వాలు.

తాత్పర్యం: ఆకాశం మొదలైన అయిదు భూతాలు, అహంకారం, మనస్సు, బుద్ధి, అవ్యక్తం మొదలైన 24 తత్త్వాలు వేదవేద్యతత్త్వాలు.

విశేషం: అవ్యక్తం నుండి మొదలైన సృష్టి 24 తత్త్వాలు కలది. అవే ఈ పద్యంలో చెప్పబడ్డవి. ఇదంతా సాంఖ్యం చెప్పిన సిద్ధాంతం.

వ. అధ్యాత్మాదులు సెప్పెద నాకర్ణింపుము. 328

తాత్పర్యం: ఆత్మకు సంబంధించినవి చెప్పుతాను వినుము.

సీ. శ్రోత్ర మధ్యాత్మంబు సూవె, శబ్దం బధి । భూతంబు దిక్కులు పురుషముఖ్య!
యధిదైవముల్, చర్మ మధ్యాత్మమందలి । సంస్పర్శ మధిభూతసంజ్ఞకంబు,

దానికి నధిదైవతంబు మరుత్తు, నే । త్రంబు దా నధ్యాత్మకంబు, రూప
మధిభూత, మాదిత్యుఁ డధిదైవతము, జిహ్వ । యధ్యాత్మకము, రస మారయంగ

తే. దాని యధిభూత ముదకము, దదధిదైవ । తంబు ఘ్రాణ మధ్యాత్మంబు దలఁప గంధ
మనఘ! యధిభూత మగుఁ దదీయాధిదైవ । తంబు, మేదిని యండ్రు విద్వజ్జనమ్ము. 329

ప్రతిపదార్థం: పురుషముఖ్య= ఉత్తమపురుషుడా!; శ్రోత్రము= శ్రవణేంద్రియం; అధ్యాత్మంబు= అధ్యాత్మము; చూవె= సుమా!; శబ్దంబు= సద్దు; (అక్షర రూపమైన భాషకు ఆధారమైనది శబ్దం) అధిభూతంబు= అధిభూతము (పంచభూత విషయమైనది); దిక్కులు= దిశలు; అధిదైవముల్= అధిదైవములు; చర్మము= త్వగింద్రియము; అధ్యాత్మము= అధ్యాత్మము; అందలి సంస్పర్శము= అందున్న స్పర్శ; అధిభూతసంజ్ఞకంబు= అధిభూతమను పేరుగలది; దానికిన్= ఆ స్పర్శకు; అధిదైవతంబు= అధిదైవము; మరుత్తు= గాలి; నేత్రంబు= చక్షురింద్రియము; తాన్= తాను; అధ్యాత్మకంబు= అధ్యాత్మకము; రూపము= రూపము; అధిభూతము= దానికి అధిభూతము; ఆదిత్యుఁడు= సూర్యుడు; అధిదైవతము= అధి దైవము; జిహ్వ= రసనేంద్రియము; అధ్యాత్మకము= అధ్యాత్మము; రసము= రుచి; ఆరయంగన్= చూడగా; దాని+అధిభూతము= దానియొక్క అధిదేవత; ఉదకము= నీరు; తత్+అధిదైవతంబు= దానియొక్క అధిదేవత; ఘ్రాణము= ఘ్రాణేంద్రియము; అధ్యాత్మంబు= అధ్యాత్మము; తలఁపన్= ఆలోచించగా; అనఘ= పుణ్యాత్ముడా!; గంధము= వాసన; అధిభూతము+అగున్= అధిభూత మవుతుంది; తదీయ= దానికిసంబంధించిన; అధిదైవతంబు= అధిదైవము; మేదిని= భూమి అని; విద్వజ్జనంబు= పండితులైన మనుష్యులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: శ్రవణేంద్రియము అధ్యాత్మము. శబ్దము అధిభూతము; దిక్కులు అధిదైవములు; త్వగింద్రియము అధ్యాత్మము. త్వగింద్రియములోని స్పర్శ అధిభూతము. స్పర్శమునకు అధిదైవతము వాయువు. చక్షురింద్రియము అధ్యాత్మము. చక్షురింద్రియమునకు విషయమైన రూపము అధిభూతము. సూర్యుడు అధిదైవతము. జిహ్వేంద్రియము అధ్యాత్మకము. దానికి విషయమైన రసము అధిభూతము. ఉదకము అధిదైవము. ఘ్రాణేంద్రియము అధ్యాత్మము. దానికి విషయమైన గంధము అధిభూతము. భూమి దానికి అధిదైవతము అని పండితులంటారు.

వ. ఇది బుద్ధీంద్రియ ప్రపంచంబు. 330

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; బుద్ధి+ఇంద్రియ ప్రపంచంబు= బుద్ధి మొదలైన ఇంద్రియాల సముదాయం.

సీ. పాద, పాయూ పస్థ, పాణి, వాగ్వర్గంబు । గర్మేంద్రియము లివి నిర్మలాత్మ !
యధ్యాత్మములు, వాని కగు నధిభూతముల్ । గంతవ్యమును విసర్గంబు నోలి
నానందమును విను మనఘ! కర్తవ్య వ । క్తవ్యంబు లన, నధిదైవతములు
వాసుమిత్త్ర ప్రజాపతి శక్రవహ్నులు । మఱి యహంకారంబు మనసు బుద్ధి

తే. పూజితాధ్యాత్మకము, లధిభూతవృత్తి । వెలయు, నభిమానమంతవ్యములును, నిశ్చ
యంబు నధిదైవములు, మేధ యమృతకరుఁడు' । బ్రహ్మ మిది వేదవాక్య నిర్ణయవిధంబు. 331

ప్రతిపదార్థం: నిర్మల+ఆత్మ!= స్వచ్ఛమైన ఆత్మ కలవాడా!; పాద= అడుగు; పాయు= గుదము, ముడ్డి; ఉపస్థ= యోని (లింగం); పాణి= చేయి; వాక్= మాట; వర్గంబు= గుంపు; ఇవి; కర్మ ఇంద్రియములు= పనిచేసే ఇంద్రియాలు; వానికిన్+అగు=

వాటికి సంబంధించిన; అధిభూతముల్= భూతసంబంధమైనవి; గంతవ్యమును= పోదగినదియు (నడువదగినది= దూరం కాలికి); విసర్గంబును= విసర్జనమును; (పాయూపస్థలకు సంబంధించిన మలమూత్రాదులు); ఓలిన్= క్రమంగా; వినుము; అనఘ!= దోషరహితుడా!; ఆనందమును= సంతోషం; కర్తవ్య= చేయదగినది; వక్తవ్యంబులు= చెప్పదగినది; అనన్= అనగా; వీటికి అధి దైవతములు= దేవతలు; వాసు= విష్ణువు; మిత్ర=సూర్యుడు; ప్రజాపతి= సృష్టికర్త; శక్ర= ఇంద్ర; వహ్నులు= అగ్ని దేవులు; పాదం= విష్ణువు; పాయువు= సూర్యుడు; ఉపస్థ= ప్రజాపతి; పాణి= ఇంద్రుడు; వాక్కునకు; అగ్ని; అధి దేవతలు; మఱి= ఇంకనూ; అహంకారంబు; మనసు; బుద్ధి - ఇవి; పూజిత= పూజించదగిన అధ్యాత్మకములు; వీటికి అధిభూత వృత్తి= ఆధి భౌతిక వ్యాపారాలు; వెలయున్= ప్రకాశిస్తూ; అభిమాన= పౌరుషం; మంతవ్యములును= మనసు చేయదగినదియును; నిశ్చయంబును= తర్కించి నిశ్చయించటం; అహంకారానికి అభిమానం; అధిభూతం; మనసునకు ఆలోచనకు; బుద్ధికి నిశ్చయజ్ఞానం, వీటికి వరుసగా అధి దైవములు= దేవతలు; మేధ= ప్రజ్ఞ (ఇది అహంకార దేవత); అమృతకరుఁడు= చంద్రుడు; అమృతమే కిరణాలుగా కలవాడు - ఇతడు మనస్సుకు దేవత; బ్రహ్మము= పరాత్పరుడు - బుద్ధికి దేవత.

తాత్పర్యం: పాదానికి నడక, పాయువునకు విసర్జనం, ఉపస్థకు ఆనందం, పాణికి కర్తవ్యం, వాక్కునకు వక్తవ్యం వరుసగా అధిభూతములు. వరుసగా పైన చెప్పిన పాదాది కర్మేంద్రియ పంచకానికి దేవతలు. విష్ణువు, సూర్యుడు, బ్రహ్మ, ఇంద్రుడు, అగ్ని. అలాగే అహంకారం, మనస్సు, బుద్ధి అనే అధ్యాత్మములకు పౌరుషం, మంతవ్యం నిశ్చయం అనేవి అధిభూతాలు. మేధ, చంద్రుడు, బ్రహ్మము అనేవి అధిదైవాలు.

క. ఇవి యెల్ల విష్ణునం దు । ద్భవము లయముఁ బొందుచుండు; బహువీచిక ల
ర్ణవమునఁ బొడమి యడఁగుమా । డ్కి విశేషము గల్గ దతనికిన్ విభుఁ డగుటన్. 332

ప్రతిపదార్థం: ఇవి ఎల్లన్= ఇవన్నీ; విష్ణునందున్= విష్ణుమూర్తిలో; ఉద్భవము= పుట్టువు; లయము= మృత్యువును; పొందుచున్+ ఉండున్= పొందుతుంటాయి; అర్ణవమునన్= సముద్రంలో; బహు= అనేక; వీచికలు= అలలు; పొడమి= పుట్టి; అడఁగుమాడ్కిన్= అణగారినట్లుగా; అతనికిన్= ఆ విష్ణువునకు; విభుఁడు+అగుటన్= ప్రభువైనందున; విశేషము= పైన మరొకటి; కల్గదు= ఉండదు.

తాత్పర్యం: ఇవన్నీ విష్ణువన్న మహాసముద్రంలో పుట్టి, అణగారిపోయే అలలవంటివి. ఆయనకంటె పైన మరొక సత్యం లేదు. ఆయనే అన్నిటికి ప్రభువు కనుక.

క. విను మవ్యక్తం బనఁగాఁ । జను, మూలప్రకృతి పురుష చైతన్యము నె
క్కొనినం జేతన యగుచు భు । వనతంత్రం బెల్ల నడపు వైభవ మెసఁగన్. 333

ప్రతిపదార్థం: వినుము= విను; అవ్యక్తంబు+అనఁగాన్+చను= అవ్యక్తమనే పేరుతో ప్రకాశించు; మూలప్రకృతి= ఈ కన్పించే సర్వానికి మూలమైన ప్రకృతి; పురుషచైతన్యము= పురుషుడనే చేతనత్వం= ఆత్మ; నెక్కొనినన్= ప్రవేశిస్తే; చేతన అగుచున్= ఆ మూలప్రకృతి ప్రాణవంతమై; భువన తంత్రంబు+ఎల్లన్= ప్రపంచ సృష్టి, స్థితి, లయాదులన్నిటినీ; వైభవము= పరిపాలన; ఎసఁగన్= ప్రకాశించగా; నడపున్= నిర్వహిస్తుంది.

తాత్పర్యం: అవ్యక్తమంటే మూలప్రకృతి. దానిలోకి పురుషుడు ప్రవేశిస్తే అది చైతన్యవంతమై సృష్టికార్యాన్ని నిర్వహిస్తుంది.

ఆ. అట్లు లోకకర్త యగు నంబుజాక్షుండు । పట్టుఁ గొమ్మ, భావభవహరుండు
హరుని యనుమతమున నఖిలాబ్జజాండంబు । లట్లు పుట్టఁజేసి, యడఁచుచుండు'. 334

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; లోకకర్త+అగు= లోకాలను నిర్మించినవాడైన; అంబుజ+అక్షుండు= పద్మాలవంటి కనులుగల విష్ణువు; పట్టుఁగొమ్మ= ఈ సృష్టికంతా ఆధారం; భావభవహరుండు= మన్మథుని సంహరించినవాడైన; హరుని= శివుడియొక్క; అనుమతమునన్= అంగీకారముతో; అఖిల= సమస్తమైన; అబ్జజ+అండంబులు= బ్రహ్మాండాలు; పుట్టన్+చేసి= జన్మింపజేసి; అడచుచున్+ఉండున్= లయింపజేస్తూ ఉంటాడు.

తాత్పర్యం: లోకకర్త విష్ణువు సమస్త సృష్టికి ఆధారం. ఆయన శివుడి అనుమతితో సమస్తబ్రహ్మాండాలు సృష్టించటం, లయించటం చేస్తూ ఉంటాడు.

విశేషం: ఇంతవరకూ రాని శివుడు ఈ పద్యంలో ఎందుకు వచ్చినట్లు? 326వ పద్యంలో రాని శివ ప్రసక్తి ఇక్కడ దేనికి? కనుకనే ఇది చాలా తాళపత్ర ప్రతులలో లేదని గుర్తించటం జరిగింది. ఈ పద్యం లేకపోయినా నష్టం లేదు.

వ. ఇట్లు సెప్పి సనత్సుజాతుండు నారదుం జరితార్థుం జేసె నని చెప్పి భీష్ముండు భీమాగ్రజుతో వెండియు.335

ప్రతిపదార్థం: ఇట్లు+చెప్పి= ఈవిధంగా వచించి; సనత్సుజాతుండు; నారదున్= నారదుణ్ణి; చరితార్థున్+చేసెన్= ధన్యుని చేశాడు; అని చెప్పి= అనిపల్కి, భీష్ముండు; భీమ+అగ్రజుతోన్= భీముడి అన్నతో, ధర్మరాజుతో; వెండియున్= మరలా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి సనత్సుజాతుడు నారదుడిని కృతార్థుడిని చేశాడని చెప్పి, భీష్ముడు ధర్మరాజుతో మరలా (ఇట్లా అన్నాడు)

ఉ. 'ఇంతకు మూలమై, యిరువదేనవ తత్త్వ మనంగ, వేద వే
దాంత పురాణవేద్యుఁ డగు నప్పురుషుండు వెలుంగు, వాఁడ కా
లాంతకుఁడైన యచ్యుతుఁ డనంతుఁడు, యోగిజనాంతరంగ వి
శ్రాంతుఁడు, విష్ణుఁ డద్వయుఁ, డసంగుఁడు గౌరవవంశదీపకా!' 336

ప్రతిపదార్థం: కౌరవ వంశదీపకా!= కౌరవవంశాన్ని వెలిగించినవాడా!; ఇంతకున్= ఇందాక చెప్పిన సృష్టికంతటికి; మూలము+ఐ= ఆధారమై; ఇరువది+ఏనవ= ఇరవై అయిదో; తత్త్వము= సత్యం; అనంగన్; వేద వేద+అంత= వేదాలకు, ఉపనిషత్తులకు; పురాణ= పురాణాలకూ; వేద్యుఁడు= తెలియదగినవాడు; అగు= అయిన; ఆ+పురుషుండు= ఆ తత్త్వమూర్తి; వెలుంగున్= వెలుగొందుతున్నాడు; వాడు+అ= అతడే; కాల+అంతకుఁడు= కాలాన్ని అంతం చేసేవాడు; ఐన= ఐనట్టి; అచ్యుతుఁడు= చెడనివాడు; అనంతుఁడు= అంతంలేనివాడు; యోగిజన= యోగుల; అంతరంగ= హృదయమే; విశ్రాంతుఁడు= సేదే దీరే స్థానంగా ఉన్నవాడు; విష్ణుఁడు= వ్యాపనశీలుడు; అద్వయుండు= ఏకతత్త్వం, రెండవది లేనివాడు; అద్వైతమూర్తి; అసంగుఁ డు= దేనియందు తగుల్కొననివాడు.

తాత్పర్యం: 'ధర్మజా! ఈ ఇరవైనాలుగు తత్త్వాలకు మూలమైన తత్త్వం ఇరవై ఐదవది విష్ణువన్న పేరున ఉన్న పురుషుడనే పేరు గలది. అది పురాణ, వేద, ఉపనిషత్తులచేత ఎరుగనైనది. కాలమున కంతకుడు, అద్వయుడు, అసంగుడు అతడు. అతడి పేరు విష్ణువు.

విశేషం: 24 తత్త్వాల విచారణ చేసింది సాంఖ్యం. అందులో ఈశ్వరతత్త్వం చెప్పబడలేదు. ఈ ఇరవైఐదవతత్త్వం చెప్పింది యోగదర్శనం. కనుకనే కవి - వేదవేదాంత పురాణ వేద్యుడన్నాడు. ఇట్లు తత్త్వం అక్కడే చెప్పబడింది. బ్రహ్మసూత్రాలలో,

భాష్యాలలో ఈ విషయం వ్యాఖ్యానించబడింది. కనుక ఇది యోగదర్శనం లోనిది. ఇందుకే 'యోగి జనాంతరంగ విశ్రాంతుడు' అనబడింది. ఇది చెప్పుమనే ధర్మరాజు అడిగింది.

వ. అనిన విని యజాతశత్రుండు సరిత్పుత్రునితో 'నియతు లయి యగ్నులు దమయంద సమాహితంబులు సేసికొని మహితాత్ములు నిజాత్మల నప్పరమాత్ము నెట్టివానింగా, భావింతు రెఱింగింపవే' యనుటయు నతనికి భీష్ముం డిట్లనియె. 337

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; న+జాత= పుట్టని; శత్రుండు= శత్రువులు కలవాడు; సరిత్+పుత్రునితోన్= గంగకొడుకు భీష్మునితో; నియతులు+అయి=నియమం కలవారై; అగ్నులు= అగ్నులను; తమ+అందున్+అ= తమలో; సమాహితంబులు చేసికొని= ఆవహింపచేసికొని; మహిత+ఆత్ములు= మహానుభావులు; నిజ= తమ యొక్క; ఆత్మలన్= ఆత్మలలో; ఆ+పరమ+ఆత్మున్= ఆ భగవంతుడిని; ఎట్టివానిన్+కాన్= ఎట్లాంటివాడినిగా, భావింతురు?= భావిస్తారు; చూస్తారు?; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; అతనికిన్= ధర్మజుడికి; భీష్ముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడిని మరలా ప్రశ్నిస్తున్నాడు. 'నియమంతో అగ్నులను తమలో ఆవహింపచేసికొని మహాత్ములు పరమాత్ముడిని ఎట్లాంటి వాడినిగా భావిస్తారు. చెప్పవే' అని.

విశేషం: ఆ రోజులలో వేదం చెప్పిన అగ్నులను ఉపాసించే వారిని గురించి ఈ ప్రశ్న వేయబడింది. గీతలో కూడా ఈ విషయం వస్తుంది.

క. అమృతోత్పత్తి సమయమున । నమరులకును, దానవులకు నని వాటిలె; నం
దమరులు దప్పిం జేడ్పడి । కమలభవుని నాశ్రయింపఁగా నియతిమెయిన్. 338

ప్రతిపదార్థం: అమృత= అమృతం; ఉత్పత్తి= పుట్టుక; సమయమునన్= వేళలో; అమరులకును= దేవతలకూ; దానవులకున్= రాక్షసులకూ; అని= యుద్ధం; పాటిలెన్= కలిగింది; అందున్= ఆ యుద్ధంలో; అమరులు= దేవతలు; డప్పిన్= దప్పికతో; చేడ్పడి= వశంతప్పి, నియతిమెయిన్= నియమంతో; కమలభవునిన్= బ్రహ్మను (పద్మంలో పుట్టినవాడు); ఆశ్రయింపఁగాన్= ఆశ్రయించగా.

తాత్పర్యం: సముద్ర మథనంతో అమృతం పుట్టింది. అప్పుడు దేవదానవులకు యుద్ధం జరుగగా అందులో దేవతలకు దప్పి కలిగి, ఆయాసపడి బ్రహ్మను నిష్ఠతో ఆశ్రయించారు.

వ. అతండు నారాయణు నాత్మయందు నిలిపి. 339

ప్రతిపదార్థం: అతండు= బ్రహ్మ; నారాయణున్= విష్ణుని; ఆత్మఅందున్= తన ఆత్మలో; నిలిపి= స్థాపించుకొని.

తాత్పర్యం: బ్రహ్మ నారాయణుడిని హృదయంలో నిలిపికొని.

తే. 'భక్తవత్సల! పరమాత్మ! పద్మనేత్ర! సర్వభూతమహేశ । ఋక్సామ యజురు
పాస్య! సాధుసంరక్షణ పరవిహార! సురలు రిపులచే నలఁగిరి, శరణ మగుము'. 340

ప్రతిపదార్థం: భక్తవత్సల!= భక్తులపై వాత్సల్యము కలవాడా!; పరమాత్మ= పరమేశ్వరా!; పద్మనేత్ర!= తామరపూలవంటి కన్నులున్న వాడా!; సర్వభూత= అఖిల ప్రపంచానికీ; మహేశ!= పరమేశ్వరా; ఋక్= ఋగ్వేదం; సామ= సామవేదం; యజుః = యజుర్వేదంచేత; ఉపాస్య!= ఉపాసించదగ్గవాడా!; సాధు= సత్పురుషులను; సంరక్షణ= రక్షించటమనే కర్మకు; పర= బద్ధుడవై; విహారా!= విహరించేవాడా!; సురలు= దేవతలు; రిపులచేన్= శత్రువులవలన; నలఁగిరి= బాధపడ్డారు; శరణము= దిక్కు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'మూడువేదాల ద్వారా ఉపాసించబడే భక్తవత్సలా! పరమాత్మా! సత్పురుషులను రక్షించటమన్న కర్మతో విహరించేవాడా! దేవతలు రాక్షసులవలన బాధపడ్డారు. రక్షించు.

వ. అని సంస్తుతిపూర్వకంబుగాఁ బ్రార్థించె; నట్టియెడ. 341

ప్రతిపదార్థం: అని; సంస్తుతి= గొప్ప స్తోత్రం; పూర్వకంబుగాన్= ముందు కలదిగా; ప్రార్థించెన్= వేడుకొన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో

తాత్పర్యం: అని స్తుతితో కూడిన ప్రార్థన చేశారు. ఆ సమయంలో.

విశేషం: ప్రార్థన స్తుతిపూర్వకంగా ఉంటుంది. కనుక దాని ద్వారా ప్రార్థించారు.

క. జలదస్వనసన్నిభమై । యెలుఁ గొక్కటి సదలఁ జెలఁగె; 'నే నిదె మిమ్మున్
గెలిపింపఁగ వచ్చితి; నను । విలసద్వర్ణములు, గాఢ విశదంబులుగాన్. 342

ప్రతిపదార్థం: ఎలుఁగు+ఒక్కటి= ఒక కంఠస్వరము; జలద= నీటినిచ్చేది, మేఘంయొక్క; స్వన= ఉరుము; సన్నిభమై= పోలినదై; చదలన్= ఆకాశంతో; నేను; ఇదె= ఇదుగో; మిమ్మున్= మిమ్మల్ని; గెలిపింపఁగన్= గెలిపించటానికి; వచ్చితిన్= వచ్చేశాను; అను= అన్న; విలసత్= అందమైన; వర్ణములు= అక్షరాలు; గాఢ= పెద్దగా; విశదంబులుగాన్= స్పష్టంగా; చెలఁ గెన్= ధ్వనించింది.

తాత్పర్యం: ఆకాశంలో ఉరు మురిమిన ట్లొక ధ్వని వినిపించింది. అందులోనుండి స్పష్టమైన మాటలు ఇట్లా వినిపించాయి - 'ఇదుగో మిమ్మల్ని కాపాడటానికి వస్తున్నాను' అని.

వ. తదనంతరంబ యకుంఠిత విక్రముం డగు వైకుంఠుండు 343

ప్రతిపదార్థం: తత్= దానికి; అనంతరంబ= అంతరం; ఎడం లేకుండా వెంటనే; అకుంఠిత= మొక్కవోని; విక్రముండు= పరాక్రమం కలవాడు; అగు; వైకుంఠుండు= విష్ణువు.

తాత్పర్యం: వెంటనే మొక్కవోని పరాక్రమం కలవాడైన విష్ణువు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: మాటలు విన్పించటం, వెంటనే విష్ణువు రావటం ఒకేసారి జరిగాయి.

క. గరుడారోహణలీలా । సరభసుఁడై, చక్రగదలు శార్ఙ్గముఁ, జంచ
త్కరముల వెలుంగ నడరి య । సురగణములఁ ద్రుంచె సురలు చోద్యంబందన్. 344

ప్రతిపదార్థం: గరుడ+ఆరోహణ= గరుత్మంతుడిపై ఎక్కి; లీలా= అందమైన; సరభసుఁడు+ఐ= ఆటోపం కలవాడై; చక్రగదలు= చక్రము, గద - అనే రెండు ఆయుధాలు; శార్ఙ్గము= విల్లు; చంచత్= ఒప్పుతున్న; కరముల= చేతులలో; వెలుంగన్= ప్రకాశించగా; అడరి= విజృంభించి; సురలు= దేవతలు; చోద్యంబు= ఆశ్చర్యం; అందన్= పొందగా; అసురగణములన్= రాక్షస సేనలను; త్రుంచెన్= సంహరించాడు.

తాత్పర్యం: గరుత్మంతుడిపై నెక్కి, విలాసంగా తొందర కలవాడై చక్ర గదా శార్ఙ్గములనే ఆయుధాలు అందమైన చేతులలో ప్రకాశించగా, రాక్షస సమూహాన్ని సంహరించాడు. అదిచూచి దేవతలు ఆశ్చర్యపడ్డారు.

వ. ఇట్లు నిర్జించి తత్క్షణంబ యతం డంతర్ధానంబు నొందిన సంతసంబును, నచ్చెరువును బెనంగొను డెందంబుతో బృందారక బృందంబు 'లిమ్మహాత్ముం డెవ్వం? డేమి భంగివాఁ డెఱింగింపవే?' యని యడిగిన నజుం 'డితండు విష్ణుండు; వైకుంఠాభిధానం బగు మూర్తి విశేషంబున విహరించె; విష్ణుని విధం బిట్టిదని యెఱుంగను; నెఱింగింపను శక్యం బగునే?' యయిన నొక్క తెఱంగునం దెలిపెడునట్టి యితిహాసంబు గలదు; వినుం 'డని పలికి వినిపించె' ధర్మనందనా! యా నిర్మలవాక్యంబు లుపన్యసించెద; దాన నీయడిగిన యర్థంబు దేటవడు; నాకర్ణింపుము. 345

ప్రతిపదార్థం: ఇట్లు; నిర్జించి= జయించి; తత్క్షణంబు+అ= ఆ క్షణంలోనే; అంతర్ధానంబు నొందినన్= అదృశ్యుడు కాగా; సంతసంబును= సంతోషం; అచ్చెరువును= ఆశ్చర్యం; పెనంగొను= ముప్పిరిగొన్న; డెందంబులతోన్= మనస్సులతో; బృందారక=దేవతల; బృందంబులు= సమూహాలు; ఈ+మహాత్ముండు= ఈ మహానుభావుడు; ఏమిభంగివాఁడు?= ఎట్లాంటివాడు; ఎఱింగింపవే= తెలుపవే; అని; అడిగినన్; అజుండు= బ్రహ్మ; ఇతండు= ఈయన; విష్ణుండు= విష్ణువు; వైకుంఠ= వైకుంఠుడనే; అభిదానంబు+అగు= పేరుగల; మూర్తి విశేషంబునన్= ప్రత్యేక ఆకారంతో; విహరించెన్= యుద్ధ విహారం చేశాడు; విష్ణునివిధంబు= విష్ణుడి పద్ధతి; ఇట్టిదని= ఇట్లాంటిదని; ఎఱుంగను= తెలిసికొనటానికిగానీ; ఎఱింగింపను= చెప్పటానికి గానీ; శక్యంబు+అగునే?= సాధ్యమౌతుందా? అయినన్= అయినా; ఒక్క తెఱంగునన్= ఒక పద్ధతిగా; తెలిపెడు+అట్టి= అతడిని గూర్చి చెప్పే; ఇతిహాసంబు= పురాణకథ; కలదు= ఉన్నది వినుండు; అని; పలికి= చెప్పి; వినిపించెన్= తెలియజెప్పాడు; ధర్మనందనా= ధర్మజా!; ఆ నిర్మలవాక్యంబులు= ఆ పుణ్యావాక్యాలను; ఉపన్యసించెదన్= యథాతథంగా చెప్పుతాను; దానన్= దానితో; నీ అడిగిన అర్థంబు= నీ వడిగిన విషయం; తేటపడున్= స్పష్టపడుతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధంగా జయించి వెంటనే ఆయన అదృశ్యుడు కాగా సంతోషం, ఆశ్చర్యం పెనవేసుకొని పోయిన మనస్సులతో దేవతలు బ్రహ్మను ప్రశ్నించారు. 'స్వామీ! ఈయన ఎవరు? ఎట్లాంటివాడు? అని. బ్రహ్మ అన్నాడు - 'ఆయనే విష్ణువు. వైకుంఠనామధేయంతో ప్రత్యేకరూపంతో విహరించాడు. ఆయన ఇట్లాంటివాడని ఎవరికి తెలుసు? ఎవరు చెప్పగలరు? అయినా ఒకరకంగా ఆయనను గురించి చెప్పే పురాణకథ ఒకటి ఉన్నది' అని బ్రహ్మ వినిపించాడు. దానిని నీకు చెప్పుతాను. ధర్మదేవతకుమారుడా! అది నీ వడిగిన విషయానికి సమాధానమౌతుంది. వినుము!' అని భీష్ముడు చెప్పుతున్నాడు.

గరుత్మంతుండు మునులకు విష్ణుదేవుని మహిమాతిశయంబు సెప్పుట (సం.13-40-1 (కుంభ))

సీ. హిమగిరిమీఁద ననేక మునీంద్రులు । సిద్ధులుఁ గూడి గోష్ఠీసుఖంబు
ననుభవింపఁగ లీల నచటికి వచ్చి సు । పర్ణుండు వారికిఁ బ్రణతుఁ డగుడు,

వా రభినందించి గారవమున సుఖా । సీనుఁ గావించి, యర్చించి, ప్రీతి
నతనితో సల్లాపమాచరించుచు నుండి । 'యొక్కటి యడిగెద ముజ్జ్వలాత్మ!'

తే. యనిన నాతండు 'ధన్యుండ నైతి; మీర । లెద్ది యడిగెద? రేను నా యెఱిఁగినంత,
యతులమతులార ! చెప్పెద' ననుడు, వార । లెలమి నవ్విహగేంద్రున కిట్టు లనిరి. 346

ప్రతిపదార్థం: హిమగిరిమీఁదన్= మంచుకొండమీద, హిమాలయంమీద; అనేక= చాలామంది; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; సిద్ధులున్= దేవతాజాతివారు; కూడి= కలిసికొని; గోష్ఠీ= స్నేహపూర్వక చర్చా సమావేశంయొక్క; సుఖంబు= సౌఖ్యం; అనుభవింపఁగన్= అనుభవిస్తుండగా; లీలన్= విలాసముగా; సుపర్ణుండు= గరుత్మంతుడు (మంచి బలమైన రెక్కలు గలవాడు); అచటికిన్; వచ్చి; వారికిన్= మునిశ్రేష్ఠులకు; ప్రణతుఁడు= నమస్కరించినవాడు; అగుడున్= కాగా; వారు= మునులు సిద్ధులు; అభినందించి= పొగడి; గారవమునన్= గౌరవంతో; సుఖ+ఆసీనున్ గావించి= సుఖమైన ఆసనమందు కూర్చుండబెట్టి; ప్రీతిన్= భక్తితో; అర్చించి= పూజించి; అతనితోన్= సుపర్ణుడితో; సల్లాపము= సంభాషణ; ఆచరించుచున్= చేస్తూ ఉండి; ఉజ్జ్వల+ఆత్మ!= ప్రకాశించే ఆత్మకలవాడా! (దివ్యదృష్టితో చూస్తే తెలిసే విషయం); ఒక్కటి అడిగెదము= ఒక టడుగుతాం; అనినన్= అంటే; ఆతండు= సుపర్ణుడు; ధన్యుండను+ఐతిన్= నేను పవిత్రుడ నైనాను; మీరలు; ఎద్ది= ఏది; అడిగెదరు?= అడుగుతారు?; ఆతుల= సాటిలేని; మతులార!= మనస్సు కలవారలారా!; ఏను= నేను; నా ఎఱిఁగినంతన్= నాకు తెలిసినంత; చెప్పెదన్= చెప్తాతాను; అనుడున్= అనగా; వారలు= ఆ సిద్ధులు, మునులు; ఎలమిన్= సంతోషంతో; ఆ+విహగ+ఇంద్రునకున్= ఆ పక్షిరాజుతో (విహగము= ఆకాశంలో ఎగిరేది= పక్షి); ఇట్టులు= ఈ విధంగా; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ఒకప్పుడు హిమాలయం మీద మునులూ, సిద్ధులూ కూర్చుని ఆధ్యాత్మిక విషయ చర్చ చేస్తూ ఉండగా అక్కడకు గరుత్మంతుడు వచ్చి, వారందరికి నమస్కరించాడు. అతడిని వారు సుఖంగా కూర్చోబెట్టి గౌరవంతో సల్లాపం చేస్తూ 'మహాత్మా! నిన్నొకటి అడగాలని ఉన్నది' అన్నారు. ఆయన 'నేను ధన్యుడనైనాను. మీరేమడుగుతారో అడగండి. నాకు తెలిసినంత చెప్తుతాను' అనగానే వా రిట్లా అన్నారు.

క. 'ప్రియభక్తుండవు, భక్త । ప్రియుఁడును విష్ణుండు, నీవు ప్రియుఁడై భక్తుం
డయి వర్తిం తా విభుకడ । దయఁ దెలియఁగఁ జెప్పవే యతని తెఱఁ గెల్లన్'. 347

ప్రతిపదార్థం: ప్రియ= ఇష్టుడవైన; భక్తుండవు= భక్తుడవు; విష్ణుండు; భక్తప్రియుఁడును= పూజించే వారియందు ప్రేమ కలవాడు; ఆ విభుకడన్= ఆ స్వామి దగ్గర; నీవు; ప్రియుఁడు+ఐ= ఇష్టుడవై; భక్తుండు+అయి= సేవించేవాడవై; వర్తింతు(వు)= ఉంటావు; అతని తెఱఁగు= ఆయన విషయం; ఎల్లన్= అంతా; దయన్= దయతో; తెలియఁగన్= స్పష్టపడేటట్లుగా; చెప్పవే!= విన్పించవా!

తాత్పర్యం: 'సుపర్ణా! నీవు విష్ణువునకు ఇష్టుడవైన భక్తుడవు. ఆ స్వామి భక్తులపై వాత్సల్యం కలవాడు. నీవా స్వామి వద్ద ప్రియభక్తుడవై ఉంటావు కనుక ఆయన విషయమంతా దయతో మాకు చెప్పుము'.

వ. అని యడిగిన నతండు వారల కిట్లనియె. 348

ప్రతిపదార్థం: అని; అడిగినన్= ప్రశ్నించగా; అతండు= గరుత్మంతుడు; వారలకున్= వారికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని అడుగగా వారితో సుపర్ణు డిట్లా అన్నాడు.

క. స్థూలప్రకారమున నీ । త్రైలోక్యము గావఁబూని, దయ చిగురొత్తన్
లీలఁ బ్రవర్తింపఁగ మన । మాలోకింతు మది గనుట యనవచ్చునొకో! 349

ప్రతిపదార్థం: దయ= కృప; చిగురొత్తన్= చిగుర్చగా; ఈ త్రైలోక్యము= ఈ ముల్లోకాలను; కావన్+పూని= రక్షించాలని; లీలన్= క్రీడగా; ప్రవర్తింపఁగన్=(భగవంతుడు) ప్రవర్తిస్తున్నాడు; మనము; ఆలోకింతుము= చూస్తున్నాం; స్థూలప్రకారమునన్= స్పష్టంగా కన్పించేటట్లుగా (కొండ గుర్తుగా); అది; కనుటఅనవచ్చున్+ఒకో?= చూచామని చెప్పవచ్చునా?

తాత్పర్యం: ఒక విషయాన్ని స్థూలంగా చూచి అది నాకు తెలుసు అని చెప్పలేం కనుక. భగవంతుడు (ఈ సృష్టి చేయటం మనకు తెలియదు కానీ) రక్షిస్తున్నాడు కదా! ఇదే స్థూలంగా మనకు తెలిసింది. ఇంతమాత్రాన ఆయన విషయం సాంతం నాకు తెలుసు నని ఎట్లా చెప్పేది?

ఉ. ఏనును, మీరు, నేల మఱి యెవ్వరు? దక్షులు, విష్ణుచందమున్
బూని యెఱుంగ, నవ్విభుఁడు భూరి దయారతి నాకు నేర్పడం
దాను మహాద్భుతంపుఁ జరితంబులు సూపుచు భాషణామృతం
బానఁగఁ జేసె నా చెవుల; నవ్విధముం దెలియంగఁ జెప్పెదన్. 350

ప్రతిపదార్థం: ఏనును= నేనూ; మీరున్= మీరూ; ఏల= ఏమిటి?; మఱి= ఇంకా; ఎవ్వరు; విష్ణుచందమున్= విష్ణువు ఉనికి; పూని= పూనుకొని; ఎఱుంగన్= తెలిసికొనటానికి; దక్షులు?= సమర్థులు? ఆ+విభుఁడు= ఆ స్వామి; భూరి= గొప్ప; దయారతిన్= కృపాసక్తితో (నిండు దయతో); నాకున్; ఏర్పడన్= స్పష్టపడేటట్లు; తాను; మహా+అద్భుతంపు= గొప్ప విచిత్రమైన; చరితంబులు= కథలు; చూపుచున్= ప్రదర్శిస్తూ; భాషణామృతంబు= అమృతంవంటి మాటలను; నా చెవులన్= నా చెవులతో; ఆనఁగన్+చేసెన్= త్రాగించాడు; ఆ+విధమున్= దానిని; తెలియంగన్= స్పష్టంగా; చెప్పెదన్= చెప్తాను.

తాత్పర్యం: ఆ స్వామి విషయం నాకూ మీకూ కాదు కదా మరి ఎవరికీ తెలియదు. కాకపోతే తన కథలు తాను నాకు చూపించి వాటి అర్థాలను నా చెవులలో అమృతంవలె పోశాడు (నింపాడు) కనుక ఆ విషయం మాత్రం చెప్పగలను.

సీ. అమరేంద్రు నిర్జించి యమృతంబు గొనిపోవు । నప్పుడు వీతెంచె నాకసమున
'మెచ్చితి విహగేంద్ర! యిచ్చెద వరము నీ' । కనుమాట యది విని, హర్షమెసఁగ
'నెవ్వరో! యెఱుఁగ ని న్నెఱిఁగించి మఱి వర । మి' మ్మంటి, దానికి నెలమి నగుచుఁ
'గాలంబుతోఁ గూడఁగా నెఱింగెదవు, వా । హనమవు గమ్ము నా' కనుచుఁ బురుషుఁ

తే. డొక్కఁ, డుజ్జ్వల తేజోమయుండు తోఁచి । 'జరయు మరణంబు లేక యసురుల సురల
నోర్వఁ జాలిన బలముతో నుల్లసిల్లు' । మనివరం బిచ్చె; నిచ్చిన నధికభక్తి. 351

ప్రతిపదార్థం: అమర+ఇంద్రున్= దేవతలరాజును; నిర్జించి= జయించి; అమృతంబున్= సుధను; కొనిపోవునప్పుడు= తీసికొని పోయేవేళ; ఆకసమునన్= ఆకాశంలో; విహగ+ఇంద్ర!= పక్షిరాజా! మెచ్చితిన్= మెచ్చుకొన్నాను; నీకున్; వరము;

ఇచ్చెదన్= ఇస్తాను; అనుమాట= అన్నమాట; వీతెంచెన్= విన్పించింది; అది విని; హర్షము= సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా; నిన్నున్; ఎవ్వరో ఎఱుఁగన్= ఎవరో తెలియదు; ఎఱిఁగించి= తెలిపి; మఱి= తర్వాత; వరమున్= వరాన్ని; ఇమ్ము+అంటిన్= అన్నాను; దానికిన్= నా మాటకు; ఎలమిన్= సంతోషంతో; నగుచున్= నవ్వుతూ; కాలంబుతోన్+కూడఁగాన్= కాలంతోపాటుగా; ఎఱింగెదవు= తెలిసి కొంటావు; నాకున్; వాహనమవు కమ్ము= వాహనానివికా; అనుచున్= అంటూ; ఒక్క పురుషుఁడు= ఒక దేవతామూర్తి; ఉజ్జ్వలతేజో మయుండు= ప్రకాశించే తేజస్స్వరూపుడు; తోఁచి= కన్పించి; జరయున్= ముసలితనం; మరణంబున్= మృతీ; లేక= లేకుండా; అసురులన్= రాక్షసులను; సురలన్= దేవతలను; ఓర్వన్+చాలిన= ఎదిరించి నిలువగల; బలముతోన్= బలంతో; ఉల్లసిల్లుము= కీర్తి పొందుము, వెలుగొందుము; అని; వరంబు; ఇచ్చెన్; ఇచ్చినన్= ఇవ్వగా; అధికభక్తిన్= ఎక్కువభక్తితో. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: నేను దేవేంద్రుడిని జయించి అమృతం తెస్తున్నపుడు ఆకాశంలో 'పక్షిరాజా! నిన్ను మెచ్చానోయి. నీకు వరమిస్తాను' అన్నమాట విన్పించింది. విని సంతోషంతో నే నన్నాను 'నీ వెవ్వరవో తెలిపి తర్వాత వర మిమ్ము' అన్నాను. దాని కాయన నవ్వి 'కాలం తోడ్పాటుతో నీకు నా సంగతి తర్వాత తెలుస్తుంది. నాకు వాహనానివి కమ్ము. సురాసురులను జయించే బలం నీ కిస్తున్నాను' అంటూ ఒక మహావ్యక్తి కళ్ళు మిరుమిట్లు గొలిపే తేజస్సుతో కన్పించి వర మిచ్చాడు. ఇవ్వగా నేను మిక్కిలి భక్తితో.

వ. ఏను దండప్రణామం బాచరించి. 352

ప్రతిపదార్థం: ఏను= నేను; దండ= కట్టెవలె పడి; ప్రణామంబు= సాష్టాంగనమస్కారం; ఆచరించి= చేసి.

తాత్పర్యం: నేను దండప్రణామం చేసి.

క. 'నీ వాహన మయ్యెద, రథ । మీ వెక్కినఁ గేతువై వహింతుఁ బెనుపు, నా
కీ వరము నిచ్చి మనుపుము' । నావుడు 'నవుఁ గాక!' యని మనఃప్రియ మెసఁగన్. 353

ప్రతిపదార్థం: నీ వాహనము+అయ్యెదన్= నీకు వాహన మౌతాను; ఈవు; రథము+ఎక్కినన్= రథమెక్కితే; కేతువై= జెండామీద గుర్తునై; పెనుపున్= పెంపును; వహింతున్= పొందుతాను; నాకున్; ఈ వరమున్; ఇచ్చి; మనుపుము= కాపాడుము; నావుడున్= అనగా; అవున్+కాక= సరే; అని; మనఃప్రియము= మనస్సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా.

తాత్పర్యం: నేను నీకు వాహనమౌతాను. నీవు రథమెక్కినప్పుడు జెండామీద గుర్తునై కీర్తి పొందాలని ఉన్నది. నాకీ వర మిచ్చి రక్షించుము. అని అనగా సరే లెమ్మని, నా మనస్సునకు సంతోషం కలిగేటట్లుగా. (తరువాతి వచనంతో అన్వయం)

ఉ. పలికి యంతర్హితుం డయ్యెఁ; నంత సంతసంబు నచ్చెరువు బెరయు మనంబుతో మదీయ జనకుపాలికిం జని, యీ వృత్తాంతం బెఱింగించిన, నతండు వికసిల్లుచు నా వదనంబు వీక్షించి 'ధన్యుండ వైతి; వమ్మహాత్ముండు నారాయణుండు; నీ వలని యనుగ్రహంబున సల్లాపసౌఖ్యంబుఁ బ్రసాదించెఁ; దపంబున నేక యోగసమాధి నవలంబించి యేను దన్నెఱుంగుటం గోరి యారాధించిన నాకు నీల, శ్వేత, పీతారుణ పింగళంబును బహూదర పాదపాణి శిరో నేత్రంబును నైన దివ్యగాత్రంబు సూపి, 'సంగంబు గల యంతరంగంబున న న్నెఱుంగ వచ్చునే;

నిస్సంగుండవై యెఱింగెదవు గాక!' యనియె; నట్టి యవ్విశ్వరూపునకు శాశ్వతపరిచర్య సేయంగల వాఁడ వగుటం గృతార్థతం బొందితి; బదరికాశ్రమంబున కరిగి యచ్చట సకల లోకసేవ్యుం డగు నా భవ్యమూర్తి సేవింపు' మని యానతిచ్చిన, నయ్యెడకు ముదంబునం బొదలుచుం బోయి. 354

ప్రతిపదార్థం: పలికి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడై పోయాడు; అంతన్= తర్వాత; సంతసంబున్= సంతోషం; అచ్చెరువున్= ఆశ్చర్యం; బెరయు= పెనగొను; మనంబుతోన్= మనస్సుతో; మదీయ= నా; జనకు పాలికిన్= తండ్రి దగ్గరకు; చని= పోయి; ఆ వృత్తాంతంబు= ఆ విషయం; ఎఱింగించినన్= చెప్పగా; అతండు= నాతండ్రి; వికసిల్లుచున్= సంతోషిస్తూ; నా వదనంబు= నా ముఖం; వీక్షించి= చూచి, ధన్యుండవు= అదృష్టవంతుడవు; ఐతివి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; నారాయణుండు= విష్ణువు; నీవలని= నీమీద, అనుగ్రహంబునన్= దయతో; సల్లాప= సంభాషణ; సౌఖ్యంబున్= సుఖం; ప్రసాదించెన్= అనుగ్రహించాడు; తపంబునను= తపస్సుతో; ఏకయోగసమాధిని= మిక్కిలి ఏకాగ్రత కల యోగసమాధిని; అవలంబించి= ఆధారంగా చేసికొని; ఏను= నేను; తన్నున్= తనను; ఎఱుంగుటన్+కోరి= తెలిసికొనాలన్న కోరికతో; ఆరాధించినన్= ఉపాసించగా; నాకున్, నీల= ఊదారంగు; శ్వేత= తెలుపు; పీత= పసుపు; అరుణ= ఎరుపు; పింగళంబును= వైడూర్యంరంగు కల; బహు= అనేక; ఉదర=పొట్టలు; పాద= కాళ్ళు; పాణి= చేతులు; శిరోనేత్రంబును+ఐన= శిరస్సులు కళ్ళు కల; దివ్యగాత్రంబు= దివ్యమైన శరీరాన్ని; చూపి= చూపించి; సంగంబు= రక్తి; కల; అంతరంగంబునన్= అంతఃకరణంతో; నన్నున్; ఎఱుంగవచ్చునే?= చూడగలవా?; నిస్సంగుండవు+ఐ= విరక్తి కలవాడవై; ఎఱింగెదవు గాక= తెలిసికొనగలవు; అనియెన్= అని అన్నాడు; అట్టి= అట్లాంటి; ఆ విశ్వరూపునకున్= లోకమే శరీరంగా కలవాడికి; శాశ్వత= నిత్యం; పరిచర్య= సేవ; చేయన్+కలవాఁడవు+అగుటన్= చేయగలిగే స్థితి పొందావు కనుక; కృత+అర్థతన్= ధన్యతను; పొందితి(వి)= పొందావు; బదరికా+ఆశ్రమంబునకున్= ఆ పేరుగల ఆశ్రమం (బదరి= రేగుచెట్లు! కల వనంలో ఉన్నందున ఆ పేరు వచ్చింది); అరిగి= పోయి; అచ్చటన్= అక్కడ; సకల లోక= లోకాలన్నిటికిని; సేవ్యుండు= పూజించదగినవాడు; అగు= ఐన; ఆ భవ్య= ఆ దివ్య; మూర్తిన్= రూపుడిని; సేవింపుము= పూజించుము; అని; ఆనతి= ఆజ్ఞ; ఇచ్చినన్= ఇవ్వగా; ఆ+ఎడకున్= ఆ చోటికి; ముదంబునన్= సంతోషంతో; పొదలుచున్= పొంగుతూ; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: అట్లా చెప్పి అదృశ్యుడు కాగా, నేను సంతోషం, ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరై పోయి వెళ్ళి, మా తండ్రిగారితో ఆ వృత్తాంతం చెప్పగా ఆయన నా ముఖం చూస్తూ, ఉల్లాసంతో 'నీవు అదృష్టవంతుడవయ్యా! ఆయన శ్రీమన్నారాయణుడు. నీమీద అనుగ్రహంతో నీ కా సంభాషణ ప్రసాదించాడు. సంతోషం. నేను ఏకభుక్తుడనై తపస్సు చేస్తే నీ కాయన నీలం, తెలుపు, ఎరుపు, వైడూర్యం (పిల్లి కళ్లకాంతి) రంగులు గల తన దివ్యమూర్తిని చూపించి అన్నాడు - 'నన్ను విరక్త బుద్ధితో చూడగలవు తప్ప లోకరక్తి గల మనస్సుతో చూడలేవు' అని. అట్లాంటి దివ్యమూర్తికి నిత్యం సేవ చేసే భాగ్యం నీకు కలిగింది. బదరికావనానికి పోయి ఆ స్వామిని సేవించుకొ' మ్మని ఆజ్ఞాపిస్తే, నేను సంతోషంతో వెళ్ళి.

సీ. అచట నారాయణు, నచ్యుతుహరిఁ బుండ । రీకాక్షుఁ, గోవిందు, లోకజనకుఁ
గని, భక్తిఁ బ్రణమిల్లి వినుతిసేయంగఁ, బీ । తాంబర కలితమై యష్టభుజము
శంఖ చక్రగదా సిశార్ఙ్గ ధరంబును । నైనరూపము దాల్చి యవ్విభుండు
సిఱునవ్వుతోడ 'వచ్చితి మేలు సేసితి । ర' మ్మంచుఁ దా నుత్తరంపుఁ దూర్పు

తే. దెసకు నల్లన పోవఁ బెంపెసఁగఁ గడఁగి । పాఱ వలయు; నా కెమ్మెయి బహుసహస్ర
యోజనంబులునని వితతోజ్జ్వలాగ్ని । యద్భుతముగ ననింధన మై వెలుంగ. 355

ప్రతిపదార్థం: అచటన్= బదరికాశ్రమంలో; నారాయణున్, అచ్యుతున్, హరిన్; పుండరీక+అక్షున్= పద్మంవంటి నేత్రాలు గలవాడిని; గోవిందున్; లోకజనకున్= లోకాలకు తండ్రిని; కని= చూచి; భక్తిన్= భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; వినుతిచేయంగన్= స్తుతించగా; పీత+అంబర= పచ్చని పట్టువస్త్రంతో; కలితము+ఐ= కూడినదై; అష్టభుజము= ఎనిమిది భుజాలు కలిగి; శంఖ= శంఖం; చక్ర= చక్రం, గదా= గద; అసి= కత్తి; శార్‌ఙ్గము= విల్లు; ధరంబును+ఐన= ధరించినదైన; రూపము= ఆకారం; తాల్చి= ధరించి; ఆ+విభుండు= ఆ ప్రభువు; చిఱు= చిన్న; నవ్వుతోడన్= నవ్వుతో; వచ్చితి(వి)= వచ్చావు; మేలు= మంచి; చేసితి(వి)= చేసావు; రమ్ము+అంచున్= రమ్మంటూ; తాను; ఉత్తరంపుఁ దూర్పు దెసకున్= ఈశాన్య దిక్కునకు; అల్లన= నెమ్మదిగా; పోవన్= పోగా; పెంపు= ఆధిక్యం; ఎసఁగన్= ఎక్కువ కాగా; కడఁగి= ప్రయత్నంతో; నాకున్= నాతో; పాఱవలయున్= పరుగెత్తాలి; బహు= అనేక; సహస్ర= వేల; యోజనంబులు= ఆమడలు; అని; వితత= విస్తారమైన; ఉజ్జ్వల= వెలిగే; అగ్ని= నిప్పు; అద్భుతముగన్= ఆశ్చర్యంగా; అనింధనము+ఐ= ఇంధనం (కట్టె) లేకుండా; వెలుంగన్= ఆ అగ్ని వెలుగగా. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: అక్కడ అచ్యుతుడు, పద్మాక్షుడు, గోవిందుడు సర్వలోకాలకు తండ్రి అయిన శ్రీమన్నారాయణుడికి భక్తితో నమస్కరించి స్తుతించగా ఆయన పీతాంబరం, ఎనిమిది భుజాలలో, శంఖ చక్ర గదా ఖడ్గ శార్‌ఙ్గములను దాల్చిన రూపముతో, చిరునవ్వుతో ఇట్లా అన్నాడు. 'మంచిది వచ్చావు. నాతో రమ్ము! అంటూ ఈశాన్య దిక్కునకు పోయాడు. నేనూ ఆయన వెంటనంటి అనేక వేలయోజనాలదూరం పరుగెత్తవలసి ఉంటుందని భావించాను. ఎదురుగా ఒక మహాద్భుతమైన అగ్ని కట్టెలు లేకుండా మండుతున్నది.

వ. కని, యప్పావకుం బావకద్యుతి యగు నమ్మహాయోగి ప్రవేశించి, యందు శివాసహితుం డై శివుండు దపంబుసేయఁ దదీయ సంవిత్సౌఖ్యం బనుభవించి, యయ్యనలంబు గడచి యరుగుచుండ, నేనును బథిశ్రమాభిభూతుండ నగుచు విడువక వెనుకఁ బోవు చుండితి; నిట్లు మఱియునుం బెద్దయు దవ్వు సని యద్దేవుండు భాస్కరకిరణంబులకుం బ్రవేశంబు లేని మహాతమంబు సొచ్చె; నచ్చటం జూడ్కిసెడి మూఢత్వంబు నొంది. 356

ప్రతిపదార్థం: కని= చూచి; ఆ+పావకున్= ఆ అగ్నిదేవుడిని; పావక ద్యుతి+అను= అగ్నివంటి కాంతికలిగిన; ఆ+మహాయోగి= ఆ మహాయోగమూర్తి (విష్ణువు); ప్రవేశించి= అగ్నిలోచొచ్చి; అందున్= ఆ అగ్నిలో; శివా= పార్వతితో; సహితుండు+ఐ= కూడినవాడై; శివుండు= ఈశ్వరుడు; తపంబుచేయన్= తపస్సు చేస్తూ ఉండగా; తదీయ= దానికి సంబంధించిన; సంవిత్= జ్ఞానం; సౌఖ్యంబు= సంతోషం (శివుని తపస్సు చూస్తూ జ్ఞానానందాన్ని పొంది); ఆ+అనలంబున్= ఆ అగ్నిని; కడచి=దాటి; అరుగుచుండన్= పోతూ ఉండగా; నేనునున్= నేనుకూడా; పథిశ్రమ= మార్గశ్రమతో; అభిభూతుండను= అలసట పొందినవాడను; అగుచున్; విడువక= వదలక; వెనుకన్= వెన్నంటి; పోవుచుండితిన్= పోతూనే ఉన్నాను; ఇట్లు= ఈ విధంగా; మఱియునున్= ఇంకా; పెద్దయున్‌దవ్వు= చాలా దూరం; చని= పోయి; ఆ+దేవుండు= ఆ భగవంతుడగు విష్ణువు; భాస్కర= సూర్యుడి; కిరణంబులకున్= కిరణాలకున్నూ; ప్రవేశంబు లేని= దూరటానికి వీలుకాని; మహాతమంబు= గొప్ప చీకటిలోనికి; చొచ్చెన్= ప్రవేశించాడు; అచ్చటన్= అక్కడ; చూడ్కి= చూపు; చెడి= చెడిపోయి; మూఢత్వంబును+ఒంది= దారి తెన్నూ తెలియనివాడనై.

తాత్పర్యం: అగ్నివంటి ఆ మహాయోగి అగ్నిలో ప్రవేశించాడు. అక్కడ పార్వతీ సహితుడై శివుడు తపస్సు చేస్తున్నాడు. అది చూచి జ్ఞానసౌఖ్యం పొంది, ఆ అగ్నిని దాటి పోతున్నాడు స్వామి. నేను మార్గాయాసం లెక్క చేయక వెనకనే పోతున్నాను. ఈ విధంగా పోయి పోయి సూర్యకిరణాలు కూడా ప్రవేశించ వీలులేని అంధకారంలోనికి ప్రవేశించేసరికి, నాకు దిక్కు తెన్ను తెలియక. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఆ దేవుఁ జిత్తమున నిడి । 'యాదిపురుష! కరుణ నన్ను నరయు; మెచటికో
యేది గతియొ నా?' కనఁగా । 'నీ దెస ర' మ్మనుచుఁ దీపుటెలుఁగుం జూపెన్. 357

ప్రతిపదార్థం: ఆ దేవున్= ఆ స్వామిని; చిత్తమునన్= బుద్ధిలో; ఇడి= పెట్టుకొని; ఆదిపురుష!= సృష్టికి మొదలైనస్వామీ!; కరుణన్= దయతో; నన్నున్; అరయుము= చూడుము; ఎచటికో= ఈ ప్రయాణ మెక్కడకు; ఏది గతియో= ఏది దిక్కో; నాకున్?; అనఁగాన్= అనేసరికి; ఈ దెస= ఈ దిక్కునకు; రమ్ము; అనుచున్; తీపు+ఎలుఁగు= ఒక తీయని కంఠస్వరాన్ని; చూపెన్= ప్రదర్శించాడు.

తాత్పర్యం: ఆ దేవుడినే మనస్సులో పెట్టుకొని 'ఆదిపురుషా! (పరమాత్మా!) ఈ ప్రయాణం ఎక్కడికో తెలియదు. నా కేది గతి?' అనేసరికి ' ఈ దెసకు రమ్ము!' అన్న ఒక తీయని కంఠధ్వని వినిపించింది.

క. మది ఖేదము, మై దప్పియుఁ । గదిరిన నే శరణు వేఁడఁగా దమ మెల్లం
దుది వోయి లేక తక్కెను । హృదయానందకర మైన యెడయై యుండెన్. 358

ప్రతిపదార్థం: మదిన్= మనస్సులో; ఖేదము= దైన్యం; మైన్= శరీరంలో; దప్పియున్= దప్పిక, ఆయాసం; కదిరినన్= కలుగగా; నేన్= నేను; శరణు వేఁడఁగాన్= ఆశ్రయం కోరగా; తమము+ఎల్లన్= చీకటిఅంతా; తుదిన్= చివరకు; పోయి= అంతరించి, నశించి; లేక= కొంచెమూ మిగలక; తక్కెను= లోపించింది; హృదయ+ఆనందకరము=హృదయానికి ఆనందాన్ని కల్గించిన; ఎడయై= సమయమై; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: మనస్సులో దుఃఖం, శరీరంలో శ్రమ కలిగేసరికి నేను శరణు కోరాను. ఆ చీకట్లన్నీ కొంచెం కూడా మిగలకుండా అంతరించాయి. ఆ సమయ మెంత ఆనందాన్ని కల్గించిందో చెప్పలేను.

తే. పట్టపగలింటి సూర్యుని పగిది నతఁడు । దోఁచెఁ సూర్యేందు తారక ద్యుతుల కచటు
గోచరము గాదు; దేవతాకోటి యాది । యైన జంతువులకు నగమ్యస్థలంబు. 359

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భగవంతుడు; పట్టపగలింటి= పట్టపగటియందలి; సూర్యుని పగిదిన్= సూర్యుడివలె; తోఁచెన్= వెలుగుతున్నాడు; తారక= నక్షత్ర; ద్యుతులకున్= కాంతులకు; అచటు= ఆ స్థలం; గోచరము కాదు= కన్పించదు; దేవతాకోటి= దేవతల సమూహం; ఆది= మొదలు, ఐన= కాగల; జంతువులకున్= జీవులకు; అగమ్య స్థలంబు= పోరానిచోటు.

తాత్పర్యం: ఆయన మిట్టమధ్యాహ్నం సూర్యుడివలె వెలుగుతున్నాడు. చుక్కల కాంతుల కా చోటు కన్పించదు. దేవతలు మొదలైన జీవులకు పోరానిచోటు.

క. దుందుభి నిస్వనములు, నా । నందనమృదుమధుర గీతనాదములుఁ జెవిం
బొందె మకరందబిందు । స్యంది కమల సుభగ నదులు నచ్చటఁ దోఁచెన్. 360

ప్రతిపదార్థం: దుందుభి= భేరుల; నిస్వనములు= ధ్వనులు; ఆనందన= ఆనందంతో; మృదు= మెత్తని; మధుర= తీయని; గీత= పాటల; నాదములు= ధ్వనులు; చెవిన్= చెవులను; పొందెన్= పొందాయి; మకరంద= తేనె; బిందు= బొట్లు; స్యంది= స్రవించే; కమల= తామరపూలతో, సుభగ= అందమైన; నదులును= ఏరులుకూడా; అచ్చటన్= అక్కడ; తోఁచెన్= కన్పించాయి.

తాత్పర్యం: భేరీ నినాదాలు ఆనందంతో నిండిన మెత్తని తీయనిపాటల సంగీతాలూ వినిపించాయి. తేనెను స్రవించే తామరపూలతో అందమైన నదులూ అక్కడ వెలిశాయి.

క. సురలకు నిమ్మెయిఁ దేజ । స్స్ఫురణము లేదన్న యట్టిపొలుపున వెలుఁగన్
నరులం గొందఱఁ గాంచితి । దరుణులనుం గంటి నద్భుతతమాకృతులన్. 361

ప్రతిపదార్థం: సురలకున్= దేవతలకు కూడా; ~~ఈ~~+మెయిన్= ~~ఈ~~ విధంగా; తేజఃస్ఫురణము= కాంతి ప్రకాశం; లేదన్న అట్టి= లేదు అనిపించే; పొలుపునన్= అందంతో; వెలుఁగన్= ప్రకాశించే; నరులన్= మనుష్యులను; కొందఱన్= కొంతమందిని; కాంచితిన్= చూచాను; అద్భుతతము= మిక్కిలి విచిత్రమైన; ఆకృతులన్= ఆకారాలు కల; తరుణులనున్= ఆడవారిని కూడా; కంటిన్= చూచాను.

తాత్పర్యం: దేవతలకు కూడా ఇట్లాంటి తేజస్సు లేదనిపించే మగవారినీ, ఆశ్చర్యకరమైన రూపవతులు కొందరు స్త్రీలనూ చూచాను.

తే. వారు పూజ లొనర్పంగ గారవంపుఁ । జూడ్కి నద్దేవుఁ డందఱఁ జూచు చరిగె;
మఱియు నట తత్ప్రదేశంబు మహితవహ్ని । మయతఁ జేసి భయంకర మయి వెలింగె. 362

ప్రతిపదార్థం: వారు= ఆ స్త్రీ పురుషులు; పూజలు+ఒనర్పంగన్= పూజలు చేయగా, ఆ+దేవుఁడు= ఆ భగవంతుడు; గారవంపు= ముద్దుచేసే; చూడ్కిన్= చూపుతో; అందఱన్= అందరినీ; చూచుచున్= చూస్తూ; అరిగెన్= వెళ్ళాడు; మఱియున్= ఇంకా; అటన్= అక్కడ; తత్ప్రదేశంబు= ఆ చోటు; మహిత= దివ్యమైన; వహ్నిమయతన్+చేసి= అగ్నిమయమైన కారణంగా; భయంకరము+అయి= భయము కొల్పుతూ; వెలింగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: వారంతా పూజిస్తూ ఉండగా, ఆ స్వామి వారిని వాత్సల్యంతో చూస్తూ వెళ్ళాడు. ఆ ప్రదేశమంతా అగ్నిమయంగా ఉన్నందున భయంకరంగా వెలిగిపోయింది.

వ. అచ్చట నే నతనిం గానక. 363

ప్రతిపదార్థం: అచ్చటన్= పైన వర్ణించిన తేజోమయలోకంలో; నేను; అతనిన్= భగవంతుని; కానక= చూడలేక.

తాత్పర్యం: అక్కడ నేను అతడిని చూడలేక.

క. భ్రమ గొని యద్దేవునిఁ జి । త్తమునం దిడి 'శరణు శరణు, దయఁ గావుము' న
న్న మితైశ్వర్య ! యనుడు శీ । తమధుర లలితాక్షరముగఁ దా నిట్లనియెన్. 364

ప్రతిపదార్థం: భ్రమకొని= భ్రాంతిపడి; ఆ+దేవునిన్= ఆ స్వామిని; చిత్తమునందున్= మనస్సులో; ఇడి= పెట్టుకొని; అమిత= అమితమైన; ఐశ్వర్య!= సంపద కలవాడా!; (ఈశ్వర!= ఈశ్వరత్వం కలవాడు) ఈశ్వరత్వమంటే సర్వాధికారం - సంపద - శాసించే శక్తి అని అర్థం); శరణు= దిక్కు నీవే; దయన్= దయతో; నన్నున్; కావుము= రక్షించుము; అనుడున్=అనగా; శీత= చల్లని; మధుర= తీయని; లలిత= కోమలమైన; అక్షరముగన్= అక్షరాలు కల మాటలతో; తాను= భగవంతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: నాకు భ్రాంతి కలిగి దిక్కు తోచక ఆ స్వామిని మనస్సులో నుంచుకొని శరణని ప్రార్థించేసరికి ఆయన చల్లగా మధురంగా కోమలంగా ఇట్లా అన్నాడు.

క. 'నిను నే మఱతునె? నీదగు । జనకునిచే నన్ను విని సుసంగతమతివై
చనుదెంచు టే నెఱుంగనె? వినతాసుత! యిందు రమ్ము, విడువుము భయమున్. 365

ప్రతిపదార్థం: వినతాసుత!= వినతా కుమారా!; నినున్= నిన్ను; నేన్= నేను; మఱతునె?= మరిచిపోతానా?; నీదగు= నీ యొక్క; జనకునిచేన్= తండ్రివలన; నన్నున్ విని= నన్ను గురించి విని; సుసంగతమతివి+ఐ= నాయందు చక్కగా లగ్నమైన మనస్సుగలవాడవై; చనుదెంచుట= రావటం; ఏన్= నేను; ఎఱుంగనె?= ఎరుగనా? ఇందున్ రమ్ము= ఇట్లా రమ్ము; భయమున్ విడువుము= భయాన్ని విడిచిపెట్టుము.

తాత్పర్యం: 'వినతాకుమారా! నిన్ను నేను మరచిపోతానా? నీ తండ్రివలన నన్ను గురించి విని నా దర్శనం కొరకు వచ్చావుకదా! భయం దేనికి? ఇట్లా రమ్ము.

వ. నన్నుం గానమికిం గలంక వలవదు. 366

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; కానమికిన్= చూడకపోవటం వలన; కలంక= దుఃఖం; వలవదు= వద్దు.

తాత్పర్యం: నన్ను చూడలేనందుకు కలత పడవద్దు.

క. మమకారాహంకారము । ల మతిం జొరనీక, నిశ్చలంబగు చూడ్కిన్
సమవేతరూపు నన్నున్ । శమభరితాత్మకులు గంద్రు సారవిచారా! 367

ప్రతిపదార్థం: సార విచారా!= సారవంతమైన ఆత్మ వివేకం కలవాడా!; మమకార= నా దనే వ్యామోహం; అహంకారములన్= నేను అనే గర్వం; మతిన్= మనస్సులో; చొరనీక= ప్రవేశించనివ్వక; నిశ్చలంబు+అగు= చలించని, ఏకాగ్రమైన; చూడ్కిన్= చూపుతో; సమవేతరూపున్= విశ్వరూపుడనైన; నన్నున్= నన్ను; శమ= శాంతి; భరిత= నిండిన; ఆత్మకులున్= ఆత్మకలవారు; కంద్రు= చూస్తారు.

తాత్పర్యం: ఆత్మ విచారణ కలవాడా! మమకారం, అహంకారం మనస్సులో ఏమాత్రం ప్రవేశించనివ్వకుండా, ఏకాగ్రమైన చూపుతో విశ్వస్వరూపుడను, సర్వాత్ముడను ఐన నన్ను శాంతి నిండిన ఆత్మకలవారు చూస్తారు.

తే. నీవు నామీఁది వేడుక నెఱయ నిష్ఠ । తోడఁ దలఁచుట మామక స్థూలరూప
దర్శి వై యుండు; దని నన్ను దయదలిర్ప । గారవించిన ననలంబు క్రందు వాసె. 368

ప్రతిపదార్థం: నీవు; నామీఁది= నాపైన; వేడుక= కోరిక; నెఱయన్= నిండుగా; నిష్ఠతోడన్= నియమంతో; తలఁచుట= భావించటం; మామక= నాదైన; స్థూలరూప= బాహ్యరూపాన్ని; దర్శివి= చూచేవాడివి; ఐ ఉండుదు+అని= ఐ ఉంటావని; నన్నున్= నన్ను; దయ తలిర్పన్= దయ చిగురించగా; గారవించినన్= మన్నించగా; అనలంబు= అగ్ని సంబంధమైన; క్రందు= బాధ; పాసెన్= పోయింది.

తాత్పర్యం: నీవు నిష్ఠతో నన్ను భావించటంవలన నా స్థూలరూప దర్శనం కలవాడివై ఉండగల' వని దయతో చెప్పేసరికి అగ్ని వేడి బాధ ఉపశమించింది.

వ. ఇవ్విధంబున సుఖిం జేసి నను గొలిపించుకొని మఱియు దవ్వుసని యాకాశంబున కెగసిన నేనుం దోన తగిలిపోవ నంతర్ధానంబు సేసె; నిట రమ్మను నెలుంగ యాధారంబుగా నా చక్కటికిం బోయి. 369

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; సుఖిన్+చేసి= నన్ను సుఖపడేటట్లు చేసి; ననున్= నన్ను; కొలిపించుకొని= సేవించుకొనేటట్లు చేసి; మఱియున్= ఇంకా; దవ్వు= దూరం; చని= వెళ్ళి; ఆకాశంబునకున్= మింటిపైకి; ఎగసినన్= ఎగిరిపోగా; నేనున్= నేను కూడా; తోన= వెన్నంటి; తగిలి= అంటుకొని; పోవన్= పోగా; అంతర్ధానంబు చేసెన్= అదృశ్యుడై పోయాడు; ఇటన్= ఇక్కడకు; రమ్ము= రా; అను= అన్న; ఎలుంగు+అ= కంఠధ్వనియే; ఆధారంబుగాన్= ఆశ్రయంగా, ఊతగా; ఆ చక్కటికిన్+పోయి= ఆ ప్రదేశానికి వెళ్ళి.

తాత్పర్యం: ఈ రకంగా నన్ను సుఖపెట్టి నా సేవ లందుకొని ఇంకా దూరంపోయి ఆకాశాని కెగిరి అదృశ్యుడు కాగా, నేను కూడా వెంబడించి 'ఇలా రా' అన్న మాటనే ఆధారంగా గ్రహించి ఆ ప్రదేశానికి వెళ్ళాను.

క. కమనీయహంస కుల సం । గమశోభిత మైన యొక్క కమలాకరముం
బ్రమదమున దాన నవగా । హము సేయుచునున్న తన్ను నచటం గంటిన్. 370

ప్రతిపదార్థం: కమనీయ= అందమైన; హంసకుల= అంచల గుంపుయొక్క; సంగమ= కలయికతో; శోభితము+ఐన= సుందరమైన; ఒక్క; కమల+ఆకరమున్= తామరపూలకు నిలయమైన చెరువును; ప్రమదమునన్= సంతోషంతో; దానన్= దానియందు; అవగాహము= స్నానం; చేయుచున్+ఉన్న= చేస్తున్న; తన్నున్= తనను; అచటన్= అక్కడ; కంటిన్= చూచాను.

తాత్పర్యం: అందమైన హంసల గుంపులు చేరటం చేత మరీ అందంగా ఉన్నట్టిదీ, తామరపూలతో అందమైనదీ అయిన చెరువునూ, తా నొక్కడే అందులో స్నానం చేస్తున్న భగవంతుడినీ చూచాను.

క. నా దిక్కు కనుంగొని, తా । నాదరమునఁ బిల్చె; నేను నచటికిఁ జని యం
దాదేవునిఁ గానమికి వి । షాదం బందుమదితోడఁ జంచల దృష్టిన్. 371

ప్రతిపదార్థం: నా దిక్కు= నా వైపు; కనుంగొని= చూచి; తాను; ఆదరమునన్= ఆదరంతో; పిల్చెన్= పిలిచాడు; నేనున్; అచటికిన్; చని; అందున్= అక్కడ; ఆ దేవునిన్= ఆ భగవంతుడిని; కానమికిన్= చూడలేక పోవటంవలన; విషాదంబు= దుః ఖం; అందు= పొందు; మదితోడన్= మనస్సుతో; చంచల= చలించే; దృష్టిన్= చూపుతో.

తాత్పర్యం: నా వైపు చూచి ప్రేమతో పిలిచినందువలన వెళ్ళగా, ఆయన కన్పించలేదు. నేను దుఃఖంతో వెతికే చూపులతో (తరువాతి పద్యంతో అన్వయం)

చ. కలయఁగఁ జూడ నద్భుతము గాఁగ ననేక శతాగ్నిహోత్రముల్
వెలుఁగుట గానవచ్చె, బహువేదరవంబులు వింటిఁ, దత్ప్రవ
క్తలఁ బొడగాన, నట్టియెడ దారుణరూప సుపర్ణ సంఘముల్
బలువిడి నాపయిం; గవిసెఁ; భ్రాంతుఁడ నైతి భయంబు పెంపునన్. **372**

ప్రతిపదార్థం: కలయఁగన్= అంతటా; చూడన్= చూడగా; అద్భుతము= చిత్రం; కాఁగన్= కాగా; అనేక= ఎన్నో; శత= వందల; అగ్నిహోత్రముల్= అగ్నిహోత్రాలు; వెలుఁగుట= ప్రకాశించటం; కానన్ వచ్చెన్= కన్పించాయి; బహు= అనేక; వేద రవంబులు= వేదధ్వనులు; వింటిన్= విన్నాను; తత్ ప్రవక్తలన్= ఆ వేద మంత్రాలు చదివిన వారిని; పొడగానన్= దర్శించలేదు; అట్టి+ఎడన్= అట్లాంటి సమయంలో; దారుణ= క్రూరమైన; సుపర్ణ= గరుత్మంతుల; సంఘముల్= సమూహాలు; బలు విడి= హఠాత్తుగా; నాపయిన్= నామీద; కవిసెన్= దూకాయి; భయంబు= భయముయొక్క; పెంపునన్= అతిశయంచేత; భ్రాంతుఁడన్+ఐతిన్= ఏమీ చేయలేని మూఢుడ నయ్యాను

తాత్పర్యం: అంతటా కలయజూస్తే అనేకవందల అగ్నిహోత్రాలు వెలిగాయి. ఎవరూ కనిపించకుండా అనేక వేదమంత్రాలు చదివిన ధ్వనులు వినిపించాయి. అట్లాంటి సమయంలో క్రూరమైన గరుత్మంతుల గుంపులెన్నో ఒకేసారి నా పయికి హఠాత్తుగా విజృంభించాయి. నేను భయభ్రాంతుడనయ్యాను.

ఆ. అట్లు భయముఁ బొంది, 'యచ్యుత! శివ! సహ! స్రాక్ష! వేదమయ!, యనాదినిధన!
త్రిభువనైకనాథ! త్రినయన! గోవింద! పద్మనాభ! హర! కృపావిధేయ! **373**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; భయమున్= భీతిని; పొంది= చెంది; అచ్యుత!= (పరమాత్మ స్థితినుండి) చ్యుతి (భ్రష్టత) లేనివాడా!; శివ!= మంగళరూపుడా!; సహస్ర+అక్ష!= వేయి కనులు కలవాడా!; వేదమయ!= వేదమూర్తీ!; అనాదినిధన!= (న+ఆది+నిధన)= చావు పుట్టుకలు లేనివాడా!; (ఆది= మొదలు; జన్మ!; నిధన= మరణం; న= లేనివాడా); త్రిభువన= ముల్లోకాలకు; ఏక= ఏకైక; నాథ!= పతీ!; త్రినయన= మూడు కన్నులు కలవాడా!; గోవింద!= గోవులను కాపాడేవాడా!; (గో అంటే శబ్దం, కిరణం - అని అనేక అర్థాలు. కనుక గోవిందుడంటే సూర్యుడనీ అర్థం); పద్మనాభ!= తామరపువ్వు బొడ్డులో ఉన్నవాడా! (అందులో నుండే బ్రహ్మ పుట్టి సృష్టి చేస్తున్నాడని పురాణగాథ; పద్మమంటే కంటికి కన్పించే ప్రకృతి= విశ్వం. అంతా. దానికి కేంద్ర బిందువుగా - చక్రానికి ఇరుసువలె ఉండేవాడని అర్థం); హర!= హరించేవాడా!= (ప్రళయం చేసేవాడా!); కృపా విధేయ!= దయకు లోబడినవాడా! (దయ కలవాడా!)

తాత్పర్యం: ఆ విధంగా భయపడి 'అచ్యుతా! శివా! సహస్రాక్షా! వేదమయా! అనాదినిధనా! త్రిభువనైకనాథా! త్రినయన! గోవింద! పద్మనాభ! హర! కృపావిధేయ!'

విశేషం: ఇది వైదిక స్తోత్రం. పురాణస్తోత్రం కాదు. స్తుతింపబడేది విష్ణువైనా, శివ, సహస్రాక్ష (ఇంద్రుడు) త్రినయన - అనే నామాలు వాడటం వలన ఇక్కడ శబ్దాల కున్న అర్థాలే ప్రధానం తప్ప పైన వ్రాసిన విధంగా, తర్వాత వచ్చిన మతాల ప్రకారం, పురాణాల ప్రకారం - శివుడు, పద్మనాభుడు వేరు దేవతలు కారు. ఎట్లాగంటే మూడవకన్ను యోగనేత్రం. అది సాధన చేస్తే ఎవరికైనా లభించే దివ్యదర్శన శక్తి. యోగి కూడా త్రినయనుడే. కనుక ఈ సమన్వయం కొరకు కవి ఇట్లా వ్రాశాడు.

క. అని మఱియుఁ, బెక్కు పేళ్ళన్, । వినుతించుచు, శరణు వేఁడి వినత శిరస్కుం
డును, ముకుళీకృత హస్తుం । డును నై యే నుండ దేవుఁడు ప్రసాదమునన్. 374

ప్రతిపదార్థం: అని= అట్లా స్తుతించి; మఱియున్= ఇంకా; పెక్కు= అనేకమైన; పేళ్ళన్= పేర్లతో; వినుతించుచున్= స్తుతిస్తూ; శరణువేఁడి= శరణుకమ్మని ప్రార్థించి; వినత= వంగిన; శిరస్కుండును= తల కలవాడును; ముకుళీకృత= ముడిచిన; హస్తుండును= చేతులు కలవాడును; ఐ= అవుతూ; ఏన్= నేను; ఉండన్= ఉండగా; దేవుఁడు= స్వామి; ప్రసాదమునన్= ప్రసన్నతతో.

తాత్పర్యం: ఇట్లా ఎన్నో నామాలతో స్తుతించి తలవాల్చి, దోసిలొగ్గిన నన్ను చూచి స్వామి దయతో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అని మఱియుఁ బెక్కు పేళ్ళన్= సహస్రనామాలు. ఈ మాట తిక్కనగారి అనువాద పద్ధతిని తెలియచేస్తుంది. ఈ ఘట్టమంతా ఉత్తరదేశప్రతులలో లేదు. కుంభకోణ ప్రతిలోనే ఉన్నది. మూలంలో సహస్రనామాలు(శివ, విష్ణు) వాటిని తెలుగులో వ్రాయటానికి వీలులేదు కనుక తిక్కనగారు మక్కికి మక్కి అనువదించలేదు. కనుక మూలంలో ఎన్నో నామాలుంటే వాటిలో ప్రధానమైనవి తీసికొని వ్రాస్తున్నాను - అనటానికి సూచన 'పెక్కు పేళ్ళు'.

క. తనుఁ జూపి, 'యోడ కోడకు । వినతాసుత!' యనియె నపుడు వినుఁడే మొదలం
గనిన బదరికాశ్రమ మ । య్యె నచటు విష్ణుని ప్రభావ మేమనవచ్చున్! 375

ప్రతిపదార్థం: తనున్= తనను; చూపి= కన్పింపచేసి; వినతాసుత!= వినత కొడుకా!; ఓడకు+ఓడకు= భయపడకు భయపడకు; అనియెన్= అన్నాడు; అపుడు= ఆ సమయంలో; వినుఁడు= వినండి (ఒక తమాషా); ఏన్=నేను; మొదలన్= మొదట; కనిన= చూచిన; బదరికాశ్రమము= రేగుచెట్ల గుంపులలోని (పూరి గుడిసె) ఆశ్రమం; అయ్యెన్= ఐనది; అచటు= ఆ స్థలం; విష్ణుని ప్రభావము= విష్ణువు మహత్త్వం; ఏమనవచ్చున్!= ఎంతని పొగడగలము!

తాత్పర్యం: అప్పు డాయన కన్పించి 'భయపడవద్దయ్యా! వినతాసుత!' అన్నాడు. అప్పు డాస్థలం నేను మొదట చూచిన బదరికాశ్రమమే. ఎంత విచిత్రమో! ఆ భగవంతుడి లీల నెవ్వడు కొనియాడగలడు?

ఉ. అ ప్పరమేశ్వరుండు లలితాష్టభుజం బగు రూపుఁ దాల్చి, తా
నెప్పటియట్ల నిల్చెఁ; గని యేను మనంబున నద్భుతంబుతో
ముప్పిరి యైన కౌతుకము మోదము నెక్కొన, నాకు సత్కృపం
జెప్పెడుఁ, గాక యెట్లు నని చేరితి నంజలి మౌళిఁ జేర్చుచున్. 376

ప్రతిపదార్థం: అ+పరమేశ్వరుండు= ఆ మహాదేవుడు; లలిత= కోమలములైన; అష్టభుజంబు= ఎనిమిది చేతులు కల; రూపున్= ఆకారాన్ని; తాల్చి= ధరించి; తాన్= తాను; ఎప్పటిఅట్ల= ఎప్పటివలెనే; నిల్చెన్= నిలబడ్డాడు; కని= చూచి; ఏనున్= నేను కూడా; మనంబునన్= మనస్సులో; అద్భుతంబుతోన్= ఆశ్చర్యంతో; ముప్పిరి+ఐన= మూడు పేటలుగా పెనవేసికొన్న; కౌతుకము= కుతూహలం; మోదము= సంతోషం; నెక్కొనన్= ఎక్కువ కాగా; నాకున్; సత్కృపన్= చక్కని దయతో; చెప్పెడున్+కాక!= తప్పక చెప్పగలడు; ఎట్లున్= ఎట్లాగైనా సరే!; అని= అనుకొంటూ; అంజలిన్= దోసిలిని; మౌళిన్= తలపై; చేర్చుచున్= చేరుస్తూ; చేరితిన్= ఆయన దగ్గరకు చేరాను.

తాత్పర్యం: ఆ మహాస్వామి ఎనిమిది చేతులతో కనిపించాడు. నేను ఆశ్చర్యపోయాను. నాకు కుతూహలమూ, సంతోషమూ ముప్పిరిగొన్నాయి. దయతో తన స్వరూపం ఎట్లాగూ తెలియచేస్తా డీ స్వామి అనుకొంటూ తలపై చేతులు మోడ్చి ఆయన దగ్గరకు చేరాను.

వ. చేరి వినయావనతుండ నయి 'దేవా! యేను భవత్పాద భక్తుండనేని నీ దయకు భాజనంబనేని నాకు వినందగునేని దురధిగమసారంబైన భవదీయప్రకారం బిట్టిదని యెఱుంగు నట్లుగాఁ జెప్పవే' యనిన నా సర్వలోక శరణ్యుండు గారుణ్యామృత మయం బైన చూడ్కి నామీఁద నొలయ నిట్లనియె. 377

ప్రతిపదార్థం: చేరి= సమీపించి; వినయ+అవనతుండన్+అయి= వినయంతో తలనువంచినవాడనై; దేవా!= స్వామీ!; ఏను= నేను; భవత్= తమ; పాదభక్తుండను= పాదాలపై భక్తి కలవాడను; ఏనిన్= అయితే; నీదయకున్; భాజనంబను= పాత్రుడను; ఏనిన్= ఐతే; నాకున్, వినన్ తగునేని= వినటానికి అర్హతుంటే; దుర్+అధిగమ= కష్టంతో పొందదగిన; సారంబు+ఐన= సారముగలదైన; భవదీయ= తమ; ప్రకారంబు= పద్ధతి; ఇట్టిది+అని= ఇట్లాంటిదని; ఎఱుంగునట్లుగాన్= తెలిసేటట్లుగా; చెప్పవే= అనుగ్రహించవే; అనినన్= అనగా; ఆ; సర్వలోక= అన్ని లోకాలకు; శరణ్యుండు= శరణని చేరదగినవాడు; కారుణ్యా= దయ అన్న; అమృతమయంబు= అమృతంతో నిండిన; చూడ్కిన్= చూపుతో (దయ అన్న అమృతం వర్షించే చూపు); నామీఁదన్= నాపయి; ఒలయన్= వ్యాపించగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా దగ్గరకు పోయి 'స్వామీ! నేను నీకు భక్తుడనైతే, నీ దయకు పాత్రుడనైతే, వినే అర్హత నాకుంటే, తపస్సుచేతకాని పొందలేని నీ సారవంతమైన తత్త్వం నాకు బోధించవా?' అని వేడికొనగా, ముల్లోకాలకూ ఆశ్రయమైన ఆ స్వామి దయామృతాన్ని వర్షిస్తూ నన్ను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం)

విష్ణుదేవుఁడు గరుత్మంతున కుపదేశించిన యాత్మతత్త్వ ప్రకారము (సం.13-43-1 (కుంభ))

సీ. 'అనిమిష గంధర్వదనుజు లాదిగ నెవ్వ । రును విను, నాయున్న రూ పెఱుంగ;
రఖిలభూతములు నాయం దుద్భవించు, వ । ర్తించు, లయించు, వర్తింప నేను
వాని వశంబున వసియింతు సర్వంబు । నందును, నాతత్త్వ మధిగమింప
నగు నగ్ని యాత్మ సమాహితంబుగఁ జేయఁ । గామవర్జిత మహంకారవిముఖ

తే. మజడ, మపరిగ్రహం బహింసానుమోది । క్రోధరహితంబు నిర్మలబోధయుతము
నిత్యతృప్తంబు, శాంతంబు, సత్యభక్తి । యైన చిత్తంబు గల నియతాత్మకులకు. 378

ప్రతిపదార్థం: విను= (రహస్యం చెప్పుతున్నాను జాగ్రత్తగా) వినుము; అనిమిష= రెప్పపాటు లేనివారు, దేవతలు; గంధర్వ= గంధర్వులు; దనుజులు= రాక్షసులు; ఆదిగన్= మొదలుగా; ఎవ్వరును= ఎవ్వరు కూడా; నా= నా యొక్క; ఉన్నరూపు= కల స్వరూపం; ఎఱుంగరు= తెలిసికొనలేరు; అఖిలభూతములు= సమస్త జీవరాసులు; నాయందున్= నాలో; ఉద్భవించున్= పుట్టుతాయి; వర్తించున్= బ్రతుకుతాయి; లయించున్= చస్తాయి; నేను వర్తింపన్= నేను మాత్రం ఈ సంసారచక్రంలో జన్మమృత్యురూపంలో తిరగటం లేదు; వానివశంబునన్= వాటికి లోబడి; సర్వంబునందునన్= అన్నింటిలో; వసియింతున్= నివసిస్తాను; నా తత్త్వము= నా స్వరూపం; అధిగమింపన్= పొందటానికి; అగు= ఔనట్టి మార్గం; అగ్నిన్= అగ్నితత్త్వాన్ని (దీన్ని

గురించి వేదం అనంతంగా వర్ణించింది); ఆత్మన్= తనలో; జీవుడిలో; సమ+ఆహితంబుగన్ చేయన్= సన్నిహితం చేసికొంటే; కామవర్జితమున్= కామంలేనిదీ; అహంకార= నేనన్న భావనకు; విముఖము= విరుద్ధమైనది; అజడము= జడంకానిది (కదిలేది); అపరిగ్రహంబు= దానంగా ఏదీ స్వీకరించనిది; అహింసా= హింస లేకపోవటాన్ని; అనుమోది= అంగీకరించేదీ; క్రోధరహితంబున్= కోపం లేనిదీ; నిర్మల= స్వచ్ఛమైన; బోధయుతము= జ్ఞానంతో కూడుకొన్నదీ; నిత్య= ఎల్లప్పుడూ; తృప్తంబు= తృప్తి కలదీ; శాంతంబు= శాంతి స్వరూపమైనదీ; సత్య= నిజమైన; భక్తిఐన చిత్తంబున్= భక్తి కల మనస్సూ; కల= ఉన్న; నియత+ఆత్మకులకున్= నిష్ఠకల ఆత్మలు కలవారికి.

తాత్పర్యం: నా స్వరూపం దేవతలు, గంధర్వులు, రాక్షసులు మున్నుగా గలవారెవ్వరికినీ తెలియదు. సమస్త ప్రాణకోట్లు నాయందేపుట్టి మెలగుతూ, నాయందే లయిస్తాయి. నేను మాత్రం ఆ భూతకోటులకు వశపడి వర్తించను. సర్వమూ నాయందే వసిస్తుంది. నా తత్త్వం జడులు కానివారూ, అహింసా ప్రవృత్తి కలవారూ, కామం లేనివారూ, అహంకారం లేనివారూ, దానంగా దేన్నీ స్వీకరించనివారూ, కోపం లేనివారూ, స్వచ్ఛమైన జ్ఞానంకలవారూ, నిత్యతృప్తులూ, శాంతీ, భక్తీ కలవారూ, నిష్ఠ కలవారూ, తమలో అగ్నిని సన్నిహితం చేసికొంటే నన్ను పొందగలరు.

వ. సాంఖ్యయోగయుక్తులు, బహిర్దర్శనులై నిశ్చయరహితు లైరేని నస్మదీయ తత్త్వంబు గాన నేర; రది మోహపంకమగ్ను లగువారికి నుపవాసంబుల నియమంబుల వ్రతంబుల నెఱుంగ శక్యంబుగా, దేకాంతిక ధ్యానపరుల కెఱుంగుట గలుగు; రజస్తమోదూషితంబు గాక కేవలసత్త్వాధిష్ఠితంబయిన జ్ఞానంబున న నన్నవలం బించునది, సూక్ష్మ సరణి వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధ నామంబులం జతుర్విధంబుల విభక్తుండనై, ప్రాణులయం దాత్మ బుద్ధ్యహంకార మనోరూపవ్యాపకత్వంబు నొంది యుండుదు; నిట్టిది మదీయ స్థూల ప్రకారంబు; కశ్యపనందనా! నీవు మన్మనస్కుండవు, మద్భక్తుండవు మత్పరాయణుండవు నై మత్స్వరూపవేది వగు' మనియె నని చెప్పి సుపర్ణుండు. 379

ప్రతిపదార్థం: సాంఖ్యయోగయుక్తులు=సాంఖ్యయోగాన్ని అనుసరించేవారు; బహిర్దర్శనులు+ఐ= బాహ్యదృష్టికలవారై; నిశ్చయ రహితులు= నిశ్చయబుద్ధిలేనివారు; ఐరేనిన్= ఐతే; అస్మదీయ= నా; తత్త్వంబు= యథార్థరూపం; కాననేరరు= చూడలేరు; అది= నా యథార్థస్వరూపం; మోహ= వ్యామోహమన్న; పంక= బురదలో; మగ్నులు= మునిగినవారు; అగువారికిన్= ఐనట్టివారికి; ఉపవాసంబులన్= భోజనం లేకుండా భగవదారాధన చేసినా; నియమంబులన్= నియమాలతో; వ్రతంబులన్= ఉపవాసాది పుణ్యకర్మలతో; ఎఱుంగన్= తెలియటం; శక్యంబుకాదు= అసాధ్యం; ఏక+అంతిక= భగవత్సాన్నిధ్యాన్ని ముఖ్యంగా అనుభవించే వారు ఏకాంతిక భక్తులు; ధ్యానపరులకున్= ధ్యానపరాయణులైతే (వారికి); ఎఱుంగుట= తెలియటం; కలుగున్= సాధ్యపడుతుంది, భగవద్దర్శనం ఆత్మానుభవం ధ్యానంతోనే సాధ్యం; రజః= రజోగుణం; తమః=తమోగుణం; దూషితంబుకాక= ఆ గుణాలతో మలినంకాని; కేవల సత్త్వ= పరిశుద్ధసత్త్వగుణంలో; అధిష్ఠితంబు+అయిన= అధిష్ఠించిన; కూర్చున్న, జ్ఞానంబునన్= జ్ఞానంతో; నన్నున్; అవలంబించునది= ఆధారంగా, ధ్యేయంగా చేసికొనాలి; సూక్ష్మ= స్థూలంకానిది; సరణిన్= రీతిలో; వాసుదేవ, సంకర్షణ= బలరామ; ప్రద్యుమ్న= మన్మథ; అనిరుద్ధ= అడ్డంలేని విజృంభణం లేదా వ్యాప్తి కలవాడు; నామంబులన్= పేర్లతో; చతుర్విధంబులన్= నాలుగు రకాలుగా; విభక్తుండనై= విభాగించుకొని; ప్రాణులయందున్= జీవులలో; ఆత్మ, బుద్ధి, అహంకార, మనః= మనస్సులన్న; రూప= రూపాలతో; వ్యాపకత్వంబు= వ్యాప్తి; ఒంది= పొంది; ఉండుదున్= ఉంటాను; ఇట్టిది= ఇట్లాంటిది; మదీయ= నా; స్థూల ప్రకారంబు= బాహ్య పద్ధతి; కశ్యపనందనా!= కశ్యపుడి కుమారుడా!; నీవు; మత్= నాయందు; మనస్కుండవు= మనస్సు కలవాడవు; మత్= నాపై; భక్తుండవు= భక్తి కలవాడవు; మత్పరాయణుండవును+ఐ= నా స్మరణ కలవాడవై; మత్= నా; స్వరూప= తత్త్వం; వేదివి= తెలిసిన వాడవు; అగుము= కమ్ము; అనియెన్= అన్నాడు; అని చెప్పి; సుపర్ణుండు= గరుత్మంతుడు.

తాత్పర్యం: సాంఖ్యయోగులై కూడా అంతర్దృష్టి లేక, నిశ్చయబుద్ధిలేక చంచల మనస్కులైనవారికి నా యథార్థ రూపం తెలియదు. వ్యామోహ మన్న బురదలో కూరుకొనిపోయి ఏవో వ్రతాలనీ, ఉపవాసాలనీ, నియమాలనీ ఆచరించినంత మాత్రాన నా తత్త్వం తెలిసేది కాదు. (లోకంలో దేవుడన్నా మతమన్నా వ్రతాలు - ఉపవాసాలు ఇవి కావంటున్నాడు) రజస్తమస్సులతో మలినం కాని కేవల సత్త్వగుణాన్నే స్థిరంగా చేసికొన్న జ్ఞానంతో నన్ను ధ్యానించటమే ముక్తిమార్గం. వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనే నాలుగు పేర్లతో నన్ను నేను విభాగించుకొని సూక్ష్మంగా, సర్వజీవులలోను ఆత్మ (వాసుదేవుడు), బుద్ధి (సంకర్షణుడు), అహంకారం (ప్రద్యుమ్నుడు), మనస్సు (అనిరుద్ధుడు) ఈ నాలుగు రూపాలుగా వ్యాపించి ఉంటాను. ఇదీ నా స్థూలరూపం. కశ్యపకుమారా! నీవు నా యందే మనస్సు నిలిపి, నన్నే భక్తితో ఆరాధిస్తూ, నిత్యం నన్నే స్మరిస్తూ నా రూపం తెలిసికొమ్ము' అని చెప్పి గరుత్మంతుడు (తరువాతి పద్యంతో అన్వయం)

క. పురుషవరులార! యద్భుత । తర మగు హరి దివ్యచేష్టితము నాకుం ద
త్కరుణం దోఁచిన యట్టిది । పరిపాటిని మీకుఁ దేటపఱిచితి భక్తిన్!' 380

ప్రతిపదార్థం: పురుషవరులార!= మానవశ్రేష్ఠులారా!; అద్భుతతరము+అగు= మిక్కిలి చిత్రమైన; హరి= విష్ణువు యొక్క; దివ్య= అతిలోకమైన (లోకాతీతమైన); చేష్టితము= చేష్ట; నాకున్; తత్= ఆ స్వామి; కరుణన్= దయతో; తోఁచినఅట్టిది= అనుభవానికి వచ్చిన దానిని; మీకున్; పరిపాటిని= క్రమంగా; భక్తిన్= భక్తితో; తేటపఱిచితిన్= స్పష్టం చేశాను.

తాత్పర్యం: మానవశ్రేష్ఠులారా! నారాయణుడి దివ్యచేష్టావిలాసం నా కాయన దయతో తెలిసింది. అది మీకు క్రమంగా భక్తితో స్పష్టం చేశాను.

వ. అనిన విని యమ్ముని సిద్ధజనంబులు పరమాదరంబున నప్పక్షిదేవు దీవించి, యామంత్రణంబు సేసి, హర్షోత్కర్షంబునం జిత్తంబులు జొత్తిల్లఁ దమలోన. 381

ప్రతిపదార్థం: అనినన్= సుపర్ణుడు చెప్పగా; విని; ఆ+ముని= ఆ మునుల; సిద్ధ= ఆ సిద్ధుల; జనంబులు= సమూహాలు; పరమ= గొప్ప; ఆదరంబునన్= ఆదరంతో; ఆ+పక్షిదేవున్= ఆ పక్షిరాజును; దీవించి= ఆశీర్వదించి; ఆమంత్రణంబుచేసి= వీడ్కొల్పి (పంపించి); హర్ష= సంతోషం యొక్క; ఉత్కర్షంబునన్= అతిశయంతో; చిత్తంబులు= మనస్సులు; జొత్తిల్లన్= సొమ్మసిల్లగా; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: చెప్పగా విన్న మునులు, సిద్ధులు ప్రేమతో సుపర్ణుడిని దీవించి పంపించి సంతోష పారవశ్యంతో మనస్సులు సొమ్మసిల్లిపోగా తమలో. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'అక్కజం బగుచున్న యిక్కథ యితనిచే । విని కృతార్థుల మైతి' మనిరి, మఱియుఁ
'బుణ్య మాయుష్యంబు భూతిప్రదము; భక్తి । వినిన విప్రుఁడు వేదవిద్య పెంపు,
నృపవైశ్య శూద్రు లనుపమాన జయధన । సౌఖ్యంబులను గంద్రు; సర్వ జనుల
కిహపర సిద్ధుల కిది సాధనం బగు' । నని పల్కి యాత్రేచ్ఛఁ జనిరి; దీని

ఆ. బ్రహ్మ సురలకుఁ జెప్పిన భంగి వసువు । లవనిసురు లయి వచ్చి మాయమ్మపాల
నున్న నా కర్థిఁ జెప్పి; రయ్యున్న రూపు । నీకు జెప్పితిఁ గురుకులనృపవరేణ్య! 382

ప్రతిపదార్థం: అక్కజంబు= ఆశ్చర్యం; అగుచున్న= అవుతున్న; ఇక్కథ= ఈ ఉపాఖ్యానం; ఇతనిచేన్= సుపర్ణునిచేత; విని; కృత+అర్థులము= నెరవేరిన కోరికలు కలవారం; ఐతిమి= అయ్యాము; అనిరి= అన్నారు; మఱియున్= ఇంకనూ; పుణ్యము= పుణ్యవ్రతం; ఆయుష్యంబు= ఆయుస్సును వద్ధిచేసేది; భూతిప్రదము= ఐశ్వర్యాన్నిచ్చేది; భక్తిన్= భక్తితో; వినిన విప్రుఁడు= విన్న బ్రాహ్మణుడు; వేదవిద్య= వేదవిద్యలయొక్క; పెంపు= సంపద; నృప= రాజు; వైశ్య= కోమట్లు; శూద్రులు= నాలుగవ కులంవారు; అనుపమాన= సాటిలేని; జయ= విజయం; ధన= ధనం; సౌఖ్యంబులను= సౌఖ్యాలను; కంద్రు= పొందుతారు; సర్వజనులకున్= లోకానికంతా; ఇహ= ఈ లోకం; పర= ఆ లోకం; సిద్ధులకున్= సంపదలకు; ఇది= ఈ కథ; సాధనంబు+అగున్= ఉపాయమౌతుంది; అని పల్కి= అని చెప్పుకొంటూ; యాత్రా= తీర్థయాత్రలపై; ఇచ్ఛన్= కోరికతో; చనిరి= వెళ్ళారు; దీనిన్= ఈ కథను; కురుకుల= కురువంశ; నృపవరేణ్య!= రాజశ్రేష్ఠుడా!; బ్రహ్మ= సృష్టికర్త; సురలకున్= దేవతలకు; చెప్పిన భంగిన్= చెప్పిన తీరుగా; వసువులు= అష్టవసువులు; అవనిసురు లయి= భూదేవతలైన బ్రాహ్మణ రూపంలో; వచ్చి; మా యమ్మపాలన్= మా అమ్మ గంగాదేవి దగ్గర ఉన్న; నాకున్= ఉన్నట్టినాకు; (భీష్ముడు); అర్థిన్= కోర్కెతో; చెప్పిరి= చెప్పారు; ఆ+ఉన్నరూపు= ఆ ఉన్న విషయం; నీకున్; చెప్పితిన్= నేను చెప్పాను.

తాత్పర్యం: 'అద్భుతమైన ఈ కథ ఇతడివలన విని కృతార్థుల మైనాం. ఇది పుణ్యం. ఆయురైశ్వర్యాల నిచ్చేది. భక్తితో వింటే బ్రాహ్మణులకు వేదవిద్య పెరుగుతుంది. రాజులకు విజయాలు కలుగుతాయి. కోమట్లు ధనలాభం పొందుతారు. శూద్రులకు సౌఖ్యాలు సమకూడుతాయి. సర్వజనులకు ఇహపరతారకమైన కథ' అని ప్రశంసించి వారంతా తీర్థయాత్రలకు వెళ్ళారు. నాయనా! ధర్మజా! ఈ కథ నట పూర్వం బ్రహ్మ వసువులకు చెప్పగా వారు బ్రాహ్మణాకారాలు ధరించి మా అమ్మ దగ్గరున్న నాకు కావాలని చెప్పి వెళ్ళారయ్యా! అదంతా నీకు వినిపించాను.'

విశేషం: వసువులు ఎనిమిదిమంది. వారే గంగకు కొడుకులై పుట్టి వెంటనే మరణించారు. ఎనిమిదవ వసువే భీష్ముడు.

వ. అని చెప్పి దేవవ్రతుండు వెండియు నిట్లనుఁ 'బాండవాగ్రజా! వైకుంఠ సుపర్ణ సంవాదంబగు నీ యాఖ్యానంబునకు నభిప్రాయం బాకర్ణింపుము. 383

ప్రతిపదార్థం: వెండియున్= ఇంకా; దేవవ్రతుండు= దైవమే జీవితధ్యేయంగా బ్రతికేవాడు భీష్ముడు; ఇట్లు; అనున్; పాండవ= పాండురాజు కొడుకులలో; అగ్రజా!= ముందుపుట్టినవాడా!; వైకుంఠ= విష్ణువు; సుపర్ణ= గరుత్మంతుడి; సంవాదంబు= సంభాషణం; అగు; ఈ; ఉపాఖ్యానంబునకున్=కథకు; అభిప్రాయంబు= భావం, తాత్పర్యం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: దేవవ్రతు డా విధంగా చెప్పి ఇంకా అంటున్నాడు. 'నాయనా! ధర్మరాజా! విష్ణువునకు, సుపర్ణుడికి మధ్య జరిగిన సంభాషణం విన్నావు కదా! దాని తాత్పర్యం కూడా చెప్తుతాను వినుము.

తే. వివిధ సంకల్ప యజ్ఞముల్ విడిచి యాత్మ । యందు నిష్ఠమై నగ్ని సమాహితముగఁ
జేసి నిస్స్పృహుఁడై విష్ణుఁ జిత్తవృత్తిఁ । జేర్చు వాఁ డవ్యయస్థితిఁ జేరనేర్చు.' 384

ప్రతిపదార్థం: వివిధ = అనేకమైన; సంకల్ప= కోరికలు; యజ్ఞముల్= జన్నాలను; విడిచి= పరిత్యజించి; ఆత్మఅందున్= ఆత్మలో; నిష్ఠమైన్= నియమంతో; అగ్నిన్= అగ్నిని; సమాహితముగన్+చేసి= చక్కగా సన్నిధి కల్పించుకొని; నిస్స్పృహుఁడు+ఐ=

విరక్తుడై; విష్ణున్= నారాయణుడిని; చిత్తవృత్తిన్= మనసునందు; చేర్చువాఁడు= లగ్నం చేసినవాడు; అవ్యయ= శాశ్వతమైన; స్థితిన్= దశను; చేరనేర్చున్= చేరుకొనగలడు.

తాత్పర్యం: నానావిధాలైన సంకల్పాలు, యజ్ఞాలు విడిచిపెట్టి, ఆత్మలో అగ్నిని ప్రతిష్ఠించుకొని విరక్తుడై విష్ణువులో మనస్సును లయం చేసినవాడు ముక్తి నందగలడు.'

వ. అని యిట్లు భీష్ముండు విష్ణు స్వరూప జ్ఞానప్రకారం బితిహాస రూపంబున ధర్మజునకుం జెప్పెనని చెప్పిన 'సప్పురుష వరుల యడుగుటలును, జెప్పుటలును లోకహితంబులై యింత యొప్పియుండునే! యటమీఁది సంభాషణ విశేషంబులు సెప్పు' మని యడుగుటయు. 385

ప్రతిపదార్థం: విష్ణుస్వరూప= విష్ణురూప సంబంధమైన, జ్ఞాన= జ్ఞాన సంబంధమైన; ప్రకారంబు= పద్ధతి; ఇతిహాస రూపంబునన్= కథారూపంలో; ధర్మజునకున్= ధర్మరాజునకు; చెప్పెను; అని; చెప్పినన్= చెప్పగా; ఆ+పురుషవరుల= ఆ మహాత్ముల; అడుగుటలును= ప్రశ్నించిన రీతులూ; చెప్పుటలును= సమాధాన రీతులున్నూ; లోక= లోకానికి; హితంబులు+ఐ= కళ్యాణదాయకాలై; ఇంత ఒప్పిఉండునే!= ఇంత చక్కగా ఉంటాయా!; అట మీఁది= ఆ తరువాతి; సంభాషణ= పరస్పరం మాట్లాడుకొన్నవాటి; విశేషంబులు= ప్రధాన విషయాలు; చెప్పుము; అని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: భీష్ముడీవిధంగా విష్ణు రూప, జ్ఞాన పద్ధతులను కథారూపంలో ధర్మరాజుకు వివరించిన విధానం విని 'ఆ మహాత్ములు అడగటం, చెప్పటం లోకహితాన్ని కలిగించేదిగా ఉండి ఇంత అందంగా ఉంటుందా? తరువాతి సంభాషణ విశేషాలు చెప్పవయ్యా!' అని అడుగగా.

ఆశ్వాసాంతము

చ. మునిహృదయాబ్జ శాంతిమధుమోద వినోది మరాళ! గాఢ చ
క్రనిహత శూలనిర్మథిత రాక్షసయూథ! నితాంత భక్తి భా
వన రమణీయ! వేద పరివాదనిరర్గళ సేవనీయ! ని
త్యనిరుపమాన నిర్మల నిరంజన ఖేలన! ధర్మపాలనా! 386

ప్రతిపదార్థం: ముని= మునులయొక్క; హృదయ+అబ్జ= హృదయాలనే తామరపూలలో; శాంతి మధు= శాంతి అనే తేనెవలని; మోద వినోది= సంతోషంతో వినోదించే; మరాళ!= హంసా!; గాఢ= గాఢంగా; చక్ర= చక్రాయుధంతో; నిహత= చంపబడిన; శూల= శూలంతో; నిర్మథిత= సంహరించబడిన; రాక్షస= రాకాసుల, యూథ!= గుంపు కలవాడా!; నితాంత= ఎడతెగని; భక్తిభావన= భక్తి కల భావనకు; రమణీయ!= అందమైనవాడా!; వేద= మంత్రాలాపంచేసే; పరివాద= వీణానాదంతో; నిరర్గళ= ఏకధాటిగా, (అడ్డు లేకుండా); సేవనీయ!= సేవించబడే వాడా!; (పరివాదం= నింద, వీణ) నిత్య= ఎల్లప్పుడు, నిరుపమాన= సాటిలేని; నిర్మల= స్వచ్ఛమైన; నిరంజన= జ్ఞానంతో; ఖేలన!= క్రీడించేవాడా!; ధర్మ= ధర్మాన్ని; పాలనా= రక్షించేవాడా!

తాత్పర్యం: మునుల హృదయాలనే తామరపూలనుండి స్రవించే శాంతి మధువును త్రాగిన ఆనందంతో విహరించే హంసస్వరూపుడా! చక్రంతో; శూలంతో రాక్షసులను చంపేవాడా! నిత్యభక్తిభావ దృష్టికి అందమైనవాడా!, వేదాలాపన

చేసే వీణానాదంతో సేవించదగినవాడా; (లేదా) వేదనింద చేసేవారికి సేవించదగినవాడా!, నిత్యమూ సాటిలేనివాడా!, స్వచ్ఛమైన జ్ఞానంతో క్రీడించేవాడా!, ధర్మపాలన చేసేవాడా!

విశేషం: ఇది హరిహరనాథ స్తుతి కనుక 2వ వాక్యంలో శూలం, చక్రం చెప్పబడ్డాయి. 4వ వాక్యాన్ని రెండు రకాలుగానూ అన్వయించుకొనవచ్చును. వేద నిరసన చేసినవారు రాక్షసులు. సోమకాసురుడిని వధించి వేదాలను ఉద్ధరించినవాడు విష్ణువు. ఇదే మత్స్యావతార కథ అని విష్ణుపరమైన అర్థం. శివుడు వీణాధరుడు కనుక వీణ ప్రాచీనకాలంలో వేదమంత్రగాన సాధనం కనుక శివపరంగా చెప్పుకొనవచ్చును. రెంటికీ తగిలి వచ్చేటట్లు పరివాద శబ్దాన్ని వాడిన తిక్కనగారి ప్రతిభకు నమస్కరించాలి.

క. సదయాపాంగా! పరిణా । మదశా సంగమ నిరాసమధురతమాంగా!
మదశోక రహితచేత । స్సదనా! సంజనిత సముపసంహృతమదనా! 387

ప్రతిపదార్థం: సదయ= దయతో (తడిసిన) కూడుకొన్న; అపాంగా!= కంటి చివరి చూపు (కటాక్షం) కలవాడా!; పరిణామ= మార్పు; దశా= స్థితి; సంగమ= ఆసక్తిని; నిరాస= తిరస్కరించేవారికి; మధురతమ= మిక్కిలి తీయనైన; అంగా!= అవయవాలు కలవాడా! మద= గర్వం; శోక= దుఃఖం; రహిత= లేని; చేతస్= మనస్సులే; సదనా!= ఇల్లుగా ఉండేవాడా!; సంజనిత= చక్కగా పుట్టించబడిన; సమ్+ఉపసంహృత= చక్కగా ఉపసంహరించబడిన (చంపబడ్డ); మదనా!= మన్మథుడు కలవాడా!

తాత్పర్యం: దయతో కూడిన క్రీగంటి చూపులు కలవాడా! పరిణామ దశలయందు ఆసక్తిలేని మధురతమమైన ఆకృతి కలవాడా! మదం, శోకాదులు లేని మనస్సును మందిరంగా చేసికొన్నవాడా! మన్మథుడి పుట్టుకకు, మరణానికీ కారణమైన నాథా! హరిహరనాథా!

విశేషం: భగవంతుడి కటాక్షం దయాస్నిగ్ధం దయను వర్షించేది. పరిణమించే సృష్టియందు ఆసక్తిలేనివారికి మధురమైన శరీరం కలవాడు. గర్వం దుఃఖం లేని మనస్సులలో ఉండేవాడు, విష్ణువు మన్మథుడిని కన్నాడు. శివుడు దహించాడు.

మాలిని

గరుడవృషపతాకా! కల్పితాశేషలోకా!
సురపరిషదుపాస్యా! శుద్ధసంవిద్వికాస్యా!
పరమమహిమసీమా! భవ్యకారుణ్యధామా!
నిరతిశయగుణాలీ! నిష్కలానందశాలీ! 388

ప్రతిపదార్థం: గరుడ= గరుత్మంతుడు; వృష= ఎద్దు; పతాకా!= జెండాలపై గుర్తులుగా కలవాడా! (వాహనమే పతాకల చిహ్నం); కల్పిత= సృష్టించబడిన; అశేష= సమస్త; లోకా!= లోకాలు కలవాడా!; సురపరిషత్= దేవతల సముదాయానికి; ఉపాస్యా!= సేవింపదగినవాడా!; శుద్ధసంవిత్= అద్వైతజ్ఞానంతో; వికాస్యా!= వికసించేవాడా!; పరమ= గొప్ప; మహిమ= మాహాత్మ్యానికి; సీమా!= సరిహద్దయినవాడా!; భవ్య= శ్రేష్ఠమైన; కారుణ్య= దయకు; ధామా!= గృహమైనవాడా!; నిరతిశయ= మిక్కిలి ఎక్కువైన; గుణాలీ!= గుణసమూహం కలవాడా!; నిష్కల= అద్వైత; ఆనందశాలీ= ఆనందం కలవాడా!

తాత్పర్యం: గరుత్మంతుడు, ఎద్దు పతాకలపై గుర్తులుగా ఉన్నవాడు, సమస్త సృష్టి చేసేవాడు, దేవతల కుపాసించదగినవాడు, అద్వైతజ్ఞానంతో వికసించేవాడు, గొప్ప మాహాత్మ్యానికి అవతలి ఒడ్డున ఉన్నవాడు, దివ్యమైన దయకు స్థానమైనవాడు, మహాగుణాలున్నవాడు, కేవలానందస్వరూపుడు అయిన హరిహరనాథుడికి నమస్కారము.

విశేషం: మాలినీవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, న, మ, య, య అనే గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాస నియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; శ్రీమత్= మంగళకరుడైన; ఉభయకవిమిత్ర= కావ్యశాస్త్ర కవులిరువురికీ మిత్రుడైనవాడు; బుధ+ఆరాధన విరాజి= పండితులను (జ్ఞానులను) సేవించటం వలన కీర్తితో ప్రకాశించేవాడు; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కన చేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీ మహాభారతంబున; ఆనుశాసనిక పర్వంబునందున్; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది ఉభయకవిమిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, జ్ఞానులచేత ఆరాధించబడి రాణించే వాడూ అయిన తిక్కన సోమయాజి శుభప్రదంగా రచించిన శ్రీ మహాభారతంలోని ఆనుశాసనికపర్వంలో మొదటి ఆశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీమయ వక్షస్థల గౌ । రీమయ వామార్ధ । బంధురీ కృత సౌంద

ర్యామృత రసకీర్తన వి । ద్యామయ! నిగమాంతవేద్య! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమయవక్షస్థల = లక్ష్మీమయమైన గుండె చేతను; గౌరీమయ= పార్వతీమయమైన; వామ+అర్ధ= ఎడమ సగం శరీరం చేతను; బంధురీకృత = ఇంపుగా చేయబడిన; సౌందర్య= అందమనెడు; అమృతరస= సుధాద్రవాన్ని; కీర్తన= కొనియాడెడు; విద్యామయ!= కళ్యాణస్వరూపుడా!; నిగమ+అంత= ఉపనిషత్తులచేత; వేద్య= తెలియదగినవాడా!; హరిహరనాథ!= హరిహరనాథ దేవా!

తాత్పర్యం: లక్ష్మీదేవి నివసించే వక్షస్థలం చేతను, పార్వతితో కూడిన ఎడమ శరీరార్ధముతోను శోభిల్లే నీ అందమనెడు అమృతరసాన్ని కీర్తించే విద్య ఏదికలదో అదియే స్వరూపమైనవాడా! ఉపనిషత్తులచేత తెలియదగినవాడా! హరిహరనాథా! చిత్తగించుము.

అష్టావక్రుం డను మునికుమారు చరిత్రము (సం.13-19-10)

వ. దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; అట్లు నారాయణ స్వరూప నిరూపణ ప్రకారంబు విని యజాతశత్రుండు సంజాతప్రీతుండై, పితామహుతోఁ 'గన్యాదానంబునకు వరుం డెట్టివాఁడు గావలయు?' ననుటయు' నక్కురువంశవరుం 'డీవిషయంబున నొక్క యితిహాసంబు గలదు విను' మని యమ్మానవపతి యాననం బాలోకించి. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే కథకుడు; జనమేజయునకున్= జనమేజయ మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అట్లు= ఆరీతి; నారాయణ స్వరూప నిరూపణ ప్రకారంబు= విష్ణుతత్త్వం బోధించిన పద్దతి; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; సంజాతప్రీతుండు+ఐ= పుట్టిన ఆనందం కలవాడై (ఆనందించి); పితామహుతోన్= తాతతో (భీష్ముడితో); కన్యాదానంబునకున్= పెండ్లిలో పిల్ల నివ్వటానికి; వరుండు; ఎట్టివాఁడు= ఎట్లాంటివాడు; కావలయున్?= కావాలి?; అనుటయున్= అంటే; ప్రశ్నిస్తే; ఆ+కురువంశవరుండు= ఆ కౌరవవంశశ్రేష్ఠుడు భీష్ముడు; ఈ విషయంబునన్= ఈ విషయంలో; ఒక్క ఇతిహాసంబు= ఒక దృష్టాంత కథ; కలదు; వినుము; అని; ఆ+మానవపతి= ఆ ప్రజలకు భర్త అయిన ధర్మరాజు యొక్క; ఆననంబు= ముఖం, ఆలోకించి= చూచి.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయుడితో అంటున్నాడు. ఆ విధంగా విష్ణుతత్త్వం చెప్పటం విన్న ధర్మరాజు సంతోషించి భీష్ముడిని అడిగాడు. 'కన్యాదానానికి ఎట్లాంటి వరుడు కావాలి?' అని. దాని కాయన 'ఒక ఇతిహాసం ఉన్నది వినుము' అని చెప్తున్నాడు.

సీ. 'అనఘ! యష్టావక్రుఁడను బ్రహ్మచారి స । త్తముఁడు. వదాన్యుఁ డన్తాపసోత్త
మునికూఁతు, సుప్రభ యను కన్యఁ బెండ్లిగాఁ । గోరి యాతని నడుగుటయు, నతఁడు
'నీవు యోగ్యుండవు, నీ కిత్తు నా పుత్రి; । నంతకు నుత్తర మరిగి రమ్ము'
నావుడు, సంయమినందనుం 'డెందుల । కరుగుదు? నే పని యాచరింతుఁ

ఆ. బనుపు 'మనుడు వదాన్యుండు 'ధనదుపురము । గడచి హిమగిరి కరుగుము; మృడుని గుఱిచి
గిరిజ తప మొనరించె నగ్గిరితటమునఁ । దత్ప్రదేశంబు పుణ్యంబు దానియందు. 3

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముఁడా!; అష్టావక్రుఁడు+అను= అష్టావక్రుడనే పేరుగల; బ్రహ్మచారి= వటువు; సత్ తముఁడు= బ్రహ్మచారులలో చాలా ఉత్తముడు; వదాన్యుఁడు+అన్= వదాన్యుడనే పేరుగల; తాపస+ఉత్తముని= ఋషిశ్రేష్ఠుడి; కూఁతున్=కూతురిని; సుప్రభ= సుప్రభ అనే పేరు గల; కన్యన్= పెండ్లిగాని కన్నెను; పెండ్లికాన్+కోరి= వివాహం చేసికొనాలని; ఆతనిన్= ఆ వదాన్యుడిని; అడుగుటయున్= వేడుకొనగా; అతఁడు; నీవు; యోగ్యుండవు= తగినవాడవు (నేటికీ ఈ పదాన్ని ఈ సందర్భంలో ఇట్లాగే వాడుకొంటున్నాం. యోగ్యుడైన వరుడికిచ్చి అని వ్యవహారంలో మాటే); నాపుత్రిన్= నా కూతురిని; నీకున్+ఇత్తును; అంతకున్= అంతలో-ఈ లోపల; ఉత్తరము= ఉత్తర దిక్కునకు; అరిగి= పోయి; రమ్ము; నావుడున్= అనగా విని; సంయమి నందనుండు= మునికుమారుడు; ఎందులకున్= ఏ అక్కరగల్గి; అరుగుదున్= వెళ్ళుదును (వెళ్ళుతాను); ఏ పని ఆచరింతున్= ఏ పని చేయాలి; పనుపుము= ఆజ్ఞాపించుము; అనుడున్= అనగా; వదాన్యుండు; ధనదు= ధనాన్ని ఇచ్చేవాడు కుబేరుడి; పురము= నగరం; కడచి= దాటి; హిమగిరికిన్= మంచుకొండకు; అరుగుము= వెళ్ళుము; మృడుని= శివుడిని; గుఱిచి= గురించి; గిరిజ= హిమాలయుడి కూతురు - పార్వతి; తపము= తపస్సు; ఒనరించెన్= చేసిందో; ఆ+గిరి= ఆ కొండ; తటమునన్= ఒడ్డున; తత్ ప్రదేశంబు= ఆ ప్రదేశం; చోటు; పుణ్యంబు= పవిత్రం; దానియందున్= అక్కడ.

తాత్పర్యం: అష్టావక్రుడని ఒక బ్రహ్మచారి వదాన్యుడనే మునికుమార్తెను - సుప్రభను పెండ్లి చేసికొనాల నుకొన్నాడు. వదాన్యుడు కూడా ఇద్దామనుకొన్నాడు. కానీ, ఈ లోపల ఉత్తరదిశకు పోయి రమ్మన్నాడు. ఎందుకని అడిగితే శివుడిగురించి పార్వతీదేవి తపస్సుచేసిన చోటు చాలా పవిత్రమైనది. అక్కడ.

క. ఆడుచుఁ బాడుచు గణములు । గూడి చరింపంగ గిరిజకుం బ్రియముగఁ, దా
వేడుక నమ్మృడుఁ డెప్పుడుఁ । గ్రీడించుచు నుండు మునులు గీర్తింపంగన్. 4

ప్రతిపదార్థం: గణములు= శివుడి గణాలు; కూడి= కలసి మెలసి; ఆడుచున్ పాడుచున్= ఆడుతూ పాడుతూ; చరింపంగన్= వినోదిస్తుండగా; గిరిజకున్= పార్వతికి; ప్రియముగాన్= ఇష్టమైనట్లు; ఆ+మృడుఁడు= ఆ శివుడున్నూ; తాన్= తాను; వేడుకన్= ఉత్సాహంతో; ఎప్పుడున్= నిత్యం; మునులు కీర్తింపంగన్= మునులు స్తుతిస్తుండగా; క్రీడించుచున్+ఉండున్= విహరిస్తుంటాడు.

తాత్పర్యం: శివుడి గణాలు కూడి యాడి వినోదిస్తూ ఉంటే ఆటలతో, పాటలతో శివుడు కూడా తపస్సు మాని పార్వతికి వేడుక కలిగించటానికై తానూ విహరిస్తుంటాడు. వారి క్రీడలను మునులు స్తుతిస్తుంటారు.

ఆ. అది పవిత్రదేశ ; మచ్చటు సూచుచుఁ । గడచి చనఁగ నీపకాననంబు
కానవచ్చు నందు గట్టి ప్రాయమునది । పుణ్యమూర్తి యమలబుద్ధి యోర్తు. 5

ప్రతిపదార్థం: అది పవిత్రదేశము; అచ్చటు= ఆ చోటు; చూచుచున్= చూస్తూ; కడచి= దాటి; చనఁగన్= పోగా; నీప= కడిమిచెట్ల; కాననంబు= తోపు; కానవచ్చున్= కనిపిస్తుంది; అందున్= అందులో; గట్టి ప్రాయమునది= ప్రౌఢవయస్సు కలది; పుణ్యమూర్తి= పవిత్రమైన రూపం కలది (చూడగానే నమస్కరించే బుద్ధి కలిగేది); అమల= నిర్మలమైన; బుద్ధి= మనస్సు కలది; ఓర్తు= ఒక స్త్రీ.

తాత్పర్యం: ఆ పవిత్ర ప్రదేశం చూస్తూ, దాటిపోగా, కదంబవనం కనిపిస్తుంది. అందులో ఒక ప్రౌఢవయస్కురాలూ, పవిత్రరూపం కలదీ, సద్బుద్ధి కలదీ అయిన ఒకామె ఉంటుంది.

క. వసియించు నమ్ముదితఁ బ్రియ । మసలారఁగఁ గాంచి వచ్చు నప్పుడ ప్రమదం
బెసఁగంగఁ బెండ్లి సేసెద । నసదృశ రూప గుణవర్త నాన్వయ విద్యా!' 6

ప్రతిపదార్థం: వసియించున్= ఉంటుంది; ఆ+ముదితన్= ఆ స్త్రీని; ప్రియము= ప్రీతి; అసలు+ఆరఁగన్= ఒప్పుతుండగా; కాంచి= చూచి; వచ్చునప్పుడు+అ= వచ్చేటప్పుడు; అసదృశ= సాటిలేని; రూప= ఆకారం; గుణ= సద్గుణాలు; వర్తన= నడవడి; అన్వయ= వంశం; విద్యా!= విద్యకలవాడా! ప్రమదంబు= సంతోషం; ఎసఁగంగన్= అతిశయించగా; పెండ్లి= వివాహం; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఆమెను చూచిరాగానే నీకు సంతోషంతో వివాహం చేస్తాను. రూపంలో, గుణంలో, ప్రవర్తనలోను, వంశంలోను, విద్యలోను సాటిలేనివాడవు కదా! తప్పక వివాహం చేస్తాను'.

సీ. అనిన నష్టావక్రుఁ 'డట్ల కా' కని చని, । బాహుదా తీరభూభాగవర్తి
యై, రాత్రి గడపి, ధనాధీశు ప్రోలికి । నరుగఁగ నతఁ డమ్మహాత్మురాక
విని, యెదురేతెంచి, వినయంబుతోడఁ దో । డ్కొనిపోయి, మహిత పూజన మొనర్చి
యూర్వశి రంభ తిలోత్తమ మొదలగు । నప్సరోవనితల యాటపాట

తే. లాదిగాఁ గల, వివిధ వినోదకృతుల । ననుదినంబు నారాధింప, నందు నిల్చె
నమ్మునీంద్రుండు, దగులు లే కభిమత ప్ర । వర్తనంబుల నొక్క సంవత్సరంబు. 7

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అష్టావక్రుఁడు; అట్లకాక అని= సరేఅని; చని= వెళ్ళి; బాహుదా= బాహుదానది యొక్క (మన రాష్ట్రంలో కడపజిల్లాలో చెయ్యేరు అనేపేరుతో బాహుదానది అన్న నది ఉన్నది); తీర= ఒడ్డునగల; భూభాగ= ప్రదేశంలో; వర్తి+ఐ= నివసించినవాడై; రాత్రి గడపి= రాత్రిని గడిపి; ధన+అధీశు= కుబేరుడి; ప్రోలికిన్= నగరానికి; అరుగఁగన్= పోగా; అతఁడు; ఆ+మహాత్ము= అష్టావక్రుడి రాక; విని; ఎదురు+ఏతెంచి= గౌరవంతో ఎదురుగా ఆహ్వానించటానికి వచ్చి; వినయంబుతోడన్= అణకువతో; తోడ్కొనిపోయి= తీసికొనివెళ్ళి; మహిత= గొప్ప; పూజనము= పూజ; ఒనర్చి= చేసి; ఊర్వశి, రంభ, తిలోత్తమ= దేవలోకంలో ఉన్న ఊర్వశి, రంభ, తిలోత్తమ అనే నర్తకీమణులు; మొదలగు= మొదలైన; అప్సరోవనితల= అప్సరస్ స్త్రీల యొక్క; ఆటపాటలు; ఆదిగాన్కల= మొదలైన; వివిధ= అనేక; వినోదకృతులన్= వినోద కార్యాలతో; అనుదినంబున్= ప్రతిరోజు; ఆరాధింపన్= పూజించగా; అందున్; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మునిశ్రేష్ఠుడు; తగులు లేక= ఆసక్తిలేక, విరక్తితో; అభిమత= ఇష్టం వచ్చిన; ప్రవర్తనంబులన్= చర్యలతో; ఒక్కవత్సరంబు= ఒక సంవత్సర కాలం; నిల్చెన్= అక్కడే ఉన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని అష్టావక్రుడు వెళ్ళి ఆ రాత్రి బాహుదా నదితీరంలో కడపి, కుబేరుడి నగరానికి వెళ్ళాడు. అతడి రాక తెలిసి కుబేరుడు ఎదురు పోయి సాదరంగా ఆహ్వానించి తెచ్చి అతిథిపూజ చేసి అతడికి వినోదార్థం రంభాదుల నాట్యాలు ఏర్పాటు చేశాడు. అష్టావక్రుడు మనస్సు చలించకుండా ఒక ఏడాది అక్కడ ఉన్నాడు.

వ. పదంపడి ధనదుండు 'నీ కేమి సేయవలయుం జేసెదం జెప్పు' మనిన నతండును 'సర్వంబును సంపన్నంబ, నీవు నిత్యసంపద నున్నతుండవై యుండు; మేనొక్క మునిపతి సెప్పిన పనికై పోయెద; నీతోడి వేడుక నిల్చితి; నింతియ కాని నా కభ్యర్థనీయం బొండు లే' దని పల్కి యట వోయి. 8

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత; ధనదుండు= కుబేరుడు; నీకున్= నీకు; ఏమిచేయవలయున్= ఏమిసల్పవలెనో; చేసెదన్= చేస్తాను; చెప్పుము= తెల్పుము; అనినన్, అతండును; సర్వంబును= అంతా; సంపన్నంబు+అ= నిండుగా, తృప్తిగా ఉన్నది; నీవు; నిత్యసంపదన్= శాశ్వతమైన ఐశ్వర్యంతో; ఉన్నతుండవై= గొప్పవాడవై; ఉండుము; ఏను= నేను; ఒక్కమునిపతి+ చెప్పినపనికై= ఒక మునీశ్వరుడు చెప్పిన పని నెరవేర్చుటకై; పోయెదన్; నీతోడివేడుకన్= నీతో కలిసిఉండే కోర్కెతో; నిల్చితిన్= ఉన్నాను; అంతియకాని= అంతేతప్ప; నాకున్= నాకు; అభి= మిక్కిలి; అర్థనీయంబు= కోరదగినది; ఒండు= వేరేదీ; లేదని; పల్కి; అటపోయి= ఆ చోటు వదలి వెళ్ళిపోయి. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: తర్వాత కుబేరు డడిగాడు; 'నీకేమి కావాలో చెప్పితే ఇస్తా'నని. అత డన్నాడు- 'నీతో ఒక ఏడాది సంతోషంగా గడిపాను. అది చాలు. నా కేమీ కోరదగినవి లేవు. నే నొక మునిపనిమీద వెళ్ళుతున్నాను' అని చెప్పి ఆ నగారాన్ని వదలి వెళ్ళిపోయాడు.

సీ. హిమశైలతట మెక్కి యీశ్వర క్రీడన । స్థలిఁ గాంచి మ్రొక్కి ప్రదక్షిణముగఁ
జని, యట యరుగంగ మునివరు చెప్పిన । కడిమిలేమ్రాఁకుల యడవి దోఁచె;
దానిఁ బ్రవేశింపఁగా, నందు మణిహేమ । మయ చిత్రరమ్య హర్మ్యము లనేక
ములు గానవచ్చె; నుజ్జ్వల సమున్నతరమ్య । హర్మ్యంబు వానిలో నధిక విభవ

ఆ. సారమై యున్నఁ జూచితద్వారభూమిఁ । జేరి, లోనికిఁ దనపేరు సెప్పి పుచ్చఁ
గన్యకలు పఱతెంచిరి, కాంతిరూప । విలసనము లొప్పఁ గొందఱు, వినయ మెసఁగ. 9

ప్రతిపదార్థం: హిమశైల తటము= మంచుకొండ పార్శ్వం; ఎక్కి= అధిరోహించి; ఈశ్వర= శివుడి; క్రీడన స్థలిన్= విహారస్థలం; కాంచి= చూచి; మ్రొక్కి= నమస్కరించి; ప్రదక్షిణముగన్= ప్రదక్షిణపూర్వకంగా; చని= వెళ్ళి; అట= పైకి; అరుగంగన్= పోగా; మునివరుచెప్పిన= మునీశ్వరుడు తెల్పిన; కడిమి= కదంబ; లే= లేత; మ్రాఁకుల= చెట్ల; అడవి= వనం; తోఁచెన్= కనపడింది; దానిన్= అందులో; ప్రవేశింపఁగాన్= వెళ్ళేసరికి; అందున్= ఆ లోపల; మణి= రత్నాలు; హేమ= బంగారం; మయ= మయమైన; చిత్ర= ఆశ్చర్యకరమైన; రమ్య= అందమైన; హర్మ్యములు= మేడలు; అనేకములు+కానవచ్చెన్= పెక్కు కనబడినవి; ఉజ్జ్వల= ప్రకాశించే; సమున్నత= చాలా ఎత్తైన; రమ్య హర్మ్యంబు= అందమైన మేడ; వానిలోన్= ఆ మేడల వరుసలో (ఇది); అధిక= ఎక్కువ; విభవ= వైభవ; సారము= సారం; ఐ=కలిగి; ఉన్నన్+చూచి= ఉండటం చూచి; తత్ద్వార భూమిన్= ఆ మేడ ద్వార ప్రదేశం; చేరి= సమీపించి; లోనికిన్= మేడలోపలికి; తనపేరు చెప్పి పుచ్చన్= ఫలానా మనిషి వచ్చాడని కబురు చేయగా;

కన్యకలు= అవివాహితలు; కాంతి= లావణ్యం; రూప= అందమైన రూపాలు; విలసనములు= అందాలు; ఒప్పన్= ప్రకాశించగా; వినయము ఎసఁగన్= వినయం వెల్లడి అయ్యేటట్లు; కొందఱు= కొంతమంది; పఱతెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: మంచుకొండ లెక్కి ఈశ్వరుడి క్రీడా స్థలాలు దర్శించి మునివరుడు చెప్పిన లేత కడిమిచెట్ల వనంలో రత్నాలు పొదిగిన బంగారు మేడల వరుస లనేకం చూచాడు. అందులో అధిక వైభవంతో ప్రకాశించే బంగారుమేడ చూచి ద్వారం దగ్గరకు పోయి లోపలకు కబురు చేశాడు ఫలానా వారు వచ్చారని. వినీవినగానే అందాలరాసులైన కన్యకలు కొందరు వినయంతో పరుగు పరుగున వచ్చారు.

వ. పఱతెంచి పరమాదరంబునం దోడ్కొని పోవునప్పు, డప్పొలంతుల యొప్పు, సూడ్కులకుం జిత్తంబునకు వేడ్కలు సేయంజాలినను, లోలత్వ రాహిత్యంబున నత్యుదాత్తుం డగుచుం జని, యభ్యంతర మందిరంబున వివిధ రత్నరశ్మి విరాజితంబైన పర్యంకంబున నార్యమూర్తియు, ధవళవసనాంగరాగయు, రుచిరాభరణ భూషితయు, ప్రౌఢవయస్కయు, నగు నొక్క వనితం గని 'మే లయ్యెడు' మనుచు నిలిచిన, నయ్యిందువదన 'యిందు రం' డని పలుకుచుం బ్రత్యుత్థానంబు సేసి. 10

ప్రతిపదార్థం: పఱతెంచి= వచ్చి; పరమ+ఆదరంబునన్= మంచి ప్రేమతో; తోడ్కొని= వెంటబెట్టుకొని; పోవునప్పుడు= వెళ్ళేటప్పుడు; ఆ+పొలంతుల= ఆ స్త్రీల; ఒప్పు= అందం; చూడ్కులకున్= చూపులకు; చిత్తంబునకున్= మనస్సుకు; వేడ్కలు= కోర్కెలు; చేయన్ చాలినను= కల్గించగలిగినా; లోలత్వ= ఆసక్తి; రాహిత్యంబునన్= లేనందువలన; అతి= మిక్కిలి; ఉదాత్తుండు= మహాత్ముడు; అగుచున్; చని= వెళ్ళి; అభ్యంతర మందిరంబునన్= లోపలి సౌధంలో; వివిధ రత్న= అనేక రత్నాల; రశ్మి= కాంతులతో; విరాజితంబు+ఐన= ప్రకాశించే; పర్యంకంబునన్= వేదికపై; ఆర్యమూర్తియున్= పుణ్యాకృతి కలదీ; ధవళ= తెల్లని; వసన= వస్త్రం; అంగరాగయున్= శరీరానికి పూసికొన్న వాసన ద్రవ్యాలు కలది, (కస్తూరి, జవ్వాది మొదలుగునవి); రుచిర= అందమైన; ఆభరణ= నగలచేత; భూషితయున్= అలంకరించుకొన్నది; ప్రౌఢవయస్కయున్= మంచి ప్రాయం కలది; అగు= అయిన; ఒక్కవనితన్= ఒక వెలదిని; కని= చూచి; మేలు+అయ్యెడున్+అనుచున్= శుభమగుగాక అని పలుకుతూ; నిలిచినన్= నిలువగా; ఆ+ఇందువదన= చంద్రుడిని పోలిన ముఖం కల్గిన ఆమె; ప్రతి+ఉత్థానంబు ఒనర్చి= ఎదురుగా లేచివెళ్ళటం చేసి. (మీది పద్యంతో అన్వయం)

తాత్పర్యం: కన్యకలు పరుగు పరుగున వచ్చి అష్టావక్రుడిని వెంటబెట్టుకొని తీసికొనిపోయారు. వారి అందచందాలకు అతడి మనస్సు చలించలేదు. అంతఃపురంలో పలురత్నాలకాంతులతో ప్రకాశించే పర్యంకముమీద పవిత్రస్వరూపిణీ (పార్వతీదేవివంటిది) తెల్లనిచీర, మైపూతలు ధరించినదీ, అందమైన ఆభరణాలు అలంకరించుకొన్నదీ, ప్రౌఢవయస్కురాలు అయిన ఒక కాంతను అతడు దర్శించి శుభమస్తు అంటూ నిలిచాడు. అపుడా చంద్రవదన 'ఇట్లా రండి' అంటూ లేచి ఎదురుగా వెళ్ళి ఆహ్వానించి తెచ్చింది.

క. అమ్మునివరు నాపర్యం । కమ్ము పయిం బ్రీతి నునిచి, గారవమునఁ బా
ద్యమ్మును నర్ఘ్యము శ్రుతివిహి । తమ్మైన విధమున నిచ్చి, తత్పార్శ్వమునన్. 11

ప్రతిపదార్థం: ఆ+మునివరున్= ఆ మునిశ్రేష్ఠుడిని; ఆ= పైన చెప్పిన; పర్యంకమ్ముపయిన్= వేదికమీద, ఆసనంమీద; ప్రీతిన్= సంతోషంతో; ఉనిచి= కూర్చోబెట్టి; గారవమునన్= గౌరవంతో; పాద్యమ్మునన్= పాదాలు కడుగుకొనటానికి నీళ్ళు;

అర్ఘ్యమున్= పూజకు తగిన నీళ్ళు; శ్రుతివిహితమ్ము+ఐన= వేదం చెప్పిన; విధమునన్= రీతిగా; ఇచ్చి; తత్= అతడి; పార్శ్వమునన్= ప్రక్కనే.

తాత్పర్యం: అష్టావక్రుడిని ఆపర్యంకంమీద కూర్చుండబెట్టి ప్రీతితో అర్ఘ్యపాద్యాలను వేదం చెప్పిన రీతిగా ఇచ్చి అతడి ప్రక్కనే.

వ. తానును వేఱొక్క సెజ్జం గూర్చుండె; నమ్ముని గలయం గనుంగొని యక్కన్నియల విభ్రమ వికారంబులు దన లోచనంబులకు గోచరంబులగుటకు నొల్లక 'యిమ్మదవతీ జనంబు లిచ్చట నేల?' యనిన నక్కాంత యక్కన్యల నెల్లం బోవం బనిచి సముచిత సల్లాపంబులు సేయుచుండి, రాత్రి యగుటయు. 12

ప్రతిపదార్థం: తానును= తానుగూడ; వేఱొక్క= మరొక; సెజ్జన్= శయ్యపై; కూర్చుండెన్; అమ్ముని; కలయన్+కనుంగొని= పరిసరాలన్నీ చూచి; ఆ+కన్నియల= ఆ కన్యల యొక్క; విభ్రమ వికారంబులు= కామభావంవలన శరీరంమీద కలిగే అందమైన చేష్టలు; తన; లోచనంబులకున్= కళ్ళకు; గోచరంబులు+అగుటకున్= కనిపించటానికి; ఒల్లక= ఇష్టపడక; ఈ+మదవతీజనంబులు= కామంతో కలిగే మత్తు కళ్ళు మొదలైన అవయవాలతో ఉన్న స్త్రీల గుంపు; ఇచ్చటన్; ఏల; అనినన్; ఆ+కాంత= ఆ స్త్రీ; ఆ కన్యలన్= ఆ కన్నియలను; ఎల్లన్= అందరినీ; పోవన్+పనిచి= పోయేటట్లు ఆజ్ఞాపించి; సముచిత= తగిన; సల్లాపంబులు= సంభాషణలు; చేయుచున్+ఉండి= సల్పుతూ ఉండి; రాత్రి; అగుటయున్= కాగా.

తాత్పర్యం: అతడి ప్రక్కనే మరొక శయపై కూర్చుండగానే ఆ ముని - ఆ కన్యల అందచందాలు చూడటానికి ఇష్టపడక వారిని పంపించివేయుమని ఆమెతో చెప్పగానే ఆమె కూడా వారిని పంపించివేసింది. తరువాత అతడితో తగిన సంభాషణలు చేస్తూ ఉన్నది. ఇంతలో రాత్రి కావటంతోనే.

ఉత్తరదిశ అష్టావక్రుని చిత్తశుద్ధిఁ బరీక్షించుట (సం.13-20-50)

క. సీతయ్యె ననుచు, నల్లన । యాతని శయనమున కరిగి, యతఁ డెడ యీఁగా,
నా తల్పంబున నొక దెసఁ । బ్రీతహృదయయై శయించెఁ బృథ్వీనాథా! 13

ప్రతిపదార్థం: పృథ్వీనాథా!= భూమికి నాథుడా! రాజా! సీతు= చలి; అయ్యెన్+అనుచున్= పుట్టుతున్నదని; అల్లన= నెమ్మదిగా; అతని శయనమునకున్= ఆయన సెజ్జకు; అరిగి= పోయి; ఆతఁడు= ఆయన; ఎడ= చోటు; ఈఁగాన్= ఇవ్వగా; ఆ తల్పంబునన్= ఆ సెజ్జపై; ఒకదెసన్= ఒక ప్రక్క; ప్రీతహృదయ+ఐ= సంతోషించిన మనస్సు కలదై; శయించెన్= పవ్వళించింది, పండుకొన్నది.

తాత్పర్యం: ధర్మరాజా! రాత్రి అయినందువలన ఆమె చలి పుట్టుతున్నదని చెప్తూ అతడి మంచం దగ్గరకు రాగా అతడు అవతలకు జరిగి ఆమెకు చోటిచ్చాడు. ఆమె కూడా సంతోషించి ఒక ప్రక్కగా పండుకొన్నది.

క. పదపడి నయమున మెయిమెయిఁ । గదియించి లతాంగి చిక్కఁ గౌఁగిటఁ జేర్పం,
గదలని చిత్తము గలిగియు, । మద మేమియు లేక, యతఁడు ప్రూనై యుండెన్. 14

ప్రతిపదార్థం: పదపడి= తరువాత; నయమునన్= నేర్పుగా; మెయిన్= తన దేహాన్ని; మెయిన్= అతడి శరీరంతో; కదియించి= చేర్చి; లతా+అంగి= తీగవంటి సన్నని శరీరం కలది; చిక్కన్= గట్టిగా; కౌఁగిటన్= కౌగిటిలో; చేర్పన్=

చేర్చుకొనగా; కదలని= చలించని; చిత్తము= మనస్సు; కలిగియున్= ఉండి; మదము= కామవికారం; ఏమియున్= కొంచెంకూడా; లేక= లేకుండా; మ్రాను+ఐ= చెట్టువలె; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: తరువాత నేర్పుగా ఆమె తన శరీరాన్ని అతడి దగ్గరకు చేర్చి గట్టిగా కౌగిలించుకొన్నది. అతడి మనస్సులో చలనం కానీ, మదం కానీ ఏమీ లేక వట్టి కట్టెవలె ఉన్నాడు.

ఆ. అట్టు లున్నఁ జూచి యత్తన్వి 'మగవారు । భోగపరులు, తాల్మి పొలఁతులందుఁ
గలుగు; నవ్విధంబు గాక యేఁ గోరంగ । ననుభవింప కునికి యగునె నీకు? 15

ప్రతిపదార్థం: అట్టులు= ఆ విధంగా; ఉన్నన్= ఉంటే; చూచి; ఆ+తన్వి= ఆ సన్నని శరీరం కలది; మగవారు= పురుషులు; భోగపరులు= భోగాలకు లోబడేవారు; పొలఁతులందున్ = స్త్రీలలో; తాల్మి= ఓర్పు; కలుగున్= ఉంటుంది; ఆ+విధంబు= ఆ పద్ధతి; కాక= కాకుండా; ఏన్= స్త్రీనైన నేను; కోరంగన్= కోరగా; అనుభవింపక+ఉనికి= అనుభవించకుండా ఉండటం; నీకున్; అగునె?= తగునా?

తాత్పర్యం: అప్పు డామె అతడితో అన్నది 'ఇదేమిటి? పురుషులు భోగతత్పరులు. స్త్రీలకు ఓర్పు ఉంటుంది. ఇది లోకంలో పద్ధతి. కాని మనపట్ల అది విపరీతంగా ఉన్నది. స్త్రీనైన నేను నిన్ను కోరగా, అనుభవించకుండా ఉండడం నీకు తగునా?

క. సంపదయు దివ్యభోగము । లింపారఁ బరిగ్రహింపుఁ; డే మీ ధనమై
పం పొనరించెద? ననుఁ గా । రింపక, కైకొని వరింపరే? యిచ్చోటన్. 16

ప్రతిపదార్థం: సంపదయున్= నా ఐశ్వర్యం; దివ్య= దేవలోక సంబంధమైన; భోగములు= అనేక భోగాలు (సుఖాలు); ఇంపారన్= ఇష్టమైనట్లు; పరిగ్రహింపుఁడు= స్వీకరించండి; ఏన్= నేను; మీ ధనమై= మీకు సొమ్మై; పంపు= మీ ఆజ్ఞలను; ఒనరించెదన్= చేస్తాను; ననున్= నన్ను; కారింపక= బాధపెట్టక; కైకొని= అంగీకరించి; ఇచ్చోటన్= ఇక్కడ; వరింపరే?= చేకొనరా?

తాత్పర్యం: నా కున్న ఈ ఐశ్వర్యాన్ని, భోగాలను స్వీకరించండి. నేనూ మీ సొమ్మై మీరు చెప్పిన పనులన్నీ చేస్తాను. నన్ను బాధించక వివాహం చేసికొనండి.

సీ. అనిన నష్టావక్రుఁ 'డతిదూష్యమగు పర । దారాభిగమనంబు దగదు; శూద్ర
సతి యైన నధిక దోషంబు, బ్రాహ్మణపత్ని । యగునేనిఁ బాతక మప్రమేయ;
మదియును గాక, నే నస్ఖలిత బ్రహ్మ । చర్యంబునం దుండి భార్యఁ గోరి
యున్నాఁడ 'ననుడు; 'నీ యొప్పనం దగిలితి । వనితలు గామార్తి వశతఁ బొంది

తే. వంశహాని దలంపరు, వరుస కలుక; । రాత్మజులఁ జూడ; రగ్రజు ననుజుఁ గొనరు
పురుష శతకంబు సంగమంబునను దృప్తి । సనరు; దీని విచారింపు మనియె' నువిద. 17

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అష్టావక్రుఁడు; అతిదూష్యము+అగు= మిక్కిలి నిందించదగిన; పర= ఇతరుడి; దార= భార్యతో; అభిగమనంబు= తిరగటం; తగదు= కూడదు; శూద్రసతి= శూద్రుడి భార్య; ఐనన్= అయితే; అధిక= మిక్కిలి;

దోషంబు= తప్పు; బ్రాహ్మణపత్ని= బ్రాహ్మణుడి భార్య; అగున్+ఏనిన్= అయితే; పాతకము= పాపం; అప్రమేయము= మితిలేనిది; అదియును+కాక= అంతేకాకుండా; ఏను= నేను; అస్ఖలిత బ్రహ్మచర్యంబునందున్= చెదరని బ్రహ్మచర్య వ్రతంలో; ఉండి; భార్యన్+కోరి ఉన్నాఁడన్= అనుడున్= పత్నిని వాంఛించి ఉన్నాను అనగా; ఉవిద= ఆ స్త్రీ, ఆమె; నీ ఒప్పునన్= నీ అందంలో; తగిలితిన్= చిక్కుకొన్నాను; వనితలు= స్త్రీలు; కామ+ఆర్తి= మన్మథ బాధకు; వశతన్= లోబడటం; పొంది; వంశహాని= కులనాశనం; తలంపరు= భావించరు; వరుసకున్= వావివరుసలకు; అలుకరు= జంకరు; ఆత్మజులన్+ చూడరు= కొడుకులను గమనించరు; అగ్రజున్= అన్నను; అనుజున్= తమ్ముడిని; కొనరు= సరకుగొనరు, లెక్కించరు; పురుషశతకంబు= నూరుమంది మగవారి; సంగమంబునను= రతితో; తృప్తిచనరు= తృప్తిపడరు; దీనిన్= ఈ విషయం; విచారింపుము= ఆలోచించుము; అనియెన్= అనిపల్కింది.

తాత్పర్యం: అష్టావక్రు డన్నాడు 'పరునిభార్యతో పోవటం నింద్యం. శూద్రసతి అయితే మరీపాపం. బ్రాహ్మణ సతి అయితే మహాపాపమే. పైగా నేను బ్రహ్మచారినై భార్యను కోరి ఉన్నాను' అని చెప్పటంతో ఆమె అన్నది 'నేను నీ అందానికి బానిసనై పోయాను. స్త్రీకి కామం కలిగితే వంశహానిని, వావి వరుసలను, అన్నదమ్ములను లక్ష్యపెట్టదు. నూరుమంది మగవారితోనూ తృప్తిపొందదు'. ఈ విషయం ఆలోచించు అన్నది.

వ. అనిన నమ్మునివరుండు. 18

తాత్పర్యం: అనగానే ఆ మునిశ్రేష్ఠుడు.

క. 'ఇది యేటి కార్యముగ నా। మది కెక్కఁగఁ జెప్పె? దిట్టి మాటలుఁ గలవే?
మదవృత్తి మాను; మేఁ బో। యెద' నావుడు నమ్మృగాక్షి యెలన వ్వొలయన్. 19

ప్రతిపదార్థం: ఇది ఏటి కార్యముగన్= ఇదేమంత చేయదగిన పని అయినట్లుగా; నా మదికిన్= నా మనస్సునకు; ఎక్కఁగన్= ఎక్కేటట్లుగా; చెప్పెదు= చెప్పుతావు; ఇట్టి= ఇట్లాంటి; మాటలున్= మాటలు కూడా; కలవే?= ఉన్నవా?; మదవృత్తిన్= మనస్సులోని కామాన్ని; మానుము= వదలుము; ఏన్= నేను; పోయెదన్= పోతాను; నావుడున్= అనగా; ఆ మృగాక్షి= ఆ లేడి కన్నులవంటి కన్నులు కలది; ఎల= లేత; నవ్వు= నగవు; ఒలయన్= (పెదవులపై) వ్యాపించగా.

తాత్పర్యం: 'ఇదేమంత ఘనకార్యమని నా మనసు కెక్కేటట్లు చెప్పుతున్నావు? ఇట్లాంటి మాటలు కూడా ఉంటాయా? నాకు తెలియదా? ఈ కోరికను వదలిపెట్టుము. నేను పోతున్నాను' అని అనగా ఆమె లేత నవ్వు చిందించి.

తే. 'కార్య మగుటయు నరిగెదు గాక పిదప, నిల్వు మంతకు' ననుటయు 'నీవు నన్నుఁ
గదియ కుండెద వేని నిల్చెద; సధర్మ। వృత్తి వగు' మని వారించె నత్తపస్వి. 20

ప్రతిపదార్థం: కార్యము= పని; అగుటయున్= కాగానే; పిదపన్= తరువాత; అరిగెదుగాక= వెళ్ళుదువుగాని; అంతకున్= అందాకా; నిల్వుము= నిలువుము; అనుటయున్= అనగా; నీవు; నన్నున్; కదియక= తాకక; ఉండెదవు+ఏనిన్= ఉంటే; నిల్చెదన్= ఉంటాను; సధర్మవృత్తివి= ధర్మదృష్టి కలదానివి; అగుము= కమ్ము; అని; ఆ+తపస్వి= ఆ ముని; వారించెన్= అడ్డగించాడు.

తాత్పర్యం: 'పనికాగానే పోదువుగానిలే. అందాక ఉండుము' అని ఆమె అనగా, అత డన్నాడు 'నీవు నన్ను తాకకుండా ఉంటే ఉంటాను. ధర్మంగా ప్రవర్తించుము' అని వారించాడు.

వ. ఇట్లు వారించి యిది శాపంబున ముదురుదనంబు నొందిన బృందారక సుందరి గావలయు; నట్లయ్యెం గాకుండె, దీని తెఱంగు నా కెఱుంగన్ జాలిం బడనేల?' యని యాత్మ నూహించి యూరకుండె; నంతఁ బ్రభాతం బైనం 'గాలోచిత కృత్యంబులు దీర్పు' మని పలికి యప్పొలంతి యుత్తమ స్నానీయ ద్రవ్యంబులు దెచ్చి, యమ్ముని యనుజ్ఞ వడసి మృదుకరతలంబుల మేను దొడసి కృతస్నానుం జేసి, యతండు సంధ్యావందనాగ్ని కార్యంబు లాచరించిన, నమృతోపమానంబులగు నన్నపానంబుల నతనిం దృప్తునిం గావించి, యుచిత సంభాషణబులం బ్రొద్దు పుచ్చి నిశాసమయం బగుటయు శయనంబునకుఁ బిలిచిన నా సుశ్లోకుండు రాకున్న 'నేనుం గన్యక; నస్ఖలిత బ్రహ్మచర్యంబునన చూవె పరిణత వయస్క నైతి; స్వతంత్ర నై యుండుదుం; బాణిగ్రహణ మహోత్సవం బనుభవింపు' మని పలికిన నమ్మహాత్ముం డిట్లనియె. 21

ప్రతిపదార్థం: ఇట్లు వారించి; శాపవశంబునన్= శాపవశాత్తు; ఇది= ఈమె; ముదురుదనంబు= గట్టివయస్సు; ఒందిన= పొందిన; బృందారక= దేవజాతి; సుందరి= అందగత్తె; కావలయున్ అయి ఉండవలెను; అట్లు+అయ్యెన్ అట్లాగే కావచ్చు; కాక+ఉండెన్= కాకపోవచ్చు; నాకున్= నాకు; దీనితెఱంగు= దీని జన్మకథ; ఎఱుంగన్= తెలిసికొనటానికి; జాలిన్+పడన్+ఏల?= జాలిపొందటం దేనికి?; అని; ఆత్మన్= తనలో; ఊహించి= ఆలోచించుకొని; ఊరకుండెన్= మిన్నకున్నాడు; అంతన్= అటుపిమ్మట; ప్రభాతంబు+ఐనన్= తెల్లవారగా; కాల+ఉచిత= ఆ సమయానికి తగిన; కృత్యంబులు= చేయదగిన పనులు; తీర్పుము;+అని+పలికి; ఆ+పొలంతి= ఆ స్త్రీ; ఉత్తమ= శ్రేష్ఠమైన; స్నానీయ= స్నానయోగ్యమైన; ద్రవ్యంబులు= వస్తువులు; తెచ్చి; ఆ+ముని; అనుజ్ఞ= అనుమతి; వడసి= పొంది; మృదు= మెత్తని; కరతలంబులన్= చేతులతో; మేను= శరీరాన్ని; తొడసి= తడిపి; కృతస్నానున్‌చేసి= స్నానంచేయించి; అతండు= ఆయన; సంధ్యావందన+అగ్నికార్యంబులు= బ్రాహ్మణ కర్మలైన ప్రాతఃకాలసంధ్యావందనం, అగ్నిహోత్రాదులు; ఆచరించినన్= చేయగా; అమృత+ఉపమానంబులు+అగు= అమృతం వంటి; అన్నపానంబులన్= అన్న, పానీయాలతో; అతనిన్; తృప్తునిన్= తృప్తి పొందినవాడిని; కావించి= చేసి; ఉచిత= తగిన; సంభాషణంబులన్= మంచిమాటలతో; ప్రొద్దుపుచ్చి= ప్రొద్దుగడిపి; నిశాసమయంబు= రాత్రి; అగుటయున్= కాగా; శయనంబునకున్= తనపడకకు; పిలిచినన్= పిలిస్తే; ఆ సుశ్లోకుండు= ఆ స్తుతింప దగ్గవాడు; రాకున్నన్= రాకపోతే; నేనున్= నేనుకూడా; కన్యకన్; అస్ఖలిత= చెదరని; బ్రహ్మచర్యంబునన= బ్రహ్మచర్యంలోనే; పరిణత= ముదిరిన; వయస్కను= వయస్సు కలదానను; ఐతిన్+చూవె= అయినాను సుమా!; స్వతంత్రను+ఐ+ఉండుదున్= నా ఇష్టం చొప్పున ప్రవర్తిస్తాను; పాణిగ్రహ+మహా+ ఉత్సవంబు= పెండ్లి సంబరం; అనుభవింపుము= పొందుము; అని పల్కినన్; ఆ+మహా+ఆత్ముండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా వారించి 'ఈమె శాపవశాత్తు ఇట్లా ముదిరిపోయిన దేవకాంత కాబోలు! అట్లా కాదేమో. ఏమైనా దీని ఆలోచనతో నేను సతమతం కావటం దేనికి?' అని ఆలోచిస్తూ అతడు ఊరుకొన్నాడు. అంతలో తెల్లవారింది. ఆమె అతడితో అన్నది 'ఈ సమయానికి తగిన పనులన్నీ పూర్తి కానిమ్ము' అని. అతడి స్నానానికి ఏర్పాట్లు చేసి, అతడి అనుమతితో తన మెత్తటిచేతులతో అతని శరీరం రుద్ది స్నానం చేయించింది. అతడు తరువాత ప్రాతఃకాల విధ్యుక్త కర్మలు పూర్తి చేసుకొన్నాక అతడిని అన్నపానాలతో తృప్తిపరచి మంచి మాటలతో ప్రొద్దు గడపింది. తరువాత రాత్రి కాగా ఆమె తనపడకకు రమ్మన్నది. అతడు కదలలేదు. అప్పు డామె 'నేను బ్రహ్మచర్య వ్రతంలోనే జీవితాన్ని గడిపాను. అందువలననే నా కింత వయసు వచ్చింది. నన్ను వివాహం చేసికొమ్ము' అంటే ఆ మహాత్ము డిట్లా అన్నాడు.

తే. 'బాల్యమునఁ దండ్రి, యౌవనప్రాప్తి మగఁడు, । వార్ధకంబునఁ దనయుఁడు, వామనయన
నరసి నడపన కా కెందు నంగనలకు । వలసినట్టులు సేయఁగా వచ్చు నెట్లు? 22

ప్రతిపదార్థం: వామనయనన్= అందాల కళ్ళు కల స్త్రీని; అరసి= కాపాడి; నడపన= జీవించేటట్లుగా (చేసేవారు); తండ్రి; బాల్యమునన్= పసితనంలో; మగఁడు= భర్త; యౌవనప్రాప్తిన్= యుక్తవయస్సులో; తనయుఁడు= కొడుకు; వార్ధకంబునన్= ముసలితనంలో; కాక; ఎందున్= ఎప్పుడూ; అంగనలకున్= స్త్రీలకు; వలసినట్టులు= వారు ఇష్టం వచ్చినట్లు; చేయఁగాన్= చేయటానికి; ఎట్లు వచ్చున్= ఎట్లా వీలౌతుంది?

తాత్పర్యం: 'స్త్రీకి పసితనంలో తండ్రి, వివాహమైన తరువాత భర్త, ముసలితనంలో కొడుకు రక్షిస్తారు తప్ప ఆమెకు స్వతంత్రంగా ఏమీ చేయటానికి వీలు లేదు కదా!

వ. 'కావున నీవు ని న్నిచ్చినం బరిగ్రహించుట పాడిగా' దను సమయంబునం జూడఁ జూడ నచ్చేడియ సుభగ యౌవన సుందరాంగియు మనోహర విలాస భంగియు నయ్యె; నైనను దానియందుఁ దగులని చిత్తంబుతో నత్తపోధన కుమారుండు. 23

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు= నీకై నీవు; నిన్ను ఇచ్చినన్= నిన్ను సమర్పించుకొన్నా; పరిగ్రహించుట= నేను స్వీకరించటం; పాడికాదు= న్యాయం కాదు; అను= మాట లంటున్న; సమయంబునన్= వేళలో; చూడన్+చూడన్= చూస్తూ ఉండగా; ఆ+చేడియ= ఆ స్త్రీ; సుభగ= అందమైన; యౌవన= యుక్త వయస్సులో; సుందరాంగియున్= అందమైన అవయవాలు కలది; మనోహర విలాసభంగియున్= అందమైన ఒయ్యారం కలదీ; అయ్యెన్= అయింది; ఐననున్= అయినప్పటికి; దానియందున్= ఆమెపై; తగులని= ఆసక్తి పొందని; చిత్తంబుతోన్= మనస్సుతో; ఆ+తపోధన కుమారుండు= తపస్సే సంపదగా కల ఋషి కొడుకు, మునికుమారుడు.

తాత్పర్యం: 'కాబట్టి స్వతంత్రించి నీకై నిన్ను అర్పించుకొన్నా నేను స్వీకరించలేను. అది న్యాయం కాదు' అని అంటూ ఉండగానే ఆమె వికసించిన యౌవనం అందమైన అవయవాలూ, మనస్సును హరించే విలాసం కలదీ అయింది. ఐనప్పటికీ అతడు చలించలేదు.

క. 'ఈ యనృత వర్తనము లే । లా? యున్న నిజంబు నీ తలంపును నిన్నుం
దోయజలోచన! చెప్పుము; । పోయెదఁ బనులు గల; వనిచి పుచ్చుము నన్నున్. 24

ప్రతిపదార్థం: ఈ అనృత= ఈ అబద్ధపు; వర్తనములు= చేష్టలు; ఏలా?= ఎందుకు?; ఉన్న నిజంబు= కలమాట; నీ తలంపును= నీ ఆలోచన; నిన్నున్= నీ వెవరవో, నిన్ను గురించి; తోయజలోచన!= తామరపూలవంటి కళ్ళున్నదానా!; చెప్పుము; పోయెదన్= పోతాను; పనులు కలవు= చేయవలసిన కార్యాలు ఉన్నాయి; నన్నున్; అనిచి పుచ్చుము= నన్ను సాగనంపుము.

తాత్పర్యం: 'ఈ అబద్ధపు చేష్టలు దేనికి? నీ సంగ తేమిటి? నీ వెవరవు? వివరంగా చెప్పుము. నాకు చాల పనులు ఉన్నాయి. కనుక నన్ను పంపించు పోతాను'.

సీ. అనవుడుఁ బ్రీతయై 'యనఘ! ని న్నారయు । తలఁపునఁ జూవె వదాన్యుఁ డిందుఁ
బుత్తెంచె; నేను నీ యుత్తరదిశఁ జుమ్ము; । నీ నిష్ఠ గాంచితి; దీన నతఁడు

నిను మెచ్చు; నాదెస మనమునఁ బ్రియమొందు; । మరుగుము సుప్రభా పరిణయమున'
కనిన నద్దేవికి వినతుఁడై, వీడ్కొని । యరిగి, యమ్మునిపతి, యాత్మఁ గనియుఁ

తే. దన్ను నడుగంగ సకలవృత్తంబుఁ జెప్పి । యతని పుత్త్రికఁ బెండ్లియై యతుల ధర్మ
భోగ గౌరవకీర్తులఁ బొంది జగతి । నతిశయిల్లె నష్టావక్రుఁ డధిపముఖ్య!' 25

ప్రతిపదార్థం: అనవుడున్= అని పల్కగా; అధిపముఖ్య!= రాజశ్రేష్ఠుడా!; ప్రీత+ఐ= సంతోషించినదై; అనఘ!= పుణ్యాత్ముడవైన అష్టావక్ర మునీంద్రా!; నిన్నున్; అరయు తలఁపునన్= పరీక్షించే ఆలోచనతో; చూవె= సుమా!; వదాన్యుఁడు= సుప్రభ తండ్రి; ఇందున్= ఇక్కడకు; పుత్తెంచెన్= నిన్ను పంపించాడు; నేను; ఈ ఉత్తర దిశన్ చుమ్ము= ఈ ఉత్తర దిక్కాంతను సుమా!; నీనిష్ఠ=నీ బ్రహ్మచర్య నియమం; కాంచితిన్= పరీక్షించాను; దీనన్= ఈ పరీక్షవలన; అతఁడు= వదాన్యుడు; నినున్ మెచ్చున్= నిన్ను మెచ్చుకొంటాడు; నా దెసన్= నా యందు; మనమునన్= మనస్సులో; ప్రియము+ఒందుము= ప్రీతిపొందుము; సుప్రభా పరిణయమునకున్= సుప్రభను వివాహం చేసికొనటానికి; అరుగుము= వెళ్ళుము; అనినన్; ఆ+దేవికిన్= ఆ దేవతకు; వినతుఁడు+ఐ= నమస్కరించి; వీడ్కొని= ఆమెవద్ద సెలవు పుచ్చుకొని; అరిగి= వెళ్ళి; ఆ+మునిపతి= ఆ వదాన్యుడన్న మునిరాజు; ఆత్మన్= తనలో; కనియున్= జరిగిన కథనంతా చూచికూడా; తన్నున్= అష్టావక్రుడిని; అడుగంగన్= అడుగగా; సకల వృత్తంబున్= జరిగినదంతా; చెప్పి= తెలిపి; అతని; పుత్రికన్= అతని కుమార్తెను; పెండ్లి+ఐ= వివాహం చేసికొని; అతుల= సాటిలేని; ధర్మ= ధర్మం; భోగ= సుఖాలు; గౌరవ= గౌరవం; కీర్తులన్= కీర్తిని; పొంది; జగతిన్= లోకంలో; అష్టావక్రుఁడు; అతిశయిల్లెన్= గొప్పవాడయ్యాడు.

తాత్పర్యం: అనేసరికి ఆమె సంతోషించి 'నిన్ను పరీక్షించే నిమిత్తం వదాన్యుడు న న్నిక్కడకు పంపించాడు. నేను ఉత్తర దిక్కాంతను. నీ నియమం చూచాను. దీనితో వదాన్యుడు సంతోషిస్తాడు. నాయందు ప్రీతినెరపుము. వెళ్ళి సుప్రభను వివాహం చేసికొను' మనగా అతడు ఆమెకు నమస్కరించి వెళ్ళి వదాన్యుడికంతా చెప్పి అతడి కూతుర్ని వివాహం చేసికొని గొప్ప ధర్మపరుడుగా గౌరవమర్యాదలతో కీర్తిపొందాడు'.

వ. అని యష్టావక్రదిశా సంవాదంబు సెప్పిన విని యప్పాండవాగ్రజుండు 'మునులవలన శూద్రజాతి భామలయందుఁ బ్రభవించిన వారికి బ్రహ్మర్షిత్వంబు గల్గుట యది యెట్లొకో'! యని వితర్కింతు; నత్తెఱంగు నాకెఱింగింపవే!' యని యనిమిషనదీనందను నడుగుటయు, నక్కురుపతికిఁ గురుపితామహుం డిట్లనియె. 26

ప్రతిపదార్థం: అని= అంటూ; అష్టావక్రదిశా సంవాదంబు= అష్టావక్రునకు ఉత్తరదిక్కాంతకు జరిగిన సంభాషణ; చెప్పినన్ విని= భీష్ముడు తెల్పగా ఆలకించి; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడు; మునులవలనన్= మునులద్వారా; శూద్రజాతి భామలయందున్= నాలుగవజాతి స్త్రీలలో; ప్రభవించిన= పుట్టిన; వారికిన్, బ్రహ్మర్షిత్వంబు= బ్రహ్మర్షిత్వం; కల్గుట= సంభవించుట; ఎట్లు+ఒకో!= ఎట్లాగబ్బా!; అని; వితర్కింతున్= ఆలోచిస్తాను; ఆ+తెఱంగు= ఆ విధానం; నాకున్; ఎఱింగింపవే= తెలుపవా; అని; అనిమిషనదీ నందనున్= గంగాపుత్రుడైన భీష్ముడిని; అడుగుటయున్= అడుగగా; ఆ+కురుపతికిన్= ఆ కురువంశ చక్రవర్తి అయిన ధర్మజుడితో; కురుపితామహుండు= కురువంశస్థులకు తాత ఐన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అష్టావక్రుడికి దిశాకన్యకు జరిగిన సంవాదం చెప్పగా విని ధర్మరాజు ఇట్లా అడిగాడు; 'మునుల వలన శూద్రస్త్రీలకు కలిగిన సంతానం బ్రహ్మర్షులు ఎట్లా కావటం? అని నాకు చాలా రోజులుగా ఆలోచన తెగటం లేదు. దీని రహస్యం విప్పి చెప్పు' మని. భీష్ముడు ఇట్లా అన్నాడు.

సీ. నాలుగు జాతుల నాతులు, విప్రున । కాంద్రుగాఁ గైకొన నగు; నృపునకుఁ
దనకులంబున నట తక్కువ కులములు । రెంటను బరిణయశ్రీ వహింపఁ
జను; వైశ్యునకు నాత్మజాతి, శూద్రాన్వ యం । బునఁ బెండ్లి గాఁ దగు భూపవర్య!
శూద్రున కర్హంబు శూద్రకన్యకఁ బెండ్లి । యగుటయు; నిది వివాహ ప్రకార

ఆ. కథిత ధర్మ; మిట్టిగతిఁ దప్పి ప్రతిలోమ । సరణి యైనఁ, గల్గు సంకరంబు;
తల్లి యెట్టి కులము దాని కులంబ యౌ । సన్నుతానులోమ సంభవునకు. 27

ప్రతిపదార్థం: విప్రునకున్= బ్రాహ్మణుడికి; నాలుగు జాతుల= నాలుగు వర్ణాల; నాతులు= స్త్రీలను; ఆంద్రు+కాన్= భార్యలుగా; కైకొనన్= స్వీకరించటానికి; అగున్= తగును; నృపునకున్= రాజునకు; తన కులంబునన్= తన క్షత్రియ కులంకంటె; అట తక్కువ= ఆ తక్కువ; కులములు రెంటను= రెండు కులాలనుండి; పరిణయశ్రీ= వివాహ మంగళం; వహింపన్ చనున్= చేసికొనవచ్చును; వైశ్యునకున్= కోమటికి; ఆత్మ జాతిన్= తమ కులంలో; శూద్ర+అన్వయంబునన్= శూద్రకులంలోను; పెండ్లికాన్= పెండ్లి అగుట; తగున్= న్యాయం; భూపవర్య!= రాజశ్రేష్ఠుడా!; శూద్రునకున్; శూద్రకన్యకన్= తమకులం పిల్లనే; పెండ్లిఅగుటయున్= వివాహం చేసికొనటమే; అర్హంబు= యుక్తము; ఇది= ఇయ్యది; వివాహప్రకార= వివాహ విధానంగా; కథిత= చెప్పబడిన; ధర్మము= న్యాయం; ఇట్టి= ఇట్లాంటి; గతిన్= పద్ధతిని; తప్పి= త్రోసిరాజని; ప్రతిలోమ సరణి= పై కులాలవారిని క్రిందికులాలవారు చేసికొనటం; ఐనన్= అయితే; సంకరంబు= వర్ణసాంకర్యం (కులాలన్ని కలగాపులగంగా కలిసిపోవటం); కల్గున్= అవుతుంది; తల్లి; ఎట్టికులము= ఏ కులందో; దాని= తల్లి; సన్నుత= పొగడ దగిన; అనులోమ= పై కులం వారినుండి; సంభవునకున్= పుట్టిన వానికి; కులంబ ఔ= కులమే అవుతుంది.

తాత్పర్యం: బ్రాహ్మణుడైతే నాలుగు కులాల వారినీ పెండ్లి చేసికొనవచ్చును. క్షత్రియుడైతే మూడు కులాల నుండి, వైశ్యుడు రెండు కులాల నుండి, శూద్రుడు తన కులంనుండి మాత్రమే వివాహం చేసికొనటం ధర్మం. ఇది తప్పితే వర్ణసాంకర్యం కలుగుతుంది. ప్రతిలోమ వివాహం పనికిరాదు. అనులోమ వివాహమే అయితే తల్లి ఏ కులానికి చెందిందో ఆమె యొక్క కులమే సంతానానిది ఔతుంది.

విశేషం: ప్రతిలోమం= క్రమంగా క్రిందికి రావటం - అవరోహణ క్రమం. అనులోమ= ఆరోహణ క్రమం. క్రమంగా పైకిపోవటం.

వ. ఇది సకలజన సామాన్యంబైన తెఱంగు; విశేషించి ముని సత్తముల యుత్తమ తపోజ్ఞాన విద్యాప్రభావంబులం జేసి తదీయబీజ సంజాతులు యోని యెద్దియైనను బ్రాహ్మణుల యగుదురు; మహా క్షత్రియులు ననులోమవృత్తి నాత్మ ప్రభావంబులం జేసి నిజబీజ సంజనితులకుఁ దమకులంబ కలిగింపం జాలుదురు; నీవు వియోని జాతులని శంకించి యడిగితివి; వారల యేల? పశు యోని జాతులు నయోనిజాతులును లోనుగా సద్విజులును రాజవరులు నగుట గన్నదిగాదె! కావున మునివరుల నృపవరుల వలనం గలిగిన జన్మంబులెల్లను; బీజ ప్రధానంబులై యతిశయిల్లు; వినుము వసిష్ఠుండు, ఋశ్యశృంగుం, డగస్త్యుండు, సత్యవత్సుద్భవుం డగు కృష్ణద్వైపాయనుండు, మందపాలనందనులు, మఱియు ద్రోణ కృపాదులుం, బ్రభవించిన భంగులు విందుమకాదె! వార లెట్టెట్టి వారయి రెఱుంగవె? యివ్విషయంబున మనువాక్యంబు గల దాకర్ణింపుము. 28

ప్రతిపదార్థం: ఇది= ఇయ్యది; సకల జనసామాన్యంబు+ఐన= మానవులందరకు సంబంధించినదైన; తెఱంగు= పద్ధతి; విశేషించి= ప్రత్యేకించి; మునిసత్తములు= మునిశ్రేష్ఠుల; ఉత్తమ= గొప్ప; తపః= తపస్సు; జ్ఞాన= జ్ఞానం; విద్యా=చదువు; ప్రభావంబులన్+చేసి= మాహాత్మ్యంవలన; తదీయ= ఆ; బీజ= విత్తు వలన; సంజాతులు= చక్కగా పుట్టినవారు; యోని= క్షేత్రం(భార్య); ఎద్దిఐననున్= ఏదైనా; ఏ కులస్త్రీఅయినా; బ్రాహ్మణుల= బ్రాహ్మణులే; అగుదురు= ఔతారు; మహాక్షత్రియులు= మహారాజులు; అనులోమ వృత్తిన్= ధర్మప్రకారంగా; ఆత్మ= తమ ఆత్మల; ప్రభావంబులన్+చేసి= శక్తితో; నిజ= తమ; బీజ= గింజ వలన; సంజనితులకున్= పుట్టినవారికి; తమకులంబ= తమ వర్ణం; కలిగింపన్+చాలుదురు= కలిగిస్తారు; నీవు; వియోని= విరుద్ధ క్షేత్రంలో; జాతులు= పుట్టినవారు; అని శంకించి= అని సందేహించి; అడిగితివి= అడిగావు; వారలు+అ ఏల?= వారిలోనే ఎందుకు? పశుయోని జాతులు= పశు సంతానం; అయోనిజాతులును= గ్రుడ్డునుండి పుట్టినవారు; లోనుగాన్= మొదలైన; సద్విజులు= మంచి విప్రులు; రాజవరులున్= రాజశ్రేష్ఠులు; అగుట; కన్నదికాదె!= చూచిందే కదా! కావున; మునివరుల, నృపవరుల వలనన్= మునిశ్రేష్ఠులవలన, రాజశ్రేష్ఠులవలన; కలిగిన= ఏర్పడిన; జన్మంబులు+ఎల్లను= పుట్టుక లన్నియూ; బీజప్రధానంబులు+ఐ= క్షేత్రంకంటె బీజం ముఖ్యమైనవై; అతిశయిల్లున్= ప్రకాశిస్తాయి; వినుము= ఆలకింపుము; వసిష్ఠుండు; ఋశ్యశృంగుండు; అగస్త్యుండు; సత్యవతి+ఉద్భవుండు= సత్యవతికి పుట్టినవాడు; అగు= ఐనట్టి; కృష్ణ ద్వైపాయనుండు మందపాలనందనులు; మఱియున్= ఇంకను; ద్రోణకృప ఆదులున్= ద్రోణుడు, కృపుడు మొదలైనవారు; ప్రభవించిన= పుట్టిన; భంగులు= పద్ధతులు; విందుము+అ కాదె= విన్నారముగదా! వారలు= వారు; ఎట్టి+ ఎట్టివారు+అయిరి= ఎంతటివారలైనారో; ఎఱుంగవె= నీకు తెలియదా?; ఈ+విషయంబునన్= ఈ సంగతియందు; మనువాక్యంబు= స్మృతికారుడైన మనువు చెప్పిన మాట; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇది సామాన్యధర్మం. విశేషధర్మాలు వేరు. మునిశ్రేష్ఠులు ఉత్తమ తపస్సు, జ్ఞానం, విద్యలు కలవారు కనుక వారి బీజశక్తిచేత పుట్టినవారు బ్రాహ్మణులే ఔతారు. తమ తల్లి లక్షణాలు రావు. అట్లాగే ఉత్తమ క్షత్రియులు కూడా తమ బీజశక్తి చేత అనులోమ పద్ధతిచేత తమ కులాన్నే కలిగించగలరు. నీవు విరుద్ధ క్షేత్రంలో పుట్టుతారు కదా అని శంకించి అడిగావు. కాని, పశుపక్ష్యాదులలో కూడా మహాబ్రాహ్మణులు, రాజులు జన్మించటం మనకు తెలుసును కదా! కాబట్టి మునులకు, రాజులకు కలిగిన సంతానం బీజ ప్రధానమే. వసిష్ఠుడు, ఋశ్యశృంగుడు, అగస్త్యుడు, వ్యాసమహర్షి, మందపాలుడి సంతానం, ద్రోణుడు, కృపుడు మొదలైన వారు పుట్టిన కథలు విన్నాం కదా! వారలు ఎట్లాంటివారైనారో నీకూ తెలుసును కదా! ఈ సందర్భంలో మనువు చెప్పిన మాటలు వినుము.

క. మునిజనుల, నదుల, సిద్ధుల । జననంబులు బుద్ధి వృత్తిఁ జర్చింపఁగ నె
వ్వనికిన్ వశంబు గా; వవి । తనతన యైనట్ల యై యుదాత్తతఁ బొందున్.' 29

ప్రతిపదార్థం: ముని జనుల= మునులైన మానవుల యొక్క; నదుల= నదులయొక్క; సిద్ధుల= యోగులయొక్క; జననంబులు= పుట్టుకలు; బుద్ధివృత్తిన్= ఆలోచనలతో; చర్చింపఁగన్= తర్కించటానికి; ఎవ్వనికిన్= ఎంతటి వానికిని; వశంబు కావు= వీలు కావు; అవి= అయ్యవి; తన తన+ఐనట్లు+ఐ= తమంత తామై; ప్రత్యేకంగా; ఉదాత్తతన్= గౌరవం; పొందున్= పొందుతాయి.

తాత్పర్యం: మునుల, నదుల, సిద్ధుల జన్మ రహస్యాలు మనబుద్ధికి తోచినట్లు చర్చించటానికి వీలుకావు. అవి ప్రత్యేకమైనవై తమంత తాము గౌరవాన్ని పొందుతాయి'.

విశేషం: ఏరుల జన్మంబు వీరుల జన్మంబు అని నన్నయ్యగా రన్నారు.

వ. అనిన విని యుధిష్ఠిరుండు. 30

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు (ఇట్లా అడిగాడు)

ఆ. 'అనఘ! దానపాత్ర మగుట విప్రుఁడు లింగి । యైననో యలింగుఁ డై చరించు
టనొ యెఱుంగఁ జెప్పు' మనవుడు గాంగేయుఁ । డిట్టు లనియె నమ్మహీశ్వరునకు. 31

ప్రతిపదార్థం: అనఘ!= మహాత్మా!; విప్రుఁడు= బ్రాహ్మణుడు; దానపాత్రము= దానమునకు యోగ్యుడు; అగుట= కావటం; లింగిఐననో= లింగవృత్తి కలవాడు కావటంవలననా! (లింగవృత్తి= ఆచారపరంగా బాహ్యంగా జీవించేవాడు); అలింగుఁడు+ఐ= సన్న్యాసియై, విరక్తుడై; చరించుటనొ= తిరగటం వలననా; ఎఱుంగన్= తెలిసేటట్లు; చెప్పుము; అనవుడున్= అనగా; గాంగేయుఁడు= భీష్ముడు; ఆ+మహీశ్వరునకున్= ఆ రాజుతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణుడు దాన యోగ్యుడు కావటం వాడి వృత్తి విశేషంతోనా? లేక విరక్తుడై బ్రతకటంవలననా?' - అని ధర్మరాజు ప్రశ్నిస్తే గంగాపుత్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం: లింగం= గుర్తు; బ్రాహ్మణుడు ఆచారాలు (లింగం) బాహ్యంగా అనుసరిస్తూ జీవించేవాడు. ఆలింగుడు= బాహ్యమైన గుర్తులు ఏమీ లేకుండా విరక్తబుద్ధితో జీవించేవాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు దానపాత్రభూతుల తెఱం గెఱింగించుట (సం.13-23-1)

క. 'విను, సద్ద్విజుండు, నిజవ । ర్తనమునఁ జరియించుచున్న దానార్హత్వం
బున వెలుఁగు, లింగియైనను । మనుజేంద్ర! యలింగవృత్తి మహితుం డేనిన్'. 32

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= మానవులకు అధిపతివైన రాజా!; విను= వినుము; సత్= మంచి; ద్విజుండు= బ్రాహ్మణుడు; లింగిఐననున్= బాహ్యాచార సంపన్నుడైనా; నిజ= తన కులానికి తగిన; వర్తనమునన్= ప్రవర్తనతో; చరియించుచున్+ఉన్నన్= బ్రతికితే; అలింగవృత్తి= బాహ్యచిహ్నాలు లేని, విరక్త చిత్తంతో; మహితుండు+ఏనిన్= గొప్పవాడైతే; దాన+అర్హత్వంబునన్= దానానికి యోగ్యమైన లక్షణంతో; వెలుఁగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: 'తన కులానికి తగిన ఆచార వ్యవహారాలతో బ్రతుకుతూ; బాహ్యవేషధారణాదులు కల్గియున్నా ఆంతరంగికంగా వీటన్నింటికి అతీతమైన ఔన్నత్యం గలవాడైతే అతడు దానయోగ్యుడు.

వ. అనుటయుఁ బాండవాగ్రజుండు. 33

తాత్పర్యం: అని అనగా విని ధర్మరాజు.

తే. శ్రద్ధ సాలంగఁ గల్గిన జనము లిచ్చు । భూరిదానముల్ దురితంబుఁ బొంద నేర
వేయెడల నని తలఁచెద నేను బుద్ధి । ననుదు నాతని కతఁ డిట్టు లను నృపాల! 34

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; శ్రద్ధ= విశ్వాసం; చాలంగన్= ఎక్కువ; కల్గిన= ఉన్న; జనములు= మనుష్యులు; ఇచ్చు= ఇచ్చే; భూరి= పెద్ద; దానముల్= దానాలు, ఏ+ఎడలన్= ఏ సందర్భంలోనూ; దురితంబున్= పాపమును; పొందనేరవు; అని;

ఏను= నేను; బుద్ధిన్= మనస్సులో; తలఁచెదన్= అనుకొంటాను; అనుడున్= అనగా; ఆతనికిన్= ధర్మరాజుతో; అతఁడు= భీష్ముడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: రాజా! 'శ్రద్ధతో జనాలిచ్చే గొప్పదానాలు పాపం పొందవని అనుకొంటాను' అని ధర్మరాజు అనగా భీష్ముడు ఇట్లా అన్నాడు.

క. 'నరవర! దుర్దాంతు లయినఁ । బరిపూతులు శ్రద్ధ గల్గు భవ్యులుఁ దా రా
దర మొప్ప నిచ్చు దానము । దురితహరమ కాక, కీడు దొడరునె యెందున్?' 35

ప్రతిపదార్థం: నరవర!= మానవశ్రేష్ఠుడా!; రాజా!; దుర్దాంతులు= అణచరాని గొప్పతనం కలవారు; అయినన్= అయితే; పరిపూతులు= పవిత్రులు; శ్రద్ధ= విశ్వాసం; కల్గు= కలిగిన; భవ్యులు= మహాత్ములు; తారు= తాము; ఆదరము= ప్రేమ; ఒప్పన్= ప్రకాశించగా; ఇచ్చు= ఇచ్చే; దానం; దురితహరమ కాక= పాపం పోగొట్టేదే తప్ప; కీడు= ఆపద; ఎందున్= ఎక్కడైనా; తొడరునె?= కలుగునా;

తాత్పర్యం: 'రాజా! మహాపవిత్రులు, శ్రద్ధ కలిగినవారు, ఆదరంతో చేసిన దానం పాప పరిహారం చేస్తుందే తప్ప పాపం కలిగించదు.'

సీ. అనుడు ధర్మాత్మజుఁ డతనితో 'దైవ కా । ర్యము నప్డు, విప్రుని నతిపరీక్షి
తునిఁ జేయ వలయునే? యనఘ! పైతృకము వి । ధంబున నన్న నాతండు, నీవు
దలఁచిన యట్టిద తగవు?' నావుడు నా నృ । పాలుం 'డపూర్వ సంబంధి సూరి
యాజి తపోనిత్యులందు సత్పాత్రము । లెవ్వార?' లనుటయు 'నింతవట్టు

తే. వారు సత్పాత్రముల, వంశవర్య ధర్మ । భాషణమ కాని తత్క్రియాపరత లేని
యట్టివానికి నరుఁడు హేమాదు లిచ్చి । పొరయుఁ బదియేండ్లు నరకానుభూతి' ననియె. 36

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; ధర్మ+ఆత్మజుఁడు= యముని కొడుకు ధర్మరాజు; అతనితోన్= భీష్మునితో; అనఘ!= దోషరహితుడా! పైతృకము విధంబునన్= పితృకార్యములోవలెనే, శ్రాద్ధక్రియలోమాదిరిగా; దైవకార్యము+అప్డు+అ= దేవతా పూజయందును; విప్రునిన్= బ్రాహ్మణుని; అతిపరీక్షితునిన్= మిక్కిలి పరీక్షించబడినవానిగా; చేయన్+వలయునే= చేయవలెనా? (దైవకార్యం= దేవతాపూజ; పైతృకము= పితృకార్యం; శ్రాద్ధం మున్నగునది) అన్నన్= అని ప్రశ్నించగా; ఆతండు= భీష్ముడు; నీవు= ఓ ధర్మజా నీవు; తలఁచిన+అట్టిది= భావించి నట్టిది; తగవు= న్యాయము; నావుడున్= అని భీష్ముడు అనగానే; ఆ నృపాలుండు= రాజైన ధర్మతనయుడు; అపూర్వ= పూర్వపరిచయం లేనివాడు; సంబంధి= చుట్టము; సూరి= పండితుడు; యాజి= యజ్ఞం చేసినవాడు; తపోనిత్యులు= నిత్యం తపస్సు చేసేవాడు; అందున్= వీరిలో; సత్+పాత్రములు= దానం పుచ్చుకొనటానికి యోగ్యులు; ఏ+వారలు= ఎవ్వరు; అనుటయున్= అని అడిగితే; ఇంతవట్టువారు= నీవు చెప్పిన వారంతా; సత్పాత్రములు+అ= మిక్కిలి అర్హులే; వంశవర్య= కులోద్ధారకుడవైన ధర్మజా!; ధర్మ భాషణము+అ+కాని= మాటలలో ధర్మమే తప్ప; తత్+క్రియాపరత= ధర్మసంబంధ కార్యకలాపములపట్ల ఆసక్తి; లేని+అట్టివానికిన్= లేనటువంటివాడికి; నరుఁడు= మనుజుడు; హేమ+ఆదులు= బంగారం మొదలైనవి; ఇచ్చి= దానంచేసి; పది+ఏండ్లు= దశవర్షాలు; నరక+అనుభూతిన్= నరకలోకానుభవం, నరకబాధలు; పొరయున్= పొందుతాడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు. పితృకార్యంలో వలెనే దేవకార్యంలోనూ బ్రహ్మణుడిని నిశితంగా పరీక్ష చేసికొని దానాదులివ్వాలా అనగా భీష్ముడు "నీ యాలోచన సరైనదే అని పలికాడు. ధర్మరాజు మరల ఇట్లా అడిగాడు. పూర్వపరిచయం లేనివారు చుట్టాలు, పండితులు, యజ్ఞం చేసినవారు, తపస్వులు వీరిలో ఎవరు దానయోగ్యులు? అని. అందుకు భీష్ముడు "వీళ్లంతా దానయోగ్యులేనని చెప్పి" ఎవడు ధర్మపన్నాలు పలుకుతూ ధర్మాన్ని ఆచరించడో వా డయోగ్యుడు. వాడికి బంగారం మొదలైనవి దానమిస్తే పదేళ్ల నరకలోకానుభవం తప్పదు అన్నాడు.

వ. అని భీష్ముఁడు వెండియు. 37

తాత్పర్యం: అని భీష్ముడు పలికి ఇంకా (ఇట్లా అన్నాడు).

క. 'ధరణియుఁ, గాశ్యప, వైశ్వా । నర, మార్కండేయు లోలిన జగద్ధిత వా
క్పరులై రొక్కెడ; వారొక । మరి గోష్ఠీనిరతి నుండి మనుజాధీశా! 38

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= ప్రజలకు అధిపతివైన ధర్మజా! ధరణియున్= భూదేవి; కాశ్యప= కాశ్యప మహర్షి; వైశ్వానర= అగ్ని; మార్కండేయులు= మార్కండేయ మహర్షి; ఓలిన= క్రమంగా; వారు= వారలు; ఒకమరి= ఒకసారి; గోష్ఠీనిరతిన్+ఉండి= చర్చా సమావేశంలో ఉన్నవారై; జగత్+హిత= లోకానికి మేలుకూర్చే; వాక్పరులు= సంభాషణా తత్పరులు; ఐరి= ఐనారు.

తాత్పర్యం: ఒకసారి భూదేవి, కాశ్యపుడు, అగ్ని, మార్కండేయుడు ధర్మవిచారణ చేస్తూ లోకానికి మేలు చేసే మాట లన్నారు. వాటిని క్రమంగా చెప్పుతాను వినుము.

వ. అవ్వాక్యంబు లాకర్ణింపుము. 39

ప్రతిపదార్థం: ఆ+వాక్యంబులు= ఆ వాక్యాలు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ వాక్యాలు వినుము.

క. 'ఘనతర మగు హ్రీ గౌరవ । మున మునిఁగినఁ బాప మఖిలమును, రూపు సెడుం
బెనుపున యగ్గలికఁ బొగడు । గనిన పయోరాశిఁ బడ్డ గడ్డయుఁ బోలెన్. 40

ప్రతిపదార్థం: ఘనతరము అగు= చాలా గొప్పదైన; హ్రీ= సిగ్గు; గౌరవమునన్= గురుత్వంలో, ఎక్కువ సిగ్గులో; మునిఁగినన్= మునిగితే; పెనుపునన్= విస్తారంలో; అగ్గలికన్= ఆధిక్యత; పొగడు= పొగడ్త; కనిన= పొంది; పయోరాశిన్= సముద్రలో; పడ్డ= పడిన; గడ్డయున్= మట్టిగడ్డ; పోలెన్= వలె; పాపము అఖిలమున్= పాపమంతా; రూపుచెడున్= నశిస్తుంది.

తాత్పర్యం: గొప్ప సిగ్గు కలిగి ఉంటే విశాలమైన సముద్రంలో పడ్డ గడ్డవలె పాపాలన్నీ నశిస్తాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. సత్కులంబునఁ బుట్టుట, సకలవేద । ములుఁ బురాణంబులును, శాస్త్రములును జదువు
టయును సద్గతిఁ జేయఁ బ్రౌఢములు గావు । శీలసామగ్రి లేని దుశ్చేష్టితునకు. 41

ప్రతిపదార్థం: శీల= మంచిస్వభావం యొక్క; సామగ్రి= సాధనం; లేని; దుస్= చెడ్డ; చేష్టితునకున్= చేష్టలు కలవాడికి; సత్కులంబునన్= మంచికులంలో; పుట్టుట= జన్మించటం; సకల= అన్ని; వేదములు; పురాణములు= భాగవతాదులు; శాస్త్రములును= సాంఖ్యం యోగం వంటి శాస్త్ర గ్రంథాలు; చదువుటయునున్= చదవటం; సత్‌గతిన్= మంచి స్థితిని, సుగతిని; చేయన్= చేయటానికి; ప్రౌఢములు కావు= సమర్థం కావు.

తాత్పర్యం: శీలంలేనివాడు ఎంత గొప్ప కులంలో పుట్టినా, అన్నివేదాలూ, పురాణాలూ, శాస్త్రాలూ చదువుకొన్నా వాడికి అవి సద్గతుల నీయలేవు.

ఆ. పలు సదువులు సదివి, పండిత మానియై, । తనదు విద్య నొరుల ఘనయశంబుఁ
దూలపుచ్చునట్టి దుష్టాత్మకుని బ్రహ్మ । హత్య వొందు; సందియంబు లేదు. 42

ప్రతిపదార్థం: పలు= అనేకం; చదువులు= శాస్త్రాలు; చదివి= అభ్యసించి; పండిత మాని+ఐ= పండితుడననుకొంటూ ఉండేవాడై; తనదు= తన; విద్యన్= చదువుతో; ఒరులన్= ఇతరుల; ఘన= గొప్ప; యశంబున్= కీర్తినీ; తూలపుచ్చునట్టి= గడ్డిపోచవలె ఎగరగొట్టే; దుష్టాత్మకునిన్= చెడ్డ మనస్సు కలవాడిని; బ్రహ్మహత్య= బ్రాహ్మణుడిని చంపితే కలిగే పాపం; పొందున్= కలుగుతుంది; సందియంబు= సందేహం; లేదు= లేదు.

తాత్పర్యం: అనేక విద్యలు నేర్చుకొని, పండితుడనే అహంకారంతో తన విద్యచేత ఇతరుల కీర్తిని గడ్డిపోచవలె భావించే దుర్మార్గుడికి బ్రహ్మహత్యా పాపం కలుగుతుంది. అందులో సందేహం లేదు.

తే. వాజిమేధముల్ వే యొక్క వలనఁ బెట్టి, । యలఘు సత్యంబు దక్కటివలనియందు
నిల్పి, తులఁ దూపఁగా, సత్యనిష్ఠ లోని । యర్ధమున కెత్తు వచ్చె నయ్యధ్వరములు.' 43

ప్రతిపదార్థం: వే= వేయి; వాజి మేధముల్= అశ్వమేధ యజ్ఞాలు; ఒక్క వలనన్= ఒక ప్రక్కన; పెట్టి= ఉంచి; అలఘు= గొప్ప; సత్యంబు= సత్యవాక్యం; తక్కటివలని యందున్ నిల్పి= మిగిలిన రెండవ ప్రక్కనుంచి; వలని; తులన్= త్రాసులో; తూపఁగాన్= తూస్తే; సత్యనిష్ఠలోని= సత్య నియమంలో ఉన్న; అర్ధమునకున్= సగానికి; ఆ+అధ్వరములు= ఆ యజ్ఞాలు; ఎత్తు= బరువు, తూకం; వచ్చెన్= వచ్చింది;

తాత్పర్యం: వేయి అశ్వమేధాలు ఒక ప్రక్కా, మరొకప్రక్క సత్యవాక్యాన్ని పెట్టి తూస్తే ఆ యజ్ఞాల బరువు సత్యవాక్యానికే సగం తూకం వచ్చింది.

వ. అని యిట్లు వర్తిల్లు నాలుగు వాక్యంబులుం జెప్పి. 44

తాత్పర్యం: అని ఈ విధంగా ప్రవర్తించిన నాలుగు మాటలు చెప్పి.

విశేషం: నాలుగు మాటలు= లోకంలో పలుకుబడి ఇక్కడ నల్గురు చెప్పిన మాటలు - అని రెండర్థాలు.

తే. 'బ్రహ్మచర్యంబు కంటెను, బరము మద్య । మాంసములు రెండు నుడుగుట మనుజనాథ!
లోకయాత్ర వాటించు చలోలుపతయు । శమముఁ గల్గి వర్తించుట శౌచవిధము'. 45

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; మద్య= కల్లు (సారాయి); మాంసములు= నంజుళ్ళు; రెండును= రెంటినీ; ఉడుగుట= మానటం; బ్రహ్మచర్యంబు కంటెను= బ్రహ్మచారిగా ఉండటం కంటె; పరము= శ్రేష్ఠం; లోకయాత్ర= బ్రతుకు తెరువు; పాటించుచున్= నడుపుకొంటూ; అలోలుపతయున్= విరక్తి; శమమున్= కామం, క్రోధంవంటివి లేకుండా శాంతి; కల్గి; వర్తించుట= బ్రతకటం; శౌచవిధము= శుచిత్వమార్గం.

తాత్పర్యం: 'రాజా! మద్య మాంసాలు మానటం బ్రహ్మచర్యం కంటె గొప్పశౌచమంటే సంసారయాత్ర సాగిస్తూ కూడా దేనియందు ఆసక్తి లేకుండా శాంతితో బ్రతకటం.

వ. అనిన విని, యజాతశత్రుండు 'ధర్మంబు నర్థంబును గామంబును నాచరించు కాలంబు లెఱింగింపవే' యనుటయు నాపగేయుం డతని కిట్లనియె. 46

ప్రతిపదార్థం: అనినన్ విని= అని పలుకగా విని; అజాతశత్రుండు= శత్రువులు లేనివాడు, ధర్మజుడు; ధర్మంబు, అర్థంబును, కామంబును= ధర్మ అర్థ కామాలన్న పురుషార్థాలను; ఆచరించు= అనుష్ఠించే; కాలంబులు= సమయాలు; ఎఱింగింపవే అనుటయున్= తెల్పుమా అనగా; ఆపగేయుండు= గంగానది కొడుకు - భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ధర్మార్థ కామాలను ఆచరించే వేళలు ఏవి?' అని ధర్మరాజు అడుగగా భీష్మ డిట్లా అన్నాడు.

తే. 'రేపకడయును, బగలును, మాపు, వరుస । నర్థ ధర్మ కామంబుల నాచరింప
వలయు; వానియం దాసక్తి వలదు; సక్తుఁ । డయ్యె నేనియు మేలు ధర్మాభినిరతి'. 47

ప్రతిపదార్థం: వరుసన్= క్రమంగా; రేపకడయును= తెలవారు జాము; పగలును= పగటిపూట; మాపు= సాయంకాలం; అర్థ - ధర్మ - కామంబులన్= ధర్మము, అర్థము, కామములను; ఆచరింపన్= చేయగా; వలయున్= వలెను; వానియందున్= వాటిపై; అసక్తి= అనురక్తి; వలదు= వద్దు; సక్తుఁడు= అనురక్తుడు; ధర్మ+అభినిరతిన్= ధర్మాచరణంలో; అయ్యెన్+ఏనియున్= అయితే; మేలు= మంచిది.

తాత్పర్యం: 'అర్థం తెల్లవారుజామున, ధర్మం పగలు; రాత్రిపూట కామం - ఈ వరుసలో అనుష్ఠించాలి. అయినా అర్థకామాలపై అంత ఆసక్తి ఉండటం మంచిది కాదు. ధర్మమందలి ఆసక్తితో అర్థకామాలయందు ఆసక్తుడు గావడం మంచిదే. ధర్మానికి అవిరుద్ధంగా అర్థకామాలు అనుభవించడం తప్పుగాదని భావం.

వ. అని మఱియును 48

తాత్పర్యం: అని ఇంకా.

క. 'విను, గురుపూజన విప్రా । ర్చనము లధిక పుణ్యములు, ధరావల్లభ! వి
ప్రుని నిందించుటయును, న । గ్నిని వేదము విడుచుటయును గిల్బిషతమముల్'. 49

ప్రతిపదార్థం: ధరా= భూమికి; వల్లభ!= రాజా!; విను= వినుము; గురుపూజన= గురువులను పూజించటం; విప్ర= బ్రాహ్మణుల; అర్చనములు= పూజలు; అధిక పుణ్యములు= మిక్కిలి పుణ్యాన్ని కలిగించే పనులు; విప్రునిన్= బ్రాహ్మణుడిని; నిందించుటయును= తిట్టడం; అగ్నినిన్= అగ్నిదేవుడినీ; వేదమున్= వేదాన్ని; విడుచుటయున్= త్యజించటం; కిల్బిషతమముల్= మహాపాపాలు.

తాత్పర్యం: 'రాజా! గురువులను, బ్రాహ్మణులను పూజించటం పుణ్యం. బ్రాహ్మణ నిందా; వేదాన్నీ, అగ్నులనూ విడవటం మహాపాపం'.

సీ. అనుటయు, ధర్మనందనుఁడు 'దానంబుల । కెవ్వరు పాత్రంబు లేర్పరింపు'
మనిన 'సద్ధర్ములు, నక్రోధనులు, సత్య । రతులు, దాంతులును, ధీరత్వ యుతులు,
నిజకర్మ నిరతులు, విజితేంద్రియులు సర్వ । భూతహితులు, నలుబ్ధులును, శుచులు
దానపాత్రములు, వేదంబు సాంగంబుగాఁ । జదివి షట్కర్మ నిష్ఠలఁ దొడంగి

తే. తత్త్వవిదులైన బ్రాహ్మణోత్తముల కీగి । విను సహస్రగుణంబగు, విశ్రుత శ్రు
తంబుఁ బ్రజ్ఞయు, శీలవృత్తములుఁ గలుగు । వారి కిచ్చుట వంశవిస్తారకంబు'. 50

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; ధర్మనందనుఁడు= ధర్మరాజు; దానంబులకున్= దానాలకు; ఎవ్వరు; పాత్రంబులు= యోగ్యులు; ఏర్పరింపుము= వేర్వేరుగా చెప్పండి; అనినన్= అని అడుగగా; సద్ధర్ములు= మంచి ధర్మనిష్ఠ కలవారు; అక్రోధనులు= కోపం లేనివారు; సత్యరతులు= సత్యనిష్ఠులు; దాంతులున్= మనో నిగ్రహం కలవారు; ధీరత్వయుతులు= ధైర్యంతో కూడినవారు; నిజకర్మనిరతులున్= తమకు విధించిన కర్మలు చేసేవారు; విజిత= జయించబడిన; ఇంద్రియులున్= ఇంద్రియాలు కలవారు; సర్వభూతహితులున్= అన్ని భూతాలపై ప్రేమ కలవారు; అలుబ్ధులున్= లోభంలేనివారు; శుచులు= పవిత్రులు; దానపాత్రములు= దానయోగ్యులు; స+అంగంబుగాన్= జ్యోతిషం మొదలైన అంగాలు గల; వేదంబున్= వేదాన్ని చదివి; షట్కర్మనిష్ఠలన్= ఆరు కర్మలయందు నియమం; తొడంగి= పూనుకొని; తత్త్వ విదులు+ఐన= తత్త్వం తెలిసిన; బ్రాహ్మణ+ ఉత్తములకున్= ఉత్తములైన బ్రాహ్మణులకు; ఈగి= దానం చేయటం; విను= వినుము; సహస్ర గుణంబు+అగున్= వేయిరె ట్లవుతుంది; విశ్రుత= విస్తారమైన; శ్రుతంబున్= వినికిడి, శాస్త్రము; ప్రజ్ఞయున్= ప్రతిభ; శీల= స్వభావం; వృత్తములున్= ప్రవర్తన; కలుగు= కలిగిన; వారికిన్; ఇచ్చుట= దానమివ్వటం; వంశవిస్తారకంబు= కులాన్ని విస్తరింపచేస్తుంది.

తాత్పర్యం: 'దానయోగ్యు లెవ్వరో వేర్వేరుగా చెప్పు' మని ధర్మరా జడుగగా - భీష్ముడన్నాడు 'ధర్మం చేసేవారు, కోపం లేనివారు, సత్యం చెప్పేవారు, దాంతులు, ధీరులు, నిజకర్మలు చేసేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, భూతదయ కలవారు, లోభం లేనివారు, శుచులు దానయోగ్యులు. ఆరు అంగాలు గల వేదాన్ని చదివి, షట్కర్మ లాచరించే ఉత్తమ బ్రాహ్మణులకు చేసే దానం వేయిరెట్లు ఫలిస్తుంది. విస్తారమైన వినికిడి, గొప్పమేధాశక్తి, ఉత్తమశీలం, ప్రవర్తన కలవారి కిస్తే వంశం విస్తరిస్తుంది.

విశేషం: షట్కర్మలు :1. యజ్ఞం చేయటం, 2. యజ్ఞం చేయించటం, 3. వేదం చదవటం, 4. వేదం చదివించటం, 5. దానం చేయటం, 6. దానం పుచ్చుకొనటం.

వ. అని నిర్దేశించి భీష్ముండు వెండియు. 51

తాత్పర్యం: అని స్పష్టంగా నిరూపించి భీష్ముడు ఇంకా (ఇట్లా అన్నాడు)

ఆ. 'యోగ్యుఁడైన విప్రుఁ డొకరుండు సంతృప్తిఁ । బొంద నధిక తృప్తిఁ బొందు దేవ
వితతి, ముని సమూహ పితృ సమాజములు; న । ట్లగుట వెదకి తెచ్చు నది విశిష్టు'. 52

ప్రతిపదార్థం: యోగ్యుఁడు+ఐన= పాత్రుడు, తగినవాడు అయిన; విప్రుఁడు= బ్రాహ్మణుడు; ఒకరుండు= ఒక్కడు; సంతృప్తిన్= సంతోషం; పొందన్= పొందితే; దేవ= దేవతలయొక్క; వితతి= సమూహం; ముని= మునుల; సమూహ= గుంపు; పితృ= పితృదేవతల; సమాజములు= సంఘాలు; సమూహం; అధిక= మిక్కిలి; తృప్తిన్= తుష్టిని; పొందున్= పొందుతుంది; అట్లు+అగుటన్= అందువలన; విశిష్టున్= ఉత్తముడిని; వెదకి= వెతికి, అన్వేషించి; తెచ్చునది= తేవాలి.

తాత్పర్యం: 'ఉత్తమ బ్రాహ్మణుడిని ఒక్కడినైనా సంతృప్తిపరిస్తే చాలు. సర్వదేవతలు, పితృదేవతలు, మునులు, అంతా సంతోషిస్తారు. కనుక వెదకి వేసారి అయినా ఒక శిష్టబ్రాహ్మణుడిని తేవాలి.'

వ. అనిన విని కౌంతేయాగ్రజుం డతనితో 'దేవ పితృ మనుష్య పూజల కాలంబు లెఱింగింపవే' యనుటయు నతండు. 53

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; అతనితోన్= భీష్ముడితో; దేవ= దేవతల; పితృ= పితృదేవతల; మనుష్య= మానవుల; పూజలకాలంబులు= పూజాసమయాలు; ఎఱింగింపవే= తెలుపవా? అనుటయున్= అనగా; అతండు= అతడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'దేవతలను, పితృదేవతలను, మనుష్యులను పూజించే సమయాలు తెలుపుము' అని అడిగాడు. భీష్ముడు (ఇట్లా అన్నాడు)

క. 'నృపవర! పూర్వాహ్ణంబును, । నపరాహ్ణము దేవ పితృ సమారాధన వి
ధ్యుపదిష్ట కాలములు; మ । ధ్యపు సమయము మానుషార్చనార్హం బరయన్.' 54

ప్రతిపదార్థం: నృపవర!= రాజులలో శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; అరయన్= విచారిస్తే; పూర్వ+అహ్ణంబును= ప్రొద్దుటిపూటా; అపర+ అహ్ణము= ప్రొద్దువాలే వేళా; దేవ= దేవతలకు; పితృ= పితృ దేవతలకు; సమారాధన= చక్కని పూజకు; విధి= బ్రహ్మ చేత, వేదంచేత; ఉపదిష్ట= నిర్దేశించబడిన; కాలములు= సమయాలు; మధ్యపు సమయము= ప్రాహ్ణ, అపరాహ్ణకాలాల మధ్యవేళ; మధ్యాహ్నం; మానుష= నరులను; అర్చన= పూజించటానికి; అర్హంబు= తగినది.

తాత్పర్యం: 'ధర్మరాజా! ప్రొద్దుటిపూట దేవతల నారాధించాలనీ, అపరాహ్ణసమయంలో పితృదేవతలను పూజించాలనీ, మధ్యాహ్నం మనుష్యులను ఆరాధించాలనీ విధి నిర్దేశించాడు'.

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. 55

తాత్పర్యం: అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'నరనాథ! కాలహీనంబును, నశుచిసం । స్పృష్టంబుఁ, బరిభుక్తశేషమును, న
మంత్రకంబును, వీతతంత్రంబుఁ, గీటకే । శ ప్రదుష్టంబు, రాక్షసులు గొంద్రు;
మానవీయ ద్రవ్యమేనియు సురపితృ । క్రియల దురాత్మకు లయినవారు
గుడిచిన నట్ల యక్కుడుపులఁ జొనుపక । మత్తుని,జడుని, నున్మత్తుఁ బతితుఁ

తే. గ్లీబుఁ గుష్ఠి, దేవలకుఁ, జికిత్సకునిని; వీతనియము, నపస్మారి, శ్విత్రి రాజ
యక్ష్మయుతుని, నర్తకుని, గాయకుని, సోమ । విక్రయుని, వేదవిక్రయు విడువ వలయు. 56

ప్రతిపదార్థం: నరనాథా!= రాజా!; కాలహీనంబును= కాలనియమం లేనిదీ; అశుచి= అపవిత్రునిచే; సంస్పృష్టంబు= ముట్టుకొనబడినదీ; అమంత్రకంబును= మంత్రం లేనిది; వీత= పోయిన (లేని); తంత్రంబున్= పూజా పద్ధతి కలది; కీట= పురుగులతో; కేశ= వెంద్రుకలతో; ప్రదుష్టంబున్= మిక్కిలి చెడ్డది అయిన; పరిభుక్తశేషమును= తినగా మిగిలిన దానిని; రాక్షసులు; కొంద్రు= తీసికొంటారు; మానవీయ= మానవ సంబంధమైన; ద్రవ్యము+ఏనియున్= వస్తువైనా; సుర= దేవతల; పితృ= పితృదేవతల; క్రియలన్= యజ్ఞాలలో; దురాత్మకులు= దుష్టబుద్ధులు; అయినవారు= అయినటువంటివారు; కుడిచినన్= తిన్నా; అట్ల= అంతే; ఆ+కుడుపులన్= ఆ తిండ్లలో; చొనుపక= ప్రవేశించనివ్వక; మత్తునిన్= మదించిన వాడినీ; జడునిన్= బుద్ధిలేనివాడినీ; ఉన్మత్తునిన్= పిచ్చివాడినీ, పతితున్= భ్రష్టుడైనవాడినీ; క్లీబున్= నపుంసకునీ; కుష్ఠిన్= కుష్ఠరోగినీ; దేవలకున్= పూజారినీ; చికిత్సకునినిన్= వైద్యుడినీ; వీతనియమున్= నియమంలేని వాడిని; అపస్మారిన్= అపస్మారం కలవాడినీ (మూర్ఛరోగ గ్రస్తుడినీ); శ్విత్రిన్= బొల్లికలవాడినీ; రాజయక్ష్మయుతునిన్= క్షయరోగినీ; నర్తకునిన్= నాట్యం చేసేవాడినీ; గాయకునిన్= సంగీత విద్వాంసుడినీ, సోమ విక్రయునిన్= సోమరసం అమ్ముకొనేవాడినీ; వేద విక్రయున్= వేద విద్యను అమ్ముకొనేవాడినీ (ధనం తీసుకొని వేదాన్ని చెప్పేవాడిని); విడువవలయున్= పరిత్యజించాలి, వదలాలి.

తాత్పర్యం: 'రాజా! కాలనియమం లేకుండా శుచిలేని వానిచే ముట్టుకొన్నదానినీ, ఎంగిలి చేసినదానినీ, మంత్రపూతం కానిదానినీ, పురుగులు, వెంద్రుకలు కలదీ, పూజాతంత్రం లేనిదీ అయిన తిండిని రాక్షసులు తింటారు. మనుష్యులకూ, పితృదేవతలకూ సంబంధించిన ద్రవ్యాలను దుష్టబుద్ధులు గ్రహించకుండా చూడాలి. మదించినవాడినీ, బుద్ధిలేనివాడినీ, పిచ్చివాడినీ, భ్రష్టుడినీ, నపుంసకుడినీ, కుష్ఠరోగినీ, పూజారినీ, వైద్యుడినీ, నియమం లేనివాడినీ, మూర్ఛరోగినీ, బొల్లివ్యాధి కలవాడినీ, క్షయరోగినీ, నర్తకుడినీ, గాయకుడినీ, సోమరసం అమ్ముకొనేవాడినీ, వేదాలను విక్రయించుకొనేవాడినీ దానయోగ్యులుగా పరిగణించరాదు.

ఆ. వడ్డి కిచ్చి కుడుచువాఁడు, ననగ్నియుఁ । బ్రాణి విక్రయమున బ్రదుకు నతఁడు,
దైవ పిత్ర్యములకుఁ దగరు, సంధ్యోపాస । నములు లేనివారు నరవరేణ్య!' 57

ప్రతిపదార్థం: నరవరేణ్యా!= మానవులలో మహోత్తముడా! రాజశ్రేష్ఠుడా!; వడ్డికిన్= వడ్డీకి; ఇచ్చి= డబ్బునిచ్చి; కుడుచువాఁడు= బ్రతికేవాడు; అనగ్నియున్= అగ్నిహోత్రం చేయనివాడు; ప్రాణి= పశుపక్ష్యాదులయొక్క; విక్రయమునన్= అమ్ముకొనటంచేత; బ్రదుకునతడున్= జీవించేవాడు; సంధ్యా+ఉపాసనము= సంధ్యాకాలంలో చేసే జపాదులు లేనివారు, సంధ్యవార్చనివారు; దైవ= దేవతా కార్యాలకు; పిత్ర్యములకున్= పితృకార్యాలకు; తగరు= పనికిరారు.

తాత్పర్యం: బ్రాహ్మణజాతిలో ఎవరైతే అగ్నిహోత్రం, సంధ్యోపాసన మాని వడ్డీ వ్యాపారస్థు లౌతారో, ప్రాణులనమ్మి జీవిస్తారో వారు దైవపితృ కార్యాలలో చేసే దానాలకు తగరు'.

వ. అనిన విని ధర్మనందనుండు శంతను నందనునితో 'దైవపిత్ర్యంబు లగు దానంబులకు నుత్తమపాత్రంబు లెవ్వ రెఱింగింపవే? యని యడుగుటయు నతం డతని కిట్లనియె. 58

ప్రతిపదార్థం: అనినన్ విని= భీష్ముడట్లు చెప్పగా విని; ధర్మనందనుండు= ధర్మరాజు; శంతను నందనునితోన్=భీష్ముడితో (శంతనుడి కుమారుడితో); దైవ పిత్ర్యంబులు= దేవతలకు; పితృదేవతలకు సంబంధించినవి; అగు= అయినట్టి; దానంబులకున్= దానాలకు; ఉత్తమ= విశిష్ట; పాత్రంబులు= యోగ్యులు; ఎవ్వరు= ఎవరు; ఎఱింగింపవే= తెలుపుమా; అని+అడుగుటయున్= అని అడుగగా; అతండు= భీష్ముండు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు. 'దైవకార్యాలలో, పితృకార్యాలలో దానం ఇవ్వటానికి ఉత్తములైన యోగ్యులు ఎవ్వరు? నాకు తెలుపుము' అని ఆ అభ్యర్థనకు సమాధానంగా భీష్ముడు ఇట్లా అన్నాడు.

దైవ పిత్ర్యంబులగు దానంబులకుఁ బాత్ర భూతుల నిరూపించుట (సం.13-24-49)

సీ. 'భోజనార్థులఁ దుష్టిఁ బొందించునతఁడును, । దెరువాటువలనఁ దస్కరులచేతఁ
జే టొంది ధనము వాంఛించు నతండు, వ్ర । తంబున కుద్యాపనంబు సేయఁ
దలఁచి యర్థించునతండును, గురుఁ దల్లి । దండ్రుల సంక్లిష్ట దారపుత్రు
లను బ్రోవఁ బడునతండును, మహావ్యాధి ని । రాసంబు సేయంగ నాస చేయు

తే. నతఁడు, నిష్పాపుఁ డైన ధరామరుండు, । నెపుడు భిక్షయ బ్రదుకగునేని నట్టి
యతఁడు, దైవపిత్ర్యములకు నతిశయంబు । గల్గు పాత్రంబు లగుదురు కౌరవేంద్ర!' 59

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర! = కురుసంతానంలో రాజా! (కురురాజ్యపాలకా); భోజన+అర్థులన్= అన్నం కావాలని వచ్చినవారిని; తుష్టిన్= తృప్తిని; పొందించు అతఁడును= పొందించేవాడునూ; తెరువాటువలనన్= దారిదోపిడి చేత; తస్కరుల చేతన్= దొంగల వలన; చేటు+ఒంది= కీడుపొంది; ధనము= డబ్బు; వాంఛించు= కోరే; అతండున్= వాడునూ; వ్రతంబునకున్= వ్రతానికి; ఉద్యాపనంబు= ముగింపు; చేయన్+తలఁచి= చేయాలనుకొని; అర్థించునతండును= డబ్బు యాచించేవాడు; గురున్= గురువును; తల్లిదండ్రులన్= జననీ జనకులను; సంక్లిష్ట= చిక్కులలోనున్న; దార= భార్య; పుత్రులను= పుత్రులను; ప్రోవన్= పోషించుటకు; పడు+అతండును= పాటుపడేవాడు; మహావ్యాధి= దీర్ఘవ్యాధి; నిరాసంబు+చేయన్= తొలగించుకొనుట కొరకు; ఆసచేయునతఁడున్= కోరుకొనేవాడునూ; నిష్పాపుఁడు= పాపంలేనివాడు; ఐన= అయినట్టి; ధరా+అమరుండు= బ్రాహ్మణుడును; భిక్షయ= బిచ్చమెత్తుకొనటమే; బ్రదుకు= జీవనోపాధి; అగునేనిన్= అయితే; అట్టిఅతఁడు= అట్లాంటివాడు; దైవ పిత్ర్యములకున్= దైవ పితృకార్యాలలో దానాలకు; అతిశయంబు+కల్గు= మిక్కిలి; పాత్రంబులు= యోగ్యులు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'కౌరవరాజా! దేవతారాధనలలో, పితృదేవతారాధనలలో దాన ధర్మాలకు యోగ్యులైనవారిని వినుము. భోజనం పెట్టి తృప్తిపరిచేవాడు, దొంగలవలన అంతా పోగొట్టుకొన్నవాడు; వ్రతోద్యాపన కోరి యాచించేవాడు, గురువు, తల్లి, తండ్రి, భార్యా పుత్రులను పోషించుటకై పాటుపడేవాడు, దీర్ఘవ్యాధిని పోగొట్టుకొనాలనుకొనేవాడు, ఎప్పుడూ భిక్షాటనంతో జీవించే పాపంలేని బ్రాహ్మణుడు - ఈ ఆరుగురు ఉత్తమ దానయోగ్యులు.'

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. 60

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'సత్త్రంబు, సాలయు, జలిపందిరియు, రచ్చ । కొట్టము వ్రచ్చుట, గురుజనముల
నిందించు, టాగమనింద, దదీయ వి । క్రయవిధి, దద్విలేఖనము, గొండి
యము, సంధిభేదన, మన్య కర్మోప జీ । వన, మకృతజ్ఞత, పారదార
వృత్తి, మంత్ర సుశాస్త్ర విధ్వంసనము, మద । లోల, ననాథను, బాలవృద్ధఁ

తే. దాపసిని, భీతివంచనఁ దలరఁజేయు । టతిథి పుత్రభృత్యులకు నాహారకలన
మాచరింపక కుడుచుట, యార్యకోటి । నిరయహేతువులుగఁ జెప్పు నృపవరేణ్య! 61

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= మహారాజా!; సత్త్రంబు= ధర్మ సత్రాలు; సాలయున్= సభాశాలలు; చలిపందిరియున్= వేసవిలో నీరుపోసేచోటు; రచ్చకొట్టము= రచ్చచావడి; వ్రచ్చుట= (వీటిని) కూల్చటం; గురుజనములన్= పెద్దవారిని; నిందించుట= తిట్టటం; ఆగమనింద= వేదనింద; తదీయ= ఆ వేదవిద్యను; విక్రయవిధి= అమ్ముకొని బ్రతకటం; తత్= ఆవేదం; విలేఖనము= వ్రాయటం; కొండియము= కొండెం చెప్పటం; సంధిభేదనము= చేసికొన్న సంధిని త్రోసిరాజనటం; అన్యకర్మ= ఇతరున కుచితమైన కర్మలతో; ఉపజీవనము= బ్రతకటం; అకృతజ్ఞత= కృతజ్ఞత లేకపోవటం (చేసినమేలు మరవటం); పారదారవృత్తి= ఇతరుల భార్యలతో వ్యభిచరించటం; మంత్రసుశాస్త్ర విధ్వంసనము= మంచి మంత్రశాస్త్రాలను నాశనం చేయటం; మదలోలన్= మదంతో చపలచిత్తం కలదానిని; అనాథను= ఆధారం లేనిదాన్ని; బాలన్= చిన్నదాన్ని; వృద్ధన్= వృద్ధురాలిని; తాపసిని= స్త్రీ సన్న్యాసిని; భీతిన్= భయంతో; వంచనన్= మోసంతో; తలరన్చేయుట= కలతపెట్టటం; అతిథి= తిథి లేక వచ్చేవానికి (ఎప్పుడైనా సరే వచ్చే చుట్టం); పుత్ర= కొడుకులకు; భృత్య= సేవకులకు; ఆహార కలనము= తిండిపెట్టటం; ఆచరించక= చేయక; కుడుచుట= (తాను) తినటం; నిరయ= నరక; హేతువులుగన్= కారణాలుగా; ఆర్యకోటి= పెద్దల సమూహం; చెప్పున్= చెబుతున్నది.

తాత్పర్యం: సత్రాలు, సభాశాలలు, రచ్చకొట్టాలు, చలిపందిళ్ళు కూల్చటం; గురువులను, వేదాన్ని నిందించటం; వేదాన్ని అమ్ముకొనటం; వ్రాయటం, కొండెం చెప్పటం, సంధిని ఉల్లంఘించటం, ఇతరులు చేసే వృత్తిని తాను చేయటం (ఇతర వర్ణాలకు చెప్పబడ్డ కర్మలను చేయటం), కృతజ్ఞత లేకపోవటం, పరస్త్రీతో వ్యభిచరించటం; మంత్రశాస్త్రాన్ని ధ్వంసంచేయటం; మదించినది, అనాథ, బాలిక, ముసలిది, తపస్విని మొదలైన వాళ్ళను భయపెట్టడం; వంచించటం; అతిథికి పుత్రులకు సేవకులకు పెట్టకుండా తానుతినటం - ఇవన్నీ నరకద్వారాలని పెద్దలు చెప్తున్నారు.

సీ. విషశస్త్ర కేశముల్ విక్రయించుట, శస్త్ర । ములచేఁత కన్యాజనులను విప్ర
తతిని గోగణమును దఱిసిపోవుట, యుపా । ధ్యాయు సభక్తికుం డైన భృత్యు
విడుపు మార్గముఁ గ్రంప నడిచి కొయ్యలు ప్రాఁతి । చెఱుచుట నరకంబు సేయు నండ్రు;
నేరమి లేకయు నెపమిడి యర్థంబు । గొనురాజుఁ బ్రజరక్ష వినికి గలిగి

తే. యాచరింపని విభుఁడును, నప్పనంబు । పలుకుబడి దప్పి కొనియెడు పతియు, గోవు
ముక్కు గుట్టెడివాఁడుఁ, దన్ముష్కఘాతి । యగునతండు నధోగతి కరుగువారు. 62

ప్రతిపదార్థం: విషశస్త్ర కేశముల్= విషము, ఆయుధాలు, తల వెంట్రుకలు; విక్రయించుట= అమ్మటం; శస్త్రములచేఁత= ఆయుధాలు తయారు చేయడం; కన్యాజనులను= కన్యకలను; విప్రతతినిన్= బ్రాహ్మణ సమూహాన్ని; గోగణమును= ఆవుల మందలను; తటిసిపోవుట= దాటిపోవడం, అతిక్రమించడం; ఉపాధ్యాయున్= గురువును; సభక్తికుండు+ఐన= భక్తితో కూడిన; భృత్యున్= సేవకుడిని; విడుపు= విడుచుట; మార్గము= దారిలో; క్రంప నడిచి= కంపగొట్టి; కొయ్యలు= కర్రలు; ప్రాఁతి= నాటి; చెఱుచుట= చెడగొట్టడం; నరకంబు చేయున్+అంద్రు= నరకాన్ని కలిగిస్తాయంటారు; నేరమి= నేరం; లేకయున్= లేకుండానే; నెప మిడి= ఏదో తప్పు నారోపించి; అర్థంబు= డబ్బును; కొను= తీసికొనే; రాజున్= రాజూ; వినికి కలిగి= వినియుండి; ప్రజరక్ష= ప్రజలను రక్షించటం; ఆచరింపని= చేయని; విభుఁడునున్= రాజును; పలుకుబడి= అన్నమాట; తప్పి= మీరి; అప్పనంబు= వస్తువులను ఇల్లడ పెట్టటం; కొనియెడు= గ్రహించే; పతియున్= రాజును; గోవు= ఆవుయొక్క; ముక్కున్= ముక్కును; కుట్టెడివాఁడున్= కుట్టేవాడు; తత్= ఆ గోజాతికి చెందిన ఎద్దులయొక్క; ముష్క= వృషణం; ఘాతి= నలగ కొట్టేవాడు; అధోగతికిన్= క్రిందిలోకాలకు; అరుగువారు= పోతారు.

తాత్పర్యం: విషము, ఆయుధాలు, తలవెంట్రుకలు విక్రయించడం, ఆయుధాలు తయారుచేయడం, కన్నెపిల్లలను, విప్రవరులను, ఆవులను దాటుకొంటూపోవటం; చదువు చెప్పే అయ్యవారిని భక్తిగల భృత్యుడిని విడిచిపెట్టటం, మార్గంలో ముళ్ళ కంప వైచి కర్రలు నాటి దారిని చెడగొట్టటం, ఇవన్నీ నరకానికి మార్గాలు. (ఇక రాజులసంగతి) - లేని నెపం పెట్టి డబ్బుగుంజే రాజు, ప్రజల కష్టాలు విని కూడా తీర్చని ప్రభువూ, ఒక వస్తువును దాచిపెట్టినప్పుడు మాట తప్పి తీసికొనేవాడు - (సామాన్య ప్రజలు) - ఆవుముక్కు కుట్టేవాడు; ఎద్దు వృషణాలు నలగ కొట్టేవాడు అధోగతి పాలౌతారు.

సీ. ధర్మంబు భయమున, దారిద్ర్య సంబాధ । మున రోగమునుఁ బాపములుఁ దొఱంగఁ
జేఁతకునైనఁ జేసిన దేవకార్యార్థ । పశుహింసనంబును, బరమ తపము
శుశ్రూషయును గల్గి శ్రుతము సంపాదించి । యప్రతిగ్రాహకుఁ డైన, మద్య
మాంస పరస్త్రీ సమాగమ వైముఖ్య । మున నాశ్రమస్థులఁ దనకులంబు

తే. వారి భరియించినను, హేమవస్త్ర మంది । రాన్నపానంబు లొసఁగిన, నాశ్రయంబు
దీనులకు నిచ్చినను, హింస మానినను, స । మంచిత స్వర్గలక్ష్మి సిద్ధించు నండ్రు. 63

ప్రతిపదార్థం: ధర్మంబు భయమునన్= ధర్మ భీతితో; దారిద్ర్య= పేదరికం వలని; సంబాధమునన్= మిక్కిలి బాధతో; రోగమునున్= రోగం; పాపములున్= పాపాలు; తొఱంగన్+చేఁతకున్+ఐనన్= తొలగద్రోయటానికైనా; చేసిన= చేసినటువంటి; దేవకార్య+అర్థ= దేవతల పనికొరకై; పశుహింసనంబును= పశువులను చంపటం; పరమ= శ్రేష్ఠమైన; తపమును= తపస్సును; శుశ్రూషయునున్= సేవ; కల్గి= కలిగి; శ్రుతము= పాండిత్యం, విద్య; సంపాదించి= కష్టపడి గడించి; అప్రతిగ్రాహకుఁడు= దానం పుచ్చుకొననివాడు; ఐనన్= అయితే; మద్య= మత్తుపానీయం; మాంస= మాంసం; పరస్త్రీ సమాగమ= ఇతర స్త్రీలతో తిరగటం; వైముఖ్యమునన్= విముఖత్వంతో (వ్యతిరేకతతో); ఆశ్రమస్థులన్= బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలలో ఉండేవారిని; తనకులంబువారిన్= స్వకులస్థులను; భరియించినను= పోషించినా; హేమ= బంగారం, వస్త్ర= బట్టలు; మందిర=

ఇల్లు; అన్నపానంబులు= భోజనం, త్రాగటానికి నీరు; ఒసఁగినన్= ఇచ్చినా; దీనులకున్= దరిద్రులకు; ఆశ్రయంబు= ఆధారము, గృహాదికము; ఇచ్చినను= ఒసంగినా; హింస= జీవరాసులను చంపటం; మానినను= మానినా; సమంచిత= ఒప్పిదమైన; స్వర్గలక్ష్మి= స్వర్గభోగం; సిద్ధించున్= లభిస్తుంది, దొరకుతుంది; అంద్రు= అంటారు.

తాత్పర్యం: ధర్మభీతితోనూ; దారిద్ర్య బాధలోనూ రోగాలను, పాపాలను తొలగించుకొనటానికైనా, దైవప్రీతికొరకు పశుహింస చేసినా, ఉత్తమ తపస్సు, గురుశుశ్రూష కలిగి పాండిత్యం సంపాదించి కూడ దానం స్వీకరించనివాడైనా, మద్యం, మాంసం, పరవనితాసంగమం మొదలైన వాటియందు విముఖుడై తన కులంవారిని భరించినా, బంగారంవస్త్రాలూ, మందిరాలూ, అన్నపానీయాలూ ఇచ్చినా, దీనులకు ఆశ్రయమొసంగినా, హింసమానినా సముచితమైన స్వర్గలక్ష్మి సిద్ధిస్తుందని పెద్ద లంటారు.

సీ. రచ్చకొట్టంబు, నారామంబుఁ గూపంబుఁ । బ్రపయుఁ గావించుట, భయభరార్త
కోటిఁ గాచుట, కన్య, గోవు, వాహనము, దా । సుని దాసి నిచ్చుట, దనకుఁ గీడు
సేసిన సైఁచుట, చెలులఁ జుట్టంబులఁ । బ్రోచుట, పెక్కంద్ర పొంటెఁ గార్య
మునఁ బరాక్రమమున ధనమునఁ దా నల । జడిపాటు, దుష్కర్మ సరణిఁ బొరయ

ఆ. కునికి, నాకలోకమునకు నిచ్చెన లగు । నెక్కులమునఁ బుట్టిరేని బహు సు
తుండు, నతికృపాన్వితుఁడు, వేయు నెలలపై । బ్రతికినతఁడుఁ గంద్రు త్రిదశపదము'. 64

ప్రతిపదార్థం: రచ్చకొట్టంబున్= రచ్చచావడి; ఆరామంబున్= తోట; కూపంబున్= నూయి; ప్రపయున్= చలిపందిరి; కావించుట= నిర్మించటం; భయభర= భయ భారంతో; ఆర్త= దుఃఖితులైన మానవుల; కోటిన్= సమూహాన్ని; కాచుట= కాపాడటం; కన్య= కన్యను; గోవున్= గోవును; వాహనమున్= మోసేజంతువును (గుర్రం, ఎద్దు); దాసునిన్= సేవకుడిని; దాసిన్= సేవకురాలిని; ఇచ్చుట= ఇవ్వటం; తనకున్; కీడు= ఆపద; చేసినన్= కలిగిస్తే; సైఁచుట= సహించటం; చెలులన్= స్నేహితులను; చుట్టంబులన్= బంధువులను; ప్రోచుట= కాపాడటం; పెక్కంద్ర పొంటెన్= అనేకులకొరకు; కార్యమునన్= పనిలో; పరాక్రమమునన్= పరాక్రమంలో; ధనమునన్= డబ్బులో; తాన్= తాను; అలజడిపాటు= అలజడిని; దుష్కర్మ= చెడ్డపనుల; సరణిన్= పద్ధతిని; పొరయకునికి= పొందకుండా వుండటం; నాకలోకమునకున్= స్వర్గలోకానికి; నిచ్చెనలు= మెట్లు; అగున్= ఔతాయి; ఏ+కులమునన్= ఏ కులంలో; పుట్టిరేని= పుట్టినా; బహు= పలువురు; సుతుండు= కొడుకులు కలవాడు; అతికృపా+అన్వితుఁడు= మిక్కిలి దయకలవాడు; వేయు= వేయి; నెలలపైన్= నెలలకుపైగా; బ్రతికిన+అతఁడున్= జీవించినతడూ సహస్రమాసోపజీవి; త్రిదశపదమున్= స్వర్గలోకాన్ని; కంద్రు= పొందుతారు.

తాత్పర్యం: రచ్చచావిడి, తోట, బావి, చలిపందిరి కల్పించటం, భయపీడితులను రక్షించటం, కన్యలను, గోవులను, వాహనాలను, దాసులనూ దాసిని ఇవ్వటం; తనకు అపకారం చేసినవాడిని క్షమించటం, స్నేహితులను, బంధువులను రక్షించటం, పెక్కుమంది కొరకు చేసే కార్యాలలో ధనం వెచ్చించి అలజడి పొందకుండా ఉండటం, దుర్మార్గవర్తనంలో చొరకుండా ఉండటం - అనేవి స్వర్గలోకప్రాప్తికి నిచ్చెనలవంటివి. ఏ కులంలో పుట్టినా, పెక్కురు కొడుకులు కలిగి మిక్కిలి దయామయుడై వేయి నెలలకాలం బ్రతికినవాడు స్వర్గలోకం చేరుకొంటాడు.'

వ. అని నిర్దేశించి. 65

తాత్పర్యం: అని స్పష్టం చేసి.

ఆ. **'నరకవాసకారణము నెఱింగించితిఁ । బుణ్యలోక హేతు భూతములును**
దేట పడఁగఁ జెప్పితిని, గురుసంతతి । శ్రేష్ఠ ! యింక నేమి సెప్పవలయు? **66**

ప్రతిపదార్థం: కురుసంతతి= కౌరవులలో; శ్రేష్ఠ!= శ్రేష్ఠుడైనవాడా!; ధర్మరాజా! నరకవాస= నరకంలో ఉండటానికి; కారణమున్= హేతువును; ఎఱింగించితిన్= చెప్పాను; పుణ్యలోక= స్వర్గలోక; హేతుభూతములును= కారణములైనవాటినీ; తేటపడఁగన్= స్పష్టంగా; చెప్పితిని= చెప్పాను; ఇంకన్= ఇకమీద; ఏమి చెప్పవలయున్= ఏమి చెప్పాలి?

తాత్పర్యం: కౌరవవంశ శ్రేష్ఠుడా! నరక, స్వర్గలోకాలు కలగటానికి కారణాలేవో స్పష్టంగా వేర్వేరుగా చెప్పాను. ఇంకా ఏమి చెప్పాలి?

వ. **అడుగు 'మనినం, గౌంతేయపూర్వజుండు శాంతనవుతో 'బ్రహ్మహత్యాసమంబు లని కొందఱు గొన్ని కర్మంబు లుగ్గడింతురు; హింస లేకయు నట్లయ్యెడు నవి యెయ్యవి? వాని నేర్పడ నెఱింగింపవే' యనుటయు నతం డతని కిట్లనియె.** **67**

ప్రతిపదార్థం: అడుగుము; అనినన్= అనిచెప్పగా; కౌంతేయ= కుంతీ సంతానంలో; పూర్వజుండు= ముందుపుట్టినవాడు - ధర్మరాజు; శాంతనవుతోన్= భీష్ముడితో; బ్రహ్మహత్యా= బ్రాహ్మణహత్య - (ఆత్మను అధర్మంతో చంపుకొనటం); సమంబులు= సమానాలు; అని; కొందఱు= కొంతమంది; కొన్ని కర్మంబులు= కొన్ని పనులు; ఉగ్గడింతురు= చెప్తుతారు; హింసలేకయున్= చంపటం లేకుండా; అట్లు= ఆ విధంగా; అయ్యెడునవి= అయ్యేవి; ఎయ్యవి= ఏవి; వానిన్; ఏర్పడన్= విడివిడిగా; ఎఱింగింపవే= తెల్పుమా; అనుటయున్= అనగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు 'కొందరు బ్రహ్మహత్యతో సమానమైన కర్మలు కొన్ని ఉన్నాయంటారు కదా! హింస లేకుండా ఏ కర్మ అయినా సరే బ్రహ్మహత్య ఎట్లా ఔతుంది? అట్లా అయ్యేకర్మ లుంటే వాటిని గూర్చి వివరించండి' అని ప్రశ్నించాడు. అతడితో భీష్ముడు ఇట్లా అన్నాడు.

సీ. **'దివ్యబోధాఢ్యు, వేదవ్యాసమునినాథు । నడిగితి నొక్కనాఁ డధిక భక్తి**
నిట్లని; యా సంయమీంద్రుండు గృప నాకు । నెఱిఁగించె, ననఘ! నా యెఱిఁగినట్టి
విధము లెఱింగింతు వినుము; విప్రునిఁ గృశు । నామంత్రితునిఁ జేసి యతఁడు, గుడువ
వచ్చినఁ బెట్టమి, వరకులంబును, సార । విద్యయుఁ, గల, విప్రవృత్తి గొనుట

తే. **నీరు ద్రావంగ గోవు లేతేర, విఘ్న । మాచరించుట, బధిర పంగ్వంధ ధనము**
లపహరించుట, వేదశాస్త్రాదినింద, । బ్రహ్మహత్య లెట్టట్టుల పౌరవేంద్ర! **68**

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర= పురువంశరాజా!; దివ్య= దివ్యమైన; బోధ+ఆఢ్యున్= జ్ఞానంచేత గొప్పవాడు అయిన; వేదవ్యాస= అనంతంగా ఉన్న వేదరాశిని నాలుగుగా విభాగం చేసిన కృష్ణద్వైపాయనుడు అను; మునినాథున్= మునిశ్రేష్ఠుడిని; అధికభక్తిన్=

మిక్కిలి భక్తితో; ఇట్లు= ఇది ఇట్లా అని; ఒక్కనాఁడు+అడిగితిన్; సంయమి+ఇంద్రుండు= ఆ మునినాథుడు; అనఘ!= పుణ్యాత్ముడా! కృపన్= దయతో; నాకున్= నాకు; ఎఱింగించెన్= తెల్పినాడు; నా ఎఱిగినట్టి= ఆయనవలన నాకు తెలిసిన; విధములు= తీరులు; ఎఱింగింతున్= నీకు చెపుతాను; వినుము= ఆలకించుము; కృశున్= దీనుడిని; విప్రునిన్= బ్రాహ్మణుడిని; ఆమంత్రితునిన్+చేసి= ఆహ్వానించి, అతఁడు= ఆయన; కుడువన్= తినటానికి; వచ్చినన్= రాగా; పెట్టమి= పెట్టకపోవటం; వరకులంబును= గొప్పకులమునూ; సారవిద్యయున్= సారవంతమైన విద్య, విద్యాసారం; కల= ఉన్న; విప్ర= బ్రాహ్మణుడి; వృత్తిన్= బ్రతుకు తెరువును; కొనుట= గ్రహించటం; నీరు= నీటిని; త్రావంగన్= త్రాగటానికి; గోవులు= ఆవులు; ఏతేరన్= రాగా; విఘ్నము= అడ్డంకి; ఆచరించుట= చేయటం; బధిర= చెవిటివాడు; పంగు= కుంటివాడు; అంధ= గ్రుడ్డివాడు వీరియొక్క; ధనములు= డబ్బులు; అపహరించుట= దొంగిలించటం; వేద శాస్త్ర+ఆది నింద= నాలుగు వేదాలను - ఇతర శాస్త్ర విద్యలను నిందించటం, తిట్టటం; బ్రహ్మహత్యలు; ఎట్టు=ఎట్లో; అట్టుల= అట్లాంటివి.

తాత్పర్యం: 'ధర్మరాజా! దివ్యజ్ఞానం కల వేదవ్యాస మునినాథుడిని ఒకసారి అడిగితే ఆయన నాకు చెప్పిన దేదో అదే నీకు చెప్పుతున్నాను. దీనుడైన వేద బ్రాహ్మణుడిని ఇంటికి ఆహ్వానించి అతడికి అన్నం పెట్టకపోవటం, చక్కగా చదువుకొన్న, మంచి కులం కల విప్రుడి జీవనాధారమైన వృత్తిని చెడగొట్టి అతడి నోరు కొట్టటం, నీరు త్రాగటానికి వచ్చిన ఆలమందలను తరిమికొట్టటం, చెవిటి గ్రుడ్డి మొదలగువారి డబ్బులు దొంగలించటం, వేదశాస్త్రాది నింద - ఇవి బ్రహ్మహత్యలతో సమానం.

తే. అలుకఁ బురి నూర వనమున నగ్ని యిడుట, । పాపశీలతమై బొంకి బ్రాహ్మణునకు
నధికతర మగు శోకంబు నావహించు । టంచితాచార! బ్రహ్మహత్యా సమములు. 69

ప్రతిపదార్థం: అంచిత= ఒప్పిదమైన; ఆచార!= ఆచారంకలవాడా!; అలుకన్= కోపంతో; పురిన్= నగరంలో; ఊరన్= గ్రామంలో; వనమునన్= తోటలో; అగ్నిఇడుట= నిప్పుపెట్టటం; పాపశీలతమైన్= పాపస్వభావంతో; బొంకి= అబద్ధమాడి; బ్రాహ్మణునకున్= విప్రునకు; అధికతరము+అగు= మిక్కిలి ఎక్కువైన; శోకంబున్= దుఃఖాన్ని; ఆవహించుట= కలిగించటం; బ్రహ్మహత్యా సమములు= బ్రహ్మహత్యతో సమానాలు.

తాత్పర్యం: మంచి ఆచారాలను అనుసరించేవాడా! కోపంతో నగరానికీ, ఊరికీ, తోటకూ నిప్పుపెట్టటం, పాప స్వభావంతో అబద్ధమాడి బ్రాహ్మణుడికి మిక్కిలి దుఃఖం కలిగించటం బ్రహ్మహత్యతో సమానం.

విశేషం: ఆచారం= చక్కగా ఆచరించిన వైదికకర్మలు - సంప్రదాయానుసారంగా సంక్రమించేవి.

తే. రూప గుణ శీలముల ననురూపుఁ డైన । వరుని కీక కన్నియఁ దన వలసినట్లు
తగని వానికి నిచ్చుట ధర్మదేవ । తాతనూభవ ! బ్రహ్మహత్యాసమంబు. 70

ప్రతిపదార్థం: ధర్మదేవతా= యముడి; తనూభవ= కుమారా! ధర్మరాజా! (ధర్మరాజు యముడి అంశంతో పుట్టినవాడు); రూప= అందమైన ఆకారంలో; గుణ= మంచిగుణాలలో; శీలములన్= స్వభావములో; అనురూపుఁడు+ఐన= తగినవాడైన; వరునికిన్= పెండ్లికొడుకునకు; కన్నియన్= కన్యను; ఈక= ఇవ్వక; తన వలసినట్లు= తండ్రి తనకిష్టమైనట్లు; తగనివానికిన్= అర్హుడుకాని వాడికి; ఇచ్చుట= ఇచ్చి పెండ్లిచేయటం; బ్రహ్మహత్యా సమంబు= బ్రహ్మహత్యతో సమానం.

తాత్పర్యం: ధర్మదేవతాంశంలో జన్మించినవాడా! రూపం, గుణం, శీలంలో యోగ్యుడై ఉన్నవాడికి పిల్ల నిచ్చి చేయకుండా తన ఇష్టం వచ్చినట్లుగా కన్యనిచ్చి వివాహం చేయటం బ్రహ్మహత్యతో సమానం'.

విశేషం: రూపం= కంటికి కనిపించే శరీర సౌందర్యం. గుణ= మనస్సునకు సంబంధించిన అందం. శీలం= ఆత్మకు సంబంధించిన అందం. ఈ మూడు ఉన్నవాడికిచ్చి వివాహం చేయటం ధర్మం.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బుణ్యతీర్థ విశేషంబుల నెఱింగించుట (సం.13-26-1)

వ. అనిన విని యజాతశత్రుండు, గంగాపుత్త్రుతోఁ 'బుణ్యతీర్థ విశేషంబులు వినవలతుం జెప్పవే' యనుటయు నమ్మహీపతికి నమ్మహితాత్ముం డిట్లనియె; 'తొల్లి గౌతముఁ డడుగ నంగిరసుండు దీర్థంబులు గొన్నింటి ప్రకారంబు సెప్పె; నప్పరిపాటి సెప్పెద; నాకర్ణింపుము. 71

ప్రతిపదార్థం: అనినన్‌విని =అని భీష్ముడు చెప్పగా ఆలించి; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగా పుత్త్రుతోన్= భీష్ముడితో; పుణ్యతీర్థ= పుణ్యక్షేత్రం ప్రక్కన పారే నదుల; విశేషంబులు= ప్రత్యేకతలు; వినవలతున్= వినాలని కోరుకొంటున్నాను; చెప్పవే= ఎరిగింపుమా; అనుటయున్= అనటంతోనే; ఆ+మహీపతికిన్= ఆ భూమి పతియైన ధర్మజునకు; ఆ+మహిత+ఆత్ముండు= ఆ మహాత్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; తొల్లి= మునుపు; గౌతముండు= గౌతముడనే ఋషి; అడుగన్= చెప్పుమని కోరగా; అంగిరసుండు= ఆ పేరుగల ముని; తీర్థంబులు కొన్నింటి ప్రకారంబు= కొన్ని పుణ్యతీర్థముల విధములు; చెప్పెన్= తెల్పినాడు; ఆ+పరిపాటి= ఆ క్రమం, ఆ విధానం; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'పుణ్యతీర్థాల విశేషాలు చెప్పు'మని అడుగగా భీష్ము డిట్లా అన్నాడు. 'పూర్వం నీవలెనే గౌతము డడిగితే అంగిరసుడు చెప్పిన విధానం నీకు చెప్పుతాను వినుము.

సీ. సప్తదినంబులు చంద్రభాగను, విత । స్తను, నూర్మి మాలినిఁ దగ వసించి
యాహారవిరహితుండై యుండ ముని సమా । నుం డగుఁ, గాశ్మీర మండలమున
నదులు గొన్ని మహావనము సొచ్చి పాఱు ది । వంబు సిద్ధించుఁ దదంబుసేవఁ;
బుష్కరమ్ముఁ బ్రభాసమును, నైమిశము, నింద్ర । మార్గంబు, దేవికా స్వర్గబిందు

తే. లును, సమవగాహనంబున జనుల నప్ప । రస్సమేత విమానవర్తనులఁ జేయు
నవనినాథ! హిరణ్యబిందువుఁ, గుశేశ । యంబు, నెల్ల పాపంబుల నపనయించు. 72

ప్రతిపదార్థం: చంద్రభాగను, వితస్తను, ఊర్మిమాలినిన్= అన్న ఈ మూడు నదులలో; సప్తదినంబులు= ఏడు రోజులు; తగన్= ఆచారయుక్తంగా; వసించి= (తీరంలో) నివసించి; ఆహార విరహితుండు+ఐ= అన్నంలేకుండా ఉపవాసం చేస్తూ; ఉండన్= ఉంటే; ముని సమానుండు+అగున్= మునితో సమానుడౌతాడు; కాశ్మీర మండలమునన్= కాశ్మీర దేశంలో; నదులు కొన్ని= కొన్ని నదులు; మహావనము= సముద్రం (వనం= నీరు; మహా=గొప్ప), అధికజలం కలది; చొచ్చి= ప్రవేశించి; పాఱున్= ప్రవహిస్తాయి; తత్= వాటి; అంబు= నీటిని; సేవన్= సేవించటంతో; దివంబు= స్వర్గం; సిద్ధించున్= లభిస్తుంది; పుష్కరమ్మున్= పుష్కరము; ప్రభాసమును= ప్రభాసం; నైమిశమున్= నైమిశం; ఇంద్రమార్గంబు= ఇంద్రమార్గం; దేవికా= దేవిక; స్వర్గబిందులును=

స్వర్గ బిందువు; సమవగాహనంబునన్= చక్కగా స్నానం చేయటంవలన; జనులన్= మనుష్యులను; అప్సరః+సమేత= అచ్చరలతో కూడిన; విమానవర్తనులన్= విమానాలలో విహరించేటట్లు; చేయున్= చేస్తాయి; అవనినాథ= ఓ భూమీశా!; హిరణ్య బిందువున్, కుశేశయంబున్= కుశేశయమనే ఈ తీర్థాలు; ఎల్లపాపంబులన్= పాపాలన్నిటినీ; అపనయించున్= పోగొడతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! చంద్రభాగలో, వితస్తలో, ఊర్మిమాలినిలో ఏడురోజులు తగినవిధంగా నివసించి ఉపవాసం చేస్తే నరుడు ముని సమాను డౌతాడు. కాశ్మీర ప్రాంతంలో కొన్ని నదులు మహావనంలో ప్రవేశించి ప్రవహిస్తాయి. వాటి నీరు సేవిస్తే స్వర్గం లభిస్తుంది. పుష్కరంలో, ప్రభాసంలో, నైమిశంలో, ఇంద్రమార్గంలో, దేవికలో, స్వర్గబిందువులో స్నానం చేసిన జనులకు అప్సరసలతో కూడిన విమానయానం లభిస్తుంది. హిరణ్య బిందువు, కుశేశయములు పాపాల నన్నిటినీ తొలగిస్తాయి.

విశేషం: పుష్కరం, ప్రభాస, నైమిశం, ఇంద్రమార్గం, దేవిక, స్వర్గబిందువులు - ఇవన్నీ తీర్థాలు. (వాటిలో) ఈ పుణ్యతీర్థ విశేషాలు శల్యపర్వంలో చెప్పబడ్డాయి. భారతం క్షేత్ర - తీర్థ విశేషాలను వర్ణిస్తుంది. హిరణ్య= బంగారం. బిందువు, బొట్టు= బంగారం రంగులో నీటి బొట్లు కలది; కుశేశయము= తామరపూలు కలది.

వ. గంధమాదన సంగతయైన యింద్రతోయయుం, గురంగదేశగత యగు కరతోయ యుం, ద్రిరాత్రోపవాసోపేత
స్నాతకులకు నశ్వమేధఫలంబు గలుగం జేయు. 73

ప్రతిపదార్థం: గంధమాదన= ఒక పర్వతం; సంగత+ఐన= ఆ పర్వతం నుండి ప్రవహించే; ఇంద్రతోయ= నదిపేరు; కురంగదేశ= ఒక దేశం; గత= ఉన్న; కరతోయయున్= నదిపేరు; త్రిరాత్ర= మూడు రాత్రులు; ఉపవాస+ఉపేత= ఉపవాసంతో పాటుగా; స్నాతకులకున్= స్నానంచేసేవారికి; అశ్వమేధ ఫలంబు= అశ్వమేధ యాగఫలం; కలుగన్+చేయున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: గంధమాదన పర్వతం నుండి ప్రవహించే ఇంద్రతోయ కురంగదేశంలోని కరతోయ - అనే నదులలో మూడురాత్రు లుపవసించి స్నానం చేస్తే చాలు అశ్వమేధఫలం అవి కలిగిస్తాయి.

తే. కనఖలమున, గంగాద్వారమునను, నీల । భూధరమునఁ, గుశావర్తమునను, బిల్వ
కమున, సుస్నాతుఁ డై పాతకములు దొఱఁగి । నాకలోక విహారంబు నరుఁడు వొందు. 74

ప్రతిపదార్థం: కనఖలమునన్, గంగాద్వారమునను, నీల (నల్లని) భూధరమునన్ (కొండలలో పుట్టిన నదిలో) కుశావర్తమునను, బిల్వకమునన్ - ఇవన్నీ నదుల పేర్లు (వాటిలో); సుస్నాతుఁడు+ఐ= భక్తితో స్నానంచేసినవాడై; పాతకములు= పాపాలు; తొఱఁగి= పోగొట్టుకొని; నరుఁడు= మానవుడు; నాకలోక= స్వర్గలోక; విహారంబు= వాహ్యాళి (సరదాగా తిరగటం); పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: కనఖలము గంగాద్వారము, నీలపర్వతము, కుశావర్తము, బిల్వకము అనే పేర్లుగల తీర్థాలలో భక్తితో స్నానంచేస్తే చాలు స్వర్గలోకం లభిస్తుంది.

క. భాగీరథి యెచట నుద । గ్భాగమునను శివుని నెలవు ప్రాంతమునఁ జనున్
ధీగణ్య! యచట నెలకు స । మాగతులగు సురలఁ గం డ్రనాహారవిధిన్. 75

ప్రతిపదార్థం: ధీగణ్య!= బుద్ధిమంతులలో గణింప దగినవాడా!; భాగీరథి= గంగ; ఎచటన్= ఎక్కడ; ఉదగ్= ఉత్తర; భాగమునను= ప్రదేశంలో; శివుని= మహేశ్వరుడి, నెలవు= స్థానం, ఉండేచోటు; ప్రాంతమునన్= ప్రదేశంలో; చనున్= ప్రవహిస్తుందో; అచటన్= అక్కడ; నెలన్= ప్రతినెలా; సమాగతులు+అగు= వచ్చేటటువంటి; సురలన్= దేవతలను; అనాహార విధిన్= ఉపవాస వ్రతంతో; కంద్రు= చూస్తారు.

తాత్పర్యం: ఎక్కడగంగానది ఉత్తరదిక్కున శివుడి నివాసమైన కైలాసశిఖరం దగ్గర ప్రవహిస్తుందో అక్కడ ఉపవాసముండేవారికి అక్కడికి ప్రతినెలా వచ్చే దేవతలు దర్శనమిస్తారు.

సీ. ఆహార ముడిగి మహాశ్రమంబున నగ్ని । హోత్రియై యొకమాస ముండి నరుఁడు
సకల సిద్ధులు మహాశ్చర్యంబుగాఁ గను, । జననాథ! భృగుతుంగమను మహా హ్ర
దమ్మున వాసరత్రయ ముపవాసి యై । బ్రహ్మవధంబు పాపంబుఁ దొఱఁగు;
వినుము! కన్యాకూపమున సాగ్నిహోత్రత । నున్నఁ గీర్తితుఁ డగు; నుభయలోక

తే. ములను సుందరికాహ్రదంబునను దగఁగ । సకృదుపస్పర్శనము చేసి చారుమూర్తి
యై జనించు; వైమానిక మనఁగఁ బరఁగు । భవ్యతీర్థంబు సేవించి పడయు దివము. 76

ప్రతిపదార్థం: జననాథ!= ప్రజాపతీ! రాజా!; మహాశ్రమంబునన్= (ఆ పేరుగల తీర్థము) మహాశ్రమంలో; అగ్నిహోత్రిఐ= అగ్నిహోత్రం చేస్తూ; ఒకమాసము= ఒక నెల; ఉండి; నరుఁడు= మనుష్యుడు; మహాశ్చర్యంబుగాన్= మిక్కిలి చిత్రంగా; సకలసిద్ధులు= అన్ని యోగసిద్ధులు; కనున్= పొందుతాడు; భృగుతుంగము అను= భృగుతుంగమనే పేరుగల; మహా= గొప్ప; హ్రదమ్మునన్= తీర్థంలో; వాసరత్రయము= మూడురోజులు; ఉపవాసిఐ= ఉపవాస ముండి; బ్రహ్మవధంబు పాపంబున్= బ్రహ్మహత్యాపాపం; తొఱంగున్= విడుచును; వినుము= ఆలకించుము; కన్యాకూపమునన్= ఆ పేరుగల కుండంలో (తీర్థం); స+అగ్ని హోత్రతన్= అగ్నిహోత్రంచేస్తూ; ఉన్నన్= ఉంటే; ఉభయలోకములను= ఈలోకంలో, పైలోకంలో; కీర్తితుఁడు= కీర్తించబడినవాడు; అగున్; సుందరికా= సుందరిక అన్న పేరుగల; హ్రదంబునన్= తీర్థంలో; తగఁగన్= చక్కగా; సకృత్= ఏ కొంచెమైనా; ఉపస్పర్శనము = జలములను తాకి; చారుమూర్తిఐ= అందమైన రూపంకలవాడై; జనించున్= జన్మిస్తాడు; వైమానికము అనఁగన్+పరఁగు= వైమానికము అనే ఆ పేరుతో ప్రసిద్ధమైన; భవ్య= శ్రేష్ఠమైన; తీర్థంబు= పుణ్యతీర్థమును; సేవించి= పూజించి; దివము= స్వర్గం; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ఒకమాసంపాటు నిత్యాగ్నిహోత్రిఅయి మహాశ్రమంలో ఉంటే మనిషికి అన్ని సిద్ధులు లభిస్తాయి. చాలా ఆశ్చర్యంగా భృగతుంగమన్న (సరస్సు) తీర్థకుండంలో మూడురోజులు ఉపవాసముంటే బ్రహ్మహత్యాపాపం పోతుంది. కన్యాకూపంలో అగ్నిహోత్రిఅయి నివసిస్తే ఇహ, పరలోకాలలో స్తుతించబడతాడు. సుందరికాతీర్థంలో కొంచెం మునిగితే అందమైన రూపంతో తిరిగి జన్మిస్తాడు. వైమానిక తీర్థ సేవచేస్తే స్వర్గం లభిస్తుంది.

తే. కృత్తికాంగార సంసేవ గిల్బిషములఁ । బాపి నాకంబుఁ జేర్చు విపాశఁ ద్రిదివ
సములు, గాలికాశ్రమ బ్రహ్మచర్య నియతి । తోడ సేవింప జన్మంబు దొఱఁగు నరుఁడు. 77

ప్రతిపదార్థం: కృత్తికా+అంగార= కృత్తిక, అంగారముల యొక్క; సంసేవ= పూజ; కిల్బిషములన్= పాపాలను; పాపి= పోగొట్టి; నాకంబున్= స్వర్గానికి; చేర్చున్= చేరుస్తుంది; విపాశన్= ఆ పేరుగల నదిలో; త్రి=మూడు; దివసములు= రోజులు; కాలికాశ్రమ=

ఆ ఆశ్రమాన్ని ఆశ్రయించి; బ్రహ్మచర్య నియతితోడన్= బ్రహ్మచర్య నియమంతో; సేవింపన్= కొలిస్తే; నరుఁడు= మనుష్యుడు; జన్మంబున్= పుట్టుక; తొలఁగున్= విడుచును.

తాత్పర్యం: కృత్తిక, అంగార సేవలవలన పాపాలు పోయి స్వర్గం లభిస్తుంది. కాళికాశ్రమంలో బ్రహ్మచర్య నియమం పాటిస్తూ ప్రక్కనే ఉన్న విపాశానదిలో మూడురోజులు మునిగితే ముక్తి లభిస్తుంది.

విశేషం: ఉస్మానియా - వావిళ్ళ ప్రతులలో 'కాలికాశ్రయ' అని ఉన్నది. ఇది తప్పు. "కాళికాశ్రమాసాద్య - విపాశాయాం కృతదోకః బ్రహ్మచారీ జితక్రోధః త్రిరాత్రం ముచ్యతే భవాత్' అని మూలం. కాళికాశ్రమాన్ని ఆశ్రయించి ... స్నానంచేస్తే కోపంలేకుండా, బ్రహ్మచర్యవ్రతంతో - జన్మరాహిత్యం కలుగుతుంది. పైగా ఇక్కడనుండి ఆశ్రమ విషయం చెప్పబడుతున్నది.

క. స్నానముఁ బితృతర్పణమును । మానితగుణ! కృత్తికాశ్రమంబున నియతిన్
మానవులు సేసి శివు కొలు । వానందాత్మకతఁ గాంతు రండ్రు మునీంద్రుల్. 78

ప్రతిపదార్థం: మానిత= గౌరవించదగిన; గుణ= గుణాలు కలవాడా!; స్నానమున్; పితృతర్పణమును= పితృదేవతలకు తర్పణాలివ్వటం; కృత్తికా= కృత్తిక అన్న పేరుగల; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; నియతిన్= నియమంతో; చేసి= చేసి, కావించి; మానవులు= జనులు; శివు కొలువు= శివుడి యొక్క సంసేవ; ఆనంద+ఆత్మకతన్= ఆనందహృదయంతో; కాంతురు= పొందుతారని; ముని+ఇంద్రుల్= మునీశ్వరులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! కృత్తికాశ్రమంలో స్నానం, పితృతర్పణం చేస్తే వారికి శివుడి సన్నిధానంలో ఆనందంతో ఉండే స్థితి లభిస్తుందని మునీంద్రు లంటారు.

తే. ద్రోణశర్మ పదంబున రూఢ మైన । తీర్థమును, శరస్తంబంబు, దేవదారు
వనముఁ దమ్ము సేవించిన మనుజు నెట్టి । వానినైనను నప్సరోవరునిఁ జేయు. 79

ప్రతిపదార్థం: ద్రోణశర్మ పదంబునన్= ద్రోణశర్మమన్న పేరుగల ఆశ్రమంలో; రూఢమైన= ప్రసిద్ధమైన; తీర్థమును; శరస్తంబంబు= ఆ పేరుగల తీర్థం; దేవదారువనమున్= ఆ పేరుగల ఆశ్రమం; తమ్మున్= తమను; సేవించిన= పూజించిన; మనుజున్= మనిషిని; ఎట్టివానిన్+ఐనను= ఎట్లాంటివాడినైనా; అప్సరస్= అప్సరసలకు; వరునిన్= భర్తను; చేయున్= చేస్తాయి.

తాత్పర్యం: ద్రోణశర్మంలోని తీర్థం, శరస్తంబం, దేవదారువనం - తమను సేవించిన వారిని అప్సరసలకు భర్తలను చేస్తాయి.

తే. చిత్రకూట జనస్థాన సేవనములు । రాజలక్ష్మి నొసఁగు; వీతభోజనత్వ
మహితవృత్తుఁడై; శ్యామాశ్రమమున నొక్క । పక్ష మున్న నంతర్ధ్యాన ఫలము గలుగు. 80

ప్రతిపదార్థం: చిత్రకూట, జనస్థాన= చిత్రకూట జనస్థానములయొక్క; సేవనములు= సేవలు; రాజలక్ష్మిన్= రాజు వైభవాన్ని; ఒసఁగున్= ఇస్తాయి; శ్యామ+ఆశ్రమమునన్= శ్యామ మన్న పేరుగల ఆశ్రమంలో; వీత= వదలిన; భోజనత్వ= భోజనముచేత; మహిత= గొప్ప; వృత్తుఁడు+ఐ= వృత్తి కలవాడై; ఒక్క పక్షము= పదునైదు రోజులు; ఉన్నన్= ఉంటే; అంతర్ధ్యాన = ఆత్మధ్యాన; ఫలము= ఫలితం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: చిత్రకూటం, జనస్థానం సేవలవలన రాజలక్ష్మి కలుగుతుంది. శ్యామాశ్రమంలో భోజనం లేకుండా పదునైదు రోజులుంటే ఆత్మలోపల ధ్యానం చేసిన ఫలితం కలుగుతుంది.

విశేషం: బహిర్ధ్యానం= బయటనున్న విగ్రహాలను ధ్యానించటం. అంతర్ధ్యానం = ఆత్మధ్యానం. ఇది శ్రేష్ఠమంటారు పెద్దలు.

క. విమలమతిం గౌశిక వా । లమున, ననాహార మౌనలంపటుఁ డై యు
న్న మనుజుఁ డిరువదియొక్కది । నములం బరమగతి సాధనశ్రీ నొందున్. 81

ప్రతిపదార్థం: విమల= స్వచ్ఛమైన; మతిన్= ఆలోచనతో; న+ఆహార (అనాహార)= ఆహారం లేకుండా; మౌన= మౌనవ్రతమునందు; లంపటుఁడు+ఐ= ఆసక్తి కలవాడై; కౌశికవాలమునన్= ఆ పేరుగల ఆశ్రమంలో; ఉన్న= నివసించిన; మనుజుఁడు= మనిషి; ఇరువదియొక్క దినములన్= మూడు వారాలలో; పరమగతి= ముక్తి; సాధనశ్రీన్= మార్గ సంపదను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: కౌశికవాలమనే ఆశ్రమంలో మూడువారాలపాటు నిర్మలమైన మనస్సుతో ఉపవాసముండి మౌనవ్రతం పాటిస్తే వాడు ముక్తికి సాధన సంపత్తిని పొందుతాడు.

సీ. పేర్చు మతంగవాపిక నేకరాత్రంబు । నిలిచి సిద్ధుం డగు, నెల వసించి
నైమిశంబునఁ బొందు నరవర! పురుష మే । ధ ఫలంబు, నట్టి విధంబ యుత్ప
లావనంబునఁ జేయఁగా విను మశ్వమే । ధంబు ఫలంబు నర్ధంబుఁ బడయు
నరుఁడు గంగా యమునా సంగమంబునఁ । గాలాంజనం బను శైలమునను

తే. నియతి నాచరితస్నానుఁ డయి విముక్తి । తెరువు గాంచు, వైవస్వత తీర్థసేవఁ
దీర్థభూతత్వ మొందు విధేయ చిత్త । వృత్తిఁ గౌరవవంశ పవిత్ర చరిత! 82

ప్రతిపదార్థం: కౌరవవంశ= కురువంశంలో; పవిత్ర చరిత!= పుణ్యమైన నడవడి కలవాడా!; ఏకరాత్రంబు= ఒకరాత్రి; పేర్చు= అతిశయమైన; మతంగ వాపికన్= మతంగమనే కుండంలో (వాపిక=బావి); నిలిచి= వసించి; సిద్ధుండు+అగున్=సిద్ధి పొందిన వాడౌతాడు; నరవర!= మనుష్యులలో శ్రేష్ఠుడా!; నైమిశంబునన్= నైమిశమనే ఆశ్రమంలో; నెల వసించి= ఒక నెల ఉండి; పురుషమేధ= మనిషిని బలిచ్చే యజ్ఞంయొక్క; ఫలంబు= ఫలితం; పొందున్= పొందును; వినుము= ఆలకించుము; అట్టివిధంబు+అ= అట్లాంటి విధానమే; ఉత్పలావనంబునన్= ఆ పేరుగల ఆశ్రమంలో; చేయఁగాన్= చేస్తే; అశ్వమేధంబు= గుర్రాన్ని బలి ఇచ్చే యజ్ఞం యొక్క; ఫలంబు= ఫలితంలో; అర్ధంబున్= సగం; పడయున్= పొందును; నరుఁడు= మనిషి; గంగా యమునా సంగమంబునన్= గంగా యమునా నదుల కూడలిలో; కాల+అంజనంబను= నల్లని కాటుక అనే; శైలముననున్= కొండపై; నియతిన్= నియమంతో; ఆచరిత= చేసిన; స్నానుఁడు+అయి= స్నానం కలవాడై; విముక్తి తెరువు= మోక్షమార్గం; కాంచున్= పొందుతాడు; వైవస్వత తీర్థ సేవన్= వైవస్వత తీర్థాన్ని సేవిస్తే; విధేయ= వినయం కల; చిత్తవృత్తిన్= మనస్సుతో; తీర్థభూతత్వము= తీర్థమైన లక్షణాన్ని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: కురువంశంలో పవిత్రచరిత్ర కలవాడా! జాగ్రత్తగా వినుము. మతంగవాపికలో ఒకరాత్రి నివసిస్తే సిద్ధుడౌతాడు. నైమిశారణ్యంలో నెల నివసిస్తే పురుషమేధ ఫలం పొందుతాడు. అదే విధంగా ఉత్పలావనంలో చేస్తే అశ్వమేధ ఫలంలో సగం ఫలం పొందుతాడు. గంగాయమునలకూడలిలో కాలాంజనంబన్న కొండలో (ఊటలో) స్నానం నియమంతో చేస్తే మోక్షమార్గం దొరుకుతుంది. వైవస్వత తీర్థాన్ని సేవిస్తే మహాభాగ్యుడౌతాడు.

విశేషం: తీర్థభూతుఁడు - తీర్థమైనవాడు. కావ్యతీర్థ - వంటి బిరుదులున్నాయి.

ఆ. విను, ప్రయాగమునకుఁ జనుదెంచుఁ గోటిత్ర । యంబు, దశ సహస్రకంబుఁ, దీర్థ
ములు నరేంద్ర! దర్శమున నందు నెలనాళ్ళు । లున్న నరుఁడు ముక్తి కొడయఁ డండ్రు. 83

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; విను= వినుము; దర్శమునన్= అమావాస్యనాడు; ప్రయాగమునకున్= గంగాయమునల కూడలి క్షేత్రమైన ప్రయాగకు; కోటిత్రయంబు= మూడుకోట్లు; దశ=పది; సహస్రకంబున్= వేలు; తీర్థములు= పుణ్యతీర్థాలు; చనుదెంచున్= వస్తాయి; అందున్= ప్రయాగలో; నెలనాళ్ళులు= మాసంపాటు; ఉన్న= నివసించిన; నరుఁడు= మానవుడు; ముక్తికిన్= మోక్షానికి; ఒడయఁడు= రాజు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! విను. అమావాస్యనాడు ప్రయాగకు మూడుకోట్ల పదివేల తీర్థాలు చేరుకుంటాయి. కనుక అక్కడ నెలనాళ్లు ఉన్నవ్యక్తి ముక్తికి అధికారి అవుతాడని చెబుతారు.

క. విను, గంగను బ్రహ్మశిరం । బను తీర్థమునందు నెల నిరాహారతమై
నునికిని మర్త్యుం డమృతాం । శునిలోకంబున మహాయశుండై యుండున్. 84

ప్రతిపదార్థం: విను= వినుము; గంగను= గంగలో; బ్రహ్మశిరంబు+అను= బ్రహ్మశిరమనే పేరుగల; తీర్థమునందున్= తీర్థంలో; నెల= ఒక మాసం; నిరాహారతమైన్= ఆహారం లేకుండా; ఉనికిని= ఉన్నందువలన; మర్త్యుండు= నరుడు; అమృత+అంశుని= అమృత కిరణాలు కల చంద్రుడి; లోకంబునన్= లోకంలో; మహా=గొప్ప; యశుండు+ఐ= కీర్తి కలవాడై; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: గంగలో, బ్రహ్మశిరమనే తీర్థంలో నెలనాళ్ళు ఉపవాసముంటే నరుడు చంద్రలోకంలో గొప్ప కీర్తితో ఉంటాడు.

సీ. అనఘ! యష్టావక్రమును, గలవింకము, దేవహ్రదము, బ్రహ్మభావ మొసఁగు
నాచరితస్నానుఁ డగు మర్త్యునకు నుర్వ । శీ కృత్తికా యోగసిద్ధ కీర్తి
యైన, లౌహిత్యంబునందు సుస్నాతుఁడై । పుండరీకాధ్వరమున ఫలంబుఁ
బొందు, రామహ్రదంబున నిరాహారుఁడై । పండ్రెండు దినములు భరిత నియతి

తే. నున్న సకలకల్మషములు నుజ్జగించు । నరుఁడు, నిర్భోజనత నెలనాళ్ళు దా మ
హాహ్రదావాసియై జమదగ్నిఁ గన్న । పుణ్యలోకంబుఁ గను మునిగణ్యుఁ డగుచు. 85

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; అష్టావక్రమును, కలవింకము, దేవహ్రదము= అన్నతీర్థాలు; బ్రహ్మభావము= పరమాత్మ భావాన్ని (అహంబ్రహ్మాస్మి= నేను పరబ్రహ్మన్ని) అన్న దర్శనాన్ని; ఒసఁగున్= ఇస్తాయి; ఆచరిత= చేసిన; స్నానుఁడగు= స్నానంకల; మర్త్యునకున్= మనిషికి; ఉర్వశీ= అప్సరస; కృత్తికా= ఆ నక్షత్రం; యోగ= కలయిక వలన; సిద్ధ= లభించిన; కీర్తిఐన= కీర్తికల; లౌహిత్యంబునందున్= ఆ పేరుగల తీర్థంలో; సుస్నాతుఁడు+ఐ= చక్కగా స్నానంచేసి; పుండరీక+అధ్వరమునన్= పౌండరీక యాగంలోని; ఫలంబున్= ఫలితం; పొందున్= పొందుతాడు; రామహ్రదంబునన్= రామహ్రద మనేచోట; నిరాహారుఁ

డు+ఐ= ఆహారం లేకుండా; పంద్రెండు దినములు= పన్నెండు రోజులు; భరిత నియతిన్= నిండైన నిష్ఠతో; ఉన్నన్= ఉంటే; సకల కల్మషములు= పాపాలన్నీ; ఉజ్జగించున్= విడుస్తాడు, పోగొట్టుకొంటాడు; నరుఁడు తాన్= మనిషితాను; నిర్భోజనతన్= భోజనం లేకుండా; మహాహ్రద= ఆ పేరుగల తీర్థంలో; ఆవాసిఐ= నివసించినవాడై; జమదగ్ని (జమత్+అగ్ని) కన్న= ఆ మహర్షి పొందిన; పుణ్యలోకంబున్= పవిత్రలోకాన్ని; మునిగణ్యుఁడు= మునులలో లెక్కింపదగినవాడై; అగుచున్= అవుతూ; కనున్= ఆ పుణ్యలోకాలు పొందుతాడు.

తాత్పర్యం: ఆ మూడు తీర్థాలలో స్నానం చేసినవాడు పరబ్రహ్మ దర్శనం చేస్తాడు. ఊర్వశీ కృత్తికా యోగంలో (జ్యోతిశ్శాస్త్ర సంబంధం కావచ్చును). లౌహిత్య తీర్థంలో స్నానంచేస్తే పౌండరీకయాగ ఫలం పొందుతాడు. రామహ్రదంలో ఉపవాసియై పన్నెండు రోజులు నియమంతో ఉంటే పాపాలన్నీ పోతాయి. మహాహ్రదంలో భోజనం లేకుండా నెలనాళ్ళుంటే జమదగ్ని పొందిన పుణ్యలోకాలు కలుగుతాయి.

క. విను వింధ్యంబున నొక నెల । తనుతాపము నోర్చి చేయుతపమున జనరం
జన! సర్వప్రాయశ్చి । త్త నిరూఢిం బొంది నరుఁడు ధర్మజ్ఞుఁ డగున్. 86

ప్రతిపదార్థం: విను= వినుము; జనరంజన!= ప్రజారంజకుడా!; వింధ్యంబునన్= వింధ్య పర్వతంమీద; ఒకనెల= ఒక మాసం; తను తాపమును= శరీరశ్రమను; ఓర్చి= సహించి; చేయు= చేసే; తపమునన్= తపస్సువలన; సర్వ= అన్ని; ప్రాయశ్చిత్త= పాపాలుచేసి వాటిని పోగొట్టుకొనటానికి చేసే వైదిక కర్మల; నిరూఢిన్= ప్రసిద్ధిని - ఫలితాన్ని; నరుఁడు= మనిషి; పొంది; ధర్మజ్ఞుఁడు= ధర్మం తెలిసినవాడు; అగున్= ఔతాడు.

తాత్పర్యం: ప్రజారంజకుడైనరాజా! వినుము. వింధ్యంమీద ఒక నెల శరీరతాపాన్ని (ఉష్ణాన్ని) ఓర్చుకొని తపస్సు చేస్తే మనిషి సర్వప్రాయశ్చిత్త ఫలం పొందుతాడు. ధర్మవేత్తా ఔతాడు.

సీ. నర్మద నాడి భూనాథనందనుఁ డగు, । జంబుమార్గంబున సంయతాత్ముఁ
డై మాసములు మూఁడు నట యొక్క నాఁడును । నిలిచిన, సర్వసిద్ధులను బొందుఁ
గోకాముఖము నీరఁ గ్రుంకి, తండులికాశ్ర । మమునకుఁ జని, వల్కలము ధరించి,
శాకభోజనుఁ డయి, శాంతిమై నున్న న । న్నెలవున నున్న కన్నెలు పదుంద్ర

తే. కధిపుఁడై యజరామరుండయి సుఖించుఁ, । గుల్యయందుఁ ద్రిరాత్రమ్ము, గుడుపు దక్కి
శౌచియై యఘమర్షణ జపము చేసి । యశ్వమేధఫలముఁ బొందు ననఘ! నరుఁడు. 87

ప్రతిపదార్థం: నర్మదన్= నర్మదానదిలో; ఆడి= స్నానమాడి; భూనాథ= రాజు యొక్క; నందనుఁడు= కొడుకు; అగున్= ఔతాడు; జంబు= నేరేడు - ఆ పళ్ళు రాలినందున నీరు నీలివన్నెతో ప్రవహిస్తుందట; మార్గంబునన్= ఆ మార్గంలో ప్రవహించే నదులలో; సంయత = నియమించిన; ఆత్ముఁడు+ఐ= మనస్సు కలవాడై; ఏకాగ్రతతో; మాసములుమూఁడు= మూణ్ణెల్లు; అట= ఆపై; ఒక్క నాఁడును= ఒక రోజు; నిలిచినన్= ఉంటే; సర్వసిద్ధులను= సిద్ధులన్నిటినీ; పొందున్= పొందుతాడు; కోకాముఖము= కోక అన్న పేరుగల నదీ ద్వారంలో; నీరన్= నీటిలో; క్రుంకి= మునిగి; తండులికా= ఆ పేరుగల; ఆశ్రమమునకున్= ఆశ్రమానికి; చని= వెళ్ళి; వల్కలము= నారబట్ట; ధరించి= కట్టుకొని; శాకభోజనుఁడు+అయి= కూరగాయలు తింటూ; శాంతిమైన్= శాంతితో; ఉన్నన్= ఉంటే; ఆ+నెలవునన్= ఆ చోట; ఉన్న; కన్నెలు= కన్యలు; పదుంద్రకున్= పదిమందికీ; అధిపుఁడై = నాథుడై; అజరా+ అమరుండు+అయి= ముసలితనం, మరణంలేనివాడై; సుఖించున్=

భోగిస్తాడు; కుల్య+అందున్= కుల్యలో, ఆపేరుగల తీర్థంలో; (కుల్య= కాల్వ); త్రిరాత్రమ్ము= మూడు రాత్రులు; కుడుపు= అన్నం; తక్కి= విడిచి; శౌచిఐ= శుచిత్వం కలిగి; అఘ= పాపం; మర్షణ= పోగొట్టే; జపముచేసి= జపమొనర్చి; నరుఁడు= మనుష్యుడు; అశ్వమేధ ఫలమున్ పొందున్= అశ్వమేధమనే యజ్ఞఫలం పొందుతాడు.

తాత్పర్యం: నర్మదానదిలో స్నానం చేస్తే రాజకుమారుడై పుట్టుతాడు. జంబూనదిలో నియమంతో మూడు మాసాలపై ఒకరోజుంటే సర్వసిద్ధులూ కలుగుతాయి. కోకాముఖంలో స్నానంచేసి తండులికాశ్రమంలో నారబట్ట ధరించి శాకాహారంతో శాంతంగా ఉంటే అక్కడున్న పదిమంది కన్యలకు మగడౌతాడు. అతడి కిక ముసలితనంగానీ, మృత్యువుగానీ ఉండదు. కుల్యానదిలో మూడురాత్రులు ఉపవాసం చేస్తే పాపాలు పోగొట్టే మంత్రాలు శుచిగా జపిస్తే - అశ్వమేధ ఫలం పొందుతాడు.

వ. ఆర్ష్టిసేనాశ్రమంబున నుజ్జానక స్నాతుండై, మర్త్యుం డఖిల పాపంబులం దొఱంగు; పిండారకంబున నేకరాత్రంబు నిలిచి యగ్నిష్టోమఫలంబుం బడయు; ధర్మారణ్యంబున బ్రహ్మసరస్సు సేవించి పౌండరీకఫలప్రాప్తిఁ గాంచు. 88

ప్రతిపదార్థం: ఆర్ష్టిసేనా+ఆశ్రమంబునన్= ఆ పేరుగల ఆశ్రమంలో ఉన్న; ఉజ్జానక= ఆ పేరుగల తీర్థంలో; స్నాతుండు+ఐ= స్నానం చేసి; మర్త్యుండు= (మరణం కలవాడు); నరుడు; అఖిల= సమస్త; పాపంబులన్= పాపాలను; తొఱంగున్= విడుస్తాడు; పిండారకంబునన్= ఆ పేరున్న తీర్థంలో; ఏకరాత్రంబు= ఒక రాత్రి; నిలిచి= ఉండి; అగ్నిష్టోమ ఫలంబున్= అగ్నిష్టోమమనే యజ్ఞం చేసిన ఫలం; పడయున్= పొందుతాడు; ధర్మ+అరణ్యంబునన్= ధర్మమన్న పేరుగల అరణ్యంలో (అడవి) ఉన్న; బ్రహ్మసరస్సు= ఆ పేరుగల చెరువును; సేవించి= పూజించి (పవిత్రభావంతో స్నానంచేసి); పౌండరీకఫల= పౌండరీకమనే యాగం చేసిన ఫలితం; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: ఆర్ష్టిసేనాశ్రమంలోని ఉజ్జానకతీర్థంలో స్నానంచేసిన నరుడికి పాపాలన్నీ తొలగిపోతాయి. పిండారక తీర్థంలో ఒకరాత్రి ఉంటే అగ్నిష్టోమయజ్ఞ ఫలం కలుగుతుంది. ధర్మారణ్యంలో ఉన్న బ్రహ్మసరస్సును సేవిస్తే పౌండరీకయాగం చేసిన ఫలం మానవులకు లభిస్తుంది.

చ. జనకుఁడు గౌరికిన్, వినుము, శంకరు మామ, హిమాద్రి సర్వర
త్ననికర విశ్వపుణ్య భవనంబు ప్రశాంతత నందు నిల్చి స
న్మునిగణ సేవనంబుఁ దపమున్ నడపంగ నరుండు సిద్ధుఁడై
వినుతికి నెక్కుఁ బొందు నరవిందభవాంతిక వాస సంపదన్. 89

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; గౌరికిన్= పార్వతికి; జనకుఁడు= తండ్రి; శంకరు మామ= శివుడికి మామ; హిమ+అద్రి= మంచుకొండ; సర్వరత్న= అన్నిరత్నాల; నికర= సమూహమునకు; విశ్వపుణ్యభవనంబు= ఎల్లపుణ్యములకు నిలయం; అందున్= ఆ హిమాద్రిలో; ప్రశాంతతన్= మిక్కిలి శాంతంతో; నిల్చి= ఉంటూ; సత్+ముని= మహామునుల; గణ= సమూహం; సేవనంబున్= సేవనూ; తపమున్= తపస్సునూ; నడపంగన్= చేస్తే; నరుండు= మానవుడు; సిద్ధుఁడు+ఐ= సిద్ధిపొందినవాడై; వినుతికిన్= ప్రస్తుతికి; ఎక్కున్= పొందును; అరవిందభవ= పద్మంలో పుట్టిన బ్రహ్మ; అంతిక= సమీపంలో; వాస= నివాస; సంపదన్= కలిమిని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: వినుము - గౌరీదేవికి తండ్రి, శివుడికి మామ, సర్వరత్న సమూహాలకూ, సర్వ పుణ్యములకూ స్థానమైన హిమాలయంమీద ప్రశాంతంగా మునిసేవతో, తపస్సుతో ఉంటే, నరుడు సిద్ధ పురుషుడై ఈ లోకంలో కీర్తి పొందటమేకాక బ్రహ్మలోకంలో ఉండే అదృష్టం పొందగలడు.

క. విను, తీర్థసేవ గామం । బును గ్రోధము మదము లోభమును జేరని నె
మ్మనము గలిగి నడపవలయు । ననఘా! ఫలసిద్ధి దాననగుఁ బురుషునకున్. 90

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; కామంబును= కామం; క్రోధము= కోపం; మదము= గర్వం; లోభమును= లోభగుణం; చేరని= సోకని; నెమ్మనము= నిండు మనస్సు కలిగి; తీర్థసేవ= తీర్థాలను సేవించటం; నడపవలయున్= చేయాలి; అనఘా!= పుణ్యాత్ముడా!; దానన్= దానితో; పురుషునకున్= మనిషికి; ఫలసిద్ధి= ఫలితం పొందటం; అగున్= జరుగుతుంది.

తాత్పర్యం: కామాదులు లేని మనస్సుతో తీర్థాలను సేవించాలి. దానివలననే కోరిన ఫలం సిద్ధిస్తుంది.

క. దమమును దపము నహింసయు । శమమును తీర్థముల వాన శౌచాతిశయం
బమలగుణ; కల్గు, రిత్త జ । లములం దోఁగిన శుచిత్వ లాభము గలదే? 91

ప్రతిపదార్థం: దమమును= కర్మేంద్రియ నిగ్రహం; తపము= (వేడి) ఏకాగ్ర భావనతో చేసే ధ్యానం మొదలైనవి; అహింసయున్= జీవహింస చేయకపోవటం; శమమును= జ్ఞానేంద్రియ నిగ్రహం; తీర్థముల= తీర్థములే; వానన్= వాటిలో (ఈ శమదమాదులలో); శౌచ= శుచిత్వ; అతిశయంబు= ఆధిక్యం; కల్గున్= కలుగుతాయి; అమలగుణ!= నిర్మలమైన గుణాలు కలవాడా! ధర్మరాజా!; రిత్త= వట్టి; జలములన్= నీళ్ళలో; తోఁగినన్= మునిగితే; శుచిత్వ లాభము= మనస్సు నిర్మలం కావటం అనే సిద్ధి; కలదే= ఉన్నదా?

తాత్పర్యం: నిర్మలములైన గుణములుగల ధర్మజా! దమము, శమము, అహింస, తపము అనునవి తీర్థములే. వాటివలన అతిశయమైన శుచిత్వం లభిస్తుంది. పై గుణములు లేక వట్టినీళ్ళలో మునిగితే పావనత్వం చేకూరుతుందా! చేకూరదని భావం.

క. దొరకొనని వానిఁ గోరక, । దొరకొనినందున మమత్వ తుష్టహృదయతం
బొరయక, విగతస్పృహులగు । పురుషులు, శుచు; లేల తీర్థములు వారలకున్? 92

ప్రతిపదార్థం: దొరకొనని= లభించని; వానిన్= వాటిని; కోరక= కోరుకొనక; దొరకొనినందునన్= దొరకినందువలన లేదా దొరికిన వాటియందు; మమత్వ= మమకారం; తుష్ట= తృప్తి చెందిన; హృదయతన్= హృదయమును; పొరయక= పొందక; విగత= పోయిన; స్పృహులు= కోరికలు కలవారు; అగు= అయిన; పురుషులు= వ్యక్తులు; శుచులు= పవిత్రులు; వారలకున్= వారికి; తీర్థములు= ఈ పుణ్య తీర్థాలు; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: ఏది నీకు అందుబాటులో ఉండదో దానిని కోరకుండా, దొరుకుతున్నవి కదా అని వాటిమీద మమకారం పెంచుకొనకుండా వాంఛలను జయించినవారు నిత్యము పవిత్రులే. వారి కీ తీర్థాల గొడవ దేనికి?

ఆ. అరయ దుర్గమములు, నతి విషమంబులు । నైన తీర్థములు ధరాధినాథ!
యధిక భక్తి యుక్తి నాత్మఁ దలంచినఁ । జాలు నరుల కల్మషములు వాయు. 93

ప్రతిపదార్థం: ధరా= భూమికి; అధినాథ!= పతీ!; అరయన్= విచారిస్తే; దుర్గమములు= పోరానివి; అతి= మిక్కిలి; విషమంబులు= కష్టంతో కూడుకొన్నవి; ఐన= అయినటువంటి; తీర్థములు= తీర్థాలు; అధిక= మిక్కిలి; భక్తి= పరమ ప్రేమ యొక్క; యుక్తిన్= కూడికతో; ఆత్మన్= హృదయంలో; తలంచినన్= భావిస్తే; చాలున్= సరిపోతుంది; నరుల= మనుష్యులయొక్క; కల్మషములు= పాపాలు; పాయున్= పోతాయి.

తాత్పర్యం: పోవటానికి వీల్లేనివి, దూరప్రదేశాలలో ఉండేవి, అయిన తీర్థాలను భక్తితో స్మరిస్తే చాలయ్యా ధర్మరాజా! మనుష్యుల పాపాలన్నీ పోతాయి.

క. జనవర! తీర్థ విధాశం । సన మగు నీ పుణ్యవాక్యచయము పవిత్రం
బనుపమము మాననీయం । బనిమిషపదవీప్రదము రహస్యము సుమ్మీ! 94

ప్రతిపదార్థం: జనవర!= ప్రజలను పాలించేవాడా!; తీర్థ= తీరముల; విధా= పద్ధతి; ఆశంసనము= కోరినది; అగు= అయిన; ఈ పుణ్యా= ఈ పవిత్రమైన; వాక్య= మాటల; చయము= సమూహం; పవిత్రంబు= పుణ్యామైనది; అనుపమము= సాటిలేనివి; మాననీయంబు= గౌరవించదగినది; అనిమిష= దేవతల; పదవీ= స్థానం; ప్రదము= ఇచ్చేది; రహస్యము= ఇది చాలా గోప్యమైనది; సుమ్మీ!= సుమా!

తాత్పర్యం: రాజా! తీర్థ విధానాలకు సంబంధించిన ఈ స్పష్టమైన పవిత్ర వాక్యాలు సాటిలేనివి, గౌరవించదగినవి, స్వర్గప్రదాలుకూడా. చాలా రహస్యం సుమా!

క. అనుగతుఁ డగు శిష్యునకుం' । దనసుతునకుఁ, జుట్టమునకు, ధరణీసుర ము
ఖ్యనియతి పదద్విజాతుల । కును, దగ నెఱిఁగించునది యకుంఠిత కరుణన్. 95

ప్రతిపదార్థం: అకుంఠిత= అడ్డులేని; కరుణన్= దయతో; అనుగతుఁడు= అనుసరించేవాడు; అగు= అయిన; శిష్యునకున్= శిష్యుడికీ; తన సుతునకున్= తన కుమారుడికీ; చుట్టమునకున్= చుట్టానికీ; ధరణీసుర ముఖ్య= బ్రాహ్మణశ్రేష్ఠులకు; నియతి= నియమం; పద= స్థానం కల్గిన; ద్విజాతులకును= రెండు జన్మలు కలవారికి, అనగా క్షత్రియ, వైశ్యులకు; తగన్= చక్కగా; ఎఱిఁగించునది= చెప్పాలి.

తాత్పర్యం: ఈ విషయం అందరితో చెప్పరాదు. ఎవరైతే గురువులను చక్కగా సేవిస్తారో ఆ శిష్యులకు, కుమారులకు, బంధువులకూ. బ్రాహ్మణశ్రేష్ఠులకూ, నియమం అనే యోగఅంగాన్ని సాధించటంలో పట్టుదలగల వైశ్యులకు, క్షత్రియులకూ నిండు ప్రేమతో చెప్పాలి.

క. నరవర! గౌతమునకు నం । గిరసుఁడు సెప్పినది యిది, యకిల్బిషబుద్ధిం
బరిపాటిఁ బఠించినఁ ద । త్పరత వినిన నపుడ పాయుఁ బాపము లెల్లన్. 96

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; గౌతమునకున్= గౌతముడికి; అంగిరసుఁడు= అంగీరస ఋషి; చెప్పినది= చెప్పింది; ఇది= ఈ వాక్య సమూహం; అకిల్బిష= పాపంలేని; బుద్ధిన్= మనస్సుతో; పరిపాటిన్= నిత్యం క్రమం తప్పక; తత్పరతన్= ఆసక్తితో; పఠించినన్= పారాయణం చేసినా; వినినన్= విన్నా; పాపములు ఎల్లన్= అన్ని పాపాలు; అపుడు+అ= అప్పుడే; పాయున్= తొలగుతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! గౌతముడికి అంగిరసుడు చెప్పిన ఈ వాక్యాలు పవిత్ర మనస్సుతో పారాయణం చేసినా విన్నా పాపాలన్ని పోతాయి.

క. మునులకు జప్యం బిది, స । ద్వినుతముఁ నిత్యముఁ బఠించు విమలాత్ములకున్;
విను, జాతి స్మరణముతో । జననం బతిపుణ్యపురుష సంతతి గలుగున్.' 97

ప్రతిపదార్థం: ఇది= ఈ వాక్యాల సముదాయం; మునులకున్= మునులకు; జప్యంబు= జపించదగినది; సత్= మంచివారిచే; వినుతమున్= స్తుతించదగింది; నిత్యము= ప్రతిదినము; పఠించు= పారాయణంచేసే; విమల= నిర్మలమైన; ఆత్ములకున్= హృదయాలున్నవారికి; జాతిస్మరణముతోన్= పూర్వజన్మ వాసనలస్మృతితో; జననంబు= జన్మ; అతి= మిక్కిలి; పుణ్యపురుష= పవిత్ర వ్యక్తుల; సంతతి= సంతానం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఈ విషయం మునులకు జపించతగింది. సత్పురుషులచేత స్తుతించతగింది. దీన్ని పారాయణం చేసే నిర్మల మనస్కులకు పూర్వజన్మ ఏ జాతిలో కలిగిందో ఆ స్మరణకల మరుజన్మ కలుగుతుంది. పుణ్యపురుష సంతానమూ కలుగుతుంది.'

అత్రి ప్రముఖ మహర్షులు శరతల్పగతుఁడైన భీష్ముఁ జూడవచ్చుట (సం.13-27-1)

వ. అని చెప్పి నయ్యవసరంబునం బుణ్యవిశేష గణ్యుండైన యగ్గాంగేయుం డట్లు గాండీవిశరంబులు శయ్యగా వీరశయనంబున నునికి నతని వీక్షింప నత్రియు, వసిష్ఠుండును, భృగుండును, బులహుండును, బులస్త్యుండును, గ్రతువు, నంగిరసుండును, నగస్త్యుండును, గణ్వుండును, గౌతముండును, విశ్వామిత్రుండును, జమదగ్నియు మొదలైన మహామునులు శిష్యవ్రాతంబుతో నేతెంచి తపఃప్రభావ స్ఫురిత ప్రభాపూరంబు భూనభోంతరంబున సంతతంబు లగుచుండ నిలిచి, యద్దేవవ్రతుని యున్న తెఱంగు గలయం గనుంగొనిరి, పాండవు లాశ్చర్య భరిత చిత్తులగుచు నత్తపోధనవర్యులం బ్రస్తుతించుచుం బ్రణమిల్లిరి; అప్పుడప్పరమసంయము లంతర్ధానంబు సేసిరి, అక్కౌరవులు నక్కురుపితామహుండును దారును వారల మాహాత్మ్యంబు లుగ్గడించుచుఁ దద్విషయంబైన సంభాషణం బొనర్చిరి; తదనంతరంబ. 98

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; పుణ్యవిశేష= విశేషపుణ్యం కలిగినందువలన; గణ్యుండు= గణించదగినవాడు; ఐన; ఆ+గాంగేయుండు= ఆ గంగానది కుమారుడు; అట్లు= ఆరీతిగా; గాండీవి= గాండీవమన్న విల్లు కలవాడు, అర్జునుడి; శరంబులు= బాణాలు; శయ్యగాన్= సెజ్జగా; వీరశయనంబునన్= వీరులకు ఉచితమైన శయ్యపై; ఉనికిన్= ఉన్నందువలన; అతనిన్; వీక్షింపన్= చూడటానికి; అత్రియున్, వసిష్ఠుండును, భృగుండును, పులహుండును; పులస్త్యుండును; క్రతువును, అంగిరసుండును; అగస్త్యుండును, కణ్వుండును, గౌతముండును, విశ్వామిత్రుండును, జమదగ్నియు మొదలైన; మహామునులు; శిష్య= శిష్యులయొక్క; వ్రాతంబుతోన్= సమూహంతో; ఏతెంచి= వచ్చి; తపఃప్రభావ= తపస్సుయొక్క మాహాత్మ్యంతో; స్ఫురిత= ప్రకాశించే; ప్రభాపూరంబు= కాంతి ప్రవాహం; భూ= భూమికి; నభః= ఆకాశానికి; అంతరంబునన్= మధ్యలో; సంతతంబులు= మిక్కిలి వ్యాపించినవి; అగుచుండన్= కాగా; నిలిచి= క్రిందికి దిగకుండా, మీదనే నిలచి; ఆ+దేవవ్రతుని= ఆ భీష్ముడియొక్క; ఉన్నతెఱంగున్= ఉన్నవిధానం; కలయన్= అంతటా; కనుంగొనిరి= చూచారు; పాండవులు= పాండురాజు కుమారులు; ఆశ్చర్యభరిత= ఆశ్చర్యంతో నిండిన; చిత్తులు= మనస్సులుకలవారు; అగుచున్= అయి; ఆ+తపోధన+

వర్యులన్= ఆ తపస్సు ఐశ్వర్యంగా కల మునిశ్రేష్ఠులను; ప్రస్తుతించుచున్= మిక్కిలి కొనియాడుతూ; ప్రణమిల్లిరి= నమస్కరించారు; అప్పుడు; ఆ+పరమ సంయములు= ఆ గొప్ప మునులు; అంతర్ధానంబు చేసిరి= అదృశ్యమయ్యారు; ఆ+కౌరవులు= పాండవులు - కురువంశ సంతానం; ఆ కురుపితామహుండును= ఆ కౌరవుల తాత, భీష్ముడూ; తారును= తామూ; వారల=ఆ మహామునుల; మాహాత్మ్యంబు= మహిమను; ఉగ్గడించుచున్= చెప్పుకొంటూ; తత్+విషయంబైన= వారికి సంబంధించిన; సంభాషణంబు= ప్రసంగం; ఒనర్చిరి= చేశారు; తత్+అనంతరంబు+అ= అటు తరువాత.

తాత్పర్యం: ఆ సమయంలో విశేషపుణ్య పురుషులలో లెక్కించతగిన భీష్ముడు, అర్జునుడు బాణాలతో నిర్మించిన తల్పంమీద మహావీరునకు తగినట్లుగా శయనించి ఉన్నాడు కనుక చూడటానికి మహర్షులు పెక్కుమంది శిష్యులతో సహా వచ్చారు. భూమికీ ఆకాశానికీ గల మధ్యభాగం వారి తపో మహత్త్వంవలన ఏర్పడిన కాంతితో నిండిపోయింది. వారంతా భీష్ముడి పరిస్థితిని పరికించారు. ఇది చూచి ఆశ్చర్యపడి పాండవులు వారికి నమస్కరించారు. ఆ మునులు అదృశ్యమైపోయారు. అది చూచిన పాండవులు, భీష్ముడు వారి చరిత్రలను ముచ్చటించుకొన్నారు. ఆ తరువాత.

తే. తాత పాదపద్మములు మస్తకము సోఁక । వినతుఁడై, ధర్మతనయుఁ 'డే జనపదంబు
లే నగంబు లేనదులు పుణ్యానుభావ । సమధికత్వంబు గలయవి జనవరేణ్య!॥ 99

ప్రతిపదార్థం: ధర్మతనయుఁడు= యముడి పుత్రుడైన పాండవాగ్రజుడు; తాత= భీష్ముడి; పాదపద్మములు= తామరపూలవంటి అడుగులు; మస్తకము= (తన) తలకు; సోఁకన్= తగిలేటట్లుగా; వినతుఁడు+ఐ= వంగి నమస్కరించి; జనవరేణ్యా= మానవులలో శ్రేష్ఠుడా!; ఏ జనపదంబులు= ఏ పల్లెపట్లు (జనులు నివసించే చోట్లు); ఏ నగంబులు= ఏ కొండలు; ఏ నదులు= ఏ ఏరులు; పుణ్య అనుభావ= పవిత్ర మాహాత్మ్యం చేత; సమధికత్వంబు= గొప్ప అతిశయం; కలయవి= కలవి.

తాత్పర్యం: యమధర్మరాజు కొడుకు ధర్మరాజు తాతగారి అడుగు దమ్ములకు తన తల తాకేటట్లు నమస్కరించి, 'తాతా! ఏ ఊళ్ళు, కొండలు, ఏళ్ళూ మాహాత్మ్యం కలవో చెప్పుము'.

వ. అని యడుగుటయు. 100

తాత్పర్యం: అని అడుగగా.

భీష్ముఁడు ధర్మజునకు గంగాప్రభావంబు సెప్పుట (సం.13-27-19)

సీ. అతనికి నాతఁ డిట్లను; 'నివ్విషయమునఁ । గల దితిహాస మొకండు, దానిఁ
వివరింతు నీ కుంఛవృత్తిపరుం డగు । నొక విప్రునింటికి నొక్క సిద్ధుఁ
దతిథియై వచ్చిన, నాతిథ్య మొనరించి । యతనితో సల్లాప మాచరింప,
నమ్మహాత్ముండు నీ యడిగిన యట్టుల । యా సిద్ధు నడిగిన, నతఁడు సెప్పె

తే. ననఘ! యెవ్వాని నడుముగా నరిగెఁ బావ । నాంబుపూర భాగీరథి యట్టి దేశ
భూధరాది పదార్థముల్ పుణ్యతమము; లట్లు గాకయు గంగ మహత్త్వ వినుము. 101

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ ధర్మరాజుతో; అతఁడు= భీష్ముడు; ఇట్లనున్= ఈ విధంగా చెప్పుతున్నాడు; ఈ విషయమునన్= ఈ విషయంలో ఒకండు= ఒకటి; ఇతిహాసంబు= పురాణ కథ;కలదు; దానిన్; నీకున్; వివరింతున్= వివరించి చెప్పుతాను; ఉంఛవృత్తిపరుండు+అగు= భిక్షాటనమే జీవనోపాధిగా గల; ఒక విప్రు+ఇంటికిన్= ఒక బ్రాహ్మణుడి, గృహానికి; ఒక్క; సిద్ధుఁడు= యోగి; అతిథిఐ= అతిథిగా వచ్చినన్= రాగా; ఆతిథ్యము= అతిథి సత్కారం; ఒనరించి= చేసి; అతనితోన్= ఆ సిద్ధుడితో; సల్లాపము= సరస సంభాషణ; ఆచరింపన్= చేయగా; ఆ మహాత్ముండు= ఆ విప్రుడు; ఆ సిద్ధున్= ఆ సిద్ధుడిని; నీఅడిగిన అట్టుల= నీ వడిగినట్లుగానే; అడిగినన్= అడుగగా; అతఁడు= సిద్ధుడు; చెప్పెన్= చెప్పాడు; అనఘ!= పుణ్యాత్ముడా!; ఎవ్వాని= ఏయే దేశములయొక్క; నడుముగాన్= మధ్యలో; పావన= పవిత్రమైన; అంబుపూర= నీటి ప్రవాహం గల; భాగీరథి= భగీరథుడివలన భూమికి దిగివచ్చిన గంగ; అరిగెన్= ప్రవహించిందో; అట్టి దేశ= అట్లాంటి దేశంలో ఉన్న; భూధర= కొండలు; అది= మొదలైన; పదార్థముల్= వస్తువులు; పుణ్య తమములు= మిక్కిలి పవిత్రములు; అట్లు కాకయున్= అంతే కాకుండా; గంగ= గంగానదియొక్క; మహత్త= ప్రభావం, మహిమ; వినుము= ఆలింపుము.

తాత్పర్యం: ధర్మరాజుతో భీష్ముడన్నాడు 'దీనికి సంబంధించిన ఒక పురాణ కథ ఉన్నది. అది నీ వడిగిన ప్రశ్నకు సమాధానం. భిక్షాటనంతో జీవించే ఒక బ్రాహ్మణుడి ఇంటికి ఒక యోగి అతిథిగా వచ్చాడు. ఆ విప్రు డతడికి మర్యాదలు చేసి కూర్చుండబెట్టి మాట్లాడుతూ నీ వడిగినట్లే యోగిని అడిగాడు. అతడు చెప్పాడు. పుణ్యాత్ముడా!; ఏ దేశాల నడుమగా గంగ ప్రవహిస్తుందో ఆ దేశంలో ఉన్న పర్వతాదులైన వస్తువులన్నీ పవిత్రములే. ఇంతేకాక గంగా మాహాత్మ్యం చెప్పుతాను వినుము.

తే. త్రిపథగా సేవనమున సిద్ధించునట్టి । గతి, జనములకు నియత కల్పితము లయ్యు
నధ్వరంబును, బ్రహ్మచర్యంబు, దపము । సంపరిత్యాగమును, జేయఁజాల వనఘ! 102

ప్రతిపదార్థం: అనఘ!= పవిత్రుడా!; త్రి= మూడు; పథ= మార్గాలలో; గ= నడిచేది- (స్వర్గంలో మందాకిని, భూలోకంలో భాగీరథి, పాతాళంలో భోగవతి అనే పేర్లతో సాగే గంగ యొక్క); సేవనమునన్= సేవతో; సిద్ధించునట్టి= లభించే; గతి= ఉత్తమ స్థితి; జనములకున్= మనుషులకు; నియత కల్పితములు+అయ్యున్= నియమానుసారంగా చేయబడినవైనా; ఆధ్వరంబును= యజ్ఞం; బ్రహ్మచర్యంబు= వేదాభ్యాసం; తపము= తపస్సు; సంపరిత్యాగమును= చక్కని దానం; చేయన్ చాలవు= సమకూర్చలేవు.

తాత్పర్యం: అనఘా! గంగను సేవిస్తే వచ్చే ఫలితం - యజ్ఞం, బ్రహ్మచర్యం, తపస్సు; త్యాగాదులచేతను వచ్చేది కాదు.

క. మే నించుక సోఁకిన గం । గానది తోయములు జనుల కల్మష కోటిం
బో నడిచి పురందర లో । కానందముఁ బొందఁ జేయు నాగమవేదీ! 103

ప్రతిపదార్థం: ఆగమవేదీ!= వేదం తెలిసినవాడా!; మేను= శరీరం; ఇంచుక= కొంచెం; సోఁకినన్= తాకితే; గంగానది తోయములు= గంగానదినీరు; జనుల= మానవుల; కల్మష= పాపాల; కోటిన్= సమూహాన్ని; పోన్= పోయేటట్లుగా; అడిచి= అణగగొట్టి; పురందర లోక ఆనందము= స్వర్గలోకానందాన్ని; పొందన్ చేయున్= లభింపజేస్తుంది.

తాత్పర్యం: గంగానది నీరు కొంచెం శరీరానికి తాకితే చాలు. మనిషి చేసిన పాపాలన్నీ పోవటమే కాక స్వర్గలోకానందాన్నిస్తుంది.

విశేషం: శ్రీరామకృష్ణ పరమహంస తరచుగా ఇదే మాట చెప్పేవారట. గంగను వారు 'బ్రహ్మచారి' అనేవారట. సాక్షాత్తు బ్రహ్మము నుండి ప్రవహించిన జలమని తాత్పర్యం.

క. మును పాపము లెన్ని యొన । ర్చినఁ బిదపను గంగ నాడఁ జీఁకటి రవి దోఁ
చిన విరియుగతి విరియు; న । య్యనఘుఁ డిలాతలము దొఱఁగి యమరత నొందున్. 104

ప్రతిపదార్థం: మును= పూర్వం; పాపములు; ఎన్ని; ఒనర్చినన్= చేసినా; పిదపను= తరువాత; గంగన్= గంగలో; ఆడన్= స్నానం చేస్తే; రవి= సూర్యుడు; తోఁచినన్= ఉదయిస్తే; చీఁకటి= అంధకారం; విరియుగతిన్= విరిసిపోయిన రీతిగా; విరియున్= చెదరిపోతాయి; ఆ+అనఘుఁడు= ఆ పుణ్యాత్ముడు; ఇలాతలము= భూమిని; తొఱఁగి= వదలి; అమరతన్= అమరత్వమును, దేవతాత్వం; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పూర్వం పాపా లెన్ని చేసినా తరువాత గంగలో మునిగితే పాపాలన్ని పటాపంచలౌతాయి - సూర్యుడు రాగానే చీకట్లు తొలగినట్లు. అంతేకాక వాడు మరణించి దేవలోకాలకు పోతాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. ఎన్ని యేఁడులు, మనుజుని యెమ్ము గంగ । వారియం దుండు, నన్ని వేల్వత్సరములు
నాకలోక మహాసుఖశ్రీకి నాతఁ । డత్తి యుండును నిర్మలచిత్తవృత్తి. 105

ప్రతిపదార్థం: ఎన్ని ఏఁడులు= ఎన్నేళ్ళు; మనుజుని= మనిషియొక్క; ఎమ్ము= ఎముక; గంగవారియందున్+ఉండున్= గంగనీళ్ళలో ఉంటుందో; అన్నివేల్= అన్నివేల; వత్సరములు= ఏళ్ళు; నాకలోక= స్వర్గలోకమందలి; మహాసుఖశ్రీకిన్= చెడని సుఖసంపదకు; ఆతఁడు= ఆ మనిషి; నిర్మల= స్వచ్ఛమైన; చిత్తవృత్తిన్= మనస్సుతో; అత్తియుండును= హత్తుకొని ఉంటాడు.

తాత్పర్యం: మనిషి ఎముక గంగనీళ్ళలో ఎన్నేళ్లుంటుందో అన్నివేల సంవత్సరాలు స్వర్గలోకంలో అతడు మహాసుఖాలు పొందగలుగుతాడు.

సీ. అనఘ! సోమము లేని యధ్వరంబును, శశి । లేని రాత్రియు, రవి లేని నభము
నాత్మధర్మము లేని యాశ్రమంబును, బుష్ప । సంపద లేని భూజమును బోలె,
హీనత నొందు, గంగానది లేని దే । శంబు, చాంద్రాయణ శతము లైన
గంగాపయః పానకరణంబు గావించు । నిర్మలత్వముఁ జేయ నేర; వగ్ని

ఆ. యందుఁ బడిన దూది యట్లగు గంగావ । గాహనమునఁ బాతకంబు లఖిల
భూతములకు దుఃఖములు వాపి కొనుటకు । నేవిధములు గంగ కీడు గావు. 106

ప్రతిపదార్థం: అనఘ!; సోమము= సోమరసం; లేని; అధ్వరంబును= యజ్ఞం; శశి= చంద్రుడు; లేని; రాత్రియున్= రేయి; రవి= సూర్యుడు; లేని= లేనట్టి; నభమున్= ఆకాశం; ఆత్మధర్మము=స్వధర్మంలేని; ఆశ్రమంబును= ఆశ్రమము - నాలుగు ఆశ్రమాలు- బ్రహ్మచర్యం; గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం; పుష్పసంపద= పూలసమృద్ధి; లేని; భూజమును పోలెన్= చెట్టు

వలె; గంగానది లేని దేశంబు= గంగపారని దేశం; హీనతన్+ఒందున్= హీనత్వం పొందుతుంది; చాంద్రాయణ= చాంద్రాయణమనే వ్రతం, చంద్రకళలు తరగటం; పెరగటం బట్టి భోజనం తగ్గించటం, పెంచటములయొక్క; శతములు= వందలు; ఐనన్= అయినప్పటికి; గంగాపయః పానకరణంబు= గంగనీటిని త్రాగటం; కావించు= చేసే; నిర్మలత్వమున్= పవిత్రతను; చేయన్‌నేరవు= చేయజాలవు; గంగా+అవగాహమునన్= గంగలో మునుగుట వలన; పాతకంబులు= పాపములు; అగ్నియందున్= నిప్పులో; పడిన= పడ్డ; దూది అట్లగున్= దూదివలె అయిపోతాయి; అఖిల= సమస్త; భూతములకున్= జీవరాసులకు; దుఃఖములు= శోకాలు; పాపి కొనుటకున్= పోగొట్టుకొనటానికి; ఏవిధములు= ఏ పద్ధతులు కూడా; గంగకున్= గంగానదికి; ఈడుకావు= సమానం కావు.

తాత్పర్యం: సోమం లేని యజ్ఞం; చంద్రుడు లేని రాత్రి, సూర్యుడు లేని ఆకాశం; స్వధర్మం లేని ఆశ్రమం, పూలు లేని చెట్టు ఎట్లా శోభను కోల్పోతాయో, అదే విధంగా గంగలేని దేశం కూడా దైన్యం పొందుతుంది. చాంద్రాయణవ్రతాలు వందచేసినా గంగ నీరు త్రాగిన ఫలితం రాదు. సకలపాపాలు గంగలో మునిగితే పోతాయి. అగ్నిలో పడ్డ దూదివలె సమస్త జీవరాసులకు దుఃఖం పోగొట్టుకొనటానికి ఎన్నిమార్గాలున్నా గంగతో సమానం కావు.

విశేషం: అలం: ఉపమ.

క. శరణంబు లేని జనులకుఁ । బరమశరణ మండ్రు మునులు భాగీరథి, ని
ర్జరులకు నమృతము లట్టుల । నరులకు గంగాజలం బనఁగ నే విందున్. **107**

ప్రతిపదార్థం: మునులు= ఋషులు; శరణంబు= దిక్కు; లేని; జనులకున్; భాగీరథిన్= గంగను; పరమ= గొప్ప; శరణము= దిక్కు; అండ్రు= అంటారు; నిర్జరులకున్= దేవతలకు (జర=ముసలితనం లేనివారు); అమృతములు+అట్టుల= అమృతమెట్లాగో అట్లాగే; నరులకున్= భూలోకంలోని వారికి; గంగా జలంబులు= గంగనీళ్ళు; అనఁగన్= అనటం; నేన్= నేను; విందున్= వింటాను.

తాత్పర్యం: దిక్కులేని జనులకు గంగ గొప్ప దిక్కని ముని లంటారు. దేవతలకు అమృతమెట్లాగో, నరులకు గంగ నీరు అట్లాంటిది - అని అనటం నేను విన్నాను.

విశేషం: అలం: ఉపమ.

క. తలపై జాహ్నవి వాలుక । యలికికొనిన ఫాలతటిఁ దదంతర్మృత్సం
కలితముఁ జేసిన, బాపం । బులు దొలఁగు సుపర్ణుఁ గనిన భుజగముల క్రియన్. **108**

ప్రతిపదార్థం: తలపైన్= నెత్తిపైన; జాహ్నవి= గంగలోని; వాలుక= ఇసుక; అలికికొనినన్= రాసుకొన్నా; ఫాలతటిన్= నుదుటియందు; తత్= ఆ గంగ యొక్క; అంతర్= లోపలి; మృత్= మట్టిని; సంకలితము= కూడుకొన్నట్లు; చేసినన్= చేసినా; సుపర్ణున్= గరుత్మంతుడిని; కనిన= చూచిన; భుజగముల= పాముల; క్రియన్= విధంగా; పాపంబులు; తొలఁగున్= పోతాయి.

తాత్పర్యం: తలమీద గంగ ఇసుక, నొసటిపై గంగమన్ను రాసుకొంటే గరుత్మంతుడిని చూచి పాములు పారిపోయినట్లుగా పాపాలు తొలగిపోతాయి.

విశేషం: అలం: ఉపమ.

క. గంగాతరంగశీకర । సంగతమగు మారుతమున సద్య స్స్పర్శం
బంగీకరించునెవ్వఁడు । భంగపఱుచు నతఁడు ఘోరపాపచయంబున్. 109

ప్రతిపదార్థం: గంగా తరంగ= గంగానది అలల యొక్క; శీకర= తుంపర్లతో; సంగతము+అగు= కూడుకొన్న; మారుతమునన్= గాలితో; సద్యః= అప్పటికప్పటి; స్పర్శంబు= స్పర్శ; ఎవ్వఁడు= ఎవడు; అంగీకరించున్= స్వీకరిస్తున్నాడో; అతఁడు= వాడు; ఘోర= భయంకరమైన; పాపచయంబున్= పాపసమూహాన్ని; భంగపఱుచున్= వమ్ముచేస్తాడు.

తాత్పర్యం: గంగా తరంగాల తుంపర్లు చిందే గాలి శరీరానికి తాకితే వాడి పాపాలన్నీ అప్పటికప్పుడే పోతాయి.

తే. ఇవుల నేడు దరంబుల, నవుల నేడు । దరములను, బిత్రువర్గంబు, నరుఁడు గంగ
నాడి శుచిఁ జేయుఁ జూచిన యంతమాత్రఁ । బాచు వాఙ్మనః కాయజ పాపతతుల. 110

ప్రతిపదార్థం: ఇవులన్= ఇవతల; ఏడుతరంబులన్= ఏడు తరాలు; అవులన్= అవతల; ఏడు తరములన్= ఏడు తరాలు (14 తరాలు); పిత్రువర్గంబున్= పితృదేవతలను; నరుఁడు; గంగన్= గంగలో; ఆడి= స్నానంచేసి; శుచిన్= స్వచ్ఛతను; చేయున్= చేస్తాడు; చూచిన అంతమాత్రన్= చూచినంత మాత్రాన; వాక్= మాటవలన; మనః= మనస్సువలన; కాయజ= శరీరం వలన పుట్టిన; పాపతతులన్= పాప సమూహాలను; పాచున్= పోగొట్టుతాడు.

తాత్పర్యం: మనుష్యుడు గంగా స్నానం చేసి పదునాలుగు తరాల పితృదేవతలను పావనుల గావిస్తాడు. గంగను చూచినంతమాత్రాన మాట, మనస్సు, శరీరం వలన కల్గిన పాపాలన్నీ పోతాయి.

తే. వినిన, వేడుక సేసినఁ, గనినఁ జేత । నంటినను, రెండు కులములయందుఁ గలుగు
పితృగణంబుల నెల్ల, సద్గతికిఁ బుచ్చు; । గంగ యెటు సేయునో యవగాహనమున. 111

ప్రతిపదార్థం: వినినన్= విన్నా; వేడుక= ఉత్సవం; చేసినన్= చేసినా; కనినన్= చూచినా; చేతన్= చేత్తో; అంటినను= తాకినా; రెండు కులములఅందున్= రెండు కులాలలోనూ - మాతృపితృ వంశాలలో; కలుగు=ఉన్నట్టి; పితృగణంబులన్= పితృదేవతా సమూహాన్ని; ఎల్లన్= అందరినీ; సత్‌గతికిన్= మంచి పరలోకస్థితికి; పుచ్చున్= పంపుతుంది; గంగ= గంగానది; అవగాహనమునన్= స్నానంచేస్తే; ఎటుచేయునో= ఇంక ఎట్టి సద్గతులు కల్గిస్తుందో చెప్పశక్యంగాదు (చాలా మేలుచేస్తుంది)

తాత్పర్యం: గంగను గురించి విన్నా, ఉత్సవం చేసినా, చూచినా, చేతితో తాకినా, రెండు కులాలలోని (పుట్టినింటి - మెట్టినింటి) పితృదేవతలను స్వర్గానికి పంపిస్తుంది. అట్లాంటప్పుడు ఇక స్నానం చేస్తే వారికేమిస్తుందో ఆ గంగాదేవి? మాటలలో చెప్పలేను.

క. విను, గంగ గంగ యను కీ । ర్తనములతో నొండునీటఁ దగ మునిఁగిన య
జ్జనులు దురితములఁ దొఱఁగుదు । రని యార్యులు సెప్ప విందు నంచితచరితా! 112

ప్రతిపదార్థం: అంచిత= మంచి; చరితా!= నడవడి కలవాడా!; విను= శ్రద్ధగా ఆలకించుము; గంగ గంగ= గంగ గంగ; అను= అన్న; కీర్తనములతోన్= స్తుతులతో (గంగా గంగా అన్నమాటలే కీర్తన); ఒండునీటన్= మరొక నీటిలో; తగన్=

తగువిధంగా; మునిఁగిన= స్నానంచేసిన; ఆ+జనులు= ఆ మనుష్యులు; దురితములన్= పాపాలను; తొఱఁగుదురు= పోగొట్టుకొంటారు; అని; ఆర్యులు= పెద్దలు; చెప్పన్= చెప్పగా; విందున్= విన్నాను.

తాత్పర్యం: గంగా, గంగా అంటూ పరవశంతో కీర్తిస్తూ ఏ నీటిలో మునిగినా పాపాలు పోతాయంటారు పెద్దలు. (ఇంక గంగలో మునిగితే వేరే చెప్పాలా?

సీ. అనఘ! చూడ సమర్థుఁ డగువాఁడు జాహ్నవిఁ । జూడకయున్నఁ బశుప్రతిముఁడు
నంధ సమానుండు నగు ; నింద్రుఁ డాదిగా । సురలు గోరెడు గంగ నరులు గోర
వలదె? చేకుఱు నపవర్గ ముత్క్రమణ కా । లంబున గంగఁ దలంచి రేని;
రాజభయంబుఁ, జోరభయంబుఁ బాప భ । యంబును, భూతభయంబు, లోను

ఆ. గాఁగఁ గలుగు భయనికాయంబు, గంగా ప్ర । శంసనమునఁ బాయు; శంభుఁ డర్థి
నతులపుణ్య యైన యద్దేవి దివినుండి । రా ధరింపఁడే శిరస్తలమున. 113

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! చూడన్= దర్శించటానికి; సమర్థుఁడు+అగువాఁడు= శక్తికలవాడు; జాహ్నవిన్= గంగను, (జహ్నుడన్న ముని చెవినుండి ప్రవహించింది కనుక అతడి కూతురు గంగ); చూడక+ఉన్నన్= చూడకపోతే; పశుప్రతిముఁడు= గొడ్డుతో సమానం; అంధ సమానుండు= గ్రుడ్డివాడితో సమానం; అగున్= అవుతాడు; ఇంద్రుఁడు+ఆదిగాన్= ఇంద్రుడు మొదలుకొని; సురలు= దేవతలు; కోరెడు= కోరుకొనే; గంగన్= గంగను; నరులు= మనుష్యులు; కోరన్‌వలదె?= కోరుకొనవద్దా?; గంగన్; ఉత్క్రమణ కాలంబునన్= ప్రాణంపోయే సమయంలో; తలంచిరి+ ఏనిన్= తలచుకొంటే; అపవర్గము= ముక్తి; చేకుఱున్= లభిస్తుంది; రాజభయంబున్= రాజువలన కలిగే భయం; చోరభయంబున్= దొంగలవలని భయం; పాపభయంబును= పాపంవలనిభయం; భూత భయంబున్= ప్రేత, పిశాచాదులవలని భయం; లోనుగాఁగన్‌కలుగు= మొదలుగా కలుగు; భయ నికాయంబున్= ఉండే భయాలన్నీ; గంగా ప్రశంసనమునన్= గంగాస్తుతివలన; పాయున్= పోవును; శంభుఁడు= శివుడు; అర్థిన్= కోరికతో; అతుల= సాటిలేని; పుణ్యఐన= పుణ్యవతిఅయిన; ఆ+దేవి= ఆ దేవత; దివినుండి= ఆకాశంనుండి; రాన్= రాగా; శిరస్తలమునన్= తలమీద; ధరింపఁడే= తాల్చడా!

తాత్పర్యం: చూడటానికి శక్తి ఉండి గంగను చూడనివాడు గొడ్డుతో సమానం. గ్రుడ్డివాడితో సమానం; ఇంద్రుడు మొదలైన దేవతలే గంగ కావాలనుకొంటే నరు లనుకోవద్దా! ప్రాణం పోయేవేళ గంగను స్మరించినంతమాత్రాన ముక్తి కలుగుతుంది. రాజ, చోర, పాప భయాలన్నీ గంగను కీర్తిస్తే పోతాయి. శివునివంటివాడు ఆ దేవత స్వర్గం నుండి దిగివస్తే తన తలమీద పెట్టుకొన్నాడు కదయ్యా!

తే. మూఁడు పథములఁ జని, లోకములకు మూఁటి । కుజ్జ్వలాలంకృతియుఁ బెంపు నొసఁగినట్టి,
యమలతరమూర్తి యగు దేవి నాశ్రయించు । వాఁడు కృతకృత్యుఁ డిది నిక్కువము కృతాత్మ! 114

ప్రతిపదార్థం: కృత+ఆత్మ!= ధన్యమూర్తీ!; మూఁడు పథములన్= మూడు దారులలో (స్వర్గ, మర్త్య, పాతాళలోకాల మార్గాలలో); చని= ప్రవహించి; లోకములకున్ మూఁటికిన్= మూడు లోకాలకు; ఉజ్జ్వల= ప్రకాశవంతమైన; అలంకృతియున్= అలంకారమునూ; పెంపును= ఆధిక్యమును; ఒసఁగినట్టి= ఇచ్చినటువంటి; అమలతర= మిక్కిలి నిర్మలమైన; మూర్తి= ఆకారం కలది; అగు= అయిన; దేవిన్= దేవతను; ఆశ్రయించువాఁడు= శరణన్నవాడు; కృతకృత్యుఁడు= ధన్యుడు; ఇది; నిక్కువము= సత్యం.

తాత్పర్యం: మూడు మార్గాలలో ప్రవహిస్తూ ముల్లోకాలకూ గొప్ప అలంకారమై కీర్తిని కలిగిస్తూ ఉండే స్వచ్ఛమూర్తి గంగాదేవిని ఎవడు ఆశ్రయిస్తున్నాడో వాడు ధన్యుడు.

విశేషం: అమలతరమూర్తి - స్వచ్ఛమైన రూపంకలది; జలానికి ఆకారం, రంగు లేవు. ఆకాశంవలె ప్రతిఫలించి నీలమౌతున్నది తప్ప, పైగా ఈ జలమూర్తులలో మిక్కిలి నిర్మలమైనది గంగాదేవి. హిమాలయాలలో జన్మించినది కాబట్టి ఎన్నో ఓషధుల గుణాలు కలిగినది కాబట్టి పవిత్రమైనది. ఈ దేశసంస్కృతి గాంగేయ సంస్కృతి, గంగకు కుమారస్వామి, భీష్ములిద్దరూ సంతానం. వారిద్దరు గాంగేయులు. గంగ ఒడ్డున కాశి మొదలైన పవిత్ర పుణ్యక్షేత్రాలు వెలిశాయి కనుక భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతికి చిహ్నం - గంగ.

క. జనులకు నింద్రుఁడు, గ్రహముల । కినుఁడును, దారలకు నోషధీశుఁడ పోలెన్
మనుజోత్తమ ! కడు నెక్కుడు । వినుము, నరుల కెల్ల జాహ్నవి మహత్త్వమునన్. 115

ప్రతిపదార్థం: మనుజ+ఉత్తమ!= మానవులలో శ్రేష్ఠుడా! రాజా!; వినుము= ఆలకించుము; జనులకున్= మానవులకు; ఇంద్రుఁడు= దేవతలరాజు; గ్రహములకున్= చంద్రాది గ్రహాలకు; ఇనుఁడును= సూర్యుడు; తారలకున్= నక్షత్రాలకు; ఓషధి+ఈశుఁడు+అ= ఓషధులకు (ఔషధాలకు ఉపయోగించే మొక్కలు లేదా వృక్షాలు) రాజు - చంద్రుడు; పోలెన్= వలె; నరులకు+ఎల్లన్= మనుజులకంతా; మహత్త్వమునన్= మాహాత్మ్యంలో; జాహ్నవి= జహ్నుడనే ముని కూతురు- గంగ; కడున్= మిక్కలి; ఎక్కుడు= గొప్పది;

తాత్పర్యం: రాజా! వినుము. మనుష్యులకు ఇంద్రుడు, గ్రహాలకు సూర్యుడు, నక్షత్రాలకు చంద్రుడు ఎట్లాగో; అట్లాగే మనుషుల కన్ని విషయాలలో మాహాత్మ్యంగల గంగ చాలా గొప్పది.

విశేషం: అలం: ఉపమ. భగీరథుడు తపస్సు చేస్తే గంగ శివుడి జటాజూటంనుండి క్రిందికి ప్రవహించి దారిలో ఉన్న జహ్నుముని ఆశ్రమాన్ని ముంచివేసింది. అది చూచి ఆయన గంగను త్రాగివేశాడు బొట్టు మిగులకుండా. మరల భగీరథుడు ప్రార్థిస్తే ఆ మహర్షి చెవినుండి తిరిగి గంగ ప్రవహించింది. అందుకని ఆమె జహ్నుకన్య - జాహ్నవి అయింది.

ఆ. సగరనృపతి పుత్త్రచయము, మునీంద్ర శా । పమున భస్మమై యపారదురిత
కల్మషంబుఁ బొందఁగా గంగ నిజజల । సేక మొసఁగి యనిచె నాకమునకు. 116

ప్రతిపదార్థం: సగర నృపతి= సగరుడన్న రాజు యొక్క; పుత్త్రచయము= కుమారుల సమూహం; ముని+ఇంద్ర= మునులకు రాజైన మునిశ్రేష్ఠుడైన కపిల మహర్షియొక్క; శాపమునన్= శాపంతో; భస్మమై= బూడిదై; అపార= అంతులేని; దురిత= పాప; కల్మషంబు= మాలిన్యం; పొందఁగాన్= పొందితే; గంగ= భాగీరథి; నిజ= తన; జల= నీళ్ళయొక్క; సేకమున్= తడుపుట; ఒసఁగి= చేసి; నాకమునకున్= స్వర్గానికి; అనిచెన్= పంపింది.

తాత్పర్యం: కపిలుడి శాపంవలన సగరుడి కొడుకులైన సాగరులు బూడిద కుప్పలుకాగా గంగ ఆ కుప్పలపై ప్రవహించి వారిని స్వర్గానికి పంపించింది. ఇది గంగా మాహాత్మ్యం.

విశేషం: సగరుడు యజ్ఞం చేస్తుండగా యాగాశ్వం తప్పిపోయింది. అతని కొడుకులు 60వేలమంది ఆ గుర్రాన్ని వెదకటానికి వెళ్ళారు. ఆ గుర్రం కపిలముని ఆశ్రమ ప్రాంతంలో తిరుగుతూ ఉండటం చూచి వారు కపిలుడే గుర్రాన్ని అపహరించా

డనుకొని ఆయనను శిక్షించటానికి పోయి, ఆ మహర్షి కోపాగ్నికి భస్మమైపోయారు. ఆ స్థితి వారికి పోవాలంటే గంగ ఆ బూడిద కుప్పలపైకి ప్రసరించాలనే ఉపాయం మహర్షి తానై చెప్పగా చివరకు భగీరథు డా పని సాధించిన వాడయ్యాడు. స్వర్గం నుండి గంగ భూమిపైకి ప్రసరించి ఆ బూడిద కుప్పలపై సుళ్ళు తిరిగితే తిరిగి సాగరులు మనుజులై స్వర్గ గతులైనారని గంగావతరణ కథ. ఇది రామాయణంలో మహర్షి వాల్మీకి ఆశ్చర్యకరంగా వర్ణిస్తాడు. ప్రవహించాలని కోరుకొన్నాడు భగీరథుడు. బ్రహ్మ 'సరే, గంగ భూమిపైకి దిగితే క్రుంగిపోతుంది కనుక శివుడిని ప్రార్థించు' అన్నాడు. మరలా భగీరథుడు శివుడి కొరకు తపస్సు చేస్తే ఆయన ప్రత్యక్షమై భగీరథుడి కోరిక మన్నిస్తానన్నాడు. గంగ ఆయన జటాజూటంలో దూరింది. భూమిపై ప్రవహిస్తూ జహ్నుడి ఆశ్రమాన్ని ముంచెత్తితే ఆయన గంగను త్రాగివేశారు. మరలా భగీరథుడు జహ్నుమునిని ప్రార్థించాడు. అప్పుడు గంగ అతని చెవినుండి నిర్గమించి సాగరుల భస్మరాసులపై ప్రవహించి వారిని సద్గతికి పంపింది.

ఇదీ భగీరథుడి చిత్ర తపస్సు. ప్రచుర పౌరుషం. ఎన్ని విఘ్నాలు వచ్చినా ప్రయత్నం విరమించకుండా సాధించే కృషిని భగీరథ ప్రయత్న మంటారు.

తే. దేవతలఁ జిత్రతపమునఁ దెలచి, గంగఁ । బ్రచుర పౌరుషుఁ డగు భగీరథుఁడు దనదు
పూర్వులైన సగర నృపపుత్రులకు ను । దాత్త గతికయి తెచ్చె నిద్ధరణి కనఘ! 117

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యాత్ముడా!; దేవతలన్= దేవతలను; చిత్ర= అద్భుతమైన; తపమునన్= తపస్సు ద్వారా; తెలచి= నమస్కరించి, సేవించి; ప్రచుర= అత్యధికమైన; పౌరుషుఁడు= ప్రయత్నం కలవాడు; అగు= అయిన; భగీరథుఁడు; తనదు= తనయొక్క; పూర్వులు+ఐన= తనవంశంలో ముందు పుట్టినవారైన (తాత ముత్తాతలు); సగర నృప= సగరరాజుయొక్క; పుత్రులకున్= కుమారులకు; గతికి+అయి= ముక్తికొరకు; ఇద్ధరణికిన్= ఈ లోకానికి; గంగన్= గంగను; తెచ్చెన్ = తీసికొని వచ్చాడు.

తాత్పర్యం: ప్రసిద్ధ పౌరుషంతో దేవతలను గురించి తపస్సుచేసి వారిని మెప్పించి సాగరుల భస్మరాసులపై ప్రవహింపచేసి, వారిని ముక్తులను చేయటం కొరకు భూలోకంలోకి గంగను తెచ్చినవాడు భగీరథుడు.

విశేషం: దైవము - పౌరుషము అని రెండున్నాయి. పౌరుషమంటే ఉత్సాహంతో మనిషి చేసే దృఢమైన ప్రయత్నం. దానికి ప్రతీక భగీరథుడు. అందుకే ఇప్పటికీ భగీరథ యత్నమన్న మాటను సామెతగా వాడుతున్నాం.

సగరుని కొడుకులు సాగరులు అరవైవేల మంది. వారు కపిలుడి కోపాగ్నికి గురి అయ్యారు. సగరుడికి మరొక భార్యకు జన్మించినవాడు అంశుమంతుడు. అతడు గంగను తేలేకపోగా అతని కొడుకు దిలీపుడు ప్రయత్నించి మరణిస్తే అతని కొడుకు భగీరథుడు బ్రహ్మను గురించి వేయేండ్లు తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరంకోరుకొమ్మంటే గంగ భూమికి ముందుగా బ్రహ్మ నుండి బయలుదేరి ఆకాశం మీదకు వ్యాపించి అక్కడి నుండి సూర్యమండలం ద్వారా మేరుపర్వతంపైకి దూకింది. అక్కడ నుండి నాలుగు పాయలుగా చీలి నాలుగు దిక్కులకు ప్రవహించింది. ఆ నాలుగు దిశలకు పారిన గంగకు నాలుగు పేర్లు;

అలకనంద : ఇది హిమాలయంమీదుగా భారతదేశంలో ప్రవహించిన పాయ - దక్షిణం

సీత : గంధమాదన పర్వతంమీదుగా భద్రేశ్వర దేశాలకు పారిన పాయ - తూర్పు.

సుచక్షువు : మాల్యవంతం మీదుగా కేతుమాల దేశాలలో ప్రవహించిన పాయ - పడమర.

విష్ణుభద్ర : ఉత్తర కురుభూములలో పారే పాయ - ఉత్తరదిశ.

ఈ మేరుపర్వతం భూచక్రాని కిరుసుగా మధ్యలో ఉంటుందని పురాణాలు చెప్పినమాట.

ఆ. విష్ణుపదము వలన, విధుని వలన, సూర్యు । వలన, మేరురూపకలితుఁ డైన
విష్ణువలనఁ, ద్రిపుర విజయి మౌళివలన । నుండి హిమనగమున నొలసె గంగ. 118

ప్రతిపదార్థం: విష్ణుపదము= ఆకాశం; వలనన్= ద్వారా, నుండి; విధునివలనన్= చంద్రుడివలన; సూర్యువలనన్= సూర్యుడినుండి; మేరు రూప కలితుఁడు= మేరు పర్వత స్వరూపుడైన; విష్ణువలనన్= విష్ణుదేవుడివలన; త్రిపురవిజయి= మూడు నగరాలను జయించినవాడు శివుడు (అతడి); మౌళివలనన్= జటాజూటంనుండి; హిమనగమునన్= మంచుకొండపై; గంగ; ఒలసెన్= ప్రవహించింది.

తాత్పర్యం: ఆకాశంనుండి చంద్రుడిమీదికి, అతడినుండి సూర్యుడిమీదికి, అతడినుండి మేరుపర్వత స్వరూపుడైన విష్ణువు వద్దకు, అక్కడినుండి శివుడి శిరస్సుమీదకు, అక్కడి నుండి హిమాలయపర్వతం మీదకు గంగ ప్రవహించింది.

క. విను, తత్పర భావంబున । మనంబు నిశ్చలత వొంద మనుజుఁడు శరణం
బని యాశ్రయింప జాహ్నవి । సనాతన పదోపలబ్ధి సంపద నొసఁగున్.' 119

ప్రతిపదార్థం: విను= వినుము; తత్పర భావంబునన్= భక్తిభావంతో; మనంబు= మనస్సు; నిశ్చలత పొందన్= నిశ్చలత్వం పొందగా; మనుజుఁడు= మనుష్యుడు; శరణంబు+అని= దిక్కని; ఆశ్రయింపన్= ఆశ్రయిస్తే; జాహ్నవి= గంగ; సనాతన= నిత్యమైన; పద= స్థానంయొక్క; ఉపలబ్ధి= లాభమన్న; సంపదన్= ఐశ్వర్యాన్ని; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: వినుము. తాత్పర్య బుద్ధితో ఎవరైతే నిశ్చలమైన మనస్సుతో శరణని ఆశ్రయిస్తారో వారి జన్మను తరింపచేసి గంగ వారి స్వస్థానమైన ముక్తి నిస్తుంది.'

వ. అని చెప్పి సిద్ధుండు, వెండియు. 120

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పి; సిద్ధుండు= సిద్ధపురుషుడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అని చెప్పి సిద్ధుడు ఇంకా (ఇట్లా చెప్పాడు)

క. ఏ నెఱిఁగినంత సెప్పితిఁ గాని యనంత మహిమంబు గంగా గుణ సం
తానంబు, శతానందము । ఖానిమిష ప్రవరకీర్త్య మనఘచరిత్రా! 121

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేని; చరిత్ర!= ప్రవర్తన కలవాడా!; ఏను= నేను; ఎఱిఁగినంత= తెలిసినంత; చెప్పితిన్= చెప్పాను; కాని; గంగా గుణ సంతానంబు= గంగాదేవి గుణ సమూహం; అనంత= విశాలమైన; మహిమంబు= మహత్త్వం కలది; శతానంద= బ్రహ్మ; ముఖ= మొదలైన; అనిమిష= దేవతలలో; ప్రవర= శ్రేష్ఠులచేత; కీర్త్యము= స్తుతించదగింది.

తాత్పర్యం: నాకు తెలిసినంత చెప్పాను. కానీ, నాయనా! ఆ తల్లి గుణగణాలు మాహాత్మ్యం బ్రహ్మాదులచేత స్తుతింప తగినదంటే ఇక మానవుల సంగతి వేరే చెప్పాలా?

క. మేరువు మణులును, వారిధి । వారి కణంబులును నెన్ను వడు వగు గంగా
స్ఫారగుణంబులు తగు సం । ఖ్యారూఢంబులుగఁ జేఁత యతులవివేకా! 122

ప్రతిపదార్థం: అతుల= సాటిలేని; వివేకా!= వివేకం కలవాడా!; గంగా= గంగాదేవియొక్క; స్ఫారగుణంబులు= దివ్యగుణాలు; తగు= తగిన; సంఖ్యారూఢంబులుగన్= లెక్కపెట్టెడి; చేఁత= చేష్ట; మేరువు మణులను= మేరుపర్వతంలోని రత్నాలను; వారిధి= సముద్రంలోని; వారి= నీటి యొక్క; కణంబులును= బొట్లను; ఎన్ను= లెక్కపెట్టే; వడువు+అగున్= పద్ధతిగా ఉంటుంది.

తాత్పర్యం: సాటిలేని వివేకం కలవాడా! గంగ దివ్యగుణాలను వ్రేలు మడిచి ఇన్ని - ఇది అని చెప్పటం ఎట్లాంటిదంటే - మేరుపర్వతంలోని రత్నాలను, సముద్రంలోని నీటి బొట్లను లెక్కపెట్టటంవంటి అవివేకపు పనే అవుతుంది.

వ. అని పలికి యిట్లనియె. 123

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి ఇట్లా అంటున్నాడు.

విశేషం: అంటే అతడి కెంత చెప్పినా తనివితీరటం లేదని తాత్పర్యం. గంగ అంటే ఈ భారతీయ సంస్కృతిలో ఎట్లాంటిదో కవి తన ఆర్ష (ఋషిసంబంధమైన) నేత్రంతో దివ్యదర్శనంతో చెప్పేమాట. ఈ భావాన్ని వ్యక్తీకరించే వచనపు ముక్కలు 120,123.

లండను ప్రక్కనున్న థేమ్సు నదిలోని నీటిని ఓడపై భారతదేశానికి తెస్తే పురుగు పట్టిందట! ఇక్కడకు వచ్చేలోపల. కానీ గంగనీటిని లండను తీసికొని వెళ్తే పురుగు పట్టలేదట! హిమాలయాలలో - ఎన్నో ఓషధులను కరిగించుకొంటూ మహర్షుల, సిద్ధుల, మునుల, యోగుల, పవిత్ర శరీరాల తపస్సుల శక్తిని సంగ్రహించుకొని ప్రవహించేది గంగ. గంగ వట్టి నది మాత్రమే కాదని మన విశ్వాసం. పరమహంస శ్రీరామకృష్ణవంటి మహాత్ములెప్పుడూ తమ శిష్యులకు ఈ మాటనే చెప్పేవారట! ఒక్కసారి స్నానంచేస్తే చాలురా పాపాలన్నీ పటాపంచలౌతాయని అనేవారట! ఈమాట మొదట శ్రీస్వామి వివేకానందవంటి తర్కబుద్ధికలవారికి రుచించలేదు కాని, తరువాత ఆ మాటలలోని సత్యాన్ని వారు గ్రహించారట!

ఆ. వేడ్క నీకు నేను వివరించినట్టి యీ । జాహ్నవీ గుణములు, సంతతంబు
మనసు, వాక్కుఁ దనువు ననఁగల సాధన । ముల భజింపు భక్తిపూర్వకముగ. 124

ప్రతిపదార్థం: వేడ్కన్= కోరికతో కావాలని; నీకున్; నేను; వివరించినట్టి= విడమరచి చెప్పిన; ఈ జాహ్నవీ గుణములు= ఈ గంగా గుణాలు; సంతతంబున్= నిత్యము, ఎడతెగకుండా; మనసు; వాక్కున్; తనువున్= శరీరం; అనన్= అనగా; కల= ఉన్న; సాధనములన్= కర్మసాధనాలతో; భక్తిపూర్వకముగన్= భక్తి శ్రద్ధలతో; భజింపు= సేవించుము.

తాత్పర్యం: సంతోషంగా నేను నీకు వివరించిన ఈ గంగాగుణాలు ఎల్లప్పుడూ మనోవాక్కాయములనే సాధనాలతో భక్తిపూర్వకంగా కొలువుము.

విశేషం: మనిషికి ఏ పనిచేయటానికైనా మూడే సాధనములు ఉన్నాయి. శరీరం, వాక్కు, మనస్సు. ఈ మూటిని కలిపి ఒకటిగా చేయటమే త్రికరణ పారిశుద్ధ్యం. ఒక టనుకొని మనస్సులో మరొకటి చెప్పి, ఇంకొకటి చేసే నాగరికత ఈనాటిది.

మనిషి మనిషి కాకుండా పోవటానికి ఈ త్రికరణ పరిశుద్ధి, త్రికరణ సమైక్యం లేకపోవటమే కారణం. ఆ మూటిని ఏకం చేసే సాధన పవిత్ర ఉపాయమే ఇట్లాంటివి వినటం, చదవటం. భారతాదులవలన మనకు కలిగే ప్రయోజన మిదే నని నన్నయ, తిక్కనలు తమ అవతారికలలో చెప్పారు. మరీ నన్నయగారు భారత శ్రవణ ఫలితం చాలా చెప్పారు. కనుక కథంటే త్రికరణ పారిశుద్ధ్యం కొరకు వినేదే అది కలిగించేదే కథంటే - కాబట్టి నీవూ గంగను సేవించి ధన్యుడ వౌతావు.

తే. అట్టులైన గంగా ప్రసాదాతిశయము । వలన సిద్ధుండవై, త్రిభువనములందు
నర్చనీయ సంక్రీడన మవిహతముగ । సంచరించు మాహాత్మ్యంబు సంభవించు. 125

ప్రతిపదార్థం: అట్టులు+ఐనన్= పైన చెప్పిన మాటలు పాటిస్తే - త్రికరణ పరిశుద్ధితో గంగను సేవిస్తే; గంగా ప్రసాద+అతిశయము వలనన్= గంగయొక్క అధికమైన దయ వలన; సిద్ధుండవు+ఐ= నెరవేరిన కోరికలు కలవాడవై; త్రి= మూడు; భువనములందున్= లోకాలలో; అర్చనీయ= సేవించదగిన; సం= చక్కని; క్రీడనము= విహారం; అవిహతముగన్= ఎదురు లేనిదికాగా; సంచరించు= తిరిగే; మాహాత్మ్యంబు= ప్రభావం; సంభవించున్= కలుగుతుంది.

తాత్పర్యం: అట్లా చేస్తే గంగ దయవలన నీవూ సిద్ధపురుషుడ వౌతావు. మూడులోకాలలో నీ విహారాలకు అడ్డుండదు. నీకు ఎదురు లేని సంచార మార్గం - మాహాత్మ్యం లభిస్తుంది.

క. నిజధర్మ నిరతుఁడై తను । భజించు సజ్జనుని చిత్తపద్మము గృపఁ దా
భజియింప గంగ యతనిం । బ్రజనిత చిరసౌఖ్యుఁ జేయుఁ బావనచరితా!' 126

ప్రతిపదార్థం: పావనచరితా= పవిత్రమైన నడవడిగల ధర్మజా! నిజధర్మ నిరతుఁడు+ఐ= స్వధర్మంలో ఆసక్తిగలవాడై; తనున్= తన్ను; భజించు= సేవించే; సత్+జనునిన్= సత్పురుషుని; చిత్తపద్మము= తన హృదయమనే పద్మం; తాన్= తాను; కృపన్= దయను; భజియింపన్= సేవించగా, పొందగా; గంగ= గంగాదేవి; అతనిన్= తన్ను భజించే సత్పురుషుణ్ణి; ప్రజనిత= కల్గించబడిన; చిర సౌఖ్యున్= శాశ్వతసుఖాలు గలవాడిని; చేయున్= చేస్తుంది;

తాత్పర్యం: పావనమైన నడవడిగల ధర్మజా! స్వధర్మాచరణంలో ఆసక్తిగల్గిన సత్పురుషుడు తనని సేవించగా గంగ తనహృదయ పద్మం దయను హత్తుకొనగా అతణ్ణి శాశ్వతసుఖవంతుణ్ణి చేస్తుంది.

విశేషం: ఈ పద్యంలో అన్వయక్లేశముంది. చిత్త పద్మం సజ్జనుడిదైతే అర్థం పొసగదు. గంగాదేవిదైతే కుదురుతుంది. అప్పుడు "సజ్జనునిఁ జిత్తపద్మము" అని ఖండబిందువుంచి రచనను సరిదిద్దాలి. ఉస్మానియా ప్రతిలో ఈ పద్యం యొక్క మూడవచరణం" భరియింప" అని ఉండగా వావిళ్లవారి భారతప్రతిలో "భరియించి" అని వుంది. అప్పుడు ఈ పద్యానికి తాత్పర్యాన్నిలా పొసగించవచ్చు. స్వధర్మనిరతుడై తనను భజించే సత్పురుషుడి యొక్క చిత్తపద్మాన్ని కృపతో తాను భజించి గంగ అతణ్ణి ప్రజనితచిర సౌఖ్యుణ్ణి చేస్తుంది. భజియించి అనే క్రియా పదానికి ప్రకరగోచితంగా "అనుగ్రహించి" ఇత్యాదిగ అర్థం చెప్పాలి. "యే యథా మాం ప్రపద్యన్తే.

వ. అని యిట్లు గంగా గుణంబు లమ్మహాద్విజునకు వివరించి యా సిద్ధుండు గగన గమనంబునం జనియె; అ విప్రోత్తముండు నియతచిత్తుండై గంగాసేవనం బాచరించి యనన్యసులభ యగు సిద్ధింబడసెఁ; బాండ వాగ్రజా! నీవును గంగా భజనంబునం బరమశుభంబు నొందుము.' 127

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; గంగాగుణంబులు= గంగ గుణాలు; ఆ+మహాద్విజునకున్= ఆ గొప్ప బ్రాహ్మణుడికి; వివరించి= తెలియజెప్పి; ఆ సిద్ధుండు= ఆ యోగి; గగన= ఆకాశంలో; గమనంబునన్= నడకతో, ప్రయాణంతో; చనియెన్= వెళ్ళాడు; ఆ+విప్ర+ఉత్తముండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; నియత= నియమబద్ధమైన; చిత్తుండు+ఐ= మనస్సు కలవాడై; గంగాసేవనంబు= గంగాసేవ; ఆ+చరించి= చక్కగా చేసి; అనన్య= సాటిలేని; సులభఅగు= తేలికఅయిన; సిద్ధిన్= ఫలాన్ని; పడసెన్= పొందాడు; పాండవ+అగ్రజా!= పాండవులలో పెద్దవాడా!; నీవునున్= నీవున్నూ; గంగా భజనంబునన్= గంగను సేవించటంవలన; పరమ= శ్రేష్ఠమైన; శుభంబును= శ్రేయస్సును; ఒందుము= పొందుము.

తాత్పర్యం: అని ఈ విధంగా సవిస్తరంగా ఆ మహాబ్రాహ్మణుడికి ఆ సిద్ధుడు వివరించి ఆయన ఆకాశమార్గంలో వెళ్ళిపోయాడు. ఆ బ్రాహ్మణుడు కూడా ఆ విధంగా నిష్ఠాపరుడై గంగను సేవించి ఇతర మార్గంలో సులభంగా దొరకని సిద్ధిని పొందాడు. ధర్మరాజా! నీవు కూడా గంగాసేవతో శుభాలు పొందుము.'

విశేషం: ఇంతగా గంగను గురించి చెప్పవలసిన అగత్య మేమిటి? అంటే వేదవాఙ్మయంలో ఇట్లా చెప్పబడింది. "సృష్టికారణమైన జలం పేరే గంగ. భగీరథుడి ద్వారా భూమికి రావటమంటే భావరూపమైన భగవచ్ఛక్తి సృష్టిగా వికసించటమే. ఈ సృష్టి ఐదు అంచెలుగా వచ్చింది. కనుకనే సృష్టికి ప్ర+పంచ= ఐదు కలదని పేరు వచ్చింది. పంచ సింధూనదులంటే సృష్టి ఐదంచెల మీదుగా వచ్చిన విషయాన్ని సూచిస్తుంది" కనుకనే గంగకు ఒక మూర్తి ఉన్నది. ఆ వర్ణన పురాణాల ప్రకారం ఇట్లా ఉన్నది.

"రత్నపాదుకలు కలది. మకరవాహనం కలదీ, తెల్లని వెన్నెలవంటి శరీరం కలది" అని ఈ రూపంలో గంగను ఆరాధించాలని పురాణాలు చెప్పుతున్నాయి.

అన్ని పురాణాలు గంగావతరణమును కీర్తించాయి. మహాబలిపురం కొండపై ఈ కథ చెక్కబడింది. ప్రపంచంలో అదొక అపూర్వ శిల్పం. ప్రాచీన భరతనాట్యంలో ఈ గంగావతరణ కథ అభినయించబడేది. దాని విషయం నందికేశ్వరుడు వ్రాసిన భరతార్ణవంలో ఉన్నది. ప్రభావతీప్రద్యుమ్న మన్న కావ్యంలో నటకు లీకథ నభినయించినట్లు పింగళి సూరన్న వర్ణించాడు.

క. అని చెప్పి, శాంతనవుఁ డి । ట్లను ; 'గంగాస్తోత్ర సహితమై పరఁగిన యి
వ్వినుతేతిహాసముఁ బఠిం । చిన వినినను రుజలు వాయుఁ జెంద వఘంబుల్.' 128

ప్రతిపదార్థం: అని చెప్పి= సిద్ధుడు చెప్పిన కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి; శాంతనవుఁడు= శంతను కుమారుడైన భీష్ముడు; గంగాస్తోత్రసహితముఐ= గంగాస్తుతితో కూడినదై; పరఁగిన= ఒప్పిన; ఈ+వినుత= ఈ వినుతించదగిన, పొగడదగిన; ఇతిహాసమున్= పురాణకథ; పఠించినన్= చదివినా; వినినను= విన్నా; రుజలు= రోగాలు; పాయున్= తొలగుతాయి; అఘంబుల్= పాపాలు; చెందవు= పొందవు.

తాత్పర్యం: భీష్ముడు కథంతా చెప్పి ఇట్లా అన్నాడు. 'ధర్మరాజా! గంగాదేవి స్తోత్రంతో కూడిన ఈ పురాణ కథను చదివినా, విన్నా రోగాలు పోవటమే కాదు, పాపాలు కూడా పోతాయి.'

విశేషం: పురాణాలలో కథ చెప్పిన ఫలితం, ప్రయోజనమూ చెప్పటం జరుగుతుంది. ఇది అట్లాంటి పద్యం. కథ దీనితో ముగుస్తుంది.

క. అనిన విని, యన్నరేంద్రుం । డనుజ సహితముగఁ బ్రభూతహర్ష సమున్మీ
లన కలనా సంవేశిత । మనస్కుఁడై యాతనికి నమస్కృతి సేసెన్. 129

ప్రతిపదార్థం: అనినన్= భీష్ముడట్లా చెప్పగా; విని= ఆలకించి; ఆ+నర+ఇంద్రుండు= ఆ రాజు; అనుజ సహితముగన్= తమ్ములతోపాటుగా; ప్రభూత= అధికమైన; హర్ష= సంతోషంతో; సమున్మీలన= బాగుగా వికసించిన, వికాసంతో; కలనా= కూడిక; సంవేశిత= స్థానంగా చేయబడిన; మనస్కు(డు+ఐ= మనస్సు కలవాడై; ఆతనికిన్= ఆ భీష్ముడికి; నమస్కృతి= నమస్కారం; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: చెప్పినదంతా విని ధర్మరాజు సంతోషంతో వికసించిన మనస్సు కలవాడై తమ్ములతోపాటుగా భీష్ముడికి నమస్కరించాడు.

విశేషం: ఆ సంస్కృత సమాసం - భీష్ముడిమీద ధర్మరాజుకు కలిగిన భక్తియొక్క ఆవేశాన్ని సూచిస్తున్నది, ధ్వనిస్తున్నది. దీనికి కారణం భీష్ము డంత అందంగా గంగా మహిమను గానంచేయటం. ఈ సంతోషం పాఠకుడు పొందే అనుభవాన్ని సూచిస్తుంది.

వ. ఇట్లు పరమహర్షంబునం బ్రణతుండై, ధర్మజుండు మందాకినీ తనయుతో 'నెవ్వరు సర్వ జనపూజ్యు? లెఱింగింపవే? భవద్వచనామృతంబునఁ దృప్తి సనక యడిగెద' ననిన, నమ్మహాత్ముండు 'వాసుదేవ నారద సంవాదంబను నితిహాసంబు వినుము; నీ యడిగిన యర్థంబు దానం దేటపడియెడు' నని పలికి యతని కిట్లనియె. 130

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారం; పరమ= గొప్ప; హర్షంబునన్= సంతోషంతో; ప్ర+నతుండై= నమస్కరించి; ధర్మజుండు= ధర్మనందనుండు (యముడికి ధర్ముడని పేరు); మందాకినీ తనయుతోన్= గంగ కుమారుడితో; ఎవ్వరు= ఎవరు; సర్వజన= అందరికీ; పూజ్యులు= పూజించదగినవారు; ఎఱింగింపవు+ఏ= తెలుపవా?; భవత్= నీ; వచనామృతంబునన్= మాటలన్న అమృతంతో; తృప్తి= సంతృప్తి; చనక= తీరక; అడిగెదన్= అడుగుతున్నాను; అనినన్= అనగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; వాసుదేవ= శ్రీకృష్ణ; నారద= నారదుల; సంవాదంబు= సంభాషణం; అను= అన్న; ఇతిహాసంబు= పురాణ గాథ; వినుము; నీ అడిగిన= నీవు అడిగిన; అర్థంబు= తాత్పర్యం; దానన్= దానితో; తేటపడియెడున్= స్పష్టపడుతుంది; అని పలికి= అని వచించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆయనతో ఈ రీతి వచించాడు.

తాత్పర్యం: అట్లా సంతోషంతో నమస్కరించి యమధర్మరాజు కుమారుడు గంగా తనయుడిని అడిగాడు. 'నీ మాటలనే అమృతం త్రాగి తృప్తితీరక అడుగుతున్నాను. లోకంలో అందరకూ పూజనీయు లెవ్వరో చెప్పుము' అని అడిగితే భీష్ముడు 'నీ వడిగిన ప్రశ్నకు సమాధానంగా వాసుదేవ నారద సంవాద మనే పురాణగాథ చెప్పుతాను వినుము' అని చెప్పుతున్నాడు.

వాసుదేవ నారద సంవాద ప్రకారము (సం.13-66-1 (కుంభ))

వ. 'తన కడకు నారదుఁడు వ । చ్చిన సత్కారము దగంగఁ జేసి, ముకుందుం
డను సమధిక బహుమానం । బున 'నెవ్వారలకు నీవు మ్రొక్కుదు చెపుమా!' 131

ప్రతిపదార్థం: ముకుందుండు= శ్రీకృష్ణుడు (మోక్ష మిచ్చేవాడు); తనకడకున్= తన దగ్గరకు; నారదుఁడు; వచ్చినన్=రాగా; సత్కారము= అతిథి సపర్యలు; తగంగన్= తగినట్లుగా; చేసి; సమధిక= మిక్కిలి ఎక్కువ; బహుమానంబునన్= గౌరవంతో; ఏ+వారలకున్= ఎవరికి; నీవు; మ్రొక్కుదు= నమస్కరిస్తావో; చెపుమా!= చెప్పుము; అనున్= అన్నాడు.

తాత్పర్యం: ఒకసారి నారదమహర్షి విష్ణుదేవుడి దగ్గరకు రాగా ఆయన సత్కారం చేసి ప్రశ్నించాడు. "నీవు మిక్కిలి గౌరవంతో ఎవరికి నమస్కరిస్తావో చెప్పుము" అని.

విశేషం: నమస్కారమంటే వినయంతో వంగి, గౌరవబుద్ధితో, హృదయపూర్వకంగా, అహంకారం లేశమాత్రం లేకుండా దండం పెట్టడం. ఆ దండంలో నేను, అన్న పదార్థమంతా లీనం కావాలి. దానిని నమస్కారమంటారు. ఇది అందరకూ చేతనయ్యేది కాదు.

వ. అనిన నద్దేవముని యద్దేవకీనందనున కిట్లనియె. 132

ప్రతిపదార్థం: ఆ+దేవముని= నారదుడు; ఆ+దేవకీ నందనునకున్= దేవకీ కుమారుడితో; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా విని నారదుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'వరుణు, సమీరణుఁ, దరణిఁ, బర్జన్యుని, । సప్తార్చి, నీశాను, షణ్ముఖుని, మ
హాలక్ష్మి విష్ణుని, నజు, బృహస్పతిఁ, జంద్రు । జలముల, భూమి, నెజ్జనము లెపుడు
నతిభక్తి సేవింతు రట్టి వారలకు నే । మ్రొక్కుదు; వేదపరులుఁ, దపోధ
నులు, దేవతా పూజనులు, భూమి ధన ధాన్య । గోదాన శీలురు, నాదరంబు

ఆ. గల్గి యతిథిపూజ గావించువారలుఁ । బితృసమర్చకులును, భిక్షితాన్న
పూత శాంత భావములు గలవారు స । త్యవ్రతులును బూజ్యు లనఘ! నాకు. 133

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యశాలీ!; వరుణున్= సముద్రములకు పశ్చిమదిక్కున అధిపతిని; సమీరణున్= వాయుదేవుడిని; తరణిన్= సూర్యుడిని; పర్జన్యునిన్= మేఘుడిని; సప్తార్చిన్= అగ్నినీ; ఈశానున్= ఈశాన్య దిక్కున ఉండే దేవతను; షణ్ముఖునిన్= కుమారస్వామిని; మహాలక్ష్మిన్= లక్ష్మీదేవిని; విష్ణునిన్; అజున్= బ్రహ్మను; బృహస్పతిన్= దేవతాగురువును; చంద్రున్; జలములన్= నీటిని; భూమిన్= భూమినీ; ఏ+జనములు= ఏ మానవులు; ఎప్పుడున్= నిత్యమూ; అతి= మిక్కిలి; భక్తిన్= భక్తితో; సేవింతురు= పూజిస్తారో; అట్టివారలకున్= అట్లాంటి వారికి; నేన్= నేను; మ్రొక్కుదున్= నమస్కరిస్తాను; వేదపరులున్= వేదం నిత్యం చదివేవారు; తపోధనులు= తపస్సే సంపదగా కలవారు; దేవతాపూజనులు= దేవతలను పూజించేవారు; భూమి= భూమినీ; ధన= డబ్బును; ధాన్య= పంటను; గో= ఆవులను; దాన= దానం చేసే; శీలురు= స్వభావం కలవారు; ఆదరంబు కల్గి= ఆదరంతో; అతిథిపూజన్= అతిథుల పూజను; కావించువారలున్= చేసేవారు; పితృ= తండ్రిని; సమర్చకులున్= పూజించేవారు; భిక్షిత+అన్నమున్= బిచ్చమడిగి తెచ్చిన అన్నంతో; పూత= పవిత్రమైన; శాంత= ఉద్రేకాలు లేని; భావములు= మనస్సులు కలవారు; సత్యవ్రతులును= నిజం మాట్లాడే స్వభావం కలవారు; నాకున్= నాకు; పూజ్యులు= పూజించ దగ్గవారు.

తాత్పర్యం: వరుణుడినీ, వాయువునూ, సూర్యుడినీ, మేఘుడినీ, అగ్నినీ, ఈశానుడినీ, కుమారస్వామినీ, మహాలక్ష్మినీ, విష్ణువునూ, బ్రహ్మనూ, బృహస్పతినీ, చంద్రుడినీ, నీటినీ, భూమినీ ఎవరు పూజిస్తారో వారిని నేను భక్తితో సేవిస్తాను. వేదవేత్తలు, తపోధనులు, దేవతలను పూజించేవారు, ధన ధాన్యభూములను, గోవులను దానం చేసేవారు, అతిథిపూజ చేసేవారు, పితృదేవతలను పూజించేవారు, భిక్షాన్నంతో తృప్తిపడే శాంతస్వభావులు, సత్యవ్రతులు - నాకు పూజ్యులు.

క. వినుత త్రివర్గనిరతులు, । ననహంకార మమకారులగు జనులు, సువ
ర్తన యుతులు, నలోలురు, బో । ధనులు, నమస్కార్యు లద్రిధర! విను నాకున్. 134

ప్రతిపదార్థం: అద్రి ధర!= (గోవర్ధనమన్న) కొండను మోసినవాడా!; విను; నాకున్= నాకు; నమస్కార్యులు= నమస్కరించ తగ్గవారు (ఈ క్రింద చెప్పినవారు); వినుత= స్తుతింపదగ్గ; త్రివర్గ= ధర్మ, అర్థ, కామాలు; నిరతులు= నిత్యం సేవించేవారు; న+అహంకార= నే నన్న భావం లేనివారు; న+మమకారులు= వ్యామోహం లేనివారు; అగు= అయిన; జనులు= మానవులు; సు= మంచి; వర్తన= ప్రవర్తనతో; యుతులు= కూడినవారు; అలోలురు= ఆసక్తి లేనివారు; బోధనులు= జ్ఞానం కలవారు.

తాత్పర్యం: ధర్మార్థ కామసేవనులు, అహంకార మమకారాలు లేనివారు, వ్యామోహం లేనివారు, సత్ప్రవర్తన కలవారు, జ్ఞానులు నాకు నమస్కరించ తగినవారు.

క. నీవును, మత్సంపూజ్య జ । నావలిఁ జిత్తమున నెఱిఁగి, యర్చనమును, సం
సేవనము, నడుప భూరి శు । భావహ మగు నవ్విధంబు యాదవసింహా'! 135

ప్రతిపదార్థం: యాదవ సింహా!= యదువంశ శ్రేష్ఠుడా!; నీవును= నీవూ; మత్= నా చేత; సం= బాగా; పూజ్య= పూజింపదగిన; జన+ఆవలిన్= మానవ సమూహాన్ని; చిత్తమునన్= మనస్సులో; ఎఱిఁగి= తెలిసి; అర్చనము= పూజ; సంసేవనము= సేవించటం; నడుపన్= నడిపితే; ఆ+విధంబు= ఆ పద్ధతి; భూరి= మిక్కిలి; శుభ= మేలు; ఆవహము+అగున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కృష్ణా! నీవున్నూ నేనూ పూజించేవారిని మనస్సులో తెలిసికొని పూజిస్తూ సేవిస్తూ ప్రవర్తిస్తే శుభం కలుగుతుంది.

క. అనియెం గావునఁ గుంతీ । తనయాగ్రజ! నీవు నివ్విధముల జనములం
గొనియాడుము, వారలు శో । భనము లొసంగుదు రఘంబుఁ బాపుదురు కృపన్.' 136

ప్రతిపదార్థం: అనియెన్+కావునన్= అన్నాడు కాబట్టి; కుంతీ తనయ+అగ్రజ!= కుంతీ కుమారులలో పెద్దవాడా!; నీవున్= నీవూ; ఈ+విధములన్= ఈ రీతిగా; జనములన్= మనుషులను; కొనియాడుము= స్తుతించుము; వారలు= వారు; శోభనములు=శుభాలు; ఒసంగుదురు= ఇస్తారు; అఘంబున్= పాపాలను; కృపన్= దయతో; పాపుదురు= పోగొట్టుతారు.

తాత్పర్యం: అన్నాడు కనుక ధర్మరాజా! నీవూ అదే విధంగా మనుజులను సేవించుము. వారు నీకు మేలు కలిగిస్తారు. పాపాలను పోగొట్టగలరు. వారి దయను పొందుము'

వ. అనిన విని యమ్మహీశ్వరుం డమ్మహితాత్మున కిట్లనియె. 137

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా ఆలించి; ఆ+మహీ= భూమికి; ఈశ్వరుండు= ప్రభువు; ఆ+మహిత+ఆత్మునకున్= ఆ మహానుభావుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

క. 'జనపతులకుఁ గర్తవ్యము । లనేకములు గలవు వానియన్నిటిలోనన్;
వినుత ప్రధానకృత్యం । బనఘచరిత ! చెప్పవే దయం దెలియంగన్.' 138

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యమైన; చరిత!=ప్రవర్తన కలవాడా!; జనపతులకున్= జనులయొక్క అధిపతులకు; కర్తవ్యములు= చేయతగిన పనులు; అనేకములు= చాలా; కలవు; వాని అన్నిటిలోనన్= వాటన్నింటిలో; వినుత= మెచ్చదగిన; ప్రధాన= ముఖ్య; కర్తవ్యంబు= పని; దయన్= దయతో; తెలియంగన్= తెలిసేటట్లు; చెప్పవే!= చెప్పవా?

తాత్పర్యం: 'రాజులు చేయవలసిన పను లనేకం ఉన్నాయి. అందులో మహత్తరమైన ముఖ్యమైన పని ఏదో దయతో చెప్పుము.'

క. అనుటయు నతనికి నతఁడి । ట్లను; 'సామ్రాజ్యాభిషిక్తుఁడైన నృపతికిన్
విను, కర్తవ్యతమం బగు । పని, బ్రాహ్మణపూజనంబు భవ్యవిచారా! 139

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; అతనికిన్= ధర్మరాజుతో; అతఁడు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; భవ్య= శ్రేష్ఠమైన; విచార!= ఆలోచన కలవాడా!; సామ్రాజ్య+అభిషిక్తుఁడు+ఐన= మహారాజ్యానికి అభిషేకం చేయబడిన; నృపతికిన్= రాజుకు; కర్తవ్యతమంబు+అగు పని= మిక్కిలి తప్పక చేయతగిన పని; బ్రాహ్మణ= బ్రాహ్మణులను; పూజనంబు= పూజించటం.

తాత్పర్యం: అని అడుగగా ధర్మరాజుతో భీష్ము డిట్లా అన్నాడు. 'రాజు రాజ్యాని కభిషేకం చేసికొన్న తరువాత చేయతగిన ముఖ్యమైన పని బ్రాహ్మణపూజ! మంచి ఆలోచన కలవాడా! వినుము.

క. భూనాథ! విప్రులు సమా । ధానంబున నున్నఁ బొదలు ధరణి, శుభమ్ముల్
మానార్హు లగుట, వారికి । మానన లేకున్న నడఁగు మనుజాధీశా! 140

ప్రతిపదార్థం: భూ= భూమికి; నాథా!= రాజా; విప్రులు= బ్రాహ్మణులు, సమ+ఆధానంబునన్= సమతా దృష్టితో, ప్రశాంత చిత్తంతో; ఉన్నన్= ఉంటే; ధరణిన్= లోకంలో; శుభమ్ముల్= శుభాలు; పొదలున్= ఎక్కువౌతాయి; మాన= గౌరవానికి; అర్హులు+అగుటన్= తగినవారు కావడం వల్ల; వారికిన్= వాళ్ళకు; మానన= మన్నన; లేకున్నన్= లేకపోతే; అడఁగున్= లోకంలో శుభాలు అణగిపోతాయి.

తాత్పర్యం: రాజా! విప్రులు సమాధానపడితే (రాజులు వారితో స్నేహం కలిగి ఉంటే) లోకానికి మేలు. వారు గౌరవించదగినవారు కనుక వారికి మన్నన లోపిస్తే లోకాలకు మేలు లేదు.

క. దైవంబు నదైవముగ, న । దైవము దైవముగఁ జేయ ధరణీదివిజుల్
భూవర! శక్తులు విను వా । రేవానికిఁ గూర్తు రతఁ డధీశత నొందున్. 141

ప్రతిపదార్థం: భూవర!= భూమికి నాథుడా!, రాజా!; దైవంబున్= దైవాన్ని; అదైవముగన్= దయ్యంగా; అదైవమున్= దయ్యాన్ని; దైవముగన్= దైవంగా; చేయన్= చేయటానికి; ధరణీదివిజుల్= భూదేవులు; బ్రాహ్మణులుః శక్తులు= సమర్థులు; విను= వినుము; వారు= ఆ విప్రులు; ఏ వానికిన్= ఎవడికి; కూర్తురో= ప్రేమకలిగి ఉంటారో; అతఁడు= అతడు; అధీశతన్= ఆధిపత్యాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: విప్రులు దైవాన్ని అదైవంగా, అదైవాన్ని దైవంగా చేయటానికి సమర్థులు. వా రెవరిపై ప్రేమకలిగి ఉంటారో వారు రాజ్యానికి అధిపతులు కాగలరు.

క. **కోపమునఁ, బ్రసాదంబున, । నాపదయును,సంపదయును, నప్పుడ తే వా**
రోపుదు రింద్రునకైనను; । శాపానుగ్రహము లా సుచరితుల లీలల్. 142

ప్రతిపదార్థం: వారు= బ్రాహ్మణులు; కోపమునన్= కోపంతో; ప్రసాదంబునన్= దయతో; ఆపదయును= ఆపదను; సంపదయును= ఐశ్వర్యాన్ని; అప్పుడు+అ= వెంటనే; తేన్= తెచ్చుటకు; వారు+ఓపుదురు= సమర్థులగుదురు; ఆ సుచరితుల= ఆ మంచి నడవడి కల వారియొక్క; లీలల్= క్రీడలు; ఇంద్రునకున్+ఐనన్= దేవతల రాజునకైనా; శాప+అనుగ్రహములు= శాపము, వరములు. (అగును)

తాత్పర్యం: వారు ఇంద్రుడికైనా కోపంతో ఆపదలు కలిగించగలరు. దయ తలిస్తే సంపదను సృష్టించగలరు. శాపానుగ్రహ సమర్థులు విప్రులు.

క. **ద్రవిడ కళిం గాశీనర । యవన శక పుళింద నృపతు లవని సురపరా**
భవమునఁ గాదే, ధరణీ । ధవ! పొందిరి తొల్లి శూద్రతా దైన్యంబున్. 143

ప్రతిపదార్థం: ధరణీ ధవ!= భూమికి నాథుడా!; ద్రవిడ= ద్రావిడ దేశం - (తమిళ దేశం); కళింగ= త్రికళింగము (ఉత్తర కళింగం - నేటి ఒరిస్సా, మధ్యకళింగం - కృష్ణా గోదావరి నదీమధ్య దేశం; దక్షిణకళింగం - కృష్ణ మధ్యదిక్కున ఉన్న ప్రాంతం); ఆశీనర= ఉత్తర భారతంలో ఒక ప్రాంతం; యవన= గ్రీసుదేశం; శక పుళింద= శకులు, పుళిందులు అనే జాతివారున్న దేశాలయొక్క; నృపతులు= రాజులు; అవనిసుర= భూ దేవతల; పరాభవమునన్= అవమానంచేతనే; కాదే!= కాదా!; శూద్రతాదైన్యంబున్= శూద్రజాతులయొక్క హీనత్వం; తొల్లి= పూర్వం; పొందిరి= పొందారు.

తాత్పర్యం: ద్రవిడాది దేశాధిపతులు బ్రాహ్మణావమానంచేతనే హీనమైన శూద్రత్వం పాలైనారు కదా!

క. **సోమాత్మకు లీశ్వరతా । శ్రీమహితులు, సర్వసౌఖ్య సిద్ధి కరులు, గో**
త్రామరులు, వారి నెప్పుడు । భూమీశ్వర! పూజనములఁ బోషింపు తగన్. 144

ప్రతిపదార్థం: భూమి+ఈశ్వర!= రాజా!; గోత్రా= భూమియందు; అమరులు= దేవతలు, బ్రాహ్మణులు; సోమాత్మకులు= చంద్రుడు ఆత్మగా కలవారు సౌమ్యులు; ఈశ్వరతాశ్రీ= ఐశ్వర్యంతో; మహితులు= గొప్పవారు; సర్వసౌఖ్య= అన్ని సుఖాలను; సిద్ధికరులు= సిద్ధింప చేసేవారు; వారిన్= ఆ బ్రాహ్మణులను; ఎప్పుడున్= నిత్యమూ; పూజనములన్= పూజలతో; తగన్= చక్కగా; పోషింపు= పోషించుము.

తాత్పర్యం: రాజా! విప్రులు చంద్రుడే ఆత్మగా కలవారు, ఐశ్వర్యం కలవారు, సర్వసౌఖ్యాలను సిద్ధింపచేసేవారు. వారి నెల్లప్పుడూ పూజలతో తనుపుము.

క. **వినుతాచారుం డగు వి । ప్రునకు, సభక్తికము గాఁగ, భోజన మిడినన్**
విను, దేవపితృ సమూహము । లనూనపరితృప్తిఁ బొందు నతులచరిత్రా!' 145

ప్రతిపదార్థం: అతుల= సాటిలేని; చరిత్రా!= కీర్తికలవాడా!; విను= వినుము; వినుత= సన్నుతమైన, పొగడదగిన; ఆచారుండు= ఆచారము కలవాడు, సదాచార సంపన్నుడు; అగు= అయిన; విప్రునకున్= బ్రాహ్మణుడికి; సభక్తికముగాఁగన్= భక్తితోపాటుగా,

భక్తిపూర్వకంగా; భోజనము+ఇడినన్= అన్నం పెట్టితే; దేవ= దేవతల; పితృ= పితృదేవతల; సమూహములు= గుంపు; అనూన= అధికమైన; పరితృప్తిన్= మిక్కిలి సంతృప్తిని; పొందున్= పొందుతాయి.

తాత్పర్యం: పదిమంది పొగడే చరిత్ర కలవాడా! వినుము. సదాచార సంపన్నుడైన బ్రాహ్మణుడికి భక్తితో అన్నం పెట్టితే దేవతలు, పితృదేవతలు మిక్కిలిగా సంతృప్తి పడతారయ్యా!'

విశేషం: పితృదేవతలు= వంశకర్తలు. కులంలో పుట్టి పోయిన పెద్దలు. దేవతలు= అగ్ని మొదలైనవారు.

వాసుదేవ పృథివీ సంవాద ప్రకారము (సం.13-66-1 (కుంభ))

వ. అని చెప్పి భీష్ముం డా భూపతితో వెండియు నిట్లను; 'భూసుర విషయంబై వాసుదేవునకుం బృథివికి సంవాదంబు గలిగె; నది యితిహాస రూపంబునఁ జెల్లు; దానిఁ జెప్పెద నాకర్ణింపుము. వాసుదేవుం డొక్కసమయంబునం బృథ్వి నాలోకించి. 146

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; భీష్ముండు= దేవవ్రతుడు; ఆ భూపతితోన్= రాజుతో; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; భూసుర విషయంబు+ఐ= బ్రాహ్మణులకు సంబంధించినట్టిదై; వాసుదేవునకున్= విష్ణునకు; పృథివికిన్= భూదేవికి; సంవాదంబు= సంభాషణం; కలిగెన్= కల్గినది; అది= ఆ సంభాషణం; ఇతిహాసరూపంబునన్= కథారూపంగా; చెల్లున్= వ్యాప్తిపొందింది; దానిన్; చెప్పెదన్= తెల్పెదను; ఆకర్ణింపుము= వినుము; వాసుదేవుండు= మహావిష్ణువు; ఒక్క సమయంబునన్= ఒకా నొక వేళ; పృథ్విన్= భూదేవతను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇట్లా చెప్పి భీష్ము డింకా ధర్మరాజుతో ఇట్లా అంటున్నాడు. 'ఒకసారి భగవంతుడైన నారాయణుడికీ, భూదేవికీ ఒక సంభాషణం జరిగింది. అది పురాణంగా లోకంలో వ్యాపించింది. దానిని చెప్పుతాను వినుము. అది బ్రాహ్మణ సంబంధమైనది. ప్రస్తుత సందర్భానికి సరిపోతుంది. వాసుదేవుడు ఒకసారి భూదేవిని చూచి.

క. లోకజనని వగుటన్ నిను । నోకాశ్యపి ! యడుగవలయు నొక్కటి దెలియన్
నాకుం జెపుమా ! పాపము । లే కృత్యము సేసి గెలుతు రెల్ల జనములున్.' 147

ప్రతిపదార్థం: ఓ కాశ్యపి= ఓ భూదేవి!; లోకజననివి= లోకాలను కన్న తల్లివి; అగుటన్= అయినందువలన; నినున్= నిన్ను; ఒక్కటి= ఒక విషయం; తెలియన్= తెలిసికొనటానికి; అడుగన్ వలయున్= అడగాల్సి ఉన్నది; పాపంబులు= పాపాలు; ఏకృత్యము= ఏ పని; చేసి= ఆచరించి; ఎల్లజనములున్= మనుష్యులంతా; గెలుతురు= గెలుస్తారో; నాకున్= నాకు; చెపుమా= చెప్పవలయును.

తాత్పర్యం: భూదేవీ! నీవు లోకజననివి కనుక అడుగుతున్నాను. లోకంలో మనుష్యులు ఏ పని చేస్తే పాపాలు పోతాయో నాకు చెప్పుము. వినాలని ఉన్నది.

ఆ. అనినఁ బృథివి యిట్టులను; 'విప్రసేవను; విప్రపూజనమున, విప్రహిత వి
ధానమునను, బాపతతి నోర్చు, మానవ । ప్రతతి, యెందు నివి నృపాలు పనులు. 148

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పృథివి= భూమి; ఇట్టులు+అనున్= ఇట్లా అంటుంది; విప్ర= బ్రాహ్మణుల; సేవను= సేవతో; విప్ర పూజనమునన్= బ్రాహ్మణ పూజతో; విప్రహితవిధానమునను= విప్రులకు మేలుకూర్చే పద్ధతులవల్లనూ; మానవ ప్రతతి=

మానవ సమూహం; పాపతతిన్=పాపాల సమూహాన్ని; ఓర్చున్= జయిస్తుంది; ఎందున్= ఎక్కడైనా; ఇవి= ఇవే; నృపాలు పనులు= రాజులు చేయదగిన పనులు.

తాత్పర్యం: అనగా భూమి ఇట్లా అంటున్నది. ఎప్పుడైనాసరే ఏమరక బ్రాహ్మణులను సేవించటంవల్లా, పూజించటం వల్లా, వారికి శుభాలు కలిగించే విధానాలతో మానవులు పాపాలను సహించుకొనగలరు. ఇదే రాజులకు హితమైన మార్గం.

ఆ. అమరవిభుని, భగసహస్ర చిహ్నునిఁ గాఁగఁ । జేసినదియు, నేత్రభాసురుండు
గా నొనర్చినదియుఁ, । గమలాక్ష! విప్రున । ల్కయుఁ బ్రసాద సంపదయును గావె!' 149

ప్రతిపదార్థం: అమరవిభుని= దేవతల నాయకుడు ఇంద్రుడిని; భగసహస్ర చిహ్నునిన్= వేయి యోనులు గుర్తులు కలవాడిని; కాఁగన్= అగునట్లు; చేసినదియున్= చేసిందీ; నేత్ర= కళ్ళచే; భాసురుండు= ప్రకాశించేవాడు; కాన్= అగునట్లు; ఒనర్చినదియున్ చేసిందీ; కమల+అక్ష!= పద్మాలవంటి నేత్రాలు కలవాడా!; విప్రు= బ్రాహ్మణుడియొక్క; అల్కయున్= కోపమూ; ప్రసాద సంపదయున్= అనుగ్రహ సమృద్ధియూ; కావె!= కారణములు కావా?

తాత్పర్యం: దేవేంద్రుడి శరీరం వేల యోని చిహ్నాలు కలదిగా చేసింది విప్రుని అలుకయే కదా! ఆ గుర్తులనే నేత్రాలుగా ఇతరులకు కనిపించేటట్లు చేసిందీ ఆ బ్రాహ్మణుడి దయయే కదా!'

విశేషం: అహల్యను కామించినప్పుడు గౌతమమహర్షి కోపించి ఇంద్రుడిని శపించి మరలా దయతలచి ఆ యోనుల్ని నేత్రాలుగా కనిపించేటట్లు చేశాడు. ఈ రెండు చర్యలకు ఆయన శాపానుగ్రహాలే కారణం.

క. అనిన విని మెచ్చి, పృథివిం । గొనియాడె రథాంగ పాణి గురునృపవర! నీ
వనిశంబు మిగులనుతిమ । న్ననలను విప్రులకుఁ బ్రియ మొనర్పుము కృపతోన్. 150

ప్రతిపదార్థం: కురు నృపవర= కురువంశంలో రాజ శ్రేష్ఠుడా!; రథ+అంగపాణి= చక్రమే ఆయుధంగా చేతిలో ఉన్నవాడు విష్ణువు; అనినన్ విని= ఆ విధంగా భూమి చెప్పగా విని; మెచ్చి= మెచ్చుకొని; పృథివిన్= భూమిని; కొనియాడెన్= పొగడాడు; నీవున్= ధర్మరాజా! నీవు; అనిశంబున్= ఎల్లప్పుడు; మిగులన్= ఎక్కువగా; నుతి= పొగడ్త; మన్ననలన్= గౌరవంతో; విప్రులకున్= బ్రాహ్మణులకు; కృపతోన్= దయతో; ప్రియము= ప్రేమ; ఒనర్పుము= చేయుము.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పగా మెచ్చుకొని చక్రపాణి భూదేవిని పొగడినాడు. కనుక ధర్మరాజా! నీవూ అట్లాగే బ్రాహ్మణులను గౌరవిస్తూ సేవిస్తూ వారికి ప్రియము చేయుము.

క. అని మఱియు శాంతనవుఁ డి । ట్లను 'జననంబునన విప్రు నధిప! మహా భా
గునిఁగాఁ జెప్పుదు రార్యులు । జనులకు వంద్యంబు లతని చరణాంబుజముల్. 151

ప్రతిపదార్థం: అని= చెప్పి; మఱియున్= ఇంకా; శాంతనవుఁడు= శంతనుడి కుమారుడు భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; జననంబునన= పుట్టుకతోనే; విప్రున్= బ్రాహ్మణుడిని; అధిప!= రాజా!; మహాభాగునిన్+కాన్= మహానుభావుడిగా; ఆర్యులు= పెద్దలు; చెప్పుదురు= చెప్తుతారు; అతని= బ్రాహ్మణుడి; చరణాంబుజముల్= పాదపద్మాలు; జనులకున్=మనుష్యులకు; వంద్యంబులు= నమస్కరింపతగినవి.

తాత్పర్యం: అని చెప్పి శాంతనవు డింకా ఇట్లా అంటున్నాడు. 'పుట్టుకతోనే బ్రాహ్మణుడు మహానుభావుడని పెద్దలంటారు. అతడి పాదపద్మాలు అందరూ పూజించతగినవి.

వ. బ్రాహ్మణుల సృజియించి బ్రహ్మ వారలతోఁ జెప్పిన విధం బాకర్ణింపుము. 152

ప్రతిపదార్థం: బ్రాహ్మణులన్= విప్రులను; సృజియించి= సృష్టించి; బ్రహ్మ= సృష్టికర్త; వారలతోన్= వారితో; చెప్పిన విధంబు= నుడివిన తీరు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు బ్రాహ్మణులను సృష్టించి, వారితో చెప్పిన పద్ధతి వినుము.

ఆ. 'అరయ మీకుఁ గృత్య మన్యంబు లే; దాత్మ । కర్మ మూఁది యుక్తధర్మనిరతి
బ్రహ్మగోపనంబుఁ బాటింపుఁ డవ్విధ । మధిక శోభనంబు నావహించు. 153

ప్రతిపదార్థం: అరయన్= విచారిస్తే; మీకున్; అన్యంబు= మరొక; కృత్యము= పని లేదు; ఆత్మకర్మము= మీ జాతికి విధించబడిన ఆధ్యాత్మిక ధర్మం; ఊఁది= ఆధారంగా చేసికొని; యుక్త= తగిన; ధర్మనిరతిన్= నిత్యం ధర్మబద్ధతతో; బ్రహ్మ గోపనంబున్= ఆత్మతత్త్వ రక్షణను; పాటింపుఁడు= అనుసరించండి; ఆ+విధము= ఆ పద్ధతి; అధిక= మిక్కిలి; శోభనంబున్= శుభాన్ని; ఆవహించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ఆత్మోపాసనమే మీరు చేయతగినది. అన్య ధర్మం లేదు. నిత్యం ధర్మబుద్ధితో పరబ్రహ్మను రక్షించుకొంటూ ప్రవర్తించండి. ఆ విధం మీకు మంచి శుభాలను కలిగిస్తుంది.

విశేషం: విప్ర= శబ్దంలో; వి- ప్ర రెండక్షరాలూ శ్రేష్ఠ అన్న అర్థం కలిగించేవి. మహాశ్రేష్ఠుడని ఆ శబ్దార్థం. బ్రాహ్మణ అంటే బ్రహ్మమునందు నిత్యాను సంధానం కలవాడు. బ్రాహ్మణములన్న వేదశాఖ యున్నది. వేదమంత్రాలతో యజ్ఞ కర్మ లెట్లా చేయాలో చెప్పేవి. ఉపనిషత్తులు జ్ఞాన యోగ ప్రతిపాదకాలు. బ్రాహ్మణాలు కర్మ ప్రధానాలు, యజ్ఞవిషయకాలు. ఉపనిషత్తులు జ్ఞానప్రధానాలని ఒక వివరణ ఉన్నది. బ్రాహ్మణులు బ్రాహ్మణాల ప్రకారం యజ్ఞం చేయించే పురోహితులు; విప్రుడంటే దైవ - ఆత్మ దర్శనం కలవాడని (SEER) అర్థం. కనుక ఈ శబ్దాలు జాతి, గుణ వాచకాలు తప్ప కుల బోధకాలు కావని నేటి పండిత సంప్రదాయం.

వ. బ్రాహ్మణ్యం బెల్ల వర్ణంబులకుం దారకంబు బ్రాహ్మియైన శ్రీఁ దపస్స్వాధ్యాయంబుల వెలుంగంజేయుం డనియె; నట్లు గావున రాజులకు బ్రహ్మ వచన పరిపాలనంబు ప్రధాన కర్తవ్యం బని చెప్పి వెండియు. 154

ప్రతిపదార్థం: బ్రాహ్మణ్యంబు= బ్రాహ్మణవర్ణం; వర్ణంబులకున్= కులాలకు; తారకంబు= తరింపచేసేది; బ్రాహ్మిఐన శ్రీన్= బ్రాహ్మణులయందున్న బ్రహ్మ సంబంధమైన శక్తితో; తపః= తపస్సు; స్వాధ్యాయంబులన్= వేదాధ్యయనాదులను; వెలుంగన్= ప్రకాశించేటట్లు, లోకాలకు వ్యాపించేటట్లు; చేయుండు+అనియెన్= చేయండని పల్కినాడు; కావునన్= కాబట్టి; రాజులకున్= ప్రభువులకు; బ్రహ్మవచన= బ్రహ్మదేవుడిమాట; పరిపాలనంబు= ఆచరించటం; ప్రధాన= ముఖ్యమైన; కర్తవ్యంబు= చేయతగినపని.

తాత్పర్యం: బ్రాహ్మణవర్ణం మిగిలిన వర్ణాలకు తారకం కనుక మీయందున్న ఆధ్యాత్మిక శక్తితో వేదాధ్యయనాదుల ఫలాన్ని లోకాలలో వ్యాపించేటట్లు చేయండి - అని బ్రహ్మ అన్నాడు. కాబట్టి బ్రహ్మ మాటను పాటించటం

రాజులకు ముఖ్య కర్తవ్యం' అని చెప్పి ఇంకా.

ఆ. అగ్ని నంట, హిమవదచలంబుఁ గదలుప । గంగఁ గట్టవచ్చుఁ గాని, విప్ర
రాజిఁ బరిభవింపరాదు; విప్రుల కొల్వు । కల్పవృక్ష సేవకరణి యధిప! 155

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అగ్ని= నిప్పును; అంటన్‌వచ్చున్= తాకవచ్చు; హిమవత్+అచలంబున్= మంచుకొండను; కదలుపన్‌వచ్చున్= కదల్చవచ్చు; గంగన్= నీటిని; కట్టన్ వచ్చున్= మూటకట్టవచ్చును; కాని; విప్రరాజిన్= బ్రాహ్మణ సమూహాన్ని; పరిభవింపన్ రాదు= అవమానించ కూడదు; విప్రుల కొల్వు= బ్రాహ్మణసేవ; కల్పవృక్షసేవ కరణి= కల్పవృక్షాన్ని పూజించటం వంటిది.

తాత్పర్యం: నిప్పును తాకవచ్చును, హిమాలయాన్ని కదలించవచ్చును, గంగను మూటకట్టవచ్చును, కాని విప్రులను అవమానించరాదు. విప్రసేవ కల్పవృక్ష సేవ వలె ఫలదాయకం.

విశేషం: అలం: ఉపమ. కల్పవృక్షం= కోర్కెలు తీర్చే దేవతా వృక్షం.

వ. ఏ తద్విషయంబైనది శక్రశంబర సంవాదంబను నితిహాసంబు గలదు వినుము. శక్రుండు జటాసురనందనుండైన శంబరు కడకుంబోయి తదీయ గోష్ఠి నుండి, యతనితో, 'నీ వేమిట నున్నతిం బొంది యుందు?' వనిన నతం డతని కిట్లనియె. 156

ప్రతిపదార్థం: ఏ తత్ విషయంబు+ఐనది= దీనికి సంబంధించినది; శక్ర= ఇంద్ర; శంబర= ఆ పేరు గల రాక్షసునియొక్క; సంవాదంబు= సంభాషణ; అను; ఇతిహాసంబు= పురాణ గాథ; కలదు= ఉన్నది; వినుము= ఆలింపుము; జటా+అసుర= జడలుకలవాడు కనుక ఆ పేరుతో ప్రకాశించు; వాని యొక్క; నందనుండు+ఐన= కుమారుడైన; శంబరు కడకున్+పోయి= శంబరుడి చెంతకు వెళ్ళి; తదీయ గోష్ఠిన్+ఉండి= అతడితో చర్చిస్తూ ఉండి; అతనితోన్= ఆ శంబరుడితో; నీవు; ఏమిటన్= ఏ కారణంవల్ల; ఉన్నతిన్; పొంది+ఉందువు= గొప్పతనాన్ని వహించి ఉన్నావు; అనినన్= అని అడుగగా; అతండు= శంబరుడు; అతనికిన్= ఇంద్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దీనికి సంబంధించిన కథ ఒకటి ఉన్నది. ఇంద్రుడికీ జటాసురుడి కొడుకు శంబరుడికీ మధ్య నడచిన సంభాషణ. ఒకసారి ఇంద్రుడు శంబరుడి దగ్గరకు పోయి 'నీ వీ ఉన్నతి పొందటానికి కారణమేమి?' టని అడిగితే అత డన్నాడు.

క. 'అలుకయు, నసూయయును, వి । ప్రులయెడ లే వనఘ! వారిఁ బ్రోతుం గాతున్
సొలయఁ దదీయారాధన । ముల కట్టులు గావునన్ విభూతి వహింతున్. 157

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విప్రులయెడన్= బ్రాహ్మణులయందు; అలుకయున్= కోపం; అసూయయును= ద్వేషం; లేవు; వారిన్= వారిని; ప్రోతున్= పోషిస్తాను; కాతున్= కాపాడుతాను; తదీయ= వారియొక్క; ఆరాధనములకున్= పూజలకు; సొలయన్= అలసిపోను; అట్టులుకావునన్= అందుచేత; విభూతిన్= ఐశ్వర్యాన్ని; వహింతున్= పొందుతాను.

తాత్పర్యం: 'నాకు బ్రాహ్మణులపై కోపం, ద్వేషం లేకపోగా వారిసేవలో నేను విసిగిపోను. అలసిపోను. అందుకే నాకీ ఉన్నతి కలిగింది.

వ. దేవాసుర యుద్ధంబున విప్రానుగ్రహంబు దేవతల గెలిపించుట గని, మజ్జనకుండు సోమునితో 'భూమిసురులు మహానుభావులుగదే!' యనుటయు నమ్మహితాత్ముం డతని కిట్లను 'వారలు తపస్స్వాధ్యాయ సిద్ధులై యుండుదురు. వారితెఱం గాకర్ణింపుము. 158

ప్రతిపదార్థం: దేవ= దేవతల యొక్క; అసుర= రాక్షసుల యొక్క; యుద్ధంబునన్= యుద్ధంలో; విప్ర+అనుగ్రహంబు= విప్రుల దయ; దేవతలన్= దేవతలను; గెలిపించుట= గెలిపించటం; కని= చూచి; మత్= నా; జనకుండు= తండ్రి; సోమునితోన్= చంద్రుడితో; భూమిసురులు= బ్రాహ్మణులు; మహానుభావులు కదే!= మహాత్ములు కదా!; అనుటయున్= అనగా; ఆ మహిత+ఆత్ముండు= ఆ మహానుభావుడు; అతనికిన్= అతడితో; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; వారలు= వారు; తపః= తపస్సు; స్వ+అధ్యాయ= (తమ జాతికి విధించబడిన) వేద అధ్యయనం; సిద్ధులు+ఐ= సిద్ధించినవారై; ఉండుదురు= ఉంటారు; వారి తెఱంగు= వారి విధానం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: దేవతలకు రాక్షసులకు జరిగిన సంగ్రామంలో బ్రాహ్మణుల దయతో దేవతలు గెలిచారు. కనుక వారు మహానుభావులు కదా! అని నా తండ్రి చంద్రుడితో అంటే ఆయన అన్నాడు 'వారు తపస్సు నందు వేదాధ్యయనమునందు సిద్ధులు కనుక వారి విషయం చెప్పుతాను వినుము'.

ఆ. 'అప్రవాసి యైన యవనీసురుని యుద్ధ । శాలి గాని ధరణిపాలు నురగ
ముల బిలాంధకారమున నడంచిన యట్లు । మెఱయనీక భూమి మ్రింగు నండ్రు. 159

ప్రతిపదార్థం: అప్రవాసిఐన= దూరదేశంపోని; అవనీసురునిన్= బ్రాహ్మణుడిని; యుద్ధశాలికాని= యుద్ధం చేయలేని; ధరణిపాలున్= రాజును; ఉరగములన్= పాపములను; బిల= బొక్కల; అంధకారమునన్= చీకటిలో; అడంచినఅట్లు= చంపినట్లు; మెఱయనీక= ప్రకాశింపనీయక; భూమి= నేలతల్లి; మ్రింగును= కబళిస్తుంది; అండ్రు= అంటారు.

తాత్పర్యం: విద్యార్జనకై దూరదేశం పోని బ్రాహ్మణుడిని, యుద్ధవిద్యావేత్త కాని రాజును కీర్తిపొందనివ్వక భూదేవి కబళిస్తుందంటారు. ఎట్లాగంటే పాములను బొక్కలలోనే చంపినట్లు.

విశేషం: అలం: ఉపమ.

క. దాని నెఱింగి, గృహంబున, । మానిత మగు చదువునందు మనసు గొలుప కెం
దేనిఁ జని చదువుదురు శ్రుతు । లానంత్యమునకుఁ దపస్వు లగుదురు విప్రుల్. 160

ప్రతిపదార్థం: దానిన్= పై దృష్టాంతం; ఎఱింగి= తెలిసి; గృహంబునన్= ఇంట్లో; మానితము+అగు= గౌరవించతగిన; చదువునందున్= విద్యలో; మనసు కొలుపక= మనస్సును పెట్టక; విప్రులు; ఎందేనిన్= ఎక్కడికైనా; చని= వెళ్ళి; చదువుదురు= చదువుకొంటారు; శ్రుతులు= వేదాలు; ఆనంత్యమునకున్= జీవిత చరమ దశలో; తపస్వులు= తపస్సు చేసుకొనేవారు; అగుదురు= ఔతారు.

తాత్పర్యం: బ్రాహ్మణులు పై దృష్టాంతం తెలిసి, ఇంట్లో విద్య ఉన్నా లేదని బయట దూరదేశాలకు పోయి వేదాలు చదువుకొని చివరకు తపస్సు చేస్తారు. ఇది బ్రాహ్మణ కర్మ.

వ. కావున వారలు సర్వాధికులు; వారల యెడ బహుమానావమానంబు లెట్టివారికి శుభాశుభంబుల నొందించుటకు సందియంబు లే 'దనిన సోముని వాక్యంబులు పాటించి మజ్జనకుండు విప్రజనంబులం బూజించి తేజిష్ఠుం డయ్యె; నేనుం దదాచారంబునం బెంపువడసితి' నని పలుకుటయు నయ్యసురేంద్రుని వచనంబు లూఁది, సురేంద్రుండు భూసురులకుం బరితోషంబు గావించి సవిశేష సమున్నతిం బొందె 'నని చెప్పిన విని గాంగేయునితోఁ గౌంతేయాగ్రజుం 'డపూర్వ చిరసమాశ్రిత దూరాగతులలోన, నధికతమం బగు పాత్రం బెవ్వ?' రని యడిగిన, నప్పుడమిఱేనికి నప్పురుషవరుం డిట్లనియె. 161

ప్రతిపదార్థం: కావునన్= కనుక; వారలు= విప్రులు; సర్వ+అధికులు= అందరికంటె గొప్పవారు; వారల+ఎడన్= వారి విషయంలో; బహుమాన= గౌరవం; అవమానంబులు= అగౌరవాలు; ఎట్టివారికిన్= ఎంతటివారికైనా; శుభ+అశుభంబులను= మేలు కీళ్ళను; ఒందించుటకున్= పొందించటానికి; సందియంబు లేదు= సందేహం లేదు; అనిన= అని పల్కిన; సోముని= చంద్రుడి; వాక్యంబులు= మాటలు; పాటించి= అనుసరించి; మత్= నా; జనకుండు= తండ్రి; విప్రజనంబులన్+పూజించి= బ్రాహ్మణులను పూజించి, తేజిష్ఠుండు= తేజోవంతుడు; అయ్యెన్= అయినాడు; నేనున్= నేనుకూడా; తత్= ఆ; ఆచారంబునన్= ఆచారంతో; పెంపు= ఆధిక్యం; పడసితిన్= పొందాను; అనిపల్కుటయున్= అని పలుకగా; ఆ+అసుర+ఇంద్రుని= ఆ రాక్షస రాజుయొక్క; వచనంబులు= మాటలు; ఊఁది= పట్టుకొని; సుర+ఇంద్రుండు= దేవరాజు; భూ+సురులకున్= బ్రాహ్మణులకు; పరితోషంబు= సంతోషం; కావించి= చేసి; సవిశేష= విశేషమైన; సమున్నతిన్= ఔన్నత్యాన్ని; పొందెన్+అని; చెప్పినన్ విని; గాంగేయునితోన్= గంగా పుత్రుడితో; కౌంతేయ+అగ్రజుండు= కుంతి కుమారులలో పెద్దవాడు ధర్మరాజు; అపూర్వ చిరసమాశ్రిత దూర+ఆగతులలోనన్= క్రొత్తవారు, చాలాకాలం నుండి తన్నాశ్రయించిఉన్నవారు, దూరప్రాంతాలనుండి వచ్చినవారిలో; అధికతమంబు= మిక్కిలి గొప్ప; అగు; పాత్రంబు= యోగ్యుడు; ఎవ్వరు+అని+అడిగినన్; ఆ పుడమి ఱేనికిన్= ఆ మహీవల్లభునికి, ధర్మజునకు; ఆ పురుషవరుండు= పురుష శ్రేష్ఠుడు - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లన్నాడు.

తాత్పర్యం: కాబట్టి వారందరి కంటె గొప్పవారు. వారిని అగౌరవిస్తే కీడూ; గౌరవిస్తే మేలూ జరుగుతాయి. ఇందులో సందేహం లేదన్న చంద్రుడి మాటలు పాటించి మాతండ్రి తేజస్వంతుడయ్యాడు. నేనూ అదే ఆచారం పాటించి ఉన్నతిని పొందాను. ఆ మాటలు విని ఇంద్రుడు కూడా అదే విధంగా చేసి విశిష్టమైన ఉన్నతిని పొందాడు' అని చెప్పితే విని ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు. క్రొత్తవారూ, చాలాకాలం తన్ను ఆశ్రయించి ఉన్నవారు, దూరదేశం నుండి వచ్చినవారూ వీరిలో ఎవరు ఉత్తములు?' అని అడుగగా భీష్ము డంటున్నాడు.

క. 'చెలులుం జుట్టలు, సంబం। ధులు, ఋత్విజులునుఁ, బురోహితులుఁ, దగు పాత్రం
బులు, హింసా క్రోధేర్ష్యా। దులు లేని జనంబు లైన దురితవిదూరా! 162

ప్రతిపదార్థం: దురిత= పాపానికి; విదూరా!= చాలా దూరాన ఉన్నవాడా!; చెలులున్= స్నేహితులు; చుట్టలు= చుట్టాలు; సంబంధులు= సంబంధించినవారు, వియ్యమందినవారు; ఋత్విజులునున్= యజ్ఞం చేయించే; బ్రాహ్మణులు; పురోహితులున్= పురోహితులున్నూ; తగు= తగిన; పాత్రంబులు= యోగ్యులు; హింసా= జీవహింస; క్రోధ= కోపం; ఈర్ష్య= అసూయ; ఆదులు= మొదలైనవి; లేని= లేనట్టి; జనంబులు= మనుజులు; ఐనన్= అయితే.

తాత్పర్యం: పాపం లేనివాడా! ఈర్ష్య, అసూయ మొదలైనవి లేనివారు అయితే, స్నేహితులు, చుట్టాలు, సంబంధించినవారు, ఋత్విజులు, పురోహితులు తగిన యోగ్యులు.

విశేషం: పురః= రాబోయే; హితుడు= హితాన్ని సూచించేవాడు. అతిప్రాచీన కాలంలో పురోహితుడు మన మానవ లోకానికి రాబోయే మంచిచెడులు సూచించేవాడు. అతడు దైవానికీ, లోకానికీ వంతెనగా ఉండి దేవతలకు రాయబారిగా ఉండేవాడట! ధ్యానంలో దేవతలు చెప్పిన విషయాలను లోకానికి చెప్పేవాడట! లోకం ఆ మాటను పాటించి నడుచుకొనేదట. తరువాతి కాలంలో వారు రాజునకు మంత్రులై రాజ్యానికి కలిగే ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములైన ఆపదలు తొలగించే వారట! - అని రాజనీతి గ్రంథాలలో చెప్పబడింది.

క. దూరాగతులు, నపూర్వులుఁ, గౌరవకులముఖ్య! పూజఁ గనుటకు నర్హుల్;
సారాచారము విద్యా । గౌరవముం గలుగఁ జూపు కరణీయ మగున్. 163

ప్రతిపదార్థం: కౌరవకుల ముఖ్య!= కురుకులంలో శ్రేష్ఠుడా!; దూర+ఆగతులు= దూరంనుండి వచ్చినవారు; అపూర్వులు= ముందు రానివారు; పూజన్=పూజను; కనుటకున్= పొందటానికి; అర్హుల్= తగినవారు; సార= అర్థవంతమైన; ఆచారము= ఆచరణ, కర్మ; విద్యాగౌరవమున్= గొప్ప విద్యావేత్త అనే మర్యాద; కలుగన్= కలవారయితే; చూపు= దర్శనం; కరణీయము= చేయతగింది; అగున్= ఔతుంది.

తాత్పర్యం: దూరం నుండి వచ్చినవారు ఇంతకుముందు తెలియనివారూ - పూజార్హులెప్పుడౌతారంటే వారు మంచి ఆచారవంతులు, విద్యావంతు లైతే అప్పుడు.

విశేషం: చూపు. అన్నచోట కొన్ని ప్రతులలో పూజ అని ఉన్నది. ఈ పాఠమే బాగుంది. అర్థం సులభంగా కుదురుతుంది.

క. ఈ మూఁడు తెఱంగుల జను । లే మెయిఁ జూచినను నశుచు లేనియుఁ బాత్ర
శ్రీ మహితుల నిజభృత్య । స్తోమము జీవనము నడపి చుమ్మీ యీగుల్.' 164

ప్రతిపదార్థం: ఈ; మూఁడు తెఱంగుల జనులు= మూడు రకాల మనుజులు; ఏమెయిన్= ఏ విధంగా; చూచినను= చూచినప్పటికి; అశుచులు= శుచిత్వం లేనివారు; ఏనియున్= అయినా; పాత్రశ్రీ= యోగ్య సంపదచేత; మహితులు+అ= గొప్పవారే; నిజ= తనయొక్క; భృత్య= సేవకుల; స్తోమము= సమూహం; జీవనము= బ్రతుకు; నడపి= గడపి; చుమ్మీ= సుమా; ఈగుల్= దానాలు.

తాత్పర్యం: అపూర్వ చిరసమాశ్రిత దూరాగతు లన్న మూడు రకాల జనులు ఏ విధంగా చూచినా అశుచులైనా, దానార్హులే. కాని, ఇందులో ఒక రహస్యమున్నది. నీ సేవకుల బ్రతుకు తెరువు చక్కగా గడపిన తరువాతే దానధర్మాలు చేయాలి సుమా!'

క. అనిన విని ధర్మసుతుఁ డి । ట్లను శంతనుసుతునితోడ 'నఘకోటికి నె
ల్లను మూలము వనితల య । జ్ఞనముల తెఱఁ గెఱుఁగఁ జెప్పు చాతుర్యనిధీ'! 165

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మసుతుఁడు= యముడి కుమారుడు; శంతను సుతుని తోడన్= శంతనుడి కుమారుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; చాతుర్యనిధీ!= నేర్పు కలవాడా!; అఘ= పాపాల; కోటికిన్= సమూహం; ఎల్లను=

మొత్తానికి; మూలము= వేరు, ప్రధాన కారణం; వనితల= స్త్రీలే; ఆ+జనముల= ఆ స్త్రీల; తెఱఁగు= పద్ధతి; ఎఱుఁగన్= తెలిసేటట్లు; చెప్పు= వివరించుము.

తాత్పర్యం: తరువాత ధర్మరాజు మరొక విషయం ప్రశ్నిస్తున్నాడు. 'పాపాలన్నిటికి మూలం స్త్రీలంటారు. వారి సంగతి చెప్పుము. నీవు చెప్పటంలో చాలా నేర్పు కలవాడవు కదా?'

నారద పంచచూడా సంవాదంబను నితిహాసము (సం.13-38-1)

వ. అనుటయు నతం డతని కిట్లనియె; 'అతివలు నీ చెప్పినట్టివార; దీనికి నారద పంచ చూడా సంవాదం బనంబరఁగు నితిహాసంబు గలదు; వనితా స్వభావ విషయంబయి యుండు; దాని నాకర్ణింపుము. దేవ మునివరుం డగు నారదుం డెందునుం జరించుచుండి పంచచూడ యను నచ్చరలేమ నొక్కెడం గాంచి.166

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అతివలు= స్త్రీలు; నీ చెప్పినట్టివారు+అ= నీవెట్లా చెప్పావో అట్లాంటివారే; దీనికిన్; నారద పంచచూడా సంవాదంబు అనన్+పరఁగు; ఇతిహాసంబు= చరిత్ర; కలదు; వనితా= స్త్రీల యొక్క; స్వభావ విషయంబు= స్వభావానికి సంబంధించినది; అయి+ఉండున్= కలదైఉన్నది; దానిన్; ఆకర్ణింపుము= వినుము; దేవముని వరుండు+అగునారదుండు= దేవతాముని శ్రేష్ఠుడైన నారదుడు; (మునులలో దేవతా మునులు, మానవ మునులని భేదమున్నది, నారదుడు దేవముని) ఎందునున్+చరించుచుండి; పంచచూడయను; అచ్చరలేమన్= అప్సరః కాంతను; ఒక్క+ఎడన్= ఒకచోట; కాంచి= చూచి.

తాత్పర్యం: అనగా విని భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. 'నీవు చెప్పినట్లే స్త్రీలు అట్లాంటివారే. పూర్వం నారదుడు ఒక అప్సరసను - పంచచూడను చూచి అడిగి తెలుసుకొన్న కథ ఉన్నది. అది స్త్రీల స్వభావాన్ని వ్యాఖ్యానించేది. ఆ కథను చెప్పుతాను వినుము. దేవఋషి శ్రేష్ఠుడైన నారదుడు ఎక్కడెక్కడో తిరుగుతూ ఉండి ఒకచోట పంచచూడ అనే అప్సరసను చూచి.

విశేషం: పంచచూడ= అయిదు తలకొప్పులు కలది. ప్రాచీనకాలశిల్పాలలో ఈ కొప్పులు మనం చూడగలం.

క. 'ఏ నొక్కటి యడిగెదఁ జెపు । మా నళినదళాక్షి'! యనుడు మా కొలఁదుల ప
ల్కైన సదుత్తర మిచ్చెద । నానతి యి 'మ్మనియె నది ప్రియం బెసఁగంగన్. 167

ప్రతిపదార్థం: నళిన= తామర పువ్వు; దళ= రేకువంటి; అక్షి!= నేత్రాలు కలదానా!; ఏను= నేను; ఒక్కటి= ఒక సంగతి; అడిగెదన్= ప్రశ్నిస్తాను; చెపుమా= సమాధానం చెప్పుము; అనుడున్= అనగా; అది= ఆ అప్సరస; ప్రియంబు= ప్రేమ, గౌరవం; ఎసఁగంగన్= అతిశయించగా; మా కొలఁదుల= మాకు తగిన; పల్కు= మాట; ఐనన్= అయితే; సత్+ఉత్తరము= సరియైన సమాధానం; ఇచ్చెదన్= ఇస్తాను; ఆనతి ఇమ్ము= ఆనతివ్వండి; అనియెన్= అన్నది.

తాత్పర్యం: నారదు డామెతో అంటున్నాడు. 'నళినదళాక్షీ! నే నొకటి అడుగుతాను చెప్పుము' అని అంటే ఆమె అన్నది 'మీ రడిగేమాట మా బోటివాళ్ళకు తెలిసేదయితే తప్పక సమాధాన మిస్తాను' అని భక్తితో అన్నది.

విశేషం: అడిగింది దేవముని కనుక 'ప్రియంబెసఁగంగన్' మాకొలఁదుల పల్కు' - అని కవి వ్రాయటం ఆమె భక్తి వినయాలను సూచిస్తాయి.

వ. అనుటయు నతండు. 168

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతో; అతండు= నారదుడు;

తాత్పర్యం: అట్లా అనగా నారదుడు.

క. 'వనితా స్వభావ మిట్టిది । యని తెలియం జెప్పు 'మనుడు, నల్ల నగుచు న
వ్వనిత' తగునయ్య! వనితకు । వనితల దుశ్చేష్టితములు వాక్రువ్వంగన్.' 169

ప్రతిపదార్థం: వనితా= స్త్రీ యొక్క; స్వభావము= సహజమైన లక్షణం; ఇట్టిది= ఇట్లాంటిది; అని; తెలియన్= స్పష్టంగా; చెప్పుము= చెప్పుము; అనుడున్= అంటే; అల్లన్= నెమ్మదిగా; నగుచున్= నవ్వుతూ; ఆ వనిత= ఆ పంచచూడ; వనితల= స్త్రీల; దుస్+చేష్టితములు= చెడ్డచేష్టలు; వనితకున్= స్త్రీకి; వాక్రువ్వంగన్= చెప్పటం; తగున్+అయ్య!= అయ్యా! ఏం న్యాయం?

తాత్పర్యం: స్త్రీ స్వభావం ఇట్లాంటిదని చెప్పుము అన్నాడు నారదుడు. ఆమె నవ్వి 'స్త్రీ స్వభావంలో దుర్లక్షణాలను స్త్రీగా నే నెట్లా చెప్పేది? అది న్యాయం కాదు కదా!'

క. అనిన విని, 'నిక్క మాడిన, । విను, త ప్పించుకయు లేదు; వివరింపు నిజం'
బని ముని పల్కిన, నయ్యం । గన యతనికి నిట్టు లనియెఁ గౌరవముఖ్యా! 170

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని= నారదుడు ఆలకించి; నిక్కము= సత్యం; ఆడినన్= చెప్పితే; విను; తప్పు= దోషం; ఇంచుకయున్= కొంచెంకూడా; లేదు; నిజంబున్= సత్యం; వివరింపు= చెప్పుము; అని; ముని= నారదుడు; పల్కినన్= అనగా; ఆ+అంగన= ఆ స్త్రీ; కౌరవముఖ్యా!= కురువంశంలో ముఖ్యమైనవాడా!; అతనికిన్= నారదుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: ధర్మరాజా! పంచచూడ పలికిన మాటలు విని నారదుడు 'నిజం చెప్పితే పాపం ఆవంతకూడా రాదు. నిజం చెప్పుము' అని అన్నాడు. అతడితో ఆమె ఇట్లా అన్నది.

వ. 'స్త్రీ స్వభావంబులు నీ వెఱుంగని యవి లేవు, ఐనను జెప్పెద నవధరింపుము. 171

ప్రతిపదార్థం: స్త్రీ స్వభావంబులు; నీవు; ఎఱుంగని యవి= తెలియనివి; లేవు; ఐననున్= అయినా; చెప్పెదన్; అవధరింపుము= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: స్త్రీల స్వభావాలు నీకు తెలియనివి లేవు. అయినా చెప్పుతాను వినుము.

విశేషం: నారదుడిపై నున్న మర్యాదకొరకు అన్నమాట లివి. ఆమె వినయ స్వభావాన్ని తెలుపుతున్నవి.

క. కులమును, సమ్మాన్యతయును । గలిగి, యొరుని భార్య యైన గౌరవలీలన్
మెలఁగుచు వెలిఁ జరియించున్ । లలన వలసినట్ల యే మనం గల దనఘా!' 172

ప్రతిపదార్థం: అనఘా!= పాపం లేనివాడా!; కులమును= సత్కులం; సమ్మాన్యతయును= గౌరవం; కలిగి= ఉండి;

ఒరునిభార్య ఐనన్= మరొకడి భార్య అయినా; గౌరవలీలన్= మర్యాద పద్ధతిగా; మెలఁగుచున్= ప్రవర్తిస్తూ; లలన= స్త్రీ; వలసినట్లు= ఇష్టం వచ్చినట్లు; వెలిన్= బయట; చరియించున్= తిరుగుతుంది; ఏమి+అనన్+కలదు?= అనటాని కేమున్నది?

తాత్పర్యం: సత్కులం, గౌరవమర్యాద లుండి మరొకడి భార్య అయి కూడా గౌరవంతో ఉంటూనే బయట తిరుగుళ్ళు తిరుగుతుంది స్త్రీ. ఇంకా అనటాని కేముంది స్వామీ!'

వ. అని పల్కి వెండియు. 173

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

సీ. 'యోషిజ్జనంబులు దోషంబులకు నెల్ల । మూలంబు; వారల నేల చెప్ప
నడిగితి గానఁ గన్నంత సెప్పెద విను, । పురుషులమేలిమి పొలఁతు లెఱుఁగ;
రదిగాక నిర్లజ్జలై కుత్సితుల భజి । యింతురు కదిసినయంతఁ జేసి,
వర్జనీయులు లేరు వారల కెవ్వరు । దండభీతిన పాడి దప్పకునికి,

తే. యగ్ని కాష్ఠముల మహాంబుధి యేఱుల । నంతకుండు భూతసంతతులను
వనజముఖులు పురుషులను దృప్తిఁ బొందుట । గలుగదండ్రు కోవిదులు మునీంద్ర! 174

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= ముని ముఖ్యుడా!; యోషిత్+జనంబులు= స్త్రీలు; దోషంబులకున్+ఎల్లన్= అన్ని తప్పులకు; మూలంబు= స్థానం; వారలను= వారిని గురించి; ఏల చెప్పన్?= చెప్పేదేముంది?; అడిగితికానన్= అడిగావు కనుక; కన్న+అంత= తెలిసినంత; చెప్పెదన్= చెప్తాను; విను; పురుషుల= మగవారి; మేలిమి= మంచి; పొలఁతులు= స్త్రీలు; ఎఱుఁగరు= తెలియలేరు; అదిగాక= అంతేకాక; కుత్సితులన్= కుచ్చితం కలవారిని; నిర్+లజ్జలు+ఐ= సిగ్గుమాలినవారై; కదిసిన+అంతన్+చేసి= సమీపించినంత మాత్రంచేత; భజియింతురు= పొందుదురు; వారలకున్= వారికి; ఎవ్వరు= ఎవరు కూడా; వర్జనీయులు= విసర్జింప తగ్గ వారు; లేరు; దండభీతిన= దండనభయంచేతనే; పాడి= న్యాయం; తప్పక= తప్పకుండా; ఉనికి= ఉండటం; కాష్ఠములన్= కట్టెలతో; అగ్ని= నిప్పు; మహా+అంబుధి= పెద్దసముద్రం; ఏఱులన్= ఏర్లతో; భూత= జీవుల; సంతతులను= సమూహంతో; అంతకుండు= మృత్యుదేవత; వనజముఖులు= పద్మంవంటి ముఖం కలవారు-స్త్రీలు; పురుషులను= పురుషులతో; తృప్తిన్+పొందుట= సంతృప్తి చెందటం; కలుగదు= కుదరదు; అని; కోవిదులు= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: మునీంద్రా! స్త్రీలు సర్వదోషాలకు మూలం. వారిని గురించి చెప్పటం దేనికి? అడిగావు కనుక తెలిసినంత చెప్తాను. పురుషులలోని గొప్పతనం స్త్రీలు గ్రహించలేరు. అంతేకాక సిగ్గులేకుండా దగ్గరకు వచ్చిన కుత్సిత స్వభావులను కూడా వదలిపెట్టరు. శిక్షపడుతుందనే భయం కనుక లేకపోతే వాళ్ళకు పరిత్యజించ తగ్గ వారెవ్వరూ లేరు. ఏ విధంగా నిప్పు కట్టెలతో, సముద్రం నదులతో, మృత్యువు జీవులతో తృప్తి పడదో అదే విధంగా స్త్రీలు పురుషులతో తృప్తి పడరు.

క. కల దొక రహస్య గోపన । మలఘుమతీ! వినుము పురుషు నన్యుం గనినం
బొలఁతులకు, నేమి సెప్పుదుఁ? । గలుగుఁ బదను తోడి కళలు గామగృహమునన్' 175

ప్రతిపదార్థం: అలఘు= గొప్ప; మతీ!= మనస్సు కలవాడా!; ఒక; రహస్యగోపనము= దాచదగిన రహస్యం; కలదు= ఉన్నది; వినుము= జాగ్రత్తగా వినుము; అన్యున్= మరొక (భర్తకాక); పురుషున్= మగవాడిని; కనినన్= చూస్తే; ఏమి చెప్పుదున్= ఏం చెప్పేది; పొలఁతులకున్= స్త్రీలకు; కామగృహమునన్= యోనిలోపల; పదను= తడి; తోడి= తడితో; కళలు= కామ వాంఛలు, కలుగున్= ఏర్పడుతాయి.

తాత్పర్యం: మహామనస్వీ! వినుము. ఒక రహస్య మున్నది. బైటకు చెప్పరానిది. అయినా నీకు చెప్తున్నాను. పరపురుషుడిని చూస్తే స్త్రీకి యోని ఆర్ద్రమౌతుంది. ఇం కేం చెప్పేది?

వ. అని వెండియు. 176

తాత్పర్యం: అని ఇంకా.

క. 'కుడుచుట, కట్టుట, పూయుట । తొడుగుటయును, వివిధ ధనతతులు గూడుట, యె
క్కుడు వేడ్కసేయఁ జాలవు । పడఁతికిఁ బరపురుషుఁ గవయఁబాఱుట పోలెన్.' 177

ప్రతిపదార్థం: పడఁతికిన్= స్త్రీకి; పరపురుషున్= ఇతరుడైన మగవాడిని; కవయన్= పొందటానికి; పాఱుట= పరుగెత్తటం; పోలెన్= వలె; కుడుచుట= తినటం; కట్టుట= వస్త్రధారణం; పూయుట= గంధం మొదలైనవి పూసికొనటం; తొడుగుటయును= నగలు మొదలైనవి ధరించటం; వివిధ= అనేక; ధనతతులు= ధనరాసులు; కూడుట= లభించటం; ఎక్కుడు= ఎక్కువ; వేడ్కన్= సంతోషాన్ని; చేయన్+చాలవు= కలిగించలేవు.

తాత్పర్యం: పరపురుషులతో వ్యభిచరించటంమీద ఉన్నంత ప్రీతి స్త్రీకి తినటం, బట్టలు వేసికొనటం, నగలు పెట్టుకొనటం, డబ్బు కూడబెట్టుకొనటం మీద కూడా ఉండదు.

వ. అని చెప్పిన విని నారదుండు 'నిజంబు పల్కి'తని పంచచూడ ననిపి నిజేచ్ఛం జనియె' నని చెప్పిన విని, ధర్మజుండు 'సుందరీ జనంబులఁ గాచు తెఱం గెఱింగింపవే' యని యడిగిన, నాపగాతనూజుం డతని కిట్లను 'వారు మయశంబరాది మాయలం గడచిన మతకంబులు గలిగి నిరూపింపరాక యుండుదురు; అది యునుం గాక వేఱొక్క విశేషం బాకర్ణింపుము. 178

ప్రతిపదార్థం: అని చెప్పినన్; విని; నారదుండు; నిజంబు పల్కితి+అని= నిజం చెప్పావని; పంచచూడను; అనిపి= పంపి; నిజ+ఇచ్ఛన్= తనకిష్టం వచ్చిన చోటికి; చనియెన్= పోయాడు; అని చెప్పినన్ విని ధర్మజుండు; సుందరీ జనంబులన్= స్త్రీల సమూహాన్ని; కాచు= రక్షించు; తెఱంగు= విధానం; ఎఱింగింపవే= చెప్పవే; అని అడిగినన్= అని అడుగగా; ఆపగా తనూజుండు= గంగానది కొడుకు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనున్; వారు= స్త్రీలు; మయ, శంబర+ఆది= మయుడు, శంబరుడు మొదలైన వారి; మాయలన్= మాయలను; కడచిన= అతిక్రమించిన; మతకంబులు= మాయలు; కలిగి; నిరూపింపన్ రాక= ఇది యని చెప్పటానికి వీలు లేకుండా; ఉండుదురు= ఉంటారు; అదియునుంగాక= అంతేకాక; వేరొక్క విశేషంబు= మరొక్క సంగతి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని చెప్పగా నారదుడు పంచచూడతో 'చాలా యథార్థం చెప్పా'వని మెచ్చుకొని ఆమెను పంపి తాను ఇష్టం వచ్చిన చోటికి పోయా'డని చెప్పగా ధర్మ రాజన్నాడు. 'ఈ ఆడవాళ్ళను ఎట్లా కాపాడుకొనాలో చెప్పు'మన్నాడు.

దానికి భీష్ము డన్నాడు 'వారు మయశంబరాది రాక్షసుల మాయలకంటె మించిన మాయలు కలవారు. వారి మాయలు ఇట్లాంటి వని నిరూపించటం కష్టం. అదీ కాక మరొక్క విశేషం చెప్పుతాను వినుము.

తే. తొల్లి నిర్దోషచిత్తత నెల్ల జనులు। వలచినప్పుడ దేవత్వ వైభవంబు
నొందఁ జాలి యుండుదురు మాయోపయుక్తి। వనితలకు లేక, సాధ్వులై యునికిఁ జేసి. 179

ప్రతిపదార్థం: వనితలకున్= స్త్రీలకు; మాయా= మాయామర్మాల; ఉపయుక్తిన్= కలిగి ఉండటం; లేక; సాధ్వులై= సాధు స్వభావలై; ఉనికిన్+చేసి= ఉన్నందువలన, తొల్లి= పూర్వం; నిర్దోషచిత్తతన్= దోషం లేని మనస్సుతో; ఎల్లన్ జనులు= మనుషులంతా; వలచినప్పుడు+అ= కావలసినప్పుడే; దేవత్వవైభవంబున్= దివ్యవైభవాన్ని; ఒందన్= పొందగా; చాలి= సమర్థులై; ఉండుదురు= ఉంటారు.

తాత్పర్యం: పూర్వం స్త్రీలు సాధువులై పవిత్రలై ఉండేవారు. వారికి మాయా మర్మాలు లేని ఆ రోజులలో పురుషులంతా కావలసినప్పుడు దైవత్వాన్ని పొందేవారు. వారి మనస్సులు పవిత్రంగా ఉండేవి కనుక.

వ. దానికి దివిజులు అసూయాగ్రస్తులై కమలయోనిం గానం జని నిజచిత్త ప్రకారం బెఱింగించిన, నతం డతివల మాయావతులం గావించి, వారికిఁ గామం బగ్గలంబుగాఁ జేసినం; బురుషులు వారి చిక్కులంబడి రోషాది దుర్గుణ దూషితు లగుటం జేసి విగతానుభావు లైరి; దేవతలును బ్రియం బందిరి; అట్లు గావున. 180

ప్రతిపదార్థం: దానికిన్= పురుషుల కా దైవత్వశక్తి కలగటం వలన; దివిజులు= దేవతలు; అసూయా+గ్రస్తులు= అసూయ భావంతో మ్రింగబడినవారై; కమలయోనిన్= పద్మంలో పుట్టిన బ్రహ్మను; కానన్= చూడటానికి; చని= పోయి; నిజ= తమ; చిత్త= మనస్సులలోని; ప్రకారంబు= ఆలోచన; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= బ్రహ్మ; అతివలను= స్త్రీలను; మాయావతులన్= మాయలు నేర్చిన వారినిగా; కావించి= చేసి; వారికిన్; కామంబు; అగ్గలంబు= ఎక్కువ; చేసినన్= చేయగా; పురుషులు= మగవారు; వారి= స్త్రీల; చిక్కులన్= వలలో; పడి= చిక్కి; రోష+ఆది= రోషం మొదలైన; దుర్గుణ= చెడ్డగుణాలచేత; దూషితులు= కలుషితులు; అగుటన్+చేసి= అయినందువలన; విగత= పోయిన; అనుభావులు= మాహాత్మ్యం కలవారు; ఐరి= ఐనారు; దేవతలును= దేవతలూ; ప్రియంబు= సంతోషం; అందిరి= పొందారు; అట్లు+కావునన్= ఆకారణంవల్ల;

తాత్పర్యం: దానికి దేవతలు అసూయపడి బ్రహ్మ దగ్గరకు పోయి తమ మనసులలోని మాట చెప్పగా ఆయన స్త్రీలను మాయలు కలవారినిగా చేసి వారికి కామం హెచ్చుగా కల్గించాడు. దానితో పురుషులు వారి వలలో చిక్కుపడి కోపాది భావాలకు లోనై తమలో ఉన్న ఆ పూర్వపు ప్రభావం పోగొట్టుకొన్నారు. దేవతలు కూడా సంతోషించారు.

క. వనితలు మాయావిను లై। యనిరూపిత చిత్తవృత్తి నంచిత రక్షం
బనువడ కుండుదు; రైనను। వినినది కథయొకటి నీకు వినిపింతుఁ దగన్. 181

ప్రతిపదార్థం: వనితలు= స్త్రీలు; మాయావినులు+ఐ= మాయలు కలవారై; అనిరూపిత= నిరూపించరాని; చిత్తవృత్తిన్= మనస్సులోని తలంపులతో; అంచిత= మంచి; రక్షన్= కట్టుదిట్టాలలో; పనుపడక= లోబడక; ఉండుదురు= ఉంటారు; ఐనమన్= అయినప్పటికి; వినినది= నేను విన్నది; కథ+ఒకటి= ఒకకథ; నీకున్; తగన్= చక్కగా; వినిపింతున్= వినిపిస్తాను.

తాత్పర్యం: స్త్రీలు మాయలు కలవారు కనుక వారి మనస్సులోని ఆలోచనలు పసికట్టి అరికట్టటం కష్టం. ఐనా నేను విన్న కథ నొకదాన్ని వినిపిస్తాను వినుము.

దేవశర్మయను మునివరు భార్య రుచి యనుదాని చరిత్రము (సం.13-40-1)

వ. దేవశర్మ యను మునిభార్య రుచి యను నంగన సర్వాంగ సుందరియై యుండుఁ; దదీయ రూపాతిశయంబు దేవగంధర్వాదులకును లోచనీయంబు. 182

ప్రతిపదార్థం: దేవశర్మ అను ముని భార్య; రుచి= రుచిఅనేపేరుగల (లావణ్యం, కాంతి కలదని అర్థం); అంగన= స్త్రీ; సర్వ+అంగసుందరిఐ= అన్ని అంగాలు అందంగా ఉన్నదై; ఉండున్= ఉన్నది; తదీయ= ఆమెయొక్క; రూప+అతిశయంబు= అందముయొక్క; ఆధిక్యం= అతిశయం; దేవ= దేవతలు; గంధర్వ= గంధర్వులు; ఆదులకును= మొదలైనవారికి; లోచనీయంబు= చూడదగింది.

తాత్పర్యం: దేవశర్మ అని ఒక ముని. అతని భార్య రుచి. ఆమె సర్వాంగసుందరి. ఆమె రూపలావణ్యం దేవగంధర్వాదులకు కూడా వాంఛింప తగ్గది.

క. అతఁ డొక నాఁ డొక యెడ కొక । క్రతువున కుపదర్శనంబు గావింపఁగఁ బో
వు తలంపు పుట్టి, వికస । న్మతి యగు తన శిష్యు విపులనామకునిఁ దగన్. 183

ప్రతిపదార్థం: అతఁడు= దేవశర్మ; ఒకనాఁడు; ఒక ఎడకున్= ఒకచోటికి; ఒక క్రతువునకున్= ఒక యజ్ఞానికి; ఉపదర్శనంబు= యాజకత్వం - పురోహితత్వం; కావింపఁగన్= చేయటానికి; పోవు= వెళ్ళే; తలంపు= ఆలోచన; పుట్టి= కలిగి; వికసత్+మతి= పరిపక్వమైన మనస్సు కలవాడు; అగు= అయిన; తన; శిష్యున్; విపుల నామకునిన్= విపులుడు అనే పేరుగల వాడిని; తగన్= చక్కగా. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: ఒకసారి దేవశర్మ ఒక యజ్ఞం చేయటానికి పోవాలనుకొని వికసించిన ఆలోచనలు కల తన శిష్యుడు విపులు డనే వాడిని పిలిచి.

విశేషం: విపులుఁడు= విపులమైన విశాలమైన బుద్ధి కలవాడు కనుక వికసన్మతి - అని పేర్కొన్నాడు కవి. అతడి విశాలబుద్ధి ముందు కథలో తెలుస్తుంది. ఇది 37 పద్యాలకథ. స్త్రీని రక్షించటం కష్టమని చెప్పటానికై చెప్పబడుతున్నది. ఇదే కథ పురుషుడి దుశ్శీలతకూ ఉదాహరణమే.

వ. పిలిచి యేకాంతంబున నతని కిట్లనియె. 184

ప్రతిపదార్థం: ఏక+అంతంబునన్= ఒకడే ఉన్న రహస్యస్థానంలో.

తాత్పర్యం: పిలిచి రహస్యంగా అతడితో ఇట్లా అన్నాడు.

క. 'రుచి నెపుడు వేచి తిరుగును । శచీవిభుఁడు; దాని నెఱిఁగి సంరక్షణ మే
నుచితంబుగ నొనరింతు, వి । కచకమలనిభాస్యఁ జేరఁ గానఁ దతండున్. 185

ప్రతిపదార్థం: శచీవిభుఁడు= శచి భర్త ఇంద్రుడు; రుచిన్= రుచిని; ఎపుడున్= నిత్యమూ; వేచి= వెన్నాడుతూ; తిరుగును= తిరుగుతూ ఉంటాడు; దానిన్= ఆ విషయం; ఎఱిఁగి= తెలిసి; సంరక్షణము= కాపాడటం; ఉచితంబుగన్= తగినట్లు; ఏను= నేను; ఒనరింతున్= చేస్తూ ఉంటాను; వికచ= వికసించిన; కమల= తామరపూవు; నిభ= వంటి; ఆస్యన్= ముఖంకల దానిని; అతండున్= ఇంద్రుడు; చేరన్= సమీపించటానికి; కానఁడు= నేరడు.

తాత్పర్యం: రుచికొరకు ఇంద్రుడు చాలాకాలంగా పొంచులు వేస్తున్నాడు. అది తెలిసిన నేను తగిన రక్షణ విధాన మాచరిస్తూ ఉన్నందువలన అతడు ఈ ఛాయలకు రాలేకున్నాడు.

తే. **నాకుఁ గ్రతువు సేయింపఁ జనంగ వలసి । యున్నయది; పరదారసముత్సుకుండు**
శక్రుఁ; డటుగాన, రుచికి రక్షావిధాన । మాచరింపుము నీవు దృఢావధాన!' 186

ప్రతిపదార్థం: దృఢ= గట్టి; అవధాన!= జాగ్రత్త కలవాడా!; నాకున్; క్రతువు= యజ్ఞం; చేయింపన్= చేయించటానికి; చనంగన్ వలసి ఉన్న+అది= పోవలసి ఉన్నది; శక్రుఁడు= ఇంద్రుడు; పరదార= పరభార్యలపై; సముత్సుకుండు= వాంఛలు కలవాడు; అటుకానన్= అందుకని; నీవు; రుచికిన్; రక్షావిధానము= రక్షించే పద్ధతిని; ఆచరింపుము= చేయుము.

తాత్పర్యం: నేను యజ్ఞం చేయించే పనిమీద పోవలసి ఉన్నది. ఇంద్రు డేమో రుచికొరకు వేచి ఉంటాడు. కనుక నీవు ఆమె నతడినుండి కాపాడే బాధ్యత తీసికొనుము.'

క. **అనిన విని 'యట్లు సేసెద' । నని విపులుఁడు గురునితోడ 'నమరవిభుం డే**
యనువునఁ జొచ్చు నొకో పర । వనితాహరణమున' కనియె వసుధాధీశా! 187

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= భూమికి పతీ! ధర్మజా! అనినన్; విని; అట్లు= అదే విధంగా; చేసెదన్= చేస్తాను; అని; విపులుఁడు= శిష్యుడు; గురునితోడన్= గురువుతో; పర= ఇతరుల, వనితా= స్త్రీ; ఆహరణమునకున్= అపహరించటానికి; అమర= దేవతల; విభుండు= రాజు; ఏ అనువునన్= ఏ ఉపాయంతో; చొచ్చునొకో!= ప్రవేశిస్తాడో కదా!; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: గురువు చెప్పినది విని 'అట్లాగే చేస్తాను. కాని, పరస్త్రీ కొరకు ఇంద్రు డే రూపంలో ఎట్లా ప్రవేశిస్తాడో కదా!' అని అన్నాడయ్యా ధర్మరాజా!

విశేషం: పరవనితా హరణమునకు విటుడు ఎట్లా వస్తాడో బ్రహ్మచారి శిష్యుడి కెట్లా తెలుస్తుంది? అందుకే అట్లా ప్రశ్నించాడు.

క. **అనుటయు ననేక మాయలు, । పొనరుపఁగా నేర్చు రూపములు పెక్కులు గై**
కొను పక్షిమృగాదిత్వము । లొనరఁగ నవి నియతి నరసి యుండఁగ వలయున్. 188

ప్రతిపదార్థం: అనుటయున్= అంటే; అనేక మాయలు= పలు మాయలు; పొనరుపఁగాన్= చేయగా; నేర్చున్= అతడికి తెలుసు; పక్షి మృగ+ఆదిత్వములు= పక్షి జంతువు మొదలైన; రూపములు= రూపాలు; పెక్కులు= అనేకం; కైకొనున్= వేసికొంటాడు; ఒనరఁగన్= చక్కగా; అవి= వాటిని; నియతిన్= శ్రద్ధగా; అరసిఉండఁగన్+వలయున్= జాగ్రత్తగా చూస్తూ ఉండాలి.

తాత్పర్యం: శిష్యు డట్లా అనగానే గురు వన్నాడు. 'అతడు మహామాయావి. పక్షి, మృగాది రూపాలు చక్కగా ధరిస్తాడు. జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండాలి.

క. రుచి మీఁదం గన్నిడి యా । శచీవిభుఁడు దిరుగు, విను మసంశయము సుమీ!
యిచటికి నాతఁడు వచ్చుట; । యచలితమతి నమ్మృగాక్షి నరయఁగ వలయున్.' 189

ప్రతిపదార్థం: ఆ శచీవిభుఁడు= ఆ ఇంద్రుడు; రుచిమీఁదన్= రుచిపై; కన్ను+ఇడి= కన్నువేసి; తిరుగున్, వినుము; ఇచటికిన్; అతఁడు; వచ్చుట; అసంశయము సుమీ= సందేహం లేదు సుమా!; ఆ+మృగ+అక్షిన్= లేడికన్నుల వంటి కన్నులు కలదానిని; అచలితమతిన్= జారుపాటులేని, ఏమరుపాటులేని మనస్సుతో; అరయఁగన్ వలయున్= నీవు చూస్తూ ఉండాలి.

తాత్పర్యం: రుచిమీద కన్నువేసిన ఆ ఇంద్రుడు తిరుగుతూ ఉంటాడు. కనుక అత డిక్కడకు రావటం తథ్యం. ఆమెను జాగ్రత్తగా చూస్తూ ఉండుము.'

క. అని యప్పగించి యాగం । బున కమ్ముని సనియె; నవ్విపులుఁడును జిత్తం
బున నవధానము దృఢముగ । వనితం గాచికొని యుండె వసుధాధీశా! 190

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; అప్పగించి= ఆమె బాధ్యత నతడిపై పెట్టి; ఆ ముని; యాగంబునకున్= యజ్ఞానికి; చనియెన్= పోయాడు; ఆ విపులుఁడును; చిత్తంబునన్= మనస్సులో; అవధానము= ఏకాగ్రత, జాగ్రత్త; దృఢముగన్= దృఢం కాగా; వసుధా+అధీశా!= రాజా!; వనితన్= రుచిని; కాచికొని= రక్షిస్తూ; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: అని అప్పగించి ముని వెళ్ళిపోగా, జాగ్రత్తగా శిష్యుడు గురుపత్నిని కాచుకొని ఉన్నాడు.

వ. అట్లుండి యొక్క యనువు విచారించుకొని. 191

ప్రతిపదార్థం: అట్లు+ఉండి= అట్లా ఉంటూ; ఒక అనువు= ఒక ఉపాయం; విచారించుకొని= ఆలోచించుకొని.

తాత్పర్యం: అట్లా ఉంటూ ఒక ఉపాయం ఆలోచించుకొని.

క. 'ఆవేశించెద యోగ । ప్రావీణ్యంబున మునీంద్రు భార్యం, దప్పే?
యా విశ్రుతాత్ము మనమున । కీ విజ్ఞానంబు దోఁచునే? వెఱ పేలా?' 192

ప్రతిపదార్థం: యోగప్రావీణ్యంబునన్= యోగశక్తితో; ముని+ఇంద్రు= దేవశర్మ గురువు యొక్క; భార్యన్= పత్నిని; ఆవేశించెదన్= ఆవహించి ఉంటాను; తప్పే?= ఇది తప్పా? కాదు కదా? ఆ విశ్రుత+ఆత్ము= ఆ జ్ఞానమూర్తియైన గురువుగారి; మనమునకున్= మనస్సుకు; ఈ విజ్ఞానంబు= ఈ (నేను చేసిన ఈ విషయానికి సంబంధించిన) తెలివి; తోఁచునే?= స్పష్టమౌతుందా?; వెఱపు= భయం; ఏలా?= దేనికి?

తాత్పర్యం: 'గురుపత్నిని నా యోగశక్తితో ఆవహించి ఉంటాను. మహాజ్ఞాని అయిన గురువుగారి కిది తెలిసే జాడ లేదు కనుక సందేహం లేకుండా ఈ పని చేస్తాను.

వ. అని వితర్కించి యమ్ముని చాతుర్య కారుణ్యంబు లూఁది శంకదక్కియక్కొమ్మ కింతనంత నాసీనుండై యుచిత కథ లొక్కింతసేపు సెల్లించి, యోగమాయాబలంబునం జేసి నడపుటయు. 193

ప్రతిపదార్థం: వితర్కించి= ముందు వెనుకలు ఆలోచించి; ఆ ముని= గురువు; చాతుర్య కారుణ్యంబులు= నేర్పు, దయ అనుగుణాలను; ఊఁది= ఆధారంగా చేసికొని; శంక= సందేహం; తక్కి= మాని; ఆ కొమ్మకున్= ఆ స్త్రీకి; అంతన్+ఇంతన్ ఆసీనుండై= దగ్గర కూర్చున్నవాడై; ఉచిత= తగిన; కథలు= పురాణగాథలు (సీతాదుల కథలు); ఒక్క+ఇంతసేపు= కొంచెంసేపు; చెల్లించి= గడపి; యోగమాయాబలంబునన్+చేసి= యోగమాయాశక్తితో; నడపుటయున్= ప్రవర్తించగా.

తాత్పర్యం: అని ఆలోచించి తన గురువుయొక్క చాతుర్యం, కారుణ్యం ఆధారంగా చేసికొని సందేహం లేకుండా ఆమె సమీపంలో కూర్చుండి ఒప్పిదాలైన కథలు కొంతసేపు చెప్పి, యోగమాయా బలంతో ప్రవరిస్తూ ఉండగా.

ఆ. పవనుఁ డాకసమునఁ బరఁగు విధంబున । నమ్మృగాక్షి తనువునందుఁ గలయ
విపులు నాత్మ దగఁ బ్రవేశించె నవ్వధూ । రత్నమునకు నెఱుఁగ రాకయుండ. 194

ప్రతిపదార్థం: ఆ+వధూ రత్నమునకున్= శ్రేష్ఠమైన ఆమెకు; ఎఱుఁగన్= తెలియగా; రాక+ఉండన్= వీలులేకుండా; పవనుఁడు= గాలిదేవుడు; ఆకసమునన్= అంతరిక్షంలో; పరఁగు విధంబునన్= తిరిగేటట్లు; విపులుఆత్మ= విపులుడి ఆత్మశక్తి; ఆ మృగ+అక్షి= లేడికన్నులవంటి కనులుగల ఆమె యొక్క; తనువు+అందున్= శరీరంలో; తగన్= చక్కగా; ప్రవేశించెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: గాలి ఆకాశంలో వ్యాపించినట్లు ఆ విపులుడి ఆత్మ ఆమె శరీరంలో ఆమెకు తెలియకుండానే ప్రవేశించింది.

విశేషం: అతడి ఆత్మ ఆమెకు తెలియకుండా ఆమె శరీరంలోకి ప్రవేశించటం - అంతరిక్షంలో గాలి తిరగటంవలె అన్న పోలికవలన ఆత్మ పదార్థం గాలివలె కనిపించేది కాదు, కాని ఉన్నదని తెలుస్తుంది. అనుభవాని కందుతుంది.

ఈ విషయం ఆధునిక పరిశోధనలలోనూ స్పష్టపడింది. దయ్యం పట్టిందనటానికి గాలి సోకిందనటం అందరకూ తెలిసిందే.

వ. ఇట్లు ప్రవేశించి యయ్యోగివరునాత్మ యన్నాతి చైతన్యంబు జడంబుగాఁ జేసికొని యుండె; అట్టియెడం బురందరుం డతిసుందరం బగు నాకారంబు దాల్చి యచ్చటికి వచ్చి విపులుని శరీరంబు సూచి నిద్రితునింగాఁ దలఁచుచు నున్మదుండగుటం జేసి యొండు పరికింపక మునిపత్నిం జేరవచ్చి. 195

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రవేశించి= చొచ్చి; ఆ యోగివరుఆత్మ= ఆ యోగిశ్రేష్ఠుడి ఆత్మ; ఆ నాతి= ఆ స్త్రీ; చైతన్యంబు= జీవాత్మను; జడంబుగాన్= చైతన్యంబు లేకుండా; చేసికొని ఉండెన్= చేసికొని ఉన్నాడు; అట్టి ఎడన్= ఆ సమయంలో; పురందరుండు= ఇంద్రుడు; అతి= మిక్కిలి; సుందరంబు+అగు= అందమైన; ఆకారంబు= రూపం; తాల్చి= ధరించి; అచ్చటికిన్= అక్కడకు; వచ్చి; విపులుని శరీరంబు= దేహం; చూచి; నిద్రితునిన్+కాన్= నిద్రపోయినవాడిగా; తలఁచుచున్= భావిస్తూ; ఉన్మదుండు= మిక్కిలి మదించినవాడు; అగుటన్+చేసి= అయినందువలన; ఒండు= ఇంకొకటి; పరికింపక= చూడక; మునిపత్నిన్= ముని భార్యను; చేరవచ్చి= సమీపించి.

తాత్పర్యం: ఈ విధంగా ప్రవేశించి ఆ యోగివరుడి ఆత్మ ఆమె చైతన్యాన్ని జడంగా చేసింది. అప్పుడు ఇంద్రుడు సుందరమైన రూపం ధరించి అక్కడకు వచ్చి విపులుడి శరీరాన్ని చూచి, నిద్రపోతున్నాడని తలచి కామంతో కన్ను కాననివాడు కాబట్టి మునిభార్యను సమీపించి.

క. 'నీవు కతంబుగ నాదగు । భావంబును భావభవుఁడు పఱచుట యరయం
గావలదే; యని పలికిన, । భూవర! యప్పొలఁతి మూఢబుద్ధిత్వమునన్. 196

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నీవు కతంబుగన్= నీవలన; నాదగు భావంబును= నా మనస్సును; భావభవుఁడు= మన్మథుడు; పఱచుట= బాధలపాలుచేయటం; అరయన్+కాన్ వలదే= విచారించాలి కదా; అని; పలికినన్= అంటే; ఆ పొలఁతి= ఆ స్త్రీ; మూఢ= జడమైన; బుద్ధిత్వమునన్= బుద్ధికలదైనందువలన.

తాత్పర్యం: ఇంద్రు డామెతో అన్నాడు. 'నీ వలన నా మనస్సును మన్మథుడే కలత పెట్టుతున్నాడు. నీవు కొంచెమైనా ఆలోచించాలి కదా!' అని అనగా రాజా! ఆమె బుద్ధి చైతన్యం కోల్పోయినందువలన.

క. సముచితముగఁ బ్రతుత్థా । నము సేయను, దగిన పలుకునకుఁ జొరఁగను నే
రమి నూరకున్ననుం దమ । కము పెంపున నతఁడు మఱియుఁ గమలాననతోన్. 197

ప్రతిపదార్థం: సముచితముగన్= తగిన విధంగా; ప్రతి+ఉత్థానము= ఎదురుగా లేచి వెళ్ళటం (ఆహ్వానించటానికి); చేయను= చేయటానికి; తగిన; పలుకునకున్= మాటలకు; చొరఁగను= పూనుకొనటానికి గాని; నేరమిన్= తెలియక; ఊరకున్ననున్= కదలకుండా ఉండగా; తమకము= కోర్కెయొక్క; పెంపునన్= అతిశయంతో; అతఁడు= ఇంద్రుడు; మఱియున్= ఇంకా; కమల= తామరవంటి; ఆననతోన్= ముఖంకలదానితో.

తాత్పర్యం: తగినరీతిగా ఆహ్వానించటానికి లేచి ఎదురు పోవటంగానీ, తగినట్లుగా మాట్లాడటంగానీ, చేయకుండా ఉండగా ఇంద్రుడు కోరికతో ఇంకా ఆ పద్మముఖితో ఇట్లా అంటున్నాడు.

విశేషం: మునిపత్నిపేరు రుచి (కాంతి - లావణ్యం) కనుక ప్రతిపద్యంలో కవి దాన్ని సూచిస్తూ విశేషణాలు వాడటం గమనించాలి. (కమలానన - వలె)

క. ' ఏ నమరేంద్రుఁడ నాదగు । మానముఁ గామశిఖి గ్రాఁచె; మానిని! దడయం
గా నేల? నన్నుఁ దగ స । మ్మానింపుము; నీకు సిగ్గు మా టింకేలా?' 198

ప్రతిపదార్థం: ఏను= నేను; అమర= దేవతలకు; ఇంద్రుఁడన్= రాజును; నాదగుమానమున్= నా గౌరవం; కామశిఖి= కామాగ్ని; క్రాఁచెన్= తప్తం చేశాడు; మానిని!= మానంగల దానా!; తడయంగాన్+ఏల?= ఆలస్యం దేనికి?; నన్నున్; తగన్= చక్కగా; సమ్మానింపుము= గౌరవించుము; నీకున్, సిగ్గుమాట= సిగ్గు విషయం; ఇంకన్= ఇంకా; ఏలా?= దేనికి?

తాత్పర్యం: నేను దేవతల రాజును. నా గౌరవాన్ని కామాగ్ని కాల్చి వేస్తున్నాడు. ఆలస్యం దేనికి? మానినీ? నన్ను తగ్గట్లు గౌరవించుము. నీకు ఇంక సిగ్గుతో పని లేదు.'

వ. అనుటయు నత్తన్వి తనువున నున్న విపులుండు దన యోగమాయం జేసి యవ్వనిత వాసవునితో 'నీకు నిందు రాఁ బనియేమి?' యనిపలికి పరవశ యగునట్లుగాఁ జేసినం జూచి యతండు వ్రీడా భయభరిత చిత్తుండయ్యెఁ; నయ్యవసరంబున. 199

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+తన్వి= ఆ స్త్రీ యొక్క; తనువునన్= శరీరంలో ఉన్న; విపులుండు; తన; యోగమాయన్+ చేసి= యోగశక్తితో; ఆ+వనిత= ఆ స్త్రీ; వాసవునితోన్= ఇంద్రునితో; నీకున్, ఇందున్= ఇక్కడకు; రాన్= రావటానికి; పనియేమి?= ఏం పని? అనిపలికి; పరవశఅగునట్లుగాన్= సొమ్మసిల్లిపోయేటట్లుగా; చేసినన్= చేయగా; చూచి; అతండు= ఇంద్రుడు; వ్రీడా= సిగ్గుతో; భయ= భయంతో; భరిత= నిండిన; చిత్తుండు= మనస్సు కలవాడు; అయ్యెన్= అయ్యాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అనటంతోనే ఆమె శరీరంలో ఉన్న విపులుడు తన యోగశక్తితో ఆమె వాసవుడితో 'నీ విక్కడకు రావలసిన పనేమి'టని అనిపించి ఆమెను సొమ్మసిల్లి పడిపోయేటట్లు చేయగా చూచి ఇంద్రుడు సిగ్గుపడ్డాడు. భయపడ్డాడు. అప్పుడు.

ఉ. అమ్మునిశిష్యుఁ డయ్యువిద యంగము వాసి, నిజాంగవర్తియై
యమ్మరుదీశుతో 'మఱచితా మును మూఁడిన యబ్భగాంకిత
త్వ మ్మొకభంగి నీఁగు టిది, దైవతసంయమి సేవనీయ భా
వమ్ము గలట్టి నీకుఁ దగవా? యిసిరో! యని పల్కి వెండియున్. 200

ప్రతిపదార్థం: ఆ+ముని శిష్యుఁడు= ఆ ముని శిష్యుడు విపులుడు; ఆ+ఉవిద= ఆమె; అంగము= శరీరం; పాసి= వదలి; నిజ= తనయొక్క; అంగవర్తిఐ= శరీరంలోకి ప్రవేశించి; ఆ+మరుత్+ఈశుతోన్= ఆ దేవరాజుతో; మఱచితా?= మరిచిపోయినావా? మును= పూర్వం; మూఁడిన= సంప్రాప్తమైన; ఆ+భగాంకితత్వమ్ము= ఆ యోని గుర్తులు కలగటం; ఒక భంగిన్= ఒక రీతిగా; ఈఁగుట= పోగొట్టుకొనటం; ఇది= ఈ పని; దైవత సంయమి= దేవమునులచే; సేవనీయ భావమ్ము= సేవింపదగిన మనస్సు కల; అట్టి= కలిగినట్టి; నీకున్; తగవా?= న్యాయమేనా? ; ఇసిరో= ఛీ ఛీ; అని పల్కి; వెండియున్= మరలా.

తాత్పర్యం: ఆ విపులుడు గురుపత్ని శరీరనుండి బయటకువచ్చి తన శరీరంలో ప్రవేశించి ఇంద్రుడితో ఇట్లా అన్నాడు. 'నీకు పూర్వం మునిశాపవశాత్తు సంక్రమించిన యోనిగుర్తులన్నీ ఎట్లాగో దేవముని సేవవలన పోగొట్టుకొన్నావు కదా! అట్లాంటి నీ కిది ధర్మమా?' అని ఇంకా.

తే. 'అవిజితేంద్రియబల! కుత్సితాత్మ। నీచ!, యెట్లు పాపంబు దొడరుట కియ్యకొంటి?
నాదు గురుని కోపాగ్నిచే నీదుదేవ। గణ విభుత్వ మహోన్నతి గ్రాఁగి పోదె?' 201

ప్రతిపదార్థం: న+విజిత= చక్కగా జయించబడని; ఇంద్రియ= అవయవాలయొక్క (కన్ను మొ॥) బల!= బలం కలవాడా!; కుత్సిత= కుచ్ఛితమైన; ఆత్మ= బుద్ధికలవాడా!; నీచ!= నీచుడా! (అధముడు); ఎట్లు= ఏ విధంగా; పాపంబు= పాపం; తొడరుటకున్= చేయటానికి; ఇయ్యకొంటి?= అంగీకరించావు?; నాదు= నా; గురుని కోప+అగ్నిచేన్= గురువుగారి కోపమన్న నిప్పుతో; నీదు= నీ; దేవగణ= దేవతా సమూహము యొక్క; విభుత్వ మహోన్నతి= రాచరికపు ఐశ్వర్యం; క్రాఁగిపోదె= నశించదా.

తాత్పర్యం: 'ఇంద్రియాలను అదుపులో పెట్టుకోలేనివాడా! అసహ్యామైన బుద్ధికలవాడా! నీచుడా! పాపం చేయటానికి ఎట్లా పూనుకొన్నావు? నీ దేవేంద్ర పదవి నా గురుకోపాగ్నికి బలి కాగలదు. జాగ్రత్త!

వ. అనిన విని దివ్యబోధంబున విపులుని యోగ బలంబు తెఱం గెఱింగి వెలవెలం బాఱు నబ్బలవైరి నాలోకించి యత్తపోధనుండు. 202

ప్రతిపదార్థం: అనినన్ విని= అని విపులుడు పల్కగా ఆలకించి; దివ్య= దేవతా సంబంధమైన; బోధంబునన్= జ్ఞానంతో; విపులుని; యోగబలంబు; తెఱంగు= సంగతి; ఎఱింగి= తెలిసి; వెలవెలన్‌పాఱు= భయంతో తెల్లబడు; ఆ+బలవైరిన్= బలుడనే రాక్షసుడిని చంపినవాడిని - ఇంద్రుడిని; ఆలోకించి= చూచి; ఆ తపోధనుండు= తపస్సే సంపదగా కల విపులుడు,

తాత్పర్యం: దివ్య జ్ఞానంతో ఇంద్రుడు విపులుడి యోగబలం తెలిసికొని భయంతో వెలవెల పోగా ఆ బలారిని చూచి విపులుడు.

క. 'ఏ నొల్లఁ గాక! భస్మము । గా, నిన్నుం జూతునే వికారీ!' యనుడుం
దా నెదురు పలుక కంత । ర్ధానము వెసఁ జేసె నతఁడు ధరణీనాథా! 203

ప్రతిపదార్థం: ఏను; ఒల్లన్+కాక= అంగీకరించను తప్ప; నిన్నున్; భస్మముకాన్= బూడిద అయ్యేటట్లుగా; చూతునే= చూడగలను కదా!; వికారీ!= వికారపు బుద్ధికలవాడా! అనుడున్= అనగా; తాను= ఇంద్రుడు; ఎదురు పలుకక= సమాధానం చెప్పక; అతఁడు= ఇంద్రుడు; అంతర్ధానమున్= అదృశ్యమగుటను; వెసన్= వెంటనే; చేసెన్= చేశాడు; ధరణీనాథా!= రాజా!

తాత్పర్యం: 'నా కిష్టంలేదు. లేకున్న నిన్ను భస్మంచేయనా? వికారపు బుద్ధి కలవాడా! అనగా ఏమీ మాటడలేక వెంటనే ఇంద్రుడు అంతర్ధానమైపోయాడు.

వ. తదనంతరంబ విపులుండు రుచిం బ్రబుద్ధం జేసి పదంపడి దేవశర్మ వచ్చిన నా శిష్యోత్తముండు వినయాచారంబు నడపి యేకాంతంబున నమ్మునితోడ. 204

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= అటు తరువాత; విపులుండు; రుచిన్= ముని పత్నిని; ప్రబుద్ధన్+చేసి= జాగ్రద్దశకు తెచ్చి (లేపి); పదంపడి= పిదప; దేవశర్మ= గురువు; వచ్చినన్= రాగా; ఆ శిష్య+ఉత్తముండు= ఆ గొప్ప శిష్యుడు; వినయ+ఆచారంబు= వినయంగా గురువుకు చేయవలసిన సేవ; నడపి= చేసి; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; ఆ మునితోడన్= గురువుతో.

తాత్పర్యం: తరువాత విపులుడు రుచిని జాగ్రత్‌స్థితికి తెచ్చి తరువాత గురువుగారు రాగానే వినయంతో నమస్కరించి ఏకాంతంలో.

తే. 'నాకపతి యిచ్చటికి వచ్చి, నాకతమునఁ । జిక్కువడి, మది భయమున సిగ్గు గదురఁ
జనియె' ననవుడు నాతఁడు సంతసిల్లి । యభిమతం బగు వరమిచ్చె నధిపవర్య! 205

ప్రతిపదార్థం: అధిపవర్య!= రాజశ్రేష్ఠుడా! నాకపతి= స్వర్గరాజు; ఇచ్చటికిన్= మన ఇంటికి; వచ్చి; నాకతమునన్= నావలన; చిక్కువడి= చిక్కులలోపడి, ఇబ్బందిపడి; మదిన్= మనస్సులో; భయమునన్= భయంతో; సిగ్గు; కదురన్= కలుగగా,

వ్యాపించగా; చనియెన్= వెళ్ళిపోయాడు; అనవుడున్= అనగా; ఆతఁడు= గురువు; సంతసిల్లి= సంతోషించి; అభిమతంబు+అగు= ఇష్టమైన; వరము+ఇచ్చెన్= వరమిచ్చాడు.

తాత్పర్యం: రాజా! శిష్యు డిట్లా చెప్పాడు. 'దేవరాజు ఇక్కడకు వచ్చి నావలన చిక్కుపడి భయంతో సిగ్గుతో వెళ్ళిపోయాడు' అని చెప్పగా గురువు సంతోషించి ఇష్టమైన వరా లిచ్చాడు.

వ. ఇచ్చినం బ్రీతుండై యవ్విపులుండు విపుల తపం బాచరించె; దేవశర్మయు దేవేంద్రుని వలని శంక దక్కి సుఖంబుండె; ఒక్కనాఁడయ్యాశ్రమంబు చక్కటి చదల దేవాంగన యోర్తు వోవ దాని చేతినుండి ప్రిదిలి భూరి పుష్పదామంబు. 206

ప్రతిపదార్థం: ఇచ్చినన్= ఇస్తే; ఆ+విపులుండు= ఆ విపులుడు; ప్రీతుండు+ఐ= సంతోషించి; విపులతపంబు= విస్తారమైన తపస్సు; ఆచరించెన్= చేశాడు; దేవశర్మయున్= మునికూడా; దేవ+ఇంద్రునివలని= దేవతలరాజునుండి; శంక= భయాన్ని; తక్కి= వదలి; సుఖంబు+ఉండెన్= సుఖంగా ఉన్నాడు; ఒక్కనాఁడు= ఒకరోజున; ఆ+ఆశ్రమంబు= ఆ ఆశ్రమంయొక్క; చక్కటి= నడినెత్తిపైన; చదలన్= ఆకాశంనుండి; దేవ+అంగన= దేవతా స్త్రీ; ఓర్తు= ఒకతె; పోవన్= పోగా; దానిచేతినుండి; ప్రిదిలి= జారి; భూరి= పెద్ద; పుష్ప= పూల; దామంబు= దండ. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: గురువు వరమిస్తే సంతోషించి శిష్యుడు గొప్ప తపస్సు చేశాడు. దేవశర్మకు దేవేంద్రుడినుండి ఇక ఏమీ ఆపదరాదని సుఖంగా ఉన్నాడు. ఇంతలో ఒకరోజున నడినెత్తిపైన ఆకాశంనుండి దేవతాస్త్రీ చేతిలో ఉన్న పూలదండ జారిపడింది.

ఆ. దివ్య పరిమళంబు, నవ్య వికాసంబు । నుల్లసిల్ల వచ్చి యుర్విఁ బడినఁ
గాంచి రుచి యుదీర్ణ కౌతుకచిత్తయై । దానిఁ బుచ్చికొనియె మానవేంద్ర! 207

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= మానవులకు ప్రభూ!; దివ్య పరిమళంబు= స్వర్గలోకంలోని వాసన; నవ్య= అపూర్వమైన; వికాసంబున్= కాంతి; ఉల్లసిల్లన్= వెదజల్లుతూ; వచ్చి; ఉర్విన్= భూమిమీద; పడినన్= పడగా; కాంచి= చూచి; రుచి; ఉదీర్ణ= అతిశయమైన; కౌతుక= కుతూహలం కల; చిత్తయై= మనస్సు కలదై; దానిన్= దండను; పుచ్చికొనియెన్= తీసికొన్నది.

తాత్పర్యం: రాజా! దివ్యమైన పరిమళం, నవ్యకాంతి కల ఆ పూలదండను భూమిమీదనుండి రుచి తీసుకొన్నది.

వ. తదవసరంబున వంగాధీశ్వరుం డగు చిత్రరథుం డయ్యాశ్రమంబున కరుగుదెంచె; అతనిదేవియు రుచియుఁ దోడంబుట్టువు లగుటంజేసి నిజగృహంబునం గలిగిన యుత్సవంబున కతండు రుచి సహితంబుగా దేవశర్మఁ బ్రార్థించి పిలిచినఁ జంపానగరంబున కరుగుచుండి రుచి గైసేసి యద్దివ్య కుసుమ దామంబునం గేశకలాపం బలంకరించుకొనినం దత్సమాగమ సమాచారంబు నడపి తద్భగిని తదీయ కుసుమ పరిమళంబున కచ్చెరువంది. 208

ప్రతిపదార్థం: తత్+అవసరంబునన్= ఆ సమయంలో; వంగ+అధీశ్వరుండు= వంగదేశానికి రాజు (వంగ= నేటి బెంగాల్); చిత్రరథుండు= అద్భుతమైన రథంగలవాడు, సూర్యునకు చిత్రరథస్వామి అనే పేరుంది; ఆ+ఆశ్రమంబునకున్; అరుగుదెంచెన్=

వచ్చాడు; అతని దేవియున్= అతడి భార్యా; రుచియున్= రుచీ; తోడంబుట్టువులు= ఒకే కడుపున పుట్టినవారు; అగుటన్+చేసి= అయినందువలన; నిజ= తన; గృహంబునన్= ఇంట్లో; కలిగిన= వచ్చిన; ఉత్సవంబునకున్= పండుగకు; అతండు= చిత్రరథుండు; రుచిసహితంబుగాన్= భార్యతోపాటుగా; దేవశర్మన్= దేవశర్మను; ప్రార్థించి= చక్కగా వేడికొని; పిలిచినన్= ఆహ్వానిస్తే; చంపా నగరంబునకున్= ఆ పేరుగల పట్టణానికి; అరుగుచుండి= పోతూ; రుచి; కైసేసి= అలంకరించుకొని; ఆ+దివ్య కుసుమ దామంబునన్= ఆ దేవతల పూలదండతో; కేశకలాపంబున్= జడముడిని; అలంకరించుకొనినన్= అలంకరించు కొనగా; తత్= వారి; సమాగమ= రాకకు చెందిన; సమాచారంబున్= విషయాన్ని; నడపి= ప్రవర్తింపజేసి; తత్+భగిని= రుచి సోదరి; తదీయ= ఆ; కుసుమ= పూల; పరిమళంబునకున్= వాసనకు; అచ్చెరువు+అంది= ఆశ్చర్యపడి.

తాత్పర్యం: ఆ సమయంలో వంగదేశపురాజు చిత్రరథుడనేవాడు భార్యతోసహా దేవవర్మ ఆశ్రమానికి వచ్చి తన భార్య - రుచి అక్కా చెల్లెళ్ళు కావటం వలన తమ ఇంట్లో ఒక ఉత్సవానికి రమ్మని దేవశర్మను అతని భార్యను ప్రార్థించగా చంపానగరానికి వారూ వెళ్ళారు. ఆ వెళ్ళేటప్పుడు రుచి తనకు దొరికిన పూలదండ నలంకరించుకొని పోయింది. ఆ పూలవాసన చూచి ఆమె సోదరి ఆశ్చర్యపడి.

విశేషం: ఆ దండ దొరికినరోజే సోదరి రావటం తటస్థించింది. ఇది కథలో స్పష్టంగా లేదు. లేదా ఆ పూలదండ దివ్యమైనది కనుక వాడిపోవటం, పరువం తప్పటం జరగనిదనీ అనుకొనవచ్చు.

ఆ. 'ఇట్టి సౌరభంబు నెన్నఁడు నెఱుఁగ; ని । ప్పువ్వు లెచటఁ గలిగెఁ బువ్వుబోఁడి!
యనినఁ 'గలిగె నస్మదాశ్రమంబున' నని । పలికి, దేవశర్మ పాలి కరిగి. 209

ప్రతిపదార్థం: ఇట్టి= ఇట్లాంటి; సౌరభంబున్= వాసనను; ఎన్నఁడున్= ఎప్పుడూ; ఎఱుఁగన్= తెలియను; ఈ+పువ్వులు= ఈ పుష్పాలు; ఎచటన్= ఎక్కడ; కలిగెన్= పూచాయి; పువ్వుబోఁడి= పూవువంటి మేనుగలదానా!; (పువ్వు+పోఁడిమి= పూలమెత్తదనంకల స్త్రీని పువ్వుబోఁడి అంటారు;) అనినన్= అంటే; అస్మత్= మా; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; కలిగెన్= పూచినవి; అని పలికి; దేవశర్మ పాలికిన్= దేవశర్మ దగ్గరకు; అరిగి= వెళ్ళి. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: 'ఇట్లాంటి వాసనగల పూలను ఎప్పుడూ చూడలేదు. ఇవి ఎక్కడివి? అని అడుగగా మా ఆశ్రమంలో ఉన్నా' యని చెల్లెలికి చెప్పి రుచి భర్త దగ్గరకు వెళ్ళి.

వ. రుచి యప్పువ్వులకుం దన చెలియలు వేడుక పడుట యెఱింగించిన, నమ్మహానుభావుండు విపులుని రావించి యత్తెఱంగు దేట పడం బలికి 'యిట్టి కుసుమంబులు గొనిరావలయు' నని పలికిన నతం డప్పువ్వులు గనిన చోటు రుచి నడిగి చెప్పించుకొని గురుప్రభావంబును నిజతపశ్శక్తియు నూఁది యప్పనిపూని చనియె; దైవికంబయి యచ్చట నెప్పటి చందంబు పుష్ప దామంబున్నం బుచ్చికొని వచ్చునప్పు డొక్కయెడ నారీ పురుషలొండొరుల చెట్టలు వట్టికొని చక్రభ్రమణభంగిఁ దిరుగుచుండి యొకళ్ళొకళ్ళగతి యొప్పదని పలికి కాలుదొడరితి, కడువేగ తిరిగి తని వివాదంబు పుట్టి యందొకం డేనట్లు సేసితినేనిం బరలోకంబున విపులుని చన్నగతికిం జనుదునని శపథంబు సేసిన, నమ్మాట వినుచు విపులుండు అట సనంజన మఱియు మార్గంబున నార్వురు జూదంబాడుచుండ వాదైన యొకం డట్ల యొట్టిడిన నప్పలుకు నాకర్ణించి యత్తపోధనుండు

చిత్తంబున విషాదంబు గదుర నేమి దోషంబు సేసితి నొకో!' యని విచారించి రుచి శరీరంబునందుఁ బ్రవేశించుట గురునకు నెఱింగింపమి గానోపునని తలంచుచు నరుగుదెంచి యక్కుసుమ మాలిక యొప్పించినం గైకొని యమ్మునివరుండు మఱఁదలి కొసంగి సంతోషం బొలయించెఁ, దదనంతరంబ తమయంతనున్న యవసరంబున నగ్గురుం డా శిష్యునితో నిట్లనియె. 210

ప్రతిపదార్థం: రుచి; ఆ+పువ్వులకున్= ఆ పుష్పాలకు; తన చెలియలు= తన చెల్లెలు; వేడుకపడుట= ముచ్చటపడుట; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+మహా+అనుభావుండు= గొప్పవ్యక్తిత్వంగల దేవశర్మ; విపులునిన్; రావించి= పిలిపించి; ఆ+తెఱంగు= ఆ విషయం; తేటపడన్= స్పష్టంగా; పలికి= చెప్పి; ఇట్టి కుసుమంబులు= ఇలాంటి పూలు; కొనిరావలయున్= తప్పకతీసికొని రావాలి; అనిపలికినన్; అతండు= విపులుడు; ఆ+పువ్వులు; కనినచోటు= చూచిన ప్రదేశం; చెప్పించుకొని= రుచి చెప్పగా తెలిసికొని; గురు ప్రభావంబును= గురుని మాహాత్మ్యం; నిజ= తన; తపః+శక్తియున్= యోగబలం; ఊఁది= ఆధారంగా గ్రహించి; ఆ+పనిపూని= ఆ పనికై ఉద్యమించి, ఆ పనిచేయుటకు అంగీకరించి; చనియెన్= పోయాడు; దైవికంబు+అయి= అదృష్టవశాత్తు; అచ్చటన్= ఆ ప్రదేశంలో; ఎప్పటిచందంబు= ఎప్పటివలెనే; పుష్ప= పూల; దామంబు= దండ; ఉన్నన్= ఉండగా; పుచ్చికొని వచ్చునప్పుడు; ఒక్క+ఎడన్; నారీ పురుషులు= స్త్రీ పురుషులు; ఒండు+ఒరుల= ఒకరినొకరు; చెట్టలు పట్టుకొని= చేతి దండలు పుచ్చుకొని; చక్ర భ్రమణ భంగిన్= రథచక్రం తిరిగేటట్లు; తిరుగుచున్+ఉండి= తిరుగుతూ; ఒకళ్ళు= ఒకరు; ఒకళ్ళ= మరొకరి; గతి= ఆట, పద్ధతి; ఒప్పదు= సరికాదు; అనిపలికి; కాలు+తొడరితి= కాలుపెట్టావు; కడున్+వేగ= మిక్కిలివేగంగా; తిరిగితి(వి)= తిరిగావు; అని; వివాదంబు= వాదం, తగవులాట; పుట్టి= కలిగి; అందున్= వారిద్దరిలో; ఒకండు= ఒకడు; ఏను+అట్లు+చేసితిన్+ఏనిన్= ఆ విధంగా నేను చేసినట్లయితే; విపులునిచన్న గతికిన్= విపులుడు పోయిన స్థితికి; చనుదును+అని= పోతానని; శపథంబు= ప్రతిజ్ఞ; చేసినన్; ఆ+మాట; వినుచున్= ఆలించుచు; విపులుండు; అట= అక్కడ; చనన్+చనన్= పోగా పోగా; మఱియున్= ఇంకా; మార్గంబునన్= దారిలో; ఆర్వురు= ఆరుగురు; జూదంబు+ఆడుచున్+ఉండన్; వాదు= తగవు; ఐనన్= ఏర్పడగా; ఒకండు; అట్లు+అ= పై విధంగానే; ఒట్టు+ఇడినన్= ఒట్టుపెట్టగా; ఆ+పలుకు= ఆ మాట; ఆకర్ణించి= విని; ఆ+తపోధనుండు= ఆ యోగి, (విపులుడు) చిత్తంబునన్= మనస్సులో; విషాదంబు= దుఃఖం; కదురన్= కలుగగా; ఏమిదోషంబు= ఏమితప్పు; చేసితిన్+ఒకో= చేశానోకదా! అని విచారించి= అని ఆలోచించి; రుచి శరీరంబు+అందున్+ప్రవేశించుట; గురునకున్; ఎఱింగింపను= చెప్పక పోవటం; కానోపు= కావచ్చు; అనితలంచుచున్; అరుగుదెంచి= వచ్చి; ఆ+కుసుమమాలిక= ఆ పూలదండను; ఒప్పించినన్= ఇవ్వగా; కైకొని= తీసికొని; ఆ+మునివరుండు; మఱఁదలికిన్+ఒసంగి= భార్యచెల్లెలికిచ్చి; సంతోషంబు; ఒలయించెన్= కల్గించాడు; తత్+అనంతరంబు+అ= ఆ తర్వాత; తమ+అంతన్+ఉన్న= ఏకాంతంగా ఉన్న; అవసరంబునన్= వేళలో; ఆ+గురుండు; ఆ శిష్యునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: రుచి తన చెల్లెలి కా పువ్వులు కావాలని చెప్పగా, ఆయన విపులుడితో పూలు తెమ్మని చెప్పాడు. అతడు రుచి నడిగి ఆ పూ లెక్కడ దొరుకుతాయో తెలిసికొని అక్కడకు వెళ్ళాడు. దైవికంగా ఆ పూలదండ అక్కడ కన్పించింది. అది తీసికొని వస్తూ ఉండగా దారిలో ఒక జంట నాట్యం చేస్తూ ఒకరు వేసిన అడుగు మరొకరు తప్పంటే - కాదంటూ వాదాడుకోగా, వారిలో ఒకరు నేను తప్పు చేస్తే విపులుడు పోయేగతికి పోతానని శపథం చేశాడు. విపులు డది వింటూ ముందుకు సాగిపోయాడు. దారిలో ఆరుగురు జూదమాడుకొంటూ ఉండగా వారిలో వారికి వాదు కలిగింది. అందులో ఒకడు పై రీతిగానే ఒట్టు పెట్టుకొనటం విపులుడు విన్నాడు. 'విని నే నేమి తప్పు చేశానో అనుకొంటూ వచ్చి గురువుగారికి దండ నప్పగించాడు. గురువు తన మరదలికి ఆ దండ నిచ్చి సంతోషపెట్టాడు. గురువు ఏకాంతంగా ఉండగా శిష్యుడితో ఇట్లా అన్నాడు.

క. 'తెరువున నొక మిథునము, జూ। దరులను గనుఁగొంటి, నీ వధర్మము నీయం
దరసి కనిన వారై పలి। కిరి వారల నెఱుఁగుదే యకిల్బిషచరితా! 211

ప్రతిపదార్థం: అకిల్బిష చరితా!= పాపంలేని నడవడి కలవాడా!; తెరువునన్= మార్గంలో; నీవు; ఒక; మిథునము= జంట, భార్యా భర్తలు; జూదరులను= జూదమాడే వారిని; కనుఁగొంటి= చూచావు కదా; అధర్మము= ధర్మవ్యతిరేకత; నీయందున్= నీలో; అరసి= విచారించి; కనిన వారు+ఐ= చూచిన వారై; పలికిరి= అన్నారు; వారలన్= వా రెవ్వరో; ఎఱుఁగుదే?= తెలుసా?

తాత్పర్యం: పాపం లేనివాడా! నీ వచ్చే దారిలో ఒకజంట, ఆరుగురు జూదరులు కనిపించారు కదా! నీపై అధర్మాన్ని ఆరోపించారే - వా రెవరో తెలిసికొన్నావా?

విశేషం: తిక్కన్నగారు వాడే సంబోధనలు చాలా అర్థవంతంగా ఉంటాయి. అవి కథను, పాత్రను, వారితత్త్వాన్ని, ఆలోచనలను బోధించేవిగా వాడటమే అర్థవంతంగా ఉండటమంటే. కథారంభంనుండి విపులుడికి వాడిన విశేషణాలు.

183. 'వికసన్మతి' - ఇది మొదటి సంబోధన. కథ మొదలు కాబోతూ ఉండగా వాడిన ఈ సంబోధన కథలో అతడెంత పవిత్రంగా, పరిపక్వ బుద్ధిఅయి ప్రవర్తించేదీ సూచించేదిగా ప్రయోగించబడింది.

186. 'దృఢావధాన!' - మంచి కట్టుదిట్టమైన జాగ్రత్త కలవాడా! తన భార్య నెట్లా రక్షించాలో ఈ సంబోధనమే చెప్పుతున్నది. తరువాత కథలో అత డెలా రక్షించాడో మనకు తెలిసింది.

201. ఇంద్రుడిని నిందిస్తూ విపులుడు వాడిన మాటలు. అవిజితేంద్రియబల - జితేంద్రియుడని వాడటం తప్ప ఇట్లా లేదు. ఇంద్రుడి బలమంతా ఏమిటి? కామాదుల ప్రేరణకు లోబడి యథేచ్ఛగా ప్రవర్తించటం, విచ్చలవిడితనమే వాడి బలం. ఇంద్రుడంటే - ఇంద్రియాలపై అజమాయిషీ చేసే దేవుడని అర్థం కనుక. ఈ సంబోధన చాలా అర్థవంతం. మనిషికూడా ఇంద్రియాలకు లోబడిపోవటానికే కారణం ఇంద్రియాధిదేవత అయినవాడే వాటికి లోబడి పోతున్నాడు కనుక మనిషి లెక్కేమిటని అర్థం. కనుకనే ఇంద్రజాల మన్నమాట పుట్టింది. ఇంద్రుడు మనపై వేసిన వల. ఇంద్రియాలకు లోబడటమే వలలో పడటం.

211. అకిల్బిష చరితా! - పై 210 వచనంలో విపులుడు మనస్సులో బాధపడటం చెప్పబడింది. నావలన ఏ తప్పు జరిగిందో అని. దానిని తీసివేయటానికి అకిల్బిషచరితా అనే ఈ సంబోధన ఉపయోగించబడింది.

తే. నీవు రుచిఁ గాచు నప్పటి నిపుణ వృత్తి। నాకు నెఱిఁగింపకునికి యన్యాయముగఁ ద
లంచిరో? లేక దానిఁ గల్మషము గాఁగ। నేను దలఁచిన శాప మీ నెట్లు నీకు? 212

ప్రతిపదార్థం: నీవు; రుచిన్; కాచు= రక్షించు; అప్పటి= వేళ; నిపుణవృత్తిన్= నైపుణ్యంతో - నేర్పుతో; నాకున్; ఎఱిఁగింపక+ ఉనికి= తెలుపకపోవటం; అన్యాయముగన్= న్యాయం కాదని; తలంచిరో?= అనుకొన్నట్లున్నారేమో! లేక; దానిన్= నీవు చేసిన పనిని; నేను; కల్మషముకాఁగన్= పాపమని; తలఁచినన్= అనుకొంటే; నీకున్; ఎట్లున్= ఏ విధంగానైనా సరే; శాపమున్= శాపాన్ని; ఈను= ఇవ్వను (ఇచ్చేవాడినే).

తాత్పర్యం: నీవు నైపుణ్యంతో రుచిని రక్షించిన విధానం (ఆమె శరీరంలో ప్రవేశించటం) నాకు చెప్పకపోవటం అన్యాయ మనుకొని ఉంటారు వారు. కాని, అది పాపమైతే నీకు ఎట్లాగైనా సరే శాప మిచ్చి ఉండేవాడినే కదా!

విశేషం: న్యాయం - సాంఘిక ధర్మం - దానిని ఉల్లంఘించడం అన్యాయం.

ధర్మం : సకల ప్రపంచానికీ, భగవంతుడికీ, తనకూ ఉన్న సంబంధం. ఇది ఆత్మ ధర్మం.

కనుకనే సామాజిక ధర్మం యొక్క ఉల్లంఘనం - తాను గురు భార్యా శరీరంలో ప్రవేశించిన విషయం గురువుగారికి చెప్పకపోవటం - చేయటం. కానీ ఆత్మ ధర్మోల్లంఘనం కాదు. కాబట్టి పాపం లేదు. ఇందుకని కవి 'కల్మషముగా౯గ' - గురువనుకోలేదు.

వ. అప్పని పాపంబు గాకుండ వరం బిచ్చితి నది మఱవు; మమ్మిథునంబు లహోరాత్రంబులు, నయ్యార్వురు ఋతువులు' అని పలికిన గురునిబోధనంబునకు నాశ్చర్యంబును బ్రసాదంబునకుఁ బ్రమోదంబునుం బొందు శిష్యునితో నతండు వెండియు. 213

ప్రతిపదార్థం: ఆ+పని= ఆ కార్యం; పాపంబుకాక+ఉండన్= పాపం కాకుండా; వరంబున్; ఇచ్చితిని; అది; మఱవుము= మరిచిపొమ్ము; ఆ+మిథునంబులు= ఆ దంపతులు; అహః+రాత్రంబులు= పగలు, రేయి; ఆ+ఆర్వురు= ఆ ఆరుగురు; ఋతువులు= వసంతాది ఋతువులు; అని పలికిన గురుని; బోధనంబునకున్= జ్ఞానానికి; ఆశ్చర్యంబును; ప్రసాదంబునకున్= దయకు; ప్రమోదంబునున్= ఆనందం; పొందు శిష్యునితోన్; అతండు= గురువు; వెండియున్= మరల.

తాత్పర్యం: ఆ పని పాపం కాకుండా వర మనుగ్రహిస్తున్నాను. దాని సంగతి మరిచిపొమ్ము. ఆ జంట రేయింపగళ్ళు ఆ యారుగురు ఋతువులు' అని చెప్పిన గురువుగారి జ్ఞానానికీ, వర మనుగ్రహించిన దయకూ సంతోషిస్తున్న శిష్యుడితో గురు వింకా అంటున్నాడు.

విశేషం: ఆదిపర్వంలో ఉదంకుడి కథలో కూడా ఈ విషయమే వస్తుంది. "సిత+అసిత తంతు సంతాన పటంబు ననునయించువారి నిద్దఱ స్త్రీలను, ద్వాదశ+అర చక్రంబుఁ బరివర్తించుచున్నవారి నార్వురఁ గుమారులను" 1-117.

దీన్ని వివరిస్తూ 118వ పద్యంలో - సిత తంతువు = తెల్లదారం, అసితతంతువు= నల్లదారంతో నేసే వస్త్రం - పగలు రేయి, అనీ, ఆర్వురు కుమారులు 6 అరలున్న చక్రం - 6 ఋతువుల కాలచక్రమనీ - చెప్పాడు కవి. రెంటినీ పోల్చి చూచుకొనవచ్చును.

తే. దినము, రాత్రియు, ఋతువులు, మనుజు చేయు। సుకృతమును దుష్కృతంబును జూచుచుండుఁ
గాని, యెంత రహస్యపుఁ గార్యమైన। నొరు లెఱుంగరు న న్నని యునికి మోస.' 214

ప్రతిపదార్థం: దినము= పగలు; రాత్రియున్= రాత్రీ; ఋతువులు; మనుజుచేయు= మనిషి చేసే; సు+కృతమును= మంచిపని; దుస్+కృతంబును= చెడ్డపనీ; చూచుచున్+ఉండున్= చూస్తూ ఉంటాయి; కాని; ఎంత= ఎట్లాంటి; రహస్యపు కార్యము= రహస్యపు పని; ఐనన్= అయినా; నన్నున్= చేస్తున్న నన్ను; ఒరులు= ఇతరులు; ఎఱుంగరు= తెలిసికొనలేరు; అని= అనుకొంటూ; ఉనికి= ఉండుట; మోస= మోసం.

తాత్పర్యం: రేయింబవళ్ళు, ఋతువులు - మనిషి చేసే మంచిపనీ చెడ్డపనీ చూస్తూ ఉంటాయి. కాని నేను చేస్తున్న ఈ రహస్యకార్యం ఎవరూ చూడటం లేదనుకొంటే మోసపోతావు సుమా!

విశేషం: ఇది చాలా గొప్ప విషయం. మనిషి ప్రకృతినుండి వస్తున్నాడు. తనకంటె అది పెద్దది. కనుక దాని కళ్ళకు దాని

సంతానం మనిషి గంతలు కట్టలేదు. ఇది ఆనాటి మనిషిభావన. నే డది పోవటం వలననే అనేక రకాల అన్యాయాలు జరుగుతున్నాయి.

ఇట్లాగే దుష్యంతోపాఖ్యానంలోనూ శకుంతల దుష్యంతుడితో అంటుంది. పోల్చి చూచుకొనవచ్చును.

వ. అనిన మఱియును. **215**

తాత్పర్యం: అని ఇంకా.

క. 'స్త్రీ రక్ష సూక్ష్మ మీ వ । ట్లేరూపున నైన వంశహీనత మమ్మం
జేరక యుండం దగఁ బరి । హారము సేసి; తది యేల యవగుణ మయ్యెన్? **216**

ప్రతిపదార్థం: స్త్రీ రక్ష= స్త్రీని కాపాడటం; సూక్ష్మము= కష్టం; ఈవు= నీవు; అట్లు= ఆ విధంగా; ఏ రూపునన్+ఐనన్= ఏ విధంగానైనా; మమ్మున్= మా దంపతులను; వంశహీనత= కులహీనత; చేరక+ఉండన్= చేరకుండా; తగన్= చక్కగా; పరిహారము= తొలగించటం; చేసితి= చేశావు; అది; ఏల= ఎందుకు; అవగుణము= చెడ్డగుణం, అయ్యెన్= ఐనది?

తాత్పర్యం: 'స్త్రీని కాపాడటం చాలా కష్టం. నీ వా విధంగా మాకు కులం తక్కువతనం రాకుండా కాపాడావు. అది మంచిదే తప్పు చెడ్డది కాదు.

విశేషం: కథ స్త్రీ రక్షణ కష్టమని చెప్పటం కొరకని వచ్చింది కనుక ఇది ముగింపు.

వ. దాని తెఱంగు నా కెఱింగింపకున్న నేమి?' అనుపలుకు వలికి దేవశర్మ విపులు నుల్లం బూరడిల్లం జేసె. అవ్వధూవరులును, విపులుండును బుణ్యలోకంబులు వడసిరి, పాండవాగ్రజా! తెఱవల తెఱంగెఱింగించితి వారి రక్షించుటయు నిట్లరిదియై యుండు' నని చెప్పి భీష్ముండు. **217**

ప్రతిపదార్థం: దాని తెఱంగు= రక్షణ విషయ విధానం; నాకున్; ఎఱింగింపక= చెప్పక; ఉన్నన్= ఉన్నంత; ఏమి= ఏమైనది; అనుపలుకు= అన్నమాట; పలికి= చెప్పి; విపులు= విపులుడియొక్క; ఉల్లంబు= మనస్సును; ఊరడిల్లన్+చేసెన్= ఊరట పొందేటట్లు చేశాడు; ఆ వధూవరులును= ఆ భార్యాభర్తలు; విపులుండును; పుణ్యలోకంబులు= స్వర్గం; పడసిరి= పొందారు; పాండవ+అగ్రజా!= పాండవులలో పెద్దవాడా!; తెఱవల= స్త్రీల; తెఱంగున్= పద్ధతి; ఎఱింగించితిన్= చెప్పాను; వారిన్= వారిని; రక్షించుటయున్= కాపాడటం; ఇట్లు; అరిది= సూక్ష్మం; ఐ, ఉండునని చెప్పి భీష్ముండు.

తాత్పర్యం: రుచిని రక్షించిన విషయం చెప్పనంతమాత్రాన ఏమైనది? అని శిష్యుడిని ఊరడించాడు గురువు. గురువూ, అతడి భార్యా, శిష్యుడూ మరణించి పుణ్య లోకాలకు పోయారు. ధర్మరాజా! స్త్రీ సంగతి చెప్పాను. వారిని రక్షించటం కష్టమనీ చెప్పాను.' అని భీష్ముడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'పలువురు గ్రీడింతురు, భూ । వలయాధిప ! యరయ మంచివారును గల; ర
క్కులధర్మ సతులకతమున । నిల నిరపాయత్వ మొంది, యెసకం బెసఁగున్. **218**

ప్రతిపదార్థం: భూ+వలయ+అధిప= భూ చక్రమునకు రాజా!; పలువురు= అనేకులు; క్రీడింతురు= యథేచ్ఛగా తిరుగుతారు; అరయన్= జాగ్రత్తగా విచారిస్తే; మంచివారును= (స్త్రీలలో) మంచివారు కూడా; కలరు= ఉంటారు; ఆ+కుల ధర్మసతుల= మంచివంశంలో పుట్టి అగ్నిసాక్షిగా వివాహమైన పతివ్రతల; కతమునన్= కారణంచేత; ఇల= భూమి; నిర్+అపాయత్వమున్= అపాయం లేనితనమును; ఒంది= పొంది; ఎసకంబు+ఎసఁగున్= అతిశయంగా ప్రకాశిస్తూ ఉన్నది.

తాత్పర్యం: 'రాజా! స్త్రీలలో పలువురు యథేచ్ఛగా సంచరిస్తారు. కాని, చూస్తే వారిలోనూ మంచివా రుంటారు సుమా! ఆ కులసతుల వలననే ఈ లోకం పచ్చగా ఉన్నది.

క. పాతివ్రత్యము గలిగిన । నాతి యనఁగ దైవ మన జనస్తుత! వేఱే?
యాతత ధర్మార్థ సుఖ । ఖ్యాతులు, సద్భార్యవలనఁ గాదే కలుగున్.' 219

ప్రతిపదార్థం: పాతివ్రత్యము= పతినే దైవంగా ఆరాధించే వ్రతం; కలిగిన; నాతి= స్త్రీ; అనఁగన్; దైవము= దేవుడు; అనన్, జనస్తుత!= లోకంతో నుతింపబడు రాజా!; వేఱే?= వేరా? కాదు ఒకరే (పతివ్రతే దైవం); ఆతత= విస్తారమైన; ధర్మ= ధర్మము; అర్థ= ధనం; సుఖ= సుఖము; ఖ్యాతులు= కీర్తులు; సత్=మంచి; భార్యవలనన్= పత్నివలననే; కాదే= కదా; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: జననుతుడవైన ధర్మజా! పతివ్రతకూ దైవానికీ భేదం లేదు. సద్భార్యవలననే పురుషార్థ సిద్ధి. ధర్మం, అర్థం, సుఖం, కీర్తి ఇవన్నీ పురుషుడికి ఆమెవలననే లభిస్తాయి కదా!'

విశేషం: ఇది స్త్రీ ప్రశంస. భారత మొక చిత్రమైన ఇతిహాసం. లోకంలో ఏ విధంగా మంచి చెడులు మనిషిని ఆశ్రయించుకొని ఉంటాయో అదే విధంగా స్త్రీలలో ఈ రెండు పార్శ్వాలు. అట్లాగే పురుషులలోనూ (ధర్మరాజు, దుర్యోధనుడు) ఉంటాయని చూపించటమే వైచిత్రి. కనుక రేయింబవళ్ళ వలె; స్త్రీలలో చెడువారివలె మంచివారూఉన్నారు. ఆ తల్లుల ఉనికి వలననే ఈ భూమి పచ్చగా ఉన్నది - అన్న వాక్యంతో చేసిన ముగింపు చాలా అద్భుతం.

భీష్ముఁడు ధర్మజునకు గాంధర్వాది వివాహ పద్ధతులఁ తెఱఁ గెఱింగించుట (సం.13-41-1)

వ. అనిన విని యజ్ఞనపతి జాహ్నవీనందనుతోఁ 'గన్యావరణ ప్రకారంబు విచారణీయం బైన కృత్యంబు; దాని తెఱం గెఱింగింపవే' యనుటయు, నతం డతని కిట్లనియె. 220

ప్రతిపదార్థం: అనినన్‌విని; ఆ+జనపతి= ఆ నరేశ్వరుడైన ధర్మజుడు; జాహ్నవీ= గంగయొక్క; నందనుతోన్= కొడుకుతో; కన్యావరణ ప్రకారంబు= వధువు నెన్నుకొనే పద్ధతి; విచారణీయంబు= ఆలోచించదగ్గది ఐన; కృత్యంబు= పని; దాని తెఱంగు= దాని విధము, ఎఱింగింపవు+ఏ= తెల్పవా? అనుటయున్= అనిప్రశ్నించగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పగా విన్న ఆ రాజు గంగకొడుకుతో అన్నాడు. 'వధువును ఎంచుకొనే పద్ధతి ఆలోచించదగ్గ విషయం. కనుక దాని సంగతి చెప్పుము' అనగా ఆయన ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'కులమును, శీలము, విద్యయు । గలవానిం బిలిచి , ప్రీతిఁ గన్నియ నీఁ గా
వలయు, నుదక ప్రదానా । కలితంబుగ; బ్రాహ్మ కర్మ గతి యిది యధిపా! 221

ప్రతిపదార్థం: అధిపా!= (ధర్మాన్ని) అధిష్ఠించి పాలించేవాడా!; కులమును= మంచి సంసారంగల కుటుంబం; శీలమున్= పవిత్రమైన ప్రవర్తన, స్వభావం; విద్యయున్= చదువూ; కలవానిన్= ఉన్నవాడిని; పిలిచి= ఆహ్వానించి; ఉదక= నీరు; ప్రదాన= ఇచ్చుట; కలితంబుగన్= కూడుకొనేటట్లుగా; కన్నియన్= కూతురును; ప్రీతిన్= ప్రేమతో; ఈఁగాన్ వలయున్= ఇవ్వాలి; ఇది; బ్రాహ్మ= బ్రాహ్మణ లేదా వైదిక; కర్మ గతి= కర్మ విధానం.

తాత్పర్యం: మంచికులం, శీలం, విద్య ఉన్న వరుడిని చూచి సాదరంగా పిలిచి ప్రేమతో కన్యను ఉదకధారా పూర్వకంగా కన్యాదానం చేయాలి. ఇది వైదిక కర్మ. వేదోక్తమైన బ్రాహ్మ వివాహం.

ఆ. క్షాత్ర మండ్రు బుధులు, గన్య పురుషుఁ గోర । నతఁడు గన్య మీఁద నాస సేయ,
నచల మగు పరస్పరానురాగము గని । ప్రమదమెసఁగఁ జేయు పరిణయంబు. 222

ప్రతిపదార్థం: కన్య= వధువు; పురుషున్= వరుని; కోరన్= కోరితే; అతఁడున్= వరుడున్నూ; కన్య మీఁదన్= కన్నెపై; ఆస చేయన్= ఆశపడితే; అచలము+అగు= చలనంలేని; పరస్పర అనురాగమున్= ఒకరిపై ఒకరికి కల ప్రేమను; కని= చూచి; ప్రమదము= సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా; చేయు= చేసే; పరిణయంబు= వివాహం; బుధులు= పండితులు; క్షాత్రము= క్షత్రియ సంబంధమని; అండ్రు= అంటారు.

తాత్పర్యం: కన్య వరుడిని కోరుకొనటం, వరుడు కన్యను కోరుకొంటూ ఉండటంతో వారిరువురి నడుమ గట్టిదైన అనురాగం గోచరించటంవలన వారిరువురికి జరిగే వివాహం క్షాత్రవివాహం.

విశేషం: వధూవరులు ప్రేమించుకొనటం చూచి చేసిన వివాహం క్షాత్రం. ఇదే నేడు మనం గొప్పదిగా చెప్పుకొనే ప్రేమవివాహం. బ్రాహ్మం వైదిక కర్మ ప్రధానం. ఇది ప్రేమ ప్రధానం. ఇందులో వ్యక్తి ప్రాధాన్యం. అందులో కర్మప్రాధాన్యం. ఈ భేదం గమనించాలి. మనదేశంలో మొదటి దానికే ప్రాధాన్యమున్నది.

క. కన్ను మనంబును దనిసిన । గన్నియ యెవ్వానిఁ గోరు గాంధర్వం బా
యన్ను నతని కిచ్చుట, వెల । వన్నుట యాసురము సూవె పౌరవముఖ్యా! 223

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా= పురువంశంలో శ్రేష్ఠుడా!; కన్ను; మనంబును= మనసు; తనిసిన= తృప్తిపడిన; కన్నియ= వధువు; ఎవ్వానిన్= ఎవరిని; కోరున్= కోరుకొంటుందో; ఆ అన్నున్= ఆ స్త్రీని; అతనికిన్= కోరినవాడికి; ఇచ్చుట= వివాహం చేయటం; గాంధర్వంబు= గంధర్వులకు సంబంధించింది కనుక దానికా పేరు; వెల పన్నుట= కట్నం కావాలనటం; ఆసురము= అసుర సంబంధమైనది; సూవె= సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! కన్నెను తాను కోరుకొన్న వాడి కిచ్చి చేసే వివాహం గాంధర్వం. కట్నంతో చేసికొనేది ఆసురం.

విశేషం: గంధర్వ అంశతో మనిషికి సౌందర్యం వస్తుంది. సంగీతం వస్తుంది. గంధర్వులు కళా - సౌందర్య ప్రియులు.

క. బలిమి మెయి వరుఁడు గన్నెకుఁ । గలవారిం బొడిచి, కరము క్రౌర్యంబున, న
ప్పొలఁతుక దుఃఖింపఁగ, వా । రలు వొగులఁగఁ, దెచ్చికొనుట రాక్షసము నృపా! 224

ప్రతిపదార్థం: నృపా!= రాజా! (నృ= మనుష్యులకు; ప= పాలకుడు); బలిమి మెయిన్= బలంతో; వరుఁడు= మగవాడు; కన్నెకున్; కలవారిన్= కన్యా బంధువులైన వారిని; పొడిచి= చంపి, జయించి; కరము= మిక్కిలి; క్రౌర్యంబునన్= క్రూరత్వంతో; ఆ పొలఁతుక= ఆ కన్య; దుఃఖింపఁగన్= ఏడ్వగా; వారలు= బంధువులు; పొగులఁగన్= ఏడ్వగా; తెచ్చికొనుట= బలవంతంగా లాక్కొనిరావటం; రాక్షసము= రాక్షసమన్న పేరు గల వివాహం;

తాత్పర్యం: రాజా! బలవంతంగా కన్నె నెత్తుకొనిపోయి క్రూరంగా ఆమె బంధువులను చంపి, వాళ్ళంతా ఏడుస్తూ ఉండగా చేసికొనే వివాహం రాక్షసం.

వ. ఇట్లు సెప్పంబడునట్టి. 225

తాత్పర్యం: ఈ విధంగా చెప్పబడే.

ఆ. అయిదు దెఱఁగులందు నారయ మూఁడు వి । ధములు ధర్మకృతులు ధర్మపుత్ర!
యాసురంబు రాక్షసాహ్వయంబును ధర్మ । దూర సంవిధాన దూషితములు. 226

ప్రతిపదార్థం: ధర్మపుత్ర!= యముని కుమారుడా!; అయిదు తెఱఁగులందున్= అయిదు రకాల వివాహాలలో; ఆరయన్= విచారిస్తే; మూఁడు విధులు= మొదటి మూడు పద్ధతులు; ధర్మకృతులు= ధర్మ సహితాలైన విధులు; ఆసురంబున్; రాక్షస+ఆహ్వయంబును= ఆసుర, రాక్షసమన్న పేర్లు కలవి; ధర్మదూర= ధర్మానికి దూరంగా ఉండే; సంవిధాన= పద్ధతితో; దూషితములు= కలుషితాలు (ధర్మక్రమానికి దూరమైనవని తాత్పర్యం)

తాత్పర్యం: ధర్మరాజా! ఈ ఐదు రకాలలో మొదటి మూడు ధర్మవివాహాలు; మిగిలినవి రెండూ ధర్మానికి దూరంగా ఉండే పద్ధతితో కూడుకొన్నందున కలుషితాలు.

విశేషం: బహుశా రాక్షస - ఆసురములు అతి ప్రాచీన ఆటవిక జాతులలో ఆచారాలై ఉండవచ్చును. స్త్రీలు తక్కువగా ఉండే జాతులలో ఇట్లాంటి ఆచారాలు వచ్చే అవకాశ మెక్కువ కనుక ఇట్లాంటివి సంభవిస్తా యంటారు పరిశోధకులు.

తే. మాతృ పితృ హీనయైనను, భ్రాతృరహిత । భావ మొందిన నబ్బాల పరిణయార్థ
వరణమున కర్హ గా దని, కురుకులాగ్ర । గణ్య! చెపుదురు పరిణయకల్పవిదులు. 227

ప్రతిపదార్థం: కురుకుల=కౌరవకులంలో; అగ్రగణ్య!= మొదట ఎన్నదగ్గవాడా! మాతృ= తల్లి; పితృ= తండ్రి; హీనఐననున్= లేనిదైనా; భ్రాతృ= సోదర; రహిత భావము= లేనితనం; ఒందినన్= పొందితే; ఆ బాల= ఆ కన్య; పరిణయార్థ వరణమునకున్= వివాహం కొరకు ఎన్నికకు; అర్హ కాదు= తగినది కాదు; అని; పరిణయకల్ప= వివాహశాస్త్ర విధానం ; విదులు= తెలిసినవారు; చెపుదురు= చెప్తుతారు;

తాత్పర్యం: తల్లీ, తండ్రీ, అన్నా లేని పిల్లను వివాహానికి ఎన్నుకొనకూడదని వివాహశాస్త్రవేత్తలు చెప్తుతారు.

విశేషం: అట్లాంటి దురదృష్టవంతురాలు మెట్టినింటినీ అట్లాగే చేస్తుందన్న భావంతో ఈ నిషేధం వచ్చి ఉంటుంది.

ఆ. ఆత్మజాతియందు, నవుల జాతులు రెంటఁ । గ్రమవివాహ మొప్పు బ్రాహ్మణునకు
ననఘ! శూద్రవనితయందు నాతని కప । త్యంబు గలిమి పాప మనియుఁ గలదు. 228

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= విప్రకులంలో పుట్టిన వాడికి; ఆత్మ= తనయొక్క; జాతి యందున్= వర్ణంలో; అవులజాతులు రెంటన్= తరువాతి రెండు వర్ణాలలో (క్షత్రియ - వైశ్య జాతులలో); క్రమ= క్రమంగా - సక్రమంగా; వివాహము= పెండ్లి; ఒప్పున్= ఒప్పుతుంది; అనఘ!= పుణ్యాత్ముడా!; ఆతనికిన్= ఆ బ్రాహ్మణుడికి; శూద్రవనితయందున్= శూద్ర స్త్రీ వలన; అపత్యంబు= సంతానం; కలిమి= కలిగి ఉండటం; పాపము= సక్రమం కాదు; అనియున్= అని కూడా; కలదు= ఉన్నది.

తాత్పర్యం: బ్రాహ్మణుడు క్రమంగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వర్ణాలలోని కన్యలను వివాహం చేసికొనవచ్చును. కాని, శూద్రస్త్రీ నుండి సంతానం కనటం మాత్రం నిషేధం అని శాస్త్రం.

తే. రాజునకు రాజవంశజ రమణి యైన । వెనుక వైశ్యవరించుట విహిత విధము
వైశ్యునకు శూద్రునకుఁ దమ వంశములన । పరిణయంబు గాఁదగు నరపాలవర్య! 229

ప్రతిపదార్థం: నర= మానవులను; పాల= పాలించేవారిలో; వర్య!= గొప్పవాడా!; రాజునకున్= క్షత్రియుడికి; రాజవంశజ= రాజవంశంలో పుట్టిన; రమణి= పత్ని; ఐన వెనుకన్= ఐన తరువాత; వైశ్యన్= కోమటిస్త్రీని; వరించుట= వివాహం కావటం; విహిత= వేదంలో విధించబడిన; విధము= పద్ధతి; వైశ్యునకున్= కోమటికి; శూద్రునకున్= నాలుగవ జాతివాడికి; తమ= తమ తమ; వంశములన్+అ= వంశాలలోనే; పరిణయంబు= వివాహం; కాన్+తగున్= చేసికొనటం బాగు.

తాత్పర్యం: రాజుకు ముందు క్షత్రియ కన్యను ఆ తరువాత వైశ్యకన్యను వివాహం చేసికొనటం శాస్త్రం విధించిన కర్మ. వైశ్యుడికి, శూద్రుడికి తమ తమ కులాలలోనే వివాహం చేసికొనాలి. నీవు రాజువు గనుక ఈ నీతిని పాటించాలి.

వ. రాజునకు, వైశ్యునకు శూద్రకన్యావరణంబు సేయుటయును గలిగియుండు' నని చెప్పిన విని యకౌంతే యాగ్రజుండు శాంతనవుతో' బాహ్మణునకు శూద్రజాతి యందు భార్యా పరిగ్రహంబు సేయందగు నని విందును; అతనికి భార్యలు ముప్వురని నిర్దేశించితిరి. అది యెట్లొకో? యనుటయు నతం డమ్మహీపతి కిట్లనియె. 230

ప్రతిపదార్థం: రాజునకున్; వైశ్యునకున్; శూద్రకన్య= నాలుగవ జాతి కన్యను; వరణంబు చేయుటయునున్= వివాహం చేసికొనట మున్నూ; కలిగి ఉండున్= ఆచారమున్నది; అని; చెప్పినన్= చెప్పగా; విని; ఆ+కౌంతేయ+అగ్రజుండు= ఆ కుంతీనందనులలో పెద్దవాడు; శాంతనవుతోన్= శంతనమహారాజు కుమారుడితో; బ్రాహ్మణునకున్; శూద్రజాతి యందున్= నాలుగవజాతిలో; భార్యా పరిగ్రహంబు= భార్యగా గ్రహించటం; చేయన్+తగున్= చేయవచ్చును; అని విందును= అని వింటున్నాను; అతనికిన్= ఆ బ్రాహ్మణుడికి; భార్యలు= ముప్వురు; అని; నిర్దేశించితిరి= సూచించారు; అది+ ఎట్లు+ఒకో+అనుటయున్, అతండు= భీష్ముడు; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజా! వైశ్యుడు శూద్రకన్యలను చేసికొనటమూ కద్దు' అని చెప్పగా విన్న ధర్మరా జన్నాడు; 'బ్రాహ్మణుడికి ముగ్గురే భార్య లన్నారు మీరు. మరి అతడు నాలుగవ జాతిలోను కన్యావరణం చేయవచ్చునని విన్నానే; ఇదెట్లాగా? అని అనగా భీష్ము డిట్లా చెప్పాడు.

ఆ. అనఘ! విషమ మైన యట్టికార్యంబు వా । టిలినఁ జూచి, పెద్ద వలచి యైన
లోభమునను శూద్రఁ దా భార్యఁగాఁ గొను । విప్రుఁ డధికపాపవృత్తి గామి. 231

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విషమము+ఐన= తీవ్రమైన (అక్రమమైన); అట్టి కార్యంబు= అటువంటి ఘటన; పాటిలినన్= కలిగితే; చూచి; పెద్ద= గొప్పగా; వలచిఐనన్= ప్రేమించి అయినా; లోభమునను= పినాసితనంతోనైనా; శూద్రన్= శూద్ర స్త్రీని; తాన్= తాను; భార్యన్+కాన్= పెండ్లాముగా; విప్రుఁడు= బ్రాహ్మణుడు; కొనున్= గ్రహిస్తాడు; అధిక= మిక్కిలి; పాపవృత్తి= పాపపు నడవడి; కామిన్= కానందున.

తాత్పర్యం: పుణ్యాత్ముడా! ఏదైనా దుర్ఘటనవలన కాని, ప్రేమించి కానీ, లోభంవలన గానీ విప్రుడు నాలుగవ జాతి పిల్లను పెండ్లిచేసికొనవచ్చును. అది మిక్కిలి పాపపునడవడి కానందువలన.

వ. అవ్విధంబు నొక్కొక్క యెడం గల్గి దూష్యంబు గాక చెల్లునని చెప్పి వెండియు. 232

ప్రతిపదార్థం: ఆ+విధంబును= ఆ పద్ధతికూడ; ఒక్క+ఒక్క= ఒక్కొక్క; ఎడన్= సందర్భంలో; కల్గి= ఏర్పడి; దూష్యంబు కాక= నింద్యం కాకుండా; చెల్లును= చెల్లుబాటౌతుంది; అని చెప్పి; వెండియున్= మరల

తాత్పర్యం: ఆ పద్ధతికూడా ఒక్కొక్క సందర్భంలో నింద్యంగాకపోతుంది' అని మరలా ఇట్లా అన్నాడు.

క. 'ధరణీసుర, రాజ, వణిక్ । తరుణులకును విప్రువలనఁ గల్గిన తనయుల్
కురునాథా! ద్విజు లనఁగా । బరఁగుదు; రది లేదు శూద్రభామ సుతులకున్.' 233

ప్రతిపదార్థం: విప్రువలనన్= బ్రాహ్మణుడి వలన; ధరణీసుర= బ్రాహ్మణ, రాజ= క్షత్రియ; వణిక్= కోమటి; తరుణులకును= స్త్రీలకు; కల్గిన; తనయుల్= కొడుకులు; కురునాథా!= కురువంశ శ్రేష్ఠుడా!; ద్విజులు= రెండు జన్మలు కలవారు; అనఁగాన్= అన్న పేరున; పరఁగుదురు= ప్రకాశిస్తారు; శూద్రభామ= శూద్ర స్త్రీ యొక్క; సుతులకున్= కొడుకులకు; అది= బ్రాహ్మణత్వం; లేదు.

తాత్పర్యం: బ్రాహ్మణునకు మొదటి మూడు కులాలలో పుట్టిన సంతానం బ్రాహ్మణులుగానే పిలువబడుతున్నారు. శూద్ర స్త్రీకి పుట్టిన సంతానం మాత్రం అట్లా లేదు.'

వ. అనవుడు ధర్మపుత్త్రుండు 'భూసురుని వలన నాలుగు జాతుల నాతులకును బ్రసూతులైన సుతులకును నతని ధనంబునందు భాగం బెట్లుండు?' నని యడిగిన. 234

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ధర్మపుత్త్రుండు; భూసురునివలనన్= భూలోకంలో దేవత - బ్రాహ్మణుడి వలన; నాలుగుజాతుల; నాతులకును= స్త్రీలకు; ప్రసూతులు+ఐన= పుట్టినవారైన; సుతులకును= కొడుకులకు; అతని ధనంబునందున్; భాగంబు; ఎట్లు+ఉండున్; అని అడిగినన్.

తాత్పర్యం: అనిన తరువాత ధర్మరాజు బ్రాహ్మణుడివలన నాలుగు జాతుల స్త్రీలకు సంతానం కలిగితే వారందరికి తండ్రి ఆస్తిపాస్తు లెట్లా పంచాలి?' అని ప్రశ్నించాడు.

సీ. **'విను, జనమేజయ మనుజేంద్ర! యమ్మేది । నీశ్వరుతో భీష్ముఁ డిట్టులనియెఁ;**
బ్రాహ్మణు నర్థంబు పది పాళ్ళుగాఁ జేయ । నాలుగు బ్రాహ్మణి నందనుండు,
క్షత్రియాత్మజుఁడు భాగములు మూఁడును, వైశ్య । తనయుండు రెండు, శూద్రాతనూజుఁ
డొక పాలు గొనుటకు నొడయులు; తుదివాఁడు । వలచి పెట్టఁగఁ గొనువాఁడు గాని

తే. **తండ్రితోడఁ ద్రివిధ తనయులతోడను । దనదు భాగమునకుఁ బెనఁగి కొనఁగఁ**
దగదు వారలకును దగదు నిర్దయతఁ ద । ద్దశమభాగ మీక తార కుడువ.' **235**

ప్రతిపదార్థం: జనమేజయ మనుజ+ఇంద్ర!= జనమేజయ మహారాజా! ఆ మేదినీ+ఈశ్వరుతోన్= ఆ రాజుతో, ధర్మజునితో; భీష్ముఁడు; ఇట్టులు; అనియెన్; బ్రాహ్మణు+అర్థంబు= బ్రాహ్మణుడి ధనం; పదిపాళ్ళుగాన్+చేయన్= పది భాగాలుగా చేస్తే; బ్రాహ్మణి నందనుండు= బ్రాహ్మణ స్త్రీ కొడుకు; నాలుగు= నాల్గుభాగాలు; క్షత్రియ+ఆత్మజుఁడు= క్షత్రియస్త్రీ కొడుకు; భాగములు మూఁడును= మూడుభాగములు; వైశ్య తనయుఁడు= వైశ్య స్త్రీ కొడుకు; రెండు= రెండుభాగలు; శూద్రా తనూజుఁడు= శూద్ర స్త్రీ కొడుకు; ఒక పాలు; కొనుటకున్= పై విధంగా పంచుకొనటానికి; ఒడయులు= అర్హులు; తుదివాఁడు= శూద్రసంతానం; వలచి= ప్రేమించి; పెట్టఁగన్= పెట్టితే; కొనువాఁడుకాని= తీసికొనేవాడే తప్ప; తండ్రితోడన్= తండ్రితో; త్రివిధ= ఆ ముగ్గురు; తనయులతోడను= కొడుకులతో; తనదు= తనయొక్క; భాగమునకున్= పాలుకు; పెనఁగి= పెనగులాడి; కొనఁగన్= తీసికొనటం; తగదు= న్యాయం కాదు; వారలకును= తండ్రికి, ఆ ముగ్గురు మిగిలిన కొడుకులకు; నిర్దయతన్= దయలేకుండా; తత్= ఆ శూద్రునకు పోవలసిన; దశమ= పదవ; భాగము= పాలు; ఈక=ఇవ్వకుండా; తార= తామే; కుడువన్= తినటం; తగదు= న్యాయం కాదు.

తాత్పర్యం: బ్రాహ్మణుడి ఆస్తి పది భాగాలు చేసి అందులో నాలుగుపాళ్ళు బ్రాహ్మణ స్త్రీ కొడుకునకు, మూడు పాళ్ళు క్షత్రియ స్త్రీ సంతానానికి, రెండు పాళ్ళు వైశ్య స్త్రీ కొడుకుకు, ఒక పాలు శూద్ర స్త్రీ సంతానానికీ ఇవ్వాలి. ఇందులో నాలుగోజాతివాడు ప్రేమించి పెట్టితే తినేవాడే కాని వా రివ్వకపోతే పోట్లాడకూడదు. అట్లాగే తండ్రి, ఆ మిగిలిన ముగ్గురు కొడుకులు కూడా పదవ పాలు వాడికి ఇవ్వాలి. తామే అంతా దయమాలి తినకూడదు'.

విశేషం: ఈ పద్యం ఒక చారిత్రక సామాజిక స్థితికి అద్దం పడుతున్నది. క్రీ.పూ. 2,3 వేల సంవత్సరాల క్రితం పరిస్థితి ఇది. ఈ విభాగంలో సమత్వం లేదు.

వ. **అనిన విని పాండవాగ్రజుండు 'దక్కిన వర్ణంబులవారి ధనంబు లెట్లుగాఁగలయవి సెప్పు' మనుటయు ననిమిష నదీనందనుం డతని కిట్లనియె.** **236**

ప్రతిపదార్థం: అనినన్ విని; పాండవ అగ్రజుండు= పాండవులలో ముందు పుట్టినవాడు; తక్కిన వర్గంబులవారి ధనంబులు ఎట్లు కాగలయవి సెప్పుము; అనుటయున్= అనగా; అనిమిషనదీ= దేవతలనది యొక్క; నందనుండు= కొడుకు; అతనికిన్= ఆ ధర్మజుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు;

తాత్పర్యం: అని చెప్పగా విన్న ధర్మరాజు 'తక్కిన వర్ణాలవారి ధన విభాగం ఎట్లా ఉంటుంది? చెప్పు'మంటే భీష్ము డిట్లా అన్నాడు.

విశేషం: అనిమిష - న+నిమిష (అనిమిష)= రెప్పకొట్టటం; లేనివాడు, కళ్ళుమూత పడటం లేనివాడు= దేవత.

సీ. 'క్షత్రియు ధనము భాగము లెనిమిది సేయ, । భూపాల వైశ్యుల పుత్రికలకు,
శూద్ర పుత్రికకును, సుతులైన యట్టి వా । రోలి నాలుగు, మూఁడు నొక్కటియును,
గొనువారు పాళ్ళులు, కురుముఖ్య! వైశ్యుని । సొమ్మున వైశ్యకు సూనుఁ డైన
యతఁడు నాలుగును శూద్రాత్మజుఁ డొకటియుఁ । గాఁగ నైదుగ నంశకములు గొంద్రు

తే. పెనఁగి కొనఁగఁ దగమి విన శూద్ర కొడుకున । కెందుఁ గలదు; వాని కీక కుడువఁ
గామియును సమంబ యేమి జాతులవారి । కయిన నిట్లు దెలియు మంశకృతులు. 237

ప్రతిపదార్థం: క్షత్రియు ధనమున్= క్షత్రియుడి ధనం; ఎనిమిది; భాగములు; చేయన్= చేస్తే; భూపాల వైశ్యుల= రాజుల కోమటులయొక్క; పుత్రికలకున్= కూతుంద్రకు; శూద్రపుత్రికకును; సుతులైన+అట్టివారు= కొడుకులుగా పుట్టినట్టివారికి; ఓలిన్= క్రమంగా; నాలుగు, మూఁడు, ఒక్కటియును; పాళ్ళులు= పాళ్ళుగా; కొనువారు= తీసికొనదగినవారు; కురుముఖ్య!= కురువంశ శ్రేష్ఠుడా!; వైశ్యుని సొమ్మునన్= వైశ్యుడి సొమ్ములో; వైశ్యకున్= వైశ్య స్త్రీకి; సూనుఁడు= కొడుకు; ఐన అతఁడు= అయినవాడు; నాలుగును; శూద్ర+ఆత్మజుఁడు= శూద్రస్త్రీ కొడుకు; ఒకటియున్; కాఁగన్= కాగా; ఐదుగన్= ఐదుగునట్లుగా; అంశకములు= పాళ్ళు; కొంద్రు= తీసికొంటారు; శూద్ర కొడుకునకున్= శూద్రస్త్రీ కుమారునకు; పెనఁగి= పోట్లాడి; కొనఁగన్= ఆస్తి తీసికొనటం; తగమి= న్యాయం కాకపోవటం; విను; ఎందున్= ఎక్కడైనా; కలదు= ఉన్నది; వానికిన్= శూద్రుడికి; ఈక= ఇవ్వక; కుడువన్= తినటం; కామియును= కాకపోవటం; సమంబ= సమానమే; ఏమిజాతుల వారికిన్= ఏ జాతివారికైనా; అంశకృతులు= భాగాలు పంచటం; ఇట్లు= ఇంతేనని; తెలియుము= తెలిసికొమ్ము.

తాత్పర్యం: క్షత్రియుడి ఆస్తి ఎనిమిది భాగాలుచేసి క్షత్రియ స్త్రీ కొడుకునకు నాల్గు, వైశ్య స్త్రీ కొడుకునకు మూడు, శూద్ర స్త్రీ కొడుకునకు ఒకపాలు; ఇది పాళ్ళ పంపకం. వైశ్యుడి ధనం ఐదు భాగాలు చేసి, కోమటి స్త్రీ కొడుకునకు నాల్గు; శూద్ర స్త్రీ కొడుకునకు ఒక పాలుగా పంచుకొనాలి. శూద్ర స్త్రీ కొడుకు పోట్లాడి తీసికొనకూడదు. వారూ ఇతడికి ఇవ్వకుండా తినకూడదు అనటం సాధారణాంశమే.

తే. ఆలు నిజజాతియందు, శూద్రాలి కెల్ల । సమములుగఁ బంచికొంద్రు భాగముల శూద్ర
తనయు లెందఱు గల్గినఁ దండ్రి ధనము । ధర్మసంగ్రహతత్పర! ధర్మతనయ!। 238

ప్రతిపదార్థం: ధర్మ= ధర్మముయొక్క; సంగ్రహ సారాంశం గ్రహించటంలో; తత్పర!= భక్తికలవాడా!; ధర్మతనయ!= ధర్మజా!; శూద్ర+ఆలికిన్+ఎల్లన్= శూద్ర సమూహానికి; ఆలు= భార్య; నిజ= తనయొక్క; జాతి= వర్గం; అందున్= అందులోనే; తండ్రి ధనమున్= శూద్ర తండ్రి డబ్బు; తనయులు= కొడుకులు; ఎందఱు= ఎంతమంది; కల్గినన్= ఉన్నా; భాగములన్= పాళ్ళను; సమములుగన్= సమానంగా; పంచి కొంద్రు= పంచుకొంటారు.

తాత్పర్యం: ధర్మసారాంశం వినటంలో ఆసక్తి కలవాడా! ధర్మరాజా! శూద్రుడు మాత్రం వారి జాతులలోనే వివాహం చేసికొనాలి. వాడి ఆస్తిని కొడుకులంతా సమంగా పంచుకొంటారు.'

వ. అని నిర్దేశించి వెండియు. 239

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; నిర్దేశించి= ఏర్పరచి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ విధంగా ఏర్పరచి ఇంకా (ఇట్లా తెలిపాడు)

క. 'విను హవ్య కవ్యములు మ । జ్జన భోజనములును, విప్రజాతి వనిత దాఁ
బనిసేయ నడపునది, య । ప్పనులకుఁ బెఱసతులు గామి బ్రాహ్మణుఁడు నృపా!' 240

ప్రతిపదార్థం: నృపా!= మానవులను పాలించేవాడా!; విను; బ్రాహ్మణుఁడు= నాలుగు కులాలనుండి వివాహం చేసికొనటానికి అర్హత ఉన్నవాడు; తాన్= తాను; విప్రజాతి వనితన్= బ్రాహ్మణ స్త్రీని; హవ్య= దేవతలకర్పించేది; కవ్యములు= పితృదేవతల కర్పించేది; మజ్జన= స్నానం; భోజనములు= ఆహారం పక్వంచేయటం - వడ్డించటం; పనిచేయన్= ఈ పనులు చేయటానికి; నడపునది= ఆజ్ఞాపించాలి; ఆ+పనులకున్= ఆ పనులను చేయటానికి; పెఱ= మిగిలిన మూడు వర్ణాల; సతులు= భార్యలు; కామి= అర్హతలేనివారు కావున.

తాత్పర్యం: వైదిక కర్మలు, హవ్య, కవ్యాల అర్పణం; తనకు స్నాన, భోజనాదులు ఏర్పాటు చేసే అర్హత ఒక్క బ్రాహ్మణ స్త్రీకే ఉన్నది. ఇతర భార్యల కీ అర్హత లేదు. కనుక బ్రాహ్మణభర్త తన బ్రాహ్మణపత్నివల్లనే ఈ పనులు అమలుపరచాలి.

భీష్ముఁడు ధర్మజున కౌరసాది పుత్త్రభేదంబు తెలంగు సెప్పుట (సం.13.49-1)

వ. అనిన విని యుధిష్ఠిరుండు. 241

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు.

క. 'కొడుకులు బహువిధు లని యె । ప్పుడు విందును; వారి తెఱఁగు పురుషవరా! యే
ర్పడఁ జెప్పవలయు నా' కని । యడిగిన, గాంగేయుఁ డిట్టులను నాతనితోన్. 242

ప్రతిపదార్థం: కొడుకులు; బహు= అనేక; విధులు= విధాలు; అని; ఎప్పుడున్= నిత్యం; విందును; పురుష వరా!= మానవులలో శ్రేష్ఠుడా!; నాకున్= నాకు; వారి తెఱఁగు= వారి విధానం; ఏర్పడన్= దేనికదిగా; స్పష్టంగా; చెప్పన్ వలయున్= వివరించాలి; అని అడిగినన్; గాంగేయుఁడు= గంగ కొడుకు - భీష్ముడు; ఆతనితోన్; ఇట్టులు+అనున్= ఇట్లు అన్నాడు.

తాత్పర్యం: 'పురుష శ్రేష్ఠుడా! కుమారు లనేకవిధా లంటారు కదా! నాకు వివరించి చెప్పుము.' అని అడుగగా భీష్ము డిట్లా అంటున్నాడు.

విశేషం: పురుషుడు; పురము= శరీరం; అందులో శయనించేవాడు= ఉండేవాడు; జీవాత్మ. ఈ జీవాత్మ పరమాత్మ అయిన సర్వేశ్వరుడి స్వరూపుడు.

తే. పరమసంస్కృత యగు నాత్మభార్యయందు । ధర్మవిధిఁ గలిగించిన తనయుఁ డనఁగఁ
దాన యౌరసుఁ డను నభిధాన మొప్పఁ । బరఁగు నుత్తముఁ డాతఁడు ప్రథముఁ డధిప! 243

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; పరమ సంస్కృత+అగు= మంచి సంస్కారం గలదైన; ఆత్మ భార్యయందున్= తన భార్య ఆధారంగా; ధర్మవిధిన్= ధర్మబద్ధంగా; కలిగించిన= పుట్టించిన; తనయుఁడు+అనఁగన్= కొడుకు అనగా; తాను+అ= తానే; ఔరసుఁడు= ఉరస్సు - ఆత్మనుండి పుట్టినవాడు; అను= అన్న; అభిధానము= పేరు; ఒప్పన్= వెలయగా; పరఁగు= కీర్తికల; ఉత్తముఁడు= శ్రేష్ఠుడు; ఆతఁడు= అతడు; ప్రథముఁడు= మొదటివాడు.

తాత్పర్యం: ధర్మపత్నియందు ధర్మబద్ధంగా పుట్టిన కొడుకు ఔరసుడు. మిగిలిన కొడుకులందరికంటె ఉత్తము డితడే. ఇతడే మొదటివాడు.

విశేషం: ఔరసుఁడు= గుండె- హృదయం నుండి పుట్టినవాడు. తండ్రి తన ఆత్మను భార్యాగర్భంలో నిక్షేపించి కన్నకొడుకు 'అంగాత్- అంగాత్ సంభవసి' - తండ్రి ప్రతి అవయవం నుండి పుట్టిన కొడుకు ఔరసుడు. దీపం నుండి మరొక దీపం పుట్టినట్లు తండ్రియే భార్యాగర్భం ద్వారా కొడుకై పుట్టుతున్నాడు. ఇందుకే భారతీయ మహిళ ఒక దృష్టితో భార్య - ప్రేయసి, మరొక దృష్టితో తల్లి. ఈ భార్యాత్వం, మాతృత్వం కలబోసి చిత్రించిన ప్రతిమలే మన స్త్రీ శిల్పాలు. కావాలనుకొన్న సంతానం ఔరసుడు. పుత్రకామేష్టి అంటే ఇదే.

తే. తగిన వరునకు నిచ్చిన తనదు దుహితఁ । గనిన పుత్త్రు నయ్యిరువురు వినఁగ నియ్య
కొనఁగ వీఁడు నా కొడు కనఁ గొడుకు వాని । పేరు పుత్త్రికా పుత్త్రుండు పౌరవేంద్ర! 244

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= పురువంశంలో గొప్పవాడా!; తగిన= అర్హుడైన; వరునకున్= పెండ్లి కొడుకునకు; ఇచ్చిన= వివాహం చేసిన; తనదు= తనయొక్క; దుహిత= కూతురు; కనిన= కన్న; పుత్రున్= కొడుకును; ఆ+ఇరువురు= కూతురు, అల్లుడు ఇద్దరు; వినఁగన్= వింటూ ఉండగా; ఇయ్యకొనఁగన్= అంగీకరిస్తే; వీఁడు= మనుమడు; నా కొడుకు; అనన్= అనగా; కొడుకు= కుమారుడు ఔతాడు; వానిపేరు; పుత్రికా పుత్రుండు= కూతురు కొడుకు దౌహిత్రుడు.

తాత్పర్యం: పురువంశ రాజా! మంచివాని కిచ్చి పెండ్లి చేసిన తనకూతురు కొడుకును - వాళ్ళిద్దరూ అంగీకరిస్తే దత్తత చేసికొనగా - ఆ దౌహిత్రుడు కూడా కొడుకే.

విశేషం: కొడుకులు లేని తండ్రి తనకు పితృక్రియలు ఎవరో ఒకరు చేయాలి కనుక దౌహిత్రుడిని దత్తత చేసికొనవచ్చును. వాడు పుత్రసమానుడై ఉత్తరక్రియలు నిర్వహించే హక్కు పొందుతున్నాడు.

తే. ధర్మపథమునఁ బనిచినఁ దనదుపత్ని । యర్హపురుష సంగతిఁ గన్న యాత్మజుండు
క్షేత్రజుం డనఁగా నిజపుత్ర భావ । మొందు ధర్మప్రపంచాభినందితాత్మ! 245

ప్రతిపదార్థం: ధర్మ ప్రపంచ= ధార్మికవర్గముచేత; అభి= మిక్కిలి; నందిత+ఆత్మ!= ఆనందించిన హృదయం కలవాడా!; ధర్మపథమునన్= ధర్మమార్గంలో; పనిచిన= ఆనతిచ్చిన; తనదు= తన; పత్ని= భార్య; అర్హ= తగిన; పురుష= మగవాడి; సంగతిన్= రతిద్వారా; కన్న; ఆత్మజుండు= కొడుకు; క్షేత్రజుండు= భార్యకొడుకు (క్షేత్రం - భార్య); అనఁగాన్; నిజ= తనయొక్క; పుత్రభావము= పుత్రత్వం; ఒందున్= పొందును.

తాత్పర్యం: ధర్మమార్గంలో తన భార్యను తానై తగిన పురుషుడి కర్పిస్తే ఆమె కన్నసంతానం కూడా తనకు కొడుకే.

విశేషం: ఆ నాటికి ఈ ధర్మం ఉండేది. మనుస్మృతి మొదలైన గ్రంథాలలో ఈ విషయం చెప్పబడింది. ధృతరాష్ట్ర- పాండు రాజులు ఈ ధర్మదృష్టితోనే వ్యాసుడి ద్వారా జన్మించారు. కనుక పద్యంలో అర్హ అంటే వ్యాసుడివంటివాడని. కేవలం

ధర్మదృష్టితోనే సంగమం జరగాలి తప్ప అన్యంకాదు. ఈనాడు "వీర్యనిధి" - "నాళికాశిశువులు" ఉన్నట్లు ఆనా డవకాశం లేదు. కాని, దీనికంటె అది మహోత్తమం.

క. జననీ జనకు లుదక దా । న నిరూఢము గాఁగ నిచ్చినం బడసిన నం
దనుపేరు దత్రిముం డని । ముని జనములు సెప్పుదురు విమోహవిదూరా! 246

ప్రతిపదార్థం: వి+మోహ= మిక్కిలి విషయాసక్తికి; విదూరా!= దూరంగా ఉండేవాడా!; జననీ జనకులు= తల్లి దండ్రులు; ఉదక= నీటి యొక్క; దాన= దానముచే; నిరూఢముకాఁగన్= ప్రసిద్ధంగా; ఇచ్చినన్= ఇస్తే; పడసిన=పొందిన; నందను పేరు= కొడుకుపేరు; దత్రిముండు; అని; మునిజనములు= ముని జనులు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: జలధారాపూర్వకంగా తల్లిదండ్రులు దానం చేసిన కొడుకుపేరు దత్రిముడు.

విశేషం: కొన్ని ప్రతులలో దత్తకుఁడు - అని ఉన్నది. (దత్తత చేసికొనబడ్డవాడు పెంపుడు కొడుకు). దత్రిముఁడు= ధారా పూర్వకంగా దానం చేయబడ్డ కొడుకు కనుక తల్లిదండ్రులు ఇష్టంతో దానం చేయటం చెప్పబడింది.

ఆ. తల్లిఁ దండ్రిఁ బాసి తనయంత నెచ్చట । నేనిఁ దిరుగునట్టి వానిఁ జూచి,
యాత్మసదృశుఁడైన యాత్మజుఁ జేసి కొ । నంగఁ గృత్రిముం డనంగఁ బరఁగు. 247

ప్రతిపదార్థం: తల్లిన్, తండ్రిన్= ఇద్దరినీ; పాసి= పోగొట్టుకొని; తన అంతన్= తనంత; ఎచ్చటనేనిన్= ఎక్కడైనా; తిరుగునట్టివానిన్; చూచి; ఆత్మసదృశుఁడు= తనకు ప్రీతిపాత్రుడు ఐన; ఆత్మజున్= కొడుకుగా; చేసికొనంగన్= చేసికొంటే; కృత్రిముండు= కృత్రిమంగా కొడుకుగా గ్రహించబడినవాడు కనుక; కృత్రిముండు; అనంగన్= అనునట్టి పేరుతో; పరఁగున్= ప్రసిద్ధుడౌతాడు.

తాత్పర్యం: తల్లిదండ్రులను పోగొట్టుకొని ఒంటరిగా తిరిగేవాడిని తన కిష్టమైన కొడుకుగా చేసికొంటే వాడిపేరు కృత్రిముడు.

తే. ఎవ్వనికిఁ బుట్టె నేనియు నెఱుఁగకుండ । నొక్కనికిఁ బరభార్యయం దుదయ మైన
సూనుఁ డా భార్య గలవాని సుతుఁడు, వాని । పేరు 'గూఢజుఁ' డనఁబడుఁ గౌరవేంద్ర! 248

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశ రాజా!; ఒక్కనికిన్= ఒక్కడికి; పరభార్యయందున్= ఇతరుడి భార్యకు; ఉదయము+ఐన= పుట్టిన; సూనుఁడు= కొడుకు; ఎఱుఁగకుండన్= తెలియకుండా; ఎవ్వనికిన్= ఎవడికైనా; పుట్టెనేనియున్= పుట్టినా; ఆ భార్య గలవాని సుతుఁడు= ఆ భర్త కొడుకు; వానిపేరు; గూఢజుఁడు= రహస్యంగా పుట్టినవాడు; అనఁబడున్= పదిమందితో చెప్పుకొనబడేవాడు.

తాత్పర్యం: తెలియకుండా ఎవడికి పుట్టినా, పరభార్యకు పుట్టినవాడు ఆ భార్య గలవాడి కొడుకే. వాడిపేరు గూఢజుడు.

క. విను తల్లిదండ్రు లొల్లక । తనయుని విడిచిన నొరుండు తనకుఁ దనయుఁగాఁ
గొని నెమ్మి నడప నపవి । ద్ధనాముఁ డగువాఁడు విమలధర్మప్రవణా! 249

ప్రతిపదార్థం: విమల= నిర్మలమైన; ధర్మప్రవణా!= ధర్మమునం దాసక్తి కలవాడా!; విను; తల్లిదండ్రులు; ఒల్లక= ఇష్టపడక; విడిచిన= విడిచిపెట్టిన; తనయునిన్= కొడుకును; ఒరుండు= మరొకడు; తనకున్; తనయుకాన్+కొని= కొడుకుగా స్వీకరించి; నెమ్మిన్= సంతోషంతో; నడపన్= పోషిస్తే; వాఁడు= అతడు; అపవిద్ధనాముఁడు= అపవిద్ధుడన్న పేరు గలవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: మంచి ధర్మాలు వినటంలో భక్తిశ్రద్ధలు కలవాడా! తల్లీదండ్రీ కాదని వదలివేసిన పిల్లవాడిని కొడుకుగా స్వీకరిస్తే వాడిపేరు అపవిద్ధుడు.

విశేషం: అప= చెడ్డగా; విద్ధుఁడు= నిరసింపబడ్డవాడు (విద్ధము= గ్రుచ్చబడినది, కొట్టబడినది)

తే. **పెండ్లి గాకమున్న పితృగృహంబునఁ గన్య । సూనుఁ గనిన వినుము దానిఁ జేసి**
కొనిన యతని కతఁడు గొడు కగుఁ గానీన । నామకమున బరఁగు నరవరేణ్య! 250

ప్రతిపదార్థం: నరవరేణ్యా!= మానవులలో గొప్పవాడా, రాజా!; వినుము= ఆలకించుము; కన్య= అవివాహిత, పెండ్లికాకమున్న= వివాహం కాకముందే; పితృగృహంబునన్= తండ్రి ఇంట్లో; సూనున్= కొడుకును; కనినన్= కంటే; దానిన్= ఆ కన్యను; చేసికొనిన అతనికిన్= చేసికొన్న వాడికి; అతఁడు= ఆ కన్యకు పుట్టినవాడు; కానీన నామకమునన్= కానీను డన్న పేరుతో; కొడుకు+అగున్= కొడుకు అవుతాడు.

తాత్పర్యం: పెండ్లిగాక ముందే తండ్రి ఇంట్లో కొడుకును కంటే ఆమెను వివాహం చేసికొన్నవాడి కా బిడ్డ కొడుకే. వాడి పేరు కానీనుడు.

విశేషం: కానీనుఁడు= కన్నెకొడుకు. భారతంలో కర్ణుడికా పేరున్నది. మనకంటె ఆనాటివారి కా విశాల దృష్టి ఉన్నట్లున్నది.

క. **విను గర్భిణి యగు టెఱుఁగక । యును, నెఱిఁగియుఁ బెండ్లియైన, నుదయించిన నం**
దనుఁ డావరునకుఁ గొడు కగు । జననాథ! సహోఢుఁ డనఁగఁ జను నండ్రు బుధుల్. 251

ప్రతిపదార్థం: జననాథ!= రాజా!; విను; గర్భిణిఅగుట= గర్భవతి కావటం; ఎఱుఁగకయునున్= తెలియకపోయి, ఎఱిఁగియున్= తెలిసియూ; పెండ్లిఐనన్= పెండ్లి చేసికొన్నాక; ఉదయించిన= పుట్టిన; నందనుఁడు= కొడుకు; ఆ వరునకున్= ఆ పెండ్లి చేసికొన్న వాడికి; కొడుకు+అగున్; సహ+ఊఢుఁడు= (సంతానం)తోపాటు భరించబడువాడు; అనఁగన్= అన్నపేరున; చనున్= లోకంలో చెలామణి ఔతాడు; అని బుధుల్= స్మృతి గ్రంథకర్తలు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పెండ్లి కాకపూర్వమే గర్భవతి అయిన కన్య - ఈ విషయం తెలిసినా తెలియకున్నా పెండ్లి చేసికొన్నాక కంటే ఆ కొడుకు పేరు సహోఢుడు. వాడిని కొడుకుగా ఆమెను వివాహం చేసికొన్నవాడు స్వీకరిస్తాడు.

తే. **విభునిఁ దాను దొఱంగిన వెలఁది, విభుఁడు । విడిచినట్టి సుమధ్యమ, విధవ, యక్ష**
తాత్వ దశ నెవ్వనికిఁ గనఁ దనయుఁ డాతఁ । డతని కొడుకు పౌనర్భవుం డనఁగఁ బరఁగు. 252

ప్రతిపదార్థం: విభునిన్= భర్తను; తాను= తానై; తొఱంగిన= విడిచిన; వెలఁది= స్త్రీ; విభుఁడు= భర్త; విడిచినట్టి= విడిచిపెట్టిన; సుమధ్యమ= అందమైన నడుము కలది, స్త్రీ; విధవ= భర్త లేనిది; అక్షతాత్వదశన్= కన్యాత్వం భంగంకాని దశలో; ఎవ్వనికిన్=

ఎవడివలననైనా; కనన్= కంటే; తనయుఁడు+ఆతఁడు= ఆ కొడుకు; అతని కొడుకు= ఎవ్వడికి పుట్టాడో అతడికే కొడుకు; పౌనర్భవుండు= తిరిగి పుట్టినవాడు; అనఁగన్; పరఁగున్= ఒప్పును.

తాత్పర్యం: భర్తను విడిచిన భార్య, భర్త విడిచిన భార్య, విధవ, ఎవడికి కొడుకును కంటారో, ఆ కొడుకు కన్నవాడికే కొడుకు. వాడిపేరే పౌనర్భవుడు.

విశేషం: అక్షతాత్వదశ - మూడు రకాలు. 1.భర్తవిడిచిపెట్టినది, 2. భర్తను విడిచిపెట్టినది, 3. విధవ - వీరు కన్యాత్వ భంగంకాని వారై ఉండాలని తాత్పర్యం.

క. జననీజనకులు లేకు । న్నను వారలు దన్ను విడిచినం దాన తనున్
దనయుఁడుగ నొరుల కిచ్చిన । ననఘా! యాతండు సను స్వయందత్తుఁ డనన్. 253

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా! జననీ జనకులు= తల్లిదండ్రులు; లేక+ఉన్నను= లేకపోయినా; వారలు= తల్లీదండ్రి; తన్నున్= తనను; విడిచినన్= వదలిపెట్టినా; తాన= తానే; తనున్= తనను; ఒరులకున్= ఇతరులకు; తనయుఁడుగన్= కొడుకుగా; ఇచ్చినన్= ఇచ్చినా; అతండు= అతడు; స్వయందత్తుఁడు= తనను తానే ఇచ్చుకొన్నవాడు; అనన్= అనగా; చనున్= ఒప్పును.

తాత్పర్యం: పుణ్మాత్ముడా! తల్లిదండ్రులు లేకపోయినా, వారు తనను విడిచిపెట్టినా, తనను తానై ఇతరులకు అర్పణంచేసికొన్నా వాడిని స్వయందత్తు డంటారు.

ఆ. తల్లిదండ్రు లమ్మఁ దనయుఁగా నొక్కరుఁ । డాత్మసదృశజన్ముఁ డైన వాని
విలిచికొనినఁ బాండవేయ మహత్తర! యక్కుమారుఁ గ్రీతుఁ డండ్రు బుధులు.' 254

ప్రతిపదార్థం: తల్లిదండ్రులు; అమ్మన్= అమ్ముకొనగా; ఒక్కరుఁడు= మరొకడు; తనయుఁగాన్= కొడుకుగా; ఆత్మ సదృశ జన్ముఁడు= తనతో సమానమైన జన్మకలవాడు; ఐనవానిన్= అయినటువంటివాడిని; విలిచికొనినన్= డబ్బిచ్చి కొనుక్కొంటే; పాండవేయమహత్తర!= పాండవులలో గొప్పవాడా!; బుధులు= పండితులు; ఆ+కుమారున్= ఆ కొడుకును; క్రీతుఁడు= కొనబడినవాడని; అండ్రు= అంటారు.

తాత్పర్యం: తల్లిదండ్రు లమ్మితే, తనకు తగినటువంటి వాడిని కొడుకుగా కొనుక్కొంటే వాడిని క్రీతు డని పండితు లంటారు.'

క. అని భీష్ముఁడు వెండియు ని । ట్లను ' నా పన్నిరువురును ధరాధిప! యోగ్య
త్వ నిరూఢు లెల్ల కర్మం । బున; కౌరసుఁ డందులోన ముఖ్యుం డరయన్. 255

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; భీష్ముఁడు; వెండియున్= ఇంకా; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; ఆ పన్నిరువురును= ఆ పదురెండు మంది; ధరా+అధిప!= రాజా; ఎల్ల కర్మంబునకున్= అన్నివైదిక కర్మలకు; యోగ్యత్వ నిరూఢులు= తగినవారు; అందులోనన్= ఆ పన్నెండు మందిలో; అరయన్= విచారిస్తే; ఔరసుఁడు= ఆ పేరుగల కొడుకు; ముఖ్యుండు= ప్రధానమైనవాడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ము డింకా ఇట్లా అంటున్నాడు. 'ఆ పన్నెండు మంది తగినవారే. అయినా వారిలో ఔరసుడే ముఖ్యుడు. ఎందుకంటే వైదిక కర్మల కన్నిటికీ తగినవాడు వాడే కనుక.

ఉ. వానిన పోలు నండ్రు బుధవర్యులు కౌరవనాథ! పుత్రికా
సూనునిఁ దక్కనీ వినిన సూనులు, యోగ్యత గాంతు రుత్తమం
బైన కులద్వయంబును, సమాగతమై, విధివత్ప్రయోగతా
నూనతఁ గల్గెనేని, నిగమోదిత కర్మకలాప యుక్తికిన్.' 256

ప్రతిపదార్థం: కౌరవనాథ!= కురువంశ శ్రేష్ఠుడా!; బుధవర్యులు= పండితశ్రేష్ఠులు; వానిన= వాడినే, ఔరసుడినే; పుత్రికాసూనునిన్= కూతురు కొడుకును; పోలును+అండ్రు= సమానుడంటారు; తక్కు= మిగిలిన; నీ వినిన= నీవు విన్న; సూనులు= కొడుకులు; ఉత్తమంబు+ఐన= శ్రేష్ఠమైన; కులద్వయంబును= రెండు కులాలు; సమాగతము+ఐ= కలిసి, సమన్వయం పొంది; విధివత్= శాస్త్ర ప్రకారంగా; ప్రయోగితా+అనూనతన్= ప్రయోగాతిశయం; కల్గెన్+ఏనిన్= పొందితే; నిగమ= వేదముచే; ఉదిత= చెప్పబడిన; కర్మకలాప= కర్మ సమూహం; యుక్తికిన్= కూడికకు; యోగ్యతన్= అర్హతను; కాంతురు= పొందుతారు.

తాత్పర్యం: ఔరసుడితో కూతురు కొడుకు సమానుడని పండిత వర్యులు అంటారు. వేద కర్మలను చక్కగా కూర్చటానికి తగిన శాస్త్ర విధులను పాటించి రెండు కులాలను ఉద్ధరిస్తే మిగిలినవారూ యోగ్యులే.'

చ్యవన నహుష సంవాదం బను నితిహాసము (సం.13-50-1)

వ. అనిన విని ధర్మజుండు 'సహవాసంబునను దర్శనంబునను బుట్టెడి స్నేహంబు లెట్టివి? వానిని గోవుల మాహాత్మ్యంబును నెఱుంగవలతుం జెప్పవే' యని యడిగిన నప్పుడమితేనికి భీష్మం డిట్లనియె. 257

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మజుండు; సహవాసంబుననున్= కలిసి ఉండటంవలన; దర్శనంబుననున్= చూడటంవలన; పుట్టెడి= కలిగెడు; స్నేహంబులు= ప్రేమలు; ఎట్టివి; వానినిన్= వాటిని; గోవుల= ఆవులయొక్క; మాహాత్మ్యంబును= ప్రభావమునూ; ఎఱుంగన్+వలతున్= తెలియవలెనని, వాంఛిస్తాను; చెప్పవే= తెల్పుమా; అని; అడిగినన్; ఆ+పుడమి జేనికిన్= ఆ భూమిపతికి, రాజుకు; భీష్ముండు+ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విన్న ధర్మరాజు భీష్ముడితో అన్నాడు. 'కలిసి ఉండటంవలన చూడటంవలన పుట్టే స్నేహాలు ఎట్లాంటివి? వాటినీ, గోవులమాహాత్మ్యమూ వినాలని ఉన్నది. చెప్పవా! అని ప్రార్థిస్తే ఆ రాజుతో భీష్ము డంటున్నాడు.

సీ. 'చ్యవనుని, నహుషుని సంవాద మితిహాస । మై చెల్లు జగమున ననఘ! నీకు
దానిఁ జెప్పెద విను; దాన నీ యడిగిన । యర్థముల్ దెలియు, మహాత్ముఁడైన
భార్గవచ్యవనుండు, భాగీరథీ యము । నలు గూడినెడ కేఁగి, యలఘునిష్ఠఁ
గ్రుంకి సుస్థిరుఁ డయి కూర్చుండి, యతుల స । మాధిపరుం డయి, మత్స్య కులము

తే. దనదు చుట్టు మెలఁగఁ దనువునఁ జెందంగ । మూరుకొనఁగఁ గృపయు ముదముఁ గదుర
భావవృత్తి తోడఁ బండ్రెండు వర్షము । లుండె; నట్టు లుండ నొక్కనాఁడు. 258

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా! (నాయనా అనటంవంటి సంబోధన); చ్యవనుని= ఆ పేరుగల ఋషియొక్క; నహుషుని= ఆ పేరుగల ప్రాచీన రాజుయొక్క; సంవాదము= ప్రశ్న ఉత్తర రూపమైన గోష్ఠి; జగమునన్= లోకంలో; ఇతిహాసమై= ఒక పురాణ కథగా; చెల్లున్= ప్రకాశిస్తుంది; నీకున్; దానిన్; చెప్పెదన్; విను; దానన్= దానివలన; నీ అడిగిన= నీవు అడిగిన; అర్థముల్= విషయములు; తెలియున్= తెలుస్తాయి; మహా+ఆత్ముఁడు+ఐన= మహత్త్వం కల; భార్గవచ్యవనుండు= భృగువంశంలో పుట్టిన చ్యవన మహర్షి; భాగీరథి= గంగ; యమునలు= యమునానది; కూడిన+ఎడకున్= సంగమ స్థలానికి; ఏఁగి= వెళ్ళి; అలఘు= గొప్ప; నిష్ఠన్= నియమంతో; క్రుంకి= స్నానంచేసి; సుస్థిరుఁడు+అయి= కదలకుండా; కూర్చుండి; అతుల= సాటిలేని; సమాధిపరుండు+అయి= సమాధియందు మునిగి; మత్స్య కులము= చేపల గుంపు; తనదు= తనయొక్క; చుట్టు= చుట్టూరా; మెలఁగన్= మెలగుతూ ఉండగా; తనువునన్= శరీరమునందు; చెందంగన్= పొందగా; మూరుకొనఁగన్= వాసన చూడగా - (పశుపక్ష్యాదులు ప్రేమతో మనిషిని నాకటం, ముట్టెతో వాసన చూడటం); కృపయున్= దయ; ముదమున్= సంతోషం; కదురన్= వ్యాపించగా; భావవృత్తితోడన్= వాటియందు లగ్నమైన మనోభావనతో; పంద్రెండు; వర్షములు= సంవత్సరాలు; ఉండెన్= ఉన్నాడు; అట్టులు= ఆ విధంగా; ఉండన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: చ్యవన నహుష సంవాదంవలన నీ సందేహం తీరుతుంది. దానినే చెప్పుతున్నాను వినుము. భృగువంశంలో పుట్టిన మహాత్ముఁడు చ్యవనుడు గంగా యమునలు కలిసిన చోటికి పోయి తపోనిష్ఠతో సమాధి గతుడయ్యాడు. అప్పుడు చేపలు అతడి చుట్టూ మూగి అతని శరీరాన్ని తాకుతూ అతనిని ముద్దుపెట్టుకొంటూ ఉంటే అతడు సంతోషంతో దయతో మనస్సులో వాటిమీదే భావం లగ్నం కాగా పదురెండు సంవత్సరా లున్నాడు.

విశేషం: ఈ చ్యవనుడి కథ అరణ్యపర్వంలో వచ్చింది. నహుషుడి కథ ఉద్యోగపర్వంలో ఉన్నది.

క. జాలరులు వలల నచ్చటి । మీలఁ దిగుచుచుండి, యయ్యమేయోగ్రతప
శ్శీలునిఁ గూడఁగఁ దిగిచి, భ । యాలోల మనస్కు లగుచు నమ్మునిపతికిన్. 259

ప్రతిపదార్థం: జాలరులు= పల్లెకార్లు; అచ్చటిమీలన్= ఆ మునిఉన్నతావులోని చేపలను; వలలన్= వలలతో; తిగుచుచున్+ఉండి= లాగుతూ; ఆ+అమేయ= ఆ మహత్తర; ఉగ్ర= భయంకర; తపః+శీలునిన్ కూడన్గన్= తపస్సే స్వభావంగా కల మహర్షిని కూడా; తిగిచి= లాగి; భయ+ఆలోల= భయంతో చలించే; మనస్కులు= మనస్సు కలవారు; అగుచున్= అవుతూ; ఆ+ముని పతికిన్= ఆ మునిశ్రేష్ఠుడితో.

తాత్పర్యం: మత్స్యకారు లా ముని ఉన్నచోట వలలతో చేపలను పట్టుతూ ఆ మహామునిని కూడా చేపలతో పాటుగా వలలతో లాగి, భయంతో వణికిపోతూ ఆ మహామునితో.

విశేషం: ఆ ముని గంగా యమునా సంగమంలో నీళ్ళలో మునిగి తపస్సు చేస్తున్నాడు. కనుకనే వలలో తగుల్కొన్నాడు. యోగులు ప్రాణవాయువును బంధించి సమాధిలోకి పోతున్నారు కనుక నీటిలో భూమిలో ఎక్కడైనా గాలి లేకపోయినా సమాధి గతులు కావటం సహజమే. శ్రీరామకృష్ణ పరమహంస సమాధి నిష్ఠులు కాగానే ఉచ్ఛ్వాస నిశ్వాసలుండేవి కావట.

ఆ. చాఁగి మ్రొక్కి 'తప్పసైఁపు మెఱుంగమి । నింతపుట్టె, సంయమీంద్ర! మమ్ముఁ
బరమకరుణఁ జూచి పనుపుము; దీనికి । నేమి సేయువార మింక?' ననుడు. 260

ప్రతిపదార్థం: చాఁగి మ్రొక్కి= సాష్టాంగ నమస్కారం చేసి; తప్పు= అపచారం; సైఁపుము= సహించుము; ఎఱుంగమిన్= తెలియకపోవటంవలన; ఇంత పుట్టెన్= ఇంత జరిగింది; సంయమి+ఇంద్ర!= మునిశ్రేష్ఠా!; మమ్మున్= మమ్ము; పరమ= గొప్ప; కరుణన్= దయతో; చూచి= క్షమించి; పనుపుము= ఆజ్ఞాపించుము; దీనికిన్= ఈ పనికి; ఇంకన్; ఏమి చేయువారము= ఏం చేయగలమో; అనుడున్= అనగా (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: మునీంద్రా! మమ్మ దయతో క్షమించుము. మాకు తెలియనందువలన ఇంత జరిగింది. దీనికి ప్రాయశ్చిత్త మేదో చెప్పి మమ్ములను రక్షించుము' అనగా.

క. జలచరములపై నర్మిలి । గలిగెడు మదిఁ దాల్చి చేర్చి కారుణ్యము బో
యలమీఁద నించుకేనియు । నలుక వొడమనీక యుండె నతఁ డవికృతుఁడై. 261

ప్రతిపదార్థం: అతఁడు= చ్యవనుడు; అవికృతుఁడై= మనోవికారాలు (కోపాదులు) లేనివాడై; జలచరములపైన్= నీటిలో తిరిగే (బ్రతికే); జీవరాసులపై; అర్మిలి= ప్రేమ; కలిగెడు= జనించే; మదిన్= మనస్సును; తాల్చి= పూని; బోయల మీఁదన్= చేపలు పట్టేవారిపై; కారుణ్యము= దయ; చేర్చి= నాటి; ఇంచుక+ఏనియున్= కొంచెమైనా; అలుక= కోపం; పొడమనీక= కలుగనీయక; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: చేపలపై ప్రేమ పూని బోయలపై దయతో మనస్సులో కోపతాపాదులే లేనివాడై ముని ఉన్నాడు.

వ. ఏటిదరికిం దిగువఁబడిన మీలదెస వారికిం జూపి వారితోడ. 262

ప్రతిపదార్థం: ఏటిదరికిన్= ఏటి ఒడ్డుకు; తిగువఁబడిన= లాగబడిన; మీల= చేపలయొక్క; దెసన్= దిశను; వారికిన్= బోయలకు; చూపి= చూపించి; వారితోడన్= బోయలతో.

తాత్పర్యం: వలలో పట్టి ఒడ్డున పెట్టబడిన చేపలవైపు చూపి ఆ బోయలతో.

తే. 'వీనితోడి సంవాసంబు మానసమునఁ । జాల నర్మిలిఁ బెనిచె; నిమ్మీలతోడఁ
గూడఁ బ్రాణంబు విడుచుట కూడదండ్రె । జనులు; గావున నటుసేయుఁ డనఘులార! 263

ప్రతిపదార్థం: అనఘులు+అర!= పాపంలేనివారైన ఓ బోయలారా! మీరు (ఆర= సంబోధనలో వచ్చే ప్రత్యయం); వీనితోడి= ఈ చేపలతో; సంవాసంబు= కలిసి బ్రతకటం; మానసమునన్= మనస్సులో; చాలన్= మిక్కిలి; అర్మిలిన్= ప్రేమను; పెనిచెన్= పెంచింది; జనులు= లోకులు; ఈ మీలతోడన్+కూడన్= ఈ చేపలతోపాటుగా; ప్రాణంబు విడుచుట= వదలుట, మరణించటం; కూడదు= పనికిరాదు; అండ్రె?= అంటారా? కావునన్= కాబట్టి; అటుచేయుఁడు= అట్లా చేయండి.

తాత్పర్యం: ఈ చేపలతోపాటుగా కలిసి నివసించాను కనుక వాటిమీద వల్లమాలిన ప్రేమ ఏర్పడింది. కనుక వాటితోపాటుగా మరణించటమూ మంచిదే. దీన్ని లోకులు మాత్రం కాదంటారా? కాబట్టి నేను చెప్పినట్లు చేయండి.

వ. తగిన తెఱంగు సెప్పెద వినుండు. 264

ప్రతిపదార్థం: తగిన తెఱంగు= వీలైన మార్గం; చెప్పెదన్; వినుండు= ఆలకించండి.

తాత్పర్యం: ఉచితపద్ధతిని చెప్పుతాను వినండి.

క. ఇమ్మీలను నన్నును మీ । రమ్మికొనుఁడు సేయువెలల ' కనుటయుఁ గడు శీ
ఘ్రమ్మున నహుషు కడకుఁ జని । యమ్మని తెఱఁ గెల్లఁ జెప్పి రలుకుచు బోయల్. 265

ప్రతిపదార్థం: ఈ+మీలనున్= ఈ చేపలను; నన్నునున్= నన్నూ; చేయు వెలలకున్= అయిన ధరకు; మీరు; అమ్మికొనుఁడు= అమ్ముకొనండి; అనుటయున్= అనగా; బోయల్; అలుకుచున్= భయపడుతూ; శీఘ్రమ్మునన్= వేగంగా; నహుషు కడకున్= రాజైన నహుషుడి దగ్గరకు; చని= పోయి, ఆ ముని= ఆ చ్యవనుడి; తెఱఁగున్+ఎల్లన్= విషయమంతా; చెప్పిరి= చెప్పారు.

తాత్పర్యం: ఈ చేపలనూ, నన్నూ అయినకాడి కమ్ముకొనండి' అని ముని చెప్పేసరికి పాపం బోయలు బిక్కు బిక్కుమంటూ పరుగులతో నహుషుడనే రాజు దగ్గరకు పోయి ఆ ముని సంగతి అంతా చెప్పారు.

వ. చెప్పిన భయంబును సంభ్రమంబును బెనంగొన నమ్మనుజపతి మంత్రి పురోహిత సహితంబుగా నప్పరమ మునిపాలికిం జనుదెంచి సాష్టాంగ దండప్రణామంబు సేసి 'బోయలు సేసిన యపరాధంబు నేమి భంగి నీఁగు వాఁడ' నని విన్నవించిన, నద్దయాళుం డిట్లనియె.' 266

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగా; భయంబునున్; సంభ్రమంబునున్= తొట్రుపాటు; పెనంగొనన్= పెనవేసికొనగా; ఆ మనుజపతి= రాజు; మంత్రి= మంత్రులు; పురోహిత సహితంబుగాన్= పురోహితులతో పాటుగా; ఆ పరమ ముని= ఆ మహాముని; పాలికిన్= దగ్గరకు; చనుదెంచి= వెళ్ళి; సాష్టాంగ దండ ప్రణామంబు= ఎనిమిది అంగములు ఏక మౌనట్లుగా; దండ ప్రణామంబు= కర్రవలె చాగిలబడి చేసే నమస్కారం; చేసి= ఆచరించి; బోయలు; చేసిన; అపరాధంబు= తప్పు; ఏమి భంగిన్= ఏ విధంగా; ఈఁగువాఁడను= పోగొట్టుకొనగలను; అని; విన్నవించినన్= మనవి చేసుకొనగా; ఆ దయాళుండు= ఆ దయగలవాడు, చ్యవనమహర్షి; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: చెప్పేసరికి తొట్రుపాటూ భయం రెండూ పెనవేసికొనగా ఆ రాజు మంత్రులను, పురోహితులను వెంటబెట్టుకొని సాష్టాంగంగా నమస్కరించి ఆ మహామునితో 'ఈ బోయలు చేసిన తప్పును నే నేవిధంగా సరిదిద్దుకొనగలనో?' అని విన్నవించుకొనగా ఆ దయగల ముని ఇట్లా అన్నాడు.

విశేషం: మంత్రి= రాజనీతివేత్తలు, భౌతిక రాజ్యాంగవేత్తలు, పురోహిత= వైదికులై దైవిక విపత్తులను నివారించేవారు. వీరుకూడా మంత్రులలో ఒకరు. రాష్ట్రానికి సంభవించే భౌతిక విపత్తును నివారించేవారు ఆధి దైవిక విపత్తులను నివారించేవారూ - ఆనాటి మంత్రి మండలిలో ఉండేవారు.

అష్ట+అంగము= రొమ్ము, ముఖం, మోకాళ్ళు, హస్తాలు మొదలైన అవయవాలన్ని భూమికి తాకేటట్లుగా కర్రవలె (దండం) బోర్లాపడి చేసే నమస్కారం. అచ్చమైన భక్తి ఉన్నచోట మాత్రమే ఇట్లా కుదురుతుంది. కర్రవలె అంటే మనస్సు నణచుకొని ఏకాగ్రంగా ఉండటం. నిశ్చలమైన మనస్సుతో చేసే నమస్కారం.

క. 'బోయలు నిజకుల ధర్మము । సేయుట యపరాధ మగునె? చెప్పెద విను వీ
రాయాసపడిరి; వీరికి । నాయొడలికిఁ దగిన వెల జనస్తుత యీవే!' 267

ప్రతిపదార్థం: జనస్తుత!= జనులచే స్తుతింపబడిన రాజా!; బోయలు; నిజ= తమ; కుల= వర్ణము యొక్క; ధర్మము= ఆచారం; చేయుట= పాటించటం; అపరాధము+అగునె?= తప్పు అవుతుందా? కాదు; చెప్పెదన్; విను; వీరు; ఆయాసపడిరి= కష్టపడ్డారు; నా యొడలికిన్= నా శరీరానికి; తగిన= అర్హమైన; వెల= ధర; వీరికిన్= బోయలకు; ఈవే!= ఇయ్యవయ్యా!

తాత్పర్యం: 'బోయలు తమ కుల ధర్మం పాటించటంలో తప్పులేదు. విషయం చెప్తాను వినుము. వీరు పాపం చాలా కష్టపడ్డారు. కనుక నా శరీరం ధర ఎంతో నిర్ణయించి అది వీరి కియ్యవయ్యా!'

విశేషం: వర్ణం వేరు. కులం వేరు. వర్ణాలు నాలుగే. కులమంటే ఒకే పద్ధతి, ఆహార విహారాచారాలు గల గుంపు.

క. అనుటయు మునివరు మనమునఁ । గినుక యొకింతయును లేమికిం బ్రీతుండై
జనపతి గిరాతులకు నిం । డని పనిచెను వేయుమాడ లాత్మసచివులన్ 268

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; మునివరు= మునిశ్రేష్ఠుడి; మనమునన్= మనస్సులో; కినుక= కోపం; ఒకింతయును= కొంచెంకూడా; లేమికిన్= లేకపోవటంవలన; ప్రీతుండై=సంతోషించి; జనపతి= రాజు; కిరాతులకున్= బోయలకు; వేయు= వేయి; మాడలు= నాణెములు (ఆనాటి రూపాయలు); ఇండు= ఇవ్వండి; అని; ఆత్మ= తన; సచివులన్= మంత్రులను; పనిచెను= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: అనటంతోనే రాజునకు సంతోషం కలిగింది. ఈ మునివరుడి మనస్సులో కోపం లేదు కదా అని. మంత్రులను పిలిచి 'వేయిమాడ లివ్వండి బోయలకు' అని ఆనతిచ్చాడు.

వ. పనిచిన యప్పలుకులు విని యమ్ముని యమ్మనుజ విభునితోఁ, 'దగవెఱిఁగి యిత్తుగా' కనవుడు, నప్పుడమితేఁడు పదివేలు సెప్పిన, నప్పరమ సంయమి యప్పటి మాటయ యాడిన, నా రాజు లక్ష యుగ్గడించె; దానికిం దపస్వి ముందటి పలుకు పలికిన; నతండు కోటి యిమ్మనియె; నమ్మాటకు నమ్మహాత్ముండు. 269

ప్రతిపదార్థం: పనిచినన్= ఆనతివ్వగా; ఆ+పలుకులు= ఆ మాటలు; విని; ఆ ముని= ఆ చ్యవనుడు; ఆ మనుజ విభునితోన్= ఆ రాజుతో; తగవు= న్యాయం; ఎఱిఁగి= తెలిసి; ఇత్తుగాక= ఇస్తావు కాక; అనవుడున్= అంటే; ఆ పుడమితేఁడు= ఆ భూమిపతి; పదివేలు= పదివేలు మాడలు; చెప్పినన్= చెప్పగా; ఆ పరమ= ఆ శ్రేష్ఠుడైన; సంయమి= ముని; అప్పటిమాటయ= ఇదివరకు చెప్పిన మాటే; ఆడినన్= అనగా; ఆ రాజు; లక్ష; ఉగ్గడించెన్= చెప్పాడు; దానికిన్= దానికీ; తపస్వి= ముని; ముందటిపలుకు= ఇదివరకు మాటే; పలికినన్; అతండు= రాజు; కోటి; ఇమ్ము+అనియెన్, ఆ మాటకున్; ఆ మహాత్ముండు= ఆ మహానుభావుడు.

తాత్పర్యం: ఆనతివ్వగా ఆ మాటలు విని 'న్యాయం తెలిసి వెల నిర్ణయించుము' అన్నాడు. రాజు పదివేలన్నాడు. మునీ అదే మాటన్నాడు. రాజు లక్ష అన్నాడు. దానికీ ముని ముందటిమాటే అన్నాడు. మరలా రాజు కోటి అన్నాడు. అప్పుడు ఆ మహాముని.

క. తల విసరి 'వెలఁ దగఁగ బో । యల కీ వలదయ్య!' యనిన నన్నరపతి 'వా
రల కిల సగ మిచ్చెద' నని । పలికిన, నప్పలుకు ద్రోపు వడ ముని పల్కెన్. 270

ప్రతిపదార్థం: తల విసరి= తల విదలించి; వెలన్= ధరను; తగఁగన్= తగునట్లు; బోయలకున్; ఈన్+వలదు+అయ్య!= ఇవ్వాలి కదయ్యా!; అనినన్; ఆ నరపతి= ఆ రాజు; వారలకున్; సగము; ఇలన్= రాజ్యాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; అని పలికినన్= అని చెప్పగా; ఆ పలుకు= ఆ మాట; త్రోపువడన్= తిరస్కృతము కాగా; ముని; పల్కెన్.

తాత్పర్యం: అనంగీకారంగా తలను ప్రక్కకుత్రిప్పి 'వెల సరిగా నిర్ణయించుము' అన్నాడు ముని. రాజేమో తన రాజ్యంలో సగ మిస్తా నన్నాడు. దానినీ కాదని ముని.

ఆ. రాజు దనదు సకలరాజ్యంబు బోయల । కిత్తు ననుడు నమ్మునీశ్వరుండు
'నీవు మంత్రివరులు నెయ్యురుఁ దలపోసి । యుచితమైన మూల్య మొసఁగు' మనియె. 271

ప్రతిపదార్థం: రాజు; తనదు= తనయొక్క; సకలరాజ్యంబు= రాజ్యమంతా; బోయలకున్; ఇత్తున్= ఇస్తాను; అనుడున్= అనగా; ఆ ముని+ఈశ్వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; నీవున్= నీవూ; మంత్రివరులు= శ్రేష్ఠులైన మంత్రులు; సచివులు; నెయ్యురున్= స్నేహితులూ; తలపోసి= ఆలోచించి; ఉచితమైన= తగినదైన; మూల్యము= వెల; ఒసఁగుము= బోయలకు ఇమ్ము; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: రాజు తన రాజ్యమంతా ఇస్తా నన్నాడు. అది విని ముని 'నీవూ' నీ మంత్రులూ, స్నేహితులూ అందరూ కలిసి ఆలోచించి తగినమూల్యం నిర్ణయించండి' అన్నాడు.

వ. అనిన విని విషాదంబుతో నహుషుం డవులం జని సచివులుం దానును నింకనేమి సేయువాఁడ నని చింతిల్లుచున్న సమయంబున నయ్యెడకు గవిజాతుండను సంయమి సనుదెంచి వారలతో 'మీరు చింత విడువుఁ డే నిమ్మునిపతి మూల్యంబు నిశ్చయించెద' ననుటయు నయ్యవనీవిభుం డప్పరివారం 'బింతటితో నాపత్పయోధి మునుంగకుండు నట్లుగా నన్నుంగావవే' యనుపలుకు పలికిన నతం డతని కిట్లనియె.272

ప్రతిపదార్థం: అనినన్; విని; విషాదంబుతోన్= దుఃఖంతో; నహుషుండు; అవులన్+చని= అవతలకు వెళ్ళి; సచివులున్= మంత్రులును; తానునున్= తానూ; ఇంకన్+ఏమిచేయువాఁడను= ఇంకేమి చేసేది; అని; చింతిల్లుచున్= చింతిస్తూ; ఉన్న సమయంబునన్= ఉన్నవేళలో; ఆ+ఎడకున్= ఆ చోటికి; గవిజాతుండు= ఆ పేరుకల; సంయమి= ముని; చనుదెంచి= వచ్చి; వారలతోన్= రాజుతో, మంత్రులతో; మీరు; చింత= దుఃఖం, విడువుఁడు= వదలిపెట్టండి; ఏను= నేను; ఈ+మునిపతి మూల్యంబున్= ఈ మునీశ్వరుని వెలను; నిశ్చయించెదన్= నిర్ణయిస్తాను; అనుటయున్= అనటంతో; ఆ+అవనీ విభుండు= ఆ భూమికి పతి, రాజు; ఆ పరివారంబు= రాజుతోపాటు వచ్చిన మంత్రులు మొదలగువారు; ఇంతటితోన్= ఈ నిర్ణయంతో; ఆపత్పయోధిన్= ఆపద అన్న సముద్రంలో; మునుంగక= మునగక; ఉండునట్లుగాన్= ఉండేటట్లుగా; నన్నున్; కావవే= రక్షించవే; అను పలుకు= అన్న మాట; పలికినన్= అనగా; అతండు= గవిజాతుండు; అతనికిన్= రాజుతో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: అని అన్నాక విన్న రాజు క్రుంగిపోయి దుఃఖంతో మంత్రులూ తానూ అవతలకు పోయి విచారించటం ప్రారంభించగా అక్కడకు గవిజాతు డన్న ముని వచ్చి 'మీరు దుఃఖించవద్దు. నే నా ముని వెల నిర్ణయిస్తాను.' అనేసరికి రాజు తేరుకొని 'నేనూ నా పరివారమూ ఈ ఆపద అనే సముద్రంలో మునిగిపోకుండా కాపాడవయ్యా' అని వేడుకొనగా అతడు రాజుతో అంటున్నాడు.

తే. 'గోవునకు బ్రాహ్మణులకును గుల మొకండ । కమలజుఁడు రెండు దెఱఁగులుగా నొనర్చె;
హవికిఁ బూర్వంబు గారణ మఖిల మంత్ర । ములకధిష్ఠాన మపరంబు భూపవర్య! 273

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠుడా!; గోవునకున్= ఆవుకు; బ్రాహ్మణునకున్= పారునకు; కులము= వర్ణం; ఒకండ= ఒకటే; కమలజుఁడు= పద్మంలో పుట్టినవాడు, బ్రహ్మ; రెండు తెఱఁగులుగాన్= రెండు విధాలుగా; ఒనర్చెన్= నిర్మించాడు; హవికిన్= హవిస్సునకు (యజ్ఞంలో వేసే వస్తువు; నేయి, పాలు మొదలగునవి); కారణము= హేతువు; పూర్వంబు= మొదలైన; గోవు; అపరంబు= రెండవది (బ్రాహ్మణుడు); అఖిల= సమస్తమైన; మంత్రములకున్= వేదమంత్రాలకు; అధిష్ఠానము= ఆధారం.

తాత్పర్యం: రాజా! గోవూ, బ్రాహ్మణు డొకటే కులం. కాకపోతే బ్రహ్మ రెండుగా సృష్టించాడు. మొదటిదైన గోవు హవిస్సుకు కారణం కాగా (పాలు, నెయ్యి ఇచ్చేది కనుక) రెండవదైన తత్త్వం బ్రాహ్మణుడు సకల మంత్రాలకూ ఆధారం.

క. వివిధాగమాశ్రయం బగు । నవనీదేవునకు మూల్య మని వాక్రువ్వన్
శివునకును గాదు ధరణీ । ధవ! గోవును నట్టిదగుట దగు నది యొసఁగన్.' 274

ప్రతిపదార్థం: వివిధ= అనేకములైన; ఆగమ= వేదాలకు; ఆశ్రయంబు= ఆధారం; అగు= అయిన; అవనీ దేవునకున్= భూమిపై ఉన్న దేవత - బ్రాహ్మణుడికి; మూల్యము= వెల ఇది; అని; వాక్రువ్వన్= చెప్పగా; శివునకును= శివుడికైనా; కాదు= చేతకాదు; ధరణీ= భూమికి; ధవ!= పతీ; గోవునున్= ఆవుకూడా; అట్టిది+అగుటన్= అట్లాంటిది కావటంవలన; ఒసఁగన్= వెలగా ఇవ్వటానికి; అది= ఆవు; తగున్= తగును.

తాత్పర్యం: సర్వవేదాలకు మూలం బ్రాహ్మణుడే కనుక అతడివెల నిర్ణయించటానికి శివుడికే శక్తి లేదు. గోవుకూడా అట్లాంటిదే కనుక దానినే వెలగా ఇవ్వటం న్యాయం.'

తే. అనినఁ బ్రియమంది నృపతి సంయమి సమీప । మునకు వచ్చి మహాభాగ! ననుఁ గృపార్ద్ర
దృష్టిఁ జూడుము; భవదీయ దేహమునకు । నింత వెల యన వచ్చునే యేరికైన? 275

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ప్రియము= సంతోషం; అంది= పొంది; నృపతి= రాజు; సంయమి= ముని; సమీపమునకున్= దగ్గరకు వచ్చి; మహాభాగ!= మహానుభావుడా!; ననున్= నన్ను; కృపా+ఆర్ద్ర= దయతో తడిసిన; దృష్టిన్= చూపుతో; చూడుము; ఏరికిన్+ఐనన్= ఎవరికైనా; భవదీయ= నీ యొక్క; దేహమునకున్= ఒడలికి; ఇంత వెల; అనన్ వచ్చునే?= అనుటకు వీలున్నదా?

తాత్పర్యం: గవిజాతు డట్లా వెల నిర్ణయించేసరికి రాజు సంతోషించి చ్యవనుడిని సమీపించి 'మహాత్మా! నన్ను కనికరించుము. నీ శరీరం వెల ఇంతని ఎవరు నిర్ణయించగలరు?

క. మునినాథ! గోవు నిచ్చెద । ననవుడు వికచముఖుఁ డగుచు 'ననుగుణ మూల్యం
బున సంప్రీతిం బొందితి' । నని భృగుకులముఖ్యుఁ డిట్టు లను నహుషునితోన్. 276

ప్రతిపదార్థం: మునినాథ!= మునులలో శ్రేష్ఠుడా!; గోవున్= ఆవును; ఇచ్చెదన్; అనవుడున్; భృగుకుల ముఖ్యుఁడు= భృగుకులంలో గొప్పవాడు చ్యవనుడు; వికచ= విప్పారిన; ముఖుఁడు= ముఖం కలవాడు; అగుచున్= అవుతూ; అనుగుణ= తగిన; మూల్యంబునన్= వెలతో; సంప్రీతిన్= చక్కని ప్రీతిని, నిండుగా ఆనందం; పొందితిన్; అని= అంటూ; నహుషునితోన్=రాజుతో; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు.

తాత్పర్యం: మునినాథ! గోవు నిస్తా' ననేసరికి సంతోషంతో వికసించిన ముఖంతో భార్గవకులనాథుడైన చ్యవనుడు రాజుతో 'నీ వెలకు సంతోషించా' నంటూ ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'గో వగ్ని మయ మమృతమయ । మో వసుధాధీశ ! వినుము హోమ విధాన
శ్రీవాహిని, నిచ్చెన త్రిద । శావాసంబునకుఁ బూజ్య మమరుల కైనన్.' 277

ప్రతిపదార్థం: ఓ వసుధా+అధీశ!= ఓయీ రాజా! (వసుధ= రత్నగర్భ, భూదేవికి; అధి+ఈశుఁడు= భర్త); గోవు= గోవంటే; అగ్నిమయము= అగ్ని స్వరూపం; అమృతమయము= అమృత స్వరూపం; వినుము= రహస్యం చెప్తున్నాను, జాగ్రత్తగా వినుము; హోమ విధాన= హోమం చేసే పద్ధతికి (అగ్నిలో హవిస్సులను అర్పించే విధానానికి); శ్రీ= పవిత్రమైన; వాహిని= మార్గం లేదా నది; త్రిదశ= దేవతల; ఆవాసంబునకున్= నివాసమైన స్వర్గానికి; నిచ్చెన= మెట్టు; అమరులకున్+ఐనన్= దేవతలకైనా; పూజ్యము= పూజించ తగింది.

తాత్పర్యం: రాజా! గోవంటే ఏమనుకున్నావు? జాగ్రత్తగా వినుము. గోవు అగ్నిమయం. అమృతమయం. యజ్ఞవిధానానికి పవిత్రమైన నది - మార్గం. దేవతలకు నివాసమైన స్వర్గానికి వేసిన నిచ్చెన దేవతల కైనా పూజ్యమే.'

విశేషం: ఈ పద్యం తిక్కనగారి శైలికి పరాకాష్ఠ. ఆయన మహేతిహాస శైలి(Sublime style)కి ప్రతీక.

నన్నయగారి శైలి మధురం. కవిబ్రహ్మశైలి విచిత్రమైనది. మొదటిది స్త్రీ సౌందర్యం వంటిది. ఇది పురుష గాంభీర్యం. క్షాత్ర శైలి. ఇది భావిస్తేనే తెలుస్తుంది. అది వినగానే తెలిసేది. ప్రాసస్థానం మీద ఒక ఊనిక పెట్టి పద్యం చదువుకొనాలి. పూర్వకాలం పద్యం పౌరాణికులు పాడేవారు. అదొక కళ. శ్రావ్యంగా ఆలపించటం ఒక కళగా పౌరాణికుడు అభ్యసించాడు. జానపద కళకారుల వలెనే లోకంలోకి జనమధ్యంలోకి పురాణ విద్యను ప్రచారం చేసినవాడు పౌరాణికుడు. అతడికి తెలిసినవిద్య ఈ పద్యం పాడే విద్య. అదొక అభినయ విశేషం. ఏ మాటను నొక్కి చదవాలి. ఏది తేల్చి చదవాలి. యతి, ప్రాస అంటే ఏమిటి? - ఈ రచనా కళ తెలిస్తే అప్పుడు శైలి తెలిసినట్లు.

గో - వగ్ని - గో అన్న అక్షరాన్ని దీర్ఘంగా సాగదీసి చదివి వ - ను తేల్చి దానిబరువు నంతా - గ్ని - మీద పడేటట్లు చదవాలి. మయమో - మరలా మో, మీవ దీర్ఘం, మోను - సాగదీసి చదవాలి - శ్రీ నీ అట్లాగే త్రిద - ను తేల్చి - "శా"ను సాగదీసి నొక్కుతూ చదివితే - ఆవు గొప్పతనం తెలుస్తుంది. పద్యరచనతో శైలిని సృష్టించటం తిక్కన మార్గం.

నన్నయగారి శబ్దమే మధురం. అల్లికా మధురమే. ఇది అలా కాదు. నన్నయగారి పద్యం అజంతా చిత్రం. తిక్కన్నగారి పద్యం ఎలిఫెంటా గుహలలోని త్రిమూర్తి శివవిగ్రహం. ఇది బరువుతో భూమిలోకి దిగిపోయింది. అది గాలిలో ఎగిరిపోతుంది.

అగ్ని - అమృత - హోమ వంటి శబ్దాలన్నీ వేదంలోని వేదవిద్యలోనివి.

జగత్తును అగ్నిహోమాత్మక అంటారు. ఉష్ణ - శీతశక్తుల ద్వంద్వ సమ్మేళనమే జగత్తు. 1. రేయింబవళ్ళు; 2. స్త్రీ పురుషులు; 3. రాజా ప్రజా; 4. గురువూ శిష్యుడూ; 5. మనిషి దైవం; 6. భూమి ఆకాశం - ఇట్లా ద్వంద్వం విరుద్ధాంశాల సమన్వయం.

1. కాలసూత్రం, 2. గృహస్థాశ్రమం; 3. రాష్ట్రవ్యవస్థ; 4. విద్యావ్యవస్థ; 5.దేవ స్వరూపం.

మతవ్యవస్థ - ఇట్లా ద్వంద్వ శక్తుల సమ్మేళనమే జగత్తు. దానినే సూర్యుడు చంద్రుడు = ఉష్ణశీతశక్తులంటుంది వేదం. అగ్ని= పురుష - ఉష్ణశక్తి; హోమ= చంద్రుడు - స్త్రీ - శీత శక్తి. కనుక గోవంటే ఈ రెండు శక్తుల సమ్మేళనం. ఇందుకే గోవు నారాధించటం ఆర్య సంస్కృతిలో ప్రధానాంశ మైనది.

ఈ ప్రాచీన వైదిక సంప్రదాయం తెలిసిన మహాకవి కనుక కవిబ్రహ్మ ఇంతటి అద్భుతమైన పద్యం వ్రాయగలిగాడు.

చ. అని యిటు లేర్పడం బలికి, 'యా తలఁ పెంతయు మేలు; గోవు ని
మ్మనఘచరిత్ర! యన్న, విభుఁడట్టుల చేసిన, బోయ లప్డు నె
మ్మనములు, మోద మంద గరిమంబున భార్గవుఁ జేరి 'మమ్ముఁ గ
న్గొనినది యాదిగాఁ గరుణ గూరెద వొక్కటి విన్నవింతుమే?' 278

ప్రతిపదార్థం: అని; ఇటులు; ఏర్పడన్= స్పష్టంగా; పలికి; ఆ తలఁపు= ఆ ఆలోచన; ఎంతయున్= మిక్కిలి; మేలు= మంచిది; గోవును= ఆవును; ఇమ్ము; అనఘ!= పాపంలేని; చరిత్ర!= శీలం కలవాడా!; అన్నన్= అనగా; విభుఁడు= రాజు; అట్టుల= అట్లే; చేసినన్= చేయగా; బోయలు; అప్డు; నెఱ+మనములు= నిండు మనస్సులు; మోదము= సంతోషం; అందన్= పొందగా; గరిమంబునన్= గౌరవంతో; భార్గవున్= చ్యవనుడిని; చేరి= సమీపించి; మమ్మున్; కన్గొనిన+అది= చూచినది; ఆదిగాన్= మొదలుగా; కరుణ= దయను; కూరెదవు= నింపుతావు; ఒక్కటి; విన్నవింతుమే?= మనవి చేసుకొందుమే?

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి ' ఆ ఆలోచన మంచిది. పుణ్యాత్ముడా! గోవు నర్పించుము' అని అనేసరికి రాజు అట్లాగే చేశాడు. బోయ లప్పుడు నిండు మనస్సులు సంతోషించగా గౌరవంతో మునిని సమీపించి 'మమ్మ చూచిన దాదిగా దయను వర్షిస్తున్నావు. మేము ఒక్కటి విన్నవించుకొంటాము (నీవు అనుమతిస్తే).'

క. అని ప్రీతిఁ బలికి, యమ్మని । యనుజ్ఞఁ గొని, 'మమ్ముఁ గావు మక్కటికమునం
గొనవయ్య! గోవు మాచే' । నన విని మొగమాట మనము నార్ద్రతఁ బెనుపన్. 279

ప్రతిపదార్థం: అని; ప్రీతిన్= ప్రేమతో; పలికి; ఆ ముని; అనుజ్ఞన్= అనుమతిని; కొని= తీసికొని; మమ్మున్; అక్కటికమునన్= దయతో; కావుము= కాపాడుము; మాచేన్= మానుండి; గోవున్= ఆవును; కొనవయ్య!= తీసికొనవయ్యా!; అనన్, విని; మొగమాట= మొగమాటచేత; మనమున్= మనస్సును; ఆర్ద్రతన్= కరిగిపోవటం; పెనుపన్= పెంచగా.

తాత్పర్యం: అని ప్రీతితో చెప్పి ఆ ముని అనుజ్ఞతో 'మమ్ములను రక్షించుము. దయతో ఆ గోవును నీవే మానుండి తీసికొనవయ్యా!' అని బోయలు వేడగా మొగమాటతో మనస్సు ద్రవించిపోగా.

తే. వేఁడికొనినట్టి కృపణుపై, వాఁడి చూడ్కి । యరయ నాశీవిషము చూపునట్ల కాన
చేయఁ బ్రార్థనా భంగంబు, మీ యభీష్ట । మాచరించెద నని గోవు నతఁడు గొనియె. 280

ప్రతిపదార్థం: వేడికొనిన+అట్టి= ప్రార్థించినట్టి; కృపణుపైన్= దీనునిపై; వాఁడి చూడ్కి= నిశితమైన చూపు; అరయన్= విచారించగా; ఆశీవిషము= పాము (కోరలలో విషమున్నది); చూపునట్లు= చూపు వంటిదే; కానన్= కావునన్; ప్రార్థనాభంగంబున్=

ప్రార్థనను నాశనం చేయటం; చేయన్= చేయను; మీ; అభి+ఇష్టము= కోరికను; ఆచరించెదను= అనుసరిస్తాను; అని; గోవును= ఆవును; అతఁడు=చ్యవనుడు; కొనియెన్= తీసికొన్నాడు.

తాత్పర్యం: వేడుకొన్నవారిపై కాఠిన్యం వహించటం పాము కాటువేయటంవంటిది. కనుక మీ ప్రార్థనను మన్నిస్తాను. భగ్నం చేయను 'మీరు కోరినట్లే గోవును గ్రహిస్తా'నని తీసికొన్నాడు.

వ. కొని యంత నిలువక. 281

ప్రతిపదార్థం: కొని= గ్రహించి; అంతన్= అంతటితో; నిలువక= ఆగక.

తాత్పర్యం: తీసికొని అంతటితో ఆగక.

తే. దర్శనప్రీతి వారిపైఁ దగుల, మీల । వలని యర్మిలి మనమున దళముకొనఁగ,
మీరు, మీలును, సమ్మోదమార దివికి । నేఁగుఁ'డని పల్కె భార్గవుం డెల్ల వినఁగ. 282

ప్రతిపదార్థం: దర్శనప్రీతి= చూడటంవలన ఏర్పడిన స్నేహం; వారిపైన్= బోయలపై; తగులన్= నాటుకొనగా; మీలవలని= చేపల మీదున్న; అర్మిలి= ప్రేమ; మనమునన్= మనస్సులో; దళము కొనఁగన్= దట్టం కాగా; మీరున్= బోయలైనమీరు; మీలునున్=చేపలును; సమ్మోదము= సంతోషం; ఆరన్= విచ్చుకొనగా; దివికిన్= స్వర్గానికి; ఏఁగుఁడు=పొండు; అని; ఎల్లన్= అందరూ; వినఁగన్= వినేటట్లు; భార్గవుండు= భృగువంశమౌని; పల్కెన్= అన్నాడు.

తాత్పర్యం: చూడటంవలన కలిగే ప్రేమ బోయలపై నాటుకొనగా, చేపలపై నున్న ప్రేమ దట్టం కాగా, బోయలతో ముని అన్నాడు అందరూ వినేటట్లుగా 'మీరూ, చేపలూ స్వర్గానికి పోదురు గాక!' అని.

విశేషం: ఇది వరం తప్ప శాపం కాదు. అకృత్రిమమైన స్వచ్ఛమైన హృదయం కలవారికి మాటలోని స్వచ్ఛత ఋజుత్వం, నిజాయితీ తెలుస్తాయి. కృత్రిమమైన మనస్సు కలవాడు ప్రతిమాటకూ వక్రభాష్యం చెప్పుకొంటాడు. ఇది నేటి మనిషి లక్షణ మని పైన చెప్పబడింది కదా! ఆ దృష్టితో చూస్తే 'ముని బోయలను చావగొట్టా డనవచ్చును. 'ఆశ్రమవాసపర్వం ద్వితీయాశ్వాసంలో ధృతరాష్ట్రుడికి వ్యాసుడు చనిపోయిన వారిని చూపించిన ఘట్టముంది. కొందరు ఆధునిక పండితులు దీనిని వివరిస్తూ వ్యాసుడు వారిని గంగలో త్రోసి చంపిం చాడని చెప్పారు. ఇదే హేతువాద దృష్టి అన్నారు. కాబట్టి శబ్దానికున్న ఋజువైన అర్థమేదో దాన్ని చెప్పటం వ్యాఖ్యానం తప్ప వక్ర వివరణం కాదు.

వ. పలికినఁ దత్క్షణంబ. 283

తాత్పర్యం: పలికిన వెంటనే.

తే. మీనములుఁ దారుఁ దనువుల తోన నెగసి । నాకలోకంబునకుఁ బోవ, నహుష నృపతి
సపరివారంబు గాఁగ నాశ్చర్య పూర । మగ్న మానసుఁ డయి యుండె మానవేంద్ర! 284

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= మానవలోకానికి రాజైనవాడా!; మీనములున్= చేపలును; తారున్= తాము, బోయలును; తనువులతోనన్= శరీరాలతోపాటుగా; ఎగసి= ఎగిరి; నాక లోకంబునకున్= స్వర్గలోకానికి; పోవన్= పోగా; నహుష నృపతి=

నహుష చక్రవర్తి; సపరివారంబుగాన్= పరివారంతోపాటుగా; ఆశ్చర్యపూర= ఆశ్చర్య ప్రవాహంలో; మగ్న= మునిగిన; మానసుఁడు+అయి= మనస్సు కలవాడై; ఉండెన్= నిశ్చేష్టుడై ఉన్నాడు.

తాత్పర్యం: చేపలు, బోయలు శరీరాలతో పైకి ఎగిరి స్వర్గానికి పోయారు. చూచిన రాజు, పరివారంతోపాటుగా ఆశ్చర్య సముద్రంలో మునిగిపోయాడు.

విశేషం: న+అ+కం= నాకం; కం=సంతోషం; ఆకం= దుఃఖం - సంతోషం లేకపోవటం; న+అకం= దుఃఖంలేనిది - ఆనందనిలయం.

వ. అప్పుడు. **285**

తాత్పర్యం: ఆ సమయంలో.

క. చ్యవనుఁడు, గవిజాతుఁడు, న । య్యవనీశ్వరుఁ బిల్చి 'వరము లడుగుము రెం డీఁ
దివిరితి' మనుడు నతఁడు 'మీ । యవిరళ సంప్రీతికంటె నర్థము గలదే!' **286**

ప్రతిపదార్థం: చ్యవనుఁడు=భార్గవుడు; గవిజాతుఁడున్= ఆ పేరుగల మునియు (గవి= ఆవుకు; జాతుఁడు= పుట్టినవాడు- గోసంతానం కనుకనే గోమాహాత్మ్యం చెప్పాడు. చూ.పై.273- 274 పద్యాలు); ఆ+అవనీ+ఈశ్వరున్= ఆ భూమిపతిని; పిల్చి= పిలిచి; వరములు= అనుగ్రహరూపంగా; అడుగుము; రెండున్= రెంటిని; ఈన్= ఇవ్వటానికి; తివిరితిమి= పూనుకొన్నాము; అనవుడున్= అనగా; అతఁడు= రాజు; మీ= మీయొక్క; అవిరళ= ఎడతెగని; (విరళము= పలుచగా - దూరంగా; న=లేనిది, దట్టంగా); సంప్రీతి కంటెన్= మంచి ప్రేమ కంటె; అర్థము= ప్రయోజనం; వరం; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: ఇద్దరు మునులు రాజుతో అన్నారు. 'రెండు వరాలనివ్వాలనుకున్నాం. కోరుకొమ్మంటే రాజన్నాడు 'మీకు నాపై నున్న ప్రేమకంటె కావలసిన దేమున్నది. (కోరదగిన దేమున్నది).'

తే. అనిన విని, యగ్గలం బైన యాదరమున । వారు ధర్మపరత్వంబు వాసవాభ
వైభవము నయ్యెడుమ నీకు వంశపావ । నాత్మ!' యనుచు, నంతర్హితు లైరి వత్స! **287**

ప్రతిపదార్థం: అనినన్; విని; వారు; అగ్గలంబు+ఐన= ఎక్కువైన; ఆదరమునన్= ప్రేమతో; నీకున్; వంశపావన+ఆత్మ!= వంశంలో ఉన్నతుడైనవాడా!; ధర్మపరత్వంబు= ధర్మబుద్ధి; వాసవ+ఆభ= వాసవుడివంటి; వైభవము= ఐశ్వర్యం; అయ్యెడుమ= కలుగుగాక!; అనుచున్= అంటూనే; అంతర్హితులు= అంతర్ధానం; ఐరి= అయ్యారు; వత్స!= నాయనా!

తాత్పర్యం: అనేసరికి అధికమైన ఆదరంతో వారిద్దరూ రాజునాశీర్వదించారు. 'వంశోద్ధారకా! నీకు ధర్మపరాయణత్వం, ఇంద్రుడివంటి ఐశ్వర్యం కలుగుగాక! అంటూ అంతర్ధానమయ్యారు.

క. మది నద్భుతంబుఁ బ్రమదముఁ । బొదలఁగ నమ్మునుల మహిమఁ బొగడుచుఁ జనియెం
దదనంతరంబ పతి నిజ । సదనమునకు నెల్ల జనులు సమ్మద మందన్. **288**

ప్రతిపదార్థం: మదిన్= మనస్సులో; అద్భుతంబు= ఆశ్చర్యం; ప్రమదమున్= సంతోషం; పొదలంగన్= కలుగగా; ఆ+మునుల;

మహిమన్= మాహాత్మ్యమును; పొగడుచున్= స్తుతిస్తూ; తత్+అనంతరంబు+అ= ఆ తరువాత; ఎల్లన్‌జనులు= జనులంతా; సమ్మదము= సంతోషం; అందన్= పొందగా; పతి= రాజు; నిజ= తన; సదనమునకున్= సౌధానికి - మేడకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: రాజు మనస్సులో ఆశ్చర్యం, సంతోషం ముప్పిరిగొనగా ఆ మునుల మాహాత్మ్యం స్తుతిస్తూ జనులంతా ఆనందిస్తుండగా తన సౌధానికి పోయాడు.

వ. అని చెప్పి భీష్ముండు. 289

తాత్పర్యం: అని భీష్ముడు కథను వివరించి.

క. వినిపించితి సంవాసం । బున దర్శనమునను౯ జిత్తమున నధిక స్నే
హ నిరూఢి గల్గుటయు గో । వునందు గల గౌరవము౯ జెవుల కింపెస౯గన్. 290

ప్రతిపదార్థం: సంవాసంబునన్= కలిసి జీవించటంవలన; దర్శనమునను= చూడటంవలన; చిత్తమునన్= మనస్సులో; అధిక= మిక్కిలి; స్నేహ నిరూఢి= స్నేహ దృఢత్వం; కల్గుటయున్= కలుగుట; గోవునందున్= గోవుపై; కల; గౌరవము= గురుత్వ భావం, గొప్పతనం; చెవులకున్; ఇంపు= ఆనందం; ఎస౯గన్= అతిశయం కాగా; వినిపించితిన్= వినిపించాను.

తాత్పర్యం: కలిసిమెలిసి బ్రతకటంవలన, దర్శనంవలన మనస్సులో స్నేహం నాటుకొనటం, ఆవుల గొప్పతనం చెవుల కింపుగా వినిపించాను.

చ్యవన కుశిక సంవాదంబను నితిహాసము (సం.13-52-1)

వ. అనిన విని యక్కురువంశవర్యుం డా ధర్మధుర్యునితో, 'నాకు నొక్కటి వినుటకుం గుతూహలం బెప్పుడుం గల్గియుండు; ఉదాత్తబ్రాహ్మ్యనిధి యైన భార్గవాన్వయంబునం జిత్రతర క్షాత్త్ర చరిత్రుం డగు పరశురాముండు జనియించుటయు, నుత్తమ క్షత్త్రియత్వ మహోష్మంబైన కుశిక కులంబునం బరమ బ్రాహ్మణ్యవిశ్రుతుం డైన విశ్వామిత్రుం డుదయించుటయును, నది యెట్లొకో? అనుచుండుదు౯ దొల్లియు౯ గొంత వింటి; నిస్సంశయంబు గాదు; మహాత్మా! మదీయచిత్తాయత్తంబుగా నత్తెఱం గెఱింగింపవే!' యనుటయు నయ్యనిమిషనదీ నందనుండు గుంతీనందనాగ్రజు తోడం 'జ్యవనకుశిక సంవాదంబను నితిహాసంబు వినుము. దాన భవత్సంశయంబు వాయు; జ్యవనుండు నిజవంశంబునకుం గుశిక కులంబు కారణంబుగా సంకరంబు గలుగ౯ గలయది అని యెఱింగి యక్కుశిక కలంబునకు నుత్పాతం బాపాదింపంగోరి కుశిక భూపాలు పాలికిం జనిన నతండు. 291

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+కురువంశ వర్యుండు= ఆ కురువంశ శ్రేష్ఠుడు, ధర్మరాజు; ఆ ధర్మధుర్యునితోన్= ఆ ధర్మవేత్తతో; నాకున్ ఒక్కటి వినుటకున్; కుతూహలంబు= కోరిక; ఎప్పుడున్; కల్గి+ఉండున్= కలుగుతుంటుంది; ఉదాత్త= ఉన్నతమగు; బ్రాహ్మ్యనిధి= బ్రాహ్మ్యశక్తికి, బ్రాహ్మణమాహాత్మ్యానికి నిధి అయిన; భార్గవ+అన్వయంబునన్= భార్గవ వంశంలో; చిత్రతర= మిక్కిలి అద్భుతమైన; క్షాత్ర చరిత్రుండు= క్షత్రియ చరిత్ర కలవాడు; అగు; పరశురాముండు; జనియించుటయున్; ఉత్తమ క్షత్రియత్వ= ఉత్కృష్ట క్షాత్ర; మహా+ఊష్మంబు= గొప్ప నిప్పు (వేడి) గల; కుశిక కులంబునన్= కుశిక వంశంలో;

పరమ బ్రాహ్మణ్య విశ్రుతుండు= బ్రాహ్మణశక్తితో ప్రఖ్యాతుడు; ఐన విశ్వామిత్రుండు ఉదయించుటయును; అది ఎట్లు+ఒకో!= అదెట్లా సాధ్యం!; అనుచుండుదున్; తొల్లియున్= పూర్వంకూడా; కొంత+వింటిన్; నిస్సంశయంబు కాదు= సందేహం తీరదు; మహా+ఆత్మా; మదీయ= నా; చిత్త+ఆయత్తంబుగాన్= నా మనస్సుకు హత్తుకొనేటట్లు; ఆ+తెఱంగు= ఆ విషయం; ఎఱింగింపవే; అనుటయున్; ఆ+అనిమిష నదీనందనుండు= ఆ దేవతానది అయిన గంగ కొడుకు; కుంతీనందన+అగ్రజుతోడన్= కుంతికొడుకులలో పెద్దవాడైన ధర్మరాజుతో; చ్యవనకుశిక సంవాదంబు+అను ఇతిహాసంబు; వినుము, దానన్; భవత్= నీ; సంశయంబు= సందేహం; పాయున్= తొలగిపోతుంది; చ్యవనుండు; నిజ= తన; వంశంబునకున్; కుశిక కులాలు; కారణంబుగాన్; సంకరంబు=సాంకర్యం; కలుగన్ కలయది= సంభవింపగల్గును; అని; ఎఱింగి= తెలిసి; ఆ+కుశికకులంబునకున్; ఉత్పాతంబు= విపత్తు; ఆపాదింపన్= కలిగింపగా; కోరి; కుశిక భూపాలు పాలికిన్= ఆ కుశికరాజువద్దకు; చనినన్= వెళ్ళగా; అతండు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడిని ప్రశ్నిస్తున్నాడు. నాకు ఒక విషయాన్ని తెలుసుకోవాలని ఎప్పటినుంచో కుతూహలంగా ఉంది. 'మహత్తరమైన బ్రాహ్మణశక్తి కల భృగువంశంలో విచిత్రమైన క్షత్రియశీలం కల పరశు రాముడెట్లా జన్మించాడు? మహోత్తమమైన క్షాత్రశక్తితో మండే కుశికవంశంలో బ్రాహ్మణ తేజస్సు కల విశ్వామిత్రు డెట్లా పుట్టాడు? ఇదివరకు కొంత విన్నాను. కాని సంశయం తీరలేదు. కనుక నా మనస్సున నాటుకొనేటట్లు స్పష్టంగా ఆ కథ చెప్పుము' అంటే భీష్ముడు 'అయితే చ్యవన కుశిక సంవాదం వినుము. నీ సందేహం తీరుతుంది. చ్యవనుడు కుశికుడివలన తన వంశం సంకరమౌతుందని తెలిసికొని ఆ కులానికి ఆపద నాపాదించాలనుకొని కుశికుడి దగ్గరకు పోయి.

విశేషం: ఇదివరకు విన్నాను. అన్నమాట చాలా నేర్పుగా అన్నాడు. ఎందుకంటే ఈ కథలు పూర్వపర్వాలలో వచ్చాయి కనుక.

క. భార్యా సహితముగా న । య్యార్య వరుని కనుగుణంపు టర్చన విధివ
చ్చర్యాపూర్వముగ వినయ । ధుర్యత వెలయంగఁ జేసె దోహల మమరన్. 292

ప్రతిపదార్థం: భార్యాసహితముగాన్= భార్యతోపాటుగా; ఆ+ఆర్యవరునికిన్= ఆ పూజనీయులలో శ్రేష్ఠుడికి; అనుగుణంపు= తగిన; అర్చనన్= పూజను; విధివత్= శాస్త్రానుగుణమైన; చర్యాపూర్వముగన్= చేష్టా పూర్వకంగా; వినయ ధుర్యత= వినయభారం; వెలయంగన్= ప్రకాశించేటట్లు; దోహలము= ఉత్సాహం; అమరన్ చేసెన్= అమరేటట్లు చేశాడు.

తాత్పర్యం: కుశికుడు భార్యతో కలిసి ఆ మునివరునకు శాస్త్రం చెప్పిన పద్దతిగా వినయంతో ఉత్సాహంగా పూజలు చేశాడు.

విశేషం: ఆర్యుడు= పూజింపదగినవాడన్న అర్థంలోనే ప్రాచీన గ్రంథాలలో ఉన్నది. కాని నేడు చరిత్రకారులు ద్రావిడజాతిని అణగద్రొక్కి, ఆర్యులెక్కడ నుండో కొన్నివేల ఏళ్ళక్రితం భారతదేశానికి వచ్చారని చెప్పుతున్నారు. ఈ దేశాన్ని అప్పటికే పాలించేవారు ద్రావిడజాతి అని వీళ్ళవాదన. కానీ వేదంలో ఎక్కడా ఈ అర్థంలో లేదని పండితులంటున్నారు.

క. పూజితునిఁ జేసి, యతనికి । రాజవరుం డిట్టులనియె 'రాజ్య విభుత్వ
భ్రాజిష్ణుఁడవై భృత్యుని । యోజను నను నడపి యేలు మర్వి మునీంద్రా! 293

ప్రతిపదార్థం: పూజితునిన్+చేసి= పూజించి (పూజించబడిన వాడినిగా చేసి); అతనికిన్= అతడితో; రాజవరుండు= రాజశ్రేష్ఠుడు; ఇట్టులు; అనియెన్; మునీంద్రా!= మునిశ్రేష్ఠా!; రాజ్యవిభుత్వ= రాజ్యసంబంధమైన ప్రభు భావంతో (రాజత్వంతో);

భ్రాజిష్ణుఁడవు+ఐ= ప్రకాశించేవాడివై; ననున్= నన్ను; భృత్యుని= సేవకుని; ఓజను= వలె; నడపి= నియోగించి; ఉర్వి ఏలుము= భూమిని పాలించుము.

తాత్పర్యం: మునీంద్రుడిని పూజించి రాజేంద్రు డతనితో అన్నాడు. 'మునీంద్రా! నీవు రాజ వైభవంతో వెలుగొందుతూ నన్ను నీ సేవకుడిగా చేసికొని ఈ ధరణిని పాలించుము.

క. ఏనును, భార్యయు, బంధులు, । నానా జనసహితముగ సనాథతఁ గని య
ట్లైనం బెంపుం బొరయం । గా నిలకుఁ బ్రమోద మొందఁ గైకొను మమ్మున్. 294

ప్రతిపదార్థం: ఏనునున్= నేనూ; భార్యయున్= భార్యా; బంధులున్=చుట్టాలూ; నానా జనసహితముగన్= అనేకులతో పాటుగా; సనాథతన్+కని= సభర్తృకత్వమునుపొంది; ఇలకున్= నేలకు (రాజ్యానికి); అట్లు= ఆవిధంగా; అయినన్= అయితే; పెంపున్= శుభం,అభివృద్ధి; పొరయంగాన్= కలుగగా; ప్రమోదము= సంతోషం; ఒందన్= పొందేటట్లుగా; మమ్మున్; కైకొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: నేనూ, నా భార్య, చుట్టాలు, పక్కాలు అంతా నిన్ను రాజుగా అంగీకరించి సేవిస్తాం. రాజ్యానికి శుభాభివృద్ధి కలిగేటట్లు మమ్ములను స్వీకరించుము.'

చ. అన విని, యమ్ముని ప్రవరుఁ డాతని కిట్లను 'రాజ్యకాంక్ష నా
మనమున లేదు, సద్వ్రతము, మానిత వృత్తిఁ జరించువాఁడ నై
జనవర! వచ్చినాఁడఁ; బరిచారము నీవును నీదు పత్నియున్
గొనకొని చేయఁ గావలయుఁ గోరిక యింతియ తీర్పు మోపినన్.' 295

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; ఆ ముని= మునులలో; ప్రవరుఁడు= శ్రేష్ఠుడు; అతనికిన్= రాజుతో; ఇట్లు; అనున్; జనవర= మానవనాథా!; నా మనమునన్= నా మనస్సులో; రాజ్యకాంక్ష= రాజ్యంమీద కోరిక; లేదు; మానిత= గౌరవించ దగ్గ; వృత్తిన్= ప్రవర్తనతో; సత్+వ్రతము= మంచి వ్రతం; చరించువాఁడనై= ఆచరించేవాడనై; వచ్చినాఁడన్= వచ్చాను; నీవునున్= నీవూ; నీదు= నీ; పత్నియున్= భార్యా; కొనకొని= పూనుకొని; పరిచారము= సేవ; చేయఁ గావలయున్=చేయాలి; ఇంతియ= ఇంతే; కోరిక= నా అభిలాష!; ఓపినన్= ఓపిక ఉంటే; తీర్పుము= చెల్లించుము.

తాత్పర్యం: అంతా విని మునీంద్రు డన్నాడు. 'రాజా! నాకు రాజ్యమేలాలన్న కోరిక ఏ కోశానా లేదు. నేను ఒక వ్రతాన్ని పూని దానిని చెల్లించుకొనటానికై తిరుగుతున్నాను. నీకు ఓపిక ఉంటే నీవూ, నీ భార్యా, బంధువులూ నాకు సేవచేస్తే చాలు. నా కోరిక ఇంతే.'

వ. అనిన విని యా దంపతులు ముదంబునం బొదలి 'యట్ల చేయువార' మనిరి; తదనంతరంబ. 296

ప్రతిపదార్థం: అనినన్ విని= అనటం విని; ఆ దంపతులు= రాజూ రాణీ; ముదంబునన్= సంతోషంతో; పొదలి= వర్ధిల్లి; అతిశయించి; అట్ల= అట్లే; చేయువారము= చేస్తాము; అనిరి= అన్నారు; తత్+అనంతరంబు+అ= అటు తరువాత.

తాత్పర్యం: అనగా విని ఆ దంపతులు సంతోషించి 'అట్లాగే చేస్తా' మన్నారు. ఆ తరువాత.

క. అమ్ముని నభ్యంతర సద । నమ్మునకుం గొని విభుండు నాతియుఁ దానున్,
సమ్మోదమ్మునఁ జని, హృ । ద్యమ్మగు, నొక చోటు సూపి యాతనితోడన్. 297

ప్రతిపదార్థం: ఆ+మునిన్= చ్యవన మహర్షిని; అభ్యంతర= లోపలి; సదనమ్మునకున్= ఇంట్లోకి; అంతఃపురానికి; కొని= తీసికొని; విభుండు= రాజు; నాతియున్= స్త్రీ (రాణి); తానున్= (రాజు) తాను; సమ్మోదమ్మునన్= సంతోషంతో; చని= పోయి; హృద్యమ్ము+ అగు= అందమైన; ఒకచోటు= ఒక స్థలం; చూపి; అతనితోడన్= మునితో.

తాత్పర్యం: ఆ మునిని అంతఃపురానికి తీసికొనిపోయి రాజూ రాణీ సంతోషంతో ఆయన కొక అందమైన నివాసం చూపించి ఆ మునితో.

ఆ. 'అనఘ! యిచట నుండు' మని పల్కి, మృదులత । ల్పంబు నంచితాసనంబు నచటఁ
బెట్టఁ బనిచి యేము ప్రీతి నొనర్చెద । మిష్టభంగిఁ బనుపుఁ డెద్దియైన' 298

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!, స్వామీ; ఇచటన్= ఈ చోట; ఉండుము; అని; పల్కి= చెప్పి; మృదుల= మెత్తని; తల్పంబు= శయ్య; అంచిత= ఒప్పిదమైన; ఆసనంబు= పీఠం; అచటన్= అక్కడ; పెట్టన్= పెట్టుమని; పంచి= ఆజ్ఞాపించి; ఏము= మేమిద్దరం; ప్రీతిన్= ప్రేమతో; ఒనర్చెదము= సేవిస్తాము; ఇష్టభంగిన్= నీకిష్టమైన విధంగా; ఎద్దిఐనన్= ఏదైనా సరే; పనుపుము= ఆనతిమ్ము!

తాత్పర్యం: 'పాపంలేనివాడా! నీవు ఇక్కడ ఉండుము.' అని పరుండుటకు మెత్తని శయ్య, కూర్చోటానికి చక్కనిపీఠం ఉంచుమని ఆజ్ఞాపించి; 'స్వామీ! తమయిష్టానుసారంగా మేము సేవిస్తాము. మీ కేమి చేయాలో చెప్పండి.'

వ. అనియె; నంత నినుం డపరగిరికడచనినం, గాలోచిత కృత్యంబు లాచరించి యమ్మహాత్ముం డాహార మడిగిన నమ్మహీపతి మహితభోజనంబున నతనిం దృప్తునిం గావించిన.' 299

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అంతన్= అంతలో; ఇనుండు= సూర్యుడు; అపరగిరికడ= పశ్చిమదిక్కున నున్న పర్వతందగ్గరికి; - క్రుంకు కొండకు; చనినన్= పోగా; కాల= ఆ సంధ్యాసమయానికి; ఉచిత= తగిన; కృత్యంబులు= వైదిక కార్యాలు (పనులు); ఆచరించి= చేసి; ఆ మహాత్ముండు= ఆ ముని; ఆహారము= భోజనం; అడిగినన్= అడుగగా; ఆ మహీపతి= ఆ భూమిపతి, రాజు; మహిత= గొప్ప; భోజనంబునన్= ఆహారంతో; అతనిన్= మునిని; తృప్తునిన్+కావించినన్= తృప్తిపడేటట్లు చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అని అన్నాడు. ఇంతలో సాయంకాలమైనది. ముని సంధ్యాకాలంలో చేయదగ్గ సంధ్యావందనాది వేదోక్త కర్మ లాచరించి రాజుతో భోజనం కావా లన్నాడు. రాజు గొప్ప విందు భోజనంతో మునిని తృప్తుడిని చేశాడు.

ఆ. అతఁడు సెజ్జఁ జేరి, యధిపుతో 'నియ్యెడ । నిద్రవోదు నేను నృపవరేణ్య!
మీరు నిదుర దక్కి మెలపున నాచర । ణంబు లొత్తు చునికి నాకుఁ బ్రియము. 300

ప్రతిపదార్థం: అతఁడు= ముని; సెజ్జన్= శయ్యను; చేరి= సమీపించి; అధిపుతోన్= రాజుతో; ఈ+ఎడన్= ఇక్కడ; నేను నిద్రపోదున్= నిద్రపోతాను; నృపవరేణ్య!= రాజులలో చాలా గొప్పవాడా!; మీరు= మీ దంపతులిద్దరు; నిదుర; తక్కి= లేకుండా; మెలపునన్= చక్కగా; నా చరణంబులు= నా కాళ్ళు; ఒత్తుచున్+ఉనికి= ఒత్తుతూ ఉండటం; నాకున్; ప్రియము= ఇష్టం.

తాత్పర్యం: ముని భోజనం చేసి మంచమెక్కి రాజుతో అన్నాడు 'నే నిక్కడ నిద్రిస్తానయ్యా! రాజశ్రేష్ఠుడా! మీ దంపతులిద్దరూ నిద్రపోకుండా నా కాళ్ళు పిసుకుతూ మేల్కొని ఉండండి: అదే నాకిష్టం.

క. ఏనై మేల్కనునంతకు । భూనాయకవర్య! నన్ను బోధింపకుఁ డీ
మానినియు నీవు' నని, ని । ద్రా నిరతుం డయ్యెం, వారుఁ దద్దయు భక్తిన్. 301

ప్రతిపదార్థం: ఏను+ఐ= నా అంత నేనుగా; మేల్కను+అంతకున్= మేలుకొనే టంతవరకు; భూనాయకవర్య!= రాజులలో శ్రేష్ఠుడా!; నన్నున్; ఈ మానినియున్= ఈ నీ భార్యయూ; నీవున్; బోధింపకుఁడు= మేల్కొలుపవద్దు; అని; నిద్రానిరతుండు+ అయ్యెన్= నిద్రలో మునిగిపోయాడు; వారున్= దంపతులు; తద్దయున్= మిక్కిలి; భక్తిన్= భక్తితో.

తాత్పర్యం: నా అంత నేనై లేచేటంతవరకు మీ ఇద్దరిలో ఎవరూ నన్ను నిద్ర లేపవద్దు' అని నిద్రించాడు. ఆ దంపతులు మిక్కిలి భక్తితో. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. కుడుపు నిదురయు, వర్జించి యడుగు లొత్తు । చుండి రమ్ముని వల్లభుఁ డొక్కప్రక్క
నచలగాత్రుఁడై నిద్రింప నద్భుతముగ । దినము లిరువది యొక్కటి సనియె నధిప! 302

ప్రతిపదార్థం: కుడుపు= తిండి; నిదురయున్= నిద్రా; వర్జించి= వదలి; అడుగులు= పాదాలు; ఒత్తుచున్+ఉండిరి= ఒత్తుతూ ఉన్నారు; ఆ ముని వల్లభుఁడు= ఆ మునిరాజు; ఒక ప్రక్కన్= ఒకే ప్రక్కకు తిరిగి; అచల= కదలిక లేని; గాత్రుఁడై= శరీరం కలవాడై; అద్భుతముగన్= ఆశ్చర్యముగా; నిద్రింపన్= నిద్రపోగా; ఇరువదిఒక్కటి; దినములు= రోజులు; చనియెన్= గతించాయి; అధిప!= రాజా! - ధర్మరాజా! (శ్రోత).

తాత్పర్యం: ధర్మరాజా! ఆ దంపతులు అన్నం నిద్రా విసర్జించి పాదాలు ఒత్తుతూనే ఉన్నారు. ఆ ముని ఒకే ప్రక్కకు తిరిగి పడుకొన్నవాడు పడుకొన్నట్లుగానే ఉన్నాడు. శరీరంలో కదలిక లేదు. ఈ విధంగా ఇరవై ఒక్క రోజులు గతించిపోయాయి.

విశేషం: ఇరవై ఒక్క రోజులు ఎట్లా పడుకుంటాడు? పిచ్చికథ అనవచ్చును. కానీ, యోగులు సమాధిలో మునిగి ఉండగలరు. ఈ యుగంలో శ్రీ రామకృష్ణ పరమహంస అట్లా ఉన్నారని వారి జీవిత చరిత్రలో ఉన్నది. ఒత్తుచుండిరి= ఒత్తుతూ ఉన్నారు. ఏమరుపాటు లేకుండా భక్తితో - దీన్ని శత్రర్థక క్రియ అంటారు.

వ. ఇరువది రెండవనాఁ డమ్ముని తనయంతన మేల్కొని. 303

తాత్పర్యం: ఇరవైరెండో రోజున ఆ ముని తనంత తానే నిద్ర లేచి.

క. ఇలు వెడలి పోయె నేమియుఁ । బలుకక; యా దంపతులును బరమశ్రాంతా
త్ము లగుచు వెనుకన చని; ర । క్కులపతి యించుకయు సరకుగొనఁ డవ్విధమున్. 304

ప్రతిపదార్థం: ఏమియున్= ఏమీ; పలుకక= మాట్లాడక; ఇలు వెడలిపోయెన్= ఇల్లు వదలి వెళ్ళిపోయాడు; ఆ దంపతులును= రాజూ రాణీ; పరమ= మిక్కిలి; శ్రాంత+ఆత్ములు= అలసిపోయిన శరీరం కలవారు; అగుచున్= అవుతూ; వెనుకన= ఆముని

వెనుకనే; చనిరి= వెళ్ళారు; ఆ+కులపతి= ఆ ముని; ఇంచుకయున్= కొంచెమైనా; ఆ విధమున్= ఆ పద్ధతిని; సరకుకొనఁడు= లెక్కపెట్టడు.

తాత్పర్యం: ముని లేచిందే తడవుగా ఏమీ మాట్లాడకుండానే ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. బాగా అలసిపోయిన దంపతులు ఆయన వెనుక పడ్డారు. దానికీ ఆయన లెక్కచేయలేదు.

విశేషం: కులపతి= పదివేల శిష్యులకు అన్నదానంతోపాటు విద్యాదానం చేసే గురువు. (ఇవ్వాళ వైస్ఛాన్సలరు - అన్నమాట కిది తెలుగుగా వాడుతున్నారు - ఆయన అట్లాంటి పనిచేయకపోయినా).

ఆ. అట్లు వారివలన నాదర రహితుఁడై । పురవరంబు వెడలి పోయి పోయి
యతఁడు సూడఁజూడ 'నంతర్హితుం డైనఁ । బతియు సతియు మూర్ఛపాలు పడిరి. 305

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; వారివలనన్= వారిపై; ఆదర= ప్రేమ; రహితుఁడై= లేనివాడై; పురవరంబు= శ్రేష్ఠమైన నగరం; వెడలి= బహిర్గమించి - బయటకు వచ్చి; పోయిపోయి= చాలా దూరం పోయి; చూడన్+చూడన్= చూస్తూ ఉండగానే; అతఁడు= ఆ ముని; అంతర్హితుండు= అదృశ్యుడు; ఐనన్= కాగా; పతియు సతియున్= భర్తా, భార్యా; మూర్ఛపాలు పడిరి= మూర్ఛపోయారు.

తాత్పర్యం: ఆ విధంగా వారిని నిరాదరించిన ముని నగరం దాటి పోయిపోయి అదృశ్యం కాగా రాజూ రాణీ మూర్ఛపోయారు.

క. కొంతవడికిఁ దెప్పిఱి యెద । నెంతయు వగ నూనఁ బురికి నేతెంచి గృహా
భ్యంతరము సొచ్చి కని ర । య్యింతియును విభుండు నమ్మునీశ్వరు సెజ్జన్. 306

ప్రతిపదార్థం: కొంతవడికిన్= కొంచెం సేపటికి; తెప్పిఱి= మూర్ఛనుండి తెప్పరిల్లి; ఎదన్= హృదయంలో; ఎంతయున్= ఎంతో; వగన్= దుఃఖం; ఊనన్= పొందగా; పురికిన్= నగరానికి; ఏతెంచి= వచ్చి; గృహ+అభి+అంతరమున్= అంతఃపురం లోనికి; చొచ్చి= ప్రవేశించి; ఆ+ఇంతియును= ఆ స్త్రీ (రాణి); విభుండున్= రాజూ; ఆ+ముని+ఈశ్వరున్= ఆముని శ్రేష్ఠుడిని; సెజ్జన్= శయ్యపై; కనిరి= చూచారు.

తాత్పర్యం: కొంతసేపటికి మూర్ఛనుండి తేరుకొని మనస్సులో బాగా మథనపడి తిరిగి నగరం ప్రవేశించి అంతః పురంలోకి పోయి చూస్తే మునీశ్వరుడు మంచంపైనే ఉన్నాడు.

వ. మును నిద్రించు ప్రక్కదక్క యొండు ప్రక్క నిద్రించు భార్గవు నట్లు గాంచి సంతోషించి, పరిశ్రాంతి దిగద్రావి యెప్పటి చొప్పున నడుగు లొత్తుచుండ, మఱియు దినంబు లిరువది యొక్కటి సనినం బ్రబుద్ధుండై. 307

ప్రతిపదార్థం: మును= ముందు - పూర్వం; నిద్రించు ప్రక్క= నిద్రించే వైపు; తక్కి= వదలి; ఒండుప్రక్కన్= మరొకప్రక్క; నిద్రించు= నిద్రపోయే; భార్గవున్= చ్యవనుడిని; అట్లు= ఆ విధంగా; కాంచి= చూచి; సంతోషించి= ఆనందించి; పరిశ్రాంతిన్= అలసటను; దిగన్ త్రావి= దిగవిడిచి, త్యజించి; ఎప్పటి చొప్పునన్= ఎప్పటివలెనే; అడుగులు= పాదాలు; ఒత్తుచున్+ఉండన్= ఒత్తుతూ ఉండగా; మఱియున్= మరలా; ఇంకా; దినంబులు= రోజులు; ఇరువది= ఇరవై పై; ఒకటి; చనినన్= గడవగా; ప్రబుద్ధుండు+ఐ= మేల్కొని

తాత్పర్యం: ముని పూర్వం నిద్రించిన వైపు వదలి మరొక ప్రక్క తిరిగి నిద్రిస్తున్నాడు. అట్లాంటివాడిని చూచి రాజూ రాణీ కలిగిన అలసట కూడా లెక్కసేయక ఎప్పటివలెనే పాదా లొత్తుతూ ఉన్నారు. మరలా ఇరవై ఒక్క రోజులు గడిచాయి. అప్పు డా భార్గవుడు నిదుర లేచి.

సీ. అతఁడు తైలాభ్యంగ మడిగినఁ బతి కమ్మ । నూనియఁ దెప్పించి మేను శిరము
నభ్యక్తములు సేయ, నమ్ముని సెడ నాడి । యంతర్హితుం డయ్యె నపరఘటికఁ
దోఁచి వికారంబు దొడరక యున్న రా । జును దేవులను గని, సుముఖుఁ డగుచు
నాచరితస్నానుఁ డగుటయు, వారు మ । హార్హంబు లగు వివిధాన్నపాన

ఆ. ములు ఘటించి, కుడువఁ బిలిచినఁ జని, వాని । నెల్లఁ గాంచి, యెక్కడేనిఁ బోయె
వార లడలు గదుర నూరకయుండి రా । పగలు రేయుఁ గురునృపాలవర్య! 308

ప్రతిపదార్థం: కురునృపాల వర్య!= కౌరవరాజశ్రేష్ఠుడా! అతఁడు= చ్యవనుడు; తైల+అభ్యంగము= నూనెరాసుకొని చేసే స్నానం, తలంటు; అడిగినన్= అడుగగా, పతి= రాజు; కమ్మనూనియన్= కమ్మని వాసనవేసే నూనెను; తెప్పించి; మేనున్= శరీరము; శిరమున్= తల; అభ్యక్తములు సేయన్= అభిషేకించగా; ఆ ముని; చెడన్+ఆడి= చెడదిట్టి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడయ్యాడు; అపరఘటికన్= మరునిముసంలో; తోఁచి= కనిపించి; వికారంబు= బాధ, దుఃఖం, విసుగు మొదలైన భావాలు; తొడరక= కలుగక; ఉన్న= ఉన్నట్టి; రాజునున్; దేవులను= దేవేరులను, రాణులను; కని; సుముఖుఁడు+అగుచున్= ప్రసన్నముఖం కలవాడై; ఆచరిత= చేయబడిన, చేయించబడిన; స్నానుఁడు= స్నానం కలవాడు; అగుటయున్= కాగా; వారు= రాజు రాణి; మహా+అర్హంబులు+అగు= మిక్కిలితగిన; వివిధ= అనేకములు; అన్న= భోజనం; పానములు= త్రాగేవి; ఘటించి= కూర్చి; కుడువన్= తినడానికి; పిలిచినన్= పిలిస్తే; చని= వెళ్ళి; వానిన్+ఎల్లన్= వాటినన్నిటినీ; కాంచి= చూచి; ఎక్కడ+ఏనిన్= ఎక్కడికైనా, ఎక్కడకో; పోయెన్= పోయాడు; వారలు= రాజు, రాణులు; ఆ పగలు రేయున్= ఆ రోజంతా; అడలు= బాధ, దుఃఖం; కదురన్= కలుగగా; ఊరక ఉండిరి= అట్లాగే కూర్చుండి పోయారు;

తాత్పర్యం: కౌరవరాజులలో శ్రేష్ఠుడైనవాడా! ఆ ముని నూనెతో తలంటు స్నానం చేయాలన్నాడు. రాజు వాసననూనె తెప్పించి తలకు శరీరానికి నూనె పూయగా ఆయన తెగ తిట్టి కనిపించకుండాపోయాడు. మరునిముసంలో కనిపించి రాజూ, రాణీ ముఖంలో కోపతాపాలు లేకపోవటం చేసి సంతోషంతో వికసించిన ముఖం కలవాడై స్నానం చేయించుకొనగా వారున్నూ తగిన అనేక అన్నపానీయాదులు సమకూర్చి భోజనానికి పిలువగా వాటిని చూచి తినకుండానే ఎక్కడికో వెళ్ళిపోయాడు. వారు ఆ రోజంతా అట్లాగే చింతిస్తూ గడిపారు.

వ. ఆ భృగువంశ వర్యుండు. 309

ప్రతిపదార్థం: ఆ భృగువంశ వర్యుండు= ఆ భృగువంశంలో శ్రేష్ఠుడు, చ్యవనుడు.

తాత్పర్యం: ఆ చ్యవనుడు.

సీ. వేగినఁ బొడసూపి, 'వేగంబ యరదంబు । వన్నింపు; నీవు నీ భామినియు వ
హింపఁగా రథికత యెసఁగఁ గాంచన రత్న । గోహయముల యాచకులకు నిచ్చు

చును జనవలయు నా 'కనుడు భూపతి తేరు । సమకట్టి, దాపటఁ జామ, దాను
వలపటఁ బూని, యావస్తువు లెల్లను । గొనివచ్చి యీ మంత్రి జనులఁ బనుప

తే. నెక్కి వారల నా సంయమీశ్వరుండు । నిశితతర మగు మునికోల నెత్తు రొలుక
మోపుచును దీనకోటికి నా పదార్థ । చయము నెడనెడ నొసఁగుచుఁ, జనుచునుండె. 310

ప్రతిపదార్థం: వేగినన్= తెల్లవారగా; పొడసూపి= కనిపించి; వేగంబు+అ= వేగంగా; అరదంబు= రథాన్ని; పన్నింపు= పూన్పుము, కట్టించుము; నీవున్; నీ భామినియున్= నీ భార్యయును, (భామ= స్త్రీ); వహింపఁగాన్= గుర్రాలై లాగగా; రథికత= నేను రథంలో కూర్చొనటం; ఎసఁగన్= ప్రకాశించగా; కాంచన= బంగారం; రత్న= మణులు; గో= ఆవులు; హయములు= గుర్రాలు; యాచకులకున్= బిచ్చగాళ్ళకు; ఇచ్చుచును= ఇస్తూ; నాకున్; చనవలయున్= పోవాలి; అనుడున్; భూ+పతి= భూమికి భర్త, రాజు; తేరు= రథం; సమకట్టి= సిద్ధపరచి; దాపటన్= ఎడమప్రక్క; చామ= భార్య; వలపటన్= కుడిప్రక్క; తానున్= రాజూ; పూని= లాగుతూ; వస్తువులు= ముని చెప్పినవి; ఎల్లనున్= అన్ని; కొనివచ్చి= తెచ్చి; ఈన్= ఇవ్వటానికి; మంత్రిజనులన్= మంత్రులను; పనుపన్= నియోగించగా; ఆ సంయమి+ఈశ్వరుండు= ఆ మునినాథుడు; ఎక్కి= రథమెక్కి; వారలన్= గుర్రాలుగా లాగుతున్న రాజును; రాణిని; నెత్తురు= రక్తం; ఒలుకన్= కారగా; నిశితతరము= మిక్కిలి వాడి; అగు= అయిన; మునికోలన్= ములుకోలతో, ములుగర్రతో; మోపుచును= పొడుస్తూ; ఆ పదార్థచయమున్= ఆ బంగారు మొదలైన వస్తువుల సమూహం; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; దీనకోటికిన్= దీనుల బృందానికి; ఒసఁగుచున్= ఇస్తూ; చనుచున్+ఉండెన్= వెళ్ళుతున్నాడు.

తాత్పర్యం: తెల్లవారగానే కనిపించి 'వెంటనే రథ మేర్పాటు చేయుము; నీవూ నీ భార్యా దాన్ని లాగుతూ ఉండగా నేను అందులో కూర్చుని బంగారం, రత్నాలు, గుర్రాలు బిచ్చగాళ్ళకు ఇస్తూ పోతూ ఉండాలి' అని చెప్పగానే రాజు రథాన్ని సిద్ధపరచి తన భార్య ఎడమప్రక్క, తాను కుడిప్రక్క గుర్రాలై లాగుతూ ఉండగా, చ్యవనుడు రథమెక్కి మంత్రులు తెచ్చిన ఆ వస్తువులను దీనజన సమూహానికి ఇస్తూ, మునికోలతో రాజునూ రాణినీ పొడుస్తూ పోతున్నాడు.

వ. పెక్కుదినంబు లాహార నిద్రలు లేమి డప్పిఁ దూలు నమ్మహీపాలు నమ్మహిషి నమ్ముని ములుకోల పోట్లనట్లు పూచిన మోదువుల చందంబు నొందింపఁ జూచి జనంబు లల్లన తమలోన 'నిట్టితపో మహిమయుం గలదే యిది యన్యాయ్యం' బని యలుగను దగవు వలుకను దేఱి చూడను రాదయ్యెడు నీ దంపతుల ధీరత్వంబును నిష్ఠాపరత్వంబును నింతయొప్పునే! దుర్వహంబగు భారంబు నిర్వికారులయి వహించుచున్న వారనుచు నుమ్మలించుచుఁ బరివేష్టించి చనం జ్యవనుండు పురంబు వెడలి వారి మనంబుల వికారంబులు గానక, యచ్చెరువును మెచ్చును బెనంగొను హృదయంబుతో నరదంబు డిగ్గి, వారల శిరంబులం గట్టిన పగ్గంబులు విడిచి, శరీరంబులు కరంబున సంస్పర్శించి, యజ్ఞనపతి యాననం బాలోకించి, 'డస్సితిగదే, వరంబిచ్చెద, వగపు దక్కి పురంబునకుం జను; మేను గంగాతీరవనంబున వ్రతచర్యా శేషంబు నిర్వహించెద; నీవు మహిషీ సహితంబుగా నెల్లి నా కడకుం జనుదె' మ్మని పలుకుటయు 'నాకు వగ పెక్కడి?' దని పలికి యవ్విభుండు.311

ప్రతిపదార్థం: పెక్కు దినంబులు= అనేక దినాలు; ఆహారనిద్రలు; లేమి= ఆహారం, నిద్ర లేనందువల్ల; డప్పిన్= అలసటతో; తూలు= సొమ్మసిలుతున్న; దప్పిక; ఆ+మహీపాలున్= ఆ రాజును; ఆ మహిషిన్= ఆ రాణిని; ఆ+ముని; ములుకోల=

ముల్లున్న కఱ్ఱయొక్క; పోట్లన్= పోట్లతో; అట్లు= ఆ విధంగా; పూచిన మోదువులచందంబున్= పూచిన మోదుగుల విధంగా; ఒందింపన్= పొందించగా; అల్లన= నెమ్మదిగా; తమలోననిట్టి తపోమహిమయుంగలదె; ఇది అన్యాయ్యంబు+అని; అలుగను; తగవు= న్యాయం; పలుకను= చెప్పటానికి; తేఱిచూడను= తేరిచూడటానికీ; రాదయ్యెడున్= వీలులేదు కదా!; ఈ దంపతుల ధీరత్వంబును= ధైర్యం, కష్టాలలో చెదరని మనస్సు కలిగి ఉండటం; నిష్ఠాపరత్వంబునున్= కార్యదీక్ష; ఇంత ఒప్పునే; దుర్వహంబు= మోయరాని; భారంబు= బరువు; నిర్వికారులయి= ఏమీ మార్పు లేనివారై, వహించుచున్నవారనుచు; ఉమ్మలించుచున్= మనస్సులలో బాధపడుతూ; పరివేష్టించి= చుట్టుకొని; మూగి; చనన్= పోగా; చ్యవనుండు; పురంబు వెడలి= పట్టణం దాటి; వారిమనంబులన్= ఆరాజదంపతుల మనస్సులలో; వికారంబులు= మార్పులు; కానక= చూడక; అచ్చెరువును= ఆశ్చర్యం; మెచ్చునున్= మెప్పుదల; పెనంగొను= ముడిపడు; హృదయంబుతోన్; అరదంబు డిగ్గి= రథం దిగి; వారల శిరంబులన్= తలలపై; కట్టిన; పగ్గంబులు= తాళ్ళు; విడిచి= తొలగించి; శరీరంబులు; కరంబునన్= చేతితో; సంస్పర్శించి= ముట్టుకొని నిమిరి; ఆ+జనపతి= ఆ రాజుయొక్క; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి; డస్సితి గదే= అలసిపోయినావు గదవయ్యా!; వరంబు+ఇచ్చెదన్; వగవు దక్కి= దుఃఖం వదలిపెట్టి; పురంబునకున్+చనుము; ఏను= నేను; గంగాతీరవనంబునన్= గంగ ఒడ్డున ఉన్న అడవిలో; వ్రతచర్యాశేషంబు= మిగిలిన వ్రతకార్యం; నిర్వహించెదన్= పూర్తిచేస్తాను; నీవు; మహిషీ సహితంబుగాన్= రాణితోపాటుగా; ఎల్లి= రేపు; నా కడకున్= నా దగ్గరకు; చనుదెమ్ము= రమ్ము; అని పలుకుటయున్= అని చెప్పగా; ఆ+విభుండు= ఆరాజు; నాకున్; వగవు+ఎక్కడిది= దుఃఖం లేదు; అని పలికి (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: అనేక దినాలు తిండి నిద్ర లేనందువలన ఆ రాజు, రాణి దప్పికతో అలసి తూలిపోతూ ముని ముల్లుకఱ్ఱపోట్ల వలన శరీరాలు పూచిన మోదుగచెట్లుకాగా, చూచిన ప్రజలు 'అయ్యో! ఇదేం న్యాయం? ఈ ముని తపోమహిమవలన ఏమీ అనలేము; కానీ, ఈ దంపతు లెంత ధైర్యంగా కార్యదీక్షను వహిస్తున్నారు?' అని అనుకొన్నారు. రాజు రాణి మనస్సులలో స్వచ్ఛమైన భక్తితో ఉండటం ముని చూచి ఆశ్చర్యంతో మెచ్చుకొంటూ రథం దిగి వాళ్ళ తలలకు కట్టన త్రాళ్ళూడదీసి, రాజుతో 'నాయనా! చాలా అలసిపోయావు. నీకు వరమిస్తాను; నీవూ, నీ భార్యా ఇంటికి పోయి రేపు రండి. నేను మిగిలిన వ్రతాన్ని ఈ గంగా తీరంలో ఉన్న అడవిలో పూర్తి చేసికొంటాను, అని చేతులతో వారి శరీరాలను నిమరగా; రాజు 'స్వామీ! మాకు అలుపుసొలుపు లేదు' అంటూ.

క. తన తనువు వనిత మేనును । గనుఁగొని యచ్చెరువు ముదము గడలుకొనఁగ న
మ్మునితో భవత్ప్రభావముఁ । గొనియాడఁగఁ దరమె మాకు గురుతరకరుణా!' 312

ప్రతిపదార్థం: తనతనువున్= తన శరీరం; వనిత= స్త్రీ; రాణి; మేనునున్= శరీరం; కనుఁగొని= చూచి; అచ్చెరువున్= ఆశ్చర్యం; ముదమున్= సంతోషం; కడలుకొనఁగన్= ముంచెత్తగా; ఆ+మునితోన్= ఆ మునితో; గురుతర కరుణా!= గొప్పదయకలవాడా!; భవత్= మీ; ప్రభావము= మహత్తు; కొనియాడఁగన్= స్తుతింపగా; మాకున్; తరమె= శక్యమా!;

తాత్పర్యం: తన శరీరం, రాణి శరీరం చూచి సంతోషం, ఆశ్చర్యం తన మనస్సును ముంచెత్తగా 'గొప్ప దయగల స్వామీ! మీ మహిమను కొనియాడ మాకుశక్యమా?

వ. అని వెండియు. 313

తాత్పర్యం: అని ఇంకా.

తే. 'శ్రమము లేదు, ప్రతోద వ్రణములు లేవు, । నాతియును, నేను, నెలజవ్వనంబుఁ గంటి
మిది మహాద్భుతతర మందుమే! భవన్మ । హానుభావత్వ మేమి సేయదు? మునీంద్ర !' 314

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= మునీశ్వరా!; శ్రమము= అలసట; ప్రతోద= ముల్లుకోలచే కల్గిన; వ్రణములు= గాయాలు; లేవు; నాతియునున్= నా భార్య; నేను; ఎల= లేత; జవ్వనంబున్= యౌవనం; కంటిమి= పొందితిమి; ఇది; మహా+అద్భుతతరము= మహాశ్చర్యం; అందుమే!= అంటామా!; భవత్= మీ; మహా+అనుభావత్వము= గొప్ప వ్యక్తిత్వం; ఏమిచేయదు?= ఏం చేయలేదు?

తాత్పర్యం: 'మునిచంద్రా! మాకు శ్రమ లేదు సరికదా! ముల్లుకర్ర వలన కలిగిన పుండ్లూ లేవు. పైగా మేము నూత్న యౌవనం పొందాము. ఇదంతా మీ మాహాత్మ్య మనుకొనమంటారా? అయినా మీ గొప్పతన మేమి చేయలేదుకనుక.

వ. అని సవినయంబుగాఁ దానును దేవియు దండప్రణామంబులు సేసి, యా సంయమివరు వీడ్కొని, సాద్భుత చిత్తులైన సకల జనులుం బరివేష్టింపఁ బురంబు ప్రవేశించి, ప్రమోదమయమూర్తు లగుచు, దివసవర్తనంబును, రాత్రి చర్యయుం గడపి, సూర్యోదయం బగుటయు.' 315

ప్రతిపదార్థం: అని= అనిపల్కి; సవినయంబుగాన్= వినయంతో; తానునున్= రాజు; దేవియున్= రాణీ; దండప్రణామంబుచేసి= సాష్టాంగంగా కాళ్ళపై పడి; ఆసంయమివరున్= ఆ మునిచంద్రుడిని; వీడ్కొని= సెలవు తీసికొని; స+అద్భుత= ఆశ్చర్యంతో కూడిన; చిత్తులు= మనస్సులు కల; సకల జనులున్= జనమంతా; పరివేష్టింపన్= చుట్టూ మూగగా; పురంబు= నగరం; ప్రవేశించి; ప్రమోదమయ= సంతోషంతో చేసిన; మూర్తులు= శరీరాలు కలవారు; అగుచున్= అవుతూ; దివస వర్తనంబునున్= పగలు చేసే పనులు; రాత్రి చర్యయున్= రాత్రిపూట కార్యాలు; కడపి= ఆచరించి; సూర్య+ఉదయంబు= ప్రొద్దుపొడవటం; అగుటయున్= కాగానే.

తాత్పర్యం: అని వినయంతో దండ ప్రణామం చేసి, ఆ మునివరుడిని వదలి ఆశ్చర్యంలో మునిగిపోయిన జనులంతా తమ చుట్టూ మూగి వెంబడించి రాగా, సంతోషంతో నిండిన శరీరాలతో నగరంలోకి ప్రవేశించి, పగలు రాత్రి చేయదగిన పనులుచేసి తెల్లవారగానే.

క. వారలు ప్రాతస్సమయా । చారంబులు నడపి భక్తి సంపద లొదవన్
గారవమున ముని నిర్ది । ష్టారణ్యమ్మునకుఁ బోయి రవనీనాథా! 316

ప్రతిపదార్థం: అవనీనాథా!= రాజా!; వారలు= రాజదంపతులు; ప్రాతస్సమయ= ప్రొద్దుటిపూట; ఆచారంబులు= ఆచారాలు; నడపి= చేసి; భక్తిసంపదలు= భక్తి అనే సంపదలు; ఒదవన్= కలుగగా; గారవమునన్= గౌరవంతో; ముని నిర్దిష్ట= ముని చెప్పిన; అరణ్యమ్మునకున్= అడవికి; పోయిరి= వెళ్ళారు.

తాత్పర్యం: రాజా! వారు ప్రొద్దున్నే నిర్వర్తించవలసిన విధులు నిర్వర్తించి భక్తి వైభవంతో, గౌరవంతో ముని చెప్పిన అడవికి వెళ్ళారు.

ఆ. అచట మణిమయంబు, నతిసుందరము, దివ్య । సదన నిభము నగు విశాలరమ్య
హర్మ్యమున్నఁ, జూచి యచ్చెరువందు చి । త్తములతోడఁ జనఁగ దానిచుట్టు. 317

ప్రతిపదార్థం: అచటన్= ఆ అడవిలో; మణిమయంబు= మణులతో చేసిన; అతి సుందరము= మిక్కిలి చక్కని; దివ్యసదననిభము= దేవతల సౌధము వంటిది; అగు= అయిన; విశాలరమ్య= పెద్దది, అందమునైన; హర్మ్యము= సౌధం; ఉన్నన్= ఉంటే; చూచి; అచ్చెరువు= ఆశ్చర్యం; అందు= పొందే; చిత్తములతోడన్= మనస్సులతో; చనఁగన్= పోగా; దానిచుట్టు= మేడకు చుట్టూరా.

తాత్పర్యం: అక్కడ రత్నాలతో చెక్కిన దేవతాభవనం వంటిది, విశాలమైన అందమైన సౌధముండగా చూచి ఆశ్చర్యంతో పోగా దాని చుట్టూ. (తరువాతి పద్యంతో అన్వయం)

చ్యవనుఁడు తన యోగబలంబునఁ గుశికునకు నాకలోకంబు సూపుట (సం.13-54-1)

సీ. స్వాధ్యాయ సంగీత సాహిత్య వర్తన । మాననీయము లగు మండపములుఁ,
గోకిల శుకభృంగ కులనాదముల నభి । రామంబు, లైన యారామములును
హంస సారసరవాత్యంత మనోజ్ఞంబు । లై సొంపు మిగులు పద్మాకరములుఁ,
జారుమయూర కేకారుత కలితంబు । లగుచు నొప్పారు క్రీడాచలములు;

తే. వీనులకుఁ జూడ్కులకు నింపు వెల్లి గొల్ప । నేర్పు గలిగిన విభవంబు నెఱయ మెఱయఁ
గరము విలసిల్లుచునికి నాకంబు వేడ్క । నయ్యెడకుఁ గాపు వచ్చిన యట్టు లుండె. 318

ప్రతిపదార్థం: స్వ+అధ్యాయ= వేదపఠనంతో కలిసిన; సంగీత= సంగీతం యొక్క; సాహిత్య= సాహిత్యము యొక్క; వర్తన= ప్రవర్తనతో; మాననీయములు= గౌరవించ దగినవి; అగు; మండపములు= మంటపాలు; కోకిల= పికములు; శుక=చిలుకలు; భృంగ= తుమ్మెదల యొక్క; కుల= సమూహంయొక్క; నాదములన్= ధ్వనులతో; అభిరామంబులు= మిక్కిలి అందమైన; ఆరామములును= తోటలు; హంస= అంచలు; సారస= బెగ్గురు పక్షులు (ఒకరకమైన కొంగలు) వీటి; రవ= ధ్వనులచే; అతి+అంత= మిక్కిలి; మనోజ్ఞంబులై= అందములై; సొంపు= ఇంపు; మిగులు= అతిశయించిన; పద్మ+అకరములు= తామరపూలకు నిలయములైన చెరువులు, చారు= అందమైన; మయూర= నెమళ్ళ యొక్క; కేకా= కూతల యొక్క; రుత= ధ్వనితో; కలితంబులు= కూడుకొన్నవి; అగుచున్; ఒప్పు+ఆరు= అందమైన; క్రీడా= ఆటలాడుకొనటానికి వీలైన; అచలములున్= కొండలును; వీనులకున్= చెవులకు; చూడ్కులకున్= చూపులకు; ఇంపు= వేడుక; వెల్లిగొల్పన్= అతిశయింపచేయగా; నేర్పు= చాతుర్యం; కలిగిన విభవంబు= ఐశ్వర్యం; నెఱయమెఱయ= విస్తరించి విలసిల్లగా; కరమున్= మిక్కిలి; విలసిల్లుచున్= శోభిల్లుచు; ఉనికి= ఉండడం వలన; నాకంబు= స్వర్గం; వేడ్కన్; ఆ+యెడకున్; కాపు వచ్చిన+అట్టులు+ఉండెన్.

తాత్పర్యం: అక్కడ మండపాలలో సంగీతంతో సాహిత్యంతో ప్రవర్తించే వేదమంత్ర పఠనం జరుగుతున్నది. కోకిలల, చిలుకల, తుమ్మెదల గుంపులు చేసే ధ్వనులతో చాలా అందమైన తోటలున్నూ, హంసలు, కొంగలు చేసే ధ్వనులతో (కంటికి, చెవికి) ఇంపైన తామరపూలున్న చెరువులు, అందమైన నెమళ్ళ కూతలుకల విహారపు కొండలు, చెవులకూ, చూపులకూ సంతోషం కలిగించే నేర్పుగల వైభవం ప్రకాశిస్తూ ఉండగా స్వర్గమే అక్కడికి వలస వచ్చిందా అన్నట్లున్నది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. సురలును, గంధర్వులు, న । ప్సరోనికాయములు, వివిధ సరస విహారా
దరలీల నందు నెడనెడ౯ । జరించుచుండిరి నితాంత సమ్మోదమునన్. 319

ప్రతిపదార్థం: సురలును= దేవతలును; గంధర్వులున్= ఆ జాతి దేవతలు; అప్సరోనికాయములున్= అచ్చరల సమూహాలు; వివిధ= అనేకములగు; సరస= రసవత్తరమైన; విహార= విహరించుటలోగల; ఆదరలీలన్= ఆదరంతో కూడిన విలాసంతో; అందున్= అక్కడ; నితాంత= ఎడతెగని; సమ్మోదమునన్= సంతోషంతో; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; చరించుచున్+ఉండిరి= తిరుగుతున్నారు.

తాత్పర్యం: దేవతలు, సంగీత విద్వాంసులైన గంధర్వులు, అప్సరసల సమూహం అనేకమైన రసవత్తర విహారాలతో, క్రీడలతో అక్కడక్కడ ఆ స్థలంలో సంతోషంగా తిరుగుతున్నారు.

తే. అవ్విధంబున కా రాజు నంగనయును । మనము లద్భుత రసమున మునుఁగుచుండ౯
'గలయొకో యిది! నిక్కమ కానినాఁడు । మిగుల ననుభవ గోచర మగునె యిట్లు?' 320

ప్రతిపదార్థం: ఆ+విధంబునకున్= ఆ పద్ధతికి; ఆ రాజున్; అంగనయును= స్త్రీయూ (రాణి); మనములు= మనస్సులు; అద్భుత రసమునన్= ఆశ్చర్య రసంలో; మునుఁగుచున్+ఉండన్= మునుగుతుండగా; కలఒకో ఇది?= ఇది కలా!; నిక్కమ కానినాఁడు= సత్యం కాకపోతే; ఇట్లు= ఈ విధంగా; మిగులన్= మిక్కిలి; అనుభవగోచరము= అనుభవానికి తోచేది; అగునె?= ఔతుందా?

తాత్పర్యం: ఆ దృశ్యానికి ఆ రాజూ, రాణీ మనస్సులు ఆశ్చర్యంతో మునిగిపోగా 'ఇది నిజమా? కలా? నిజమే కాకపోతే అనుభవానికి ఎట్లా అందుతున్నది?'

వ. అని వెండియు. 321

తాత్పర్యం: అని ఇంకా.

క. 'ఉత్తర కురు భూమియొ? లో । కోత్తర మగునట్టి నాకమొకొ? తనువులతో
నిత్తాపసవరుని కరుణ । నిత్తెఱఁగున సంభవించె నిచ్చోటు సొరన్.' 322

ప్రతిపదార్థం: ఉత్తర కురుభూమియొ?= ఈ పేరుగల రాజ్యం (ప్రాచీన కాలంలో భారతవర్షం నేటి చైనా మంగోలియా దాకా వ్యాపించి ఉండేదట. ఈ ఉత్తర కురుభూములు హిమాలయ ప్రాంతమో అవతలిదో? కొందరు హిమాలయాలకు అవతలి దంటారు); లోకోత్తరము= లోకానికిపైది; అగునట్టి; నాకము+ఒకొ?= స్వర్గమా?; తనువులతోన్= శరీరాలతో; ఇచ్చోటు= ఈ ప్రాంతంలోకి; చొరన్= ప్రవేశించటం; ఈ+తాపసవరుని= ఈ మునిశ్రేష్ఠుడి; కరుణన్= దయవలన; ఈ+తెఱగునన్= ఈ విధంగా; సంభవించెన్= కలిగింది.

తాత్పర్యం: 'ఈ ప్రాంత మేదో? ఉత్తర కురుభూములా? లేక లోకోత్తరమైన స్వర్గమా? సశరీరంగా ఇక్కడకు రావటం కేవలం ఈ మునీశ్వరుడి దయ.'

విశేషం: కురుభూములు= కురుక్షేత్రం, ఇది నేటి ఢిల్లీ ప్రాంతం. దానికి ఉత్తరదిక్కున ఉన్న ప్రదేశం ఉత్తర కురుభూములు,

హిమాలయాలు కావచ్చును. ఎందుకంటే నేటికీ ఆ ప్రాంతం పవిత్రంగా, మహాయోగులు నివసించేదిగా చెప్పబడుతున్నది కనుక. ఈ విషయాలకొరకు 'హిమాలయంలో మహర్షులతో నివసించటం వంటి ఆంగ్ల గ్రంథాలు చూచినా, మహాయోగి ఆత్మకథ చూచినా తెలుస్తుంది. నేటి విద్యావేత్తల కా విషయాలు తెలియకపోవటంవలన భారత ఆధ్యాత్మిక యోగ విద్యలతో పరిచయం లేనందున అబద్ధాలుగా గోచరిస్తున్నవి తప్ప మహాత్ముల జీవితాలలో ఇవి నగ్న సత్యాలే.

వ. అనుచు నమ్మహనీయ హర్మ్యంబు సొచ్చి, యందు మణిమయ పర్యంకంబునం బవ్వళించి యున్న యప్పరమ మునిం గనిరి, అపరక్షణంబున నతం డంతర్ధానంబు సేసె. అతనితోడన యా మేడయు మున్ను గన్న యశేష విశేషంబులును నదృశ్యంబు లయ్యె, అయ్యిరువురు నిట్టట్టు మెలంగి యక్కాన నొక్కెడఁ గౌశబృసీ సమాసీనుండును జపపరుండునునైన యాసంయమివరు నాలోకించి; రట్లు గాంచి భూవిభుండు భార్యతో నిట్లనియె. **323**

ప్రతిపదార్థం: అనుచున్; ఆ+మహనీయ= ఆ మహత్తరమైన; హర్మ్యంబు= సౌధం; చొచ్చి= ప్రవేశించి; మణిమయ= రత్నాలతో చేసిన; పర్యంకంబునన్= మంచంమీద; పవ్వళించిఉన్న= పడుకొని ఉన్న; ఆ+పరమ మునిన్= ఆ గొప్పమునిని; కనిరి= చూచారు; అతండు= ఆ ముని; అపరక్షణంబునన్= మరుక్షణంలో; అంతర్ధానంబు చేసెన్= కనిపించకుండా పోయాడు; అతనితోడన; ఆమేడయున్; అశేష విశేషంబులు= అనంత విశేషాలు; అదృశ్యంబులు= కనిపించనివి; అయ్యెన్; ఆ+ఇరువురున్= రాజు రాణి; ఇట్టున్+అట్టున్= ఇటూ అటూ ; మెలంగి=తిరిగి; ఆ+కానన్= ఆ అడవిలో; ఒక్క+ఎడన్= ఒకచోట; కౌశ= దర్భతో నేసిన (కుశ=దర్భ); బృసీ= చాపమీద; సమాసీనుండునున్= కూర్చున్నవాడు; జపపరుండును= జపమగ్నుడైనవాడు; ఐన; ఆ సంయమివరున్= ఆ మునిశ్రేష్ఠుడిని; ఆలోకించిరి= చూచారు; అట్లు; కాంచి= చూచి; భూవిభుండు= భూమిపతి; భార్యతోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంటూ ఆ మహాభవనంలోకి వెళ్ళిచూస్తే రత్నమంచంపైన మునీంద్రుడు నిద్రిస్తున్నాడు. అంతలోనే మరలా అదృశ్యుడైపోగా; ఆ భవనం, వాళ్ళు చూచిన విశేషాలు అన్నీ కనిపించకుండా పోయాయి. మునిమాత్రం అడవిలో ఒకచోట దర్భచాపపై కూర్చుని జపం చేసికొంటూ కనిపించాడు. అప్పుడు రాజు రాణితో అన్నాడు.

తే. 'ఉవిద! మునియోగబల మిట్టు లుండునే! య । నూనరాజ్యంబు సులభంబు మానవులకు
బ్రాహ్మణత్వంబుఁ దపము దుర్లభము దపము । కలిమిఁ జేయుచు నున్నాఁడు వలసినట్లు.' **324**

ప్రతిపదార్థం: ఉవిద!= రాణీ! (స్త్రీ); ముని= ముని యొక్క; యోగబలము= యోగశక్తి; ఇట్టులు= ఈ విధంగా; ఉండునే?= ఉంటుందా?; అనూన= గొప్ప; రాజ్యంబున్; సులభంబు= తేలిక; మానవులకున్= మనుషులకు; బ్రాహ్మణత్వంబున్= బ్రాహ్మణ లక్షణం; తపము= తపస్సు; దుర్లభము= కష్టపడి పొందదగినది; తపముకలిమిన్= తప స్సంపదచేత; వలసినట్లు= ఇష్టం వచ్చినట్లు; చేయుచున్+ ఉన్నాఁడు= చేస్తున్నాడు.

తాత్పర్యం: 'రాణీ! మునియోగశక్తి చూచావా? ఇంతగొప్పదా? మనిషికి రాజ్యం సులభం తప్ప బ్రాహ్మణత్వం, తపస్సు సులభం కావు. ఈయన తపస్సంపద ప్రభావంచేత ఇష్టం వచ్చినట్లుగా సృష్టిస్తున్నాడు.

చ. అనునెడ నిందు రండని సమాదర మొప్పఁగ వారిఁ బిల్చె న
మ్ముని; నరనాథుఁడున్, సతియు, మోడ్చిన చేతులతోడఁ జేరఁగాఁ

జని, ధరఁ జాఁగి మ్రొక్కుటయు, సంయమి దీవన లిచ్చి, రాజు నా

ననమున సుప్రసన్న నయన ప్రభ పర్వఁగ నెమ్మి నిట్లనున్. 325

ప్రతిపదార్థం: అను+ఎడన్= అనే సమయంలో; ఆ+ముని; వారిన్= రాజ దంపతులను; ఇందున్= ఇక్కడకు; రండు+అని= రండు అంటూ; సమాదరము= మంచి ఆదరణ; ఒప్పఁగన్= కలుగగా; పిల్చెన్= పిలిచాడు; నరనాథుఁడున్= రాజు; సతియున్=భార్య; మోడ్చిన= అంజలించిన (దండంపెట్టిన); చేతులతోడన్= హస్తాలతో; చేరఁగాన్ జని= దగ్గరకు వెళ్ళి; ధరన్= నేలపై; చాఁగి= సాగిలబడి; మ్రొక్కుటయున్= నమస్కరించగా; సంయమి= ముని; దీవనలు=ఆశీస్సులు; ఇచ్చి; రాజు+ఆననమునన్= రాజు ముఖంమీద; సు ప్రసన్న= మంచి శాంతం కల; నయన= నేత్రాల; ప్రభ= వెలుగు; పర్వఁగన్= వ్యాపించగా; నెమ్మిన్= సంతోషంతో; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అంటున్న సమయంలో ముని ఆదరంతో వాళ్ళనిద్దరిని ఇట్లా రండని పిలువగానే వారు చేతులుమోడ్చి మునిని సమీపించి భూమిపై చాగిలపడి మ్రొక్కగా ముని ఆశీర్వదించి రాజు ముఖంమీద తన ప్రశాంత నేత్ర కాంతులు వ్యాపించగా సంతోషంతో ఇట్లా అంటున్నాడు.

ఆ. 'మనసు నింద్రియములు మనుజేంద్ర! యింత వ । శ్యంబు లగునె నీకు? నరయఁ గీ డొ

కింత యైన లేదు సంతసమందితి; । నిత్తు వరము వేఁడు మెద్దియైన.' 326

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= రాజా!; మనసు= మనస్సు; ఇంద్రియములు= అవయవాలు; ఇంత= ఇంతగా; నీకున్; వశ్యంబులు+అగునె?= వశమైనవా? అరయన్= పారచూచినా; కీడు= లోపం; ఒక+ఇంతయైనన్= ఇంతైనా; లేదు; సంతసము= సంతోషం; అందితిన్= పొందాను; వరమున్; ఇత్తున్= ఇస్తాను; ఎద్దిఐనన్= ఏదైనా; వేఁడుము= కోరుకొమ్ము.

తాత్పర్యం: 'రాజా! నీకు నీ మనస్సూ, ఇంద్రియా లింతగా వశమైనాయా? ఆశ్చర్యమయ్యా! ఎంతో ఆలోచించి చూచినా నీ వలన లోపమింతైనా లేదు వరం కోరుకొమ్ము. ఏదైనాసరే ఇస్తాను. నీవంటే నాకు చాలా సంతోషంగా ఉన్నది.'

క. అనిన విని యగ్ని కల్పుఁడ । వనఁ జను 'నీమది ప్రసన్నమగునట్టులుగా

మునిజనవంద్యా ! కొల్వం । గను కంటెను మిగులమేలు గలదే కోరన్.' 327

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; మునిజనవంద్యా!= ముని సమూహంచేత పొగడదగినవాడా!; అగ్ని కల్పుఁడవు= అగ్నివంటివాడవు; అనన్ చను= అనదగ్గ; నీ మది= నీ మనస్సును; ప్రసన్నము= ప్రశాంతం; అగునట్లుగాన్= అయ్యేటట్లుగా; కొల్వన్= సేవించుట; కనుకంటెన్= పొందటంకంటే; కోరన్= కోరుటకు; మిగుల= అధికమైన; మేలుకలదే!= శుభమున్నదా!

తాత్పర్యం: మునులకే నమస్కరించదగిన నీవు అగ్నితో సమానుడవు. ఇట్లాంటి నీ మనస్సు ప్రసన్నమయ్యేటట్లు సేవించుట కంటే గొప్ప మే లేమున్న దని కోరనయ్యా!

వ. అని పలికి కుశికుండు వెండియు. 328

తాత్పర్యం: అని చెప్పి కుశికుడు ఇంకా (అంటున్నాడు)

తే. 'ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్ప । వలయు; మీరు మా యింటికి వచ్చి యొక్క
ప్రక్కక్రిందుగ నిరువది యొక్క దినము । లనఘ! నిద్రించి; తది మొదలైన నీదు. 329

ప్రతిపదార్థం: ఒకటి అడిగెదన్= ఒక టడుగుతాను; కృప= దయ; చిగురు+ఒత్తన్= చిగురింపగా; చెప్పన్ వలయున్= చెప్పాలి; మీరు; మాఇంటికిన్; వచ్చి; ఒక్క ప్రక్క= ఒకవైపు; క్రిందుగన్= క్రిందుగా చేసి; ఇరువదిఒక్క దినములు= ఇరవై ఒక్క రోజులు; అనఘ!= పుణ్యాత్ముడా!; నిద్రించితి= నిద్రించావు; అది మొదలు+ఐన= అది మొదలుగా; నీదు= నీ యొక్క.

తాత్పర్యం: 'స్వామీ! ఒకటడుగుతాను. దయతో చెప్పాలి. మీరు మా ఇంటికి వచ్చి ఒకవైపే ఒత్తిగిలి ఇరవైయొక్క రోజులు పడుకొన్నారు కదా! అది మొదలుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. చరితం బద్భుతము మునీ । శ్వర! దీనికిఁ గారణము విచారమున కగో
చర; మెఱిఁగింపు 'మనుడు నా । ధరణీవల్లభునితో నతం డిట్లనియెన్. 330

ప్రతిపదార్థం: చరితంబు= కథ, ప్రవర్తన; అద్భుతము= ఆశ్చర్యం; ముని+ఈశ్వర!= మునినాథా!; దీనికిన్; కారణము= ఇందుకు హేతువు; విచారమునకున్= ఆలోచనకు; అగోచరము= కనిపించదు; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుడున్; అతండు= ఆ ముని; ఆ ధరణీ విభునితోన్= రాజుతో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: కథ చాలా అద్భుతం. మునీశ్వర! కారణం గోచరించటం లేదు. కనుక చెప్పండి' అనగా రాజుతో ముని ఇట్లా అంటున్నాడు.

వ. సురలు మునులు సురజ్యేష్ఠుం గొలిచియుండం బ్రసంగ వశంబున నప్పరమేష్ఠి వారలతో భృగు కుశిక వంశంబులకు బ్రహ్మక్షత్రంబులు తడంబడి సంకరంబు వాటిల్లు నని చెప్పె; నప్పు డేనచ్చట నుండి వినుటం జేసి యాసంకరంబున కోర్వక మీ యన్వయంబు నిర్మూలంబు సేయువాఁడ నయి వ్రతంబు నెపంబిడి, భవద్గృహంబు సొచ్చి యున్ని పోకలం బోయితి; అలసి డస్సి యెప్పుడేని మీర లడ్డ మాడుదురు అప్పుడ శపింతు నిట్టిద నా యెత్తికోలు; మీ యందు ధైర్యహానియు శోకంబును గోపంబును లేమిని మెచ్చి వరం బిచ్చియుం దనివి సనక, తనువులతోడన మీరు నాకలోకం బాలోకించు నట్లుగా నీ గంగాతీరంబున సంఘటించితి; దానిం గని నరేంద్రత్వంబుదెస నుదాసీన భావంబు నొంది బ్రాహ్మణ్యంబునందు స స్పృహుండ వై తది యెఱుఁగుదు; నీకు మూఁడవవాఁడు బ్రహ్మతేజో దీప్తుం డయి జనియించు; వరంబు వేఁడు' మనుటయు నమ్మానవపతి దీనికంటెను గడచిన వరంబునుం గలదే? మదీయ సంతానంబు బ్రహ్మత్వ ప్రాప్త మహత్త్వ నిరూఢంబును, గాఢధర్మ తత్పరంబునుంగా నను గ్రహింపు' మనిన నమ్ముని 'యట్ల యయ్యెడు నూఱడిల్లుము. నీదు మనుమండు త్రిలోక పూజనీయుండు' అని పల్కిన నప్పతి 'వాఁడేమి కతంబున బ్రాహ్మణుం డగు నత్తెఱంగెఱింగింపవే' యనవుడు నత్తాపసోత్తముండు 'విను మస్మద్వంశంబున ఋచీకుం డనువాఁడు జన్మించి నీ తనయుం' డైన గాధి యనియెడు వాని పుత్రి భార్యగాఁ బరిగ్రహించు; నత్తపోధనుండు దననందనుం డగు జమదగ్నియందు సమస్త ధనుర్వేదంబును నావహించు, నవ్విశేషంబు తత్పుత్త్రునందు ఫలియించు; నది యంతయు సకల క్షత్రియ క్షయకారి యైన దైవంబు కృత్యంబు, దానివలన ఋచీక, గాధి వధూజనానుష్ఠాన పరివర్తనంబు గలుగు;

నది కారణంబుగా నుగ్రక్షత్రధర్ముండగు పరశురాముండు జమదగ్నికిం, బరమ బ్రాహ్మణ్యగణ్యుం డయిన విశ్వామిత్రుండు గాధికి జనియింతురు, బ్రహ్మ పలుకు సత్యంబ; యుష్మదన్వయంబు భార్గవ కులసంబంధంబున జనశ్లాఘనీయంబై వెలయం గలయది, యేను తీర్థంబునకుం జనియెద, నీవు సుఖివై యుండుము' అని చెప్పుటయు, నప్పుడమిఱేఁడు భార్యాసహితంబుగ సవిశేష వినయంబగు వందనం బాచరించి వీడ్కొని చనియె; జ్యవనుండును నిజేచ్ఛం జనియె; నిది పరశురామ విశ్వామిత్ర జన్మ ప్రకారంబు. 331

ప్రతిపదార్థం: సురలు, మునులు, సురజ్యేష్ఠున్= దేవతలలో పెద్దవాడు బ్రహ్మను; కొలిచిఉండన్= సేవిస్తూ ఉండగా; ప్రసంగవశంబునన్= మాటల సందర్భంలో; ఆ పరమేష్ఠి= ఆ బ్రహ్మ; వారలతోన్= వారితో; భృగుకుశిక వంశంబులకున్; బ్రహ్మక్షత్రంబులు= బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు; తడంబడి= మారుదలపొంది, తలక్రిందులై; సంకరంబు= సాంకర్యం; పాటిల్లున్= జరుగుతుంది; అని చెప్పెన్; అప్పుడు ఏను అచ్చటన్+ఉండి వినుటన్+చేసి; ఆ సంకరంబునకున్; ఓర్వక= సహించక; మీ; అన్వయంబున్= వంశాన్ని; నిర్మూలంబు= నాశనం; చేయువాడను+అయి= చేద్దామనుకొని; వ్రతంబు నెపంబు+ఇడి= వ్రతమిషతో; భవత్= మీ; గృహంబు= ఇల్లు; చొచ్చి= ప్రవేశించి; ఇన్ని; పోకలన్+పోయితిన్= నాటకా లాడాను; అలసి; డస్సి= తూలి; ఎప్పుడేని మీరలు; అడ్డము+ఆడుదురు= ఎదురు చెప్పుతారు; అప్పుడు+అ+శపింతున్; ఇట్టిద; నా; ఎత్తికోలు= పూనిక, ప్రయత్నం; మీయందున్; ధైర్యహానియున్= కష్టాలలో చెదరకుండా ఉండే మనస్తత్వం; శోకంబును; కోపంబును లేమిని= లేకపోవటం; మెచ్చి; వరంబు; ఇచ్చియున్; తనివి చనక= తృప్తిపడక; తనువులతోడన; మీరు; నాకలోకంబు; ఆలోకించునట్లుగాన్= చూచేటట్లు; ఈ గంగాతీరంబునన్; సంఘటించితిన్= ఏర్పాటు చేశాను; దానిన్; కని; నర+ఇంద్రత్వంబు దెసన్= రాజత్వంవైపు; ఉదాసీనభావంబున్= ఔదాసీన్యం, తక్కువ చూపు; ఒంది= పొంది; బ్రాహ్మణ్యంబునందున్= బ్రాహ్మణ ధర్మంమీద; సస్పృహుండవు+ఐతి(వి)= కోరిక కలవాడవైతివి; అది ఎఱుఁగుదున్; నీకున్; మూడవవాఁడు= మూడవ తరంవాడు; బ్రహ్మతేజో దీప్తుండు= బ్రాహ్మణ తేజస్సుతో ప్రకాశించేవాడు; అయి జనించు; వరంబు; వేడుము+అనుటయున్; ఆ మానవపతి= ఆ రాజు; దీనికంటెను; కడచిన= దాటిన; అధికమైన; వరంబునున్; కలదే= ఉన్నదా? బ్రహ్మత్వప్రాప్త=బ్రాహ్మణత్వము చేత పొందబడిన; మహత్త్వ= గొప్పతనంచేత; నిరూఢంబునున్= ప్రసిద్ధియైనదిగానూ; గాఢ= గట్టి; ధర్మ తత్పరంబునుంగాన్= ధర్మం మీద తాత్పర్యబుద్ధి గలదిగానూ అనుగ్రహింపుము; అనినన్; ఆ+ముని; అట్ల అయ్యెడున్; ఊఱడిల్లుము; నీదు మనుమండు; త్రిలోకపూజనీయుండు= మూడులోకాలకు పూజించదగ్గవాడు; అనిపల్కినన్; ఆ+పతి= ఆ రాజు; వాఁడు= అతడు; ఏమికడంబునన్= ఏ కారణంవలన; బ్రాహ్మణుండగున్ ఆ తెఱంగు; ఎఱింగింపవే; అనవుడున్; అ+తాపస+ఉత్తముండు= ఆ మునీశ్వరుండు; వినుము, అస్మత్= నా; వంశంబునన్, ఋచీకుండను వాడు జన్మించి నీ తనయుండైన గాధి; అనియెడు; వాని; పుత్రిన్= కూతురును; భార్యగాన్ పరిగ్రహించున్; ఆ+తపోధనుండు; తననందనుండగు జమదగ్నియందున్; సమస్త; ధనుర్వేదంబునున్= ధనుర్విద్య, విలువిద్యను; ఆవహించున్= కల్గించును; ఆ+విశేషంబు; తత్+పుత్త్రునందున్= అతని కుమారుని యందు; ఫలియించున్; అది+అంతయున్; సకలక్షత్రియ= సమస్తరాజుల; క్షయకారి= వినాశము గల్గించునది; ఐన= ఐనట్టి; దైవంబు= దైవముయొక్క; కృత్యంబు= పని,విధి ఘటన; దాని వలనన్; ఋచీక గాధి వధూజనానుష్ఠాన పరివర్తనంబు గలుగు; అది కారణంబుగాన్; ఉగ్ర= క్రూర; క్షత్ర ధర్ముండు= క్షత్రియ స్వభావం కలవాడు అగు పరశురాముండు జమదగ్నికిన్; పరమ= గొప్ప; బ్రాహ్మణ్య= బ్రాహ్మణ సమూహానికి; గణ్యుండు= లెక్కింపదగ్గవాడు అయిన; విశ్వామిత్రుండు; గాధికి జనియింతురు; బ్రహ్మపలుకు సత్యంబు+అ; యుష్మత్+అన్వయంబు= నీ కులం; భార్గవకుల సంబంధంబునన్= సంబంధం వలన, బంధుత్వం చేత; జన= జనులచేత; శ్లాఘనీయంబు+ఐ= పొగడదగ్గదై; వెలయన్ కలయది= ప్రకాశించగలది; ఏను= నేను; తీర్థంబుననున్; చనియెదన్= వెళ్ళెదను; నీవు సుఖివి+ఐ= సుఖవంతుడవై; ఉండుము; అని చెప్పుటయున్; ఆ+పుడమి= భూమికి; ఱేఁడు= రాజు; భార్యసహితంబుగన్= భార్యతోకూడ; సవిశేష వినయంబు+అగు= అధికమైన వినయముతో కూడినదైన; వందనంబు; ఆచరించి వీడ్కొని చనియెన్; చ్యవనుండును; నిజ+ఇచ్ఛన్= తన ఇష్టం వచ్చినచోటికి; చనియెన్= వెళ్ళాడు; ఇది; పరశురామ విశ్వామిత్ర జన్మప్రకారంబు= పుట్టినవిధము.

తాత్పర్యం: దేవతలు మునులు బ్రహ్మదేవుడిని సేవిస్తున్న సమయంలో, ప్రసంగవశాత్తు బ్రహ్మ వారితో ఇట్లా అన్నాడు. 'భవిష్యత్తులో భృగు, కుశిక వంశాలకు బాంధవ్య మేర్పడుతుంది' అని. అది విని వర్ణసాంకర్యాని కిష్టపడక నీ వంశాన్ని నాశనం చేద్దామన్న తలంపుతో మీ ఇంటికి వచ్చి పోకిళ్ళు పోయాను. కాని, మీలో కోపతాపాదులేవీ నాకు గోచరించలేదు. దానికి సంతోషించి వరమిచ్చాను. అయినా నాకు తృప్తి తీరక స్వర్గలోకం చూపించాను. నీకు రాచరికంమీద కంటె బ్రాహ్మణ్యం మీద మక్కువ. నీకు మూడోతరంలో బ్రహ్మతేజోమయుడు జన్మిస్తాడు. కాబట్టి వరం కోరుకొమ్ము రాజా! అనుగ్రహిస్తాను.' అంతా విని రాజన్నాడు 'నా కింతకంటె వర మేమి కావాలయ్యా! నా సంతానం బ్రాహ్మణత్వం ధర్మపరత్వం పొందే వర మనుగ్రహించుము' అనగా ముని 'నీ మనుమడు మూడులోకాలకు వందనీయు డౌతాడు' అని అన్నాడు. రా జన్నాడు 'నా మనుమడు బ్రాహ్మణు డెట్లా ఔతాడో చెప్పుము' అనగా అత డన్నాడు. 'నా వంశంలో ఋచీకు డనే వాడు జన్మించి నీ కుమారుడైన గాధి కూతురును పెళ్ళి చేసికొనగా అతడికి జమదగ్ని జన్మిస్తే అతడు విలువిద్య నంతా జమదగ్ని పొందేటట్లు చేస్తాడు. ఆ ధనుర్విద్య అతడి కొడుకు పరశురాముడిలో ఫలిస్తుంది. ఈ విద్య సకల క్షత్రియ కుల నాశనం చేస్తుంది. ఇదంతా దైవఘటన. దానివలన ఋచీక, గాధి వధువుల అనుష్ఠానాలు మార్పు పొంది జమదగ్నికి క్రూరస్వభావం కల క్షత్ర ధర్మంతో పరశురాముడు జన్మిస్తాడు. గాధికి మహాబ్రాహ్మణ తేజోనిధి విశ్వామిత్రుడు జన్మిస్తాడు. మీ కులాల కలయిక లోకానికే కీర్తి పాత్రమౌతుంది. నేనిక తీర్థయాత్రలకు పోతాను. నీవు సుఖంగా ఉండుము' అంటూ ముని తన దారిన తాను పోయాడు. రాజు భార్యతో సహా అతడికి వినయంతో నమస్కరించాడు.

విశేషం: ఈ కథను చెప్పుమని అడిగినప్పుడు ధర్మరా జన్నాడు 'మహాత్మా!' మదీయ చిత్తాయత్తంబుగా నత్తెఱంగెఱింగింపవే' యని. ఈ కథ నట్లా మనస్సునకు హత్తుకొనేటట్లు చెప్పాడు మహాత్ముడైన కవిబ్రహ్మ. ఓర్పు ఎంత చేకూరుస్తుందో పాఠకులు గమనించాలి. అచ్చమైన మనిషిని నిర్మించటం సాహిత్య ప్రయోజన మన్నారు తొల్లిటి పెద్దలు. ఇంతకంటె దాని కుదాహరణ మేమున్నది కనుక.

భీష్ముఁడు ధర్మజునకు దానవిశేషముల నెఱింగించుట (సం.13-92-28 (కుంభ))

క. అని కురుపితామహుఁడు సె । ప్పిన విని, ధర్మాత్మజుండు ప్రియమందుచు నా
తనితో 'దానవిశేషము । లనఘా! యెఱిఁగింపు' మనుడు నతఁ డిట్లనియెన్. 332

ప్రతిపదార్థం: అని; కురుపితామహుఁడు= కౌరవుల తాత, భీష్ముడు; చెప్పినన్= చెప్పగా, చెప్పితే; విని; ధర్మ+ఆత్మజుండు= యమధర్మరాజు కొడుకు; ప్రియమున్= ప్రీతిని; అందుచున్= పొందుతూ; అతనితోన్= ఆ భీష్ముడితో; అనఘా!= పుణ్యాత్ముడా!; దానవిశేషములు; ఎఱిఁగింపుము= చెప్పుము; అనుడున్= అంటే; అతండు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు సంతోషించి తాతగారిని దాన విశేషాలు చెప్పుమని అడిగాడు.

సీ. 'కాంస్యోపదోహయుఁ గాంచన చారుశృం । గయు ధవళాంబర కలితయును, స
దక్షిణయును నయి తగుగోవుఁ బాత్రత్వ । భవ్యవిప్రునకు సద్భక్తితోడ

నిచ్చిన దానికి నెన్ని రోమము లన్ని । దివ్యవత్సరములుఁ ద్రిదశలోక
మున వసింతురు; కులంబున యేడు తరముల । జనముల సుగతికి ననుతు రధిప!

ఆ. కన్య, భూమి, గృహము, గనక, మన్నము, జల । మంబరంబు, శయన, మాసనంబు,
వాహనంబు, విప్రవరునకు నీగి లో । కముల రెంట సౌఖ్యకారి యండ్రు. 333

ప్రతిపదార్థం: కాంస్య= కంచుతో చేసిన; ఉపదోహయున్= పాలు పితికెడుపాత్రతో కూడినది; కాంచన= బంగారు; చారు= అందమైన; శృంగయున్= కొమ్ములు కలది; ధవళ= తెల్లని; అంబర= వస్త్రంతో; కలితయును= కూడుకొన్నదియు; సదక్షిణయును= దక్షిణతో కూడుకొన్నది అయి; తగు= ఒప్పునట్టి; గోవున్= ఆవును; పాత్రత్వ= అర్హతకల; భవ్య= శ్రేష్ఠుడైన; విప్రునకున్= బ్రాహ్మణుడికి; సత్= మంచి; భక్తితోడన్= భక్తితో; ఇచ్చినన్= దానమిస్తే; దానికిన్= ఆ గోవునకు; ఎన్ని; రోమములు= వెంట్రుకలో; అన్ని; దివ్య వత్సరములు= దేవతా సంవత్సరాలు; త్రిదశ లోకమునన్= దేవతల లోకంలో, స్వర్గంలో; వసింతురు= ఉంటారు; కులంబునన= తన కులంలో, ఏడు తరముల; జనములన్= మనుష్యులను; సుగతికిన్= మంచిస్థితికి; అనుతురు= పంపిస్తారు; అధిప!= రాజా!; కన్య= వివాహం కాని పడుచు; భూమి= పంటనేల; గృహము= ఇల్లు; కనకము= బంగారం; జలము= నీరు; అంబరంబు= వస్త్రం; శయనము= మంచం; ఆసనంబు=కుర్చీ, పీట; వాహనంబు= ప్రయాణ సౌకర్యానికి గుర్రం మొదలగునవి; విప్రవరునకున్= బ్రాహ్మణ శ్రేష్ఠుడికి; ఈగి=దానమివ్వటం; లోకములరెంటన్= ఇహపరలోకాలందు; సౌఖ్యకారి= సుఖాన్ని కలిగిస్తుందని; అండ్రు= పెద్దలు అంటారు.

తాత్పర్యం: పాలుపితికెడు కంచుపాత్ర బంగారు కొమ్ముల తొడుగులు తెల్లని వస్త్రాలు వీటితోకూడిన ఆవును దక్షిణతో పాటుగా యోగ్యత గల గొప్పవిప్రునకు మంచిభక్తితో దానమిస్తే ఆ గోవుకు ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో అన్ని దివ్యసంవత్సరాలు దేవతలలోకంలో నివసిస్తారు. తమ కులంలో ఏడుతరాల జనాలను ఉత్తమలోకాలకు పంపుతారు. ఆడుపిల్ల, భూమి, ఇల్లు, బంగారము, అన్నము, నీరు, వస్త్రము, పాన్పు, కూర్చుండేపీట, వాహనము అనేవానిని విద్యాపుష్కలంగా ఉన్న బ్రాహ్మణునకు దానం ఇవ్వటం ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖాన్ని కలిగించే కార్యం అని పెద్దలు చెబుతారు.

క. అనిన విని పాండవాగ్రజుఁ । 'డనఘా! యిన్నింటికంటె నధికంబగు దా
ని నెఱింగింపు' మనుడు, న । జ్జనపతి కిట్లను నతఁడు ప్రసన్నాత్మకుఁడై. 334

ప్రతిపదార్థం: అనినన్; విని; పాండవ+అగ్రజుండు= పాండవులలో ముందు పుట్టినవాడు, పెద్దవాడు; అనఘా!= పాపం లేనివాడా!; ఇన్నింటికంటెన్= వీటన్నిటికన్నా; అధికంబు= గొప్పది; అగుదానిన్= అయిన దానిని; ఎఱింగింపుము= తెలియజేయుము; అనుడున్; ఆ+జనపతికిన్= ఆ రాజుతో; అతఁడు= భీష్ముడు; ప్రసన్న+ఆత్మకుఁడై= ప్రశాంత హృదయం కలవాడై; ఇట్లు; అనున్.

తాత్పర్యం: విని ధర్మరా జన్నాడు; 'పాపం లేనివాడా! వీటన్నిటికంటె గొప్ప దానమేదో చెప్పుము' అని. దాని కతడు సంతోషించి ప్రసన్నమైన మనస్సుతో.

తే. 'అర్థి గోరిన వస్తువు లర్థితోడ । నీగి యెల్ల దానములకు నెక్కుడరయ;
నఖిల భూతమ్ములకు నభయంబు నిచ్చు ।టంతకంటెను మే లందు రార్యజనులు.' 335

ప్రతిపదార్థం: అర్థి= యాచకుడు; కోరిన వస్తువులు= ఏది కోరితే అది; అర్థితోడన్= ప్రేమతో; ఈఁగి= ఇవ్వటం; ఎల్లన్ దానములకున్; ఎక్కుడు= అన్ని దానాలలోకి ఎక్కువ; అరయన్= ఆలోచిస్తే; అంతకంటెన్= దానికంటె కూడా; అఖిల భూతమ్ములకున్= సర్వ జీవరాసులకు; అభయంబున్+ఇచ్చుట= భయం పోగొట్టటం, రక్షణ కల్పించటం; ఆర్యజనులు= ధర్మవేత్తలు, పండితులు; మేలు= గొప్ప; అందురు.

తాత్పర్యం: ఏది కోరి యాచకుడు తన దగ్గరికి వస్తాడో దాన్నే ప్రేమతో ఇవ్వటం అన్ని దానాలలో శ్రేష్ఠం. దానికంటె కూడా సర్వజీవులకు అభయ మివ్వటం చాలా గొప్పది.

విశేషం: దీనికి ఉదాహరణగా ఇదే పర్వంలో నాలుగవ ఆశ్వాసం 314 పద్యం నుండి ప్రారంభమైన పురుగు కథ గ్రహించాలి. మహాభారతమంటే పురుగు దగ్గర నుండి శ్రీకృష్ణపరమాత్మ దాకా వ్యాపించి ఉన్న సమస్త సృష్టి కథ.

వ. 'అని చెప్పి వినుమని మఱియు నిట్లనియె'. 336

తాత్పర్యం: అని ఆ విధంగా వివరించి, ఇంకా విను మని ఇట్లా చెప్పుతున్నాడు.

తే. వీరశయనంబు మేలండ్రు వీనికంటె । మఱియుఁ గొన్నింటి కంటెను మనుజనాథ!
దానముల కావు, వెదకిన దానిఁ బోల । లేవు, పుణ్య కర్మములలో నేవియైన.' 337

ప్రతిపదార్థం: వీనికంటెన్= ఈ చెప్పిన వాటికంటె; వీరశయనంబు= యుద్ధంలో మరణించటం; మేలు+అండ్రు= గొప్పదంటారు; మనుజనాథ!= మానవులకు పాలకుడా!; మఱియున్= ఇంకా కొన్నింటికంటెను; దానముల కావు= అసలు దానాలే లేవు; వెదకినన్= వెతికిచూచినా; పుణ్యకర్మములలోన్= పుణ్య చేష్టలలో; ఏని ఐనన్= ఏవైనాసరే; దానిన్= వీరశయనాన్ని; పోలన్ లేవు= సరిపోలగా లేవు.

తాత్పర్యం: వీరశయన మన్నింటికంటె గొప్పది. దానితో పోలిస్తే మిగిలినవి అసలు దానాలే కావు. సర్వపుణ్య కర్మలలోను అదే గొప్పది.'

వ. అనుటయు ధర్మజుండు తమ్ములం దెసం గనుంగొనిన, వార లతని చిత్తం బెఱింగి రణమరణ స్తుతి సేయ, నతండు సమరంబునం జచ్చిన బంధు, మిత్ర జ్ఞాతి, జనంబుల వలని శోకంబు వదలి వాహినీ నందను వాక్యంబు లభినందించె; నా దేవవ్రతుండు వెండియు. 338

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ధర్మజుండు= ధర్మరాజు; తమ్ములదెసన్= తమ్ముళ్ళవైపు; కనుంగొనినన్= చూడగా; అతని చిత్తంబు= అన్న మనస్సు; ఎఱింగి= తెలిసికొని; రణ= యుద్ధంలో; మరణ= మరణించినవారి; స్తుతి= ప్రశంస; చేయన్= చేయగా; అతండు; సమరంబునన్= యుద్ధంలో; చచ్చిన=మరణించిన; బంధు= చుట్టాలు; మిత్ర= స్నేహితులు; జ్ఞాతి జనంబులవలని= దాయాది జనులకారణంగా ఏర్పడిన; శోకంబు= దుఃఖము; వదలి= వదలి; వాహినీ= నది; నందనుండు= కొడుకు; వాక్యంబులు= మాటలు; అభినందించెన్= పొగడినాడు; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; వెండియున్= మరలా.

తాత్పర్యం: అనగానే ధర్మరాజు తమ్ముళ్ళవైపు చూచాడు. వారు ఆయన మనసు తెలిసికొని యుద్ధంలో చనిపోయిన వారిని స్తుతించారు. చచ్చిపోయిన బంధువులు, స్నేహితులు, దాయాదులపై ఉన్న దుఃఖాన్ని పోగొట్టుకొని ధర్మరాజు గంగాదేవికొడుకు చెప్పిన మాటలను స్తుతించాడు. భీష్ముడు మరలా ఇట్లా అన్నాడు.

క. 'అరియైన దీనుఁడై తను । శరణం బని వేఁడినం , బ్రసన్నాత్మత న
ప్పురుషుని కోలిక దీర్చినఁ । బురుషోత్తముఁ డందు రతనిఁ బురుషవరేణ్యా! 339

ప్రతిపదార్థం: పురుషవరేణ్యా!= మనుష్యులలో శ్రేష్ఠుడా!, వీరులలో శ్రేష్ఠుడా!; అరి ఐనన్= శత్రువు ఐనా; దీనుఁడై= దైన్యంతో; తనున్= తనను; శరణంబని= దిక్కు అని రక్షింపుమని; వేఁడినన్= ప్రార్థిస్తే; ప్రసన్న+ఆత్మతన్= సమమైన మనస్సుతో, ప్రశాంతబుద్ధితో; ఆ పురుషుని= ఆ వీరుడి, ఆ వ్యక్తియొక్క; కోరిక; తీర్చినన్; అతనిన్= అతనిని; పురుషోత్తముఁడు+ అందురు= నారాయణుడు అని అంటారు; పురుషులలో ఉత్తముడని అంటారు,

తాత్పర్యం: శత్రు వెట్లాంటివా డైనా దైన్యంతో శరణు కోరితే అతడి కోరిక తీర్చిన వాడిని పురుషోత్తము డంటారు.

క. అడుగక యున్నను, నాలిం । గొడుకుల రక్షింప లేక, కుతిలపడుచు నె
ప్పుడుఁ బేదతనము గల నరు । నెడ రుడుపఁగవలయు నది మహితగుణ మనఘా! 340

ప్రతిపదార్థం: అనఘా!; అడుగక ఉన్ననున్= అడుగక పోయినా; ఆలిన్= భార్యను; కొడుకులన్= సంతానాన్ని; రక్షింపలేక= సాక లేక; కుతిలపడుచున్= బాధపడుతూ; ఎప్పుడున్; పేదతనము= పేదరికం; కల; నరుని= మనుష్యుడి; ఎడరు= ఆపద, దుఃఖం; ఉడుపఁగ వలయున్= పోగొట్టాలి; అది; మహిత= గొప్ప; గుణము= స్వభావం.

తాత్పర్యం: భార్యా పుత్రులను పోషించుకొనలేక పేదరికంతో బాధపడే మనిషి దుఃఖాన్ని పోగొట్టటం గొప్ప గుణమయ్యా! ధర్మజా!

క. నిజదారపరులు సంతత । యజనరతులుఁ గామరోష హంతలు నగు స
ద్ద్విజుల నరసి ధన మిచ్చుట । త్రిజగత్పూజ్య మగు నండ్రు ధీరవిచారా!' 341

ప్రతిపదార్థం: ధీరవిచారా! చెదరని మనస్సుతో ఆలోచించేవాడా!; నిజదారపరులు= స్వంత భార్యలయందే ప్రేమకలవారు; సంతత= నిత్యం; యజనరతులు= యాగం చేయడంలో ఆసక్తి కలవారు; కామ=కామాన్ని; రోష= కోపాన్ని; హంతలు= చంపినవారు అగు; సత్+ద్విజులన్= మంచి బ్రాహ్మణులను; అరసి= పరిశీలించి; ధనమున్= డబ్బు; ఇచ్చుట; త్రిజగత్ పూజ్యము= మూడు లోకాలలో పూజించ దగ్గది; అంద్రు= అంటారు.

తాత్పర్యం: సమబుద్ధితో విచారించేవాడా! స్వభార్యలయందే మనస్సు లగ్నమైనవారు, నిత్యమూ యజ్ఞయాగాదులు చేస్తూండేవారు, కామ రోషాలు లేనివారూ అయిన మంచి బ్రాహ్మణులను పరిశీలించి దానంచేయటం మూడు లోకాలలో గొప్పవిషయం. లేదా, మూడు లోకాలకూ పూజించదగ్గది.'

విశేషం: ధర్మపరుడైన మనిషి ఎవరు అంటే ఈ మూడు లక్షణాలు కలవాడు. 1.స్వభార్యారక్తుడు - ఇతర స్త్రీలను ధర్మబుద్ధితో చూచేవాడు, 2. యజనపరుడు - యజ్ఞ యాగాదులు చేయటంలో ఆసక్తుడు; 3.కామ-రోషహంత అవి కలవాడు ఇట్లా ధర్మ - అధర్మ పరులుంటారు. ఈ పద్య రచన చాలా అందమైనది. మూడు గుణాలను ముచ్చటగా సమంగా

పద్యపాదాలలో మూడేసి వాక్యాలుగా సమవాక్యాలుగా చెప్పటంవలన పద్యరచనలో సమత్వం తూగు వచ్చాయి.

వ. అనినం బాండవాగ్రజుండు 'యాచనా యాచనంబులలో నెయ్యది దానార్హం బగు?' నని యడిగిన నతనికిఁ బితామహుం డిట్లనియె. 342

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాండవాగ్రజుండు= ధర్మరాజు; యాచన= భిక్షాటన, దానమడగటం; అయాచనంబులలోన్= దానం కోరకపోవటంలో; ఏ+అది= ఏది; దాన+అర్హంబు= దానానికి తగింది; అని= అని; అడిగినన్= అడుగగా; అతనికిన్= అతడికి; పితామహుండు= తాత భీష్ముండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా జవాబు చెప్పాడు.

తాత్పర్యం: అనగా, ధర్మరా జన్నాడు 'అడిగిన వాడికి దానం చేయటం మంచిదా? అడగనివాడికి దానం చేయటం మంచిదా?' దీనికి తాతగారు సమాధానం చెప్పుతున్నారు.

చ. 'అడిగిన నిచ్చుకంటెను నయాచకుఁ గాఁగ నెఱింగి యిచ్చు టె
క్కుడు ఫలమిచ్చు; దానవిధికోవిద! వేడుట సావు వేఁడఁగా
బడు టది పెద్దసావు; దగు ప్రార్థన పూర్ణము సేయునాతఁ డా
యడిగిన వానిఁ దన్నును దయారతిఁ గావఁగఁ జాలు వాఁడగున్.' 343

ప్రతిపదార్థం: అడిగినన్= అడిగితేనే; ఇచ్చుకంటెను= ఇవ్వటం కంటె; అయాచకున్+కాఁగన్= అడగనివాడినిగా; ఎఱింగి= తెలిసి; ఇచ్చుట; ఎక్కుడు= ఎక్కువ; ఫలము= ఫలితం; ఇచ్చున్; దానవిధి కోవిద!= దాన సంబంధమైన విధులు తెలిసినవాడా!; వేఁడుట= కోరటం; చావు= మరణం; వేఁడఁగాఁబడుట= ప్రార్థించబడటం; అది; పెద్దచావు= అన్నిటికంటె పెద్దదైన మరణం; తగు ప్రార్థన= అర్హమైన కోరికను; పూర్ణము= సంపూర్ణము; ఫలవంతం; చేయునాతఁడు= చేసేవాడు; అడిగినవానిన్= వేడుకొన్నవాడిని; తన్నునున్= తనను; దయారతిన్= దయాగుణమందలి ఆసక్తితో; కావఁగన్= రక్షించటానికి; చాలువాఁడు= సమర్థుడైనవాడు; అగున్= ఔతాడు.

తాత్పర్యం: 'అడిగితే ఇవ్వటం కంటె అడగనివాడు వీడు అని తెలిసి వాడికి ఇవ్వటం చాలా గొప్పదానం. దానవిధులు తెలిసినవాడా! అసలు అడగట మన్నది చావువంటిది. అడగబడటం పెద్దచావు వంటిది. కనుక అడగని వాడి కివ్వటంవలన వాడినీ, పుచ్చుకొన్నవాడినీ, తననూ రక్షించేవా డౌతాడు.'

వ. అనిన విని యుధిష్ఠిరుం డతని కిట్లనియె. 344

తాత్పర్యం: ఆ విధంగా భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. దానము యజ్ఞక్రియ నాఁ। గా నతులిత ధర్మవిధులు గల; వందు ధరి
త్రీ నాథోత్తమ! యధిక ఫ। లానూనంబై వెలుంగు నది యెయ్యదియో?' 345

ప్రతిపదార్థం: దానము; యజ్ఞక్రియ= యజ్ఞ కర్మ; నాన్+కాన్= అనగా; అతులిత= సాటిలేని; ధర్మవిధులు= ధర్మపద్ధతులు; కలవు= ఉన్నవి; అందున్= దానిలో; ధరిత్రీ నాథ!+ఉత్తమ!= రాజులలో శ్రేష్ఠుడా!; అధిక= గొప్ప; ఫల= ఫలితం; అనుమానంబు+ఐ= ఎక్కువై; వెలుంగునది= ప్రకాశించేది; ఎయ్యదియో?= ఏదో?

తాత్పర్యం: 'దానం యజ్ఞంవంటిది. అందులోనే ధర్మవిధు లున్నాయి. మహారాజా! వాటిలోకెల్లా అధికమైన ఫలితాల నిచ్చే దేదో?

వ. వినవలఁతుం జెప్పవే యని యడిగిన నయ్యనిమిష నదీనందనుం డప్పాండు నందనాగ్రజున కిట్లనియె.346

ప్రతిపదార్థం: వినవలఁతున్= వినటానికిష్టపడుతున్నాను, వినాలనుకొంటున్నాను; చెప్పవే!= చెప్పవా?; అని అడిగినన్; ఆ+అనిమిష= దేవతల; నదీ= ఏరు; నందనుఁడు= కొడుకు, దేవతానది గంగ - ఆమె కొడుకు; ఆ పాండు నందన+అగ్రజునకు= పాండురాజు కొడుకులలో పెద్దవాడు ధర్మరాజుకు; ఇట్లు అనియెన్.

తాత్పర్యం: వినాలనుకొంటున్నాను' అని అడుగగా భీష్ముడు ధర్మరాజుతో ఇలా అంటున్నాడు.

ఉ. భూసురకోటికిన్ వినయపూర్వముగా ధన ధాన్య గో మణి
క్ష్మా సలిలాన్న ముఖ్యములు సమ్మతి నీగి సుయజ్ఞ మాసనో
ద్భాసితసత్క్రియన్ నడపు భవ్యుఁడు యజ్ఞములుం దపంబులుం
జేసిన పుణ్యముం బడయుఁ; జేయుము దానము లోపి నిత్యమున్.' 347

ప్రతిపదార్థం: వినయపూర్వముగాన్= వినయపూర్వకంగా, సమస్కారపూర్వకంగా (వినతి= వినయం, మనస్సులో, వాక్కులో, శరీరంలో, వంగి నమస్కరించే లక్షణం, ఇచ్చేవాడికుండాలి); భూసుర= భూమిపై దేవతలైన - బ్రాహ్మణులయొక్క; కోటికిన్= సమూహానికి; ధన= డబ్బు; ధాన్యం=పంట; గో= ఆవు; మణి= మణులు; క్ష్మా= భూమి; సలిల= నీరు; అన్న= భోజన; ముఖ్యములు= మొదలైనవి; సమ్మతిన్= ఇష్టంతో; ఈఁగి= ఇవ్వటం; సు+యజ్ఞము= మంచి యజ్ఞము; ఆసన= పీట; ఉత్+భాసిత= పైకి వెలుగొందే; సత్క్రియన్= మంచిపని; ఆసనం మీద కూర్చుండి చేసే పని; నడపు= నడిపే; భవ్యుఁడు= శ్రేష్ఠుడు; యజ్ఞములున్; తపంబులున్; చేసిన పుణ్యమున్= చేసినంత పున్నెం; పడయున్= పొందుతాడు; దానములు; ఓపి= ఓర్పుతో; నిత్యమున్; చేయుము= కావింపుము.

తాత్పర్యం: నిత్యము బ్రాహ్మణులకు వినయపూర్వకంగా, ధనధాన్యాలు, ఆవు, రత్నం, భూమి, నీరు, అన్నాదులు సద్బుద్ధితో ఇవ్వటం యజ్ఞమే. కనుక దానం చేయుము. అది తపస్సు, యజ్ఞం చేసిన ఫలితమిస్తుంది.'

క. అనవుడు నాతనితో ని । ట్లనుఁ గుంతీతనయముఖ్యుఁ 'డనఘా! పెక్కుల్
వినఁబడు దానము లధికం । బనఁ దగియెడు దాన మెద్ది? యన్నిటిలోనన్.' 348

ప్రతిపదార్థం: అనవుడున్; ఆతనితోన్= భీష్మడితో; కుంతీ తనయ ముఖ్యుఁడు= కుంతి కొడుకులలో పెద్దవాడు; ఇట్లు; అనున్; అనఘా!; దానములు; పెక్కుల్= అనేకం; వినఁబడున్= చెప్పబడుచున్నవి; అన్నిటిలోనన్= వాటన్నిటిలో; అధికంబు= గొప్పది; అనన్= అనుటకు; తగియెడు= అర్హమైన; దానము= దానం; ఎద్ది?= ఏది?

తాత్పర్యం: అనగానే భీష్మడితో ధర్మరాజు అన్నాడు. 'అనేక దానాలు చెప్పబడుతున్నాయి కదా! వాటిలో ఉత్తమమైనది ఏది?'

వ. అని యడిగిన నయ్యాపగాసూనుం డమ్మానవపతి కిట్లనియె. 349

ప్రతిపదార్థం: అని; అడిగినన్; ఆ+ఆపగాసూనుండు= నదీకుమారుడు, భీష్ముడు; మానవపతికిన్= రాజుకు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: అని ప్రశ్నించిన ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా అన్నాడు.

భూదాన మహిమాభివర్ణనము (సం.13-61-1)

క. దానము లన్నిటికిని భూ । దానం బెక్కుడు సమస్త ధాన్యములుఁ బ్రభూ
తానేక వస్త్ర ధన ర । త్నానూనత్వమును భూమి నవుట కతమునన్. 350

ప్రతిపదార్థం: సమస్త ధాన్యములు= అన్ని పంటలు; ప్రభూత= అధికమైన; అనేక= పెక్కు; వస్త్ర= గుడ్డ; ధన= డబ్బు; రత్న= మణులు; వీనియొక్క అనూనత్వమును= అధిక్యమును; భూమిన్= భూమిలో; అవుట కతమునన్= అవుతున్నందువలన; దానములు; అన్నిటికిని= అన్నిటికంటె; భూదానంబు= నేలను దానం చేయటం; ఎక్కుడు= ఎక్కువ.

తాత్పర్యం: దానాలన్నింటిలో భూదానమే శ్రేష్ఠం. ధాన్యాలన్నిటికి నేలయే ఆధారం. అంతే కాదు, బట్టకు ప్రత్తి అక్కడే పండుతుంది. రత్నాలూ భూమిలోనే కదా దొరికేవి. కనుక అతిశయంగా డబ్బిచ్చేది నేలయే.

క. కనకము రజతము వస్త్రం । బును ధాన్యము వివిధ రత్నములు నిచ్చిన య
వ్వినుత ఫలంబుల నెల్లను । గను నుత్తమభూమి దానకర్త నరేంద్రా! 351

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= మానవనాథా!, రాజా!; కనకము= బంగారం; రజతము= వెండి; వస్త్రంబును= గుడ్డా; ధాన్యము= పంట; వివిధ రత్నములు= అనేక రత్నాలు; ఇచ్చిన= దానం చేసిన; ఆ+వినుత= ఆ పొగడ దగ్గ; ఫలంబులన్+ఎల్లన్= ఫలితాలన్నింటినీ; ఉత్తమ భూమి దానకర్త= మంచిభూమిని దానంచేసినవాడు; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: బంగారం, వెండి, వస్త్రం, ధాన్యం, వివిధ రత్నాలు - ఇచ్చిన ఫలా లన్నిటినీ శ్రేష్ఠమైన భూదానం చేసినవాడు పొందుతాడు.

సీ. భూమి కెంతాయువు భూదానకర్తయు । నంతకాలము సుఖ మందుచుండు
నమరలోకంబున; నల్పమైనను భూమి । యిచ్చిన బహుభూమి యేలు నతఁడు;
రాజు విశేషించి రణమృతి యొండెను । భూదాన కర్తృత్వ పుణ్య మొండెఁ
బడయంగవలయుఁ బాపఁగ నోపు బ్రహ్మ హ । త్యాది పాతకముల నైన భూమి

తే. దాన మెంత పాపాత్ముచే నైన భూమిఁ । గొనిన గల్మష మొందదు; వినుము మహిత
మైన భూదానవిధియును నశ్వమేధ । యాగమును సదృశంబులం డ్రాదిమునులు. 352

ప్రతిపదార్థం: భూమికిన్; ఎంత; ఆయువు= ఆయుస్సో; భూదానకర్తయున్= భూదానం చేసినవాడున్నూ; అమర లోకంబునన్= దేవతాలోకంలో; అంత కాలమున్; సుఖమున్; అందుచున్; ఉండున్; భూమి; అల్పము+ఐననున్= కొంచెమైనాసరే; ఇచ్చినన్=

ఇస్తే; అతఁడు= ఇచ్చినవాడు; బహుభూమి= ఎక్కువ నేలను; ఏలును= పాలించగలడు; విశేషించి= వీరికంటె ఎక్కువగా; రణమృతి= యుద్ధంలో చావు; ఒండెన్= ఐనా; భూదాన= భూమి నివ్వటం; కర్తృత్వ పుణ్యము+ఒండెన్= కర్తయైన పున్నెమైనా సరే (భూమిని దానం చేసిన కర్త పున్నెమైనా; పడయంగన్ వలయున్= పొందవలెను; భూమిదానము; బ్రహ్మహత్య= బ్రాహ్మణ హత్య; అవి= మొదలైన; పాతకములన్+ఐనన్= పాపాలనైనా; పాపఁగన్= పోగొట్టగా; ఓపున్= సమర్థమగును; ఎంత పాపాత్ముచే నైనన్; భూమిన్ కొనినన్= భూమిని గ్రహిస్తే; కల్మషము= పాపం; ఒందదు= తగులదు; వినుము; ఆది మునులు= ప్రాచీన కాలఋషులు; మహితము+ఐన= గొప్పదైన; భూదాన విధియునున్= భూమిని దానంచేసే కర్మ; అశ్వమేధయాగమును= అశ్వమేధమన్న యాగమూ; సదృశంబులు= సమానములు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: భూమి ఎంత కాలం ఉంటుందో భూదానం చేసినవాడుసైతం స్వర్గలోకంలో అంతకాలం ఉంటాడు. కొంచెం నేలను దానంచేసినా ఎంతో నేలను పొందగలడు. రాజు రణమరణమైనా పొందాలి, భూదానమైనా చేయాలి. భూదానంవలన బ్రహ్మహత్యవంటి పాపాలు పోతాయి. భూదానాన్ని ఎంత పాపాత్ముడు చేసినా, గ్రహించినవానికి కల్మషం రాదు. భూదానం అశ్వమేధం సమాన మని ఆదిమునులు అంటారు.

క. దారిద్ర్యముచేఁ గుందుచు । నేరిని నడుగంగఁ బోవ కెంతయుఁ గృశతం
గూరిన విప్రున కుర్వర । వారని దయ నీగి ఫలము వాగ్గోచరమే? 353

ప్రతిపదార్థం: దారిద్ర్యముచేన్= పేదరికంతో; కుందుచున్= బాధపడుతూ; ఏరినిన్= ఎవరినీ; అడుగంగన్= అడగటానికి; పోవక= పోకుండా; ఎంతయున్= మిక్కిలి; కృశతన్= లేమిడిలో; కూరిన= కూరుకొనిపోయిన; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఉర్వరన్= భూమిని; వారని దయన్= ఎక్కువ దయతో; ఈగి= దానము చేయడంలోని; ఫలము= ఫలితం; వాక్+గోచరమే?= వాక్కున కందునా? అందదు.

తాత్పర్యం: "దారిద్ర్యంతో బాధపడుతూ ఎవరినీ యాచించడానికి పోకుండా ఎంతోలేమిడిలో కూరుకుపోయిన బ్రాహ్మణుడికి ఎక్కువ దయతో పంటపండే భూమిని దానం చేస్తే కలిగే ఫలితాన్ని మాటల్లో చెప్పడం సాధ్యమా?"

విశేషం: అన్ని రకాల పైరులచే నిండిన నేల 'ఉర్వర'.

తే. యాగకర్తయు శాంతుండు నైన యట్టి । విప్రుఁ బ్రార్థించి యైన నుర్వీప్రతి గ్ర
హంబు సేయించు టత్యధికంబు భూమి । దానవిధి విశేషంబులలోన నెల్ల. 354

ప్రతిపదార్థం: భూమిదాన విధి విశేషంబులు= భూదాన సంబంధమైన విశేష విధానాలు; లోనన్= లోపల; ఎల్లన్= అన్నిటిలో; యాగకర్తయున్= యజ్ఞాలు చేసినవాడు; శాంతుండును= సమత్వం కలవాడును; ఐన అట్టి= అయినటువంటి; విప్రున్= బ్రాహ్మణుడిని; ప్రార్థించియైనన్= మిక్కిలిగా వేడుకొనిఐనాసరే; ఉర్వీ= భూమి; ప్రతిగ్రహంబు= గ్రహించటం; చేయించుట= చేయించటం; అతి+అధికంబు= మిక్కిలి అధికమైనది.

తాత్పర్యం: భూదాన విధులలో విశేషమైన విధి ఏమంటే యాగం చేసినవాడు శాంతుడైనవాడు అయిన బ్రాహ్మణుడిని ప్రార్థించయినాసరే భూమిని గ్రహించేటట్లు చేయించటం గొప్ప విశేషం.

విశేషం: ప్రతి పద్యంలోనూ విప్రశబ్దమే కనిపిస్తున్నది. ఇది చాలా విచారింపదగ్గది. వేదంలో "ఏకం సత్ విప్రా బహుధా

వదంతి'' అని ఉన్నది. 'ఉన్న సత్య మొక్కటే దానినే విప్రు లనేక రకాలుగా వివరిస్తున్నారు' అన్నచోట విప్రశబ్దంలో వి= విశిష్టమైన; ప్ర= అధికమైన; అన్న అర్థంలో ఉపసర్గలు. ఆనాటి కాలంలో శబ్దం నిజమైన అర్థంలోనే వాడబడేది. రానురాను ఆ అర్థం పోయి శబ్దం అరిగిన నాణెమై పోతుంది. కనుక తిక్కనగారు వాడే విప్ర శబ్దం వేదంలో చెప్పిన అర్థంలోనే గ్రహించాలి. విప్ర=ఋషి.

క. విను మర్హుఁడైన విప్రున । కనఘా! గోచర్మమాత్ర యగు మేదిని ని
చ్చినఁ బోని యట్టి పాపము । నినుపొడుపునఁ జెడని తమము నెందును గలవే? 355

ప్రతిపదార్థం: అనఘా!; వినుము; అర్హుఁడు+ఐన= తగినవాడైన; విప్రునకున్; గోచర్మమాత్ర= గోవు చర్మమంత మాత్రం; అగు= అయిన; మేదినిన్= భూమిని; ఇచ్చినన్= దానమిస్తే; పోని= పోవని; అట్టి= అటువంటి; పాపము; ఇనుపొడుపునన్= సూర్యోదయంతో; చెడని= నాశంకాని; తమమున్= చీకటి; ఎందునున్= ఎక్కడైనా; కలవే?= ఉన్నాయా?

తాత్పర్యం: ధర్మరాజా! తగినబ్రాహ్మణుడికి గోచర్మమంత భూమిని దానమిస్తే పోని పాపంకానీ, సూర్యోదయంతో తొలగని చీకటికానీ ఎక్కడైనా ఉంటాయా?

విశేషం: అలం: సహోక్తి.

క. ఆజిప్రాప్త మృతులు గురు । పూజకులును, మఱియు నెట్టి పుణ్యాత్మకులున్
రాజోత్తమ! భూదాన । భ్రాజిష్ణునిఁ బోల రంద్రు పరమమునీంద్రుల్'. 356

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమ!= ఉత్తముడవైన రాజా!; ఆజి= యుద్ధంలో; ప్రాప్త= పొందిన; మృతులు= చావుకలవారు; గురు= ఆచార్యుని; పూజకులును= పూజించేవారును; మఱియున్; ఎట్టి= ఎట్లాంటి; పుణ్య+ఆత్మకులున్= పుణ్యం చేసినవారున్నూ; రాజ+ఉత్తమ= ఉత్తముడవైన రాజా!; పరమ= గొప్ప; ముని+ఇంద్రుల్= మునిశ్రేష్ఠులు; భూదాన= భూమిని దానంచేయటంవలన; భ్రాజిష్ణునిన్= ప్రకాశించేవాడిని; పోలరు= సరితూగరు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: యుద్ధంలో మరణించినవారు, గురువులను పూజించేవారు, మరి ఎట్లాంటి పుణ్యాత్ములైనా సరే భూదానంతో ప్రకాశించేవాడితో సరిపోలరు అంటారు మునీశ్వరులు.'

వ. అని చెప్పి భీష్ముండు వెండియు నిట్లను 'భూదేవి జనులకు హితంబుగా నానతిచ్చిన వాక్యంబులు భూగీత లనంబరఁగు; వాని విని పరశురాముండు భూదానపరుం డయ్యె నని విందుము పాండవాగ్రజా! యవి నీ వాకర్ణింపుము. 357

ప్రతిపదార్థం: అనిచెప్పి; భీష్ముండు; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; భూదేవి; జనులకున్= జనులకు; హితంబుగాన్= మేలుకొరకుగా; ఆనతి+ఇచ్చిన= సెలవిచ్చిన; వాక్యంబులు= మాటలు; భూగీతలు= భూదేవి చెప్పిన మాటలు; అనన్= అనే పేరున; పరఁగున్= వ్యాప్తిపొందాయి; వానిన్= వాటిని; విని= ఆలకించి, పరశురాముండు= పరశురాముడు; భూదానపరుఁడు= భూమిని దానం చేసేవాడు; అయ్యెన్= అయ్యాడు; అని; విందుము= విన్నాము; పాండవాగ్రజా!= ధర్మరాజా!; అవి= వాటిని, భూగీతలను; నీవు= నీవు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: పాండవులలో పెద్దవాడా! భూదేవి జనం శుభం కోరి చెప్పిన మాటలు భూగీత లనే పేరున లోకంలో పేరు పొందాయి. అవి విని పరశురాముడు భూదానంచేశాడు. నీవూ అవి వినాలి.

విశేషం: గీత= పాడబడినది. పాట= పరమాత్మ దర్శనంతో ఆనందావేశం పొందిన ఋషి పాడినపాట గీత. ఇదే ఉత్ గీత (థ) లన్న పేరున ఉపనిషత్తులలో చెప్పబడ్డాయి. భగవద్గీత - భగవంతుడి పాట, మాట. బ్రహ్మగీత, దేవీగీతలు ఇట్లా అనేకం వచ్చాయి. ఆత్మానందాన్ని అందించేకొరకు వ్యక్తమైన పాట. పూర్వం మాట లేదు. పాటే ఉండేది. మాట మంత్రమైన పాటయిన దశ ఒకటే ఉన్నది. మాటయినా పాటవలె ఉంటుంది. మహాత్ముల వాక్యాలే గీతలు.

క. 'నను నిండు రెండు లోకము । లను జెడని యశస్సుఖంబులం బడయఁగఁ గో
రినయట్లయినను దీనికి । నెన లేవు సుఁడీ! తలంప నే ధర్మములున్. 358

ప్రతిపదార్థం: రెండు లోకములను= ఇహ పరలోకాలలో; యశః= కీర్తి; సుఖంబులన్= సుఖాలు; పడయఁగన్= పొందటానికి; కోరినఅట్లు+అయిననున్= కోరేటట్లయితే; దీనికిన్= భూదానానికి; ననున్+ఇండు= నన్ను దానం చేయండి; తలంపన్= ఆలోచింపగా; ఏ ధర్మములున్= ఏ ధర్మాలున్ను; ఎనలేవు సుఁడీ= సరిగావు సుమా!

తాత్పర్యం: నన్ను దానంచేస్తే రెండు లోకాలలో మేలు కలుగుతుంది. ఈ లోకంలో కీర్తి, ఆలోకంలో సుఖమూ కావాలనుకొంటే నన్ను దానం చేయండి. దీనికి సమాన మైన ధర్మాలేవీ లేవు.

చ. ఇతరుల దాన మేనిఁ దమ యీగియ యేనిని నన్ను మార్తురే
మతి నరకాధివాసగతి మాన్పఁ దలంచుట గల్గినన్ సమం
చితముగ భక్తి నిచ్చుట కుశీలత మార్చుట నాకు హర్ష భా
సితయుఁ; బరాభవ వ్యథయు జేఁత సుఁడీ! యిదె చాటి చెప్పితిన్.' 359

ప్రతిపదార్థం: ఇతరుల దానము+ఏనిన్= ఇతరుల దానమైనా; తమ= స్వంత; ఈగియ ఏనిని= దానమైనా; నన్నుమార్తురే?= నన్ను మారుస్తారా; మతి= ఆలోచనలో; నరక= నరకంలో; అధివాసగతి= ఉండేస్థితి; మాన్పన్= మానుకొనే; తలంచుట= తలంపు; కల్గినన్= కలిగితే; సమంచితముగన్= చక్కగా; భక్తిన్= భక్తితో; ఇచ్చుట= దానంచేయుటం; కుశీలతన్= చెడ్డస్వభావంతో; మార్చుట= మార్చటం; నాకున్; హర్షభాసితయున్= సంతోషంతో తృప్తినివ్వటం; పరాభవవ్యథయున్= అవమాన బాధ; చేఁత సుఁడీ= చేయటం సుమా!;= ఇదె= ఇదుగో; చాటి= ఎలుగెత్తి; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: నరకంలో ఉండాలన్న కోరిక లేకపోతే దానమైనా స్వదానమైనా నన్ను మార్చరు. సంతోషంగా నన్ను ఇస్తే నాకు చాలా ఆనందం కలిగించినట్లు. దుష్టస్వభావంతో ఆ దానాన్ని మారిస్తే, హరిస్తే నాకు అవమానం కలిగించినట్లు. ఇదే వినండి అంతవరకు ఎలుగెత్తి చెప్పుతున్నాను.'

విశేషం: ఉద్గీత= ఉత్ గీత= ఎలుగెత్తి చెప్పినదే. అతి ప్రాచీనకాలంలో భూమిపై ఎవరికీ హక్కుండేది కాదు. అంతా రాజాధీనంలోనే ఉండేది. రిజిస్ట్రేషన్ వ్యవస్థ ఆంగ్లేయులు ప్రవేశపెట్టారు. ఈ గీతార్థం అతి ప్రాచీనవ్యవస్థను చెప్పుతుంది.

క. 'వినుఁ డుభయలోకముల మే । లొనరింతుం గీ డొకింతయును నిలువఁగ నీ
క నిరాసంబు నొనర్తును । నను నిచ్చిన నెట్టి దుర్జనములకు నైనన్.' 360

ప్రతిపదార్థం: వినుఁడు= ఆలకించండి; ననున్= నన్ను; ఇచ్చిన= ఇచ్చినటువంటి; ఎట్టి= ఎట్లాంటి; దుర్జనములకున్+ఐనన్= చెడ్డవారికైనను; ఉభయ లోకములన్= ఇహపరలోకముల యందును; మేలు+ఒనరింతున్= శుభములు కలుగ జేస్తాను; కీడు+ఒకింతయును= అశుభం ఏమాత్రమయినా; నిలువఁగనీయక= కలుగనీయక; నిరాసంబున్+ఒనర్తున్= నిరసిస్తాను.

తాత్పర్యం: 'వినండి. ఎట్టి దుర్మార్గులకైనా నన్ను ఇస్తే, నేను ఇహపరాలకు మేలు చేస్తాను. కీడు ఏమాత్రం కలుగకుండా నివారిస్తాను.'

వ. అనియె 'నని యవ్వాక్యంబు లుపన్యసించి దేవవ్రతుం డన్నర దేవోత్తమునకు మఱియుం జెప్పు; 'నవ్విషయంబున నింద్రుం డడుగ బృహస్పతి సెప్పిన వచనంబులు వినుము చెప్పెద. 361

ప్రతిపదార్థం: అనియెన్; అని; ఆ+వాక్యంబులు= ఆ మాటలు; ఉపన్యసించి= వివరించి; దేవవ్రతుండు= భీష్ముడు; ఆ నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడికి; మఱియున్; చెప్పున్; ఆ+విషయంబునన్= ఆ సందర్భంగా; ఇంద్రుండు; అడుగన్; బృహస్పతి చెప్పిన; వచనంబులు= పలుకులు; వినుము= ఆలకించుము; చెప్పెదన్= చెప్పెదను.

తాత్పర్యం: అని చెప్పినట్లు ఆ మాటలు భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు. ' ఆ విషయంలో ఇంద్రు డడిగితే బృహస్పతి చెప్పిన మాటలు ఉన్నాయి. వినుము చెప్పుతాను.

ఆ. 'భూమి రత్నగర్భ పురుహూత! యటు గాన । కలుగు భూమిదాన కర్త యైన
వాని కశ్వ హస్తి వనితాది సర్వ ర । త్నములు నిచ్చునట్టి యమితఫలము. 362

ప్రతిపదార్థం: భూమి; రత్నగర్భ= రత్నాలు కడుపులో కలది (రత్నమంటే చెట్టూ; బొగ్గూ, పంటా అన్నీ రత్నాలే ధనాన్నిచ్చేవి కనుక); పురుహూత!= ఇంద్రా!; అటుకాన= అట్లు కాబట్టి; భూమిదానకర్తఐన వానికిన్= భూమిని దానంచేసిన వాడికి; అశ్వ= గుర్రం; హస్తి= ఏనుగు; వనిత= స్త్రీ; ఆది= మొదలైన; సర్వ= అన్ని; రత్నములు= మణులు; ఇచ్చునట్టి= దానం చేసినట్టి; అమిత= అధికమైన; ఫలము= ఫలితం; కలుగుతుంది.

తాత్పర్యం: ఇంద్రా! భూదేవి రత్నగర్భ కాబట్టి భూదానం చేసినవాడికి గుర్రం, ఏనుగు, స్త్రీ మొదలైన రత్నాలను ఇచ్చినటువంటి ఫలితం కలుగుతుంది.

విశేషం: రాజనీతి శాస్త్రాలలో సప్తరత్నాలు చెప్పబడ్డాయి. అందులో కొన్ని ఈ పద్యంలో చెప్పబడ్డాయి.

1. గుర్రం, 2.ఏనుగు, 3. స్త్రీ= రాజశ్రీ, రాజు ఐశ్వర్యం. ఈ 7లో రత్నాలు. రథం, ధర్మచక్రం సేనాపతి. మంత్రి మొదలైనవి ఆ ఏడులో ఉన్నాయి. కనుకనే ఆది అని చెప్పబడినది. రాజు రాజ్యపాలనం చేయటానికి ఆధారాలు.

క. వసుదాయిని యైన వసుధ । నొసఁగి నతనిఁ దన్న తన్న యొసఁగె ననుచు సం
తసపడు భూతము లన్నియు । నసమానము భూమిదాన మమరాధీశా! 363

ప్రతిపదార్థం: అమర= దేవతలకు; అధి+ఈశా!= పాలకుడా!; వసుదాయిని= బంగారాన్నిచ్చేది; ఐన; వసుధన్= నేలను (వసువును ధరించేది); ఒసఁగిన= ఇచ్చిన; అతనిన్= అతడిని; తన్న తన్న= తనను, తననే; ఒసఁగెన్= ఇచ్చెను; అనుచున్= అంటూ; భూతములు= పంచభూతాలు (ఆకాశం, అగ్ని, నిప్పు; నీరూ, నేల); అన్నియున్= అయిదూ; సంతసపడున్= సంతోషిస్తాయి; భూమిదానము; అసమానము= సాటిలేనిది.

తాత్పర్యం: దేవరాజా! వసుధ బంగారాన్నిస్తుంది. కనుక సకలభూతాలు తనను, తనను దానంచేశాడని చేసినవాడిని చూచి సంతోషిస్తాయి.

విశేషం: పంచభూతాలలో భూమి అట్టడుగున ఉన్నది. దీనిలో మిగిలిన నాలుగు ఉన్నాయి. కనుక అవి సంతోషిస్తాయి.

క. విను రాజులకు నవశ్యం । బును జేయఁగవలయు నధిక భూదానము; రా
జనువాఁ డఘముల కాకర । మనఘా! యది దక్కనొంట నది వ్యయ మగునే? 364

ప్రతిపదార్థం: అనఘా; విను; రాజులకున్; అవశ్యంబును= తప్పక; భూదానమున్; చేయఁగన్ వలయును= చేయాలి; రాజు; అనువాఁడు; అఘములకున్= పాపాలకు; ఆకరము= నిలయం, స్థానం; అది తక్కన్= భూదానం తప్పించి; ఒంటన్= మరొకదానితో; అది= ఆ పాపం; వ్యయము= నాశనం; అగునే= ఔతుందా? కాదని భావం.

తాత్పర్యం: అనఘా! రాజులకు భూదానం తప్పక చేయవలసిన విధి ఉన్నది. ఎందుకంటే రాజైనవాడు పాలనలో అనేక పాపాలు చేయవలసి వస్తుంది. అది పోవాలంటే భూదానమే మార్గం.

విశేషం: రాజ్యాంతే నరకం ధ్రువమ్ - రాజ్యపాలన చివర నరకం తప్పక కలుగుతుంది అని పెద్దలమాట. పరిపాలనలో ఎన్ని అధర్మాలైనా కలిగే అవకాశమున్నది కనుక ఆ సూక్తి పుట్టింది. అది పోగొట్టుకొనటానికి మార్గ మొక్క భూదానమే. ఆ రోజులలో కోశాగారంలో మిగిలిన ధనాన్ని ప్రజలకు పంచి ఇచ్చే అలవాటుండేది. హర్షుడు మొదలగువారిట్లా చేశారని చరిత్ర చెప్పుతున్నది. ప్రాచీన చక్రవర్తుల ధర్మపాలన కది గుర్తు. రాజు ప్రజలకు తండ్రి. ప్రజ అంటేనే సంతానమని అర్థం. తన సంతానాన్ని కాపాడుకొనవలసిన బాధ్యత తండ్రివంటి రాజుదే. కనుకనే రాజంటే ప్రజారంజనం, ఆనందం చేసేవాడని అర్థం. భారతం ఆ ధర్మచక్రవర్తి ఎట్లా ఉంటాడో చెప్పటానికే వ్రాయబడిన ఇతిహాసం. కనుకనే ధర్మరాజని భారత నాయకుడికి పేరు. కనుకనే ఇతడే ధర్మాలన్నిటికీ శ్రోతగా చేయబడ్డాడు. ఇదొక రాజ శిక్షణ. (ధర్మరాజు రాజధర్మ స్వరూపుడు).

క. పూర్వదత్త యైన భూమి నెవ్వఁడు పుచ్చి । కొనియె, నతఁడు దనదు కులమువారి
నిరువదొక్కతరము నరకవాసులఁ జేయు । దాను నడుము గాఁగ ధర్మనిరత! 365

ప్రతిపదార్థం: ధర్మనిరత!= ధర్మమునందు నిష్ఠకలవాడా!, నిరంతరము ధర్మము నందు లగ్నమైన బుద్ధి కలవాడా!; పూర్వదత్త+ఐన= పూర్వమే ఇవ్వబడిన; భూమినిన్; ఎవ్వఁడు; పుచ్చుకొనియెన్= తీసికొన్నాడో; అతఁడు; తనదు= తన; కులమువారిన్; ఇరువదొక్క తరమున్; నరకవాసులన్= నరకంలో నివసించేవారిగా; చేయున్= చేస్తాడు; తాను; నడుమ= కేంద్రం; కాఁగన్= కాగా.

తాత్పర్యం: ముందిచ్చిన భూమిని తిరిగి ఎవ్వడు గ్రహిస్తాడో తిరిగి తీసికొంటాడో వాడు తన కులంలో ఇరవైయొక్క తరాల వాళ్ళను నరకంలో పడేటట్లు చేస్తాడు. మహాపాపానికి తాను కేంద్రమౌతాడు. (ఈ పాపభారమంతా వాడే మోయాలి)

క. మును దా విప్రున కిచ్చెద । నని భువి యీ కుండుకంటె నధికపుఁ బాపం
బును నడుగ కిచ్చుటకు మిగి । లిన పుణ్యము నెందు నరయ లేవండ్రు బుధుల్.' 366

ప్రతిపదార్థం: మును= ముందుగా; తాన్= తాను; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఇచ్చెదన్= ఇస్తాను; అని; భువిన్=భూమిని; ఈక+ఉండు కంటెన్= ఇవ్వకుండా ఉండటం కంటే; అధికపుఁ బాపంబును= ఎక్కువ పాపం; అడుగక= అడగకుండానే; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; మిగిలిన= మించిన; పుణ్యమున్; ఎందున్= ఎక్కడా; అరయన్= విచారిస్తే; బుధుల్= పండితులు; లేవు+అండ్రు= లేవని అంటారు.

తాత్పర్యం: ఇస్తానని వాగ్దానం చేసిన భూమిని ఇవ్వకపోవటం కంటె మహాపాపం లేదు. అడక్కుండానే ఇచ్చినంత మహాపుణ్యమూ లేదు - అని పండితులంటారు.'

వ. అనిన విని యజాతశత్రుండు సురనదీపుత్త్రుతో 'దానపరులయిన మానవులకు దాతవ్యంబులగువాని విశేషంబు లెఱింగింపవే' యనుటయు, నతం డన్న కనక పానీయ ప్రముఖంబులైన పదార్థంబుల విశేషంబులు గల; వవి యెఱింగించెద; నొక్కనాఁ డన్నంబు విషయం బైన దానంబు ప్రకారంబు. 367

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాత= పుట్టని (లేని); శత్రుండు= శత్రువులు కలవాడు, ధర్మరాజు; సురనదీ= గంగా; పుత్త్రుతోన్= కొడుకుతో; దానపరులు= దానబుద్ధికలవారు; అయిన; మానవులకున్= మనుష్యులకు; దాతవ్యంబులు+అగువాని= ఈయదగిన వాటియొక్క; విశేషంబులు= విశేషాలు; ఎఱింగింపవే= తెలుపవే; అనుటయున్; అతండు= భీష్ముడు; అన్న= భోజనం; కనక= బంగారం; పానీయ= త్రాగదగ్గవి; ప్రముఖంబులు= మొదలైన; పదార్థంబుల= వస్తువుల; విశేషంబులు; కలవు= ఉన్నాయి; అవి= వాటిని; ఎఱింగించెదన్= చెప్పుతాను; ఒక్కనాఁడు= ఒక్కరోజు; అన్నంబు విషయంబు+ఐ= అన్నానికి సంబంధించిన; దానంబు ప్రకారంబు= దానం పద్ధతి. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: చెప్పగా విని ధర్మరాజు భీష్ముడితో 'దానస్వభావం కలవారికి దానం చేయటానికి తగిన వస్తువు లేవి? వాటి విశేషాలు చెప్పు'మని అడుగగా భీష్ముడంటున్నాడు. 'అన్నం, బంగారం, పానీయాలు మొదలైన పదార్థాల విశేషాలు ఉన్నాయి. వాటి సంగతి తరువాత చెప్పుతాను. 'ముందు ఒకరోజన్నదాన విషయం వినుము.

క. ఏ నడుగఁగ నారదముని । మానితముగఁ జెప్పినట్టి మాటలు సువ్య
క్తానూన వృత్తిఁ జెప్పెద । భూనాయక! యేక చిత్తమున విను వానిన్. 368

ప్రతిపదార్థం: ఏను= నేను; అడుగఁగన్= అడిగితే; నారదముని= నారదమహర్షి; మానితముగన్= ఆదరంగా; చెప్పినట్టి మాటలు; సువ్యక్త= బాగా తెలిసేటట్లు; అనూన= అధికమైన; వృత్తిన్= బుద్ధితో; చెప్పెదన్; భూనాయక!= భూమిపాలకుడా! ఏకచిత్తమునన్= ఏకాగ్రబుద్ధితో; వానిన్= వాటిని; విను= వినుము.

తాత్పర్యం: నేనడిగితే నారదముని ఆదరబుద్ధితో చెప్పిన మాట లున్నాయి. వాటిని స్పష్టపడేటట్లు చేయాలన్న సంకల్పంతో రాజా! చెప్పుతున్నాను; ఏకాగ్రబుద్ధితో వినుము.

విశేషం: సమ్యక్ శ్రవణం బుద్ధదేవుడి అష్టాంగసూక్తులలో ఒకటి. గురువుల వాక్యాలను చక్కగా విని మననం చేసుకోవాలి. దానికే ఈ మాట.

క. మునులును దివిజులు నన్నము । వినుతింతురు లోకతంత్రవిధిఁ గ్రతువులు ద
క్కునుగల సర్వము నన్నం । బున నడచుం గాన యన్నము విశిష్ట మిలన్. 369

ప్రతిపదార్థం: మునులును= మునులున్నూ; దివిజులున్= దేవతలున్నూ; అన్నమున్, వినుతింతురు= స్తుతిస్తారు; లోకతంత్ర విధిన్= లోకయాత్రా పద్ధతిలో; క్రతువులు= యజ్ఞాలు; తక్కునుగల= మిగిలిన; సర్వమున్= సమస్తమూ; అన్నంబునన్= అన్నంతోనే; నడచున్= నడుస్తాయి; కాన= కాబట్టి; అన్నము; ఇలన్= లోకంలో; విశిష్టము= గొప్పది,

తాత్పర్యం: దేవతలు, ఋషులు అన్నాన్ని పొగడుతున్నారు. లోకయాత్రలో యజ్ఞయాగాదులు మిగిలినవన్నీ అన్నంతోనే ప్రవర్తిస్తున్నాయి. కనుక అన్నంకంటె విశిష్టమైన దేదీ లేదు.

విశేషం: వేదంలో అన్నం పరబ్రహ్మంగా స్తుతించబడింది. గీతలోనూ అన్నంనుండి సకల భూతాలు పుట్టుతున్నాయని చెప్పబడ్డది. "అన్నాద్భవంతి భూతాని' - 3.14. నేటి వేదవేత్తలు అన్నము అంటే పదార్థ జగత్తు= భూదేవి అంటున్నారు.

ఆ. అన్నదాన సదృశ మగు దాన మెందు నె । న్నఁడును లేదు గావునను విధేయ
మన్నదాన మధిక యత్నపూతంబుగాఁ । బూని దానిచేఁత పుణ్యతమము. 370

ప్రతిపదార్థం: అన్నదాన సదృశము= అన్నదానంతో సమానము; అగు= అయిన; దానము; ఎందున్= ఎక్కడా; ఎన్నఁడును= ఎప్పుడు; లేదు; కావునను= కాబట్టి; అన్నదానము; విధేయము= విధిగా చేయదగింది; అధికయత్న= మిక్కిలి ప్రయత్న; పూతంబుగాన్= పవిత్రంగా; పూని= పూనుకొని; దానిచేఁత= అన్నదానం చేయటం; పుణ్యతమము= మిక్కిలిపుణ్యం.

తాత్పర్యం: అన్నదానంతో సమానమైనది లేదు. కనుక అది తప్పక చేయదగింది. ఎక్కువ ప్రయత్నంతో నైనా సరే పవిత్రంగా చేయటం ఎక్కువ పుణ్యమిస్తుంది.

సీ. ప్రాణంబులకు విధారక మన్న మింటి జ । నంబుల కుడిగి యైనను సుభక్తి
నతిథికిఁ బెట్టుట యధిక పుణ్యము శ్రాంతు । వృద్ధుఁ దాపసు బాలు వికలు వనితఁ
గడపఁగా దాఁకలి గదిరి యర్థించిన । గృహమేధి కవమతి గినుక దగదు
కాలంబుతోఁ గుక్క మాలఁడు దుదిగాఁగ । నాఁకొని వచ్చిన ననుగుణముగ

ఆ. నాచరింపవలయు నాహార కల్పన । మునుల దేవ పితృ సముత్క రముల
నన్నదాన విధుల నాదరంబుగఁ బ్రియ । మొందఁ జేఁతఁబోల వొండు విధులు. 371

ప్రతిపదార్థం: ప్రాణంబులకున్= ప్రాణాలకు; విధారకము= చక్కని ధారకము, ధరింపచేసేది; అన్నము; ఇంటి జనంబులకున్= ఇంట్లోని మనుష్యులకు; ఉడిగి ఐననున్= మానుకొనైనా; సుభక్తిన్= మంచిభక్తితో; అతిథికిన్= తిథిలేకవచ్చేవాడికి; పెట్టుట; అధిక= పెద్ద; పుణ్యము= పవిత్రం; శ్రాంతున్= అలసిపోయినవాడిని; వృద్ధున్= ముసలివాడినీ; తాపసున్= తపస్సు చేసికొనేవాడినీ; బాలున్= పసివాడినీ; వికలున్= అంగలోపం కలవాడినీ; వనితన్= స్త్రీనీ; ఆఁకలి కదిరి= ఆకలి వేసి; అర్థించినన్= అర్థిస్తే; కడపన్ కాదు= పెట్టకుండా త్రోసివేయరాదు; గృహమేథికిన్= గృహస్థుకు; అవమతి= అవమానము; కినుక= కోపం; తగదు= యుక్తం కాదు; ఆఁ కొనివచ్చినన్= ఆకలితో వస్తే; కాలంబుతోన్= సకాలంలో; కుక్క; మాలఁడు; తుదిగాగన్= చివరకాగా; అనుగుణముగన్= తగినట్లుగా; ఆహారకల్పన= భోజన సదుపాయం; ఆచరింప వలయున్= సమకూర్చాలి; మునులన్= ఋషులను; దేవ= దేవతలను; పితృసముత్కరములన్= పితృదేవతా సమూహాన్ని; ఆదరంబుగన్= భక్తితో; అన్నదాన విధులన్= అన్నం పెట్టటంతో; ప్రియము= సంతోషం; ఒందన్= పొందేటట్లు; చేఁతన్= చేయటాన్ని; ఒండు= మరొక; విధులు= కర్మలు; పోలవు= సరికావు, సాటికావు.

తాత్పర్యం: అన్నం ప్రాణధారకం కనుక ఇంట్లో వాళ్ళకు మానుకొనైనా అతిథులకు పెట్టటం పుణ్యం. అందులోనూ అలసినవాడు, స్త్రీ, బాలుడు, అంగవైకల్యం కలవాడు, ముసలి, తాపసి అయినవారి నసలే కాదనకూడదు. ఆకలితో వచ్చిన కుక్కను, మాలవాడిని గృహస్థు అన్నదానంతో తగినట్లు ఆదరించాలి. అవమానించడం, కోపగించడం కూడదు. మునులు, పితృదేవతలు, దేవతలు - వీరిని అన్నదానంతో సంతోషపెట్టటం శ్రేష్ఠకర్మ.

విశేషం: ధారకమన్నమాటను మన మీనాటికీ ఇట్లాగే వాడుతున్నాము. "ధారకమేమీ లోపలకు పోవటంలేదు" రోగిని చూచి అనేమాట ధారకమంటే; ప్రాణాన్ని నిలబెట్టేది.

కుక్క, మాలడు - "శుని చైవశ్వపాకేచ పండితాస్సమదర్శినః" అని గీత. పండితులంటే ఉత్తములతో పాటు, కుక్కనూ, మాలనూ, సమానంగా చూచేవాడని అర్థం.

క. కులమును, విద్యయు, వృత్తము । నలఘుమతీ! యన్న మిడుటకై యడుగంగా
వలవదు; విప్రుని నాదర । మలరంగా నిడుట లెస్స యడిగిన మాత్రన్.' 372

ప్రతిపదార్థం: అలఘుమతీ!= గొప్ప మనసు కలవాడా!; కులమున్= ఉత్తమకులం; విద్యయున్= చదువూ (సంస్కారాన్ని పెంచేది); వృత్తమున్= నడవడిక; అన్నమున్; ఇడుటకై= పెట్టటానికి; అడుగంగాన్ వలవదు= అడగకూడదు; ఆదరము= ఆదరణ; అలరంగాన్= వికసించగా; విప్రునిన్= బ్రాహ్మణుడికి; అన్నము; అడిగిన మాత్రన్= అడిగినంత మాత్రంతోనే; ఇడుట= పెట్టటం; లెస్స= గొప్ప.

తాత్పర్యం: పెద్దమనసు కలవాడా! అన్నం పెట్టటానికి కులము, విద్యా, నడవడిక అడగరాదు. బ్రాహ్మణుడు అన్నం కావాలంటే చాలు. ఆదరపూర్వకంగా పెట్టాలి.'

విశేషం: అలఘుమతీ!= సంబోధన గీతలోని పండితశబ్దాన్ని తాకేది; సమదర్శనం కలవాడని భావం.

వ. అని వెండియు. 373

తాత్పర్యం: అని ఇంకా.

తే. అజుఁడు కల్పాదియం దన్న మమృత మనియె । నన్న హాని బలాధికు నైన దుర్బ
లాత్ముఁగాఁ జేయుఁ, గావున నన్న భుక్తి । సకలధాతు వృద్ధికినయి జనము గోరు.' 374

ప్రతిపదార్థం: అజుఁడు= జన్మలేనివాడు (మనిషివలె పుట్టేవాడు కాడు) బ్రహ్మ; కల్ప+ఆది+అందున్= సృష్టికి మొదలునందు; అన్నము; అమృతము= మృతిలేనిది; అనియెన్; అన్నహాని= అన్నంలేకపోవటం; బల+అధికున్= అధికబలం కలవాడిని; ఐనన్=అయినా; దుర్బల+ఆత్ముఁగాన్= బలహీనుడిగా; చేయున్= చేస్తుంది; కావునన్= కాబట్టి; అన్నభుక్తి= అన్నం తినటం; సకలధాతు= అన్ని ధాతువుల; వృద్ధికిన్+అయి= పెరుగుదల కొరకు; జనము= ప్రజ; కోరున్= కోరుకొంటుంది.

తాత్పర్యం: సృష్టి ప్రారంభంలో బ్రహ్మ అన్నం అమృతమని చెప్పాడు. కనుకనే అన్నంలేనివా డెంత బలంకలవా డయినా బలహీను డౌతున్నాడు. ఎందుకంటే అన్నం సప్తధాతువులను పోషిస్తుంది కనుక.'

విశేషం: అమృతశబ్దం వేదంలో పరబ్రహ్మ అన్న అర్థంలో ఉన్నది. లోకం మృత్యువనీ, తత్త్వం అమృతమనీ చెప్పబడింది. కనుకనే అన్నం తినకపోతే ఎంత బలం కలవాడయినా బలహీనపడుతున్నాడు. శరీరం సప్త ధాతువులతో నిర్మితమైనది. వస, నెత్తురు, మాంసం, మేదస్సు, ఎముక, మజ్జ, వీర్యం - అనేవి సప్తధాతువులు.

క. అని యతఁడు వల్కె ననియును । విని యన్నము సవినయముగ విప్రాదులకున్
మనుజేశ! యిడుదు నీవును । మన మలరఁగఁబెట్టుమీ సమస్త జనులకున్. 375

ప్రతిపదార్థం: అని; అతఁడు= బ్రహ్మ; పల్కెన్= చెప్పాడు; అనియును విని; సవినయముగన్= వినయంతో; విప్ర+ఆదులకున్= బ్రాహ్మణులు మొదలైనవారికి; అన్నమున్; మనుజ+ఈశ= రాజా!; ఇడుదు= పెడుతున్నావు; నీవునున్= నీవు కూడా; ఇడుదు= పెడుతున్నావు; సమస్తజనులకున్= మనుషులందరకూ; మనము= మనస్సు; అలరఁగన్= సంతోషంతో వికసించేటట్లు; పెట్టుమీ!= పెట్టవయ్యా!

తాత్పర్యం: అని నారదుడు చెప్పిన మాట విని నీవున్నూ ధర్మరాజా! బ్రాహ్మణులు మొదలైనవారికి అన్నం సవినయంగా పెట్టుతున్నావు. కాని, అందరికీ అట్లాగే పెట్టుము.

ఆ. అన్న మిడిన మణిమయావాసశయ్యాస । నములు నమృత భోజనంబు హృద్య
మాల్య లేపనములు మహనీయ మహిళాను । భవముఁ జిరతనొందు దివమునందు.' 376

ప్రతిపదార్థం: అన్నము; ఇడినన్= పెట్టితే; మణిమయ+ఆవాస= మణులతో చేసిన సౌధం; శయ్యా= మణులతో చేసిన మంచం; ఆసనములు= సింహాసనములు; అమృతభోజనంబు= అమృతంతో సమానమైన అన్నం; హృద్య= మదికింపైన; మాల్య= పూలదండలు; లేపనములు= గంధం మొదలైన పూతలు; మహనీయ= మహత్తర; మహిళా+అనుభవమున్= స్త్రీలతో పొందే అనుభవం; దివము నందున్= స్వర్గంలో; చిరతన్= చిరకాలం; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: అన్నదానం వలన స్వర్గసుఖాలు లభిస్తాయి. అవెట్లా ఉంటాయి? అంటే - మణిసౌధాలలో నివసించటం, రత్నాల మంచాలపై శయనించటం, రత్నాల సింహాసనాలపై కూర్చొనటం, మదికింపైన పూలదండలతో, గంధం పూతలతో మహత్తరమైన అప్సరసలను అనుభవించటం - ఇవి చిరకాలం లభిస్తాయి.'

విశేషం: ఈ ఫలాలు శ్రోత కాసక్తి కలిగించే లౌకిక సుఖాలు లేదా స్వర్గసుఖాలు. ఇది పురాణకథా పద్ధతి.

నక్షత్రదాన మహిమాతిశయ నిరూపణము (సం.13-63-1)

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'నక్షత్ర విషయంబులైన దానంబుల తెఱంగెఱింగింపవే' యనుటయు 'నిట్లు దేవకీదేవి యడుగ నన్నారీరత్నంబునకు నారదుండు సెప్పిన వాక్యంబుల యర్థంబు లుపన్యసించెద నాకర్ణింపుము.'377

ప్రతిపదార్థం: అనినన్; విని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నక్షత్ర విషయంబులు+ఐన= నక్షత్రం దృష్టిగా గల; దానంబుల= దానాల; తెఱంగు+ఎఱింగింపవే= విధానం తెలియజేయవే; అనుటయున్= అనగా; ఇట్లు; దేవకీదేవి; అడుగన్; ఆ+ నారీరత్నంబునకున్= స్త్రీరత్నానికి, - మహాత్మురాలైన స్త్రీకి; (ఎందుకంటే శ్రీకృష్ణుడికి కన్నతల్లి కనుక); నారదుండు; చెప్పిన= విశదీకరించిన; వాక్యంబుల+అర్థంబులు= మాటల తాత్పర్యం; ఉపన్యసించెదన్= వినిపిస్తాను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: యుధిష్ఠిరు డన్నాడు భీష్ముడితో 'ఏ నక్షత్రంలో ఏ దానం చేస్తే పుణ్యమో చెప్పుము' అని. భీష్ము డన్నాడు 'దేవకీదేవి ఇట్లాగే అడిగితే నారదమహర్షి వివరించిన తాత్పర్యం చెప్పుతాను వినుము.

విశేషం: నారదుడు - ప్రతికథలో వస్తాడు. చివరకు మొన్న మొన్నటి త్యాగరాజస్వామికి సంగీత గ్రంథాన్నిచ్చి ప్రేరణ కలిగించినాడు కదా! దీని కర్థమేమిటి? అంటే నారదుడు దివ్యజ్ఞానాన్ని ఇచ్చేవాడు అని అర్థం. అజ్ఞానం ప్రతిమనిషిలోనూ ఉంటుంది. నిద్రపోయేదాన్ని కొందరు మేల్కొలుపుకొంటే కొందరు నిద్రపోతారు. ఆ జ్ఞానవృద్ధుడు తెల్లనివాడు, వీణవాయించేవాడు. వీణ- నాదమాధుర్య సంకేతం - యోగభాషలో వెన్నుపాము. దానిలో నిద్రించే శక్తి యోగాభ్యాసంతో మేల్కొల్పబడగలిగితే ఆ శక్తి నిద్రలేస్తూ చేసే నాదమాధుర్యం వీణ. కనుక నారదుడికి చావు, పుట్టుకలు లేవు. నీలో ఉన్న జ్ఞానాని కతడు సంకేతం.

ప్రతిచోట యుధిష్ఠురుడనే కవి వాడటం గమనించాం. రెండు రకాల యుద్ధాలున్నట్లు భారతమే చెప్పింది.

1. రాజులు చేసేది, ఇక్కడ శత్రువు బైటివాడు.

2. తనపై తాను చేసికొనేది. ఇక్కడ శత్రువులు - కామ, క్రోధాదులు. తనకు శత్రువు తానే. ఇది అంతర్యుద్ధం. అది మిథ్యాయుద్ధమట. ఇవి తథ్య యుద్ధములు. తిక్కనగారన్న మాటలే. మొదటిది స్త్రీపర్వంలో ముగిసి రెండవది శాంతిపర్వంతో ఆరంభమైనది. దీనిలోనూ జయం సాధించినవాడే ధర్మచక్రవర్తి అని భారతీయ రాజధర్మం చెప్పుతున్నది. యుదిష్ఠిరు డంటే ఈ అంతర్యుద్ధంలో ఉన్న వీరుడని తాత్పర్యం.

సీ. కార్తెఁ బాయస మబ్జగర్భునితార మా । షములు మాంసమ్ము నంజంగఁ గలుగు
నన్నంబు శశితారయందు గోవార్ద్ర న । దితి తారఁ బులగంబు దీపుగలయు
నట్టులు గురుతార నధిప ! సువర్ణమా । శ్లేష రూప్యము మఖఁ జెల్లు నుప్పు
తిలలు భగుం డధిదేవత యగు తారఁ । జెఱకుఁ దేనియ నుపాసిక్త మైన

తే. భక్త ముత్తరఫల్గునిఁ బాలతోడ । పౌష్టికాన్నంబు రవితార సకరిరథము
చిత్తనాఁడు శ్రీగంధపుఁ జెక్క స్వాతిఁ । దనకుఁ బ్రియమైన యది మేలు దానమునకు. 378

ప్రతిపదార్థం: కార్తెన్= కార్తెలో - కృత్తికా నక్షత్రంలో; పాయసము= పాలతో చేసిన అన్నం, క్షీరాన్నం; అబ్జగర్భునితారన్= బ్రహ్మఅధిదేవతగల నక్షత్రంలో; మాషములు= మినుములు; శశితారయందున్= చంద్ర నక్షత్రంలో; మాంసమ్ము; నంజంగన్+ కలుగు అన్నంబు= నంజుకొనటానికి వీలైన అన్నం; ఆర్ద్రన్= ఆర్ద్రా నక్షత్రంలో; గోవు; అదితితారన్= అదితి నక్షత్రంలో; తీపుగలయునట్టులు= తీపికలిసేవిధమైన; పులగంబు= పులగం అన్నం; అధిప!= రాజా!; గురుతారన్= బృహస్పతి నక్షత్రంలో; సువర్ణము= బంగారం; ఆశ్లేషన్= ఆశ్లేష నక్షత్రంలో; రూప్యము= వెండి; ఉప్పు; తిలలున్= నువ్వులు; మఖన్= మఖా నక్షత్రంలో; చెల్లున్= తగును; భగుండు= సూర్యుడు; అధి దేవతయగు తారన్= అధిదేవతగా కల నక్షత్రంలో; చెఱకుఁ దేనియ= చెఱకు రసం (లేదా చెఱకురసం తేనెతో కలిపి); ఉపాసిక్తము= చక్కగా తడిసిన; భక్తము= అన్నం; ఉత్తర ఫల్గునిన్= ఉత్తర ఫల్గునీ నక్షత్రంలో; పాలతోడన్; పౌష్టికాన్నంబు; రవితారన్= సూర్యదేవతా నక్షత్రంలో, స+కరి+రథము= ఏనుగుతోపాటుగా రథం; చిత్తనాఁడు= చిత్తా నక్షత్రంలో; శ్రీగంధపుఁజెక్క= మంచి గంధంచెక్క; స్వాతిన్= స్వాతిలో; తనకున్; ప్రియమైనఅది= ఏది ఇష్టమో అదీ; దానమునకున్; మేలు= మంచిది.

తాత్పర్యం: కార్తెలో పాయసం, బ్రహ్మఅధిదేవతగాకల నక్షత్రంలో మినుములు, చంద్రతారలో మాంసాన్నం, ఆర్ద్రలో ఆవూ, అదితిలో తీయని పులగం; బృహస్పతి నక్షత్రంలో బంగారం, ఆశ్లేషలో వెండి, మఖలో ఉప్పు, నువ్వులు, భగునితారలో చెఱకు రసంతో నిండిన అన్నం, ఉత్తర ఫల్గునిలో పాలతో వండిన పౌష్టికాన్నం; సూర్య నక్షత్రంలో ఏనుగూ,రథం, చిత్తలో మంచి గంధపు చెక్క; స్వాతిలో తనకిష్టమైన దేదో అది దానానికి మంచిది.

విశేషం: ఈ పద్యంలో ఉన్న నక్షత్రాలను ఈక్రింది విధంగా గుర్తించాలి.

అబ్జగర్భునితార	- (అభిజిత్తు లేదా) రోహిణి
శశితార	- మృగశిర
అదితితార	- పునర్వసు
గురుతార	- పుష్యమి.
భగుండధిదేవత అగుతార	- హస్త

సీ. **అనఘ! విశాఖ నె ద్దనురాధఁ బైచీర । విను జ్యేష్ఠఁ దగఁ గటివేము గూర్చి**
ముల్లంగి మూల సన్మూలఫలంబుఁ బూ । ర్వాషాఢఁ బెరు వుత్తరాఖ్య యైన
యాషాడ మాక్షికార్ద్రాన్నంబు హరివసు । జలతారకములఁ గంబళము గుజ్జు
లమరిన బండియు యవలుఁ బూర్వోత్తరా । భాద్ర పౌష్ణాశ్వినీ భరణులందుఁ.

తే. **గ్రొవ్వుగల మేక నంజుడు గొఱియ యెఱచి । కంచుకుండతో మొద వశ్వకలిత శకట**
మతుల తిలధేను లీఁ బాడి; యఖిలతార । కముల నీగులు నూర్ధ్వలోకములఁ జేయు.' **379**

ప్రతిపదార్థం: అనఘ! విను; విశాఖన్= విశాఖలో; ఎద్దు; అనురాధన్= ఆ నక్షత్రంలో; పై చీర= పైన వేసికొనే పంచె; జ్యేష్ఠన్= జ్యేష్ఠలో; తగన్= ఒప్పిదముగా; కటివేము= కరివేప; కూర్చి= చేసిన, ముల్లంగి; మూలన్= మూలానక్షత్రంలో; సన్మూల= మంచివేరు; ఫలంబు= పండు; పూర్వాషాఢన్= పూర్వాషాఢలో; పెరువు= పెరుగు; ఉత్తర+ఆఖ్య= ఉత్తర పేరుగల; ఆషాఢన్= ఆషాఢలో; ఉత్తరాషాఢలో; మాక్షిక= తేనెతో; ఆర్ద్ర= తడిసిన; అన్నంబు; హరి= విష్ణు; వసు= అష్టవసువులు; జల= నీరు - ఈ మూడు దేవతలుగాగల; తారకములన్= నక్షత్రాలలో వరుసగా; కంబళము= గొర్రె ఉన్నితో నేసిన దుప్పటి (- విష్ణు నక్షత్రంలో;) గుజ్జులు= వసికొయ్యలు; అమరిన= ఏర్పాటైన; బండియున్; (వసు నక్షత్రంలో;) యవలున్= ధాన్య విశేషం (జలతారకలో); పూర్వ+ఉత్తరా భాద్రన్; పౌష్ణ అశ్వినీ, భరణులందున్= ఈ నక్షత్రాలలో వరుసగా; క్రొవ్వుగల మేక నంజుడు= కొవ్వు పట్టిన మేక మాంసం (పూర్వాభాద్రలో దానంచేయాలి); గొఱియయెఱచి= గొర్రెమాంసం (ఉత్తరాభాద్రలో); కంచుకుండతోన్= పూర్వాభాద్ర ఉత్తరాభాద్రలలో మట్టికుండ కాకుండా కంచుతో చేసిన కుండతోపాటుగా; మొదవు= ఆవు (పౌష్ణంలో); అశ్వకలిత= గుర్రంతో కూడిన; శకటము= బండి (అశ్వినిలో); అతులితిలధేనులు= సాటిలేని నువ్వులు; ఆవులు (భరణిలో); ఈన్= ఇవ్వటం; పాడి= న్యాయం; అఖిల= సమస్త; తారకములన్= నక్షత్రాలలో; ఈగులు= దానాలు; ఊర్ధ్వ లోకములన్= పైలోకాలను; చేయున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: పుణ్యాత్ముడా! విశాఖలో ఎద్దును, అనూరాధలో ఉత్తరీయం, పై కండువా, జ్యేష్ఠలో కరివేపాకుతో కూడిన ముల్లంగి, మూలానక్షత్రంలో మంచి వేరుగల పండు, పూర్వాషాఢలో పెరుగు, ఉత్తరాషాఢలో తేనెతో తడిసిన అన్నం, శ్రవణంలో కంబళి, ధనిష్ఠలో వసికొయ్యలుగల బండి, శతభిషంలో యవలు, పూర్వాభాద్రలో క్రొవ్విన మేకనంజుడు,

ఉత్తరాభాద్రలో గొర్రెమాంసం, రేవతిలో కంచుకుండతో ఆవు, అశ్వినిలో గుర్రపుబండి, భరణిలో మేలైన నువ్వులు, ఆవులు దానం చేయటం మేలు. అన్ని నక్షత్రదానాలూ సద్గతులను కలిగిస్తాయి.'

వ. అని యెఱింగించి యమ్మానవపతితో నమ్మాననీయుండిట్లనియె. 380

ప్రతిపదార్థం: అని; ఎఱింగించి= తెలిపి; ఆ+మానవపతితోన్= ఆ రాజుతో; ఆ+మాననీయుండు= గౌరవించదగినవాడు;

తాత్పర్యం: అని తెలిసి రాజుతో ఆ మాననీయుడు ఈ విధంగా ప్రసంగం కొనసాగించాడు.

క. 'అలఘుతర సకల కామ్యం । బుల నిచ్చినయట్టి మహిత పుణ్యంబై తా
వెలుఁగుఁ గనక మిచ్చుట యని । పలికెం గర్మజ్ఞుఁ డత్రి పరహితచరితా! 381

ప్రతిపదార్థం: పరహిత= ఇతరుల మేలు కోరే; చరితా!= నడవడి కలవాడా!; అలఘుతర= మిక్కిలి గొప్ప; సకల= సమస్త; కామ్యంబులను= కోరికలను; ఇచ్చినఅట్టి= ఇచ్చునట్టి, ఇవ్వగల; మహిత= మహత్తర; పుణ్యంబు+ఐ= పుణ్యాంకలదై; తాన్; వెలుఁగున్= ప్రకాశిస్తుంది; కనకము= బంగారం; ఇచ్చుట= ఇవ్వటం; అని; కర్మజ్ఞుఁడు= వేద కర్మలు (దాన విధులు) తెలిసిన; అత్రి= అత్రిమహాముని; పలికెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇతరుల మేలుకొరకు జీవించేవాడా! చాలా గొప్పకోరికలను తీర్చగలిగేదీ, పుణ్యమైనదీ, బంగారు దానమని అత్రి మహర్షి చెప్పాడు.

తే. కనక మాయుఃప్రదంబు, పావనము, భావ । శుద్ధి నొనరించు దాతకు; సువ్రతమున
వేడ్కతో దాని నిచ్చుట వేఱ పొగడ । నేల? యనియె హరిశ్చంద్రుఁ డిద్ధతేజ! 382

ప్రతిపదార్థం: ఇద్ధ= ప్రకాశించే; తేజ!= క్షాత్ర తేజస్సు కలవాడా!; దాతకున్= దానం చేసినవాడికి; కనకము= బంగారం; ఆయుఃప్రదంబు= ఆయుస్సు నిచ్చేది; పావనము= పవిత్రం; భావశుద్ధిన్= చిత్త నైర్మల్యాన్ని; ఒనరించున్= కలిగిస్తుంది; హరిశ్చంద్రుఁడు; సువ్రతమునన్= మంచి వ్రతంలో; వేడ్కతోన్= వేడుకతో; దానిన్= బంగారం; ఇచ్చుట; వేఱ= వేరే; పొగడన్ ఏల= ఎందుకు ప్రశంసించాలి; (అని) అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ప్రకాశించు తేజస్సు కలవాడా! హరిశ్చంద్రు డిట్లా అన్నాడు. 'బంగారం దాతకు ఆయుస్సు నిస్తుంది. మనస్సును నిష్కల్మషం చేస్తుంది. ఏదైన మంచివ్రతం చేసే సమయంలో దానిని ఇవ్వటం చాలా మంచిదని వేరే చెప్పటం దేనికి?'

క. పానీయదాన ముత్తమ । దానం బని యఖిల ధర్మతత్త్వ దృఢ పరి
జ్ఞానానూనుం డగు మను । మానవపతి సెప్పె నృపసమాజ వరేణ్యా! 383

ప్రతిపదార్థం: నృప సమాజ= రాజసమూహంలో; వరేణ్యా!= గొప్పవాడా!; అఖిల= సమస్త; ధర్మతత్త్వ= ధర్మరహస్య; దృఢ= గట్టి; పరిజ్ఞాన= చక్కని జ్ఞానంతో; అనూనుండు= గొప్పవాడు; అగు= ఐన; మను మానవపతి= మనువన్న రాజు (మానవులకు పాలకుడు); పానీయదానము= త్రాగదగినది, దానంచేయుట; ఉత్తమ= గొప్ప; దానంబు; అని చెప్పెన్= అన్నాడు.

తాత్పర్యం: ఓయీ! రాజశ్రేష్ఠుడా! సకలమానవ లోకానికి ఆద్యుడైన మనువు సమస్త ధర్మ రహస్యాలను గట్టిగా తెలిసిన గొప్పవాడు. ఆయన అన్నాడు - 'త్రాగటానికి చేసేదానం ఉత్తమదాన'మని.

విశేషం: మను శబ్దంనుండి మానవ శబ్ద మేర్పడింది. - ఆంగ్లంలో మాన్ కూడా ఇదే. సకల మానవులకు ఆద్యుడైనవాడు మనువు. మానవజాతి కాయన మూలపురుషుడు. ఆయన వ్రాసిందే మనుస్మృతి. వేల సంవత్సరాలుగా ఈ దేశంలో సకల ధర్మాల కదే ప్రమాణం. అది జర్మన్ భాషలోనికి అనువదించబడింది.

క. కావునఁ జెఱువులు నూతులు । బావులుఁ గొలఁకులును నెపుడుఁ బౌరవవర్యా!
కావింపవలయు; నవి గడుఁ । బావనములు పుణ్యలోక భాగిత నిచ్చున్. 384

ప్రతిపదార్థం: పౌరవవర్యా!= పురువంశంలో శ్రేష్ఠుడా!; కావునన్= కాబట్టి; చెఱువులు; నూతులున్= చేదుడుబావులు; బావులున్= రాతి కట్టడంగల దిగుడుబావులు; కొలఁకులునున్= కోనేళ్లు; ఎపుడున్= ఎల్లప్పుడు; కావింపవలయున్= నిర్మించాలి; అవి; కడున్= మిక్కిలి; పావనములు= పవిత్రాలు; పుణ్యలోక= స్వర్గలోకంలో; భాగితన్ ఇచ్చున్= నివసించే అర్హతనిస్తాయి.

తాత్పర్యం: చెరువులు, కొలనులు, నూతులు, బావులు త్రవ్వించటం మంచిపని. స్వర్గలోక నివాసాన్ని కలిగించే ఈ పనులు దానకర్మలలో పవిత్రమైనవి.

విశేషం: నూయి= ఇది చిన్న నీటి చెలమగుంట. బావి= పెద్ద నుయ్యి, (వాపీ సంస్కృతం, బావి వెలుగు); కొలను= చిన్న నీటి గుంట; చెఱువు= పెద్ద కొలను; కొలను (ఏకవచనం) - కొలకులు, (బహువచనం.)

సప్త సంతానాలలో చెరువులు, బావులు త్రవ్వించటం ఒకటి. నేటికీ రాయలసీమవంటి ప్రాంతాలలో పూర్వపు రాజులు త్రవ్వించిన చెరువులే వీటి కాధారం. నడక ప్రయాణంగాకల రోజులలో అట్లాగే బండ్లపై పోయే రోజులలో దారి ప్రక్క చెట్టు, బావి ఏర్పాటు చేయటం గొప్ప పుణ్య కర్మగా భావించబడేది. ఎండన పడి వచ్చిన బాటసారి, బండి, ఎడ్లు, నీళ్ళుత్రాగి, సేదదీరి పోయేవి. ఒక మనిషికి, జంతువుకు, పిట్టకు, నీరు పోయటం కంటె గొప్ప మానవ సేవ ఏముంటుంది? ఈ నాటికీ ఇది మనం నేర్చుకొనదగిందే కదా! పట్టణాలలో కొళాయిలు వచ్చాక బాటసారికి నీరిచ్చేవారికి కరువైన దంటే ఆ దుస్థితి నేమనాలి. మనకంటె నాటి మానవుడు మానవధర్మవేత్త అనటాని కిదే సాక్ష్యం కదా!

క. అనఘా! యెవ్వని కావిం । చిన సలిలాశయమునందుఁ జెలఁగుచు గోవుల్
గొను నీ రాతని వంశం । బున కవి గావించు నూర్ధ్వ భువన ప్రాప్తిన్. 385

ప్రతిపదార్థం: అనఘా= పుణ్యాత్ముడా!; ఎవ్వని= ఎవడియొక్క; కావించిన= నిర్మించిన; సలిల+ఆశయము+అందున్= నీటి నిలయం, చెరువులు మొదలగువాటియందు; గోవుల్= ఆవులు; చెలఁగున్= ఆటలాడుతూ; నీరున్= నీటిని; కొనున్= త్రాగునో, గ్రహిస్తాయో; ఆతని= అతడి యొక్క; వంశంబునకున్= కులానికి; అవి= ఆవులు; ఊర్ధ్వభువన= పైలోకాలయొక్క; ప్రాప్తిన్= పొందుటను; కావించున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: నాయనా! ఎవడు త్రవ్వించిన చెరువులు మొదలైన జలాశయాల్లో ఆవులు కేరింతలుగొడుతూ నీరు త్రాగుతాయో వాడి కులాని కవి స్వర్గాన్నిస్తాయి.

విశేషం: గోలోకమని పద్నాలుగు లోకాలలో ఒకటి. దానికథ హరివంశంలో మనోహరంగా ఉన్నది. గోవు అంటే వెలుగు కిరణం. గోపతి= సూర్యుడు (కృష్ణుడు). చీకటిలోనుండి వెలుగురావటమే సృష్టి. (ప్రళయం చీకటి.) కనుక గోవు అంటే విశ్వం.

(భూమి). సకల చరాచర జీవరాశికీ అది తల్లివంటిది. గోవు అంటే కదిలేది; జగత్తు అన్నా కదిలేదనే అర్థం. కదలిక ప్రాణి లక్షణం. మృత్యు లక్షణం అచేతనత్వం. ఇందుకని మనకు గోవు పూజింపదగింది.

తే. ఆఁకలేక యెవ్వాని జలాశయమున । మండు వేసవి యందును మనుజకోటి
యవభృథస్నాన పానంబు లాచరించు । నతఁడు వొందఁడు వివిధ దుర్గాది గతులు. 386

ప్రతిపదార్థం: ఆఁక లేక= అడ్డం లేకుండా; ఎవ్వాని= ఎవనియొక్క; జల+ఆశయమునన్= నీటికి నిధిఅయిన చెరువులు మొదలగు వాటిలో; మండు వేసవి+అందునున్= మంటలు చెరిగే వేసవిలోనూ; మనుజకోటి= మానవ సమూహం; అవభృథస్నానము= యజ్ఞాంతంలో చేసే మంగళస్నానం; పానంబులు= నీరుత్రాగటం; ఆచరించున్= చేస్తుందో; అతఁడు=ఆ జలాశయం నిర్మించినవాడు; వివిధ= అనేక; దుర్గ+అదిగతులు= దుర్గతులు మొదలైనవి; పొందఁడు.

తాత్పర్యం: ఎవడు త్రవ్వించిన జలాశయాలలో అడ్డం లేకుండా మండు వేసవిలో మానవులు, అవభృథస్నాన పానాలు చేస్తారో ఆ చెరువు త్రవ్వించినవాడు దుర్గతులు పొందడు.

క. యాగాది కర్మముల కుప । యోగింపంబడుటఁజేసి యుత్తమము, ఘృతం
బాగురు వస్తువు నిచ్చుట । యాగములకు నగ్నికిం బ్రియంబై యుండున్. 387

ప్రతిపదార్థం: యాగ= యజ్ఞం; ఆది= మొదలైన; కర్మములకున్= వేదం చెప్పిన కర్మలకు; ఉపయోగింపన్+పడుటన్‌చేసి= ఉపయోగింప బడటం వలన; ఘృతంబు= నేయి; ఉత్తమము= శ్రేష్ఠం; ఆ గురువస్తువున్= ఆ గొప్ప పదార్థమును; ఇచ్చుట= దానం చేయటం; యాగములకున్= యజ్ఞాలకున్నూ; అగ్నికిన్= అగ్నిదేవుడికీ; ప్రియంబు+ఐ= ప్రీతి కలదై; ఉండున్= ఉన్నది.

తాత్పర్యం: ఘృతదానం చాలా శ్రేష్ఠం. అది యాగాదులలో ఉపయోగిస్తుంది. కనుక అట్లాంటి ఘనవస్తువు నివ్వటం వలన యాగాలకూ, అగ్నికీ ప్రీతిపాత్రమౌతున్నది.

తే. గరగ లొసఁగిన నరుఁడు భూసురు లొనర్చు । ఆచమనముఖ కర్మంబులందు షష్ఠ
భాగఫల మొందు నెగడికిఁ బాచనమున । కింధనము లిచ్చి ధనముల నెసక మెసఁగు. 388

ప్రతిపదార్థం: గరగలు= కుండలు; ఒసఁగిన= ఇచ్చిన; నరుఁడు= మనిషి; భూసురులు= భూ దేవతలు (బ్రాహ్మణులు); ఒనర్చు= చేసే; ఆచమన= ఆచమించటం; ముఖ= మొదలైన; కర్మంబులందున్= వేద విధులలో; షష్ఠ= ఆరవ; భాగ= అంశ; ఫలము= ఫలితం; ఒందున్= పొందుతాడు; నెగడికిన్= నెగడునకు; (నెగడు= పెద్దమంట;) పాచనమునకున్= వంటకు; ఇంధనములు= కట్టెలు; ఇచ్చి= దానంచేసి; ధనములన్= డబ్బుతో; ఎసకము+ఎసఁగున్= అతిశయిస్తాడు; తులదూగుతాడు.

తాత్పర్యం: కుండలు దానం చేస్తే బ్రాహ్మణుడు చేసే ఆచమనాది వైదిక విధుల పుణ్యంలో ఆరవభాగం పుణ్యం పొందుతాడు. నెగళ్ళకు, వంటకు కట్టె లిస్తే ధనంతో తులతూగుతాడు.

విశేషం: అతిప్రాచీనమైన పాత్ర కుండ. దానిని చాలా పవిత్రంగా చూడటం ఒక ఆచారమైపోయింది. వివాహాలలో గరగముంత నేటికీ దాంపత్య పూర్ణతకు సాక్షిగా మనకు మిగిలేఉన్నది. అదే ఇక్కడ గరగ.

ఆ. ఛత్ర మిచ్చి కాంచుఁ బుత్త్రులఁ బురుషుండు । సకల కామ్య దానసమము శకట
మిచ్చు టనఘ! చెప్పు లిచ్చినఁ గంటకు । లైన రిపులఁ ద్రొక్కి యతఁడు దిరుగు. 389

ప్రతిపదార్థం: పురుషుండు= మానవుడు; ఛత్రము= గొడుగు; ఇచ్చి; పుత్త్రులన్= కొడుకులను; కాంచున్= పొందుతాడు; శకటమున్= బండిని; ఇచ్చుట= ఇవ్వటం; సకల= అన్ని; కామ్య= కోరికలతో చేసే; దానసమము= దానాలతో సమానం; అనఘ!= పుణ్యాత్ముడా!; చెప్పులు; ఇచ్చినన్= ఇస్తే; కంటకులు= ముండ్లు (విరోధులు); ఐన= అయినటువంటి; రిపులన్= శత్రువులను; త్రొక్కి= కాలరాచి; అతఁడు= దానంచేసినవాడు; తిరుగున్= సంచరిస్తాడు.

తాత్పర్యం: మనిషి గొడుగును దానంచేయటంవలన పుత్రసంతానాన్ని పొందగలడు. బండిని దానం చేయడం అన్ని కోరికలనూ తీర్చే దానంతో సమానం. చెప్పులిస్తే కంటకులైన శత్రువులను అణచి హాయిగా బ్రతుకుతాడు.

విశేషం: కామ్యదానం= స్వర్గాదిసుఖాలను కోరి చేసేదానం. అకామ్యదానం= ఏమీ కోరకుండా చేసేది.

కంటకం= ఇది రాజనీతి శాస్త్రంలోని మాట. రాజుకు అనేకమంది విరోధులు ఉంటారు. ఎవడు విరోధి? ఎవడు కాడు? తెలిసికొనటానికి వీలుగా కౌటిల్యుని అర్థశాస్త్రంలో కంటక శోధనాధ్యాయం వ్రాయబడింది.

ఇక్కడ కంటకం రాజుకు సంబంధించింది కాదు. అయితే రాజుకు చెప్పులు దానం చేయట మేమిటి?

క. తిలలు పితృభోజ్యములుగా । జలజభవుఁడు సేసెఁ బితృనిచయ మలరఁ గడుం
దిల లిచ్చిన శుచు లగుదురు । దొలఁగుం బర్వసురతాది దోషము లెల్లన్. 390

ప్రతిపదార్థం: జలజభవుఁడు= పద్మంలో జన్మించినవాడు, బ్రహ్మ; పితృనిచయము=పితృదేవతల సమూహం; అలరన్= సంతోషించేటట్లు; తిలలు= నువ్వులు; పితృ= పితృదేవతలకు; భోజ్యములుగాన్= తిన దగ్గవిగా; చేసెన్= విధించాడు; కడున్= ఎక్కువ; తిలలు= నువ్వులు; ఇచ్చినన్= ఇస్తే; శుచులు= మలినం (పాపంలేనివారు)); అగుదురు= అవుతారు; పర్వ= పర్వములందలి, (అమావాస్య, పూర్ణిమ); సురత+ఆది= సంభోగం మొదలైన వాటివల్లకలిగే; దోషములు= పాపాలు; ఎల్లన్= అన్ని; తొలఁగున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: పితృదేవతలకు ఆహారంగా నువ్వులను సృష్టించాడు బ్రహ్మ. తిలలిస్తే పితృదేవత లందరూ సంతోషిస్తారు. కనుక తిలలను ఎవడు ఎక్కువ దానం చేస్తాడో వాడు పవిత్రుడవుతాడు. పర్వదినంలో సంభోగం చేసిన పాపాలవంటివి అన్నీ పోతాయి.

విశేషం: ఆ దినాలలో రతి నిషిద్ధ మన్నమాట.

తే. దివ్యముని యగు కాశ్యపు భవ్య గాత్ర । ముల జనించి భవ్యంబు లై తిలలు వెలయు;
నట్లు గావునఁ దత్కృతయజన మఖిల । వస్తు యజనంబుతో సరివచ్చు నండ్రు. 391

ప్రతిపదార్థం: తిలలు= నువ్వులు; దివ్యముని= దేవతల ముని; అగు; కాశ్యపు= కాశ్యపుడి యొక్క; భవ్య= మహత్తుగల; గాత్రములన్= అవయవాలనుండి, శరీరం నుండి; జనించి= పుట్టి; భవ్యంబులు+ఐ= శ్రేష్ఠములై; వెలయున్= ప్రకాశిస్తాయి; అట్లు కావునన్= అందువలన; తత్= వాటితో; కృత= చేసిన; యజనము= యాగం; అఖిల= సమస్త; వస్తు= పదార్థ; యజనంబుతోన్= యజ్ఞంతో; సరివచ్చును= సమానమౌతుంది; అంద్రు= అని పెద్దలంటారు.

తాత్పర్యం: దివ్యముని అయిన కాశ్యపుని శరీరాంగాలనుండి పుట్టాయి కనుక తిలలు శ్రేష్ఠము లయ్యాయి. కనుక వాటితో చేసే యజ్ఞకర్మ సమస్త వస్తువులతో చేసిన యుగకర్మతో సమానం.

క. తిలదాన మఖిల దానం । బుల కంటె విశిష్ట మెల్ల మునులును నియతిం
దిల లర్హములగు పాత్రం । బుల కిచ్చియ కాదె పెంపు వొందిరి వత్సా!' 392

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; తిలదానము= నువ్వులను దానంచేయటం; అఖిల= సమస్త; దానంబులకంటెన్= దానాలకంటె; విశిష్టము= గొప్పది; ఎల్లమునులును= మునులందరూ; నియతిన్= నియమంతో; తిలలు= నువ్వులను; అర్హములగు= యోగ్యులైన; పాత్రంబులకున్= వ్యక్తులకు; ఇచ్చియకాదె= ఇచ్చే కదా; పెంపు= అతిశయాన్ని, గొప్పతనాన్ని; పొందిరి= పొందినారు.

తాత్పర్యం: నాయనా! తిలదానం సర్వశ్రేష్ఠం. ఇందుకే మునులంతా వీటిని అర్హులు, యోగ్యులైనవారికి దానం చేసికదా అంతగొప్ప వా రైనారు.'

విశేషం: మన కనేక క్రతువులలో (వైదిక విధులలో) నువ్వులకు విశిష్ట స్థానం ఉన్నది. ఇది ఈనాటికీ ప్రసిద్ధమే.

వ. 'అని చెప్పి యాపగాతనయుం డొక విశేషంబు వినిపింపవలసి ధర్మజున కిట్లనియె.' 393

ప్రతిపదార్థం: అని చెప్పి; ఆపగా తనయుండు= నది కొడుకు, భీష్ముడు; ఒక; విశేషంబున్= ప్రత్యేక విషయాన్ని; వినిపింప వలసి= తప్పక వినిపించదలంచి; ధర్మజునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు ఒక విశేషాన్ని వినిపించవలసి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. 'దానము లాదిగాఁ గలుగు ధర్మము లెల్లను జేఁతకున్ నిజా
ధీనపుఁ జోటు గావలయు దేవతలున్ మునులుం జతుర్ముఖుం
గానఁగఁ బోయి యజ్ఞముఖ కర్మ సమాచరణార్థ మై తదీ
యానుమతిం దగం బడసి యయ్యయిచోటుల నాచరింపరే. 394

ప్రతిపదార్థం: దానములు; ఆదిగాన్; కలుగు= ఉన్న; ధర్మములు= ధర్మాలు; ఎల్లను= అన్నీ; చేఁతకున్= చేయటానికి; నిజ= తనకు; ఆధీనపు= స్వాధీనమైన; చోటు కావలయున్= తావు కావాలి; దేవతలున్; మునులున్= మునులున్నూ; చతుర్ముఖున్= నాలుగు మొగాలు కల బ్రహ్మను; కానఁగన్= దర్శించగా; పోయి; యజ్ఞముఖ= యాగమూ మొదలైన; కర్మ= కర్మలయొక్క; సమాచరణ+అర్థమై= చక్కగా చేయటం కొరకు; తదీయ= అతడి; అనుమతిన్= సమ్మతిని; తగన్= చక్కగా; పడసి= పొంది; అయ్యయి= ఆయా చోటులన్= స్థలాలలో; ఆచరింపరే= చేయరా?

తాత్పర్యం: దానాది కర్మలు చేయటానికి తనకు లోబడిన చోటు కావాలి. పూర్వం మునులూ, దేవతలూ, బ్రహ్మను దర్శించి యజ్ఞం మొదలైన వేద కర్మలు చేయటానికి ఆయన అనుమతి పొంది ఆయా చోట్ల చేశారు కదా!

క. కాననము గిరులు నదులును । నానా తీర్థములు భూజనంబుల కెల్లన్
భూనుత! సాధారణములు । వానను ధర్మములు సేయవచ్చు నిజేచ్ఛన్. 395

ప్రతిపదార్థం: కాననమున్= అడవీ; గిరులున్= కొండలున్నూ; నదులునున్= నదులూ; నానా= అనేక; తీర్థములున్= తీర్థాలు; భూ= భూమిపై; జనంబులకున్= జనాలకు; ఎల్లన్= అందరకూ; భూనుత!= భూప్రజచేత స్తుతింప దగ్గవాడా!; సాధారణములు= సామాన్యాలు; వాననున్= వాటిలో; నిజ+ఇచ్ఛన్= స్వేచ్ఛతో; ధర్మములు= ధర్మాలు; చేయవచ్చున్= చేయవచ్చును.

తాత్పర్యం: భూమిచేత అంటే రాష్ట్ర ప్రజలచేత పొగడదగ్గవాడా! అడవీ, కొండలూ, నదులూ అనేక తీర్థాలు దానధర్మాలు చేయటానికి యోగ్య స్థలాలు. అక్కడ భూప్రజ లంతా దానం చేయవచ్చును.

విశేషం: తీర్థం= నదీ, క్షేత్రం కలచోటు. పుణ్యక్షేత్రం ప్రక్కనున్న నది తీర్థం.

ఆ. **అధిప! నా మనమునయందుఁ దోఁచినయది । యాచరింపవలయు నర్థమగుటఁ**
జేసి దీని నీకుఁ జెప్పితి గో దాన । శస్తమహిమ వినుము విస్తరింతు. **396**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నా మనమునయందున్= నా మనస్సులో; తోఁచిన అది= స్ఫురించినట్టిది; ఆచరింపన్ వలయు= చేయవలసిన; అర్థము= విషయం; అగుటన్‌చేసి= కావటంవలన; దీనిన్= ఈ విషయం; నీకున్; చెప్పితిన్; గోదాన= గోవులను దానం చేయటంయొక్క; శస్త= ప్రశస్తమైన, నుతింపదగ్గ; మహిమ= మహత్త్వం; విస్తరింతున్= వ్యాఖ్యానిస్తాను; వినుము= ఆలకించుము;

తాత్పర్యం: రాజా! నా మనస్సునకు తోచిన దాన్ని ఆచరించదగ్గ విషయం కావటంవలన నీ కిది చెప్పాను. ఇక గోదాన మహిమను వివరిస్తాను వినుము.

సీ. **గోవు లెక్కుడు తపోభావితాత్ముల కంటె । ననినఁ దద్గౌరవంబునకు మేర**
గలదె? సత్యాఖ్య లోకంబున నవి సోమ । సంగతత్వంబున సంచరించు
వినుత హోమముల కెల్లను బాలుఁ బెరుపు నే । యును నిచ్చుఁ గర్షనంబునకు నొదవుఁ
దోలు శృంగంబులు వాలంబు రోమ చ । యము శకృన్మూత్రము లఖిలవర్త

ఆ. **నముల కుపకరించు; శ్రమము శీతాతప । వ్యథయు లేమి నెపుడు నతిభరంపుఁ**
బనులు సేయు గోవు బ్రాహ్మణుఁ డన నేక । తత్త్వ మగుటఁ బరపదంబుఁ గాంచు. **397**

ప్రతిపదార్థం: తపోభావితాత్ములకంటెన్= తపస్సుద్వారా భావించే ఆత్మలు కలవారికంటే; గోవులు= ఆవులు; ఎక్కుడు= ఎక్కువ; అనినన్= అంటే; తత్= వాటియొక్క; గౌరవంబునకున్= గొప్పతనానికి; మేర= సరిహద్దు; కలదె? =ఉన్నదా? సత్య+ఆఖ్య= సత్యమన్న పేరుగల; లోకంబునన్= లోకంలో; అవి= గోవులు; సోమ= చంద్రుడి; సంగతత్వంబునన్= స్నేహంతో; సంచరించున్= తిరుగుతాయి; వినుత= ప్రశస్త; హోమములకున్+ఎల్లనున్= అన్నిహోమాలకు; పాలున్; పెరువున్= పెరుగు; నేయునున్= నేయీ; ఇచ్చున్= ఇస్తాయి; కర్షనంబునకున్= వ్యవసాయానికి; ఒదవున్= ఉపయోగపడతాయి; తోయిన్= చర్మం; శృంగంబులున్= కొమ్ములూ; వాలంబున్= తోకా; రోమచయమున్= వెంట్రుకల గుంపు; శకృత్= పేడ; మూత్రములున్= మూత్రాలు; అఖిల= సమస్త; వర్తనములకున్= పనులకు; ఉపకరించున్= ఉపయోగిస్తాయి; శ్రమము= శ్రమా; శీత= చలి; ఆతప= ఎండ వీటివల్ల; వ్యథయున్= బాధా; లేమి= లేకపోవటంవలన; ఎపుడున్= ఎల్లప్పుడూ; అతి= మిక్కిలి;

భరంపు= బరువైన; పనులు= కార్యములు; చేయున్; గోవు= ఆవు; బ్రాహ్మణుఁడున్= విప్రుడు; అనన్= అనగా; ఏకతత్త్వము= ఒకే సత్యం; అగుటన్= కావటంవలన; పరమ= గొప్ప; పదంబు= స్థానం; కాంచున్= పొందుతాయి.

తాత్పర్యం: తపస్సుద్వారా భగవంతుడిని భావించే వారికంటె ఆవులు గొప్ప - అని అంటే వాటి గౌరవానికి హద్దేమిటి? చంద్రుడితో కలిసి అవి సత్యలోకంలో సంచరిస్తాయి. హోమాలకు కావలసిన పాలు, పెరుగు, నెయ్యి ఇస్తాయి. ఎద్దులు సేద్యానికి పనికివస్తాయి. వాటి చర్మం, కొమ్ములు, తోకా, వెంద్రుకలు, పేడా, మూత్రం అన్ని పనులకు ఉపకరిస్తాయి. ఎండకూ, చలికీ, బాధపడనివి కావటంవలన బరువైన పనులన్నిటికీ పనికి వస్తాయి. గోవన్నా బ్రాహ్మణుడన్నా ఒకే తత్త్వం కావటంవలన గోదానం చేసినవాడు ముక్తిపొందుతాడు.

క. గోవుల విప్రుల కిచ్చిన । నే విషమపు గతులఁ బొరయ కేరికి నరుగం
గా వశము గానిలోకము । లావాసంబులుగ నిలుతు రతి సుఖవృత్తిన్. 398

ప్రతిపదార్థం: గోవులన్= ఆవులను, విప్రులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చినన్; ఏ విషమపు గతులన్= ఎట్లాంటి చెడ్డస్థితులను; పొరయక= కలుగక, పొందక; ఏరికిన్= ఎవరికీ; అరుగంగాన్= పోవటానికి; వశముకాని=వీలుపడని; లోకములు= పుణ్యలోకాలు; ఆవాసంబులుగన్= నివాసములుకాగా; అతి= మిక్కిలి; సుఖవృత్తిన్= సుఖమయమైన మనస్సుతో; నిలుతురు= ఉంటారు.

తాత్పర్యం: ఆవులను బ్రాహ్మణులకు దానంచేస్తే ఎట్లాంటి సంకటస్థితులు పొందక, ఎవరూ పొందరాని పుణ్యలోకాలలో సుఖంగా ఉండగలరు.

క. గోవుల పాలమృతం బని । దేవేంద్రుఁడు సెప్పెఁ గాన ధీరత్వనిధీ!
గోవు నొసఁగ నమృతము స । ద్భావంబున నిచ్చినట్టి ఫల మొడఁగూడున్. 399

ప్రతిపదార్థం: ధీరత్వనిధీ!= ధైర్యానికి నిలయమైనవాడా; గోవులపాలు= ఆవులపాలు; అమృతంబు= కేవలం అమృతమే అని; దేవేంద్రుఁడు= వేల్పులదొర; చెప్పెన్+కాన= చెప్పారు కనుక; గోవున్; ఒసఁగన్= ఇవ్వటం; అమృతమున్; సద్భావంబునన్= మంచిమనస్సుతో; ఇచ్చినట్టి; ఫలము= ఫలితం; ఒడన్+కూడున్= లభించును.

తాత్పర్యం: ఆవులపాలు అమృతమేనని దేవేంద్రుడు చెప్పాడు కనుక గోవును ఇవ్వటంవలన అమృతాన్ని దానం చేసిన ఫలాన్ని పొందగలడు.

విశేషం: ధీరత్వము= కష్టనష్టాలలో మనస్సు చెదరకుండా జీవించటం, ఆపదల నెదిరించ గలగటం.

తే. అనఘ! గోవులు ప్రాణంబు లని సమస్త । మునులు సెప్పుదు; రట్లు గావునఁ దలంపఁ
బ్రాణదాన విధాన సంప్రాప్త మైన । ఫలము గోదానకర్తకుఁ గలుగుఁ జూవె! 400

ప్రతిపదార్థం: అనఘ!; గోవులు; ప్రాణంబులు= ప్రాణాలు; అని; సమస్త= అందరు; మునులు= ఋషులు; చెప్పుదురు; అట్లుకావునన్= అందువలన; తలంపన్= ఆలోచిస్తే; ప్రాణదానవిధాన= ప్రాణాన్ని దానం చేసేపద్ధతివల్ల; సంప్రాప్తమైన= లభించిన; ఫలము; గోదానకర్తకున్= గోవును దానం చేసినవాడికి; కలుగున్ చూవె!= కలుగును సుమా!

తాత్పర్యం: మునులు 'ఆవులంటే ప్రాణాలు' అని చెప్పుతారు. కనుక ప్రాణదానం చేయడంవల్ల లభించే ఫలం గోదానకర్తకు కలుగుతుందిసుమా!

క. క్రూరునకు నాస్తికునకు దు । రారంభున కిచ్చినం బరమ దుఃఖమునుం
గూరును గో; వది దాతను । నారకిఁ జేయుం; బరీక్షణము గడు వలయున్. 401

ప్రతిపదార్థం: క్రూరునకున్= హింసించేవాడికీ; నాస్తికునకున్= దైవమంటూ ఎవరూ లేరని నమ్మేవానికీ; దుర్+ఆరంభునకున్= దుష్టబుద్ధితో పనులు ప్రారంభించేవాడికీ; ఇచ్చినన్; గోవు; పరమ దుఃఖమునన్= మహా దుఃఖంలో; కూరును= కూరుకొనిపోతుంది; అది= దాని శోకం; దాతనున్= ఇచ్చిన వాడిని; నారకిన్ చేయున్= నరకంలో నివాసిగా చేస్తుంది; పరీక్షణము= పరిశీలన; కడున్= చాలా; వలయున్= కావాలి.

తాత్పర్యం: బాగా పరీక్షించి గోవును దానం చేయాలి. క్రూరుడికీ, నాస్తికుడికీ, చెడ్డపనులు చేసేవాడికీ ఇస్తే గోవు శోకిస్తుంది. ఆ శోకం దాతను నరకలోకంలో పడవేస్తుంది.

ఆ. గొడ్డు బడుగుఁ దెవులు గొంటుఁ గ్రే పెడలిన । దాని నెచ్చటేని నూన మైన
యట్టిదాని నొకట నాయాసపడి యున్న । దాని నీరు గోప్రదానవిదులు. 402

ప్రతిపదార్థం: గొడ్డున్= గొడ్డుబోతు, చూలు కలగనిది; బడుగున్= బక్కచిక్కినది; తెవులుగొంటున్= రోగాలు కలది (గొడ్లకు వచ్చే ఒక రకమైన వ్యాధి, దాటికుట్టు అని కూడా అంటారు); క్రేపు= దూడ; ఎడలిన= పోయిన; దూరమైన; దానిన్(ఒకచూలు తరువాత మరలా చూలు దాల్చనిది); ఎచ్చటన్+ఏనిన్= ఎక్కడైనా; ఊనము= దోషం; ఐన అట్టి దానిన్= కలదానిని; ఒకటన్= ఒకే విధంగా; ఆయాసపడి ఉన్న దానిన్= రొప్పేదానిని; గోప్రదాన విదులు= ఆవులను దానంచేయటం తెలిసినవారు; ఈరు= ఇవ్వరు.

తాత్పర్యం: గొడ్డుబోతుని, తెవులుగొంటును, బక్కచిక్కినదానిని ఎక్కడైనా సరే చెడ్డసుడి ఉన్న దానిని, ఒకేరీతిగా రొప్పు రోగం గల దానిని గోదానవిధి తెలిసినవా రివ్వరు.

విశేషం: దానం చేయుట మంటే పనికిరాని దాని నివ్వట మనుకొనవచ్చును కనుక ఈ పద్యం చెప్పబడింది. కఠోపనిషత్తులో తండ్రి ఇట్లాంటి ఆవులనే దానంచేస్తుంటే కొడుకు నచికేతుడు చూచి బాధపడ్డాడని కథ ఉన్నది. అది దానం కాదు - అని చెప్పటం ప్రధానం.

క. విను పుణ్యలోకముల కా । వనఘా! విప్రులకు గోచయంబులఁ బెక్కి
చ్చిన నవి దాతకు మోక్షం । బును జేయఁగఁ జాలు నండ్రు పూర్వాచార్యుల్.' 403

ప్రతిపదార్థం: విను; అనఘా!; విప్రులకున్= బ్రాహ్మణులకు; గోచయంబులన్= ఆవుల మందలను; పెక్కు= ఎక్కువ; ఇచ్చినన్; అవి; దాతకున్= ఇచ్చినవాడికి; పుణ్యలోకములు+అ= పుణ్యలోకాలే; కావు= కావు; మోక్షంబునున్= మోక్షాన్ని; చేయఁగన్ చాలును= కలిగించగలవు అని; పూర్వ= ముందరి; ఆచార్యుల్= గురువులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: "అనఘా! వినుము బ్రాహ్మణులకు గోవుల గుంపులను ఎక్కువగా దానం చేస్తే ఆ గోవులు పుణ్యలోకాలనే కాదు మోక్షాన్నికూడ కలిగించ కలవని పూర్వాచార్యులు అన్నారు.

వ. 'అని చెప్పి గాంగేయుం డన్న పానీయ దానఫలాతిశయంబులు వెండియు వినిపింప వేడ్కసేసి యవ్విభుని కిట్లనియె' 404

ప్రతిపదార్థం: అని చెప్పి; గాంగేయుండు= గంగకొడుకు భీష్ముడు; అన్న= అన్నం; పానీయ= త్రాగేవి; దానఫల+అతిశయంబులు= దానంచేయటం వల్ల కలిగే గొప్పఫలితాలు; వెండియున్= ఇంకా; వినిపింపన్= వినిపించాలని; వేడ్క+చేసి= వేడుకపడి; ఆ+విభునకున్= ఆ రాజుతో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: ఇట్లా వివరించి భీష్ముడు అన్నపానీయ దానాల గొప్పతనం చెప్పాలని ముచ్చటపడి ధర్మరాజుతో అన్నాడు;

సీ. 'అధిప! యింకను విను మన్నంబు జలమును । నిచ్చుట యీవుల కెల్ల నెక్కు
డగుట నేఁ జెప్పెద నమృత సుధాస్వధా । నామముల్ సురలందు నాగకులము
నందును బితృకోటియందును వర్తిల్లు । నన్నంబునకు నోలినట్లుఁ గాక
యది ప్రాణ మండ్రు మహాత్ములు గావున । దానిఁ బెట్టుట ప్రాణదాన సమము;

తే. విను విశేషించి తత్పాకమునకు జల ము । పాశ్రయము చంద్రునకుఁ బుట్టఁ బట్టునయ్యె
జలము చంద్రుండు గాఁడె యోషధులఁ బ్రోచుఁ । గాన యుత్తమ మన్నంబు కంటె జలము.' 405

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇంకను= ఇంకా; వినుము; అన్నంబు; జలమునున్= నీటిని; ఇచ్చుట; ఈవులకున్+ఎల్లన్= అన్ని దానాలకంటె; ఎక్కుడు= ఎక్కువ; అగుటన్=అయినందువలన; నేన్= నేను; చెప్పెదన్= చెపుతాను; అమృత= అమృతమనునట్టి; సుధా= సుధా అనేటి; స్వధా= స్వధా అనేటి; నామముల్= పేర్లు; (క్రమంగా) సురలందున్= దేవతలలో; నాగకులమునందున్= సర్పజాతిలోను (పాతాళలోకంలో ఉండేది నాగులు; స్వర్గలోకంలో ఉండేది దేవతలు; పితృకోటియందునున్= పితృదేవతల సమూహంలో; వర్తిల్లున్= ప్రవర్తిస్తాయి; అన్నంబునకున్= అన్నానికి; ఓలిన్= క్రమంగా (అన్నాన్ని దేవలోకంలో అమృతమనీ, పాతాళంలో సుధ అనీ, పితృలోకంలో స్వధ అనీ అంటారు); అట్లున్‌కాక= అంతేకాక; అది; ప్రాణము= ప్రాణశక్తి; అని; మహాత్ములు; అండ్రు= అంటారు; కావునన్; దానినీ; పెట్టుట= అన్నం పెట్టటం; ప్రాణదానసమము= ప్రాణం దానంచేయటంతో సమానం; విను= వినుము; విశేషించి= మీదు మిక్కిలి; తత్+పాకమునకున్= అన్నంవండుటకు; జలము= నీరు; ఉప+ఆశ్రయంబు= ఉనికిపట్టు; చంద్రునకున్= చంద్రుడికి; పుట్టన్= జన్మించుటకు; జలము= నీరు; పట్టున్= స్థానంకూడా; అయ్యెన్= అయినది చంద్రుండుకాఁడె= చంద్రుడే కదా; ఓషధులన్= మొక్కలను; ప్రోచున్= రక్షిస్తాడు; కాన= కనుక; అన్నంబుకంటెన్; జలము= నీరు; ఉత్తమము= శ్రేష్ఠం.

తాత్పర్యం: 'రాజా! ఇంకా చెప్పుతాను వినుము. అన్నదానం అన్నిటికంటె చాలా గొప్పది. అన్నాన్ని స్వర్గలోకంలో అమృతమనీ, నాగలోకంలో సుధ అనీ, పితృలోకంలో స్వధ అనీ అంటారు. దాన్నే మహాత్ములు ప్రాణమంటారు. కనుక అన్నదానం ప్రాణదానంతో సమానం. ఇంకా విశేషించి చెప్పుతాను వినుము. అన్నంకంటె జలదానం గొప్పది. అది అన్నపాకానికి ఉపాశ్రయం. జలంలోనే చంద్రుడు పుట్టి సకల ఓషధులకు రక్షకుడయ్యాడు. కనుక అన్నంకంటె జలం గొప్పది.'

విశేషం: దేవతలకు హోమం చేసే మంత్రాలు స్వాహాతోను,
పితృదేవతా మంత్రాలు స్వధాతోనూ అంతమౌతాయి.

వ. అని పలికి మఱియును. 406

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

క. 'తనకుఁ గలయట్టి యన్నము । నన సుర పితృపూజనములు నరునకు నడపం
జను నతిథి తర్పణము దా । నన తగ నొనరించు వాఁడు నరవరముఖ్యా!' 407

ప్రతిపదార్థం: నరవరముఖ్యా!= రాజశ్రేష్ఠుడా!; తనకున్ కల అట్టి= తనకున్నటువంటి; అన్నమునన=అన్నంతోనే; నరునకున్= మనిషికి; సుర= దేవతల; పితృ= పితృదేవతల; పూజనములు= పూజలు; నడపన్= చేయగా; చనున్= వలయును; అతిథి= అతిథులను; తర్పణము= తృప్తిని; దానన= అన్నంతోనే; వాఁడు; తగన్= చక్కగా; ఒనరించున్= చేస్తాడు.

తాత్పర్యం: 'తనకున్న అన్నంతోనే దేవతల పితృదేవతల పూజలు చెల్లించాలి. అతిథులను దానితోనే తృప్తి పొందించాలి.'

వ. అని నిర్దేశించి తిలదానం బత్యాదరణీయంబని ప్రసంగించి 'యది వినినది యైనను నేమి? తద్విషయంబున కొక్క యితిహాసంబు గలదు; చెప్పెద విను 'మని పలికి, యనిమిష నదీనందనుండు కుంతీనందనాగ్రజుతో నిట్లనియె. 408

ప్రతిపదార్థం: అని; నిర్దేశించి= సెలవిచ్చి, చెప్పి; తిలదానంబు= నువ్వులను దానం చేయటం; అతి+ఆదరణీయంబు= మిక్కిలి ఆదరించదగ్గది;అని; ప్రసంగించి= ప్రసంగం చేసి; అది వినినది+ ఐననున్= అది విన్నదైనా; ఏమి= ఏముంది? (వింటే మాత్రమేమి?); తద్విషయంబునకున్= ఆ విషయానికి సంబంధించి; ఇతిహాసంబు= కథ; కలదు= ఉన్నది; చెప్పెదన్; వినుము+అని= ఆలకించుమని; పలికి= వచించి; అనిమిష నదీ నందనుండు= దేవతలనదియైన గంగయొక్క కొడుకు భీష్ముడు; కుంతీనందన= కుంతి కొడుకులలో; అగ్రజుతోన్= పెద్దవాడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పి తిలదానం చాలా ఆచరించదగ్గది అని వివరించి ఆ విషయం నీవు విన్నదైనా మరలా ఒక కథ చెప్తుతాను వినుము. దానివలన నీకు నష్ట మేమిటి?' కనుక అని భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు.

తిలదాన విషయక యమ బ్రాహ్మణ సంవాదము (సం.13-67-1)

సీ. మధ్యదేశమున గ్రామంబు విద్వజ్జన । బహులమై యొక్కటి పర్ణశాల
యను పేర నొప్పారు నందుల విప్రుని । శర్మి నామునిఁ బ్రీతి జముఁడు పిలువఁ
బనిచి దానముల కెల్లను దిలదాన మె । క్కుడు తిలలకుఁ బితృకోటి వేడ్క
సేయుఁ బాపంబులు సెందవు తిలభక్షిఁ । బుణ్య కర్తృత్వంబు బుద్ధిఁ గోరు

తే. దేనిఁ దిల లెప్డువిప్రుల కిమ్ము భక్తి । ననియె వస్త్ర దీపము లీగి యతుల దాన
మనఘ! చీరల దివియల నమర పితృ స । మర్చనము సేఁత పరమధర్మ మని చెప్పె. 409

ప్రతిపదార్థం: పర్ణశాల= ఆకులతో కప్పిన ఇల్లు; అనుపేరన్= అన్నపేరుతో; గ్రామంబు= ఊరు; మధ్యదేశమునన్= మధ్యప్రదేశంలో; విద్వత్+జన బహులమై= పండితుల సమూహంతో క్రిక్కిరిసి; ఒక్కటి, ఒప్పారున్= పేరు పొందింది;

అందులన్= అక్కడ; శర్మి నామునిన్= శర్మి అన్న పేరుగల వాడిని; విప్రునిన్= బ్రాహ్మణుడిని; జముఁడు= యముడు; ప్రీతిన్= ప్రేమతో; పిలువన్ పనిచి= పిలిపించి; దానములకున్+ఎల్లను= అన్ని దానాలలో; తిలదానము; ఎక్కుడు= గొప్పది; తిలలకున్= నువ్వులకు; పితృకోటి= పితృదేవతల సమూహం; వేడ్క సేయున్= ముచ్చటపడుతుంది; తిలభక్షిన్= నువ్వులు తినేవాడిని; పాపంబులు= పాపాలు; చెందవు= పొందవు; పుణ్యకర్తృత్వంబున్= పవిత్ర కర్తృత్వాన్ని; బుద్ధిన్= బుద్ధియందు; కోరుదు+ఏని= కోరితే; విప్రులకున్= బ్రాహ్మణులకు; తిలలు; ఎప్డున్= ఎప్పుడూ; ఇమ్ము= ఇవ్వు; భక్తిన్= భక్తితో; అని; అనియెన్; వస్త్ర= వస్త్రము; దీపములు= దివ్వెలు; ఈగి= దానం; అతుల= సాటిలేని దానము; అనఘ! చీరలన్= వస్త్రాలతో; దివియలన్= దీపాలతో; అమర= దేవతల; పితృ= పితృదేవతల; సమర్చనముచేఁత= పూజించటం; పరమ= గొప్ప; ధర్మము; అని; చెప్పెన్.

తాత్పర్యం: మధ్యప్రదేశములో పర్ణశాల అని ఒక గ్రామమున్నది. అందులో అనేకమంది పండితులు ఉండేవారు. వారిలో శర్మి అనే పేరుగలవాడిని పిలిచి యముడన్నాడు - 'అన్ని దానాలలో తిలదానం గొప్పది. పితృదేవతలు దానికొరకు వేడ్కపడతారు. నువ్వులు తిన్న వానిని పాపాలు పొందవు. కనుక నీవు మంచి పని చేయదలచుకొంటే బ్రాహ్మణులకు నువ్వులు దానం చేయుము. వస్త్రాలు, దీపాలు దానం చేయటం గొప్పది. వస్త్రాలతో దేవతలు, దీపాలతో పితృదేవతలు సంతోషిస్తారు కనుక.

వ. అని యిట్లు యమబ్రాహ్మణ సంవాదంబు వినిపించి శాంతనవుం డమ్మహీకాంతు నాననంబు సవిశేషాదరంబున నాలోకించి. 410

ప్రతిపదార్థం: అని; ఇట్లు; యమ= యముడు; బ్రాహ్మణ= శర్మి; సంవాదంబు= సంభాషణ; వినిపించి, శాంతనవుండు= శంతనుడి కుమారుడు; ఆ మహీకాంతు= ఆ రాజుయొక్క, ఆననంబు= ముఖం; సవిశేష= విశిష్టమైన; ఆదరంబునన్= ఆదరణతో; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని ఈ విధంగా యమ శర్మి సంవాదం వినిపించి శాంతనవుడు ధర్మరాజును ఆదరణతో చూచి.

క. 'విను పృథివియును సరస్వతి । యును గోవును దాన విధికి నొక్కంతలుగా
విని యుండుదు వీనిం బో । లిన దాతవ్యములు నొండు లేవని విందున్. 411

ప్రతిపదార్థం: పృథివియునున్= భూమి; సరస్వతియునున్= చదువు; గోవునున్= ఆవునూ; దాన విధికిన్= దానం చేయటానికి; ఒక్క+అంతలుగాన్= ఒకటేనని; వినియుండుదున్= విన్నాను; వీనిన్= వీటిని; పోలిన; దాతవ్యములు= ఇవ్వదగ్గవి; ఒండు= మరొకటి; లేవు; అని; విందున్= విన్నాను.

తాత్పర్యం: దానం చేయదగ్గవి మూడే అవి 1.భూమి, 2.చదువు, 3.గోవు. వీటికంటె గొప్పవి లేవు.

ఆ. రాజముఖ్య! తగు సరస్వతి శిష్యున । కొసఁగ, భూమి దాన మూర్జితముగఁ
జేసినట్టి ఫలము సిద్ధించు, ధేనువు । నిచ్చుటయును భూమి నిచ్చినట్ల. 412

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజశ్రేష్ఠుడా!; శిష్యునకున్= విద్యార్థికి; సరస్వతి= విద్య; ఒసఁగన్= ఇవ్వటం; తగున్= యోగ్యం; భూమిదానము= భూదానం; ఊర్జితముగన్= ఎక్కువగా; చేసినట్టి ఫలము; సిద్ధించున్= కలుగుతుంది; ధేనువును= ఆవును; ఇచ్చుటయును= ఇవ్వటమూ; భూమిన్= నేలను; ఇచ్చినట్లు+అ= దానం చేసినట్లే.

తాత్పర్యం: రాజముఖ్య! శిష్యుడికి తగునట్లుగా విద్యాదానం చేయటం భూదానం చేసినంత! గోవునివ్వటం కూడా భూదానం చేసినంతే!

క. అనయముఁ గొంచెపు వెలకుం । గొనవచ్చును సారభూత గోవును దానం
బున ఫల మధికము దానము । గొని నాతఁడు సుఖము దానఁ గొనుఁ జేసేతన్. 413

ప్రతిపదార్థం: అనయమున్= ఎప్పుడు; కొంచెపు= తక్కువ; వెలకున్= ధరకు; కొనవచ్చును= కొనుక్కొనవచ్చును; సారభూత= అన్నిటికి సారమగుతున్న లేదా పంచభూత సారమైన (గోవు విశ్వసంకేతం కనుక); గోవును= ఆవును; దానంబునన్= గోదానంవలన; ఫలము= ఫలితం; అధికము= ఎక్కువ; దానము కొనినాతఁడు= దానం గ్రహించినవాడూ; చేసేతన్= చేతులారా!; సుఖమున్= సౌఖ్యాన్ని; దానన్= గోదానంతో; కొనున్= గ్రహిస్తాడు.

తాత్పర్యం: పంచభూతస్వరూపిణి అయిన గోమాతను తక్కువ వెలకు కొనవచ్చును. గోదానఫలం ఇచ్చినవాడికీ, - తీసికొన్నవాడికీ కలుగుతుంది.

ఆ. దేవ పితృ సమర్చనావాసములు గోశ । కృత్ప్రలేపనమునఁ గీర్తనీయ
శుచితఁ బడయు ననిన సువ్రత! గోవుల । భూరి మహిమ వేఱ పొగడ నేల? 414

ప్రతిపదార్థం: సువ్రత!= వ్రతనిష్ఠ కలవాడా!; దేవ= దేవతల; పితృ= పితృదేవతల; సమర్చనా= పూజా; ఆవాసములు= నివాసాలు, పూజా మందిరాలు; గో= ఆవు; శకృత్= పేడ; ప్రలేపనమునన్= అలకటంవలన; కీర్తనీయ= పొగడదగ్గ; శుచితన్ పడయున్= శుచిత్వాన్ని పొందుతాయి; అనినన్= అనగా; గోవుల; భూరిమహిమ= గొప్పమహిమ; వేఱ= ప్రత్యేకంగా; పొగడన్+ఏల= పొగడటం దేనికి?

తాత్పర్యం: ధర్మరాజా! దేవతలను, పితృదేవతలను ఆరాధించే నివాసాలు ఆవులపేడతో అలకటం వలన పొగడదగిన పవిత్రత కలుగుతుం దనగా ఇక గోవుల గొప్ప మహిమ వేరే పొగడటం ఎందుకు?

తే. కుడుపునకు ముందు రొడ్డుల గోవునకు స । మంచిత గ్రాసముష్టి నిత్యంబు నేఁడు
గాల మిచ్చిన నతఁ డెల్ల కామ్యములును । బ్రాహ్మణుల కర్థి నొసఁగిన ఫలము వడయు. 415

ప్రతిపదార్థం: ఏఁడుకాలము= సంవత్సరకాలం; నిత్యము= ప్రతిరోజు; కుడుపునకున్= తాను భుజించటానికి; ముందర= ముందే; ఒడ్డుల= మరొకరి; గోవునకున్= ఆవుకు; సమంచిత= చక్కని; గ్రాసముష్టి= పిడికెడు గడ్డి; ఇచ్చినన్= ఇస్తే; అతఁడు; ఎల్ల కామ్యములును= అన్ని కోరికలను; బ్రాహ్మణులకున్= విప్రులకు; అర్థిన్= ప్రేమతో; ఒసఁగిన= ఇచ్చిన; ఫలము= ఫలితం; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: తాను తినే ముందు ఆవుకు పిడికెడు గడ్డి సంవత్సరం పొడుగునా ప్రతి దినమూ ఎవ డిస్తాడో వాడు బ్రాహ్మణులకు కోర్కెలన్నీ తీర్చినంత ఫలం పొందుతాడు.

క. గోదాన విధము సుపథగ । మై దాతకు నెల్ల మేలు నాపాదించున్
వేదప్రియ! యది దురితో । త్పాదక మగు నాతనికి విపథగతమైనన్. 416

ప్రతిపదార్థం: వేదప్రియ!= వేదాలపై ప్రీతికలవాడా!; గోదాన విధము= గోదానం పద్ధతి; సుపథగము+ఐ= మంచి మార్గం పొంది; దాతకున్= ఇచ్చినవాడికి; ఎల్లన్ మేలున్= శుభాన్నంతా (అన్ని శుభాలను); ఆపాదించున్= కలిగిస్తుంది; అతనికిన్= అతనికీ; విపథగతము+ఐనన్= చెడ్డమార్గాన పోతే; అది; దురిత= పాపం; ఉత్పాదకము= పుట్టించేది; అగున్= ఔతుంది.

తాత్పర్యం: గోదానవిధము సన్మార్గంలో సాగితే దాతకు మేలు చేకూరుతుంది. చెడుమార్గంలో అయితే కీడు కలిగిస్తుంది.

విశేషం: వేదప్రియ సంబోధన రహస్యమేమంటే - సుపథ అన్నమాట ఈశావాస్యంలో మోక్షమార్గ మని భావం. విపథ= పాపమార్గం. కనుక వేదప్రియ అనే సంబుద్ధి వాడబడింది.

నృగచరిత్రము (సం.13-69-1)

తే. **దుష్టమైన గోదానంబు గష్టవృత్తిఁ దెచ్చె నృగనాముఁ డగు జగతీవిభునకు**
నత్తెఱం గితిహాసమై యవనిఁ బరఁగు; వినుము సెప్పెద దాని వివేకధుర్య! **417**

ప్రతిపదార్థం: వివేకధుర్య!= బుద్ధిమంతుడా!; దుష్టమైన= చెడ్డదైన; గోదానంబు= గోదానం; నృగనాముఁడు= నృగు డన్న పేరుగల; జగతీ విభునకున్= రాజునకు; కష్టవృత్తిన్= కష్టపాటు; తెచ్చెన్= కలిగించింది; ఆ తెఱంగు= ఆ విధానం; ఇతిహాసము+ఐ= పూర్వకథగా; అవనిన్= లోకంలో; పరఁగున్= వ్యాప్తమైనది; దానిన్; చెప్పెదన్; వినుము.

తాత్పర్యం: నృగుడన్న రాజు చెడ్డగా గోదానంచేసినందువలన కీడు కలిగిన విషయం ఒక పూర్వకథగా లోకంలో ప్రసిద్ధమైనది. అది నీకు చెప్పుతాను వినుము.

క. **ద్వారవతి నొక్క నూతం । దోరపుఁ దను వక్కజమగు తొండ నొకటి న**
చ్చేరువ మెలఁగుజనులు గని । నీ రిది గలఁగించు నిట్ల నిలిచిన యేనిన్. **418**

ప్రతిపదార్థం: ద్వారవతిన్= ద్వారకలో; ఒక్క నూతన్= ఒక నూతిలో; తోరపుఁ దనువు= పెద్ద శరీరంతో; అక్కజము= ఆశ్చర్యం; అగు= అయిన; తొండన్= తొండను; ఒకటిన్= ఒకదానిని; ఆ చేరువ= ఆ సమీపంలో; మెలఁగు జనులు= మసలే మనుషులు; కని= చూచి; ఇది= ఈ తొండ; ఇట్లు= ఇట్లాగే; నిలిచిన ఏనిన్= ఉంటే; నీరు= నీటిని; కలఁగించున్= బురద చేస్తుంది.

తాత్పర్యం: ద్వారకలోని ఒకనూతిలో ఒక పెద్ద శరీరం గల తొండ ఉన్నది. దగ్గరలో ఉన్న మనుష్యులు చూచి దీ న్నిట్లాగే ఉండనిస్తే నీరంతా పాడైపోతుంది. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **అని బలు మ్రోకులు వేగమ । కొని వచ్చి తగిల్చి లావుగొని తిగువఁగ నా**
ఘనజంతు వచలితంబై । యునికికి విస్మయము నొందు నుల్లంబులతోన్. **419**

ప్రతిపదార్థం: అని= అంటూ; బలు= పెద్ద; మ్రోకులు= త్రాళ్ళు; వేగమ= వెంటనే; కొనివచ్చి= తెచ్చి; తగిల్చి= దానికి తగిలించి; లావు+కొని= బలం పుంజుకొని; తిగువఁగన్= లాగగా; ఆ ఘన జంతువు= ఆ పెద్ద ప్రాణి; అచలితంబు+ఐ= కదలకుండా; ఉనికికిన్= ఉండటానికి; విస్మయము= ఆశ్చర్యం; ఒందు+ఉల్లంబులతోన్= పొందిన మనస్సులతో.

తాత్పర్యం: ఆ విధంగా భావించి వారు బలమైన మోకులు తెచ్చి దానికి తగిలించి పైకి లాగటానికి ప్రయత్నించారు. కాని, అది కదల్లేదు. అందుకు వారు ఆశ్చర్యపోయారు.

తే. కృష్ణు పాలికిఁ బోయి యక్కీట మున్న । తెఱఁగు సెప్పినఁ జని దానిఁ దిగిచె వెడల
నమ్మహాత్ముఁ డెఱింగియు నర్థితోడ । నడుగ నది 'యేను నృగుఁడఁ జు' మ్మనియె ననఘ! 420

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; కృష్ణుపాలికిన్= శ్రీకృష్ణుడి దగ్గరకు; పోయి; ఆ కీటము= ఆ పురుగు; ఉన్న తెఱఁగు= ఉన్న విధము; చెప్పినన్= చెప్పగా; చని= పోయి; దానిన్= తొండను; వెడలన్= బయటకు వచ్చేటట్లుగా; తిగిచెన్= పైకి లాగాడు; ఆ+మహాత్ముఁడు= ఆ స్వామి; ఎఱింగియున్= తెలిసికూడా; అర్థితోడన్= కోర్కెతో; అడుగన్= అడిగితే; అది= ఆ తొండ; ఏను= నేను; నృగుఁడన్ చుమ్ము= నృగుడను సుమా! అనియెన్= అన్నది.

తాత్పర్యం: వారు శ్రీకృష్ణుడికి విన్నవించగా ఆయన వచ్చి దాన్ని బయటకు లాగాడు. ఆయన కదేదో తెలిసికూడా ప్రశ్నించగా 'నేను నృగుడను సుమా!' అని తొండ చెప్పింది.'

వ. అనిన విని యద్దేవుండు 'నీ వనేక గో సహస్రంబుల విప్రజనంబుల కిచ్చి తని విందు; మిట్టి దుర్జన్మంబు నీకేల వాటిల్లె?' ననుటయు నమ్మనుజవల్లభుండు. 421

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ దేవుండు= ఆ శ్రీకృష్ణుడు; గోసహస్రంబులు= వేల గోవులు; విప్రజనంబులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చితి అని విందున్= ఇచ్చావని విన్నానే; ఇట్టి= ఇటువంటి; దుర్జన్మంబు= దుష్టమైన పుట్టుక; నీకున్; ఏల= ఎందుకు; పాటిల్లెన్?= కలిగింది?; అనుటయున్= అనగా; ఆ మనుజవల్లభుండు= ఆ రాజు.

తాత్పర్యం: కృష్ణు డన్నాడు 'అరే! నీవు ఎన్నో గోవులను దానం చేశావని విన్నానే! నీకీ పాడు పుట్టుక ఎట్లా కలిగింది? అనగా అతడు.

సీ. ఉత్తమ బ్రాహ్మణుం డొకనికి నొక్కనాఁ । డొక గోవు నిచ్చితి నుల్ల మలర
నతఁడును గొనిపోయె; నది మేఁత కర్థి మా । కదుపుల లోపలఁ గలసి వచ్చె
గోవుల మఱియును గోపాలకులు దాన । విధికినై తెచ్చుచో విధివశమున
వానిలో నదియును వచ్చిన నెఱుఁగక । దానంబు సేసితి; దాని మున్న

ఆ. గొనినయతఁడు దడవి కని 'యిది నాదు గో' । వనియెఁ బిదపఁ గొనిన యతఁడు పెనఁగి
'నాకు నృపతి యొసఁగె' నా నిద్దఱకును వా౹ దైన నన్నుఁ గాన నరుగుదెంచి. 422

ప్రతిపదార్థం: ఉత్తమ= మంచి; బ్రాహ్మణుండు+ఒకనికి; ఉల్లము= మనస్సు; అలరన్= వికసించగా; ఒక్కనాఁడు; ఒక గోవున్; ఇచ్చితిన్= ఇచ్చాను; అతఁడును= ఆయన; కొనిపోయెన్= తీసికొనిపోయాడు; అది= ఆ గోవు; మేఁతకున్= మేతకొరకు; అర్థిన్= కోర్కెతో; మా కదుపులలోపలన్= మా ఆలమందలతో కలిసి; వచ్చెన్= వచ్చింది; మఱియును= ఇంకనూ, ఆ పిదప; గోపాలకులు= ఆలమేపరులు, ఆలమందలు మళ్ళవేసేవారు; దానవిధికిన్+ఐ= దాన విధానం కొరకు; గోవులన్ తెచ్చుచోన్= ఆవులను తోలుకొని వస్తున్నప్పుడు; విధివశమునన్= దైవవశాత్తు; వానిలోన్= ఆ గోవులతో కలిసి; అదియున్= ఇదివరకు

దానం చేసిన గోవు; వచ్చినన్= రాగా; ఎఱుఁగక= తెలియక; దానంబు చేసితిన్= దానిని మరొకరికి దానం చేశాను; దానిన్; మున్ను= పూర్వం; కొనిన యతఁడు= తీసికొన్నవాడు; తడవి= పరిశీలించి; కని= చూచి; ఇది; నాదుగోవు= నా గోవు; అనియెన్= అన్నాడు; పిదపన్= తరువాత; కొనిన అతఁడు= తీసికొన్నవాడు; పెనఁగి= మారుపల్కి, ఎదురొడ్డి; నాకున్; నృపతి= రాజు; ఒసఁగెన్= ఇచ్చాడు; నాన్= అనగా; ఇద్దఱకున్; వాదు= తగాదా; ఐనన్= జరిగితే; నన్నున్; కానన్= చూడటానికి; అరుగు దెంచి= వచ్చి.

తాత్పర్యం: ఒక ఉత్తమ బ్రాహ్మణుడికి ఒక గోవును ఇచ్చాను. అది మేతకొరకు తిరిగి మా ఆలమందలలో చేరిరాగా, మావారు తెలియక దానంకొరకు ఆవులను తెమ్మంటే దాన్ని వీటితోపాటు తెచ్చారు. దానిని మరొకరికి ఇచ్చాను. మొదటివా డా గోవును చూచి ఇది నాదంటే, రెండోవాడు నాకిది రాజుగారు ఇచ్చారన్నాడు. ఇద్దరకు వాదు కలిగితే నా దగ్గరకు వచ్చి.

వ. తనముందటి తెఱం గెఱింగించి. 423

తాత్పర్యం: తనయొక్క పూర్వస్థితి చెప్పి.

క. ఇచ్చినవారల కొనఁగా । వచ్చిన నడ్డంబు గలదె వసుధాధిప! యం
చిచ్చఁగడు నొచ్చి పలికిరి । వెచ్చని నిట్టూర్పులడర విప్రులిరువురున్. 424

ప్రతిపదార్థం: వసుధా+అధిప!= రాజా! (భూమి నేలేవాడా!); ఇచ్చినవారలు+అ= ఇచ్చినవారే; కొనఁగాన్ వచ్చినన్= తీసికొనటానికి వస్తే; అడ్డంబు కలదె?= అడ్డమున్నదా? అంచున్= అని; ఇచ్చన్= మనస్సులో; కడున్= మిక్కిలి; నొచ్చి= బాధపడి; విప్రులు= బ్రాహ్మణులు; ఇరువురునున్= ఇద్దరూ; వెచ్చని= వేడి; నిట్టూర్పులు= నిశ్వాసాలు; అడరన్= వ్యాపించగా; పలికిరి= మాట్లాడారు.

తాత్పర్యం: రాజా! ఇచ్చినవాడే తీసికొంటే అడ్డ మేమున్నదని ఇద్దరు బ్రాహ్మణులు మనస్సులో బాధపడి వేడి నిట్టూర్పులు విడుస్తూ అన్నారు.

విశేషం: పద్యమంతా కోపం వచ్చినవాడు మాటాడే తీరును తెలుపుతున్నది. ద్విత్వ చకారప్రాస దాని కూతం. వేడి నిట్టూర్పులు ఏమీ చేయలేని కోపాన్ని తెలియజేసేవి.

వ. మఱియుం బొడము మాటల నమ్మొదవు పోకడ నాకుఁ దెల్లం బగుటయు. 425

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా, అనేకంగా; పొడము= పుట్టిన; మాటలన్= మాటలవలన; ఆ మొదవు= ఆ గోవు; పోకడ= విధానం, లేదా పోవటం; నాకున్; తెల్లంబు= స్పష్టం; అగుటయున్= కావటంతో.

తాత్పర్యం: వాళ్ళున్న మాటలనుబట్టి ఆ గో విదివరకే దత్తం చేయబడిందని నాకు స్పష్టం కావటంతో.

ఉ. దానికి నేను జిత్తమునఁ దాపము నొందుచు మున్ను గొన్న య
మ్మానితవిప్రు వేఁడికొని 'మంచివి గోవులు నీకు నూఱు వే
యైనను నిచ్చెదన్ విడువవయ్య మహీసురవర్య! నెమ్మి న
ద్ధేనువు' నన్న నాస్యమున దీనత దోఁపఁగ నాతఁ డిట్లనున్. 426

ప్రతిపదార్థం: దానికిన్= జరిగిపోయిన విషయానికి; నేను; చిత్తమునన్= మనస్సులో; తాపమున్= బాధను; ఒందుచున్= పొందుతూ; మున్ను= పూర్వము; కొన్న= దానం తీసికొన్న; ఆ+మానిత= ఆ గౌరవింపదగ్గ; విప్రున్= బ్రాహ్మణుడిని; వేఁడికొని= బ్రతిమాలి; గోవులు; మంచివి; నీకున్; నూఱు వేయి= లక్ష; ఐననున్= ఐనాసరే; ఇచ్చెదన్= ఇస్తాను; మహీసురవర్య!= బ్రాహ్మణ శ్రేష్ఠుడా!; నెమ్మిన్= సంతోషంతో; ఆ+ధేనువున్= ఆ గోవును; విడువవయ్య!= వదలిపెట్టవయ్యా!; అన్నన్= అనగా; అతఁడు; అస్యమునన్= ముఖంలో; దీనత= దైన్యం; తోఁపఁగన్= కనిపిస్తుండగా; ఇట్లు; అనున్.

తాత్పర్యం: జరిగిపోయినదానికి మనస్సులో బాధపడి నేను మొదట తీసికొన్న విప్రుడితో 'స్వామీ! గోవును ఇమ్ము. దానికి బదులు నీకు మంచి గోవులు లక్ష ఇస్తా' ననగా - అతడు దైన్యంతో ఇట్లా అన్నాడు.

తే. 'పాలు గడుఁ బెక్కు దాని సబాము లెస్స । పెయ్య కర్మిలి గలదు మత్ప్రియ సుతుండు
పాల కేడ్చిన యపుడ చన్పట్టనిచ్చు - నేది ప్రొద్దైన నట్టి గో వెందుఁ గలదు? 427

ప్రతిపదార్థం: పాలు; కడున్+పెక్కు= చాలా ఎక్కువ; దాని సబాము లెస్స= ఆ ఆవుస్వభావం మంచిది; పెయ్యకున్= దూడపై; అర్మిలి= ప్రేమ; కలదు= కలిగిఉన్నది; మత్= నా; ప్రియసుతుండు= కూర్మి కొడుకు; పాలకున్= పాలకొరకు; ఏడ్చినఅపుడు+అ= ఎప్పుడు ఏడిస్తే అప్పుడు; ఏది ప్రొద్దు+ఐనన్= ఏ వేళనైనా; చన్= పొదుగు; పట్టన్+ఇచ్చున్= పట్టుకొననిస్తుంది, అట్టిగోవు, ఎందున్= ఎక్కడ; కలదు?= ఉన్నది?

తాత్పర్యం: దానికి పాలెక్కువ. దూడమీద దానికి మక్కువ ఎక్కువ. నా చిన్నారి కొడుకు ఏడ్చినప్పుడు ఏ వేళనైనా సరే పొదుగును పట్టుకొన నిస్తుంది. అట్లాంటి గోవు ఎక్కడ ఉంటుంది?

క. శ్రీవోలె నింటిలో నా । గోవుండఁగఁ జూతుఁగాని కోటి మొదవులుం
గావు సరి దాని' కని భూ । దేవుఁడు వోవుటయు నేను దీనత దోఁపన్. 428

ప్రతిపదార్థం: శ్రీ= మహాలక్ష్మి; పోలెన్= వలె; ఆ గోవు; ఇంటిలోన్= ఇంట్లో; ఉండఁగన్= ఉంటే; చూతున్ కాని= చూడగలను కానీ; కోటి; మొదవులున్= ఆవులైనా; దానికిన్; సరికావు= సమానం కావు; అని; భూదేవుఁడు= బ్రాహ్మణుడు; పోవుటయున్= పోగా; నేను; దీనత= దైన్యం; తోఁపన్= తోపగా.

తాత్పర్యం: అది మహాలక్ష్మివలె ఇంట్లో ఉంటే చూడగలను కాని, కోటిగోవులైనా దానితో సమానం కా'వని ఆయన కోపంతో వెళ్ళిపోగా నేను దైన్యంతో.

విశేషం: ఇందాక బ్రాహ్మణుడు దైన్యంతో అంటే ఇప్పుడు రాజు దైన్యం తోపగా అంటున్నాడు.

చ. 'కనకము ధేనువుల్ మణి నికాయము లిచ్చెద; నేమి యైనఁ ద
క్కును మది కిష్టమైన యది గోరుము గోవున' కంచుఁ జేరి త
క్కిన ధరణీసుపర్వునకుఁ గీడ్పడి యెమ్మెయి వేఁడికొన్న 'నేఁ
గొన భవదీయ రాజ్యమును; గుత్సితవృత్తికి నియ్యకొందునే?' 429

ప్రతిపదార్థం: కనకము= బంగారం; ధేనువుల్= గోవులు; మణినికాయములు= అనేక రత్నాలు; ఏమిఐనన్= ఏమైనాసరే; ఇచ్చెదన్= ఇస్తాను; తక్కునున్= మిగిలినది (ఏదైనాసరే); మదికిన్= మనస్సుకు; ఇష్టము= ఇష్టం; ఐనఅది= ఐనదాన్ని;

గోవునకున్= ఆవునకు బదులు; కోరుము= కోరుకొమ్ము; అంచున్= అంటూ; చేరి= సమీపించి; తక్కిన= రెండవ; ధరణీ సుపర్వునకున్= భూదేవుడికి, బ్రాహ్మణుడికి; కీడ్పడి= దైన్యంతో; ఏ+మెయిన్= ఏ విధంగా; వేఁడికొన్నన్= వేడుకొనినా; ఏన్= నేను; భవదీయ= నీ; రాజ్యమును= రాజ్యమైనా; కొనన్= తీసికొనను; కుత్సిత వృత్తికిన్= కుచ్చితపు ఆలోచనకు; ఇయ్యకొందునే?= ఇష్టపడతానా?

తాత్పర్యం: బంగారం, మణులు, ఆవులు ఏదైనా సరే కోరుకొమ్ము కానీ 'ఈ ఆవు నిమ్ము' అని ఎంత దీనంగా బ్రతిమిలాడినా ఆ రెండవ బ్రాహ్మణుడు అంగీకరించక 'నాకు రాజ్యమైనా సరే వద్దు పొమ్ము. ఇంత కుత్సితబుద్ధిని నే నంగీకరించను.'

తే. అనియెఁ గాని నా మాట గైకొనఁడ యాతఁ; డట్టి యెడఁ గాలవశగతి యావహిల్లి
యముని కడ కేఁగ నాతోడ నతఁడు వికచ । నలినలోచన! యిట్లని పలికెఁ బ్రీతి. 430

ప్రతిపదార్థం: అనియెన్+కాని= అన్నాడు తప్ప; ఆతఁడు= అతడు; నా మాటన్; కైకొనఁడ= వినిపించుకొనలేదు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కాలవశగతి= మరణదశ; ఆవహిల్లి= కలిగి; యముని; కడకున్= సమీపానికి; ఏఁగన్= పోగా; నాతోడన్= నాతో; అతఁడు= యముడు; వికచ= విప్పారిన; నలిన= తామరపూలవంటి; లోచన!= నేత్రాలవాడా!; ఇట్లని= ఈ విధంగా; ప్రీతిన్= ప్రేమతో; పలికెన్= అన్నాడు.

తాత్పర్యం: వికసించిన తామరపూలవంటి నేత్రాలున్నవాడా! ఆ రెండవ బ్రాహ్మణు డట్లా అన్నాడు తప్ప నా మాట పట్టించుకొనలేదు. అప్పుడు మృత్యువు సంభవించి నేను యముని దగ్గరకు పోగా అతడు నాతో ప్రేమగా ఇట్లా అన్నాడు.

విశేషం: వికచ నళిన లోచన= ఈ సంబోధన భగవంతుడి నేత్ర సౌందర్యాన్ని సూచించేదే. అయినా ఇక్కడ కథ విన్నాక కలిగే ఆశ్చర్యాన్ని సూచిస్తుంది.

చ. 'జనవర! పుణ్యకర్మము లసంఖ్యము లీవొనరించి తొక్క వి
ప్రునిధన మజ్ఞతం గొనుటఁ బొందె సకిల్బిషభావ మల్ప మి
ట్లొనరిన రెంట నయ్యెడు మహోన్నతి దుర్గతులందు మున్ను నీ
చనునెడ యెద్ది నావుడు న సౌఖ్యపుఁ జోటని సమ్మతించితిన్. 431

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; ఈవు= నీవు; పుణ్య కర్మములు= పుణ్య కార్యాలు; అసంఖ్యములు= లెక్కలేనన్ని; ఒనరించితి= చేశాడు; ఒక్క; విప్రుని ధనము= బ్రాహ్మణుడి సొమ్ము; అజ్ఞతన్= తెలియక; కొనుటన్= గ్రహించడంవల్ల; సకిల్బిష= పాపంతో కూడిన; భావము= సంస్కారం; అల్పము= కొంచెం; పొందెన్= కలిగింది; ఇట్లు; ఒనరిన= ఒనగూడిన, సంభవించిన; రెంటన్= రెంటితో; అయ్యెడు= కలిగే; మహా+ఉన్నతి= గొప్పదశ; సద్గతి; దుర్గతులు= చెడ్డదశ; అందున్= అందులో; మున్ను= ముందుగా; నీ చనునెడ= నీవు వెళ్ళేలోకం; ఎద్ది= ఏది; నావుడున్= అంటే; అసౌఖ్యపుఁజోటు= సుఖంలేనిచోటు - నరకం; అని; సమ్మతించితిన్= అంగీకరించాను.

తాత్పర్యం: 'రాజా! నీ వనేక పుణ్యకార్యాలు చేసినందున సద్గతి కలుగుతుంది. కాని, తెలియకుండా బ్రాహ్మణుడి సొమ్ము నీకు చేకూరటంవలన పాప మింత అంటింది. కనుక సద్గతి, దుర్గతులలో నీ వేది ముందుగా అనుభవించాలనుకుంటున్నావో చెప్పు'మని యముడు అనగా నేను దుర్గతినే ఎన్నుకొన్నాను.

ఆ. అట్టు లియ్యకొనిన యా క్షణమాత్ర మ । స్తకము క్రిందు గాఁగ ధరణిఁ బడఁగ
వలసె; నపుడు వింటి నలఘు కృపార్ద్ర వ । ర్ణాలికలితమైన యముని పలుకు. 432

ప్రతిపదార్థం: అట్టులు= ఆ విధంగా; ఇయ్యకొనిన= అంగీకరించిన; ఆక్షణమాత్రన్= ఆక్షణంలో; మస్తకము= తల; క్రిందు+ కాఁగన్= క్రిందై; ధరణిన్= భూమిమీద; పడఁగన్ వలసెన్= పడవలసి వచ్చింది; అపుడు; అలఘు= గొప్ప; కృపా+ఆర్ద్ర= దయతో తడిసిన; వర్ణ+ఆలి= అక్షరాల సమూహంతో; కలితమైన= కూడిన; యముని పలుకున్= యముడి మాటను; వింటిన్= విన్నాను.

తాత్పర్యం: అట్లా అంగీకరించానో లేదో తలక్రిందులుగా భూమిపై పడ్డాను. పడుతుండగా దయగల యముని మాట వినిపించింది.

వ. అది యెయ్యది యంటేని. 433

ప్రతిపదార్థం: అది; ఏ+అది= ఏది; అంటేని= అంటే.

తాత్పర్యం: అది ఏమంటే.

తే. వాసుదేవుఁ డనేక సంవత్సరముల । కధిప! నీ యున్న చోటికి నరుగుదెంచి
యుద్ధరించు ని న్నట నిత్యసిద్ధ సౌఖ్య । మైన లోకమునకుఁ జను దనఘ! నీవు. 434

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీ+ఉన్నచోటికిన్= నీవుండే స్థలానికి; అనేక సంవత్సరములకున్= చాలా కాలం తరువాత; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; అరుగుదెంచి= వచ్చి; నిన్నున్; ఉత్+హరించున్= పైకి తీస్తాడు; (ఉత్+ధరించు= చక్కగా ఆదుకొంటాడు, రక్షిస్తాడు) అటన్= అక్కడ; అనఘ!= పుణ్యాత్ముడా!; నీవు; నిత్య= శాశ్వత; సిద్ధ= ఉన్న; సౌఖ్యము= సుఖాలు కలది; ఐన= అయిన; లోకమునకున్= లోకానికి, చనుదు= వెళ్ళుతావు.

తాత్పర్యం: రాజా! చాలా కాలం తరువాత భగవంతుడైన శ్రీకృష్ణుడు నీవున్న చోటికి వస్తాడు. నిన్ను పైకి తీయటమే కాక సద్గతి ననుగ్రహిస్తాడు. తరువాత నీకు అతడి అనుగ్రహంతో శాశ్వత సుఖాలు కల లోకం లభిస్తుంది.

విశేషం: ఇది యముడి దయగల మాట. అతడికీ రాజుమీద జాలి కలిగింది. 'అయ్యో! పాపం దానం చేసి పాపం కొనుక్కొన్నాడే' అని.

వ. ఇట్లు వినుచు నిలాతలంబునం బడి కృకలాసత్వంబు నొంది చరియించుచుండి, నేఁడు దైవదత్తంబయిన చిత్తవర్తనంబునం జేసి యిక్కూపంబునకు వచ్చిన యపర క్షణంబునం గృకలాసంబులకు లేనిమేని పెం పావహిల్లిన నుల్లంబు సవిస్మయం బగుచునుండ యమప్రసాదంబున నెప్పుడును మాయని పరిజ్ఞానంబు వర్తిల్లనున్నంతం బరమ యోగీంద్ర భావ్యంబగునీ భవ్యసన్నిధి దొరకొనియె' నని పలికె నప్పు డప్పుడమిఱేనికిఁ బూర్వాచరిత పుణ్య కర్మానురూపం బగు రూపం బావిర్భవించిన దానికిం బ్రమోదభరితుం డై యతండు. 435

ప్రతిపదార్థం: ఇట్లు వినుచున్= ఇట్లా వింటూ; ఇలా తలంబునన్+పడి= భూమిపై పడి; కృకలాసత్వంబున్= తొండ స్వభావాన్ని, రూపాన్ని; ఒంది= పొంది; చరియించుచుండి= తిరుగుతూ ఉండి; నేఁడు; దైవదత్తంబు+అయిన= దైవ మనుగ్రహించిన; చిత్తవర్తనంబునన్+చేసి= మనసు సంకల్పంతో; ఈ+కూపంబునకున్= ఈ బావికి; వచ్చిన; అపర క్షణంబునన్= మరుక్షణంలో; కృకలాసంబులకున్= తొండలకు లేని; మేని పెంపు= శరీర విస్తృతి; ఆవహిల్లినన్= కలిగితే; ఉల్లంబు= మనస్సు; సవిస్మయంబు+ అగుచున్+ఉండన్= ఆశ్చర్యంపొందుచుండగా; యమప్రసాదంబునన్= యముడి దయతో; ఎప్పుడును= నిత్యం; మాయని= మాసిపోని; పరిజ్ఞానంబు= గొప్ప తెలివి; వర్తిల్లనున్నంతన్= ప్రవర్తిస్తుండగా; పరమ= గొప్ప; యోగి+ఇంద్ర= మహాయోగులకు; భావ్యంబు+అగు= భావించ దగ్గ; నీ; భవ్య= మహా; సన్నిధి= సాన్నిధ్యం; దొరకొనియెన్= లభించింది; అని పలికెన్= అని చెప్పాడు; అప్పుడు; ఆ+పుడమి= ఆ భూమి; జేనికిన్= రాజుకు; పూర్వ+ఆచరిత= పూర్వజన్మంలో చేసిన; పుణ్య= పవిత్ర; కర్మ+అనురూపంబు+అగు= కర్మానుగుణమైన; రూపంబు= ఆకారం; ఆవిర్భవించినన్= కలిగినంత; దానికిన్= ఆ అదృష్టానికి; ప్రమోద= సంతోషంతో; భరితుండై= నిండినవాడై; అతండు= రాజు.

తాత్పర్యం: ఇట్లా వింటూనే భూమిపై పడ్డాను. వెంటనే తొండరూపం వచ్చింది. ఇవ్వాళ దైవానుగ్రహంతో కలిగిన సంకల్పానుసారంగా ఈ బావి దగ్గరకు వచ్చిన మరుక్షణంలో శరీరం సాధారణంగా తొండలకు లేని విధంగా పెరిగిపోతే ఆశ్చర్యపోయాను. యముడి దయతో నాకు మంచి జ్ఞానమున్నది కనుక ఈ రోజు యోగులకు లభించే నీ దివ్య సన్నిధి నాకు లభించింది' అని చెప్పాడు. పూర్వ జన్మకర్మానుగుణమైన రూపం కలిగింది. దాని కతడు సంతోషించి.

నృగుఁడు శ్రీకృష్ణువలనం బాపవిముక్తుఁడై పుణ్యలోకమునకుఁ బోవుట (సం.13-69-28)

తే. 'దేవ! నీ దగు కారుణ్య దృష్టి యమృత । పూరమును బోలె నా మీఁదఁ బొలయుటయును
దీనదశ పాసె; భవదనుజ్ఞానిరూఢి । నేను జనియెద సంచిత స్థానమునకు.' 436

ప్రతిపదార్థం: దేవ!= స్వామీ!; నీ దగు= నీదైన; కారుణ్యదృష్టి= దయగల చూపు; అమృతపూరమును పోలెన్= అమృత ప్రవాహంవలె; నా మీఁదన్= నాపైన; పొలయుటయును= వ్యాపించటంవలన; దీనదశ పాసెన్= దైన్యస్థితి పోయింది; భవత్= నీ; అనుజ్ఞానిరూఢిన్= ఆనతి మేరకు; సంచిత= కర్మతో సంపాదించుకొన్న; స్థానమునకున్= గతికి; నేనున్; చనియెదన్= పోతాను.

తాత్పర్యం: 'స్వామీ! నీ దయ అమృతప్రవాహమై నాపయి పొంగి పొరలినందువలన నా దీనత్వం తొలగిపోయింది. నీ ఆజ్ఞవలన సద్గతికి పోతాను.'

క. అని సవినయ ప్రణామం । బున నారాధించి వృష్ణిపుంగవుఁ దగ వీ
డ్కొని యా నృగుఁడు విమానం । బున నుత్తమలోకమునకుఁ బోయె నరేంద్రా! 437

ప్రతిపదార్థం: నరేంద్రా!= మానవులకు అధిపతీ!; అని; స+వినయ= వినయంతో కూడిన; ప్రణామంబునన్= నమస్కారంతో; ఆరాధించి= పూజించి; వృష్ణిపుంగవున్= వృష్ణివంశంలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడిని; తగన్= అర్హమైన రీతిగా; వీడ్కొని= సెలవు కైకొని; ఆనృగుఁడు= ఆ నృగుడనురాజు; విమానంబునన్= విమానంమీద; ఉత్తమ= శ్రేష్ఠమైన; లోకమునకున్= లోకానికి; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: రాజా! ఈ విధంగా వినయంతో నమస్కరించి, శ్రీకృష్ణుడిని పూజించి, తగినట్లుగా వారి సెలవు గైకొని విమానంమీద ఉత్తమలోకాలకు నృగుడు వెళ్ళిపోయాడు.

వ. ఇవ్విధంబున. 438

తాత్పర్యం: ఈ విధంగా.

క. భరితానందుఁ డగుచు నృగుఁ । డరిగిన, లోకహితకారియై కృష్ణుఁడు ని
ర్భర మధురతాతిహృద్యా । క్షరంబుఁగా నిట్టు లనియెఁ గౌరవముఖ్యా! 439

ప్రతిపదార్థం: నృగుఁడు= ఆ రాజు; భరిత= నిండిన; ఆనందుఁడు= ఆనందం కలవాడు; అగుచున్= అవుతూ; అరిగినన్= పోగా; కృష్ణుఁడు; లోకహితకారిఐ= లోకానికి మేలుకోరినవాడై; నిర్భర= నిండారిన; మధురతా= మాధుర్యంతో; అతి= మిక్కిలి; హృద్య= హృదయరంజకమైన; అక్షరంబుఁగాన్= అక్షరాలు కలిగినట్లుగా; కౌరవముఖ్యా!= కౌరవశ్రేష్ఠుడా!; ఇట్టులు; అనియెన్.

తాత్పర్యం: నృగుడు ఈ విధంగా ఆనందభారంతో పోయిన తరువాత శ్రీకృష్ణుడు మాధుర్యం నిండారిన అక్షరాలతో ఇట్లా సెలవిచ్చాడు.

క. 'ధరణీసుర ధన హరణము । దురితతమము నృపున కధిక దోషము నృగగో
హరణ క్రియ విప్రస్వా । హరణము భూపాలవరున కాపదఁ దెచ్చున్.' 440

ప్రతిపదార్థం: నృపునకున్= రాజునకు; ధరణీసుర= బ్రాహ్మణుల; ధనహరణము= సొమ్ము నపహరించటం; దురిత తమము= మిక్కిలి పాపం; అధిక దోషము= అతిశయమైన తప్పు; నృగ గోహరణ క్రియన్= నృగుడు గోవును హరించిన రీతిగా; భూపాలవరునకున్= భూమిని పాలించే ఏ రాజుకైనా; విప్ర= బ్రాహ్మణుడి యొక్క; స్వ+ఆహరణము= సొమ్మును కాజేయటం; ఆపద తెచ్చున్= ఆపదను కలిగిస్తుంది.

తాత్పర్యం: 'రాజునకు విప్రుని సొమ్ము అపహరించటం చాలా పాపం. కనుక విప్రుడి సొంత ధనాన్ని ఏ రాజూ హరించరాదు. అది మహాపాపం. నృగుడు విప్రుడి ఆవును అపహరించటం వలన కదా! అంత ఆపద పొందాడు.'

వ. అనియె; నివ్వాక్యంబులు నీకుం జెప్పవలవ దైన నితిహాసావసానువర్తి యగుటం జేసి వినిపించితి' నని చెప్పి యప్పాండవాగ్రజుతో భీష్ముండు వెండియు. 441

ప్రతిపదార్థం: ఈ+వాక్యంబులు= ఈ వాక్యాలు; నీకున్= నీకు; చెప్పన్= చెప్పటం; వలవదు= అక్కర్లేదు; ఐనన్= ఐనా; ఇతిహాస+అవసాన= కథ చివరలో; అనువర్తి= అనుసరించినది; అగుటం జేసి= అయినందువలన; వినిపించితిన్= వినిపించాను.

తాత్పర్యం: ఈ వాక్యాలు నీకు చెప్పనక్కర్లేదు. కాని, ఈ పురాణ కథాంతంలో ఉన్నందున నీకు చెప్పవలసి వచ్చింది.' అని చెప్పి ధర్మరాజుతో భీష్మడు ఇంకా.

క. 'సత్సంగతి సజ్జనులకు । నుత్సవ మొనరించు నృగున కున్నతిఁ ద్విజగ
ద్వత్సలుఁ డగు కృష్ణుండు స । ముత్సుకతం జేరఁ జనుట యొసఁగిన మాడ్కిన్.' 442

ప్రతిపదార్థం: త్రిజగత్+వత్సలుఁడు= మూడు లోకాలయందు వాత్సల్యంగలవాడు; అగు= ఐన; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; సముత్సుకతన్= మంచి ఉత్సాహంతో; చేరన్+చనుట= చెంతకు జేరుట; నృగునకున్= నృగు మహారాజుకు; ఉన్నతిన్= సద్గతిని; ఒసఁగినమాడ్కిన్= అనుగ్రహించిన విధంగా; సత్+జనులకున్= మంచివారికి; సత్+సంగతి= మంచివారిస్నేహం; ఉత్సవము= పండుగ, కోర్కెలు కొనసాగడం; ఒనరించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: 'సత్పురుషులకు మహాత్ములతో కలియటం పండుగవంటిది. శ్రీకృష్ణానుగ్రహంవలన కదా నృగు డుత్తమలోకాలకు వెళ్ళాడు.'

వ. అని పలికి మఱియును. 443

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

క. 'దానము సమగ్ర ఫలదము । భూనాయక! గోవునెడ విబుద్ధిత్వము గీ
డైనది గావున గోస । మ్మానన మేమఱక యుండు మది యేప్రొద్దున్.' 444

ప్రతిపదార్థం: భూనాయక!= రాజా!; దానము; సమగ్ర= పూర్ణసమస్త; ఫలదము= ఫలాన్నిస్తుంది.; గోవునెడన్= ఆవు విషయంలో; విబుద్ధిత్వము= అజ్ఞానం; కీడు= ఆపద; ఐనది; కావునన్= కాబట్టి; ఏ ప్రొద్దున్= ఎప్పుడును; గో సమ్మాననము= ఆవును ఆరాధించటం; మదిన్= మనస్సులో; ఏమఱక= మరువక; ఉండుము.

తాత్పర్యం: 'రాజా! దానం అమిత ఫలదాయి. కనుక ఆవు విషయంలో అజ్ఞానం పనికిరాదు. దానిని గౌరవంతో నిత్యమూ పూజించుము.'

వ. అనిన విని ధర్మజుండు 'గోవులయెడ విరుద్ధాచరణంబున నయ్యేడు దురితంబు తెఱంగెఱింగించితి; గో దాన ఫలవిశేషం బింకను విన వలతుం జెప్పవే' యనుటయు, ననిమిష నదీనందనుం 'డివ్విషయంబున నైనది యొక్క యితిహాసంబు గల దాకర్ణింపు' మని యతని కిట్లనియె. 445

ప్రతిపదార్థం: అనినన్, విని; ధర్మజుండు= ధర్మరాజు; గోవుల ఎడన్= ఆవుల విషయంలో; విరుద్ధ+ఆచరణంబునన్= వ్యతిరేకమైన కర్మచేత; అయ్యేడు= కలిగే; దురితంబు= పాపంయొక్క; తెఱంగు= విధానం; ఎఱింగించితి= స్పష్టం చేశావు; గోదాన ఫలవిశేషంబు= ఆవును దానం చేయటంవలన కలిగే విశేషఫలం; ఇంకనున్= ఇంకా; వినవలతున్= వినాలనివాంఛిస్తున్నాను; చెప్పవే అనుటయున్= అని అడుగగా; అనిమిష నదీ= దేవతానదియైన గంగయొక్క; నందనుండు= కొడుకు; ఇవ్విషయంబునన్= ఈ విషయంలో; ఐనది= జరిగినది; ఒక్క+ఇతిహాసంబు+కలదు= ఒక పూర్వకథ ఉన్నది; అకర్ణింపుము= వినుము అని; అతనికిన్= ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆవు విషయంలో వ్యతిరేకంగా చేయటంవలన కలిగే పాపం సమగ్రంగా చెప్పావు. గోవును దానం చేసినందువలన కలిగే విశేషఫలం వినాలని ఉన్నది. చెప్పు' మని అడిగితే దేవతానది కొడుకు 'ఈ విషయంగా ఒక కథ ఉన్నది చెప్పుతాను వినుము' అని ఇట్లా అన్నాడు.

గో ప్రభావ విషయకం బగు నౌద్దాలకి పుత్ర చరిత్రము (సం.13-70-1)

సీ. 'అనఘుఁ డౌద్దాలకి యను మహాముని । దన తనయునిఁ బిలిచి యిధ్మములు దర్భ
కట్టయు జలపూర్ణ కలశంబుఁ బువ్వులు । మఱచి వచ్చితి నేటి మడఁ గుమార!
గొని రమ్ము వేగంబ చని' । యన్ననాచికేతాహ్వయుం డగు నతం డరుగునంత
వాహిని పొంగిన వఱ్ఱోడి యవి వోయెఁ । గానక యాతండు క్రమ్మఱంగ

ఆ. నరుగుదెంచి కాన ననుటయు నాఁకలి । దనదు కర్మవైకృతంబు సైఁపఁ
జాలకలిగి 'యోరి! జముఁ జూడఁ బొ'మ్మని । శాప మిచ్చెఁ దండ్రి భూపవర్య! 446

ప్రతిపదార్థం: అనఘుఁడు= పుణ్యాత్ముడు; ఔద్దాలకి= ఉద్దాలకుడి కొడుకు; అనుమహాముని= అనేగొప్ప ఋషి; తన; తనయునిన్= కొడుకును; పిలిచి; ఇధ్మములు= అగ్నిలో వేసే సమిధలు; దర్భకట్టయున్= దర్భలకట్ట; జలపూర్ణకలశంబున్= నీరునిండా ఉన్న చెంబు; పువ్వులున్; ఏటిమడన్= ఏటిరేవులో - ఒడ్డున; మఱచివచ్చితిన్; కుమార!= నాయనా!; వేగంబ చని= త్వరగా పోయి; కొనిరమ్ము= తీసికొనిరమ్ము; అన్నన్= అని చెప్పగా; నాచికేత+ఆహ్వయుండు+అగు+అతండు= నాచికేతుడన్నపేరుగల ఆతడు; అరుగునంతన్= వెళ్ళేలోపల; వాహిని= నది; పొంగినన్= పొంగగా; వఱ్ఱు ఓడి= వరదపాలై, ప్రవాహంపాలై; అని పోయెన్= తండ్రి చెప్పినవన్నీ నీటిలో కొట్టుకొనిపోయాయి; ఆతండు= నాచికేతుడు; కానక= చూడక; క్రమ్మఱంగన్= తిరిగి; అరుగుదెంచి= వచ్చి; కానన్= వాటిని చూడలేకపోయాను; అనుటయున్= అనగా; ఆఁకలి; తనదు= తన; కర్మవైకృతంబు= కర్మ దుష్ఫలితం; సైఁపన్‌చాలక= ఓర్చుకొనలేక; తండ్రి; ఓరీ= కోపంతోచేసిన సంబోధన; జమున్= యముడిని; చూడన్= చూడటానికి; పొమ్ము= పో; అని; అలిగి= కోపించి; శాపమున్; ఇచ్చెన్.

తాత్పర్యం: ఉద్దాలకుని కొడుకు ఔద్దాలకి. అతడి కొడుకు నాచికేతుడు. ఒకరోజు తండ్రి కొడుకుతో 'నాయనా! ఏటిరేవులో కుశలు, సమిధలు, కమండలువు, పూలూ అన్నీ మరచిపోయి వచ్చాను. త్వరగా పోయి తీసికొనిరమ్ము' అన్నాడు. కొడుకూ సరే నని పోగా, అంతకుముందే నది పొంగి వాటిని తనతోపాటు తీసికొనిపోయింది. కొడుకు వాటిని కానక తిరిగివచ్చి తండ్రితో చెప్పగానే ఆయనకు ఆకలి, దుష్ట కర్మఫలం ఏకమై క్రమ్ముకోగా కొడుకును 'యముడి దగ్గరికి పొమ్ము' (చావుము) అని శపించాడు.

విశేషం: ఇందులో తెలుగు మాటలు - ఏటిమడ, వఱ్ఱు, ఓడి (నీరు ఓడటం) చాలా అందమైనవి.

ఈ ఔద్దాలకి - నాచికేతుల కథ కఠోపనిషత్తులోనిది. ఇందులో తండ్రి ముసలి ఆవులను దానంచేస్తూ ఉంటే చూచిన కొడుకు న న్నెవరికి దానం చేస్తా? వని ముమ్మా రడిగితే 'యముడికి' అని తండ్రి కోపంతో విసుగుతో అంటాడు. వాడు యముడి దగ్గరకు వెళ్ళి ఆధ్యాత్మికవిద్య నెరిగి వస్తాడు. అదే కఠోపనిషత్తు.

వ. ఇట్లు శపియించిన నబ్బాలకుండు గేలు మోడ్చి ఫాలంబున మోపికొనుచుం 'బ్రసన్నుండ వగు' మని పలుకు పలుకఁగాఁ జేతనారహితుండై పడుటయు నమ్మునివరుండు. 447

ప్రతిపదార్థం: ఇట్లు; శపియించినన్; ఆ+బాలకుండు= ఆ పిల్లవాడు; కేలు= చేయి; మోడ్చి= ముడిచి; ఫాలంబునన్= నుదుటిపై; మోపికొనుచున్= ఆనిస్తూ; ప్రసన్నుండవు= ప్రశాంత మనస్కుడవు; అగుము= కమ్ము; అని పలుకు= మాట; పలుకఁగాన్= అన్నంతలో; చేతనా= చైతన్యం, ప్రాణం; రహితుండై= పోయినవాడై; పడుటయున్= క్రిందపడటంతో; ఆ మునివరుండు= ఆ మునిరాజు.

తాత్పర్యం: తండ్రి శపించేసరికి కొడుకు నమస్కరించి తండ్రీ నా పై దయ చూపించుమని అంటూ ఉండగానే అతడి ప్రాణం పోయి క్రింద పడ్డాడు. అప్పుడు తండ్రి.

క. కనుఁగొని పశ్చాత్తాపం । బున నుల్లం బెరియ నిట్లు పుత్త్రకు నే నే
పనికై చేసితి విగతా । సునిఁగా నని మూర్ఛ మునుఁగుచుం బడియె ధరన్. 448

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; పశ్చాత్= వెనుక కలిగే; తాపంబునన్= బాధచేత; ఉల్లంబు= మనస్సు; ఎరియన్= మాడిపోగా; ఇట్లు; పుత్త్రకున్= కొడుకును; నేను; ఏ పనికై= దేనికొరకు; విగత+అసునిన్ కాన్= పోయిన ప్రాణాలు కలవాడినిగా; చేసితిన్= చేశాను; అని; మూర్ఛన్= మూర్ఛలో; మునుఁగుచున్= మునుగుతూ; ధరన్= భూమిపై; పడియెన్=పడ్డాడు.

తాత్పర్యం: చూచి తండ్రి పశ్చాత్తాపంతో కుమిలి 'అయ్యో! కొడుకును దేనికొరకు చంపుకొన్నా?'నని మూర్ఛపడ్డాడు.

వ. పడి యొక్కింతసేపునకుం దేఱి తనయుం దేఱి చూచి యశ్రులొలుక నబ్బాలకు నురంబున మొగంబు మోపి చేష్ట దక్కి యుండ, నద్దినశేషంబును నయ్యామినియునుం జనియె సూర్యోదయ సమయంబున. 449

ప్రతిపదార్థం: పడి= భూమిపై పడి ఒక్కింతసేపునకున్= కొంచెం సేపటికి; తేఱి= తేరుకొని; తనయున్= కొడుకును; తేఱి జూచి= తేరిపార చూచి; అశ్రులు+ఒలుకన్= కన్నీరు పారగా; ఆ+బాలకు= ఆ కొడుకుయొక్క; ఉరంబునన్= రొమ్ముపై; మొగంబు= తనమొగం; మోపి= ఆనించి; చేష్ట+తక్కి= చైతన్యంపోయి; ఉండన్= ఉన్నంతలో; ఆ+దినశేషంబును= ఆ మిగిలిన పగలు; ఆ+యామినియున్= ఆ రాత్రికూడా; చనియెన్= కడచింది; సూర్య+ఉదయ సమయంబునన్= తెల్లవారి ప్రొద్దుపొడిచేవేళ.

తాత్పర్యం: కొంతసేపటికి తేరుకొని కొడుకును చూచి ఏడ్చి, పిల్లవాడి రొమ్మున మొగంపెట్టి నిశ్చేష్టుడై ఉన్నంతలో మిగిలిన పగటితోపాటు రాత్రికూడ గడచిపోయింది. ప్రొద్దుపొడుస్తున్న వేళలో.

ఆ. అతని కన్ను నీర నాప్లుతంబైన యా । శవము చేతనించి చలన మొంది
యెలమి నత్తపస్వి యీక్షించుచుండఁ గ । న్దెఱచె, నిట్లు మగుడఁ దెలివినొంది. 450

ప్రతిపదార్థం: అతనికన్ను నీరన్= తండ్రియొక్క కన్నీటితో; ఆప్లుతంబైన= అంతటా తడిసిపోయిన; ఆ శవము; చేతనించి= చైతన్యం పొంది; చలనమొంది= కదలిక కలిగి; అత్తపస్వి= ఆ ముని; ఎలమిన్= సంతోషంతో; ~~ఈక్షించుచుండన్~~= చూస్తుండగా; అట్లు; మగుడన్= తిరిగి; తెలివిన్+ఒంది= తెలివి కలిగి; కన్+తెఱచెన్= కన్ను విప్పాడు.

తాత్పర్యం: తండ్రి కన్నీటిలో నానిపోయిన ఆ శవం క్రమంగా చైతన్యం పొంది తెలివి కలుగగా తిరిగి కళ్ళు తెరిచాడు.

క. తనుఁ గనుఁగొనియెడి సుతుతో । మునిపతి యి ట్లనియెఁ 'బుణ్యముల ప్రోఁకవు నీ
వనఘ! చని పుణ్యలోకముఁ । గని మత్పుణ్యమున రాక గలిగెను మగుడన్. 451

ప్రతిపదార్థం: తనున్= తనను; కనుఁగొనియెడి= చూచెడు; సుతుతోన్=కొడుకుతో; మునిపతి= మునిరాజు; ఇట్లు; అనియెన్; పుణ్యముల ప్రోఁకవు= నా పున్నెముల రాశివి; అనఘ!; నీవు; చని= పోయి; పుణ్యలోకమున్= ఏ స్వర్గలోకమునో; కని= చూచి; మత్= నా; పుణ్యమునన్= పుణ్యంతో; మగుడన్= తిరిగి; రాక= రావటం; కలిగెను= సంభవించింది.

తాత్పర్యం: తనను చూస్తున్న కొడుకుతో తండ్రి 'నా పుణ్యాలరాశీ! నాయనా! ఏ పుణ్యలోకమో పోయి తిరిగి నా అదృష్టంచేత తిరిగి రావటం కలిగిందిరా!

క. నీదగు తనువున దివ్యా । మోదము సాంద్రమయి సోడు ముట్టెడు నత్యా
హ్లాదమహాశ్చర్యసము । త్పాది యగుచు; నీగతాగతములం జెపుమా!' 452

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; ఆహ్లాద= సంతోషం; మహా+ఆశ్చర్యం= గొప్ప అద్భుతం; సముత్పాది= కలిగించేది; అగుచున్= అవుతూ; నీది+అగు= నీదైన; తనువునన్= శరీరంలో; దివ్య= దేవతా సంబంధమైన; ఆమోదము= పరిమళం; సాంద్రము+అయి= దట్టమై; సోడు= బ్రహ్మరంధ్రము; ముట్టెడున్= తాకుతున్నది; నీ= నీయొక్క; గత= పోక; ఆగతములన్= రాకలను గురించి; చెపుమా!= చెప్పరా!

తాత్పర్యం: నీ శరీరం నుండి దివ్యమైన వాసనలేవో గుబులుకొంటూ నాసాగోళాలనంట తాకుతున్నవి. ఇది చాలా ఆహ్లాదంగా, ఆశ్చర్యంగా ఉన్నది. కనుక నీ వెక్కడికి వెళ్ళావు? మరలా ఎట్లా తిరిగి రాగలిగావు? ఆ కథ చెప్పవయ్యా!'

వ. అనిన విని యమ్మునిపతికిం బ్రణమిల్లి యక్కుమారుం డిట్లనియె. 453

ప్రతిపదార్థం: అనినన్‌విని; ఆ మునిపతికిన్= ఆ మునిశ్రేష్ఠుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; ఆ కుమారుండు= ఆ బాలకుడు; ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: ఆ మాటలు విని కొడుకు తండ్రికి నమస్కరించి ఇట్లా అన్నాడు.

సీ. ' నీ యాజ్ఞc జని కమనీయ విశాలమై । మణిమయత్వంబున మహిత మగుచు
వెలిcగెడు సమవర్తి కొలువు కూటముc బ్రవే । శించితి నాతcడు సేరc బిలిచి
యంచితాసనము వెట్టించి భవద్గౌర వాతిశయంబున నర్ఘ్య ముఖ్య
పరిపూజనముల సంభావించె నతనితో । 'నే లోకమున వసియించువాcడ

తే. ననఘ! యానతి యిమ్ము నా కంటి 'ననిన । 'నీవు సావవు; నీ తండ్రి నిన్ను జమునిc
జూడc బొమ్మని పనిచినc జూచి; తంద । యరుగు మమ్ముని వగ పేద' ననియె నతcడు. 454

ప్రతిపదార్థం: నీ యాజ్ఞన్= నీ ఆనతితో; చని= వెళ్ళి; కమనీయ= అందమైన; విశాలమై= విశాలమైన; మణిమయత్వంబునన్= మణులు నిండారి ఉన్నందున, మణులతో స్థగితమైనందున; మహితము= గొప్పది; అగుచున్= అవుతూ; వెలిcగెడు= ప్రకాశించే; సమవర్తి= యముడి; కొలువుకూటమున్= సభాశాలలో; ప్రవేశించితిన్= ప్రవేశించాను; ఆతcడు= ఆ యముడు; చేరన్ పిలిచి= దగ్గరకు పిలిచి; అంచిత= అందమైన; ఆసనము= పీఠం; పెట్టించి= భటులతో ఏర్పాటుచేసి; భవత్= నీపై నున్న; గౌరవ అతిశయంబునన్= అధిక గౌరవ భావంతో; అర్ఘ్య= ఆచమించే నీరు; ముఖ్య= మొదలైన; పరిపూజనములన్= గొప్ప పూజలతో; సంభావించెన్= నన్ను గౌరవించాడు; అతనితోన్; అనఘ!= పుణ్యాత్ముడా!; ఏ లోకమునన్= ఏ లోకంలో; (నేను) వసియించువాcడను= వసించాలి; నాకున్; ఆనతిఇమ్ము= సెలవిమ్ము; అంటిన్= అన్నాను; అనినన్; నీవు; చావవు= చచ్చిపోలేదు; నీ తండ్రి; నిన్నున్; జమునిన్= యముడిని; చూడన్+పొమ్ము= చూడటానికి పొమ్ము; అని; పనిచినన్= ఆజ్ఞాపిస్తే; చూచితి= (వచ్చి నన్ను) చూచావు; ఆ+ముని= ఆ మునియొక్క; వగపు= దుఃఖం; ఏదన్= పోగా; అంద= అక్కడికే; అరుగుము= పొమ్ము; అని అతcడు= ఆ యముడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నీ యానతితో నేను వెళ్ళి విశాలమైన మణులు పొదిగిన అందమైన యముడి కొల్వుకూటంలో ప్రవేశించేసరికి ఆయన నీమీదున్న గౌరవభావంతో నాకు సింహాసనం, అర్ఘ్యం మొదలైనవి ఇచ్చి గౌరవించాడు. నే నన్నాను అర్థంగాక - 'ప్రస్తుతం నేను ఏ లోకంలో ఉండాలని అని అడుగగా అత డన్నాడు 'నీవు చావలేదురా! నీ తండ్రి యముడిని చూడరా' అని తిట్టాడు కదా! చూచావు. అక్కడికే పొమ్ము! పాపం మీ నాయన ఏడుస్తున్నాడు' అని అన్నాడు.

విశేషం: భవత్ గౌరవాతిశయంబునన్ - అని అనటం గొప్ప సంస్కార ఫలితం. అది తన గొప్పతనమని భ్రమించవచ్చునుగదా! కనుక నాచికేతుడి మర్యాదను సూచిస్తున్నది. యముడి మాటలు పెద్దవాడు చిన్నవాడితో ముద్దుగా అన్నట్లున్నాయి.

వ. అనుటయు 'నట్లకాక! మగిడిపోయెద; నీ కడకు వచ్చితి, ధర్మమయుండవగు నిన్ను దర్శించితిం; బుణ్యలోకంబులు దర్శింప వేడ్క పుట్టెడుఁ జూపవే' యని విన్నవించిన. 455

ప్రతిపదార్థం: అనుటయున్= అనియముడు పలుకగా; అట్లకాక= అట్లాగే; మగిడి= తిరిగి; పోయెదన్= పోతాను; నీ కడకున్= నీ దగ్గరకు; వచ్చితిన్= వచ్చాను; ధర్మమయుండవు= ధర్మ స్వభావుడవు; అగు= అయిన; నిన్నున్= నిన్ను (యమధర్మరాజును) దర్శించితిన్= దర్శించగలిగాను; పుణ్యలోకంబులు= స్వర్గాది పుణ్యలోకాలు; దర్శింపన్= చూడాలనే; వేడ్క+పుట్టెడున్= కోరిక కలుగుతున్నది; చూపవే= చూపించవా; అని= అని; విన్నవించినన్= విన్నపం చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: 'అట్లాగే తిరిగి వెళ్ళుతాను. ధర్మమూర్తివైన నిన్ను దర్శించాను. పుణ్యలోకాలని ఉంటాయట గదా! వాటిని దర్శించాలని కోరికగా ఉన్నది. చూపించవా!' అని విన్నవించుకొనగా.

ఉ. అంచిత వాహనా కలిత యానముఁ దేరఁగఁ బంచి నన్ను నె
క్కించి సహాధిరూఢుఁ డయి కేల్ దన కేల నమర్చి సత్కథా
సంచయవర్తనుం డగుచుఁ జారుముఖాబ్జవికాస మొప్ప వ
ర్తించుచుఁ బుణ్యలోకములు ప్రీతి యెలర్పఁగ నాకుఁ జూపినన్. 456

ప్రతిపదార్థం: అంచిత= అందమైన; వాహన+ఆకలిత= గుర్రాలను పూంచిన; యానమున్= బండిని; తేరఁగన్+పంచి= తెప్పించి; నన్నున్; ఎక్కించి; సహ+అధిరూఢుఁడు+అయి= నాతోపాటు తానూకూర్చుండి; కేల్= నా చేతిని; తనకేలన్= తన హస్తంలో; అమర్చి= ఘటించి, పట్టుకొని; సత్ కథా సంచయ= దివ్యకథలసమూహం; వర్తనుండు+అగుచున్= చెప్పుతూ; చారు= అందమైన; ముఖ= ముఖం అనెడి; అబ్జ= తామరపూవుయొక్క; వికాసము+ఒప్పన్= వికసించిన అందం ప్రకాశించగా; వర్తించుచున్= మెలగుతూ; పుణ్యలోకములు= స్వర్గాది లోకాలను; ప్రీతి= ప్రేమ; ఎలర్పఁగన్= తేటపడగా; నాకున్; చూపినన్= చూపించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అందమైన గుర్రాలు కట్టిన రథం తెమ్మని ఆజ్ఞాపించి నన్ను ఎక్కించి (చేతితో పట్టి) తానూ నాతోపాటు కూర్చుండి తనచేతితో నాచేయి పట్టుకొని, మంచి కథలు చెప్పుతూ వికసించిన ముఖంతో నవ్వుతూ నాకు పుణ్యలోకాలన్నీ చూపించగా.

తే. నయనములకుఁ జిత్తమున కానంద మొసఁగు । నట్టి మణిగేహవాపికోద్యానములును
బరమభక్ష్య భోజ్యాత్మక గిరులు హృద్య । దుగ్ధ ఘృతమయ ఘనసరిత్తులును గంటి. 457

ప్రతిపదార్థం: నయనములకున్= కన్నులకు; చిత్తమునకున్= మనస్సుకు; ఆనందమున్= ఆనందం; ఒసఁగునట్టి= కలిగించే; మణిగేహ= మణులు తాపిన ఇండ్లు; వాపికా= దిగుడు బావులున్నూ; ఉద్యానములును= ఉద్యాన వనాలున్నూ; పరమ= గొప్ప; భక్ష్య= నమిలి తినేవి; భోజ్య= భుజించేఆహారాలు; ఆత్మక= కల; గిరులు= కొండలు; హృద్య= ఆప్యాయమైన; దుగ్ధ= పాలు; ఘృత= నేయి; మయ= మయమైన; ఘన= గొప్ప; సరిత్తులును= నదులును; కంటిన్= చూచాను.

తాత్పర్యం: కళ్ళకూ మనస్సుకూ ఆహ్లాదాన్ని కలిగించే మణిసౌధాలు, దిగుడుబావులు, ఉద్యానవనాలూ, కొండలవలె ఉన్న భక్ష్యాలు, భోజ్యాలు, నదులై పారే పెరుగు, పాలు, నేయి చూచాను.

విశేషం: కొండలే భక్ష్యభోజ్యాలుగా ఉన్నాయి. పాలు, నేయి నదులుగా పారుతున్నాయి.

వ. మఱియు గంధమాల్య దివ్యాంబరాభరణ ప్రముఖంబులగు భోగ యోగ్య పదార్థంబులు మహారాసులై యుండ నాలోకించితి; 'ఈ లోకంబు లే పుణ్యంబులు సేసిన జనుల కనుభావ్యంబు?' లని యడిగితి; నడిగిన ధర్మరా జిట్టిట్టి వారివని యెఱింగించి 'యిం దధిక విభవంబులైన యట్టి మాననీయ స్థానంబులు గోదానంబు లాచరించిన వారలయవి; భక్ష్యభోజ్య గిరులును దుగ్ధ ఘృతనదులును వారివ' యని చెప్పి, వెండియు.458

ప్రతిపదార్థం: గంధ= చందనం; మాల్య= పూదండలు; దివ్య= దేవతా సంబంధమైన; అంబర= వస్త్రాలు; ఆభరణ= నగలు; ప్రముఖంబులు+అగు= మొదలైనవి; భోగయోగ్య= అనుభవించటానికి తగిన; పదార్థంబులున్= వస్తువులు; మహా= గొప్ప; రాసులై= గుట్టలై; ఉండన్= ఉండగా; ఆలోకించితిన్= చక్కగా చూచాను; ఈ లోకంబులు= ప్రస్తుతం నేను చూస్తున్న ఈ లోకాలు; ఏ పుణ్యంబులు= ఎట్లాంటి పుణ్యాలు; చేసిన; జనులకున్; అనుభావ్యంబులు= భోగించ దగ్గవి; అని; అడిగితిన్; అడిగినన్; ధర్మరాజు; యముడు; ఇట్టిట్టివారివి= ఇట్లాంటి వారికి సంబంధించినవని; ఎఱింగించి= స్పష్టపరచి; ఇందున్; అధిక విభవంబులు= మిక్కిలి వైభవం కలవి; ఐనయట్టి; మాననీయ= గౌరవింపదగ్గ; స్థానంబులు= లోకాలు; గోదానంబులు; ఆచరించిన వారలయవి= చేసినవారివి; భక్ష్యభోజ్య గిరులును= భక్ష్యాల, భోజ్యాల కొండలు; దుగ్ధ= పాలు; ఘృత= నేయి; నదులును; వారివ= గోదానం చేసినవారివే, అని చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: మంచిగంధం, పూలమాలలు, దేవలోకంనుండి వచ్చిన వస్త్రాలు, ఆభరణాలు మొదలైన భోగాలకు తగిన పదార్థాలు పెద్దరాసులుగా ఉండగా చూచాను. ఈ లోకాలు ఏ పుణ్యకార్యాలు చేసినవారికి అనుభవించదగినవి అని అడిగాను. అప్పుడు ధర్మరాజు ఇటువంటివారివి యీలోకాలు అని తెలియజేసి ఇందులో చాలా గొప్ప సంపదలుగలవి, గొప్పగా భావింపదగినవి అయిన స్థానాలు గోదానాలు చేసిన వారివి. భుజింపదగిన పదార్థాలకొండలు, పాలు, నెయ్యి అనేవాని నదులున్నూ వారివే అని చెప్పి యింకా.

క. మానిత పాత్రము సద ను । ష్ఠానంబును బ్రీతి భక్తి సంపన్నతలున్
ధేనువు మేలిమియుం గల । దానముఫల మిట్టి దనఁగఁ దరమె యజునకున్. 459

ప్రతిపదార్థం: మానిత= గౌరవింప దగ్గదీ; పాత్రము= యోగ్యమైనదీ; సత్+అనుష్ఠానంబును= మంచి కర్మానుష్ఠానానికి యోగ్యమైనదీ; ప్రీతి= ప్రేమ; భక్తి; సంపన్నతలున్= సంపదలును; ధేనువు= ఆవే; మేలిమియున్= మేలు; ఆధిక్యం; కల= కలిగిన; దానము ఫలము= దానఫలం; అజునకున్= బ్రహ్మకు; ఇట్టిది; అనఁగన్= అనటానికి; తరమె!= శక్యమా!

తాత్పర్యం: గౌరవించ దగినదీ, యోగ్యమైనదీ, అనుష్ఠానం, ప్రేమ, భక్తి సంపదల మేల్మిగలట్టి గోదాన ఫల మింతింతని చెప్పటానికి బ్రహ్మకు శక్యం కాదు.

తే. బలము లేఁబ్రాయమును రూపుఁ గలుగునట్టి । గనపయెద్దు సద్ధర్మ విప్రునకు నిచ్చి
నతఁడు సద్విధి గోదాన మాచరించి । నతని పడసిన గతిఁ గాంచు ననఘచరిత! 460

ప్రతిపదార్థం: అనఘ చరిత!= పుణ్య ప్రవర్తన కలవాడా!; బలము; లేఁబ్రాయమును= లేతవయస్సు; రూపు= రూపం; కలుగు+అట్టి= ఉన్నటువంటి; గనపయెద్దున్= ఎత్తైన, బలిసిన ఎద్దు; సత్+ధర్మ విప్రునకున్= మంచి ధర్మపరుడైన బ్రాహ్మణుడికి; ఇచ్చినతఁడు= దానం చేసినవాడు; సత్+విధిన్= వేదోక్తంగా; గోదానమున్; ఆచరించినతని= చేసినవాడు; పడసిన గతిన్= పొందిన దశను; కాంచున్= పొందగలడు.

తాత్పర్యం: బలం, రూపం, లేతవయస్సు గల గనపయెద్దును ధర్మపరుడైన సద్బ్రాహ్మణునకు దానంచేస్తే వేదోక్తంగా గోదానం చేసినవాడు పొందే సద్గతి పొందగలడు.

క. గోవులు సూర్యుని యుజ్జ్వల । గోవులయ ట్లగుటఁ జేసి గోదానపరుల్
భూవినుతా! సూర్య సదృశు । లై వెలుఁగుదు; రిట్ల చెప్పు నాగమఫణితుల్.' 461

ప్రతిపదార్థం: గోవులు= ఆవులు; సూర్యుని= సూర్యుడియొక్క; ఉత్+జ్వల= ప్రకాశించే; గోవుల కిరణాల; అట్లు; అగుటన్+చేసి= అయినందువలన; గోదానపరుల్= ఆవులను దానం చేసేవారు; భూవినుతా!= లోకంచేత పొగడబడేవాడా! సూర్యసదృశులు+ఐ= సూర్యుడివంటివారై; వెలుఁగుదురు= ప్రకాశిస్తారు; ఆగమ ఫణితుల్= వేదవాక్యాలు; ఇట్లు+అ చెప్పున్= ఇట్లా చెప్పుతున్నాయి.

తాత్పర్యం: ఆవు లంటే సూర్యకిరణాలవంటివి. కనుక గోదానం చేసేవారు సూర్యుడివలె ప్రకాశిస్తా రని ఆగమమార్గాలు చెప్పుతున్నాయి.'

క. అని పలికి వీడుకొలిపిన । మునివర! యజ్జముని చరణముల కెఱఁగి ముదం
బున వచ్చితి' ననె జనకుని । మన మానందరసపూర మయతం బొంగన్. 462

ప్రతిపదార్థం: అని పలికి; వీడుకొలిపినన్= సెలవిప్పించగా; మునివర!= మునిశ్రేష్ఠా!; ఆ+జముని= ఆ యముని; చరణములకున్= పాదాలకు; ఎఱఁగి= నమస్కరించి; ముదరంబునన్= సంతోషంతో; వచ్చితిన్= వచ్చాను; అనెన్= అన్నాడు; జనకుని= తండ్రి; మనము= మనస్సు; ఆనందరస= ఆనందరసమనెడు; పూర= ప్రవాహ; మయతన్= స్వరూపంతో; పొంగన్= పొంగులెత్తగా.

తాత్పర్యం: అని చెప్పి నన్ను పొమ్మనగా ఆ యముడి పాదాలకు నమస్కరించి సంతోషంతో వచ్చాను' అని తండ్రి మనస్సులో ఆనందరసం పొంగిపొరలేటట్లుగా వినిపించాడు.

ఇంద్రునకు బ్రహ్మ చెప్పిన గోదాన విషయక వాక్యము (సం.13-71-5)

వ. అని చెప్పిన విని కుంతీతనయాగ్రజుండు 'గోదాన కర్త లెందేని వసింతు రాలోకం బెట్టి? దెఱింగింపు' మనిన నన్నరదేవునితో దేవవ్రతుండు 'దీనికి బ్రహ్మవాక్యంబులు గల; వివి యింద్రుం డడిగిన నతనికి బ్రహ్మ యిట్లనియె. 463

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని భీష్ముడుచెప్పగా, విని= ఆలకించి; కుంతీతనయ+అగ్రజుండు= కుంతి కొడుకులలో పెద్దవాడు; గోదానకర్తలు= ఆవులను దానంచేసినవారు; ఎందున్+ఏని= ఎక్కడ; వసింతురు= నివాసం చేస్తారో; ఆలోకంబు= ఆ గోలోకం; ఎట్టిది= ఎట్లాంటిది; ఎఱింగింపుము= తెలియజేయుము; అనినన్=అనగా; ఆ+నరదేవునితోన్= ఆ రాజుతో; దేవవ్రతుండు= భీష్ముడు; దీనికిన్; బ్రహ్మ వాక్యంబులు= బ్రహ్మచెప్పిన సమాధానములు; కలవు= ఉన్నవి; ఇట్లు+అ = ఈ విధంగా; ఇంద్రుండు=ఇంద్రుడు; అడిగినన్= అడుగగా; అతనికిన్= ఇంద్రునికి; బ్రహ్మ= బ్రహ్మ; ఇట్లు+అ= ఈ విధంగా జవాబు చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా భీష్ముడు చెప్పిన తరువాత ధర్మరా జన్నాడు 'గోదానం చేసినవా రేలోకాలకు పోతారో చెప్పుము' అని. దానికి భీష్ముడు 'నీవలె పూర్వం ఇంద్రుడు బ్రహ్మ నడిగితే ఆయన చెప్పిన మాటలు వినిపిస్తాను విను' మని ఇట్లా అన్నాడు.

ఆ. 'అడిగి మేలు సేసి; తాలోక మెవ్వరు । నెఱుఁగ కునికిఁ దెల్ల; మేను సువ్ర
తాత్ములైన మునులు నతుల పాతివ్రత్య । సతులు నెఱుఁగుదుము విశాలచిత్త! 464

ప్రతిపదార్థం: విశాలచిత్త!= గొప్ప మనస్సు కలవాడా! అడిగి= ప్రశ్నించి; మేలుచేసితి= మేలు చేశావు; ఆలోకమున్= ఆలోకాన్ని; ఎవ్వరున్= ఎవ్వరూ; ఎఱుఁగక+ఉనికి= తెలియకుండటం; తెల్లము= స్పష్టం; ఏనున్= నేను; సువ్రత+ఆత్ములు= గొప్ప వ్రతాలు చేసే స్వభావం కలవారు; ఐన మునులు= ఐనటువంటి ఋషులు; అతుల= సాటిలేని; పాతివ్రత్య సతులు= పతియే (భర్తే) దైవమని ఆరాధించే శీలవతులు; ఎఱుఁగుదుము= ఆ లోకం గురించి ఎరిగినవాళ్ళం.

తాత్పర్యం: 'ఆలోకం తెలిసినవారు నేను, వ్రతనిష్ఠులైన మునులు, పతివ్రతలైన స్త్రీలు మాత్రమే. కనుక నీ వడిగి లోకానికి మేలు చేశావు. నీ వడగకపోతే ఈ విషయం మాలోనే ఉండి ఎవరికీ తెలిసేది కాదు.

క. విను మయ్యెడఁ గాలక్రమ । మును దప్పియు రోగములును ముదిమియు లే; వ
వ్వినుత స్థానం బవ్యయ । మును గేవల సార సంప్రమోదకరంబున్. 465

ప్రతిపదార్థం: వినుము; ఆ+ఎడన్= ఆ చోట; కాల= కాలంయొక్క; క్రమమును= క్రమం; డప్పియున్= దప్పిక; రోగములునున్= రోగాలు; ముదిమియున్= ముసలితనం; లేవు; ఆ+వినుత= ఆ పొగడదగిన; స్థానంబు= చోటు; న+వ్యయమునున్= నాశనంలేనిది; కేవల= ముఖ్య; సార= సారవంతమైన; సంప్రమోదకరంబున్= మంచి ఆనందం కలిగించేది.

తాత్పర్యం: ఆ లోకంలో కాలక్రమ ముండదు. ఋతువు లుండవు, దప్పి, రోగాలు ముసలితనం లేవు. ఆ ప్రశంసింపదగ్గ లోకం నాశనం లేనిది. స్వచ్ఛమైన ఆనందాన్ని కలిగించేది.

వ. దానిపేరు గోలోకంబు. 466

తాత్పర్యం: దాని పేరు గోలోకం.

క. గురు శుశ్రూషకులును, స । త్యరతులు శమదమ వినిర్మలాత్ములు దుర్భ
క్ష్యరహితులును నిల్తు రను । త్తర మగునచ్చోట గోప్రదానపరులతోన్. 467

ప్రతిపదార్థం: న+ఉత్తరము= అత్యుత్తమమైనది; అగు; ఆ+చోటన్= ఆ గోలోకంలో; గోప్రదాన పరులతోన్= ఆవులను దానం చేసేవారితోపాటుగా; గురు శుశ్రూషకులునున్= గురువులను సేవించేవారున్నూ; సత్యరతులున్= నిజాన్నే చెప్పేవారున్నూ;

శమ, దమ= బయటి ఇంద్రియాలను, లోపలి ఇంద్రియాలను (జయించిన); వినిర్మల+ఆత్ములు= స్వచ్ఛమైన ఆత్మలు కలవారు; దుర్+భక్ష్య రహితులున్= చెడు తిండి తిననివారూ; నిల్తురు= నివసిస్తారు.

తాత్పర్యం: ఆ లోకంలో గోదానం చేసేవారితోపాటుగా, గురువులను సేవించేవారూ, సత్యమే చెప్పేవారూ, అంతరింద్రియ, బహిరింద్రియ జయంద్వారా పరిశుద్ధమైన ఆత్మలు కలవారూ, అపవిత్రాహారం తిననివారూ నివసిస్తారు.'

వ. అని వెండియు. 468

తాత్పర్యం: అని చెప్పి, మరలా (ఇట్లా అన్నాడు)

ఉ. 'దాయధనంబు సంగరవిధా సముపార్జితమున్ సధర్మ కో
పాయసమాహితంబును శుభప్రతిపాదనలబ్ధమున్ మరు
న్నాయక! వెండియుం గలుగు నాయపుఁ జొప్పుల సొమ్ములుం దగన్
గో యజనార్థ సత్క్రియలకుం బెఱసొమ్ముల నైనఁ గీడగున్. 469

ప్రతిపదార్థం: మరుత్+నాయక!= ఇంద్రుడా! (దేవతలరాజా!); గో=ఆవులు; యజన= యజ్ఞం; అర్థ= విషయమైన; సత్ క్రియలకున్= మంచికార్యాలకు; (ఆవులను దానం చేయటమనే యజ్ఞరూపమైన మంచికర్మల కొరకు లేదా గోదాన యజ్ఞం మొదలైన మంచి పనులకొరకు;) దాయ ధనంబు= దాయాదుల సొమ్ము; సంగరవిధా= యుద్ధ విధానంతో; సముపార్జితమున్= సంపాదించినది; స+ధర్మక+ఉపాయ= ధర్మంతో కూడుకొన్న ఉపాయం ద్వారా; సమాహితంబునున్= కూడబెట్టినదీ; శుభప్రతిపాదన= శుభమైన వృత్తి మొదలైన చేష్టద్వారా; లబ్ధమున్= లభించిందీ; వెండియున్= ఇంకా; కలుగు= ఉన్న - చెప్పక వదలిన; ఆయము+చొప్పులన్= ఆదాయం పద్ధతులతో లభించిన; సొమ్ములున్= ధనం; తగున్= ఉచితమైనది; పెఱ= ఇతరమైన; సొమ్ములను+ఐనన్= ధనంతో నయితే; కీడు+అగున్= హాని కలుగుతుంది.

తాత్పర్యం: ఆవులను దానం చేయటానికి కావలసిన ధనం పవిత్రంగా సంపాదించినదై ఉండాలి. దాయల ధనం, యుద్ధజయం ద్వారా, ధర్మసాధనలద్వారా, శుభవృత్తులద్వారా సంపాదించిన డబ్బే కావాలి. ఇంకా ఇట్లాంటి పవిత్ర కార్యాల ద్వారా లభించిన ధనం కావాలి తప్ప పెర సొమ్ములు పనికిరావు. దీనివలన కీడు తప్ప మంచి జరుగదు.

క. విను గోలోకంబును గడ । చిన లోకము గలుగ; దూఁది చెప్పెదఁ బుణ్యం
బును గోప్రదాన విధి మిగి । లిన యట్టిది వత్స! యొండు లే దరయంగన్. 470

ప్రతిపదార్థం: విను= వినుము; గోలోకంబును= గోలోకాన్ని; కడచిన= అతిక్రమించిన; లోకము= లోకం; కలుగదు= ఉండదు; ఊఁది= నొక్కి; చెప్పెదన్= చెప్తుతాయి; పుణ్యంబునున్= పవిత్రమైనది; గోప్రదాన విధిన్= ఆవులను దానంచేయటమన్న ధర్మాన్ని; మిగిలిన అట్టిది= అతిక్రమించిన ధర్మం; వత్స!= నాయనా!; అరయంగన్= విచారిస్తే; ఒండు= మరొకటి; లేదు.

తాత్పర్యం: నాయనా! గట్టిగా చెప్తుతున్నాను నమ్ముము. గోలోకాన్ని మించిన పుణ్యలోకం కానీ, గోదానంకంటె మించిన శుభమైన ధర్మం కానీ లేవు.

తే. ఆగమాధ్యయనంబు, వ్రతాభిరతియు, । నైజకర్మ శీలము, గురుపూజనంబు,

మాతృపితృ రక్షణముఁ, బాత్ర మహిమ లప్ర । తర్క్య ఫలదాయి యైన గోదానవిధికి. 471

ప్రతిపదార్థం: అప్రతర్క్య= తర్కించటానికి వీలుకాని; ఫలదాయి= ఫలితాన్నిచ్చే; గోదాన విధికిన్= గోదాన కర్మకు; పాత్రమహిమలు= తగిన గొప్పదానాలు; ఆగమ=వేద; అధ్యయనంబు= చదవటం; వ్రత= వ్రతాలలో; అభిరతియున్= మక్కువయు; నైజ= తన; కర్మ శీలమున్= కర్మలు చేసే స్వభావం; గురు= గురువులకు; పూజనంబున్= ఆరాధన; మాతృ పితృ రక్షణమున్= తల్లిదండ్రులను రక్షించుటయును;

తాత్పర్యం: గొప్ప ఫలితాల నిచ్చే గోదాన క్రియ కర్హమైన మహిమలు గలవి, వేదాన్ని చదవటం, వ్రతాలపై అభిలాష, స్వభావసిద్ధమైన కర్మల నైజం, గురువులను పూజించటం, తల్లిదండ్రులను పూజించట మన్నవి.'

క. అని నిర్దేశించిన న । వ్వనరుహసంభవుని దివ్యవాక్యంబులు నె

మ్మనమున నిడి గోయజ్ఞము । లనూనవిధి నడపె నింద్రుఁ డమలచరిత్రా! 472

ప్రతిపదార్థం: అమల= పవిత్రమైన; చరిత్రా!= నడవడి కలవాడా!; అని= ఈ విధంగా; నిర్దేశించినన్= సెలవియ్యగా; ఆ+వనరుహ= నీటిలో పుట్టిన పద్మం నుండి; సంభవుని= పుట్టినవాని - బ్రహ్మ; దివ్య = మహత్తరమైన; వాక్యంబులు= మాటలు; నెఱ+మనమునన్= నిండైన మనస్సులో; ఇడి= ధరించి; గోయజ్ఞములు= గోదాన కర్మలు; ఇంద్రుఁడు; అనూన= అధికమైన; విధిన్= శాస్త్రోక్తపద్ధతిలో; నడపెన్= చేశాడు.

తాత్పర్యం: పవిత్ర ప్రవర్తన కలవాడా! బ్రహ్మ చెప్పిన దివ్య వాక్యాలు విని ఇంద్రుడు అదే విధంగా గోయజ్ఞం నిర్వహించాడు.

క. నీవును నవధానముతో । గోవుల మన్నింపు పాత్రకోటి కొసఁగు స

త్సేవిత పుణ్య చరిత్రము । లా వెరవునఁ బోల వెన్నియైనఁ గుమారా!' 473

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా!; నీవును= నీవున్నూ; అవధానముతోన్= ఏకాగ్రతతో; గోవులన్= ఆవులను; మన్నింపుము= గౌరవించుము; పాత్ర= అర్హులైన; కోటికిన్= జనసమూహానికి; ఒసఁగు(ము)= దానంచేయుము; సత్+సేవిత= మంచివారిని సేవించేవారి; పుణ్య= పవిత్రమైన; చరిత్రములు= కథలు; ఎన్నిఐనన్= ఎన్నైనా; ఆ వెరవునన్= గోదానమునకు; పోలవు= సరికావు.

తాత్పర్యం: నాయనా! నీవూ నిష్ఠతో గోవులను పూజించుము. తగినవారికి దానంచేయుము. పుణ్యపురుషుల చరిత్రలు కూడా గోదానానికి సరికావు.'

క. అని యిట్లు గోవిశేషము । లనేక భంగులను బాండవాగ్రజునకు శం

తనుసుతుఁడు సెప్పె నన విని । 'మునివర! యేభంగి వాక్యములు మఱి సెల్లెన్?' 474

ప్రతిపదార్థం: గో విశేషములు= ఆవునకు సంబంధించిన విశేషాలు; అనేక భంగులను= అనేక విధాలుగా; పాండవ= పాండవులలో; అగ్రజునకున్= ముందుపుట్టిన ధర్మరాజునకు; శంతను సుతుఁడు= శంతనుడి కొడుకు - భీష్ముడు; చెప్పెను; అనన్= అనగా; విని; మునివర!= మునిశ్రేష్ఠుడా!; ఏ భంగి= ఏ తీరు; వాక్యములు= మాటలు; మఱి= తరువాత; ఇంకా; చెల్లెన్= నడిచాయి.

తాత్పర్యం: అని ఈ విధంగా గో విశేషా లెన్నో ధర్మరాజుకు భీష్ముడు చెప్పటం విని శ్రోతలైన మహర్షులు సూతుడితో - 'మునివరా! ఇంకా ఏతీరు మాటలు చెల్లాయో వినిపించుము'.

వ. అని యడుగుటయు. 475

తాత్పర్యం: అని అడుగగా.

ఆశ్వాసాంతము

శా. ధర్మాధర్మ విదూర నీతి పరవిద్వచ్చిత్తయోగీ! జగ
న్నిర్మాణ స్థితి తంత్ర సంహరణధూర్నిర్వాహరాగీ! మహా
శర్మాపాదనపాదపద్మ సుతపస్స్వాధ్యాయసద్మా! మనోం
తర్ముద్రాలతికా ఫలత్వలసితా! దాంతి స్ఫుటోద్భాసితా! 476

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మ= ధర్మము, అధర్మము రెంటికీ; విదూర= చాలా దూరంగా ఉన్న; నీతిపర= నీతిపరులైన; విద్వత్= పండితుల; చిత్త= మనస్సులలో ఉన్న; యోగీ!= మహాయోగీ!; జగత్= లోక; నిర్మాణ= సృష్టించటం; స్థితితంత్ర= సృష్టిని భద్రంగా రక్షించే ఉపాయం; సంహరణ= లయ కృత్యముల; ధూః= భారమును; నిర్వాహ= నిర్వహించే; రాగీ!= అనురక్తి కలవాడా!; మహా= గొప్ప; శర్మ= సుఖం; ఆపాదన= కలిగించే; పాదపద్మ= తామరపూలవంటి అడుగులు కలవాడా!; సు=మంచి; తపస్= తపస్సు; స్వ+అధ్యాయ= వేదపఠనమే; సద్మా!= గృహంగా కలవాడా; మనః+అంతర్= మనస్సు లోపల; ముద్రా= ఆనందం, లేదా యోగముద్రలన్న; లతికా= తీగకు (పడ్డ); ఫలత్వ= ఫలరూపంతో; లసితా!= అందమైనవాడా!; దాంతి= ఇంద్రియ నిగ్రహంతో ఏర్పడ్డ మనశ్శాంతితో; స్ఫుట= స్పష్టంగా; ఉత్+భాసితా!= పైకి ప్రకాశించేవాడా!

తాత్పర్యం: స్వామీ! నీవు ధర్మాధర్మాలకు అతీతమైన దివ్యవిద్యాపరులైన పండితుల మనస్సులలో ఉన్న యోగీశ్వరుడవు! లేదా - యోగమంటే చిత్తవృత్తములను నిరోధించటం కనుక విద్వాంసుల చిత్తవృత్తులను నిరోధించే సాధనరూపమైన యోగమే నీవు. నీకూ యోగానికీ అభేదం. సృష్టి స్థితి సంహారాలన్న బరువును మోయటంలో అనురాగం, రక్తి కలవాడా! తపస్సులోనూ, వేదాధ్యయనంలోనూ, అంటే వాటిని ఆచరించే వారి హృదయాలే నివాసంగా కలవాడా! ముత్+ర= మోదమును సంతోషాన్ని తెచ్చేది (కలిగించేది) కనుక ముద్ర, చిన్ముద్ర అభయముద్ర ఇట్లాంటి యోగముద్రలన్న లతకు కాచిన పండువంటివాడా! ప్రశాంత మనస్కులైన యోగుల హృదయాలనుండి పైకి లోకంలోకి ప్రకాశం చిమ్మేవాడా!

విశేషం: గతంలో శ్రీకృష్ణుడు యోగీశ్వరేశ్వరుడుగా చెప్పబడ్డాడు. కనుక ఈ సంబోధన సార్థకమౌతున్నది.

పై వాక్యంలో విరక్తి స్వరూపుడైన యోగిగా పిలువబడ్డ భగవంతు డిక్కడ రాగిగా స్తుతించబడుతున్నాడు. ఈ హరిహరస్తుతులన్నీ సమాస భూయిష్ఠమైన రచన కలవి. వేదాంత, యోగశాస్త్ర సంబంధం కలవీ, హరుడు(శివుడు) యోగి హరి రాగి. హరి సగుణమూర్తి కనుక పాదపద్మాలు కలవాడు = (శరీరం ఉన్నవాడుగా స్తుతించబడుతున్నవాడు). మరలా తపస్స్వాధ్యాయ స్వరూపుడంటే నిర్గుణస్వరూపుడై హరుడుగా స్తుతించటం. చివరి రెండు విశేషాలూ కేవల జ్ఞానస్వరూప వర్ణనలు. చిత్-ఆనంద స్వరూప వర్ణనలు.

క. ప్రమద విషాదాది ద్వం । ద్వమలావిహితాంతరంగవాసా! విశ్వా
గమవేద్య సముల్లాసా! శమరమ్య విభాస! నియమ జనిత వికాసా! 477

ప్రతిపదార్థం: ప్రమద= సంతోషం; విషాద=దుఃఖం; ఆది= మున్నుగాగల; ద్వంద్వ= రెండు; మల= దోషం - మలినం; అవిహిత= లేని; అంతరంగ= అంతఃకరణం; వాసా!= నివాసంగా కలవాడా!; విశ్వ= ప్రపంచమనే; ఆగమ= వేదంద్వారా; వేద్య= తెలియదగిన; సముల్లాసా!= ఆనంద, ఉత్సాహ స్వరూపుడా!; శమ= అంతరింద్రియ నిగ్రహం చేత; రమ్య= అందమైన; వి+భాస= విశిష్టమైన ప్రకాశం కలవాడా!; నియమ= యోగనియమాలతో; జనిత= పుట్టిన; వికాసా!= వికాసం కలవాడా!

తాత్పర్యం: సంతోష, దుఃఖాలు అనే ద్వంద్వం లేని మనసులే ఆవాసంగా కలవాడా! సృష్టి అన్నదే వేదం. దానిద్వారా సృష్టించటంద్వారా పరమేశ్వరుడి అనురాగస్వరూపమైన ఆనందోత్సాహాలు తెలుస్తున్నాయి. సృష్టిద్వారానే అతడి ఉనికి తెలుస్తున్నది కనుక అదే వేదం. శమాన్వితులైన మహాత్ములనుండి విశిష్టంగా ప్రకాశిస్తున్నాడు. యోగ నియమాలనుండి వికసించే ఆనందమన్న తామరపూవు భగవంతుడు యోగసాధన లేనివారి హృదయాలలో నిద్రపోతున్నవాడు. యోగులలో మేల్కొంటున్నాడు. ఇదే వికాస మంటే.

విశేషం: శ్రీ రామకృష్ణ పరమహంస వంటివారు లేకపోతే మనకు భగవంతుడి ఉనికి తెలిసేది కాదు. కనుక అట్లాంటివారే భగవంతుడన్న దీపం వెలిగిన గృహాలు. ఆ దీపపు వెలుగు కూడా రమ్యమైనది.

మాలిని.

'అకలుష హృదయాంతర్యాగ సంసిద్ధి మూర్తీ!
వికృతి దశక షట్క స్వీకృతి ప్రౌఢవర్తీ!
సకృపలసదపాంగోత్సా ర్యమాణాశ్రితార్తీ!
సకల నిగమచూడా చారురంగైక వర్తీ! 478

ప్రతిపదార్థం: అకలుష= నిష్కల్మషమైన; హృదయ= హృదయాలలోని; అంతర్యాగ= లోపలియజ్ఞంద్వారా; సంసిద్ధిమూర్తీ!= సిద్ధించిన ఫల స్వరూపం కలవాడా!; వికృతి= వికారాలు; దశక= పది; షట్క= ఆరు; స్వీకృతి= స్వీకరించటంచేత; ప్రౌఢ= పరిపక్వతతో; వర్తీ!= ప్రవర్తించేవాడా!; స+కృప= దయాసహితత్వంతో; లసత్= ప్రకాశించే; అపాంగ= కడకంటి చూపుతో; ఉత్సార్యమాణ= నశింపచేస్తున్న; ఆశ్రిత= ఆశ్రితులైన భక్తుల; ఆర్తీ!= దుఃఖం కలవాడా!; సకల నిగమ= వేదాలన్నిటియొక్క; చూడా= శిరస్సులే; చారు= అందమైన; రంగ= నాట్యరంగస్థలంమీద; ఏక= ముఖ్యమైన; వర్తీ!= నటకుడా!

తాత్పర్యం: అంతర్యాగం, బహిర్యాగమని ఉపాసనలు రెండు రకాలు. బయటచేసే షోడశోపచారపూజలు బహిర్యాగం. జ్ఞానం, వివేక దృష్ట్యా సర్వపూజలు మనస్సులో భావించిచేయటం అంతర్యాగం. ఇదే సిద్ధిని కలిగించేది. కనుక సంసిద్ధిమూర్తీ - అంతర్యాగ ఫలమే సంసిద్ధి ముక్తి. అదే ఆకారంగా కలవాడా! 16 వికారాలను స్వీకరించి కూడా, చెదరకుండా ప్రవర్తించేవాడా! (ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి పంచ భూతాలు (5), జ్ఞానేంద్రియాలు-5, కర్మేంద్రియాలు-5, మనస్సు-1). దయతో తొణికిసలాడుతున్న కడగంటి చూపుతో ఆశ్రితుల దుఃఖాలను చెదరగొట్టేవాడా! సకల వేదాల శిరస్సులనే నాట్యరంగంమీద నాట్యంచేసే ప్రధాన నటకుడైనవాడా! హరిహరనాథా!

విశేషం: శివుడి నాట్యాన్ని ఇట్లా వ్యాఖ్యానించటం చాలా అందంగా ఉన్నది.

ఆశ్వాసాంతాలన్నీ అంత్యానుప్రాసాలంకారంతో అంతమయ్యే సంబోధనలు కలవి. ప్రతి వాక్యము ఒక సంబోధన. ఈ అంత్యానుప్రాసవలననే వాక్యాలు ఎక్కడకు తెగిపోతున్నాయో, ఎంతవరకు సంబోధనో తెలుస్తుంది. లేకపోతే అర్థం చెప్పటం సాధ్యంకాదు. ఒక సంబోధన హరునకు తరువాతిది హరికి అన్వయించేవిగా ఉంటాయి. కొన్నిచోట్ల మొదటిదీ, చివరిదీ హరునకు అన్వయిస్తూ మధ్యలో రెండూ హరి కన్వయిస్తాయి. ఏది ఏదో తెలిసికొనటం పండితులకూ ఇబ్బందిగానే ఉంటుంది.

ఉదాహరణకు చివరి పద్యంలో మొదటి వాక్యం, చివరివాక్యం హరుని సంబోధనలు. మధ్యలోవి రెండు హరి కన్వయించేవి. లేదా అన్ని భగవత్సంబోధనలే. ఈ ఏర్పాటున్నదా అంటే ఉన్నది. లేదా అంటే లేదు. స్పష్టంగా ఉండదు కనుక మూర్తి వర్ణనమున్న సంబోధన సగుణతత్త్వమైన హరికీ, కానిది నిర్గుణతత్త్వమైన హరునకూ అన్వయించి తీరాలి. ఎందుకంటే విరాటపర్వ అవతారికలో హరిహరనాథమూర్తినట్లా వర్ణించాడు కనుక.

'కరుణారసము పొంగి పొరలెడు చాడ్పున। శశిరేఖ నమృతంబు జాలువాఱ

హరినీలపాత్రిక సురభి చందన మున్న। గతి నాభి ధవళపంకజము మెఱయ.'

అన్న ఆ పద్యంలో మొదటిచరణం శివవర్ణన, మూడోచరణమూ శివునకే అన్వయిస్తుంది. 2, 4 చరణాలూ హరి కన్వయించేవి. కాబట్టి ఆశ్వాసాంతాలలోనూ ఇదే పద్ధతి అన్వయిస్తుంది. మాలిని వృత్తలక్షణానికి అను.1.388 పద్యం చూడండి.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమైనదీ, ఉభయ కవిమిత్రుడని ప్రశస్తిని పొందిన కొమ్మనామాత్యపుత్రుడూ, పండితులను సేవించటం వలన ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలో ఆనుశాసనిక పర్వంలో రెండవ ఆశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని రెండవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - తృతీయాశ్వాసము

శ్రీ మహిమ దానకరుణా । భూమోద్భాసి బహునామ! పుణ్యస్తోమా

రామహృదయధామ! విత । ర్కామేయ విభూతిసీమ హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= ఓ హరిహరనాథస్వామీ!; శ్రీ= సంపద; మహిమ= గొప్పతనం; దాన= దానం; కరుణా= దయ అనే వాటి; భూమ= ఎక్కువతనాన్ని; ఉద్భాసి= బాగుగా ప్రకాశింపజేసే; బహునామ!= పెక్కు పేరులు గలవాడా!; పుణ్య= పుణ్యాల; స్తోమ= సముదాయానికి; ఆరామ= పూలతోటవంటి; హృదయ= హృదయమే; ధామ= నివాసమైనవాడా!; వితర్క= గొప్ప ఊహలకు; అమేయ= అందని; విభూతి= మహిమయొక్క; సీమ!= హద్దు గలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథ స్వామీ! నీ పేర్లన్నీ నీలోని ఐశ్వర్యం, గొప్పతనం, దానం, దయ అనే గుణాలను చక్కగా ప్రకటిస్తూ ఉంటాయి. ఎన్నో పుణ్యాల పూలతోట లయిన హృదయాలలో నీవు నివసిస్తూ ఉంటావు. ఏ తర్కమూ నీ మహిమను అందుకోలేదు.

విశేషం: భగవంతుడికి బహునామాలు. ఏ నామమైనా ఆయన మహాగుణాలయిన దాన దయాదులను ప్రకటిస్తూ భక్తులను ఆకట్టుకొంటుంది. అంటే ఆయనపేరేదీ నేతిబీరకాయవంటిది కాదన్నమాట. ఆ పేరు స్మరిస్తే సంపదో, మహిమో, మహావస్తువో, ఆపదలు తొలగటమో సిద్ధిస్తుందని తాత్పర్యం. ఆయన పుణ్యాత్ముల హృదయాలలో కాపురం ఉంటాడు. అంటే అట్టివారి హృదయాలే నిజమైన దేవాలయా లన్నమాట! కాబట్టి మానవులందరూ పుణ్యకార్యాలు చేసి భగవంతుడిని గుండెలో నిలుపుకొనాలని సూచన. ఆయన మహిమ తర్కానికి అందదు. కనుక తర్కంతో తలలు బ్రద్దలు కొట్టుకొనటంవలన మానవుడు భగవంతుడికి దూరమవుతున్నాడని హెచ్చరిక.

ఇందులో నామకీర్తనా, పుణ్యసాధనా, భగవత్ప్రాప్తీ అనేవి ఒకదానికొకటి సాధనాలుగా మనం సంభావించాలి.

ధర్మజునకు భీష్ముం డనుష్ఠేయంబులఁ జెప్పుట (సం.13-74-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు గోవుల మహానుభావంబు విని పాండవాగ్రజుండు భీష్మునితో 'ధర్మంబులు తేటపడ ననుగ్రహించుచుం బుయిలోట వాపి నన్నుం గలిపికొని కృపకు భాజనంబుగాఁ జేయుటం జేసి కొంకక యింకను నడిగెదఁ; దాత్పర్యంబున ననుష్ఠింపవలయునవి యెయ్యవి యెఱింగింపవే!' యనుటయు నతనితో నతండు. 2

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే ముని; జనమేజయునకున్= జనమేజయ మహారాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; గోవుల మహానుభావంబున్= ఆవుల గొప్పతనాన్ని; విని= విని; పాండవ+అగ్రజుండు= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; భీష్మునితోన్= భీష్ముడితో; ధర్మంబులు= ధర్మాలు; తేటపడన్= చక్కగా తెలిసేవిధంగా; అనుగ్రహించుచున్= దయచూపుతూ; పుయిలోట= సంకోచభావాన్ని; పాపి= తొలగించి; నన్నున్= నన్ను; కలిపికొని= మీలోని వాడినిగా చేసికొని; కృపకున్= దయకు; భాజనంబుగాన్= పాత్రమయ్యే విధంగా; చేయుటన్+చేసి= చేయటంవలన; కొంకక= వెనుకాడకుండా; ఇంకనున్= ఇంకా; అడిగెదన్= అడుగుతాను; తాత్పర్యంబునన్= శ్రద్ధ సడలకుండా; అనుష్ఠింపవలయునవి= చేయవలసినవి; ఏ+అవి= ఏవి; ఎఱింగింపవే?= తెలుపవా?; అనుటయున్= అనగా; అతనితోన్= ఆ ధర్మరాజుతో; అతండు= ఆ భీష్ముడు.

తాత్పర్యం: ప్రభూ! వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా చెప్పుతున్నాడు: ధర్మరాజు గోవుల గొప్పతనాన్ని ఆలకించి భీష్ముడితో ఇట్లా అంటున్నాడు. 'తాతా! నే నడిగిన ధర్మాలన్నీ స్పష్టంగా తెలిసేవిధంగా దయతో చెప్పుతున్నావు. నా మనస్సులోని సంకోచాన్ని తొలగించి నన్ను నీ దయకు పాత్రం చేసికొన్నావు. కనుక సందేహం వదలి ఇంకా అడుగుతున్నాను. శ్రద్ధతో చేయదగిన పను లేవో నాకు చెప్పుము' అనగా భీష్ముడు ధర్మరాజుకు ఇట్లా చెప్పుతున్నాడు.

విశేషం: శాస్త్రాలలో పరిప్రశ్న అని ఒకటి ఉన్నది. మహావిషయాలు తెలిసికొనదలచినవాడు వినయపూర్వకంగా తనకు కావలసిన విషయాలను పెద్దవారిని అడుగుతూ ఉండాలి. 'అడగందే చెప్పరాదు' అని కూడా ధర్మశాస్త్రం శాసిస్తున్నది. కాబట్టి ధర్మరాజు భీష్ముడి దయను కొనియాడుతూ ప్రసన్నుడిని చేసికొంటున్నాడు. పుయిలోటవాపి - మహాయుద్ధంలో పాండవులు భీష్ముడిని కూడా చిత్రహింసకు గురిచేశారు. ఇప్పుడు ఆయననే అడుగవలసి వచ్చింది అని ధర్మరాజు గుండెగుబులు. దానిని భీష్ముడు తొలగించాడు. నన్నుం గలిపికొని - యుద్ధం ముగిసేవరకు భీష్ముడూ ధర్మరాజూ పగవారు. భీష్ముడు దానిని పట్టించుకొనక ధర్మరాజును హృదయానికి దగ్గరగా తీసికొన్నాడు.

సీ. 'విను నియమంబును వేదపాఠంబుఁ ద । ద్ధరణంబు దమము నధ్యాపనంబు
నప్రతిగ్రహమును నాత్మీయకర్మని । ష్ఠయు సకలేంద్రియ జయము సత్య
నిరతియు శ్రుతదాన పరతయు బ్రహ్మ చ । ర్యముఁ బితృశుశ్రూషణమును మాతృ
శుశ్రూషణము గురుశుశ్రూషణము నను । కంపయు గోవ్రత సంపదయును

ఆ. వత్స! యాచరింపవలయునట్టివి' యని । పలుకుటయును నా నృపాలవరుఁడు
'గో ప్రదానవిధి యకుంఠిత కృప నాకు । నెఱుఁగఁ జెప్పవే సమిద్ధబుద్ధి.' 3

ప్రతిపదార్థం: వత్స!= నాయనా!; విను= వినుము; నియమంబును= నియమమున్నూ; వేద పాఠంబున్= వేదాలను నేర్చుకొనటమూ; తత్+ధరణంబు= వానిని వదలకుండా పట్టుకొనటమూ; దమము= మనస్సును అదుపులో పెట్టుకొనటమూ; అధ్యాపనంబున్= వేదాలను బోధించటమూ; అప్రతిగ్రహమునున్= దానాలు పట్టకపోవటమూ; ఆత్మీయ కర్మ నిష్ఠయున్= తన కర్తవ్యాలయందు శ్రద్ధా; సకల+ఇంద్రియ జయమున్= అన్ని ఇంద్రియాలనూ గెలవటమూ; శ్రుత దాన పరతయున్= చదువునందూ; దానమునందూ ఆసక్తి ఉండటమూ; బ్రహ్మచర్యమున్= బ్రహ్మమునందు ప్రవర్తిస్తూ ఉండటమూ; పితృ శుశ్రూషణమును= తండ్రిని సేవించటమూ; మాతృశుశ్రూషణమున్= తల్లిని సేవించటమూ; గురుశుశ్రూషణమున్= గురువులను సేవించటమూ; అనుకంపయున్= దయకలిగి

ఉండటమూ; గో వ్రత సంపదయును= ఆవులను సేవించటం అనే సంపదా; ఆచరింపవలయునట్టివి= చేయదగినట్టివి; అని= అని; పలుకుటయున్= చెప్పగా; ఆ నృపాలవరుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు; సమిద్ధబుద్ధి!= చక్కగా వెలుగొందుచున్న బుద్ధిగల ఓతాతా!; గో ప్రదానవిధి= గోవులను దానంచేసే కార్యాన్ని; నాకున్= నాకు; అకుంఠితకృపన్= ఏ మాత్రమూ మొక్కవోని దయతో; ఎఱుఁగన్+చెప్పవే!= తెలిసే విధంగా చెప్పవయ్యా!

తాత్పర్యం: 'నాయనా! వినుము. నియమమూ, వేదాలను చదవటం, వాటిని హృదయంలో నిలుపుకొనటం, మనస్సును అదుపులో పెట్టుకొనటం, వేదాలను ఇతరులకు నేర్పటం, దానాలు పట్టకపోవటం, తన కర్తవ్యాన్ని శ్రద్ధతో చేయటం, ఇంద్రియాలన్నింటినీ గెలవటం, సత్యంపై ఆసక్తి ఉంచటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం, తల్లిదండ్రులను, గురువులను సేవించటం, దయకలిగి ఉండటం, గోవులకు సంబంధించిన వ్రతాలను సమృద్ధిగా చేయటం - ఇవి చేయదగిన పనులు' అని భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'తాతా! నీది మంచి వెలుగొందుతున్న బుద్ధి. గోవులను దానమిచ్చే పద్ధతిని గూర్చి నాకు మిక్కిలి దయతో తెలియజెప్పుము' అన్నాడు.

విశేషం: ఇవన్నీ ఉత్తమ మానవుడు తప్పక చేయవలసిన పనులు. వేదం ధర్మమూలం కాబట్టి దానిని చదవాలి. చదివించాలి. తా నాచరించాలి. ఇతరులచేత ఆచరింపజేయాలి. దానాలు పుచ్చుకొనటంవలన ఇచ్చేవారి పాపాలు సంక్రమిస్తాయి. ఆ కారణంగా పుచ్చుకొనకూడదు. బ్రహ్మచర్యం పాటించాలి. అంటే కామాదిభావాలను దగ్గరకు రానీయరాదు. పితృశుశ్రూషణం - వేదం మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, తల్లీదండ్రీ గురువూ దైవమైనవాడవు కావాలి అని శాసిస్తున్నది. అనుకంప సర్వభూతాల యందు దయకలిగి ఉండటం, ఎందుకంటే అన్నింటియందూ భగవంతుడే కదా నిండి ఉన్నాడు.

వ. అని యడిగిన యక్కురుపతికిం గురుపితామహుం డిట్లనియె. 4

ప్రతిపదార్థం: అని; అడిగిన; ఆ+కురుపతికిన్= ఆ కౌరవమహారాజునకు; కురు పితామహుండు= కురువంశంవారికి తాత అయిన భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లా అడుగగా భీష్మ డిట్లా చెప్పాడు.

ఆ. 'తనియ మేసి నీరు ద్రావి మందకు వచ్చి । సౌఖ్య మెసఁగఁ బసులు శయన మొంది
యుండ నచట నియతి నుండి మాంధాతృండు । పరమభక్తి నమరగురునిఁ దలఁచి. 5

ప్రతిపదార్థం: పసులు= పశువులు; తనియన్= తృప్తిపడేటట్లుగా; మేసి= మేసి; నీరు= నీటిని; త్రావి= త్రాగి; మందకున్= గోశాలలోనికి; వచ్చి; సౌఖ్యము= సుఖం; ఎసఁగన్= ఎక్కువయ్యేటట్లుగా; శయనము+÷ఒంది= పడుకొని; ఉండన్= ఉండగా; అచటన్= అక్కడ; నియతిన్= నిష్ఠతో; ఉండి= నిలిచి; మాంధాతృండు= మాంధాత అనే రాజు; పరమభక్తిన్= గొప్పభక్తితో; అమరగురునిన్= దేవతలకు గురువైన బృహస్పతిని; తలఁచి= తలపోసి.

తాత్పర్యం: 'ఆవులు కడుపారా మేత మేశాయి. నీరు త్రాగాయి. గోశాలకు వచ్చి సుఖంగా పడుకొన్నాయి. అప్పుడు మాంధాత అక్కడ నిష్ఠతో ఉండి గొప్ప భక్తితో బృహస్పతిని తలచుకొన్నాడు.

విశేషం: మాంధాతకు పశువులమీద ఎంత భక్తి ఉన్నదో దీనివలన తెలుస్తున్నది. మహారాజు అంతఃపురంలో హంసతూలికా తల్పాలమీద సుఖనిద్ర పొందవలసినవాడు, మందలో నిష్ఠతో ఉన్నాడు. అంటే అతడి భక్తి ఎంత గొప్పదో మనం ఊహించుకొనవచ్చును.

వ. ఇట్ల యడుగం గలవాఁడై కరంబులు మొగిచి బహువిధంబులం బ్రస్తుతించిన, నా పురుహూత పురోహితుండు ప్రత్యక్షం బగుటయు, న ప్పుడమితేఁ డమ్మహాత్ముని పాదంబులకుం బ్రణమిల్లి యడిగిన నద్దేవగురుం డన్నర దేవోత్తమున కిట్లనియె. 6

ప్రతిపదార్థం: ఇట్ల= ఈ విధంగానే; అడుగన్ కలవాఁడు+ఐ= అడగదలచినవాడై; కరంబులు= చేతులు; మొగిచి= మోడ్చి; బహువిధంబులన్= పెక్కురీతులతో; ప్రస్తుతించినన్= కొనియాడగా; ఆ పురుహూత పురోహితుండు= దేవేంద్రుడి పురోహితుడైన ఆ బృహస్పతి; ప్రత్యక్షంబు+అగుటయున్= సాక్షాత్కరించగా; ఆ+పుడమితేఁడు= ఆ రాజు; ఆ+మహాత్ముని పాదంబులకున్= ఆ మహాత్ముడి కాళ్ళకు; ప్రణమిల్లి= దండ నమస్కారం చేసి; అడిగినన్= అడుగగా; ఆ+దేవగురుండు=దేవతలకు గురువైన ఆ బృహస్పతి; ఆ+నరదేవ+ఉత్తమునకున్= రాజులలో శ్రేష్ఠుడయిన ఆ మాంధాతకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: నీ వడిగినట్లే అడుగదలచి చేతులు మోడ్చి ఎన్నో విధాలుగా స్తోత్రాలు చేయగా ఆ బృహస్పతి ప్రత్యక్షమయ్యాడు. ఆ రాజు అతడి కాళ్ళమీద పడి నమస్కరించాడు. అప్పుడు అడిగాడు. బృహస్పతి ఆ రాజు కిట్లా చెప్పాడు.

విశేషం: మహా విషయాలు తెలిసికొనదలచినవాడు ఎట్లా మహాత్ములను ప్రసన్నం చేసికొనాలో ఇందులో కవి సూచిస్తున్నాడు. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా'' అని గీత. కాళ్ళమీద పడటం ప్రణిపాత. అడగటం పరిప్రశ్న. ఈ రెంటివలన సేవకూడా చేశాడని మనం ఊహించుకొనవచ్చును. చక్కని సంప్రదాయం పాటిస్తున్నాడు కనుకనే రాజు నరదేవులలో ఉత్తము డయ్యాడు. కనుకనే దేవగురువు వంటివాడు ప్రసన్నుడై అడిగిన విషయాన్ని వివరించి చెప్పటానికి సుముఖుడయ్యాడు.

బృహస్పతి మాంధాతకుఁ దెలిపిన గోదానవిధి ప్రకారము (సం.13-75-4)

ఆ. పుణ్యదినమునందు భూసురానుజ్ఞతో। నుపవసించి గోవు లున్న మంద
కరిగి పరమ నియతి నయ్యహోరాత్ర మ। గ్గోష్ఠమున వసించి నిష్ఠతోడ. 7

ప్రతిపదార్థం: పుణ్యదినమునందున్= తిథివార నక్షత్రాదులు బాగా ఉన్న రోజున; భూసుర+అనుజ్ఞతోన్= బ్రాహ్మణుడి, పురోహితుడి అనుమతితో; ఉపవసించి= ఉపవాసం చేసి; గోవులు+ఉన్న మందకున్= ఆవులున్న శాలకు; అరిగి= వెళ్ళి; పరమ నియతిన్= గొప్ప నియమంతో; ఆ+అహోరాత్రము= ఆ పగలూ రాత్రీ; నిష్ఠతోడన్= దీక్షతో; ఆ+గోష్ఠమునన్= ఆ గోవుల శాలలో; వసించి= ఉండి.

తాత్పర్యం: గోదానం చేయదలచినవాడు మంచి రోజు చూచుకొని పురోహితుడి అనుమతి పొంది ఉపవాసం చేసి గోవులున్న శాలకు వెళ్ళి గట్టి నియమంతో ఒక రోజల్లా నిష్ఠతో అక్కడ గడపాలి.

విశేషం: ఏ శుభకార్యానికైనా మంచిరోజు అవసరం. అది తప్పక ఫలా న్నిస్తుంది. పురోహితుడు రాబోయే కష్టసుఖాలు ముందే విచారించి తెలియజేస్తాడు. అందుకని అతనితో సంప్రతించటం అవసరం. వ్రతానికి నియమాలు చాలాముఖ్యం. అవి లేకపోతే ఫలం దక్కదు. ఉపవాసంవలన దేహమూ, ఇంద్రియాలూ స్వాధీనమవుతాయి. దానివలన నిష్ఠ చెడకుండా ఉంటుంది.

వ. మఱియుఁ నాఁడు. 8

తాత్పర్యం: ఆ తరువాతి రోజున.

ఆ. సంగవాభిధాన సత్కాలమునఁ దన । యిచ్చుగోవుఁ బేర నెలమిఁ బిలిచి
యజుఁడు కరుణఁ జెప్పినట్టి యవ్వాక్య ర । త్నముఁ బఠించునది యుదాత్తచరిత! 9

ప్రతిపదార్థం: ఉదాత్త చరిత!= గొప్ప నడవడి కల ఓ రాజా! సంగవ+అభిధాన సత్కాలమునన్= సంగవమనే పేరుగల మంచి వేళలో; తన+ఇచ్చు గోవున్= తా నీయదలచిన ఆవును; పేరన్= పేరుతో; ఎలమిన్= ప్రీతితో; పిలిచి; అజుఁడు= బ్రహ్మ; కరుణన్= దయతో; చెప్పిన+అట్టి= చెప్పిన; ఆ+వాక్యరత్నమున్= ఆ గొప్ప వాక్యాన్ని; పఠించునది= చదవాలి.

తాత్పర్యం: మంచివాడా! సంగవం అనే పేరుగల మంచి సమయంలో తాను ఇవ్వదలచిన ఆవును ప్రీతితో పేరుపెట్టి పిలిచి బ్రహ్మదేవుడు దయతో చెప్పిన మహాకావ్యాన్ని పఠించాలి.

విశేషం: పగటిని ఆరు భాగాలుగా భావిస్తారు. 1. ఉషస్సు, 2. సంగవం, 3.మధ్యాహ్నం, 4.అపరాహ్ణం, 5.సాయంకాలం, 6.నిశాముఖం. ఇందులో రెండవ భాగం అయిన సంగవ కాలం దానయోగ్యమని బృహస్పతి చెప్పుతున్నాడు. ఆవులను పాలుపితికే సమయం, ఆవులు దూడలతో కలిసి ఉండే కాలం అని దీనికర్థం. సూర్యోదయం అయిన తరువాత మూడు ముహూర్తాల కాలం సంగవకాలం. పేరన్- పెంపుడు జంతువులకు పేర్లు పెట్టటం చాలా ప్రాచీనకాలం నుండీ ఉన్నదన్నమాట.

ఆ. తల్లి గోవు, వృషము దండ్రి, గర్భప్రదే । శంబు దివము, ధరణి సంప్రతిష్ఠ
యని పఠించి యోగ్యుఁడగు విప్రు నర్చించి । పలుకవలయు నీగి కలిమి దెలియ. 10

ప్రతిపదార్థం: గోవు= ఆవు; తల్లి= మా అమ్మ; వృషము= ఎద్దు; తండ్రి= మా నాయన; దివము= స్వర్గం; గర్భప్రదేశంబు= కడుపు; ధరణి= భూమి; సంప్రతిష్ఠ= (నాకు) నిలుకడ; అని; పఠించి= చదివి; యోగ్యుఁడు+అగు విప్రున్= అర్హతగల విద్యావంతుడిని; అర్చించి= పూజించి; ఈగి కలిమి= ఇచ్చే సంకల్పం; తెలియన్= తెలిసేవిధంగా; పలుకవలయున్= పలకాలి.

తాత్పర్యం: 'ఆవు నా తల్లి, ఎద్దు నా తండ్రి, స్వర్గం వీరి గర్భప్రదేశం, ఇది నిలిచి ఉన్న తావే నాకు నిలుకడ ఇచ్చే తావు' అని చదివి దానం గ్రహించటానికి అర్హతగల విద్యగలవాడిని అర్చించి దానమిచ్చే సంకల్పం తనకున్నదని తెలిసే విధంగా పలకాలి.

విశేషం: మూలంలో బ్రహ్మ పలికిన వాక్యం ఈ విధంగా ఉన్నది.

> **"గౌర్మేమాతా వృషభః పితా మే**
> **దివం శర్మ జగతీ మే ప్రతిష్ఠా"** అను. 76. 7

'దివంశర్మ' అనే దానికి నీలకంఠులు - ఆవు, ఎద్దు అనేవి నాకు స్వర్గాన్నీ, ఇహసుఖాన్నీ ఇచ్చుగాక అని వ్యాఖ్యానించారు. దీనిని బట్టి 'గర్భప్రదేశంబు దివము' ఆవు ఎద్దుల గర్భప్రదేశం స్వర్గంలోని సుఖంవంటి సుఖాన్నిస్తుందని సంభావించాలి. అట్లాగే జగతీ - అనే పదానికి 'గోవు' అనే అర్థాన్ని నీలకంఠులు చెప్పారు. గోవే నాకు ప్రతిష్ఠ అని అర్థం. కాగా తిక్కనగారు ధరణి అనే పర్యాయ పదం వాడారు. కనుక ఆవు నిలుచున్న తావు నాకు స్థిరత్వాన్ని కూర్చే భూమి అనే అర్థాన్ని ఆయన సంభావించినట్లుగా ఊహించాలి.

యోగ్యుడగు విప్రున్= బ్రాహ్మణ పర్యాయ పదాలలో విప్రశబ్దం విద్యావంతుడిని తెలుపుతుంది. "విద్యయా యాతి విప్రత్వమ్" అని లోకరూఢి. విద్య అంటే పరమార్థ విద్యయే.

వ. తదనంతరంబ. **11**

తాత్పర్యం: ఇట్లా పఠించి చెప్పిన వెంటనే.

క. సారములగు గోవులు మ । ద్ఘోర సకల కల్మషములుఁ ద్రుంచును సౌమ్య
త్వారూఢంబులు శాశ్వత । సారోదారపద మిచ్చి సౌఖ్యముఁ జేర్చున్. **12**

ప్రతిపదార్థం: సారములు+అగు గోవులు= చక్కని శక్తి కల ఆవులు; మత్+ఘోర సకల కల్మషములన్= నా భయంకరాలైన అన్ని పాపాలనూ; త్రుంచును= ముక్కలు చేస్తాయి; సౌమ్యత్వ+ఆరూఢంబులు= సాధువర్తనంలో పేరుగొన్న ఆవులు; శాశ్వత సార+ ఉదారపదమున్= అంతం లేని స్థిరమైన గొప్పస్థానాన్ని; ఇచ్చి= కలిగించి; సౌఖ్యమున్= సుఖాన్ని; చేర్చున్= చేరుస్తాయి.

తాత్పర్యం: మంచి సత్తువ గల ఆవులు నా భయంకర పాపాలన్నింటినీ రూపుమాపుతాయి. మంచి సాధుశీలం గల ఆవులు శాశ్వతమూ, సారమూ, మహిమగలదీ అగు స్థానాన్ని ఇచ్చి సుఖాన్ని కూరుస్తాయి.

విశేషం: పాపాలు మనిషిని నరకానికి చేరుస్తాయి. ఆవులు ఆ పాపాలను పటాపంచలు చేస్తాయి. శాశ్వత, సార, ఉదారపదం అంటే మోక్షం. కనుక అక్కడి సౌఖ్యం బ్రహ్మానందం అని భావం.

క. అని పలికి గోవు నిచ్చితి । ననుచు నుదకధారఁ బ్రీతి నవ్విప్రుకరం
బునఁ బోయవలయు నర్ఘ్యం । బని చెప్పుదు రజ్జలంబు నాదిమునీంద్రుల్. **13**

ప్రతిపదార్థం: అని; పలికి= చెప్పి; ఆవును; ఇచ్చితిన్= ఇచ్చాను; అనుచున్= అంటూ; ఉదకధారన్= నీటిధారను; ప్రీతిన్= ప్రీతితో; ఆ+విప్రు కరంబునన్= ఆ విద్యావంతుడి చేతిలో; పోయవలయున్= విడవాలి; ఆది ముని+ఇంద్రుల్= తొలుతటి మునివర్యులు; ఆ+జలంబున్= ఆ నీటిని; అర్ఘ్యంబు+అని= పూజకు పనికివచ్చే పవిత్రమైనదని; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: ఇట్లా అని గోవు నిచ్చాను. ఆ విద్యావంతుడి చేతిలో ప్రీతితో నీటిధార వదలాలి. అట్లా వదలిన నీరు అర్ఘ్యం అని తొలుతటి మునిశ్రేష్ఠులు చెప్పుతారు.

విశేషం: ఇచ్చితి - ఇది భూతకాలక్రియ. ఇది దీని మీది మమకారాన్ని ఇంతకుముందే కోసివేశాను అన్న స్ఫురణ కలిగిస్తుంది. దానం ధారాపూర్వకంగా చెయ్యాలి. చేతిలోనుండి వదలిన నీరు మళ్ళీ తనకు అందని విధంగా దానం ఇచ్చిన వస్తువు మళ్ళీ తన దగ్గరకు చేరకూడదు అనే స్ఫూర్తి ఇందులో ఉన్నది. అర్ఘ్యం అంటే పవిత్రజలం. ఆదిమునీంద్రులు చాలా ప్రామాణికులు. వారు చెప్పిన మాటలలో పొల్లు ఉండదు అని భావం.

క. విను శిష్యుఁడు వ్రతశీలుం । డనఘుఁడు శాంతుండు దాంతుఁ డక్రోధనుఁ డీ
వినుత ప్రదాన విధికిని । జననాథవరేణ్య! యెఱుఁగు సత్పాత్రంబుల్. **14**

ప్రతిపదార్థం: జననాథవరేణ్య!= రాజోత్తమా! విను= వినుము; ఈ వినుత ప్రదాన విధికిని= కొనియాడ దగిన ఈ దాన కార్యానికి; శిష్యుఁడు= విద్యనేర్చుకొనే స్వభావం కలవాడూ; వ్రతశీలుఁడు= పుణ్యకార్యాలు చేయటం శీలంగా ఉన్నవాడూ;

అనఘుఁడు= పాపాలు లేనివాడూ; శాంతుండు= కామమూ, క్రోధము మొదలగు వికారాలు లేనివాడూ; దాంతుఁడు= ఇంద్రియాలమీద అదుపుగలవాడూ; అక్రోధనుఁడు= క్రోధం లేనివాడూ; సత్పాత్రంబుల్= మంచి యోగ్యత కలవారు; ఎఱుఁగు= తెలిసికొనుము.

తాత్పర్యం: నాయనా! రాజశ్రేష్ఠా! గోవులను దానం పుచ్చుకొనటానికి విద్యావంతుడూ, పుణ్యకారాలు చేసేవాడూ, పాపాలు లేనివాడూ, శాంతమైన మనస్సు కలవాడూ, ఇంద్రియాల వికారం లేనివాడూ, క్రోధం లేనివాడూ యోగ్యులు.

విశేషం: శిష్యుడంటే గురుశాసనానికి లోబడి ప్రవర్తించేవాడు. ఎన్ని వ్రతాలు చేసినా ఒక్కపాపం ఆ పుణ్యాన్నంతటినీ కొట్టివేస్తుంది. కనుక వ్రతాలు చేసినా పాపాల జోలికి పోనివాడై ఉండాలి. 'శాంతుండు' అన్న దానిలోనే క్రోధం లేకపోవటం ఉన్నది. మరల 'అక్రోధనుడు' అని అనటం ఎందుకంటే ఎంత శాంతుడైనా క్రోధానికి బలియైపోయే ప్రమాదం ఎక్కువ. కనుక హెచ్చరిక కొరకు పునరుక్తి.

ఆ. ఇవ్విధమున గోవు నిచ్చిన యాతండు । చంద్రలోక వసన సౌఖ్య మొందు'
నని సురేంద్ర మంత్రి యమ్మహీపాలుతో । నాదరమున నిట్టు లనియె మఱియు. 15

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ విధంగా; గోవున్= ఆవును; ఇచ్చిన+ఆతండు= ఇచ్చిన వ్యక్తి; చంద్రలోక వసన సౌఖ్యము= చంద్రలోకంలో నివాసం పొందిన సుఖాన్ని; ఒందున్= పొందుతాడు; అని= అని పలికి; సురేంద్రమంత్రి= దేవేంద్రుడి మంత్రి అయిన బృహస్పతి; ఆ+మహీపాలుతోన్= ఆ రాజు మాంధాతతో; ఆదరమునన్= ఆదరంతో; మఱియున్= ఇంకా; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా గోవును దాన మిచ్చిన వ్యక్తి చంద్రలోకంలో నివసించే సుఖం పొందుతాడు' అని చెప్పి బృహస్పతి ఆ మాంధాతతో ప్రీతితో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: మాంధాత అడిగిన విషయం బృహస్పతి చెప్పాడు. కానీ విషయంమీద ఉన్న ప్రీతితో అడక్కపోయినా బృహస్పతి మరికొంత విషయాన్ని చెప్తున్నాడు.

ఉ. మానవుఁ డోపి యాశ్వయుజ మాసము రెండవు నష్టమిం దగం
బూని దినత్రయంబు పరిపూజిత గోష్ఠతలంబునన్ వ్రతా
ధీనతఁ బెండ యన్నమును ధేనువు మూత్రముఁ బాలుఁ బానముం
గా నియతిన్ వసించి బహు కామ్యఫలంబులఁ బొందు భూవరా! 16

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; మానవుఁడు= మనుష్యుడు; ఓపి= సమర్థుడై; ఆశ్వయుజ మాసము రెండు+అవు+అష్టమిన్= ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం అష్టమినాడు; తగన్= చక్కగా; పూని= సంకల్పించి; దినత్రయంబు= మూడు రోజులు; గోష్ఠతలంబునన్= గోశాలలో; వ్రత+అధీనతన్= వ్రతానికి పూర్తిగా వశమయి; పెండ= పేడ; అన్నమును= అన్నము; ధేనువు మూత్రమున్= ఆవు పంచితం; పాలున్= పాలూ; పానమున్ = త్రాగేదీ; కాన్= కాగా; నియతిన్= నిష్ఠతో; వసించి= ఉండి; బహు కామ్య ఫలంబులన్= పెక్కు కోరిన ఫలాలను; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! మానవుడు ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం అష్టమి మొదలుకొని మూడు రోజులు గొడ్ల సావిడిలో వ్రతనిష్ఠతో ఉండాలి. పేడనే అన్నంగా, మూత్రమే పాలూ నీరుగా నిష్ఠతో నివసించాలి. ఆ విధంగా కోరిన కోర్కెలు ఎన్నింటినో పొందుతాడు.

విశేషం: ఓపి తగన్ అనే మాటలు ఏ కొంచెమూ ఏవగించుకొనరా దనే హెచ్చరికను సూచిస్తాయి. నిజానికి ఆవులు పేడా మూత్రమూ రోగాలన్నీ రూపుమాపే పదార్థాలుగా ఇప్పటి శాస్త్రవేత్తలు కూడా గుర్తిస్తున్నారు.

వ. అని చెప్పె నట్లు బృహస్పతి నిర్దేశించిన తెఱంగున మాంధాతృండు మహీసురులకు గోవుల నిచ్చి యుభయ లోకంబులను వినుతుండయి వెలింగె; నవ్విధం బెఱింగి గో ప్రదానపరులైన భరత దిలీప భగీరథ దాశరథి ప్రభృతి భూపతులు పుణ్యలోకంబులు వడసిరి; పాండవాగ్రజా! నీవును దేవగురూపదిష్టంబు లయిన యివ్వాక్యం బులు భావగతంబులు సేసికొని గో విషయ విధిజ్ఞుండవై విప్రోత్తములకు నుత్తమ గో ప్రచయంబుల ని' మ్మనిన నమ్మనుమండు తాతకుం బ్రీతిం బ్రణామంబు సేసిన, నమ్మహాత్ముండు వెండియు నవ్విభున కిట్లనియె. 17

ప్రతిపదార్థం: అని; చెప్పెన్= చెప్పాడు; అట్లు= ఆ విధంగా; బృహస్పతి నిర్దేశించిన తెఱంగునన్= బృహస్పతి చెప్పిన పద్ధతి ప్రకారం; మాంధాతృండు= మాంధాత; మహీసురులకున్= బ్రాహ్మణులకు; గోవులన్= ఆవులను; ఇచ్చి= దానం చేసి; ఉభయ లోకంబులను= ఈ లోకంలోనూ, పరలోకంలోనూ; వినుతుండు+అయి= ప్రశంసలు పొందినవాడై; వెలంగెన్= ప్రకాశించాడు; ఆ+విధంబు= ఆ పద్ధతిని; ఎఱింగి= తెలిసికొని; గో ప్రదానపరులు+ఐన= ఆవులను దానమిచ్చే ఆసక్తికల; భరత, దిలీప,భగీరథ, దాశరథి, ప్రభృతి భూపతులు= భరతుడు, దిలీపుడు, భగీరథుడు, రాముడు మొదలైన రాజులు; పుణ్యాలోకంబులు= పుణ్యా లోకాలను; పడసిరి= పొందారు; పాండవ+అగ్రజ!= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజా!; నీవును= నీవుకూడా; దేవగురు+ ఉపదిష్టంబులు+అయిన= దేవగురువు బృహస్పతి చెప్పిన; ఈ+వాక్యంబులు= ఈ మాటలు; భావగతంబులు= భావంలో నిలిచినవిగా; చేసికొని; గో విషయ విధిజ్ఞుండవు+ఐ= ఆవులకు సంబంధించిన కర్తవ్యాలను తెలిసికొన్నవాడవై; విప్ర+ ఉత్తములకున్= శ్రేష్ఠులూ; విద్యావంతులూ అయిన బ్రాహ్మణులకు; ఉత్తమ గో ప్రచయంబులన్= మేలైన ఆవుల మందలను; ఇమ్ము= ఇవ్వుము; అనినన్= అని పలుకగా; ఆ+మనుమండు= ఆ మనుమడు; తాతకున్= తాతకు; ప్రీతితోన్= ప్రేమతో; ప్రణామంబు+ చేసినన్= మ్రొక్కగా; ఆ+మహాత్ముండు= గొప్పహృదయ ధర్మంగల ఆ భీష్ముడు; వెండియున్= ఇంకా; ఆ+విభునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పాడు. మాంధాత బృహస్పతి మాట ప్రకారం శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు ఆవులను దానంచేసి ఇహపరలోకాలలో ప్రసిద్ధిపొందాడు. ఆ విధానం తెలిసికొని భరతుడు, దిలీపుడు, భగీరథుడు, రాముడు మొదలైన రాజులు కూడా శ్రద్ధతో గోదానాలు చేసి పుణ్యలోకాలు చేరుకొన్నారు. ధర్మరాజా! నీవు కూడా బృహస్పతి చెప్పిన మాటలను హృదయంలో పదిలపరచుకొని ఆవులకు సంబంధించిన శాస్త్రవిషయాలను చక్కగా తెలిసికొని బ్రహ్మవిద్యలో ఆరితేరిన బ్రాహ్మణులకు మేలైన ఆవులను మందలకొలదీ దానమిమ్ము' అన్నాడు. ఆ మాటలకు ధర్మరాజు ఎంతో ఆనందపడి తాతకు సాష్టాంగ దండప్రణామం చేశాడు. అప్పుడు భీష్ముడు అతనికి ఇంకా ఇట్లా చెప్పాడు.

విశేషం: మాంధాతతోపాటు మరికొందరు పురాతన రాజులను చెప్పటం భావం దృఢపడటం కొరకు. విప్రోత్తములకు అనటం వలన 'విద్యయా యాతి విప్రత్వం' - విద్యచేతనే విప్రత్వం కలుగుతుంది అన్నమాటలనుబట్టి విద్య అంటే పరమార్థ విద్యయే. కనుక అట్టి వారిలో ఉత్తములకు దానమిస్తే దానఫలం ఉత్తమంగా ఉంటుందని సూచన. ఉత్తమ గోవులను అనటంవలన పనికిమాలిన వాటిని వదలించుకొనటానికి దానం ఇవ్వరాదని హెచ్చరిక.

క. రేపకడ నీరు ద్రావక । మేపు గొనక మున్న గోవు మిక్కిలి భక్తిన్
భూపాల యిచ్చునది ది । వ్యాపార సుఖంబుఁ బడయ నాత్మఁ దలఁచినన్. 18

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; దివ్య+అపార సుఖంబున్= స్వర్గంలోని అంతులేని సుఖాన్ని; పడయన్= పొందటానికి; ఆత్మన్= హృదయంలో; తలఁచినన్= తలచినట్లైతే; రేపకడన్= ప్రొద్దుననే; నీరు= నీటిని; త్రావక= త్రాగకుండా; మేపుకొనక మున్న= మేత మేయకముందే; మిక్కిలి భక్తిన్= గొప్ప భక్తితో; గోవున్= ఆవును; ఇచ్చునది= ఇమ్ము.

తాత్పర్యం: ధర్మరాజా! స్వర్గ సుఖాలు అపారంగా పొందాలి అనే కోరిక మనసులో ఉంటే ఉదయాన్నే గోవు నీరుత్రాగకముందే మేతమేయకముందే గొప్ప భక్తితో దానము చేయవలయును.

విశేషం: దానం ఒక పవిత్రమైన ఉపాసనవంటిది. అది చేయదలచినవాడు శాస్త్రవిధి నతిక్రమించకూడదు.

క. మొదవులలో నెల్లఁ గపిల । మొదవు వరిష్ఠంబు రాజముఖ్య! నియతిమై
నది విప్రున కిచ్చు టరయఁ । దుది దానంబులకు; నఱకు దురితాటవులన్.' 19

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజశ్రేష్ఠా!; మొదవులలోన్ ఎల్లన్= ఆవులన్నింటిలో; కపిల మొదవు= పుల్లావు; వరిష్ఠంబు= మేలైనది; నియతిమైన్= నిష్ఠతో; అది= దానిని; విప్రునకున్= విద్యలో ఆరితేరిన వాడికి; ఇచ్చుట= ఇవ్వటం; అరయన్= పరిశీలిస్తే; దానంబులకున్= దానాలకు; తుది= చివరిది; దురిత+అటవులన్= పాపాలనే అడవులను; నఱకున్= నరికివేస్తుంది.

తాత్పర్యం: రాజా! ఆవులలో పుల్లావు చాలా మేలైనది. దానిని నిష్ఠతో విప్రుడికి దానం చేయటం దానాలకు చివరిమెట్టు. అది పాపమనే అడవులను నరికివేస్తుంది.'

విశేషం: గోరోజనం రంగుగల ఆవులను పుల్లావు లంటారు. 'తుది' అంటే మరొకదానం చేయనక్కరలేదని భావం. 'దురిత మనే అటవి' అన్నరూపకంవలన పాపాల చెడ్డఫలితాలు ఎంత గాఢంగా ఉంటాయో భావనకు వస్తుంది.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు 'కపిలగోవున కీ విశేషం బెట్లు గలిగె నెఱింగింపవే' యనుటయు గాంగేయుం డతని కిట్లనియె. 20

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని=ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతికొడుకులలో పెద్దవాడు; కపిల గోవునకున్= పుల్లావుకు; ఈ విశేషంబు= ఈ గొప్పతనం; ఎట్లు= ఏ విధంగా; కలిగెన్= కలిగింది; ఎఱింగింపవే= తెలియజేయుము; అనుట యున్= అనగా; గాంగేయుండు= గంగకొడుకు భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు= ఈ విధంగా; అని యెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని ధర్మరాజు 'తాతా! పుల్లావుకు ఆ మహిమ ఎట్లా వచ్చిందో చెప్పుము' అంటే భీష్ము డతడితో ఇట్లా అన్నాడు.

గోవులకుఁ గపిలత్వంబు సిద్ధించిన ప్రకారము (సం.13-76-21)

సీ. 'దేవత లాఁకొని దేవతాజ్యేష్ఠునిఁ । గానంగఁ బోవ నా కమలజన్ముఁ
దమృత మిచ్చిన ముదమారఁగాఁ ద్రావఁ ద । త్పురభిత్వ సంపద సురభి పుట్టె;

నది సౌరభేయుల నధిప! యుత్పాదించె; నొక యప్డు హిమగిరి యుపరితల మ
లంకరించుచు నవి శంక యించుక లేక। యున్నెడ వానిలో నొకటి లేఁగ

ఆ. చన్ను గుడువఁ దదాస్య నిష్యంద మాన। మైన దుగ్ధ ఫేనము పవమాన నిహతిఁ
దూలి తప ముగ్రముగఁ జేయు శూలి మౌళిఁ। బడిన నద్దేవుఁ డధికకోపంబు గదుర. 21

ప్రతిపదార్థం: దేవతలు= దేవలోకంవారు; ఆఁకొని= ఆకలిపొంది; దేవతాజ్యేష్ఠునిన్= బ్రహ్మను; కానంగన్= చూడటానికి; పోవన్= పోతే; ఆ కమలజన్ముఁడు= కమలంలో పుట్టిన ఆ బ్రహ్మ; అమృతమున్= అమృతాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా; ముదము+ ఆరఁగాన్= తృప్తితీరేటట్లు; త్రావన్= త్రాగగా; తత్ సురభిత్వ సంపదన్= దాని వాసన ఎక్కువతనానికి; సురభి= కామధేనువు; పుట్టెన్= పుట్టింది; అధిప!= రాజా!; అది= కామధేనువు; సౌరభేయులన్= ఆవులను; ఉత్పాదించెన్= పుట్టించింది; ఒక+అప్డు= ఒక సమయంలో; అవి= ఆ ఆవులు; హిమగిరి ఉపరితలము= మంచుకొండ పై భాగాన్ని; అలంకరిం చుచున్= అందగింపజేస్తూ; శంక= జంకు; ఇంచుక= కొంచెం కూడా; లేక ఉన్న+ఎడన్= లేకుండా ఉన్నప్పుడు; వానిలోన్= ఆ ఆవులలో; ఒకటి= ఒక్కటి; లేఁగ= దూడ; చన్ను కుడువన్= పొదుగులో పాలు త్రాగుతూ ఉంటే; తత్ ఆస్య నిష్యంద మానము+ఐన= దాని మోమునుండి జారుచున్న; దుగ్ధ ఫేనము= పాల నురుగు; పవమాన నిహతిన్= గాలిదెబ్బకు; తూలి= చెదరి; తపము= తపస్సు; ఉగ్రముగన్= తీవ్రంగా; చేయు= చేస్తున్న; శూలి= శివుడి; మౌళిన్= తలమీద; పడినన్= పడగా; ఆ+దేవుఁడు= ఆ ప్రభుడు; అధిక కోపంబు= ఎక్కువ కోపం; కదురన్= కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: దేవతలకు ఆకలి వేసింది. బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. ఆయన అమృత మిచ్చాడు. వారు తనివితీరా త్రాగారు. ఆ అమృతపు సువాసనకు కామధేనువు పుట్టింది. దానికి ఆవులు పుట్టాయి. అవి ఒకప్పుడు హిమాలయం పై భాగాన అలంకారంగా తిరుగుతున్నాయి. వానిలో ఒక ఆవు లేగ పాలు త్రాగుతూ ఉంటే దానినోటి దగ్గరి నురుగు గాలివాటానికి ఎగిరి అక్కడ తీవ్రంగా తపస్సు చేస్తున్న శివుడి నెత్తిమీద పడింది. శివుడికి చాలా కోపం వచ్చింది.

విశేషం: 'శూలి' అనే పదం సాభిప్రాయం. అది ఆయనకోపానికి అనుగుణంగా వచ్చి పడింది.

క. చిచ్చఱకన్నదరు లెగయ। విచ్చినఁ గపిలత్వ మొందె విబుధప్రకరం
బచ్చెరు వందుచుఁ గన్గొన। నచ్చేరువ సౌరభేయు లమలచరిత్రా! 22

ప్రతిపదార్థం: అమల చరిత్రా!= స్వచ్ఛమైన ప్రవర్తనగల ఓ రాజా!; చిచ్చఱ కన్ను= నిప్పులు గ్రక్కే (మూడవ) కన్ను; అదరులు= నిప్పు కణికలు; ఎగయన్= ఎగిరి పడేటట్లుగా; విచ్చినన్= తెరువగా; ఆ+చేరువ సౌరభేయులు= ఆ దగ్గరలో ఉన్న ఆవులు; విబుధ ప్రకరంబు= దేవతల సముదాయం; అచ్చెరువు+అందుచున్= ఆశ్చర్యపడుతూ; కన్గొనన్= చూస్తూ ఉండగా; కపిలత్వము= గోరోచనం వన్నెను; ఒందెన్= పొందాయి.

తాత్పర్యం: శివుడి అగ్నిమయమైన మూడవ కన్ను నిప్పులు గ్రక్కుతూ తెరుచుకొనేసరికి ఆ ప్రాంతంలో ఉన్న ఆవులన్నీ, దేవతలు ఆశ్చర్యపడుతూ ఉండగా, ఎర్రని రంగును పొందాయి.

విశేషం: పద్యం చిన్న ప్రమాణం. అది హఠాత్తుగా జరిగిన సంఘటనకు వ్యంజకంగా రూపొందింది. 'చిచ్చు' అనే చిన్న శబ్దంలో మూడు చకారాలు ఉన్నాయి. అవి అగ్ని చిటపటలను సూచిస్తాయి.

క. అవి బిట్టు బెదరఁ దక్కటి । యవియు నదరి బెదరె; నిట్టు లగ్గోవులు వా
ఱె వెసను సోముని పాలికి । నవనీశ్వర! దాని నెఱిఁగి యజుఁ డేతెంచెన్. 23

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర!= రాజా!; అవి= అట్లా క్రొత్త రంగు వచ్చిన ఆవులు; బిట్టు= పెద్దగా; బెదరన్= భయపడగా; తక్కటి అవియున్= మిగిలినవి కూడా ; అదరి= హడలి; బెదరెన్= భయపడిపోయాయి; ఇట్టులు= ఈ విధంగా; ఆ+గోవులు= ఆ ధేనువులు; పాఱెన్= పారిపోయాయి; వెసను= వెంటనే; దానిన్= ఆ సంగతిని; ఎఱిఁగి= తెలిసికొని; అజుఁడు= బ్రహ్మ; సోముని పాలికిన్= శివుడి దగ్గరకు; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా రంగుమారిన ఆవులు బెదరేసరికి తక్కిన ఆవులు బెదరి పారిపోయాయి. ఆ సంగతి తెలిసికొని బ్రహ్మదేవుడు శివుడి దగ్గరకు వచ్చాడు.

విశేషం: తాను సృజించిన గోవులు శివుడి కోపానికి గురి అయ్యాయి కనుక ఆ కోపాన్ని పోగొట్టటం బ్రహ్మ బాధ్యత.

సీ. ఏతెంచి నిభృతిమై నీశ్వరు చరణాంబు । జములకు నెఱఁగి హస్తములు మొగిచి
యమృతసిక్తుఁడ వైతి వఖిలేశ! గోవుల । కెంగిలి లేే; దిందుఁ డెట్టు లమృత
మొసఁగు నట్టుల గోవు లొసఁగు దుగ్ధంబులఁ । దద్వత్స పీత దుగ్ధంబు శుచియ
కాన కోపము దక్కి కరుణింపు' మని యొక్క । కమనీయ వృషభంబుఁ గప్ప మిచ్చె;

ఆ. శివుఁడు ప్రియమంది దానిఁ గేతువును వాహ । నంబుగాఁ జేసి సకలజనంబు నెలమి
వృషభకేతనుఁ డనియును, వృషభవాహ । నుం డనియుఁ బేర్కొనఁగ నొప్పియుండె నధిప! 24

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ఏతెంచి= వచ్చి; నిభృతిమైన్= నిండుదనంతో; ఈశ్వరు చరణ+అంబుజములకున్= శివుడి పాదములనే పద్మాలకు; ఎఱఁగి= మ్రొక్కి; హస్తములు= చేతులు; మొగిచి= మోడ్చి; అఖిల+ఈశ= సర్వప్రభూ!; అమృత సిక్తుఁడవు= అమృతంతో తడిసినవాడవు; ఐతివి= అయ్యావు; గోవులకున్= ఆవులకు; ఎంగిలి= నోటినుండి జారిన దాని దోషం; లేదు; ఇందుఁడు= చంద్రుడు; ఎట్టులు= ఏ విధంగా; అమృతము= అమృతాన్ని; ఒసంగున్= ఇస్తాడో; అట్టులన్= ఆ విధంగానే; గోవులు= ఆవులు; దుగ్ధంబులన్= పాలను; ఒసఁగున్= ఇస్తాయి; తద్ వత్స పీత దుగ్ధంబున్= వాటి దూడలు త్రావినపాలు కూడా; శుచి+అ= నిర్మలమే; కాన= కనుక; కోపము= కోపాన్ని; తక్కి= వదలి; కరుణింపుము= దయజూడుము; అని= అని పలికి; ఒక్క కమనీయ వృషభంబున్= ఒక అందమైన ఎద్దును; కప్పమున్= కానుకగా; ఇచ్చెన్= ఇచ్చాడు; శివుఁడు= ఈశ్వరుడు; ప్రియము+అంది= సంతోషం పొంది; దానిన్= ఆ ఎద్దును; కేతువును= జెండామీద గుర్తుగా; వాహనంబుగాన్= ఎక్కిరింతగా; చేసి= ఏర్పరచి; ఎలమిన్= ప్రీతితో; సకలజనంబున్= జనులంతా; వృషభకేతనుఁడు=ఎద్దు టెక్కెంగా కలవాడు; అనియును= అనీ; వృషభ వాహనుండు= ఎద్దు వాహనంగా కలవాడు; అనియున్= అనీ; పేర్కొనఁగన్= పేరు పెట్టి వ్యవహరిస్తూ ఉంటే; ఒప్పి+ఉండెన్= చక్కగా ఉన్నాడు.

తాత్పర్యం: రాజా! బ్రహ్మ అట్లా వచ్చి ఈశ్వరుడి కాళ్ళకు మ్రొక్కాడు. చేతులు జోడించి స్వామీ! 'నీవు అమృతంతో తడిశావు. ఆవులకు ఎంగిలి లేదు. చంద్రు డమృతం ఇచ్చినట్లు ఆవులు పాలిస్తాయి. కాబట్టి వాటి దూడలు త్రావిన పాలు కూడా పరిశుద్ధాలే. కనుక కోపం వదలి మమ్మల్ని కరుణించుము' అని ఒక చక్కని ఎద్దును కానుకగా ఇచ్చాడు. శివుడు ప్రీతిపొంది దానిని ధ్వజంమీద గుర్తుగా, వాహనంగా చేసికొని వృషభకేతనుడు, వృషభవాహనుడు అని అందరూ తన్ను పిలుస్తూ ఉంటే సంతోషంతో ఉన్నాడు.

విశేషం: శంకరుడు బోళావ్యక్తి కదా! వెంటనే కోపం పోగొట్టుకొన్నాడు. ఉచ్ఛిష్టం అంటే తింటున్న పదార్థం వెలుపలికి రావటం. అది ఎంగిలి. దానిని ఆచారనిష్ఠ కలవారు అంటరు. బ్రహ్మ ఆవులకు ఆ దోషం లేదని శివుడికి చెప్పాడు.పైగా ఆ ఆవు పాలూ అమృతమూ ఒకే రకమైనవని కూడా చెప్పాడు.

వ. ఇట్లు ప్రసన్నుండయి గో సంచారం బెందునుం గలుగునట్లుగా ననుగ్రహించిన నా సౌరభేయీ సముదయంబు మగుడ నన్నగంబునకు వచ్చి విచ్చలవిడి వర్తింపంజూచి, తన చూపునం గపిల లయిన గోవులకుం దక్కిన వర్ణంబుల కంటె నుత్తమత్వంబు గలుగ వరం బిచ్చి విరించిని వీడ్కొలిపె; నట్లు గావునం గపిల గోప్రదానంబు గోదాన కల్పంబున కంతకు నధికం బని చెప్పి. 25

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రసన్నుండు+అయి= కోపం పోయినవాడై; గో సంచారంబు= ఆవులు తిరగటం; ఎందునున్= ఎక్కడయినా; కలుగు+అట్లు+కాన్= కలిగే విధంగా; అనుగ్రహించినన్= వరంగా ఇవ్వగా; ఆ సౌరభేయీ సముదయంబు= ఆ ఆవుల మంద; మగుడన్= తిరిగి; ఆ+నగంబునకున్= ఆ కొండకు; వచ్చి; విచ్చలవిడిన్= ఇష్టం వచ్చినట్లుగా; వర్తింపన్= తిరుగుతూ ఉంటే; చూచి= కనుగొని; తన చూపునన్= తన దృష్టిచేత; కపిలలు అయిన గోవులకున్= కపిలవర్ణం పొందిన ఆవులకు; తక్కిన వర్ణంబుల కంటెన్= తక్కిన రంగుల ఆవులకంటె; ఉత్తమత్వంబు= శ్రేష్ఠత్వం; కలుగన్= కలిగేటట్లు; వరంబు= వరాన్ని; ఇచ్చి; విరించిని= బ్రహ్మను; వీడ్కొలిపెన్= పంపించాడు; అట్లు+కావునన్= ఆ తీరు అయినది కనుక; కపిల గోప్రదానంబు= పుల్లావులను దానం చేయటం; గో దాన కల్పంబునకున్= గోవులను దానం చేయటమనే విధానానికి; అంతకున్= మొత్తానికి; అధికంబు= మిన్న; అని; చెప్పి.

తాత్పర్యం: శివు డిట్లా ప్రసన్నుడై గోవులు ఎక్కడైనా ఇచ్చవచ్చినట్లు తిరిగేటట్లుగా వరం ఇచ్చాడు. ఆవుల మంద మరల ఆ కొండకు వచ్చి స్వేచ్ఛగా తిరగటం చూచి, తన చూపునకు కపిలవర్ణం పొందిన ఆవులు తక్కిన రంగుల ఆవులకంటె గొప్పవిగా వర మిచ్చి బ్రహ్మను అతడి లోకానికి పంపాడు. కనుక గోదాన పద్ధతిలో కపిలగోవులను దానం చేయటం గొప్ప విషయం అని చెప్పి.

విశేషం: మహానుభావుల కోపం కూడా విశేషఫలాన్ని ఇస్తుం దనటానికి ఇది ఒక దృష్టాంతం.

క. ఈ కపిలాఖ్యానము సు । శ్లోకము; దీని పఠనంబు శ్రుతముఁ గలిమలో
ద్రేకంబుఁ బాచి సుతుల న । నేక ధనంబులను బెంపు నిచ్చు నరేంద్రా!' 26

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; ఈ కపిలా+ఆఖ్యానము= ఈ కపిలగోవు కథ; సుశ్లోకము= మిక్కిలి పవిత్రమైనది; దీని పఠనంబు= దీనిని చదవటమూ; శ్రుతమున్= వినటమూ; కలిమల+ఉద్రేకంబున్= కలి కల్మషం పెచ్చు పెరగటాన్ని; పాచి=తొలగించి; సుతులన్= కుమారులను; అనేక ధనంబులను= పెక్కు ధనాలను; పెంపున్= గొప్పతనాన్నీ; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: రాజా! ఈ కపిల గోవుల కథ చాలా పవిత్రమైనది. దీన్ని చదివినా, విన్నా సకల పాపాల విజృంభణం అణగి పోతుంది. మంచి సంతానాన్ని, గొప్ప ధనాలను ఇది ఇస్తుంది.'

విశేషం: మానవుడు వివేకంతో కోరవలసినవి అనిష్టాన్ని తొలగించుకొనటం, ఇష్టాన్ని కూర్చుకొనటం. అందుకే ఈ పద్యంలో ముందు పాపాలు పటాపంచ లవటాన్నీ, తరువాత సుతధనలాభాన్నీ చెప్పాడు.

వ. అనిన విని ధర్మపుత్త్రుండును దమ్ములును సమ్మోదంబు నొంది భీష్మునకుం బ్రణమిల్లి గోప్రదానంబులు విధి సంపన్నంబులుగాఁ జేయువారై మనంబులం బూని; రప్పితామహుం డప్పాండవాగ్రజు నుద్దేశించి వెండియు నిట్లనియె. 27

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మపుత్త్రుండును= ధర్మరాజున్నూ; తమ్ములును= తమ్ముళ్ళూ; సమ్మోదంబున్+ఒంది= ఎంతో ఆనందపడి; భీష్మునకున్= భీష్ముడికి; ప్రణమిల్లి= సాష్టాంగ దండం చేసి; గో ప్రదానంబులు= గోవులను మంచి బుద్ధితో ఇవ్వటాలను; విధి సంపన్నంబులుగాన్= శాస్త్ర విధానం నిండుగా ఉండే విధంగా; చేయువారు+ఐ= చేసేవారై; మనంబులన్= హృదయాలలో; పూనిరి= సంకల్పించారు; ఆ+పితామహుండు= ఆ తాత; ఆ+పాండవ+అగ్రజున్= పాండుకుమారులలో పెద్దవాడైన ధర్మరాజును; ఉద్దేశించి= చూచి; వెండియున్= ఇంకను; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: తాత ఇట్లా చెప్పగా ధర్మరాజూ, తమ్ములూ పరమానందం పొందారు. భీష్ముడికి సాష్టాంగ నమస్కారం చేశారు. గోదానాలను శాస్త్రవిధానంతో ఏ లోపం లేకుండా చేయాలని సంకల్పించారు. ఆ తాత మళ్ళీ ధర్మరాజును చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: తమ్ములును అనటంవలన మంచిపనులు చేయటంలో వారు ధర్మరాజువంటివారే అనే అర్థం స్ఫురిస్తుంది. ప్రణమిల్లి- ఒక్కొక్క మహావిషయం విన్నప్పుడల్లా వారికి భీష్ముడిమీద గౌరవం ఇనుమడిస్తున్నదని తాత్పర్యం. పితామహుడు - తాతకు మనుమల మీద విశేషానురాగం ఉంటుంది.

సీ. 'సౌదాసుఁ డనఁగ నిక్ష్వాకు కులంబున । జనియించె; నాతఁడు మునివరేణ్యుఁ
డైన వసిష్ఠుని నాత్మపురోహితు । వినతుఁ డై యడిగెఁ బవిత్ర మెద్ది?
యని దాని కాదర మతిశయిల్లఁగ నమ్మ । హాత్ముఁ డిట్లనియెఁ 'బుణ్యాత్మ! వినుము
గోవు పవిత్రంబు గోవు హవిర్జన్మ । భూమి గో వరయఁగా భూతములకు

ఆ. నెల్ల నాధారభూతమౌ నీడ్యవస్తు । వతుల లక్ష్మికి మూల; మత్యంత దురిత
జలనిధికి నోడ; నిర్జర సద్మమునకు । ననఘ! నిచ్చెన సురలకు మనికిపట్టు.' 28

ప్రతిపదార్థం: ఇక్ష్వాకు కులంబునన్= ఇక్ష్వాకుడి కులంలో; సౌదాసుఁడు అనఁగన్= సౌదాసుడనే పేరుతో; జనియించెన్= (ఒక రాజు) పుట్టాడు; ఆతఁడు= ఆ రాజు; మునివరేణ్యుఁడు+ఐన= మునులలో శ్రేష్ఠుడైన; వసిష్ఠునిన్= వసిష్ఠుడిని; ఆత్మ పురోహితున్= తన పురోహితుడిని; వినతుఁడు+ఐ= వినయం కలవాడై; పవిత్రము= పవిత్రమైనది; ఎద్ది= ఏది? అని, అడిగెన్= అడిగాడు; ఆ+మహాత్ముఁడు= దొడ్డబుద్ధి గల ఆ వసిష్ఠుడు; దానికిన్; ఆదరము= ప్రీతి; అతిశయిల్లఁగన్= పెంపొందగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; పుణ్య+ఆత్మ= ఓయి పుణ్య హృదయుడా!; వినుము; అనఘ!= పాపాలు లేనివాడా; గోవు= ఆవు; పవిత్రంబు= పవిత్రం అయినది; గోవు= ఆవు; హవిస్+జన్మభూమి= హోమపదార్థాలకు పుట్టిన ఇల్లు; అరయఁగాన్= మెలకువతో చూస్తే; గోవు= ఆవు; భూతములకున్+ఎల్లన్= అన్ని ప్రాణులకు; ఆధార భూతము+ఔ= ఆధారంగా అయిన; ఈడ్య వస్తువు= పూజించదగిన వస్తువు; అతుల లక్ష్మికిన్= సాటిలేని సంపదకు; మూలము= కుదురు; అత్యంత దురిత జనిధికిన్= మిక్కిలి ఘోరమైన పాపాలనే సముద్రానికి; ఓడ; నిర్జరసద్మమునకున్= దేవతల నెలవైన స్వర్గానికి; నిచ్చెన= నిచ్చెన; సురలకున్= దేవతలకు; మనికిపట్టు= నివసించే చోటు.

తాత్పర్యం: ఇక్ష్వాకువంశంలో సౌదాసుడనే రాజు ఉండేవాడు. మునులలో ఉత్తముడూ, తన పురోహితుడూ అయిన వసిష్ఠుడిని ఆ రాజు వినయంతో 'స్వామీ! పవిత్రమైన దేది?' అని అడిగాడు. ఎంతో ప్రీతి పొంది ఆ మహాత్ముడు ఇట్లా అన్నాడు. 'పుణ్యాత్ముడా! వినుము! గోవు పవిత్రమైనది. గోవు హోమద్రవ్యాలకు పుట్టినిల్లు. అన్ని ప్రాణులకూ గోవే ఆధారం. అది పూజ్యమైనది. సాటిలేని సంపదలకు మూలం. మహాపాపా లనే సముద్రాన్ని దాటటానికి ఓడ, స్వర్గానికి నిచ్చెన, దేవతలకు నివాసస్థలం.'

విశేషం: మునివరేణ్యుడు, ఆత్మ పురోహితుడు కనుక తా నడిగే ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పగలడని రాజునకు నమ్మకం. మంచి ప్రశ్న అడిగినందుకు వసిష్ఠుడికి ఎంతో ప్రీతి కలిగింది. అందుకనే 'పుణ్యాత్మ' అని సంబోధిస్తున్నాడు. పుణ్యాత్ములకు కాని ఇటువంటి జిజ్ఞాస కలుగదని భావం. వ్యవసాయానికీ, పాడిపంటలకు, యజ్ఞద్రవ్యాలకు గోవే ఆధారం కనుక దానివలననే మానవులకు సుఖశాంతులు వర్ధిల్లుతాయి కనుక ఈ ప్రశంస అస్థాన పతితం కాదు.

వ. అని చెప్పి మఱియును. 29

తాత్పర్యం: వసిష్ఠ డిట్లా చెప్పి మరికొన్ని విషయాలు చెప్తున్నాడు.

క. 'పదియును నూఱును వేయును । మొదవులు గలవారు దానములుగా నొకటిం
బదియింటి నూటి నిచ్చిన । నదియు నదియు నదియు నదృశమగు ఫలము నెడన్. 30

ప్రతిపదార్థం: పదియును= పదిన్నీ; నూఱును= వందా; వేయును= వేయీ; మొదవులు= ఆవులు; కలవారు= ఉన్నవారు; దానములుగాన్= దానాలుగా; ఒకటిన్= ఒక దానినీ; పదియింటిన్= పదింటినీ; నూటిన్= నూరింటినీ; ఇచ్చినన్= ఇస్తే; అదియున్= ఆ ఒక్కటి నిచ్చినదానమూ; అదియున్= ఆ పదింటి నిచ్చినదానమూ; అదియున్= ఆ నూరింటి నిచ్చిన దానమూ; ఫలము+ఎడన్= అందించే ఫలం విషయంతో; సదృశము= సమానం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: 'పది ఆవులున్నవారు ఒకదానినీ, వంద ఆవులున్నవారు పదింటినీ, వేయి ఆవులున్నవారు నూరింటినీ దానం చేస్తే ఆ మూడు దానాల ఫలమూ సమానం అవుతుంది.

విశేషం: దానం అనేది శక్తినిబట్టి చేయాలి. దానం ముఖ్యం కానీ ఎంత? అనేది ప్రధానం కాదు. ఆ విధంగా ఫలితం సమానం అవుతుంది.

క. విను గోవులను బ్రభాతం । బునఁ దలఁచుట, తద్గుణములు వొగడుట, భక్తిం
గనుఁగొనుట యధిక పుణ్యము । లని యెఱిఁగించు జనములకు నాగమఫణితుల్. 31

ప్రతిపదార్థం: వినుము; ఆగమ ఫణితుల్= వేదకావ్యాలు; జనములకున్= జనాలకు; గోవులను= ఆవులను; ప్రభాతంబునన్= ప్రొద్దున; తలఁచుట= స్మరించటమూ; తత్‌గుణములు= వాని గుణాలను; పొగడుట= కొనియాడటమూ; భక్తిన్= భక్తితో; కనుఁగొనుట= (ఆవులను) చూడటమూ; అధిక పుణ్యములు= ఎక్కువ పుణ్యాలు; అని; ఎఱిఁగించున్= తెలియజేస్తాయి.

తాత్పర్యం: ఉదయకాలంలో ఆవులను తలవటమూ వాటి గుణాలను కొనియాడటమూ, భక్తితో వాటిని చూడటమూ గొప్ప పుణ్యకార్యాలని వేదవాక్యాలు జనాలకు తెలియజేస్తున్నాయి.

విశేషం: 'ఆగమం' అంటే శబ్ద ప్రమాణం. అది అన్ని ప్రమాణాలకంటె మిన్న అయినది. కాబట్టి దీనిలో సంశయించవలసిన దేమీ లేదని భావం. ప్రభాతంబున= అంటే దినారంభంలో, పుణ్యకార్యాలతో రోజుపని ప్రారంభిస్తే రోజంతా పుణ్యంతో నిండుతుందని భావం. 'విను' అనే మాట శ్రద్ధను సూచిస్తుంది.

ఆ. కిల్బిషంబు గోశకృన్మూత్రముల కేవ । పడుట సకలమాంసభక్షి కైన
ఘోరపాప మండ్రు గోమాంస భక్షణ । మబ్జసంభవాదు లైన సురలు. 32

ప్రతిపదార్థం: గో శకృత్+మూత్రములకున్= ఆవు పేడ, పంచితములకు; ఏవపడుట= రోతపడటం; కిల్బిషంబు= పాపం; అబ్జసంభవ+ఆదులు+ఐన= బ్రహ్మ మొదటగా ఉన్న; సురలు= దేవతలు; సకల మాంస భక్షికిన్+ఐనన్= అన్ని జంతువుల మాంసాలు తినేవానికి కూడా; గో మాంస భక్షణము= ఆవుల మాంసం తినటం; ఘోర పాపము= చాలా భయంకరమైన పాపం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఆవుల మలమూత్రాలకు రోతపడటం పాపం. అన్ని జంతువుల మాంసాలు తినే వారికైనా ఆవు మాంసం తినటం చాలా ఘోరమైన పాపం అని బ్రహ్మ మొదలైన దేవతలు అంటారు.

క. జనములు దుస్స్వప్నంబులు । గని గో కీర్తనము సేయఁగాఁ దద్దురితం
బునఁ బొరయరు గోమయయుత । వినుతాంబు స్నాన మతిపవిత్రం బనఘా! 33

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; జనములు= మానవులు; దుస్ స్వప్నంబులు= పీడకలలు; కని= పొంది; గో కీర్తనము= ఆవులను పొగడటం; చేయఁగాన్= చేస్తే; తత్ దురితంబునన్= ఆ పాపాన్ని; పొరయరు= పొందరు; గోమయ యుత వినుత+ అంబు స్నానము= ఆవుపేడతో కలిసి ప్రశస్తమైన నీటితో (చేసే) స్నానం; అతి పవిత్రంబు= మిక్కిలి పరిశుద్ధమైనది.

తాత్పర్యం: మానవులు పాడుకలలు కన్నప్పుడు ఆవులను గురించి మంచి మాటలు పలికితే ఆ పాపాలను పొందరు. ఆవుపేడ కలిపిన నీటి స్నానం ఎంతో పరిశుద్ధి నిస్తుంది.

చ. సురభులు, సౌరభేయులును సుస్థితి నాకడ నుండుఁ గాత మేఁ
గరము వినీతి గోగణముఁ గన్గొనుచుండెద నర్థి గో సము
త్కరమును నన్ను నెప్డుఁ గనుఁ గావుత మం చెద గోవులం దలం
తురు బుధబోధితుల్ భయము దోఁచిన చోటులఁ దత్ప్రశాంతికై.' 34

ప్రతిపదార్థం: బుధబోధితుల్= పండితులచే ఉపదేశింపబడినవారు; భయము= భీతి; తోఁచినచోటులన్= ఏర్పడిన తావులలో; తత్ ప్రశాంతికై= అది అణగిపోవటానికి; సురభులు= ఆవులు; సౌరభేయులును= ఆవుదూడలున్నూ; సుస్థితిన్= మంచి నిలుకడతో; నాకడన్= నా దగ్గర; ఉండున్+కాతన్= ఉండుగాక; ఏన్= నేను; కరము= మిక్కిలి; వినీతిన్= వినయంతో; గోగణమున్= ఆలమందను; అర్థిన్= కోరికతో; కన్గొనుచుండెదన్= చూస్తూ ఉంటాను; గో సముత్కరమును= ఆవులమందకూడా; నన్నున్= నన్ను; ఎప్డున్= ఎల్లవేళలా; కనున్ కావుతన్= చూచుగాక; అంచున్= అంటూ; ఎదన్= హృదయంలో; గోవులన్= ఆవులను; తలంతురు= భావిస్తూ ఉంటారు.

తాత్పర్యం: పండితులచే ఉపదేశాలు పొందినవారు, భయాందోళనలు పొందేటప్పుడు వాటిని ఉపశమింపజేసికొనటానికి ఆవులను, దూడలను తమవద్ద సుస్థిరంగా ఉండాలని కోరుకొంటారు. నేను వినయంతో వాటి యోగక్షేమాలను ప్రీతితో చూస్తూ ఉంటాననీ, గో సమూహంకూడా నన్నెపుడూ చల్లగా చూడాలని వారు భావిస్తుంటారు.

వ. అని నిర్దేశించి వెండియు నమ్మునీంద్రుం డా నరేంద్రున కిట్లనియె. 35

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; నిర్దేశించి= చెప్పి; వెండియున్= ఇంకా; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మహర్షి శ్రేష్ఠుడు; ఆ నరేంద్రునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఆ వసిష్ఠ మహాముని సౌదాస మహారాజుతో ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'అరుణ ధవళ మేచక ధూ । సరవర్ణాకలిత గో విషయదానంబుల్
ఖరకర సురపాగ్ని పవన । పరలోక సుఖముల నిచ్చు వసుధాధీశా! 36

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= రాజా!; అరుణ= ఎరుపు; ధవళ= తెలుపు; మేచక= నలుపు; ధూసర= బూడిదరంగు; అనే; వర్ణ= వన్నెలతో; ఆకలిత= చక్కగా కూడుకొన్న; గో= ఆవుల; విషయ= సంబంధమైన; దానంబుల్= దానాలు; ఖరకర= సూర్యుడి; సురప= ఇంద్రుడి; అగ్ని= అగ్నిదేవుడి; పవన= వాయుదేవుడి; వర= శ్రేష్ఠమైన; లోక= లోకములందలి; సుఖములన్= సుఖాలను; ఇచ్చున్= ఇస్తాయి.

తాత్పర్యం: రాజా! ఎర్రని ఆవుల దానం సూర్యలోక సుఖాన్నీ, తెల్లని ఆవుల దానం ఇంద్రలోక సుఖాన్నీ, నల్లని గోవుల దానం అగ్నిలోక సుఖాన్నీ, బూడిదరంగు ఆవుల దానం వాయులోక సుఖాన్నీ ఇస్తుంది.

విశేషం: నాలుగురంగులూ, నాలుగు లోకాలూ క్రమంగా అన్వయించే విధంగా చెప్పటంవలన ఇందులో క్రమాలంకారం (యథాసంఖ్యాలంకారం) గోచరిస్తున్నది. ఏ రంగు గోవు ఉన్నా దాని దానం ఏదో ఒక పుణ్యలోకాన్నిస్తుంది అనే అర్థం ఇక్కడ ఈ అలంకారంవలన స్ఫురిస్తుంది. కనుక 'అలంకారకృత వస్తుధ్వని' రూపంగా ఈ అలంకారం ఔచిత్యాన్ని సాధించుకొంటున్నది. ఆ లోకాలుకూడా వట్టివికావు 'వరా'లు అంటే కోరదగినవి.

క. విను తక్కిన వర్ణంబులు । జనవర గంధర్వ సిద్ధ సాధ్యాది నివా
స నితాంత సౌఖ్యదము లగు । ననిమిష యోషి త్ప్రియత్వ మన్నియు నిచ్చున్. 37

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; విను= వినుము; తక్కిన వర్ణంబులు= తక్కిన రంగుల ఆవులు (దానాలు); గంధర్వ= గంధర్వులు; సిద్ధ= సిద్ధులు; సాధ్య= సాధ్యులు; ఆది= మొదలైనవారి; నివాస= ఉనికిపట్టుల; నితాంత= ఎడతెగని; సౌఖ్య దములు= సుఖములను ఇచ్చేవి; అగున్= అవుతాయి; అన్నియున్= అన్నిరకాల ఆవులు (ఆవుల దానాలు); అనిమిష యోషిత్ ప్రియత్వము= దేవతా కాంతలకు ప్రియుడయ్యే భావాన్ని; ఇచ్చున్= ఇస్తాయి.

తాత్పర్యం: రాజా! తక్కిన వర్ణాల ఆవుల దానం గంధర్వ, సిద్ధ, సాధ్యనామాలుగల దేవజాతుల లోకాల సుఖాన్ని అనంతంగా ఇస్తాయి. అన్ని రకాల గోవులదానాలు అప్సరఃకాంతలకు వల్లభుడయ్యే భాగ్యాన్ని కలుగజేస్తాయి.

విశేషం: గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు - వీరిని దేవయోనులు అంటారు. వీరు అటు దేవతలంత మహిమగలవారు కారు. కేవలం మనుష్యులవంటి అల్పశక్తిమంతులూ కారు. అనిమిషులు - రెప్పపాటులేనివారు. అది దేవతల కొక గుర్తు. 'నితాంత' అన్నారు కనుక కొన్ని తరగతుల వారికి అదికూడా అపేక్షణీయమే అవుతుంది.

క. ధేను ప్రమాణ యగు తిల । ధేనువు నిచ్చిన నరుండు దీప్తుండగుఁ బు
ణ్యానూన లోక సంవా । సానందోన్నతిఁ జరించు నప్రతిహతుఁడై. 38

ప్రతిపదార్థం: ధేనుప్రమాణ అగు= ఆవు తూకానికి సరిపడే; తిలధేనువున్= నువ్వుల ఆవును; ఇచ్చిన నరుండు= ఇచ్చే మానవుడు; దీప్తుండు= ప్రకాశించేవాడు; అగున్= అవుతాడు; అప్రతిహతుఁడు+ఐ= ఏ అడ్డూ అదుపు లేనివాడై; పుణ్య= పుణ్యంతో; అనూన= ఏ తక్కువతనమూ లేని; లోక= లోకంలో; సంవాస= చక్కగా ఉండటంవలన కలిగిన; ఆనంద= ఆనందంయొక్క; ఉన్నతిన్= ఎక్కువతనంతో; చరించున్= తిరుగుతూ ఉంటాడు.

తాత్పర్యం: ఆ వెత్తు నువ్వుల ఆవును దానం చేసిన మానవుడు మంచి తేజస్సుతో ఒప్పారుతూ ఉంటాడు. పుణ్యం ఏ మాత్రమూ తక్కువ కాని లోకాల నివాసంవలన కలిగే ఆనందాతిశయంతో విహరిస్తూ ఉంటాడు.

విశేషం: ఇది ప్రత్యామ్నాయ పద్ధతి అంటారు. ఆవులు దానమివ్వటానికి లేనివాడు పుణ్యలోకాలకు అనర్హుడా? అన్న ప్రశ్నకు ఇది సమాధాన మిస్తుంది. 'తిలధేనువు' అంటే నువ్వులతో ఆవు బొమ్మ చేయాలని తాత్పర్యం. 'అనూన' 'ఉన్నతి' అనే పదాలచేత ప్రత్యామ్నాయ పద్ధతి అయినా ఫలం విశేషంగా ఉంటుందనే సూచన వ్యక్తమవుతుంది.

క. బహురూప విశ్వరూపక । మహిత సురూపత్వ దివ్యమహిమ గలుగు గో
మహనీయమూర్తి మన్మతి । సహిత మగుం గాత మనుట సంపద లొసఁగున్.' 39

ప్రతిపదార్థం: బహురూప= పెక్కురూపాలు గల; విశ్వరూపక= సమస్తమైన రూపాలుగల; మహిత= గొప్పతనంగల; సురూపత్వ= చక్కని ఆకారంగల; దివ్య= దేవలోకపు; మహిమ కలుగు= మహిమ ఉన్నట్టి; గో= ఆవులయొక్క; మహనీయమూర్తి= గొప్ప ఆకృతి; మత్+మతి సహితము= నా బుద్ధితో కూడినది; అగున్ కాతన్= అగుకాక; అనుట= అని పలకటం; సంపదలు=సంపదలను; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఎన్నో రూపాలు, అన్ని రూపాలు కలిగి గొప్పతనం కల చక్కని ఆకారంతో దేవలోకపు మహిమ కలిగి ఉండే ఆవుల మహనీయ రూపం నా బుద్ధిలో నిలిచి ఉండుగాక అనుకొనటం సంపదల నిస్తుంది.'

విశేషం: 'విశ్వరూపక' - అనే పదప్రయోగంవలన గోవునకు విరాట్స్వరూపంతో సామ్యం స్ఫురిస్తుంది.

క. అని ముని చెప్పిన సౌదా । స నరేంద్రుఁడు గో ప్రదాన సక్తాత్ముండై
యనితర సులభావ్యయ సుఖ । జనకస్థానంబు వడసె జనసంస్తుత్యా! 40

ప్రతిపదార్థం: జనసంస్తుత్యా!= జనులచేత స్తుతింప బడే ఓ రాజా!; అని= ఆ విధంగా; ముని= వసిష్ఠముని; చెప్పినన్= చెప్పగా; సౌదాస నర+ఇంద్రుఁడు= సౌదాస రాజు; గో ప్రదాన సక్త+ఆత్ముండు+ఐ= ఆవులను శ్రద్ధతో దానమివ్వటంలో లగ్నమైన మనస్సు కలవాడై; అనితరసులభ= ఇతరులకు తేలికగా దొరకని; అవ్యయ= తరుగులేని; సుఖ= సుఖానికి; జనక స్థానంబు= పుట్టిన చోటును; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: రాజా! ఆ వసిష్ఠు డట్లా చెప్పగా సౌదాస మహారాజు గోవులను శ్రద్ధగా దానం చేసే పనిలో మనస్సును లగ్నం చేసి ఇతరుల కందని నాశనంలేని సుఖం పుట్టేస్థానాన్ని సంపాదించాడు.

విశేషం: దీన్ని ఆఖ్యాయిక అంటారు. అంటే ఒక పుణ్యకార్యం చేసినవాని కథ. దీనివలన మానవులకు గోదాన విషయంలో ప్రచోదన కలుగుతుంది. 'ప్ర' 'సక్త' అనే పదాలు దానంలో ఉన్న విశిష్టతను వ్యక్తం చేస్తున్నాయి. కనుకనే 'అనితర సులభ', 'అవ్యయ' అనే పదాలకు సార్థకత సిద్ధిస్తుంది.

క. అని గంగాపుత్త్రుఁడు గో । వినుత మహిమఁ దెలియఁ జెప్ప విని ధర్మసుతుం
'డనఘచరిత్రా! యిట్లుం । డునె గోవుల పెంపు?' నావుడుం దగ మఱియున్. **41**

ప్రతిపదార్థం: అని; గంగాపుత్త్రుఁడు= భీష్ముడు; గో వినుత మహిమన్= గోవుల కొనియాడ దగిన గొప్పతనాన్ని; తెలియన్= తెలిసే విధంగా; చెప్పన్= చెప్పగా; విని; ధర్మసుతుండు= ధర్మరాజు; అనఘ చరిత్రా!= పాపాలులేని నడవడి కల ఓ మహానుభావా!; గోవులపెంపు= ఆవుల గొప్పతనం; ఇట్లు= ఈ విధంగా; ఉండునె= ఉంటుందా? నావుడున్= అని పలుకగా; తగన్= తగునట్లుగా; మఱియున్= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా భీష్ముడు గోవుల గొప్పతనాన్ని తెలియజెప్పగా విన్న ధర్మరాజు 'పుణ్యచరిత్రా! గోవుల మహిమ ఇంత గొప్పదా?' అన్నాడు. అప్పుడు మళ్ళీ. (తరువాతి వచనంతో అన్వయం)

విశేషం: 'ఇట్లుండునె' అనే పదబంధం ధర్మరాజు హృదయంలో కలిగిన ఆనందాశ్చర్యాలను అభివ్యక్తం చేస్తున్నది. శ్రోత ప్రీతితో వింటుంటే వక్తకు మరింత ఉత్సాహం కలుగుతుంది. అందుకనే భీష్ముడు ఇంకా చెప్పాలని ఉబలాట పడుతున్నారు.

వ. అమ్మహాత్ముం డమ్మహీపతితో 'గో విశేషం బింకను విను' మని యిట్లనియె. **42**

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముండు= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడు; ఆ+మహీపతితోన్= ఆ రాజుతో; గో విశేషంబు= గోవుల గొప్పతనం; ఇంకను= ఇంకా; వినుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: దొడ్డబుద్ధి గల భీష్ముడు ధర్మరాజుతో ఆవుల గొప్పతనం ఇంకా వినుము అని ఇట్లా చెప్పుతున్నాడు.

వేదవ్యాసముని శుకునకుఁ దెలిపిన గో ప్రభావ ప్రకారము (సం.13-80-6)

సీ. 'సర్వజ్ఞుఁ డగు పరాశరనందనుని పాద । పద్మంబులకు దృఢభక్తి నెఱఁగి
యతని నందనుఁడు సమంచిత మతియును । నవు శుకుం డెల్ల వస్తువులకంటె
నధికతమంబును యజ్ఞమూలంబును । నగు నది యెయ్యది? యతులకరుణ
నా కెఱింగింపవే' నావుడు నమ్మహి । తాత్ముఁ డివ్విధము మహానుభావ;

తే. మనఘ! యెందు నెక్కాలము నన్యవస్తు । వులకు లేదరయంగ గోవులకుఁ దక్కఁ
బుణ్యతమతయు యాగవిభూతి మూల । కారణత్వంబు వానిక కాక కలవె? **43**

ప్రతిపదార్థం: సర్వజ్ఞుఁడు+అగు= అంతయు తెలిసినవాడైన; పరాశరనందనుని= పరాశరుడి కుమారు డగు వ్యాసుడి; పాద పద్మంబులకున్= తామరపూలవంటి అడుగులకు; అతని నందనుఁడు= అతని కొడుకు; సమంచిత మతియును= మన్నింపదగిన

బుద్ధి కలవాడు; అవు= అయిన; శుకుండు= శుకుడు; దృఢభక్తిన్=గట్టిదైన భక్తితో; ఎఱఁగి= మ్రొక్కి; ఎల్ల వస్తువులకంటెన్= అన్ని వస్తువులకన్నా; అధికతమంబును= మిక్కిలి గొప్పదీ; యజ్ఞమూలంబును= యజ్ఞాలకు ఆధారమూ; అగునది= అయినది; ఏ+అది?= ఏది? అతులకరుణన్= సాటిలేనిదయతో; నాకున్= నాకు; ఎఱింగింపవే= దయతో తెలుపుమా? నావుడున్= అన్నంతనే; ఆ+మహిత+ఆత్ముఁడు= దొడ్డబుద్ధిగల ఆ వ్యాసుడు; అనఘ!= పాపరహితుడా?; ఈ+విధము= ఇట్టిదైన; మహానుభావము= గొప్ప ప్రభావం; ఎందున్= ఎక్కడా; ఏ+కాలమున్= ఏ కాలంలోనూ; అరయంగన్= పరీక్షించిచూడగా; గోవులకున్= ఆవులకు; తక్కన్= కాక; అన్య వస్తువులకున్= వేరు పదార్థాలకు; లేదు; పుణ్యతమతయున్= అన్నింటికంటె ఎక్కువ పుణ్యం కలది కావటమూ; యాగ విభూతి మూల కారణత్వంబున్= యజ్ఞాల ఐశ్వర్యానికి మొదటి హేతువు కావటమూ; వానిక= ఆ ఆవులకే; కాక; కలవె?= ఉన్నాయా?

తాత్పర్యం: సర్వమూ ఎరిగిన వ్యాసుడి పాదాలకు చెదరని భక్తితో మ్రొక్కి అతడి కుమారుడూ, మంచి బుద్ధి విశేషం కలవాడూ అయిన శుకుడు 'అన్ని వస్తువుల కంటె గొప్పదీ, యజ్ఞాలకు మూలమైనదీ ఏది? దయతో నాకు తెలుపుమా!' అని ప్రార్థించాడు. అప్పుడు వ్యాసుడు 'ఈ విధమైన గొప్ప ప్రభావం ఎక్కడా ఎప్పుడూ ఆవులకు తప్ప మరొకదానికి లేదు. పుణ్యం తుదిమెట్టు అనదగిన లక్షణమూ, యజ్ఞాల సంపదకు మూలకారణం కావటమూ ఆవులకే తప్ప మరొకదానికి కలవా?' (అని చెప్పాడు).

విశేషం: దృఢభక్తి నెఱఁగి - ఏదైనా తెలియ దగిన విషయాన్ని పెద్దల దగ్గర తెలుసుకొనటానికి ప్రణిపాతం - కాళ్ళకు మ్రొక్కటం ఒక సముదాచారం. ఎఱింగింపవే - తెలిసికొనటంలో శుకున కున్న గాఢవాంఛ నిది అభివ్యక్తం చేస్తుంది. అతుల కరుణ - అనేది దీనికి బలా న్నిస్తుంది.

క. అని చెప్పి మఱియు నిట్లను । 'విను గోవులు పరమ నియతి వేధఁ గొలువ నె
మ్మన మలర నతఁడు గనుఁగొని । మును వానికి లేని శృంగములు కల్పించెన్. 44

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; చెప్పి= తెలియజేసి; మఱియున్= ఇంకా; ఇట్లు= ఇట్లా; అనున్= చెప్పాడు; విను= శ్రద్ధతో ఆలకించుము; గోవులు= ఆవులు; పరమనియతిన్= గొప్ప నిష్ఠతో; వేధన్= బ్రహ్మదేవుడిని; కొలువన్= పూజించగా; అతఁడు= బ్రహ్మ; నెఱ+మనము= నిండు హృదయం; అలరన్= ప్రీతి పొందగా; కనుఁగొని= చూచి; మును= ముందు; వానికిన్= ఆ ఆవులకు; లేని= లేనట్టి; శృంగములు= కొమ్ములను; కల్పించెన్= పుట్టించాడు.

తాత్పర్యం: వ్యాసు డిట్లా చెప్పి ఇంకా ఈ విధంగా పలికాడు. 'నాయనా! వినుము. ఆవులు బ్రహ్మను గొప్ప నిష్ఠతో సేవించగా అతడు గుండెనిండుగా సంతోషపడి పూర్వం వాటికి లేని కొమ్ములు సృష్టించాడు.

వ. అట్లు కొమ్ము లొసఁగి సురముని లోకంబు నాలోకించి. 45

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కొమ్ములు= కొమ్ములను; ఒసఁగి= ఇచ్చి; సుర ముని లోకంబున్= దేవతల మునుల సముదాయాలను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ విధంగా కొమ్ము లిచ్చి దేవతల సముదాయాన్నీ, మునుల సముదాయాన్నీ చూచి (ఇట్లా అన్నాడు).

చ. 'పరమ పవిత్రముల్ యజన భాజనముల్ దము విన్నఁ జూచినన్
దురితచయంబులం దొలఁగఁ ద్రోవఁగఁ జాలుఁ బ్రధానకర్త కు

త్తరగతి లాభవైభవము తంగెటి జున్నుగఁ జేయు గోవు లె
వ్వరు దగ వీనిఁ గొల్తు రనివారణఁ జొత్తురు వారు నాకమున్.' 46

ప్రతిపదార్థం: పరమపవిత్రముల్= మిక్కిలి పావనమయినవీ; యజనభాజనముల్= యజ్ఞాలకు పాత్రమయినవీ అయిన గోవులు; తమున్= తమను; విన్నన్= విన్నా; చూచినన్= కన్నా; దురిత చయంబులన్= పాపాల రాసులను; తొలఁగన్= తొలగిపోయే విధంగా; త్రోవఁగన్+చాలున్= త్రోసివేయగలవు; గోవులు= ఆవులు; ప్రధానకర్తకున్= యజ్ఞకార్యంలో ముఖ్యుడైన యజమానునకు; ఉత్తరగతి లాభ వైభవము= ఉత్తర లోకాలకు పోవటం అనే లాభపు సంపదను; తంగెటి జున్నుగన్= తంగేటి చెట్టుకు బట్టిన తేనె పట్టువలె; చేయున్= చేస్తాయి; ఎవ్వరు= ఎవరు; తగన్= చక్కగా; వీనిన్= ఈ ఆవులను; కొల్తురు= పూజిస్తారో; వారు= ఆ మనుష్యులు; అనివారణన్= అడ్డులేకుండా; నాకమున్= స్వర్గాన్ని; చొత్తురు= ప్రవేశిస్తారు.

తాత్పర్యం: 'ఆవులు పరమపవిత్రమైనవి. యజ్ఞాలకు మూలకారణం అయినవి. వాటిని గూర్చి విన్నా, వాటిని చూచినా పాపాలను పటాపంచలు చేస్తాయి. యజమానులకు ఉత్తర లోకాలకు పోవటం అనే గొప్పతనాన్ని తంగెటిజున్నుగా సమకూరుస్తాయి. వాటిని శ్రద్ధతో పూజించినవారు అడ్డులేకుండా స్వర్గానికి చేరుకొంటారు.

విశేషం: పరమపవిత్రాలు కనుకనే యజ్ఞభాజనాలు అవుతున్నాయి. తంగెటిజున్ను సులభప్రాప్తికరమూ, రుచికరమూ, హితకరమూ కనుక అందరూ అపేక్షిస్తారు. గోవులను సేవించటంవలన ఉత్తరగతి ఆ విధంగా సిద్ధిస్తుంది. అనివారణన్ - స్వర్గం వారి సొంత ఇల్లువంటి దవుతుం దని భావం.

వ. అనియె గోవుల పావనత్వంబు విశేషించి చెప్పెద వినుము. 47

ప్రతిపదార్థం: అనియెన్= బ్రహ్మ ఈ విధంగా చెప్పాడు; గోవుల పావనత్వంబు= ఆవుల పవిత్రతను గూర్చి; విశేషించి= ఇంకా ఎక్కువగా; చెప్పెదన్= చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: అని బ్రహ్మ చెప్పాడు. వ్యాసుడు గోవుల పావనత్వాన్ని గురించి మరికొన్ని విశేషాలు చెప్పుతాను వినుము' అన్నాడు.

సీ. అమలాత్మ! గోవు మూత్రముఁ బాలు నేయిని । బానార్హ మగు పెండతోన వరుస
మూఁడు దినంబులు మును ద్రావి మఱి మూఁడు । దివసంబులందు వాయువు భుజించి
యవలు నుగ్గుగ ధేనునివహంబు ద్రొక్కించి । వెలవ నత్తెఱఁగు నూకలన కాఁచి
నెలలు మూఁ డత్యంత నియతి నాహారంబు । గొన బ్రహ్మహత్యఁ బోలినవి యైనఁ

తే. బాయుఁ బాపముల్ దివిజు లీపావన క్రి । యా విధానంబునన కాదె యసురగణము
గెలిచి రావులనేయి విప్రులకు నీగి । దాని వేల్చుట ద్రావు టుదాత్తతరము. 48

ప్రతిపదార్థం: అమల+ఆత్మ= నిర్మలమైన హృదయం కలవాడా!; గోవు మూత్రమున్= ఆవు మూత్రాన్నీ; పాలున్= పాలను; నేయిని= నేతినీ; పాన+అర్హము+అగు= త్రాగుటకు యోగ్యం అయిన; పెండతోన= పేడతో; వరుసన్= వరుసగా; మును= ముందు; మూఁడు దినంబులు= మూడు రోజులు; త్రావి= త్రాగి; మఱి మూఁడు దివసంబులందున్= తరువాతి మూడు రోజులలో; వాయువున్= గాలిని; భుజించి= తిని; యవలు= యవలనే ధాన్యాన్ని; నుగ్గుగన్=రవ్వగా అయ్యేవిధంగా; ధేను నివహంబున్= ఆవులమందతో; త్రొక్కించి; ఆ+తెఱఁగు నూకలన= ఆ విధంగా అయిన నూకలతోనే; వెలవన్= గంజిని;

కాఁచి=కాచి; నెలలు= మాసాలు; మూఁడు= మూడు; అత్యంతనియతిన్= ఎక్కువ నిష్ఠతో; ఆహారంబు= అన్నంగా; కొనన్= తీసికొంటే; బ్రహ్మహత్యన్= బ్రాహ్మణుడిని చంపటాన్ని; పోలినవి= పోలేవి; ఐనన్= అయినా; పాపముల్= పాపాలు; పాయున్= పోతాయి; దివిజులు= స్వర్గంలో పుట్టిన దేవతలు; ఈ పావన క్రియా విధానంబునన= ఇట్టి పవిత్రమైన పని తీరుననే; కాదె= కదా; అసురగణమున్= రక్కసుల గుంపును; గెలిచిరి= గెలిచారు; ఆవులనేయి= ఆవుల నేతిని; విప్రులకున్= వేద విద్యగల బ్రాహ్మణులకు; ఈఁగి= ఇవ్వటమూ; దాని వేల్చుట= దానిని హోమం చేయటమూ; త్రావుట= త్రాగటమూ; ఉదాత్త తరము= చాలా గొప్పది.

తాత్పర్యం: నిర్మలాత్ముడా! ఆవుమూత్రాన్నీ, పాలనూ, నేతినీ, పేడనూ కలిపి ముందు వరుసగా మూడు రోజులు త్రాగాలి. తరువాత మూడు రోజులు ఉపవాసం ఉండాలి. ఆ తరువాత మూడు నెలలు ఆవులు త్రొక్కిన యవలనూకలతో కాచిన గంజిని భోజనంగా గ్రహించాలి. ఇట్లా చేస్తే బ్రహ్మహత్యవంటి పాపాలు కూడా రూపుమాసిపోతాయి. దేవతలు ఈ పని చేసే కదా రాక్షసులమూకలను గెలిచారు. ఆవులనెయ్యిని విద్యావంతులకు దానం చేయటమూ హోమం చేయటమూ, త్రాగటమూ చాలా గొప్ప విషయం.

విశేషం: వాయువు భుజించి - ఉపవాసం ఉండి అని భావం. మహాపాపాలు పోవటం మాత్రమే కాదు స్వర్గసుఖం కూడా లభిస్తుంది. అంటే ఒక పనితో రెండు ప్రయోజనాలు సిద్ధిస్తాయని భావం. దృష్టాంతంగా దేవతల విజయాన్ని చెప్తున్నారు.

క. విమలాంబువుల నుప స్ప । ర్శము నిర్వర్తించి గో ప్రచయ మధ్యమునన్
దమయుతముగ గోమతి చి । త్తమున జపించిన శుచిత్వ ధన మొడఁగూడున్. 49

ప్రతిపదార్థం: విమల+అంబువులన్= స్వచ్ఛమైన నీటితో; ఉపస్పర్శము= ఆచమనం; నిర్వర్తించి= చేసి; గో ప్రచయ మధ్యమునన్= ఆవులమంద నడుమ; దయయుతముగన్= ఇంద్రియాలను అదుపుచేసికొనటంతో పాటుగా; గోమతి= గోమతి అనే మంత్రాన్ని; చిత్తమునన్= హృదయంలో; జపించినన్= జపిస్తే; శుచిత్వ ధనము= పరిశుద్ధత అనే సొమ్ము; ఒడఁగూడున్= సిద్ధిస్తుంది,

తాత్పర్యం: స్వచ్ఛమైన నీటితో ఆచమనం చేసి ఆవులమందనడుమ ఇంద్రియ నిగ్రహంతో 'గోమతి' మంత్రాన్ని హృదయంలో జపిస్తే మానవుడికి పవిత్రత అనే ధనం చేకూరుతుంది.

విశేషం: ఉపస్పర్శం అంటే ఆచమనం. లోపల ఉన్న సూక్ష్మశరీర శుద్ధికొరకు భగవన్నామం మూడు మారులూ అంటూ నీటిని కొంచెంగా లోపలికి పుచ్చుకొనటాన్ని ఆచమనం అంటారు. ఉపస్పర్శం అంటే స్నానం కూడా అని కూడా అర్థం ఉన్నది. కాబట్టి 'స్వచ్ఛమైన నీటిలో స్నానం చేసి' అని కూడా అర్థం చెప్పుకొనవచ్చును. 'దమయుతముగన్' - ఇంద్రియాల అదుపులేకుండా చేసే జపాదులు ఫలాన్నివ్వవు అని భావం. చిత్తమునన్ - జపం మూడు విధాలు. మంత్రాన్ని పైకి, ఇతరులకు వినపడే విధంగా ఉచ్చరిస్తూ జపం చేయటం మొదటి పద్ధతి. పెదవుల కదలిక లేకుండా నోటిలో శబ్దం పైకిరాకుండా చేసే జపం రెండవ పద్ధతి. మంత్రాన్నీ, మంత్రార్థాన్నీ హృదయంలో మాత్రమే భావన చేయటం మూడవది. వీటిలో మూడవది సర్వశ్రేష్ఠమైనది. ఈ పద్యంలో 'చిత్తమున' అనే మాటద్వారా దానినే చెప్పారు. 'శుచిత్వధనము' - మానవుడు సాధారణంగా లోపలా, వెలుపలా ఎన్నో మలినాలతో కూడి ఉంటాడు. అవి అతనిని పాప కూపానికి లాగుతూ ఉంటాయి. స్నానాదులచేత వెలుపలి మలాన్నీ, జపాదులచేత లోపలిమలాన్నీ (మనస్సు) మొదలైన సూక్ష్మదేహపు మలాన్నీ) పోగొట్టుకొంటే అతడు పరమార్థానికి సన్నిహితుడవుతాడు. అందుకని అది ఒక మహాధనంగా ఈ పద్యంలో చెపుతున్నాడు.

తే. అగ్ని సన్నిధి గోనిచయంబు నడుమ । బ్రాహ్మణుల పాల గోమతీపఠన మాచ
రించినను విన్నఁ గోర్కి సిద్ధించు; గోవుఁ । గడచినట్టిది లేదు జగత్త్రయమున. 50

ప్రతిపదార్థం: అగ్ని సన్నిధిన్= అగ్ని సమీపంలో; గోనిచయంబు నడుమన్= ఆవుల మంద మధ్యలో; బ్రాహ్మణుల పాలన్= బ్రహ్మజ్ఞానం కలవారి దగ్గర; గోమతీ పఠనము= గోమతి మంత్రాన్ని చదవటం; ఆచరించినను= చేసినా; విన్నన్= విన్నా; కోర్కి= కాంక్ష; సిద్ధించున్= నెరవేరుతుంది; జగత్త్రయమునన్= మూడు లోకాలలో; గోవున్= ఆవును; కడచినట్టిది= మించినట్టిది; లేదు.

తాత్పర్యం: అగ్ని దగ్గరా, ఆవులమందలోనూ, బ్రహ్మజ్ఞానం కలవారిదగ్గరా గోమతీమంత్రాన్ని పఠించినా, విన్నా కోరిన కోరిక నెరవేరుతుంది. మూడులోకాలలో ఆవును మించినది మరొకటి లేదు.

విశేషం: అగ్ని, ఆవు, బ్రాహ్మణుడు పరమ పవిత్ర స్వరూపాలని భావం. వారి దగ్గర చదివిన మంత్రం శీఘ్రంగా ఫలాన్నిస్తుందని భావన. స్వయంగా చదవలేనివారికి కూడా గతి ఉన్నది. అది శ్రవణం ద్వారా సిద్ధిస్తుంది. జగత్త్రయం -స్వర్గం, మర్త్యం, పాతాళం.

క. అని యి ట్లుపన్యసించిన । జనక వచన రచనఁ గల్గు సార మఖిలముం
గని శుకుఁడు గోసమారా । ధన తత్పరచిత్తుఁ డయ్యె ధర్మతనూజా!' 51

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ధర్ముడి కుమారా!; అని= ఇట్లని; ఇట్లు= ఈ విధంగా; ఉపన్యసించినన్= ప్రమాణపూర్వకంగా చెప్పగా; జనక వచన రచనన్= తండ్రి మాటల కూర్పులో; కల్గు= ఉన్న; సారము= నిగ్గు; అఖిలమున్= మొత్తంగా; కని= తెలిసికొని; శుకుఁడు= శుక మహర్షి; గో సమారాధన తత్పర చిత్తుఁడు= ఆవులను చక్కగా పూజించటంలో చెడని శ్రద్ధగల హృదయం గలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వ్యాసు డిట్లా ప్రీతితో నిరూపించి చెప్పగా తండ్రి మాటలలోని సారమంతా గ్రహించి శుకుడు గోవులను చక్కగా ఆరాధించటంలో ఆసక్తిగల మనస్సుకలవా డయ్యాడు.'

విశేషం: సారము - ఒక విషయాన్ని ప్రతిపాదించటానికి సంబంధించిన అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. అందులో శ్రోత సారాన్ని గ్రహించాలి. తత్పర, చిత్తుఁడు - అందే లగ్నమైన మనస్సు కలవాడు. మనస్సు లగ్నమైతే తక్కిన రెండు కరణాలు - మాటా, చేష్టా - తప్పక లగ్న మవుతాయి. అప్పుడే ఆరాధన ఫలదాయక మవుతుంది. ఉపన్యసించటం - అంటే ఉప=దగ్గర, న్యసించటం=ఉంచటం, హృదయానికి హత్తుకొనేటట్లు చెప్పటం అని భావం.

వ. అనిన విని పాండవాగ్రజుండు 'బ్రహ్మ విశ్వంబునకు విభుండు తదీయస్థానంబునకు మీఁదు గోలోకంబని విందు; నట్లుగాఁ గతంబేమి?' యని యడుగుటయు నాపగాతనయుం డతని నాదర భరితుం డగుచు నాలోకించి 'వినుము వివరించెద; విశ్వకర్మ తపో నియతుండయి యజ్ఞార్థంబును మోక్షార్థంబునుంగా నమృతమయ మూర్తియుఁ గామరూపిణియు నగు సురభి యను కన్యకం దన మనోవృత్తి గల్పించి మహాతేజోమయుండగు నొక్క పురుషుని సృజియించిన, దేదీప్యమానుం డగు నాతం డతి మనోహరాకృతి యగు నయ్యతివం గనుంగొని కామమోహితుం డయి యార్తి నొందుటయు నఖిల లోక పావనుండైన చతురాననుండు సన్నిహితుండై 'మార్తో భవ' యని పలికి యతని యార్తత్వం బుడిపి తన పల్కు కారణంబుగా మార్తాండ నామం బొసంగి యన్నారీ

రత్నంబు నిచ్చి, యన్నెలంతకు నీకును జనియించిన యపత్యంబులు యాగాపవర్గార్థ క్షీర జనకంబులై మదీయ లోకంబునకు నుపరిభాగంబున వర్తింప వరంబిచ్చితి' ననియె; నట్లొందిన యయ్యిరువురకుం బ్రభవించిన సౌరభేయీకులం బా కమలాసను నిర్దేశించినట్టిదై సురాసుర ప్రముఖ నిఖిల జనంబులకు నమస్కార్యంబును సపర్యాభాజనంబును నయి రాజిల్లు నని చెప్పి వెండియు. **52**

ప్రతిపదార్థం: అనినన్= ఇట్లు చెప్పగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= పాండుకుమారులలో పెద్దవాడు ధర్మరాజు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; విశ్వంబునకున్= సమస్తానికి; విభుండు= ప్రభువు; తదీయ స్థానంబునకున్= అతనిదైన నెలవునకు; మీఁదు= పైది; గోలోకంబు= గోవుల లోకం; అని; విందును= వింటున్నాను; అట్లు కాన్= ఆ విధంగా అవటానికి; కతంబు= కారణం; ఏమి అని; అడుగుటయున్= అడిగినంతనే; ఆపగా తనయుండు= నది కొడుకు భీష్ముడు; అతనిన్= ఆ ధర్మరాజును; ఆదర భరితుండు= ప్రీతి నిండినవాడు; అగుచున్= అవుతూ; ఆలోకించి= చూచి; వివరించెదన్= వివరిస్తాను; వినుము; విశ్వకర్మ= దేవతల శిల్పి; తపస్+నియతుండు+అయి= తపస్సునందు నిష్ఠ కలవాడై; యజ్ఞ+అర్థంబును= యజ్ఞాల కొరకున్నూ; మోక్ష+అర్థంబునున్+కాన్= మోక్షంకొరకున్నూ; అమృతమయమూర్తియున్= అమృతమే అంతా అయిన ఆకారం కలదీ; కామ రూపిణియున్= ఇచ్చవచ్చిన రూపం పొందగలదియు; అగు= అయిన; సురభి అను కన్యకన్= సురభి అనే బాలికను; తన మనస్+ వృత్తిన్= తన సంకల్పాన్ని బట్టి; కల్పించి= ఏర్పాటు చేసి (సృష్టించి); మహత్+తేజస్+మయుండు+అగు= గొప్ప తేజస్సుతో నిండిన స్వరూపంగల; ఒక్క పురుషునిన్= ఒక్క మగాడిని; సృజియించినన్= పుట్టించగా; దేదీప్యమానుండు+అగు ఆతండు= కాంతితో ఎక్కువగా విరాజిల్లుతున్న ఆ పురుషుడు; అతి మనస్+హర+ఆకృతి అగు= మిక్కిలిగా మనస్సును ఆకర్షించే రూపంగల; ఆ+అతివన్= ఆ ఇంతిని; కనుంగొని= చూచి; కామ మోహితుండు+అయి= కామంతో ఒడలెరుగనివాడై; ఆర్తిన్= దుఃఖాన్ని; ఒందుటయున్= పొందగా; అఖిల లోక పావనుండు+ఐన= అన్ని లోకాలలో పవిత్రుడయిన; చతుర్+ఆననుండు= నాలుగు మోముల దేవర; సన్నిహితుండు+ఐ= సమీపానికి వచ్చినవాడై; మా+ఆర్తః+భవ= దుఃఖము కలవాడవు కాకుము; అని; పలికి; అతని ఆర్తత్వంబు= అతడి దుఃఖాన్ని; ఉడిపి= పోగొట్టి; తన పల్కు= తన మాట (మార్తో అన్న తన మాట); కారణంబుగాన్= హేతువుగా; మార్తాండ నామంబు= మార్తాండు డనే పేరు; ఒసఁగి= ఇచ్చి; ఆ+నారీ రత్నంబున్= స్త్రీలలో శ్రేష్ఠ అయిన ఆ ఇంతిని; ఇచ్చి= భార్యగా ఇచ్చి; ఆ+నెలంతకున్= ఆ స్త్రీకీ; నీకున్= నీకూ; జనియించిన+అపత్యంబులు= పుట్టిన సంతానాలు; యాగ+అపవర్గ+అర్థ క్షీర జనకంబులు+ఐ= యజ్ఞాలకూ, మోక్షానికీ పనికివచ్చే పాలను పుట్టించేవి అయి; మదీయ లోకంబునకున్= నాదైన సత్యలోకానికి; ఉపరిభాగంబునన్= పై భాగంలో; వర్తింపన్= ఉండటానికి; వరంబు= వరాన్ని; ఇచ్చితిన్= ఇచ్చాను; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; ఒందిన= ఏర్పడ్డ; ఆ+ఇరువురకునున్= ఆ ఇద్దరికీ; ప్రభవించిన= పుట్టిన; సౌరభేయీ కులంబు= సురభి సంతానం అయిన ఆవుల సముదాయం; ఆ కమలాసను నిర్దేశించిన+అట్టిది+ఐ= ఆ బ్రహ్మచెప్పిన విధంగా అయినదై; సుర+అసుర ప్రముఖ నిఖిల జనంబులకున్= దేవతలు, రాక్షసులు మొదలగు సకల జనాలకూ; నమస్కార్యంబును= నమస్కరించదగినదీ; సపర్యా భాజనంబును= పూజకు యోగ్యమైనదీ; అయి; రాజిల్లున్= ఒప్పుతున్నది; అని చెప్పి= అని తెలియజేసి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ మాట విని ధర్మరాజు భీష్ముడిని ఇట్లా అడిగాడు. 'బ్రహ్మ ఈ సమస్త లోకాల సముదాయానికీ ప్రభువు కదా! గోలోకం ఆయన లోకానికి కూడా పైన ఉంటుందని విన్నాను. దానికి కారణం ఏమిటి?' అంటే భీష్ముడు నిలువెల్లా ఆదరంతో మనుమడిని చూచి 'విను వివరిస్తాను. పూర్వం దేవతల శిల్పి యజ్ఞంకొరకని, మోక్షంకొరకని అమృతమే అయిన స్వరూపంగలదీ, ఇష్టరూపం ధరించగలదీ అయిన సురభి అనే కన్యకను మనస్సుతీరు కనుగుణంగా సృష్టించాడు. అట్లాగే గొప్పతేజోవంతు డయిన ఒక్కమగవాడిని కూడా సృష్టించాడు. తేజస్సుతో వెలిగిపోతున్న ఆ పురుషుడు మనస్సును మరపించివేసే ఆకారంగల ఆ యింతిని చూచి కామభావన

పొంది చెప్పరాని వేదన పొందాడు. లోకాలన్నింటిని పవిత్రం చేయగల బ్రహ్మ అతని దగ్గరకు వచ్చి 'మార్తోభవ' (ఆర్తుడవు కావద్దు) అని పలికి అతడి దుఃఖం పోగొట్టాడు. తానన్న మాట కారణంగా అతడికి 'మార్తాండుడు' అని పేరు పెట్టి ఆ చక్కని యింతిని భార్యగా ఇచ్చి ఈమెకూ నీకూ పుట్టిన సంతానం యాగాలకూ, మోక్షాలకూ కావలసిన పాలను సృష్టిస్తూ నా లోకానికి పై భాగాన ఉండే వరం ఇచ్చాను అన్నాడు. ఆ విధంగా కలిపిన వారిద్దరికీ పుట్టిన సంతానం బ్రహ్మశాసనం మేరకు దేవతలు, రాక్షసులు మొదలైన వారందరికీ నమస్కార యోగ్యమూ, పూజకుపాత్రమూ అయి ఒప్పుతున్నది' అని చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

విశేషం: ఆదర భరితుండు - శిష్యుడు మంచి ప్రశ్నవేస్తే గురువు ఆనందం పొందుతాడు. తపోనియతుండయి తపస్సు అంటే తీవ్రభావన. అది దేన్నయినా సాధిస్తుంది. ఆమె అమృతమయమూర్తి. అతడు మహా తేజోమయుడు కనుక వారి సంతానం అత్యున్నత స్థితి నందటం మహా ఫలసాధనకు కావలసిన వస్తువును అందించటం సంభవించింది. యజ్ఞము కర్మకాండకు సంబంధించినది. దానివలన యజమానుని మూడు కరణాలు - మనస్సు, వాక్కు, చేష్ట అనేవి పరమ పవిత్రాలవుతాయి. అప్పుడు అవి జ్ఞాననిష్ఠకు యోగ్యాలై ముక్తికి కారణా లవుతాయి. కాబట్టి 'యాగాపవర్గార్థ క్షీరజనకములు' అనటం. గోవులు సురలకే కాదు అసురులకు కూడా పూజాస్థానాలు. అంటే గోవులను హింసించేవారు రక్కసులకంటే హీను లని భావం.

క. 'అది కారణముగ గోవులు । తుది ముట్టిన పెంపు గలిగి దురితహరగుణా
స్పదమయి తమ్ము సభక్తిక । హృదయు లగుచుఁ గొలుచు వారి కిష్టము లొసఁగున్.' 53

ప్రతిపదార్థం: అది= ఆ బ్రహ్మదేవుడి ఏర్పాటు; కారణముగన్= హేతువుగా; గోవులు= ఆవులు; తుది ముట్టిన పెంపు= చిట్టచివరకు చేరిన గొప్పతనం; కలిగి= పొంది; దురిత హర గుణ+ఆస్పదము+అయి= పాపాలను పోగొట్టే గుణానికి తావు అయి; తమ్మున్= వానిని; సభక్తిక హృదయులు+అగుచున్= భక్తితో కూడిన భావం కలవారగుచూ; కొలుచువారికిన్= సేవించేవారికి; ఇష్టములు= కోరిన కోర్కెలను; ఒసఁగున్= ఇస్తాయి.

తాత్పర్యం: 'బ్రహ్మచేసిన కట్టడినిబట్టి ఆవులు గొప్పతనపు తుదియంచు చేరుకొని పాపాలను పటాపంచలు చేసే గుణానికి స్థానమై, భక్తితో నిండిన హృదయంతో సేవించే వారికి కోరిన కోర్కెలను ఇస్తున్నాయి.'

విశేషం: గోవుల గొప్పతనం సృష్టికర్త ఏర్పాటువలన సిద్ధించింది. ఆ గొప్పతనం కూడా కడముట్టా లభించింది. కాబట్టి అవి పాపాలను పటాపంచలు చేస్తాయి. కోరిన కోర్కెలను తీరుస్తాయి. 'అగుచున్' అనటంవలన భక్తి నిరంతరంగా సాగుతూనే ఉండాలి అనేది సూచన.

క. అని చెప్పినఁ బాండునృపతి । తనయుఁడు మార్తాండ సురభి దాంపత్యమునన్
మును పుట్టిన ప్రజ యెయ్యది? । వినవలతు మహాత్మ చెప్పవే నా' కనుడున్. 54

ప్రతిపదార్థం: అని= ఇట్లని; చెప్పినన్= భీష్ముడు చెప్పగా; పాండు నృపతి తనయుఁడు= పాండురాజు కొడుకు యుధిష్ఠిరుడు; మహాత్మ!= ఓ మహానుభావా!; మార్తాండ సురభి దాంపత్యమునన్= మార్తాండుడు సురభి అనే వారి సంసార ధర్మంవలన; మును= ముందుగా; పుట్టిన ప్రజ= పుట్టిన సంతానం; ఏ+అది= ఏది?; వినన్ వలతున్= వినగోరుతున్నాను; నాకున్= నాకు; చెప్పవే!= చెప్పుమా!; అనుడున్= అనగా.

తాత్పర్యం: అని చెప్పగా ధర్మరాజు 'మహాత్మా! ఆ మార్తాండుడూ సురభీ సంసారధర్మం నిర్వహించగా ముందుగా పుట్టిన సంతానం ఏదో వినగోరుతున్నాను. దయతో నాకు చెప్పుము' అన్నాడు.

విశేషం: దాంపత్యానికి సంతానమే ఉత్తమ ఫలం. అందుకే 'ప్రజాయై గృహమేధినామ్' - సంతానం కొరకే గృహమేధులు- అని కాళిదాసు అంటాడు. కనుకనే ధర్మ విషయ జిజ్ఞాసగల ధర్మరాజుకు అది తెలియదగిన అంశం అయింది. మహాత్మా! అనే సంబోధనా; చెప్పవే! అనే ప్రార్థనార్థక క్రియా అతని జిజ్ఞాసను చక్కగా అభివ్యక్తం చేస్తున్నాయి. 'నాకు' అనే పదం ఇక్కడ వ్యంజకం. 'ఎంతో ఆసక్తిగల' నాకు అని దాని వ్యంగ్యార్థం. దీన్ని 'అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని' అంటారు.

వ. భీష్ముం డిట్లనియె. **55**

తాత్పర్యం: భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తే. 'తపము పెంపున సురభి మార్తాండు వలన । ధరణినాథ! యేకాదశాత్మజులఁ బడసె
నిగమ సంకీర్తనీయులు నిఖిలలోక । పతులు వారు బ్రాహ్మణులకుఁ బ్రకృతి సుమ్ము. **56**

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; సురభి= సురభి అనే ఆ వనిత; తపము పెంపునన్= తపస్సు గొప్పతనంచేత; మార్తాండువలనన్= మార్తాండుడి నుండి; ఏకాదశ+ఆత్మజులన్= పదకొండు మంది కొడుకులను; పడసెన్= పొందింది; నిగమ సంకీర్తనీయులు= వేదాలకును కొనియాడ దగినవారు; నిఖిల లోక పతులు= అన్ని లోకాలకు ఏలికలు అయిన; వారు= ఆ కుమారులు; బ్రాహ్మణులకున్= బ్రాహ్మణులకు; ప్రకృతి= మూలకారణం; సుమ్ము!= సుమా!

తాత్పర్యం: ఆ సురభి తపస్సు గొప్పతనంతో మార్తాండుడివలన పదకొండు మంది కొడుకులను పొందింది. వారిని వేదాలు కూడా కొనియాడతాయి. లోకాలన్నిటికీ వారు పాలకులు. బ్రాహ్మణులకు మూలకారణం అయినవారు సుమా!

విశేషం: కుమారులు లోకసామాన్యంగా పుట్టినవారు కాదు. తపస్సు మహిమవలన కలిగారు. కనుకనే వేదాలు వారిని కొనియాడు తున్నాయి. లోకాలన్నింటికీ పాలకులయ్యారు. అంతేకాదు బ్రహ్మజ్ఞాన సంపన్నులైన వారికి వీరు ప్రకృతి.

వ. వారల నేకాదశ రుద్రులంగా నెఱుంగుము. **57**

ప్రతిపదార్థం: వారలన్= ఆ కుమారులను; ఏకాదశ రుద్రులన్+కాన్= పదకొండు సంఖ్యతో ఒప్పారే రుద్రులనుగా; ఎఱుంగుము= తెలిసికొనుము.

తాత్పర్యం: వారే ఏకాదశ రుద్రులని తెలిసికొనుము.

తరువోజ.

అనఘాత్మ! యజపాదుఁ డన, నహిర్బుధ్న్యుఁ । డనఁ గడు విలసిల్లి, త్ర్యంబకుఁ డీతఁ
డనఁగ, వృషాకపి యన నొప్పి, శంభుఁ । డను పేరి పెంపున, నమరి కపాలి

యనఁగ, రైవతుఁ డన నతులానుభావ । మతిశయిల్లఁగ, హరుఁ డన బహురూపుఁ
డనఁ గీర్తిఁ గని, యుగ్రుఁ డన విశ్వరూపుఁ । డనఁ బేర్చి యా రుద్రు లర్చితు లైరి. 58

ప్రతిపదార్థం: అనఘ+ఆత్మ!= పాపములేని ఆత్మ కలవాడా!; అజపాదుఁడు= అజపాదు డనగా; అహిర్బుధ్న్యుఁడు+అనన్= అహిర్బుధ్న్యుడు అనగా; కడున్= మిక్కిలి; విలసిల్లి= ఒప్పారి; త్ర్యంబకుఁడు; ఈతఁడు= ఇతడు; అనఁగన్= అనగా; వృషాకపి; అనన్= అనగా; ఒప్పి= ఒప్పారి; శంభుఁడు అను పేరి పెంపునన్= శంభుడనే నామము యొక్క మహిమతో; అమరి= ఒప్పి; కపాలి అనఁగన్= కపాలి అనగా; రైవతుఁడు+అనన్= రైవతు డనగా; అతుల+అనుభావము= సాటిలేని గొప్పతనం; అతిశయిల్లఁగన్= పెంపొందగా; హరుఁడు+అనన్= హరుడనగా; బహురూపుఁడు+అనన్= బహురూపుడనగా; కీర్తిన్ కని= కీర్తి పొంది; విశ్వరూపుఁడు+అనన్= విశ్వరూపు డనగా; పేర్చి= అతిశయించి; ఆ రుద్రులు= రుద్రులు అను పేరుగలవారు; అర్చితులు= పూజింపబడేవారు; ఐరి= అయ్యారు.

తాత్పర్యం: పుణ్యాత్మా! అజపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్ర్యంబకుడు, వృషాకపి, శంభుడు, కపాలి, రైవతుడు, హరుడు, బహురూపుడు, ఉగ్రుడు, విశ్వరూపుడు అని ప్రసిద్ధికెక్కి ఆ రుద్రులు లోకాలకు పూజ్యులయ్యారు.

వ. తదనంతరంబ సౌరభేయీ ప్రచయంబు ప్రభవించె; నగ్గోకులంబు విశేషం బాకర్ణింపుము. 59

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= ఆ తరువాతనే; సౌరభేయీ ప్రచయంబు= ఆవుల సముదాయం; ప్రభవించెన్= పుట్టింది; ఆ+గోకులంబు విశేషంబు= ఆ ఆవుల సముదాయం విశిష్టత; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ తరువాతనే ఆవుల సముదాయం పుట్టింది. ఆ ఆవుల సముదాయం ప్రత్యేకతను వినుము.

సీ. ఆననంబునను జిహ్వను శృంగముల బల । వైరి, రంధ్రంబుల మారుతుండు,
కకుదంబునందు శ్రీకంఠుండు, పదముల । యందు మరుద్గణ మనఘ! కుక్షి
వహ్ని, చన్నుల సరస్వతి, పెండఁ బంచిత । మున లక్ష్మియును, గీర్తియును గ్రమమున
రుధిరంబునందుఁ జంద్రుఁడు, హృదయంబున । భగుఁడను దేవత, పాల వేధ

తే. వెంద్రుకలయం దనుష్ఠాన వితతి, దోఁక । ధర్ముఁ, డక్షుల సూర్యుండు, చర్మమునఁ ద
పంబు సిద్ధి తేజము సంధిపట్ల సిద్ధు । లునికి గల దటె; గోవు నేమనఁగవచ్చు! 60

ప్రతిపదార్థం: ఆననంబునను= మోమునందు; జిహ్వను= నాలుకయందు; శృంగములన్= కొమ్ములందు; బలవైరి= ఇంద్రుడు; రంధ్రంబులన్= ఇంద్రియ ద్వారాలలో; మారుతుండు= గాలి; కకుదంబునందున్= మూపురంలో; శ్రీకంఠుండు= శివుడు; పదముల అందున్= కాళ్ళయందు; మరుత్+గణము= దేవతల సముదాయం; అనఘ!= పుణ్యాత్మ!; కుక్షిన్= కడుపునందు; వహ్ని= అగ్ని; చన్నులన్= పొదుగులలో; సరస్వతి= చదువుల తల్లి; క్రమమునన్= క్రమంగా; పెండన్= పేడయందు; పంచితమునన్= మూత్రంలోను; లక్ష్మియును= లక్ష్మీదేవి; కీర్తియును= కీర్తి; రుధిరంబునందున్= రక్తంలో; చంద్రుఁడు= చంద్రుడు; హృదయంబునన్= హృదయంలో; భగుఁడు+అనుదేవత= భగుడనే పేరుగల దేవత; పాలన్= పాలలో; వేధ=బ్రహ్మ; వెంద్రుకలయందున్= వెంద్రుకలలో; అనుష్ఠాన వితతి= ఆచారాల సముదాయమూ; తోఁకన్= తోకయందు; ధర్ముఁడు= యమధర్మరాజు; అక్షులన్= కన్నులలో; సూర్యుండు= భాస్కరుడూ; చర్మమునన్= తోలునందు; తపంబు= తపస్సు; సిద్ధి=

కార్యాలు నెరవేరటమూ; తేజము= తేజస్సూ; సంధిపట్లన్= కీళ్ళచోటులందు; సిద్ధులు= అణిమ మొదలైన అష్ట సిద్ధులూ; ఉనికి+కలదు+అటె= నివాసముగా ఉన్నాయట; గోవున్= ఆవును; ఏమి+అనఁగన్ వచ్చున్= ఏమనవచ్చును!

తాత్పర్యం: పుణ్యాత్మా! ఆవు మోములో, నాలుకలో, కొమ్ములలో ఇంద్రుడున్నాడు. ఇంద్రియద్వారాలలో వాయుదేవుడున్నాడు. మూపురంలో శివుడు, పాదాలలో దేవతల సముదాయం, కడుపులో అగ్ని ఉన్నారు. పొదుగులో సరస్వతీ, పేడలో లక్ష్మి, మూత్రంలో కీర్తి, రక్తంలో చంద్రుడూ ఉన్నారు. హృదయంలో భగుడనే దేవతా, పాలలో బ్రహ్మ ఉన్నారు. వెంట్రుకలలో ఆచారాల సముదాయమంతా ఉన్నది. తోకలో యముడూ, కన్నులలో సూర్యుడూ ఉన్నారు. చర్మంలో తపస్సు, సిద్ధీ, తేజమూ ఉన్నాయి. కీళ్ళలో అష్టసిద్ధులు ఉన్నాయి. ఇట్టివి గల గోవు మహిమ ఇంతటిది అని చెప్పటం ఎట్లా సాధ్యమవుతుంది?

విశేషం: ఈ పద్యం ప్రకారం గోవు అంటే విశ్వమూ, విశ్వకర్తా, విశ్వభర్తా మొదలైన సర్వమునకూ నివాస భూమి అని తెలుస్తున్నది.అంటే సమస్త విశ్వమూ సూక్ష్మరూపంలో గోవుగా ఉన్నదని భావం. సిద్ధులు - అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం అని ఎనిమిది. 'ఏమనఁగవచ్చు' - గోమహిమ మాటల కందనిది అని భావం.

వ. మఱియు నొక్కటి యక్కజం బగునది గో మహానుభావ ప్రకటంబయిన యితిహాసంబు సెప్పెద వినుము. 61

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఒక్కటి= ఒకటి; అక్కజంబు+అగునది= ఆశ్చర్యకరమైనది; గో మహానుభావ ప్రకటంబు+అయిన= గోవుల గొప్పతనాన్ని తెలియజేసేదయిన; ఇతిహాసంబు= ప్రాతగాథ; చెప్పెదన్= చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: ఇంకా గోవుల మహిమను తెలియజేసే ఆశ్చర్యకరమైన ఇతిహాసం ఒకటి ఉన్నది. చెప్పుతాను వినుము.

విశేషం: ధర్మరాజు ప్రత్యేకించి అడుగకపోయినా భీష్ముడు ఉత్సాహంతో చెప్పబూనుకొన్నాడు. అంటే విషయం చాలా శ్రద్ధగా వినదగినదని తాత్పర్యం. ఇతిహాసం - తొల్లిటి కథ - ఇతిహాసాలు చెప్పదలచిన విషయానికి ప్రామాణ్యాన్ని సంపాదిస్తాయి.

సుమిత్రుఁ డను మునిచేఁ బోషింపఁబడిన గోవుల ప్రభావము (సం.13-120-1(కుంభ))

తే. త్రిశిఖరం బనుపేరి ధాత్రీధరము ను । పాంతమున రుద్ర కల్పితంబైన కూల
హాభిధాన కల్లోలిని శోభితోప । కంఠయై యొప్పుఁ దత్తీర కాననమున. 62

ప్రతిపదార్థం: త్రిశిఖరంబను పేరి ధాత్రీధరము+ఉపాంతమునన్= త్రిశిఖరం అనే పేరుగల కొండ దగ్గర; రుద్ర కల్పితంబు+ఐన= రుద్రుడిచేత సృష్టింపబడిన; కూలహా+అభిధాన కల్లోలిని= కూలహ అను పేరుగల నది; శోభిత+ఉపకంఠ+ఐ= శోభతో కూడిన ప్రాంత ప్రదేశాలు కలదై; ఒప్పున్= విరాజిల్లుతూ ఉండేది; తత్+తీర కాననమునన్= దాని ఒడ్డున ఉన్న అడవిలో.

తాత్పర్యం: త్రిఖరం అనే కొండ ఉండేది. దాని సమీపంలో రుద్రుడు సృష్టించిన 'కూలహ' అనేనది చక్కని అందమైన పరిసరాలతో అలరారుతూ ఉండేది. దాని ఒడ్డున ఉన్న అడవిలో. (తరువాతి పద్యంతో అన్వయం)

వ. భృగు వంశ సంభవులగు సంయమీశ్వరులు గొంద ఱాశ్రమంబులు గావించుకొని తపఃపరులై యుండుదు; రందు సుమిత్త్రుం డను పేరం బరఁగి పరమాచారభవ్యుం డగు నొక్క భార్గవునకు నంగిరసుం డను నొక్క

మహాద్విజుండు సఖ్యంబునను సౌజన్యంబునను గో శర్కర యొసంగిన నమ్ముని తన గోవు నయ్యోషధి మేపి పోషించిన నది సుపుష్టయు సుస్వరయు సురూపయునై యొక్క వృషభంబు పొందు వడసి గర్భిణియై మిథునంబు నీనిన. 63

ప్రతిపదార్థం: భృగు వంశ సంభవులు+అగు= భృగు అనే మహర్షి వంశంలో పుట్టినవారగు; సంయమి+ఈశ్వరులు= గొప్ప నిగ్రహంగల వారిలో శ్రేష్ఠులు; కొందఱు= కొంతమంది; ఆశ్రమంబులు= పర్ణశాలలు; కావించుకొని= ఏర్పాటు చేసికొని; తపః పరులు+ఐ= తపస్సే ప్రధానమైన పనిగా గలవారై; ఉండుదురు= ఉండేవారు; అందున్= వారిలో; సుమిత్రుండు+అను= సుమిత్రుడనే; పేరన్= పేరుతో; పరఁగి= ఒప్పి; పరమ+ఆచార భవ్యుండు+అగు+ఒక్క భార్గవునకున్= గొప్ప ఆచారంచేత శుభాలుగల ఒక్క భృగువంశ వ్యక్తికి; అంగిరసుండు, అను+ఒక్క మహాద్విజుండు= అంగిరసుడనే ఒక గొప్ప బ్రాహ్మణుడు; సఖ్యంబునను= చెలిమివలన; సౌజన్యంబునను= మంచితనంచేతనూ, గో శర్కర= గోశర్కర అనే ఒక తీగను; ఒసంగినన్= ఇవ్వగా; ఆ+ముని= ఆ మహర్షి సుమిత్రుడు; తన గోవును= తన ఆవును; ఆ ఓషధిన్= ఆ తీగను; మేపి= తినిపించి; పోషించినన్= పెంచగా; అది= ఆ ఆవు; సుపుష్టయున్= చక్కగా బలిసినదీ; సుస్వరయున్= మంచి నాదం కలదీ; సురూపయున్= మంచి రూపం కలదీ; ఐ= అయి; ఒక్క వృషభంబు పొందు= ఒక ఎద్దు సంపర్కాన్ని; పడసి= పొంది; గర్భిణి+ఐ= గర్భం ధరించినదై; మిథునంబున్= జంటను; ఈనినన్= కనగా.

తాత్పర్యం: భృగువంశంలో పుట్టిన కొందరు మహామునులు పర్ణశాలలు వేసికొని తపస్సునందు శ్రద్ధతో ఉండేవారు. వారిలో సుమిత్రుడని ఒక ముని గొప్ప ఆచార నిష్ఠతో ఉండే ఒక భార్గవుడికి అంగిరసుడనే గొప్ప బ్రాహ్మణుడు గోశర్కర అనే పదార్థం చెలిమివలనా, మంచితనం వలనా ఇచ్చాడు. ఆ పదార్థాన్ని ఆయన తన ఆవుకు మేపగా అది మంచి బలమూ, నాదమూ, రూపమూ పొంది ఏపుగా పెరిగింది. ఒక ఎద్దుతో కలిసి గర్భం తాల్చి పెయ్యను, కోడెదూడను కనింది.

విశేషం: సంయమి+ఈశ్వరులు= 'యమం' అంటే ఇంద్రియ నిగ్రహం. ఇది ఉపలక్షణంగా ఎనిమిది అంగాల యోగమార్గంలో వారు సిద్ధి పొందిన వారని భావించాలి. అందుకే ఈశ్వరులు - శ్రేష్ఠులు, ఆచారభవ్యుడు, విష్ణుసహస్రనామం ధర్మం ఆచారం నుండి పుడుతున్నదని చెప్తున్నది. "ఆచార ప్రభవో ధర్మః" దానిచేత అతడు భవ్యుడు, శ్రేష్ఠుడు అవుతున్నాడు. అందుకనే మహాద్విజుడు చెలిమిచేశాడు. మంచితనాన్ని భావించాడు. కానుక ఇచ్చాడు. సురూప, రూపం అంటే ఏ విధమైన అలంకారాలు లేకపోయినా అలంకారాలవలన కలిగే సౌందర్యం ఉన్నట్లు భాసింపజేసే లక్షణం. 'ఆవేధ్యా రోప్య నిక్షేప్య బన్ధనీయై రభూషితమ్, యేన భూషిత వద్భాతి తద్రూపమితి కథ్యతే".

క. అమ్మిథునము బహుసంతా । నమ్మయ్యెం బెరిఁగి క్రమమునను గో నిచయం
బిమ్మెయిఁ బెక్కు సహస్రము । లమ్మునికిం గల్గె గోవు లతఁడును వానిన్. 64

ప్రతిపదార్థం: ఆ+మిథునము= ఆ జంట; బహు సంతానమ్ము= పెక్కు బిడ్డలు గలది; అయ్యెన్= అయింది; ఈ+మెయిన్= ఈ విధంగా; క్రమమునను= క్రమంగా; గో నిచయంబు= ఆవులమంద; పెరిఁగి= వృద్ధిపొంది; పెక్కు సహస్రములు= చాలా వేల కొలదిగా; గోవులు= ఆవులు; ఆ+మునికిన్= ఆ సుమిత్రుడనే మునికి; కల్గెన్= ఏర్పడ్డాయి. అతఁడును= ఆ ముని; వానిన్= ఆ ఆవులను.

తాత్పర్యం: ఆ జంట క్రమక్రమంగా పెరిగి పెక్కు వేల ఆవులు ఆ మునికి సొమ్ముగా ఏర్పడ్డాయి. అతడు కూడా వాటిని. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. వేడ్కఁ జూచుచు నెప్పుడు వెనుకఁ దిరిగి। మేపు నీరును గలచోటి కోపి వెలిచి
పాలు గ్రేపులు గుడువ సప్రమదుఁ డగుచుఁ దాను గోస్తన ఫేనంబు ద్రావియుండు. 65

ప్రతిపదార్థం: వేడ్కన్= ప్రీతితో; చూచుచున్= చూస్తూ; ఎప్పుడున్= ఎల్లవేళలా; వెనుకన్= వెనుకవైపుగా; తిరిగి; మేపు= గడ్డీ; నీరు= నీళ్ళూ; కల చోటికి= ఉన్న తావునకు; ఓపి= కష్టాలకు తట్టుకొని; వెలిచి= త్రిప్పి; పాలు= పాలను; క్రేపులు= దూడలు; కుడువన్= త్రాగుతుంటే; సప్రమదుఁడు= నిండైన ఆనందంతో కూడినవాడు; అగుచున్= అవుతూ; తాను; గో స్తన ఫేనంబు= ఆవు చన్నుల దగ్గరి నురుగును; త్రావి= త్రాగి;ఉండున్= ఉండేవాడు.

తాత్పర్యం: ఆ ముని వాటిని ప్రీతితో పరామరిక చేస్తూ ఉండేవాడు. వాటివెంట తిరుగుతూ మంచి పచ్చికా నీరూ కలచోటులలో ఓపికతో త్రిప్పుతూ, దూడలు తల్లుల పాలు త్రాగుతూ ఉంటే పరమానంద పడుతూ తాను మాత్రం ఆ పాలు త్రాగేటప్పుడు వచ్చే నురుగును త్రాగుతూ ఉండేవాడు.

విశేషం: ఉన్నవి కొన్నివేల ఆవులు. వాటికి కావలసిన పచ్చికా నీరూ ఉన్నచోటనే దొరకవు అయినా అవి పుష్టిగా ఉండటమే తన కానందం కనుక పచ్చికా, నీరూ, ఎక్కడ దొరికితే అక్కడకు శ్రమకోర్చి వెళ్ళేవాడు అని 'ఓపి' అన్నమాటకు భావం. ఆవుల పొదుగులలో దూడలు పాలు త్రావటం ఒక మనోజ్ఞమైన దృశ్యం. స్వార్థంలేని వాడికి అది మరింత ఆనంద కారణమవుతుంది. అందుకనే 'సప్రమదుఁడు' తన పుష్టికి నురుగు చాలు. అంటే దూడల నోట్లో దుమ్ముకొట్టే బుద్ధి ఏ మాత్రమూ లేదని భావం.

క. దానన చేసి యతనికిన్। ఫేనపుఁ డను నామ మొసఁగెఁ బ్రియమున ముని స
మ్మానితుఁ డగు గౌతముఁ డి। ట్లా నిర్మలబుద్ధి గోసమారాధకుఁడై. 66

ప్రతిపదార్థం: ముని సమ్మానితుఁడు= మునుల మన్ననగొన్నవాడు; అగు= అయిన; గౌతముఁడు= గౌతముడనే ఋషి; దానన చేసి= ఆ కారణంచేతనే; అతనికిన్= ఆ సుమిత్రుడికి; ఫేనపుఁడు అను నామము= ఫేనపుడనే పేరును; ప్రియమునన్= ప్రియంతో; ఒసఁగెన్= ఇచ్చాడు; ఇట్లు= ఈ విధంగా; ఆ నిర్మల బుద్ధి= ఆ స్వచ్ఛమైన బుద్ధిగల సుమిత్రుడు; గో సమారాధకుఁడు+ఐ= గోవులను చక్కగా భక్తితో పూజించేవాడై.

తాత్పర్యం: మునుల మన్ననగొన్న గౌతముడనే మహర్షి ఆ సుమిత్రుడికి ఆ కారణంచేతనే (పాలనురుగు త్రాగే కారణం చేతనే) అదే అర్థంగల 'ఫేనపుడు' అనే పేరు పెట్టాడు. ఇట్లా నిర్మలమైన బుద్ధిగల ఆ ముని గోవులను చక్కగా ఆరాధిస్తూ. (తరువాతి వచనంతో అన్వయం)

విశేషం: ముని సమ్మానితుడు కనుక అతని పెద్దతనంవలన అతడు పెట్టిన పేరు అందరికీ ప్రీతిపాత్రమైనదని ధ్వని, బిరుదువంటి ఆ పేరు సుమిత్రుడి స్వభావాన్ని కలుషితం చేయలేదు. కాబట్టే అతడు 'నిర్మలబుద్ధి'.

వ. వర్తిల్లుచుండ నొక్కనాఁడు కామరూపిణు లగు గోవులు కొన్ని కాంతాకారంబులు గైకొని కమనీయంబగు కొలన జలక్రీడలు సలుపుచుండఁ దోడిధేనువు లచ్చట మెలంగి కనుంగొని 'మీ రెవ్వ?' రని మానుష భాషణంబుల నడిగిన నయ్యంగనా జనంబులు. 67

ప్రతిపదార్థం: వర్తిల్లుచుండన్= కాలం గడుపుతుండగా; ఒక్కనాఁడు= ఒక రోజున; కామరూపిణిలు+అగు గోవులు= కోరిన రూపం ధరించగల ఆవులు; కొన్ని; కాంతా+ఆకారంబులు= మంచి రూపవంతులైన స్త్రీల రూపాలను; కైకొని= ధరించి; కమనీయంబు+అగు= మనోహరమైన; కొలనన్= ఒక కొలనిలో; జలక్రీడలు= నీటి యాటలు; సలుపుచున్+ఉండన్= చేస్తూ ఉండగా; తోడి ధేనువులు= తమతోపాటుగా ఉండే ఆవులు; అచ్చటన్= ఆ తావులో; మెలంగి= తిరుగుతూ; కనుంగొని= చూచి; మీరు; ఎవ్వరు; అని; మానుష భాషణంబులన్= మనుష్యుల మాటలతో; అడిగినన్= అడుగగా; ఆ+అంగనా జనంబులు= ఆ సుందరకాంతలు.

తాత్పర్యం: ఆయన అట్లా ప్రవర్తిస్తూ ఉండగా ఒక రోజున కోరిన రూపం ధరించగల కొన్ని ఆవులు చక్కని మగువల రూపాలను ధరించి ఒక అందమైన కొలనులో జలకాలాడుతూ ఉండగా తోడి ఆవులు 'మీరెవ్వరు?' అని మనుష్యుల మాటలతో అడుగగా ఆ కాంతలు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అంగనలు - అంటే మంచి అందంగల, అంగం= దేహం కలవారు.

తే. **'ఏము గోవుల' మనవుడు 'నిట్టి యద్భు । తానుభావంబు మీ కెట్టు లావహిల్లె?'**
ననిన విని వానితోడ నయ్యతివ లిట్టు । లనిరి 'మా తెఱఁ గేర్పడ వినుఁడు మీరు. 68

ప్రతిపదార్థం: ఏము= మేము; గోవులము= ఆవులం; అనవుడున్= అనగా; ఇట్టి= ఈ విధమైన; అద్భుత+అనుభావంబు= అచ్చెరువు గొల్పే మహిమ; మీకున్; ఎట్టులు= ఏ విధంగా; ఆవహిల్లెన్?= కలిగింది; అనినన్= అనగా; విని; వానితోడన్= ఆ ఆవులతో; ఆ+అతివలు= ఆ సుందర వనితలు; ఇట్టులు= ఈ విధంగా; అనిరి= పలికారు; మీరు; మా తెఱఁగు= మా పద్ధతి; ఏర్పడన్= చక్కగా తెలిసే విధంగా; వినుఁడు= వినండి.

తాత్పర్యం: 'మేము ఆవులం' అన్నాయి. అంటే 'మీకీ ఆశ్చర్యకరమైన గొప్పతనం ఎట్లా కలిగింది?' అని గోవు లడుగగా వాటితో ఆ కాంతలు ఇట్లా అన్నారు. 'మా తీరు తేటతెల్లంగా వినండి.'

విశేషం: 'మీకు' మేము గోవులమే కదా! మాకు లేని మహిమ మీ కెట్లా కలిగింది అనే జిజ్ఞాసను ఈ పద్యం వ్యక్తం చేస్తుంది. మీరు - అనేది కూడా వ్యంజకమే. మమ్ములను గూర్చి ఆసక్తితో వినగోరుతున్న మీరు అని అర్థం. అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని అంటారు.

వ. **హవ్య కవ్యంబులకు నతిథిపూజనంబులకు నిజాహారంబులకు సద్ద్విజావలి సంతోషింప నింపారు పాలు వారికిం గురియుదుము, కృషిక్రియా సర్వ నిర్వర్తనంబులకు మా పుత్రులం బనుతు; మా సుకృతంబుల నివ్విశేషంబు కలిగె; మాకును గోలోకంబును సులభంబు; మీ రా సుకర్మంబులు సూచి యసూయ సేయుదురు గావున.69**

ప్రతిపదార్థం: హవ్య కవ్యంబులకున్= హవ్యానికీ, కవ్యానికీ (హవ్యం= దేవతలకిచ్చే పదార్థం; కవ్యం= పితృదేవతలకిచ్చే పదార్థం); అతిథిపూజనంబులకున్= అతిథుల మన్నించటానికీ; నిజ+ఆహారంబులకున్= తమ భోజనాలకూ; సత్+ద్విజ+ఆవలి= ఉత్తమ బ్రాహ్మణుల సముదాయం; సంతోషింపన్= చక్కని తృప్తిపొందే విధంగా; ఇంపు+ఆరు పాలు= శ్రేష్ఠమైన పాలను; వారికిన్= ఆ బ్రాహ్మణులకు; కురియుదుము= ఎక్కువ ప్రమాణంలో అందిస్తాం; కృషి క్రియా సర్వ నిర్వర్తనంబులకున్= వ్యవసాయం మొదలైన అన్ని పనులకు; మా పుత్రులన్= మా సంతానాన్ని కోడెలను, ఎద్దులను; పనుతుము=పంపుతాం; ఆ సుకృతంబులన్= ఆ పుణ్యాలవలన; ఈ+విశేషంబులు= ఈ గొప్పతనాలు; కలిగెన్= కలిగాయి; మాకును= మాకుకూడా;

గోలోకంబును= గోవుల లోకం; సులభంబు= తేలికగా అందుతుంది; మీరు; ఆ సుకర్మంబులు= మంచి పనులు; చూచి; అసూయ+చేయుదురు= అసూయ పొందుతారు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: హవ్యకవ్యాలకూ, అతిథిపూజలకూ, ఆహారానికీ చక్కగా తృప్తిగా వినియోగించుకొనటానికి వీలుగా పాలు సమృద్ధిగా ఉత్తమ బ్రాహ్మణులకు ఇస్తాం. మా సంతానాన్ని వ్యవసాయం మొదలైన పనులు చేయటానికి పంపుతాం. ఆ పుణ్యాలవలన మా కీ విశేషాలు కలిగాయి. మాకు కూడా గోలోకం తేలికగా సిద్ధిస్తుంది. మా పుణ్యకార్యాలు చూచి మీరు అసూయపడతారు. కనుక.

విశేషం: మానవుడు ఎన్నో ఋణాలతో పుడతాడు. అవి తీర్చుకొనటానికి అయిదు యజ్ఞాలు ప్రతిదినమూ చేస్తూ ఉండాలి. అవి బ్రహ్మయజ్ఞం; పితృయజ్ఞం; దేవయజ్ఞం; మనుష్యయజ్ఞం; భూతయజ్ఞం అనేవి ఇందులో ఇంచుమించుగా అన్నింటికీ కావలసిన పదార్థం గోవులు సమర్పిస్తాయి. కనుక ఉత్తమ బ్రాహ్మణులు చేసిన కర్మల ఫలితాలు అవి కూడా పొందుతాయి. ఇక పురుష సంతానం వ్యవసాయానికి ఉపయోగపడుతూ అందరినీ కాపాడుతుంది. అసూయ అంటే గుణాలను దోషాలుగా భావించి చెప్పటం 'అసూయాతు దోషారోపో గుణేష్వపి' - అమ. కురియుదుము - క్రియ వ్యంజకం. వర్షం కురిస్తే జలం ఎంత సమృద్ధిగా ఉంటుందో అంత సమృద్ధిగా పాలు ఇస్తాము అని ధ్వని.

క. క్రేపులు తో రా దుర్గతిఁ । బ్రాపింపఁ గలార యిట్టి భావిచరిత ము
ద్దీపిత బోధమునం గని । మీపై కృపఁ జెప్పవలసె మీకుం దెలియన్. 70

ప్రతిపదార్థం: క్రేపులు= దూడలు; తోన్= వెంటనంటి; రాన్= రాగా; దుర్గతిన్= దుఃఖపు గతిని; ప్రాపింపఁగలార= పొందుతారు; ఇట్టి= ఈ విధమైన; భావిచరితము= రాబోయే స్థితిని; ఉద్దీపిత బోధమునన్= ప్రకాశించే జ్ఞానంతో; కని= చూచి; మీ పై కృపన్= మీమీది అనుగ్రహంతో; మీకున్= మీకు; తెలియన్= తెలిసే విధంగా; చెప్పవలసెన్= చెప్పవలసి వచ్చింది.

తాత్పర్యం: మీ దూడలు మీతో రాగా మీరు చెడుదశను పొందుతారు. మా హృదయాలలో వెలుగొందే జ్ఞానం ఆధారంగా ఈ విషయాన్ని మేము ముందుగా తెలిసికొని మీ మీది దయతో మీకు తెలిసే విధంగా చెప్పవలసి వచ్చింది.

విశేషం: ఉద్దీపిత బోధము - సాధారణంగా భవిష్యత్తు ఎవరికీ తెలియదు. కాని, మహాపుణ్యాత్ములకు తపస్సంపన్నులకూ అది తెలుస్తుంది. ఇది కూడా ఆ కాంతారూప గోవులు చేసిన పుణ్య ఫలమే. రాబోయే అనర్థాన్ని ముందుగా తెలియజెప్పటం పరిహార మార్గాలను అన్వేషించి పాటించటంకొరకు. అదే ఇక్కడ కృప.

వ. అనుటయు నగ్గోవులు దీనాననలై. 71

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; ఆ+గోవులు= ఆ ఆవులు; దీన+ఆననలు+ఐ= జాలిగొలిపే మోములు గలవై.

తాత్పర్యం: అన్నంతనే ఆ గోవులు దీనమైన మొగాలు కలవై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'గోవులకును గోవులు గతి । గావున మీ రరసి సుగతి గలుగు తెరువు మా
కే విధి నైనను జెప్పం । గా వలదే యనిన నట్ల కా' కని వారల్. 72

ప్రతిపదార్థం: గోవులకును= ఆవులకు; గోవులు= ఆవులు; గతి= దిక్కు; కావునన్= కాబట్టి; మీరు; అరసి= చక్కగా పరిశీలించి; సుగతి కలుగు తెరువు= మంచి గతి గలిగే మార్గం; మాకున్; ఏ విధిన్ ఐనను= ఏ విధంగానైనా; చెప్పంగాన్ వలదే= చెప్పవద్దా?; అనినన్= అంటే; అట్ల కాక= సరే అట్లాగే; అని; వారల్= ఆ కాంతలు.

తాత్పర్యం: 'గోవులకు గోవులే దిక్కు కనుక మీరు మెలకువతో ఆలోచించి మాకు మంచి గతి కలిగే మార్గం ఎట్లాగైనా చెప్పాలి కదా!' అంటే 'సరే అట్లాగే' అని ఆ కాంతలు (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: మీరు, మాకు అనేవి అర్థాంతర సంక్రమిత వాచ్యాలు. మాతో సమానజాతి అయి, మా యందు కృపగల మీరు, దిక్కుతోచక దుఃఖపడుతున్న మాకు - అని వ్యంగ్యార్థం ఏ విధినైనను ఇది ఒత్తిడితో కూడిన ప్రార్థనను తెలియజేస్తుంది.

తే. రంతిదేవుండు వేవత్సరములు సేయు । నధ్వరమునకుఁ బశువులై యరుగుఁ; డతఁడు
విశసనము సేయ గోలోక విభవ మొందఁ । గాంతు' రని నెమ్మిఁ బల్కిన సంతసిల్లి. 73

ప్రతిపదార్థం: రంతిదేవుండు= రంతి దేవుడనే రాజు; వే వత్సరములు= వేయి యేండ్లు; చేయు+అధ్వరమునకున్= చేసే యజ్ఞానికి; పశువులు+ఐ= పశువులుగా; అరుగుఁడు= వెళ్ళండి; అతఁడు= ఆ రాజు; విశసనము+చేయన్= చంపగా; గోలోక విభవము= గోవుల లోకపు మహిమ; ఒందన్+కాంతురు= పొందగలుగుతారు; అని; నెమ్మిన్= ప్రీతితో; పల్కినన్= పలుకగా; సంతసిల్లి= సంతోషించి.

తాత్పర్యం: 'రంతిదేవుడు వేయి యేండ్లు చేసే యజ్ఞంలో మీరు పశువులుగా వెళ్ళండి. ఆ రాజు మిమ్ములను యజ్ఞంలో బలియిస్తే మీకు గోలోకంలో ఉండే మహిమ కలుగుతుంది' అని ప్రీతితో చెప్పగా ఆ గోవులు సంతోషించి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అగ్గోవు లవ్విభు నధ్వరంబునకుఁ బో । నుత్సహించుటయు నం దొక్క గోవు
'మనము సుమిత్రుని ధన । మాతఁ డనుమతి । సేయక యెట్లు వోఁ జెల్లు?' ననిన
'నాతనిఁ జంపుద మతఁడును గోలోక । మున కేఁగుదెంచుఁగా!' కని కడంగి
చని మునిఁ దేఱి చూడను జాల కంతంత । నతిభీతిఁ గ్రమ్మఱి యరుగుటయును

తే. గొన్ని కపిలధేనువు లతి క్రూరచిత్త । 'లేము వధియించెదము మాకు నేమి మేలు
సేయు వారలు దగ మీరు సెప్పుఁ' డనిన । నన్ని మొదవులు నేకవాక్యత్వ మొంది. 74

ప్రతిపదార్థం: ఆ+గోవులు= ఆ ఆవులు; ఆ+విభు+అధ్వరంబునకున్= ఆ రాజు రంతిదేవుడి యాగానికి; పోన్= పోవటానికి; ఉత్సహించుటయున్= వేడుక పడగా; అందున్= వాటిలో; ఒక్క గోవు= ఒక ఆవు; మనం; సుమిత్రుని ధనము= సుమిత్రుడి సొమ్ము; అతఁడు= ఆ సుమిత్రుడు; అనుమతి+చేయక= ఒప్పుకొనకుండా; ఎట్లు= ఏ విధంగా; పోన్= పోవటం; చెల్లును?= కుదురుతుంది?; అనినన్= అంటే; అతనిన్= ఆ సుమిత్రుడిని; చంపుదము= చంపివేద్దాం; అతఁడును= అతడు కూడా; గోలోకమునకున్= గోవుల లోకానికి; ఏఁగుదెంచున్+కాక= వస్తాడు; అని; కడంగి= పూనుకొని; చని= వెళ్ళి; మునిన్= మునిని; తేఱి చూడను+చాలక= నిబ్బరంగా చూడను కూడా శక్తిలేక; అంతన్+అంతన్= దవ్వులనుండియే; అతిభీతిన్= ఎక్కువ భయంతో; క్రమ్మఱి= మరలి; అరుగుటయును= పోగా; కొన్ని కపిల ధేనువులు= కొన్ని పుల్లావులు; అతి క్రూరచిత్తలు= మిక్కిలి

క్రూరమైన హృదయం కలవి; ఏము= మేము; వధియించెదము= చంపుతాము; మాకున్= మాకు; ఏమి= ఏ విధమైన; మేలు= మంచిని; చేయువారలు?= చేస్తారు; తగన్= తగువిధంగా; మీరు; చెప్పుఁడు= చెప్పండి; అనినన్= అనగా; అన్ని మొదవులు= ఆవులన్నీ; ఏకవాక్యత్వము= ఒక అభిప్రాయం కలగటం; ఒంది= పొంది.

తాత్పర్యం: ఆ ఆవులన్నీ రంతిదేవుడి యాగానికి వెళ్ళటానికి సిద్ధపడ్డాయి. అందులో ఒక ఆవు 'మనం సుమిత్రుడి ధనం కదా! అతడి అంగీకారం లేకుండా పోవటం ఎట్లా కుదురుతుంది?' అన్నది. 'అయితే అతడిని చంపుదాం. అతడు కూడా గోలోకానికి వస్తాడు' అని నిర్ణయించుకొని ముని దగ్గరకు బయలుదేరాయి. కాని అతడిని సూటిగా చూడను కూడా చూడ లేక దూరం నుండియే తిరిగి వెళ్ళిపోయాయి. కొన్ని పుల్లావులు హృదయంలో క్రూరత్వం నింపుకొని 'మేము అతడిని చంపుతాం. మాకు మీ రేమి మేలు ఇస్తారు? తగు విధంగా చెప్పండి' అనగా ఆవులన్నీ కూడబలుకుకొని ఒకమాటకు వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'చంపుదము' - ఇది కృతఘ్నతగాదు. వాటిని విడిచి అతడూ, అతడిని విడిచి అవీ ఉండలేవు. కనుక తాము పొందే సద్గతికి అతడుకూడా చేరుకొనాలని మాత్రమే వాటి భావన. దీనిని కవి ముందు స్పష్టం చేస్తాడు. 'తేఱిచూడను చాలక' - అతడిని పేనపునితనం ఒక మహా తపస్సు. దానితో తాము చంపటమనే చెడు తలంపుతో (లోక సామాన్య దృష్టితో) దరికి చేరలేకపోయాయి. కనీసం కన్నులతో సూటిగా చూడటం కూడా సాధ్యం కాలేదు. 'అతి క్రూరచిత్తత్వం' - సంకల్పం మంచిదయినా చేష్ట లోకం చూపునకు విరుద్ధమైనది. కాబట్టి గుండెలో దయలేకుండా చూచుకొనాలి. కనుక అవి గుండెను బండ చేసికొన్నాయి అని భావం.

ఆ. 'సకల వర్ణ ధేను సమితికి నెల్లను । గపిల గోవు శ్రేష్ఠ గాఁగఁ గపిల
నీగి గో శతంబు నిచ్చిన యట్లుగా । వరము మీకు నిచ్చు వార' మనియె. 75

ప్రతిపదార్థం: సకల వర్ణ ధేను సమితికిన్= అన్ని రంగుల ఆవుల సముదాయానికి; ఎల్లను= అంతా; కపిలగోవు= గోరోచన వర్ణంగల ఆవు; శ్రేష్ఠ= అన్నింటికంటె మిన్న; కాఁగన్= అయ్యేవిధంగాను; కపిలను= పుల్లావును; ఈఁగి= దానంచేయటం; గోశతంబున్= నూరు ఆవులను; ఇచ్చిన+అట్లుగాన్= ఇచ్చినదానితో సమానం అవునట్లుగాను; మీకున్= మీకు; వరము= వరాన్ని; ఇచ్చువారము= ఇస్తాము; అనియెన్= అన్నాయి.

తాత్పర్యం: 'అన్ని రంగుల ఆవులన్నింటిలో కపిలవర్ణం గలవి మిక్కిలి గొప్పవి అయ్యే విధంగానూ, ఒక కపిలగోవును దానంచేస్తే అది వందగోవుల దానంతో సమానం అయ్యేవిధంగానూ మీకు వరమిస్తాం' అన్నాయి.

వ. అనిన విని కరంబుప్రియంబునం గామరూపిణులైన యగ్గోవులు రూపాంతరంబులు గైకొని యా భృగువంశ వర్యు పాలికిం బోయి 'యేము గోమాతలము; నీదగు గో సమారాధనంబునకు మెచ్చి వరంబిచ్చువారమై వచ్చితి; మిష్టం బెయ్యది యడుగు' మనుటయు నమ్ముని 'యిప్పటి యట్ల యెల్లప్పుడును గోవులవలన భక్తిస్నేహంబులు గలుగ నిం' డనియె నమ్మాటకు నవి 'యట్ల యయ్యెడుఁగాక!' యని పలికి వెండియు నిట్లనియె. 76

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; కరంబు= మిక్కిలి; ప్రియంబునన్= ఇష్టంతో; కామరూపిణులు+ఐన= ఇచ్ఛవచ్చిన రూపం పొందగల; ఆ+గోవులు= ఆ ఆవులు; రూప+అంతరంబులు= వేరు రూపాలు; కైకొని= ధరించి; ఆ భృగువంశవర్యు పాలికిన్= భృగువంశంలో ఎన్నదగినవాడైన ఆ సుమిత్రుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; ఏము= మేము;

గోమాతలము= ఆవుల తల్లులము; నీది+అగు= నీదైన; గోసమారాధనంబునకున్= ఆవుల భక్తితోడి పూజకు; మెచ్చి= ఆనందపడి; వరంబు= వరాన్ని; ఇచ్చువారము+ఐ= ఇచ్చేవారమై; వచ్చితిమి= వచ్చాము; ఇష్టంబు= ఇష్టమైనది; ఏ+అది=ఏదో; అడుగుము= కోరుకొనుము; అనుటయున్= అనగా; ఆ+ముని= ఆ ముని; ఇప్పటి+అట్లు+అ= ఇప్పటివలెనే; ఎల్ల+అప్పుడున్= సర్వకాలాలలో; గోవులవలనన్= ఆ గోవుల విషయంలో; భక్తి స్నేహంబులు= భక్తీ చెలిమీ; కలుగన్= కలిగేటట్లు; ఇండు= వరం ఇవ్వండి; అనియెన్= అన్నాడు; ఆ+మాటకున్= ఆ మాటకు; అవి= ఆ ఆవులు; భక్తి చెలిమీ; కలుగన్= కలిగేటట్లుగా; ఇండు= వరం ఇవ్వండి; అనియెన్= అన్నాడు; ఆ+మాటకున్= ఆ మాటకు; అని= ఆ ఆవులు; అట్ల= అట్లాగే; అయ్యెడున్+కాక= అవుతుంది; అని; పలికి= మాట్లాడి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాయి.

తాత్పర్యం: ఆ ఆవులు అట్లా చెప్పగా పుల్లావులు విని ఎంతో ప్రీతితో కోరినరూపాలు ధరించగలిగినవి కనుక వేరురూపాలు పొంది ఆ సుమిత్రుడి కడకరిగి 'అయ్యా! మేము గోమాతలం. నీవు చేసే ఈ గో పూజకు సంతోషం కలిగి నీకు వరమివ్వటానికి వచ్చాం. నీ కేది ఇష్టమో దాన్ని కోరుకొనుము' అన్నాయి. అప్పు డా ముని 'ఇప్పటిదానివలెనే నాకు ఆవులమీద భక్తి స్నేహాలు ఎప్పటికీ ఉండేవరం ఇవ్వండి' అన్నాడు. దానికి అవి 'అట్లాగే అవుతుంది' అని ఇంకా ఇట్లా అన్నాయి.

క. ' ఈ లోకం బేటికి? మన । గోలోకంబునకు రమ్ము కులవర!' యనుడుం
'జాలుదునే మద్గో ర । త్నాలి విడిచి యందు రాక' కని ముని పల్కెన్. 77

ప్రతిపదార్థం: కులవర!= కులంలో శ్రేష్ఠుడా!; ఈ లోకంబు= ఈ లోకం; ఏటికిన్= ఎందుకు? మన గో లోకంబునకున్= మనదైన ఆవుల లోకానికి; రమ్ము= రా; అనుడున్= అన్న వెంటనే; మత్ గో రత్న+ఆలిన్= నా గోవులనే రత్నాల వరుసను; విడిచి= వదలి; అందు= ఆ గోలోకం; రాకకున్= రావటానికి; చాలుదునే?= శక్తికలవాడనా?; అని; ముని; పల్కెన్= అన్నాడు.

తాత్పర్యం: 'కులశ్రేష్ఠా! ఈ లోకంతో పనియేమి? మన గోలోకానికి రమ్ము!' అన్నంతనే 'నేనీ గో రత్నాల వరుసను వదలి అక్కడికి రాగలనా?' అని ముని పలికాడు.

విశేషం: 'ఈ లోకంబు ఏటికి' - ఇది విశిష్టమైనదీ, కోరదగినదీ కాదని తాత్పర్యం. 'మన' - నీవు మాతో ఏ మాత్రమూ భేదంలేనివాడవని భావం. చాలుదునే - ఆ లోకం ఎంత గొప్పదయినా నా ప్రాణానికి ఈ గోవులే సర్వస్వం అని అతని అభిప్రాయం.

క. విని యా ధేనువు లాతని । తను వాకసమునకు నెత్తి తమ యోగబలం
బునఁ జైతన్యముఁ బాపి య । వని మీఁదఁ గళేబరంబు వైచి రయమునన్. 78

ప్రతిపదార్థం: విని= ఆలకించి; ఆ ధేనువులు= ఆ ఆవులు; అతని తనువు= ఆ సుమిత్రుడి దేహాన్ని; ఆకసమునకున్= ఆకాశానికి; ఎత్తి; తమ యోగ బలంబునన్= తమ యోగశక్తిచేత; చైతన్యమున్= ప్రాణాన్ని; పాపి= పోగొట్టి; కళేబరంబున్= ప్రాణం లేని దేహాన్ని; అవనిమీఁదన్= నేలమీద; వైచి= వేసి; రయమునన్= వేగంతో.

తాత్పర్యం: ఆ మాట విన్న ఆవులు అతని దేహాన్ని ఆకాశానికి ఎత్తి తమ యోగబలంవలన ప్రాణాలు పోగొట్టి దేహాన్ని క్రిందవేసి వేగంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆకాశానికి ఎత్తటం అంటే ఊర్ధ్వగతి - ఉత్తమగతి కల్పించటం. యోగబలంచేత ప్రాణశక్తిని దేహంనుండి వేరు చేశాయి. కనుక ఆ ప్రాణశక్తి అంత్యకాలంలో చికాకు పొందలేదు - అనే అంశం ఊహకు వస్తుంది.

క. కొమ్ములఁ గాళ్ళం బిండిగఁ । గ్రుమ్మి మగిడిపోయి పూసగ్రుచ్చిన గతి మున్
తమ్ముం బనిచిన గోవుల । కమ్ముని తెఱఁ గెల్లఁ జెప్పి హర్ష మొనర్చెన్. 79

ప్రతిపదార్థం: కొమ్ములన్= కొమ్ములతో; కాళ్ళన్= కాళ్ళతో; పిండిగన్= పిండి అయ్యేటట్లు; క్రుమ్మి= పొడిచి; మగిడి పోయి= తిరిగి వెళ్ళి; పూసగ్రుచ్చినగతిన్= పూసగ్రుచ్చినట్లుగా; మున్= ముందు; తమ్మున్= తమ్ము; పనిచిన గోవులకున్= పంపిన ఆవులకు; ఆ+ముని తెఱఁగు= ఆ ముని తీరును; ఎల్లన్= అంతా; చెప్పి= వివరించి; హర్షము= ఆనందం; ఒనర్చెన్= కలిగించాయి.

తాత్పర్యం: కొమ్ములతో కాళ్ళతో ఆ దేహాన్ని పిండి పిండి అయ్యేవిధంగా పొడిచి తిరిగివెళ్ళి మునుపు తమ్ము పంపించిన ఆవులకు ఆ ముని తీరును పూసగ్రుచ్చినట్లుగా చెప్పి ఆనందం కలిగించాయి.

విశేషం: కొమ్ముల..... క్రుమ్మి - ఇది ప్రాణం పోయిన తరువాత దేహానికి చేసే సంస్కారం వంటిది. 'పూసగ్రుచ్చిన గతిన్' - ఇది ఒక జాతీయం - ఏ చిన్న అంశాన్నీ వదలకుండా అని దీని భావం.

వ. గోలోకంబునకు ముఖ్యలగు గోమాత లంతయు నెఱింగి తమ కడకుం జనుదెంచిన సుమిత్రు నాదరించి సుదతులై విహరించిన గోవులు మొదలుగా సకల గోవుల తెఱంగు నతని కెఱింగించి 'నీకు నిది మేల కాక' యని పలికి యతనిం బ్రీతునిం జేసి బ్రహ్మ ఘాతిక లయిన యన్ని గోవులకును 'మీ వంశం బశుచి వదనం' బయ్యెడు మని శాపం బిచ్చిన నాధేనువులు రంతిదేవు పాలికిం బోయి సుగతి వేఁడి తమ్మం బశువులుంగా విశసింపు మని మానుష భాషణంబులం బ్రార్థించుటయు. 80

ప్రతిపదార్థం: గోలోకంబునకున్= గోవుల లోకానికి; ముఖ్యలు+అగు= ప్రధాన వ్యక్తులయిన; గోమాతలు= గోవుల తల్లులు (గోమాతలనబడే వారు); అంతయున్= ఆ విషయమంతా; ఎఱింగి= తెలిసికొని; తమ కడకున్= తమ దగ్గరకు; వచ్చిన సుమిత్రున్= వచ్చిన సుమిత్రుడిని; ఆదరించి= మన్నించి; సుదతులు+ఐ= ఆడవాండ్రై; విహరించిన గోవులు= తిరిగిన ఆవులు; మొదలుగాన్= ఆదిగా; సకల గోవుల తెఱంగున్= అన్ని ఆవుల తీరును; అతనికిన్= ఆ సుమిత్రుడికి; ఎఱింగించి= తెలిపి; నీకున్= నీకు; ఇది= ఇట్లాంటి స్థితి; మేలు+అ= మేలే; కాక= అగుగాక; అని; పలికి; అతనిన్= అతడిని; ప్రీతునిన్= ప్రీతికలవాడినిగా; చేసి= ఒనర్చి; బ్రహ్మఘాతికలు= బ్రాహ్మణుడిని చంపినవి; అయిన అన్ని గోవులకును= అయిన ఆవులన్నింటికీ; మీ వంశంబు= మీ కులం; అశుచి వదనంబు+అయ్యెడున్= శుచిలేని మొగం కలదవుతుంది; అని; శాపంబు= శాపాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా; ఆ ధేనువులు= ఆ ఆవులు; రంతిదేవు పాలికిన్= రంతిదేవుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; సుగతి= మంచిగతిని; వేఁడి= కోరుకొని; తమ్మన్= తమను; పశువులు+కాన్= యజ్ఞ పశువులుగా; విశసింపుము= చంపుము; అని; మానుష భాషణంబులన్= మనుష్యుల మాటలతో; ప్రార్థించుటయున్= వేడినంత.

తాత్పర్యం: గోలోకంలో ప్రధానస్థితి గల గోమాతలు ఆ విషయమంతా తెలిసికొని తమ దగ్గరకు వచ్చిన సుమిత్రుడిని ప్రేమతో లాలించి స్త్రీలై తిరిగి ఆవులు మొదలుకొని తక్కిన అన్నింటి తీరును అతడికి తెలిపి 'నీకిది మేలే అవుతుంది' అని అతడికి ప్రీతి కలిగించాయి. తరువాత ఆ బ్రాహ్మణుడిని హత్య చేసిన ఆవులన్నింటికీ మీముఖం

నల్లగా అవుతుంది అని శాపం పెట్టాయి. ఆ ఆవులు రంతిదేవుడి దగ్గరకు పోయి 'మాకు మంచిగతి కలిగించుము. మమ్ము నీ యజ్ఞంలో పశువులుగా బలి ఇమ్ము' అని మనుష్యుల మాటలతో ప్రార్థించాయి. అట్లా ప్రార్థించగా.

విశేషం: ఇక్కడ కపిల గోవులకు పాపం ఎట్లా వచ్చింది? అని సందేహం కలుగుతుంది. మేము ఈ పాపం చేశామనే భావన ఉన్న వాటికి - అంటే అహంకారభావన ఉన్నవాటికి పాపం అంటుతుంది. అది లేనివాటికి అంటదు. **"యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య నలిప్యతే; హత్వా పి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే"** అన్న గీతావాక్యం దీనికి ప్రమాణం. ఎవనికి అహంకారభావన ఉండదో; బుద్ధి చేసినపనియందు అంటులేకుండా ఉంటుందో వాడు ఈ లోకాలను రూపుమాపినా చంపిన వాడు కాడు. అతడికి పాప బంధం ఉండదు. పశువులుగా యజ్ఞంలో బలియివ్వటం పాప పరిహారార్థమని ఇందు సూచన.

క. 'మిమ్ముఁ దెగఁ జూచి సద్గతి । కెమ్మెయిఁ బోవంగ నేర్తు నే' నని వినయా
ర్ద్రమ్ముగ మ్రొక్కుచుఁ బలికిన । నమ్మానవపతికి నిట్టులను నగ్గోవుల్. 81

ప్రతిపదార్థం: నేను; మిమ్మున్= మిమ్ములను; తెగన్+చూచి= చంపి; సద్గతికిన్= ఉత్తమ స్థితికి; ఏ+మెయిన్= ఏ విధంగా; పోవంగన్ నేర్తున్;= పోగలను?; అని; వినయ+ఆర్ద్రమ్ముగన్= వినయపు చెమ్మ కలిగే విధంగా; మ్రొక్కుచున్= పాదాలకు నమస్కరిస్తూ; పలికినన్= పలుకగా; ఆ+మానవపతికిన్= ఆ రాజునకు (రంతిదేవునకు); ఆ+గోవుల్= ఆ ఆవులు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాయి.

తాత్పర్యం: 'మిమ్మల్ని చంపి నేను ఉత్తమగతి ఎట్లా పొందుతాను?' అని వినయం ఉట్టిపడే విధంగా మ్రొక్కుతూ పలుకగా ఆ ఆవులు ఆ రాజుతో ఇట్లా అన్నాయి.

విశేషం: వినయార్ద్రమ్ముగన్ - వినయం అణువణువునా నిండినట్లు అని భావం. మ్రొక్కటం అంటే సాధారణంగా సాష్టాం గదండ ప్రణామం చేయటం అని అర్థం. మిమ్మున్, నేనె - అనే పదాలు అర్థాంతర సంక్రమిత వాచ్యాలు - పరమ పూజ్యులైన మిమ్ములను, ప్రాణాలు ఒడ్డి అయినా రక్షించుకొనదగిన మిమ్ములను ఇత్యాద్యర్థం వ్యంగ్యం. అట్లాగే 'గోవులయందు పరమభక్తిగల' నేను అనే అర్థం ఇక్కడ స్ఫురిస్తుంది.

క. జ్ఞానుల యీ పనికై నినుఁ గానఁగఁ బుత్తెంచి, రట్లు గావున సుమనో
మానితగతి నీకును నగు । భానునిభా! నీయశంబుఁ బరఁగు జగములన్. 82

ప్రతిపదార్థం: భానునిభా!= సూర్యుడి వంటివాడా!; జ్ఞానులు+అ= జ్ఞానం కలవారే; ఈ పనికై= ఈ పనికొరకు; నినున్=నిన్ను; కానఁగన్= చూడటానికి; పుత్తెంచిరి= (మమ్ములను) పంపారు; అట్లు కావునన్= కాబట్టి; సుమనస్+మానితగతి= దేవతలు గౌర వించే స్థితి; నీకునున్= నీకు కూడా; అగున్= అవుతుంది; నీ యశంబున్= నీకీర్తికూడా; జగములన్= లోకాలలో; పరఁ గున్= వ్యాపిస్తుంది.

తాత్పర్యం: సూర్యసమానుడా! ఈ పనికొరకు జ్ఞానులే నిన్ను చూడవలసినదిగా మమ్మల్ని పంపారు. కాబట్టి దేవతలు కూడా గౌరవించే గతి నీకు సిద్ధిస్తుంది. నీ కీర్తి లోకాలలో వ్యాపిస్తుంది.

విశేషం: భానునిభా! - అనటంవలన సూర్యుడివలె నీవు తత్కాలంలో మమ్ములను బాధించినా అది ఉత్తర కాలంలో సత్ఫల దాయకమే అవుతుంది అన్న అర్థం ప్రతీయమానం అవుతుంది. నీకును - గోహత్య చేసిన నీకును - అని భావం. యశస్సు లోకాలలో ఎంతకాలం ఉంటుందో అంతకాలం ఆ వ్యక్తి పుణ్యలోకాలలో ఉంటాడని శాస్త్రజ్ఞులు చెప్పుతున్నారు. జ్ఞానులు

'జ్ఞానీత్వాత్మైవ మేమతమ్' - జ్ఞాని ఆత్మయే అని నా అభిప్రాయం అన్న గీతావాక్యం ప్రమాణంగా జ్ఞానులు - అందులోను పెక్కండ్రు చెప్పారంటే అది పరమాత్మ పలుకువలె అనుల్లంఘనీయం అని తాత్పర్యం.

క. నావుడు మీలోపల నొక । గోవైనను మోహవశతఁ గూరుటయు మఖం
బావేళఁ బరిసమాప్తము । గావలయును వినుఁడు సమయ కల్పన దెలియన్.' 83

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; మీలోపలన్= మీలో; ఒక గోవు+ఐనను= ఒక్క ఆవైనా; మోహవశతన్= మోహానికి లొంగటం; కూరుటయున్= పొందినట్లైతే; మఖంబు= యజ్ఞం; ఆ వేళన్= ఆ సమయంలో; పరిసమాప్తము= పూర్తిగా ముగిసినది; కావలయును= అవ్వాలి; సమయ కల్పన= ఈ ఒడంబడిక ఏర్పాటు; తెలియన్= చక్కగా తెలిసే విధంగా; వినుండు= వినండి.

తాత్పర్యం: అని ఆ ఆవులు అంటే ఆ రాజు 'మీలో ఒక్క ఆవైనా చావుకు వెనుకాడితే వెంటనే నా యజ్ఞం ముగిసిపోవాలి. ఈ ఒడంబడికను మీరు చక్కగా వినండి.'

విశేషం: మోహవశతఁ గూరుట - అయ్యో! నాకీ ఘోరమైన చావు వచ్చిపడిందే అని బాధపడటం.

క. అని యవ్విభుండు వలికిన । విని గోవులు సమ్మతింప విశసించుచు వే
ల్చె నతఁడు యజ్ఞానలమున । ననేక గోచయములం గ్రమాకలనమునన్. 84

ప్రతిపదార్థం: అని= ఇట్లా అని; ఆ+విభుండు= ఆ రాజు; పలికినన్= పలుకగా; విని= ఆలకించి; గోవులు= ఆవులు; సమ్మతింపన్= ఒప్పుకొనగా; అతఁడు= ఆ రంతిదేవుడు; క్రమ+ఆకలనమునన్= శాస్త్ర విధి పద్ధతిలో; అనేక గోచయములన్= పెక్కు ఆవుల మందలను; విశసించుచున్= చంపుతూ; యజ్ఞ+అనలమునన్= యజ్ఞాగ్నిలో; వేల్చెన్= హోమం చేశాడు.

తాత్పర్యం: రా జిట్లా పలుకగా ఆ ఆవులు ఒప్పుకొన్నాయి. ఆ రంతిదేవుడు పెక్కు ఆవుల మందలను విధి ననుసరించి చంపి యజ్ఞపు అగ్నిలో హోమం చేశాడు.

విశేషం: క్రమ+ఆకలనమునన్= అతడు చేసిన పని శాస్త్ర సమ్మతం అనే విషయాన్ని ఈ పదం వ్యక్తం చేస్తుంది. యజ్ఞాలను దేవతలకూ, మనుష్యులకూ పరస్పరం ఉపకారకాలుగా భగవంతుడు సృష్టించాడని భగవద్గీత చెప్పుతున్నది.

క. ఒకనాఁడు గో వొకటి లేఁ । గకుఁ జన్నిచ్చుచును దానిఁ గనుఁగొని నీ విం
కకటా! యెక్కడఁ జేరెద । వకృపులు వచ్చెదరు చంప' నని పల్కుటయున్. 85

ప్రతిపదార్థం: ఒకనాఁడు= ఒక దినాన; గోవు= ఆవు; ఒకటి= ఒక్కటి; లేఁగకున్= చిన్న దూడకు; చన్ను+ఇచ్చుచును= పాలిస్తూ; దానిన్= ఆ దూడను; కనుఁగొని= చూచి; అకటా!= అయ్యో!; నీవు ఇంకన్= ఇటుపై; ఎక్కడన్= ఏ తావునందు; చేరెదవు?= చేరుతావు?; అకృపులు= దయలేనివారు; చంపన్= చంపటానికి; వచ్చెదరు= వస్తారు; అని; పల్కుటయున్= పలుకగా.

తాత్పర్యం: ఒక రోజున ఒక ఆవు తన చిన్ని దూడకు పాలిస్తూ 'అయ్యో బిడ్డా! దయలేనివారు చంపటానికి వస్తారు. నీ వెక్కడకు పోతావు?' అని పలుకగా. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: నిజానికి చావు కోరింది తామే అయినా ఆ ఆవుకు కర్మబద్ధతవలన చావుభయం, దానివలన దుఃఖం కలిగాయి.

గోవులు రంతిదేవు యజ్ఞ పశువులై గోలోకంబునకుఁ బోవుట (సం.13-123-26 (కుంభ))

వ. మహానుభావుండు గావున నప్పలుకులు విని రంతిదేవుం డయ్యాగంబు సుప్రయోగంబుగా సమాప్తంబు గావించెఁ; గొన్ని గోవులు కడమవడి పుడమిన నిలిచె; నధ్వరోపయోగంబు వడసిన గోగణంబులు గోలోకంబునకుం బ్రమోదంబునం బోయెఁ; దదీయ చర్మాస్థి శ్రేణులు తటంబులై తనరం బ్రభూత రక్తమేదః క్లేదంబు లేఱై పాఱి చర్మణ్వతి యను పేరం బరఁగె; నా రంతిదేవ భూపతియును యజ్ఞ సమృద్ధుండై వృద్ధశ్రవుని తోడి సఖ్యంబునం బొలిచి యక్షయ నాకంబున సుశ్లోకుండై యుండె; ఫేనపాఖ్యుండును గోలోకంబున శాశ్వతుండై వసించె' నని చెప్పి భీష్ముండు వెండియు. 86

ప్రతిపదార్థం: మహా+అనుభావుండు= గొప్ప ప్రభావం కలవాడు; కావునన్= కాబట్టి; రంతిదేవుండు= రంతిదేవుడు; ఆ+పలుకులు= ఆ ఆవు మాటలు; విని= ఆలకించి; ఆ+యాగంబు= ఆ యజ్ఞం; సుప్రయోగంబు+కాన్= చక్కగా చేసినదయ్యే విధంగా; సమాప్తంబు= ముగిసినదానిని; కావించెన్= చేశాడు; కొన్ని గోవులు= కొన్ని ఆవులు; కడమ+పడి= మిగిలిపోయి; పుడమిన్+అ= భూమియందే; నిలిచెన్= ఉండిపోయాయి; అధ్వర+ఉపయోగంబు= యజ్ఞంలో ఉపయోగాన్ని; పడసి= పొందిన; గోగణంబులు= ఆవులమందలు; గోలోకంబునకున్= గోలోకానికి; ప్రమోదంబునన్= మంచి ఆనందంతో; పోయెన్= పోయాయి; తదీయ చర్మ+అస్థి శ్రేణులు= వానివైన తోళ్ళు, ఎముకలు అనే వాటి వరుసలు; తటంబులు= ఒడ్డులు; ఐ= అయి; తనరన్= ఒప్పగా; ప్రభూత రక్త మేదః క్లేదంబులు= చాలా ఎక్కువ అయిన నెత్తురు, మెదడు అనేవాటి తడులు; ఏఱు+ఐ= నది అయి; పాఱి= ప్రవహించి; చర్మణ్వతి+అను పేరన్= చర్మణ్వతి (చర్మములు గలది) అనే పేరుతో; పరఁగెన్= ఒప్పింది; ఆ రంతిదేవ భూపతియును= ఆ రంతిదేవ మహారాజున్నూ; యజ్ఞ సమృద్ధుండు+ఐ= యజ్ఞాల నిండైన సంపద కలవాడై; వృద్ధశ్రవునితోడి సఖ్యంబునన్= ఇంద్రుడితోడి చెలిమితో; పొలిచి= ఒప్పి; అక్షయ నాకంబునన్= తరుగు లేని స్వర్గంలో; సుశ్లోకుండు+ఐ= అందరి పొగడ్తలు అందినవాడై; ఉండెన్= ఉన్నాడు; ఫేనప+ఆఖ్యుండును=ఫేనపుడన్న పేరుగల ఆ సుమిత్రుడున్నూ; గోలోకంబునన్= గోలోకంలో; శాశ్వతుండు+ఐ= ఎల్లవేళల ఉండేవాడై; వసించెన్= ఉన్నాడు; అని= ఇట్లా అని; చెప్పి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: గొప్ప మహిమగలవాడు కనుక ఆ రంతిదేవుడు ఆ ఆవు మాట విని ఆ యాగాన్ని ఏలోపం లేకుండా ముగించాడు. ఆ విధంగా కొన్ని ఆవులు మిగిలిపోయి భూమిమీదనే నిలిచిపోయాయి. యజ్ఞంలో వినియోగం పొందిన ఆవుల మందలు ఆనందంతో గోలోకానికి వెళ్ళాయి. వాటి చర్మాలూ, ఎముకలూ ఒడ్డులు కాగా వాని నెత్తురు, మెదడులోని తడి ఏరై ప్రవహించి చర్మణ్వతి అనే పేరున ఒప్పింది. రంతిదేవ మహారాజున్నూ యజ్ఞపుపంట పండించుకొని ఇంద్రుడితోడి చెలిమితో సుఖంగా చెడని స్వర్గంలో మంచి కీర్తి పొందుతూ ఉన్నాడు. ఫేనపుడున్నూ గోలోకంలో శాశ్వతంగా నివసించాడు' అని చెప్పి భీష్ముడు ఇంకా ఇట్లా అంటున్నాడు.

విశేషం: ఇందులో యజ్ఞంలో మిగిలిన ఆవులు తప్ప తక్కిన వారంతా సుఖస్థితి పొందటాన్ని వివరించారు. దీనివలన యజ్ఞం సత్ఫలదాయకమే అన్న భావం తెలియవస్తున్నది.

సీ. 'మానవనాథ! యీ ఫేనపాఖ్యానంబు । బదరికాశ్రమమున బాదరాయ
ణుఁడు ప్రీతి నారాయణునకుఁ జెప్పిన నమ్మ । హాత్ముండు గో యజనార్థి యగుచు
నిది గొనియాడంగ విదితమై జగమునఁ । బరఁగెఁ; బుణ్యతమంబు పావనంబు
దీనిఁ బఠించిన వీనుల నించిన । దురిత వర్గంబులఁ బొరయ వలదు;

తే. పూరు నృపకుల భూషణ! పూత చరిత! నీవు నతిభక్తి గలుగుము గోవులందుఁ
బరమనియతి నీ తంత్రంబు పఠన విధియు । నేత దాకర్ణనంబును నెపుడుఁ జలుపు.' 87

ప్రతిపదార్థం: మానవనాథ!= రాజా!; ఈ ఫేనప+ఆఖ్యానంబున్= ఈ ఫేనపుని కథను, బదరికా+ఆశ్రమమునన్= బదరికాశ్రమంలో; బాదరాయణుఁడు= శ్రీ వ్యాసుడు; ప్రీతిన్= ప్రీతితో; నారాయణునకున్= నారాయణుడనే మునికి; చెప్పినన్= చెప్పగా; ఆ+మహాత్ముండు= ఆ దొడ్డబుద్ధిగలవాడు; గో యజన+అర్థి= గోవుల యజ్ఞం కోరినవాడు; అగుచున్= అవుతూ; ఇది= దీనిని; కొని+అడంగన్= ప్రీతితో పలుకగా; జగమునన్= లోకంలో; విదితము+ఐ= అందరికీ తెలిసినదై; పరఁగెన్= ఒప్పింది; పుణ్యతమంబు= అన్నింటికన్నా పుణ్యమైనదీ; పావనంబు= పవిత్రం చేసేదీ అయిన; దీనిన్= దీనిని; ఈ ఫేనపుని కథను; పఠించినన్= శ్రద్ధతో చదివినా; వీనులన్= చెవులయందు; నించినన్= నింపుకొన్నా; దురిత వర్గంబులన్= పాప సముదాయాలలో; పొరయన్= కలిసిపోవటం; వలదు= కలుగదు; పూరు నృప కులభూషణ!= పూరుడు అనే రాజు కులానికి అలంకారమైనవాడా; పూతచరిత!= పవిత్రమైన చరిత్ర కలవాడా!; నీవును= నీవుకూడా; గోవులందున్= గోవుల విషయంలో; అతిభక్తిన్= మిక్కిలి భక్తిని; కలుగుము= పొందుము; పరమనియతిన్= గొప్పనిష్ఠతో; ఈ తంత్రంబు= ఈ క్రియయొక్క; పఠన విధియున్= చదవటమనే పనినీ; ఏతత్+ఆకర్ణనంబును= దీనిని వినటాన్నీ; ఎపుడున్= ఎల్లవేళలా; చలుపు= చేస్తూ ఉండుము.

తాత్పర్యం: 'రాజా! ఈ ఫేనపుని కథను బదరికాశ్రమంలో శ్రీ వేదవ్యాసుడు నారాయణమునికి ప్రీతితో చెప్పాడు. ఆ మహానుభావుడు గో యజ్ఞం చేయగోరి దీనిని గూర్చి అందరకూ తెలుపుతూ ఉండగా అది లోకంలో క్రమంగా అందరికీ తెలిసింది. ఎంతో పుణ్యమైనదీ, పావనమైనదీ అయిన దీనిని చదివినా, విన్నా పాపాల సంగతి కలుగదు. నీవుకూడా గోవుల విషయంలో గొప్ప భక్తి కలిగి ఉండుము. గోవులను సేవించిన విధానాన్ని చదవటం, వినటం ఎప్పుడూ చేస్తూ ఉండుము.'

విశేషం: బాదరాయణుడు నారాయణుడికి బదరికాశ్రమంలో చెప్పాడంటే నరనారాయణులనే మునులలో నారాయణుడు అనుకొనాలి. ఇది మానవులలో రుచి పుట్టటానికి దోహదం చేస్తుంది. పూరునృప కులభూషణ! పూతచరిత్ర! - అనే రెండు సంబోధనలు సాభిప్రాయాలు. పూరుడు స్వార్థం ఏ మాత్రమూ లేకుండా తండ్రికి యౌవనం ఇచ్చి అతడి ముదిమిని గొన్నవాడు - ఆ విధంగా వంశకర్త అయినవాడు. నీవు కూడా అటువంటి వాడవు కనుక సత్కార్యాచరణ నీవు తప్పక చేయగలవాడవే - అనే భావం ఇందులో స్ఫురిస్తుంది. గోవులందు అతిభక్తి కలుగుము - ఈ క్రియా ప్రయోగం ఇప్పుడు వ్యవహారంలో కనబడదు. తంత్రంబు పఠనవిధి - తంత్రంయొక్క పఠనవిధి అని షష్ఠీ తత్పురుషం.

క. అనిన విని 'యట్ల చేసెద । ననఘా! గోమహిమ యిట్టు లాకర్ణింపం
గనియును దనివి సనదు నా । మన; మింకను జెప్ప నీ విమల వాక్యములన్.' 88

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి (ధర్మరాజు); అనఘా!= పుణ్యాత్ముడా!; అట్లు+అ= అట్లాగే; చేసెదన్= చేస్తాను; గోమహిమ= ఆవుల గొప్పతనం; ఇట్టులు= ఈ విధంగా; ఆకర్ణింపన్ కనియును= వినగలిగి కూడా; నా మనము= నా హృదయం; తనివి+చనదు= తృప్తిపొందదు; నీ విమల వాక్యములన్= స్వచ్ఛమైన నీ మాటలతో; ఇంకను= ఇంకా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పిన దానిని విని ధర్మరాజు 'పుణ్యాత్మా! గోవుల మహిమ ఈ విధంగా వినగలిగినా ఇంకా నా మనస్సు తృప్తి పొందలేదు. స్వచ్ఛమైన నీ మాటలతో మరింతగా నాకు దయతో చెప్పుము' (అని ప్రార్థించాడు)

విశేషం: అనఘా! అన్న సంబోధనా, నీ విమలవాక్యములన్' అన్నమాటా ధర్మరాజు జిజ్ఞాస ఎంత ఘనమైనదో అభివ్యక్తం చేస్తున్నాయి.

క. అని ధర్మతనయుఁ డడిగిన । ననయంబుఁ బ్రియంబుఁ బొంది యమరనదీనం
దనుఁ డిట్లను 'సత్యవతీ । తనయుని వాక్యములు సెప్పెదను వినుము నృపా! 89

ప్రతిపదార్థం: అని= ఇట్లని; ధర్మతనయుఁడు= ధర్మరాజు; అడిగినన్= అడుగగా; అమరనదీ నందనుఁడు= దేవనది అయిన గంగ కొడుకు భీష్ముడు; అనయంబున్= మిక్కిలి ఎక్కువగా; ప్రియంబున్= ప్రీతిని; పొంది; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; నృపా!= రాజా!; సత్యవతీ తనయుని వాక్యములు= సత్యవతి కుమారుడైన వ్యాసుడి పలుకులు; చెప్పెదను= చెప్పుతాను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు అడుగగా భీష్ముడు పట్టరాని సంతోషం పొంది ఇట్లా అన్నాడు. 'నాయనా! వ్యాసుడి మాటలు చెప్పుతాను వినుము.

విశేషం: అమరనదీనందనుడు; సత్యవతీనందనుడు అనే పదాలు ఆ ఇరువురి ఆజన్మ శుద్ధతను తెలియజేస్తాయి.

ఆ. గోవిశేష మర్థి నీవు నన్నడిగిన । యట్ల శుకుఁడు దండ్రి నడిగెఁ; దాని
కాత్మఁ బ్రియముఁ బొంది యా మహాసంయమి । యా సుబుద్ధి కిట్టు లనియె నధిప! 90

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీవు; అర్థిన్= కోరికతో; గో విశేషము= ఆవుల గొప్పతనాన్ని గురించి; నన్నున్= నన్ను; అడిగిన+ అట్లు+అ= అడిగిన విధంగానే; శుకుఁడు= శుకమహర్షి; తండ్రిన్= తండ్రి అయిన వ్యాసుడిని; అడిగెన్= అడిగాడు; దానికిన్= అట్లా అడిగిన దానికి; ఆత్మన్= హృదయంలో; ప్రియమున్= ప్రీతిని; పొంది; ఆ మహాసంయమి= ఆ గొప్ప నిగ్రహవంతుడు; ఆ సుబుద్ధికిన్= మంచిబుద్ధిగల ఆ శుకునకు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: రాజా! నీవు కోరికతో గోవుల గొప్పతనాన్ని గూర్చి నన్నడిగినట్లే శుకుడు తన తండ్రి నడిగాడు. దాని కాయన ఎంతో ప్రీతి పొంది ఆ మహర్షి ఆ సుబుద్ధికి ఇట్లా చెప్పాడు.

విశేషం: మహాసంయమి అనటంవలన అతడు చెప్పే విషయం యొక్క ప్రామాణ్యం స్ఫురిస్తుంది. సుబుద్ధికి అనటంచేత సుబుద్ధులు మాత్రమే చెప్పిన దానిని సార్థకం చేస్తారు అన్నభావం తెలియవస్తున్నది.

సీ. స్థావర జంగమాత్మకమైన భూత జా । లంబు సుస్థితి గోగణంబు నాశ్ర
యమునన తత్సంభవమును గోవులయంద; । యవి మూల సంతాన మజున; కట్లుఁ
గాక సిద్ధుల సాధ్యగణముల మాత లి । ట్లగుట యెఱింగిన యతఁడు బ్రహ్మ
లోక గోలోకాది లోకాంతరములకుఁ । దనయింటి కరుగు చందమున నరుగుఁ

తే. బరమగతిఁ గోరువారలు పాదముష్టి । యష్టి వాక్చిత్తముల గోవు నభిభవింప
కుండ వలయు నివ్విద్యఁ బద్మోద్భవుండు । సెప్పె నది యాత్మపావన శిష్ట సేవ్య. 91

ప్రతిపదార్థం: స్థావర జంగమ+ఆత్మకము= కదలనివి, కదిలేవి అన్న సుస్థితి గలది; ఐన= అయిన; భూతజాలంబు సుస్థితి= వస్తువుల ప్రాణుల యొక్క సముదాయపు చక్కని స్థితి; గోగణంబు+ఆశ్రయంబునన= గోవుల సముదాయం యొక్క ఆధారం మీదనే; తత్ సంభవంబును= వాని పుట్టుకకూడా; గోవులయందు+అ= ఆవులయందే; అవి= ఆ ఆవులు; అజునకున్= బ్రహ్మకు; మూలసంతానము= మొదటి బిడ్డలు; అట్లున్ కాక= అంతేకాక; సిద్ధుల సాధ్యగణముల మాతలు= ఆవులు సిద్ధులు సాధ్యుల సముదాయాలు అనే దేవజాతి వారి తల్లులు; ఇట్లు= ఈ విధంగా; అగుట= అవటం; ఎఱింగిన+అతఁడు= తెలిసికొన్నవాడు; బ్రహ్మలోక గోలోక+ఆది లోక+అంతరములకున్= బ్రహ్మలోకమూ, గోవుల లోకమూ మొదలైన ఇతరలోకాలకు; తన ఇంటికిన్= సొంత ఇంటికి; అరుగుచందమునన్= వెళ్ళేవిధంగా; అరుగున్= వెళ్ళుతాడు; పరమగతిన్= మిక్కిలి ఉత్తమమైన లక్ష్యాన్ని; కోరువారలు= కోరే మనుష్యులు; గోవును= ఆవును; పాద ముష్టి యష్టి వాక్ చిత్తములన్= కాలితో; పిడికిలితో, కఱ్రతో, మాటతో, మనస్సుతో; అభిభవింపక= తిరస్కరించక; ఉండవలయున్= ఉండాలి; ఈ+విద్యన్= ఈ విద్యను; పద్మ+ఉద్భవుండు= బ్రహ్మ; చెప్పెన్= ఉపదేశించాడు; అది= ఆ విద్య; ఆత్మపావన= ఆత్మను పవిత్రం చేసేది; శిష్ట సేవ్య= ఉత్తమ ప్రవృత్తి కలవారికి సేవించదగింది.

తాత్పర్యం: నాయనా! సృష్టిలో ఉన్న కదలని పదార్థాలు, కదిలే ప్రాణులు అనే అన్నింటి చక్కని స్థితీ గోవులను ఆశ్రయించినందువలననే కలుగుతున్నది. వాటి పుట్టుకకూడా వాటివలననే ఏర్పడుతున్నది. ఆవులు బ్రహ్మకు తొలిబిడ్డలు. అంతే కాదు; సిద్ధులు, సాధ్యులు మొదలైన దేవయోనిగణాలకు కూడా ఆవులు తల్లులు. ఈ విషయం తెలిసినవాడు బ్రహ్మలోకం, గోలోకం మొదలైన లోకాలకు సొంత ఇంటికి వెళ్ళినట్లు వెళ్ళుతాడు. అత్యుత్తమగతిని కోరేవారు కాలితో, పిడికిలితో, కఱ్రతో, మాటతో, మనస్సుతో ఆవును తిరస్కరించరాదు. ఇది బ్రహ్మ చెప్పిన విద్య. ఆత్మను పవిత్రం చేసేది, ఉత్తములు సేవించవలసినది.

విశేషం: 'తన ఇంటి కరుగుచందమున' - అంటే సర్వ స్వతంత్రతా భావంతో అని భావం. ఇది ఒక మంచి జాతీయం. పాదముష్టి - వీటివలన గోవును ఏ విధంగానూ హింసింపరాదని సూచన. 'పద్మోద్భవుండు చెప్పెన్' - అంటే ఇది తిరుగులేని శాసనం. దీనిని ధిక్కరించినవాడు దిక్కులేని వాడవుతా డని తాత్పర్యం. ఆత్మపావన, శిష్టసేవ్య అనేవి 'విద్య' అనే స్త్రీలింగ శబ్దానికి విశేషణాలు కావున స్త్రీ లింగరూపాలు.

క. పావనమని శ్రుతి సెప్పిన । యే వస్తువు నాశ్రయించి యెక్కుడయిరి భూ
తావలులకు సుర లట్టిది । గోవు; తదీయ మగు మహిమకున్ గుఱిగలదే? 92

ప్రతిపదార్థం: పావనము= పవిత్రం; అని; శ్రుతి= వేదం; చెప్పిన ఏ వస్తువున్= చెప్పిన ఏ వస్తువును; ఆశ్రయించి= ఆధారం చేసికొని; సురలు= దేవతలు; భూత+ఆవలులకున్= ప్రాణుల సముదాయాలకు; ఎక్కుడు= అధికులు; అయిరి=అయ్యారో;

అట్టి+అది= ఆ విధమైనది; గోవు=ఆవు; తదీయము= దానిది; అగు= అయిన; మహిమకున్= గొప్పతనానికి; గుఱి= హద్దు; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: వేదం పవిత్రమని చెప్పి గోవు నాశ్రయించి దేవతలు తక్కిన అన్ని ప్రాణికోటులకంటె గొప్పవారయ్యారు. కాబట్టి గోవుల మహిమకు హద్దు ఉన్నదా?

క. వీణా కాహళ వేణు । క్వాణ ప్రతిమములు ధేనువర్గధ్వను ల
క్షీణ సుకృతంబు నిర్మల । వాణి తదాకర్ణనంబు వర్ణన విధమున్. 93

ప్రతిపదార్థం: ధేనువర్గధ్వనులు= ఆవుల జాతుల నాదాలు; వీణా కాహళ వేణు క్వాణ ప్రతిమములు= వీణ, బూర పిల్లనగ్రోవి, అనేవాటి నాదాలకు సాటి వచ్చేవి; నిర్మలవాణి= ఆవుల నిర్మలమైన నాదం; తత్+ఆకర్ణనంబు= దానిని వినటమూ; వర్ణ నవిధమున్= వర్ణించటమూ; అక్షీణ సుకృతంబు= తరగని పుణ్యం.

తాత్పర్యం: ఆవుల కంఠనాదాలు వీణా, కాహళ, వేణు నాదాల వంటివి. ఆ ధ్వని అతి స్వచ్ఛమైనది. దానిని వినటమూ, చెప్పుకొనటమూ తరగని పుణ్యాన్ని ఇస్తాయి.

విశేషం: కాహళ= నాలుగు అయిదు లోహపు గొట్టాలు ఒకదానితో ఒకటి బిగించి ఏర్పాటు చేసికొనటానికి వీలుగా ఉండే ఒక వాద్యం.

క. క్షీరము దధియును ఘృతము సు । ధా రూపము లగుట దేవతా ప్రీణన య
జ్ఞారంభంబులు విమలా । చారా! గో దోహ నైక సాధ్యము లయ్యెన్. 94

ప్రతిపదార్థం: విమల+ఆచారా!= మాలిన్యంలేని ప్రవర్తన కలవాడా!; క్షీరము= పాలు; దధియును= పెరుగును; ఘృతము= నేయియు; సుధా రూపములు= అమృతం రూపాలు; అగుటన్= కావటంవలన; దేవతా ప్రీణన యజ్ఞ+ఆరంభంబులు= దేవతలను ప్రీతిపరచే యజ్ఞాలు అనే కార్యాలు; గో దోహన+ఏక సాధ్యములు= ఆవుల పాలు అనే ఒక్కదానిచేతనే సాధించదగినవి; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: విమలాచారా! పాలు పెరుగు నెయ్యి అమృతస్వరూపాలు కనుక దేవతలను తృప్తిపరచే యజ్ఞ కార్యాలు ఆవుల పాలవలన మాత్రమే సాధ్యాలవుతున్నాయి.

విశేషం: విమలాచారా! అనే సంబోధన తాను పెక్కు మంచి విషయాలు యోగ్యతను తెలియజేస్తున్నాయన్న స్ఫూర్తిని కలిగిస్తుంది.

ఆ. శ్రుతులు నౌపనిషద సూక్తులు గో స్వరూ । పంబు లని సరోజభవుఁడు సెప్పె
ధర్మపరత పరమతపము మహాధ్వర । మనఁగఁ బరఁగు గో సమర్చనంబు. 95

ప్రతిపదార్థం: సరోజభవుఁడు= పద్మంలో పుట్టిన బ్రహ్మ; శ్రుతులును= వేదాలు; ఔపనిషద సూక్తులు= ఉపనిషత్తులకు సంబంధించిన మంచి మాటలు; గో స్వరూపంబులు= గోవుల స్వరూపాలు; అని; చెప్పెన్= చెప్పాడు; గో సమర్చనంబు= ఆవులను భక్తితో పూజించటం; ధర్మపరత= ధర్మమే తుది మెట్టు కావటం; పరమతపము= గొప్పతపస్సు; మహా+అధ్వరము= గొప్ప యజ్ఞం; అనఁగన్= అనటానికి; పరఁగున్= ఒప్పును.

తాత్పర్యం: వేదాలూ, జ్ఞాన విషయాలైన ఉపనిషత్తులూ గో స్వరూపాలే అని బ్రహ్మ చెప్పాడు. ఆవులను భక్తితో పూజించటం ధర్మం తుది మెట్టు, గొప్పతపస్సు, మహిమగల యజ్ఞం అనటానికి ఒప్పుతుంది.

విశేషం: శ్రుతులు - వేదాలు నాలుగు భాగాలుగా ఉన్నాయి. అందులో సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకం అనేవి ఒక విభాగంగా, ఉపనిషత్తులు ఒక విభాగంగా చెప్తుతారు. మొదటి విభాగానికి కర్మకాండ అనీ, చివరిదానికి జ్ఞానకాండ అనీ పేరు. బ్రహ్మ చెప్పాడు కనుక తప్పక విశ్వసించాలి అని భావం.

క. ఈ వాక్యంబులు భూదే । వావలి సన్నిధిఁ బఠించు నాతఁడు పుణ్యుం
డై వెలయు; విన్నవారలు । పావనగుణ! తత్క్షణంబ పాతు రఘములన్. 96

ప్రతిపదార్థం: పావనగుణ!= పవిత్రగుణాలుగల శుకా!; ఈ వాక్యంబులు= ఈ మాటలను; భూదేవ+ఆవలి సన్నిధిన్= బ్రాహ్మణుల సముదాయం దగ్గర; పఠించు+ఆతఁడు= శ్రద్ధతో చదివేవాడు; పుణ్యుండు+ఐ= పుణ్యంకలవాడై; వెలయున్= ఒప్పుతాడు; విన్నవారలు= విన్న మనుష్యులు; తత్ క్షణంబు+అ= అప్పటికప్పుడు; అఘములన్= పాపాలను; పాతురు= పోగొట్టుకొంటారు.

తాత్పర్యం: పావనగుణా! ఈ వాక్యాలు బ్రాహ్మణుల సమీపంలో చదివేవాడు పుణ్యమూర్తి అవుతాడు. విన్నవారు అప్పటి కప్పుడు పాపవిముక్తి పొందుతారు.

తే. గో ఘృతంబు ప్రాశించియు గోకరీష । సువిహిత స్నానుఁ డయ్యు భూదివిజుఁ డధిక
భక్తి నిత్యంబు గోమతీపఠన మాచ । రించియును గల్మషముల నిర్జించు ననఘ! 97

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; భూదివిజుఁడు= బ్రాహ్మణుడు; గో ఘృతంబు= ఆవు నేయి; ప్రాశించియున్= లోపలికి పుచ్చుకొనీ; గోకరీష సువిహిత స్నానుఁడు= ఆవుపేడ కలిసిన నీళ్ళతో చక్కగా చేయబడిన స్నానం కలవాడు; అయ్యున్= అయినీ; అధికభక్తిన్= ఎక్కువ భక్తితో; నిత్యంబు= ప్రతిదినము; గోమతీపఠనము= గోమతీమంత్రాన్ని చదవటం; ఆచరించియును= చేసినీ; కల్మషములన్= పాపాలను; నిర్జించున్= పూర్తిగా గెలుస్తాడు (త్రోసి వేస్తాడు).

తాత్పర్యం: పుణ్యాత్మా! ఆవు నెయ్యి లోపలికి పుచ్చుకొనీ, ఆవుపేడ కలిసిన నీళ్ళతో స్నానంచేసీ, మహాభక్తితో ప్రతిదినమూ గోమతీ పఠనం గావించే బ్రాహ్మణుడు పాపాలన్నింటినీ త్రోసి పారవేస్తాడు.

విశేషం: గో ఘృతం తాగడం వగైరా కాయిక నిష్ఠ. 'భక్తి' మానసనిష్ఠ. గోమతీ పఠనం వాచికనిష్ఠ. ఇట్లా మూడు నిష్ఠలూ కలవటమే త్రికరణశుద్ధి. అది తప్పక సత్ఫలితాన్ని సాధిస్తుంది.

చ. అనిమిషులున్ మహామునులు నయ్యయి పెంపులు గోమతిం బఠిం
చిన సుకృతంబునం గనిరి శ్రీయును శత్రుజయంబుఁ బేర్మియుం
దనయ సమృద్ధియుం గలుగుఁ దత్పఠనంబున బంధుకోటి బం
ధనమునఁ బాయు; మార్గమునఁ దప్పు మృగార్తియుఁ జోరబాధయున్.' 98

ప్రతిపదార్థం: అనిమిషులున్= దేవతలూ; మహామునులు= గొప్ప మునులూ; ఆ+అయి పెంపులు= ఆయా మహిమలు; గోమతిన్= గోమతిని; పఠించిన సుకృతంబునన్= పారాయణం చేసిన పుణ్యంవలన; కనిరి= పొందారు; తత్ పఠనంబునన్= దాన్ని చదవటంవలన; శ్రీయును= సంపదా; శత్రుజయంబున్= పగవారి మీద గెలుపూ; పేర్మియున్= పెద్దతనమూ; తనయ సమృద్ధియున్= బిడ్డలసంపదా; కలుగున్= కలుగుతుంది; బంధుకోటి= పఠించినవారి చుట్టాల సముదాయంకూడా; బంధనమునన్= బంధాలనుండి; పాయున్= విడివడుతుంది; మార్గమునన్= దారిలో; మృగ+ఆర్తియున్= క్రూరజంతువుల పీడా; చోర బాధయున్= దొంగలబాధా; తప్పున్= కలగకుండా ఉంటుంది.

తాత్పర్యం: దేవతలు, మహామునులు గోమతిని పఠించిన పుణ్యం వలననే ఆయా గొప్ప స్థితులను పొందారు. దానిని పఠించటంవలన సంపదా, పగవారిని గెలవటం, అభివృద్ధీ, పుత్రులు ఎక్కువగా కలగటం సిద్ధిస్తాయి. వారి చుట్టాలకు కూడా బంధాలు నశిస్తాయి. ప్రయాణాలలో క్రూరమృగాల బాధా, దొంగలబాధా తప్పిపోతాయి.'

విశేషం: చదివినవాడు తనవారికి కూడా మేలు కూర్చగల సామర్థ్యం పొందటం ఇక్కడ గొప్ప విశేషం.

వ. అనిన విని యమ్మునిపతికి శుకుం డిట్లనియె. 99

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ఆ+మునిపతికిన్= మునులలో గొప్పవాడైన ఆ వ్యాసుడికి; శుకుండు= కొడుకైన శుకమహర్షి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా వ్యాసుడితో శుకు డిట్లా అన్నాడు.

వేదవ్యాసముని శుకునకుఁ జెప్పిన కపిల గో మహానుభావము (సం.13-126-2 (కుంభ))

క. తమజాతికిఁ దగుకర్మ । క్షమతలు లేకున్న యట్టి జనములు కపిలా
సమధిక పూజన తద్దా । నము లొనరింతు; రవి వాచు నా దురితంబుల్. 100

ప్రతిపదార్థం: తమజాతికిన్= తమ పుట్టుకకు; తగు= తగిన; కర్మక్షమతలు= కర్మం చేసే యోగ్యతలు; లేక+ఉన్న+అట్టి జనములు= లేనట్టి మానవులు; కపిలా సమధిక పూజన తత్+దానములు= పుల్లావుల గొప్ప పూజలూ; వాటి దానాలు; ఒనరింతురు= చేస్తారు; అవి= ఆ పూజలు, దానాలు; ఆ దురితంబుల్= ఆ పాపాలను; పాచునా= పోగొట్టుతాయా?

తాత్పర్యం: తాము పుట్టిన జాతికి తగిన కర్మల యోగ్యతలు లేని మానవులు కపిల గోవులను మిక్కిలిగా పూజిస్తారు. దానం చేస్తారు. అవి వారి పాపాల నన్నింటినీ పోగొట్టుతాయా?

సీ. అనుటయు 'సందియం బది యేల?' కపిలఁ బూ । జించినఁ, బ్రీతి నిచ్చినను జెడని
యఘములు గల్గునే?' యనియెఁ బరాశర । తనయుఁ డవ్వాక్యంబు విని తదీయ
తనయుండు గపిల కంతటి పెంపురాఁ గతం । బేమి?' నావుడు నమ్మునీశ్వరుండు
విను మని యిట్లను 'ననిమిష సంఘంబు । నొక కారణమునఁ బావకుఁడు మొఱఁగి

తే. యరిగి తనదుగుప్తి యర్థించి గోవుల । నాశ్రయించె నవియు నగ్ని గోప
నంబు సేసె నవ్విధంబున శిఖియున్కి । సుర లెఱింగి రెల్లచోటు నరసి. 101

ప్రతిపదార్థం: అనుటయున్= అని శుకు డనగా; పరాశర తనయుఁడు= పరాశరుడి కొడుకు వ్యాసుడు; సందియంబు= సందేహం; అది+ఏల?= ఎందుకు? కపిలన్= పుల్లావును; పూజించినన్= పూజించినా; ప్రీతిన్= ప్రేమతో; ఇచ్చినను= దానమిచ్చినా; చెడని+అఘములు= నాశనం కాని పాపాలు; కల్గునే?= ఉంటాయా?; అనియెన్= అన్నాడు; ఆ+వాక్యంబున్= ఆ మాటను; విని; తదీయ తనయుండు= ఆవ్యాస మునీంద్రుని పుత్రుడైన శుకుడు; కపిలకున్= కపిల గోవునకు; అంతటి పెంపు= అంతటి గొప్పతనం; రాన్= రావటానికి; కతంబు= కారణం; ఏమి?= ఏమిటి?; నావుడున్= అనగా; ఆ+ముని+ ఈశ్వరుండు= మునులలో శ్రేష్ఠుడైన ఆ వ్యాసుడు; వినుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; పావకుఁడు= అగ్నిదేవుడు; ఒక కారణమునన్= ఒక కారణంగా; అనిమిష సంఘంబున్= దేవతల సంఘాన్ని; మొఱఁగి= కనుగప్పి; అరిగి= వెడలి; తనదుగుప్తి= తన్ను దాచటాన్ని; అర్థించి=కోరి; గోవులన్=ఆవులను; ఆశ్రయించెన్= చేరుకొన్నాడు; అవియున్= ఆ ఆవులున్నూ; అగ్నిన్= అగ్నిని; గోపనంబు+చేసెన్= దాచాయి; సురలు= దేవతలు; ఎల్లచోటున్= అన్ని తావులందునూ; అరసి= వెదకి; శిఖి= అగ్ని; ఆ+విధంబునన్= ఆ విధంగా; ఉన్కి= ఉండటం; ఎఱింగిరి= తెలిసికొన్నారు.

తాత్పర్యం: కుమారు డిట్లా పలుకగా వ్యాసుడు 'నాయనా! నీకు సందేహ మెందుకు? కపిలను పూజించినా దానమిచ్చినా పోనిపాపాలు ఉంటాయా?' అన్నాడు. అప్పుడు శుకుడు తండ్రి మాటలు విని పుల్లావుకు అంతటి మహిమ రావటానికి కారణం ఏమిటి?' అని అడిగాడు. అప్పు డా మునిశ్రేష్ఠుడు వినుము. పూర్వం అగ్నిదేవు డొక కారణంగా దేవతల కన్నుగప్పి తనను దాచుమని గోవుల నాశ్రయించాడు. అవి దాచాయి. దేవతలు అన్నితావులూ వెదకి అగ్ని ఆ విధంగా ఉన్న సంగతి తెలిసికొన్నారు.

విశేషం: శిఖి - శిఖలంటే జ్వాలలు, అవి కలవాడు అగ్ని. నిమిషం అంటే రెప్పపాటు. అది లేనివారు అనిమిషులు= దేవతలు.

వ. ఎఱింగి కూడుకొని గోవులకడకు వచ్చి వానితో 'నగ్ని దాఁచుట యఖిలజగజ్జనంబులకు నహితంబు సేయుట గాదె! చూపకుండుట దగ' దని పలుకుటయుఁ, బుయిలోడి గోవు లప్పావకుం జూపిన, నాసుపర్వులు సంతోషించి వానికి వరం బీవలయునని యవ్వాయు సఖుం బ్రార్థించిన నతండు నగ్గోవుల యందు డాఁగి యుండ నవి కపిలచ్ఛాయం బ్రాపించి యునికిం గనుంగొని గోవుల కెల్లను కపిల యెక్కుడగుటయుం, దదీయారాధనంబునుం దద్దానంబునుం బుణ్యతమంబులై దురితంబుల దమియించి యుత్తమలోకంబుల నిచ్చుటయు వరంబులుగా నిచ్చెనని చెప్పి వెండియు. 102

ప్రతిపదార్థం: ఎఱింగి= తెలిసికొని; కూడుకొని= గుంపులుగా అయి; గోవులకడకున్= ఆవుల దగ్గరకు; వచ్చి; వానితోన్= ఆ ఆవులతో; అగ్నిన్= అగ్నిని; దాఁచుట= కనపడకుండా ఉంచటం; అఖిల జగత్+జనంబులకున్= సమస్తమైన లోకపుజనాలకు; అహితంబు= కీడు; చేయుట+కాదె!= చేయటం కదా!; చూపక+ఉండుట= కనిపింపచేయకుండటం; తగదు= కూడదు; అని; పలుకుటయున్= పలుకగా; గోవులు= ఆవులు; పుయిలోడి= సంకోచించి; ఆ+పావకున్= ఆ అగ్నిదేవుడిని; చూపినన్= చూపగా; ఆ సుపర్వులు= ఆ దేవతలు; సంతోషించి= ఆనందించి; వానికిన్= ఆవులకు; వరంబు= వరం; ఈవలయును= ఇవ్వాలి; అని; ఆ+వాయుసఖున్= వాయువునకు చెలి అయిన అగ్నిదేవుడిని; ప్రార్థించినన్= వేడుకొనగా; అతండు= ఆ అగ్ని; తాను; ఆ+గోవులయందున్= గోవులమధ్య; డాఁగి= దాగి; ఉండన్=ఉండగా; అవి= ఆ ఆవులు; కపిల+ఛాయన్= గోరోచనపు రంగును; ప్రాపించి= పొంది; ఉనికిన్= ఉండటాన్ని; కనుంగొని= చూచి; గోవులకున్+ఎల్లను= అన్నిగోవులకంటె; కపిల= పుల్లావు; ఎక్కుడు= మిన్న; అగుటయున్= కావటాన్నీ; తదీయ+ఆరాధనంబునున్= అట్టి ఆవును పూజించటమూ; తత్+ దానంబున్= దానిని దానమివ్వటమూ; పుణ్యతమంబులు+ఐ= గొప్ప పుణ్యాలై; దురితంబులన్= పాపాలను; దమియించి=

అణగగొట్టి; ఉత్తమ లోకంబులన్= పుణ్యలోకాలను; ఇచ్చుటయున్= ఇవ్వటమూ; వరంబులుగాన్=వరాలుగా; ఇచ్చెన్= ఇచ్చాడు; అని; చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: దేవతలు తెలిసికొని గోవుల దగ్గరకు వచ్చి వాటితో 'అగ్నిని దాచటం వలన అన్ని లోకాల జనానికీ కీడు చేయటం కదా! చూపకుండటం తగదు' అని అంటే గోవులు చిన్నబుచ్చుకొని అగ్నిని చూపాయి. దేవతలు సంతోషించి ఆవులకు వరమివ్వాలని అగ్నిని ప్రార్థించగా అతడు ఆ గోవులలో దాగి ఉన్నప్పుడు అవి కపిలవర్ణం పొందటం చూచి 'గోవులన్నింటిలో కపిల మిన్న' అనీ, 'దానిని పూజించటం, దానమివ్వటం గొప్ప పుణ్యకార్యాలై పాపాలను అణగగొట్టి ఉత్తమలోకాలను పొందజేస్తా'యనీ వరాలుగా ఇచ్చాడు అని చెప్పి; ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'పుయిలోడటం' అంటే చేసిన తప్పు గురించి సిగ్గుపడటం అని ఇచ్చట అర్థం.

ఈ సందర్భంలో అగ్ని అనటానికి శిఖి పావకుడు వాయుసఖుడు అనే పదాలు వాడటం గమనించాలి. ఇవన్నీ పవిత్రార్థకాలు. కాబట్టే అగ్ని వరమివ్వగలిగాడని కవి హృదయం.

తే. కపిల యిచ్చిన వానిన కాదు నిజము । కొన్నవానిని బుణ్యాత్మకుఁడుగఁ జేయు;
నీవుఁ గపిలా సమర్చనా నిరత మాన । సుండ వగు టెంతయును మేలు సువ్రతాత్మ!' 103

ప్రతిపదార్థం: కపిల= పుల్లావు; ఇచ్చినవానిన్+అ= ఇచ్చినవాడినే; కాదు; నిజము+అ= సందియంలేని నిజం; కొన్నవానిని= దానం పుచ్చుకొన్నవాడిని కూడా; పుణ్య+ఆత్మకుఁడుగన్+చేయున్= పుణ్యంగల హృదయం కలవాడిని చేస్తుంది; సువ్రత+ఆత్మ!= మంచి నిష్ఠగల హృదయంగలవాడా!; నీవున్= నీవు కూడా; కపిలా సమర్చనా నిరత మానసుండవు= పుల్లావు పూజలోమిక్కిలి ఆసక్తిగల మనస్సు కల వాడవు; అగుట= కావటం; ఎంతయున్= ఎంతైనా; మేలు= మంచిది.

తాత్పర్యం: కపిలగోవు దానమిచ్చిన వాడినే కాదు. పుచ్చుకొన్నవాడిని కూడా పుణ్యాత్ముడిని చేస్తుంది. మంచి నియమ నిష్ఠలుగల కుమారా! నీవు కూడా కపిల గోవులను ఆసక్తితో పూజించే హృదయం కలవాడవు కావటం మేలు.'

విశేషం: కొన్ని దానాలు పుచ్చుకొన్నవాడు ఇచ్చినవారి పాపాలను కూడా గ్రహించవలసి వస్తుంది. అందుకే తిలదానం మొదలైనవి కొందరు స్వీకరింపరు. ఇక్కడ అటువంటిది లేకపోగా కపిలగోవును పుచ్చుకొన్నవాడు కూడా పుణ్యాత్ముడు కావటంవలన దాని మహిమ మరింత గొప్పదిగా నిరూపణకు వచ్చింది.

వ. అని చెప్పుటయు నప్పరమమునీశ్వరుతో నమ్ముని కుమార వరుండు 'కపిలా లక్షణం బెఱింగింపవే' యనిన నతం డతని కిట్లనియె. 104

ప్రతిపదార్థం: అని= అట్లు; చెప్పుటయున్= చెప్పగా; ఆ+పరమ ముని+ఈశ్వరుతోన్= ఆ మహర్షి శ్రేష్ఠుడితో; ఆ+ ముని కుమార వరుండు= ముని కుమారులలో మిన్న అయిన శుకుడు; కపిలా లక్షణంబు= కపిల తీరును; ఎఱింగింపవే= తెలియజేయుమా!; అనినన్= అంటే; అతండు= ఆ వ్యాసుడు; అతనికిన్= ఆ శుకునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసు డిట్లా చెప్పితే; ఆ మునిశ్రేష్ఠుడితో ఆ కుమారశ్రేష్ఠుడు 'నాయనా! కపిల లక్షణం నాకు దయతో తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పు డత డతడితో ఇట్లా అన్నాడు.

తే. కర్ణ శృంగాక్షి ఖుర నాసికా పుటములు । గపిలములు, గుత్తుకయును ముష్కములు గవిల
పట్టు లొందు నెందే నొకపట్టు కపిల । మైనఁ గపిలాత్వ గుణమున కదియ చాలు. 105

ప్రతిపదార్థం: కర్ణ= చెవులు; శృంగ= కొమ్ములు; అక్షి= కన్నులు; ఖుర= గిట్టలు; నాసికాపుటములు= ముక్కుల లోపలిభాగాలు; కపిలములు= గోరోచనం రంగు కలవి; కుత్తుకయును= మెడా; ముష్కములు= అండాలు; కవిలపట్టులు= కపిలవర్ణం స్థానాలు; ఒందును= ఒప్పుతాయి; ఎందేన్= ఎక్కడైనా; ఒకపట్టు= ఒక్కచోటు; కపిలము= గోరోచనం రంగు; ఐనన్= అయినా; కపిలాత్వ గుణమునకున్= కపిల అయ్యే స్థితికి; అది+అ= అదే; చాలున్= చాలును.

తాత్పర్యం: చెవులు, కొమ్ములు, కన్నులు, గిట్టలు, ముక్కులు, మెడ, అండాలు కపిలవర్ణంలో ఉండాలి. వీటిలో ఏ ఒక్కచోటున ఆ రంగు ఉన్నా 'కపిల' అవటానికి అదే చాలు.

విశేషం: ముష్క శబ్దం చేత ఇక్కడ కపిలవర్ణం గల ఎద్దును సంభావించటం సముచితం.

క. మేనెల్లఁ గపిల మైనను । దానిం జెప్పంగ నేల? తగదు కపిలలన్
మానితగుణ! పిదికి కుడువఁ । గా నే బలికైనఁ గాక కట్టఁ బెటికకున్. 106

ప్రతిపదార్థం: మేను= దేహం; ఎల్లన్= అంతా; కపిలము= గోరోచనం రంగు; ఐనను= అయితే; చెప్పంగన్+ఏల?=(దాని గొప్పను గూర్చి) చెప్పనేల?; మానితగుణ!= మన్నన పొందిన గుణాలు కలవాడా!; కపిలలన్= పుల్లావులను; పిదికి= పాలు పిండి; కుడువఁగాన్= త్రాగటం; తగదు= కూడదు; ఏ బలికిన్= ఏ విధమైన బలికి; ఐనన్= అయినా; తగదు= కూడదు; కాక= మరియును; పెటికకున్= బరువునకు; కట్టన్= కట్టటం; తగదు= కూడదు.

తాత్పర్యం: ఇక ఒడలంతా కపిలవర్ణమే అయితే దాని మహిమను గూర్చి చెప్పటమెందుకు? గుణవంతుడా? కపిలలను పాలుపిండి త్రావరాదు. ఏ బలికీ ఉపయోగించరాదు. బరువులు వానిమీద వేసి కట్టరాదు.

విశేషం: పెటిక అంటే ఎద్దుల నడ్డిమీద అటూ ఇటూ బరువుతో నింపిన గోనె మూట. కపిల పూజించదగినది కనుక పాలుతీయటం వంటి సాధారణ కార్యాలు చేస్తే దాని నవమానించటం అవుతుందని తాత్పర్యం.

ఆ. కాలఁ గేలఁ గోలఁ గపిల దండించిన । నరకవాసమునకు నరుగవలయుఁ,
బూరి నీరు లెస్స యారసి యగ్గోవు । సత్కరింప సుగతి సంభవించు. 107

ప్రతిపదార్థం: కాలన్= కాలితో; కేలన్= చేతితో; కోలన్= కర్రతో; కపిలన్= పుల్లావును; దండించినన్= కొడితే; నరకవాసమునకున్= నరకలోకంలో ఉండటానికి; అరుగన్+వలయున్= వెళ్ళవలసి వస్తుంది; పూరి= గడ్డి; నీరు= నీళ్ళు; లెస్స= బాగుగా; ఆరసి= చూచుకొని; ఆ+గోవున్= ఆ ఆవును; సత్కరింపన్= మన్నిస్తే; సుగతి= మంచిగతి; సంభవించున్= కలుగుతుంది.

తాత్పర్యం: కపిలగోవును కాలితో చేతితో కర్రతో కొడితే నరకానికి వెళ్ళవలసి వస్తుంది. మంచిమేతా, నీరూ తగిన సమయాలలో చూచుకొంటూ మన్ననతో కాపాడితే స్వర్గం లభిస్తుంది.

క. అనఘ! కపిలా ప్రదానం । బునకు ఫలం బిట్టి దనఁగబోలునె! కమలా
సనుఁడు మహానంద ప్రదమని వెఱచుచుఁ జెప్పె, దాని నట యే మందున్?' 108

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; కపిలా ప్రదానంబునకున్= కపిలను గొప్పగా దానమివ్వటానికి; ఫలంబు= ఫలం; ఇట్టిది= ఇంత మాత్రమైనది; అనఁగన్ పోలునె?= అనవచ్చునా?; కమల+ఆసనుఁడు= పద్మం కూర్చునే చోటుగా ఉన్న బ్రహ్మదేవుడు; దానిన్= ఆ దానాన్ని; మహా+ఆనంద ప్రదము+అని= పరమానందాన్ని ఇచ్చేదని; వెఱచుచున్= భయపడుతూ; చెప్పెన్= చెప్పాడు; అట= ఆ విషయంలో; ఏమి+అందున్?= ఇక ఏమి చెప్పగలను?

తాత్పర్యం: పుణ్యాత్ముడా! కపిలలను దానం చేయటంవలన కలిగే ఫలం ఇంతమాత్రంగా ఉంటుందని చెప్పరాదు. బ్రహ్మదేవుడు కూడా భయపడుతూ అది మహానందాన్ని కలిగించేది అని చెప్పాడు. ఇంక నే నేమి చెప్పగలను?

విశేషం: 'ప్రదానం' అత్యంతభక్తి శ్రద్ధలతో చేయవలెనని సూచన. వెఱచుచున్= సరిగా చెప్పగలుగుతున్నానా? అని భయం. అంటే నిజానికి మహానందంకంటె గొప్ప ఫలం సిద్ధిస్తుందని భావం. బ్రహ్మదేవుడు కూడా ఆ ఫలాన్ని నిష్కర్షచేసి చెప్పలేడని తాత్పర్యం.

వ. అని వెండియు. 109

తాత్పర్యం: వ్యాసు డిట్లా చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'వసుధామర గాయత్త్రీ । వసంతములు సత్య గోసువర్ణంబులు నే
కసముద్భవంబు లని తా । పస వర్యులచేత విందుఁ బావనచరితా! 110

ప్రతిపదార్థం: పావనచరితా!= పవిత్రమైన నడవడి కలవాడా!; వసుధా+అమర గాయత్రీ వసంతములు= బ్రాహ్మణులు గాయత్రి వసంతర్తువు; సత్య గో సువర్ణంబులు= సత్యం ఆవులు బంగారం; ఏక సముద్భవంబులు= ఒక్కదాని నుండే పుట్టాయి; అని; తాపసవర్యులచేతన్= గొప్ప తపస్సంపద కలవారినుండి; విందున్= వింటూ ఉంటాను.

తాత్పర్యం: మంచి నడవడి కల ఓ శుకా! బ్రాహ్మణులు, గాయత్రి, వసంత కాలం, సత్యం, గోవులు, బంగారం, అనేవి ఒకదాని నుండియే పుట్టాయని గొప్ప భావనాపటిమ గలవారు చెప్పగా వింటూ ఉంటాను.

విశేషం: బ్రాహ్మణులు మొదలైనవి ఒకచోట పుట్టటంవలన ఆ అన్నింటికీ మహిమ సమానం అని చెప్పినట్లయింది. తాపసవర్యులచేత అనటంవలన ఈ మాటను ప్రమాణంగా స్వీకరించాలి అనే అర్థం స్ఫురిస్తుంది. 'ల చేత' అనే బహువచన ప్రయోగం ఈ భావాన్ని మరింత గట్టి చేస్తుంది. 'విందును' అనే తద్ధర్మార్థక క్రియవలన ఆ మాట 'ఎప్పటిదో' అని త్రోసివేయరాదన్న సూచన తెలియవస్తుంది. పావన చరితా! అన్న సంబోధన ఇట్టి మహా విషయాలు పావన చరితులకే వినవస్తాయి అన్న అర్థాన్ని స్ఫురింపజేస్తుంది.

ఈ పద్యంలో 'వసంతములు' అనుదానికి 'వసుమతులు' అనే పాఠాంతరం ఉన్నది. వసుమతి అంటే భూమి.

క. కావున భూమియుఁ గనకము । గోవును దానార్హవస్తు కోటికి నెల్లన్
ధీవినుతా! యెక్కు డగుట । నీ విమలోదాత్త బుద్ధి నెలవు కొలుపుమీ!' 111

ప్రతిపదార్థం: ధీవినుతా!= బుద్ధిచేత కొనియాడదగినవాడా!; కావునన్= కాబట్టి; భూమియున్= భూమీ, కనకమున్= బంగారమూ; గోవును= ఆవూ; దాన+అర్హ వస్తుకోటికిన్= దానమివ్వదగిన వస్తువుల సముదాయానికి; ఎల్లన్= అన్నింటికీ; ఎక్కుడు+అగుట= గొప్పది కావటం; నీ విమల+ఉదాత్త బుద్ధిన్= నీదైన స్వచ్ఛమూ, ఉన్నతమూ అయిన బుద్ధిలో; నెలవు కొలుపుమీ= నిలిపి ఉంచుకొనుము.

తాత్పర్యం: కాబట్టి భూమీ, బంగారమూ, ఆవూ దానమివ్వదగిన వస్తువులన్నింటికంటె గొప్పవి అని నీ దొడ్డబుద్ధిలో చెదరకుండా నిలుపుకొనుము.'

విశేషం: ధీవినుతా, విమలోదాత్తబుద్ధిన్ - అన్న పదాలచేత ఈ విషయంలో మరొక భావన రావటం బుద్ధి ఔన్నత్యాన్ని చెడగొట్టుతుంది అన్న స్ఫూర్తి కలుగుతుంది.

ఇందులో భూమియు అన్న పదం ఉండటం చేత వెనుకటి పద్యంలో 'వసుమతులు' సరియైన పాఠంగా నిర్ణయించవచ్చు.

క. అని మునిపతి సెప్పినఁ ద । త్తనయుఁడు ప్రియమందె' ననుడు ధర్మసుతుం డే
వినియుండుదు సిరి గోమయ । మున నుండుట; దాని కెద్ది మూల మగునొకో? 112

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; మునిపతి= ముని శ్రేష్ఠుడు (వ్యాసుడు); చెప్పినన్= చెప్పగా; తత్ తనయుఁడు= అతడి కుమారుడు (శుకుడు); ప్రియము+అందెన్= తృప్తి చెందాడు; అనుడున్= అనగా; ధర్మసుతుండు= ధర్మరాజు; ఏన్= నేను; సిరి= లక్ష్మి; గోమయమునన్= ఆవుపేడయందు; ఉండుటన్= ఉండటాన్ని; విని ఉండుదున్= విని ఉన్నాను; దానికిన్= అట్లా ఉండటానికి; మూలము= మొదటి కారణం; ఎద్ది= ఏది; అగునొకో!= అయి ఉంటుందో కదా!

తాత్పర్యం: వ్యాసుడు ఇట్లా చెప్పగా శుకుడు తృప్తి చెందాడు - అన్నమాట విని ధర్మరాజు 'ఆవుపేడలో లక్ష్మి ఉంటుందని నేను విన్నాను. దానికి కారణం ఏమిటో?' అని అడిగాడు.

గో శ్రీ సంవాదము (సం.13-81-2)

వ. అనుటయు గాంగేయుండు 'గో శ్రీ సంవాదం బను నితిహాసంబు విను; మయ్యర్థంబు దేటపడు' నని పలికి యిట్లనియె. 113

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; గాంగేయుండు= గంగ కొడుకు భీష్ముడు; గో శ్రీ సంవాదంబు= ఆవులకు, లక్ష్మికి అయిన సంభాషణ; అను ఇతిహాసంబు= అనే పూర్వగాథను; వినుము; ఆ+అర్థంబు= నీ వడిగిన ఆ విషయం; తేటపడును= స్పష్టం అవుతుంది; అని పలికి= అని చెప్పి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అడుగగా భీష్ముడు 'గో శ్రీ సంవాదం' అనే పూర్వగాథను వినుము. నీ వడిగిన విషయం చక్కగా తెలుస్తుంది' అని ఇట్లా చెప్పాడు.

సీ. 'సిరి ధేనువులలోని కరిగిన 'నెవ్వత?' । వని యవి యడిగిన నమ్మహాత్మ
'శ్రీ నేను మీలో వసింపఁగా వచ్చితి' । ననవుడుఁ 'జంచల వైన నిన్ను
నొల్లము మాలోన నునుపఁగా ననియె న । గ్గోవులు' దాని కద్దేవి వగచి
'యేను బాసిన సర్వదానవకులముఁ గీ । డ్పడియెఁ' బొందిన సురల్ ప్రభుత నొంది;

తే. రేను వచ్చుట గోరి కాదే తపంబు । లాచరింతురు; నన్నిట్టు లభిభవించు
టుఱవె మీ?' కన్న 'నధ్రువ మొల్ల మనుట । యభిభవమె? నీకుఁ బోలిన యచటి కరుగు.' 114

ప్రతిపదార్థం: సిరి= లక్ష్మి; ధేనువులలోనికిన్= ఆవుల లోనికి; అరిగినన్= పోగా; అవి= ఆ ఆవులు; ఎవ్వతవు?= నీవు ఎవ్వరవు?; అని; అడిగినన్= అడుగగా; ఆ+మహాత్మ= దొడ్డబుద్ధిగల ఆమె; ఏను= నేను; శ్రీన్= లక్ష్మిని; మీలోన్= మీలో; వసింపఁగాన్= ఉండుటకు; వచ్చితిన్= వచ్చాను; అనవుడున్= అన్న వెంటనే; ఆ+గోవులు= ఆ ఆవులు; చంచలవు+ఐన నిన్నున్= చపలస్వభావం కల నిన్ను; మాలోనన్ ఉనుపఁగాన్= మాలో ఉంచుకొనటానికి; ఒల్లము= ఇష్టపడము; అనియెన్= అన్నాయి; దానికిన్= ఆ విషయానికి; ఆ+దేవి= ఆ లక్ష్మీ దేవి; వగచి= దుఃఖపడి; ఏను= నేను; పాసినన్= వదలిపోగా; సర్వదానవ కులమున్= రాక్షసుల కులమంతా; కీడ్పడియెన్= చెడిపోయినది; పొందిన సురల్= నన్ను పొందిన దేవతలు; ప్రభుతన్= గొప్పతనాన్ని; ఒందిరి= పొందారు; ఏను= నేను; వచ్చుట= రావటాన్ని; కోరి కాదే= కోరియే కదా; తపంబులు= తపస్సులు; ఆచరింతురు= చేస్తారు; నన్నున్= అట్టి నన్ను; ఇట్టులు= ఈ విధంగా; అభిభవించుట= అవమానం చేయటం; మీకున్= మీకు; ఉఱవె?= తగునా?; అన్నన్= అనగా; అధ్రువము= చంచలమైన దానిని; ఒల్లము= ఇష్టపడటం; అనుట= అనటం; అభిభవమె?= అవమానమవుతుందా; నీకున్= నీకు; పోలిన అచటికిన్= ఇష్టమైన చోటికి; అరుగు= వెళ్ళుము.

తాత్పర్యం: ఒకప్పుడు లక్ష్మి గోవుల మందలోనికి వెళ్ళింది. ఆవులు 'నీ వెవరవు? అని అడిగాయి. ఆమె 'నేను లక్ష్మిని; మీతో కలిసి ఉందామని వచ్చాను' అన్నది. అప్పు డవి 'నీవు చంచలస్వభావం కలదానవు కనుక మాలో ఉంచుకొనటానికి ఇష్టపడం' అని చెప్పాయి. దానికి ఆమె దుఃఖపడి 'నేను వదలిపోతే రాక్షసులంతా చెడిపోయారు. నేను చేరటంవలన దేవతలు ప్రభుత్వం పొందారు. నా రాకను కోరేకదా మనుజులంతా తపస్సులు చేస్తారు. అట్టి న న్నిట్లా అవమానించటం తగునా? అని అడిగింది. అప్పుడవి 'స్థిరత్వం లేని దానిని మేమిష్టపడం అనటం అవమానమా? నీకు తోచిన చోటికి వెళ్ళుము' అన్నాయి.

విశేషం: లక్ష్మికి చంచల, చపల అనే పేర్లు ఉన్నాయి. **"సిరి దా వచ్చిన వచ్చును. సలలితముగ నారికేళ సలిలము భంగిన్; సిరి దాఁ బోయినఁ బోవును, గరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ."** అని సూక్తి.

క. అని గోవులు పలికిన సిరి । విని 'మీచే నిట్లు పరిభవింపఁగఁబడి యేఁ
జనిన నను నెవ్వరును గై । కొనరు; శరణ మగుఁడు వేఁడికొనియెద మిమ్మున్. 115

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; గోవులు= ఆవులు; పలికినన్= పలుకగా; విని; సిరి= లక్ష్మి; మీచేన్= మీచేత; ఇట్లు= ఈ విధంగా; పరిభవింపఁగన్+పడి= అవమానం పొంది; ఏన్= నేను; చనినన్= పోతే; ననున్= నన్ను; ఎవ్వరును= ఎవరుకూడా; కైకొనరు= ఆదరించరు; మిమ్మున్= మిమ్ములను; వేఁడికొనియెదన్= ప్రార్థిస్తాను; శరణము+అగుఁడు= ఆశ్రయం ఇవ్వండి.

తాత్పర్యం: అని ఆవులంటే లక్ష్మీదేవి విని 'మీరిట్లా నన్ను అవమానిస్తే నేను ఎక్కడికి వెళ్ళినా నన్నెవరూ తీసికొనరు. మిమ్ములను వేడుకొంటున్నాను నాకు ఆశ్రయం ఇవ్వండి' అన్నది.

తే. మీ సమీపంబునం దున్కి మేలు; దాని । నిండు నా 'కని యడిగిన నెంత యేని
నాదరంబున నగ్గోవు లంతవట్టుఁ గూడి యిట్లను లక్ష్మికిఁ గురువరేణ్య! 116

ప్రతిపదార్థం: కురువరేణ్యా!= కురుశ్రేష్ఠుడా!; మీ సమీపంబునందున్= మీ దగ్గర; ఉన్కి= ఉండటం; మేలు= శుభం; దానిన్=అట్లా ఉండటాన్ని; నాకున్= నాకు; ఇండు= అనుగ్రహించండి; అని అడిగినన్= అని అడిగితే; ఎంతయేనిన్= ఎంతో; ఆదరంబునన్= ప్రీతితో; ఆ+గోవులు= ఆ ఆవులు; అంతుపట్టున్= అన్నీ; కూడి= కలిసి; లక్ష్మికిన్= లక్ష్మీదేవితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాయి.

తాత్పర్యం: మీదగ్గర ఉండటం మేలు. నాకది అనుగ్రహించండి' అని అడిగితే ఆ గోవులన్నీ ఒక్క అభిప్రాయంతో ఎంతో ఆదరంతో లక్ష్మీదేవితో ఇట్లా అన్నాయి.

క. 'మా మూత్ర పురీషంబులు । భామా! వేదంబు లెఱుఁగుఁ బావనములు నీ
వీ మేలి వస్తువులఁ బ్రియ । ధామమ వై యుండు మింపు దలకొన మాకున్. 117

ప్రతిపదార్థం: భామా!= ఓ ఇంతీ!; మా మూత్ర పురీషంబులు= మా మూత్రం, మలం అనేవి; పావనములు= పవిత్రమైనవి; వేదంబులు= వేదాలు; ఎఱుఁగున్= (ఈ సంగతిని) తెలిసికొన్నాయి; నీవు; ఈ మేలి వస్తువులన్= ఈ గొప్ప వస్తువులందు; ప్రియధామమవు+ఐ= ప్రియమైన నివాసం కలదానవై; మాకున్= మాకు; ఇంపు= ప్రీతి; తలకొనన్= కలిగే విధంగా; ఉండుము.

తాత్పర్యం: 'లక్ష్మీ! మా మల మూత్రాలు పరమ పవిత్రాలని వేదాలకు తెలుసు. నీవు ఈ గొప్ప వస్తువులలో మాకు ప్రీతి కలిగే విధంగా మంచి నివాసం కలదానవై ఉండుము.'

విశేషం: 'మా మూత్ర పురీషములు పానవములు' అనే వాక్య గర్భంలో 'వేదంబు లెఱుఁగు' అనే వాక్యాంతరం ఉండటం ఒక విశేషం. అట్లాంటి వాక్యనిర్మాణంవలన చెప్పదలచిన అంశానికి ఒక దార్ఢ్యం ఏర్పడటం వ్యవహారంలో మనం చూస్తాం.

తే. అనుటయును సిరి 'నాదు పుణ్యమునఁ జేసి । కంటిఁ బడయంగ మీ యనుగ్రహము' ననుచు
నట్లు వసియించె నిది గోమయ ప్రభావ । మూల మిట్టిది గోవు నమోఘ మహిమ. 118

ప్రతిపదార్థం: అనుటయును= అని పలుకగా; సిరి= లక్ష్మి; నాదు పుణ్యమునన్ చేసి= నా పుణ్యంవలన; మీ అనుగ్రహమున్= మీ దయను; పడయుంగన్= పొందగా; కంటిన్= కన్నాను; అనుచున్= అంటూ; అట్లు= ఆ విధంగా; వసియించెన్= ఉన్నది; ఇది; గోమయ ప్రభావ మూలము= ఆవుపేడ గొప్పతనానికి మొదటి కారణం; గోవు+అమోఘ మహిమ= ఆవుయొక్క చెడని మహిమ; ఇట్టి+అది= ఇటువంటిది.

తాత్పర్యం: ఆవులు ఆ విధంగా చెప్పగా లక్ష్మి 'నా పుణ్యంచేత మీదయ పొందగలిగాను' అంటూ వాటి మలమూత్రాదులయందు నివసించింది. ఇది ఆవుపేడ గొప్పతానికి మొదలు. ఆవుల చెడని మహిమ ఇటువంటిది.

వ. మఱియు నొక్క విశేషంబు సెప్పెద నాకర్ణింపుము. 119

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఒక్క విశేషంబు= ఒక అసాధారణ విషయాన్ని; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= శ్రద్ధతో వినుము.

తాత్పర్యం: ఇంకా ఒక గొప్ప విషయం చెప్పుతాను వినుము.

ఆ. సురభి తపము సేయ సరసిజాసనుఁడు ప్ర। త్యక్షమై 'మనోరథంబు సెప్పు
మిచ్చు కౌతుకమున వచ్చితి' ననవుడు। నిట్టు లనియె నది మహీశవర్య! 120

ప్రతిపదార్థం: మహీ+ఈశవర్య!= రాజవరేణ్యా!; సురభి= కామధేనువు; తపము+చేయన్= తపస్సు చేయగా; సరసిజ+ ఆసనుఁడు= పద్మం ఆసనంగా గల బ్రహ్మ; ప్రత్యక్షము+ఐ= కన్నుల కగపడి; మనస్+రథంబు= కోరిక; చెప్పుము= తెలియ జేయుము; ఇచ్చుకౌతుకమునన్= ఇచ్చే వేడుకతో; వచ్చితిన్= వచ్చాను; అనవుడున్= అనగా; అది= ఆ కామధేనువు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: రాజా! కామధేనువు తపస్సు చేస్తే బ్రహ్మ కానవచ్చి 'నీ కోరిక ఏమిటో చెప్పుము; ఇచ్చే వేడుకతో వచ్చాను' - అంటే అది ఇట్లా అన్నది.

విశేషం: 'ఇచ్చు కౌతుకమున' అనటం కామధేనువుకు వరమివ్వగలగటం బ్రహ్మదేవునంతటి వాడికి కూడా ప్రమోద కారణం అన్న సంగతిని సూచిస్తుంది.

క. 'మీ రిట్లు ప్రసన్నమతిన్। గారవమున వచ్చినంతకంటెను మే లేఁ
గోరంగ వలయునట్టిది। కారుణిక ప్రథమగణ్య! కలదే నాకున్?' 121

ప్రతిపదార్థం: కారుణిక ప్రథమగణ్య!= దయగల వారిలో మొదట ఎన్నదగిన మహాత్మా!; మీరు= తమరు; ఇట్లు= ఈ విధంగా; ప్రసన్నమతిన్=కలత లేని బుద్ధితో; గారవమునన్= నా మీది మన్ననతో; వచ్చిన+అంతకంటెను= వచ్చినదానికంటె; ఏన్= నేను; కోరంగన్ వలయు+అట్టి+అది= కోరదగినదైన; మేలు= శుభము; నాకున్= నాకు; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: గొప్పదయగల మహాత్మా! మీరు ఈ విధంగా స్వచ్ఛమైన బుద్ధితో మన్ననతో రావటం కంటె నేను కోరదగిన శుభం మరొకటి ఉన్నదా?

విశేషం: కారుణిక ప్రథమగణ్య! అన్న సంబోధన బ్రహ్మదేవుడి వాత్సల్యాతిశయాన్నీ, సురభి ఆనందాతిశయాన్నీ సూచిస్తుంది.

వ. అనిన నత్యంత సంతుష్ట స్వాంతుండై సురజ్యేష్ఠుండు సురభిం జూచి 'సురలోకాది దివ్య లోకంబుల కెల్లను గోలోకంబు మీఁదుగా వరం బిత్తుంగాక' యని తలంచి యవ్విశేషంబు మున్న తనవలన సిద్ధంబగుట సంస్మృతి గోచరం బగుటయు. 122

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; సురజ్యేష్ఠుండు= దేవతలకెల్ల పెద్ద అయిన బ్రహ్మ; అత్యంత సంతుష్ట స్వాంతుండు+ఐ= మిక్కిలి తృప్తి పొందిన మనస్సు కలవాడై; సురభిన్= కామధేనువును; చూచి; సురలోక+ఆది దివ్యలోకంబులకున్= దేవతలలోకం మొదలైన దివ్యలోకాలకు; ఎల్లను= అన్నింటికంటె; గోలోకంబు= గోవుల లోకం; మీఁదు= పై నుండేది; కాన్= అయ్యేటట్లుగా; వరంబున్= వరాన్ని; ఇత్తున్ కాక= ఇస్తాను; అని; తలంచి= భావనచేసి; ఆ+విశేషంబు= ఆ గొప్పతనం; మున్ను+అ= ఇంతకు ముందే; తనవలనన్= తనచేత; సిద్ధంబు+అగుట= ఏర్పడింది కావటం; సంస్మృతి గోచరంబు= స్మరణకు తోచటం; అగుటయున్= కాగా.

తాత్పర్యం: ఆ మాటకు పరమానందం పొంది బ్రహ్మ సురభిని చూచి దేవలోకం మొదలైన ఊర్ధ్వలోకాల కన్నింటికీ గోలోకంపైన ఉండేదిగా వరమిస్తాను అనుకొని, ఆ విషయం ఇంతకుముందే తనచేత ఏర్పడి ఉండటం గుర్తుకు రాగా.

విశేషం: భూలోకము, భువర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము అనేవి ఊర్ధ్వలోకాలు. 'గోలోకం' ఈ అన్నింటికంటె పైగా నిలపటం బ్రహ్మసంకల్పం. దీనివలన గోవు సర్వలోక పూజ్య అన్న మర్యాద ఏర్పడుతుంది.

తే. గోవులకు మేలు సేయంగ గోరు నాదు । చిత్తమున మద్వరంబున సిద్ధమైన
తెఱఁగ యొలసె దైవికమయి దీనిపెంప । యావహించెద నని యిచ్చె నవ్వరంబు. 123

ప్రతిపదార్థం: గోవులకున్= ఆవులకు; మేలు= శుభం; చేయంగన్= చేయటానికి; కోరు= కోరుతున్న; నాదు చిత్తమునన్= నా మనస్సులో; మత్+వరంబునన్= నా భావనయందు; సిద్ధము= ఏర్పడి ఉన్నది; ఐన తెఱఁగు+అ=అయిన విధమే; దైవికము+అయి= పరమాత్మ కూర్పుగా; ఒలసెన్= కలిగింది; దీని పెంపు+అ= దీని గొప్పతనమే; ఆవహించెదన్= కలుగజేస్తాను; అని; ఆ+వరంబున్= ఆ వరాన్ని; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: గోవులకు శుభం కూర్చాలన్న కోరిక కల నా హృదయంలో నా వరానికి ఇంతకుముందే ఏర్పడి ఉన్న తీరు అనుకూలంగా అమరి ఉన్నది. ఈ మహిమనే కలుగజేస్తాను అని ఆ వరం ఇచ్చాడు.

విశేషం: 'దైవికము' లోకాలన్నింటినీ సృష్టిచేసే మహామహిమగల బ్రహ్మకూడా దైవికం అనుకొన్నాడంటే అతడికి కూడా ఒక నియామక శక్తి ఉన్నదన్న విషయం తెలియవస్తుంది. అదే పరమాత్మ. గోవులు సర్వలోకాలకు పూజ్యులు కావటం పరమాత్మ సంకల్పంగా ఈ పద్యం తెలియజేస్తున్నది.

క. వనరుహ సంభవుఁ డత్తెఱఁ । గునఁ దనలోకంబు కంటె గోలోకము స
జ్జన వినుతచరిత! మీఁదై । యునికి వెలుఁగఁజేసె; నది మహోజ్జ్వల మయ్యెన్.' 124

ప్రతిపదార్థం: సత్+జన వినుతచరిత!= మంచివారు కొనియాడదగిన నడవడి కల ఓ ధర్మరాజా!; వనరుహ సంభవుఁడు= పద్మంలో పుట్టినవాడగు బ్రహ్మ; ఆ+తెఱఁగునన్= ఆ విధంగా; గోలోకమున్= ఆవుల లోకాన్ని; తన లోకంబు కంటెన్= తనదైన సత్యలోకం కంటె; మీఁదు+ఐ= పైదై; ఉనికి= ఉండటం; వెలుఁగన్ చేసెన్= ప్రకాశింపజేశాడు; అది= ఆ గోలోకం; మహా+ఉజ్జ్వలము= గొప్ప తేజస్సు కలది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రహ్మ ఆ విధంగా గోలోకం తన సత్యలోకంకంటె పైన ఉండి ప్రకాశించేదిగా చేశాడు. ఆ గోలోకం దీనివలన ఎంతో గొప్పతనం పొందింది.'

వ. అని చెప్పి. 125

తాత్పర్యం: అట్లా చెప్పి.

క. గోవిషయ వాక్యపఠన । శ్రావణ సంశ్రవణములు ధరావర యాయు
శ్శ్రీవిభవకీర్తి సుగతి స । మావహములు దత్పరుండ వగు మిక్కథలన్. 126

ప్రతిపదార్థం: ధరావర!= రాజా!; గో విషయ వాక్య పఠన శ్రావణసంశ్రవణములు= ఆవులకు సంబంధించిన మాటలు చదవటం; వినిపించటం, చక్కగా వినటం అనేవి; ఆయుః శ్రీ విభవ కీర్తి సుగతి సమావహములు= ఆయువునూ, సంపదనూ, ప్రభుత్వాన్నీ, కీర్తినీ, సద్గతినీ కలిగించేవి; ఈ+కథలన్= ఈ కథలయందు; తత్పరుఁడవు+అగుము= శ్రద్ధకలవాడవగుము.

తాత్పర్యం: ధర్మరాజా! గోవులకు సంబంధించిన వాక్యాలను చదవటం, వినిపించటం, వినటం అనేవి ఆయువునూ, సంపదనూ, అధికారాన్నీ, కీర్తినీ, మంచిగతినీ కలుగజేస్తాయి. కాబట్టి ఈ కథలందు శ్రద్ధను పెంపొందించుకొనుము.

విశేషం: తాను చదవాలి. తాను పొందే మహా ప్రయోజనాన్ని ఇతరులకు అందించటంకొరకు చదవలేని వారికి వినిపించాలి. (శ్రావణం) తనకంటె గొప్పవారు మరికొన్ని గొప్ప విషయాలు చెపితే ఆసక్తితో వినాలి (సంశ్రవణం) ఇది భారతీయుల "సర్వే జనాః సుఖినో భవన్తు" అన్న భావానికి సంబంధించిన సంప్రదాయం.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవుతో 'మహాత్మా! గోవుల మాహాత్మ్యంబు దేటపడం బెక్కు భంగులం జెప్పి నన్నుం గృతార్థుం జేసితి; సర్వయజ్ఞంబులందును దాతవ్యం బత్యంతంబు సువర్ణంబని విందు; వేదంబులు 'సువర్ణ దక్షిణేతి వై' యని చెప్పెడు; భూమియు గోవులుఁ గాంచనంబును నీ విషయంబులైన దానంబులు నుత్తమంబు అని వేదవ్యాసు వచనంబు కలిమి నీవ చెప్పితి; సువర్ణ విశేషంబు వినవలతుం జెప్పవే' యనుటయు నతం డతని కిట్లనియె. 127

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; మహాత్మా!= దొడ్డబుద్ధిగలవాడా!; గోవుల మాహాత్మ్యంబు= ఆవుల మహిమ; తేటపడన్= స్పష్టమయ్యే విధంగా; పెక్కు భంగులన్= పలువిధాలుగా; చెప్పి; నన్నున్= నన్ను; కృత+అర్థున్= నెరవేరిన ప్రయోజనం కలవాడినిగా; చేసితి= చేశావు; సర్వ యజ్ఞం బులందును= అన్ని యజ్ఞాలలో; దాతవ్యంబు= ఇవ్వదగినది; అత్యంతంబు= మిక్కిలి అయినది; సువర్ణంబు= బంగారం; అని; విందున్= వింటూ ఉంటాను; వేదంబులు= వేదాలు; సువర్ణ దక్షిణేతి వై = బంగారు కానుక కలదియే అని; చెప్పెడున్= చెపుతూ ఉంటాయి; భూమియున్= భూమీ; గోవులున్= ఆవులూ; కాంచనంబునున్= బంగారమూ; ఈ విషయంబులు+ఐన, దానంబులున్= వీటికి సంబంధించిన దానాలూ; ఉత్తమంబులు= మేలైనవి; అని; వేదవ్యాసు వచనంబు= వేదవ్యాసుడి పలుకు; కలిమి= ఉండటాన్ని; నీవు+అ= నీవే; చెప్పితి= చెప్పావు; సువర్ణ విశేషంబున్= బంగారం గొప్పతనాన్ని; వినవలతున్= వినగోరు తున్నాను; చెప్పవే= చెప్పుమా; అనుటయున్= అంటే; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడిట్లా చెప్పగా విని ధర్మరాజు అతడితో 'మహాత్మా! ఆవుల మహిమ చక్కగా తెలియవచ్చే విధంగా ఎన్నో తీరులతో చెప్పి నన్ను ధన్యుడిని చేశావు. యజ్ఞాలన్నింటిలో మిక్కిలి శ్రేష్ఠంగా ఇవ్వదగినది బంగారం అని వింటూ ఉంటాను. వేదాలు కూడా సువర్ణ దక్షిణను కొనియాడుతూ ఉంటాయి. భూమి, ఆవులూ, బంగారమూ, వీటికి సంబంధించిన దానాలూ మిక్కిలి మేలైనవని వేదవ్యాసుడి మాట ఉన్నట్లుగా నీవే చెప్పావు. బంగారం గొప్పతనాన్ని వినాలని ఉన్నది. నాకు దయచేసి చెప్పుము. అంటే అతడి కతడు ఇట్లా అన్నాడు.

విశేషం: కౌంతేయాగ్రజుండు - పెద్దకుమారుడికి తక్కిన వారికంటె ఎక్కువ బాధ్యత ఉంటుంది. శాస్త్రాలు మొదటి కొడుకును ధర్మసంతానం అనీ, తక్కిన వారిని కామసంతానం అనీ చెబుతున్నాయి. వేదాలూ, వేదవ్యాసుడు చెప్పినమాట పొల్లుపోవటానికి వీలులేదు. వాటిని అనాదరం చేయరాదు. కాబట్టి వినాలనే కోరిక ధర్మరాజుకు మిక్కుటంగా కలిగింది.

భీష్ముఁడు ధర్మజునకు సువర్ణ దాన మహిమాతిశయంబు సెప్పుట (సం.13-83-6)

సీ. శంతను నృపతి లోకాంతరగతుఁడైన విను తదీయశ్రాద్ధ విధి యొనర్పఁ
బూని గంగాద్వారమున కేఁగి మా తల్లి । గంగ సాహాయ్యంబు గారవమున
నాచరింపంగఁ గ్రియాకలాపం బెల్ల । నడపఁ బిండ ప్రదానంబు సమయ
మగుటయు దర్భ విన్యాస మొనర్ప నం । దంగుళీయక కంకణాంగదములఁ

ఆ. గాంతమైన యొక్క కరము పొడమి యఱ । చేయి సాఁచుటయును జిత్త మద్భు
తంబుఁ బొంద దానిఁ దప్పక చూచి య । య్యధిపు బాహు వగుట యాత్మ నెఱిఁగి. 128

ప్రతిపదార్థం: శంతను నృపతి= శంతను మహారాజు; లోక+అంతర గతుఁడు+ఐనన్= మరొక లోకం పొందినవాడు కాగా; తదీయ శ్రాద్ధవిధి= ఆయన శ్రాద్ధం పని; ఒనర్పన్= చేయటానికి; పూని= సంకల్పించి; గంగా ద్వారమునకున్= గంగ ఒడ్డుకు; ఏఁగి= వెళ్ళి; మా తల్లి= మా అమ్మ; గంగ; సాహాయ్యంబున్= సాయాన్ని; గారవమునన్= ప్రేమతో; ఆచరింపంగన్= చేయగా; క్రియాకలాపంబు= శ్రాద్ధపు పనుల సముదాయము; ఎల్లన్= అంతటినీ; నడపన్= చేయగా; పిండ ప్రదానంబు సమయము= పిండాలిచ్చే వేళ; అగుటయున్= కాగా; దర్భవిన్యాసము= దర్భలను ఉంచటం; ఒనర్పన్= చేస్తే; అందున్= ఆ ప్రదేశంలో; అంగుళీయక కంకణ+అంగదములన్= ఉంగరాలు, చేతి వలయము, బాహుపురి అనే వాటితో; కాంతము= సుందరం; ఐన ఒక్క కరము= అయిన ఒక చేయి; పొడమి= కన్పట్టి; అఱచేయి= అరచేయి; చాఁచుటయును= చాపగా; చిత్తము= హృదయం; అద్భుతంబు+పొందన్= అబ్బురమందగా; దానిన్; తప్పక= కన్నార్పకుండా; చూచి= కనుగొని; ఆ+అధిపు బాహువు+అగుటన్= ఆ రాజు చేయి కావటాన్ని; ఆత్మన్= హృదయంలో; ఎఱిఁగి= తెలిసికొని.

తాత్పర్యం: మా తండ్రి శంతను మహారాజు చనిపోయినపుడు పరలోక క్రియలు చేయటానికి గంగ ఒడ్డుకు వెళ్ళి మా అమ్మ ప్రేమతో సాయం చేస్తూ ఉంటే ఆ క్రియాకలాపమంతా చేస్తున్నప్పుడు పిండాలు పెట్టే సమయంలో ఉంగరాలూ, కంకణమూ, అంగదమూ అనే ఆభరణాలతో మనోహరమైన ఒక హస్తం కన్పట్టి అరచేయి చాచింది. అది చూచి ఆశ్చర్యపడి దానిని రెప్పలార్చకుండా చూచి అది ఆ రాజు చేయియే అని తెలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: లోకాంతరగతుడు - మరొక లోకానికి వెళ్ళినవాడు. చనిపోవుట అనే మాటలో ఇక్కడ నుండి బయలుదేరి మరొక చోటికి పోయాడనే అర్థం. భారతీయుల విశ్వాసానికి సంబంధించినది. శ్రాద్ధవిధి - శ్రద్ధతో చేసేపని శ్రాద్ధం - ఈ పదం చనిపోయినవారి ఉత్తమ గతిని కోరి చేసే ప్రక్రియ అనే అర్థంలో రూఢి పొందింది. పిండ ప్రదానంబు - శ్రాద్ధంలో ఇది ఒక అంగం. చనిపోయిన వారిని మొదలు పెట్టి మూడు తరాల వరకు ఉన్న వారికి మూడు అన్నపుముద్దలు దర్భల మీద ఒక క్రమంతో ఉంచుతారు. - అంటే చనిపోయిన వ్యక్తికీ (చనిపోయి ఉంటే) అతడి తండ్రికీ, అట్లాగే అతడి తండ్రికీ - అన్నమాట. అట్లాగే తల్లి అయితే తల్లికీ, ఆమె అత్తగారికీ, ఆమె అత్తగారికీ - వీరిలో ఎవరైనా బ్రదికి ఉంటే వారికి పిండం పెట్టరాదు. వీరికి క్రమంగా వసు రుద్ర ఆదిత్య రూపాలని వ్యవహారం.

క. జనకుఁడు వేడుకఁ జే సాఁ । చిన యంతన సంతసిల్లి చేతం బిండం
బనుమానింపక యేఁ బె । ట్టిన శాస్త్రవిధాన గతి ఘటింపమి వచ్చున్. 129

ప్రతిపదార్థం: జనకుఁడు = తండ్రి; వేడుకన్= కోరికతో; చేఁ= చేయి; చాఁచిన+అంతన= చాచినంతనే; సంతసిల్లి= మురిసి పోయి; ఏన్= నేను; చేతన్= చేతిలో; పిండంబు= పిండాన్ని; అనుమానింపక= అనుమానం పొందక; పెట్టినన్= పెట్టితే; శాస్త్రవిధాన గతి= శాస్త్రం విధించిన తీరు; ఘటింపమి= కుదరకపోవటం; వచ్చున్= వస్తుంది.

తాత్పర్యం: తండ్రి వేడుకపడి చేయి చాచాడు. నేను మురిసిపోయి అనుమానించకుండా చేతిలో పిండం పెట్టితే శాస్త్రం ఒప్పుకోని స్థితి కలుగుతుంది.

విశేషం: శ్రాద్ధం శాస్త్రాన్ననుసరించి పెట్టాలి. అనుమానాలతో శాస్త్ర ప్రమాణాన్ని పట్టించుకొనకుండా, శాస్త్ర పద్ధతికి విరుద్ధంగా చేస్తే వ్యర్థం అవుతుంది. అప్పుడది శ్రాద్ధమే కానిదవుతుంది.

తే. పితృకరంబునఁ బిండంబు పెట్టు మనదు । శాస్త్ర మంచిత మగు కుశాస్తరణమునన
పెట్టఁ జెప్పఁ; నట్లగుట 'నేఁ బెట్టఁ జేత' । నని మనంబునఁ దలఁచి వచనము సేసి. 130

ప్రతిపదార్థం: శాస్త్రము; పిండంబు= పిండాన్ని; పితృకరంబునన్= తండ్రి చేతిలో; పెట్టుము= పెట్టు; అనదు= అని చెప్పలేదు; అంచితము+అగు= చక్కనిదైన; కుశ+ఆస్తరణమునన్+అ= దర్భల పరపుపైనే; పెట్టన్= పెట్టటాన్ని; చెప్పున్= విధించింది; అట్లు+ అగుటన్= కాబట్టి; నేన్= నేను; చేతన్= చేతిలో; పెట్టన్= పెట్టను; అని; మనంబునన్= హృదయంలో; తలఁచి= భావించి; వచనము+చేసి= ఆ మాటనే పలికి.

తాత్పర్యం: శాస్త్రం పిండాన్ని తండ్రిచేతిలో పెట్టుమని చెప్పదు. చక్కని దర్భలు పరచిన చోటనే ఉంచాలని చెప్పుతున్నది. కాబట్టి చేతిలో పెట్టను అని నిశ్చయించుకొని ఆ మాటనే పలికి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఇక్కడ పితృ శబ్దానికి కేవలం తండ్రి అని అర్థం కాదు. ఎవరి నుద్దేశించి శ్రాద్ధం పెడుతున్నారో వారు అని అర్థం. వారిని పితృదేవతలు అంటారు. ఆస్తరణం పరచిన చోటు, వచనముచేసి సాధారణంగా వైదిక ప్రక్రియలో చేయబోయే పనిని మనసులో భావన చేయాలి. మాటతో చెప్పాలి. క్రియ చేయాలి. దానినే త్రికరణశుద్ధి అంటారు.

క. అమలంబగు కుశసంస్తర । ణమునం బిండంబు వెట్టినం దోఁచిన హ
స్త మదృశ్యమయ్యెఁ; మత్పితృ । సమితి ముదము మోములం దెసఁగఁ బొడ సూపెన్. 131

ప్రతిపదార్థం: అమలంబు+అగు= పరిశుద్ధమైన; కుశసంస్తరణమునన్= దర్భలు పరచినచోట; పిండంబు= పిండాన్ని; పెట్టినన్= పెట్టగా; తోఁచిన హస్తము= కన్పట్టిన చేయి; అదృశ్యము+అయ్యెన్= కనపడకుండా పోయింది; ముదము= ఎక్కువ అయిన ఆనందం; మోములన్= మొగాలలో; ఎసఁగన్= వ్యాప్తిచెందగా; మత్ పితృ సమితి= నా పితృదేవతల సముదాయం; పొడ+చూపెన్= కన్పట్టింది.

తాత్పర్యం: పరిశుద్ధమైన దర్భలు పరచినచోటనే పిండం పెట్టాను. అప్పుడు కనపడిన చేయి అదృశ్యమైపోయింది. సంతోషంతో విప్పారిన ముఖాలతో మా పితృదేవతలు నా ముందు సాక్షాత్కరించారు.

విశేషం: ధర్మాత్ములు శాస్త్రమార్గాన్ని అవలంబించటమే ఇష్టపడతారు. చేయి చాచటం ఇక్కడ పరీక్షగా మనం భావించాలి. అందులో భీష్ముడు కృతార్థుడయ్యాడు. ఆనందం తొణికిసలాడుతున్న ముఖాలతో పితృసమితి ముఖ్యంగా తండ్రి, తాత, ముత్తాత కనిపించారు. అమలంబు ఏ దోషమూ లేనిదిగా దర్భాసనాన్నీ, తక్కిన వారినీ చూచుకొనటం 'శ్రాద్ధం'లో ఒక సూక్ష్మాంశం.

క. పొడసూపి ధర్మమార్గం । బెడపక 'నీ విట్లు పిండ మిడుటకు హర్షం
బడరినఁ జనుదెంచితి మె । క్కుడు తృప్తిం బొందితిమి ప్రగుణ్యచరిత్రా!' 132

ప్రతిపదార్థం: పొడ+చూపి= కనిపించి; ప్రగుణ్య చరిత్రా!= మిక్కిలిగా మన్నించదగిన నడవడి కలవాడా!; నీవు; ధర్మమార్గంబు= ధర్మపద్ధతిని; ఎడపక= చెడగొట్టక; ఇట్లు= ఈ విధంగా; పిండము= పిండాన్ని; ఇడుటకున్= ఇవ్వటంవలన; హర్షంబు= సంతోషం; అడరినన్= మిక్కుటంగా కలుగగా; చనుదెంచితిమి= వచ్చాము; ఎక్కుడు తృప్తిన్ = చాలా ఎక్కువైన తృప్తిని; పొందితిమి= పొందాము.

తాత్పర్యం: అట్లా కనిపించి ఆ పితృదేవతలు ఇట్లా అన్నారు. 'ఎంతో మన్నింపదగిన ప్రవర్తనగల ఓ రాజా! నీవు ధర్మమార్గాన్ని చెరపకుండా పిండం పెట్టావు కనుక మాకు పరమానందం కలిగింది. వచ్చాము ఎక్కువ తృప్తిని పొందాము.'

విశేషం: 'ప్రగుణ్య చరిత్రా!' గుణింపదగినది గుణ్యము - గుణించటమంటే అధికం చేయటం. 'ఎక్కువగా మన్నించదగిన' అని తాత్పర్యం.

వ. అని పలికి వెండియు. 133

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= మాటాడి; వెండియున్= మరలా.

తాత్పర్యం: వా రిట్లా పలికి ఇంకా (ఇట్లా అన్నారు.)

క. 'భూమికి గోవులకునునై । హేమమిడుట యస్మదీయ హితమును దేవ
స్తోమ ప్రియముం బావన । తా మహనీయంబుఁ జుమ్ము ధర్మవిధిజ్ఞా! 134

ప్రతిపదార్థం: ధర్మవిధిజ్ఞా!= ధర్మవిధులను చక్కగా తెలిసినవాడా!; భూమికిన్= భూమికొరకు; గోవులకునున్+ఐ= ఆవులకొరకూ; హేమము= బంగారాన్ని; ఇడుట= ఇవ్వటం; అస్మదీయ హితమును= మాకు మేలొనరించేదీ; దేవ స్తోమ ప్రియమున్= దేవతల సముదాయానికి ప్రియమైనదీ; పావనతా మహనీయంబున్= పవిత్రతతో గొప్పదైనదీ; చుమ్ము= సుమా!

తాత్పర్యం: 'ధర్మక్రియలు చక్కగా తెలిసిన ఓ భీష్మా! భూమికి గోవులకు బదులుగా నీవు సువర్ణమును ఇవ్వడం మాకెంతో మేలు కూర్చేదీ, దేవతలకు ప్రీతిని కూర్చేదీ, పవిత్రతతో గొప్పదైనదీ అయిన పని సుమా!

విశేషం: దానాలలో భూదానమూ, గోదానమూ మొదలైనవి ఎన్నో ఉన్నాయి. సాధారణంగా ఆయా సందర్భాలలో వాటినే దానం చేయాలి. గతి లేకపోతే ప్రత్యామ్నాయాలు - బదులుగా చేసేవి ఉంటాయి. కానీ సువర్ణదానం గతిలేనప్పుడు చేసేది కాదు. దాన మహిమను ఇనుమడింప జేసేది అని ఈ పద్యభావం. పితృదేవతలు, స్వర్గలోక వాసులైన దేవతలకంటె కొంచెం తక్కువ స్థాయివారు. వీరి నుద్దేశించి ఇచ్చే సువర్ణదానం పై స్థాయివారికి కూడా ప్రీతి కలిగించిందంటే దాని మహిమ ఎంతటిదో ఊహించాలి. భూమికిన్, గోవులకును ఇక్కడ షష్ఠి' దానికి బదులు అనే అర్థాన్నిస్తుంది.

క. పావనము సువర్ణము వం । శావలికిం దనకు నిర్మలాత్మత నిచ్చున్;
నీ వది యెఱిఁగి సకలయ । జ్ఞావసరములను సువర్ణ యాజివ యగుమీ! 135

ప్రతిపదార్థం: పావనము= పవిత్రమైన; సువర్ణము= బంగారం; వంశ+ఆవలికిన్= వంశాల వరుసకూ; తనకున్= తనకూ; నిర్మల+ఆత్మతన్= దోషం లేని బుద్ధిని; ఇచ్చున్= ఇస్తుంది; నీవు; అది= ఆ విషయాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; సకల యజ్ఞ+అవసరములన్= అన్ని యజ్ఞాల సమయాలలో; సువర్ణ యాజివి+అ= బంగారు దక్షిణలతో యజ్ఞం చేసేవాడవు; అగుమీ= కమ్ము.

తాత్పర్యం: సువర్ణం పరమ పవిత్రమైనది. అది ఇచ్చిన వాడినే కాదు తరతరాలుగా ఉన్న వంశంవారందరికీ కల్మషంలేని బుద్ధినిస్తుంది. నీ వది తెలిసికొని అన్ని యజ్ఞాలలో సువర్ణదానం చేస్తూ ఉండుము.

విశేషం: సువర్ణం సృష్టిలో అందరికీ అపేక్షించదగిన వస్తువు. అట్టిదానిని దానం చేయటమంటే మమకారదోషాన్ని చంపుకొనటమన్నమాట. అన్ని అనర్థాలకూ మూలకారణమైన మమకారాన్ని చంపుకొనటానికి అవకాశం ఇస్తున్నది. కాబట్టి దానివలన నిర్మలాత్మత సిద్ధిస్తుంది.

క. అని చెప్పి చనిన నాదగు । మనము సువర్ణ ప్రదాన మహిమ కెలయఁ ద
ద్వినుతా నుష్ఠానపర । త్వ నిరూఢుఁడ నైతి నేను ధర్మతనూజా!' 136

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ధర్మనందనా!; అని చెప్పి= ఇట్లా చెప్పి (పితృదేవతలు) చనినన్= వెళ్ళగా; నాది+అగు మనము= నా హృదయం; సువర్ణ ప్రదాన మహిమకున్= బంగారం గొప్పగా దానం చేయటంలోని గొప్పతనానికి; ఎలయన్= ఆసక్తిపడగా; ఏను= నేను; తద్+వినుత+అనుష్ఠాన పరత్వ నిరూఢుఁడను= మేలైన ఆచరణలో శ్రద్ధ కలవానితనమునందు గట్టిగా నిలుకడ కలవాడిని; ఐతిన్= అయ్యాను.

తాత్పర్యం: ధర్మనందనా! నా పితృదేవతలు ఇట్లా బోధించి వెళ్ళిన తరువాత నా హృదయం సువర్ణదానం విషయంలో ఆరాటపడసాగింది. దానిని నిశ్చలబుద్ధితో చేసే దీక్ష కలవాడ నయ్యాను.'

విశేషం: పెద్దలు చెప్పిన గొప్ప విషయాన్ని ధర్మబుద్ధి కలవాడు శ్రద్ధాసక్తులతో ఆచరించాలి అనేది ఇందులో ధ్వని.

వ. అని పలికి యా భూవల్లభునితో భీష్ముండు వెండియు నిట్లను 'నిది యేను గనినది సువర్ణదాన మహిమ; మఱియును వినినదియుం గల దాకర్ణింపుము. 137

ప్రతిపదార్థం: అని; పలికి= మాటాడి; భీష్ముండు= భీష్ముడు; ఆ+భూవల్లభునితోన్= ఆ రాజుతో; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; ఇది= ఈ సంగతి; నేను= నేను; కనినది= చూచింది; సువర్ణ దానమహిమ= బంగారాన్ని దానం చేయటంలోని గొప్పతనం; మఱియును= ఇంకా; వినినదియున్= విన్నది కూడా; కలదు= ఉన్నది, ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇట్లా చెప్పి భీష్ము డా రాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. 'ఇది నేను చూచిన విషయం. సువర్ణ దాన మహిమ ఇంకా విన్నది ఉన్నది. వినుము.

సీ. పరశురాముఁడు గిన్క నిరువది యొక్క మా । అదయుఁడై రాజుల వెదకి వెదకి
వధియించి, కృపపుట్టి వాజిమేధంబు ప్రా । యశ్చిత్తముగఁ జేసి, యంతఁ దనివి

సనక వసిష్ఠాది మునివరేణ్యులఁ గూర్చి । 'కల్మష పంకంబు గడిగి పురుషు
నత్యంత విమలుఁ జేయంగ నెయ్యది యొపు?' ననిన వసిష్ఠుఁ డిట్లనియె నతని

ఆ. 'కనఘ! విను సువర్ణ మగ్నిమయంబు దే । వతలు నగ్నిమయత నతిశయిల్లు
వారు గావునను సువర్ణదానంబు దే । వతల నీగి యట్ల శ్రుతులు సెప్పు. 138

ప్రతిపదార్థం: పరశురాముఁడు; కిన్కన్= కోపంతో; అదయుఁడు+ఐ= దయమాలినవాడై; రాజులన్= రాజులను; ఇరువది+ఒక్క మాఱు= ఇరవై ఒక్కమార్లు; వెదకి వెదకి= బాగా వెదకి; వధియించి= చంపి; కృప+పుట్టి= దయకలిగి; వాజిమేధంబు= అశ్వమేధ యాగాన్ని; ప్రాయశ్చిత్తముగన్= పాపం పోవటానికి చేసే కర్మ విశేషంగా; చేసి= ఆచరించి; అంతన్= ఆ మాత్రంతో; తనివి+ చనక= తృప్తి పొందక; వసిష్ఠ+అది మునివరేణ్యులన్= వసిష్ఠుడు మొదలైన మహర్షి శ్రేష్ఠులను; కూర్చి= సమావేశపరచి; కల్మష పంకంబున్= పాపమనే బురదను; కడిగి; పురుషున్= మానవుడిని; అత్యంత విమలున్= మిక్కిలి పరిశుద్ధుడినిగా, చేయంగన్= చేయటానికి; ఏ+అది= ఏది; ఓపున్= చాలును; అనినన్= అంటే; వసిష్ఠుఁడు= వసిష్ఠ మహర్షి; అతనికిన్= ఆ పరశురాముడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అనఘ!= పుణ్యాత్ముడా!; విను= వినుము; సువర్ణము= బంగారము; అగ్నిమయంబు= అగ్నితో నిండింది; దేవతలును= దేవతలు కూడా; అగ్నిమయతన్= అగ్నియే స్వరూపంగా ఉండటంతో; అతిశయిల్లువారు= గొప్పతనం పొంది ఉండేవారు; కావునన్= కనుక; సువర్ణదానంబు= బంగారం దానం చేయటం; దేవతలన్= దేవతలను; ఈగి= ఇవ్వటం; అట్లు+అ= ఆ విధంగానే; శ్రుతులు= వేదాలు; చెప్పున్= చెప్పుతాయి.

తాత్పర్యం: పరశురాముడు కోపంతో రాజులను ఇరువది ఒక్కసార్లు వెదకి వెదకి చంపాడు. చివరకు జాలి పుట్టింది. ప్రాయశ్చిత్తంగా అశ్వమేధయాగం చేశాడు. అయినా తృప్తి కలగలేదు. వసిష్ఠుడు మొదలైన మహర్షుల నందరినీ సమావేశపరచి 'అయ్యలారా! పాపపు బురదను కడిగివేసి పురుషుడిని మిక్కిలి పరిశుద్ధుడినిగా చేయగలది ఏది?' అని అడిగాడు. వసిష్ఠుడు - 'ఓ పుణ్యాత్ముడా! బంగారం అగ్నిమయం. దేవతలూ అగ్ని స్వరూపులే కనుక బంగారాన్ని దానమిస్తే దేవతల నిచ్చినట్లే. వేదాలు కూడా ఇట్లాగే చెప్పుతున్నాయి.

విశేషం: 'వెదకి వెదకి' ఎవ్వరినీ వదలరాదన్న కసితో కూడిన పట్టుదలను ఈ పదం వ్యక్తం చేస్తుంది. 'మునివరేణ్యులన్' తపశ్శక్తి చేత మహా విషయాలను దర్శించిన వారిని. అట్టివారే ఇటువంటి నిర్ణయాలు చేయగలరు. అగ్నిమయత నతిశయిల్లు - అగ్ని సర్వాన్ని కాల్చివేస్తుంది. కనుక పాపాలను కూడా నామరూపాలు లేకుండా చేస్తుందని భావం. 'దేవతలు' పుణ్యపాపాల అంటు సొంటులు లేనివారు. కేవలం పుణ్యఫలం అనుభవించేవారు; శ్రుతులు సెప్పు - శబ్ద ప్రమాణం కనుక సందేహించరానిదని వ్యంగ్యం.

తే. కావున సువర్ణ మసదృశ । పావనతాస్పదము; దాని భక్తిమెయిన్ వి
ప్రావలి కిచ్చిన యతనికిఁ బావనతం గొఱఁత గలదె పావనమూర్తీ! 139

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; పావనమూర్తీ!= పవిత్ర స్వరూపం కలవాడా!; సువర్ణము= బంగారం; అసదృశ పావనతా+ ఆస్పదము= సాటిలేని పవిత్రతకు చోటు; దానిన్= ఆ సువర్ణాన్ని; భక్తిమెయిన్= భక్తితో; విప్ర+ఆవలికిన్= విప్రుల సముదాయానికి; ఇచ్చిన+అతనికిన్= ఇచ్చినవాడికి; పావనతన్= పవిత్రత విషయంలో; కొఱఁత= లోటు; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: ఓ పవిత్రమూర్తీ! బంగారం ఆ విధంగా పవిత్రతకు నిలయమైనది. దానిని భక్తితో వేదవిద్యలో ఆరితేరిన వారికి ఇచ్చేవాడికి పవిత్రత విషయంలో లోపం ఉంటుందా?

విశేషం: పద్యంలో పావనశబ్దం మూడు పర్యాయాలు ఆవృత్తమై కలిగే పవిత్రతయొక్క మహిమను నొక్కి చెప్తున్నది. ఇందులో విప్రశబ్దాన్ని వాడటం ప్రత్యేకంగా గుర్తించదగింది. "విద్యయా యాతి విప్రత్వమ్" విద్యచేత విప్రత్వాన్ని పొందుతాడని పెద్దలమాట. విద్య అంటే ముక్తి నిచ్చే జ్ఞాన విద్యయే.

క్రిందటి పద్యంలో అనఘ! అనే సంబోధనా, ఆ పద్యంలోని పావనమూర్తీ! అనే సంబోధనా గుర్తించదగినవి. నిజానికి నీ పాపం అశ్వమేధయాగంతోనే నశించింది. నీవు పుణ్యాత్ముడవే. పవిత్రుడవే. అయినా నీ బెంగ పోవటానికి ఉపాయం చెప్తున్నాం అనే తాత్పర్యాన్ని ఈ సంబోధనలు వ్యంజింపచేస్తాయి.

భక్తి మెయిన్ - అనేది శ్రద్ధా విషయకంగా తీసికొనదగిన జాగ్రత్తను గూర్చి హెచ్చరిస్తుంది.

వసిష్ఠుఁడు పరశురామునకుఁ జెప్పిన సువర్ణ మహిమము (సం.13-83-40)

వ. ఏను బ్రహ్మముఖంబున వినినది సువర్ణ విషయంబైన విశేషం బొక్కటి యెఱింగించెద; నవహితుండవై విను' మని పలికి యమ్మునిపతి యమ్మహాత్మున కిట్లనియె. 140

ప్రతిపదార్థం: ఏను= నేను; బ్రహ్మముఖంబునన్= బ్రహ్మదేవుడి ముఖం నుండి; వినినది= విన్నది; సువర్ణ విషయంబు+ఐన= సువర్ణ సంబంధమైన; విశేషంబు= విశేషం; ఒక్కటి; ఎఱింగించెదన్= తెలుపుతాను; అవహితుండవు+ఐ= పరాకుతనం లేనివాడవై; వినుము; అని పలికి; ఆ+మునిపతి= మునులలో శ్రేష్ఠుడైన ఆ వసిష్ఠుడు; ఆ+మహాత్మునకున్= దొడ్డబుద్ధిగల ఆ పరశురాముడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నేను బ్రహ్మనోటినుండి విన్న విషయం సువర్ణానికి సంబంధించినది ఒకటి నీకు తెలుపుతాను చెదరని మదితో వినుము. అని ఆ మునిశ్రేష్ఠుడు ఆ మహాత్ముడితో ఇట్లా చెప్పాడు.

విశేషం: 'బ్రహ్మముఖంబునన్' ఇది వేదవాక్యంవలె ఏ కొంచెమూ సందేహం లేకుండా నమ్మదగినదని భావం.

క. గిరిజయు గిరీశుఁడును నొం । డొరువులకై తప మొనర్చి యొకళు లొకళ్లన్
బెరయం బడసి పరమసుఖ । భరితాత్మకు లైరి జగము ప్రమదం బందన్. 141

ప్రతిపదార్థం: గిరిజయున్= పార్వతీదేవీ; గిరి+ఈశుఁడును= పరమేశ్వరుడున్నూ; ఒండొరువులకై= ఒకరికొకరకై; తపము+ఒనర్చి= తపస్సు చేసి; ఒకళులు= ఒకరు; ఒకళ్ళన్= ఒకరిని; బెరయన్+పడసి= పొంది; జగము= లోకము; ప్రమదంబు+అందన్= పరమ సంతోషం పొందునట్లుగా; పరమ సుఖ భరిత+ఆత్మకులు= మహాసుఖంతో నిండిన హృదయాలు కలవారు; ఐరి= అయ్యారు.

తాత్పర్యం: పార్వతీపరమేశ్వరులు ఒకరికొరకు ఒకరు తపస్సు చేసి ఒకరినొకరుగా పొందారు. లోకమంతా మహానందం పొందగా వారు పరమసుఖంతో నిండిన హృదయాలు కలవారయ్యారు.

విశేషం: పార్వతి తపం పంట పరమేశ్వరుడు. పరమేశ్వరుడి తపస్సు పంట పార్వతి. సృష్టిలో మరెక్కడా ఇట్టి స్థితి కానరాదు. ఇక్కడ పరమసుఖం అంటే దాంపత్యసుఖం. ఆ ఆదిమ దంపతుల కామసుఖం జగత్తు కంతటికీ ఆనందదాయకం కావటం కూడా గమనించదగింది. అంటే ఆ దంపతులు జగదానందానికే సమాగమం పొందుతారు తప్ప స్వసుఖాపేక్షతో కాదని భావం.

వ. కొండొకకాలంబునకు నయ్యాదిమ గృహస్థుని తేజం బాపరమగృహిణి నిమిత్తంబుగా రేతో ధాతు రూపంబునం బ్రసన్నంబై యమ్మహేశ్వరు మానస వృత్తిం జేసి యగ్నియందు నిలిచియుండ, నత్తఱిం దారకుం డను నొక్క రక్కసుచేతం బెక్కు విధంబులం బాధలంబడి యనిమిషులును మునులును గమలయోనిం గానంజని యద్దానవుండు తముం బఱచిన పాట్లెల్ల నెఱింగించిన, నద్దేవుండు వారితో 'దీని నెఱింగి యేను మున్న మీకు శోభనం బయ్యెడు తెఱంగు సమకట్టినవాఁడ; మీ రగ్ని నాశ్రయించి మాకు శుభంబు సేయవలయునని సంప్రార్థనంబు సేయునది; యతండు కర్తవ్యం బెఱుంగు; నరుగుం' డని నియోగించిన సంతోషించి' యట్లు చేసెద' మని యవ్విధాత వీడ్కొని వార లగ్నికడకుం బోవ నుత్సహించి. 142

ప్రతిపదార్థం: కొండొక కాలంబునకున్= కొంత కాలానికి; ఆ+అదిమ గృహస్థుని తేజంబు= మొట్టమొదటి సంసారి అయిన ఆ ఈశ్వరుడి వీర్యం; ఆ పరమ గృహిణి నిమిత్తంబుగాన్= ఆ గొప్ప ఇల్లాలు కారణంగా; రేతస్ ధాతు రూపంబునన్= రేతస్సు అనే మూల పదార్థ రూపంతో; ప్రసన్నంబు+ఐ= జారినదై; ఆ+మహా+ఈశ్వరు మానస వృత్తిన్+చేసి= ఆ పరమేశ్వరుడి భావనచేత; అగ్నియందున్= అగ్నిదేవుడి యందు; నిలిచి+ఉండన్= నిలిచి ఉండగా; ఆ+తఱిన్= ఆ సమయంలో; తారకుండు+ అను ఒక్కరక్కసు చేతన్= తారకుడనే ఒక రాక్షసుడిచేత; పెక్కు విధంబులన్= చాలా విధాలుగా; బాధలన్= బాధలను; పడి= పొంది; అనిమిషులును= దేవతలూ; మునులును= మునులున్నూ; కమలయోనిన్= కమలం జన్మస్థానంగా గల బ్రహ్మను; కానన్= చూడటానికి; చని=వెళ్ళి; ఆ+దానవుండు= ఆ రాక్షసుడు; తమున్= తమ్ము; పఱచిన+పాట్లుఎల్లన్= పెట్టిన కష్టాలన్నింటినీ; ఎఱింగించినన్= తెలుపుకొనగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మదేవుడు; వారితోన్= వారితో; దీనిన్= ఈ సంగతిని; ఎఱింగి= తెలిసి కొని; ఏను= నేను; మున్ను+అ= పూర్వమే; మీకున్= మీకు; శోభనంబు= మేలు; అయ్యెడు తెఱంగు= అయ్యే పద్ధతిని; సమకట్టిన వాఁడన్= ఏర్పాటు చేశాను; మీరు; అగ్నిన్= అగ్నిదేవుడిని; ఆశ్రయించి= చేరుకొని; మాకు; శుభంబు= మంచి; చేయవలయును= చేయాలి; అని; సంప్రార్థనంబు+ చేయునది= చక్కగా వేడుకొనండి; అతండు= ఆ అగ్నిదేవుడు; కర్తవ్యంబు= చేయదగినదానిని; ఎఱుంగున్= ఎరుగును; అరుగుండు= వెళ్ళండి; అని; నియోగించినన్= ఆజ్ఞాపించగా; సంతోషించి= ఆనందం పొంది; అట్లు+అ= ఆ విధంగానే; చేసెదము= చేస్తాము; అని; ఆ+విధాతన్= ఆ బ్రహ్మ దగ్గర; వీడ్కొని= సెలవు తీసికొని; అగ్నికడకున్= అగ్ని దగ్గరకు; పోవన్= వెళ్ళటానికి; ఉత్సహించి= వేడుకపడి.

తాత్పర్యం: కొంతకాలానికి ఆ మొదటి సంసారికి ఆ దొడ్డ ఇల్లాలు కారణంగా వీర్యం వెలువడింది. అతడు దానిని భావన శక్తిచేత అగ్నియందు నిలిపి ఉంచాడు. ఆ సమయంలో తారకాసురు డనే ఒక రాక్షసుడి వలన ఎన్నో బాధలు పడిన దేవతలు మునులు బ్రహ్మదగ్గరకు పోయి తాము పడిన బాధలన్నీ చెప్పుకొన్నారు. ఆ దేవుడు దీని సంగతి తెలిసికొని 'మీకు శుభమయ్యే పద్ధతి ముందే చేసి ఉంచాను. మీరు అగ్ని దగ్గరకు వెళ్ళి వేడుకొనండి. అతడికి ఏమి చేయాలో తెలుసు. వెళ్ళండి.' అని చెప్పగా వారెంతో సంతోషపడి అట్లాగే చేస్తాం అని బ్రహ్మదగ్గర సెలవు తీసికొని అగ్ని దగ్గరకు పోవటానికి ఉత్సాహపడ్డారు.

విశేషం: 'ఆదిమగృహస్థుడు' - పరమేశ్వరుడు జగత్తుకంతటికీ తండ్రి కనుక తొలి గృహస్థు. 'పరమగృహిణి' తన తపశ్శక్తిచేత పరమేశ్వరుడి దేహంలో సగభాగం పొందగలిగిన ఇల్లాలు. రేతస్సు శుక్లం, ధాతువు, మూలపదార్థం - ఇవి శరీర సంబంధంగా ఏడు. చర్మము, మాంసము, మజ్జ, అస్థి, వస, మేదస్సు, శుక్లము. బ్రహ్మదేవుడు భూతం, వర్తమానం, భవిష్యత్తు అనే మూడు కాలాలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ముందే చేసి ఉంచుతాడు. ప్రసన్నంబై - ప్రస్ఖలితంబై. పాఠాంతరము.

సీ. ఆతని యున్నెడ యారసికొని చను । నప్పు డాతండు నిద్రాతిశయము
నూని ప్రచ్ఛన్నుఁడై యుండుట వారలు । గానక యున్నంతఁ, గప్ప యొకటి
యగ్ని పాతాళంబునం దున్కి యెఱిఁగింప । నప్పావకుఁడు డాఁగి పిప్పలమున
కేఁగెడు నెడ శాపమిచ్చె జిహ్వాస్ఫూర్తి । లేక రసాలి వివేక మెడలి

తే. యుండెడుమ కప్ప లని బొక్కలెండ నెండి । చచ్చియును నీరు వచ్చినఁ జావు బొంకు
సేసి యెలుఁగులు సెలఁగఁగఁ జెలఁగ వరము । వారు కప్పల కిచ్చి రవార్యతేజ! 143

ప్రతిపదార్థం: ఆతని ఉన్న+ఎడ= ఆ అగ్ని ఉన్నతావు; ఆరసికొని=వెదకికొని; చను+అప్పుడు= వెళ్ళే సమయంలో; ఆతండు= ఆ అగ్నిదేవుడు; నిద్రా+అతిశయమున్= నిద్దురముంపును; ఊని= పొంది; ప్రచ్ఛన్నుఁడు+ఐ= తెలియరానివాడై; ఉండుటన్= ఉన్నందు వలన; వారలు= ఆ దేవతలు, మునులు; కానక ఉన్నంతన్= గుర్తింపకున్నంతలో; కప్ప ఒకటి= ఒక కప్ప; అగ్ని= వహ్నిదేవుడు; పాతాళంబునందున్= పాతాళలోకంలో; ఉన్కి= ఉండటం; ఎఱిఁగింపన్= తెలుపగా; ఆ+పావకుఁడు= ఆ అగ్ని; డాఁగి= దాగుకొని; పిప్పలమునకున్= రావిచెట్టుకు; ఏగెడు+ఎడన్= వెళ్ళే సమయంలో; జిహ్వా స్ఫూర్తి= నాలుక కదలిక; లేక= లేకుండా; రస+ఆలి వివేకము= రుచుల సముదాయము ఏర్పాటు; ఎడలి= నశించి; కప్పలు= మండూకములు; ఉండెడుమ= ఉండుగాక; అని; శాపము+ఇచ్చెన్= శాపమిచ్చాడు; అవార్యతేజ= అడ్డుకొనరాని వర్చస్సు కలవాడా!; వారు = ఆ దేవతలు; మునులు; బొక్కలు= నేలలోని బొరియలు; ఎండన్= ఎండచేత; ఎండి= వేడెక్కి; (కప్పలు); చచ్చియును= చచ్చికూడా; నీరు= నీళ్ళు; వచ్చినన్= వస్తే; చావు=చావును; బొంకుచేసి= కల్లచేసి; ఎలుఁగులు= చప్పుళ్ళు; చెలఁగఁగన్= పిక్కటిల్లేటట్లుగా; చెలఁగన్= విజృంభించునట్లు; వరము= వరాన్ని; కప్పలకున్= కప్పలకు; ఇచ్చిరి= ఇచ్చారు.

తాత్పర్యం: అగ్నిదేవుడు ఉన్నచోటికి వారు వెదుక్కొంటూ వచ్చారు. అప్పు డతడు నిద్రముంచుకొనిరాగా ఎవ్వరికి కనపడకుండా ఉండటంవలన వారికి కనపడలేదు. ఒక కప్ప అగ్ని దేవుడు పాతాళంలో ఉన్న సంగతిని వారికి తెలియజేసింది. ఆ అగ్నిదేవుడు గుట్టుగా రావిచెట్టు దగ్గరకు పోతూ, 'కప్పలకు నాలుక కదలిక ఉండదు. రుచులు తెలియరావు' అని శాపమిచ్చాడు. దేవతలు, మునులు 'కప్పలు బొరియలలో ఎండలకు ఎండి చచ్చినా నీరు రాగానే చావును అబద్ధం చేసి బెకబెక చప్పుళ్ళతో విజృంభిస్తాయి' అని వరమిచ్చాడు.

విశేషం: జిహ్వాస్ఫూర్తి అంటే రుచి గ్రహించే శక్తి అని గ్రహించాలి.

వ. ఇవ్విధంబున విబుధులు మునులు నమ్మండూకంబు మఱుకువ యుడిపి మఱియును. 144

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; విబుధులు=దేవతలు; మునులు= మునులున్నూ; ఆ+మండూకంబు మఱుకువ= ఆ కప్ప దుఃఖాన్ని; ఉడిపి= తొలగించి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా ఆ దేవతలు, మునులు ఆ కప్ప దుఃఖాన్ని పోగొట్టి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అనలుని నన్వేషింపఁగ । వనగజ మొక్కండు రావివలను చతురతం
గనుగీటి చూపవార । వ్వనస్పతిం జేరఁజనఁగ వారని యలుకన్. 145

ప్రతిపదార్థం: అనలునిన్= అగ్నిని; అన్వేషింపఁగన్= వెదకగా; వనగజము= అడవి ఏనుగు; ఒక్కండు= ఒకటి; రావివలను= రావిచెట్టు వైపు; చతురతన్= నేర్పుతో; కనుగీటి= కన్ను కదలజేసి; చూపన్= చూపగా; వారు= ఆ దేవతలూ, మునులూ; ఆ వనస్పతిన్= ఆ చెట్టును; చేరన్+చనఁగన్= సమీపించగా; వారని అలుకన్= తగ్గని కోపంతో.

తాత్పర్యం: అగ్నిని వెదుకుతూ ఉంటే ఒక అడవి ఏనుగు ఒడుపుగా కనుసైగతో రావిచెట్టువైపు చూపింది. వారు ఆ చెట్టును సమీపించారు. (అగ్ని) పట్టరాని కోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: పువ్వులు లేకుండా కాయలు కాచే చెట్టును వనస్పతి అంటారు.

వ. అయ్యగ్నిదేవుండు గజంబులకు జిహ్వ దిరుగం బడ శపించుచు శమీగర్భ నివాసి యయ్యె; నది మొదలుగా నగ్నికి శమీగర్భంబునం దుత్పత్తి కలిగె; నద్దివిజులును దాపసులును గజంబులు ప్రతీపజిహ్వంబు లయ్యును సర్వరసజ్ఞానంబు గలిగి మాననీయంబులగు వరంబులంజేసి రాజితంబు లగునట్లుగా ననుగ్రహించి యగ్గజంబు విషాదంబు మాన్పి; రంత నొక్క శుకం బెఱింగింప శమీగర్భంబున నగ్ని యునికి యెఱింగి యందఱుం గ్రందుకొనం గడువేగంబునం బొదివికొనిన, నిదుర సెడుటకుం గోపించి. 146

విశేషం: ఆ+ఆగ్నిదేవుండు= ఆ అగ్నిదేవుడు; గజంబులకున్= ఏనుగులకు; జిహ్వ= నాలుక; తిరుగన్+పడన్= తిరుగబడే విధంగా; శపించుచున్= శాపమిస్తూ; శమీ గర్భ నివాసి= జమ్మికడుపులో ఉండేవాడు; అయ్యెన్= అయ్యాడు; అది మొదలుగాన్= అది మొదలుకొని; అగ్నికిన్=వహ్నికి; శమీగర్భంబునందున్= జమ్మికడుపులో; ఉత్పత్తి= పుట్టుక; కలిగెన్= ఏర్పడింది; ఆ దివిజులును= ఆ దేవతలున్నూ; తాపసులును= మునులూ; గజంబులు= ఏనుగులు; ప్రతీప జిహ్వంబులు= తిరుగబడిన నాలుక కలవి; అయ్యును= అయికూడా; సర్వ రసజ్ఞానంబు= అన్ని రుచుల తెలివి; కలిగి= ఉండి; మాననీయంబులు+అగు వరంబులన్+చేసి= మన్నింపదగిన వరముల వలన; రాజితంబులు= ఒప్పారేవి; అగు+అట్లుగాన్= అయ్యే విధంగా; అనుగ్రహించి= దయచూపి; ఆ+గజంబు విషాదంబున్= ఆ ఏనుగు దుఃఖాన్ని; మాన్పిరి= పోగొట్టారు; అంతన్= తరువాత; ఒక్క శుకంబు= ఒక చిలుక; ఎఱింగింపన్= తెలుపగా; శమీగర్భంబునన్= జమ్మి గర్భంలో; అగ్ని+ఉనికి= అగ్ని ఉండటం; ఎఱింగి= తెలిసికొని; అందఱున్= అందరూ; క్రందుకొనన్= సందడిహెచ్చుగా; కడు వేగంబునన్= గొప్ప వేగంతో; పొదివికొనినన్= క్రమ్ముకొనగా; నిదుర= నిద్ర; చెడుటకున్= పాడైనదానికి; కోపించి= కోపం పొంది.

తాత్పర్యం: ఆ అగ్ని ఏనుగులకు నాలుక తిరగబడిపోయే విధంగా శపించాడు. జమ్మిగర్భంలో ప్రవేశించి నివసించాడు. దేవతలూ మునులూ ఏనుగులు తిరుగబడిన నాలుకలు కలవి అయినా అన్ని రుచులనూ చక్కగా గ్రహించగలిగి మంచి వరాలతో ఒప్పారే విధంగా వరమిచ్చి ఆ ఏనుగు చింత పోగొట్టారు. అప్పుడొక చిలుక తెలుపగా అగ్ని జమ్మికడుపులో ఉన్న సంగతి తెలిసికొని అందరూ ఒక్క పెట్టున చుట్టుముట్టారు. అగ్ని నిద్ర చెడినందుకు కోపం పొందింది.

విశేషం: "శమీగర్భంబునం దుత్పత్తి కలిగెన్" - జమ్మికొయ్యలను ఒరిపిడి చేస్తే నిప్పు త్వరగా పుట్టుతుంది.

ఆ. జిహ్వ మరలఁ బడఁగఁ జిలుకల నగ్ని శ । పించె ; సురలు సెవుల కించునట్టి
పలుకు వాని కొసఁగి చిలుక నానందింపఁ । జేసి యా కృశానుఁ జేరఁ జనిన. 147

ప్రతిపదార్థం: అగ్ని= అగ్నిదేవుడు; చిలుకలను; జిహ్వ= నాలుక; మరలఁబడఁగన్= తలక్రిందులయ్యేటట్లుగా; శపించెన్= తిట్టాడు; సురలు= దేవతలు; చెవులకున్= చెవులకు; ఇంచు+అట్టి= రుచించునట్టి; పలుకు= మాట; వానికిన్= ఆ చిలుకలకు; ఒసఁగి= ఇచ్చి; చిలుకన్= ఆ చిలుకను; ఆనందింపన్+చేసి= సంతోషపరచి; ఆ కృశానున్= ఆ అగ్నిదేవుడిని; చేరన్ చనినన్= సమీపించగా.

తాత్పర్యం: అగ్ని చిలుకలకు నాలుక తిరుగబడే విధంగా శపించాడు. దేవతలు చెవుల కింపైన పలుకు కలిగే విధంగా అనుగ్రహించి ఆ చిలుకల సంతాపాన్ని పోగొట్టారు. అగ్నిని చేరుకొన్నారు.

వ. అతండు వారి నాలోకించి 'మీ వచ్చిన కార్యం బేమి?' యని యడిగిన వారుఁ దారక దైత్యు చేయు బాధ లెఱింగించి, వాఁ డేమి యుపాయంబునం దెగటాఱు నత్తెఱం గాపాదింపు' మని నిన్నుం బ్రార్థింప వచ్చితి మని పలికి వెండియు. 148

ప్రతిపదార్థం: అతండు= అ అగ్ని; వారిన్= దేవతలను, మునులను; ఆలోకించి= చూచి; మీ వచ్చిన కార్యంబు= మీరు వచ్చిన పని; ఏమి; అని; అడిగినన్= అడుగగా; వారున్= వారును; తారక దైత్యు చేయు బాధలు= తారకు డనే రాక్షసుడు కల్గిస్తున్న బాధలను; ఎఱింగించి= తెలిపి; వాఁడు= ఆ రక్కసుడు; ఏమి ఉపాయంబునన్= ఏ ఉపాయంతో; తెగటాఱున్= చస్తాడో; ఆ+తెఱంగు= ఆ విధానాన్ని; ఆపాదింపుము= ఆచరించుము; అని; నిన్నున్= నిన్ను; ప్రార్థింపన్= వేడుకొనటానికి; వచ్చితిమి= వచ్చాం; అని; పలికి= చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అగ్ని ఆ మునులనూ దేవతలనూ చూచి 'మీరు వచ్చిన పని ఏమిటి?' అని అడిగాడు. వారు తారకాసురుడు పెట్టుతున్న బాధలను తెలిపి, 'వా డే ఉపాయంతో చస్తాడో అది నీవు ఆచరించాలి - అని నిన్ను వేడుకొనటానికి వచ్చాం' అని పలికి ఇంకా.

క. 'మాకుం గుశలము గోరుము; నీకును మే; లివ్విధంబు నీదు మహిమ యీ
లోకంబు లెల్ల మనములఁ । జేకొని కీర్తించునట్లు సేయుము కరుణన్.' 149

ప్రతిపదార్థం: మాకున్= మాకు; కుశలము= క్షేమం; కోరుము= ఆకాంక్షించుము; ఈ+విధంబు= ఈ పద్ధతి; నీకును= నీకుకూడా; మేలు= మంచిది; నీదు మహిమ= నీ గొప్పతనం; ఈ లోకంబులు+ఎల్లన్= ఈ లోకాలన్నీ; మనములన్= మనస్సులలో; చేకొని= గ్రహించి; కీర్తించు+అట్లు= కొనియాడే విధంగా; కరుణన్= దయను; చేయుము.

తాత్పర్యం: 'మా క్షేమాన్ని నీవు కోరుము. ఇది నీకు కూడా మంచిదే. లోకాలన్నీ నీ మహిమను మనస్సులలో నిలుపుకొని కొనియాడే విధంగా దయచూపుము.'

సీ. అనినఁ బ్రసన్నత 'నట్టులు చేసెద । నూఱడుం' డని వారి నూఱడించి
తనయందు వెలుఁగు శంభుని వీర్య మిడియె గం । గా గర్భరూపంబు గాఁగ నాతఁ;
డది యతి పరివృద్ధ మగుటయు ధరియింప । నోర్వక నిర్జర పర్వతంబు
తటమున శరవణస్థంబుగా గంగ యు । త్సృష్ట మొనర్ప నా శిఖరి సతరు

తే. వల్లరీగుల్మకముగ సువర్ణమయత । వెలుఁగ బాలుఁడై వెలిఁగె నవ్వీరగర్భ;
మచ్చటికి వచ్చి కృత్తిక లార్వురును మ । దీయ పుత్త్రకుఁ డనుచు నెత్తికొని రనఘ! 150

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా! అనినన్= అంటే; ఆతఁడు= ఆ వహ్ని; ప్రసన్నతన్= దయతో; అట్టులు= ఆ విధంగా; చేసెదన్= చేస్తాను; ఊఱడుండు= శాంతి పొందండి; అని; వారిన్= ఆ దేవతలను, మునులను; ఊఱడించి= శాంతపరచి; తనయందున్= తనలో; వెలుఁగు= ప్రకాశించే; శంభుని వీర్యము= శివుడి రేతస్సును; గంగా గర్భరూపంబు కాఁగన్= గంగకు పిండరూపంగా; ఇడియెన్= ఉంచాడు; అది= ఆ గర్భరూపం; అతిపరి వృద్ధము అగుటయున్= మిక్కిలి ఎక్కువగా పెరిగిపోయింది కావటంవలన; గంగ= గంగానది; ధరియింపన్+ఓర్వక= పట్టుకొనలేక; నిర్జర పర్వతంబు తటమునన్= దేవతలకొండ ఒడ్డున; శరవణస్థంబు= రెల్లుతోటలో నిలుచునది; కాన్= అయ్యేటట్లు; ఉత్సృష్టము ఒనర్పన్= జార్చివేయగా; ఆ శిఖరి= ఆ కొండ; సతరు వల్లరీ గుల్మకముగన్= చెట్లతో; తీవెలతో, పొదలతో పాటుగా; సువర్ణమయతన్= బంగారుతో నిండినదై; వెలుఁగన్= కాంతులు చిమ్మగా; ఆ+వీరగర్భము= వీరుడిదైన ఆ గర్భం; బాలుఁడు+ఐ= కుమారుడై; వెలిఁగెన్= ప్రకాశించింది; అచ్చటికిన్= ఆ తావునకు; వచ్చి= ఏ తెంచి; కృత్తికలు ఆర్వురును= కృత్తికలన్న పేరుగల ఆరుగురు స్త్రీలు; మదీయ పుత్రకుఁడు= నా కొడుకు; అనుచున్= అంటూ; ఎత్తికొనిరి= ఎత్తికొన్నారు.

తాత్పర్యం: పుణ్యాత్ముడా! వా రట్లా అన్న వెంటనే అగ్ని అట్లాగే చేస్తాను. మీరు శాంతి పొందండి అని వారిని శాంత పరచి తనలో వెలుగుతున్న శివుడి రేతస్సును గంగలో గర్భరూపంగా వదిలాడు. అది చాలా పెద్దగా పెరిగిన కారణంగా గంగ దానిని మోయలేక మేరుపర్వతం ఒడ్డున ఉన్న ఒక రెల్లు తోటలో నిలిపింది. ఆ పర్వతం చెట్లతో, తీగలతో, పొదలతో బంగారు వన్నెతో మిలమిలలాడింది. ఆ వీరగర్భం ఒక బాలరూపంగా ప్రకాశించింది. అప్పు డక్కడకు వచ్చిన కృత్తిక లారుగురు నా కొడుకంటే నాకొడుకంటూ ముద్దుతో ఆ బాలుడిని ఎత్తుకొన్నారు.

విశేషం: 'నిర్జరపర్వతంబు' - మేరు పర్వతానికి 'సురాలయ' మని పేరు. కనుక అది దేవతల కొండ. శరముల వనము - శరవణము - రెల్లు తోట; వీర గర్భము - వీరుడైన శివుడి రేతస్సుతోనైన గర్భం లేక వీరరూపమైన గర్భం. కృత్తికలు - ఆరు నక్షత్ర రూపాల సముదాయం.

వ. ఇత్తెఱంగున నొక్కట నెత్తికొనుటయు నక్కుమారుండును షణ్ముఖుండై యొక్క పెట్ట సకలకృత్తికా స్తన్యపానం బాచరించె; న ట్లగ్నిసంభవ గాంగేయ కార్తికేయత్వంబు లొందిన యయ్యిందుమౌళితేజంబు పదంపడి బ్రహ్మాది దేవతలు పూజింప దేవసేనాధిపతిత్వంబునం బేర్చి యర్చిర్మహిత యయిన మహాశక్తిం దారకుం బరిమార్చి బృందారక ముని బృందంబుల కానందం బొనర్చె' నని యిట్లప్పరమముని పరశురామునకుం జెప్పి పురహరుం డగు నప్పురుషుండు హిరణ్మయుం డగుటయు 'నద్దేవదేవుండు దాన తనూభవుండై తోఁచుటయుం దథావిధ రేతోధారణంబున వహ్ని హిరణ్యాత్మకరేతో మూర్తియై హిరణ్యరేతుం డనం జనుటయు, నతండు తద్రేతః కలనంబునం దన్మయుం డగుటంజేసి పురహరునకు వహ్నిరేతుం డను నభిధానంబు గలుగుటయుం దేటపఱచి యవ్విధంబున రూపవంతంబైనది కావున సువర్ణంబు జాతరూప నామకంబై పరఁగుటయు నెఱింగించి.151

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్=ఈ విధంగా; ఒక్కటన్= ఒక్క విధంగా; ఎత్తికొనుటయున్= ఎత్తుకొనగా; ఆ+కుమారుండును= ఆ బాలకుడునూ; షణ్ముఖుండు+ఐ= ఆరుమొగాలు కలవాడై; ఒక్కపెట్ట= ఒక్క మారే; సకల కృత్తికా స్తన్య పానంబు= కృత్తిక

లందరి చనుబాలు త్రాగటం; ఆచరించెన్= చేశాడు; అట్లు= అట్లా; అగ్ని సంభవ గాంగేయ కార్తికేయత్వంబులు= అగ్నిపుత్రుడు గంగ కొడుకు కృత్తికల తనయుడు కావటం; ఒందిన ఆ+ఇందుమౌళి తేజంబు= పొందిన ఆ చంద్రశేఖరుడి వీర్యం; పదం పడి= తరువాత; బ్రహ్మ+ఆది దేవతలు= బ్రహ్మ మొదలైన దేవతలు; పూజింపన్= కొలువగా; దేవసేనా+అధిపతిత్వంబునన్= దేవతలసేనకు నాయకుడవటం ద్వారా; పేర్చి= విజృంభించి; అర్చిర్ మహిత= జ్వాలలతో గొప్పగా వెలుగొందేది; అయిన మహాశక్తిన్= అయిన గొప్ప శక్తి అనే ఆయుధంతో; తారకున్= తారక రాక్షసుడిని; పరిమార్చి= చంపి; బృందారక ముని బృందంబులకున్= దేవతల, మునుల సముదాయాలకు; ఆనందంబు+ఒనర్చెన్= ఆనందాన్ని కలిగించింది; అని; ఇట్లు= ఈ తీరున; ఆ పరమముని= గొప్ప ముని అయిన ఆ వసిష్ఠుడు; పరశురామునకున్= పరశురాముడికి; చెప్పి= తెలియజేసి; పుర హరుండు= త్రిపురాసురులను రూపుమాపినవాడు; అగు= అయిన; ఆ+పురుషుండు= ఆ పరమేశ్వరుడు; హిరణ్మయుండు= బంగారమే స్వరూపమైనవాడు; అగుటయును= కావటమూ; ఆ+దేవదేవుండు= దేవులకు దేవుడైన ఆ శివుడు; తాను+అ= తానే; తనూభవుండు+ఐ= కుమారుడై; తోఁచుటయున్= కన్పట్టటమూ; తథావిధ రేతస్ ధారణంబునన్= ఆ విధమైన శుక్లాన్ని ధరించటంచేత; వహ్ని= అగ్ని; హిరణ్య+ఆత్మక రేతస్ మూర్తి+ఐ= స్వర్ణమయ మైన రేతస్సు ఆకారంగా గలవాడై; హిరణ్యరేతుండు= హిరణ్యరూపమైన రేతస్సు కలవాడు; అనన్+చనుటయున్= అనటానికి వీలైనవాడు కావటమూ; అతండు= ఆ అగ్ని; తద్ రేతస్+కలనంబునన్= ఆ రేతస్సు సంబంధంచేత; తద్+మయుండు= ఆ రేతస్సే స్వరూపమైనవాడు; అగుటన్+చేసి= కావటంవలన; పురహరునకున్= శివుడికి; వహ్నిరేతుండు+అను= అగ్ని రేతస్సుగా కలవాడనే; అభిధానంబు= పేరు; కలుగుటయున్= రావటమూ; తేట పఱచి= స్పష్టంచేసి; ఆ+విధంబునన్= ఆ తీరున; రూపవంతంబు= రూపం కలది; ఐనది= అయింది; కావునన్= కాబట్టి; సువర్ణంబు= బంగారం; జాతరూప నామకంబు= పుట్టిన రూపం కలది అన్న అర్థంతో 'జాతరూపం' అనే పేరుకలది; ఐ= అయి; పరఁగుటయును= ఒప్పారుటయూ; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: ఈ విధంగా ఒకేమారు ఆ ఆరుగురూ ఎత్తుకొనటంవలన ఆ కుమారుడు ఆరుముఖాలు ధరించి ఒకేమారు ఆ ఆరుగురు కృత్తికల చనుబాలు త్రాగాడు. ఆ విధంగా అగ్నిపుత్రుడు, గంగాపుత్రుడు, కృత్తికాపుత్రుడు అనే పేర్లు పొందిన ఆ శివుడి తేజస్సు తరువాత బ్రహ్మ మొదలైన దేవతలు పూజింపగా దేవసేనకు నాయకుడై జ్వాలలతో వెలుగొందుతున్న మహాశక్తి అనే ఆయుధంతో తారకుడిని చంపివేశాడు. దేవతలకూ, మునులకూ ఆనందాన్ని కలిగించాడు' అని ఆ వసిష్ఠమహర్షి పరశురాముడికి చెప్పాడు. ఇంకా త్రిపురాసులను మట్టుపెట్టిన ఆ పరమపురుషుడు బంగారమే స్వరూపంగా గలవాడు కావటమూ, ఆ దేవదేవుడు తానే కుమారరూపంతో పుట్టటమూ, అట్టి శుక్లాన్ని ధరించటంచేత అగ్నిదేవుడు బంగారు రూపమైన రేతస్సు కలవాడై హిరణ్యరేతుడు కావటమూ, అట్టి రేతస్సే అతడి స్వరూపం కనుక ఆ అగ్ని శివుడి రేతోరూపుడు కనుక శివుడికి వహ్నిరేతుడనే పేరు కలగటమూ చక్కగా వివరించి స్పష్టం చేశాడు. బంగారానికి ఆ విధంగా రూపం ఏర్పడింది. కనుక దానికి జాతరూపమనే పేరు గలగటం కూడా చెప్పాడు.

విశేషం: నిజానికి సువర్ణ మహిమను వసిష్ఠుడు చెప్పినా ఇందులో కుమారస్వామి కథ రమణీయంగా ఇమిడి ఉన్నది. పరమేశ్వరుడే కుమారస్వామి. భారతీయులు పురుషుడే స్త్రీయందు పుత్రరూపంలో ఉదయిస్తాడని నమ్ముతారు. అగ్ని నుండి పుట్టటంవలన అగ్నిభవుడనీ, గంగయందు పుట్టటంవలన గంగాతనయు డనీ, కృత్తికల స్తన్యం గ్రోలటంవలన వారికి పుత్రుడై కార్తికేయుడనీ, శరములవనంలో పుట్టటంవలన శరవణభవుడనీ, ఆరుముఖాలతో ఏకకాలంలో పాలు త్రాగటంవలన షణ్ముఖు డనీ ఎప్పుడూ కుమార స్వరూపంతో ఉండటంవలన 'కుమారస్వామి' అనీ అనేక పర్యాయాలు గర్భరూపంగా జారినవాడు కనుక స్కందుడనీ పేర్లు వచ్చాయి.

క. మహితాత్మక! యేతాదృశ । మహిమంబు సువర్ణ మది సమంచిత తేజో
మహనీయము తద్దానము । మహత్త్వ మా శివుఁడ యెఱుఁగు మాకుం జూడన్. 152

ప్రతిపదార్థం: మహిత+ఆత్మక!= దొడ్డది అయిన బుద్ధికలవాడా!; సువర్ణము= బంగారం; ఏతాదృశ మహిమంబు= ఇటువంటి గొప్పతనం కలది; అది; సమంచిత తేజస్+మహనీయము= చక్కగా ఒప్పారే కాంతితో మన్నన కెక్కింది; తద్+దానము మహత్త్వము= దానిని దానమివ్వటంలోని గొప్పతనాన్ని; మాకున్= మాకు; చూడన్= చూడగా; ఆ శివుఁడు+అ= ఆ సర్వము నెరిగిన శివుడే; ఎఱుఁగున్= తెలియును.

తాత్పర్యం: మహానుభావా! బంగారం మహిమ ఇటువంటిది. దాని కాంతి అపురూపమైనది. దాని దానంలోని గొప్పతనం సర్వజ్ఞుడైన శివుడికే తెలుసు నని మాభావం.

విశేషం: శివుడు అనటంవలన తక్కిన ఎవ్వరికీ పూర్తిగా తెలియదని భావన.

వ. అవ్విశేషంబున నశేష కల్మషంబులం బాసి నరుండు విధూమత్వంబున వెలుంగు శుచియునుం బోలె శుచిత్వ సంపద సొంపారం బెంపారు నని యుపదేశించె నవ్వసిష్ఠ మునివరు వచనంబు లూఁది యమందాదర వర్ణనీయుండై సువర్ణదాన పరంపర లాచరించి. 153

ప్రతిపదార్థం: ఆ+విశేషంబునన్= ఆ గొప్పతనంచేత; అశేష కల్మషంబులన్= అన్ని విధాలైన పాపాలనూ; పాసి= వదలి; నరుండు= మానవుడు; విధూమత్వంబునన్= పొగలేనితనంతో; వెలుంగు శుచియునున్+పోలెన్= ప్రకాశించే అగ్నివలె; శుచిత్వ సంపద= నిర్మలత్వం అనే సంపద; సొంపారన్= ఇంపులు నింపగా; పెంపారున్= గొప్పతనంతో వృద్ధి పొందుతాడు; అని; ఉపదేశించెన్= బోధించాడు; ఆ+వసిష్ఠమునివరు వచనంబులు= ఆ వసిష్ఠమహర్షి మాటలు; ఊఁది= గట్టిగా పట్టుకొని; అమంద+ఆదర వర్ణనీయుండు+ఐ= గొప్ప ఆదరంతో కొనియాడదగినవాడై; సువర్ణ దాన పరంపరలు= బంగారం దానాల వరుసలను; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ఆ దానమహిమవలన సర్వపాపాలను పోగొట్టుకొని నరుడు పొగలేని నిప్పువలె పరిశుద్ధ సంపదతో ఒప్పుతాడని బోధించాడు. పరశురాముడు 'ఆ వసిష్ఠమహర్షి మాటలను గట్టిగా హృదయంలో నిలుపుకొని ఎంతో ఆదరంతో సువర్ణదానాలు చేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అగ్నికి శుచి అని ఒకపేరు. మాలిన్యం ఏ మాత్రమూ లేనివాడని భావం. అట్లాగే సువర్ణదానాలు చేసినవాడు పాపాలనే మలినాలు ఏ మాత్రమూ లేనివాడై స్వచ్ఛతతో ప్రకాశిస్తాడని తాత్పర్యం.

క. ఆ రాముండు శుచిత్వ । శ్రీ రాజితుఁడయ్యెః నట్లు సేయుము నీవుం
గౌరవముఖ్యా! యది భవ । పారావారఘన యానపాత్రము సుమ్మీ!' 154

ప్రతిపదార్థం: ఆ రాముఁడు= ఆ పరశురాముడు; శుచిత్వ శ్రీ రాజితుఁడు= పరిశుద్ధి అనే సంపదతో విరాజిల్లేవాడు; అయ్యెన్= అయ్యాడు; కౌరవముఖ్యా!= కురువంశం వారిలో శ్రేష్ఠుడా!; నీవున్= నీవుకూడా; అట్లు= ఆ విధంగా; చేయుము= ఆచరించుము; అది= ఆ పని; భవ పారావార ఘన యానపాత్రము= సంసారమనే సముద్రానికి గొప్ప నావ; చుమ్మీ!= సుమా!

తాత్పర్యం: పరశురాము డా విధంగా పాపాలులేనివాడై శుచిత్వ సంపదతో విరాజిల్లాడు. కురువరా! నీవు కూడా అట్లా ఆచరించుము. అది సంసారమనే సముద్రానికి పెద్దనావ సుమా!'

విశేషం: అలం: రూపకం. సంసారం అంటే పుట్టటం చావటం అనే రెండు చక్రాలలో తిరుగుతూ ఉండటం. అది అనంతంగా ఉంటుంది. కనుక సముద్రంతో పోలిక. ఘన యానపాత్రము అనటంవలన ప్రమాదంలేకుండా దాటిస్తుంది అన్న అర్థం వ్యక్తమౌతుంది.

క. అని యనిమిష తటినీ ప్రియ । తనయుఁడు సెప్పుటయు ధర్మతనయుఁడు హృదయం
బునఁ బ్రమదము నిండార న । తనితో నతిభక్తి వినయ ధామం బగుచున్. 155

ప్రతిపదార్థం: అని= అట్లా; అనిమిష తటినీ ప్రియ తనయుఁడు= దేవతల నది అయిన గంగ ముద్దుల కొడుకు; చెప్పుట యున్= చెప్పినంతనే; ధర్మతనయుఁడు= ధర్మరాజు; హృదయంబునన్= హృదయంలో; ప్రమదము= ఆనందం; నిండారన్= నిండి ఉండగా; అతనితోన్= ఆ భీష్ముడితో; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; వినయ ధామంబు= వినయానికి నెలవు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: భీష్మ్మ డిట్లా చెప్పగా ధర్మరాజు హృదయంలో సంతోషం పొంగిపొరలింది. అతడు గొప్ప భక్తితో తన ఒడలెల్లా వినయమే కాగా.

విశేషం: ఏదైనా ఒక మహా విషయాన్ని తెలిసికొనగోరేవాడికి ఉండవలసిన లక్షణాలు భక్తి, వినయం, సంతోషం అనే వాటిని ఇక్కడ సూచిస్తున్నారు. 'అనిమిషతటినీ ప్రియతనయుడు' గంగవలె ఆశ్రయించినవారిని పవిత్రులను చేయగలవాడని భావం.

వ. 'పితృ యజ్ఞ ప్రకారం బెఱింగింపవే' యనుటయు నక్కురువరుఁ డన్నరనాథున కిట్లనియె. 156

ప్రతిపదార్థం: పితృ యజ్ఞ ప్రకారంబు= పితృదేవతల పూజా పద్ధతిని; ఎఱింగింపవే?= తెలుపుమా?; అనుటయున్= అన్నం తనే; ఆ+కురువరుఁడు= కౌరవులలో శ్రేష్ఠుడైన ఆ భీష్ముడు; ఆ+నరనాథునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్=అన్నాడు.

తాత్పర్యం: 'తాతా! దయచేసి పితృయజ్ఞం ఎట్లా చేయాలో చెప్పవూ?' అని అడుగగా భీష్ముడు ధర్మరాజునకు ఇట్లా చెప్పాడు.

విశేషం: బ్రహ్మయజ్ఞం, పితృయజ్ఞం; దేవయజ్ఞం, భూతయజ్ఞం; మనుష్యయజ్ఞం - అనే వాటిని పంచమహాయజ్ఞాలు అంటారు. మానవుడు వీటిని చేస్తూ ఉండాలి అని ధర్మశాస్త్రం శాసిస్తున్నది. అందులో పితృయజ్ఞం ఎట్లా చేయాలో ధర్మరాజు తెలిసికొనగోరు తున్నాడు.

క. 'పితృపూజ సమగ్ర్యము దై । వత పూజనమునకు మనుజవల్లభ! పితృ దే
వతలఁ గొనియాడుదురు దే । వత లాదిగఁ గల్గు నెల్లవారును భక్తిన్. 157

ప్రతిపదార్థం: మనుజవల్లభ!= రాజా!; దైవత పూజనమునకున్= దేవతల ఆరాధనకంటె; పితృపూజ= పితృదేవతలను పూజించటం; సమగ్ర్యము= మిన్న; దేవతలు+ఆదిగన్= దేవతలు మొదలుగా; కల్గు+ఎల్లవారును= ఉన్న అందరూ; భక్తిన్= భక్తితో; పితృదేవతలన్= పితృ రూపంలో ఉన్న దేవతలను; కొనియాడుదురు= ప్రశంసిస్తారు.

తాత్పర్యం: రాజా! పితృదేవతలను పూజించటం దేవతలను పూజించటం కన్నా మిన్న అయిన పని. ఎందుకంటే దేవతలు మొదలైనవారందరూ భక్తితో పితృదేవతలను స్తుతిస్తూ ఉంటారు.

విశేషం: తరచుగా 'మనుజవల్లభ!' వంటి సంబోధనలు కవి వాడుతూ ఉంటాడు. ఇందులో ఒక సూక్ష్మార్థం ఉన్నది. రాజు అన్నీ చక్కగా తెలిసికొని ఆచరిస్తే ప్రజలు అతడిని అనుసరించి మంచిమార్గంలో నడుస్తారు. "యథా రాజా తథా ప్రజాః " అని గదా సూక్తి.

వ. విశేషించి మనుష్యులకుఁ బితృ సమారాధనంబు సర్వశుభ సాధనంబు. 158

ప్రతిపదార్థం: విశేషించి= మిక్కిలిగా; మనుష్యులకున్= మానవులకు; పితృ సమారాధనంబు= పితృదేవతలను చక్కగా కొలవటం; సర్వ, శుభ సాధనంబు= అన్ని శుభాలకు సాధనం.

తాత్పర్యం: ప్రత్యేకించి మనుష్యులకు పితృపూజ అన్ని శుభాలకూ సాధనం.

విశేషం: ఈ ఘట్టంలో 'పితృ' శబ్దానికి మరణించిన తన వంశంవారని అర్థం.

భీష్ముఁడు ధర్మజునకుఁ బితృపూజా విధానం బెఱింగించుట (సం.13-87-3)

క. అమవస నమవసఁ బితృయ । జ్ఞము దగఁ బిండ ప్రదాన సహితముగా భ
క్తి మెయిం జేయు నతఁడు ని । త్యముఁ జేసిన వాఁడ యగు సమంచిత చరితా! 159

ప్రతిపదార్థం: సమంచిత చరితా!= చక్కగా ఒప్పారు నడవడిగల ఓ ధర్మరాజా!; అమవసన్ అమవసన్= ప్రతి అమావాస్యనాడును; పిండ ప్రదాన సహితముగాన్= పిండములు పెట్టుటతోపాటుగా; తగన్= పద్ధతి ననుసరించి; భక్తిమెయిన్= భక్తితో; పితృయజ్ఞమున్= శ్రాద్ధమును; చేయు+అతఁడు= చేసేవాడు, నిత్యమున్= ప్రతిదినము; చేసినవాఁడు+అ= చేసినవాడే; అగున్= ఔతాడు.

తాత్పర్యం: చక్కని నడవడిగల ఓ ధర్మరాజా! ప్రతి అమావాస్యనాడూ భక్తితో పిండప్రదానంతో కూడా విధి ననుసరించి శ్రాద్ధం చేసేవాడు నిత్యమూ చేసినవాడే అవుతాడు.

విశేషం: అమావాస్య పితృప్రీతికరమైన దినం. పిండము అంటే మంత్రపూర్వకంగా ఒక్కొక్కరికి ఒక్కొక్కటి చొప్పున దర్భలపై ఉంచే అన్నపు ముద్దలు. నిజానికి పితృయజ్ఞము ప్రతిదినమూ చేయాలి. నెల కొక్కమారు వచ్చే అమావాస్యనాడు చేస్తే నిత్యమూ చేసినట్లే అని చెప్పటంవలన మానవులకు ఆ కార్యం మీద అనురక్తి కలుగుతుంది.

వ. పితృయజ్ఞంబునకుఁ దిథి విశేషంబు సెప్పెద. 160

ప్రతిపదార్థం: పితృయజ్ఞంబునకున్= శ్రాద్ధానికి; తిథి విశేషంబు= ప్రశస్తమైన తిథులను; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: శ్రాద్ధానికి సంబంధించిన తిథుల విశేషాలను చెప్పుతాను.

విశేషం: 'తిథి' అంటే స్థూలంగా 'Date' అని అర్థం. ఇవి పదునైదు. మనం ఇప్పుడు అనుకునే తేదీవంటిదే. అయితే భారతీయుల తిథి సూర్యోదయంతో మొదలై సూర్యోదయం వరకు అనే లెక్కతో ఉండదు. మొత్తానికి రోజులో ఎక్కడో ప్రారంభమై 24 గంటలకు కొంచెం హెచ్చుతగ్గులుగా సాగుతూ ఉంటుంది.

సీ. పాడ్యమిఁ బితృయజ్ఞపరుఁడైనఁ జారుకాం । తాపతి; విదియఁ గాంతలకుఁ దండ్రి'
తదియను జవితిని దా వాజిధనికుండు । పశుభాగి పంచమి బహుసుతుండు,
షష్ఠి భానాత్ముండు, సప్తమిఁ గృషిభాగి, । యష్టమి వాణిజ్య పుష్టుఁడు, వసు
గజ ధర్మవిష్ణు చిత్తజ తిథులం । దేకశత జంతువులను గోచయముఁ గుప్య

తే. ములును దగ బ్రహ్మ వర్చస్వి పుత్రకులును । ధనము గలవాఁడు విను చతుర్దశి రణైక
భాగి పున్నమ నమవస భవ్య సర్వ । కామ్య ఫలభాగి యగుఁ జువ్వె కౌరవేంద్ర! 161

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర= ధర్మజా! పాడ్యమిన్= పాడ్యమి తిథినాడు; పితృ యజ్ఞపరుఁడు= శ్రాద్ధంపై ఆసక్తి కలవాడు; ఐనన్= అయితే; చారు కాంతాపతి= అందమైన భార్యకు భర్త (అవుతాడు); విదియన్= రెండవ తిథినాడు; కాంతలకున్= అందమైన స్త్రీలకు; తండ్రి= జనకుడు (అవుతాడు); తదియను= మూడవ తిథినాడునూ; చవితిని= నాలుగవ తిథియందూ; తాన్= తాను; వాజిధనికుండు= గుర్రాలు ధనంగా కలవాడు; పశుభాగి= పశుసంపద కలవాడు; పంచమిన్= అయిదవ తిథి; బహుసుతుండు= పెక్కండ్రు కొడుకులు కలవాడు; షష్ఠిన్= ఆరవ తిథియందు; భానాత్ముండు= ప్రకాశించే ఆత్మ కలవాడు; సప్తమిన్= ఏడవ తిథియందు; కృషిభాగి= వ్యవసాయం కలవాడు; అష్టమిన్= ఎనిమిదవ తిథియందు; వాణిజ్య పుష్టుఁడు= వర్తకపు పుష్టి కలవాడు; వసు గజ ధర్మ విష్ణు చిత్తజ తిథులందున్= నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి అనే పేర్లుగల తొమ్మిదవ, పదియవ, పదునొకండవ, పండ్రెండవ, పదుమూడవ తిథులందు; ఏక శతజంతువులను= ఒక వంద చొప్పున జంతువులను (ఏక శఫజంతువులను అని పాఠం - ఒంటి గిట్టగల జంతువులను అని అర్థం); గోచయమున్= ఆవుల మందలను; కుప్యములును= లోహ సంపదలను; తగన్= తగినంత; బ్రహ్మవర్చస్వి పుత్రకులును= బ్రహ్మతేజస్సు గల కొడుకులును; ధనము గలవాఁడు= సంపద కలవాడును, విను= వినుము; చతుర్దశిన్= చతుర్దశి అనే పదునాలుగవ తిథి యందు; రణ+ఏక భాగి= యుద్ధం మాత్రమే పొందేవాడు; పున్నమన్= పూర్ణిమయందు; అమవసన్= అమావాస్యయందు; భవ్య సర్వ కామ్య ఫలభాగి= శ్రేష్ఠములైన అన్ని కోర్కెల ఫలాన్ని పొందేవాడు; అగున్= అవుతాడు; చువ్వె= సుమా!

తాత్పర్యం: పాడ్యమినాడు శ్రాద్ధాన్ని ఆసక్తితో పెడితే అందమైన అతివకు భర్త అవుతాడు. విదియనాడు కన్యలకు తండ్రి అవుతాడు. తదియనాడు గుర్రాల ధనంకలవాడూ, చవితినాడు గోధనం కలవాడూ అవుతాడు. పంచమినాడు ఎక్కువమంది కొడుకులు కలవాడు, షష్ఠినాడు చక్కగా ప్రకాశించే బుద్ధికలవాడు, సప్తమినాడు వ్యవసాయ దారుడు, అష్టమినాడు వ్యాపారపుష్టి కలవాడూ అవుతాడు. నవమినాడు ఒంటిగిట్టలు గల పశువులు ధనంగా కలవాడూ, దశమినాడు ఆలమందలు కలవాడూ, ఏకాదశినాడు లోహసంపదలు కలవాడూ, ద్వాదశినాడు బ్రహ్మతేజస్సు గల పుత్రులు కలవాడూ, త్రయోదశినాడు భాగ్యవంతుడూ, చతుర్దశినాడు యుద్ధం మాత్రమే పొందేవాడూ, పూర్ణిమ, అమవస తిథులందు శ్రేష్ఠమైన కోర్కెలు అన్నీ తీరినవాడూ అవుతాడు.

విశేషం: ప్రతి తిథికి ఒక్కొక్క అధి దేవత ఉన్నది. నవమికి వసువులు, దశమికి - ఏనుగులు, ఏకాదశికి యముడు, ద్వాదశికి భృగువు, త్రయోదశికి - మన్మథుడు. ఈ పద్యంలో ఈ తిథులను అధిదేవతల పేర్లతో వ్యవహరించారు. కుప్యమంటే వెండి బంగారం కాక తక్కిన లోహం.

క. అపరంబగు పక్షంబును । నపరాహ్ణము మేలు పితృసమర్చనమున కా
దృపుఁ దిథి దశమి చతుర్దశి । నృపవర! యప్పక్షమునను నింద్యతఁ బొరయున్.' 162

ప్రతిపదార్థం: నృపవర!= రాజోత్తమా! పితృసమర్చనమునకున్= పితృదేవతల పూజకు; అపరంబు అగు పక్షంబును= రెండవదైన కృష్ణ పక్షమూ; అపరాహ్ణము= పగటిని అయిదు భాగాలుగా చేస్తే అందులో నాలుగవ భాగమైన కాలమూ; మేలు= శ్రేష్ఠమైనవి; ఆ పక్షమునను= ఆ కృష్ణ పక్షంలో; ఆద్యము+తిథి= మొదటిదైన పాడ్యమి తిథీ; దశమి= పదో తిథీ; చతుర్దశి= పదునాలుగో తిథీ; నింద్యతన్= చెడ్డ స్థితిని; పొరయున్= పొందుతాయి.

తాత్పర్యం: రాజా! కృష్ణపక్షమూ, అపరాహ్ణమూ శ్రాద్ధానికి మంచి సమయాలు. కృష్ణపక్షంలో పాడ్యమి, దశమి, చతుర్దశి తిథులు మంచివి కావు.'

విశేషం: అపరాహ్ణము: అహస్సు అంటే పగటిభాగం. సుమారు పండ్రెండు గంటలనుకొని మూడు భాగాలు చేస్తే మూడవ భాగాన్ని అపరాహ్ణం అంటారు. అంటే సూర్యోదయం ఆరుగంటలకు అయితే మధ్యాహ్నం రెండుగంటల తరువాత కాలం. మరొక విధంగా పగటిని అయిదు భాగాలు చేస్తే ఒక్కొక్కభాగం సుమారు రెండు గంటల ముప్పైఆరు నిముషాలు అవుతుంది. ఈ భాగాలు మూడు గడువగా నాలుగవ భాగం అపరాహ్ణం అవుతుంది. ఈ లెక్క ప్రకారం కూడా మధ్యాహ్నం రెండు గంటల తరువాతి కాలమే అపరాహ్ణం. అపరపక్షమంటే కృష్ణపక్షం. పూర్ణిమ తరువాత పాడ్యమి మొదలుకొని అమావాస్యదాకా ఉండే పదునైదు రోజుల కాలం. ఇది నెలలో రెండవ భాగం కనుక 'అపరపక్షం' అంటారు.

క. అనిన విని ధర్మసూనుం । 'డనఘా! యెద్దానఁ బితృసమర్చన మొనరిం
చిన నధిక ఫలంబగు న । వ్వినుత ద్రవ్యములఁ జెప్పవే తెలియంగన్.' 163

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= శ్రద్ధతో ఆలకించి; ధర్మసూనుండు= ధర్ముడి కొడుకు యుధిష్ఠిరుడు; అనఘా!= పుణ్యాత్ముడా!; ఏ+దానన్= దేనితో; పితృసమర్చనన్= పితృదేవతలపూజ; ఒనరించినన్= చేస్తే; అధిక ఫలంబు= ఎక్కువ ఫలం; అగున్= కలుగుతుందో; ఆ+వినుత ద్రవ్యంబులన్= మేలైన ఆ పదార్థాలను; తెలియంగన్= తెలిసే విధంగా; చెప్పవే= దయతో తెలియజేయుము.

తాత్పర్యం: భీష్ముడు చెప్పినది విని ధర్మరాజు 'పుణ్యాత్ముడా! శ్రాద్ధం ఏ వస్తువులతో చేస్తే ఎక్కువ ఫలం వస్తుందో ఆ మేలైన పదార్థాలను తెలియజెప్పుము' అన్నాడు.

వ. అనుటయు దేవవ్రతుం డతని కిట్లనియె. 164

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; దేవవ్రతుండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా భీష్ముడు ధర్మరాజుకు ఈ విధంగా చెప్పాడు.

క. 'తిలపాయస ఘృతములు పితృ । కలనములకు నుత్తమములు; గవ్యంబు మహా
ఫల; మెదియైనన్ మత్స్యం । బులు మాంసము విహితవిధిఁ బ్రభూత ఫలంబుల్. 165

ప్రతిపదార్థం: తిల పాయస ఘృతములు= నువ్వులు, పరమాన్నము, నేయి; పితృ కలనములకున్= శ్రాద్ధములకు; ఉత్తమములు= శ్రేష్ఠములైనవి; గవ్యంబు= ఆవులనుండి ఏర్పడేది; ఎది+ఐనన్= ఏదైనా; మహాఫలము= గొప్ప ఫలం కలది అవుతుంది; మత్స్యం బులు= చేపలు, మాంసము= మాంసమున్నూ; విహిత విధిన్= శాస్త్రం ప్రకారం; ప్రభూత ఫలంబుల్= దొడ్డ ఫలం కలవి.

తాత్పర్యం: నువ్వులు, పాయసమూ, నేయి శ్రాద్ధాలకు మేలైన వస్తువులు. ఆవులనుండి ఏర్పడేది ఏదైనా గొప్ప ఫలాన్నిస్తుంది. చేపలు, మాంసమూ శాస్త్రం విధించిన తీరు ననుసరించి దొడ్డఫలా న్నిస్తాయి.

విశేషం: గవ్యము - గోవునుండి వచ్చేది; పాలు, పెరుగు, నేయి, పేడ, మూత్రం - వీటిని పంచ గవ్యాలంటారు. చేపలు, మాంసము - అవి ఆహారంగా ఉపయోగించేవారు మాత్రమే శ్రాద్ధములలో వాడాలి. అందరూ కాదు.

తే. గొఱియనంజుడు ఖడ్గంబు నెఱచి గండ । మృగమునందలి పలలంబు మేఁకమాంస
మొక్కఁడొకటికి ఫలమున నెక్కు డండ్రు । పితృ సమర్చన విదులైన పెద్ద లధిప! 166

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; పితృ సమర్చన విదులు= పితృదేవతల పూజలను గూర్చి చక్కగా తెలిసినవారు; ఐన పెద్దలు= అయిన వృద్ధులు; గొఱియ నంజుడు= గొర్రె మాంసం; ఖడ్గంబు+ఎఱచి= ఖడ్గమృగం మాంసం; గండమృగము నందలి పలలంబు= గండభేరుండం అనే దాని అందలి మాంసం; మేఁక మాంసము= మేక మాంసమూ; ఒకటికిన్= ఒకదాని కంటె; ఒకఁడు= ఒకటి; ఫలమునన్= ఫలం విషయంలో; ఎక్కుడు= మిన్న; అండ్రు= అంటారు.

తాత్పర్యం: గొర్రె, ఖడ్గమృగం, గండ భేరుండం, మేక అనేవాటి మాంసం ఒకదానికంటె ఒకటి మేలైనదని శ్రాద్ధతత్త్వం తెలిసిన పెద్దలు చెప్పుతూ ఉంటారు.

విశేషం: గండ మృగం - నిఘంటువులో దీనికి ఖడ్గమృగం అని అర్థం చూపారు. పద్యంలో అది ముందే ఉన్నది. కనుక గండమృగం అంటే గండ భేరుండ పక్షిగా గ్రహించాలి. నిజానికి దీనిని పక్షి అంటున్నా అది మృగజాతికి చెందినదే అని శబ్దరత్నాకరం చెప్పుతున్నది. ఈ పద్యంలో మాంస పర్యాయ వాచకాలు నంజుడు, ఎఱచి, పలలము అనే వాటిని కవి ప్రయోగించటం విశేషం.

వ. నక్షత్ర విశేషం బాకర్ణింపుము. 167

ప్రతిపదార్థం: నక్షత్ర విశేషంబు= నక్షత్రాలకు సంబంధించిన ప్రత్యేకతను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: శ్రాద్ధం విషయంలో ఏ నక్షత్రం ప్రత్యేకత ఏమిటో చెప్పుతాను వినుము.

సీ. కార్తెఁ బైతృక మగు కర్మ మొనర్ప ని । శ్శత్రుత, రోహిణిఁ, బుత్ర లబ్ధి,
శశితారకమున నోజః ప్రాప్తి యార్ద్రఁ గ్రూ । రపు వర్తనము, పునర్వసువు నందుఁ
గృషి ఫలోదయ, మనిమిష గురుతార సు । పుష్టి, యాశ్లేష నుత్కృష్ట వీర
తనుజ లాభము, మఖం దనకులమున పెంపు, । పుబ్బ సౌభాగ్య విస్ఫూర్తి సిద్ధి,

తే. యర్యమునితారఁ బెక్కపత్యములు పుట్టు, । హస్తమునఁ గర్మసఫలత, యవులతార
సుందరాకార యుతులగు సుతులఁ గనుట, । యనిలతార వాణిజ్య వర్ధనము గలుగు. 168

ప్రతిపదార్థం: పైతృకము= పితృదేవతలకు సంబంధించినది; అగు కర్మము= అయిన పని (శ్రాద్ధం); కార్తెన్= కృత్తికా నక్షత్రమున్న రోజున; ఒనర్పన్= చేస్తే; నిశ్శత్రుత= పగవారు లేనిస్థితి (కలుగుతుంది); రోహిణిన్= రోహిణియందు; పుత్రలబ్ధి=

కొడుకులు కలగటం; శశితారకమునన్= మృగశిర నక్షత్రంలో; ఓజస్+ప్రాప్తి= బలం కలగటం; ఆర్ద్రన్= ఆర్ద్రలో; క్రూరము+ వర్తనము= దయలేని నడవడి; పునర్వసువునందున్= పునర్వసు నక్షత్రంలో; కృషి ఫల+ఉదయము= సేద్యపు ఫలం పుట్టటం; అనిమిషగురుతారన్= దేవతలగురువు బృహస్పతి నక్షత్రం-పుష్యమిలో; సుపుష్టి= మంచి దేహబలం; ఆశ్లేషన్= ఆశ్లేష నక్షత్రంలో; ఉత్కృష్ట వీర తనుజలాభము= గొప్ప వీరులైన కొడుకులు కలగటం; మఖన్= మఖ అనే నక్షత్రంలో; తన కులమున పెంపు= తన కులంలో అభివృద్ధి; పుబ్బన్= పూర్వఫల్గుని నక్షత్రంలో; సౌభాగ్య విస్ఫూర్తి సిద్ధి= గొప్ప భాగ్యం పెరగటం అనే సిద్ధి; అర్య మునితారన్= సూర్యుడు దేవతగాగల ఉత్తర ఫల్గునీ నక్షత్రమునందు; పెక్కు= ఎక్కువ మంది; అపత్యములు= సంతానములు; పుట్టున్= కలుగును; హస్తమునన్= హస్త అనే నక్షత్రంలో; కర్మసఫలత= పనులు ఫలించటం; అవులతారన్= తరువాతిదైన చిత్త అనే నక్షత్రంలో; సుందర+ఆకార యుతులు= అందమైన రూపంతో కూడినవారు; అగు సుతులన్= అయిన కొడుకులను; కనుట= పొందటం; అనిలతారన్= వాయువు దేవతగాగల స్వాతియందు; వాణిజ్య వర్ధనము= వర్తకం పెంపొందటం; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: పితృకర్మ కృత్తికలో చేస్తే పగవారులేని స్థితి, రోహిణిలో కొడుకులు కలగటం, మృగశిరలో దేహబలం, ఆర్ద్రలో క్రూరత్వం, పునర్వసులో సేద్యపు ఫలం దక్కటం, పుష్యమిలో మంచి పుష్టి; ఆశ్లేషలో గొప్ప శక్తి కల కుమారులు కలగటం, మఖలో వంశాభివృద్ధి; పుబ్బలో సౌభాగ్యం పెరగటం, ఉత్తరలో సంతానం పెంపొందటం, హస్తలో కార్యసిద్ధి, చిత్తలో సుందర పుత్రులు కలగటం, స్వాతిలో వర్తకం అభివృద్ధి అనే ఫలాల నిస్తుంది.

విశేషం: ఒక్కొక్క నక్షత్రానికి ఒక్కొక్క అధిదేవత ఉంటుంది. ఈ పద్యంలో కొన్నింటిని ఆ అధిదేవతల పేర్లతో వ్యవహరించారు. మృగశిర - చంద్రుడు, పుష్యమి - బృహస్పతి; ఉత్తర - సూర్యుడు; స్వాతి- వాయువు, 'పూర్వఫల్గుని'లో మొదటి అక్షరాలను గ్రహించి 'పూఫ' అనటం అది క్రమంగా పుబ్బగా మారటం గుర్తించదగినది. (ఫల్గుని, ఫాల్గునము, ఫల్గునుండు అనే పదాలలో న కారమే కాని ణ కారం కాదన్నది బాగా గుర్తించాలి).

సీ. **వినుము విశాఖ సత్తనయ బహుత్వ మ । నూరాధ రాజాధికార, మైంద్ర**
మునఁ బ్రభుత్వము పెంపు; మూలఁ బూర్వాషాఢ । నారోగ్యమును నుత్తమాతిశయము,
నుత్తరాషాఢ శోకోదయ రహితత్వ, । మభిజిత్తునందు విద్యాభియుక్తి,
శ్రవణ కాలమునఁ బరమ గతి సిద్ధి, ధ । నిష్ఠ రాజ్యము, జలనిధిపతార

తే. **మొదలుగాఁ దారకంబులు మూఁట నఖిల । కార్యఫలములు, సదజావికములు గోవు,**
లవుల మూఁటను గుప్య వృద్ధ్యశ్వకాయు । వులు శుచి శ్రాద్ధకర్తకుఁ గలుగు నధిప!' **169**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వినుము= శ్రద్ధతో ఆలకించుము; విశాఖన్= విశాఖనక్షత్రంలో; సత్ తనయ బహుత్వము= మంచి కొడుకుల పెక్కువ; అనూరాధన్= అనూరాధయందు; రాజ+అధికారము= ప్రభుత్వం; ఐంద్రమునన్= ఇంద్రుడు దేవతగాగల జ్యేష్ఠయందు; ప్రభుత్వము పెంపు= అధికారం పెరగటం; మూలన్= మూలా నక్షత్రంలోను; పూర్వాషాఢన్= పూర్వాషాఢ అనే నక్షత్రంలోను (వరుసగా); ఆరోగ్యమును= రోగాలు లేనితనమూ; ఉత్తమ+అతిశయము= గొప్ప అభివృద్ధి; ఉత్తరాషాఢన్= ఉత్తరాషాఢ నక్షత్రంలో; శోక+ఉదయ రహితత్వము= దుఃఖం కలగటం అనేది లేకపోవటం; అభిజిత్తునందున్= అభిజిత్తులో; విద్యా+అభియుక్తి= మంచి విద్య అలవడటం; శ్రవణ కాలమునన్= శ్రవణ నక్షత్రం ఉన్న వేళయందు; పరమగతి సిద్ధి= మోక్షం సిద్ధించటం; ధనిష్ఠన్= ధనిష్ఠలో; రాజ్యము; జలనిధి ప తార= జలములకు రాజైన వరుణుడి నక్షత్రం శతభిషం; మొదలుగాన్ =మొదలుకొని; తారకంబులు= నక్షత్రములు; మూఁటన్= మూడింటియందు; అఖిల కార్య ఫలములు= అన్ని పనులు నెరవేరటం; సత్

అజ+అవికములు= మంచి మేకలు, గొర్రెలు (అనువాటి లాభం); గోవులు= ఆవులు (లభించటం); అవుల మూఁటను= తరువాతి మూడు నక్షత్రాలలో; కుప్యవృద్ధి+అశ్వక+ఆయువులు= లోహముల సంపద పెరగటం; గుర్రాలు లభించటం, ఆయువు పెరగటం; శుచిశ్రాద్ధ కర్తకున్= పరిశుద్ధుడైన శ్రాద్ధ కర్తకు; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: రాజా! వినుము. విశాఖయందు మంచి పుత్రులు కలగటం, అనూరాధయందు ప్రభుత్వం, జ్యేష్ఠలో అధికారం పెంపొందటం, మూలయందు ఆరోగ్యం, పూర్వాషాఢయందు గొప్ప అభివృద్ధి, ఉత్తరాషాఢయందు శోకం తొలగిపోవటం, అభిజిత్తునందు విద్యాభివృద్ధి, శ్రవణంలో మోక్షం, ధనిష్ఠయందు రాజ్యం, శతభిషంలో కార్యఫలం, పూర్వాభాద్రలో మేకలు గొర్రెలు వృద్ధి పొందటం, ఉత్తరాభాద్రలో గోసంపద వృద్ధి పొందటం, రేవతి యందు లోహసమృద్ధి, అశ్వినియందు గుర్రాల లాభం, భరణియందు ఆయువు అనే ఫలాలు నిర్మలుడైన శ్రాద్ధకర్తకు లభిస్తాయి.'

విశేషం: ఇంద్రము - ఇంద్రదేవతాకము - జ్యేష్ఠ; అభిజిత్తు - నక్షత్రాలు ఇరువదియేడు మాత్రమే. కాని కొందరు ఉత్తరాషాఢ, శ్రవణాలకు మధ్య 'అభిజిత్తు' అనే మరొక నక్షత్రాన్ని కూడా లెక్కిస్తారు. ఆ లెక్కన ఇరవై ఎనిమిది. జలనిధి - సముద్రము. దాని రాజు వరుణుడు. అతడు దేవత అయిన నక్షత్రం శతభిషం. అది మొదలుకొని మూడు అంటే శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర. తరువాతి మూడు తారలు రేవతి, అశ్విని, భరణి.

'నక్షత్రేష్టి' అని ఒక మంత్రభాగం ఉన్నది. అందులో నక్షత్రాల వరుస కృత్తికతో ప్రారంభమైనది. ప్రస్తుతం అశ్వినితో మొదలవుతున్న వ్యవహారం ఉన్నది. వైదిక సంప్రదాయా న్ననుసరించి ఈ సందర్భంలో కృత్తికతో ప్రారంభించినట్లు భావించాలి.

'కుప్యం' అంటే వెండి, బంగారు కాక తక్కిన లోహాలు. శుచిశ్రాద్ధకర్త - అనటంవలన శ్రాద్ధానికీ, పవిత్రతకూ గట్టి సంబంధం ఉన్నదని తెలియవస్తున్నది.

వ. అనిన నప్పుడమిఱేఁ డప్పురుషవరునిం 'బితృ పూజనంబులకుఁ బాత్రంబు లెట్టివి గావలయు?' నని యడిగిన నయ్యమరనదీనందనుం డిట్లనియె. 170

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+పుడమిఱేఁడు= ఆ రాజు; ఆ+పురుషవరునిన్= పురుషులలో శ్రేష్ఠుడైన ఆ భీష్ముడిని; పితృపూజనంబులకున్= పితృదేవతల ఆరాధనలకు, పాత్రంబులు= యోగ్యతకలవి; ఎట్టి+అవి= ఏ విధమైనవి; కావలయును= కావాలి; అని; అడిగినన్= అడుగగా; ఆ+అమరనదీ నందనుండు= ఆ గంగకొడుకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇట్లు చెప్పగా ధర్మరాజు భీష్ముడితో 'పితృదేవతల ఆరాధనకు యోగ్యులు ఎవరు?' అని అడిగితే భీష్ము డిట్లా చెప్పాడు.

క. దైవిక కృత్యంబులకును । భూవర! భూసురుల సూక్ష్మముగ శోధింపం
గా వలదు గాని పితృ పూ । జావిధికిఁ బరీక్ష వలయు సమ్యగ్భంగిన్. 171

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; దైవిక కృత్యంబులకును= దైవ సంబంధమైన కార్యాలకు; భూసురులన్= బ్రాహ్మణులను; సూక్ష్మముగన్=నిశితంగా; శోధింపంగాన్= పరీక్షించటం; వలదు= వద్దు; కాని; పితృ పూజా విధికిన్= శ్రాద్ధపు పనికి; సమ్యక్+భంగిన్= చక్కని తీరున; పరీక్ష= గుణ దోషాలను పట్టిచూడటం; వలయున్= కావాలి.

తాత్పర్యం: రాజా! దేవతాసంబంధమైన పనులలో బ్రాహ్మణులను అణువణువునా పరీక్షించ నక్కరలేదు. కాని, శ్రాద్ధాలకు మాత్రం చాలా గట్టిగా పరీక్ష చేయాలి.

విశేషం: ఇచట భూసురులంటే ఆయా పనులలో మంత్ర తంత్రాలను ప్రయోగించేవారని భావం. బ్రాహ్మణుడిలోని ఏ చిన్న లోపమైనా శ్రాద్ధాన్ని నాశనం చేస్తుందని ధ్వని.

వ. కావున నీ వడిగి మేలు చేసి తాకర్ణింపుము. 172

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు; అడిగి= ప్రశ్నించి; మేలు చేసితి= మంచిపని చేశావు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: కనుక నీవు ఈ విషయం అడిగి మంచి చేశావు. వినుము.

తే. కులవయో రూపశీల విద్యల నుదాత్తు । లనఁగఁ దగువారు పంక్తి పావనులు తద్గు
ణమ్ము లారయ లేని జనములు పంక్తి । దూషకులు పైతృకమునకు దోషదూర! 173

ప్రతిపదార్థం: దోషదూర!= తప్పుడు గుణాలకు దూరమైన ఓ ధర్మరాజా!; పైతృకమునకున్= శ్రాద్ధానికి; కుల వయస్ రూప శీల విద్యలన్= కులం; వయస్సు, రూపం, మంచి స్వభావం; గొప్పచదువు అనువాటిచేత; ఉదాత్తులు= గొప్పవారు; అనఁ గన్+తగువారు= అనటానికి యోగ్యత కలవారు; పంక్తి పావనులు= భోజనంచేసేవారి వరుసను పవిత్రం చేయగలవారు; ఆరయన్= పరిశీలించి చూడగా; తత్+గుణమ్ములు= ఆ గుణాలు; లేనిజనములు= లేని మనుష్యులు; పంక్తి దూషకులు= బంతిని (వరుసను) చెడగొట్టువారు.

తాత్పర్యం: మంచికులం, ప్రాయం, అందచందాలు, స్వభావం, విద్య అనే వాటిచేత ఉన్నతులనదగినవారు శ్రాద్ధక్రియలో పంక్తిని పవిత్రం చేసేవారు. ఈ గుణాలు లేనివారు పంక్తిని పాడుచేసేవారు.

విశేషం: 'దోషదూర' అనే సంబోధనలో ఎన్నడూ దోషాలను దగ్గరకు రానివ్వకుము అన్న సూచన తోస్తున్నది. రూపం ఉన్నచోట మంచిగుణాలు ఉంటాయని ఒక భావన. "యత్రాకృతి స్తత్ర గుణాః" శీలం' అంటే అభ్యాసాదులవలన రావటం, పోవటం లేని స్వభావం. ఇచట 'సచ్ఛీలం' అనే అర్థాన్నే గ్రహించాలి. 'ఆరయన్' అనే పదం చేత ఆ గుణాలు లేనితనాన్ని జాగ్రత్తగా పరిశీలించి తెలిసికొనాలని భావం.

వ. మఱియును బంక్తి దూషకులం జెప్పెద నాకర్ణింపుము. 174

ప్రతిపదార్థం: మఱియును= ఇంకా; పంక్తిదూషకులన్= వరుసను పాడుచేసేవారిని; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇంకా పంక్తిని పాడుచేసేవారిని తెలుపుతాను వినుము.

విశేషం: కలిసి మెలగనివారు - పంక్తిదూషకులు.

సీ. జూదరి గరదుండు వేదంబు సదువని । వాఁడు వడ్డికి నిచ్చువాఁడు గాయ
కుండు గ్రామము పనిఁ గుడుచునాతఁడు గృహ । దాహి కుష్ఠము గల తనువు నాతఁ

డఱుఁ దెవుల్ గొన్నాతఁ డఖిల వస్తువులును । నమ్మెడు నతఁడు సోమమ్ము విక్ర
యించిన యతఁ డబ్ధి సంచార లాభోప । జీవకుం డుర్వీశ సేవకుండు

తే. భార్యయును దాను బుత్రులఁ బంచికొన్న । వాఁడు పసులఁ బెక్కేలెడువాఁడు కపట
కృత్యముల ద్రుచ్చిమిని శిల్పకృతుల బ్రదుకు । వారు పంక్తిదూషకు లండ్రు పౌరవేంద్ర!' 175

ప్రతిపదార్థం: పౌరవేంద్ర!= పురువంశరాజా!; జూదరి= జూదగాడు; గరదుండు= విషం పెట్టేవాడు; వేదంబు+చదువనివాఁడు= వేదాధ్యయనం చేయనివాడు; వడ్డికిన్= ధనాన్ని వడ్డీకి; ఇచ్చువాఁడు= ఇచ్చేవాడు; గాయకుండు= పాటలు పాడి పొట్టగడుపుకొనేవాడు; గ్రామము పనిన్= ఊరి పనితో; కుడుచు+ఆతఁడు= జీవనం చేసేవాడు; గృహదాహి= ఇళ్ళకు నిప్పు పెట్టేవాడు; కుష్ఠముగల తనువు+ఆతఁడు= కుష్ఠ రోగంగల శరీరం ఉన్నవాడు; అఱు+తెవుల్ కొన్న+ఆతఁడు= క్షయరోగం కలవాడు; అఖిల వస్తువులును= అన్ని దినుసులను; అమ్మెడు+అతఁడు= అమ్మేవాడు; సోమమ్ము= యజ్ఞంలో ఉపయోగించే సోమరసాన్ని; విక్రయించిన+అతఁడు= అమ్మినవాడు; అబ్ధి సంచార లాభ+ఉపజీవకుండు= సముద్ర ప్రయాణాలతో కలిగిన లాభంతో బ్రతికేవాడు; ఉర్వీ+ఈశసేవకుండు= రాజు కొలువులో ఉన్నవాడు; భార్యయును= పెండ్లామును; తాను; పుత్రులన్= బిడ్డలను; పంచికొన్నవాఁడు= పంచుకొన్నవాడు; పసులన్= పశువులను; పెక్కు= ఎక్కువగా; ఏలెడువాఁడు= పాలించేవాఁడు; కపట కృత్యములన్= వంచన పనులతో; ద్రుచ్చిమిని= దొంగతనంతోను; శిల్పకృతులన్= నేర్పుగల పనులతోను; బ్రదుకువారు= జీవించేవారు; పంక్తిదూషకులు= పంక్తిని చెరచేవారు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! జూదగాడు, విషం పెట్టేవాడు, వేదం చదవనివాడు, వడ్డీవ్యాపారి, గాయకుడు, కరణం, ఇళ్ళు కాల్చేవాడు, కుష్ఠరోగి, క్షయరోగి, అన్ని వస్తువులను అమ్మేవాడు, సోమం అమ్మేవాడు, సముద్రవ్యాపారి, రాజోద్యోగి, భార్యా తనూ కన్నకొడుకులను పంచుకొన్నవాడు, వ్యాపారంకొరకు పశువులను పెద్ద సంఖ్యలో పెంచేవాడు, మోసం పనులు, దొంగతనం, శిల్పపు పనులు - వీటితో బ్రదుకు సాగించేవారూ పంక్తి దూషకులు అంటారు.'

విశేషం: యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహం అని బ్రాహ్మణుడికి వేదం నిర్ణయించిన కర్మలు ఆరు. వీటికి విరుద్ధమైనవన్నీ అతడికి దుష్టగుణాలుగా లెక్క. గాయకుడు, శిల్పి ఎట్లా దుష్టులు? అనే అనుమానం కలుగవచ్చును. కేవలం ఆత్మానందంకొరకు, ఇతరుల ఆనందంకొరకు మాత్రమే అయితే అవి దోషాలు కావు. అవి బ్రతుకు తెరువులయితే వాటివలన విహిత కర్మలు చెడతాయి కనుక అవి దోషాలు. భార్యా, తనూ, కొడుకులను పంచుకొనటం అంటే నిత్యమైన దాంపత్య ధర్మాన్ని చెరచటం. అది దోషం.

వ. అని చెప్పి వెండియు. 176

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా అంటున్నాడు.

క. 'తలఁ జీరసుట్టియును జె । ప్పులు దొడిగియుఁ జేసినట్టి భోజనము ఫలం
బలఘుచరిత! పద్మజుఁ డసు । రల భాగం బని విధించెఁ బ్రకటఫణితులన్. 177

ప్రతిపదార్థం: అలఘు చరిత!= గొప్పదైన ప్రవర్తన కలవాడా!; పద్మజుఁడు= బ్రహ్మ; తలన్= నెత్తికి; చీర= వస్త్రము; చుట్టియును= చుట్టుకొని; చెప్పులు= పాదరక్షలు; తొడిగియును= ధరించీ; చేసిన+అట్టి భోజనము ఫలంబు= చేసిన భోజనం ఫలం; అసురల భాగంబు= రాక్షసులకు చెందేది; అని; ప్రకట ఫణితులన్= స్పష్టమైన తీరులతో; విధించెన్= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: దొడ్డ నడవడికల రాజా! తలకు గుడ్డచుట్టి చెప్పులు వేసికొని చేసిన భోజనం ఫలం రాక్షసులకు చెందుతుందని బ్రహ్మ స్పష్టమైన పద్ధతులతో శాసించాడు.

విశేషం: ప్రధానంగా సందర్భాన్నిబట్టి పితృ కర్మలయందు అని సంభావించాలి. ఇతర సమయాలలో కూడా ఇది దోషమే.

తే. పలుదెఱంగుల వంటకంబులఁ బ్రమాద । జాతమై యశుచిత్వంబు సంభవించి
నప్పు డసురులు గొండ్రు క్రియా ఫలంబుఁ; । దిలలు పైఁ జల్ల నశుచిత దొలఁగు నండ్రు. 178

ప్రతిపదార్థం: పలు+తెఱంగులన్= పెక్కు విధాలుగా; వంటకంబులన్= శ్రాద్ధంకొరకు ఉంచిన భోజన పదార్థాలమీద; ప్రమాద జాతము+ఐ= పొరపాటువలన పుట్టినదై; అశుచిత్వంబు= మైల; సంభవించిన+అప్పుడు= కలిగినప్పుడు; క్రియా ఫలంబున్= అట్టి వంటకాలతో చేసిన శ్రాద్ధ కర్మల ఫలితాన్ని; అసురులు= రాక్షసులు; కొంద్రు= గ్రహిస్తారు; పైన్= మీద; తిలలు= నువ్వులు; చల్లన్= చల్లితే; అశుచిత= అశుభ్రత; తొలఁగును= పోతుంది; అండ్రు= అంటారు.

తాత్పర్యం: వంటకాలమీద ఎన్నో విధాలుగా మైల సోకవచ్చు. అట్టి వాటితో పితృకర్మంచేస్తే ఆ ఫలం రాక్షసులు దక్కించుకొంటారు. ఆ వంటకాలమీద నువ్వులు చల్లితే ఆ అశుచిత్వం పోతుం దంటారు.

విశేషం: మైలపడ్డ వంటకాలతో శ్రాద్ధం చేయటం వ్యర్థమే కాదు అనర్థదాయకం కూడా అవుతుందని భావం.

క. శాంతుఁడు సువ్రతశీలుఁడు । దాంతుం డధ్యాపకుండు దయగలవాఁ డ
త్యంత ప్రబోధ సంప । ద్వంతుఁడు పావనులు భూపవర! పంక్తులకున్. 179

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; శాంతుఁడు= మనస్సును నిలువరించినవాడు; సువ్రతశీలుఁడు= చక్కని వ్రతములు చేసే స్వభావం కలవాడు; దాంతుండు= ఇంద్రియాలపై అదుపు గలవాడు; అధ్యాపకుండు= వేదం చదివించేవాడు; దయగలవాఁడు= ప్రాణులయందు జాలిగలవాడు; అత్యంత ప్రబోధ, సంపద్వంతుఁడు= మిక్కిలి ఎక్కువ అయిన జ్ఞానమనే సంపదగలవాడు; పంక్తులకున్= శ్రాద్ధ భోజనపు వరుసలకు; పావనులు= పవిత్రులు.

తాత్పర్యం: రాజా! శాంతుడు, వ్రతశీలుడు, దాంతుడు, వేదం బోధించేవాడు, ప్రాణులయందు జాలిగలవాడు, పండిన జ్ఞానసంపద గలవాడూ శ్రాద్ధభోజన పంక్తులలో పవిత్రులు.

విశేషం: అంతరింద్రియ నిగ్రహం శాంతి, బహిరింద్రియ నిగ్రహం దాంతి; ప్రబోధం అంటే జ్ఞానం. మోక్ష విషయకమైన బుద్ధి.

క. వ్యాకరణ ధర్మశాస్త్ర వి । వేకములుఁ బురాణజాత వేదిత్వము బ్ర
హ్మైకత్వ బోధనము నధి । పా! కలిగినవారు పంక్తిపావనులు గడున్. 180

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వ్యాకరణ ధర్మశాస్త్ర వివేకములు= శబ్దశాస్త్రం, ధర్మశాస్త్రం అనే వాటిలో ప్రజ్ఞ; పురాణజాత వేదిత్వము= పురాణాల సముదాయం తత్త్వపూర్వకంగా తెలిసి ఉండటమూ; బ్రహ్మ+ఏకత్వ బోధనము= బ్రహ్మం ఒకటే అనే జ్ఞానమూ; కలిగినవారు= ఉన్నవారు; కడున్= ఎక్కువగా; పంక్తి పావనులు= పంక్తిని పవిత్రం చేసేవారు.

తాత్పర్యం: వ్యాకరణజ్ఞానమూ, ధర్మశాస్త్రజ్ఞానమూ, పురాణజ్ఞానమూ, పరమాత్మజ్ఞానమూ కలవారు మిక్కిలిగా పంక్తి పావనులు.

విశేషం: వ్యాకరణం శబ్ద బ్రహ్మమును గురించి చెప్పుతుంది. ధర్మశాస్త్రం చేయదగినవాటినీ, చేయరానివాటినీ తెలపటం ద్వారా ఉత్తమత్వాన్ని కలిగిస్తుంది. పురాణాలు వేదార్థాలను చక్కగా వివరిస్తాయి. ఇవి క్రమంగా ఒక దానిద్వారా మరొకటి పుష్టిని పొంది బ్రహ్మజ్ఞానానికి సహకరిస్తాయి. బ్రహ్మజ్ఞానం తుదిమెట్టు. తక్కినవి వరుసగా దానికి పూర్వంలో ఉండే సోపానాలు.

తే. మేలి గుణములు గనియు నమిత్రజనము । శ్రాద్ధ పాత్రంబుఁ జేయంగఁ జన దమిత్ర
దత్తమైనది భస్మహుతంబుఁ జౌట । నిడిన విత్తును బోలెనై చెడు నృపాల! 181

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; మేలిగుణములు= ఉత్తమ గుణాలు; కనియును= చూచికూడా; అమిత్రజనమున్= మైత్రిలేని జనాన్ని; శ్రాద్ధ పాత్రంబున్= పితృకర్మలో తగినదిగా; చేయంగన్+చనదు= చేయరాదు; అమిత్రదత్తము= పగవారికి ఇచ్చింది; ఐన+అది= అయిన వస్తువు; భస్మహుతంబున్= బూడిదలో వేసిన హోమ ద్రవ్యమున్నూ; చౌటన్= చవిటినేలలో; ఇడిన విత్తును పోలెన్= పెట్టిన విత్తనంవలె; ఐ= అయి; చెడున్= చెడిపోతుంది.

తాత్పర్యం: రాజా! మంచిగుణాలు ఉన్నా పగవారిని శ్రాద్ధంలో పాత్రం చేయరాదు. పగవారికి ఇచ్చినది బూడిదలో వేసిన హోమద్రవ్యంవలె, చవిటినేలలో విత్తిన బీజంవలె చెడిపోతుంది.

విశేషం: అలం: ఉపమ. "ఏకక్రియం భవేన్మిత్రమ్" - ఒకే విధమైన పనులతో కలసిమెలసి ఉండేవారిని మిత్రము అంటారు. పనులలో విరుద్ధంగా నడచేవారు అమిత్రులు. వారు శ్రాద్ధంలో పంక్తికి పనికిరారు.

క. మును ముట్ట నెఱిఁగి శ్రాద్ధం । బునకుం గైకొనుట మేలు భూసురునిం గై
కొని యరసి కాఁ డనిన నా । తని యుమ్మలికంబు సెఱుచు ధార్మికు నైనన్. 182

ప్రతిపదార్థం: భూసురునిన్= బ్రాహ్మణుడిని; మును= ముందుగానే; ముట్టన్= పూర్తిగా; ఎఱిఁగి= తెలిసికొని; శ్రాద్ధంబునకున్= పితృయజ్ఞానికి; కైకొనుట= గ్రహించటం; మేలు= మంచిది; కైకొని= గ్రహించి; అరసి= తరువాత పరీక్షించి; కాఁడు= పనికిరాడు; అనినన్= అంటే; ఆతని+ఉమ్మలికంబు= ఆ బ్రాహ్మణుడి గుండెదిగులు; ధార్మికుని+ఐనన్= ధర్మం తప్పక నడచుకొనే వాడినైనా; చెఱుచున్= చెడగొట్టుతుంది.

తాత్పర్యం: యోగ్యతను ముందే కడదాకా పరీక్షించి బ్రాహ్మణుడిని నియోగించటం మంచిది. అట్లాకాక నియోగించిన తరువాత పరీక్షించి పనికిరాడంటే అతడి వేదన ఎంత ధర్మాత్ముడినైనా పాడుచేస్తుంది.

విశేషం: ఇది చాలా సుకుమారమైన విషయం. పిలిచి అవమానిస్తే ఆ దోషం తనకే త్రిప్పికొడుతుందని గుర్తించి జాగ్రత్త పడాలి.

క. ఈ తెఱఁగు లెల్ల నెఱిఁగి సు । నీతంబుగ శ్రాద్ధ మధిక నియతి నడపు ని
ర్ధూత దురితుండు నడచుఁ బ్రి । యాతిశయం బెసఁగ దేవయానమున నృపా!' 183

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; ఈ తెఱఁగులు= ఈ పద్ధతులు; ఎల్లన్= అన్నింటినీ; ఎఱిఁగి= తెలిసికొని; శ్రాద్ధము= పితృయజ్ఞాన్ని; అధిక నియతిన్= ఎక్కువ నిష్ఠతో; సునీతంబుగన్= చక్కగా చేసిన దానినిగా; నడపు నిర్ధూత దురితుండు= నడపునట్టి పూర్తిగా తొలగిపోయిన పాపాలు కలవాడు; ప్రియ+అతిశయంబు= సంతోషం యొక్క ఎక్కువతనం; ఎసఁగన్= వృద్ధిపొందగా; దేవయానమునన్= దేవతల దారిలో; నడచున్= ప్రయాణిస్తాడు.

తాత్పర్యం: రాజా! ఈ పద్ధతులన్నీ చక్కగా తెలిసికొని గొప్ప నిష్ఠతో శ్రాద్ధం చక్కగా ఆచరించే పాపరహితుడు సంతోషం ఉప్పొంగుతుండగా దేవమార్గంలో ప్రయాణిస్తాడు.'

విశేషం: సునీతము. అధిక నియత అనే పదాలు శ్రద్ధ సడలనీయని లక్షణానికి వ్యంజకాలు.

వ. అని చెప్పి శాంతనవుండు కౌంతేయాగ్రజునితో మఱియు నిట్లను 'బ్రహ్మమానస పుత్త్రుండగు నత్రిమునీంద్రు వంశంబునకుం దొడవగు దత్తాత్రేయ నందనుండు నిమినామధేయుండగు సంయమి కొడుకు శ్రీమంతుండను పేరివాఁడు మృతుం డగుటయు. 184

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పి= తెలియజేసి; శాంతనవుండు=శంతనుడి కొడుకు భీష్ముడు; కౌంతేయ+అగ్రజునితోన్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజుతో; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్తున్నాడు; బ్రహ్మ మానస పుత్త్రుండు= బ్రహ్మమనస్సునుండి పుట్టిన కొడుకు; అగు అత్రి ముని+ఇంద్రు వంశంబునకున్= అయిన అత్రి మహర్షి వంశానికి; తొడవు+అగు= ఆభరణం అగు; దత్తాత్రేయ నందనుండు= అయిన దత్తాత్రేయుడి కొడుకు, నిమినామధేయుండు= నిమి అనే పేరుగలవాడు; అగు సంయమి కొడుకు= అయిన మహర్షి పుత్రుడు; శ్రీమంతుండు+అను పేరివాఁడు= శ్రీమంతుడనే పేరుగలవాడు; మృతుండు= చనిపోయినవాడు; అగుటయున్= కాగా.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి భీష్ముడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. 'బ్రహ్మదేవుడి మానసపుత్రుడు అత్రిమహర్షి వంశానికి అలంకారం అనదగిన దత్తాత్రేయుడి కుమారుడు నిమి. అతడి కొడుకు శ్రీమంతు డనేవాడు చనిపోయాడు.

విశేషం: మానసపుత్రుడు - సంకల్పమాత్రంచేత పుట్టినవాడు. సనక సనందనాదులు కూడా ఇట్టివారే.

ఇతిహాసాలు ధర్మవిషయాలను సూటిగా చెప్తుతాయి. అవి హృదయంలో చక్కగా నాటుకొనటానికి కొన్ని కథలమీద సమన్వయించి చూపుతాయి. ఇది అట్టి కథలలో ఒకటి.

క. నిమి యక్కుమారునకు శ్రా । ద్ధము సేయుచు నుండి భక్తిఁ దలఁచినఁ గృప న
త్రిమునీంద్రుఁడు వచ్చి క్రియా । సమీక్షణము సేసె మది నెసఁగు నర్మిలితోన్. 185

ప్రతిపదార్థం: నిమి= నిమిమహర్షి; ఆ+కుమారునకున్= ఆ చనిపోయిన కొడుకునకు; శ్రాద్ధము= పితృయజ్ఞం; చేయుచున్= చేస్తూ; ఉండి; భక్తిన్= భక్తితో; తలఁచినన్= భావించగా; కృపన్= దయతో; అత్రి ముని+ఇంద్రుఁడు= అత్రి మహర్షి; వచ్చి= ఏతెంచి; మదిన్= హృదయంలో; ఎసఁగు= వృద్ధిపొందే; అర్మిలితోన్= ప్రేమతో; క్రియా సమీక్షణము= కర్మయొక్క బాగోగుల పరీక్షను; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: నిమి ఆ కొడుకుకు శ్రాద్ధం చేస్తూ భక్తితో తలచినంతనే అత్రి మహర్షి దయతో వచ్చి పెరుగుతున్న ప్రేమతో కార్యకలాపాన్ని చక్కగా పరికించాడు.

వ. అట్లు పావక క్రియా కలాపం బనుసంధించి యా సంయమివరుండు. 186

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; పావక క్రియా కలాపంబు= పవిత్రం చేసే పనుల సముదాయాన్ని; అనుసంధించి= చక్కగా సమన్వయించి; ఆ సంయమి వరుండు= ఋషిశ్రేష్ఠుడైన ఆ అత్రి.

తాత్పర్యం: ఆ పవిత్ర క్రియా సముదాయాన్నంతా చక్కగా భావించి యా మహర్షి శ్రేష్ఠుడు.

అత్రిమహాముని నిమి కెఱింగించిన శ్రాద్ధక్రియా విశేషము (సం.13-91-3)

ఆ. 'పరిగృహీతు లైన బ్రాహ్మణుల్ పంక్తి పా । వన వరిష్ఠు లగుట, వారి కిడిన
దర్భ విష్టరములు దక్షిణావర్తంబు । లగుటఁ గ్రియలు దిలసమగ్ర లగుట. 187

ప్రతిపదార్థం: పరిగృహీతులు= శ్రాద్ధమునకు ఎన్నుకొని తెచ్చినవారు; ఐన బ్రాహ్మణుల్= అయిన విప్రులు; పంక్తి పావన వరిష్ఠులు= వరుసను పవిత్రం చేసేవారిలో మిక్కిలి గొప్పవారు; అగుటన్= కావటాన్నీ, వారికిన్= వారికై; ఇడిన= పెట్టిన; దర్భ విష్టరములు= దర్భల ఆసనాలు; దక్షిణ+ఆవర్తంబులు= కుడివైపు మలగినవి; అగుటన్= కావటాన్ని; క్రియలు= ఆయా కర్మ విశేషాలు; తిల సమగ్రలు= నువ్వులు నిండుగా కలవి; అగుటన్= కావటాన్నీ.

తాత్పర్యం: ఎన్నుకొని తెచ్చిన బ్రాహ్మణులు పంక్తి పావనులలో మిక్కిలి శ్రేష్ఠులు కావటం, వారికై పెట్టిన దర్భ ఆసనాలు కుడివైపు మలగినవి కావటం, క్రియలన్నీ నువ్వులతో నిండుదనం కలవి కావటమూ (190వ పద్యంలోని 'ఉగ్గడించి సంభావించెన్' అనే దానితో అన్వయం).

క. అమలినతర దర్భన్యా । సము లెందును దక్షిణంబు సాఁగ నిడిన య
గ్రములు గలిగి యుండుట మం । త్రము లయ్యె విధుల కంచితముగ నడచుటన్. 188

ప్రతిపదార్థం: అమలిన తర దర్భ న్యాసములు= మిక్కిలి స్వచ్ఛములైన దర్భలు ఉంచుటలు; ఎందును= అన్ని చోట్ల; దక్షిణంబు= కుడివైపుగా; సాఁగన్= వ్యాపించేటట్లు; ఇడిన+అగ్రములు= ఉంచిన చివళ్ళు; కలిగి+ఉండుట= కలిగి ఉండటాన్ని; మంత్రములు= వేదమంత్రాలు; ఆ+ఆ విధులకున్= ఆయా శాస్త్ర విధానములకు; అంచితముగన్= చక్కగా కుదిరేటట్లుగా; నడచుటన్= వర్తించటాన్ని.

తాత్పర్యం: స్వచ్ఛమైన దర్భలు ఉంచిన పద్ధతి కుడివైపు సాగిన చివళ్ళు కలిగి ఉండటాన్నీ, మంత్రాలు ఆయా పనులకు తగినట్లుగా నడవటాన్నీ.

ఆ. మునగ యుల్లి యడవి మునగ దుర్మాంసము । లానుగమ్ము మలినమైన యుప్పు
కటియ జీలకఱ్ఱ కటివేము గురుజ యిం । గువ ప్రవర్జనీయ కోటి యగుట. 189

ప్రతిపదార్థం: మునగ= మునగకూర; ఉల్లి= ఎర్రగడ్డలు, తెల్ల గడ్డలు; అడవి మునగ= అడవి మునగ అనే శాకము; దుర్మాంసములు= చెడిన మాంసములు; ఆనుగమ్ము= సొరకాయ; మలినము+ఐన ఉప్పు= చెడిన ఉప్పు; కటియ జీలకఱ్ఱ= నల్లని జీలకర్ర, కటివేము= కరివేపాకు; గురుజ= ఉత్తుండి అనే ఆకుకూర; ఇంగువ= ఇంగువ అనేవి; ప్రవర్జనీయ కోటి= బొత్తుగా విడువదగిన వస్తువుల సముదాయం; అగుటన్= కావటాన్ని.

తాత్పర్యం: ఆ శ్రాద్ధంలో మునగ, ఉల్లి, అడవి మునగ, చెడుమాంసాలు, సొరకాయ, మలినమైన ఉప్పు, నల్లజీలకర్ర, కరివేపాకు, గురజాకు, ఇంగువ అనే వస్తువులు పూర్తిగా విడచి వేసిన సంగతిని (సంభావించాడు).

క. శునకంబు రజస్వల యగు । వనిత పతితుఁ దంత్యజాతి వాఁ డా క్రియ ప
ట్టున కెయిది తవులఁ జేరక । చనఁ జేయుట నుగ్గడించి సంభావించెన్. 190

ప్రతిపదార్థం: శునకంబు= కుక్క; రజస్వల+అగు వనిత= ముట్టైన స్త్రీ; పతితుఁడు= చెడునడవడి కలవాడు; అంత్యజాతివాఁడు= శూద్రుడు; ఆ క్రియ పట్టునకున్= ఆ శ్రాద్ధకర్మ జరుగుతున్న చోటికి; ఎయిది= వెంటబడి; తవులన్+చేరక= సమీపించక; చనన్+చేయుటన్= పోయేటట్లు చేయటాన్నీ; ఉగ్గడించి= వివరించి చెప్పి; సంభావించెన్= కొనియాడాడు.

తాత్పర్యం: కుక్క, ముట్టుత, భ్రష్టుడు, శూద్రుడు, ఆ శ్రాద్ధం జరిగే తావులో తిరుగకుండా చూచుకొనటాన్ని వివరించి చెప్పి కొనియాడాడు.

విశేషం: ఇవన్నీ అక్కడ ఉన్నవి ఉండవలసిన తీరులో ఉండటం, ఉండరానివి ఉండకపోవటం అనే విషయాలను మనం ఉపదేశాలుగా గ్రహించాలి. (187-190)

క. కావున శ్రాద్ధక్రియలకు । భూ వల్లభ! యట్టి భంగి పూజ్యత నిచ్చుం
దా వినిపించెం బితృదే । వావలి నత్రి నిజవంశుఁ డగు నిమికిఁ దగన్. 191

ప్రతిపదార్థం: కావునన్= కనుక; భూవల్లభ!= రాజా!; శ్రాద్ధ క్రియలకున్= పితృదేవతల అర్చన పనులకు; అట్టి భంగి= ఆ పద్ధతి; పూజ్యతన్= మన్ననను; ఇచ్చున్= ఇస్తుంది; అత్రి= అత్రి మహర్షి; తాన్= తాను; నిజవంశుఁడు= తనవంశంలోనివాడు; అగు నిమికిన్= అయిన నిమికి; తగన్= చక్కగా; పితృదేవ+ఆవలిన్= పితృదేవతల వరుసను గూర్చి; వినిపించెన్= వినిపించాడు.

తాత్పర్యం: కాబట్టి భూపాలా! శ్రాద్ధక్రియలకు ఇట్టి విధానం ఎంతో మన్నన నిస్తుంది. అత్రి మహర్షి తనవంశం వాడైన నిమికి పితృదేవత లెవరెవరో చక్కగా తెలియజేశాడు.

వ. అత్తెఱం గెఱింగించెద నత్రి నిమితో నిట్లను శ్రాద్ధంబున నర్యమవరుణ సోమాగ్నులకు భాగంబులు బ్రహ్మ కల్పించె; విశ్వలగు దేవతలు పితృదేవతలతోఁ గూడం దత్క్రియోప యోగ్యతం దోఁతురు వారలకును భాగకల్పనం బొనరించె; దేవతలయందుఁ గొందఱ నూష్మపులయిన మహాభాగులం బితృత్వ నిర్దేశంబున నేర్పరించె; నవ్విరించి వివరించిన నామంబులు సెప్పెద వినుము; బలుండు ధృతి విపాప్ముండు పుణ్యకృత్తు పావనుండు పార్ష్ణిక్షేముండు సమూహుండు దివ్యసానువు వివస్వంతుండు వీర్యవంతుండు హ్రీమంతుండు కీర్తిమంతుండు, కృతుండు విద్యుద్వర్చసుండు సోమవర్చసుండు, సూర్యశ్రీ సోమపుండు సూర్యసావిత్రుండు దత్తాత్ముండు పుండరీయకుం డుష్ణినాభుండు నభోదుండు విశ్వాయువు దీప్తి చమూహరుండు సురేశుండు వ్యోమారి శంకరుండు భవుం డీశుండు కర్తకృతి దక్షుండు భువనుండు దివ్యకర్మకృత్తు గణితుండు పంచవీర్యుం డాదిత్యుండు రశ్మిమంతుండు సప్తకృత్తు సోమపూర్వుండు విశ్వకృత్తు కవి యనుగోప్త సుగోప్త నప్త యీశ్వరుండు జితాత్ముండు మునివీర్యుండు దీప్తరోముండు భయంకరుం డను కర్ముండు ప్రతీతుండు ప్రదాత యంశుమంతుండు శైలాభుండు పరమక్రోధి ధీరోష్ణి భూపతి స్రజుండు వజ్రి వరి వీరలు భాగార్హులని చెప్పి వెండియు. 192

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు = ఆ పద్ధతి; ఎఱింగించెదన్= వివరిస్తాను; అత్రి= అత్రి మహర్షి; నిమితోన్= నిమితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; బ్రహ్మ= సృష్టికర్త; శ్రాద్ధంబునన్= శ్రాద్ధంలో; అర్యమ వరుణ సోమ+అగ్నులకున్= సూర్యుడు, వరుణుడు, చంద్రుడు, అగ్ని అనేవారికి; భాగంబులు= పాళ్ళు; కల్పించెన్= ఏర్పాటు చేశాడు; విశ్వలు= విశ్వలనే పేరుగల (విశ్వ శబ్దానికి సర్వులు అనే అర్థం కూడా ఉన్నది); అగు దేవతలు= దివిజులు; పితృదేవతలతోన్= పితృదేవతలతో; కూడన్= కలిసి; తత్+క్రియా+ఉపయోగ్యతన్= ఆ శ్రాద్ధపుపనిలో ఉపయోగింపబడటంతో; తోఁతురు= కానవస్తారు; వారలకును= ఆ విశ్వదేవులనే వారికి కూడా; భాగకల్పనంబు= పాళ్ళ ఏర్పాటు; ఒనరించెన్= చేశాడు; దేవతలయందున్= దేవతలతోను, ఊష్మపులు= వేడిని పీల్చేవారు; అయిన మహాభాగులన్= అయిన గొప్పవారిని; కొందఱన్= కొందరిని; పితృత్వ నిర్దేశంబునన్= పితృదేవతలనే పేరుతో; ఏర్పరించెన్= ఏర్పాటు చేశాడు; ఆ+విరించి= ఆ బ్రహ్మ; వివరించిన నామంబులు= తెలిపిన పేర్లు; చెప్పెదన్= చెప్పుతాను; వినుము; బలుడు, ధృతి, విపాప్ముడు, పుణ్యకృత్తు, పావనుడు, పార్ష్ణిక్షేముడు, సమూహుడు, దివ్యసానువు, వివస్వంతుడు, వీర్యవంతుడు, హ్రీమంతుడు, కీర్తిమంతుడు, కృతుడు, విద్యుద్వర్చసుడు, సోమవర్చసుడు, సూర్యశ్రీ, సోమపుడు, సూర్యసావిత్రుడు, దత్తాత్ముడు, పుండరీయకుడు, ఉష్ణినాభుడు, నభోదుడు, విశ్వాయువు, దీప్తిచమూహరుడు, సురేశుడు, వ్యోమారి, శంకరుడు, భవుడు, ఈశుడు, కర్తకృతి, దక్షుడు, భువనుడు, దివ్యకర్మకృత్తు, గణితుడు, పంచవీర్యుడు, ఆదిత్యుడు, రశ్మిమంతుడు, సప్తకృత్తు, సోమపూర్వుడు, విశ్వకృత్తు, కవి, అనుగోప్త, సుగోప్త, నప్త, ఈశ్వరుడు, జితాత్ముడు, మునివీర్యుడు, దీప్తరోముడు, భయంకరుడు, అనుకర్ముడు, ప్రతీతుడు, ప్రదాత, అంశుమంతుడు, శైలాభుడు, పరమక్రోధి, ధీరోష్ణి, భూపతి, స్రజుడు, వజ్రి, వరి - ఈ పేర్లున్న వీరలు= ఈ చెప్పినవారు; భాగ+అర్హులు= శ్రాద్ధఫలంలో భాగం పొందటానికి; అర్హత కలవారు; అని; చెప్పి= వివరించి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ విధానం చెప్పుతాను అని అత్రి నిమితో ఇట్లా అన్నాడు. 'బ్రహ్మ సూర్యుడికి, వరుణుడికి, చంద్రుడికి, అగ్నికి శ్రాద్ధఫలంలో భాగాలు ఏర్పరచాడు. విశ్వేదేవతలు, పితృదేవతలతో కలిసి ఆ పనిలో ఉపయోగ పడతారు. కనుక వారికి కూడా పాళ్ళు ఏర్పాటు చేశాడు. దేవతలలో కూడా ఊష్మపులనే దొడ్డవారున్నారు. వారిని కూడా పితృదేవతలుగా విభాగం చేశాడు. బ్రహ్మ వివరించిన ఆ పేర్లు చెప్పుతాను వినుము; బలుడు, ధృతి, విపాప్ముడు, పుణ్యకృత్తు, పావనుడు, పార్ష్ణిక్షేముడు, సమూహుడు, దివ్యసానువు, వివస్వంతుడు, వీర్యవంతుడు, హ్రీమంతుడు, కీర్తిమంతుడు, కృతుడు, విద్యుద్వర్చసుడు, సోమవర్చసుడు, సూర్యశ్రీ, సోమపుడు, సూర్యసావిత్రుడు, దత్తాత్ముడు, పుండరీయకుడు, ఉష్ణినాభుడు, నభోదుడు, విశ్వాయువు, దీప్తిచమూహరుడు, సురేశుడు, వ్యోమారి, శంకరుడు, భవుడు, ఈశుడు, కర్తకృతి, దక్షుడు, భువనుడు, దివ్యకర్మకృత్తు, గణితుడు, పంచవీర్యుడు, ఆదిత్యుడు, రశ్మిమంతుడు, సప్తకృత్తు, సోమపూర్వుడు, విశ్వకృత్తు, కవి, అనుగోప్త, సుగోప్త, నప్త, ఈశ్వరుడు, జితాత్ముడు, మునివీర్యుడు, దీప్తరోముడు, భయంకరుడు, అనుకర్ముడు, ప్రతీతుడు, ప్రదాత, అంశుమంతుడు, శైలాభుడు, పరమక్రోధి, ధీరోష్ణి, భూపతి, స్రజుడు, వజ్రి, వరి - వీరుకూడా పితృయజ్ఞ ఫలంలో భాగం పొందువారని చెప్పి ఇంకా ఈ విధంగా చెప్పాడు.

క. గిరివన దుర్గము లందును । సరి దుత్తరణంబు నపుడు శ్రాద్ధ విధి సమా
చరణ సమయమున వీరిం । బరికీర్తించిన యతండు వడయు శుభంబుల్. **193**

ప్రతిపదార్థం: గిరి వన దుర్గము లందును= కొండలలో, అడవులలో, పోరానితావులలో, సరిత్+ ఉత్తరణంబు+అపుడు= నదులు దాటే వేళలలో, శ్రాద్ధవిధి సమాచరణ సమయమునన్= పితృయజ్ఞం చేసేవేళలలో; వీరిన్= ఈ ఊష్మపులనే దేవతలను; పరికీర్తించిన+ అతండు= చక్కగా స్తుతించినవాడు; శుభంబుల్= శుభాలను; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: కొండలలో అడవులలో పోవశక్యంగాని తావులలో నదులు దాటే వేళలలో శ్రాద్ధసమయాలలో వీరిని స్తుతించిన నరుడు శుభాలను పొందుతాడు.

విశేషం: వీరి అనుగ్రహంవలన ప్రమాదాలు రాకుంటాయి అని భావం.

ఆ. పూరిపంట ప్రాలు నారుగబియ్యంబు । జంబువున ఫలంబు శ్రాద్ధ కృతికిఁ
గావు తుమ్మ నేడ్వఁగాదు శ్రాద్ధ క్రియా । చరణ సమయములఁ బ్రశాంతివలయు.' 194

ప్రతిపదార్థం: పూరిపంట ప్రాలు= పూరిపంట బియ్యం; ఆరుగ బియ్యంబు= ఆరుగల బియ్యం; జంబువున ఫలంబు= నేరేడు పండు; శ్రాద్ధకృతికిన్= శ్రాద్ధం పనికి; కావు= పనికి రావు; శ్రాద్ధ క్రియా+ఆచరణ సమయములన్= శ్రాద్ధకర్మ చేసే సమయాలలో; తుమ్మన్= తుమ్మటం; ఏడ్వన్= ఏడవటం; కాదు= కూడదు; ప్రశాంతి= చక్కని శాంతి; వలయున్= కావాలి.

తాత్పర్యం: గడ్డిపంటల ధాన్యాలు, ఆరుగలు, నేరేడు పండు శ్రాద్ధానికి పనికిరావు. శ్రాద్ధసమయంలో తుమ్మటం, ఏడవటం కూడదు. ప్రశాంతి కావాలి.

విశేషం: 'తుమ్మటం' అప్రయత్నంగా వస్తుంది. దానిపై అదుపు ఉండకపోవచ్చు. అట్టి సందర్భంలో శ్రాద్ధ స్థానం నుండి దూరంగా వెళ్ళి ఆ పని చేసి మరల రావలసి ఉంటుంది. ప్రశాంతి ఉద్వేగం, ఆరాటం మొదలైన లక్షణాలు లేకుండా ఉండటం. కోపతాపాలను రాకుండా చూచుకొనటం మొదలగునవి.

వ. అనియునుం జెప్పె నని చెప్పి, సరిత్సూనుండు ధర్మజుతో మఱియు నిట్లనియె. 195

ప్రతిపదార్థం: అనియునున్= అనికూడా; చెప్పెన్= (అత్రి నిమితో) చెప్పాడు; అని; చెప్పి= తెలియజేసి; సరిత్+సూనుండు= నది కొడుకు భీష్ముడు; ధర్మజుతోన్= ధర్మరాజుతో; మఱియున్; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అత్రి ఈ విషయాలు కూడా చెప్పాడని భీష్ముడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'ఒకతఱి మునివర్యు లొక్కటఁ బెక్కండ్రు । శ్రాద్ధముల్ సేయ భోజ్యములు పెక్కు
లనుభవించుటఁ దమ కఱుగమి పుట్టుట । యును, బితృదేవతల్ సనిరి సోము
కడ, కట్లు సని తమ కాఱియ సెప్పిన । నతఁడు 'పద్మజుపాలి కరుగుఁ' డనియె;
వా రట్లు కా కని బోరన నరిగి ప । ద్మజునిఁ గాంచి యజీర్ణ దశ యెఱుంగ

తే. విన్నవించినఁ, దనయొద్ద వెలుఁగుచున్న । యగ్నిఁ జూపి 'యిక్కీ డితం డపహరించు'
ననిన నగ్ని 'మత్సహితులై కొనిన నఱుగఁ । జేయువాఁడ నాహారముల్ సిద్ధ మదియు. 196

ప్రతిపదార్థం: ఒకతఱిన్= ఒకప్పుడు; మునివర్యులు= మునిశ్రేష్ఠులు; పెక్కండ్రు= చాలామంది; ఒక్కటన్= ఒకేసారి; శ్రాద్ధముల్= పితృయజ్ఞాలు; చేయన్= చేయగా; భోజ్యములు= ఆహారపదార్థాలు; పెక్కులు= చాలా; అనుభవించుటన్= తినగా; తమకున్= తమకు; అఱుగమి= అరగకపోవటం; పుట్టుటయును= పుట్టగా; పితృదేవతల్= పితృదేవతలు; సోము కడకున్= చంద్రుడి దగ్గరకు; చనిరి= వెళ్ళారు; అట్లు= ఆ విధంగా; చని= వెళ్ళి; తమ కాఱియ= తమ వేదనను; చెప్పినన్= చెప్పగా; అతఁడు= ఆ చంద్రుడు; పద్మజు పాలికిన్= బ్రహ్మదగ్గరకు; అరుగుఁడు= వెళ్ళండి; అనియెన్= అన్నాడు; వారు= ఆ

పితృదేవతలు; అట్లు+అ= అట్లే; కాక= అగుగాక; అని; బోరనన్= గబగబా; అరిగి= వెళ్ళి; పద్మజునిన్= బ్రహ్మను; కాంచి= చూచి; అజీర్ణదశ= అరుగని స్థితిని; ఎఱుంగన్= తెలిసే విధంగా; విన్నవించినన్= మనవిచేయగా; తన+ఒద్దన్=తనకడ; వెలుఁగుచున్న+అగ్నిన్= ప్రకాశిస్తున్న అగ్ని దేవుడిని; చూపి= చూపించి; ఈ+కీడు= ఈ ఆపదను; ఇతండు= ఈ అగ్ని; అపహరించున్= తొలగిస్తాడు; అనినన్= అంటే; అగ్ని= అగ్నిదేవుడు; మత్+సహితులు+ఐ= నాతో కలిసి ఉన్నవారై; కొనినన్= ఆహారం తీసికొన్నట్లయితే; ఆహారముల్= భోజనాలను; అఱుగన్+ చేయువాఁడన్= జీర్ణంచేస్తాను; అదియున్= అది; సిద్ధము= ఏర్పాటు.

తాత్పర్యం: ఒకసారి చాలమంది మునులు ఒకే సమయంలో శ్రాద్ధాలు చేశారు. భోజన పదార్థాలు ఎక్కువగా తినటంవలన పితృదేవతలకు అగ్నిమాంద్యం (అజీర్ణం అనే జబ్బు) కలిగింది. వారంతా చంద్రుడి దగ్గరకు పోయి తమగోడు విన్నవించుకొన్నారు. చంద్రుడు 'మీరు బ్రహ్మ దగ్గరకు పొండి' అన్నాడు. వా రట్లాగే అని వడివడిగా వెళ్ళి బ్రహ్మను చూచి తమ అజీర్తి విషయం చెప్పారు. ఆయన తన దగ్గర నున్న అగ్నిని చూపి 'ఈ ఆపదను ఇతడు తొలగిస్తాడు' అన్నాడు. అగ్ని 'ఇకపైన మీరు ఆహారాలను నాతో కలిసి తీసికొంటే నేను వాటిని అరిగిస్తాను. ఇది సిద్ధమైన మాట' అన్నాడు.

విశేషం: చంద్రుడికి ఓషధీశుడని పేరు. ఓషధులు రోగాలను తొలగిస్తాయి. అందుకని ముందు పితృదేవతలు అతడి దగ్గరకు వెళ్ళారు. చంద్రుడు బహుశః శాశ్వతమైన ఏర్పాటు కొరకు బ్రహ్మ దగ్గరకు పంపిఉంటాడు.

క. అని పలికినఁ బితృదేవత । లనలుఁడు ముఖ్యుఁడుగ నెపుడు నాహారంబుల్
గొని సుఖ జీర్ణానందం । బు నొందుదురు సూవె భరతభూపవరేణ్యా! 197

ప్రతిపదార్థం: భరత భూపవరేణ్యా!= భరతవంశ రాజులలో ఎన్నదగినవాడా!; అని; పలికినన్= అనగా; పితృదేవతలు; అనలుఁడు= అగ్ని; ముఖ్యుఁడుగన్= ప్రధానుడుగా; ఎపుడున్= ఎల్లవేళలా; ఆహారంబుల్= భోజనాలను; కొని= గ్రహించి; సుఖ జీర్ణ+ఆనందంబున్= సుఖంగా అరగటంవలన కలిగే ఆనందాన్ని; ఒందుదురు= పొందుతున్నారు; చూవె!= సుమా!

తాత్పర్యం: రాజా! అగ్ని ఇట్లా అంటే పితృదేవతలు అగ్నిని ముందుంచుకొని భోజనాలు చేసి సుఖంగా జీర్ణించుకొని ఆనందం పొందుతున్నారు.

విశేషం: "అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్".

అని గీత - పరమాత్ముడే సర్వప్రాణులలో వైశ్వానరాగ్ని రూపంలో ఉండి నాలుగు విధాలైన పదార్థాలను జీర్ణం చేస్తున్నాడన్న భావాన్ని ఇక్కడ అనుసంధించుకొనవచ్చును. అనలుడు అంటే అలమ్ చాలు అననివాడు. ఎంత పదార్థాన్నైనా కాల్చి వేయగలవాడని ఇక్కడ ఈ శబ్దాన్ని సాభిప్రాయంగా వాడారు.

క. కావున సాగ్నికుఁడయి తగ । నే వాఁడొనరించు శ్రాద్ధ మీడ్యం బది; సం
భావింతురు పెద్దయుఁ బితృ । దేవత లసురులకు రాదు తేఱియుఁ జూడన్. 198

ప్రతిపదార్థం: కావునన్= కనుక; ఏవాఁడు= ఎవ్వడు; స+అగ్నికుఁడు+అయి= అగ్ని కలవాడై; శ్రాద్ధము= పితృయజ్ఞం; ఒనరించున్= చేస్తాడో; అది= అట్లా చేసిన ఆ పని; ఈడ్యంబు= కొనియాడదగింది; పితృదేవతలు; పెద్దయున్= మిక్కిలిగా; సంభావింతురు= మన్నన చేస్తారు; అసురులకున్= రక్కసులకు; తేఱియున్= నెమ్మదితో; చూడన్+రాదు= చూడ వీలుకాదు.

తాత్పర్యం: కనుక శ్రాద్ధం అగ్ని పూజలతో కలిపి చేస్తే అది ఎంతో ప్రశస్తమవుతుంది. పితృదేవతలు పరమానందం పొందుతారు. రాక్షసులు అటువైపు కన్నెత్తి చూడనుకూడా రారు.

విశేషం: తద్దినాలలో ముందుగా విచ్ఛిన్నాగ్నిని పునస్సంధానించి ఉపాసిస్తారు.

ఆ. అనఘ! పితృపితామహ ప్రపితామహ । పూజనములు శిష్ట పూర్వకముగఁ
జేయవలయు నియతి దాయ దొడ్గిన జన్ని । దంబుతోడ భక్తిధామ మగుచు. 199

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యవంతుడా!; పితృ పితామహ ప్రపితామహ పూజనములు= తండ్రి, తాత, ముత్తాతల పూజలు; శిష్టపూర్వకముగన్= సదాచారం ముందు ఉండే విధంగా; నియతిన్= నిష్ఠతో, దాయ తొడ్గిన జన్నిదంబుతోడన్= తిరుగబడేటట్లు ధరించిన జందెంతో; భక్తిధామము= భక్తికి నెలవు; అగుచున్= అవుతూ; చేయవలయున్= చేయాలి.

తాత్పర్యం: చక్కని ఆచారంతో, నిష్ఠతో, కుడిభుజానికి మార్చుకొన్న జందెంతో భక్తికి నివాసమా అన్నట్లున్నవాడై తండ్రి, తాత ముత్తాతలకు పూజలు చేయాలి.

విశేషం: జందెం సంధ్యావందనం, యజ్ఞం మొదలైన పనులప్పుడు ఎడమభుజం మీదుగా ధరించాలి. దీనిని 'ఉపవీత స్థితి' అంటారు. పితృక్రియలలో కుడిభుజానికి మార్చుకొనాలి. దీనిని 'ప్రాచీనావీత స్థితి' అంటారు. దేహధర్మాలైన మలమూత్ర విసర్జనాది క్రియల సమయంలో దండలా వేసికొనాలి. దీనిని 'నివీతస్థితి' అంటారు. ఇక్కడ దాయ దొడ్గిన జన్నిదంబుతోడ అంటే 'ప్రాచీనావీత స్థితి' అని భావం. 'పితృ పితామహ ప్రపితామహులు' మరణించినవారికే శ్రాద్ధ క్రియ.

తే. పిండ సంబంధమునఁ బాయుఁ బ్రేతభావ । మది సుగతి నిచ్చు; గయఁ బిండ మట్లు గాన
నరుగునో గయ కొకఁ డైన నని కదా య । నేక పుత్త్రులఁ గోరుదు రిద్ధచరిత! 200

ప్రతిపదార్థం: ఇద్ధ చరిత!= పరిశుద్ధమగు నడవడి కలవాడా!; ప్రేత భావము= ప్రాణుల చావు తరువాత స్థితి; పిండ సంబంధమునన్= పిండం పెట్టిన కారణంగా; పాయున్= పోతుంది; గయన్= గయా క్షేత్రంలో; పిండము= పెట్టిన పిండము; అది; సుగతిన్= మంచి గతిని; ఇచ్చున్= ఇస్తుంది; అట్లు కానన్= ఆ కారణంగా; గయకున్= గయకు; ఒకఁడు+ఐనన్= ఒక్కడైనా; అరుగునో= వెళ్ళునేమో; అని కదా!= అన్న భావంతో కదా!; అనేక పుత్త్రులన్= ఎక్కువ మంది కొడుకులను; కోరుదురు= పొందగోరుతారు.

తాత్పర్యం: మాన్యచరిత్రుడా! చనిపోయిన జీవికి ప్రేతభావం పిండ సంబంధంవలన నశిస్తుంది. గయలో పెట్టిన పిండం ప్రేతభావాన్ని పోగొట్టటమే కాదు పుణ్యగతిని కూడా ఇస్తుంది. అందుకనే ఒక్క కొడుకైనా గయకు వెళ్ళి పిండం పెడతాడన్న ఆశతో మానవులు ఎక్కువమంది కొడుకులను కోరుకొంటారు.

విశేషం: 'గయకు నరుగునో' అంటే పిండ ప్రదానంకొరకు అనే అర్థాన్ని సంభావించాలి. మరణించిన జీవి ప్రేత రూపంలో నరకం అనుభవిస్తాడని మనవారి నమ్మకం. ఆ నరకం నుండి విముక్తి పిండ ప్రదానం ద్వారా కలుగుతుంది. గయలో పిండం పెట్టితే పుణ్యలోకాలు కూడా లభిస్తాయి అని కూడా విశ్వాసం.

క. గౌరి యగు కన్య వరదా । నా రూఢం జేఁత; నీలమైన వృషభమున్
గారవమున విడుపు ముదం । బారంగాఁ జేయుఁ బితృచయము చిత్తములన్. 201

ప్రతిపదార్థం: గౌరి+అగు కన్యన్= రజస్వల కాని కన్యను; వరదాన+ఆరూఢన్= వరుడికి ఇచ్చుటలో లక్ష్యమైనదానినిగా; చేఁత= చేయటం; నీలము= నల్లని వన్నెకలది; ఐన వృషభమున్= అయిన ఎద్దును; గారవమునన్= దొడ్డబుద్ధితో; విడుపు= వదలుట; పితృచయము చిత్తములన్= పితృదేవతల హృదయాలను; ముదంబు= సంతోషం; ఆరంగాన్= అధికమయ్యేటట్లు; చేయున్= చేస్తాయి.

తాత్పర్యం: రజస్వల కాని కన్యను వరుడికి భార్యగా ఇవ్వటం, నల్లని యెద్దును ఆబోతుగా వదలటమూ అనేవి పితృదేవతలకు ఎంతో ఆనందం కలిగిస్తాయి.

క. శ్రాద్ధంబు ప్రకారంబును । వృద్ధా చార్యోక్తభంగి వివరించితి; నీ
బుద్ధిం దోఁచినదాని స । మిద్ధ గుణోదార! యడుగు మెయ్యది యైనన్.' 202

ప్రతిపదార్థం: సమిద్ధగుణ+ఉదార!= చక్కగా ప్రకాశించు గుణములతో గొప్పవాడా!; వృద్ధ+ఆచార్య+ఉక్త భంగిన్= వృద్ధులైన ఆచార్యులు చెప్పిన తీరున; శ్రాద్ధంబు ప్రకారంబును= శ్రాద్ధం చేయవలసిన విధానాన్ని; వివరించితిన్= తెలిసే విధంగా చెప్పాను; నీ బుద్ధిన్= నీ బుద్ధిలో; తోఁచిన దానిన్= తట్టిన దానిని; ఏ+అది+ఐనన్= దేనికైనా; అడుగుము.

తాత్పర్యం: మేలిగుణాలతో గొప్పవాడవైన రాజా! పెద్దలైన ఆచార్యులమాటల ననుసరించి శ్రాద్ధవిధానాన్ని నీకు వివరించాను. నీ బుద్ధికి తోచిన ఏ విషయమైనా అడుగుము చెప్పుతాను'.

విశేషం: వృద్ధా చార్యోక్తభంగిన్ - వృద్ధులంటే అనుభవంతో ఔగాములను నిర్ణయించుకొనగలవారు: ఆచార్యులు - శాస్త్రవిషయాలను చక్కగా గ్రహించి శిష్యులతో ఆచరింపజేస్తూ తాము ఆచరించేవారు. ఈ సందర్భంలో 'అత్రి' వంటివారు. కనుక ఈ విషయంలో సందేహించరాదని భావం.

క. అని నిర్జరాపగానం । దనుండు పలుకుటయుఁ, బ్రియము దళుకొత్తఁగఁ బాం
డు నృపాలు నగ్రనందనుఁ । డనూన వినయమున నమ్మహామతి తోడన్. 203

ప్రతిపదార్థం: అని; నిర్జర+ఆపగా నందనుండు= దేవతల నదికొడుకు భీష్ముడు; పలుకుటయున్=పలికినంతనే; పాండు నృపాలు+అగ్రనందనుఁడు=పాండురాజు పెద్దకొడుకు; ప్రియము= ప్రీతి; తళుకొత్తఁగన్= అధికం కాగా; అనూన వినయమునన్= ఎక్కువ వినయంతో; ఆ+మహామతితోడన్= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడితో.

తాత్పర్యం: భీష్మ్మ డిట్లా అన్నంతనే ధర్మరాజు ప్రీతి రెట్టింపు కాగా అధికమైన వినయంతో ఆ మహాజ్ఞానితో ఇట్లా అన్నాడు.

విశేషం: నిర్జరాపగానందనుఁడు - పవిత్రత, జ్ఞానం మొదలైన ఉదాత్త లక్షణాలను ఈ పదం స్ఫురింపజేస్తుంది. 'ప్రియము తళుకొత్తంగన్' - ధర్మరాజుకు ఎన్నో విషయాలు తెలిసికొనాలని పట్టరాని ఉత్కంఠ. అయినా పెద్దవాడు, తా నతడితో యుద్ధంచేసి నొప్పించాడు మొదలైన సంకోచా లెన్నో మదిలో ఉన్నాయి. ఈ దశలో ఆ మహానుభావుడే ఏది అయినా అడుగుము - అని ప్రచోదన చేస్తున్నాడు. కనుక ప్రీతి అతిశయించింది. మహామతి - ఏది అడిగినా చెప్పగల సామర్థ్యాన్ని ఇది అభివ్యక్తం చేస్తుంది.

క. 'తప మని యార్యులు సెప్పుదు । రుపవాసవ్రతము; నదియె; యొండు గలదొ సా
రపుఁ దపము తెలఁగు నాకుం । గృప నెఱిఁగింపుము విధూతకిల్బిష!' యనుడున్. 204

ప్రతిపదార్థం: ఆర్యులు= పూజ్యులు; ఉపవాస వ్రతమున్= ఉపవాసమనే నియమాన్ని; తపము= తపస్సు; అని; చెప్పుదురు= తెలుపుతారు; అదియె?= అదేనా?; ఒండు= మరొకటి; కలదొ?= ఉన్నదా?; సారము+తపము తెఱఁగు= చేవగల తపస్సు తీరు; విధూత కిల్బిష!= చక్కగా తొలగించుకొన్న పాపాలు కలవాడా!; నాకున్= నాకు; కృపన్= దయతో; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుడున్= అనగా.

తాత్పర్యం: 'పాపాలను పటాపంచలు చేసికొన్న మహానుభావా! ఉపవాస నియమాన్నే తపస్సు అని ఆర్యులు అంటూ ఉంటారు. నిజానికి అదేనా, మరేదైనా ఉన్నదా? చేవగల తపస్సు పద్ధతిని నాకు దయతో తెలుపుము' అంటే.

విశేషం: ఆర్యులు - తమ సత్ప్రవర్తనతో ఇతరులకు మన్నించదగినవారు. 'నాకు' - తెలిసికొనాలనే ఉత్కంఠ అధికంగా ఉన్న నాకు - అని ఇది అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని. కృప, నాకు, విధూతకిల్బిష అనే పదాలు గీత చెప్పిన 'పరిప్రశ్న'ను అభివ్యక్తం చేస్తాయి.

క. అమ్మహాత్ముఁ డిట్టు లనుఁ 'బెక్కు దివసంబు । లుపవసించి యునికి తపము చొప్పె
దాన విను తపస్వి గానేరఁ డది యాత్మ । ఘాత మగుట నరుఁడు గౌరవేంద్ర! 205

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముండు= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడు; ఇట్టు= ఇట్లా; అనున్= అన్నాడు; కౌరవ+ఇంద్ర!= కురువంశంవారిలో గొప్పవాడా!; పెక్కు దివసంబులు= ఎక్కువ దినములు; ఉపవసించి ఉనికి= పస్తులు ఉండటం; తపము చొప్పు+ఎ?= తపస్సు పద్ధతియా?; విను= శ్రద్ధగా ఆలకించుము; దానన్= దానిచేత; నరుఁడు= మానవుడు; అది= అట్లా ఉండటం; ఆత్మ ఘాతము= ఆత్మను హింసించటం; అగుటన్= కావటంవలన; తపస్వి= తపస్సు కలవాడు; కానేరఁడు= కాజాలడు.

తాత్పర్యం: అప్పుడు మహానుభావుడైన భీష్మ డిట్లా చెప్పాడు. 'కురువరా! ఎన్నో రోజులు పస్తులుండటం తపస్సు కానే కాదు. అది ఆత్మను హింసించటం. కనుక దానివలన నరుడు తపస్వి కాజాలడు.

విశేషం: పాండురాజు కొడుకులు, ధృతరాష్ట్రుడి కొడుకులు అందరూ కురువంశంలోనివారే కనుక కౌరవులే. కానీ ఈ పదం ధృతరాష్ట్రుల కుమారులకు విడిగా రూఢమైనది. తపము చొప్పె? అన్న ప్రశ్న వ్యతిరేకార్థాన్ని తెలుపుతుంది. కానేకాదని భావం. 'ఆత్మఘాతం కనుక' అని కారణం కూడా చెప్పాడు. ఇక్కడ ఆత్మ అంటే ధర్మసాధనమైన దేహం అనే అర్థాన్ని గ్రహించాలి. 'విను' అనే మాట శ్రద్ధను ద్యోతకం చేస్తున్నది.

క. సత్యంబు బ్రహ్మచర్యము । నిత్యశుచిత మౌన మతుల నియమము దయ శు
ద్ధ త్యాగంబుఁ దపస్సం । పత్త్యాకృతు లండ్రు బుధులు పౌరవముఖ్యా!' 206

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంవారిలో గొప్పవాడా!; బుధులు= తత్త్వమెరిగినవారు; సత్యంబు= సత్యం; బ్రహ్మచర్యము= బ్రహ్మమునందు ప్రవర్తించటం; నిత్య శుచిత= ఎడతెగని పరిశుద్ధత; మౌనము= మాటలయందు నిగ్రహం; అతుల నియమము= సాటిలేని నిష్ఠ; దయ= భూతములయందు జాలి; శుద్ధ త్యాగంబున్= దోషం లేని దానగుణం; తపస్+సంపత్తి+ఆకృతులు= తపస్సనే మహాభాగ్యపు రూపాలు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సత్యం, బ్రహ్మచర్యం, ఎడతెగని పరిశుద్ధత, మౌనం, సాటిలేని నిష్ఠ, భూతదయ, మచ్చలేని త్యాగం అనేవి తపస్సంపదయొక్క ఆకారా లని తత్త్వమెరిగినవారు చెప్పుతారు.'

విశేషం: సత్యము - పరతత్త్వానికి విరుద్ధం కానిది; బ్రహ్మచర్యము - బ్రహ్మమంటే వేదం, తత్త్వం - వానియందు ప్రవర్తించటం; శుచిత - బాహ్యశుద్ధి; అంతశ్శుద్ధి; మౌనము - కేవలం వాక్కుని నిలిపివేయటం అని అర్థం కాదు. ముని ధర్మాన్ని - పరమాత్మ చింతనం చేస్తూ దానికి విరుద్ధమైనది పలుక కుండటం; శుద్ధ త్యాగము - వదలివేసిన దానియందు ఏ మాత్రమూ మమకారభావన లేకుండా ఉండటం. సత్యం పలకటం, బ్రహ్మచర్యం పాటించటం ఇత్యాదిగా ఆచరణ సంబంధమైన పదాలను ఇక్కడ కలుపుకొనాలి.

వ. అనిన విని కురుపతి కురుపితామహునితో 'మహాత్మా! దానశీలుని యప్రతిగ్రాహకుని విశేషం బెట్టిది? యెఱింగింపు' మనవుడు నా దేవవ్రతుం 'డీ విషయంబునకు సప్తర్షి వృషాదర్భి సంవాదం బను నితిహాసంబు గల' దని చెప్పి యమ్మనుజపతి కిట్లనియె. 207

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; కురుపతి= కురురాజు; కురుపితామహునితోన్= కౌరవుల తాత అయిన భీష్ముడితో; మహాత్మా!; దానశీలుని= ఇవ్వటమే శీలంగా కలవాడియొక్క; అప్రతిగ్రాహకుని= ఇతరులనుండి దేనినీ దానరూపంగా పుచ్చుకొననివాడియొక్క; విశేషంబు= ప్రత్యేకత; ఎట్టి+అది?= ఏ విధమైనది?; ఎఱింగింపుము= తెలుపుము; అనవుడున్= అనగా; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఈ విషయంబునకున్= ఈ సంగతికి; సప్తర్షి వృషాదర్భి సంవాదము= సప్తఋషులకు, వృషాదర్భి అనే వాడికిని అయిన సంభాషణ; అను+ఇతిహాసంబు= అనే పూర్వపు గాథ; కలదు= ఉన్నది; అని; చెప్పి; ఆ+మనుజ పతికిన్= ఆ రాజునకు,ధర్మజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పగా వినిన ధర్మరాజు తాతతో 'మహానుభావా! దానశీలుడి విశేషమూ, దానం పుచ్చుకొననివాడి ప్రత్యేకతా ఎట్టిదో నాకు తెలుపుము' అన్నాడు. అప్పుడు భీష్ముడు 'ఈ విషయానికి సప్తర్షి వృషాదర్భి సంవాదం అనే పూర్వపు గాథ ఒకటి ఉన్నది' అని ఇట్లా చెప్పాడు.

విశేషం: ప్రతిగ్రాహకుండు - దానం పుచ్చుకొనేవాడు. కొందరు ఆ పనిచేయరు. వారు అప్రతిగ్రాహకులు; దేవవ్రతుడు భీష్ముడి వ్యవహారనామం. ఇతిహాసం - 'ఇది ఇట్లా ఉండటం' అని ఈ శబ్దానికి అర్థం. పూర్వకాలంలో జరిగిన వృత్తాంతం. కొన్ని ధర్మాలను కథా రూపంతో బోధించటం పురాణేతిహాసాలలో ఒక పద్ధతి. దానిని ఇక్కడ అవలంబిస్తున్నాడు.

సప్తర్షి వృషాదర్భి సంవాదం బను నితిహాసంబు ప్రకారము (సం.13-94-4)

**తే. 'కశ్యపాత్రి విశ్వామిత్ర గౌతములును । విను భరద్వాజ జమదగ్నులును వసిష్ఠు
డును జగంబుల నెల్లఁ బేర్కొనిన ఋషులు । వారి సప్తర్షిగణ మండ్రు కౌరవేంద్ర! 208**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశవరేణ్యా!; కశ్యప+అత్రి విశ్వామిత్ర గౌతములును= కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు అనువారూ; విను= వినుము; భరద్వాజ జమదగ్నులును= భరద్వాజుడూ, జమదగ్నీ; వసిష్ఠుఁడును= వసిష్ఠుడూ, జగంబులన్= లోకములందు; ఎల్లన్= అంతటా; పేర్కొనిన ఋషులు= ప్రసిద్ధి పొందిన మునులు; వారిన్= వారిని; సప్త+ఋషి గణము= సప్తర్షుల సముదాయం; అంద్రు= అంటారు.

తాత్పర్యం: 'రాజా! కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు, భరద్వాజుడు, జమదగ్ని, వసిష్ఠుడు అని అన్ని లోకాలలో ప్రసిద్ధి పొందిన ఏడుగురు ఋషులు ఉన్నారు. వారిని సప్తర్షిగణం అంటారు.

వ. వసిష్ఠుని దేవి యగు నరుంధతి యెందును నతనితోడన తిరుగు; నయ్యందఱకుం బరిచారికయై గండ యను చేడియ వర్తించుఁ; దద్వల్లభుండగు పశుసఖుండును వారలకుం బరిచారకత్వం బాచరించు; నప్పదుండ్రును దపశ్చరణ పరులై ధరణిం జరించుచుండ నత్యంతఘోర యగు ననావృష్టి దోఁచి జీవసాధనంబు లగు పదార్థంబులు దుర్లభంబులై జనంబులకుఁ బ్రాణంబులు రక్షించుకొనుట దుష్కరంబై చెల్లెం; గశ్యపాదులు నతి క్షుధార్తులై యాహారం బన్వేషించు నెడ శిబిసూనుం డైన యాజ్య నామధేయుండు తొల్లి యజ్ఞదక్షిణార్థం బుగాఁ దన కొడుకు నీలుండను వాని ఋత్విగ్జనంబుల కిచ్చినం దద్వశగతి నుండి కాలం బగుటయు మృతి నొందినం దదీయ శవంబు. 209

ప్రతిపదార్థం: వసిష్ఠునిదేవి= వసిష్ఠుడి పత్ని; అగు అరుంధతి= అయిన అరుంధతి, ఎందును= ఎప్పుడు; అన్ని తావులను; అతని తోడన్+అ= అతడితోనే; తిరుగున్= సంచరిస్తుంది; ఆ+అందఱకున్= వారందరికీ; పరిచారిక+ఐ= సేవకురాలై; గండ అను చేడియ= గండ అనే వనిత; వర్తించున్= తిరుగుతుంది; తద్+వల్లభుండు= ఆమె భర్త; అగు పశుసఖుండును= అయిన పశుసఖు డనేవాడు; వారలకున్= ఆ ఋషులకు; పరిచారకత్వంబు= సేవ; ఆచరించున్= చేస్తూ ఉండేవాడు; ఆ+పదుండ్రును= ఆ పదిమంది; తపస్+చరణపరులు+ఐ= తపస్సు చేయటంలో ఆసక్తికలవారై; ధరణిన్= భూమియందు; చరించుచున్+ఉండన్= తిరుగుతుండగా; అత్యంతఘోర= మిక్కిలి భయం గొలిపేది; అగు+అనావృష్టి= అయిన వానలు లేనిదశ; తోఁచి= ఏర్పడి; జీవ సాధనంబులు= బ్రదకటానికి కావలసినవి; అగు పదార్థంబులు= అయిన వస్తువులు; దుర్లభంబులు+ఐ= ఎంత కష్టపడ్డా దొరకనివై; జనంబులకున్= మనుష్యులకు; ప్రాణంబులు= ప్రాణాలు; రక్షించుకొనుట= కాపాడుకొనటం; దుష్కరంబు+ఐ= సాధ్యంకానిదై; చెల్లెన్= సాగింది; కశ్యప+ఆదులు= కశ్యపుడు మొదలైనవారు; అతి క్షుధా+ఆర్తులు+ఐ= మిక్కిలి ఆకలితో పీడనొందినవారై; ఆహారంబు= అన్నం; అన్వేషించు+ఎడన్= వెదకే సందర్భంలో; శిబి సూనుండు= శిబి కొడుకు; ఐన యాజ్యనామధేయుండు= అయిన యాజ్యుడనే పేరివాడు; తొల్లి= మునుపు; యజ్ఞదక్షిణ+అర్థంబుగాన్= యజ్ఞంలో కానుకగా నొసగుటకై; తనకొడుకు= తన కుమారుడైన; నీలుండు అనువానిన్= నీలు డనే వాడిని; ఋత్విక్+జనంబులకున్= యజ్ఞం చేయించే బ్రాహ్మణులకు; ఇచ్చినన్= ఇవ్వగా; తద్+వశగతిన్= వారి ఆధీనంలో; ఉండి; కాలంబు+అగుటయున్= ఆయువు చెల్లగా; మృతిన్= చావును; ఒందినన్= పొందగా; తదీయశవంబు= వాడి మృతదేహం.

తాత్పర్యం: వసిష్ఠుడి ధర్మపత్ని అరుంధతి అన్నివేళలా అతడితోడనే తిరుగుతుంది. 'గండ' అనే ఆమె, ఆమె భర్త పశుసఖుడనే వాడూ ఆ ఋషులందరికీ సేవచేస్తుండేవారు. ఆ పదిమందీ తపస్సు చేస్తూ ఉంటారు. ఈ విధంగా ఆ పదిమందీ తపస్సు చేసికొంటూ భూమిమీద తిరుగుతూ ఉండగా మహాభయంకరమైన అనావృష్టి ఏర్పడింది. బ్రతకటానికి తగిన పదార్థాలు దొరకక ప్రజలకు ప్రాణాలు రక్షించుకొనటం కూడా అసాధ్యమై పోయింది. కశ్యపుడు మొదలైనవారు ఆకలి పీడించగా అన్నంకొరకు వెదకుతున్నారు. శిబికొడుకు యాజ్యు డనేవాడు మునుపు యజ్ఞ దక్షిణగా తన కొడుకు నీలు డనే వాడిని ఋత్విక్కులకు ఇచ్చాడు. వాడు వారి అధీనంలో ఉండి కాలం కావటంవలన మరణించాడు. వాడి శవం. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సొదపై నుండఁగ వారలు । పదుండ్రును నుం జూచి దాని భక్షింపంగా
మదిఁ గోరి చేరి చుట్టుం । బొదివిన సమయమునఁ గాటి పొంత తెరువునన్. 210

ప్రతిపదార్థం: సొదపైన్= కాల్చటానికి పేర్చిన కట్టెలమీద; ఉండఁగన్= ఉండగా; వారలు= ఆ కశ్యపుడు మొదలైనవారు; పదుండ్రునున్= పదిమందీ; చూచి= కనుగొని; దానిన్= ఆ శవాన్ని; భక్షింపంగాన్= తినటానికి; మదిన్= మనస్సులో; కోరి= వాంఛించి; చేరి= దరి కరిగి; చుట్టున్= అన్ని వైపులా; పొదివిన సమయమునన్= మూగిన సమయంలో; కాటి పొంత తెరువునన్= వల్లకాటి దగ్గరి దారిలో.

తాత్పర్యం: ఆ శవం కట్టెల మీద ఉండగా ఆ పదిమందీ దానిని చూచి తినటానికై దానిచుట్టూ మూగి ఉన్న సమయంలో వల్లకాటి దగ్గరి దారిలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. వేఁట వోయి మరలి విభుఁ డొక్కరుఁడు వృషా । దర్భినాముఁ డతుల దానపరుఁడు

పోయి పోయి కాంచి, పోవక నిలిచి, య । మ్మునులతోడ నధిక వినయ మెసఁగ. 211

ప్రతిపదార్థం: వేట= వేటకై; పోయి= వెళ్ళి; మరలి= తిరిగి; విభుఁడు= రాజు; ఒక్కరుఁడు= ఒకడు; వృషాదర్భి నాముఁడు= వృషాదర్భి అనే పేరుగలవాడు; అతుల దాన పరుఁడు= సాటిలేని దానాలయందు ప్రీతికలవాడు; పోయి పోయి= చాలా దూరంపోయి; కాంచి= చూచి; పోవక నిలిచి= పోకుండ ఆగి; అధిక వినయము= ఎక్కువ వినయం; ఎసఁగన్= ఒప్పగా; ఆ+మునులతోడన్= ఆ మునులతో. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: వేఁటకు వెళ్ళి తిరిగి వస్తున్న వృషాదర్భి అనే రాజు - గొప్ప దానాలు ప్రీతిగా చేసేవాడు - వారిని చూచి ముందుకు పోవక ఆగి మిక్కిలి వినయంతో ఆ మునులతో ఇట్లా అన్నాడు.

విశేషం: 'అతులదాన పరుఁడు' - ఇది ముందు కథకు సూచన. అధిక వినయము - ఇది అతని గుర్తింపును సూచిస్తుంది. వారు మహానుభావులన్న విషయం దర్శనంచేతనే తెలిసికొన్నాడని భావం.

క. 'మీ రాఁకలి పెల్లున నా । హారంబుగ శవముఁ గొనుట కడరితి; రిట్లే

లా? రం డిచ్చెద మీ కా । హారంబులు వలసినట్టి' వని తా మఱియున్. 212

ప్రతిపదార్థం: మీరు; ఆఁకలిపెల్లునన్= ఆకలి ఎక్కువకు; ఆహారంబుగన్= భోజన పదార్థంగా; శవమున్= ప్రాణంలేని దేహాన్ని; పీనుగను; కొనుటకున్= తినటానికి; అడరితిరి= సిద్ధపడ్డారు; ఇట్లు= ఈ విధంగా; ఏలా?= ఎందుకు; రండు= నాతో రండి; మీకున్= మీకు; వలసిన+అట్టి+అవి= కావలసినవైన; ఆహారంబులు= భోజనాలు; ఇచ్చెదన్= ఇస్తాను; అని= అని పలికి; తాన్= తాను; మఱియున్= ఇంకా.

తాత్పర్యం: 'మీరు ఆకలి ఎక్కువ కావటంవలన శవాన్ని తినటానికి సిద్ధపడ్డారు. మీకు కోరిన భోజనాలు ఇస్తాను రండి' అని ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: మీరు - అర్థాంతర సంక్రమితవాచ్యధ్వని - మహర్షులూ తపస్సు చేస్తున్నవారూ అయిన మీరు అని భావం.

క. బహువిధముల ధాన్యములును । బహు రసవర్గములు మీకు భక్తి నొసఁగెదన్

బహుతురగ శకట గోగణ । బహుళ బహుగ్రామములును బహుమతి నిత్తున్.' 213

ప్రతిపదార్థం: మీకున్= మీకు; బహువిధముల ధాన్యములును= పెక్కు విధాలైన తిండిగింజలు; బహురసవర్గములున్= పెక్కు రుచుల పదార్థాల సముదాయాలను; భక్తిన్= భక్తితో; ఒసఁగెదన్= ఇస్తాను; బహు తురగ శకట గోగణ బహుళ బహు

గ్రామములును= పెక్కు గుఱ్ఱాలు, బండ్లు, ఆలమందలు చాలా ఎక్కువగా ఉన్న పెక్కు ఊళ్ళను; బహుమతిన్= మన్ననతో; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ఎన్నో ధాన్యాలు, రుచిగల పదార్థాలు, గుఱ్ఱాలు, బండ్లు, ఆవులు అధికంగా ఉన్న పెక్కు ఊళ్ళు మీకు భక్తితో మన్ననతో ఇస్తాను.'

విశేషం: పద్యంలో 'బహు' శబ్దం అనేక పర్యాయాలు వాడటం రాజు దానంలోని ఉత్సాహాతిశయాన్ని సూచిస్తుంది. జీవితకాలంలో మీరు ఇట్టి శవభోజనం గురించి ఆలోచనకూడా చేయనక్కరలేని స్థితి కల్పిస్తాననే అతని హృదయం ఇక్కడ వ్యక్తమవుతున్నది. భక్తిన్ బహుమతిన్ అన్న మాటలు, అతని మంచితనానికి నిదర్శనంగా నిలుస్తాయి.

వ. అనిన వార లతని కిట్లనిరి. 214

ప్రతిపదార్థం: అనినన్= అంటే; వారలు= ఆ ఋషులు; అతనికిన్= ఆ వృషాదర్భికి; ఇట్లు= ఈ విధంగా; అనిరి= అన్నారు.

తాత్పర్యం: అని చెప్పగా ఆ ఋషులు అతడితో ఇట్లా అన్నారు.

తే. 'రాజవర! రాజుదెసఁ బ్రతిగ్రహము విషముఁ । గల్లుఁగాఁ జూతు మిట్టులు గాంచి యున్న
యట్టి మాకు నీవిచ్చెదనుట మా వి । ధం బెఱుంగమి యింతియ; తప్పు గాదు.' 215

ప్రతిపదార్థం: రాజవర!= రాజశ్రేష్ఠా!; రాజుదెసన్= రాజువైపునుండి; ప్రతిగ్రహమున్= పుచ్చుకొనుటను; విషమున్= విషమును; కల్లుఁగాన్= కల్లుగానూ; చూతుము= భావిస్తాము; ఇట్టులు= ఈ విధంగా; కాంచి ఉన్న అట్టి మాకున్= భావించి ఉన్న మాకు; నీవు; ఇచ్చెదన్= ఇస్తాను; అనుట= అనటం; మా విధంబు= మా పద్ధతి; ఎఱుంగమి= తెలియకపోవటం; ఇంతియ= ఇంతే; తప్పు= దోషం; కాదు.

తాత్పర్యం: 'రాజా! రాజునుండి పుచ్చుకొనటం విషంగానూ; కల్లుగానూ భావిస్తాం. ఇట్టి భావన కల మాకు నీవు ఏదో ఇస్తాననటం మా సంగతి తెలియకపోవటం మాత్రమే. మీ తప్పు కాదులే.'

విశేషం: విషంతో కల్లుతో సమానంగా రాజు ఇచ్చిన దానిని భావిస్తాం. అంటే ప్రతిగ్రహం ప్రాణాలు తీసేదిగా, ఒకవేళ ప్రాణాలున్నా వివేకాన్ని హరించివేసేదిగా మా భావన అని భావం.

క. అనుడు విషాదము తోడం । జని కృత్రిమ వన ఫలములు సమకట్టి తగన్
జనపతి మంత్రుల ఋషులకుఁ । గొనిపొండని పంప వా రంకురిత భక్తిన్. 216

ప్రతిపదార్థం: అనుడున్= అన్నంతనే; జనపతి= రాజు; విషాదము తోడన్= దుఃఖంతో; చని= వెళ్ళి; కృత్రిమ వన ఫలములు= మాయతో ఏర్పడిన అడవి పండ్లు; సమకట్టి= సిద్ధంచేసి; తగన్= తగు విధంగా; మంత్రులన్= మంత్రులను; ఋషులకున్= ఆ పదిమంది ఋషులకొరకు; కొనిపొండు= తీసికొని వెళ్ళండి; అని; పంపన్= పంపగా; వారు = ఆ మంత్రులు; అకుంఠిత భక్తిన్= మొక్కవోని భక్తితో.

తాత్పర్యం: ఋషు లట్లా అనగా రాజు విచారంతో వెళ్ళిపోయి కృత్రిమమైన అడవి పండ్లను చక్కగా సిద్ధంచేసి మంత్రులను 'వీటిని ఆ ఋషులకొరకు తీసికొని వెళ్ళుం'డని పంపాడు. వారు చక్కని భక్తితో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. వానిం దెచ్చి యమ్మహాత్ములకు సమర్పించిన. 217

ప్రతిపదార్థం: వానిన్= ఆ పండ్లను; తెచ్చి; ఆ+మహాత్ములకున్= దొడ్డబుద్ధిగల ఆ మహర్షులకు; సమర్పించినన్= ఇవ్వగా.

తాత్పర్యం: ఆ పండ్లు తెచ్చి ఆ మహానుభావులకు సమర్పించగా.

ఆ. వారు పట్టి చూచి వానివ్రేఁగున హేమ। గర్భకంబు లగుట గాంచి నవ్వి
పుచ్చుకొనక యున్నఁ బోయి భూపతికి న। త్తెఱఁ గమాత్యకోటి యెఱుఁగఁ జెప్పె. 218

ప్రతిపదార్థం: వారు= ఆ ఋషులు; పట్టి చూచి= పరీక్షించి; వాని వ్రేఁగునన్= వాటి బరువునుబట్టి; హేమ గర్భకంబులు= బంగారం కడుపులో ఉన్నవి; అగుటన్= అవటం; కాంచి= తెలిసికొని; నవ్వి; పుచ్చుకొనక+ఉన్నన్= గ్రహించకుంటే; అమాత్యకోటి= మంత్రుల సముదాయం; పోయి= వెళ్ళి; భూపతికిన్= రాజుకు; ఆ తెఱఁగు=ఆ విషయం; ఎఱుఁగన్ చెప్పెన్= తెలియ జెప్పింది.

తాత్పర్యం: ఆ ఋషులు ఆ పండ్లను పట్టుకొని చూచి వాటి బరువునుబట్టి వాటి కడుపులో బంగారం ఉండటం తెలిసికొని నవ్వి పుచ్చుకొనలేదు. మంత్రులు వెళ్ళి రాజుకు ఈ విషయం తెలియజెప్పారు.

విశేషం: నవ్వి - రాజు ఎత్తును గ్రహించగలిగినందుకు, రాజు ఔదార్యం గుర్తించినందుకు, తమ నిష్ఠ చెడనందుకు కలిగిన ఆనందం.

క. విని యతఁడు రాజసంబున। గనలు వొడమి కృత్తి వేల్వఁగాఁ దగువారిం
బనిచిన నప్పుడు హోమం। బున రాక్షసి యోర్తు పుట్టె భూపవరేణ్యా! 219

ప్రతిపదార్థం: భూపవరేణ్యా!= రాజశ్రేష్ఠా!; విని= ఆ సంగతి ఆలకించి; అతఁడు= ఆ వృషాదర్భి; రాజసంబునన్= రజోగుణ ప్రభావంవలన; కనలు+పొడమి= కోపంపుట్టి; కృత్తిన్= కృత్తి అనే రాక్షసిని; వేల్వఁగాన్= హోమంద్వారా తెప్పించటానికి; తగువారిన్= తగిన వారిని; పనిచినన్= ఆజ్ఞాపించగా; అప్పుడు= ఆ సమయంలో; హోమంబునన్= హోమంలో; రాక్షసి= రక్కసి; ఓర్తు= ఒకతె; పుట్టెన్= జనించింది.

తాత్పర్యం: రాజా! ఆ సంగతి తెలిసికొన్న వృషాదర్భికి రాజసంవలన కోపం వచ్చింది. 'కృత్తి'ని హోమం ద్వారా తెప్పించగలవారిని నియోగించాడు. అప్పుడు హోమంలో ఒక రక్కసి పుట్టుకొని వచ్చింది.

విశేషం: రాజసం - రజోగుణ విలక్షణం. ఇది నిష్కారణమైన కోపతాపాలను పుట్టించి చివరకు ఆత్మ వినాశానికి కారణం అవుతుంది. కృత్తి వేల్వన్ - ఇది ఒక క్షుద్ర విద్య. తాంత్రిక ప్రయోగం.

వ. పుట్టియప్పుడమితేని ముందట నిలిచి 'పనియేమి పనుపు' మనిన నతండు ప్రీతుండై 'కశ్యపాదులం గనుపుగొట్టు' మని పనిచిన, నది వార లున్నెడ రోసిపోయె, నంతకు మున్న వారు వనంబున మూలంబులు ఫలంబులు వెదకి తిరుగుచుండ శునస్సఖుండను పరివ్రాజకుండు వచ్చి వారిం గని వందనంబు సేసిన వారలభినందించి; రతండు నమ్మునులం గలిసి యేకార్థుండై సంచరించె; నట్లు చరించు నమ్మహాత్ము లతిక్షుధాన్వితులై తామరతూండ్లు పుచ్చికొని నమలుటకై యొక్క నలినాకరంబునకు సత్వరగతి నరుగుచు నున్న నా రక్కసి యక్కొలని కడ్డంబుగాఁ బోయి పొడసూపి నిలిచిన. 220

ప్రతిపదార్థం: పుట్టి= జన్మించి; ఆ+పుడమిఱేని ముందటన్= ఆ రాజుముందర; నిలిచి= నిలబడి; పని= కార్యం; ఏమి; పనుపుము= ఆనతివ్వుము; అనినన్= అనగా; అతండు= ఆ రాజు; ప్రీతుండు+ఐ= ప్రీతిపొందినవాడై; కశ్యప+ఆదులన్= కశ్యపుడు మొదలైనవారిని; కనుపు+కొట్టుము= ముక్కలుగా నరుకుము; అని; పనిచినన్= పంపగా; అది= ఆ కృత్తి; వారలు+ఉన్న+ఎడన్= వారున్నచోటును; రోసి పోయెన్= వెదకుతూ పోయింది; అంతకు మున్ను+అ= అంతకుముందే; వారు= ఆ మహర్షులు; వనంబునన్= అడవిలో; మూలంబులు= దుంపలు; ఫలంబులు= పండ్లు; వెదకి= అన్వేషించి; తిరుగుచున్+ఉండన్= తిరుగుతూ ఉండగా; శునస్సఖుండు అను పరివ్రాజకుండు= శునస్సఖుడనే సన్న్యాసి; వచ్చి; వారిన్= వారిని; కని= చూచి; వందనంబు+చేసినన్= నమస్కరించగా; వారలు= వారు; అభినందించిరి= ప్రీతితో మంచిమాటలు పలికారు; అతండును= ఆయనకూడా; ఆ+మునులన్= ఆ మునులతో; కలసి= కూడుకొని; ఏక+అర్థుండు+ఐ= ఒకే ప్రయోజనం కలవాడై; సంచరించెన్= తిరుగాడాడు; అట్లు= ఆ విధంగా; చరించు+ఆ+మహాత్ములు= తిరుగుతున్న ఆ గొప్ప వ్యక్తులు; అతిక్షుధా+అన్వితులు+ఐ= పిక్కటిల్లిన ఆకలితో కూడిన వారై; తామరతూండ్లు= తామర కాడలలోపలి మెత్తని పదార్థాలను; పుచ్చికొని= తీసికొని; నమలుటకున్+ఐ= నమలటానికై; ఒక్క నలిన+ఆకరంబునకున్= ఒక తామరకొలనికి; సత్వరగతిన్= వేగంగల నడకతో; అరుగుచున్+ఉన్నన్= పోతూ ఉండగా; ఆ రక్కసి= కృత్తిఅనేఆ రాక్షసి; ఆ+కొలనికిన్= ఆ చెఱువుకు; అడ్డంబుగాన్= అడ్డంగా; పోయి= వెళ్ళి; పొడ+చూపి= వారికి కనబడి; నిలిచినన్= నిలువగా.

తాత్పర్యం: కృత్తి పుట్టి ఆ రాజు ముందర నిలిచి 'పని ఏమిటో సెలవివ్వుము' అన్నది. అతడు ప్రీతి పొంది 'కశ్యపాదులను ముక్కలు ముక్కలుగా నరుకుము' అని పంపాడు. అంతకు ముందే మునులు అడవిలో దుంపలూ, పండ్లు వెతుక్కుంటూ తిరుగుతూ ఉండగా శునస్సఖుడనే సన్న్యాసి వారిని చూచి వందనం చేశాడు. వారు అతడిని మంచిమాటలతో ఆదరించారు. అతడు కూడా ఆ మునులతో తిరుగుతున్నాడు. అట్లా తిరుగుతున్న ఆ మహాత్ములు కడుపు కాల్చివేసే ఆకలితో తామరతూండ్లు అయినా నమలుదామని ఒక సరస్సు దగ్గరికి వడివడిగా వస్తున్నారు. అప్పు డా కృత్తి వారి కడ్డంగా వచ్చి నిలిచింది.

విశేషం: కనుపుగొట్టు అనేమాట 'కసి' ని వ్యక్తంచేస్తుంది. ప్రేగులు కాల్చివేసే ఆకలిలో కూడా వారు ఒక నియమానికి కట్టుబడి ఉండటం వారి మహాత్మత్వాన్ని నిరూపిస్తుంది.

క. ఈ కమలవనము చేరువ । నే కార్యము సేయఁ జూచె? దీ వెవ్వత?' వం
చా కొలను సొరఁగ నమ్ముని । లోకము సేరుటయు నచ్చెలువ యెలుఁ గెసఁగన్. 221

ప్రతిపదార్థం: ఆ మునిలోకము= ఆ మునుల సముదాయము; ఈ కమల వనము చేరువన్= ఈ తామర కొలను దగ్గర; ఏ కార్యము= ఏ పని; చేయన్+చూచెదు?= చేస్తావు?; ఈవు= నీవు; ఎవ్వతవు= ఎవతెవు; అంచున్= అంటూ; ఆ కొలను= ఆ చెరువును; చొరఁగన్= ప్రవేశించటానికి; చేరుటయున్= రాగా; ఆ+చెలువ= ఆ యింతి; ఎలుఁగు+ఎసఁగన్= పెద్ద గొంతుతో.

తాత్పర్యం: ఆ మహర్షులు 'ఈ తామరకొలను దగ్గర ఏమి చేస్తున్నావు?' అంటూ చెరువులో ప్రవేశించబోగా ఆమె పెద్ద గొంతుతో (ఇట్లా అన్నది).

విశేషం: 'ఏం పని' అంటూ కొలనిలోనికి దిగబోయారు - అంటే ఆమె సమాధానం మీద వారికి పెద్ద ఆసక్తి లేదు.

వృషాదర్భి పుత్తెంచిన కృత్తి శునస్సఖునిచే మృతిఁ బొందుట (సం.13-95-48)

వ. ' ఏ నెవ్వత నైతి నేమి? యిక్కొలని కావలియున్న దాన' ననుటయు నమ్మునులు వెల్లనై' యాఁకట నలందురి యుపజీవింప నొండేమియు లేమింజేసి యీ సరోవరంబున బిసంబులు వెతికికొని భక్షించు వారమై వచ్చితి' మనిన నవ్వనిత 'మీ మీ పేళ్ళు సెప్పిమఱి పద్మవనంబు ప్రవేశించువా' రని పలికిన నప్పరమమును లన్నాతి యాతుధాని యగుటయుం గృత్తియగుటయు వధింప వచ్చినది యగుటయు నెఱింగి కశ్యపాదులగు పదుండ్రును దానికి దుర్బోధత్వంబు దోఁచునట్లుగా నిర్వచన సహితంబుగాఁ దమనామంబులు సెప్పి; రప్పాపవర్తన వెఱఁగు పడియుండ శునస్సఖుండు దన యభిధానం బభివ్యక్తంబుగా నుగ్గడించినం గృత్తి 'నీ పేరు దెలియం జెప్ప విదియేమి?' యనవుడు నతండు 'తేటపడం జెప్పియుండం జెప్పవనియెద; విట్లంట తప్పుగాదె? యిట్టి యుద్దండవు మంత్ర దండంబు పాలు వడు' మని బ్రహ్మదండ నిభంబగు నిజహస్తగత దండంబున దాని శిరంబు బెట్టు వ్రేయుచుఁ 'బాపకర్మురాలా! పడు ము భస్మంబ వగు మని నిష్ఠురాక్షరంబుగా నిర్దేశించిన దుర్దశ యగుచుంబడి యా రక్కసి భస్మీభూతయయ్యె; నప్పు డప్పదునొకండ్రునుం బ్రమోదంబునం బయోజషండంబు సొచ్చి. 222

ప్రతిపదార్థం: ఏను= నేను; ఎవ్వతను= ఎవర్తిని; ఐతిని= అయితే; ఏమి?; ఈ+కొలనికావలి+ఉన్నదానన్= ఈ సరస్సుకు కావలిగా ఉన్నదానను; అనుటయున్= అనునంతనే; ఆ+మునులు= ఆ మహర్షులు; పెల్లనై= తెల్లబారి; ఆఁకటన్= ఆకలిచేత; అలందురి= కటకటపడి; ఉపజీవింపన్= బ్రతుకుటకు; ఒండు= మరొకటి; ఏమియున్= ఏదియును; లేమిన్+చేసి= లేకపోవటంవలన; ఈ సరోవరంబునన్= ఈ చెరువులో; బిసంబులు= తామరతూండ్లు; పెఱికికొని= త్రుంచుకొని; భక్షించువారము+ఐ= తినేవాళ్ళమై; వచ్చితిమి= వచ్చాము; అనినన్= అనగా; ఆ+వనిత= ఆ ఆడది; మీ మీ పేళ్ళు= మీ మీ పేరులు; చెప్పి; మఱి= తరువాత; పద్మవనంబు= తామరలున్న చోటును; ప్రవేశించువారు= చొరగలరు; అని; పలికినన్= పలుకగా; ఆ+పరమ మునులు= ఆ మహర్షులు; ఆ+నాతి= ఆ స్త్రీ; యాతుధాని= రక్కసి; అగుటయున్= కావటమూ; కృత్తి అగుటయున్= కృత్తి అనే మృత్యుదేవత కావటమూ; వధింపన్ వచ్చినది= చంపటానికి వచ్చింది; అగుటయున్= కావటమూ; ఎఱింగి= తెలిసికొని; కశ్యప+ఆదులు+అగు= కశ్యపుడు మొదలగు; పదుండ్రును= పదిమందీ; దానికిన్ = ఆ రక్కసికి; దుర్బోధత్వంబు= అర్థంకాక పోవటం; తోఁచునట్లుగాన్= వ్యక్తమయ్యే తీరున; నిర్వచన సహితంబుగాన్= అర్థ వివరణతోపాటుగా; తమ నామంబులు= తమ పేర్లు; చెప్పిరి= చెప్పారు; ఆ+పాపవర్తన= పాపపు నడవడిగల ఆ ఇంతి; వెఱఁగుపడి+ఉండన్= ఆశ్చర్యపడి ఉండగా; శునస్సఖుండు= శునస్సఖుడనే సన్న్యాసి; తన అభిధానంబు= తన పేరు; అభివ్యక్తంబుగాన్= చక్కగా తెలిసే విధంగా; ఉగ్గడించినన్= చెప్పగా; కృత్తి; నీ పేరు= నీ నామం; తెలియన్= చక్కగా తెలిసే విధంగా; చెప్పవు= చెప్పలేదు; ఇది; ఏమి?= ఎందుకు; అనవుడున్= అన్నంతనే; అతండు= ఆ ముని; తేటపడన్= స్పష్టమయ్యే విధంగా; చెప్పి ఉండన్= చెప్పి ఉండగా; చెప్పవు= చెప్పలేదు; అనియెదవు= అంటావు; ఇట్లు= ఈ విధంగా; అంట= అనటం; తప్పు కాదె!= దోషం కదా!; ఇట్టి ఉద్దండవు= ఇట్టి పొగరుబోతువు; మంత్ర దండంబు= మంత్రశక్తిగల కర్రకు; పాలు పడుము= వశం కమ్ము; అని; బ్రహ్మదండ నిభంబు= బ్రహ్మ దండంవంటిది; అగు నిజహస్తగత దండంబునన్= అయిన తన చేతిలో ఉన్న కర్రతో; దాని శిరంబు= ఆ కృత్తి తలను; బెట్టు= గట్టిగా; వ్రేయుచున్= కొడుతూ; పాపకర్మురాలా!= పాపపు పనులు చేసేదానా!; పడుము= పడిపో; భస్మంబవు= బూడిదవు; అగుము= అయిపొమ్ము; అని; నిష్ఠుర+అక్షరంబుగాన్= పరుషమైన అక్కరాలు ఉండేవిధంగా; నిర్దేశించినన్= పలుకగా; దుర్దశ+అగుచున్= చెడ్డ స్థితికలది ఔతూ; పడి= క్రిందకు దొరలి; ఆ+రక్కసి= ఆ రాక్షసి; భస్మీభూత= బూడిద అయినది; అయ్యెన్= అయింది; అప్పుడు= ఆ సమయంలో; ఆ పదునొకండ్రునున్= ఆ పదునొకండుమందీ; ప్రమోదంబునన్= మిగుల ఆనందంతో; పయోజషండంబు= తామర వనంలోకి; చొచ్చి= ప్రవేశించి.

తాత్పర్యం: 'నే నెవరైతే నేమి? ఈ కొలనుకు కావలిదాన్ని' అనగా ఆ మునులు 'మిక్కిలి ఆకలితో కష్టపడి తినటానికి మరేమీ లేకపోవటంవలన ఈ తామరతూండ్లు తీసికొని తినగోరినవారమై వచ్చాం' అన్నారు. అప్పు డా ఇంతి 'మీ మీ పేర్లు చెప్పిన తరువాతనే కొలనులోకి ప్రవేశించాలి' అంటే ఆ మహర్షులు ఆమె రాక్షసి అనీ, కృత్తి అనీ, తమను చంపటానికి వచ్చిందనీ తెలిసికొని కశ్యపుడు మొదలైన పదిమంది తమ పేర్లు దానికి తెలియరాకుండేటట్లుగా నిర్వచనాలతో కూడ కలిపి చెప్పారు. ఆమె అది తెలిసికొనలేక నిశ్చేష్టురాలైంది. శునస్సఖుడు మాత్రం తన పేరు సూటిగా చెప్పాడు. కృత్తి 'నీ పేరు తెలిసే విధంగా చెప్పవేం?' అన్నది. అప్పు డతడు నేను చక్కగా తెలిసే విధంగా చెప్తే చెప్పవు అంటావు. ఇది తప్పు కదా! నీవు చెడిపెవు. ఇదిగో మంత్రదండానికి వశం కమ్ము!' అని బ్రహ్మదండం వంటి తన చేతి కర్రతో దాని నెత్తిమీద గట్టిగా కొట్టుతూ. 'పాపాత్మురాలా! బూడిదైపో' అని పరుషంగా పలికాడు. దానితో అది భస్మమై కూలి పోయింది. అప్పు డా పదునొక్కండ్రు ఆనందంతో తామరల కొలనులోనికి ప్రవేశించారు.

విశేషం: నిర్వచనం అంటే ఆ అర్థం ఏ ధాతువుమూలంగా వచ్చిందో వివరించటం. ఉదాహరణకు కశ్యపుడు అంటే పశ్యకుడు అన్నింటినీ సూక్ష్మదృష్టితో చూచేవాడు అని అర్థం. ఇది ఒక మహా శాస్త్రం చెప్పిన విద్య కనుక ఆ రక్కసికి అర్థం కాలేదు. శునస్సఖుడు సూటిగా తన పేరు చెప్పగా ఇతరుల ధోరణికంటె భిన్నంగా ఉన్నందువలన నిర్వచనం లేకపోవటం కారణంగా అర్థం కాలేదు. శ్రేయస్కాముడు తన పేరు చెప్పరాదని శాస్త్రం **"ఆత్మనామ గురోర్నామ నామాతికృపణస్య చ శ్రేయస్కామో న గృహ్ణీయాత్ జ్యేష్ఠాపత్య కళత్రయోః"** అని అనుశాసనం. కనుక కృత్తి వారు పేర్లు చెబితే దోషాన్ని నిరూపించి చంపాలనుకొన్నది. అది బెడిసికొట్టటం కొరకు అసలు పేర్లు చెప్పక నిర్వచన సహితంగా చెప్పారు.

తే. **బిసము లాదట నందఱుఁ బెఱికి రొంపి । వోవ నీటఁ దెమల్చి మోపుగ నమర్చి**
తీరమునఁ బెట్టి నియమముల్ దీర్పఁజొచ్చి । తీర్చి యాఁకలి దముఁ గోసి తినఁగఁ గూడి. **223**

ప్రతిపదార్థం: అందఱున్= వారంతా; ఆదటన్= ప్రీతితో; బిసములు= తామరతూండ్లను; పెఱికి= త్రుంచి; రొంపి= బురద; పోవన్= పోయే విధంగా; నీటన్= నీటిలో; తెమల్చి= జాడించి; మోపుగన్= కట్టగ; అమర్చి= ఏర్పరచి; తీరమునన్= ఒడ్డున; పెట్టి= ఉంచి; నియమముల్= సంధ్యాపూజ మొదలైన విధులను; తీర్పన్+చొచ్చి= చేయబూని; తీర్చి= ఆచరించి; ఆఁకలి= క్షుధ; తమున్= తమను; కోసి తినఁగన్= కోసికొని తింటూ ఉండగా; కూడి= కలిసి.

తాత్పర్యం: అందరూ ప్రీతితో ఆ తామరతూడులను పెకలించి బురద పోయేవిధంగా నీటిలో జాడించి మోపుగా కట్టి ఒడ్డునబెట్టి విధులు తీర్చుకొని ఆకలి తమను తినివేస్తుంటే అందరూ కలిసి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆకలి వారిని తినివేస్తున్నది - అంటే ఆకలితో ప్రేగులు కాలిపోతున్నాయన్నమాట. ఇక్కడ విశేషం ఏమంటే అంత ఆకలితో ఉన్నా నియమాలు తీర్చుకొన్న తరువాతనే తినబోయారు. ఇది వారి ధర్మనిష్ఠను నిరూపిస్తుంది.

క. **కొలను వెడలి బిసము లిడిన । నెలవునకుం బోయి యచట నిగిడించిన చూ**
డ్కుల కవి దోఁపక యున్నను । గలయం బరికించి యెట్లుఁ గానక తమలోన్. **224**

ప్రతిపదార్థం: కొలను= సరస్సునుండి; వెడలి= వెలుపలికి వచ్చి; బిసములు+ఇడిన నెలవునకున్= తామరతూండ్లు పెట్టిన చోటికి; పోయి= వెళ్ళి; అచటన్= అందు; నిగిడించిన చూడ్కులకున్= పరగించిన చూపులకు; అవి= ఆ తూండ్లు; తోఁ

పక+ఉన్నను= కనపడకపోగా; కలయన్= అన్నివైపుల; పరికించి= జాగ్రత్తగా చూచి; ఎట్లున్= ఏ విధంగానూ; కానక= చూడక; తమలోన్= తమలో.

తాత్పర్యం: వారంతా కొలనునుండి బయటకు వచ్చి తూడులమోపు పెట్టినచోట దృష్టి సారించారు. అవి కనపడకపోగా అన్నివైపులా జాగ్రత్తగా చూచారు. అయినా కనపడలేదు. అప్పుడు వారు తమలో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఒండొరుల శంకించి శపథంబులు పలుకుదుము గాక యని నిశ్చయించి శునస్సఖుని వినువానింగాఁ జేసికొని; రప్పు డత్రి యిట్లనియె. 225

ప్రతిపదార్థం: ఒండొరులన్= ఒకరినొకరు; శంకించి= అనుమానించి; శపథంబులు= ఒట్టులు; పలుకుదుము కాక= పలుకుదాం; అని; నిశ్చయించి= తీర్మానించి; శునస్సఖునిన్= శునస్సఖుడిని; వినువానిన్+కాన్= వినేవాడినిగా; చేసికొనిరి= చేసికొన్నారు; అప్పుడు= ఆ సమయంలో; అత్రి= అత్రి మహర్షి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వారు ఒకరినొకరు అనుమానించారు. ఒట్టుపెట్టుకొని తమ తప్పులేనితనం నిరూపించుకొందామని నిర్ణయించుకొన్నారు. శునస్సఖుడిని మధ్యవర్తిగా వినటానికి ప్రార్థించారు. అప్పుడు అత్రి మహర్షి ఇట్లా అన్నాడు.

విశేషం: ఇట్లా ఒట్టు పెట్టుకొనే పద్ధతి అన్నిదేశాలలో అన్ని కాలాలలో ఉన్నట్లు తెలియవస్తున్నది. పాపభీతి ఉన్నవారు తప్పుచేసి ఒట్టుపెట్టుకొనరు.

తే. 'మొదవుఁ దన్నుట, రవియభిముఖత దనకుఁ । గలుగు మూత్ర పురీష మోక్షణము సేఁత,
యధ్యయన మనధ్యయనమునందు నడపు । టగు బిసంబులు మ్రుచ్చిలి నట్టు లైన.' 226

ప్రతిపదార్థం: (నేను) బిసంబులు= తూడులు; మ్రుచ్చిలిన+అట్టులు+ఐనన్= దొంగిలించినట్లైతే; మొదవున్= ఆవును; తన్నుట= తన్నటం; తనకున్= తనకు; రవి+అభిముఖత= సూర్యు డెదురుగా ఉండటం; కలుగన్= కలుగగా; మూత్ర పురీష మోక్షణము= మూత్రమును, మలమును వదలటం అనే పని; చేఁత= చేయటం; అనధ్యయనము నందున్= వేదం చదువరాని దినాన; అధ్యయనము= చదవటం; నడపుట= సాగించటం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: నేను తామరతూండ్లు దొంగిలిస్తే ఆవును తన్నిన పాపం, సూర్యుడి కెదురుగా మలమూత్రాలను విడచిన పాపం, అనధ్యయన దినం నాడు వేదాలు చదివిన పాపమూ నాకు కలుగుతాయి.

విశేషం: ఇవన్నీ మహాపాపాలు. పాడ్యమి, అష్టమి, పూర్ణిమ, అమావాస్య అనే తిథులు అనధ్యయన దినాలు. అట్లాగే పూజ్యులెవరైనా గురుకులానికి వస్తే ఆ దినాన్ని శిష్టానధ్యయనంగా పరిగణిస్తారు.

వ. అనుటయు వసిష్ఠుండు. 227

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; వసిష్ఠుండు= వసిష్ఠ మహర్షి.

తాత్పర్యం: అప్పుడు వసిష్ఠు డిట్లా అన్నాడు.

క. శ్రుతి సదువమి; సన్న్యాస । స్థితిఁ గాముకుఁ డగుట; గుక్కఁ జేకొని తిరుగన్
మతి రోయమి నయ్యెడు దు । ర్గతి తూఁడులు మ్రుచ్చిలించు కష్టునకు నగున్.' 228

ప్రతిపదార్థం: తూఁడులు= తామరకాడలు; మ్రుచ్చిలించు కష్టునకున్= దొంగిలించిన నీచుడికి; శ్రుతి= వేదం; చదువమి= చదవకపోవటం; సన్న్యాస స్థితిన్= సన్న్యసించిన దశలో; కాముకుఁడు= స్త్రీ మోహం కలవాడు; అగుట= కావటం; కుక్కన్= కుక్కను; చేకొని= పట్టుకొని; తిరుగన్= తిరుగగా; మతిన్= బుద్ధిలో; రోయమిన్= ఏవగించుకొనకపోవటంవలన; అయ్యెడు దుర్గతి= కలిగే నీచదశ; అగున్= అవుతుంది.

తాత్పర్యం: తామరతూడులు దొంగిలించిన నీచుడికి వేదం చదవకపోయిన పాపం, సన్న్యసించి కామభావన పొందినవాడి పాపం, కుక్కను పట్టుకొని తిరుగుతూ అసహ్యించుకొననివాడికయ్యే దుర్గతీ కలుగుతాయి.'

విశేషం: బ్రాహ్మణుడు నిష్కారణంగా ఆరు అంగాలతోకూడిన వేదం చదవాలని స్మృతి చెప్పింది. కనుక చదవకపోవటం పాపం, 'సన్న్యాసం' అంటే కామక్రోధాది భావాలను పూర్తిగా అవతల ఉంచటం. ఆ స్థితి పొంది కామభావనకు లోబడితే అది రెండింటికీ చెడిన స్థితి అవుతుంది.

వ. అని వెండియు. 229

తాత్పర్యం: అని పలికి వసిష్ఠుడు ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'సుత నమ్మికొనుట, శరణా । గతుఁ జేకొనకునికి నిచ్చు కారుణికు దరి
ద్రతఁ జూచియు వేఁడుట నగు । గతి బిసములు దాఁచికొనుట గల్గినఁ గల్గున్.' 230

ప్రతిపదార్థం: సుతన్= బిడ్డను; అమ్మికొనుట= అమ్ముకొనటం; శరణ+ఆగతున్= రక్షణ కోరి వచ్చినవాడిని; చేకొనక+ఉనికిన్= కైకొనకుండటం; ఇచ్చు కారుణికు దరిద్రతన్= ఇచ్చే దయగలవాడిలేమిని; చూచియున్= చూచికూడా; వేఁడుటన్= యాచించటంవలన; అగుగతి= అయ్యే దశ; బిసములు= తామరతూండ్లు; దాఁచికొనుట= దాచుకొనటం; కల్గినన్= కలిగితే; కల్గున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'కన్న కూతురిని అమ్ముకొనటం, శరణుకోరి వచ్చినవాడిని రక్షించకపోవటం, దాత దరిద్రుడు కావటం చూచికూడా అడుగుకొనటం అనే పాపాలు తూడులు దాచిన వాడికి కలుగుతాయి.'

వ. అనియెఁ; దదనంతరంబ. 231

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; తత్+అనంతరంబు+అ= వెంటనే.

తాత్పర్యం: వసిష్ఠ డిట్లా అన్నాడు. ఆ తరువాత.

చ. 'పలలవృథోపభుక్తి, సభఁ బక్షముఁ బల్కుట, దుష్టదాన, ము
గ్మలి దివసంబునం గవయు కష్టత, విప్రజనంబు లుబ్ధతా
కులితముఁ జేఁత, యెల్లసరకుం గొని యమ్ముట కాదె తూఁడు తీఁ
గలపొది మ్రుచ్చిలించు' టని కశ్యపసంయమి వల్కె భూవరా! 232

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; కశ్యపసంయమి= కశ్యపుడనే మహర్షి; పలల వృథా+ఉపభుక్తి= మాంసం వ్యర్థంగా తినటం; సభన్= న్యాయస్థానంలో; పక్షమున్= ఒకడివైపు; పల్కుట= మాటాడటం; దుష్టదానము= చెడుదానం; ఉగ్మలిన్= స్త్రీని (భార్యను); దివసంబునన్= పగటియందు; కవయు కష్టత= సంగమించే నీచత్వం; విప్రజనంబున్= చక్కని విద్యగలవారిని; లుబ్ధతా+ఆకులితము= లోభగుణంతో కలత పొందిన వారినిగా; చేఁత= చేయటం; ఎల్లసరకున్= సరుకునంతా; కొని; అమ్మట= అమ్మటం; కాదె= కదా; తూఁడుతీఁగల పొదిన్= తామరతూడు తీగల మోపును; ప్రుచ్చిలించుట= దొంగిలించటం; అని; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: కశ్యపమహర్షి ఇట్లా అన్నాడు. 'మాంసం వ్యర్థంగా తినటం, న్యాయస్థానంలో అన్యాయంగా ఒకడివైపు సాక్ష్యం పలకటం, చెడుదానం, స్త్రీని పగటిపూట కలిసే నీచత, విద్యగల బ్రాహ్మణులను లోభగుణంచేత ఏడిపించటం, సరుకునంతా నిలువచేసి ఎక్కువ లాభాలకు అమ్ముకొనటం ఈ తామరతూడుల మోపు దొంగిలించటం అవుతుంది.

విశేషం: "విద్యయా యాతి విప్రత్వమ్" మోక్షవిద్యవలననే బ్రాహ్మణుడు విప్రుడవుతాడు. ఆ పాపాలు చేసినవాడి కేగతి కలుగుతుందో ఈ దొంగతనం చేసినవాడి కదేగతి అని తాత్పర్యం.

వ. పదంపడి. 233

తాత్పర్యం: తరువాత.

క. జ్ఞాతులయెడ గోవులయెడ । గోతులయెడ ధర్మ మెడలి క్రూరుఁ డగుట కా
ర్యాతుర విప్రోపేక్షా । నీతి బిసము లపహరించు నిపుణత యరయన్. 234

ప్రతిపదార్థం: బిసములు= తామరతూండ్లు; అపహరించు నిపుణత= దొంగిలించే నేర్పు; అరయన్= పరిశీలించగా; జ్ఞాతులయెడన్= బంధువుల విషయంలో; గోవులయెడన్= ఆవుల విషయంలో; గోతులయెడన్= స్త్రీల విషయంలో; ధర్మము= ధర్మాన్ని; ఎడలి= వీడి; క్రూరుఁడు= దయలేనివాడు; అగుట= కావటం; కార్య+ఆతుర విప్ర+ఉపేక్షా నీతి= పని తొందరతో దిగులుగల విద్యావంతులగు బ్రాహ్మణులయెడ ఉదాసీనత పాటించటం అనే నీతి.

తాత్పర్యం: ఈ తామరతూడులను దొంగిలించే నేర్పు ఎటువంటిదంటే బంధువుల విషయంలో, ఆవుల విషయంలో, స్త్రీల విషయంలో ధర్మం తప్పి దయలేనివాడు కావటం, పనిపడి దిగులుగా ఉన్న విప్రులను గూర్చి పట్టించుకొనని నీతివంటిది.'

విశేషం: జ్ఞాతులు, గోవులు, స్త్రీలు, విప్రులు - వీరి యందు చిన్నపాటి దోషాలున్నా పట్టించుకొనకూడదని విదురనీతిలో చెప్పారు. (సం.5.36. 62. తెలుగు. ఉ.2.68)

క. అని పలికి భరద్వాజుం । డను మఱియు 'హవిస్సు గ్రంప నగ్ని నిడుట, యొ
జ్జ నధఃకరించి చదువుట । యను నివి సరియౌ బిసాపహరణంబునకున్.' 235

ప్రతిపదార్థం: అని= ఇట్లని; పలికి= మాట్లాడి; భరద్వాజుండు= భరద్వాజ మహర్షి; మఱియున్= ఇంకా; అనున్= అన్నాడు; హవిస్సు= వేల్చే పదార్థాన్ని; క్రంపన్= కంపయందలి; అగ్నిన్= నిప్పునందు; ఇడుట= ఉంచటం; ఒజ్జన్= గురువును; అధః

కరించి= క్రిందుచేసి; చదువుట= చదవటం; అను+ఇవి= అనే ఈ పనులు; బిస+అపహరణంబునకున్= తామరతూండ్ల దొంగిలించటానికి; సరి= సాటి; ఔన్= అవుతాయి.

తాత్పర్యం: ఇట్లా పలికి భరద్వాజ మహర్షి ఇంకా ఇట్లా అన్నాడు. 'మంత్రంతో పవిత్రమైన పదార్థాన్ని కంపలోని అగ్నిలో పోయటం, గురువును తక్కువచేసి విద్యను నేర్పటం అనే పనులు తామరతూండ్ల దొంగతనానికి సాటి అవుతాయి.'

విశేషం: హవిస్సును ప్రత్యేకంగా ఏర్పరచిన ధార్యాగ్నిలోనే ఉంచాలి. లేకపోతే అది పనికిమాలిన దవుతుంది.

వ. అని పలుకుటయు. 236

తాత్పర్యం: అత డట్లా పలికిన తరువాత.

తే. "ముట్టునను భార్యఁ గవయుట, మూత్రమును బు । రీషమును నీర విడుపు, విద్వేషయుక్తి
యోషి దుపజీవనము మృణాళోత్కరంబు । మ్రుచ్చిలుటఁ బోలు కల్మషములె తలంప.' 237

ప్రతిపదార్థం: ముట్టునను= చెరగుమాసినపుడు; భార్యన్= పెండ్లమును; కవయుట= కలియటం; మూత్రమును= మూత్రాన్నీ; పురీషమును= మలాన్ని; నీరన్= నీటిలో; విడుపు= విడవటం; విద్వేషయుక్తి= పగతోకూడి ఉండటం; యోషిత్+ఉపజీవనము= ఆడదానిపై ఆధారపడి బ్రతకటం; తలంపన్= ఆలోచిస్తే; మృణాళ+ఉత్కరంబు మ్రుచ్చిలుటన్= తామరతూడుల మోపును దొంగిలించటాన్ని; పోలు కల్మషములు+ఎ?= పోలిన పాపాలా?

తాత్పర్యం: 'ముట్టైన భార్యను కలవటం, మలమూత్రాలను నీటిలో వదలటం, పగగొని ఉండటం, స్త్రీపై ఆధారపడి బ్రతకటం ఈ తామరతూడుల దొంగతనానికి సాటియైన పాపాలా!'

విశేషం: ఆ పాపాలకన్నా ఇది మిక్కిలి ఘోరమైన దని భావం.

క. అని జమదగ్ని మఱియు ని । ట్లను 'నన్యోన్యాతిథిత్వ మసహాయపువై
రనిరూఢి, పాఁడి మొదవుం । గనలి యడుచు టీడె బిసనికర చోరతకున్. 238

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; జమదగ్ని= జమదగ్ని మహర్షి; మఱియున్= ఇంకా; ఇట్లు= ఇట్లా; అనున్= అన్నాడు; అన్యోన్య+అతిథిత్వము= ఒకడి కొకడు అతిథి కావటమూ, అసహాయము+వైర నిరూఢి= తోడులేని పగను గట్టిగా నిలుపుకొనటమూ; పాఁడిమొదవున్= పాడి ఆవును; కనలి= కోపగించి; అడుచుట= కొట్టటం; బిస నికర చోరతకున్= తామరతూండ్ల మోపు దొంగిలింతకు; ఈడు+ఎ?= సాటియా?

తాత్పర్యం: ఇట్లా చెప్పి జమదగ్ని ఇంకా ఇట్లా అన్నాడు. 'ఒకరి కొకరు అతిథులు కావటం, సాయంలేని పగను నిలుపుకొనటం, పాడి ఆవును కోపించి కొట్టటం అనే పాపాలు ఈ తామరతూండ్ల దొంగతనానికి సాటి అవుతాయా?'

విశేషం: ఆ పాపాలన్నింటిని మించిన పాపం ఇది అని భావం.

వ. అనవుడు గౌతముండు. 239

తాత్పర్యం: అన్న తరువాత గౌతము డిట్లా పలికాడు.

క. 'ధృతవేద త్యజనానల। వితతి వృథాత్యాగ సోమ విక్రయ వృషలీ
పతితా దుర్గ్రామాజీ। వితలు బిసస్తేయ కష్టవృత్తికి నెనయే? 240

ప్రతిపదార్థం: ధృత= చేపట్టిన; వేద= వేదాలను; త్యజన= వదలటం; అనల= అగ్నుల; వితతి= సముదాయాన్ని; వృథా= వ్యర్థంగా; త్యాగ= వదలివేయటం; సోమ విక్రయ= సోమరసాన్ని అమ్మటం; వృషలీపతితా= శూద్ర స్త్రీకి మగడు కావటం; దుర్గ్రామ+ఆజీవితలు= చెడ్డ ఊరిలో బ్రతుకుతూ ఉండటం అనే పాపాలు; బిసస్తేయ కష్ట వృత్తికిన్= తూండ్ల దొంగతనమనే నీచపు నడవడికి; ఎన+ఏ?= సాటియా.

తాత్పర్యం: 'చేపట్టిన వేదవిద్యను వదలివేయటం, అగ్నిహోత్రపూజను నిష్కారణంగా మానటం, సోమం అమ్మటం, శూద్రస్త్రీకి మగడు కావటం, చెడ్డ ఊరిలో జీవించటం అనే పాపాలు తామరతూండ్ల దొంగతనానికి సాటి అవుతాయా?'కావని భావం.

వ. అని నిర్దేశించిన విశ్వామిత్రుం డిట్లనియె. 241

ప్రతిపదార్థం: అని= ఇట్లా అని; నిర్దేశించినన్= పలుకగా; విశ్వామిత్రుండు= విశ్వామిత్ర మహర్షి; ఇట్లు= ఇట్లా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని పలుకగా విశ్వామిత్రు డిట్లా అన్నాడు.

క. 'తగు భృత్యులఁ బ్రోవకునికి। దగని భటులఁ బ్రోపు కపటధార్మికవృత్తిన్
జగతీపతిఁ గొల్చుట లె। స్సగఁ బోలఁగ నేర్చునే బిసస్తైన్యంబున్?' 242

ప్రతిపదార్థం: తగు భృత్యులన్= యోగ్యతకల బంటులను; ప్రోవక+ఉనికి= కాపాడకుండటమూ; తగని భటులన్= పనికిరాని బంటులను; ప్రోపు= రక్షించటం; కపట ధార్మిక వృత్తిన్= మోసపు ధర్మానికి సంబంధించిన నడవడికతో; జగతీపతిన్= రాజును; కొల్చుట= సేవించటం; బిసస్తైన్యంబున్= తామరతూడుల దొంగతనాన్ని; లెస్సగన్= బాగుగా; పోలఁగన్+నేర్చునే?= సాటిరాగలదా?

తాత్పర్యం: పనికి వచ్చే సేవకులను రక్షించక పోవటమూ, పనికిరాని సేవకులను కాపాడటమూ, కపటధర్మపు నడవడితో రాజును సేవించటం అనేవి తామరతూడుల దొంగతనానికి సాటి రాగలవా?

విశేషం: విశ్వామిత్రుడు ఒకప్పుడు రాజర్షి. కనుక భట సంరక్షణ విషయకంగా పలకటం సముచితంగా ఉన్నది.

వ. నావుడు నరుంధతి యల్ల నవ్వుచు. 243

ప్రతిపదార్థం: నావుడున్= అని పలికిన తరువాత; అరుంధతి= వసిష్ఠుడి ధర్మపత్ని అయిన అరుంధతి; అల్లన్= మెల్లగా; నవ్వుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: అప్పుడు అరుంధతి మెల్లగా నవ్వుతూ (ఇట్లా అన్నది).

విశేషం: ఇక్కడ నవ్వు హృదయంలోని నిర్మలత్వానికి గుర్తు.

క. 'సతతంబు నత్త దూఱుటఁ, బతియెడ దుశ్చిత్త యగుటఁ, బరమాన్నము నొ
క్కత సేవించుట నగు దు । ర్గతి బిసములు డాఁచికొన్న కష్టకుఁ గలుగున్.' 244

ప్రతిపదార్థం: సతతంబున్= ఎల్లవేళలా; అత్తన్= అత్తను; దూఱుటన్= తిట్టటంవలన; పతి ఎడన్= మగని విషయంలో; దుశ్చిత్త= చెడు భావాలు గలది; అగుటన్= కావటంవలనా; పరమ+అన్నమున్= శ్రేష్ఠమైన అన్నం; ఒక్కత= ఒకతే; సేవించుటన్= తినటంవలన; అగు దుర్గతి= అయ్యే పాడుగతి; బిసములు= తామరతూడులు; దాచికొన్న కష్టకున్= దాచుకొన్న నీచురాలికి; కలుగున్= వస్తుంది.

తాత్పర్యం: 'ఎప్పుడూ అత్తను తిట్టటంవలనా, భర్తవిషయంలో చెడు భావాలు గలది కావటంవలనా, మంచిభోజనం ఒక్కతే తినటం వలనా కలిగే పాడుగతి తామరతూడులు దాచుకొన్న నీచురాలికి వస్తుంది.'

విశేషం: 'అత్త' ఇక్కడ ఉపలక్షణం. మగని బంధువులందరినీ గ్రహించాలి. స్త్రీ పుట్టిల్లు విడిచి మెట్టినిల్లు చేరిన పిదప అక్కడివారి నందరినీ ఆత్మీయులుగా భావించి ప్రేమించకపోతే ఆ ఇల్లు నరకప్రాయం అవుతుందని భావం. 'పతియెడ' భార్యాభర్తలు ఒకరి విషయంలో ఒకరు త్రికరణ శుద్ధిగా మంచి భావనతో ఉండాలి. లేకపోతే అది సంసారాన్ని నరకకూపం చేస్తుంది. 'పరమాన్నము' స్త్రీ మాతృ స్వరూపిణి. ఆమె ఆహారాన్ని తనవారికందరికీ పెట్టిన తరువాతనే భుజిస్తుంది. అంతేకాదు **"ఏకః స్వాదు న భుఞ్జీత"** అన్న సూక్తి కూడా రుచిగల పదార్థాన్ని ఒక్కడే తినకూడదని చెప్పుతున్నది. ఒక్కతే తినటం మాతృధర్మానికి విరుద్ధం. అందుకే ఆమె కష్ట - నీచురాలు.

అరుంధతి స్త్రీ ధర్మసంబంధమైన పలుకులు పలకటం ఉచితం.

సీ. అనుడు 'వంటకము సేసిన యింతి తా మున్ను । గుడుచుట, పనియెడఁ గుటిల యగుట,
బొంకులు పలుకుట, పుత్త్రిక వెలగొని । యిచ్చుట, సుజనుల కెగ్గు సేఁత,
యెట్టి దుర్గతిఁ దెచ్చు నట్టిద కల్గు బి । సావలి మ్రుచ్చిలి నట్టులైన;
నిట్లు గాకయుఁ బుట్టువెల్ల దాస్యంబు నీఁ । గకపోవు నక్కీడు గల నికృష్ట'

తే. యనియె గండ; 'యసంతానుఁ డగుట, గర్భ దాసుఁ డగుట దరిద్రత్వ తప్పుఁ డగుట
చెందుఁ దూఁడులకట్ట మ్రుచ్చిలిన కష్ట । నరుని' కని పల్కెఁ బశుసఖనాముఁ డధిప! 245

ప్రతిపదార్థం: అనుడున్= అన్నంతనే; గండ= గండ అనే సేవకురాలు; బిస+ఆవలిన్= తూడుల కట్టను; మ్రుచ్చిలిన+అట్టులు+ఐనన్= దొంగిలిస్తే; వంటకము చేసిన ఇంతి= పాకంచేసిన ఆడది; తాన్= తాను; మున్ను= ముందుగా; కుడుచుట= తినటమూ; పనియెడన్= చేసే పనివిషయంలో; కుటిల= చిత్తశుద్ధిలేనిది; అగుట= కావటమూ; బొంకులు= కల్లపలుకులు; పలుకుట= పలకటమూ; పుత్త్రికన్= కన్నబిడ్డను; వెల+కొని= మూల్యం తీసికొని; ఇచ్చుట= ఇవ్వటమూ; సుజనులకున్= మంచివారికి; ఎగ్గు= కీడు; చేఁత= చేయటమూ; ఎట్టి దుర్గతిన్= ఎటువంటి పాడుగతిని; తెచ్చున్= తెస్తాయో; అట్టి+అది+అ= అట్టి పాడు గతియే; కల్గున్= కలుగుతుంది; ఇట్లు+ కాకయున్= ఇంతే కాక; ఆ+కీడు కల నికృష్ట= ఆ దోషం ఉన్న నీచురాలు; పుట్టువు+ఎల్లన్= బ్రతుకంతా; దాస్యంబున్= బానిస తనాన్ని; ఈఁగకపోవున్= తొలగించుకొనలేక పోతుంది; అనియెన్= అన్నది; అధిప!= రాజా!; పశుసఖనాముఁడు= పశుసఖుడనే పేరుగలవాడు; తూడులకట్టన్= తూఁడుల మోపును; మ్రుచ్చిలిన కష్ట నరునికిన్= దొంగిలించిన నీచ మానవుడికి; అసంతానుఁడు= బిడ్డలు లేనివాడు; అగుట= కావటమూ;

గర్భదాసుఁడు= తల్లి గర్భంలో ఉండినప్పటినుండీ బానిస; అగుట= కావటమూ; దరిద్రత్వ తప్తుఁడు= లేమితో కాలిపోయినవాడు; అగుట= కావటమూ; చెందున్= పొందుతాడు; అని; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: గండ అనే సేవకురాలు 'తామరతూడులు దొంగిలించిన నీచురాలికి వంటచేసి ముందుగా తినటం, పనులలో వంచనచేయటం, అబద్ధాలు పలకటం, పుత్రికను సొమ్ముకు అమ్ముకొనటం, మంచివారికి కీడు చేయటం అనే పాపాలు తెచ్చే దుర్గతిని తెస్తుంది. ఇంతే కాక బ్రతుకంతా దాస్యం వదలని స్థితి ఆ నీచురాలికి కలుగుతుంది' అని పలికింది. పశుసఖుడు తామరతూడులు దొంగిలించినవాడు, సంతానం లేనివాడు, గర్భదాసుడు, కూడుగుడ్డలకు చెడినవాడూ అవుతా' డని పలికాడు.

విశేషం: ఇక్కడ సేవకవృత్తిలో ఉన్న ఈ దంపతులు తదనుగుణంగా పలకటం గమనించదగింది. ఋషి ఈ నెపంతో ఆయా వ్యక్తుల ధర్మాలను వ్యంగ్యమార్గంలో సూచించారు.

వ. అని యిట్లందఱుం దన కభిముఖులై పలికిరి; వారితో శునస్సఖుం డిట్లనియె. 246

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా అందఱున్= వారందరూ; తనకున్= తనకు; అభిముఖులు= ఎదురుమొగం కలవారు; ఐ= అయి; పలికిరి= పలికారు; వారితోన్= వారితో; శునస్సఖుండు= శునస్సఖుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా వారందరూ తనవైపు మొగం పెట్టి పలికారు. అప్పుడు శునస్సఖుడు వారితో ఇట్లా అన్నాడు.

క. 'ఛందోజ్ఞున కైనను, దన । నందన నధ్వర ధురీణునకు నైనను నా
నందముగ నిచ్చుటం బో । లుం దూఁడులకట్ట ద్రుచ్చిలుట దలపోయన్.' 247

ప్రతిపదార్థం: తలపోయన్= ఆలోచింపగా; తూఁడులకట్టన్= తామరతూడుల మోపును; ద్రుచ్చిలుట= దొంగలించటం; తననందనన్= తన బిడ్డను; ఛందోజ్ఞునకున్+ఐనన్= వేదా లెరిగిన వాడికిగానీ; అధ్వర ధురీణునకున్= యజ్ఞాలలో ఎక్కువభారం వహించేవాడికి; ఐననున్= కానీ; ఆనందముగన్= సంతోషంగా; ఇచ్చుటన్= దానంచేయటంతో; పోలున్= సాటి అవుతుంది.

తాత్పర్యం: 'బాగా ఆలోచిస్తే తామరతూడుల మోపును దొంగిలించటం తన కూతురిని మంచి వేదవేత్తకో, యజ్ఞభారాలు వహించేవాడికో ఇవ్వటంతో సమానం అవుతుంది.'

విశేషం: ఛందోజ్ఞుడు - ఛందస్సు అంటే వేదం. ఇష్టప్రాప్తికీ, అనిష్ట పరిహారానికీ అలౌకికమైన ఉపాయం చెప్పే మహావాఙ్మయం. దానిని తత్త్వ పూర్వకంగా తెలిసికొనటం చాలా గొప్ప విషయం. అట్టివాడు కోటికొకడు ఉండవచ్చును. అతడికి కన్యను ఇవ్వటమంటే అది అనంత పుణ్యఫలాన్నిస్తుంది.

యజ్ఞ ధురీణుడు - యజ్ఞం చేయాలంటే అంగబలం, అర్థబలం, బుద్ధిబలం, మంత్రాలబలం మొదలైనవి ఎన్నో పుష్కలంగా ఉండాలి. భారతంలో సభాపర్వంలో రాజసూయయాగం ధర్మరాజు చేసిన ధోరణిని చక్కగా వివరించారు. దానిని అనుశీలిస్తే దీని సంగతి తెలుస్తుంది. యజ్ఞం సక్రమంగా నిర్వహిస్తే మహాఫలా న్నిస్తుంది. నిర్వహించలేకపోతే మహాప్రమాదం ముంచుకొని వస్తుంది. కాబట్టి 'ధురీణుడు' - ప్రమాదంలేకుండా గట్టెక్కించగలవాడు - దుర్లభుడు. అట్టివాడికి కన్య నివ్వటం మహాపుణ్య ఫలాన్నిస్తుంది. శునస్సఖుడు ఇప్పటి దొంగతనాన్ని దానితో పోలుస్తున్నాడు!

తే. అనిన నయ్యందఱును 'బుణ్యమైన కర్మ । మనఘ! శపథంబునకు విషయముగ నీవు
పలికి; తటుగాన బిసలతా ప్రతతి సపహ । రించినాఁడవు; మమ్ముఁ గారింప కిమ్ము. 248

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+అందఱును= వారందరూ; అనఘ!= పుణ్యాత్ముడా!; నీవు; పుణ్యకర్మము= పుణ్యమైన పనిని; శపథంబునకున్= ఒట్టునకు; విషయముగన్= విషయంగా; పలికితి= పలికావు; అటు+కానన్= కాబట్టి; బిసలతా ప్రతతిన్= తామరతూడుల కట్టను; అపహరించినాఁడవు= దొంగలించినవాడవు; మమ్మున్= మమ్ములను; కారింపక= బాధింపక; ఇమ్ము= ఇచ్చివేయుము.

తాత్పర్యం: అత డట్లా అంటే వారంతా 'అయ్యా! నీవు పుణ్యకార్యాన్ని ఒట్టుకు సంగతిగా చేసి మాటాడుతున్నావు. అంటే తామరతూడులు దొంగిలించా వన్నమాట. మమ్ములను బాధించక వాటిని మాకిచ్చివేయుము' అన్నారు.

విశేషం: ఆ ఋషులూ, సేవక దంపతులు పాపాలమీద ఒట్టుపెట్టుకొన్నారు. శునస్సఖుడు పుణ్యంతో పోల్చాడు. అంటే అతడే దొంగిలించాడని నిర్ణయం చేయటానికి అవకాశం కల్పించాడు.

సీ. అనిన 'నిక్కం బిది యందఱు నొండొరు । నేమనియెదరొ? వీ రీబిసముల
పొది యేను దాఁచి చూచెద నని దాఁచితి; । నిదె కొనుఁ' డని దాని నిచ్చి, మీకు
నలిగి వధించుటకై హోమవహ్నిఁ బు । ట్టించి వృషాదర్భి పంచెఁ గృత్తి;
నది మున్న కాంచి రక్షార్థినై వచ్చి యా । రక్కసిఁ జంపితి; నిక్కమునకు

ఆ. వాసవుండ; లోభవర్జనముఖ భవ । త్స ద్గుణములఁ జేసి శాశ్వతంపు
నెలవు గలిగె; రండు నెగయుండు పుణ్యలో । కముల' కని సమాదరమునఁ బలికె. 249

ప్రతిపదార్థం: అనినన్= అని వారు పలుకగా; ఇది= ఈ విషయం; నిక్కంబు= నిజం; వీరు= ఈ ఋషులు; అందఱున్= అందరూ; ఒండొరున్= ఒకరినొకరు; ఏమి; అనియెదరొ= భావిస్తారో; ఈ బిసముల పొది= ఈ తూడుల మోపును; ఏను= నేను; దాఁచి= దాచి; చూచెదన్= చూస్తాను; అని; దాఁచితిన్= దాచాను; ఇదె= ఇదిగో; కొనుఁడు= తీసికొనండి; అని; దానిన్= ఆ మోపును; ఇచ్చి; మీకున్= మీ మీద; అలిగి= కోపించి; వధించుటకున్+ఐ= చంపటానికి; వృషాదర్భి= వృషాదర్భి అనే రాజు; కృత్తిన్= కృత్య అనే రక్కసిని; హోమవహ్నిన్= హోమపు అగ్నిలో; పుట్టించి; పంచెన్= పంపాడు; అది= ఆ విషయం; మున్ను+అ= ముందే; కాంచి= తెలిసికొని; రక్షా+అర్థిని+ఐ= రక్షచేయగోరినవాడినై; వచ్చి= అరుదెంచి; ఆ రక్కసిన్= ఆ రక్కసిని; చంపితిన్= చంపివేశాను; నిక్కమునకున్= నిజానికి; వాసవుండన్= దేవేంద్రుడను; లోభ వర్జన ముఖ భవత్ సద్గుణములన్+చేసి= దురాశవదలటం మొదలైన మీ మంచి గుణాలవలన; శాశ్వతము+నెలవు= ఎన్నటికీ చెడని చోటు; కలిగెన్= సిద్ధించింది; రండు= రండి; పుణ్యలోకములకున్= పుణ్యలోకాలకు; నెగయుండు= పైకి లేవండి; అని; సమాదరమునన్= మిక్కిలి ఆదరంతో; పలికెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ ఋషులు ఆ విధంగా పలుకగా అతడు 'నిజమే ఈ తూడుల విషయంలో మీలో మీరు ఎట్లా సంభావిస్తారో చూడాలని వాటిని నేనే దొంగిలించాను. ఇవిగో తీసికొనండి' అని వాటిని వారి కిచ్చి 'వృషాదర్భి మీమీద కోపంతో మిమ్ములను చంపటానికి హోమాగ్నిలో కృత్యను పుట్టించి పంపాడు. దానిని ముందే తెలిసికొని మిమ్ములను కాపాడటానికి వచ్చి యా రక్కసిని చంపాను. నేను నిజానికి దేవేంద్రుడను. లోభం వదలటం మొదలైన మీ

మంచిగుణాలవలన మీకు శాశ్వతలోకాలు సిద్ధించాయి. రండి ఆ పుణ్యలోకాలను అధిరోహించండి' అని ప్రీతితో పలికాడు.

విశేషం: 'ఏమి+అనియెదరో!' - సాధారణంగా ఇటువంటి సందర్భాలలో ఒకరినొకరు శంకిస్తారు. సత్యం తెలిసికొనలేక ఇతరులయందు ద్వేషం పెంచుకొంటారు. అది మానవనైజం. దేవేంద్రుడు దానిని పరీక్షించాడు. "లోభవర్జనముఖ' - లోభం మహాపాపగుణం. అది వదలితే ఫలం శాశ్వత లోకప్రాప్తి. మనుజుడు దీనిని గుర్తించాలి. అల్పవస్తువులమీది లోభంవలన శాశ్వతంగా పాపలోకాలలో నివసించాలి. ఆ కాస్త దుర్గుణాన్ని ప్రయత్నంతో వదలగలిగితే అక్షయపుణ్య లోకాలు లభిస్తాయి. ఇది ఈ కథలోని ఉపదేశం.

వ. అట్లు పలుకుటయు. 250

తాత్పర్యం: అత డట్లు పలికినంతనే.

చ. అనయముఁ బ్రీతిఁబొంది మును 'లట్టుల చేసెద మంచు నింద్రు ప
జ్జన తగ నేఁగి దేవపరిషత్పరిపూజ్యపదస్థులై వెలిం
గి నిఖిలలోక నిత్యపరికీర్తితమూర్తుల నొప్పి; రింతయు
న్విను మపరిగ్రహంబు మహనీయత నైనది సూవె భూవరా! 251

ప్రతిపదార్థం: మునులు= ఆ మహర్షులు; అనయమున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రీతిని; పొంది; అట్టులు+అ= అట్లే; చేసెదము= చేస్తాం; అంచున్= అంటూ; ఇంద్రు పజ్జన్+అ= ఇంద్రుడి ప్రక్కనే; తగన్= చక్కగా; ఏఁగి= వెళ్ళి; దేవ పరిషత్ పరి పూజ్య పదస్థులు= దేవతల సభలో మిక్కిలి పూజించదగిన స్థానంలో ఉన్నవారు; ఐ= అయి; వెలింగి= ప్రకాశించి; నిఖిలలోక నిత్య పరికీర్తిత మూర్తులన్= అన్ని లోకాలలో ఎప్పుడూ కొనియాడబడే ఆకారాలతో; ఒప్పిరి= ఒప్పారారు; భూవరా!= రాజా!; వినుము= శ్రద్ధగా ఆలకించుము; ఇంతయున్= ఇదంతా; అపరిగ్రహంబు మహనీయతన్= ఇతరుల సొమ్మును దానరూపంలో కూడా గ్రహించని గొప్పతనంవలన; ఐనది= అయింది; సూవె!= సుమా!

తాత్పర్యం: ఆ మునులందరూ ఎంతో ప్రీతి పొంది అట్లాగే చేస్తామని పలికి దేవేంద్రుడి ప్రక్కనే చక్కగా అరిగి దేవలోకంలో పూజించదగిన స్థానాలలో ప్రకాశిస్తూ లోకాలన్నీ మన్నించి కొనియాడే రూపాలతో మెరిసిపోయారు. రాజా! వినుము. ఇదంతా పుచ్చుకొనకపోవటం అనే గుణపు గొప్పతనంవలన కలిగింది సుమా!

విశేషం: దేవపరి.....పదస్థులై; నిఖిల... మూర్తులన్ - అనే దీర్ఘ సమాసాలు వారి గొప్పతనపు ఆధిక్యాన్ని సూచిస్తున్నాయి.

సాధారణంగా ఒకడు దానాదులను తన పాపాలను పోగొట్టుకొనటానికి చేస్తాడు. అంటే అవి పుచ్చుకొనే వాడికి సంక్రమించే ప్రమాదం ఉన్నది. తన పాపాలే తనను పట్టి పల్లారుస్తూ ఉండగా ఇతరుల పాపాలు చుట్టుకొంటే కలిగే నరకయాతన ఎట్టిదో మనం ఊహించవచ్చును. కనుక 'అపరిగ్రహం' మహాపుణ్యంగా చెప్పారు.

క. కావున లోభము విడుచుట । కేవియు సరిగావు గుణము; లీగుణము మహీ
దేవునకు వలయుఁ బెద్దయు । నీ విధమున కమరసంఘ మెంతయు మెచ్చున్.' 252

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; గుణములు= ఇతర గుణాలు; ఏవియున్= ఏవి కూడా; లోభము విడుచుటకున్= లోభాన్ని విడవటానికి; సరి కావు= సాటికావు; ఈ గుణము= ఈ లోభం వదలట మనే గుణం; మహీదేవునకున్= బ్రాహ్మణుడికి; పెద్దయున్= చాలా ఎక్కువగా; కావలయున్= కావాలి; ఈ విధమునకున్= ఈ పద్ధతికి; అమరసంఘము= దేవతల సముదాయం; ఎంతయున్= ఎంతో; మెచ్చున్= మెచ్చుతుంది.

తాత్పర్యం: కాబట్టి లోభాన్ని విడవటానికి మ రేగుణాలూ సాటి రావు. అందునా బ్రాహ్మణుడు దీనిని మరింత శ్రద్ధతో పాటించాలి. దీనిని దేవతలెంతో గొప్పగా భావిస్తారు.'

విశేషం: బ్రాహ్మణుడి బ్రతుకు తక్కిన వర్ణాలవారికంటె ఎంతో కఠోరనియమాలతో కూడింది. తక్కిన వారికి అల్పప్రయత్నంతో కలిగే ఉత్తమ ఫలాలు అతడికి మహా ప్రయత్నంతో గానీ సిద్ధించవు.

వ. అని చెప్పి భీష్ముండు వెండియు. 253

ప్రతిపదార్థం: అని; చెప్పి= వివరించి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: భీష్ము డిట్లా చెప్పి ఇంకా (వివరిస్తున్నాడు).

ఉ. 'ఈ యితిహాస మార్యసభ నెవ్వఁడు సమ్మతిఁ జెప్పువాఁడు దీ
ర్ఘాయువు శ్రీయు ధర్మము సమంచితకీర్తియు వృద్ధిఁ బొంద సౌ
ఖ్యాయతనాత్ముఁడై మను; సురావలియుం బితృకోటియుం బ్రియ
శ్రీ యలరారఁ గీ డతనిఁ జెందక యుండఁగఁ జేయు నెయ్యెడన్.' 254

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఏ నరుడు; ఈ ఇతిహాసము= ఈ మునుపటి కథను; ఆర్యసభన్= మంచినడవడిగల వారి సభలో; సమ్మతిన్= మంచిబుద్ధితో; చెప్పున్= చెప్పుతాడో; వాఁడు= అట్టివాడు; దీర్ఘ+ఆయువున్= ఎక్కువ ఆయుర్దాయమూ; శ్రీయున్= సంపదా; ధర్మము= ధర్మమూ; సమంచిత కీర్తియున్= మంచి కొనియాడదగిన కీర్తి; వృద్ధిన్+పొందన్= పెంపొందగా; సౌఖ్య+ఆయతన+ఆత్ముఁడు+ఐ= సౌఖ్యానికి నెలవైన హృదయం కలవాడై; మనున్= బ్రతుకుతాడు; సుర+ఆవలియున్= దేవతల సముదాయమూ; పితృకోటియున్= పితృదేవతల సమూదాయమూ; ప్రియశ్రీ= ప్రీతి సంపద; అలరారన్= చక్కగా కలిగేటట్లుగా; ఏ+ఎడన్= ఎక్కడనూ; కీడు= ఆపద; అతనిన్= అట్టివాడిని; చెందక ఉండఁగన్+చేయున్= రాకుండా చేస్తుంది.

తాత్పర్యం: 'ఈ పాతకథను ఆర్యుల సభలో ప్రవచించేవాడు దీర్ఘమైన ఆయువూ, సంపదా, ధర్మమూ, దొడ్డ కీర్తి పెంపొందగా సౌఖ్యానికి నెలవైన బుద్ధిగలవాడై జీవిస్తాడు. దేవతలూ, పితృదేవతలూ ఎంతో ప్రీతితో అతడి కే ఆపదా ఎటువైపునుండీ రాకుండా చేస్తారు.'

విశేషం: ఇది ఈ కథకు ఫలశ్రుతి. ప్రతికార్యానికి ఒక ఫలం ఉంటుంది. ఫలాన్ని అపేక్షించి పనికి నరుడు ఉపక్రమిస్తాడు. కనుక ఋషులు ఫలాన్ని గూర్చి చెప్పుతూ ఉంటారు. ఆ ఫలం ఉదాత్త మనుష్యులను మరింతగా ఆకర్షిస్తుంది. ఈ కథ చాలా గొప్పది. అప్రతిగ్రహం, లోభం లేకపోవటం అనే మహాగుణాల మహిమను ఇది వక్కాణించింది. విన్నవారు ఆ గుణాలను అలవరచుకొంటారు. ఇక చెప్పినవారి సంగతి చెప్పనక్కర లేదు గదా!

ఇందులో ఇంచుమించు సగానికి పైభాగంలో సుఖలాభాన్ని గురించీ, మిగిలిన దానిలో దుఃఖనాశాన్ని గురించీ చెప్పారు. కేవలం సుఖం లభిస్తే చాలదు. అది లభించిన తృప్తిని చెడగొట్టే కీడుకూడా నశించాలి. అప్పుడే పూర్ణఫలం దక్కినట్లవుతుంది.

ఉపానద్దాన విషయక సూర్య జమదగ్ని సంవాదము (సం.13-97-3)

వ. అనిన విని యజాతశత్రుండు శంతనుపుత్రుతోఁ బితృ కార్యాదులయందు గొడుగులుఁ జెప్పులు నిడుట యుత్తమ ప్రకారం బని చెప్పుదురు; వాని విశేషంబు తెలం గెఱింగింపవే!' యనుటయు నమ్మహాత్ముం డమ్మహీపతి కిట్లను; 'సూర్యజమదగ్ని సంవాదంబను నితిహాసంబు వినుము; దాన నీయడిగినయది తేటపడు, జమదగ్ని మహాముని క్రీడార్థియై శరాసనంబు ధరించి రేణుకాదేవి బాణంబులకట్టఁ గొని తనతోడం జనుదేర నివాసంబు వెడలి యొక్కబయల నయ్యంపపొది నిలువ వైపించికొని దూరాపాతనం బాచరింప నిక్కుసుమకోమలి సని యమ్ము లేఱికొని వచ్చి యిచ్చుచుండు. 255

ప్రతిపదార్థం: అనినన్= అన్న తరువాత; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; శంతను పుత్రుతోన్= శంతనుడి కొడుకు భీష్మడితో; పితృకార్య+ఆదులయందున్= శ్రాద్ధం మొదలైన పనులయందు; గొడుగులు= గొడుగులున్నూ; చెప్పులున్= చెప్పులూ; ఇడుట= దానంచేయటం; ఉత్తమ ప్రకారంబు= మంచిపద్ధతి; అని; చెప్పుదురు= చెప్పుతారు; వాని విశేషంబు తెలంగు= ఆ గొడుగు చెప్పుల మహిమ పద్ధతిని; ఎఱింగింపవే= చెప్పవా; అనుటయున్= అనగానే; ఆ+మహాత్ముండు= ఆ మహాబుద్ధిశాలి; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; సూర్య జమదగ్ని సంవాదంబు= సూర్యుడికి జమదగ్ని మహర్షికి అయిన సంభాషణ; అను ఇతిహాసంబు= అనే ప్రాతకాలపు కథను; వినుము; దానన్= దానివలన; నీ+అడిగిన+అది= నీ వడిగింది; తేటపడున్= స్పష్టమవుతుంది; జమదగ్ని మహాముని= జమదగ్ని అనే ఒక గొప్ప ముని; క్రీడా+అర్థి+ఐ= వినోదించగోరినవాడై; శర+ఆసనంబున్= వింటిని; ధరించి=పట్టుకొని; రేణుకాదేవి= భార్యఅయిన రేణుకాదేవి; బాణంబులకట్టన్= బాణాల పొదిని; కొని= పట్టుకొని; తనతోడన్= తనతోపాటు; చనుదేరన్= రాగా; నివాసంబున్= ఇంటినుండి; వెడలి= వెలుపలికి వచ్చి; ఒక్కబయలన్= ఒక బయలు ప్రదేశంలో; ఆ+అమ్ము+పొదిన్= ఆ అమ్ములకట్టను; నిలుపన్= ఉండేటట్లుగా; వైపించుకొని= దూర+ఆపాతనంబు= దూరంగా పడవేయుటం; ఆచరింపన్= చేయుగా; ఆ+కుసుమకోమలి= పూవులవలె సుకుమారి అయిన ఆమె; చని= వెళ్ళి; అమ్ములు= బాణాలు; ఏఱికొని= ఏరుకొని; వచ్చి= అతడి దగ్గరకు వచ్చి; ఇచ్చుచున్+ఉండున్= ఇస్తూ ఉన్నది.

తాత్పర్యం: తరువాత ధర్మరాజు భీష్మడిని 'తాతా! శ్రాద్ధాదులలో గొడుగులు, చెప్పులు దానం చేయటం చాలా మంచి పనిగా చెప్పుతారు. వాటి సంగతి చెప్పుము' అని ప్రార్థించాడు. అప్పు డా దొడ్డబుద్ధిగల భీష్మడు ఆ రాజుతో ఇట్లా అన్నాడు. 'సూర్యజమదగ్ని సంవాదం అనే పురాతన కథ వింటేనే నీ వడిగిన విషయం చక్కగా తెలుస్తుంది వినుము. జమదగ్ని ఒకనాడు వినోదంకొరకు విల్లు పుచ్చుకొని బాణాల పొది తీసికొని భార్య రేణుక వెంటరాగా ఇల్లు వెడలి ఒక బయలులోనికి వచ్చి ఆ కట్టను ఒకచోట నిలువజేసి, దూరంగా బాణాలు పడవేస్తూ ఉన్నాడు. ఆమె ఆ బాణాలు ఏరి తెచ్చి మరల అతడికి అందిస్తూ ఉన్నది.

విశేషం: క్రీడార్థి - హింసకొరకు కాదని సూచన. కుసుమ కోమలి - ఇది రాబోయే కథాంశాన్ని సూచించే విశేషగుణం, బయలు విశాలమైన ప్రదేశం - పొరపాటున ఎవ్వరికీ బాణాలు తగిలే అవకాశం లేదనటాన్ని సూచిస్తుంది.

తే. ఇవ్విధమున వినోదింప నినుఁడు గగన । మధ్యగతుఁ డయ్యె నప్పు డమ్మగువ యమ్ము
లేఁటి తేరంగఁబోయి యొక్కింత దడసి । యరుగుదెంచిన నాతఁ డయ్యబలతోడ. 256

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ విధంగా; వినోదింపన్= క్రీడిస్తూ ఉండగా; ఇనుఁడు= సూర్యుడు; గగన మధ్య గతుఁ డు= నడిమింటికి వచ్చినవాడు; అయ్యెన్= అయ్యాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+మగువ= ఆ కాంత; అమ్ములు= బాణాలు; ఏఁటి= ఏరుకొని; తేరంగన్= తేవటానికి; పోయి= వెళ్ళి; ఒక్క+ఇంత= కొంచెం సేపు; తడసి= ఆలస్యం చేసి; అరుగుదెంచినన్= వస్తే; ఆతఁడు= ఆ జమదగ్ని; ఆ+అబలతోడన్= ఆ ఇంతితో.

తాత్పర్యం: ఈ విధంగా ఆడుకొంటూ ఉండగా సూర్యుడు నడిమింటికి వచ్చాడు. అప్పుడు ఆ రేణుక బాణాలు ఏరి తేవటానికి పోయి కొంచెం జాగుచేసి వస్తే అతడు ఆమెతో (ఇట్లా అన్నాడు).

విశేషం: అబల - ఇది సాభిప్రాయ విశేషణం. మధ్యాహ్న సూర్యుడి వేడిమికి తట్టుకొనలేకపోయిం దన్న భావాన్ని సూచిస్తుంది.

క. 'లోలాక్షి! యచట నిమ్మరి । యేల తడసి?' తనుడుఁ బేర్చు నినతేజమునన్
నేలకు వేఁడిమి దనికినఁ । జాలన వెసఁ ద్రొక్కఁ దలయుఁజాలఁ దపించెన్. 257

ప్రతిపదార్థం: లోల+అక్షి!= త్రిప్పు కనులదానా!; అచటన్= అక్కడ; ఈ+మరి= ఇంతసేపు; ఏల?=ఎందుకు?; తడసితి= జాగు చేశావు; అనుడున్= అనగానే; పేర్చు+ఇన తేజమునన్= ఎక్కువ అయిన సూర్యుడి వేడిమికి; నేలకున్= భూమికి; వేఁడిమి= వేడి; తనికినన్= సోకగా; వెసన్= వేగంగా; త్రొక్కన్= త్రొక్కుటకు; చాలను+అ= చాలలేక పోయాను; తలయున్= నెత్తికూడా; చాలన్= ఎక్కువగా; తపించెన్= కాలింది.

తాత్పర్యం: 'లోలాక్షీ! అక్కడ ఇంత జాగుచేశావేమి?' అని అంటే 'సూర్యుడి తేజస్సు తీవ్రమైన కారణంగా నేల వేడెక్కింది. వడివడిగా కాళ్ళాన్చి నడవలేకపోయాను. తలకూడా వేడి ఎక్కింది.

విశేషం: లోలాక్షి! - ఏకాంతంలో భార్యను భర్త సరసంగా పిలిచిన పిలుపు. అంతేకాదు ఆమె పొందిన శ్రమవలన కన్నులు నిశ్చలతను కోల్పోయిన అంశంకూడా ఇక్కడ ఈ పదంచేత తెలియవస్తుంది. క్రింద కాళ్ళు, పైన తలా రెండు వేడివలన వివశం అయ్యాయి అని భావం.

క. ఇమ్మెయి నలంగి యొక వృ । క్షమ్మున క్రీనీడ నిలిచి చనుదెంచుట నా
కిమ్మరి దడయ వలసె' నని । యమ్ముద్దియ సెప్పెఁ జెమట యడరఁగ మేనన్. 258

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; నలంగి= అలసిపోయి; ఒక వృక్షమ్మున క్రీనీడన్= ఒక చెట్టు క్రింద నీడలో; నిలిచి= నిలుచుండి, చనుదెంచుటన్= రాగా; నాకున్= నాకు; ఈ+మరి= ఇంతసేపు; తడయన్ వలసెన్= జాగుచేయవలసి వచ్చింది; అని; ఆ+ముద్దియ= ఆ ముద్దరాలు; మేనన్= ఒడలిపై; చెమట= స్వేదం; అడరఁగన్= వ్యాప్తి పొందగా; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: ఈ విధంగా ఒక చెట్టు క్రింది నీడలో కొంతసేపు నిలిచి రావటంవలన నా కింతసేపు జాగు చేయవలసి వచ్చింది' అని చెమట ఓడుతున్న దేహం గల ఆ ముద్దరాలు చెప్పింది.

విశేషం: ముద్దియ - ముద్దరాలు, కష్టాన్ని తట్టుకొనలేనితనం దీనివలన వ్యక్తమవుతుంది. చెమట దీనికి సాక్ష్యం.

క. విని 'యే మేమీ! నొంచెనె । యినుఁడు నినుం; దత్ఫలంబు నిప్పుడ కుడువం
గనియెదుఁ గా కస్త్రానల । మునఁ బొదివెద నతని' ననియె ముని కోపమునన్. 259

ప్రతిపదార్థం: విని= ఆ మాట విని; ముని= ఆ జమదగ్ని మహర్షి; కోపమునన్= కోపంతో; ఏమి+ఏమీ= ఏమిటేమిటీ; ఇనుఁడు= సూర్యుడు; నినున్= నిన్ను; నొంచెనె?= కష్టపెట్టాడా?; తత్+ఫలంబు= దానిఫలం; ఇప్పుడు+అ= ఇప్పుడే; కుడువన్+కనియెడున్+కాక= అనుభవిస్తాడు కాక!; అతనిన్= వాడిని; అస్త్ర+అనలమునన్= అస్త్రాల అగ్నిలో; పొదివెదను= ముంచివేస్తాను; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని ముని కోపంతో 'ఏమేమీ సూర్యుడు నిన్ను బాధించాడా? ఆ ఫలం ఇప్పుడే అనుభవిస్తాడు. నా అస్త్రాలమంటలో క్రమ్మివేస్తాను' అన్నాడు.

విశేషం: ఏమేమీ - అనేచోట సంరంభం; ఇప్పుడు - అన్నచోట ఆలస్యం చేయరాదన్న తీవ్రతా మొదలైన భావాలు స్ఫురిస్తూ క్రోధమనే భావాన్ని చక్కగా రూపుకట్టిస్తున్నది ఈ రచన. ఆ మహర్షి తపశ్శక్తి సూర్యుడిని కూడా నిర్ధూమధామం చేయగలదిగా దీనిని బట్టి తెలియవస్తున్నది.

ఉ. దాని నెఱింగి భూసురతఁ దాల్చి వెసం జనుదెంచి యర్కుఁ డ
మ్మానిత సంయమిం గని యమత్సరభావము దోఁప 'రోషమున్
మానుము' నావుడుం 'బలుకు మానుము; నీవటు వాయు; మేసెదన్
భానుని నేలఁ గూల' నని పల్కె మునీంద్రుఁడు శోణితాక్షుఁడై. 260

ప్రతిపదార్థం: అర్కుఁడు= సూర్యుడు; దానిన్= ఆ సంగతి; ఎఱింగి= తెలిసికొని; భూసురతన్= బ్రాహ్మణత్వాన్ని; తాల్చి= ధరించి; వెసన్=వేగంగా; చనుదెంచి= వచ్చి; ఆ+మానిత సంయమిన్= మన్నించదగిన ఆ మహర్షిని; కని= చూచి; అమత్సరభావము= ప్రశాంత లక్షణం; తోఁపన్= కనపడే విధంగా; రోషమున్= క్రోధాన్ని; మానుము= వదలుము; అనుడున్= అనగానే; పలుకు= మాట; మానుము= చాలించుము; నీవు; అటు= అవతలకు; పాయుము= తొలగుము; నేలన్= నేలమీద; కూలన్= కూలేటట్లుగా; భానునిన్= రవిని; ఏసెదన్= కొట్టుతాను; అని; ముని+ఇంద్రుఁడు= మహర్షి శ్రేష్ఠుడు; శోణిత+అక్షుఁడు+ఐ= ఎరుపెక్కిన కనులు కలవాడై; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ సంగతి తెలిసికొని సూర్యుడు బ్రాహ్మణ వేషం ధరించి వచ్చి మన్నించదగిన ఆ సంయమిని చూచి శాంతస్వభావం కనపడే విధంగా 'క్రోధం చాలించుము' అన్నాడు. అప్పుడు మునివర్యుడు కెంపెక్కిన కనులతో 'చాలించు నీ మాటలు; ప్రక్కకు తొలగుము; ఆ సూర్యుడిని నేలపై కూల నేస్తాను' అన్నాడు.

విశేషం: అమత్సరభావము - వచ్చినది సూర్యుడు. మహర్షి నిష్కారణంగా తనమీద కోపం ప్రదర్శిస్తున్నాడు. అయినా తాను కోపం పొందలేదు. అంటే అతడు సూర్యచంద్రాది దేవతలకు కూడా మన్నింపదగిన మహాత్ముడని భావం. దానినే 'మానితసంయమి' అనే పదంచేత కవి స్పష్టం చేస్తున్నాడు. శోణితాక్షుఁడు - కన్నులెరుపెక్కినాయి. ఇది సాత్త్వికభావం. రౌద్రరస స్ఫూర్తి కిది దోహదం చేస్తుంది.

చ. పలికిన బ్రాహ్మణుం డొదుగఁబాఱక నిల్చి 'మునీంద్ర! యిట్టు లి
ట్టల మగు క్రూరవృత్తికిఁ గడంగుదురే? సవితృండు రశ్మిలన్
జల మొసఁగంగ నోషధుల సంపద హవ్యమహత్త్వ మొంది వే
ల్పులకు బలంబు నిచ్చునది లుప్తము గాదె యతండు నొచ్చినన్.' 261

ప్రతిపదార్థం: పలికినన్= అట్లు పలుకగా; బ్రాహ్మణుండు= బ్రాహ్మణవేషధారి అయిన సూర్యుడు; ఒదుగన్+పాఱక= ప్రక్కకు తప్పుకొని పరుగెత్తక; నిల్చి= అక్కడనే ఉండి; ముని+ఇంద్ర!= మునిశ్రేష్ఠా!; ఇట్టులు= ఈ విధంగా; ఇట్టలము= ఎక్కువ; అగు= అయిన; క్రూరవృత్తికిన్= దయలేని నడవడికి; కడంగుదురే?= పూనుకొంటారా?; సవితృండు= సూర్యుడు; రశ్మలన్= కిరణాలతో; జలము= నీటిని; ఒసఁగంగన్= ఇవ్వగా; ఓషధుల సంపద= ధాన్యాల సంపద; హవ్య మహత్త్వము= హోమపదార్థపు మహిమను; ఒంది= పొంది; వేల్పులకున్= దేవతలకు; బలంబున్= సత్తువను; ఇచ్చున్= ఇస్తుంది; అతండు= సూర్యుడు; నొచ్చినన్= బాధపడితే; అది= ఆ పని; లుప్తము= నశించేది; కాదె!= కాదా!

తాత్పర్యం: జమదగ్ని ఇట్లా అంటే ఆ బ్రాహ్మణుడు ప్రక్కకు తప్పుకొని వెళ్ళిపోక నిలిచి 'మునీంద్రా! ఇంత అధికమైన క్రూరపు నడవడికి (మీ వంటివారు) పూనుకొంటారా? సూర్యుడు నీరు ఇస్తే ఓషధులసంపద హవ్యపదార్థపు మహిమను పొంది దేవతలకు బలాన్నిస్తుంది. అట్టి సూర్యుడు బాధపడితే ఆ బలం లోపిస్తుంది కదా!'

విశేషం: వేసవికాలంలో ఎండతీవ్రత లోకం మేలుకొరకే. ఆ తీవ్రతవలననే మేఘాలు ఏర్పడతాయి. వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయి. తిండి కలిగి మనుష్యులు కండగలవారవుతారు. ఇక్కడ వేల్పులబలం భూమి మీద ప్రాణికోటి బలానికి మూలకారణమని మనం గుర్తించాలి. వేల్పులంటే గాలి, నింగి, నిప్పు, నీరు, నేల అనే పంచభూతాలే అని కూడా గుర్తించాలి. అవి సమస్థితిలో ఉంటే అన్నీ సమస్థితిలోనే ఉంటాయనేది శాస్త్రీయ నిరూపణకు సంబంధించిన విషయం.

చ. అనినను శాంతిలేమికి భయం బెదఁ గూరఁగ మ్రొక్కి యాతఁ 'డే
నినుఁడ సహింపు నావలన నెగ్గులు గల్గినయేని; నీకు నె
మ్మనము దయామయం బని సమస్త జగంబులు సంస్తుతింపఁగా
విని ముదమందుదున్; శరణు వేఁడెదఁ గావుము న న్మునీశ్వరా!' 262

ప్రతిపదార్థం: అనినను= ఇట్లా చెప్పినా; శాంతి లేమికిన్= శాంతి కలగకపోవటానికి; భయంబు= భయం; ఎదన్= హృదయంలో; కూరఁగన్= ఏర్పడగా; ఆతఁడు= ఆ బ్రాహ్మణుడు; మ్రొక్కి= మోకరిల్లి; ఏన్= నేను; ఇనుఁడన్= సూర్యుడను; నావలనన్= నానుండి; ఎగ్గులు= కీడులు; కల్గిన ఏని= కలిగితే; సహింపు= సైపుము; నీకున్= నీకు; నెఱ+మనము= నిండు మనస్సు; దయామయంబు= దయతో నిండింది; అని; సమస్తజగంబులు= అన్ని లోకాలు; సంస్తుతింపఁగాన్= చక్కగా కొనియాడుతుండగా; విని= ఆలకించి; ముదము= సంతసం; అందుదున్= పొందుతూ ఉంటాను; ముని+ఈశ్వరా!= మహర్షి శ్రేష్ఠుడా!; శరణు= రక్షణం; వేఁడెదన్= కోరుతాను; నన్= నన్ను; కావుము= కాపాడుము.

తాత్పర్యం: ఇంత చెప్పినా జమదగ్ని శాంతి పొందలేదు. సూర్యుడు హృదయంలో భయపడి 'మునీశ్వరా! నేను సూర్యుడను. నా వలన నీకు ఏ కీడులు కలిగినా సహించుము. నీ హృదయం దయతో నిండిన దని అన్ని లోకాలు కొనియాడగా విని సంతోషం పొందుతూ ఉంటాను. నిన్ను శరణు కోరుతున్నాను. నన్ను రక్షించుము' (అన్నాడు).

విశేషం: కల్గినయేని - కలిగి ఉంటే, నిజానికి నేను ఏ దోషమూ చేయలేదని ధ్వని. మరి భయ మెందుకు అంటే మహర్షుల మహిమ అటువంటిది. వారు సకారణంగానైనా అకారణంగానైనా కోపగిస్తే ప్రళయభీకరు లవుతారు - అనే విషయం ఇక్కడ ఉపదేశం.

చ. అనినఁ బ్రశాంతుఁడై తపను నా భృగుముఖ్యుఁడు ప్రీతి గారవిం
చినఁ బ్రమదంబునన్ గొడుగుఁ జెప్పులు మానసవృత్తిఁ దెచ్చి య
మ్ముని కడఁ బెట్టి, యత్తరణి ము న్నివి లేవని పల్కి దీన మైఁ
దనుకదు, వీనఁ బాదములఁ దాఁకదు నాదగు వేఁడి యేమియున్. 263

ప్రతిపదార్థం: అనినన్= అంటే; ఆ భృగుముఖ్యుఁడు= భృగువంశంలో శ్రేష్ఠుడైన ఆ జమదగ్ని; ప్రశాంతుఁడు+ఐ= కోపం మొదలైన వికారాలు లేనివాడై; తపనున్= సూర్యుడిని; ప్రీతిన్= ప్రీతితో; గారవించినన్= మన్నింపగా; ఆ+తరణి= ఆ సూర్యుడు; ప్రమదంబునన్= ఆనందంతో; మానసవృత్తిన్= సంకల్ప మాత్రంచేత; గొడుగున్= ఛత్రమునూ; చెప్పులు= చెప్పులనూ; తెచ్చి; ఆ+మునికడన్= ఆ మహర్షి దగ్గర; పెట్టి= ఉంచి; మున్ను= ఇంతకు పూర్వం; ఇవి= ఈ గొడుగూ, చెప్పులూ; లేవు; అని; పల్కి= పలికి; నా దగు వేఁడి= నాదైన వేడి; ఏమియున్= ఏ మాత్రమూ; దీనన్= ఈ గొడుగువలన; మైన్= ఒడలి యందు; తనుకదు= కలుగదు; వీనన్= ఈ చెప్పులవలన; పాదములన్= కాళ్ళను; తాఁకదు= అంటదు.

తాత్పర్యం: సూర్యు డిట్లా అనగా ఆ జమదగ్ని శాంతించాడు. అతడిని మన్నించాడు. అప్పుడు సూర్యుడు సంకల్పమాత్రంచేత గొడుగూ చెప్పులూ సృష్టించి తెచ్చి ఆతడి దగ్గర ఉంచి "ఇవి పూర్వం లేవు. ఈ గొడుగువలన నా వేడి ఏ మాత్రమూ శరీరానికి తాకదు. ఈ చెప్పుల వలన కాళ్ళకు తాకదు'' (అన్నాడు).

విశేషం: సూర్యుడి మన్నన ఋషి కోపాన్ని పోగొట్టింది. అతి ప్రశాంతత సూర్యుడికి సంతోషం కలిగించింది. అందుకే అడగకపోయినా గొడుగూ, చెప్పులూ సృష్టించి ఇచ్చాడు. వాటి ప్రయోజనాలను వివరించాడు.

మ. నయ మిట్లారఁగ నాతపత్రము నుపానద్ద్వంద్వముం జూపి చె
ప్పి యపూర్వంబగు సృష్టిఖేలనమునం బెంపారు నవ్వస్తువుల్
దయ సద్విప్రున కీఁగి యైహిక సుఖౌదాత్త్వంబు నాముష్మిక
ప్రియమున్ దాతకు సుస్థిరంబులుగఁ గల్పించున్ మునీంద్రోత్తమా! 264

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నయము= నేర్పు; ఆరఁగన్= కలుగునట్లుగా; ఆతపత్రమున్= ఎండనుండి రక్షించే గొడుగునూ; ఉపానత్+ద్వంద్వమున్= చెప్పుల జతనూ; చూపి= కనబరచి; చెప్పి= వాటిని గూర్చి వివరించి; ముని+ఇంద్ర+ఉత్తమా!= మునివర్యులలో శ్రేష్ఠుడా!; అపూర్వంబు+అగు= మునుపులేని; సృష్టిఖేలనమునన్= సృజన విలాసంతో; పెంపు+ఆరు= మహిమతో విరాజిల్లు, ఆ+వస్తువుల్= ఆ గొడుగూ, చెప్పులూ అనే వస్తువులను (ఈ వస్తువుల్= అన్న పాఠం మేలైనది); దయన్= దయతో; సత్+విప్రునకున్= దోషంలేని విద్యావంతుడికి; ఈఁగి= ఇవ్వటం; ఐహిక సుఖ+ఔదాత్త్వంబున్= ఈ లోకసంబంధమైన సుఖపు గొప్పతనాన్నీ; ఆముష్మిక ప్రియమున్= పరలోకంలో ఇష్టమైన సుఖాన్నీ; దాతకున్= ఇచ్చేవాడికి; సుస్థిరంబులుగన్= చెడక నిలిచేవాటినిగా; కల్పించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ఇట్లా నేర్పు మీరగా గొడుగునూ చెప్పుల జతనూ చూపి వాటి విశేషాన్ని వక్కాణించి, మహర్షివరేణ్యా! అపూర్వమైన సృష్టివిలాసంతో ఏర్పడి వెలుగొందుతున్న ఈ వస్తువులను దయతో మంచి విద్యావేత్తకు దానం చేయటం దాతకు ఇహలోకపు సుఖాధిక్యాన్నీ, పరలోకంలో ప్రియమైన సుఖాన్నీ సుస్థిరంగా చేస్తుంది(అని చెప్పాడు).

విశేషం: ఆతపత్రం - ఎండనుండి రక్షించేది; ఉపానత్- పాదములయందు బంధింపబడేవి, విప్రుడు - 'విద్యయా యాతి విప్రత్వమ్' - విద్యచేత విప్రత్వాన్ని పొందుతాడు. విద్యావంతుడిని లోకం రక్షించుకొంటే అతడు లోకరక్షణకు మార్గం కనుగొని చెప్తుతాడు. కనుక విప్రున కివ్వాలనటం. అందునా సద్విప్రునకు - లోకహితైక కాంక్ష కలవాడే సద్విప్రుడు. సుస్థిరంబులుగన్ - దాత లోకరక్షకుడిని రక్షించే పనిచేశాడు కనుక అతడికి ఇహపరసుఖాలు శాశ్వతంగా ఉంటాయి.

మ. అనినన్ మో మలరన్ దినేశ్వరునిఁ దా నామంత్రితుంజేసి య
మ్మునిశార్దూలుఁడు వల్లభాసహితుఁడై మోదంబునం దేలుచుం
జనియెన్ నాఁడు జనంబు లెల్లను బ్రహర్షం బందుచున్ వానిఁ గై
కొని రవ్వస్తువు లిట్టి వేర్పడఁగ నీకుం జెప్పితిన్ భూవరా! 265

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; అనినన్= అని పలుకగానే; ఆ+ముని శార్దూలుఁడు= మునులలో గొప్పవాడగు ఆ జమదగ్ని; మోము= మొగం; అలరన్= ప్రకాశించగా; దిన+ఈశ్వరునిన్= సూర్యుడిని; తాను= తాను; ఆమంత్రితున్+చేసి= మర్యాదతో మంచిమాటలతో పంపి; వల్లభా సహితుఁడు+ఐ= ప్రియురాలితో కూడినవాడై; మోదంబునన్= సంతోషంతో; తేలుచున్= తేలిపోతూ; చనియెన్= వెళ్ళాడు; జనంబులు+ఎల్లను= ప్రజలందరూ; నాఁడు= అప్పుడు; ప్రహర్షంబు+అందుచున్= పరమానందం పొందుతూ; వానిన్= ఆ గొడుగు, చెప్పులు అనేవాటిని; కైకొనిరి= తీసికొన్నారు; ఆ+వస్తువులు= ఆ వస్తువులు; ఇట్టివి= ఈవిధమైనవి; నీకున్= నీకు; ఏర్పడఁగన్= చక్కగా తెలిసే విధంగా; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: ఓ రాజా! సూర్యు డట్లా చెప్పగా ఆ మహర్షిశ్రేష్ఠుడు మొగం వికసించగా సూర్యుడిని మంచిమాటలతో సాగనంపి, భార్యతోపాటు పరమానందంతో తన తావున కరిగాడు. అది మొదలు జనులంతా ఆ వస్తువులను గొప్ప సంతోషంతో కైకొన్నారు. ఈ వస్తువుల సంగతి నీకు స్పష్టంగా తెలిసే విధంగా చెప్పాను.

విశేషం: మోమలరన్- కృతజ్ఞతను ప్రకటించటం ఆ కాలంలో అంతమాత్రమే. నిజానికి కృతజ్ఞత బయటకు చెప్పదగినది కాదు. గుండెలో పదిలపరచుకొనదగినది. ఈ విషయాన్ని ఈ పదబంధం సూచిస్తుంది. సూర్యుడంతటివాడు ప్రత్యక్షదైవంగా భావనకు వచ్చేవాడు ఎందుకు భయపడ్డాడో 'మునిశార్దూలుడు' అనే పదం వ్యక్తం చేస్తుంది. అట్టి వారి నిగ్రహానుగ్రహాలమీద లోకవృత్తి సాగుతుందని భావం.

చ. దినకరచిత్తసృష్టములు దివ్యమునీశ్వరులాలితంబు లీ
వినుత పదార్థముల్ గరుణ విప్రునకున్ యతి సాధువృద్ధ స
జ్జనులకు నిమ్ము నీ; వది సుసారపు ధర్మము సూవె! దానఁ గ
ల్గును విను! గోకులాకలితలోకము లోనగు పుణ్యలోకముల్. 266

ప్రతిపదార్థం: దినకరచిత్త సృష్టములు= సూర్యుడి మనసుతో సృజింపబడినవి; దివ్య ముని+ఈశ్వర లాలితంబులు= గొప్ప మహర్షిచేత మన్నింపబడినవి (అయిన); ఈ వినుత పదార్థముల్= ఈ కొనియాడదగిన వస్తువులను; కరుణన్= దయతో;

విప్రునకున్= గొప్ప విద్యావంతుడికి; యతి సాధు వృద్ధ సత్+జనులకున్= యతులకు, సాధువులకు, ముదుసలులకు, మంచివారికి; నీవు; ఇమ్ము= దానము చేయుము; అది= ఆ దానం; సుసారము+ధర్మము= గొప్ప సారంగల ధర్మం; చూవె= సుమా!; దానన్= దానిచేత; విను= వినుము; గోకుల+ఆకలిత లోకము= ఆవులమందలతో కూడిన లోకం; లోనగు= మొదలైన; పుణ్యలోకముల్= పుణ్యంగల లోకాలు; కల్గును= లభిస్తాయి.

తాత్పర్యం: రాజా! సూర్యుడు మనస్సుతో సృష్టించినవీ, మహర్షి మన్నించినవీ అయిన ఈ మంచి వస్తువులను విద్యావంతుడికి, యతులకూ, సాధువులకు, పెద్దవయస్సువారికీ, మంచి మానవులకు దానం చేయుము. అది మిక్కిలి సారంగల ధర్మం సుమా! దానితో గోలోకం మొదలైన పుణ్యలోకాలు లభిస్తాయి.

విశేషం: సృష్టించినది లోకబాంధవుడు సూర్యుడు. అదికూడా కేవలం సంకల్పమాత్రంచేత. మొదట గ్రహించి ప్రేమతో ఉపయోగించినది ఒక మహర్షివరేణ్యుడు. తమంత తాము ప్రయోజనాన్నిబట్టి కొనియాడదగినవి. కనుక అనంతపుణ్యాన్ని దాతకు ఇస్తాయి - అని భావం. యతులు - పరమాత్మానుభవంకొరకు యత్నంచేసేవారు; సాధువులు - పరుల మేలును సాధించటానికి ప్రయత్నించేవారు; వృద్ధులు - అశక్తులు, అందుకనే ఇతరులకు ఏ అపకారమూ చేయనివారు. సత్+జనులు- మంచివారు. ఇట్లా వీరిని పేర్కొనటంవలన దానం పాత్రత ఎరిగి చేయాలి - అనే విషయం ప్రతీయమానం అవుతుంది. అపాత్రదానం దాతకు పాతకాన్ని కలిగిస్తుంది. 'చూవె' ఇది నిశ్చయార్థకం. సందేహించవద్దని హెచ్చరిక చేస్తుంది. విను - తాను చెప్పుతున్న విషయం శ్రద్ధాసక్తులతో వినదగిన దన్న భావాన్ని సూచిస్తుంది.

క. దాన ప్రవణ! యుపాన । ద్దానంబును నాతపత్ర దానము సురస
మ్మాననభాజనములగుట । నానాబుధజనులచే వినంబడు నెపుడున్. 267

ప్రతిపదార్థం: దానప్రవణ!= దానమునందు నిష్ఠకలవాడా!; ఉపాసత్+దానంబును= చెప్పులను ఇవ్వటమూ; ఆతపత్రదానము= గొడుగు నివ్వటమూ; సుర సమ్మానన భాజనములు= దేవతల మన్ననకు పాత్రములు; అగుట= కావటం; నానా బుధ జనులచేన్= ఎందరో పండిత జనులవలన; ఎపుడున్= ఎల్లవేళల, వినన్+పడున్= వినబడుతున్నది.

తాత్పర్యం: దాననిష్ఠగల ఓ రాజా! చెప్పులను, గొడుగును దానమివ్వటం దేవతల మన్ననకు యోగ్యమైనదని ఎందరో పండితవరేణ్యులు చెప్పగా ఎప్పుడూ వింటూ ఉంటాము.

విశేషం: దాన ప్రవణ! - సంబోధన సాభిప్రాయం. 'ఇచ్చే స్వభావం ఉన్నవాడవు కనుక దేవతలు కూడా మన్నించే దానం చేయుము' అని ఇక్కడ అభిప్రాయం. నానాబుధ - ఎవరో ఒకరు చెపితే ప్రమాణం కాకపోవచ్చును. అనేకులు - అందులోను బుధులు, జ్ఞానసంపన్నులు చెప్పుతున్నారు. వినంబడున్- తద్ధర్మార్థకక్రియ సార్వకాలికత్వాన్ని సూచిస్తున్నది. 'ఎపుడున్' అనేది దానిని మరింత దృఢపరుస్తున్నది.

క. అనిన విని పాండుభూవర తనయోత్తముఁ డిట్టు లనియెఁ దాతకు శూద్రుం
డనఘా! యెమ్మెయిచరితం । బున నిహపర పరమసౌఖ్యములఁ జెందఁగనున్? 268

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పాండుభూవర తనయ+ఉత్తముఁడు= పాండురాజు కొడుకులలో శ్రేష్ఠుడగు ధర్మరాజు; విని= ఆలకించి; తాతకున్= తాత అయిన భీష్ముడికి; ఇట్టులు= ఇట్లా; అనియెన్= అన్నాడు; అనఘా!= పుణ్యాత్ముడా!; శూద్రుండు= నాలుగవ జాతివాడు; ఏ+మెయి చరితంబునన్= ఏ విధమైన నడవడితో; ఇహ పర పరమ సౌఖ్యములన్= ఈ లోకపు, పరలోకపు పరమసుఖాన్నీ; చెందన్+కనున్?= పొందగలుగుతాడు?

తాత్పర్యం: భీష్ము డిట్లా చెప్పిన తరువాత ధర్మరాజు తాతను ఇట్లా అడిగాడు. 'పుణ్యాత్మా! శూద్రు డెటువంటి నడవడితో ఈ లోకపు, పరలోకపు సుఖాలను పరమసుఖాన్నీ పొందుతాడు?'

విశేషం: 'పాండుభూవర తనయోత్తముఁడు' - భీముడు మొదలైన తక్కిన నలువురకు మహాధర్మాలు తెలిసికొనాలన్న గాఢవాంఛ గానీ, ఏ ప్రశ్న, ఏ సమయంలో, ఏ మహానుభావుడిని ఎట్లా, ఎందుకు అడగాలన్న వివేకంగానీ ఉన్నట్లు దాఖలాలు లేవు. ధర్మరాజు ఆ అయిదుగురిలో ఇట్టి జిజ్ఞాసావివేకాలు సమృద్ధిగా ఉన్న కారణంచేత ఉత్తము డవుతున్నాడు. ధర్మరాజు ప్రశ్నలో ఒక తపన కనిపిస్తుంది. నాలుగవ జాతివాడు ఈ లోకంలో సుఖం పొందాలి. పరలోకంలో సుఖం పొందాలి. పరమసుఖం - అంటే మోక్షసుఖం పొందాలి. దానికి దారిఏదో చెప్పుము - అని తాతను అడుగుతున్నాడు. చివరి జాతివాడికి ఇహపర పరమసౌఖ్యాలను అతడు అపేక్షిస్తున్నాడంటే సర్వమానవ సుఖాపేక్ష అతడికి హృదయంలో నిగూఢవాంఛగా మనం గుర్తించాలి. ప్రశ్నలో ఇంత లోతైన భావం ఉన్నది కనుకనే ముందుగా కవి అతడి ఉత్తమత్వాన్ని పేర్కొని ప్రశంసించాడని మనం గుర్తించాలి.

వ. అనుటయు నతం డతని కిట్లనియె. 269

ప్రతిపదార్థం: అనుటయున్= అనునంతనే; అతండు= భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఆ మాట విని తాత ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

శూద్రున కవశ్యానుష్ఠేయంబైన ధర్మంబు నిరూపించుట (సం.13-164-4)

క. లోక హితార్థంబుగ ముని । లోకోత్తముఁ డాత్మ శిష్యలోకమునకు సు
శ్లోకుఁడు పరాశరుఁడు ధ । ర్మాకారము లెఱుఁగ జెప్పె నంచితచరితా! 270

ప్రతిపదార్థం: అంచితచరితా!= కొనియాడదగిన నడవడి కలవాడా!; ముని లోక+ఉత్తముఁడు= మునుల సముదాయంలో శ్రేష్ఠుడు; సుశ్లోకుఁడు= మంచికీర్తి కలవాడు; అగు; పరాశరుఁడు= పరాశరమహర్షి; లోకహిత+అర్థంబుగన్= సర్వజనుల మేలే ప్రయోజనంగా; ఆత్మ శిష్య లోకమునకున్= తన శిష్యుల సముదాయానికి; ధర్మ+ఆకారములు= ధర్మస్వరూపాలను; ఎఱుఁగన్= తెలిసే విధంగా; చెప్పెన్= ఉపదేశించాడు.

తాత్పర్యం: సాధువర్తనా! మహర్షిశ్రేష్ఠుడు, మంచి కీర్తిగలవాడూ అయిన పరాశరుడు లోకపు మేలే ప్రయోజనంగా తన శిష్యసముదాయానికి ధర్మస్వరూపాలను తెలియజెప్పాడు.

విశేషం: ఇందులో చెప్పగల అర్హత 'ముని లోకోత్తముఁడు, సుశ్లోకుఁడు' అనే విశేషణాలచేత తెలియవస్తున్నది. ఈ చెప్పటంలో వంచనగానీ, స్వార్థంగానీ లేదనే అంశం "లోకహితార్థంబుగ" అనే పదంచేత వ్యక్తమవుతున్నది. 'ఆత్మ శిష్యలోకమునకు' - అనే పదంచేత విద్యాసంప్రదాయం చెప్పినట్లయింది. 'ఎఱుఁగన్' అనే పదంవలన బోధకుడి ప్రజ్ఞ తెలియవస్తున్నది. ఇట్లా విద్యాసమగ్రత, స్వార్థం లేకపోవటం, బోధకతాసామర్థ్యం, సంప్రదాయపరిజ్ఞానం అనే నాలుగు అంశాలు విద్య ఏ స్థాయిలో ఉండాలో ఈ పద్యం ప్రతిపాదిస్తున్నది.

వ. అవ్వాక్యంబులు సెప్పెద నందు భవత్ప్రశ్నవిషయంబయిన యర్థంబు నవగతంబగు నాకర్ణింపుము. 271

ప్రతిపదార్థం: ఆ+వాక్యంబులు= ఆ మాటలు; చెప్పెదన్= చెప్తుతాను; అందున్= వాటిలో; భవత్+ప్రశ్న విషయంబు= నీవు అడిగిన విషయం; అయిన అర్థంబును= అయిన అంశం కూడా; అవగతంబు= తెలియవచ్చేది; అగున్= అవుతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ మాటలు చెప్తుతాను. అందులో నీ ప్రశ్న విషయం అర్థం కూడా తెలియవస్తుంది, వినుము.

సీ. కరుణాఢ్యుఁడగు పరాశరమునివరుఁడు శి। ష్యులకు నిట్లను నింద్రియోత్కరంబు
గెలిచి యంతశ్శత్రుకులమైన కామాది। వర్గంబు నోర్చి గర్వంబు వదలి
త్రైవర్ణికులయెడ భావంబు భక్తిమ। యంబుగా శుశ్రూష యాచరించి
శూద్రుఁ డైహిక సుఖసుగతులఁ బడయు వే। దాధీతితపముల నాచరించె
ఆ. నేని నుభయలోక హీనాత్ముఁడగు భూమి। సురనృపాల వైశ్య శూద్రులకును
నధ్యయనము, బలసమగ్రత, వాణిజ్య। మనుచరత్వ మధిక ధనము లరయ. 272

ప్రతిపదార్థం: కరుణా+ఆఢ్యుఁడు= దయచేత గొప్పవాడు; అగు= అయిన; పరాశరమునివరుఁడు= పరాశరుడనే మునిశ్రేష్ఠుడు; శిష్యులకున్= తనవద్ద అధ్యయనం చేసేవారికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; శూద్రుఁడు= నాలుగవజాతి వర్ణంవాడు; ఇంద్రియ+ఉత్కరంబున్= ఇంద్రియాల గుంపును; గెలిచి= అదుపులో ఉంచుకొని; అంతః+శత్రు కులము= లోపలి శత్రువుల సముదాయం; ఐన= అయిన; కామ+ఆది వర్గంబున్= కామం మొదలైన వాటి సముదాయాన్ని; ఓర్చి= ఓడించి; గర్వంబున్= గర్వాన్ని; వదలి= వదలిపెట్టి; త్రైవర్ణికుల ఎడన్= మూడు వర్ణాలవారి విషయంలో, భావంబు= హృదయం; భక్తిమయంబు= భక్తితో నిండినది; కాన్= అయ్యేవిధంగా; శుశ్రూష= సేవ; ఆచరించి= చేసి; ఐహికసుఖ సుగతులన్= ఈ లోకపు సుఖాన్ని, ఉత్తమ గతినీ; పడయున్= పొందుతాడు; వేద+అధీతి తపములన్= వేదం చదవటం, తపస్సు అనేవాటిని; ఆచరించెను+ఏని= చేస్తే; ఉభయలోకహీన+ఆత్ముఁడు= రెండు లోకములు పోయిన ఆత్మ కలవాడు; అగున్= అవుతాడు; భూమిసుర నృపాల వైశ్య శూద్రులకును= బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అనే వారికి; అరయన్= చూడగా; అధ్యయనము= వేదం చదవటం; బలసమగ్రత= బలం నిండుగా ఉండటం; వాణిజ్యము= వ్యాపారము; అనుచరత్వము= సేవకత్వం; అధిక ధనములు= గొప్పధనాలు.

తాత్పర్యం: దయతో గొప్పవాడైన పరాశరముని శిష్యులకు ఇట్లా చెప్పాడు: 'శూద్రుడు ఇంద్రియములపై పట్టు గలిగి, లోపలి శత్రువులైన కామం మొదలైనవాటిని గెలిచి, గర్వం వదలి తక్కిన మూడు వర్గాలవారిపట్ల హృదయం భక్తిమయం చేసికొని సేవ చేసినట్లయితే ఈ లోకపు సుఖాన్నీ, ఉత్తమ గతినీ పొందుతాడు. వేదం చదవటం గానీ తపస్సు గానీ చేస్తే రెండు లోకాలనూ కోల్పోతాడు. బ్రాహ్మణుడికి అధ్యయనము, రాజునకు బలము నిండుగా ఉండటమూ, వైశ్యునకు వాణిజ్యమూ, శూద్రునకు సేవకత్వమూ గొప్పధనాలు.

విశేషం: అంతశ్శత్రువులు - కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము. త్రైవర్ణికులు - బ్రాహ్మణ వైశ్య, శూద్రులు; ఈ పద్యంలో 'సేవ' అంటే ఆంగ్లంలో 'Service' వృత్తులు అని అర్థం. వృత్తిధర్మాలు అయిన కమ్మరం, కుమ్మరిపని మొదలైనవాటితో వ్యవసాయాదులకు కావలసిన వస్తుసముదాయాన్ని సమాజానికి అందించటమే సేవ.

సుగతి అనేచోట స్వర్గసుఖము, మోక్షసుఖము - రెంటినీ గ్రహించాలి.

క. ఇవి శాస్త్రదృష్టమార్గము । లవనిసురప్రభృతు లీ సదాచారంబుల్
సువిహితములుగా నడపిన । భువనద్వయమునను బడయఁ బోలుం బెంపుల్. 273

ప్రతిపదార్థం: ఇవి= ఈ ధర్మాలు; శాస్త్ర దృష్ట మార్గములు= శాస్త్రం చూపిన పద్ధతులు; అవనిసుర ప్రభృతులు= బ్రాహ్మణులు మొదలైనవారు; ఈ సత్+ఆచారంబుల్= ఈ మంచి ఆచారాలను; సువిహితములుగాన్= చక్కగా అనుష్ఠింపబడినవిగా; నడపినన్= సాగజేస్తే; భువనద్వయమునను= రెండు లోకాలలోను, పెంపుల్= మహిమలను; పడయన్+ పోలున్= పొందవచ్చును.

తాత్పర్యం: ఇవి శాస్త్రం చూపిన మార్గాలు. బ్రాహ్మణులు మొదలైనవారు ఈ సదాచారాలను చక్కగా పాటిస్తే రెండులోకాలలోను గొప్పతనం పొందవచ్చును.

విశేషం: శాస్త్రం - ఏది కార్యము, ఏదికాదు అనే నిర్ణయానికి శాస్త్రమే ప్రమాణమని గీత చెప్పింది.

తే. ఇట్లు గా కాత్మధర్మంబు లెడల విడిచి । వర్ణములు నాలుగింట నెవ్వారలైన
దొలఁగ ద్రొక్కినఁ బాటిల్లు దుష్టగతులు । మన్నకాలంబు పదపడి చన్నయపుడు. 274

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కాక= కాకుండా; వర్ణములు= వర్ణాలు; నాలుగింటన్= నాలుగింటిలో; ఏ+వారలు+ఐనన్= ఎవరైనా; ఆత్మధర్మంబులు= తమ ధర్మాలను; ఎడలన్+విడిచి= తప్పునట్లుగా వదలి; తొలఁగన్+త్రొక్కినన్= తొలగునట్లు నడిస్తే; మన్నకాలంబున్= బ్రతికినంత కాలమునూ; పదపడి= తరువాత; చన్నయపుడున్= మరణించినపుడూ; దుష్టగతులు= చెడుగతులు; పాటిల్లున్= వస్తాయి.

తాత్పర్యం: ఇట్లా కాక నాలుగు వర్ణాలలో ఎవరైనా వారి స్వధర్మాలను విడిచిపోతే బ్రతికినప్పుడు, చచ్చిన తరువాత వారికి చెడుగతులు కలుగుతాయి.

విశేషం: బ్రతికినపుడు చెడుగతి అంటే - సమాజం మన్నింపకపోవటం మొదలైనది. దానివలన పాపకార్యాలు చేయవలసివస్తే నరకం కలగటం మొదలైనవి పరత్ర చెడుగతులు.

వ. అని పలికి శౌచవిధి యెఱిఁగింపం దలంచి యిట్లనియె. 275

ప్రతిపదార్థం: అని; పలికి= చెప్పి; శౌచవిధి= శుచిత్వం ఏర్పడే విధానం; ఎఱిఁగింపన్= తెలపటానికి; తలంచి= తలపోసి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు ఇట్లా చెప్పి, శుచిత్వపు విధానం చెప్పగోరి ఇట్లా అన్నాడు.

విశేషం: శౌచం అంటే - దేహంలోపలా, వెలుపలా కలిగే మాలిన్యం పోవటం. 'శుచి' అంటే పరిశుద్ధుడు, పరిశుద్ధము అని అర్థం. అట్టివాని / దాని భావం శౌచం. అది ఎట్లా ఏర్పడుతుందో ఆ పద్ధతిని 'శౌచవిధి' అంటారు. మానవజాతి సర్వకాల సర్వావస్థలలో శౌచాన్ని అపేక్షిస్తుంది.

క. మూత్ర పురీషోత్సృష్టికి । రాత్రి పగలు దక్షిణోత్తర దిశాముఖతా
సూత్రణము వలయునది సం । ధ్యా త్రయమును నుత్తరంబ యగు నప్పనికిన్. 276

ప్రతిపదార్థం: మూత్ర పురీష+ఉత్సృష్టికిన్= మూత్రము, మలము అనువాటిని విసర్జించటానికి; రాత్రి= రాత్రి సమయమున; పగలు= పగటి సమయమున; దక్షిణ+ఉత్తర దిశా ముఖతా+ఆసూత్రణము= దక్షిణం, ఉత్తరం దిక్కులవైపు ముఖం ఉంచటం అనే విధానం; వలయునది= ఆచరించాలి; సంధ్యాత్రయమును= సంధ్యలు మూడింటియందునూ; ఆ+పనికిన్= ఆ పనికి; ఉత్తరంబు+అ= ఉత్తర దిక్కే; అగున్= కావాలి.

తాత్పర్యం: మానవుడు మలమూత్రాలు వదిలేటప్పుడు రాత్రివేళ దక్షిణదిక్కుగా, పగటివేళ ఉత్తరదిక్కుగా ముఖం ఉంచి చేయాలి. మూడు సంధ్యలలో ఉత్తరంవైపే ముఖం ఉంచటం ఆ పనికి తగినది.

విశేషం: ప్రకృతిలో కొన్ని సమయాలలో కొన్ని ప్రదేశాలలో విశేషశక్తులు ఉండటం మనం గమనిస్తున్నాం. గాలి సాధారణంగా ఒక వైపునుండి వీచటం, సూర్యచంద్రులు ఒకవైపున కొన్ని సమయాలలో కనబడటం మొదలైనవి ప్రత్యక్షవిషయాలు. ఈ వాయువు, సూర్యచంద్రులు మొదలైనవి మనకు ఎన్నో ప్రయోజనాలు - మరెక్కడా లభించనివాటిని ఇస్తున్నాయి. కనుక వాటిని దేవతలుగా భారతీయులు భావిస్తున్నారు. అందువలన వాటివైపు తిరిగి మలమూత్రాదులు విడవటం దేహానికి ప్రమాదం కలిగిస్తుంది కాబట్టి ఈ పనికి దిక్కులు నిర్దేశించారు.

సంధ్యాత్రయము - 'సంధ్య' అంటే రెండు కాలాల కలయిక. రాత్రినీ, పగటినీ కలిపేది ప్రాతస్సంధ్య, పగటినీ, రాత్రినీ కలిపేది సాయంసంధ్య, పగలు పూర్వాహ్ణాన్నీ, అపరాహ్ణాన్నీ కలిపేది మధ్యాహ్నసంధ్య.

క. పలుకవలదు శౌచక్రియ । సలుపక మును, సలుపునపుడు జలములు దొడలం
జిలుకుట యొప్పదు మృత్తిక । వలయు నపానంబునం ద్రివారంబు లిడన్. 277

ప్రతిపదార్థం: శౌచక్రియ = శుచిత్వపు పని; చలుపక మును= చేయకముందు; పలుకవలదు= మాటాడరాదు; చలుపు+అపుడు= ఆ పనిచేసే సమయంలో; తొడలన్= తొడలమీద; జలములు= నీళ్ళు; చిలుకుట= కొంచెంగా చల్లటం; ఒప్పదు= తగదు; అపానంబునన్= పృష్ఠభాగంలో; మృత్తికన్= మట్టిని; త్రివారంబులు= మూడుసార్లు; ఇడన్+వలయున్= ఉంచాలి.

తాత్పర్యం: మలమూత్రాలు వదలిన తరువాత శుద్ధిచేసుకొనకుండా మాటాడరాదు. శుద్ధికొరకు తొడలమీద నీళ్ళు చిలకటం పనికిరాదు. ముడ్డిని మూడుసార్లు మట్టితో తోమాలి.

విశేషం: 'అపానంబునన్' - అనటంవలన ఇది మలవిసర్జనకు సంబంధించినదిగా గుర్తించాలి. ఊరక నీళ్ళు చల్లితే 'అశుద్ధం' కణాలు అక్కడే ఉండి పోతాయి. అది తనకూ, తన సమీపంలో ఉన్నవారికీ జుగుప్సను కలిగిస్తుంది. అందుకని మట్టితో మూడుసార్లు శుద్ధి చేసుకొనాలి.

క. గుదతలము నొవ్వఁ దోమినఁ । గదురును రోగంబు లేపగంధాపగమ
ప్రదమగు కొలఁదిన శౌచము । సదురుగ నా చెప్పినట్ల సలుపఁగ వలయున్. 278

ప్రతిపదార్థం: గుదతలము= ముడ్డిపైభాగం; నొవ్వన్= నొప్పిపుట్టే విధంగా; తోమినన్= తోమితే; రోగంబు= జబ్బు; కదురును= కలుగుతుంది; లేప, గంధ, అపగమ ప్రదము= అంటిన చెడువాసన తొలగటాన్ని కలిగించునది; అగుకొలఁ

దిన= అయినంత మాత్రమే; శౌచము= శుభ్రం చేయటం, చదురుగన్= చక్కగా; నా చెప్పిన+అట్లు+అ= నేను చెప్పినట్లే, చలుపఁగవలయున్= చేయాలి.

తాత్పర్యం: ముడ్డిని నొప్పిపుట్టే విధంగా తోమరాదు. అలాచేస్తే రోగం కలుగుతుంది. అంటిన చెడువాసన తొలగటాన్ని కూర్చే అంత మాత్రం తోమటం సుకుమారంగా నేను చెప్పినట్లు చేయాలి.

విశేషం: మట్టితో తోమే సమయంలో తీసికొనవలసిన జాగ్రత్తలు చెప్పుతున్నారు. పుండయ్యే - విధంగా తోమరాదు అని భావం.

తే. అంబరంబున శౌచజలంబు వడుట । చెట్ట; శౌచ మల్లల్లన చేఁత మేలు;

వామకరశుద్ధి దొల్తఁ ద్రివార మృత్తి । కా కలనమునఁ దద్ద సేయంగ వలయు. 279

ప్రతిపదార్థం: శౌచజలంబు= శుద్ధికొరకు వాడిన నీరు; అంబరంబునన్= ఆకాశంలో (కట్టిన బట్టమీద); పడుట= పడటం; చెట్ట= చెడ్డది; శౌచము= శుద్ధి; అల్లన్+అల్లన్+అ= మెల్లమెల్లగానే; చేఁత= చేయటం; మేలు= మంచిది; తొల్తన్= మొదట; వామకరశుద్ధి= ఎడమచేతిని కడుగుకొనటం; త్రివార మృత్తికా+ఆకలనమునన్= మూడుసార్లు మట్టిని పట్టించటంచేత; తద్దన్= అత్యంతమూ; చేయంగన్+వలయున్= చేయాలి.

తాత్పర్యం: పృష్ఠం కడిగే నీళ్ళు చిందరవందరగా పడటం మంచిది కాదు. కడుగుకొనటం మెల్లమెల్లగా చేయటం మంచిది. ఆ తర్వాత ముందు ఎడమచేతిని మూడుసార్లు మట్టితో తోమి చక్కగా కడుగుకొనాలి.

విశేషం: ముడ్డికడిగిన నీళ్ళు మలంతో నిండి ఉంటాయి కదా! అవి అన్నివేపులా చిందే విధంగా చేస్తే ఆ మల అణువులు పరిసరాలలో వ్యాపించి కాలుష్యాన్ని కలిగిస్తాయి. ఈనాడు మనం ఎక్కువగా అనుకొంటున్న వాతావరణకాలుష్యనివారణకు ఇతిహాసకర్త మార్గాలు సూచిస్తున్నారు. పృష్ఠశుద్ధి అయిన తరువాత, ముందు ఎడమచేతిని మూడుసార్లు మట్టితో తోమాలి. మలం పోవటం, మలకణాలు పోవటం, దుర్వాసన పోవటం అనేవాటికై కావచ్చును - మూడు పర్యాయాలు తోమటం. అంబురంబున అంటే కట్టిన బట్టమీద అనికూడా చెప్పవచ్చు.

క. కుడిచేతఁ బిదప డా చేఁ । గడిగి పొరిన్ సప్తమృత్తికా కలనమునం

గడుగునది కరయుగము; మఱి । కడుగవలయు గుహ్య మల్పక మృదాకలనమునన్. 280

ప్రతిపదార్థం: పిదపన్= పిమ్మట; కుడిచేతన్= కుడిచేతితో; డాచేన్= ఎడమచేతిని; కడిగి= శుద్ధిచేసి; పొరిన్= మరల, సప్తమృత్తికా కలనమునన్= ఏడు మట్టిముద్దలను ఉపయోగించటం ద్వారా; కరయుగమున్= రెండు చేతులను; కడుగునది= కడగాలి; మఱి= తరువాత; అల్పకమృత్+ఆకలనమునన్= కొంచెపు పాటి మట్టిని ఉపయోగించటంతో; గుహ్యమున్= అపానస్థలాన్ని; కడుగవలయున్= కడగాలి.

తాత్పర్యం: తరువాత కుడిచేతితో ఎడమచేతిని కడగాలి. తరువాత ఏడు మట్టిముద్దలను ఉపయోగించి రెండుచేతులను శుద్ధి చేసికొనాలి. తరువాత మళ్ళీ అపానస్థలాన్ని కొంచెం మట్టితో కడగాలి.

క. ఇమ్మెయి గుహ్యతలము శు । ద్ధమ్ముగ నొనరించి కేల్ పదంపడి జలధౌ

తమ్ముగఁ జేసి సముత్థా । నమ్ము పిదపఁ బాదశోధనము సేయఁదగున్. 281

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; గుహ్యతలమున్= గుదం పై భాగాన్ని; శుద్ధమ్ముగన్+ఒనరించి= శుభ్రంచేసి; పదంపడి= తరువాత; కేల్= చేతిని; జలధౌతమ్ముగన్= నీటితో కడుగబడిన దానిని; చేసి; సముత్థానము పిదపన్= లేచిన తరువాత; పాదశోధనము= కాళ్ళు కడుగుకొనటం; చేయన్+దగున్= చేయాలి.

తాత్పర్యం: ఇట్లా గుదతలం శుభ్రం చేసికొన్న తరువాత చేతులు నీటితో చక్కగా కడుగుకొని, లేచి నిలబడి, పాదాలు శుభ్రంగా కడుగుకొనాలి.

విశేషం: మలవిసర్జన చేసిన ప్రాంతమంతా అశుద్ధంగా ఉంటుంది. కనుక ఆ సూక్ష్మక్రిములు పాదాలనుండి దేహంలోకి ప్రవేశించకుండా పాదాలు కడుగుకొనటాన్ని ఇక్కడ ఆదేశించారు.

క. జనములు సూచుచునుండఁగ । జనదు మలము మూత్రమును విసర్జింపఁగ, న
ప్పనులకు శౌచాచరణం । బునకు నవశ్యంబు నోలములు గావలయున్. 282

ప్రతిపదార్థం: జనములు= జనాలు; చూచుచున్+ఉండఁగన్= చూస్తూ ఉండగా; మలమున్= మలాన్ని; మూత్రమును= మూత్రాన్నీ; విసర్జింపఁగన్= వదలటం; చనదు= కూడదు; ఆ పనులకున్= ఆ రెండు పనులకున్నూ; శౌచ+ఆచరణంబునకున్= శుద్ధి పనికీ; అవశ్యంబున్= తప్పనిసరిగా; ఓలములు= మరుగు తావులు; కావలయున్= ఉండాలి.

తాత్పర్యం: బహిరంగ స్థలాలలో మలమూత్రాదులు వదలరాదు. ఆ పనులకూ, వాటి శుద్ధి పనికీ చెట్లు మొదలైనవి గల మరుగుతావులు ఉండాలి.

విశేషం: స్త్రీ పురుషుల లింగాలకు 'గుహ్యం' అని ఒక వ్యవహారం. అంటే గుట్టుగా ఉంచవలసినది అని అర్థం. మలమూత్ర విసర్జనాలు జనాలు చూస్తుండగా చేస్తే అది చూచేవారికి జుగుప్స పుట్టిస్తుంది. శుచికర్మకూడా మరింత ఏవగింపు కలిగిస్తుంది. కనుక మరుగుచోట్లను నిర్దేశించారు. చెట్లనడుమ తావులైతే వాతావరణకాలుష్యం తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

క. ఆపత్సమయంబున శౌ । చాపాదన మిట్టి భంగి నబ్బమి మలసం
లేపన గంధము వోపఁ గ్రి । యాపరుఁడై చేయునది మృదాకలనంబున్. 283

ప్రతిపదార్థం: ఆపత్సమయంబునన్= ఆపదవేళలో; శౌచ+ఆపాదనము= శుద్ధిని కలిగించటం; ఇట్టి భంగిన్= ఈ విధంగా; అబ్బమిన్= కుదరకపోవటంచేత; మల సంలేపన గంధము= మలం అంటటంవలన అయిన వాసన; పోవన్= పోయే విధంగా; మృత్+ఆకలనంబున్= మట్టిని అంటించటంచేత; క్రియాపరుఁడు+ఐ= పనియందు శ్రద్ధ కలవాడై; చేయునది= చేయాలి.

తాత్పర్యం: ఆపదవేళలో ఇంతగా శుద్ధి కుదరకపోతే మలం అంటిన వాసన పోయే విధంగా శ్రద్ధతో మట్టితో కడుగుకొనాలి.

విశేషం: ప్రాచీన ఋషులు ధర్మాలు బండగా నిర్దయతో చెప్పరు. పరిస్థితులు అన్నీ అనువుగా ఉంటే ధర్మలోపం చేయరాదు. అనుకూలించని వేళలో ధర్మం పేరుతో శరీరాన్నీ, మనస్సునూ హింసించకూడదు. ఇది ఋషిమార్గం. ఆపదసమయం అంటే చెప్పిన విధంగా శుద్ధక్రియ చేయటానికి అనువుకాని వేళ అని భావం. క్రియాపరుడు= పనిలో శ్రద్ధలోపించనివాడు.

సీ. బుద్బుద విరహితంబుగ వారిఁ గరమున । గొనకొని పారి దెందమునకుఁ జేరు
నట్లుగ నిశ్శబ్దమై యుండ ముమ్మాఱు । ద్రావి యిన్మాఱు తిర్యగ్విధమున

నాస్యంబు దొడసి నీ రంఘ్రుల శిరమునఁ । బ్రోక్షించి యోష్ఠ సంపుటము ముట్టి

నాసికాపుటములు నయనముల్ సెవులు మూఁ । పులు హృదయము నాభితలము మౌళి

ఆ. ముట్టవలయు హస్తములు పాదయుగమధ్య । గతములుగ నుద జ్ముఖత్వ మొండెఁ

బ్రాఙ్ముఖత్వ మొండెఁ బ్రాపించి యిమ్మెయి । నాచమనము సేయు టార్యమతము. 284

ప్రతిపదార్థం: బుద్బుద విరహితంబుగన్= బుడగలు లేకుండునట్లుగా; వారిన్= నీటిని; కరమునన్= చేతితో; గొనకొని= ప్రయత్నించి; పొరిన్= క్రమంగా; డెందమునకున్= గుండెకు; చేరు+అట్లు+కన్= చేరే విధంగా; నిశ్శబ్దము+ఐ= చప్పుడు లేనిదై; ఉండన్= ఉండగా; మూడు+మాఱు= మూడు సారులు; త్రావి= త్రాగి; ఇన్+మాఱు= రెండుమార్లు; తిర్యక్+విధమునన్= అడ్డంగా; ఆస్యంబున్= మొగమును; తొడసి= తుడిచి; నీరు= నీళ్ళు; అంఘ్రులన్= కాళ్ళమీదా; శిరమునన్= తలపైనా; ప్రోక్షించి= చిలుకరించి; ఓష్ఠ సంపుటమున్= పెదవుల మొగ్గవంటి స్థితిని; ముట్టి= తాకి; నాసికాపుటములు= ముక్కురంధ్రములు; నయనముల్= కన్నులు; చెవులు; మూఁపులు= భుజాలు; హృదయము= వక్షస్సు; నాభితలము= బొడ్డు; మౌళి= తల; ముట్టవలయున్= తాకాలి; హస్తములు= చేతులు; పాదయుగమధ్యగతములుగన్= కాళ్ళజంటనడుమ ఉన్నవిగా; ఉదక్+ముఖత్వము= ఉత్తరపు మోము అగుట; ఒండెన్= కానీ; ప్రాక్+ముఖత్వము= తూర్పు మొగం కావటం; ఒండెన్= కానీ, ప్రాపించి= పొంది; ఈ+మెయిన్= ఈ విధంగా; ఆచమనము= ఆచమనం అనే క్రియను; చేయుట= చేయటం; ఆర్యమతము= ఆర్యులకు సమ్మతమైనది.

తాత్పర్యం: బుడగలులేని నీరు చేతిలో చక్కగా గ్రహించి మెల్లగా గుండె దగ్గరకు చేరేవిధంగా చప్పుడు లేకుండా మూడుమారులు గ్రహించాలి. రెండుసార్లు అడ్డంగా నోటిని తుడుచుకొనాలి. నీళ్ళు కాళ్ళమీద, తలమీద చిలుకరించుకొనాలి. నోటిని చేతితో తాకాలి. ముక్కు, కన్నులు, చెవులు, భుజాలు, హృదయం, బొడ్డు శిరస్సు- వీటిని తాకాలి. చేతులు రెండు కాళ్ళకు మధ్య ఉంచుకొని, ఉత్తరపు మొగంగా గానీ తూర్పు మొగంగాగానీ కూర్చుండి ఈ విధంగా ఆచమనం చేయాలి. ఇది ఆర్యులు సమ్మతించిన పద్ధతి.

విశేషం: ఇంతవరకు బాహ్యశౌచం చెప్పారు. ఇప్పుడు అంతరశౌచం చెప్పుతున్నారు. అందులో మొదటిది ఆచమనక్రియ. ఇది మూడు విధాలు. శ్రౌతం, స్మార్తం, పౌరాణం అని వాటి పేర్లు. మూడు విధానాలలో ప్రక్రియ ఇంచుమించుగా ఒక్కటే. ఉచ్చరించే మంత్రాదులలోనే మార్పులు.

తిర్యగ్విధమునన్ - పెదవులపై ఒక అంచునుండి మరొక అంచువరకు అడ్డంగా తుడవటం. ఆచమనం చేసేటప్పుడు ఉత్తరదిక్కుగా గానీ, తూర్పుదిక్కుగా గానీ మొగంపెట్టి కూర్చోవాలి.

ఈ ప్రక్రియవలన ఫలాలు తరువాతి పద్యంలో చెప్పుతున్నారు.

సీ. ముమ్మాటి జలపానమున నోలి ఋగ్యజు । స్సామవేదంబులు సంతసిల్లుఁ

దొలితొలి వక్త్రంబు దొడయ నథర్వ హ । ర్షంబును రెండవసారె ధర్మ

శాస్త్ర తోషేతిహాస ప్రమోద పురాణ । సంప్రీతులును గల్గుఁ జరణయుగముఁ

బ్రోక్షింపఁ బుండరీకాక్షుండు ప్రియమందు । నయనంబు లంటిన నలినహితుఁడు

తే. సమ్మదంబునఁ దేలు నాచమన సంప్ర । యోగ మిట్టిది వస్త్రయజ్ఞోపవీత
ధరణముల నన్నపానతంత్రముల మున్ను । సేసి పిదపను నిది యనుష్ఠింపవలయు. 285

ప్రతిపదార్థం: ముమ్మాటి జలపానమునన్= మూడుమారులు నీరు త్రావటంచేత; ఓలిన్= వరుసగా; ఋక్+యజుస్+ సామవేదంబులు= ఋక్కు, యజుస్సు, సామము అనే వేదాలు; సంతసిల్లున్= సంతోషిస్తాయి; తొలితొలిన్= మొదటిసారిగా; వక్త్రంబు= నోటిని; తొడయన్= తుడువగా; అథర్వ హర్షంబునున్= అథర్వవేదం ఆనందించటమూ; రెండవుసారెన్= రెండోమారు; తొడయన్= తుడువగా; ధర్మశాస్త్ర తోష ఇతిహాస ప్రమోద పురాణ సంప్రీతులును= ధర్మశాస్త్రం సంతోషించటం, ఇతిహాసం ఆనందించటం, పురాణం ప్రీతి పొందటం; కల్గున్= కలుగుతాయి; చరణయుగమున్= కాలిజంటను (పై); ప్రోక్షింపన్= నీటిని చిలుకరింపగా; పుండరీక+అక్షుండు= పద్మములవంటి కన్నులుగల శ్రీమహావిష్ణువు; ప్రియము+అందున్= ప్రీతి పొందుతాడు; నయనంబులు= కనులు; అంటినన్= తాకితే; నలినహితుఁడు= పద్మముల బంధువు-సూర్యుడు; సమ్మదంబునన్= పరమా నందంతో; తేలున్= తేలిపోతాడు; ఆచమన సంప్రయోగము= ఆచమనపు చక్కని విధానం; ఇట్టిది= ఇటువంటిది; వస్త్ర యజ్ఞో పవీత ధరణములన్= బట్టలు, జందెము తాల్చుటను; అన్నపాన తంత్రములన్= భోజనము, నీరు పుచ్చుకొనటం మొదలైన పనులను; మున్ను= ముందు; చేసి; పిదపను= తరువాత, ఇది= ఈ ఆచమన కార్యం; అనుష్ఠింపవలయున్= ఆచరించాలి.

తాత్పర్యం: మూడు మారులు నీరు పుచ్చుకొనటంవలన క్రమంగా ఋక్కు, యజుస్సు, సామం అనే వేదాలు సంతసిస్తాయి. మొదటిసారి నోరు తుడవటంవలన అథర్వవేదం హర్షం పొందుతుంది. రెండవసారి తుడవటం వలన ధర్మశాస్త్రం, ఇతిహాసం, పురాణం అనేవి పరమానందం పొందుతాయి. కాళ్ళపై నీళ్ళు చిలుకరించటం వలన విష్ణువు, కనులను తాకటంవలన సూర్యుడు ఆనందిస్తాడు. ఆచమన విధానం ఇటువంటిది. వస్త్రాలు, జందెము తాల్చినప్పుడు, అన్నపానాల వేళలలోను ముందు ఆచమనం చేసి తరువాత కూడ ఈ ఆచమన కార్యం చేయాలి.

విశేషం: ఆచమనం నాలుగు వేదాలకు, ధర్మశాస్త్రాలకు, విష్ణుసూర్యులకు ఆనందం కలిగిస్తుందని ఈ పద్యం చెప్తుతున్నది. ఇట్లా చెప్పటంవలన ఆ పనియందు ఆదరం కలుగుతుంది. ఆచమనప్రక్రియ శ్రమలేకుండా ఒకటి రెండు నిముసాలలో చేయవచ్చును. ఫలితం అనంతంగా ఉంటుందని ఈ పద్యం ప్రతిపాదిస్తున్నది. సాధారణంగా సూక్ష్మక్రిముల వ్యాప్తిని నిరోధించే ఒక ప్రక్రియగా, అంతశ్శుద్ధికొరకు దీనిని ఆచరించవచ్చును.

తే. ఆస్యశుద్ధి యొనర్చిన యపుడు పోక । భక్ష్యభోజ్య లవంబులు పండ్ల నడుమ
నిలిచి పదపడి పోవుట గలిగెనేని । నాచమన మాక్షణంబ చేయంగవలయు. 286

ప్రతిపదార్థం: ఆస్యశుద్ధి = నోటి శుభ్రత; ఒనర్చిన అపుడు= చేసినప్పుడు; పోక= పోక; భక్ష్య భోజ్య లవంబులు= కొరికి నమలి తిన్న పదార్థాల కణాలు; పండ్ల నడుమన్= పండ్ల మధ్య; నిలిచి= ఉండి, పదంపడి= తరువాత; పోవుట= వెడలిపోవటం; కలిగెన్+ఏని= కలిగితే; ఆ క్షణంబు+అ= అప్పటికప్పుడు; ఆచమనము= ఆచమనం అనే పనిని; చేయంగవలయున్= చేయాలి.

తాత్పర్యం: నోటిని శుభ్రం చేసికొన్నప్పుడు అంతకుముందు తినిన పదార్థాలు పండ్లమధ్య నిలిచిపోయి తరువాత బయటకు వస్తే ఆ క్షణంలోనే ఈ ఆచమనకార్యాన్ని చేయాలి.

వ. శౌచవిధి సమస్త వర్ణసామాన్య ధర్మంబు, శూద్రునకు నాచమనం బోష్ఠపుటం బొకమరి ప్రోక్షించుకొనుటయు, దానిం గరంబున నడ్డం బొకమరి దొడయుటయు నింతియ. 287

ప్రతిపదార్థం: శౌచవిధి= శుచిత్వపు పని; సమస్త వర్ణ సామాన్య ధర్మంబు= అన్ని వర్ణాలకు సమానంగా ఉండే ధర్మం; శూద్రునకున్= శూద్రవర్గం వాడికి; ఆచమనంబు= ఆచమనపు పని; ఓష్ఠపుటంబు= పెదవుల దొప్పను; ఒకమరి= ఒకమారు; ప్రోక్షించుకొనుటయున్= నీరు చల్లుకొనటం; దానిన్= నోటిని; కరంబునన్= చేతితో; ఒకమరి= ఒకమారు; అడ్డంబు= అడ్డంగా; తొడయుటయున్= తుడవటం; ఇంతియ= ఇంతే.

తాత్పర్యం: పైన తెలిపిన శౌచకార్యం అన్ని వర్ణాలవారు సాధారణంగా ఆచరించవలసిన ధర్మం. శూద్రునకు ఆచమనం అంటే పెదవులమీద నీరు ఒకమారు చిలుకరించుకొనటమూ, నోటిని అడ్డంగా చేతితో ఒకమారు తుడుచుకొనటమూ - ఇంతే.

క. తాను శుచిత్వం బేమిట । నైనను నేమఱక నియతి నతులితశుశ్రూ
షానిరతుండై శూద్రుఁడు । మానిత విప్రులకు నోడి మనఁగా వలయున్. 288

ప్రతిపదార్థం: శూద్రుఁడు= నాలుగవ వర్గపు వ్యక్తి; ఏమిటన్+ఐనన్= ఏ విధంగానైనా; తాను; శుచిత్వంబు= శౌచాన్ని; ఏమఱక= ఉపేక్షించక; నియతిన్= నిష్ఠతో; అతులిత= శుశ్రూషా నిరతుండు+ఐ= సాటిలేని సేవాభావంలో శ్రద్ధ కలవాడై; మానిత విప్రులకున్= మాన్యతగల విద్యావంతులకు; ఓడి= వినయం కలిగి; మనఁగావలయున్= జీవించాలి.

తాత్పర్యం: శూద్రుడు ఏ విధంగానైనా శుచిత్వాన్ని నిష్ఠతో సాధించి సాటిలేని సేవాభావంతో గొప్పవిద్యావంతులయెడ వినయం కలిగి జీవిస్తూ ఉండాలి.

విశేషం: "విద్యయా యాతి విప్రత్వం" - విప్రుడంటే గొప్ప విద్యలను శ్రద్ధతో ఆర్జించి బుద్ధితో జగత్ క్షేమానికై వినియోగించేవాడు. సంఘంలో తక్కిన వ్యక్తులు అట్టివారికి తోడ్పడటంవలన మేలు జరుగుతుంది. ఇక్కడ 'శుశ్రూషా' శబ్దాన్ని ఆ విధంగా సమన్వయం చేసికొనాలి. జాతిమాత్రంచేత ఆరాధించనక్కరలేదనే విషయాన్ని 'విప్ర' శబ్దం సూచిస్తున్నది. అందులోని విశేషార్థాన్ని సంభావించాలి. అంతేకాదు. శుశ్రూష అంటే సేవ. అంటే వృత్తి ధర్మాలు; కమ్మరి, కుమ్మరి, వడ్రంగం మొదలైనవి అనికూడా గ్రహించాలి. ఓడి అంటే అహంకార లక్షణం లేకుండా భావం.

సీ. అవనీసురుఁడు జపయజ్ఞుఁ డధ్యయనోప । జీవి తపశ్శోభి; భూవరుండు
ప్రారంభయజ్ఞుండు పరమదండోప జీ । వకుఁడు పాలనశోభి; వైశ్యుఁడమల
హవ్యయజ్ఞుఁడు విక్రయాజీవి యాతిథ్య । పరిశోభి, శూద్రుండు పరిచరత్వ
యజ్ఞుండు శుశ్రూషణాజీవి దక్షత్వ । శోభి; యట్టులు గాని చొప్ప లఖిల

ఆ. వర్ణజాతులకు నవశ్యంబు; నాలవ । వాని కెమ్మెయిం ద్రివర్ణభక్తి
వలయు నడప యతులవలన విశేషించి । నిత్యభజనపరత కృత్య మరయ. 289

ప్రతిపదార్థం: అవనీసురుఁడు= బ్రాహ్మణుడు, జపయజ్ఞుఁడు= జపరూపమైన యజ్ఞం కలవాడు; అధ్యయన+ఉపజీవి= వేదాలను అర్థంతోపాటు గ్రహించటమే బ్రదుకుతెరువుగా గలవాడు; తపస్+శోభి= తపస్సుతో ప్రకాశించేవాడు; భూవరుండు= రాజు; ప్రారంభయజ్ఞుండు= పూనికయే యజ్ఞంగా గలవాడు; పరమదండ+ఉపజీవకుఁడు= శ్రేష్ఠమైన దండనీతియే బ్రతుకు తెరువైనవాడు; పాలనశోభి= ఏలటంతో రాణించేవాడు; వైశ్యుఁడు= మూడవ వర్ణంవాడు; అమల హవ్యయజ్ఞుఁడు= దోషంలేని హోమద్రవ్యం యజ్ఞంగా గలవాడు; విక్రయ+ఆజీవి= అమ్మకం బ్రదుకుతెరువైనవాడు; అతిథ్య పరిశోభి= అతిథుల పూజతో ప్రకాశించేవాడు; శూద్రుండు= నాలుగవ వర్ణంవాడు; పరిచరత్వ యజ్ఞుండు= సేవకభావం యజ్ఞంగా గలవాడు; శుశ్రూషణ+ఆజీవి= సేవయే బ్రదుకుతెరువుగా గలవాడు; దక్షత్వశోభి= సమర్థతతో విరాజిల్లేవాడు; అట్టులు= ఆ విధము; కాని చొప్పులు= కాని విధానాలు; అఖిల వర్ణ జాతులకున్= అన్ని వర్ణాలలో పుట్టినవారికి; అవశ్యంబు= వశముకానివి; నాలవవానికిన్= నాలుగవ వర్ణంలో పుట్టిన వ్యక్తికి; అరయన్= భావిస్తే; ఏ+మెయిన్= ఎట్లాగయినా, త్రివర్ణభక్తి= మూడు వర్ణాలవారియందు అనురాగం; నడపన్= సాగించటం; వలయున్= కావాలి; విశేషించి= మీదు మిక్కిలి; యతులవలనన్= పరమార్థం కొరకు యత్నం చేసే వారియెడల; నిత్య భజన పరత= ఎల్లప్పుడు సేవచేసే ఆసక్తి; కృత్యము= చేయదగిన పని.

తాత్పర్యం: బ్రాహ్మణుడికి జపమే యజ్ఞం. అధ్యయనమే బ్రదుకుతెరువు. తపస్సు శోభ తెస్తుంది. క్షత్రియుడికి ప్రయత్నం యజ్ఞం, దండనీతి బ్రదుకుతెరువు. పాలనం శోభ తెస్తుంది. వైశ్యుడికి హవ్యం యజ్ఞం. అమ్మకం బ్రదుకుతెరువు. ఆతిథ్యం శోభ తెస్తుంది. శూద్రుడికి సేవలందించటం యజ్ఞం. సేవలే అతడి బ్రతుకుతెరువు. పనిలో సామర్థ్యం వన్నె తెస్తుంది. వీటికంటె వేరైన విధానాలు ఆయావర్ణాలవారికి వశంకానివి. నాలుగవవర్ణం వాడు తక్కిన మూడు వర్ణాలవారియందు అనురాగం కలిగి నడుచుకొనాలి. ప్రత్యేకించి యతుల విషయంలో ఎల్లప్పుడు అనురాగం కలిగి ఉండటం అతడి కర్తవ్యం.

విశేషం: జపయజ్ఞుడు - మంత్రాన్ని పలుమారులు నిష్ఠతో హృదయంలో ఆవృత్తి చేయటం జపం. యజ్ఞమంటే పరమశ్రద్ధతో చేసే పవిత్ర కార్యం. జపయజ్ఞం; ఇది పరమార్థ సాధనకు ఉపకరిస్తుంది. దీనికి అధ్యయనమూ తపస్సూ విశిష్టతను చేకూరుస్తాయి. కాబట్టి బ్రాహ్మణుడు ఐహికసుఖాపేక్ష లేనివాడై తనకు, తన పరిధిలో ఉన్నవారికి పరమసుఖం కలిగే సుకృత్యాలు - జప అధ్యయన తపస్సులు చేస్తూ ఉండాలి.

రాజ, వైశ్య, శూద్రులు తమ నియతధర్మాలద్వారా ఐహికసుఖం అందరికీ సాధించాలి. ఈ విధంగా నాలుగు వర్ణాలవారు అన్యోన్యభావనతో ఇహపరాలను సాధించటం ఆర్షధర్మం కాంక్షించిన విజయం.

హవ్యయజ్ఞుడు - అంటే హోమద్రవ్యాలను యజ్ఞాలను చేసేవారికి అందించటమే యజ్ఞంగా కలవాడని భావన చేయవచ్చును.

పరిచరత్వం, శుశ్రూషణ - ఇవి వృత్తిధర్మాలు. చాకలి, మంగలి, కమ్మరి మొదలైనవారి పనులు.

యతులు - యత్నశీలం కలవారు. లౌకికమైన ప్రవృత్తి లేక పరమార్థమందే ప్రయత్నం కలవారు. వారి విషయంలో సర్వవర్ణాలవారు భక్తికలిగి ఉండాలి.

క. యతి సర్వాశ్రమ చరణ। స్థితులకు నుత్కృష్టుఁ డతని తెరవూఁదిన శ
క్తత కలిగినవారు శ్రుతి। స్మృతి విహితాచారులగుట మే లరయంగన్. 290

ప్రతిపదార్థం: అరయంగన్= పరికింపగా; యతి= సన్న్యాసి; సర్వ+ఆశ్రమ చరణ స్థితులకున్= అన్ని ఆశ్రమాల పనుల దశలకంటె; ఉత్కృష్టుఁడు= అధికమైన స్థితికలవాడు; అతని తెరువు= అతడి మార్గం; ఊఁదిన శక్తత కలిగినవారు= అవలంబించిన శక్తికలవారు; శ్రుతి స్మృతి విహిత+ఆచారులు= వేదాలు, ధర్మశాస్త్రాలు బోధించిన ఆచారాలు కలవారు; అగుట= కావటం; మేలు= మంచిది.

తాత్పర్యం: యతి అన్ని ఆశ్రమాలవారికంటె మిన్న అయినవాడు. ఆ మార్గం అవలంబించి సమర్థతతో నిర్వహింపదలచినవారు వేదాలు, ధర్మశాస్త్రాలు చెప్పిన ఆచారాలను పాటించటం మేలు.

విశేషం: యతిధర్మాలు చాలా క్లిష్టమైనవి. అవి పాటించకపోతే ఆ ఆశ్రమం స్వీకరించటం మంచిది కాదని హెచ్చరిక.

సీ. **ప్రియవాదితయును శాంతియును దాంతియు ననా। లస్యంబు నతుల శీలంబు గలిగి**
నా కిది వలయు దీన సుదుస్తరంబును। ఘోరంబు నైన సంసారజలధిఁ
గడతు నేనని భిక్షుకజనంబులకు నెవ్వి। హితము లప్పనులు సంతతముఁ జేయు
చడుగులొత్తుచు నిష్ఠ మడుగుచు నీచత। ననుచరించుచు ధర్మమున నుపార్జి

ఆ. **తంబులైన యట్టి ద్రవ్యసంచయములఁ। దృప్తి సేసి దేహగుప్తి నడపి**
పగలు రేయు నాక పరిచర్య నొనరించి। శూద్రుఁడిహపరముల సుఖము వడయు. 291

ప్రతిపదార్థం: ప్రియవాదితయునున్= ప్రియంగా పలకటమూ; శాంతియునున్= కామక్రోధాదులు లేకుండటమూ; దాంతియున్= ఇంద్రియముల అదుపు కలిగి ఉండటం; అనాలస్యంబున్= సోమరితనం లేకుండా ఉండటం; అతుల శీలంబున్= సాటిలేని మంచి నడవడి; కలిగి; నాకున్= నాకు; ఇది= ఈ లక్షణం; వలయున్= ఆవశ్యకము; దీనన్= దీనిచేత; సుదుస్తరంబును= మిక్కిలిగా దాట శక్యం కానిదీ; ఘోరంబున్= భయంకరమైనదీ; ఐన= అయినట్టి; సంసారజలధిన్= సంసారమనే సముద్రాన్ని; నేను; కడతున్= దాటుతాను; అని; భిక్షుక జనంబులకున్= బిచ్చమెత్తుకొని జీవించే జనులకు; ఎవ్వి= ఏవి; హితములు= మేలయినవో; ఆ+పనులు= ఆ కార్యాలు; సంతతమున్= ఎల్లప్పుడు; చేయుచున్= చేస్తూ; అడుగులు+ఒత్తుచున్= మహాత్ముల పాదసేవ చేస్తూ; నిష్ఠన్= నిష్ఠతో; మడుగుచున్= శుద్ధుడవుతూ; నీచతన్= తక్కువతనంతో; అనుచరించుచున్= మెలగుతూ; అనుసరిస్తూ; ధర్మమునన్= ధర్మమార్గంతో; ఉపార్జితంబులు= సంపాదించినవి; ఐన అట్టి ద్రవ్య సంచయములన్= అయిన వస్తువుల సముదాయాలతో; తృప్తిచేసి= తృప్తిపడి; దేహగుప్తిన్= దేహరక్షణను; నడపి= ప్రవర్తింపజేసి; పగలు రేయున్= ఇది పగలు, ఇది రాత్రి; నాక= అనక; పరిచర్యన్= సేవను; ఒనరించి= చేసి; శూద్రుఁడు= నాలుగవ వర్ణం వ్యక్తి; ఇహపరములన్= ఈ లోకంలోనూ, పరలోకంలోనూ; సుఖము= సుఖాన్ని; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ప్రియమైన మాటా, శాంతీ, ఇంద్రియనిగ్రహమూ, సోమరితనం లేకపోవటం, మంచి శీలమూ కలిగి ఉండటం ఆవశ్యకం. ఈ లక్షణం చేత ఈ దాట శక్యంకాని, భయంకరమైన సంసారం దాటుతానన్న భావంతో భిక్షుకజనాలకు ఏవి కర్తవ్యాలో అవి నిరంతరం చేస్తూ మహాత్ములకు పాదసేవ చేస్తూ నిష్ఠతో శుద్ధుడై, అహంకారంలేనివాడై ధర్మంతో సాధించిన వస్తువులతో దేహపోషణ చేసికొంటూ, పగలనక, రాత్రి అనక పరిచర్య చేస్తూ శూద్రుడు ఇహపర సుఖాలను పొందుతాడు.

విశేషం: అనాలస్యంబు - అలసభావం లేకపోవటం. అలసుడంటే పనుల విషయంలో శ్రద్ధ లేనివాడు, మమకారాన్ని నీచత - ఇది అహంకారాన్ని చంపే పద్ధతి, నీచత అంటే తన్ను గురించి గొప్పగా భావించకుండటం. పగలు, రేయు నాక - సర్వ కాలాలలో అవసరాన్నిబట్టి, ఆయా పనులకు సిద్ధంగా ఉండాలని తాత్పర్యం.

క. దానోపవాసముల స । న్మానితగతి లేదు శూద్రునకు యతి దెస స
మ్మాననమునఁ దత్పూజా । ధీనరతిం గాని యెన్ని తెరువులఁ జూడన్. 292

ప్రతిపదార్థం: శూద్రునకున్= శూద్రుడికి; ఎన్ని తెరువులన్= ఎన్ని మార్గాలతో; చూడన్= చూచినా; యతిదెసన్= యతిపట్ల; సమ్మాననమునన్= మన్ననతోనూ; తత్+పూజా+అధీనరతిన్= అతడిని పూజించటానికి వశమవటంలోని ప్రీతితోను; కాని= కాక; దాన+ఉపవాసములన్= దానమూ, ఉపవాసమూ అనే వాటితో; సత్+మానిత గతి= చక్కని మన్నింపబడిన గతి; లేదు.

తాత్పర్యం: శూద్రుడికి యతిపట్ల గౌరవమూ, అతడి పూజకు వశమైన ప్రీతి అనే వాటితోనే కానీ ఎన్నివిధాలుగా చూచినా దానమూ, ఉపవాసమూ అనే వాటితో మంచి మన్నన పొందే అవకాశం లేదు.

విశేషం: యతికి సమ్మానమూ, పూజ అంటే పరమార్థానికి, పరమాత్మకూ సేవ చేయటం అని భావం.

తే. తెరువుఁ దప్పి తూఁగాడుచు నరుగుదెంచు । యతిఁ గనుంగొని మనమున నడరు పొడమ
నెదురుకొని డప్పి తీర్చి సమ్మదముసేఁత । శూద్రునకు ధర్మవిధి యని శ్రుతులు చెప్పు. 293

ప్రతిపదార్థం: తెరువున్= దారిని; తప్పి; తూఁగాడుచున్= అలసతతో తూగిపోతూ; అరుగుదెంచు యతిన్= వచ్చే సన్న్యాసిని; కనుంగొని= చూచి; మనమునన్= హృదయంలో; అడరు= తొందర; పొడమన్= కలుగగా; ఎదురుకొని= ఎదురువెళ్ళి; డప్పి తీర్చి= దాహంతీర్చి; సమ్మదము చేఁత= ఆనందం కలిగించటం; శూద్రునకున్= శూద్రుడికి; ధర్మవిధి= ధర్మంతో కూడిన కర్తవ్యం; అని; శ్రుతులు= వేదాలు; చెప్పున్= చెప్పుతున్నాయి.

తాత్పర్యం: దారితప్పి అలసతతో తూగిపోతూ వస్తున్న అతడిని చూచి హృదయంలో తొందర పుట్టగా ఎదురేగి, అతడి శ్రమను పోగొట్టి సంతోషపెట్టటం శూద్రునకు ధర్మపు కర్తవ్యం అని వేదాలు చెప్పుతున్నాయి.

విశేషం: అడరు పొడమన్ - ఆలస్యంచేస్తే ఏమై పోతాడో అనే భీతితో కూడిన తొందరతో ఆదరించాలి అని భావం. డప్పి - దాహం, శ్రమ; తెరువు తప్పాడు కనుక దేహశ్రమ, మనఃక్లేశం రెండూ ఉంటాయి. ఆదరణవలన అమితానందం కలుగుతుంది.

చ. యతి రుజఁ బొందినం దొఱఁగ । నౌషధ కృత్యముఁ బథ్యమై సమం
చితమగు నట్టి భోజనము సేర్చుటయున్ మలమూత్రముల్ జుగు
ప్సితములు గాని భంగిగల చిత్తముతో జలకార్య మోపి వ
ర్ణితముగఁ జేఁతయుం గల చరిత్రము శూద్రున కిచ్చు సద్గతిన్. 294

ప్రతిపదార్థం: యతి= సన్న్యాసి; రుజన్= జబ్బును; పొందినన్= పొందితే; తొఱఁగన్= పోవటానికి; ఔషధ కృత్యమున్= మందు ఇవ్వటమూ; పథ్యము+ఐ= దేహానికి హితం చేసేదై; సమంచితము= మంచిదీ; అగు+అట్టి భోజనము= అయినట్టి ఆహారము; చేర్చుటయున్= అందివ్వటమూ; మలమూత్రముల్= మలము, మూత్రము; జుగుప్సితములు= ఏవగింపు కలిగించేవి;

కాని భంగికల చిత్తముతోన్= కాని తీరు అయిన హృదయంతో; జలకార్యము= నీటిపని (శుద్ధిచేయటం); ఓపి= సహించి; వర్ణితముగన్= జనాలు కొనియాడే విధంగా; చేఁతయున్= చేయటమూ; కలచరిత్రము= కలనడవడి; శూద్రునకున్= శూద్రుడికి; సద్గతిన్= మంచిగతిని; ఇచ్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: యతికి జబ్బుచేస్తే మందు ఇవ్వటం, హితమైన మంచి భోజనం పెట్టటం; మలమూత్రాలను ఏవగించు కొనకుండా ఎత్తిపారవైచినీటితో శుద్ధిచేయటం జనాలు కొనియాడే విధంగా చేయగల నడవడి శూద్రుడికి సద్గతిని సమకూరుస్తుంది.

విశేషం: 'చిత్తముతో, ఓపి, వర్ణితములుగా' అనే పదాలు సేవలోని త్రికరణశుద్ధిని అభివ్యక్తం చేస్తున్నాయి. కేవలం మెప్పుకొరకు చేయరాదనే హెచ్చరికను కూడా ప్రతీయమానం చేస్తున్నాయి.

సర్వసంగపరిత్యాగం చేసిన యతికి అవశదశలో సేవకు మరొక దిక్కు ఉండదు కనుక దీనిని ఇంత నొక్కి చెప్పుతున్నారు. నరసేవ నారాయణసేవగా భారతీయ ఋషులు భావించారనటానికి ఇది నిదర్శనం.

క. ఏ విధమున నోపిన యతి । భావము దుఃఖంబు వాపుపని సాదర చే
తోవృత్తిఁ బూని చేయం । గావలయును శూద్రుఁడది సుగతి నొందించున్. 295

ప్రతిపదార్థం: శూద్రుఁడు= శూద్రుడు; ఏ విధమునన్= ఏ విధంగా; ఓపినన్= శక్తి ఉంటే (ఆ విధంగా); యతి భావము దుఃఖంబు= యతి యొక్క హృదయంలోని దుఃఖాన్ని; పాపు పని= పోగొట్టే పనిని; సాదరచేతస్+వృత్తిన్= ఆదరంతో కూడిన మనస్సు ప్రవర్తనతో; పూని= యత్నపడి; చేయన్+కాన్+వలయును= చేయాలి; అది= అట్లా చేయటం; సుగతిన్= మంచిగతిని; ఒందించున్= పొందిస్తుంది.

తాత్పర్యం: శూద్రుడు శక్తి ఉన్న విధంగా యతి హృదయంలోని దుఃఖాన్ని పోగొట్టే పనిని ఆదరంగల బుద్ధితో చేయాలి. అది సుగతిని కలిగిస్తుంది.

సర్వవర్ణ సామాన్యధర్మ నిరూపణ ప్రకారము (సం.13-152-1 (కుంభ))

వ. అని చెప్పి సర్వజాతి సామాన్యంబులగు ధర్మంబు లెఱింగించు నాదరంబున నమ్మునివరుం డిట్లనియె. 296

ప్రతిపదార్థం: అని; చెప్పి= తెలియజేసి; ఆ+మునివరుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు (పరాశరుడు); సర్వజాతి సామాన్యంబులు= అన్ని జాతులకు సమానంగా ఉండేవి; అగు ధర్మంబులు= అయిన ధర్మాలు; ఎఱింగించు+ఆదరంబునన్= తెలిపే కుతూహలంతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్ = పలికాడు.

తాత్పర్యం: ఇట్లా చెప్పి, అన్ని జాతులవారికి సమానంగా ఉండే ధర్మాలు చెప్పాలనే వేడుకతో ఆ మునిశ్రేష్ఠుడు పరాశరు డిట్లా చెప్పాడు.

సీ. పరధనంబుల కాసపడక యొడ్లను । దనయట్ల కాఁజూచుచు నఖిల వస్తు
వులుఁ దోఁచు నడఁగు వీచుల చందమున మెఱుం । గులభంగి నని కనుఁగొనుచు నెందు

నాసక్తిలేక భూతాలిపై దయ కల్గి । నడచుట హితము తోనడచుఁ జేసి

నది మేల చేయుట చదురు కీ డవశతఁ । దొడరఁ బ్రాయశ్చిత్త దోహలమున

తే. వేగ తొలఁగించు టొప్పెడు వెరవ యెమ్ము । లేని జంతువుఁ జంపి త్రిస్నానములను

ద్వాదశ ప్రాణసంయమ నాదరమున । నొక్క యుపవాసమునఁ బాపయుక్తి వాయు. 297

ప్రతిపదార్థం: పరధనములకున్= ఇతరుల సొమ్ములకు; ఆసపడక= ఆశపొందక; ఒడ్లను= ఇతరులను; తనఅట్లు+అ+కాన్= తనవలెనే; చూచుచున్= భావిస్తూ; అఖిలవస్తువులున్= సమస్తమైన వస్తువులూ; తోఁచు అడఁగు వీచుల చందమునన్= పైకి కనిపిస్తూ అడగిపోయే తరంగాల విధంగా; మెఱుంగులభంగిన్= మెరుపులలాగా; అని కనుఁగొనుచున్= పరికిస్తూ; ఎందున్= దేనిమీదా; ఆసక్తి= తగులుపాటు; లేక; భూత+ఆలిపైన్= ప్రాణుల సముదాయంమీద; దయ కల్గి= దయపెట్టుకొని; నడచుట= ప్రవర్తించటం; హితము= మేలు; తోన్= తనతోపాటు; నడచున్= వస్తుంది; చేసిన+అది= చేసే పని; మేలు+అ= ఇతరులకు శుభమైనదే; చేయుట= చేయటం; చదురు= సరియైనది; అవశతన్= తన వశం తప్పటంవలన; కీడు= తప్పు పని; తొడరన్= కలిగితే; ప్రాయశ్చిత్త దోహలమునన్= ప్రాయశ్చిత్తం మీది ఉత్సాహంతో; వేగ= వెనువెంటనే; తొలఁగించుట= పోగొట్టుకొనటం; ఒప్పెడు వెరవు+అ= ఒప్పునట్టి కార్యము; ఎమ్ములేని జంతువున్= ఎముకలేని జంతువును; చంపి= చంపిన కారణంగా; త్రిస్నానములను= మూడు స్నానాలచేత; ద్వాదశ ప్రాణ సంయమన+ఆదరమునన్= పండ్రెండు మార్లు ప్రాణాయామం చేసే ఆదరంచేత; ఒక్క ఉపవాసమునన్= ఒక రోజు భోజనం మానివేయటంచేత; పాపయుక్తి= పాపపు తగులును; పాయున్= తొలగించుకొంటాడు.

తాత్పర్యం: ఇతరుల సొమ్ముల కాసపడరాదు. ఇతరులను తనతో సమానంగా భావించాలి. కనపడే వస్తువులన్నీ వచ్చిపోయే తరంగాలవంటివి - అని భావించి వాటిపై మమకారం వదలాలి. ప్రాణులన్నిటిమీదా దయకలిగి ఉండాలి. చేసిన మేలే మనతో వస్తుంది. చేసే పని ఇతరులకు మేలైన దైతేనే చేయాలి. పొరపాటున చెడుపని చేస్తే వెనువెంటనే ప్రాయశ్చిత్తం చేసికొని తొలగించుకొనాలి. ఎముకలులేని జంతువును చంపితే మూడుస్నానాలూ, పండ్రెండు ప్రాణాయామాలూ, ఒక ఉపవాసమూ చేస్తే ఆ పాపం పోతుంది.

విశేషం: తరంగం, మెరుపు క్షణంలో పుట్టి క్షణంలో నశిస్తాయి. సృష్టిలో సర్వవస్తువులూ అటువంటివే. కాబట్టి అనిత్యాలైన వాటిమీద ఆసక్తి తొలగించుకొని నిత్యమైన పరతత్త్వంమీద దృష్టి నిలపాలనే ఉపదేశం ఇక్కడ తోస్తుంది.

కీడు అవశతన్ తొడరన్ - దీనివలన బుద్ధిపూర్వకంగా చేసే పాపాలకు ప్రాయశ్చిత్తం లేదని చెప్పినట్లయింది. స్నానం బాహ్యశుద్ధినీ, ప్రాణాయామాలు నాడీమండలశుద్ధినీ, ఉపవాసం - అంతశ్శుద్ధినీ కలిగిస్తాయని భావం.

ఆ. అస్థి కలిగి హీనమగుజంతు వైనఁ ద । ద్విగుణవృత్తి వలయుఁ బ్రగుణజంతు

వునకు నలుమడించుకొనునది నరమాత్ర । హింస యష్టగుణ కృతీహఁ బాయు. 298

ప్రతిపదార్థం: అస్థి= ఎముక; కలిగి= ఉండి; హీనము= తక్కువది; అగు జంతువు= అయిన జంతువు; ఐనన్= అయితే; తత్+ద్విగుణవృత్తి= దానికి రెట్టింపు పని; వలయున్= కావాలి; ప్రగుణజంతువునకున్= ఇంకా ఎక్కువ గుణంగల జంతువు విషయంలో; నలుమడించుకొనునది= నాలుగు రెట్లు చేసికొనాలి; నరమాత్రహింస= సాధారణ మానవుడి హింస; అష్టగుణ కృతి+ఈహన్= ఎనిమిదిరెట్ల ప్రాయశ్చిత్తపు పని యందలి కోరికతో; పాయున్= పోతుంది.

తాత్పర్యం: ఎముక ఉండిన తక్కువ జాతి జంతువును చంపితే ప్రాయశ్చిత్తం రెండు రెట్లు చేసికొనాలి. పెద్ద జంతువైతే నాలుగు రెట్లు, మానవమాత్రుడిని హింసిస్తే ఎనిమిది రెట్లు ప్రాయశ్చిత్తంతో ఆ పాపం పోతుంది.

విశేషం: ఎముకలేని జంతువు విషయం మొదటి పద్యంలో చెప్పారు. ఎముక ఉన్న జంతువును చంపితే దానికి ప్రాయశ్చిత్తం రెండు స్నానాలు, 24 ప్రాణాయామాలు, రెండు ఉపవాసాలు.

పెద్ద జంతువైతే నాలుగు స్నానాలు, నలభై ఎనిమిది ప్రాణాయామాలు, నాలుగు ఉపవాసాలు; మానవహింసచేస్తే ఎనిమిది స్నానాలు, తొంభై ఆరు ప్రాణాయామాలు, ఎనిమిది ఉపవాసాలు ప్రాయశ్చిత్తం.

అయితే ఇవన్నీ పొరపాటున జరిగిన పాపానికి మాత్రమే. బుద్ధిపూర్వకమైన హింసకు మహానరకయాతన అనుభవించవలసినదే.

క. హీననరునట్ల గుఱ్ఱము । నేనుఁగును మనుష్యవధ మనేకాబ్దికభి
క్షానిరతి ప్రభృతి సుక । ర్మానుష్ఠానములఁ గాని యఱుగ దలఁతులన్. 299

ప్రతిపదార్థం: గుఱ్ఱమును= గుఱ్ఱమూ; ఏనుఁగును= ఏనుగునూ; హీననరు+అట్లు+అ= సాధారణ మానవుడివలెనే; మనుష్య వధము= గొప్ప మనుష్యుడిని చంపటం, అనేక+అబ్దిక భిక్షా నిరతి ప్రభృతి సుకర్మ+అనుష్ఠానములన్= పెక్కు ఏండ్లకు సంబంధించిన, బిచ్చమెత్తుకొనుట మొదలైన మంచి పనులను చేయటంవలన; కాని; అలఁతులన్= తక్కువ వాటిచేత; అఱుగదు= నశించదు.

తాత్పర్యం: గుఱ్ఱాన్నీ ఏనుగునూ చంపిన పాపానికి ప్రాయశ్చిత్తం సాధారణ జనుడిని చంపిన దానికి వలెనే చేసికొనాలి. విశిష్టులైన మనుజులను చంపితే కలిగే పాపం ఎన్నో ఏండ్లు బిచ్చమెత్తటం మొదలైన సత్కర్మలవలననే కానీ తక్కువ రకపు ప్రాయశ్చిత్తాలతో పోదు.

విశేషం: ఆబ్దిక - అబ్ద సంబంధమైన, ఏండ్లకు సంబంధించిన అని భావం. బిచ్చమెత్తుకొని దేహాన్ని పోషించుకొనటం ఒక విధమైన ప్రాయశ్చిత్తం. బిచ్చమెత్తుకొనటమంటే మానాభిమానాలను సర్వదా సర్వథా వదలివేసికొనటమన్నమాట. అది మనిషి హృదయంలో గొప్ప సంస్కారాన్ని సమకూరుస్తుంది.

తే. కల్లు ద్రావుట గురుతల్పగమన మధిక । పాతకము లివి ప్రాణముల్ వాయఁబెట్టి
చేయు ప్రతికారములఁ గాని చెడవు గోధ । రాద్యధిక దానములనైన నఱుగ వండ్రు. 300

ప్రతిపదార్థం: కల్లు= మద్యము; త్రావుట= త్రాగటము; గురుతల్ప గమనము= గురువు భార్యను పొందటం; అధిక పాతకములు= మిక్కిలి దొడ్డ పాపాలు; ఇవి; ప్రాణముల్= ప్రాణాలను, పాయన్+పెట్టి= పోవటానికైనా సిద్ధంచేసి; చేయు ప్రతికారములన్= చేసే ప్రాయశ్చిత్తాలతో; కాని; చెడవు= నశింపవు; గో ధరా+ఆది+అధిక దానములన్+ఐనన్= గోవులను, భూమిని, ఇంకా గొప్ప వస్తువులను మొదలైన వాటిని దానంచేయటంవలన కూడా; అఱుగవు= నశింపవు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: మద్యపానమూ, గురుభార్యను కలియటం అనేవి మహాఘోరపాపాలు. ప్రాణాలైనా బలిపెట్టి చేసే ప్రాయశ్చిత్తాలతోగానీ అవి నశింపవు. గోదాన భూదానాదులతో కూడా అవి నశింపవంటారు.

విశేషం: మద్యపానంవలన మనిషిలో యుక్తాయుక్తవివేకజ్ఞానం అంతరిస్తుంది. దానివలన అతడు ఎంత పాడుపనిచేయటానికైనా సంకోచించడు. గురుపత్ని తల్లికంటె మన్నింపదగినది. ఆమెతో రమించటమంటే తల్లి భావనయే హృదయంనుండి తొలగించివేయటం. కనుక ఇవి మహాపాతకాలు. ప్రాయశ్చిత్తవిధిలో ప్రాణాలు పోయే స్థితి ఉన్నా సంకోచపడక చేసికొంటేనే ఈ పాపాలు పోతాయి. ఆ ప్రయత్నం లేకపోతే మానవత్వమే లేనివాడని భావం.

క. ఇవి యెఱిఁగి యెపుడు పరలో । కవిభీతి మనంబునందుఁ గల్గి సకలభూ
తవిషయదయ నూనిన య । ట్టి వాఁడు కీడెల్లఁ బోనడిచి మేలొందున్. 301

ప్రతిపదార్థం: ఇవి= ఈ విషయాలు; ఎఱిఁగి= తెలిసికొని; ఎపుడున్= సర్వకాలాలలో; పరలోక విభీతి= పరలోక సంబంధమైన పెనుభయం; మనంబునందున్= హృదయంలో; కల్గి= ఉంచుకొని; సకల భూత విషయ దయన్= అన్ని ప్రాణుల యెడలను దయను; ఊనిన అట్టివాఁడు= గట్టిగా పదిలపరచుకొన్నవాడు; కీడు+ఎల్లన్= పాపమంతటినీ; పోన్= పోవునట్లు; అడిచి= అణగగొట్టి; మేలు= శుభాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ విషయాలు తెలిసికొని, హృదయంలో పరలోక సంబంధమైన భయాన్ని నిలుపుకొని, ఎల్లవేళలా అన్ని ప్రాణుల యెడల దయ కలిగి ఉండేవాడు పాపాల నన్నింటినీ పోగొట్టుకొని శుభం పొందుతాడు.

విశేషం: పరలోకం ప్రత్యక్షం కాదు కనుక చాలామందికి అది లేదని వెర్రి భావన. కాని కొంచెం ఆలోచిస్తే ఇందులోని భ్రమ తొలగి పోతుంది. భవిష్యత్తు అంతా అప్రత్యక్షమే కదా! కాని దానికొరకు లక్షలు, కోట్లు సంపాదిస్తాడు మానవుడు. అట్లాగే ప్రత్యక్షం కాకపోయినా పుణ్యఫలాలను, పాపఫలాలను అనుభవించవలసిన పరలోకం ఉందని నమ్మినవాడు. 'వి' భీతితో ఉంటాడు. ఇది విశేషభయం. ఎందుకంటే ఫలితం ప్రతీకారం లేనిదై ఉంటుంది. కనుక ముందే జాగ్రత్త పడాలి అని 'వి' అనే ఉపసర్గ ఉపదేశిస్తుంది.

"సకల భూత......" పాపాలన్నీ స్వార్థం కారణంగా ఏర్పడతాయి. భూతదయ స్వార్థాన్ని రూపుమాపుతుంది. కనుక అది పాపాలు చేయకుండా ఉండటానికి గొప్ప సాధనం.

'ఎపుడు' - జీవితకాలమంతా పుణ్యం చేసినా ఒక్క క్షణంలో చేసిన పాపం కుండెడు పాలలో చిన్న విషపు బొట్టువలె సర్వనాశనం చేస్తుంది. కనుక 'చిన్న' పాపమే కదా! క్షణకాలమే కదా!' అనే ఊరట పాపం విషయంలో పనికిరాదని హెచ్చరిక.

క. ఈ నెఱిఁ గైకొని శూద్రుం । డైనను గ్రమవృత్తి నవ్యయంబగు పదముం
గానం బడయుట గల్గును । వానికి నియమముల త్రోవ వలవక యునికిన్. 302

ప్రతిపదార్థం: వానికిన్= అతడికి; నియమముల త్రోవ= నియమాల మార్గం; వలవక ఉనికిన్= ఏర్పడని కారణంగా; ఈ నెఱిన్= ఈ ధర్మసూక్ష్మాన్ని; కైకొని= చేపట్టి; శూద్రుండు+ఐనన్= శూద్రుడైనా; క్రమవృత్తిన్= క్రమప్రవర్తనతో; అవ్యయంబు= నాశనము కానిది; అగు= అయిన; పదమున్= స్థానాన్ని; కానన్+పడయుట= పొందగలుగుట; కల్గును= కలుగుతుంది.

తాత్పర్యం: శూద్రుడికి అతి కఠోరమైన నియమనిష్ఠలు విధించని కారణంగా ఈ చెప్పిన ధర్మసూక్ష్మాన్ని అతడు ఆచరించి, క్రమపద్ధతిలో శాశ్వతమైన పదాన్ని పొందే అవకాశం ఉంది.

విశేషం: పూర్వం చెప్పిన ధర్మాలను జాగ్రత్తగా పాటించిన శూద్రుడు క్రమంగా పై వర్ణాలలో పుట్టి తుదకు పరమపదాన్ని

పొందగలుగుతాడని పద్యభావం. అంటే పై వర్ణాలవారు ఎంతో ప్రయాసతో అధిక నియమనిష్ఠలతో పొందే మహాప్రయోజనాన్ని శూద్రుడు ఈ ఆచార్యనిష్ఠచేత పొందగలుగుతాడని అభిప్రాయం.

వ. అని నిర్దేశించి యరిష్టంబు లెఱిఁగింప ననుకంప పుట్టుటయు. 303

ప్రతిపదార్థం: అని= ఇట్లని; నిర్దేశించి= చక్కగా తెలియజేసి; అరిష్టంబులు= కీడులు; ఎఱిఁగింపన్= తెలుపటానికి; అనుకంప= దయ; పుట్టుటయున్= కలుగగా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి, ఆ పరాశరుడు కీడులను గూర్చి చెప్పాలని దయపుట్టి (ఇట్లా చెప్పాడు)

విశేషం: అరిష్టాలంటే ఇక్కడ రాబోయే అశుభాలను సూచించే శకునాలవంటివి.

సీ. పురుషు హిరణ్మయు నరుఁడెవ్వఁ డుత్తర । మునఁ గాంచు దక్షిణముఖత నుండ
నతనికి వర్షత్రయమున మృత్యువు వచ్చుఁ । రవి మండలంబు నిష్ప్రభము గాఁగఁ
గనిన రెండేఁడులఁ; గౌముదిఁ దననీడఁ । దూఁటు చూచిన నొక్క యేఁట; నది వి
మౌళియై యున్న షణ్మాసమాత్రంబునఁ; । గర్ణముల్ గరములఁ గదియ మూసి

ఆ. కొనిన యపుడు ఘోత వినకున్న నెలనాళ్ళఁ; । గర్ణములును నాసికయును బట్టు
కదల వికృత వర్ణకత పండ్లఁ గన్నులఁ । గలుగ నాఁడ మరణ మొలయునండ్రు. 304

ప్రతిపదార్థం: నరుఁడు= మనిషి; ఎవ్వఁడు= ఎవడు; హిరణ్మయున్= బంగారం రూపంగల; పురుషున్= పురుషుని; దక్షిణముఖతన్= దక్షిణమువైపు మొగం ఉంచినవాడై; ఉండన్= ఉండగా; ఉత్తరమునన్= ఉత్తరదిక్కున; కాంచున్= చూస్తాడో; అతనికిన్= అట్టి మనిషికి; వర్షత్రయమునన్= మూడేండ్లలో; మృత్యువు= చావు; వచ్చున్= వస్తుంది; రవిమండలంబు= సూర్యబింబం; నిష్ప్రభము కాఁగన్= వన్నెలేనిదై యుండగా; కనినన్= చూస్తే; రేండేఁడులన్= రెండు సంవత్సరాలలో(మృత్యువు వస్తుంది); కౌముదిన్= వెన్నెలలో; తననీడన్= తన నీడలో; తూఁటు= రంధ్రాన్ని; చూచినన్= చూస్తే; ఒక్క+ఏఁటన్= ఒక్క సంవత్సర కాలంలో (మృత్యువు వస్తుంది); అది= తననీడ; విమౌళి+ఐ ఉన్నన్= తలలేనిదై ఉంటే; షట్+మాస మాత్రంబునన్= ఆరు నెలల కాలంలోనే (మృత్యువు వస్తుంది); కర్ణముల్= చెవులు; కరములన్= చేతులతో; కదియన్= బిగించినట్లు; మూసికొనిన+అపుడు= మూసుకొన్నప్పుడు; ఘోఁత= ఒక విధమైన నాదం; వినక+ఉన్నన్= వినకుంటే; నెలనాళ్ళన్= నెలరోజులలో (మృత్యువు వస్తుంది); కర్ణములును= చెవులునూ; నాసికయును= ముక్కున్నూ; పట్టు= బిగింపు, కదలన్= కదిలితే; పండ్లన్= దంతాలలో; కన్నులన్= కన్నులలో; వికృత వర్ణకత= వికారపు రంగు కలగటం; కలుగన్= ఏర్పడితే; నాఁడు+అ= ఆ రోజుననే; మరణము= చావు; ఒలయును= కలుగును; అండ్రు= అంటారు.

తాత్పర్యం: నరుడు హిరణ్మయపురుషుడు దక్షిణంవైపు మొగం పెట్టి ఉత్తరందిక్కున ఉండటం చూస్తే మూడేండ్లలో మరణిస్తాడు. సూర్యబింబం కాంతి తప్పి ఉండటం చూస్తే రెండేళ్ళలో మృతి పొందుతాడు. వెన్నెలలో తన నీడలో రంధ్రాన్ని చూస్తే ఒక సంవత్సరకాలంలో ఆయువు తీరినవాడవుతాడు. తననీడ తలలేనిదై కనపడితే ఆరు నెలలలో వెళ్ళిపోతాడు. చెవులను చేతులతో గట్టిగా మూసుకొన్నప్పుడు నాదం వినకపోతే నెలనాళ్ళలో చావు పొందుతాడు. చెవులు, ముక్కు పట్టు సడలి, పండ్లలో, కన్నులలో వికారపు వర్ణం కానవస్తే ఆ రోజే మరణిస్తాడు అంటారు.

విశేషం: హిరణ్మయపురుషుడంటే సూర్యబింబంలో ఉండే శ్రీమన్నారాయణుడు. సూర్యుడు ఉత్తరాన ఉదయించటం అనర్థదాయకం కదా!

వ. అట్లు వర్తిల్లు నరిష్టంబులం దెయ్యవి దోఁచినం గలంకం బొరయని యంతరంగంబుతోడఁ దృష్ణాకలితంబైన సంసారంబునందలి వ్యాసంగంబు వదలి హృదయం బేకాగ్రంబు గావించి మునీంద్ర నిర్దిష్ట నిర్మలధ్యాన కర్మం బులం దగిలి యుండె నేనిం గాలాంతకప్రసాదంబు పడయుం దెలివికొఱంతం గాలగోచరత్వంబు నొంది వైశ్య రాజన్య విప్రకులంబులం దత్తద్విధ సంపత్సమృద్ధంబులుఁ బ్రబుద్ధంబులు నగు వంశంబులం గ్రమంబున జనించి. 305

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; వర్తిల్లు+అరిష్టంబులందున్= ప్రవర్తించే అరిష్టాలలో; ఏని+అవి= ఏవి; తోఁచినన్= కన పడినా; కలంకన్= కలత; పొరయని అంతరంగంబుతోడన్= పొందని హృదయంతో; తృష్ణాకలితంబు= ఆశలతో కూడినది; ఐన= అయినట్టి; సంసారంబునందలి వ్యాసంగంబు= సంసారంలోని తగులాన్ని; వదలి= విడిచి; హృదయంబు= మనస్సును; ఏక+అగ్రంబు= చెదరని దానిని; కావించి= చేసి; ముని+ఇంద్ర నిర్దిష్ట నిర్మల ధ్యాన కర్మంబులన్= మునిశ్రేష్ఠులు తెలియజెప్పిన మచ్చలేని ధ్యానపు కార్యములలో; తగిలి ఉండెన్+ఏనిన్= ఆసక్తుడై ఉంటే; కాల+అంతక ప్రసాదంబు= కాలాన్ని అంతంచేసే దైవంయొక్క అనుగ్రహాన్ని; పడయున్= పొందుతాడు; తెలివి కొఱంతన్= తెలివితక్కువచేత; కాల గోచరత్వంబున్= కాలుడికి కనపడటం (మరణించటం); ఒంది= పొంది; వైశ్య, రాజన్య విప్రకులంబులన్= కోమటుల, క్షత్రియుల, విప్రుల కులాలలో; తత్+తత్+విధ సంపత్+ సమృద్ధంబులున్= ఆయా విధాల సంపదలతో నిండుతనం కలవీ; ప్రబుద్ధంబులున్= జ్ఞానసంపద కలవీ; అగు వంశంబులన్= అయిన వంశాలలో; క్రమంబునన్= వరుసగా; జనించి= పుట్టి.

తాత్పర్యం: ఆ విధంగా ఉండే అరిష్టాలలో ఏవి తోచినా మనుజుడు కలత పొందని హృదయంతో ఆశల దాహం కలదైన సంసారంమీది లంపటాన్ని వదలివైచి మనస్సును కుదుటపరచుకొని మునివర్యులు చెప్పిన నిర్మలధ్యాన కార్యాలలో ఆసక్తి కలిగి ఉంటే కాలరూప పరమాత్ముడి అనుగ్రహం పొందుతాడు. ఒకవేళ దానికి వలసిన తెలివి చాలకపోతే మరణించి వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలలో ఆయా విధాల సంపదల నిండుతనమూ, జ్ఞానసంపదా కల వంశాలలో క్రమంగా పుట్టి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అంతకాలంలో చేసిన ధ్యానఫలంగా ఉత్తమవంశాలలో ఉన్నత సంపదలు కలచోట జన్మిస్తాడు. **"శుచీనాం శ్రీమతాం గేహే యోగ భ్రష్టోఽభిజాయతే"** అనే భగద్వాక్యాన్ని ఇక్కడ సమన్వయం చేసికొనాలి.

క. అయ్యై కర్మంబుల దెస । నెయ్యం బెసలారఁ గలిగి నియమ నిరూఢుం
డియ్యన యన సుకృతంబుల । నయ్యెడు సౌఖ్యంబు నిహమునందుఁ బరమునన్. 306

ప్రతిపదార్థం: ఈ+అన= ఈతడు; ఆ+ఆ+కర్మంబుల దెసన్= ఆయా పనులయెడ; నెయ్యంబు= ప్రేమ; ఎసలారన్= అతిశయించగా; కలిగి= ఏర్పడి; నియమ నిరూఢుండు= నియమములతో చెక్కు చెదరనివాడు; అనన్= అనునట్లుగా; సుకృతంబులన్= పుణ్యములతో; అయ్యెడు సౌఖ్యంబున్= అయ్యే సుఖాన్ని; ఇహమునందున్= ఈ జన్మలోను; పరమునన్= పరంలోను.

తాత్పర్యం: ఆయా కార్యవిశేషాలలో ప్రేమ అతిశయించగా ఏర్పడి అతడు నియమాలయందు దృఢమైన ఆదరం కలవాడన్న ప్రతిష్ఠ పొంది, పుణ్యకార్యాలవలన ఏర్పడే సుఖాన్ని ఇహపరలోకాలలో (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అనుభవించుచు గమనంబు నాగమనము । నాచరించుచు బ్రహ్మసభాంతమైన
పుణ్యలోక నికాయంబుఁ బొంది యెల్ల । నెఱిఁగి యూహించి యిట్లని యెడఁ దలంచు. 307

ప్రతిపదార్థం: అనుభవించుచున్= అనుభవిస్తూ; గమనంబున్= పోవటమూ; ఆగమనమున్= రావటము; ఆచరించుచున్= చేస్తూ; బ్రహ్మసభా+అంతము= బ్రహ్మయొక్క సభ తుదిగా; ఐన= అయిన; పుణ్యలోక నికాయంబున్= పుణ్యలోకాల సముదాయాన్ని; పొంది= చేరుకొని; ఎల్లన్= అంతటినీ; ఎఱిఁగి= తెలిసికొని; ఊహించి= భావించి; ఇట్లు+అని= ఈ విధంగా; ఎడన్= హృదయంలో; తలంచున్= భావిస్తాడు.

తాత్పర్యం: (ఇహపరసుఖాలను) అనుభవిస్తూ బ్రహ్మసభ చివరగా ఉన్న పుణ్యలోకాల కన్నింటికీ రాకపోకలు గావిస్తూ నిండైన జ్ఞానం పొంది తన భావనతో ఈ విధంగా హృదయంలో తలపోస్తాడు.

క. 'ఇవి యెల్ల నశాశ్వతములు । భవమరణాకలితములును; బటుసంసారో
ద్భవదుఃఖయుక్తములు; సుఖ । లవయుతములు వీని యందు లౌల్యంబేలా?' 308

ప్రతిపదార్థం: ఇవి= ఈ లోకాలు; ఎల్లన్= అన్నీ; అశాశ్వతములు= నిత్యములు కానివి; భవ మరణ+ఆకలితములును= పుట్టుక; చావులతో కూడినవి; పటు సంసార+ఉద్భవ దుఃఖ యుక్తములు= గట్టిదైన అజ్ఞానంవలన పుట్టిన దుఃఖంతో కూడినవి; సుఖ లవ యుతములు= సుఖంయొక్క లేశంతో కూడినవి; వీనియందున్= ఇట్టి వీటిమీద; లౌల్యంబు= ఆశ; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: 'ఇవన్నీ ఎప్పటికైనా నశించేవి. పుట్టుక చావు అనే వాటితో కూడినవి. గట్టిదైన అజ్ఞానంతో ఏర్పడే దుఃఖాన్ని అంటిపెట్టుకొని ఉండేవి. కొంచెపాటి సుఖం మాత్రం కలవి. వీటిమీద మమకారం ఎందుకు?'

విశేషం: ఇక్కడ నాలుగు దోషాలను పేర్కొన్నారు. 1. అనిత్యత; 2.చావుపుట్టుకలుండటం; 3.దుఃఖ బహుళత; 4. సుఖస్వల్పత్వం. వివేకం కలవాడు ఈ దోషాలలో ఏ ఒక్కటి ఉన్నా అపేక్షించడు. అన్నీ కలిసి ఉంటే ఇక చెప్పనేల?

"ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున" అని భగవద్వాక్యం. 'అర్జునా! బ్రహ్మలోకం వరకు సర్వలోకాలు మరల తిరిగి రావలసినవే' దీనిని ఇక్కడ అనుసంధించికొనాలి. వివేకధనుడు అపేక్షించేది పునరావృత్తిరహిత శాశ్వత ఆనందైకధామం.

వ. అని తలంచి యపునర్భవకారియు ననధికంబును నచలంబును నగు ధర్మంబు కోరుచుండు నకృతకర్మఫలంబు నొందను గృతకర్మ ఫలంబు తొలఁగను నెవ్వరికి వశంబు కామి ధ్రువం బగుటం జేసి కృతకర్మవిశేషంబున నతండు వాసవాది వరిష్ఠసహవాసంబున వర్తించి. 309

ప్రతిపదార్థం: అని= ఇట్లు; తలంచి= భావించి; అపునర్+భవ కారియున్= తిరిగి పుట్టటం కలిగించనిదిన్నీ; అనధికంబును= తనకంటె మిన్న అయినది లేనిదీ; అచలంబును= ఊగిసలాట లేనిదియు; అగు= అయిన; ధర్మంబు= ధర్మాన్నీ; కోరుచుండున్= కోరుతూ ఉంటాడు; అకృత కర్మఫలంబున్= చేయని పని ఫలాన్ని; ఒందను= పొందటానికీ; కృతకర్మఫలంబు= చేసిన పనుల

ఫలాన్ని; తొలఁగను= వదలటానికీ; ఎవ్వరికిన్= ఎట్టివారికినీ; వశంబు కామి= సాధ్యం కాకపోవటం; ధ్రువంబు= నిశ్చయం; అగుటన్+చేసి= కావటంవలన; కృతకర్మ విశేషంబునన్= చేసిన పుణ్యకర్మలవలన; అతండు= అట్టి జనుడు; వాసవ+ఆది వరిష్ఠ సహవాసంబునన్= దేవేంద్రుడు మొదలైన మహాత్ములతో కలిసి ఉండటంతో; వర్తించి= మెలగి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఇట్లు తలపోసి మరల పుట్టుక కలిగించునదీ, తన కంటె మిన్న అయినది లేనిదీ, మిక్కిలి స్థిరమైనదీ అయిన ధర్మాన్ని కోరుతూ ఉంటాడు. చేయని పనికి ఫలం పొందటంగానీ, చేసిన కర్మఫలం పొందకపోవటానికి గానీ ఎవరికీ సాధ్యం కాదనేది నిశ్చయం కనుక, చేసిన పుణ్యకర్మంవలన అతడు దేవేంద్రుడు మొదలైన మహాత్ముల సహవాసంతో కొంతకాలం ఉంటాడు.

తే. పుణ్యఫలకాలమున యంతమున నితాంత । సంప్రబుద్ధ జనంబు వంశమునఁ బుట్టి
బ్రహ్మసంస్కారముల నెల్లఁ బడసి యతిథి । దేవ పితృకోటులకుఁ బరితృప్తి చేసి. 310

ప్రతిపదార్థం: పుణ్యఫలకాలమున అంతమునన్= పుణ్యముల ఫలం అనుభవించే కాలం చివర; నితాంత సంప్రబుద్ధ జనంబు వంశమునన్= చాలా అధికమైన జ్ఞానం గల జనాల వంశంలో; పుట్టి= జన్మించి; బ్రహ్మ సంస్కారములన్= బ్రాహ్మణ సంస్కారములను; ఎల్లన్= అన్నింటినీ; పడసి= పొంది; అతిథి దేవ పితృ కోటులకున్= అతిథులు, దేవతలు, పితృదేవతలు అను వారి సముదాయములకు; పరితృప్తిచేసి= మిక్కిలి తృప్తి గావించి.

తాత్పర్యం: పుణ్యఫలం ముగిసే సమయంలో గొప్ప జ్ఞానసంపద గలవారి వంశంలో పుట్టి, బ్రహ్మవేత్తలు పొందే సంస్కారాలన్నీ పొంది, అతిథులకు, దేవతలకు, పితృదేవతలకు మిక్కిలి తృప్తి కలిగించి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇందులో విప్రుడు ఆచరించవలసిన పంచమహాయజ్ఞాలను సూచించారు. 'బ్రహ్మసంస్కారములు' అనటంవలన (1)బ్రహ్మయజ్ఞం (2) భూతయజ్ఞం అనేవి; అతిథి తృప్తివలన (3) మనుష్య యజ్ఞం దేవతల తృప్తివలన (4) దేవయజ్ఞం, పితృతృప్తివలన; (5) పితృయజ్ఞం అనేవి సిద్ధిస్తున్నాయి. భారతీయులు తల్లి గర్భంలో బీజం పడకముందు నుండి శరీరం బూడిదయ్యేవరకు చేసుకొనే సంస్కారాలు అనేకం ఉన్నాయి. గర్భాదానము, పుంసవనము, సీమంతము, జాతకర్మ నామకరణము, చూడాకర్మ, కేశఖండనము, ఉపనయనము, వివాహము మొదలైనవి.

తే. భార్య పుత్రు లాదిగఁ గల పాశసంచ । యంబు నిరసించి యతిధర్మ మాచరించి
యిలు వెడలి గురుశుశ్రూష నలఘు సాంఖ్య । యోగ శాస్త్ర రహస్యైకయోగ మొంది. 311

ప్రతిపదార్థం: భార్య= పెండ్లము; పుత్రులు= సంతానం; ఆదిగన్= మొదలుగా; కల= ఉన్న; పాశసంచయంబు= పాశాల సముదాయాన్ని; నిరసించి= త్రోసివేసి; యతి ధర్మము= సన్న్యాసి ధర్మాన్ని; ఆచరించి= చక్కగా నిర్వహించి; ఇలు= ఇంటినుండి; వెడలి= బయటకు వచ్చి; గురు శుశ్రూషన్= గురువుల సేవతో; అలఘు సాంఖ్య యోగ శాస్త్ర రహస్య+ఏక యోగము= గొప్పవైన సాంఖ్యము, యోగము అనే శాస్త్రాల గుట్టులను ఒక్కటిగా కలిపి అనుభవించటాన్ని; ఒంది= సాధించి.

తాత్పర్యం: భార్యాపుత్రులు మొదలైన బంధాల నన్నింటిని తెగగోసి వేసికొని, సన్న్యాసి ధర్మాన్ని చక్కగా పాటించి, ఇంటినుండి బయటపడి, గురువుల సేవతో గొప్పవైన సాంఖ్యయోగశాస్త్రాల రహస్యాలను ఒక్కటిగా చేసికొని అనుభవించి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: భార్య మొదలైనవారు పాశాలు - కట్టి పడవేసే త్రాళ్ళవంటివారు. ఎందుకంటే వారి రక్షణ, పోషణ భారంతోనే కాలమంతా గడచిపోతుంది. ఆ పనులతోనే పుణ్యపాపాల బంధాలు పెరిగిపోతాయి. పరమార్థచింతనకు అవకాశం ఉండదు.

యతిధర్మం - సంగం త్యజించటం. సమ్+న్యాసం= చక్కగా తీసి అవతల ఉంచటం. దేనిని అంటే సంగాన్ని. అదే సర్వానర్థ మూలకారణం. 'సతిన్యాసః' అని కూడా మరొక అర్థం చెప్పుతాను. సత్స్వరూపుడైన భగవంతుడియందు అన్నింటినీ - తను, మనో, ధన, ప్రాణాదులను చక్కగా అర్పణ చేయటం అని దానికర్థం.

శుశ్రూష - శ్రవణం మీది ఇచ్ఛ. పరమార్థం వినాలనే కోరిక - క్రమంగా ఆ కోరికతో చేసేసేవ శుశ్రూష అయింది.

సాంఖ్యం - సంఖ్యా సంబంధమైనది. తత్త్వాలలెక్క అని స్థూలంగా అర్థం. పంచభూతాలు, పంచ ఇంద్రియాలు, పంచ తన్మాత్రలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం అనే ఇరవైనాలుగు తత్త్వాల చక్కని జ్ఞానం సాంఖ్యం.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులనే ఎనిమిది అంగాలతో కూడిన చిత్తవృత్తి నిరోధరూపమైన విద్య యోగం.

ఈ రెంటి సమన్వయం ఏకయోగం - దీనివలన నరుడు జననమరణరూప సంసారచక్రం నుండి ముక్తి పొందుతాడు. ఇది భారతీయుల తత్త్వవిద్య. అయితే ఈ సాధన శరీరం రాలిపోయేవరకు సాగాలి.

సీ. **పుణ్యంబులైన యరణ్యంబులను శూన్య । గృహముల దేవతాగృహములందు**
గుహలను నిలుచుచుఁ గుడుపు భిక్ష నొనర్చి । యొకచోట మరగక యొల్లమియును
వలపును నెడలి నిర్ద్వంద్వత పాటించి । మమత యహంకృతి మాని నిత్య
తృప్తాత్ముఁడును జనాధీనత్వరహితుండు ।నై గమ్యదిశ యొక్కఁ డనఁగ లేక

ఆ. **మెలఁగుచుండి పక్వఫలము తొడిమఁ బాయు । పగిది గుణచయంబుఁ బాసి యక్ష**
యంబు నచలమును నిరామయంబును నగు । పదముఁ జెందు శుద్ధభావ మెసఁగ. **312**

ప్రతిపదార్థం: పుణ్యంబులు= పవిత్రములు; ఐన= అయినట్టి; అరణ్యంబులను= అడవులయందు; శూన్య గృహములన్= జనాలు లేని పాడుబడ్డ కొంపలందు; దేవతాగృహములందున్= దేవాలయాలయందు; గుహలను= కొండగుహలలోను; నిలుచుచున్= ఉంటూ; కుడుపు= తిండిని; భిక్షన్= బిచ్చంతో; ఒనర్చి= చేసి; ఒక చోటన్= ఒక తావున; మరగక= అలవాటు పడక; ఒల్లమియును= ఇష్టపడకపోవటాన్ని; వలపును= ఇష్టపడటాన్ని; ఎడలి= వదలివేసి; నిర్ద్వంద్వత= ఇష్టానిష్టాలు, రాగద్వేషాలు మొదలైన జంటలు లేనితనాన్ని; పాటించి= ఆచరించి; మమత= మమకారాన్ని (వస్తువులు మొదలగువాటియందు నాది అనే భావాన్ని); అహంకృతి= అహంకారాన్ని (నేను - అనే భావాన్నీ); మాని= వదలి; నిత్య తృప్త+ఆత్ముఁడును= ఎల్లవేళల తృప్తి

పొందిన హృదయం కలవాడును; జన+అధీనత్వ రహితుండును=జనులకు వశం కావటంలేనివాడును; ఐ= అయి; గమ్యదిశ= వెళ్ళదగిన దిక్కు; ఒక్కఁడు= ఇది; అనఁగన్= అనటానికి; లేక= లేకుండా; మెలఁగుచుండి= తిరుగుతూ; పక్వఫలము= బాగా పండిన పండు; తొడిమన్= తొడిమను; పాయు పగిదిన్= వదలి రాలిపోయే విధంగా; గుణచయంబున్= గుణముల సముదాయాన్ని; పాసి= వదలి; అక్షయంబున్= నాశనంకానిదీ; అచలమును= కదలికలేనిదీ; నిరామయంబును= ఏ రోగమూ లేనిదీ; అగు= అయిన; పదమున్= స్థానాన్ని; శుద్ధభావము= నిర్మలత్వం; ఎసఁగన్= అతిశయింపగా; చెందున్= పొందుతాడు.

తాత్పర్యం: పవిత్రాలైన అడవులలో, జనాలులేని ఇండ్లలో, దేవాలయాలలో, కొండ గుహలలో ఉంటూ భిక్షమెత్తిన తిండి తింటూ ఒకచోటికి అలవాటుపడక రాగద్వేషాలు వదలివేసి ద్వంద్వాలను తొలగించుకొని, అహంకార మమకారాలను రూపుమాపి, నిత్యతృప్తిగల హృదయంతో జనులకు వశంకాని స్థితితో ఒక గమ్యం అనేది లేకుండా తిరుగుతూ బాగా పండిన పండు తొడిమనుండి రాలిపోయిన విధంగా సత్త్వరజస్తమోగుణాల నెలవైన దేహాన్ని వదలివేసి, శుద్ధభావంతో నాశనంకానిదీ, స్థిరమైనదీ, ఏ తెగులూ లేనిదీ అయిన శాశ్వతపదాన్ని పొందుతాడు.

విశేషం: సన్న్యాసి ధర్మాన్ని ఇందులో వివరించి చెప్పారు. నెలవుమీద, తిండిమీద, మనోభావాలమీద ఏ విధమైన ప్రవృత్తి ఉండాలో వివరించారు. 'ఒకచోట మరగక' - ఒక స్థానాన్ని ఎన్నుకుంటే ఒక సంసారం ప్రారంభమవుతుంది. గమ్యం కూడదు. ఇది గమ్యం అనుకొంటే ఏదో ఫలాభిలాష ఉంటుందన్న మాట. 'గుణచయంబున్ పాసి'' గుణాతీత స్థితిని పొంది, గుణాలు బంధకారణాలు. కాబట్టి వాటికి లోబడకుంటేనే ముక్తి. అక్షయశబ్దాన్ని సత్తుకు 'అచల' శబ్దాన్ని చిత్తుకూ, నిరామయశబ్దాన్ని ఆనందానికీ సూచకాలుగా భావించి సచ్చిదానందాత్మక శాశ్వత పదం పొందుతాడనే అర్థాన్ని ఇక్కడ గ్రహించాలి. అది పరమాత్మ సాయుజ్యరూపమైనది.

వ. అని చెప్పి. 313

ప్రతిపదార్థం: అని= ఇట్లా; చెప్పి= బోధించి.

తాత్పర్యం: అని బోధించి (తరువాతి పద్యంతో అన్వయం)

క. భిక్షుకుఁ డిమ్మెయి నీడముఁ । బక్షి విడుచునట్లు మాయఁబాసి యభేద్యం
బక్షర మను తత్త్వంబును । సాక్షాత్కృతిఁ గూర్చి నిలుచు శాశ్వత పదవిన్. 314

ప్రతిపదార్థం: భిక్షుకుఁడు= సన్న్యాసి; ఈ+మెయిన్= ఈ విధంగా; పక్షి; నీడమున్= గూడును; విడుచు+అట్లు= విడిచే విధంగా; మాయన్= మాయను; పాసి= వదలి; అభేద్యంబు= భేదింపరానిది; అక్షరము= నాశనము కానిదను అర్థముగల అక్షరము; అను= అనే; తత్త్వంబును= తత్త్వాన్ని; సాక్షాత్కృతిన్= ప్రత్యక్షం కావటాన్ని; కూర్చి= ఏర్పరచుకొని; శాశ్వతపదవిన్= నిత్యమైన స్థానంలో; నిలుచున్= ఉంటాడు.

తాత్పర్యం: సన్న్యాసి ఈ విధంగా గూడు వదలిన పక్షివలె మాయను వదలివైచి, భేదింపరాని అక్షరం అనే తత్త్వాన్ని ప్రత్యక్షం చేసికొని, శాశ్వతపదవిలో నిలుస్తాడు.

విశేషం: మాయ - ప్రకృతి అనే తత్త్వాన్ని మాయ అని వ్యవహరిస్తారు. అక్షరము అను తత్త్వంబును - పరమాత్మతో అభిన్నంగా అయిన స్థితిని. దీనినే ముక్తి అంటారు.

వ. అమ్మహానుభావుండు సంసార సాగరంబు గడచుటయ కాదాశ్రితులనుం గడపం జాలియుండు. 315

ప్రతిపదార్థం: ఆ+మహానుభావుండు= అట్టి గొప్ప అనుభావంకల వ్యక్తి; సంసారసాగరంబు = సంసారమనే మహాసముద్రాన్ని; కడచుట+అ= దాటడమే; కాదు; ఆశ్రితులనున్= తన్ను చేరినవారిని; కడపన్= దాటించుటకు; చాలి ఉండున్= సమర్థుడై ఉంటాడు.

తాత్పర్యం: ఆ మహాత్ముడు సంసారసముద్రాన్ని దాటటమే కాదు, తన్నాశ్రయించిన వారిని కూడా దాటించగలుగుతాడు.

విశేషం: సంసారము - జననమరణ రూపమైన తిరుగుడు వ్యవహారం. ఇది మహా దుస్తరం కనుక సముద్రంతో పోలుస్తారు. "స్వయం తీర్త్వా పరాంస్తారయతి" అని శాస్త్రవాక్యం. తాను దాటి ఇతరులను దాటిస్తాడు - దీనిని ఇక్కడ సమన్వయించుకోవాలి. నిజానికి సంసారసాగరం నుండి దాటింపజేయగలవాడు పరమాత్మ ఒక్కడే. మళ్ళీ ఆ సామర్థ్యం సంపూర్ణ జ్ఞానసంపదగల గురువునకు మాత్రమే ఉంటుంది. "గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురు ర్దేవో మహేశ్వరః" గురుః సాక్షాత్ పర బ్రహ్మ తస్మై శ్రీగురవే నమః" అని భారతీయులు విశ్వసించి గురుని స్తుతిస్తారు.

ఉ. కావున భిక్షుఁ జెంది ప్రియకారిత శూద్రుఁడు గొల్చునేని సం
భావితుఁ డైన యాతని కృపారసమాని తదీయ సంగ వి
ద్రావిత కల్మషుండయి చిరక్రమవృత్తిత నూయి గ్రొచ్చి నీ
ర్వావిరి గన్నయట్టులు శివంబగు తత్త్వము గాంచు నెమ్మెయిన్. 316

ప్రతిపదార్థం: కావునన్= కనుక; శూద్రుఁడు= నాలుగవజాతివాడు; ప్రియకారితన్= ప్రియములు చేసే ప్రవృత్తితో; భిక్షున్= సన్న్యాసిని; చెంది= ఆశ్రయించి; కొల్చున్+ఏని= సేవిస్తే; సంభావితుఁడు= మన్నింపబడినవాడు; ఐన= అయిన; ఆతని= ఆ సన్న్యాసియొక్క; కృపారసము=దయ అనే రసాన్ని; ఆని= పుచ్చుకొని; తదీయ సంగ విద్రావిత కల్మషుండు= అతనిదైన సంబంధంచేత దూరంగా తరిమివేయబడిన పాపాలు కలవాడు; అయి= అయి; చిరక్రమ వృత్తితన్= బహుకాలం క్రమమైన ప్రవర్తనతో; నూయి= బావి; గ్రొచ్చి= త్రవ్వి; నీర్= నీటిని; వావిరి= సమృద్ధిగా; కన్న+అట్టులు= పొందే విధంగా; ఏ+మెయిన్= ఎట్లాగైనా (తప్పక); శివంబు= మంగళప్రదము; అగు= అయిన; తత్త్వమున్= తత్త్వమును; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: కనుక శూద్రుడు ప్రియములుచేస్తూ సన్న్యాసిని సేవిస్తే గొప్ప మన్ననగల అతని దయారసం ఆస్వాదించి అతడి సంగంవలన పాపాలన్నీ పటాపంచలు కాగా ఎంతో కాలం కష్టపడి నూయి త్రవ్వి నీరు సమృద్ధిగా పొందిన విధంగా శివతత్త్వాన్ని (శాశ్వతపదవిని) పొందుతాడు.

విశేషం: ఇది పరమసులభమైన మార్గం. సన్న్యాసి అష్టకష్టాలు పడి పొందిన మహాఫలాన్ని శూద్రుడు తత్సేవవలన పొందుతున్నాడు. శివంబగు తత్త్వము - అక్షయశాశ్వతమోక్ష సామ్రాజ్యం. చిరక్రమవృత్తితన్ - క్రమంగా వైశ్యాది జన్మలు అనే సోపానాలను విజయవంతంగా కడచి - అని భావం.

తే. అఖిల జనులకుఁ బరమ పదాభిలాష । వృత్తి సామాన్య; యది యొండు వెంట శూద్ర
జనములకు నెట్లు వొరలిన సఫల గాదు । దాని భిక్షుకసేవ సత్ఫలతఁ గూర్చు. 317

ప్రతిపదార్థం: అఖిల జనులకున్= అన్ని వర్ణాల వారికీ; పద+అభిలాష వృత్తి= శాశ్వతమైన మోక్ష స్థానం కోరిక ఉండటం; సామాన్య= సాధారణమైనది; ఎట్లు= ఏ విధంగా; పొరలినన్= తిరుగుళ్ళు పడినా; ఒండు వెంటన్= మరొక విధంగా; అది= ఆ పరమ పదంపైన కోరిక; శూద్రజనులకున్= శూద్రవర్ణంవారికి; సఫల= ఫలంతో కూడినది; కాదు; భిక్షుకసేవ= సన్న్యాసులను సేవించటం; దానిన్= ఆ కోరికను; సత్ఫలతన్= మంచిఫలం పొందటాన్ని; కూర్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: పరమపదంమీద వాంఛతో ఉండటం జనులందరికీ సమానవిషయమే. ఎంత కష్టపడినా శూద్రులకు అది మరొక మార్గంలో సఫలం కాదు. సన్న్యాసిసేవ దానిని సఫలం చేస్తుంది.

పరాశరమునిప్రణీత ధర్మవిశేషంబు భీష్ముండు ధర్మజునకుం జెప్పుట (సం.13-153-1 (కుంభ))

తే. వర్ణములకెల్ల నింద్రియ వ్యాప్తి నిగ్ర । హంబు వలయు నియ్యది గన్నయంతఁ దృప్తిఁ
బొంది యొండాసపడకున్న నొందు సాధు । జనులు వెదకు ననామయ సత్పదంబు. 318

ప్రతిపదార్థం: వర్ణములకున్= జాతులకు; ఎల్లన్= అన్నింటికీ; ఇంద్రియ వ్యాప్తి నిగ్రహంబు= ఇంద్రియముల వ్యాప్తిని అరికట్టటం; వలయున్= కావాలి; ఈ+అది= ఇది; కన్న+అంతన్= పొందినంతనే; తృప్తిన్= తనివిని; పొంది; ఒండు= మరియొకటి; ఆసపడక= ఆశింపక; ఉన్నన్= ఉంటే; సాధుజనులు= సన్న్యాసులు; వెదకు అనామయ సత్ పదంబు= వెదకే ఏ జాడ్యమూ లేని బ్రహ్మపదం; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: అన్ని వర్ణాలవారికీ ఇంద్రియాలు వ్యాపించటాన్ని అరికట్టటం కర్తవ్యం. దానిని సాధించి మరొకటి కోరకుండేవాడు సాధుజనులు వెదకే తెవులులేని బ్రహ్మపదాన్ని పొందుతాడు.

విశేషం: ఇంద్రియాలు - చర్మము, కన్నులు, చెవులు, ముక్కు, నాలుక - ఇవి క్రమంగా స్పర్శ; రూపం, శబ్దం, గంధం, రసం - అనే వాటి కొరకు వెంపరలాడుతూ ఉంటాయి. అవి సక్రమంగా లభించకపోతే అక్రమంగానైనా సాధించటానికి ప్రయత్నిస్తాయి. ఆ విధంగా ఇంద్రియాలు విషయాలపై ప్రసరించటం బంధకారణం అవుతుంది. వాటిని సాగకుండా నిలుపటం బ్రహ్మప్రాప్తి కారణం అవుతుంది.

అనామయసత్పదంబు - బ్రహ్మపదం - పరమాత్మలో ఐక్యం కావటం. ఇవికాక తక్కిన బ్రహ్మలోకాదులన్నీ రాకపోకలతో అనిత్యాలు కావటంవలన దోషం కలవి. వివేకవంతుడు వాటికొరకు వెదకడు.

తే. పరమమైన యీ ధర్మంబు వట్టి పాప । యోనులగు కామినులును వైశ్యులును శూద్రు
లును సుగతి గాంతు రనిన సజ్జనతఁ బరఁగు । బ్రాహ్మణులకు రాజులకును బ్రాఁతె సుగతి? 319

ప్రతిపదార్థం: పరమము= మిక్కిలి గొప్పది; ఐన ఈ ధర్మంబు= అయిన ఈ ధర్మాన్ని; పట్టి= ఆధారంగా గ్రహించి; పాప యోనులు= పాపపు జన్మకారణం కలవారు; అగు= అయిన; కామినులును= స్త్రీలు; వైశ్యులును= మూడవ వర్ణంవారు; శూద్రులును= నాలుగవ వర్ణం వారును; సుగతి= మంచిగతిని; కాంతురు= పొందుతారు; అనినన్= అంటే; సత్+జనతన్=

మంచి జనుడి భావంతో; పరఁగు= ఒప్పే; బ్రాహ్మణులకున్= బ్రాహ్మణులకూ, రాజులకున్= క్షత్రియులకున్నూ; సుగతి= మంచిగతి; బ్రాఁతి+ఎ= దుర్లభమా? కాదని భావం.

తాత్పర్యం: ఎంతో శ్రేష్ఠమైన ఈ ధర్మాన్ని అవలంబించి పాపపు జన్మకారణాలుగల స్త్రీలు, వైశ్యులు, శూద్రులు కూడా సుగతి పొందుతారంటే సజ్జనులైన బ్రాహ్మణులకు, క్షత్రియులకు సుగతి దుర్లభమా?

విశేషం: స్త్రీలు, వైశ్యులు, శూద్రులు - పూర్వజన్మంలోని పాపకర్మవలన ఆ స్థితిని పొందారని కర్మసిద్ధాంత భావన. అట్లాగే మునుపటి జన్మలందలి పుణ్యకర్మఫలంగా మొదటి రెండు వర్ణాలలో జన్మిస్తారని భావన. ఈ విధంగా ఈ పాపపుణ్యాలు జన్మకు యోనులు కారణాలు. అంతేకానీ ఇప్పుడు వారు పాపాత్ములు, వీరు పుణ్యాత్ములు అని విభాగం చేయటం సరికాదు.

వ. అని చెప్పి వెండియు. 320

తాత్పర్యం: పరాశరు డిట్లా చెప్పి, ఇంకా విశేషించి బోధిస్తున్నాడు.

సీ. బోధ మక్షీణపాపునకుఁ గల్గదు సద్గు । రుండు సెప్పంగ సంశ్రుతములైన
పనులఁ బాపంబులు వాసిన నిర్మల । జ్ఞానోదయం బగు దాన గర్వ
ముదయింప వచ్చిన నుడుపంగవలయు గ । ర్వంబున గురుసమారాధనంబు
వదలిన నా బోధవైభవ మెడలిన । యంతటఁ బోక కీ డావహిల్లుఁ

ఆ. బరమబోధమునకు ఫల ముపశాంతిగా । నెఱిఁగి యెంతబోధ మెక్కు డయ్యె
నంతశాంతుఁ డగుచు ననవరతంబును । గురునిఁ గొలిచి మేలు పురుషుఁ డొందు. 321

ప్రతిపదార్థం: అక్షీణ పాపునకున్= నశించని పాపాలు కలవాడికి; బోధము= జ్ఞానం; కల్గదు= ఏర్పడదు; సత్+గురుండు= ఉత్తముడైన గురువు; చెప్పంగన్= బోధింపగా; సంశ్రుతములు= చక్కగా వినవచ్చినవి; ఐన పనులన్= అయిన కార్యములతో; పాపంబులు= పాపాలు; పాసినన్= నశిస్తే; నిర్మల జ్ఞాన+ఉదయంబు= స్వచ్ఛమైన జ్ఞానం పుట్టటం; అగున్= అవుతుంది; దానన్= దానిచేత; గర్వము= పొగరు; ఉదయింప వచ్చినన్= పుట్టబోతే; ఉడుపంగవలయున్= మాన్పాలి; గర్వంబునన్= పొగరుతో; గురు సమారాధనంబు= గురువుల చక్కని పూజ; వదలినన్= మానివేస్తే; ఆ బోధ వైభవము= ఆ జ్ఞానపు మహిమ; ఎడలిన అంతటన్= పోయినంతటితో; పోక= పోవక; కీడు= ఆపద; ఆవహిల్లున్= కలుగుతుంది; పరమబోధమునకున్= గొప్పదియైన జ్ఞానానికి; ఫలము= ప్రయోజనం; ఉపశాంతి= మిడిసిపాటు లేకపోవటం; కాన్= కావటం; ఎఱిఁగి= తెలిసికొని; బోధము= జ్ఞానము; ఎంత= ఎంతగా; ఎక్కుడు= అధికం; అయ్యెన్= అవుతుందో; అంత= అంతగా; శాంతుఁడు= ఓర్పుగలవాడు; అగుచున్= అవుతూ; అనవరతంబును= ఎల్లప్పుడు; గురునిన్= జ్ఞానబోధ చేసిన వ్యక్తిని; కొలిచి= సేవించి; పురుషుఁడు= మనుజుడు; మేలు= శుభాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పాపం తరుగనివాడికి జ్ఞానం కలుగదు. సద్గురువు బోధించిన పనులు చక్కగా ఆచరిస్తే పాపాలు పోతాయి. అప్పుడు నిర్మలమైన జ్ఞానం కలుగుతుంది. అయితే దానివలన గర్వం ఏర్పడితే దానిని రూపుమాపాలి. గర్వంతో గురుపూజ మానితే జ్ఞానం నశించటమే కాదు, ఆపద కూడా కలుగుతుంది. గొప్పజ్ఞానానికి ఫలం మిడిసిపడకుండటం అని తెలిసికొని, జ్ఞానం ఎంతగా పెరుగుతుందో శాంతి నంతగా పెంచుకొనాలి. కనుక ఎల్లప్పుడు గురుసేవ చేస్తూ నరుడు మేలు పొందుతాడు.

విశేషం: తెలివివలన గర్వం పొందటం మానవుడి పెద్ద బలహీనత. దాని దుష్ఫలితాన్ని ఈ పద్యంలో చక్కగా తెలియజేశారు. భారతీయ సంప్రదాయంలో గురువు తెప్పవంటివాడు. గురువు సాక్షాత్తు పరబ్రహ్మ. అతడిని పట్టుకొనటం, వదలిపెట్టటం అనేవి ఉండవు. ఈ రహస్యాన్ని ఇందులో మనం చక్కగా గ్రహించాలి.

సీ. రక్షించునది యుదరంబు శిశ్నము ధృతిఁ । బాణిపాదములు దృక్పాటవములు
వినుఁ డింద్రియంబుల మనమును మనమున । బుద్ధి నిట్లైనఁ బ్రబోధవికచ
హృదయస్థుఁడై ధూమ మెడలిన శిఖివోలె । వెలుఁగు దేవునిఁ జూచు వెరవు గలుగు
యుక్తుండు గాకేల యొదవు మహేశ్వరుఁ । గనుట? యుక్తాత్ముండు గనును భక్తి

తే. నట్టి భంగికిఁ జాలిన యట్టిఁడైన । వికృతిషోడశకంబును ప్రకృతి సప్త
కంబు మూలప్రకృతిఁ జిత్తకలన నరయ । వికృతియును బ్రకృతియుఁ గాని విభునిఁ గాంచు. 322

ప్రతిపదార్థం: ఉదరంబు= పొట్టను; శిశ్నమున్= గుహ్యమును; ధృతిన్= బుద్ధిశక్తితో; రక్షించునది= కాపాడాలి; పాణిపాదములు= చేతులు, కాళ్ళు; దృక్+పాటవములు= చూపునందలి పటుత్వాలను; రక్షించునది= కాపాడాలి; వినుఁడు= ఆలకించండి; ఇంద్రియంబులన్= ఇంద్రియాలతో; మనమును= మనస్సును; మనమునన్= మనస్సుతో; బుద్ధిని; రక్షించునది= చెడకుండ చూచుకొనాలి; ఇట్లు= ఈ విధంగా; ఐనన్= అయితే; ప్రబోధ వికచ హృదయస్థుఁడు= గొప్ప ఉపదేశంతో వికసించిన హృదయంలో ఉన్నవాడు; ఐ= అయి; ధూమము= పొగ; ఎడలిన= పోయిన; శిఖిపోలెన్= అగ్నివలె; వెలుఁగు దేవునిన్= ప్రకాశించే పరమాత్మను; చూచు వెరవు= చూచే అవకాశం; కలుగున్= కలుగుతుంది; యుక్తుండు= యోగముకలవాడు; కాక= కాకుండా; మహేశ్వరున్= పరమాత్మను; కనుట= పొందటం; ఏల= ఎందుకు; ఒదవున్?= కలుగుతుంది?; యుక్త+ఆత్ముండు= యోగం సిద్ధించిన హృదయం కలవాడు; భక్తిన్= భక్తిని; కనును= పొందుతాడు; అట్టి భంగికిన్= అట్టి పద్ధతికి; చాలిన అట్టిఁడు= సమర్థుడు; ఐనన్= అయితే; వికృతిషోడశకంబును= వికారముల పదునారింటిని; ప్రకృతి సప్తకంబున్= ప్రకృతుల ఏడింటిని; మూలప్రకృతిన్= మూలమైన ప్రకృతిని; చిత్తకలనన్= చిత్తపు కూడిక చేత; అరయన్= పరీక్షింపగా; వికృతియును= వికృతిస్వరూపుడు; ప్రకృతియున్= ప్రకృతి స్వరూపుడును; కాని= కానట్టి; విభునిన్= పరమాత్మను; కాంచున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: వినండి. మానవుడు కడుపును, లింగాన్నీ, కాళ్ళు చేతులను, దృష్టిశక్తులనూ కాపాడుకొనాలి. ఇంద్రియాలతో మనస్సును, మనస్సుతో బుద్ధిని రక్షించుకొనాలి. ఇట్లా అయితే సుజ్ఞానంతో వికసించిన అతడి హృదయంలో నెలకొని ఉన్నవాడు, పొగలేని అగ్నివలె వెలుగొందుతున్నవాడు అయిన పరమాత్మను దర్శించే అవకాశం కలుగుతుంది. యోగసిద్ధి పొందనివాడికి మహేశ్వరుడిని కనుగొనటం ఎట్లా సాధ్యమవుతుంది? యోగసిద్ధి పొందిన వాడికి భక్తి ఏర్పడుతుంది. ఆ విధానానికి సమర్థుడైన వాడు పదహారు వికారాలను, ఏడు ప్రకృతులను మూలప్రకృతినీ చిత్తంలో చక్కగా కూర్చుకొని, వికృతి కానివాడు, ప్రకృతి కానివాడు అయిన పరమాత్మను సందర్శిస్తాడు.

విశేషం: ఇది ఆధ్యాత్మికవిద్య. కడుపు, శిశ్నము, మొదలైన వాటిని రక్షించుకొనటమంటే భుక్తి విషయంలో, రక్తి విషయంలో లౌల్యం లేకుండా ఉండటం. అట్లాగే అకృత్యాలు చేయకుండటం, అగమ్యస్థలాలకు పోకపోవటం, పాణిపాదాలను రక్షించుకొనటం. ఇంద్రియాలను విచ్చలవిడిగా ప్రవర్తించనీయకపోతే మనస్సు అదుపులోనికి వస్తుంది. అంటే సంకల్పవికల్పాలు నశిస్తాయి. మనస్సు అదుపులోనికి వస్తే బుద్ధి తన అధీనంలో ఉంటుంది. అంటే పరమార్థ సంబంధమైన నిర్ణయాలే చేస్తుంది. కానీ

ఇహసుఖసంబంధ నిర్ణయాలు చేయదు. ప్రబోధం అంటే గురువు ఉపదేశించిన జ్ఞానం. దానిచేత అంతవరకు హృదయంలో ఉన్నా, ఉన్నట్లు తెలియరాని పరమాత్మ ఉనికి తెలుస్తుంది. దానికి ఉపమానం పొగపోయిన శిఖి. పొగ దట్టంగా క్రమ్మితే అగ్ని సరిగా కనబడదు కదా! ఇక్కడ జ్ఞానాగ్ని అటువంటిది. వికృతి షోడశకంబు - అంటే పంచ ఇంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచతన్మాత్రలు - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. మనస్సు ఈ పదునారింటి సముదాయం. ప్రకృతి సప్తకం అంటే పంచభూతాలు - పృథివి, నీరు, నిప్పు, గాలి, నింగి, మహత్తు, అహంకారం అనేవి మూలప్రకృతి - ఈ అన్నింటికీ మూలకారణమైన హిరణ్యగర్భుడు. ఈ మొత్తం ఇరవైనాలుగు తత్త్వాలు భక్తితో వికసించిన హృదయం కలవాడికి చిత్తంలో విస్పష్టంగా భాసిస్తాయి. 16+8గా అయిన వికృతి ప్రకృతులకు అతీతంగా ఉన్న పరమాత్మ దర్శనం అప్పుడు సిద్ధిస్తుంది.

క. ఇది సాంఖ్యానము దీనిని । మది కలవడఁ జేసికొనుచు మఱవక గురు ని
ర్మదుఁడై కొలువఁగఁ గేవల । పదము నతని కరుణ పెంపు ప్రకటము సేయున్. 323

ప్రతిపదార్థం: ఇది; సాంఖ్యానము= జ్ఞానము; దీనిని= ఈ జ్ఞానాన్ని; మదికిన్= మనస్సునకు; అలవడన్+చేసికొనుచున్= అభ్యాసం ద్వారా గట్టి చేసికొంటూ; గురున్= గురువును; మఱవక= మరచిపోక; నిర్మదుఁడు+ఐ= పొగరులేనివాడై; కొలువఁగన్= సేవింపగా; అతని కరుణ పెంపు= అతడి దయయొక్క ఎక్కువతనం; కేవల పదమున్= కైవల్యం అనే స్థానాన్ని; ప్రకటము+చేయున్= వెల్లడి చేస్తుంది.

తాత్పర్యం: ఇది జ్ఞానమార్గం. దీనిని హృదయంలో పదిలపరచుకొంటూ గురువును మరచిపోక, పొగరులేనివాడై సేవిస్తూ ఉంటే అతడి దయ కైవల్యాన్ని చక్కగా తెలుపుతుంది.

విశేషం: సాంఖ్యానము -సమ్యక్ఖ్యానం చక్కని తెలివి అని అర్థం. అంతేకాక సంఖ్యాసంబంధమైనది. తత్త్వముల సంఖ్యను వివరించటం ద్వారా తెలివిని ప్రసాదిస్తుంది కనుక సాంఖ్యం. కేవలుడు అంటే ఏ విధమైన అంటుసొంటులు, ద్వంద్వాలు లేకుండా తనకు తానే స్వతంత్రుడు, శుద్ధుడు, బుద్ధుడు, ఆనందస్వరూపుడు అయిన పరమాత్మ. అతడి పదం కేవలపదం. అంటే జీవ బ్రహ్మైక్యరూపమైన పరమగతి - అని తాత్పర్యం. గురువు అనుగ్రహం లేకపోతే అది తెలియరాదు. గురువే సాక్షాత్తు పరబ్రహ్మము. కనుక గురువును మరవరాదు. గురువు విషయంలో గర్వాదులను పొందరాదు - అని ఈ పద్యంలో హెచ్చరిక చేస్తున్నారు.

తే. భిక్షుభావంబుఁ బొంది యీ శిక్ష యూఁది । మెలఁగు నర్హత త్రైవర్ణికులకుఁ గలదు
శూద్రునకు భిక్షుసంసర్గ సులభ మమల । పదము వానికి భిక్షుతఁ బరఁగఁ జనదు. 324

ప్రతిపదార్థం: భిక్షు భావంబున్= సన్న్యాసితనాన్ని; పొంది= అవలంబించి; ఈ శిక్ష= ఈ అభ్యాసం; ఊఁది= గట్టిగా పట్టుకొని; మెలఁగు+అర్హత= ప్రవర్తించే యోగ్యత; త్రైవర్ణికులకున్= మొదటిమూడు వర్ణాలవారికి; కలదు= ఉన్నది; శూద్రునకున్= నాలుగవ వర్ణంవాడికి; అమల పదము= స్వచ్ఛమైన కైవల్యపదం, భిక్షు సంసర్గ సులభము= సన్న్యాసుల సహవాసంచేత తేలికగా లభించునది; వానికిన్= ఆ శూద్రుడికి; భిక్షుతన్= సన్న్యాసి ధర్మంతో; పరఁగన్= ప్రవర్తించటం; చనదు= కూడదు.

తాత్పర్యం: సన్న్యాసిభావాన్ని పొంది ఈ అభ్యాసాన్ని గట్టిగా పట్టుకొని ప్రవర్తించే అర్హత మూడు వర్ణాలవారికి ఉన్నది. శూద్రుడికి ఆ కైవల్యపదం సన్న్యాసినంటిపెట్టుకొని ఉండటం వలననే తేలికగా లభిస్తుంది. అతడు సన్న్యాసి ధర్మాన్ని స్వీకరించకూడదు.

క. పరమజ్ఞానుల యొద్దను । బరఁగిన నజ్ఞుఁడును బోధభరితుఁడగు నిరం
తర మేరుసమీపస్థితి । హిరణ్యరుచిఁ గాక మెసకమెసఁగిన పగిదిన్. 325

ప్రతిపదార్థం: నిరంతర మేరు సమీప స్థితిన్= ఎల్లవేళల మేరుపర్వతం దగ్గర ఉండటం చేత; కాకము= కాకి; హిరణ్యరుచిన్= బంగారు వన్నెతో; ఎసకము= అతిశయము; ఎసఁగిన పగిదిన్= పెంపొందిన విధంగా; పరమ జ్ఞానుల+ఒద్దను= గొప్ప జ్ఞానం కలవారికడ; పరఁగినన్= మెలగితే; అజ్ఞుఁడును= ఏమియు తెలియనివాడు కూడా; బోధభరితుఁడు= జ్ఞానంతో నిండినవాడు; అగున్= అగును.

తాత్పర్యం: ఎల్లవేళలా బంగారు కొండ దగ్గర ఉండటంచేత కాకి కూడా బంగారు వన్నెతో మిలమిలలాడిన విధంగా గొప్ప జ్ఞానం కలవారిదగ్గర మెలగిన తెలియనివాడు కూడా జ్ఞానపూర్ణు డవుతాడు.

విశేషం: ఇది భ్రమరకీటకన్యాయం వంటిది. పరుసవేది ఇనుమును బంగారు చేయటం వంటిది. ఆరు నెలలు కలిసి ఉంటే వారు వీరవుతారనే తెలుగు సామెత కూడా దీనిని నిరూపిస్తుంది.

క. గురు శుశ్రూషా మహిమం । గరుణఁ జతుర్వర్ణ హితముగా నిమ్మాడ్కిం
బరివర్ణితంబు సేసెం । బరాశర మునీశ్వరుండు పౌరవముఖ్యా! 326

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశ శ్రేష్ఠుడా!; పరాశర ముని+ఈశ్వరుండు= పరాశరుడనే మునిశ్రేష్ఠుడు; ఈ+మాడ్కిన్= ఈ విధంగా; కరుణన్= దయతో; చతుర్+వర్ణ హితముగాన్= నాలుగు వర్ణాలవారికి మేలు కలిగే తీరున; గురు శుశ్రూషా మహిమన్= గురువులను సేవించటంవలన కలిగే గొప్ప స్థితిని; పరివర్ణితంబు= నిండుగా చెప్పబడిన దానినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరాశరమహర్షి ఈ విధంగా కరుణతో నాలుగు వర్ణాల వారికి మేలు కలిగే విధంగా గురుసేవ గొప్పతనాన్ని వివరించి చెప్పాడు.

విశేషం: మునీశ్వరుడు అనటంచేత అతడి మాట ప్రమాణంగా తీసికొనదగినదని సూచన. 'కరుణన్' అనటంవలన ఇట్లా చెప్పటంలో స్వార్థచింతన లేదనటం తెలియవస్తుంది. 'హితము' అనటంవలన ఒకవేళ పైకి ఇది కటువుగా ఉన్నా, ఔషధంవలె ఆచరిస్తే మేలు చేసేది - అన్న స్ఫూర్తి కలుగుతుంది. పరివర్ణితంబు అన్నచోట ఉపసర్గ 'పరి' అనేది - 'ఇది తుదిమాట. దీనికి వికల్పాలు లేవు' అనటాన్ని స్ఫురింపజేస్తుంది. ఇట్లా ఈ చిన్న పద్యం వ్యంగార్థపుష్టమై కావ్యధర్మశోభితమై అలరారుతున్నది.

వ. అని సకల ధర్మోపదేశధుర్యుండైన భీష్ముండు పరాశర మునివర్యు వాక్యసంచయంబు సెప్పినం బరితుష్టుండయి పరమ వినయంబునం బాండవాగ్రజుం డక్కురుకులాగ్రగణ్యుతో 'నరులు సురలకు వంద్యులగు వారును గలరని విందు వారల వర్తనంబెట్టి దెఱింగింపు' మనిన నతం డతని కిట్లనియె. 327

ప్రతిపదార్థం: అని= ఇట్లు; సకల ధర్మ+ఉపదేశధుర్యుండు=అన్ని ధర్మాలను ఉపదేశించటంలో సమర్థుడు; ఐన భీష్ముండు= అయిన భీష్ముడు; పరాశర మునివర్యు వాక్య సంచయంబు= పరాశరమహర్షి యొక్క వాక్యాల సముదాయాన్ని; చెప్పినన్= చెప్పగా; పరితుష్టుండు+అయి= మిక్కిలి ఆనందించినవాడు అయి; పాండవ+అగ్రజుండు= పాండుకుమారులలో పెద్దవాడు

అయిన ధర్మరాజు; పరమ వినయంబునన్= మిక్కిలి వినయంతో; ఆ+కురు కుల+అగ్రగణ్యుతోన్= కురువంశంలో మొదట లెక్కింపదగిన ఆ భీష్ముడితో; సురలకున్= దేవతలకు కూడా; వంద్యులు= మన్నింపదగినవారు; నరులు= మానవులు; కలరు= ఉన్నారు; అని; విందున్= వింటున్నాను; వారల వర్తనంబు= అట్టివారి నడవడి; ఎట్టిది?= ఏ విధమైనది?; ఎఱింగింపుము= తెలియజేయుము; అనినన్= అంటే; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్ = అన్నాడు.

తాత్పర్యం: ధర్మాలన్నింటిని చక్కగా తెలియజెప్పటంలో నేర్పుగల ఆ భీష్ముడు ఈ విధంగా పరాశరమునీంద్రుడి వాక్యాలను తెలుపగా పరమానందం పొంది ధర్మరాజు మహా వినయంతో భీష్ముడితో 'ఆర్యా! దేవతలు కూడా మ్రొక్కదగిన నరులుంటారని విన్నాను. అట్టివారి నడవడి యెటువంటిదో తెలియజెప్పుము.' అంటే భీష్ము డతనితో ఇట్లా అన్నాడు.

విశేషం: సురలు నరులకు వంద్యులు. ఇది సహజవ్యవహారం.కాని, సురలకు కూడా వంద్యులయిన నరులున్నారట. ఇది విశేష వ్యవహారం. ధర్మరాజుకు అట్టివారి నడవడిని గురించి తెలిసికొనాలనిపించింది.

సీ. 'ఇట్లు మాతలి యమరేంద్రుని నడిగిన । ధర్మార్థ కామముల్ ధర్మచరిత
వర్తనఁ జెల్లించువారు, వామాక్షులు । గోరఁగాఁ దగు రూపగుణ సమృద్ధి
గలిగియు వర్జితకాము లయ్యెడు వారు । విద్యాధనైశ్వర్యవిషయ గర్వ
విరహితులగువారు విజితేంద్రియులు నిజ । దారతృప్తులుఁ దపోధనము గాఢ

తే. తత్పరతఁ గూర్చు ఘనులు సత్యవ్రతులును । బరమశౌచులు బహుకార్యపరత లేని
గూఢధర్ములు సన్న్యాస కోవిదులును । దనకు నభివంద్యు లగుట యతండు సెప్పె. 328

ప్రతిపదార్థం: ఇట్లు= ఇదే విధంగా; మాతలి= ఇంద్రుడి సారథి అయిన మాతలి; అమర+ఇంద్రునిన్= దేవేంద్రుడిని; అడిగినన్= అడిగితే; అతండు= ఆ ఇంద్రుడు; ధర్మ+అర్థ కామముల్= ధర్మము, అర్థము, కామము అనే పురుషార్థాలను; ధర్మచరిత వర్తనన్= ధర్మమును నడిపే ప్రవర్తనతో; చెల్లించువారు= సాగింపజేసేవారు; వామ+అక్షులు= చక్కని కనులుగల ఆడువారు; కోరఁగాన్= వాంఛింపగా; తగు రూప గుణ సమృద్ధి= తగిన అందమూ, సద్గుణ సంపదా; కలిగియున్= ఉండి కూడా; వర్జిత కాములు= వదలిన కామం కలవారు; అయ్యెడువారు= అయ్యేవారు; విద్యా ధన+ఐశ్వర్య విషయ గర్వ విరహితులు= చదువు, సంపద, ప్రభుత్వము అనే విషయాలవలన ఏర్పడే గర్వంలేనివారు; అగువారు= అయినవారు; విజిత+ఇంద్రియులు= గెలువబడిన ఇంద్రియములు గలవారు; నిజ దార తృప్తులు= తమ భార్యలతో తృప్తి చెందేవారు; గాఢ తత్పరతన్= చెదరని పట్టుదలతో; తపోధనమున్= తపస్సు అనే ధనాన్ని; కూర్చు ఘనులు= కూడబెట్టే గొప్పవారు; సత్యవ్రతులును= సత్యమునందు నిష్ఠ కలవారు; పరమశౌచులు= గొప్ప పరిశుద్ధత కలవారు; బహు కార్యపరత= పెక్కు కార్యాలలో ఆసక్తి; లేని గూఢ ధర్ములు= లేకుండా గుట్టుగా ధర్మం ఆచరించేవారు; సన్న్యాస కోవిదులును= సన్న్యాస ధర్మంలో సర్వమూ తెలిసి ఆచరించేవారు; తనకున్= తనకు; అభివంద్యులు= నమస్కరింపదగినవారు; అగుటన్= కావటం; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ఇదే విధంగా మాతలి దేవేంద్రుడిని అడిగాడు. అతడు ఇట్లా చెప్పాడు. ధర్మ, అర్థ, కామ పురుషార్థాలను ధర్మం తప్పని నడవడితో ఆచరించేవారు, సుందరాంగులు స్వయంగా కోరినా, తమకు తగిన రూపము, శక్తి

సంపదలు ఉన్నా కామాన్ని వదలి మెలగేవారూ, విద్యాగర్వం, ధనగర్వం, ప్రభుత్వగర్వం మొదలైనవి లేనివారు, ఇంద్రియములపై గట్టి అదుపు కలవారు, తమ భార్యలతో తృప్తిపొందేవారు, దృఢమైన పట్టుదలతో తపస్సు అనే ధనాన్ని కూడబెట్టే మహాత్ములు, సత్యనిష్ఠ కలవారు, వెలుపలిలోపలి పరిశుద్ధతను సాధించేవారు, అనేక కార్యాల తగులం లేక గుట్టుగా ధర్మం ఆచరించేవారూ, నిజమైన సన్న్యాసధర్మాలను నేర్పుతో పాటించేవారు తనకు మ్రొక్కదగినవారు.

విశేషం: వీటికి క్రమంగా రఘువంశరాజులు, అర్జునుడు లేక ప్రవరుడు, జనకుడు, హరిశ్చంద్రుడు, శిబిచక్రవర్తి, శ్రీరామచంద్రుడు మొదలగువారు ఉదాహరణ ప్రాయులు.

వ. అనిన విని ధర్మతనయుండు 'తటాక నిర్మాణ రూపంబగు ధర్మంబు విశేషంబు వినవలతుం జెప్పవే' యనుటయు ననిమిషనదీనందనుం డాదరభరితుండై. 329

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్ముని కుమారుడు; తటాక నిర్మాణ రూప ధర్మంబు విశేషంబు= చెరువును నిర్మించటం అనే ధర్మంలోని గొప్పతనం; వినవలతున్= వినటానికి ఇష్టపడుతున్నాను; చెప్పవే= దయతో వివరించుము; అనుటయున్= అంటే; అనిమిష నదీనందనుండు= దేవతల నది అయిన గంగ కొడుకు; ఆదర భరితుండు+ఐ= ఆదరంతో నిండినవాడై.

తాత్పర్యం: తరువాత ధర్మరాజు 'చెరువు త్రవ్వించటం అనే ధర్మంలోని గొప్పతనం తెలిసికొనాలని ఉన్నది తాతా! చెప్పుతావా?' అంటే భీష్ముడు నిండైన ఆదరంతో ఇట్లా అన్నాడు.

విశేషం: తటాకం - నీటికి సంబంధించినది. భీష్ముడు నదీనందనుడు. నది నీటికి నెలవు కదా! అందుకని ఆయనకు ఈ ప్రశ్న మరింత ఆనందాన్ని కలిగించింది.

భీష్ముఁడు ధర్మజునకుఁ దటాక నిర్మాణ ఫలవిశేషంబు సెప్పుట (సం.13-92-1)

సీ. దేవ తిర్యఙ్నరస్థావరాశ్రయము త । టాకంబు విను మట్లుఁ గాక యందు
గోకులంబులు నీరు గొని దాని కర్తకు । లము నెల్లఁ బుణ్యలోకమున కనుచు
నీ లోకమున శ్రీయు నెక్కుడు కీర్తియు । నతనికిఁ జేయు వర్షాగమమున
సీతున వేసవిఁ జెఱువులో నీరున్న । నగ్నిహోత్రాదిమయజ్ఞ వాజ

ఆ. పేయఫలములోలి నాయన కగుఁ గట్టఁ । దగిన తరువు లిడిన సుగతి గలుగు
నిహసుఖంబుఁ బొందు విహగాది బహుభూత । వాససౌఖ్య మతఁడు సేసెఁ గాన. 330

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; తటాకంబు= జలాశ్రయం (చెరువు); దేవ తిర్యక్+నర స్థావర+ఆశ్రయము= దేవతలకు, పశువులకు, పక్షులకు, నరులకు, కదలికలేని వస్తువులకు ఆశ్రయము; అట్లున్+కాక= అంతేకాక; అందున్= దానిలో; గోకులంబులు= ఆవుల మందలు; నీరు= నీటిని; కొని= త్రావి; దాని కర్త కులమున్= ఆ చెరువు త్రవ్వించినవాడి కులమును; ఎల్లన్=అంతటినీ; పుణ్యలోకమునకున్= పుణ్యలోకానికి; అనుచున్= పంపుతాయి; ఈ లోకమునన్= ఈ

లోకంలో; శ్రీయున్= సంపదను; ఎక్కుడు కీర్తియున్= అధికమైన కీర్తిని; అతనికిన్= ఆ కర్తకు; చేయున్= కలిగిస్తాయి; వర్షా+ఆగమమునన్= వానకాలము రాకయందూ; సీతునన్= చలికాలంలోనూ; వేసవిన్= వేసవికాలంలోనూ; చెఱువులోన్= తటాకంలో; నీరు= జలం; ఉన్నన్= ఉంటే; ఆయనకున్= త్రవ్వించిన ఆ వ్యక్తికి; అగ్నిహోత్ర+ఆదిమ+యజ్ఞ వాజపేయ ఫలములు= అగ్ని హోత్రం మొదలుగాగల యజ్ఞాలూ, వాజపేయ యాగం మొదలైన వాని ఫలాలు; ఓలిన్= వరుసగా; అగున్= సిద్ధిస్తాయి; కట్టన్= కట్ట మీద; తగిన తరువులు= యోగ్యమైన చెట్లు; ఇడినన్= నాటితే; అతఁడు= ఆ కర్త; విహగ+ఆది బహు భూత వాస సౌఖ్యము= పక్షులు మొదలైన పెక్కు ప్రాణుల నివాసం అనే సుఖాన్ని; చేసెన్= చేశాడు; కానన్= కనుక (అతడికి); సుగతి= పరంలో మంచిగతి; కలుగున్= కలుగుతుంది; ఇహసుఖంబున్= ఈ లోకపు సుఖాన్ని కూడా (అతడు); పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: వినుము. చెరువు దేవతలకు, పశువులకు, పక్షులకు, రాయి రప్పవంటి స్థావరాలకు నెలవైనది. అంతేకాదు. అందులో నీరు త్రావి ఆవులమందలు దాని కర్త కులాన్నంతటినీ పుణ్యలోకాలకు పంపుతాయి. ఈ లోకంలో గొప్ప సంపదనూ, చెడని కీర్తినీ కలిగిస్తాయి. వానకాలంలో, చలికాలంలో, ఎండకాలంలో చెరువులో నీళ్ళుంటే మహాయజ్ఞాలు చేసిన ఫలం ఆ కర్తకు లభిస్తుంది. కట్టమీద తగిన చెట్లు నాటితే పక్షులు మొదలైన ప్రాణికోటికి నిలువనీడనిచ్చి సుఖం కూర్చినవాడు ఔతాడు కనుక అతడికి ఇహపర సుఖాలు కలుగుతాయి.

విశేషం: ఈనాడు మనం ఎక్కువగా అనుకొంటున్న పర్యావరణ సమతౌల్యభావన ఇందు చూడవచ్చును.

క. సలిలాశయములు చేసిన । నలఘుప్రియ మందుఁ బితృచయము లూర్ధ్వగతుల్
గలుగును దానం దమ కను । తలఁపున నది గోరుచుండు ధర్మతనూజా! 331

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ధర్మనందనా!; పితృచయములు= పితృదేవతలు; సలిల+ఆశయములు= నీటి కొలకులు; చేసినన్= నిర్మిస్తే; అలఘు ప్రియము= మిక్కిలి ప్రియమును; అందున్= పొందుతారు; దానన్= దానివలన; తమకున్= తమకు; ఊర్ధ్వగతుల్= పైలోకపు గమనములు; కలుగును= సిద్ధిస్తాయి; అను తలఁపునన్= అనే భావంతో; అది= తటాక నిర్మాణాన్ని; కోరుచుండున్= కోరుతూ ఉంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! పితృదేవతలు తమ వంశంవారు చెరువులు త్రవ్విస్తే పరమానందం పొందుతారు. దానివలన తమకు ఉత్తమ లోకాలకు పోయే వీలు కలుగుతుందని దాని నెప్పుడూ కోరుతూ ఉంటారు.

తే. ఛాయ నతిథి వర్గంబుఁ బుష్పముల సురగ । ణంబుఁ బండులఁ బితృనివహంబుఁ బ్రమద
మందఁ జేయు వృక్షంబు లట్లగుట వృక్ష । రోపణ క్రియ మేటి ధర్మువు కుమార! 332

ప్రతిపదార్థం: కుమార!= నాయనా!; వృక్షములు= చెట్లు; ఛాయన్= తమ నీడతో; అతిథివర్గంబున్= అతిథుల సముదాయాన్ని; పుష్పములన్= పూవులతో; సురగణంబున్= దేవతల సముదాయాన్నీ; పండులన్= పండ్లతో; పితృ నివహంబున్= పితృదేవతల గణాన్నీ; ప్రమదము= అధికానందం, అందన్+చేయున్= కలిగిస్తాయి; అట్లు= ఆ విధం; అగుటన్= కావటంవలన; వృక్షరోపణ క్రియ= చెట్లు నాటటం అనే పని; మేటి ధర్మువు= గొప్ప ధర్మం.

తాత్పర్యం: నాయనా! చెట్లు తమనీడతో అతిధులకూ, పువ్వులతో దేవతలకు, పండ్లతో పితృదేవలకూ పరమానందం కలిగిస్తాయి. కనుక చెట్లు నాటటమనే పని గొప్ప ధర్మం.

విశేషం: ఒక చెట్టు నాటితే మూడు లోకాలవారు తృప్తి పొందటాన్ని ఋషులు భావించిన సంగతిని మనం అనుక్షణం స్మరించాలి. ఈనాటి వృక్షరక్షణతత్పరతతో పోల్చి చూడవచ్చును.

క. అనిన విని ప్రీతుఁడై య । జ్జన విభుఁడు గృహస్థధర్మ సాకల్యజ్ఞా
న నిరూఢి నాదు చిత్తం । బున నొలయింపు భవదీయ పుణ్యఫణితులన్. 333

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ప్రీతుఁడు+ఐ= ఆనందించినవాడై; ఆ+జనవిభుఁడు= ఆ రాజు, ధర్మజుడు; గృహస్థ ధర్మ సాకల్య జ్ఞాన నిరూఢిన్= గృహస్థుడి ధర్మపు సమగ్రమైన జ్ఞానంయొక్క ప్రసిద్ధిని; భవదీయ పుణ్యఫణితులన్= నీవైన పవిత్ర వాక్కులతో; నాదు చిత్తంబునన్= నా హృదయంలో; ఒలయింపు= ప్రవేశపెట్టుము.

తాత్పర్యం: ఆ మాటలు విని ఆనందించిన ధర్మరాజు 'గృహస్థ ధర్మానికి సంబంధించిన నిండైన ప్రసిద్ధిని నీ పుణ్యవాక్యాలతో నా హృదయంలో ప్రవేశపెట్టుము' అని అడిగాడు.

క. అనవుడుఁ దాత యలరి య । మ్మనుమనితో నిట్టు లనియె మహియును విష్ణుం
డును జేసిన సంవాదము । విను మది నీ కోర్కిఁ దీర్చు విశ్రుత కీర్తీ! 334

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; తాత; అలరి= సంతోషపడి; ఆ+మనుమనితోన్= మనుమడైన ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; విశ్రుతకీర్తీ!= ప్రసిద్ధికెక్కిన కీర్తిగలవాడా!; మహియును= భూదేవియు; విష్ణుండును= విష్ణువును; చేసిన సంవాదము= చేసిన సంభాషణము; వినుము; అది= ఆ ప్రసంగం; నీ కోర్కిన్= నీ కోరికను; తీర్చున్= నెరవేరుస్తుంది.

తాత్పర్యం: అన్నంతనే తాత ఆ మనుమడితో ఇట్లా అన్నాడు. 'ప్రసిద్ధమైన కీర్తిగల ధర్మరాజా! మునుపు భూదేవికి విష్ణువుకు అయిన సంవాదం వినుము. అది నీ కోరికను తీరుస్తుంది.

విశేషం: భూవిష్ణు సంవాదరూప ఇతిహాసప్రకటన ఆదరాతిశయంకొరకని గుర్తించాలి.

తే. నన్ను నీ వడిగిన యట్లు వెన్నుఁ డర్థి । బుజ్జవంబులు మున్నుగ భూమిదేవి
నడిగె; దానికిఁ బ్రియమంది యమ్మహాను । భావ యిట్లని చెప్పెఁ దద్భావ మలర. 335

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; నీవు; అడిగిన+అట్లు= అడిగిన విధంగా; వెన్నుఁడు= కృష్ణుడు; అర్థిన్= కోరికతో; బుజ్జవంబులు= లాలనలు; మున్నుగన్= ముందు కలుగునట్లుగా; భూమిదేవిన్= భూదేవిని; అడిగెన్= అడిగినాడు; దానికిన్= ఆ అడగటానికి; ప్రియము+అంది= సంతోషపడి; ఆ+మహానుభావ= గొప్ప ప్రభావంగల ఆ భూమి; తత్+భావము= ఆ విష్ణుడి హృదయం; అలరన్= ప్రీతి పొందగా; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పినది.

తాత్పర్యం: నన్ను నీవడిగినట్లుగా కృష్ణుడు ముందు ప్రేమవాక్యాలతో బుజ్జగించి భూదేవిని అడిగాడు. దానికి ప్రీతిచెంది, ఆ మహానుభావునికి, అతడి హృదయం ప్రీతిపొందే విధంగా ఇట్లా చెప్పింది.

విశేషం: బుజ్జవంబులు - విష్ణువు సర్వమూ తెలిసినవాడు. ప్రేమతో భూదేవితో చెప్పించాలని అతడికి కోరిక కలిగింది. అందుకని లాలన మాటలు చాలా పలికాడు.

క. 'దేవా ! హుతవహపరిచ । ర్యావిధి యొనరించి బలిసమాచరణము భ
క్త్యావేశంబునఁ జేయఁగ । దైవతసంఘంబు సమ్మదంబునఁ దేలున్. 336

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; హుతవహ పరిచర్యా విధి= అగ్నిసేవ అనే కార్యం; ఒనరించి= చేసి; బలిసమాచరణము= బలివేయటం అనే మంచి పనిని; భక్తి+ఆవేశంబునన్= భక్తి ఒడలంతయు నిండునట్లుగా; చేయఁగన్= చేస్తే; దైవత సంఘంబు= దేవతల సముదాయం; సమ్మదంబునన్= మిక్కిలి ఆనందంతో; తేలున్= తేలుతుంది.

తాత్పర్యం: 'ప్రభూ! గృహస్థుడు అగ్ని ఆరాధన చేయాలి. భూతాలకు బలిని ఒడలంతా నిండిన భక్తితో చేయాలి. దానివలన దేవతల సముదాయం పరమానందంలో తేలుతుంది.

విశేషం: అగ్ని అర్చన శాస్త్రీయమైన ప్రక్రియ. అగ్నిలో హుతమైన మంచి పదార్థాల శక్తి వాతావరణంలో లీనమై పరిసరాలను కాలుష్యం నుండి రక్షిస్తుంది. ఆ వాసన పీల్చిన ప్రాణులన్నింటికీ ఆ శక్తి సంక్రమిస్తుంది.

భారతీయులు 'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అనే భావం కలవారు కారు. అందరికీ అన్నీ సుఖంగా ఉంటేనే తమకు సుఖం అనే భావన వారిది. ఆ దృష్టితో చీమలు మొదలుకొని వీలైనంత ఎక్కువ పరిధిలో ప్రాణులకు ఆహారం అందించి తాము తింటారు. దీనికే 'భూతదయ' అని పేరు. "నితాంతాపారభూతదయ" ప్రసాదించుమని భాగవతప్రార్థన. అన్నింటిలో పరమాత్మను చూసే లక్షణం కూడా ఇందులో గోచరిస్తుంది. పైగా ఇచట పలుకుతున్నది భూమాత - అన్ని జీవుల ఆకలి తీర్చటమే ఆమె ప్రగాఢ వాంఛ.

తే. అన్నమున దుగ్ధమునఁ బండ్లనైన మూల । కోటి నైనను దనుపారు నీటనైన
నిత్యమును జేయునది పితృకృత్య మోపి । వైశ్వదేవ మవశ్య నిర్వాహ్య మనఘ! 337

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; అన్నమునన్= అన్నంతో గానీ; దుగ్ధమునన్= పాలతో గానీ; పండ్లన్+ఐనన్= ఫలాలతో గానీ; మూలకోటిన్= దుంపల సముదాయంతో; ఐననున్= కానీ; తనుపారు నీటన్= మంచి చల్లని నీటితో; ఐనన్= కానీ; ఓపి= సహించి; పితృకృత్యము= పితృదేవతల పని అయిన తర్పణం; నిత్యమును= ప్రతిదినమూ; చేయునది= చేయాలి; వైశ్వదేవము= వైశ్వదేవమనే కర్మ; అవశ్య నిర్వాహ్యము= తప్పని సరిగా చేయవలసినది.

తాత్పర్యం: అన్నం, పాలు, పండ్లు, దుంపలు, చల్లని నీరు - అనే వీటిలో దేనితోనైనా ప్రతిదినము పితృదేవతలకు తర్పణం చేయాలి. 'వైశ్వదేవం' అనే కర్మ తప్పని సరిగా ఆచరించాలి.

విశేషం: పితృకృత్యము - పితృయజ్ఞం. ఇది ప్రతిదినం చేయవలసిన అయిదు యజ్ఞాలలో ఒకటి. 'వైశ్వదేవం' - విశ్వదేవులనే వారికి ప్రీతి కలిగించే ఒక వైదికకార్యం. ఇది దేవయజ్ఞంలో భాగం.

ఈ యజ్ఞాలన్నీ ఆధునికదృష్టితో శాస్త్రీయ ప్రయోజనాలను కలిగించటం పరిశీలించవచ్చును. వాతావరణ సమతౌల్య సాధనకు, త్యాగబుద్ధిని పెంపొందించటానికి ఇవి నిమిత్తాలుగా మనం సంభావించాలి.

క. ఆ చేఁత పిదప దానం । బాచరణీయంబు శక్తి కనుగుణముగ భి
క్షాచర్య సేయు విప్రుల । వేచి యిడఁగవలయు నెపుడు వేగమ భిక్షల్. 338

ప్రతిపదార్థం: ఆ చేఁత పిదపన్= ఆ పని తరువాత; శక్తికిన్= తన ఓపికకు; అనుగుణముగన్= తగినట్లుగా; దానంబు= ఈవి; ఆచరణీయంబు= చేయదగినది; ఎపుడున్= ఎల్లవేళల; భిక్షాచర్య= బిచ్చమెత్తుకొనటం; చేయు విప్రులన్= చేసే విద్యావంతులను; వేచి= కనిపెట్టుకొని ఉండి; వేగము+అ= ఆలస్యం చేయకుండా; భిక్షల్= భిక్షలను; ఇడఁగవలయున్= ఇవ్వాలి.

తాత్పర్యం: వైశ్వదేవం తరువాత తన శక్తి మేరకు దానాలు చేయాలి. బిచ్చమెత్తుకొనే విద్యావంతులైన బ్రాహ్మణులను ఎదురుచూచి వేగంగా భిక్షలివ్వాలి.

విశేషం: దీనిని మనుష్యయజ్ఞం అంటారు. ఇది ఒక విధమైన "సోషలిజం". 'అందరూ సుఖపడాలి' అనే తత్త్వం ఇందులో మనకు గోచరిస్తుంది. ఇతరులకు పెట్టకుండా తినే తిండి అతి నికృష్టమైనదిగా భారతీయ ఋషులు భావించటంలోని సామాజికదృష్టిని మనం గుర్తించి "అతిసంచయేచ్ఛ" వదలుకొనటం కర్తవ్యమని ఇటువంటి అంశాలవలన తెలిసివస్తుంది.

"దానే నారాతీనపానుదన్త" అని మహానారాయణోపనిషత్తు చెప్పుతున్నది. దానంతో శత్రువులు తొలగిపోతారట.

తే. అప్పటికి వారు లేకున్న నగ్రమగ్ని । ముఖమునందైన నిడునది సఖుల బంధు
జనుల నతిథుల గురుల భోజనవిధాన । తృప్తులుగఁ జేసి బలివిధిఁ దీర్పవలయు. 339

ప్రతిపదార్థం: అప్పటికిన్= ఆ సమయానికి; వారు= యాచకులైన ఆ విప్రులు; లేక+ఉన్నన్= లేకపోతే; అగ్రము= అన్నంలో మొదటి భాగాన్ని; అగ్నిముఖమునందున్= హోమంలో; ఐనన్= అయినా; ఇడునది= ఉంచాలి; సఖులన్= మిత్రములను; బంధు జనులన్= చుట్టాలను; అతిథులన్= భోజనం వేళకు వచ్చిన అన్నార్థులను; గురులన్= గురువులను; భోజన విధాన తృప్తులుగన్= అన్నం పెట్టటంచేత తృప్తిపడిన వారినిగా; చేసి= కావించి; బలివిధిన్= బలికార్యాన్ని; తీర్పవలయున్= తీర్చాలి.

తాత్పర్యం: భోజనసమయానికి విద్యావంతులైన బ్రాహ్మణోత్తములు రాకపోతే వండిన పదార్థాలలో ముందు భాగాన్ని హోమకుండంలోనైనా వేయాలి. తరువాత మిత్రులను, చుట్టాలను, అతిథులను, గురువులను అన్నంపెట్టి తృప్తిపరచాలి. పిదప బలికార్యం చేయాలి.

విశేషం: బలికార్యం అంటే పక్షులకు, పశువులకు అన్నంలో కొంతభాగం ఇవ్వాలని భావన. దీనిని తరువాత వివరిస్తున్నారు.

వ. బలు లుభయ ప్రకారంబులు; వానియందు ధర్మాధర్మౌషధి వనరక్షోజనాది విషయంబైన శ్రౌతబలి యేను మున్ను నిర్దేశించినది; యిప్పుడు చెప్పినయది పశుపక్షి చండాల ప్రభృతి గోచరంబగు స్మార్తబలి' యని నిర్దేశించి వెండియు. 340

ప్రతిపదార్థం: బలులు= 'బలి' అనేది; ఉభయ ప్రకారంబులు= రెండు విధాలైనవి; వానియందున్= వానిలో; ధర్మ+అధర్మ+ఓషధి వన, రక్షస్, జన+ఆది విషయంబు= ధర్మానికి అధర్మానికి; ఓషధులు, అడవులు, రక్షస్సులనే జనాలు మొదలైనవాటికి సంబంధించినది; ఐన= అయిన; శ్రౌతబలి= శ్రుతి - వేదం చెప్పిన బలి; ఏను= నేను; మున్ను= ముందు; నిర్దేశించినది=

చెప్పినది; ఇప్పుడు; చెప్పినయది= చెప్పినది; పశు పక్షి చండాల ప్రభృతి గోచరంబు= జంతువులు, పక్షులు, చండాలురు మొదలైనవారికి సంబంధించినది; అగు= అయిన; స్మార్తబలి= స్మృతి, ధర్మశాస్త్రం చెప్పిన బలి; అని, నిర్దేశించి= చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: బలులు రెండు రకాలు. వాటిలో ఇదివరకు నేను చెప్పిన శ్రౌతబలి. అది ధర్మానికి, అధర్మానికి ఓషధులకు, అడవులకు, రక్షస్సులకు మొదలైన వాటికి సంబంధించినది. ఇప్పుడు చెప్పినది స్మార్తబలి. ఇది పశువులకు, పక్షులకు, చండాలురు మొదలైన వారికి సంబంధించినది - అని వివరించి ఇంకా ఇట్లా చెప్పింది.

విశేషం: వైశ్వదేవానికి పూర్వం ఒక బలి తరువాత ఒక బలి అని చెప్పారు. వాటి విభాగం విషయాన్ని ఇక్కడ చక్కగా వివరించారు.

ఆ. **విను గృహస్థధర్మవిధ మిది యీ భంగి । నడపి పిదప భోజనంబు సేయ**
వలయు విప్రుఁ డిట్టి వాఁడొందు నిహపర । సౌఖ్యసంపదలఁ బ్రశస్తచరిత!' **341**

ప్రతిపదార్థం: ప్రశస్తచరిత!= కొనియాడబడిన ప్రవర్తన కలవాడా!; విను= వినుము; గృహస్థ ధర్మ విధము= గేస్తుని ధర్మపు పద్ధతి; ఇది; ఈ భంగిన్= ఈ పద్ధతిని; నడపి= సాగించి; పిదపన్= పిమ్మట; విప్రుఁడు= విద్యావంతుడు; భోజనంబు+ చేయవలయున్= భోజనం చేయాలి; ఇట్టివాఁడు= ఇటువంటివాడు; ఇహ పర సౌఖ్య సంపదలన్= ఈ లోకపు పరలోకపు సుఖాల సంపదలను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: సత్ప్రవర్తన కల ఓ కృష్ణా! ఇది గృహస్థధర్మం. ఈ పద్ధతిని సాగించి విప్రుడు భోజనం చేయాలి. ఇట్టివాడు ఇహపరసుఖాలను పొందుతాడు.'

విశేషం: ఇది భూదేవి కృష్ణుడికి చెప్పినమాట. తరువాతి పద్యంలో కృష్ణు డట్లా చేశాడని చెప్తున్నారు. కాబట్టి ఇక్కడ విప్రశబ్దం విశేషార్థంలో - 'ఉత్తమ జ్ఞానవృద్ధుడు' - అనే అర్థంలో వాడినట్లు గుర్తించాలి.

క. **అని చెప్పినఁ గృష్ణుఁడు నె । మ్మన మలర గృహస్థవిధి సమాచరణము ని**
ష్ఠ నడపెఁ గర్మ శ్రద్ధా । ఘన! నీవును నట్ల నడపు గార్హస్థ్యంబున్. **342**

ప్రతిపదార్థం: అని; చెప్పినన్= చెప్పగా; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; నెఱ+మనము= నిండు హృదయం; అలరన్= సంతోషింపగా; గృహస్థ విధి సమాచరణము= యజమానధర్మపు ఆచారాలను; నిష్ఠన్= పట్టుదలతో; నడపెన్= నడిపాడు; కర్మ శ్రద్ధాఘన!= కర్మములయందు శ్రద్ధచేత గొప్పవాడా!; నీవును= నీవు కూడా; అట్లు+అ= అట్లాగే; గార్హస్థ్యంబున్= గృహస్థధర్మాన్ని; నడపు= సాగించుము.

తాత్పర్యం: అని చెప్పగా కృష్ణుడు హృదయంలో ఎంతో సంతోషించి గృహస్థధర్మ ఆచారాలను నిష్ఠతో నిర్వహించాడు. ధర్మరాజా! నీవు కూడా కర్మశ్రద్ధ అధికంగా కలవాడవు కనుక గృహస్థధర్మాన్ని చక్కగా నిర్వహించుము.

విశేషం: నిజానికి కృష్ణుడికి ఈ లౌకికధర్మాలతో పని లేదు. కాని లోకసంగ్రహంకొరకు, లోకులకు ప్రమాణబుద్ధి ఏర్పడటం కొరకు ఆచరించినట్లు చెప్పినారని మనం గ్రహించాలి. "యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః'' అనే గీతావాక్యం ఇట స్మరించాలి.

క. అది దురితనిరాసము న । భ్యుదయానందంబు జేయుఁ బుణ్యయశస్సం
పద నిచ్చు నూర్ధ్వలోక । ప్రదమగు దానిఁ గొనియాడు భరతవరేణ్యా!' 343

ప్రతిపదార్థం: భరతవరేణ్యా!= భరతవంశంలో శ్రేష్ఠుడా!; అది= ఆ గృహస్థధర్మం; దురిత నివాసము= పాపాలను పోగొట్టేది; అభ్యుదయ+ఆనందంబున్= శుభంతో కూడిన ఆనందాన్ని; చేయున్= కలిగిస్తుంది; పుణ్య యశస్+సంపదన్= పుణ్యమైన కీర్తి అనే సంపదను; ఇచ్చున్= ఇస్తుంది; ఊర్ధ్వ లోక ప్రదము= పై లోకాలను భద్రంగా ఇచ్చేది; అగున్= అవుతుంది; దానిన్= అట్టి గృహస్థ ధర్మాన్ని; కొనియాడు= మనస్సులో ప్రశంసించుము.

తాత్పర్యం: ధర్మజా! గృహస్థధర్మం పాపాలను పటాపంచలు చేస్తుంది. ఈ లోకంలో శుభాలన్నీ కూర్చి ఆనందం కలిగిస్తుంది. పవిత్రమైన కీర్తి అనే సంపదను ప్రసాదిస్తుంది. పుణ్యలోకాలను చక్కగా కూరుస్తుంది. కనుక దానిని గొప్పగా భావించుము'.

విశేషం: నాలుగు ప్రయోజనాలను ఇక్కడ చెప్పుతున్నారు. 1.పాపాలు పోవటం; 2. ఐహిక ఆనందం కలగటం; 3.పుణ్యకీర్తి లభించటం; 4. ఉత్తమలోకాలు సిద్ధించటం. ఇవి ఒక దానికొకటి కారణకార్యసంబంధం కలవి. కొనియాడటమంటే దాని మహిమను ఎల్లప్పుడు భావిస్తూ ఆచరిస్తూ ఉండటం అనే అర్థాన్ని భావించాలి.

వ. అని యిట్లు భీష్ముండు భీమాగ్రజునకు గృహస్థ ధర్మప్రకారం బెఱింగించెనని చెప్పుటయు నప్పౌరవకులోత్తముల సంప్రశ్నోత్తరంబులు మఱి యెత్తెఱంగునం జెల్లెం? జెప్పవే యనుటయు. 344

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; భీష్ముండు= భీష్ముడు; భీమ+అగ్రజునకున్= భీముడి అన్న అయిన ధర్మరాజునకు; గృహస్థధర్మ ప్రకారంబు= గృహస్థుడి ధర్మపు విధానం; ఎఱింగించెన్= తెలిపాడు; అని; చెప్పుటయున్= చెప్పగా; ఆ+పౌరవ కుల+ ఉత్తముల సంప్రశ్న+ఉత్తరంబులు= పూరువంశంలో అతిశ్రేష్ఠులగు ఆ ధర్మరాజ శాంతనవుల మంచి ప్రశ్నలు, సమాధానములు; మఱి= ఇంకా; ఏ+తెఱంగున్= ఏ విధంగా; చెల్లెన్= సాగెను; చెప్పవే= దయచేసి తెల్పుము; అనుటయున్= అనగా.

తాత్పర్యం: అని ఈ విధంగా భీష్ముడు ధర్మరాజునకు గృహస్థాశ్రమ ధర్మవిధానం చెప్పాడని చెప్పగా జనమేజయుడు ఇంకా ఆ పూరువంశ శ్రేష్ఠుల ప్రశ్నసమాధానములు ఏ విధంగా సాగాయో తెల్పుమని కోరాడు.

విశేషం: అది పౌరవకులం - పూరు చక్రవర్తి చాలా గొప్ప వ్యక్తి. అతని కులం, అందులో ఉత్తములు - అనటంచేత పాఠకుడు ఎంత అవధానబుద్ధితో వినాలో హెచ్చరిక చేసినట్లయినది. అవి వట్టి ప్రశ్నలు కావు. 'సు' ప్రశ్నలు - మానవ సమాజం చక్కగా భావించదగిన ప్రశ్నలు. 'చెప్పవే' అనేది పరిప్రశ్నరూప ప్రార్థన.

ఆశ్వాసాంతము

చ. అపగత కామరోష హృదయాంతర ఖేలన కల్య! నిర్జపా
జప మహిత ప్రతైక పర సంగధురాధిక లౌల్య! చంద్రమ

స్తపనమయాక్ష! కౌస్తుభనితాంతరుచి స్ఫురితాస్థిదామ దీ
ప్తి పటల చారువక్ష! మునిధీస్ఫుట భావిత! దేవ సేవితా! 345

ప్రతిపదార్థం: అపగత కామరోష హృదయ+అంతర ఖేలన కల్య!= తుడిచి పెట్టుకొనిపోయిన కామం, క్రోధం గల హృదయం లోపల ఆడుకొనటంలో నేర్పరీ!; నిర్జపా జప మహిత వ్రత+ఏక పర సంగ ధురా+అధిక లౌల్య!= 'అజపా' మంత్రం జపం చేయటమనే గొప్ప దీక్షలో గొప్ప ఆసక్తికలవారికి సంబంధించిన భారం విసయంలో గొప్ప ఆసక్తి కలవాడా!; చంద్రమస్+తపన మయ+అక్ష= చంద్రుడు, సూర్యుడు అనే రూపాల కన్నులు కలవాడా!; కౌస్తుభ నితాంతరుచి స్ఫురిత అస్థిదామ దీప్తి పటల చారువక్ష!= కౌస్తుభమణి యొక్క గొప్ప కాంతితో విరాజిల్లే ఎముకలదండ దీప్తుల సముదాయంతో అందమైన ఎదురురొమ్ము కలవాడా!; ముని ధీ స్ఫుట భావిత!= మహర్షుల బుద్ధిచేత స్పష్టంగా భావింపబడే దేవా!; దేవ సేవితా!= దేవతలచేత సేవింపబడే ప్రభూ!

తాత్పర్యం: స్వామీ! కామక్రోధాదులు లేని హృదయాలలో క్రీడించటంలో నీవు నేర్పరివి. అజపా గాయత్రీమంత్రం జపించటమే గొప్ప వ్రతంగా గలవారి సర్వభారాలు వహించటంలో ఆసక్తి కలవాడవు. చంద్రుడు, సూర్యుడు నీ కన్నులు. కౌస్తుభమహాకాంతులతో తళతళలాడే అస్థిమాలా కాంతులతో అందమైన వక్షస్స్థలం నీది. మహర్షుల బుద్ధులు నిన్ను చక్కగా భావిస్తాయి. దేవతలందరు నిన్ను సేవిస్తూ ఉంటారు.

విశేషం: ఈ విశేషణాలు హరికీ, హరుడికీ సమంగా సరిపోతాయి. కౌస్తుభమణి హరిది, అస్థిమాల హరుడిది. తత్త్వదృష్టితో రెండూ ఒకటే.

'అజపా' గాయత్రీ అని ఒక మంత్రం. అది పరమాత్మను వర్ణిస్తుంది. ఆ జపం చేసేవారి సర్వభారాలను - యోగక్షేమాలను భగవంతుడు ఆసక్తితో వహిస్తాడు.

మునులంటే కేవలం భావనామయంగా భగవంతుడిని దర్శించేవారు. వాక్కులు, మనస్సు అతడిని అందజాలవని శ్రుతి చెప్తున్నది కదా!

క. సత్త్వాధిష్ఠాన కృత శు । భత్త్వ ప్రకటాభిధాన! భక్తాధీనా!
తత్త్వం పదార్థరూపా! తత్త్వ సదనదీప! ధూత దైత్యాటోపా! 346

ప్రతిపదార్థం: సత్త్వ= సత్తగుణానికి; అధిష్ఠాన= ఆధారం కాబట్టి; కృత= చేయబడిన; శుభత్వ= మంగళాన్ని; ప్రకట= తెలియజేసే; అభిదాన!= పేరుగలవాడా!; భక్త+అధీనా!= భక్తులకు వశమైనవాడా!; తత్+త్వం పదార్థరూపా!= అది నీవు అనే పదాల అర్థమైనవాడా!; తత్త్వసదనదీప!= బ్రహ్మ భావమనే మహాగృహానికి దీపమైనవాడా!; ధూత దైత్య+ఆటోపా!= ఎగురగొట్టబడిన దైత్యుల గర్వం కలవాడా!

తాత్పర్యం: స్వామీ! నీ పేర్లు సత్త్వగుణానికి ఆధారాలు. వాటివలన మానవులకు కలిగే శుభాలను స్పష్టం చేస్తూ ఉంటాయి. నీవు భక్తులకు వశం అయినవాడవు. 'తత్' "త్వం" అనే పదాలకు అర్థమైనవాడవు నీవు. బ్రహ్మభావ భవనానికి నీ వొక మహాదీపం. దైత్యుల మిడిసిపాటును తుక్కుదూగరగా కొట్టివేస్తావు.

విశేషం: భగవంతుడి పేర్లన్నీ - శివనామాలుగానీ, విష్ణునామాలుగానీ సత్త్వగుణంతో నిండారి, శుభాన్ని కలిగిస్తూ ఉంటాయి. అందుకే ఆ నామాలను పారాయణ చేస్తూ ఉంటారు.

అటువంటి భక్తులకు భగవంతుడు వశమై పోతాడు. నిజానికి భగవంతుడు మహావిషయం. భక్తుడు అల్పవిషయం. అయినా భగవంతుడు భక్తుడి వశంలో ఉండటానికి ఇష్టపడతాడు. వాత్సల్యపూర్ణుడైన తండ్రి సర్వసమర్థుడై ఉండి కూడా కుమారుడిని వీపుమీద ఎక్కించుకొని మోసినట్లు ఈ అంశాన్ని సంభావించాలి. తత్ - ఆ పరమాత్మ; త్వమ్ - నీవు - జీవుడు, ఈ రెండూ జ్ఞానానికి ఒకటే. నీవే బ్రహ్మవు అని వేదాలు ఘోషిస్తూ ఉన్నాయి.

'తత్' అంటే బ్రహ్మపదార్థం - 'తత్త్వం- అంటే బ్రహ్మపదార్థ భావన. దానికి పరమాత్మ దీపం - అంటే బ్రహ్మము సంగతి నరుడికి తెలియజేప్పే జ్ఞానం కలవాడని భావం.

దైత్యులు - అంటే అఖండ చైతన్యాన్ని గుర్తించలేక ఖండబుద్ధితో అల్పాత్ములైనవారు. వారి గర్వాన్ని నాశనంచేయటమంటే అల్పజ్ఞానాన్ని ముక్కలుగా చేసి వేయటం.

మాలిని :

జగదవన వినోదా! సత్యజాత ప్రమోదా!
సగుణ విగుణ భంగీ! సంయమారామ సంగీ!
విగత వికృత మూర్తీ! విశ్వభూత ప్రవర్తీ!
సుగమగహన భూమా! సోమపింఛాభిరామా! **347**

ప్రతిపదార్థం: జగత్+అవన వినోదా!= లోకాల రక్షణం చేయటమే వినోదం అయినవాడా!; సత్య జాత ప్రమోదా!= సత్యం నుండి పుట్టిన పరమానందం కలవాడా!; సగుణ విగుణ భంగీ!= సగుణం, విగుణం అనే రెండు పద్ధతులు కలవాడా!; సంయమ+ఆరామ సంగీ!= ఇంద్రియ నిగ్రహం అనే ఉద్యానవనంతో (సంగం) సంబంధం కలవాడా!; విగత వికృత మూర్తీ!= పోయిన వికారాలుగల స్వరూపం కలవాడా!; విశ్వ భూత ప్రవర్తీ!= సమస్త భూతములను ప్రవర్తింపజేయువాడా! సుగమగహన భూమా!= తేలికగా పొందదగినదీ, పొందరానిదీ, అయిన మహిమ కలవాడా!, సోమ ఫింఛ+అభిరామా!= చంద్రుడు, నెమలి పింఛములతో అందమైనవాడా!

తాత్పర్యం: దేవా! నీకు లోకాలను రక్షించటమే వినోదం. సత్యగుణం నుండి పుట్టిన ఆనందం నీ స్వరూపం. సగుణం, విగుణం అనే రెండు పద్ధతులు నీకు ఉన్నాయి. ఇంద్రియాలపై నిగ్రహం అనే పూలతోట నీ నెలవు. నీకు ఏ వికారాలూ లేవు. సర్వప్రాణులు, స్థావరాలు నీవలననే ప్రవర్తిస్తున్నాయి. నీ మహిమ కొందరకు సులభం, కొందరకు దుర్లభం. నీవు చంద్రుడిని, నెమలి పింఛాన్ని ధరించి సౌందర్యంతో విరాజిల్లుతున్నావు.

విశేషం: అవనం - రక్షణ. ఇందులో సృష్టి, పోషణ, వినాశం అన్నీ ఉన్నాయి. సృష్ట్యాదులు పరమాత్మకు వినోదాలు.

సత్యజాత ప్రమోదా! - వస్తూ పోతూఉండే ఆనందం అసత్యజ్ఞానంవలన కలుగుతుంది. అది అనిత్యం కనుక ఆపేక్షణీయం కాదు. ఇక పరమాత్మవలన కలిగే జ్ఞానం సత్యంనుండి ఏర్పడుతుంది. 'సత్యం- అంటే సర్వకాల సర్వావస్థలలో సర్వులకూ ఏకాకారంగా ఉండేది.

సుగుణవిగుణ భంగీ! - పరమాత్మ నిజానికి నామరూపాదులు లేనివాడు. నామరూపాదులే గుణాలు. అవి లేని భంగి నిర్గుణం. కాని లీలామాత్రంగా అవతారాలు ధరించి నామరూపాదులతో వ్యవహారం చేస్తాడు. అది సగుణభంగి.

ఇంద్రియాలు ఐహిక విషయాలనే అందిస్తాయి. అది సుఖదుఃఖాత్మకం. ఇక్కడి సుఖం కూడా కేవలం తాత్కాలికం. కాబట్టి నిత్యానందం కావాలంటే ఇంద్రియాలను విషయాలపై ప్రసరింపనివ్వకూడదు. అటువంటి నిగ్రహం కలవారి హృదయమే భగవదారామం. పుట్టటం, పెరగటం, మార్పులు పొందటం, పరిక్షయం పొందటం, నశించటం మొదలైన వికారాలన్నీ జీవలక్షణాలు. దేవుడి కవేవీ ఉండవు. అవి ఉండటం దుఃఖలక్షణం. లేకపోవటం ఆనందలక్షణం.

సుగమగహన భూమా! - పరమేశ్వరుడి మహిమ జ్ఞానం కలవారికి సులభం. అది లేనివారికి దుర్లభం.

స్వామి హరిహరరూపుడు - హరియై నెమలి పింఛాన్ని శిరస్సు మీద అలంకారంగా ధరిస్తాడు. హరుడై చంద్రకళను ధరిస్తాడు. నెమలి పింఛంలో ఎన్నో రంగులు, మురిపించే ఆకారాది విశేషాలు ఉన్నాయి. కనుక అది సృష్టిలో ఉండే సౌందర్యానికి ప్రతీక. అట్లాగే చంద్రరేఖ. అట్టి మహాసౌందర్య ప్రతీకను పరమాత్మ అనంతమైన తన దేహంలో ఒక్క చిన్న ప్రదేశంలో ధరిస్తాడు. అంటే విశ్వసౌందర్యమంతా ఆయనకు ఒక చిన్న ఆభరణంవంటిదని భావం. ఆ ఆభరణంతో ఆ పరమాత్మ సమస్త ప్రాణికోటికి ఆనంద ప్రదాత అవుతాడు.

గద్యము

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందు దృతీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమైనది. ఉభయ కవిమిత్రుడని ప్రశస్తిని పొందిన కొమ్మనామాత్యపుత్రుడూ, పండితులను సేవించటం వలన ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో ఆనుశాసనిక పర్వంలో మూడవ ఆశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని మూడవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - చతుర్థాశ్వాసము

శ్రీ పరమ మహిమనిశ్చల। తాపాదనకేళి కౌతు కాతిశయ మనో

వ్యాపారనిరూఢ స్తు। త్యాపాంగవిలాస లలిత! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= లక్ష్మి, విషం అనే వాని; పరమ= గొప్పదైన; మహిమ= అతిశయం చేత; కలిగిన; నిశ్చలతా= కదలిక లేనితనాన్ని; ఆపాదన= కలిగించునట్టి; కేళి= ఆటయందు; కౌతుక= వేడుకయొక్క; అతిశయ= ఎక్కువతనం గల; మనస్, వ్యాపార= భావన అనే పనిచేత; నిరూఢ= సుస్థిరమైన; స్తుత్య= కొనియాడదగిన; అపాంగ= కడగంటి చూపుయొక్క; విలాస= లీలచేత; లలిత= మనోహరమైన వాడా!; హరిహరనాథా!= హరిహరనాథదేవా!

తాత్పర్యం: స్వామీ! లక్ష్మిని, విషాన్ని ధరించి నీవు మోహం (నిశ్చలత) పొందావు. అది నీకొక క్రీడ. దానివలన నీ మనోవ్యాపారం ఏ కొంచెమూ చలనం లేనిదయింది. దానితో నీ కడగంటి చూపులలో ఏదో వర్ణింపరాని సౌందర్య విలాసం తాండవిస్తున్నది.

విశేషం: అలం: శ్లేష. సగం మూసిన పరమాత్మ కన్నులు పరమ మనోహరంగా ఉన్నాయి. ఆ మనోహరతకు కారణం అయనకు కలిగిన స్తబ్ధతగా కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు. ఆ స్తబ్ధత హరి లక్ష్మిని, హరుడు కాలకూటాన్ని ధరించిన కారణంగా ఏర్పడినట్లు కూడా ఊహిస్తున్నాడు. అయితే ఇది భగవంతుడికి ప్రమోదం. అదే సాధారణ మానవుడికైతే ప్రమాదం.

ధూపదీపనైవేద్యంబుల ఫలవిశేషము భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట (సం.13-155-1(కుంభ))

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయ మహారాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ప్రభూ! వైశంపాయన మహర్షి జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

తే. అట్లు గృహమేధి ధర్మతత్త్వావగమము। దనకుఁ గలుగంగఁ జేసిన తాత కెఱఁగి

మనుమఁ డూర్జితభక్తియు వినయగౌర। వంబు సమధికతావైభవంబుఁ బొంద. 3

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తనకున్= తనకు; గృహమేధి; ధర్మ, తత్త్వ+అవగమము= గృహస్థుడి ధర్మాల తత్త్వం చక్కగా తెలియటం; కలుగంగన్+చేసిన తాతకున్= కలుగజేసిన తాత భీష్ముడికి; ఎఱఁగి= మ్రొక్కి; మనుమఁడు= మనుమడైన

ధర్మరాజు; ఊర్జిత భక్తియున్= గొప్పదైనభక్తీ; వినయ గౌరవంబున్= వినయంతో కూడిన గౌరవమూ; సమధికతా వైభవంబున్= మిక్కిలి ఎక్కువ కావటంలోని గొప్పతనాన్నీ; పొందన్= పొందగా.

తాత్పర్యం: ఆ విధంగా తనకు గృహస్థధర్మంయొక్క నిజస్వరూపం చక్కగా తెలియజేసిన తాతకు (మ్రొక్కి మనుమడు ధర్మరాజు మహాభక్తీ, వినయగౌరవమూ చాలా ఎక్కువ కాగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఎఱిగి - ప్రణిపాతం శాస్త్రం విధించిన మర్యాద, జ్ఞానదాతలకు సమయానుగుణంగా మ్రొక్కటం కర్తవ్యం. 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' - 'జ్ఞానాన్ని ప్రణిపాతంచేతా, పరిప్రశ్నచేతా, సేవచేతా తెలిసికొమ్ము' అంటుంది గీత.

వ. 'మహాత్మా! సుమనోధూపదీప నైవేద్యంబు లుత్తమం బులగు పూజాసాధనంబు లని వానింగొని దేవతలం బూజింతురు; తద్విశేషం బెఱింగింపవే' యని యడుగుటయు నం డాదరభరితుం డయి 'దీని శుక్రుండు బలి దానవేంద్రునకు బలి మనువునకు, మనువు సువర్ణుండను తపోధనునకు సువర్ణుండు నారదునకుం జెప్పి, రప్పరమముని నాకుం జెప్పె నత్తెఱంగు సెప్పెద నాకర్ణింపు' మని పలికి యప్పుడమితేని కిట్లనియె. 4

ప్రతిపదార్థం: మహాత్మా!= గొప్ప బుద్ధి విశేషం గల మహానుభావా! సుమనస్+ధూప, దీప, నైవేద్యంబులు= పూలు, పొగ వేయటమూ, దీపమూ, ఆహారం సమర్పించటమూ; ఉత్తమంబులు= మేలయినవి; అగు పూజాసాధనంబులు= అయిన పూజా వస్తువులు; అని; వానిన్= వానిని; కొని= గ్రహించి; దేవతలన్= దేవతలను; పూజింతురు= పూజ చేస్తారు; తత్+విశేషంబు= వాని మహిమను; ఎఱింగింపవే= దయతో చెప్పుము; అని; అడుగుటయున్= అడుగగా; అతండు= ఆ భీష్ముడు; ఆదరభరితుండు= ఆదరంతో నిండినవాడు; అయి; దీనిన్= ఈ విషయాన్ని; శుక్రుండు= రాక్షసగురువైన శుక్రాచార్యుడు; బలి, దానవ+ఇంద్రునకున్= బలి అనే రాక్షసరాజుకూ; బలి= ఆ బలి చక్రవర్తి; మనువునకున్= మనువునకూ; మనువు= ఆ మనువు; సువర్ణుండు= సువర్ణుడు; అను= అనే; తపస్+ధనునకున్= తపస్సు ధనంగా గల ఒక ఋషికీ; సువర్ణుండు= సువర్ణుడు; నారదునకున్= నారదమహర్షికీ; చెప్పిరి= ఉపదేశించారు; ఆ+పరమముని=ఆ మహర్షి; నాకు; చెప్పెన్= బోధించాడు; ఆ+తెఱంగు= ఆ విధానాన్ని; చెప్పెదను= చెబుతాను; ఆకర్ణింపుము= శ్రద్ధగా చెవులొగ్గి వినుము; అని; పలికి= మాట్లాడి; ఆ+పుడమి ఱేనికిన్= ఆ రాజుకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'మహాత్మా! పూలు, ధూపమూ, దీపమూ, నైవేద్యమూ మేలైన పూజా సాధనాలని వానితో దేవతలను పూజిస్తారు. వాటి విశేషం చెప్పవా?' అని ధర్మరాజు అడిగితే భీష్ముడు ఆదరంతో నిండినవాడై 'ఈ విషయాన్ని శుక్రుడు బలికీ, అతడు మనువునకూ, అతడు సువర్ణుడనే తాపసికీ, అతడు నారదుడికీ చెప్పారు. ఆ మహర్షి నాకు చెప్పాడు. అది నీకు చెప్పుతాను. శ్రద్ధగా వినుము' అని ఆ రాజునకు ఇలా చెప్పాడు.

విశేషం: ఈ విషయాన్ని ఎవరు ఎవరికి చెప్పారో ఇక్కడ చెబుతున్నారు. దీనినే సంప్రదాయం అంటారు. ఇందులో బలి - రాక్షసుడు, మనువు- మానవమూల పురుషుడు, సువర్ణుడు తపోధనుడు అంటే మానవులలో అతిశ్రేష్ఠుడు. నారదుడు దేవర్షి - అంటే ఇది అన్ని జాతులవారికి, అన్ని లోకాలవారికీ మానవులలో సామాన్యులకూ, సర్వశ్రేష్ఠులకూ సంబంధించిన మహావిషయం - అనే హెచ్చరిక తెలియవస్తున్నది.

సీ. 'ఓషధు లమృత మయ్యుత్తమ వస్తు సం । తతిలోనఁ బుష్పవంతములు మేలు;
పుష్పముల్ గొని సురపూజ లొనర్చిన । మానవులకు మంచి మనసు గలుగు;

నట్లు గావున సుమనో౽భిధానము పుష్ప । ములకయ్యెఁ ద ద్ద్రవ్యపూజ లిచ్చు
నరుల కోర్కులు సుమనస్కతఁ దీర్చుట । నమరులు సుమనస్కు లనఁగఁ జనిరి;

ఆ. కంపు రూపుఁ దెలుపుఁ గలిగి యకంటక । భూరుహాదులందుఁ బుట్టినట్టి
పుష్పములఁ బ్రియంబుఁ బొంది కైకొంద్రు, ని । ర్జరులు పూజనములఁ గురువరేణ్య! 5

ప్రతిపదార్థం: కురువరేణ్యా!= కురువంశంలో ఎన్నదగినవాడా!; ఓషధులు= ఒకజాతి చెట్లు; అమృతము= అమృతం వంటివి; ఆ+ఉత్తమ వస్తు సంతతిలోనన్= ఆ మేలైన వస్తు సముదాయంలో; పుష్పవంతములు= పూలు కలవి; మేలు= గొప్పవి; పుష్పముల్= పూవులను; కొని= గ్రహించి; సురపూజలు= దేవతల పూజలు; ఒనర్చినన్= చేస్తే; మానవులకున్= మనుష్యులకు; మంచి మనసు= మంచిదైన హృదయం; కలుగున్= కలుగుతుంది; అట్లు= ఆ విధం; కావునన్= అవటంచేత; పుష్పములకున్= పూవులకు; సుమనస్+అభిధానము= 'సుమనస్సు' అనే పేరు; అయ్యెన్= ఏర్పడింది; తత్+ద్రవ్య, పూజలు= ఆ వస్తువులతో పూజలు; ఇచ్చు, నరుల కోర్కులు= ఇచ్చే మానవుల కోరికలను; సుమనస్కతన్= మంచి మనస్సు ఉండటంతో; తీర్చుటన్= తీర్చటంచేత; అమరులు= దేవతలు; సుమనస్కులు= మంచి మనస్సు కలవారు అనే అర్థంగల సుమనస్కులు; అనఁగన్+చనిరి= అన్న పేరు కలవారయ్యారు; కంపు= మంచి వాసనా; రూపున్= చక్కని అందమూ; తెలుపున్= తెల్లదనమూ; కలిగి= కలిగి; అకంటక, భూరుహ+ఆదులందున్= ముళ్ళులేని చెట్లు మొదలగు వానియందు; పుట్టిన+అట్టి, పుష్పములన్= పుట్టిన పూవులతో; ప్రియంబున్= ప్రేమను; పొంది; నిర్జరులు= దేవతలు; పూజనములన్= పూజలను; కైకొంద్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: 'కురువరా! ఓషధులు అమృతం వంటివి. ఆ మేలిజాతి వస్తువులలో పూలు పూచే చెట్లు మరింత మేలైనవి. పూలతో దేవతలను పూజించే నరులకు మంచి మనస్సు కలుగుతుంది. కనుకనే పూలకు 'సుమనస్సులు' అనే పేరు కలిగింది. ఆ వస్తువులతో పూజించే మానవుల కోర్కెలను మంచి బుద్ధితో తీరుస్తారు కనుక దేవతలకు కూడ 'సుమనస్కులు' అనే పేరు కలిగింది. మంచి వాసనా, మంచి రూపమూ, తెల్లదనమూ కలిగి ముళ్ళు లేని చెట్లనుండీ, తీగెలనుండీ పువ్వులను గ్రహించి పూజ చేస్తే దేవతలు ప్రియమంది ఆ పూజలను గ్రహిస్తారు.

విశేషం: ఓషధులు అంటే మందుచెట్లు. పువ్వులలో ఔషధగుణాలు చాలా ఉంటాయి. అందుకనే ఫ్లోరల్ మెడిసిన్స్ వ్యాప్తిలోకి వచ్చాయి. ప్రాచీనులు పూలలోని ఔషధీయ గుణాలను కనిపెట్టి, మనుష్యులకు వాటితో ఎక్కువ సాంగత్యం కలగటం కోసం పూజాద్రవ్యాలుగా నిర్ణయించారు. పుష్పంలో వికసించే గుణాన్నీ, వాసననూ, అందాన్ని చూస్తూ ఉండే మనిషి ఎల్లప్పుడూ వాటినే భావించటం చేత మంచి గుణాలు కలవాడవటం సహజం. ఆ దృష్టితో పూలను 'సుమనస్సులు' అనటం చాలా గొప్ప విషయం. 'కంపు' అనే పదాన్ని ప్రాచీన కాలంలో 'సువాసన' అనే అర్థంలో వాడారు. ఇప్పుడు అది దుర్వాసనకు పర్యాయపదం అయింది. భూరుహ ఆదులలో తీగలు, చిన్నచెట్లు ఉంటాయి. సాధారణంగా శరీరం లోపలికి వెళ్ళకుండా ఆరోగ్యాన్నీ, తుష్టినీ, పుష్టినీ కలిగించే పూలు గొప్పవనటంలో ఆశ్చర్యం లేదుకదా!

క. నలినంబులు జాజులునుం । దులసీదళములుఁ బ్రభూతతోషము గీర్వా
ణులకుం జేయును, యక్షా । దులకు జలోద్భవము లెల్లఁ దుష్టి యొనర్చున్. 6

ప్రతిపదార్థం: నలినంబులు= తామరపూలూ; జాజులునున్= జాజిపూలూ; తులసీదళములున్= తులసీదళాలు; గీర్వాణులకున్= దేవతలకు; ప్రభూత తోషమున్= మిక్కిలి ఎక్కువ ఆనందాన్ని; చేయును= కలిగిస్తాయి; యక్ష+ఆదులకున్= యక్షులు మొదలైనవారికి; జల+ఉద్భవములు= నీటిలో పుట్టిన పూలు; ఎల్లన్= అన్నీ; తుష్టి= ఆనందాన్ని; ఒనర్చున్= చేస్తాయి.

తాత్పర్యం: తామరలూ, జాజులూ, తులసీదళాలు దేవతలకు పరమానందం కలిగిస్తాయి. నీటిపూలు యక్షులు మొదలగు వారికి సంతోషం కూరుస్తాయి.

విశేషం: తులసీదళములు - సాధారణంగా మూడు ఆకుల సముదాయంగా ఉన్నవానిని 'దళాలు' అంటారు. జలోద్భవములు- నీటిపూలు - పైన తామరలను చెప్పారు కనుక తక్కిన నీటి పూలను ఈ పదంచేత గ్రహించాలి. యక్ష+ఆదులు= యక్షులు, కిన్నరులు, కింపురుషులు, రక్షస్సులు, భూతములు, విద్యాధరులు, అప్సరసలు, గంధర్వులు మొదలైనవారిని దేవయోనులు అంటారు. Semi Gods అని వీరికి వ్యవహారం. మనుజులకంటె కొంచెం పై స్థాయికి, దేవతలకంటె క్రింది స్థాయికి చెందిన వారు.

క. అరుణంబులును సకంటక । తరుభవములుఁ గటుకగంధధామములు నొన
ర్తురు శాత్రవాభిచారిక । కరణమున నధర్వమాంత్రికతఁ గుసుమంబుల్. 7

ప్రతిపదార్థం: అరుణంబులును= ఎర్రనివీ; సకంటక, తరు, భవములున్= ముళ్ళుగల చెట్లనుండి పుట్టినవీ, కటుకగంధ ధామములు= ఘాటైన వాసనలకు తావు అయినవీ; అయిన; కుసుమంబుల్= పూవులను; అధర్వమాంత్రికతన్= అధర్వవేదపు మంత్రాల సంబంధంతో; శాత్రవ+ఆభిచారిక, కరణమునన్= పగవారిని పరిమార్చు ప్రయోగాలలో; ఒనర్తురు= ఉపయోగిస్తారు.

తాత్పర్యం: ఎర్రనివీ, ముళ్ళచెట్లనుండి పుట్టినవీ, ఘాటైన వాసన కలవీ అయిన పువ్వులను క్షుద్రప్రయోగాలలో అధర్వమంత్రాల కూర్పుతో ఉపయోగిస్తారు.

విశేషం: అభిచారిక కరణము - చేతబడి మొదలైన క్షుద్రప్రయోగాలు. పగవారిని రూపుమాపే క్షుద్రమంత్రాలు అధర్వవేదంలో ఉన్నాయని చెప్తుతారు. క్షుద్రప్రయోగాలలో ఉపయోగించేవాటిని దేవతాపూజలకు వినియోగించరాదని ఇక్కడ సూచన.

తే. భూతరక్షోగణములకు భూపవర్య! తీక్ష్ణగంధపుష్పంబులు తృప్తిఁజేయు
నలుపుఁదెలుపుఁ గలిగి పరిమళసుకాంతి । భరితములు నగు పువ్వులు నరుల మెచ్చు. 8

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజా!; తీక్ష్ణ, గంధ పుష్పంబులు= ఘాటైన వాసన గల పూలు, భూత, రక్షస్+గణములకున్= భూతముల, రక్షస్సుల గణాలకు, తృప్తిన్ చేయున్= తృప్తిని కలిగిస్తాయి; నలుపున్= నల్లదనమూ; తెలుపున్= తెల్లదనమూ; కలిగి= ఉండి; పరిమళ, సుకాంతి, భరితములు= మంచివాసనా, చక్కని కాంతీ అనే వాటితో నిండినవి; అగు పువ్వులు= అయిన పూలు; నరులమెచ్చు= నరులకు ఇష్టమైనవి.

తాత్పర్యం: రాజా! ఘాటైన వాసనగల పూలు భూతాలకు, రక్షస్సులకూ ప్రీతిగొలుపుతాయి. నలుపు, తెలుపూ గలిగి మంచి వాసనా, కాంతి ఉన్న పూలు మనుష్యులకు ఇష్టం అయినవి.

విశేషం: పూవులయందలి ఇష్టానిష్టాన్ని బట్టి మనుష్యులలోనే ఎవరు ఏ వర్గానికి చెందిన వారో నిర్ణయింపవచ్చును.

క. విను దేవాలయమునఁ బిత్ృ । వనమునఁ బుట్టు కుసుమములు వలదు వివాహం
బునకు శాంతికపౌష్టిక । వనితాజనరంజనాది వర్తనములకున్. 9

ప్రతిపదార్థం: విను= వినుము; దేవ+ఆలయమునన్= గుడియందూ; పితృవనమునన్= వల్లకాటియందూ; పుట్టు కుసుమములు= పుట్టే పువ్వులు; వివాహంబునకున్= పెండ్లికీ; శాంతిక, పౌష్టిక, వనితా, జన, రంజన+ఆది, వర్తనములకున్= శాంతికర్మలకు; పుష్టికర్మలకూ; స్త్రీలను ఆనందపరచటం మొదలైన పనులకూ; వలదు= వద్దు.

తాత్పర్యం: రాజా! వినుము. దేవాలయంలో, వల్లకాటిలో పుట్టిన పూలను పెండ్లిండ్లకూ, శాంతికర్మలకు, పుష్టికర్మలకూ, స్త్రీలను ఆనందపరచే పనులకూ ఉపయోగించవద్దు.

విశేషం: దేవాలయంలో పువ్వులు దేవతల సొమ్ము. అవి మనం తెచ్చుకుంటే దైవద్రోహం చేసినట్లు. శ్మశానం సర్వాసహ్యానిధానం. అందుకోసం అక్కడి పూలు మనస్సునకు ఉద్వేగం పుట్టిస్తాయి. దేవతలకు, గ్రహాదులకు కోపతాపాలు రాకుండా చేసేవి శాంతిక కర్మలు. ఆయువు, ధనము, ఆరోగ్యమూ మొదలైన వాటి పుష్టికోసం చేసే కర్మలు పౌష్టికాలు.

తే. కుసుమముల గంధమున దేవకోటి, వాని । దర్శనంబున యక్షులు; దదుపభోగ
మున భుజంగప్రతాన మీమూఁడు దెఱఁగు । లను మనుష్యులు ప్రియమందు టనఘ! కలుగు. 10

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; కుసుమముల గంధమునన్= పూలవాసనతో; దేవకోటి= దేవతల సముదాయమూ; వాని, దర్శనంబునన్= వానిని చూడటంచేత; యక్షులు= యక్షులనే దేవజాతివారూ; తత్+ఉపభోగమునన్= వాని అనుభవంచేత; భుజంగ, ప్రతానము= నాగులనే వారి సముదాయమూ; ఈ మూఁడు తెఱఁగులను= ఈ మూడు పద్ధతులద్వారా; మనుష్యులు= మానవులూ; ప్రియము+అందుట= ప్రీతి పొందటం; కలుగున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: అనఘా! పూలవాసనలతో దేవతలు, వాటి దర్శనంతో యక్షులూ, వాటి అనుభవంతో సర్పములూ, ఈ మూడు పద్ధతులతో మానవులు ప్రీతి పొందుతారు.

విశేషం: పువ్వులు సర్వజాతులనూ ఏదో ఒక రూపంతో సంతృప్తి పరుస్తాయని భావం. క్రూరతలో పేరుగొన్న పాములు కూడా పూవులవలన ప్రీతి పొందుతాయంటే తక్కిన వాటి సంగతి చెప్పనేల? ఈ విధంగా అర్థాపత్తి అలంకార ధ్వని ఇక్కడ ఉన్నది.

క. దేవత లర్హ కుసుమ పూ । జావిధిఁ బ్రియ మంది యపుడ జనులయెడల సం
భావించి వారి కోర్కులు । గావింతురు సఫలములుగఁ గౌరవనాథా! 11

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కౌరవుల రాజా!; దేవతలు= స్వర్గంలో ఉన్నవారు; అర్హ, కుసుమ, పూజా, విధిన్= తగిన పూల పూజ అనే పనితో; ప్రియము+అంది= ప్రీతి చెంది; అపుడు+అ= అప్పుడే; జనుల ఎడలన్= జనుల విషయంలో; సంభావించి= మంచి తలపులు ఏర్పరచుకొని; వారి కోర్కులు= వారి కోరికలను; సఫలములుగన్= ఫలవంతాలుగా; కావింతురు= చేస్తారు.

తాత్పర్యం: రాజా! దేవతలు తగిన పూలతో చేసిన పూజలతో ప్రీతిచెంది, అప్పటికప్పుడు ఆ జనుల విషయంలో మంచిమనసు కలవారై, వారి కోరికలను ఫలవంతాలుగా చేస్తారు.

విశేషం: అపుడ, సంభావించి -। అనే పదాలను జాగ్రత్తగా గమనించాలి. పూలపూజ సద్యఃఫలదాయకం అని భావన.

తే. సల్లకీజాత నిర్యాస మెల్ల దేవ । తలకు మే లంతకంటె గుగ్గిలము లెస్స
యగరు గంధర్వ యక్షోరగాదులకుఁ బ్రి । యంబు ధూపదానము నెడ నధిపవర్య! 12

ప్రతిపదార్థం: అధిపవర్య!= రాజవరేణ్యా!; ధూపదానము+ఎడన్= పొగవేయటం విషయంలో; ఎల్ల దేవతలకున్= దేవతలందరికీ; సల్లకీ, జాత, నిర్యాసము= అందుగు చెట్టునుండి తీసిన పొడి; మేలు= మంచిది; అంతకంటెన్= దానికంటె; గుగ్గిలము= గుగ్గిలం అనే ధూపం పొడి; లెస్స= మేలైనది; అగరు= అగరు; గంధర్వ, యక్ష+ఉరగ+ఆదులకున్= గంధర్వులు, యక్షులు, నాగులు మొదలగువారికి; ప్రియంబు= ప్రీతికరం.

తాత్పర్యం: రాజా! ధూపం ఇచ్చే విషయంలో అందుగు చెట్టు నుండి తీసిన పొడి దేవతలందరికీ మేలైనది. దానికంటె గుగ్గిలం మరింత మంచిది. అగరు గంధర్వులకు, యక్షులకు, నాగులకు ప్రీతికరమైనది.

వ. ధూపదానంబులయందు నధికతరంబు కర్పూరధూపం' బని చెప్పి మఱియును. 13

ప్రతిపదార్థం: ధూపదానంబులయందున్= పొగవేయటంలో; అధికతరంబు= మిక్కిలి ఎక్కువ అయినది; కర్పూరధూపంబు= కప్పురపు పొడి పొగ వేయటం; అని, చెప్పి= తెలిపి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: పొగవేసే విషయంలో అన్నింటికంటె మిన్న అయినది కర్పూరధూపం' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

క. సమధురమును గటువును దీ । క్ష్ణమునగు గంధముల ధూపకలన వరుస హృ
ద్యములు సురయక్ష రక్ష । స్సమితులకును దత్ప్రకారజాతులకు నృపా! 14

ప్రతిపదార్థం: నృపా!= రాజా!;సమధురమును= తీయదనం కలదీ; కటువును= కారం కలదీ; తీక్ష్ణమున్= చాలా ఘాటైనదీ; అగు గంధముల, ధూపకలన= అయిన వాసనల పొగ పొడి సంబంధం; వరుసన్= వరుసగా; సుర, యక్ష, రక్షస్+సమితులకును= దేవతలయ, యక్షుల, రక్షస్సుల సముదాయాలకు; తత్, ప్రకార, జాతులకున్= అటువంటి జాతుల వారికీ; హృద్యములు= మనోహరం అయినవి.

తాత్పర్యం: రాజా! తీపి, కారం, ఘాటు అయిన ధూపాలు వరుసగా దేవతలకు, యక్షులకు, రక్షస్సులకు అటువంటి జాతులవారికి ప్రీతికరమైనవి.

తే. తగినయట్టి ధూపము దేవతలకు నిచ్చి । పరమపుష్టియు నాయువుఁ బడయుఁ గర్త
యక్ష గంధర్వపన్నగ రాక్షసులును । ధూపమున మెచ్చి కోర్కు లిత్తురు కుమార! 15

ప్రతిపదార్థం: కుమార!= నాయనా!; కర్త - ఆయా పూజలు చేసే వ్యక్తి; దేవతలకున్= దేవతలకు; తగిన+అట్టి, ధూపము= వారివారికి తగిన ధూపం; ఇచ్చి= సమర్పించి; పరమ పుష్టియున్= గొప్ప దేహపాటవాన్నీ; ఆయువున్= ఆయువునూ; పడయున్= పొందుతాడు; యక్ష, గంధర్వ, పన్నగ, రాక్షసులును= యక్షులు, గంధర్వులు, నాగులు, రాక్షసులూ; ధూపమునన్= వారివారికి నిర్దేశించిన ధూపంచేత; మెచ్చి= సంతోషించి; కోర్కులు= కోరికలను; ఇత్తురు= ఇస్తారు.

తాత్పర్యం: నాయనా! తగిన ధూపం దేవతలకు వేసి కర్త మిక్కిలి పుష్టినీ, ఆయువునూ పొందుతాడు. యక్షులు, గంధర్వులు, నాగులూ, రక్షస్సులూ ధూపంవలన మెచ్చి, కోర్కెలను సఫలం చేస్తారు.

విశేషం: ధూపద్రవ్యాలలో ఉండే విశిష్టమైన ఔషధగుణం వేసినవాడికీ, పరిసరాలలో ఉన్నవారికీ సంక్రమించి వారిలో రోగనిరోధక శక్తిని పెంచటం మొదలైన వానిచేత పుష్టినీ, ఆయువునూ పెంపొందిస్తుందని శాస్త్రీయంగా భావన చేయవచ్చును.

క. మలయజము నగరు మఱియుం । గలుగు సురభివస్తువులు నికామప్రియదం
బులు వైహారికధూపం । బులయెడ మానవులచిత్తములకు నరేంద్రా! 16

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= మానవాధీశా!; వైహారిక ధూపంబుల యెడన్= వేడుకగా వేసుకొనే ధూపాల విషయంలో; మలయజమున్= మంచిగంధమూ; అగరు= అగరు; మఱియున్= ఇంకా; కలుగు వస్తువులు= ఆ విధంగా ఉండే వస్తువులు; మానవచిత్తములకున్= మనుష్యుల హృదయాలకు; నికామ, ప్రియదంబులు= మిక్కిలి ప్రీతిని కలిగించేవి.

తాత్పర్యం: రాజా! గంధపుపొడి, అగరు, సాంబ్రాణి వంటి వస్తువులు వేడుకకోసం ధూపం వేసుకొనేవారి హృదయాలకు ఎంతో ప్రీతిని కలిగిస్తాయి.

విశేషం: ధర్మం అతిక్రమించని భోగదృష్టి ప్రాచీనుల అభిప్రాయంతో త్యజింపదగినది కాదని దీనివలన గుర్తించవచ్చును.

ఆ. దైవతార్చ లపుడు తామసభూత ర । క్షోముఖంబు లైన కుత్సితంపు
జాతులెల్ల దీపసన్నిధి నడఁగు న । ట్లగుట దీపదాన మధికఫలము. 17

ప్రతిపదార్థం: దైవత+అర్చల+అపుడు= దేవతలను పూజించే సమయాలలో; తామస, భూత, రక్షస్+ముఖంబులు= తమోగుణం కల భూతాలు, రక్షస్సులు మొదలయినవి; ఐన= అయిన; కుత్సితము+జాతులు= చెడు బుద్ధులుగల జాతులు; ఎల్లన్=అన్నీ; దీపసన్నిధిన్= దీపం దగ్గర; అడఁగున్= నశించిపోతాయి; అట్లు= ఆ విధం; అగుటన్= కావటం వలన; దీపదానము= దీపం దేవుడికి ఇవ్వటం; అధికఫలము= ఎక్కువ ఫలం (ఇచ్చేది).

తాత్పర్యం: దేవతల పూజలు చేసే సమయాలలో తమోగుణం గల భూతాలు మొదలైన చెడు బుద్ధులతో ఉండే జాతులన్నీ దీపం దగ్గర నశించిపోతాయి. కాబట్టి దీపదానం ఎంతో ఎక్కువ ఫలం కలది అవుతుంది.

విశేషం: దేవతలు సత్త్వగుణ ప్రధానులు. రజస్తమోగుణాల విజృంభణగల రక్షఃపిశాచాదులు వారికి ద్రోహం చేయటానికి సిద్ధపడుతూ ఉంటాయి. అవి వినాశనం పొందటానికి దీపం వెలిగిస్తాం. దీపం జ్ఞానానికి ప్రతీక. చీకటి అజ్ఞానానికి ప్రతీక.

క. ఆలోకదాన మున భూ । పాల! పరఁగు దీప మీగి భావము సద్ధ
ర్మాలోకనశీలంబగు । నా లెస్స యొనర్చినట్టి యతనికి నధిపా! 18

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; దీపము= దీపాన్ని; ఈగి= ఇవ్వటం; ఆలోకదానము= వెలుగును ప్రసాదించటం; అనన్= అనగా; పరఁగున్= ఒప్పుతుంది; అధిపా!=రాజా!; ఆ, లెస్స= ఆ మంచిపని; ఒనర్చిన+అట్టి+అతనికిన్= చేసిన వ్యక్తికి; భావము= హృదయం; సత్+ధర్మ+ఆలోకన, శీలంబు= మంచిధర్మాలను చేసే స్వభావం కలది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: రాజా! దీపం ఇవ్వటమంటే వెలుగును ప్రసాదించటం అన్నమాట. ఆ మంచిపని చేసిన వ్యక్తికి హృదయం గొప్పవైన పరమాత్మధర్మాలను చూచే స్వభావం కల దవుతుంది.

విశేషం: 'సత్' పరమాత్మ లక్షణం. దానికి సంబంధించిన ధర్మాలను చూడటమే శీలంగా గల దవుతుంది.

తే. ఘృతము సాలమి వర్తి నికృష్ట యగుట । దగ సమర్పించి పెంచుట ధరణినాథ!
కాని యవి దీపదాన విధానమునఁ బ్ర । కాశవస్తువు దృఢదీప్తికముగ వలయు.' 19

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; ఘృతము= నెయ్యి; చాలమి= చాలకపోవటం; వర్తి= వత్తి; నికృష్ట= హీనమైనది; అగుట= కావటం; దగ= తాపము; సమర్పించి= ఏర్పరచి; పెంచుట= పెంచటమూ; దీపదానవిధానమునన్= దీపం ఇచ్చే విధానంలో; కాని+అవి= కూడని పనులు; ప్రకాశవస్తువు= వెలుగు అనే వస్తువు; దృఢ, దీప్తికముగన్= గట్టి జ్వాల కలదిగా; వలయున్= ఉండాలి.

తాత్పర్యం: రాజా! నేయి తక్కువగా ఉంచటం, వత్తి బలంలేనిదికావటం, కొంచెం వెలిగించి పెట్టటం - దీపం పెట్టటంలో కూడని పనులు. వెలుగు గట్టి జ్వాల కలదై ఉండాలి.

వ., అని వెండియు. 20

ప్రతిపదార్థం: అని; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అని భీష్ము డింకా ఇట్లా చెప్పాడు.

క. 'ఒరు లిచ్చినదీపం బప । హరించి తత్పాతకమున నంధుండగు భూ
వర! రథ్యాసభ గుడిపై । గిరి దీపంబిడి విభూతికిం బాత్రమగున్. 21

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; ఒరులు= ఇతరులు; ఇచ్చిన దీపంబు= దేవుడికి సమర్పించిన దీపాన్ని; అపహరించి= దొంగిలించి; తత్+పాతకమునన్= ఆ పాపంచేత; (ఆ పని చేసినవాడు); అంధుండు+అగున్= గ్రుడ్డివాడవుతాడు; రథ్యాసభన్= బాటలోని చావడిలో; గుడిపైన్= గుడిపైన; గిరిన్= కొండమీద; దీపంబు+ఇడి= దీపాన్ని ఉంచి; విభూతికిన్= ఐశ్వర్యానికి; పాత్రము+అగున్= యోగ్యుడౌతాడు.

తాత్పర్యం: రాజా! ఇతరులు దేవుడి కిచ్చిన దీపం దొంగిలించితే ఆ పాతకంవలన నరుడు గ్రుడ్డివాడవుతాడు. బాటలోని చావడిలో, దేవాలయంమీదా, కొండమీదా దీపం పెట్టిన వ్యక్తి ఐశ్వర్యానికి పాత్రుడౌతాడు.

విశేషం: దీపం హరించట మంటే దొంగిలించటం, ఆర్పివేయటం - అని రెండర్థాలు గ్రహించవచ్చును. వెలుగును తిరస్కరిస్తున్నా డన్నమాట. అది గ్రుడ్డివాని చేష్ట. కాబట్టి అంధుడవుతాడని భావం. చావడి మొదలైన చోట్ల పెట్టిన దీపం ఎక్కువమందికి ఉపయోగపడుతుంది

తే. ఆలనేయి ముఖ్యము; మహిషాదిమేష । జనిత ఘృతములుఁ దైలంబు మనుజనాథ!
మధ్యమము లగు; మేదోఽ స్థి మాంసరసము । లరయ నింద్యముల్ దీపసమర్పణమున. 22

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; దీపసమర్పణమునన్= దీపం పెట్టటంలో; ఆలనేయి= ఆవులనెయ్యి; ముఖ్యము= అతిశ్రేష్ఠము; మహిష+ఆది, మేష, జనిత ఘృతములు= గేదె మొదలయినవానినుండి, గొర్రెనుండి పుట్టిన నేతులు; తైలంబు= నువ్వులనూనె; మధ్యమములు= మధ్యరకానివి; అగున్= అవుతాయి; మేదస్+అస్థి, మాంస, రసములు= మేదస్సు; ఎముకలు, మాంసము అనువాని రసములు; అరయన్= పరిశీలించగా, నింద్యముల్= తుచ్ఛములు.

తాత్పర్యం: రాజా! దీపం పెట్టటానికి ఆవునెయ్యి చాలా మంచిది. గేదె, మేక, గొర్రె మొదలగువాటి నేతులు, నువ్వుల నూనె రెండవపద్ధతివి. క్రొవ్వు మొదలైన రసాలు పనికిమాలినవి.

విశేషం: క్రొవ్వొత్తులు దేవతార్చనలో వాడరాదని ఇది చెబుతున్నది.

క. **జ్యోతి స్సాలోక్య కులో। ద్ద్యోతన మహిత ప్రకాశయోగంబులు, పు**
త్రా! తెచ్చు దీపదానము। దాత కొసఁగు నమరపూజిత సుఖత్వంబున్. **23**

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; జ్యోతిస్+సాలోక్య= జ్యోతిర్లోకాలతో సమానలోకాలను పొందటం; కుల+ఉద్ద్యోతన= కులాన్ని వెలుగొందజేయటం; మహిత, ప్రకాశ, యోగంబులు= గొప్ప వెలుగు - జ్ఞానం పొందే యోగం కలగటం అనే వాటిని; దీపదానము= దీపం పెట్టటం; తెచ్చున్= తెస్తుంది; దాతకున్= దీపం ఇచ్చినవానికి; అమరపూజిత సుఖత్వంబున్= దేవతలచేత పూజింపబడే మహాసుఖాన్ని; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: నాయనా! దీపదానం జ్యోతిర్లోకాల సమానస్థితిని, కులం వెలుగొందటాన్నీ, మహాజ్ఞానాన్నీ ప్రసాదిస్తుంది. దీపదానం చేసినవాడికి దేవతలు పూజించటం అనే సుఖం కలుగుతుంది.

క. **దేవతలకు నగ్రపుసం। భావన నుపహార మిచ్చి పదపడి కుడువం**
గా వలయు నట్టు సేయని। ధీవిరహితుఁ డసుర యగుట దెల్లం బధిపా! **24**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; దేవతలకున్= దేవతలకు; అగ్రము+సంభావనన్=మొట్టమొదటి మర్యాదతో; ఉపహారము= నైవేద్యము; ఇచ్చి; పదపడి= తరువాత; కుడువన్+కాన్+వలయున్= తాను భుజించాలి; అట్టు= ఆ విధంగా; చేయని ధీ విరహితుఁడు= చేయని బుద్ధి లేనివాడు; అసుర= రక్కసుడు; అగుట= కావటం; తెల్లంబు= స్పష్టం.

తాత్పర్యం: రాజా! దేవతలకు మొదట గౌరవంతో నైవేద్యం ఇచ్చి, తరువాత తాను అన్నం భుజించాలి. అట్లా చేయని బుద్ధిహీనుడు రాక్షసు డవటం తథ్యం.

విశేషం: 'తైర్దత్తా న ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః' - 'వారిచ్చినవి వారికి పెట్టకుండా తినేవాడు దొంగయే' అని గీత చెప్తున్నది. మానవుడు తినే, అనుభవించే సర్వపదార్థాలు దేవతల వలన వచ్చినవే. ఆ కృతజ్ఞతను నివేదించుకోవటమే నివేదనలోని ఆంతర్యం.

వ. **కావున.** **25**

తాత్పర్యం: కనుక.

క. **తనయింటఁ గలుగు నన్నము। మును దేవతలకు నివేద్యముగఁ జేసి ప్రణా**
మనియమసహిత సమర్పణ। మునఁ గృతకృత్యుఁడుగ వలయుఁ బురుషుం డనఘా! **26**

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; పురుషుండు= మానవుడు; తనయింటన్= తన గృహంలో; కలుగు+అన్నమున్= ఉన్న అన్నాన్ని, మును= ముందుగా; దేవతలకున్= దేవతలకు; నివేద్యముగన్= సమర్పించబడినదానినిగా; చేసి= ఒనర్చి;

ప్రణామ నియమ సహిత సమర్పణమునన్= మ్రొక్కటం అనే నియమంతో కూడిన చక్కని అర్పణతో; కృతకృత్యుఁడు= నెరవేరిన పని కలవాడు; కన్+వలయున్= కావాలి.

తాత్పర్యం: రాజా! నరుడు తన యింటిలో చేసికొన్న అన్నాన్ని ముందు దేవతలకు నమస్కారపూర్వకంగా సమర్పించి కృతకృత్యుడు కావాలి.

విశేషం: ప్రణామనియమం భక్తిపూర్వక సమర్పణను తెలియజేస్తుంది.

వ. పూజకుండు శక్తి సంపన్నుం డయి యొనర్చిన. 27

ప్రతిపదార్థం: పూజకుండు= అర్చన చేసేవాడు; శక్తి సంపన్నుండు= శక్తి అనే సంపద నిండుగా కలవాడు; అయి; ఒనర్చిన= చేసినట్టి.

తాత్పర్యం: అర్చన చేసే వ్యక్తి శక్తి నిండుగా వినియోగించి చేసినట్టి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. తిలపిష్టము దధిదుగ్ధం । బులు మఱియును ధూపములును బుణ్యపరిమళం
బులునగు పదార్థములు విబు । ధులకుం బ్రియ మొసఁగు బలివిధులఁ గురుముఖ్యా! 28

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= కౌరవవంశంలో శ్రేష్ఠుడా!; బలివిదులన్= నైవేద్యం పనులలో; తిలపిష్టము= తెలకపిండి; దధి, దుగ్ధంబులు= పెరుగు, పాలు; మఱియును= ఇంకా; ధూపములును= ధూపాలు; పుణ్య, పరిమళంబులును= పవిత్రమైన సువాసనలు కలవీ; అగు పదార్థములు= అయిన వస్తువులు; విబుధులకున్= దేవతలకు; ప్రియము= ప్రీతిని; ఒసఁగున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: కురువరా! నివేదనక్రియలలో నువ్వులపిండి, పెరుగు, పాలు, ఇంకా మంచి సువాసనలు గల వస్తువులు దేవతలకు ప్రీతిని కలిగిస్తాయి.

క. ఉపహారసమర్చకుఁడగు । సుపురుషు గృహదైవతములు శుభములఁ గూర్చున్
నృపవర! తత్కర్మరహితుఁ । గృపలేక నితాంతవిఫలకృత్యుం జేయున్. 29

ప్రతిపదార్థం: నృపవర!= రాజశ్రేష్ఠా!; ఉపహార సమర్చకుఁడు= నైవేద్యంతో చక్కగ పూజ చేసేవాడు; అగు సుపురుషున్= అయిన మంచి మనిషిని; గృహదైవతములు= ఇలవేల్పులు; శుభములన్= శుభములతో; కూర్చున్= కూడినవాడినిగా చేస్తారు; తత్+కర్మ రహితున్= ఆ పని లేనివానిని; కృప= దయ; లేక= లేకుండా; నితాంత విఫల కృత్యున్= ఎల్లవేళల చెడిన పనులు గలవానినిగా; చేయున్= చేస్తారు.

తాత్పర్యం: రాజా! నివేదనతో అర్చించే వ్యక్తికి ఇంటి దేవతలు సకలశుభాలు కలిగిస్తారు. ఆ పని చేయనివాడిని దయమాలి ఎల్లవేళలా చెడిన పనులు కలవాడినిగా చేస్తారు.

విశేషం: 'దేవతలు ఇంత రాగద్వేషాలతో ఉంటారా?' అని మనం శంకించనక్కరలేదు. నిజానికి శుభములు కలగటం, పనులు చెడటం అనేది మన మనశ్శక్తి మీద ఆధారపడి ఉంటుంది. భక్తిపూర్వక దేవతార్చన ఆ మనశ్శక్తికి పుష్టినిస్తుంది.

ఆ. రక్తమాంస సహిత భక్త పిండముల ను । ల్లసితలోహితాక్త లాజములను
సురను బలియొనర్ప నురగయక్షాసుర । ప్రముఖ భూతములు శుభంబు లొసఁగు. 30

ప్రతిపదార్థం: రక్త, మాంస, సహిత, భక్త, పిండములన్= నెత్తుటితో మాంసంతో కూడిన అన్నపుముద్దలను; ఉల్లసిత, లోహిత+అక్త, లాజములను= చక్కగా ప్రకాశించేవి, ఎరుపుతో కూడినవి అయిన పేలాలను; సురను= కల్లును; బలి+ ఒనర్పన్= నివేదన చేస్తే; ఉరగ, యక్ష, అసుర, ప్రముఖ, భూతములు= పాములు, యక్షులు, రక్షస్సులు మొదలైన భూతాలు, శుభంబులు= మేళ్ళను; ఒసఁగున్= ఇస్తాయి.

తాత్పర్యం: రక్తం, మాంసం అనే వాటితో కూడిన అన్నపుముద్దలను, బాగా మెరిసిపోతున్న ఎర్రదనంతో కూడిన పేలాలను, కల్లును ఉపహారంగా ఇస్తే నాగులు, యక్షులు, రాక్షసులు మొదలైన భూతాలు మేలు నిస్తాయి.

విశేషం: ఈ విధమైన బలులు నింద్యాలు. అయినా లోకుల మనస్తత్వాని కనుగుణంగా ఇక్కడ చెప్పినట్లు భావించాలి.

క. సౌమ్యాసౌమ్యబలులు విను । సౌమ్యాసౌమ్య ప్రకార జనకృత్యంబుల్
సౌమ్యనృపోత్తమ । యయ్యై । కామ్యముఁ దత్తత్ప్రపూజ్య కరణిం జేయున్. 31

ప్రతిపదార్థం: సౌమ్య నృప+ఉత్తమ!= మంచి హృదయం గల రాజవరేణ్యా!; విను= ఆలకించుము; సౌమ్య+అసౌమ్యబలులు= మంచివి, చెడ్డవి అయిన నివేదనలు; సౌమ్య+అసౌమ్య ప్రకార జన కృత్యంబుల్= మంచివారు, చెడ్డవారు అయిన జనులు చేసే పనులు, తత్+తత్+ప్రపూజ్య కరణిన్= ఆయా పూజలందుకొనేవారి విధంగానే, ఆ+ఆ+కామ్యమున్= ఆయా కోరికను; చేయున్= సిద్ధింపజేస్తాయి.

తాత్పర్యం: ఉత్తమనృపా! మంచి ప్రవృత్తికలవారు మంచి బలులను, దుష్టప్రవృత్తి కలవారు ఉగ్రమైన బలులను ఆయా దేవతల ధోరణిలోనే చేస్తూ ఉంటారు. దానికి అనుగుణంగానే ఫలితాలను పొందుతారు.

విశేషం: పైన చెప్పిన తిలపిష్టము మొదలైనవి సౌమ్యబలి. రక్తమాంస సహితమైనది అసౌమ్యబలి. సత్త్వగుణసంపన్నులు మొదటిదానిని, అది లేనివారు రెండవరకపు బలిని వారివారి దేవతల స్వభావాలకు అనుగుణంగా ఇస్తారు. ఆయా దేవతాదులు తదనుగుణంగానే ఫలితాలను ప్రసాదిస్తారు. అంటే సౌమ్యబలినే మానవుడు ఆదరించాలి అని సూచన.

క. అగ్రప్రదాయి వర్ణస । మగ్రుఁడు బలయుతుఁడు బుద్ధిమంతుఁడు లోకా
నుగ్రహ పాత్రము శాత్రవ । నిగ్రహశక్తుండుఁ దత్త్వనిష్ఠుండు నగున్.' 32

ప్రతిపదార్థం: అగ్రప్రదాయి= మొదటిదైన సౌమ్యబలిని దేవతలకు సమర్పించేవాడు; వర్ణసమగ్రుఁడు= చక్కని వన్నె నిండుగా గలవాడు; బలయుతుఁడు= గొప్పబలంతో కూడినవాడు; బుద్ధిమంతుఁడు= శ్రేష్ఠమైన బుద్ధి కలవాడు; లోక+అనుగ్రహ, పాత్రము= లోకుల దయకు పట్టయినవాడు; శాత్రవ నిగ్రహ శక్తుండున్= పగవారిని నిలువరించటంలో సమర్థుడూ; తత్త్వనిష్ఠుండున్= పరమాత్మ తత్త్వంలో నిష్ఠ కలవాడూ, అగున్= అవుతాడు.

తాత్పర్యం: సౌమ్యబలిని ఇచ్చేవాడు మంచి వన్నె కలవాడూ, బలం కలవాడూ, బుద్ధి కలవాడూ, లోకానుగ్రహానికి పాత్రమయిన వాడూ, పగవారిని అణచివేసే సమర్థత కలవాడూ, పరతత్త్వంలో నిష్ఠ కలవాడూ అవుతాడు.'

విశేషం: సౌమ్యబలి ఫలితాలను వర్ణించారు. అంటే మనుజులు దానియందే ఆదరం కలవారు కావాలని హెచ్చరిక. అసౌమ్యబలి ఈ ఫలితాలకంటె వేరైన దుష్టఫలితాల నిస్తాయని కూడా సూచన. కనుక జంతుబలి భారతధర్మం కాదని మనం గుర్తించాలి.

వ. అనిన విని యజాతశత్రుండు గంగాపుత్రుతో 'సుమనోధూపదీపబలిప్రదానంబుల ఫలవిశేషంబు లింకను వినవలతుం జెప్పవే' యనుటయు నప్పురుషవరుండా కురువంశవరున కిట్లను 'నహుషువృత్తాంతంబున నది విస్పష్టంబగు వినుము చెప్పెద. 33

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= పుట్టనిశత్రువులు కల ధర్మరాజు; గంగాపుత్రుతోన్= గంగకొడుకైన భీష్మడితో; సుమనస్+ధూప, దీప, బలి ప్రదానంబుల, ఫల విశేషంబులు= పూలు, ధూపము, దీపము, నైవేద్యమివ్వటం అనే వాటి ఫలాల మహిమలను; ఇంకను= ఇంకా ; వినవలతున్= వినటానికి కోరుతున్నాను; చెప్పవే= చెప్పవా; అనుటయున్= అన్నంతనే; ఆ+పురుషవరుండు= పురుషులలో శ్రేష్ఠుడైన ఆ భీష్ముడు; ఆ కురువంశవరునకున్= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; నహుషువృత్తాంతంబునన్= నహుషుడి కథలో; అది= ఆ విషయం; విస్పష్టంబు= తేటతెల్లం; అగున్= అవుతుంది; వినుము= శ్రద్ధతో వినుము; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'పూలూ, ధూపమూ, దీపమూ, నివేదనా అనేవాటి మహాఫలితాలను ఇంకా వినాలని ఉంది. తాతా! చెప్పవా' అని అడిగితే ఆ మహాపురుషుడు ఆ కురువంశశ్రేష్ఠుడితో ఇట్లా అన్నాడు 'నహుషుడి కథలో ఆ విషయం తేటతెల్లం అవుతుంది. వినుము చెప్పుతాను.

విశేషం: అడిగేవాడు అజాతశత్రుడు. చెప్పేవాడు గంగాపుత్రుడు. విషయం ఎంత ప్రమాణభూతమయినదో పరిశీలించండి అని పాఠకుడికి ఒక హెచ్చరిక. వినుము అనే మాటలో అవధానబుద్ధితో అనే ధ్వని ఉంటుంది.

భీష్ముఁడు ధర్మజునకు నహుషుని ధూపదీపదానవిశేషంబు చెప్పుట (సం.13-156-1 (కుంభ))

సీ. నహుషుఁడు భూపాలనము సేయుచుండి రా। జస మించుకయు లేక సత్త్వనిష్ఠఁ
బుష్పంబులను ధూపముల దీపముల నివే। ద్యంబుల నమరుల కర్చ లిచ్చుఁ
బితృసంతతికి దీనఁ బ్రీతి యొనర్చు రా। క్షస యక్షభూతభుజంగమాది
తర్పణంబులు నర్హతానిరూఢములు గా। నివి గొని యొనరించు నిట్లు నిత్య

తే. నిరతిఁ జెల్లించి తత్ఫలపరిణతి ప్ర। దీప్త తేజోవిశేష సంప్రాప్తదేవ
రాజ్యుఁడై సురమునిగణ పూజ్యభావ। మహిమఁ బొందియు దీనిఁడా మఱవఁ డధిప! 34

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నహుషుఁడు= నహుషచక్రవర్తి; భూపాలనము= భూమిని పాలించుటను; చేయుచున్+ఉండి= చేస్తూ ఉండి; రాజసము= పొగరు; ఇంచుకయున్= కొంచెమైనా; లేక; సత్త్వనిష్ఠన్= సత్త్వగుణంలో చెదరుపాటు లేనితనంతో; పుష్పంబులను= పూలతో; ధూపములన్= ధూపములతో; దీపములన్= దీపాలతో; నివేద్యంబులన్= నైవేద్యాలతో; అమరులకున్= దేవతలకు; అర్చలు= పూజలు; ఇచ్చున్= ఇచ్చేవాడు; దీనన్= దీనితో; పితృసంతతికిన్= పితృదేవతలకు; ప్రీతి+ఒనర్చున్= ప్రీతి

చేసేవాడు; రాక్షస, యక్ష, భూత, భుజంగమ+ఆది తర్పణంబులు= రక్షస్సులు, యక్షులు, భూతములు, నాగదేవతలు మొదలగు వాని తర్పణాలను (తృప్తి కలిగించే క్రియలను); అర్హతా నిరూఢములు కాన్= యోగ్యతకు చక్కగా సరిపడేవిగా; ఇవి= పూలు మొదలైన వానిని; కొని= తీసికొని; ఒనరించున్= చేస్తూ ఉండేవాడు; ఇట్లు= ఈ విధంగా; నిత్యనిరతిన్= ప్రతిదినపు నిష్ఠతో; చెల్లించి= ఆచరించి; తత్ ఫల పరిణతి ప్రదీప్త, తేజస్+ విశేష సంప్రాప్త దేవ రాజ్యుఁడు= దాని ఫలపు పాకం చేత మిక్కిలి వెలుగొందే తేజస్సుయొక్క మహిమచేత పొందబడిన దేవతల రాజ్యం గలవాడు; ఐ= అయి; సురముని గణ పూజ్య భావ మహిమన్= దేవతలు, మునులు - అనువారి సముదాయాలకు గౌరవించబడే భావపు మహిమను; పొందియున్= పొంది కూడా; దీనిన్= ఈ పూజావిధానాన్ని; తాన్= తాను; మఱవఁడు= మరచిపోలేదు.

తాత్పర్యం: రాజా! నహుషుడు భూమినేలుతూ పొగ రేమాత్రమూ లేకుండా సత్యనిష్ఠతో పూలు, ధూపమూ, దీపములూ, నైవేద్యాలు అనేవాటితో దేవతలకు పూజలు చేస్తూ ఉండేవాడు. అట్లాగే పితృదేవతలకు, రాక్షసులకు, యక్షులకు, భూతాలకు, సర్పాలు మొదలైనవాటికి తర్పణాలు, యోగ్యత ననుసరించి పూలు మొదలైనవాటితో చేస్తూ ఉండేవాడు. ఇది ఏనాడూ మానకుండా చేసి, దాని ఫలంగా పాకానికి వచ్చిన గొప్ప తేజస్సుతో దేవరాజ్యాన్ని పొందగలిగాడు. దేవతలు, మునులు అతడిని పూజించే మహిమను పొంది కూడా అతడు దీనిని మరువలేదు.

విశేషం: నిత్యనిరతి - మనం ఆహారం ఏ విధంగా ప్రతిదినమూ తీసుకుంటామో ఆ విధంగానే దేవతలకు అందించాలని భావన. తాను తింటూ దేవతలను పస్తుంచరాదని హెచ్చరిక. పొందియున్- సాధారణంగా సిద్ధిపొందినవాడు సాధన చేయనక్కరలేదు. లేదా సిద్ధిపొందిన తరువాత గర్వం తలకెక్కుతుంది. ఈ రెండు కారణాలుగా మరచే అవకాశం ఉన్నా మరవలేదని భావన.

క. సురలఁ బితృదేవతలఁ ద । త్పరతను మున్నెట్టు లట్ల పన్నుగ సమ్య
క్పరితృప్తులఁగా జేయుం । బరమకుసుమధూపదీప బలిదానములన్. 35

ప్రతిపదార్థం: సురలన్= దేవతలను; పితృదేవతలన్= పితరులు అనే దేవతలను; తత్పరతను= వారియందే భావం నిలిచే విధంగా (శ్రద్ధతో); మున్ను= ముందు; ఎట్టులు= ఎట్లో; అట్లు+అ= అట్లే; పన్నుగన్= చక్కగా; పరమ కుసుమ, ధూప, దీప, బలి దానములన్= శ్రేష్ఠమైన పూలు, ధూపములూ, దీపములూ, నైవేద్యములు అనే వాటి దానాలతో; సమ్యక్, పరితృప్తులన్ కాన్= చక్కగా, నిండుగా తృప్తి పొందినవారినిగా; చేయున్= చేస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: దేవతలను, పితరులను శ్రద్ధతో దేవరాజ్యం పొందక ముందు చేసినట్లుగానే మంచిపూలు, ధూపాలు, దీపాలు, నైవేద్యాలు అనేవాటితో చక్కగా నిండుగా తృప్తి పరచేవాడు.

తే. దానఁజేసి తదీయ మహానుభావ । మంత కంతకు నగ్గల మగుటకతనఁ
దగియె మునివరవాహనత్వంబు నమ్మ । హాద్యుతికి వేయునేల యవద్యరహిత! 36

ప్రతిపదార్థం: అవద్యరహిత!= దోషాలు లేనివాడా!; దానన్+చేసి= దానివలన; తదీయ, మహా+అనుభావము= అతడి గొప్పమహిమ; అంతకున్+అంతకున్= ఇంకా ఇంకా; అగ్గలము= అధికం; అగుట కతనన్= అయిన కారణంగా; ఆ+మహాద్యుతికిన్= ఆ గొప్ప తేజశ్శాలికి; మునివరవాహనత్వంబు= మునిశ్రేష్ఠుల వాహనం కలగటం; తగియెన్= ఏర్పడినది; వేయున్= వేయి మాటలు; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: నిర్మలచిత్తుడా! దానిచేత ఆతడి గొప్ప మహిమ అంతకంతకూ పెరిగిపోయింది. ఆ కారణంగా ఆ మహాతేజశ్శాలి మునులు మోసే వాహనం కలవా డవటం సమకూడింది. వేయి మాటలేల?

విశేషం: అవద్యం - పలుకరానిది - దోషం - అది లేనివాడు అవద్యరహితుడు. 'మునివరవాహనత్వంబు' అన్నచోట 'వర' శబ్దం మరింత ప్రకృతార్థాన్ని పుష్టం చేస్తున్నది.

క. విను మనుజేంద్రుల కెవ్వరి । కిని లేని విశేష మతనికిం గలుగుట గ
ర్వనిరూఢి నొంది దుర్వ । ర్తనపరుఁడై యాతఁ డజగరత్వముఁ బొందెన్. 37

ప్రతిపదార్థం: విను= వినుము; మనుజ+ఇంద్రులకున్= రాజులకు; ఎవ్వరికిని= ఎవ్వరికీ; లేని విశేషము= లేని మహిమ; అతనికిన్= ఆ నహుషునకు; కలుగుటన్= కలగటంచేత; గర్వ నిరూఢిన్= పొగరు సడలని స్థితిని; ఒంది= పొంది; ఆతఁడు= ఆ నహుషుడు; దుర్వర్తనపరుఁడు= చెడు నడవడియందు పట్టుదలకలవాడు; ఐ= అయి; అజగరత్వమున్= పెనుబాము అవటం; పొందెన్=పొందాడు.

తాత్పర్యం: రాజా! వినుము. ఏ రాజుకూ లేని గొప్పతనం అతడికి కలిగిన కారణంగా చెదరని గర్వం పొంది ఆతడు తప్పుదారిని బట్టి పెనుబామై పోయాడు.

విశేషం: దుర్వర్తన - ఇంద్రుడి భార్య శచిని కోరటం అనేది; పరుఁడు= బృహస్పతి వంటి మహానుభావులు ఎంత బోధించినా తలకెక్కని మొండి పట్టుదల గలవాడు.

వ. అట్టియెడఁ బూర్వంబునం జేసిన పుష్పాదిదాన పుణ్యవిశేషంబుల మహానుభావంబువలన నవ్వసుమతీశ్వరు శపించిన మునీశ్వరుండు సదయుండయి శాపమోక్షంబు నిర్దేశించెఁ 'దత్ఫలవిశేషంబునన యశేషదోష నిరసననిపుణుండ వగు నీవప్పుణ్యానుష్ఠానంబున కొదవి' తని చెప్పి వెండియు. 38

ప్రతిపదార్థం: అట్టియెడన్= అట్టి సందర్భంలో; పూర్వంబునన్= మునుపు; చేసిన= చేసినట్టి; పుష్ప+ఆది, దాన పుణ్యవిశేషంబుల= పూవులు మొదలగు వాటి దానంవలన అయిన పుణ్యమహిమల; మహా+అనుభావంబువలనన్= గొప్ప శక్తివలన; ఆ+వసుమతీ+ఈశ్వరున్= ఆ భూప్రభువును; శపించిన; ముని+ఈశ్వరుండు= శపించిన మునిశ్రేష్ఠుడు; సదయుండు+అయి= దయతో కూడినవాడై; శాపమోక్షంబున్= శాపం విడుదలను; నిర్దేశించెన్= చెప్పాడు; తత్+ఫల విశేషంబునన్+అ= ఆ ఫలం యొక్క విశేషం చేతనే; అశేష దోష నిరసన నిపుణుండవు= సమస్తమైన దోషాలను త్రోసివేయటంలో నేర్పుగలవాడవు; అగు నీవు= అయిన నీవు; ఆ+పుణ్య+ అనుష్ఠానంబునకున్= ఆ పుణ్యకార్యం ఆచరణకు; ఒదవితి(వి) = సిద్ధపడ్డావు; అని; చెప్పి= తెలియజేసి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ పరిస్థితిలో అంతకుమునుపు చేసిన పూలు మొదలైన దానాల పుణ్యమహిమల గొప్పశక్తిచేత ఆ రాజును శపించిన మహర్షి దయగలవాడై శాపం తీరే విధానాన్ని సూచించాడు. 'ఆ ఫలవిశేషంచేతనే సమస్త పాపాలను దూరంచేసే నేర్పుగల నీవు ఆ పుణ్యకార్యం ఆచరించటానికి పూనుకున్నావు' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: శాపమోక్ష ప్రదానం చేయటానికి వీలులేనంత మహాపాపం చేసినా చేసినా, పుణ్యవిశేషం వలన అది ప్రయోజనం కలిగించిందనీ చెప్పటం వలన పుష్పాదిదానాల మహిమకు సాటిలేనితనం చెప్పినట్లయింది.

తే. **పాండవాగ్రజ! నహుషుండు బ్రహ్మసభకు । నాత్మగృహమున కరిగినయట్ల యరిగె;**
నట్టి పెంపును జనవిభుం డవ్విశిష్ట । దానఫలమునఁ జూవె పొందంగఁ బడసె. **39**

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజ!= పాండుకుమారులలో పెద్దవాడా!; నహుషుండు= నహుషచక్రవర్తి; బ్రహ్మసభకున్= బ్రహ్మదేవుడి సభకు; ఆత్మగృహమునకున్= తనయింటికి; అరిగిన+అట్లు+అ= వెళ్ళినట్లే; అరిగెన్= వెళ్ళాడు; జనవిభుండు= ఆ రాజు; అట్టి పెంపును= అట్టి గొప్పతనాన్ని; ఆ+విశిష్ట దాన ఫలమునన్= ఆ గొప్పదాన ఫలంచేతనే; పొందంగన్ పడసెన్= పొందగలిగాడు; చూవె= సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! నహుషుడు బ్రహ్మసభకు సొంత ఇంటికి వెళ్ళినట్లుగా వెళ్ళాడు. ఆ రాజు మహిమను ఆ మహా దాన ఫలంచేతనే కదా పొందగలిగాడు!'

విశేషం: బ్రహ్మసభకు వెళ్ళటమంటే భూలోకం మొదలైన ఆరు లోకాలు దాటి ఏడవదైన సత్యలోకానికి వెళ్ళటం. అంటే స్వర్గం పొందటానికి చేసిన పుణ్యానికి సుమారు ఆరురెట్ల పుణ్యం చేస్తే అది లభిస్తుంది. అందులోను బెరుకుతో, జంకుతో కాకుండా సొంత ఇంటికి వెళ్ళినట్లు అంటే ఆ పుణ్యం ఇంకా ఎంత గొప్పది కావాలో ఆలోచించదగిన విషయం. అంత పుణ్యాన్ని దేవతలకు పుష్పాదిదానంచేత మానవుడు సంపాదిస్తాడని కథాతాత్పర్యం.

క. **అని పలికి భీష్ముఁడిట్లను । 'విను మెందును దీపదానవిధి మే లనిశం**
బును జేయ నూర్ధ్వలోకం । బును గర్తకుఁ బరమదివ్య బోధము నిచ్చున్. **40**

ప్రతిపదార్థం: అని; పలికి; భీష్ముఁడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; వినుము= ఆలకించుము; ఎందును= అన్నింటిలో; దీపదాన విధి= దీపం ఇవ్వటం అనే పని; మేలు= శ్రేష్ఠమైనది; అనిశంబును= ఎల్లవేళల; చేయన్= చేయగా; కర్తకున్= చేసినవాడికి; ఊర్ధ్వలోకంబును= పై లోకాన్నీ; పరమ దివ్య బోధమున్= మిక్కిలి గొప్పదైన జ్ఞానాన్నీ; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఇట్లా చెప్పి భీష్మ డింకా ఇట్లా అన్నాడు. 'అన్ని విషయాలలో దీపదానం చాలా శ్రేష్ఠమైనది. అది చేసినవాడికి పై లోకాలను, గొప్పది, మహిమగలదీ అయిన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

విశేషం: ఊర్ధ్వలోకం పుణ్యానుభవానికి సంకేతం. జ్ఞానం కైవల్యాన్ని ప్రసాదిస్తుంది. దీపం ఇచ్చే వెలుగు భగవత్తత్త్వాన్ని ప్రస్ఫుటం చేస్తుందని తాత్పర్యం. అంతేకాక 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న ఉపనిషద్వాక్యం కూడా ఇక్కడ సమన్వయిస్తుంది.

క. **ఎన్ని నిమిషములు దైవత । సన్నిధి వెలుఁ గంగఁ జేయు జనుఁడు ప్రదీపం**
బన్ని సురవత్సరములు సు । ఖోన్నతి సన్నుతుల నాతఁ డొప్పు దివమునన్. **41**

ప్రతిపదార్థం: జనుఁడు= మనిషి; ప్రదీపంబు= పెద్దదీపాన్ని; దైవతసన్నిధిన్= దేవత సమీపంలో; ఎన్ని నిమిషములు= ఎన్ని నిముషములకాలం; వెలుఁగంగన్+చేయున్= వెలుగునట్లు చేస్తాడో; అన్ని సుర వత్సరములు= అన్ని దేవతల ఏండ్లు; ఆతఁడు= ఆ మనిషి; సుఖ+ఉన్నతిన్= సుఖంయొక్క పెక్కువతో; సన్నుతులన్= మంచి ప్రశంసలతో; దివమునన్= స్వర్గంలో; ఒప్పున్= వెలుగొందుతాడు.

తాత్పర్యం: మనిషి దేవుడిదగ్గర ఎన్ని నిముసాలు పెద్దదీపం వెలిగించి ఉంచుతాడో అన్ని దేవసంవత్సరాల కాలం స్వర్గంలో అధికసుఖంతో చక్కని ప్రశంసలతో ప్రకాశిస్తాడు.

విశేషం: మనుజుల సంవత్సరం దేవతల కొకరోజు. అంటే మనుషుల మూడువందల అరవై ఏండ్లు దేవతలకొక సంవత్సరం అన్నమాట.

క. అనిన విని ధర్మజుఁడు శం । తనుతనయుని తోడ విప్రధనము హరిం
చిన యాతఁ డేగతిం జను? । ననుటయు నతఁ డిట్టు లనియె నన్నరపతికిన్. 42

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుఁడు= ధర్మరాజు; శంతనుతనయునితోడన్= శంతనుడి కొడుకైన భీష్ముడితో; విప్రధనము= మహావిద్యావంతుడి సొమ్ము; హరించిన+ఆతఁడు= దొంగిలించిన వ్యక్తి; ఏ గతిన్= ఏ దారిలో; చనున్?= పోతాడు?; అనుటయున్= అన్నంతనే; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ+నరపతికిన్= ఆ రాజునకు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ మాట విన్న తరువాత భీష్ముడితో ఇట్లా అన్నాడు 'విప్రుడి సొమ్ము దొంగిలించినవాడి గతి ఏమిటి?' అంటే భీష్ము డా రాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: 'విద్యయా యాతి విప్రత్వమ్' అన్న వాక్యాన్ని బట్టి పరమార్థజ్ఞానం పుష్కలంగా కలవాడే విప్రుడు.

క. దురితము లనేకములు గల । వరయఁగ లోకమున వాని యన్నిటికంటెన్
ధరణిసురధనము పాపపుఁ । దెరువునఁ గొనుటధిక మండ్రు ధీరవిచారా! 43

ప్రతిపదార్థం: ధీరవిచారా!= బుద్ధి విశేషంతో కూడిన వివేకం కలవాడా!; అరయఁగన్= పరిశీలించి చూడగా; లోకమునన్= లోకంలో; దురితములు= పాపాలు; అనేకములు= పెక్కులు; కలవు= ఉన్నాయి; వాని; అన్నిటికంటెన్= ఆ అన్నింటికంటె; ధరణిసుర ధనము= బ్రాహ్మణుడి సొమ్ము; పాపము+తెరువునన్= పాపపుపద్ధతిలో; కొనుట= గ్రహించుట; అధికము= పెద్దది; అండ్రు= అంటారు.

తాత్పర్యం: వివేకంతో కూడిన విచారం కల ఓ ధర్మరాజా! పరిశీలిస్తే లోకంలో పాపాలు లెక్కలేనన్ని ఉన్నాయి. ఆ అన్నింటిలో బ్రహ్మజ్ఞానసంపన్నుడి సొమ్ము పాపపు పద్ధతిలో దొంగిలించటం చాలా పెద్దది అంటారు.

విశేషం: 'ధీరవిచారా!' అనే సంబోధనలో 'ఇది చాలా సూక్ష్మబుద్ధితో విచారించి నిర్ణయించవలసిన అంశం' అనే సూచన వ్యక్తం అవుతుంది.

క. భూసుర ధనాపహరణము । చేసినఁ గులనాశమగుట సిద్ధము; దానం
జేసి యగును జండాల । త్వాసంగము నపరభవము నందు నరేంద్రా! 44

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; భూసుర, ధన+అపహరణము= బ్రాహ్మణుడి సొమ్ము దొంగిలించటం; చేసినన్= చేస్తే; కులనాశము= కులమంతా నశించటం; అగుట= కావటం; సిద్ధము= తప్పక జరుగుతుంది; దానన్+చేసి= దానివలన; అపర భవమునందున్= మరు పుట్టుకలో; చండాలత్వ+ఆసంగము= చండాలుడగుటతోడి దృఢమైన సంబంధం; అగును= అవుతుంది.

తాత్పర్యం: రాజా! బ్రహ్మజ్ఞానం కలవాడి సంపదను దొంగిలిస్తే కులనాశనం తప్పక జరుగుతుంది. అంతేకాదు- మరు పుట్టుకలో తప్పనిసరిగా చండాలు డయ్యే స్థితి కలుగుతుంది.

విశేషం: తన పాపం తనతో ఆగదు. తనతో చుట్టరికం గల వారినందరినీ అంత మొందిస్తుంది. అంటే అది ఎంత ఘోరకృత్యమో సంభావించాలి.

వ. ఒక్క యితిహాసంబు సెప్పెద నాకర్ణింపుము. 45

ప్రతిపదార్థం: ఒక్క+ఇతిహాసంబు= ఒక పురాతన కథను; చెప్పెదను= చెబుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: దీనికి సంబంధించిన ఒక ప్రాతకాలపు వృత్తాంతాన్ని వివరిస్తాను వినుము.

ఆ. క్షత్ర బంధుఁ డనఁగఁ గలఁ డొక్క నరపతి । యతఁడు మాలవాని నధికదుఃఖ
భాగిఁ గాంచె గాలిఁ బఱచు విప్రక్షేత్ర । తలము రేణువునకుఁ దలఁగి చనఁగ. 46

ప్రతిపదార్థం: క్షత్రబంధుఁడు+అనఁగన్= క్షత్రబంధు డనే పేరుగల; ఒక్క, నరపతి= ఒకరాజు; కలఁడు= ఉన్నాడు; అతఁడు= ఆ రాజు; అధిక దుఃఖభాగిన్= మిక్కిలి దుఃఖం అనుభవిస్తున్న; మాలవానిన్= చండాలుని; గాలిన్= గాలిచేత; పఱచు విప్రక్షేత్రతలము రేణువునకున్= ఎగిరి వచ్చుచున్న బ్రాహ్మణుడి పొలంలోని దుమ్ము కణానికి; తలఁగి= తప్పుకొని; చనఁగన్= పోతూ ఉండగా; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: క్షత్రబంధుడనే రాజొకడు ఉన్నాడు. ఒకనా డతడు బ్రాహ్మణుడి పొలంనుండి గాలికి ఎగిరి వస్తున్న రేణువుని తప్పుకొని వెళుతున్నవాడు, మహాదుఃఖంతో ఉన్నవాడు అయిన ఒక మాలవాడిని చూచాడు.

క. కని యీ ధూళికిఁ గడు రో । సిన కారణమేమి? యనుడుఁ జెప్పె నతనికి
ట్లని యమ్మాలఁడు 'దొలుబా । మున నేనొక విప్రుకొడుక మునులు నుతింపన్. 47

ప్రతిపదార్థం: కని= చూచి; ఈ ధూళికిన్= ఈ దుమ్మునకు; కడున్= ఎక్కువగా; రోసిన కారణము= రోతపడిన హేతువు; ఏమి?= ఏమిటి?; అనుడున్= అనగా; ఆ+మాలఁడు= ఆ మాలవాడు; అతనికిన్= ఆ క్షత్రబంధునకు; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు; తొలుబామునన్= పూర్వజన్మలో; నేను; ఒక, విప్రుకొడుకన్= ఒక బ్రాహ్మణుడి కుమారుడిని; మునులు= మహర్షులు; నుతింపన్= కొనియాడునట్లుగా.

తాత్పర్యం: చూచి, ఆ రాజు 'ఆ ధూళికి అంతగా రోతపడుతున్నావు కారణమేమి' టని అడిగాడు. అప్పుడతడు ఇట్లా చెప్పాడు 'నేను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడి కుమారుడిని. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. పరమనిష్ఠతోడ బ్రహ్మచర్యవ్రత । మాచరింతు; భిక్షితాన్న మొక్క
నాఁడు వేడ్కఁ బుణ్యనది తీరమున భుజిం । పంగఁ దలఁచి చనఁగఁ బాప మడరి. 48

ప్రతిపదార్థం: పరమనిష్ఠతోడన్= గొప్ప నిలుకడతో; బ్రహ్మచర్య వ్రతము= బ్రహ్మమునందు ప్రవర్తించటం అనే వ్రతాన్ని; ఆచరింతున్= చేస్తూ ఉన్నాను; ఒక్కనాఁడు= ఒకరోజున; పుణ్యనది తీరమునన్= పుణ్యమైన నది ఒడ్డున; భిక్షిత+అన్నమున్= బిచ్చమెత్తిన అన్నాన్ని; భుజింపంగన్= తినటానికి; తలఁచి= సంకల్పించి; చనఁగన్= వెళ్ళగా; పాపము= పాపం; అడరి= పండి.

తాత్పర్యం: (మునులు కొనియాడే విధంగా) బ్రహ్యచర్యవ్రతం ఆచరిస్తున్నాను. ఒకరోజున పుణ్యమైన నది ఒడ్డున బిచ్చమెత్తిన అన్నం తినటానికి సంకల్పించి వెళ్ళాను. ఇంతలో నా పాపం పండింది.

విశేషం: వెనుకటి పద్యంలోని 'మునులునుతింపన్' అనేది ఈ పద్యంలోని 'బ్రహ్మచర్యవ్రతం' - బ్రహ్మమంటే వేదం. దాని అధ్యయనంలో ప్రవర్తించటం. అందులో అనేక నియమాలు ఉన్నాయి. భిక్షమెత్తిన అన్నం భుజించటం అందులో ఒక నియమం.

క. ధరణీదేవక్షేత్రము । పరాగపటలంబు బహుళ పవనంబుగతిం
బరఁగి నరనాథ! నాదగు । కరంబు నన్నమునఁ బట్టె గడుసాంద్రముగన్. 49

ప్రతిపదార్థం: నరనాథ!=రాజా!; ధరణీ దేవ క్షేత్రము, పరాగ, పటలంబు= బ్రాహ్మణుడి పొలంలోని ధూళి సముదాయం; బహుళ పవనంబుగతిన్= ఎక్కువ అయిన గాలివాటంచేత; పరఁగి= వ్యాపించి; నాది+అగు= నాదైన; కరంబు+అన్నమునన్= చేతిలోని అన్నంమీద; కడుసాంద్రముగన్= చాలా దట్టంగా; పట్టెన్= పట్టింది.

తాత్పర్యం: రాజా! నా పాపం పండి బ్రాహ్మణుడి భూమిలోని ధూళి గాలివాటానికి ఎగిరివచ్చి, నాచేతిలో ఉన్న అన్నంమీద మిక్కిలి దట్టంగా పట్టింది.

విశేషం: కరంబు నన్నమున - చేతినే పాత్రగా ఉపయోగించటం కూడా ఒక విధమైన బ్రహ్మచర్య వ్రత నియమం. ఈ సందర్భంలో కరపాత్ర స్వాములవారిని స్మరించవచ్చును.

క. ఆ ధూళితోడఁ గుడిచిన । నీ దుర్జన్మంబు వచ్చె; నిది యెఱిఁగెడు సం
వేదనము పూర్వపుణ్య ఫ । లోదయమునఁ గలిగె; నిన్న యొక కలగంటిన్. 50

ప్రతిపదార్థం: ఆ ధూళితోడన్= ఆ దుమ్ముతోపాటు; కుడిచినన్= తినగా; ఈ దుర్జన్మంబు= ఈ పాడు పుట్టుక; వచ్చెన్= వచ్చినది; ఇది=దీనిని; ఎఱిఁగెడు సంవేదనము= తెలిసికొనే జ్ఞానము; పూర్వ పుణ్య ఫల+ఉదయమునన్= తొలి పుట్టువులోని పుణ్యఫలం పుట్టుకవలన; కలిగెన్= ఏర్పడింది; నిన్న= నిన్నటిరోజున; ఒక కలన్= ఒక స్వప్నమును; కంటిన్= కన్నాను.

తాత్పర్యం: ఆ ధూళితోపాటు అన్నం తినగా ఈ పాడు పుట్టుక నాకు కలిగింది. ఇది తెలిసికొనే జ్ఞానం మునుపటి జన్మలోని పుణ్యం పండిన కారణంగా కలిగింది. నిన్న నాకొక కల వచ్చింది.

విశేషం: సాధారణంగా పూర్వజన్మ జ్ఞానం ఉండటం అరుదు. అందునా పాపఫలానుభవంలో ఉన్న వాడికి కలగటం మరీ వింత. అందుకే మునులు మెచ్చే విధంగా బ్రహ్మచర్యవ్రతం నడపిన విషయాన్ని ముందు ప్రస్తావించారు. ఆ అంశాన్ని ఇక్కడ అనుసంధించుకోవాలని సూచించారు.

వ. దానిం జెప్పెద నవధరింపుము. 51

ప్రతిపదార్థం: దానిన్= ఆ కలను; చెప్పెదను= చెబుతాను; అవధరింపుము= దయతో వినుము.

తాత్పర్యం: ఆ కలను గురించి వివరిస్తాను. దయతో వినుము.

క. ఒక విప్రవరుఁడు ననుఁగని । 'యకటకటా! యనుచు నిలిచి యడలకు మీ దుః
ఖకలాప మెల్లి వాయును । సకలంబును క్షత్రబంధుసంవాదమునన్.' 52

ప్రతిపదార్థం: ఒక విప్రవరుఁడు= ఒక బ్రాహ్మణశ్రేష్ఠుడు; ననున్= నన్ను; కని= చూచి; అకటా+అకటా!= అయ్యయ్యో!; అనుచున్= అంటూ; నిలిచి; అడలకుము= కుమిలిపోకుము; ఈ దుఃఖకలాపము= ఈ ఏడ్పుల సముదాయం; సకలంబును= అంతా; ఎల్లి= రేపు; క్షత్రబంధు సంవాదమునన్= క్షత్రబంధుడితో చేసే ప్రసంగం చేత; పాయును= తొలగి పోతుంది.

తాత్పర్యం: ఒక బ్రాహ్మణశ్రేష్ఠుడు నన్ను చూచి 'అయ్యయ్యో! దుఃఖపడకుము. ఈ దుఃఖమంతా రేపు క్షత్రబంధు సంవాదంతో నశించిపోతుంది.'

క. అనియె ననిచెప్పి వీడ్కొని । చని మృతుఁడై తొంటి బహుళసత్కర్మంబుల్
దను నుత్తమ పదమునకుం । గొనిపోయిన నిత్యసౌఖ్యకుండై యుండెన్. 53

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అని; చెప్పి; వీడ్కొని= సెలవు తీసికొని; చని= వెళ్ళి; మృతుఁడు+ఐ= చనిపోయినవాడై; తొంటి బహుళ సత్+కర్మంబుల్= పూర్వజన్మలోని పెక్కు పుణ్యకార్యాలు; తనున్= తనను; ఉత్తమపదమునకున్= ఉత్తమస్థానానికి; కొనిపోయినన్= తీసికొనిపోగా; నిత్య, సౌఖ్యకుండు+ఐ= శాశ్వతమైన సౌఖ్యం కలవాడై; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: అని చెప్పాడు' అని పలికి అతడి దగ్గర సెలవు తీసికొని వెళ్ళి మరణించి, పూర్వపు పుణ్యకర్మలు తనను ఉత్తమపదానికి కొనిపోగా శాశ్వతసుఖం కలవాడై ఉన్నాడు.

విశేషం: నిత్యసౌఖ్యం - పునరావృత్తిలేని మోక్షసుఖం.

వ. అనిన విని యజాతశత్రుండు గంగాపుత్త్రుతో 'నాకలోకం బేకప్రకార మనోహారియై యుండునో? బహుప్రకార ప్రమోదియై వెలుంగునో? యెఱింగింపవే!' యనుటయు నతండు 'పుణ్యకర్మంబు లనేకవిధంబులు గావే? కావునం దత్త దనురూపానేకస్థానంబై నాకంబు నిశ్శోకంబును నస్తోకసుఖకరంబును నై కరం బొప్పుచుండు గౌతమ శతక్రతుసంవాదం బను నితిహాసంబు విను మది భవదీయ ప్రశ్నంబునకుఁ బ్రాదేశవిశదీకరణం బగు నుత్తరంబై యుండెడు; గౌతముండను మహాద్విజుండు వనంబునం దపంబు సేయుచుండి శుండాల శిశువుం దల్లిలేనిదాని నొక్కెడం గని కారుణ్యంబు వొడమి పుత్త్రునింబోలెఁ బెనిచె; నయ్యేనిక కొదమ కాలక్రమంబున మేటి యేనుంగయి మెలంగుచుండె; నక్కాలంబున భూపాలనంబు సేయు ధృతరాష్ట్రుండను రాజు నాకారంబు దాల్చి నాకపతి యయ్యెడకు వచ్చి యవ్వారణపతిం బట్టి తనకుం గొనిపోవువాఁడై దీని నాకిమ్మని యమ్మునిపతి నడుగుటయు నతండు. 54

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగాపుత్రుతోన్= భీష్ముడితో; నాకలోకంబు= స్వర్గలోకం; ఏక ప్రకార మనస్+హారి= ఒకే విధంగా మనస్సును ఆకర్షించేది; ఐ= అయి; ఉండునో?= ఉంటుందా?; బహుప్రకార; ప్రమోది పెక్కు తీరుల ఆనందం కలిగించేది; ఐ= అయి; వెలుంగునో?= ప్రకాశిస్తుందో?; ఎఱంగింపవే!= తెలుపుమా!; అనుటయున్= అంటే; అతండు= ఆ భీష్ముడు; పుణ్యకర్మంబులు= పుణ్యఫలాన్నిచ్చే పనులు; అనేకవిధంబులు= పెక్కుతీరులైనవి; కావే?= కావా?; కావునన్= కాబట్టి; తత్, తత్, అనురూప+అనేక స్థానంబు= వాని వానికి తగిన పెక్కు తావులు కలది; ఐ= అయి; నాకంబు= స్వర్గం; నిస్+శోకంబును= శోకంలేనిదీ; అస్తోకసుఖ కరంబును= మిక్కిలి అధికమైన సుఖాన్ని కలిగించేదీ; ఐ= అయి; కరంబు= మిక్కిలిగా; ఒప్పుచున్+ఉండున్= ఒప్పుతూ ఉంటుంది; గౌతమ శతక్రతు, సంవాదంబు= గౌతముడికి,

దేవేంద్రుడికి అయిన సంభాషణం; అను+ఇతిహాసంబు= అనే పురాతన కథ; వినుము; అది; భవదీయ ప్రశ్నంబునకున్= నీదైన ప్రశ్నకు; ప్రాదేశ విశదీకరణంబు= కొంతభాగం స్పష్టం చేసేది; అగు+ఉత్తరంబు= అయిన సమాధానం; ఐ= అయి; ఉండెడున్= ఉంటుంది; గౌతముండు+అను, మహా ద్విజుండు= గౌతముడనే గొప్ప బ్రహ్మవేత్త; వనంబునన్= అడవిలో; తపంబు= తపస్సు; చేయుచున్+ ఉండి= చేస్తూ ఉండి; శుండాల శిశువున్= ఏనుగుపిల్లను; తల్లి లేనిదానిని; ఒక్క+ఎడన్= ఒకచోట; కని= చూచి; కారుణ్యంబు= జాలి; ఒడమి= పుట్టి; పుత్త్రునిన్+పోలెన్= కొడుకొనువలె; పెనిచెన్= పెంచాడు; ఆ+ఏనిక కొదమ= ఆ గున్న ఏనుగు; కాలక్రమంబునన్= కాలం గడుస్తూ ఉండగా; మేటి ఏనుంగు= పెద్ద ఏనుగు; అయి; మెలంగుచున్+ఉండెన్= తిరుగుతూ ఉంది; ఆ+కాలంబునన్= ఆ కాలంలో; భూపాలనంబు= భూమినేలటం; చేయు ధృత రాష్ట్రుండు= చేసే ధృతరాష్ట్రుడు; అనురాజు+ఆకారంబు= అనే రాజు ఆకారం; తాల్చి= ధరించి; నాకపతి= స్వర్గపు ఏలిక-ఇంద్రుడు; ఆ+ఎడకున్= ఆ చోటికి; వచ్చి= ఏతెంచి; ఆ+వారణపతిన్= ఆ ఏనుగురాజును; పట్టి= పట్టుకొని; తనకున్= తనకోసం; కొనిపోవువాఁడు= తీసికొని పోయేవాడు; ఐ= అయి; దీనిన్= దీనిని; నాకున్= నాకు; ఇమ్ము= ఇవ్వు; అని; ఆ+మునిపతిన్= ఆ మునిశ్రేష్ఠుడిని; అడుగుటయును= అడుగగా; అతండు= ఆ గౌతముడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు భీష్మడితో 'స్వర్గము ఒకే విధమైన ఆనందం కలదియా? పెక్కుతీరుల ఆనందం కలిగించేదై ప్రకాశిస్తుందా?' అని అంటే భీష్ముడు 'పుణ్యకర్మలు పెక్కుతీరులైనవి కదా! కనుక ఆయా కర్మలకు తగిన పెక్కుతావులు కలదై స్వర్గం దుఃఖం లేనిదీ, అమితమైన సుఖాన్ని కలిగించేదీ అయి ఎంతో ఒప్పుతూ ఉంటుంది. గౌతమదేవేంద్ర సంవాదం అనే ఒక ఇతిహాసం చెప్పుతాను వినుము. అది నీ ప్రశ్నకు కొంతవరకు విశదపరిచే సమాధానం అవుతుంది. గౌతముడనే ఉత్తమబ్రాహ్మణుడు అరణ్యంలో తపస్సు చేస్తూ ఉన్నాడు. ఆయనకు ఒకనాడు తల్లిలేని ఏనుగు పిల్ల ఒకటి కానవచ్చింది. దానిమీద జాలిపుట్టి దానిని తన కొడుకువలె పెంచాడు. ఆ ఏనుగుగున్న కాలక్రమాన శ్రేష్ఠమైన ఏనుగై తిరుగుతూ ఉంది. ఆ కాలంలో భూమి నేలుతున్న ధృతరాష్ట్ర డనే రాజు రూపం ధరించి దేవేంద్రుడు ఆ చోటికి వచ్చి ఏనుగును పట్టి తనకొరకు తీసికొని పోయే తలపుతో 'దీనిని నా కి 'మ్మని మునివరుడిని అడిగాడు. అప్పుడతడు.

విశేషం: ప్రాదేశము - చూపుడు వ్రేలిని, బొటన వ్రేలిని చాచి పట్టిన కొలత. జాన వంటిది. ఇక్కడ కొంతభాగానికి సంబంధించిన అని అర్థం. స్వర్గం - శోకం లేనిది - అంతమాత్రమే కాదు. గొప్ప సుఖాన్ని కూర్చేది.

తే. **'ఇధ్మములు దెచ్చి యిచ్చు నే నిచట లేని । సమయమునఁ గాఁచు నీ పర్ణశాల మర్త్య**
బుద్ధియుత మిది యీ దంతిఁ బుత్త్రుఁబోలెఁ । బెనిచినాఁడ నీకీఁజాల మనుజనాథ! 55

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; ఇది= ఈ ఏనుగు; ఇధ్మములు= అగ్నిహోత్రపు పుడకలను; తెచ్చి ఇచ్చున్= తెచ్చి ఇస్తుంది; నేను; ఇచటన్= ఇక్కడ; లేని సమయమునన్= లేని వేళలో; ఈ పర్ణశాలన్= ఈ గుడిసెను; కాఁచున్= రక్షిస్తుంది; మర్త్య, బుద్ధి, యుతము= మనిషిబుద్ధి వంటి బుద్ధితో కూడినది; ఈ దంతిన్= ఈ ఏనుగును; పుత్త్రున్ పోలెన్= కన్న కొడుకును వలె; పెనిచినాఁడన్= పెంచినవాడను; నీకున్= నీకు; ఈన్+చాలన్= ఇవ్వలేను.

తాత్పర్యం: రాజా! ఈ ఏనుగు నాకు అగ్నిహోత్రం చిదుగులను తెచ్చి ఇస్తుంది. నేనిక్కడ లేని వేళలలో ఈ పర్ణశాలను కాపాడుతూ ఉంటుంది. దీని బుద్ధి మనుష్యుల బుద్ధి వంటిది. దీనిని నా కన్నకొడుకువలె పెంచాను. నీ కివ్వలేను.

విశేషం: మనుజనాథ! అనే సంబోధనలో రెండు భావాలు స్ఫురిస్తాయి. నీవు మహారాజువై యుండి నా సొమ్ముకు ఆశపడరాదు అని ఒక భావం. 'రత్నహారీ తు పార్థివః' - అని ఉన్నా దయచేసి నన్ను నిర్బంధించకుము. దానిపై నా మమకారం అటువంటిది - అని రెండవ భావం.

ఇంద్రునకు గౌతమునితో నైన సంవాదము (సం.13-159-11 (కుంభ))

వ. అనుటయు నా కృత్రిమజనవిభుండు. **56**

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; ఆ కృత్రిమ జనవిభుండు= మారురూపం గల ఆ రాజు.

తాత్పర్యం: అన్నంతనే మారురూపం గల ఆ రాజు.

చ. 'మునులకు నేనుఁ గేటికి? నమూల్యపుగోవులఁ బుచ్చికొమ్ము వే
యనఘ! పసిండి నీ వలసినంతయు నిచ్చెద' నన్న 'శైశవం
బున నిది తల్లి లేకునికిఁ బుట్టిన యక్కటికంబు పెంపునం
బెనుచుటఁ జేసి దీనిపయిఁ బ్రేమము నామదిఁగల్గు భూవరా! **57**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; మునులకున్= వైరాగ్యంతో ఉండవలసిన మునులకు; ఏనుఁగు=ఏనుగు; ఏటికిన్?= ఎందుకు?; అమూల్యము+గోవులన్= వెలకట్టరాని; ఆవులను; వేయి= వేయింటిని; పుచ్చికొమ్ము= తీసికొమ్ము; పసిండిన్= బంగారమును; నీవలసిన+అంతయున్= నీవు ఇష్టపడినంత; ఇచ్చెదన్= ఇస్తాను; అన్నన్= అంటే; భూవరా!= రాజా!; శైశవంబునన్= పసితనంలో; ఇది= ఈ ఏనుగు; తల్లి లేక+ఉనికిన్= తల్లిలేకుండటం వలన; పుట్టిన+అక్కటికంబు పెంపునన్= పుట్టిన జాలియొక్క ఎక్కువతనంతో; పెనుచుటన్+ చేసి= పెంచటంవలన; దీనిపయిన్= దీనిమీద; ప్రేమము= వాత్సల్యము; నామదిన్= నా హృదయంలో; కల్గున్= ఉన్నది.

తాత్పర్యం: 'పుణ్యవంతుడా! మునులకు ఏనుగెందుకు? వెలకట్టలేని ఆవులను వేయినిస్తాను. నీవు కావలసినంత బంగారం ఇస్తాను. తీసికొమ్ము' అనగా 'రాజా! పసితనంలో ఇది తల్లిలేకుండటంవలన కలిగిన జాలితో దీనిని పెంచిన కారణంగా దీనిమీద వాత్సల్యం నా హృదయంలో కలిగింది.

విశేషం: మునులకు ఏనుఁగేటికి - అంటే ఏనుగులు రాజైన నావంటివానికి ఉండాలి అని భావం. ముని అంటే మోక్షపరాయణుడు. ఏనుగు దానికి విఘ్నకారి కావచ్చును. అయితే గోవులు, బంగారం కావా? అంటే అవి ఆశ్రమ నిర్వహణకు ఏనుగుకంటె మిన్నగా ఉపకరిస్తాయనే భావంతో పలుకుతున్నాడు.

క. కావున నొల్లను బదివే । ల్గోవుల నిచ్చినను నిష్కకోటి యొసఁగినం
బోవయ్య యేను మొఱయిడఁ । గా వావిరిఁ గొనఁగఁ దగునె కరిపతి నీకున్?' **58**

ప్రతిపదార్థం: కావునన్= కనుక; పదివేల్= పదివేల; గోవులన్= ఆవులను; ఇచ్చినను= ఇచ్చినా; నిష్కకోటి= కోటిబంగారు నాణాలు; ఒసఁగినన్= ఇచ్చినా; ఒల్లను= ఇష్టపడను; పోవయ్య; ఏను= నేను; మొఱ ఇడగాన్= మొత్తుకుంటూ ఉంటే; వావిరిన్= ఒత్తిడి చేసి; నీకున్= నీకు; కరిపతిన్= ఏనుగును; కొనఁగన్+తగునె?= గ్రహింపదగునా? తగదని భావం.

తాత్పర్యం: పదివేల ఆవులనిచ్చినా, కోటి బంగారు నాణాల నిచ్చినా నేనిష్టపడను. వెళ్ళుము. నేను మొత్తుకొంటుంటే నీవు ఒత్తిడి చేసి ఏనుగును తీసికొని పోవటం తగునా?'

క. అని మునిపతి పలికిన న । జ్జనపతి 'వాహనము గాఁగ సామజముం గై
కొనఁదగదె రాజునకు ని । ట్లనఁదగునే నీకు? విడువు హస్తిఁ బ్రియమునన్.' 59

ప్రతిపదార్థం: అని; మునిపతి= మునివర్యుడు; పలికినన్= పలికితే; ఆ+జనపతి= ఆ రాజు; వాహనము= ఎక్కిరింత; కాఁగన్= కావటానికి; సామజమున్= ఏనుగును; కైకొనన్= గ్రహించటం; రాజునకున్= రాజునకు; తగదె?= కూడదా?; రాజునకున్= రాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనన్= పలకటం; నీకున్= నీకు; తగునే?= యుక్తమా?; హస్తిన్= ఏనుగును; ప్రియమునన్= ఇష్టపూర్వకంగా; విడుము= వదలుము.

తాత్పర్యం: అని ముని అంటే రాజు 'వాహనంగా ఏనుగును గ్రహించటం రాజుకు తగని పనియా? రాజుతో ఇట్లా అనటం నీకు తగునా? ఇష్టంతో ఏనుగును వదలిపెట్టుము' అన్నాడు.

విశేషం: 'రత్నహారీ తు పార్థివః' అని న్యాయం. శ్రేష్ఠమైన వస్తువులను రాజు గ్రహించవచ్చునని దీని తాత్పర్యం. ఈ న్యాయాన్ని హృదయంలో భావిస్తూ 'రాజునకు కైకొన తగదా? రాజుతో ఇట్లా పలుకవచ్చునా?' అని అంటున్నాడు. 'నా విష్ణుః పృథివీపతిః' - విష్ణ్వంశలేనివాడు రాజు కాజాలడు' - అన్న న్యాయాన్ని ఇక్కడ కూడ అనుసంధించుకోవాలి. ప్రియమునన్ - ఇష్టంతో - ఇష్టపడి ఇవ్వకపోతే బలాత్కరించవలసి వస్తుందన్న సూచన ఇక్కడ వ్యంగ్యం. తరువాతి పద్యంలో దీనిని కవి మరింత స్పష్టం చేస్తున్నాడు.

వ. అని రాజసంబు దోఁపం బలుకుటయు నప్పరమద్విజుండు పుయిలోట దక్కి యిట్లనియె. 60

ప్రతిపదార్థం: అని; రాజసంబు= పొగరు; తోఁపన్= తెలియనట్లుగా; పలుకుటయున్= పలికితే; ఆ+పరమద్విజుండు= ఆ ఉత్తమ బ్రాహ్మణుడు; పుయిలోట= సంకోచం; తక్కి= వదలి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని పొగరు తెలిసే విధంగా పలికితే ఆ ఉత్తమ బ్రాహ్మణుడు సంకోచం వదలి ఇట్లా అన్నాడు.

విశేషం: రాజసం - రజోగుణంవలన ఏర్పడినది. సందర్భాన్ని బట్టి 'పొగరు'. దీనివలననే వెనుకటి పద్యంలో 'బెదరింపు' ను ఊహించాము.

తే. 'పుణ్యకర్ములు హర్షంబుఁ బొందఁగనుట । పాపకర్ములు శోకార్తి పాలుపడుట
యెచటఁ గల్గు నజ్జముసభ కేఁగుదెమ్ము । దంతి నచ్చట నిచ్చెద ధరణినాథ!' 61

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; ఎచటన్= ఎక్కడ; పుణ్యకర్ములు= పుణ్యమైన కర్మలు గలవారు; హర్షంబున్= సంతోషమును; పొందన్+కనుట= పొందగలుగుట; పాపకర్ములు= పాపపు పనులు చేసేవారు; శోక+ఆర్తి పాలుపడుట= దుఃఖపు పీడకు పాలుకావటమూ; కల్గున్= అవుతుందో; ఆ+జము సభకున్= అట్టి యుముడి లోకానికి; ఏఁగుదెమ్ము= రమ్ము; అచ్చటన్= ఆ తావున; దంతిన్= ఏనుగును; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: 'పుణ్యకర్మలు చేసేవారు ప్రమోదాన్నీ, పాపపుపనులు చేసేవారు పరమదుఃఖాన్నీ పొందే చోటు యమలోకం ఉన్నదే - అక్కడకు రమ్ము నీ కీ ఏనుగు నిస్తాను.'

విశేషం: యముడు మానవుల పాపపుణ్యాలను నిర్ణయించి శోకాన్నీ సంతోషాన్నీ తగిన ప్రమాణంలో ప్రసాదిస్తూ ఉంటాడు. అక్కడ 'నీ, నా' పుణ్యాపాపాలు తేలుతాయని తాత్పర్యం.

వ. అనుటయు నతండు. **62**

తాత్పర్యం: అనగా ఆ ఇంద్రుడు.

సీ. వినుము నాస్తికు లగు జనులుఁ బాపాత్మకు । లునుగాక యేను వత్తునె మునీంద్ర!
యచటికి?' నన్న 'నయ్యముఁడు పుణ్యుఁడు తదీ । యాదరం బొప్పదే?' యనియె విప్రుఁ
డమ్మాట కవ్విభుం 'డప్పఁ బ్రోచునతండుఁ । దల్లికిఁ దండ్రి కత్యంతభక్తి
గలవాఁడు నమ్మేలు గనునందు రా నొల్ల' । నని పల్కెఁ బల్కిన నత్తపస్వి

తే. 'రమ్ము మందాకినికిఁ దత్తటమ్ము పొంత । హస్తి విడిచెద' ననుమాట యాడ నాతఁ
'డతిథిశిష్టాన్నభోజులు న ప్రతిగ్ర । హులును గం ద్రది సరకు సేయుదునె యచటు?' **63**

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= మునివరా!; వినుము; నాస్తికులు= పరలోకము లేదనువారు; అగు జనులున్= అయిన జనులూ; పాప+ఆత్మకులును= పాపపు హృదయం కలవారూ; కాక =తక్క; ఏను= నేను; అచటికిన్= ఆ తావునకు; వత్తునె?= వస్తానా?; అన్నన్= అంటే; విప్రుఁడు= జ్ఞానవంతుడైన ఆ ముని; ఆ+యముఁడు= ఆ యమధర్మరాజు; పుణ్యుఁడు= పుణ్యం కలవాడు; తదీయ+ఆదరంబు= అతడిదైన ఆదరం; ఒప్పదే?= చెల్లదా?; అనియెన్= అన్నాడు; ఆ+మాటకున్= ఆ పల్కునకు; ఆ+ విభుండు= ఆ రాజు; అతండు= ఆ యముడు; అప్పన్= అక్కను; ప్రోచున్= రక్షిస్తాడు; తల్లికిన్= అమ్మకు; తండ్రికిన్= తండ్రికీ; అత్యంతభక్తి= మిక్కిలి ఎక్కువ భక్తి; కలవాఁడు= ఉన్నవాడు; ఆ+మేలు= దానివలన అయ్యే మంచిని; కనున్= పొందుతాడు; అందున్= అచటికి; రాన్= రావటానికి; ఒల్లను= ఇష్టపడను; అని; పల్కెన్= పలికాడు; పల్కినన్=పలుకగా; ఆ+తపస్వి= ఆ తాపసుడు; మందాకినికిన్= ఆకాశగంగ దగ్గరకు; రమ్ము= రా; తత్+తటమ్ముపొంతన్= దాని ఒడ్డు దాపున; హస్తిన్= ఏనుగును; విడిచెదన్= వదలుతాను; అనుమాట= అన్న పలుకు; ఆడన్= పలుకగా; ఆతఁడు= ఆ రాజు; అది= ఆ గంగ ఒడ్డును; అతిథి శిష్ట అన్న భోజులు= అతిథులు తినగా మిగిలిన అన్నాన్ని తినేవారు; అప్రతిగ్రహులును= దానం సొమ్ము పుచ్చుకోనివారున్నూ; కంద్రు= పొందుతారు; అచటు= ఆ తావు; సరకు+చేయుదునె?= లెక్క చేస్తానా?

తాత్పర్యం: మునీంద్రా! వినుము. నాస్తికులు, పాపాత్ములు అక్కడకు పోతారుగానీ నేను వస్తానా?' అన్నాడు. అప్పుడు ఋషి 'ఆ యముడు పుణ్యాత్ముడు గదయ్యా! అతడిని ఆదరింపవద్దా? అంటే ఆ మాట విని రాజు ఆ యముడు అక్కను కాపాడుతూ ఉంటాడు. తల్లిదండ్రులంటే ఎంతో భక్తి కలవాడు. ఆ పుణ్యం పొందుతాడు. కనుక అతడి దగ్గరకు రా' న్నాడు. అప్పుడు ఆ తాపసి 'పోనీ గంగ ఒడ్డుకు రమ్ము! అక్కడ ఏనుగును నీకు వదలుతాను' అంటే 'అతిథులు తినగా మిగిలిన భోజనం తినేవారు. దానాలు ముట్టనివారూ అక్కడకు పోతారు. నేను దానిని లెక్క చేస్తానా?' అన్నాడు.

విశేషం: యముడి విషయంలో పాపపుణ్యాలు రెండూ చెప్పారు. యముడి అక్క కాళింది. తల్లిదండ్రులు ఛాయాసూర్యులు. తల్లివంటి అక్కను, తల్లిదండ్రులను భక్తితో సేవించటం అనే మహాపుణ్యం వలన అతడికి యమత్వం సిద్ధించిందని సూచన. అతిథులు తినగా మిగిలిన అన్నాన్ని 'విఘసం' అంటారు. దానిని భుజించటం మహాపుణ్యంగా పరిగణించారు.

క. అనినను ముని 'మేరు వనం । బున నీ కొప్పింతు గజముఁ బోద' మనుడు న
జ్జననాథవరేణ్యుండా । తని మోమునఁ జూడ్కి నిగుడ దరహాసముతోన్. 64

ప్రతిపదార్థం: అనినను= అంటే; ముని= ఆ మహర్షి; మేరువనంబునన్= మేరుపర్వతపు తోటలో; నీకున్= నీకు; గజమున్= ఏనుగును; ఒప్పింతున్= అప్పగిస్తాను; పోదము= పోదాము; అనుడున్= అనగా; ఆ+జననాథ, వరేణ్యుండు= ఆ రాజశ్రేష్ఠుడు; అతని మోమునన్= అతడి మొహం మీద; చూడ్కి= చూపు; నిగుడన్= నిలుచునట్లుగా; దరహాసముతోన్= చిరునవ్వుతో.

తాత్పర్యం: అప్పుడు ఆ గౌతమముని 'మేరుపర్వతం తోటలో నీకు ఏనుగు నిస్తాను పోదాము' అంటే ఆ రాజు అతడి మోముపై చూపు నిలిపి, చిరునవ్వుతో ఇట్లా అన్నాడు.

క. 'మృదువులు సత్యోపేతులు । సదయులు భూతహితు లందుఁ జనుజనములు నా
కది యేల వేడ్కనిదె వ । చ్చెద నొండొకమంచి చోటు సెప్పు' మనవుడున్. 65

ప్రతిపదార్థం: అందున్= అచ్చటికి; చను జనములు= వెళ్ళే జనులు; మృదువులు= మెత్తని మనస్సు కలవారు; సత్య+ఉపేతులు= సత్యవ్రతంతో కూడినవారూ; సదయులు= దయతో కూడినవారు; భూతహితులు= ప్రాణులకు మేలు చేసేవారు; నాకున్= నాకు; అది= ఆ చోటు; ఏల?= ఎందుకు? ఒండొక మంచిచోటు= మరొక్క ఉత్తమస్థలాన్ని; చెప్పుము= పేర్కొనుము; వచ్చెదన్= వస్తాను; అనవుడున్= అన్నంతనే.

తాత్పర్యం: అక్కడికి వెళ్ళే జనాలు మెత్తటి హృదయం, సత్యవ్రతం, దయ, ప్రాణులయందు హితబుద్ధీ కలవారు. అది నాకెందుకు? ఇంకేదైనా మంచిచోటు చెప్పుము. వస్తాను. అనగా (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: నాకు ఇది వ్యంగ్యంగా 'అది చాలా తక్కువ పుణ్యం. నేను దానికంటె మహోన్నత పుణ్యం చేసినవాడను' అనే భావాన్ని తెలుపుతున్నది.

క. 'నారదమునినాయకుని వి । హారస్థలమైన వనమునం దిచ్చెద నీ
వారణము నచట కిన్నర । ధీరమ్యం బప్సరో మతి ప్రియ మనఘా!' 66

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; నారదముని నాయకుని= నారదుడనే మునిశ్రేష్ఠుడి యొక్క; విహారస్థలము= తిరుగాడేచోటు; ఐన వనమునందున్= అయిన ఉద్యానంలో; ఈ వారణమున్= ఈ ఏనుగును; ఇచ్చెదన్= ఇస్తాను; అచటు= ఆ తావు; కిన్నర ధీ రమ్యంబు= కిన్నరుల బుద్ధితో మనోహరమైనది; అప్సరస్ మతి ప్రియము= అప్సరసల హృదయానికి ఇష్టమైనది.

తాత్పర్యం: 'పుణ్యాత్మా! నారదుడు విలాసంగా తిరిగే పూదోటలో ఈ ఏనుగు నిస్తాను. అది కిన్నరుల బుద్ధికి రమణీయమైనది. అప్సరసల హృదయానికి ప్రియమైనది.'

సీ. అనిన గౌతము పల్కు విని 'గీతనృత్యాది । చతురులై దేవతా సన్మునీంద్ర
హర్షంబు గావించునట్టి వారచ్చటి । కరుగుదు రేనొల్ల నచ్చ' టనియె

నరపతి; 'యుత్తరకురుభూము లనిమిష । కమనీయములు సర్వకామ్యవర్షి
యగునందు వాసవుఁ డట వచ్చి కరినొప్పఁ । గొను' మని పలికె నమ్మునివరుండు

తే. 'కామహింసా రహితులకుఁ గాక నాకుఁ దరమె తత్ప్ర దేశం?' బని దర్పఫణితి
నాడెఁ బతి; దాని కాభూసురాగ్రగణ్యుఁ । 'డిందుగృహమున నిత్తు రమ్మిభము' ననుడు. 67

ప్రతిపదార్థం: అనిన గౌతము పల్కున్= ఇట్లా అనిన గౌతముడి మాటను; విని= ఆలకించి; నరపతి= రాజు, గీత నృత్య+ఆది చతురులు= పాట, ఆట మొదలైనవాటిలో నేర్పు కలవారు; ఐ= అయి; దేవతా సత్+ముని+ఇంద్ర హర్షంబున్= దేవతలకు, మంచి మునులకు ఆనందాన్ని; కావించు+అట్టివారు= కలిగించేవారు; అచ్చటికిన్= ఆ ప్రదేశానికి; అరుగుదురు= వెళ్తారు; ఏను= నేను; అచ్చటు= ఆ చోటు; ఒల్లను= ఇష్టపడను; అనియెన్= అన్నాడు; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; ఉత్తర కురుభూములు= ఉత్తరదిక్కుగా ఉన్న కురుదేశాలు; అనిమిష, కమనీయములు= దేవతలు కూడ కోరునట్టివి; అందున్= ఆ చోట; వాసవుఁడు= ఇంద్రుడు; సర్వ కామ్య వర్షి= అన్ని కోరికలను వర్షించేవాడు; అగున్= అవుతాడు; అటన్= అక్కడకు; వచ్చి= ఏతెంచి; కరిన్= ఏనుగును; ఒప్పన్= ఒప్పునట్లుగా; కొనుము= స్వీకరించుము; అని; పలికెన్= చెప్పాడు; పతి= రాజు; తత్+ప్రదేశంబు= ఆ తావు; కామ హింసా రహితులకున్= కామము, హింస లేనివారికి; కాక= తక్క; నాకున్= నాకు; తరమె?= యోగ్యమా?; అని; దర్పఫణితిన్= గర్వపు ధోరణిలో; ఆడెన్= పలికాడు; దానికిన్= దానికి; ఆ భూసుర+అగ్రగణ్యుఁడు= ఆ బ్రాహ్మణవరేణ్యుడు; ఇందుగృహమునన్= చంద్రుడి ఇంటిలో; ఇభమున్= ఏనుగును; ఇత్తున్= ఇస్తాను; రమ్ము= రా; అనుడున్= అనగా.

తాత్పర్యం: అనిన గౌతముడి పలుకు విని రాజు 'ఆటపాటలలో నేర్పుకలిగి దేవతలకు, గొప్ప మునులకు ఆనందం కలిగించే వారు అచ్చటికి వెళ్తారు. ఆ చోటు నేనిష్టపడను' అన్నాడు. అప్పుడు ముని 'ఉత్తరకురుభూములు దేవతలకు కూడా ఇష్టమైనవి. దేవేంద్రుడు అక్కడ అందరి కోరికలను తనివితీరా తీరుస్తాడు. అచటికి వచ్చి ఏనుగును తీసికొమ్ము' అన్నాడు. రాజు 'అది కామము, హింస లేనివారికే కానీ నాకు కాదు' అని గర్వపు ధోరణిలో పలికాడు. అప్పుడు గౌతముడు 'పోనీ, చంద్రుడి ఇంటిదగ్గర ఏనుగునిస్తాను రమ్ము' అన్నాడు.

విశేషం: దర్పఫణితి అనేమాటచేత ముని పేర్కొంటున్న పుణ్యలోకాలన్నీ తన పుణ్యానికి లొచ్చు అన్నభావం స్ఫురిస్తుంది.

క. 'దానరతులు సక్షము లా । దానవిముఖు లందుఁ బోవు తరము జనులు నా
కానెలవు నెలవు కా' దని । మానవపతి పలుక ముని సమధురవచనుఁడై. 68

ప్రతిపదార్థం: దానరతులు= దానంపై మిక్కిలి ప్రీతి కలవారు; సక్షములు= సహనం కలవారు; ఆదానవిముఖులు= దానం పుచ్చుకొనటం ఇష్టంలేనివారు; అందున్= అచటికి; పోవు తరము జనులు= పోయే అర్హతగల జనాలు; నాకున్= నాకు; ఆ నెలవు= ఆ చోటు; నెలవుకాదు= నివాసయోగ్యం కాదు; అని; మానవపతి= రాజు, పలుకన్= పలుకగా; ముని= మహర్షి; సమధుర వచనుఁడు= తీయని మాటలు కలవాడు; ఐ= అయి.

తాత్పర్యం: 'దానం మీద ప్రీతి, గొప్ప ఓర్పుకలవారు, దానం పుచ్చుకొనటంమీద అనిష్టం కలవారు అనగా అపరిగ్రహులు అందు పోయే అర్హత కలవారు. నా కా చోటితో పనిలేదు' అని పలుకగా; ముని తీయని మాటలతో.

వ. అన్నరునాథుతోడ. 69

తాత్పర్యం: ఆ ముని ఆ రాజుతో ఇట్లా అన్నాడు.

సీ. 'రవిపాల నిచ్చెద రమ్ము కుంజరముఁ జే । కొనుటకు' ననిన నజ్జనవిభుండు
'నుతతపస్స్వాధ్యాయరతులకు గంతవ్య । మచ్చోటు నాకేల?' యనుడు 'వరుణు
పురిఁ గుంభిఁ గైకొను పొద' మన్న మునిఁ జూచి । 'యగ్నిహోత్రము నిష్టియజనములును
గలవా రరుగుదురు గాక యన్నెలవొల్ల' । ననియాడె; భూపతి యతని కాతఁ

తే. 'డింద్రుకడ మర్త్య కోటికి నిష్ట మచట । గౌరు నీకిత్తు నని' చెప్పె 'శూరయాజి
వేదిశతవర్షపురుషులు వోదురందు । దాని నేఁగోర' నని పల్కె ధరణివిభుఁడు. 70

ప్రతిపదార్థం: రవిపాలన్= సూర్యుడివద్ద; ఇచ్చెదన్= ఇస్తాను; కుంజరమున్= ఏనుగును; చేకొనుటకున్= తీసికొనటానికి; రమ్ము; అనినన్= అనగా; ఆ+జనవిభుండు= ఆ రాజు; ఆ+చోటు= ఆ స్థలము; నుత తపస్+స్వాధ్యాయ రతులకున్= మెచ్చదగిన తపస్సు, వేదములను పఠించుట అను వాటియందు ప్రీతి కలవారికి; గంతవ్యము= పోదగినది; నాకున్= నాకు; ఏల?= ఎందుకు?; అనుడున్= అన్నంతనే; వరుణుపురిన్= వరుణుడి పట్టణంలో; కుంభిన్= ఏనుగును; గైకొను= గ్రహించుము; పొదము= పద; అన్నన్= అంటే; మునిన్= మునిని; చూచి; అగ్నిహోత్రమును= అగ్నిచేత ఆరాధనము; ఇష్టియజనములును= యజ్ఞయాగాదులు; కలవారు= ఉన్నవారు; అరుగుదురు కాక= వెళ్తారుగానీ; ఆ+నెలవు= ఆచోటు; ఒల్లను= ఇష్టపడను; అని; భూపతి=రాజు; ఆడెన్= పలికాడు; అతనికిన్= ఆ రాజునకు; ఆతఁడు= ఆ ముని; ఇంద్రుకడన్= దేవేంద్రుడియొద్ద; మర్త్యకోటికిన్= మానవుల సముదాయానికి; ఇష్టము= ప్రీతి; అచటన్= అక్కడ; గౌరున్= ఏనుగును; నీకున్= నీకు; ఇత్తున్= ఇస్తాను; అని; చెప్పెన్= చెప్పాడు; ధరణి విభుఁడు= రాజు; అందున్= అచటికి; శూర, యాజి, వేది, శతవర్షపురుషులు= శూరులు; యజ్ఞాలు చేసేవారు, వేదములను అధ్యయనం చేసినవారు, నూరేండ్లు జీవించిన జనులు; పోదురు= వెళ్తారు; దానిన్= దానికి; నేన్= నేను; కోరను= ఇష్టపడను; అని; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ మునిరాజుతో రావయ్యా! సూర్యుడి దగ్గర నీకు ఏనుగునిస్తాను. తీసికొమ్ము' అంటే రాజు 'మెచ్చదగిన తపస్సు, వేదాధ్యయనము ప్రీతిగా చేసేవారికి అది వెళ్ళదగినచోటు. అది నాకెందుకు?' అన్నాడు. 'పోనీ వరుణుడి నగరంలో ఏనుగును తీసికొమ్ము' అంటే 'అగ్నిహోత్రము, యజ్ఞాలు కలవారు అక్కడకు పోతారు. ఆ చోటు నా కిష్టం లే'దన్నాడు. 'అయితే ఇంద్రుడి నెలవు మనుష్యుల కందరికీ ఇష్టం. అచట ఏనుగునిస్తాను' అని ముని అంటే శూరులు, యాజులు, వేదాధ్యయనపరులు, నూరేండ్లు జీవించినవారు అక్కడకు పోతారు. అది నేను కాంక్షించను' అన్నాడు రాజు.

విశేషం: వేది - వేదము కలవాడు.

వ. అని పలికిన నప్పరమతపోధనుండు. 71

ప్రతిపదార్థం: అని; పలికినన్= పలుకగా; ఆ+పరమతపస్+ధనుండు= మహాతపస్సే ధనంగా గల ఆ గౌతముడు.

తాత్పర్యం: అని పలుకగా ఆ మహర్షి.

క. 'రదిఁగొను మచ్చోటను వే । పొద ప్రాజాపత్యలోకమున' కనవుడు 'నా
కది యేల? యశ్వమేధుల । పద' మనియెం బతి తపస్విపతి యాతనితోన్. 72

ప్రతిపదార్థం: రదిన్= ఏనుగును; ఆ+చోటను= ఆ ప్రదేశంలో; కొనుము= గ్రహించుము; ప్రాజాపత్యలోకమునకున్= ప్రజాపతి (బ్రహ్మ) దైనలోకానికి; వే= శీఘ్రముగా; పొద= పద; అనవుడున్= అంటే; అన్నంతనే; పతి= రాజు; అది= ఆ లోకము; అశ్వమేధుల పదము= అశ్వమేధాలు చేసేవారి స్థానం; నాకున్= నాకు; ఏల?= ఎందుకు?; అనియెన్= అన్నాడు; తపస్విపతి= మునివరుడు; అతనితోన్= అతడితో.

తాత్పర్యం: 'పోనీ బ్రహ్మలోకానికి శీఘ్రమే పద, ఏనుగును తీసికొమ్ము' అన్నాడు. 'అది అశ్వమేధాలు చేసేవారికి నెలవయ్యా! నాకెందుకు?' అన్నాడు రాజు.

చ. 'అపగత మోహశోక మగునట్టిది గోగణలోక మిత్తు మ
ద్విపవరు నందు నీ 'కనినఁ 'దీర్థనిషేవులు గోప్రదానపు
ణ్యపరులు బ్రహ్మచర్యనియమాఢ్యులు నచ్చటి కేఁగువారు దా
ని పయిఁ బ్రియంబు నాదు మది నెక్కొన దక్కడ కేల వచ్చెదన్? 73

ప్రతిపదార్థం: అపగతమోహ శోకము= పోయిన అజ్ఞానము దుఃఖము కలది; అగు+అట్టి+అది= అయినట్టి; గోగణ లోకము= గోవుల సముదాయం ఉండే లోకం; అందున్= అక్కడ; మత్ ద్విపవరున్= నా ఏనుగును; నీకున్= నీకు; ఇత్తున్= ఇస్తాను; అనినన్= అంటే; అచ్చటికిన్= అక్కడకు; ఏఁగువారు= వెళ్ళేవారు; తీర్థ, నిషేవులు= పుణ్యస్థలాలను శ్రద్ధతో సేవించేవారు; గో ప్రదాన పుణ్యపరులు= ఆవులను గొప్పగా దానం ఇచ్చే పుణ్యంమీద ఆసక్తి కలవారు; బ్రహ్మచర్యనియమ+ఆఢ్యులు= బ్రహ్మచర్యం నియమాలు పాటించి ఘనత కెక్కినవారు; దానిపయిన్= దానిమీద; నాదు మది= నా మనస్సు; నెక్కొనదు= తగులదు; అక్కడకున్= ఆచోటికి; ఏల= ఎందుకు; వచ్చెదన్?= వస్తాను?

తాత్పర్యం: ఆ ముని, రాజుతో 'అయ్యా! శోకంగాని మోహంగానీ ఇసుమంత కూడా లేని గోలోకంలో నీకు నా యేనుగు నిస్తాను రమ్ము' అన్నాడు. రాజు 'తీర్థాలు సేవించేవారు, గోదానపుణ్యం మీద గొప్ప ఆసక్తి కలవారు, బ్రహ్మచర్యవ్రతం నియమంతో నుతికెక్కినవారూ అక్కడకు పోయేవారు. దానిమీద నా మనస్సు ప్రీతి పడదు. అక్కడి కెందుకు వస్తాను?' అన్నాడు.

సీ. అని ధృతరాష్ట్రుఁ డాడిన ముని 'శీతోష్ణ । సుఖదుఃఖ మిత్రారి ముఖములైన
బహువిధద్వంద్వముల్ పరఁగవు బ్రహ్మలో । కమున నయ్యెడ సామజము హరింతు
గాని 'ర మ్మనుడు నమ్మానవపతి 'యసం । గులుఁ గృతాత్ములు వ్రతాచలితమతులు
నధ్యాత్మనిరతులు నందుఁ బోదురుగాక । యచ్చటు గాన శక్యంబె నాకు

తే. నవని సురవర్య!' యన రాజు నతఁడు సూచి । ముని మహత్తరుఁడే' నిన్ను ననిమిషేంద్రుఁ
గా నెఱింగితి నెల్లలోకములఁ దిరుగు । దెచటనైనఁ బొందదు గదా యెగ్గు నిన్ను'. 74

ప్రతిపదార్థం: అని= ఇట్లు; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ఆడినన్= పలుకగా; ముని= మహర్షి; బ్రహ్మలోకమునన్= బ్రహ్మదేవుడి లోకంలో; శీత+ఉష్ణ సుఖదుఃఖ మిత్త్ర+అరిముఖములు= చలి, వేడి, సుఖం- దుఃఖం, చెలి-పగవాడు మొదలైనవి; ఐన, బహువిధ ద్వంద్వముల్= అయిన పెక్కు తీరుల జంటలు; పరఁగవు= కలుగవు; ఆ+ఎడన్= ఆ తావున; సామజమున్= ఏనుగును; హరింతు కాని= తీసికొందువుగాని; రమ్ము; అనుడున్= అంటే; ఆ+మానవపతి= ఆ రాజు; అసంగులు= సంగము లేనివారు; కృత+ఆత్ములు= ఆత్మను సాధించినవారు; వ్రత+అచలిత మతులు= వ్రతములయందు ఏ కొంచెం కదలని బుద్ధి కలవారు; అధ్యాత్మ నిరతులు= పరమార్థ విద్యయందు నిష్ఠకలవారు; అందున్= అచటికి; పోదురుకాక= పోతారు; అచ్చటు= ఆ తావు; కానన్=చూడటానికి; నాకున్= నాకు; శక్యంబు+ఎ?= సాధ్యమా?; అవనిసురవర్య!= బ్రాహ్మణోత్తమా!; అనన్= అనగా; రాజున్= రాజును; మునిమహత్తరుఁడు= మునులలో మిక్కిలి గొప్పవాడయిన; అతఁడు= ఆ గౌతముడు; చూచి; నిన్నున్= నిన్ను; అనిమిష+ఇంద్రున్‌కాన్= దేవతల ప్రభువుగా; ఏన్= నేను; ఎఱింగితిన్= గుర్తించాను; ఎల్లలోకములన్= అన్ని లోకాలలో; తిరుగుదు=సంచరిస్తూ ఉంటావు; ఎచటన్ ఐనన్= ఎక్కడైనా; నిన్నున్; ఎగ్గు= కీడు; పొందదు కదా= చేరదు కదా!

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా ముని 'శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మిత్రశత్రువులు అని ఈ తీరైన పెక్కు జంటభావాలు లేని తావు బ్రహ్మలోకం. అక్కడ ఏనుగును తీసికొమ్ము రమ్ము' అన్నాడు. అప్పుడు రాజు 'సంగం లేనివారు, ఇంద్రియనిగ్రహం కలవారు, వ్రతాలయందు నిష్ఠ కలవారు, అధ్యాత్మవిద్యయందు పరమాసక్తి కలవారు అచటి కరుగువారు. అది చూడటం నాకు సాధ్యమా?' అన్నాడు. అంత రాజును ముని పరిశీలించి చూచి 'నిన్ను దేవేంద్రుడిగా గుర్తించాను. నీ వన్ని లోకాలు తిరుగుతూ ఉంటావు. ని న్నే కీడూ పొందదు గదా!' అన్నాడు.

విశేషం: అసంగులు - సంగం అంటే వస్తువులు మొదలైనవాటి యందు ప్రీతి. లంపటం. ఇది మమకారాన్ని కలిగించి సర్వానర్థాలకు మూలకారణం అవుతుంది. సంగం వలన కామం, దానివలన క్రోధం, దానివలన సమ్మోహం, దానివలన స్మృతి నశించటం, బుద్ధినాశనం కలుగుతాయని భగవద్గీత చెప్తున్నది. అట్టి పరమనీచమైన 'సంగం' లేనివారు అసంగులు. కృతాత్ములు - ఆత్మను సాధించినవారు. ఇంద్రియాలను, మనస్సును స్వాధీనపరచుకొని పరమాత్మజ్ఞానం చక్కగా పొందినవారు. ద్వంద్వములు - విరుద్ధ భావాల జంటలు - వీటిలో ఒకటి కలిగినపుడు శోకాన్నీ, మరొకటి కలిగినప్పుడు ఆనందాన్నీ మానవుడు పొందుతూ ఉంటాడు. ఈ రెండూ లేని స్థితి పరమోత్తమమైనది. అట్టి ద్వంద్వాలు బ్రహ్మలోకంలో ఉండవు.

చ. అనవుడు మ్రొక్కి యింద్రుఁడు 'మహాత్మ! మతంగజ హేతు వాదవ
ర్తను ననుఁ బంపు నీ పనుపు దక్కొని చేసెద' నన్నఁ 'బుత్త్రుఁ డీ
వనకరి నాకు సాధుజనవత్సల! యిమ్ము కరంబు నెమ్మి దీ
ని' ననియె సాంత్వనంబుగ మునిప్రవరుండు గులప్రదీపకా! 75

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ఇంద్రుఁడు= దేవరాజు; మ్రొక్కి= నమస్కరించి; మహా+ఆత్మ!= దొడ్డబుద్ధి కలవాడా!; మతంగజ, హేతు, వాద, వర్తనున్= ఏనుగు నిమిత్తంగా వాదాన్ని నడపిన; ననున్= నన్ను; పంపు= ఆజ్ఞాపించుము; నీ పనుపున్= నీ ఆదేశాన్ని; తక్కొని= ప్రయత్నపడి; చేసెదన్= చేస్తాను; అన్నన్= అంటే; మునిప్రవరుండు= మునివర్యుడు; సాధుజనవత్సల!= మంచివారియందు పుత్రప్రేమ కలవాడా!; ఈ వనకరి= ఈ అడవి ఏనుగు; నాకున్= నాకు; పుత్త్రుఁడు=కొడుకు; కరంబు నెమ్మిన్= మిక్కిలి ప్రేమతో; దీనిన్= దీనిని; ఇమ్ము; అని; సాంత్వనంబుగన్= బతిమాలుతూ; కులప్రదీపకా!= కులాలను చక్కగా ప్రకాశింప చేసేవాడా!; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ముని అట్లా అన్నంతనే దేవేంద్రుడు 'మహాత్మా! ఏనుగు నెపంగా వాదాన్ని ప్రవర్తింపజేసిన నన్ను ఆజ్ఞాపించుము. నీ ఆజ్ఞను దలదాల్చి నిర్వహిస్తాను' అంటే 'సాధుజనవత్సలా! దేవేంద్రా! ఈ అడవి ఏనుగు నా బిడ్డ. దీనిని మిక్కిలి ప్రేమతో నాకిమ్ము' అని బతిమాలుతూ మునివరేణ్యుడు అన్నాడు కులప్రదీపకుడవైన ధర్మరాజా!

వ. అనిన విని యింద్రుం డిట్లనియె. 76

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఇంద్రుండు= దేవేంద్రుడు; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ఇంద్రు డిట్లా అన్నాడు.

తే. 'కరి చెలంగి నీమీఁదఁ బుష్కరము సాఁచి । మూరుకొనియెడు నడుగుల మ్రోల నిల్చి
ముద్దు గురియుచుఁ బలుమఱు మ్రొక్కు నిట్టి । దాని నిన్నేల పాపుదు మాననీయ! 77

ప్రతిపదార్థం: మాననీయ!= మన్నించదగినవాడా!; కరి= ఏనుగు; చెలంగి= పొంగిపోయి; నీ మీఁదన్= నీపై; పుష్కరము= తొండాన్ని; చాఁచి= ప్రసరింపచేసి; మూరుకొనియెడున్= తలను వాసన చూస్తున్నది; అడుగుల మ్రోలన్= పాదాల దగ్గర; నిల్చి= నిలబడి; ముద్దు కురియుచున్= ప్రేమను ఒలకపోస్తూ; పలుమఱున్= పెక్కుమారులు; మ్రొక్కున్= మ్రొక్కుతున్నది; ఇట్టిదానిన్= ఇట్టిదానిని; నిన్నున్= నిన్ను; ఏల= ఎందుకు; పాపుదున్= విడదీస్తాను?

తాత్పర్యం: 'మాననీయా! ఈ ఏనుగు ఆనందంతో పొంగిపోతూ నీమీద తొండం చాచి మూర్ధాఘ్రాణం చేస్తున్నది. పాదాలదగ్గర నిలిచి ప్రేమను ఒలకబోస్తూ నీకు పెక్కుసార్లు మ్రొక్కుతున్నది. ఇట్టి దీనినీ, నిన్నూ నేను ఎందుకు విడదీస్తానయ్యా?

మ. ననునే డాఁచెద నన్న నేబుధులుఁ గానంజాల రక్షీణబో
ధన సంపత్తి నెఱింగి తేర్పడ మునీంద్రా! రండు నీవున్ భవ
త్తనయుండీ కరియున్ నితాంతసుఖ నిత్యంబైన నాకంబునం
దనపాయస్థితి మత్సఖత్వమునఁ బెంపారం బ్రవర్తింపఁగన్.' 78

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠుడా!; ననున్= నన్ను; నేన్= నేను; డాఁచెదను= గుప్తపరచుకుంటాను; అన్నన్= అంటే; ఏ బుధులు= ఏ దేవతలు; కానన్, చాలరు= తెలిసికొనలేరు; అక్షీణ బోధన సంపత్తిన్= తరుగని జ్ఞానం అనే సంపదతో; ఏర్పడన్= స్పష్టంగా; ఎఱింగితి(వి)= తెలిసికొన్నావు; నీవున్= నీవూ; భవత్ తనయుండు= నీ కొడుకు; ఈ కరియున్= ఈ ఏనుగున్నూ; నితాంతసుఖ నిత్యంబు= చెడని సుఖంతో శాశ్వతం; ఐన నాకంబు+నందున్= అయిన స్వర్గంలో; అనపాయ స్థితిన్= అపాయము (ఎడబాటు) లేని స్థితితో; మత్ సఖత్వమునన్= నా చెలిమితో; పెంపు+ఆరన్= మన్నన కలుగునట్లుగా; ప్రవర్తింపఁగన్= ఉండటానికి; రండు= రండి.

తాత్పర్యం: మునివర్యా! నన్ను నేను గోప్యం చేసికొనదలచితే ఏ దేవతలు కనుగొనలేరు. కాని నీవు తరగని జ్ఞాన సంపదతో నన్ను గుర్తుపట్టావు. నీవూ నీ కొడుకైన ఈ ఏనుగు స్వర్గంలో మరల తిరిగి రానక్కరలేని స్థితితో నా చెలిమితో మన్ననగా ప్రవర్తించటానికి రండి.'

విశేషం: నితాంతసుఖ నిత్యము - దుఃఖం మందుకైనా ఉండదని భావం. అనపాయస్థితిన్ 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' - పుణ్యం క్షీణిస్తే జనులు మరల భూలోకానికి వస్తారు - అని గీత. 'మీకు అట్టి స్వర్గపు ఎడబాటు ఉండదు' అని తాత్పర్యం. మత్, సఖత్వమునన్ - స్వర్గంలో తక్కినవారివలె నిన్నొక సామాన్య వ్యక్తిగా చూడను. నాకు సమప్రాణుడిగా చూస్తాను అని వక్కణ. 'సమప్రాణః సఖా మతః' - తన ప్రాణంతో సమానంగా ఎవరిని పరిగణించి వ్యవహరిస్తాడో అతడే సఖుడు.

ఆ. అనుడు సంతసిల్లి యట్ల కాకనిన న । మ్మని వరుండుఁ గరియు మున్ను గాఁగ
నేఁగె దివమునకు మహేంద్రుండు సమ్మోద । భరితుఁడగుచుఁ గురునృపాల వర్య! 79

ప్రతిపదార్థం: కురునృపాలవర్య= కురు రాజోత్తమా!; అనుడున్= అన్నంతనే; సంతసిల్లి= ఆనందించి; అట్లు+అ= అట్లే; కాక= అగుగాక!; అనినన్= అనగా; మహేంద్రుండు= దేవరాజ్యాధిపతి; ఆ+మునివరుండున్= ఆ మునిశ్రేష్ఠుడునూ; కరియున్= ఏనుగునూ; మున్ను= ముందు; కాఁగన్= అగునట్లుగా; దివమునకున్= స్వర్గానికి; సమ్మోద భరితుఁడు= పరమానందంతో నిండినవాడూ; అగుచున్= అవుతూ; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అప్పుడా ముని అట్లాగే అనగా దేవేంద్రుడు, ఆ మహర్షినీ, ఏనుగునూ ముందు పెట్టుకొని పరమానందం నిండినవాడై స్వర్గానికి వెళ్ళాడు.

విశేషం: మున్ను కాగన్ - ఇది అత్యంత గౌరవాన్ని ప్రస్ఫుటీకరిస్తుంది. సమ్మోదభరితుడు - నిజంగా పరమానందం పొందవలసినవారు మునీ, ఏనుగూ. ఎందుకంటే వారి పుణ్యం పండి శాశ్వతసుఖ లోకాలకు పయనిస్తున్నారు. కాని తీసికొని వెళుతున్న సర్వసుఖదాత ఇంద్రుడు పరమానందం పొందుతున్నాడంటే మహాపుణ్యాత్ముల రాకవల్లనే దేవలోకం సుస్థిరమవుతుంది. తన పదవి భద్రంగా ఉంటుంది - అన్న భావం అతడికి కలిగించిందనే అర్థం ఇక్కడ వ్యక్తమవుతున్నది.

క. అనిన విని భీష్ముతో న । జ్జనపతి యిట్లనియెఁ 'దపము సారపు ధర్మం
బని యూఁది మీరు సెప్పుదు । రనఘా! లేకుండునే తదధికం బొకఁడున్?' 80

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ఆ+జనపతి= ఆ ధర్మరాజు; భీష్ముతోన్= భీష్మునితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అనఘా!= పుణ్యాత్మా!; తపము= తపస్సు; సారము+ధర్మంబు= అన్ని ధర్మాల సారం వంటిది; అని; మీరు= తమరు; ఊఁది= నొక్కి; చెప్పుదురు= చెపుతూ ఉంటారు; తత్+అధికంబు= దానికంటె ఎక్కువ అయినది; ఒకఁడున్= ఒక్కటి కూడా; లేక+ఉండునే= లేకుండా ఉంటుందా?

తాత్పర్యం: అని చెపితే విని ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు. 'మహాత్మా! మీరు తపస్సును సారమైన ధర్మంగా నొక్కి చెప్పుతూ ఉంటారు. దానిని మించిన ధర్మం మరొకటి లేదా?'

వ. అనుటయు నా దేవవ్రతుం డానరదేవోత్తము నర్మిలి నాలోకించి. 81

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఆ నరదేవ+ఉత్తమున్= రాజులలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజును; అర్మిలిన్= ప్రేమతో; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అనగా ఆ దేవవ్రతుడు ఆ రాజశ్రేష్ఠుడిని ప్రేమతో చూచి (ఇట్లా చెప్పాడు)

విశేషం: దేవవ్రతుడు భీష్ముడి పుట్టుపేరు; అర్మిలిన్-ఉత్తమప్రశ్న అడిగినందుకు కలిగిన ఆనందాన్ని ఇది అభివ్యక్తం చేస్తుంది.

భగీరథునకు బ్రహ్మతో నైన సంవాదప్రకారము (సం.13-160-1 (కుంభ))

సీ. వినుము ధర్మము లెల్ల వినుతకృత్యంబుల । తప మెన్ని యెన్నఁగా ధర్మ మెందుఁ
గలదు?; తపం బనఁగా నియతాశన । త్వము; భగీరథుఁడు పద్మజుని సభకు
నరిగిన నతనితో నద్దేవుఁ డిందుల । కతుల నిర్మలతపమాచరింప
కరుగుదేరంగ నెవ్వరికిని రాదెట్లు । వచ్చితో? యనిన నవ్వసుమతీశుఁ

తే. డేను గోదానములును భూదానములును । గన్యకాదానములుఁ దీర్థకలనములును
రాజసూయాశ్వమేధాధ్వరములుఁ బెక్కు । సేసినాఁడ వచ్చుట దానఁజేసి కాదు. 82

ప్రతిపదార్థం: వినుము; ధర్మములు= ధర్మాలు; ఎల్లన్= అన్నీ; వినుత కృత్యంబులు+అ= కొనియాడదగిన పనులే; తపము= తపస్సును; ఎన్ని= పరిగణించి; ఎన్నఁగాన్= లెక్కించుటకు; ధర్మము= ధర్మం; ఎందున్= ఎక్కడ; కలదు?= ఉంది?; తపంబు= తపస్సు; అనఁగాన్= అంటే; నియత+అశనత్వము= నియమంతో కూడిన భోజనం తీసికోవటం; భగీరథుఁడు= భగీరథుడనే రాజు; పద్మజుని సభకున్= బ్రహ్మసభకు; అరిగినన్= పోగా; అతనితోన్= అతడితో; ఆ+దేవుఁడు= ఆ బ్రహ్మదేవుడు; ఇందులకున్= ఇక్కడికి; అతుల నిర్మల తపము= సాటిలేని దోషములేని తపస్సు; ఆచరింపక= చేయక; అరుగుదేరంగన్= రావటానికి; ఎవ్వరికిని= ఎట్టివారికైనా; రాదు= కాదు; ఎట్లు= ఏ విధంగా; వచ్చితి+ఓ?= వచ్చావో?; అనినన్= అంటే; ఆ+ వసుమతీ+ఈశుఁడు= ఆ రాజు; ఏను= నేను; గోదానములును= గోవుల దానాలూ; భూదానములును= భూముల దానాలూ; కన్యాదానములున్= కన్యకల దానాలూ; తీర్థ కలనములును= తీర్థాలకు పోవటం అనే పనులూ; రాజసూయ+ అశ్వమేధ+అధ్వరములున్= రాజసూయము, అశ్వమేధము అనే యజ్ఞాలూ; పెక్కు= ఎక్కువ; చేసినాఁడన్= చేసినవాడిని; వచ్చుట= ఇక్కడికి రావటం; దానన్ చేసి= దానివలన; కాదు.

తాత్పర్యం: వినుము. ధర్మాలన్నీ కొనియాడదగిన కార్యాలే. తపస్సును చెప్పి చెప్పగల ధర్మం ఎక్కడ ఉన్నది? తపస్సు అంటే నియమంతో భోజనం గ్రహించటం. భగీరథుడనే రాజు బ్రహ్మసభకు పోతే ఆ బ్రహ్మదేవుడు 'ఇక్కడకు సాటిలేనిదీ, స్వచ్ఛమైనదీ అయిన తపస్సు చేయకుండా రావటం ఎవ్వరికీ సాధ్యంకాదు. నీవు ఎట్లు వచ్చావో?' అన్నాడు. అపు డా రాజు 'నేను గోదానాలూ, భూదానాలూ, కన్యాదానాలూ, తీర్థయాత్రలూ, రాజసూయయాగాలూ, అశ్వమేధపుయజ్ఞాలూ ఎన్నో చేశాను. కాని ఇక్కడకు రావటం వాటివలన కాదు.

మ. అవనీదేవత లొక్కెడం గ్రతువిధి వ్యాసక్తు లై యుండఁ ద
త్ప్రవిఘాతంబులు దోఁచె నేను రణసంరంభంబునన్ వారి కు
త్సవ మొందించితి వానిఁబాపి ముదమొందన్ వారు నన్ బ్రహ్మపా
ల వరిష్ఠావ్యయ సౌఖ్య మొందు మని లీలం జెప్పినన్ వచ్చితిన్. 83

ప్రతిపదార్థం: అవనీదేవతలు= బ్రాహ్మణులు; ఒక్క+ఎడన్= ఒకచోట; క్రతు విధి వ్యాసక్తులు= యజ్ఞం పనిలో మిక్కిలి ఆసక్తి కలవారు; ఐ= అయి; ఉండన్= ఉండగా; తత్ ప్రవిఘాతంబులు= దానికి మహావిఘ్నాలు; తోఁచెన్= కన్పట్టాయి; నేను;

రణసంరంభంబునన్= యుద్ధపు ఆర్భాటంతో; వానిన్= ఆ విఘ్నాలను; పాపి= తొలగించి; వారికిన్= ఆ బ్రాహ్మణులకు; ఉత్సవము= ఆనందము; ఒందించితిన్= కలిగించాను; వారు= ఆ బ్రాహ్మణులు; ముదము+ఒందన్= సంతోషం కలుగగా; నన్= నన్ను; బ్రహ్మపాలన్= బ్రహ్మదేవుడి దగ్గర; వరిష్ఠ+అవ్యయ సౌఖ్యము= మిక్కిలి శ్రేష్ఠమైన నాశనములేని సుఖాన్ని; ఒందుము= పొందుము; అని; లీలన్= విలాసంగా; చెప్పినన్= చెప్పితే; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: బ్రాహ్మణులంతా ఒకచోట యజ్ఞకార్యంలో నిమగ్నులై ఉన్నారు. అప్పుడు ఆ పనికి ఎన్నో అవరోధాలు కలిగాయి. నేను యుద్ధం ఉద్ధృతంగా చేసి, ఆ ఆటంకాలను తొలగించి, వారి కానందం కలిగించాను. వారు నన్ను బ్రహ్మదగ్గర మిక్కిలి ఉత్తమం అయినదీ, ఎన్నటికీ తరిగిపోనిదీ అయిన ఆనందం పూర్ణసౌఖ్యంతో పొందవలసిందిగా లీలతో చెప్పారు, వచ్చాను.

విశేషం: లీలన్= బ్రహ్మదగ్గర సుఖం పొందుమని వారు విలాసంగా చెప్పారు. అనగా వారు బ్రహ్మను కూడా శాసింపగల మహిమగల వారని భావం.

తే. ఆఁకలియు నీరువట్టును నాదరింప । కేను విప్రులపని సేసి యిట్టిమహిమఁ
గంటి నియతాశనత్వమ కాక తప మ । నంగ వేఱొండె? ధర్మాభినంద్యహృదయ!' 84

ప్రతిపదార్థం: ధర్మ+అభినంద్య హృదయ!= ధర్మంచేత కొనియాడబడిన హృదయం కల మహానుభావా!; ఆఁకలియున్= ఆకలినీ; నీరువట్టును= దప్పికనూ; ఆదరింపక= లెక్కచేయక; ఏను= నేను; విప్రుల పని= బ్రాహ్మణోత్తముల పనిని; చేసి; ఇట్టి మహిమన్= ఇటువంటి గొప్పతనాన్ని; కంటిన్= పొందాను; నియత+అశనత్వము+అ= నిగ్రహించబడిన భోజనం కలతనమే; కాక; తపము= తపస్సు; అనంగన్= అనగా; వేఱు= ఇతరము; ఒండు+ఎ?= ఒకటి కలదా?

తాత్పర్యం: మహానుభావా! ఆకలినీ, దప్పినీ లెక్కచేయక విప్రవర్యుల కార్యాన్ని నిర్వహించి ఇట్టి మహిమ పొందగలిగాను. తపస్సు అంటే ఆహారంలోని నియమం కాక మరొకటి ఉన్నదా? నీ హృదయాన్ని ధర్మాలన్నీ కొనియాడుతాయి కదా!'

చ. అనుటయు బ్రహ్మ యవ్విభున కర్చన లిచ్చి తగంగ గారవిం
చె నధిప! నీవు విప్రుల భజింపుము సంయమితాశనుండవై
యని దివిజాపగాసుతుఁడు సాదరభాషణ వృత్తిఁ జెప్పిన
న్విని ముదమంది ధర్మజుఁడు నెమ్మి దలిర్పఁగ నమ్మహాత్ముతోన్. 85

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అనుటయున్= అని చెప్పగా; బ్రహ్మ; ఆ+విభునకున్= ఆ రాజునకు; అర్చనలు= పూజనలు (మన్ననలు); ఇచ్చి= ఒసగి; తగంగన్= తగు తీరున; గారవించెన్= మర్యాద చేశాడు; నీవును= నీవుకూడా; సంయమిత+అశనుండవు= నిండుగా అదుపుగల భోజనం కలవాడవు; ఐ= అయి; విప్రులన్= ఉత్తమ విద్యావంతులగు బ్రాహ్మణులను; భజింపుము= సేవించుము; అని; దివిజ+ఆపగాసుతుఁడు= దేవలోకంలో పుట్టిన నదియొక్క కొడుకు; సాదర భాషణ వృత్తిన్= ప్రీతితో కూడిన మాటల ప్రవర్తనతో; చెప్పినన్= ఉపదేశించగా; ధర్మజుఁడు= ధర్మరాజు; విని, ముదము= సంతోషము; అంది= పొంది; నెమ్మి= ప్రేమ; తలిర్పఁగన్= పుట్టగా; ఆ+మహాత్ముతోన్= మహాత్ముడైన ఆ భీష్ముడితో.

తాత్పర్యం: భగీరథు డట్లా చెప్పగా బ్రహ్మ ఆ రాజును గొప్పగా మన్నించి తగు విధంగా గౌరవించాడు. రాజా! నీవు కూడా భోజనవిషయంలో చెడని నిష్ఠ కలవాడవై విప్రులను సేవించుము' అని భీష్ముడు ఆదరపూర్వకంగా చెప్పితే, విని, పరమానందం పొంది, ధర్మరాజు ప్రేమ చిగురించగా ఆ మహాత్ముడితో ఇట్లా అన్నాడు.

విశేషం: దివిజాపగాసుతుడు - అతడు చెప్పే విషయాలన్నీ అతడి తల్లి అమృతహృదయంవలె అమృతాయమానంగా ఉన్నాయని స్ఫురించే అర్థం. సాదరభాషణవృత్తిన్ - భీష్ముడి మాటలలో అనాదరభావం వెదకిచూచినా లేదు. అందుకనే ఇంకా ఇంకా ధర్మరాజు అడుగగలుగుతున్నాడు.

క. 'పురుషుఁడు శతాయు వనుశ్రుతి । పురుషవరా! బాలురైనఁ బొందుదురు మృతిం
జిరమగు నేమిట నాయు వ । చిరమగు నెద్దానఁ? దెలియఁజెప్పుము కరుణన్.' 86

ప్రతిపదార్థం: పురుషవరా!= పురుషశ్రేష్ఠా!; శ్రుతి= వేదం; పురుషుఁడు= మానవుడు; శత+ఆయువు= నూరేండ్ల ఆయువు కలవాడు; అనున్= అంటున్నది; బాలురు= చిన్నవయస్సువారు; ఐనన్= కూడా; మృతిన్= చావును; పొందుదురు= పొందుతూ ఉంటారు; ఏమిటన్= దేనిచేత; ఆయువు= జీవితకాలం; చిరము= ఎక్కువకాలం కలది; అగున్= అవుతుంది?; ఏ+దానన్=దేని చేత; అచిరము= తక్కువకాలం కలది; అగున్= అవుతుంది; కరుణన్= దయతో; తెలియన్= నాకు తెలిసేటట్లుగా, చెప్పుము.

తాత్పర్యం: 'మహాత్మా! వేదం పురుషుడు నూరేండ్ల బ్రదుకు కలవాడని అంటున్నది. కానీ చిన్నతనంలోనే కొందరు మరణిస్తున్నారు. దేనిచేత ఆయువు వృద్ధి పొందుతుంది? దేనిచేత తరిగిపోతుంది? దయతో నాకు తెలియజెప్పుము.'

వ. అనుటయు నయ్యఖిలధర్మవేది యవ్విభున కిట్లనియె. 87

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+అఖిలధర్మవేది= సమస్త ధర్మాలు తెలిసిన ఆ దేవవ్రతుడు; ఆ+విభునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అడిగితే సర్వధర్మాలు తెలిసిన ఆ శంతనుకుమారుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'అనఘ! ఆచార మాయువుఁ బెనుచు నదియ । కాదు శ్రీయును గీర్తియుం గలుగఁ జేయు
విను దురాచారుఁ డాయువు పెనుపుఁ బొందఁ । డతని సర్వభూతంబులు నభిభవించు.' 88

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; ఆచారము= సత్ప్రవర్తనము; ఆయువున్= జీవితకాలాన్ని; పెనుచున్= పెంచుతుంది; అది+అ+కాదు= అంతేకాదు; కాదు; శ్రీయును= సంపదను; కీర్తియున్= కీర్తినీ; కలుగన్+చేయున్= కలిగేటట్లు చేస్తుంది; విను= వినుము; దురాచారుఁడు= చెడు నడవడి కలవాడు; ఆయువు పెనుపున్= ఆయువు యొక్క వృద్ధిని; పొందఁడు= చెందడు; అతనిన్= అట్టివాడిని; సర్వభూతంబులు= అన్ని భూతాలు; అభిభవించున్= ఛీ కొట్టుతాయి.

తాత్పర్యం: 'పుణ్యాత్ముడా! ఆచారం ఆయువును పెంచుతుంది. అంతేకాదు - సంపదను, కీర్తినీ కలిగిస్తుంది. ఇక దురాచారుడు ఆయుర్వృద్ధిని పొందలేడు. సర్వభూతాలూ వాడిని తిరస్కరిస్తాయి.

విశేషం: ఆచారమంటే శాస్త్రం చెప్పిన విధంగా నడచుకొనటం, సర్వభూతాలు - భూమి మొదలైన పంచభూతాలు లేక సర్వప్రాణులు, పదార్థాలు. అభిభవించు - అవి తిరస్కరిస్తే బ్రదుకు లేదని భావం.

క. కావున నాచారపరత ।భూవర! మేల్ సాధుజనులు వోవు తెరువు సం
భావించుట యాచారము । దా వర్ణాశ్రమ సమర్థతం బరఁగు నృపా! 89

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; కావునన్= కాబట్టి; ఆచారపరత= ఆచారంలో నిష్ఠ; మేల్= మంచిది; సాధుజనులు= ఉత్తములైన మనుష్యులు; పోవు తెరువు= నడచే దారిని; సంభావించుట= చక్కగా తెలిసికొని ప్రవర్తించటం; ఆచారము= ఆచారం; నృపా!= రాజా!; తాన్= అది; వర్ణ+ఆశ్రమ సమర్థతన్= వర్ణములు, ఆశ్రమములు అనువాని కనుగుణ మైనదై; పరఁగున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: రాజా! కనుక ఆచారం గట్టిగా పాటించటం మంచిది. ఉత్తమపురుషులు పోయే మార్గాన్ని చక్కగా తెలిసికొని నడచుకొనటమే ఆచారం. అది వర్ణధర్మాలకు, ఆశ్రమధర్మాలకు అనుగుణమై ఉంటుంది.

విశేషం: ధర్మాలన్నీ స్వయంగా తెలిసికొనటం తేలికకాదు. అందుకని పురాణేతిహాసాలలో మహానుభావులైన వారు ఆయా సందర్భాలలో ఎలా ప్రవర్తించారో చక్కగా తెలిసికొని ఆ విధంగా ఆచరించాలని ఇక్కడ సూచన. వేదం 'అథ యది తే కర్మ విచికిత్సా, వృత్తి విచికిత్సా స్యాత్' - నీకు కర్మములో గానీ, నడవడిలో గానీ సందేహము కలిగితే - ఇత్యాదివాక్యాలలో ఈ అంశాన్ని చక్కగా నిరూపించింది.

ఆ. గురునిమాట సరకు గొనమి దుశ్శీలత । పిట్ట పుడుక గోరు పిసుకఁ ద్రుంపఁ
గఱవ మరుగు టుదయకాలాస్తమయ సమ । యముల భానుఁ జూచు టాయు వడఁచు. 90

ప్రతిపదార్థం: గురునిమాట= గురువు వాక్యాన్ని; సరకు+కొనమి= లెక్కచేయకపోవటం; దుస్+శీలత= చెడు నడవడి కలిగి ఉండటం; పిట్ట= పక్షిని; పుడుక= పుడకనూ; గోరున్= గోటినీ; పిసుకన్= పిసుకగా; త్రుంపన్= త్రుంచగా; కఱవన్= కొరకగా; మరుగుట= అలవాటుపడుతూ; ఉదయకాల+అస్తమయ సమయములన్= సూర్యుడు ఉదయించే కాలంలోనూ; అస్తమించే కాలంలోనూ, భానున్= సూర్యుడిని; చూచుట= చూడటమూ; ఆయువు= జీవితకాలాన్ని; అడఁచున్= అణచివేస్తుంది.

తాత్పర్యం: గురువులమాటను లెక్కచేయకపోవటం, చెడు నడవడితో మెలగటం, పిట్టను పిసకటానికీ, పుడకను త్రుంచటానికీ, గోళ్ళను కొరకటానికీ అలవాటు పడటం; ఉదయ అస్తమయ కాలాలలో సూర్యుడిని చూడటం ఆయువును హరించివేస్తాయి.

విశేషం: పిట్ట.... ఇక్కడ క్రమాన్వయం. పిట్ట, పిసుకన్, పుడుక... ద్రుంపన్, గోరు - కఱవన్ - మరుగుట అని అన్వయం.

క. విను క్రోధంబును హింసయు । నన్నృతంబును లేమి సంధ్య లైనం దదుపా
సనము సురపూజనము రే - పానరించుట చిరతరాయు వొనరించు నృపా! 91

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; విను= జాగ్రత్తగా ఆలకించుము; క్రోధంబును= తీవ్రమైన కోపమూ; హింసయున్= ఇతరులను పీడించటం; అనృతంబును= అసత్యమూ; లేమి= లేకపోవటం ; సంధ్యలు=సంధ్యాకాలాలు; ఐనన్= కలిగినప్పుడు; తత్+ ఉపాసనము= ఆ సంధ్యాదేవిని పూజించటము; రేపు= ప్రతి ఉదయకాలమునందు; సురపూజనము= దేవతలను అర్చించటము; చిరతర+ఆయువు= మిక్కిలి ఎక్కువ ఆయువును; ఒనరించున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: రాజా! జాగ్రత్తగా వినుము. క్రోధం, హింస, అసత్యం అనే వాటిని లేకుండా చూచుకొనాలి. సంధ్యాకాలం వచ్చినప్పుడు ఉపాసించాలి. ప్రతి ఉదయం దేవతలను అర్చించాలి. ఈ పనులు ఆయువును పెంపొందిస్తాయి.

క. పరదారగమన మొప్పదు, । పురుషున కది యెల్ల పాపములకంటె నరే
శ్వరవర! యాయుస్సంక్షయ । కరంబు దద్వర్జనంబు గడు మే లరయన్. 92

ప్రతిపదార్థం: నర+ఈశ్వర వర!= రాజవరేణ్యా!; పురుషునకున్= మానవుడికి; పరదార గమనము= ఇతరుల భార్యలను పొందటం; ఒప్పదు= తగదు; అది= పరదారగమనం; ఎల్ల పాపముల కంటెన్= అన్ని పాపాలకంటె; ఆయుస్+సంక్షయ కరంబు= ఆయువును మిక్కిలిగా నాశనం చేసేది; తత్+వర్జనంబు= దానిని వదలటం; అరయన్= పరికించితే; కడున్= మిక్కిలి; మేలు= శ్రేష్ఠము.

తాత్పర్యం: రాజా! ఇతరుల భార్యలను పొందటం కూడదు. అది అన్ని పాపాలకంటే ఎక్కువగా ఆయువును కుదించి వేస్తుంది. దానిని వదలటం ఎంతో మంచిది.

విశేషం: పురుషపరంగా పరదారగమనం గురించి చెప్పారు. అట్లాగే స్త్రీపరంగా పరపురుషగమనం కూడా ఉపలక్షణంగా ఇక్కడ గ్రహించవచ్చును.

క. పరదారలయందును సఖి । గురువృద్ధ నృపాలబాలకుల బాంధవభూ
సుర వైద్య భృత్య బుధ నా । గరికుల సతు లాయువునకుఁ గడుఁ జే టనఘా! 93

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; పరదారలయందును= ఇతరుల సతుల విషయంలో కూడా; సఖి= మిత్రుడు; గురు= గురువు; వృద్ధ= పెద్దవాడు; నృపాల= రాజు; బాలకుల= పిన్నవారి యొక్క; బాంధవ= చుట్టాలు; భూసుర= బ్రాహ్మణులు; వైద్య= వైద్యులు; భృత్య= సేవకులు; బుధ= పండితులు, నాగరికుల= నగరాధికారులు (నగరంలో ఉండేవారు) అనే ఇట్టివారియొక్క; సతులు= భార్యలు; ఆయువునకున్= బ్రదుకునకు; కడున్= మిక్కిలిగా; చేటు= కీడు.

తాత్పర్యం: పరభార్యలలో కూడా మిత్రుడు, గురువు, పెద్దవాడు, రాజు, బాలుడు, చుట్టము, బ్రాహ్మణుడు, వైద్యుడు, సేవకుడు, పండితుడు, నాగరికుడు అనువారి భార్యలు మరింత ఎక్కువగా ఆయువునకు కీడు చేస్తారు.

విశేషం: ఇది ఊరకే హెచ్చరికకొరకు చెప్పినమాట. ఎవరి సంపర్కమైనా అట్టిదే.

వ. అని చెప్పి. 94

తాత్పర్యం: ఇట్లా వివరించి.

క. మేలివి గీడివి యని భూ । పాలక! యేఁ జెప్పినట్టి పను లెఱుఁగుము నీ
పోలిన యాయువు పెనుపం । జాలు ననియు నపహరింప శక్తము లనియున్. 95

ప్రతిపదార్థం: భూపాలక!= రాజా!; ఇవి; మేలు= శ్రేష్ఠములు; ఇవి; కీడు= చెడ్డవి; అని; ఏన్= నేను; చెప్పిన+అట్టి, పనులు= చెప్పిన కార్యములు; నీ పోలిన ఆయువున్= నీవు భావించిన ఆయువును; పెనుపన్= పెంచుటకు; చాలున్= చాలును;

అనియున్= అనీ; అపహరింపన్= తగ్గించివేయుటకు; శక్తములు= సమర్థములు; అనియున్= అనీ; ఎఱుఁగుము= తెలిసికొనుము.

తాత్పర్యం: రాజా! నేను చెప్పినట్టి పనులలో మంచివి ఆయువును పెంచేవి అనీ, కీడైనవి ఆయువును త్రుంచేవి అనీ తెలిసికొనుము.

తే. తగనియది యెద్దియైన వ్రతంబు పూని । మాన నోచిన నాయువు మాల్పకుండు
నంతటన పోవ దాయు వత్యంతవృద్ధిఁ । జేయుఁ దగినది సేసినఁ జెప్పనేల? 96

ప్రతిపదార్థం: తగని+అది= కూడనిది; ఎద్ది= ఏది; ఐనన్= అయినా; వ్రతంబు= వ్రతము; పూని=సంకల్పించి; మానన్= మానినా; నోచినన్= నోచినా; ఆయువున్= ఆయువును; మాల్పక= చెడగొట్టక; ఉండున్= ఉంటుంది; అంతటన్+అ= అంత మాత్రాన; పోవదు= పోదు; ఆయువు= బ్రదుకును; అత్యంత వృద్ధిన్= మిక్కిలి పెరిగినదానిని; చేయున్= చేస్తుంది; తగిన+అది= తగినది; చేసినన్= చేస్తే; చెప్పన్ ఏల?= చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: తనకు కూడనిదైనా ఒక వ్రతాన్ని సంకల్పించి మానినా, నోచినా ఆయువును చెడకుండా చూస్తుంది. అంతేకాదు, ఆయువును ఎక్కువగా పెంపొందిస్తుంది. అంటే ఇక తగిన వ్రతం చేస్తే కలిగే ఫలం ఏమిటో చెప్పనేల?

వ. అని పరిభాషించి. 97

తాత్పర్యం: అని పలికి.

క. దేవగృహము కడ వీథిని । గోవాటమునందు రచ్చకొట్టము పొంతన్
భూవర! సస్యములను వి । ష్ఠావిసృజన మొప్పదండ్రు చారిత్రవిదుల్. 98

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; చారిత్రవిదుల్= నడవడిని గూర్చి ఎరిగినవారు; దేవగృహము కడన్= దేవాలయం దగ్గర; వీథిని= నలుగురు నడిచే బాటలో; గోవాటమునందున్= గోవుల శాల సమీపంలో; రచ్చకొట్టము పొంతన్= రచ్చ సావడి దరిని; సస్యములను= పంటలదగ్గరా; విష్ఠావిసృజనము= మలం వదలటం; ఒప్పదు= కూడదు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఆచారం తెలిసినవారు దేవాలయం దగ్గరా, వీథిలోను, గోశాల దగ్గరా, రచ్చసావడి దరినీ, పంటలమీదా మలవిసర్జనం చేయరాదని చెప్తుతారు.

ఆ. ప్రాఙ్ముఖుండు నార్ద్రపాదుండు నై భోజ । నంబు సేఁత మే లనంగ విందు
నిలిచియుండి కుడుపు నింద్య మమ్మెయి మూత్ర । సర్జనంబుఁ బాపసరణి యండ్రు. 99

ప్రతిపదార్థం: ప్రాక్+ముఖుండున్= తూర్పుదిక్కు మొగమైనవాడు; ఆర్ద్రపాదుండున్= తడికాళ్ళు కలవాడును; ఐ= అయి; భోజనంబు+చేఁత= అన్నం తినటం; మేలు=శ్రేష్ఠము; అనంగన్= అని చెప్పగా; విందున్= వింటూ ఉన్నాను; నిలిచి ఉండి= నిలబడి; కుడుపు= తినటం; నింద్యము= దోషము; ఆ+మెయిన్= అదే విధంగా; మూత్ర సర్జనంబున్= మూత్రం వదలటం కూడా; పాపసరణి= పాపపు పద్ధతి; అండ్రు= అంటారు.

తాత్పర్యం: తూర్పుమొగం అయినవాడు, కడుగుకొన్న కాళ్ళు కలవాడునై భోజనం చేయటం చాలా మంచిదని విన్నాను. నిలిచియుండి భోజనం చేయటం తప్పు. అట్లాగే నిలిచి మూత్రం వదలటం కూడా పాపపు పద్ధతి అని చెప్తుతారు.

విశేషం: ఆర్ద్రపాదుడు - తడికాళ్ళు కలవాడు - అంటే భోజనానికి ముందు కాళ్ళు కడుగుకొనాలని అర్థం.

క. అనలము గోవును బ్రాహ్మణుఁ జన దెంగిలితోడ ముట్టఁ జంద్రార్కులఁ జూ
డను నమ్మెయిఁ దగ దాసన । మును గాంస్యము ననఘ! భిన్నములు వర్జ్యంబుల్. 100

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అనలమున్= అగ్నిని; గోవును= ఆవును; బ్రాహ్మణున్= బ్రహ్మజ్ఞానము కలవాడిని; ఎంగిలితోడన్= ఎంగిలితో; ముట్టన్= తాకుట; చనదు= కూడదు; ఆ+మెయిన్= అదే విధంగా; చంద్ర+ఆర్కులన్= చంద్రుడినీ, సూర్యుడినీ; చూడను= చూడటం కూడా; తగదు= పనికిరాదు; ఆసనమును= పీటా; కాంస్యము= కంచుపాత్రా; భిన్నములు= పగిలిపోయినవి; వర్జ్యంబుల్= విడువదగినవి.

తాత్పర్యం: అగ్నిని, ఆవును, బ్రాహ్మణుడిని ఎంగిలితో ముట్టరాదు. అట్లాగే ఎంగిలితో చంద్రుడిని, సూర్యుడిని చూడరాదు. పగిలిపోయిన ఆసనాన్నీ, కంచుపాత్రను విడిచివేయాలి.

ఆ. వృద్ధు వచ్చునపుడు విను బాలు ప్రాణంబు । లెగయఁజూచి యతని కెదురు లేచి
ప్రణతిఁ జేసెనేనిఁ బాదునఁబడి యవి । దొంటి యట్ల నిలుచు దురితదూర! 101

ప్రతిపదార్థం: దురితదూర!= పాపాలకు దూరమైనవాడా!; విను= వినుము, వృద్ధు= పెద్దవాడు; వచ్చు+అపుడు= వచ్చే సమయంలో; బాలు ప్రాణంబులు= చిన్నవాని ప్రాణాలు; ఎగయున్= పైకి లేచుటకు; చూచి; అతనికిన్= ఆ పెద్దవానికి; ఎదురు=ఎదురుగా; లేచి; ప్రణతిన్= నమస్కారమును; చేసెన్, ఏనిన్= చేసినట్లైతే; పాదునన్= మూలస్థానంలో; పడి; తొంటి+అట్లు+అ= ముందటి విధంగానే; నిలుచున్= నిలుస్తాయి.

తాత్పర్యం: దురితదూరా! పెద్దవాడు ఎదురుగా వస్తున్నప్పుడు చిన్నవాడి ప్రాణాలు పైకి లేచిపోవటానికి చూచి, అతడికి ఎదురుగా లేచి నమస్కారం చేస్తే మళ్ళీ అవి తమ కుదుళ్ళలో మునుపటివలె చేరుకొని నిలిచి ఉంటాయి.

విశేషం: దీనినే ప్రత్యుత్థానం అంటారు. పెద్దవారికి లేచి ఎదురువెళ్ళటం, అభివాదనం కూడా ఇటువంటిదే. నామగోత్రాలు చెప్పి పెద్దవారికి నమస్కరించటం.

తే. అధ్యయనమున మస్తకం బంటుటయును । నిద్రయును నశుచితతోడ నింద్యకోటి
శిరము గోకంగఁ దగ దిరుచేత మస్త । కంబు తైలంబుఁ బూయఁగాఁ గాదు మేన. 102

ప్రతిపదార్థం: అధ్యయనమునన్= వేదాలు చదివే సమయంలో; మస్తకంబు= తలను; అంటుటయును= తాకుట; అశుచిత తోడన్= శౌచము లేకుండా; నిద్రయును= నిద్రించటమూ; నింద్యకోటి= దోషసముదాయంలోనివి; ఇరుచేతన్= రెండు చేతులతో; శిరమున్= తలను; గోకంగన్= గీరటం; తగదు= కూడదు; మస్తకంబు తైలంబు= తలమీది నూనెను; మేనన్= ఒంటిమీద; పూయఁగాన్= పూయటం; కాదు= కూడదు.

తాత్పర్యం: వేదం చదువుతూ తలను తాకరాదు. పరిశుభ్రత లేకుండా నిద్రపోరాదు. ఇవి దోషాల వరుసలోనివి. రెండు చేతులతో తల గోకరాదు. తలమీది నూనెను ఒంటికి పూసుకోరాదు.

సీ. వైరనిర్బంధంబు వలవదు గురునితో । నతఁడు కోపించిన ననుసరించి
తేర్చుట మేలు నిందించుట గురునెడ । నన్నృతమాడుట మాయు వపహరించు

విప్రగోక్షత్రియ వృద్ధ దుర్బల భార । వహ గర్భిణులకు నీవలయుఁ దెరువు
మాన్యభూదేవుని మంగళంబుల వన । స్పతులను వలగొని చనఁగవలయుఁ

తే. బంచదశిని జతుర్దశిఁ బద్మమిత్ర । వసుతిథుల జన్మతిథులందు వలయు బ్రహ్మ
చర్య మడుగు లొండొంటితోఁ జనదు తోమ । దోషములు గొండియముఁ గ్రూరభాషణంబు. 103

ప్రతిపదార్థం: గురునితోన్= గురువుతో; వైరనిర్బంధంబు= పగతోడి పట్టుదల; వలవదు= వద్దు; అతఁడు= గురువు; కోపించినన్= కోపం చెందినా; అనుసరించి= వెంటపడి; తేర్చుట= ప్రసన్నుడిని చేయటం; మేలు= మంచిది; నిందించుట= తిట్టటం; గురు+ఎడన్= గురువు విషయంలో; అనృతము= అబద్ధం; ఆడుట= పలకటం; ఆయువున్= జీవితకాలాన్ని; అపహరించున్= తొలగిస్తుంది; విప్ర= బ్రాహ్మణులకు; గో= ఆవులకు; క్షత్రియ= దేశాలనేలే రాజులకు; వృద్ధ= పెద్దవారికి; దుర్బల= ఒడలియందు సత్తువలేని వారికీ; భారవహ= బరువులు మోస్తున్నవారికి; గర్భిణులకున్= గర్భవతులైన స్త్రీలకు; తెరువున్= దారిని; ఈన్+వలయున్= ఇవ్వాలి; మాన్యభూదేవునిన్= పూజింపదగిన బ్రాహ్మణుడిని; మంగళంబులన్= మంగళం కలిగించే గోవు మున్నగువానిని; వనస్పతులను= మంచి చెట్లను; వలగొని= ప్రదక్షిణం చేసి; చనఁగన్ వలయున్= వెళ్ళాలి; పంచదశిని= పూర్ణిమ అమావాస్య దినాలలో; చతుర్దశిన్= చతుర్దశి తిథియందు (పక్షంలో పదునాలుగవ దినం); పద్మమిత్ర వసు తిథులన్= ద్వాదశి; అష్టమి తిథులందు, జన్మతిథులందున్= పుట్టిననాటి తిథులందు; బ్రహ్మచర్యము= భార్యాసంగమం చేయకుండటం మొదలైన బ్రహ్మచర్యధర్మం; వలయున్= పాటించాలి; అడుగులు= పాదాలను; ఒండొంటితోన్= ఒకదానితో మరొకదానిని; తోమన్= తోముట; చనదు= కూడదు; కొండియమున్= చాడీ, పితూరీలు చెప్పటం; క్రూరభాషణంబు= పరుషంగా పలకటం; దోషములు= తప్పుడు పనులు.

తాత్పర్యం: గురువుతో వదలని శత్రుభావం కూడదు. అతడు కోపించినా అనుసరించి ప్రసన్నుడిని చేసికొనటం మంచిది. గురువును నిందించటం, అతడి విషయాలలో అబద్ధాలు చెప్పటం ఆయువును బాగా తగ్గించి వేస్తాయి. దారిలో నడుస్తున్నప్పుడు ఎదురుగా ఉత్తమబ్రాహ్మణులు, ఆవులు, క్షత్రియులు, ముసలివారు, బలహీనులు, బరువు మోసేవారు, గర్భవతులు వస్తుంటే తాను తప్పుకొని వారికి దారి ఇవ్వాలి. పూజింపదగిన బ్రాహ్మణుడు, మంగళవస్తువులు, చెట్లు కనబడితే వాటికి ప్రదక్షిణం చేసి వెళ్ళాలి. పూర్ణిమ అమావాస్యలలో, చతుర్దశినాడు, ద్వాదశి, అష్టమి తిథులలో, జన్మతిథినాడూ బ్రహ్మచర్యం పాటించాలి. కాళ్ళు ఒకదానితో ఒకటి తోమరాదు. చాడీలు చెప్పటం, పరుషంగా పలకటం దోషాలు.

విశేషం: పద్మమిత్రుడంటే సూర్యుడు - ద్వాదశాదిత్యులు కనుక పద్మమిత్రతిథి అంటే ద్వాదశిః వసువు లెనమండుగురు. కనుక అష్టమి.

తే. అంగహీను దరిద్రు విద్యావిహీను । రూపహీనునిఁ దెగడుట పాప మండ్రు
వేద దేవతానిందలు వేతనార్థ । కముగ జోస్యంబు నడపుట కల్మషములు. 104

ప్రతిపదార్థం: అంగహీనున్= అవయవాలు పోయినవాడిని; దరిద్రున్= బీదవాడిని; విద్యావిహీనున్= చదువులేనివాడిని; రూపహీనునిన్= అందచందాలు లేనివాడిని; తెగడుట= నిందించటం; పాపము= పాపం; అండ్రు =అంటారు; వేద దేవతానిందలు= వేదాలను, దేవతలను నిందించటం, వేతన+అర్థకముగన్= బత్తెం కోసం; జోస్యంబు= జ్యోతిషమును; నడపుట= సాగించటం; కల్మషములు= పాపాలు.

తాత్పర్యం: అవయవాలు లోపించినవాడినీ, లేమితో బాధపడేవాడినీ, చదువురానివాడినీ, అందచందాలు లేనివాడినీ నిందించటం పాపం. వేదాలను, దేవతలను తూలనాడటం, బత్తెంకోసం జోస్యం చెప్పటం పాపాలు.

విశేషం: 'అంగహీనునన్' ఇత్యాది-సాధారణంగా 'ఆ కుంటివాడు, ఈ గ్రుడ్డివాడు, దరిద్రుడు, చదువూ సంధ్యాలేని మూర్ఖుడు' ఇత్యాదిగా మాటలు వింటూ ఉంటాం. ఈ వైఖరి పాపంగా భారతం చెబుతున్నది. నిజానికి ఈ అవలక్షణాలు వారు స్వయంగా అప్పుడు చేసుకున్న తప్పులు కావు. పూర్వజన్మపు పాపఫలాలు. అట్టివాడిని నిందిస్తే అట్టి తప్పే తానూ చేసినట్లు అవుతుంది. అట్టి ఫలాలనే అనుభవించ వలసి వస్తుంది.

సీ. దంతధావనము మూత్రపురీష సర్జనం । బులు మౌనియై చేయవలయు; నుభయ
సంధ్యల నిద్రింపఁ జనదు; తండ్రికి రేపు । మ్రొక్కి యాచార్యవిప్రులకు వరుస
మఱి మ్రొక్కునది; వీరి కెఱఁగుట దక్కదే । వార్చనంబునకు మున్నన్యుకడకుఁ
జనఁగాదు; గర్భిణీసంయోగ । మొప్పదు । పరిణయంబునకు మున్ సురతసుఖము
తే. ననుభవించిన నవకీర్ణ యందు రట్టి । యఘము వోవుఁ బ్రాయశ్చిత్త మాచరింప
నుత్తరము పడమర దలయుఁగ శయింపఁ । దగదు శీర్ణతల్పంబు నిద్రయును గీడు. 105

ప్రతిపదార్థం: దంతధావనము= పండ్లు తోముట; మూత్రపురీష సర్జనంబులు= మూత్రం, మలం వదలటాలు; మౌని= మౌనం కలవాడు; ఐ= అయి; చేయువలయున్= చేయాలి; ఉభయ సంధ్యలన్= రెండు సంధ్యవేళలలోను; నిద్రింపన్+చనదు= నిద్రపోరాదు; రేపు= ఉదయకాలంలో; తండ్రికిన్= తండ్రికి; మ్రొక్కి= నమస్కరించి; ఆచార్య విప్రులకున్= వేదవిద్యలు నేర్పే గురువునకు, ఉత్తమ విద్యగల బ్రాహ్మణుడికి; వరుసన్= క్రమంగా; మఱి= తరువాత; మ్రొక్కునది= నమస్కరించాలి; వీరికిన్= వీరికి; ఎఱఁగుట= నమస్కరించటం; తక్క= తప్ప; దేవ+అర్చనంబునకున్= దేవతల పూజకు; మున్ను= ముందు; అన్యుకడకున్= ఇతరుల యొద్దకు; చనన్+కాదు= పోరాదు; గర్భిణీ సంయోగము= గర్భవతియైన భార్యను కలవటం; ఒప్పదు= కూడదు; పరిణయంబునకున్= పెండ్లికి; మున్= మునుపు; సురతసుఖమున్= రతిసుఖాన్ని; అనుభవించినన్= అనుభవిస్తే; 'అవకీర్ణ' అందురు= 'అవకీర్ణ' అని పిలుస్తారు; అట్టి అఘము= అటువంటి పాపం; ప్రాయశ్చిత్తము+ఆచరింపన్= ప్రాయశ్చిత్తం చేసుకుంటే; పోవున్= పోతుంది; ఉత్తరము= ఉత్తరం వైపు; పడమర= పడమటి దిక్కుగాను; తలయున్+కన్=తల ఉండే విధంగా; శయింపన్ తగదు= పడుకొనరాదు; శీర్ణతల్పంబు, నిద్రయును= శిథిలమైన ప్రక్కగల నిద్రకూడా; కీడు= చెడ్డది.

తాత్పర్యం: పండ్లు తోముట, మూలమూత్రాలను వదలటం మౌనంతో చేయాలి. రెండు సంధ్యలలో నిద్రపోరాదు. ప్రతిదినం ఉదయకాలంలో తండ్రికి, ఆచార్యుడికీ, ఉత్తమ బ్రాహ్మణుడికి నమస్కరించాలి. ఇట్లా నమస్కరించటం తప్ప దేవతార్చనకు ముందు ఎవరి దగ్గరకూ వెళ్ళరాదు. గర్భవతియైన భార్యతో సంగమం పొందరాదు. పెండ్లికి ముందు స్త్రీ సుఖం పొందితే అట్టి వ్యక్తిని అవకీర్ణ అంటారు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం చేసికొనాలి. ఉత్తరంవైపు పడమటివైపు తలపెట్టి పడుకొనరాదు. కుక్కి మంచంమీద నిద్రపోవటం చేటు.

విశేషం: తండ్రికి - దీనిని ఉపలక్షణంగా తీసికొని 'తల్లికి' కూడా నమస్కరించటం విధి అని గ్రహించాలి. అవకీర్ణ - ఇది స్త్రీ పురుషు లిద్దరికీ వర్తిస్తుందని గ్రహించాలి.

క. సిత పీతంబులు ధార్యము । లతులమతీ! కుసుమకోటియందుఁ గృతస్నా
నత రే పాపము శుచితా । చ్యుతుఁడగు సుస్నాతుఁడేని నొడలు దొడసినన్. 106

ప్రతిపదార్థం: అతులమతీ!= సాటిలేని బుద్ధి విశేషం కల ఓ ధర్మరాజా!; కుసుమకోటియందున్= పూలసముదాయంలో; సిత, పీతంబులు= తెల్లనివి, పసుపు వన్నె కలవీ; ధార్యములు= ధరింపదగినవి; రే= రాత్రియందు; కృతస్నానత= స్నానం చేసినవాడు కావటం; పాపము= పాపం; సుస్నాతుఁడు ఏనిన్= చక్కగా స్నానం చేసినవాడైనా; ఒడలు= దేహాన్ని; తొడసినన్= నీటితో తుడిచినా; శుచితాచ్యుతుఁడు= పరిశుద్ధతనుండి జారినవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: పువ్వులలో తెల్లనివీ, పచ్చని వన్నె కలవీ ధరింపదగినవి. రాత్రివేళ స్నానం పాపం. రాత్రివేళ స్నానం చేసినా, ఒళ్ళు నీటితో తుడిచినా శుచిత్వం నుండి జారినవాడవుతాడు.

తే. నీళ్ళ నాడక మును పూఁత నిందితంబు । సీర తడితో విదిర్చుట సెట్ట; యొరులు
గట్టి విడిచిన వస్త్రంబు గట్టఁ గాదు । మడత మార్చు టొప్పదు కడుమాపు డైన. 107

ప్రతిపదార్థం: నీళ్ళన్+ఆడక మును= స్నానం చేయకముందు; పూఁత (మేనికి సుగంధ ద్రవ్యాలు) పూసుకొనటం; నిందితంబు= దోషం, చీర= వస్త్రాన్ని; తడితోన్= తడితో; విదిర్చుట= విదిలించటం; చెట్ట= చెడుపని; ఒరులు= ఇతరులు; కట్టి= ధరించి; విడిచిన వస్త్రంబున్= విడిచిన బట్టను; కట్టన్= కట్టటం; కాదు= కూడదు; కడు మాపుడు+ఐనన్= బాగా మాసిపోయినదైనా; మడతన్= మడిబట్టను; మార్చుట= మార్చటం; ఒప్పదు= పనికిరాదు.

తాత్పర్యం: స్నానం చేయకుండా మైపూతలు వాడటం దోషం. బట్టను తడితో విదిలించటం చెడ్డపని. ఇతరులు కట్టినబట్టను కట్టరాదు. బాగా మాసినా మడిబట్టలను మార్చరాదు.

విశేషం: మడత - ఇత్యాది. ప్రత్యేకించి దేవతాపూజ మొదలైన పనులకొరకు తడిపి ఆరేసిన వస్త్రాలను మడతలు అంటారు. అవి మాసినాయని వాటిని తీసివేసి మామూలు వస్త్రాలు ధరించి పూజాదికాన్ని చేయరాదని భావం.

క. వలవదు వటపిప్పలముల । ఫలములు నమలంగ మేడిపండ్లును దగ; దా
వుల మేకల నెమిళుల యెఱ । చులుఁ గానివి యవిహితంపుఁ జోటుల నధిపా! 108

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వట పిప్పలముల ఫలములు= మఱ్ఱి, పిప్పలి పండ్లు; నమలంగన్= నమలటం; వలవదు= కూడదు; మేడిపండ్లును= మేడిచెట్టు పండ్లు కూడా; తగదు= తినరాదు; ఆవుల, మేఁకల, నెమిళుల+ఎఱచులున్= ఆవుల, మేకల, నెమళ్ళ మాంసాలు; అవిహితము+చోటులన్= పగ ఉన్న తావులలో; కానివి= చేయరానివి.

తాత్పర్యం: రాజా! మఱ్ఱిపండ్లు, పిప్పళ్ళు, మేడిపండ్లు తినరాదు. శత్రుస్థానాలలో ఆవుల, మేకల, నెమళ్ళ మాంసాలు పనికి రానివి.

క. విను మొరు మూ చూ । చిన భోజ్యము నింద్య; మన్యచిత్తము తోడం
గొనఁదగ దాహారము; పా । త్తునఁ గుడుచుట యఘము గూడు దూషించుటయున్. 109

ప్రతిపదార్థం: వినుము= విను; ఒరు మూ చూచిన భోజ్యము= ఇతరుడు వాసన చూచిన ఆహారపదార్థము; నింద్యము= చెడినది (గా భావింపదగినది); ఆహారము= భోజనం; అన్యచిత్తముతోడన్= పరధ్యానంతో; కొనన్= తీసికొనటం (తినటం); తగదు= కూడదు; పొత్తునన్= ఒక్కకంచంలో; కుడుచుట= తినటము; కూడున్= తినే పదార్థాన్ని; దూషించుటయున్= నిందించటమూ; అఘము= పాపం.

తాత్పర్యం: "ఇతరులు వాసన చూచిన భోజనం నిందించదగినది. పరధ్యానంతో ఆహారము తీసికొనదగదు. ఒకేపాత్రలో ఇతరులతో కలిసి (పొత్తున) భుజించడం కూటిని దూషించడం పాపాలు"

విశేషం: మూ చూచిన ఇట్టి పదార్థాన్ని ఉచ్ఛిష్టం అంటారు. పరుడు వాసన చూచిన అన్నంలో వాడి అంతర్గత శరీరదోషాలు దానితో సంక్రమించే అవకాశం ఉంటుంది. అన్యచిత్తము - అన్నం మనస్సును, దేహాన్నీ చక్కగా పెంచుతుంది. పరధ్యానంతో ఉంటే ఆ ప్రయోజనాలు చెడిపోతాయి. ఒకే కంచంలో భుజించడం. ఇది ఆరోగ్యానికి మంచిదికాదు.

క. చేతఁగొని యుప్పు నమలుట, రాతిపయిని నుప్పు గొనుట, రాత్రి దధిమధూ
పేతంబుగఁ గుడుచుట, ధ । ర్మేతరములు; రేయి సక్తు వెగ్గ నరేంద్రా! 110

ప్రతిపదార్థం: నరేంద్రా! = రాజా!; ఉప్పున్= లవణాన్ని; చేతన్= చేతిలో; కొని= తీసికొని; నమలుట= నమలటం; రాతిపయినిన్ ఉప్పున్= రాతిమీద ఉన్న ఉప్పును; కొనుట= తినటం; రాత్రి= రేయి వేళ; దధి, మధు+ఉపేతంబుగన్= పెరుగు, తేనెలతో కలసి ఉండునట్లుగా; కుడుచుట= తినటం; ధర్మ+ఇతరములు= అధర్మాలు; రేయి= రాత్రిపూట; సక్తువు= పేలపిండి; ఎగ్గు= కీడు చేస్తుంది.

తాత్పర్యం: చేతితో ఉప్పును గ్రహించి నమలటమూ, రాతిమీద ఉన్న ఉప్పును తినటమూ, రాత్రిపూట పెరుగు, తేనెలతో భుజించటమూ దుష్టకార్యాలు. రాత్రివేళ పేలపిండి కీడు చేస్తుంది.

విశేషం: ఉప్పు చాలా శీఘ్రముగా రోగక్రిములను ఆకర్షిస్తుంది. కనుక ఇతరుల చేతినుండి, బాగా సూక్ష్మక్రిములు వ్యాపించే రాయి మొదలైనవాటినుండి తీసికొనవద్దని నిషేధించి ఉంటారు. పెరుగు, తేనెలు తేలికగా జీర్ణం కాని పదార్థాలు కాబట్టి వాటిని రాత్రివేళ తింటే అజీర్ణరోగం రావచ్చును.

క. ఒకళులు సూచినయది వా । రికిఁ బెట్టక నమలుటయును బ్రీతిం దన పం
క్తికిఁ దెచ్చిన చుట్టలు వే । ఱొక భంగిం గుడువఁ గుడుపు నుఱు విషభుక్తిన్. 111

ప్రతిపదార్థం: ఒకళులు= ఇతరులు; చూచిన+అది= చూచిన ఆహారపదార్థాన్ని; వారికిన్= వారికి; పెట్టక= పెట్టకుండా; నమలుటయున్= తినటమూ; ప్రీతిన్= ప్రేమతో; తన పంక్తికిన్= తన వరుసకు; తెచ్చిన చుట్టలు= తెచ్చిన చుట్టాలు; వేఱు+ఒక భంగిన్= మరొక పద్ధతిలో; కుడువన్= తింటూ ఉంటే; కుడుపున్= తాను తినటమూ; విషభుక్తిన్= విషం తినటాన్ని; ఉఱున్= పోలుతుంది.

తాత్పర్యం: ఇతరులు చూచిన పదార్థాన్ని వారికి పెట్టకుండా తానొక్కడే తినటమూ, ప్రేమతో తన పంక్తికి వచ్చిన చుట్టాలు హీనమైన పదార్థాలు తింటూ ఉండగా తాను మేలి పదార్థాలు తినటమూ విషం తినటంతో సమానం అవుతాయి.

విశేషం: ఈ భారతధర్మం చాలా సూక్ష్మంగా ఆలోచింపదగినది. 'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అన్న భావాన్ని భారతధర్మం ఎన్నటికీ అంగీకరించదు. 'అందరి సుఖమే ఆత్మసుఖం' అనే ధోరణి భారతీయులది.

క. నేయు మధువు సక్తువు దధి । పాయసము జలంబు భుక్తపరిశిష్టము భూ
నాయక! యేరికి నిడఁ దగ । దాయువు పెంపారఁ గోరు టాత్మఁ గలిగినన్. 112

ప్రతిపదార్థం: భూనాయకా!= రాజా!; ఆయువు= బ్రదుకు కాలం; పెంపారన్= అభివృద్ధి చెందటం; కోరుట= కోరటం; ఆత్మన్= బుద్ధిలో; కలిగినన్= కలిగితే; నేయున్= నేతిని; మధువున్= తేనెనూ; సక్తువున్= పేలపిండినీ; దధి= పెరుగునూ; పాయసమున్= పరమాన్నాన్నీ; జలంబు= నీటినీ; భుక్తపరిశిష్టమున్= తినగా మిగిలిన వీటిని; ఏరికిన్= ఎవరికీ; ఇడన్ తగదు= పెట్టరాదు.

తాత్పర్యం: రాజా! ఆయువును పెంచుకొనే కోరిక ఆత్మలో ఉంటే, నేయి, పేలపిండి, పెరుగు, పాయసం, నీరు - అనే వస్తువులలో తినగా మిగిలినవాటిని ఎవరికీ పెట్టరాదు.

విశేషం: తాను తినగా మిగిలినదానిని 'ఉచ్ఛిష్టం' అంటారు. ఎంగిలి అని కూడా దానికి వ్యవహారం. దానిలో తన శరీరరోగ దోషాలు సంక్రమిస్తాయి. పైన పేర్కొన్న పదార్థాలతో ఆ దోషం మరింత ఎక్కువగా ఉండే లక్షణాన్ని సంభావించి ఈ నిషేధం చెప్పి ఉంటారు.

తే. అంగుళాగ్రముల్ చిటికెనలందు మొదళు । లనఘ! దేవర్షి తీర్థము లనఁగఁ బరఁగు
వరుస వలకేలి యుప్పలవాయి పైతృ । కంపుఁదీర్థంబు తర్పణకార్యమునకు. 113

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; తర్పణ కార్యమునకున్= తర్పణం అనే పనికి; అంగుళ+అగ్రముల్= వ్రేళ్ళకొనలు; చిటికెనలందున్= చిటికెన వ్రేళ్ళయందు; మొదళులు= మొదటి భాగాలు; వరుసన్= వరుసగా; దేవ+ఋషి తీర్థములు= దేవతీర్థములు; ఋషి తీర్థములు; అనఁగన్+పరఁగున్= అన్న పేరుతో ఒప్పుతాయి; వలకేలి= కుడిచేతి; ఉప్పలవాయి= చూపుడు వ్రేలికి బొటనవ్రేలికి మధ్యనున్న భాగం; పైతృకము+తీర్థంబు= పితృదేవతల తీర్థం.

తాత్పర్యం: పుణ్యాత్మా! తర్పణకార్యాలలో వ్రేళ్ల తుదలను దేవతీర్థం అంటారు. చిటికెనవ్రేళ్ళ మొదటి భాగాలను ఋషితీర్థాలంటారు. కుడిచేతిలో చూపుడు, బొటన వ్రేళ్ళ మధ్యభాగాన్ని పితృతీర్థం అంటారు.

విశేషం: దేవతలకు తర్పణం చేసేటప్పుడు వ్రేళ్ళ చివళ్ళమీదుగా నీళ్ళు వదలాలి. ఋషులకు తర్పణం చేసే సమయంలో చిటికెన వ్రేళ్ల మొదటి కణుపుల మీదుగా నీళ్ళు వదలాలి. పితృదేవతల తర్పణంలో బొటనవ్రేలికి చూపుడు వ్రేలికి నడుమ ప్రదేశంనుండీ నీళ్ళు వదలాలి అని పద్యం తాత్పర్యం. తీర్థం అంటే పవిత్రస్థలం.

క. ఆచమనపూర్వకంబుగ । నాచరణీయంబు సర్వ మగుతర్పణమున్
వాచః పరుషత క్రోధం । బాచార విధిజ్ఞు లఘము లండ్రు కుమారా! 114

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా!; సర్వము= అన్నివిధములది; అగు తర్పణమున్= అయిన తర్పణమూ; ఆచమన పూర్వకంబుగన్= 'ఆచమనం' అనే కార్యం ముందు కలిగేటట్లుగా; ఆచరణీయంబు= చేయదగింది; ఆచార విధిజ్ఞులు= ఆచారం విధానాలను చక్కగా తెలిసినవారు; వాచఃపరుషత= మాటలలో పరుషత్వమూ; క్రోధంబు= కోపము; అఘములు= పాపాలు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: అన్ని విధములైన తర్పణాలనూ ఆచమనం చేసిన తరువాతనే చేయాలి. ఆచారాల విధానాలు ఎరిగినవారు మాటలలో కటువుతనమూ, కోపమూ పాపాలని అంటారు.

విశేషం: ఆచమనం - కేశవాది నామాలు ఉచ్చరిస్తూ మూడు మారులు చిన్న ప్రమాణంలో నీరు పుచ్చుకోవటం. ఆచమనం చేసిన తరువాతనే తర్పణం చెయ్యాలి - అని తాత్పర్యం. పరుషంగా పలకటం, క్రోధం తాల్చటం ఎప్పుడూ పాపాలే కానీ సందర్భాన్ని బట్టి తర్పణాది కార్యాల సమయంలో వాటిని ఏ మాత్రమూ దరిచేరనీయరాదన్న సూచన తెలియవస్తున్నది.

క. దినమున సురతం బెయ్యెడఁ । జనదు; చెడిపఁ గన్యఁ గవయఁ జనదు; పతిత నం
టని దాని నగ్నఁ జూడం । జన దుమిసిన వార్పకునికి సక్షుతుఁడైనన్. 115

ప్రతిపదార్థం: దినమునన్= పగటివేళ; సురతంబు= భార్యను కలియుట; ఏ+ఎడన్= ఎన్నటికినీ; చనదు= కూడదు; చెడిపన్= చెడిపోయినదానిని; కన్యన్= వివాహము కానిదానినీ; కవయున్= కూడటం; చనదు= పనికిరాదు; పతితన్= శీలం చెడిన కాంతను; అంటనిదానిన్= ముట్టయినదానిని; నగ్నన్= బట్టలు లేనిదానిని; చూడన్+చనదు= చూడరాదు; ఉమిసినన్= ఉమ్మి వేసినా;సక్షుతుఁడు= తుమ్ము కలవాడు; ఐనన్= అయినా; వార్పక+ఉనికి= ఆచమనం చేయకపోవటం; చనదు= కూడదు.

తాత్పర్యం: పగటివేళ భార్యను కలియరాదు. శీలం చెడిన స్త్రీని, కన్యను కూడరాదు. పతితను, రజస్వలను, నగ్నంగా ఉన్న స్త్రీని చూడరాదు. ఉమ్మినప్పుడు, తుమ్మినప్పుడు ఆచమనం చేయకపోవటం తప్పు.

ఆ. అట్టియెడలఁ దనకు నాచమనము దొర । కొనకయున్న సూర్యుఁ గనుచుఁ బ్రణవ
కలనతోడఁ గూడ వలచెవి ముట్టుట । శుచిత నిచ్చు నండ్రు సూరిజనులు. 116

ప్రతిపదార్థం: అట్టి+ఎడలన్= అటువంటి సందర్భాలలో; తనకున్= తనకు; ఆచమనము= ఆచమనం చేయటం; దొరకొనక+ ఉన్నన్= కుదరకపోతే; సూర్యున్= సూర్యుడిని; కనుచున్= చూస్తూ; ప్రణవకలనతోడన్= ఓంకారం పలకటంతో; కూడన్= కూడగా; వలచెవి= కుడిచెవి; ముట్టుట= తాకటం; శుచితన్= పవిత్రతను; ఇచ్చున్= ఇస్తుంది; అని; సూరిజనులు= పండితులు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: అటువంటి సందర్భాలలో ఆచమనం చేయటం సాధ్యం కాకపోతే సూర్యుడిని చూస్తూ, ఓంకారాన్ని పలుకుతూ, కుడిచెవిని తాకటం పవిత్రతను కలిగిస్తుందని పండితులు చెప్పుతారు.

ఆ. భగిని గురుని మిత్త్రుఁ బండితు వంశజుఁ । బేదపడినఁ దెచ్చి ప్రియముతోడఁ
దనగృహమున కల్మి కనురూపముగఁ బ్రోపు । పెనుపు సేయు నాయువునకు సిరికి. 117

ప్రతిపదార్థం: భగినిన్= సోదరిని; గురునిన్= గురువునూ; మిత్త్రున్= చెలికానినీ; పండితున్= పాండిత్యము కలవాడినీ; వంశజున్= తన వంశంలో పుట్టినవాడినీ, పేదపడినన్= పేదతనం పొందితే; ప్రియముతోడన్= ప్రీతితో; తెచ్చి= తీసికొని వచ్చి; తన గృహమున కల్మికిన్= తన ఇంటిలోని సంపదకు; అనురూపముగన్= తగినవిధంగా; ప్రోపు= పోషించటం; ఆయువునకున్= ఆయుస్సునకూ; సిరికిన్= సంపదకూ; పెనుపు= వృద్ధిని; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: సోదరి, గురువు, చెలికాడు, పండితుడు, జ్ఞాతి - అనేవారు దిక్కులేనివారయితే వారిని తీసికొని వచ్చి ప్రేమతో తన సంపద కనురూపంగా పోషించటం ఆయువునూ, సంపదనూ వృద్ధి చేస్తుంది.

విశేషం: ఈ పనివలన ఆయువే కాదు. సంపద కూడా వృద్ధి పొందటం విశేషం. చాలామంది మరొకరిని పోషించవలసి వస్తే సంపద తరిగిపోతుందనుకుంటారు. కానీ అది నిజం కాదు. సౌజన్యసంపదవలన ఆర్థిక సంపద కూడా అభివృద్ధి అయ్యే అవకాశాలు ఎన్నో ఉంటాయి.

క. పారావతములు శుకములు । శారికలును బుష్పలతలు జనవర! పసిఁడిం
దారమున నైన ముట్టులు । నారయ గృహమంగళంబు లాదర్శములున్. 118

ప్రతిపదార్థం: జనవర!= రాజా! పారావతములు=పావురాలు; శుకములు= చిలుకలు; శారికలును= గోరువంకలు; పుష్పలతలు= పూలతీగలు; పసిఁడిన్ దారమునన్= బంగారు తీగతో; ఐన ముట్టులు= ఏర్పడిన వస్తువులు; ఆదర్శములున్= అద్దాలు; అరయన్= పరిశీలించగా; గృహమంగళంబులు= ఇంటికి శుభం కలిగించే వస్తువులు.

తాత్పర్యం: రాజా! పావురాలు, చిలుకలు, గోరువంకలు, పూలతీగెలు, బంగారు తీగల వస్తువులు, అద్దాలు ఇంటిలో మంగళవస్తువులు.

తే. గ్రువ్వ గ్రద్ద దివ్వారుపుఁ బ్రువ్వు గూబ । యిల్లు సొచ్చిన శాంతి సేయింప వలయుఁ
జదువుఁ గుడుపును సందెలఁ జనదు రాత్రి । యైనఁ బితృకార్యములు సేయు టఘముఁ జేయు. 119

ప్రతిపదార్థం: గ్రువ్వ= అడవి పావురము; గ్రద్ద= గ్రద్ద; దివ్వారుపు+ప్రువ్వు= దీపం ఆర్పే పురుగు; గూబ= గుడ్లగూబ; ఇల్లు= ఇంటిలోనికి; చొచ్చినన్= ప్రవేశిస్తే; శాంతి= మంత్రపూర్వకమైన కీడు తొలగే క్రియను; చేయింపన్ వలయున్= చేయించాలి; చదువున్= పఠనమును; కుడుపును= భోజనము; సందెలన్= సంధ్యాసమయాలలో; చనదు= చేయరాదు; రాత్రి; ఐనన్= అయితే; పితృకార్యములు - శ్రాద్ధములు; చేయుట= చేయటం; అఘమున్= పాపాన్ని; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: గువ్వ, గ్రద్ద, దీపం ఆర్పే పురుగు, గూబ ఇంటిలో ప్రవేశిస్తే శాంతి చేయించాలి. సంధ్యలలో చదవటం, తినటం పనికిరాదు. రాత్రివేళ శ్రాద్ధాలు చేయటం పాపం కలిగిస్తుంది.

క. కులమును రూపము శీలముఁ । గల కన్య వరించి యందుఁ గనిన యపత్యం
బులకుఁ దగ నడపునది మం । గళములు గృతదైవపైతృక క్రియుఁ డగుచున్. 120

ప్రతిపదార్థం: కులమును= మంచి వంశము; రూపమున్= చక్కని అందచందాలు; శీలమున్= ఉత్తమమైన నడవడీ; కల కన్యన్= ఉన్న కన్నెను; వరించి= ఎన్నుకొని వివాహం ఆడి; అందున్= ఆమెయందు; కనిన+అపత్యంబులకున్= కన్న సంతానానికి; కృత, దైవ, పైతృక క్రియుఁడు= దైవకార్యాలు, పితృకార్యాలూ నిర్వహించినవాడు; అగుచున్= అవుతూ; మంగళములు= శుభకార్యములు; తగన్= తగువిధంగా; నడపునది= చేయాలి.

తాత్పర్యం: మంచి కులమూ, రూపమూ, శీలమూ గల కన్యను వరించి ఆమెయందు పొందిన సంతానానికి, ముందు దైవకార్యాలు, పితృకార్యాలు ఆచరించినవాడై శుభకార్యాలు నిర్వహించాలి.

విశేషం: మంగళములు - వివాహం మొదలైనవి, అపత్యం - 'న పతన్తి అనేన పితరః నరకే' అని ఈ శబ్దానికి వ్యుత్పత్తి. పితరులు దీనిచేత నరకంలో పడరు.

తే. వలయుఁ బ్రాఙ్ము ఖోదఙ్ము ఖత్వముల నొకటి । తారకంబులుఁ దిథులును వారములును
జోస్యు లెఱిఁగించినవి మేలు సువ్రతైక । లోల! మంగలి పనికిని దైలమునకు. 121

ప్రతిపదార్థం: సువ్రత+ఏకలోల!= శ్రేష్ఠములైన వ్రతములయందు మాత్రమే ఆసక్తి కల ఓ ధర్మరాజా!; మంగలిపనికిని= క్షౌరమునకు; తైలమునకున్= తలంటుపనికిని; ప్రాక్+ముఖ, ఉదక్+ముఖత్వములన్= తూర్పుమొగం, ఉత్తరపుమొగం కావటములలో; ఒకటి= ఒక్కటి; వలయున్= ఉండాలి; తారకంబులున్= నక్షత్రాలు; తిథులును= తిథులును; వారములును= వారాలూ; జోస్యులు= జ్యోతిశ్శాస్త్ర వేత్తలు; ఎఱిఁగించినవి= తెలిపినవి; మేలు= మంచివి.

తాత్పర్యం: రాజా! నీవు మంచివ్రతములయందు మాత్రమే మిక్కిలి ఆసక్తి కలవాడవు. కనుక వినుము. క్షురకర్మ, అభ్యంగస్నానం అనే పనులకు తూర్పునకు గానీ, ఉత్తరానికి గానీ మొగంపెట్టి కూర్చొనాలి. ఏ నక్షత్రాలు, తిథులు, వారాలు మేలైనవో జ్యోతిష్కులు చెప్పిన వాటిని తెలిసికొని పాటించాలి.

క. వినుము సపిండీకరణ । మ్మున నేకోద్దిష్టమునను భోజనవిధి వ
ర్జన మొప్పు; నామతింపక । చన దామెతఁ గుడువఁ బోవ సజ్జనవినుతా! 122

ప్రతిపదార్థం: సజ్జన వినుతా!= సజ్జనుల మంచి నుతికల ఓ ధర్మరాజా!; వినుము= విను; సపిండీకరణమ్మునన్= సపిండీకరణం అనే క్రియ జరిగిన రోజున; ఏక+ఉద్దిష్టమునను= ఏకోద్దిష్టశ్రాద్ధం చేసిన రోజున; భోజనవిధి వర్జనము= భోజనం పనిని మానటం; ఒప్పున్= మేలవుతుంది; ఆమతింపక= పిలువకుండా; ఆమెతన్= విందును; కుడువన్= తినటానికి; పోవన్= పోవటం; చనదు= కూడదు.

తాత్పర్యం: రాజా! వినుము. సపిండీకరణం, ఏకోద్దిష్టశ్రాద్ధం చేసిన రోజులలో భోజనం మానటం మంచిది. పిలువకుండా విందుభోజనాలకు పోరాదు.

విశేషం: సపిండీకరణం - క్రొత్తగా చనిపోయినవారికి పెట్టిన పార్వణపు పిండాన్ని (అన్నపుముద్దను) వారి పూర్వులు, చనిపోయినవారు ఆయన తండ్రి, తాతలకు ఉద్దేశించిన పిండాలతో కలపటం అనే శ్రాద్ధక్రియ. వారిని క్రమంగా వసు, రుద్ర, ఆదిత్యరూపాలు అంటారు. ఏక+ఉద్దిష్టశ్రాద్ధం అంటే ఒక వ్యక్తి మరణించిన పదవరోజున అతడిని మాత్రం ఉద్దేశించి చేసే శ్రాద్ధం. సాధారణంగా ఇతర శ్రాద్ధాలలో వర్గానికి శ్రాద్ధం పెట్టుతారు. వర్గం అంటే పితృ, పితామహ, ప్రపితామహులు ఇత్యాది.

క. తల్లికిఁ దండ్రికి సుతులకు । నెల్ల విధంబులను వలయు హితములు సెప్పన్
మల్లకుఁడు గాక కర్జము । సల్లభ్యము గాఁగఁ జూచి సౌజన్యనిధీ! 123

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనపు గనియైన ఓ ధర్మరాజా!; మల్లకుఁడు= కఠినచిత్తం కలవాడు; కాక= కాకుండా; కర్జము= కార్యము; సత్+లభ్యము= చక్కగా పొందదగినది; కాఁగన్= అయ్యేటట్లు; చూచి= పరీక్షించి; తల్లికిన్= అమ్మకు; తండ్రికిన్= తండ్రికి; సుతులకున్= కొడుకులకు; ఎల్లవిధంబులను= అన్ని తీరులలో; హితములు= మంచిమాటలు; చెప్పన్ వలయున్= తెలుపదగును.

తాత్పర్యం: కఠినహృదయుడు కాకుండా, కార్యాన్ని చక్కగా సాధించే తలపుతో, తల్లికైనా, తండ్రికైనా, కొడుకులకైనా

మేలైన ఉపదేశాలు చేయవచ్చు.

విశేషం: సుతులకు అన్నదానిలో అవసరాన్ని బట్టి సుతలను కూడా కలుపుకొనాలి.

సీ. క్షత్రియుం డశ్వంబు గజమును రథమును । నెక్కు నేర్పులు గనుఁ బెక్కు గఱచి
నానాయుధాభ్యాస నైపుణంబునఁ బొల్చి । యుద్ధతంత్రములకు నోహటింప
కుండెడు మదిఁ బేర్చి దండనీతికి బోధ । కంబగు నట్టి శాస్త్రంబు మొదలు
గాఁగ గాంధర్వంబు గామమంత్రంబు లో । నుగ శాస్త్రముల నెల్లఁ దగిన భంగి

ఆ. నలవరించి మున్న యధ్యయనంబునఁ । జొరవ గలిగి ధర్మచరణవేది
యై ప్రజాభిరక్ష యధ్వరకరణంబు । వలను మెఱసి నడవవలయు నధిప! 124

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; క్షత్రియుండు= క్షత్రజాతివాడు; అశ్వంబున్= గుర్రాన్నీ; గజమును= ఏనుగును; రథమును= రథాన్నీ; ఎక్కు నేర్పులు= ఎక్కేనేర్పులను; కనున్= పొందుతాడు; పెక్కు= అనేకములను; కఱచి= నేర్చుకొని; నానా+ఆయుధ+ అభ్యాస నైపుణంబునన్= పెక్కైన ఆయుధాల ప్రయోగాల యందలి పాండిత్యంతో; పొల్చి= రాణించి; యుద్ధతంత్రములకున్= పోరులలోని మెలకువ పనులకు; ఓహటింపక= వెనుదీయక; ఉండెడు మదిన్= ఉండే బుద్ధితో; పేర్చి= అతిశయించి; దండనీతికిన్= రాజనీతికి (శిక్షాస్మృతికి); బోధకంబు= ఉపదేశం చేసేది; అగు+అట్టి శాస్త్రంబు= మొదలుకాఁగన్= మొదటిది అయ్యేటట్లుగా; గాంధర్వంబు= సంగీతాన్ని; కామతంత్రంబు= కామశాస్త్రము, లోనుగన్= మొదలుగా; శాస్త్రములన్, ఎల్లన్= సకల శాస్త్రాలను; తగిన భంగిన్= ఉచితమైన పద్ధతిలో; అలవరించి=పట్టుకొని; మున్ను+అ= ముందే; అధ్యయనంబునన్= వేదం నేర్వటంలో; చొరవ= మంచి ప్రవేశం; కలిగి= పొంది; ధర్మ చరణ వేది= ధర్మపు ప్రవర్తనను చక్కగా తెలిసినవాడు; ఐ= అయి; ప్రజా+అభిరక్ష= ప్రజలను నిండుగా కాపాడుట; అధ్వకరణంబు= యజ్ఞాలు చేయటం అనువాటిలో; వలను= నేర్పు; మెఱసి= అతిశయించి; నడవవలయున్= నడవాలి.

తాత్పర్యం: రాజా! క్షత్రియుడు గుర్రాన్నీ, ఏనుగునూ, రథాన్నీ ఎక్కే నేర్పులను సాధించాలి. ఎన్నో విద్యలు నేర్చి సర్వాయుధాల ప్రయోగంలోని ప్రావీణ్యంతో ప్రకాశించాలి. శత్రువుల యుద్ధతంత్రాలకు బెదరిపోకుండా గుండెను దిటవు చేసికొనాలి. దండనీతికి మొదలైన అర్థశాస్త్రం వంటి శాస్త్రాలను, సంగీతవిద్యను, కామశాస్త్రాన్నీ ఇంకా తక్కిన సర్వశాస్త్రాలనూ తగిన విధంగా అభ్యాసం చేయాలి. వేదం చదవటంలో చక్కని నిపుణతను సాధించి, ధర్మప్రవృత్తిని బాగుగా ఎరిగినవాడై, ప్రజలను చక్కగా ఏలటం, యజ్ఞకార్యాలను మెలకువతో చేయటం అనే పనులలో ప్రావీణ్యం గడించాలి.

విశేషం: ఒక్క మాటలో క్షత్రియుడు సర్వవిషయాలలో అందరికంటె మిన్న అయిన పాండిత్యం గడించాలని భావం. అప్పుడు అతడు ఇతరులపై ఆధారపడవలసిన అవసరం ఉండదు. ఇతరుల వంచనకు లోబడని స్థితీ, దానివలన స్థిరత్వమూ సిద్ధిస్తాయి.

క. విను వర్ణాచారంబుల । ననఘ! యిచటఁ దెలుపఁ దొడఁగ నైనను మును లీ
పను లాయుర్వృద్ధికరము । లనుట కతన వలసె నీకునై చెప్పంగన్. 125

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విను= ఆలకించుము; ఇచటన్= ఇక్కడ; వర్ణ+ఆచారంబులన్= వర్ణముల ఆచారాలను; తెలుపన్= తెలుపటానికి; తొడఁగను= సిద్ధపడను; ఐనను= అయినా; మునులు= మహర్షులు; ఈ పనులు= పైన చెప్పిన పనులు; ఆయుర్ వృద్ధికరములు= ఆయువును పెంపొందించునవి; అనుట కతనన్= అనటం కారణంగా; నీకున్+ఐ= నీకోసం; చెప్పంగన్ వలసెన్= చెప్పవలసి వచ్చింది.

తాత్పర్యం: రాజా! ఇక్కడ వర్ణాచారాలను చెప్పటం నా తలపు కాదు. అయినా మునులు పై చెప్పిన క్షత్రియ ధర్మాలు ఆయువును వృద్ధి పరచేవి అని చెప్పటంవలన వీటిని నీకోసం చెప్పవలసి వచ్చింది.

సీ. అధిప! రజస్వల నంటుట కల్మష । మాచరితస్నాన యైన సతిఁ జ
తుర్థదినంబున దోషాసమయమునఁ । జెందంగఁ దగు నండ్రు గొంద ఱార్యు
లేనవునాఁ డొంద నింతియు షష్ఠాహ । మునఁ బొంద మగవాఁడు బుట్టు వినుము
మఱియును సమవిషమములగు దివసంబు । లందోలిఁ బురుషుండు నంగనయును

తే. సంభవింతు రిట్టులు షోడశంబు దాఁక । నెల్లనాఁడును ఋతుశక్తి యెడలకుండ
నెట్టి కార్యము గల్గిన ఋతుమతీస । మాగమము దప్పనీకున్న నాయు వెక్కు **126**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; రజస్వలన్= ముట్టయిన స్త్రీని (భార్యను); అంటుట= తాకుట; కల్మషము= పాపము; కొందఱు= కొందరు; ఆర్యులు= పూజ్యులు; ఆచరితస్నాన= చేసిన స్నానం కలది; ఐన సతిన్= అయిన భార్యను; చతుర్థదినంబునన్= నాలుగవరోజున, దోషా సమయమునన్= రాత్రివేళ; చెందంగన్= పొందటం; తగును= కూడును; అండ్రు= అంటారు; ఏనవునాఁడు= ఐదవరోజున; ఒందన్= కలసినట్లయితే; ఇంతియున్= స్త్రీ శిశువు; షష్ఠ+అహమునన్= ఆరవరోజున; పొందన్= పొందితే; మగవాఁడున్= మగశిశువూ; పుట్టున్= పుట్టుతారు; వినుము= ఆలకించుము; మఱియును= ఇంకనూ; సమవిషమములు= సరి, బేసి సంఖ్యలు; అగు దివసంబులందున్= అయిన రోజులలో; ఓలిన్= క్రమంగా; పురుషుండున్= మగవాడు; అంగనయును= స్త్రీయు; సంభవింతురు= పుట్టుతారు; ఇట్టులు= ఈ విధంగా; షోడశంబుదాఁకన్= పదునారవ రోజువరకు; ఎల్లనాఁడును= ప్రతిదినమూ; ఋతుశక్తి= రజస్సుయొక్క శక్తి; ఎడలక+ఉండన్= పోకుండా; ఎట్టి కార్యము= ఎటువంటి పని; కల్గినన్= కలిగినా; ఋతుమతీ సమాగమము= ఋతువుగల భార్యతోడి కలయికను; తప్పనీక+ఉన్నన్= తప్పిపోకుండా ఉంటే; ఆయువు= జీవితకాలం; ఎక్కున్= వృద్ధి పొందుతుంది.

తాత్పర్యం: రజస్వల నంటటం పాపం. స్నానం చేసిన భార్యను నాల్గవదినాన రాత్రివేళ పొందాలి అని కొందరు పూజ్యులు అంటారు. అయిదవనాడు సమాగమం పొందితే స్త్రీ శిశువూ, ఆరవనాడు పొందితే మగశిశువు కలుగుతారు. ఇంకా వినుము. సరిరోజులలో భార్యను కలిసినట్లైతే మగపిల్లవాడూ, బేసి రోజులలో స్త్రీ శిశువూ కలుగుతారు. ఈ విధంగా పదహారవ రోజు వరకు స్త్రీ ఋతువు వ్యర్థం కాకుండా, ఎన్ని పనులున్నా పురుషుడు ఋతువుగల భార్యను పొందుతూఉంటే ఆయువు పెరుగుతుంది.

క. విను మాచార మవశ్యం । బును నడపఁగ వలయు ధర్మమున కది మూలం
బనఘా! ధర్మం బాయువుఁ । బెనుచును లక్ష్మిని యశంబుఁ బెంపొందించున్. **127**

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; వినుము= ఆలకించుము; ఆచారము= చక్కని; క్రమబద్ధమైన నడవడిని; అవశ్యంబును= తప్పనిసరిగా; నడపఁగన్ వలయున్= ప్రవర్తింపజేయాలి; అది= ఆ ఆచారం; ధర్మమునకున్= ధర్మానికి; మూలంబు=

కుదురు; ధర్మంబు= ధర్మము; ఆయువున్= బ్రతికే కాలాన్ని; పెనుచును= వృద్ధి చేస్తుంది; లక్ష్మిని= సంపదను, యశంబున్=కీర్తిని; పెంపొందించున్= పెరిగేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: అనఘా! వినుము. ఆచారాన్ని తప్పనిసరిగా నడిపించాలి. అది ధర్మానికి కుదురు. ధర్మం ఆయువును పెంచుతుంది. సంపదను, కీర్తిని వృద్ధి చేస్తుంది.

తే. ఇన్ని యాచారములలోన నెక్కు డండ్రు । సకలభూతంబు లందును సదయుఁ డగుట
యాదిమును లట్లు గావున నఖిలవర్ణ । ములకు దయకల్మి పెద్దయు వలయుగుణము. 128

ప్రతిపదార్థం: ఆదిమునులు= మొట్టమొదటి జ్ఞానసంపన్నులు; ఇన్ని+ఆచారములలోనన్= ఆ అన్ని ఆచారాలలో; సకలభూతంబు లందును= సమస్త ప్రాణులయందు; సదయుఁడు= దయతో కూడినవాడు; అగుట= కావటం; ఎక్కుడు= మిన్న; అండ్రు= అంటారు; కావునన్= కనుక; అఖిలవర్ణములకున్= అన్నివర్ణాలవారికి, అన్ని వర్ణాలవారి విషయంలో; దయకల్మి= దయకలిగి ఉండటం; పెద్దయున్= మిక్కిలి పెద్దదైన; వలయు గుణము= ఉండవలసిన గుణం.

తాత్పర్యం: ఆదిమునులు ఆచారాలన్నింటిలో సర్వభూతాలపై దయ మిన్న అయిన దంటారు. కాబట్టి అన్ని వర్ణాల వారికీ అన్ని వర్ణాలవారి విషయంలో దయ కలిగి ఉండటం పెద్దగా ఉండవలసిన గుణం.

క. ఈ యాచారాధ్యాయం । బాయుశ్శ్రీకీర్తికారి యగుఁ బాపంబుల్
వాయం జేయును బృథివీ । నాయక! సద్భక్తిఁ జదివినను దగ వినినన్. 129

ప్రతిపదార్థం: పృథివీనాయక!= రాజా!; ఈ ఆచార+అధ్యాయంబు= ఈ ఆచారసంబంధమైన గ్రంథవిభాగం; సత్+భక్తిన్= మంచి భక్తితో; చదివినను= చదివినా; తగన్= బాగుగా; వినినన్= విన్నా; ఆయుస్, శ్రీ, కీర్తి కారి= ఆయువును; సంపదను, కీర్తిని కలిగించేది; అగున్= అవుతుంది; పాపంబుల్= పాపాలను; వాయన్ చేయున్= పోగొట్టుతుంది.

తాత్పర్యం: రాజా! ఈ ఆచారాధ్యాయమును మంచి భక్తితో చదివినా, తగువిధంగా విన్నా ఆయువు, సంపద, కీర్తి కలుగుతాయి. పాపాలను పోగొట్టుతుంది.

తే. అనిన బ్రీతుఁడై పాండునృపాగ్రతనయుఁ । డమరతటినీతనూజుతో నన్నదమ్ము
లేమివిధమునఁ దమలోన నెనసి నడచు । వార? లెఱిఁగింపు' మనుటయు గారవమున. 130

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పాండు నృప+అగ్రతనయుఁడు= పాండురాజు పెద్దకొడుకు; ప్రీతుఁడు= ప్రీతి పొందినవాడు; ఐ= అయి; అమరతటినీ తనూజుతోన్= దేవనది కుమారుడగు భీష్ముడితో; అన్నదమ్ములు= సోదరులు; ఏమి విధమునన్= ఏ తీరున; తమలోనన్= తమలో; ఎనసి= పొందిక కలిగి; నడచువారలు?= ప్రవర్తిస్తారు?; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుటయున్= అంటే; గారవమునన్= ప్రీతితో.

తాత్పర్యం: అని చెప్పగా ధర్మరాజు ప్రీతిపొంది, భీష్ముడితో 'అన్నదమ్ము లేవిధంగా తమలో తాము పొందిక కలిగి ప్రవర్తించవలెనో తెలుపుమా!' అనగా భీష్ముడు ప్రేమతో.

వ. అతం డతని కిట్లనియె. 131

ప్రతిపదార్థం: అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'విను భక్తియు వెఱపుఁ గలిగి । యనుజన్ములు పెద్దవాని నారాధింపన్
జనవర! యతండుఁ దమ్ములఁ । గొనియాడన్ సిరికిఁ బ ట్టగుదు రుజ్జ్వలులై. 132

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; విను= ఆలకించుము; అనుజన్ములు= తమ్ములు; భక్తియున్= గౌరవభావము; వెఱపున్=భయము; కలిగి; పెద్దవానిన్= అన్నను; ఆరాధింపన్= కొలువగా; అతండున్= అన్న కూడా; తమ్ములన్= తమ్ములను; కొనియాడన్= మన్నించగా; ఉజ్జ్వలులు= చక్కని ప్రకాశము కలవారు; ఐ= అయి; సిరికిన్= సంపదకు; పట్టు= స్థానం; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. తమ్ములు అన్నయెడ భయభక్తులు కలిగి ఆరాధించాలి. అన్న తమ్ములను మన్నిస్తూ ఉండాలి. ఇట్లా అయితే ఆ అన్నదమ్ములు లోకంలో ప్రకాశిస్తూ సంపదకు స్థానం అవుతారు.

విశేషం: భక్తి, వెఱపు - 'పితృసమో జ్యేష్ఠ' - పెద్దవాడు తండ్రితో సమానుడు - కనుక తండ్రియందువలె భక్తి, ఏ తప్పుచేస్తే, ఏ విధమైన కోపం వస్తుందో అన్న భయమూ, అన్నయెడల కలిగి ఉండాలని తాత్పర్యం.

క. అనుజుఁ డొకఁడు వెంగలియై । నను దప్పెడుఁ గాని పెద్దనకుఁ గార్యజ్ఞా
ననిరూఢి లేక తక్కిన । ననుజన్ములు సిక్కువడుదు రవనీనాథా! 133

ప్రతిపదార్థం: అవనీనాథా!= రాజా!; అనుజుఁడు= తమ్ముడు; ఒకఁడు= ఒక్కడు; వెంగలి= బుద్ధిలేనివాడు; ఐనను= అయినా; తప్పెడున్= తప్పిపోతుంది; కాని= కానీ; పెద్ద+అనకు= జ్యేష్ఠుడికి; కార్య , జ్ఞాన నిరూఢి= పనులకు సంబంధించిన చక్కని తెలివి స్థిరంగా ఉండటం; తక్కినన్= చెడితే; అనుజన్ములు= తమ్ములు; చిక్కు+పడుదురు= ఇబ్బందుల పాలవుతారు.

తాత్పర్యం: రాజా! తమ్ము డొకడు బుద్ధిహీనుడైనా పెద్ద ప్రమాదం లేదు. కానీ అన్న కార్యజ్ఞానం దృఢంగా లేనివాడైతే తమ్ముళ్ళు ఇబ్బందుల పాలవుతారు.

విశేషం: అన్న నాయకుడు - నడపువాడు, తమ్ముళ్ళు - నేయులు నడపబడేవారు. నాయకుడు బుద్ధిహీను డయితే నడపబడే వారికి నాశనమే గతి - అని తాత్పర్యం.

చ. జనవర! యన్నదమ్ములు ప్రసన్నమతిం గలకల్మి పంచి కు
డ్చిన వినుతించు లోకములు; శ్రీయుఁ బొరింబొరిఁ బెంపు నొందు; లో
భనిరతిఁ బెద్ద కాసపడి పాడి దొఱంగినఁ బ్రాణగొడ్డపుం
బనులగు నవ్విధంబు మనపద్దది కాదె జగం బెఱుంగఁగన్! 134

ప్రతిపదార్థం: జనవర!= రాజా! అన్న+తమ్ముడు= అన్నయును, తమ్ముడును; ప్రసన్నమతిన్= దుష్టభావాలు లేని బుద్ధితో; కల కల్మిన్= ఉన్న సంపదను; పంచి= చక్కగా విభాగించుకొని; కుడ్చినన్= అనుభవిస్తే; లోకములు= లోకాలు (జనులు); వినుతించున్= కొనియాడుతాయి; పొరిన్ పొరిన్= క్రమంగా; శ్రీయున్= సంపద కూడా; పెంపున్=వృద్ధిని; ఒందున్=పొందుతుంది; లోభనిరతిన్= పిసినిగొట్టుతనపు పట్టుదలతో; పెద్దకున్= అధికభాగానికి; ఆసపడి= కోరిక పొంది; పాడి= న్యాయం; తొఱంగిన్=

వదలివేస్తే; ప్రాణగొడ్డము+పనులు= ప్రాణానికి ముప్పుతెచ్చే పనులు; అగున్= అవుతాయి; ఆ+విధంబు= ఆ తీరు; జగంబు= లోకము; ఎఱుంగన్= తెలియునట్లుగా; మన పడ్డ+అది, కాదె!= మనం అనుభవించినదే కదా!

తాత్పర్యం: రాజా! అన్నదమ్ములు కలతలు లేని బుద్ధితో ఉన్న సంపదను చక్కగా పంచుకొని అనుభవించాలి. అప్పుడు లోకులు మెచ్చుతారు. సంపద కూడా క్రమంగా వృద్ధి పొందుతుంది. అట్లాకాక ఒకడు అత్యాశతో ఎక్కువ భాగాన్ని ఆపేక్షిస్తే ప్రాణాంతకపు పనులు ఏర్పడుతాయి. లోకమంతా ఎరిగినవిధంగా అది మనం అనుభవించిందే కదా!

విశేషం: ఇక్కడ వ్యంగ్యంగా భీష్ముడు ధృతరాష్ట్రుడి తప్పిదాన్ని సూచిస్తున్నాడు. ప్రసన్నమతి - ఉన్న సంపదలో ఒకడు నిష్కారణంగా ఎక్కువభాగాన్ని అపేక్షించటం కుళ్ళుబుద్ధి. నాకెంత అధికారం ఉన్నదో వాడికి కూడా అంతే ఉంది అనుకోవటం సమబుద్ధి.

తే. తండ్రి పిమ్మట నన్నయ తండ్రి పిన్న । వారలకు నెల్ల నాతనివనిత తల్లి
తల్లికడచన్న నని చెప్పి తాత మఱియు । మనుమనికి నిట్టులను నభిమన్యుపౌత్ర! 135

ప్రతిపదార్థం: తండ్రి పిమ్మటన్= తండ్రి తరువాత; అన్న+అ= అన్నయే; పిన్నవారలకున్= తమ్ములకు; ఎల్లన్= అందరికీ; తండ్రి= నాయన; తల్లి కడచన్నన్= అమ్మ చనిపోతే; ఆతని వనిత= అన్న భార్య; తల్లి= అమ్మ; అని; చెప్పి= బోధించి; అభిమన్యుపౌత్ర!= అభిమన్యుడి మనుమడవగు ఓ జనమేయా! తాత= తాత అయిన భీష్ముడు; మఱియున్= ఇంకా; మనుమనికిన్= మనుమడైన ధర్మరాజునకు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= చెబుతున్నాడు.

తాత్పర్యం: జనమేజయా! తండ్రి తరువాత అన్నయే తమ్ము లందరికీ తండ్రి. తల్లి చనిపోయిన పిమ్మట అన్న భార్యయే వారికి తల్లి అని చెప్పి, జనమేజయా! తాతయైన భీష్ముడు ఆ మనుమడికి ఇంకా ఇట్లా బోధించాడు.

విశేషం: 'అభిమన్యు పౌత్ర!' ఇది జనమేజయుడికి వైశంపాయనుడు చేసిన సంబోధన. అభిమన్యుడు లోకోత్తరవీరుడు. అతడి పౌత్రుడిగా తనను పిలిస్తే జనమేజయుడికి పరమానందం.

క. మానవనాయక! యగ్రజుఁ డైనను ననుజన్ముఁ డేని నన్యాయంబుం
బూని సహోదరులకుఁ గీ । డైన నతఁడు దండ్యుఁ డందు రవనీపతికిన్. 136

ప్రతిపదార్థం: మానవనాయక!= జననాయకా!; రాజా!; అగ్రజుఁడు= అన్న; ఐనను= అయినా; అనుజన్ముఁడు= తమ్ముడు; ఏనిన్= అయినా; అన్యాయంబున్= న్యాయవిరుద్ధం అయినదానిని; పూని= పట్టుకొని; సహ+ఉదరులకున్= అన్నదమ్ములకు; కీడు= ప్రమాదం చేసేవాడు; ఐనన్= అయితే; అవనీపతికిన్= రాజునకు; దండ్యుఁడు= దండింప బడదగినవాడు; అందురు= అంటారు.

తాత్పర్యం: రాజా! అన్నగానీ తమ్ముడు గానీ న్యాయం తప్పి అన్నదమ్ములకు కీడుచేస్తే వాడు రాజునకు శిక్షార్హుడవుతాడు.

విశేషం: 'మానవనాయక!' అన్న సంబోధనవల్ల ఇది చక్కగా గుర్తించి నీ ఏలుబడిలో ఇట్టి వాటిని పరిశీలించాలి అని సూచన.

వ. అని సహోదరప్రకారంబు సెప్పి వెండియు. 137

ప్రతిపదార్థం: అని; సహోదర ప్రకారంబు= అన్నదమ్ముల తీరు; చెప్పి= తెలిపి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అని అన్నదమ్ములు వ్యవహరించవలసిన విధానాన్ని బోధించి, ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. విను మప్పఁ దల్లియట్లుగఁ; గొని నడపఁగ వలయుఁ జన్ను గుడిపి పెనిచె నె
వ్వనిత యదియు నాతనికిని । జననీసమ యండ్రు బుధులు సౌజన్యనిధీ! 138

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనపు గనియైన వాడా!; వినుము= ఆలకించుము; అప్పన్= అక్కను; తల్లి+అట్లుగన్= తల్లివలెనే; కొని= భావించి; నడపఁగన్+వలయున్= చెల్లించాలి; ఏ+వనిత+= ఏ స్త్రీ; చన్ను కుడిపి= చనుపాలుత్రావించి, పెనిచెన్= పెంచినదో; అదియున్= ఆ స్త్రీ కూడా; అతనికిన్= ఆ పాలు త్రావినవాడికి; జననీసమ= తల్లితో సమానురాలు; అని; బుధులు= జ్ఞానము కలవారు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సుజనుడా! అక్కను తల్లివలె భావించి మన్నించాలి. అట్లాగే పసితనంలో చన్నిచ్చి పెంచిన స్త్రీ కూడా తల్లితో సమానురాలే అని పండితులు చెప్తుతారు.

విశేషం: స్థూలంగా ధర్మరాజు అన్నదమ్ముల సంగతి అడిగినా ఆ వరుసలోని వారినిగూర్చి కూడా భీష్ముడు చెప్పటం భావగ్రాహి లక్షణం.

క. జనకుం డధికుఁ డుపాధ్యా । యునకుఁ బదిమడుంగు లెక్కు డుర్వీనాథా!
జనకునకు దశ గుణంబులు । జనని గురుత్వమున నిది ప్రశస్తము శ్రుతులన్. 139

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా!; జనకుండు= కన్నవాడు; ఉపాధ్యాయునకున్= చదువుచెప్పువాడికంటె; పది మడుంగులు= పదిరెట్లు; అధికుఁడు= ఎక్కువవాడు; జనని= తల్లి; జనకునకున్= తండ్రికంటె; గురుత్వమునన్= గొప్పతనంలో; దశగుణంబులు= పదిరెట్లు; ఎక్కుడు= మిన్న అయినది; ఇది= ఈ సంగతి; శ్రుతులన్= వేదాలలో; ప్రశస్తము= ప్రశంసకు వచ్చింది.

తాత్పర్యం: రాజా! ఉపాధ్యాయుడికంటె తండ్రి పదిరెట్లు ఎక్కువ మాన్యుడు. తండ్రికంటె తల్లి పదిరెట్లు గౌరవంలో మిన్న అయినది. వేదాలు ఈ విషయాన్ని ప్రశంసించాయి.

క. జననీజనకులచే నగు । జననం బాగమము దను విషయ మని చెప్పున్
విను మాచార్యు వలన నొం । దిన పు ట్టజరామరంబు దివ్యంబునగున్. 140

ప్రతిపదార్థం: ఆగమము= వేదము; జననీజనకులచేన్= తల్లిదండ్రులచేత; అగు జననంబు= అయిన పుట్టుక; తను విషయము= దేహమునకు సంబంధించినది; అని; చెప్పున్= చెప్తుతున్నది; వినుము= ఆలకించుము; ఆచార్యునివలనన్= గురువువలన; ఒందిన పుట్టు= కలిగిన జన్మ; అజరామరంబు= ముదిమి, చావు లేనిది; దివ్యంబున్= దేవలోక సంబంధం కలది; అగున్= అగును.

తాత్పర్యం: రాజా! తల్లిదండ్రులవలననైన జన్మ దేహసంబంధి అని వేదం చెప్తుతున్నది. ఆచార్యుడివలన నైన పుట్టుక ముసలితనమూ, చావులేనిది, దివ్యమైనది.

విశేషం: ఆచార్యుడు - శాస్త్రార్థాల నన్నింటినీ తనలో నింపుకొని వాటిని శిష్యుడితో ఆచరింపజేస్తూ స్వయంగా ఆచరించేవాడు ఆచార్యుడు.

'ఆచినోతి హి శాస్త్రాణి ఆచారే స్థాపయత్యపి,
స్వయ మాచరతే యస్తు స ఆచార్య ఇతి స్మృతః'

ఆచార్యవాన్ పురుషోవేద' అని శ్రుతి. ఆచార్యుడు గల పురుషుడే తత్త్వాన్ని తెలిసికొనగలడు. తల్లిదండ్రులు బంధహేతువైన దేహాన్నిస్తున్నారు. ఆచార్యుడు ఆ దేహసంబంధం లేని స్థితిని - మోక్షాన్ని ప్రసాదిస్తున్నాడు. కనుక ఆ పుట్టుక అజరామరమూ దివ్యమూ అవుతున్నది.

వ. కావున గౌరవంబున నాచార్యుండు సర్వాధికుండు. 141

ప్రతిపదార్థం: కావునన్= కనుక; గౌరవంబునన్= మాన్యతలో; ఆచార్యుండు= గురువు; సర్వ+అధికుండు= అందరికంటె ఎక్కువ అయినవాడు.

తాత్పర్యం: కనుక గౌరవంలో ఆచార్యుడు అందరికంటె మిన్న.

విశేషం: 139వ పద్యంలో చెప్పిన ఉపాధ్యాయుడు, 140వ పద్యంలో చెప్పిన ఆచార్యుడు ఒకరే అనుకోరాదు. ఉపాధ్యాయుడంటే లోకపు చదువులను చెప్పేవాడనీ, ఆచార్యుడు పరమార్థాన్ని బోధిస్తాడని తెలిసికోవాలి. లేకపోతే 'జనకుడు ఉపాధ్యాయునకు పది మడుంగులు' అన్న వాక్యానికీ 'గారవంబున ఆచార్యుండు సర్వాధికుండు' అన్న మాటకూ పరస్పరవైరుద్ధ్యం సిద్ధిస్తుంది.

క. అని యిట్లు సుప్రసంగం । బున గురుజన తారతమ్యములు సెప్పినఁ దా
విని శంతనుతనయున కి । ట్లనుఁ బాండు నృపాగ్రతనయుఁ డతులిత భక్తిన్. 142

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; సుప్రసంగంబునన్= మంచి ప్రసంగాన్ని బట్టి; గురుజన తారతమ్యంబులు= మన్నించ దగిన జనములలోని ఎక్కువతక్కువలను; చెప్పినన్= చెప్పగా; తాన్= తాను; విని= ఆలకించి; పాండు, నృప+అగ్ర తనయుఁడు= పాండురాజు పెద్దకొడుకు ధర్మజుడు; శంతనుతనయునకున్= శంతనుడి కుమారుడైన భీష్మడితో; అతులితభక్తిన్= సాటిలేని భక్తితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: అని మంచి ప్రసంగంలో గురుజనుల ఎక్కువతక్కువలను గూర్చి చెప్పగా ధర్మరాజు సాటిలేని భక్తితో భీష్మడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అతులిత భక్తిన్ - సర్వాధికుడైన ఆచార్యుడి స్థానంలో భీష్మడిని ధర్మరాజు సంభావించిన తీరు దీనివలన తెలియ వస్తున్నది.

క. 'భూసురులకు నృపులకు నుప । వాసము దగుఁ గాని యన్యవర్ణులకుఁ దదీ
యాసక్తి కలిమి పెద్దయు । దోసంబని విందు ధర్మధుర్యస్వాంతా! 143

ప్రతిపదార్థం: ధర్మ ధుర్య స్వాంతా!= ధర్మమును భరించు హృదయంకల ఓ తాతా!; భూసురులకున్= బ్రాహ్మణులకు; నృపులకున్= రాజులకు; ఉపవాసము= పస్తు ఉండటం; తగున్= చెల్లుతుంది; కాని; అన్యవర్ణులకున్= వేరు వర్ణాల వారికి;

తదీయ+ఆసక్తి కలిమి= దానిదైన తగులం ఉండటం; పెద్దయున్= అధికమైన; దోసంబు= తప్పు; అని; విందున్= వింటూ; ఉంటాను.

తాత్పర్యం: 'బ్రాహ్మణులకు, క్షత్రియులకు ఉపవాసము మంచిది. తక్కిన వర్ణాల వారికి కాదు. ఉపవాసాలమీద ఆసక్తి ఉండటం పెద్దదోషం అని నేను వింటూ ఉంటాను.

విశేషం: కృషి గోరక్ష, వాణిజ్యమూ, వృత్తులూ చేసికొనే జాతులవారు ఉపవాసాదుల జోలికిపోతే అది వృత్తి ధర్మానికి అడ్డుగా నిలుస్తుందని భావం.

భీష్ముఁడు ధర్మరాజున కుపవాసవిధివిశేషంబు సెప్పుట (స.13-163-3 (కుంభ))

వ. ఉపవాసవిధియోగ్యతయును దత్ఫల విశేషంబును వినవలతుం జెప్పవే యనుటయు నప్పురుషవరుం డప్పుడమి ఱేనితో, 'దీని నీవు నన్నడిగినట్ల యే నంగిరసు నడిగిన నమ్మునిపతి నాకుం జెప్పె నత్తెఱంగుఁ జెప్పెద నాకర్ణింపు' మని పలికి యిట్లనియె. 144

ప్రతిపదార్థం: ఉపవాసవిధి యోగ్యతయును= ఉపవాస నియమానికి తగినతనాన్ని; తద్ఫల విశేషంబును= దాని ఫలంయొక్క గొప్పతనాన్నీ; విన వలతున్= వినగోరుతున్నాను; చెప్పవే= దయతో చెప్పుము; అనుటయున్= అనగా; ఆ+పురుషవరుండు= ఆ మనుజశ్రేష్ఠుడు; ఆ+పుడమిఱేనితోన్= ఆ రాజుతో; దీనిన్= దీనిని; నీవు; నన్నున్; అడిగిన+అట్లు+అ= అడిగిన విధంగానే; ఏను= నేను; అంగిరసున్= అంగిరసుడనే మహర్షిని; అడిగినన్= అడిగితే; ఆ+మునిపతి= ఆ మహర్షి; నాకున్= నాకు; చెప్పెన్= బోధించాడు; ఆ+తెఱంగున్= ఆ పద్ధతిని; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= చెవు లొగ్గి వినుము; అని; పలికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఉపవాస విధికి యోగ్యత, దాని గొప్పఫలము అనే వాటిని గూర్చి వినగోరుతున్నాను. చెప్పవూ!' అని అడిగితే భీష్ము డా రాజుతో ఇట్లా అన్నాడు. ఈ విషయం గురించి నీ వడిగినట్లే నేను అంగిరసు డనే మహర్షి నడిగాను. ఆయన నాకు చెప్పిన సంగతి నీకు వినిపిస్తాను. వినుము' అని ఇట్లా అన్నాడు.

క. రాత్రిత్రయంబు బ్రహ్మ। క్షత్రియులకు నుపవసింపఁ జనుఁ దదధికమున్
గాత్రస్థితిఁ దప్పింపని। మాత్ర నయిన మేలు కురుసమాజవరేణ్యా! 145

ప్రతిపదార్థం: కురుసమాజ వరేణ్యా!= కురువంశంలో గొప్పవాడా!; బ్రహ్మక్షత్రియులకున్= బ్రాహ్మణులకు, రాజులకు; రాత్రిత్రయంబు= మూడు రాత్రులు; ఉపవసింపన్= పస్తు ఉండటం; చనున్= తగును; తద్+అధికమున్= అంత కెక్కువ కూడా; గాత్ర స్థితిన్= దేహము స్థితిని; తప్పింపని మాత్రన్= చెడగొట్టని ప్రమాణం; అయినన్= అయితే; మేలు= మంచిది.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణులు, క్షత్రియులు మూడు రాత్రులు ఉపవాసం చేయదగును. శరీరస్థితి చెడకుండా ఉంటే అంతకంటె ఎక్కువ చేసినా మంచిదే.

విశేషం: రాత్రిత్రయంబు అంటే మూడు పగళ్ళూ, మూడు రాత్రులూ అని భావం. గాత్రస్థితి - 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' 'శరీరం మొదటి ధర్మసాధనం కదా!' అన్నారు. కనుక ఏ మాత్రమూ శరీరాన్ని భంగించేది కారాదు.

క. విను వైశ్యులకును శూద్రుల । కును నాలుగు కుడుపు లుడుగు కొలఁదికి మిగులం
జన దుపవసింప నుపవా । సనిరూఢత పెంపు కల్మషము వారలకున్. 146

ప్రతిపదార్థం: విను= వినుము; వైశ్యులకున్= కోమటివారికిని; శూద్రులకున్= శూద్రులకునూ; నాలుగు కుడుపులు= నాలుగు భోజనాలు; ఉడుగు కొలఁదికిన్= వదలే లెక్కకు; మిగులన్= మించేటట్లుగా; ఉపవసింపన్ చనదు= ఉపవాసం ఉండ రాదు; ఉపవాస, నిరూఢత పెంపు= ఉపవాసమునందలి పట్టుదలను పెంచుకొనటం; వారలకున్= ఆ రెండువర్ణాల వారికి; కల్మషము= పాపం.

తాత్పర్యం: వైశ్యులు, శూద్రులు నాలుగు భోజనాలు వరకు మానవచ్చును. అంతకుమించి ఉపవాసపు పట్టుదలను పెంచుకొనటం వారికి పాపం.

విశేషం: నాలుగు కుడుపులు ఉడుగుట అంటే రెండు పగళ్ళూ, రెండు రాత్రిళ్ళు ఉపవాసం ఉండవచ్చునని భావం.

ఆ. పౌర్ణమాసిఁ బూర్వపక్షాష్టమీ చతు । ర్దశుల నుభయపక్ష వశత వచ్చు
షష్ఠిఁ బంచమిని సునిష్ఠమై నుపవాస । మున్న వివిధశుభము లొలయు నండ్రు. 147

ప్రతిపదార్థం: పౌర్ణమాసిన్= పూర్ణిమనాడు; పూర్వపక్ష+అష్టమీ, చతుర్దశులన్= శుక్లపక్షంలోని అష్టమినాడు, చతుర్దశినాడూ; ఉభయపక్షవశతన్= రెండుపక్షాలకు వశమై; వచ్చు షష్ఠిన్= వచ్చే షష్ఠినాడు; పంచమిని= పంచమితిథియందు; సునిష్ఠమైన్= దృఢమైన నిష్ఠతో; ఉపవాసము= పస్తు; ఉన్నన్= ఉంటే; వివిధశుభములు= పెక్కు రకాల మేళ్ళు; ఒలయును= కలుగును; అంద్రు= అంటారు.

తాత్పర్యం: పూర్ణిమనాడు, శుక్లపక్ష అష్టమి, చతుర్దశి తిథులయందు, శుక్లకృష్ణ పక్షాలలో షష్ఠి, పంచమి తిథులయందూ, చెదరని నియమంతో ఉపవాసం ఉంటే ఎన్నోవిధాల శుభాలు కలుగుతాయని అంటారు.

విశేషం: 'సునిష్ఠమైన్= ఉపవాసం విషయంలో చాలామంది సర్దుబాటు ధోరణిలో ఉంటారు. దంభంకొరకు ఉపవాసాలు చేస్తారు. అవి పనికి మాలినవని ఈ పద్యం హెచ్చరిస్తున్నది.

సీ. ఏకభుక్తవ్రత మెంతయు నిష్ఠ మా । సం బెల్ల నడపిన సద్విజుండు
సుభగాకృతియు రూపశోభితాంగనయు స । త్సుతులును ధనధాన్యతతులు భోగ
ములు సద్గుణంబులు భూరియశంబును । మొదలైన బహుశుభంబులకుఁ బాత్ర
మగు నేఁడుకాల మయ్యతులవ్రతము సల్పి । యఖిల భూలోకసౌఖ్యములుఁ ద్రిదివ

తే. మోదమును గండ్రు రెండును మూఁడు నాల్గు । నీ క్రమంబున నోపిన ట్లెక్కినట్టి
దినము లెడ పెట్టి కుడుచుచు ధృతి నొకేఁడు । నడపువారల తెఱఁగు లేర్పడఁగ వినుము. 148

ప్రతిపదార్థం: ఏకభుక్త వ్రతము= ఒక పూట భోజనం చేసే వ్రతాన్ని; ఎంతయున్= మిక్కిలి; నిష్ఠన్= నియమంతో; మాసంబు=నెల; ఎల్లన్= అంతా; నడపిన సత్ ద్విజుండు= చేసిన ఉత్తమబ్రాహ్మణుడు; సుభగ+ఆకృతియున్= అందమైన ఆకారం; రూప శోభిత+ అంగనయున్= గొప్ప సౌందర్యంతో విరాజిల్లే భార్య; సత్పుతులును= మంచి పుత్రులు; ధన ధాన్య

తతులు= ధనములు; ధాన్యాలు అనే వాటి రాశులు; భోగములు=సుఖాలు; సత్+గుణంబులు= మంచి గుణాలు; భూరి యశంబును= అధికమైన కీర్తి; మొదలు+ఐన= మొదలైన; బహుశుభంబులకున్= పెక్కు మంగళములకు; పాత్రము= యోగ్యతకలవాడు; అగున్= అగును; ఏఁడుకాలము= ఒక్క సంవత్సరకాలం; ఆ+అతుల వ్రతం= సాటిలేని ఆ వ్రతాన్ని; సల్పి= ఆచరించి; అఖిల భూలోక సౌఖ్యములు= సమస్తములైన భూలోకమందలి సుఖాలనూ; త్రిదివ మోదమును= స్వర్గంలోని ఆనందాన్నీ; కంద్రు= పొందుతారు, రెండును= రెండు రోజులు; మూఁడును= మూడు రోజులు; నాల్గున్= నాలుగు దినములు; ఈ క్రమంబునన్= ఈ వరుసలో; ఓపిన+అట్లు= శక్తి ఉన్న విధంగా; ఎక్కిన+అట్టి దినములు= పెరిగిన రోజులు; ఎడ పెట్టి= వ్యవధానం ఉంచి; కుడుచుచున్= తింటూ; ధృతిన్= ధైర్యగుణంతో; ఒక+ఏఁడు= ఒక్క ఏడాదికాలం; నడపువారల తెఱఁగులు= జరిపేవారి విధానాలు; ఏర్పడఁగన్= స్పష్టమయ్యే విధంగా; వినుము= వినుము.

తాత్పర్యం: రోజుకు ఒకమారు మాత్రమే భుజించటం అనే వ్రతాన్ని ఎంతో నిష్ఠతో ఒక నెలరోజులు చేసిన ఉత్తమ బ్రాహ్మణుడు మంచిరూపమూ; అందచందాలు గల భార్య; గుణవంతులైన కొడుకులూ; ధనధాన్యాలూ; సుఖాలూ, మంచిగుణాలూ; గొప్ప కీర్తి మొదలైన పెక్కు శుభాలకు పాత్ర మవుతాడు. ఈ సాటిలేని వ్రతాన్ని ఒక్క సంవత్సరకాలం చేసిన భూలోక సుఖాలన్నింటినీ, స్వర్గసుఖాలనూ పొందుతారు. అట్లాగే రెండురోజులు, మూడురోజులు, నాలుగురోజులు, ఈవిధంగా శక్తిమేరకు ఎక్కువ రోజులు వ్యవధానం ఉంచి తింటూ ధైర్యంతో ఒక సంవత్సరం వ్రతం చేసేవాళ్ళ పద్ధతులు వివరిస్తాను వినుము.

విశేషం: రూపశోభిత+అంగన= ఆవేధ్యము, ఆరోప్యము, విక్షేప్యము, బంధనీయము - అని నాలుగు విధాలైన ఆభరణాలు ధరించకపోయినా, ధరించినట్లు ప్రకాశించే అందాన్ని రూపం అంటారు. (ఆవేధ్యారోప్యనిక్షేప్య బంధనీయై రభూషితం, యేన భూషితవద్భాతి తద్రూపమితి కథ్యతే) అంగన - అన్న శబ్దంకూడా శ్రేష్ఠమైన అంగములు కలది అనే అర్థాన్నిస్తుంది.

క. ఎక్కుడు దినముల శుభములు । నెక్కు నఖిలవైభవములు నెక్కు దినమునం
దక్కక యుండెడు కాలము । నెక్కు మహాత్మతయు నెక్కు నిభపురనాథా! 149

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తిపురప్రభూ!; ఎక్కుడు దినములన్= అధికమైన దినములతో; శుభములున్= మంగళములునూ; ఎక్కున్= అధికం అవుతాయి; అఖిల వైభవములున్= సమస్తమైన భోగభాగ్యాలు కూడా; ఎక్కున్= మెండవుతాయి; దినమునన్= రోజులో; తక్కక+ఉండెడు కాలమున్= వ్యర్థమై పోకుండే కాలం; ఎక్కున్= పెరుగుతుంది; మహాత్మతయున్= గొప్ప ఆత్మ కలిగే తనంకూడా; ఎక్కున్= వృద్ధి అవుతుంది.

తాత్పర్యం: ధర్మరాజా! ఉపవాసదినాలు పెరిగిన కొలదీ శుభములు పెరుగుతాయి. సమస్తవైభవాలు అధికమవుతాయి. దినములో వ్యర్థం కాకుండా పోయేకాలం వృద్ధి అవుతుంది. మహాత్మత కూడా అతిశయం అవుతుంది.

విశేషం: తక్కక ఉండెడు కాలము - తక్కుట - తప్పిపోవటం - అంటే వ్యర్థం కావటం - అట్లా కాకుండా ఉండేకాలం పెరుగుతుంది.

తే. వత్సరం బెల్లఁ బక్షోపవాసనియతిఁ । గడపు నతనికిఁ బుణ్యలోకంబు లెల్ల
వాసభూములు మాసోపవాసవృత్తి । యైన బ్రహ్మలోకంబు సౌఖ్యంబు గలుగు. 150

ప్రతిపదార్థం: వత్సరంబు= ఒక ఏడు; ఎల్లన్= అంతా; పక్ష+ఉపవాస నియతిన్= పదునైదు రోజులకాలం ఉపవాసనియమంతో; కడపు+అతనికిన్= సాగించేవాడికి; పుణ్యలోకంబులు= ఉత్తమలోకాలు; ఎల్లన్= అన్నీ; వాసభూములు= నివాసం ఉండే తావులు; మాస+ఉపవాస వృత్తి= నెలరోజులు ఉపవాసం చేసేవాడు; ఐనన్= అయితే; బ్రహ్మలోకంబు సౌఖ్యంబు= బ్రహ్మలోకంలో ఉండే పరమసుఖం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఒక ఏడాదిపక్షం రోజుల చొప్పున ఉపవాస నిష్ఠతో గడిపేవాడికి పుణ్యలోకాలన్నీ నివాసభూము లవుతాయి. నెలరోజులు చొప్పున ఉపవాసం చేసేవాడికి బ్రహ్మలోకపు సుఖం లభిస్తుంది.

విశేషం: పక్షోపవాసం అంటే నెలలో ఒక పదునైదురోజులు ఉపవసించటం. పదునైదురోజులు భోజనం చేయటం అన్న వరుస అనీ, మాసోపవాసం అంటే ఒక నెల ఉపవాసం ఉండి తరువాతి నెల భుజించటం అనే క్రమాన్ని పాటించటం అనీ భావించాలి. మొదటిదానిలో 12 పక్షాలు ఉపవాసం 12 పక్షాలు భోజనం, రెండవదానిలో 6 మాసాలు ఉపవాసం 6 మాసాలు భోజనం అని తాత్పర్యం.

ఆ. ఎంత నిష్ఠ గలిగె నేనియు మాసంబు । లోనియంద యెక్కుడైన దినము
లధిప! యుపవసింపనగుఁ గాని మాసాధి । కోపవాసవృత్తి పాపమండ్రు. 151

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ఎంతనిష్ఠ= ఎంతటి నిలుకడ (పట్టుదల); కలిగెన్+ఏనియున్= కలిగినప్పటికీ; మాసంబులోని+ అందు+అ= మాసంలోపలనే; ఎక్కుడు+ఐన దినములు= ఎక్కువ రోజులు; ఉపవసింపన్= భోజనం మాని ఉండటం; అగున్ కాని= తగునుకానీ; మాస+అధిక+ఉపవాస వృత్తి= నెలకుమించి ఉపవాసం ఉండటం; పాపము= పాపం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఎంత కఠిననిష్ఠ ఉన్నా నెలకులోబడిన కాలంలోనే ఎక్కువ రోజులు ఉపవసించాలి. నెలకు మించిన రోజులు ఉపవాసం ఉండటం పాపం అంటారు.

వ. యుగసామర్థ్యంబుననుం బురుషమహానుభావవిశేషంబుననుంజేసి యుపవాసవ్రతంబు మహాధికకాలకృతం బయినను గీడుం జేయక యత్యంతఫలప్రదంబై యుండు. 152

ప్రతిపదార్థం: యుగ సామర్థ్యంబుననున్= కృతం మొదలైన యుగాల శక్తివలనా; పురుష మహా+అనుభావవిశేషంబుననున్+చేసి= వ్యక్తియొక్క గొప్ప ప్రభావపు మహిమవలనా; ఉపవాసవ్రతంబు= ఉపవాసం అనే వ్రతం; మహా+అధిక కాల కృతంబు= చాలా ఎక్కువ కాలం చేయబడినది; అయినను= అయినా; కీడున్= ఆపద; చేయక= చేయక; అత్యంత ఫల ప్రదంబు= చాలా ఎక్కువ ఫలాన్ని ఇచ్చేది; ఐ= అయి; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: యుగాలశక్తినిబట్టి, మనిషి సామర్థ్యంలోని విశేషాన్నిబట్టీ ఉపవాసవ్రతం చాలా ఎక్కువకాలం చేసేది అయినా ప్రమాదం చేయక అత్యధికఫలాన్ని ఇచ్చేదై ఉంటుంది.

విశేషం: యుగాలకు సంబంధించిన కాలప్రమాణము, శక్తిప్రమాణమూ, ఆయుఃప్రమాణమూ వేర్వేరుగా ఉంటాయి. ధర్మరాజాదులు 125 సంవత్సరములు బ్రదికినట్లుగా భారతంలో ప్రమాణాలు ఉన్నాయి. అది ద్వాపరయుగం.

తే. మాతకును వేదమునకు ధర్మంబునకును । బరములగు గురుశాస్త్ర లాభములు లేవు;
తపము లే దుపవాసవ్రతంబుకంటె । నధిక మైనది యండ్రు మహాత్ము లనఘ! 153

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; మహాత్ములు= దొడ్డబుద్ధికలవారు; మాతకును= తల్లికీ; వేదమునకున్= శ్రుతికీ; ధర్మంబునకును= ధర్మానికీ; పరములు= మించినవి; అగు= అయిన; గురు శాస్త్ర లాభములు= గురువు, శాస్త్రము, లాభము అనేవి; లేవు; ఉపవాసవ్రతంబు కంటెన్= ఉపవాసం అనే నియమం పాటించటం కంటె; అధికము= గొప్పది; ఐనది= అయినట్టిది; తపము= తపస్సు; లేదు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: పుణ్యాత్మా! మహాత్ములు తల్లిని మించిన గురువూ, వేదాన్ని మించిన శాస్త్రమూ, ధర్మాన్ని మించిన లాభమూ అట్లాగే ఉపవాసవ్రతాన్ని మించిన తపస్సూ లేదని చెప్పుతారు.

విశేషం: తల్లి మున్నగు వారి వరుసలో చెప్పటం వలన ఉపవాసవ్రతం తల్లినీ, వేదాన్నీ, ధర్మాన్నీ గౌరవించిన స్థాయిలో గౌరవించ దగినదనే అర్థం స్ఫురిస్తుంది. తుల్యయోగితాలంకారాన్ని భావించాలి.

తే. పావనంబులలో నెల్ల బ్రాహ్మణుండు । పరమపావన మను శ్రుతి పౌరవేంద్ర!
యట్లు గావున భూదేవతార్చనంబు । భక్తి సంభృతముగ నడపంగ వలయు. 154

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= పురువంశమువారిలో గొప్పవాడా!; పావనములలోన్= పవిత్రమైన వాటిలో; ఎల్లన్= అన్నింటికంటె; బ్రాహ్మణుండు= బ్రహ్మజ్ఞానం చక్కగా కల వ్యక్తి; పరమపావనము= మిక్కిలి పవిత్రమైన విషయము; అని; శ్రుతి= వేదం; అనున్= చెప్పుతుంది; అట్లు= ఆ విధం; కావునన్= కావటంచేత; భూదేవతా+అర్చనంబు= బ్రహ్మజ్ఞానసంపద కలవాడిని పూజించటం; భక్తి సంభృతముగన్= భక్తితో నిండిన తీరులో; నడపంగన్ వలయున్= చేయాలి.

తాత్పర్యం: రాజా! పవిత్రములైన అన్నింటిలో బ్రాహ్మణుడు పరమపవిత్రం అని వేదం చెప్పుతున్నది. కనుక అట్టి బ్రాహ్మణుడిని మన్నించటం నిండైన భక్తిభావంతో చేయాలి.

విశేషం: ఇట్టి పట్టులలో కేవల జన్మభావంచేతనే కలుగుతుందని అనుకోరాదు. బ్రాహ్మణ, విప్ర, శ్రోత్రియ మున్నగు శబ్దాలకుండే విశిష్టార్థాన్ని భావించి ఆ లక్షణాలున్న వ్యక్తినే గ్రహించాలి.

వ. అప్రసక్తం బైనను నీయర్థంబు వినవలయు నట్టిది గావునం జెప్పితి' నని పలికి వెండియు. 155

ప్రతిపదార్థం: అప్రసక్తంబు= ప్రసంగానికి సంబంధించినదికానిది; ఐనను= అయినప్పటికి; ఈ+అర్థంబు= ఈ విషయం; వినవలయు+అట్టి+ఇది= వినవలసింది; కావునన్= కనుక; చెప్పితిన్= నీకు చెప్పాను; అని; పలికి= చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఇది సందర్భానికి తగినమాట కాదు అయినా వినదగినది కనుక నీకు తెలిపాను' అని ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది వక్త జాగరూకతను పట్టి ఇచ్చే వైఖరి. ఇక్కడ సందర్భం ఉపవాసవ్రత విషయం. కనుక ఇది అప్రస్తుతప్రసంగం. అయినా వెనుకటి పద్యంలో తల్లి, వేదం, ధర్మం, ఉపవాసం - అనే వాటిని మహావిషయాలుగా చెప్పిన కారణంగా ఆ వరుసలో పరమపవిత్రుడు బ్రాహ్మణుడు అని చెప్పవలసి వచ్చింది.

చ. 'అనశననిష్ఠఁజేసి సుర లాదిమునుల్ మహితానుభావులై
రనఘ! సహస్రవర్ష సమనంతర కల్పితమైన యేకభు

క్తనియమతంత్రమున్ నడపి గాధితనూజుఁడు బ్రాహ్మణత్వముం

గనియె మహోపవాసములఁ గాని ఫలంబులు లేవు భూవరా! 156

ప్రతిపదార్థం: అనఘ!= ఉత్తముడా!; సురలు= దేవతలు; ఆదిమునులు= ఆదికాలపు మహర్షులు; అనశననిష్ఠన్‌చేసి= ఆహారం తీసికొనకపోవటం (ఉపవాసం) అనే నిష్ఠతో; మహిత+అనుభావులు= మిక్కిలి గొప్ప ప్రభావం కలవారు; ఐరి= అయ్యారు; గాధి తనూజుఁడు= గాధి కొడుకైన విశ్వామిత్రుడు; సహస్ర వర్ష సమనంతర కల్పితము= వేయి ఏండ్లు అడ్డు లేనిదిగా చేసికొనబడినది; ఐన ఏక భుక్త నియమ తంత్రమున్= అయిన ఒక పూట భోజనం అనే నియమంతో కూడిన విధానాన్ని; నడపి= సాగించి; బ్రాహ్మణత్వమున్= బ్రాహ్మణుడు కావటాన్ని; కనియెన్= పొందాడు; భూవర!= రాజా!; మహా+ఉపవాసములన్= గొప్ప ఉపవాసాలతో; కాని ఫలంబులు= సిద్ధింపని ప్రయోజనాలు; లేవు= లేవు.

తాత్పర్యం: పుణ్యాత్మా! దేవతలు, ఆదిమునులు, ఉపవాసనియమంచేతనే గొప్ప ప్రభావం కలవా రయ్యారు. విశ్వామిత్రుడు వేయి ఏండ్లు ఒక్కరోజు కూడా విఘాతం లేకుండా ఒక పూట భోజనం అనే నియమవిధిని నిర్వహించి బ్రాహ్మణత్వాన్ని పొందగలిగాడు. కనుక, రాజా! గొప్ప నిష్ఠతో కూడిన ఉపవాసాలవలన పొందరాని ప్రయోజనాలు లేవు.

విశేషం: సాధారణంగా మానవుడు ధర్మసూత్రాలకు దృష్టాంతాలను దర్శింపగోరుతాడు. ఆ మనస్తత్త్వాన్ని గుర్తించిన వ్యాసభగవానులు ఉపవాసనిష్ఠకు విశ్వామిత్రుడి దృష్టాంతాన్ని అనుసంధించారు.

క. కావున నుపవాసవ్రత । సేవనము శరీరమునకుఁ జిత్తంబునకుం

బావన మైహిక మహిమయు । దేవనిలయ సుఖము నివ్విధిన్ సమకూరున్. 157

ప్రతిపదార్థం: కావునన్= కనుక; ఉపవాస వ్రత సేవనము= ఉపవాసం అనే వ్రతాన్ని సేవించటం; శరీరమునకున్= దేహానికీ; చిత్తమునకున్=మనస్సుకూ; పావనము= పవిత్రతను కలిగించేది; ఈ+విధిన్= ఈ పనివలన; ఐహిక మహిమయున్= ఈ లోకపు గొప్పతనమూ; దేవ నిలయ సుఖమున్= దేవలోకపు సుఖమున్నూ; సమకూరున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: కనుక ఉపవాసవ్రతాన్ని ఆచరించటం శరీరానికీ, మనస్సుకూ పవిత్రతను చేకూరుస్తుంది. దీనివలన ఈ లోకంలో గొప్పతనమూ, దేవలోకపు సుఖమూ అబ్బుతాయి.

విశేషం: ఇది శాస్త్రీయంగా నిరూపణ పొందిన విషయం. ఈనాడు యోగ అభ్యాసం చేసి ఆరోగ్య పరిరక్షణ చేసికొనగోరే వారంతా వారానికి ఒకరోజు ఉపవాసం ఉంటున్నారు. దానివలన శరీరం తేలిక కావటం, హృదయంలో మంచి భావాలు కలగటం అనుభవంలో ఉన్నట్లు వ్యక్తం చేస్తున్నారు. మంచి భావాలు కలగటమే సౌమనస్యం - దేవత్వం.

క. పరమగు నీవ్రతమున కం । గిరసుఁడు దర్శకుఁడు దత్సుగీత విధమునన్

నరు లెవ్వరు దర్శకులగు । దురు వారిం బొరయ వేమి దుఃఖములు నృపా! 158

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; పరము= మిక్కిలి గొప్పది; అగు+ఈ వ్రతమునకున్= అయిన ఈ ఉపవాస వ్రతానికి; అంగిరసుఁడు= అంగిరసుడనే మహాముని; దర్శకుఁడు= ద్రష్ట (మొదట భావించి లోకానికి తెలియజెప్పినవాడు); తద్+సుగీత

విధమునన్= అతడు చక్కగా తెలియజెప్పిన తీరున; నరులు= మానవులు; ఎవ్వరు= ఎవ్వరైతే; దర్శకులు= ప్రవర్తకులు; అగుదురు= అవుతారో; ఏమి దుఃఖములు=ఎటువంటి దుఃఖాలు; వారిన్= వారిని; పొరయవు= అంటవు.

తాత్పర్యం: రాజా! మిక్కిలి శ్రేష్ఠమైన ఈ ఉపవాసవ్రతానికి అంగిరసుడు ద్రష్ట. అతడు చక్కగా వివరించిన తీరున దీనిని ప్రవర్తింపజేసే వారిని ఏ దుఃఖాలూ అంటవు.

విశేషం: దర్శకుడు - ఋషి అని భావించాలి. 'ఋషిశ్చ కిల దర్శనాత్' - ఒక మహా విషయాన్ని కనిపెట్టి ప్రచారంలోనికి తెచ్చే వ్యక్తిని దర్శకుడు, ద్రష్ట, ఋషి అంటారు.

క. ఈ తంత్రంబు పఠించినఁ । బ్రీతి వినినఁ బాయు బహుదురితములు దిర్య
గ్జాతుల భాష లెఱింగెడు । నాతెలి వగు నపరభవమునందు నరులకున్. 159

ప్రతిపదార్థం: ఈ తంత్రము= ఈ కార్యవిధానము; పఠించినన్= చదివినా; ప్రీతిన్= ప్రీతితో; వినినన్= విన్నా; బహుదురితములు= పెక్కు పాపములు; పాయున్= పోతాయి; నరులకున్= మానవులకు; అపరభవమునందున్= మరుజన్మలో; తిర్యక్+జాతుల భాషలు= పశువుల, పక్షుల జాతులభాషలు; ఎఱింగెడు+ఆ తెలివి= తెలిసికొనే జ్ఞానం; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఈ కార్యవిధానం చదివినా విన్నా అన్ని పాపాలు నశిస్తాయి. మానవులకు మరుజన్మలో పశువుల, పక్షుల భాషలు తెలిసికొనే తెలివి అబ్బుతుంది.

విశేషం: దీనిని ఫలశ్రుతి అంటారు. ఇది ప్రాచీన పురాణాదులలో ఒక్కొక్క ఘట్టం ముగిసిన తరువాత సాధారణంగా అనుసంధిస్తూ ఉంటారు. దీనివలన పాఠకుడిలో తెలిసికొనాలనే కుతూహలం పెరుగుతుంది. ఆచరణకు దోహదం కలుగుతుంది. పశుపక్ష్యాదుల భాషలలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. భవిష్యత్తు, నష్టవస్తుప్రశ్న మొదలైనవాటికి శకునాలను చూడటం అనాదిగా అన్ని దేశాలలోనూ ఉన్నది.

వ. అనిన విని ధర్మజుండు సర్వధర్మజ్ఞానమాననీయునితో 'యజ్ఞకర్త యగుట మేలని మీరు పెక్కెడలం జెప్పితిరి; యజ్ఞంబు ధనధాన్యవిభవ సహాయసంపన్నులకుం దక్కం దక్కటివారలకుం జేయ శక్యంబు గామి దెల్లం బెల్లవారికి ననుష్ఠింపనయ్యెడు నట్టి పుణ్యకర్మం బెయ్యది యుపదేశింపవే' యనుటయు నమ్మహీపతికి నమ్మహితాత్ముం డిట్లనియె. 160

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుండు= ధర్ముడి కొడుకు యుధిష్ఠిరుడు; సర్వ ధర్మ జ్ఞాన మాననీయునితోన్= అన్ని ధర్మాల తెలివిచేత గౌరవం పొందదగిన భీష్ముడితో; యజ్ఞకర్త= యజ్ఞాలు చేసేవాడు; అగుట= కావటం; మేలు= మంచిది; అని; మీరు= తమరు; పెక్కు+ఎడలన్= చాలా తావులలో; చెప్పితిరి= చెప్పి ఉన్నారు; యజ్ఞంబు= యజ్ఞం అనేది; ధన ధాన్య విభవ సహాయ సంపన్నులకున్= ధనము, ధాన్యము, వస్తువులు పుష్కలంగా ఉండటం, తోడుపడేవారు అనే సంపదలు కలవారికి; తక్కన్= కాక; తక్కటివారలకున్= మిగిలినవారికి; చేయన్= ఆచరించటం; శక్యంబు+కామి= సాధ్యం కాకపోవటం; తెల్లంబు= స్పష్టము; ఎల్లవారికిన్= అందరికీ; అనుష్ఠింపన్+అయ్యెడు+అట్టి పుణ్యకర్మంబు= ఆచరించదగిన పుణ్యకార్యం; ఏ+అది= ఏదో; (దానిని); ఉపదేశింపవే= తెలుపుమా; అనుటయున్= అన్నంతనే; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఆ+మహిత+ఆత్ముండు= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు 'సర్వధర్మాల జ్ఞానంతో మన్నించ దగినవాడైన భీష్ముడితో ఇట్లా అన్నాడు. యజ్ఞకర్త కావటం ఉత్తమం అని మీరు పెక్కుచోట్ల చెప్పారు. యజ్ఞం ధనము, ధాన్యమూ, ఐశ్వర్యమూ, సహాయులు అత్యధికంగా ఉన్నవారికి తప్ప తక్కినవారికి చేయటం సాధ్యం కాదనే విషయం అందరకూ తెలిసినదే. మరి అందరూ చేయదగిన పుణ్యకర్మం ఏదో నాకు బోధింపరూ!' అనగా ఆ రాజునకు ఆ మహాత్ము డిట్లా చెప్పాడు.

విశేషం: దీనివలన ధర్మరాజు హృదయౌన్నత్యం తెలియవస్తున్నది. సర్వమానవ ఉద్ధరణతాత్పర్యం అతడికి కలదని తెలియవస్తున్నది. ఇది ఒక విధంగా భారతకర్త హృదయతాత్పర్యం. ఆ పుణ్యకార్యం యజ్ఞం ఇచ్చే ఉత్కృష్టఫలం వంటి ఫలాన్ని ఇవ్వాలని కూడా సందర్భాన్ని బట్టి అడిగేవాడి తాత్పర్యం.

క. 'నరవర! యర్థంబులునుం । బరివారము లేకయును శుభస్థితిఁ జేయన్
దొరకొని యుండుట గని యం । గిరసుం డుపవాసముం బ్రకీర్తించెఁ దగన్. 161

ప్రతిపదార్థం: నరవర!=రాజా!; అర్థంబులునున్= ధనాలు, వస్తువులూ; పరివారము= సేవకుల సముదాయము; లేకయును= లేకున్నా; శుభస్థితిన్= శుభమైన స్థితిలో; చేయన్= ఆచరించటానికి; దొరకొని+ఉండుట= అనువై ఉండటం; కని= భావించి; అంగిరసుండు= అంగిరసుడనే మహాముని; ఉపవాసమున్= ఉపవాసాన్ని; తగన్= చక్కగా; ప్రకీర్తించెన్= బాగా కొనియాడాడు.

తాత్పర్యం: 'రాజా! అర్థబలమూ, అంగబలమూ లేకున్నా ఏ లోపమూ లేకుండా చేయటానికి కుదురుతుందని గమనించి, అంగిరసుడు ఉపవాసాన్ని మిక్కిలిగా కొనియాడాడు.

విశేషం: ఉపవాసం అతి సులభంగా చేయదగినదీ, యజ్ఞఫలంవంటి ఫలాన్నిచ్చేదీ అని ఫలితార్థం.

క. ఉపవాసాయాసంబును । నృపముఖ్యా! దుస్సహముగ నీవు దలఁచి య
జ్ఞపరత్వము దుర్ఘట మను । నెపమిడి యి ట్లడిగి తని మనీషం గంటిన్. 162

ప్రతిపదార్థం: నృపముఖ్యా!= రాజోత్తమా!; ఉపవాస+ఆయాసంబును= పస్తు ఉండటంలోని శ్రమను; దుస్సహముగన్= ఓర్వశక్యం కాని దానినిగా; నీవు; తలఁచి= భావించి; యజ్ఞపరత్వము = యజ్ఞాలపై శ్రద్ధ కలిగి ఉండటం; దుర్ ఘటము= కూర్పరానిది; అను నెపము= అను మిషను; ఇడి= పెట్టి; ఇట్లు= ఈ విధంగా; అడిగితి(వి)= అడిగినావు; అని; మనీషన్= భావనాబలంతో; కంటిన్= గుర్తించాను.

తాత్పర్యం: పస్తు ఉండటంలోని శ్రమ సహింపరానిది కదా! అని - యజ్ఞం చేయటం ఎంతో కష్టంతో సాధ్యమయ్యే పని అనే నెపం పెట్టి ఇట్లా అడిగావని నేను భావనతో తెలిసికొన్నాను.

విశేషం: ప్రశ్నించేవారి హృదయగతం తెలిసికొనటం వక్త యొక్క మహాగుణం. అట్టివారినే ఇంగితజ్ఞుడు అంటారు. భీష్ముడు పరమవివేకం కలవాడు కనుక ధర్మరాజు ఇంగితాన్ని పట్టుకొనటమే కాదు బట్టబయలు కూడా చేశాడు.

వ. అనశనవ్రతంబు లందును జులుకని తెఱం గెఱింగించెద. 163

ప్రతిపదార్థం: అనశన= ఆహారం మానటం; వ్రతంబులందును= వ్రతాలలో కూడా; చులుకని= తేలిక; తెఱంగు= పద్ధతి; ఎఱింగించెదన్= తెలుపుతాను.

తాత్పర్యం: ఉపవాసవ్రతంలో కూడా తేలిక పద్ధతిని తెలుపుతాను.

విశేషం: ఇది శ్రీవ్యాసుల అపారకరుణకు మచ్చు తునక.

చ. పగలును రేయుఁ గుడ్చి జలపానము లోనుగఁ గుడ్చునప్డు తు
ష్టిగ నొనరించి మర్త్యుఁ డొకటిన్ నడుమన్ మఱి యెప్డు నంటకే
మిగతిని బాపముం బొరయమిం దలకొల్పుచు హోమకార్యముం
దగుమెయిఁ జేయుచున్న విను తంగెటిజున్నగు నూర్ధ్వలోకముల్. 164

ప్రతిపదార్థం: మర్త్యుండు= మానవుడు; పగలును= పగటి భాగంలోను; రేయిన్=రాత్రియందు; కుడ్చి= భుజించి; జలపానము లోనుగన్= నీరు త్రాపుట మొదలుగ; కుడ్చు+అప్డు= తినే సమయంలో; తుష్టిగన్= తృప్తిగ; ఒనరించి= చేసి; నడుమన్= ఆ రెండు భోజనాలకు మధ్య; ఒకటిన్= ఏ ఒక్కదానినీ; మఱి= ఇక; ఎప్డున్= ఎప్పుడూ; అంటక= ముట్టక; ఏమి గతినిన్= ఏ విధంగానూ; పాపమున్= పాపమును; పొరయమిన్= పొందకపోవటాన్ని; తలకొల్పుచున్= చేస్తూ; హోమకార్యమున్= అగ్నిహోత్రపు అర్చనను; తగు మెయిన్= తగు విధంగా; చేయుచున్= చేస్తూ; ఉన్నన్= ఉంటే; విను= ఆలకించుము; ఊర్ధ్వలోకముల్= పై లోకాలు; తంగెటి జున్ను= తంగెటి జున్నువంటివి; అగున్= అవుతాయి.

తాత్పర్యం: పగలు ఒకమారు, రాత్రి ఒకమారు నీటితోపాటు తృప్తిగా భుజిస్తూ మధ్యలో మరి ఏమీ ముట్టుకొనకుండా ఏ విధమైన పాపం అంటకుండా చూచుకొంటూ హోమకార్యం తగిన విధంగా చేస్తూ ఉంటే పుణ్యాలోకాలు తంగెటిజున్నువలె అందుతాయి.

విశేషం: తంగేటి చెట్టుమీది తేనె పెర ఎంత తేలికగా అందుబాటులో ఉంటుందో అంత సులభంగా పుణ్యాలోకాలు అందుతాయని తాత్పర్యం. దినానికి నియతసమయాలలో రెండు భోజనాలు చేయటం, మధ్య నీటితో సహా ఏమీ ముట్టకపోవటం, పాపపు పనులు చేయకపోవటం, అగ్నిహోత్రాన్ని అర్చించటం - అనే ప్రవర్తన కూడా ఉపవాసం వంటిదే అవుతుందని భావం.

వ. ఇది మేలితెఱంగు గొందఱు దుష్కరంబుగాఁ దలంతు రట్టివారలు దమయోపినభంగుల నంగిరసుం డుపదేశించిన యుపవాస వ్రతవిశేషంబు లనుష్ఠించు వా రని చెప్పిన నప్పౌరవోత్తముం డయ్యుత్తమ బోధనిధికి నమస్కరించి యధ్యాత్మక విద్యాబోధక ప్రకారంబులగు వాక్యసంచయంబులు పెక్కెడలం గృష్ణద్వైపాయనాది మునీంద్రులును గృష్ణుండును నాకర్ణింప నుపన్యసించితిరి కృష్ణశ్రోతృత్వంబు మహార్ఘతమంబు గృష్ణుని యున్న రూ పెఱుంగుటయు నత్యంతసంభావనీయంబు. 165

ప్రతిపదార్థం: ఇది= ఇప్పుడు చెప్పినది; మేలితెఱంగు= ఉత్తమపద్ధతి; కొందఱు=కొందరు; దుష్కరంబుగాన్= చేయశక్యంబు కానిదిగా; తలంతురు= అనుకొంటారు; అట్టివారలు= ఆ విధమైన మనుష్యులు; తమ ఓపిన భంగులన్= తమకు చేతనైన పద్ధతులతో; అంగిరసుండు= అంగిరసుడనే ముని; ఉపదేశించిన ఉపవాస వ్రత విశేషంబులు= ఉపవాసం అనే వ్రతంలోని ఇతర పద్ధతులను; అనుష్ఠించువారు= ఆచరించవలసిన వారు; అని; చెప్పినన్= చెప్పగా; ఆ+పౌరవ+ఉత్తముండు= పురువంశంలో శ్రేష్ఠుడైన ధర్మరాజు; ఆ+ఉత్తమబోధ నిధికిన్= మిక్కిలి మేలైన జ్ఞానపురాశి అయిన భీష్మునికి; నమస్కరించి= ప్రణామం చేసి; అధ్యాత్మక విద్యా బోధక ప్రకారంబులు= తత్త్వసంబంధమైన విద్యను తెలియపరచే విధానాలు కలవి; అగు వాక్య

సంచయంబులు= అయిన మాటల సముదాయాలను; పెక్కు+ఎడలన్= పలుతావులలో; కృష్ణ ద్వైపాయన+ఆది ముని+ ఇంద్రులును= శ్రీ వేదవ్యాసుడు మొదలగు మునిశ్రేష్ఠులూ; కృష్ణుండును= వాసుదేవుడునూ; ఆకర్ణింపన్= వింటూ ఉండగా; ఉపన్యసించితిరి= వివరించి చెప్పారు; కృష్ణశ్రోతృత్వంబు= కృష్ణుడు వినేవాడు కావటం; మహా+అర్హతమంబు= మిక్కిలి యోగ్యమైన విషయం; కృష్ణుని ఉన్నరూపు= శ్రీకృష్ణుడి యథార్థతత్త్వం; ఎఱుంగుటయున్= తెలిసికొనటం కూడా; అత్యంత సంభావనీయంబు= మిక్కిలి చక్కగా భావించదగింది.

తాత్పర్యం: ఇది ఉత్తమపద్ధతి. కొందరు దీనిని కూడా కష్టమైనదిగా భావిస్తారు. అట్టివారు తమ శక్తి ననుసరించి అంగిరసుడు చెప్పిన ఉపవాసవ్రత పద్ధతులను ఆచరించాలి అని చెప్పగా ఆ ధర్మరాజు ఉత్తమజ్ఞానఖని అయిన భీష్ముడికి నమస్కరించి 'తత్త్వవిద్యను చక్కగా తెలిపే వాక్యాలను పెక్కుతావులలో వేదవ్యాసుడు మొదలైన మహామునులు, శ్రీకృష్ణుడు వింటూ ఉండగా వివరించారు. శ్రీకృష్ణుడు శ్రోత కావటం మిక్కిలి యోగ్యమైన విషయం. కృష్ణుడి నిజతత్త్వం తెలిసికొనటం కూడా మిక్కిలి భావించదగిన విషయం.

ఆ. ఎవ్వఁ డెఱుఁగఁబడిన నెఱుఁగంగఁ బాలివి । యైన యెల్ల యవియు నవగతంబు
లగుట యీ పరాశరాత్మజుఁ డాశ్రిత । కోటి కర్థిఁ గృష్ణు గుఱిచి చెప్పె. **166**

ప్రతిపదార్థం: ఈ పరాశర+ఆత్మజుఁడు= పరాశరుడికి కుమారుడైన వేదవ్యాసుడు; ఎవ్వఁడు= ఎవరైతే; ఎఱుఁగఁబడినన్= తెలియబడితే; ఎఱుఁగంగన్= తెలియటానికి; పాలివి= లక్ష్యమైనవి; ఐన ఎల్ల+అవియున్= అయినవన్నీ; అవగతంబులు= తెలియబడినవి; అగుట= కావటం; ఆశ్రితకోటికిన్= తనను ఆశ్రయించినవారి సమూహాలకు; అర్థిన్= కోరికతో; కృష్ణున్+గుఱిచి= కృష్ణుడి గూర్చి; చెప్పెన్= బోధించాడు.

తాత్పర్యం: ఈ వేదవ్యాసుడు 'ఎవరిని తెలిసికొంటే సృష్టిలోని తెలియదగిన విషయాలన్నీ తెలుస్తాయో అట్టివాడు శ్రీకృష్ణుడు' అని ఆశ్రయించిన వారి కందరికీ తెలియచెప్పాడు.

విశేషం: 'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానమ్' అని ఉపనిషత్తు. ఒకదాని ఎఱుకచేత అన్నింటి జ్ఞానం కలుగుతుంది. ఆ ఒకటి పరమాత్మ తత్త్వం. అది కృష్ణరూపంలో ఉన్నదని వ్యాసతాత్పర్యం.

క. కావున నధ్యాత్మక వా । క్యావలికిం జేరుగడ మహామహిమపదం
బై విలసిల్లెడుఁ గృష్ణుఁడ । యే వినఁగా వలతు నమ్మహితవాక్యంబుల్.' **167**

ప్రతిపదార్థం: కావునన్= కనుక; కృష్ణుఁడు+అ= కృష్ణుడే; అధ్యాత్మక వాక్య ఆవలికిన్= తత్త్వం తెలిపే వాక్యాల పంక్తులకు; చేరుగడ= చివరిలక్ష్యమూ; మహామహిమపదంబు= గొప్ప ప్రభావంతో కూడిన స్థానమూ; ఐ= అయి; విలసిల్లెడున్= ప్రకాశిస్తున్నాడు; ఆ+మహిత వాక్యంబుల్= అట్టి పూజ్యతగల వాక్యాలను; ఏన్= నేను; వినఁగాన్ వలతున్= వినగోరుతున్నాను.

తాత్పర్యం: కాబట్టి కృష్ణుడే జ్ఞానం బోధించే వాక్యాలకు చివరి లక్ష్యం. అతడే గొప్ప మహిమకు స్థానం అయి విరాజిల్లుతున్నాడు. అట్టి తత్త్వజ్ఞాన వాక్యాలను నేను వినగోరుతున్నాను.'

విశేషం: ఆత్మ అంటే శరీరం - అధ్యాత్మ అంటే శరీరంలో ఉన్న తత్త్వం. అతడినే 'దేహి' అంటారు. పరమాత్మ - దానికి సంబంధించినది అధ్యాత్మకం.

వ. అని పలికి యింకను నధ్యాత్మవిద్యావివరణంబు లగు వాక్యంబు లనుగ్రహింపవలయు నని సంప్రార్థనంబు సేసిన నప్పార్థివాగ్రగణ్యుతో నక్కురువరేణ్యుండు హరసనత్కుమార సంవాదంబు సెప్పెద నది యధ్యాత్మ విద్యోపకార ప్రకారంబు లైన యుపన్యాసంబుల నొప్పియుండు విను మని యిట్లనియె. 168

ప్రతిపదార్థం: అని; పలికి= మాట్లాడి; ఇంకనున్= ఇంకా; అధ్యాత్మవిద్యా వివరణంబులు= పరమార్థవిద్యను స్పష్టం చేసేవి; అగు వాక్యంబులు= అయిన వచనాలను; అనుగ్రహింపవలయును= నాకు దయతో బోధించాలి; అని; సంప్రార్థనంబు+చేసినన్= వినయంతో అడుగగా; ఆ+పార్థివ+అగ్రగణ్యుతోన్= రాజశ్రేష్ఠుడగు ఆ ధర్మజుడితో; ఆ+కురువరేణ్యుండు= కురువంశంలో ఉత్తముడైన ఆ భీష్ముడు; హరసనత్కుమార సంవాదంబు= శివుడికి; సనత్కుమారుడికి అయిన సంభాషణాన్ని; చెప్పెదన్= చెప్తుతాను; అది= ఆ ఘట్టం; అధ్యాత్మ విద్యా+ఉపకార ప్రకారంబులు= పరమార్థాన్ని తెలిపేవిద్యకు పనికివచ్చే తీరులుగలవి; ఐన ఉపన్యాసంబులన్= అయిన ప్రసంగాలతో; ఒప్పి= అలరారి; ఉండున్= ఉంటుంది; వినుము= ఆలకించుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ఇంకా పరమార్థాన్ని వివరించే వాక్యాలను నాకు దయచేయుము - అని చక్కగా ప్రార్థిస్తే ఆ రాజుతో ఆ భీష్ముడు 'హరసనత్కుమార సంవాదం అనే విషయం వివరిస్తాను. అది పరమార్థవిద్యకు ఉపకరించే తీరులు గల ప్రసంగాలతో అలరారి ఉంటుంది. వినుము.' అని ఇట్లా చెప్పాడు.

విశేషం: భీష్ముడు పరమార్థాన్ని గురించి తనకు తోచిన దానిని చెప్పటానికి పూనుకొనలేదు. హరసనత్కుమార సంవాదం చెప్తుతానన్నాడు. అంటే మహావిషయాలు పరమప్రామాణికుల వాక్యాలుగా ఉంటే తప్ప గ్రాహ్యాలు కావని తాత్పర్యం. దీనినే శబ్దప్రమాణం అంటారు.

హరసనత్కుమారసంవాదప్రకారము (సం.13-165-5 (కుంభ))

చ. హరుఁడు సనత్కుమారుకడ కర్థిమెయిం జనుదేర నమ్మునీ
శ్వరుఁ డుచితాసనాదు లుపచారవిధిజ్ఞతఁ దా నొనర్చి యా
దరభరితాత్ముఁడై 'యభిమతం బగు కార్య మనుగ్రహింపు త
త్పరమతి నిర్వహింతుఁ దగ దానిఁద్రిలోచన! మృత్యుమోచనా! 169

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; సనత్కుమారు కడకున్= సనత్కుమారుడనే ముని దగ్గరకు; అర్థిమెయిన్= కోరికతో; చనుదేరన్= రాగా; ఆ+ముని+ఈశ్వరుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు; ఉపచార విధిజ్ఞతన్= సేవలవిధానం చక్కగా తెలిసిన భావంతో; ఉచిత+ఆసన+ ఆదులు= తగిన ఆసనం మొదలైన వాటిని; తాన్= తాను; ఒనర్చి= చేసి; ఆదరభరిత+ఆత్ముఁడు+ఐ= ఆదరంతో నిండిన హృదయం కలవాడై; త్రిలోచన!= ముక్కంటీ!; మృత్యు మోచనా!= మృత్యువునుండి విడిపింప జేయువాడా!; అభిమతంబు= ఇష్టము; అగు కార్యము= అయినపని; అనుగ్రహింపుము= దయతో చెప్పుము; తత్పరమతిన్= అదే పరమలక్ష్యం అన్న బుద్ధితో; తగన్= తగినవిధంగా; దానిన్= దానిని; నిర్వహింతున్= చేస్తాను.

తాత్పర్యం: శివుడు సనత్కుమారుడి దగ్గరకు రాగా ఆ మహర్షి అతిథిమర్యాదలు చక్కగా తెలిసినవాడు కనుక తగు విధమైన ఆసనాదులను కూర్చి ఆదరంతో నిండిన బుద్ధితో 'త్రిలోచనా! మృత్యుమోచనా! నీకేది ఇష్టమో దానిని దయతో చెప్పుము. దానియందు పరమశ్రద్ధగల బుద్ధితో చక్కగా చేస్తాను' అన్నాడు.

విశేషం: హరుడు త్రిలోచనుడు - సూర్యచంద్రాగ్ని రూపనేత్రాలు కలవాడు. అంటే సర్వకాలాలలో సర్వవిషయకదర్శనజ్ఞానం కలవాడు. మృత్యుమోచనుడు - మృత్యువంటే అధ్యాత్మపరిభాషలో అజ్ఞానం. దానిని విడిపించేవాడు. అంటే అన్నింటిని దర్శిస్తూ అన్నింటి జ్ఞానం సమగ్రంగా కలిగినవాడని భావం. సనత్కుమారుడు తత్త్వజ్ఞాని కనుక అర్థాలు స్ఫురించే విధంగా సంబోధించాడు.

తే. అనిన 'నీతోడ గోష్ఠికి నర్థిపుట్టి । యరుగుదెంచితిఁ దమ్ముఁడ!' యని ప్రమోద
మెసఁగఁ బల్కి యప్పరమేశుఁ డిట్టు లనియె । నఖిలలోకార్చితుం డగు నతనితోడ. 170

ప్రతిపదార్థం: అనినన్= అంటే; ఆ+పరమ+ఈశుఁడు= ఆ మహేశ్వరుడు; తమ్ముఁడ!= ఓయి తమ్ముడా!; నీతోడన్= నీతో; గోష్ఠికిన్= మంచిమాటలు మాట్లాడుకొనటానికి; అర్థి= కోరిక; పుట్టి= కలిగి; అరుగుదెంచితిన్= వచ్చాను; అని; ప్రమోదము= పరమానందం; ఎసఁగన్= అతిశయించే విధంగా; పల్కి= పలికి; అఖిలలోక+అర్చితుండు= సమస్తలోకాల మన్ననగొన్నవాడు; అగు+అతనితోడన్= అయిన ఆ సనత్కుమారుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ముని పలికితే పరమేశ్వరుడు 'తమ్ముడా! నీతో ప్రసంగం చేయాలనే కోరిక పుట్టి వచ్చాను' అని పరమానందం అతిశయించే విధంగా పలికి, సర్వలోకాలు పూజించే ఆ సనత్కుమారుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: తమ్ముడ!- మహేశ్వరుడికి రుద్రుడనే పేరు ఉన్నది. ఆ దశలో అతడు బ్రహ్మ సృష్టించిన బాలుడు. సనకుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు అనే పలువురు బ్రహ్మమానసపుత్రులు - కనుక సోదరసంబంధం. అఖిలలోకార్చితుడు - తనకు తమ్ముడైనా జ్ఞానవిశేషాన్ని బట్టి సర్వలోకాలూ అర్చించే మహిమ కలవాడు కనుక సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు కూడా స్వయంగా వచ్చాడని హేతుదర్శనం.

క. 'ధ్యానమున దర్శనీయం । బైనది యే వస్తు? వెన్ని యనఘచరిత! స
మ్మానితతత్త్వంబులు? సం । ఖ్యానము యోగంబు నెట్టి గతులం జెల్లున్?' 171

విశేషం: అనఘచరిత!= పుణ్యప్రవర్తన కల ఓ మునీ!; ధ్యానమునన్= ధ్యానంలో; దర్శనీయంబు= చూడదగినది; ఐనది= అయినది; ఏ వస్తువు?; సమ్మానిత తత్త్వంబులు= చక్కగా భావించదగిన తత్త్వాలు; ఎన్ని?; సంఖ్యానము= జ్ఞానము; యోగంబు= యోగమూ; ఎట్టి గతులన్= ఏ పద్ధతులతో; చెల్లున్= ప్రవర్తిస్తాయి?

తాత్పర్యం: 'పుణ్యాత్మా! ధ్యానంలో చూడదగిన వస్తు వేది? చక్కగా భావించదగిన తత్త్వాలు ఎన్ని? జ్ఞానమూ, యోగమూ ఏ విధంగా ప్రవర్తిస్తాయి?

వ. చెప్పుము. మఱియు నధ్యాత్మవిషయంబులగు విశేషంబులును వివరింపు మనుటయు నయ్యంభోజసంభవుం డయ్యభవున కిట్లనియె. 172

ప్రతిపదార్థం: చెప్పుము= తెలియచెప్పుము; మఱియున్= ఇంకా; అధ్యాత్మవిషయంబులు= తత్త్వానికి సంబంధించినవి; అగు విశేషంబులు= అయిన ప్రత్యేకించి తెలిసికొనదగిన విషయాలు; వివరింపుము= తెలియజెప్పుము; అనుటయున్= అన్నంతనే; ఆ+అంభోజ సంభవుండు= పద్మంలో పుట్టినబ్రహ్మ (కుమారుడగు సనత్కుమారుడు); ఆ+అభవునకున్= ఆ రుద్రుడికి; ఇట్లు+ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: చెప్పుము. ఇంకా తత్త్వవిషయాలు తెలియచెప్పుము' అనగా సనత్కుమారుడు శివుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అధ్యాత్మం - ఆత్మ అంటే ఇక్కడ దేహం. దేహంలో ఉన్నతత్త్వం అధ్యాత్మం. వక్త అంభోజ సంభవుండు - అనగా బ్రహ్మ - అతడి మానసపుత్రుడైన సనత్కుమారుడు 'ఆత్మా వై పుత్రనామాసి' అనే న్యాయంచేత అతడే అవుతున్నాడు. శ్రోత అభవుడు - పుట్టుకలేనివాడు - వారి వాక్యాలు పరమాదరంతో గ్రహించదగిన వని సూచన. ప్రమాణబుద్ధిని కలిగించటం కోసం ఇటువంటి పదాలను ప్రయోగించారు.

క. అరయఁగఁ దత్త్వము లనునవి । యిరువది నాల్గండ్రు గొంద ఱిభదనుజహరా!
యిరువది మూఁ డనుటయుఁ గల । దిరువది యేనండ్రు వానినే యెట్లనినన్. 173

ప్రతిపదార్థం: ఇభదనుజహరా!= ఏనుగు రక్కసుడి రూపుమాపిన ఓ శివా!; కొందఱు= కొంతమంది; తత్త్వములు= భావములు; అనునవి= అనేవి; ఇరువదినాల్గు= ఇరవై నాలుగు; అండ్రు= అంటారు; ఇరువదిమూఁడు= ఇరవైమూడు; అనుటయున్= అనటం కూడా; కలదు= ఉన్నది; వానిన్+ఏ= ఆ తత్త్వాలనే; ఇరువదియేను= ఇరవై అయిదు; అండ్రు= అంటారు; ఎట్లు= ఏ విధంగా; అనినన్= అనగా.

తాత్పర్యం: శివా! తత్త్వాలు ఇరవై నాలుగని కొందరూ, ఇరవై మూడని కొందరూ, ఇరవై అయిదని కొందరూ అంటారు. ఎట్లాగంటే.

విశేషం: దీనిని సాంఖ్యం అంటారు. ఇందులో లెక్క ఉంటుంది కనుక. తత్త్వం అంటే 'దానితనం' అని శబ్దార్థం. అయితే ఇక్కడ ఇది ఒక పరిభాష. ఆ శబ్దంతోనే దానిని వ్యవహరించటం మంచిది.

క. ఇరువది మూఁ డనువార । ల్గిరిజేశ్వర! ప్రాకృతుల్ మలీమసవిధ మ
త్తెరువు మనోబుద్ధులు వా । రరయఁగ నొక్కండ యండు రది యట్లుండెన్. 174

ప్రతిపదార్థం: గిరిజా+ఈశ్వర!= గిరిజానాథా!; ఇరువదిమూఁడు= ఇరవైమూడు; అనువారల్= అనేవారు; ప్రాకృతుల్= నిండు జ్ఞానం లేని పామరులు; ఆ+తెరువు= ఆ పద్ధతి; మలీమసవిధము= మలినమైనదారి; వారు= ఆ మార్గంవారు; అరయఁగన్= పరికింపగా; మనస్+బుద్ధులు= మనస్సు, బుద్ధి అనేవి; ఒక్కండు+అ= ఒక్కటే; అండురు= అంటారు; అది; అట్లు= ఆ విధంగా; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: శివా! తత్త్వాలు ఇరవైమూడు అనేవారు పామరులు. అది మలినమైన పద్ధతి. వారు మనస్సు, బుద్ధి ఒక్కటే అంటారు. అది అట్లా ఉండనిమ్ము.

విశేషం: మనస్సు - సంకల్పవికల్పాల రూపమైన బుద్ధి - నిశ్చయాత్మకమైనది. ఇట్లా చక్కగా రెండింటిస్థితి తెలుస్తూ ఉంటే ఒక్కటే అనటం సరికాదు. అందుకనే అది మలినమైన మార్గం. పామరమార్గం.

క. ఇరువది నాల్గనువారలు । నరసి మనశ్శుద్ధి బుద్ధి యను కాన్పున న
ప్పరుసునఁ బలికెద రేఁ గను । తెరువున విను తత్త్వవిధము దేవస్తుత్యా! 175

ప్రతిపదార్థం: దేవస్తుత్యా!= దేవతలచేత కొనియాడబడే పరమేశ్వరా!; ఇరువదినాల్గు+అనువారలు= తత్త్వాలు ఇరవై నాలుగు అనేవారు; మనస్+శుద్ధి= మనస్సు నిర్మలంగా ఉండటం; బుద్ధి; అను కాన్పునన్= అనే దృష్టితో; ఆ+పరుసునన్= ఆ విధంగా

పలికెదరు= చెప్పుతారు; ఏన్= నేను; కను తెరువునన్= చూచేదారిలో; తత్త్వవిధము= తత్త్వాలస్థితిని గూర్చి; విను= ఆలకించుము.

తాత్పర్యం: పరమేశ్వరా! ఇరవై నాలుగు అనేవారు మనస్సుయొక్క పరిశుద్ధతయే బుద్ధి అనే దృష్టితో అట్లా అంటారు. నేను చూచే మార్గంలో తత్త్వాల సంగతిని వివరిస్తాను. వినుము.

విశేషం: మనస్సు నిరంతరం చలనశీలం అయింది. అది ఒకటి. అది నిశ్చయాన్ని పొందినప్పుడు చలనరూపమైన దోషం ఉండదు. కనుక అప్పుడు దానికి 'బుద్ధి' అనే మరొక స్థితి ఏర్పడుతుంది. ఈ విధంగా మనస్సు వేరు, బుద్ధి వేరు అని పరిగణించేవారు తత్త్వాలు ఇరవై నాలుగంటారు అని పద్యతాత్పర్యం.

తే. పంచవింశ మధిష్ఠానభావ మొంది । విలసనము నిచ్చుఁ దగఁ జతుర్వింశతికిని;
దన్నకని తనయంద డిందఁగఁ జేయు । దాన నప్పిండు గలయది లేనియదియు. 176

ప్రతిపదార్థం: పంచవింశము= ఇరవై అయిదోతత్త్వము; అధిష్ఠాన భావము= అన్నింటికీ ఆధారం అయ్యే భావాన్ని; ఒంది= పొంది; తగన్= తగువిధంగా; చతుర్+వింశతికిని= ఇరువది నాల్గింటి సముదాయానికి; విలసనమున్= ప్రకాశాన్ని; ఇచ్చున్= ఇస్తుంది; తన్నున్+అ= తననే; కని= చూచి; తనయందున్+అ= తనయందే; డిందగన్= లీనమైపోయే విధంగా; చేయున్= చేస్తుంది; దానన్=ఆ కారణంగా; ఆ+పిండు= ఆ ఇరవై నాల్గింటి సముదాయం; కల+అది= ఉన్నదీ; లేని+అదియున్= లేనిదీ (అవుతుంది)

తాత్పర్యం: 'అధిష్ఠానం' అనే రూపంలో ఇరవై అయిదవ తత్త్వం ఉన్నది. అది తక్కిన ఇరవైనాల్గింటికీ ఒక స్థితిని కల్పిస్తుంది. ఆ ఇరవై నాలుగూ దానిని చూచి దానియందే లీనమై పోయేటట్లుగా అది చేస్తుంది. కనుక అవి ఉండటమూ, లేకపోవటమూ రెండూ సంభవమే.

విశేషం: అధిష్ఠానం అంటే ఆధారం. ఇరవై నాలుగింటినీ పట్టి నిలిపేది అని భావం. కనుకనే ఆ తక్కిన ఇరవైనాలిగింటికీ అది 'ఉనికి - లేక ప్రకాశం' అనే స్థితిని కల్పిస్తుంది. అయితే ఈ ఇరవైనాలుగూ దానిని చూచి దానిలో 'లీనం' అయిపోతాయి. లీనం అయిపోవటమంటే నామరూపాలు లేకుండా పోవటం. ఒక నది సముద్రంలో కలవటానికి ముందువరకు నది. సముద్రంలో కలిసిన తరువాత ఆ పేరుగాని, దాని గుణాలుగానీ ఏమీ మిగలవు. ఆ స్థితికి లీనం అవటం అని వ్యవహారం. ప్రస్తుతం ఇరవైనాలుగు తత్త్వాలు విడిగా ఉన్నంతవరకూ అవి 'ఉన్నట్లు'; ఇరవై అయిదవ తత్త్వంలో 'లీన' మయినప్పుడు అవి లేనట్లు. ఈ ఇరవై అయిదవ తత్త్వాన్నే 'పరమాత్మ' అంటారు.

వ. చతుర్వింశతి తత్త్వంబులు వివరించెద. 177

ప్రతిపదార్థం: చతుర్+వింశతితత్త్వంబులు= ఇరవై నాలుగు తత్త్వాలను; వివరించెదన్= తెలియచెప్పుతాను.

తాత్పర్యం: ఇరవై నాలుగు తత్త్వాలను వివరిస్తాను.

తే. అవధరింపుము భూతంబు లయిదుఁ దద్గు । ణములుఁ బది యింద్రియములు మనంబు బుద్ధి
యును మహేశ! యహంకారమును బ్రకృతియు । నాఁగఁ దత్త్వంబు లిరువది నాల్గు వొలుచు. 178

ప్రతిపదార్థం: మహా+ఈశ!= పరమేశా!; అవధరింపుము= దయతో వినుము; భూతంబులు= భూతము అనే పేరుగలవీ; తత్+గుణాలు= వాటి గుణాలు; అయిదున్= అయిదూ; ఇంద్రియములు= ఇంద్రియాలు అనే పేరు గలవి; పది= పదీ;

మనంబు= మనస్సు; బుద్ధియును= బుద్ధీ; అహంకారమును= అహంకారమూ; ప్రకృతియున్= ప్రకృతీ; నాఁగన్= అనగా; తత్త్వంబులు= తత్త్వాలు; ఇరువదినాల్గు= ఇరవై నాల్గు; పొలుచున్= ఒప్పుతూ ఉంటాయి.

తాత్పర్యం: పరమేశ్వరా! అయిదు భూతాలు, అయిదైన వాటి గుణాలు, పది ఇంద్రియాలూ, మనస్సు, బుద్ధి, అహంకారమూ, ప్రకృతీ ఇవి ఇరవై నాలుగు తత్త్వాలు.

విశేషం: 1.నేల, 2.నీరు, 3.నిప్పు, 4.గాలి, 5.నింగి ఇవి అయిదు భూతాలు - భూతం అంటే ఉన్నది. అనాదిగా ఉన్నది అని స్థూలంగా అర్థం.

వాటి గుణాలు :1.గంధం (నేల), 2.రసం (నీరు), 3.రూపం (నిప్పు), 4. స్పర్శ (గాలి), 5. శబ్దం (నింగి)

పది ఇంద్రియాలు: అయిదు కర్మేంద్రియాలు + అయిదు జ్ఞానేంద్రియాలు.

1. వాక్కు, 2. చేతులు, 3.కాళ్ళు, 4. మలం విసర్జించే అవయవం, 4. జననేంద్రియం. ఇవి ఆయా పనులను చేస్తూ ఉంటాయి. కనుక కర్మేంద్రియాలు అంటారు.

1. చర్మము, 2. కన్ను, 3. చెవి, 4.నాలుక, 5. ముక్కు ఇవి వెలుపలి పదార్థాదుల స్పర్శాది లక్షణాలను జీవికి తెలియజేస్తాయి. కనుక జ్ఞానేంద్రియాలు.

5+5+5+5=20. ఇవిగాక 1.మనస్సు, 2.బుద్ధి, 3.అహంకారము, 4.ప్రకృతి - అనేవి నాలుగు (20+4=24) కలిపితే ఇరవైనాలుగు.

అయి దయిదుగా ఉన్న వాటికి క్రమసంబంధం చూచుకోవాలి. అంటే ఒక భూతం, ఒక గుణం, ఒక జ్ఞానేంద్రియం పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. అది ఈ క్రింది విధంగా అనుసంధించుకొనాలి.

	భూతం	**గుణం**	**జ్ఞానేంద్రియం**
1.	నేల	గంధం	ముక్కు
2.	నీరు	రసం	నాలుక
3.	నిప్పు	రూపం	కన్ను
4.	గాలి	స్పర్శ	చర్మం
5.	నింగి	శబ్దం	చెవి

కర్మేంద్రియాలు ఈ అన్నింటికీ తగిన విధంగా సహకరిస్తూ తమ పనులు చేసికొంటాయి.

(21) మనస్సు: వచ్చే భావాలు, పోయే భావాలు అనేవాటి సముదాయరూపమైనది.

(22) బుద్ధి : నిశ్చయాత్మక - అంటే ఒక పనికి నిర్ణయం కుదిరిన దశలో దానిని బుద్ధి అంటారు.

(23) అహంకారం : 'నేను' అనే భావం. నేను చేస్తున్నాను, నేను చూస్తున్నాను - అనే భావం దేనివలన ఏర్పడుతున్నదో

దానిని 'అహంకారం' అంటారు.

(24) ప్రకృతి : పై అన్నింటికీ మూలకారణమైన తత్త్వం. దీనినే 'మాయ' అని కూడా అంటారు.

వ. ఆ చతుర్వింశతి తత్త్వంబుల నధిష్ఠించి యుండు తత్త్వంబు నిర్దేశించెద. 179

తాత్పర్యం: ఆ ఇరువది నాలుగు తత్త్వాలకూ ఆధారరూపంగా ఉండే తత్త్వాన్ని చెప్పుతాను.

క. దేహం బనియెడ నెరవున । నూహించును బుధుఁడు దాననుండుం గాష్ఠ
స్వాహాప్రియు క్రియఁ బురుషుఁడు । సోऽహ మనిన కాన్పు రుద్ర! యతనిఁ గను టగున్. 180

ప్రతిపదార్థం: బుధుఁడు = జ్ఞానం కల పండితుడు; దేహంబు= శరీరం; అని; ఎడన్= ఒక తావును; నెరవునన్= సముదాయ రూపంలో; ఊహించును= భావిస్తాడు; దానన్= ఆ దేహంలో; కాష్ఠ స్వాహాప్రియు క్రియన్= కట్టెలోని అగ్నివలె; పురుషుఁడు= పురుషు డనబడే ఇరవై అయిదవ తత్త్వం; ఉండున్= ఉంటుంది; రుద్ర!= ఓ పరమేశ్వరా!; సః+అహమ్= అతడే నేను; అనిన కాన్పు= అనే దృష్టి; అతనిన్= ఆ పురుషుడిని; కనుట= దర్శించటం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: రుద్రా! జ్ఞాని పై ఇరువదినాల్గింటి సముదాయాన్ని దేహం అని భావిస్తాడు. అందులో 'పురుషుడు' కట్టెలో నిప్పు ఉన్నట్లు ఉంటాడు. అతడే 'నేను' అనే జ్ఞానం పొందటమే ఆ పురుషుడిని దర్శించే విధానం.

విశేషం: శ్రీ శంకరులు నిరూపించిన అద్వైతసిద్ధాంత రహస్యమంతా ఈ పద్యంలో మనకు స్పష్టం అవుతుంది. పైన చెప్పిన ఇరవైనాలుగు తత్త్వాల సముదాయాన్ని దేహం అంటారు. 'పురుషుడు' అనబడే ఇరవై అయిదవ తత్త్వం అందులోనే ఉంటుంది. ఆత్మని+అధి= 'దేహమును ఆధారంగా చేసికొని ఉండేది - అధ్యాత్మమ్ అని అధ్యాత్మ శబ్దాని కర్థం. దేహంలో పురుషుడు ఉండే స్థితిని చక్కగా తెలియటం కోసం ఒక ఉపమానం ద్వారా తెలియజేస్తున్నాను. దేహం కట్టెవంటిది. అందులో ఉండే పురుషుడు అగ్నివంటివాడు. అగ్నికి రెండుదశలు. 1. వ్యక్తదశ. కట్టె కాలుతున్నప్పుడు అగ్ని కంటికి తెలియవస్తుంది. 2. అవ్యక్త దశ. కట్టెలో గూఢంగా అగ్ని ఉండే దశ. కనుకనే ఒక కట్టెను మరొక కట్టెతో మథిస్తే అగ్ని పుట్టుతున్నది. ఈ విధంగా పైకి కనపడకుండా ఉన్నట్లు తెలియవచ్చే దశను అవ్యక్తదశ అంటారు. పురుషుడు దేహంలో ఈ రెండు స్థితులలో దేహానికి ఆధారమై ఉంటాడు. అనగా ఆ 'పురుషతత్త్వం' ఉన్నది కనుకనే ప్రకృతి మొదలైన ఇరవైనాలుగు తత్త్వాల సముదాయం ఉన్నది. అది లేకపోతే ఇది లేదు - అన్న స్థితిలో ఉన్నాడు. జీవుడు ఆ పురుషుడిని సంసారబంధం లేకపోవటం అనే పరమప్రయోజనాన్ని అపేక్షించి తెలిసికొనాలి. దానికి మార్గాన్ని ఇక్కడ సులభపద్ధతిలో చెప్పుతున్నారు. 'అహమ్' అంటే నేను - అంటే ఇరవైనాలుగు తత్త్వాల సముదాయరూపమైన జీవుడు. 'సః' - అంటే ఇరువది యైదవ తత్త్వంగా ఉండే పరమాత్మ. అది నేనే, నేనే అది - అన్న వివేకం పొందటమే పరమాత్మను చూడటం. దానివలన జీవుడికి పరమాత్మతతో ఒక్కటి అయ్యే స్థితి కలుగుతున్నది. దానినే మోక్షం అంటారు. అద్వైతసిద్ధి అంటే ఇదే. ద్వి - రెండు, 'ద్వితా' - రెండు ఉండటం. దాని భావం - ద్వైతం అది లేని స్థితి - అద్వైతం - ఇక్కడ రెండు అంటే (1) .జీవుడు, (2) పరమాత్మ.

క. ఈ నెఱి నిలుచుట గలుగదు । మానేర్ష్యావంతు లైన మానవులకు ని
ష్ఠానూన తపోవర్తకు । లైనను గార్హస్థ్యబహుముఖాత్మకు లగుటన్. 181

ప్రతిపదార్థం: నిష్ఠా+అనూన తపస్+వర్తకులు= ఏ కొంచెం చెదరని తక్కువకాని తపస్సును ప్రవర్తింపజేసేవారు; ఐనను= అయినా; గార్హస్థ్యబహుముఖ+ఆత్మకులు= గృహస్థధర్మంలో పెక్కురీతులైన భావాలు కలవారు; అగుటన్= కావటంవలన; మాన+ఈర్ష్యావంతులు= అభిమానమూ, ఈర్ష్య అనే భావాలు కలవారు; ఐన మానవులకున్= అయిన మనుష్యులకు; ఈ నెఱి= ఈ వివేకం; నిలుచుట= స్థిరంగా ఉండటం; కలుగదు= కలగదు.

తాత్పర్యం: గృహస్థులు పెక్కుభావాలు కలవారు కావటంవలన చెడని దీక్షగల తపస్సులో ప్రవర్తిస్తున్నవారైనా ఈర్ష్య, దురభిమానం గల మానవులకు ఈ వివేకం ఎక్కువకాలం నిలవదు.

విశేషం: 'అతడే నేను' అనుకొన్నాం కదా! మరి మనకు మోక్షం సిద్ధించటం లేదేమి? - అనే ప్రశ్నను సంభావించి సమాధానం చెప్తున్నారు. మోక్షం ఈ వివేకం స్థిరంగా సర్వకాల సర్వావస్థలలో చెడకుండా ఉన్నవారికి మాత్రమే సిద్ధిస్తుంది. దీనికి 'విక్షేపాలు- భంగం కలిగించేవి - పెక్కులు. 1.గార్హస్థ్యబహుముఖాత్మకత - గృహస్థధర్మంలో ఉండటంవలన అనేకభావాలను చూడవలసి రావటం. 2. మానం - అంటే అహంకారం. దురభిమానం. నేనే సర్వానికీ కర్తను - అనే దుష్టమైన ఆలోచన, 3. ఈర్ష్య -ఇతరుల విశిష్టతను చూచి సహింపలేకపోవటం మొదలగునవి. ఇవన్నీ తనను తాను లయం చేసికొని పరమాత్మలో కలిసిపోవటానికి అడ్డుపడే లక్షణాలు. ఇవి తొలగాలంటే 'నిష్ఠానూన తపస్సు' కావాలి. కానీ సాధన ఉన్నా ప్రతిబంధకాలైన ఈర్ష్యాదులను తొలగించుకొనకపోతే సాధన బూడిదలో పోసిన పన్నీరువంటి దవుతుంది. ఎందుకంటే 'సోహఽమ్' అనే వివేకం 'నిలుచుట కలుగదు' కనుక.

వ. శ్రుతి పురుషు నమృతార్థ తత్త్వంబనియు బ్రహ్మం బనియు నిర్దేశించు. 182

ప్రతిపదార్థం: శ్రుతి= వేదం; పురుషున్= పురుషు డనే తత్త్వాన్ని; అమృత+అర్థ తత్త్వంబు= అమృతం అనే అర్థంగల తత్త్వం; అనియున్= అనీ; బ్రహ్మంబు= బ్రహ్మము; అనియున్= అనీ; నిర్దేశించున్= తెలియచేస్తున్నది.

తాత్పర్యం: వేదం 'పురుష' తత్త్వాన్ని అమృతార్థతత్త్వమనీ బ్రహ్మమనీ తెలియజేస్తున్నది.

విశేషం: 'అమృతం' అంటే చావు లేనిది. ఆ అర్థంగల తత్త్వం అమృతార్థతత్త్వం - 'అవినాశి తు తద్విద్ధి' అని భగవద్గీత. బ్రహ్మము అనగా పెద్దది అని శబ్దార్థం. దీనికంటె మించినది, పెద్దది వ్యాపించినదీ మరొకటి లేదు కనుక 'బ్రహ్మము' అనే పదం సార్థకమైనది. శ్రుతి అనగా శబ్దప్రమాణం. అనగా ఇతర ప్రమాణాల ద్వారా తెలియరాని అంశాలను తెలియజెప్పేది. అది తిరుగులేని ప్రమాణం.

తే. అన్ని తత్త్వంబులకు నమృతార్థతత్త్వ। మెక్కు డది ఈశ్వరంబు ననీశ్వరంబు
సత్యపాకంబు నతిరహస్యంబు దానిఁ। గనిన మృత్యుజాలము చిక్కు గడవవచ్చు. 183

ప్రతిపదార్థం: అమృత+అర్థతత్త్వము= అమృతం అనే అర్థం గల తత్త్వం; అన్ని తత్త్వంబులకున్= ముందు చెప్పిన ఇరవై నాలుగు తత్త్వాలకంటె; ఎక్కుడు= గొప్పది; అది= ఆ తత్త్వం; ఈశ్వరంబు= అన్నింటికీ ప్రభువు; అనీశ్వరంబు= మరియొక ప్రభువు లేనిది; సత్యపాకంబు= సత్యం పండిన రూపం; అతి రహస్యంబు= మిక్కిలి గోప్యమైనది; దానిన్= ఆ తత్త్వాన్ని; కనినన్= కనుగొంటే; మృత్యుజాలము చిక్కు= మరణం అనే వలలో చిక్కటం; కడవన్ వచ్చున్= దాటవచ్చును.

తాత్పర్యం: ఈ అమృతార్థతత్త్వం అన్ని తత్త్వాలకు మించినది. అది అన్నింటినీ శాసించేది. దానికి మరొక శాసకుడు లేడు. సత్యం పండిన స్వరూపం. మిక్కిలి రహస్యమైనది. దానిని తెలిసికొంటే మృత్యువు వలనుండి దాటవచ్చును.

విశేషం: ఈశ్వరము - తక్కిన ఇరవై నాలుగు తత్త్వాలు దీని అధీనంలో ప్రభువువద్ద సేవకుడివలె ప్రవర్తిస్తాయి అని భావం. అనీశ్వరంబు - దీనిని శాసించే మిన్న అయిన తత్త్వం మరొకటి లేదని భావం. సత్యపాకంబు - పరమసత్యం అని భావం. అంటే మూడుకాలాలలో, సర్వదేశాలలో ఏ యితర ప్రమాణం చేతనూ త్రోసివేయరానిది అని భావం. అతి రహస్యం - దీని గుట్టు తెలిసికొనటం ఎంతవారికీ సాధ్యం కాదని భావం. ఇక్కడ మృత్యువంటే అజ్ఞానము, సంసారము అనే పేర్లతో వ్యవహరించబడే దశ. దాని తగులం దీనివలన రూపుమాసిపోతుందని భావం.

క. అనఘ! యనులోమమునఁ దోఁ । పును బ్రతిలోమమున లయము వొందుటయును గ
ల్గును సర్వతత్త్వముల కవి । యెనయిక బ్రహ్మమును గలయు టేకత్వ మగున్. 184

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముఁడా!; సర్వతత్త్వములకున్= తత్త్వాలన్నింటికీ; అనులోమమునన్= పైనుండి క్రిందికి అనే విధానంచేత; తోఁపును= కన్పడటం అనే స్థితీ (సృష్టి); ప్రతిలోమమునన్= క్రిందినుండి పైకి పోవుట అనే విధానం చేత; లయము= ఒకదానిలో ఒకటి కలిసిపోవటం; పొందుటయును= పొందటమూ; కల్గును= ఏర్పడుతున్నది; అవి= ఆ తత్త్వాలు; ఎనయిక= ఒక్కటి కావటం; బ్రహ్మమును= 'బ్రహ్మము' అనే ఇరవై అయిదవ తత్త్వాన్ని; కలియుట= కలసిపోవటం; ఏకత్వము= ఒక్కటి కావటం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: అనఘా! తత్త్వాలన్నీ పైనుండి క్రిందికి అనే తీరులో ఏర్పడితే 'సృష్టి' అంటారు. క్రిందినుండి పైకి అనే పద్ధతిలో కలసిపోతే 'లయం' అంటారు. అవి అన్నీ కలిపి బ్రహ్మమును చేరుకొనటమే 'ఏకత్వం' అవుతుంది.

విశేషం: అనులోమం - అంటే - బ్రహ్మము - ప్రకృతి - అహంకారము - బుద్ధి - మనస్సు - పంచభూతాలు -పంచగుణాలు - పంచేంద్రియాలు - అనే వరుసలో ఏర్పడటం. దీనిని సృష్టి అంటారు. ఇంద్రియాలు గుణాలలో, అవి భూతాలలో, అవి మనస్సులో, అవి బుద్ధిలో, అది అహంకారంలో, అది ప్రకృతిలో, అది బ్రహ్మలో క్రమంగా లీనం కావటటం ప్రతిలోమ విధానం. దీనిని 'లయప్రక్రియ' అంటారు. ఇట్లా చివరకు బ్రహ్మము ఒక్కటే ఉండే స్థితిని 'ఏకత్వం' అని వ్యవహరిస్తారు. దీనిని సాధకుడు అంతరంగంలో సాధించి చెదరకుండా నిలుపుకొనటం మోక్షం.

తే. ఉత్తమశ్రద్ధ లేకున్నఁ జిత్త మేక । ముఖము గాకున్న నింద్రియముల జయింప
కున్న వేదంబు చదువకయున్న నతని । కీ పరిజ్ఞాన మీఁ దగ దిద్ధచరిత! 185

ప్రతిపదార్థం: ఇద్ధచరిత!= చక్కగా ప్రకాశిస్తున్న నడవడికలవాడా!; ఉత్తమశ్రద్ధ= శ్రేష్ఠమైన హృదయసమర్పణ; లేక+ఉన్నన్= లేకుంటే; చిత్తము= మనస్సు; ఏకముఖము= ఆ ఒక వస్తువునందు లగ్నం అయినది; కాకున్నన్= కాకపోతే; ఇంద్రియములన్= ఇంద్రియాలను; జయింపక+ఉన్నన్= గెలువకపోతే; వేదంబు= శ్రుతిని; చదువక+ఉన్నన్= చదువకపోతే; అతనికిన్= అట్టివాడికి; ఈ పరిజ్ఞానమున్= ఈ సమగ్రమైన జ్ఞానాన్ని; ఈన్ తగదు= ఇవ్వరాదు.

తాత్పర్యం: పరమేశ్వరా! శ్రేష్ఠమైన శ్రద్ధలేనివాడికీ, చిత్తాన్ని ఏకాగ్రంగా నిలుపలేనివాడికీ, ఇంద్రియాలను గెలువని వాడికీ, వేదం చదువనివాడికీ ఈ మహాజ్ఞానాన్ని ఇవ్వరాదు.

విశేషం: 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం, తత్పరః సంయతేన్ద్రియః' అని భగవదనుశాసనం. శ్రద్ధకలవాడూ, తత్పరుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడూ జ్ఞానం పొందుతాడు. ఈ పద్యంలో ఈ అంశాలను క్రమంగా పేర్కొన్నారు. తత్పరత్వమే ఏకాగ్రత. శ్రద్ధ అంటే హృదయాన్ని లక్ష్యంమీదనే ఉంచటం. ఈ మహాజ్ఞానాన్ని ఇవ్వరాదు అనటంలో జ్ఞానం విలువ తెలియచెప్పటం ప్రధానలక్ష్యం.

వ. అని చెప్పి తదనంతరంబ యధ్యాత్మంబుల నధిభూతంబుల నధిదైవంబుల నుపన్యసించె నా సనత్కుమారుండు దత్ప్రపంచంబు నారదునకుం జెప్పట యేను నీకెఱింగించి యప్పరిపాటి నిన్ను మున్న వినిపించితి ధర్మనందనా! యమ్మునిపతి మఱియు నప్పశుపతితో నిట్లనియె. 186

ప్రతిపదార్థం: అని; చెప్పి= తెలిపి; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మట; అధ్యాత్మంబులన్= దేహాన్ని ఆశ్రయించిన వాటిని గూర్చి; అధిభూతంబులన్= ప్రాణులనాశ్రయించి ఉన్నవాటిని; అధిదైవంబులన్= దేవతల నాశ్రయించి ఉన్నవాటిని; ఉపన్యసించెన్= చక్కగా వివరించాడు; ఆ సనత్కుమారుండు= ఆ సనత్కుమారుడు; తద్+ప్రపంచంబున్= విషయాల విస్తరాన్ని; నారదునకున్= నారదమహర్షికి; చెప్పుట; ఏను= నేను; నీకున్= నీకు; ఎఱింగించి= తెలిపి; ఆ+పరిపాటిన్= ఆ క్రమాన్ని; నిన్నున్= నీకు; మున్ను+అ= ఇంతకుముందే; వినిపించితిన్= తెలియజెప్పాను; ధర్మనందనా!= ధర్మరాజా!; ఆ+మునిపతి= మునులలో ఉత్తముడైన ఆ సనత్కుమారుడు; మఱియున్= ఇంకా; ఆ+పశుపతితోన్= ఆ పరమేశ్వరుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్=అన్నాడు.

తాత్పర్యం: తరువాత సనత్కుమారుడు ఆధ్యాత్మములనూ, అధిభూతాలను, అధిదైవాలను గురించి వివరించి చెప్పాడు. ధర్మరాజా! ఆ సనత్కుమారుడు ఆ వివరాలనన్నింటినీ నారదుడికి తెలియజెప్పా డని ఆ క్రమమంతా ఇంతకుముందే నీకు చెప్పాను. తరువాత ఆ మునిశ్రేష్ఠుడు పరమేశ్వరుడితో ఇట్లా అన్నాడు.

ఆ. సకల జంతువులకు సామాన్య మధ్యాత్మ । మాదిగాఁగఁ గల్గు నంతవట్టు
నిట్లు గాఁగ నెఱుఁగు టెఱుఁగుట యొండుమైఁ । గనుట యెఱుక గాదు కామదమన! 187

ప్రతిపదార్థం: కామదమన!= కాముడిని అణచిన ఓ శంకరా!; సకలజంతువులకున్= అన్ని ప్రాణులకు; అధ్యాత్మము+ ఆదిగాఁగన్= అధ్యాత్మము మొదలుగా; కల్గు+అంతవట్టున్= ఉన్న అది అంతా; సామాన్యము= సమానంగా ఉండేదే; ఇట్లు= ఈ విధంగా; కాఁగన్= అవటం; ఎఱుఁగుట= తెలిసికొనటం; ఎఱుఁగుట= నిజమైన తెలివి; ఒండుమైన్= మరొకవిధంగా; కనుట= చూడటం; ఎఱుక= జ్ఞానము; కాదు.

తాత్పర్యం: శంకరా! అధ్యాత్మం మొదలైనది సర్వప్రాణులకు సమానంగా ఉండేది. ఇట్లా తెలిసికొనటమే నిజమైన జ్ఞానం. మరొకవిధమైనది జ్ఞానం కాదు.

విశేషం: ఇంతవరకు చెప్పిన అధ్యాత్మజ్ఞానం ఎవరికో ఒకరికి సంబంధించినది కాదు. సమస్తప్రాణికోటికీ సంబంధించినది - అని తెలిసికొనటమే నిజమైన జ్ఞానం. దీనివలన సర్వప్రాణికోటియందూ ఆత్మతత్త్వం నిండి ఉన్నది అనే మహావిషయం స్పష్టం చేసినట్లయింది.

క. విను మధ్యాత్మప్రభృతులు । గనిరే? మున్నమరదనుజ గంధర్వులునుం
గనుటయుఁ గల్గునె? బ్రహ్మం । బున నున్న నిజంబు తత్ప్రబోధం బసదే? 188

ప్రతిపదార్థం: వినుము; అమర దనుజ గంధర్వులున్= దేవతలు, రాక్షసులు, గంధర్వులు; మున్ను= పూర్వం; అధ్యాత్మ ప్రభృతులు= అధ్యాత్మం మొదలైన విషయాలను; కనిరే?= తెలిసికొన్నారా? బ్రహ్మంబునన్+ఉన్న నిజంబు= బ్రహ్మములో ఉన్న సత్యాన్ని; కనుటయున్= ఇకముందు తెలిసికొనటమూ; కల్గునె?= కలుగుతుందా?; తద్+ప్రబోధంబు= దానిని తెలియజెప్పటం; అసదు+ఏ?= తక్కువదియా?

తాత్పర్యం: ఓయి సర్వజ్ఞా! దేవతలుగానీ, రాక్షసులుగానీ, గంధర్వులు గానీ మునుపు ఈ అధ్యాత్మం మొదలైన విషయాలు తెలిసికొనగలిగారా? బ్రహ్మముయొక్క నిజతత్త్వం తెలిసికొనటం సాధ్యమా? దానిని తెలియజెప్పటం తేలిక పనియా?

విశేషం: బ్రహ్మజ్ఞానం అనంతమైనది. దేవతాదులకు కూడా తెలియదగినది కాదు. తెలిసికొనటం, తెలియజెప్పటం రెండూ దుష్కరాలే అని తాత్పర్యం. దేవతలు సత్త్వగుణానికీ, రాక్షసులు తమోగుణానికీ, గంధర్వులు రజోగుణానికీ ప్రతీకలుగా భావిస్తే పరమాత్మతత్త్వం గుణాతీతమైనది అనే భావన సిద్ధిస్తుంది.

క. ఓం కారవాచ్య మది యన । హంకార నిరూఢ భావనారాధ్యము ని
ష్పంక మశీత మనుష్ణము । శంకర మఖిలంబునకుఁ దృషాహరము శివా! 189

ప్రతిపదార్థం: శివా= శంకరా!; అది= ఆ బ్రహ్మము-తత్త్వం; ఓంకారవాచ్యము= 'ఓమ్' అనే ప్రణవముచేత చెప్పదగినది; అనహంకార నిరూఢ భావనా+ఆరాధ్యము= అహంకారం పూర్తిగా నశించిన భావనకు ఆరాధించదగినది; నిష్పంకము= ఎట్టి మాలిన్యము లేనిది; అశీతము= చల్లదనము లేనిది; అనుష్ణము = వేడి లేనిది; అఖిలంబునకున్= సృష్టిలో సమస్తమైన దానికి; శంకరము= శుభాన్ని కలిగించేది; తృషాహరము= దాహాన్ని తొలగించి వేసేది.

తాత్పర్యం: శివా! ఆ బ్రహ్మతత్త్వం ఓంకారంచేత మాత్రమే చెప్పదగినది. అహంకారం బొత్తిగా లేని వారి భావనచేత మాత్రమే ఆరాధించబడేది. ఏ మాలిన్యమూ లేనిది. ద్వంద్వాలకు అతీతమైనది. సర్వమునకు శుభాన్ని కలిగించేది. అందరి దాహాలు తీర్చునట్టిది.

విశేషం: 'ఓంకారం' దీనిని ప్రణవం అంటారు. ఇది పరబ్రహ్మమునకు వాచకం. ఆకార ఉకార మకారాల సముదాయం ఓంకారం. దీని పరిపూర్ణమైన అర్థాన్ని మాండూక్యోపనిషత్తు వివరిస్తున్నది. అహంకారం ఉన్నవాడికి తానూ, ప్రపంచమూ మాత్రమే కనిపిస్తాయి. పరమాత్మ ఉనికినే అతడు పసికట్టలేడు. సృష్టిలోని సర్వపదార్థాలలో ఏదో దోషం ఉండనే ఉంటుంది. చివరకు హరిహరబ్రహ్మలు కూడా పరమాత్మ తంత్రానికి లోబడినవారే కావటం గుర్తిస్తే వారిలో అస్వతంత్రత అనే దోషం ఉన్నది. ఇక తక్కిన జీవకోటి సంగతి చెప్పనేల? కానీ పరమాత్మకు అట్టిదోషమేమీ లేదని 'నిష్పంకము' అనే శబ్దం తెలియచేస్తున్నది.

అశీతము, అనుష్ణము - అనే పదాలలోని శీతత్వ ఉష్ణత్వాలు ద్వంద్వాలకు సంకేతాలు. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, లాభనష్టాలు మొదలయినవి ద్వంద్వాలు. అవి సుఖంతోపాటు దుఃఖానికి కూడా కారణాలవుతాయి. పరమాత్మ ద్వంద్వాతీతుడు కనుక ఆనందైక ఘనుడని ఉపనిషత్తులు చెప్పుతున్నాయి.

శంకరము - సమస్తప్రాణికోటికీ శుభాన్ని కూర్చేది - ఇక్కడ 'శమ్' అంటే దేశకాల పాత్రములకు అతీతమైన పరమానందం అనే అర్థం గ్రహించాలి.

తృషాహరము - జ్ఞానలాభం పొందిన సాధకుడు మరి దేనినీ అపేక్షించడు. అపేక్ష దుఃఖానికి కారణం. అనపేక్షత పరమ సుఖదాయకం. ఇట్లా ఈ పద్యంలో పరమాత్మ లక్షణాలను ప్రపంచించారు.

తే. అప్రమేయ మవిజ్ఞేయ మచల మాది । విరహితంబు నితాంతంబు విమల మవ్య
యంబు పుండరీకాక్ష మనక్షవిషయ । మచ్యుతము సదసత్పరమైక్యభాసి. 190

ప్రతిపదార్థం: అప్రమేయము=ఊహకందనిది; అవిజ్ఞేయము= తెలియశక్యముకానిది; అచలము= కదలికలేనిది; ఆది విరహితంబు= మొదలులేనిది; నితాంతంబు= అన్నింటికంటె మిన్న అయినది; విమలము= దోషములు లేనిది; అవ్యయంబు= ఎట్టిమార్పులు లేనిదీ; పుండరీక+అక్షము= పద్మములవంటి కన్నులు కలది; అనక్షవిషయము= ఇంద్రియములకు విషయముకానిది; అచ్యుతము= జారుపాటు లేనిది; సత్+అసత్ పరమ+ఐక్య భాసి= ఉన్నది లేనిది అనువాటి గొప్ప ఏకత్వముచేత ప్రకాశించేది.

తాత్పర్యం: ఆ బ్రహ్మము ఊహ కందనిది. తెలియ శక్యము కానిది, కదలిక లేనిది, మొదలు లేనిది, అన్నింటి కంటె మిన్న అయినది, దోషములు లేనిది, ఎట్టిమార్పులు లేనిది, పద్మములవంటి కన్నులు కలది, ఇంద్రియములకు తెలియరానిది, చ్యుతి లేనిది. సదసత్తుల గొప్ప కలయికలో భాసించేది.

విశేషం: అప్రమేయము - మేయము అనగా కొలవదగినది, ప్రమేయము - గొప్పగా కొలవదగినది - అది కానిది అప్రమేయం. పొడవు, ఎత్తు, వెడల్పు మొదలైన ప్రమాణాలు చెప్పరానిది అని భావం.

అవిజ్ఞేయము : ఇతరమైన అనుమానాది ప్రమాణాల ద్వారా తెలిసికొన జాలనిది.

అచలము : స్థిరమైనది. చలనం ఉంటే ఉన్నచోటు, పోయే చోటు మొదలైనవి భావాలు ఉంటాయి. ఉంటే కొలతలు మొదలైనవి ఏర్పడుతాయి. అవి లేవు కనుక అచలము.

ఆదివిరహితంబు : ఆదిశబ్దం మధ్య, అంతశబ్దాలను కూడా సూచిస్తున్నది. ఆది, మధ్య, అంతం అనే దేశకాలభేదాలు లేనిది.

నితాంతంబు : అన్నింటికంటె అధికమైనది. అందుకనే దానిని 'బ్రహ్మము' అంటారు.

విమలము : స్వచ్ఛమైనది. మలం (దోషం) లేనిది. ఉత్పత్తి, స్థితి, వినాశనం మొదలైన వికారాలే మలాలు. అవి లేనిది.

అవ్యయంబు : వ్యయం అనగా తరుగుదల. ఏదో ఒక కారణంగా స్థితిలో వచ్చే క్షీణత - అది లేనిది, పుండరీక+అక్షము= పుండరీకం అనగా హృదయం అనే పద్మం. అందులోనికి వ్యాపించి ఉండేది. వేదమంత్రం హృదయకుహరంలోని సన్ననిరంధ్రంలోని అతిసూక్ష్మమైన అగ్నిజ్వాల నడిమి ప్రదేశం పరమాత్మ స్థానమని అభివర్ణించింది.

అనక్షవిషయము : ఇంద్రియాలకు విషయం కానిది అంటే ఇంద్రియాలచేత తెలియరానిది. ఇంద్రియాలంటే కన్ను, ముక్కు మొదలైనవి రూపగంధాదులను గ్రహిస్తాయి. ఆ అన్నింటికీ అతీతమైనది కనుక ఆత్మతత్త్వం ఇంద్రియాతీతమైనది.

అచ్యుతము : చ్యుతి అంటే జారుపాటు మార్పు అట్టిదేమీ లేనిది.

సత్+అసత్+పరమ+ఐక్యభాసి : సత్ ఉన్నది, అసత్ అంటే లేనిది. ఉన్నది పరమాత్మతత్త్వం, లేనిది జగత్తత్త్వం. ఈ రెంటియొక్క పరమమైన - అత్యుత్కృష్టమైన ఐక్యం - ఏకత్వం - ఒక్కదానితనం - దానితో ప్రకాశించేవాడు. జీవాత్మ పరమాత్మల ఏకత్వం పరిపూర్ణంగా సిద్ధించినపుడు కొంతకాలం ఆ ఏకత్వం లేకుండా దానికోసం సాధనచేసిన వ్యక్తికి ప్రకాశరూపంలో తెలియవచ్చేది.

ఈ పద్యం ఉపనిషదాదులు అనేకయుక్తులతో నిరూపించటానికి ప్రయత్నించే పరమాత్మతత్త్వాన్ని అక్షరరూపంలో వ్యక్తం చేస్తున్నది.

క. అది నారాయణుఁ డొకనికి । విదిత మతనివలన సురలు వివిధమునులు ని
ర్మదసిద్ధసాధ్యగణములు । మొదలగు నర్హుల సుబోధముల పొలమయ్యెన్. 191

ప్రతిపదార్థం: అది= ఆ పరతత్త్వం; నారాయణుఁడు= శ్రీమన్నారాయణుడు; ఒకనికిన్= ఒక్కడికి; విదితము= తెలిసినది; అతనివలనన్= ఆ నారాయణుడివలన; సురలు= దేవతలు; వివిధ మునులు= వేరువేరు విధాలకు చెందిన మునులు; నిర్మద సిద్ధ సాధ్య గణములు= మదంలేని సిద్ధులు సాధ్యులు అనేవారి సముదాయాలు; మొదలగు+అర్హుల సుబోధముల పొలము= మొదలైన యోగ్యత గల జ్ఞానములకు సంబంధించిన క్షేత్రం; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: ఆ పరతత్త్వం నారాయణుడి కొక్కడికే మొదట తెలిసింది. అతడివలన దేవతలు, మునులు, సిద్ధులు, సాధ్యులు మొదలగు యోగ్యతగలవారి జ్ఞానపు పొలం అయింది.

విశేషం: నారాయణుడు - పరమాత్మ స్వరూపంయొక్క సగుణరూపం మొదటి వెలుగు నారాయణుడు. అంటే పరమాత్మ నిర్గుణబ్రహ్మం. నారాయణుడు సగుణబ్రహ్మం అని భావం. 'సగుణం' అనగా సాధకుల తెలివికొరకు నామరూపాదులు పొందిన తత్త్వం. సురలు అనగా బ్రహ్మాదులు వివిధమునులు - బ్రహ్మాది లోకాలకు సంబంధించిన సనత్కుమారుడు, నారదుడు మొదలైనవారు.

నిర్మద, అర్హులు అనే మాటలవలన కేవలం సిద్ధాది పరిగణనకు వచ్చినవారందరికీ ఆ తత్త్వం తెలియవచ్చేది కాదన్న అర్థం తెలియవస్తున్నది.

దీనినే సంప్రదాయం లేదా గురుపరంపర అంటారు. ఈ రెండూ లేని విద్యలు అనాదివిద్యలు కావు. ఆత్మతత్త్వం అనాది విద్య. అనంతవిద్యలు కావు. ఆత్మతత్త్వం అనాదివిద్య. అనంతవిద్య అని నిరూపించటానికి ఈ పరంపరను చెప్పటం పరిపాటి.

వ. అట్లయిన నా తత్త్వంబు దృశ్యత్వంబు నిరూఢంబుగా దెట్లనిన వినుము బంధ విముక్తుండు కదా కనువాఁడు. 192

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; అయినను= అయినా; ఆ తత్త్వంబు; దృశ్యత్వంబు= ఆ పరమాత్మ తత్త్వం కనపడేతనం; నిరూఢంబు= స్పష్టంగా తెలియవచ్చేది; కాదు; ఎట్లు= ఏ విధంగా; అనినన్= అనగా; వినుము= వినుము; బంధవిముక్తుండు= బంధంనుండి విడివడినవాడు; కదా; కనువాఁడు= చూచేవాడు.

తాత్పర్యం: అట్లా అయినా ఆ తత్త్వం కనపడేది కావటం జరుగదు. వినుము. ఎందుకంటే, బంధంనుండి విముక్తి పొందినవాడే కదా చూచేవాడు.

విశేషం: నారాయణుడు మొదలుకొని మహాజ్ఞానసంపన్నుల చక్కని తెలివికి పొలమైనా ఆ పరతత్త్వం కంటికి కనబడదు. ఎందుకంటే అది శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం వంటి విషయం కాదు. ఇంద్రియాలు వాటిని వాటి వికారాలను మాత్రమే చూస్తాయి. ఇక్కడ 'చూచువాడు' అనగా పరతత్త్వదర్శనం చేయగలవాడు అని అర్థం. పైన చెప్పిన ఇరవైనాలుగు తత్త్వాలలో చిక్కటమే బంధం. దానినుండి బయటపడటమే విముక్తి. ఇరవైనాలుగు తత్త్వాలలో చిక్కుకొన్నవాడికి అవే కనిపిస్తాయి. కాని వాటి కతీతంగా 'పెంజీకటి కవ్వల నెవ్వం డేకాకృతియై' అన్నట్లు ఉన్నది కనిపించదు. దానికి బంధవిముక్తి సాధనం - అని భావం. ఈ భావాన్ని మరింత స్పష్టంగా చెప్తున్నారు.

చ. స్మరహర! పొందు నింద్రియసమాజయుగంబు మనంబు బుద్ధియుం
బరువడిమై నహంకరణబంధము వాసిన జీవుఁ దత్సము
త్కరసహితంబుగా నతఁడు దాఁ బరతత్త్వమునందు లీనతం
బొరయును, దాని నెవ్వరు ప్రబోధముగాఁ గనువారు? సెప్పుమా! 193

ప్రతిపదార్థం: స్మరహర!= మన్మథుడిని హరించిన ఓ శంకరా!; పరువడిమైన్= మిక్కిలి వేగంతో; అహంకరణ బంధము= అహంకారం అనే బంధం; పాసిన జీవున్:= వదలిన జీవుడిని; ఇంద్రియసమాజయుగంబు= ఇంద్రియాల సముదాయపు జంట; మనంబు= మనస్సు; బుద్ధియున్= బుద్ధీ; పొందున్= పొందుతాయి (జీవుడిలో చేరుకొంటాయి); అతఁడు= ఆ జీవుడు;

తద్+సముత్కర సహితంబుగాన్= ఆ సముదాయంతో పాటు; పరతత్త్వమునందున్= అన్నింటికంటె వేరుగా మిన్నగా ఉండే పరమాత్మ తత్త్వంలో; లీనతన్= కలిసిపోవటాన్ని; పొరయును= పొందుతాడు; దానిన్= అట్టి పరతత్త్వాన్ని; ఎవ్వరు= ఎవరు; ప్రబోధముగాన్= చక్కగా తెలియవచ్చే విధంగా; కనువారు?= చూచేవారు? చెప్పుమా?= చెప్పుము.

తాత్పర్యం: శివా! అహంకారాన్ని వదలిన జీవుడిలో రెండు విధాలైన ఇంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ లీనమైపోతాయి. అట్లా లీనమైన ఆ అన్నింటితోపాటు జీవుడు పరతత్త్వంలో లీనమైపోతాడు. ఇక పరతత్త్వాన్ని చూచేదెవరో చెప్పుము.

విశేషం: 'చూడటం' అంటే చూచేవాడు (ద్రష్ట) చూడబడేది (దృశ్యం) కన్ను ప్రసరించటం (దర్శనం) అనే మూడు ఉండాలి. పరతత్త్వం విషయంలో ఈ మూడు ఉండే అవకాశం లేదని ఈ పద్యం చెప్తున్నది. ఎట్లా గంటే పరతత్త్వ విషయంలో మొదట 'నేను' అనే భావం (అహంకారం) జారిపోతున్నది. దానితో జీవుడియందున్న రెండు విధాలైన ఇంద్రియాల గుంపులు, మనస్సు, బుద్ధీ అనే పంద్రెండు తత్త్వాలు తమ ఉనికిని కోల్పోతాయి. అనగా నీళ్ళల్లోవేసిన ఉప్పురాయివలె కలిసిపోతాయి. అహంకారం+పది ఇంద్రియాలు+మనస్సు+బుద్ధి అనే పదమూడు కలిసిపోయిన ఆ జీవుడు. సముద్రంలో చేరిన నదివలె ప్రత్యేకస్థితి లేకుండా పరతత్త్వంలో కలిసిపోతాడు. అనగా అక్కడ నిశ్చలంగా, నిలకడగా, నిర్వికారంగా, నిరంజనంగా ఉండేది పరతత్త్వం ఒక్కటే. అప్పుడు చూచేవాడూ, చూడబడేది, చూడటమూ అంతా ఆ పరతత్త్వమే. కాగా దానికంటె ఇతరుడు చూచేవాడు ఉండటం ఎట్లా సాధ్యం? అని పద్యతాత్పర్యం.

ఇంద్రియ సమాజయుగంబు - అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు. ఇంద్రియాల లయం చెప్పటవలన ఇంద్రియగుణాలు, వాటి కాధారభూతాలైన పంచభూతాలు అనేవాటి లయం కూడా చెప్పినట్లే అయింది.

క. భూతము లన్నియు నడఁగిన । యాతఱిఁ దనుఁ దాన కనుచు నంజనరహిత
త్వాతిశయ మెసఁగ వెలిఁగెడు । నాతెలి వాతత్త్వమునకు నమరు మహేశా! 194

ప్రతిపదార్థం: మహా+ఈశా!= పరమేశ్వరా!; భూతములు= నేల మొదలైన భూతములు; అన్నియున్= అన్నీ; అడఁగిన+ఆ తఱిన్= లీనమై పోయిన ఆ సమయంలో, తనున్= తనను; తాను+అ= తానే; కనుచున్= చూస్తూ; అంజన రహితత్వ+ అతిశయము= అంటులేనితనంవలన అయ్యే మహిమ; ఎసఁగన్= ఒప్పగా; వెలిఁగెడు+ఆ తెలివి= ప్రకాశించే ఆ జ్ఞానం; ఆ తత్త్వమునకున్= ఆ విధంగా లీనమైన జీవుడనే తత్త్వానికి; అమరున్= ఏర్పడుతున్నది.

తాత్పర్యం: పరమేశ్వరా! ఈ విధంగా పంచభూతాలు మొదలుకొని మనస్సు, బుద్ధి మొదలైనవన్నీ స్వరూపం కోల్పోయిన తరువాత జీవుడు తనను తానే చూస్తూ ఏ విధమైన అంటూ లేకుండా పరతత్త్వమే అటు వెలిగే స్థితిని పొందుతాడు.

విశేషం: ఈ స్థితినే 'అద్వైతం' అంటారు. అనగా రెండూలేని స్థితి జీవదేవభేదం లేని స్థితి. దానినే 'సోహ౽మ్' అదే నేను అనే భావనతో వ్యవహరిస్తారు. 'తత్త్వమసి' 'అయమాత్మా బ్రహ్మ,' 'ప్రజ్ఞానం బ్రహ్మ' మొదలైన మహావాక్యాల తాత్పర్య స్థితిలో ఉండటం.

ఆ. అని సనత్కుమారుఁ డభవుతో మఱియు ని । ట్లనియె దేహవర్తులైన దైవ
తముల నెల్ల నాదరమున నాకర్ణింపు । మేర్పరింతు యోగహితము గోరి. 195

ప్రతిపదార్థం: అని= ఇట్లు చెప్పి; సనత్కుమారుఁడు= సనత్కుమార మహర్షి; మఱియున్=ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అభవుతోన్= శివుడితో; అనియెన్= అన్నాడు; యోగహితమున్= యోగపు మేలును; కోరి= వాంఛించి; దేహవర్తులు= దేహంలో తిరిగేవి; ఐన దైవతములన్= అయిన దేవతా స్వరూపాలను; ఎల్లన్= అన్నింటినీ; ఏర్పరింతున్= విడివిడిగా వివరిస్తాను; ఆదరమునన్= శ్రద్ధతో; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని చెప్పి, సనత్కుమారుడు శివుడితో ఇంకా ఇట్లా అంటున్నాడు. 'శివా! యోగం చక్కగా తెలియటం కొరకు దేహంలో ఉండే దైవతాల నన్నింటినీ వివరిస్తాను. ప్రీతితో వినుము.

విశేషం: దైవతం అనగా ఏదో ఒక విశిష్టలక్షణంతో వెలుగొందే తత్త్వం. ఉదాహరణకు కన్ను, ముక్కు, చెవి మొదలైనవి. ఎందుకంటే కంటికుండే దర్శనసామర్థ్యం మరి దేనికీ, ఎక్కడా ఎప్పుడూ ఉండదు. అట్లాగే తక్కినవి కూడా. ఈ దృష్టితో భారతీయులు చెప్పుకొనే ముక్కోటి దేవతలను మనదేహంలోనే వివేకంతో దర్శించవచ్చును. అట్లా దర్శించటంవలన యోగం పరిపాకదశకు వస్తుంది. యోగం అనే మాటకు కలయిక అని ఒక అర్థం - జీవబ్రహ్మముల ఏకత్వమే ఇక్కడ సందర్భాన్ని బట్టి యోగం. దానికి హితం అంటే ఆ భావన అభ్యాసపాటవంచేత గట్టిపడటం.

సనత్కుమారుఁడు శివునకు దేహాంతర్గతదైవతములం దెలుపుట (సం.13-167-1(కుంభ))

సీ. జిహ్వ సోముఁడు వాణి శిఖి ప్రాణమున గాడ్పు । దానంబునందు శతహ్రదాలి
వ్యానస్తనాంతరవర్తులై పర్జన్య । గగనముల్ బలమునఁ గౌశికుండు
మతి నపానమున సమానంబునందు నీ । శాన మిత్రాప్సరస్సమితు లక్షు
లందు సూర్యుఁడు మేన నంఘ్రులఁ జెవి భూమి । ధరణిధరుండు దిక్తతి యుపస్థ

తే. మునఁ బ్రజాపతి బుద్ధి యం దనఘ! బ్రహ్మ । యుండు నింతకు బుధ్యమానుం డనంగ
వెలుఁగు నాత్మ యధిష్ఠాత విను ప్రబుద్ధుఁ । డన నబుద్ధుండు నా నొప్పు నతఁడు మఱియు. 196

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా! జిహ్వన్= నాలుకయందు; సోముఁడు= చంద్రుడు; వాణి= వాగ్దేవత; శిఖి= అగ్ని; ప్రాణమునన్= ప్రాణం అనే వాయువునందు; గాడ్పు= వాయుదేవుడు; ఉదానంబునందున్= ఉదానం అనే వాయువులో; శతహ్రద+ఆలి= మెరుపుల వరుస; వ్యాన స్తన+అంతర వర్తులు= వ్యానం అనే వాయువులోను; రొమ్మునడిమి భాగంలోను తిరుగువారు; ఐ= అయి; పర్జన్య గగనముల్= ఇంద్రుడు ఆకాశమూ అనేవి; బలమునన్= బలంలో; కౌశికుండు= ఇంద్రుడు; మతిన్=బుద్ధియందు; అపానమునన్= అపానమనే వాయువునందు; సమానంబునందున్= సమానం అనే వాయువులోను; ఈశాన మిత్ర అప్సరస్+ సమితులు= ఈశానుడు, సూర్యులు, అప్సరసల సముదాయము; అక్షులందున్= కన్నులలో; సూర్యుఁడు; మేనన్= ఒడలియందు; అంఘ్రులన్= కాళ్ళలో; చెవిన్= చెవియందు; భూమి; ధరణిధరుండు= విష్ణువు; దిక్తతి= దిక్కుల సముదాయము; ఉపస్థమునన్= జననేంద్రియములో; ప్రజాపతి= బ్రహ్మ; బుద్ధిఅందున్= బుద్ధిలో; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; ఉండున్= ఉంటారు; ఇంతకున్= దీని కంతటికి; అధిష్ఠాత= ఆక్రమించి సర్వాధికారి అయి ఉండేవాడు; బుధ్యమానుండు= తెలియబడేవాడు; అనంగన్= అనగా; వెలుఁగు+ఆత్మ= వెలుగునట్టి పరమాత్మ; మఱియున్= ఇంకా; విను= వినుము; అతఁడు= ఆ పరమాత్మ; ప్రబుద్ధుఁడు= సర్వము చక్కగా ఎరిగియున్నవాడు; అనన్= అనగాను; అబుద్ధుండు= ఏమియు తెలియనివాడు; నాన్= అనగాను; ఒప్పున్= ఒప్పుతూ ఉంటాడు.

తాత్పర్యం: శివా! వినుము. నాలుకయందు చంద్రుడు, వాక్కు, అగ్ని ఉంటాయి. ప్రాణవాయువులో వాయువు, ఉదానవాయువులో మెరపులు, వ్యానంలో వర్షాదేవత, రొమ్మునందు ఆకాశం, బలంలో ఇంద్రుడు, బుద్ధిలో ఈశానుడు, అపానం అనే వాయువులో ద్వాదశాదిత్యులు, సమానం అనే వాయువులో అప్సరసలు, కన్నులలో సూర్యుడు, దేహం మొత్తం భూమి, పాదాలలో విష్ణువు, చెవిలో దిక్కుల సముదాయము, జననేంద్రియంలో ప్రజాపతి, బుద్ధియందు బ్రహ్మ ఉంటారు. ఈ అన్నింటికీ తెలియబడే ఆత్మ అధిష్ఠాత (సర్వశక్తిమంతుడైన అధికారి). అతడు ప్రబుద్ధుడు, అబుద్ధుడు అని రెండు విధాలుగా ఉంటాడు.

విశేషం: ఇక్కడ విశేషంగా తెలిసికొనదగిన విషయాలు కొన్ని ఉన్నాయి. దేహంలో అయిదు విధములైన వాయువులున్నాయి. వాటికి నిర్దిష్టమైన స్థానాలున్నాయి. పట్టిక ద్వారా వాటిని తెలుసుకొందాం.

	వాయువులు	స్థానాలు
1.	ప్రాణము	హృదయం
2.	అపానము	గుదము
3.	వ్యానము	సర్వశరీరము
4.	ఉదానము	కంఠము
5.	సమానము	నాభి

ప్రజాపతి - అంటే స్థూలంగా బ్రహ్మ అనే అర్థం. కాని దక్షుడు, కశ్యపుడు మొదలైన ఆది సృష్టికర్తలను ఇక్కడ ప్రజాపతి శబ్దంచేత గ్రహించాలి. బ్రహ్మ అనగా వారికి కూడ పుట్టుక నిచ్చిన చతుర్ముఖుడు. బుధ్యమానుఁడు - తెలియబడుచున్నవాడు; ప్రబుద్ధుడు - మేలుకొన్నవాడు. అంటే వ్యక్తస్వరూపం. అబుద్ధుడు - మేలుకొననివాడు - అవ్యక్తస్వరూపం. అనగా ఆత్మ వ్యక్తమనీ అవ్యక్తమనీ రెండు దశలతో ఒక్కటియే అయి ఉంటుందని భావం.

క. ఈ దైవతముల నన్నిటి । నాదరమునఁ గనుచు యోగి యచలితనిష్ఠన్
వేదమయా! మూర్ధగతుం । డై దక్షతపేర్మి నిలుపుఁ బ్రాణము లచటన్. 197

ప్రతిపదార్థం: వేదమయా!= వేదమే స్వరూపమైన పరమేశ్వరా!; యోగి= యోగం కలవాడు; ఈ దైవతములన్= ఈ దేవతా స్వరూపాలను; అన్నిటిన్= అన్నింటినీ; ఆదరమునన్= ప్రీతితో; కనుచున్= చూస్తూ; అచలిత నిష్ఠన్= ఏ కొంచెమూ కదలికలేని నిష్ఠతో; మూర్ధగతుండు= తలలోనికి ప్రవేశించినవాడు; ఐ= అయి; దక్షత పేర్మిన్= సామర్థ్యపు మహిమతో; అచటన్= శిరస్సునందు; ప్రాణములు= ప్రాణాలను; నిలుపున్= నిలుపుతాడు.

తాత్పర్యం: వేదమయుడవైన పరమేశ్వరా! యోగి ఈ దేవతలందరినీ ఆదరంతో చూస్తూ ఏ కొంచెమూ చెదరని నిష్ఠతో శిరస్సులోనికి ప్రవేశించి, తన సమర్థతను పండించుకొని, ప్రాణాలను శిరస్సునందు నిలుపుతాడు.

విశేషం: ఇందులో యోగసిద్ధికి సంబంధించిన మూడు ప్రధానాంశాలను చెప్పుతున్నారు. 1. దైవతస్వరూపాలను చూడటం, 2. అట్లా చూస్తూ తాను సూక్ష్మశరీరంతో శిరస్సులోనికి చేరుకొనటం, 3. దేహంలో అక్కడక్కడ నిలిచి ఉన్న ప్రాణాలను శిరస్సులోనికి తెచ్చి నిలపటం. యోగపరంగా ఇక్కడ శిరస్సు అంటే 'సహస్రారకమలం' అని భావించాలి. అది పరమాత్మ స్థానం. పరమాత్మ

తక్కిన సర్వదేవతాస్వరూపాలకంటె విశిష్టమైనది. నిత్యము, సత్యము, ఆనందము మొదలైన సంజ్ఞలు కలది. అనగా తక్కిన దైవతములకు ఆ స్థితి లేదు. కనుక వాటిని 'చూడటం' అంటే వాటి తక్కువ స్థితిని నిర్ణయించుకొని, వాటిని అపేక్షించకుండా ఉండటం. వాటిని అపేక్షిస్తే యోగి ఆయా స్థానాలలోనే నిలిచిపోతాడు. వాటి గతే అతడిదీ అవుతుంది. ప్రాణాలను అక్కడ నిలపటం అంటే అనిత్యదశలో ఉన్నవాటికి నిత్యదశను కూర్చటం. దానివలన యోగి సర్వాన్నీ పరమాత్మలో లయం చేసి, తానూ లయమై పరమాత్మ తానయ్యే స్థితిని పొందుతాడని తాత్పర్యం. దీనికి 'దక్షతపేర్మి' కావాలి. ఎందుకంటే యోగం అభ్యసించేవాడికి ఏవో చిన్నచిన్న శక్తులు ఏర్పడుతాయి. వాటికి ప్రలోభపడితే వాడు పొందేది సర్వనాశనమే. అనగా మూర్ధగతుడయ్యే స్థితికానీ, ప్రాణాలను అక్కడ నిలిపే స్థితిగానీ సిద్ధించదు.

తే. అపుడు బుధ్యమానునిఁగను నవ్వరిష్ఠ । తత్త్వ మవ్యక్త మంద్రు తద్దర్శియగుఁ బ్ర
బుద్ధుఁ డాతని నతని నబుద్ధుఁ డెఱుఁగు । చుండు నివి యాత్మదశ లతఁ డొకఁడ యనఘ! 198

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యమూర్తీ!; అపుడు= ఆ సమయంలో; బుధ్యమానునిన్= తెలియబడేవాడిని; కనున్= చూస్తాడు; ఆ+వరిష్ఠ తత్త్వము= మిక్కిలి గొప్పదైన ఆ తత్త్వాన్ని; అవ్యక్తము= తెలియబడనిది; అనే అర్థంగల 'అవ్యక్తం' అని; అంద్రు= అంటారు; ప్రబుద్ధుఁడు= ప్రబుద్ధుడనే ఆత్మస్వరూపుడు; తద్+దర్శి= అతడిని చూచేవాడు; అగున్= అవుతాడు; ఆతనిన్= ఆ తెలియబడే వాడిని; అతనిన్= ఆ తెలిసికొన్నవాడిని; అబుద్ధుఁడు= అబుద్ధుడనే ఆత్మతత్త్వం; ఎఱుఁగుచుండున్= తెలిసికొంటాడు; ఇవి= ఈ చెప్పినవి; ఆత్మదశలు= ఆత్మలోని వేరువేరు అవస్థలు; అతఁడు= ఆ పరమాత్మ; ఒకఁడు+అ= ఒక్కడే.

తాత్పర్యం: యోగి అపుడు తెలియబడేవాడిని - అంటే 'వ్యక్త' బ్రహ్మమును చూస్తాడు. అట్లా చూచిన విశేషస్థితిని 'అవ్యక్తం' ప్రబుద్ధుడు దానిని దర్శిస్తాడు. ఆ వ్యక్త, అవ్యక్త స్వరూపాలను రెండింటినీ అబుద్ధుడు తెలిసికొంటాడు. నిజానికి బుధ్యమానుడు, ప్రబుద్ధుడు, అబుద్ధుడు అనేవి దశలలో భేదాలే తప్ప ఆత్మ ఒక్కటే సుమా!

విశేషం: బ్రహ్మతత్త్వం అనుభూతికి వచ్చినపుడు తెలిసేది, తెలిసేవాడూ, తెలియటం అనే దశాభేదాలు ఉండవని భావం.

క. ఇవ్విధము గాంచు యోగికి । నెవ్వరు సరిగారు యతు లనేకు లచలులై
యవ్వస్తువు గోరుదు రది । దవ్వొరులకు యోగితతికిఁ దక్క మహేశా! 199

ప్రతిపదార్థం: మహేశా!= పరమేశ్వరా!; ఈ విధమున్= ఈ పద్ధతిని; కాంచు యోగికిన్= దర్శించే యోగికి; ఎవ్వరున్= ఎవ్వరునూ; సరికారు= సాటికారు; యతులు= యత్నం శీలంగా గలవారు; అనేకులు= ఎంతోమంది; అచలులు= నిష్ఠ చెదరనివారు; ఐ= అయి; ఆ+వస్తువున్= ఆ పరతత్త్వమనే వస్తువును; కోరుదురు= కోరుతూ ఉంటారు; అది= ఆ తత్త్వం; యోగితతికిన్= యోగుల సముదాయానికి; తక్కన్= కాక; ఒరులకున్= ఇతరులకు; దవ్వు= దూరమైనది.

తాత్పర్యం: పరమేశ్వరా! ఈ విధానాన్ని చూచే యోగికి సాటి వచ్చేవారు ఉండరు. ఎందరో పరమనిష్ఠతో దానికొరకు ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ అది యోగులకు తప్ప మరెవ్వరికీ అందుబాటులో ఉండదు.

విశేషం: 'ఎవ్వరు సరికారు' అంటే అతడు బ్రహ్మవేత్త కనుక బ్రహ్మమే అయి, అసదృశస్థితిని పొందుతాడని భావం.

ఆ. క్షరుఁడు నక్షరుండుఁ బరుఁడును నందు ర । వ్వినుతదశలఁ బంచవింశకుఁడు ప్ర
బుద్ధనాముఁ డతఁ డబుద్ధునిఁ గనుఁ బురు । ష విధముగను బ్రకృతిసంగ మెఱుఁగు. 200

ప్రతిపదార్థం: ఆ+వినుతదశలన్= కొనియాడదగిన ఆ దశలయందు; క్షరుఁడున్= క్షరుడన్నపేరుగలవాడు; అక్షరుండున్= అక్షరుడన్న పేరు గలవాడు; పరుఁడును= పరుడన్న పేరుగలవాడు; అందురు= అంటారు; పంచవింశకుండు= ఇరువది యైదవవాడు; ప్రబుద్ధనాముండు= ప్రబుద్ధుడనే పేరుగలవాడు; అతఁడు= ఆ ప్రబుద్ధుడు; అబుద్ధునిన్= అబుద్ధుడనే వాడిని; పురుషవిధముగను= పురుషుడి తీరున; కనున్= చూస్తాడు; ప్రకృతిసంగము= ప్రకృతి అనే తత్త్వంతోడి కలయికను; ఎఱుఁగున్= పొందుతాడు.

తాత్పర్యం: ఆత్మతత్త్వం క్షర, అక్షర, పర అనే పేర్లతో వేరువేరు దశలలో ఉంటుంది. ఇరువదియైదవ తత్త్వమైన వాడికి పేరు ప్రబుద్ధుడు. అతడు అబుద్ధుడిని పురుషుడి తీరున చూస్తాడు. ప్రకృతితో కలయికను పొందుతాడు.

విశేషం: గీతావాక్యాన్ననుసరించి క్షరమంటే సర్వభూతాలు. అక్షరమంటే ఈ అన్నింటికీ మూలమైన కూటస్థతత్త్వం. పరమంటే ఈ రెంటికీ అతీతమైన పురుషోత్తమతత్త్వం. గీతలో పదునైదవ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తియోగం. 16,17,18 శ్లోకాలలో ఈ అంశాల వివరణ ఉన్నది. ఇక్కడ పురుషుడంటే పరమాత్మ అనియే అర్థం. ప్రకృతి అంటే మాయ. దానితో సంగం ఉంటే పరమేశ్వరుడని పురుషుడికి పేరు. లేకుంటే సదాశివుడని పేరు.

క. విను షడ్వింశుఁ డబుద్ధుం । డనఁ జను వాఙ్మనసములకు నందక యునికిం
దనుఁగా నాతత్త్వంబుం । గనిన ప్రబుద్ధుండ యతఁడు కామధ్వంసీ! 201

ప్రతిపదార్థం: కామధ్వంసీ!= కాముడి రూపుమాపిన ఓ శివా!; విను= ఆలకించుము; షడ్వింశుఁడు= ఇరవై ఆరవ తత్త్వంగా లెక్కించబడు ఆ పరమాత్మ; వాక్+మనసములకున్= మాటకు, మనస్సుకు; అందక= దొరకక; ఉనికిన్= ఉండటంవలన; అబుద్ధుండు= అబుద్ధుడు; అనన్= అనగా; చనున్= ఒప్పుతాడు; ఆ తత్త్వంబున్= ఆ ఇరవై ఆరవ తత్త్వాన్ని; తనుఁగాన్= తానేగా; కనిన ప్రబుద్ధుండు+అ= చూచిన ప్రబుద్ధుడనే ఇరవై అయిదవ తత్త్వమే; అతఁడు= ఆ ఇరవై ఆరవ తత్త్వం రూపమైనవాడు.

తాత్పర్యం: శివా! ఇరవై ఆరవతత్త్వానికి అబుద్ధుడని వ్యవహారం. ఎందుకనగా అది మాటకూ, మనస్సుకూ అందదు. ఇరవై అయిదవ ప్రబుద్ధ తత్త్వం. అది - అనగా ఆ ఇరవై ఆరవ తత్త్వం అయిన అబుద్ధుడు తానే అని గుర్తిస్తే అవి రెండూ ఒకటి అవుతాయి.

విశేషం: స్థూలంగా ఇరవై అయిదవ తత్త్వం అనగా జ్ఞానం పొందిన జీవాత్మ అనీ, ఇరవై ఆరవతత్త్వం పరమాత్మఅనీ, 'అది నేనే' అనుకొన్నప్పుడు ఆ రెండూ ఒకటే అవుతాయనీ, అదే కైవల్యమనీ అద్వైతమనీ మనం గుర్తించవచ్చును.

క. వేఱుగఁ గనినం బ్రకృతికిఁ । జూఱ విడిచినట్ల తనదు సుజ్ఞానము న
క్కాఱు విడిచి తనకంటెను । మీఱ నొకటి లేమి గాన్పు మెయికొనవలయున్. 202

ప్రతిపదార్థం: వేఱుగన్= అబుద్ధుడు తన కంటె భిన్నమైనదిగా; కనినన్= చూస్తే; తనదు సుజ్ఞానము= తనదైన మంచి జ్ఞానాన్ని; ప్రకృతిన్= 'మాయ' అనే పేరుగల ప్రకృతికి; చూఱ విడిచిన+అట్లు+అ= ధారపోసినట్లే; ఆ+కాఱు= ఆ అజ్ఞానాన్ని; విడిచి= వదలి; తనకంటెను= తనకంటె; మీఱన్= మించిపోయిదిగా; ఒకటి= వేరొకటి; లేమి= లేకుండుటను; కాన్పు= పొందటం; మెయికొనవలయున్= అంగీకరించాలి.

తాత్పర్యం: ప్రబుద్ధుడు అబుద్ధుడిని తనకంటె వేరుగా చూస్తే తాను పొందిన ఉత్తమజ్ఞానమంతా ప్రకృతికి ధారపోసినట్లే అవుతుంది. అట్లాకాక, ఆ అజ్ఞానాన్ని తొలగించుకొని తనకంటె మించినది మరొకటి లేదు అనే జ్ఞానాన్ని సమ్మతించాలి.

విశేషం: అద్వైతస్థితిని ఇందులో చక్కగా విశదీకరించారు. జీవాత్మ పరమాత్మలు వేరు అనుకొనటమే అజ్ఞానం. వేరుకాదు అనుకొనటమే సుజ్ఞానం. అజ్ఞానం బంధానికీ, సుజ్ఞానం మోక్షానికీ హేతువులు.

వ. అని చెప్పి. 203

తాత్పర్యం: అని బోధించి.

తే. తత్త్వమునఁగల్గు మూఁ డవస్థలను దెల్ల । ముగ భవద్భవ్యసన్నిధి నిగదనమునఁ
గూర్చు టఖిలేశ! నీ వెఱుంగుటయు నాకు । నెల్ల యోగిజనంబులు నెఱుఁగు టయ్యె.' 204

ప్రతిపదార్థం: అఖిల+ఈశ!= సర్వమునకు ప్రభువైన ఓ శంకరా!; తత్త్వమునన్= తత్త్వంలో; కల్గు మూఁడు+అవస్థలను= ఉండే మూడు దశలను; భవత్ భవ్య సన్నిధిన్= నీదైన పరమోత్తమ సన్నిధానంలో; తెల్లముగన్= స్పష్ట మయ్యేవిధంగా; నిగదనమునన్= పలుకునందు; కూర్చుట= కూర్చటమూ; నీవు, ఎఱుంగుటయున్= తెలిసికొనటమూ; నాకున్= నాకు; ఎల్ల యోగి జనంబులు= యోగం పండిన జనాలందరూ; ఎఱుఁగుట= తెలిసికొనటంగా; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: సర్వేశా! తత్త్వంలో ఉండే మూడు దశలను నేను నీ దివ్యసన్నిధానంలో స్పష్టంగా చెప్పటం, నీవు వినటం అనేవి నాకు యోగిజనాలందరూ తెలిసికొన్నట్లయింది.'

విశేషం: నిజానికి పరమేశ్వరుడు సర్వజ్ఞుడు. సనత్కుమారుడి వలన అతడు క్రొత్తగా తెలిసికొనవలసింది ఏమీ లేదు. కాగా లోకానుగ్రహబుద్ధితో అతడు అడగటం, ఇతడు చెప్పటం జరిగింది. కనుక యోగిజనాలందరూ తెలిసికొన్నట్లయింది అంటున్నాడు.

వ. అని పలికి 'మునిజనకృత్యంబులు వివరించెద నవధరింపు' మనుమాటయు సువ్యక్తంబుగా నాడి యాక్రీడా తపస్వికి నప్పరమయశస్వి యిట్లనియె. 205

ప్రతిపదార్థం: అని; పలికి= మాట్లాడి; మునిజనకృత్యంబులు= మునులైన జనులు చేయవలసిన పనులు; వివరించెదన్= చక్కగా తెలియజేస్తాను; అవధరింపుము= శ్రద్ధతో వినుము, అను మాటయున్= అనే మాటను; సువ్యక్తంబుగాన్= చాలా స్పష్టమైన తీరులో; ఆడి= పలికి; ఆ క్రీడాతపస్వికిన్= విలాసంగా తపస్సు చేసికొనే ఆ పరమేశ్వరుడికి; ఆ+పరమయశస్వి=గొప్ప కీర్తిగల ఆ సనత్కుమారుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా చెప్పి 'మునిజనుల పనులు వివరిస్తాను. దయతో వినుము' అనే మాటను చక్కగా తెలియునట్లుగా పలికి, క్రీడాతపస్వి అయిన శివుడితో మహాకీర్తిగల ఆ సనత్కుమారుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇక్కడ ఒక ధర్మరహస్యం ఉన్నది. మునిజనకృత్యాలు శివుడు అడుగలేదు. అడుగని విషయం అడగనివాడికి చెప్పరాదని ధర్మశాస్త్రం. మరి సనత్కుమారు డీ ప్రసంగం ఎట్లా తెచ్చాడు? అన్న శంకకు సమాధానప్రాయంగా 'అనుమాటయు

సువ్యక్తంబుగా నాడి', 'క్రీడాతపస్వి', 'పరమయశస్వి' అనే పదబంధాలను కవి కూర్చాడు. ఆ ధర్మం కేవలం సాధారణ మానవులకు సంబంధించినది. గురుశిష్యభావం ఉన్నచోట మాత్రమే పాటించవలసినది. ఇక్కడ అటువంటిది లేదు - అని చెప్పటం పై మాటల తాత్పర్యం.

క. ముని వనమున శూన్యాలయ । మున నైన గుహానికేతమున నేనిని నా
సనబంధధీరుఁడై మన । మునఁ గొని యింద్రియము విషయమునఁ బెడఁబాపున్. 206

ప్రతిపదార్థం: ముని= ముని అయినవాడు; వనమునన్= అడవియందో; శూన్య+ఆలయమునన్+ఐనన్= జనంలేని ఇంటియందో, గుహానికేతమునన్+ఏనినిన్= కొండగుహ అనే నివాసంలోనో; ఆసన బంధ ధీరుఁడు= కూర్చుండే తీరునందు చెదరని స్థితి కలవాడు; ఐ= అయి; ఇంద్రియమున్= ఇంద్రియాన్ని; మనమునన్= మనస్సులోనికి; కొని= గ్రహించి; విషయమునన్= విషయంనుండి; పెడన్ పాపున్= దూరం చేస్తాడు.

తాత్పర్యం: ముని అడవియందో, జనసంచారం లేని పాడుకొంపలోనో, కొండగుహలోనో ఏ మాత్రమూ పట్టు తప్పని ఆసనస్థితి కలవాడై, ఇంద్రియాన్ని మనస్సులో లయింపజేసి, విషయంనుండి దూరం చేస్తాడు.

విశేషం: ఉన్న స్థానం యోగప్రతిబంధకం కాకూడదు. అందుకని అడవి మొదలైనవి. ఆసనం అంటే కూర్చుండే తీరు. శరీరాన్ని నిశ్చలం చేయకపోతే మనస్సు అతిచంచలం అవుతూ ఉంటుంది. అందుకని ఆసనబంధధీరత్వం. ఇంద్రియం జాత్యేకవచనం. ఇంద్రియాలు అయిదింటినీ గ్రహించాలి. అట్లాగే శబ్దస్పర్శరూప రసగంధాలు అయిదు. విషయాలవైపు ప్రసరించే యింద్రియాలను మనస్సులో త్రొక్కిపెట్టాలి. అప్పుడే యోగం కుదురుతుంది.

క. గురు నుపదేశము నడపుం । బురహర! విణ్మూత్ర వేగముల నాఁకలితోఁ
బొరయం డయ్యభ్యసనము । గురువుగ నాహార మెపుడుఁ గొనఁ డే చవులన్. 207

ప్రతిపదార్థం: పురహర!= శివా!; గురు+ఉపదేశము= గురువు చెప్పిన బోధ; నడపున్= సాగిస్తాడు; విట్+మూత్ర వేగములన్= మలము, మూత్రము అనేవాటి తొందరలను; ఆఁకలితోన్= ఆకలితో పాటు; పొరయఁడు= పొందడు; ఆ+అభ్యసనము= ఆ అభ్యాసం; గురువుగన్= పెద్దది అయ్యేటట్లుగా; ఏ చవులన్= ఎట్టి రుచులతోను; ఆహారమున్= ఆహారాన్ని; ఎపుడున్= ఎప్పుడూ; కొనఁడు= గ్రహించడు.

తాత్పర్యం: గురువు బోధించిన పద్ధతిని పాటిస్తాడు. మలమూత్రముల వేగాన్నీ, ఆకలినీ పొందడు. దానికి అనుగుణంగా రుచి పాకాలను మరచి, ఎప్పుడూ ఆహారం గ్రహించని అభ్యాసం చేస్తాడు.

విశేషం: ఆసనబంధ ధీరతకు ఆటంకమైన మలమూత్ర విసర్జన అవసరం లేని స్థితిని ఉపవాసాదులద్వారా అభ్యసించి నిశ్చలంగా ఉండగలుగుతాడని తాత్పర్యం.

క. కుడిచిన యప్పడ యోగము । దొడఁగుటయును వలదు; మనసు దూలకయుండన్
మృడ! వినుము బుద్ధిగొని యె । క్కుడు నిష్ఠను వలయు దానిఁ గుదియింపంగన్. 208

ప్రతిపదార్థం: మృడ!= ఓ శివా!; వినుము; కుడిచిన+అప్పుడు+అ= భోజనం చేసిన వెంటనే; యోగము= యోగాన్ని; తొడఁగుటయును= మొదలుపెట్టటం; వలదు= వద్దు; బుద్ధిన్= బుద్ధిని; కొని= పట్టుకొని; ఎక్కుడు నిష్ఠను= అధికమైన

చెదరని తనంతో; మనసు; తూలక+ఉండన్= తూలిపోకుండా; దానిన్= దానిని; కుదియింపంగన్= నొక్కి పెట్టటం; వలయున్= చేయాలి.

తాత్పర్యం: శివా! తిన్న వెంటనే యోగాభ్యాసాన్ని మొదలు పెట్టరాదు. బుద్ధితో మనసు చెదరకుండా ఎక్కువ నిష్ఠతో దానిని అణచిపెట్టాలి.

విశేషం: మనస్సు అంటే సంకల్ప వికల్పాలు, బుద్ధి అనగా నిశ్చయాత్మకమైన దశ. యోగం అంటేనే చిత్తవృత్తులను అరికట్టటం. కనుక మనస్సును అణచివేయటం అంటే అమనస్కదశ. ఇది యోగంలో ఒక స్థాయి.

క. అది గుదిసిన విజ్ఞానము । గదలక నిర్వాత దీపకాంతియుఁ బోలెం
బొదలును జిత్తంబును నుప । లదశాసంప్రాప్తి నిశ్చలం బగు దానన్. 209

ప్రతిపదార్థం: అది= ఆ మనస్సు; కుదిపినన్= అణగిపోతే; విజ్ఞానము= విశేషమైన జ్ఞానం; కదలక= చలనంలేక; నిర్వాత దీప కాంతియున్ పోలెన్= గాలి లేనిచోట వెలుగు వలె; పొదలును= ఉంటుంది; దానన్= దానిచేత; చిత్తంబును= మనస్సు కూడా; ఉపల దశా సంప్రాప్తి= రాతివంటి స్థితిని పొందటం చేత; నిశ్చలంబు= చలనంలేనిది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: మనస్సు అణగితే విజ్ఞానం గాలిలేనిచోట దీపంవలె కదలకుండా ఉంటుంది. దానివలన చిత్తము కూడా రాతివలె నిశ్చలంగా ఏర్పడుతుంది.

విశేషం: చిత్తచలనం అనగా లక్ష్యంమీదినుండి ఇతర విషయాలకు జరగటం. కదిలే సూదిలో దారం ఎక్కించటంవలె అటువంటి చిత్తంలో యోగాన్ని పొందటం అసాధ్యం. కనుక యోగాభ్యాసం చేసేవాడు చిత్తాన్ని స్థాణువుగా మలచుకోవటం అవసరమని పద్య తాత్పర్యం.

తే. అనఘ! నిర్జన నిశ్శబ్దమైన యట్టి । చోటు హృదయస్థుఁ డగు దేవుఁ జూచుపనికి
వలయు; లేకున్న శబ్దసంకలిత మేని । సజ్జనాన్విత స్థల మార్యసమ్మతంబు. 210

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; నిర్జన నిశ్శబ్దము= జనులు లేనిది, సవ్వడిలేనిది; ఐన అట్టి చోటు= అయిన తావు; హృదయస్థుడు= హృదయంలో ఉన్నవాడు; అగు దేవున్= అయిన దేవుడిని; చూచు పనికిన్= చూచేపనికి; వలయున్= కావాలి; లేక+ఉన్నన్= అట్టిది లేకపోతే; శబ్దసంకలితము+ఏని= సవ్వడితో కూడినది అయితే; సత్+జన+అన్విత స్థలము= మంచి జనులతో కూడిన తావు; ఆర్య సమ్మతంబు= ఆర్యులకు ఇష్టమైనది.

తాత్పర్యం: శివా! హృదయంలో ఉన్న దేవుడిని చూచే పనికి జనాలు, సవ్వడులు లేని తావు కావాలి. ఒకవేళ అట్టితావు లభించక సవ్వడి ఉన్న తావు అయితే మంచివారు ఉన్నది మేలని ఆర్యులు చెప్తారు.

విశేషం: జనసంచారం, వివిధాలైన సవ్వడులు విషయాలవైపు ఇంద్రియాలను, మనస్సునూ లాగివేస్తాయి. యోగం భంగపడుతుంది. కనుక నిర్జన, నిశ్శబ్ద స్థానాన్ని నిర్దేశిస్తున్నారు. అయితే అట్టిది దుర్లభం. కనుక సత్+జనులు= సత్ అంటే పరమాత్మయొక్క ఒక లక్షణమైన అస్తిత్వం. దానియందు ఉండే జనులు సజ్జనులు. వారున్న తావు శబ్దసంకలితమైనా అది పరమాత్మపరమే అవుతుంది కనుక యోగం భంగం కాదు. ఆర్యులు అనగా ఒక ప్రత్యేకమైన జీవనవిధానం కలవారు. ఇది జాతి కాదు. స్వభావం. హృదయస్థుడు 'ఈశ్వరః సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి' అని గీత. పద్మకోశంవలె ఉండే హృదయంలో నీవారపు ముల్లువలె ఉండే సన్నని రంధ్రంలోని అగ్నిజ్వాలలో చివరిభాగంలో సదాశివుడు ఉంటాడని వేదమంత్రం చెప్తున్నది.

క. విను తమము నిస్తమముఁ జే। తనారహిత చేతనా సుధామయతా స్థా
ననిరూఢము నగు తత్త్వము। గను నిన్నియుఁ గలుగు యోగి కరుణామూర్తీ! 211

ప్రతిపదార్థం: కరుణామూర్తీ!= దయామూర్తీ! విను= వినుము; తమము= అజ్ఞానరూపమైన చీకటి; నిస్తమమున్= చీకటిలేని స్థితి; చేతనారహిత చేతనాసుధామయతా స్థాన నిరూఢము= చైతన్యములేనిది, చైతన్యము అనే అమృతముతో నిండినది అయిన చోటుగా దృఢపడినది; అగు తత్త్వమున్= అయిన పరమాత్మ తత్త్వాన్ని; ఇన్నియున్= పై చెప్పిన లక్షణాలన్నీ; కలుగు యోగి= కల యోగి; కనును= దర్శిస్తాడు.

తాత్పర్యం: కరుణామూర్తీ! వినుము. చీకటి, చీకటిలేనిది, చైతన్యము లేనిది, చైతన్యమే అమృతస్వరూపం అయినది అయిన తత్త్వాన్ని పై లక్షణాలన్నీ ఉన్న యోగి దర్శిస్తాడు.

విశేషం: ఇందులో తమము - నిస్తమము; చేతనారహితము - చేతనాసహితము - అని తత్త్వానికి రెండేసి విరుద్ధధర్మాలు చెప్పారు. దీనిని సరిగా సమన్వయించుకొనాలి. తమము అనగా అజ్ఞానులకు అది ఒక భయంకరమైన చీకటి. అనగా దానిని గురించి వారేమాత్రము తెలిసికొనలేరు. నిస్తమము అనగా జ్ఞానవంతులకు అదే ఒక మహాజ్యోతి. అందులో వారు సర్వాన్నీ దర్శిస్తారు. అట్లాగే పరతత్త్వం సృష్టిలోని ఇతర పదార్థాల వంటి చైతన్యం - చేతనధర్మం - కదలిక మొదలైన లక్షణాలు లేనిది కనుక చేతనారహితం. సృష్టిలోని బ్రహ్మ మొదలు అతినీచమైన పదార్థం వరకు ఉండే సర్వానికి చైతన్యాన్ని ప్రసాదించేది కనుక చైతన్యరూపమైన అమృతస్థితియే స్వభావమైన తావు. పై లక్షణాలు (206-210 పద్యాలలో చెప్పినవి) కల యోగికి ఆ పరతత్త్వం గోచరిస్తుంది.

క. మదనహరా! యోగనిరతు। లది గని దుఃఖముల దొలఁగి యజరామరతా
స్పదమగు నెలవుల నిలుతురు। పొదలుదు రణిమాదిచయ విభూతిపదమునన్. 212

ప్రతిపదార్థం: మదనహరా!= మన్మథుడిని హరించిన ఓ పరమేశ్వరా!; యోగనిరతులు= యోగమునందు నిష్ఠకలవారు; అది=దానిని; కని=చూచి; దుఃఖములన్= దుఃఖాలను; తొలఁగి= తొలగించుకొని; అజర+అమరతా+ఆస్పదము= ముదిమి, చావు లేనితనానికి వీలుకలవి, అగు నెలవులన్= అయిన తావులలో; నిలుతురు= శాశ్వతంగా ఉంటారు; అణిమ+ఆది చయ విభూతి పదమునన్= అణిమ మొదలైన అష్టసిద్ధుల సముదాయపు ఐశ్వర్యం ఉన్న తావునందు; పొదలుదురు= తిరుగుతూ ఉంటారు.

తాత్పర్యం: శంకరా! యోగనిష్ఠ కలవారు ఆ తత్త్వాన్ని అందుకొని, దుఃఖాలన్నింటినీ తొలగించుకొని, చావు, ముదిమి లేని తావులలో శాశ్వతంగా ఉంటారు. అణిమ మొదలైన సిద్ధుల సంపదలతో విహరిస్తూ ఉంటారు.

విశేషం: దుఃఖాలు - జన్మదుఃఖం, జరాదుఃఖం, మృత్యుదుఃఖం మొదలైనవి, ఎక్కడ ఇంద్రియాలు సుస్థితి లేకుండా కష్టపడుతూ ఉంటాయో అది 'దుఃఖం' - దుర్గతి పొందిన ఇంద్రియస్థితి కలది అని దీనికి అర్థాన్ని సంభావించాలి. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం - అనేవి అష్టసిద్ధులు. ఇవి యోగికి సిద్ధిస్తాయి. అయితే ఐహికసుఖాపేక్షతో గానీ, ప్రదర్శనకు గానీ వీటిని వినియోగిస్తే వాడు తత్క్షణమే యోగభ్రష్టుడవుతాడు. వీటిద్వారా పరమాత్మ దర్శనాన్ని సుదృఢం చేసికొనటమే ఉత్తమలక్ష్యం.

వ. అని మఱియును. 213

తాత్పర్యం: సనత్కుమారుడు ఈ విధంగా చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

తే. యక్షగంధర్వసిద్ధ సాధ్యాది భూత । కోటికంటెను మిగిలి యోగులు నిజేచ్ఛఁ
బరఁగుదురు భవ్యయోగతత్పరుల మేము । నిట్టు లగుట యోగీశ! నీ యెఱుఁగు పనియ. 214

ప్రతిపదార్థం: యోగి+ఈశ!= యోగులకుప్రభువైన ఓ పరమాత్మా!; యోగులు= యోగసిద్ధి పొందినవారు; యక్ష గంధర్వ సిద్ధ సాధ్య+ఆది భూతకోటికంటెను= యక్షులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు మొదలైన ప్రాణుల సముదాయంకంటె కూడా; మిగిలి= అతిశయించి; నిజ+ఇచ్ఛన్= తమ ఇష్టాన్నిబట్టి; పరఁగుదురు= ప్రవర్తిస్తూ ఉంటారు; భవ్య యోగ తత్పరులము= మిక్కిలి శ్రేష్ఠమైన యోగమునందు మాత్రమే బుద్ధిగలవారము; ఏమును= అయిన మేము కూడ; ఇట్టులు= ఈ విధంగా; అగుట= కావటం; నీ+ఎఱుఁగు పని++అ= నీవెరిగిన కార్యమే.

తాత్పర్యం: యోగినాథా! యోగులు సిద్ధులు మొదలైన దేవజాతులకంటె మించిపోయి తమ ఇష్టాన్ని బట్టి ప్రవర్తిస్తూ ఉంటారు. భవ్యమైన యోగమునందు చెడని నిష్ఠ గల మేము కూడా అట్లా కావటం నీకు తెలిసిన విషయమే కదా!

విశేషం: విద్యాధరులు, అప్సరసలు, యక్షులు, రక్షస్సులు, గంధర్వులు, కిన్నరులు, పిశాచులు, గుహ్యకులు, సిద్ధులు, సాధ్యులు వీరిని దేవయోనులు అంటారు. వీరు దేవతలకు మానవులకు మధ్యవారు. ఆంగ్లంలో వీరిని semi gods అంటారు. మేము అటువంటివారమే అని చెప్పటం నిదర్శనంకొరకే కానీ అహంకారదృష్టితో కాదు. ఇది ఫలశ్రుతివలె రుచి పుట్టించటానికి చేసిన ప్రసంగం. 'మేము' అనే బహువచనం కూడా అటువంటిదే. దానిని క్రింది భాగంలో వివరిస్తున్నారు.

వ అని సహజన్ము లయిన సనక సనందన సనత్సుజాతులం దలఁపించిన వాఁడయి వెండియు. 215

ప్రతిపదార్థం: అని= ఇట్లా చెప్పి; సహజన్ములు= కలిసిన పుట్టుక కలవారు; అయిన సనక సనందన, సనత్సుజాతులన్= సనకుడు, సనందనుడు, సనత్సుజాతుడు అనేవారిని; తలఁపించినవాఁడు= స్మరింపచేసినవాడు; అయి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి, తన తోబుట్టువు అయిన సనకుడు, సనందనుడు, సనత్సుజాతుడు అనేవారిని తలపింప చేసి ఇంకా ఇట్లా అన్నాడు.

తే. యోగధర్మంబు కంటెను నుత్తమంబు । గలుగ నేరదు ధర్మ మొక్కటియు నపున
రాగమం బగు పదమున కరయ నిదియ । మేటి నిచ్చెన సంయమికోటి కెల్ల. 216

ప్రతిపదార్థం: యోగధర్మంబుకంటెను= యోగం అనే ధర్మంకంటె; ఉత్తమంబు= గొప్పది (అగు); ధర్మము= ధర్మం; ఒక్కటియున్= ఒక్కటికూడా; కలుగన్‌నేరదు= ఉండజాలదు; ఇది+అ= ఇదే; అరయన్= పరిశీలించగా; సంయమకోటికిన్+ఎల్లన్= ఇంద్రియ నిగ్రహాదులు కలవారందరికీ; అపునర్+ఆగమంబు+అగు= తిరిగివచ్చుటలేనిదైన; పదమునకున్= స్థానానికి; మేటినిచ్చెన= గొప్ప నిచ్చెన.

తాత్పర్యం: యోగధర్మంకంటె ఉత్తమమైన ధర్మం ఒక్కటి కూడా లేదు. మునుల సముదాయం తిరిగిరాక లేని స్థానాన్ని చేరుకొనటానికి ఇదే మేటినిచ్చెన.

విశేషం: 'సంయమికోటి' అనటంవలన ఆ స్థాయికి ఎదగలేనివారికి కర్మభక్తిజ్ఞాన మార్గాలు ఉన్నాయి అని సూచించినట్లయినది.

క. యోగంబుతెఱఁగు సెప్పితి । భోగివరాభరణ! సాంఖ్యమును జెప్పెదఁ ద
ద్భాగులగు నైష్ఠికులు భవ । సాగరముం గడతు రైక్యసంబోధమునన్. 217

ప్రతిపదార్థం: భోగివర+ఆభరణ!= శ్రేష్ఠమైన సర్పాలు భూషణాలుగా గల ఓ శివా!; యోగంబు తెఱఁగు= యోగం విధానాన్ని; చెప్పితిన్= చెప్పాను; సాంఖ్యమునున్= జ్ఞానమార్గాన్ని; చెప్పెదన్= చెప్పుతాను; తద్+భాగులు= దానిని భజించేవారు; అగు నైష్ఠికులు= అయిన నిష్ఠకలవారు; ఐక్య సంబోధమునన్= ఆ రెంటి కలయికను చక్కగా తెలియటంవలన; భవసాగరమున్= సంసారమనే సముద్రాన్ని; కడతురు= దాటుతారు.

తాత్పర్యం: శివా! ఇంతవరకు యోగమార్గాన్ని వివరించాను. ఇంక సాంఖ్యాన్ని చెప్పుతాను. దానిని సేవించే నిష్ఠ కలవారు యోగమూ, సాంఖ్యమూ ఒక్కటే అనే భావంతో సంసారసముద్రాన్ని దాటుతారు.

విశేషం: పైన యోగమే తప్ప అపునరాగమనస్థితికి మరొక ధర్మం లేదన్నారు. ఇంక సాంఖ్యం చెప్పట మెందుకు? అనే శంక కలుగుతుంది. దానిని తొలగించటానికి యోగము - సాంఖ్యము ఒక్కటే అనే భావాన్ని ఇందులో ముందుగా ప్రస్ఫుటం చేస్తున్నారు. 'ఏకం యోగం చ సాంఖ్యం చ యః పశ్యతి స పశ్యతి' (5-5) అని గీతావాక్యం. యోగమూ, సాంఖ్యమూ ఒక్కటే అని ఎవడు భావిస్తాడో వాడే సరియైన భావుకుడు - అని అర్థం.

సనత్కుమారుఁడు రుద్రునకు సాంఖ్యయోగంబు తెలం గెఱింగించుట (సం.13-168-1(కుంభ))

వ. కావున నత్యాదరంబున నాకర్ణింపు' మని పలికి యిట్లనియె. 218

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అత్యాదరంబునన్= మిక్కిలి ఆదరంతో; ఆకర్ణింపుము= వినుము; అని; పలికి= చెప్పి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కాబట్టి మిక్కిలి శ్రద్ధతో వినుము' అని ఇట్లా అన్నాడు.

విశేషం: ఇక్కడ అత్యాదరం శ్రోతకు శివుడికి కాదు. అత్యాదరంతో వినటం ఏల? - అనగా యోగం పరమోత్తమధర్మం అన్నారు. దాని తరువాతిదిగా చెప్పేదానిని ఎందుకు పట్టించుకోవాలి అనే శంకను విడనాడాలి. ఎందుకంటే యోగమూ, సాంఖ్యమూ ఒక్కటిగానే దర్శించాలి కనుక.

ఆ. 'ఇంద్రియములకంటె నీశాన! మన మహం । కారతత్త్వ మంతకంటె, దాని
కంటె బుద్ధి, బుద్ధికంటెఁ బ్రకృతి యెక్కు । డిన్నిటికిని బురుషుఁ డెక్కు డరయ. 219

ప్రతిపదార్థం: ఈశాన!= ఈశ్వరా!; ఇంద్రియములకంటెన్= చర్మము, కన్ను, చెవి, నాలుక, ముక్కు - అనేవాటికంటె; మనము= మనస్సు; అంతకంటెన్= దానికంటె; అహంకారతత్త్వము= 'నేను' అనే భావన పుట్టే తత్త్వమూ; దానికంటెన్= దానికంటె; బుద్ధి= నిశ్చయాత్మకమైన బుద్ధి అనే తత్త్వమూ; బుద్ధికంటెన్= బుద్ధికంటె; ప్రకృతి= ప్రకృతి అనే తత్త్వమూ; ఎక్కుడు= మిన్న అయినవి; అరయన్= పరిశీలించి చూడగా; పురుషుఁడు= పురుషుడు అనే తత్త్వం; ఇన్నిటికిన్= ఈ అన్నింటికీ; ఎక్కుడు= అధికమైనది.

తాత్పర్యం: 'ఈశ్వరా! ఇంద్రియాలకంటె మనస్సు, దాని కంటె అహంకారతత్త్వం, దానికంటె బుద్ధి, దానికంటె ప్రకృతి ఎక్కువ. వీటన్నిటికంటె పురుషుడు మిన్న.

విశేషం: శబ్ద స్పర్శ రూపరస గంధాలను గ్రహించి మనస్సు కందించేవి ఇంద్రియాలు. సంకల్పవికల్పాల పుట్ట మనస్సు. నేను చూస్తున్నాను, నేను వింటున్నాను - అన్నతీరుగా వ్యవహరించే తత్త్వం 'అహంకారం'. మనస్సు, అహంకారమూ అందించే విషయాలను తెలిసికొని, నిశ్చయాలను కలిగించేది బుద్ధి. దానికి పై మెట్టున ఈ అన్నింటికీ మూలకారణమై ఉండే మాయను 'ప్రకృతి' అంటారు. ఈ అన్నింటికి పై స్థాయిలో 'పురం' అనే వ్యవహారం గల దేహంలో సాక్షి మాత్రంగా శయనించి ఉండే తత్త్వం పురుషుడు. ఇంద్రియాదులు క్రమంగా మెట్లు. 'పురుషుడు' ఇన్నిటిని ఎక్కాడు అని విడిగా చెప్పటం వలన ఇది 'గమ్యం' - అందవలసిన చోటు అని చెప్పినట్లయింది.

తే. అంబరాది భూతములు శబ్దాది గుణము । లింద్రియము లిరుదెఱఁగు బాలేందుమౌళి!
మన మహంకారబుద్ధు లిట్లొనరి ప్రకృతిఁ । గలయఁ దత్త్వచతుర్వింశకత్వ మొందు. 220

ప్రతిపదార్థం: బాల+ఇందుమౌళి!= బాలచంద్రుడు శిరోభూషణంగా ఉన్న ఓ పరమేశ్వరా!; అంబర+ఆది భూతములు= ఆకాశం మొదలైన భూతాలు (5); శబ్ద+ఆది గుణములు= శబ్దం మొదలైన గుణాలు (5); ఇరు+తెఱఁగు= రెండు విధాలయిన; ఇంద్రియములు= ఇంద్రియాలు (10); మనము= మనస్సు (1); అహంకారబుద్ధులు= అహంకారం అనే తత్త్వమూ; బుద్ధి అనే తత్త్వమూ (2); ఇట్లు= ఈ విధంగా; ఒనరి= కూడి; ప్రకృతిన్= ప్రకృతి అనే తత్త్వంలో; కలయన్= కలియగా; తత్త్వచతుర్+ వింశకత్వంబు= తత్త్వాల ఇరువది నాల్గింటితనము; ఒందున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: శివా! ఆకాశం మొదలైన భూతాలు ఐదు. వాటి గుణాలైన శబ్దం మొదలైనవి అయిదు. రెండు విధాల ఇంద్రియాలు పదీ, మనస్సు, అహంకారం, బుద్ధి అనే మూడూ, ప్రకృతి అనే ఒక తత్త్వమూ కలిసి మొత్తం ఇరువది నాలుగు తత్త్వాలు అవుతాయి.

విశేషం: 1. భూతాలు : ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి.

2. గుణాలు : శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము.

3. ఇంద్రియాలు : (1) కర్మేంద్రియాలు: 1. వాక్కు, 2. చేయి, 3. కాలు, 4.విసర్జనేంద్రియము, 5.జననేంద్రియము,
(2) జ్ఞానేంద్రియాలు: 1.చర్మము, 2. కన్ను, 3. చెవి, 4. నాలుక, 5.ముక్కు.

క. చేతనుఁ డగు పురుషుని ని । శ్చేతనయగు ప్రకృతి వొంది చేతనతాప్ర
స్ఫీత యగుం బెఱతత్త్వము । లాతత్త్వం బను మహాబ్ధియందలి తరఁగల్. 221

ప్రతిపదార్థం: చేతనుఁడు= ప్రాణశక్తి కలవాడు; అగు పురుషునిన్= అయిన పురుషుడనే తత్త్వాన్ని; నిశ్చేతన= ప్రాణశక్తి లేనిది; అగు ప్రకృతి= అయిన ప్రకృతి; పొంది= చేరుకొని; చేతనతా ప్రస్ఫీత= ప్రాణశక్తితో మిక్కిలి శక్తి గలది; అగున్= అవుతుంది; పెఱతత్త్వములు= మిగిలిన ఇరవై మూడు తత్త్వాలు; ఆ తత్త్వంబు= ఆ ఇరవై నాలుగవదైన ప్రకృతి; అను మహా+అబ్ధియందలి తరఁగల్= అనే మహాసముద్రంలోని తరంగాలు.

తాత్పర్యం: చైతన్యం గల 'పురుషుడు' అనే తత్త్వాన్ని ఆశ్రయించి, చైతన్యం లేని ప్రకృతి చైతన్యం పుష్టిగా కలది అవుతుంది. తక్కిన తత్త్వాలు ఆ తత్త్వం అనే మహాసముద్రంలోని తరంగాలు.

విశేషం: ప్రకృతి మొదలూ పంచభూతాలవరకు ఉండే ఇరవైనాలుగు తత్త్వాలు సహజసిద్ధంగా చైతన్యం లేనివి. సహజసిద్ధము, నిత్యమూ అయిన చేతనధర్మం - ఇరవై అయిదవదైన పురుషతత్త్వానికి మాత్రమే ఉన్నది. చైతన్యం లేని ప్రకృతి, చైతన్యం గల పురుషుడిని పొంది అయస్కాంతాన్ని పొందిన ఇనుము అయస్కాంత ధర్మాన్ని పొందినట్లుగా చైతన్యం కలది అవుతుంది. ప్రకృతి ఒక మహాసముద్రంవంటి దయితే తక్కిన బుద్ధి మొదలైనవి అందలి తరంగాలు. అనగా ప్రకృతికి సంక్రమించిన చేతనధర్మం వాటికి కూడా ఏర్పడుతుంది. ఏర్పడుతుంది అనగా పోయే అవకాశం కూడా ఉన్నదని అర్థం. ప్రకృతి మొదలైనవాటి చైతన్యం నిత్యం కాదని తాత్పర్యం.

క. గుణములఁ బొందఁడు పురుషుఁడు । గుణమహితా! ప్రకృతి యిచ్చు గుణముల కేమే
గుణములు దానను గుణులై । గుణిత్వ మా నిర్గుణాత్మకున కొలయించున్. 222

ప్రతిపదార్థం: గుణమహితా!= గుణాలచేత గొప్పతనం పొందినవాడా!; పురుషుఁడు= పురుషుడనే తత్త్వం; గుణములన్= గుణాలను; పొందఁడు= పొందడు; ప్రకృతి= ప్రకృతి అనే తత్త్వం; గుణములకున్= గుణాలకు; ఏమి+ఏన్= ఏవైనా; గుణములు= గుణాలను; ఇచ్చున్= ఇస్తుంది; దానను= దానిచేత; గుణులు+ఐ= గుణాలు కలవియై; ఆ నిర్గుణ+ఆత్మకునకున్= గుణాలు లేని స్వభావం కల ఆ పురుషుడికి; గుణిత్వము= గుణములు కలవా డగుటను; ఒలయించున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: శివా! పురుషుడికి ఏ గుణాలూ లేవు. ప్రకృతియే గుణాలకు ఏవైనా గుణాలను ఇస్తుంది. దానిచేత తక్కిన తత్త్వాలు గుణాలు కలవియై గుణాలు లేని పరమాత్మకు గుణాలు కలిగిన స్థితిని కలిగిస్తాయి.

విశేషం: గుణాలంటే సత్త్వము, రజస్సు, తమస్సు - అనేవి. ఇవి ప్రకృతికి సంబంధించినవి. ఇవి తక్కిన భూతాదులకు రుచి, రంగు, వాసన మొదలైన గుణాలను కల్పిస్తాయి. ఆ విధంగా అన్నీ గుణాలు కలవి అవుతాయి. ఈ గుణాలుగల ఇరవైనాలుగు తత్త్వాలు గుణాలు లేని పురుషుడిని చేరటంవలన అతడు కూడా 'గుణి' - గుణాలు కలవాడు అవుతున్నాడు. గాజుపాత్రలో రంగునీరు పోస్తే గాజుపాత్ర రంగు కలదిగా కనిపిస్తుంది. నీరు తీసివేస్తే రంగులేనితనం తెలియవస్తుంది. ఇట్టిది పరమాత్మ తత్త్వం. నీటికి ఆధానం చేసిన రంగుమాత్రం సాధారణంగా నీటిని వదలిపోదు. కనుక ప్రకృతి మొదలైనవాటి గుణిత్వము అటువంటిది.

తే. వీని నెల్ల నసత్కోటిగా నెఱింగి । కొనుచుఁ బ్రకృతి నుపేక్షించి తనకుఁ దాన
కాని యొండెద్దియును లేమి గాంచినపుడు । పురుషుఁ డపగత ధూమాగ్నిఁ బోలి వెలుఁగు. 223

ప్రతిపదార్థం: వీనిన్ ఎల్లన్= వీటి నన్నింటిని; అసత్ కోటిగాన్= సత్యము కాని వాటి సముదాయంగా; ఎఱింగికొనుచున్= తెలిసికొంటూ; ప్రకృతిన్= ప్రకృతిని; ఉపేక్షించి= పట్టించుకొనకుండా; తనకున్= తనకు; తాను+అ= తానే; కాని; ఒండు= మరియొకటి; ఎద్దియును= ఏదీ కూడా; లేమి= లేకపోవటాన్ని; కాంచిన+అపుడు= గుర్తించినపుడు; పురుషుఁడు= మానవుడు; అపగత ధూమ+అగ్నిన్= తొలగిన పొగగల నిప్పును; పోలి; వెలుఁగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ఈ అన్నింటిని సత్పదార్థానికి వేరైనవిగా తెలిసికొంటూ ప్రకృతిని పట్టించుకొనకుండా తనకు తానే కానీ మరొకటి ఏమీ లేదు అని గుర్తించినపుడు సాధకుడైన పురుషుడు పొగలేని నిప్పువలె ప్రకాశిస్తాడు.

విశేషం: ఇక్కడ పురుషుడు ఇరవై అయిదవ తత్త్వమైన పరమాత్మ కాదు. సాధకుడైన పురుషుడు. కానీ ఆ స్థితిలో ఆ పురుషుడితో ఈ పురుషుడు అభిన్నుడు.

తే. అట్లు గాక యహంకార మావహిల్లి । ప్రకృతి దానని సృష్టికిఁ బ్రలయమునకుఁ
గర్త యైన వికారాత్మకత్వ మొందుఁ । బ్రకృతివికృతులు గాని యా ప్రభువు నపుడు. 224

ప్రతిపదార్థం: అట్లు+కాక= ఆ విధంగా కాక; అహంకారము= 'నేను' అనేభావం; ఆవహిల్లి= కలిగి, ప్రకృతి; తాను= తానే; అని; సృష్టికిన్= ఉత్పత్తికి; ప్రళయమునకున్= వినాశానికి; కర్త= చేయువాడు; ఐనన్= అయితే; అపుడ= ఆ సమయంలో; ప్రకృతి వికృతులు= ప్రకృతిగాని, వికృతిగాని, కాని= కానట్టి; ఆ ప్రభువును= ఆ ఆత్మరూపుడైన ప్రభువును; వికార+ఆత్మకత్వము= వికారం స్వభావంగా ఉండే లక్షణం; ఒందున్= పొందుతుంది.

తాత్పర్యం: అట్లా కాక, సాధకుడైన పురుషుడు అహంకారం కలగటంవలన ప్రకృతియే తానని భావించి, సృష్టికీ ప్రళయానికీ కర్త అయితే ప్రకృతిగానీ వికృతిగానీ కాని ఆ ప్రభువును వికారస్థితి పొందుతుంది.

విశేషం: వేదాంత పరిభాషలో 'జీవుడు' ఇక్కడ ఇరవై అయిదవతత్త్వంగా పరిగణింపబడే పురుషుడు. అతడికి పైవైపు ఇరవై ఆరవ తత్త్వం 'పరమాత్మ' ఉన్నది. క్రిందివైపు ఇరవైనాలుగవ తత్త్వం ప్రకృతి ఉన్నది. ప్రకృతితోపాటు తక్కిన ఇరవైమూడు తత్త్వాలూ ఉన్నాయి. ఇప్పుడు ఈ జీవుడు పైవైపు చూచి ప్రకృత్యాదులతో తనకు సంబంధం లేదనుకొంటే అతడు ఇరవై ఆరవ తత్త్వం లక్షణాలు పొంది ఏకాత్ముడై వెలుగుతాడు. దీనిని 223వ పద్యంలో చెప్పారు. అట్లాకాక క్రిందివైపు ఒరిగి, ప్రకృతితో తాదాత్మ్యం పొందితే 'సంసారం' అనే జగత్తుకు కర్త అవుతాడు. (224వ పద్యం). ఇది బంధహేతువు. అది మోక్షహేతువు. దీనినే మరింత స్పష్టంగా తరువాతి పద్యంలో చెప్పుతున్నారు.

క. ధృతి పూనమిఁ బ్రకృతికి వశ । గతుఁ డగుచు దమోమయత్వకలితం బగు న
వ్వితతాసుఖితత్వము సుఖ । మతిఁ బురుషుం డనుభవించు మదనధ్వంసీ । 225

ప్రతిపదార్థం: మదనధ్వంసీ!= మన్మథుడిని సంహరించినవాడా! శివా!; ధృతి= ధైర్యాన్ని; పూనమిన్= అవలంబింపక పోవటం చేత; పురుషుండు= జీవుడు; ప్రకృతికిన్= ప్రకృతికి; వశగతుఁడు+అగుచున్= లొంగిపోతూ; తమో మయత్వకలితంబు+అగు= తమోగుణంతో కూడుకొనినదైన; ఆ+వితత+అసుఖితత్వము=ఎడతెగని ఆ దుఃఖం కలవాని స్వభావాన్ని; సుఖమతిన్= సుఖం అనుకొనే భావనతో; అనుభవించున్= అనుభవిస్తాడు.

తాత్పర్యం: ఓ శివా! ధైర్యాన్ని అవలంబింపక పోవటం వలన జీవుడు ప్రకృతికి లొంగిపోతూ తమోగుణంతో కూడుకొన్న దుఃఖమయమైన సంసారస్థితిని సుఖమనే భావనతో అనుభవిస్తూ ఉంటాడు.

క. నేరిమి దాని నుపేక్షం । జేరుప షడ్వింశభావసిద్ధిఁ బొరయు గౌ
రీరమణ! పంచవింశుఁడు । సారామల నిపుణమతిఁ బ్రసన్నాత్మకుఁడై. 226

ప్రతిపదార్థం: గౌరీరమణ!= పార్వతీహృదయేశా!; పంచవింశుఁడు= ఇరవైఅయిదవ తత్త్వం వాడైన పురుషుడు (జీవుడు); సార+అమల నిపుణమతిన్= సారమైనదీ, మలినం లేనిదీ, నేర్పుగలదీ అయిన బుద్ధితో; ప్రసన్న+ ఆత్మకుఁడు= ఏ మాలిన్యమూ లేని ఆత్మకుడు; ఐ=అయి; నేరిమిన్= నేర్పుతో; దానిన్= ఆ ప్రకృతిని; ఉపేక్షన్= ఒప్పరికించటంలో; చేరుపన్= చేరిస్తే; షట్+వింశ భావ సిద్ధిన్= ఇరవై ఆరవభావం ఏర్పడటాన్ని; పొరయున్= పొందుతాడు.

తాత్పర్యం: పార్వతీపతీ! ఇరవై అయిదవ తత్త్వం వాడైన జీవుడు సారమైనదీ, మలినం లేనిదీ, నేర్పు గలదీ అయిన బుద్ధితో ప్రసన్నమైన ఆత్మ కలవాడై నేర్పుతో ఆ ప్రకృతిని పట్టించుకొనక ఉంటే ఇరవై ఆరవ తత్త్వపు సిద్ధిని పొందుతాడు.

విశేషం: ఇది బహుక్లిష్టమైన సాధన. దీనికి బుద్ధి ఎట్లా ఉండాలో చాలా జాగ్రత్తగా పరిశీలించవలసిందిగా కవి హెచ్చరిస్తున్నాడు. అది సారం కలది కావాలి. అనగా సర్వభావాలను కాచి వడబోసి నిగ్గు తేల్చుకున్న స్థితి బుద్ధిలో ఏర్పడాలి. ఒక్కసారి ఏర్పడితే చాలదు. దానిలో ప్రకృతివైపు మొగ్గజేసే మలినలక్షణాలు రాకుండా చూచుకోవాలని 'అమల' శబ్దం దీనిని సూచిస్తుంది. అయినా ప్రయోజనం సిద్ధించకపోవచ్చును - నేర్పు లేదు కనుక. 'నేర్పు' అనగా నిరంతర సాధనతో వచ్చే క్రియాపాటవం. ఇవన్నీ ఉన్నా మరే కారణం చేతనైనా ప్రసన్నత లోపిస్తే సిద్ధి దూరమవుతుంది. ఈ విధంగా సాధన విషయంలో ఎంత జాగరూకత ఉండాలో ఈ పద్యం వివరిస్తున్నది.

క. సత్త్వాశ్రయమునఁ బురుషుఁడు । దత్త్వాశ్రయమునను సత్త్వతత్త్వముల వివే
కిత్వాలేపత్వములన । విత్త్వముఁ జిత్త్వంబు నొందు విశ్వాధారా! 227

ప్రతిపదార్థం: విశ్వ+ఆధారా!= విశ్వానికంతటికి పట్టుగొమ్మ అయిన ఓ విశ్వరూపా!; పురుషుడు= పురుషనాముడైన ఇరవై అయిదవతత్త్వం వాడు; సత్త్వ+ఆశ్రయమునన్= సత్త్వగుణాన్ని అవలంబించినందువలనను; తత్త్వ+ఆశ్రయమునను= తత్త్వాన్ని ఆశ్రయించినందువలనను, సత్త్వ తత్త్వముల వివేకిత్వ+అలేపత్వములన్+అ= సత్త్వము, తత్త్వము అనేవాటి స్పష్టమైన జ్ఞానం పొందటం, వాటి అంటు లేకుండటం అనేవాటి వలన; విత్త్వము= జ్ఞానమును; చిత్త్వంబున్= 'చిత్' స్వరూపం కలిగి ఉండటాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: సర్వాధారా! పురుషుడు సత్త్వాన్ని ఆశ్రయించి, తత్త్వాన్ని ఆశ్రయించి, ఆ రెండింటిని చక్కగా తెలిసికొనటం, వాటి అంటు లేకుండా చూచుకొనటం అనే పనులవలన తెలిసినవాడు, చైతన్యవంతుడూ అవుతాడు.

విశేషం: సత్త్వం అనగా ఉండటం - అస్తిత్వం. తత్త్వం అనగా జ్ఞానం. ఈ రెండింటిని చక్కగా పరిశీలించి చూచుకొంటే మొదటి దానివలన వివేకిత్వం - అనగా నిత్యం, అనిత్యం అనేవాటి చక్కని జ్ఞానం, రెండవదానివలన, అలేపత్వం - అనగా అంటులేనితనం కలుగుతుంది. విత్+త్వ, చిత్+త్వములు రెండూ పరమాత్మ రెండు లక్షణాలు.

క. నానా త్వైకత్వము ల । జ్ఞానజ్ఞానజము లనపజయ! కండ్రు బుధుల్
వాని నవిద్యయు విద్యయుఁ గా నివి విను పంచవింశకస్థావస్థల్. 228

ప్రతిపదార్థం: అనపజయ!= ఓటమి ఎరుగని ఓ దేవా!; నానాత్వ+ఏకత్వములు= పెక్కులగుట, ఒక్కటియగుట అనేవి; అజ్ఞాన జ్ఞానజములు= అజ్ఞానం వలనా, జ్ఞానం వలనా పుట్టేవి; బుధుల్= జ్ఞానవంతులు; వానిన్= ఆ రెండింటిని; అవిద్యయున్= అవిద్యగాను (అజ్ఞానంగానూ); విద్యయున్+కాన్= విద్యగానూ (జ్ఞానంగానూ); కండ్రు= చూస్తారు; విను= వినుము; ఇవి= ఈ రెండు; పంచవింశకస్థ+ అవస్థల్= ఇరువదియైదవ తత్త్వంలో ఉన్నవాడి దశలు.

తాత్పర్యం: మహేశా! పెక్కు లగుట అజ్ఞానం వలన కలిగిన స్థితి. ఒక్కటి కావటం జ్ఞానంవలన కలిగే స్థితి. పండితులు దీనినే అవిద్య, విద్య అంటారు. ఈ రెండూ ఇరవై అయిదవతత్త్వం వాడైన జీవుడి దశలు.

విశేషం: జీవుడు ప్రకృతితో తాదాత్మ్యం పొందితే విశ్వమంతా అనేక వస్త్వాదులతో ఉన్నట్లు భాసిస్తుంది. ఇరవై ఆరవ తత్త్వంతో తాదాత్మ్యం పొందితే 'ఏకత్వం' సిద్ధిస్తుంది. మొదటిది అజ్ఞానంవలనా, రెండవది జ్ఞానంవలనా సిద్ధిస్తాయి. వీటికే అవిద్య, విద్య అని కూడా పేర్లు. ఇరవై అయిదవ తత్త్వంవాడైన జీవుడికి, ఈ రెండు దశలూ కలిగే అవకాశం ఉన్నది. అవిద్య బంధానికి కారణం. విద్య మోక్షానికి కారణం.

క. విద్యామయషడ్వింశుఁడు । విద్యావిద్యావిభేదవిరహితుఁ డజరుం
డాద్యుఁ డనంతుం డచ్యుతుఁ । డద్యతనుఁ డనాది కేవలాత్మకుఁ డరయన్.' 229

ప్రతిపదార్థం: అరయన్= పరీక్షించగా; విద్యామయ షడ్వింశుఁడు= విద్యయే స్వరూపంగా గల ఇరవై ఆరవ తత్త్వం వాడు; విద్యా+ అవిద్యా, విభేదరహితుఁడు= విద్య, అవిద్య అనే వేర్వేరు భేదాలు లేనివాడు; అజరుండు= ముదిమి లేనివాడు; ఆద్యుఁడు= మొట్ట మొదటివాడు; అనంతుండు= అంతంలేనివాడు; అచ్యుతుఁడు= ఏ విధమైన జారుపాటు లేనివాడు; అద్యతనుఁడు= ఇప్పటివాడు; అనాది= తనకొక మొదలు లేనివాడు; కేవల+ఆత్మకుఁడు= తనకు తానే అయినవాడు.

తాత్పర్యం: పరికించగా విద్యయే స్వరూపంగా గల ఇరవై ఆరవతత్త్వంవాడు విద్య, అవిద్య అనే దశలు లేనివాడు, ముసలితనం లేనివాడు, మొట్టమొదటివాడు, అంతంలేనివాడు, ఏ విధమైన మార్పూ లేనివాడు. ఇప్పటివాడు, మొదలు లేనివాడు, తనకు తానే అయినవాడు'.

విశేషం: ఇరవై ఆరవతత్త్వంవాడి తత్త్వాన్ని ఇక్కడ వక్కాణిస్తున్నారు. 'ఏకత్వం' విద్య అని పైన చెప్పారు. ఆ ఏకత్వస్వరూపుడే అతడు. ఇరవై అయిదవ తత్త్వం వాడికి రెండు దశలు - అవిద్య, విద్య అని ఉన్నాయని వెనుకటి పద్యంలో చెప్పారు. ఆ దశలు ఇతడికి లేవు. ఆ దశలు ఉన్నవానికి సృష్టిలో సర్వపదార్థాలవలె చివికి జీర్ణించిపోయే స్థితి ఉంటుంది. ఇతడికి అట్టి స్థితి లేదు కనుక అజరుడు. 'జర' - ముదిమి ఉంటే తరువాతి స్థితి చావు. అది రెండు దశలున్న వాడికి ఉంటుంది. ఇతడికి ఉండదు. కనుక అనంతుడు. 'చ్యుతి' అంటే మార్పు. మార్పు అంటే సృష్టికి పూర్వం నుండీ ఉన్నవాడు అద్యతనుఁడు - అనగా అప్పుడు ఎట్లా ఉన్నాడో ఇప్పుడు ఇట్లాగే ఉన్నవాడు. దీనినిబట్టి ఎప్పుడూ ఏకస్వరూపంతో ఉండేవాడు అన్న అర్థం సిద్ధిస్తుంది. 'అనాది' - ఆది అంటే ఇక్కడ పుట్టుక. అది లేనివాడు - అది లేకపోతే స్థితి, చావు అనీ మరో రెండు దశలు ఉండవు. కేవలాత్మకుఁడు-తనకు తానే అయినవాడు. అనగా తన స్థితికి ఆధారం, కారణం మొదలైనవిగా మరొకటి లేనివాడు. ఏకస్వరూపుడు అని అర్థం.

ఆ. అని యుపన్యసించి యమ్మునిపతి యను । శంభుతోడ మఱియు 'సాంఖ్యయోగ
శిష్టమానసుల కరిష్టపరిజ్ఞాన । వైభవాతిశయము వలసియుండు. 230

ప్రతిపదార్థం: అని= ఇట్లని; ఉపన్యసించి= తెలిసేటట్లుగా చెప్పి; ఆ+మునిపతి= మునులలో గొప్పవాడగు ఆ సనత్కుమారుడు; శంభుతోడన్= శివుడితో; మఱియున్= ఇంకా; అనున్= అంటున్నాడు; సాంఖ్య, యోగ, శిష్ట, మానసులకున్= సాంఖ్యమనే యోగంలో శిక్షణ పొందిన మనస్సు కలవారికి; అరిష్ట, పరిజ్ఞాన వైభవ+అతిశయము= కీడుల చక్కని జ్ఞానపు సంపదయొక్క ఎక్కువతనం; వలసియుండున్= కావాలి.

తాత్పర్యం: ఇట్లా చక్కగా తెలియజెప్పి, సనత్కుమారుడు శివుడితో ఇట్లా అంటున్నాడు. 'సాంఖ్యయోగంలో శిక్షణ పొందిన మనస్సు కలవారు కీడులను గురించి చక్కని జ్ఞానం పొంది ఉండాలి.

విశేషం: అరిష్టాలంటే యోగాన్ని పాడు చేసే విషయాలు. అవి తెలిసికొనకపోతే యోగం చెడి, సాధకుడు భ్రష్టుడవుతాడు.

వ. ఎట్లనిన దృష్టారిష్టవికృతులయి యా సుకృతుల విచ్ఛిన్నాత్మాను సంధానంబునం దదీయ దురవస్థం ద్రోవంజాలుదు రరిష్టంబు లవధరింపు' మను పలుకు పలికి 'వాని నెల్లను వివరించెద'; నని పరాశర

సంయమీశ్వరుండు శిష్యుల కుపదేశించిన విధంబులైయుండు నంతవట్టును మును నీ వాకర్ణించి తని యమ్మునివరుండు మఱియు నమ్మహాదేవుతో 'నరిష్టంబులం గాంచి యోగిజనంబులు సర్వాంగధారణ సహితంబును బరమహితంబును నగు ననేకత్వాకలన కృత్యంబున మృత్యువు జయింతు' రని నిర్దేశించి.231

ప్రతిపదార్థం: ఎట్లు= ఏ విధంగా; అనినన్= అంటే; దృష్ట+అరిష్ట వికృతులు= చూడబడిన అరిష్టాలు, వికారాలు కలవారు; అయి; ఆ+సుకృతులు= ఆ పుణ్యాత్ములు; అవిచ్ఛిన్న+ఆత్మ+అనుసంధానంబునన్= ఎడతెగకుండా ఆత్మను కూర్చుకొనటం చేత; తదీయ దురవస్థన్= ఆ అరిష్టాలవలన ఏర్పడే పాడుదశను; త్రోవన్= త్రోసివేయటానికి; చాలుదురు= సమర్థులవుతారు; అరిష్టంబులు= కీడులు; అవధరింపుము= దయతో వినుము; అను పలుకు= అనే మాట; పలికి; వానిన్= వాటిని; ఎల్లను= అన్నింటిని; వివరించెదను= తెలియచెప్పుతాను; అని; పరాశర సంయమి+ఈశ్వరుండు= పరాశరుడనే మహర్షిశ్రేష్ఠుడు; శిష్యులకున్= తనకడ అధ్యయనం చేసేవారికి; ఉపదేశించిన విధంబులు= బోధించిన పద్ధతులు; ఐ+ఉండు+అంతవట్టును= అయి ఉండే అంతవరకు; మును= తొల్లి; నీవు; ఆకర్ణించితి(ని)= విన్నావు; అని; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; మఱియున్= ఇంకా; ఆ+మహదేవుతోన్= ఆ మహాదేవుడు శంకరుడితో; అరిష్టంబులన్= కీడులను; కాంచి; యోగిజనంబులు= యోగం అభ్యసించే మనుజులు; సర్వ+అంగ ధారణ సహితంబునున్= అన్ని అంగాలను పట్టి నిలపటంతో కూడినదీ; పరమ హితంబును= మిక్కిలి మేలు చేసేదీ; అగు= అయిన; అనేకత్వ+ఆకలన కృత్యంబునన్= పెక్కు లగుటను ఒక్కటిగా చేయటం అనే పనితో; మృత్యువున్= చావును; జయింతురు= గెలుస్తారు; అని; నిర్దేశించి= తెలియచెప్పి.

తాత్పర్యం: ఏ విధంగా అనగా అరిష్టాలను, వికారాలు తెలిసికొని పుణ్యాత్ములు ఎడతెగకుండా ఆత్మను కూర్చుకొనటం ద్వారా వాటివలన కలిగే చెడుదశను త్రోసి వేయగలుగుతారు. కనుక కీడును తెలిసికొనాలి.' అని పలికి, 'వాటిని వివరిస్తాను' అని 'మునుపు పరాశరమహర్షి శిష్యులకు చెప్పిన విషయాలుగా ఉన్నాయి. అంతవరకు నీవు విని ఉన్నావు' అని సనత్కుమారుడు ఇంకా మహాదేవుడితో ఇట్లా అన్నాడు. 'అరిష్టాలను తెలిసికొని యోగిజనాలు అన్ని అంశాలను పట్టి నిలపటం అనే పనితో కూడినదీ, మిక్కిలి మేలైనదీ అయిన అనేకము లవటం అనేదానిని ఏకస్వరూపంలోనికి తేవటం అనే క్రియద్వారా మృత్యువును గెలుస్తారు' అని చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆత్మను అనుసంధించటం అనే పని అవిచ్ఛిన్నంగా జరగాలి. లేకపోతే భ్రష్టత కలుగుతుంది. అనేకత్వ+ఆకలన, కృత్యంబుగనన్= అనేకాలంటే 24 తత్త్వాలు. వాటి 'ఆకలనం' అనగా కలపటం - ఒక్కటి చేయటం. అనేకత్వం అవిద్య అని పైన తెలిపారు. కనుక ఆ స్వరూపాన్ని చక్కగా తెలిసికొనటం అని కూడా ఇక్కడ అర్థంగా భావించవచ్చును. అవిద్య కూడా తెలియదగినదే. దానివలన మృత్యువును తరించాలి అని వేదానుశాసనం. 'అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృతమశ్నుతే' అని ఉపనిషద్వాక్యం. ఈ దృష్టితో ఈ పద్యంలో ఈ వాక్యపూర్వార్థాన్ని సమన్వయించినట్లుగా భావించాలి.

క. జలమున మీను నుదుంబర । ఫలమున మశకములుఁ బోలెఁ బ్రకృతిం దా ని
మ్ముల నునికి తెలిసి వేర్పా ।టలవఱిచిన పురుషుఁ డవ్యయత్వము పొందున్. 232

ప్రతిపదార్థం: జలమునన్= నీటిలో; మీనున్= చేపయూ; ఉదుంబర ఫలమునన్= మేడిపండులో; మశకములున్= పురుగులు; పోలెన్= వలె; ప్రకృతిన్= ప్రకృతిలో; తాను= జీవుడు; ఇమ్ములన్= చక్కగా; ఉనికి= ఉండటం; తెలిసి= ఎరిగి; వేర్పాటు= వేరు కావటం, అలవఱిచిన పురుషుఁడు= అభ్యాసం చేసిన జీవుడు; అవ్యయత్వము= అవ్యయుడైన పరమాత్మ స్థితిని; పొందున్=

పొందుతాడు.

తాత్పర్యం: నీటిలో చేపా, మేడిపండులో పురుగులూ ఉన్నట్లుగా తాను ప్రకృతిలో ఉన్నానని తెలిసికొని, దానినుండి వేరుకావటం అభ్యాసం చేసి, సిద్ధిపొందిన పురుషుడు అమృతత్వస్థితి పొందుతాడు.

విశేషం: నీటిలో చేప ఉన్నది కాని నీరే చేపకాదు. మేడిపండులో పురుగులు ఉన్నాయి. కానీ పండే పురుగులు కాదు. తనను ఆవరించిన నీరు, పండువంటి ప్రకృతిధర్మాలు తనకంటె వేరైనవి అని గుర్తించటం, తన నిజస్థితి ఏమో పరికించి అది తానే అనే భావాన్ని అనుసంధించుకొనటం సాధకుడి కృత్యాలు. సాధన సిద్ధిదశకు వస్తే కలిగే ఫలం అవ్యయత్వం. అవ్యయుడు ఇంతవరకు చెప్పిన ఇరవై ఆరవతత్త్వం వాడు - పరమాత్మ. అది కావటం అవ్యయత్వం. దీనికే కైవల్యం, మోక్షం మొదలైన వ్యవహారాలు ఉన్నాయి. ఇందులో 'విద్యయా అమృత మశ్నుతే' అనే రెండవవాక్య భాగార్థాన్ని సమన్వయించి చూపారు. ఇక్కడ 'వేర్పాటే' విద్య.

తే. కమలదళమున నున్న జలము విధమునఁ । బ్రకృతినుండి తదీయసంబంధవికృతి
లేని తనుఁ గని వెలుఁగు నిర్లేపనిశ్చ । లాజరామరపదవి జీవాహ్వాయుండు. 233

ప్రతిపదార్థం: జీవ+ఆహ్వాయుండు= జీవుడనే పేరుగలవాడు; కమలదళమునన్= తామరాకుమీద; ఉన్న జలము విధమునన్= ఉన్న నీటివలె; ప్రకృతిన్= ప్రకృతియందు; ఉండి; తదీయసంబంధ వికృతి= దానికి సంబంధించిన వికారము; లేని= లేనట్టి; తనున్= తనను; కని= కాంచి; నిర్లేప నిశ్చల+అజర+అమర పదవిన్= అంటులేనిది, కదలికలేనిది, ముదిమిలేనిది, చావులేనిది అగు స్థానమునందు; వెలుఁగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: జీవుడు తామరాకుమీద నున్న నీటివలె ప్రకృతియందు ఉండి దానికి సంబంధించిన వికారాలు లేకుండా ఉన్న తనను చూచుకొని అంటు, కదలిక, ముదిమి, చావు లేని స్థానంలో వెలుగొందుతాడు.

విశేషం: నీటిలో చేప ఉండటం, తామరాకు మీద నీరుండటం అనే రెండు దృష్టాంతాలు బంధానికీ మోక్షానికీ ప్రతీకలు. నీటిలోని చేపకు (232వ పద్యంలో చెప్పిన సంగతి) నీటి సంపర్కం - అంటు ఉంటుంది. ప్రకృతిలోని జీవుడికి అటువంటి సంబంధం ఉంటే అంటు - దానివలన చలనమూ, దానివలన జర, దానివలన మరణమూ అనే వికారాలు సిద్ధిస్తాయి. ఇక తామరాకుమీద నీరు, తామరాకు సంపర్కం లేకుండా ఉంటుంది. అనగా 'నిర్లేప' స్థితి దానికి ఉంటుంది. దానివలన చలనాది వికారాలు కలుగవు. అదే అవ్యయత్వం.

ఆ. ప్రకృతి నిట్లు పాసి పంచవింశుండు ష । డ్వింశభావమొంది విమలశివ ని
రంజన స్వరూపుఁడై వెలుఁగొందు న । త్తెఱఁగు ముక్తియండ్రు దేవదేవ! 234

ప్రతిపదార్థం: దేవదేవ!= దేవులకు దేవుడవైన ఓ మహాదేవా!; పంచవింశుండు= ఇరవై అయిదవవాడు అయిన జీవుడు; ఇట్లు= ఈ విధంగా; ప్రకృతిన్= ఇరవైనాలుగవ తత్త్వం అయిన ప్రకృతిని; పాసి= వదలి; షడ్వింశభావము= ఇరవైఆరవ తత్త్వం అయిన పరమాత్మ భావాన్ని; ఒంది= పొంది; విమల శివ నిరంజన స్వరూపుఁడు+ఐ= నిర్మలము, మంగళము, ఇతరముల అంటు లేనిది అయిన స్వరూపం కలవాడై; వెలుఁగు+ఒందున్= ప్రకాశిస్తాడు; ఆ+తెఱఁగు= ఆ తీరును; ముక్తి= మోక్షం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: జీవుడు ఈ విధంగా ప్రకృతిని వదలివేసి పరమాత్మతనాన్ని పొంది, విమలము, శుభము, అంటులేని స్వరూపం కలవాడై ప్రకాశిస్తాడు. దేవదేవా! ఈ స్థితినే ముక్తి అంటారు.

విశేషం: ప్రకృతిని పాసి - అనగా ప్రకృతితోపాటు వెనుక ఉన్న ఇరవైమూడు తత్త్వాలను వదలి అనే అర్థం భావించాలి. షడ్వింశుడు - ఈ ఇరవై అయిదు తత్త్వాలకు అతీతంగా ఉండే పరమాత్మ. ప్రకృతి సంపర్కం వదలితే జీవాత్మ పరమాత్మే అవుతాడు. ఇదే అద్వైతం. పరమాత్మ లక్షణాలు మూడింటిని ఇక్కడ చెప్పారు. 1.విమలత్వం - మలం అంటే జీవపరంగా అజ్ఞానదోషం. అది లేనితనం. 2.శివత్వం - అనగా మంగళస్వరూపం. కేవలం జీవుడు పెరగటం. తరగటం మొదలైన స్థితులతో కూడినవాడు కనుక అక్కడ కేవల శుభత్వం ఉండదు. పరమాత్మకు అట్టిదిలేదు. 3.నిరంజనత్వం - ప్రకృతితో కలిసి గుణాదుల సోకు పొందటం జీవలక్షణం. అది దోషం. తామరాకుమీద నీటి బొట్టువలె అంటకుండా ఉండటం నిరంజనత్వం.

క. ఈ పరిబోధం బభవా! కాపిల మస్మద్గురుండు గపిలుఁ డతని శి
క్షాపరిణతి బహుశిష్యులు । దీపితవిజ్ఞానులైరి దృఢనిశ్చయతన్. 235

ప్రతిపదార్థం: అభవా!= జన్మమే లేని ఓ శివా! ఈ పరిబోధంబు= ఈ సమగ్రమైన జ్ఞానం; కాపిలము= కపిలమహర్షి ప్రసాదించినది; అస్మత్ గురుండు= నా గురువు; కపిలుఁడు= కపిలమహర్షి; అతని శిక్షా పరిణతిన్= అతడి బోధన పాకంచేత; బహుశిష్యులు= పెక్కుమంది శిష్యులు; దృఢనిశ్చయతన్= చెదరని నిశ్చయబుద్ధి కలగటం చేత; దీపితవిజ్ఞానులు= వెలుగొందే విజ్ఞానం కలవారు; ఐరి= అయ్యారు.

తాత్పర్యం: శివా! ఈ చక్కని జ్ఞానాన్ని కపిలమహర్షి లోకానికి అనుగ్రహించాడు. అతడు నా గురువు. అతడి బోధన పాకంచేత పెక్కుమంది శిష్యులు చెదరని నిశ్చయబుద్ధి కలవారై ప్రకాశించే విజ్ఞానం కలవారయ్యారు.

విశేషం: గురువు విశిష్టత ఇక్కడ తెలియవస్తున్నది.

క. ఏనును శిష్యుల కీ వి । జ్ఞానము పెక్కండ్రకుం బ్రసన్నమతిని గా
ఢానూనంబుగఁ దెలిపితి । మానిత మది దివ్యమునిసమాజముచేతన్. 236

ప్రతిపదార్థం: ఏనును= నేను కూడా; శిష్యులకున్= అధ్యయనం చేసేవారికి; పెక్కండ్రకున్= చాలామందికి; ప్రసన్నమతిని= ప్రసన్నమైన బుద్ధితో; ఈ విజ్ఞానమున్= ఈ సాంఖ్యరూప విశేషజ్ఞానాన్ని; గాఢ+అనూనంబుగన్= గట్టిగా తక్కువతనం లేని విధంగా; తెలిపితిన్= బోధించాను; అది= ఆ విజ్ఞానం; దివ్యముని సమాజముచేతన్= దేవతలమునుల సముదాయంచేత; మానితము= మన్నన కెక్కింది.

తాత్పర్యం: దేవా! నేను కూడా ఈ విజ్ఞానాన్ని పెక్కుమంది శిష్యులకు ప్రసన్నమైన బుద్ధితో దృఢంగా, తక్కువతనం లేకుండా బోధించాను. దివ్యమును లెందరో దీనిని మన్నించారు.

విశేషం: విద్యకు అధీతి, బోధ, ఆచరణ; ప్రచారణ - అని నాలుగు దశలు. క్రిందటి పద్యంలో నా గురువు కపిలుడు, ఆతని శిష్యులు దీపిత విజ్ఞానులైరి అనేమాటలచేత అధ్యయనం, ఆచరణం అనే దశలు తెలియవచ్చాయి. ఈ పద్యంలో 'నేను చెప్పాను' అన్నదానిచేత బోధ, ప్రచారణ అనే దశలు ప్రసక్తాలయ్యాయి. ఇట్లా సంప్రదాయం తెలుపటానికే ఈ ప్రసంగం

కాని ఆత్మోత్కర్షను చాటుకొనటానికి కాదు. 'గాఢ అనూనంబుగన్' అనటం కూడ ఉపదేశం ఎట్లా ఉండాలో తెలియచేయటాని కని గుర్తించాలి.

వ. గార్గ్య గౌతమ కాత్యాయనాదులు దీనన చేసి దీప్తబోధులయి వీతాతంకులును విజ్వరులును నిర్లేపులును నిర్భరానందులు నైరని చెప్పి వెండియు నిట్లనియె. 237

ప్రతిపదార్థం: గార్గ్య, గౌతమ, కాత్యాయన+ఆదులు= గార్గ్యుడు, గౌతముడు, కాత్యాయనుడు మొదలైనవారు; దీనన్+అ చేసి= ఈ జ్ఞానంచేతనే; దీప్తబోధులు= ప్రకాశించే జ్ఞానం కలవారు; అయి; వీత+అతంకులును= పోయిన అవరోధాలు కలవారు; విజ్వరులును= నశించిన మనస్సంబంధి రోగాలు కలవారు; నిర్లేపులును= తొలగిన ప్రకృతిసంపర్కం కలవారున్నూ; నిర్భర+ ఆనందులును= పరిపూర్ణమైన ఆనందం కలవారున్నూ; ఐరి= అయ్యారు; అని; చెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నారు.

తాత్పర్యం: గార్గ్యుడు, గౌతముడు, కాత్యాయనుడు మొదలైనవారు ఈ జ్ఞానంచేతనే చక్కగా వెలుగొందే జ్ఞానం కలవారై, ఆతంకాలు పోయినవారు, మనస్సులోని శంకలు నశించినవారు, ప్రకృతి సంపర్కం వదలినవారు, నిండైన ఆనందం పొందినవారు అయ్యారు.' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ఇందులో జ్ఞానలబ్ధి ఫలితాలను సోపానక్రమంలో చెప్పారు. మొదటిదశ గురువువలన వినటం, తరువాత మననం నిదిధ్యాస చేయటం - దీప్తబోధులు అన్నంతవరకు ఈ మూడు మెట్లు ఉన్నట్లు భావించాలి. మధ్యలో అరిష్టాలు వస్తాయని ఇంతకుముందు చెప్పారు. వాటిని తొలగించుకొనటం నాలుగవ మెట్టు. బయటినుండి కలిగేవి కాక, లోపల కలిగే వికారాలే జ్వరాలు, వాటిని తొలగించుకొనటం విజ్వరత్వం - అయిదవమెట్టు, ఆరవమెట్టు సిద్ధి - ప్రకృతితో లేపం లేకుండా ఉండటం - నిర్లేపత్వం. చివరిది ఫలరూపం. అదే నిర్భరానందం. ఇట్లా వారయ్యారని చెప్పటం సాధకుడు ఇట్లా కావాలి - అని చెప్పటానికి ఉపలక్షణం. ఈ విధంగా మహావిద్యయొక్క దశాభేదాలను ఈ వచనం పరమరమణీయంగా తెలుపుతున్నది.

క. సంగము బంధ మఖిల ని। స్సంగత మోక్షంబు బహువిచారము లేలా?
పింగజటాజూట కలిత! గంగాబాలేందు మహిత! గౌరీసహితా!' 238

ప్రతిపదార్థం: పింగ జటాజూట కలిత!= పచ్చని జడల ముడులతో కూడినవాడా!; గంగా బాల+ఇందు మహిత!= గంగానదితో, లేతచందురుడితో విరాజిల్లువాడా!; గౌరీసహితా!= పార్వతి సగభాగంగా గల పరమశివా!; బహువిచారములు= పెక్కు ఆలోచనలు; ఏలా?= ఎందుకు?; సంగము= ప్రకృతితో కలయిక; బంధము= కట్టు; నిస్+సంగత= సంగం లేకుండటం; మోక్షంబు= విడుదల.

తాత్పర్యం: శివా! పెక్కు విచారాలు ఏల? జీవుడు ప్రకృతితో అంటిపెట్టుకొని ఉండటమే బంధం. ఆ విధమైన సంపర్కం లేకుండటమే మోక్షం.'

విశేషం: పద్యంలో శివుడికి చేసిన మూడు సంబోధనలు పైకి పద్యపూరణం కోసంగా కనిపిస్తాయి. కానీ పరిశీలించి చూస్తే తత్త్వస్ఫోరకాలు. శివుడి జటాజూటం 'వ్యోమం' - అనగా ఆకాశం. గంగానది జలదేవత, చంద్రుడు - జ్యోతి స్వరూపం, పార్వతి- భూతత్త్వం. ఈ విధంగా శివుడి విశ్వవ్యాపకత అనే ధర్మాన్ని కవి తెలుపుతున్నాడు. అంతేకాదు ఇరవై ఆరవతత్త్వం అయిన పరమాత్మవు నీవు. లోకానుగ్రహం కొరకు నా చేత ఈ యోగసాంఖ్యమార్గాలను చెప్పించినావు అనే స్ఫూర్తికి ఈ సంబోధనలు సహకరిస్తాయి.

పరమాత్మ - జీవుడు - ప్రకృతి. క్రిందివైపు ప్రసరించటం సంగం. అదే బంధం. పైవైపు ప్రసరించటం నిస్సంగత - అదే మోక్షం. ఇది ఈ విద్యకు ఉపసంహారవాక్యం.

క. అని యిట్లు శివునకును న । మ్ముని విజ్ఞాపించి గగనమున కెగసి వెసం
జనియె శివుండును నిజది । వ్య నిరర్గళ చిత్తపథ విహారుం డయ్యెన్. 239

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఆ+ముని= ఆ సనత్కుమార మహర్షి; శివునకును= పరమేశ్వరుడికి; విజ్ఞాపించి= విన్నవించి; గగనమునకున్= ఆకాశానికి; ఎగసి= ఎగిరి; వెసన్= వేగంగా; చనియెన్= వెళ్ళాడు; శివుండును= శంకరుడు కూడా; నిజ దివ్య నిరర్గళ చిత్త పథ విహారుండు= తనదైన దివ్యము, అడ్డులేనిదీ అయిన మనస్సునకు సంబంధించిన మార్గంలో విహరించేవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: అని ఈ విధంగా ఆ మహర్షి శివుడికి యోగసాంఖ్యాలను విన్నవించి, ఆకాశాని కెగిరి వేగంగా వెళ్ళిపోయాడు. శివుడు కూడా తన దివ్యమూ, అడ్డులేనిదీ అయిన చిత్తపథంలో విహారం కలవా డయ్యాడు.

విశేషం: చిత్తపథం - హృదయపుండరీకం అనేస్థానం అని సంభావించాలి. 'సనత్కుమారుడు ఆకాశాని కెగిరాడు. శివుడు చిత్తపథంలో విహరించాడు' అన్న ఈ మాటలలో వారిద్దరి ఏకత్వాన్ని గుర్తించాలి. ఆకాశం అంటే 'దహరాకాశం' హృదయంలో సదాశివస్థానమైన చోటు. శివుడిదీ అదే. ఈ విధంగా ఇద్దరూ వెళ్ళినచోటు ఒక్కటే. అనగా ఇద్దరూ ఒక్కటే అని తాత్పర్యం.

క. అని చెప్పిన భీష్మున కి । ట్లను ధర్మతనూజుఁ డెక్కుడైన శుచిత్వం
బొనరింపఁ జాలు తీర్థం । బనఘా! యెఱిఁగింపవే దయం దెల్లముగన్. 240

ప్రతిపదార్థం: అని; చెప్పినన్= చెప్పగా; ధర్మతనూజుఁడు= ధర్ముడి కుమారుడైన యుధిష్ఠిరుడు; భీష్మునకున్= భీష్ముడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; అనఘా!= పుణ్యాత్మా!; ఎక్కుడు= ఎక్కువ; ఐన శుచిత్వంబు= అయిన పవిత్రతను; ఒనరింపన్ చాలు తీర్థంబు= చేయగల పుణ్యస్థానం ఏదో; దయన్= దయతో; తెల్లముగన్= స్పష్టమయ్యే విధంగా; ఎఱిఁగింపవే!= తెలుపుమా!

తాత్పర్యం: ఈ విధంగా చెప్పిన భీష్ముడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు. 'అనఘా! మిక్కిలి ఎక్కువ పవిత్రతను కలిగించ గల తీర్థం ఏదో దయతో స్పష్టంగా తెలుపవూ!'

సీ. అనవుడు నాతఁ డమ్మనుజవల్లభుతోడ । 'వినుము తీర్థము లెల్లవియును మేల;
సత్యాభిధానమై శౌచాతిశయముఁజే । యఁగఁ జాలు మానసంబైన తీర్థ
మది ధృతి యనుమహాహ్రదమున శోభిల్లుఁ । దమము రజస్సును దఱియఁ ద్రోచి
కొనుచు సత్యము నూఁతగొని చొచ్చి యాచరి । తస్నానుఁడై శుచిత్వమున వెలుఁగు

ఆ. నరుఁడు వీతరాగ పరిహృతేంద్రియ దృఢ । వ్రతలసద్వివేకు లతిశయిల్లు
విమలతీర్థములు సవినయత వారలఁ । జెందుటయును దీర్థసిద్ధి యధిప! 241

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ+మనుజవల్లభుతోడన్= ఆ రాజుతో; అధిప!= రాజా!; వినుము= ఆలకించుము; తీర్థములు= పవిత్రస్థలములు; ఎల్ల+అవియును= అన్నీ; మేలు+అ= మేలైనవే; మానసంబు= మనస్సునకు సంబంధించినది; ఐన తీర్థము= అయిన తీర్థం; సత్య+అభిధానము= 'సత్యం' అనే పేరుగలది; ఐ= అయి; శౌచ+అతిశయమున్= పవిత్రతయొక్క ఎక్కువతనాన్ని; చేయఁగన్+చాలున్= చేయగలుగుతుంది; అది= ఆ తీర్థం; ధృతి= ధీరత; అను మహాహ్రదమునన్= అనే పెద్దజలాశయంలో; శోభిల్లున్= ప్రకాశిస్తుంది; తమమున్= తమస్సు అనే గుణాన్నీ; రజస్సు= రజస్సు అనే గుణాన్నీ; తటియన్= దూరమైపోయే విధంగా; త్రోచికొనుచున్= నెట్టివేసికొంటూ; నరుఁడు= మానవుడు; సత్యమున్= సత్యగుణాన్ని, ఊఁత= ఆధారంగా; కొని= గ్రహించి; చొచ్చి= ప్రవేశించి; ఆచరిత స్నానుఁడు= చేయబడిన స్నానం గలవాడు; ఐ= అయి; శుచిత్వమునన్= పరిశుద్ధతతో; వెలుఁగున్= ప్రకాశిస్తాడు; వీత రాగ పరిహృత+ఇంద్రియ దృఢ వ్రత లసత్ వివేకులు= వదలిన విషయప్రీతి, తొలగించబడిన ఇంద్రియాలూ, చెదరని నియమనిష్ఠలూ గల వివేకవంతులు; అతిశయిల్లు విమల తీర్థములు= మిక్కిలిగా వెలుగొందే స్వచ్ఛమైన పవిత్రస్థానాలు; సవినయతన్= వినయంతోపాటు; వారలన్= అట్టివారిని; చెందుటయును= ఆశ్రయించటం కూడా; తీర్థసిద్ధి= తీర్థంవలన కలిగే సిద్ధియే.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా అడిగినంతనే భీష్ముడతడికి ఇట్లా చెప్పాడు. 'రాజా! తీర్థాలన్నీ మేలైనవే. మానసతీర్థం ఒకటి ఉన్నది. దాని పేరు 'సత్యం'. అది మిక్కిలి పవిత్రతను కలిగిస్తుంది. 'ధృతి' అనే మహా జలాశయంలో అది విరాజిల్లుతూ ఉంటుంది. తమస్సు, రజస్సు అనే రెండు గుణాలను దూరంగా తొలగించుకొంటూ, సత్యాన్ని ఊతకర్రగా తీసికొని దానిలోనికి ప్రవేశించి స్నానం చేసినవాడు పరిశుద్ధతతో ప్రకాశిస్తాడు. రాగద్వేషాలు వదలి, ఇంద్రియాల వికారాలను తొలగించుకొని, ఏమాత్రమూ సడలని వ్రతం పాటిస్తూ వివేకం కలిగిన మహాత్ములు కూడా గొప్ప నిర్మలతీర్థాలే. వారిని వినయపూర్వకంగా ఆశ్రయించటం కూడా తీర్థాలవలనకలిగే సిద్ధిని కలిగిస్తుంది.

విశేషం: మనస్సులో పుట్టే వికారాలు తమస్సు, రజస్సు అనే గుణాల వలన కలుగుతాయి. తమస్సు ఆవరణశక్తి. అనగా దేనినీ చూడనీయదు. రజస్సు విక్షేపశక్తి. ఎక్కడా నిలువనీయదు. ఈ రెండింటినీ దూరంగా తోసివేస్తే తప్ప మనస్సు తీర్థం కాదు. దానికి సముద్రమంత ధైర్యం కావాలి. తీర్థమంటే తరింపచేసేది. నీటిలోనికి దిగేవాడికి లోతు తెలియటం మొదలైన ప్రయోజనాల కొరకు ఒక ఊత - ఆధారదండం ఉండాలి. ఇక్కడ అదే సత్యం, లేదా సత్త్వగుణం. దీనివలన నరుడు లోపలా, వెలుపలా, నిండైన పరిశుద్ధత కలవాడవుతాడు. మరొకరకపు తీర్థాలు కూడా ఉన్నాయి. అవి కదలేవి, ప్రాణవంతమైనవి. వారు 'వివేకులు' - రాగద్వేషాలను తొలగించుకొన్నవారు. ఇంద్రియవికారాలకు లోబడనివారు, చెదరని నియమ నిష్ఠలుకలవారు, సత్యమేదో, అసత్యమేదో విడమరచి చూడగలవారు అయిన మహాపురుషులు ఆ తీర్థాలు. వారలను ఆశ్రయించటంవలన కూడా తీర్థఫలం సిద్ధిస్తుంది. ఇందులో మొదటిది కొంచెం క్లిష్టమైన పద్ధతి. రెండవది కొంచెం సులభపద్ధతి. దయతో వ్యాసభగవానుడు మధ్యమాధికారుల కొరకు ఈ రెండవ తీర్థాన్ని కూడా ఇక్కడ అనుగ్రహిస్తున్నారు. ఇంతకు మునుపు చెప్పిన యోగమూ, సాంఖ్యమూ ఎంతో శక్తిసంపన్నత కలవారికి తప్ప సాధ్యంకానివి. అంత స్థాయికి ఎదగలేనివారి గతి ఏమిటి? అన్న ప్రశ్నకు ఈ పద్యం సమాధానరూపంగా దారి చూపుతుంది. అందుకొరకే దాని కనుబంధంగా ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది.

క. దమమును దపము నహింసయు । శమమును దీర్థముల వాన శౌచాతిశయం
బమలగుణ! కలుగు రిత్తజ । లములం దోఁగిన శుచిత్వలాభము గలదే?' 242

ప్రతిపదార్థం: అమలగుణ!= స్వచ్ఛమైన గుణములు గల ఓ ధర్మరాజా!; దమమును= ఇంద్రియనిగ్రహమూ; తపమున్= తపస్సూ; అహింసయున్= ఇతరులను పీడించకుండటమూ; శమమును= శాంతి (మనస్సు ఉద్వేగపడకుండటమూ);

తీర్థములు+అ= తీర్థములే; వానన్= వాటిచేత; శౌచ+అతిశయంబు= పరిశుద్ధత యొక్క ఎక్కువతనము; కలుగున్= కలుగుతుంది; రిత్తన్= ఊరకయే (వ్యర్థంగా); జలములన్= నీటిలో; తోఁగినన్= మునిగితే; శుచిత్వలాభము= పరిశుద్ధత అనే లాభం; కలదు+ఏ?= ఉంటుందా?

తాత్పర్యం: ధర్మరాజా! ఇంద్రియాలను అదుపుచేసికొనటం, దేహాన్నీ, మనస్సునూ నియమనిష్ఠలద్వారా ఎండగట్టటం, ఇతరప్రాణాలను హింసించకుండటం, మనస్సులో ఉద్వేగం రాకుండా చూచుకొనటం అనేవి కూడా తీర్థాలే. వాటిచేత ఎక్కువ శుద్ధత కలుగుతుంది. ఊరకే నీటిలో మునిగితే పరిశుద్ధత కలుగుతుందా?'

విశేషం: దేహపు పై భాగం శుద్ధం అయినంత మాత్రాన చాలదు. అంతశ్శుద్ధి కావాలి. అది జలాదులతో ఏర్పడదు.

వ. అని వెండియు. 243

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'దొరకొననివానిఁ గోరక । దొరకొనినందును మమత్వతుష్టహృదయతం
బొరయక విగతస్పృహులగు । పురుషులు శుచు లేల తీర్థములు వారలకున్?' 244

ప్రతిపదార్థం: దొరకొననివానిన్= అందనివానిని; కోరక= అపేక్షింపక; దొరకొనిన+అందును= అందినవాటియందును; మమత్వతుష్ట హృదయతన్= నాది అనే భావమూ, ఆనందపు పొంగు కలిగిన హృదయం కలవాడు కావటాన్ని; పొరయక= పొందక; విగత స్పృహులు= నశించిన వాంఛకలవారు; అగు పురుషులు= అయిన నరులు; శుచులు= పరిశుద్ధులు; వారలకున్= అట్టివారికి; తీర్థములు= తరింపచేసే పుణ్యాజలాలు; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: 'దొరకని వాటిని కోరక, దొరికిన వాటియందు మమకారము, తుష్టి అనే లక్షణాలను పొందక, ఆశను విడనాడి బ్రదికే నరులు పవిత్రులు. వారికి వేరైన తీర్థాలెందుకు?'

విశేషం: మమత్వం - అనగా నాది అనే భావన. తుష్టి - అనగా పొంగిపోవటం - ఈ రెండింటినీ వదలాలి. ఎందుకనగా మమత్వ మేర్పడితే - రక్షణయందు, నాశమునందు దుఃఖం కలుగుతుంది. వస్తుగతతుష్టి వస్తునాశంతో దుఃఖంగా మారుతుంది.

క. అనినఁ బ్రియమంది తాతకు । మనుమఁడు ప్రణమిల్లి 'బోధమహితా! యేవ
ర్తనమున నుత్తమపదముం । గను నం; ద్రది యెఱుఁగఁ జెప్పు కరుణ దలిర్పన్. 245

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ప్రియము+అంది= తృప్తిపడి; మనుమఁడు= మనుమడైన ధర్మరాజు; తాతకున్= తాతకు; ప్రణమిల్లి= దండ నమస్కారం చేసి; బోధమహితా!= జ్ఞానంచేత గొప్పవాడా!; ఏ వర్తనమునన్= ఎట్టి నడవడితో; ఉత్తమపదమున్= మేలైన స్థానాన్ని (మనుష్యుడు); కనున్= పొందుతాడు; అంద్రు= అంటారో; అది= దానిని; కరుణ= దయ; తలిర్పన్= చిగురించగా; ఎఱుఁగన్= తెలిసేటట్లుగా; చెప్పు= బోధించుము.

తాత్పర్యం: అనగా సంతృప్తి చెంది మనుమడు ప్రణామం చేసి, తాతతో ఇట్లా అన్నాడు. 'జ్ఞానమహితా! ఎట్టి ప్రవర్తనతో మనుష్యుడు ఉత్తమపదం చేరుకొంటా డంటారో దానిని నాకు దయ చిగురించగా బోధించుము.

విశేషం: ప్రణమిల్లి - ఇది ప్రాతకాలపు కృతజ్ఞతాభివ్యక్తి ధోరణి. అంతేకాదు 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' అని గీత. ప్రణిపాతం అంటే కాళ్ళకు మ్రొక్కటం.

వ. మృతుండు మేను విడిచి యెయ్యది సహాయంబుగాఁ జను నదియును వినవలతు' నని యడిగిన నమ్మహానుభావుం డా భూవల్లభున కిట్లనియె. 246

ప్రతిపదార్థం: మృతుండు= మరణించినవాడు; మేను= దేహాన్ని; విడిచి= వదలిపైచి; ఏ+అది= ఏది; సహాయంబుగాన్= ఊతగా; చనున్= వెళ్తాడో; అదియునున్= దానిని కూడా; వినవలతున్= వినగోరుతున్నాను; అని; అడిగినన్= అడిగితే; ఆ+మహానుభావుండు= గొప్ప సమర్థతగల ఆ భీష్ముడు; ఆ భూవల్లభునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మరణించినవాడు దేహాన్ని వదలి ఏ తోడుగా వెళ్ళుతాడు? ఆ విషయం కూడా వినగోరుతున్నాను.' అని అడుగగా ఆ మహానుభావుడు ఆ రాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న - ఎందుకనగా బ్రతికి ఉన్నవాడికి మరణం తరువాత ఏమి అవుతుందో తెలియదు. మరణించిన తరువాత జీవుడి అనుభవం ఎటువంటిదో చెప్పటానికి అవకాశం లేదు. కనుక భీష్ముడు దీనికి సూటిగా సమాధానం చెప్పటం లేదు.

క. 'నీ యడిగిన గూఢములగు । నీ యర్థము లెఱుఁగఁ జెప్ప నింద్రగురుఁడు గా
కేయెడల నొరుఁడు గలఁడే. యాయన యిట వచ్చు నిపుడ యడుగుము ప్రీతిన్.' 247

ప్రతిపదార్థం: నీ+అడిగిన గూఢములు+అగు+అర్థములు=నీవడిగిన మిక్కిలి రహస్యములైన ఈ విషయాలు; ఎఱుఁగన్= తెలిసే విధంగా; చెప్పన్= చెప్పటానికి; ఇంద్రగురుఁడు= దేవేంద్రుడి గురువైన బృహస్పతి; కాక= తప్ప; ఏ+ఎడలన్= ఏ తావులోనైనా; ఒరుఁడు= ఇతరుడు; కలఁడు+ఏ?= ఉంటాడా?; ఆయన= ఆ బృహస్పతి; ఇటన్= ఇక్కడకు; ఇపుడు+అ= ఇప్పుడే; వచ్చున్= వస్తాడు; ప్రీతిన్= ప్రీతితో; అడుగుము= అడుగు.

తాత్పర్యం: 'నీవడిగిన అర్థం చాలా గూఢమైనది. దీనిని తెలియచెప్పగలవాడు బృహస్పతి తప్ప మరొక డున్నాడా? ఆయన ఇప్పుడే ఇక్కడకు వస్తాడు. ప్రీతితో అడుగుము.'

విశేషం: ఇంద్రగురుడు - బృహస్పతి అనగా అతడికి తెలియని అర్థాలు లేవని భావం. సంకల్పమాత్రం చేత భీష్ముడు బృహస్పతితో సన్నిహితత్వం కల్పించుకొన్నాడు. అనగా జ్ఞానసంపన్నులకు బృహస్పతి మొదలైనవారు నిత్యసన్నిహితంగా ఉంటారని భావం. 'బుద్ధిలో బృహస్పతి' అని నానుడి. కనుక అతడు ఎంత నిగూఢమైన విషయమైనా చెప్పగలుగుతాడు.

క. అను సమయంబున నయ్యెడ । కనిమిష గురుఁ డరుగుదెంచె నతనికిఁ గుంతీ
తనయాగ్రజుండుఁ దమ్ములు । జనపతులును గేశవుండు సద్భక్తిమెయిన్. 248

ప్రతిపదార్థం: అను సమయంబునన్= అంటున్నవేళలో; ఆ+ఎడకున్= ఆ చోటికి; అనిమిషగురుఁడు= దేవతల గురువైన బృహస్పతి; అరుగుదెంచెన్= విచ్చేశాడు. అతనికిన్= అతడికి; కుంతీతనయ+అగ్రజుండున్= కుంతికొడుకులలో పెద్దవాడైన ధర్మరాజూ; తమ్ములున్= తమ్ము లయిన భీమాదులు; కేశవుండున్= శ్రీకృష్ణుడూ; సత్+భక్తిమెయిన్= మంచిభక్తితో.

తాత్పర్యం: అనే సమయంలో అక్కడకు బృహస్పతి విచ్చేశాడు. అతడికి ధర్మరాజు తమ్ములు, రాజులు, కృష్ణుడూ సద్భక్తితో (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఎదుర్కొని ప్రణామపూర్వకంబుగా సముచితోపచారంబులం బ్రీతాత్ముంజేసి యాసీనుండై యున్నెడం గురుపతి యగ్గురునిం గురుపితామహు నడిగినయట్ల యడిగిన నతం డతని కిట్లనియె. 249

ప్రతిపదార్థం: ఎదుర్కొని= ఎదురేగి; ప్రణామ పూర్వకంబుగాన్= నమస్కారం మొదటి ఉపచారంగా; సముచిత+ఉపచారంబులన్= చక్కగా తగిన సేవలతో; ప్రీత+ఆత్మున్= ప్రీతి పొందిన హృదయం కలవాడినిగా; చేసి; ఆసీనుండు= కూర్చున్నవాడు; ఐ= అయి; ఉన్న+ఎడన్= ఉన్నసమయంలో; కురుపతి= ధర్మరాజు; ఆ+గురునిన్= దేవగురువైన ఆ బృహస్పతిని; కురు పితామహున్= కౌరవులకు తాత అయిన భీష్ముడిని; అడిగిన+అట్లు+అ= అడిగినట్లే; అడిగినన్= అడుగగా; అతండు= ఆ బృహస్పతి; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఎదురేగి నమస్కరించి తగిన అర్ఘ్యపాద్యాదు లర్పించటం అనే సేవలు చేసి తృప్తిపరచి అతడు కూర్చున్న తరువాత ధర్మరాజు ఆ దేవగురువును తన తాత నడిగినట్లే అడుగగా అత డతడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'తనకుఁ దాన కలఁడు జననంబు నప్పుడు । మరణమునను సుగతి నరకములను
దల్లి దండ్రి దక్కు నెల్లబంధులు శరీ । రంబు ననుగమించి క్రమ్మఱుదురు. 250

ప్రతిపదార్థం: జననంబు+అప్పుడు= పుట్టుక సమయంలో; మరణమునను= చావునందూ; సుగతి నరకములను= పుణ్యగతి, నరకం అనేవాటియందూ; తనకున్= తనకు (జీవుడికి)÷; తాను+అ= తానే; కలఁడు= ఉన్నాడు; తల్లి= అమ్మ; తండ్రి= నాయన; తక్కున్; ఎల్లబంధులు= మిగిలిన చుట్టాలందరు; శరీరంబున్= శరీరాన్ని; అనుగమించి= వెంటనంటి వెళ్ళి; క్రమ్మఱుదురు= మరలి వస్తారు.

తాత్పర్యం: 'పుట్టినప్పుడు, గిట్టినప్పుడు పుణ్యపాపాల ఫలాల భూమి లయిన స్వర్గం, నరకం అనే వాటియందు తనకు తానే ఉంటాడు. తల్లి, తండ్రి, మిగిలిన బంధువులు శరీరాన్ని వెంటనంటి తిరిగి వెళ్ళిపోతారు.

విశేషం: శరీరం అనగా ఇక్కడ ప్రాణం లేని కళేబరం. దానిని కాల్చటమో, పూడ్చటమో చేసిన తరువాత వారు వెంటనంటి పోయేది ఏమీ ఉండదు. కనుక బంధువులు వెనుకకు తిరిగి వెళ్ళిపోతారు.

క. ఉత్తమపథంబు ధర్మా । యత్తము, ధర్మంబు మృతుల కధిప! సహాయం
బెత్తెఱఁగున ధర్మక్రియఁ । జిత్తంబునఁ జేర్పవలయు జీవించుతఱిన్. 251

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఉత్తమపథంబు= మేలైన త్రోవ; ధర్మ+ఆయత్తము= ధర్మానికి వశమైనది; మృతులకున్= మరణించిన వారికి; ధర్మంబు= ధర్మము; సహాయంబు= తోడు; ఏ+తెఱఁగునన్= ఏ విధంగానైనా; జీవించు తఱిన్= బ్రతికి ఉన్నప్పుడే; ధర్మక్రియన్= ధర్మమనే క్రియను; చిత్తంబునన్= హృదయంలో; చేర్పవలయున్= చేర్చాలి.

తాత్పర్యం: రాజా! మేలుత్రోవ ధర్మంమీద ఆధారపడి ఉంటుంది. చచ్చినవారికి ధర్మమే తోడుగా వస్తుంది. కనుక బ్రతికి ఉన్నప్పుడే ధర్మకార్యాలను హృదయంలో పదిలపరచుకొనాలి.

విశేషం: జీవించుతతిన్= చనిపోయి సాధించేదేమీ లేదు. ధర్మక్రియను చిత్తంలో చేర్చటమంటే సంకల్పరూపంలో ఉంచుకొనాలి. తదనుగుణంగా ఆచరించాలి - అని భావం.

క. అది లేనివాఁడు నరకా । స్పదుఁ డగు నటుగాన ధర్మపరుఁ డగుటయ యొ
ప్పిదము మనుజునకు నేఁ జె । ప్పెద మఱియును వలయువానిఁ బ్రీతి నడుగుమీ'. 252

ప్రతిపదార్థం: అది= ఆ ధర్మం; లేనివాఁడు= లేని వ్యక్తి; నరక+ఆస్పదుఁడు= నరకమనే తావు కలవాడు; అగున్= అవుతాడు; అటు= ఆ విధం; కాన= కనుక; మనుజునకున్= మనిషికి; ధర్మపరుఁడు= ధర్మమునందు మిక్కిలి శ్రద్ధ కలవాడు; అగుట+అ= కావటం; ఒప్పిదము= తగినది; మఱియున్= ఇంకా; వలయువానిన్= కావలసిన వాటిని; ప్రీతిన్= ప్రీతితో; అడుగుమీ= అడుగుము; నేన్= నేను; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ధర్మం లేనివాడు నరకానికి పోతాడు. కనుక ధర్మపరుడు కావటమే మనిషికి మంచిది. ఇంకా నీకు కావలసిన వాటిని ప్రీతితో నడుగుము. నేను చెప్పుతాను'.

వ. అనిన నజ్జనపతి 'శరీరంబు విడిచి చనియెడు జీవుని ధర్మం బె ట్లనుగమించు?' ననుటయు నయ్యాం గిరసుండు. 253

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+జనపతి= ఆ రాజు; శరీరంబు= దేహం; విడిచి= వదలి; చనియెడు జీవునిన్= వెళ్ళే జీవుడిని; ధర్మంబు= ధర్మం; ఎట్లు= ఏ విధంగా; అనుగమించున్?= వెంటనంటి పోతుంది? అనుటయున్= అనగా;; ఆ+అంగిరసుండు= ఆ బృహస్పతి.

తాత్పర్యం: అని చెప్పిన తరువాత ఆ ధర్మరాజు 'దేహం విడిచి వెళ్ళే జీవుడిని ధర్మం ఎట్లా అంటి వెళ్తుంది? అని అడిగాడు. అప్పుడు ఆ బృహస్పతి ఇట్లా చెప్పాడు.

తే. 'భూత పంచక శక్తులు బుద్ధియును స । ధర్మకంబుగ జీవుతోఁ దగిలి యరుగు'
ననుడు 'రేతఃప్రకార మె?' ట్లనియె నృపతి; । యతని కిట్లని చెప్పె నయ్యమరమంత్రి. 254

ప్రతిపదార్థం: భూతపంచక శక్తులు= భూతాల అయిదింటి శక్తులు; బుద్ధియును= బుద్ధీ; సధర్మకంబుగన్= ధర్మంతోపాటుగా; జీవుతోన్= జీవుడితో; తగిలి= వెంటబడి; అరుగున్= పోతాయి; అనుడున్= అన్నంతనే; నృపతి= రాజు; రేతస్+ప్రకారము= వీర్యం యొక్క పద్ధతి; ఎట్లు= ఏ విధము?; అనియెన్= అన్నాడు; ఆ+అమరమంత్రి= దేవతల మంత్రి అయిన ఆ బృహస్పతి; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'అయిదు భూతాల శక్తులు అయిన శబ్దస్పర్శ రూపరస గంధాలు, బుద్ధి, ధర్మం అనేవి కలిసి జీవుడిని అనుసరించి వెళ్తాయి' అనగా ధర్మరాజు రేతస్సు పద్ధతి ఏమిటి?' అని అడిగాడు. అప్పుడు బృహస్పతి అతడి కిట్లా చెప్పాడు.

తే. దేహగత భూప్రభృతి పంచదేవతలును । మనసు నన్నసంతృప్తిఁ బొందిన నృపాల!
కల్గు రేతస్సు పురుషుండుఁ గామినియును । బొందఁగా నది గర్భత్వ మొందుఁ జువ్వె. 255

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; దేహగత భూ ప్రభృతి, పంచ దేవతలును= దేహంలో ఉన్న భూమి మొదలైన అయిదు దేవతలు; మనసున్= మనస్సూ; అన్న సంతృప్తిన్= అన్నంతో మిక్కిలి సంతృప్తిని; పొందినన్= పొందితే; రేతస్సు= 'వీర్యం' అనే పదార్థం; కల్గున్= ఏర్పడుతుంది; పురుషుండున్= మగవాడూ; కామినియును= స్త్రీయు; పొందఁగాన్= కలియగా; అది= ఆ రేతస్సు; గర్భత్వము= పిండం కావటం; ఒందున్= పొందుతుంది; చువ్వె= సుమా!

తాత్పర్యం: దేహంలో ఉన్న భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే అయిదు భూతాలూ, మనస్సు అనేవి అన్నంతో - నిండైన తృప్తిని పొందితే 'రేతస్సు' అనే పదార్థం కలుగుతున్నది. స్త్రీపురుషుల కలయికవలన అది గర్భంగా ఏర్పడుతుంది.

విశేషం: స్త్రీ అయినంత మాత్రాన గర్భం ఏర్పడదనీ ఆమె కామభావం కలిగి గర్భం ధరించే సామర్థ్యం కలిగినదై ఉండాలి అనే సూచన 'కామిని' అనే శబ్దంలో ఉన్నది. దీనిని బట్టి పురుషుడు కూడా 'కాముకుడు' అయి ఉండాలనే అర్థం సిద్ధిస్తున్నది.

వ. అని చెప్పి మఱియును. 256

ప్రతిపదార్థం: అని చెప్పి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి బృహస్పతి ఇంకా ఇట్లా అంటున్నాడు

తే. 'పుణ్యపాపానుగుణభంగిఁ బుట్టి సౌఖ్య । దుఃఖమయ సంసరణమునఁ దొడరు నరుఁడు
వినుము కేవల ధర్మవర్తనసుఖైక । భాజనత నొందు ధర్మైకపరత మేలు. 257

ప్రతిపదార్థం: నరుఁడు= జనుడు; పుణ్యపాప+అనుగుణభంగిన్= పుణ్యమునకు, పాపమునకు తగిన విధంగా; పుట్టి= జనించి; సౌఖ్య, దుఃఖమయ సంసరణమునన్= సుఖంతో, దుఃఖంతో నిండిన సంసారంలో; తొడరున్= ప్రవేశిస్తాడు; వినుము; కేవల ధర్మవర్తనన్= అధర్మపు వాసనకూడా లేని ధర్మపు నడవడితో; సుఖ+ఏక, భాజనతన్= సుఖానికి మాత్రమే పాత్ర మవటాన్ని; ఒందున్= పొందుతాడు; ధర్మ+ఏక పరత= ధర్మమునందు మాత్రమే శ్రద్ధ కలిగి ఉండటం; మేలు= మంచిది.

తాత్పర్యం: 'నరుడు పుణ్యానికి తగిన విధంగా సుఖమయ సంసారంలో ప్రవేశిస్తాడు. పాపాల కనుగుణంగా దుఃఖమయసంసారంలో ప్రవేశిస్తాడు. అట్లాకాక ధర్మప్రవర్తన మాత్రమే అవలంబిస్తే సుఖానికి మాత్రమే పాత్రమవుతాడు. కనుక ధర్మమునందు మాత్రమే శ్రద్ధ కలిగి ఉండటం మేలైన పని.

విశేషం: సృష్టిలో మానవప్రవృత్తిలో ఒక విచిత్రమైన స్థితి ఉంటుంది. పుణ్యఫలం కోరుకొంటాడు. పుణ్యం చేయటానికి ఇష్టపడడు. పాపఫలం వద్దంటాడు. పాపాలు మాత్రం చేస్తూ ఉంటాడు. అయితే ఇష్టానిష్టాలతో సంబంధం లేకుండా కర్మల కనుగుణంగా సుఖదుఃఖమయ సంసారం పొందక తప్పదు. సుఖదుఃఖాలు రెండూ అనిత్యాలే. నిత్యసుఖంకోసం ధర్మం మాత్రమే ఉన్న ప్రవృత్తిని పొందా లంటున్నారు శ్రీవ్యాసులు.

క. జనవర! కృమిగర్దభముఖ । జననంబులఁ బొంది నరకసంవాసముఁ జెం
దు నధికపాపాత్ముండగు । మనుజుఁడు కర్మ సవిశేషమహిమఁ దెలిపెదన్. 258

ప్రతిపదార్థం: జనవర!= రాజా! అధిక పాప+ఆత్ముండు= ఎక్కువ పాపాలలో నిండినవాడు; అగు మనుజుఁడు= అయిన నరుడు; కృమి, గర్దభ, ముఖ, జననంబులన్= పురుగు, గాడిద మొదలైన పుట్టుకలను; పొంది; నరక సంవాసమున్= నరకంలో

నివసించటాన్ని; చెందును= చెందుతాడు; కర్మ సవిశేష మహిమన్= ఆయాకర్మల విశేషంతో కూడిన ఎక్కువతనాన్ని; తెలిపెదన్= తెలుపుతాను.

తాత్పర్యం: రాజా! ఎక్కువ పాపం హృదయంలో నిండినవాడు పురుగు, గాడిద మొదలైన పుట్టుకలతో నరకంలో నివాసం చేస్తాడు. కర్మల విశేషమహిమను తెలుపుతాను. వినుము.

క. జననీజనక గురులయెడ । నొనరించిన మేలుఁ గీడు నొదవించు సుఖం
బునకును దుఃఖమునకు నిం । తని కొలఁది యిడన్ వశంబె యజునకు నైనన్? 259

ప్రతిపదార్థం: జననీ జనక గురుల యెడన్= తల్లి, తండ్రి, గురువు - వీరి విషయంలో; ఒనరించిన మేలున్= చేసిన మంచిపనీ; కీడున్= అపచారమూ; ఒదవించు సుఖంబునకున్= కలిగించే సుఖానికీ; దుఃఖమునకున్= దుఃఖానికీ; కొలఁది= ప్రమాణము; ఇంత= ఈ మాత్రము; అని; ఇడన్= పెట్టటం; అజునకున్= బ్రహ్మకు; ఐనన్= అయినా; వశంబు+ఎ?= సాధ్యమా?

తాత్పర్యం: తల్లిదండ్రుల విషయంలో గురువు విషయంలో చేసిన మేలు కూర్చే సుఖానికీ, కీడు కూర్చే దుఃఖానికి కొలత ఇంత అని చెప్పటం బ్రహ్మకైనా సాధ్యమా?

క. మాతృపితృగురులు దక్కఁగ । నే తెరువునః బాప మొలసె నేనియు దానిం
బాతురు ప్రాయశ్చిత్త । స్ఫీతులు దద్విషయమైనఁ జెడ దల్పములన్. 260

ప్రతిపదార్థం: మాతృపితృ గురులు= తల్లీ, తండ్రీ, గురువూ; తక్కఁగన్= కాక; ఏ తెరువునన్= ఏ దారిలోనైనా; పాపము= పాపం; ఒలసెన్ ఏనియున్= కలిగినట్లయితే; దానిన్= దానిని; ప్రాయశ్చిత్త స్ఫీతులు= ప్రాయశ్చిత్తం చేత పుష్టి పొందినవారు; పాతురు= తొలగించుకొంటారు; తద్+విషయము= తల్లి, తండ్రి, గురువు అనేవారి సంబంధం కలది; ఐనన్= అయితే; అల్పములన్= తక్కువవాటిచేత; చెడదు= నశింపదు.

తాత్పర్యం: తల్లి, తండ్రి, గురువు అనేవారుకాక తక్కిన ఏ విషయంలోనైనా పాపం కలిగితే తగిన విధమైన ప్రాయశ్చిత్తం చేసికొని పోగొట్టుకొంటారు. వారి విషయంలో మాత్రం పాపం సులభంగా పోదు.

విశేషం: ప్రాయశ్చిత్తం - తెలియక చేసిన తప్పును పరిహరించుకొనే వ్రతమూ, దానమూ మొదలైనవి.

క. కొలు చపహరించు నన్నరుఁ । డెలుకయుఁ బందియును నైన యీ దుర్జననం
బులఁ బొందు నంతఁ బాపము । వొలియక యాతనికిఁ గుక్కపుట్టువుఁ గల్గున్. 261

ప్రతిపదార్థం: కొలుచు= ధాన్యము; అపహరించు+ఆ+నరుఁడు= దొంగిలించే ఆ మనిషి; ఎలుకయున్= ఎలుకా; పందియునున్= పందీ; ఐన ఈ దుర్జననంబులన్= అయిన ఈ పాడు పుట్టుకలను; పొందున్= పొందుతాడు; అంతన్= దానితో; పాపము= పాపం; పొలియక= నశించక; అతనికిన్= వాడికి; కుక్కపుట్టువున్= కుక్కపుట్టుకకూడా; కల్గున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధాన్యం దొంగిలించిన మనిషి ఎలుక, పంది మొదలైన పుట్టుకలు పొందుతాడు. దానితో పాపం పోక, అతడికి కుక్క పుట్టుక కలుగుతుంది.

క. పరదారగమన దోషము । వరుసన వృకకంక గృధ్ర వలిముఖ శవభు
క్తిరతంబులైన భవములఁ । బొరయించుం గృమియుఁగాఁగఁ బుట్టించుఁ దుదిన్. 262

ప్రతిపదార్థం: పరదార గమన దోషము= ఇతరుల ధర్మపత్నులను పొందటం అనే పాపం; వరుసన్+అ= క్రమంగా; వృక= తోడేలు; కంక= రాబందులు; గ్రద్ధ= గ్రద్దలు; వలిముఖ= కోతుల; శవభుక్తి= శవాలను తినటంలో; రతములు= ప్రీతి కలవి; ఐన భవములన్= అయిన పుట్టుకలను; పొరయించున్= కలిగిస్తుంది; తుదిన్= కడకు; కృమియున్= బురదలో తిరుగు పురుగు; కాఁగన్= అయ్యేటట్లుగా; పుట్టించున్= పుట్టిస్తుంది.

తాత్పర్యం: పరులభార్యలను పొందటం అనే పాపం తోడేలు, రాబందు, గ్రద్ద, కోతి, శవాల తిండి యందు ప్రీతిగల జంతువు పుట్టుకలను కలిగిస్తుంది. చివరకు పురుగు పుట్టుక కూడా పొందిస్తుంది.

సీ. తనయ నొక్కని కిచ్చి మనసు మరలఁబడి । యన్యున కిచ్చిన యట్టివాఁడు
కృమియగు; దేవకార్యము సేసి మఱి పైతృ । కంబు సేయక భోజనంబు సేయు
నతఁడు కాకం బగు; నన్నఁ దిట్టినఁ గ్రౌంచ । మై పుట్టు; బ్రహ్మకులాభిజాతఁ
గవసి శూద్రుఁడు నరకపుగుంట పుర్వగు । నంతకు కింకరు లంటఁ బట్టి

తే. కట్టికొనిపోయి కోసియుఁ గాల్చియును గృ తఘ్ను నుగ్రకంటక సముదయము మీఁదఁ
క్రంద నదిమియు మఱియు దుఃఖములఁ బెట్టు । తెఱఁగు లెన్ని యన్నింటను బఱతు రధిప! 263

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; తనయన్= కూతురిని; ఒక్కనికిన్= ఒకవ్యక్తికి; ఇచ్చి= దానం చేసి (కన్యాదానం చేసి); మనసు= మనస్సు; మరలఁబడి= తిరుగబడి; అన్యునకున్= మరియొకనికి; ఇచ్చిన+అట్టివాఁడు= ఇచ్చిన వ్యక్తి; కృమి= పురుగు; అగున్= అవుతాడు; దేవకార్యము= దేవతల ఆరాధనము; చేసి= ఆచరించి; మఱి= అటుపైన; పైతృకంబు= పితృకార్యం; చేయక= కావించక; భోజనంబు+చేయు+అతఁడు= భోజనం చేసేవాడు; కాకంబు= కాకి; అగున్= అవుతాడు; అన్నన్= అన్నను; తిట్టినన్= నిందిస్తే; క్రౌంచము= క్రౌంచమనే పక్షి; ఐ= అయి; పుట్టున్= జన్మిస్తాడు; బ్రహ్మ కుల+అభిజాతన్= బ్రాహ్మణకులంలో చక్కగా పుట్టిన స్త్రీని; కవసి= కూడి; శూద్రుఁడు= నాల్గవ కులంవాడు; నరకము+గుంటపుర్వు= నరకం అనే గుంటలోని క్రిమి; అగున్= అవుతాడు; కృతఘ్నున్= చేసిన మేలును మరచేవాడిని; అంతకు కింకరులు= యముడి భటులు; అంటన్ పట్టి= గట్టిగా పట్టుకొని; కట్టికొనిపోయి= కట్టివైచి తీసికొనిపోయి; కోసియున్= ముక్కలుగా చేసి; కాల్చియును= మంటలలో మాడ్చివైచి; ఉగ్ర కంటక సముదయముమీఁదన్= భయంకరమైన ముండ్ల మొత్తాల మీద; క్రందన్= కందిపోయే విధంగా; అదిమియున్= నొక్కిపెట్టి; మఱియున్= ఇంకా; దుఃఖములన్= కష్టాలను; పెట్టు; తెఱఁగులు= పెట్టే పద్ధతులు; ఎన్ని= ఎన్నికలవో; అన్నింటను= అన్నింటిచేతను; పఱతురు= బాధిస్తారు.

తాత్పర్యం: రాజా! ముందు ఒకడికి బిడ్డను కన్యాదానం చేసి, మనస్సు త్రిప్పుకొని మరొకడికి ఇచ్చేవాడు పురుగు అవుతాడు. దేవతారాధన చేసి పితృకార్యం చేయకుండా భోజనం చేసేవాడు కాకిగా పుట్టుతాడు. అన్నను నిందిస్తే క్రౌంచపక్షి అవుతాడు. బ్రాహ్మణస్త్రీని పొందిన శూద్రుడు నరకమనే గుంటలో పురు గవుతాడు. కృతఘ్నుడిని యమకింకరులు గట్టిగా పట్టి కట్టి కోసి కాల్చి, ఘోరమైన ముండ్లకంపలమీద వేసి నొక్కి ఇంకా బాధలు పెట్టే తీరు లెన్నో అన్నింటిచేతా పీడిస్తారు.

క. ధనవాంఛ నిరాయుధుఁ జం । పిన గాడిద మొదలు గాఁగఁ బెక్కులు తిర్య
గ్జననంబులఁ బొందును శ । స్త్ర నిహతిఁ దోడ్తోడ మరణదశ పాటిల్లున్. 264

ప్రతిపదార్థం: ధనవాంఛన్= ధనంమీద కోరికతో; నిరాయుధున్= ఆయుధం లేనివాడిని; చంపినన్= చంపితే; గాడిద మొదలు కాఁగన్= గాడిద మొదలైన; పెక్కులు= ఎక్కువ సంఖ్యగల; తిర్యక్+జననంబులన్= పశువులు, పక్షులు మొదలైన పుట్టుకలను; పొందును= పొందుతాడు; శస్త్రనిహతిన్= ఆయుధాల దెబ్బచేత; తోడు+తోడన్= మీదమీద; మరణదశ= చావు; పాటిల్లున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధనం మీద ఆశతో ఆయుధం లేనివాడిని చంపితే గాడిద మొదలయిన నీచజంతువుల, పక్షుల పుట్టుకలు ఎన్నో వస్తాయి. మాటిమాటికి ఆయుధపు దెబ్బతో చావు కలుగుతూ ఉంటుంది.

ఆ. ఆఁడుదానిఁ జంపినతఁ డేక వింశతి । దూష్య నరకవాసదుఃఖ మొందు
నన్నదధిపయోఘృతాపూపహరణముల్ । మక్షికాదికీటమయత సేర్చు. 265

ప్రతిపదార్థం: ఆఁడుదానిన్= అబలను; చంపిన+అతఁడు= చంపినవాడు; ఏకవింశతి దూష్య నరక వాస దుఃఖము= ఇరవైయొక్క సంఖ్య గల నీచమైన నరకాలలో ఉండటం అనే దుఃఖాన్ని; ఒందున్= పొందుతాడు; అన్న= అన్నము; దధి= పెరుగు; పయస్= పాలు; ఘృత= నేయి; అపూప= భక్ష్యాలు అనేవాటి; హరణముల్= దొంగిలింతలు; మక్షికా+ఆది కీటమయతన్= ఈఁగ మొదలైన నీచపు పురుగులయ్యే దశలోనికి; చేర్చున్= చేరుస్తాయి.

తాత్పర్యం: స్త్రీని చంపితే ఇరవై ఒక్క విధాల నరకాలలో ఉండే దుఃఖం కలుగుతుంది. అన్నము, పెరుగు, పాలు, నెయ్యి, తినుబండారాలు అనే వాటి దొంగతనాలు ఈఁగ మొదలైన పురుగుల పుట్టుకలలో చేరుస్తాయి.

విశేషం: ఏకవింశతి నరకాలు - తామిస్రము, లోహశంకువు, మహానిరయము, శాల్మలి, రౌరవము, కుంభలము, పూతిమృత్తికము, కాలసూత్రము, సంఘాతము, లోహితోదము, సవిషము, సంప్రపాతనము, మహానరకము, కాకోలము, సంజీవనము, మహాపథము, అవీచి, అంధతామిస్రము, కుంభీపాకము, అసిపత్రవనము, తాపనము.

ఆ. ఫలము నినుము వెండిఁ బసిఁడి మ్రుచ్చిలికొన్నఁ । గ్రోఁతి వాయసంబు గ్రువ్వ నీచ
కృమియు నగు సదంబరము హరించిన శశ । జనన మొందు నరుఁడు మనుజనాథ! 266

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; నరుఁడు= మానవుడు; ఫలమున్= పండును; ఇనుమున్= ఇనుమును; వెండిన్= వెండిని; పసిఁడిన్= బంగారాన్ని; మ్రుచ్చిలికొన్నన్= దొంగిలిస్తే; క్రోఁతి= కోతి; వాయసంబు= కాకి; గ్రువ్వ= పావురము; నీచ కృమియున్= తక్కువజాతి పురుగూ; అగున్= అవుతాడు; సత్+అంబరమున్= మంచి వస్త్రమును; హరించినన్= ఎత్తుకొనిపోతే; శశజననము= కుందేటి పుట్టువును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! నరుడు పండు, ఇనుము, వెండి, బంగారం అనే వాటిని దొంగిలిస్తే వరుసగా కోతి, కాకి, గువ్వ, పురుగు అనే జన్మలు పొందుతాడు. ఇతరుల బట్టలను అపహరిస్తే కుందేలుగా పుట్టుతాడు.

విశేషం: 'సదంబరము' - చినిగిన పాతలు బయట పారవేస్తే అవసరానికి వాటిని వాడుకొనటం తప్పుకాదని భావం.

తే. నమ్మి యిల్లడవెట్టిన సొమ్ముఁ గొనిన । మీను లోనగు నీచపు యోనులందుఁ
బుట్టు; గంధవస్తువులు గొన్నట్టివాఁడు । వినుము మఱు పుట్టువునఁ జుంచుతనము నొందు. 267

ప్రతిపదార్థం: నమ్మి= విశ్వాసం ఉంచి; ఇల్లడ+పెట్టిన సొమ్మున్= తనవద్ద దాచి ఉంచిన సొమ్మును; కొనినన్= తనది చేసికొంటే; మీను= చేప; లోనగు+నీచము+యోనులందున్= మొదలైన నీచపు కడుపులలో; పుట్టున్= పుట్టుతాడు; వినుము; గంధవస్తువులు= సుగంధ ద్రవ్యాలను; కొన్న+అట్టివాఁడు= దొంగిలించేవాడు; మఱుపుట్టువునన్= మరుసటి జన్మలో; చుంచుతనము= చుంచు కావటాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: తనయందు నమ్మకం ఉంచి ఇతరులు దాచుకొన్న సొమ్మును అపహరిస్తే చేప మొదలైన నీచజన్మలు కలుగుతాయి. పరిమళద్రవ్యాలను దొంగిలిస్తే కంపెలుక అవుతాడు.

తే. వనిత లీపాపములు సేసి వానివాని । పత్నులై జనియింతురు; పాపభీతిఁ
దెరువు తప్పక నడచిన నరులు సౌఖ్య । మందుదురు రెండు లోకంబు లందు నధిప!' 268

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వనితలు= స్త్రీలు; ఈ పాపములు= పైన చెప్పిన పాపాలను; చేసి= చేసిన కారణంగా; వానివాని పత్నులు= పైన చెప్పిన నీచజన్మలు కలవారి భార్యలు; ఐ= అయి; జనియింతురు= పుట్టుతారు; పాపభీతిన్= పాపంవలన భయంతో; తెరువు= మంచిమార్గం; తప్పక= తప్పకుండా; నడచిన నరులు= ప్రవర్తించిన మనుష్యులు; రెండు లోకంబులందున్= ఈ లోకము, పరలోకము అనే రెండు లోకాలలో; సౌఖ్యము= సుఖాన్ని; అందుదురు= పొందుతారు.

తాత్పర్యం: స్త్రీలు పైన పేర్కొన్న పాపాలను చేస్తే పురుషులు చేసిన పాపాల ఫలితాలుగా చెప్పిన నీచజన్మల వారి భార్యలై పుట్టుతారు. పాపం కలుగుతుందన్న భయంతో ధర్మమార్గం తప్పకుండా నడచుకొన్నవారు ఇహపరలోకాలలో సుఖాన్ని అనుభవిస్తారు.'

విశేషం: ఇక్కడ తెరువు అనగా ధర్మశాస్త్రం నిర్ణయించిన పద్ధతి.

వ. అని చెప్పి యిట్లనియె; 'నేనుం గొన్ని తెఱఁగు లెఱింగించితి మఱియు ననేక పదార్థాపహరణంబులకు బహువిధంబులగు ఫలంబులు వాటిల్లు వాని నెల్లను శాస్త్రాంతరశ్రవణంబున నెఱింగెదు గాక' యనిన విని యక్కురుపతి బృహస్పతితోఁ 'బాపంబులం బాపికొనుతెఱం గెఱింగింపవే' యనుటయు నతం డతని కిట్లనియె. 269

ప్రతిపదార్థం: అని; చెప్పి= తెలిపి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; నేనున్= నేను; కొన్ని తెఱఁగులు= కొన్ని పద్ధతులను; ఎఱింగించితిన్= తెలిపాను; మఱియున్= ఇంకా; అనేక పదార్థ+అపహరణంబులకున్= పెక్కు వస్తువుల దొంగతనాలకు; బహువిధంబులు= పెక్కుతీరులు; అగు= అయిన; ఫలంబులు= శిక్షలుగా అయ్యే ఫలాలు; పాటిల్లున్= కలుగుతాయి; వానిన్= వానిని; ఎల్లను= అన్నింటినీ; శాస్త్ర+అంతర శ్రవణంబునన్= వేరుశాస్త్రాల వినికిడిచేత; ఎఱింగెదు కాక= తెలిసికొంటావు; అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+కురుపతి= ఆ కురురాజు యుధిష్ఠిరుడు; బృహస్పతితోన్= దేవమంత్రి అయిన బృహస్పతితో; పాపంబులన్= ఈ దోషాలను; పాపికొనుతెఱంగు= పోగొట్టుకొనే దారి; ఎఱింగింపవే= దయచేసి తెలుపుమా!; అనుటయున్= అన్నంతనే; అతండు= ఆ బృహస్పతి; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: బృహస్పతి ఇట్లా చెప్పి ఇంకా ఈ విధంగా అన్నాడు. 'నేను కొన్ని తీరులను తెలిపాను. ఇంకా అనేక వస్తువుల దొంగతనాలకు కలిగే ఫలాలు పెక్కుతీరులలో ఉన్నాయి. వాటి నన్నింటినీ ఇతర శాస్త్రాలను వినటం ద్వారా నీవు తెలిసికొందువుగాక!' అనగా విని ధర్మరాజు బృహస్పతితో 'ఈ పాపాలను పోగొట్టుకొనే విధం తెలుపవూ!' అని అడిగితే అత డతడితో ఇట్లా అన్నాడు.

క. విను దానంబులఁ బాపము । లనఘా! చెడు దానములకు నన్నిటికిని స
జ్జన సేవ్య! యన్నదానము । మును లధికం బంద్రు పాపములఁ బాపునెడన్. 270

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; విను= ఆలకించుము; పాపములు= చెడుపనుల దోషాలు; దానంబులన్= దానాలతో; చెడున్= నశిస్తాయి; సత్+జన సేవ్య= ఉత్తమ జనులచేత సేవించబడేవాడా!; మునులు= జ్ఞానసంపన్నులు; పాపములన్= పాపాలను; పాపు+ఎడన్= పోగొట్టే విషయంలో; అన్నదానము= అన్నం పెట్టటం; దానములకున్= దానాలకు; అన్నిటికిన్= అన్నింటికీ; అధికంబు= మిన్న అయినది; అంద్రు= అంటారు.

తాత్పర్యం: పుణ్యాత్ముడా!; పాపాలు దానాలతో నశిస్తాయి. పాపాలను పోగొట్టే విషయంలో అన్ని దానాలకంటె అన్నదానం గొప్పదని మును లంటారు.

విశేషం: ధర్మరాజు హృదయంలో 'నేను యుద్ధంలో ఎందరిచావుకో కారణమయ్యాను. ఆ పాపాల చెడు ఫలితాలు నాకు కలుగుతాయా' అన్న శంక ప్రశ్నలో అభివ్యక్తం అవుతున్నది. దానిని తొలగించటం కొరకు 'అనఘా! సజ్జనసేవ్య!' అనే రెండు సంబోధనలను చిన్న పద్యంలో తిక్కన నిక్షేపించాడు.

అన్నదానం గొప్పది. దీనికి రెండు కారణాలను మనం భావించవచ్చును. 1. ఏ ఇతర దానంలోనూ 'చాలు' అనే మాట ఉండదు. అన్నదానం ఒక్కటే 'చాలు' అనిపించే దానం. 2. అన్నం శరీరాన్ని పోషిస్తుంది. శరీరం మొదటి ధర్మసాధనం. ('శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్' అంటాడు కాళిదాసు). దానాలు పాపాలను ఎట్లా పోగొట్టగలవు? - అని కొందరు శంకిస్తారు. పాపం స్వార్థపు ముద్దుబిడ్డగదా! దానం స్వార్థాన్ని రూపుమాపుతుంది కదా! ఆ విధంగా దానం పాపనాశకం అవుతుంది.

క. న్యాయార్జిత మగు నన్నము । వేయింటికిఁ బెట్టవలయు విప్రజనము హ
ర్షాయత్తంబుగ దానం । బాయని పాపములు గలవె? పౌరవముఖ్యా! 271

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశం వారిలో ఉత్తముడా!; న్యాయ+ఆర్జితము= ధర్మమార్గంతో సంపాదించినది; అగు+అన్నమున్= అయిన అన్నాన్ని; వేయింటికిన్= వేయి సంఖ్యగల వారికి; విప్రజనము= వేదవిద్యలు నిండుగా గల జనం; హర్ష+ఆయత్తంబుగన్= ఆనందానికి వశమయ్యే విధంగా; పెట్టవలయున్= పెట్టాలి; దానన్= దానిచేత; పాయనిపాపములు= నశించని పాపాలు; కలవె?= ఉన్నాయా?

తాత్పర్యం: ధర్మరాజా! ధర్మమార్గంలో సంపాదించిన అన్నాన్ని వేయిమంది విద్వజ్జనులు పరమానందం పొందే విధంగా పెట్టాలి. దానితో పోని పాపాలు ఉంటాయా?

విశేషం: తాను కష్టపడి ధర్మమార్గంలో సంపాదించిన అన్నమే సత్పాత్రమందు చేరినదై సత్ఫలితాన్నిస్తుందనే హెచ్చరిక న్యాయార్జితము, విప్రజనము మొదలైన పదాలలో గుట్టుగా ఉన్నది.

తే. తిరిసి యేనియు నన్నంబు దెచ్చి శిథిలు । లైన విప్రుల యాఁకలి నపహరించు
పురుషుఁ డూర్ధ్వలోకంబుల పురుషవరుల । కర్చనీయుఁడై వెలుఁగుచు నంద యుండు. 272

ప్రతిపదార్థం: తిరిసి, ఏనియున్= బిచ్చమెత్తి అయినా; అన్నంబు= అన్నాన్ని; తెచ్చి= సాధించి; శిథిలులు= బక్కచిక్కినవారు; ఐన విప్రుల ఆఁకలిన్= అయిన విద్వాంసుల ఆకలిని; అపహరించు పురుషుఁడు= తీర్చే మనుష్యుడు; ఊర్ధ్వలోకంబుల పురుష వరులకున్= పైనున్న పుణ్యలోకాలయందలి జనులకు; అర్చనీయుఁడు= పూజించదగినవాడు; ఐ= అయి; వెలుఁగుచున్= ప్రకాశిస్తూ; అందున్+అ= అక్కడనే; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: బిచ్చ మెత్తి అయినా అన్నం సంపాదించి, బ్రదుకుచెడిన విద్యావంతులైన వారి ఆకలి తీర్చేవాడు పైన ఉత్తమలోకాలలో ఉన్న పురుషశ్రేష్ఠులకు మన్నించదగినవాడై అక్కడనే శాశ్వతంగా ఉంటాడు.

విశేషం: శిథిలులు - శరీరసౌష్ఠవమూ, సంపద సౌష్ఠవమూ రెండూ చెడినవారు, విప్రులు - విద్యయా యాతి విప్రత్వం. జ్ఞానదాయకమైన విద్యనేర్చి, ఇతరులకు అందించే పుణ్యాత్ములు విప్రులు. అంద - అందే అవధారణార్థకంచేత శాశ్వతంగా అనే అర్థం సిద్ధిస్తుంది.

క. వేదాధ్యయనార్థ ప్రతి । పాదనమున విప్రవరుఁడు బ్రహ్మ విషయ స
ద్భూదానంబుల నరపతి । యే దురితము లైనఁ గౌరవేశ్వర! పాచున్. 273

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వర!= కురువంశ ప్రభూ!; విప్రవరుఁడు= విప్రులలో శ్రేష్ఠుడైనవాడు; వేద+అధ్యయన అర్థ ప్రతిపాదనమునన్= వేదం పఠించటం, అర్థాన్ని ఇతరులకు తెలపటం అనే క్రియతోను; నరపతి= రాజు; బ్రహ్మ విషయ సత్+భూదానంబులన్= బ్రాహ్మణుడి విషయంలో చక్కని భూమిని దానంచేసే పనులచేత; ఏ దురితములు= ఎట్టి పాపాలను; ఐనన్= అయినా; పాచున్= పోగొట్టుకొంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణుడు వేదం అధ్యయనం చేయటం, అర్థజ్ఞానాన్ని లోకానికి సమర్పించటం అనే పనిచేతా, రాజు అటువంటి విద్యావంతులకు మంచి భూమిని ఇవ్వటంఅనేపనిచేతా ఎటువంటి పాపాలనైనా పోగొట్టు కొంటారు.

విశేషం: భారతీయ ఋషిధర్మంలో బ్రహ్మక్షత్రియ వర్ణాల బాధ్యత ఎంతో బరువైనది. వారు సుస్థితిలో ఉంటే తక్కిన జనాలందరినీ పరిరక్షించగల వారవుతారు. “లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు” అనే ఆశంసలోని తాత్పర్యం ఇదే.

తే. నేర్చి యలజడిఁ బడిన వాణిజ్య విధులఁ బడసి వైశ్యుఁ డన్నంబిడి పడయు సుగతి
చచ్చునంతలు వడి సిరి దెచ్చికొని చ । తుర్థులన్నంబు వెట్టి కాంతురు దివంబు. 274

ప్రతిపదార్థం: వైశ్యుండు= కోమటి; నేర్చి= చక్కని నేర్పు కలిగి; అలజడిన్= ఆపదలో; పడిన వాణిజ్యవిధులన్= పడినట్టి వరక్తపు పనులయందు; పడసి= సంపాదించి; అన్నంబు= భోజనంబు; ఇడి= పెట్టి; సుగతిన్= మంచి గతిని; పడయున్= పొందుతాడు; చచ్చు+అంతలు= ప్రాణం పోయే అంతలుగా; పడి= పాట్లుపడి; సిరిన్= సంపదను; తెచ్చికొని= సంపాదించి; చతుర్థులు= నాలుగవ జాతివారు; అన్నంబు+పెట్టి= అన్నం పెట్టి; దివంబున్= స్వర్గాన్ని; కాంతురు= పొందుతారు.

తాత్పర్యం: వైశ్యుడు చక్కని నేర్పుతో ఆపదలందు చిక్కుకొన్న వర్తకపు పనులతో సంపాదించి అన్నంపెట్టి సుగతికి చేరుతాడు. ప్రాణాంతకమైన పాట్లుపడి ధనం సంపాదించి శూద్రులు అన్నదానం చేసి స్వర్గం చేరుకొంటారు.

విశేషం: అలజడిఁబడిన వాణిజ్యవిధులు - వర్తకం చాలా గందరగోళమైన వృత్తి. ఏ క్షణంలో నష్టం వచ్చి ఉన్నదంతా ఊడ్చుకొని పోతుందో ఎవరూ చెప్పలేరు. ఆ విధంగా మనస్తాపం కలిగించే వృత్తిలో సంపాదించి కూడా అన్నదానం చేయాలని భావన. అట్లాగే శూద్రుడు శుశ్రూషాపరుడై ఒక్కొక్క సమయంలో ప్రాణాలకు కూడా తెగించి పనులు చేయవలసి వస్తుంది. అయినా అన్నదానం చేయాలి - అని బోధ.

తే. దివము వంధ్యంబు గాకుండఁ దివిరి యన్న । పానదానంబు లొదవిన భంగిఁ జేసి
మఱి భుజించుటఁ బోలెడు మహితధర్మ । కార్య మొండొకఁ డెందును గలదె యరయ.' 275

ప్రతిపదార్థం: దివము= స్వర్గం; వంధ్యంబు= వట్టిపోయినది; కాక+ఉండన్= కాకుండా; తివిరి= ప్రయత్నించి; అన్నపాన దానంబులు= అన్నం, నీరు అనే దానాలు; ఒదవిన భంగిన్= సాధ్యమైన తీరులో; చేసి; మఱి= ఆ పిమ్మట; భుజించుటన్= తినటాన్ని; పోలెడు మహిత ధర్మ కార్యము= పోలే గొప్ప ధర్మమైన పని; ఒండు+ఒకఁడు= మరొకటి; ఎందును= ఎక్కడైనా; అరయన్= పరికింపగా; కలదు+ఎ?= ఉన్నదా?

తాత్పర్యం: స్వర్గం వట్టిపోకుండా గట్టి ప్రయత్నంచేసి, తన కున్నంతలో అన్నపానాలు దానంచేసి తినటం అనే దానితో సాటికి వచ్చే సమున్నత ధర్మకార్యం మరొకటి ఎంత వెదకినా ఉంటుందా?

విశేషం: స్వర్గం వట్టిపోవటమంటే అక్కడకు వెళ్ళే పుణ్యాత్ములు లేకపోవటం. అన్నదానం మెండుగా చేసినవారు స్వర్గాన్ని వట్టిపోకుండా చేస్తారని భావం.

తే. అన్నదానంబు ధర్మంబు లన్నిటికిని । ముఖ్య మింత యెఱుఁగు కురుముఖ్య!' యనుడు
ననిమిషాధిప మంత్రికి నమ్మహీశుఁ । డిట్లనియె భక్తి వినయంబు లెసక మెసఁగ. 276

ప్రతిపదార్థం: కురుముఖ్య!= కౌరవశ్రేష్ఠా!; అన్నదానంబు= అన్నం పెట్టటం; ధర్మంబులు= ధర్మాలు; అన్నిటికిని= అన్నింటికీ; ముఖ్యము= ప్రధానము; ఇంత= ఈ మాత్రం; ఎఱుఁగు= తెలిసికొనుము; అనుడున్= అనినంతనే; అనిమిష+అధిప మంత్రికిన్= దేవతల రాజు అయిన దేవేంద్రుడి మంత్రి బృహస్పతికి; ఆ+మహీ+ఈశుఁడు= ఆ రాజు; భక్తి వినయంబులు= భక్తి, వినయము అనేవి; ఎసక మెసఁగన్= ఎక్కువ కాగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కురువరా! అన్నదానం ధర్మాలన్నింటికీ ముఖ్యమైనది. ఈ మాత్రం తెలిసికొనుము' అనగా ధర్మరాజు భక్తివినయాలు పెంపొందుతూ ఉండగా బృహస్పతితో ఇట్లా అన్నాడు.

క. 'ధ్యానం బింద్రియవృత్తుల । మానించు టహింస గురుసమర్చన విధి ని
త్యానుష్ఠానము దప మను । వీనఁ బరమసేవ్య మెద్ది వినఁగా వలతున్. 277

ప్రతిపదార్థం: ధ్యానంబు= మనస్సును ఏకాగ్రం చెయ్యటం; ఇంద్రియవృత్తులన్= ఇంద్రియాల తిరుగుళ్ళను; మానించుట= నిలవరించటం; అహింస= ఇతర జీవులను పీడించకుండటం; గురు సమర్చన విధి= గురువులను పూజించటమనే పని;

నిత్య+అనుష్ఠానము= ప్రతిదినము దేవతార్చనాదులను శ్రద్ధతో చేయటం; తపము= తపస్సు; అను వీనన్= అనే వీనియందు; పరమ సేవ్యము= మిక్కిలి గొప్పగా సేవింపదగినది; ఎద్ది= ఏది?; వినఁగాన్+వలతున్= వినగోరుతున్నాను.

తాత్పర్యం: 'ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, అహింస, గురువులను ఆరాధించటం, నిత్యకర్మములను శ్రద్ధతో ఆచరించటం, తపస్సు - అనే వీటిలో మిక్కిలి గొప్పగా సేవింపదగిన దేదో వినగోరుతున్నాను.

వ. వినిపింపు' మనిన నమ్మహాత్ముండు. 278

ప్రతిపదార్థం: వినిపింపుము= చెప్పుము; అనినన్= అంటే; ఆ+మహాత్ముండు= దొడ్డబుద్ధి గల ఆ బృహస్పతి.

తాత్పర్యం: నాకు తెలియజెప్పుము' అనగా దొడ్డబుద్ధి గల ఆ బృహస్పతి (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఈ యాఱును మంచి తెరువు । లై యుండు నహింస యున్నయైదిటికిఁ బవి
త్రాయతన మట్లు గాకయు । నేయుత్తమధర్మములను నిది వెలిఁగించున్.' 279

ప్రతిపదార్థం: ఈ+ఆఱును= ఈ ఆరూ కూడా; మంచి తెరువులు= మంచిదారులు; ఐ= అయి; ఉండున్= ఉంటాయి; అహింస= అన్యులను పీడించకుండా ఉండటం; ఉన్న ఐదిటికిన్= మిగిలిన అయిదింటికీ; పవిత్ర+ఆయతనము= పవిత్రమైన స్థానము; అట్లు కాకయున్= అంతేకాకుండా; ఏ+ఉత్తమధర్మములను= ఏ గొప్ప ధర్మాలనైనా, ఇది= ఈ అహింస; వెలిఁగించున్= ప్రకాశింపజేస్తుంది.

తాత్పర్యం: ఈ ఆరూ మంచి దారులే. అహింస తక్కిన అయిదింటికీ పవిత్రమైన స్థానం. అంతే కాదు. అహింస ఏ ఉత్తమధర్మాలనైనా ప్రకాశింపజేస్తుంది.

విశేషం: 'అహింసా పరమో ధర్మః' అని సూక్తి. మరొకదానిని హింసించటమంటే పరమాత్మను హింసించటమే. ఎందుకంటే పరమాత్మ అన్నింటియందు ఏకరూపంలో ఉన్నాడు కదా!

వ. అని పలికి యామంత్రణంబు సేసి వాసవమంత్రి యమరనగరంబునకుం జనియెఁ; దదనంతరంబ. 280

ప్రతిపదార్థం: అని; పలికి= మాట్లాడి; ఆమంత్రణంబు+చేసి= వెళ్ళి వస్తానని చెప్పి; వాసవమంత్రి= దేవేంద్రుడి మంత్రి= బృహస్పతి; అమరనగరంబునకున్= దేవతల నగరం అయిన అమరావతికి; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: బృహస్పతి ఇట్లా చెప్పి వీడ్కోలు మాటలు పలికి దేవతల నగరానికి వెళ్ళాడు. ఆ తరువాత.

ఆ. ధర్మనందనుఁడు పితామహుతో 'సర్వ । దేవతలును భూమి దేవతలును
మునివరులు నహింస గొని యాడుదురు దాని । తెఱఁగు సెప్పు నాకుఁ దేటపడఁగ.' 281

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= ధర్మునిపుత్రుడు - యుధిష్ఠిరుడు; పితామహుతోన్= తాతతో; సర్వదేవతలును= అందరు దేవతలునూ; భూమిదేవతలును= భూమియందు ఉన్న దేవతలైన బ్రహ్మజ్ఞానసంపన్నులూ; మునివరులున్= మునులలో శ్రేష్ఠులైనవారూ; అహింసన్= అహింసను; కొనియాడుదురు= గొప్పగా చెప్తుతారు; దాని తెఱఁగు= దాని పద్ధతి; నాకున్= నాకు; తేటపడఁగన్= తెల్లం అయ్యే విధంగా; చెప్పు= బోధించుము.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు తాతతో ఇట్లా అన్నాడు. 'దేవతలు అందరూ, అట్లాగే భూమిలోని దేవతలైన బ్రాహ్మణులు, మునిశ్రేష్ఠులూ అహింసను ప్రశంస చేస్తూ ఉంటారు. దాని సంగతి నాకు స్పష్టమయ్యే విధంగా బోధించుము.'

వ. అనుటయు నమ్మహనీయుం డమ్మనుజపతిం బరమాదరంబున నాలోకించి. 282

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆ+మహనీయుండు= దొడ్డవ్యక్తి అయిన ఆ భీష్ముడు; ఆ+మనుజపతిన్= ఆ రాజును; పరమ+ఆదరంబునన్= మిక్కిలి ప్రీతితో; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అన్నంతనే ఆ మహానుభావుడు భీష్ముడు ఆ రాజును మిక్కిలి ప్రీతితో చూచి (తరువాతి పద్యంతో అన్వయం.

భీష్ముఁడు ధర్మజునకు నహింసాస్వరూప నిరూపణంబు సేయుట (సం.13-176-6 (కుంభ))

ఆ. 'దంతియడుగు లోనఁ దక్కిన జంతుచ । యంబు నడుగు లెల్ల నడఁగి యుండు
నట్ల ధర్మకోటు లన్నియు లోనగు । నిద్ధగుణ! యహింస కింత నిజము. 283

ప్రతిపదార్థం: ఇద్ధగుణ!= మిక్కిలి ప్రకాశించు గుణములు గలవాడా!; దంతి అడుగులోనన్= ఏనుగు పాదంలో; తక్కిన జంతుచయంబు+ అడుగులు= మిగిలిన జంతువుల సముదాయం అడుగులు; ఎల్లన్= అన్నీ; అడఁగి= లోబడి; ఉండు+అట్లు+అ= ఉండే విధంగానే; ధర్మకోటులు= ధర్మాల సముదాయాలు; అన్నియున్= అన్నీ; అహింసకున్= అహింస అనే ధర్మానికి, లోన్ అగున్= లోబడి ఉంటాయి; ఇంత= ఇది అంతా, నిజము= సత్యము.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఏనుగు అడుగులో అన్ని జంతువుల అడుగులు ఇమిడి ఉండే తీరున అహింస అనే ధర్మంలో సర్వధర్మాలు లోబడి ఉంటాయి. ఇది సత్యం.

విశేషం: ఇక్కడ అడుగు అంటే పాదపు గుర్తు. ఈ ఉపమానంవలన అహింసను పాటిస్తే అన్ని ధర్మాలను పాటించినట్లే అనే అర్థం వ్యక్తమవుతుంది.

వ. అదియును. 284

తాత్పర్యం: ఆ అహింస అనేది కూడా (తరువాతి పద్యంతో అన్వయం)

క. అరయఁగ నాలుగు విధములఁ । బరఁగుఁ జతుష్పాదవృత్తిఁ బరఁగిన గోవున్
దొరయుచు నం దొకఁ డెడలిన । నరవర! సద్ధర్మవర్తనము గుంటువడున్. 285

ప్రతిపదార్థం: నరవర!= మనుజశ్రేష్ఠా!; చతుస్+పాద వృత్తిన్= నాలుగు పాదాల వర్తనతో; పరఁగిన గోవున్= ఒప్పిన ఆవును; దొరయుచున్= పోలుతూ; అరయఁగన్= పరిశీలించగా; నాలుగు విధములన్= నాలుగు తీరులలో; పరఁగున్= ఉంటుంది; అందున్= వాటిలో; ఒకఁడు= ఒకటి; ఎడలినన్= తొలగినా; సత్+ధర్మవర్తనము= శ్రేష్ఠమైన ధర్మపు నడక; కుంటు+పడున్= కుంటు పడుతుంది.

తాత్పర్యం: రాజా! నాలుగుకాళ్ళ నడకగల ఆవువలె ఆ అహింస కూడా నాలుగు తీరులలో ఉంటుంది. అందులో ఏ ఒక్కటి లోపించినా శ్రేష్ఠమైన ధర్మపు సాగుదల కుంటుపడుతుంది.

తే. మనసునను వాక్కునను గాయమునను హింస । నడపు మాంసంబు దినుటతో నాలుగయ్యెఁ
దెఱఁగు లవి సువ్వె హింస వర్తింపఁ జేయుఁ । గాన కడుఁ గీడు మాంసభక్షణము దలఁప. 286

ప్రతిపదార్థం: మనసునను= మనస్సుచేత; వాక్కునను= మాటచేత; కాయమునను= దేహంచేత; హింస నడపు= హింస చేయటం; మాంసంబున్= మాంసాన్ని; తినుటతోన్= తినటంతో; అవి; తెఱఁగులు= పద్ధతులు; నాలుగు= నాల్గు; అయ్యెన్= అయినవి; సువ్వె= సుమా!; తలఁపన్= భావించగా; హింసన్= పీడను; వర్తింపన్+చేయున్= కలుగజేస్తుంది; కానన్= కనుక; మాంసభక్షణము= మాంసం తినటం; కడున్= మిక్కిలి; కీడు= దోషము.

తాత్పర్యం: మనసుచేత, మాటచేత, దేహంచేత హింసచేయటం, మాంసం తినటం అనేదానితో కలిపి ఆ పద్ధతులు నాలు గైనాయి. హింసను కలిగిస్తుంది కనుక మాంసభోజనం చాలా పెద్ద దోషం.

విశేషం: ఇతరులను గురించి చెడుగా భావించటం మనోహింస, దురుసుమాటలు పలకటం వాకొహింస, కొట్టటం మొదలైనది కాయహింస.

క. ఈ నాలుగు దెఱఁగుల దగ । మానుట యేఁ జెప్పినట్టి మహితాహింసా
నూనచతుర్విధములు మాం । సానేకరుచి ప్రమగ్నుఁ డది యెట్లుడుగున్? 287

ప్రతిపదార్థం: ఈ నాలుగు+తెఱఁగులన్= ఈ నాలుగు పద్ధతులను; తగన్= తగినట్లుగా; మానుట= మానటం; ఏన్=నేను; చెప్పిన+అట్టి= చెప్పిన; మహిత+అహింసా+అనూన చతుర్+విధములు= గొప్పది అయిన అహింసయొక్క తక్కువకాని నాల్గు పద్ధతులు; మాంస+అనేక రుచి ప్రమగ్నుఁడు= మాంసపు పెక్కు విధములైన రుచులలో బాగా మునిగినవాడు; అది= ఆ ఆహింసను; ఎట్లు= ఏ విధంగా; ఉడుగున్?= మానుతాడు?

తాత్పర్యం: ఈ నాలుగు విధాలైన హింసలను మానటమే నేను చెప్పిన అహింసలోని నాలుగు గొప్ప పద్ధతులు. మాంసపు రుచులను బాగా మరగినవాడు దాని నెట్లా వదలుతాడు?

క. కావున మాంసముపైఁ దగు । లే విధమున నుడుగుటయ యహింసారూపం
బై వఱలుఁ జుమీ భూవర!' నావుడు నక్కురువిభుఁడు వినయమయుఁడగుచున్. 288

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; కావునన్= కనుక; ఏ విధమునన్= ఏ విధంగానైనా; మాంసముపైన్= నంజుడుమీద; తగులు= ప్రీతి; ఉడుగుట+అ= వదలటమే; అహింసారూపంబు= అహింస అనే తీరు గలది; ఐ= అయి; వఱలున్= ఒప్పుతుంది; చుమీ= సుమా!; నావుడున్= అన్నంతనే; ఆ+కురువిభుఁడు= ఆ కురువంశరాజు; వినయమయుఁడు= వినయంతో నిండినవాడు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: రాజా! కనుక ఏ విధంగా నైనా సరే మాంసంమీద ప్రీతి వదలుకొనటమే అహింసగా ఒప్పుతుంది సుమా!' అని అనగా ఆ కౌరవరాజు వినయం నిండిన వాడవుతూ (తరువాతి పద్యంతో అన్వయం).

వ. 'మాంసంబు పితృదేవతలకుం బ్రియంబు శ్రాద్ధంబు మాంసముఖ్యంబుగా నడపవలయునని చెప్పదురు. వధింపక మాంసలాభం బెట్లు గలుగు?' ననుటయు ననిమిషనదీనందనుం డానరనాథున కిట్లనియె. 289

ప్రతిపదార్థం: మాంసంబు= నంజుడు; పితృదేవతలకున్= పితరులు అనే దేవతలకు; ప్రియంబు= ఇష్టమైనది; శ్రాద్ధంబు= శ్రాద్ధం అనే పని; మాంసముఖ్యంబుగాన్= మాంస ప్రధానంగా; నడపవలయున్= సాగించాలి; అని; చెప్పుదురు= చెప్తుతూ ఉంటారు; వధింపక= చంపక; మాంసలాభంబు= మాంసం దొరకటం; ఎట్లు= ఏ విధంగా; కలుగున్?= కలుగుతుంది?; అనుటయున్= అని పలికితే; అనిమిష నదీనందనుండు= దేవతలనది అయిన గంగయొక్క కుమారుడు భీష్మడు; ఆ నరనాథునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: 'మాంసం పితృదేవతలకు చాలా ఇష్టమైనది. శ్రాద్ధాన్ని మాంసం ప్రధానద్రవ్యంగా సాగించాలి అంటారు. చంపకపోతే మాంసం దొరకటం ఎట్లాగు?' అంటే భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది ధర్మానికి సంబంధించిన శంక. ఇట్టి శంకలను అడిగే సమయంలో సాధారణంగా చాలామంది పలుకులలో పొగరు పొడచూపుతుంది. అది వక్త కోపానికి కారణం అవుతుంది. అందుకనే వెనుకటి పద్యంలో ధర్మరాజులో అట్టి 'అవినయం' ఏ మాత్రం లేదు. కేవలం తెలిసికొనాలనే కోరిక మాత్రమే ఉందని చెప్పటానికై వినయమయుండగుటను చెప్పారు.

తే. 'వాజిమేధంబుకంటెను బూజనీయ । కర్మ మందురు మాంస భక్షణము విడుపు
వినుము చంపుటయును జంపఁ బనుచుటయును । గల్మషంబుల కెల్ల నగ్గలము లధిప! 290

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; మాంసభక్షణము విడుపు= మాంసాన్ని తినటం మానటం; వాజిమేధంబుకంటెను= అశ్వమేధయాగం కంటె; పూజనీయ కర్మము= మన్నింపదగిన పని; అందురు= అంటారు; వినుము; చంపుటయును= చంపటమూ; చంపన్= చంపటానికి; పనుచుటయును= పంపటమూ; కల్మషంబులకున్= పాపాలకు; ఎల్లన్= అన్నింటికీ; అగ్గలములు= అధికమైనవి.

తాత్పర్యం: 'రాజా! మాంసభోజనం వదలటం అశ్వమేధయాగంకంటే కూడా పూజింపదగిన పని అంటారు. వినుము. చంపటమూ, చంపించటమూ అనే పనులు పాపాలన్నింటికంటె అధికమైనవి.

క. పితృకార్యయజ్ఞముఖముల । శ్రుతిచోదిత హింసఁ గీడు సొరనేరదు వి
శ్రుతగుణ మాంసము చవిగో । రి తినం బ్రాణిఁ దెగటార్చు క్రియఁ బాపమగున్. 291

ప్రతిపదార్థం: విశ్రుతగుణ!= కొనియాడబడిన గుణములు కలవాడా!; పితృకార్య యజ్ఞముఖములన్= శ్రాద్ధము, యజ్ఞము మొదలైన వాటియందు; శ్రుతిచోదిత హింసన్= వేదం చెప్పిన హింసచేత; కీడు= దోషం; చొరన్+నేరదు= ప్రవేశింపజాలదు; మాంసము చవి= మాంసపు రుచి; కోరి= వాంఛించి; తినన్= తినటంకొరకు; ప్రాణిన్= ప్రాణంగల జంతువును; తెగటార్చు క్రియన్= చంపే పనిచేత; పాపము= దోషం; అగున్= ఔతుంది.

తాత్పర్యం: రాజా! శ్రాద్ధాలలో, యజ్ఞాలలో వేదం తెలిపిన హింసచేత దోషం కలుగబోదు. మాంసపురుచి మరిగి తినటానికై ప్రాణిని చంపే పనివలన పాపం కలుగుతుంది.

క. తను నమలిన వాని నమలు । నని మాంసము తెఱఁగు సెప్పు నాగమములు గా
వునఁ దద్భక్షణ ముడిగిన । ననఘ! తపంబునకుఁ జాలు నది యొక్కండున్. 292

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; ఆగమములు= శాస్త్రములు, వేదములు; తనున్= తన్ను; నమలినవానిన్= నమలినవాడిని; నమలును= నములుతుంది; అని; మాంసము తెఱఁగు= మాంసం తీరును; చెప్పున్= చెప్పుతూ ఉంటాయి; కావునన్= కనుక; తద్+భక్షణము= దానిని తినటం; ఉడిగినన్= మానితే; అది= ఆ మానటం; ఒక్కండును= ఒక్కటీ; తపంబునకున్= తపస్సునకు; చాలున్= చాలుతుంది.

తాత్పర్యం: మాంసం తన్నెవరు నములుతారో వారినే నములుతుంది - అని ఆగమాలు చెప్పుతున్నాయి. కనుక, రాజా! ఆ మాంసపు తిండి ఒక్కటీ మానితే అదే తపస్సునకు సరిపోతుంది.

విశేషం: మాంసభక్షణం అన్యహింసే కాదు, ఆత్మహింస కూడా అవుతుందని భావం.

క. జనవర! మాంసముచవిఁ గడ । చిన చవు లరయంగ లేమిఁ జేసి చవి యెఱిం
గినవాఁ డది యుడిగిన నా । తని దేవసమానుఁ డండ్రు ధర్మవిధిజ్ఞుల్. 293

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; మాంసము చవిన్= మాంసపు రుచిని; కడచిన చవులు= మీరిన రుచులు; అరయంగన్= పరిశీలించగా; లేమిన్+చేసి= లేకపోవటంవలన; చవి+ఎఱింగినవాఁడు= రుచి తెలిసినవాడు; అది= మాంసభోజనాన్ని; ఉండిగినన్= వదలివేస్తే; అతనిన్= అట్టివాడిని; ధర్మవిధిజ్ఞుల్= ధర్మం పద్ధతులు బాగా తెలిసినవారు; దేవసమానుఁడు= దేవతలతో సాటి అయినవాడు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! మాంసం రుచిని మించిన రుచులు ఎంత వెదకినా లేని కారణంగా ఆ రుచి మరగినవాడు దానిని మానితే అట్టివాడిని ధర్మశాస్త్రాలు చక్కగా తెలిసినవారు దేవతలతో సమానుడు అంటారు.

విశేషం: రుచి తెలియనివాడు మాంసం జోలికి పోక పోవటం గొప్ప విషయం కాదు. రుచి తెలిసినవాడు మానటం ఎంతో గొప్ప విషయం - అని భావం.

ఉ. మ్రానను ఱాతనుం గలదె మాంసము ప్రాణుల మేనఁగాక? య
మ్మేనుల నొంచునప్డు తమ మేనులు సోఁకినమాత్ర నెట్లగున్
దానిఁ దలంపఁగా వలదె? తానది మానిన హింసలన్నియున్
మానవె? యంచు నుత్తముఁడు మాంసము మాను దయార్ద్రచిత్తుఁడై. 294

ప్రతిపదార్థం: మాంసము= నంజుడు; ప్రాణులమేనన్= ప్రాణంగల జంతువుల దేహంలో; కాక= తప్ప; మ్రానను= చెట్టునందు; ఱాతనున్= రాతియందు; కలదె?= ఉన్నదా?; ఆ+మేనులన్= ఆ దేహాలను; నొంచు+అప్డు= పీడించే సమయంలో; తమ మేనులు= తమ దేహాలు; సోఁకిన మాత్రన్= తాకినంత మాత్రాన; ఎట్లు= ఏ విధంగా; అగున్= అవుతుందో; దానిన్= దానిని; తలంపన్+కాన్= తలపోయటం; వలదె?= వద్దా?; తాన్= తాను; అది= ఆ హింసను; మానినన్= మానితే; హింసలు= పీడలు; అన్నియున్= అన్నీ; మానవె?= మానవా?; అంచున్= అని భావిస్తూ; ఉత్తముఁడు= గొప్పవాడు; దయా+ఆర్ద్ర చిత్తుఁడు= దయతో మెత్తనైన మనస్సు కలవాడు; ఐ= అయి; మాంసమున్= మాంసాన్ని; మానున్= ఆపివేస్తాడు.

తాత్పర్యం: ప్రాణుల దేహంలోనే కానీ మాంసం మ్రానులోను, రాతిలోను లేదు కదా! ఆ దేహాలను పీడించే సమయంలో తమ దేహాలకు ఏదైనా తగిలితే తనకు నొప్పి కలుగుతున్నది కదా! కనీసం దానినైనా భావించాలి కదా!

కనుక మాంసంకొరకు హింస మానితే అన్ని హింసలూ మానినట్లే - అని ఉత్తముడు భావించి, దయ కలవాడై మాంసం తినటం మానుతాడు.

ఆ. మాంస మానకునికి మనుజేశ! ప్రాణివ। ధాభిరతి దొఱంగు టగుటఁ జేసి
యట్టివాని కభయ మఖిలభూతంబుల। వలన నెపుడు నెందుఁ గలిమి నిజము. 295

ప్రతిపదార్థం: మనుజ+ఈశ!= రాజా!; మాంసము= ఎరచి; ఆనక= తినక; ఉనికి=ఉండటం; ప్రాణివధ+అభిరతిన్= ప్రాణంగల జంతువులను చంపటంమీద ప్రీతిని; తొఱంగుట= వదలివేయటం; అగుటన్+చేసి= కాబట్టి; అట్టి వానికిన్= ఆ విధంగా మాంసం మానిన వాడికి; అఖిల భూతంబులవలనన్= అన్ని భూతాలవలనను; ఎపుడున్= ఎల్లవేళలా; ఎందున్= అన్నిప్రదేశాలలో; అభయము= భయంలేని స్థితి; కలిమి= కలగటం; నిజము= సత్యం.

తాత్పర్యం: రాజా! మాంసం ముట్టకపోవటం అంటే ప్రాణులను వధించే ప్రీతిని వదలటమే. కనుక, అట్టివాడికి అన్నివేళలలో, అన్ని తావులలో, అన్ని భూతాలవలన అభయం కలగటం సత్యం.

విశేషం: భూతములు చరములు, అచరములు అనే వ్యవహారంగల సర్వపదార్థాలు. ఎందున్, ఎపుడు, అఖిలభూతంబుల వలన అవి ఈ మూడింటినీ చెప్పటం వలన దేశకాలపాత్రలవలన అట్టివారికి భయం కలుగదని భావం.

క. స్వాయంభువుఁ డను మనువును। నీ యర్థము సెప్పె లోకహితముగ మార్కం
డేయాదులు మాంసముడుగు। టాయుశ్శ్రీ రూపకారి యగు నని రధిపా! 296

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; స్వాయంభువుఁడు= స్వాయంభువనామం కలవాడు; అను మనువును= అనే మనువు కూడా; ఈ+అర్థము= ఈ విషయాన్ని; లోకహితముగన్= లోకానికి మేలైన విధంగా; చెప్పెన్= బోధించాడు; మార్కండేయ+ఆదులు= మార్కండేయ మహర్షి మొదలైనవారు; మాంసము= మాంస భోజనం; ఉడుగుట= మానటం; ఆయుస్+శ్రీ రూపకారి= ఆయువును, సంపదను, సౌందర్యాన్ని కలిగించేది; అగున్= అవుతుంది; అనిరి= అన్నారు.

తాత్పర్యం: స్వాయంభువుడనే మనువు కూడా ఈ విషయాన్నే లోకానికి మేలు కలిగే విధంగా చెప్పాడు. మార్కండేయుడు మొదలైన చిరంజీవులైన మహర్షులు కూడా మాంసపుతిండి మానటం ఆయువును, సంపదను, అందచందాలను పెంపొందిస్తుందని అన్నారు.

విశేషం: తాత్పర్యంగా మాంస భోజనం ఆయువు మొదలైన వాటిని హరిస్తుందనే అర్థం గ్రహించాలి. మనువు మానవజాతి మూల పురుషుడు, మార్కండేయాదులు చిరంజీవులు. అట్టివారి ఉపదేశం వదలరానిది అని భావం.

క. విను మాంసము గోరు నరుఁడు। దనుజుఁడ చూవె! మును దేవతలు మాంసంబుం
దిను టుడిగి కాదె దానవ। జనితభయముఁ బోవఁ ద్రోవఁ జాలిరి వత్సా! 297

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; విను= శ్రద్ధగా ఆలకింపుము; మాంసమున్= మాంసాన్ని; కోరు నరుఁడు=కోరే మనుష్యుడు; దనునజుఁడు+అ= రాక్షసుడే; చూవె!= సుమా!; మును= పూర్వం; దేవతలు= దేవలోకంవారు; మాంసంబున్= మాంసాన్ని; తినుట= తినటం; ఉడిగి= మాని; కాదె?= కదా!; దానవజనిత భయమున్= దానవులవలన పుట్టిన భయాన్ని; పోవన్= పోయేవిధంగా; త్రోవన్= త్రోసివేయటానికి; చాలిరి= సమర్థులయ్యారు.

తాత్పర్యం: కుమారా! శ్రద్ధగా వినుము. మాంసం తినగోరే మనుష్యుడు రక్కసుడే సుమా! పూర్వం దేవతలు మాంసభోజనం విడిచియే కదా - రాక్షసులవలన కలిగిన భయాన్ని పోద్రోలగలిగారు!

క. దానము ధర్మము దప మి । జ్యానిష్ఠ యనంగఁ గల్గు సత్క్రియ లెల్లన్
మానవనాథ! యహింసా । నూనాకృతు లంద్రు శ్రుతుల నూనిన పెద్దల్. 298

ప్రతిపదార్థం: మానవనాథా!= రాజా!; శ్రుతులన్= వేదాలను; ఊనిన= పట్టుకొన్న; పెద్దల్= జ్ఞానం పండిన వృద్ధులు; దానము= ఇవ్వటం; ధర్మము= సత్కార్యములు చేయటం; తపము= శరీరాన్ని నియమనిష్ఠలతో శుష్కింపజేయటం; ఇజ్యానిష్ఠ= యజ్ఞాలయందు దృఢమైన దీక్ష కలిగి ఉండటం; అనంగన్= అనగా; కల్గు సత్+క్రియలు= ఉండే మంచి పనులు; ఎల్లన్= అన్నీ; అహింసా+అనూన+ఆకృతులు= అహింసకంటె తక్కువ కాని కార్యాలు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! వేదార్థం చక్కగా తెలిసిన జ్ఞానసంపన్నులు దానము, ధర్మము, తపస్సు, యజ్ఞనిష్ఠ అనే ఉత్తమ క్రియలన్నీ అహింసకు తక్కువ కాని కార్యాలే అంటారు.

క. శతవర్షదుష్కరతపః । కృతి నంజుడు దినమి నగు సుకృత మివి రెండున్
మతిఁ దలఁప నొక్కరూ పని । శ్రుతివేదులు సెప్పుదురు కురుక్షితినాథా! 299

ప్రతిపదార్థం: కురుక్షితినాథా!= కురుదేశపు ప్రభూ!; శతవర్ష దుష్కరతపస్+కృతి= నూరేండ్లు చేయనలవికాని తపస్సు చేయటం; నంజుడు= మాంసం; తినమిన్= తినకపోవటంచేత; అగు సుకృతము= కలిగే పుణ్యమూ; ఇవి రెండున్= రెండూ; మతిన్= బుద్ధిలో; తలఁపన్= భావిస్తే; ఒక్క రూపు= ఒకే విధమైనవి; అని; శ్రుతివేదులు= వేదం తెలిసినవారు; చెప్పుదురు= వక్కాణిస్తారు.

తాత్పర్యం: నూరేండ్లు చేయనలవికాని తపస్సు చేయటమూ, మాంసం తినకపోవటంవలన కలిగే పుణ్యమూ- ఈ రెండూ ఒకే విధమైనవని వేదవేత్తలు చెప్పుతారు.

విశేషం: వేదానుశాసనం అంటే తిరుగులేనిమాట. మాంసం మానటం అనే ఒక్క సులభసాధ్యమైన పనితో నూరేండ్లు ఘోరమైన తపస్సు చేస్తే కలిగే పుణ్యం సాధించటం వివేకం గలవాడి పని కదా!

క. తపముల దానంబుల బ్ర । హ్మపురి నివాసంబు దప్పదనరాదు, జనా
ధిప! మాంసము నమలని పు । ణ్యపురుషునకు సులభ మందు రా నెల వార్యుల్. 300

ప్రతిపదార్థం: జన+అధిప!= రాజా!; తపములన్= తపస్సులచేతను; దానంబులన్= దానములచేత; బ్రహ్మపురి నివాసంబు= బ్రహ్మదేవుడి పట్టణంలో ఉండే మహాభాగ్యం; తప్పదు= తప్పక కలుగుతుంది; అనరాదు= అనటానికి వీలులేదు; ఆర్యుల్=ఉత్తమ పురుషులు; మాంసము= నంజుడు; నమలని పుణ్య పురుషునకున్= తినని పుణ్యంగల జనునకు; ఆ నెలవు= ఆ తావు; సులభము= తేలికగా దొరుకునది; అందురు= అంటారు.

తాత్పర్యం: రాజా! తపములు, దానములు అనే వాటిచేత బ్రహ్మలోక నివాసం తప్పదు అనరాదు. కానీ ఆర్యులు మాంసం తినని పుణ్యపురుషుడికి ఆ నెలవు తేలికగా లభిస్తుందని చెప్పుతారు.

విశేషం: మాంసభోజనం చేయకపోవటం తపస్సులచేతను, దానాలచేతను పొందే పుణ్యవిశేషంకంటె గొప్పది అని తాత్పర్యం.

తే. అధిప! యాషాఢముఖ్యంబు లైన నెలలు । నాలుగింటను మాంసంబు నమల కుడుగు
టాయురారోగ్య బలకీర్తు లను ఫలములు । నాలుగింటిని నిచ్చు నన్నరున కండ్రు. 301

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఆషాఢ ముఖ్యంబులు= ఆషాఢం మొదలుగా గలవి; ఐన నెలలు= అయిన నెలలు; నాలుగింటను= నాలిగింటిలోను; మాంసంబు= నంజుడును; నమలక= తినక; ఉడుగుట= మానటం; ఆయుస్+ఆరోగ్య బల కీర్తులు= ఆయువు, ఆరోగ్యం, బలం, కీర్తి; అను ఫలములు= అనే ఫలితాలను; నాలుగింటిని= నాలిగింటిని; ఆ+నరునకున్= ఆ మనిషికి; ఇచ్చున్= లభిస్తాయి; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! ఆషాఢం మొదలైన నాలుగు నెలలలో మాంసం తినటం మానటం ఆయువు, ఆరోగ్యం, బలం, కీర్తి అనే నాలుగు ఫలాలు ఆ మనిషికి కలిగిస్తుందని చెప్పుతారు.

విశేషం: ఆషాఢముఖ్యం అయిన నెలలు - ఆషాఢం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం. ఈ నాలుగూ సాధారణంగా వర్షం పడే సమయం. రోగాలు ప్రబలుతాయి. ఆ దృష్టితో కూడా మాంసం మానటం మంచిది.

ఋషులు దయామూర్తులు. ఇంతకు ముందు పూర్తిగా మాంసం మాను మన్నారు. అది బొత్తిగా సాధ్యం కాకపోతే కనీసం ఈ నాలుగు నెలలైనా మాను మంటున్నారు.

ఆ. సగర నల దిలీప నృగ భగీరథ ముఖ్య ।నృపులు వార్షికంపు నెలలు నాల్గు
మాంసభక్షణంబు మానుట నుభయ లో । కంబులందుఁ బెంపుఁ గాంచి రండ్రు.' 302

ప్రతిపదార్థం: సగర నల దిలీప నృగ భగీరథ ముఖ్య నృపులు= సగరుడు, నలుడు, దిలీపుడు, నృగుడు, భగీరథుడు మొదలైన రాజులు; వార్షికము+నెలలు= వర్షాకాలపు నెలలు; నాల్గున్= నాలుగునూ; మాంసభక్షణంబు= మాంసం తినటం; మానుటన్= మానటంవలన; ఉభయ లోకంబులందున్= రెండు లోకాలలోను; పెంపున్= గొప్పతనాన్ని; కాంచిరి= పొందారు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సగరుడు, నలుడు, దిలీపుడు, నృగుడు, భగీరథుడు మొదలైన మహాచక్రవర్తులందరూ వర్షాకాలం నాలుగు నెలలు మాంసం తినటం మానివేసి, ఇహపరలోకాలలో గొప్పతనం పొందారని చెప్పుతారు.'

వ. అనిన విని యజాతశత్రుండు శంతనుపుత్త్రుతో 'నిమ్మెయి మహనీయంబయిన మాంసవర్జనంబు పాటించి తక్కిన యపూపాదులు ఫలప్రభృతులు నగు భక్ష్యంబు లాచరించి యేల వర్తింప రెల్ల జనంబులు?' ననుటయు. 303

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; అజాత శత్రుండు= పుట్టని పగవారుగల ధర్మరాజు; శంతను పుత్త్రుతోన్= శంతనుడి కొడుకైన భీష్ముడితో; ఈ+మెయిన్= ఈ విధంగా; మహనీయంబు= గొప్పది; అయిన మాంసవర్జనంబు= అయిన మాంసం వదలటం; పాటించి= ఆచరించి; తక్కిన అపూప+ఆదులు= మిగిలిన పిండివంటలు మొదలైనవి; ఫలప్రభృతులు= పండ్లు మొదలైనవి; అగు భక్ష్యంబులు= అయిన తినుపదార్థాలను; ఆచరించి= తిని; ఎల్లజనంబులు= జనులందరు; ఏల= ఎందుకు; వర్తింపరు?= ప్రవర్తించరు; అనుటయున్= అనగా.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'ఈ విధంగా మిక్కిలి గొప్పదైన మాంసం విడనాడటం పాటించి తక్కిన పిండివంటలు, పండ్లు మొదలైన తినుపదార్థాలతో జనులంతా ఎందుకు ప్రవర్తించరు?' అనగా (తరువాతి పద్యంతో అన్వయం.)

మాంసభక్షణ మందలి రుచివిశేషంబు మానుట దుష్కరంబని చెప్పుట (సం.13-178-7 (కుంభ))

సీ. అతనికి నతఁ డిట్టులను మాంసముల చవి । మరగినవానికి మాన వశమె?
యట్లు గాకయు సురతాసక్తునకు బల । మొలయు నధ్వశ్రాంతుఁ డుల్లసిల్లు
క్షతము శీఘ్రమున లోపితమగుఁ గృశునకుఁ । బుష్టి వేగమ వచ్చు భూపవర్య!
విను మాంసభక్షణంబున నపూప ఫలాదు । లం దవ్విశేషంబు లరయఁగలవె?

తే. మాంస మానిన దోషంబు మహిత దాన । విధులఁ బాయు దివిజపితృవిధివిశిష్ట
మైన యెఱచి గీడొలయదు యజ్ఞములకుఁ । బశువిధానంబు వేదంబు పనుపు గాన. 304

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ ధర్మరాజునకు; అతఁడు= ఆ భీష్ముడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; మాంసముల చవి= నంజుడుల రుచి; మరగినవానికిన్= అలవాటు పడిన వ్యక్తికి; మానన్= మానటం; వశమె?= సాధ్యమా?; అట్లు+కాకయున్= అంతేకాక; భూపవర్య!= రాజోత్తమా!; మాంసభక్షణమునన్= మాంసం తినటంవలన; సురత+ఆసక్తునకున్= మిథునకర్మయందు తగులం కలవాడికి; బలము= సత్తువ; ఒలయున్= కలుగుతుంది; అధ్వశ్రాంతుఁడు= బాటయందు అలసినవాడు; ఉల్లసిల్లున్= ఉత్సాహం పొందుతాడు; క్షతము= గాయం; శీఘ్రమునన్= తొందరలో; లోపితము= పోయినది; అగున్= అవుతుంది; కృశునకున్= బక్కచిక్కినవాడికి; పుష్టి= శక్తి; వేగము+అ= వేగమే; వచ్చున్= వస్తుంది; విను= ఆలకించుము; అపూప ఫల+ఆదులందున్= పిండి వంటలు, పండ్లు మొదలగు వాటిలో; ఆ+విశేషంబులు= ఆ గొప్పతనాలు, అరయన్= పరిశీలింపగా; కలవె?= ఉన్నాయా?; మాంసము= ఎరచి; ఆనిన దోషంబు= తిన్న తప్పు; మహితదాన విధులన్= గొప్పవైన దానకార్యాలచేత; పాయున్= తొలగుతుంది; యజ్ఞములకున్= జన్నాలకు; పశువిధానంబు= పశువులను ఉపయోగించే పద్ధతి; వేదంబు పనుపు= వేదం చెప్పిన శాసనం; కానన్= కనుక; దివిజ పితృవిధి విశిష్టము= దేవతలకు, పితృదేవతలకు సంబంధించిన కార్యాలలో మన్నన గొప్పది; ఐన+ఎఱచిన్= అయిన మాంసంతో; కీడు= దోషం; ఒలయదు= కలుగదు.

తాత్పర్యం: ఆ ధర్మరాజుతో భీష్మ డిట్లా అన్నాడు. 'మాంసాల రుచి మరగినవారికి మానటం సాధ్యమా? అంతే కాదు. మాంసం తినటంవలన రతిమీద ప్రీతిగలవాడికి బలం కలుగుతుంది. ప్రయాణం చేసి అలసినవాడికి ఉత్సాహం కలుగుతుంది. గాయాలు తొందరగా మానుతాయి. చిక్కినవాడికి పుష్టివేగంగా కలుగుతుంది. పిండివంటలలో పండ్లలో ఈ విశేషాలు లేవు కదా! మాంసం తింటే కలిగే పాపం గొప్ప దానకార్యాలతో పోతుంది. యజ్ఞాలలో పశువును ఉపయోగించటం వేదం అనుశాసనం కనుక దైవపితృకార్యాలలో ఉపయోగించిన మాంసంవలన దోషం కలుగదు.

వ. ఇట్లు గాన నంజుడు నమలుటయు నధికదోషంబులు గాని యెడలునుం గలిగియుండు; నగస్త్యుండు రాజులకు వేఁట విధించెం గావునం గుతూహలంబుఁ గోపంబు ననియెడు భావంబులం బొరయక లోకరక్షణార్థంబుగాఁ

గ్రూరమృగ వధంబును స్వహస్తవిక్రమార్జిత మాంసంబున దేవపితృప్రీణనం బొనర్చుటకుం గాఁ బక్షి మృగమారణంబును జేయు భూనాయకుండు దురితంబులం బొరయకుండు విశేషంబు వినుము. 305

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధం; కానన్= కావున; నంజుడు= మాంసం; నమలుటయున్= తినటంకూడా; అధిక దోషంబులు= ఎక్కువ తప్పులు; కాని+ఎడలునున్= కాని సందర్భాలు కూడా; కలిగి యుండున్= ఉన్నాయి; అగస్త్యుండు= అగస్త్య మహర్షి; రాజులకున్= ప్రజల నేలే వారికి; వేఁట= జంతువులను చంపటం; విధించెన్= శాసించాడు; కావునన్= కనుక; కుతూహలంబున్= వేడుక; కోపంబున్= కోపము; అనియెడు భావంబులన్= అనే భావాలను; పొరయక= పొందక; లోక రక్షణ+అర్థంబుగాన్= లోకాలను రక్షించటం ప్రయోజనంగా; క్రూర మృగ వధంబును= క్రూర జంతువులను చంపటమూ; స్వహస్త విక్రమ+ఆర్జిత మాంసంబునన్= తనచేతి పరాక్రమంతో సంపాదించిన మాంసంతో; దేవ పితృ ప్రీణనంబు= దేవతల, పితృదేవతల ప్రీతిని; ఒనర్చుటకున్+కాన్= చేయటానికిగాను; పక్షి మృగ మారణంబును= పక్షులను, మృగాలను చంపటాన్ని; చేయు భూనాయకుండు= చేసే రాజు; దురితంబులన్= పాపాలను; పొరయక+ఉండున్= పొందకుంటాడు; విశేషంబు= ప్రత్యేకమైన సంగతి; వినుము.

తాత్పర్యం: ఇట్లు గాన మాంసం తినటం పెద్ద తప్పు కాని సందర్భాలు కూడా ఉంటాయి. అగస్త్యుడు రాజులకు వేటను విధిగా చెప్పాడు. కాబట్టి వేడుక, కోపము అనే భావాలకు చిక్కకుండా లోకరక్షణకొరకు క్రూరమృగాలను చంపటం, తన చేతిబలంతో సంపాదించిన మాంసంతో దేవపితృదేవతలకు ప్రీతికావించుటకొరకు పక్షులను, పశువులను చంపే రాజు పాపాలలో పడడు. ఒక విశేషం వినుము.

ఆ. అన్యమాంసమున నిజాంగమాంసంబుఁ బో । షింతు ననుటకంటెఁ జెట్టలేదు
మాంసభక్షణంబు మానుటకంటెను । మేలు లేదు కర్మజాలకమున. 306

ప్రతిపదార్థం: అన్యమాంసమునన్= ఇతర ప్రాణి మాంసంతో; నిజ+అంగ మాంసంబున్= తన దేహంలోని మాంసాన్ని; పోషింతున్= పెంపొందిస్తాను; అనుటకంటెన్= అనటంకంటె; చెట్ట= పాపం; లేదు; మాంసభక్షణంబు= మాంసం తినటం; మానుటకంటెను= మానుటకంటె; కర్మజాలకమునన్= కర్మముల సముదాయంలో; మేలు= మంచిపని; లేదు.

తాత్పర్యం: ఇతరప్రాణి మాంసంతో తన దేహంలోని మాంసాన్ని పెంపొందిస్తాను - అనటంకంటె పాపం మరొకటి లేదు. మాంసం తినటం మానటంకంటె కర్మముల సముదాయంలో మేలైనది మరొకటి లేదు.

తే. మాంసభక్షణ దోషంబు మాను దాన । మహిమ ననుటయు మాంసంబు మఱి భుజింప
కున్నఁ జూవె; ధర్మము లెవ్వియును దలంప । దయకు సదృశంబులే? కురుధరణినాథ! 307

ప్రతిపదార్థం: కురుధరణినాథ!= కురుదేశ ప్రభూ!; మాంసభక్షణ దోషంబు= మాంసం తినటంవలన కలిగే పాపం; దానమహిమన్= దానపు గొప్పతనంచేత; మానున్= పోతుంది; అనుటయున్= అనటం కూడా; మఱి= పిదప; మాంసంబు= మాంసం; భుజింపక+ ఉన్నన్= తినకుంటేనే; చూవె!= సుమా!; తలంపన్= భావింపగా; ధర్మములు= ధర్మాలు; ఎవ్వియును= ఏవి అయినా; దయకున్= కరుణకు; సదృశంబులే?= సాటి అగునా?

తాత్పర్యం: రాజా! మాంసం తినటంవలన కలిగే పాపం దానాల మహిమవలన పోతుంది అనటంకూడా ఇక అటుపై మాంసం తినకుంటేనే సుమా! ధర్మా లేవైనా దయకు సాటి అవుతాయా?

విశేషం: ప్రాయశ్చిత్తాలు ఉన్నాయి కదా! అని పాపాలు చేయటంవలన దోషాలు ప్రాయశ్చిత్తాలవలన కూడా పోవు.

తే. ఆత్మ సదృశత ప్రాణభయంబునందుఁ । బ్రాణులకు నెల్లఁ గని మాంసభక్షణంబు
మాను దయ నార్ద్రమానసుండైన పురుషుఁ । డాతనికి బ్రహ్మలోకాదు లాటపట్టు. 308

ప్రతిపదార్థం: దయన్= జాలితో; ఆర్ద్రమానసుండు= మెత్తని హృదయంగలవాడు; ఐన పురుషుఁడు= అయిన నరుడు; ప్రాణులకున్= ప్రాణంగలవాటికి; ఎల్లన్= అన్నింటికీ; ప్రాణభయంబునందున్= ప్రాణం విషయంలోని భయమునందు; ఆత్మసదృశతన్= తన పోలికను; కని= చూచి; మాంసభక్షణంబు= మాంసం తినటం; మానున్= మానివేస్తాడు; ఆతనికిన్= అట్టివాడికి; బ్రహ్మలోక+ఆదులు= బ్రహ్మలోకం మొదలైనవి; ఆటపట్టు= ఆడుకొనే చోటు.

తాత్పర్యం: దయతో మెత్తని హృదయంకల నరుడు ప్రాణులన్నింటికీ ప్రాణభయంలో తనవంటి స్థితినే చూచి మాంసం తినటం మానివేస్తాడు. అతడికి బ్రహ్మలోకం మొదలైనవి క్రీడారంగాలు.

విశేషం: ఆటపట్టులో స్వేచ్ఛగా ఆనందంతో తిరిగే విధంగా అట్టివాడు బ్రహ్మలోకాదులలో విహరిస్తాడని భావం.

క. భూతముల కలుగు నతనికి । భూతము లఖిలములు నలుగు భూతహితార్థీ!
భూతముల కభయ మిచ్చిన । పూతాత్మున కభయ మిచ్చు భూతావలియున్. 309

ప్రతిపదార్థం: భూతహిత+అర్థీ!= ప్రాణుల మేలు కోరేవాడా!; భూతములకున్= ప్రాణుల విషయంలో; అలుగు+అతనికిన్= పగపెట్టుకొనేవాడికి; భూతములు=ప్రాణులు; అఖిలములు= అన్నీ; అలుగున్= పగ కలిగి ఉంటాయి; భూతములకున్= ప్రాణులకు; అభయము= భయం లేని తనాన్ని; ఇచ్చిన పూత+ఆత్మునకున్= ఇచ్చిన పవిత్ర హృదయుడికి; భూత+ఆవలియున్= ప్రాణుల వరుసలు కూడా; అభయము= అభయాన్ని; ఇచ్చున్= ఇస్తాయి.

తాత్పర్యం: ధర్మరాజా! ప్రాణుల విషయంలో పగ గలిగి ఉన్న వాడియెడల ప్రాణులు కూడా శత్రుభావంతోనే ఉంటాయి. ప్రాణులకు అభయం ఇచ్చే పవిత్రహృదయుడికి అవి కూడా అభయం ఇస్తాయి.

ఆ. దానమును దపంబు ధర్మంబు యజ్ఞంబు । శౌచ మంత్రతంత్ర సత్యములును
బుధు లహింస రూపములు గాఁగఁ జెప్పుట । నెల్లకల్మి సుమ్మహింస కలిమి. 310

ప్రతిపదార్థం: బుధులు= వివేకంగలవారు; దానమును= ఈగిని; తపంబున్= తపస్సును; ధర్మంబున్= ధర్మమును; యజ్ఞంబున్= యజ్ఞాన్నీ; శౌచ మంత్ర తంత్ర సత్యములును= శుద్ధి మంత్రము, అనుష్ఠానము, సత్యము అనువాటిని; అహింసరూపములు= అహింస యొక్క మరొక రూపములు; కాఁగన్= అవటాన్ని; చెప్పుటన్= చెప్పటంచేత; అహింస కలిమి= అహింస ఉండటం; ఎల్లకల్మి= అన్నింటి సంపదయే; సుమ్మ!= సుమా!

తాత్పర్యం: వివేకవంతులు దానం, ధర్మం, తపస్సు, యజ్ఞం, పరిశుద్ధత, మంత్రం, అనుష్ఠానం, సత్యం - ఇవన్నీ అహింసరూపాలే అని చెప్పటంవలన అహింస అనే సంపద ఉంటే అన్ని సంపదలు ఉన్నట్లే.

క. నరనాథ! యహింసా గుణ । పరిగణనము గొంత మాత్రఁ బలికితి ధర్మో
త్తర యగు నహింస మేలిమి । యరయం గడుఁ బెద్ద దాని నలవఱుపు మదిన్.' 311

ప్రతిపదార్థం: నరనాథ!= ప్రజాపాలకా!; అహింసా గుణ పరిగణనము= అహింస అనే గుణాల లెక్క; కొంతమాత్రన్= కొంతమాత్రమే; పలికితిన్= చెప్పాను; ధర్మ+ఉత్తర= ధర్మం తుదిగా ఉన్నది; అగు+అహింస మేలిమి= అయిన అహింస యొక్క గొప్పతనం; అరయన్= పరికించగా; కడున్= మిక్కిలి; పెద్ద= ఎక్కువ అయినది; దానిన్= దానిని; మదిన్= హృదయంలో; అలవఱుపు= అభ్యాసం చేయుము.

తాత్పర్యం: రాజా! అహింసయొక్క మహిమను కొంతమాత్రమే చెప్పాను, అది ధర్మమే పర్యవసానంగా గలది. దాని మహిమ పరిశీలించి చూస్తే చాలా గొప్పది. కనుక దానిని హృదయంలో అభ్యాసం చేయాలి.'

ఆ. అనిన సంతసిల్లి యమ్మహీపతి తాత । కధికభక్తి మ్రొక్కి 'యస్మదీయ
సంగరంబునందుఁ జచ్చినవారల । కేది గతియొ నాకు నెఱుఁగఁ జెప్పు. 312

ప్రతిపదార్థం: అనినన్= అనగా; సంతసిల్లి= ఆనందపడి; ఆ+మహీపతి= ఆ రాజు; తాతకున్= తాత అయిన భీష్ముడికి; అధికభక్తిన్= ఎక్కువ అయిన భక్తితో; మ్రొక్కి= పాదనమస్కారం చేసి; అస్మదీయ సంగరంబునందున్= మాదైన యుద్ధంలో; చచ్చినవారలకున్= మరణించినవారికి; ఏది; గతియొ=గతియో; నాకున్; ఎఱుఁగన్= తెలిసేవిధంగా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: అనగా సంతోషించి ధర్మరాజు మిక్కుటమైన భక్తితో తాతకు దండనమస్కారం చేసి 'మాదైన యుద్ధంలో చచ్చినవారు ఎక్కడికి పోతారో నాకు తెలియజెప్పుము. (అని అడిగాడు)

క. బ్రదుకును జావును సుఖదుః । ఖదములుగా జంతుకోటి కరుణామూర్తీ!
మదిఁ దలఁచుఁ బ్రాణలాభము । వదలు టరిదిగాన నట్టివారి నడిగితిన్.' 313

ప్రతిపదార్థం: కరుణామూర్తీ!= జాలియే రూపమైన ఓ తాతా!; జంతుకోటి= ప్రాణుల సముదాయం; బ్రదుకును= జీవించి ఉండటాన్నీ; చావును= మరణాన్నీ; సుఖదుఃఖదములుగాన్= సుఖాన్నీ, దుఃఖాన్నీ ఇచ్చేవిగా; మదిన్= హృదయంలో; తలఁచున్= భావిస్తుంది; ప్రాణలాభము= ప్రాణం పొందటం అనేదానిని; వదలుట= విడిచిపెట్టటం; అరిది= చాలా అపురూపమైన విషయం; కానన్= కనుక; అట్టివారిన్= ఆ విధంగా ప్రాణం వదలినవారిని గూర్చి; అడిగితిన్= అడిగాను.

తాత్పర్యం: దయామూర్తీ! ప్రాణులు బ్రదుకు సుఖమిచ్చేదనీ, చావు దుఃఖాన్నీ కలిగిస్తుందనీ మనస్సులో భావిస్తూ ఉంటారు. ఉన్న ప్రాణాన్ని వదలుకొనటం చాలా అరుదు. కనుక అట్టివారిని గూర్చి అడిగాను.

విశేషం: సర్వప్రాణకోటికీ మిక్కిలి ప్రియమైనది ప్రాణం. యుద్ధానికి రావటమంటే దానిని చేజేతులా వదలుకొనటానికి సిద్ధపడటమే కదా! ఇది చాలా అరుదైన విషయం. ప్రాణంకంటె మిన్నగా దేనిని ఆశించి జనులు యుద్ధాలలో మరణిస్తారు? అని ధర్మరాజు ఆంతర్యం. 'కరుణామూర్తీ!' అనే సంబోధన చాలా అర్థవంతం. 'యుద్ధంలో నిన్ను నేను రూపుమాపదలచాను. అట్టి నాయందు ఏ విధమైన ద్వేషం పూనక నేను అడిగిన ధర్మాలన్నీ ఆప్యాయంగా చెప్పుతున్నావు. ఇంతకంటె కరుణకు నిదర్శనం ఏమిటి?'అనిస్ఫూర్తి.

క. అనుటయు 'లెస్సగఁ దలఁచితి । విను మొక కీటంబునకును వేదవ్యాసం
బున లోకహితమొనర్చిన । మునికి నయిన సత్కథనము మునినుతచరితా! 314

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; మునినుతచరితా!= మునులు కొనియాడే నడవడిగలవాడా!; లెస్సగన్= మేలుగా; తలఁచితి= భావించావు; ఒక కీటకంబునకును= ఒక పురుగునకూ; వేదవ్యాసంబునన్= వేదాలను విడమరచి చూపటంతో; లోకహితము= లోకం మేలు; ఒనర్చిన మునికిన్= చేసిన మహర్షికీ; అయిన సత్+కథనమున్= జరిగిన మంచి ప్రసంగాన్ని; విను= ఆలకించుము.

తాత్పర్యం: అని అంటే 'మంచివాడా! నీవు చాలా చక్కగా భావించావు. ఒక పురుగునకూ, వేదవ్యాసమహర్షికీ జరిగిన సంభాషణ చెప్పుతాను వినుము.

విశేషం: 'మునినుతచరితా!' అనే సంబోధనపై 'కరుణామూర్తీ' అనే సంబోధనకు సమాధానగర్భితమైనది. 'నీవు యుద్ధంచేయటం లోకసామాన్య విషయంకాదు. దానిని గూర్చి నీవు పశ్చాత్తాపం పొందటమే. నీ శీలం మునులకు కూడా ప్రశంసనీయం అని చెప్పుతున్నది' అనే స్ఫూర్తిని అందులో అందుకొనాలి. వేద... మునికిన్ అని సాగదీయటం గౌరవవిశేషాన్ని అభివ్యక్తం చేయటం కొరకు.

వ. దాన నీ యడిగిన యర్థంబు తెల్లం బగు' నని పలికి భీష్ముం డిట్లనియె. 315

ప్రతిపదార్థం: దానన్= ఆ సంభాషణచేత; నీ+అడిగిన అర్థంబు= నీవడిగిన విషయం; తెల్లంబు= స్పష్టం; అగున్= అవుతుంది; అని; పలికి= మాటాడి; భీష్ముండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ సంభాషణచేత నీవడిగిన విషయం స్పష్టంగా తెలుస్తుంది' అని పలికి భీష్ము డిట్లా అన్నాడు.

క. శకటపథంబునఁ గీటం । బొకటి వెసం బాఱఁ గాంచె యోగీంద్రుఁడు జం
తుకలాప మానసదశా । ప్రకార సంవేది బాదరాయణుఁ డధిపా! 316

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; యోగి+ఇంద్రుఁడు= యోగులలో శ్రేష్ఠుడు; జంతు కలాప మానస దశా ప్రకార సంవేది= జంతువుల సముదాయపు హృదయాలలోని దశల తీరులను చక్కగా తెలిసికొనేవాడు; బాదరాయణుఁడు= శ్రీ వేదవ్యాసుడు; శకటపథంబునన్= బండిదారిలో; కీటకంబు= పురుగు; ఒకటి= ఒకటి; వెసన్= వడిగా; పాఱన్= పరుగెత్తుతూ ఉండగా; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: యోగులలో శ్రేష్ఠుడు, జంతువుల హృదయాల తీరులను చక్కగా తెలిసికొనగలవాడు అయిన వేదవ్యాసుడు బండ్లు నడచేదారిలో ఒక పురుగు వేగంగా పరుగుతీస్తూ ఉండగా చూచాడు.

విశేషం: బాదరాయణుడు - బదరీవనం (రేగుతోట) స్థానంగా కలవాడు యోగీంద్రుడు కనుకనే జంతువుల హృదయభావాలను తెలిసికొనగలుగువాడని భావన.

వ. కాంచి నిరూపించి యాకృష్ణద్వైపాయనుం డక్కీటకంబుతో 'నీవు భయంబున రయం బెసఁగం బాఱెదవు కారణం బేమి?' యని యడిగిన నది యమ్మునీంద్రున కిట్లనియె. 317

ప్రతిపదార్థం: కాంచి= చూచి; నిరూపించి= తనవలన ప్రమాదం కలుగదని దానికి నమ్మకం కలిగించి; ఆ+కృష్ణద్వైపాయనుండు= ఆ వ్యాసమహర్షి; ఆ+కీటకంబుతోన్= ఆ పురుగుతో; నీవు; భయంబునన్= భీతితో; రయంబు= వేగం; ఎసఁగన్= ఎక్కువ

అయ్యే విధంగా; పాఱెదవు= పరుగెత్తుతున్నావు; కారణంబు= హేతువు; ఏమి?; అని అడిగినన్= అడిగితే; అది= ఆ పురుగు; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ మహర్షిశ్రేష్ఠుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: చూచి, దానిని ఆపి, ఆ వ్యాసభగవానుడు ఆ పురుగుతో 'నీవు భయంతో మిక్కిలి వేగంతో పారిపోతున్నావు. దీనికి కారణం ఏమిటి?' అని అడిగితే ఆ పురుగు ఆ మునిశ్రేష్ఠుడితో ఇట్లా అన్నది.

విశేషం: కృష్ణద్వైపాయనుడు - నల్లనివాడు, ద్వీపం స్థానంగా కలవాడు; యమునానది ద్వీపంలో సత్యవతీపరాశరులకు పుట్టి అక్కడ ఉంటూ ఉంటాడు. బదరికావనంలో కూడా ఉంటాడు.

తే. 'తెప్పతెరలంగ బండు లేతెంచుచున్న । యవి మహాత్మ! తన్నేమిజాతారవములుఁ
గడఁక నెడ్లను దఱిమి రొప్పెడు నరాలి । యులివు విని యుల్లమునఁ గడునులుకు పుట్టి. 318

ప్రతిపదార్థం: మహాత్మ!= దొడ్డబుద్ధిగలవాడా!; తెప్పతెరలంగన్= మిక్కిలి వేగంగా; బండులు= బండ్లు; ఏతెంచుచున్న+అవి= వస్తున్నాయి; తత్+నేమి జాత+ఆరవములున్= వాటి చక్రపు పట్టాలనుండి పుట్టిన పెనురొదలు; కడఁకన్= మిక్కిలి పూనికతో; ఎడ్లను= ఎద్దులను; తఱిమి= వెంటబడి; రొప్పెడు నర+ఆలి ఉలివున్= తోలే జనసముదాయాల నాదాన్నీ; విని; ఉల్లమునన్= గుండెలో; కడున్= ఎక్కువ అయిన; ఉలుకు= గుబులు; పుట్టి= కలిగి.

తాత్పర్యం: 'మహాత్మా! మీద మీద వేగంగా బండ్లు వస్తున్నాయి. వాటి పట్టాల చప్పుళ్లు, ఎడ్లను పూనికతో తోలే జనాల అరుపులు విని నా గుండెలో గుబులు పుట్టింది.

వ. బ్రదుకును జావును బరమసుఖంబును నత్యంత దుఃఖంబునుం గాదె? కావున. 319

ప్రతిపదార్థం: బ్రదుకును= జీవితమూ; చావును= మరణమూ; పరమసుఖంబునున్= మిక్కిలి సుఖమూ; అత్యంత దుః ఖంబునున్= మిక్కిలి ఎక్కువ దుఃఖమూ; కాదె?= కదా!; కావునన్= కనుక.

తాత్పర్యం: బ్రదుకు ఎంతో సుఖమైనది. చావు మిక్కిలి దుఃఖాన్ని కలిగించేది కదా! కనుక. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. క్రందున మేను సిదియు నను । కొందల పాటొంది ప్రాణగొడ్డమగుటఁ ద
ప్పం దొలఁగఁ బాఱెదను ముని । బృందారక! యసదె ప్రాణభీతి దలంపన్?' 320

ప్రతిపదార్థం: క్రందునన్= ఒత్తిడిలో; మేను= దేహం; చిదియున్= నలిగిపోతుంది; అను కొందలపాటు= అనే కంగారు; ఒంది= పొంది; ప్రాణగొడ్డము= ప్రాణం పోయేపని; అగుటన్= కావటంవలన; తప్పన్= తప్పించుకొనటానికి; తొలఁగన్+పాఱెదను= తొలగిపోతున్నాను; ముని బృందారక!= మునివరా!; తలంపన్= ఆలోచిస్తే; ప్రాణభీతి= ప్రాణానికి సంబంధించిన భయం; అసదె?= తక్కువదా?

తాత్పర్యం: సందడిలో దేహం నలిగిపోతుందనే కంగారుతో ప్రాణంపోయే పని కనుక తప్పించుకొని తొలగి పోతున్నాను. భావిస్తే ప్రాణభీతి ప్రాణికి తక్కువది కాదు కదా!'

చ. అన విని దాని కిట్టులను నమ్మహితాత్మకుఁ డెంతలెస్స? నీ
మనికి దలంప నింద్రియసమాజసుఖంబులఁ బొందఁ గీటము
ల్గను టదిలేదు దుఃఖబహుళం బిది యీ యొడ లేల? చావు నీ
కనయము సౌఖ్యకారియగు నత్తెఱఁ గీవు దలంచి చూడుమా!' 321

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; ఆ+మహిత+ఆత్మకుఁడు= మిక్కిలి గొప్ప ఆత్మకల ఆ వ్యాసుడు; దానికిన్= ఆ పురుగునకు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు; తలంపన్= భావింపగా; నీ మనికి= నీ బ్రదుకు; ఎంత= ఏ మాత్రం; లెస్స?= మేలైనది? కీటముల్= పురుగులు; ఇంద్రియ సమాజ సుఖంబులన్= ఇంద్రియాల సముదాయంవలన కలిగే సుఖాలను; పొందన్+కనుట= పొందగలగటం; అది= అనేది; లేదు; ఇది+ఈ+ఒడలు= ఈ దేహం; దుఃఖబహుళంబు= దుఃఖాలు పెల్లుగా గలది; ఏల?= ఇట్టిది నీ కెందుకు?; నీకున్= నీకు; చావు= మరణం; అనయము= ఎల్లప్పుడు; సౌఖ్యకారి= సుఖాన్ని కలిగించేది; అగున్= అవుతుంది; ఈవు= నీవు; ఆ+తెఱఁగు= ఆ పద్ధతిని; తలంచి= భావించి; చూడుమా!= చూడుము.

తాత్పర్యం: అన్నమాట విని ఆ మహానుభావుడు దానితో ఇట్లా అన్నాడు. నీ బ్రదుకు ఎంత మేలైనది? పురుగులు ఇంద్రియసుఖాలు పొందే వీలు అంతగా లేదు కదా! పెక్కు దుఃఖాలకు తావైన ఈ దేహం ఎందుకు? నీకు చావే సుఖం కలిగిస్తుంది. ఆ పద్ధతి ఆలోచించి చూడుము.'

విశేషం: తత్త్వం గ్రహించటానికే ఈ ధోరణి కాని నిజంగా దాని చావు వ్యాసుడు కోరుతున్నాడని అర్థం గ్రహించరాదనటం కొరకు "మహితాత్మకుఁడు" అనే పదాన్ని కవి ప్రయోగించాడు.

వ. అనుటయు నక్కీటంబు. 322

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; ఆ+కీటంబు= ఆ పురుగు.

తాత్పర్యం: అని అనగా ఆ పురుగు ఇట్లా అంటున్నది.

తే. 'అనఘ! కీటంబులకు విషయజములైన । సౌఖ్యములఁ బొంద లే దను చదువు గలదె?
వినుము తమతమ తెరువుల ననుభవింపఁ । గలదు చావును భీతికిఁ గారణంబు. 323

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; కీటంబులకున్= పురుగులకు; విషయజములు= శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే విషయాలవలన పుట్టేవి; ఐన సౌఖ్యములన్= అయిన సౌఖ్యాలను; పొందన్= పొందుటకు; లేదు= అవకాశం లేదు; అను చదువు= అనే విద్య; కలదె?= ఉన్నదా?; వినుము; తమతమతెరువులన్= తమ తమదారులలో; అనుభవింపన్= అనుభవించటానికి; కలదు= వీలు ఉన్నది; చావును= చావు కూడా; భీతికిన్= భయానికి; కారణంబు= హేతువు.

తాత్పర్యం: 'మహాత్మా! పురుగులకు విషయసుఖాలు పొందే వీలులేదనే విద్య ఉన్నదా? అవి కూడా తమతమ దారులలో సుఖాల ననుభవిస్తాయి. అట్లాగే చావు భయానికి కారణం అవుతుంది.

వ. నీవు నా మనం బరసి; తింతియ కాక యింత యెఱుంగవే? యది యట్లుండె నా తెఱం గవధరింపు; మేను
దొలుమేన నొక్క శూద్రుండ ధనవంతుండ. 324

ప్రతిపదార్థం: నీవు; నా మనంబు= నా హృదయాన్ని; అరసితి(వి)= పరీక్షించావు; ఇంతియ= ఇంతే; కాక; ఇంత= ఈ మాత్రం; ఎఱుంగవే?= తెలియవా? అది= ఆ విషయం; అట్లు= ఆ విధంగా; ఉండెన్= ఉన్నది; నా తెఱంగు= నా తీరు; అవధరింపుము= చక్కగా వినుము; ఏను= నేను; తొలుమేనన్= పూర్వదేహంలో; ఒక్కశూద్రుండన్= ఒక నాల్గవజాతివాణ్ణి; ధనవంతుండన్= శ్రీమంతుణ్ణి;

తాత్పర్యం: నీవు నా మనస్సును పరీక్షించావు కాని ఈ చిన్న విషయం నీకు తెలియనిదా? అది అట్లా ఉండనిమ్ము. నా సంగతి వినుము. నేను వెనుకటి జన్మలో ఒక శూద్రుడను. గొప్ప ధనం కలవాడను. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఆచారహీనత యతిలోభ మన్యధ । నాపేక్ష క్రూరత యవినయంబు
మొదలైన దుర్గుణంబులకు నెల్లను నెల । వైయుండి మాతకు నధికభక్తిఁ
బ్రీతి యెప్పుడు నొనరింతు; బ్రాహ్మణమాత్రుఁ । డతిథి యొక్కరుఁ డొక యప్పు డరుగు
దెంచిన నతనిఁ బూజించితి నది కార । ణముగ జాతిస్మరణంబు గలిగె

తే. మంచికర్మము సుఖము నొందించు టిపుడు । గాన వచ్చె మునీశ్వర! కరుణ నాకు
నత్తెఱం గెఱింగింపవే!' యతివిశదము । గాఁగ ననవుడు నాతండు గారవమున. 325

ప్రతిపదార్థం: ఆచారహీనత= మంచి నడవడి లేకపోవటం; అతిలోభము= మిక్కిలి పిసినిగొట్టుతనం; అన్య ధన+అపేక్ష= ఇతరుల సొమ్ముపై కోరిక, క్రూరత= దయలేనితనం; అవినయంబు=పెద్దలయెడల నమ్రత లేకపోవటం; మొదలు+ఐన దుర్గుణంబులకున్= మొదలైన చెడు గుణాలకు; ఎల్లను= అన్నింటికీ; నెలవు= నివాసపుచోటు; ఐ; ఉండి= (కూడ); మాతకున్= తల్లికి; అధికభక్తిన్= మిక్కిలి భక్తితో; ఎప్పుడున్= ఎల్లవేళలా; ప్రీతిన్= ప్రియాన్ని; ఒనరింతున్= చేసేవాడిని; ఒక+ అప్పుడు= ఒక సమయంలో; బ్రాహ్మణమాత్రుఁడు= కేవలం పుట్టుకచేత బ్రాహ్మణుడైనవాడు; అతిథి= తిథి నియమంలేకుండా వచ్చినవాడు; ఒక్కరుఁడు= ఒకడు; అరుగుదెంచినన్= రాగా; అతనిన్= అతడిని; పూజించితిన్= గౌరవించాను; అది= ఆ పూజ; కారణముగన్= కారణంగా; జాతి స్మరణంబు= పూర్వజన్మజ్ఞానం తలపగలగటం; కలిగెన్= కలిగింది; ముని+ఈశ్వర!= మునిశ్రేష్ఠా; మంచి కర్మము= మంచిపని; సుఖమున్= సుఖాన్ని; ఒందించుట= కలిగించటం; ఇపుడు= ఇప్పుడు; కానవచ్చెన్= తెలియవచ్చింది; ఆ+తెఱంగు= ఆ పద్ధతి; నాకున్= నాకు; కరుణన్= జాలితో; అతి విశదము= తేటతెల్లం; కాఁగన్= అయ్యేవిధంగా; ఎఱింగింపవే!= తెలుపుమా!; అనవుడున్= అని అంటే; ఆతండు= ఆ వేదవ్యాసుడు; గారవమునన్= ప్రీతితో.

తాత్పర్యం: ఆచారం లేకపోవటం, అత్యాశ, ఇతరుల ధనాన్ని కోరటం, క్రౌర్యం, వినయం పాటించకపోవటం మొదలైన చెడు లక్షణాలకు నివాసభూమిగా ఉన్నాను. అయినా తల్లికి ఎక్కువ భక్తితో ఎప్పుడూ ప్రీతి కలిగించాను. ఒకనాడు ఒక బ్రాహ్మణుడు అతిథిగా వస్తే అతడిని గౌరవించాను. దానివలన పూర్వజన్మస్మరణ కలిగింది. మంచి కర్మం సుఖం కలిగిస్తుంది - అనే సంగతి ఇప్పుడు నాకు తెలిసింది. మునీశ్వరా! దయతో నాకా విషయం తేటతెల్లంగా చెప్పుము' అంటే అతడు బుజ్జగింపుతో. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: ఎన్ని దుర్గుణాలున్నా మంచిపని వ్యర్థం కాదని ఈ పద్యం చెప్తుతున్నది.

వ. ఆ జంతువుం గనుంగొని 'నీవు సెప్పనేల? దుష్కర్మకోటివలనం గీటంబ వగు టెఱింగితి భవదాచరితంబు లైన సత్కర్మంబులుం గాంచితి నమ్మేలునకు సంతోషించి కాదె నీతో సంభాషించితి! మదీయ తపోవిశేషంబున నీదయిన కీటత్వం బపనయించెద విషాదం బపనయింపుము; తపోబలంబును గడచినబలంబులుం గలవే? మనుష్యజన్మంబు నొంది మేలొనర్చెద ననుకోర్కి నీకుం బుట్టుట మేలు; మానవులకుం గర్మభూమికృతంబులైన సదసత్కర్మంబులం జూవె దేవతలును గీటంబులు నగుట వాటిల్లెడు' నని పలికి వెండియు. 326

ప్రతిపదార్థం: ఆ+జంతువున్= ఆ ప్రాణిని; కనుంగొని= చూచి; నీవు; చెప్పన్+ఏల?= చెప్పటం ఎందుకు? దుష్కర్మ కోటివలనన్= పాపపు పనుల ఎక్కువతనంవలన; కీటంబవు= పురుగువు; అగుట= కావటం; ఎఱింగితిన్= తెలిసికొన్నాను; భవత్+ఆచరితంబులు= నీవు చేసినట్టివి; ఐన సత్+కర్మంబులున్= అయిన పుణ్యకార్యాలు కూడా; కాంచితిన్= పరికించాను; ఆ+మేలునకున్= ఆ మంచిపనికి; సంతోషించి= ఆనందించి; కాదె!= కదా!; నీతోన్= నీతో; సంభాషించితిన్= ప్రసంగం చేశాను; మదీయ తపస్+ విశేషంబునన్= నాదైన గొప్పదగు తపస్సుచేత; నీ+అది= నీకు సంబంధించినది; అయిన కీటత్వంబు= అయిన పురుగుతనం; అపనయించెదన్= పోగొట్టుతాను; విషాదంబు= దుఃఖం; అపనయింపుము= తొలగించుకొనుము; తపస్+బలంబును= తపస్సు శక్తిని; కడచిన బలంబులున్= మించిన బలాలు; కలవే?= ఉన్నవా?; మనుష్య జన్మంబున్= మానవుడి పుట్టుకను; ఒంది= పొంది; మేలు= మంచిపని; ఒనర్చెదన్= చేస్తాను; అను కోర్కి= అనే కోరిక; నీకున్= నీకు; పుట్టుట= కలగటం; మేలు= మంచిది; మానవులకున్= మనుష్యులకు; కర్మభూమి కృతంబులు= కర్మలకు సంబంధించిన భూమియందు చేసినట్టివి; ఐన సత్+అసత్+ కర్మంబులన్= మంచి చెడు పనులచేత; చూవె!= సుమా!; దేవతలును= దేవలోకంవారు; కీటంబులును= పురుగులు మొదలగు జంతువులును; అగుట= కావటం; పాటిల్లెడున్= సంభవిస్తుంది; అని; పలికి= మాట్లాడి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ జంతువు చూచి, 'నీవు చెప్పటం ఎందుకు? పాపాల సముదాయంవలన నీవు పురుగు అయిన సంగతి నాకు తెలుసు. నీవు చేసిన పుణ్యకార్యాలు కూడా నేను గుర్తించాను. ఆ మంచిపనికి సంతోషించి కదా - నీతో సంభాషణ చేశాను! నాదైన గొప్ప తపస్సు చేత నీ పురుగుతనాన్ని పోగొడతాను. నీవు విచారం మానుము. తపశ్శక్తిని మించిన శక్తులు లేవు. మనుష్యజన్మం పొంది మంచి పనులు చేస్తాననే కోరిక నీకు కలగటం కూడా మంచిదే. ఇది కర్మభూమి. మనుష్యులు ఇక్కడ చేసిన మంచిపనులవలన దేవతలవుతారు. పాపకార్యాలవలన పురుగులుగా పుట్టుతారు అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

క. సుకృతము లమ్మెయిఁ గల్గుట । నకట! జనిస్మృతియుఁ గల్గె నస్మత్సంద
ర్శకతయు నీకు నొదవె నో । డకు మున్నతపదము నిచ్చుటకు మెయికొంటిన్. 327

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; సుకృతములు= మంచి పనులు; కల్గుటన్= కలిగిన కారణంగా; అకట!= అయ్యో!; జనిస్మృతియున్= పూర్వపు పుట్టుక గుర్తు రావటం; కల్గెన్= కలిగింది; అస్మత్+సందర్శకతయున్= నన్ను చక్కగా చూడగలగటం కూడా; నీకున్= నీకు; ఒదవెన్= కలిగింది; ఓడకుము= భయపడకుము; ఉన్నతపదమున్= గొప్ప స్థానం; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; మెయికొంటిన్= అంగీకరించాను.

తాత్పర్యం: ఆ పుణ్యాలు కలగటంవలననే నీకు పూర్వజన్మ గుర్తుకు రావటం, నన్ను చూడగలగటం కలిగాయి. సంకోచపడకుము. నీకు ఉన్నత స్థానం ఇవ్వటానికి అంగీకరించాను.

వ. అత్తెఱం గాకర్ణింపుము. 328

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ పద్ధతి; ఆకర్ణింపుము= చక్కగా చెవులబెట్టు.

తాత్పర్యం: ఆ తీరు వినుము.

వేదవ్యాసుఁడు గీటంబునకు నుత్తమజన్మంబులు గలుగ ననుగ్రహించుట (సం.13-180-1(కుంభ))

ఆ. నీచ శూద్రవైశ్య నృపజన్మములఁ గ్రమ । వృత్తి నొందు మెపుడుఁ జిత్తమునకుఁ
బు ట్టెఱుంగునట్టి పోఁడిమి నొసఁగితి । ధర్మపరుఁడు వగుదు దానఁ జేసి.' 329

ప్రతిపదార్థం: నీచ శూద్ర వైశ్య నృప జన్మములన్= మనుష్యజన్మకంటె క్రిందివైన గోజన్మ మొదలైనది, శూద్రజన్మ, వైశ్యజన్మ, క్షత్రియుడి పుట్టుక అనే వాటిని; క్రమవృత్తిన్= క్రమమైన తీరుతో; ఒందుము= పొందుము; ఎపుడున్= అన్ని జన్మల సమయాలలోను; చిత్తమునకున్= హృదయానికి; పుట్టు= పుట్టుక; ఎఱుంగు+అట్టి పోఁడిమిన్= తెలిసికొనగల సమర్థతను; ఒసఁగితిన్= ఇచ్చాను; దానన్+చేసి= దానివలన; ధర్మపరుఁడవు= ధర్మమునందు మిక్కిలి ఆసక్తికలవాడవు; అగుదు(వు)= ఔతావు.

తాత్పర్యం: జంతుజన్మలు, శూద్ర, వైశ్య, క్షత్రియ జన్మలు క్రమంగా పొందుము. ఆ అన్ని జన్మలలో నీ హృదయానికి పూర్వజన్మజ్ఞానం కలిగే శక్తి ఇచ్చాను. దాని వలన ధర్మశ్రద్ధకలవాడవు కమ్ము.'

విశేషం: పుట్టెఱుంగుట అంటే ఈ పుట్టుకకు కారణం ఏమిటో తెలియటం. అది తెలిస్తే పాపాచరణకు జీవుడు సిద్ధపడడు.

క. అని సాత్యవతేయుఁడు గృప । నెనసి సుధాధారఁ బోలు నీక్షణముం ద
త్తనువున నిగిడించిన న । మ్మునిపతిఁ గీర్తించె భూతములు ప్రీతములై. 330

ప్రతిపదార్థం: అని= ఇట్లు పలికి; సాత్యవతేయుఁడు= సత్యవతి కుమారుడగు వ్యాసుడు; కృపన్= దయను; ఎనసి= పొంది; సుధాధారన్= అమృతధారను; పోలు+ఈక్షణమున్= పోలునట్టి చూపును; తద్+తనువునన్= అతడి దేహంమీద; నిగిడించినన్= పరపగా; ఆ+మునిపతిన్= మహర్షులలో శ్రేష్ఠుడైన ఆతడిని; భూతములు= ప్రాణులు; ప్రీతములు= ప్రేమకలవి; ఐ; కీర్తించెన్= కొనియాడినవి.

తాత్పర్యం: ఇట్లా పలికి, వ్యాసుడు దయ పూని అమృతధారవంటి చూపును ఆ పురుగు దేహంమీద సారించాడు. అప్పుడు సర్వభూతాలు ప్రీతిపొంది, ఆ మహర్షిని కొనియాడాయి.

క. అక్కీటంబును భక్తిన్ । మ్రొక్కి శిరం బతని పాదముల మోపి మనం
బెక్కుడు ప్రమోదమునఁ గడుఁ । జొక్కఁగఁ దదనంతరమ యసువులం దొఱఁగెన్. 331

ప్రతిపదార్థం: ఆ+కీటంబును= ఆ పురుగు కూడా; భక్తిన్= భక్తితో; మ్రొక్కి= చాగిలపడి; శిరంబు= తల; అతని పాదములన్= అతడి పాదాలమీద; మోపి= ఆనించి; మనంబు= మనస్సు; ఎక్కుడు ప్రమోదమునన్= ఎక్కువ అయిన గొప్ప ఆనందంతో; కడున్= మిక్కిలిగా; చొక్కఁగన్= పరవశించగా; తద్+అనంతరము+అ= ఆ వెనువెంటనే; అసువులన్= ప్రాణాలను; తొఱఁగెన్= వదలినది.

తాత్పర్యం: ఆ పురుగు భక్తితో చాగిలపడి, తల నతడి పాదాల దగ్గర ఆన్చి, హృదయం ఆనందంతో ఎంతో పరవశించిపోతూ ఉండగా వెనువెంటనే ప్రాణాలు వదలింది.

వ. కారుణికత్వధుర్యుం డగు నప్పారాశర్యుం డట్లవలీల మేలొనర్చి కీటంబుం గృతార్థంబుంజేసి నిజేచ్ఛం జనియె నదియు నమ్మహానుభావు నిర్దేశించిన తెఱంగున జనియించుచు ననేకపుణ్యంబు లాచరించుచు నృపజన్మంబునం బూజ్యంబైన రాజ్యంబు నొంది. 332

ప్రతిపదార్థం: కారుణికత్వ ధుర్యుండు= దయకలిగి ఉండటంలో మిక్కిలి గొప్పవాడు; అగు+ఆ+పారాశర్యుండు= అయిన ఆ పరాశరమహర్షి కుమారుడగు వ్యాసుడు; అట్లు= ఆ విధంగా; అవలీలన్= మిక్కిలి తేలికగా; మేలు= శుభం; ఒనర్చి= కలిగించి; కీటంబున్= పురుగును; కృత+అర్థంబున్= నెరవేరిన ప్రయోజనంకల దానిని; చేసి; నిజ+ఇచ్ఛన్= తన ఇష్టమును అనుసరించి; చనియెన్= వెళ్ళాడు; అదియున్= ఆ పురుగున్నూ; ఆ+మహా+అనుభావు నిర్దేశించిన; తెఱంగునన్= ఆ మహాత్ముడు తెలియజెప్పిన తీరున; జనియించుచున్= పుట్టుతూ; అనేక పుణ్యంబులు= పెక్కు పుణ్యాలు; ఆచరించుచున్= చేస్తూ; నృపజన్మంబునన్= క్షత్రియ జన్మంలో; పూజ్యంబు= ఎక్కువ మన్నించదగినది; ఐన రాజ్యంబున్= అయిన రాజ్యాన్ని; ఒంది= పొంది.

తాత్పర్యం: దయాశాలి అయిన వ్యాసుడు ఆ విధంగా మిక్కిలి సులభంగా మేలుచేసి, ఆ పురుగును కృతార్థం చేసి తన ఇచ్చచొప్పున వెళ్ళాడు. అది కూడా ఆ మహాత్ముడు చెప్పిన తీరున పుట్టుతూ; ఎన్నో పుణ్యాలు చేస్తూ రాజజన్మంలో మహనీయమైన రాజ్యం పొంది. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఏనుంగు నెక్కి పెక్కేనుంగు లిరుగడ । రాఁ దురంగంబుల రమణ యొప్ప
గొడుగులుం బడగలు ముడివడ గాయక । వందిపాఠకుల రవంబు లెసఁగ
భూషణంబుల రత్నపుంజంబు దీప్తులు । దిక్కుల నెల్లను దీఁటుకొనఁగ
సామంతకవిజన సీమంతినీముఖ । పరివారవైభవస్ఫురణ మలర

తే. దేవపతి వోలె సాత్యవతేయు నాశ్ర । మమున కేతెంచి తత్పాదకమల మాత్మ
ముకుట సంగతముగఁ జాఁగి మ్రొక్క గరుణ । నాతఁ డెత్తి తన్మస్తక మక్కుఁజేర్చె. 333

ప్రతిపదార్థం: ఏనుంగున్= ఏనుగును; ఎక్కి; పెక్కు= చాలా; ఏనుంగులు= ఏనుగులు; ఇరుగడన్= రెండువైపులా; రాన్= రాగా; తురంగంబుల రమణ= గుర్రాల సొంపు; ఒప్పన్= అందగించగా; గొడుగులున్= తెల్లని గొడుగులు; పడగలున్= జెండా గుర్తులు; ముడివడన్= చిక్కుపడుచుండగా; గాయక వంది పాఠకుల రవంబులు= పాటగాండ్రయొక్క, స్తోత్రపాఠకులయొక్క నాదాలు; ఎసఁగన్= అతిశయించగా; భూషణంబుల రత్నపుంజంబు దీప్తులు= ఆభరణాలయందలి రత్నాలరాసుల కాంతులు; దిక్కులన్= దిక్కులందు; ఎల్లను= అంతటా; దీఁటుకొనఁగన్= నిండుకొనగా; సామంత= సామంతరాజులు; కవిజన= కవిజనులు; సీమంతినీ= సుందరాంగులు; ముఖ= మొదలైన; పరివార= వెంటనంటి యుండేవారి; వైభవ స్ఫురణము= విభవపు స్ఫూర్తి; అలరన్= ఒప్పారగా; దేవపతి పోలెన్= దేవేంద్రుడివలె; సాత్యవతేయు+ఆశ్రమమునకున్= వ్యాసుడి ఆశ్రమానికి; ఏతెంచి= వచ్చి; తద్+పాదకమలము= అతడి పాదం అనే పద్మాన్ని; ఆత్మ ముకుట సంగతముగన్= తన కిరీటంతో తాకినదిగా; చాఁగి= సాష్టాంగపడి; మ్రొక్కన్= నమస్కరించగా; ఆతఁడు= ఆ వేదవ్యాసుడు; కరుణన్= దయతో; ఎత్తి= లేవదీసి; తద్+మస్తకము= అతడి తలను; అక్కు= రొమ్మున; చేర్చెన్= చేర్చాడు.

తాత్పర్యం: పెద్ద ఏనుగు నెక్కి, రెండువైపుల ఎన్నో ఏనుగులు రాగా, గుర్రాల సొంపులు ఒప్పుతుండగా, గొడుగులు, జెండాలు ముడివడుతుండగా, గాయకులు, స్తోత్రాలవాళ్ళూ చేసే ధ్వనులు మిన్నుముట్టుతుండగా, ఆభరణాల రత్న సముదాయాల కాంతులు దిక్కులందు వ్యాపించగా, సామంతులు, కవులు, పుణ్యస్త్రీలు మొదలైన పరివారపు వైభవం ఒప్పుతుండగా దేవేంద్రుడివలె వ్యాసుడి ఆశ్రమానికి వచ్చి, అతడి పాదపద్మాలకు తన కిరీటం తాకే విధంగా సాష్టాంగ దండప్రణామం చేయగా దయతో ఆతడు అతడిని పైకి లేవదీసి, ఆతడి తలను తన రొమ్మున హత్తుకొన్నాడు.

విశేషం: ఒక చిన్న మంచిపనివలన ఎంత మహాఫలం పొందవచ్చునో చెప్పటానికి సుదీర్ఘమైన ఈ పద్యాన్ని కవి ప్రయోగించారు. ఇది ఇతరుల స్ఫూర్తికి దోహదం చేస్తుంది.

వ. ఇ ట్లత్యాదరంబున సంభావించి శిష్యజనంబు నియోగించి. 334

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అత్యాదరంబునన్= మిక్కిలి ప్రేమతో; సంభావించి= మన్నించి; శిష్యజనంబున్= శిష్యులైన వారిని; నియోగించి= ఆదేశించి.

తాత్పర్యం: ఇట్లు మిక్కిలి ప్రేమతో మన్నించి, శిష్యులను ఏర్పాటు చేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. రాజన్య సముచితంబగు । పూజావిధి యాచరించి పురుషోత్తమ! నీ
వీజన్మంబున సన్ముని । రాజికి వెఱఁ గగు తపశ్చరణ మొందవనా! 335

ప్రతిపదార్థం: రాజన్య సముచితంబు= రాచబిడ్డకు తగినది; అగు పూజావిధి= అయిన మన్నన కార్యం; ఆచరించి= చేసి; పురుష+ఉత్తమ!= పురుషులలో శ్రేష్ఠుడా!; నీవు; ఈ జన్మంబునన్= ఈ పుట్టుకలో; సత్+మునిరాజికిన్= ఉత్తములైన మునుల వరుసకు; వెఱఁగు= ఆశ్చర్యం కలిగించేది; అగు తపస్+చరణము= అయిన తపస్సును చేయటం; ఒందవనా!= పొందుమయ్యా!

తాత్పర్యం: రాజకుమారుడికి తగిన మర్యాదలు చేసి 'ఉత్తమపురుషుడా! నీవు ఈ జన్మంలో ఉత్తమ మునులకు కూడా ఆశ్చర్యం గొలిపే తపస్సు చేయవయ్యా!

క. గోవులకై యొండెను వి । ప్రావలికై యొండె నిర్భరాహవకేలీ
ప్రావీణ్యము మెఱసి విడువు । నీ వసువులు దాన నధిక నిర్మలత యగున్. 336

ప్రతిపదార్థం: గోవులకున్+ఐ= ఆవులకొరకు; ఒండెను= కాని; విప్ర+ఆవలికిన్+ఐ=విద్వజ్జనులైన బ్రాహ్మణులకొరకు; ఒండెను= కానీ; నిర్భర+ఆహవ కేలీ ప్రావీణ్యము= నిండైన యుద్ధపు ఆటలో మిక్కిలి నేర్పు; మెఱసి= ప్రకాశింపజేసి; నీవు; అసువులు= ప్రాణాలు; విడువు= వదలుము; దానన్= దానిచేత; అధిక నిర్మలత= ఎక్కువ దోషంలేని స్థితి; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఆవులకొరకు గానీ, విప్రులకొరకుగానీ గొప్ప యుద్ధనైపుణ్యం వెలువడజేసి, నీవు ప్రాణాలు వదలుము. దానితో నీకు మిక్కిలి నిర్మలత్వం కలుగుతుంది.

విశేషం: గోవులు దేహపుష్టికీ, విప్రులు బుద్ధిపుష్టికీ తగిన వస్తుభావాలను ప్రజలకు అందిస్తూ ఉంటారు. కనుక వారికొరకు ప్రాణత్యాగం చేయటం పవిత్రకర్తవ్యంగా ప్రాచీనులు భావించారు. పైగా విప్రు డంటే అధ్యాత్మవిద్యాసంపన్నుడు.

వ. ఇట్లు నిష్కల్మషత్వంబు సిద్ధించిన. 337

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిస్+కల్మషత్వంబు= పాపంలేనితనం; సిద్ధించినన్= ఏర్పడితే.

తాత్పర్యం: ఈ విధంగా దోషంలేనితనం సిద్ధిస్తే. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ధరణీసురజనన మహిమ । దొరకొను నీ 'కని విధించి దుర్దాంతరిపు
స్ఫురణహరణపరిణతు న । న్నరపతి వీడ్కొల్పె మునిజనంబులు వొగడన్. 338

ప్రతిపదార్థం: ధరణీసుర జనన మహిమ= బ్రాహ్మణ జన్మ అనే గొప్ప స్థితి; నీకున్= నీకు; దొరకొనున్= లభిస్తుంది; అని; విధించి= ఆజ్ఞాపించి; దుర్దాంతరిపు స్ఫురణ హరణ పరిణతున్= అణపశక్యం కాని శత్రువుల విజృంభణను పోగొట్టటంలో పాండిత్యంగల; ఆ+నరపతిన్= ఆ రాజును; మునిజనంబులు= మునులు; పొగడన్= కొనియాడగా; వీడ్కొల్పెన్= పంపించాడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణజన్మ అనే మహనీయస్థితి నీకు కలుగుతుంది' అని చెప్పి అణపశక్యం కాని శత్రువులను రూపుమాపే ప్రజ్ఞగల ఆ రాజును మునులు కొనియాడుతూ ఉండగా పంపాడు.

విశేషం: దుర్దాంతరిపులు - అంతరంగశత్రువులు కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యాలు. ఈ శత్రువులను రూపుమాపే ప్రజ్ఞకలవాడే బ్రహ్మణశబ్దం పొందుతాడని స్ఫురించే అర్థం.

తే. అతఁడు నానంద సంభరితాంతరంగుఁ । డగుచు దండప్రణామంబు లాచరించి
యరిగి యమ్ముని చెప్పిన యట్ల చేసి । భూమిసురజన్మలాభంబుఁ బొందె నధిప! 339

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అతఁడును= ఆ రాజు కూడా; ఆనంద సంభరిత+అంతరంగుఁడు= ఆనందంతో బాగా నిండిన హృదయం కలవాడు; అగుచున్= అవుతూ; దండ ప్రణామంబులు= సాష్టాంగనమస్కారాలు; ఆచరించి= చేసి; అరిగి= వెళ్ళి; ఆ+ముని= ఆ మహర్షి; చెప్పిన+అట్లు+అ= చెప్పినట్లే; చేసి= ఆచరించి; భూమిసుర జన్మ లాభంబున్= బ్రాహ్మణజన్మమనే ప్రయోజనాన్ని; పొందెన్= పొందాడు.

తాత్పర్యం: రాజా! అతడున్నూ ఆనందంతో నిండిన అంతరంగం కలవాడై సాష్టాంగనమస్కారాలు చేసి వెళ్ళి ఆ ముని చెప్పినట్లే ఆచరించి, బ్రాహ్మణజన్మ పొందాడు.

విశేషం: దండప్రణామం - దండం అంటే కర్ర. దానివలె నేలకు దేహాన్ని ఆన్చి చేసే నమస్కారం. దీనివలన 'నేను సర్వావయవాలతో నీకు విధేయుడనై ఉంటా' నని చెప్పినట్లవుతుంది.

వ. ఇవ్విధంబున సద్విజుండై. 340

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ తీరున; సత్+ద్విజుండు= ఉత్తమ బ్రాహ్మణుడు; ఐ= అయి.

తాత్పర్యం: ఈ విధంగా ఉత్తమబ్రాహ్మణుడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ద్విజుడంటే రెండు జన్మలు గలవాడు. మాతృగర్భం నుండి పుట్టట ఒక జన్మ. ఉపనయనాది సంస్కారాలతో రెండవ జన్మ. "సంస్కారా ద్విజ ఉచ్యతే" - సంస్కారంవలన ద్విజుడు అనబడతాడు.

క. పుణ్య స్థలముల నెల్ల న । గణ్యము లగు యూపములు ప్రకాశములుగఁ గ
ర్మణ్యతయు వివిధ రత్న హి । రణ్యాదిక దానములును బ్రస్తుతి కెక్కన్. 341

ప్రతిపదార్థం: పుణ్యస్థలములన్= పవిత్రమైన క్షేత్రాలలో; ఎల్లన్= అన్ని చోటులందు; అగణ్యములు= లెక్క పెట్ట శక్యము కానివి; అగు యూపములు= అయిన కట్టుకొయ్యలు (యజ్ఞపశువును కట్టివేసే స్తంభాలు); ప్రకాశములుగన్= అందరకు తెలిసే విధంగా; కర్మణ్యతయున్= కర్మమందు నిష్ఠయు; వివిధ రత్న హిరణ్య+ఆది దానములు= అనేకములైన రత్నాలు, సువర్ణాలు మొదలైన దానములతో; ప్రస్తుతికిన్= గొప్ప ప్రశంసకు; ఎక్కన్= ఎక్కునట్లుగా.

తాత్పర్యం: పుణ్యక్షేత్రాలన్నింటిలో లెక్కలేనన్ని యూపస్తంభాలు, అందరకూ కనపడే విధంగా కర్మమందు నిష్ఠ, అనేక రత్నాలు, సువర్ణాలు మొదలైన దానాలతో ప్రశంస కెక్కగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అధ్వరంబు లనేకంబు లాచరించి । యతఁడు మఱియును బాదరాయణునిఁ గాంచె
సదయచిత్తత నప్పరాశరసుతుండు । వీడుకొలుపంగఁ జని యశోవిభవ మెసఁగ. 342

ప్రతిపదార్థం: అధ్వరంబులు= యజ్ఞాలు; అనేకంబులు= పెక్కులు; ఆచరించి= చేసి; అతఁడు= ఆ వ్యక్తి; మఱియును= మరొక మారు; బాదరాయణునిన్= వేదవ్యాసుడిని; కాంచెన్= సందర్శించాడు; ఆ+పరాశరసుతుండు= పరాశరుడి కుమారుడు వ్యాసుడు; సదయచిత్తతన్= దయతో కూడిన హృదయం కలవాడితనంతో; వీడుకొలుపంగన్= సెల వొసంగి పంపగా; చని= వెళ్ళి; యశోవిభవము= కీర్తియొక్క వైభవం; ఎసఁగన్= వృద్ధి పొందగా.

తాత్పర్యం: యజ్ఞా లెన్నో చేసి, అతడు మరొక మారు శ్రీ వేదవ్యాసులను సందర్శించాడు. ఆ మహర్షి మిక్కిలి దయగల హృదయంతో పంపగా వెళ్ళి, కీర్తిధనం వృద్ధిపొందగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వ్రతశీలతఁ బరఁగి తుదిన్ । శతమఖునకు నగ్గలంపు సఖుఁడై యమరా
ర్చిత సంస్తుతభవ్యపద । స్థితి నవ్యయ పరమసౌఖ్య సిద్ధిం దనరెన్. 343

ప్రతిపదార్థం: వ్రతశీలతన్= వ్రతములయందు శీలం కల తనంతో; పరఁగి= ఒప్పారి; తుదిన్= కడకు; శతమఖునకున్= దేవేంద్రుడికి; అగ్గలము+సఖుఁడు= గొప్పమిత్రుడు; ఐ= అయి; అమర+అర్చిత సంస్తుత భవ్య పద స్థితిన్= దేవతలచేత పూజింపబడి కొనియాడదగిన, శ్రేష్ఠమైన స్థానంలోని ఉనికిచేత; అవ్యయ పరమ సౌఖ్య సిద్ధిన్= ఎన్నటికి తరుగువోని అత్యుత్తమ సుఖం కలగటంతో; తనరెన్= ఒప్పారాడు.

తాత్పర్యం: వ్రతం శీలంగా గలవాడై, చివరకు దేవేంద్రుడికి గొప్ప మిత్రం అయి, దేవతలు పూజించే కొనియాడదగిన శ్రేష్ఠమగు స్థానంలో ఉండి, తరుగువోని పరమసుఖం సిద్ధించినవాడై ప్రకాశించాడు.

విశేషం: 'శీలం' అంటే స్వభావం. వ్రతాలు చేయటం అతడికి స్వభావంగా అయిందని భావం. శతమఖ శబ్దం సార్థకం. ఈతడు పెక్కు యజ్ఞాలు చేశాడు. నూరు యజ్ఞాలు చేసినవాడు దేవేంద్రు డవుతాడు. కనుక ఇతడు అతడికి సఖుడైనాడు. అంతేకాదు, ఇన్ని యజ్ఞాలు చేసికూడా మంచితనంచేత దేవేంద్రుడికి అసూయాస్థానం కాలేదు. సఖు డంటే సమప్రాణుడు.

వ. అని చెప్పి భీష్ముండు. 344

ప్రతిపదార్థం: అని; చెప్పి; భీష్ముండు= భీష్ముడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. మనుజేంద్ర! కురుక్షేత్రం । బున నద్భుతఘోరసమరమున నమ్మాడ్కిం
దనువులు దొఱఁగిన నృపులకు । ననంత సుఖగతులు గల్గు టనుమానంబే? 345

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= రాజా!; కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రంలో; అద్భుత, ఘోర సమరమునన్= అద్భుతం, భయంకరం అయిన యుద్ధంలో; ఆ+మాడ్కిన్= ఆ విధంగా; తనువులు= దేహాలు; తొఱఁగిన నృపులకున్= వదలిన రాజులకు; అనంతసుఖగతులు= అంతంలేని సుఖ స్థితులు; కల్గుట= కలగటం; అనుమానంబే?= సందేహమా?

తాత్పర్యం: రాజా! కురుక్షేత్రంలో అద్భుతభయంకర యుద్ధంలో దేహాలు వదలిన రాజులకు అనంత సుఖాలుగల గతులు కలగటంలో అనుమానం ఏమీ లేదు.

వ. భవదీయబంధు లందఱు నూర్ధ్వలోక ప్రాప్తుల; నీ వేమియు ననుమానింపకు' మని పలికినం బాండవాగ్రజుండు పరమసంతోషభరితాంతఃకరణుండై సురసరిత్సూనుతో 'విద్యా తపోదానంబులలో నెయ్యది విశేషం బెఱింగింపవే!' యనుటయు నమ్మహీపతి నమ్మహామతి గౌరవంబునం గనుంగొని. 346

ప్రతిపదార్థం: భవదీయబంధులు= నీ చుట్టాలు; అందఱున్= అందరూ; ఊర్ధ్వలోక ప్రాప్తులు+అ= పై పుణ్యలోకాలను పొందినవారే; నీవు; ఏమియున్= ఏమీ; అనుమానింపకుము= సందేహించవద్దు; అని; పలికినన్= పలికితే; పాండవ+అగ్రజుండు= పాండుడి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; పరమ సంతోష భరిత+అంతఃకరణుండు+ఐ= గొప్ప సంతోషంతో నిండిన హృదయం కలవాడై; సురసరిత్+సూనుతోన్ దేవతలనది గంగ కొడుకు భీష్ముడితో; విద్యా తపస్+దానంబులలోన్= విద్య, తపస్సు, దానం - అనే వాటిలో; ఏ+అది= ఏది; విశేషంబు?= గొప్పది; ఎఱింగింపవే?= దయతో చెప్పుము!; అనుటయున్= అనగా; ఆ+మహీపతిన్= ఆ రాజును; ఆ+మహామతి= గొప్పబుద్ధిశాలి అయిన భీష్ముడు; గౌరవంబునన్= దొడ్డబుద్ధితో; కనుంగొని= చూచి.

తాత్పర్యం: నీ చుట్టాలందరూ పైనున్న ఉత్తమలోకాలను పొందినవారే. నీ వేమీ అనుమానపడకుము అని చెప్పగా ధర్మరాజు పరమసంతోషంతో నిండిన హృదయం కలవాడై భీష్ముడితో 'విద్య, తపస్సు, దానం అనే వాటిలో ఏది గొప్పది? దయ చేసి తెలుపుము' అనగా ఆ రాజును ఆ బుద్ధిశాలి మన్ననతో చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: గౌరవం - అంటే గురుభావం. ఇక్కడ ఆ అర్థాన్ని గ్రహింపరాదు. అడిగినది గొప్ప విషయం కనుక అడిగిన వాడియందు గొప్పవాడు అనే భావన కలిగిందనే అర్థం గ్రహించాలి.

తే. 'వ్యాసమైత్రేయ పుణ్యసంవాద మనఘ! వినిన నీ ప్రశ్నమున కది విశదమైన
యుత్తరంబగు నేకాగ్రచిత్తవృత్తి। వగుమ! నీ 'వని పల్కి యిట్లనియె నధిప! 347

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; వ్యాస మైత్రేయ పుణ్యసంవాదము= వ్యాసుడు, మైత్రేయుడు అనేవారి పవిత్రమైన సంభాషణం; వినినన్= వింటే; అది; నీ ప్రశ్నమునకున్= నీ ప్రశ్నకు; విశదము= స్పష్టము; ఐన+ఉత్తరంబు= అయిన సమాధానం; అగున్= అవుతుంది; నీవు; ఏక+అగ్ర చిత్తవృత్తివి= చెదరని మనస్సుతీరు కలవాడవు; అగుము!= కమ్ము!; అని; పల్కి= పలికి; అధిప= రాజా!; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: పుణ్యాత్మా! వ్యాసమైత్రేయ సంవాదం వింటే అది నీ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవుతుంది. మనస్సును చెదరనీయకుము' అని భీష్ముడు పలికి ఇట్లా అన్నాడు జనమేజయమహారాజా!

విశేషం: ఇక్కడ అధిప! అనే సంబోధన జనమేజయుడికి సంబంధించినది, అనఘ- ధర్మరాజుకు సంబోధన వక్తలు క్రమంగా వైశంపాయనుడు, భీష్ముడు.

వ్యాసమైత్రేయ సంవాదము భీష్ముఁడు ధర్మరాజునకుఁ జెప్పుట (సం.13-182-1(కుంభ))

సీ. 'వ్యాసమునీంద్రుండు వారాణసీపురి। కరిగి మున్ మైత్రేయుఁ డచట నునికి
నాతని యున్నెడ కప్రకాశతఁ జన్న। నెఱిఁగి యమ్మహితాత్ముఁ డెఱఁగి భక్తిఁ
బూజించి యుత్కృష్టభోజనంబునఁ దృప్తి। సేసిన నధికవికాసరుచిర
ముఖుఁడైన యమ్మహామునిఁ జూచి 'మోదమ। గ్గలమయి మీయందుఁ గానఁబడియెఁ

తే. గారణంబేమొకో?' యని గారవమున। నాతఁ డడిగిన నతఁ డధికాదరమునఁ
'దపము శ్రుత మాదిగాఁ గల ధర్మకోటి। లోన నెల్లను నధికంబు దాన' మనియె. 348

ప్రతిపదార్థం: వ్యాసముని+ఇంద్రుండు= వ్యాసమహర్షి; వారాణసీ పురికిన్= కాశీపట్టణానికి; అరిగి= వెళ్ళి, మున్= ముందుగా; మైత్రేయుఁడు= మైత్రేయుడనే ముని; అచటన్= ఆ తావున; ఉనికిన్= ఉండటంవలన; ఆతని+ఉన్న+ఎడకున్= ఆతడున్నచోటునకు; అప్రకాశతన్= గూఢంగా; చన్నన్= పోగా; ఆ+మహిత+ఆత్ముఁడు= దొడ్డ ఆత్మశక్తిగల ఆ ముని; ఎఱిఁగి= తెలిసికొని; భక్తిన్= భక్తితో; ఎఱఁగి= దండ ప్రణామం చేసి; పూజించి= పూజ గావించి; ఉత్కృష్ట భోజనంబునన్= మేలైన ఆహారంతో; తృప్తి+చేసినన్= తృప్తి కలిగించగా; అధిక వికాస రుచిర ముఖుఁడు= ఎక్కువగా వికసించిన అందమైన ముఖం కలవాడు; ఐన ఆ+మహామునిన్= అయిన ఆ గొప్ప మునిని; చూచి; మీయందున్= మీయందు; మోదము= ఆనందము; అగ్గలము+అయి= ఎక్కువ అయి; కానన్+ పడియెన్= కనపడుతున్నది; కారణంబు= హేతువు; ఏమి+ఒకో!= ఏదో కదా!; అని; గారవమునన్= గౌరవంతో; ఆతఁడు= ఆ మైత్రేయుడు; అడిగినన్= అడిగితే; అతఁడు= ఆ వ్యాసుడు; అధిక+ఆదరమునన్= మిక్కిలి ప్రీతితో; తపము= తపస్సు; శ్రుతము= విద్య; ఆదిగాన్= మొదలుగా; కల ధర్మకోటి లోనన్= కల ధర్మాల సముదాయంలో; ఎల్లను= అన్నింటియందు; దానము= త్యాగం, ఇవ్వటం అనేది; అధికంబు= గొప్పది; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసమహర్షి కాశీనగరానికి వెళ్ళాడు. అక్కడ అంతకుముందే ఉన్న మైత్రేయమహర్షి దగ్గరకు గుట్టుగా వెళ్ళాడు. ఆ మహానుభావుడు గుర్తుపట్టాడు. పరమభక్తితో చాగిలపడి నమస్కరించి పూజించి, శ్రేష్ఠమైన భోజనం

పెట్టి, తృప్తిపరచాడు. దానితో వ్యాసుడి ముఖం ఎంతో విప్పారి ఆనందంతో సుందరమయింది. అది చూచి మైత్రేయుడు 'మీయందు ఆనందం అత్యధికంగా కానవస్తున్నది. కారణం ఏమిటో?' అని మర్యాద ఉట్టిపడుతూ ఉండగా అడిగాడు. అప్పుడు వ్యాసుడు మరింత ఆదరంతో 'తపస్సు విద్య మొదలైన ధర్మాలన్నింటిలో దానం గొప్పది' అన్నాడు.

విశేషం: అప్రకాశతన్ - తానెవరో తెలియనీయకుండా వ్యాసుడు వెళ్లాడు. మహానుభావులను ఎట్లాగైనా మన్నిస్తారు. సాధారణ వ్యక్తిగా వెళ్ళినప్పుడు చేసే మర్యాద తీరునుబట్టి మనిషి హృదయౌన్నత్యం తెలుస్తుంది.

వ. అని మఱియును. 349

తాత్పర్యం: అని ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'దానార్హవస్తువులలో । మానిత మన్నంబ యన్నమయము లసువులున్
మేనుఁ దదీయబలంబును । గాన బుధులు దానిఁ దద్ద గైకొంద్రు మదిన్. 350

ప్రతిపదార్థం: దాన+అర్హవస్తువులలోన్= దానానికి తగిన పదార్థాలలో; అన్నంబు+అ= అన్నమే; మానితము= ఎక్కువ మన్నింపబడినది (గొప్పది); అసువులున్= ప్రాణాలు; మేనున్= దేహమూ; తదీయబలంబును= ఆ దేహానికి చెందిన శక్తీ; అన్నమయములు= అన్నం యొక్క స్వరూపాలే; కానన్= కనుక; బుధులు= వివేకంగలవారు; దానిన్= ఆ అన్నాన్ని; మదిన్= హృదయంలో; తద్దన్= ఎక్కువగా (గొప్పది అనే భావంతో); కైకొంద్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: 'దానం ఇవ్వదగిన వస్తువులలో అన్నమే గొప్పది. ప్రాణాలూ, దేహమూ, దాని బలమూ అన్నం స్వరూపాలే. కనుక పండితులు దానిని మనస్సులో గొప్పదిగా భావిస్తారు.

విశేషం: "అన్నమయం హి సౌమ్య మనః" - సౌమ్యుడా 'మనస్సు అన్నమయం కదా!' అని ఉపనిషద్వాక్యం. అన్నం రక్తం, మాంసం మొదలైన ధాతువులుగా మారు ప్రక్రియను ఆధునికవిజ్ఞానశాస్త్రంతోపాటు ప్రాచీన ఋషులు కూడా సందర్శిం చారనటానికి ఈ పద్యం నిదర్శనం.

క. తప ముల్లము కల్మషముల । నపగతములఁ జేయు విద్య కాస్పదమగు నా
తపసి మహితదానంబున । నుపచితమగు విద్య దపము నుత్కర్షించున్. 351

ప్రతిపదార్థం: తపము= తపస్సు; ఉల్లము కల్మషములన్= మనస్సులోని మాలిన్యాలను; అపగతములన్= తొలగిపోయే వాటినిగా; చేయున్= చేస్తుంది; విద్యకున్= మోక్షసంబంధమైన జ్ఞానానికి; ఆస్పదము= తావు; అగున్= అవుతుంది; ఆ తపసి మహితదానంబునన్= ఆ తాపసుడు చేసిన గొప్ప దానంవలన; విద్య; ఉపచితము= చక్కగా పెంపొందినది; అగున్= అవుతుంది; తపమున్= తపస్సును; ఉత్కర్షించున్= గొప్పదానినిగా చేస్తుంది.

తాత్పర్యం: తపస్సు మనస్సులోని మాలిన్యాల నన్నింటిని తొలగించి వేస్తుంది. విద్యకు అవకాశం కల్పిస్తుంది. ఆ తపసి చేసిన గొప్ప దానంవలన విద్య పెంపొందుతుంది. ఆ విద్య తపస్సును వృద్ధిచేస్తుంది.

విశేషం: తపస్సు అంటే కఠోరములైన నియమాలచేత శరీరాన్ని శుష్కింపజేయటం. దీనివలన మనస్సు వికారాలు నశిస్తాయి. "సరసాహారము రాగహేతువు" అని కదా కవివాక్కు. కనుక ఆహార నియమంవలన మనస్సు అదుపులోనికి వస్తుంది. దుష్ట భావాలు జారిపోతాయి. విద్య అంటే అధ్యాత్మవిద్యయే. మాలిన్యాలు జారిపోయిన మనస్సులోనే అధ్యాత్మవిద్య నిలుస్తుంది. దానం అంటే వస్తుత్యాగం. అది మమకారదోషాన్ని తొలగించి వేస్తుంది. మమకారం బంధానికి కారణం. కనుక తపస్సు చేసి హృదయంలో విద్యను పదిలపరచుకొన్నవాడు దానం చేస్తే అది 'మహితం' - గొప్పది అవుతుంది. దానివలన విద్య మరింత పెరుగుతుంది. అది లోక లోకేశ్వరతత్త్వాలను చక్కగా నిరూపిస్తూ మరల తపస్సును చక్కగా పోషిస్తుంది. ఇట్లా ఇది ఒక మహనీయచక్రం.

క. కాన తపంబును విద్యయు । దానౌదాత్త్య ప్రవర్ధితంబులు విద్యా
నూనత్వం బచ్యుతు గను । దానికి దీపంబు సద్వ్రతప్రవణులకున్. 352

ప్రతిపదార్థం: కాన= కాబట్టి; తపంబును= తపస్సును; విద్యయున్= అధ్యాత్మ జ్ఞానమూ; దాన+ఔదాత్త్య ప్రవర్ధితంబులు= దానపు గొప్పతనంచేత పెంపొందింపబడినవి; సద్వ్రతప్రవణులకున్= మంచి వ్రతాలయందు నిష్ఠ కలవారికి; విద్యా+అనూనత్వంబు= విద్యయొక్క తక్కువకానితనం; అచ్యుతున్= పరమాత్మను; కనుదానికిన్= చూచేదానికి; దీపంబు= చక్కని జ్యోతి.

తాత్పర్యం: కనుక తపస్సూ, విద్యా దానం మహిమచేత పెంపొందుతాయి. విద్యలో లోపం లేకపోవటం చక్కని వ్రతనిష్ఠకలవారికి పరమాత్మను చూపించే దీపం అవుతుంది.

ఉ. కావున నన్నదానమునఁ గా కెటలుండు మహాప్రమోద? మ
త్యావిలచిత్తుఁ డైనను మహత్తరదానమునన్ విశుద్ధ స
ద్భావత నొందు నిక్క' మని పల్కె నరేంద్ర! తపంబు విద్యయున్
దైవత పూజనీయములు దానము వానికిఁ బోషకంబగున్.' 353

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అన్నదానమునన్= అన్నదాన విషయంలో; మహాప్రమోదము= పరమానందం; కాక= కలుగకుండా; ఎటులు= ఏ విధంగా; ఉండున్?= ఉంటుంది?; అతి+ఆవిల చిత్తుఁడు= మిక్కిలి మలినమైన చిత్తం కలవాడు; ఐనను= అయినా; మహత్తర దానమునన్= మిక్కిలి గొప్పదైన (అన్న) దానంచేత; విశుద్ధ సత్+భావతన్= నిర్మలమైన మంచిభావం కల తనాన్ని; ఒందున్= పొందుతాడు; నిక్కము=సత్యము; అని; నరేంద్ర!= రాజా!; పల్కెన్= (వ్యాసుడు) పలికాడు; తపంబున్= తపస్సు; విద్యయున్= విద్య; దైవత పూజనీయములు= దేవతలకు(కూడా) పూజింపదగినవి; దానము= దానం; వానికిన్= ఆ రెండింటికీ; పోషకంబు= పుష్టి కలిగించేది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: కాబట్టి అన్నదానంచేత పరమానందం తప్పక కలుగుతుంది. పరమదుష్టభావాలు కలవాడైనా గొప్పదైన ఈ దానంచేత నిర్మలమూ, మంచిదీ అయిన భావం కలవాడవుతాడు. ఇది సత్యం' అని వ్యాసుడు చెప్పాడు. రాజా! తపస్సు, విద్య దేవతలు కూడా మన్నించే విషయాలు. దానం వాటిని చక్కగా పెంచుతుంది.

విశేషం: వేదం "తస్మా దన్నం దదన్సర్వాణ్యేతాని దదాతి" అంటున్నది. అన్నదానం చేస్తే అన్ని దానాలూ చేసినట్లే.

క. అని శాంతనవుఁడు సెప్పిన । విని కౌంతేయాగ్రజుండు 'విమలమతీ! యం
గనల సమాచారంబులు । వినంగ నే వలతుఁ జెప్పవే తెలియంగన్?' 354

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; శాంతనవుఁడు= శంతనుడి కుమారుడు భీష్ముడు; చెప్పినన్= చెప్పగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతికొడుకులలో పెద్దవాడు యుధిష్ఠిరుడు; విని= ఆలకించి; విమలమతీ!= స్వచ్ఛమైన బుద్ధిగల ఓ తాతా!; అంగనల సమాచారంబులు= స్త్రీలకు సంబంధించిన చక్కని ఆచారాలు; నేన్= నేను; వినంగన్= వినటానికి; వలతున్= ఇష్టపడుతున్నాను; తెలియంగన్= తెలిసే తీరున; చెప్పవే!= చెప్పుమా!

తాత్పర్యం: ఇట్లా భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు 'విమలమతీ! స్త్రీల సమాచారాలు వినగోరుతున్నాను. చక్కగా తెలిసే విధంగా నాకు చెప్పుమా! (అన్నాడు)

వ. అనిన నతండు 'కైకేయీ శాండిలీ సంవాదంబున నిది దెల్లంబగుఁ జెప్పెద విను' మని యిట్లనియె. 355

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతండు= ఆ భీష్ముడు; కైకేయీ శాండిలీ సంవాదంబునన్= కైకేయి, శాండిలి అనే వారి సంభాషణలో; ఇది= నీ వడిగిన విషయం; తెల్లంబు= చక్కగా తెలిపేది; అగున్= అవుతుంది; చెప్పెదన్= చెప్పుతాను; వినుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అంటే భీష్ముడు 'కైకేయీ శాండిలీ సంవాదంలో నీ వడిగిన విషయం స్పష్టమవుతున్నది. చెప్పుతాను వినుము' అని ఇట్లా చెప్పాడు.

తే. సుమన యనియెడు కైకేయి యమరపురము । నందు శాండిలిఁ గని 'భవ్యమైన దివ్య
పదవి యే వర్తనమునఁ జొప్పడియె నీకు? । నతివ! చెప్పుము నా కని యడిగె నధిప! 356

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; సుమన; అనియెడు కైకేయి= అనే పేరుగల కేకయ రాజపుత్రి; అమరపురమునందున్= దేవతల పట్టణం అయిన అమరావతిలో; శాండిలిన్= శాండిలి అనే ఇంతిని; కని= చూచి; అతివ!= కాంతా!; భవ్యము= మిక్కిలి గొప్పది ఐన దివ్యపదవి= అయిన దేవలోకపు స్థానం; నీకున్= నీకు; ఏ వర్తనమునన్= ఎట్టి నడవడివలన; చొప్పడియెన్?= కలిగింది?; నాకున్= నాకు; చెప్పుము= తెలుపుము; అని; అడిగెన్= అడిగింది.

తాత్పర్యం: కేకయరాజపుత్రి సుమన అమరావతిలో శాండిలిని చూచి 'కాంతా! ఇంత శ్రేష్ఠమైన దేవలోక నివాసం నీకు ఏ నడవడితో కలిగిందో నాకు చెప్పుము' అని అడిగింది.

వ. అని యడిగిన యాయమ కయ్యంగన యిట్లనియె. 357

ప్రతిపదార్థం: అని; అడిగిన+ఆ+అమకున్= అడిగిన ఆ ఇంతికి; ఆ+అంగన= ఆ స్త్రీ - శాండిలి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పింది.

తాత్పర్యం: అని అడిగిన సుమనకు శాండిలి ఇట్లా చెప్పింది.

సీ. 'మామకు నత్తకు మార్పల్క, దేవ పి । త్రతిథిపూజనములయందు సొలయ,
నిలువడిఁ దలవాకి లెప్పుడు నెఱుఁగక । పెలుచ నవ్వక శుద్ధి వెలయ విప్ర
భిక్ష యోపిక కల్గి పెట్టుచు వర్తింతు । వలయు కార్యములకు వెలఁది! మగుడఁ
బతివచ్చునప్పుడు భక్తియు వేడ్కయుఁ । బొదల నాసనపాద్యములను సుముఖ

ఆ. భావమునను సేవ పాటింతు, బిడ్డల । శిక్ష వదలఁ, దిట్టఁ జెట్టఁ గనియు,
నాకు వేఱ ప్రియ మనఁగ లేదు; పతిమెచ్చు । వంటకములు చవిగ వండి యిడుదు. 358

ప్రతిపదార్థం: మామకున్= భర్తతండ్రికి; అత్తకున్= మగని తల్లికి; మారు+పల్కన్= ఎదురుమాట చెప్పను; దేవ పితృ+అతిథి పూజనములయందున్= దేవతల, పితృదేవతల, అతిథుల పూజలలో; సొలయన్= విముఖురాలను కాను; ఇలువడిన్= మంచినడతతో; తలవాకిలి= వీథివాకిలి; ఎప్పుడున్= ఎప్పుడూ; ఎఱుఁగక= తెలియక; పెలుచన్= పెద్దగా; నవ్వక; శుద్ధి= పరిశుద్ధత; వెలయన్= చక్కగా కలుగగా; విప్రభిక్ష= మంచి విద్య కలవారికి భిక్షను; ఓపిక= సహనం; కలిగి; పెట్టుచున్= పెట్టుతూ; వెలఁది!= ఓ ఇంతీ!; వలయు కార్యములకున్= చేయవలసిన పనులకు; మగుడన్= తిరిగి; వర్తింతున్= నడచుకొంటాను; పతి= మగడు; వచ్చు+ అప్పుడు= ఇంటికి వచ్చే సమయంలో; భక్తియున్= నిండైన గౌరవమూ; వేడ్కయున్= ఉత్సాహభావం; పొదలన్= కలుగగా; ఆసన పాద్యములను= ఆసనమును, కాళ్ళు కడుగుకొనటానికి నీటిని; సుముఖ భావమునను= అనుకూలభావంతో; సేవ= పరిచర్య; పాటింతున్= కూర్చుతాను; బిడ్డలశిక్షన్= బిడ్డలను తీర్చిదిద్దటాన్ని; వదలన్= విడువను; చెట్టన్= చెడును; కనియున్= చూచి; కూడా; తిట్టన్= నిందించను; నాకున్= నాకు; వేఱు+అ= మరొకటి అయిన; ప్రియము= ఇష్టము; అనఁగన్= అనటానికి; లేదు; పతి మెచ్చు వంటకములు= భర్త మెచ్చే పాకాలు; చవిగన్= రుచిగా; వండి; ఇడుదున్= పెట్టుతాను.

తాత్పర్యం: అత్తమామలకు ఎదురు చెప్పను. దేవపూజలు, శ్రాద్ధములు, అతిథి సపర్యలు అనే పనులలో ఎడమొగం పెట్టను. మంచి నడవడికతో ఉంటాను. వీథివాకిలి తెలియకుండా ఉంటాను. పకపకా నవ్వను. పరిశుద్ధ బుద్ధితో విద్యగలవారికి భిక్షపెట్టుతూ తక్కిన పనులు చూచుకొంటాను. భర్త ఇంటికి వచ్చినప్పుడు పీట వెయ్యటం, కాళ్ళకు నీళ్ళు ఇవ్వటం - మొదలైన పనులు నేనే అనుకూలభావంతో చేస్తాను. బిడ్డలను తీర్చిదిద్దటం అనే పనిని వదలను. ఎక్కడైనా చెడ్డతనం కనిపించినా తిట్టను. నాకు ప్రియమైన దంటూ వేరే ఏమీ లేదు. భర్త ఇష్టపడే వంటలు చేసి పెట్టుతూ ఉంటాను.

విశేషం: 'తలవాకిలి ఎఱుఁగను' అంటే 'వికారభావంతో వీథిజనాలను చూడను' అని భావం. పగలబడి నవ్వటం కొన్ని సందర్భాలలో అవతలి వారికి ఉద్వేగం పుట్టించవచ్చు. శుద్ధి వెలయన్ - ఇక్కడ శుద్ధి బాహ్యాభ్యంతరాలకు సంబంధించినది. స్నానాదులవలన బాహ్యశుద్ధీ, కోపతాపాలు లేనితనంతో ఆంతరశుద్ధీ ఏర్పడుతాయి. 'సుముఖభావం' - భార్యాభర్తల అనురాగం త్రికరణశుద్ధితో కూడినది కావాలి - అని సూచన. చెట్టఁ గనియుఁ దిట్టన్ - ఇది హృదయపు సమస్థితిని, సృష్టిలోని తీరు తెన్నులను నిర్వికారంగా చూడగల హృదయౌన్నత్యాన్నీ సూచిస్తుంది. భారతీయదాంపత్యం మహిమను ఈ పద్యం తెలుపుతుంది. ఇందులోని పవిత్రప్రవర్తన పురుషుడికి కూడా అన్వయించుకొనాలి.

చ. వరుఁ డొక వెంట నెన్నఁడు ప్రవాసగతుం డగు నాఁటఁ గోలె న
ప్పురుషుఁడు వచ్చునంతకును బూవులు పూఁతలు మేలిచీర లా
భరణము లెక్కుడుం జవులపాకవిశేషము లాదరింప నె
ప్పరుసునఁ గొల్చుఁ గూడురువ బంధులకున్ దగ నెమ్మి సల్పుదున్. 359

ప్రతిపదార్థం: వరుఁడు= మగడు; ఒక వెంటన్= ఒక పనిమీద; ఎన్నఁడు= ఏనాడు; ప్రవాసగతుండు= పరదేశం పోయినవాడు; అగున్= అవుతాడో; నాఁటన్+కోలెన్= ఆ దినం మొదలుకొని; ఆ+పురుషుఁడు= ఆ మగవాడు (భర్త); వచ్చు+అంతకును=

వచ్చేవరకు; పూవులు= పూలు; పూఁతలు= సుగంధ ద్రవ్యాల పూతలు; మేలిచీరలు= మేలైన వస్త్రాలు; ఆభరణములు= నగలు; ఎక్కుఁడున్= ఎక్కువ అయిన; చవుల పాక విశేషములు= రుచిగల వంటలు; ఆదరింపన్= ఇష్టపడను; ఏ+పరుసునన్= ఏ విధంగాను; కొల్చున్= ధాన్యాన్ని; కూడు= అన్నాన్ని; ఉరువన్= పారవేయను (వ్యర్థంచేయను); బంధువులకున్= చుట్టాలకు; తగన్= తగు విధంగా; నెమ్మి= ప్రీతిని; సల్పుదున్= చేస్తాను.

తాత్పర్యం: భర్త ఏ పనిమీదనైన పొరుగూళ్ళకు పోతే, ఆనాటినుండి తిరిగి వచ్చేవరకు పూవులు, మైపూతలు, మంచి చీరలు, నగలు, రుచి పాకాల భోజనపదార్థాలు ఆదరింపను. ఏ విధంగానూ ధాన్యపు గింజలను, అన్నాన్నీ వ్యర్థపరచను. బంధువులకు తగు విధంగా ప్రీతి కలిగిస్తాను.

విశేషం: కామభావాన్ని అదుపులో ఉంచుకొనే ప్రయత్నం ఇందులో ప్రస్తావనకు వచ్చింది. 'తగన్' నెమ్మిసల్పుదున్ - అనే చోట 'తగన్' అనే పదం చాలా జాగ్రత్తగా చూడదగినది. ధర్మేతరమైన ప్రీతి బంధువులు కోరితే - అనే శంకను ఈ మాట పరిహరిస్తుంది.

క. గోవులు మొదలగు తిర్య । గ్జీవుల సుఖవృత్తు లరసి చెల్లింతు గృహ
శ్రీ వర్తనంబునకుఁ బతి । భావము సంకటపడంగఁ బలుక నొకటియున్. 360

ప్రతిపదార్థం: గోవులు= ఆవులు; మొదలు+అగు తిర్యక్+జీవుల సుఖ వృత్తులు= మొదలైన పశువులు, పక్షులు అనే ప్రాణుల సుఖమైన బ్రదుకులను; అరసి= చక్కగా తెలిసికొని; చెల్లింతున్= నడిపిస్తాను; గృహశ్రీ వర్తనంబునకున్= ఇంటి సంపద సాగుదలకు; పతి భావము= భర్త మనస్సు; సంకట పడంగన్= చికాకుపడే విధంగా; ఒకటియున్= ఒక్కమాట కూడా; పలుకన్= మాటాడను.

తాత్పర్యం: ఆవులు మొదలైన ప్రాణుల సుఖజీవనాన్ని పరీక్షించి సాగిస్తాను. ఇంటి సంపద సాగుబడి విషయంలో భర్త హృదయం కలతపడే విధంగా ఒక్కమాట కూడా పలుకను.

విశేషం: 'గృహిణీ గృహముచ్యతే' - 'ఇల్లాలే ఇల్లు' అని దాని భావం. దాని కనుగుణంగా ఈ పద్యం బాధ్యతను స్మరింపజేస్తుంది.

తే. అగ్ని యోపి రక్షింతు రహస్యమైన । దాని వెలిపుచ్చ గర్భంబు దాల్చియున్న
యపుడు వాచవు లెల్లను నవులఁ బెట్టి । దాని కెయ్యవి పథ్యముల్ వానిఁ గొందు'. 361

ప్రతిపదార్థం: అగ్ని= అగ్నిహోత్రాన్ని; ఓపి= సహనం దాల్చి; రక్షింతున్= కాపాడుతాను; రహస్యము= ఇతరులకు తెలియరానిది; ఐనదానిన్= అయిన దానిని; వెలిపుచ్చన్= బయటపెట్టను; గర్భంబు= కడుపు; తాల్చి ఉన్న+అపుడు= ధరించి ఉన్న సమయంలో; వాచవులు= నోటి రుచులు; ఎల్లను= అన్నింటినీ; అవులన్= అవతల (దూరంగా); పెట్టి= ఉంచి, దానికిన్= గర్భానికి (కడుపులో ఉన్న బిడ్డకు); ఏ+అవి= ఏయే పదార్థాలు; పథ్యముల్= హితం కలిగించేవో; వానిన్= వాటిని; కొందున్= తీసికొంటాను.

తాత్పర్యం: భర్త నిత్యాగ్నిహోత్రి కనుక ఆ అగ్నిని ఓపికతో కాపాడుతూ ఉంటాను. రహస్యాన్ని బయటపెట్టను. కడుపుతో ఉన్నపుడు నోటి రుచుల నన్నింటినీ దూరంగా ఉంచి, బిడ్డ కేవి మేలు చేస్తాయో వాటినే భుజిస్తాను.

క. అని చెప్పి యట్టి చందం । బున నడచిన సతికి లోకములు రెండును సౌ
ఖ్యనిరూఢి యొసఁగు; బొగ డొం । దు నరుంధతి వోలె నవ్వధూటి నరేంద్రా! 362

ప్రతిపదార్థం: అని; చెప్పి= బోధించి; నర+ఇంద్రా!= రాజా!; అట్టి చందంబునన్= ఆ తీరున; నడచిన సతికిన్= ప్రవర్తించిన పతివ్రతకు; లోకములు= లోకాలు; రెండును= రెండుకూడా; సౌఖ్యనిరూఢి= సుఖపు గట్టి స్థితిని; ఒసఁగున్= ఇస్తాయి; ఆ+వధూటి= అట్టి స్త్రీ; అరుంధతి పోలెన్= వసిష్ఠుడి ధర్మపత్ని అరుంధతివలె; పొగడు= ప్రశంస; ఒందున్= పొందుతుంది.

తాత్పర్యం: అని చెప్పింది. రాజా! ఆ విధంగా ప్రవర్తించిన ఉత్తమవనిత ఇహపరలోకాలలో రెండింటిలో శాశ్వత సుఖం పొందుతుంది. ఆ ఇల్లాలు అరుంధతివలె ప్రశంస కెక్కుతుంది.

విశేషం: ఇక్కడ సుమన వాక్యం పూర్తిచేయటం కనపడుటలేదు. కనుక "అని చెప్పె నట్టి" అనే పాఠం గ్రహించటం మేలు. తరువాతి దంతా అప్పుడు భీష్ముడి వాక్యం అవుతుంది.

క. 'నృప! యీ యాఖ్యానము ప । ర్వపు దినమున భక్తిఁ జదువువారలు విను పు
ణ్య పురుషులును నాయుశ్శ్రీ । లపరిమితము లొంది యమరు లగుదురు పిదపన్

ప్రతిపదార్థం: నృప= రాజా!; ఈ+ఆఖ్యానము= ఈ కథ; పర్వము+దినమునన్= పండుగనాడు; భక్తిన్= భక్తితో; చదువు వారలు= చదివేవారు; విను= ఆలకించు; పుణ్య పురుషులును= పుణ్యంగల మనుష్యులు (అవుతారు); ఆయుస్+శ్రీలు= ఆయువు, సంపద; అపరిమితములు= మేర లేనంతటివి; ఒంది= పొంది; పిదపన్= మరణం తరువాత;అమరులు= దేవతలు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'రాజా! ఈ కథను పర్వపురోజులలో భక్తితో చదివేవారు పుణ్యపురుషులౌతారు. మేరలేని ఆయువును సంపదను పొందుతారు. కడకు దేవత లవుతారు.'

వ. అనిన విని ధర్మనందనుండు 'సర్వశాస్త్రసారంబై శ్రేష్ఠంబగు ననుష్ఠేయం బెయ్యది? పితామహా! యనుగ్రహింపు'మని యభ్యర్థించిన నాపగేయుండు కృపావిధేయుండై 'నారదపుండరీక సంవాదం బాకర్ణింపుము దాన నీయడిగిన యర్థంబు తెలియును దీర్థపరుండును జపతత్పరుండును బుండరీకాభి ధానుండును నైన మహాద్విజుం డొక్కయెడ నారదమహామునిం గని భక్తింబ్రణతుండై యిత్తెఱంగునన యడుగ నతం డతని కిట్లనియె. 364

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని; ధర్మనందనుండు= ధర్మపుత్రుడు; సర్వశాస్త్ర సారంబు+ఐ= అన్ని శాస్త్రాల సారమై; శ్రేష్ఠంబు+అగు= మిక్కిలి గొప్పదైన; అనుష్ఠేయంబు= చేయవలసిన కార్యం; ఏ+అది?= ఏది?; పితామహా= తాతా!; అనుగ్రహింపుము= ప్రసాదించుము; అని; అభ్యర్థించినన్= వినయంతో కోరగా; ఆపగేయుండు= నదికొడుకు భీష్ముడు; కృపా విధేయుండు+ఐ= దయకు లోబడినవాడై; నారద పుండరీక సంవాదము= నారదుడు, పుండరీకుడు అనేవారి సంభాషణ; ఆకర్ణింపుము= వినుము; దానన్= దానియందు; దానిచేత; నీ+అడిగిన అర్థంబు= నీవు అడిగిన విషయం; తెలియును= తెలుస్తుంది; తీర్థపరుండును= పుణ్యస్థలాలయందు పరమాదరం కలవాడు; జపతత్పరుండును= జపంమీద మిక్కిలి శ్రద్ధకలవాడూ; పుండరీక+అభిధానుండును= పుండరీకుడు అనే పేరుగలవాడు; ఐన మహాద్విజుండు= అయిన గొప్ప బ్రాహ్మణుడు; ఒక్క+ఎడన్= ఒకచోట; నారద మహామునిన్= నారద మహర్షిని; కని= చూచి; భక్తిన్= భక్తితో; ప్రణతుండు+ఐ= చాగి మ్రొక్కినవాడై;

ఈ+తెఱంగునన్+అ= నీవు అడిగిన ఈ తీరుననే; అడుగన్= అడిగితే; అతండు= ఆ నారదుడు; అతనికిన్= ఆ పుండరీకుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అన్నమాట విని ధర్మరాజు 'అన్ని శాస్త్రాల సారము, మిక్కిలి గొప్పదీ అయిన ఆచరణ ఏమిటి? తాతా! దయచేసి చెప్పుము.' అని కోరాడు. భీష్ముడు మిక్కిలి దయకు లోబడినవాడై 'నారదపుండరీక సంవాదం వినుము. దానివలన నీవడిగిన విషయం తెల్లమవుతుంది. తీర్థాలు సేవించటం, జపంచేసికొనటం శీలంగాగల పుండరీకుడనే మహర్షి ఒక చోట నారదుడిని చూచి భక్తితో మ్రొక్కి నీ వడిగినట్లే అడిగాడు. అపుడు నారదు డిట్లా చెప్పాడు.

విశేషం: మీద మీద ప్రశ్నలడుగుతున్నా భీష్ముడు సంతోషంతో ఓపికతో సమాధానాలు చెపుతూనే ఉన్నాడు. విసుగు చెందటంలేదు. అదే అతడి "కృపావిధేయత"

నారదపుండరీక సంవాదం బను పరమేతిహాసప్రకారము (సం.13-186-1 (కుంభ))

సీ. 'పరమేష్ఠి చెప్పిన పరమధర్మం బల్ప । ఫణితి మహార్థంబు భవ్యమతికి
శ్రోతవ్యమును బరిజ్ఞాతవ్యమును దాని । విను ప్రకృతికిఁ బర మనఁగఁ బడిన
యిరువ దేనగుతత్త్వ మరయంగ జీవాత్ముఁ । డాతండ సర్వభూతాత్మకుండు
నరుఁడన వెలుఁగు నప్పురుషుని వలనన । కలిగి నారములన వెలసినట్టి

తే. యన్యతత్త్వంబు లతనికి నయన మగుట । నతఁడు నారాయణుం డన నతిశయిల్లు
విశ్వమును దనయంద యావిర్భవింప । విలయ మొంద నద్దేవుండు విభుతఁ బొల్చు. 365

ప్రతిపదార్థం: పరమేష్ఠి= బ్రహ్మ; అల్పఫణితిన్= సులభమైన తీరున; చెప్పిన పరమధర్మంబు= చెప్పిన మిక్కిలి శ్రేష్ఠమైన ధర్మం; మహత్+అర్థంబు= గొప్ప అర్థం కలది; భవ్యమతికిన్= ఉత్తమ బుద్ధికలవాడికి; శ్రోతవ్యమును= వినదగినది; పరిజ్ఞాతవ్యమును= నిండుగా తెలియదగినది; దానిన్= దానిని; విను(ము)= ఆలకించుము; ప్రకృతికిన్= ప్రకృతి అనే తత్త్వానికి; పరము= తరువాతిది; అనఁగన్+పడిన= అనబడిన; ఇరువది+ఏను+అగుతత్త్వము= ఇరవై అయిదవ తత్త్వం; అరయంగన్= పరిశీలించగా; జీవ+ ఆత్ముఁడు= జీవుడనే ఆత్మ; ఆతండు+అ= అతడే, సర్వభూత+ఆత్మకుండు= అన్ని భూతాల స్వరూపం అయినవాడు; నరుఁడు= మానవుడు; అనన్= అనే పేరుతో; వెలుఁగన్= ప్రకాశిస్తాడు; ఆ+పురుషుని వలనన్+అ= అట్టి నరుడనే పురుషుడివలననే; కలిగి= ఏర్పడి; నారములు= నరసంబంధమైనవి అనే అర్థంతో 'నారములు' అనన్= అనగా; వెలసిన+అట్టి అన్యతత్త్వంబులు= రూపు గొన్నట్టి ఇతర తత్త్వాలు; అతనికిన్= ఆ పురుషుడికి; అయనము= స్థానము; అగుటన్= కావటంవలన; అతఁడు= ఆ పురుషుడు; నారాయణుండు= నారాయణుడు; అనన్= అనగా; అతిశయిల్లున్= ఒప్పుతాడు; ఆ+దేవుండు= ఆ దేవుడు; విశ్వమును= ఈ సమస్తమైన ప్రపంచాల సముదాయాన్ని; తనయందున్+అ= తన యందే; ఆవిర్భవింపన్= పుట్టగా; విలయము= కలిసిపోవటం; ఒందన్= పొందగా; విభుతన్= విభుడు అనే భావంతో; పొల్చున్= విరాజిల్లుతాడు.

తాత్పర్యం: 'బ్రహ్మ సులభమైనతీరులో గొప్ప అర్థంతో చెప్పిన పరమధర్మం ఒకటి ఉన్నది. అది పుణ్యబుద్ధి కలవాడు వినదగినది. పరిపూర్ణంగా తెలియదగినది. దానిని వినుము. ప్రకృతి అనే ఇరవైనాలుగవ తత్త్వం ఒకటి ఉన్నది. దానికి తరువాతి తత్త్వం జీవాత్మ. అతడు సర్వభూతాల స్వరూపం అయినవాడు. 'నరుడు' అతడి

వ్యవహారనామం. అతడివలన ఏర్పడిన తక్కిన తత్త్వాలన్నీ నారములు. అతడు నారములు స్థానంగా గలవాడు. కనుక, నారాయణుడు (నార+అయన). ఆ ప్రభువు విశ్వమంతటినీ పుట్టిస్తూ మరల తనలో లీనం చేస్తూ 'విభుడు' అవుతున్నాడు.

విశేషం: పూర్వం యోగసాంఖ్యాల సందర్భంగల హరసనత్కుమార సంవాదంలో ఇరవై అయిదు తత్త్వాలు ప్రస్తావనకు వచ్చాయి. పంచభూతాలు మొదలుకొని ప్రకృతివరకు ఉండే ఇరవై నాలుగు తత్త్వాలు ఇరవై అయిదవది అయిన 'నర' (జీవాత్మ) తత్త్వం వలన ఏర్పడటంవలన నారములు. జీవాత్మ వీటికి (అయనం) స్థానమైనవాడు కనుక నారాయణుడు. సృష్టి ఏర్పడటమూ, లీనమైపోవటమూ అతడియందే జరుగుతాయి. దృష్టాంతంగా నీటిని గ్రహించవచ్చును ఉన్నదంతా జలము కాగా సుడి, బుడగ, తరంగం మొదలైన పేర్లు నీటిలోని స్థితిభేదాలను బట్టి ఏర్పడుతున్నాయి. కాని నీటినుండి బుడగను, సుడినీ, తరంగాన్నీ వేరుచేయలేం. ఎందుకంటే అది నీరే తప్ప మరొకటి కాదు కనుక. ఈ పద్యంలోని ఈ రహస్యాన్ని ఈ దృష్టాంతం ద్వారా చక్కగా పట్టుకొనవచ్చును.

ఈ జీవాత్మ స్వరూపాన్ని వ్యష్టిగా, సమష్టిగా దర్శించాలి. ఒక్కొక్క వ్యక్తిలో చూస్తే వ్యష్టి దర్శనం. విశ్వమంతా ఒక్కటిగా భావించి చూస్తే సమష్టి దర్శనం.

క. పరమ బ్రహ్మం బనఁగాఁ । బరతత్త్వం బనఁగఁ బరమపద మనఁగా నీ
శ్వరుఁ డన విష్ణుఁ డన జగ । ద్భరితత నారాయణుండు దా వెలుఁగొందున్. 366

ప్రతిపదార్థం: నారాయణుండు= ఆ నారాయణుడు; పరమ బ్రహ్మంబు= అంతకంటె మరొక దశలేని బ్రహ్మము; అనన్+కాన్= అనగా; పరతత్త్వంబు= దానికి మించిన తత్త్వం లేదనే పరతత్త్వం; అనన్+గన్= అనగా; పరమపదము= దానిని మించిన ఉన్నత స్థానం లేదనే అర్థంగల పరమపదం; అనఁగాన్= అనగా; ఈశ్వరుఁడు= అన్నింటికీ ప్రభువు అనే అర్థంగల ఈశ్వరుడు; అనన్= అనగా; విష్ణుఁడు= అంతటా వ్యాపించినవాడు అనే అర్థంగల విష్ణుడు; అనన్= అనగా; జగత్+భరితతన్= విశ్వమంతా నిండిన తనంతో; తాన్= తాను; వెలుఁగు+ఒందున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ఆ నారాయణుడు పరమబ్రహ్మము. పరతత్త్వము, పరమపదము, ఈశ్వరుడు, విష్ణువు - అనే పేర్లతో విశ్వమంతా నిండి వెలుగుతూ ఉంటాడు.

విశేషం: 'బ్రహ్మం' అంటే బృహత్తు - పెద్దది అని అర్థం. 'పరబ్రహ్మం' అంటే దానికంటె పెద్దది మరొకటి ఉండదని భావం. 'తత్త్వం' అంటే స్థూలంగా పదార్థం. పరతత్త్వం అన్నింటికి మించిన దశలో ఉండే భావం.

ఆ. అతఁడు వాసుదేవుఁ డన నాత్మ యనఁగ వే । దాంతవాక్యబోధ్యుఁడై వెలుంగు
నరుల కప్పదములు నామాంతరంబు ల । ర్థాంతరంబు లేని యట్టి వనఘ! 367

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; అతఁడు= ఆ నారాయణుడు; వాసుదేవుఁడు= వాసుదేవుడు; అనన్= అనగా; ఆత్మ; అనఁగన్= అనగా; వేదాంతవాక్య బోధ్యుఁడు+ఐ= ఉపనిషత్తుల వాక్యములతో తెలియవచ్చేవాడై; వెలుంగున్= ప్రకాశిస్తాడు; నరులకున్= 'నరులు' అనబడేవారికి; ఆ+పదములు= ఆ మాటలు; నామ+అంతరంబులు= మరియొక పేర్లు; అర్థ+అంతరంబు= వేరొక అర్థం; లేని+అట్టి+అవి= లేనట్టివి.

తాత్పర్యం: ఆ నారాయణుడే వాసుదేవుడు, ఆత్మ అనే పేర్లతో ఉపనిషత్తుల మాటలచేత తెలియవస్తూ ఉంటాడు. నరుడికి కూడా అవి వేరు పేర్లు. కాని అర్థంలో మాత్రం భేదం లేనివి.

విశేషం: వాసుదేవుడు - వస్= ఉండటం; దివ్= ప్రకాశించటం - అనే రెండు ధాతువులనుండి ఏర్పడిన వాసు, దేవ అనే రెండు పేర్ల సముదాయవాచకం. "ఎల్లయందును దా వసియించు టెల్లయును తనయందు వసియించు టంద్రు వాసుదేవు డని పేరి కర్థంబు'' అని భారతంలో మరొక సందర్భంలో చెప్పారు. అన్నియెడలా, అన్ని వేళలా ఉంటూ ప్రకాశించే తత్త్వాన్ని వాసుదేవు డంటారు. "అత'' అని ధాతువు. సంతతగమనం కలది అని దాని కర్థం. దాని నుండి ఏర్పడిన శబ్దం 'ఆత్మ'. అంతటా వ్యాపించి ఉండేది - అని దానికి అర్థం. ఈ విధంగా నరనారాయణులకు నామభేదమే కాని అర్థభేదం లేదని తాత్పర్యం. అమ్మ, తల్లి, మాత అనీ శబ్దాలు వేరయినా అవి చెప్పే అర్థం ఒక్కటే కదా!

ఆ. సర్వశాస్త్రవాక్యసమితి నాలోకించి । మఱియు దృఢవిచారమహిమఁ దెలిసి
నిశ్చయింపఁబడియె నిష్ఠ నారాయణు । నెపుడుఁ దలఁపవలయు నిది యొకండ. 368

ప్రతిపదార్థం: సర్వశాస్త్రవాక్యసమితిన్= అన్ని శాస్త్రాల వాక్యాల సముదాయాన్ని; ఆలోకించి= చూచి; మఱియున్= ఆపైన; దృఢ విచారమహిమన్= గట్టిదైన ఆలోచన యొక్క గొప్పతనంతో; తెలిసి= తెలిసికొని; ఇది; ఒకండు+అ= ఒక్కటే; నిశ్చయింపన్+పడియెన్= నిర్ణయింపబడింది. ఎపుడున్= ఎల్లవేళలా; నిష్ఠన్= గురితప్పకుండా; నారాయణున్= నారాయణ తత్త్వాన్ని; తలఁప వలయున్= భావిస్తూ ఉండాలి.

తాత్పర్యం: సర్వశాస్త్రాల వాక్యాలను పరిశీలించి, గట్టి వివేకంతో దానిని చక్కగా తెలిసికొని ఇది ఒక్కటే నిర్ణయించబడింది. ఎల్లవేళలా నిష్ఠతో నారాయణుడిని స్మరిస్తూ ఉండాలి.

విశేషం: సర్వశాస్త్రసమితి నాలోకించటం - శ్రవణం, దృఢవిచార మహిమను తెలిసికొనటం - మననం; నిశ్చయించటం - నిదిధ్యాసనం. జ్ఞానానికి ఈ మూడు క్రమదశలు. జ్ఞానం ఎప్పుడూ అందరికీ ఏకాకారంగా ఉంటుంది. దానినే 'ఒకండ' అనే పదంతో చెప్పారు. ఇదే అద్భుతమైన మహార్థాన్ని అల్పఫణితితో చెప్పే తీరు. (365వ పద్యం చూడండి)

వ. కావున. 369

తాత్పర్యం: కనుక.

క. పరమానుష్ఠేయం బిది । నరోత్తమా! నీవు నెపుడు నారాయణుఁ ద
త్పరతఁ దలఁపు చొరకు సవి । స్తర శా స్త్రార్థముల క్రందుఁ దలపోఁతలకున్. 370

ప్రతిపదార్థం: నర+ఉత్తమా!= మానవశ్రేష్ఠుడా!; ఇది= నేను చెప్పినది; పరమ+అనుష్ఠేయంబు= అన్నింటిని మించి ఆచరించదగినది; నీవున్= నీవు కూడా; తత్+పరతన్= అదే లక్ష్యంగా; ఎపుడున్= ఎల్లవేళలా; నారాయణున్= నారాయణుడిని; తలఁపు= భావించుము; సవిస్తర శాస్త్ర అర్థముల క్రందున్= చాలా వ్యాపించిన శాస్త్ర చర్చల గందరగోళంలో; తలపోఁతలకున్= ఊహలకు; చొరకు= ప్రవేశింపకుము.

తాత్పర్యం: మనుజవరా! ఇదే అనుష్ఠింపవలసిన వాటిలో అన్నింటికంటె ఉత్తమమైనది. కనుక నీవు కూడా నారాయణుడిని పరమశ్రద్ధతో భావించుము. విస్తృతంగా ఉన్న శాస్త్రచర్చల గందరగోళంలోని ఊహలు చేయటానికి ప్రవేశించకుము.

విశేషం: ఏది తెలిసికొంటే సర్వమూ తెలుస్తుందో అది తెలిసికొన్న తరువాత శాస్త్రచర్చలు ప్రారంభించటం వ్యర్థమే కాదు అనర్థం కూడా. క్రొత్తది రాదు. ఉన్నది పోతుంది. అని ఈ పద్యంలో ద్వితీయార్థం హెచ్చరిస్తున్నది.

క. విను మొక యించుక సేపై । నను నారాయణునిఁ దలఁచినను సుగతిఁ గనున్
మనుజుఁ డనిన మదినెప్పుడు । నునిచిన యాతనికి బ్రాతె? యుత్తమధిషణా! 371

ప్రతిపదార్థం: ఉత్తమధిషణా!= గొప్ప మేధకలవాడా!; వినుము; ఒక+ఇంచుకసేపు+ఐనను= చాలా కొంచెం కాలం అయినా; నారాయణునిన్= నారాయణుడిని; తలఁచినను= భావించినా; మనుజుఁడు= నరుడు; సుగతిన్= మంచిగతిని; కనున్= పొందుతాడు; అనినన్= అనగా; మదిన్= హృదయంలో; ఎప్పుడున్= ఎల్ల వేళలా; ఉనిచిన అతనికిన్= నిక్షేపించుకొన్నవాడికి; బ్రాతె?= తక్కువ అవుతుందా?

తాత్పర్యం: మహా మేధావీ! కొంచెం సేపైనా నారాయణుడిని తలపోస్తే మనుజుడికి సుగతి కలుగుతుంది - అంటే ఎల్లవేళలా హృదయంలో నారాయణుడిని నిక్షేపించుకొన్నవాడికి సుగతి తక్కువ అవుతుందా?

విశేషం: అమృతం ఏ కొంచెం భుజించినా అమరత్వం సిద్ధిస్తుంది. అట్లాగే నారాయణస్మరణ ఫలాన్ని కూడా భావించవచ్చును.

క. ప్రణుత యగు 'నమోనారా । యణాయ' యను నక్షరాలి నంతప్రాప్తి
క్షణమున జిహ్వకుఁ దెచ్చినఁ । బ్రణవార్థం బైన పదముఁ బడయుదురు నరుల్. 372

ప్రతిపదార్థం: ప్రణుత= మిక్కిలి ప్రశస్తమైనది; అగు= అయిన; 'నమోనారాయణాయ= నారాయణ దేవునకు నమస్సు' అనే అర్థంగల నమోనారాయణాయ; అను అక్షర+ఆలిన్=అనే అక్షరాల వరుసను; మంత్రాన్ని; అంతప్రాప్తి క్షణమునన్= తుది గడియలు వచ్చిన వేళలలో; జిహ్వకున్= నాలుకకు; తెచ్చినన్= తెస్తే; నరుల్= మానవులు; ప్రణవ+అర్థంబు= ఓంకారానికి అర్థం; ఐన పదమున్= అయిన పరమస్థానాన్ని; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: మరణకాలంలో 'నమోనారాయణాయ' అనే మంత్రాన్ని పలికితే నరులు ప్రణవానికి అర్థమైన పరమపదాన్ని పొందుతారు.

విశేషం: "ఓమ్" అనేది ప్రణవం. ఓమ్ శబ్దానికి అర్థం పరమాత్మ. "అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్, యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః" అని గీత. 'మరణకాలంలో నన్నే స్మరిస్తూ దేహం వదలినవాడు నా భావాన్నే పొందుతాడు. ఇందు సందియంలేదు.' నా భావం అంటే పరమాత్మ భావం. ఆ శ్లోకభావాన్నే ఈ పద్యం చెప్తుతున్నది.

క. నారాయణ పదవాచ్యం । బారయ బ్రహ్మంబు దాని ననిశము వినియున్
సారమతిం దలఁచియు నిం । పారఁగఁ బొగడియు రమించు టతులహిత మగున్. 373

ప్రతిపదార్థం: ఆరయన్= చక్కగా విచారింపగా; నారాయణ పదవాచ్యంబు= నారాయణ అనే శబ్దం చేత చెప్పబడేది; బ్రహ్మంబు= బ్రహ్మమే; దానిన్= ఆ బ్రహ్మమును; అనిశము= ఎల్లవేళలా; వినియున్= విని; సారమతిన్= పదునైన బుద్ధితో; తలఁచియున్= భావించి; ఇంపారఁగన్= చక్కగా; పొగడియున్= కొనియాడి; రమించుట= ఆనందపడటం; అతుల హితము= సాటిలేని మేలు; అగున్= అవుతుంది.

తాత్పర్యం: 'నారాయణ' శబ్దం చెప్పేది బ్రహ్మమునే. దానిని ఎల్లవేళలా వింటూ, పదునైన బుద్ధితో భావిస్తూ చక్కగా కీర్తిస్తూ ఆనంద మందటం సాటిలేని మేలు అవుతుంది.

విశేషం: ఇక్కడ కూడా శ్రవణ, మనన, నిదిధ్యాసలను చెప్పారు. హృదయమందిరంలో ఆ భావం చక్కగా కుదురుకొనటమే నిదిధ్యాసనం. 'రమించటం' అనే శబ్దంలో ఆ భావాన్ని మనం గ్రహించాలి. లోకవిషయజ్ఞానానికి 'మతి' చాలును. పరతత్త్వ జ్ఞానానికి 'సారమతి' కావాలి. సారమతి అంటే ఏది నిత్యమో ఏది అనిత్యమో నిర్ణయించి నిష్కర్షగా చెప్పగల బుద్ధి.

తే. విండు నారాయణ పరాయణుండు పాత । కముల గెలిచి వెలుంగుటె కాదు తన్ను
నాశ్రయించినవారికి నతులమైన । వెలుఁగు నొసఁగంగఁ జాలుట వేధచేఁత. 374

ప్రతిపదార్థం: విండు= వినండి; నారాయణ పరాయణుండు= నారాయణుడే పరమగతి అనే నిర్ణయం కలవాడు; పాతకములన్= పాపాలను; గెలిచి= జయించి; వెలుంగుట+ఎ= ప్రకాశించటమే; కాదు; తన్నున్= తనను; ఆశ్రయించినవారికిన్= చేరుకొన్నవారికి; అతులము+ఐన= సాటిలేనిదైన; వెలుఁగున్= జ్ఞానం అనే వెలుగును; ఒసఁగంగన్= ఇవ్వటానికి; చాలుట= సమర్థుడు కావటం; వేధచేఁత= బ్రహ్మచేసిన పని.

తాత్పర్యం: వినండి, నారాయణుడే పరదైవంగా కలవాడు పాతకాలను కాలరాచి ప్రకాశించటమే కాదు, తన్ను చేరుకొన్నవారికి కూడా సాటిలేని ఆ జ్యోతిని ప్రసాదించగలగటం బ్రహ్మచేసిన ఏర్పాటు.

విశేషం: "స్వయం తీర్త్వా పరాం స్తారయతి" అని సూక్తి. తానుదాటి ఇతరులను దాటిస్తాడు. అంటే తనకు ఇతరులకు గురుశిష్య భావం ఉంటుంది. భారతీయతత్త్వంలో గురువు పరబ్రహ్మమే.

క. చతురాశ్రమముల లోపల । నతులమతీ! యెందు నిలిచి నతనికి భక్తిన్
మతిఁ గేశవుఁ గూర్పక స । ద్గతి పెఱకర్మముల నేల కల్గఁగ నేర్చున్? 375

ప్రతిపదార్థం: అతులమతీ!= సాటిలేని బుద్ధికలవాడా!; చతుర్+ఆశ్రమముల లోపలన్= నాలుగు ఆశ్రమాలలో; ఎందున్= దేనిలో; నిలిచిన+అతనికిన్= ఉన్నవాడికైనా; భక్తిన్= భక్తితో; మతిన్= బుద్ధియందు; కేశవున్= నారాయణుడిని; కూర్పక= నిలుపక; సత్+గతి= ఉత్తమ స్థితి; పెఱకర్మములన్= వేరు కర్మములతో; ఏల?= ఎట్లు?; కల్గఁగన్+నేర్చున్?= కలుగుతుంది?

తాత్పర్యం: మహాబుద్ధిశాలీ! నాలుగాశ్రమాలలో దేనియం దున్నవాడికైనా మదిలో కేశవుడిని నిలుపకపోతే ఇతర కర్మల ద్వారా ఉత్తమగతి ఎట్లా కలుగగలదు?

విశేషం: చతురాశ్రమములు: 1.బ్రహ్మచర్యం, 2.గార్హస్థ్యం, 2. వానప్రస్థం, 4.సన్న్యాసం. ఆశ్రమధర్మనిష్ఠ ఉండవలసినదే. నారాయణ స్మరణ లేకపోతే ఆ నిష్ఠ ఉత్తమగతి నీయజాలదని భావం.

క. కను టరిది యొండుమెయి వి । ష్ణుని భక్తిం గనుము నీవు సువ్రత! యద్దే
వుని వినుము భక్త వత్సలుఁ । డను నామము గలిమి దృశ్యుఁ డగు భక్తులకున్.' 376

ప్రతిపదార్థం: సువ్రత= చక్కని నియమ పాలనగల మనిషీ!; ఒండు మెయిన్= మరొక విధంగా; విష్ణునిన్= నారాయణుడిని; కనుట= చూడటం; అరిది= అసాధ్యం; నీవు; భక్తిన్= భక్తితో; కనుము= చూడుము; ఆ+దేవునిన్= ఆ దేవుడిని గూర్చి;

వినుము; భక్త వత్సలుఁడు= భక్తులయందు బిడ్డలయందలి భావం ఉన్నవాడు అని అర్థంగల భక్తవత్సలుడు; అను నామము= అనే పేరు; కలిమి= ఉండటంవలన; భక్తులకున్= భక్తులకు; దృశ్యుఁడు= చూడబడేవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: ఉత్తమవ్రతుడా!; మరొక విధంగా విష్ణువును చూడజాలము. భక్తితో దర్శించుము. ఆ దేవుడిని గూర్చి వినుము. 'భక్తవత్సలుడు' అనే నామం ఆయనకు ఉన్నందువలన అతడు భక్తులకు కానవస్తాడు'.

విశేషం: నిజానికి పరమాత్మను చర్మనేత్రాలతో చూడటం సాధ్యం కాదు. అయినా అతడి దయవలన కృష్ణాదిరూపంలో భక్తులు చూస్తూ ఉంటారు. 'వివేకచూడమణి' స్వస్వరూపానుసంధానమే భక్తి అంటున్నది. కనుక భక్తి అంటే తత్త్వజ్ఞానమే.

క. అని నారదుఁ డుపదేశిం । చిన నానైష్ఠికుఁడు నియతచిత్తుండై వి
ష్ణుని నర్చించు సభక్తిక । మననవిశేషమున నెపుడు మనుజాధీశా! 377

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; అని= ఈ విధంగా; నారదుఁడు= నారదమహర్షి; ఉపదేశించినన్= బోధించగా; ఆ నైష్ఠికుఁడు= గొప్పనిష్ఠ కల ఆ పుండరీకుడు; నియత చిత్తుండు+ఐ= చెదరని హృదయం కలవాడై; సభక్తిక మనన విశేషమునన్= భక్తితో కూడిన నిరంతరభావన యొక్క అతిశయంతో; ఎపుడున్= ఎల్లవేళలా; విష్ణునిన్= నారాయణుడిని; అర్చించున్= పూజిస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: రాజా! ఈ విధంగా ఈ నారదుడు బోధిస్తే ఆ నిష్ఠాపరుడు చెదరని చిత్తంతో భక్తిగల మననంతో ఎల్లవేళలా నారాయణుడిని అర్చిస్తూ ఉంటాడు.

విశేషం: 'అర్చించున్' అనేది తద్ధర్మక్రియ. అర్చించటం శీలంగా ఏర్పడాలని అది సూచిస్తుంది.

తే. శంఖచక్రగదాధరు శార్ఙ్గిఁబుండ । రీకదళసన్నిభాక్షుఁ గిరీటకుండ
లాభిరాము శ్రీవత్ససంశోభివక్షుఁ । గౌస్తుభోజ్జ్వలుఁ గలలోనఁ గను నతండు. 378

ప్రతిపదార్థం: శంఖచక్ర గదాధరున్= పాంచజన్యమనే శంఖాన్నీ, సుదర్శనం అనే చక్రాన్నీ, కౌమోదకి అనే గదను ధరించినవాడికి; శార్ఙ్గిన్= శార్ఙ్గం అనే విల్లు కలవాడిని; పుండరీక దళ సన్నిభ+అక్షున్= పద్మపు రేకులను పోలిన కన్ను లున్న వాడిని; కిరీట కుండల+అభిరామున్= కిరీటమూ, కుండలములు అనే వాటితో చూడముచ్చట అయిన వాడిని; శ్రీవత్స సంశోభివక్షున్= శ్రీవత్సమనే పుట్టుమచ్చతో అందమైన రొమ్ము కలవాడిని; కౌస్తుభ+ఉజ్జ్వలున్= కౌస్తుభ మనే మణి కాంతులతో వెలిగిపోవుచున్నవాడిని; కలలోనన్= కలలో; కను+అతండు= చూచేవాడు.

తాత్పర్యం: శంఖము, చక్రము, గద, శార్ఙ్గము అనేవాటిని నాలుగు చేతులతో ధరించిన స్వామి, పద్మపత్రముల వలె విశాలమైన ఆర్ద్రమైన కన్నులతో విరాజిల్లువాడు, కిరీటకుండల కాంతులతో చూడముచ్చట అయినవాడు, శ్రీవత్సమనే పుట్టుమచ్చతో విరాజిల్లు రొమ్ము కలవాడు, కౌస్తుభమణి కాంతులతో వెలిగిపోయేవాడు అయిన శ్రీమన్నారాయణుడిని కలలో చూచినవాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శంఖం నాదానికీ, చక్రం కాలానికీ, గద ఆనందం కలిగించటానికీ, (గదకు కౌమోదకి అని పేరు!) శార్ఙ్గం - ధనుస్సు, దుష్టశిక్షణ, శిష్టరక్షణకూ సంకేతాలు. పుండరీకం సర్వతోముఖప్రసరణశీలానికి సంకేతం. కిరీటం సార్వభౌమత్వానికి

సంకేతం, కుండలాలు - కర్ణాభరణాలుగా జ్ఞానానికి సంకేతం, శ్రీవత్సం - పుట్టుమచ్చ. ఇది సౌందర్యానికి ద్యోతకం. కౌస్తుభం - అనన్య సాధారణజ్ఞాన జ్యోతిస్సుకు సంకేతం. (ఇట్లా భావించవచ్చును.)

క. చిరకాలంబున సాక్షా । త్కరణంబును గల్గు దానఁ గానని పదముం
బొరయని శుభముం గలవే? । కురువర! నీవు నతిభక్తిఁ గొలువుము విష్ణున్. 379

ప్రతిపదార్థం: చిరకాలంబునన్= పెద్దకాలంలో; సాక్షాత్+కరణంబును= ప్రత్యక్షం కావటాన్ని; కల్గున్= పొందుతాడు; దానన్= దానిచేత; కానని పదమున్= కనపడని స్థానం; పొరయని శుభమున్= పొందని శుభమూ; కలవే?= ఉంటాయా? కురువర!= కురురాజా!; నీవును= నీవుకూడా; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; విష్ణున్= విష్ణువును; కొలువుము= సేవించుము.

తాత్పర్యం: బహుకాలం ఆ రూపం మనస్సులో నిలిచిపోయిన వాడవుతాడు. దానిచేత చూడని పదమూ, పొందని శుభమూ ఉండదు. రాజా! నీవుకూడా పరమభక్తితో విష్ణువును సేవించుము.

క. అనిన విని హర్షపూరం । బునఁ జిత్తము దేల ధర్మపుత్రుం డా శం
తను సుతునకుఁ బ్రణమిల్లెం । దనువునఁ బులకాంకురప్రతతి జాదుకొనన్. 380

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; హర్షపూరంబునన్= ఆనందపు ప్రవాహంలో; చిత్తము= హృదయము; తేలన్= తేలిపోగా; ధర్మపుత్రుండు= ధర్మరాజు; తనువునన్= దేహంమీద; పులక+అంకుర ప్రతతి= పులకలమొలకల సముదాయం; జాదుకొనన్= వ్యాపించగా; శంతను సుతునకున్= శంతనుడి కుమారు డగు భీష్ముడికి; ప్రణమిల్లెన్= సాష్టాంగ నమస్కారంచేశాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ఆనందలహరిలో హృదయం తేలిపోతూ ఉండగా ధర్మరాజు ఒడలంతా పులకలు వ్యాపించగా భీష్ముడికి ప్రణామం చేశాడు.

విశేషం: పరమానందం మొదలైన భావాలు కలిగినపుడు శరీరంమీద రోమాలు నిక్కపొడుచుకొనే స్థితిని రోమాంచం అంటారు. దానినే పులకాంకురప్రతతిగా ఇక్కడ చెప్పారు.

విశేషం: పరమానందం మొదలైన భావాలు కలిగినపుడు శరీరంమీద రోమాలు నిక్కపొడుచుకొనే స్థితిని రోమాంచం అంటారు. దానినే పులకాంకురప్రతతిగా ఇక్కడ చెప్పారు.

వ. ప్రణమిల్లి యతనితో 'దానప్రియవచనంబుల రెంటియందును నధికరంజనంబెయ్యది? చెప్పవే' యనుటయు నద్దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లను 'రెండును మంచి తెఱంగుల యెదిరిచందం బెఱింగి నడపునది దానంబు రంజకం బగుటం దెలుపవలవదు సామవాదంబు గుణంబు దెల్లంబగునట్టి యితిహాసంబు వినుము చెప్పెద, బుద్ధి సంపన్నుండగు నొక్కబ్రాహ్మణుండు విజనంబగు వనంబునం గార్యవశంబున మెలంగఁ దన్మాంసం బాహారంబు గొనుటకయి దారుణుం డగు దానవుం డతనిం బట్టికొనిన సాంత్వనభాషణంబులు ప్రయోగించు వాఁ డయి యవ్విప్రుండు గలంకయుఁ గొందలంబును లేని డెందంబుతో నద్దానవు నాననంబు గనుంగొనిన నాధైర్యధుర్యుం గనుంగొని తదీయంబగు నుదాత్తత్వంబునం జిత్తంబు రంజిల్లి యద్దనుజుం డద్ధరాదివిజునితో

'మదీయంబగు ప్రశ్నంబునకు సదుత్తరం బిచ్చితేని నిన్ను విడిచెద' నను పలుకు పలికి తన శరీరంబు డయ్యుటకు వెలుకం బాఱుటకుం గారణంబేమి? యని యడిగిన నమ్మహీసురవరుండు వేగిరపడక కొండొకసేపు విచారించి 'మహాపురుషా! నీ యట్టి కృపాపరుం డడుగం దోఁచిన తెఱంగునం జెప్పుట మేలు కాదె? యాకర్ణింపు' మని సౌముఖ్యంబు నొంది. 381

ప్రతిపదార్థం: ప్రణమిల్లి= సాష్టాంగ నమస్కారంచేసి; అతనితోన్= ఆ భీష్ముడితో; దాన ప్రియవచనంబులన్= దానము, ప్రియంగా పలకటం అనే; రెంటియందును= రెండింటిలో; అధిక రంజనంబు= ఎక్కువ ప్రీతి కలిగించేది; ఏ+అది?= ఏది?; చెప్పవే!= దయతో చెప్పవూ!; అనుటయున్= అనగా; ఆ+దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పుతున్నాడు; రెండును= నీవు చెప్పిన ఆ రెండూ; మంచి తెఱంగులు+అ= మంచి పద్ధతులే; ఎదిరి చందంబు= ఎదుటివాడి తీరు; ఎఱింగి= తెలిసికొని, నడపునది= చేయవలె; దానంబు= దానం; రంజకంబు= ప్రీతికలిగించేది; అగుటన్= కావటం; తెలుపన్+వలవదు=తెలుప నక్కరలేదు; సామవాదంబు గుణంబు= ప్రియమైన మాటల గుణం; తెల్లంబు= స్పష్టం; అగు+అట్టి ఇతిహాసంబు= అయిన ప్రాత కాలపు కథ; చెప్పెదన్= చెప్పుతాను; వినుము; బుద్ధి సంపన్నుండు= బుద్ధి సమృద్ధిగా కలవాడు; అగు+ఒక్క బ్రాహ్మణుండు= అయిన ఒక బ్రాహ్మణుడు; విజనంబు= జనం లేనిది; అగు వనంబునన్= అయిన అడవిలో; కార్యవశంబునన్= పనికి లోబడి; మెలంగన్= తిరుగుతూ ఉండగా; తద్+మాంసంబు= ఆతడి మాంసం; ఆహారంబు= భోజనం; కొనుటకున్+అయి= తీసికొనటానికి; దారుణుండు+అగు= కరకువాడు అయిన; దానవుండు= రాక్షసుడు; అతనిన్=అతడిని; పట్టికొనినన్= పట్టుకొనగా; సాంత్వన భాషణంబులు= మెత్తని మాటలు; ప్రయోగించువాఁడు+అయి= ఉపయోగించేవాడై; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; కలంకయున్= కలతపాటు; కొందలంబును= సంక్షోభం; లేని డెందంబుతోన్= లేని హృదయంతో; ఆ+దానవు+ఆననంబు= ఆ రక్కసుడి మొగం; కనుంగొనినన్= చూడగా; ఆ ధైర్యధుర్యున్= గుండె నిబ్బరంలో గట్టివాడైన ఆ బ్రాహ్మణుడిని; కనుంగొని= చూచి; తదీయంబు= అతడిది; అగు+ఉదాత్తత్వంబునన్= అయిన గొప్పతనంచేత; చిత్తంబు= హృదయం; రంజిల్లి= ప్రీతిచెంది; ఆ+దనుజుండు= ఆ రాక్షసుడు; ఆ+ధరాదివిజునితోన్= ఆ బ్రాహ్మణుడితో; మదీయంబు= నాదయినది; అగు ప్రశ్నంబునకున్= అయిన ప్రశ్నకు; సత్+ఉత్తరంబు= మంచి సమాధానం; ఇచ్చితి+ఏని= ఇస్తే; నిన్నున్=నిన్ను; విడిచెదన్=వదలుతాను; అనుపలుకు= అనే మాట; పలికి; తన శరీరంబు= తన ఒడలు; డయ్యుటకున్= కృశించిపోవటానికి; వెలుకన్+పాఱుటకున్= పాలిపోవటానికి; కారణంబు= హేతువు; ఏమి?= ఏది?; అని; అడిగినన్= ఆ+మహీసుర వరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; వేగిరపడక= తొందరపడక; కొండొకసేపు= కొంతసేపు; విచారించి= ఆలోచించి; మహాపురుషా!= గొప్పవాడా!; నీ+అట్టి కృపాపరుండు= నీవంటి దయాశీలి; అడుగన్= అడుగగా; తోఁచిన తెఱంగునన్= ఊహకు వచ్చిన విధంగా; చెప్పుట= చెప్పటం; మేలు= మంచిది; కాదె!= కాదా!; ఆకర్ణింపుము= వినుము; అని; సౌముఖ్యంబు= అనుకూలభావాన్ని (మంచి మోము కలిగిన తనాన్ని); ఒంది= పొంది.

తాత్పర్యం: నమస్కరించి భీష్ముడితో 'దానము, ప్రియభాషణము అనే రెంటిలో ఏది ఎక్కువ ప్రీతి కలిగిస్తుంది? చెప్పవూ? అని అడిగితే భీష్ము డా రాజుతో ఇట్లా అన్నాడు. ఆ రెండూ మంచి పద్ధతులే. 'అవతలివాడి తీరెరిగి నడపాలి. 'దానం ప్రీతికరమైనది' అనేదానిని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. మంచిమాటల గుణాన్ని తెలిపే పురాతనకథ ఒకటి చెప్పుతాను వినుము. బుద్ధిశాలి అయిన ఒక బ్రాహ్మణుడు జన సంచారంలేని అడవికి పనిమీద వెళ్ళాడు. ఒక కరకురక్కసి అతడి మాంసం తినగోరి, అతడిని పట్టుకొన్నాడు. ఆ బ్రాహ్మణుడు మంచిమాటలు ప్రయోగించేవాడయి, ఏ విధమైన కలతపాటులేని గుండెతో ఆ రాక్షసుడి మొగం చూస్తున్నాడు. ఆ రక్కసుడు ఆ

ధైర్యశాలిని చూచి, అతడి గుండె నిబ్బరానికి హృదయంలో సంతోషించి, 'నా ప్రశ్నకు తగిన మంచి సమాధానం చెప్పితే నిన్ను వదలుతాను' అని 'నా శరీరం కృశించి పోవటానికి, పాలిపోవటానికి కారణం ఏమిటి?' అని అడిగాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు తొందరపడక కొంతసేపు విచారించి, 'మహాపురుషా! నీ వంటి దయాశాలి అడిగితే తోచిన విధానం చెప్పటం మేలు కదా! వినుము.' అని మంచి మొగంతో అనుకూల భావం పొంది (ఇట్లా అన్నాడు).

సీ. 'చుట్టాల నీదగు చెట్టతనంబునఁ । బాసి పశ్చాత్తాపపరుఁడ వగుట,
లేమి గల్గిన దుర్లభామేయధనములు । గోరుట మొగమోటగూరి యొరుని
చేఁ బడ్డ నిన్ను గెల్చితి నని యాతఁ డు । బ్బుట కృప, నుపకారమునకుఁ బాత్ర
ముగ నీవు చేసిన పురుషుఁ డా మేల్ దన । యలఘుపౌరుషమునఁ గలిగె ననుట.

ఆ. కుమతిజనులు నీదు గుణములు గొనియాడ । సిగ్గుపడుచు బుధులచేతఁ బొగడు
గాన మరుగుచునికి, వీనిలో నొక్కట । గార్శ్య పాండురతలు గలుగు ననఘ!' 382

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; చుట్టాలన్= బంధువులను; నీ+అది= నీది; అగు చెట్టతనంబునన్= అయిన చెడ్డతనంతో; పాసి= వదలి; పశ్చాత్+తాపపరుఁడవు= వెనుక బాధపడినవాడవు; అగుట= కావటం; లేమి= దారిద్ర్యము; కల్గినన్= కలిగితే; దుర్లభ+అమేయ ధనంబులు= ఎంత కష్టపడినా దొరకని సొమ్ములను; కోరుట= కోరటం; మొగమోట= సంకోచం; కూరి= పొంది; ఒరునిచేన్= ఇతరునిచేత; పడ్డ= పాట్లుపడిన; నిన్ను; గెల్చితిని= జయించాను; అని; ఆతఁడు= ఆ ఇతరుడు; ఉబ్బుట= పొంగిపోవటం; కృపన్= జాలితో; ఉపకారమునకున్= మేలునకు; పాత్రముగన్= స్థానంగా; నీవు చేసిన పురుషుఁడు= నీవు చేసిన జనుడు; ఆ మేల్= ఆ మేలు; తన అలఘు పౌరుషమునన్= తనదైన గొప్ప మగతనంతో; కలిగెన్= కలిగింది; అనుట= అనటం; కుమతిజనులు= చెడుబుద్ధిగల మనుష్యులు; నీదు గుణములు= నీ మంచి లక్షణాలను; కొనియాడన్= ప్రశంసచేయగా; సిగ్గుపడుచున్= బిడియం పొందుతూ; బుధులచేతన్= విద్వాంసులవలన; పొగడు=పొగడ్త; కానన్= పొందటానికి; మరుగుచున్+ఉనికి= అలవాటు పడుతూ ఉండటం; వీనిలోన్= వీటిలో; ఒక్కటన్= ఒక్కదానిచేత; కార్శ్యపాండురతలు= క్షీణించటం, పాలిపోవటం అనే లక్షణాలు; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'బంధువులను నీ చెడు స్వభావంతో వదలి తరువాత బాధపడటం, దారిద్ర్యం కలిగినపుడు ఎన్నటికీ లభించని గొప్పధనాలు కోరటం, మొగమోటంవలన పరుడు పెట్టిన బాధలను నీ వనుభవించగా వాడు నేను జయించానని పొంగిపోవటం, జాలితలచి నీవు మేలు చేయగా ఆ మేలు పొందినవాడు అది తన పరాక్రమమే అని చెప్పటం, పాడుబుద్ధికలవారు నిన్ను పొగడుతూ ఉంటే సిగ్గుపడుతూ పండితుల మెప్పు కొరకు చూస్తూ ఉండటం - వీటిలో ఒకదానిచేత కృశించటం, పాలిపోవటం కలుగుతాయి.'

వ. అని వెండియు. 383

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా అంటున్నాడు.

సీ. 'ఉచితంబుగా నెటి నుగ్గడించిన మాట । సభ యియ్యకొనమి, వల్లభకు నీదు
తప్పు తెల్లంబయి తాపంబుఁ బొందఁగఁ । దేర్పంగనేరక త్రిప్పికొనుట,

నీ సొమ్మునకు నొరుఁ డాసించుచుండంగ । దానికిఁ దగ రక్ష దలఁచుచునికి,
దులువ పిమ్మట నిన్ను దూషించు పలుకులు । కులజులు నిజముగాఁ గొనుట, నీవు

తే. మానుషంబుల నడపంగ మాయకానిఁ । గాఁగఁ జెలులు గాంచుట, వగ కలిమి పేర్మి
దాని వెలిపుచ్చ నోపమి, వీన నొకటఁ । గార్శ్య పాండురత్వంబులు గలుగు ననఘ! 384

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యపురుషుడా! ఉచితంబుగాన్= తగు విధంగా; నెఱిన్= చక్కగా; ఉగ్గడించిన మాట= పలికిన పలుకును; సభ= పెద్దలున్న తావు (న్యాయస్థానం); ఇయ్యకొనమి= ఒప్పుకొనకపోవటం; వల్లభకున్= భార్యకు (ప్రియురాలికి); నీదు తప్పు= నీ నేరం; తెల్లంబు= స్పష్టంగా తెలిసినది; అయి; తాపంబున్= దుఃఖం; పొందంగన్= పొందగా; తేర్పంగన్= సముదాయించటానికి; నేరక= సాధ్యపడక; త్రిప్పికొనుట= మరలిరావటం; నీ సొమ్మునకున్= నీ ధనానికి; ఒరుఁడు= వేరువాడు; ఆసించుచుండంగన్= కోరుతూ ఉండగా; దానికిన్= ఆ సొమ్మునకు; తగన్= తగు విధంగా; రక్ష= రక్షణ; తలఁచుచున్+ఉనికి= ఆలోచిస్తూ ఉండటం; తులువ= దుర్మార్గుడు; పిమ్మటన్= నీ వెనుక (చాటుగా); నిన్నున్= నిన్ను; దూషించు పలుకులు= నిందించే మాటలను; కులజులు= నీ బంధువులు; నిజముగాన్= సత్యంగా; కొనుట= గ్రహించటం; నీవు; మానుషంబులన్= పౌరుషపు పనులను; నడపంగన్= చేయగా; మాయకానిన్+కాఁగన్= మాయలు చేసేవాడినిగా; చెలులు= నీ మిత్రులు; కాంచుట= చూడటం; వగ కలిమి పేర్మిన్= పెను దుఃఖం కలగటంవలన; దానిన్= దానిని; వెలిపుచ్చన్+ఓపమి= బయటపెట్టుకొనలేకపోవటం; వీనన్= వీటిలో; ఒకటన్= ఒకదానిచేత; కార్శ్య పాండురతలు= చిక్కిపోవటం, వెలవెలబోవటం; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'నీవు తగు విధంగా పలికినదానిని సభ (పెద్దల సంఘం) ఒప్పుకొనకపోవటం, నీ తప్పు నీ భార్యకు తెలిసి ఆమె కుమిలిపోతూ ఉంటే నీవు సముదాయించలేకపోవటం, నీ సొమ్మును కొట్టివేయాలని ఇతరుడు కనిపెట్టుకొని ఉంటే దానికి ఏది దిక్కు? - అని నీవు ఆలోచిస్తూ ఉండటమూ, దుర్మార్గుడు చాటున నిన్ను గూర్చి చేసిన నిందలను నీ బంధువులు నిజాలని భావించటం, నీవు దొడ్డపనులు చేస్తూ ఉంటే నీ చెలికాండ్రు నిన్ను మాయలవాడినిగా భావించటం, నీ హృదయంలో ఉన్న పెనుదుఃఖాన్ని బయట పెట్టుకొనకపోవటం - వీటిలో ఒకటి క్షీణతకూ, పాలిపోవటానికీ కారణం.'

తే. అని మఱియును. 385

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా చెప్పుతున్నాడు.

సీ. 'భార్య పుత్రకుఁ డల్లు డార్యవృత్తము లేమిఁ । గ్రుమ్మరించుట, జనకుండు దల్లి
సోదరుల్ నవయుట, యుర్వీసురుని గోవుఁ । దొలుమేనఁ జంపుట, దుష్టబుద్ధి
భూసురదేవార్థములు పుచ్చికొనుట, య । ర్థము గోలుపోక, బాంధవుల చావు,
బాలిశు మొగమోటఁ బనికొనఁగాఁ దన । యశమున కంతరాయంబు గలిమి,

తే. పెద్దకాలంబు యత్నసంపీడ నొంది । చెల్లఁ జేసిన పని యొక్క పొల్లపగతు
చే నసిద్ధతఁ బొందుట, వీన నొకటఁ । గార్శ్యపాండురత్వంబులు గలుగు ననఘ! 386

ప్రతిపదార్థం: భార్య= పత్ని; పుత్రకుఁడు= కొడుకు; అల్లుఁడు= బిడ్డ మగడు; ఆర్యవృత్తము= మంచి నడవడి; లేమిన్= లేకపోవటంవలన; క్రుమ్మరించుట= తిప్పలు పెట్టటం; జనకుండు= తండ్రి; తల్లి= అమ్మ; సోదరుల్=అన్నదమ్ములు; నవయుట= రోగం మొదలైనవాటిచేత కృశించిపోవటం; తొలుమేనన్=పూర్వజన్మలో; ఉర్వీసురుని గోవున్= బ్రాహ్మణుడి ఆవును; చంపుట= చంపటం; దుష్టబుద్ధిన్= పాపపుబుద్ధితో; భూసుర దేవ+అర్థములు= బ్రాహ్మణుల, దేవతల సొమ్ములు; పుచ్చికొనుట= తీసికొనటం; అర్థము కొలుపోక= ధనం పోగొట్టుకొనటం; బాంధవుల చావు= చుట్టాల మరణం; మొగమాటన్= ఇతరుల ఒత్తిడికి లొంగిన కారణంగా; బాలిశున్= నీచుడిని; పనికొనఁగాన్= ఉద్యోగంలో నియమించగా; తన యశమునకున్=తన కీర్తికి; అంతరాయంబు+ కలిమి= ఆటంకం కలగటం; పెద్దకాలంబు= చాలాకాలం; యత్న సంపీడన్= ప్రయత్నంలో పడరాని పాటును; ఒంది= పొంది; చెల్లన్= నెరవేరునట్లుగా; చేసినపని; ఒక్క పొల్ల పగతుచేన్= ఒకే ఒక్క నీచుడైన పగవాడిచేత; అసిద్ధతన్= నెరవేరని స్థితిని; పొందుట= పొందటం; వీనన్= వీటిలో; ఒకటన్= ఒకదానిచేత; కార్శ్య పాండురత్వంబులు= క్షీణత ఒడలు కళ తప్పటం అనేవి; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'పెండ్లము, కొడుకు, అల్లుడు మంచి నడవడి లేనివారై త్రిప్పలు పెట్టటం, తండ్రి, తల్లి, అన్నదమ్ములు రోగాదులచే కృశించటం, పూర్వజన్మలో బ్రాహ్మణుడి ఆవును చంపటం, పాపభావంతో బ్రాహ్మణులసొమ్ము, దేవుడి సొమ్ము అపహరించటం, ధనం పోగొట్టుకొనటం, చుట్టాలు చావటం, పనికిమాలినవాడిని పనిలో పెట్టుకొని పేరు పాడుచేసికొనటం, ఎంతో కాలం ఎన్నో ప్రయత్నాలు చేసి ఒక కొలిక్కి తెచ్చిన పనిని నీచుడైన పగవాడు పాడుచేయటం, వీటిలో ఒకదానిచేత మనిషి కృశిస్తాడు, పాలిపోతాడు.'

విశేషం: తొలుమేనన్- చేసిన పాపం జన్మజన్మాలకు వెంటనంటి వస్తుంది. ఇట్టివాటిని మహానుభావులు జ్యోతిషం మొదలైనవాటి ద్వారా తెలిసికొని, తెలియజేస్తారు.

క. అని యిట్లేర్పడఁ జెప్పిన । విని యద్దనుజపతి మెచ్చి విడిచెం గుంతీ
తనయాగ్రజ! భూసుర సాం । త్వన మిట్టిది; యడుగు మింక వలసినదానిన్.' 387

ప్రతిపదార్థం: కుంతీ తనయ+అగ్రజ!= కుంతికొడుకులలో పెద్దవాడా!; అని; ఇట్లు= ఈ విధంగా; ఏర్పడన్= వివరించి; చెప్పినన్= చెప్పగా; విని=ఆలకించి; ఆ+దనుజపతి= ఆ రక్కసిరేడు; మెచ్చి= మెచ్చుకొని; విడిచెన్= (ఆ బ్రాహ్మణుడిని) విడిచిపెట్టాడు; భూసుర సాంత్వనము= బ్రాహ్మణుల ప్రియభాషణం; ఇట్టి+అది= ఇటువంటిది; ఇంకన్= ఇంకా; వలసినదానిన్= కోరిన దానిని; అడుగుము.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ విధంగా ఆ బ్రాహ్మణుడు స్పష్టంగా చెప్పాడు. అది విని ఆ రాక్షసుడు మెచ్చుకొని, అతడిని విడిచిపెట్టాడు. మంచిమాటల తీరు ఇటువంటిది. ఇంకేమి కావాలో అడుగుము.'

విశేషం: ప్రియభాషణం ప్రాణాలు దక్కించింది. ఇంతకంటె మరొక లాభం పెద్దది ఏముంటుంది? - అని భావం.

వ. అనిన నజాతశత్రుండు గంగాపుత్త్రువదనంబునం జూడ్కి నిలిపి మోడ్చి కరంబులు శిరంబునం గదియించి.388

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగాపుత్త్రువదనంబునన్= భీష్ముడి మొగంవైపు; చూడ్కిన్= చూపును; నిలిపి; మోడ్చిన కరంబులు= జోడించిన చేతులు; శిరంబునన్= తన తలపైన; కదియించి= కూర్చి.

తాత్పర్యం: అనగా ధర్మరాజు భీష్ముడి ముఖంమీద చూపు నిలిపి, చేతులు మోడ్చి తలపై పెట్టుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇది పరమగౌరవాన్ని సూచిస్తుంది. భీష్ముడు, వృద్ధుడు, యుద్ధంలో అలసినవాడు, అంపశయ్యమీద ఉన్నవాడు, ఏ క్షణంలోనయినా ప్రాణత్యాగం చేయటానికి సిద్ధంగా ఉన్నవాడు. అయినా పరమవాత్సల్యంతో ఇంకా అడుగుము, ఇంకా అడుగుము-అంటున్నాడు. ఈ స్థితికి ధర్మరాజు హృదయం ఎంత ఆర్ద్రమై పోయిందో ఇటువంటి మాటలవలన తెలియవస్తుంది.

తే. 'మమ్ము సంసారవార్ధి పారమ్ముఁ జేర్చు । యానపాత్రంబు నీ కరుణాతిశయమ
యఖిలకల్మషములఁ బాపునట్టి దాని । వినఁగఁ గోరెద నొక పురావృత్త మనఘ! 389

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; మమ్మున్= మమ్ములను; సంసారవార్ధి పారమ్మున్= సంసారం అనే మహాసముద్రపు ఒడ్డును; చేర్చు యానపాత్రము= చేర్చే ఓడ; నీ కరుణా+అతిశయము+అ= నీ దయయొక్క పెక్కువయే; అఖిల కల్మషములన్= అన్ని పాపాలను; పాపు+అట్టిదానిన్= పోగొట్టేదానిని; ఒక పురావృత్తము= ఒక ప్రాతకాలపు గాథను; వినఁగన్= వినటానికి; కోరెదన్= కోరుతున్నాను.

తాత్పర్యం: 'మహాత్మా! మమ్ములను సంసారం అనే మహాసముద్రం ఒడ్డుకు చేర్చే ఓడ నీ దయావిశేషమే! అన్ని పాపాలను హరించే ఒక ప్రాతకాలపు గాథను వినగోరుతున్నాను.

విశేషం: సంసారం అంటే పరమాత్మజ్ఞానం లేక చావుపుట్టుకల చక్రంలో ఎడతెగకుండా సంచరించటం.

క. మునిమనుజపతుల సన్నిధి । నిను నీ కృష్ణుండు మాననీయచరిత! వే
డ్క నుపాసించుచు నున్నాఁ । డనుత్తమప్రీతి దాని నాకర్ణింపన్. 390

ప్రతిపదార్థం: మాననీయ చరిత!= మన్నింపదగిన నడవడి కలవాడా!; ఈ కృష్ణుండు= ఈ వాసుదేవుడు; ముని మనుజపతుల సన్నిధిన్= మునులు; రాజులు మొదలగువారి సమీపంలో; అనుత్తమ ప్రీతిన్= మిక్కిలి గొప్పదైన ప్రేమతో; దానిన్= నేనడిగిన దానిని; ఆకర్ణింపన్= వినటానికి; నినున్= నిన్ను; వేడ్కన్= కుతూహలంతో; ఉపాసించుచున్= శ్రద్ధతో దగ్గరగా కూర్చున్నవాడు అవుతూ; ఉన్నాడు.

తాత్పర్యం: మాననీయచరితా! ఈ శ్రీకృష్ణుడు మునులయొక్క, రాజులయొక్క సమక్షంలో నీవు చెప్పేదానిని వినటానికై నిండైన ప్రీతితో వేడుకతో నిన్ను ఉపాసిస్తూ ఉన్నాడు.

విశేషం: ఉపాసన - అంటే దగ్గర కూర్చోవటం అని శబ్దార్థం. శ్రద్ధాసక్తులతో కొలవటం అని రూఢ్యర్థం.

క. సమ్మోదమ్మున నేనుం । దమ్ములునుం దేల సత్కథాకథన పర
త్వ మ్మాదరింపు మునివ । ర్గమ్ము నృపచయమ్ము పులకరాజి వహింపన్.' 391

ప్రతిపదార్థం: నేనున్= నేనూ; తమ్ములున్= మా తమ్ముళ్ళూ; సమ్మోదమ్మునన్= మిక్కిలి ఆనందంతో; తేలన్= తేలునట్లుగా; మునివర్గమ్ము= మునుల సముదాయమూ; నృపచయమ్ము= రాజుల సముదాయమూ; పులకరాజి= రోమాంచం; వహింపన్= ధరింపగా; సత్+కథా కథన పరత్వమ్ము= మంచి కథ చెప్పటంలోని ఆసక్తిని; ఆదరింపుము= ప్రీతితో గ్రహించుము.

తాత్పర్యం: నేనూ, మా తమ్ముళ్ళూ పరమానందంలో తేలిపోయే విధంగా మునులూ, రాజులూ పులకాంకురాలు పొందగా మంచికథ చెప్పటంలోని ఆసక్తిని ఆదరించుము.'

వ. అనుటయు భీష్ముండు. 392

తాత్పర్యం: అనగా భీష్ముడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పుణ్యం బగు నితిహాస మ । గణ్యగుణా! నీకుఁ జెప్పఁ గను సుకృతముఁ గా
రుణ్యనిధి సర్వలోక శ । రణ్యుఁడు గృష్ణుండు విను వరంబుఁ బడసితిన్. 393

ప్రతిపదార్థం: అగణ్యగుణా!= లెక్కింపజాలనన్ని మంచి గుణాలు కలవాడా!; పుణ్యంబు= మేలైనది; అగు+ఇతిహాసము= అయిన పురాతన కథ; నీకున్= నీకు; చెప్పన్= చెప్పటానికి; కను సుకృతము= పొందే పుణ్యాన్నీ; కారుణ్యనిధి= దయకు గనీ; సర్వలోక శరణ్యుఁడు= అన్నిలోకాలకు రక్షకుడైనవాడూ అగు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; విను వరంబున్= వినే వరాన్నీ, పడసితిన్= పొందాను.

తాత్పర్యం: 'గుణనిధీ! పుణ్యమైన పురాతనచరిత్రను నీకు చెప్పే పుణ్యాన్నీ, దయాసముద్రుడూ, అన్ని లోకాలకు రక్షకుడూ అయిన శ్రీకృష్ణపరమాత్మ వినే వరాన్నీ పొందాను.

విశేషం: శ్రీకృష్ణుడు 'సర్వము తాను అయినవాడు'. అతడు నిలుకడగా ఉండి వినటం ఎంత భాగ్యం! ధర్మరాజు ఆ కృష్ణుడి అనుగ్రహం పరిపూర్ణంగా పొందినవాడు. అతడికి చెప్పటం ఎంత పుణ్యవిశేషం! భీష్ముడు దీనిని అభివ్యక్తం చేస్తున్నాడు.

క. పారాశర్యాదిమునులు । నీ రాజన్యులును వినికి యెంతకు లేదీ
గారాము నాకుఁ బరమో । దారపదావాప్తి గాదె ధర్మతనూజా! 394

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= యమధర్మరాజు ముద్దుబిడ్డా! పారాశర్య+ఆది మునులున్= వ్యాసుడు మొదలైన మహర్షులు; ఈ రాజన్యులును= ఈ రాజవంశాలవారు; వినికి= వినటం; నాకున్= నాకు; ఈ గారాము= ఈ గౌరవం; ఎంతకున్= ఎంతకు; లేదు; పరమ+ఉదార పద+అవాప్తి= అతిశ్రేష్ఠము, మహిమగలదీ అయిన పదం పొందటం; కాదె!= కదా!

తాత్పర్యం: ధర్మరాజా! శ్రీ వేదవ్యాసులు మొదలైన మహర్షులు, ఈ రాజవంశంవారూ వినటంవలన నా గౌరవం ఎంత ఉన్నతమైనదో చెప్పటానికి వీలులేనిది, పరమపదం పొందటమే కదా!

విశేషం: వేదవ్యాసుడు అష్టాదశ పురాణాదులకు కర్త. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అనదగినవాడు, తక్కినవారు కూడా ఇంచుమించు అంతటివారు. ఉత్తమజన్మతో యుద్ధాలలో సర్వమూ త్యాగం చేయటానికి సిద్ధపడిన మహోన్నతవ్యక్తిత్వం కలవారు రాజన్యులు. వీరంతా సావధానంగా వింటూ ఉంటే చెప్పే అదృష్టం ఎంతటిదో చెప్పగలమా! - అనే భావం "ఎంతకు లేదు"? అనే పదాలలో గోచరిస్తుంది.

వ. నీ యడిగిన యట్టిదానికి నొక యితిహాసంబు గలదది యుమామహేశ్వర సంవాదం బనం బరఁగుఁ బౌరవోత్తమా! యప్పురావృత్తంబు ప్రవర్తించుటకుం గతంబైన కథ మున్ను సెప్పి, మఱి దానిం జెప్పిన నొప్పియుండుం గావున నప్పరిపాటిం జెప్పెద నవధానపరుండవయి యాకర్ణింపు'మని పలికి, హరికిం బరమభక్తిం బ్రణమిల్లి, యప్పాండవముఖ్యు ముఖచంద్రికం దనవిలోచనచకోరంబు లాన నమ్మానవపతికి నమ్మాననీయమతి యిట్లనియె. 395

ప్రతిపదార్థం: నీ+అడిగిన+అట్టిదానికిన్= నీవడిగిన దానికి; ఒక ఇతిహాసంబు= ఒక పూర్వకథ; కలదు= ఉన్నది; అది; ఉమామహేశ్వర సంవాదంబు= ఉమ, మహేశ్వరుడు అనే వారి సంభాషణం; అనన్= అనగా; పరఁగున్= ఒప్పుతున్నది; పౌరవ+ ఉత్తమా!= పూరువంశం వారిలో శ్రేష్ఠుడా; ఆ+పురావృత్తంబు=ఆ మునుపటి కథ, ప్రవర్తించుటకున్= జరుగుటకు; కతంబు= కారణం; ఐన కథ= అయిన వృత్తాంతం; మున్ను= ముందుగా; చెప్పి; మఱి= తరువాత; దానిన్= దానిని; చెప్పినన్= చెప్పి నట్లయితే; ఒప్పి+ఉండున్= తగిన విధంగా ఉంటుంది; కావునన్=కనుక; ఆ+పరిపాటిన్= ఆ వరుసలో; చెప్పెదన్= చెప్పుతాను; అవధాన పరుండవు= ఏకాగ్రత కలవాడవు; అయి; ఆకర్ణింపుము= వినుము; అని; పలికి; హరికిన్= కృష్ణుడికి; పరమభక్తిన్= గొప్పభక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; ఆ+పాండవముఖ్యు ముఖ చంద్రికన్= పాండుకుమారులలో మొదటివాడైన ధర్మరాజు ముఖమనే వెన్నెలను; తన విలోచన చకోరంబులు= తన కనులు అనే చకోరపక్షులు; ఆనన్= ఆస్వాదిస్తూ ఉండగా; ఆ+మానవ పతికిన్= ఆ రాజునకు; ఆ+మాననీయమతి= మన్నించదగిన బుద్ధివిశేషంగల ఆ భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నీ వడిగిన దానికొక కథ ఉన్నది. దానిని ఉమామహేశ్వర సంవాదం అంటారు. అది ఏర్పడటానికి కారణం ముందు చెప్పి, తరువాత దానిని చెప్పితే మేలుగా ఉంటుంది. ఆ వరుసలో చెప్పుతాను - శ్రద్ధగా వినుము.' అని మహాభక్తితో కృష్ణుడికి నమస్కరించి, ధర్మరాజు మోము వెన్నెలలను తన కన్నులనే చకోరాలు ఆస్వాదిస్తూ ఉండగా (ధర్మరాజు ముఖాన్ని మిక్కిలి ప్రీతితో చూస్తూ) భీష్ముడు ఆ రాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఒక మహాపుణ్యకథను ఒక మహాబుద్ధిశాలికి సాక్షాత్తు శ్రీకృష్ణుడి సన్నిధానంలో చెప్పుతున్నాను' అనే ఆనందం భీష్ముడిలో పట్టశక్యం కాని ప్రమాణంలో ఉన్నదని 'ముఖచంద్రిక' - విలోచనచకోర' రూపకాలు అభివ్యక్తం చేస్తున్నాయి.

భీష్ముఁడు ధర్మజునకు శ్రీకృష్ణుని చరిత్రంబు చెప్పుట (సం.13-203-1 (కుంభ))

క. తనయునిఁ బడయుటకై తప । మొనరింపఁగ రుక్మిణియు సముత్సుకవృత్తిం
దనతో రాఁ దుహినాద్రికిఁ । జనియెం గృష్ణుండు మునులు సంతస మందన్. 396

ప్రతిపదార్థం: కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; తనయునిన్= కుమారుడిని; పడయుటకున్+ఐ= పొందటంకొరకు; తపము= తపస్సు; ఒనరింపఁగన్= చేయటానికి; రుక్మిణియున్= రుక్మిణీదేవి కూడా; సముత్సుక వృత్తిన్= మిక్కిలి వేడుక కల భావంతో; తనతోన్= తనతో; రాన్= రాగా; మునులు= మహర్షులు; సంతసము= సంతోషం; అందన్= పొందగా; తుహిన+అద్రికిన్= మంచుకొండకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కుమారుడిని పొందగోరి, తపంచేయటంకొరకు రుక్మిణి కూడా వేడుకతో రాగా మునులు ఆనందపడగా హిమవత్పర్వతానికి వెళ్ళాడు.

విశేషం: కృష్ణుడికి ఇదొకలీల. లోకానికి బోధించే పద్ధతులలో తాను ఆచరించటం ఒక పద్ధతి.

వ. ఇట్లు చని, ద్వాదశవార్షిక వ్రతక్లిష్టుండై యున్న కృష్ణుం గాన మునీంద్రులు నారదపర్వత వ్యాసవాల్మీకి దేవల కాశ్యప ప్రభృతులు శిష్యవర్గంబుతో వచ్చినవారలం బాద్యాసనాది సముచితార్చనంబుల సంభావించిన వార లద్దేవునిం బరివేష్టించి పుణ్యగోష్ఠి నడపుచున్న సమయంబున. 397

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చని= వెళ్ళి; ద్వాదశ వార్షిక వ్రత క్లిష్టుండు+ఐ= పంద్రెండు ఏండ్ల వ్రతంతో మిక్కిలి కష్టపడి ఉన్నవాడై; ఉన్న కృష్ణున్= ఉన్న శ్రీకృష్ణుడిని; కానన్= చూడటానికి; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; నారద పర్వత వ్యాస వాల్మీకి దేవల కాశ్యప ప్రభృతులు= నారదుడు; పర్వతుడు, వ్యాసుడు, వాల్మీకి, దేవలుడు, కాశ్యపుడు మొదలైనవారు; శిష్యవర్గంబుతోన్= శిష్యుల సముదాయంతో; వచ్చినన్= రాగా; వారలన్= వారిని; పాద్య+ఆసన+ఆది సముచిత+అర్చనంబులన్= కాళ్ళకు నీరు; కూర్చుండే పీట మొదలైన తగిన పూజలతో; సంభావించినన్= మర్యాద చేయగా; వారలు= ఆ మునులు; ఆ+దేవునిన్= ఆ దేవుడిని; పరివేష్టించి= చుట్టుకొని కూర్చుండి; పుణ్యగోష్ఠి= పవిత్రమైన సంభాషణ; నడపుచున్= సాగిస్తూ; ఉన్న సమయంబునన్= ఉన్న వేళలో.

తాత్పర్యం: ఇట్లా వెళ్ళి, పంద్రెండు ఏండ్ల వ్రతంచేసి, బాగా నలిగి ఉన్న కృష్ణుడిని చూడటానికి నారదుడు, పర్వతుడు, వ్యాసుడు, వాల్మీకి, దేవలుడు, కాశ్యపుడు మొదలైన మునులు శిష్యులతోపాటు రాగా, వారికి తగిన ఉపచారాలు చేసిన తరువాత వారందరూ కృష్ణుడిని చుట్టుకొని సద్విషయాలు మాటాడుకొంటూ ఉన్న సమయంలో.

తే. అతని ముఖమున వెడలి మహాగ్ని యమ్మ । హీధరము విపినంబుల నేర్చెఁ బక్షి
మృగయుతంబుగ సిద్ధసాధ్యగణములు స । మాకులత్వంబుఁ బొందఁ బెల్లడరి యధిప! 398

ప్రతిపదార్థం: మహా+అగ్ని= గొప్ప అగ్ని; అతని ముఖమునన్= అతడి ముఖంనుండి; వెడలి= వెలువడి; ఆ+మహీధరము విపినంబులన్= ఆ కొండ అడవులను; పక్షి మృగ యుతంబుగన్= పక్షులు, జంతువులు అనే వాటితోపాటుగా; సిద్ధసాధ్యగణములు= సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతివారి గుంపులు; సమాకులత్వంబున్= మిక్కిలి కలతపాటు; పొందన్= పొందగా; పెల్లు= పెద్దగా; అడరి= వ్యాపించి; ఏర్చెన్= కాల్చింది.

తాత్పర్యం: అతడి ముఖంనుండి గొప్ప అగ్ని వెలువడి మృగాలు, పక్షులు, సిద్ధులు, సాధ్యులు మొదలైన వారంతా గుండెలలో తీవ్రమైన ఆందోళన పొందుతూ ఉండగా పెద్దగా వ్యాపించి, ఆ కొండ అడవులను కాల్చివేసింది.

విశేషం: మృగాలు, పక్షులు అనే క్రింది జాతి ప్రాణులను, సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతి వారినీ చెప్పటంచేత తక్కిన అన్ని విధాల ప్రాణుల సంగతీ చెప్పినట్లయింది.

క. ఆ కృష్ణుఁడు నిజసౌమ్యా। లోకనమున నాశిఖిని మలుఁగఁ జేసెం బూ
ర్వాకారత నవ్వనము ని । రాకులతం బొల్చె నది మహాద్భుత మయ్యెన్. 399

ప్రతిపదార్థం: ఆ కృష్ణుఁడు= ఆ కృష్ణభగవానుడు; నిజ సౌమ్య+ఆలోకనమునన్= తనదైన మంచి చూపుతో; ఆ శిఖినిన్= ఆ అగ్నిని; మలుఁగన్= ఆరిపోయే విధంగా; చేసెన్= చేశాడు; ఆ+వనము= ఆ అడవి; పూర్వ+ఆకారతన్= మునుపటి రూపంతోడనే; నిరాకులతన్= ఏ కలతపాటు లేని తనంతో; పొల్చెన్= ప్రకాశించింది; అది= ఆ సంగతి; మహా+అద్భుతము= గొప్ప ఆశ్చర్యం కలిగించేది; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: కృష్ణుడు తన శుభమైన చూపుతో ఆ మంటను మరలింపజేశాడు. ఆ అడవి మునుపటి విధంగానే ఏ వికారమూ లేని దయింది. అది అందరకూ ఎంతో అబ్బురం అయి కనిపించింది.

విశేషం: ఈ విషయం కృష్ణుడికి సర్వభూతాలపై ఉన్న అధికారాన్ని సూచిస్తుంది.

తే. దాని కమ్మును లెల్లఁ జిత్తమున భయము । విస్మయంబును బెనఁగొన వెఱఁగుపాటు
గదిరి చిత్రరూపంబుల కరణి నుండ । వారిఁ గన్గొని రుక్మిణీవల్లభుండు. 400

ప్రతిపదార్థం: దానికిన్= ఆ సంఘటనకు; ఆ+మునులు= ఆ మహర్షులు; ఎల్లన్= అందరూ; చిత్తమునన్= హృదయంలో; భయము= భీతి; విస్మయంబును= ఆశ్చర్యం; పెనఁగొనన్= అల్లుకొని పోగా; వెఱఁగుపాటు= చేష్టలుడిగిన స్థితి; కదిరి= వ్యాపించి; చిత్రరూపంబుల కరణిన్= చిత్రపటంలోని ఆకారాల విధంగా; ఉండన్= ఉండగా; రుక్మిణీ వల్లభుండు= రుక్మిణి ప్రియుడు - కృష్ణుడు; వారిన్= వారిని; కన్గొని= చూచి.

తాత్పర్యం: ఆ సంఘటనకు గుండెలో గుబులూ, అచ్చెరువూ కలుగగా, ఆ మునులందరూ నిశ్చేష్టత పొంది బొమ్మలోని రూపాలవలె ఉండగా, కృష్ణుడు వారిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: చిత్రపటంలో ఒక భావం తోచే విధంగా గీసిన బొమ్మ ఏ మార్పూ లేక అట్లాగే ఉంటుంది. సాధారణదశలో ప్రాణులు అట్లా ఉండటం అసాధ్యం. తీవ్రమైన భయాదులవలన అట్టి స్థితి సహజంగా ఏర్పడుతుంది. దీనినే 'స్తంభం' అనే భావంగా అలంకార శాస్త్రం చెప్పుతున్నది.

వ. 'మీరీ యనలంబు తెఱం గేమిగా నెఱింగితి? రున్న రూపెఱింగింపవలయు' ననుటయు వారలు సభక్తికంబులగు చిత్తంబులతోడ. 401

ప్రతిపదార్థం: మీరు= మీరలు; ఈ+అనలంబు తెఱంగు= ఈ అగ్నితీరు; ఏమిగాన్= ఏ విధమైనదిగా; ఎఱింగితిరి?= తెలిసికొన్నారు; ఉన్నరూపు= ఉన్న విధం; ఎఱింగింపవలయున్= తెలుపవలె; అనుటయున్= అన్నంతనే; వారలు= ఆ మునులు; సభక్తికంబులు= భక్తితో కూడినవి; అగు చిత్తంబులతోడన్= అయిన హృదయాలతో.

తాత్పర్యం: 'మీరీ అగ్ని తీరు ఏమిగా తెలిసికొన్నారు? ఉన్నది ఉన్నట్లు చెప్పండి' అంటే వారు భక్తితో నిండైన హృదయాలతో (ఇట్లా అంటున్నారు).

క. 'దేవా! విశ్వము గలుగుట । నీవలనన; యడఁగుటయును నీయందు భవ
ద్భావాధీనమ సకల । స్థావరజంగమ సమాహితత్వం బెల్లన్. 402

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; విశ్వము= ఈ లోకాల సముదాయం; కలుగుట= ఏర్పడటం; నీవలనన్+అ= నీవలననే; అడఁ గుటయును= లీనమై పోవటం; నీ అందున్+అ= నీయందే; సకల స్థావర జంగమ సమాహితత్వంబు= సమస్తమైన స్థిరంగా ఉండే భూతాలయొక్క, కదిలే ప్రాణులయొక్క స్థితి; ఎల్లన్= అంతా; భవత్+భావ+అధీనము+అ= నీ సంకల్పానికి వశమైనదియే.

తాత్పర్యం: ప్రభూ! ఈ విశ్వమంతా ఏర్పడటం నీవలననే; అణగిపోవటం నీయందే. కదలనివి, కదలేవి అయిన సమస్తభూతాల ప్రవృత్తి అంతా నీ సంకల్పానికి వశమైనదే.

తే. నీవు మమ్ము బోధింపఁగా నేర్తుగాక । యిమ్మహానలస్ఫురణంబు నిట్టి దనఁగ
నేము నేర్తుమె? యేమియో యెఱుఁగ కునికిఁ । గాదె నివ్వెఱ పడితిమి? కమలనాభ!' 403

ప్రతిపదార్థం: కమలనాభ!= కమలము బొడ్డునందు గల ఓ సర్వాధారా!; నీవు; మమ్ముౕన్= మమ్ములను; బోధింపఁగాన్= తెలుపగా; నేర్తు(వు); కాక= నేర్చెదవు గానీ; ఈ+మహా+అనల స్ఫురణంబున్= ఈ గొప్ప అగ్ని వెలువడటం; ఇట్టి+అది= ఇటువంటిది; అనఁగన్= అనుటకు; ఏము= మేము; నేర్తుము+ఎ?= సమర్థుల మగుదుమా?; ఏమియో?= అది ఏమో?; ఎఱుఁగక+ఉనికిన్= తెలియకపోవటంవలన; కాదె!= కదా!; నివ్వెఱపడితిమి?= నిశ్చేష్టులం అయ్యాము?

తాత్పర్యం: నీవు మాకు తెలుపగలవు గానీ, ఈ అగ్ని వెలువడటం ఏమిటో మేము తెలిసికొనగలమా? అది ఏమో తెలియకనే కదా! మేము నిశ్చేష్టులం అయ్యాము!

వ. అనుటయు భవదీయ చేతఃప్రసన్నతగాదె జగంబుల వర్తనంబునకు నాధారంబు. 404

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; భవదీయచేతస్+ప్రసన్నత= మీదైన హృదయాల నిర్మలత్వం; కాదె= కదా!; జగంబుల వర్తనంబునకున్= లోకాల సాగుదలకు; ఆధారంబు= ఆధారం.

తాత్పర్యం: అని ఆ మహర్షులు అనినంతనే కృష్ణుడు 'మీ హృదయాలు ప్రసన్నంగా ఉండటమే కదా లోకాల సాగుదలకు ఆధారం! (అన్నాడు).

విశేషం: "సంతో భూమిం తపసా ధారయంతి" అని సూక్తి. 'సజ్జనులు తమ తపస్సుచేత భూమిని పట్టి నిలుపుతారు.' శ్రీకృష్ణుడు ఇక్కడ ఈ వాక్యార్థాన్ని సమన్వయించాడు.

క. కావున మీకుం బ్రియముగ । నీ వహ్ని తెఱంగు దెలియ నెఱిఁగించెదఁ జి
త్తావిలత విడువుఁ డని కమ । లావరుఁ డిట్లనియె వారలకుఁ గురువర్యా! 405

ప్రతిపదార్థం: కావునన్= కనుక; మీకున్= మీకు; ప్రియముగన్= ప్రీతి కలిగే విధంగా; ఈవహ్నితెఱంగు= ఈ అగ్ని తీరు; తెలియన్= తెలిసే విధంగా; ఎఱిఁగించెదన్= తెలుపుతాను; చిత్త+ఆవిలత= హృదయంలోని కలతపాటు; విడువుఁడు= వదలండి, అని; కురువర్యా= ధర్మరాజా!; కమలా వరుఁడు= లక్ష్మీవల్లభుడైన కృష్ణుడు; వారలకున్= వారికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: కనుక మీకు ప్రియంగా ఈ అగ్ని తీరు తెలియజెప్పుతాను. మీ హృదయాలలోని ఆవేగాన్ని తొలగించుకొనండి' అని కృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇప్పుడు వాసుదేవరూపంలో ఉన్నా ఆయన ఎప్పుడూ లక్ష్మీవల్లభుడే! రుక్మిణియే ఇప్పుడు లక్ష్మి.

వ. ఒక దానవుఁడు జగన్నా । శకుఁ డిత్తఱిఁ గలఁడు వానిఁ జంపుట కేఁ బూ
నక యునికి గలిగె వాఁ డ । స్త్రకళావిదుఁ డగుట నా కతంబున నగుటన్. 406

ప్రతిపదార్థం: ఈ+తఱిన్= ఈ సమయంలో; జగత్+నాశకుఁడు= జగత్తును నశింపజేసేవాడు; ఒక దానవుఁడు= ఒక రాక్షసుడు; కలఁడు= ఉన్నాడు; వాఁడు= అతడు; అస్త్ర కళా విదుఁడు= అస్త్రములను కళను చక్కగా ఎరిగినవాడు; అగుట= కావటం; నా కతంబునన్= నా కారణంగా; అగుటన్= కావటంవలన; ఏన్= నేను; వానిన్= వాడిని; చంపుటకున్= చంపటానికి; పూనక= సిద్ధపడక; ఉనికి= ఉండటం; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: ఈ సమయంలో లోకాలను నశింపజేసే రాక్షసుడు ఒకడున్నాడు. వాడు అస్త్రవిద్యలో నేర్పరి కావటం నావలననే అయిన కారణంగా వాడిని నేను చంపటానికి సిద్ధపడలేదు.

విశేషం: విద్యనేర్పినవాడు తండ్రి అవుతాడు. తండ్రి కొడుకును చంపటం సాధ్యం కాదు కదా! అంతేకాక విషవృక్షమైనా స్వయంగా పెంచి త్రుంచలేరని కాళిదాసోక్తి. "విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతమ్".

క. కడుఁ గ్రొవ్వి వాఁడు లోకము । నుడుకులఁ బెట్టంగ విసివి యుగ్రతపమునం
గొడుకుఁ బడసి యద్దనుజునిఁ । బొడవడఁగింపం దలంచి భూరివ్రతమున్. 407

ప్రతిపదార్థం: వాఁడు= ఆ రక్కసుడు; కడున్= మిక్కిలిగా; క్రొవ్వి= బలిసి; లోకమున్= జగత్తును; ఉడుకులన్= బాధలలో; పెట్టంగన్= పెట్టగా; విసివి= విసుగుచెంది; ఉగ్రతపమునన్= ఘోరమైన తపస్సుతో; కొడుకున్= కుమారుడిని; పడసి= పొంది; ఆ దనుజున్= ఆ రాక్షసుడిని; పొడవు+అడఁగింపన్= చంపటానికి; తలంచి= సంకల్పించి; భూరివ్రతమున్= గొప్ప వ్రతాన్ని.

తాత్పర్యం: కానీ ఆ రాక్షసుడు క్రొవ్వి, లోకాలను త్రిప్పులబెడుతున్నాడు. విసుగుపుట్టి, ఘోరమైన తపస్సుతో కొడుకును పొంది ఆ రాక్షసుడిని చంపటానికి సంకల్పించి మహావ్రతాన్ని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. నడప మదాత్మ యగ్నియయి నా వదనంబున నిర్గమించె యె
క్కుడుపడి పద్మగర్భుకడకుం జనె నమ్మహితుండు మన్మథుం
గొడుకుగఁ బంచి వే తను మగుడ్పగ వచ్చెఁ గడంగి పోవున
ప్పుడు వనమేర్చె నేను గృపఁ బూర్వవిధం బొడఁగూడఁ జూచితిన్. 408

ప్రతిపదార్థం: నడపన్= సాగింపగా; మత్+ఆత్మ= నా ఆత్మ; అగ్ని= వహ్ని; అయి; నా వదనంబునన్= నా నోటినుండి; నిర్గమించి= వెలువడి; ఎక్కుడు+పడి= పెద్దదై; పద్మగర్భుకడకున్= బ్రహ్మదగ్గరకు; చనెన్= వెళ్ళినది; ఆ+మహితుండు= ఆ గొప్పవాడు; మన్మథున్= మన్మథుడిని; కొడుకుగన్= నా కుమారుడిగా; పంచి= పంపి; వే= వడిగా; తనున్= తన్ను; మగుడ్పఁగన్= మరలింపగా; వచ్చెన్= వచ్చినది; కడంగి= ప్రయత్నపడి; పోవు+అప్పుడు= తిరిగి పోయే సమయంలో; వనము= అడవి; ఏర్చెన్= కాల్చివేసింది; నేను; కృపన్= జాలితో; పూర్వవిధంబు= తొల్లిటి తీరు; ఒడఁగూడన్= ఏర్పడునట్లుగా; చూచితిన్= చేశాను.

తాత్పర్యం: (గొప్పవ్రతం) సాగించగా నా ఆత్మ అగ్ని అయి నా ముఖం నుండి బయటకు వచ్చింది. అది క్రమంగా బాగా పెరిగి, బ్రహ్మదగ్గరకు వెళ్ళింది. ఆ మహానుభావుడు మన్మథుడిని నా కుమారుడిగా పంపి, దానిని మరలించాడు. అది తిరిగి పోతూ ఈ అడవిని కాల్చివేసింది. నేను జాలిపుట్టి, మరల దానికి మొదటిరూపు కల్పించాను.

విశేషం: సృష్టి వ్యవహారమంతా బ్రహ్మ పని. అందుకని అగ్ని అక్కడకు వెళ్ళింది. తిరిగిపోతూ కాల్చటం ఎందుకు? అంటే అది దాని స్వభావం.

వ. ఇది యద్దహనంబు తెఱం' గని చెప్పి యప్పరమపురుషుం డమ్మునివరులతో మఱియును. 409

ప్రతిపదార్థం: ఇది; ఆ+దహనంబు తెఱంగు= ఆ అగ్ని తీరు; అని; చెప్పి; ఆ+పరమ పురుషుండు= ఆ పరమాత్మ; ఆ+ముని వరులతోన్= మహర్షిశ్రేష్ఠులగు నారదాదులతో; మఱియును= ఇంకా.

తాత్పర్యం: ఆ అగ్ని ఏర్పడిన విధం ఇది' అని చెప్పి ఆ పరమాత్మ ఆ మహర్షులతో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ఒక మహారాజు ప్రియమైన సేవకుడి పెండ్లిలో పల్లకీ ప్రక్కన నడుస్తాడు. అయినా అతడు మహారాజే. పరమాత్మ అవతారరూపంలో వేరు నామరూపాలు పొందినా పరమాత్మయే. ఈ దృష్టితో ఇక్కడ పరమపురుష శబ్దాన్ని తిక్కనగారు ప్రయోగించారు.

సీ. **'లోకత్రయంబున మీకు నవిదితంబు । లేదు త్రికాల సంవేదులార!**
యుత్తమం బగు పురావృత్తంబు చెప్పి కృ । తార్థుఁ జేయుండు న న్ననిన వారు
సవినయంబుగఁ గృతాంజలు లయి 'మమ్మింత । పెద్ద సేయుదె? నీవు పెద్దలకును
బెద్ద వయత్నసంభృతజగత్త్రయుఁడవు । విశ్వప్రకారసంవిదుఁడ వేము

తే. **నీ యెఱుంగని యితిహాస మేయుగమున । నెఱిఁగి చెప్పుదు? మనవుడుఁ జిఱుతనగవు**
మోమునకుఁ జెన్ను సేయ నమ్మురహరుండు । వారలకు నిట్టులనుఁ గురువంశ వర్య! **410**

ప్రతిపదార్థం: త్రికాల సంవేదులార!= మూడుకాలాలను చక్కగా తెలిసిన విజ్ఞులారా!; లోకత్రయంబునన్= మూడు లోకాలలో; మీకున్= మీకు; అవిదితంబు= తెలియనది; లేదు; ఉత్తమంబు= శ్రేష్ఠమైనది; అగు పురావృత్తంబున్= అయిన ఇతిహాసాన్ని; చెప్పి; నన్నున్= నన్ను; కృతార్థున్= నెరవేరిన కోరిక కలవాడినిగా; చేయుండు= చేయండి; అనినన్= అనగా; వారు= ఆ మునులు; సవినయంబుగన్= వినయంతో; కృత+అంజలులు= పట్టిన దోసిలి కలవారు; అయి; మమ్మున్= మమ్మలను; ఇంత= ఇంతగా; పెద్ద+చేయుదె?= గొప్పవారిని చేస్తావా?; నీవు; పెద్దలకును= మహావృద్ధులకుకూడా; పెద్దవు= పెద్దవాడవు; అయత్న సంభృతజగత్+ త్రయుఁడవు= ఏ ప్రయత్నంలేకయే చక్కగా భరింపబడిన మూడు లోకాలు కలవాడవు; విశ్వ ప్రకార సంవిదుడవు= విశ్వపుతీరును చక్కగా తెలిసినవాడవు; ఏము= మేము; నీ ఎఱుంగని ఇతిహాసము= నీ వెరుగని కథను; ఏ యుగమునన్= ఏ యుగంలో; ఎఱిఁగి= తెలిసికొని; చెప్పుదుము?= చెప్తుతాము; అనవుడున్= అని పలుకగా; ఆ+మురహరుండు= మురాసురుని సంహారం చేసిన ఆ కృష్ణుడు; చిఱుతనగవున్= చిన్న నవ్వు; మోమునకున్= ముఖానికి; చెన్ను+చేయన్= సొంపు కూర్పగా; కురువంశవర్య!= కురువంశంలో ఉత్తముడా!; వారలకున్= ఆ మునులకు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు.

తాత్పర్యం: 'మీరు మూడు కాలాలు తెలిసినవారు. మూడు లోకాలలో మీకు తెలియనిది లేదు. నాకొక ఉత్తమ ఇతిహాసం చెప్పి నా కోరిక తీర్చండి' అనగా వారు వినయంతో చేతులు జోడించి, 'నీవు మమ్మ ఇంత గొప్ప చేస్తే ఎట్లాగు? నీవు పెద్దలకు పెద్దవు. లోకాల నన్నింటినీ అవలీలగా భరించగలవాడవు. విశ్వపు తీరుతెన్నులు చక్కగా తెలిసినవాడవు. నీకు తెలియని ఏ కథను మేము ఏ యుగంలో తెలిసి చెప్పగలవారము?' అన్నారు. అప్పుడు కృష్ణుడు చిరునగవు మొగానికి వింత శోభ కలిగిస్తూ ఉండగా వారితో ఇట్లా అన్నాడు.

విశేషం: పెద్దలకు పెద్ద - పెద్దలు సృష్టి స్థితి లయ కర్తలు - బ్రహ్మ విష్ణు మహేశ్వరులు - వారికి పెద్ద పరమాత్మ అని తాత్పర్యం. కృష్ణుడు త్రికాలాలను, త్రిలోకాలను తెలిసినవారినిగా మునులను పేర్కొన్నాడు. వారు ప్రతిగా త్రిమూర్తులకు అతీతమైన పరమాత్మ స్వరూపుడిగా, త్రిలోకాలకంటె మించి ఉన్న విశ్వమయుడుగా పేర్కొన్నారు. 'చిరునగవు'లో తరువాత తాను చెప్పబోయే విషయం లీలామాత్ర మనే సూచన ఉన్నది.

క. 'మానుషయోని జనించితిఁ। గాన మదీయ మగు బుద్ధిగౌరవము దదీ
యానుగుణత్వోపహితము। గా నెఱుఁగుఁడు మీరు సెప్పు కత విను టసదే?' 411

ప్రతిపదార్థం: మానుషయోనిన్= మనుష్య గర్భంలో; జనించితిన్= పుట్టాను; కానన్= కనుక; మదీయము= నాది; అగు బుద్ధి గౌరవము= అయిన బుద్ధిగొప్పతనం; తదీయ+అనుగుణత్వ+ఉపహితము=దానికి తగిన విధంగా ఏర్పడినది; కాన్= అగుటను; ఎఱుఁగుఁడు= తెలిసికొనండి; మీరు; చెప్పు కత= చెప్పే కథ; వినుట= వినటం; అసదే?= చిన్న విషయమా?

తాత్పర్యం: మనుష్యగర్భంలో పుట్టాను. కనుక, నా బుద్ధిస్థితి దానికి తగిన విధంగానే ఉన్నది - అని తెలిసికొనండి. మీరు చెప్పేకథ నాకు చిన్నదెట్లా అవుతుంది?

చ. అనుటయు వారలందఱుఁ బ్రియంబున దానికి నియ్యకొన్న నె
మ్మనములతోడ 'నీ పనికి మాన్యచరిత్రుఁడు నారదుండ త
క్కిన పెఱవారు చాలరు ప్రకీర్త్యవివేకుఁడు కృష్ణు డర్థితో
వినఁగఁ బురాతనంబయిన వృత్తము నమ్ముని చెప్పు టొప్పగున్. 412

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; వారలు= ఆ మునులు; అందఱున్= అందరూ; దానికిన్= దానికి; ఇయ్యకొన్న నెఱ+మనములతోడన్= ఒప్పుకొన్న నిండు హృదయాలతో; ఈ పనికిన్= ఈ కథ చెప్పటం అనే పనికి; మాన్యచరిత్రుఁడు= మన్నన కెక్కిన నడవడి కలవాడు; నారదుండు+అ= నారదుడే; తక్కిన పెఱవారు= మిగిలిన ఇతరులు; చాలరు= సమర్థులు కారు; ప్రకీర్త్యవివేకుఁడు= మిక్కిలి కొనియాడదగిన వివేకంగలవాడు; కృష్ణుఁడు; అర్థితోన్= కోరికతో; వినఁగన్= వింటూ ఉంటే; పురాతనంబు= ప్రాత కాలానిది; అయిన వృత్తమున్= అయిన సంగతిని; ఆ+ముని= ఆ నారద మహర్షి; చెప్పుట=చెప్పటం; ఒప్పు= మంచిది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: కృష్ణు డట్లా అనగా వారందరూ అంగీకరించిన హృదయాలతో 'ఈ పనికి సమర్థుడు నారదుడే. అతడి నడవడి ఎంతో మన్నన కెక్కినది. తక్కినవారు దీనికి చాలరు. లోకమంతా పెద్ద ఎత్తున కొనియాడే వివేకంకల శ్రీకృష్ణుడు వింటూ ఉంటే పూర్వకథను ఆ ముని చెప్పటమే బాగుంటుంది.'

చ. అని తగ నేక వాక్యతఁ బ్రియంబున నాతనితోడ నీవు మున్
కనినది విన్నయట్టిది ప్రకామకుతూహల చిత్తుఁ డైన కృ
ష్ణుని వినిపింపు నావుడు మనోజ్ఞ కథాకథనంబునందు వే
డ్క నిగుడ నమ్మునీంద్రుఁడు వికాసమునన్ మొగ ముల్లసిల్లఁగన్. 413

ప్రతిపదార్థం: అని; తగన్= బాగుగా; ఏకవాక్యతన్= ఒక్కమాట అగునట్లుగా; ప్రియంబునన్= ప్రీతితో; ఆతనితోడన్= ఆ నారదుడితో; నీవు; మున్= మునుపు; కనినది= చూచినది; విన్న+అట్టి+అది= విన్నది; ప్రకామ కుతూహల చిత్తుఁడు= పెద్దకోరికతో వేడుక కల హృదయం కలవాడు; ఐన కృష్ణునిన్= అయిన కృష్ణుడిని(కి); వినిపింపు= చెప్పుము; నావుడున్= అని పలుకగా; ఆ+ముని+ఇంద్రుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు; మనోజ్ఞ కథాకథనంబునందున్= హృదయాన్ని మురిపించే కథను చెప్పటంలో; వేడ్క= ఉత్కంఠ; నిగుడన్= వ్యాపించగా; మొగము= ముఖం; వికాసమునన్= విప్పారుటతో; ఉల్లసిల్లఁగన్= ప్రకాశించగా.

తాత్పర్యం: అని ఒక్కమాటగా నారదుడితో ఇట్లా అన్నారు. 'నీవు మునుపు చూచినది, లేక వినినది అయిన వృత్తాంతం ఎంతో కోరికతో ముచ్చట పడుతున్న కృష్ణుడికి చెప్పుము'. అప్పుడు నారదుడు వేడ్క పుట్టి, ముఖం వికాసంతో వెలుగొందుతూ ఉండగా (ఇట్లా అన్నాడు).

ఉమామహేశ్వర సంవాదంబను నితిహాసంబు (సం.13-205-1 (కుంభ))

క. నారాయణ సౌహార్ద్రో । దారత్వవిభూతి మున్న తనకుఁ గలిమి న
న్నారాయణుని మనోరథ । మారం బూరించె శంకరాంబికల కథన్. 414

ప్రతిపదార్థం: నారాయణ సౌహార్ద+ఉదారత్వ విభూతిన్= నారాయణుని చెలిమిలోని గొప్పతనపు సంపద; మున్ను+అ= ముందే తనకున్= తనకు (నారదుడికి); కలిమిన్= ఉండటంవలన; ఆ+నారాయణుని మనస్+రథము= ఆ నారాయణుడి కోరికను; శంకర+అంబికల కథన్= పరమేశ్వరుడు, అంబిక అనే వారి కథతో; ఆరన్= తనివి తీరా, పూరించెన్= నింపాడు.

తాత్పర్యం: 'నారాయణుని చెలిమి' అనే మిక్కిలి గొప్ప సంపద తనకు పూర్వమే ఉండటంవలన ఉమామహేశ్వరుల కథలతో ఆ నారాయణుడి కోరికను తనివితీరా నారదుడు పూరించాడు.

విశేషం: లోకసామాన్యంగా 'సౌహార్ద' శబ్దానికి 'చెలిమి' అని అర్థం. ఇక్కడ విశేషంగా నారాయణుడి హృదయంలో పదిలపరచుకొన్న స్థితిచేత అనే అర్థం సంభావించాలి.

వ. అత్తెఱంగు వివరించెద నట్లు సమస్త సంయమిసంఘంబును బ్రస్తుతి పూర్వకంబుగా నియోగింపం బ్రియంబునం బురాతన కథాకథనంబునకుం బూని యద్దేవముని యద్దేవకీనందనునకు వందనం బాచరించి తదభివందనంబు వడసి యవ్విభున కిట్లనియె. 415

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ పద్ధతిని; వివరించెదన్= విశేషంగా తెలియజేస్తాను; అట్లు= ఆ విధంగా; సమస్త సంయమి సంఘంబును= మునుల సముదాయమంతా; ప్రస్తుతి పూర్వకంబుగాన్= ప్రశంస మొదలుగా; నియోగింపన్= నియమించగా; ఆ+దేవముని= దేవలోకపు మునియైన ఆ నారదుడు; పురాతన కథాకథనంబునకున్= పూర్వకాలపు కథను చెప్పటానికి; ప్రియంబునన్= ప్రీతితో; పూని= సంకల్పించి; ఆ+దేవకీనందనునకున్= దేవకి కొడుకైన శ్రీకృష్ణుడికి; వందనంబు= నమస్కారం; ఆచరించి= చేసి; తద్+అభివందనంబు= అతడి నమస్కారం; వడసి= గ్రహించి; ఆ+విభునకున్= ఆ దేవుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఆ తీరు వివరంగా చెప్పుతాను. ఆ విధంగా మునులందరూ ప్రశంసతోపాటు తనను నియమించగా నారదుడు సంతోషంతో ఇతిహాసం చెప్పటానికి పూనుకొని, ముందు శ్రీకృష్ణుడికి నమస్కారం చేసి, అతడి ప్రతినమస్కారం గ్రహించి, అతడితో ఇట్లా అన్నాడు.

తే. తీర్థభజనంబునకు నెందుఁ దిరుగుచుండి । యిత్తుషారనగంబున కేను వచ్చి
కంటి రమణీయ మగు కేలికావనంబు । సకలతరువల్లరీగుల్మచారుతలము. 416

ప్రతిపదార్థం: ఏను= నేను; తీర్థ భజనంబునకున్= పుణ్యస్థలాలను సేవించటానికి; ఎందున్= అన్ని చోటులందు; తిరుగుచున్+ఉండి= తిరుగుతూ; ఈ+తుషార నగంబునకున్= ఈ మంచుకొండకు; వచ్చి= ఏతెంచి; సకల తరు వల్లరీ

గుల్మ చారు తలము= అన్ని విధములైన చెట్లు, తీగెలు, పొదలు అనేవాటితో అందమైన చోటు; రమణీయము= మనోజ్ఞమైనది; అగు కేలికావనంబున్= అయిన ఉద్యానవనాన్ని; కంటిన్= చూచాను.

తాత్పర్యం: నేను పుణ్యస్థలాలు సేవిస్తూ, అన్ని స్థలాలు తిరుగుతూ, ఈ హిమవత్పర్వతానికి వచ్చి, చూడముచ్చట అయినది. అన్ని రకాల చెట్లు, తీగెలు, పొదలు అనే వాటితో సుందరంగా ఉన్నదీ అయిన ఒక ఉద్యానవనాన్ని చూచాను.

విశేషం: "భజ సేవాయామ్" అని ధాతువు కనుక భజనం అంటే సేవించటం.

క. కోకిలకుల గంధర్వా । నీకధ్వను లెనసి బెరసి నిగుడఁగ నమరీ
లోకభ్రమరీమండలి । కా కలకలనాదములును గలిసి చెలంగన్. 417

ప్రతిపదార్థం: కోకిల కుల గంధర్వ+అనీక ధ్వనులు= కోకిలలగుంపుల యొక్క, గంధర్వుల సముదాయాలయొక్క నాదాలు; ఎనసి= విజృంభించి; బెరసి= కలిసిపోయి; నిగుడఁగన్= వ్యాపించగా; అమరీ= దేవతాస్త్రీ; లోక= సముదాయంయొక్క; భ్రమరీ= ఆడు తుమ్మెదల; మండలికా= గుంపులయొక్క; కలకలనాదములును= అవ్యక్తమధుర నాదములు; కలిసి= ఒకదానితో ఒకటి కలిసి; చెలంగన్= వ్యాపించగా.

తాత్పర్యం: కోకిలల నాదాలు, గంధర్వుల గానాలు, దేవకాంతల రాగాలు, ఆడు తుమ్మెదల అవ్యక్తమధుర గీతాలు కలిసి విజృంభించగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఒప్పు నవ్వనంబునం గనక స్థలంబున శార్దూల చర్మవసన భుజగాభరణ భసితాంగరాగ విరచితాలంకార చారు దివ్యదేహుం డగు మహాదేవుండు సుర సిద్ధసాధ్య విద్యాధర మునిపుంగవ భూతగణ పరివృతుం డయి యున్న నప్పేరోలగంబున నేనును సముచితప్రకారంబున నయ్యనిరూపణీయప్రకారుం గొల్చి యుండితి నట్టి సమయంబున. 418

ప్రతిపదార్థం: ఒప్పు+ఆ+వనంబునన్= ఒప్పారే ఆ పూదోటలో; కనక స్థలంబునన్= బంగారు తాపడం గల తావున; శార్దూల= పులియొక్క; చర్మ= తోలు అనే; వసన= వస్త్రం; భుజగ= పాములనే; ఆభరణ= నగలు; భసిత= విభూతి అనే; అంగరాగ= మైపూతలతో; విరచిత= చేయబడిన; అలంకార= శృంగారం గల; చారు= మనోహరమైన; దివ్య= మిక్కిలి ఉత్తమమైన; దేహుండు+అగు= దేహం కలవాడైన; మహాదేవుండు= పరమేశ్వరుడు; సుర= దేవతల; సిద్ధ=సిద్ధుల; సాధ్య= సాధ్యుల; విద్యాధర= విద్యాధరుల; మునిపుంగవ= మహర్షివరేణ్యుల; భూత= భూతముల; గణ= గుంపులచేత; పరివృతుండు+ అయి= చుట్టబడినవాడై; ఉన్నన్= ఉండగా; ఆ+పేరు+ఓలగంబునన్= ఆ పెద్ద సభలో; నేనును= నేను కూడా; సముచిత ప్రకారంబునన్= తగిన తీరున; ఆ+అనిరూపణీయ ప్రకారున్= ఇట్టివాడని భావించరాని ధోరణిలో గల ఆ సదాశివుడిని; కొల్చి= సేవించి; ఉండితిన్= ఉన్నాను; అట్టి సమయంబునన్ = ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ విధంగా ఒప్పారే ఆ ఉద్యానంలో బంగారు తాపిన ప్రదేశంలో పులితోలు అనే వస్త్రం, సర్పాల ఆభరణాలు, విభూతి మైపూతలతో అలంకరించుకొనిన అతిశ్రేష్ఠమైన దేహంగల ఆ మహాదేవుడు దేవతలు, సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు, మునివరులు, భూతములు అనే వారి గుంపులు చుట్టి రాగా కొలువున్న ఆ పెద్ద సభలో నేను కూడా తగు తీరున నిరూపించరాని తీరుతెన్నులుగల ఆ స్వామిని కొల్చి ఉన్నాను. ఆ సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సాధ్యులు మొదలయినవారు దేవయోనులనే జాతులవారు. "అనిరూపణీయ ప్రకారుఁడు" ఇది పరమాత్మ లక్షణం. మాట, మనసు, చేష్ట అనేవి ఏ విధంగా, ఎందుకు, ఎప్పుడు ఉంటాయో ఎవ్వరికీ తెలియరానివాడు.

సీ. పుణ్యాంగనాకారములు దాల్చి పుణ్య న । దీ నివహంబులు దిశలు గొల్చి
చనుదేర శంకరసదృశ పరిష్కార । కల్యాణతను వైన గౌరి వచ్చి
వెనుక దిక్కున మెలుపునఁ జేరి మోమున । కలఁతిన వ్వినుమడి చెలువు నొసఁగఁ
దమ్మిఱేకుల నుల్లసమ్మాడు తన మృదు । కర యుగ్మమునను శంకరుని నేత్ర

తే. యుగ్మ మల్ల మూసి యున్నంత లోక మ । నర్క చంద్రతారకాగ్నియై మ
హాంధకారమగ్న మగుటయు సంక్షోభ । మందె భూతసముదయంబు లెల్ల. 419

ప్రతిపదార్థం: పుణ్యనదీ నివహంబులు= పుణ్యాలైన నదుల సముదాయములు; దిశలు= దిక్కులు; పుణ్య+అంగనా+ఆకారములు= పుణ్యస్త్రీల ఆకారాలు; తాల్చి= ధరించి; కొల్చి= సేవించి; చనుదేరన్= రాగా; శంకర సదృశ పరిష్కార కల్యాణ తనువు= శంకరుడి అలంకారములను పోలిన అలంకారములతో శుభమైన మేను గలది; ఐన గౌరి= అయిన పార్వతీదేవి; వచ్చి= ఏతెంచి; వెనుక దిక్కునన్= వెనుక వైపు; మెలుపునన్= నేర్పుతో; చేరి= సమీపించి; మోమునకున్= మొగానికి; అలఁతి నవ్వు= చిన్న నగవు; ఇనుమడి చెలువున్= రెట్టింపు శోభను; ఒసఁగన్= ఇవ్వగా; తమ్మిఱేకులన్= పద్మపత్రాలను; ఉల్లసమ్మ+ఆడు= ఎకసెక్కం చేసే; తన మృదు కరయుగ్మమునను= తన మెత్తని చేతుల జంటచేత; శంకరుని నేత్ర యుగ్మము= శివుడి కన్నుల జంటను; అల్లన్= మెల్లగా; మూసి; ఉన్న+అంతన్= ఉన్నంతలో; లోకము= జగము; అనర్క చంద్ర తారక+అగ్ని+ఐ= సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు అగ్ని లేనిదై; మహా+అంధకార మగ్నము= పెనుచీకటిలో మునిగినది; అగుటయున్= కాగా; భూతసముదయంబులు= ప్రాణుల గుంపులు; ఎల్లన్= అన్నీ; సంక్షోభము= కలతపాటును; ఒందెన్= పొందాయి.

తాత్పర్యం: పుణ్యనదులు, దిక్కులు స్త్రీరూపాలు ధరించి సేవించిరాగా, శివుడి అలంకారంవంటి అలంకారంతో శుభమైన దేహంగల పార్వతి మెల్లగా వెనుకవైపునుండి సమీపించి చిరునవ్వు ముఖానికి రెట్టింపు సౌందర్యాన్ని కలిగిస్తూ ఉండగా, తమ్మిరేకులను పరిహాసం చేసే తనచేతుల జంటతో శివుడి కనుల జంటను మెల్లగా మూయగా, జగమంతా సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్నిలేనిదై పెనుచీకటిలో మునిగిపోయింది. అప్పుడు ప్రాణికోటులన్నీ కళవళపడ్డాయి.

విశేషం: ఇందరి ముందర ఈ పరిహాసధోరణి సముచితమా? అని కొందరికి శంక కలుగవచ్చును. పార్వతీపరమేశ్వరులు జగత్పితరులు. పిల్లలముందు తల్లిదండ్రులు పిల్లల వినోదంకొరకు ఇట్లా ప్రవర్తించటం సహజమే. అంతేకాదు. శంకరుడి నేత్రాలు సర్వలోకాలకు వెలుగునిచ్చే దివ్యజ్యోతులని నిరూపించటం కూడా లోకమాత ఉద్దేశం కావచ్చును.

ఉ. అప్పుడు ఫాలలోచనము నప్పరమేశుఁడు విచ్చె విచ్చినం
గప్పెఁ దదగ్నిజిహ్వలు నగం బఖిలంబును గౌరిదేవి య
ట్లొప్పమి తండ్రి కైనఁ గని యుల్లము బెగ్గిల నీశునంఘ్రులం
గప్పఁగ మౌళిభూషణము కాంతి ప్రణామముఁ జేసెఁ జేసినన్. 420

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ+పరమ+ఈశుఁడు= ఆ మహేశ్వరుడు; ఫాలలోచనమున్= నొసటి కన్నును; విచ్చెన్= తెరిచాడు; విచ్చినన్= తెరువగా; తద్+అగ్ని జిహ్వలు= దాని అగ్ని జ్వాలలు; నగంబు= కొండను; అఖిలంబును= మొత్తాన్ని; కప్పెన్= కప్పివేసినాయి; అట్లు= ఆ విధంగా; ఒప్పమి= కీడు; తండ్రికిన్= తన తండ్రి అయిన హిమవంతుడికి; ఐనన్= కాగా; కని= చూచి; గౌరిదేవి= పార్వతీదేవి; ఉల్లము= హృదయం; బెగ్గిలన్= దిగు లొందగా; మౌళి భూషణము కాంతి= శిరస్సునందలి ఆభరణం కాంతి; ఈశు+అంఘ్రులన్= ఈశ్వరుడి పాదాలను; కప్పఁగన్= కప్పివేయగా; ప్రణామమున్= నమస్కారము; చేసెన్= చేసినది; చేసినన్= చేస్తే.

తాత్పర్యం: అప్పుడు పరమేశ్వరుడు నొసటి కంటిని తెరిచాడు. దానితో ఆ కంటిమంటలు కొండనంతటినీ పాదివివేశాయి. ఆ విధంగా తండ్రికి ఆపద సంభవించగా పార్వతి గుండెలో దిగులుపడి, తన శిరస్సునందలి అలంకారపు కాంతి శివుడి పాదాలను కప్పగా చాగిలబడి నమస్కరించింది. అట్లా నమస్కరించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: శిరోభూషణం చంద్రరేఖ కావచ్చును.

ఆ. హరుఁడు కరుణఁ జూడ నా హిమవన్నగ । దాహ ముడిగి శోభితత్వ మొలసె
నార్య పరమవిస్మయముఁ బొంది యాసర్వ । భువనకర్తతోడ సవినయముగ. 421

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; కరుణన్= దయతో; చూడన్= చూడగా; ఆ+హిమవత్+నగ దాహము= ఆ మంచుకొండ మంట; ఉడిగి= పోయి; శోభితత్వము= శోభగలదానితనం; ఒలసెన్= కలిగింది; ఆర్య= పార్వతి; పరమ విస్మయమున్= గొప్ప ఆశ్చర్యం; పొంది; ఆ+సర్వ భువన కర్తతోడన్= అన్ని లోకాలకు కర్త అయిన ఆ శివుడితో; సవినయముగన్= వినయంతో పాటుగా.

తాత్పర్యం: శివుడు దయతో చూడగా ఆ మంచుకొండ మంట చల్లారి, మరల శోభతో అలరారినది. పార్వతి పరమాశ్చర్యం పొంది, సర్వలోకాలకు నిర్మాత అయిన ఆ శివుడితో వినయంతో. (ఇట్లా అన్నది)

సీ. నిటలంబుకను దెఱచుటకుఁ గారణమేమి । సర్వేశ! యిది రహస్యంబు గాక
యున్నేనిఁ జెప్పవే!' యన్న నద్దేవుండు । 'కాంత! నీ కెఱిఁగింపఁగాని యట్టి
పని యెందుఁ గల్గునే? వినుము లోకాత్మక । త్వము నాకుఁ గల్గుట వలనఁ జేసి
నన్నేది వొందిన నన్నిలోకంబుల । నది వొందుఁ గాన నాయంబకములు

తే. నీవు మూయంగఁ దిమిరంబు నిఖిలలోక । చయముఁ గప్పిన భూతముల్ భయముఁ బొందె
నీ కరంబులు ద్రోవక చీఁకటియును । జెఱుచుటకు ఫాలనేత్రంబు దెఱవవలసె.' 422

ప్రతిపదార్థం: సర్వ+ఈశ!= సర్వమునకు ప్రభువైన ఓ మహేశా! నిటలంబు కను= నొసటికన్ను; తెఱచుటకున్= తెరవటానికి; కారణము= హేతువు; ఏమి?; ఇది= ఈ విషయం; రహస్యంబు= గుట్టయినది; కాక+ఉన్నన్+ఏనిన్= కాకపోతే; చెప్పవే!= దయతో చెప్పుము!; అన్నన్= అనగా; ఆ+దేవుండు= ఆ దేవుడు; కాంత!= ఓ ప్రియురాలా!; నీకున్= నీకు; ఎఱిఁగింపన్= తెలుపుటకు; కాని+అట్టిపని= కూడనిపని; ఎందున్= ఎక్కడైనా; కల్గునే?= ఉంటుందా?; వినుము= ఆలకించుము; నాకున్= నాకు;

లోక+ఆత్మకత్వము= లోకములన్నీ నేనే అయిన భావం; కల్గుటవలనన్+చేసి= కలగటంవలన; నన్నున్= నన్ను; ఏది= ఏమి; పొందినన్= పొందినా; అన్ని లోకంబులన్= లోకాలన్నింటినీ; అది; పొందున్= పొందుతుంది; కానన్+కనుక; నా+అంబకములు= నా కన్నులు; నీవు; మూయంగన్= కప్పగా; తిమిరంబు= చీకటి; నిఖిల లోకచయమున్= అన్ని లోకాల సముదాయాన్ని; కప్పినన్= ఆవరించగా; భూతముల్= ప్రాణులు; భయమున్= భయాన్ని; పొందెన్= పొందాయి; నీ కరంబులు= నీ చేతులను; త్రోవక= తొలగించక; చీకటియును= చీకటిని; చెఱచుటకున్= పోగొట్టటానికి; ఫాలనేత్రంబు= నొసటి కంటిని; తెఱవన్+వలసెన్= తెరువవలసి వచ్చింది.

తాత్పర్యం: 'సర్వేశా! నొసటికన్ను తెరవటానికి కారణం ఏమిటి? ఇది రహస్యం కాకపోతే చెప్పుము' అని గౌరి అడుగగా కాంతా! నీకు తెలుపరానిపని ఎక్కడైనా ఉంటుందా? వినుము. ఈ లోకాలన్నీ నా స్వరూపాలే కనుక నా కేది కలిగితే లోకాలన్నింటికీ అదే కలుగుతుంది. నీవు నా కన్నులు మూయగా చీకటి అన్ని లోకాలను ఆవరించింది. భూతాలు భయం పొందాయి. నీ చేతులు తొలగించకుండా చీకటిని పోగొట్టటం కొరకు నా నుదుటికంటిని తెరవవలసి వచ్చింది.

విశేషం: చేతులు తొలగించకుండటం ముచ్చట తీర్చటంకొరకు. చేతులు తోసివేస్తే పార్వతి మనస్సు కష్టపడుతుంది. లోకాల భయం తొలగించటం తత్క్షణకర్తవ్యం. అందు కని మూడవ కన్ను తెరవటం.

వ. అనిన విని యంబిక తనకు నడుగవలయునట్టివి యడుగుటకు నది యవసరంబుగాఁ గనికొని యక్కపర్ది కిట్లనియె. 423

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని; అంబిక= పార్వతి; తనకున్= తనకు; అడుగవలయు+అట్టి+అవి= అడుగవలసినవి; అడుగుటకున్= అడగటానికి; అది; అవసరంబుగాన్= తగిన సమయంగా; కనికొని= భావించి; ఆ+కపర్దికిన్= ఆ శివుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: అని చెప్పగా విని పార్వతి తా నడుగవలసినవి అడగటానికి అది తగిన సమయంగా భావించి, శివుడితో ఇట్లా అన్నది.

విశేషం: అంబిక - అన్ని లోకాలకు తల్లి. కపర్ది - శివుడి జటల సముదాయిన్ని కపర్దం అంటారు. అది కలవాడు కపర్ది. ఆకాశమంతా ఆయన జడల సముదాయం. అందుకనే ఆయనను వ్యోమకేశు డనికూడా అంటారు.

క. 'నాలుగు ముఖములు నీకు । న్ఫాలనయన! కలుగఁ గారణం బేమి? మధు
శ్రీలాలిత్యాస్పద వా । క్యాలీకలనమున నాకు నానతి యీవే!' 424

ప్రతిపదార్థం: ఫాలనయన!= నొసటిపై కన్నుగల ఓ శివా!; నాలుగు ముఖములు= నాలుగు మోములు; నీకున్= నీకు; కలుగన్= ఉండటానికి; కారణంబు= కారణం; ఏమి; మధు= తేనెయొక్క; శ్రీ= సంపదయొక్క; లాలిత్య= ఇంపునకు;ఆస్పద= తావు అయిన; వాక్య= మాటల; ఆలీ= వరుసయొక్క; కలనమునన్= కూర్పుతో; నాకున్= నాకు; ఆనతి+ఈవే= చెప్పవూ!

తాత్పర్యం: 'నిటలాక్షా! నీకు నాలుగు మొగాలు ఎందుకు ఉన్నాయో తేనెవంటి మాటల కూర్పుతో సెలవివ్వవూ!'

విశేషం: నిజానికి శివుడికి అయిదు ముఖాలు. ఇక్కడ సాధారణంగా ఉండే ముఖం కాక తక్కిన నాలుగు ముఖాల సంగతి అడుగుతున్నట్లు భావించాలి. సద్యోజాతం, వామదేవం, అఘోరం, తత్పురుషం, ఈశానం అనేవి ఆ అయిదు ముఖాలకుపేర్లు.

వ. అనిన విని యమ్మహాదేవికి నద్దేవుం డిట్లను 'దైత్యులు సుందోపసుందులన నిర్వురు గలరు. వార లవార్య భుజవీర్య శౌర్యసంపన్నులు నస్త్రశస్త్రావధ్యులునై యుండుదురు. వారల వినాశంబునకై మయుండు లోకంబులం గల ఒప్పులం దెల్ల నుత్తమసారంబులు దిలప్రమాణంబు లాహరించి యొక్క కామినిం గావించి తిలోత్తమ యను పేరిడి నాకడకుం దెచ్చిన నచ్చెలువ నాకుం బ్రదక్షిణంబుగా వచ్చునెడ నేనిది దేవకార్యంబు సేయ నోపుఁ బొమ్మను తలంపుతో నత్తరుణి తిరిగిన దిక్కుదిక్కున కొక్కొక్క మొగంబు దాల్చి దానిం బరీక్షించితి; నాటంగోలెఁ జతుర్ముఖుండనై యుండుదు.' 425

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఆ+మహాదేవికిన్= ఆ పార్వతికి; ఆ+దేవుండు= ఆ పరమేశ్వరుడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; దైత్యులు= దితి కొడుకులైన రక్కసులు; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; అనన్= అనగా; ఇర్వురు= ఇద్దరు; కలరు= ఉండేవారు; వారలు= వారు; అవార్య= నిలువరింపరాని; భుజ= చేతుల; వీర్య= సత్తువయొక్క; శౌర్య= పరాక్రమంయొక్క; సంపన్నులును= సంపద కలవారు; అస్త్ర శస్త్ర+అవధ్యులును= అస్త్రాలకు, ఆయుధాలకు చంపరానివారు; ఐ= అయి; ఉండుదురు= ఉండేవారు; వారల వినాశంబునకై= వారల చావుకొరకు; మయుండు= విశ్వకర్మ; లోకంబులన్= లోకాలలో; కల ఒప్పులందున్= ఉన్న అందాలలో; ఎల్లన్= అన్నింటిలో; ఉత్తమ సారంబు= మేలైన స్థిరభాగాలను; తిలప్రమాణంబులు= నూవుగింజలంత కొలత కలవాటిని; ఆహరించి= తెచ్చి; ఒక్క కామినిన్= ఒక కాంతను; కావించి= చేసి; తిలోత్తమ; అను పేరు= అనే పేరు; ఇడి= పెట్టి; నా కడకున్= నా వద్దకు; తెచ్చినన్= తేగా; ఆ+చెలువ= ఆ ఇంతి; నాకున్= నాకు; ప్రదక్షిణంబుగాన్= వలగొనునట్లుగా; వచ్చు+ఎడన్= వచ్చే సమయంలో; నేను; ఇది= ఈమె; దేవకార్యంబు= దేవతలపనిని; చేయన్+ఓపున్= చేయగలదు; పొమ్ము; అను తలంపుతోన్= అనే భావనతో; ఆ+తరుణి= ఆ యువతి; తిరిగిన దిక్కు దిక్కునకున్= తిరిగిన ప్రతి దిక్కునకు; ఒక్క+ఒక్క మొగంబు= ఒక్కొక్క మొగం; తాల్చి= ధరించి; దానిన్= ఆమెను; పరీక్షించితిన్= చూచాను; నాటన్+కోలెన్= ఆ దినం మొదలుగా; చతుర్+ముఖుండను+ఐ= నాలుగు ముఖాలు కలవాడనై; ఉండుదున్= ఉంటున్నాను.

తాత్పర్యం: అంటే విని పరమేశ్వరుడు పార్వతికి ఇట్లా చెప్పాడు. 'సుందుడు', 'ఉపసుందుడు' అనే రక్కసు లిరువురు ఉండేవారు. వారి భుజశక్తీ, శౌర్యమూ తిరుగులేనివి. అస్త్రాలకు, శస్త్రాలకు చంపరానివారుగా ఉండేవారు; వారిని చంపటంకొరకు విశ్వకర్మ అన్ని లోకాలలో ఉన్న అంద చందాల నన్నింటినీ నూవుగింజ అంత లెక్కలో తెచ్చి, ఒక కామినిగా చేసి, తిలోత్తమ అని పేరు పెట్టి, నా వద్దకు తెచ్చాడు. ఆమె నా చుట్టు ప్రదక్షిణంగా తిరిగింది. నే నాకాంత దేవకార్యం చేస్తుందిలెమ్ము - అని ఆమె తిరిగిన ప్రతిదిక్కుకు ఒక్కొక్క మొగం పెట్టి చూచాను. ఆనాటినుండి నాలుగు మోములవాడనై ఉన్నాను.'

విశేషం: అస్త్రం అంటే మంత్ర ప్రయోగంగల ఆయుధం. శస్త్రం అంటే సాధారణమైన ఆయుధం. వీర్యం అంటే దేహశక్తి. శౌర్యం మనశ్శక్తి. ప్రదక్షిణం అంటే పూజ్యవ్యక్తులను, వస్తువులను తనకు కుడిచేతివైపుగా ఉంచుకొని తిరిగిరావటం. దీనివలన సర్వస్వరూపభావన కలుగుతుంది. 'కామం కలది, కామం కలిగించేది' అని 'కామిని' శబ్దానికి రెండర్థాలను ఇక్కడ భావించవచ్చును. శివుడు దిక్కు కొక మొగం పెట్టుకొని చూడటం వ్యామోహంతో కాదు. ఆమె సామర్థ్యాన్ని పరీక్షించటంకొరకు.

చ. అన విని గౌరి 'నీకు భువనాధిప! కంఠమునందుఁ గప్పు గ
ల్గిన కత మేమి? నాకు నెఱిఁగింపుము' నావుడు దేవదైత్యు లం

బునిధి సుధార్థమై తరువఁ బుట్టి విషంబు త్రిలోకభీకరం
బనితరసాధ్యమై యొదవె; నత్తఱిఁ దాల్చితి దానిఁ గుత్తుకన్. 426

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; గౌరి= పార్వతి; భువన+అధిప!= సర్వలోక ప్రభూ!; నీకున్= నీకు; కంఠమునందున్= మెడయందు; కప్పు= నలుపు; కల్గిన కతము= కలిగిన కారణం; ఏమి?; నాకున్= నాకు; ఎఱిఁగింపుము= తెలుపుము; నాపుడున్= అన్నంతనే; దేవదైత్యులు= దేవతలు, రాక్షసులు; సుధా+అర్థము+ఐ= అమృతంకొరకు; అంబునిధిన్= సముద్రాన్ని; తరువన్= చిలుకగా; విషంబు= విషం; పుట్టి; త్రిలోకభీకరంబు= మూడు లోకాలకు భయం పుట్టించేది; అనితరసాధ్యము+ఐ= ఇతరులకు లొంగనిదై; ఒదవెన్= కలిగింది; ఆ+తఱిన్= ఆ సమయంలో; దానిన్= ఆ విషాన్ని; కుత్తుకన్= కంఠంలో; తాల్చితిన్= పెట్టుకొన్నాను.

తాత్పర్యం: అప్పుడు పార్వతి జగదీశా! నీకు కంఠంలో నలుపెందుకు కలిగింది?' అని అడిగితే శివుడు 'దేవతలు రక్కసులు అమృతం కొరకు సముద్రాన్ని చిలికారు. అప్పుడు ముల్లోకాలకు భయం కలిగిస్తూ ఎవ్వరికీ అణపరానిదై విషం పుట్టింది. నేను దానిని కంఠంలో పెట్టుకొన్నాను.

విశేషం: నిజానికి ఈ విషయం పార్వతికి తెలియనిది కాదు. 'మ్రింగుమనె సర్వమంగళ' అని భాగవతం. ఈ ప్రశ్నలన్నీ అడగటం లోకానుగ్రహంకొరకు మాత్రమే అని మనం గుర్తించాలి.

తే. అట్లు కంఠంబునందు మహావిషంబు । దాల్చి నీలత గల్గిన దానఁ జేసి
కమలజాది సురులు నీలకంఠుఁ డంచు । నన్నుఁ గొనియాడి రప్పుడు నలినవదన!' 427

ప్రతిపదార్థం: నలినవదన!= పద్మంవంటి మోముగల ఓ భవానీ!; అట్లు= ఆ విధంగా; కంఠంబునందున్= గొంతుకలో; మహావిషంబు= ఘోరమైన విషం; తాల్చి= ధరించి; నీలత= నలుపు; కల్గినదానన్+చేసి= కలిగిన కారణంగా; కమలజ+ఆది సురులు= బ్రహ్మ మొదలైన దేవతలు; నీలకంఠుఁడు= నీలకంఠుడు; అంచున్= అంటూ; అప్పుడు= ఆ సమయంలో; నన్నున్= నన్ను; కొనియాడిరి= ప్రశంసించారు.

తాత్పర్యం: పార్వతీ! ఆ విధంగా గొంతుకలో భయంకరమైన విషం ధరించిన కారణంగా నలుపు ఏర్పడింది. బ్రహ్మమొదలైన దేవతలు నీలకంఠుడని నన్ను కొనియాడారు.'

విశేషం: నల్లని మచ్చ నిజానికి ప్రశంసకు పట్టుకాదు. కానీ లోకరక్షణకు గుర్తుగా నిలిచిన కారణంగా ప్రశంస కలిగింది.

వ. అని చెప్పి శంకరుం 'డింక నేమి యడుగవల?' తడుగు మనుటయుఁ 'బినాకం బెల్ల యాయుధంబులకంటె మెచ్చి పట్టుదు దీనికిం గతంబెయ్యది?' యని యడిగిన నా మృడుం డామ్మృడాని కిట్లనియె. 428

ప్రతిపదార్థం: అని; చెప్పి; శంకరుండు= శివుడు; ఇంకన్= ఇంకా; ఏమి= ఏది; అడుగన్+వలతు= అడుగగోరుతున్నావో; (దానిని); అడుగుము; అనుటయున్= అనినంతనే; పినాకంబు= పినాకం అనే ధనుస్సును; ఎల్ల+ఆయుధంబులకంటెన్= ఆయుధాల న్నింటికంటె; మెచ్చి; పట్టుదు= తాల్చుతూ ఉంటావు; దీనికిన్= దీనికి; కతంబు= కారణం; ఏ+అది= ఏది; అని; అడిగినన్= అడిగితే; ఆ మృడుండు= ఆ శివుడు; ఆ మృడానికిన్= ఆ పార్వతికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి శంకరుడు 'ఇంకా ఏమి అడుగగోరావో అడుగుము' అంటే పార్వతి 'నీవు పినాకాన్ని అన్ని ఆయుధాలకంటె ఎక్కువ ఇష్టంతో పట్టుకొని ఉంటావు. దీనికి కారణం ఏమిటి? అని అడిగితే శివుడు భవానికి ఇట్లా అన్నాడు.

సీ. **ఆదియుగంబున నబల! కణ్వుం డను । సంయమి తపము నిష్ఠానిరూఢి**
మెయిఁ జేయఁ బెరిఁ గె వల్మీకంబు దనువు ము । నుంగ నప్పుట్ట వేణువును బుట్టె
విను లోకసామాన్యఘనత గాకుండ మ । హాద్భుతాయామంబు నధికమైన
పరిణాహమును గల్గె బ్రహ్మ యమ్మునికిఁ బ్ర । త్యక్షమై వరమిచ్చె నతనిమీఁదఁ

ఆ. **బెరిఁగియున్న వెదురు గరమర్థిఁ దాఁ బుచ్చి । కొని జగద్ధితంబు గోరి చేసె**
నాకు విష్ణునకుఁ బినాకశార్ఙ్గము లగ్ర । ఖండమున నొనర్చె గాండివంబు. 429

ప్రతిపదార్థం: అబల!= ఓ ఇంతీ!; ఆదియుగంబునన్= మొదటి యుగంలో; కణ్వుండు అను సంయమి= కణ్వుడనే గొప్ప నిగ్రహం కల ముని; నిష్ఠానిరూఢి మెయిన్= నిష్ఠ చెదరని స్థితితో; తపము= తనస్సు; చేయన్= చేయగా; తనువు= ఒడలు; మునుంగన్= మునుగునట్లుగా; వల్మీకంబు= పుట్ట; పెరిఁగెన్= పెరిగింది; ఆ+పుట్టన్= ఆ పుట్టనుండి; వేణువును= వెదురును; పుట్టెన్= పుట్టింది; విను= వినుము; లోకసామాన్యఘనత= లోకంలో సాధారణమైన గొప్పతనం; కాక+ఉండన్= కాకుండా; మహా+అద్భుత+ఆయామంబున్= చాలా ఆశ్చర్యకరమైన పొడవూ; అధికము= ఎక్కువది; ఐన పరిణాహమును= అయిన వెడల్పు; కల్గెన్= కలిగినవి; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; ఆ+మునికిన్= ఆ మునికి; ప్రత్యక్షము+ఐ= సాక్షాత్కరించి; వరము= కోరిన దానిని; ఇచ్చెన్= అనుగ్రహించాడు; అతనిమీఁదన్= అతడిపై; పెరిఁగి+ఉన్న వెదురు= పెరిగి ఉన్న వెదురు; కరము= మిక్కిలి; అర్థిన్= కోరికతో; తాన్= తాను; పుచ్చికొని= తీసికొని; జగత్+హితంబు= లోకాలకు మేలు; కోరి= కాంక్షించి; నాకున్= నాకు; విష్ణునకున్= విష్ణుడికి; పినాక శార్ఙ్గములు= పినాకం అనే వింటినీ, శార్ఙ్గం అనే వింటినీ; అగ్రఖండమునన్= పై ముక్కతో; గాండీవంబున్= గాండీవమనే ధనుస్సునూ; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: మొదటిదైన కృతయుగంలో కణ్వుడు అనే మహర్షి మహానిష్ఠతో తపస్సు చేశాడు. అతడి ఒడలు మునిగిపోయే విధంగా పెద్ద పుట్ట పెరిగింది. దానిమీద ఒక వెదురు కూడా పుట్టింది. ఏదో లోకసాధారణమైన గొప్పదనంతో కాకుండా మహాశ్చర్యం కలిగించే పొడవూ, మిక్కిలి వెడల్పూ దానికి కలిగాయి. బ్రహ్మ ఆ మహర్షికి ప్రత్యక్షమై వరమిచ్చాడు. ఆ వెదురు తాను తీసికొని, లోకాల మేలు కాంక్షించి నాకు పినాకాన్నీ, విష్ణువుకు శార్ఙ్గం అనే వింటినీ, చివరి తునుకతో గాండీవాన్నీ చేశాడు.

వ. **ఇవ్విధంబున విండ్లు మూఁడు గావించి లోకహితం బాచరించి యవ్విరించి యమ్మూఁడవ విల్లు దాఁ గైకొని తనలోకంబునకుం జనియె నిది పినాకంబు సంభావనీయంబైన తెఱం' గని చెప్పిన.** 430

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; విండ్లు= ధనుస్సులు; మూఁడు= మూడింటిని; కావించి= నిర్మించి; లోకహితంబు= లోకపు మేలు; ఆచరించి= చేసి; ఆ+విరించి= ఆ బ్రహ్మ; ఆ+మూఁడవ విల్లు= ఆ మూడవదైన గాండివం అనే వింటిని; తాన్= తాను; కైకొని= గ్రహించి; తనలోకంబునకున్= తనదైన సత్యలోకానికి; చనియెన్= వెళ్ళాడు; ఇది; పినాకంబు=పినాకమనే ధనుస్సు; సంభావనీయంబు= మన్ననగొన్నది; ఐన తెఱంగు= అయిన తీరు; అని; చెప్పినన్= చెప్పగా.

తాత్పర్యం: ఈ విధంగా మూడు విండ్లు చేసి లోకాలకు మేలు కావించి, ఆ బ్రహ్మ ఆ మూడవ వింటిని తాను గ్రహించి, తన లోకానికి వెళ్ళాడు. పినాకాన్ని ఎక్కువగా మన్నించటానికి గల కారణం ఇది అని చెప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. విని గిరితనూజ 'పెఱ వా । హనముల నొల్లక వృషంబు నఖిలేశ్వర! నె
మ్మనమునఁ గైకొని యెక్కుదు । వినఁగా నే వలతుఁ జెప్పవే కారణమున్?' 431

ప్రతిపదార్థం: విని= ఆలకించి; గిరితనూజ= కొండబిడ్డ పార్వతి; అఖిల+ఈశ్వర!= సర్వేశ్వరా!; పెఱ వాహనములన్= ఇతరములగు ఎక్కిరింతలను; ఒల్లక= ఇష్టపడక; వృషంబున్= ఎద్దును; నెఱ+మనమునన్= నిండు హృదయంతో; కైకొని= ఆదరించి; ఎక్కుదు(వు)= ఎక్కుతావు; కారణమున్= కారణాన్ని; వినఁగాన్= వినటానికి; ఏన్= నేను; వలతున్= కోరుతున్నాను; చెప్పవే= చెప్పుము.

తాత్పర్యం: అంటే విని పార్వతి 'సర్వేశ్వరా! ఇతరవాహనాలను ఇష్టపడక నిండు మనస్సుతో ఆదరించి ఎద్దును ఎక్కుతూ ఉంటావు. కారణం వినాలనే కోరికతో ఉన్నాను. దయతో చెప్పుము' అన్నది.

వ. అనిన నద్దేవుఁ డమ్మహాదేవి కిట్లనియె. 432

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+దేవుఁడు=ఆ దేవుడు; ఆ+మహాదేవికిన్= ఆ మహాదేవి పార్వతికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా శివుడు పార్వతితో ఇట్లా అన్నాడు.

సీ. హిమవన్నగంబునం దేను లోకహితార్థ । మైన మహాతప మాచరింప
గోవులు చుట్టుఁ దేఁకువ సెడి తిరిగి నన్ । సంకట పెట్టినఁ బంకజాక్షి!
కోపించిచూడ సంతాపాకులత్వంబుఁ । బొందె గోకుల మరవిందభవుఁడు
నమరులుఁ జనుదెంచి ప్రార్థించి వృషముఁ గా । నిక యిచ్చి కరుణ జనింపఁ బలికి

తే. నాకు గోపతి యనియెడు నామ మిచ్చి । రపుడు గోబాధ మాన్చి రయ్యమలవృషము
వాహనముఁ గేతువునుగా శివప్రచార । మాచరింతు నెల్లెడ నది యాది గాఁగ.' 433

ప్రతిపదార్థం: పంకజాక్షి!= తామరవంటి కనులుగల ఓ భవానీ!; హిమవత్+నగంబునందున్= మంచుకొండమీద; ఏను= నేను; లోకహిత+అర్థము= లోకముమేలు ప్రయోజనంగా గలది; ఐన మహా తపము= అయిన గొప్ప తపస్సు; ఆచరింపన్= చేస్తూ ఉండగా; గోవులు= ఆవులు; చుట్టున్= అన్నివైపుల; తేఁకువ+చెడి= భయంపోయి; తిరిగి= సంచరించి; నన్= నన్ను; సంకట పెట్టినన్= కష్టపెట్టితే; కోపించి= కోపం పొంది; చూడన్= చూడగా; గోకులము= ఆవులమంద; సంతాప+ఆకులత్వంబున్= దుఃఖంచేత కలతపడిన తనాన్ని; పొందెన్= పొందినది; అరవిందభవుఁడును= బ్రహ్మయు; అమరులున్= దేవతలు; చనుదెంచి= వచ్చి; ప్రార్థించి= ప్రార్థనచేసి; వృషమున్= ఎద్దును; కానిక= కానుకగా; ఇచ్చి= ఒసగి; కరుణ= దయ; జనింపన్= కలుగునట్లుగా; పలికి= మాటాడి; నాకున్= నాకు; గోపతి; అనియెడు నామము= అనే పేరు; ఇచ్చిరి= ఇచ్చారు; అపుడు= ఆ సమయంలో;

గోబాధ= ఆవుల బాధను; మాన్చిరి= పోగొట్టారు; ఆ+అమలవృషము= దోషంలేని ఆ ఎద్దు; వాహనమున్= వాహనం; కేతువును= ధ్వజమునూ; కాన్= కాగా; అది= ఆ సమయం; ఆది కాఁగన్= మొదలుగా; ఎల్ల+ఎడన్= అన్ని తావులందు; శివ ప్రచారము= మంగళమైన సంచారం; ఆచరింతున్= చేస్తూ ఉంటాను.

తాత్పర్యం: నేను లోకాల మేలుకొరకు మంచుకొండమీద గొప్ప తపస్సు చేస్తూ ఉండగా చుట్టూ ఆవులు చేరి, భయం తీరి తిరుగుతూ నన్ను కష్టపెట్టాయి. అప్పుడు నేను కోపించి చూడగా అవి బాధపడ్డాయి. బ్రహ్మ, దేవతలు వచ్చి నన్ను ప్రార్థించి, దయపుట్టే మాటలు పలికి, నాకొక ఎద్దును కానుకగా ఇచ్చి, 'గోపతి' అనే పేరు పెట్టి గోవుల బాధ తీర్చారు. అది మొదలు నేనా ఎద్దును వాహనంగా, ధ్వజంగా చేసికొని శుభమైన సంచారం అన్ని తావులలో చేస్తూ ఉన్నాను.'

విశేషం: శివుడికి ఏ కోరికాలేదు. మరి తపస్సు ఎందుకంటే లోకం మేలుకొరకే.

వ. అనుటయు నంబిక యప్పరమేశుతో 'నీవు పరమ శుచులును రమణీయంబులు నగు నివాసంబుల వసియింపక యశుచియుఁ గేశాస్థికపాల దుర్గంధదుర్దర్శంబునైన శ్మశానంబున నునికికిఁ గతంబేమి?' యనిన నతం డిట్లనియె. 434

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; అంబిక= పార్వతి; ఆ+పరమ+ఈశుతోన్= ఆ మహేశ్వరుడితో; నీవు; పరమ శుచులును= మిక్కిలి పరిశుభ్రంగా ఉండేవీ; రమణీయంబులును= అందంగా ఉండేవీ; అగు నివాసంబులన్= అయిన నెలవులందు; వసియింపక= ఉండక; అశుచియున్= శుభ్రతలేనిదీ; కేశ= వెంట్రుకలు; అస్థి= ఎముకలు; కపాల= పుర్రెలు; దుర్గంధ= పాడుకంపు అనే వాటితో; దుర్దర్శంబున్= చూడరానిదీ; ఐన శ్మశానంబునన్= అయిన వల్లకాటిలో; ఉనికికిన్= ఉండటానికి; కతంబు= కారణం; ఏమి; అనినన్= అనగా; అతండు= ఆ శివుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా పార్వతి పరమేశ్వరుడితో 'గొప్ప శుచి కలవీ, మనోహరమైనవీ అయిన నెలవులలో ఉండక శుభ్రతలేనిదీ, జుట్టు, ఎముకలు, పుర్రెలు, కంపు అనువాటితో చూడరాని వల్లకాటిలో నీవు ఉండటానికి కారణం ఏమిటి? అని అడిగింది. అప్పుడు శివు డిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికిఁ దనశ్మశానవాసతకుఁ గారణంబు చెప్పుట (సం13-207-1(కుంభ))

ఉ. 'క్రూరపు భూతముల్ జనుల ఘోరవిధంబుల ముట్టి యెప్పుడున్
మారణ మాచరింపఁగ సమస్తజనంబులు నాశ మొందఁగా
వారిజసంభవుం డెఱిఁగి వచ్చి ననుం దగఁ గాంచి తత్ప్రతీ
కారము సేఁతకై వినయగౌరవ మొప్పఁగ వేఁడె; వేఁడినన్. 435

ప్రతిపదార్థం: క్రూరము+భూతముల్= క్రూరమైన ప్రాణులు; జనులన్= జనులను; ఘోరవిధంబులన్= భయంకరమగు తీరులతో; ముట్టి= తాకి; ఎప్పుడున్= ఎల్లవేళలా; మారణము= వధ; ఆచరింపఁగన్= చేయగా; సమస్తజనంబులు= అందరు జనులు; నాశము+ఒందఁగాన్= నాశం పొందగా; వారిజ సంభవుండు= పద్మమునపుట్టిన బ్రహ్మ; ఎఱిఁగి= తెలిసికొని; వచ్చి= ఏతెంచి; ననున్= నన్ను; తగన్= తగు విధంగా; కాంచి= తూచి; తద్+ప్రతీకారము+చేఁతకున్+ఐ= దానికి ప్రతిక్రియచేయటం కొరకు; వినయగౌరవము= వినయంతో కూడిన గౌరవము; ఒప్పఁగన్= ఒప్పగా; వేఁడెన్= ప్రార్థించాడు; వేఁడినన్= ప్రార్థించగా.

తాత్పర్యం: క్రూరభూతాలు జనులను ఘోరంగా తాకి, వధ చేశాయి. సమస్తజనాలు నశిస్తున్నారు. బ్రహ్మ అది తెలిసికొని నా కడకు వచ్చి, నన్ను తగు విధంగా చూచి, దానికి మారుచేత చేయవలసిందిగా నన్ను వేడుకొన్నాడు. అట్లా ప్రార్థిస్తే. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: తగన్ - సముచితమర్యాదతో, అభివాదనం మొదలైన పనులుచేసి అని భావం.

వ. నిశ్చితంబుగా నొక్కెడనుండి లోకంబులు రక్షింపవలయు నని తలంచితి నట్టియెడ. 436

ప్రతిపదార్థం: నిశ్చితంబుగాన్= నిర్ణయింపబడినదిగా; ఒక్క+ఎడన్= ఒక్కచోట; ఉండి= నిలిచి; లోకంబులు= లోకాలను; రక్షింపవలయున్= కాపాడాలి; అని; తలంచితిన్= తలపోశాను; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: నిర్ణయించుకొనిన ఒక ప్రదేశంలో ఉండి లోకాలను కాపాడాలని భావించాను. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. మోక్షపరులు శుచిస్థానముగఁ బ్రశంస । సేయుదురు విజనత్వవిశేష మెఱిఁగి
కాన యింపై శ్మశానంబు మానసమున । నొలసెఁ గావున నయ్యెడ నునికి గలిగె. 437

ప్రతిపదార్థం: మోక్షపరులు= మోక్షమునందు ఆసక్తికలవారు; శుచిస్థానముగన్= పవిత్రమైన స్థానంగా; విజనత్వ విశేషము= జనాలు లేని ప్రత్యేకస్థితిని; ఎఱిఁగి= తెలిసికొని; ప్రశంస+చేయుదురు= గొప్పగా చెప్తారు; కాన= కనుకనే; ఇంపు+ఐ= ఇష్టమైనదై; శ్మశానంబు= వల్లకాడు; మానసమునన్= మనస్సులో; ఒలసెన్= మెదలినది; కావునన్= కనుక; ఆ+ఎడన్= ఆ తావున; ఉనికి= ఉండటం; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: మోక్ష మందు ఆసక్తికలవారు జనాలులేని కారణంగా పవిత్రస్థానం అని శ్మశానాన్ని పొగడుతారు. కనుక నాకు వల్లకాటిమీద మనస్సు కలిగింది. అక్కడ ఉండటం అందువలన కలిగింది.

విశేషం: కేశాదులు శుచిత్వానికి భంగాలు కావు. జనసంచారంవలననే దుష్టభావాలు వ్యాపించి, శుచిత్వం నశిస్తుంది. వస్తుశౌచం కాదు. భావశౌచం ముఖ్యం అని ఈ పద్యం ప్రతిపాదిస్తున్నది.

చ. అచటన యుండి లోకముల నన్నిటి నాత్మఁ దలంచి రక్ష సే
యుచు విహరింతు, భూతచయ మొక్కటఁ గూడి చరించుచున్కికిం
బ్రచురకుతూహలుండ నయి రాగముఁ బొందుదు నట్లుగాన నా
కచటు నివాసమయ్యె విను మన్యతలంబులు దానిఁ బోలునే?' 438

ప్రతిపదార్థం: అచటన్+అ= అక్కడనే; ఉండి= నెలకొని; లోకములన్= లోకాలను; అన్నిటిన్= అన్నింటినీ; ఆత్మన్= ఆత్మలో; తలంచి= భావించి; రక్ష= రక్షణ; చేయుచున్= చేస్తూ; విహరింతున్= తిరుగుతూ ఉంటాను; భూతచయము= ప్రాణుల సముదాయం; ఒక్కటన్= ఒక్కచోట; కూడి= కలిసి; చరించుచున్+ఉన్కికిన్= తిరుగుతూ ఉండటానికి; ప్రచుర కుతూహలుండను= మిక్కిలి వేడుక కలవాడను; అయి; రాగమున్= ప్రీతిని; పొందుదున్= పొందుతూ ఉంటాను; అట్లు+కానన్= అట్లు కనుక; నాకున్= నాకు; అచటు= ఆ తావు; నివాసము=ఉండే నెలవు; అయ్యెన్= అయినది; వినుము; అన్యతలంబులు= వేరుచోట్లు; దానిన్= ఆ శ్మశానాన్ని; పోలునే= పోలునా?

తాత్పర్యం: అక్కడనే ఉండి లోకాలను మనస్సులో భావించి, రక్షణ చేస్తూ ఉంటాను. సర్వభూతాలు ఒక్కచోట ఉండి కలిసి తిరుగుతూ ఉంటాయి కనుక మిక్కిలి వేడుకతో ప్రీతి పొందుతూ ఉంటాను. కనుక నా కది నివాసమైనది. పెరతావులు దానిని పోలవు గదా!'

విశేషం: సర్వప్రాణులూ మరణం తరువాత ఉచ్చనీచ భేదాలు లేకుండా తిరగేతావు కనుక శ్మశానం శివుడికి ప్రీతిపాత్రమైనదని భావం.

తే. అనిన భసితాంగరాగంబు నస్థి ఫణధ । రాభరణములుఁ బరశుశూలాయుధములు
నై మహోగ్రతభీకరమైన రూప । మభవ! యేల కైకొంటి వీ?' వనియె గిరిజ. 439

ప్రతిపదార్థం: అనినన్= అని శివుడు చెప్పగా; గిరిజ= పార్వతి; అభవ!= శివా!; భసిత+అంగరాగంబు= బూడిద అనే మైపూతా; అస్థి ఫణధర+ఆభరణములు= ఎముకలు, పాములు అనే ఆభరణాలూ; పరశు శూల+ఆయుధములు= గండ్రగొడ్డలి, శూలము అనే ఆయుధాలున్నూ; ఐ= అయి; మహా+ఉగ్రతన్= మిక్కిలి తీవ్రతగల; భీకరము= వెరపు పుట్టించేది; ఐన రూపము= అయిన రూపాన్ని; ఈవు= నీవు; ఏల?= ఎందుకు?; కైకొంటివి= గ్రహించావు?; అనియెన్= అన్నది.

తాత్పర్యం: అని శివుడు పలుకగా పార్వతి 'బూదిపూత, ఎముకల, పాముల ఆభరణాలు, గొడ్డలి, శూలం అనే ఆయుధాలు అనేవాటితో మిక్కిలి తీవ్రతగల భయంకరమైనరూపం ఎందుకు ధరించావు? అని అడిగింది.

విశేషం: అభవుఁడు - పుట్టుకలేనివాడు అంటే తక్కిన వికారాలు కూడా లేనివాడని భావం.

వ. అనుటయు నమ్మహేశ్వరుం డాపరమేశ్వరితోడ. 440

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; ఆ+మహా+ఈశ్వరుండు= ఈ పరమేశ్వరుడు; ఆ పరమ+ఈశ్వరితోడన్= లోకాలన్నీ ఏలే ఆ పార్వతితో.

తాత్పర్యం: అప్పుడు శివుడు పార్వతితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఈ ఘట్టంలో పార్వతికి 'పరమేశ్వరి' వంటి పేర్లు వాడటంలో ఒక రహస్యం ఉన్నది. ఆమె ప్రశ్నలన్నీ స్వజ్ఞానం కొరకు కాదు. లోకాలకు తెలిపే మార్గం మాత్రమే ఇది. ఇది గుర్తించవలసిన విషయం.

సీ. 'లోకస్వరూపంబు లోలాక్షి! రెండు వి । ధమ్ములు శీత ముష్ణమ్ము నాఁగఁ
జనునివి రెంటను సకలంబు గ్రథితమై । యుండు సౌమ్యాగ్నేయయోగకలిత
మఖిలజగంబు సౌమ్యము విష్ణుఁ డాగ్నేయ । మేను వహింతు మయ్యిరుదెఱంగు
లెనయుటఁ గొని భరియింతు నీ విశ్వంబుఁ । గావున నాగ్నేయ భావరూఢ

తే. యైన యాకృతి లోకహితార్థముగ వ । హించినాఁడ నింకెయ్యది యీవు నన్ను
నడిగె దడుగుము' నావుడు నార్య 'సోముఁ । దలఁ బ్రియంబున నేటికిఁ దాల్చి? తనియె. 441

ప్రతిపదార్థం: లోల+అక్షి!= విలాసపు చూపులు కల ఓ కాంతా!; లోక స్వరూపంబు= లోకం తీరు; రెండు విధమ్ములు= రెండు రకాలు; శీతము= చల్లనిది; ఉష్ణము= వేడిది; నాఁగన్= అనగా; చను+ఇవి= సాగే ఇవి; రెంటన్= రెంటియందు; సకలంబు= అంతా; గ్రథితము= కూర్చబడినది; ఐ= అయి; ఉండున్= ఉంటుంది; అఖిలజగంబు= సమస్త లోకమూ; సౌమ్య+ఆగ్నేయ యోగ కలితము= చంద్రుడి భావం; అగ్నిభావం అనే వాటి కలయికతో కూడినది; సౌమ్యము= సోమలక్షణం గలదానిని; విష్ణుఁడు= విష్ణువు; ఆగ్నేయము= అగ్ని సంబంధం అయిన దానిని; ఏను= నేను; వహింతుము= పట్టుకొని ఉంటాము; ఆ+ఇరు తెఱంగులు= ఆ రెండు తీరులు; ఎనయుటన్= కలిసి ఉండటాన్ని; కొని= గ్రహించి; ఈ విశ్వంబున్= ఈ సమస్త లోకాల సముదాయాన్ని; భరియింతున్= భరిస్తూ ఉంటాను; కావునన్= కనుక; ఆగ్నేయ భావ రూఢ= అగ్ని సంబంధంగల భావంతో గట్టిగా నిలిచి ఉన్నది; ఐన+ఆకృతి= అయిన ఆకారాన్ని; లోకహిత+అర్థముగన్= లోకం మేలు ప్రయోజనంగా; వహించినాఁడన్=భరించాను; ఈవు=నీవు; ఇంకన్= ఇంకా; ఏ+అది= ఏది; నన్నున్= నన్ను; అడిగెదు= అడుగుతావో; అడుగుము; నావుడున్= అని పలుకగా; ఆర్య= పార్వతి; సోమున్= చంద్రుడిని; తలన్= తలమీద; ప్రియంబునన్= ఇష్టంతో; ఏటికిన్= ఎందుకు; తాల్చితి?= పెట్టుకొన్నావు?; అనియెన్= అన్నది.

తాత్పర్యం: 'వనితా! లోకస్వరూపం రెండు రకాలు. చల్లదనం, వెచ్చదనం అనే ఈ రెండు విధాలతో సకలమూ కూర్చబడి ఉంటుంది. ఈ జగత్తంతా సౌమ్యము, ఆగ్నేయము అనే రెంటి కలయికతో కూడి ఉన్నది. సౌమ్యమైన దానిని విష్ణువూ, ఆగ్నేయమైన దానిని నేను భరిస్తూ ఉంటాము. ఆ రెంటినీ కలిపి ఈ విశ్వాన్ని నేను వహిస్తూ ఉంటాను. కనుక అగ్నిసంబంధమైనభావంలో పాతుకొనిపోయిన ఆకారం లోకంమేలుకొరకు తాల్చాను. ఇంకా ఏమి అడగాలో అడుగుము.' అంటే పార్వతి 'నీవు చంద్రుడిని ప్రేమతో తలపై ధరించటానికి కారణం ఏమిటి? అని అడిగింది.

విశేషం: సౌమ్యం - సోముడితనం, చల్లదనం, ఆహ్లాదకత మొదలైనవి. ఆగ్నేయం - అగ్ని సంబంధమైనది. వెచ్చదనం, భీకరత్వం మొదలైనది. ఇక్కడ ఇద్దరిని చెప్పినా నిజానికి తత్త్వం ఒక్కటే. సౌమ్యం ఉన్నచోటు విష్ణువనీ, ఆగ్నేయం ఉన్నచోటు శివుడనీ వ్యవహార భేదమే కానీ వస్తుభేదం లేదని గుర్తించాలి. దానికి "అయ్యిరు తెఱంగు లెనయుటఁ గొని భరియింతు నీ విశ్వంబు'' అనే వాక్యం ప్రమాణం.

చ. అనవుడు దక్షుయజ్ఞమున కల్గిననాఁడు సురాలి కేను బీ
డన మొనరించుచోట వికటంబుగ సోముని మేను ద్రొక్కఁగా
నను శరణంబు వేఁడిన మనంబున నక్కటికంబు పుట్టి చే
సిన దురితంబు సోమునిట సేయకపోదని మౌళిఁ దాల్చితిన్.' 442

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; దక్షుయజ్ఞమునకున్= దక్షుడు చేసిన యజ్ఞానికి; అల్గిననాఁడు= కోపగించినప్పుడు; సుర+ఆలికిన్= దేవతల గుంపునకు; ఏను= నేను; పీడనము= బాధ; ఒనరించుచోటన్= చేసే తావున; సోమునిమేను= చంద్రుడి దేహాన్ని; వికటంబుగన్= అడ్డదిడ్డంగా; త్రొక్కఁగాన్= త్రొక్కివేయగా; ననున్= నన్ను; శరణంబు= రక్షణ; వేఁడినన్= ప్రార్థించగా; మనంబునన్= హృదయంలో; అక్కటికంబు= జాలి; పుట్టి= కలిగి; చేసిన దురితంబు= చేసిన కీడు; సోమున్= చంద్రుడిని; ఇటు= ఈ విధంగా; చేయక= చేయకుండా; పోదు= నశించదు; అని; మౌళిన్= తలమీద; తాల్చితిన్=ధరించాను.

తాత్పర్యం: పార్వతి అట్లా అడుగగా శివుడు చెప్పుతున్నాడు. 'దక్షయజ్ఞంలో నేను కోపగించినపుడు దేవతల నందరినీ హింసించాను. ఆ సందర్భంలో చంద్రుడి దేహాన్ని అడ్డదిడ్డంగా త్రొక్కివేశాను. అతడు నన్ను శరణు

కోరాడు. మనస్సులో జాలి కలిగి చంద్రుడికి చేసిన కీడు ఇట్లా చేస్తే కానీ పోదని భావించి తలపై ధరించాను.'

చ. అన విని కొల్చి యున్న మునులందఱు నీశుదయావిశేషము
న్మనముల మెచ్చి పొంగి యభినందనపూర్వము గాఁగ భక్తియున్
వినయము నుల్లసిల్లఁ బదివేల విధంబులఁ బ్రస్తుతించి ర
య్యనుపమధాము గౌరి సమయం బిది నా కని మోడ్పుఁ గేలితోన్. 443

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని= ఆలకించి; కొల్చి ఉన్న మునులు= సేవించి ఉన్న మునులు; అందఱున్= అందరూ; ఈశు దయా విశేషమున్= ఈశ్వరుడి దయయందలి మహిమను; మనములన్= హృదయాలలో, మెచ్చి= గొప్పగా భావించి; పొంగి= ఆనందపు ఉబ్బు పొంది; అభినందనపూర్వము గాఁగన్= మంచిమాటలు ముందు ఉండునట్లుగా; భక్తియున్= భక్తీ; వినయమున్= అణకువా; ఉల్లసిల్లన్= ప్రకాశిస్తూ ఉండగా; పదివేల విధంబులన్= పదివేల తీరులతో; ప్రస్తుతించిరి= కొనియాడారు; గౌరి= పార్వతి; ఆ+అనుపమధామున్= సాటిలేని నెలవుగల ఆ శివుడిని; ఇది; నాకున్= నాకు; సమయము= తగువేళ; అని; మోడ్పు+ కేలితోన్= మోడ్చిన చేతితో.

తాత్పర్యం: ఇట్లా చెప్పగా విని మునులందరూ ఈశ్వరుడి దయను, దొడ్డతనాన్ని హృదయాలలో మెచ్చుకొని పొంగి మంచిమాటలతో, భక్తివినయాలతో, పదివేల పద్ధతులతో ప్రశంస చేశారు. గౌరి శివుడితో 'ఇది నాకు సమయం' అని చేతులు జోడించి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇది ఘట్టానికి ఉపసంహారవాక్యం. శివుడి పనులన్నీ పరమదయకు ప్రతీకాలే. అందులో అపకారం చేసిన చంద్రుడిని రక్షణ కోరినంతమాత్రాన నెత్తిన పెట్టుకొనటం దయకు పరాకాష్ఠ. దీనినే మునులు సంభావించారు.

తే. లోలలోచన దీప్తులు బాలచంద్ర। భూషణుని వదనంబునఁ బొలయ మునుల
మానసంబులు సంప్రీతి నూన సాంత్వ। నస్వరంబుగ నిట్లను నలిననాభ! 444

ప్రతిపదార్థం: నలిననాభ!= పద్మము బొడ్డునందుగల దేవా!; లోలలోచన దీప్తులు= విలాసంగా కదలాడే కన్నుల కాంతులు; బాలచంద్ర భూషణుని వదనంబునన్= శివుడి ముఖాన; పొలయన్= వ్యాపించగా; మునుల మానసంబులు= మునుల హృదయాలు; సంప్రీతిన్= నిండైన తృప్తిని; ఊనన్= తాల్పగా; సాంత్వన స్వరంబునన్= మెత్తని కంఠనాదంతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నది.

తాత్పర్యం: కృష్ణా! విలాసంగా కదిలే కన్నుల కాంతులు శివుడి ముఖంమీద తిరుగుతుండగా; మునుల హృదయాలు నిండు తృప్తిని తాల్పగా మెత్తని స్వరంతో ఇట్లా అన్నది.

విశేషం: ఇక్కడ కవి పూర్వ సంభావితార్థాన్ని కొంత స్పష్టం చేస్తున్నారు. "మునుల మానసంబులు సంప్రీతిమానన్" అంటే ఉమ ప్రశ్నలు వారి సంతృప్తి కొరకే అని భావం.

క. 'వర్ణాశ్రమ ధర్మము లభి। వర్ణింపుము వేదనిరతవత్సల! యవి నా
కర్ణములతో నఖిలజన। కర్ణంబులఁ బొంది పుణ్యకర్తృత యొసఁగున్.' 445

ప్రతిపదార్థం: వేదనిరతవత్సల!= వేదములయందు చెడని పుత్రప్రేమగల ఓ శంకరా!; వర్ణ+ఆశ్రమ ధర్మములు= వర్ణములు, ఆశ్రమములు అనేవాటి ధర్మాలు; అభివర్ణింపుము= చక్కగా తెలుపుము; అవి; నా కర్ణములతోన్= నా చెవులతో పాటు; అఖిల జనకర్ణంబులన్= జనులందరి చెవులను; పొంది= చేరి; పుణ్యకర్తృత= పుణ్యానికి కర్తలయ్యే స్థితిని; ఒసఁగున్= ఇస్తాయి.

తాత్పర్యం: శివా! వర్ణముల, ఆశ్రమముల ధర్మాలను చక్కగా తెలియజెప్పుము. అవి నా చెవులతోపాటు మానవులందరి చెవులలో ప్రవేశించి వారికి పుణ్యం చేసిన తనాన్ని ఇస్తాయి.'

విశేషం: వర్ణములు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతులు; ఆశ్రమాలు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములు.

వ. అనియెననియిట్లు గౌరి లోక హితార్థంబుగా వర్ణాశ్రమధర్మంబులు పరమేశ్వరు నడుగుటయు నారదముని కృష్ణునకుం జెప్పిన తెఱంగు భీష్ముండు ధర్మజునకుం జెప్పుట యుపన్యసించిన నాకర్ణించి. 446

ప్రతిపదార్థం: అనియెన్= అని పలికినది; అని; ఇట్లు= ఈ విధంగా; గౌరి= పార్వతి; లోకహిత+అర్థంబుగాన్= లోకం మేలుకొరకని; వర్ణ+ఆశ్రమ ధర్మంబులు= వర్ణాలు, ఆశ్రమాలు అనేవాటి ధర్మాలను; పరమేశ్వరున్=శివుడిని; అడుగుటయున్= అడగటాన్ని; నారదముని= నారదమహర్షి; కృష్ణునకున్=కృష్ణుడికి; చెప్పిన తెఱంగు= చెప్పినతీరు; భీష్ముండు= భీష్ముడు; ధర్మజునకున్= ధర్మరాజునకు; చెప్పుట= చెప్పటం; ఉపన్యసించినన్= తెలుపగా; ఆకర్ణించి= విని.

తాత్పర్యం: అని పలికింది. అని ఈ విధంగా పార్వతి లోకం మేలుకొరకు వర్ణాశ్రమ ధర్మాలను పరమేశ్వరుడిని అడగటాన్ని నారదమహర్షి కృష్ణుడికి చెప్పినతీరు భీష్ముడు ధర్మరాజునకు వివరించటాన్ని చక్కగా తెలిపితే విని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇక్కడ తెలిపినవాడు వైశంపాయనుడు. విన్నవాడు జనమేజయుడు. ఇక్కడ వక్తృశ్రోతల జంటలు నాలుగు ఉన్నాయి.

వైశంపాయనుడు - జనమేజయుడు;
భీష్ముడు - ధర్మరాజు;
నారదుడు - కృష్ణుడు;
శివుడు - పార్వతి.

పార్వతికి చెప్పినాడని నారదుడు కృష్ణుడికి తెలిపిన విషయాన్ని భీష్ముడు ధర్మరాజునకు వివరించాడని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు. నిజానికి మరొక జంట కూడా ఉన్నది. సూతుడు - శౌనకాది మునులు. ఇది సమన్వయం.

క. మునివర! నాదగు చిత్తం । బునఁ గౌతూహలము చాల మొలతెంచి తలి
ర్పున నెలరారెడు నేర్పడ । వినిపింపుము మీఁది కథ సవిస్తారముగన్. 447

ప్రతిపదార్థం: మునివర!= ఓ వైశంపాయనా!; నాది+అగు= నాయొక్క; చిత్తంబునన్= హృదయంలో; కౌతూహలము= వేడుక; చాలన్= ఎక్కువగా; మొలతెంచి= పుట్టి; తలిర్పునన్= చిగురు తొడగటంతో; ఎలరారెడున్= వికాసం పొందుతున్నది. మీఁది కథ= తరువాతి వృత్తాంతం; సవిస్తారముగన్= పెంపొందించిన రూపం కలుగునట్లుగా; ఏర్పడన్= తెలిసేవిధంగా; వినిపింపుము= వినిపించుము.

తాత్పర్యం: మునివరా! నా హృదయంలో వేడుక మొలకెత్తి చిగురుతొడిగి పెంపుతో ఉన్నది. తరువాతి కథ విస్తారంగా తెలిసేవిధంగా వినిపించుము.

వ. అని యడుగుటయు. 448

తాత్పర్యం: అని అడుగగా.

ఆశ్వాసాంతము

మ. స్ఫుటతత్త్వోదయ సంభృతైకమధురా! భూతైకరక్షాధురా!
తటినీ పింఛమనోజ్ఞమౌళిలలితా! దాంతాత్మసంకీలతా!
త్రుటితాపత్వ సమున్నతాశ్రితజనా! దూరాంజనా! సువ్రతో
త్కటశీలావనలోల! దివ్యహృదయా! ధర్మప్రసన్నోదయా! 449

ప్రతిపదార్థం: స్ఫుట= స్పష్టంగా తెలిసిన; తత్త్వ= జ్ఞానం యొక్క; ఉదయ= పుట్టుకచేత; సంభృత= చక్కగా పొందబడిన; ఏక= ఒకటే అయిన; మధురా!= ఆనందపు తీపి కలవాడా!; భూత+ఏక రక్షాధురా!= ప్రాణులను కేవలభావంతో రక్షించే బరువు కలవాడా!; తటినీ= నది; పింఛ= నెమలిపురి అనే వాటితో; మనోజ్ఞ= సుందరమైన; మౌళి= శిరస్సుతో; లలితా!= సుకుమారమైనవాడా!; దాంత+ఆత్మ సంకీలతా!; ఇంద్రియ నిగ్రహంగల హృదయంగలవారిచేత కూర్చబడేవాడా!; త్రుటిత+ఆపత్వ సమున్నత+ ఆశ్రితజనా!= తొలగించబడిన, విపత్తులు గల్గి యుండటంచేత, గొప్పవారైన, ఆశ్రయించినజనులు గలవాడా! దూర+అంజనా!= దూరమైన అంటు (లంపటం) కలవాడా!; సువ్రత+ఉత్కటశీల+అవనలోల!= మంచి ఆచారాలతో కూడిన గొప్ప స్వభావంగలవారిని రక్షించటంలో ఆసక్తిగల దివ్యమైన హృదయం కలవాడా!; ధర్మప్రసన్న+ఉదయా!= ధర్మంచేత ప్రసన్నమయ్యే హృదయం కలవాడా!

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! నీవు స్పష్టంగా తెలిసిన జ్ఞానంచేత బాగా నిండిన ఆనందం కలవాడవు, ప్రాణులను రక్షించే కేవలభావం కలవాడవు. గంగానది, నెమలిపింఛం అనేవాటితో సుందరమైన శిరస్సుతో సుకుమారమైనవాడవు. యోగులు అనుసంధించుకొనే దైవానివి. ఆపదలు తొలగి ఉదాత్తులయిన ఆశ్రితజనాలు కలవాడవు. సంసారాదుల లంపటాలు ఏమీ లేనివాడవు. చక్కని ఆచారనిష్ఠగల స్వభావం కలవారిని రక్షించటానికై వెంపరలాడే దివ్యహృదయం కలవాడవు. మనుష్యుల ధర్మాచరణంచేత ప్రసన్నమయ్యే హృదయం కలవాడవు.

విశేషం: 'తటినీ పింఛ' అనే చోటమాత్రమే హరుడు, హరి కానవస్తారు. తక్కిన సంబోధనలన్నీ ఉభయ సాధారణాలు.

భగవదానందం చక్కగా తెలిసినవారికి మాత్రమే కలుగుతుందని మొదటి సంబోధన తాత్పర్యం.

దాంతాత్ములంటే యోగులు. వారు ఎడతెగకుండా ధ్యానంలో పరమాత్మను అనుసంధించుకొంటూ ఉంటారు.

జన్మము, జర మొదలైన భయంకరమైన ఆపదలు తునుకలుగా చీలిపోయినపుడు వారు 'సమున్నతులు' - మిక్కిలి ఎత్తైనవారు. అంటే పరమాత్మస్వరూపులే అవుతారు. ఆ విధంగా ఆశ్రితులను చేసేవాడు స్వామి అని 'త్రుటిత' - ఇత్యాది సంబోధన తాత్పర్యం.

మానవుడు ధర్మం ఆచరిస్తే పరమాత్మ హృదయం ప్రసన్నమవుతుంది. కనుక ధర్మాచరణమే మానవకర్తవ్యం అనే బోధ చివరి సంబోధనలో తెలియవస్తుంది.

క. దేహాభిమాన సంభృత । మోహతమోనిరసనాభిముఖ! భూరివివే
కాహీన మహాసత్త్వ స । మాహిత చిన్మాత్రరూప! మధురిమ సుభగా! 450

ప్రతిపదార్థం: దేహ=శరీరమునందు; అభిమాన= నేను అనే అభిమానంతో; సంభృత= నిండిన; మోహ= అజ్ఞానం అనే; తమః = చీకటిని; నిరసన= పారద్రోలుటయందు; అభిముఖ!= అనుకూలత కలవాడా!; భూరి= గొప్ప; వివేక= జ్ఞానంతో కూడిన; అహీన= తక్కువతనంలేని; మహాసత్త్వ= గొప్ప సత్త్వగుణం కలవారియందు; సమాహిత= చక్కగా ఉంచబడిన; చిత్+మాత్ర రూప!= జ్ఞానం మాత్రమే అయిన రూపంగలవాడా!; మధురిమ సుభగా!= ఆనందమనే మాధుర్యంతో సుందరమైనవాడా!

తాత్పర్యం: స్వామీ! 'దేహమే నేను' అనే భావమే అజ్ఞానం. దానితో నిండి మోహమనే చీకటిని త్రోసివేయటంలో నీవు అనుకూలుడవు. గొప్ప జ్ఞానం కలిగిన మహానుభావులలో నెలకొని ఉన్న జ్ఞానాకారుడవు. ఆనందంతో సుందరుడవు.

విశేషం: 'దేహాభిమానం' అనగా 'నశించే దేహమే నేను' అనే భావన. దీనితో నిండిపోయి ఉంటుంది అజ్ఞానం. అది భయంకరమైన కారుచీకటివంటిది. అందులోపడి దిక్కుతోచనివారు భక్త్యాదులచేత సేవిస్తే, పరమాత్మ దానిని రూపుమాపటానికి సిద్ధంగా ఉంటాడు.

అజ్ఞానం నశించి తరువాత జ్ఞానాన్ని సాధించాలి. అది ఏదో కొంచెం పాటిదైతే లాభంలేదు. భూరివివేకం కావాలి. అది కలవారు "మహాసత్త్వులు'' అవుతారు. ఇందులో రెండర్థాలు భావించవచ్చును. గొప్ప సత్త్వగుణం కలవారు. గొప్ప గుండెబలం కలవారు అని ఆ రెండర్థాలు. గొప్ప సత్త్వమంటే శుద్ధతత్త్వం. గొప్ప హృదయబలం అంటే జగత్తును త్రోసివేయగల పరమాత్మను పట్టుకొనగల ధీమా! అది కలవారి హృదయంలో జ్ఞానైకస్వరూపంతో భగవంతుడు ఉంటాడు.

అజ్ఞానాన్ని రూపుమాపి, జ్ఞానాన్ని హృదయంలో పదిలపరచుకొంటే లభించే ఫలం పరమానందం. అది పరమాత్మ స్వరూపమే. దానితో అతడు సుందరుడు. ఇందులో ఈ విధంగా పరమాత్మ ధర్మాలు అయిన సత్, చిత్, ఆనందస్వరూపాలు మూడు రూపుదిద్దుకొన్నాయి.

మాలిని :

త్వరిత విహిత గాఢధ్యాయి సంమోదవాదా!
స్ఫురదరి దృఢశూల స్ఫూర్తి సంశస్తహస్తా!
తరణి శశిమయత్వోదారతా చిత్రనేత్రా!
పరమ నియతనిష్ఠాభవ్యహృత్పద్మసద్మా! 451

ప్రతిపదార్థం: త్వరిత= తొందరగా; విహిత= చేయబడిన; గాఢ= తీవ్రమైన; ధ్యాయి=ధ్యానంగలవారి; సంమోద=ఆనందంతో కూడిన; వాదా!=పలుకులు కలవాడా!; స్ఫురత్= తళతళలాడుచున్న; అరి=చక్రము; దృఢ= గట్టిదైన; శూల= శూలము అనే వాటి; స్ఫూర్తి= కదలికచేత; సంశస్త= మిక్కిలి కొనియాడదగిన; హస్తా!= చేతులు కలవాడా!; తరణి శశిమయత్వ= సూర్యచంద్ర

భావాల; ఉదారతా= గొప్పతనంతో; చిత్రనేత్రా!= విచిత్రములైన కనులు కలవాడా!; పరమ= మిక్కిలి శ్రేష్ఠమైన; నియత= పట్టుతప్పని; నిష్ఠా= నిష్ఠచేత; భవ్య= మిక్కిలి గొప్పదైన; హృత్+పద్మ సద్మా!= హృదయమనే పద్మం స్థానం అయినవాడా!

తాత్పర్యం: హరిహరదేవా! నీవు తొందరతో కూడి చేసిన తీవ్రధ్యానం కలవారి ఆనందవాక్కులే స్వరూపంగా కలవాడవు. తళతళళాడే చక్రమూ, గట్టిదైన త్రిశూలమూ అనే వాటి కదలికలతో ప్రశస్తమైన చేతులు కలవాడవు. సూర్యచంద్ర రూపాలయిన మహోదాత్త చిత్రనేత్రాలు కలవాడవు. మహానిష్ఠచేత భవ్యమైన హృదయపద్మం స్థానం అయినవాడవు.

విశేషం: పరమాత్మదర్శనం చేసినవారు సామగానాలు చేస్తూ పారవశ్యంతో ఉంటారని వేదం (తైత్తిరీయ ఉపనిషత్తు) వివరించింది. చక్రం విష్ణువుచేతిలో, శూలం శివుడిచేతిలో ఉండటం ప్రసిద్ధమే. ఏకత్వం కొరకు'చక్రమనే శూలం' వంటి అర్థాన్ని భావించవచ్చును. సూర్యుడు, చంద్రుడు కన్నులవటం ఉభయ సాధారణం. పట్టుతప్పని నిష్ఠగల భవ్యుల హృదయాలే పరమాత్మ గోచరించే తావులు. కనుక అటువంటి హృదయం సాధించండని కవి వ్యంగ్యోపదేశం.

గద్యము :

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందుఁ జతుర్థాశ్వాసము.

తాత్పర్యం: ఇది శ్రీమంతుడు, ఉభయకవిమిత్రుడు, కొమ్మనమంత్రి కుమారుడు, బుధులను సేవించటంచేత ప్రకాశించేవాడు అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని ఆనుశాసనికపర్వంలో నాలుగవ ఆశ్వాసం.

ఆనుశాసనికపర్వంలో చతుర్థాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - పంచమాశ్వాసము

శ్రీకాళీత్వాదరసు । శ్లోకాలోకన విలాస సుస్థిర భవనా!
శోకముదాద్యవధూతి । వ్యాకోశ వివేక భవన! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీకాళీత్వ = లక్ష్మీ పార్వతీ భావములందలి; ఆదర = మన్ననచే; సుశ్లోక = వాసిగాంచిన; ఆలోకనవిలాస = చూపుల యొక్క సొబగులకు; సుస్థిర భవనా! = శాశ్వత నివాసమైనవాడా!; శోక = దుఃఖం; ముత్+ఆది (ముదాది) సంతోషం మొదలైన జంటల యొక్క; అవధూతి = వినాశంతో, నిర్మూలనంతో; వ్యాకోశ = విప్పారిన; వివేక భవన! = విజ్ఞానమునకు నెలవైన వాడా!; హరిహరనాథా! = ఓ హరిహరనాథుడనే పరబ్రహ్మమా!

తాత్పర్యం: హరిహరనాథా! భక్తుల మీద ప్రసరించే నీ కటాక్ష వీక్షణాలు సకలైశ్వర్యాలకూ, సమస్త సన్మంగళాలకూ నిశ్చలాలైన నిలయాలు. సుఖ దుఃఖాదులైన ద్వంద్వాల యొక్క నిర్మూలనం వలన నీవు వికసించిన విజ్ఞానానికి నెలవై ఉన్నావు స్వామీ!

విశేషం: కవిబ్రహ్మ తిక్కన సోమయాజి హరిహరనాథాంకితంగా తాను రచించిన భారత సంహితలోని ప్రతి పర్వ ఆశ్వాసాద్యంత పద్యాలలో భేదం లేని భక్తితో శివకేశవులను స్తుతించాడు. మాకందం వంటి ఈ కందపద్యంలో శ్రీత్వ కాళీత్వములందు ఆదరమేదురములైన దృగ్విలాసాలు కలవాడుగా హరిహరనాథుడిని ఆ మహనీయుడు కీర్తించాడు.

శ్రీత్వ మనగా లక్ష్మీభావం. కాళీత్వ మనగా గౌరీ భావం. భావ మనగా ధర్మం. రమా గౌరీ భావము లేవనగా క్రమంగా సకలైశ్వర్య ప్రదాయకత్వం, సకల సన్మంగళ ప్రదత్వం. ఆ రెంటినీ హరిహరనాథుడు తన దృక్ప్రసారంతో భక్తులకు అనుగ్రహిస్తున్నాడని తాత్పర్యం.

అంతేకాదు. సుఖదుఃఖాది ద్వంద్వ నిరాకృతితో ఆ పరమేశ్వరుడు విస్తరిల్లిన విజ్ఞానమునకు ఉనికిపట్టైన వాడు గనుక ఆశ్రిత వర్గమునకు ముక్తిని ప్రసాదిస్తున్నాడని భావం. ఈ రీతిగా ఆయన భక్తులకు ఇహపరసౌఖ్యవిధాయకుడని చెప్పినట్లైనది.

శివుఁడు పార్వతికి వర్ణాశ్రమాచారంబుల తెఱఁ గెఱిఁగించుట. (సం.13-128-28(అను-1-15).

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా! = ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు = వేదవ్యాస మహర్షి శిష్యుడైన వైశంపాయనుడనే పేరుగల పౌరాణికుడు; జనమేజయునకున్ = పరీక్షిన్మహారాజపుత్రుడైన జనమేజయ మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వ్యాసభగవానుడి శిష్యుడైన వైశంపాయనుడనే పౌరాణికుడు పరీక్షిన్మహారాజు కుమారుడైన జనమేజయ మహారాజుతో ఈ విధంగా పలికాడు.

తే. **అట్లు గంగాత్మజుండు ధర్మాత్మజునకుఁ । జెప్పి యిట్లనుఁ 'గౌరవశ్రేష్ఠ! పద్మ**
నాభుతో నవ్విధంబున నారదుండు । పార్వతీదేవి ప్రశ్న ముపన్యసించి. 3

ప్రతిపదార్థం: అట్లు = ఆ ప్రకారంగా; గంగా+ఆత్మజుండు = గంగాదేవి తనయుడైన భీష్ముడు; ధర్మ+ఆత్మజునకున్ = యముడి కుమారుడైన యుధిష్ఠిరుడికి; చెప్పి = వచించి; ఇట్లు+అనున్ = ఈ విధంగా అన్నాడు; కౌరవ శ్రేష్ఠ! = కురువంశజులలో ఉత్తముడవైన ధర్మజా!; పద్మనాభుతోన్ = నళినము నాభియందుగల నారాయణుడితో- అనగా శ్రీకృష్ణుడితో; ఆ+విధంబునన్ = ఆ తీరున; నారదుండు = నారద మహర్షి; పార్వతీ దేవి ప్రశ్నము = గౌరీదేవి యొక్క ప్రశ్నను; ఉపన్యసించి = ఉగ్గడించి; (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ఆ ప్రకారం గంగాపుత్రుడైన భీష్ముడు ధర్మనందనుడితో చెప్పి, ఇంకా ఇట్లన్నాడు. 'కురుకులోత్తమా! ధర్మజా! శ్రీకృష్ణుడితో నారదుడు ఆ విధంగా పార్వతీదేవి శివుడిని ఏమడిగిందో చెప్పి.

వ. **ఇట్లనియె నప్పర్వతరాజపుత్రి ప్రార్థించిన నప్పరమేశ్వరుండు పరమాదర భరితుండై.** 4

ప్రతిపదార్థం: ఇట్లు+అనియెన్ = ఈ విధంగా అన్నాడు; ఆ+పర్వతరాజపుత్రి = ఆ నగాధిరాజైన హిమవంతుడి కూతురు గిరిజాదేవి; ప్రార్థించినన్ = వర్ణాశ్రమ ధర్మాలు చెప్పుమని మిక్కిలి వేడుకొనగా; ఆ+పరమ+ఈశ్వరుండు = ఆ దేవాధిదేవుడైన శంభుడు; పరమ+ఆదర+భరితుండు+ఐ = గొప్ప గౌరవబుద్ధితో నిండిన వాడై.

తాత్పర్యం: నారదమౌని శ్రీకృష్ణభగవానుడితో ఇట్లా అన్నాడు. 'ఆ విధంగా ఆ శైలరాజతనయ వర్ణాశ్రమధర్మాలు చెప్పుమని తనను మిక్కిలి వేడుకొనగా మహేశ్వరుడు పరమాదరంతో.

సీ. **అజుఁడు మున్ లోకహితార్థంబుగా బ్రాహ్మ । ణులను సృజించి రాజులను వైశ్యు**
లను శూద్రులను గ్రమం బొనరంగఁ గల్పించె; । నాజాతులకు నోలి నతని ముఖము
బాహులు నూరులుఁ బదములు సంభవ । స్థానంబు లగుటయుఁ, దారతమ్య
భాగిను లగునని పార్వతి కాతండు । తత్తదాచరణీయ ధర్మములును

ఆ. **వినుము విస్తరించె; విప్రులు లోకధా । రకులు; వారియెడఁ బరాభవంబు**
సేఁత యెల్ల చేటుఁ జేయు; సమ్మాన దా । నములు సకల శోభనము నొనర్చు. 5

ప్రతిపదార్థం: వినుము = దేవీ! నీవు నన్నడిగిన వర్ణాశ్రమాచార విధ మెట్లాంటిదో వివరిస్తాను ఆలకించుము; అజుఁడు = బ్రహ్మదేవుడు; మున్ = మునుపు; లోక హిత+అర్థంబుగాన్ = జగత్తుకు మేలు చేకూర్చటం కొరకు; బ్రాహ్మణులను = నాల్గు వర్ణాలలో మొదటివర్ణం వారైన విప్రులను; సృజించి = పుట్టించి; రాజులను = క్షత్రియులనే రెండవ వర్ణంవారిని; వైశ్యులను = కోమటులనే మూడవ వర్ణంవారినీ; శూద్రులను = శూద్రులనే చతుర్థజాతివారినీ; క్రమంబు+ఒనరంగన్ = వరుస తప్పకుండ; కల్పించెన్ = ఉద్భవింప జేశాడు; ఆ జాతులకున్ = ఆ బ్రాహ్మణాది వర్ణముల వారికి; ఓలిన్ = క్రమంగా; అతని ముఖము = ఆ పరమేష్ఠి వదనం; బాహులున్ = భుజములు; ఊరులున్ = తొడలు; పదములున్ = చరణాలు; సంభవస్థానంబులు+అగుటయున్ = జన్మ ప్రదేశాలు కావటం వలన; తారతమ్య భాగినులు+అగున్ = ఆ బ్రాహ్మణ ప్రముఖ జాతులు న్యూనాధిక్యములు, ఎక్కువ తక్కువ అనే తేడాలు కలవి అయినాయి; అని = అంటూ; పార్వతికిన్= శైలజకు;

ఆతండు= ఆ చంద్రశేఖరుడు; తత్+తత్= ఆయాజాతుల వారి యొక్క; ఆచరణీయ = ఆచరించదగిన; ధర్మములును = విధులు; విస్తరించెన్ = విపులంగా తెలిపాడు; విప్రులు= భూసురులు; లోక ధారకులు = లోకమును ధరించేవారు, సమాజానికి ఆధారభూతులు; వారి+ఎడన్ = అట్టి భూసురుల విషయమున; పరాభవంబు+చేత = సలిపే అవమానం; ఎల్ల చేటున్+చేయున్ = మిక్కిలి కీడు చేస్తుంది; సమ్మానదానములు = ఆ మహనీయులకు చేసే సత్కారాలు, ఇచ్చే దానాలు; సకల శోభనమున్+ఒనర్చున్ = అన్ని శుభాలను కలిగిస్తాయి.

తాత్పర్యం: అపర్ణా! ఆలకించు. పూర్వం బ్రహ్మదేవుడు లోకానికి మేలు చేయాలని నాల్గు వర్ణాలను సృజించాడు. తొలుత మహీసురులను, తరువాత క్షత్రియులను, పిదప వైశ్యులను, ఆవల శూద్రులను జన్మింప జేశాడు. విధాత ముఖం నుండి విప్రులు, బాహువులనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదాలనుండి శూద్రులు పుట్టారు. ఈ రీతిగా వారివారి సంభవస్థానాలు బ్రహ్మ యొక్క వేరువేరు శరీర భాగాలు కావడం వల్ల ఆ నాలుగు జాతులవారిలో ఎక్కువ తక్కువ తేడాలు ఏర్పడ్డాయి. అందుచేతనే బ్రాహ్మణాది జాతులవారు ఆచరించవలసిన ధర్మాలలో గూడా వ్యత్యాసాలున్నవి అంటూ హరుడు ఆయాజాతులవారి విధులను హైమవతికి వివరించాడు. గౌరీ! భూసురులు లోకమునకు ఆధారభూతులు. వారిని అవమానిస్తే కీడు మూడుతుంది. వారికి చేసే సత్కారాలు, సలిపే దానాలు సకల శుభాలు సమకూరుస్తాయి.

చ. **ప్రియ మఱి యజ్ఞునేనియు దరిద్రుని నేనియు విప్రుఁ గందఁ జే**
త యుభయలోక సౌఖ్యములు దవ్వుగఁ జేయుఁ; దదీయమైన నిం
దయు నను బెట్టు దిట్టుట, యధర్మత నాతని సొమ్ము పుచ్చి కొం
టయును మదర్థముంగొనుట; డాఁపక చెప్పితి; నిక్క మింతయున్.' 6

ప్రతిపదార్థం: ప్రియము+అఱి = ప్రేమ నశించి, పగగొని; అజ్ఞున్+ఏనియున్ = ఏమీ తెలియనివాడైనప్పటికినీ; దరిద్రునిన్+ఏనియున్ = పేదవాడైనప్పటికినీ; విప్రున్ = బ్రాహ్మణుడిని; కందన్+చేఁత = బాధించట మనేది; ఉభయలోక సౌఖ్యములు = ఇహపరాలకు సంబంధించిన సుఖాలను; దవ్వుగన్+చేయున్ = దూరం చేస్తుంది; తదీయము+ఐన = ఆ విప్రుడికి సంబంధించినట్టి; నిందయున్ = దూషణం కూడ; ననున్ = ఈశ్వరుడనైన నన్ను; బెట్టు = మిక్కిలి; తిట్టుట = నిందించటమే అవుతుంది; అధర్మతన్ = ధర్మ విరుద్ధంగా; ఆతని సొమ్ము = ఆ బ్రాహ్మణుడి ద్రవ్యం; పుచ్చికొంటయును = గ్రహించటం కూడ; మత్+అర్థమున్ = నా ధనమును; కొనుట = స్వీకరించటమే అవుతుంది; డాఁపక = ఈ విషయం రహస్యంగా ఉంచక; చెప్పితిన్ = నీకు తెలిపినాను; ఇంతయున్ = నేను చెప్పినదెల్ల; నిక్కము = నిజం.

తాత్పర్యం: ఉమా! పగవహించి ఏమియు తెలియని వాడైనప్పటికినీ, బీదవాడైనప్పటికినీ బ్రాహ్మణుడిని బాధించరాదు. అతడిని వేధించేవాళ్ళు ఇహపరలోక సౌఖ్యాలకు దూరమై పోతారు. బ్రాహ్మణుడిని దూషించటం నన్ను దూషించటమే సుమా! అన్యాయంగా అతడి సొమ్ము కాజేయడం నా ద్రవ్యాన్ని అపహరించటమే అవుతుంది. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచక నీకు చెప్పినాను. నేను చెప్పినదంతా సత్యమే.'

విశేషం: "విప్రుసొమ్ము కంటె విషము మేలు" - ఇత్యాది సూక్తులు సంఘంలో బ్రాహ్మణుడి కున్న గౌరవాన్ని చాటుతాయి.

వ. అని పలికి యిట్లనియె. 7

ప్రతిపదార్థం: అని పలికి = అని వచించి; ఇట్లు+అనియెన్ = మరల పరమేశ్వరుడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈశ్వరుడు మహేశ్వరితో అట్లు పలికి మళ్ళీ ఇట్లా అన్నాడు.

సీ. 'అధ్యయనంబును యజనంబు దానంబు । నధ్యాపనంబును యాజనముఁ బ్ర
తిగ్రహంబును బ్రశాంతియుఁ దపస్సత్యశౌ । చంబులు విప్రధర్మంబు లాప
దలఁ దక్క నతనికి వలవదు వాణిజ్య: । మగ్నికార్యంబు, శూద్రాన్నవర్జ
నము, నిజదార సంగమ నియమంబును, । నిరుప్రొద్దు గుడుపును, హింస లేమి

ఆ. యును, నివాస శుద్ధియును, నతిథిప్రియ । త్వంబు బ్రాహ్మణులకు వలయుఁ; దపము
పేర్మి సాధనముగ ధర్మమూలముగ వా । రల సృజించెఁగాదె నలినభవుఁడు. 8

ప్రతిపదార్థం: అధ్యయనంబును = వేదాలను గురుముఖంగా చదవటం; యజనంబున్ = యజ్ఞ యాగాది కర్మలు చేయటం; దానంబున్ = గోవు, భూమి మొదలైన వాటిని యోగ్యులైన వారి కివ్వటం; అధ్యాపనంబును = వేదాది విద్యలను అన్యులకు నేర్పడం; యాజనమున్ = యజ్ఞయాగాదులు తాను చేయించటం; ప్రతి గ్రహంబును = దానాదులు పుచ్చుకొనటం; ప్రశాంతియున్ = కామక్రోధాది విరహితమైన మనస్సుతో నిమ్మళంగా ఉండటం; తపః = శాస్త్రోక్తమైన కర్మలకు అర్హత; సత్య = నిజం పలికే నియమం; శౌచంబులు = శాస్త్రోక్త కర్మాచరణ యోగ్యత, పవిత్రతలు; విప్రధర్మంబులు = బ్రాహ్మణధర్మాలు; ఆపదలన్+తక్కన్ = కష్టాలలో దప్ప; అతనికిన్ = విప్రుడికి; వాణిజ్యము = వ్యాపారం, వర్తకం; వలవదు = తగదు; అగ్ని కార్యంబు = హోమ మొనర్చుట; శూద్ర+అన్న వర్జనము = శూద్రులొసగిన అన్నమును భుజించక వదలివేయటం; నిజదారసంగమ నియమంబును = తన పెండ్లముతోనే కూడునట్టి నియమం అనగా అన్యకాంతాసక్తి లేకుండటం; ఇరుప్రొద్దుకుడుపును = రెండు పూటల మాత్రమే భుజించటం; హింసలేమియును = ప్రాణులను హింసించకుండుట-అనగా అహింసావ్రతపాలనం; నివాస శుద్ధియును = గృహమును శుభ్రంగా ఉంచుకొనటం; అతిథి ప్రియత్వంబున్ = భోజన సమయాన ఇంటికి వచ్చిన వారిని ఆదరించటం; బ్రాహ్మణులకున్ = భూసురులకు; వలయున్ = తగును; తపము పేర్మి = తపస్సు యొక్క ఆధిక్యం; సాధనముగన్ = సర్వకార్యసాధనంగా; ధర్మమూలముగన్ = ధర్మమునకు ఆధారంగా; వారలన్ = భూదేవులను; నలిన భవుఁడు = పద్మమునుండి జనించిన బ్రహ్మ; సృజించెన్+కాదు+ఎ = సృష్టిచేశాడు గదా.

తాత్పర్యం: వేదాలను గురుముఖంగా నేర్చి వల్లించటం, యజ్ఞాలు చేయటం, పాత్రులైనవారికి దానాలివ్వటం, వేదాది విద్యలను ఇతరులకు బోధించటం, యజ్ఞయాగాది కర్మలు చేయించటం, యాగం చేసినట్టి యజమానులిచ్చే దానాలు పరిగ్రహించటం, ప్రశాంతచిత్తంతో ఉండటం, తపమాచరించటం, సత్యవాఙ్నియమం, మనోవాక్కాయము లందు పరిశుద్ధుడుగా ఉండటం విప్రులధర్మాలు. ఇడుమలలో తప్ప బ్రాహ్మణుడికి వర్తకం ఏమాత్రం తగదు. భూసురుడు నిత్యాగ్నిహోత్రిగా ఉండాలి. అంటే ప్రతినిత్యం హోమకార్యం నిర్వర్తించాలి. శూద్రులు పెట్టే తిండి తినగూడదు. తన భార్యతోనే కాపురం చెయ్యాలి కాని పరాంగనల పొందు పనికిరాదు. రెండు పూటల మాత్రమే భుజించాలి. ఇంటిని పరిశుద్ధంగా ఉంచుకొనాలి. భోజనవేళకు వచ్చిన అతిథి అభ్యాగతులను ప్రీతితో ఆదరించాలి.

ఇవి బ్రాహ్మణ ధర్మాలు. తపస్సమృద్ధియే సకల కార్యసాధనంగా, ధర్మమునకు ఆధారభూతులుగా బ్రాహ్మణుల్ని బ్రహ్మదేవుడు సృజించాడు.

విశేషం: "బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప,
కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవై ర్గుణైః." -- (భగ. 18-41)

ప్రాచీన కర్మలమూలంగా ఏర్పడే సత్త్వాది గుణాలను బట్టి ఆయా వర్ణాల వారు చేయదగిన కర్మలను శాస్త్రాలు విభజించి చెప్పాయి అంటూ ఉపక్రమించి వాసుదేవుడు అర్జునుడికి విప్రధర్మ మెట్లాంటిదో ఈ క్రింది విధంగా గీతలో ఉగ్గడించాడు.

"శమో దమ స్తప శ్శౌచం క్షాంతి రార్జవ మేవ చ,
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్." -- (భగ. 18-42)

"శమం, దమం, తపం, శౌచం, క్షాంతి, ఆర్జవం, జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యం అనేవి బ్రాహ్మణులకు సంబంధించిన సహజ కర్మలు, ధర్మాలు" -- అని.

ఆ. క్షత్రియులకు విప్రసంరక్ష ముఖ్యధ । ర్మంబు; ధరణి వారి రక్షణమునఁ
గాని బ్రదుక; దమ్మహానుభావుల పాల । నంబు సేయ శోభనంబు నొందు. 9

ప్రతిపదార్థం: క్షత్రియులకున్ = రెండవజాతి వారైన రాచవారికి; విప్రసంరక్ష = బ్రాహ్మణులను బాగా కాపాడటం; ముఖ్య ధర్మంబు= ప్రధానమైన ధర్మం; ధరణి = పుడమి; వారి రక్షణమునన్+కాని = ఆ క్షత్రియులు కాపాడటం వలననే తప్ప; బ్రదుకదు= జీవించదు; ఆ మహా+అనుభావులు+అ= ఆ గొప్ప సామర్థ్యం గల క్షత్రియులే; పాలనంబు+చేయన్= ఏలుబడి సాగించగా; శోభనంబున్+ఒందున్= శుభములు పొందుతుంది.

తాత్పర్యం: క్షత్రియులకు బ్రాహ్మణ సంరక్షణమే ప్రధాన ధర్మం. రాచవారి సంరక్షణలోనే ధరణికి సర్వతోముఖాభివృద్ధి సమకూడుతుంది. మిక్కిలి సామర్థ్యం గల క్షత్రియులు ఏలుబడి సాగించగా పుడమికి సకల శుభాలు సంప్రాప్త మవుతాయి.

విశేషం: "శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్,
దాన మీశ్వర భావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్. " -- (భగ. 18-43)

శౌర్యం, తేజస్సు, ధృతి, దాక్ష్యం అనగా నేర్పు, యుద్ధమునందు అపలాయనం, దానం, ఈశ్వరభావం అంటే అన్యులను శాసించగల సామర్థ్యం - ఇవి క్షత్రియసాధారణ కర్మలుగా, ధర్మాలుగా భగవద్గీత ప్రబోధించింది.

నరులలో నేను నరాధిపుడిని అని భగవానుడు ఉగ్గడించడం చేత సాధు సంరక్షణమే భగవదవతార ప్రయోజనం గనుక సాధువులైన భూసురులను కాపాడటం రాజులకు ముఖ్యమైన ధర్మంగా, ప్రధాన కర్తవ్యంగా ఈ పంచమవేదం నిర్ణయించింది.

క. రమణీ! యధ్యయనము యజ । నము దానము సాధుపోషణము దుర్జనులన్
దమియించుటయు సముత్సా । హము కల్మియు ధృతియు నృపుల కగు ధర్మంబుల్. 10

ప్రతిపదార్థం: రమణీ! = ఓ కాత్యాయనీ!; అధ్యయనము = శస్త్రాస్త్రవిద్యలు అభ్యసించటం; యజనము = యాగాలు చేయించటం; దానము = తగినవారికి వస్తువుల నొసంగటం; సాధుపోషణము = సత్పురుషులను వృద్ధి పొందించటం; దుర్జనులన్ = దుర్మార్గులను; దమియించుటయున్ = అణచివేయటం; సముత్సాహము కల్మియున్ = మంచి ఉత్సాహం కలిగి ఉండటం; ధృతియున్ = ధైర్యం; నృపులకున్ = రాజులకు, క్షత్రియులకు; అగు = తగిన; ధర్మంబుల్ = ధర్మాలై ఉన్నవి - లేదా ధర్మంబులు+అగున్ = ధర్మములై ఉన్నవి అని కూడ అర్థం చెప్పవచ్చు.

తాత్పర్యం: దేవీ! వేదశాస్త్రాలు అనగా ధనుర్వేదం, నీతిశాస్త్రం మొదలైన విద్యలు అభ్యసించటం, యజ్ఞయాగాది క్రతువులు చేయించటం, అర్హులకు దానా లివ్వటం, సత్పురుషులను సాకటం, దుష్టులను అణచివేయటం, మిక్కిలి ఉత్సాహం కలిగి ఉండటం అనేవి రాజధర్మాలు.

విశేషం: రాజులకు ఉండవలసిన ప్రభు మంత్రోత్సాహ శక్తులలో ఉత్సాహ మొకటి.

తే. **శస్త్ర జీవికయును నరిషష్ఠ భాగ । మా హరించుటయును భృత్యు నరయుటయును**
బ్రజ వివాదంబు వినుచోటఁ బక్షపాతి । గామియును రాజులకుఁ గృత్యకర్మకోటి. **11**

ప్రతిపదార్థం: శస్త్ర జీవికయునున్ = ఆయుధాలే జీవనోపాయంగా గలిగి ఉండటం, వేటాడటం, వైరులను సంహరించటం అనేవి రాజులకు శాస్త్ర విహితకృత్యాలు కనుక వారు శస్త్రజీవులు; అరి = కప్పముగా, పన్నుగా; షష్ఠ భాగము = ఆదాయంలో ఆరవపాలు; ఆహరించుటయునున్ = గ్రహించటం - శాత్రవులను జయించి వారి సంపదలో ఆరవభాగం కప్పంగా గైకొనటమేకాక, తన ఏల్బడిలోని ప్రజలరాబడిలోనుండి ఆరవపాలు పన్నుగా వసూలు చేయటం; భృత్యున్ = సేవకుడిని; అరయుటయును = పరిపోషించటం; ప్రజవివాదంబు = తన రాజ్యంలో ప్రజలనడుమ ఏర్పడిన తగవులు; వినుచోటన్ = ఆలకించేటప్పుడు; పక్షపాతి కామియును = ఒకవైపు మొగ్గకుండటం అనునవి; రాజులకున్ = దొరలకు; కృత్యకర్మకోటి = చేయదగిన పనుల యొక్క మొత్తమై ఉన్నది.

తాత్పర్యం: ఆయుధాలపై ఆధారపడి బ్రతుకుతెరువు సాగించటం, శత్రురాజులను ఓడించి వారి సంపదలో ఆరవభాగం కప్పంగా గైకొనటం, మరియు తమ రాజ్యంలోని ప్రజల ఆదాయంలో నుండి ఆరవపాలు పన్నుగా గ్రహించటం, తమను కొలిచియున్న సేవకులను పోషించటం, ప్రజల నడుమ ఏర్పడ్డ తగవులు తీర్చేటపుడు పక్షపాతం వహించకుండా న్యాయనిర్ణయం చేయడం రాజులకు శాస్త్రవిహిత కర్తవ్య కర్మలు.

సీ. **వణిజులు లోక ప్రవర్తనంబుల కెల్ల । నుపకారకులు; గృషియును ననేక**
భంగి బేహారంబుఁ బసులఁ బెంచుటయుఁ గృ । త్యంబులు; వారల కధ్యయనము
యజనంబు దానంబు నర్హ కర్మంబులు; । ద్రైవర్ణిక ద్విజత్వమ్ము కతన
నాతిథ్యములు విధేయములు; వారికిఁ దిల । గంధరసముల విక్రయము దగదు;

తే. **మూఁడు జాతుల శుశ్రూషమూల కార్య । గతి తదుపయుక్తి శూద్రుల కలిమి నడచు;**
వారు శుశ్రూషకులు; విప్రవందనంబు । వినయ మక్రూరు లగుట తద్విహిత కృతులు. **12**

ప్రతిపదార్థం: వణిజులు = వ్యాపారం చేసే వైశ్యులు; లోక ప్రవర్తనంబులకున్+ఎల్లన్ = లోకవ్యవహారాలన్నింటికినీ; ఉపకారకులు = మేలు చేసేవారు; కృషియునున్ = సేద్యము; అనేక భంగి బేహారంబున్ = పలు తెరగులైన వ్యాపారాలూ, పసులన్ = పశువులను; పెంచుటయున్ = పోషించటమూ; కృత్యంబులు = వారు చేయదగిన పనులు; త్రైవర్ణిక ద్విజత్వమ్ము కతనన్ = మొదటి మూడు వర్ణములకు విహితమైన యజ్ఞోపవీత ధారణాది హేతువుచేత; వారలకున్ = ఆ వైశ్యులకు; అధ్యయనమున్ = గురుముఖమున వేదాలు పఠించటం; యజనంబున్ = యజ్ఞాలు చేయటం; దానంబున్ = గోభూదానాలు పాత్రుల కొసగటం; అర్హకర్మంబులు = తగిన కృత్యాలు; ఆతిథ్యములు = అతిథి సత్కారాలు; విధేయములు = వారు చేయదగినవి; వారికిన్ = ఆ వైశ్యులకు; తిలగంధరసముల = నువ్వులు, గంధములు, రసములు వీటియొక్క; విక్రయము = అమ్మకం; తగదు = కూడదు; మూఁడు జాతుల శుశ్రూషమూల కార్యగతి= బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనెడి త్రైవర్ణికుల సేవా మూలకమైన పనుల చొప్పుతో; తత్+ ఉపయుక్తిన్= ఆ త్రైవర్ణికులకు ఉపయోగపడుటతో; శూద్రులకలిమి= శూద్రులయొక్క ఉనికి; నడచున్= సాగుతుంది; వారు = ఆ శూద్రులు; శుశ్రూషకులు= సేవించునట్టివారు; విప్రవందనంబు= బ్రాహ్మణులకు నమస్కరించటం; వినయము= అణకువ, విధేయత; అక్రూరులు+అగుట= కఠినులుగాక సౌమ్యులై ఉండటం; తత్ విహిత కృతులు= ఆ శూద్రులకు తగిన ధర్మములు, పనులు.

తాత్పర్యం: వైశ్యులు లోక వ్యవహారా లన్నింటికీ ఉపకరించేవారు. వ్యవసాయం, పలురకాలయిన వ్యాపారాలు, పశుపోషణ వీరికి విధి విహిత కృత్యాలు. బ్రాహ్మణ క్షత్రియులవలె వీరున్నూ మాతృగర్భం నుండి జన్మించటం, ఉపనయన సంస్కారం పొందటం అనే రెండు జన్మలు కలవారు కనుక ద్విజులు. ద్విజ ధర్మములైన వేద విద్యాభ్యాసం, యజ్ఞాలు చెయ్యటం, గో భూదానాలు ఇవ్వటం, అతిథులను సత్కరించటం ఈ మొదలైనవి వీరికి ఆచరణీయ కృత్యాలు. వైశ్యులు తిలగంధ రసాలు విక్రయించరాదు. శైలజా! మరి శూద్రుల ధర్మం బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సేవ చెయ్యటం. వారికి అన్నివిధాల ఉపకరించటం. బ్రాహ్మణులకు ప్రణమిల్లటం, వినయపరులై, సౌమ్యులై మెలగటం వారి ధర్మాలు.

విశేషం: మాతృ గర్భమున జన్మించటం, ఉపనయన సంస్కారమున పవిత్ర జన్మను పొందటం అనే రెండు జన్మలు కలవాడు ద్విజుడు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు ద్విజశబ్ద వాచ్యులు.

"కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్,
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాఽపి స్వభావజమ్." -- (భగ. 18-44)

వ్యవసాయం, పశుసంరక్షణ, వర్తకం వైశ్యులకు సహజ కర్మ. జీవనోపాయం కూడ. అట్లాగే త్రైవర్ణికులకు అనగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు పరిచర్య గావించడం శూద్రుడికి సహజ కర్మ. అది వాడి బ్రతుకు తెరువుగూడ - అని గీతోపనిషత్తు వర్ణధర్మాలు నిర్దేశించింది.

క. తన తన వర్ణంబునకుఁ ద । గిన యాచారంబు నడపి కిల్బిష రహితుం
డనఁ బరఁగు నెల్లవారికి । విను మున్మును జన్మ సౌఖ్య విభవము గల్గున్. 13

ప్రతిపదార్థం: విను = ఓ గౌరీ! ఆలకించుము; తన తన వర్ణంబునకున్ = తాను జన్మించిన కులానికి; తగిన = యుక్తమైన; ఆచారంబు = అనుష్ఠానం; నడపి = అనుష్ఠించి; కిల్బిష రహితుండు = పాపంలేనివాడు; అనన్ = అని లోకం మెచ్చగా; పరఁగు = ఒప్పునట్టి; ఎల్ల వారికిన్ = ప్రతివారికిన్నీ; మున్మును = ముందుముందు; జన్మ సౌఖ్య విభవము = ఎత్తిన జన్మల వలన పరమ సుఖం; కల్గున్ = లభిస్తుంది

తాత్పర్యం: గౌరీ! వినుము, తన తన కులానికి తగిన ఆచారం పాటించి పాపరహితుడైన ప్రతివాడు తనకు మున్ముందు కలుగబోయే జన్మలో పరమ సుఖాన్ని చూరగొంటాడు.

విశేషం: "స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు." -- (భగ. 18-45)

మనుష్యులు తమ తమ వర్ణాలకు అనుగుణమైన ధర్మాలను ఆదరంతో ఆచరిస్తే పరమ పద ప్రాప్తిరూప ఫలసిద్ధిని పొందుతారు.

"యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః." -- (భగ. 18-46)

ప్రపంచ సృష్టి స్థితి లయాలకు మూలమై విశ్వమంతటా వ్యాపించియున్న పరమాత్మను స్వధర్మానుష్ఠానంతో ఆరాధిస్తే పరమ పద ప్రాప్తి కల్గుతుంది అంటూ గీతలో భగవంతుడు చాటిన సంగతే ఈ కందంలో పొందుపరచబడింది.

వ. ఇవి వర్ణ ధర్మ ప్రకారంబు; లింక నాశ్రమ ధర్మంబులు వివరించెద నాకర్ణింపు' మని పలికి పార్వతికి పరమేశ్వరుం డిట్లనియె. 14

ప్రతిపదార్థం: ఇవి వర్ణ+ధర్మ ప్రకారంబులు = ఇవి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణాలకు సంబంధించిన ధర్మ విధానాలు; ఇంకన్ = ఇక; ఆశ్రమధర్మంబులు = ఆశ్రమ ధర్మాలను; వివరించెదన్ = వక్కాణిస్తాను; ఆకర్ణింపుము = ఆలకించుము; అని పలికి = అని వచించి; పరమ+ఈశ్వరుండు= చంద్రశేఖరుడు; పార్వతికిన్= సర్వమంగళకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు;

తాత్పర్యం: పార్వతీ! వర్ణ ధర్మ రీతు లిట్లాంటివి. ఇక ఆశ్రమ ధర్మాలు విశదపరుస్తాను వినుము' అంటూ పరమేశ్వరుడు ఆమెకు చెప్పటానికి ఉపక్రమించాడు.

విశేషం: ఆశ్రమములు నాలుగు. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్న్యాసము.

**సీ. బ్రహ్మ చర్య వ్రత పరమ నిష్ఠయు, గురు । నాశ్రయించుటయు, నధ్యయన కృతియు,
నగ్ని కార్యంబు, గుర్వర్థ సంచారంబు, । భైక్షచర్యయుఁ గమలాక్షి! బ్రహ్మ
చారి ధర్మంబు; లాశ్రమములకెల్ల నా । శ్రయణీయమై గృహస్థత్వ మొప్పు;
శౌచంబు, నిజదార సంతుష్టియును, బంచ । యజ్ఞంబులును, నిగమాభిరతియు,**

**తే. దాన హోమ దయాతిథి మాననములు । వలయు గృహమేధికిని; వనవాస వన్య
భోజన బ్రహ్మచర్య జటాజిన ప్ర । ధారణములు వానప్రస్థ ధర్మకోటి. 15**

ప్రతిపదార్థం: కమల+అక్షి! = తామర రేకుల వంటి కన్నులు గలదానా! గౌరీ!; బ్రహ్మచర్య వ్రత పరమనిష్ఠయున్ = బ్రహ్మ చర్యమనే నియమంలో మిక్కిలి శ్రద్ధ; గురున్ = ఆచార్యుడిని; ఆశ్రయించుటయున్ = విద్యకొరకు సేవించటం; అధ్యయన కృతియున్ = గురువుకడ విద్యాభ్యాసమనే పని; అగ్ని కార్యంబున్ = అగ్నిని ఉపాసించటం-హోమాదులు సల్పటం; గురు+అర్థ

సంచారంబు = గురువు పని నిర్వహించటానికై తిరగటం; భైక్ష చర్యయున్ = భిక్షాటనం-మధుకరవృత్తి నవలంబించటం; బ్రహ్మచారి ధర్మంబులు = బ్రహ్మచారి యొక్క విధులు; ఆశ్రమములకున్+ఎల్లన్ = అన్ని ఆశ్రమాలకు; ఆశ్రయణీయము+ఐ = ఆశ్రయించుటకు తగినదై; గృహస్థత్వము = గృహస్థుగా ఉండటం-గృహస్థాశ్రమం; ఒప్పున్ = విలసిల్లుతుంది; శౌచంబున్ = పరిశుద్ధత; నిజదార సంతుష్టియును = తన పత్నితోనే సంతృప్తి చెందడం; పంచ యజ్ఞంబులును = దేవయజ్ఞం, భూతయజ్ఞం, పితృ యజ్ఞం, బ్రహ్మ యజ్ఞం, మనుష్య యజ్ఞం అనే అయిదు మహా యజ్ఞాలు నిర్వహించటం; నిగమ+అభిరతియున్ = వేద విద్యాభ్యాసమందు మిక్కిలి ఆసక్తి; దాన = వలసిన వారికి గోవులు భూములు ఇవ్వటం; హోమ = అగ్నికార్యం; దయా = కృప; అతిథి మాననములు = ఇంటికి వచ్చిన అతిథి అభ్యాగతులను ఆదరించటం; గృహమేధికిని = గృహస్థాశ్రమం స్వీకరించిన వాడికి; వలయున్ = అనుసరించ దగిన ధర్మాలు; వనవాస = అరణ్యంలో నివసించటం; వన్య భోజన = ఆడవిలో లభించే కందమూలఫలాలను భుజించటం; బ్రహ్మచర్య = వనితాసంగమం వదలటం; జటా+అజిన ధారణములు = జడలు తాల్చటం, చర్మాలు ధరించటం; వాన ప్రస్థ ధర్మ కోటి = వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు ఆచరించవలసిన ధర్మాల యొక్క సముదాయమై ఉన్నది.

తాత్పర్యం: బ్రహ్మచర్య వ్రతం అవలంబించటంలో గొప్ప నిలుకడ, గురుదేవుడిని ఆశ్రయించటం, వేదపాఠంలో ఆసక్తి గల్గి ఉండటం, హోమాలు సల్పటం, గురుని కార్యం నెరవేర్చుటకై సంచరించటం, భిక్షాన్నం భుజించటం అనేవి బ్రహ్మచారి యొక్క ధర్మాలు. దేవీ! అన్ని ఆశ్రమాలవారికి ఆధారభూతమై గృహస్థాశ్రమం ఒప్పారుతున్నది. పరిశుద్ధత పాటించటం, తన భార్యతోనే సంతృప్తి చెందటం, ప్రతినిత్యం దేవయజ్ఞం, భూతయజ్ఞం, పితృ యజ్ఞం, బ్రహ్మ యజ్ఞం, మనుష్యయజ్ఞం అనే పంచ యజ్ఞాలు నిర్వర్తించటం, వేదమునందు ఆసక్తి, దానం, హోమం, దయ, అతిథిపూజ గృహస్థుడికి ఆచరణీయాలైన ధర్మాలు. అడవిలో నివసించటం, అక్కడ లభించే కందమూలాదులు భక్షించటం, బ్రహ్మచర్య వ్రతపాలనలో నిష్ఠ అనగా స్త్రీ సంగమువివర్జనం, జడలు తాల్చటం, చర్మాలు ధరించటం వానప్రస్థాశ్రమంలో ఉన్నవారియొక్క ధర్మాలు.

చ. కినియమి, సంగవర్జన, మకించన భావము, తాల్మి, విప్రవా
సనము, ప్రశాంతి, యార్జవము, శౌచము, సద్వ్రతనిష్ఠ, భైక్షభో
జన, మిల నిద్రసేఁత, కృప, సంతతత తత్త్వ విచింతనంబు మా
నిని! యతి ధర్మముల్ శ్రుతి గణించిన భంగిన యేను జెప్పితిన్. **16**

ప్రతిపదార్థం: మానిని! = ఆత్మాభిమానం గల చెలీ!; కినియమి = కోపపడకుండటం; సంగవర్జనము = ఇంద్రియ విషయాల అణచివేత అంటే పరమాత్మ కన్నా భిన్నమైన వస్తువులతో సంబంధం లేకుండటం; అకించన భావము = ఏమియూ లేనివాఁడై ఉండటం (ధనాదులందు ప్రీతి మానటం); తాల్మి = ఓర్పు; విప్రవాసనము = దేశాంతరమున నివసించటం లేదా బ్రాహ్మణులతో కూడి నివసించటం; ప్రశాంతి = నిమ్మళంగా ఉండటం; ఆర్జవము = ఋజుప్రవర్తన, సరియగు నడత; శౌచము = పరిశుద్ధత; సద్వ్రత నిష్ఠ = మంచి వ్రతాలను ఆచరించటంలో నిలుకడ అనగా అహింస మొదలైన నియమాలలో శ్రద్ధ; భైక్ష భోజనము = భిక్షించి తెచ్చుకొన్న అన్నం ఆరగించటం; ఇలన్ = నేలమీద; నిద్రసేఁత = పరుండటం, నిదురించటం; కృప = కనికరం; సంతత తత్త్వ విచింతనంబు = ఎల్లప్పుడు తత్త్వవిచారం సల్పుతుండటం; యతిధర్మముల్ = సన్న్యాసికి తగిన ధర్మాలు; శ్రుతి = వేదం; గణించినభంగిన్+అ = చెప్పిన విధంగానే; ఏను = నేను; చెప్పితిన్ = నీకు తెలిపాను.

తాత్పర్యం: కోపపడకుండా ఉండటం, ఇంద్రియ విషయాలను అణచివేయటం అనగా పరమాత్మకంటె ఇతరములైన విషయాలతో సంబంధం వదలటం, ఇతర దేశాలలో వర్తించటం లేదా బ్రాహ్మణులతో కలసి నివసించటం, సహనం, చక్కని నడత, పరిశుద్ధత, ఉత్తమ వ్రతాలు ఆచరించటంలో ఆసక్తి, భిక్షాన్నంతో జీవించటం, భూమి మీద శయనించటం, కారుణ్యం, ఎల్లవేళల ఆత్మతత్త్వ విచారం అన్నవి సన్న్యాసి యొక్క ధర్మాలు. శైలజా! వేదాలలో చెప్పబడిన ఈ ధర్మాలను నీకు తెలిపాను.

విశేషం: సంగ వర్జన మనగా పరమాత్మ కంటె వేరైన వస్తువులతో సంబంధం లేకుండటంగా -

"మత్కర్మ కృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః,
నిర్వైర స్సర్వభూతేషు యస్స మా మేతి పాండవ." - అని భగవద్గీత వెల్లడించింది.

"అకించనోఽ నన్యగతి శ్శరణ్య, త్వత్పాదమూలం శరణం ప్రపద్యే" నిన్ను చేరడానికి వలసిన కర్మ భక్తి జ్ఞానాలలో ఏ ఒక్కటీ బొత్తిగా లేనివాడిని. నిన్నే శరణు వేడుతున్నాను. నన్ను కాపాడు మన్న యామునాచార్యుల వారి నైచ్యానుసంధాన ప్రదర్శకమైన ఈ శ్లోకం మనకు స్తోత్రరత్నంలో(22) కనిపిస్తుంది.

వ. **అని యిట్లాశ్రమ ధర్మంబులు సెప్పిన విని యప్పరమేశ్వరుతోఁ బార్వతి 'తపంబు తపంబనుచు మునిజనంబు లాచరింతురు; దాని తెఱం గెఱింగింపవే' యనిన నద్దేవుం డిట్లనియె.** **17**

ప్రతిపదార్థం: అని+ఇట్లు = అంటూ ఈ ప్రకారంగా; ఆశ్రమ ధర్మంబులు = చతురాశ్రమాలకు సంబంధించిన ధర్మాలు; చెప్పినన్ = శంకరుడు తెల్పగా; విని = ఆలకించి; ఆ+పరమేశ్వరుతోన్ = ఆ పరమ శివుడితో; పార్వతి = హిమవంతుడి కూతురైన ఉమాదేవి; తపంబు తపంబు+అనుచున్ = తపస్సు తపస్సుఅంటూ; మునిజనంబులు = మౌనులు; ఆచరింతురు = చేస్తారు; దానితెఱంగున్ = ఆ తపస్స్వరూపమును; ఎఱింగింపవు+ఏ = తెల్పుమా; అనినన్ = అని పార్వతి ప్రశ్నించగా; ఆ దేవుండు = భగవంతుడైన శంభుడు; ఇట్లు+అనియెన్ = ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ముందు పేర్కొన్న విధంగా ఆశ్రమ ధర్మాలను తెల్పగా విని పార్వతి శివుడితో 'తపస్సు తపస్సు అంటూ ఆసక్తితో మునీశ్వరులు తపస్సు చేస్తారు. దాని స్వరూప మెట్లాంటిదో ఎరిగింపు మని వేడగా అత డిట్లా అన్నాడు.'

శివుండు పార్వతికిఁ దపస్స్వరూపంబు చెప్పుట. (సం.13-580-15 (అను.1)).

సీ. **భోగార్థులై తపంబునకుఁ జొత్తురు; తపం । బనఁగ వానప్రస్థు లాచరించు**
ధర్మంబు; లింద్రియ కర్మ నిగ్రహముతో । నుభయకాలములను యోగసేవ
ఫలకాంక్షఁ జేత తపస్స్వరూపంబుగా । నడపి కాలం బైన నాకమునకు
నరిగి తద్భోగంబు లనుభవింతురు; పుణ్య । మవసిత మగుడు మర్త్యత్వ మొంద

తే. **వత్తు; రధికనియతి నుపవాసములను । జపముఁ బంచాగ్ని మధ్య వాసంబు గలుగు**
తపముఁ గల దప్పరః ప్రియత్వం బొనర్చుఁ । గర్త కది; వాఁడుఁ దుది వచ్చుఁగాని మరలి.' **18**

ప్రతిపదార్థం: భోగ+అర్థులు+ఐ = సుఖాలు అనుభవించవలెనన్న కోరిక గలవారై; తపంబునకున్+చొత్తురు = తపస్సు చేయటానికి పూనుకొంటారు; తపంబు+అనఁగన్ = తపస్సంటే; వానప్రస్థులు = వాన ప్రస్థమనే ఆశ్రమంలో ఉన్నవారు;

ఆచరించుధర్మంబులు = చేసేటటువంటి పుణ్యాలు; ఇంద్రియ కర్మ నిగ్రహముతోన్ = ఇంద్రియాలయొక్క వ్యాపారాలు అరికట్టుతూ; ఉభయ కాలములను = రెండు వేళలలో అనగా ఉదయసాయంకాలాలలో; యోగసేవ = యోగాభ్యాసం; ఫలకాంక్షన్+చేత = ప్రయోజనాపేక్షతో చేయటం; తపస్+స్వరూపంబుగాన్+నడపి = తపశ్చర్యగా కొనసాగించి; కాలంబు+ఐనన్ = కాలం కాగానే అనగా మరణం సంప్రాప్తించగా; నాకమునకున్ = స్వర్గలోకానికి; అరిగి = వెళ్ళి; తద్+భోగంబులు = ఆ స్వర్గలోకసౌఖ్యాలు; అనుభవింతురు = భుజిస్తారు; పుణ్యము = తాము చేసిన పుణ్యం; అవసితము+అగుడున్ = ముగియగానే; మర్త్యత్వము+ ఒందన్ = మానవులై జన్మించటానికి; వత్తురు = దివినుండి భువికి దిగి వస్తారు; అధిక నియతిన్ = మిక్కిలి నియమంతో; ఉపవాసములను = పస్తులుండటం; జపమున్ = మంత్రములను జపించటం; పంచ+అగ్ని మధ్యవాసంబున్ = ఐదగ్నుల నడుమ ఉండటం; కలుగుతపమున్ = కలిగినట్టి కఠోరతపస్సు; కలదు = ఉన్నది; అది = ఆ ఘోరతపస్సు; కర్తకున్ = చేసేవాడికి; అప్సరః ప్రియత్వంబు+ఒనర్చున్ = అప్సరసలకు (దేవతాస్త్రీలకు) వల్లభు డయ్యేటట్లు చేస్తుంది; వాఁడు = ఆ తపశ్శాలి; తుదిన్=చివరకు; మరలి వచ్చున్+కాని = తిరిగి భూతలానికి రాగలడే కాని స్వర్గంలో స్థిరంగా ఉండడు.

తాత్పర్యం: భోగాలను వాంఛించి తపస్సు చేయడానికి పూనుకొంటూ ఉంటారు. వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు చేసే పుణ్యకర్మలే సుమా తపస్సు. ఇంద్రియ వ్యాపారాలను మాని ప్రాతస్సాయంకాలాలలో ఫలాపేక్షతో యోగాభ్యాసాన్ని తపస్సు మాదిరిగా నడిపి ఆయుస్సు చెల్లగా స్వర్గానికి పోయి అక్కడి సుఖాలు అనుభవిస్తారు. ఆర్జించిన పుణ్యం కాస్తా ముగియగానే మర్త్య లోకానికి తిరిగివస్తారే తప్ప అక్కడ శాశ్వతంగా ఉండరు. మిక్కిలి నియమంతో నిరాహారులై మంత్రజపంచేయటం, ఐదగ్నులమధ్య వేసవిలో ఉండటంవంటి ఘోరతపస్సులు కూడ ఉన్నాయి. అట్లాంటి తపస్సు కర్తకు దేవతాంగనలతో సంయోగం సమకూరుస్తుంది. అయినప్పటికి వాడు తపస్సుచేత ఆర్జించిన పుణ్యం కాస్తా ఫలభోగంతో నశించగానే తిరిగి భూలోనికి వస్తాడు.'

విశేషం: ఈ విషయాన్ని భగవద్గీత ఇట్లా చాటింది.

"త్రైవిద్యా మాం సోమపాః పూత పాపా
యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే,
తే పుణ్య మాసాద్య సురేంద్ర లోకం
అశ్నన్తి దివ్యాన్ దివి దేవభోగాన్." (భగ. 9-20)

"తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి,
ఏవం త్రయీధర్మ మను ప్రపన్నా
గతాగతం కామ కామా లభంతే." (భగ. 9-21)

కేవలం కర్మనిష్ఠాపరులు ఇంద్రాది దేవతలను ఉద్దేశించి యజ్ఞయాగాలు సల్పి స్వర్గం చేరి అక్కడ ఇంద్రభోగాలు అనుభవిస్తారు. స్వర్గాది ఫలాలు అపేక్షించి కర్మలు చేసేవారు వాటిని అక్కడ అనుభవించి తమ పుణ్యం క్షీణించగానే భూలోకానికి తిరిగి వస్తారు. పంచాగ్నులు - నాల్గువైపుల గనగన మండే అగ్గిగుండాలు, నడినెత్తిన ప్రచండ సూర్యుడు - ఈమధ్య నిలిచి వేసవిలో సాగించే కాయక్లేశ యుతమైన కఠోర తపస్సు శీఘ్ర ఫలసిద్ధికి కారణం. శివుడిని గూర్చి పార్వతి సాగించిన తపస్సు ఇట్లాంటిదే.

వ. అని చెప్పి మఱియు, **19**

తాత్పర్యం: ఈ విధంగా పార్వతికి తెలిపి మరలా పరమేశ్వరు డిట్లా అన్నాడు.

ఉ. 'దారయుతంబుగా నడచు తాపసముఖ్యు లహింస పేర్మికై
కారుణికత్వ మగ్గలము గల్గి తలంతురు సర్వజీవులుం
దారును నొక్కరూపుగఁ బదంపడి పుత్ర కళత్రయుక్తిఁ బెం
పారుదు రూర్ధ్వలోకమున నజ్జనమున్ మఱివచ్చుఁ గ్రమ్మఱన్.' 20

ప్రతిపదార్థం: దారయుతంబుగన్ = ధర్మపత్నితోపాటు; నడచు = తపశ్చర్యతో మెలగే; తాపసముఖ్యులు = మునులలో శ్రేష్ఠులు; అహింస పేర్మికై = అహింసయొక్క గొప్పతనముకై; కారుణికత్వము = దయాస్వభావం; అగ్గలము+కల్గి = మిక్కిలి కలిగి; సర్వజీవులున్ = సమస్త ప్రాణులున్నూ; తారును = తామున్నూ; ఒక్కరూపుగన్ = ఒకేవిధమని; తలంతురు = భావిస్తారు; పదంపడి = పిదప; పుత్రకళత్రయుక్తిన్ = కొడుకులతో, భార్యలతో కూడి; ఊర్ధ్వలోకమునన్ = పై లోకంలో-స్వర్గంలో; పెంపారుదురు = ఒప్పుతుంటారు; మఱి = పిదప; ఆ+జనమున్ = అట్టివారు కూడ, క్రమ్మఱన్ = తిరిగి; వచ్చున్ = భూలోకానికి పునర్జన్మమెత్తడానికి వస్తారు.

తాత్పర్యం: 'భార్యలతో మెలగే మునివర్యులు అహింసావ్రతం యొక్క గొప్పతనం గుర్తెరిగి మిక్కిలి దయాగుణం కలవారై, సమస్తప్రాణులు తమవంటివే యని భావిస్తారు. ఆయుష్కాలం తీరిన పిమ్మట వారు ఆలుబిడ్డలతో కూడి పుణ్యలోకాలకు వెళ్ళి అక్కడ పుణ్యఫలాలైన సౌఖ్యాలు అనుభవిస్తారు. తమ పుణ్యం క్షీణించగానే వారు అక్కడినుండి మరలి భూలోకానికి వచ్చి మనుష్యులుగా పుట్టుతారు.'

వ. అనిన భవాని 'వనవాసవ్రతవిశేషంబులుం, దదీయఫల ప్రకారంబులు నేర్పడ నానతీయవే' యనుటయు నభవుండు భరితాదరుండై. 21

ప్రతిపదార్థం: అనినన్ = అని శివుడు పల్కగా; భవాని = పార్వతి; వనవాస వ్రతవిశేషంబులున్ = వనవాస నియమాలలోని ఘనతలనూ; తదీయఫల ప్రకారంబులు = ఆ వనవాస వ్రత ఫలముల యొక్క విధములనూ; ఏర్పడన్ = స్పష్టంగా; ఆనతీయవు+ఏ = సెలవిమ్మా; అనుటయున్ = అని అడుగగా; అభవుండు = పరమేశ్వరుడు; భరిత+ఆదరుండు+ఐ = నిండిన ఆదరంకలవాడై - భార్య పట్ల మిక్కిలి మన్నన కలవాడై (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అని సాంబశివుడు పల్కగా ఉమాదేవి 'వనవాస వ్రతాచరణలోని ఘనతనూ, ఆ వ్రత ఫలాలనూ సెలవియ్యం' డని ప్రార్థించగా పరమేశ్వరుడు పత్నియందలి పరమాదరంతో ఇట్లా అన్నాడు.

సీ. 'ఉపవాసములు మౌన మూర్వీశయత్వ మా । సన మూర్ధ్వ బాహుక స్థాపనంబు
నియమితా హారత్వ నిష్ఠ క్రమంబున । శశి మరుద్యక్ష వాసముల నిలుపు
గంధర్వ దేవ నాగస్థానముల నున్కి । యును బహుసౌఖ్య సంయుతము గాఁగ
నానా సహస్రాబ్ద మాననీయంబుగఁ । గావించు సంక్షేపగణనఁ గొన్ని

తే. మహితనియతులు సెప్పితి; మఱియు నేమి । వ్రతము సల్పినఁ బాప నిర్హరణ మగుటఁ
బుణ్యగతికల్మి దప్ప దరణ్యవాసి; కడుగు మింకను వలసిన యట్టి' వనుడు. 22

ప్రతిపదార్థం: ఉపవాసములు = నిరాహారములు; మౌనము = మాట్లాడకుండటం, వాఙ్నియమం; ఉర్వీశయత్వము = నేలమీద పరుండటం; ఆసనము = యోగాసనాలలో కూర్చోవటం; ఊర్ధ్వబాహుక స్థాపనంబున్ = క్రిందికి దించకుండా చేతులు పైకెత్తి పట్టటం; నియమిత+ఆహారత్వ నిష్ఠ = నిర్ణయించిన వేళలోనే ఆహారం స్వీకరించే నియమం; క్రమంబునన్ = వరుసగా (వానప్రస్థుడిని), శశి, మరుత్, యక్ష వాసములన్ నిలుపున్ = చంద్రుడు, వాయువు, యక్షులు అనువారి లోకాలలో చేరుస్తుంది; గంధర్వ దేవ నాగస్థానములన్ = గంధర్వలోకం, దేవలోకం, పాతాళలోకం అనే లోకాలలో; బహుసౌఖ్యసంయుతము+కాఁగన్ = అనేక సుఖాలతో కూడునట్లు; నానా సహస్ర+అబ్ద+మాననీయంబుగన్ = పెక్కువేల సంవత్సరాలు ఆదరించబడేటట్లుగా; ఉన్కియును కావించున్ = ఉండునట్లు చేస్తుంది; సంక్షేపగణనన్ = క్లుప్తంగా లెక్కించి; కొన్ని మహిత నియతులు = గొప్పవైన కొన్ని వ్రతనియమాలు; చెప్పితిన్ = నీకు తెల్పినాను; మఱియున్ = ఇంకను; ఏమివ్రతము సల్పినన్ = ఎట్టి వ్రతం ఆచరించినా; పాపనిర్హరణము+అగుటన్ = పాపం నశించటం చేత; పుణ్యగతి కల్మి = పుణ్యస్థితి సమకూడటం; అరణ్యావాసికిన్ = వనంలో నివసించేవాడికి, వానప్రస్థుడికి; తప్పదు = కలుగక మానదు; ఇంకను= మరియును; వలసిన+అట్టివి = నీకు కావలసిన విషయాలు; అడుగుము = నన్ను ప్రశ్నించుము; అనుడున్ = అని శంభుడు వచించగా. (పార్వతి అడిగిందని తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ఉపవాసాలు సల్పటం, మాట్లాడకుండా ఉండటం, నేల మీద పండుకొనటం, యోగాసనాలలో ఉండటం, చేతులు మీది కెత్తి పట్టటం, నియమిత వేళలలో ఆహారం మితంగా స్వీకరించటం అనే నియమాలకు ఫలంగా వరుసగా చంద్ర, వాయు, యక్ష, గంధర్వ, నాగ లోక నివాసాలు సంప్రాప్తిస్తాయి, ఆయా లోకాలలో అనేక సంవత్సరాలు బహువిధ సౌఖ్యాలు అనుభవించే భాగ్యం వానప్రస్థుడికి కలుగుతుంది. ఈ రీతిగా సంగ్రహంగా నీకు కొన్ని వ్రతానుష్ఠాన ఫలాలు తెలిపాను. ఎట్టి వ్రతాలు అనుష్ఠించినా వానప్రస్థుడికి పాపాలు తొలగి పుణ్యగతులు లభించడం తప్పదు. గిరిజా! ఇంకా నీవు అడుగ దలచిన విషయాలుంటే అడుగు'మంటూ పరమేశ్వరుడు పలికాడు.

క. 'యాయావరుల నమరవం । ద్యా! యేర్పడఁ జెప్పు మనియె నంబిక; దేవుం
డాయమ కిట్లనుఁ' దీర్థప । రాయణు లుపవాసవిధి సమధికులు వారల్. 23

ప్రతిపదార్థం: అంబిక = గౌరీదేవి; అమరవంద్యా! = దేవతలచే కొనియాడబడువాడా!; యాయావరులన్ = ఇల్లిల్లు తిరిగి, పొలాలలో సంచరించి ధాన్యం గడించి బ్రదికే విరాగులను గూర్చి; ఏర్పడన్ = స్పష్టంగా; చెప్పుము+అనియెన్ = తెల్పుమని ప్రశ్నించింది; దేవుండు = భగవంతుడైన శివుడు; ఆ+అమకున్ = ఆ తల్లికి, ఉమకు; ఇట్లు+అనున్ = ఈ విధంగా చెప్పాడు; వారల్ = యాయావరులు; తీర్థ పరాయణులు = తీర్థయాత్రలందు శ్రద్ధకలవారు; ఉపవాసవిధిసమధికులు = ఉపవాసా లుండటంలో కడు దొడ్డవారు.

తాత్పర్యం: గౌరీదేవి పరమేశ్వరుడిని చూచి 'దేవతలచే నమస్కరింపబడు ప్రాణేశ్వరా! ఇల్లిల్లుతిరిగి, చేలలో సంచరించి గడించిన ధాన్యంతో జీవించే విరాగులను గూర్చి తేటతెల్లంగా తెల్పండి' అని అడిగింది. అందుకు తేజస్స్వరూపుడైన ఈశానుడు 'హైమవతీ! నీ వడిగిన యాయావరులు దేశద్రిమ్మరులు. తీర్థయాత్రలు సల్పటంలో మిక్కిలి శ్రద్ధాసక్తులు కలవారు. ఉపవాస నియమాలలో కడు గొప్పవారు.

వ. అది యెట్లంటేని. 24

తాత్పర్యం: అ దెట్లంటావా? అయితే వినుము.

**క. నానాతీర్థ సతత సు। స్నానంబులఁ బల్లలైన జడలును భిక్షా
నూనోపవాస కృశమగు। మేనులునై వారితపము మిక్కిలి మెఱయున్. 25**

ప్రతిపదార్థం: నానాతీర్థ = అనేక పుణ్యతీర్థాలలో; సతత = ఎడతెగని; సుస్నానంబులన్ = పవిత్ర స్నానాల చేత; పల్లలు+ఐన = ఎరుపు మించిన తెలుపురంగు గల; జడలును = తైల సంస్కారం లేక మెలివడిన తల వెంట్రుకలునూ; భిక్షా = భిక్షాన్నం వలననూ; అనూన = అధికములైన; ఉపవాస = పస్తులుండటం చేతను; కృశము+అగు = శుష్కించిన; మేనులున్+ఐ = శరీరాలు గలిగినదై; వారితపము = యాయావరుల యొక్క తపస్సు; మిక్కిలి మెఱయున్ = ఎక్కువగా ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: యాయావరులు అనేక పుణ్యతీర్థాలలో నిరంతరం పవిత్ర స్నానాలు చేస్తూ ఉంటారు. అందువలన వారి తల వెంట్రుకలు జడలు గట్టి ఎరుపుమించిన తెలుపు రంగు కలిగి ఉంటాయి. భిక్షాన్నం తినటం వలననూ, మితిలేని ఉపవాసాలు చేయడం వల్లనూ వారి దేహాలు బక్కచిక్కి ఉంటాయి. కాని' వారి తపస్సు వెలుగులు విరజిమ్ముతూ ఉంటుంది.

**క. మాసోపవాస విధులం। జేసి తృణజ ధాన్యభుక్తి సెల్లింతురు వా
రేసురలకు లేని సుఖా। వాసమ్ములఁ జరితములను వఱలుదురు తుదిన్.' 26**

ప్రతిపదార్థం: మాస+ఉపవాస విధులన్+చేసి = నెలనెలా ఉపవాసం సల్పే నియమాలచేత; తృణధాన్యభుక్తి+చెల్లింతురు = నివ్వరివడ్ల బియ్యపన్నం భుజిస్తారు; ఏ సురలకున్+లేని = ఎట్టి దేవతలకూ లేనట్టి; సుఖ+ఆవాసమ్ములన్ = సౌఖ్యస్థానాలలో; చరితములన్ = సంచారముల చేత; తుదిన్ = కడపట; వఱలుదురు = వెలిగెదరు.

తాత్పర్యం: ఒక్కొక్క నెల రోజులపాటు ఉపవాసాలుండి ఆ పుణ్యపురుషులు నివ్వరివడ్ల దంపుడు బియ్యపన్నం భుజించి జీవితం సాగిస్తారు. కడపట ఏ దేవతలకు లభించని సుఖస్థానాలలో నడయాడుతూ వారు ప్రకాశిస్తారు.'

వ. అనిన విని యవ్వనితారత్నంబు 'వైఖానసుల విధంబు వివరింపు' మనుటయు న వ్విరూపాక్షుండు. 27

ప్రతిపదార్థం: అనినన్ = అని పరమేశ్వరుడు చెప్పగా; విని = ఆలకించి; ఆ+వనితా రత్నంబు = స్త్రీలలో శ్రేష్ఠురాలైన ఆ దుర్గాదేవి; వైఖానసుల విధంబున్ = వైఖానసులు అనే వారి యొక్క వైనం; వివరింపుము = తెలుపుము; అనుటయున్ = అని అడుగగా; ఆ+విరూప+అక్షుండు = త్రినేత్రుడైన ఆ శంకరుడు (ఇట్లా అనియెన్ - అని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: పరమేశ్వరుడు పలుకగా విని మహిళామణి అయిన పరమేశ్వరి 'నాథా! వైఖానసు లనగా ఎట్లాంటివారు? వారి స్వరూప మేమిటో చెప్పు'మని అడుగగా శివుడు.

**సీ. 'వైఖానసులు ఖరవ్రతు; లెట్టులంటేని। శిలఁ దృణధాన్యముల్ చిదుక నడచి
కొందఱు పండులఁ గొఱికి కొందఱు గన్న। గుఱుముల గువ్వల తెఱఁగు దోఁప
నప్పటి కప్పటి కాననంబున వైచి। కొని కొంద ఱాకు లెండినవి యేఱి
కొని కొంద ఱంబువుల్ గొని కొంద ఱనిలంబు। గొంద ఱాహారంబు గొందు; రట్లుఁ**

తే. **గాక యాహారపరులును గలరు; వార । లింద్రునకుఁ బూజనీయులై యెక్కుడైన**
పదవిఁ జిరకాల బహుసౌఖ్యభాగు లగుదు' । రని మహేశ్వరుఁ డుమకు నిట్లనియె మఱియు. **28**

ప్రతిపదార్థం: వైఖానసులు = వైఖానసు లనేవారు; ఖర వ్రతులు = కఠిన నియమాలు కలవారు; ఎట్టులు+అంటేని = ఎట్లనగా; శిలన్ = రాతిమీద; తృణ ధాన్యముల్ = నివ్వరివడ్లు మొదలైన గడ్డి ధాన్యాలను; చిదుకన్+అడచి = పొట్టురాలేటట్లు కొట్టి; కొందఱు = కొంతమంది; పండులన్ = దంతములతో; కొఱికి = పదార్థాలను నమిలి; కొందఱు = మరికొంతమంది; కన్నగుఱుములన్ = కనిపించిన గింజలను; గువ్వల తెఱఁగు+తోఁపన్ = పక్షులతీరు గోచరించగా; అప్పటికిన్+అప్పటికిన్ = ఆవేళ కావేళకు; ఆననంబునన్ వైచికొని = నోటిలో వేసికొని; కొందఱు = వేఱొక కొందరు; ఎండినవి ఆకులు = ఎండి నేల రాలిన ఆకులను; ఏఱికొని కొందఱు = ఎత్తుకొని కొందరు; అంబువుల్ = నీళ్ళు; కొని = గ్రహించి, త్రాగి; కొందఱు = కొంతమంది; అనిలంబున్ = గాలిని (పీల్చుకొని); కొందఱు = కొంతమంది; ఆహారంబు కొందురు= భుజిస్తారు; అట్లున్+కాక = ఆ మాదిరిగా కాక అనగా పవన పర్ణాంబు భక్షులే కాకుండా; ఆహార పరులును = అన్నం ఆరగించేవారు కూడ; కలరు = ఉన్నారు; వారలు = ఆ మహనీయులు; ఇంద్రునకున్ = దేవతా వల్లభుడికి; పూజనీయులు+ఐ = పూజించదగిన వారై; ఎక్కుడు+ఐన+పదవిన్ = ఉన్నతమైన స్థానంలో; చిరకాల = దీర్ఘ కాలం; బహుసౌఖ్యభాగులు+అగుదురు+అని = పెక్కు సుఖాలు అనుభవిస్తారని చెప్పి; మహేశ్వరుఁడు = పరమ శివుడు; ఉమకున్ = పార్వతికి; మఱియున్ = ఇంకనూ; ఇట్లు+అనియెన్ = ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: వైఖానసు లనేవారు కఠోరనియమాలు కలవారు. వారిలో కొందరు నివ్వరివడ్లు మొదలైన తృణధాన్యాలను తెచ్చి రాతిమీద నలగగొట్టి లేదా రోటిలో వేసి దంచుకొని తింటారు. కొందరు పండ్లు మొదలైన వాటిని పళ్ళతో కొరికి తింటారు. కొందరు కంటికి కనిపించిన గింజలను పక్షులమాదిరిగా అప్పటికప్పుడు నోటిలో వేసికొంటారు. కొందరు ఎండుటాకులను ఏరుకొని తింటారు. కొందరు నీళ్ళు త్రాగి బ్రతుకుతారు. గాలిని మాత్రమే పీల్చి కొందరు జీవిస్తారు. ఆహారం భుజించేవారు కూడ కొంద రున్నారు. వీరందరూ దేవేంద్రుడికి కూడా పూజించదగిన వారై చాలకాలం పలురకాల సౌఖ్యాలు అనుభవిస్తూ ఉన్నతపదవులలో విరాజిల్లుతుంటారు' అని మహాదేవుడు మహేశ్వరికి చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

వ. **'ఇవి యెల్లను వానప్రస్థ నియమ నిష్ఠా భేదంబులు; తపంబు తపంబని మును లాచరింతురు దాని తెఱం గెఱింగింపు మని నీవు తొల్త నడిగిన విధంబునం దొడంగి నా చెప్పిన విధంబు లన్నియుం దపంబను శబ్దంబున కర్థంబులైయుండు'నని చెప్పి 'యంగుష్ఠ ప్రమాణదేహులు మృగాజిన వసనులు నిర్ద్వంద్వులు నై వాలఖిల్యు లను పేరం బ్రసిద్ధులగు మునులు దినకర దీప్తులతోడం గూడి వర్తించుచుండుదురు; వారల తపో వైభవంబునం గాదె జగంబులు సుస్థిరంబులై యున్నయవి; యొండుమెయి దుర్లభంబు లైనట్టివి తపంబున సులభంబులగుం; దపంబు గడచిన ధర్మంబుగలదే?'యని పలికి యాదరాతిశయంబున శివుండు శైలేంద్రతనయతో 'ధర్మంబులు మఱియు నెఱింగించెద; నవహితవై యాకర్ణింపు'మని యిట్లనియె.** **29**

ప్రతిపదార్థం: ఇవి+ఎల్లను = ఈ చెప్పినవన్ని; వానప్రస్థ నియమనిష్ఠా భేదంబులు = వానప్రస్థాశ్రమాలలో ఉన్నవారియొక్క వ్రత నిష్ఠలలోని తేడాలు; తపంబు తపంబు+అని = తపస్సు తపస్సు అంటూ; మునులు; ఆచరింతురు = చేస్తారు; దాని తెఱంగు = ఆ తపోవిధానం ఎఱింగింపుము; అని; నీవు; తొల్తన్ = మొదట; అడిగిన విధంబునన్ = ప్రశ్నించిన ప్రకారం;

తొడంగి = పూనుకొని; నా చెప్పిన = నేను వచించిన; విధంబులు+అన్నియున్; తపంబు+అను = తపస్సు అనేటటువంటి; శబ్దంబు నకున్ = మాటకు; అర్థంబులు+ఐ+ఉండున్; అని చెప్పి = అని శివుడు వచించి; అంగుష్ఠ ప్రమాణ దేహులు = బొటన వ్రేలెడు పొడవున్న శరీరం కలవారు; మృగ+అజినవసనులు = జింకతోళ్ళు వస్త్రములుగా కలవారు, అనగా జింక చర్మాలు ధరించేవారు; నిర్ద్వంద్వులున్+ఐ = సుఖ దుఃఖములు అనే జంటలకు లోబడనివారై; వాలఖిల్యులు+అను పేరన్ = వాలఖిల్యులు అనే నామంతో; ప్రసిద్ధులు+అగు మునులు = ప్రఖ్యాతులైన మౌనులు; దినకర దీప్తుల తోడన్ కూడి = సూర్యకిరణ తేజంతో కూడినవారై; వర్తించుచున్+ఉండుదురు = లోకంలో మెలగుతుంటారు; వారల తపః+వైభవంబునన్+కాదు+ఎ = ఆ వాలఖిల్యుల తపస్సు యొక్క మహిమవలననేకదా; జగంబులు = లోకాలు; సుస్థిరంబులు+ఐ = గట్టి నిలుకడ గలవై; ఉన్న+అవి = ఉన్నాయి; ఒండు మెయిన్ = మరొక మార్గంలో; దుర్లభంబులు+ఐన+అట్టివి = పొందుటకు శక్యంకానివి; తపంబునన్; సులభంబులు+అగున్ = సులువుగా పొంద తగినవి అవుతాయి; తపంబుక+డచిన = తపస్సునకు మించిన; ధర్మంబు; కలదు+ఏ? = ఉన్నదా? (లేదని తాత్పర్యం); అని పలికి = అంటూ ఈశ్వరుడు వచించి; ఆదర+అతిశయంబునన్ = మిక్కిలి మన్ననతో; శివుండు; శైల+ఇంద్ర తనయతోన్= పర్వతరాజ పుత్రికతో; ధర్మంబులు; మఱియున్ = ఇంకనూ; ఎఱింగించెదన్; అవహితవు+ఐ= సావధానచిత్తవై; ఆకర్ణింపుము = వినుము; అని, ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'దేవీ! నే నింతవరకు చెప్పిన వన్నీ వానప్రస్థాశ్రమ నియమాలలోని విశేషాలు. తపస్సు తపస్సు అంటూ మునీశ్వరులు ఆసక్తితో ఆచరిస్తారే ఆ తప స్స్వరూప మెట్లాంటిదో వ్యాఖ్యానించు మని మునుపు నీ వడిగావు. కనుక నేను చెప్పినవన్నీ తపస్సు క్రిందికే వస్తాయి. మరి బొటనవ్రేలంత శరీరాలు గలిగిన వాలఖిల్యులనే మునీశ్వరు లున్నారు. వారు మిక్కిలి ప్రసిద్ధులు. జింక చర్మాలు వస్త్రాలుగా ధరిస్తారు. సుఖదుఃఖాదులైన ద్వంద్వాలకు వారు అతీతులు. సూర్య కిరణ కాంతులతో కూడి సన్మార్గము నాశ్రయించి ప్రవర్తిస్తుంటారు. వారి తపోమహిమ వలన లోకాలు నిశ్చలంగా నిలిచి ఉన్నాయి. ఇతర సాధనాలతో సమకూడని ప్రయోజనాలు తపస్సాధన వలన తేలికగా సిద్ధిస్తాయి. తపస్సును మించిన ధర్మం మరొకటి లే'దని తెల్పి పరమాదరంతో పరమేశ్వరుడు పార్వతితో, 'తరుణీ! మరి కొన్ని ధర్మాలు తెల్పుతాను సావధానచిత్తవై విను'మని ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రీమన్నారాయణ స్వరూపుడైన సూర్యభగవానుడు చైత్రం మొదలు ఫాల్గున మాస పర్యంతం ఒక్కో నెలలో ఒక్కో పేరుతో ఆర్గురు అనుచరులతో కూడిన వాడై తనను ఉపాసించే వారి పాపాలు పోకారుస్తాడు. తనకు అభిముఖంగా అరవైవేలమంది వాలఖిల్య మహర్షులు స్తుతిస్తూ అరుగుతుండగా సంచరిస్తాడని భాగవతపురాణం చెప్తుతోంది. వాలఖిల్యులు వియన్మార్గంలో సూర్యకిరణాలతోపాటు సాగిపోతూ సంచరిస్తారని భావం.

ఉ. అంబుజసూతి యేర్పడ గృహస్థ సమర్థముగాఁ బ్రవృత్తి ధ
ర్మంబు నొనర్చె; నార్యజన మాన్యము దాని తెఱంగు చాల సూ
క్ష్మం; బతి కాంక్షలేక తగుకాలమునన్ సమచిత్తవృత్తి ని
త్యంబును ధర్మముఖ్యముగ నర్థముఁ గామముఁ జల్పు టొప్పగున్. 30

ప్రతిపదార్థం: అంబుజసూతి = పద్మమునుండి పుట్టిన బ్రహ్మదేవుడు; ఏర్పడన్ = స్పష్టంగా; గృహస్థ సమర్థముగాన్ = గృహస్థుడికి తగినట్లుగా; ప్రవృత్తి ధర్మంబున్ = ఐహిక ఫలసాధనమైన ప్రవృత్తి రూపవైదిక ధర్మాన్ని; ఒనర్చెన్ = చేశాడు; దానితెఱంగు = ఆ ప్రవృత్తి ధర్మం యొక్క స్వరూపం; ఆర్యజనమాన్యము = పెద్దలచేత ఆదరించబడింది; చాల సూక్ష్మంబు

= ఆ ధర్మం దురవ గాహం, అగోచరం, మిక్కిలి సున్నితం; అతి కాంక్షలేక = మిక్కిలి ఆశలేక; సముచిత వృత్తిన్ = సరి అయిన మనో వర్తనతో; తగుకాలమునన్ = తగిన సమయంలో; నిత్యంబును = ప్రతిదినం; ధర్మ ముఖ్యముగన్ = ధర్మమే ప్రధానంగా, ధర్మానికి విరుద్ధం గాకుండా; అర్థమున్ = అర్థ పురుషార్థాన్ని, ద్రవ్యాన్ని; కామమున్ = కామ పురుషార్థాన్ని, సుఖానుభవాన్ని; చల్పుట = సాధించుట; ఒప్పు+అగున్ = తగును.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు గృహస్థుడికి తగినట్లు ప్రవృత్తి ధర్మాన్ని కల్పించాడు. అది పెద్దలందరిచేత ఆదరించబడింది. ఆ ప్రవృత్తి ధర్మం మిక్కిలి సూక్ష్మ మైనది. పేరాసలేక సమచిత్తంతో యుక్తకాలంలో ధర్మమే ప్రధానంగా భావించి ద్రవ్యార్జన చేయాలి. ఆర్జించిన ధనంతో ధర్మానికి అవిరుద్ధంగా భోగాలు అనుభవించాలి - అనగా కోరికలు తీర్చుకొనాలి. ఇట్లా అర్థకామపురుషార్థాలు గృహస్థు సాధించటం సమంజసం.

చ. అతఁడు నివృత్తి ధర్మము ప్రయత్నమునన్ వివరించె మోక్షణో
ద్యత మది తత్ప్రకారములు దాంతియు భూతచయంబుపై దయా
రతియును సత్యదృష్టియు విరాగత యింద్రియకోటికిన్ దృఢ
స్థితముగఁ జేసి యోగనిరతిం బరిశాంతి యొనర్చికొంటయున్. 31

ప్రతిపదార్థం: అతఁడు = సృష్టికర్త అయిన బ్రహ్మ; నివృత్తి ధర్మము = మోక్షఫల సాధనమైన నివృత్తిరూప ధర్మాన్ని; ప్రయత్నమునన్ = పూనికతో; వివరించెన్ = వెల్లడించాడు; అది = ఆ నివృత్తి ధర్మం; మోక్షణ+ఉద్యతము = ముక్తి కొరకైన యత్నం; దాంతియున్ = బహిరింద్రియ నిగ్రహం; భూతచయంబు పైన్ = ప్రాణుల సమూహం మీద; దయారతియున్ = దయాగుణంలో పరమ ప్రీతియూ; సత్య దృష్టియున్ = సత్యమునందు చూపు; విరాగత = ఆత్మేతరములందు విరక్తి; దృఢస్థితముగన్+చేసి = ఏమాత్రం చలించకుండేటట్లు చేసి-గట్టి నిలుకడ కలిగించి; యోగనిరతిన్ = యోగమందు ఆసక్తిచేత; ఇంద్రియ కోటికిన్ = ఇంద్రియముల సమూహానికి; పరిశాంతి+ఒనర్చి కొంటయున్ = సంపూర్ణమైన ఉపశమనం కలిగించు కొనటం; తత్ప్రకారములు = ఆ నివృత్తి ధర్మస్వరూపాలు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు నివృత్తి ధర్మాన్ని పూనికతో వివరించాడు. ఆ నివృత్తి ధర్మం ముక్తి ఫలసాధనం. వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే అయిదు కర్మేంద్రియాలను యోగ్య కర్మలలో ప్రవర్తింపజేయటం, జీవుల సముదాయంపై దయగలిగి ఉండటం, సత్యముపై దృష్టి ఉంచటం, ఆత్మకంటె ఇతరములైన వాటియందు విరక్తి, యోగకౌశలంవలన ఇంద్రియాలకు చలనం మాన్పి, గట్టి నిలుకడ కూర్చి వాటికి సంపూర్ణమైన శాంతి నొసంగటమే ఆ నివృత్తి ధర్మ ప్రకారమై ఉన్నది.

వ. అని మఱియును. 32

తాత్పర్యం: అని పలికి శంకరుడు మరల ఇట్లా అన్నాడు.

తే. 'క్షుత్పిపాసలచేఁ గడుఁ గుందినట్టి । యతిథి వచ్చినఁ బ్రియమున నతని దప్పి
వోవునట్లుగ సముచితభోజనంబు । వెట్టు టెల్ల పుణ్యములకుఁ బెద్ద తలఁప. 33

ప్రతిపదార్థం: క్షుత్ పిపాసలచేన్= ఆకలి దప్పులచేత; కడున్ = మిక్కిలి; కుందినట్టి = డస్సినటువంటి; అతిథి =

ఆగంతుకుడు; వచ్చినన్ = రాగా; ప్రియమునన్= ప్రేమతో; అతని డప్పి = అతని యొక్క శ్రమ; పోవునట్లుగన్ = తొలగేటట్లు; సముచిత భోజనంబు= మిక్కిలి తగిన భోజనం; పెట్టుట; ఎల్ల పుణ్యములకున్= అన్ని ధర్మాలలోనికి; తలం పన్= భావించగా; పెద్ద= దొడ్డది.

తాత్పర్యం: ఆకలి దప్పులతో నొచ్చి యింటికి వచ్చిన అతిథికి ఆదరంతో అన్నం పెట్టి అతడి బడలిక తీర్చడం పుణ్యాలన్నింటిలో గొప్ప పుణ్యం.

విశేషం: అతిథిః తిథులతో నిమిత్తం లేకుండ ఆకలి దప్పులు తీర్చుకొనటానికి వచ్చినవాడు, భోజన సమయానికి వచ్చినవాడు.

క. దీనికి నఖిలాశ్రమ సువి । ధానంబులకును గృహస్థతయ నెల వగుటన్
దాని పదాఅవ పాలి స । మానముగా దరయ నాశ్రమం బెయ్యదియున్.' 34

ప్రతిపదార్థం: దీనికిన్ = ఈ చెప్పిన అతిథి సుకృతానికి; అఖిల+ఆశ్రమ సువిధానంబులకున్ = బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమములనే నాలుగు ఆశ్రమాల యొక్క మంచి పద్ధతులకును; గృహస్థతయ = గార్హస్థ్య ధర్మమే; నెలవు+అగుటన్ = ఉనికిపట్టు కావటంచేత; ఆశ్రమంబు+ఎయ్యదియున్ (ఏ+అది = ఏయది, ఎయ్యది) = ఏ యాశ్రమం కూడ; అరయన్ = పరికించగా; దాని పది+ఆఅవపాలి= ఆ గృహస్థాశ్రమ ధర్మము యొక్క షోడశాంశమునకు కూడ; సమానము+కాదు= సాటిరాదు.

తాత్పర్యం: సఖీ! ఈ చెప్పిన అతిథి సత్కారానికీ, తక్కిన ఆశ్రమాల మనుగడకూ (ఉనికికీ) గృహస్థాశ్రమమే ఆధారం కనుక ఏ ఆశ్రమం కూడ దీని పదారవభాగానికి గూడ సమానం కాదు. అనగా చతురాశ్రమాలలో గృహస్థాశ్రమమే కడుదొడ్డదని భావం.'

క. అన విని 'గృహస్థునకు నే । పనిముఖ్యం?' బనియె గిరిజ; పశుపతి 'జననీ
జనకారాధన మతనికి । ననుపమ మగునట్టి ధర్మ' మని రూపించెన్. 35

ప్రతిపదార్థం: అనన్+విని = అని చెప్పగా ఆలించి; గిరిజ = పార్వతి; గృహస్థునకున్ = సంసారికి; ఏ పని ముఖ్యంబు+ అనియెన్ = ఏ కార్యం ప్రధానమని అడిగింది. (అందుకు); పశుపతి= శివుడు; అతనికిన్ = గృహస్థునకు; జననీజనక+ ఆరాధనము = తలి దండ్రులను పూజించటం; అనుపమము+అగునట్టి = పోలిక లేనట్టి; ధర్మము+అని = పుణ్య కార్యమని; రూపించెన్ = నిర్ణయించాడు.

తాత్పర్యం: పరమశివుడి పలుకులు విని పార్వతి 'ప్రాణేశ్వరా! గృహస్థుడికి ఏ పని ముఖ్యం?' అని ప్రశ్నించింది. 'అతడికి తలిదండ్రులపూజ ముఖ్యమైన' దని శివుడు బదులు పలికాడు.

వ. అ ద్దేవుండు వెండియు. 36

తాత్పర్యం: భగవంతుడైన శివు డింకా (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

క. 'పతి భక్తి ముఖ్య ధర్మము । సతి' కనవుడు, దేవి 'నరుఁడు జననీ జనకుల్
మృతు లైనను, నాతి విగత । పతిత్వ మొందినను జేయు పను లెయ్యవియో?' 37

ప్రతిపదార్థం: సతికిన్ = భార్యకు; పతి భక్తి = మగని యందు భక్తి; ముఖ్య ధర్మము = ప్రధానమైన ధర్మం; అనవుడున్ = అని శంభుడు చెప్పగా; దేవి = గౌరి; నరుఁడు = మనుష్యుడు; జననీ జనకుల్ = మాతా పితలు; మృతులు+ఐనన్ = చని పోయినను; నాతి = స్త్రీ; విగత పతిత్వము+ఒందినను = పెనిమిటిని కోల్పోయినను; చేయుపనులు = ఆచరించవలసిన కార్యాలు; ఏ+అవి+ఓ(ఎయ్యవియో)? = ఎట్టివో? (అని అడిగింది).

తాత్పర్యం: 'సతికి పతిసేవే ప్రధాన కర్తవ్య' మని పరమశివుడు పలుకగా భవాని 'నాథా! గృహస్థు తలిదండ్రులను, భార్య భర్తను కోల్పోయి నపుడు వారు చేయవలసిన పను లేమిటో సెలవిం' డని కోరింది.

వ. అనుటయు నభవుండు 'వారి వర్తనంబు లెఱింగించెద విను' మని యిట్లనియె. 38

ప్రతిపదార్థం: అనుటయున్ = అని కోరగా; అభవుండు = శంకరుడు; వారి వర్తనంబులు = వారు నిర్వహించవలసిన విధులు; ఎఱింగించెదన్; వినుము; అని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పార్వతి ప్రశ్న విని శంకరుడు, 'ఉమా! నీవు అడిగిన వారి కర్తవ్య కర్మ లేమిటో తెలుపుతాను విను' మని ఇట్లా అన్నాడు.

క. 'దేవాతిథి పితృ పూజలు । గావించుట భావశుద్ధి కలిమి నరునకున్
దేవీ! వలయును వారికి । నే విధమున బ్రహ్మచర్య మేమఱమి తగున్.' 39

ప్రతిపదార్థం: దేవ+అతిథి+పితృపూజలు = దేవతల యొక్క, అతిథుల యొక్క, పితృ దేవతలయొక్క పూజలు; కావించుట = చేయుట; నరునకున్ = మనుజుడికి; భావ శుద్ధి కలిమి = భావంలో నిర్మలత్వం ఉండడం; వలయును= కావాలి; దేవీ!= ప్రియురాలా!; ఏ విధమునన్ = ఏ రీతిగానైనా; వారికిన్ = పతివిహీనలకు, విధవరాండ్రకు; బ్రహ్మచర్యము = బ్రహ్మచర్యవ్రతపాలనం; ఏమఱమి = మఱవకుండటం; తగున్ = ఒప్పును.

తాత్పర్యం: 'ప్రియురాలా! దేవతల, పితృదేవతల, అతిథుల పూజలు సక్రమంగా నడపటం చిత్తశుద్ధి కల్గి ఉండటం నరులకు ముఖ్యం. బ్రహ్మచర్య వ్రతాన్ని ఏ విధంగానైనా ఏమరకుండటం విధవలకు యుక్తం.

వ. అని నిర్దేశించి మఱియును. 40

తాత్పర్యం: అని నిర్ణయపూర్వకంగా చెప్పి పరమేశ్వరుడు ఇంకా (ఇట్లా అన్నాడు అని తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'పంచపర్వ సురత పరిహృతితో నిజ । దార తృప్తుఁ డగుచు ధాన్యకోటి
పక్షి యెలుక దినిన బ్రతుకుఁగాఁ గను గృహ । పతికి నశ్వమేధ ఫలము గలుగు.' 41

ప్రతిపదార్థం: పంచపర్వ = అయిదు పర్వములందు అనగా అష్టమి, చతుర్దశి, పూర్ణిమ, అమావాస్య, సూర్యసంక్రాంతి దినములందు; సురత పరిహృతితోన్ = సంభోగం వర్జించటంతో పాటు; నిజదారతృప్తుఁడు+అగుచున్ = తన భార్యతో సంభోగించి సంతుష్టి చెందుతూ; ధాన్యకోటిన్ = తన యింటిలోని ధాన్య సమూహమును; పక్షి = పిట్ట; ఎలుక = మూషికం; తినినన్ = తింటే; బ్రతుకున్ +గాక = అవి తిని జీవించుగాక; అను = అని పల్కునట్టి; గృహపతికిన్ = ఇంటియజమానుడికి-గృహస్థుడికి; అశ్వమేధ ఫలము = అశ్వమేధ యాగం చేస్తే లభించే ఫలం; కలుగున్ = లభిస్తుంది.

తాత్పర్యం: 'నెలలో వచ్చే అష్టమి, చతుర్దశి, పున్నమ, అమావాస్య, రవి సంక్రాంతి తిథులందు సంగమం వదలి, కేవలం తన భార్య కలయికతోనే సంతృప్తి చెందుతూ, తన గృహంలోని ధాన్యరాశిని పక్షులు, ఎలుకలు తింటుంటే వాటిని హింసించకుండా, అవిగూడ తిని బ్రదుకు గాక అని భావించే గృహమేధి అశ్వమేధయాగం చేసినవారు పొందే ఫల మెంతటిదో, అంతటి ఫలాన్ని పొందుతాడు.'

విశేషం: పై పద్యంలోని మూడవ పాదం "పక్షి యెలుక దినిన బ్రతుకుఁగాఁగను గృహపతికి" అని ఉన్నప్పుడు ఆ పాఠానికి ధాన్యకోటిని పక్షులు, ఎలుకలు కేవలం జీవించడానికి మాత్రమే తిన్న చందంగా, కేవలం భోగకాంక్షతో గాకుండా బ్రతుకు వెళ్ళబుచ్చడానికే ఆహారం స్వీకరించే గేస్తు హయమేధయాగ ఫలాన్ని పొందుతాడని అర్థం చెప్పుకోవచ్చును.

వ. అని చెప్పి. 42

తాత్పర్యం: ఈ విధంగా పలికి.

ఆ. 'ఎచట మెలఁగె నేమి యెట్లుండె నేమి దా । నేమి సేసె నేమి యెల్ల సంగ
ములును విడిచి కుడుపు వలన నియతి గల్గు । యతికి మోక్షవీథి యాటపట్టు'. 43

ప్రతిపదార్థం: ఎచటన్ = ఎక్కడ; మెలఁగెన్+ఏమి = ఎట్లు ప్రవర్తించినా; ఎట్లు+ఉండెన్+ఏమి = ఎక్కడ నివసించినా; తాన్ = తాను; ఏమిచేసినన్+ఏమి = ఎట్టి పనులు చేసినా; ఎల్ల సంగములును విడిచి = సర్వ సంగపరిత్యాగ మొనర్చి; కుడుపు వలనన్ = ఆహార విషయంలో; నియతి+కల్గు = నియమమున్న; యతికిన్ = సన్యాసికి; మోక్షవీథి = ముక్తి పథం; ఆట పట్టు = క్రీడారంగం, విహార స్థలం, సులభసాధ్యం.

తాత్పర్యం: 'ఎక్కడ ఎట్లా ప్రవర్తించినా, ఎట్లా ఉన్నా, ఎట్టి పనులు చేసినా సర్వ సంగములనూ పరిత్యజించి, ఆహార విషయంలో నియమ మున్న యతీశ్వరుడికి ముక్తి కరతలామలకం.'

వ. అనిన విని సంప్రీతయై శైలరాజపుత్రి పురహరునితో 'రాజనువానికి భూజనంబుల యట్ల శరీరంబును భోజనాదులును నట్లయుండియు నతం డెల్లవారలచే మ్రొక్కు గొనుటకు, నిగ్రహానుగ్రహం బులకుం జాలి సర్వాధికత్వంబున శోభిల్లు దానికిం గారణం బేమి ? యెటింగింపవే' యనుటయు నీశానుం డిట్లనియె. 44

ప్రతిపదార్థం: అనినన్+విని = అని శంకరుడు చెప్పగా ఆలకించి; సంప్రీత+ఐ = సంతోషించినదై; శైలరాజపుత్రి = హిమవంతుడి కూతురైన సర్వమంగళ; పురహరునితోన్ = త్రిపుర ధ్వంసకుడైన రుద్రుడితో; రాజు+అనువానికిన్ = ప్రభువనే వాడికి; భూజనంబుల+అట్ల = పుడమిలోని జనుల వలెనే; శరీరంబును = దేహమూ; భోజన+ఆదులును = ఆహారం మొదలైనవి; అట్లు+అ+ఉండియున్ = భూమియందలి నరుల వలెనే ఉన్నప్పటికినీ; అతండు = రాజు; ఎల్లవారలచేన్ = మనుష్యులందరి చేత; మ్రొక్కు కొనుటకున్ = నమస్కారాలు స్వీకరించడానికినీ; నిగ్రహ+అనుగ్రహంబులకున్ = శిక్షించుటకునూ,

రక్షించుటకునూ; చాలి = సమర్థుడై; సర్వ+అధికత్వంబునన్ = అందరికంటె అధికుడై; శోభిలున్ = ప్రకాశిస్తాడు; దానికిన్ = అట్లా రాజు వెలుగొందటానికి; కారణంబు+ఏమి? = హేతువేమిటి?; ఎఱింగింపవు+ఏ = తెలుపుమా; అనుటయున్ = అని అంబిక అడుగగా; ఈశానుండు = శివుడు; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరమశివుడు అట్లా పలుకగా సంతోషించి పార్వతీదేవి ఆయనతో 'సర్వజ్ఞా! రాజనేవాడికి లోకం లోని నరులకు వలెనే శరీరమున్నది. వారికి వలెనే భోజనమజ్జనాదులు కూడ సాగుతాయి. అయినప్పటికీ రాజు తక్కిన వారికంటె అధికుడై అందరి వందనాలు అందుకొంటాడు. ప్రజలను దండించటానికీ, పరిరక్షించటానికీ అతడు సామర్థ్యం కలిగి ఉంటాడు. ఇందుకు కారణమేమిటో వివరించండి-' అని వేడగా మహేశ్వరుడిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికి రాజత్వ మహిమాతిశయంబు చెప్పుట. (సం.13-అను- 1-15-895)

సీ. **'అధికపుఁదపమున నైనది రాజత్వ; ၊ మట్లు గావునఁ బేర్మి నతిశయిల్లు;**
జనములచే మ్రొక్కుగొనుటకు నిగ్రహం ၊ బునకు ననుగ్రహంబునకు శక్తుఁ
డై యుండు నతఁడు; తదీయ సునీతియ ၊ విను ముదమున రాజు వినయపరునిఁ
జేసి యెల్లజనంబు శిక్షించు, నింద్రియ ၊ జయమును నరివర్గజయముఁ బడయు,

తే. **నెఱిఁగి యుపధా విశుద్ధుల నిడు నమాత్య ၊ పదవి, కనురక్త సారవద్బలముఁ బ్రోచు;**
హితవరుల మిత్త్రులుగఁ గొను నిలకు మేలొ ၊ నర్చు, దుర్గంబు రక్షించుఁ, గూర్చు ధనము. 45

ప్రతిపదార్థం: రాజత్వము = రాజగుట, రాచరికం; అధికము+తపమునన్ = మిక్కుటమైన తపస్సు చేత; ఐనది = లభిస్తుంది; అట్లు+కావునన్ = తపశ్చర్యయే దొరతనానికి హేతు వవటం చేత ; అతఁడు = ప్రభువు, పేర్మిన్ = గౌరవంతో; అతిశయిల్లున్ = పెంపొందుతాడు; జనములచేన్ = ప్రజలచేత; మ్రొక్కున్+కొనుటకున్ = వందనాలు స్వీకరించటానికి; నిగ్రహంబునకున్ = దండించటానికి; అనుగ్రహంబునకున్ = దయదలచి కాపాడటానికి; శక్తుఁడు+ఐ+ఉండున్ = చాలినవాడై, దక్షుడై ఉంటాడు; విను = గౌరీ! చెవి యొగ్గి ఆలకించుము; తదీయ సునీతి+అ = వాని యొక్క మంచినీతియే; ముదమునన్ = సంతోషంతో; రాజున్ = నృపాలుడిని; వినయపరునిన్+చేసి = అడకువ కలవాడినిగా ఒనర్చి; ఎల్ల జనంబున్ = సమస్త ప్రజలను; శిక్షించున్ = అణకువ గలవారినిగా చేస్తుంది; ఇంద్రియ జయమును = ఇంద్రియముల యొక్క గెలుపును; అరివర్గ జయమున్ = శాత్రవ సమూహము యొక్క గెలుచుటను; పడయున్ = పొందుతుంది; ఉపధా విశుద్ధులన్ = గుణశీల పరీక్షలో నెగ్గిన పవిత్రులైన వారిని; ఎఱిఁగి = తెలిసి; అమాత్యపదవికిన్+ఇడున్ = మంత్రి పదవులలో నిలుపుతుంది; అనురక్త = తనయందు అనురాగం గల; సారవత్ = చేవ గలిగిన; బలమున్ = సైన్యమును; ప్రోచున్ = కాపాడుతుంది; హితవరులన్ = తనకు మేలుచేయుటంలో ఆసక్తి కలవారిని; మిత్రులుగన్ = స్నేహితులుగా; కొనున్ = స్వీకరిస్తుంది; ఇలకున్ = ధరణికి, జనులకు; మేలు+ఒనర్చున్ = క్షేమం కలిగిస్తుంది; దుర్గంబున్= కోటను, రక్షించున్ = కాపాడుతుంది; ధనమున్ = విత్తాన్ని; కూర్చున్ = సమకూరుస్తుంది, చేరుస్తుంది.

తాత్పర్యం: 'చేసిన తపస్సుకు ఫలంగా రాజుగా జన్మించడం జరుగుతుంది. కనుక రాజు గౌరవపాత్రుడై వెలుగొందుతాడు. భూపతి జనుల నమస్కారాలు గైకొనడానికి, వారిని దండించటానికి, దయతో కాపాడటానికి తగిన వాడై ఉంటాడు. అత డనుసరించే మంచినీతి అతడిని అణకువ కలవాడినిగా తీర్చిదిద్ది ప్రజలందరినీ

నీతిమార్గంలో నడిపిస్తుంది. ఆ నీతివలననే భూవల్లభుడు ఇంద్రియజయం, శాత్రవ జయం పొందుతాడు. చక్కగా యోచించి గుణశీలపరీక్షలో ఉత్తీర్ణులైన పవిత్రులను మాత్రమే మంత్రి పదవులలో నియమిస్తాడు. తనయందు ప్రేమ విశ్వాసాలున్న, చేవగలిగిన సేనలను దయతో పోషిస్తాడు, తనకు మేలుచేసే వారినే స్నేహితులుగా చెంతకు చేర్చు కొంటాడు. ఆత డనుసరించే నీతి జనులకు క్షేమం కలిగిస్తుంది. దుర్గాన్ని రక్షిస్తుంది. ధనాన్ని సమకూరుస్తుంది.

విశేషం: జ్ఞానేంద్రియాలు : కన్ను, ముక్కు, చెవి, చర్మం, నాలుక
కర్మేంద్రియాలు : వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ.

పాయువు అనగా మల ద్వారం; ఉపస్థ అనగా మూత్రద్వారం. ఇవి పది. మనస్సు ఒకటి మొత్తం ఇంద్రియాలు పదకొండు. వాటిని జయించట మంటే అవి అసన్మార్గంలో చరించకుండా సన్మార్గంలో వర్తించేటట్లు చూడటం.

వ. ఇవ్విధంబున సప్తాంగ సంపన్నత్వంబు నొంది. 46

ఇవ్విధంబునన్= పై పద్యంలో నిరూపించిన విధంగా.

తాత్పర్యం: రాజు ఈ విధంగా సప్తాంగ సంపత్తి పొందినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సప్త+అంగములు = సప్తాంగములు
1.రాజు, 2.అమాత్యుడు, 3.మిత్రుడు, 4.బొక్కసం, 5.రాజ్యం, 6.దుర్గం, 7. సైన్యం

"స్వామ్యమాత్య సుహృత్కోశ రాష్ట్ర దుర్గ బలాని చ" అని ఈ విషయాన్నే అమరకోశం వివరించింది.

క. చేయఁ డపాత్రవ్యయములు । సేయుం బాత్రవ్యయంబు సేయున్ నిజ ర
క్షాయత్న మెల్లతెఱఁగులఁ । బాయక ధర్మంబు సేయుఁ బాపము దొఱఁగున్. 47

ప్రతిపదార్థం: అపాత్రవ్యయములు చేయఁడు = అనర్హములైనవాటికి డబ్బు వెచ్చించడు; పాత్ర వ్యయంబు+చేయున్ = తగినవాటికే వెచ్చిస్తాడు; నిజరక్షాయత్నము = తనను కాపాడుకొనే ప్రయత్నం; ఎల్ల తెఱఁగులన్ = అన్నివిధాల; చేయున్ = చేస్తాడు; పాయక = ఉడుగక, మానక; ధర్మంబు+చేయున్ = పుణ్యకార్యాలు ఆచరిస్తాడు; పాపంబు+తొఱఁగున్ = పాప కృత్యాలు మానుతాడు.

తాత్పర్యం: ప్రభువైనవాడు చేయదగని వ్యయం చెయ్యడు. అర్హమైన వాటికి వెచ్చించడంలో వెనుకంజ వేయడు. తన్ను సకలవిధాల సంరక్షించుకొనటంలో ఏమరుపాటు వహించడు. పుణ్యకార్యాలు చేస్తాడు. పాపకార్యాలు మానుతాడు.

ఆ. ఆచరించు దండ మక్రోధకాముఁడై । చారదృష్టిఁ జూచు శత్రు కృత్య
ములను, నాత్మదేశ పుర పరివారవి । ధముల సత్యభాషణముల నెగడు. 48

ప్రతిపదార్థం: అక్రోధకాముఁడు+ఐ = కోపం, ప్రేమ లేనివాడై; దండము = శిక్ష; ఆచరించున్ = విధిస్తాడు; శత్రుకృత్యములను = విరోధులుచేసే పనులను; ఆత్మదేశ = తనదేశమందలి; పుర = పట్టణాలలోని; పరివార = బలగముయొక్క; విధములన్

= తీరు తెన్నులను, పోకడలను; చారదృష్టిన్ = వార్తలు తెచ్చే వేగుల వాండ్రు అనే కళ్ళతో; చూచున్ = కనుగొంటాడు; సత్యభాషణములన్ = సత్యవాక్యము లాడుతూ; నెగడున్ = వెలుగొందుతాడు.

తాత్పర్యం: న్యాయవిచారణ సలిపి శిక్ష విధించేటప్పుడు పరాయివాడని ఒకడిపై కోపంగాని, తనవాడని మరొకడిపై ప్రేమగాని చూపడు. తనకు విరోధులైన ఇరుగు పొరుగు రాజ్యాలలోనివారు చేసే పనులనూ, తన రాజ్యమందలి జనులూ, పట్టణాలలోని ప్రజలూ, తన సేవకులూ తననుగూర్చి ఏమనుకొంటున్నారో వేగులవాండ్రు అనే కన్నులతో చూచి తెలుసుకొంటాడు. సత్యవాక్పరిపాలకుడై విఖ్యాతి వహిస్తాడు.

క. ఉద్యోగము ప్రియవాదిత ।విద్యాపరినిష్ఠ సంధి విగ్రహ విహతా
వద్యత దీనానాథ వి । పద్యాపన మాజ్ఞవెరవు పాటించుఁ దగన్. 49

ప్రతిపదార్థం: ఉద్యోగము = ప్రయత్నం; ప్రియవాదిత = ప్రేమగా మాట్లాడటం; విద్యాపరినిష్ఠ = విద్యలయందు మిక్కిలి అక్కర; సంధి విగ్రహ విహత+అవద్యత = సంధి విగ్రహాలనే తంత్రాల చేత దోషాలు పోగొట్టుకొనటం; దీన+అనాథ+ విపద్+యాపనము = దీనుల యొక్క, దిక్కులేని వారి యొక్క ఆపదలను తొలగించటం; ఆజ్ఞ వెరవు = ఆజ్ఞ లివ్వటంలో నేర్పు; తగన్ = ఒప్పిదంగా, పాటించున్ = ప్రభువు అనుసరిస్తాడు.

తాత్పర్యం: రాజైనవాడు యత్న పరుడు కావాలి. ప్రియంగా సంభాషించాలి. విద్యలయందు శ్రద్ధాసక్తులు గలిగి ఉండాలి. సంధి విగ్రహం మొదలైన షట్తంత్ర ప్రయోగనైపుణివల్ల ఏర్పడ్డ చిక్కులు తొలగించుకొనాలి. దీనుల యొక్క, దిక్కుమాలినవారి యొక్క ఆపదలు తొలగించాలి; ఆజ్ఞలిడి పనులు చేయించటంలో చాతుర్యం ప్రదర్శించాలి. ఇవి రాజులు అనుసరించ వలసిన ధర్మాలు.

ఆ. కయ్యమునకు నెపుడుఁ గాలు ద్రవ్వఁడు, తగ । వైన రణము శూరుఁడై యొనర్చు;
యజ్ఞ దాన విధి పరాయణుఁడై యుండు । ని త్తెఱంగు వృత్త ముత్తమంబు. 50

ప్రతిపదార్థం: కయ్యమునకున్ = యుద్ధమునకు; ఎపుడున్ = ఏ వేళనూ; కాలుద్రవ్వఁడు = సిద్ధపడడు; తగవు+ఐన+రణమున్ = న్యాయమైన సంగ్రామాన్ని; శూరుఁడు+ఐ = వీరుడై; ఒనర్చున్ = చేస్తాడు; యజ్ఞ దాన విధి పరాయణుఁడు+ఐ = యాగాలు, దానాలు చేయటంలో శ్రద్ధాసక్తులు కలవాడై ; ఉండున్ = ఉంటాడు; ఈ+తెఱంగు వృత్తము = ఈ విధమైన నడవడిక; ఉత్తమంబు = శ్రేష్ఠం.

తాత్పర్యం: ప్రభువైన వాడు తనకు తానుగా అకారణంగా జగడానికి ఎప్పుడూ సిద్ధ పడడు. ధర్మంగా యుద్ధం చేయవలసివచ్చినపుడు వెనుకడుగు వేయడు. యజ్ఞము లొనర్చటంలో, దానాలు చేయటంలో శ్రద్ధాసక్తులు కలిగి ఉంటాడు. రాజుకు ఇటువంటి ప్రవర్తనమే సముచితం.

విశేషం: 'కయ్యమునకు కాలుద్రవ్వ' వంటి జాతీయాలకు, నుడికారాలకు తిక్కన రచన కాణాచి.

క. ఈ నీతులకు విరుద్ధము । లైన పనుల నరకములకు నరుగు నృపతి పా
పానీత దుఃఖ మొకతఱి । మాను నొరుల కతని కెపుడు మానక యుండున్. 51

ప్రతిపదార్థం: నృపతి = రాజు; ఈ నీతులకున్ = ఈ న్యాయ కార్యాలకు; విరుద్ధములు+ఐన = వ్యతిరిక్తాలైన; పనులన్ = పనులు చేయటంవలన; నరకములకున్+అరుగున్ = దుర్గతుల పాలవుతాడు; పాప+ఆనీత దుఃఖము = పాపకార్యాలు చేయటం చేత కలిగిన దుఃఖం; ఒరులకున్ = ఇతరులకు; ఒకతఱిన్ = ఒకప్పుడు; మానున్ = తొలగిపోతుంది; అతనికిన్ = రాజుకు మాత్రం; ఎపుడున్ = ఎట్టి సమయమందునూ; మానక+ఉండున్ = విడువకుండా ఉంటుంది.

తాత్పర్యం: రాజైన వాడు పూర్వోక్తమైన న్యాయానికి విరుద్ధములైన పనులు చేస్తే నరకాల పాలవుతాడు. పాపం వల్ల కలిగే దుఃఖాలు ఒకప్పుడు ఇతరులను వదల వచ్చును గాని రాజును మాత్రం ఎన్నటికీ వదలవు.

ఆ. భావశుద్ధి గలిగి యీ వినీతులఁ బూని । ప్రజల కెవ్వఁ డతుల రక్షణంబు
సేయు నట్టి విభుఁడు సిరియును గీర్తియుఁ । గాంచుఁ బుణ్యలోక గతియుఁ బడయు.' 52

ప్రతిపదార్థం: భావశుద్ధి+కలిగి = నిర్మలమైన మనస్సు గలిగి; ఈ+వినీతులన్+పూని = ఈ చెప్పబడిన న్యాయపద్ధతుల ననుసరించి; ఎవ్వఁడు = ఏ రాజు; ప్రజలకున్ = జనులకు; అతుల రక్షణంబు = సాటిలేని సంరక్షణ; చేయున్ = కలిగిస్తాడో; అట్టి విభుఁడు = అటువంటి ప్రభువు; సిరియున్ = సంపదయు; కీర్తియున్ = యశస్సునూ; కాంచున్ = పొందుతాడు; పుణ్యలోక గతియున్ = ఉత్తమలోక నివాసం; పడయున్ = పొందుతాడు.

తాత్పర్యం: ఏ రాజు చిత్తశుద్ధితో ఈ చెప్పిన నీతుల్ని అనుసరించి ప్రజలను రక్షిస్తాడో ఆ రాజు ఐశ్వర్యమునూ, యశస్సునూ పొందగలడు. మరణానంతరం పుణ్యలోకాలకు వెళ్ళుతాడు.'

క. అనుటయు 'ధర్మ రహస్యము । వినఁ గోరెద' ననిన శాంభవికి శంభుం డి
ట్లనియె 'నహింస రహస్యం । బనఁ బరఁగును ధర్మజాత మఖిలమునందున్.' 53

ప్రతిపదార్థం: అనుటయున్ = అని శివుడు పలుకగా; ధర్మ రహస్యమున్ = ధర్మ మందలి మర్మమును, ధర్మ సూక్ష్మాన్ని; వినన్+కోరెదన్ = వినుటకు కుతూహల పడుతున్నాను; అనిన శాంభవికిన్ = అని అడిగిన అంబికకు; శంభుండు = పరమేశ్వరుడు; ఇట్లు+అనియెన్ = ఈ విధంగా చెప్పాడు; అహింస = ప్రాణులను బాధించకుండుట; ధర్మజాతము+ అఖిలము+అందున్ = సమస్తమైన ధర్మ సమూహంలో; రహస్యంబు+అనన్ = రహస్యమని చెప్పుటచేత; పరఁగును = ఒప్పును.

తాత్పర్యం: అని శివుడు వచింపగా పార్వతీదేవి 'నాథా! ధర్మ రహస్యం వినవలెనని కుతూహల పడుతున్నాను' అన్నది. అందుకు శంకరుడు 'దేవీ! సకల ధర్మ సమూహమునందు జీవులను హింసించకుండటమే పరమ ధర్మ'మని పలికాడు.

వ. అనిన విని యా జగన్మాత యవ్విశ్వధాతతో 'హింసావర్జనం బే జనులకుం జెల్లదని చూచెద; నహింస తెఱం గెఱింగింపవే' యనిన నద్దేవుం 'డది నీ తలంచినట్ల; నేలం బిపీలికా ప్రముఖంబుల నాకసంబున మశకాదుల మఱియుం బేను నల్లి సీరపేను లోనైన జంతువులం జంపక యెవ్వరికి మానరా; దట్లు గావున.54

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శంభుడు పల్కగా ఆకర్ణించి; ఆ జగత్+మాత = లోకాలకు తల్లిఅయిన పార్వతి; ఆ విశ్వధాతతోన్ = ప్రపంచాన్ని ధరించే (పోషించే) పరమేశ్వరుడితో; హింసా వర్జనంబు = హింసను మానటం; ఏ జనులకున్

= ఎవ్వరికినీ; చెల్లదు+అని = శక్యం కాదు అని; చూచెదన్ = భావిస్తాను; అహింస తెఱంగు = అహింసావిధానమును, స్వరూపాన్ని; ఎఱింగింపవు+ఏ = తెలుపుమా; అనినన్ = అని వేడగా; ఆ+దేవుండు= ఆ ధూర్జటి; అది = అహింస అనేది; నీ తలంచినట్లు+అ = నీవు భావించినట్లే దుస్సాధ్యం; నేలన్ = భూమిమీద ; పిపీలికా ప్రముఖంబులన్ = చీమలు మొదలైన వాటిని; ఆకసంబునన్ = అంబరంలో; మశక+ఆదులన్ = దోమలు మొదలైన వాటినీ; మఱియున్ = ఇంకనూ; నల్లి = మత్కుణం; సీరపేను = చీరపేను = బట్టను అంటుకొని ఉండే తెల్లని పేను; లోనైన = (లోను+ఐన) = మొదలైన; జంతువులన్ = ప్రాణులను, చంపక; ఎవ్వరికిన్ = ఎంతటి వారికినీ; మానన్ రాదు = విడిచి పెట్టుటకు వీలుకాదు; అట్లు+కావునన్ = అందుచేత; (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని ఈశ్వరు డనగా విని ఆ జగజ్జనని జగద్రక్షకుడైన సదాశివుడితో 'ప్రాణేశ్వరా! హింస చేయకుండటం ఎవ్వరికినీ శక్యం కాదని భావిస్తాను. అహింసా స్వరూపం ఎట్లాంటిదో తెలుపవలసింది' అని వేడగా శివుడు 'ప్రేయసీ! నీ వన్నట్లుగానే నేలమీద చీమలు మొదలైన వాటినీ, గగనంలో దోమలు మొదలైన వాటినీ, తల వెంట్రుకలలో పేలనూ, మంచముల నాశ్రయించుకొన్న నల్లులనూ, వస్త్రాలనంటి పెట్టుకొన్న చీర పేలూ మొదలైన కీటకాలను చంపకుండా ఉండటం ఎవ్వరికినీ సాధ్యం కాదు. అందుచేత

చ. **ఫలము దళంబునుం దొడిమఁ బాయుట, రాలిన వానిఁ గొంచు నా**
కలి కెరవేసి గోరసము కార్యమునట్టుల నిర్వహించి బు
ద్ధులు వెలిలేక నిశ్చలతఁ దోయజపత్రనిభాక్షి! చిత్రరూ
పులొకొ యనంగ నుండు శమ పుణ్యులు సూవె యహింసనాత్మకుల్. **55**

ప్రతిపదార్థం: తోయజ పత్రనిభ+అక్షి = కమల దళములతో సమానములైన కన్నులుగల గౌరీ!; ఫలము = పండూ; దళంబునున్ = ఆకూ; తొడిమన్+పాయుటన్ = వృంతమును వీడటం వల్ల, కాడను వదలడం చేత; రాలిన వానిన్ = చెట్టునుంచి క్రింద పడిన ఆ ఫలపర్ణాలను; కొంచున్ = గ్రహిస్తూ; ఆఁకలికిన్ = క్షుత్తునకు; ఎరవేసి = ఆహారమొనర్చి; గోరసము కార్యము = ఆవుపాలు లేక పెరుగు లేక మజ్జిగ అనువాటిని త్రాగడం అనే పనిని; అట్టులన్ = నేలరాలిన పండ్లను ఆకులను భక్షించినట్లే; నిర్వహించి = చేసి (ఆకలిని ఫలపర్ణాలతో, దప్పికను గోక్షీరాదులతో తీర్చుకొని); బుద్ధులు = తలంపులు; వెలిలేక = బహిర్విషయాల మీదికి వెళ్ళకుండా అనగా ఆత్మేతర విషయములందు ప్రవర్తించకుండా; నిశ్చలతన్ = చలనం లేక; చిత్ర రూపులు+ఒకొ+అనంగన్ = పటాలలోని బొమ్మలు కాబోలు అనునట్లు; ఉండు = ఉన్నట్టి; శమ పుణ్యులు = అంతరింద్రియనిగ్రహం గలిగిన పుణ్యాత్ములు; అహింసన+ఆత్మకుల్+చూవె = జీవహింస సల్పనట్టి స్వభావం కలవారు సుమా!

తాత్పర్యం: ఫలాలు, ఆకులు బాగుగా పండి చెట్ల తొడిమల నుండి తమంతట తామే నేలమీద రాలగా వాటిని తిని ఆకలి తీర్చుకొంటూ, ఆవుపాలో, పెరుగో, మజ్జిగో త్రాగి దప్పిక బాపుకొంటూ ఇతర విషయాల మీదికి బుద్ధులు పోనీయకుండా, చిత్తరువులలోని బొమ్మల మాదిరి చలనరహితులై, అంతరింద్రియాలను జయించిన మహనీయులే సుమా అహింసా స్వభావులు!

విశేషం: సూవె అనే పదం సహజ సరళాదిది కాదు. చూవె, చూడవే, చూడవే, చూ అనేవి గసడదవాదేశ సంధివల్ల సూ గా మారుతాయి. చూవె-సూవె చుమా-సుమా, చుమీ, సుమ్మీ చూ- సూ- ఇవి నిశ్చయార్థకములైన అవ్యయాలు.

తే. **అదియ శ్రుతిచేత ధర్మ రహస్య మనఁగఁ । బడియెఁ' నని చెప్పి మఱియును భవుఁడు దేవి**
కిట్టులను 'నట్లుగాక యహింస తెఱఁగు । గలదు వినుము విశేషించి కమలనయన! **56**

ప్రతిపదార్థం: కమలనయన! = తామర రేకుల వంటి కన్నులు గల కాంతామణీ!; అదియ = హింస చేయకుండటమే; శ్రుతి చేతన్ = వేదం చేత; ధర్మ రహస్యము+అనఁగన్+పడియెన్ = ధర్మ రహస్యమని నుడువబడింది; అని చెప్పి = అని వచించి; మఱియును = ఇంకా; భవుఁడు = మహా దేవుఁడు; దేవికిన్ = భగవతిఅయిన కాత్యాయనికి; ఇట్టులు+అనున్ = ఈ విధంగా అన్నాడు; అట్లు+కాక = ఇంతకు ముందు చెప్పబడినట్లేగాక; విశేషించి = ప్రత్యేకించి; అహింస తెఱఁగు+కలదు = అహింసా విధాన మున్నది; వినుము = ఆలకించుము.

తాత్పర్యం: కాత్యాయనీ! ఈ అహింస అనేదే ధర్మ రహస్యమని వేదంలో చెప్పబడింది' అని పల్కి శివదేవుడు భవానితో ఇట్లన్నాడు. 'దేవీ! అహింస అనేది వేరే విధంగా కూడ ఉన్నది. చెపుతాను వినుము.

తే. **విధి వశంబున మృతిఁ బొందు వివిధ జంతు । నిచయమం దనహంకార నిష్ఠుఁడైనఁ**
బురుషుఁ గల్మష మేమియుఁ బొందనేర; । దెట్టు లంటేని విను మది యేర్పరింతు. **57**

ప్రతిపదార్థం: విధివశంబునన్ = దైవాధీనంగా; మృతిన్+పొందు = మరణం చెందునట్టి; వివిధ జంతునిచయము+అందున్ = రకరకాల ప్రాణి సముదాయంలో; అనహంకార (న+అహంకార) నిష్ఠుఁడు+ఐన+పురుషున్ = నేను, నాది అని గర్వించకుండే వాడిని; కల్మషము = పాపం; ఏమియున్ = ఇసుమంతయు; పొందన్+ నేరదు = చెందజాలదు; ఎట్టులు+అంటేనిన్ = అదెట్లంటే; వినుము = ఆలకించుము; అది = ఆ విషయం; ఏర్పరింతున్ = వివరిస్తాను.

తాత్పర్యం: దైవాధీనంగా చనిపోతున్న ప్రాణి కోటిలో అహంకార రహితుడైన పురుషుడిని పాపం ఏమాత్రం అంటుకొనదు. అదెట్లంటే అహింసా స్వరూపాన్ని వివరిస్తాను పార్వతీ! వినుము.

విశేషం: అహంకారము - దేహమే ఆత్మ అనే అభిమానం. ఈ దేహానికి చెందిన ఆలుబిడ్డలు, మిత్రులు, గృహక్షేత్రాదులు తనవనే బుద్ధి. ఇదే అహంకారమంటే. ఇది లేకుండటం అనహంకారం. అందలి నిలుకడ అనహంకారనిష్ఠ. అది కలవాడు అనహంకారనిష్ఠుడు. అంతా విధి వశమై ప్రవర్తిస్తుంది. అన్నింటికి కర్త సర్వేశ్వరుడు. నేను నిమిత్త మాత్రుడిని అని భావించే వాడు అనహంకార నిష్ఠుడు. కర్మ ఫలమందు కర్తృత్వభోక్తృత్వబుద్ధి లేనివాడు హింస చేసినా అతడు చెయ్యనివాడే.

సీ. **దివియలోఁ బడుఁ బ్రువ్వు, దివియ యెత్తినవారిఁ । బాపంబు వొందునే, యోపి దున్న**
నాఁగేటిమొనఁ జచ్చు నానావిధ ప్రాణు । లన్నరుఁ బొందునే యఘము? వారు
తమపనుల్ సేయ విధాతృవశమున నా । యువు దెగినట్టి జంతువులు సచ్చు;
నేము సంపితి మని యించుకేనియు నహం । కారంబు వారికిఁ గలుగ; దట్లు

తే. **గానఁ జూవె వారిఁ గల్మష మొందదు; । పుణ్యపాపములకు బుద్ధి మూల'**
మని శివుండు మఱియు నను 'హింసవోలెనై । యధిక ధర్మమైన విధము వినుము. **58**

ప్రతిపదార్థం: ప్రువ్వు = పురుగు; దివియలోన్ = దీపంలో; పడున్ = కాలి నశిస్తుంది; దివియ+ఎత్తిన వారిన్ = ఆ దీపం పెట్టినవారిని; పాపంబు = పాతకం; పొందున్+ఏ? = చెందుతుందా? లేదని భావం; ఓపి = నేర్పుకలిగి, సమర్థుడై; దున్నన్

= పొలం దున్నగా; నాఁగేటి మొనన్ = నాగలి యొక్క ఇనుప కర్రు మొన గ్రుచ్చుకొని; నానా విధ ప్రాణులు+చచ్చున్ = పలు రకాలైన జీవులు - లద్దె పురుగులు, వాన పాములు మొదలైన మట్టి పొరలలోని ప్రాణులు, కీటకాదులు చచ్చిపోతాయి; ఆ +నరున్ = అరక తోలుతున్న సేద్యగాడిని; అఘము = పాపం, కిల్బిషం; పొందును+ఏ? = పొందుతుందా? పొందదని తాత్పర్యం; వారు = మనుష్యులు; తమ పనుల్+చేయన్ = తమతమ కార్యాలు నిర్వహించే వేళలలో; విధాతృవశమునన్ = దైవవిధిచేత; ఆయువు తెగిన+అట్టి = ఆయుష్కాలం ముగిసినటువంటి; జంతువులు = ప్రాణులు; చచ్చున్ = చనిపోతూ ఉంటాయి; ఏము = మేము; చంపితిమి+అని = వధించామని; అహంకారంబు = కర్తృత్వం; వారికిన్ = ఆయా పనులు చేసికొంటున్న నరులకు; ఇంచుక+ఏనియున్ = కొంచెం కూడ; కలుగదు = జనించదు; అట్లు+కానన్ = అందుచేత; చూవె = సుమా!; వారిన్ = ఆ పని పాటులలో నిమగ్నులైన మనుజులను; కల్మషము = పాపం, దురితం, ఒందదు = చెందదు; పుణ్యాపాపములకున్ = సుకృత దుష్కృతాలకు; బుద్ధి = బుద్ధియే; మూలము+అని = హేతువంటూ, కారణమంటూ; శివుండు = పశుపతి; మఱియున్ = ఇంకనూ; అనున్ = చెప్పుతున్నాడు; హింస పోలెన్+ఐ = హింసవలె ఉండి కూడ; అధిక ధర్మము = అది పరమ ధర్మం; ఐన విధము = ఐనట్టి తీరు; వినుము = గౌరీ! నీవు వినుము.

తాత్పర్యం: దీపాలలో పడి పురుగు లనేకం చస్తుంటాయి. దీపం పెట్టిన వాడికి ఆ పాపం సంప్రాప్తించటం లేదు. సేద్యగాడు అరకతో పొలం దున్నేటపుడు నాగలి కర్రు తగిలి మట్టి పొరలలోని జీవులెన్నో చనిపోతున్నాయి. ఆ పాతకం హాలికుడికి సంభవించటం లేదు గదా! మనుష్యులు తమతమ పనులు చేసికొంటున్నప్పుడు వాటి వాటి ఆయువుతీరి ప్రాణులెన్నో చస్తుంటాయి. వాటి చావుకు తాము కారణమని ఆ జనులు తలపోయరు కనుకనే వారికి జీవహింసాదోషం కలగటం లేదు. సఖీ! పాపపుణ్యాలు కలగటానికి బుద్ధియే కారణం' అని ఈశ్వరుడు మహేశ్వరికి చెప్పి 'ఇది హింసాస్వరూపంతో ఉన్నప్పటికినీ అహింసా ధర్మమైన విధం ఎట్లో వివరిస్తాను వినవలసిం' దని ఇట్లా అన్నాడు.

విశేషం: పాపపుణ్యాలకు మూలం మనస్సే అనే ఉపనిషదర్థం ఈ పద్యంలో పేర్కొనబడింది.

క. దైవగతిఁ జేసి తమకుం । జావవలసి గోవు లొండు చా వొల్లక స
ద్భావమున రంతిదేవుని । కావించు మఖమునఁ బశుతఁ గైకొని నెమ్మిన్. 59

ప్రతిపదార్థం: గోవులు = ఆవులు; దైవగతిన్+చేసి = విధి విధానం అనుసరించి; తమకున్ = తమకు (ధేనువులకు) చావన్ వలసి = మృతి తప్పనందున; ఒండు చావు+ఒల్లక = మరొక విధమైన మరణాన్ని అంగీకరించక; సద్+భావమునన్ = మంచి మనసుతో; రంతిదేవుని కావించు = రంతిదేవు డనే రాజు చేయునట్టి; మఖమునన్ = యజ్ఞంలో; పశుతన్+కైకొని = పశుత్వము వరించి; నెమ్మిన్ = ప్రీతితో. (అతడి చెంతకు వచ్చాయని తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: విధివశాన తమకు చావు మూడినందున గోవులు మరొక విధంగా మరణించటానికి సమ్మతించక రంతిదేవు డనే రాజు చేస్తున్న యాగంలో బలిపశువులు కావటానికి ప్రీతి వహించి.

వ. అనేక సహస్రంబు లరుదెంచి. 60

తాత్పర్యం: పెక్కువేలు వచ్చి.

క. తము విశసించుట కా భూ । రమణుని వేడంగ నతఁడు రాజీవాక్షీ!
క్రమమున విశసింపఁగఁ జ । ర్మములు దరులు గాఁగఁ బాఱె రక్తము నదియై. 61

ప్రతిపదార్థం: రాజీవ+అక్షీ! = పద్మములవంటి నేత్రములుగలదానా!; తమున్ = తమ్ము; విశసించుటకున్ = యాగంలో చంపుటకు; ఆ భూరమణునిన్ = ఆ మహీపతిని; వేడంగన్ = ప్రార్థించగా; అతఁడు = ఆ రాజు; క్రమమునన్ = వరుసగా; విశసింపఁగన్ = వాటిని సంహరించగా; చర్మములు = ఆ ధేనువుల తోళ్ళు; దరులు+కాఁగన్ = గట్లుకాగా; రక్తము = నెత్తురు; నది+ఐ = ఏరై; పాఱెన్ = ప్రవహించింది.

తాత్పర్యం: తమ్ము యజ్ఞంలో విశసించుమని వేలకొలది ఆవులు వచ్చి రంతిదేవ మహారాజును వేడుకొన్నవి. రంతిదేవుడు ఆ ధేనువులు కోరినట్లు వాటిని యాగంలో విశసించాడు. ఆ గోవుల చర్మాలు గట్లు కాగా, వాటి నెత్తురు ఏరై పారింది.

క. ఆచర్మణ్వతి యను నది । గోచరమే వర్ణనమునకుం బ్రియ మగు కం
పై చవిచేయం బొలిచి య । నీచమహిత సలిల మయ్యె నెత్తురు సుదతీ! 62

ప్రతిపదార్థం: సుదతీ! = మంచి దంతములు గలదానా!; ఆచర్మణ్వతి+అను నది = చర్మణ్వతి అనేపేరు గల ఆ యేరు; వర్ణనమునకున్ = కొనియాడటానికి; గోచరమే = శక్యమా? కాదని భావం; నెత్తురు = ధేనురక్తము; ప్రియము+అగు = ఇష్టమైన; కంపు+ఐ = పరిమళం కలదై; చవి చేయన్ = రుచిగొల్పగా; పొలిచి = ఒప్పి; అనీచ = అల్పముగాని; మహిత = పూజ్యమైన; సలిలము+అయ్యెన్ = జల మైనది.

తాత్పర్యం: చక్కని పలువరుసగల శర్వాణీ! ఆ చర్మణ్వతీనదిని వర్ణించుటకు సాధ్యం గాదు. నదిలోని రక్తం పావన జలమై, రుచికరమై, కమ్మని పరిమళాలు వెదజల్లుతుంటుంది.

క. స్నానమునఁ బానమున నా । కానందము సేయు నమ్మహానది; గోసం
తానము దివికి నరిగె; న । మ్మానవపతిఁ జెప్పనేల? మధురాలాపా! 63

ప్రతిపదార్థం: మధుర+ఆలాపా! = ఇంపైన పలుకులు కలదానా!; ఆ+మహానది = గొప్పనదిఅయిన చర్మణ్వతి; స్నానమునన్ = తన జలాలలో స్నానమాడుటచేతను; పానమునన్ = తన నీరు త్రాగటం చేతను; నాకున్ = నాకు; ఆనందము+చేయున్; సంతోషం కలిగిస్తుంది; గోసంతానము = ధేనుసముదాయం; దివికిన్ = స్వర్గానికి; అరిగెన్ = వెళ్ళింది; ఆ+మానవపతిన్ = నరపాలకుడూ, యజ్ఞమునకు యజమానుడు అయిన ఆ రంతిదేవుడిని గూర్చి; చెప్పన్+ఏల? = చెప్పుటెందుకు?

తాత్పర్యం: ఇంపుగ మాటలాడే గౌరీ! చర్మణ్వతీ నదిలో స్నానమాడటం వలన, ఆ నదీజలములు త్రాగటం వలన నా కెంతో ఆనందం కలుగుతుంది. యజ్ఞంలో విశసించబడిన గోవులన్నీ స్వర్గం చేరాయి. మరి యాగ మొనర్చిన రంతిదేవ మహారాజు పుణ్యగతి ఇట్టిదని చెప్ప వలసిన అవసర మేమున్నది? (అత డుత్తమగతులు పొందాడని తాత్పర్యం.)

క. పరబలముపై నడరి నె । త్తురు వఱ్ఱులు వాఱఁ జంపుదురు దురమున న
ప్పురుసదనంబును బుణ్యో । త్తర మని వేదములు సెప్పుఁ దనుతరమధ్యా! 64

ప్రతిపదార్థం: తనుతరమధ్యా! = మిక్కిలి సన్నని నడుముగల దానా!; పరబలముపైన్ = శత్రుసైన్యం మీద; అడరి = విజృంభించి; నెత్తురు = రక్తం; వఱ్ఱులు+పాఱన్ = ప్రవాహా లయ్యేటట్లుగా; దురమునన్ = యుద్ధంలో; చంపుదురు = వధిస్తారు; ఆ+పరుసఁదనంబును = ఆ కాఠిన్యం కూడా, ఆ కర్కశత్వం కూడ; పుణ్య+ఉత్తరము+అని = పుణ్యాలలో మేలైనదని; వేదములు = శ్రుతులు; చెప్పున్ = వచిస్తున్నాయి.

తాత్పర్యం: మిక్కిలి సూక్ష్మమైన నడుము గల సుందరీ ! శత్రుసేనలపై విరుచుకపడి రక్తం వరదలై పారేటట్లుగా యుద్ధంలో సంహరిస్తారు. ఆ క్రూరకర్మ సైతం పుణ్యాలలో మేటిఅని వేదాలు వక్కాణిస్తున్నాయి.

విశేషం: "హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్,
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః. (భగ. 2-37)
సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ,
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి." (భగ. 2-38)

శత్రువులచేతిలో నీవు చస్తే మోక్షాన్ని పొందుతావు. నీవు శాత్రవులను జయిస్తే రాజ్యాన్ని అనుభవిస్తావు. కనుక యుద్ధానికి సిద్ధపడుము. సుఖదుఃఖాలను, లాభ నష్టాలను, జయాపజయాలను సమానమైనవిగా భావించి కర్తవ్యబుద్ధితో యుద్ధం ఆరంభించుము. నీకు పాపం రాదు - అని గీత చాటుతున్నది. సంగ్రామంలో శాత్రవవధ, యజ్ఞంలో జంతుహింస పుణ్య హేతువు లని శ్రుతులు ఘోషిస్తున్నాయి.

క. పోరుల యందలి మరణము । మారణముం బుణ్యలోక మహిత మహిమకుం
గారణ; మెఱుఁగు మహింసా । కారం బిట్టి దని నీవ కమలదళాక్షీ!' 65

ప్రతిపదార్థం: కమల దళ+అక్షీ! = పద్మ పత్రములవంటి నయనములు కలదానా!; పోరుల+అందలి = యుద్ధాలలోని; మరణము = చావు; మారణమున్ = చంపటమూ; పుణ్యలోక మహిత మహిమకున్ = స్వర్గాది ఉత్తమ లోకాలలోని పూజ్యమైన గొప్పతనానికి (అనుభవించటానికి); కారణము = హేతువు; అహింసా+ఆకారంబు = అహింస యొక్క స్వరూపం; ఇట్టిది+అని = ఇట్లాంటిదని; నీవు+అ = నీవే; ఎఱుఁగుము = తెలిసికొనుము.

తాత్పర్యం: తామర రేకులవంటి కన్నులు గలదానా! యుద్ధాలలో చావటం గాని, చంపటంగాని స్వర్గాది పుణ్యలోకాలలో పూజ్యమైన మహిమను పొందటానికి కారణం. అహింసా స్వరూప మిటువంటిదని దేవీ! నీవు గ్రహించుము.'

సీ. అని చెప్పి వెండియు హరుఁడు పార్వతితోడ । నిట్లను 'వేఁటకు నెలయు టఘము
కాదు; సస్యములు మృగములచేత నశించు; । జగమెల్ల నిర్మనుష్యంబు గాఁగఁ
గోరు మృగము; లది కారణంబుగ మృగ । హతి రాజులకు ధర్మమయ్యె; నట్లు
గాక మృగములకుఁ గలుగు సద్గతి రాజు । చే మృతిఁ బొందినఁ జెలువ! వినుము

తే. దండ్యు దండింపకుండు, ట దండ్యు దండ । నంబు గూర్చుట, విప్రుమనంబు నొచ్చు
నట్టి పనిసేఁతయును విను మనపరాధి । తనువు నొంచుట సూ హింస ధరణిపతికి'. 66

ప్రతిపదార్థం: అనిచెప్పి = అని పల్కి; హరుఁడు = ఈశ్వరుఁడు; వెండియున్ = మరల; పార్వతి తోడన్ = గిరి పుత్రికతో; ఇట్లు+అనున్ = ఈ రీతిగా పలికాడు; వేఁటకున్ = జంతువుల వేటకు; ఎలయుట = ఉద్యమించటం, ఉన్ముఖుడు కావటం; అఘము కాదు = పాపం కాదు; సస్యములు = పైరులు; మృగములచేతన్ = జంతువుల చేత ; నశించున్ = నాశన మవుతాయి; మృగములు = జంతువులు; జగము+ఎల్లన్ = లోక మంతా; నిః+మనుష్యంబు+కాఁగన్+కోరున్ = మనుష్యులు లేకుండా ఉండాలని వాంఛిస్తాయి; అది కారణంబుగన్ = ఆ హేతువుచేత; మృగహతి = జంతువులను చంపటం; రాజులకున్ = దొరలకు; ధర్మము+అయ్యెన్ = న్యాయమయింది; అట్లు+కాక = అంతేగాక; రాజుచేన్ = నృపతిచేత; మృతిన్+పొందినన్ = మరణం చెందితే; మృగములకున్ = జంతువులకు; సత్+గతి+కలుగున్ = పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది; చెలువ! = ఓ సుందరీ! వినుము = ఆలకించుము; దండ్యున్ = దండింపదగినవాడిని; దండింపక+ఉండుట = శిక్షించక మానటం; అదండ్యున్ = దండింప తగని వాడిని; దండనంబు+కూర్చుట = శిక్ష విధించటం; విప్రమనంబు = బ్రాహ్మణుడి హృదయం; నొచ్చునట్టి = బాధ చెందునట్టి; పని+చేఁతయున్ = పని చేయుటం; అనపరాధి (న+అపరాధి) = తప్పుచేయని వాడి యొక్క; తనువున్ నొంచుట = శరీరాన్ని బాధించటం; ధరణి పతికిన్ = భూభర్తకు; హింస+సూ! = హింసను కావించుటయే సుమా!

తాత్పర్యం: అని చెప్పి శర్వుడు శర్వాణితో మళ్ళీ ఇట్లన్నాడు. 'దాక్షాయణీ! రాజులకు జంతువులను వేటాడటం వలన పాపం రాదు. మృగాలు పైర్లను నాశనం చెయ్యడమేగాక లోకంలో మానవు లెవ్వరూ ఉండగూడదని కోరుకుంటాయి. కాబట్టి వాటిని సంహరించటమే రాజులకు పుణ్యకార్యం. అంతే గాక రాజుల చేతిలో హతమయ్యే మృగాలకు పుణ్యగతులు కలుగుతాయి. దండింపదగిన వారిని దండించకున్నా, దండింప తగని వారిని దండించినా, బ్రాహ్మణుడి మనస్సు నొప్పించినా, తప్పు చేయని వాడి శరీరాన్ని బాధించినా రాజు హింస చేసిన వాడే అవుతున్నాడు సుమా!'

వ. అని బోధించి. 67

తాత్పర్యం: అని తెలియజెప్పి.

క. 'భూసురుల కలుక వుట్టం । జేసి నహుష ముఖ్య నృపులు చెడుట ప్రసిద్ధం
బాసురపతి విప్రునలుకఁ । గాసిఁ బడఁడె? తెలచి పడసెఁ గాదె నయనముల్? 68

ప్రతిపదార్థం: నహుష ముఖ్య నృపులు = నహుషుడు మొదలైన రాజులు; భూసురులకున్ = బ్రాహ్మణులకు; అలుక = కోపం; పుట్టన్+చేసి = జనింప జేసి; చెడుట = నశించటం; ప్రసిద్ధంబు = లోక మెరిగిన విషయమే; ఆ సురపతి = ఆ దేవేంద్రుడు; విప్రు+అలుకన్ = బ్రాహ్మణుడి ఆగ్రహంచేత; గాసిన్+పడఁడు+ఎ? = వ్యథ చెందలేదా?; తెలచి = ఆ దేవతావల్లభుడు వేడుకొని; నయనముల్ = నేత్రాలు; పడసెన్+కాదు+ఎ? = పొందలేదా? పొందినాడని భావం.

తాత్పర్యం: నహుషుడు మున్నగు నరపతులు పెక్కుమంది బ్రాహ్మణులకు కోపం కలిగించి చెడిపోవటం లోకాని కంతా తెలుసు. దేవేంద్రు నంతటి వాడు గౌతమ మహర్షి శాపం వలన వెతలపాలు కాలేదా? తన తప్పును క్షమింపవేడుకొని సురపతి ఆ మునీంద్రుడి కృపతో కన్నులను పొందలేదా?

విశేషం: నహుషుడు చెడిన వృత్తాంతం:

అధికార మదమత్తుడైన నహుష చక్రవర్తిని క్షణకాలంలో స్వర్గ పద భ్రష్టుడిని చేశాడు అగస్త్య మహర్షి. దేవేంద్రుడు

బ్రహ్మహత్యాపాతకం వలన స్వర్గ సింహాసనాధిపత్యం కోల్పోయి నిషధాచలంలో తలదాచుకొంటున్నాడు. సుర రాజ్యాన్ని ఏలదగ్గవాడు మానవపతి నహుషుడే అని మునీంద్రులు నిర్ణయించారు. యమ వరుణాది దేవతలు తమ శక్తి ప్రభావాలను అతడికి పంచియిచ్చి దేవరాజ్యానికి అధిపతిని చేశారు. అతడు దేవ భోగాలు అనుభవిస్తూ కొంతకాలానికి మదోన్మత్తుడై లావణ్యవతి శచీదేవిని చూచి ఆమె కొరకు చెప్పి పంపుతాడు. అతడి బారినుంచి తన్ను రక్షించుమని శచీదేవి బృహస్పతిని వేడుకొన్నది. బృహస్పతి ఆమెకు ఆశ్రయమిస్తాడు. ఇది తెలిసి నహుషుడు శచిని తన దగ్గరకు పంపుమని గురుడిని ఆదేశిస్తాడు. బృహస్పతి సూచన మేరకు శచీదేవి తనకు కొంచెం గడువు కావాలని, ఈ లోపల ఇంద్ర ప్రాభవానికి తగినట్లు సప్తర్షులు మోసే అందలంలో అతడు ఊరేగటం తనకు అభిలషణీయమని నహుషుడికి చెప్పి పంపుతుంది. ఆమె మీది వ్యామోహంతో నహుషుడు ఆ పని చేస్తాడు. తేజో హీనుడవుతాడు. పల్లకిమోస్తున్న సప్తర్షులు 'గోసంప్రోక్షణంలో చెప్పబడిన మంత్రాలు నీకు ప్రమాణ భూతములా' అని అడిగినప్పుడు 'ఏంతమాత్రం కావు' అని అతడు సమాధాన మిస్తాడు. అప్పుడు అగస్త్య మహర్షి 'పెద్దలు అభినందించిన మంత్రాలను నిందించటం అజ్ఞానం' అనగానే నహుషుడు కోపించి అతని తలను తన కాలితో తంతాడు. అగస్త్యుడు పట్టరాని ఆగ్రహంతో 'నహుషా! పూజనీయులైన మహర్షులచే నీ అందలం మోయించావు. వారు కొనియాడుతున్న మంత్రాలను దూషించావు. అంతేగాక నన్ను అవమానించావు. కనుక పదభ్రష్టుడవై బహు వత్సరాలు భూలోకంలో సర్పరూపంలో పడి ఉండు' మని శాపమిస్తాడు. నహుషుడు తనకు పూర్వస్మృతి చెడకుండా ఉండేటట్లున్నూ, శాపం తొలగేందుకు ఉపాయమున్నూ ప్రసాదించుమని అగస్త్యుణ్ణి వేడుకొంటాడు. 'నీ అడిగిన ప్రశ్నలకు ఏ ఉత్తముడు సరియైన సమాధానాలిస్తాడో అతడివలన నీకు శాపాంత మవుతుం' దని ఆ మునీంద్రుడు కరుణిస్తాడు.

నహుషుడు శాపఫలంగా వెంటనే హిమాలయప్రాంత భూతలంలో అజగరమై పడి ఉంటాడు. అరణ్యవాస కాలంలో భీముడు ఒంటరిగా వేటకని వెళ్ళి ఆ అజగరం చేత బంధితు డవుతాడు. తమ్ముడిని వెదకుతూ ధర్మరాజు అక్కడికి వచ్చి భీముడిని విడిచి పెట్టుమని ఆ మహాసర్పాన్ని కోరుతాడు. అజగర రూపుడైన నహుషుడు తన వృత్తాంతాన్ని వినిపించి 'తన ప్రశ్నలకు సమాధాన మిచ్చి శాపం బాపు'మని పల్కుతాడు. అతని ప్రశ్నలన్నింటికి ధర్మజుడు తగిన జవాబులిచ్చి అతనికి శాపవిముక్తి కలిగిస్తాడు. దివ్యరూపధరుడైన నహుషుడివలన అధ్యాత్మ రహస్యాలు గ్రహించి ధర్మతనయుడు తమ్ముడితో కలసి వెడలిపోతాడు. బ్రాహ్మణుడి ఆగ్రహంవలన నహుషుడికి పట్టిన దుర్గతీ, అతడి అనుగ్రహం వలన లభించిన శాపవిముక్తీ ఆరణ్యపర్వంలోని అజగరోపాఖ్యానంలో తెలుపబడ్డాయి.

క. కావున విప్రారాధకుఁ । డై వెలయు విభుండు రాష్ట్ర మతనిధనము సై
న్యావలి బంధుల విప్రుల । దీవనలం బొదలు నింత తెల్లము దేవీ!' 69

ప్రతిపదార్థం: దేవీ! = ప్రాణేశ్వరీ!; కావునన్ = కాబట్టి; విప్ర+ఆరాధకుఁడు+ఐ = బ్రాహ్మణులను పూజించేవాడై; విభుండు = = రాజు; వెలయున్ = వెలుగొందుతాడు; రాష్ట్రము = రాజ్యం; అతని ధనము = ఆ ప్రభువు యొక్క విత్తం; సైన్య+ఆవలి = సేనా సమూహం; బంధువుల = చుట్టాల యొక్క; విప్రుల = భూసురుల యొక్క; దీవనలన్ = ఆశీర్వాదములచే; పొదలున్ = వృద్ధి పొందుతుంది; ఇంత తెల్లము = ఈ విషయం విస్పష్టం.

తాత్పర్యం: ప్రియురాలా! కాబట్టి రాజు బ్రాహ్మణులను సేవించటం వలననే ప్రకాశిస్తాడు. అతడి రాజ్యం, ధనం, సైన్య సముదాయం, చుట్టాల యొక్క, విప్రులయొక్క ఆశీస్సుల వల్ల వృద్ధి చెందుతాయి. ఇది విస్పష్టమైన విషయం.'

వ. అని నిర్దేశించి కపర్ది గౌరితో వెండియు. 70

ప్రతిపదార్థం: అని నిర్దేశించి = అంటూ నిర్ణయపూర్వకంగా చెప్పి; కపర్ది = శివుడు; గౌరితోన్; వెండియున్ = మరల.

తాత్పర్యం: అని నిర్ణయించి చెప్పి శంకరుడు గౌరితో మళ్ళీ ఇట్లా అన్నాడు.

ఆ. 'పరమ మంత్రవిధులఁ బశువులు యూపంబు । లందుఁ గట్టఁబడి మహాశుచిత్వ
విభవ మొందు విహిత విశసన క్రియ మేను । విడిచి దివ్యసుఖము వడయుఁ బొలఁతి! 71

ప్రతిపదార్థం: పొలఁతి! = ఓ వనితా!; పశువులు = బలినొసగుటకు తీసుకు రాబడిన పశువులు; పరమ మంత్ర విధులన్ = శ్రేష్ఠములైన మంత్ర కలాపములతో; యూపంబులందున్ = యూపస్తంభాలయందు; కట్టన్+పడి = బంధించబడి; మహా శుచిత్వ విభవమున్ = పరమ పావనత్వమహిమను; ఒందున్ = పొందును; విహిత విశసన క్రియన్ = శాస్త్ర సమ్మతమైన సంహార క్రియచేత; మేనున్ = శరీరమును; విడిచి = వదలి; దివ్యసుఖమున్ = స్వర్లోకసౌఖ్యాన్ని; పడయున్ = పొందును.

తాత్పర్యం: 'అపర్ణా! ధేనువులు యాగశాలలో యూప స్తంభాలకు మంత్రాలతో బంధించబడి పరమ పవిత్రా లవుతున్నవి. శాస్త్ర సమ్మతంగా వధించబడి శరీరం విడిచి స్వర్గలోకంలో దివ్యసుఖాలు అనుభవిస్తాయి.

విశేషం: యూపము = యజ్ఞ పశువును కట్టుటకై పాతిన కొయ్య.

క. హోమ విధులఁ దన్మాంసము । లామిషములు గాఁగ నొసఁగి యమరుల నగ్ని
ష్టోమాదులఁ బ్రోవఁగఁ బర । మామిత సౌఖ్యములు గల్గు యజమానులకున్. 72

ప్రతిపదార్థం: హోమ విధులన్ = హోమ కార్యాలలో; తత్+మాంసము = యజ్ఞపశువుల మాంసము; ఆమిషములు కాఁగన్ = భోగ్యవస్తువులుగా; ఒసఁగి = సమర్పించి; అమరులన్ = దేవతలను; అగ్నిష్టోమ+ఆదులన్ = వసంతకాలంలో సల్పే అగ్నిష్టోమం మొదలైన యాగాలచే; ప్రోవఁగన్ = పోషించగా; యజమానులకున్ = యాగములు చేసేవారికి; పరమ+అమిత+సౌఖ్యములు = శ్రేష్ఠమైన మితిమీరిన సుఖాలు (మోక్షం); కల్గున్ = లభిస్తాయి.

తాత్పర్యం: అగ్నిష్టోమం మొదలైన యజ్ఞాలలో హోమాదుల ద్వారా దేవతలకు భోగ్యవస్తువుగా పశుమాంసం సమర్పించి తృప్తికలిగించటం వల్ల, యజ్ఞకర్తకు అమరులవల్ల అమితమైన ఉత్తమమైన సౌఖ్యాలు కలుగుతాయి.

క. శ్రుతి విహితహింస హింసగ । మతిఁ దలఁపఁగ రాదు ముని సమాజం బిది దు
ష్కృత తతిఁ బాపెడు పరమ సు । కృతమని కొనియాడుఁ గాన గీర్వాణనుతా! 73

ప్రతిపదార్థం: గీర్వాణనుతా! = దేవతలచే కొనియాడబడే గౌరీ!; శ్రుతి విహిత హింస = వేదంచేత విధించబడిన హింస; ఇది= ఇద్ది; దుష్కృత తతిన్ = పాపసమూహాన్ని; పాపెడు = తొలగించే; పరమసుకృతము+అని = మహా పుణ్య కర్మఅని; ముని సమాజంబు = మునుల సంఘం; కొనియాడున్+కాన = మెచ్చుతున్నారు గనుక; హింసగన్ = హింసాకార్యంగా; మతిన్ = మనస్సునందు; తలఁపఁగన్ +రాదు = భావించకూడదు.

తాత్పర్యం: గౌరీ! యజ్ఞాలలో చేసే పశుహింస హింసకాదని వేదాలు శాసిస్తున్నాయి. యాగాలలోని పశుహింస పాపాలను పటాపంచలు గావించే పుణ్యకార్యమని మునీశ్వరులు కొనియాడుతున్నారు. కనుక పశువధను హింసాకార్యంగా భావించరాదు.'

ఆ. అని యహింస తెఱఁగు లన్నియు నెఱిఁగించి । 'యింక నేమి వినఁగ నిచ్చసేసె?'
దనిన రుద్రు నడిగె నద్రిజ 'జనుల జీ । వనము తెఱఁగు లెల్ల వనజనాభ!' 74

ప్రతిపదార్థం: అని = అంటూ; అహింస తెఱఁగులు+అన్నియున్ = అహింస యొక్క స్వరూపాలు సమస్తం; ఎఱిఁగించి = పార్వతికి తెల్పి; ఇంకన్ = ఇటుపై; ఏమి వినఁగన్ = ఏమి ఆలకించవలెనని; ఇచ్చ+చేసెదు? = వాంఛిస్తున్నావు?; అనినన్ = అని శంభుడు పల్కఁగా; వనజనాభ! = కమలములవంటి కన్నులుగల శ్రీకృష్ణా!; అద్రిజ = కొండకూతురు ఉమాదేవి; జనుల = మానవుల యొక్క; జీవనము తెఱఁగులు+ఎల్లన్ = జీవన విధానము లన్నింటినీ, బ్రతుకు తెరువు లెల్ల; రుద్రున్ = శంకరుడిని; అడిగెన్ = ప్రశ్నించింది.

తాత్పర్యం: ఈశ్వరుడు అహింస యొక్క స్వరూప స్వభావా లన్నింటినీ తెలిపి, 'గౌరీ! నీ వింకా ఏమి వినాలని అభిలషిస్తున్నావు?' అని అడిగాడు. ఆమె 'నాథా! జగములోని జనుల జీవన విధానా లెట్టివో చెప్పు' మని రుద్రుడిని కోరింది శ్రీకృష్ణా! అని నారదుడు కృష్ణుడితో అన్నాడు.

సీ. అడిగిన నద్దేవి కద్దేవుఁ డిట్లనుఁ । ' గాంత! మానుష్యంబు కర్మభూమి;
సుఖదుఖమూలముల్ సురతిర్యగాత్మక । త్వంబు; లట్లగుట విత్తంబు వలయు
మనుజుల; కెట్లన్న విను ధర్మకామముల్ । విత్తసాధ్యంబులు; విద్య వార్త
సేవ కార్షత యర్థసిద్ధికి మూలముల్; । విద్యవానికి ననవద్యతయును'

ఆ. గర్షకునకు నేల కాల మెఱుంగుట, । జట్టికాని కేది సంభవించె
నందు విలువ మొదలునగు లాభమును నెడ । వ్యయము గల్గుటయు శివ ప్రదములు. 75

ప్రతిపదార్థం: అని+అడిగినన్ = అని అపర్ణ ప్రశ్నించగా; ఆ దేవికిన్ = ఆ స్వప్రకాశ స్వరూపిణికి; ఆ దేవుఁడు = సర్వజ్ఞుడైన త్రిలోచనుడు; ఇట్లు+అనున్ = ఈ రీతిగా వచించాడు; కాంత = ఓ రమణీ! మానుష్యంబు = మనుష్యత్వం, మనుజలోకం; కర్మభూమి = కర్మలాచరించే చోటు; సుర+తిర్యక్+ఆత్మకత్వంబులు = దేవతల యొక్క, పశు పక్ష్యాదుల యొక్క జన్మాలు; సుఖదుఃఖమూలముల్ = వరుసగా సుఖానికి, దుఃఖానికి కారణాలు (స్థానాలు); అట్లు+అగుటన్ = అందుచేత; మనుజులకున్ = నరులకు; విత్తంబు = ద్రవ్యం; వలయున్ = కావాలి, అవసరం; ఎట్లు+అన్నన్ = ఎందుకంటే; విను = ఆలకించుము; ధర్మ కామముల్ = ధర్మ కామ పురుషార్థాలు అనగా పుణ్యకార్యాలు చెయ్యటం, కోరికలు తీర్చుకోవటం అనేవి; విత్తసాధ్యంబులు = డబ్బు చేతనే పొందతగినవి; విద్య = చదువు; వార్త = వాణిజ్యం సల్పుట; సేవ = దాస్యం, పనులు చెయ్యటం; కార్షత = కృషీవలత్వం, వ్యవసాయంచెయ్యడం; అర్థ సిద్ధికిన్ = డబ్బు రాబడికి, ధనం లభించటానికి; మూలముల్ = హేతువులు; విద్య వానికిన్ = చదువుగలవాడికి, విద్యావంతుడికి; అనవద్యతయును = ఆచారాదులచేత నిందారాహిత్యం, మాట పడకుండటం; కర్షకునకున్ = సేద్యం చేసేవాడికి; నేల, కాలము+ఎఱుంగుట = భూసారం, విత్తుటకు తగిన ఋతువేదో తెలియటం; జట్టి కానికిన్ = వర్తకుడికి; ఏది = ఏ వస్తువు, ఏ సరకు; సంభవించెన్ = లభిస్తుందో; అందున్ = ఆ ప్రదేశంలో; విలువన్ = కొనుటకు; మొదలు = మూలధనం; అగులాభమును = సమకూడే ఆదాయం; ఎడవ్యయము = అందుకు అయ్యేఖర్చులు; కల్గుటయున్ = కలగటం; శివ ప్రదములు = శుభాన్నిస్తాయి.

తాత్పర్యం: పార్వతి ఆ విధంగా అడిగినప్పుడు శివుడిట్లా అంటున్నాడు. 'దేవీ! మానవలోకం కర్మ భూమి. దేవత్వం సుఖాలకూ, పశుపక్ష్యాదులుగా జన్మించటం దుఃఖా లనుభవించడానికీ కారణ మవుతున్నాయి. అందువల్ల మనుష్యులకు

ధనం కావాలి. ఎందుకంటే పుణ్యకార్యాలు ఆచరించవలెనన్నా, కోరికలు తీర్చుకొనాలన్నా ధనం అవసరం. విద్యగలవాడికి నిందా రాహిత్యం, సేద్యం చేసికొనే వాడికి పొలము యొక్కసారం, విత్తేసమయం అనగా ఋతుధర్మం తెలిసి ఉండటం, వర్తకుడికి ఆయాతావులలో దొరికే సరుకులను అక్కడ కొనుగోలు చెయ్యటానికి మూలధనం (పెట్టుబడి), పెట్టుబడితో వచ్చే లాభం, అందుకు అయ్యే వ్యయం తెలియడం శుభాన్ని కలిగిస్తాయి.

విశేషం: "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః"

సత్త్వరజస్తమోగుణాలు, వాటికి తగ్గ శమదమాది కర్మలూ విభాగించి నేనే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను సృష్టించాను అని భగవానుడు గీతలో ఉగ్గడిస్తూ --

"శమో దమ స్తప శ్శౌచం క్షాన్తి రార్జవ మేవ చ,
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్." (భగ. 18-42)

శమం (బాహ్యేంద్రియనిగ్రహం), దమం (మనోనిగ్రహం), తపస్సు, శౌచం, ఆర్జవం (త్రికరణశుద్ధి), జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యం - అనేవి బ్రాహ్మణుడికి స్వభావంతో పుట్టిన కర్మలుగా పేర్కొన్నాడు. ఆలాగే-

"కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్,
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్".

వ్యవసాయం, పశు సంరక్షణ, వర్తకం వైశ్యుడికి సహజలక్షణాలనీ, బ్రాహ్మణాది వర్ణాలకు సేవచేయడమే శూద్రుడికి సహజ ధర్మమూ, జీవిక అనీ పరమాత్మ గీతలో చెప్పటం జరిగింది. 66వ పద్యంలో రాజధర్మాలు వివరించటం జరిగినందున ఈ పద్యంలో మళ్ళీ రాజకులోచిత ధర్మాలు, జీవనోపాయం చెప్పబడలేదు.

క. పసులం బాలించునతఁడు । విసువక యేమఱక వాని విధము లెఱిఁగి ప్రో
చి సమర్థుం డగు; వెరవునఁ । బసిఁ గను సేవకుఁడు ధనముఁ బడయుఁ బొగడుతోన్. 76

ప్రతిపదార్థం: పసులన్ = పశువులను; పాలించు+అతఁడు = కాచేవాడు; విసువక = శ్రమ అనుకోక; ఏమఱక = అలక్ష్యం చేయక, ఉపేక్షించక; వానివిధములు+ఎఱిఁగి = వాటి కష్టసుఖాలు తెలిసికొని; ప్రోచి = కాపాడి, సంరక్షించి; సమర్థుండు+అగున్= నేర్పుకాడవుతాడు; వెరవునన్ = ఉపాయంతో, మెలకువతో; పసిన్ = పసరాలను; కను = చూచుకొనే; సేవకుఁడు = పనివాడు; పొగడుతోన్ = ప్రశంసతో, కీర్తితో; ధనమున్ = డబ్బును; పడయున్ = పొందుతాడు;

తాత్పర్యం: పశువులను పాలించేవాడు విసుగు చెందక, ప్రాలుమాలక వాటి కష్టసుఖాలు గమనిస్తూ కాపాడి నేర్పుకాడనిపించుకొంటాడు. మెలకువతో పశువులను చూచుకునేవాడు కీర్తితోపాటు ధనం గడిస్తాడు.

క. వంచనయును జాడ్యంబును । నించుకయును లేక ప్రభువు నిష్ట మెఱిఁగి తాఁ
బంచిన పని వెరవునఁ గా । వించిన కర్మకరుఁ డొందు విపుల ధనంబుల్.' 77

ప్రతిపదార్థం: వంచనయున్ = మోసమునూ; జాడ్యంబును = అలసత్వమూ, సోమరితనమూ; ఇంచుకయును లేక = కొంచెమైనను కలుగక; ప్రభువు+ఇష్టము = యజమానుడి కోరిక; ఎఱిఁగి = తెలిసి; తాన్ = తాను (సేవకుడు); పంచిన పనిన్ = ఆజ్ఞాపించిన కార్యమును; వెరవునన్ = నేర్పుతో; కావించిన = చేసినట్టి; కర్మకరుఁడు = పని మనిషి, సేవకుడు, భృత్యుడు; విపుల ధనంబుల్ = విస్తారమైన విత్తమును, సిరిని; ఒందున్ = పొందుతాడు.

తాత్పర్యం: మోసం, సోమరితనం లేక తన యజమానుడి పనిని అతడి యిష్టప్రకారం నెరవేర్చే సేవకుడు విస్తారమైన ధనం పొందుతాడు.'

వ. అని వెండియు. 78

తాత్పర్యం: అని మరల. (శంకరుడు పార్వతితో అట్లని మరల ఇట్లంటున్నాడు అని తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పరధన పరదారల నప । హరింపమియు, దేవపితృ సమారాధనముం
గరుణయు నతిథి సపర్యయు । గిరితనయా! యెల్లవారికిం గృత్యంబుల్.' 79

ప్రతిపదార్థం: గిరితనయా! = పర్వతపుత్రీ!; హైమవతీ! పరధన = ఇతరుల విత్తమునూ; పరదారలన్ = ఇతరుల పత్నులనూ; అపహరింపమియున్ = దొంగిలించకుండటం, కాజేయకుండటం; దేవపితృసమారాధనమున్ = దేవతలయొక్క పితృదేవతల యొక్క పూజనమూ; కరుణయున్ = దయాగుణమున్నూ; అతిథిసపర్యయున్ = అతిథులకు సేవ చేయటమూ; ఎల్లవారికిన్ = అందరికీ; కృత్యంబుల్ = చేయదగిన పనులు.

తాత్పర్యం: 'పార్వతీ! పరులధనమునూ, పరుల పత్నినీ కోరకుండటం; దేవతలను, పితృదేవతలను ఆరాధించటం; కృపాగుణం కలిగిఉండటం; అతిథి సేవ చేయటం అందరూ ఆచరించవలసిన ధర్మాలు.'

శివుఁడు పార్వతికి వర్ణకర్మ పరిపాకంబుల తెఱంగెఱింగించుట (సం.13 అను 1-15-1525)

వ. అనిన విని యపర్ణాదేవి 'వర్ణంబుల కర్మంబులు పాకంబుఁ బొందు ప్రకారంబు చెప్పు' మని య
ప్పరమేశ్వరు నడిగిన నతం డిట్లనియె. 80

ప్రతిపదార్థం: అనినన్ విని = అని పరమశివుడు పల్కగా ఆలకించి; అపర్ణాదేవి = ఉమాదేవి; వర్ణంబుల కర్మంబులు = బ్రాహ్మణాది జాతులవారు చేయు పనులు; పాకంబున్+పొందు+ప్రకారము = పక్వమయ్యే తీరు; చెప్పుము+ అని; ఆ+పరమ+ ఈశ్వరున్+అడిగినన్; అతండు = ఆ శివుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శివుడు చెప్పగా ఆలకించి 'కులముల యొక్క కర్మలు పరిపక్వమయ్యే విధమెట్టిదో తెల్పు'మని గౌరీదేవి కోరగా ఈశ్వరు డిట్లా అన్నాడు.

విశేషం: పరమేశ్వరుడిని పతిగా కోరి పార్వతి పర్ణములు = ఆకులు కూడ మెసవక ఘోర తపస్సు చేసింది గనుక ఆమెకు అపర్ణ అని పేరు వచ్చింది.

చ. 'తమ తమ కర్మముల్ తెరువు దప్పక చేసినవారు దేవలో
కమున సుఖంబు పొందుదురు; క్రమ్మఱ వచ్చియుఁ బూర్వజాతి జ
న్మమున మహర్ధిఁ బొందుదురు; మానిని! యిమ్మెయిఁ దప్పి యెట్టి కృ
త్యములఁ జరించి రజ్జనుల కట్టి కులంబునఁ బుట్టు వాటిలున్. 81

ప్రతిపదార్థం: మానిని = అభిమానవతీ! గౌరీ!; తెరువు+తప్పక = దారి తప్పక; తమ తమ కర్మముల్ = తమ తమ కుల వృత్తులు; చేసినవారు = సల్పినట్టి వారు; దేవలోకమునన్ = స్వర్గభువనంలో; సుఖంబు+పొందుదురు = సౌఖ్యాలు అనుభవిస్తారు;

క్రమ్మఱి వచ్చియున్ = పుణ్యం క్షీణించగానే తిరిగి ధరణికి వచ్చి కూడా; పూర్వజాతిజన్మమునన్ = మునుపటి కులంలోని పుట్టుకతో; మహా+బుద్ధిన్ = మిక్కిలిపెంపును; పొందుదురు = చెందుతారు; ఈ+మెయిన్+తప్పి = ఈ విధానం విడిచి; ఎట్టి కృత్యములన్+చరించిరి = ఎట్టి పనులలో ప్రవర్తిస్తారో; ఆ+జనులకున్ = ఆ నరులకు; అట్టి కులంబునన్ = అట్టివర్ణంలోనే; పుట్టు = పుట్టుక; పాటిలున్ = కలుగుతుంది.

తాత్పర్యం: 'హైమవతీ! ఆయా కులాలకు విధింపబడిన కర్మలను శ్రద్ధతో చేసే వారు స్వర్గలోకంలో సుఖమనుభవిస్తారు. పుణ్యం క్షీణించగనే వారు అక్కడ నుండి వచ్చి మళ్ళీ భూతలంలో మునుపటి కులాలలోనే జన్మించి మిక్కిలి అభివృద్ధి పొందుతారు. అట్లా కాకుండ తమ తమ కుల ధర్మాలు వదలి ఏయేకర్మలు చేస్తారో, ఆయా కర్మలను బట్టి వారు ఆయాకులాలలో పుట్టుతారు.

విశేషం: "స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు." - (భగ. 18-45)

"యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః." - (భగ. 18-46)

అర్జునా! తమ తమ వర్ణ ధర్మాలను వదలక ఆదరంతో ఆచరించే వాడు పరమపదాన్ని పొందుతాడు. అదెట్లాగో చెప్పుతాను వినుము. సకలభూతముల వ్యాపారాలు ఆ పరమాత్మవలననే జరుగుతున్నాయి. చరాచరాత్మకమైన జగమంతటా అతడు నిండి ఉన్నాడు. అట్టి పరమాత్మను మానవుడు తనకు విధించబడిన కర్మతో ఆరాధించి సిద్ధిని పొందుతున్నాడు - అని అర్జునుడికి భగవంతుడి ఉపదేశం.

క. **ఎంతెంత మేలు చేసిన । నంతంతియ కులము నెక్కుడై సమకూరుం**
గాంతా! విప్రుఁ డయిన న । త్యంతానంద మగులోక మతనికిఁ గలుగున్.' **82**

ప్రతిపదార్థం: కాంతా! = రమణీ!; ఎంత+ఎంత = ఏపాటి, ఏ కొలది; మేలు చేసినన్ = ఉపకారం చేస్తాడో; అంత+అంతియ = అంతకు తగినట్టి; కులము = జాతి; ఎక్కుడు+ఐ+సమకూడున్ = గొప్పగా లభిస్తుంది; విప్రుఁడు+అయినన్ = బ్రాహ్మణుడై జన్మిస్తే; అతి+ఆనందము+అగు లోకము = మిక్కిలి సంతోష భరితమైన లోకం; అతనికిన్ = ఆ భూసురుడికి; కలుగున్ = లభిస్తుంది.

తాత్పర్యం: ఎవడు ఏ పాటి పుణ్యం చేస్తాడో వాడికి ఆ పాటి ఉత్తమ కులం లభిస్తుంది. అధిక పుణ్య ఫలంగా నరుడు బ్రాహ్మణ జాతిలో జన్మిస్తే అతడికి నిత్యానందమయమైన ఉత్తమ లోక ప్రాప్తి కలుగుతుంది.'

వ. **అని చెప్పి మఱియును.** **83**

తాత్పర్యం: శంభుడు గిరిజతో అట్లా చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

ఉ. **'ఆపదఁ దూలపోక సిరి నంది మదింపక శౌర్యవృత్తిమైఁ**
బాపుల గెల్చి యార్జవము బంధుజనాలికి నార్యకోటికిన్

జూపుచు దీనులం గరుణఁ జూచి తగం గలమాత్రఁ బ్రోచుచున్
గోపము లేక మన్కి గలుగున్ దివిజాంశమునన్ జనించినన్.' 84

ప్రతిపదార్థం: దివిజ+అంశమునన్ = దేవతల అంశంలో; జనించినన్ = పుడితే; ఆపదన్ = కష్టంవచ్చినప్పుడు, విపత్తులో; తూలపోక = చలించక, నొవ్వక, బాధపడక; సిరిన్ = సంపదను; అంది = పొంది; మదించక = గర్వించక; శౌర్య వృత్తిమైన్ = శూరత్వంతో, పరాక్రమంతో; పాపులన్ గెల్చి = కలుషాత్ములను జయించి; ఆర్జవము = చక్కని నడవడిక, ఋజువర్తన; బంధుజన+ఆళికిన్ = చుట్టాల సమూహానికి; ఆర్యకోటికిన్ = పెద్దల సముదాయానికి; చూపుచున్ = కనబరచుతూ, దీనులన్ = నొచ్చినవారిని, దిక్కులేని వారిని; కరుణన్+చూచి = దయతో ఆదరించి; తగన్ = ఒప్పిదముగ; కలమాత్రన్ = తనశక్తికి తగినట్లు; ప్రోచుచున్ = కాపాడుతూ; కోపము లేక మన్కి = ఆగ్రహంలేని బ్రతుకు; కలుగున్ = లభిస్తుంది.

తాత్పర్యం: దేవతల అంశలో జన్మించిన వాడు ఆపదలయందు చలించడు. సంపదలయందు గర్వించడు. పరాక్రమంతో పాపులను జయిస్తాడు. బంధుజనముల యెడ, పెద్దల సమూహం పట్ల ఋజు ప్రవర్తనతో మెలగుతాడు. దీనుల యందు కనికరం కలిగి తన శక్తి మేరకు వారిని సంరక్షిస్తాడు. కోపతాపాలు లేని మనుగడతో విరాజిల్లుతాడు.'

క. అనిన విని గౌరి 'కొందఱు । మనుజులు సంపద సుఖించి మనఁ గొందఱు లే
మి నలంగి దుఃఖ పడుదురు; । విన వలతుం గారణంబు; వినిపింపు శివా!' 85

ప్రతిపదార్థం: అనినన్+విని = పరమశివుడు అట్లా చెప్పగా ఆకర్ణించి; గౌరి = నగరాజకుమారి; శివా! = పరమేశ్వరా!; కొందఱు = కొంతమంది; మనుజులు = మానవులు; సంపదన్ = ఐశ్వర్యంతో; సుఖించి మనన్ = సౌఖ్యా లనుభవిస్తూ బ్రతుకగా; కొందఱు = కొంతమంది; లేమిన్ = లేమిడితో, పేదరికంతో, దారిద్ర్యంతో; నలంగి = బాధచెంది, నొచ్చి; దుఃఖము+పడుదురు = చింతిస్తుంటారు; కారణంబు = ఇందుకు హేతువు; వినన్ = వినుటకు; వలతున్ = వాంఛిస్తాను; వినిపింపు = చెప్పవలసినది.

తాత్పర్యం: అని మహాదేవుడు చెప్పగా విని భవాని 'హృదయేశ్వరా! పుడమిలో కొందరు సిరిసంపదలతో తులదూగుతూ సుఖా లనుభవిస్తుండగా మరి కొంతమంది పేదరికంతో అగచాట్లపాలై దుఃఖపడుతుంటారు. ఇందుకు కారణ మేమిటో వినగోరుతున్నాను. సెలవియ్యండి.'

చ. అనుటయు శంభుఁ డిట్లను 'దయన్ బలి భిక్షము పెట్టలేమిఁ గుం
దిన చెలిఁ జుట్టముం బిలిచి దీనత వాపి యపాపవృత్తిఁ జె
ల్లిన తొలుబాము గల్గునరు లెస్సగ మంచు విధాత; నిష్కృపా
త్ముని నతిలోభ దూషితుని దుర్గతి దుఃఖితుఁ జేయుఁ బార్వతీ!' 86

ప్రతిపదార్థం: అనుటయున్ = అని సర్వమంగళ పలుకగా; శంభుఁడు = శంకరుడు; ఇట్లు +అనున్ = ఈలాగున పలికాడు; పార్వతీ = గిరిజా!; దయన్ = కారుణ్యంతో; బలి = భూతములకు (కాకులు మొదలైనవాటికి); బలి = ఆహారం (పిడికెడు మెతుకులు); భిక్షము = యాచకులకు చేరెడు బియ్యం; పెట్టన్+లేమిన్ = పెట్టుటకు లేనందున; కుందిన = చింతించిన, దుఃఖించిన; చెలిన్ = మిత్రుడిని; చుట్టమున్ = బంధువును; పిలిచి = ఆహ్వానించి, రమ్మని; దీనత+పాపి = దరిద్రతను

తొలగించి, వారి పేదరికాన్ని నిర్మూలించి; అపాపవృత్తిన్ = కలుషరహితమైన ప్రవర్తనతో, పుణ్య వర్తనతో; చెల్లిన = సాగిన, గడచిన; తొలుబాము+కల్గు+నరున్ = ముందటి జన్మముగల, పూర్వజన్మం కలిగిన మనుజుడిని; విధాత = బ్రహ్మదేవుడు; లెస్సగన్ = చక్కగా, బాగుగా; మన్పున్ = అన్న వస్త్రాదులిచ్చి పోషిస్తాడు, జీవింపజేస్తాడు; నిస్+కృపా+ఆత్మునిన్ = దయలేని మనసు గలవాడినీ, అతిలోభ దూషితున్ = పరమ దురాశాపరుడిని, పిసినారి తనం గలవాడిని; దుర్గతి దుఃఖితున్+చేయున్ = పేదరికంతో విలపించేవాడినిగా చేస్తాడు.

తాత్పర్యం: ఉమాదేవి అట్లా అడిగితే శివు డిట్లా అన్నాడు. 'గౌరీ! భూతములకు బలి సమర్పణ చెయ్యటానికి, యాచకులకు బిచ్చం వెయ్యటానికి ఏమీలేక ఎంతో బాధపడుతున్న తన మిత్రులను, చుట్టాలను రమ్మని చెంతకు చేరదీసి వారి పేదరికాన్ని తొలగించి పుణ్య ప్రవర్తనతో పూర్వజన్మం గడపిన పురుషుడికి బ్రహ్మదేవుడు అధికంగా సిరిసంపద లిచ్చి కాపాడుతాడు. అట్లా కాకుండా తొలి జన్మలో దయారహితుడై, పరమలుబ్ధుడై (పిసినిగొట్టై) జీవితం గడపిన వాడిని ఈ జన్మలో కష్టాలపాలు చేసి దుఃఖపడేటట్లు చేస్తాడు బ్రహ్మ.

విశేషం: భవమునకు వికృతి పదం బాము. తొలుబాము = పూర్వభవము = ముందటి జన్మము - జన్మాంతర సుకృతదుష్కృత ఫలానుభవం తప్పదని నిరూపణ చేస్తాయి.

క. వినుమలుకయుఁ గూర్మియు లే । వనవద్యా! యెజ్జనంబులందును విధికిన్
మును చేసిన కర్మము ఫల । మనుభవ గోచరము సేయు నంతియ తఱితోన్.' 87

ప్రతిపదార్థం: అనవద్యా! = అనింద్యచరిత్రురాలా!; వినుము = ఆలకించుము; విధికిన్ = బ్రహ్మకు, పరమేష్ఠికి; ఏ+జనంబుల +అందున్ = ఏ మనుష్యుల యందూ; అలుకయున్ = కోపమూ, కినుక; కూర్మియున్ = ప్రేమయూ; లేవు = కలుగవు; మును చేసిన కర్మము ఫలము = వారు మునుపటి జన్మలలో చేసిన కర్మల యొక్క ఫలం; తఱితోన్ = సమయమునందు; అనుభవ గోచరము+చేయున్ = అనుభవానికి వచ్చేటట్లుచేస్తుంది; అంతియ = ఇంతేసుమా! ఇంతకన్న వేరేమీ లేదు.

తాత్పర్యం: ప్రాణేశ్వరీ! చెప్పుతాను వినుము. బ్రహ్మదేవుడికి ఏ జీవుల యందు కోపం గానీ, ప్రేమగానీ లేవు. కానీ ఆయా జనులు పూర్వజన్మలలో చేసికొన్న కర్మలఫలం అనుభవించవలసిన వేళరాగానే వారి అనుభవానికి వస్తుంది. ఇంతేగాని ఇందుకు వేరే కారణం లేదు.'

విశేషం: "సమోఽహం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యో భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్." (భగ. 9-29)

నేను సర్వ ప్రాణులపట్ల సమానుడిని. నాకు ద్వేషించ తగిన వాడుగాని, ఇష్టుడుగాని లేడు అని గీతలో భగవానుడు చెప్పినట్లు జగత్సృష్టికర్తకు ఒకరిపట్ల కినుకగానీ, మరొకరిపట్ల ప్రేమగానీ లేవు. ఆయా జీవులు చేసికొన్న సుకృత దుష్కృతాలే వారి సుఖదుఃఖాలకు హేతువులు.

వ. అని యెఱింగించి వెండియు. 88

తాత్పర్యం: అని తెలిపి పరమేశ్వరుడు మళ్ళీ (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'ధనము గలిగియుండి ధవళాక్షి! కుడువక । కట్టకుండు పరమకష్టజనము
లొరువు లొత్తిచెప్పనుపకారులై తొలు । పుట్టునందు మనిన యట్టివారు. 89

ప్రతిపదార్థం: ధవళ+అక్షి! = తెలి కన్నులదానా!; ధనము+కలిగి+ఉండి = చేతిలో దండిగా డబ్బుండి కూడా; కుడువక = తిండి తినక; కట్టక+ఉండు = దుస్తులు ధరించకుండే; కష్టజనులు = పరమనీచులు; ఒరువులు = ఇతరులు; ఒత్తి చెప్పన్ = నొక్కి చెప్పగా, గట్టిగా నిర్బంధించి చెప్పగా; ఉపకారులు+ఐ = పరులకు మేలొనర్చువారై; తొలు పుట్టు+అందున్ = పూర్వజన్మలో, మునుపటి పుట్టువులో; మనిన+అట్టివారు = జీవించినటువంటివారు సుమా!

తాత్పర్యం: 'దేవీ! విశాలాక్షీ! పూర్వజన్మలో ఇరుగు పొరుగువారు నొక్కి నొక్కి చెప్పగా, వారి నిర్బంధానికి తలయొగ్గి పరులకు ఉపకారం చేస్తూ ఆ బ్రతుకు అట్లా వెళ్లబుచ్చినవారు ఇప్పుడు సిరి సంపద లుండికూడా కమ్మగా భుజించక, మంచి ఉడుపులు ధరించక నీచంగా జీవిస్తున్న ఆ జనులే సుమా!

ఆ. తమకు ధనము లేక తగు భోగముల కెవ్వ । రైన నడప మను సుఖాఢ్యజనులు
తొల్లి పేదవార లుల్ల మర్థుల కెప్డుఁ । బెట్టఁగోరుచుండి నట్టివారు. 90

ప్రతిపదార్థం: తమకున్ = తమకు; ధనము లేక = ద్రవ్యం లేకున్ననూ; తగు భోగములకున్ = కావలసిన సుఖానుభవాలకు; ఎవ్వరు+ఐనన్ = ఎవ్వరెవ్వరో; నడపన్ = జరుపుతుండగా, ఇస్తూఉంటే; మను = జీవించునట్టి; సుఖ+ఆఢ్య+జనులు = సుఖాలనుభవిస్తున్న పుణ్యాత్ములు; తొల్లి = పూర్వం, మునుపు ; పేదవారలు = దరిద్రులు, బీదవాళ్ళు; ఉల్లము = మనస్సు; అర్థులకున్ = అడుగుకునేవాళ్ళకు, యాచకులకు; ఎప్డు = ఎల్లప్పుడూ; పెట్టన్+కోరుచున్+ఉండిన+అట్టివారు = ఇవ్వవలెనని వాంఛించే వారేసుమా!

తాత్పర్యం: ఇపుడు తమకు విత్తం లేకపోయినప్పటికీ ఇతరుల సహాయ సహకారాలతో సుఖాలు అనుభవిస్తున్న జనులు వెనుకటి జన్మలో తాము పేదవారైనప్పటికీ తమ మనసులలో ఎల్లప్పుడు పేదసాదలకు పెట్టి పోషించవలెనని వాంఛించే ఉదారులే సుమా!

విశేషం: పెట్టే శక్తి తనకు లేకపోయినా పెట్టవలెననే సంకల్ప ముంటే చాలు. అదే తన భావి సుఖానికి మూల మవుతుంది. తను పెట్టకపోయినా పెట్టే ఇల్లు చూపటం తనకు ఎంతో మేలుచేకూరుస్తుంది అని చెప్పటానికి ఇటువంటి సూక్తులే మూలం.

సీ. ఆయాసపడకుండ నర్థంబు చేరెడు । వారు పాత్రజనంబుఁ దార పిలిచి
తొలుమేనఁ బెట్టిన యలఘు దయాఢ్యులు; । ధనసిద్ధి బహులయత్నమునఁ గలుగు
మనుజులు పూర్వజన్మమున నర్థులు దమ్ము । నడుగ దాఁపక యిచ్చినట్టి వార;
లాయాసమునను విత్తాగమం బెడలెడు । జనులు ముందరి పుట్టువునఁ గృపా వి

తే. హీనులై యాచకుల నలయించి పిదప । నిడని లోభులు; ముదిసి ధనేశుఁడగు న
రుండు ప్రాయంబునాఁ డీక గం డడంగి । తొంటి భవమున నీగికిఁ దొడఁగి నతఁడు. 91

ప్రతిపదార్థం: ఆయాసము+పడక+ఉండన్ = శ్రమ చెందకుండ; అర్థంబు = విత్తం; చేరెడు వారు = చెందుతున్నవారు; తొలుమేనన్ = ముందటి జన్మలో; పాత్రజనంబున్ = యోగ్యులైనవారిని, తగినవారిని, అర్హులను; తారు+అ = తామే; పిలిచి

= ఆహ్వానించి; పెట్టిన+అలఘు+దయా+ఆఢ్యులు = దానం చేసిన గొప్ప దయాగుణమున్నవారు; బహుల యత్నమునన్ = పలువిధములైన ప్రయత్నాలతో; ధనసిద్ధి కలుగుమనుజులు = ద్రవ్యలాభం పొందునట్టి మనుష్యులు; పూర్వజన్మమునన్ = తొలుతటి పుట్టువులో; అర్థులు = యాచకులు; తమ్ముగ్ = తమర్ని; అడుగన్ = కోరగా; డాపక = తన దగ్గరనే పదిలపరచుకోక; ఇచ్చిన+అట్టివారలు = ఒసగిన పుణ్యపురుషులు సుమా!; ఆయాసమునను = శ్రమపడియూ; విత్త+ఆగమంబు = ధనము యొక్క లాభం, ప్రాప్తి; ఎడలిన జనులు = తొలగిన వారు; ముందరి పుట్టువునన్ = పూర్వజన్మలో; కృపావిహీనులు+ఐ = దయాశూన్యులై, కరుణమాలిన వారై; యాచకులన్ = అర్థులను; అలయించి = ఇంటికి త్రిప్పుకొని శ్రమ పెట్టి; పిదపన్ = తరువాత; ఇడని లోభులు = ఇయ్యని పిసినిగొట్టులు, లుబ్ధులు; ముదిసి = ముసలివాడై; ధన+ఈశుఁడు+అగు = ధనాధిపతిఅయిన, మహాధనికుడైన; నరుండు = మనుజుడు; తొంటి భవమునన్ = ముందటిజన్మలో; ప్రాయంబునాఁడు+ఈక = మంచి యౌవనదశలో ఉన్నప్పుడు దానంచెయ్యక; గండు+అడంగి = బలముడిగి, శక్తి చెడి, ముసలివాడై; ఈగికిన్ = దానము సల్పడానికి; తొడఁగిన+అతఁడు = పూనుకొన్నవాడు సుమీ!

తాత్పర్యం: ఈశ్వరీ! ఎక్కువ శ్రమపడకుండా డబ్బు ఎవరికి లభిస్తుందో వారు తొల్లిటి జన్మలో యోగ్యులైన వారిని తమంతట తామే రండని పిలిచి దానము చేసిన దయామయ హృదయులు సుమా! మిక్కిలి ప్రయత్నంతో ఇప్పుడు ధనం గడిస్తున్నవారు పూర్వ జన్మలో యాచకులు తమర్ని వేడినప్పుడు రేపురా, మాపురా, మళ్లీ రమ్మన కుండా, దాన మొనర్చిన పుణ్యాత్ములు సుమా! మిక్కిలి శ్రమపడికూడా విత్తం చేకూరక వేదన చెందుతున్నవారు మునుపటి పుట్టువున యాచకుల్ని కనికరం లేక పలుమారు తమ యింటికి తిప్పుకుని చివరికి ఏదీ యివ్వక పంపివేసిన లోభులు సుమా! ముసలితనంలో కుబేరులై ఉన్నవారు వెనుకటి జన్మలో తాము పడుచుదనంలో ఉన్నప్పుడు శక్తికొలది ఒకరికి ఉపయోగపడక వార్ధకంలో దానధర్మాలకు పూనుకొన్న వారే సుమీ!

తే. **కలిగియుండియుఁ దెవులుల కతన భోగ । ములు భుజింపఁగలేని మర్త్యులు, గిరీంద్ర**
తనయ! తొలుమేన రోగముల్ దనికి చచ్చు । నపుడు దానంబుసేసిన యట్టివారు. **92**

ప్రతిపదార్థం: గిరి+ఇంద్రతనయ! = ఓ కొండలరాయని కూతురా!; కలిగి+ఉండియున్ = తనకు సంపద ఉండికూడా; తెవుళుల కతనన్ = రోగాల మూలంగా; భోగములు = సుఖాలు; భుజింపఁగన్+లేని = అనుభవించజాలని; మర్త్యులు = మనుష్యులు; తొలుమేనన్ = పూర్వజన్మాన; రోగముల్+తనికి = వ్యాధులు సంభవించి; చచ్చు+అపుడు = మరణించే వేళ; దానముల్ = దానాలు; చేసిన+అట్టివారు = ఇచ్చినవారు సుమా!

తాత్పర్యం: గిరిజాదేవీ! కలిమి కలిగి ఉండి కూడా వ్యాధిగ్రస్తులైన కారణాన బాధపడుతూ ఇపుడు భోగా లను భవించడానికి నోచుకొననివారు పూర్వజన్మంలో జబ్బులంటుకొని చనిపోయే సమయంలో దానం చేసిన వారే సుమా!

తే. **అధిక సౌందర్యములు గలయట్టి జనులు । తొల్లి మాంసభోజనములఁ దొఱఁగియున్న**
వారు రూపవిహీనులు దారు రూపు । గలిగి తొలుమేనఁ గొనటులఁ బలికినారు. **93**

ప్రతిపదార్థం: అధికసౌందర్యములు = ఎక్కువచక్కదనాలు, మిక్కిలి అందాలు; కల+అట్టి = కలిగినటువంటి; జనులు = మనుష్యులు; తొల్లి = పూర్వం; మాంసభోజనములన్ = మాంసాహారాన్ని; తొఱఁగి+ఉన్నవారు = మానివేసినవారు, విడిచినట్టివారు; రూపవిహీనులు = వికృతస్వరూపులు; తారు = తాము; తొలుమేనన్ = పూర్వజన్మలో; రూపు+కలిగి = అందంకలవారై; కొనటులన్ = కురూపులను; పలికినారు = ఎగతాళిచేసినవారు, పరిహసించినవారు సుమా!

తాత్పర్యం: ప్రేయసీ! చక్కందనం కలిగి ఉన్నవారు పూర్వజన్మలో మాంసం తినటం మానివేసినట్టివారే. నేడు వికృత స్వరూపులై ఉన్నవారు మునుపటి జన్మలో తాము సొగసుకాండ్రై ఉండి కురూపులను పరిహసించిన వాళ్లే సుమా!

క. విను సౌభాగ్యసమేతుఁడు । ముని నిజదారైకపరుఁడు; ముందటి జన్మం
బున భార్యకుఁ బ్రీతి యొన । ర్చని మనుజుఁడు సుభగతావిరహితతఁ బొందున్. 94

ప్రతిపదార్థం: విను= గౌరీ! వినుము; సౌభాగ్యసమేతుఁడు= వైభవోపేతుడు; ముని= పూర్వజన్మంలో; నిజదార+ఏకపరుఁడు= తన భార్యయందే మిక్కిలి ఆసక్తి కలవాడు; ముందటి జన్మంబునన్ = తొలుతటి పుట్టుకలో; భార్యకున్ = తన పత్నికి; ప్రీతి+ఒనర్చని = సంతోషం కల్గించని, తృప్తి చేకూర్చని; మనుజుఁడు = మనిషి; సుభగతావిరహితతన్ = సౌభాగ్యవిహీనత్వాన్ని; పొందున్ = పొందుతాడు అనగా అందచందాలు లేని ఆలిని పొందుతాడు.

తాత్పర్యం: ప్రియురాలా! పూర్వజన్మలో తన పత్నియందు పరమ ప్రీతిగల పురుషుడు, ఏకపత్నీవ్రత పరాయణుడు సౌందర్యవతిని ఇల్లాలుగా పొందుతాడు. ముందటి జన్మలో భార్యను ఉపేక్షించి యథేచ్ఛగా విహరించినవాడు సౌభాగ్యవిహీను డవుతాడు.

క. అమితజ్ఞానము విజ్ఞా । నముఁ గలిగియుఁ బేదయైన నరుఁడు చనిన జ
న్మమున వినికి గలిగియు దా । నము తెరువునఁ బోనివాఁడు నళినదళాక్షీ! 95

ప్రతిపదార్థం: నళినదళ+అక్షీ! = తామరరేకుల వంటి కన్నులు కలదానా!; అమితజ్ఞానమున్ = అధికమైన అధ్యాత్మజ్ఞానమును; విజ్ఞానమున్ = శాస్త్ర సంబంధమైన జ్ఞానమునూ, అనుభవపూర్వకమైన జ్ఞానమునూ; కలిగియున్ = లభించికూడా; పేద+ఐన+ నరుఁడు = దరిద్రుడైన మానవుడు; చనిన జన్మమునన్ = పోయిన పుట్టుకలో; వినికి+కలిగియున్ = ధర్మాలను గూర్చి వినికూడ; దానము తెరువునన్+పోనివాఁడు = దాన పథంలో వెళ్ళనివాడు సుమా!

తాత్పర్యం: తామరరేకులవంటి కన్నులుగల పార్వతీ! అధ్యాత్మ జ్ఞానమూ, శాస్త్రజ్ఞానమూ కలిగి ఉండి కూడా పేదరికంతో అలమటించేవాడు తొలి జన్మంలో ధర్మాలను తెలిసికూడా దానం చేయటానికి ఏమాత్రం పూననివాడే సుమా!

క. తగుబుద్ధిలేక సంపద । మిగులఁ గలుగు నరుఁడు తొంటిమేనఁ గరుణమై
విగతప్రజ్ఞుం డయ్యును । దగ దీనులఁ బ్రోచినతఁడు దళితాబ్జముఖీ ! 96

ప్రతిపదార్థం: దళిత+అబ్జముఖీ! = వికసించిన పద్మంవంటి ముఖంకలదానా!; తగు బుద్ధిలేక = తగిన తెలివిలేక; సంపద = ఐశ్వర్యం; మిగులన్ = మిక్కిలి; కలుగు నరుఁడు = కలిగినట్టివాడు; తొంటిమేనన్ = పూర్వజన్మలో; విగతప్రజ్ఞుండు+అయ్యునున్ = తెలివిలేనివాడు అయినప్పటికిన్నీ, వివేకవిహీను డైనప్పటికినీ; కరుణమైన్ = దయతో; తగన్ = చక్కగా; దీనులన్ = దరిద్రులను; ప్రోచిన+అతఁడు = రక్షించినవాడే సుమా!

తాత్పర్యం: వికసించిన కమలంవంటి మోముగలదానా! ఈ జన్మలో తగినంత తెలివితేటలు లేకపోయినప్పటికినీ మెండగు సంపద కలవాడు పూర్వజన్మలో వివేకహీనుడై ఉండి కూడా కనికరంతో దరిద్రులను రక్షించిన వాడే సుమా!

సీ. మేధావియై విన్కి మిగిలి విద్యలఁ బొల్చు । నరుఁడు దొల్బామున గురున కధిక
భక్తుఁడై తనదైన పాండిత్య మొరులకుఁ । గావించు వేడుక గలుగు సుజనుఁ;
డభ్యసింపంగ విద్యాయుక్తి లేకుండు । నాతఁడు తొల్లి విద్యాధికత్వ
మున గర్వియై శిష్టజనులకు సభ భంగ । మొనరించి కుందఁజేసిన యతండు;

తే. భార్యయును బిడ్డలును దాను బహుధనముల । భోగులై రోగములు లేక పొల్చువార
లమలినాచార పాత్రదానములు సత్య । కరుణలును దొంటి భవమునఁ గలిగినారు. 97

ప్రతిపదార్థం: మేధావి+ఐ = బుద్ధిమంతుడై, మంచితెలివి కలవాడై; విన్కిమిగిలి = శాస్త్రాదులను శ్రవణం చేసి, బహుశ్రుతుడై; పొల్చు = ఒప్పుతున్న, విలసిల్లునట్టి; నరుఁడు = మనుష్యుడు; తొల్+బామునన్ = కడచిన జన్మలో; గురునకున్ = ఆచార్యుడికి; అధిక భక్తుఁడు+ఐ = గొప్ప భక్తుడై; తనది+ఐనపాండిత్యము = విద్యలయందు తనకున్న నేర్పును; ఒరులకున్ = అన్యులకు; కావించు = కలిగించునట్టి; వేడుక+కలుగు+సుజనుఁడు = అభిలాష కలిగిన సత్పురుషుడు సుమా!; అభ్యసింపఁగన్ = చదువుకొనుటకు; విద్యాయుక్తి లేక+ఉండు+ఆతఁడు = విద్యాయోగం లేనటువంటివాడు; తొల్లి = మునుపు; విద్యా+అధికత్వమునన్ = విద్యలయొక్క అతిశయంచేత; మెండుగ విద్యలు రావటం వలన; గర్వి+ఐ = పొగరుబోతై; శిష్టజనులకున్ = మంచినడవడిగల మహనీయులకు, ఆర్యులకు, పూజ్యులకు; సభన్ = సభయందు; భంగము+ఒనరించి = అవమానం కలిగించి; కుందన్+చేసిన+అతండు = బాధించినవాడే, నొప్పించినవాడే సుమా!; భార్యయును = పత్నియు; బిడ్డలు = పిల్లలు; తనున్ = తానూ; బహుధనములన్ = పెక్కు సిరిసంపదలతో; భోగులు+ఐ = సుఖాలనుభవిస్తున్నవారై; రోగములు లేక = వ్యాధిగ్రస్తులు కాకుండ; పొల్చువారలు = శోభిల్లుతున్న వాళ్ళు; అమలిన+ఆచార = నిర్మలమైన ఆచారములు, నడవళ్ళు; పాత్రదానములు = అర్హులైనవారికివ్వటం; సత్యకరుణలును = నిజంపలకటం, దయాస్వభావం; తొంటిభవమునన్ = వెనుకటిజన్మలో; కలిగినారు = కలిగినట్టివారు.

తాత్పర్యం: బుద్ధిమంతుడై శాస్త్రశ్రవణం చేసి అనగా బహుశ్రుతుడై విద్యలచేత విలసిల్లే మానవుడు గడచిన జన్మలో ఆచార్యుడిని పరమభక్తితో ఆరాధించిన వాడే సుమా! అంతేగాక తాను నేర్చిన విద్యలను ఇతరులకు నేర్పి వారిని పండితులను చేయవలెననే అభిలాష కలిగిన మహాశయుడు సుమా! ఈ జన్మలో నేర్చుకుందా మనుకొన్నా విద్యలబ్బని వాడు మునుపటి జన్మలో విద్యాతిశయంతో దర్పించి పెద్దలను సభలలో అవమానపరచి వారి హృదయాలను నొప్పించిన వాడే సుమా! తాను, తన ఆలుబిడ్డలు అనేక భోగభాగ్యాలు అనుభవిస్తూ రోగాలు లేక హాయిగా మనుగడ సాగిస్తున్న వాళ్ళు ముందటి జన్మలో నిర్మలమైన ఆచారం గలవారూ, అర్హులకు దానధర్మాలు చేసిన వారూ, సత్యవచనులూ, దయాపరులై ఉండినవాళ్ళే సుమా!

ఆ. ఆలుబిడ్డ లొఱటులై లేమిఁ గుందుచుఁ । దెవులుచేతఁ బడుచు నవయు జనులు
మున్ను క్రోధలోభముల నాస్తికతఁ బర । పీడనంబు చేసి పేర్చినారు. 98

ప్రతిపదార్థం: ఆలుబిడ్డలు = భార్యయూ, పిల్లలూ; ఒఱటులు+ఐ = మూర్ఖులై; లేమిన్ = దారిద్ర్యంతో; కుందుచున్ = నొగులుతూ; తెవులుచేతన్+పడుచున్ = రోగాల బారిపడుతూ; నవయుజనులు = కృశిస్తున్న, బాధ పడుతున్న మనుష్యులు;

మున్ను = పూర్వం; క్రోధలోభములన్ = కోపం చేతను, దురాశచేతనూ; నాస్తికతన్ = దేవుడు లేడని చెప్పటం చేతనూ; పరపీడనంబు+చేసి = ఇతరులను బాధించి; పేర్చినారు = చెలరేగిన వారే సుమా!

తాత్పర్యం: తమ ఆలుబిడ్డలు మూర్ఖులై ఒకవంక పేదరికంతో, మరొకవంక రోగాలతో అల్లాడుతుండగా కష్టాలనుభవిస్తున్న మనుష్యులు పూర్వజన్మంలో కోపం, దురాశ, దేవుడు లేడనటం మొదలైన చెడుగుణాలతో పరులను బాధిస్తూ విజృంభించినవారే సుమా!

సీ. కాంత! జాత్యంధుండు గన్నులు చెడువాఁడు । తన యొప్పు మెఱయుచుఁ దగిలి యొరుని
వనితఁ దొల్మేనఁ జూచినవాఁడు, కర్ణరో । గార్తుండు కటుక వాక్యములఁ దొల్లి
శిష్టు నొప్పించిన కష్టుండు, కడుపునఁ । దెవులైనతఁడు పూర్వ భవమునందు
గరదుండు, గోశ మశ్మరిని శర్కరను బా । ధితుఁ డగు నరుఁ దన్యసతిని గన్య

ఆ. మహిషి గోవుఁ దురగి మదనాతురత మున్ను । గవిసినాఁడు, శోషి దివిరి యొరువు
లనుభవింపఁ దెచ్చుకొనిన మాంసము దొంటి । పుట్టువున హరించినట్టి నీచు. 99

ప్రతిపదార్థం: కాంత! = ఓ వెలదీ!; జాత్యంధుండు = పుట్టుకతోనే గ్రుడ్డివాడూ, జనుషాంధుడూ; కన్నులు చెడువాఁడు = పుట్టుకతోనేగాక తరువాత చూపు గోల్పోయిన వాడూ; తన+ఒప్పు+మెఱయుచున్ = తన సౌందర్యం ప్రదర్శిస్తూ; తగిలి = వెంటపడి, పూనుకొని; ఒరుని వనితన్ = పరకాంతను; తొలుమేనన్ = ముందటి జన్మలో; చూచినవాఁడు = వీక్షించినవాడు సుమా!; కర్ణరోగ+ఆర్తుండు = చెవికి వచ్చిన రోగంతో బాధపడేవాడు; కటుక వాక్యములన్ = గాటయిన మాటలతో, పరుష పదాలతో, నిష్ఠురవచనాలతో; శిష్టున్ = సదాచారసంపన్నుడిని, యోగ్యుడిని; నొప్పించిన కష్టుండు = బాధించిన దుష్టుడు; కడుపునన్ = పొట్టలో; తెవులు+ఐన+అతఁడు = రోగంతో అల్లాడేవాడు; పూర్వభవము+అందున్ = తొలుతటి జన్మలో; గరదుండు = విషం పెట్టినవాడు సుమా!; కోశము+అశ్మరిని = మూత్రకోశసంబంధియైన నీరుకట్టు జబ్బుతో, మూత్రకృఛ్రవ్యాధితోనూ; శర్కరను = మధుమేహవ్యాధితోనూ; బాధితుఁడు+ఆగునరుఁడు = పీడించబడుతున్నమనిషి; అన్యసతిని = మరొక్కడి భార్యనూ; కన్యన్ = పెళ్ళికాని పడుచునూ; మహిషిన్ = గేదెనూ; గోవున్ = ఆవునూ; తురగిన్ = ఆడు గుర్రాన్నీ; మదన+ఆతురతన్ = కామోద్రేకంతో; మున్ను = తొలుతటి జన్మలో; కలిసినాఁడు = కూడిన వాడేసుమా!; శోషి = శుష్కించినవాడు, క్షయరోగి; తివిరి = ఇష్టపడి; ఒరువులు = ఇతరులు; అనుభవింపన్ = భుజించటానికి, తెచ్చుకొనిన మాంసమున్ = తెచ్చుకొన్నట్టి ఎరచిని; తొంటి పుట్టువునన్=పూర్వభవంలో; హరించిన+అట్టి= కాజేసినటువంటి; నీచు= అల్పుడు, క్షుద్రుడు, తుచ్ఛుడు సుమా!

తాత్పర్యం: వనితామణీ! వినుము. పుట్టుకతోనే గ్రుడ్డిఅయినవాడూ, మరి కొన్నాళ్ళకు చూపు కోల్పోయిన వాడూ తొలిజన్మలో తన సొగసును కనబరుస్తూ పరుని భార్యను పనిగట్టుక చూచినవాడే సుమా! చెవిపోటుతో బాధపడేవాడు ముందటి జన్మలో కర్కశవాక్యాలతో యోగ్యపురుషులను నొప్పించిన వాడే సుమా! పొట్టలో ఏదో ఒక జబ్బుతో పీడించబడేవాడు వెనుకటి పుట్టువులో ఇతరులకు విషం పెట్టినవాడే సుమా! నీరు కట్టు రోగంవల్ల, మూత్రద్వారంలో రాళ్ళు ఏర్పడినవాడూ, మధుమేహవ్యాధితో తీపులు తీసుకొంటున్నవాడు పూర్వజన్మలో మన్మథోద్రేకంతో పరకాంతను, పెళ్ళికాని పడుచును కూడినవాడే సుమా! అంతేగాదు; ఆవును, బఱ్ఱెను, ఆడు గుర్రాన్ని దాటినవాడే సుమా! నేడు క్షయరోగంతో బాధపడుతున్నవాడు తొలుతటి జన్మలో ఎవరో తిందామని ఆశపడి తెచ్చి పెట్టుకొన్న మాంసాన్ని కాజేసి గుట్టుగ ఆరగించిన నీచుడు సుమా!

ఆ. ఉలుముగొన్నవాఁడు తొలుమేన నాఘాత । బంధనముల నొరుల ప్రన్నఁదనము
చెఱచినాఁడు, పంగు వొఱవగఁ గాలుసే । విఱిచి సాధుజనులఁ బఱిచినాఁడు. 100

ప్రతిపదార్థం: ఉలుము+కొన్నవాఁడు = కుష్ఠరోగం కలవాడు; తొలుమేనన్ = పూర్వదేహంలో; ఒరుల = ఇతరుల యొక్క; ప్రన్నఁదనమున్ = అందమును; ఆఘాతబంధనములన్ = కొట్టుట చేతనూ, కట్టుట చేతనూ; చెఱచినాఁడు = పాడుచేసినవాడే సుమా!; పంగువు = నేడు కుంటివాడుగా ఉన్నవాడు; ఒఱవగన్ = వక్రంగా, వికృతంగా; కాలు+చే+విఱిచి = కాళ్ళు చేతులు విరిచి; సాధుజనులన్ = సత్పురుషులను; పఱిచినాఁడు = బాధపెట్టినవాడే సుమా!

తాత్పర్యం: నేడు కుష్ఠరోగిగా ఉన్నవాడు పూర్వజన్మంలో కొట్టి, కట్టి పరుల చక్కందనాన్ని చెరచినవాడే సుమా! ఇపుడు కుంటివాడుగా ఉన్నవాడు తొలుతటి పుట్టువులో సుజనులను కాళ్ళుచేతులు వక్రంగా విరిచి బాధించిన వాడే సుమా!

క. పిలకాదులఁ గంతులచే । నలమటఁ బడువారు బడియ నడిచియు ముష్టిం
జలమునఁ బొడిచియు సాధులఁ । దొలుబామున నొంచినట్టి దుష్టచరిత్రుల్. 101

ప్రతిపదార్థం: పిలక+ఆదులన్ = చర్మవ్యాధులు మొదలైన వాటితోనూ; కంతులచేన్ = కణుతులచేతనూ (గడ్డలతోనూ); అలమటన్+పడువారు = బాధపడేవాళ్ళు; తొలుబామునన్ = పూర్వభవంలో, క్రిందటి జన్మలో; సాధులన్ = సజ్జనులను; బడియన్ = దుడ్డుకర్రతో; అడిచియున్ = కొట్టియూ; చలమునన్ = ఈర్ష్యతో; ముష్టిన్ = పిడికిలితో; పొడిచియున్ = క్రుమ్మియూ; నొంచినట్టి = నొప్పించినట్టి, బాధించినట్టి; దుష్టచరిత్రుల్ = చెడునడత కలవారే సుమీ!

తాత్పర్యం: చెలీ! చర్మరోగాలతో, కణుతులతో బాధపడేవారు పూర్వజన్మలో సజ్జనులను బడితెతో బాదీ, మచ్చరంతో పిడికిలితో పొడిచీ నొప్పించిన వారే సుమీ!

విశేషం: "గ్రంధిభిః పిలకై శ్చైవ క్లిశ్యన్తే భృశదుఃఖితాః" అనే శ్లోకం పై పద్యానికి మూలం.

ఆ. పాదరోగు లశుచి పదముల దేవాల । యములు మెట్టుటయును నసదువారిఁ
దప్పులేక క్రొవ్వి తన్నుటయును దొలు । పుట్టునందుఁ గలిగినట్టివారు. 102

ప్రతిపదార్థం: పాదరోగులు = కాళ్లయందు వ్యాధులు గలవారు; అశుచిపదములన్ = అపరిశుద్ధములైన అడుగులతో; దేవ+ఆలయములు = దేవుడిగుళ్లు; మెట్టుటయును = ప్రవేశించడం; అసదువారిన్ = బలహీనులను, దీనులను; తప్పులేక = వారియందు దోషాలు లేకున్నప్పటికీ; క్రొవ్వి = పొగరుపట్టి; తన్నుటయును = కాళ్లతో తాడించడం అనే చెడుగుణాలు; తొలు పుట్టు+అందున్ = ముందటి జన్మలో; కలిగినట్టివారు = ఉన్నట్టివారు.

తాత్పర్యం:నేడు కాలిజబ్బులతో అల్లాడుతున్నవారు పూర్వజన్మలో అపవిత్రములైన పాదాలతో దేవుడి గుళ్ళకు వెళ్ళిన వారే సుమా! గౌరీ! ఏ తప్పులేకుండానే దిక్కుమాలిన దీనులను పొగరుబట్టి తమ కాళ్ళతో తన్నినవాళ్ళే సుమా వీరు!

చ. జ్వరమున గుల్మపీడ నతిసారములన్ బలుపుండులన్ మహో
దరమున వాతపిత్త కఫదారుణ రోగములన్ నిరంతరా

తురు లగువారు నిర్దయతఁ దొల్లి వినోదము గాఁగ జీవులం
దరమిడి చంపినారు గురుఁ దల్లడ పెట్టినవారు పార్వతీ! 103

ప్రతిపదార్థం: పార్వతీ! = హైమవతీ!; జ్వరమునన్ = జ్వరంచేత; గుల్మపీడన్ = కడుపులో దుర్మాంసపు బిళ్ళవలన కలిగే బాధతో; అతిసారములన్ = విరేచనాలతో, భేదులతో; బలుపుండులన్ = మిక్కిలి కురుపులతో, వ్రణాలతో; మహా+ఉదరమునన్ = మహోదరమనే వ్యాధితో (పొట్ట పెరిగే రోగం); వాత పిత్త కఫ = వాతము, పిత్తము, కఫము అనే; దారుణ రోగములన్ = భయంకరాలైన జబ్బుల చేత; నిరంతర = ఎల్లప్పుడు; ఆతురులు+అగువారు = బాధపడేవారు; తొల్లి = పూర్వజన్మలో; నిర్దయతన్ = కరుణలేక; వినోదము+కాఁగన్ = వేడుకగా, క్రీడగా; జీవులన్ = ప్రాణులను; తరము+ఇడి = వరుసపెట్టి; చంపినారు = సంహరించినట్టి వారే సుమీ!; గురున్ = ఆచార్యుడిని; తల్లడము+పెట్టినవారు = బాధించినవారేసుమా!

తాత్పర్యం: జ్వరం, కడుపులో బల్ల, భేదులు, కురుపులు, మహోదరం అనే పొట్ట పెరిగే వ్యాధి, వాతం, పిత్తం, శ్లేష్మం అనే త్రిదోషాలవలన కలిగే జబ్బులు-వీటి వల్ల ఎల్లప్పుడూ తల్లడిల్లుతున్నవారు పూర్వజన్మలో జంతువులను వరుసపెట్టి చంపినవారే సుమా! గురువును దుఃఖపెట్టిన వారే సుమా!

తే. గూనివాఁడును బిచ్చుకకుంటు గుజ్జుఁ । గొలుచు లమ్ముచోఁ గ్రచ్చులు గలిపి సరకు
దూఁచిపెట్టెడు చోటులఁ దూన్కి దరపి । పూర్వ భవమున లాభంబుఁ బొందినారు. 104

ప్రతిపదార్థం: గూనివాఁడును = ఎత్తైన వీపుకలవాడు; పిచ్చుక కుంటున్ = తొడలు లేనివాడు; గుజ్జున్ = పొట్టివాడును, కుబ్జుడు; కొలుచులు+అమ్ముచోన్ = ధాన్యం విక్రయించే సమయంలో; క్రచ్చులు+కలిపి = తాలు, తరకలు, రాళ్ళు కలిపియూ; సరకున్ = వస్తువును; తూఁచిపెట్టెడు చోటులన్ = తక్కెడలో ఉంచి తూనిక వేసేవేళ; తూన్కి = తూనిక; తరపి = తగ్గించి(తప్పు తూనిక తూచి); పూర్వభవమునన్ = ముందటి జన్మలో; లాభంబున్ = అన్యాయమైన లాభమును; పొందినారు = గడించినట్టివారే.

తాత్పర్యం: దేవీ! ఈ జన్మలో గూనివాడు, తొడలు లేనివాడు, మరుగుజ్జు క్రిందటి జన్మలో ధాన్యంలో తాలు తబక కలిపి విక్రయించిన వాళ్ళు. తప్పుడు తూనికలు తూచి వస్తువులు అమ్మి అక్రమ లాభాలు ఆర్జించిన వాళ్ళే.

సీ. వెఱ్ఱులు తొలుమేన వెడ్డున సాధుజ । నము మోసపుచ్చి ధనంబు గొన్న
జను లనపత్యులు విను తొల్లి పితృకార్య । దూరులు బాలఘాతులును జువ్వె;
పొలఁతి! నపుంసకుల్ పూర్వభవంబున । నెద్దుఁ బట్టిన వారు నేమి తప్పుఁ
బొరయకుండఁగఁ గోపమునఁ ద్రికచ్ఛేదంబు । గావించినారును, గామ సుఖము

తే. విఘ్నపఱిచిన తులువలు, విధవ తొంటి । జన్మమునయందు భర్తృవంచన మొనర్చి
ధనము గూర్చిన యదియు మదంబు పేర్మి । నోర్తుమగని హరించిన యుగ్మలియును. 105

ప్రతిపదార్థం: వెఱ్ఱులు = పిచ్చివాళ్ళు; తొలుమేనన్ = మునుపటి జన్మలో; వెడ్డునన్ = వంచనతో; సాధుజనమున్ = సత్పురుషులను; మోసము+పుచ్చి = దగాచేసి; ధనంబు+కొన్నజనులు = ద్రవ్యం గ్రహించిన మనుష్యులు; విను = పార్వతీ! ఆలకించుము; న+అపత్యులు(అనపత్యులు) = ఇప్పుడు బిడ్డలు లేకుండా ఉన్నవాళ్ళు; తొల్లి = మునుపటి జన్మలో; పితృకార్యదూరులు = తమ తల్లిదండ్రులకు శ్రాద్ధాది క్రియ నిర్వర్తించని వాళ్ళునూ; బాలఘాతులును+చువ్వె = బిడ్డలను

చంపిన వాళ్ళునూ సుమా!; పొలఁతి! = చెలియా!; నపుంసకుల్ = మగతనం లేని వాళ్ళు; పూర్వభవంబునన్ = ముందటి జన్మలో; ఎద్దున్+పట్టినవారు = ఎద్దుయొక్క విత్తులు నలగగొట్టినవాళ్ళే; ఏమితప్పున్ = ఎట్టి దోషమూ, అపరాధమూ; పొరయక+ఉండన్+కన్ = వాటివల్ల కలుగక పోయినా; కోపమునన్ = క్రోధంతో, కినుకతో; త్రిక+ఛేదంబు+కావించినారు = ముడ్డిపూస విరుగ గొట్టినవారున్నూ; కామ సుఖమున్ = రతిసౌఖ్యం, సురతసుఖం; విఘ్నపఱచిన = ఆటంకపరచిన; తులువలు = తుచ్ఛులు, దుష్టులు; విధవ = మగడులేనిది, భర్తృవిహీన; తొంటి జన్మము+అందున్ = మునుపటి పుట్టుకలో; భర్తృవంచనము+ఒనర్చి = మగడినిమోసపుచ్చి; ధనము+కూర్చిన+ఆదియున్ = ద్రవ్యం ఆర్జించినట్టిదేసుమా!; మదము+పేర్మిన్ = గర్వాతిరేకంతో; ఓర్తుమగనిన్ = మరొక్కదాని పెనిమిటిని; హరించిన = లోబరచుకొన్న; ఉగ్మలియును = మగువయు అగును.

తాత్పర్యం: ప్రేయసీ! వినుము. ఇప్పుడు పిచ్చివాళ్ళుగ ఉన్నవాళ్ళు ముందటి జన్మలో వంచనతో సజ్జనుల డబ్బు కాజేసిన వారే సుమా! ఇప్పుడు బిడ్డలు లేనివాళ్ళు తమ తల్లిదండ్రులకు శ్రాద్ధక్రియలు నిర్వర్తించని వాళ్ళూ, పిల్లల్ని చంపినవాళ్ళూ అయి ఉన్నారు. నపుంసకులుగా ఉన్నవాళ్ళు తొలిజన్మలో ఎద్దును కట్టిపడవైచి దాని వృషణాలు నలిచిన వాళ్ళూ, ముడ్డిపూస విరుగ బొడిచిన వాళ్ళూ, రతిసౌఖ్యాన్ని అనుభవించకుండా చేసినవాళ్ళూ అయి ఉన్నారు. నేడు విధవరాలుగా ఉన్న చిన్నది మునుపు పెనిమిటిని మోసం చేసి ధనం ఆర్జించినట్టిదీ, పొగరుపట్టి మరియొక దాని భర్తను తన వశం చేసికొన్న గడుసుదీ సుమా!

తే. **ప్రయతులై పుట్టి యేవంపుఁబనులఁ గడుపుఁ । బ్రోచికొనువా రహంకారముననుఁ గర్వ**
మాన మద దంభములఁ దొల్లి మాన్యజనులఁ । బరిభవించిన తుచ్ఛులు పద్మనయన! **106**

ప్రతిపదార్థం: పద్మనయన! = కమలములవంటి కన్నులు గల చెలీ!; ప్రయతులు+ఐ+పుట్టి = పవిత్రులుగ జన్మించి; ఏవంపుఁబనులన్ (ఏవము+పనులన్) = రోత కలిగించే కృత్యములచేత, నీచకార్యాలతో, అసహ్యమైన పనులతో; కడుపున్+ప్రోచికొనువారు = పొట్టను పోషించుకొనేవారు; అహంకారముననుఁ = నేనే అధికుడనన్న భావంతోను; గర్వమానమద దంభములన్ = పొగరుచేతను, చిత్త సమున్నతి చేతను, మదము చేతను, డంబము చేతను; తొల్లి = పూర్వజన్మలో; మాన్య జనులన్ = గౌరవించ దగిన వారిని, సజ్జనులను; పరిభవించిన = అవమానించిన; తుచ్ఛులు = అల్పులు, నీచులు సుమా!

తాత్పర్యం: కమలాక్షీ! పరిశుద్ధులై జన్మించినప్పటికినీ రోతపుట్టించే పనులు చేస్తూ, నేడు జీవిస్తున్నవాళ్ళు తొలిజన్మలో తాము గొప్పవాళ్ళమనే అహంకారంతో, పొగరుబోతుతనంతో, అభిమానంతో, మదంతో, డంబంతో విర్రవీగుతూ సత్పురుషులను అవమానపరచిన అల్పులు సుమా!

విశేషం: దంభం = ప్రసిద్ధి కోసం దానధర్మాలు సల్పటం; మానం = తన విద్యకూ, వంశానికీ తగని దురభిమానం.

సీ. **దాసత్వ మొంది యదల్పులఁ దిట్టుల । నాటులఁ బడుచుండునట్టి నీచు**
లప్పాటఁ దొలుమేన నతి గర్వులై ప్రల్ల । దమ్మునఁ బెక్కండ్రఁ దప్పులేక
తిట్టియు నడిచియుఁ దిరిగినవార లా । పొలువలపైఁ గృపగలిమి మేలు
ధనిక గృహద్వారమునఁ బ్రతిహారి ద । మ్మాఁగంగ నుండి దైన్యమున దుఃఖ

తే. **పడు జనంబులు భోగైకపరతఁ దొల్లి । మాననీయుల కవసర మీని వారు**
రాజదండితుఁ డకృతాపరాధుఁ గ్రూర । దండ దూషితుఁ జేసినతండు సూవె! **107**

ప్రతిపదార్థం: దాసత్వము+ఒంది = సేవకులై; అదల్పులన్ = తర్జనభర్జనలతో, బెదరింపులతో; తిట్టులన్ = దూషణలతో; ఆటులన్ = బాధలను; పడుచున్+ఉండు+అట్టి = అనుభవిస్తున్న; నీచులు = దుష్టులు; ఆ+పాటన్ = ఆ విధంగా; తొలుమేనన్ = ముందటి జన్మలో; అతి గర్వులు+ఐ = మిక్కలి అహంకారులై; ప్రల్లదమ్మునన్ = వదరుబోతు తనంతో, దుర్భాషలతో; పెక్కండ్రన్ = పలువురను, అనేకులను; తప్పులేక = దోషం లేకపోయినా; తిట్టియున్ = దూషించి; అడిచియున్ = కొట్టి; తిరిగినవారలు = సంచరించినట్టి వారు; ఆ పొలువలపైన్ = ఆ దుష్టులమీద; కృప+కలిమిమేలు = దయకలిగి ఉండటం మంచిది; ధనిక గృహద్వారమునన్ = భాగ్యవంతుల యొక్క వాకిళ్ళ వద్ద; ప్రతిహారి = వాకిటి కావలివాడు, ద్వార పాలకుడు; తమ్మున్ = తమను; ఆగంగన్ = ఆపగా, నిలువరించగా; ఉండి = అక్కడే నిలబడి; దైన్యమునన్ = పేదతనంతో; దుఃఖపడు జనంబులు = చింతిస్తున్న మనుష్యులు; భోగ+ఏక+పరతన్ = సుఖములందలి పరమాసక్తితో; మాననీయులకున్ = గౌరవించదగినవారికి; అవసరము+ఈనివారు = అవకాశం కల్గించని వారే సుమా!; రాజదండితుఁడు = రాజుచే శిక్షించబడిన వాడు; అకృత+అపరాధున్ = తప్పు చెయ్యని వాడిని; క్రూరదండ దూషితున్= కఠినమైన శిక్షచే చెరచబడినవాడిగా; చేసిన+అతండు+చూవె = చేసినవాడే సుమా!

తాత్పర్యం: సేవకులై పరుల నాశ్రయించి వారి బెదిరింపులనూ, దూషణలనూ, పెట్టేబాధలనూ సహిస్తున్న అధములు ముందటి జన్మలో మిక్కిలి గర్వంతో, వదరుబోతులై వాగుతూ నిరపరాధులైన వారిని తమ ఇష్టానుసారం తిట్టుతూ కొట్టుతూ ప్రవర్తించిన వారే సుమా! దేవీ! అట్లాంటి వారి మీద దయచూపటం మంచిది. ధనవంతుల ఇండ్లకేగి అక్కడ ద్వారపాలకులచే అడ్డగించబడి దైన్యంతో దుఃఖించే జనులు ముందటి జన్మలో తమ దర్శనార్థమై పెద్దలు రాగా వారికి అవకాశమియ్యని దుర్మార్గులే సుమీ! ఈనాడు రాజదండనకు గురియైనవాడు పూర్వజన్మలో ఏ అపరాధం చెయ్యని వాడికి కఠినమైన శిక్షవిధించిన వాడే సుమా!

తే. **విను నష్టసకలధను లగు । జనములు నిక్షేప మిడిన సరకులు దొలుబా**
మున మగుడ నీక నెపమిడి । కొనినట్టి యసత్య లోభ కుత్సితు లతివా! **108**

ప్రతిపదార్థం: అతివా! = ఓ మగువా!; విను = శ్రద్ధగా ఆకర్ణించుము; నష్టసకల ధనులు+అగు+జనములు = పోగొట్టుకొన్న సమస్తమైన ధనములు గల నరులు; నిక్షేపము+ఇడిన = తమ దగ్గర దాచనిచ్చిన; సరకులు = వస్తువులు;మగుడన్ = మళ్ళీ; ఈక = ఇవ్వక; తొలు బామునన్ = ముందటి జన్మలో; నెపము+ఇడి = ఏదో ఒకసాకు పెట్టి; కొనిన+అట్టి = పుచ్చుకొన్న; అసత్య లోభకుత్సితులు = అసత్యవాదులు, లోభులు, కపటులు సుమా!

తాత్పర్యం: గౌరీ! సకలధనాలు కోల్పోయి అల్లాడుతున్నవారు పూర్వజన్మలో తమ దగ్గర దాచుటకై ఉంచిన వస్తువులను తిరిగి వాళ్ళకు ఇవ్వక ఏదో ఒకసాకు చూపి కాజేసిన అసత్యవాదులు, లోభులు, కపటులు సుమా!

క. **తమబంధులుఁ దారును నొ । క్కమరియ తెగటాఱువారు కరుణారహిత**
త్వమునఁ దొలుమేన వెడపగ । నమేయ నరవధము సేసినట్టి దురాత్ముల్.' **109**

ప్రతిపదార్థం: తమబంధులున్ = తమచుట్టాలూ; తారును = తామున్నూ; ఒక్కమరి+అ = ఒకేసారి, ఒకేతడవ; తెగటాఱువారు = నశించేవారు; కరుణారహితత్వమునన్ = దయాశూన్యులై; తొలుమేనన్ = మునుపటి జన్మలో; వెడపగన్ = నిష్కారణ విరోధంతో; అమేయ = మితిలేని; నరవధము = మనుజ సంహారం; చేసినట్టి = కావించిన; దుర్+ఆత్ముల్ = చెడుమనస్సు కలవారు సుమా!

తాత్పర్యం: తమ చుట్టములూ, తామూ ఒకేసారి మరణం పాలైనవారు పూర్వజన్మలో కృపలేనివారై నిర్హేతుకమైన ద్వేషంతో బహుజనాన్ని చంపిన పాపాత్ములు సుమా!'

వ. అని యెఱింగించి యీశ్వరుం డీశ్వరితో నిట్లనియె. 110

తాత్పర్యం: అని చెప్పి భవుడు మళ్ళీ భవానితో ఇట్లా అన్నాడు.

సీ. 'ఇంతి! నా చెప్పిన యిప్పాపకర్ములం । దఱకును నరకంబు దప్ప; దందుఁ
బడుపాటు లెల్లను బడివచ్చి నరులైన । యప్పుడు వాటిల్లునట్టి తెఱఁగు
లివి; యట్లు గాకయు నెక్కుడుగాని పా । పంబుల మానుషభవము గలుగు
నిట్లైన నమ్మేన నే కర్మమున ఫల । మైనను మానవు లనుభవింప;

ఆ. రోపి మునులు దేవయోనులు నత్తను । వునన తపము ఫలము లనుభవింతు'
రనిన దేవి 'యెఱుఁగ నయ్యె మీదయఁ బెక్కు । లర్థములు గృతార్థ నైతి' ననియె. 111

ప్రతిపదార్థం: ఇంతి! = ఓ చెలువా!; నాచెప్పిన = నేను నుడివిన; ఈ+పాపకర్ములు = ఈ పాపకృత్యాలు చేసినవారు; అందఱకును = ఎల్లరకూ; నరకంబు తప్పదు = నరకబాధలు అనుభవించక తప్పదు; అందున్ = ఆ నరకలోకంలో; పడుపాటులు+ఎల్లనున్ = పొందవలసిన కష్టాలన్నీ; పడివచ్చి = అనుభవించివచ్చి; నరులు+ఐన+అప్పుడు = తిరిగి మానవులై పుట్టినప్పుడు; పాటిల్లు+అట్టి+తెఱఁగులు+ఇవి = సంభవించబోయే గతులివి; అట్లు+కాకయున్ = అట్లాకాకుండాను; ఎక్కుడు+కానిపాపంబులన్ = అధికములుగాని పాపాలచేత; మానుషభవము కలుగున్ = మనుష్యజన్మ లభిస్తుంది. ఇట్లు+ఐనన్ = ఈ విధంగా లభించినప్పుడు; ఆ+మేనన్ = ఆ శరీరమునందు; ఏకర్మమున ఫలము+ఐనను = ఎట్టి కర్మ ఫలితమైనా; మానవులు = నరులు; అనుభవింపరు = పొందరు; ఓపి = సమర్థులై; మునులు = మునీశ్వరులు; దేవయోనులున్ = దేవజాతుల వారునూ; ఆ+తనువుననె = ఆ దేహమునందే; తపము ఫలములు = తపస్సుయొక్క ఫలాలు; అనుభవింతురు = అనుభవిస్తారు; అనినన్ = అని శంభుడు పల్కగా; దేవి = శాంభవి; మీదయన్ = నాథా! మీ యొక్క కృపచే; పెక్కులు+అర్థములు = పలువిషయాలు; ఎఱుఁగన్+అయ్యెన్ = తెలిసికొనగలిగాను; కృతార్థన్+ఐతిన్ = ధన్యురాల నయ్యాను; అనియెన్ = అని చెప్పింది.

తాత్పర్యం: 'కాత్యాయనీ! నే చెప్పిన ఈ పాపులందరికీ నరకం తప్పదు. పూర్వం తా మొనర్చిన దురితాలవలన నరకలోకంలో నానాబాధ లనుభవించి మళ్ళీ వీరు పుడమిలో నరులై జన్మించినపుడు వారికి ఈ చెప్పబడిన గతులు కలుగుతాయి. అధికములైన పాపకృత్యాలు సల్పనివారికి మనుష్య జన్మ కలుగుతుంది. అయితే ఆ శరీరమందే మనుషులు తాము చేసిన కర్మఫలాలు అనుభవించరు. కాని, మునీశ్వరులు, యక్షగరుడగంధర్వ కిన్నర కింపురుషాది దేవయోనులు మాత్రం తాము సల్పిన తపః ఫలాలను ఆ దేహములందే అనుభవిస్తారు' అని పరమేశ్వరుడు పల్కగా 'దేవా! మీ కృప వలన పెక్కు సంగతులు తెలిసికొని ధన్యురాలనయ్యాను' అని పార్వతి పలికింది.

వ. అని వెండియు న ద్దేవునితో 'మనుజు లపరజన్మంబునంగాని కర్మఫలంబు లనుభవింప రంటిరి; తప్పు చేసిన నరుల నరపతు లిట్టి తప్పున కిట్టి దండంబను నిరూపణంబున దండించెద రని యక్కర్మంబు ఫలం బప్పుట్టువునన యనుభవించుట గాదె?' యనిన గౌరికి గంగాధరుం డిట్లనియె. 112

ప్రతిపదార్థం: అని వెండియున్ = అని మరలా; ఆ+దేవునితోన్ = ఆ శంకరుడితో; మనుజులు = నరులు; అపర జన్మంబునన్+కాని = తరువాతి జన్మలో తప్ప; కర్మఫలంబులు; అనుభవింపరు; అంటిరి = మీరన్నారు గదా!; తప్పు చేసిన, నరులన్, నరపతులు = రాజులు; ఇట్టి తప్పునకున్ = ఇటువంటి దోషానికి, ఇట్టిదండంబు = ఇటువంటి శిక్ష; అను నిరూపణంబునన్ = అనే నిర్ణయంతో; దండించెదరు; అని = అని గౌరి పలికి; ఆ+కర్మ ఫలంబు; ఆ+పుట్టువునన = ఆ జన్మలోనే; అనుభవించుట+కాదు+ఎ? = అనుభవించినట్లవుతున్నది కదా! అనినన్ = అని పలుకగా; గౌరికిన్; గంగాధరుండు = గంగను తలపై ధరించిన శివుడు; ఇట్లు+అనియెన్ = ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని వచించి మహేశ్వరి మళ్ళీ మహాదేవుడితో ఇట్లా అన్నది. నాథా! ఇపుడు మనుషులు చేసే కర్మలయొక్క ఫలాలు మున్ముందు కలుగబోయే జన్మలందే వారు అనుభవిస్తారు అని మీరన్నారుకదా! మరి తప్పొనర్చిన జనులను ఈ తప్పునకు ఇట్టి శిక్ష అని శాస్త్ర విధి ననుసరించి నిర్ణయించి రాజు దండిస్తున్నాడు కదా! అపుడు మనుషులు తమ కర్మఫలాలు ఈ లోకంలోనే ఈ దేహమందే అనుభవించినట్లవుతున్నది. మరి తమరు ఉత్తర జన్మలందే వారికి కర్మ ఫలానుభవం అని చెప్పటానికి హేతువేమిటి?' అని ప్రశ్నించింది. అందుకు ఈశ్వరు డిట్లా అన్నాడు.

సీ. **'జనపతుల్ దమ రాజసంబున దండించి । నారుగా నొల్లక నరుల తప్పు**
లకుఁ దగు దండంబు లన వారిఁ బఱతురు; । తక్కొరు లెవ్వరుఁ దప్పుసేయ
వెఱచుటకై యట్టి విధి మూఁడుటది పూర్వ । కర్మంబువలనన కాని, యపుడు
గలిగిన తప్పునఁ గా' దన్న నాదేవి । 'యవనీశ దండితుఁ డైన నరున

తే. **కఘము వాయునొ? పాయదో?' యనిన నీశ్వ । రుండు 'నృపదండితుఁడు యమదండమునను**
బడఁడు; లేని తప్పున నరుఁ బఱిచినతనిఁ । బఱుపకున్నాతనిని యమబాధ వొందు.' **113**

ప్రతిపదార్థం: జనపతుల్ = ప్రభువులు; తమరాజసంబునన్ = తమ యొక్క అధికారంతో (దుర్గర్వంతో); దండించినారు+కాన్ = శిక్షించిన వారుగా; ఒల్లక = అంగీకరించక; నరులతప్పులకున్ = మనుషులు చేసిన అపరాధాలకు; తగు = అర్హములైన; దండంబులన = శిక్షలచేతనే; వారిన్ = ఆ దోషులను; పఱతురు = బాధిస్తారు; తక్కు+ఒరులు+ఎవ్వరున్ = మిగిలినవారెవ్వరునూ; తప్పు+చేయన్+వెఱచుటకై = తప్పిదము లొనర్ప భయపడటానికై; అట్టివిధి = అట్టి కీడు; మూఁడుట+అది = సంభవించటమనేది; పూర్వ కర్మంబు వలనన కాని = ముందటి జన్మలో చేసిన కర్మవలననే తప్ప; అపుడు+కలిగిన = అప్పుడు చేసిన; తప్పునన్+కాదు = అపరాధంవలనకాదు; అన్నన్ = అని పరమశివుడు పల్కగా; ఆ+దేవి = ఆ పరమేశ్వరి; అవనీ+ఈశ+దండితుఁడు+ఐన = ధరణీ వల్లభుడి చేత శిక్షించబడినట్టి; నరునకున్ = మనిషికి; అఘము = పాపం; పాయును+ఒ? = తొలగుతుందా?; పాయదు+ఓ? = తొలగదా?; అనినన్ = అని ప్రశ్నించగా; ఈశ్వరుండు; నృపదండితుఁడు = రాజుచే శిక్షించబడ్డవాడు; యమదండమునమున్ = యముడి యొక్క శిక్షను; పడఁడు = అనుభవించడు; లేని తప్పునన్ = చెయ్యని దోషంచేత అనగా తప్పు చెయ్యకున్నా; నరున్ = మనిషిని; పఱిచిన+అతనిన్ = బాధించిన వాడిని; పఱుపక+ఉన్న+ఆతనినిన్ = తప్పు చేసినా దండించకున్నవాడిని; యమబాధ పొందున్ = యముడి వలన బాధ కలుగుతుంది.

తాత్పర్యం: రాజులు కేవలం తమకున్న అధికారదర్పంతో శిక్షిస్తున్నామని తలపోయక జనులు చేసే తప్పులకు తగిన దండన విధించి వారిని బాధిస్తారు. ఇతరులు అట్లాంటి తప్పులు చేయటానికి భయపడతారు అనే ఉద్దేశంతోనే వారట్లా చేస్తారు. రాజ దండనకు గురికావటం అన్నది పూర్వం తను చేసికొన్న కర్మ వలననే సంప్రాప్తిస్తుంది కాని ఇప్పుడు తను చేసిన తప్పువలన కాదు' అని శివదేవుడు వ్యాఖ్యానించగా గౌరీదేవి, 'దేవదేవా! రాజుచే దండించబడిన

వాడికి పాపం తొలగుతుందా? తొలగదా?' అని అడిగింది. 'పాలకుడిచేత దండింపబడినవాడు మఱి యమదండన పొందడు. తప్పు చెయ్యని వాడిని దండించినా, తప్పు చేసిన వాడిని దండించక విడిచిపెట్టినా తప్పక అతడు యమదండనకు గురి ఔతా'డని పార్వతికి పరమేశ్వరుడు ప్రతివచించాడు.

వ. అని నిర్దేశించి వెండియు. 114

తాత్పర్యం: అని ఈశ్వరుడు నిర్ణయపూర్వకంగా చెప్పి మరల (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

క. 'విను తమ చేసిన కర్మం । బున ఫల మెవ్వరికిఁ ద్రోచి పుచ్చఁగ రా; దె
ట్లును గుడువక పో' దది యన । విని పార్వతి యిట్టు లనియె విభునకుఁ గృష్ణా ! 115

ప్రతిపదార్థం: విను = గౌరీ! వినుము; తమ చేసిన = తామొనర్చిన; కర్మంబునఫలము = పనుల వలని ఫలం; ఎవ్వరికిన్ = ఎట్టివారికిన్నీ; త్రోచిపుచ్చన్+ కన్+రాదు = తొలగద్రోయుటకు వీలుపడదు; అది = ఆ కర్మ ఫలం; ఎట్లును = ఏ విధంగానైన; కుడువక = అనుభవించక; పోదు = నశించదు; అనన్ = అని శంకరుడు చెప్పగా; విని = ఆలకించి; పార్వతి; విభునకున్ = తన భర్తకు; కృష్ణా! = శ్రీ కృష్ణా!; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నది అని నారదుడు దేవి పల్కిన మాటలను వాసుదేవుడికి తెలిపాడు.

తాత్పర్యం: 'పార్వతీ! వినుము. తాము చేసిన కర్మఫలాలను తొలగ త్రోసికొనడానికి ఎంతటి వారికిన్నీ శక్యంగాదు. ఆ కర్మలఫలం అనుభవించితీరవలసిందే' అని శంకరు డనగా పార్వతి మళ్ళీ శ్రీకృష్ణా! ఇట్లా అన్నది.

తే. 'కర్మఫలములు గుడిచినఁ గాని పోవ । వంటి; వానిఁ బ్రాయశ్చిత్త మపహరించు
నందు; రశ్వమేధంబున నఖిల పాప । ములును జెడు ననఁగా విందు భూతనాథ!' 116

ప్రతిపదార్థం: భూతనాథ! = భూతగణాలకు ప్రభుడవైన ప్రాణేశ్వరా!; కర్మఫలములు = చేసిన కర్మల యొక్క ఫలాలు; కుడిచినన్+కాని = అనుభవిస్తే కాని; పోవవు+అంటి = తొలగవు అని చెప్పినావు; వానిన్ = ఆ కర్మఫలాలను; ప్రాయశ్చిత్తము = పాపపరిహారార్థమైన క్రియ; అపహరించున్+అందురు = పోగొట్టుతుందని చెప్పుతారు; అశ్వమేధంబునన్ = అశ్వమేధయాగం వల్ల; అఖిల పాపములును = సమస్త దురితాలూ; చెడున్ = నశిస్తాయి; అనఁగాన్+విందున్=అని చెప్పగా వింటున్నాను.

తాత్పర్యం: 'జీవితేశ్వరా! కర్మఫలాలు అనుభవించక తీరదని తమరు వచిస్తున్నారు. ప్రాయశ్చిత్తాలవలన దోషాలు తొలగిపోతాయని అంటారు. అశ్వమేధయాగం చేస్తే సర్వపాపాలు పటాపంచలవుతాయనే మాటలు వింటున్నాను.'

వ. అని పలికి 'యిది యెట్లొకో?' యనుటయు భవుండు. 117

ప్రతిపదార్థం: అని పలికి = అని వచించి; ఇది+ఎట్లు+ఒకో? = ఈ సంగతి ఏమిటో?; అనుటయున్ = అని గౌరి అడుగగా; భవుండు = శివుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: పార్వతీదేవి ఈ రీతిగా పలికి 'ఈ కర్మానుభవం విషయం ఎట్టిది?' అని అడుగగా శంభు'డిట్లా అన్నాడు.

ఆ. 'అతివ! కామకృతములైన కర్మంబుల । ఫలము లనుభవింప వలయు; వినుమ
కామకృతము చెడుట గలుగుఁ బ్రాయశ్చిత్త । మాచరింప సంశయంబు వలదు. 118

ప్రతిపదార్థం: అతివ! = ఓ తరుణీ!; కామ కృతములు+ఐన = కోరికతో చేసినట్టివగు; కర్మంబులఫలములు = కర్మల యొక్క ఫలాలు; అనుభవింపన్ వలయున్ = అనుభవించే తీరాలి; వినుము = పార్వతీ! శ్రద్ధగా ఆలకించుము; ప్రాయశ్చిత్తము+ ఆచరింపన్ = దోషపరిహారార్థం చేయునట్టిక్రియ వల్ల; అకామకృతము = ఏ సంకల్పం లేక చేయబడినట్టి కర్మయొక్క ఫలం; చెడుట+కలుగున్ = నశించిపోవటం జరుగుతుంది; సంశయంబు వలదు = సందేహించ నక్కరలేదు.

తాత్పర్యం: 'దేవీ! కోరి కోరి చేసిన కర్మల యొక్క ఫలాలు తాను అనుభవించక తీరదు. ఎట్టి సంకల్పం లేక, అజ్ఞానం వల్లనో, పరాకువల్లనో చేసిన కర్మల యొక్క ఫలం మాత్రం ప్రాయశ్చిత్తం వలన తప్పక నశిస్తుంది. ఈ విషయంలో సంశయం వద్దు.

క. కావునఁ గుడువక పొలియదు । దేవాసురమునులకైన దేవీ! కర్మో
ద్భావితఫల మీయర్థము । నీవలవఱపుము భవన్మనీషఁ దిరముగన్. 119

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి, కనుక; దేవీ! = ప్రేయసీ!; కర్మ+ఉద్భావితఫలము = కర్మల వలన ఉద్భవించిన (జనించిన) ఫలం; దేవ+అసుర+మునులకున్+ఐనన్ = వేల్పులకైనా, రాక్షసులకైనా, మునీశ్వరులకైనా; కుడువక = అనుభవించక; పొలియదు = నశించదు, సమసిపోదు; ఈ+అర్థమున్ = ఈ సంగతిని; నీవు = నీవు; భవత్+మనీషన్ = నీ బుద్ధియందు; తిరముగన్ = స్థిరంగా, గట్టిగా; అలవఱపుము = అభ్యసించుము,(ధరించుము).

తాత్పర్యం: రమణీ! కనుక దేవతలకైనా, రక్కసులకైనా, మునులకైనా మరెవ్వరికైనా తాము చేసిన కర్మల ఫలం తామే అనుభవించక నశించదు. ఈ విషయాన్ని నీ బుద్ధిలో దృఢంగా పదిలపరచుకొమ్ము'!

వ. అని చెప్పి య ప్పరమేశ్వరుండు వెండియు. 120

ప్రతిపదార్థం: అని చెప్పి = అని పలికి; ఆ+పరమ+ఈశ్వరుండు = ఆ మహేశ్వరుడు; వెండియున్ = మరల. (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని నుడివి మహాదేవుడు మళ్ళీ అంబికతో ఇట్లా అన్నాడు.

క. సుకృతముల నరుఁడు నాకము । నకుఁ జను; నవి గొంచెమైన నరుఁడ యగును; వా
నికి దివి కేఁగి డిగిన యత । నికి మానుష వైభవములు నెఱయం గల్గున్.' 121

ప్రతిపదార్థం: నరుఁడు = మానవుడు; సుకృతములన్ = పుణ్యాలచేత; నాకమునకున్ = స్వర్గానికి; చనున్ = వెళతాడు; అవి = ఆ పుణ్యాలు; కొంచెము+ఐనన్ = స్వల్పమైతే; నరుఁడు+అ = నరుడే; అగున్ = అవుతాడు; వానికిన్ = ఆ మనుజుడికి; దివికిన్+ఏఁగి = స్వర్గలోకానికి వెళ్ళి; డిగిన+అతనికిన్ = అక్కడ నుండి భువికి వచ్చిన వాడికి; మానుష వైభవములు = మనుషులకు కలిగే శుభములు; నెఱయన్ = పూర్ణంగా; కల్గున్ = లభిస్తాయి.

తాత్పర్యం: మానవుడు పుణ్యాలొనర్చి స్వర్గలోకానికి వెళ్ళుతాడు. ఆ పుణ్యములు అల్పములైతే పుడమిలో మనుష్యుడై పుట్టుతాడు. ఇట్లా అల్పపుణ్యుడికీ, స్వర్గానికి వెళ్ళి మరలి వచ్చిన వాడికి మనుష్య భోగాలు పూర్ణంగానే లభిస్తాయి.'

వ. అని నిర్దేశించి యుద్దేశ రూపంబునం గర్మంబుల తెఱం గెఱింగించి 'యింక నేమి యడుగవల తడుగు' మనిన నంబిక 'కర్మ కరణంబు జంతువశంబు గ్రహవశంబునా రెండు తెఱంగులం జెప్పదు; రం దెయ్యది దృఢం?' బని యడుగుటయు మృడుం డిట్లనియె. 122

ప్రతిపదార్థం: అని నిర్దేశించి = అని నిర్ణయించి; ఉద్దేశరూపంబునన్ = తలంచిన విధంగా; కర్మంబుల తెఱంగు = కర్మముల యొక్క స్వరూపం, విధానం; ఎఱింగించి = తెలిపి; ఇంకన్, ఏమి+అడుగన్+వలతు = ఏ విషయం అడుగదలచావో; అడుగుము; అనినన్ = అని శంభు డనగా; అంబిక = గౌరి; కర్మకరణంబు = కర్మలు చేయటం; జంతువశంబు = ప్రాణులకు అధీనం; గ్రహవశంబు = సూర్యాదిగ్రహాల యొక్క అధీనం; నాన్ = అని; రెండు తెఱంగులన్ = రెండు విధాలుగా; చెప్పుదురు; అందున్ = ఆ రెంటిలో; ఏ+అది(ఎయ్యది) = ఏది; దృఢంబు = బలీయం; అని+అడుగుటయున్ = అని ప్రశ్నించగా; మృడుండు = శంకరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ ప్రకారం గిరీశుడు గిరిజకు తెల్పి 'ఉమా! నేను భావించిన చందంగా నీకు కర్మస్వరూపం వివరించాను. ఇంకా ఏమైనా అడుగదలంచితే అడుగు' మన్నాడు. పార్వతి, 'దేవా! కర్మాచరణం జీవుల వశమనీ, సూర్యాదిగ్రహాలకు అధీనమనీ రెండు విధాలుగా చెప్పుతుంటారు. ఇందులో ఏది బలీయమో సెలవియ్యండి' అని అడిగింది. అందుకు ఈశు డిట్లా అన్నాడు.

తే. 'నాతి! విను గ్రహచారంబు హేతువులుగ । నశుభములు శుభములు నరుఁ డాచరించు;
గ్రహము చేయించునే? తాన కాక చేఁత । కొడయుఁ డటుగాన ఫలములు గుడువ వలయు.' 123

ప్రతిపదార్థం: నాతి! = ఓ సుందరీ!; విను = వినుము; గ్రహచారంబు = గ్రహముల యొక్క సంచారం; హేతువులుగన్ = కారణంకాగా; నరుఁడు = మనిషి; అశుభములున్ = చెడుపనులనూ, పాపకార్యాలనూ; శుభములున్ = మంచిపనులనూ, పుణ్యకార్యాలనూ; ఆచరించున్ = చేస్తాడు; చేఁతకున్ = కర్మకు; ఒడయుఁడు = అధికారి; తాను+అ+కాక = కేవలం తానే తప్ప; గ్రహము చేయించును+ఏ? = గ్రహం తన చేత ఆ పని చేయిస్తుందా? చేయించదనిభావం; అటు+కాన = అందుచేత; ఫలములు = కర్మలయొక్క ఫలాలు; కుడువన్+వలయున్ = తాను అనుభవించవలసిందే.

తాత్పర్యం: 'కాత్యాయనీ! గ్రహాల యొక్క సంచారం కారణంగా నరుడు శుభాశుభకర్మలు చేస్తాడు. ఆ కర్మ లన్నింటికీ తానే అధికారి. గ్రహాలు తన చేత ఆ పనులు చేయించటం లేదు కదా! కనుక ఆ కర్మఫలాలు తానే అనుభవించక తప్పదు.'

విశేషం: గ్రహాలు తొమ్మిది. 1)సూర్యుడు 2)చంద్రుడు 3)అంగారకుడు 4)బుధుడు 5)బృహస్పతి 6)శుక్రుడు 7)శని 8)రాహువు 9)కేతువు. అంగారకుడిని కుజుడంటారు. బృహస్పతికి గురుడని పేరు.

ద్రుతాంతమైన 'కావునన్' అనేదానిలో "వు" లోపించగా శేషించిన రూపం కానన్. అటుగానన్ అని ద్రుతాంతంగా దీనికి పూర్వకవి ప్రయోగాలు కోకొల్లలు. కాని, భారతంలో ఇది కళగానే కన్పిస్తుంది.

మ. 'ధృతరాష్ట్రుండును బుత్త్రులున్ వనము; గుంతీనందనుల్ సింహముల్;
మతి నూహింప నసింహమైన వనమున్ మర్దింతు; రెందున్ వనా
వృత వృత్తంబులుగాని సింహములకున్ వేగంబు చేటొందుఁ; గా
<u>న తగం</u> బొందుట కార్య మీయుభయమున్ సంతుష్టిమై నున్కికిన్.' (ఉద్యో. 1-358)

'కానన్' అనేది ద్రుతప్రకృతిక మైనప్పటికీ తిక్కనగారు దీనిని కళగానే స్వీకరించారు. లేకపోతే ద్రుతసంధికార్యాలు ప్రవర్తించి 'కానఁదగన్' అను రూపం సిద్ధించి ప్రాసమైత్రికి భంగం కలిగి ఉండేది.

వ. అనినఁ 'జా వనునది యేమి?' యని యుమ యడుగ నీశానుం డిట్లనియె. 124

ప్రతిపదార్థం: అనినన్ = అని శివుడు తెల్పగా; ఉమ = పార్వతి, చావు+అనునది = మరణమనేది; ఏమి = ఏమిటి?; అని, అడుగన్ = ప్రశ్నించగా; ఈశానుండు = ఈశ్వరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని పార్వతి 'చావు అంటే ఏమిటి?' అని అడుగగా, శివుడు ఇట్లా అన్నాడు.

తే. 'నిత్యుఁ డాత్ముండు; దేహ మనిత్య; మతఁడు । ముదిమిఁ దెవులున వికృతమై యది వికలతఁ
బొందుటయు, దానిఁ దొఱఁగి తాఁ బోవునట్టి । దశకు మరణ మ న్పేరయ్యెఁ దనులతాంగి! 125

ప్రతిపదార్థం: తనులతా+అంగి! = సన్నని తీగవంటి శరీరంకలదానా!; ఆత్ముండు = జీవుడు; నిత్యుఁడు = నశించనివాడు, శాశ్వతుడు; దేహము = శరీరం; అనిత్యము = శాశ్వతం కానిది, నశించిపోయేది; ముదిమిన్ = ముసలితనం చేతనూ; తెవులునన్ = రోగాల చేతనూ; వికృతము+ఐ = పరిణామం పొందినదై, మార్పు చెందినదై; అది = ఆ మేను; వికలతన్+పొందుటయున్ = శక్తిని గోల్పోవగా; దానిన్ = తనువును; తొఱఁగి = విడిచి; తాన్ = జీవుడు; పోవునట్టి దశకున్ = వెళ్ళిపోయేస్థితికి; మరణము+అన్ = చావు అనే; పేరు+అయ్యెన్ = నామం ఏర్పడింది.

తాత్పర్యం: 'తీగవంటి సన్నని శరీరం గల చెలీ! జీవుడు శాశ్వతంగా ఉండేవాడు. దేహం అట్లాంటిది కాదు; నశించిపోయే స్వభావం కలది. దేహాత్మల కున్న తేడా ఇది. అయితే ముసలితనం చేత, రోగాల చేత మారిపోయి క్షీణించి శరీరం నశించే వేళ జీవుడు దానిని విడిచి వెళ్ళే స్థితికే మరణం అని పేరు.

విశేషం: భగవద్గీతోపనిషత్తులోని సాంఖ్యయోగం దేహాత్మ లక్షణాలను "న జాయతే మ్రియతే వా కదాచిత్"; "వేదాఽవినాశినం నిత్యం"; "వాసాంసి జీర్ణాని యథా విహాయ"; "దేహీ నిత్య మవధ్యోఽయం" ఇత్యాది శ్లోకాలలో విపులంగా చర్చించింది.

క. జీవుఁడు జీర్ణ శరీరముఁ । బోవిడిచి నవంబుఁ బొందఁ బుట్టను పేరం
దా వెలయుం దద్దశ జీ । వావలి వర్తించు నిటు గతాగతపరయై.' 126

ప్రతిపదార్థం: జీవుఁడు = ఆత్మ; జీర్ణ శరీరమున్ = శిథిలమైన శరీరాన్ని; పోన్ విడిచి = పరిత్యజించి; నవంబున్ = నూతనమైనదాన్ని, క్రొత్తదానిని; పొందన్ = గ్రహించటానికి; పుట్టు+అనుపేరన్ = పుట్టుతున్నాడు అనే పేరుతో; తాన్ = తాను; వెలయున్ = వెలుగొందుతున్నాడు; తత్+దశన్ = ఆ స్థితియందు; జీవ+ఆవలి = ప్రాణిసమూహం; ఇటు = ఈ ప్రకారం; గత+ఆగత+పర+ఐ = పోవుట, వచ్చుట అనువాటికి అధీనమై - రాకపోకలకు అనగా చావు పుట్టువులకు లోబడి; వర్తించున్ = మెలగుతుంది;

తాత్పర్యం: జీవుడు శిథిలమైన శరీరాన్ని వదలి క్రొత్త దేహాన్ని చేకొనే దానికే పుట్టుక అని పేరు. ప్రాణులు ఈ విధంగా కర్మమూలకములైన దేహాలను ధరిస్తూ విడుస్తూ అంటే జనన మరణాలకు అధీనులై ప్రవర్తిస్తుంటారు.'

విశేషం: "వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి,
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ." (భగ. 2-22)

మానవుడు శిథిలాలైన వస్త్రాలను వదలి నూతన వస్త్రాలను ఎట్లా ధరిస్తాడో, అట్లే జీవుడు కూడ శిథిలాలైన శరీరాలను విడిచి క్రొత్తవైన ఇతర శరీరాలను పొందుతున్నాడు.

ఇత్యాది గీతాశ్లోకాలు ఇక్కడ స్మర్తవ్యాలు.

వ. అనిన విని పార్వతి శర్వునితో 'బాలురు చచ్చుటకును వృద్ధులు పెద్ద కాలంబు బ్రదుకుటకును గారణం బేమి?' యనుడు నతండు. 127

ప్రతిపదార్థం: అనినన్; విని; పార్వతి; శర్వునితోన్ = శంకరుడితో; బాలురు = పిల్లలు; చచ్చుటకును; వృద్ధులు = ముసలివారు; పెద్దకాలంబు = పెక్కు సంవత్సరాలు; బ్రదుకుటకును; కారణంబు+ఏమి; అనుడున్ = అని ప్రశ్నించగా; అతండు = శివుడు. (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: శంభుడు అట్లా చెప్పగా విన్న గౌరీదేవి అతడితో 'మహేశ్వరా! పిల్లలు చావటానికి, పెద్దలు చిరకాలం జీవించటానికి హేతు వేమిటి?' అని ప్రశ్నించగా శివు డిట్లా బదులు చెప్పాడు.

తే. 'మేను జీర్ణముగాఁ జేయుఁ గాని మరణ। మొందఁ జేయదు విను కాల మెందు నరుని
పూర్వకర్మంబు లాయువుఁ బొదలఁ జేయ। సన్నముగఁ జేయ బ్రదుకును జావుఁ గలుగు.' 128

ప్రతిపదార్థం: విను = గౌరీ వినుము; కాలము = కాలం అనేది; మేనున్ = శరీరమును; జీర్ణముగాన్+చేయున్+కాని = చివికిపోయేటట్లు చేస్తుంది తప్ప; మరణము+ఒందన్+చేయదు = చనిపోయేటట్లు చేయలేదు; ఎందున్ = ఎక్కడైనా; నరునిపూర్వకర్మంబులు = మానవుడు పూర్వజన్మలో చేసికొన్న కర్మలు; ఆయువున్ = ఆయుష్యాన్ని, జీవితకాలాన్ని; పొదలన్+చేయన్ = వృద్ధి పొందేటట్లు చేయగా; సన్నముగన్+చేయన్ = క్షీణించేటట్లు చేయగా; బ్రదుకును = జీవించటం; చావున్ = మరణించటం; కలుగున్ = సంభవిస్తాయి.

తాత్పర్యం: 'దేవీ! విను. కాలం శరీరాన్ని శుష్కింపజేస్తుంది గాని చంపలేదు, నరుడు చేసిన పూర్వకర్మలే అతడి జీవిత కాలాన్ని పెంచటం చేత, క్షీణింప జేయడం చేత బ్రతకటం, చావటం అనేవి సంభవిస్తాయి.'

వ. అని చెప్పిన 'నాయు వేమిటం బెరుఁగు? నేద్దానం దఱుఁగు?' ననిన విని యుమకు నుమాపతి యిట్లనియె.129

ప్రతిపదార్థం: అని చెప్పినన్; ఆయువు = ఆయుస్సు; ఏమిటన్ = దేనిచేత; పెరుఁగున్? = వృద్ధి చెందుతుంది?; ఏ+దానన్ = దేనిచేత; తఱుఁగున్ = సన్నగిల్లుతుంది, క్షీణిస్తుంది?; అనినన్; విని; ఉమకున్; ఉమాపతి = శివుడు; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని శివుడు చెప్పగా ఆకర్ణించి పార్వతీదేవి 'జీవితేశ్వరా! ఆయుస్సు దేనిచే వృద్ధి పొందుతుంది? దేని చేత క్షీణిస్తుంది? చెప్పు' మని అడిగింది. అందుకు ఉమావల్లభుడు ఇట్లా సమాధాన మిచ్చాడు.

శివుఁడు పార్వతికి ఆయుర్వృద్ధి క్షయంబులకుఁ గారణంబులు చెప్పుట. (సం.13 అను 01 15-2300).

తే. 'క్షమయు సత్యంబుఁ గృపయు శౌచమును గురుల । వలని భక్తియు నాయువు పొలుపు నిచ్చు;
నలుక బొంకు క్రూరత శుచితాపగమము । గురువిరోధ మాయువుఁ గడుఁ గుందఁ జేయు. 130

ప్రతిపదార్థం: క్షమయున్ = సహనం, ఓర్పు; సత్యంబున్ = నిజం చెప్పటం; కృపయున్ = దయ; శౌచమును = పరిశుద్ధత; గురులవలని భక్తియున్ = ఆచార్యుల యెడ భక్తి భావం, పెద్దల యందు భక్తి; ఆయువు పొలుపున్ = ఆయుర్దాయము యొక్క పెంపును; ఇచ్చున్ = కలుగ జేస్తాయి; అలుక = కోపం, బొంకు = అబద్ధమాడటం; క్రూరత = కనికరం లేకుండటం, కర్కశత్వం; శుచితా+అపగమము = పరిశుద్ధత నుండి తొలగటం, శౌచవిహీనత్వం; గురు విరోధము = ఆచార్యుడి పట్ల వైరం, దేశికులపై ద్వేషం; ఆయువున్ = ఆయుష్యాన్ని; కడున్ = మిక్కిలి; కుందన్+చేయున్ = తగ్గించి వేస్తాయి, క్షీణింపజేస్తాయి.

తాత్పర్యం: 'సహనం, సత్యం, దయ, పరిశుద్ధత, గురువులయందు భక్తి ఆయుస్సును వృద్ధిపరుస్తాయి. క్రోధం, అబద్ధం, క్రూరత్వం, అపరిశుద్ధత, గురుద్వేషం అనేవి ఆయుస్సును మిక్కిలి క్షీణింపజేస్తాయి గౌరీ!

తే. తపమునను బ్రహ్మచర్యవ్రతమున హిత మి । తాశనమున రసాయనాభ్యాసమునను
బెరుఁగు నాయు; వాక్రియలపై నరుఁడు ప్రీతి । గలుగుటయుఁ బూర్వభవకృత కర్మ ఫలము. 131

ప్రతిపదార్థం: తపమునను = తపస్సు చేతనూ; బ్రహ్మచర్యవ్రతమునన్ = బ్రహ్మచర్య నియమపాలనం చేతనూ; హిత+మిత+అశనమునన్ = తగినట్టి, మితమైన ఆహారం చేతనూ; రసాయన+అభ్యాసమునను = జీవనౌషధాలను సేవించటం చేతనూ; అనగా ముసలితనం, మృత్యువును పోగొట్టే రసాయనాలను వాడటం చేతనూ; ఆయువు = ఆయుస్సు; పెరుఁగున్ = వృద్ధి చెందుతుంది; నరుఁడు = మానవుడు; ఆక్రియలపైన్ = తపస్సు మున్నుగా కలిగిన ఆ చర్యల మీద; ప్రీతి+కలుగుటయున్ = ఇష్టపడటం కూడ, మక్కువ చెందటం సైతం; పూర్వభవ = ముందటి జన్మలో; కృత = చేయబడిన; కర్మఫలము = కర్మలయొక్క ఫలమే సుమా!

తాత్పర్యం: విష్ణుసహోదరీ! తపస్సు చేతనూ, బ్రహ్మచర్యవ్రతానుష్ఠానం చేతనూ, ప్రియమైన, మితమైన ఆహారం స్వీకరించటం చేతనూ, జరామృత్యుహరణమైన జీవనౌషధాలను సేవించటం చేతనూ ఆయుర్దాయం పెరుగుతుంది. పై నుడివిన క్రియలమీద ఆసక్తి కలగటం కూడ ఆ నరుడు తొలుతటి జన్మలో చేసిన సుకృత కర్మల ఫలమే సుమా!

క. తన లావున కధిక మయిన । పనిసేయు టయుక్తమును నపథ్యము నగు భో
జనములు హరించు నాయువు; । వనిత! యవియుఁ బూర్వకర్మ వశతన కలుగున్. 132

ప్రతిపదార్థం: వనిత! = ఓ వెలదీ!; తనలావునకున్ = తన శక్తికి, తన బలమునకు; అధికము+అయిన = మించిన, ఎక్కువైన; పనిచేయుట = పనులు సల్పటం; అయుక్తమును = తగనిదియు; అపథ్యమున్+అగు = హితం కానిదియు అగు; భోజనములు

= ఆహారాలు, తిండ్లు; ఆయువున్ = ఆయుస్సును; హరించున్ = నశింపజేస్తాయి; అవియున్ = పై జెప్పినవి; పూర్వకర్మ వశతన్+అ = మునుపటి జన్మలో చేసిన కర్మల ననుసరించే; కలుగున్ = సంభవిస్తాయి.

తాత్పర్యం: గిరిజా! తన శక్తికి మించిన పనులు చెయ్యటం, అయోగ్యమైన, హితకరం కాని తిండ్లు తినటం వలన ఆయువు హరించుక పోతుంది. ఇట్లాంటివి పూర్వజన్మలో చేసిన కర్మల వల్లనే సంభవిస్తాయి.

వ. మఱియు నొక్క విశేషంబు సెప్పెద. 133

తాత్పర్యం: ఇంకొక్క విశేషం చెప్పుతాను గౌరీ! వినుము.

ఆ. సుకృతు లమరలోక సుచిరవాసులు నిట । దిగి చిరాయువులును నగుదు; రితరు
లతిచిరముగ నరకగతు లయి తుది నాయు । వల్ప మగు మనుష్యు లగుట గలుగు.' 134

ప్రతిపదార్థం: సుకృతులు = పుణ్యాత్ములు; అమరలోక సుచిరవాసులు = స్వర్గలోకంలో బహు దీర్ఘకాలం నివసించేవారు అవుతారు; ఇట దిగి = ఇలకు దిగివచ్చి; చిర+ఆయువులును+అగుదురు = దీర్ఘాయుష్మంతు లవుతారు; ఇతరులు = తక్కిన వారు, పాపాత్ములు; అతి చిరముగన్ = మిక్కిలి పెద్దకాలం; నరక గతులు+అయి = నరకలోకమునకు వెళ్ళినవారై; తుదిన్ = చివరకు, కడపట; ఆయువు = జీవితకాలం; అల్పము+అగు = తక్కువైన; మనుష్యులు+అగుట = మానవులై పుట్టటం; కలుగున్ = సంభవిస్తుంది, జరుగుతుంది.

తాత్పర్యం: పుణ్యపురుషులు దేవలోకంలో సుఖా లనుభవిస్తూ బహుకాలం గడపి పుణ్యం క్షీణించగానే తిరిగి భూలోకంలో మానవులుగా పుట్టుతారు. అప్పుడు వారు పుడమిలో దీర్ఘకాలం జీవిస్తారు. పాపులు నరకలోకంలో యాతనలు అనుభవించి పిమ్మట భూమిలో నరులై జన్మిస్తారు. అపుడు వారు అల్పమయిన ఆయుస్సు కలిగి ఉంటారు.'

విశేషం: దీర్ఘకాలం మనటానికి, అల్పకాలం జీవించటానికి ఆయాజీవులు చేసిన పుణ్యపాపాలే హేతువులని చెప్పటం జరిగింది.

క. నా విని భవాని 'పురుష । స్త్రీ విధములు రెండు గలవు త్రినయన! వానన్
జీవుఁడు వర్తించు తెఱఁగు । నీ వేర్పడఁ జెప్పవే!' యనియెఁ గంసారీ! 135

ప్రతిపదార్థం: కంస+అరీ(కంసునికి విరోధి)! = కంసుడుని సంహరించిన శ్రీకృష్ణా!; నాన్ = అని పరమేశ్వరుడు చెప్పగా; విని = ఆకర్ణించి; భవాని = శివపత్ని అయిన పార్వతి; త్రినయన! = మూడు కన్నులు గల శివా!; పురుష స్త్రీ విధములు = మగవాడని, ఆడుది అనే రీతులు; రెండు+కలవు = రెండున్నవి; వానన్ = ఆ రెంటిలో; జీవుఁడు = ఆత్మ; వర్తించు తెఱఁగు = మెలగే విధం; నీవు = తమరు; ఏర్పడన్ = విశదంగా, స్పష్టంగా; చెప్పవు+ఏ! = సెలవియ్యవా!; అనియెన్ = అని అడిగింది.

తాత్పర్యం: కృష్ణా! (కృష్ణుడితో నారదు డంటున్నాడు) శివుడు చెప్పిన మాటలువిని భవాని మరల భవుడితో

'ప్రాణేశ్వరా! లోకంలో పురుషులనీ, స్త్రీ లనీ జీవులు రెండు రకాలుగా ఉన్నారు కదా! వారిలో జీవుడు ఎట్లా ప్రవర్తిస్తుంటాడో ఆ విషయం నాకు విస్పష్టంగా వివరించు' మని వేడుకొనింది.

వ. అనిన విని మహాదేవుండు మహీధరతనయ కిట్లనియె. 136

ప్రతిపదార్థం: అనినన్; విని; మహాదేవుండు = ఈశ్వరుడు; మహీధరతనయకున్ = కొండ కొమార్తెకు, పార్వతికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పార్వతి అడుగగా శంభుడు ఆమెతో ఇట్లా అన్నాడు.

క. 'తాత్త్వికములైన పురుష । స్త్రీత్వంబులు లేవు పార్వతీ! జీవున; కా
తత్త్వమున కహంకృతిఁ గ । ర్మిత్వ మొలసి భావ్యవిధమ మెయికొను చుండున్.' 137

ప్రతిపదార్థం: పార్వతీ! = గౌరీ!; జీవునకున్ = ఆత్మకు; తాత్త్వికములు+ఐన = శరీరారంభక ద్రవ్యాలైన భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనే మహాభూతాలు, అహంకారతత్త్వం, మహత్తత్త్వం, మూలప్రకృతి అనే తత్త్వాల భేదం వలన కలిగిన, పురుషస్త్రీత్వంబులు లేవు = మగతనం ఆడుతనం అనేవి లేవు; ఆ తత్త్వమునకున్ = ఆ జీవభావానికి; అహంకృతిన్ = అహంకారం చేత; కర్మిత్వము+ఒలసి = కర్మసంబంధం లభించి; భావ్య విధము+అ = భావించినట్లుగానే స్త్రీ పురుషభేదం; మెయికొనుచున్+ఉండున్ = సంభవిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: 'గౌరీ! జీవుడికి మహదహంకారాదులైన తత్త్వాలలో భేదం వాటిల్లి మగవాడుగనో, ఆడుదిగనో జన్మించటం సంభవించదు. ఆత్మ స్త్రీ దేహం ధరించినా, పురుష శరీరం పొందినా ఆ ఇరవైనాలుగు తత్త్వాలు స్త్రీ పురుషులకు ఏకవిధంగానే ఉంటాయి. వాటిలో మార్పుండదు. అహంకారం వలన జీవుడికి కర్మ సంబంధం కలిగి ఆడుదిగనో, మగవాడుగనో రూపం ధరిస్తాడు.'

విశేషం: భూమి, జలం, వాయువు, తేజస్సు, ఆకాశం అనే పంచమహాభూతాలూ, అహంకారతత్త్వం, మహత్తత్త్వం, మూల ప్రకృతి అనే ఎనిమిది ద్రవ్యాలతో శరీరం రూపొందుతుంది. చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు అనే అయిదు జ్ఞానేంద్రియాలు, వాక్కు, చేయి, కాలు, మలవిసర్జనద్వారం, మూత్రవిసర్జన ద్వారం(పాయువు, ఉపస్థ) అనే అయిదు కర్మేంద్రియాలూ, మనస్సూ, జ్ఞానేంద్రియ పంచకం చేత గ్రహించబడే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అనే అయిదు విషయాలూ మొత్తం ఈ ఇరవై నాలుగు శరీరాన్ని ఆశ్రయించుకొని ఉండే తత్త్వాలు. ఈ తత్త్వాలు పురుషుడికిగాని, స్త్రీకి గాని ఏకవిధంగానే ఉంటాయి. అయితే ఆయాజీవులు చేసికొన్న పుణ్యాపాప కర్మ ఫలాలైన సుఖదుఃఖాలు అనుభవించటానికి శరీరాలు ఏర్పడుతాయి. నేనే ఈ పని చేస్తున్నాను అనే అహంకర్తృత్వ బుద్ధి వలన ఆ పుణ్యాపాప కర్మ సంబంధమైన సుఖదుఃఖానుభవం కొరకు జీవుడు శరీరం ధరిస్తాడు. అది పురుష దేహమైనా కావచ్చు; స్త్రీ దేహమైనా కావచ్చు. అంతేకాని అసలు ఆత్మకు స్త్రీత్వ పురుషత్వాలులేవు.

వ. అని మఱియును. 138

తాత్పర్యం: అని చెప్పి మహాదేవుడు మళ్ళీ (ఉమతో ఇట్లా అన్నాడు అని తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'కర్మములకుఁ గర్తగాఁ డాత్ముఁ; డతని స । త్త్వము రజస్సుఁ దమము వాత పిత్త
కఫము లెట్లు మర్త్యకాయ గతము లగు । నట్ల పొందుఁ గర్త లవియ చూవె. 139

ప్రతిపదార్థం: ఆత్ముఁడు = జీవుడు; కర్మములకున్ = కర్మలకు; కర్తకాఁడు = చేసేవాడు కాదు; వాతపిత్త కఫములు = వాతం, పిత్తం, శ్లేష్మం అనేవి; ఎట్లు = ఏ విధంగా; మర్త్యకాయగతములు+అగున్ = మనిషి శరీరాన్ని పొందుతాయో; అట్లు+అ = ఆ రీతిగానే; అతనిన్ = జీవుడిని; సత్త్వము = సత్త్వగుణం; రజస్సు = రజోగుణం; తమము = తమోగుణం; పొందున్ = ఆశ్రయిస్తాయి, కూడుతాయి; కర్తలు = ఆ పనులు చేసేవి; అవి+అ+చూవె = ఆ సత్త్వ రజ స్తమో గుణాలే సుమా!

తాత్పర్యం: 'గౌరీ! ఆత్ముడు కర్మలకు కర్త కాడు. వాతం, పిత్తం, కఫం అనే త్రిదోషాలు శరీరాలను ఆశ్రయించుకొని ఉన్న చందంగా సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం జీవుడిని ఆశ్రయించి ఉంటాయి. ఈ మూడు గుణాలే కర్మలకు కర్తలు గాని జీవుడు మాత్రం కానేకాడు.

విశేషం: "సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః,
నిబధ్నన్తి మహాబాహో! దేహే దేహిన మవ్యయమ్." (భగ. 14-5)

సత్త్వరజస్తమోగుణాలు ప్రకృతికి సహజమైన గుణాలు. అవి నాశరహితుడైన ఆత్మను దేవమనుష్యాది దేహాలలో బంధిస్తున్నాయి.

"ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః,
అహంకార విమూఢాత్మా కర్తాऽహ మితి మన్యతే." (భగ. 3-27)

ప్రకృతికి చెందిన సత్త్వ రజస్తమోగుణాలచేత చేయించబడుతున్న కర్మలను ఆత్మయొక్క యథార్థస్వరూపం తెలియనివాడు దేహాత్మాభిమానం వలన ఆ పను లన్నిటినీ తానే చేస్తున్నట్లు తలపోస్తాడుకాని వాస్తవానికి గుణాలే కర్మలకు కర్తలు అని గీత చెప్పుతున్నది.

తే. సత్య శౌచ దయాదులు సాత్త్వికములు, । రమణి! లోభ సంగాదులు రాజసంబు,
లనృత హింసాపరత్వ భయాలసత్వ । ధైర్యహాని నిద్రాదులు తామసములు. 140

ప్రతిపదార్థం: రమణి! = సుందరీ!; సత్య శౌచదయా+ఆదులు = సత్యం, పరిశుద్ధత, కృప మొదలైన గుణాలు; సాత్త్వికములు .= సత్త్వగుణానికి సంబంధించినట్టివి; లోభసంగ+ఆదులు = దురాశ లేదా పిసినారితనం, సంసార విషయాసక్తి మొదలైనవి; రాజసంబులు = రజోగుణ సంబంధమైనవి; అనృత = అబద్ధాలాడటం; హింసాపరత్వ = జీవులను బాధించటంలో ఆసక్తి; భయ = భీతి చెందటం; అలసత్వ = సోమరితనం; ధైర్యహాని = ధైర్యంకోల్పోవటం; నిద్రా+ఆదులు = నిద్రించటం మొదలైనవి; తామసములు = తమోగుణానికి సంబంధించినవి.

తాత్పర్యం: సుందరీ! సత్యం, శుచిత్వం, కరుణ మొదలైనవి సత్త్వగుణానికి సంబంధించినటువంటివి. అత్యాశ (పిసినారితనం--అవసరమైనపుడు తన సొమ్ము ఖర్చుపెట్టకుండటం), భార్యాపుత్రమిత్రాదుల యందు మమత మొదలైనవి రజోగుణ సంబంధమైనవి. అబద్ధాలు చెప్పడం, జీవహింసయందు ఆసక్తి, భయపడటం, సోమరితనం, అధైర్యం, నిద్ర మొదలైనవి తమోగుణానికి చెందినట్టివి.

క. ఇవి నానాముఖములఁ బురు । షు వికారముఁ బొందఁ జేయుచుం బరఁగును హై
మవతీ! కావున సర్వం । బు వినుము గుణకృత్య మిట్టి బోధం బొప్పన్ 141

ప్రతిపదార్థం: ఇవి = ఈ త్రిగుణాలు; నానా ముఖములన్ = అనేకరీతుల; పురుషున్ = జీవుడిని, ఆత్మడిని; వికారమున్+ పొందన్+చేయుచున్ = స్వభావంలో మార్పులు కలిగిస్తూ; పరఁగున్ = విలసిల్లుతున్నవి; కావునన్ = కాబట్టి; హైమవతీ! = హిమవంతుడి పుత్రివైన దేవీ!; ఇట్టి బోధంబు = ఇట్టి తెలివి; ఒప్పన్ = చెలువొందగా; వినుము = ఆలకించుము; సర్వంబు = సమస్తమూ; గుణకృత్యము = గుణాలు చేసే పనే.

తాత్పర్యం: గిరిజా! సత్త్వరజస్తమోగుణాలు మూడున్నూ పురుషుడిని నానావికారాల పాలు చేస్తున్నవి. కనుక సర్వకార్యాలూ ఈ గుణాల చేతనే చేయబడుతున్నవని తెలివితో తెలిసికొనుము.

తే. తన్వి! సాత్త్విక రాజస తామసాత్మ । లైనవారలఁ బుణ్యలోకానుభవము
మనుజభావంబు నిరయపీడనముఁ బొందు । మోక్షలక్ష్మి నిర్గుణునకు మునుఁగ ముసరు. 142

ప్రతిపదార్థం: తన్వి! = ఓ చెలీ!; సాత్త్విక రాజస తామస+ఆత్ములు+ఐనవారలన్ = సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం కలిగినట్టి వారిని; పుణ్యలోక+అనుభవమున్ = పుణ్యలోక సుఖానుభవం; మనుజభావంబున్ = మనుష్యత్వం; నిరయపీడనమున్ = నరకలోక బాధయున్నూ; పొందున్ = వరుసగా చెందుతాయి; మోక్ష లక్ష్మి = ముక్తి సంపద; నిర్గుణునకున్ = త్రిగుణాతీతుడికి; మునుఁగన్ ముసరున్ = పరిపూర్ణంగా చేకూరుతుంది.

తాత్పర్యం: పార్వతీ! సత్త్వగుణప్రధానుడికి పుణ్యలోక సుఖాలు, రజోగుణప్రధానుడికి మనుష్యత్వమూ, తమోగుణప్రధానుడికి నరకలోక బాధ కలుగుతాయి. త్రిగుణాతీతుడైన వాడికి ముక్తి పరిపూర్ణంగా లభిస్తుంది.

విశేషం: ఈ యర్థాన్నే భగవద్గీత ఇట్లా వెల్లడించింది.

"ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః,
జఘన్యగుణ వృత్తిస్థాః అధో గచ్ఛంతి తామసాః."

"నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి,
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి." (భగ. 14-18,19.)

వ. అని వెండియు. 143

తాత్పర్యం: అని పరమశివుడు పలికి ఇంకనూ (ఇట్లా అన్నాడని తరువాతి సీసపద్యంతో అన్వయం).

సీ. 'ఎట్టివి కర్మంబు లట్టివ నరుల శు । భాశుభసంప్రాప్తు; లట్లు గాక
పర విప్రియమున మేల్ వడయుటయును గల్గుఁ । బతిభృత్యతతిఁ బటు భర్త్సనముల
నొజ్జ శిష్యులఁ దర్జనోక్తుల వెజ్జ రో । గార్తుల నానా విధౌషధముల
నలమటఁ బొందింతు రవ్విధంబుల చేఁత । లన్నియు సుకృతంబులై ఫలించు'

ఆ. నని మఱియును జెప్పు 'నఖిలేంద్రియో పేత । మగు జరాయుజంబు నండజంబు
నువిద! చోఁకు నెఱుఁగు నుద్భిజ్జములు స్వేద । జముల కదియుఁ జూపు సంభవించు. 144

ప్రతిపదార్థం: కర్మంబులు = చేసే పనులు; ఎట్టివి = ఎట్లాంటివో; నరుల శుభ+అశుభ సంప్రాప్తులు = మనుష్యులు పొందేటటువంటి పుణ్యాపాపాలరాకడలు కూడ; అట్టివి+అ = అటువంటివే అవుతాయి; అట్లు+కాక = పై జెప్పినవిధంగా కాకుండా; పరవిప్రియమునన్ = ఇతరులకు అనిష్టములైన వాటిని చెయ్యటం వలన కూడ; మేల్ = మంచిని; పడయుటయును+ కల్గున్ = పొందడం కూడ జరుగుతుంది; పతి = యజమానుడు, అధికారి; భృత్యతతిన్ = సేవక గణాన్ని; పటు భర్త్సనములన్ = గట్టిగా బెదరించటం చేత, నిందించటం వలన; ఒజ్జ = గురువు, ఉపాధ్యాయుడు; శిష్యులన్ = ఛాత్రులను; తర్జన+ఉక్తులన్ = బెదరింపుమాటల చేత; వెజ్జు = వైద్యుడు; రోగ+ఆర్తులన్ = వ్యాధుల చేత బాధపడేవారిని; నానావిధ+ఔషధములన్ = పలురకాలైన మందుల చేతనూ; అలమటన్+పొందింతురు = శ్రమ పెట్టుతారు; ఆ+విధంబుల+చేఁతలు+అన్నియున్ = ఆ రీతివైన పనులన్నీ; సుకృతంబులు+ఐ = పుణ్యకార్యాలై; ఫలించున్ = పండుతాయి, ప్రయోజనాలు సిద్ధింపజేస్తాయి; అని = అంటూ; మఱియును = ఇంకా; చెప్పున్ = చెప్ప సాగినాడు; ఉవిద! = ఓ ప్రియా!; జరాయుజంబున్ = మావియందు పుట్టునదియూ; అండజంబున్ = గ్రుడ్డు నుండి పుట్టునదియూ; అఖిల+ఇంద్రియ+ఉపేతము+అగున్ = అన్ని ఇంద్రియాలతోనూ కూడిన దవుతుంది; ఉద్భిజ్జములు= చెట్లూ, పొదలూ; చోఁకున్+ఎఱుఁగున్ = స్పర్శజ్ఞానం కలిగి ఉంటాయి; స్వేదజములకున్ = చెమటవలన జన్మించిన జీవులకు; అదియున్+చూపు = స్పర్శజ్ఞానంతో పాటు దర్శన శక్తి కూడ; సంభవించున్ = కలుగుతుంది.

తాత్పర్యం: 'మనుషులు చేసేపనులను బట్టి వారికి మేలుగీళ్లు లభిస్తాయి. చెడ్డపని చేస్తే చెడు ఫలితం, మంచి పనులు చేస్తే మంచి ఫలితం కలుగుతాయన్న మాట. ఇందుకు భిన్నంగా కూడా జరగటం కద్దు. ఇతరులకు ఇష్టంగాని పనులు చేసే కర్తకు మేలు కలగటం కూడా సంభవిస్తుంది. అధికారి సేవకులను బెదరిస్తూ మాట్లాడటం, వైద్యుడు రోగాలతో అల్లాడే వారిని, చేదు, వగరు, కారం మందులు మింగించి శ్రమ పెట్టటం, గురువు విద్యార్థులను దండించటం ఇట్లాంటివే. ఈ పనుల వల్ల కర్తకు పుణ్యమేకాని పాపం రాదు'-- అని చెప్పి మహేశ్వరుడు మహాదేవితో మళ్ళీ అంటున్నాడు. 'దేవీ! మావియందు పుట్టిన ప్రాణీ, గ్రుడ్డునుండి జన్మించిన జీవీ సకలేంద్రియాలతో ఒప్పారుతుంది. చెట్లు చేమలు స్పర్శజ్ఞానం మాత్రమే కలిగి ఉంటాయి. చెమట వలన జన్మించిన జీవులస్థితి గతులు గూడ వృక్షాదుల స్థితిగతుల వంటివే. కాని, వీటికి దర్శనశక్తి గూడ ఉంటుంది.

విశేషం: జీవరాసులు నాలుగు విధాలు: 1)జరాయుజములు 2)అండజములు 3) ఉద్భిజ్జములు 4) స్వేదజములు అని.

అందు 1) జరాయుజములు అనగా మావి నుండి, గర్భాశయం నుంచి పుట్టినట్టివి--మనుష్యులు, పశువులు మొదలైన ప్రాణులు.

2) అండజములు = గ్రుడ్డువలన పుట్టినవి: పక్షులు, చేపలు, బల్లులు, పాములు.

3) ఉద్భిజ్జములు = భూమిని భేదించుకొని పుట్టినవి: వృక్షములు, లతలు (తీగలు) గుల్మములు (పొదలు)

4) స్వేదజములు = చెమటవలన పుట్టే క్రిమి విశేషాలు-- ఈగలు, దోమలు, చీమలు, మిడుతలు, నల్లులు, క్రిములు, కీటకాలు.

క. **నరుఁడు జరాయుజములలో । తరుణీ! విను ముత్తముఁడు; శ్రుతము లేకున్నన్**
సరి నతఁడు పశువుఁ; గావున । వరిష్ఠ మగునట్టి వినికి వలయు నరునకున్. **145**

ప్రతిపదార్థం: తరుణీ! = ఓ లలనా!; వినుము = ఆలింపుము; నరుఁడు = మనుజుడు; జరాయుజములలోన్ = మావి నుండి పుట్టిన జీవులలో; ఉత్తముఁడు = శ్రేష్ఠుడు; శ్రుతము+లేక+ఉన్నన్ = పెద్దల వలన ధర్మాధర్మముల వినికిడి లేకపోయినచో;

అతఁడు = ఆ మనుజుడు; పశువున్+సరి = పశువుతో, జంతువుతో సమానుడే; కావునన్ = కాబట్టి; నరునకున్ = మానవుడికి; వరిష్ఠము+అగు = శ్రేష్ఠమైన; వినికి వలయున్ = బోధ, ఉపదేశం అవసరం.

తాత్పర్యం: కాంతా! మావినుండి ఉద్భవించిన ప్రాణులలో మానవుడు శ్రేష్ఠుడు. అతడు ధర్మాధర్మాల స్వరూప మెట్టిదో పెద్దల వలన వినాలి. అట్టి వినికి లేనిచో అతడు పశువుతో సమానుడే. కావున జనుడికి శ్రేష్ఠమైన వినికిడి అవసరం.

క. **ఇరుదెఱఁగు విను తమము శా । ర్వరమును దేహజము శార్వరము దేజస్సం**
స్ఫురణమునఁ బాయు శ్రుతమునఁ । బరిహృతమగు దేహజంబు పర్వతపుత్రీ! **146**

ప్రతిపదార్థం: పర్వతపుత్రీ! = ఓ హైమవతీ!; విను = వినుము; తమము = చీకటి; ఇరు+తెఱఁగు = రెండు విధాలు; శార్వరమును = శర్వరీ సంబంధము అనగా రాత్రిసంబంధమైనదీ; దేహజమున్ = శరీర సంబంధమైనదియూ (అని); శార్వరము = రేయి వలన కలిగిన చీకటి; తేజస్+సంస్ఫురణమునన్ = వెలుగు గోచరించటంచేత, కాంతి ప్రసరించటం వలన; పాయున్ = తొలగుతుంది; దేహజంబు = శరీరం నుండి పుట్టినట్టిది; శ్రుతమునన్ = వినికిడి వలన (వేదశాస్త్ర శ్రవణం వలన); పరిహృతము+ అగున్ = తొలగింపబడుతుంది.

తాత్పర్యం: గౌరీ! వినుము; చీకటి రెండు విధాలు. ఒకటి రాత్రి వలన కలిగినట్టిది. రెండవది శరీరం వలన ఏర్పడినట్టిది. రాత్రి చీకటి కాంతి ప్రసరణం వలన నశిస్తుంది. దేహమున పుట్టిన చీకటి పెద్దలు చేసే శాస్త్ర చర్చ ఆలకించి గ్రహించటం వలన తొలగిపోతుంది.

విశేషం: దేహమున పుట్టిన చీకటి అంటే అజ్ఞానం.

ఆ. **బ్రహ్మ యా తమంబుఁ బాపుటకై తపో । వ్యాప్తిఁ బడసె శ్రుతులు నంగములును**
గానఁ గార్యములు నకార్యంబులును వానఁ । దెలిసి కొనఁగ బుద్ధి కలఁక దీఱు. **147**

ప్రతిపదార్థం: బ్రహ్మ = బ్రహ్మదేవుడు; ఆ తమంబున్ = ఆ చీకటిని; పాపుటకై = తొలగించటానికి; తపః వ్యాప్తిన్ = తపస్సు యొక్క సమృద్ధి చేత, చిరకాల ఘోర తపస్సు చేత; శ్రుతులున్ = వేదాలనూ; అంగములునున్ = వేదాంగాలైన ఆరుశాస్త్రాలనూ; పడసెన్ = పొందినాడు; కానన్ = కనుక; కార్యములున్ = చేయదగిన పనులూ; అకార్యంబులునున్ = చేయ దగని పనులూ; వానన్ = ఆ వేద శాస్త్రాల చేత; తెలిసికొనఁగన్ = ఎఱిగినట్లయితే; బుద్ధి కలఁక తీఱున్ = బుద్ధిజాడ్యం, మాంద్యం నశిస్తుంది.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు శరీరంలోని చీకటిని తొలగించటానికి బహుకాలం గొప్ప తపస్సు చేసి ఆ తపఃఫలంగా వేదాలనూ, శాస్త్రాలనూ పొందగలిగాడు. కాబట్టి చేయదగిన పను లేవో, చేయరాని పనులేవో ఆ వేదశాస్త్రాల వలన తెలియవలె. అందువలన బుద్ధి జాడ్యం తొలగిపోతుంది.

విశేషం: శ్రుతులు: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. వేదాంగములు: శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం-- ఇవి ఆరు.

తే. **క్రోధకామాదులైన దుర్గుణము లెల్ల । వాయుహతి మేఘపటలంబు వాయు పగిది**
శ్రుతముచేఁ బాయు; నరులలో సురల కరణి । శ్రుతయుతులు దేజరిల్లుదు రతిశయిల్లి. **148**

ప్రతిపదార్థం: క్రోధకామ+ఆదులు+ఐన = కోపం, కామం మొదలైన; దుర్గుణములు+ఎల్లన్ = చెడుగుణాలన్నీ; వాయుహతిన్ = గాలిదెబ్బచే, తాకిడి చేత; మేఘ పటలంబు = మబ్బులగుంపు; పాయుపగిదిన్ = తొలగిపోయే విధంగా; శ్రుతము చేన్ = వేదశాస్త్రపురాణాల వినికి చేత; పాయున్ = తొలగిపోతాయి; నరులలోన్ = మనుషుల్లో; శ్రుతయుతులు = వేదశాస్త్రాదుల వినికిడితో కూడినవారు; సురల కరణిన్ = దేవతలమాదిరి; అతిశయిల్లి = మించి; తేజరిల్లుదురు = ప్రకాశిస్తారు, వెలుగొందుతారు.

తాత్పర్యం: కామక్రోధాది దుర్గుణా లన్నీ గాలి దెబ్బకు మబ్బులు చెదరిపోయేటట్లు వేదశాస్త్రాల వినికిడివలన నశిస్తాయి. మానవులలో బహుశ్రుతు లైన మహనీయులు వేల్పుల వలె హెచ్చుగా విరాజిల్లుతారు.

విశేషం: "కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్." (గీత. 3అధ్యా 37శ్లో.)

రజోగుణం వలన కామం జనిస్తుంది. ఈ కామానికి ఎంత అనుభవించినా తృప్తి ఉండదు. ఇదే అడ్డగించబడి కోపంగా మారి ఘోరపాపాలు చేయిస్తుంది. ఇది జ్ఞానికి ప్రబలశత్రువు-అని గీత కామక్రోధాలు ఎట్లాంటివో వివరించింది.

వాయుహతిన్ మేఘపటలంబు వాయు పగిది, క్రోధ కామాది దుర్గుణములు శ్రుతముచే పాయున్ - అనుచోట ఉపమాలంకారం.

తే. శ్రుతము నరునిఁ బరిజ్ఞానయుతునిఁ జేయు। వాని సుకృత మల్పమును ననూన ఫలము
నిచ్చు; నజ్ఞాని సత్కర్మ మెంతయైన। నఫల మగుఁగాన శ్రుతవంతుఁ డగుట వలయు.' 149

ప్రతిపదార్థం: శ్రుతము = శాస్త్రాదుల వినికి; నరునిన్ = మనుజుడిని; పరిజ్ఞానయుతునిన్+చేయున్ = పూర్ణజ్ఞానంతో కూడిన వాడినిగా చేస్తుంది; వాని సుకృతము = అతడు చేసిన పుణ్యం; అల్పమును = కొంచెమైననూ; అనూనఫలమున్+ఇచ్చున్ (న+ఊన = అనూన) = మిక్కుటమైన ఫలాన్ని ప్రసాదిస్తుంది. కొదువలేని ఫలాన్ని ఇస్తుంది; అజ్ఞాని సత్కర్మము = జ్ఞానం లేని వాడి యొక్క మంచిపని అనగా వాడు చేసిన పుణ్యకర్మ; ఎంత+ఐనన్ = ఎంత గొప్పదైనప్పటికిన్నీ; అఫలము+అగున్ = వ్యర్థమవుతుంది; కానన్ = కాబట్టి; శ్రుతవంతుఁడు+అగుట+వలయున్ = శాస్త్రాదుల వలన ధర్మస్వరూపం ఎరిగిన వాడు కావడం అవసరం.

తాత్పర్యం: శాస్త్రాదుల వినికిడి మానవుడిని పరిపూర్ణ జ్ఞానవంతుడిని చేస్తుంది. అట్టి వివేకవంతుడు చేసే పుణ్యం కొంచెమైనా గొప్ప ఫలం వానికి ప్రసాదిస్తుంది. "అజ్ఞాని చేసిన మంచిపని ఎంత గొప్పదైనా అది వ్యర్థమవుతుంది. కాబట్టి మానవుడు శ్రుతవంతుడుకావడం ఎంతో అవసరం"

వ. అని నిర్దేశించి సర్వేశ్వరితో సర్వజ్ఞుం డిట్లనియె. 150

ప్రతిపదార్థం: అని నిర్దేశించి = ఇట్లు నిర్ణయపూర్వకంగా తెల్పి; సర్వ+ఈశ్వరితోన్ = సమస్తమునకు నాయకురాలైన గౌరీదేవితో; సర్వజ్ఞుండు = సమస్తం తెలిసిన శంభుడు; ఇట్లు+అనియెన్ = ఇట్లా వచించాడు.

తాత్పర్యం: అని చెప్పి లోకేశ్వరి అయిన ఉమాదేవితో శివదేవుడు ఇట్లా చెప్పాడు.

సీ. 'మృతిఁ బొంది వేగ జన్మించినఁ బూర్వదై । హికము లన్నియు బుద్ధి నెలయువాఁడు
జాతిస్మరుం డనఁ జను; నయ్యెఱుక పెద్ద । వాఁడు గాఁగాఁ జెడు; వనిత! వినుము
పుట్టెఱుంగుట కల్మి బోధించుటకు నాస్తి । కులమును జన్మంబు గలుగు తెఱఁగుఁ;
జచ్చిపోయిన వారు వచ్చి యత్తను వొంది । మెలఁగు టొక్కొక చోటఁ గలిగియుండు;

తే. నట్టి తెఱఁగు వెంగలు లైన యమునిదూత । లొరులఁ జని కొనిపోయినఁ గరుణతోడ
న మ్మహాత్ముండు మగిడి పొమ్మన్న నరుగు । దెంచుటని నీ వెఱుంగు; సందియము లేదు.' 151

ప్రతిపదార్థం: వనిత! = ఓ వెలదీ!; వినుము = ఆలకించుము; మృతిన్+పొంది = మరణం చెంది; వేగ = శీఘ్రమే, వెను వెంటనే; జన్మించినన్ = పుట్టినచో; పూర్వదైహికములు+అన్నియున్ = మునుపటి జన్మ వృత్తాంతా లెల్ల; బుద్ధిన్ = మనస్సులో; ఎలయువాఁడు = నెలకొని ఉన్నవాడు; జాతిస్మరుండు = పూర్వజన్మ వృత్తాంతం ఎరిగినవాడు; అనన్+చనున్ = అని చెప్పుటకు తగి ఉంటాడు; ఆ+ఎఱుక = ఆ పూర్వజన్మస్మృతి; పెద్దవాఁడు+కాఁగాన్ = క్రమంగా వయసుముదిరిన వాడవుతుండగా; చెడున్ = నశిస్తుంది; పుట్టు+ఎఱుంగుట కల్మి = పూర్వజన్మము తెలియుటను కలిగి ఉండటం; జన్మంబు+కలుగు+తెఱఁగున్ = జన్మవచ్చే విధానాన్ని; నాస్తి కులమును = ఈశ్వరుడు లేడనే జాతిని; బోధించుటకున్ = తెలియపఱచుటకు మేల్కొల్పుటకు ఉపకరిస్తుంది; చచ్చిపోయినవారు = మరణించినవారు; వచ్చి = యమలోకం నుంచి మరలి వచ్చి; ఆ+తనువు+ఒంది = మృతదేహంలో ప్రవేశించి; మెలఁగుట = వ్యవహరించటం; ఒక్క+ఒకచోటన్ = ఒక్కొక్క తావులో; కలిగి+ఉండున్ = జరుగుతుంటుంది; అట్టి తెఱఁగు = అట్లాంటి సంఘటన; వెంగలులు+ఐన = అవివేకులైన; యముని దూతలు = యమకింకరులు; ఒరులన్ = ఆయువు ముగియని వాళ్ళను; చని = వారి దగ్గరకు వచ్చి; కొని పోయినన్ = యమలోకానికి తీసికొని వెళ్ళగా; కరుణ తోడన్ = కనికరంతో; ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డ మనసు గల యమధర్మరాజు; మగిడి పొమ్ము+అన్నన్ = ఆ జీవుడిని తిరిగి వెళ్ళుమని చెప్పగా; అరుగుదెంచుట = చచ్చినవాడు తిరిగి కాయంలో ప్రవేశిం చటం అని; నీవు+ఎఱుఁగు = నీవు తెలియాలి; సందియము లేదు = ఈ విషయంలో అనుమానం వద్దు.

తాత్పర్యం: 'మరణించినతోనే మళ్ళీ జన్మిస్తే పూర్వజన్మ విషయాలన్నీ అతని బుద్ధిలో నెలకొని ఉంటాయి; జ్ఞప్తిలో ఉంటాయి. అట్లా పూర్వ జన్మవృత్తాంతం ఎరిగిన వాడిని జాతిస్మరు డంటారు. క్రమంగా వయసు పెరిగి పెద్దవాడవుతున్న కొద్దీ అతడు తొల్లింటి పుట్టుకకు సంబంధించిన ఎరుకను కోల్పోతాడు. కాత్యాయనీ! పూర్వజన్మకు సంబంధించిన ఎరుకను గలిగిఉండటం పునర్జన్మ ఉన్నదనే విషయాన్ని నిరీశ్వరవాదులకు తెలియజెప్పడానికి తోడ్పడుతుంది. చనిపోయిన వాడు తిరిగి ఒక్కొక్కప్పుడు బ్రతకడం కద్దు. అదెట్లంటే యమకింకరులు పొరపాటున ఒకడి ప్రాణాలకు బదులు మరొకడి ప్రాణాలు గైకొని వెళ్ళినపుడు ధర్మాత్ముడైన యముడు గమనించి ఆయుస్సు తీరని వాడిని కనికరించి బ్రతుకుమని తిరిగి పంపివేయటం సంభవిస్తుంటుంది. అప్పుడు మృతుడు మరల జీవితు డవుతాడు. ఇట్లాంటి విషయా లెన్నో ఉన్నవి. సందేహించ నక్కర లేదు.'

శివుఁడు పార్వతికి స్వప్నాదుల తెఱం గెఱింగించుట (సం.13-అను -15-2457)

వ. అని తెలిపిన గౌరి 'కల యనునది యేమి? యెఱింగింపవే' యనుటయును నతండు. 152

ప్రతిపదార్థం: అని తెలిపినన్ = అని శంభుడు చెప్పగా; గౌరి; కల+అనునది+ఏమి? = స్వప్న మనగా ఎటువంటిది?; ఎఱింగింపవు+ఏ = చెప్పుమా; అనుటయును = అని అడుగగా; అతండు = ఈశ్వరుడు (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని శంభుడు చెప్పగా గౌరీదేవి 'జీవితేశ్వరా! కల అంటే ఏమిటి? తెలుపు'మని వేడగా శివు డిట్లా అన్నాడు.

ఆ. 'స్వప్న మనఁగ సుప్తజనము మనశ్చేష్ట । యదియుఁ గాంచు నొగి ననాగతములఁ
గానఁ గలలు సూచకము లగు భావి శు । భాశుభోదయముల కనుచుఁ జెప్పె. 153

ప్రతిపదార్థం: స్వప్నము+అనఁగన్ = కల అంటే; సుప్తజనము మనః+చేష్ట = నిదురిస్తున్న జనుల యొక్క మనోవ్యాపారం; అదియున్ = ఆ మనసు; ఒగిన్ = క్రమంగా; అనాగతములన్ = రాబోయేవాటిని; కాంచున్ = దర్శిస్తుంది; కానన్ = కాబట్టి; కలలు; భావి = రానున్న; శుభ+అశుభ+ఉదయములకున్ = మేలు కీళ్ళ యొక్క పుట్టుకలకు; సూచకములు+అగున్ = ప్రకటన లవుతాయి, చూపుతాయి, వెల్లడిస్తాయి; అనుచున్; చెప్పెన్ = ఈశ్వరుడు తెలిపాడు.

తాత్పర్యం: 'స్వప్నమంటే నిదురిస్తున్న మనిషి యొక్క మనస్సు చేసే వ్యాపారం. ఆ మనస్సు రాబోయే విషయాలను ముందుగా కనుగొంటుంది. కనుక కలలు మునుముందు కలుగబోయే కష్టసుఖాలను వెల్లడిస్తాయి' అని పరమేశ్వరుడు పరమేశితో పలికాడు.

వ. చెప్పిన విని భవాని భవునితోడ. 154

ప్రతిపదార్థం: చెప్పినన్; విని; భవాని = గౌరీదేవి; భవునితోడన్ = ఈశ్వరుడితో (ఇట్లా అన్నది అని తరువాతి పద్యంతో అన్వయం).
తాత్పర్యం: ఈశ్వరుడు పలికిన పలుకులు ఆలకించి గౌరి ఆయనతో ఇట్లా అన్నది.

సీ. 'దైవంబొ? కర్మవర్తనము జనంబు ను । త్సాహంబొ?' యనిన ' నతండు దైవ
మోపి కర్మంబు సేయుట లేదు దైవసం । కలన ఫలం బిచ్చుఁ గాని వినుము
దేవి! పూర్వకృతంబు దైవనామకమునఁ । బరఁగు; నప్పటి చేఁత పౌరుషంబు
కృషివోలె నుండుఁ; బౌరుష గతి వర్ష స । ద్వాయువులట్ల దైవ ప్రకార

తే. మెఱుఁగు ఖనన మథనముల నెట్లు జలముఁ । జిచ్చుఁ బుట్టు నమ్మెయి నరుచేష్ట దైవ
యోగమున సిద్ధిఁ బొందు నుద్యోగ రహితుఁ । డెత్తెఱంగున దైవ సమృద్ధిఁ బడయు. 155

ప్రతిపదార్థం: కర్మవర్తనము = కర్మలయందు ప్రవర్తింపచేయటం; దైవంబు+ఒ? = దైవమా? (లేక); జనంబు+ఉత్సాహంబు+ఒ? = జనుల యొక్క యత్నమా?; అనినన్ = అని శర్వాణి ప్రశ్నించగా; అతండు = చంద్రమౌళి; దైవము = దైవం; ఓపి = పూనుకొని; కర్మంబు+చేయుట లేదు = కర్మను సల్పడం లేదు; దైవసంకలన = దైవము యొక్క తోడ్పాటు, ఘటన; ఫలంబు+ఇచ్చున్+కాని = ప్రయోజనాన్ని సిద్ధింపజేస్తుంది; దేవి! = సాధ్వీ!; వినుము = ఆలకించవలసింది; పూర్వకృతంబు = నరుడు మునుపు చేసిన సుకృతం; దైవనామకమునన్ = దైవమనే పేరుతో; పరఁగున్ = విలసిల్లుతుంది; అప్పటి చేఁత = జనుడు అప్పుడు చేసిన కర్మ; పౌరుషంబు = పురుష సంబంధము; పౌరుషగతి = పురుష వ్యాపారం; కృషి+పోలెన్+ఉండున్ = సేద్యం వలె ఉంటుంది; దైవప్రకారము = విధి విధానం; వర్షసద్+వాయువులు+అట్లు+అ = వాన, మంచిగాలి వలె ఉంటుంది; కృషి ఫలించటానికి వర్షం, మంచిగాలి అవసరం గదా! అని; ఎఱుఁగు = తెలిసికొనవలసినది; ఖనన మథనములన్ = నేలను త్రవ్వుట వలన, అరణి కట్టెను చిలుకుట వలన; ఎట్లు = ఏ విధంగా; జలమున్ = నీరూ; చిచ్చున్ = అగ్నియూ; పుట్టున్ = జన్మిస్తాయో; ఆ+మెయిన్ = ఆ రీతిగానే; నరుచేష్ట = మనిషి యొక్క క్రియాచరణ; దైవయోగమునన్ = దైవం

యొక్క తోడ్పాటుతో; సిద్ధిన్+పొందున్ = ఫలిస్తుంది, ఫలకారి అవుతుంది; ఉద్యోగరహితుఁడు = యత్నం చెయ్యనివాడు; ఏ+తెఱంగునన్ = ఏ విధంగా; దైవసమృద్ధిన్ = భాగ్యము యొక్క పెంపును; పడయున్? = పొందగలడు? పొందలేడని భావం.

తాత్పర్యం: 'మానవుడిని కర్మలయందు ప్రవర్తింపజేస్తున్నది దైవమా? లేక అతడి ఉత్సాహమా? చెప్పవలసిన దని గౌరి ప్రశ్నిస్తే శంకరు డిట్లా బదులు పలికాడు. 'దేవీ! దైవం తానుగా ఏ పనీ చెయ్యడు కాని నరుడు చేసే పనులకు తోడ్పడి ఫలాన్నిస్తాడు. ముందటి జన్మలో జనుడు చేసిన కర్మమే దైవమని చెప్పబడుతుంది. ఇపుడు చేసే కర్మ పౌరుషమని పిలువబడుతుంది. మనిషి చేసే యత్నం వ్యవసాయంవంటిది. దైవసహాయ మంటేనో జలం వంటిది; గాలి వంటిది. ఇవి రెండూ కృషి ఫలించడానికి తోడ్పడుతాయి. నేలను త్రవ్వినపుడే నీరు పడుతుంది. అరణికట్టెను మథించినపుడే అగ్నిపుట్టుతుంది. అట్లాగే మానవయత్నం - దైవం సాయపడినపుడు ఫలిస్తుంది. అసలు యత్నపరుడు కానివాడికి దైవంతోడ్పాటు ఎట్లా లభిస్తుంది? (లభించనే లభించదని భావం.)

క. కావున నుద్యోగంబును । దైవంబును గారణములు దామరసాక్షీ!
యే విధమునఁ గర్మముల ఫ । లావాప్తికి దీన సంశయము వలదు సుమీ!' 156

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; తామరస+అక్షీ! = పద్మములవంటి నేత్రములు గలదానా!; ఏ విధమునన్ = ఏ రీతిగా చూచినప్పటికినీ; కర్మముల = కర్మముల యొక్క; ఫల+అవాప్తికిన్ = ఫలముల యొక్క సంప్రాప్తికి; ఉద్యోగంబును = మనుష్యయత్నమూ; దైవంబును = దైవబలమునూ; కారణములు = హేతువులు; దీనన్ = ఈ విషయంలో; సంశయము వలదు సుమీ! = సందేహం అక్కర లేదు సుమా!

తాత్పర్యం: కమలముల వంటి కన్నులు గల సఖీ! ఎట్లు పరికించినా కర్మఫలాలు లభించటానికి మానవ యత్నమూ; దైవానుకూల్యం కారణాలు. ఇందులో అనుమానించవలసిన అక్కర లేదు సుమా!'

తే. అనిన నంబిక 'గర్భంబు నాత్ముఁ డెట్లు । చొచ్చు?' ననవుడు నభవుఁడు 'సురత బీజ
రక్త దైవముల్ సూవె కారణము లాత్మ । గర్భ సంవేశనమునకుఁ గమలనయన! 157

ప్రతిపదార్థం: అనినన్ = అని శంభుడు పలుకగా; అంబిక = పార్వతి; ఆత్ముఁడు = జీవుడు; గర్భంబున్ = ఉదరమును; ఎట్లు+చొచ్చున్? = ఎట్లా ప్రవేశిస్తాడు?; అనవుడున్ = అని అడుగగా; అభవుఁడు = శ్రీకంఠుడు; కమలనయన! = తామరల వంటి కన్నులు గలదానా!; ఆత్మ = జీవుడి యొక్క; గర్భసంవేశనమునకున్ = గర్భంలో ప్రవేశించటానికి; సురత = రతి క్రీడయూ; బీజ = పురుషుడి వీర్యమూ; రక్త = స్త్రీ యొక్క నెత్తురూ; దైవముల్ = దైవమూ అనే యీ నాలుగూ; కారణములు+సూవె! = హేతువులు సుమా!

తాత్పర్యం: శివుడు ఆ విధంగా చెప్పగా విన్నదై పార్వతి 'నాథా! జీవుడు గర్భంలో ప్రవేశించటానికి హేతువు లెట్టివి?' అని అడిగింది. అందుకు శంకరుడు 'పద్మాక్షీ! స్త్రీ పురుషుల యొక్క సంభోగం, పురుషుడి వీర్యమూ, స్త్రీ యొక్క శోణితమూ, దైవం యొక్క తోడ్పాటూ ఇందుకు కారణాలు' (అని చెప్పాడు).

క. మాయారహితుఁ డహంకా । రాయత్తతఁ జూవె పుట్టువను చెఱఁబడి నా
నాయాసంబులఁ బడు నా । జ్ఞాయుతుఁడై యాత్ముఁ డింత చర్చింపు మదిన్.' 158

ప్రతిపదార్థం: మాయారహితుఁడు = సహజంగా కూటయుక్తులు, కుయుక్తులు, కాపట్యం లేని; ఆత్ముఁడు = జీవుడు; ఆజ్ఞాయుతుఁడు+ఐ = దైవం యొక్క ఆజ్ఞతో కూడినవాడై; అహంకార+ఆయత్తతన్+చూవె! = అహంకారానికి అధీనుడగుట వల్లనే సుమా!; పుట్టువు+అను = జన్మమనే; చెఱన్+పడి = బంధనంలో చిక్కి; నానా+ఆయాసంబులన్+పడున్ = పలు విధములైన శ్రమల పాలవుతున్నాడు; ఇంత = ఈ విషయం; మదిన్ = నీ మనసులో; చర్చింపు = విచారించుము.

తాత్పర్యం: పార్వతీ! నిష్కల్మషుడైన జీవుడు అహంకారమునకు వశుడై దాని ఆజ్ఞచొప్పున జన్మమనే చెరలో చిక్కి బహుకష్టాలపాలవుతున్నాడు. ఇది నీ మనసులో చర్చించుము'.

సీ. **అని చెప్పి 'దైవరహస్యంబు వినిపింతు । విను' మని పలికి యిట్లనియె శివుఁడు**
'తొల్లి మనుష్యులు తొలుమేని కర్మంబు । లెఱుఁగఁగాఁ జాలుట నెల్లవారు
మేలుసేయఁగ ననిమిషలోకమున నధి । కంబగు సందడి గాఁగ మనుజు
లమరులై పేర్చిన' నజుఁడు వేల్పుల సంక । టము వాయుటకు నుపాయము దలంచి

తే. **మానవుల కయ్యెఱుకకల్మి మాన్చి కామ । రోషముల నొలయించిన దోషకృతుల**
వారు నరకాది సమ్మర్దకారు లగుడు, । నదియుఁ గాదని చింతించి యనువు గాంచి. **159**

ప్రతిపదార్థం: అని చెప్పి = అని వచించి; దైవరహస్యంబున్ = దేవతలకు కూడా గోప్యమైన విషయం, వినిపింతున్ = చెప్పుతాను; వినుము+అని పలికి = వినవలసిందని చెప్పి; శివుఁడు = శంకరుడు; ఇట్లు+అనియెన్ = అంబికతో ఇట్లా అన్నాడు; తొల్లి = పూర్వం; మనుష్యులు = నరులు; తొలుమేని కర్మంబులు = పూర్వజన్మంలో చేసిన పనులు; ఎఱుఁగఁగాన్+చాలుటన్ = తెలియగలిగినవారు కావటం చేత; ఎల్లవారు = మనుష్యులందరు; మేలు+చేయన్+కన్ = సత్కార్యములు సల్పటం వలన; అనిమిషలోకమునన్ = దేవలోకంలో, స్వర్గంలో; అధికంబు+అగు = మిక్కుటమైన; సందడి కాఁగన్ = సమ్మర్దం కలుగగా, చోటు చాలక ఇరుకు ఏర్పడగా; మనుజులు = నరులు; అమరులు+ఐ = మృతిలేనివారై, వేల్పులై; పేర్చినన్ = అతిశయించగా; అజుఁడు = బ్రహ్మదేవుడు; వేల్పుల సంకటము = దేవతల యొక్క కష్టం, చిక్కు; పాయుటకున్ = తొలగుటకు; ఉపాయము+తలంచి = వెరవు పరికించి, ఉపాయం ఆలోచించి; మానవులకున్ = మనుష్యులకు; ఆ+ఎఱుక+కల్మి = ఆ పూర్వజన్మ జ్ఞాన సంపద, ఆ స్మృతి సమృద్ధిని; మాన్చి = తొలగించి; కామరోషములన్ = కామక్రోధాలను; ఒలయించినన్ = కలుగజేయగా; వారు = నరులు; దోషకృతులన్ = దుష్టకార్యాలచేత; నరక+ఆది సమ్మర్దకారులు+అగుడున్ = నరకలోకాదులయందును రాయిడి (ఒత్తిడి) కలిగించినవారు కాగా; అదియున్ కాదు+అని = అట్లు వారిని పాపకృత్యాలకు ప్రేరేపించి నరకలోక నివాసులను చేయటం కూడా తగదని; చింతించి = ఆలోచించి; అనువు+కాంచి = అందుకు ఉపాయం కనుగొని-(తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: పరమేశ్వరుడు శాంకరిని అవలోకించి 'సతీ! దేవతలకు కూడా ఎరుకపడని ఒక రహస్యం ఉన్నది చెప్పుతాను విను' మంటూ ఉపక్రమించాడు. 'పూర్వం మానవులందరికీ పూర్వ జన్మస్మృతి ఉండేది. అందువలన వారు ఎల్లప్పుడూ పుణ్యకార్యాలు చేస్తూ తత్ ఫలితంగా స్వర్గలోకానికి చేరేవారు. మితి మీరి అందరూ అక్కడికి వెళ్ళటం వలన స్వర్గధామంలో చోటు చాలక సమ్మర్దం ఏర్పడింది. వేల్పులకు సంకటస్థితి కలిగింది. దానిని నివారించుటకు బ్రహ్మదేవుడు ఉపాయం ఆలోచించి జనులు పుణ్యకార్యాలు సల్పకుండా వారికి ఇదివరకున్న

పూర్వజన్మజ్ఞానాన్ని తొలగించి, కామక్రోధాలను వారికి కల్పించాడు. ఆ చెడు గుణాల వలన వారు చెడుపనులు చేయటానికి పూనుకొని నరకలోక నివాసులు అవుతూండటం వలన అక్కడ కూడా మితిమీరిన త్రొక్కిడి ఏర్పడింది. ఇది కూడా బాగులేదని చతుర్ముఖుడు మరొక ఉపాయం ఆలోచించాడు. ఇది సమంజసమైనదని భావించాడు.

క. సరిగా నా రెండెడలకు । నరులు సనుట గోరి మనమునం గానమియుం
బరలోక విధము శాస్త్రము । వెరవునఁ గనుటయు నొనర్చె విధి వారలకున్.' 160

ప్రతిపదార్థం: ఆ రెండు+ఎడలకున్ = ఆ స్వర్గలోకానికి, నరక లోకానికి; సరిగాన్ = సమానంగా; నరులు = మనుష్యులు; చనుట+కోరి = వెళ్ళవలెనని వాంఛించి; మనమునన్ = మనసులో; పరలోక విధము = పరలోక విధానాన్ని; కానమియున్ = కనుగొనజాలకుండుటను; శాస్త్రము వెరవునన్ = శాస్త్రం యొక్క ఆధారంతో; కనుటయున్ = కనుగొనుటయును; వారలకున్ = ఆ నరులకు; విధి = బ్రహ్మ; ఒనర్చెన్ = చేశాడు.

తాత్పర్యం: అటు స్వర్గానికి, ఇటు నరకానికి మనుషులు మితిమీరి వెళ్ళి సమ్మర్దం కలిగించకుండా, ఆ రెండు చోట్లకు సమానంగా వెళ్ళేటట్లు చేయదలచి బ్రహ్మదేవుడు పరలోకస్థితి గతులు మనోదృష్టి చేత వారు ఎరుగకుండేటట్లుగాను, శాస్త్రం చేతనే తెలిసేటట్లు గాను చేశాడు.'

వ. అనినం బార్వతి 'పునర్జన్మంబు గలదు లేదను సంశయంబుతోన పొట్టు పొరలగుదురు నరులు; దాని తెఱంగు నిశ్చయింపవే' యనుటయు నంధకారాతి యిట్లనియె. 161

ప్రతిపదార్థం: అనినన్; పార్వతి; పునః+జన్మంబు = మరణించినవాడు తిరిగి పుట్టటం; ఉత్తర జన్మ; కలదు = ఉన్నది; లేదు; అను = అనునట్టి; సంశయంబుతోన్+అ = సందేహంతోనే; నరులు; పొట్టు పొరలు+అగుదురు = నలిగి నలిగి పోతున్నారు, సతమతమైపోతున్నారు; దాని తెఱంగున్ = ఆ పునర్జన్మ విషయం; నిశ్చయింపవు+ఏ = నిర్ణయింపుమా; అనుటయున్ = అని వేడగా; అంధక+అరాతి = అంధకుడనే రాక్షసుడికి శత్రువు = అనగా అంధకాసురుడిని గూల్చిన త్రిశూలపాణి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భవుడు పలుకగా భవాని ' దేవా! పునర్జన్మ కలదని కొందరూ, లేదని కొందరూ వాదులాడుకొంటూ సతమత మవుతున్నారు. ఆ ఉత్తర జన్మం విషయ మెట్టిదో నిర్ణయించ వేడుతున్నాను' అని పల్కగా అంధకాసురుడిని హరించిన హరు డిట్లా అన్నాడు.

క. 'కలదో లేదో యనియెడు । తలపోతయ కాని నిశ్చితము గాదు సురా
దులకుఁ బునర్జన్మంబుల । కలిమియు లేమియును నరులు గానమి దప్పే? 162

ప్రతిపదార్థం: సుర+ఆదులకున్ = దేవతలు మొదలైనవారికి కూడా; కలదు+ఓ = పునర్జన్మ ఉన్నదో; లేదు+ఓ = లేదో; అనియెడు = అనునట్టి; తలపోత+అ+కాని = ఊహయేకాని; పునఃజన్మంబుల = పునర్జన్మల యొక్క (తిరిగి జన్మించటం అనువాటి యొక్క); కలిమియున్ = ఉండటం; లేమియునున్ = లేకుండటం అనే విషయం; నిశ్చితము+కాదు = నిర్ణయించబడలేదు; నరులు= మానవులు; కానమి= చూడజాలకుండటం, ఎరుగకుండటం; తప్పు+ఏ? = దోషమా? కాదని భావం.

తాత్పర్యం: 'అసలు పునర్జన్మ ఉన్నదో లేదో అనే సంశయం దేవతలకు కూడా ఉన్నది. వారి కీ విషయంలో ఒక నిశ్చయజ్ఞానం లేదు. మరి మానవులకు అది తెలియకుండటంలో ఆశ్చర్య మేమున్నది?

క. కల; దది యూరక కానఁగ । నలవియె? శ్రుతివాక్యసమితి యర్థంబులపై
నిలిచిన శ్రద్ధం గ్రమమున । దెలివొందినఁ గాక యెట్టి ధీమంతులకున్.' 163

ప్రతిపదార్థం: అది = పునర్జన్మ; కలదు = ఉన్నది; శ్రుతివాక్యసమితి = వేదవాక్యముల సముదాయము యొక్క; అర్థంబులపైన్ = భావముల మీద; నిలిచిన = సక్తమైన; శ్రద్ధన్ = ఆసక్తితో; క్రమమునన్ = క్రమాన; తెలివి+ఒందినన్+కాక = జ్ఞానం పొందితే తప్ప, వివేక వంతుడైతే తప్ప; ఎట్టి ధీమంతులకున్ = ఎంతటి ప్రజ్ఞావంతులకు కూడా; ఊరక = తేలికగా, అలవోకగా; కానఁ గన్ = తెలియుటకు; అలవి+ఎ? = శక్యమా, సాధ్యమా?

తాత్పర్యం: ప్రేయసీ! పునర్జన్మమనేది ఉన్నది. అది ఎంతటి బుద్ధిమంతులకైనా వేద వాక్యాలయొక్క అర్థం గ్రహించకుండా తెలిసికొనటానికి సాధ్యపడదు.'

వ. అనిన విని గౌరి గంగాధరున కిట్లనియె. 164

ప్రతిపదార్థం: అనినన్; విని; గౌరి; గంగాధరునకున్ = గంగను శిరసున ధరించిన వాడికి - పరమేశ్వరుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శివుడి పలుకులు విని ఉమాదేవి మళ్ళీ ఆయనతో ఇట్లా అన్నది.

క. 'మృతులైనవారలు నిరా । కృతులై యుండుదురు; వారిఁ గీనాశ భట
ప్రతతి కొని చనుట, యా పితృ । పతి శాసించు టవి యెట్టి భంగులు దేవా!' 165

ప్రతిపదార్థం: దేవా! = స్వప్రకాశస్వరూపుడా!; మృతులు+ఐనవారలు = చనిపోయిన వాళ్ళు; నిర్+ఆకృతులు+ఐ = రూపరహితులై; ఉండుదురు = ఉంటారు; వారిన్ = ఆ మృతులను; కీనాశభటప్రతతి = యమకింకరుల గుంపు; కొనిచనుట = తీసికొని వెళ్ళటం; ఆ పితృపతి = ఆ యమధర్మరాజు; శాసించుట = వారిని దండించటం; అవి = అనునట్టివి; ఎట్టి భంగులు? = ఏ విధమైనవి?

తాత్పర్యం: 'ప్రభూ! చనిపోయిన వాళ్ళు ఆకారరహితులై ఉంటారు. యమకింకరులు రూపరహితులైన వారిని తమ వెంట ఎట్లా తీసికొనిపోతారు? యమధర్మరాజు వారిని ఎట్లా శిక్షిస్తాడు? ఈ సంగతులు నాకు విశదంగా చెప్పండి' అని గౌరి కోరింది.

వ. అని యడిగిన న ద్దేవుం డిట్లనియె. 166

తాత్పర్యం: అని ఉమాదేవి ప్రశ్నించగా ఆ భగవంతుడు ఇట్లా అన్నాడు.

సీ. 'తటియైన మనుజులఁ దనువులు విడిపించి । మాయాశరీర సమన్వితులుగ
నొనరించి దూతలు గొనిపోదు; రందును । ధర్మవర్తుల సుగంధంబు మృదువు
నైన మార్గమున, మధ్యపువారి నిర్బాధ । సరణిఁ, బాపాత్ముల బరుసఁదనము
ముటికియుఁ గల పథంబున నడపింతు, రి । ప్పరుసునఁ జని పితృపతికిఁ జూప

ఆ. నతఁడు పుణ్యలోక గతియును మానవ । త్వంబు ఘోరనరక వాసమును వి
ధించి పుచ్చు వారిఁ దెలచి మన్నించి భ । ర్జించి వరుసతోడఁ జిగురుఁబోఁడి!' 167

ప్రతిపదార్థం: చిగురుఁబోఁడి! = చిగురుటాకు వలె మెత్తని మేనుగలదానా!; దూతలు = యమభటులు; తఱి+ఐన = ఆయుస్సు దీరిన, కాలం చెల్లిన; మనుజులన్ = మనుష్యులను; తనువులు విడిపించి = దేహాలు వీడేటట్లు చేసి; మాయాశరీర సమన్వితులుగన్ = కృత్రిమమైన దేహాలతో కూడిన వారిని; ఒనరించి = చేసి; కొనిపోదురు = తీసికొని వెళ్ళుతారు; అందునన్ = అట్లా తమ వెంట కొనిపోయే వారిలో; ధర్మవర్తులన్ = ధర్మంగా నడుచుకొనేవారిని (ఉత్తములను); సుగంధంబు = సువాసన; మృదువు+ఐన = మెత్తనైన; మార్గమునన్ = దారిలోనూ; మధ్యము+వారిన్ (మధ్యపువారిని) = అంతగా ధర్మపరులు కానట్టివారిని (మధ్యములను); నిర్బాధసరణిన్ = అంతగా కష్టములు లేని తెరువులోనూ; పాప+ఆత్ములన్ = పాపహృదయులను (అధములను); పరుస+తనమున్ = కఠినత్వమూ; ముఱికియున్ = మాలిన్యమూ; కల = కలిగిన; పథంబునన్ = బాటలో; నడపింతురు = నడచేటట్లు చేస్తారు. ఆ+పరుసునన్ = ఆ తీరున; చని = వెళ్ళి; పితృపతికిన్ = యముడికి, సమవర్తికి; చూపన్ = దర్శింప జేయగా; అతఁడు = ఆ యమధర్మరాజు; వారిన్ = తనకడకు వచ్చిన ఉత్తమ, మధ్యమ, అధములను; వరుసతోడన్ = క్రమంగా; తెలచి = పొగడి, కొనియాడి; మన్నించి = ఆదరించి; భర్జించి = బెదరించి, పుణ్యలోక గతియునున్ = స్వర్గలోక గమనమును; మానవత్వంబున్ = మనుష్యత్వమును అనగా నరలోకగతియును; ఘోరనరకవాసమును = భయానకమైన నరకలోకమున పడియుండుటయు; విధించి = ఏర్పరచి; పుచ్చున్ = పంపి వేస్తాడు.

తాత్పర్యం: 'కోమలీ! యమభటులు ఆయువు ముగిసిన జనుల దగ్గరకు వచ్చి వారి ప్రాణాలను శరీరాల నుండి వెడలిస్తారు. పిదప ఒక మాయా దేహంలో వారి అసువులను ప్రవేశపెడతారు. ఆ కృత్రిమ దేహాలతో వారిలో ధర్మాత్ములైన వారిని పరిమళవంతమైన మృదుమార్గంలోనూ, మధ్యములైన వారిని అంతగా కష్టాలు లేని దారిలోనూ, పాపులను దుర్గంధభూయిష్ఠమైన, కఠినమైన త్రోవలోనూ, నడిపించుకొంటూ వెళ్ళి యముడికి చూపిస్తారు. యమధర్మరాజు పుణ్యపురుషులను కొనియాడి పుణ్యలోకాలకు పంపుతాడు. రెండవ తెగవారిని ఆదరించి నివసించుటకు మనుజ భువనానికి పొమ్మంటాడు. పాపులను బెదరించి నరకలోకానికి గెంటి వేస్తాడు.'

వ. అని చెప్పిన నగేంద్రతనయ చంద్రశేఖరుని తోడ. 168

తాత్పర్యం: అని పరమేశ్వరుడు చెప్పగా పర్వతరాజపుత్రి ఐన గౌరీదేవి చంద్రుడిని శిరసున ధరించిన శంకరుడితో. (ఇట్లా పలికెనని తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నరకం బెట్టిది? కల్మష । కరులన్ జముఁ డెట్టి భంగిఁ గాఱియఁ బెట్టున్?
వరదా! చెప్పు మనుడు న । ప్పురహరుఁ డిట్లనియె వృష్ణిపుంగవ! ప్రీతిన్. 169

ప్రతిపదార్థం: నరకంబు+ఎట్టిది? = నరక మనగా ఎటువంటిది?; కల్మష కరులన్ = పాపం చేసే వారిని; జముఁడు = యమధర్మరాజు; ఎట్టిభంగిన్ = ఏ రీతిని; కాఱియన్+పెట్టున్? = బాధపెడతాడు?; వరదా! = కోరికలిచ్చువాఁడా!; చెప్పుము = తెల్పుము; అనుడున్ = అని పార్వతి పలుకగా; ఆ+పురహరుఁడు = ఆ త్రిపురాలను ధ్వంసం చేసిన రుద్రుడు; ప్రీతిన్ = సంతోషంతో; ఇట్లు+అనియెన్ = ఇట్లా వచించాడు; వృష్ణిపుంగవ! = వృష్ణివంశజులలో శ్రేష్ఠుడా, శ్రీకృష్ణా!

తాత్పర్యం: 'నరక మంటే ఎట్లాంటిది? పాపులను యముడు ఏ విధంగా బాధిస్తాడు? నాథా! నాకు చెప్పండి' అని అంబిక అడుగగా ఆ త్రిపురాసుర సంహారి సంతోషంతో ఇట్లా అన్నాడు శ్రీకృష్ణా! (అని నారద మహర్షి ఉమాశంకరుల సంవాదాన్ని వాసుదేవుడికి వినిపించాడు).

సీ. **'రౌరవం బనఁగ ధరాస్థలిక్రింద మ । హారౌరవం బన నవుల దాని**
కావల విను కంటకావనంబన నుండుఁ । గ్రమవృత్తిఁ బేర్చు దుఃఖములు గలిగి
యగ్నికుండంబునా నటఁ బంచకష్టంబు । నాఁగల విట్లున్న నరకతలము
లై దందుఁ బాపక్రియా తారతమ్యంబు । లూహించి యంతకుం డునుపఁ బనుచుఁ

తే. **దగిన యెడలఁ బాపాత్ములఁ దద్భటాలి । దహన కర్తన బంధన తాడనములఁ**
బఱుప వారలఁ గుక్కలు గఱచుఁ' గ్రిములు । దొలుచు' గ్రద్దలు నొప్పించుఁ దుండనిహతి. **170**

ప్రతిపదార్థం: క్రమవృత్తిన్ = వరుస ప్రకారం; పేర్చు = అతిశయించే; దుఃఖములు+కలిగి = కష్టాలతో కూడినవై; రౌరవంబు+ అనఁగన్ = రౌరవము అనే పేరుతో; ధరాస్థలి క్రిందన్ = భూమికి అడుగు భాగంలోనూ; మహారౌరవంబు+ అనన్ = మహారౌరవం అనేనామంతో; అవులన్ = ఆ రౌరవానికి అవతల; దానికిన్+ఆవలన్ = ఆ మహారౌరవానికి తరువాత; కంటకావనంబు+అనన్ = ముళ్ళ అడవి అనే పేరుతోనూ; అగ్నికుండంబునాన్ = అగ్నికుండం అనే పేరుతో మరొకటి; అటన్ = అక్కడ; పంచకష్టంబునాన్+కలవి = పంచకష్టము అనే పేరు కలిగినవి; ఇట్లు+ఉన్న = ఈ రీతిగా ఉన్నట్టి; నరకతలములు = నరకప్రదేశాలు; ఐదు = అయిదు(ఉన్నవి); అందున్ = వాటిలో; అంతకుండు = యముడు; పాపక్రియా తారతమ్యంబులు+ఊహించి = ఆయాజీవు లొనర్చిన పాపకార్యాల యొక్క హెచ్చు తక్కువలు పరికించి; పాప+ఆత్ములన్ = కిల్బిష మొనర్చిన వాళ్ళను; తగిన+ఎడలన్ = ఉచితమైన తావులందు; ఉనుపన్ = ఉంచుటకు; పనుచున్ = ఆజ్ఞాపిస్తాడు; వారలన్ = ఆ పాపులను; తత్+భట+ఆలి = ఆ యముడి యొక్క భటుల సమూహం; దహన = కాల్చడం; కర్తన = చీల్చటం; బంధన = కట్టటం; తాడనములన్ = కొట్టటం అనేపనుల చేత; పఱుపన్ = బాధలపాలు చెయ్యగా; కుక్కలు = శునకాలు; కఱచున్ = ఆ దుర్మార్గులను కరుస్తాయి; క్రిములు = పురుగులు; తొలుచున్ = రంధ్రాలు ఏర్పడేటట్లు చేస్తాయి; గ్రద్దలు = గృధ్రాలు; తుండనిహతిన్ = ముక్కుల యొక్క పొడుపులతో; నొప్పించున్ = వారు అల్లాడేటట్లు చేస్తాయి.

తాత్పర్యం: 'గిరినందినీ! భూమికి అధోభాగంలో ఐదు నరక ప్రదేశా లున్నవి. అవి ఒకదానికంటె మరొకటి పరమబాధాకరాలు. అవేవంటే - రౌరవం, మహారౌరవం, కంటకారణ్యం, అగ్నికుండం, పంచకష్టం అనే పేరులు కలవి. అవి దుర్మార్గులు తాము చేసిన పాపఫలం అనుభవించే చోట్లు. యముడు ఆయాజీవుల పాపాల యొక్క తారతమ్యాలను అనుసరించి ఆయీ నరకస్థానాలకు పంపుతాడు. అక్కడ యమభటులు వారిని కాలుస్తూ, నరుకుతూ, కాలుచేతులు కట్టిపడవేస్తూ, కొట్టుతూ నానావిధాల బాధిస్తారు. ఆ నరక వాసులను జాగిలాలు కరిచీ, పురుగులు తొలిచీ, గ్రద్దలు ముక్కులతో పొడిచీ నొప్పిస్తాయి.

వ. **మఱియును యమదూత వ్రాతంబు నానావిధ వేదనలం బెట్టి దండించుచుండు.** **171**

ప్రతిపదార్థం: మఱియును = ఇంకా; యమదూత వ్రాతంబు = యమకింకరుల యొక్క సమూహం; నానా విధ = పలు రకాలైన; వేదనలన్+పెట్టి = బాధలకు గురిచేసి; దండించుచున్+ఉండున్ = శిక్షిస్తూ ఉంటారు.

తాత్పర్యం: అక్కడ యమదూతలు పాపులను నానాయాతనలకు గురి చేస్తూ బహుభంగుల శిక్షిస్తారు.

ఉ. అమ్మెయిఁ బాపముల్ వొలియునంతకు దుఃఖము లంది కీటజ
న్మమ్ములఁ బక్షియోనులఁ గ్రమంబునఁ బొంది మృగత్వ మానుష
త్వమ్ముల నోలిఁ బొందుదురు వా రిను మెంతయుఁ గ్రాఁగి కల్మష
త్వమ్ము దొఱంగుమాడ్కి నవతామరస ప్రతిమాన లోచనా!' 172

ప్రతిపదార్థం: నవ = నూత్నమైన, అప్పటికప్పుడు వికసించిన; తామరస = పద్మదళములకు; ప్రతిమాన = సాటివచ్చు; లోచనా = కన్నులు గలదానా!; ఆ+మెయిన్ = ఆ రకంగా; పాపముల్ = కిల్బిషాలు; పొలియు+అంతకున్ = నశించే వరకూ; దుఃఖములు+అంది = కష్టాలు అనుభవించి; వారు = ఆ జీవులు; ఇనుము = ఇనుము అనే లోహం; ఎంతయున్ = మిక్కిలి; క్రాఁగి = కొలిమిలో తప్తమై; కల్మషత్వమ్మున్ = మాలిన్యమును, తుప్పును; తొఱంగుమాడ్కిన్ = వదలినచందంగా; క్రమంబునన్ = వరుసగా; కీట జన్మమ్ములన్ = పురుగుల యొక్క పుట్టుకలనూ; పక్షియోనులన్ = పక్షుల జన్మాలనూ; పొంది = చెంది; ఓలిన్ = ఆ పిదప వరుసగా; మృగత్వ మానుషత్వమ్ములన్ = జంతువులవుటనూ, మనుజులవుటనూ; పొందుదురు = చెందుతారు.

తాత్పర్యం: కమల పత్రములతో సమానమైన కన్నులు గల కాత్యాయనీ! ముందు నుడివినట్లు పాపులు తమ పాపాలు నశించే వరకూ నరకలోకాలలో నానావిధ యాతనలు అనుభవించి కొలిమిలో కాగిన ఇనుము తుప్పును వీడిన విధంగా శుద్ధులై తొలుత పురుగులుగానూ, పిదప పక్షులుగానూ, ఆవల మృగాలుగానూ, అనంతరం మనుష్యులు గానూ జన్మ లెత్తుతారు.'

విశేషం: శంకరాచార్యులవారు చెప్పినట్లు "జంతూనాం నరజన్మదుర్లభతరం". జీవి తనదుష్కర్మల ఫలంగా నానా విధక్షుద్రయోనులలో పుట్టి పుట్టి, చచ్చి చచ్చి చివరి కెప్పుడో పాపాలు నశించి పరిశుద్ధుడై ఫలితంగా మానవజన్మను పొందుతున్నాడు. మానవుడై జన్మించినవాడు దైవీగుణసంపత్తిని అలవరచుకొనాలి. ఆసురీసంపదను అలవరచుకొనగూడదని భగవద్గీతలోని షోడశాధ్యాయం హితోపదేశం చేస్తుంది.

వ. అనిన విని పార్వతి 'పాపంబు లనునవి యెట్టివి? యెఱింగింపవే' యనుటయు నీశానుం డిట్లనియె.173

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శివుడు చెప్పగా విన్నదై; పార్వతి; పాపంబులు+అనునవి; ఎట్టివి?; ఎఱింగింపవు+ఏ = తెలియ జెప్పవా; అనుటయున్ = అని అడుగగా; ఈశానుండు = శివుడు, ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఈశాను డట్లా పలుకగా ఆలకించినదై ఉమాదేవి, 'దేవా! పాపాలంటే ఎట్లాంటివో తెలుపవా?' అని అడుగగా అత డిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికి మానస వాచిక కాయికములను త్రివిధ పాపములఁ దెల్పుట. (సం.13-అను-1.15-2792).

సీ. 'మానిని! త్రివిధముల్ మానస వాచిక । కాయికంబులఁ బాతకంబు; లందుఁ
బరధనాపేక్షణ పాపానుమోద ధ । ర్మద్వేష ముఖములు మానసంబు;

లనృత దారుణ భాషణాదులు వాచిక । ములు; వధంబును బంధమును నభక్ష్య
భక్షణంబును నన్యభామారతము మద్య । పానంబు మొదలైన పాపకృతులు

తే. కాయికంబులు; విను మధికం బపేయ । పానమది దుష్కృతంబులలోన నెల్లఁ
బానమున నిందతో వచ్చుఁ బ్రాణగొడ్డ । ములును జేటులు నరకాబ్ధి మునుఁగుటలును. 174

ప్రతిపదార్థం: మానిని! = ఆత్మాభిమానం గల ఓ వెలదీ!; పాతకంబులు = పాపాలు; మానస వాచిక కాయికంబులన్ = మనసు చేత, నోటిచేత, శరీరం చేత చేయబడేవి; త్రివిధముల్ = మూడు విధాలు, ముత్తెఱగులు; అందున్ = ఆ మూడు విధాలలో; మానసంబులు = మనస్సంబంధమైనవి; పరధన+అపేక్షణ = ఇతరుల సొమ్ము వాంఛించటం; పాప+అనుమోద = పాపకృత్యాలను సమ్మతించటం, చూచి సంతోషించటం; ధర్మద్వేషముఖములు = పుణ్యాలను ద్వేషించటం మొదలైనవి; అనృత = అసత్యాలు పలకటం, దారుణ భాషణ+ఆదులు = పరమ కర్కశంగా మాట్లాడటం మొదలైనవి; వాచికములు = వాక్కునకు చెందిన పాపాలు; వధంబును = ప్రాణులను చంపటం; బంధమును = కట్టివేయటం; అభక్ష్యభక్షణంబును = తినగూడని వాటిని తినటం; అన్యభామారతమున్ = పరుని భార్యతో కూడటం; మద్యపానంబున్ = కల్లు త్రాగటం; మొదలు+ఐన = మున్నగు; పాపకృతులు = కిల్బిషకృత్యాలు; కాయికంబులు = శరీర సంబంధమైనట్టివి; వినుము = ప్రేయసీ! శ్రద్ధగా ఆలకించుము; అపేయ పానము+అది = త్రాగరానిదైన సారాయి త్రాగటం అనేది; దుష్కృతంబులలోనన్+ఎల్లన్ = పాపా లన్నింటియందునూ; అధికంబు = కడుపెద్దది; పానమునన్ = త్రాగుడు వలన; ప్రాణగొడ్డములును = ప్రాణహానికరములు, ప్రాణోపద్రవాలు; చేటులున్ = కీళ్ళు; నరక+అబ్ధిమునుఁగుటలును = నరకమనే సముద్రంలో మునిగి పోవటాలు; నిందతోన్ = అపకీర్తితో; వచ్చున్ = సంభవిస్తాయి.

తాత్పర్యం: 'దేవీ! మనసుతో చేయబడేవి, నోటితో సల్పబడేవి, శరీరంతో కావింపబడేవి అని పాపాలు ముప్పిధాలు. ఇతరుల ద్రవ్యాన్ని వాంఛించటం, దుష్కృత్యాలు జరుగుతుంటే అంగీకరించటం లేదా చూచి సంతోషించటం, ధర్మకార్యాలను ద్వేషించటం మొదలైనవి మనస్సంబంధమైన పాపాలు. అబద్ధాలు చెప్పటం, కఠోరంగా మాట్లాడటం, వాక్సంబంధమైన దోషాలు, చంపటం, బంధించటం, తిన కూడని వాటిని తినటం, పరుని పత్నిని అనుభవించటం, కల్లు త్రాగటం మొదలైనవి శరీరసంబంధమైన పాతకాలు. పార్వతీ! వినుము. పాపా లన్నింటిలో దొడ్డపాపం కల్లు త్రాగటం. మద్యపానం వలన ప్రాణోపద్రవం కలుగుతుంది, చేటు వాటిల్లు తుంది, నరకసముద్రంలో కూలటం జరుగుతుంది.

విశేషం: బాలవ్యాకరణకర్త పరవస్తు చిన్నయసూరి లక్షణవిరుద్ధంబగు భాష గ్రామ్యంబు. అది గ్రంథరచనకు పనికిరాదని శాసించాడు. కాన కఱకంఠుడు, కపిల గడ్డము, కపిలజడల వంటి నన్నయ భారత ప్రయోగాలకు రక్షణ కల్పించడానికి ఆయన "పెద్దలు వ్యవహరించిన మాట గ్రామ్యమైనను గ్రహింపదగును'' అంటూ "ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు'' అని సూత్రం కల్పించాడు. అందుకు ఉదాహరణగా ఇచ్చిన పదాలలో తిక్కన గారి ఈ ప్రాణగొడ్డము ఒకటి. ఈనాడు అనేకమారులు, అల్పదండిత్యాదులు పేరున్న పెద్ద పెద్ద కవులే నిరంకుశంగా వాడుతున్నారు.

క. లోకము నిర్మర్యాద । త్వాకులమై చెడదె సజ్జనావలి మధుపా
నాకాంక్ష దొఱఁగకున్న గు । ణా కల్పా! యేమిసేయ దక్కీడు నరున్? 175

ప్రతిపదార్థం: గుణ+ఆకల్పా! = సద్గుణాలే నగలుగా గలదానా!; సత్+జన+ఆవలి = సత్పురుషుల యొక్క సంఘం; మధుపాన+ఆకాంక్ష = మద్యం త్రాగడంలోని ఆసక్తి; తొఱఁగక+ఉన్నన్ = వదలకుంటే, మానకుంటే; లోకము = ప్రపంచం; నిర్+మర్యాదత్వ+ఆకులమై = హద్దులేమిచే కలిగిన వ్యాకులపాటు చెందినదై; చెడదు+ఎ? = నశింపదా? ఆ+కీడు = ఆ మధుపానాసక్తి వలన కలిగే హాని; నరున్ = మనిషిని; ఏమి+చేయదు? = ఏమిచేయలేదు? అనగా అన్ని అనర్థాల పాలు కావిస్తుందని భావం.

తాత్పర్యం: గుణభూషితవైన పార్వతీ! సత్పురుషులు మద్యపానం మానకపోతే లోకం హద్దు లేనిదై సంక్షోభానికి గురై చెడిపోతుంది. మధుసేవ మనిషికి ఏ హాని కల్గించలేదు? అన్ని అనర్థాలనూ కల్గిస్తుందని తాత్పర్యం.

క. కావున నే విధమున సుర । సేవింపక యుడుగుటొప్పుఁ జెలువ! సకల వ
ర్ణావలికి దానఁ గీర్తి । శ్రీవైభవ పుణ్యగతులు సేర్చికొన నగున్. 176

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; చెలువ = ఓ లలనా; ఏ విధమునన్ = ఎట్టైనా; సురసేవింపక = మద్యం త్రాగక; ఉడుగుట = మానటం; ఒప్పున్ = తగును; దానన్ = అట్లా చేయడం వలన; సకల వర్ణ+ఆలికిన్ = అన్నికులాలవారికిన్నీ; కీర్తి శ్రీవైభవ పుణ్యగతులు = యశస్సు, సిరి, వైభవం, పుణ్యలోకాలు; చేర్చి కొనన్+అగున్ = పడయవచ్చును, పొందవచ్చును.

తాత్పర్యం: కాబట్టి కాంతామణీ! ఏ విధంగానైనా కల్లుమానటం అవశ్యకర్తవ్యం. అట్లా చెయ్యటం వలన పేరు ప్రఖ్యాతులూ, సిరిసంపదలూ, గొప్పతనం, సద్గతులూ సర్వజాతులవారూ సంపాదించుకొనవచ్చు.'

క. అన విని యంబిక 'సుకృతము । లనునవి యెట్టి?' వని యడుగు నద్దేవికి ని
ట్లనియెం జంద్రార్ధధరుం । డనుమోదోల్లాసి యగుచు నంబుజనాభా! 177

ప్రతిపదార్థం: అనన్; విని; అంబిక = దుర్గ; సుకృతములు+అనునవి = పుణ్యాలు అనేవి; ఎట్టివి? = ఎట్లాంటివి?; అని = అంటూ; అడుగు = ప్రశ్నించునట్టి; ఆ+దేవికిన్ = ఆ భగవతికి; చంద్ర+అర్ధ+ధరుఁడు = నెలవంకను తలదాల్చిన శివుడు; అనుమోద+ఉల్లాసి+అగుచున్ = సంతోషంతో ప్రకాశిస్తున్నవాడై; ఇట్లు+అనియెన్ = ఇట్లా చెప్పాడు; అంబుజనాభా! = పద్మమునాభియందుగలవాడా! శ్రీ కృష్ణా!

తాత్పర్యం: అని పరమేశ్వరుడు పలుకగా పార్వతీదేవి 'ప్రభూ! పుణ్యాలంటే ఎట్లాంటివి? అని ప్రశ్నించింది. అందుకు శశాంకశేఖరుడు సంతోషంతో విలసిల్లుతూ ఆమె కిట్లని చెప్పాడు శ్రీకృష్ణా! (అని నారదమహర్షి శౌరితో అన్నాడు).

తే. 'ఔపరమికాభిధానంబు నంబుజాక్షి! । నిరుపకరణాఖ్యమును సోపకరణనామ
కంబు నయి లోకమున సుకృతంబు పరఁగుఁ । ద్రివిధముల వానిఁ దగ వివరింతు వినుము. 178

ప్రతిపదార్థం: అంబుజ+అక్షి! = తామరరేకులవంటి నేత్రాలు గలగౌరీ!; ఔపరమిక+అభిధానంబున్ = ఔపరమికము అనే పేరుగలదియూ; నిరుపకరణ+ఆఖ్యమునున్ = నిరుపకరణము అనే పేరుగలదియూ; సోపకరణనామకంబున్ = సోపకరణము అనే పేరుగలదియూ; అయి = కలిగి; లోకమునన్ = జగములో; సుకృతంబు = పుణ్యం; త్రివిధములన్ = మూడురీతుల; పరఁగున్ = ఒప్పుతున్నది; వానిన్ = మూడు విధాల ఉన్న పుణ్యాలను; తగన్ = చక్కగా; వివరింతున్ = వెల్లడిస్తాను; వినుము = ఆలకించుము.

తాత్పర్యం: 'పద్మ దళముల వంటి నయనాలు గల గౌరీ! పుణ్యం ఔపరమికం అనీ, నిరుపకరణం అనీ, సోపకరణం అనీ మూడూ విధాలుగా ప్రపంచంలో వెలుగొందుతున్నది. విశదీకరిస్తాను. విను.

సీ. **ఔపరమిక మనునది పాపవర్జన; । మకట! కానఁగ నేర రజ్ఞజనులు;**
యత్నంబు వలదు; వ్యయం బేమియును లేదు । పరలోకభీతిఁ బాపములఁ దొఱఁగి
నంతన సుగతి సౌఖ్యం బొడఁగూడెడు; । నదియు నాత్మాధీన; మట్టిదాని
సుకరత్వ మెఱుఁగక చొత్తురు నరకంబు; । వెరవరుల్ శ్రుతమున వృద్ధయోగ

తే. **మునను ధృతికల్మి నింద్రియ వినియమమున । నది దమకుఁ గలిగింతురు; యమ మనంగఁ**
బరఁగు నది దాన నాకంబుఁ బడయవచ్చు, । ననినఁ జెప్పంగ నేల ధర్మాభియుక్తి. 179

ప్రతిపదార్థం: ఔపరమికము+అనునది = ఔపరమికము అనేది; పాపవర్జనము = పాపకృత్యాలను వదలటమే; అకట! = అయ్యో!; అజ్ఞజనులు = మూర్ఖులు, మూఢులు; కానఁగన్+నేరరు = తెలిసికొనలేరు; యత్నంబు వలదు = ఇందుకు పెద్దగా ప్రయత్నించనక్కర లేదు; వ్యయంబు+ఏమియును+లేదు = ధనం కొంచెమైనా వెచ్చించవలసినపని లేదు; పరలోకభీతిన్ = పరలోకంలో ఎట్లాంటి బాధలు అనుభవించ వలసి వస్తుందో అనే భయంతో; పాపములన్ = దురితాలను; తొఱఁగిన+అంతన్+అ = విడిచి పెట్టిన మాత్రాననే; సుగతిసౌఖ్యంబు = సద్గతి వలని సుఖం, స్వర్గ సౌఖ్యం; ఒడన్+కూడెడున్ = లభిస్తుంది; అదియున్ = ఆ పాపవివర్జనం; ఆత్మ+అధీనము = తనకు వశమయ్యే ఉంటుంది; అట్టిదాని సుకరత్వమున్ = ఆ పాపవర్జనం వలన కలిగే సౌలభ్యం, మేలు; ఎఱుఁగక = తెలియక; నరకంబున్+చొత్తురు = నరకలోకంలో ప్రవేశిస్తారు; వెరవరుల్ = ఉపాయశాలురు; శ్రుతమునన్ = వేద శాస్త్రపురాణాదుల వినికి చేతనూ; వృద్ధయోగముననున్ = పెద్దలసాంగత్యం చేతనూ; ధృతికల్మిన్ = ధైర్యం కలిగి ఉండటం వలననూ; ఇంద్రియవినియమమునన్ = ఇంద్రియాలను నిగ్రహించటం చేతనూ, అది = ఆ పరలోకసుఖం, తమకున్ = తమకు; కలిగింతురు = లభించేటట్లు చేస్తారు, చేకూరుస్తారు; అది యమము+అనంగన్+పరఁగున్ = అది యమమనే పేరుతో విలసిల్లుతుంది; దానన్ = ఆ యమముచేత; నాకంబున్ = స్వర్గాన్ని; పడయన్+వచ్చున్ = పొందవచ్చును. అనినన్ = అని చెప్పునపుడు; ధర్మ+అభియుక్తిన్ = పుణ్యార్జనమును గూర్చి; చెప్పంగన్+ఏల? = చెప్పటమెందుకు?

తాత్పర్యం: ఔపరమిక మనగా పాపాలను విడిచిపెట్టడం. అయ్యో! ఇంత సులభమైన దానిని మూఢ మానవులు గ్రహించనేరకున్నారు. పాపవర్జనానికి ప్రయత్నం అక్కరలేదు. డబ్బును వెచ్చించ వలసిన అవసరంలేదు. పరలోకం ఉన్నది గదా అనే భయంతో పాపకృత్యాలు చేయటం మానితే చాలు. సద్గతి వలన కలిగే సౌఖ్యం తనంతట తానే లభిస్తుంది. దుష్కృత్యాలు మానటం అనేది తన చేతిలోని పనేకదా! ఇందువలన కలిగేమేలు గమనించక జనులు చెడుపనులు చేస్తూ నిరయం పాలవుతున్నారు. ఉపాయశాలురగు బుద్ధిమంతులు వేదశాస్త్ర పురాణాదులను వింటూ, పెద్దలను సేవిస్తూ, ధైర్య మవలంబించి, ఇంద్రియాలను నిగ్రహించి సద్గతుల వలన కలిగే సౌఖ్యమును పొందుతారు. యమం వల్లనే స్వర్గసుఖం లభిస్తుంది అని చెప్పేటప్పుడు మానవుడు కేవలపుణ్యాకర్మలే ఆచరి స్తున్నప్పుడు లభించే భాగ్యం ఇట్టిదని వర్ణించడానికి శక్యం కాదు.

విశేషం: యమము: ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకోవటం. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధు లనేవి యోగాంగాలు. ఇవి ఎనిమిది. వీటిలో మొదటిది యమము -- (ఇంద్రియ నిగ్రహం).

ఆ. నిరుపకరణ మనఁగఁ బరఁగు శౌచంబు స । త్యంబు శాంతి దాంతి యార్జవంబు
వ్రతనిరూఢి సముపవాసంబు బ్రహ్మ చ । ర్యంబు కల్మి నియమ మండ్రు దాని. 180

ప్రతిపదార్థం: శౌచంబు = శుచిత్వం, పరిశుద్ధత; సత్యంబున్ = నిజము; శాంతి = త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములనే జ్ఞానేంద్రియాల నిగ్రహం, అంతరింద్రియాల నణచటం; దాంతి = వాక్, పాణి, పాద, పాయూ పస్థలనే కర్మేంద్రియాల యొక్క నిగ్రహం; అనగా బహిరింద్రియాల గెలుపు; ఆర్జవము = నిష్కాపట్యం, స్వచ్ఛమైన నడవడిక; వ్రతనిరూఢి = వ్రతాలయందు ప్రీతి; సముపవాసంబు = ఒక్కప్రొద్దు లుండటం; బ్రహ్మచర్యంబు కల్మి = బ్రహ్మచర్యం అవలంబించటం; నిరుపకరణము+ అనఁగన్ = నిరుపకరణం అనే పేరుతో; పరఁగున్ = ఒప్పుతుంది; దానిన్ = ఆ నిరుపకరణాన్నే; నియమము+అండ్రు = నియమ మని అంటారు.

తాత్పర్యం: పరిశుద్ధత, సత్యం, అంతరింద్రియ నిగ్రహం (శాంతి), బహిరింద్రియనిగ్రహం (దాంతి), ఋజుప్రవర్తన, వ్రతాలను ప్రీతితో అనుష్ఠించటం, ఒక్కప్రొద్దు లుండటం, బ్రహ్మచర్యవ్రతపాలన అనేవి నిరుపకరణం అనే పేరుతో చెలువొందుతున్నాయి. ఈ నిరుపకరణమునే నియమ మంటారు.

సీ. ఆభ్యంతరంబు బాహ్యము ననఁగా శౌచ । మిరు దెఱఁగై యుండు హృదయసుకృత
మాభ్యంతరము విను మాహారశుద్ధియు । నంగశోధనము బాహ్యంబు సత్య
మన్నది గన్నది విన్నది యున్న రూ । పున నుక్త మగుట యంభోజవదన!
శాంతి బుద్ధీంద్రియ సన్నివారణ దాంతి । కర్మేంద్రియముల యోగ్యప్రవృత్తి;

తే. యార్జవము గుటిలుఁడు గామి యగు వ్రతంబు । మంచిపని పూని నడపుట యంచితోప
వాస మశననిగ్రహ మనవద్యమైన । బ్రహ్మచర్యంబు గామునిబారిఁ బడమి. 181

ప్రతిపదార్థం: శౌచము = పరిశుద్ధత; ఆభ్యంతరంబున్ = లోపలిదీ; బాహ్యమున్ = వెలుపలిదీ; అనఁగాన్ = అనునట్లు; ఇరు+తెఱఁగు+ఐ = రెండు విధాలై; ఉండున్ = ఉంటుంది; హృదయసుకృతము = మనసు చేసిన పుణ్యం; ఆభ్యంతరము = లోపలిది; వినుము = గౌరీ! ఆలకించుము; ఆహారశుద్ధియున్ = భోజనం యొక్క పరిశుద్ధి; అంగశోధనమున్ = దేహమును శుద్ధపరచుట, (ఒడలు తోముకొనుట); బాహ్యంబు = వెలుపలిది; అంభోజవదన! = పద్మమువంటి ముఖముగలదానా!; అన్నది = నోటితో చెప్పినది; కన్నది = కంటితో చూచినదీ; విన్నది = చెవులతో ఆలకించినదీ; ఉన్నరూపునన్ = యథాతథంగా; ఉన్నది ఉన్నట్లుగా; ఉక్తము+అగుట = చెప్పబడుట; సత్యము = నిజం; బుద్ధి+ఇంద్రియ+సత్+నివారణ = మనస్సు మున్నగు ఇంద్రియాలను బాగా నిగ్రహించటం; శాంతి = శాంతి అనబడుతుంది; కర్మ+ఇంద్రియముల = వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే అయిదు కర్మేంద్రియాల యొక్క; యోగ్యప్రవృత్తి = సక్రమమైన ప్రవర్తన; దాంతి = దాంతి అనబడుతుంది. కుటిలుఁడు+కామి = మోసగాడు కాకుండటం, కాపట్యం లేకుండటం; ఆర్జవము = ఆర్జవ మనబడుతుంది; మంచిపని = సత్కార్యం; పూని = యత్నించి; నడపుట = సాగించటం; వ్రతము+అగున్ = వ్రతమనిపించుకొంటుంది; అశన నిగ్రహము = ఆహారం మానివేయటం; అంచిత+ఉపవాసము = ఒప్పిదమైన ఉపవాస మవుతుంది; కామునిబారిన్+పడమి = మన్మథుడికి వశుడు కాకుండటం; బ్రహ్మచర్యము = బ్రహ్మచర్యమని చెప్పబడుతుంది.

తాత్పర్యం: శౌచమనేది ఆభ్యంతరమనీ, బాహ్యమనీ రెండురకాలు. అందు మనస్సు యొక్క పారిశుద్ధ్యం ఆభ్యంతర మవుతుంది. ఆహార శుద్ధి, దేహశుద్ధి బాహ్యమని చెప్పబడుతుంది. నోటితో చెప్పినదీ, కంటితో చూచినదీ, చెవులతో విన్నదీ ఉన్నదున్నట్లు చెప్పడమే నిజం. దేవీ! జ్ఞానేంద్రియపంచకాన్ని జయించటమే శాంతి. కర్మేంద్రియాలను సద్విషయాలలో ప్రవర్తింపజేయటమే దాంతి. నిష్కపటవర్తనమే ఆర్జవం. మంచిపనులు పూనికతో చేయటమే వ్రతం. భోజనం మానటమే ఉపవాసం. కామోద్రేకానికి గురికాకుండా ఉండటమే బ్రహ్మచర్యం.

విశేషం: 'నిరుపకరణ మనఁగ' అనే 180వ పద్యానికి ఈ పద్యం వివరణప్రాయం.

ఆ. **నాతి! తీర్థసేవనంబును నియమ వి । శేష మగుట దానిఁ జెప్పవలయు**
సకలనదులఁ దీర్థసంజ్ఞలు గల వబ్ధి । కరుగునట్టి విచ్చు నధికఫలము. **182**

ప్రతిపదార్థం: నాతి! = ఓ మగువా!; తీర్థసేవనంబును = పుణ్యతీర్థాలను సేవించటం; నియమ విశేషము+అగుటన్ = నియమాలలో ఒకటికావటం వలన; దానిన్ = దానిని గూర్చి; చెప్పన్ వలయున్ = తప్పక చెప్పాలి; సకలనదులన్ = అన్ని నదుల విషయంలో; తీర్థసంజ్ఞలు= తీర్థాలనే పేర్లు కలవు; అబ్ధికిన్+అరుగు+అట్టివి = సముద్రమునకు పోయే నదులు; అధిక ఫలమున్+ఇచ్చున్ = మిక్కుటమైన పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాయి.

తాత్పర్యం: చెలీ! పుణ్యతీర్థాలలో మునగడం కూడ నియమ విశేషం గనుక తీర్థాలను గురించి చెప్పవలసి ఉన్నది. అన్ని నదులూ పుణ్యతీర్థాలే. వాటిలో సాగరానికి పోయేనదులు అధిక ఫలాన్ని ఇస్తాయి.

తే. **వానియందును మునిపద మాననీయ । దేశములు నబ్ధిసంయోగ దేశములును**
దెలియు మన్యోన్యసంగమ దేశములును । బరమతీర్థంబు లగుఁ బద్మపత్రనయన! **183**

ప్రతిపదార్థం: పద్మపత్రనయన! = తామర రేకుల వంటి కన్నులు కలదానా! గౌరీ!; వానియందును = ఆ పుణ్య తీర్థాలలోనూ; మునిపదమాననీయ = మునీంద్రులు అడుగులు మోపటం చేత ఆదరించదగిన; దేశములున్ = చోటులూ; అబ్ధి సంయోగదేశములును = సముద్రంలో కలిసే చోట్లున్నూ; అన్యోన్య(అన్యః+అన్య) సంగమ దేశములును = ఒకదానితో ఒకటి చేరేచోట్లున్నూ; పరమ తీర్థంబులు+అగున్ = శ్రేష్ఠమైన తీర్థా లవుతాయి; తెలియుము = దేవీ! గ్రహించుము.

తాత్పర్యం: ఆ విధంగా సముద్రంలో కలియుటకు అరిగే నదులలో మునీశ్వరులు తమ పాదాలు మోపి పవిత్రీ కరించిన చోట్లూ, ఈ స్రవంతులు సాగరంలో కలిసే చోట్లూ, నదీనదాలు పరస్పరం కూడే చోట్లూ అనగా సంగమస్థానాలూ ఉత్తమతీర్థాలని దేవీ! గ్రహించుము.

క. **వనధి మహాతీర్థం బం । దును సంయమివరులచేతఁ దొల్లి ప్రియమునం**
గొనియాడఁ బడిన చోటులు । విను ముత్తమ తీర్థములు వివేకాభరణా! **184**

ప్రతిపదార్థం: వివేక+ఆభరణా! = విజ్ఞానమే అలంకారంగా గల గౌరీ!; వినుము = ఆలకించుము; వనధి = సముద్రం; మహాతీర్థంబు = గొప్ప పుణ్యతీర్థం; అందును = మీదుమిక్కిలి; సంయమివరులచేతన్ = మునీంద్రుల చేత; తొల్లి =

పూర్వం; ప్రియమునన్ = ఇష్టంతో, ఆదరంతో; కొనియాడన్+పడిన = పొగడబడినట్టి; చోటులు = ప్రదేశాలు, తావులు; ఉత్తమతీర్థములు = శ్రేష్ఠములైన తీర్థాలు, పవిత్ర తీర్థాలు.

తాత్పర్యం: విజ్ఞానమే విభూషణంగా గల పార్వతీ! వినుము. సాగరం ఒక గొప్ప పుణ్యతీర్థం. మునుపు మునిశ్రేష్ఠులు ప్రియపడి శ్లాఘించిన సాగరసంగమ ప్రదేశాలన్నీ పరమ పవిత్రాలైన తీర్థాలు.

క. వెలి శుచియై మఱి తీర్థం । బులు సొచ్చుట మేలు నియమములు దీర్చి తగన్
వెలలిన యెడ దేవార్చన । ములు విప్రార్చన లవశ్యమును గృత్యంబుల్. 185

ప్రతిపదార్థం: వెలిన్ = వెలుపల, నదికి బయట; శుచి+ఐ = పరిశుద్ధుడై; మఱి = ఆవల; తీర్థంబులు+చొచ్చుట = నీళ్ళలో ప్రవేశించటం; మేలు = మంచిది; నియమములు+తీర్చి = స్నానాది విధులెల్ల ఆచరించి; తగన్ = యుక్తంగా; వెలలిన+ఎడన్ = నది నుండి తీరం చేరిన తరువాత; దేవ+అర్చనములు = దేవతాపూజలు; విప్ర+అర్చనలు = బ్రాహ్మణపూజలు; అవశ్యమును = తప్పక; కృత్యంబుల్ = చేయదగినట్టివి.

తాత్పర్యం: పుణ్యతీర్థాలలో మునగటానికి ముందు కాలకృత్యాలు తీర్చుకొని, స్నానమాడి పరిశుద్ధుడై ఆవల ఆ పవిత్రతీర్థాలలో ప్రవేశించాలి. ఆ విధంగా తీర్థాలలో ప్రవేశించి స్నానవిధులెల్ల చక్కగా ఆచరించి గట్టెక్కిన తరువాత దేవబ్రాహ్మణ పూజలు తప్పకుండా నిర్వర్తించాలి.

క. చేరువ తీర్థము కంటెను । దూరపుఁదీర్థంబు మేలు తోయజవదనా!
శారీరాయాసము ద । త్కారణమై వేదవాక్యగతి యిట్లుండున్. 186

ప్రతిపదార్థం: తోయజవదనా! = పద్మంవంటి మోము కలదానా!; చేరువ తీర్థము కంటెను = సమీపంలోని తీర్థం కన్నా; దూరము+ తీర్థంబు (దూరపు తీర్థంబు) దూరప్రదేశంలో ఉండే తీర్థం; మేలు = శ్రేష్ఠమైనది; (ఎందుకంటే) శారీర+ఆయాసము = దేహము యొక్క బడలికయే, శ్రమయే; తత్+కారణము+ఐ = అందుకు హేతువై; వేదవాక్యగతి = వేద వచనాల యొక్క పోకడ; ఇట్లు+ఉండున్ = ఈ రీతిగా ఉంటుంది.

తాత్పర్యం: ఓ పద్మముఖీ! దగ్గరలో ఉండే తీర్థాన్ని సేవించడం కంటె, దూరంలో ఉండే తీర్థాన్ని సేవించడమే మంచిది. ఎందుకంటే వేదవాక్యాల పోకడ ననుసరించి తీర్థయాత్రలో దేహం బడలిక చెందడం, శ్రమపొందడం మంచిది.

క. విను సోపకరణ మనునది । ధనధాన్యాదిక సమగ్రతను గృహమేధుల్
గొనియాడుతెఱఁగు దానం । బున వైదిక పైతృకాది పుణ్యక్రియలన్. 187

ప్రతిపదార్థం: విను = అపర్ణా! ఆలకించుము; సోపకరణము+అనునది = సోపకరణం అని చెప్పబడేది; ధన ధాన్య+ఆదిక = ధనం, ధాన్యం మొదలైనవాటి యొక్క; సమగ్రతను = పూర్ణత్వం చేత, మెండుగా కలిగి ఉండటం చేత; గృహమేధుల్ = గృహస్థులు, గేస్తులు, ఇంటి యజమానులు; దానంబునన్ = దానాల చేతను; వైదిక = వేదోక్తములైన, వేదవిహితాలైన; పైతృక+ఆది = పితృశ్రాద్ధం, తర్పణం మొదలైన; పుణ్యక్రియలన్ = పవిత్రకార్యాలను; కొనియాడు తెఱఁగు = ఆదరించే విధానమై ఉన్నది.

తాత్పర్యం: అపర్ణా! ఆలకించుము. సోపకరణ మనేది మెండుగా ధనధాన్యాలు గల గృహస్థులు దానము చేతను, పితృశ్రాద్ధాదులైన వైదిక కార్యాలచేతను ఆదరించే విధానమై ఒప్పుతున్నది.

సీ. **న్యాయార్జితంబైన యర్థంబు వేదవి । త్త్వము శాంతి మొదలగు వరగుణములు**
గల విప్రునకుఁ బుణ్య కాలపావన దేశ । కలితంబుగా భక్తి గలిగి యీగి
మేలిదానము శక్తి మిగులుట శక్తికిఁ । దగుట దానికిఁ గడుఁ దగమి యుత్త
మము మధ్యమము నధమము నగు దాన వి । ధానంబు వినుము మిట్లు దైవికంబుఁ

తే. **బైతృకంబును లోనైన పనులఁ దాను । వేడ్కసేయు వస్తువుఁ గొను విప్రుకోర్కి**
కనుగుణంబగు నదియును నర్థి నిచ్చు । టధికతరమైన ఫల మిచ్చు నంబుజాక్షి! 188

ప్రతిపదార్థం: అంబుజ+అక్షి! = నీరజములవంటి నేత్రాలు కలదానా!; న్యాయ+ఆర్జితంబు+ఐన = న్యాయం తప్పక సంపాదించినట్టి; అర్థంబున్ = విత్తాన్ని; వేదవిత్త్వమున్ = వేదమునెరుంగుటు; శాంతి = ఇంద్రియనిగ్రహం; మొదలు+అగు = మున్నుగా కలిగిన; వరగుణములు = శ్రేష్ఠములైన గుణాలు; కల = కలిగిన; విప్రునకున్ = బ్రాహ్మణుడికి; పుణ్యకాల = పవిత్రమైన కాలంతో; పావనదేశ = పవిత్రమైన ప్రదేశంతో; కలితంబుగాన్ = కూడి ఉండేటట్లుగా; భక్తి+కలిగి = భక్తి భావం కలిగి; ఈగి = ఇచ్చుట; మేలిదానము = ఉత్తమ దానం; శక్తిన్ మిగులుట = తన శక్తికి మించటం; శక్తికిన్+ తగుట = తన శక్తికి తగినట్లుండటం; దానికిన్ = తనశక్తికి; కడున్ = మిక్కిలి; తగమి = తగినట్లు ఉండకుండటం అనేవి వరుసగా; ఉత్తమమున్ = శ్రేష్ఠమూ; మధ్యమమున్ = రెండవ రకం; అధమమున్ = హీనమూ; అగు = అయినట్టి; దానవిధానము = దానపద్ధతి అవుతుంది; వినుము = అంబికా! ఆలకించుము; ఇట్లు = ఈ రీతిగా; దైవికంబు = దైవసంబంధం; పైతృకంబు = పితృసంబంధమును; లోను+ఐన పనులన్ = మొదలగు కార్యములందు; కొను = స్వీకరించే; విప్రుకోర్కికిన్ = బ్రాహ్మడికాంక్షకు; అనుగుణంబు+అగు+అదియునున్ = తగినట్టి దానిని; అర్థిన్ = ప్రీతితో, భక్తితో; ఇచ్చుట = దానమివ్వటం; అధికతరము+ ఐన = ఎంతో ఎక్కువైన; ఫలము+ఇచ్చున్ = ఫలాన్నిస్తుంది;

తాత్పర్యం: న్యాయంగా సంపాదించిన సొమ్మును వేదం చదివిన, శాంతి మొదలైన సద్గుణాలు కలిగిన బ్రాహ్మణుడికి పుణ్యకాలమందు, పుణ్యక్షేత్రమందు భక్తితో దానం చేయటం ఎంతో ఉత్తమం. తన శక్తికి మించిన దానం పరమోత్తమం. తన శక్తికి తగినట్లివ్వడం మధ్యమం. తన శక్తికి ఏ మాత్రం తగనట్లు ఇవ్వడం అధమం. దేవీ! దానవిధాన మంటే ఇది. ఈ విధంగానే దేవ సంబంధమైన యజ్ఞయాగాదులలోనూ, పితృకార్యములైన శ్రాద్ధాదులలోనూ తన కిష్టమైన వస్తువునూ, దానగ్రహీత అయిన బ్రాహ్మణుడి కోరికకు తగిన వస్తువునూ శ్రద్ధా భక్తులతో సమర్పిస్తే ఆ దానం మిక్కుటమైన ఫలాన్ని ఇస్తుంది.

తే. **చేయు టెంతయు మేలైనఁ జేసి పిదప । వగచినట్టి దానము దనుఁ బొగడికొన్న**
దానవిధి నిష్ఫలంబులు గాన రెండు । నుడుగుదాత మహాఫల మొందఁ గాంచు.' 189

ప్రతిపదార్థం: చేయుట = దానం సల్పటం; ఎంతయున్ = మిక్కిలి; మేలు+ఐనన్ = శ్రేయస్కరమైనదైనను; చేసి = సలిపి; పిదపన్ = దానానంతరం; వగచినట్టి దానము = చింతించునట్టి దానమూ; తనున్ = తనను; పొగడికొన్నదానవిధి = మెచ్చుకొనే దాన పద్ధతి; నిస్+ఫలంబులు+కానన్ = ఫలరహితములు కాబట్టి, ప్రయోజన శూన్యాలు కనుక; రెండున్ = ఆ రెండు విధాలైన దానాలను; ఉడుగుదాత = వదలునట్టి ఈవికాడు; మహాఫలమున్ = గొప్ప ప్రయోజనాన్ని; ఒందన్+కాంచున్ = పొందగలడు.

తాత్పర్యం: "దానం చేయడం ఎంతోమేలే అయినప్పటికీ చేసిన తర్వాత దుఃఖపడినదానమూ, తానిచ్చినదాన్ని తానే పొగడుకొనే దానమూ నిష్ఫలాలు. కాబట్టి ఈ రెండూ మానుకొన్న దాత మహాఫలాన్ని పొందగలడు''.

వ. అనుటయు దాక్షాయణి 'దాతవ్యంబు లెయ్యవి చెప్పు' మనిన భవుం డిట్లనియె. 190

ప్రతిపదార్థం: అనుటయున్ = అని శివుడు చెప్పగా; దాక్షాయణి = దక్షప్రజాపతి కూతురైన సతీదేవి; దాతవ్యంబులు = దానం చెయ్యదగిన వస్తువులు; ఏ+అవి (ఎయ్యవి) = ఏవి; చెప్పుము; అనినన్ = అని అడుగగా; భవుండు = శంకరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శంభుడు తెలుపగా పార్వతీదేవి 'దానమీయ తగిన వస్తువు లేవో చెప్పు' మని అడుగగా ఈశ్వరు డిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికి దాన ఫల విశేషంబుల నెఱింగించుట. (సం.13 అను 1.15-3205)

సీ. 'అన్నంబుఁ దోయంబు నఖిలజంతువులకుఁ । బ్రాణముల్ గాన య ప్పరమవస్తు
వులు మేలు దాతవ్యములలోన నెల్లను; । నతిథుల కవి యిచ్చు టమరలోక
చిరమహాసౌఖ్యంబుఁ జేయుఁ; గాంచన మగ్ని । యగుటఁ దద్దాన మత్యంతపావ
నము సర్వకామప్రదము; గోవు సద్విప్రు । నకు నీగి తద్రోమ నికరసంఖ్య

ఆ. వరుస నాకలోక వాసంబు గావించు; । నందుఁ గపిల నిచ్చునాతఁ డిరువ
దొక్క తరము వారి నూర్ధ్వలోకమునకు । ననుపఁ జాలు వికచవనజవదన! 191

ప్రతిపదార్థం: వికచవనజవదన! = వికసించిన పద్మంవంటి ముఖం కలదానా!; అన్నంబున్ = ఓగిరం, కూడు, ఆహారం; తోయంబున్ = నీళ్ళూ, జలమూ, ఉదకమూ; అఖిలజంతువులకున్ = సమస్త జీవులకూ, ప్రాణముల్+కానన్ = ప్రాణాధారాలు గనుక; ఆ+పరమ వస్తువులు = ఆ శ్రేష్ఠములైన పదార్థాలు, అన్నోదకాలు; దాతవ్యములలోనన్+ఎల్లన్ = దానమివ్వదగిన వస్తువులన్నింటిలోనూ; మేలు = ఉత్తమమైనవి, మంచివి; అతిథులకున్ = భోజనవేళకు వచ్చినవారికి; అవి = ఆహారపానీయాలు; ఇచ్చుట = ఇవ్వటం; అమరలోక = దేవలోకంలో; చిరమహాసౌఖ్యంబున్+చేయున్ = బహుకాలం గొప్ప సుఖాలను కలిగిస్తుంది; కాంచనము = బంగారం; అగ్ని+అగుటన్ = నిప్పుకావటం వలన; తత్+దానము = సువర్ణదానం; అత్యంత పావనము = మిక్కిలి పవిత్రమైనది, కల్మషహరం; సర్వకామప్రదము = అన్ని కోరికలను ఈడేరుస్తుంది; గోవున్ = ధేనువును; సత్+విప్రునకున్ = మంచి బ్రాహ్మణుడికి; ఈగి = దానమివ్వటం; తత్+రోమనికరసంఖ్య = ఆ ఆవు యొక్క శరీరమందలి వెంట్రుకల యొక్క లెక్క; వరుసన్ = క్రమంగా; నాకలోకవాసంబున్ = స్వర్గలోకనివాసాన్ని; కావించున్ = కలుగజేస్తుంది; అందున్ = ఆ ధేనువులలో

కూడ; కపిలన్ = గోరోచనా వర్ణం కల గోవును, పుల్లావును; ఇచ్చు+అతఁడు = దానం చేసేవాడు; ఇరువది+ఒక్కతరము వారిన్ = తన పూర్వులలో ఇరవై ఒక్కతరాల వాళ్ళను; ఊర్ధ్వలోకమునకున్ = పుణ్యలోకానికి, స్వర్గానికి; అనుపన్+చాలున్ = పంపగలడు.

తాత్పర్యం: ఓ పద్మముఖీ! గౌరీ! అన్నం, నీళ్ళూ సకల ప్రాణులకూ ప్రాణాధారాలు కనుక ఆ శ్రేష్ఠములైన పదార్థాలు దాన మివ్వదగిన వస్తువు లన్నింటిలో మిక్కిలి ఉత్తమపదార్థాలు. అతిథులకు చేసే అన్నదానం, జలదానం దాతకు స్వర్గలోకంలో బహుకాలం మహాభోగానుభవం సమకూరుస్తాయి. బంగారం నిప్పు. దానిని దానం చెయ్యడం పరమపవిత్రం. అది అన్ని కోరికలను ఈడేరుస్తుంది. గోవును సద్బ్రాహ్మణుడికి దానమిస్తే దాని శరీరంలో ఎన్ని వెంట్రుక లున్నవో అన్నియేండ్లు స్వర్గలోకనివాస సౌఖ్యం పొందవచ్చును. ఆ గోవులలోనూ కపిల గోవును దానమిచ్చేదాత తన పూర్వులు ఇరవై యొక్క తరాల వారిని స్వర్గానికి పంపగలడు.

క. వినుభూమిదాన కర్తకు । ననిమిషలోకమున నిలువనగు సౌఖ్యంబుల్
దనరుచు నుండఁగ నెఱ పెం । పున భూమి గలంత కాలమును గిరితనయా! 192

ప్రతిపదార్థం: గిరితనయా! = ఓ శైలపుత్రీ!; విను = ఆలకించుము; భూమిదాన కర్తకున్ = భూదానం చేసిన వాడికి; భూమి+కల+అంత+కాలమున్ = భూమి ఉండేవరకూ; సౌఖ్యంబుల్ = సుఖాలు; తనరుచున్+ఉండన్+కన్ = వర్ధిల్లుతుండగా, శోభిల్లుతుండగా; నెఱపెంపునన్ = పూర్ణగౌరవంతో, నిండు గౌరవంతో; అనిమిషలోకమునన్ = దేవలోకంలో; నిలువన్+ అగున్ = ఉండవచ్చును.

తాత్పర్యం: పార్వతీ! వినుము. భూదానం చేసిన పుణ్యపురుషుడు ఆ భూమి ఉండేంత వరకూ పరిపూర్ణ సుఖాలు అనుభవిస్తూ, మిక్కిలి గౌరవంతో దేవలోకంలో నివసిస్తాడు.

ఆ. భూమి నఖిల మగు విభూతి విశేషజా । తంబు గలుగుఁ గానఁ దత్ప్రదాన
మెల్ల వస్తువులును నిచ్చిన యట్లగు । దానఁ బోని పాపతమము లేదు. 193

ప్రతిపదార్థం: భూమిన్ = నేలయందు; అఖిలము+అగు = సమస్తమైన; విభూతి విశేషజాతంబు = సంపద్విశేషముల యొక్క సమూహం అనగా మణులు, మాణిక్యాలు, వెండి, బంగారం మొదలైన అనర్ఘవస్తువులు; కలుగున్ = లభిస్తుంది; కానన్ = కాబట్టి; తత్+ప్రదానము = ఆ ధరణీదానం అనేది; ఎల్ల వస్తువులునున్+ఇచ్చిన+అట్లు+అగున్ = అన్ని వస్తువులనూ ఇచ్చినట్లే అవుతుంది; దానన్ = ఆ భూదానం వలన; పోని = నశించని; పాపతమము లేదు = పాతక మనే చీకటి లేదు.

తాత్పర్యం: భూమిలో సర్వవిధాలైన సంపద్విశేషాలు నెలకొని ఉంటాయి. కనుక భూదానం చేసినట్లయితే సకల వస్తు దానం చేసినట్లే అవుతుంది. ధరణీదానం వలన నశించని దురితమనే చీకటి ఉండనే ఉండదు.

విశేషం: అలం: పాపతమము అనే చోట రూపకం.

క. అతివా! కన్నియ నిచ్చినఁ । బితృపతి ముదమందు, సురలుఁ బ్రీతు లగుదు; రం
చితగతి కర్తకు దొరకొను । నతి తేజశ్శ్రీయశస్కమగు నబ్భవమున్. 194

ప్రతిపదార్థం: అతివా! = ఓ సఖీ!; కన్నియన్+ఇచ్చినన్ = పిల్లనిచ్చి పెళ్ళి చేస్తే, కన్యాదానం చేస్తే; పితృపతి = యమధర్మరాజు;

ముదము+అందున్ = సంతోషం పొందుతాడు; సురలు = దేవతలు; ప్రీతులు+అగుదురు = హర్షం చెందుతారు; కర్తకున్ = కన్యాదాన మొనర్చిన వాడికి; అంచిత గతి = పూజించదగిన, ఒప్పిదమైన సద్గతి; దొరకొనున్ = సమకూడుతుంది, లభిస్తుంది; ఆ భవమున్ = ఆతడి జన్మం కూడ; అతితేజస్ = మిక్కుటమైన కాంతి; శ్రీ = సంపద; యశస్కము+అగున్ = కీర్తిగలది అవుతుంది.

తాత్పర్యం: గిరిజా! కన్యాదానం చేసిన యెడల యముడు సంతోషిస్తాడు. వేల్పులు హర్షిస్తారు. కన్యాదాతకు సద్గతులు కలుగుతాయి. ఆతని జన్మం కాంతియుతమై, సంపద్యుక్తమై, కీర్తిమంతమై విరాజిల్లుతుంది.

తే. **విద్య యిచ్చుట సత్పాత్ర విషయమైన । నవ్యయానందపదముఁ జేయంగఁ జాలుఁ;**
దగఁగ దక్షిణయిచ్చి పేదలకు విద్య । యీ నియోగించుటయుఁ దత్సమాన కృతియ. **195**

ప్రతిపదార్థం: విద్య+ఇచ్చుట = విద్యాదానం చెయ్యటం, చదువు చెప్పటం; సత్పాత్ర విషయము+ఐనన్ = యోగ్యులకే చెందినది అయితే; అవ్యయ+ఆనందపదమున్ = శాశ్వతసుఖస్థానమును; చేయంగన్+చాలున్ = లభింపజేయగలదు; తగన్+కన్ = (తగఁగన్) తగినట్లుగా; దక్షిణ+ఇచ్చి = గురువులకు ధనమిచ్చి; పేదలకున్ = దరిద్రులకు; విద్య+ఈన్ = విద్యనిచ్చుటకు; నియోగించుటయున్ = నియమించటం కూడ; తత్+సమానకృతి+అ = తాను విద్య చెప్పటంతో సమానమైన కార్యమేఅవుతుంది.

తాత్పర్యం: యోగ్యులైన వారికి విద్యాదానం చేస్తే విద్యాదాతకు శాశ్వతమైన పరలోక సౌఖ్యం లభిస్తుంది. అట్లా తాను చదువు చెప్పేశక్తిలేని వాడైతే గురువులకు దక్షిణ లిచ్చి పేదలకు విద్య చెప్పిస్తే స్వయంగా విద్యచెప్పిన వాడికి లభించే శాశ్వతానంద పదవి ఇతనికి గూడ లభిస్తుంది.

సీ. **తిలరాశి యిచ్చినఁ గలుగు నగ్నిష్టోమ । ఫలము; వాసోదాన ఫలము చిరత**
రాయువు; గొడు గీగి యఖిలపీడలఁ బాపు; । దాసదాసీజనదాన మహిమ
కర్మ విమోక్షంబు గలిగించు; దీపదా । నము ఫల మాత్మాతివిమలభావ;
మంబు ప్రవాహంబు నధిగమింపఁగఁ జేఁత । నిఖిల వ్యసనముల నిస్తరింపఁ

ఆ. **జేయుఁ; దెరువు లెస్ససేయుట సంతాన । మిచ్చు; నౌషధంబు నిచ్చు టెల్ల**
తెవులుఁ బాపు; సాదు దెరువరి కునికి ప । ట్టొసఁగు టొసఁగు దనుసుఖోదయములు.' **196**

ప్రతిపదార్థం: తిలరాశి = నువ్వుల ప్రోగు; ఇచ్చినన్ = దానం చేస్తే; అగ్నిష్టోమ ఫలము = అగ్నిష్టోమమనే యజ్ఞం చేయటం వలన లభించే ప్రయోజనం; కలుగున్ = చేకూరుతుంది; వాసన్+దానఫలము = వస్త్రదానం చేస్తే లభించే మేలు; చిరతర+ఆయువు = దీర్ఘాయుష్యం; గొడుగు+ఈగి = ఛత్రదానం; అఖిలపీడలన్ = సమస్త బాధలనూ; పాపున్ = తొలగిస్తుంది; దాసదాసీజన దానమహిమ = సేవకులనూ, సేవికలనూ దానం చెయ్యటం వలన కలిగే ప్రభావం; కర్మ విమోక్షంబు+కలిగించున్ = కర్మ బంధం నుండి విముక్తి కలిగిస్తుంది; దీపదానము ఫలము = దీపదానం వలన లభించే ఫలం; ఆత్మ+అతి విమల భావము = ఆత్మకు మిక్కిలి నైర్మల్యం కలగటం; అంబు ప్రవాహంబున్ = నీటి వెల్లువను, జలప్రవాహాన్ని; అధిగమింపన్+ కన్+ చేఁత = పొందేటట్లు చేయడం; నిఖిల వ్యసనములన్ = ఎల్లదుఃఖాలనూ; నిస్తరింపన్+చేయున్ = దాటేటట్లు చేస్తుంది, తరింపజేస్తుంది; తెరువున్ = బాటను; లెస్స+చేయుట = బాగుపరచటం; సంతానము+ఇచ్చున్ = బిడ్డలను ప్రసాదిస్తుంది; ఔషధంబున్+ఇచ్చుట = మందునొసగటం; ఎల్ల+తెవులున్+పాపున్ = అన్ని రోగాలను మాన్పుతుంది; సాదు తెరువరికిన్ = సాధువైన బాటసారికి; ఉనికి పట్టు+ఒసఁగుట = నివాసస్థానమివ్వటం;

ఆశ్రయం కల్పించటం; తనుసుఖ+ ఉదయములు= దేహానికి సౌఖ్యవృద్ధి; ఒసఁగున్ = కలుగ జేస్తుంది, సమకూరుస్తుంది.

తాత్పర్యం: నువ్వులను దానమిస్తే అగ్నిష్టోమ యాగఫలం కర్తకు లభిస్తుంది. వస్త్రదానం వలన దీర్ఘాయుర్దాయం చేకూరుతుంది. ఛత్రదానం సర్వబాధానివారకం. దాసదాసీజన దాన ప్రభావం వలన కర్మబంధం నుండి విముక్తి సమకూడుతుంది. దీపాన్ని దానమిస్తే ఆత్మకు నైర్మల్యం సిద్ధిస్తుంది. జలప్రవాహాన్ని అందుబాటులోకి తెస్తే సకల దుఃఖనివృత్తి కలుగుతుంది. దారి డొంకలను బాగు పరిస్తే బిడ్డలు పుడతారు. మందులివ్వటం వలన రోగబాధలు తొలగిపోతాయి. సాధువైన బాటసారికి ఆశ్రయ మొసగితే తన శరీరానికి సౌఖ్యాభివృద్ధి సమకూడుతుంది.'

వ. అనిన విని 'యజ్ఞంబు తెఱం గెఱింగింపవే' యని పార్వతి ప్రార్థించినం బరమేశ్వరుం డిట్లనియె. 197

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శంకరుడు చెప్పగా ఆలించి; యజ్ఞంబు తెఱంగు = యాగము యొక్క స్వరూపం; ఎఱింగింపవు+ఏ = తెలుపవా; అని; పార్వతి; ప్రార్థించినన్ = వేడగా; పరమేశ్వరుండు; ఇట్లు+అనియెన్ = ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని శంకరుడు చెప్పగా ఆలకించి అంబిక 'యజ్ఞము యొక్క స్వరూప మెట్టిదో సెలవిం' డని వేడగా ఆయన ఇట్లా అన్నాడు.

సీ. 'విను మింతి! వైదికంబును లౌకికంబును । నన రెండు దెఱఁగులు యజ్ఞవిధులు;
వర్ణయోగ్యార్జన వర్ధనాంచిత ధన । ధాన్యముల్ గొని దేవతలకుఁ దృప్తి
యగునట్లుగా ఋత్వి గర్చన మొప్పఁగాఁ । గావించునది వైదికంబు; దేవ
తలకు మహోత్సవంబులు సేయుటయు గీత । వాద్యనృత్యము లనవద్యములుగ

ఆ. సంఘటించుటయును సద్గంధమాల్య ధూ । ప ప్రదీప భోజ్యభక్ష్యములు స
మాదరంబుతో నివేదించుటయు లౌకి । కంబు; రెండు నమరగణహితములు. 198

ప్రతిపదార్థం: ఇంతి! = కాంతా!; విను = వినుము; యజ్ఞ విధులు = యాగాచరణాలు, యజ్ఞవిధానాలు, యజ్ఞ ప్రకారాలు; వైదికంబును = వేదసంబంధమైనది; లౌకికంబును = లోకసంబంధమైనది; అనన్ = అనగా; రెండు తెఱఁగులు = రెండురీతులు; వర్ణయోగ్య = కులమునకు తగినట్లు; ఆర్జన = సంపాదనముచే; వర్ధన = పెంపుదల చేత; అంచిత = ఒప్పునట్టి; ధనధాన్యముల్ = విత్తం, ధాన్యం; కొని = గ్రహించి; దేవతలకున్ = ఇంద్రాదిదేవతలకు; తృప్తి+అగునట్లుగాన్ = సంతుష్టి కలిగేరీతిలో; ఋత్విక్+అర్చనము = వేదమంత్రాలను చెప్పునట్టి ఋత్విజులను పూజించటం; ఒప్పఁగాన్ = తగి ఉండగా; కావించు+అది = చేయునటువంటిది; వైదికంబు = వేదసంబంధమైన యజ్ఞం; దేవతలకున్ = సురలకు; మహా+ ఉత్సవంబులు = పెద్ద పెద్ద తిరునాళ్ళు; చేయుటయున్ = నిర్వహించటం; గీతవాద్యనృత్యములు = పాటలు, మేళాలు, నాట్యాలు; అనవద్యములుగన్ = అనింద్యములుగా, కొఱతలేకుండా; సంఘటించుటయున్ = సమకూర్చటమున్నూ; సద్+గంధ = మంచిగంధం; మాల్య = పూలదండలు; ధూప = సాంబ్రాణి మున్నగు పొగలు వేయటం; ప్రదీప = దీపాలు వెలిగించటం; భోజ్యములు = భుజింపదగినవి; అన్నం, పప్పు మొదలైనవి; భక్ష్యములు = వడలు, లడ్లు మొదలైన పిండివంటలు, తిను బండాలు; సమాదరంబుతోన్ = గౌరవబుద్ధితో; నివేదించుటయున్ = నైవేద్యమివ్వటం, ఆరగింపు చేయటం; లౌకికంబు = లోకసంబంధమైనది; రెండున్ = వైదికం, లౌకికం అనే ఈ రెండున్నూ; అమరగణహితములు = దేవతాసమూహానికిఇష్టమైనవి.

తాత్పర్యం: 'అపర్ణా! ఆలకించుము. యజ్ఞాలు వైదికములనీ, లౌకికములనీ రెండు విధాలు. బ్రాహ్మణాదిజాతుల వారు తమ కులధర్మాలను అనుసరించి సంపాదించి, వృద్ధిపరచిన ధనధాన్యాలను వెచ్చించి దేవతలకు సంతృప్తి కలిగేటట్లు వేదోక్తంగా ఋత్విక్కులకు సంభావన లిచ్చి నిర్వహించే యాగాలు వైదికాలు. వేల్పులకు బ్రహ్మోత్సవాలు అనగా తిరునాళ్ళు వైభవోపేతంగా జరిపించటం, ఆ దేవోత్సవాలలో పాటలు, మేళం వాయించటం, ఆటలు ఏర్పాటుచేయించటం, మంచి గంధం, పూలమాలలు, ధూపం, దీపం, భక్ష్యభోజ్యాలతో నైవేద్యం సమర్పించటం ఈ మొదలైన షోడశోపచారాలతో దేవుళ్ళను అర్చించటం లౌకికమని చెప్పబడుతున్నది. అటు వైదికం, ఇటు లౌకికం ఈ రెండు విధానాలూ దేవతలకు ఇష్టమైన ఆరాధనా పద్ధతులు.

తే. **ధర్మములు దానములును సద్వ్రతచయంబు । సదృశములు గావు వినుము యజ్ఞమున కరయ**
యజ్ఞకర్త లోకోత్తరుం డతని కిచ్చు । టతనిచేఁ గొను టధిక పుణ్యములు చెలువ! **199**

ప్రతిపదార్థం: చెలువ! = ఓ తరుణీ!; వినుము = ఆలకించుము; ధర్మములు = ధర్మాలు, పుణ్యాలు; దానములును = వితరణములు; సద్+వ్రతచయంబు = మంచి వ్రతాలు, నోములు; అరయన్ = పరికించగా, పరిశీలించగా, ఆలోచించగా; యజ్ఞమునకున్ = యాగమునకు, క్రతువునకు, సవనమునకు; సదృశములు+కావు = సమానం కావు; యజ్ఞకర్త = యాగం చేసేవాడు, యజమానుడు; లోక+ఉత్తరుఁడు = జనులలో శ్రేష్ఠుడు; అతనికిన్ = యజ్ఞం చేసేవాడికి; ఇచ్చుట = ఇవ్వటం; అతనిచేన్+కొనుట = అతనివలన స్వీకరించటం; అధికపుణ్యములు = మిక్కిలి పుణ్యాలు.

తాత్పర్యం: శ్రుతులకూ, స్మృతులకూ విహితమైన కర్మలు ధర్మాలు. అట్టి ధర్మాలు, దానాలు, మంచి వ్రతాలు ఇవేవీ యజ్ఞానికి సాటి రాలేవు. యజ్ఞం చేసినవాడు నరులలో ఉత్తముడు. అట్టి యాగకర్తకు ఇవ్వటంకాని, అతడి వలన పుచ్చుకొనటం గాని పరమ పుణ్యాలు.

ఉ. **మానస కృత్యముల్ సురసమాజ మెఱుంగఁగఁ జాలుఁ గావునన్**
మానస మెక్కడేనిఁ జన మంచిగఁ జేసిరయేని యజ్ఞమున్
దానము నాదియైన సుకృతంబులు లగ్గ ఫలింప నీదు త
ద్ధ్యాన పరత్వ పూత సుకృతంబులకున్ ఫలమిచ్చు మెచ్చుచున్.' **200**

ప్రతిపదార్థం: సురసమాజము = దేవతాసంఘం; మానసకృత్యముల్ = మనస్సు చేసే పనులు, మనోవ్యాపారాలు; ఎఱుంగన్‌కన్+చాలున్ = తెలిసికొనగలదు; కావునన్ = కాబట్టి; మానసము = చిత్తం; ఎక్కడన్+ఏనిన్+చనన్ = ఎక్కడికో వెళ్ళిపోతే, ఎక్కడెక్కడనో సంచరిస్తుంటే; మంచిగన్ = ప్రశస్తంగా, ఘనంగా; చేసిర+ఏనిన్ = చేసినప్పటికిన్నీ; యజ్ఞమున్ = యాగమూ; దానమున్ = వితరణమూ; ఆది+ఐన = మొదలైన; సుకృతంబులు = పుణ్యాకార్యాలు; లగ్గ ఫలింపన్+ఈదు = సురసమాజం లెస్సగా ఫలించేటట్లు చేయదు; తద్+ధ్యాన+పరత్వ = తదేకధ్యానమందు సక్తమగుటచే; పూత = పవిత్రమైన; సుకృతంబులకున్ = సత్కార్యాలకు, పుణ్యకార్యాలకు; మెచ్చుచున్ = కొనియాడుతూ; ఫలము+ఇచ్చున్ = ఆ దివిజసమూహం ఫలం ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: దేవతాసమూహం మానవుల యొక్క మనోవృత్తులను తెలిసికొనగలదు. మన సెక్కడో మసలుతుంటే యజ్ఞం, దానం మున్నగు పుణ్యాకార్యాలు ఎంతో ఘనంగా నిర్వర్తించినప్పటికిన్నీ దేవ సమాజం వాటికి ఫలాన్ని

ప్రసాదించదు. తదేక ధ్యానంతో పవిత్రమైన మనసును నిల్పి చేసే పుణ్యకార్యాలను మెచ్చుతూ దివిజబృందం ఫలాన్ని అనుగ్రహిస్తుంది.'

క. అని చెప్పిన హిమవద్గిరి । తనయ త్రిపురవైరితోడ 'దైవికవిధు లే
విన(గని సంతోషించితి; । వినిపింపుము పైతృకంబు విధము వృషాంకా!' 201

ప్రతిపదార్థం: అని చెప్పినన్ = అని శంకరుడు పలుకగా; హిమవత్ గిరితనయ = మంచు కొండకూతురైన పార్వతీదేవి; త్రిపురవైరితోడన్ = త్రిపురములను దహించిన పరమేశ్వరుడితో; దైవికవిధులు = దేవతలకు సంబంధించిన కర్మలు; ఏన్ = నేను; వినన్+కని = వినుటకు నోచి; సంతోషించితిన్ = ఆనందించాను; వృష+అంకా! = వృషభం ధ్వజంగా కల మహాదేవా!; పైతృకంబు విధము = పితృదేవతలకు చెందిన కర్మ విధానాన్ని; వినిపింపుము = తెలియజెప్పుము.

తాత్పర్యం: అని పరమేశ్వరుడు పలుకగా విని హిమాలయ నగాధిరాజు కూతురైన ఉమాదేవి త్రిపురా సురసంహారకుడైన ఈశ్వరుడితో 'నాథా! మీవలన దైవికములైన కార్యములను విననోచి ఆనందమందినాను. ఇక పితృదేవతలకు ప్రీతికరములైన కార్యములను గూర్చి తెలుప వేడుతున్నాను.'

సీ. అనిన నా సర్వజ్ఞు(డద్దేవి కిట్లను । 'గయ కురుక్షేత్రంబు గంగయాది
యగు పుణ్యదేశంబు లతిఫలదంబులు; । మాఘ భాద్రపదాఖ్య మాసములు బ
హుళపక్ష మపరాహ్ణ ముగ్మలి! యమవస । ద్వాదశి నవములు పర(గు దుష్టి(
బితృ దేవతల కిచ్చు(; గుతప దౌహిత్ర తి । లలు నితాంత పవిత్రములు పితృక్రి

తే. యలకు; శౌచ మక్రోధ మవ్యగ్రభావ । మర్హములు శుక్లపక్ష పూర్వాహ్ణ యుగ్మ
దివస జన్మదినములు నిందితము లాజ్య । ముద్గ పాయసాపూపముల్ ముఖ్యకోటి. 202

ప్రతిపదార్థం: అనినన్ = గౌరి అడుగగా; ఆ సర్వజ్ఞుడు = సమస్త మెరింగిన శివుడు; ఆ+దేవికిన్ = ఆ గిరిసుతకు; ఇట్లు+అనున్ = ఇట్లా వచించాడు; ఉగ్మలి = చెలీ!; గయ, కురుక్షేత్రంబున్, గంగ; ఆది+అగు = మొదలైన; పుణ్య దేశంబులు = పవిత్రప్రదేశాలు; అతి ఫలదంబులు = మిక్కిలి ఫలాన్నిచ్చే చోట్లు; మాఘ, భాద్రపద+ఆఖ్య+మాసములు = మాఘము, భాద్రపదము అనే పేర్లుగల నెలలూ; బహుళపక్షము = కృష్ణపక్షం (అమావాస్యకు ముందటి పాడ్యమి విదియ మొదలైన పదునాల్గు తిథులు - వెరసి పదిహేను రోజుల కాలం); అపర+అహణము = మధ్యాహ్నమునకు పైబడినకాలం; అమవస= అమావాస్య; ద్వాదశి నవములు = ద్వాదశి, నవమి అనే తిథులు; పర(గు తుష్టిన్ = ఒప్పిదమైన సంతృప్తిని, మిక్కిలి సంతృప్తిని; పితృదేవతలకున్; ఇచ్చున్ = ఇస్తాయి; కుతప = కుతపకాలం అనగా పగలు పదునెన్మిది గడియలకు పైబడిన కాలం; దౌహిత్ర = కూతురు యొక్క కొడుకు; తిలలు = నువ్వులు; నితాంత పవిత్రములు = మిక్కిలి పవిత్రమైనట్టివి; పితృక్రియలకున్ = శ్రాద్ధాది పితృక్రియలకు; శౌచము = పరిశుద్ధత; అక్రోధము = కోపం లేకుండటం అనగా క్రోధరాహిత్యం; అవ్యగ్రభావము = కలత చెందని హృదయం, ఆందోళన చెందకుండుట; అర్హములు = యుక్తములు, తగినట్టివి; శుక్లపక్ష = శుక్లపక్షం; పూర్వ+అహ్న = మధ్యాహ్నమునకు ముందటికాలం; యుగ్మదివస = సరిదినాలు; జన్మదినములు = పుట్టినరోజులు; నిందితములు = తగని రోజులు; ఆజ్య = నేయి; ముద్గ = పెసలు; పాయస = పరమాన్నం; అపూపముల్ = పిండివంటలు; ముఖ్యకోటి = ప్రధానమైన పదార్థాల సమూహం.

తాత్పర్యం: అని అంబిక అడుగగా సర్వవిదుడైన శంభుడు ఆమెతో ఇట్లన్నాడు. సఖీ! గయ, కురుక్షేత్రం, గంగ మున్నగు పవిత్ర ప్రదేశాలు పితృకర్మలకు మిక్కిలి ఫలప్రదాలు. మాఘభాద్రపద మాసాలూ, బహుళపక్షం, అపరాహ్ణ సమయం, అమావాస్య, ద్వాదశి, నవమి అనే తిథులు పితృదేవతలకు మిక్కిలి సంతృప్తినిస్తాయి. కుతపకాలం, దౌహిత్రుడు, నువ్వులు పితృకర్మలకు మిక్కిలి అర్హములు. శ్రాద్ధాదులు జరుపునప్పుడు శుచిత్వం, కోపరాహిత్యం, వ్యాకులపాటు చెందకుండటం ఆవశ్యకాలు. శుక్లపక్షం (పూర్ణిమతో చేరిన పాడ్యమి, విదియ మొదలైన పదునైదు తిథుల కాలం), పూర్వాహ్ణం (మధ్యాహ్నమునకు ముందటి కాలం), సరిదినాలు, పుట్టిన రోజులు పితృకర్మలకు యోగ్యములు కావు. నెయ్యి, పెసరపప్పు, పరమాన్నం, పిండివంటలు (మినుప వడలు, అప్పాలు, నువ్వుల ఉండలు) శ్రాద్ధాదులలో ముఖ్యపదార్థాలు.

విశేషం: పక్షం = పదిహేను రోజుల కాలం. నెలకు రెండు పక్షాలు. మొదటిది శుక్లపక్షం. రెండవది బహుళ పక్షం లేక కృష్ణ పక్షం. పాడ్యమి విదియ తదియ మొదలైన పదునాల్గు తిథుల తర్వాత వచ్చేది పూర్ణిమ లేక పున్నమ. ఇది శుక్ల పక్షం, లేక సిత పక్షం, పాడ్యమి విదియ ఇత్యాది తిథుల తర్వాత వచ్చే అమావాస్యతో కలిపి పదిహేనురోజులు బహుళపక్షం లేక కృష్ణ పక్షం.

హిందూ కాలమాన ప్రకారం రోజుకు 60 గడియలు. గడియకు 60 విగడియలు; గడియ అనగా 24 నిమిషముల కాలం. విగడియ 24 సెకండ్ల సమయం.

కుతపము: పగటిప్రొద్దు పదిహేను భాగాలలో ఎనిమిదవ భాగం కుతపకాలం. ఉదయం 11గం.36 నిమిషాల తర్వాత 48 నిమిషాలు అనగా 12గం.24 నిమిషాల సమయం కుతపకాలం. ఈ కాలం పితరులకు ప్రశస్త పుణ్యాకాలం. ఈ కుతపకాలానికి ముందు పితృదేవతలకు పిండ ప్రదానాదులు చేయరాదు.

క. శ్రోత్రియు లరోగు లవికల । గాత్రులు పాత్రములు పైతృకములకు సచ్చా
రిత్రత్వము ముఖ్యంబు స । గోత్రు మృతకళత్రు నన్యకులుఁ గొన రతివా! 203

ప్రతిపదార్థం: అతివా! = రమణీ!; పైతృకములకున్ = శ్రాద్ధాదులకు, ఆబ్దికాలకు, తద్దినాలకు; శ్రోత్రియులు = వేదం చదివినవారూ; అరోగులు = రోగాలు లేని వాళ్ళూ; అవికలగాత్రులు = అంగవైకల్యం లేని వాళ్ళూ; పాత్రములు = అర్హులు, తగినవారు, యోగ్యులు; సత్+చారిత్రత్వము = మంచినడవడి; ముఖ్యంబు = ప్రధానం, ఆవశ్యకం; సగోత్రున్ = తన గోత్రం వాడినీ, మృతకళత్రున్ = భార్య చనిపోయిన వాడినీ; అన్యకులున్ = ఇతరకులస్థుడినీ; కొనరు = అంగీకరించరు, నిమంత్రించరు.

తాత్పర్యం: దేవీ! శ్రాద్ధాదులందు నిమంత్రించటానికి వేదం చదివినవారూ, రోగాలు లేనివారూ, అంగవైకల్యం కలుగని వారూ అర్హులు. వీరందరూ మంచి నడవడి గలవారై ఉండాలి. తన గోత్రం వాడూ, భార్య మరణించిన వాడూ, ఇతర కులస్థుడూ తద్దినాలలో నిమంత్రణకు పనికిరాడు.

ఆ. గంధపుష్పమాలికా ధూపదీప వ । స్త్రముల నర్చ లిచ్చి తగఁగ భోజ

నములు నిర్వహించి క్రమవృత్తిఁ బిండప్ర । దానవిధి యొనర్చు టేను మెత్తు.' **204**

ప్రతిపదార్థం: గంధ = చందనం; పుష్పమాలికా = పూలదండలు; ధూప = సాంబ్రాణి పొగ; దీప = దీపం; వస్త్రములన్ = క్రొత్త బట్టలు మున్నగు వాటిచేత; అర్చలు+ఇచ్చి = పూజలు చేసి; తగన్+కన్ = చక్కగా, ఒప్పిదంగా; భోజనములు నిర్వహించి = అన్నపానీయాలిచ్చి; క్రమవృత్తిన్ = స్వాములు సంతృప్తిగ భుజించిన మీదట; పిండప్రదాన విధి = పితరులకు పిండాలు పెట్టేపని; ఏను = నేను; మెత్తున్ = శ్లాఘిస్తాను.

తాత్పర్యం: ఆబ్దికంలో నిమంత్రితులైన వారిని గంధం, పూలమాలలు, ధూపం, దీపం, వస్త్రాలు మొదలైన వాటితో పూజించి శ్రద్ధాభక్తులతో వారికి భోజనాలు పెట్టి సంతుష్టులను చెయ్యాలి. ఆ పిదప శాస్త్ర విధి ననుసరించి పితరులకు పిండ ప్రదాన మొసగటం కాత్యాయనీ! నేను ఎంతో మెచ్చుకుంటాను.'

వ. అని యెఱింగించిన మేనకాత్మజ మృడునితో నిట్లనియె. **205**

ప్రతిపదార్థం: అని; ఎఱింగించినన్ = శివుడు చెప్పగా; మేనకా+ఆత్మజ = హిమవంతుడి పత్ని అయిన మేనకాదేవి యొక్క కూతురైన అంబిక; మృడునితోన్ = శివుడితో; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నది.

తాత్పర్యం: శివు డట్లా చెప్పగా విని మేనకాదేవి పుత్రి అయిన ఉమ శంభుడితో ఇట్లా అన్నది.

క. 'మృతిఁ బొంది పునర్జన్మము । నతర్క్యగుణ జంతుకోటి యప్పుడ పొందుం
బితృపూజన మని యెవ్వరి । కితవుగఁ జేయుదురు దీని నెఱిఁగింపు శివా!' **206**

ప్రతిపదార్థం: శివా! = ఈశ్వరా! అతర్క్యగుణ = ఊహించనలవిగాని గుణాలు కలిగిన; జంతుకోటి = ప్రాణిసమూహం; మృతిన్+పొంది = మరణించి; పునః+జన్మము = మరొకపుట్టుక; అప్పుడు+అ = వెంటనే; పొందున్ = పొందుతుంది; (అట్లాంటప్పుడు); పితృపూజనము+అని = పితరులకు పూజ అంటూ; ఎవ్వరికిన్ = మరెవ్వరికి; ఇతవుగన్ = ప్రీతిగా; చేయుదురు? = చేస్తారు?; దీనిన్ = ఈ విషయమును; ఎఱిఁగింపు = నాకు తెల్పవలసినది.

తాత్పర్యం: 'పరమేశ్వరా! ఊహించటానికి అలవిగాని గుణాలుగల ప్రాణికోట్లు తమతమ కర్మఫలాలు అనుభవించటానికి చచ్చి మరల వెంటనే జన్మిస్తున్నాయి. అట్లాంటప్పుడు ఎవరి ప్రీతి కొరకు జనులు పితృపూజ సల్పుతున్నారో అనగా శ్రాద్ధాది కర్మలు నిర్వహిస్తున్నారో నాకు తెల్పండి.'

ఆ. అనుడు నచటనున్న మునిజను లెల్లను । నగతనూజ నాత్మఁ బొగడి యభవుఁ
డిచ్చు నుత్తరంబు నేర్పడ విను వేడ్క । గదురనుండి రపుడు కంసదమన! **207**

ప్రతిపదార్థం: అనుడున్ = అని గౌరి అడుగగా; అచటన్+ఉన్న = అక్కడ వేంచేసి ఉన్నట్టి; మునిజనులు+ఎల్లను = మునీశ్వరులందరూ; అగతనూజన్ = పర్వతపుత్రిని; (అగము, నగము = కొండ); పొగడి = కొనియాడి; అభవుఁడు = శంకరుడు; ఇచ్చు+ఉత్తరంబున్ = చెప్పునట్టి ప్రతివచనాన్ని; ఏర్పడన్ = విశదంగా; వినువేడ్క = ఆలకించవలెననే కోరిక; అపుడు = ఆ సమయాన; కదురన్ = కలుగగా; కంసదమన! = కంసు నణంచిన శ్రీకృష్ణా!; ఉండిరి = వేచి ఉన్నారు,

ఎదురుచూస్తున్నారు.'

తాత్పర్యం: అని గౌరీదేవి అడుగగా, అక్కడున్న మునీశ్వరులంతా గిరిపుత్రిని ప్రశంసించి 'శంకరుడు ఆమె మాటల కేమి బదులిస్తాడో వినవలెనన్న కుతూహలంతో ఉన్నారు శ్రీకృష్ణా! (అని నారదుడు వాసుదేవుడితో అన్నాడు).

సీ. **అంబిక కిట్లను హరుఁడు 'సందేహింపఁ । దగునది యిది గుహ్యతమము వినుము**
దివిజు లట్టుల పితృదేవతలును; దేవ । బృంద ముత్తరదిశఁ బితృచయంబు
దక్షిణ దిశ నుండుఁ; దత్పూజనంబులు । వరుసన హవ్యకవ్యంబు లండ్రు;
చచ్చినవారికి శ్రాద్ధంబు సేయఁగా । నా పితృ సంఘంబు హర్ష మొంది

తే. **యాయువును శ్రీయుఁ గీర్తియు నాదియైన । యైహికంబులు సుగతియు నాదరమునఁ**
గర్త కొసఁగు సురాసుర గరుడ యక్ష । తతులకును బూజనీయంబు పితృగణంబు.' **208**

ప్రతిపదార్థం: హరుఁడు = శంభుడు; అంబికకున్ = ఆ మహాదేవికి; ఇట్లు+అనున్ = ఇట్లన్నాడు; ఇది = ఇపుడు నీవు నన్నడిగిన విషయం; సందేహింపన్+తగునది = సంశయింపదగినదే. ఇది = ఈ సంగతి; గుహ్యతమము = పరమ రహస్యమైనది. వినుము = చెప్పుతాను ఆలకించుము; పితృదేవతలును = పితృదేవతలు కూడ; దివిజుల+అట్టులు+అ = దేవతల వంటివారే; దేవబృందము = వేల్పులసమూహం; ఉత్తరదిశన్ = ఉత్తరపుదిక్కులో; పితృచయంబు = పితృదేవతలగుంపు; దక్షిణదిశన్+ఉండున్ = దక్షిణపుదిక్కులో ఉంటుంది; తత్+పూజనంబులు = దేవతలయొక్క, పితృదేవతల యొక్క అర్చనలు; వరుసన్+అ = వరుసగా; హవ్యకవ్యంబులు+అండ్రు = హవ్యము, కవ్యము అని అంటారు; చచ్చినవారికిన్ = మరణించిన వారికి; శ్రాద్ధంబు చేయన్+కాన్ = తద్దినం పెడితే; ఆ పితృసంఘంబు = ఆ పితృదేవతల యొక్క సమాజం; హర్షము+ఒంది = సంతోషం పొంది; ఆయువును = ఆయుష్యమూ; శ్రీయున్ = సంపదనూ; కీర్తియున్+ఆది+ఐన = యశస్సూ మొదలైన; ఐహికంబులు = ఇహలోక సుఖాలు; సుగతియున్ = సద్గతినీ, పరలోకమునూ; ఆదరమునన్ = అభిలాషతో, ప్రీతితో; కర్తకున్ = యజమానుడికి; ఒసఁగున్ = అనుగ్రహిస్తారు; పితృగణంబు = పితృదేవతల యొక్క సముదాయం; సుర+అసుర = దేవదానవుల యొక్క; గరుడ = గరుడుల యొక్క, యక్ష = యక్షులయొక్క; తతులకునున్ = సమూహాలకునూ; పూజనీయంబు = పూజించదగినది.

తాత్పర్యం: పరమేశ్వరుడు పార్వతితో ఇట్లా అన్నాడు. 'సతీ! నీ వడిగిన విషయం నిజంగా సందేహాస్పదమైనదే. ఇది అతిరహస్య విషయం. చెప్పుతాను వినుము. పితృదేవతలు కూడ దేవతలవంటి వారే. దేవతలు ఉత్తరపు దిక్కులో ఉంటారు. పితృదేవతలు దక్షిణ దిశలో ఉంటారు. దేవతా పూజనానికి హవ్యమని, పితృదేవతా పూజకు కవ్యమని పేళ్ళు. చనిపోయిన వారికి శ్రాద్ధం పెట్టినట్లయితే పితృదేవతా సమాజాలు సంతోషపడి ఆ యజమానుడికి చిరాయుష్యం, ఐశ్వర్యం, యశస్సు మొదలైన ఇహలోక సుఖాలు ప్రసాదిస్తారు. ఆదరంతో సద్గతులు కూడా కలిగిస్తారు. పితృదేవతా సమూహం దేవ దానవ గరుడ యక్ష సమూహానికి గూడ పూజింప దగినవారే సుమా!'

వ. **అని నిర్దేశించి వెండియు.** **209**

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ (ఇట్లా అన్నాడు)

క. **'తమ తమ సారములకుఁ దగఁ । గమలాక్షీ! చేయుదాన కల్పనల విశే**
షము లొక్క రూపయగుఁ ద । త్ప్రమాణ రూపణము చేసి పలికెదఁ దెలియన్. **210**

ప్రతిపదార్థం: కమల+అక్షీ! = పద్మాలవంటి లోచనములు కలదానా!; తమ తమ సారములకున్ = తమ తమ శక్తులకు, యోగ్యతలకు; తగన్ = అర్హమైనట్లు, తగినట్లు; చేయు = సల్పునట్టి; దాన కల్పనల విశేషములు = దాన రచనయందలి విశేషాలు; ఒక్క రూపు+అ+అగున్ = ఫలప్రదాన విషయంలో సమానములై ఉన్నవి; తత్+ప్రమాణ రూపణముచేసి = ఆయాదానముల యొక్క పరిమితులను బట్టి యథార్థస్థితి ఎట్లాంటిదో నిర్వచించి; తెలియన్+పలికెదన్ = నీకు తెలిసేటట్లు చెప్పుతాను.

తాత్పర్యం: "తామరరేకులవంటి నేత్రములుగల పార్వతీ! తమతమ శక్తికి తగినట్లు చేసే దానవిశేషాలన్నీ సమానంగానే ఉంటాయి. ఆయాదానాల, వాటి ఫలితాల ప్రమాణాలను నిర్వచించి తెలిసేట్లు చెప్తాను."

క. **విను మొక కుంచెడు ధాన్యము । తన కాయతి గల్గు నతఁడు దాని నొసఁగినన్**
ధనకోటి గల్గువాఁ డ । ద్ధన మొసఁగిన నొక్కరూప తత్తత్ఫలముల్. **211**

ప్రతిపదార్థం: వినుము = పార్వతీ! ఆలకించుము; తనకున్ = తనకు; ఒక కుంచెడు ధాన్యము = నాలుగుమానికలు లేదా నాలుగు ముంతల గింజలు; ఆయతి = ఆదాయం, రాబడి; కల్గు+అతఁడు = కలిగినట్టి వాడు; దానిన్ = ఆ నాలుగు ముంతల గింజలను; ఒసఁగినన్ = ఒకడికి దానం చేసినా; ధనకోటి = కోటి రొక్కం, కోటిరూపాయలు; కల్గువాఁడు = ఉన్నవాడు; ఆ+ధనము = ఆ ద్రవ్యమంతా; ఒసఁగినన్ = సమర్పణ చేసినా; తత్+తత్+ఫలముల్ = ఆ నాల్గుముంతలు గింజ లిచ్చిన వాడికీ, ఈ కోటిరూపాయల విత్తం ఇచ్చిన వాడికీ లభించే ఫలాలు; ఒక్క రూపు+అ = సరి సమానాలే సుమా!

తాత్పర్యం:. గౌరీ! వినుము. కుంచెడు ధాన్యం రాబడి గలవాడు ఆ కుంచెడు గింజలు దానమొనర్చినా, కోటికి పడగెత్తినవాడు ఆ కోటి రూపాయలు దానమిచ్చినా కలిగే ఫలం మాత్రం సమానమే. దాన పరిమాణమును బట్టి ఫలపరిమాణ ముండదు. శక్తి ననుసరించి చేసే దానాలు దాతకు సమాన ఫలితాలిస్తాయని తాత్పర్యం.

క. **పరుషత్వము లే కంతః । కరణంబున శుద్ధి చాలఁ గలిగి ప్రియము పొం**
పిరివోవఁ జేఁత దానము । పరమోత్కృష్టంబు పద్మపత్రనిభాక్షీ!' **212**

ప్రతిపదార్థం: పద్మపత్రనిభ+అక్షీ! = తామరరేకులతో సమానములైన కన్నులు కలదానా!; పరుషత్వము లేక = కాఠిన్యం లేక; అంతఃకరణంబున శుద్ధి = మనస్సునందు పరిశుద్ధత, నైర్మల్యం; చాలన్ = మిక్కిలి; కలిగి = ఉండి; ప్రియము = ఇష్టం, సంతోషం; పొంపిరి+పోవన్ = అతిశయించగా; దానము చేఁత = దాన మొనర్చుట; పరమ+ఉత్కృష్టము = మిక్కిలి ఉత్తమం.

తాత్పర్యం: కమల పత్రాలవంటి కన్నులు కలదానా! కాఠిన్యం లేకుండా మిక్కిలి చిత్తశుద్ధితో సంతోష పూర్వకంగా చేసే దానం అత్యుత్తమం.'

క. **అని చెప్పి 'కొన్ని ధర్మము । లనఘా! యెఱిఁగింతు నీకు నవధానముతో**
విను' మని పలికి శివుం డి । ట్లను విశదము గాఁగఁ గూర్చి యంబుజనాభా! **213**

ప్రతిపదార్థం: అని చెప్పి = అని వచించి; శివుండు = పరమేశ్వరుడు; అనఘా! = ఓ దోషరహితురాలా, పుణ్యాత్మురాలా, గౌరీ!; కొన్ని ధర్మములు = మరికొన్ని ధార్మిక విషయాలు; నీకున్ = నీకు; ఎఱిఁగింతున్ = తెలుపుతాను; అవధానముతోన్ = ఏకాగ్రతతో, శ్రద్ధతో; వినుము; అని పలికి; విశదము కాఁగన్ = తేటతెల్లమయ్యేటట్లు, స్పష్టమయ్యేటట్లు; కూర్చి = ఆ ధర్మముల నుద్దేశించి, గురించి; ఇట్లు+అనున్ = ఇట్లా అన్నాడు; కమలనాభా! = పద్మము నాభియందుగల శ్రీకృష్ణా!

తాత్పర్యం: అని వచించి పరమేశ్వరుడు శాంభవితో 'ఓ పుణ్యురాలా! నీకు మరికొన్ని ధర్మాలు తెలియజెప్పుతాను. ఏకాగ్రచిత్తంతో ఆలకించు'మంటూ విస్పష్టంగా చెప్పినాడు శ్రీకృష్ణా! (అని నారదుడు శ్రీకృష్ణుడిని సంబోధించి ఈశ్వరుడు గౌరికి చెప్పిన ధర్మాలు తెలిపాడు).

చ. 'తెవులుకులు గొన్నవారి కవి దీఱుట కౌషధ మీగి, దుర్గతుల్
దవులు జనాలిఁ బ్రోపు, సుపథంబుగఁ దైర్థిక కోటిఁ దన్పు, బాం
ధవ రహితత్వ దీనశవ దాహము, దుఃఖితులైన వారిఁ దే
ర్ప వెరవు, నోర్పుఁ గల్మియును బ్రస్తుతి కెక్కిన మేటి ధర్మముల్.' 214

ప్రతిపదార్థం: తెవుళులు+కొన్నవారికిన్ = జబ్బుపడినవాళ్ళకు; అవి+తీఱుటకున్ = ఆ రోగాలు కుదరటానికి, మానడానికి; ఔషధము+ఈఁగి = మందునివ్వటం; దుర్గతుల్+తవులు = దుఃస్థితిలో ఉన్న, కష్టాల పాలైన, కడగండ్లలో చిక్కిన; జన+ఆలిన్ = జనుల యొక్క సమూహాన్ని; ప్రోపు = కాపాడటం, సంరక్షించటం; సుపథంబుగన్ = మంచిదారిగా; తైర్థిక కోటిన్ = తీర్థయాత్రా పరుల బృందాన్ని; తన్పు = తృప్తి నొందించటం; బాంధవరహితత్వ = చుట్టాలు లేనందున; దీన = దిక్కుమాలినట్టి, అనాథగానున్న; శవదాహమున్ = పీనుగును కాల్చటం; దుఃఖితులు+ఐనవారిన్ = దుఃఖము పొందుతున్నవాళ్ళను; తేర్పన్ = ఓదార్చుటకు; వెరవున్ = ఉపాయం; ఓర్పు+కల్మియున్ = సహనం కలిగి ఉండటం; ప్రస్తుతికిన్+ఎక్కిన = పొగడ్తగాంచిన; మేటిధర్మముల్ = గొప్పధర్మాలు, ఉత్తమధర్మాలు.

తాత్పర్యం: 'వ్యాధులతో బాధపడేవారికి ఆ రోగాలు మానటానికి మందులివ్వటం, దుఃస్థితిలో ఉన్నవాళ్ళను ఆదుకొనటం, తీర్థయాత్రాపరులను మంచిమార్గంలో సంతృప్తి పరచటం (అన్నపానములిచ్చి, ఆశ్రయం సమకూర్చి), చుట్టపక్కాలు లేనట్టి అనాథప్రేతకు దహనక్రియ జరపటం, దుఃఖాలపాలైన వారిని ఆ దుఃఖాల నుండి ఉద్ధరించే ఉపాయం ఆలోచించటం, ఓర్పు కలిగి ఉండటం గణన కెక్కిన ఉత్తమ ధర్మాలు.'

వ. అని పలికినఁ బార్వతీదేవి పరమప్రియంబు నొంది. 215

తాత్పర్యం: అని శివుడు చెప్పగా ఉమాదేవి మిక్కిలి సంతోషపడి.

శివుఁడు పార్వతికి ధర్మవిశేషంబుల తెఱం గెఱిఁగించుట. (సం.13. అను 1-16-3630).

సీ. 'ధర్మంబు నానావిధంబులఁ బరఁగు నం; । ద్రవి యెఱిఁగింపవే యనుడు హరుఁడు
'వితతంబులగు శ్రుతి స్మృతులచేఁ జెప్పఁగాఁ । బడిన తెఱంగులు పడఁతి! వినుము

జాతి ధర్మములు, దేశజ ధర్మములుఁ, గుల । ధర్మంబులును, గణ ధర్మములును,
గాయంబు వికృతులఁ గాలపర్యయముల । వచ్చు నాపద్ధర్మ వర్తనములు

ఆ. గాఁగ నిట్లు ధర్మగతు లైదు గల వని । చెప్పుటయును గౌరి శివునితోడఁ
'బుణ్యలోక కలిత భోగంబు లెట్లుండు?' । ననిన నిట్టు లనియె హరుఁడు గృష్ణ! 216

ప్రతిపదార్థం: ధర్మంబు = ఇహపర సుఖాలు కలిగించటానికి కారణమైన ధర్మం; నానా విధంబులన్ = అనేకరీతుల; పరఁగున్+అంద్రు = ఒప్పుతుందని చెప్పుతారు; అవి = ఆ ధర్మాలను; ఎఱిఁగింపవు+ఏ = తెలుపుమా; అనుడున్ = అని గిరిజ వేడగా; హరుఁడు = శంకరుడు; వితతంబులు+అగు = విస్తారములైన, విరివి అయిన; శ్రుతి స్మృతులచేన్ = వేదాల చేతనూ, ధర్మశాస్త్రాలచేతనూ; చెప్పన్+కాన్+పడిన = చెప్పబడినట్టి; తెఱంగులు = విధములు; పడఁతి! = ఓ ప్రాణేశ్వరీ, ఓ తరుణీ!; వినుము = ఆలించుము; జాతిధర్మములున్ = బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే జాతుల యొక్క ఆచారాలు; దేశజ ధర్మములున్ = ఆయాదేశములందు కలిగిన, పాటించునట్టి ధర్మాలు; కులధర్మంబులును = ఆయాఇండ్లవారికి తండ్రి తాత ముత్తాతల నుండి వాడుక పడిన ధర్మాలు; గణధర్మములును = జనసముదాయం అనుసరించే సామాన్యధర్మాలు; కాయంబు వికృతులన్ = శరీరము యొక్క మార్పులచేతను (బాల్య యౌవన కౌమార వార్ధక్య లక్షణాల చేత); కాలపర్యయములన్ = కాలము యొక్క మార్పులచేతను; వచ్చు = సంభవించు, కలుగునట్టి; ఆపత్+ ధర్మవర్తనములు = విపత్కాలంలో అనుసరణీయాలైన ధర్మాలు; కాఁగన్ = అనగా; ఇట్లు = ఈ ప్రకారం; ధర్మగతులు = ధర్మము యొక్క తీరులు; ఐదు కలవు = ఐదున్నవి; అని, చెప్పుటయును = పరమశివుడు నుడువగా; గౌరి; శివునితోడన్ = శంకరుడితో; పుణ్యలోకకలితభోగంబులు = ఉత్తమ లోకాలందలి సుఖాలు; ఎట్లు+ఉండున్+అనినన్ = ఎట్లా ఉంటాయని అడుగగా; హరుఁడు = ఈశ్వరుడు; ఇట్టులు+అనియెన్+కృష్ణ! = శ్రీకృష్ణా! ఇట్లా అన్నాడు. (అని నారదుడు దేవకీనందనుడితో నుడివాడు).

తాత్పర్యం: 'ప్రాణేశ్వరా! ధర్మం పలువిధాలుగా ఉంటుందని అంటారు. ఆ ధర్మస్వరూపం ఎట్లాంటిదో నాకు వివరిస్తారా' అని పార్వతి వేడగా పరమేశ్వరుడు 'దేవీ! విరివిగా ఉన్న వేదాలలో, ధర్మశాస్త్రాలలో ధర్మస్వరూపం వ్యాఖ్యానించబడింది. విశదీకరిస్తాను. వినుము. బ్రాహ్మణక్షత్రియవైశ్య శూద్రులనే నాలుగు వర్ణాలవారు అనుసరించే ధర్మమూ, ఆయాదేశాలలో పాటించబడే ధర్మమూ, ఒకే జాతివారైనా వేర్వేరు ఇండ్లవారు తమ తండ్రి తాత ముత్తాతల నుంచి వాడుక చొప్పున అనుష్ఠించే ధర్మమూ (కులధర్మం), మంది అనుసరించే సామాన్య ధర్మమూ, శరీరస్థితిని బట్టి, కాలము యొక్క మార్పులను బట్టి అవలంబించే ఆపద్ధర్మమూ అని ధర్మం ఐదు విధాలు అని పినాకపాణి వచించాడు. ఆ మాటలు విని శర్వాణి శర్వుడితో 'ప్రభూ! పుణ్యాజగాలలో సుఖానుభవాలు ఎట్లా ఉంటాయి?' అని అడిగింది. అందుకు అభవుడు ఇట్లా అంటున్నాడు కృష్ణా! (అని నారద మహర్షి మహేశ్వరుడు గౌరితో అన్నమాటలు వినిపించాడు).

సీ. 'ఎల్లపుష్పంబులు నెక్కాలమును దద్ద । విలసిల్లుఁ; గల్పక వృక్షజనిత
మనులేప; మాహార మమృత; మంబరములు । నిత్యామలినములు; నిరుపమాన
భంగి దీప్తంబు లాభరణముల్; వాన ర । మించుచు నన్యోన్యమిత్రభావ
మొప్పంగ మేనుల యొప్పును మనముల । మార్దవంబును గుణమాన్యతలును

తే. గలిగి పురుషులుఁ గాంతలుఁ గామహర్ష । లీల లెసఁగఁ గ్రోధాదులు లేక రుజయు
జరయు నెఱుఁగక నలిఁ జరింతురు దివంబు । నందు సంతత నిర్భరానంద మొంద.' 217

ప్రతిపదార్థం: ఎల్లపుష్పంబులున్ = సమస్తములైన పువ్వులు; ఏ+కాలమును = అన్ని కాలములందును, పన్నెండు మాసాలలోనూ, ఆరు ఋతువులలోనూ; తద్ద = మిక్కిలి; విలసిల్లున్ = ప్రకాశిస్తాయి; కల్పకవృక్షజనితము = కల్పతరువుల నుండి కలిగినట్టిది (నిర్యాసం, జిగురు, బంక); అనులేపము = (మైపూత) ఒడలికి పూసికొనే పరిమళ ద్రవ్యం; ఆహారము = తినేతిండి; అమృతము = సుధ; అంబరములు = కట్టుకునే బట్టలు; నిత్య+అమలినములు = ఎల్లప్పుడూ మురికి లేనటువంటివి; ఆభరణముల్ = ధరించే నగలు, సొమ్ములు, రవణములు; నిర్+ఉపమానభంగిన్ = పోలికలేని విధంగా, సాటిలేనట్లుగా; దీప్తంబులు = ప్రకాశించునట్టివి; వానన్ = మీద నుడివిన వాటితో; రమించుచున్ = ఆనందిస్తూ; అన్యోన్యమిత్రభావము = పరస్పరస్నేహం; ఒప్పంగన్ = విలసిల్లగా; మేనుల = శరీరాల యొక్క; ఒప్పును = చక్కదనమూ, సౌందర్యమూ; మనముల మార్దవంబును = హృదయాల యొక్క మెత్తదనమూ; గుణమాన్యతలును = సద్గుణాలయొక్క యోగ్యతలూ; కలిగి = లభించిన వారై; పురుషులున్ = మగవారూ; కాంతలున్ = ఆడువారు; కామహర్షలీలలు+ఎసఁగన్ = కోర్కెలు తీరినందున ఆనంద విలాసాలొప్పగా; క్రోధ+ఆదులు లేక = కోపం మొదలైన దుర్గుణాలు కలుగక; రుజయున్ = రోగమూ; జరయున్ = ముసలితనమూ; ఎఱుఁగక = తెలియక; నలిన్ = ప్రేమతో, అనురాగంతో; దివంబు+అందున్ = స్వర్గంలో; సంతత = ఎడతెగని; నిర్భర+ఆనందము+ఒందన్ = అపరిమితమైన హర్షం కలుగగా; చరింతురు = వర్తిస్తారు, సంచరిస్తారు.

తాత్పర్యం: 'స్వర్గలోకంలో అన్నిరకాల పువ్వులు అన్ని కాలాలలో ప్రకాశిస్తుంటాయి. అక్కడ మగవారూ, ఆడువారూ కల్పతరువుల నుండి లభించే పరిమళద్రవ్యం తమశరీరాలకు పూసికొంటారు. అమృతమే వారికి ఆహారం. ఎప్పుడూ మాయని ఉడుపులు తాలుస్తారు. సాటిలేక వెలుగొందే సొమ్ములు ధరిస్తారు. పరస్పర మైత్రితో, మేని అందచందాలతో, మనసుల మెత్తందనాలతో, సద్గుణాలయోగ్యతలతో వారు ఒప్పారుతుంటారు. యథేచ్ఛగా సుఖాలలో తేలుతుంటారు. వారికి క్రోధాది దుర్గుణాలు లేవు. రోగాలు లేవు; ముసలితనం లేదు. వారు నిత్యయౌవనమూర్తులు. ఎల్లప్పుడు పట్టరానంత ఆనంద పారవశ్యంతో వారు స్వర్గంలో హాయిగా విహరిస్తుంటారు.'

వ. అనిన విని హైమవతి 'సుగతి దుర్గతులకుఁ జనం గలవారిం జూచి వీ రిట్టివారని నిశ్చయింపవచ్చుట రామి యెఱింగింపు' మనవుడు మృడుండు విను మని యిట్లనియె. 218

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శంభుడు చెప్పగా ఆలకించి; హైమవతి = హిమవంతుడి పుత్రిక పార్వతి; సుగతి దుర్గతులకున్ = స్వర్గనరకాలకు; చనన్+కలవారిన్ = పోదగిన వాళ్ళను, చూచి = కనుగొని; వీరు+ఇట్టివారు+అని = వీళ్ళు ఇట్లాంటి వాళ్ళని; నిశ్చయింపన్ = నిర్ణయించుటకు; వచ్చుట; రామి = సాధ్యాసాధ్యములు, శక్యాశక్యములు; ఎఱింగింపుము = తెల్పుము; అనవుడున్ = అని అడుగగా; మృడుండు = ఈశ్వరుడు; వినుము; అని ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శివుడు చెప్పగా పార్వతి 'స్వర్గనరకాలకు పొయ్యేవాళ్ళు వీళ్ళని జనాలను చూచి నిర్ణయించటం శక్యమగునా? కాదా? చెప్పు' మని అడిగింది. అందుకు ఆయన ఇట్లా అన్నాడు.

చ. 'జనులకుఁ గీడు రోయక యజస్రము ధర్మరతిం జరించి స
జ్జన గురు పూజనంబులును సత్యహితోక్తులు దీనపోషణం
బును నతిథిప్రియత్వమును భూరిదయార్ద్రతయుం గలట్టి వా
రనిమిషలోకగాములని యాత్మ నెఱుంగుము మేనకాత్మజా! 219

ప్రతిపదార్థం: మేనకా+ఆత్మజా! = మేనకాదేవి కుమారీ!; జనులకున్ = నరులకు; కీడు+రోయక = హాని తలపెట్టక, అపకృతిగావించక; అజస్రము = ఎల్లప్పుడు; ధర్మరతిన్ = ధర్మమందలి ఆసక్తితో, ప్రీతితో; చరించి = మెలగి; సత్+జన = సత్పురుషుల యొక్క; గురు = ఒజ్జల యొక్క; పూజనంబులును = పూజించుటలు; సత్యహిత+ఉక్తులు = యథార్థమైనవీ, మేలుగలిగించేవి అయినట్టి మాటలు; దీనపోషణంబును = దరిద్రులను వృద్ధికి తెచ్చుట; అతిథి ప్రియత్వమును = అతిథుల యందు ఆదరణము; భూరిదయా+ఆర్ద్రతయున్ = మిక్కుటమైన దయారసం చేత తడియుటయు; కల+అట్టివారు = కలిగినటువంటి జనులు; అనిమిషలోకగాములు+అని = స్వర్గలోకానికి వెళ్ళేవారని; ఆత్మన్ = మదిలో; ఎఱుంగుము = తెలియుము.

తాత్పర్యం: 'ఓ మేనకాదేవి తనయా! మనుష్యులకు అపకారం తలపెట్టని వారూ, ఎల్లవేళల ధర్మమందే ఆసక్తిగలవారూ, సత్పురుషులనూ గురువులనూ పూజించే వారూ, సత్యముగనూ, హితముగనూ మాట్లాడేవారూ, పేదలను పోషించేవారూ, అతిథులను ఆదరించేవారూ, అధిక కరుణా రసముచే చెమ్మగిల్లిన హృదయం కలవారూ అయిన నరులు స్వర్గలోకానికి వెళ్ళేవారని గ్రహించుము.

చ. పరుసని పల్కు బొంకులగు పల్కులు నన్యధనాభిలాషముం
బరవనితా విలోలతయు బాంధవ సజ్జన విప్రియంబు దు
శ్చరితులతోడిమైత్రియును సంతత ధర్మరతాభ్యసూయయుం
గరినిభయాన! ఘోరనరకంబున కేఁగెడి వారి చిహ్నముల్.' 220

ప్రతిపదార్థం: కరినిభయాన! = ఏనుగు నడకతో సమానమైన నడక గలదానా!; పరుసనిపల్కు = కఠినపు వాక్కు; బొంకులు+అగుపల్కులు = అబద్ధపు మాటలు; అన్యధన+అభిలాషమున్ = ఇతరుల విత్తమునందు కోరిక; పరవనితా విలోలతయున్ = పరాయిస్త్రీ యందు మిక్కిలి ఆశ; బాంధవ = చుట్టాలయందు; సత్+జన = సత్పురుషుల యందు; విప్రియంబు = ఇష్టం లేకుండటం; దుస్+చరితుల తోడి మైత్రియును = చెడు నడవడి గలవారితో చెలిమి; సంతత ధర్మరత = ఎల్లప్పుడు ధర్మమునందు ఆసక్తి గలవారియందు; అభ్యసూయయున్ = మిక్కిలి దోషారోపణబుద్ధి లేదా కోపం, (అనేవి); ఘోర = భయంకరమైన; నరకంబునకున్ = నరకలోకానికి; ఏగెడి వారిచిహ్నముల్ = వెళ్ళేవారి యొక్క గుర్తులు, లక్షణాలు.

తాత్పర్యం: గజగమనంవంటి గమనం గల శైలజా! కఠినంగా మాట్లాడటం, అబద్ధాలు చెప్పటం, పరులధనాన్ని అపేక్షించటం, పరస్త్రీలను వాంఛించటం, బంధువులయందు, సత్పురుషులయందు ద్వేషం వహించటం, చెడునడవడిగల వారితో స్నేహం చెయ్యటం, ధర్మమందు శ్రద్ధగలవారియెడల అసూయవహించటం అనేవి భయంకర నరకం పాలయ్యే వారి లక్షణాలు, గుర్తులు.'

క. అని చెప్పిన విని హిమగిరి । తనయ వృషధ్వజుని తోడ 'ధర్మంబులు పె
క్కనుపమమూర్తీ! పరమం । బనఁ జాలెడు ధర్మ మెద్ది యన్నిటిలోనన్. 221

ప్రతిపదార్థం: అని చెప్పినన్ = అని శివుడు నుడువగా; విని; హిమగిరితనయ = హిమవత్పర్వత పుత్రిక; వృషధ్వజుని తోడన్ = శివుడితో; అనుపమమూర్తీ! = సాటిలేని స్వరూపము గలవాడా!; ధర్మంబులు = ధర్మాలు; పెక్కు = అనేకం; పరమంబు+అనన్ +చాలెడు = శ్రేష్ఠము అని చెప్పడానికి తగిన; ధర్మము = అభ్యుదయ శ్రేయస్సాధనమైన కృత్యం; అన్నిటిలోనన్ = అన్నింటిలో; ఎద్ది? = ఏది?

తాత్పర్యం: అని పరమశివుడు పలుకగా విని పరమేశ్వరి ఆ వృషభకేతనుడితో 'సాటిలేని స్వరూపంగల స్వామీ! ధర్మాలు ఎన్నో ఉన్నాయి. అన్నింటిలో ఉత్తమోత్తమమైన ధర్మం ఏది?

వ. చెప్పు మనిన న ప్పరమేశ్వరుం డిట్లనియె. 222

తాత్పర్యం: తెలుపుమని అడుగగా సర్వేశ్వరు డిట్లా అన్నాడు.

క. 'రమణీ! వర్గత్రయ ధ । ర్మము లిచ్చు సుఖములు దుఃఖమయము లచిరముల్
గమనాగమకరములు ని । త్యమహాసౌఖ్యంబు మోక్షధర్మం బిచ్చున్. 223

ప్రతిపదార్థం: రమణీ! = సుందరీ!; వర్గత్రయధర్మములు = ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాల వలన లభించే పుణ్యాలు; ఇచ్చు సుఖములు = ఇచ్చునట్టి సౌఖ్యాలు; దుఃఖమయములు = దుఃఖరూపాలు; అచిరముల్ = శాశ్వతములు కానివి; గమన+ఆగమ+కరములు = రాకపోకలను కలుగజేసేవి; మోక్షధర్మంబు = చతుర్విధ పురుషార్థాలలో నాల్గవదైన మోక్షధర్మం; నిత్యమహా సౌఖ్యంబున్ = శాశ్వతమైన గొప్ప సుఖాన్ని; ఇచ్చున్ = ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: 'గౌరీ! ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలవలన లభించే సుఖాలు చివరకు దుఃఖ మయాలు, అశాశ్వతాలు. వస్తూ పోతూ ఉంటాయే కాని నిలుకడగా ఉండేవి కావు. నాల్గవపురుషార్థమైన మోక్షధర్మం మాత్రం శాశ్వతమైన మహానందాన్ని ప్రసాదిస్తుంది.

విశేషం: వర్గత్రయం-త్రివర్గం. అనగా ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలు. మోక్షం నాల్గవ పురుషార్థం. సాధించదగినది అదే. శబ్దస్పర్శరూపరసగంధాలనే విషయాలతో త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములనే జ్ఞానేంద్రియ పంచకానికి కల సంబంధములే మాత్రా స్పర్శలు. ఇవి సుఖదుఃఖాది ద్వంద్వాలను కలుగజేస్తాయి. సుఖదుఃఖాదు లన్నీ వస్తూ పోతూ ఉండేవే తప్ప శాశ్వతంగా ఉండేవి కావు. అట్టి ద్వంద్వాలను సహించుమని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు.

"మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః,
ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత." (భగ. 2-14) అని.

సీ. కావున విను త్రివర్గంబుకంటెను మేలు । దలపోయ మోక్షంబు; దానిఁ బడయు
తెఱఁ గెఱింగించెదఁ దెఱవ! గృహస్థ ధ । ర్మంబున నిల్చి ఋణంబు లెల్లఁ

బాచి వనమునకుఁ బరమశాంతత నేఁగి । సద్గురుముఖమున సాంఖ్యయోగ
విదుఁ డగునది; పంచవింశతి జ్ఞానంబు । సాంఖ్యంబు, ధర్మనిశ్చలత యోగ;

తే. మాసమాచారయుగళ మేకాధి కరణ । మస్ఖలితముగ మది నది యలవరించి
ధ్యానపరుఁ డయి శీతోష్ణ హర్ష శోక । ముఖములగు వివిధ ద్వంద్వములఁ దొఱంగి. 224

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; త్రివర్గంబుకంటెను = ధర్మార్థకామముల కంటె; తలపోయన్ = ఆలోచించగా; మోక్షంబు = నాల్గవ పురుషార్థమైన ముక్తి; మేలు = ఉత్తమం; దానిన్ = ఆ మోక్షాన్ని; పడయు తెఱఁగు = పొందేవిధం; ఎఱింగించెదన్ = తెలుపుతాను; తెఱవ! = ఓ కాంతా!; విను = ఆకర్ణించుము; గృహస్థధర్మంబునన్+నిల్చి = గృహస్థాశ్రమ ధర్మం అవలంబించి; ఋణంబులు+ఎల్లన్ = దేవ ఋణము, పితృ ఋణము, ఋషి ఋణము అనే మూడింటితో పాటు నాల్గవదైన మనుష్య ఋణమును; పాచి = తొలగించి; వనమునకున్ = అడవికి; పరమశాంతతన్ = మిక్కిలి నెమ్మదితో; ఏఁగి = వెళ్ళి; సద్+గురుముఖమునన్ = మంచి ఆచార్యుడి వలన; సాంఖ్యయోగ విదుఁడు = సాంఖ్యయోగం ఎరిగినవాడు; అగునది = కావాలి; పంచవింశతి జ్ఞానంబు = ఇరువదైదుతత్త్వాల యెఱుక; సాంఖ్యంబు = సాంఖ్యమని చెప్పబడుతున్నది; ధర్మనిశ్చలత = ధర్మమందు చలించకుండుట లేదా నిలుకడ; యోగము = యోగమని పిలువబడుతున్నది; ఆ సమాచారయుగళము = సాంఖ్యయోగము, కర్మయోగము అనేవి రెండు; ఏక+అధికరణము = ఒకే ఆధారముగా గలవి; అది = దానిని, మదిన్ = మనస్సులో; అలవరించి = అభ్యసించి, సమకూర్చి; ధ్యానపరుఁడు+అయి = ధ్యానమందు ఆసక్తి కలవాడై; శీత+ఉష్ణ, హర్షశోకముఖములు+అగు = శీతోష్ణములు, సుఖదుఃఖాలు మున్నగు; వివిధ ద్వంద్వములన్ = పలురకాలైన ద్వంద్వాలను, తొఱంగి = వీడి, విడిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: గౌరీ! ధర్మార్థకామములనే మూడు పురుషార్థముల కంటె ఆలోచించగా నాల్గవ పురుషార్థమైన మోక్షమే శ్రేష్ఠమైనది. దానిని పొందే విధం వివరిస్తాను వినుము. మానవుడు గార్హస్థ్యం స్వీకరించి దేవఋణాన్ని యజ్ఞయాగాదుల చేతనూ, ఋషిఋణాన్ని వేదపాఠం చేతనూ, పితృఋణాన్ని శ్రాద్ధతర్పణాదుల చేతనూ, మనుష్యఋణాన్ని ఆతిథ్యం చేతనూ తీర్చి, పరమశాంతుడై అరణ్యాలకు వెళ్ళవలె. యోగ్యుడగు గురువువలన సాంఖ్యయోగాన్ని గురించి తెలిసికొనవలె. సాంఖ్యయోగమంటే ఇరువదైదుతత్త్వముల ఎరుకయే. ధర్మమందు చలించక నిలవడమే యోగమని చెప్పబడుతుంది. సాంఖ్యమూ, యోగమూ ఇవి రెండున్నూ ఏకాశ్రయాలే. మనసులో ఈ రెంటినీ జారుపాటు లేకుండా నిలుపుకొని ధ్యానపరుడయి శీతోష్ణసుఖదుఃఖాది ద్వంద్వాల నుండి విముక్తుడు కావాలి. అనగా ద్వంద్వాలను జయించాలి.

విశేషం: సంఖ్య అంటే జ్ఞానం. జ్ఞానం వలన నిశ్చయించబడే ఆత్మతత్త్వానికే సాంఖ్యమని పేరు.
సంఖ్యకు సంబంధించినది కావడం వలన కూడా సాంఖ్య యోగం.

"భూతాని చ కవర్గేణ చవర్గేణేంద్రియాణి చ
టవర్గేణ తవర్గేణ జ్ఞానగంధాదయ స్తథా
మనః పకారేణైవోక్తం ఫకారేణ త్వహంకృతిః
బకారేణ భకారేణ మహాన్ ప్రకృతి రుచ్యతే
ఆత్మా తు స మకారోఽయం పంచవింశః ప్రకీర్తితః."

కఖగఘఙ - అను కవర్గం చేత - పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం అనే పంచభూతాలు;

చఛజఝఞ - అను చవర్గం చేత - వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే పంచకర్మేంద్రియాలు;
టఠడఢణ - అనే టవర్గం చేత - త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములనే పంచజ్ఞానేంద్రియాలు;
తథదధన - అనే తవర్గం చేత - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అనే పంచతన్మాత్రలు;

పకారము చేత మనస్సు, ఫకారము చేత అహంకారం, బకారము చేత మహత్తు, భకారము చేత ప్రకృతి, మకారము చేత ఇరువదైదవతత్త్వమైన జీవాత్మ గ్రహించబడుతుంది - ఇది పంచవింశతితత్త్వాత్మకమైన సృష్టి వ్యవస్థ.

"సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః
ఏక మప్యాస్థితస్సమ్యక్ ఉభయో ర్విందతే ఫలమ్." (భగ. 5-4)

కర్మయోగ జ్ఞానయోగాలు పరస్పరం భిన్నములని అల్పజ్ఞులు భావిస్తారు. కాని, వీటిల్లో ఏది అనుష్ఠించినా ఆత్మదర్శన ప్రాప్తి అవుతుంది.

"య త్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే,
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి." (భగ. 5-5)

ఆత్మదర్శనానికి సాధనభూతములైన జ్ఞాన కర్మయోగాలకు భేదం లేదని గుర్తించిన వారే పండితులు- అని భారతంలో మరోచోట దీనికి ఉపోద్బలకంగా చెప్పబడింది.

ఉ. శౌచము బ్రహ్మచర్యమును శాంతియు లఘ్వశనంబునై యిళం
జూచుచు నంతరాత్ము నెడసొచ్చిన విఘ్నవిశేషమున్ ధృతిం
ద్రోచుచు భక్తియుక్తికి గురుండు ప్రమోదమయుండు గాఁగఁ ద
ద్గోచరతం జరింపఁగ నకుంఠిత మోక్షసుఖంబు చొప్పడున్. 225

ప్రతిపదార్థం: శౌచమున్ = శుచిత్వమూ, పరిశుద్ధత; బ్రహ్మచర్యమును = బ్రహ్మచర్యమనేవ్రతమూ; శాంతియున్ = అంతరింద్రియనిగ్రహం, మనో నిగ్రహం; లఘు+అశనంబున్+ఐ = మితాహారస్వీకారం కలిగి; ఇళన్ = ఇళ అనేనాడి ద్వారా; అంతరాత్మున్ = జీవుడిని; చూచుచున్ = కనుగొంటూ; ఎడ+చొచ్చిన = నడుమ ప్రవేశించిన; విఘ్నవిశేషమున్ = అంతరాయ పరంపరను, ఆటంకాలను; ధృతిన్ = ధైర్యంతో; త్రోచుచున్ = నెట్టివేస్తూ, తొలగించుకొంటూ; భక్తియుక్తికిన్ = తాను భక్తి భావంతో కూడి ఉండటానికి; గురుండు = తన ఆచార్యుడు; ప్రమోదమయుండు+కాఁగన్ = సంతోషభరితుడు కాగా; తద్+గోచరతన్ = ఆ గురుడి దృష్టికి గోచరమయ్యేటట్లు; చరింపఁగన్ = మెలగితే; అకుంఠిత = మొక్కవోవని; మోక్షసుఖంబు = మోక్షానందం; చొప్పడున్ (చొప్పు+పడున్) = లభిస్తుంది, సమకూడుతుంది.

తాత్పర్యం: పరిశుద్ధత, బ్రహ్మచర్యవ్రతం, అంతరింద్రియ నిగ్రహం, మితమైన ఆహారస్వీకారం కలిగి ఇళానాడి ద్వారా ఆత్మను అవలోకిస్తూ నడుమ నడుమ సంభవించే విఘ్నపరంపరను ధైర్యంతో తొలగదోస్తూ, తన భక్తి భావనకు గురుడు సంతసించగా, అతడి పర్యవేక్షణలో మెలగటం వలన మొక్కవోని మోక్షానందం లభిస్తుంది.

తే. అది సదాభ్యాసకలన నత్యంతనిర్మ । లంబు నవ్యయమును నచలంబు ఘనము
నై జరావ్యాధి మరణ జన్మాది దుఃఖ । బహుళ సంసార చక్రంబుఁ బాపనేర్చు.' 226

ప్రతిపదార్థం: అది = ఆ మోక్షధర్మం; సదా+అభ్యాస కలనన్ = నిరంతరం అభ్యాసం చేయటం వలన; అతి+అంత+నిర్మలమున్ = మిక్కిలి స్వచ్ఛమైనదీ; అవ్యయమునున్ = తరుగనిదీ; అచలంబున్ = చలింపనిదీ; ఘనమున్ = దొడ్డదీ; ఐ = అయి; జరా = ముసలితనం, వార్ధక్యం; వ్యాధి = రోగం, మరణ = చావు, మృతి; జన్మ = పుట్టుక, జననం; ఆది = మొదలైన; దుఃఖబహుళ = దుఃఖాలచేత నిబిడమైన, సాంద్రమైన, దట్టమైన; సంసార చక్రంబున్ = పరిభ్రమణశీలమైన సంసారమండలం నుండి; పాపన్+నేర్చున్ = తొలగించగలదు.

తాత్పర్యం: అంబికా! మోక్షధర్మం నిరంతరాభ్యాసంవలన మిక్కిలి నిర్మలమైనది. తరుగనిది, చలించనిది; దొడ్డది. అది ముసలితనం, రోగం, జననం, మరణం మొదలైన దుఃఖాలతో నిండిన సంసారచక్రంలో జీవి చిక్కకుండ చేయగలదు.

వ. అని యుపదేశించి వెండియు. 227

తాత్పర్యం: అని పరమశివుడు గౌరికి బోధించి మరలా ఇట్లా అన్నాడు.

క. 'విను సంసారమునకు విసు । వని మర్త్యుఁడు శోకమోహ వశగతుఁడై మో
క్షనిరూఢిఁ బడయ నేరఁడు । మనము విరక్తముగ విసివి మఱి ముక్తి గనున్. 228

ప్రతిపదార్థం: విను = గౌరీ! ఆలకించుము; సంసారమునకున్ = జనన మరణరూపమైన సంసారానికి; విసువని = విసుగుచెందని; ఛీయని రోయని; మర్త్యుఁడు = మనుజుడు; శోకమోహవశగతుఁడు+ఐ = శోకమునకూ, వ్యామోహమునకూ అధీనుడై; మోక్షనిరూఢిన్ = ముక్తి వలన ప్రసిద్ధిని, మోక్షసంపదను; పడయన్+నేరఁడు= పొందలేడు; మనము = తన మనస్సు; విరక్తముగన్ = ప్రాపంచిక విషయములందు అపేక్షలేనిదౌతూ; విసివి = వేసట చెంది, నిర్వేదము పొంది; మఱి = ఆవల; ముక్తిన్+కనున్ = మోక్షాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'దేవీ! సంసారమందు విరక్తి చెందని మనిషి శోకమోహాలకు అధీనుడై ముక్తిని పొందలేడు. తన మనసు ప్రాపంచిక విషయా లనుభవించి, అనుభవించి విసిగి వేసారి విరక్తి పొందినపుడే మోక్షాన్ని పొందగలడు.

వ. అట్టిదశ చింతా వివర్జనంబునను, భూతాస్థిరత్వ జ్ఞానంబునను, తృష్ణారాహిత్యంబునను గాని కలుగదు గావున వాని భంగులు ప్రకటించెద. 229

ప్రతిపదార్థం: అట్టిదశ = వైరాగ్యం; చింతా వివర్జనంబుననున్ = చింతను వదలుట చేతనూ, భూత+అస్థిరత్వ జ్ఞానంబుననున్ = ప్రాణికోట్లు శాశ్వతంగా ఉండవనే వివేకం వలననూ; తృష్ణారాహిత్యంబుననున్ = ఆశను వీడుట చేతనూ; కాని = తప్ప; కలుగదు = సంభవించదు; కావునన్ = కనుక; వాని భంగులు = వాటి తీరులు; ప్రకటించెదన్ = వెల్లడిస్తాను, చాటుతాను.

తాత్పర్యం: గిరిజా! సంసార వైరాగ్యం అనేది చింతను మానడం వలన, భూతములు శాశ్వతములు కావు అనే వివేకం వలన, ఆశను వీడటం వలనగాని కలుగదు. కనుక ఆ మూటి స్వరూప మెట్లాంటిదో వివరిస్తాను. సావధానచిత్తవై ఆకర్ణించుము.

సీ. ధనములు చెడిన బాంధవులు సచ్చినఁ దదీ । యములగు గుణముల యందు మనసు
వెట్టక యున్నది యెట్టన్న వగచినఁ । దాపంబు వొందుట దక్క నొండు

గలుగునే సుఖము దుఃఖంబును దోడివ। యవి మార్చి వచ్చుచు నరుగుచుండుఁ
గేవల సుఖము లే దా వాసవునకైనఁ। జేటు దృశ్యములకు సిద్ధ మగుట

తే. **మున్న కనియున్న వగ చిత్తమున జనింప। దరయఁ గీడు పరిగ్రహ మది సమగ్ర**
మైనతఁడు పొత్తినూలి ప్రువ్వట్ల తాన। తనకు బంధంబు గావించికొను లతాంగి! 230

ప్రతిపదార్థం: లతా+అంగి! = తీగవంటి మేను గలదానా!; ధనములు చెడినన్ = విత్తం నశించినా; బాంధవులు = చుట్టాలు; చచ్చినన్ = మరణించినా; తదీయములు+అగు = ఆ బాంధవులకు సంబంధించిన; గుణములయందున్ = సత్స్వభావములందు; మనసు = చిత్తమును; పెట్టక+ఉన్న+అది = నిలుపకుండా ఉండాలి (పోయిన చుట్టాలను స్మరిస్తూ ఉండకూడదు); ఎట్టు+ అన్నన్ = ఎందుకంటే; వగచినన్ = వారికై దుఃఖిస్తే; తాపంబు+పొందుట+తక్కన్ = వేదన చెందటమే తప్ప, బాధ పడటమే తప్ప; ఒండు+కలుగును+ఏ = మరొక్క ప్రయోజనమున్నదా?; సుఖము = సౌఖ్యమూ; దుఃఖంబును = శోకమూ; తోడివి+ అ = వెంటనుండేవే; అవి = ఆ హర్షశోకాలు, మోదఖేదాలు; మార్చి = ఒకదాని తర్వాత మరొక్కటిగా, వచ్చుచున్+అరుగుచున్+ ఉండున్ = వస్తూ పోతూ ఉంటాయి; ఆ వాసవునకున్+ఐనన్ = ఆ దేవేంద్రుడికైనా; కేవల సుఖములేదు = అచ్చంగా సుఖమే కలగటం లేదు; దృశ్యములకున్ = కంటికి కనపడేవాటికెల్ల; చేటు = వినాశం; సిద్ధము+అగుట = నిర్ణయించబడి ఉండటం; మున్న = ముందే; కని+ఉన్నన్ = తెలిసి ఉంటే; చిత్తమునన్ = మనసులో; వగ = దుఃఖం; జనింపదు = పుట్టదు; అరయన్ = ఆలోచిస్తే; పరిగ్రహము = ఇతరులనుండి స్వీకరించటం; కీడు = హాని; అది సమగ్రము+ఐనన్= అది పూర్ణమైతే; అతఁడు = దానం గైకొన్నవాడు; పొత్తినూలిప్రువ్వు+అట్లు+అ = పట్టుకాయలోని పురుగుమాదిరి; తనకున్+తాను+అ = తనకు తానే; బంధంబు+కావించికొనున్ = కట్టిపడవేసికొంటాడు.

తాత్పర్యం: మహాదేవీ! ధనం పోయినా, చుట్టాలు చనిపోయినా, వారి గుణాలు తలచుకొని మనసున చింతించకుండటం మంచిది. ఎందుకనగా అట్లా దుఃఖించడం వలన తన శరీరానికి బాధతప్ప మరో ప్రయోజనం లేదు. సుఖదుఃఖాలు జంట బాయనివి. అవి ఒక దాని తర్వాత మరొకటిగా వస్తూ పోతూ ఉంటాయి. దేవేంద్రునంతటి వాడుకూడా సుఖం మాత్రమే పొందటం లేదు. దుఃఖం గూడ అనుభవిస్తున్నాడు. దృగ్గోచరములైన పదార్థము లన్నింటికీ వినాశం తప్పదు అన్న విషయం తెలిస్తే మనసులో దుఃఖం కలుగదు. పరులవలన వస్తువులు స్వీకరించటం హానికరం. పరిగ్రహమే వృత్తిగా పెట్టుకొన్నవాడు పట్టుకాయలోని పురుగు తన దారాలతో తన్ను బంధించుకొని చెడునట్లు చెడిపోతాడు.

విశేషం: అలం: పొత్తినూలి ప్రువ్వట్లు అనుచోట ఉపమాలంకారం.

ఆ. **విను ధనార్జనంబు ధనరక్షణంబు ధ। నవ్యయంబు ధనవినాశనముఁ బ్ర**
గాఢ దుఃఖదములు గావున దుఃఖభా। జనము ధనము గాల్చు మనఁగ వలయు. 231

ప్రతిపదార్థం: విను = ఆలకించుము; ధన+ఆర్జనంబు = ద్రవ్యం సంపాదించటం; ధనరక్షణంబు = ఆర్జించిన విత్తాన్ని కాపాడటం; ధనవ్యయంబున్ = డబ్బును వెచ్చించటం; ధనవినాశనమున్ = సొమ్ముపోవటం; ప్రగాఢ దుఃఖదములు = అత్యంత దుఃఖాన్ని కలిగిస్తాయి. కావునన్ = కాబట్టి; ధనము = సొత్తు; దుఃఖభాజనము = దుఃఖానికి పాత్రం; కాల్చుము+అనఁగన్+వలయున్ = అట్టి డబ్బును తగులబెట్టుమని చెప్పవలె.

తాత్పర్యం: దేవీ! శ్రద్ధగా వినుము. ధనం సంపాదించటం, కాపాడటం, వ్యయపరచటం, నాశనం కావటం అన్నవి తీవ్రదుఃఖాన్ని కలిగిస్తాయి. కనుక ఇన్ని దుఃఖాలకు మూలమైన డబ్బును తగులబెట్టుమని చెప్పటం యుక్తం.

క. రమణీ! తృష్ణాసమ దుః । ఖమును బరిత్యాగ సమ సుఖముఁ గలవే? కా
యము ముదిసిన ముదియదు ప్రా । ణము గొని పోఁజాలు తెవులనం జనుఁ దృష్ణన్. 232

ప్రతిపదార్థం: రమణీ! = ఓ అంగనామణీ!; తృష్ణా సమదుఃఖమును = ఆశతో సమానమైన దుఃఖం; పరిత్యాగ సమసుఖమున్ = ఆశను వీడటంతో సమానమైన సుఖం; కలవు+ఏ? = ఉన్నవా? లేవని భావం; కాయము = శరీరం, ముదిసినన్ = ముసలితనం పొందినా; ముదియదు = ఆశ మాత్రం ముసలితనం పొందదు; తృష్ణన్ = ఆశను; ప్రాణము = ఊపిరిని; కొనిపోవన్+చాలు = తీసికొని వెళ్ళేశక్తి కలిగిన; తెవులు = వ్యాధి; అనన్+చనున్ = అని చెప్పవచ్చు.

తాత్పర్యం: శైలజా! అశతో సమానమైన దుఃఖం, ఆశను వదలటంతో సమానమైన సుఖం లేనే లేవు. ఆశ అనేది మనుష్యుడి శరీరం ముదిమిని పొందినా తాను మాత్రం ముదిమిని పొందదు. ఆశను ప్రాణాలు తీయగల ఘోరరోగం అని చెప్పవచ్చును.

క. కామములు భోగములఁ దెగు । నే? మెలఁతుక! నేత నాఱునే చిచ్చు ధృతిం
గామములఁ దొఱఁగు సౌఖ్యము । నేమెయి సౌఖ్యములుఁ బోలునే యరయంగన్. 233

ప్రతిపదార్థం: మెలఁతుక! = ఓ వనితారత్నమా!; కామములు = కోరికలు, విషయతృష్ణలు; భోగములన్ = అనుభవించటం వలన; తెగును+ఏ? = నశించునా? నశించవని భావం; చిచ్చు = అగ్ని; నేతన్ = నేతితో, ఆజ్యంతో; ఆఱును+ఏ? = చల్లారునా? అరయంగన్ = పరికించగా, భావించగా, ఆలోచించగా; ధృతిన్ = ధైర్యంతో; కామములన్ = వాంఛలను; తొఱఁగు సౌఖ్యమున్ = వీడుటవలన లభించే సుఖాన్ని; ఏ+మెయిన్ = ఏ విధంగానూ; సౌఖ్యములు = సుఖాలు; పోలును+ఏ? = సరిపోలగలవా? సాటి కాజాలవని తాత్పర్యం.

తాత్పర్యం: ఉమా! కోరిక లెప్పుడూ అనుభవించటం చేత తీరనే తీరవు. ఆజ్యధారలవలన అగ్ని చల్లారదు. చల్లారకపోగా అంతకంతకూ హెచ్చుతుంది. ధైర్యంతో ఆశలు త్యజించటం వలన లభించే సౌఖ్యానికి ఏ విధంగాను సుఖాలు దీటుకాలేవు.

విశేషం: "న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి,
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే." (శ్రీమద్భాగవతమ్. 9-19-14.)

అనుభవిస్తూ ఉంటే కామం ఎన్నటికీ శమించదు. అగ్నిలో నెయ్యి వేసిన చందంగా అది వృద్ధి చెందుతూనే ఉంటుంది.

క. విచ్చలవిడి నింద్రియముల । నెచ్చటికైనను జనంగనిచ్చిన నరకం
బచ్చువఱుచుఁ; గుదియించినఁ । దెచ్చు సుగతి నరున కది సతీమౌళిమణీ! 234

ప్రతిపదార్థం: సతీమౌళిమణీ! = ఓ పతివ్రతా శిరోరత్నమా!; ఇంద్రియములన్ = కన్ను ముక్కు చెవి మొదలుగా గల ఇంద్రియాలను; విచ్చల విడిన్ = స్వేచ్ఛగా, నిరాటంకంగా; ఎచ్చటికిన్+ఐనను = వాటి ఇష్టం వచ్చిన తావుకు; చనన్+కన్+ఇచ్చినన్ = పోనిస్తే; నరకంబున్ = పాపమును; అచ్చు+పఱుచున్ = కలిగిస్తాయి; కుదియించినన్ = అణచివేస్తే, వశపరచుకుంటే; అది = ఆ యింద్రియ నిగ్రహం; నరునకున్ = మానవుడికి; సుగతిన్ = ఉత్తమగతిని, పుణ్యస్థితిని; తెచ్చున్ = కలుగజేస్తుంది.

తాత్పర్యం: ఓ సాధ్వీశిరోమణీ! ఇంద్రియాలను వాటి ఇష్టప్రకారం ఎచటికైనా పోనిస్తే అవి నరకాన్ని సమకూరుస్తాయి. అట్లా వాటిని స్వేచ్ఛా సంచారానికి అనుమతించక అణచివేస్తే (నిరోధిస్తే) అవి జనుడికి సద్గతి లభింపజేస్తాయి.

తే. కామరసమున నతితృష్ణుఁడై మనుష్యుఁ । డర్థతృష్ణా పరీతాంతరంగుఁ డైన
గొఱియ నడవిలో నెత్తెడు కోలుపులియుఁ । బోలె మృత్యు వాతనిఁ గొనిపోవు దేవి!' 235

ప్రతిపదార్థం: దేవి = ప్రియురాలా!; మనుష్యుఁడు = మానవుడు; కామరసమునన్ = కామమనెడు రుచిగల పదార్థమందు; అతితృష్ణుఁడు+ఐ = మిక్కిలి ఆశకలవాడై; అర్థతృష్ణాపరీత = ధనమందలి అశతో ఆవరించబడిన, ఆక్రమించబడిన; అంతరంగుఁడు+ఐనన్ = మనసుగల వాడైతే; అడవిలోన్ = అరణ్యంలో; గొఱియన్ = గొర్రెను; ఎత్తెడు = హరించునట్టి; కోలుపులియున్+ పోలెన్ = పెద్దపులిమాదిరి, బెబ్బులి వలె; మృత్యువు = మిత్తి; అతనిన్ = కామదాహం, ధనదాహం గలనరుడిని; కొనిపోవున్ = తీసికొని వెళ్ళుతుంది.

తాత్పర్యం: విషయాభిలాషతో, ధనాశతో నిండిన మనసుగల మానవుడిని అడవిలో గొర్రెను అపహరించే బెబ్బులి మాదిరి మృత్యువు తన వెంట కొనిపోతుంది.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని పలికి 'జరామృత్యువులఁ ద్రోవం జాలు మేలెయ్యది యంటేనిఁ జెప్పెద నాకర్ణింపు' మనుపలుకు పలికి యిట్లనియె. 236

ప్రతిపదార్థం: అని పలికి = అని చెప్పి; జరామృత్యువులన్ = ముసలితనమును, మరణమును; త్రోవన్+చాలు = తరుమ గొట్టగల; మేలు = వరము, మంచి పని; ఏ+అది(ఎయ్యది) = ఏది; అంటి+ఏనిన్ = అన్నచో; చెప్పెదన్ = వచిస్తాను; ఆకర్ణింపుము = వినుము; అనుపలుకు = ఆనుమాట పలికి, ఇట్లు+అనియెన్ = శివుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరమేశ్వరుడు పార్వతి కట్లు వచించి 'ముసలితనమునూ, మరణాన్ని తరుమగొట్టగల క్షేమంకరమైన మంచిపని ఏది అని అడిగినచో చెప్పుతాను విను' మని ఇట్లా అన్నాడు.

తే. **'ధనములును దానములుఁ దపోధనము వాజి । పేయ రాజసూయంబులు వేయు నోపి**
చేయుటలు గావు మోక్షదర్శిత్వ మొకఁడ । మందు జరకు మృత్యువునకు నిందువదన! 237

ప్రతిపదార్థం: ఇందువదన! = జాబిలివంటి మోము గలదానా!; ధనములును = విత్తములు; దానములున్ = వితరణములు, ఈవులు; తపోధనమున్ = తపస్సనెడు ధనం, తపశ్చర్య; వాజిపేయ రాజ సూయంబులున్ = అశ్వమేధ రాజసూయాది యాగాలు; వేయున్ = వెయ్యి; ఓపి+చేయుటలు = సమర్థతతో సల్పుటలు; జరకున్ = ముదిమికీ; మృత్యువునకున్ = మిత్తికీ; మందు = నివారకమైన ఔషధం; కావు = కాజాలవు; మోక్షదర్శిత్వము+ఒకఁడు+అ = మోక్షమును దర్శించటమన్నది ఒక్కటే; మందు = జరామరణాలను మాన్పే ఔషధం.

తాత్పర్యం: 'చంద్రముఖీ! ధనాలు, దానాలు, తపస్సులు, అశ్వమేధ రాజసూయయాగాలు ఇవేవీ జరామరణాలను కలుగకుండా చేయలేవు. ముక్తి ఒక్కటే ముసలితనాన్నీ మరణాన్నీ మాన్పుటకు తగినమందని గ్రహించుము.

తే. **జాములును దివసములు మాసములు నేండ్లు । నైన కాల మాయువుగొని యరుగుచుండు;**
నెల్లి చేయుపనులు నేఁడ యింతి! మా పొ । నర్చుపని రేప చేయుట నామతంబు. 238

ప్రతిపదార్థం: ఇంతి! = ఓ పడతీ!; జాములును = యామములు; దివసములున్ = దినములు; మాసములున్ = నెలలు; ఏండ్లున్ = సంవత్సరాలు; ఐనకాలము = ఈ రీతిగా ఉన్న కాలం; ఆయువున్ = ఆయుస్సును; కొని = గ్రహించి; అరుగుచున్+ఉండున్ = పోతూ ఉంటుంది; ఎల్లి చేయుపనులు = రేపు చేసే కార్యాలు; నేఁడు+అ = ఈనాడే; మాపు+ఒనర్చుపని = సాయంకాలం చేసేపని; రేపు+అ = ఉదయమే; చేయుట = సల్పటం; నామతంబు = నా ఆశయం, నాపద్ధతి, నా కిష్టం.

తాత్పర్యం: తరుణీ! జాములు, దినములు, నెలలు, సంవత్సరాలు ఈ రూపంతో ఉన్నకాలం జీవుల ఆయుస్సును హరించుకొని ముందుకు సాగిపోతూ ఉంటుంది. రేపు చేసేపని ఈ రోజు, సాయంకాలం చేయవలసిన పని ఉదయమే చేయటం నాకిష్టం.

విశేషం: జాము అనగా యామం. ఏడున్నర గడియలకాలం ఒక జాము. జామునకు 3 గంటలు. పగలు నాల్గుజాములు, రేయి నాల్గుజాములు చేరితే ఒక రోజు. ఇరవైనాలుగు గంటలు.

తే. **మేలు గడువేగ చేయరు కాలపాశ । బద్ధులై యేమఱుటఁజేసి పడఁతి! మనుజు**
లింత యెఱుఁగుట సంసార మెడలఁద్రోచు । నట్టి విసువుటఁ బుట్టించునది హితంబు. 239

ప్రతిపదార్థం: పడఁతి! = ఓ చెలువా!; మనుజులు = నరులు; కాలపాశబద్ధులు+ఐ = కాలమనే త్రాటిచేత బంధించబడిన వారై; ఏమఱుటన్+చేసి = పరాకు వహించటం వలన, జాగరూకులు కానందున, కాలప్రభావ మెట్టిదో మఱచినందున; మేలు = మంచిపని; కడువేగ = మిక్కిలి తొందరగా; చేయరు = ఆచరించరు; ఇంత+ ఎఱుఁగుట = కాలం ఆయుస్సును హరిస్తుందన్న విషయం గ్రహించటం; సంసారము = సంసారాన్ని; ఎడలన్+త్రోచునట్టి = తొలగించేటటువంటి; విసువుటన్ = విరక్తిని; పుట్టించున్ = జనింపచేస్తుంది; అది హితంబు = ఆ వైరాగ్యమే మేలు సమకూరుస్తుంది.

తాత్పర్యం: మనుష్యులు కాలాధీనులై ఏమరుపాటు వహించి మంచి పనులు మిక్కిలి తొందరగా చెయ్యరు. కాలం ఆయుస్సును హరిస్తుందన్న విషయం తెలిసికొనటంచేత సంసారమందు వైరాగ్యం కలుగుతుంది. ఆ విరక్తియే ముక్తికి సాధనమై మేలు చేకూరుస్తుంది.

విశేషం: "అమానిత్వమదంభిత్వం అహింసా క్షాంతి రార్జవమ్,
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మ వినిగ్రహః " (భగ. 13-8)

"ఇంద్రియార్థేషు వైరాగ్యం అనహంకార ఏవ చ,
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్." (భగ. 13-9)

"అసక్తి రనభిష్వంగః పుత్రదారగృహాదిషు,
నిత్యం చ సమచిత్తత్వం ఇష్టానిష్టోపపత్తిషు." (భగ. 13-10)

ఇట్లా అమానిత్వాది గుణసంపత్తి మోక్షసాధనంగా గీత నుడివింది. ఆ యీ విషయాలే ఇక్కడ ప్రశంసించబడ్డాయి.

వ. ఇవ్విధంబున. 240

తాత్పర్యం: ఈ ప్రకారంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

**క. ఈ తెరువు లాదరింపఁగఁ । జేతోగతికిని విమర్శసిద్ధి యొదవుఁ ద
జ్జాత విరక్తియు ముక్తికి । నా తెరువ సమీపవర్తి యచలేంద్రసుతా! 241**

ప్రతిపదార్థం: అచల+ఇంద్రసుతా! = శైలరాజపుత్రీ!; ఈ తెరువులు = ఈ మార్గాలు; ఆదరింపన్+కన్ = అంగీరించటం వలన, పాటించటం వలన; చేతోగతికిన్ = మనఃప్రవృత్తికి; విమర్శసిద్ధి = పరిశీలన శక్తి; ఒదవున్ = లభిస్తుంది; తత్+జాత = యుక్తాయుక్తపరిశీలనాశక్తివలన కలిగిన; విరక్తియున్ = వైరాగ్యం; ముక్తికిన్ = మోక్షానికి; ఆతెరువు+అ = ఆ దారియే; సమీపవర్తి = చేరువలో ఉన్నట్టిది.

తాత్పర్యం: పై నుడివిన మార్గా లనుసరిస్తే మనసునకు విమర్శనా పరిజ్ఞాన మేర్పడుతుంది. దాని వలన వైరాగ్యం సిద్ధిస్తుంది. ఆ విరక్తి మార్గమే ముక్తికి చేరువైన దారి.

**క. వైరాగ్యంబు ప్రశాంతికిఁ । గారణము; ప్రశాంతి ముక్తిఁ గను; మోక్షానం
దారాము జరామృత్యువు । లేరూపునఁ జేర నేర విద్ధచరిత్రా!.' 242**

ప్రతిపదార్థం: ఇద్ధ చరిత్రా! = ప్రకాశమానమైన నడవడికలదానా!; వైరాగ్యంబు = విషయవాంఛారాహిత్యం; ప్రశాంతికిన్ = మనోజయానికి; కారణము = హేతువు; ప్రశాంతి; ముక్తిన్ = మోక్షమును; కనున్ = దర్శిస్తుంది; మోక్ష+ఆనంద+ఆ రామున్ = మోక్షానందమందు క్రీడించే వాడిని; జరామృత్యువులు = వార్ధకం, మరణం; ఏరూపునన్ = ఏ విధంగానైనా; చేరన్ నేరవు = సమీపించలేవు.

తాత్పర్యం: ఓ పవిత్ర చరిత్రురాలా! ప్రాపంచిక వస్తు వ్యామోహం లేనివాడికి మనోజయం సిద్ధిస్తుంది. దాని వలన ముక్తి లభిస్తుంది. జరామరణాలు మోక్షానందంలో తేలియాడే వాడి చెంతకు చేరలేవు.'

క. అని చెప్పి మఱియు శివుఁ డి । ట్లను హిమగిరిసుతకు 'సాంఖ్య మమలినహృదయా!
విను వివరించెద; సంసృతి । యను రోగంబునకు వైద్య మది యరయంగన్. 243

ప్రతిపదార్థం: అని చెప్పి = అని పలికి; మఱియున్ = ఇంకనూ; శివుఁడు; హిమగిరి సుతకున్ = మంచుకొండ కొమార్తె అయిన అంబికకు; ఇట్లు+అనున్ = ఇట్లా అన్నాడు; అమలిన హృదయా! = నిర్మలమైన మనస్సుగల దేవీ!; సాంఖ్యమున్ = సాంఖ్యయోగాన్ని; వివరించెదన్ = వ్యాఖ్యానిస్తాను; విను = ఆకర్ణించుము; సంసృతి+అను = సంసారమనే; రోగంబునకున్ = వ్యాధికి; అది = సాంఖ్యము; వైద్యము = మందు, చికిత్స.

తాత్పర్యం: అని పలికి పరమేశ్వరుడు పార్వతితో మళ్ళీ ఇట్లా అన్నాడు. 'స్వచ్ఛమైన హృదయం గల గౌరీ! సాంఖ్యమును గూర్చి చెప్పుతాను వినుము. అది సంసారమనే రోగానికి తగిన మందు.

శివుఁడు పార్వతికి సాంఖ్యప్రకారంబు దెలుపుట. (సం.13 అను 1-15-4096).

ఆ. జ్ఞానమున విముక్తి సాంఖ్యులు పడయుదు । రరసిచూడఁగా నిరర్థకంబు
ఘోరతరము నండ్రు శారీరమైన త । పంబుఁ బంచ వింశ భజన మూఁది. 244

ప్రతిపదార్థం: సాంఖ్యులు = జ్ఞానమార్గం అనుసరించేవారు; జ్ఞానమునన్ = అధ్యాత్మ జ్ఞానంచేత; విముక్తిన్ = మోక్షాన్ని; పడయుదురు = పొందుతారు; పంచవింశభజనంబు+ఊఁది = ఇరువదైదవదైన ఆత్మ యొక్క సేవను ఎగురగొట్టి, మాని; శారీరము+ఐన+తపంబు = దేహసంబంధమైన తపస్సు; అరసిచూడఁగాన్ = పరామర్శిస్తే, పరిశీలిస్తే; నిర్+అర్థకమున్ = ప్రయోజన శూన్యం; ఘోరతరమున్ = మిక్కిలి దారుణం; అండ్రు = అని చెప్పుతారు.

తాత్పర్యం: సాంఖ్యమతావలంబులు జ్ఞానంవలన మోక్షం పొందుతారు. పరామర్శిస్తే ఆత్మను సేవించటం మాని శారీరకమైన తపస్సు చేయటంవలన ప్రయోజనం ఉండదు. అది పరమప్రయాసకరం కూడ అని చెప్పుతారు.

సీ. ప్రకృతి కవ్యక్తనామకమును గల; దందు । మహదహంకార తన్మాత్రలును మ
నము నింద్రియములు భూతములు జన్యములుగా । నోలిన యిరువది నాలు గయ్యెఁ;
బంచవింశక తత్త్వభావితక్షేత్ర మా । తత్త్వ సంతానంబు సత్త్వమును ర
జస్సుఁ దమస్సు నాఁ జను నిజగుణములఁ । బ్రకృతిదాఁ గరణ రూపములు గాఁగఁ

ఆ. గొని సృజించు లోకకోటి నయ్యవ్యక్త । మణువు నిత్య మేక మక్రియం బ
హైతుకంబు చక్షురాదుల కగ్రాహ్య । మది ప్రధాన మనఁగ నతిశయిల్లు. 245

ప్రతిపదార్థం: ప్రకృతికిన్ = ప్రకృతికి; అవ్యక్తనామకమును+కలదు = అవ్యక్త మనే పేరున్నూ ఉన్నది; అందున్ = ఆ అవ్యక్తమందుండి; మహత్ = మహత్తు; అహంకార = అహంకారం; తన్మాత్రలును = శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అనేవి; మనమున్ = మనస్సు; ఇంద్రియములు = జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు మొత్తం పది; భూతములున్ = పంచభూతాలు అనగా పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము; జన్యములు+కాన్ = జనించగా; ఓలిన్ = క్రమంగా; ఇరువదినాలుగు+అయ్యెన్ = చతుర్వింశతి సంఖ్యగలవి అయ్యాయి; పంచవింశకతత్త్వ = ఇరువదైదవతత్త్వమైన ఆత్మచేత; భావిత = ఆదరించబడిన; క్షేత్రంబు = ప్రకృతి; ఆతత్త్వసంతానంబున్ = ఆ

యిరువది నాల్గుతత్త్వాల సముదాయాన్ని; సత్త్వమును = సత్త్వగుణమూ; రజస్సున్ = రజోగుణమూ; తమస్సున్ = తమోగుణమూ; నాన్ = అనగా; చను = ఒప్పునట్టి; నిజగుణములన్ = తన గుణాలతో; ప్రకృతి తాన్ = ఆ ప్రకృతి; కరణరూపములు కాఁగన్+కొని = కార్యసాధనములు కాగా గైకొని; లోకకోటిన్ = జీవరాసులను, భూతజాలమును; సృజించున్ = జనింపజేస్తుంది; ఆ+అవ్యక్తము = ఆ ప్రకృతి అనేది; అణువు = సూక్ష్మమైనది; నిత్యము = శాశ్వతము; ఏకము = ఒక్కటే, అద్వితీయం; అక్రియంబు = కార్యరూపం కానట్టిది; అహైతుకంబు = కారణం కానట్టిది; (ఆ ప్రకృతి కార్యకారణములకు అతీతమైనది); చక్షుః+ఆదులకున్ = కన్ను మొదలైన ఇంద్రియాలకు; అగ్రాహ్యము = గ్రహింపరానిది, గోచరము కానట్టిది; అది = ఆ ప్రకృతి; ప్రధానము+అనఁగన్ = ప్రధానమనే పేరుతో; అతిశయిల్లున్ = ఒప్పారుతుంది. (ప్రకృతికే అవ్యక్తమనీ, ప్రధానమనీ పేర్లు).

తాత్పర్యం: ప్రకృతికి అవ్యక్తమనే పేరు కూడా ఉన్నది. అందుండి మహత్తూ, అహంకారం, శబ్దాదులైదూ, మనస్సూ, జ్ఞానేంద్రియాలు ఐదూ, కర్మేంద్రియాలు ఐదూ, పంచభూతాలు జన్మించగా మొత్తం ఇరువది నాల్గుతత్త్వాలైనాయి. ఇరువదైదవతత్త్వం ఆత్మ. ఇట్టి ఆత్మకు స్థానమై ప్రకృతి నిజగుణాలైన సత్త్వరజస్తమస్సులను సాధనాలుగా గ్రహించి లోకాలను సృష్టిస్తుంది. అవ్యక్త మనేది ఎట్టిదనగా అది పరమాణువు. శాశ్వతం. ఏకం, కార్యరూపం కాదు; కారణరహితమైనట్టిది. అది ఇంద్రియాలకు గోచరించదు. ప్రధానమనే పేరుతో అది విలసిల్లుతుంది.

తే. సౌఖ్యతుష్టిప్రకాశముల్ సాత్త్వికములు । మోద ఖేదాదిక ద్వంద్వములు లతాంగి!
రాజసము లప్రకాశ సంత్రాస మోహ । ములును దంద్రయుఁ దామసములుగ నెఱుఁగు. 246

ప్రతిపదార్థం: లతా+అంగి! = తీగవంటి శరీరముగల దేవీ!; సౌఖ్యతుష్టి ప్రకాశముల్ = సుఖం, సంతృప్తి, పదార్థవిజ్ఞానం అనే గుణాలు; సాత్త్వికములు = సత్త్వమునకు సంబంధించినట్టివి; మోదఖేద = సంతోషం, దుఃఖం; ఆదిక = మొదలైన; ద్వంద్వములు = జంటలు; రాజసములు = రజోగుణ సంబంధులు; అప్రకాశ = జ్ఞానరాహిత్యం; సంత్రాస = భయం; మోహములు = విపరీతజ్ఞానం; తంద్రయున్ = సోమరితనం; తామసములుగన్ = తమోగుణప్రధానాలుగా; ఎఱుఁగు = తెలియుము.

తాత్పర్యం: సౌఖ్యం, సంతృప్తి, వివేకం సత్త్వగుణానికి సంబంధించిన లక్షణాలు. సంతోషం, దుఃఖం మొదలైన ద్వంద్వాలు రజోగుణ ప్రధానాలు; జ్ఞానరాహిత్యం, భీతి, విపరీతజ్ఞానం, సోమరితనం అనేవి తమోగుణ ప్రధానాలని గ్రహించుము.

విశేషం: "సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః,
నిబధ్నంతి మహాబాహో! దేహే దేహిన మవ్యయమ్." (భగ. 14-5)

సత్త్వరజస్తమోగుణాలు ప్రకృతికి సహజమైనగుణాలు. ప్రకృతి పరిణామమే శరీరం. కనుక ఆ మూడు గుణాలు దేహాన్ని ఎప్పుడూ వదలవు. అవి నాశరహితుడైన జీవుడిని దేవమనుష్యాది శరీరాలలో బంధిస్తున్నాయి.

"తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశక మనామయమ్,
సుఖ సంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ." (భగ. 14-6)

సత్త్వమనే గుణం నిర్మలమైనది; జ్ఞాన ప్రకాశకం. అది జీవుడికి జ్ఞానమందు, సుఖమునందు ఆసక్తిని రేకెత్తిస్తుంది. అందు చేత పురుషుడు వైదిక కర్మలలో ప్రవర్తించి ఆ కర్మఫలాలు అనుభవించడానికి జన్మలెత్తుతాడు. ఈ రీతిగా సత్త్వగుణం కూడా సంసారబంధ కారణమే.

"రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్,
తన్నిబధ్నాతి కౌంతేయ! కర్మసంగేన దేహినమ్." (భగ. 14-7)

రజోగుణం స్త్రీపురుషుల ప్రేమకు కారణం. అది ఇంద్రియార్థములందూ, దారపుత్రమిత్రాదులందు ఆసక్తిని కలిగిస్తుంది. అందుచేత పురుషుడు కర్మ లాచరిస్తాడు. ఫలానుభవానికై జన్మిస్తుంటాడు. ఇట్లా రజోగుణం కూడా బంధకమే అవుతున్నది.

"తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్,
ప్రమాదాలస్య నిద్రాభిః తన్నిబధ్నాతి భారత." (భగ. 14-8)

తమోగుణం విపరీత జ్ఞానం వలన పుట్టి విపరీత జ్ఞానాన్ని కల్గిస్తుంది. ఇది జీవికి ఏమరుపాటునూ, సోమరితనాన్నీ, నిద్రనూ కలిగిస్తూ సంసార బంధహేతు వవుతున్నది.

"సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత,
జ్ఞాన మావృత్య తు తమః ప్రమాదే సంజయ త్యుత." (భగ. 14-9)

సత్త్వగుణం సుఖాసక్తిని, రజోగుణం కర్మాసక్తినీ, తమోగుణం విరుద్ధ కార్యప్రవృత్తిని కల్గిస్తున్నాయి.

"రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత,
రజస్సత్త్వం తమశ్చైవ తమస్సత్త్వం రజస్తథా." (భగ. 14-10)

ఈ త్రిగుణాలలో ఒక్కొక్కటి ఒక్కొక్క సమయాన మిగిలిన రెండు గుణాలను మించిపోయి తన పనిని తాను సాధిస్తుంది - అన్న భగవద్గీతార్థములే ఇక్కడ చెప్పబడ్డాయి.

క. ధృతి విజ్ఞాన శ్రద్ధలు । నతివ! యసమ్మోహమును దయయు హర్షము నం
చిత సత్త్వ వృద్ధిఁ బరి వ । ర్ధితంబులగు సత్త్వ మరుగఁ దెరలుం దారున్. 247

ప్రతిపదార్థం: అతివ! = ఓ చెలువా!; ధృతి = ధైర్యం; విజ్ఞాన శ్రద్ధలు = శాస్త్రజ్ఞానం, ధర్మకార్యాసక్తి; అసమ్మోహమును = భ్రాంతి లేకుండటం; దయయున్ = కరుణ; హర్షమున్ = సంతోషమూ; అంచిత సత్త్వవృద్ధిన్ = ఒప్పిదమైన సత్త్వగుణం ఉద్రేకించి నప్పుడు; పరివర్ధితంబులు+అగున్ = మిక్కిలి వృద్ధి పొందుతాయి; సత్త్వము = ఆ సత్త్వగుణం; అరుగన్ = అణగి పోగానే; తారున్ = ఆ గుణాలు కూడా; తెరలున్ = తొలగిపోతాయి.

తాత్పర్యం: ధైర్యమూ, అనుభవసహితమైన జ్ఞానమూ, శ్రద్ధ, భ్రాంతిరాహిత్యమూ, కరుణ, సంతోషం అనే గుణాలు సత్త్వగుణం ఉద్రేకించి నపుడు మిక్కిలి వృద్ధి చెందుతాయి. ఆ సత్త్వ గుణం అణగినప్పుడు అవి కూడ అణగిపోతాయి.

క. క్రోధ లోభ కామానృత ద్రోహచింత । తాపములకు రజోభివర్ధనము వృద్ధిఁ
జేయు వానికి నెల్ల సంక్షీణ భావ । మావహిల్లు రజఃక్షయ మావహిల్ల. 248

ప్రతిపదార్థం: క్రోధ = కోపం; లోభ = దురాశ, పిసినారితనం; కామ = కామం (రాగం); అనృత = అసత్యం; ద్రోహచింత = పరులకు కీడు తలపెట్టటం; తాపములకున్ = దుఃఖాలు అనే వాటికి; రజః+అభివర్ధనము = రజోగుణముయొక్క

పెరుగుదల; వృద్ధిచేయున్ = వృద్ధిని కల్గిస్తుంది; రజఃక్షయము = రజోగుణవినాశం; ఆవహిల్లన్ = కలుగగా; వానికిన్+ఎల్లన్ = మీద చెప్పబడిన క్రోధాది గుణాలన్నింటికీ; సంక్షీణభావము = తరుగుదల, హీనస్థితి; ఆవహిల్లున్ = కలుగుతుంది.

తాత్పర్యం: కోపం, లోభం, కామం, అసత్యం, పరులకు కీడు చేసే తలంపు, దుఃఖం మొదలైనవి కలగటానికి రజోగుణవృద్ధియే కారణం. ఆ రజోగుణం క్షీణిస్తే ఇవన్నీ క్షీణిస్తాయి.

తే. **సంశయంబు విషాదంబు జడత నిద్ర। విను తమస్సు వర్ధింపఁగాఁ బెనుపు నొందు**
నది విహీనతఁ బొందిన నవియు హీన। భావ మొందు వికస్వర పద్మనయన! **249**

ప్రతిపదార్థం: వికస్వర పద్మనయన! = వికసించిన కమలాలవంటి కన్నులు గల శైలజా!; విను = వినుము; సంశయంబు = సందేహం; విషాదంబు = దుఃఖం; జడత = మాంద్యం; నిద్ర = నిదుర; తమస్సు = తమోగుణం; వర్ధింపన్+కాన్ = వృద్ధి నొందించగా; పెనుపున్+ఒందున్ = అవి వృద్ధి చెందుతాయి; అది = తమోగుణం; విహీనతన్+పొందినన్ = క్షీణస్థితిని చెందితే; అవియున్ = ఆ సంశయాది గుణాలన్నీ; హీనభావము+ఒందున్ = క్షీణిస్తాయి.

తాత్పర్యం: ఓ పద్మపత్రాక్షీ! సందేహం, దుఃఖం, మాంద్యం, నిద్ర అనేవి తమోగుణంవలన వృద్ధిపొందుతాయి. ఆ తమోగుణం క్షీణిస్తే ఇవీ క్షీణిస్తాయి.

సీ. **ఒక్కఁ డొక్కనిచేత నెక్కుచుఁ దఱుగుచుఁ। ద్రిగుణంబులును బ్రవర్తించు; వీన**
జనితంబులగు ప్రీతి సంతాప మోహాదు। లొదవినఁ దత్తద్గుణోదయములఁ
గని యుపేక్షించుచు మనము నూనఁగ నీమి। కార్యంబు ధర్మార్థకామములకు
నమర మనుష్య తిర్యగ్జననములకు। మూలముల్ సత్త్వాదు లోలి నెఱుఁగు

తే. **బుద్ధి యనఁగ మహత్తత్త్వమునకు నామ;। మది వివేక విజ్ఞాన చిహ్నంబు; భూత**
జని యహంకారమునకు లక్షణ; మహంక। రణము దొఱఁగుట మోక్షకారణము దేవి! **250**

ప్రతిపదార్థం: దేవి! = దాక్షాయణీ!; ఒక్కఁడు = ఒక్కగుణం; ఒక్కని చేతన్ = మరొక్క గుణం చేత; ఎక్కుచున్ = వృద్ధి గాంచుచు; తఱుఁగుచున్ = క్షీణిస్తూ; త్రిగుణంబులును = సత్త్వరజస్తమోగుణాలు మూడున్నూ; ప్రవర్తించున్ = సాగుతుంటాయి; నడుస్తుంటాయి; వీనన్ = ఈ గుణాలవలన; ప్రీతి = సంతోషం, సంతాప = దుఃఖం; మోహ+ఆదులు = భ్రాంతి మొదలైనవి; జనితంబులు+అగున్ = సంభవిస్తాయి; ఒదవినన్ = అట్లా కలుగగా; తత్+తత్+గుణ+ఉదయములన్ = ఆయా గుణముల యొక్క పుట్టుకలను; కని = చూచి; ఉపేక్షించుచున్ = ఉదాసీనభావం వహిస్తూ, ఒప్పరికిస్తూ; మనమున్ = తన మనస్సును; ఊనగనీమి = ఆ గుణకార్యములందు లగ్నం కాకుండా చేయటం; కార్యంబు = కర్తవ్యం; ధర్మ+అర్థ+ కామంబులకున్ = ధర్మ మొనర్చుటకు, సొమ్ము గడించుటకు, కోరిక లనుభవించుటకు; అమర మనుష్య తిర్యక్+జననములకున్ = దేవతలుగా, మానవులుగా, పశుపక్ష్యాదులుగా జన్మించుటకునూ; సత్త్వ+ఆదులు = సత్త్వరజస్తమోగుణాలు; ఓలిన్ = వరుసగా; మూలముల్ = కారణాలు; ఎఱుఁగు = దేవీ! గ్రహించుము; బుద్ధి+అనఁగన్ = బుద్ధి అనేది; మహత్+తత్త్వమునకున్ = మహత్తునకు; నామము = పేరు; అది = అది; వివేక విజ్ఞాన చిహ్నంబు = వివేకమునకు, విజ్ఞానమునకు గుర్తు - అనగా విచారణ సల్పేశక్తికి, శాస్త్రజ్ఞానమునకు గుర్తు; భూతజని = భూతముల యొక్క ఉత్పత్తి; అహంకారమునకున్+లక్షణము = అహంకారమునకు ఆనవాలు, చిహ్నం; అహంకరణము = నేను అనే

అభిమానం; తొఱఁగుట = వదలటం; మోక్షకారణము = ముక్తికి హేతువు.

తాత్పర్యం: సత్త్వరజస్తమోగుణాలలో ఒక్కొక్కగుణం ఒక్కొక్కవేళ ఉద్రేకించి తక్కిన రెండు గుణాలను అణచివైచి ప్రవర్తిస్తుంటుంది. ఇట్లా ఆ మూడు గుణాల వృద్ధి క్షయాలు సాగుతూ ఉంటాయి. సత్త్వగుణం విజృంభించినపుడు ఆ గుణ కార్యమైన సంతోషం, రజోగుణాభివృద్ధివలన దుఃఖం, తమోగుణం చెలరేగినపుడు మోహం కలుగుతుంటాయి. ఇట్లా ఆయా గుణవర్ధనంవలన ఆయాగుణాలు సంభవిస్తున్నవనీ, ఇవన్నీ ఆ గుణకార్యాలే అనీ, వాటితో నాకు నిమిత్తం లేదనీ తెలిసి నరుడు ఆ గుణకార్యాలపట్ల ఉదాసీనుడై ఉండాలి. తన మనస్సు ఆయా సుఖ దుఃఖాల యందు నిమగ్నం కాకుండా ఉండేటట్లు జాగ్రత్త వహించటమే అతడి కర్తవ్యం. ఈ గుణత్రయమే ధర్మార్థకామ సంగ్రహణానికీ, దేవమనుష్య పశుపక్ష్యాది జాతులలో జన్మించడానికీ హేతువవుతున్నది. బుద్ధి అనగా మహత్తత్త్వానికి మరొక నామధేయం. అది వివేక విజ్ఞానాలకు గుర్తు. అహంకారం భూతోత్పత్తికి మూలం. అహంకార పరిత్యాగంవలననే ముక్తి లభిస్తుంది.

ఆ. అన్నియింద్రియముల నడరింప మగుడఁ జే । యంగ మనసు చాలు; నవియు నదియు
భూత తద్వికారములును దేహము తద । న్యుండు దానఁ బరఁగి యుండు దేహి. 251

ప్రతిపదార్థం: అన్నిఇంద్రియములన్ = దశేంద్రియాలను, ఇంద్రియాలన్నింటినీ; అడరింపన్ = విషయములందు ప్రవర్తింపచేయుటకూ; మగుడన్+చేయన్+కన్ = నివర్తింపజేయుటకూ, మరలించుటకూ; మనసు = చిత్తం; చాలున్ = సమర్థమై ఉంటుంది; అవియున్ = ఆ యింద్రియాలూ; అదియున్ = ఆ చిత్తమూ; భూత = పృథివ్యప్తేజో వాయ్వాకాశములనే (నేల, నీరు, నిప్పు, గాలి, నింగిఅనే) పంచభూతాలూ; తద్+వికారములును = ఆ పంచభూతగుణములైన శబ్దస్పర్శరూప రసగంధాలున్నూ; దేహము = శరీరమై ఉన్నది; తద్+అన్యుండు = ఆ దేహం కంటె భిన్నుడైన; దేహి = ఆత్ముడు, జీవుడు; దానన్ = ఆ శరీరమందు; పరఁగి ఉండున్ = ఒప్పారుతుంటాడు.

తాత్పర్యం: ఇంద్రియాలు విషయాలపై ప్రవర్తిల్లుటకునూ, విషయముల నుండి ఇంద్రియాలను మరల్చుటకునూ మనస్సు సమర్థమై ఉన్నది. ఆ ఇంద్రియాలు, మనస్సు, పృథి వ్యాదిభూత పంచకం, భూతగుణాలైన శబ్దస్పర్శాదులు శరీరం. ఇది జీవుడికంటె భిన్నమైనది. జీవుడు ఈ దేహమనే ఆలయంలో నెలకొని ఉన్నాడని గ్రహించుము.

క. విను దేహియు దేహము వే । అను నిశ్చయదృష్టి గల్గునాతఁడు చాలున్
మనసు మగిడింప నది ని । ర్మనస్కతఁ బొనర్చి మోక్షమార్గముఁ జూపున్. 252

ప్రతిపదార్థం: విను = వినుము; దేహియున్ = జీవుడు; దేహమున్ = శరీరం; వేఱు+అను = ఒక్కటికావు అనే; నిశ్చయదృష్టి = నిర్ణయమునందు చూపు; కల్గు+ఆతఁడు = కలిగినవాడు; మనసున్ = తన మనస్సును; మగిడింపన్+చాలున్ = ఇంద్రియార్థముల నుండి త్రిప్పుటకు సమర్థు డగును-అనగా విషయముల మీదికి పోకుండ చేయగలడు; అది = అట్లామనసును మరలించటం; నిర్మనస్కతన్+పొనర్చి = సంకల్ప వికల్పములు కలుగకుండా చేసి; మోక్షమార్గమున్+చూపున్ = ముక్తి మార్గాన్ని కనబరుస్తుంది.

తాత్పర్యం: దేవీ! దేహం, ఆత్మ ఒక్కటికావు-వేరు వేరైనవి అనే నిర్ణయాత్మకమైన దృష్టికలవాడు తన మనస్సును

ఇంద్రియార్థాలనుండి మరలించటానికి శక్తి గలిగి ఉంటాడు. విషయాలనుండి నివృత్తమైన మనస్సు సంకల్పరహితమై ముక్తి మార్గాన్ని కనపరుస్తుంది.

వ. అప్పుడు ప్రకృతిం దొఱంగి పంచవింశకుండు వెలుంగు; నాతత్త్వంబు పరమ హంసుండనం బరఁగుఁ దద్విజ్ఞానంబు శాంతిసాధ్యంబును బరమశాంతి ప్రదంబునై యుండు. 253

ప్రతిపదార్థం: అపుడు = ఆ వేళ, ఆ మోక్షస్థితిలో; ప్రకృతిన్+తొఱంగి = దేహమే నేను అనే అభిమానం వదలి; పంచ వింశకుండు = ఇరువదైదవతత్త్వమైన ఆత్ముడు; వెలుంగున్ = ప్రకాశిస్తాడు; ఆ తత్త్వంబు = ఆ తత్త్వం; పరమహంసుండు+ అనన్+పరఁగున్ = పరమహంసుడనే నామధేయంతో ఒప్పారుతుంది; తద్+విజ్ఞానంబు = ఆ పరమహంస తత్త్వము యొక్క ఎఱుక; శాంతిసాధ్యంబును = మనోనిగ్రహం చేతనే సంపాదించతగినదియూ; పరమశాంతి ప్రదంబున్+ఐ = పరిపూర్ణమైన శాంతినిచ్చేది గానూ; ఉండున్ = ఉంటుంది.

తాత్పర్యం: ఆ ముక్తిదశయందు దేహమే నేననే అభిమానం వదలి ఆత్ముడు ప్రకాశిస్తాడు. ఆ తత్త్వమే పరమహంసు డని చెప్పబడే తత్త్వం. ఆత్మతత్త్వం ఇట్టిదనే యెఱుక మనోజయం వలననే సమకూడుతుంది. అది పరమశాంతిని ప్రసాదిస్తుంది.

మ. రసగంధాది గుణాలి లేమి నవికారత్వంబునన్ సర్వ సం
వసనవ్యాప్తి నణుత్వభంగిని మహత్త్వస్ఫూర్తిఁ జక్షుః ప్రభృ
త్యసమాలంబితఁ దేజరిల్లు పరమాత్మాఖ్యంబు షడ్వింశకం
బు సమత్వంబునఁ జూచు శాంతుఁ డతివా! పొందున్ విమోక్షస్థితిన్.
254

ప్రతిపదార్థం: అతివా! = ఓ భామా!; రసగంధ+ఆది = రసం, గంధం మొదలైన; గుణ+ఆలిలేమిన్ = గుణసముదాయం లేనందుననూ; అవికారత్వంబునన్ = పరిణామంలేనందు చేతనూ; సత్వసంవసన వ్యాప్తిన్ = అన్నింటియందునివసించటం, వ్యాపించి ఉండుట చేతనూ; అణుత్వభంగిన్ = సూక్ష్మపరిమాణంలో ఉన్నందుననూ; మహత్వ స్ఫూర్తిన్ = గొప్ప పరిమాణంలోఉన్నందుననూ; చక్షుః ప్రభృతి = కన్ను మొదలైన ఇంద్రియాలచేత; అసమాలంబితన్ = గ్రహించబడకుండుట చేతనూ; తేజరిల్లు = ఒప్పారుతున్న; షడ్వింశకంబున్ = ఇరువది ఆరవతత్త్వమైన; పరమాత్మ+ఆఖ్యంబున్ = పరమాత్మ అనే పేరుగల వాడిని; సమత్వంబునన్ = భేదరహితబుద్ధితో; చూచు = దర్శించునట్టి; శాంతుఁడు = మనస్సును జయించినవాడు; విమోక్షస్థితిన్ = మోక్షపదవిని; పొందున్ = చెందగలడు.

తాత్పర్యం: దేవి! రసగంధాది గుణాలు లేనిదై, పరిణామ శూన్యమై, అన్నిటియందు వసించుచు, అన్నిటియందు వ్యాపించి ఉన్నదై, అతిసూక్ష్మరూపమై, బృహత్పరిమాణమునూ గలదై, కన్ను మొదలగు ఇంద్రియాలకు అగోచరమై ఇరువది ఆరవ తత్త్వమొకటి విరాజిల్లుతున్నది. అదే పరమాత్మ. సమబుద్ధితో దానిని దర్శించే శాంతస్వరూపుడు మోక్షపదమును పొందగలడు.

వ. ఇది కపిలాది పరమర్షిసేవితంబైన సాంఖ్యధర్మంబు; యోగ ప్రకారంబు వివరించెద. 255

ప్రతిపదార్థం: ఇది = ఈ చెప్పినది; కపిల+ఆది = కపిలుడు మొదలగు; పరమ+ఋషి = గొప్ప ఋషులచే; సేవితంబు+ఐన = అనుసరించబడిన, అనుష్ఠించబడిన; సాంఖ్యధర్మంబు = సాంఖ్యమనే పేరుగల జ్ఞాన విధం; యోగప్రకారంబున్ = యోగము యొక్క విధమును; వివరించెదన్ = వ్యాఖ్యానిస్తాను.

తాత్పర్యం: గౌరీ! ఇవుడు నేను నుడివింది కపిలుడు మున్నగు గొప్ప మునీంద్రులు అనుసరించిన జ్ఞానమార్గం. ఇక యోగమార్గం ఎట్లాంటిదో ఇప్పుడు వివరిస్తాను. వినవలసింది.

సీ. **విను మింద్రియంబులు మనసును బుద్ధియు । నాత్మండు నొక్కటి యగుటఁ గాన్పు**
యోగ పరిజ్ఞాన ముగ్మలి యగ్ని స । మా రాధనంబును నధిక వాగ్వి
వర్జనంబును సత్త్వవత్త్వంబు దానాధ్య । యనములు శౌచ సత్యములుఁ బాప
ములఁ బాపుఁ బాపనిర్ముక్తుఁడై మఱియోగ । మాచరింపఁగ యోగ్యుఁ డగు నరుండు

తే. **మనసు పట్టుట ముఖ్యపుటనువు దాని । కామిషము గాలగాని కెట్లట్ల శుచియు**
నజనమును నగుచోట మృద్వాసనమునఁ । గాయమున కార్జవము భంగి గలుగనుండి. **256**

ప్రతిపదార్థం: ఉగ్మలి! = ఓ పడతీ!; వినుము = ఆలింపుము; ఇంద్రియంబులు = కన్నుమొదలైన ఇంద్రియాలూ; మనసును = మనస్సూ; బుద్ధియున్ = బుద్ధీ; ఆత్ముండున్ = ఆత్మయూ; ఒక్కటి అగుటన్ = ఏకమై ఉండుటను; కాన్పు = దర్శించటం; యోగపరిజ్ఞానము = యోగమునకు చెందిన పూర్ణజ్ఞానం; అగ్నిసమారాధనంబును = అగ్నిహోత్రుడి యొక్క ఉపాసన, పూజించటం; అధికవాక్+వివర్జనంబును = ఎక్కువగా మాట్లాడటం మానటం, మౌన వ్రతావలంబనం; సత్త్వవత్త్వంబు = సత్త్వగుణం కలిగి ఉండటం; దాన+అధ్యయనములున్ = పాత్రులకు దానమివ్వటం, వేదమును పఠించటం; శౌచసత్యములున్ = పరిశుద్ధుడై ఉండటం, అబద్ధమాడ కుండటం; పాపములన్ = పాతకాలను; పాపున్ = తొలగిస్తాయి; పాపనిర్ముక్తుఁడు+ఐ = దురితముల నుండి తొలగినవాడై, విడువబడ్డవాడై; మఱిన్ = ఇంకనూ; యోగము+ఆచరింపన్+కన్ = యోగ మనుష్ఠించటానికి; నరుండు = మనుజుడు; యోగ్యుడు+అగున్ = అర్హుడవుతాడు; దానికిన్ = యోగానుష్ఠానానికి; మనసున్ = మనస్సును; పట్టుట = విషయాల మీదికి వెళ్ళకుండా నిలువరించటం; ముఖ్యము+అనువు = (ముఖ్యపు+అనువు = ముఖ్యపు+టు+అనువు = ముఖ్యపు టనువు) ప్రధానమైన ఉపాయం; గాలగానికిన్ (గాలము+కాఁడు = గాలగాఁడు) = గాలం వేసి చేపలు పట్టే చెంబడివాడికి, బెస్తకు; ఆమిషము+ఎట్లు = మాంస మెట్లో; అట్లు+అ = ఆ విధంగానే; శుచియున్ = శౌచము, పరిశుద్ధత; అజనమును+అగుచోటన్ = మనుష్యులు లేని తావునందు, ఏకాంత ప్రదేశంలో; మృదు+ఆసనమునన్ = మెత్తనిపీఠం మీద; కాయమునకున్ = శరీరమునకు; ఆర్జవము+భంగి = ఋజువుగా ఉండే తీరు, వక్రత లేని విధం; కలుగన్ = ఏర్పడగా; ఉండి = కూర్చుండి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఉమాదేవీ! ఇంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ, ఆత్మా ఒక్కటే అగునట్లు దర్శించటం పరిపూర్ణమైన యోగజ్ఞానం. అగ్నిహోత్రుడిని ఉపాసించటం అనగా హోమాదులు నిర్వర్తించటం, మిక్కిలిగ మాట్లాడకుండటం - అనగా మౌనవ్రతావలంబనం, సత్త్వగుణం కలిగి ఉండటం, పాత్రులకు దానం సల్పటం, వేదాలు చదవటం, శుచిగా ఉండటం, సత్యం పల్కటం, పాతకాలను తొలగిస్తాయి. అట్లా పాపాల నుండి నిర్ముక్తుడైన మనుజుడు యోగానుష్ఠానానికి అర్హుడవుతాడు. మనసును అటునిటు విషయాలమీదికి వెళ్ళనీక నిలువరించటమే ఇందుకు ముఖ్యమైన ఉపాయం. చేపలు పట్టే జాలరికి మాంసమెట్లు ముఖ్యమో అట్లాగే యోగ మనుష్ఠించేవాడికి పరిశుద్ధమూ, జనశూన్యమూ అయిన

ప్రదేశం ముఖ్యం. అట్టి ఏకాంత ప్రదేశంలో మృదువైన పీఠం మీద శరీరంలో వంపులేకుండా, నడుం వంగకుండా కూర్చోనాలి.

విశేషం: యోగానుష్ఠాన పద్ధతి గురించి భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మసంయమ యోగం విపులంగా వివరించింది. అందులోని విషయాలే ఈ 256వ పద్యం మొదలు 263వ పద్యం వరకు -- ఎనిమిది గద్య పద్యాలలో సంగ్రహ ఫక్కిలో చెప్పబడ్డాయి.

"యోగీ యుంజీత సతతం ఆత్మానం రహసి స్థితః,
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః." (భగ. 6-10)

"శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిర మాసన మాత్మనః,
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్." (భగ. 6-11)

"తత్రై కాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మ విశుద్ధయే." (భగ. 6-12)

"సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్." (భగ. 6-13)

"ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః,
మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః." (భగ. 6-14)

"యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ నియతమానసః,
శాంతిం నిర్వాణ పరమాం మత్సంస్థా మధిగచ్ఛతి." (భగ. 6-15)

యోగనిష్ఠుడు యోగాభ్యాసకాలంలో జితేంద్రియుడై దేనియందూ మమకారం లేకుండా మనుష్యులు లేని ప్రదేశంలో ఒంటరిగా కూర్చొని ఆత్మను ధ్యానించాలి.

ధ్యానానికి పూనుకునేటప్పుడు తనకు అనుకూలమైన పీట మీద మనశ్శుద్ధికై దర్భలను పరవాలి. ఆ పీట అటు ఇటూ బెసకనిదిగా ఉండాలి. అది అంతహెచ్చు, అంత లొచ్చు కానిదిగా ఉండాలి. తాను కూర్చొని ధ్యానం చేసే చోటు పవిత్రంగా ఉండాలి. అనగా ఆ ప్రదేశం క్రిమికీటకాదులు లేనిదిగా దుర్గంధభూయిష్ఠం కానిదిగా ఉండాలి. అట్టి చోట సుఖకరమైన స్థిరాసనం మీద కూర్చొని మనసును ఆత్మయందే నిల్పి ఇంద్రియాలను, వాటి వ్యాపారాలను అరికట్టి ఆత్మధ్యానం చెయ్యాలి. అదే సంసారవిముక్తికి దారి.

యోగానికి ఉపక్రమించేవాడు తన శరీరం(నడుము), మెడ, తలను సమంగా, వంకరలేకుండా, చలించకుండా నిలిపి దిక్కులను చూడకుండా దృష్టిని ముక్కుకొనపై నిలపాలి.

ఎటువంటి భయం లేక ప్రసన్న హృదయుడై బ్రహ్మచర్య వ్రతాన్ని అవలంబించాలి. ఇక్కడ బ్రహ్మచర్యవ్రతమనగా గృహస్థుడికి నిషిద్ధదేశకాలములందు స్త్రీ సంగమం లేకుండటం. పెళ్ళికానివాడికి ఎప్పుడూ స్త్రీ సంగమం లేకుండటం.

ఇట్లా బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించి మనస్సును విషయాలమీదికి వెళ్ళకుండా నిగ్రహించి నన్నే పొందవలెననే వాంఛతో దానిని నామీదనే నిల్పి ధ్యానించాలి.

ఈ విధంగా నిశ్చలమైన చిత్తంతో నన్నే ధ్యానించేవాడు సుఖానికి పరమావధి అయిన ముక్తిని పొందుతాడు.

క. మనమున నైదింద్రియములు । నునిచి మనం బాత్మ నల్ల నొదిఁగింపఁగ నె
క్కొని ప్రాణంబు నపానం । బును వశ్యత నిలుచు యోగమున సిద్ధికినై. 257

ప్రతిపదార్థం: మనమునన్ = మనస్సులో; ఐదు+ఇంద్రియములు = పంచేంద్రియాలను; ఉనిచి = ఉంచి; మనంబున్ = ఆ మనస్సును; ఆత్మన్ = ఆత్మయందు; అల్లన్ = మెల్లగా; ఒదిఁగింపఁగన్ = లీనమయ్యేటట్లు చేయగా; నెక్కొని = సమకూడి; ప్రాణంబున్ = ప్రాణవాయువున్నూ; అపానంబునున్ = అపానమనేవాయువున్నూ అనగా ఉచ్ఛ్వాసనిశ్వాసములు రెండూ; యోగమున సిద్ధికిన్+ఐ = యోగం ఫలించుటకై; వశ్యతన్ = అధీనములై; నిలుచున్ = నిలబడుతాయి.

తాత్పర్యం: మనస్సున ఐదింద్రియాలనూ, మనస్సునూ ఆత్మయందు లీన మొనర్చగా ఉచ్ఛ్వాస నిశ్వాసములు రెండున్నూ యోగం సిద్ధించటానికి అధీనములై ఉంటాయి.

తే. అవహితుం డయి తద్దశ యనుభవింపఁ । గా నపానమిశ్ర ప్రాణ గతికి మూర్ధ
మతివ! యమ్మెయి నెలవగు; నతఁడ చూవె । జీవుఁ డనఁ బరమాత్ముండు నా వెలుంగు.' 258

ప్రతిపదార్థం: అతివ! = ఓ కాంతా! అవహితుండు+అయి = మనుజుడు సావధానుడై; తత్+దశ+అనుభవింపఁగన్ = ఆ స్థితిని అనుభవిస్తుండగా; అపానమిశ్ర ప్రాణగతికిన్ = అపానవాయువుతో గూడిన ప్రాణవాయువు యొక్క గమనానికి; మూర్ధము = శిరస్సు; ఆ+మెయిన్ = ఆ రీతిగా; నెలవు+అగున్ = స్థానమవుతుంది; అతఁడు+అ = ఆస్థానమయిన వాడే; జీవుఁడు+అనన్ = జీవుడనగా; పరమాత్ముండు నాన్ = పరమాత్ముడనగా; వెలుంగున్+చూవె! = విరాజిల్లుతాడు సుమా!

తాత్పర్యం: మనుజుడు ఏకాగ్రచిత్తుడై మీద చెప్పిన స్థితియందుండగా అపానవాయువుతో కూడిన ప్రాణవాయువు యొక్క గమనమునకు శిరస్సు నిలయమవుతుంది. నిలయమైన అతడే జీవుడని, పరమాత్మ అని చెప్పబడుతూ ప్రకాశిస్తున్నాడు.'

వ. అని వెండియు. 259

తాత్పర్యం: అని చెప్పి మరల శివుడు (భవానితో ఇట్లా అంటున్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. ప్రాణు నపానునందును నపానునిఁ బ్రాణునియందు నిల్పి ని
ర్వాణముఁ గోరి చిత్తము తిరంబుగఁ బట్టఁగఁ బ్రాణసంయమా
క్షీణత దేహమధ్యశిఖిఁ జిమ్ముఁగఁ దత్త్రయ మొంది మూర్ధపా
లీణతఁ గోర్కి సల్పు నపరిచ్యుతిఁ దద్గతుఁడైన యోగికిన్. 260

ప్రతిపదార్థం: ప్రాణున్ = ప్రాణవాయువును; అపాను+అందున్ = అపానవాయువునందును; అపానునిన్ = అపానమును; ప్రాణుని+అందున్ = ప్రాణమునందును; నిల్పి = స్థాపించి, ఉంచి; నిర్వాణమున్+కోరి = మోక్షము నపేక్షించి; చిత్తము = మనస్సు; తిరంబుగన్ = స్థిరముగా, దృఢముగా, నిశ్చలముగా; పట్టఁగన్ = స్వాధీనపరచుకొనగా; నిగ్రహించగా; తత్+గతుఁ డు+ఐన+యోగికిన్ = అట్టి యోగవిధానమందు నెలకొన్న యోగికి; ప్రాణసంయమ+అక్షీణత = ప్రాణనిరోధము యొక్క

ఆధిక్యము; దేహమధ్యశిఖిన్ = శరీరము యొక్క నడుమనున్న అగ్నిని- ఊష్మమును; చిమ్మన్+కన్ = వ్యాప్తం చేయగా, విసరగా, ఎగమీటగా; తత్+త్రయము = ప్రాణము, అపానము, దేహమధ్యాగ్ని అను మూడున్నూ; ఒంది = చేరుకొని; అపరిచ్యుతిన్ = జారుపాటులేనితనంతో; తొలగిపోకుండా; మూర్ధపారీణతన్ = శిరస్థానమును భేదించుకొని పోవుటయందు; కోర్కి సల్పున్ = అభిలాష వహిస్తాయి.

తాత్పర్యం: ప్రాణమును అపానములో, అపానమును ప్రాణములో స్థాపించి ముక్తిని వాంఛించి మనస్సును గట్టిగా నిరోధించగా ఆ యోగ మార్గము నందు నిరతుడైన యోగికి ప్రాణనిరోధ సంపన్నత్వం శరీరమందలి ఊష్మమును పైకి ఎగజిమ్మగా ఆ ప్రాణాపాన దేహాగ్నులు మూడును చేరి ఏ మాత్రము జారుపాటు లేకుండ మూర్థ స్థానమును భేదించుకొని పోవుటలో అభిలాష వహిస్తాయి.

విశేషం: తపస్విభ్యోஉధికో యోగీ జ్ఞానిభ్యోஉపి మతోஉధికః,
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున. (భగ. 6-46)

"అర్జునా! యోగి కృచ్ఛ్ర చాంద్రాయణాది రూపమైన తపస్సులు చేసే వారికంటె, శాస్త్ర జన్యజ్ఞానం గల వారి కంటె, ఇష్టాపూర్తాది కర్మలు ఆచరించేవారి కంటె శ్రేష్ఠుడు. కనుక నీవు యోగివి కమ్ము" అని యోగం యొక్క గొప్పతనం చెప్పి దాని తీరుతెన్నులు ఆత్మసంయమయోగంలో శ్రీకృష్ణభగవానుడు అర్జునుడికి వివరిస్తాడు.

వ. అని చెప్పి వెండియు. 261

తాత్పర్యం: అని పరమేశ్వరుడు గౌరితో చెప్పి మరల (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

చ. అలసతయున్ విచిత్తతయు నత్యశనాదరణంబు రోగముం
గలయును లోభమున్ భయముఁ గామముఁ గ్రోధము లౌల్యమున్ విరో
ధులు విను యోగసేవకు; నదుష్టతఁ బేర్చిన యోగ మిచ్చు సి
ద్ధు లెనిమిదింట నప్రతిహతుం డయి యోగి చరించు నెల్లెడన్. 262

ప్రతిపదార్థం: అలసతయున్ = సోమరితనమూ, జడత, మాంద్యమూ; విచిత్తతయున్ = పరధ్యానంలో ఉండటం, పరాకు; అతి+అశన+ఆదరణంబున్ = మిక్కుటంగా తినడంలో అపేక్ష; రోగమున్ = వ్యాధియూ; కలయును = స్వప్నమూ, నిదుర; లోభమున్ = దురాశ, పిసినిగొట్టుతనం; భయమున్ = భీతియూ; కామమున్ = స్త్రీ వాంఛ, కోరిక; క్రోధమున్ = కోపం; లౌల్యమున్ = విషయాసక్తి, భోగేచ్ఛ, చాపల్యం; యోగసేవకున్ = యోగాభ్యాసానికి; విరోధులు = శత్రువులు; విను = వినుము; అదుష్టతన్ = దోషరహితత్వంతో; పేర్చిన యోగము = అతిశయించిన యోగం; ఇచ్చు = ప్రసాదించునట్టి; సిద్ధులు+ఎనిమిదింటన్ = అష్టసిద్ధులతో; అప్రతిహతుండు+అయి = అడ్డులేని వాడై, ఎదురులేని వాడై, ఆటంకంలేనివాడై; యోగి = యోగీశ్వరుడు; ఎల్ల+ఎడన్ = అన్నిచోట్ల, అంతటా; చరించున్ = తిరుగ గలడు.

తాత్పర్యం: సోమరితనం, పరధ్యానంలో ఉండటం, విపరీతంగా తిండితినటం, రోగం, నిదుర, పిసినిగొట్టు తనం, భీతి, స్త్రీవాంఛ (కోరిక), కోపం, విషయాసక్తి లేదా భోగేచ్ఛ అనేవి యోగానుష్ఠానానికి ప్రబలశత్రువులు. దోషరహితమై ఒప్పారునట్టి యోగం ప్రసాదించే అష్టసిద్ధులతో యోగి అడ్డమాపులేక అంతటా యథేచ్ఛగా విహరించగలడు.

విశేషం: అష్టసిద్ధులు: అణిమా మహిమాచైవ గరిమా లఘిమా తథా, ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం వశిత్వం చాష్టసిద్ధయః.

1) అణిమ = అణుస్వభావం. దీనివలన సూక్ష్మాకారం ధరించి సర్వత్ర వెళ్ళటానికి శక్తి సమకూడుతుంది.

2) మహిమ = గొప్పతనం; ఇందువలన బృహత్స్వరూపం ధరించుటకు వీలవుతుంది.

3) లఘిమ = తేలికగా ఉండటం: దీని వలన తన కిష్టం వచ్చినపుడు చులకనగా ఉండ గలశక్తి లభిస్తుంది.

4) గరిమ = భారమగుట: తన్నెంత బలవంతులైననూ పైకెత్త లేనంత బరువుగా తానుండ గల శక్తి ఈ ఐశ్వర్యం వలన సమకూడుతుంది.

5) ప్రాప్తి = పొందటం: దీని వలన వాంఛితార్థం వెంటనే పొందబడుతుంది.

6) ప్రాకామ్యం = తన కోరికకు అడ్డులేకుండటం.

7) ఈశత్వం = ప్రాభవం కలిగి ఉండటం.

8) వశిత్వం = లోబరుచుకొనటం.

ఆ. నిద్రపెంపు నిద్ర నిగ్రహించుటయును । గొలఁది మీఱు కుడుపుఁ గుడువమియును
యోగి కొప్ప; వతఁడు యుక్త వర్తనుఁడైన । నువిద! దుఃఖహారి యోగ మొందు. 263

ప్రతిపదార్థం: ఉవిద! = ఓ చెలీ!; నిద్రపెంపు = నిద్ర యొక్క ఆధిక్యం, ఎక్కువగా నిద్రించటం; నిద్ర నిగ్రహించుటయును = నిద్రను మానటం; కొలఁది మీఱు కుడుపున్ = మితిమీరి భుజించటం; కుడువమియును = అసలే భుజించకుండటం; యోగికిన్ = యోగానుష్ఠాన పరుడికి; ఒప్పవు = తగవు; అతఁడు = యోగి; యుక్త వర్తనుఁడు+ఐనన్ = తగిన తీరున యోగం అనుష్ఠిస్తే; దుఃఖహారి = దుఃఖాన్ని తొలగించునట్టి; యోగము = యోగమును; ఒందున్ = పొందగలడు.

తాత్పర్యం: ఎక్కువగా నిద్రపోవటం, బొత్తిగా నిద్రపోకుండా ఉండటం, మితిమీరి భుజించటం, మొదలే భుజించకుండా ఉండటం యోగికి తగవు. గౌరీ! యోగి తగిన తీరున మెలగితే దుఃఖాన్ని హరించే యోగం సిద్ధిస్తుంది.

విశేషం: "నాత్యశ్నతస్తు యోగోఽస్తి నచైకాంత మనశ్నతః,
న చాతి స్వప్న శీలస్య జాగ్రతో నైవ చార్జున!" (భగ. 6-16)

అపరిమితంగా తినే వాడికి, అసలే తినని వాడికి, ఎక్కువగా నిద్రించే వాడికి, ఎప్పుడూ మేల్కొని ఉండేవాడికి ఈ యోగం సిద్ధించదు.

"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు,
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా." (భగ. 6-17)

మితాహార విహారాలు, తన శక్తికి లోబడి మితంగా కార్యకలాపాలయందు ప్రవర్తించటం, మితంగా నిద్రపోవటం, మితమైన మెలకువ గలిగిన వాడికి కర్మబంధ విమోచనం కలిగించే యోగం సిద్ధిస్తుంది.

వ. ఇట్టిది యోగధర్మం' బనిన నంబిక 'సాంఖ్యయోగ శ్రవణంబునఁ బరిజ్ఞాత పరమార్థ నైతి; భవదీయ సాయుజ్యంబుభక్తు లెట్టి పరిచర్యం బడయుదు? రెఱింగింపవే' యని యడిగిన మృడుండు మృడాని కిట్లనియె. 264

ప్రతిపదార్థం: యోగధర్మంబు; ఇట్టిది = ఇట్లాంటిది; అనినన్; అంబిక = పార్వతి; సాంఖ్యయోగ శ్రవణంబునన్ = సాంఖ్య యోగములు వినటం చేత; పరిజ్ఞాత = చక్కగ తెలియబడిన; పరమార్థన్+ఐతిన్ = పరమార్థం కలదాననైనాను; మోక్షధర్మం తెలిసికొనగలిగాను; భవదీయసాయుజ్యంబున్ = నీలో ఐక్యమొందటాన్ని; భక్తులు; ఎట్టి పరిచర్యన్ = ఏ విధమైన సేవచేత; పడయుదురు = పొందగలరో; ఎఱింగింపవు+ఏ = తెలుపవా; అని; అడిగినన్; మృడుండు = శంకరుడు; మృడానికిన్ = శాంకరికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దేవీ! యోగ స్వరూప మిట్టి' దని శంకరుడు శర్వాణికి చెప్పగా ఆమె- 'దేవా! సాంఖ్యమును, యోగమును తమవలన విని పరమార్థ మెట్టిదో గ్రహించాను. మరి భక్తులు ఎట్టిసేవ చేసి నీలో ఐక్యమంద గలరో తెల్పుమని వేడుతున్నాను' అని పలుకగా ఈశ్వరుడు ఈశ్వరితో ఇట్లా అన్నాడు.

విశేషం: సాయుజ్యం చతుర్విధ ముక్తులలో ఒకటి.

1) సాయుజ్యం అనగా ఐక్యం, లయం. తాను కొలిచే దేవతలో లయం కావటం.
2) సారూప్యం = ఆ రూపంవంటి రూపం పొందటం అనగా సమానరూపత్వమును వహించటం.
3) సాలోక్యం = తన ఇష్టదేవత ఉన్న లోకంలో తానూ ఉండటం.
4) సామీప్యం = సాన్నిధ్యం, లేక సమానత్వం చెందటం'.

శివుండు పార్వతికి నాత్మసాయుజ్య ప్రాప్తిసాధనంబులు దెలుపుట. (సం.13- అను 1-4336).

క. **'విను మవిచింత్యుఁడ సురలకు । మునులకు నేనియును యోగమును సాంఖ్యము నా**
యొనరించినయవి యీశుఁడ । సనాతనుఁడ నవ్యయుండ సత్యాత్ముండన్. **265**

ప్రతిపదార్థం: వినుము = పార్వతీ! వినుము; సురలకున్ = దేవతలకు; మునులకున్+ఏనియున్ = మునీంద్రులకైననూ; అవిచింత్యుఁడన్ = ఊహించనలవిగాని వాడిని; యోగమును = యోగవిద్యయూ; సాంఖ్యమును = సాంఖ్యశాస్త్రమునూ; నా+ఒనరించిన+అవి = నేను రచించినట్టివి; ఈశుఁడన్ = సమస్తమునకు నేను ప్రభుడను; సనాతనుఁడన్ = శాశ్వతమైన వాడిని, ప్రాచీనుడిని, ఎప్పటినుండో ఉన్నవాడిని; అవ్యయుండన్ = నాశరహితుడిని; సత్య+ఆత్ముండన్ = సత్యస్వరూపుడిని.

తాత్పర్యం: ప్రేయసీ! వినుము. వేల్పులకునూ, మునులకునూ నే నిట్టివాడనని ఊహింపనలవిగాని వాడిని. సాంఖ్యయోగ శాస్త్రములు రెంటికినీ నేనే కర్తను, నేనే సర్వమునకు అధిపతిని. పురాణపురుషుడను నేనే. నేనే నాశరహితుడిని, నేనే సత్యస్వరూపుడిని.

క. **ఏను బ్రసన్నుఁడనైనం । గానిది లే దర్చకులకుఁ గావున మంత్ర**
ధ్యానస్తుతి వందన ముఖ । నానాభజనముల వలయు నైష్ఠికత శివా! **266**

ప్రతిపదార్థం: శివా! = దుర్గా!; ఏను = నేను; ప్రసన్నుఁడన్+ఐనన్ = అనుగ్రహిస్తే; అర్చకులకున్ = నన్ను కొలిచే వారికి, కానిదిలేదు = దుర్లభమైనది ఏదీ లేదు; కావునన్ = కనుక; మంత్ర = మంత్రం; ధ్యాన = చింతనమూ; స్తుతి = స్తోత్రమూ; వందనముఖ = నమస్కారం మొదలైన; నానాభజనములన్ = పలువిధాలైన సేవలందు; నైష్ఠికత = ఆసక్తి, నిలుకడ, దీక్ష; వలయున్ = ఉండవలె.

తాత్పర్యం: దుర్గా! నేను దయదలిస్తే నన్ను కొలుచునట్టివారికి సకలప్రయోజనాలు సమకూడుతాయి. కనుక మంత్ర జపం, చింతనం, స్తోత్రం, నమస్కారం మొదలైన సకల విధాలైన నా సేవలందు భక్తుడు నిష్ఠాపరుడై ఉండటం ముఖ్యం.

ఆ. నాలుగాశ్రమముల నలువురు విప్రుల । కతివ! పాశుపతమహావ్రతంబు
తెఱఁగు లేను దొల్లి దెలిపితి; శిష్య ప్ర । శిష్య సరణి నది ప్రసిద్ధ మయ్యె. 267

ప్రతిపదార్థం: అతివ! = రమణీ! నాలుగు+ఆశ్రమములన్ = బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాలలోని; నలువురు విప్రులకున్ = నలుగురు బ్రాహ్మణులకు; పాశుపత మహావ్రతంబు తెఱఁగులు = పాశుపతమనే గొప్పవ్రతము యొక్క విధానాలు; ఏను = నేను; తొల్లి = మునుపు; తెలిపితిన్ = బోధించాను, చెప్పినాను; అది = ఆ వ్రత విధానం; శిష్య ప్రశిష్యసరణిన్ = శిష్యులు, ఆ శిష్యులకు శిష్యులు అనేవారి ద్వారా; ప్రసిద్ధము+అయ్యెన్ = లోక విఖ్యాతి గాంచింది;

తాత్పర్యం: దేవీ! పూర్వం నేను బ్రహ్మచర్యం మొదలగు నాలుగు ఆశ్రమాల లోని నలుగురు బ్రాహ్మణులకు పాశుపత మహావ్రత విధానాన్ని బోధించాను. అది ఆ నలుగురు బ్రాహ్మణులవలన, వారి శిష్యులవలన, ప్రశిష్యులవలన జగత్ప్రఖ్యాతి చెందింది.

క. మంగళ రక్షా శుచితా । లింగార్చన యోగ్యతలు ఫలించుటకై భూ
తిం గావించితిఁ; దల్లి । ప్తాంగులును గపాలధరులునై శాంతిమెయిన్. 268

ప్రతిపదార్థం: మంగళ రక్షా = శుభముల యొక్క రక్షణ; శుచితా = పావనత్వం; లింగ+అర్చనయోగ్యతలు = లింగమును పూజించుటకు అర్హతలు; ఫలించుటకై = నెరవేరుటకై, సిద్ధించుటకై; భూతిన్ = విభూతిని; కావించితిని = రూపొందించాను; తత్+లిప్త+అంగులును = ఆ భస్మమును దేహము నందు ధరించిన వారునూ; కపాలధరులును = భిక్షాపాత్రను ధరించిన వారును, ఐ = అయి; శాంతిమెయిన్ = మనోనిగ్రహంతో, శాంతిస్వభావంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: దేవీ! మంగళ రక్షణ కొరకు, పవిత్రత సమకూడటం కొరకు, లింగము నర్చించే యోగ్యత సిద్ధించటం కొరకు నేను విభూతిని రూపొందించాను. ఆ విభూతిని శరీరమందు అలదుకొని, భిక్షాపాత్రను చేబూని మనో నిగ్రహంతో.

తే. బ్రహ్మచర్య భిక్షాశన పరత గలిగి । జటిత యొండె ముండిత యొండె సంభరించి
మనసు నాయంద తిరముగా నునిచి యొండు । వస్తువుల దెస నొల్లమి వర్తిలంగ. 269

ప్రతిపదార్థం: బ్రహ్మచర్య = బ్రహ్మచర్యవ్రతం; భిక్షా+అశనపరతకలిగి = భిక్షాన్నం భుజించటం అనువాటియందు ఆసక్తి కలిగి; జటిత+ఒండెన్ = జడలు దాల్చటం గాని; ముండిత+ఒండెన్ = తల బోడి చేయించుకొనటంగాని; సంభరించి = స్వీకరించి; మనసున్ = చిత్తాన్ని; నాయందు+అ = నా మీదనే; తిరముగాన్+ఉనిచి = నిశ్చలంగా నిలిపి, దృఢంగా, గట్టిగా నిలిపి; ఒండు వస్తువులదెసన్ = ఇతరములైన ప్రాపంచిక వస్తువుల విషయంలో; ఒల్లమి = అనాదరం; వర్తిలంగన్ = సాగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: బ్రహ్మచర్యవ్రతం అవలంబించి, భిక్షాన్నం భుజిస్తూ, జుట్టు పెంచుకొని గాని, తలగొరిగించుకొనిగాని

ఉంటూ, నాయందు గట్టిగా మనసుంచి, ఇతర వస్తువుల పట్ల అనాదరం గలిగిన వారై.

క. చరియించు భక్తజనులకుఁ । బరమానందైకతానుభవ మొసఁగుదు; న
వ్వెరవున మత్సాయుజ్యము । దొరకును వారలకు వికచతోయజవదనా! 270

ప్రతిపదార్థం: చరియించు = ప్రవర్తించే; భక్త జనులకున్ = నా భక్తులైన వారికి; పరమ+ఆనంద+ఏకతా+అనుభవము = శ్రేష్ఠమైన ఆనందము యొక్క ముఖ్యానుభవం, మహానందము యొక్క పరమానుభూతిని; ఒసఁగుదున్ = అనుగ్రహిస్తాను; వికచతోయజవదనా! = వికసించిన పద్మం వంటి ముఖం కలదానా!; ఆ+వెరవునన్ = చిత్తం నాయందే దృఢముగ లగ్నమొనర్చి, నాకంటె అన్యములైన వస్తువులను అనాదరించటం అనే ఉపాయంచేత; వారలకున్ = నా భక్తులకు; మత్+సాయుజ్యము = నన్ను పొందటం, నాలో ఐక్యంకావటం అనేది; దొరకును = లభిస్తుంది.

తాత్పర్యం: పూచిన కమలం వంటి ముఖము గల కాత్యాయనీ దేవీ! మనసు నాయందే నిశ్చలంగా నిల్పి ప్రవర్తించే భక్తజనావళికి బ్రహ్మానందము యొక్క పరమానుభూతిని ప్రసాదిస్తాను. ఆ ఉపాయంతోనే భక్తులు నా సాయుజ్యమును పడయగలరు.

వ. ఇది సాయుజ్యావాప్తి ప్రకారం' బని చెప్పి వెండియు. 271

ప్రతిపదార్థం: ఇది = ఇపుడు నేను నుడివింది; సాయుజ్య+అవాప్తి ప్రకారంబు = సాయుజ్యమనే మోక్షం పొందునట్టి విధానం; అని చెప్పి; వెండియున్ = మళ్ళీ, (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఇది సాయుజ్యమనే ముక్తిని పొందే విధమని గౌరికి చెప్పి శంకరుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. శివలింగ స్థాపనముఁ ద్రి । భువనములం బరమహితము పొంటెం గరుణన్
ధవళాక్షి! చేసితిం ద । త్ప్ర విమల లింగమున నన్ను భావించు టుఱున్. 272

ప్రతిపదార్థం: ధవళ+అక్షి! = ఓ తెలికన్నుల చెలీ!; పరమహితము పొంటెన్ = మిక్కిలిమేలు కలిగించేటందుకు; కరుణన్= కృపతో; త్రిభువనములన్ = ముల్లోకాలలో; శివలింగస్థాపనమున్+చేసితిన్ = శివలింగాలను ప్రతిష్ఠించాను; తత్ = ఆ యొక్క ప్రవిమల లింగమునన్ = నిర్మలమైన లింగంలో; నన్నున్ = నన్ను; భావించుట= తలంచటం, స్మరించటం; ఉఱున్= తగును.

తాత్పర్యం: శైలకుమారీ! ముజ్జగాలకు మేలు చేయదలచి దయతో నేనే శివలింగాలను స్థాపించాను. ఆ పవిత్రమైన లింగాలను నాస్వరూపంగా ఎంచి పూజించటం సముచితం.

చ. కలమెయిఁ బాల నేత నుదకంబులనేని వరాభిషేక మం
గళము నొనర్చి భక్తి రతి గంధము మాల్యము ధూప దీప సం
కలనములన్ నివేద్యమును గాఢ సమర్పణ మొందఁ జేసి లిం
గలసితమూర్తియందు ననుఁ గాంచి భజించిన ముక్తి చేకుఱున్.' 273

ప్రతిపదార్థం: కలమెయిన్ = ఉన్నంతలో, తన శక్తికి తగినట్లు; పాలన్ = క్షీరంతో; నేతన్ = నేయితో; ఉదకంబులన్+ఏనిన్

= నీళ్ళతో నైనా; వర+అభిషేకమంగళము = శ్రేష్ఠమైన మజ్జనమనెడు శుభమును; ఒనర్చి = చేసి; భక్తిరతిన్ = భక్తితత్పరతతో; గంధమున్ = చందనం; మాల్యమున్ = పూలదండలు; ధూపదీప సంకలనములన్ = సాంబ్రాణి పొగవేయటం, దీపమును వెలిగించి చూపటం అనే ఉపచారాల యొక్క కూడికతో; నివేద్యమును = నైవేద్యాన్ని; గాఢసమర్పణము+ఒందన్+చేసి = అధికపూజ్యభావంతో సమర్పణ కావించి; లింగలసిత మూర్తి+అందున్ = శివలింగము యొక్క ఒప్పిదమైన స్వరూపమందు; ననున్ = నన్ను; కాంచి = దర్శించి; భజించినన్ = కొలిస్తే; ముక్తి = మోక్షం; చేకుఱున్ = లభిస్తుంది.

తాత్పర్యం: పార్వతీ! తన శక్తికి తగినట్లు క్షీరంతోనూ, ఘృతంతోనూ, లేదా జలంతోనైనా లింగమునకు అభిషేకం సల్పి భక్తితో గంధపుష్ప ధూపదీప నైవేద్యములు సమర్పించి ఆ శివలింగమునందు పరమేశ్వరుడనైన నన్ను దర్శించి భజించే భక్తులకు ముక్తి లభిస్తుంది.'

క. అని పలికి 'నీవు దేవాం । గన లాదిగఁ గల త్రిలోక కాంతలకును మ్రొ
క్కునకుం బాత్రం బగు పద । వనజంబులు గల్గి యొప్పు వరసతి వతివా!. 274

ప్రతిపదార్థం: అని పలికి = అని ఈశ్వరుడు వచించి; అతివా! = ఓ భామినీ!; నీవు; దేవ+అంగనలు = దేవతాస్త్రీలు, వేల్పు బోటులు; ఆదిగన్+కల = మొదలుగా గల; త్రిలోక కాంతలకును = ముల్లోకాల లోని ముగుదలందరికినీ; మ్రొక్కునకున్ = వారు నమస్కరించుటకు; పాత్రంబు+అగు = అర్హమైన; పదవనజంబులు = పద్మముల వంటి పాదాలు; కల్గి = కలిగిన దానవై; ఒప్పు = ప్రకాశించే; వర సతివి = ఉత్తమ పతివ్రతవు కదా!

తాత్పర్యం: ఆ విధంగా గిరిజతో పలికి శంకరుడు ఆమెను చూచి 'ప్రాణేశ్వరీ! నీవు దేవతా స్త్రీలు మొదలుగా ముజ్జగాలలోని వెలదులందరి మ్రొక్కులు స్వీకరించ దగిన పాదపద్మాలు గల పతివ్రతాశిరోమణివి సుమా!'

క. చతురవు వివేక విభవో । న్నత చిత్తవు వ్రతవిధాన నైష్ఠికతా సం
యుత మతివి లౌకిక జ్ఞా । నితా మహిమ సహజమతి వనిందిత వరయన్. 275

ప్రతిపదార్థం: చతురవు = నేర్పుగల దానవు, చుఱుకైన దానవు; వివేక విభవ+ఉన్నత చిత్తవు = యథార్థ జ్ఞానం యొక్క ఆధిక్యంతో కూడిన పెద్ద మనసు కలదానవు; వ్రత విధాననైష్ఠికతా సంయుత మతివి = నోములు నోమటంలో ఆసక్తితో కూడిన మనసు కల దానవు; లౌకిక జ్ఞానితా మహిమ సహజమతివి = లోకసంబంధమైన జ్ఞానం యొక్క గొప్పతనం పుట్టుకతోనే వచ్చిన చిత్తం కలదానవు; అరయన్ = పరిశీలించగా; అనిందితవు = మాటపడని దానవు, దూరులేని దానవు.

తాత్పర్యం: గౌరీ! నీవు నేర్పు కలిగిన దానవు, యథార్థజ్ఞాన వైభవంతో కూడిన దొడ్డమనసు కలదానవు, వ్రత విధానములందు నిష్ఠతో కూడిన చిత్తం కలదానవు, సహజంగా వచ్చిన లోకజ్ఞానంతో కూడిన హృదయం కల దానవు. నీవు మాటపడని దానవు.

క. కావునఁ గాంతా ధర్మము । నీ వలనం దెలియువేడ్క నెమ్మనమున నా
కావిర్భవించెఁ; జెప్పం । గా వలయును దాని వికచకమలదళాక్షీ!.' 276

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; వికచకమల దళ+అక్షీ! = వికసించిన తామర రేకుల వంటి నేత్రములు కలదానా!; కాంతా ధర్మమున్ = స్త్రీ ధర్మాన్ని; నీవలనన్ = నీ మూలంగా; తెలియు వేడ్క = తెలిసికొనవలెననే ఇచ్ఛ, కుతూహలం; నెమ్మనమునన్ (నెఱ+మనమునన్) నా నిండు మనసులో; ఆవిర్భవించెన్ = జనించింది; దానిన్ = మహిళా ధర్మాన్ని; చెప్పన్+కాన్+వలయున్ = నీవు చెప్పాలి.

తాత్పర్యం: ప్రాణేశ్వరీ! వనితా ధర్మం ఎట్లాంటిదో నీ వలన తెలియవలెననే కుతూహలం నా హృదయంలో కలిగింది. కనుక స్త్రీ ధర్మం ఎట్టిదో నీవు చెప్పాలి.'

ఆ. **అనిన సిగ్గుతోడి యలఁతి న వ్వొలసిన । చెన్ను మొగము వింత చెలువుఁ దాల్ప**
వాంచి యెత్తి గౌరి వరునితో నిట్లను । 'నేను మీకుఁ దెల్ప నెంతదాన?. **277**

ప్రతిపదార్థం: అనినన్ = అని శివుడు తన్నడుగగా; సిగ్గుతోడి = లజ్జతో కూడిన; అలఁతినవ్వు = చిరునగవు, చిన్నినవ్వు, పిన్న నవ్వు; ఒలసిన = వ్యాపించిన; చెన్ను మొగము = సుందరమైన వదనం; వింత చెలువున్+తాల్పన్ = కొత్త అందాన్ని పొందగా; వాంచి = సిగ్గు బరువున ముందు తలను వంచు కొన్నదై; ఎత్తి = భర్తకు బదులాడ వలసి ఉన్నందున వంచిన మొగం పైకెత్తి; గౌరి = గిరిసుత అయిన పరమేశ్వరి; వరునితోన్ = పెనిమిటి అయిన శంభుడితో; ఇట్లు+అనున్ = ఈ రీతిగా పలికింది; నేను = నేను; మీకున్ = సర్వజ్ఞులైన తమకు; తెల్పన్ = స్త్రీ ధర్మాన్ని మనవి చేయటానికి; ఎంత దానన్? = ఏ పాటిదాన్ని?

తాత్పర్యం: శివుడు స్త్రీధర్మం వివరించుమని అడిగినపుడు గౌరీదేవి సిగ్గుతో కూడిన చిన్నినవ్వు ఎగబ్రాకి తన అందమైన మోమునకు అపూర్వమైన సొబగును సమకూర్చగా వంచిన వదనాన్ని కొంచెం పైకెత్తి మగడితో ఇట్లా అన్నది. 'నాథా! తరుణీ ధర్మం ఎట్లాంటిదో తమకు నివేదించటానికి నే నేపాటిదాన్ని?

విశేషం: పాత్రల యొక్క స్వరూప రూప చిత్రణకౌశలం కవిబ్రహ్మ తిక్కన గారికి అలవడినట్లు సారస్వతరంగంలో మరేకవికి అలవడలేదన్న మాట పాతమాట. ఈ చిరుపద్యంలో పార్వతీ దేవిని పాఠకుల కట్టెదుట నిల్పినాడు బుధజన విరాజి తిక్కన సోమయాజి.

క. **ఐనను మీరడిగిన మ । న్మానస బోధంబు కొలఁది మగువల తెఱఁగుల్**
పూని వినిపింప కుండుట । దాన తగదు గాన చెప్పెదను సర్వజ్ఞా!' **278**

ప్రతిపదార్థం: ఐనను = మీకు తెలుపునంతటిదాన్ని కాకున్నా; మీరు = తమరు; అడిగినన్ = తెలుపుమన్నప్పుడు; మగువల తెఱఁగుల్ = ఆడువారి తీరులు; మత్+మానస+బోధంబు కొలఁదిన్ = నాచిత్త మందలి తెలివి కొద్దీ; పూని = యత్నించి; వినిపింపక+ఉండుట = తెలియజేయకుండటం; తాన = అనునది; తగదు+కానన్ = యుక్తం కాదు కనుక; సర్వజ్ఞా! = సమస్త మెరింగిన స్వామీ!; చెప్పెదను = వచిస్తాను, మనవి చేస్తాను.

తాత్పర్యం: సర్వజ్ఞుడవైన స్వామీ! మీరు స్త్రీ ధర్మ మెట్టిదో తెలుపుమని అడిగినప్పుడు నాకు తెలిసినంతవరకు చెప్పకుండటం మంచిది కాదు కనుక మనవి చేస్తాను.'

క. **అని పలికి మఱియు నిట్లను । 'నను నెప్పుడుఁ బాయకుండు నదు లెల్లను; న**
వ్వనితలతోడ సమాలో । చన మొనరించి మఱి చెప్పఁ జను నిత్తెఱఁగున్.' **279**

ప్రతిపదార్థం: అని పలికి = అని గౌరి వచించి; మఱియున్ = ఇంకా; ఇట్లు+అనున్ = ఈ లాగున చెప్పింది; ననున్ = నన్ను; ఎప్పుడున్ = అన్ని వేళల; నదులు+ఎల్లను = నదులన్నియూ; పాయక+ఉండున్ = విడిచి పెట్టక నాతోనే ఉంటాయి;

ఆ+వనితల తోడన్ = ఆ మగువలతో, ఆ నదీమతల్లులతో; సమాలోచనము+ఒనరించి = యోచించి, సంప్రదించి; మఱి = పిదప, పిమ్మట, తరువాత; ఈ+తెఱఁగున్ = మీ రడిగిన తరుణీ ధర్మాలను; చెప్పన్+అగున్ = చెప్పదగును, చెప్పుతాను.

తాత్పర్యం: గౌరి మహేశ్వరుడితో అట్లా పలికి మళ్ళీ ఇట్లా అన్నది. 'దేవా! నదులెల్లను ఎల్లవేళల నన్ను విడువకుండా ఉంటాయి. ఆ నదీమతల్లులతో సంప్రదించిన తరువాత తా మడిగిన స్త్రీ ధర్మాలు ఎట్టివో మనవిచేస్తాను.'

వ. అని విన్నవించి గంగ యమున గోదావరి కౌశికి కావేరి కృష్ణవేణి పెన్న నర్మద బాహుద రేవ తమస మొదలైన నదులు మున్న తనతోడన వచ్చి యున్న నన్నాతుల గుఱించి 'యీశానుం డిట్లడిగెడు నెట్లు చెప్పద?' మనిన గంగాదేవి 'నీకంటె నే మెఱుంగుదుమే? నీ వెఱింగిన తెఱంగున నంగనాధర్మం బెఱింగించి పతిం బ్రీతునిం జేయు; మేము భవదీయ వాగమృతంబు వీనుల నినిచెద' మనుటయుఁ బార్వతి ప్రసన్నచిత్తయై వల్లభు వదనంబునం జూడ్కి నిలిపి. 280

ప్రతిపదార్థం: అని, విన్నవించి = మనవి చేసికొని; గంగ = భాగీరథి; యమున = కాళింది; గోదావరి = గౌతమి; కౌశికి, కావేరి, కృష్ణవేణి, పెన్న = పినాకిని; నర్మద, బాహుద, రేవ, తమస, మొదలు+ఐన = మున్నుగా కలిగిన; నదులు; మున్ను+అ = ముందుగానే; తన తోడను+అ; వచ్చి+ఉన్నన్ = వచ్చిఉండగా; ఆ+నాతులన్ గుఱించి = ఆ మగువల (నదుల) నుద్దేశించి, ఆ నదులతో; ఈశానుండు = ఈశ్వరుడు; ఇట్లు; అడిగెడున్ = అడుగుతున్నాడు; ఎట్లు; చెప్పుదము = సమాధానమిస్తాము; అనినన్; గంగాదేవి; నీ కంటెన్; ఏము = మేము; ఎఱుంగుదుము+ఏ; నీవు; ఎఱింగిన; తెఱంగునన్ = విధమున; అంగనా ధర్మంబు = స్త్రీ ధర్మం; ఎఱింగించి; పతిన్ = భర్తను; ప్రీతునిన్+చేయుము = సంతోషించిన వానిగా సల్పుము; ఏము = మేము, భవదీయ = నీ యొక్క; వాక్+అమృతంబు = వచనములనెడు సుధారసం; వీనులన్ = చెవులలో; నినిచెదము = నిండించెదము; అనుటయున్ = అని చెప్పగా; పార్వతి; ప్రసన్నచిత్త+ఐ = సంతుష్టాంతరంగఅయి, అనుగ్రహ యుక్తమగు మనస్సు గలదై; వల్లభు వదనంబునన్ = పెనిమిటి యొక్క ముఖమునందు; చూడ్కి నిలిపి = చూపులు ప్రసరింపజేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అంబికాదేవి అట్లా పలికి గంగ, యమున, గోదావరి, కావేరి, కృష్ణవేణి, పెన్న, బాహుద, రేవ, తమస మున్నగు వాహినులు మునుపే తనతో అక్కడికి వచ్చి ఉన్నందున వాటిని చూచి 'ఓ చెలులారా! శివదేవుడు స్త్రీ ధర్మ మెఱింగింపుమని కోరినాడు. మన మేమి చెప్పవలెనో చెప్పండి' అని అడిగింది. అందుకు గంగాదేవి ఆమెతో 'అమ్మా! నీకంటె స్త్రీ ధర్మాలు మా కేమి తెలుసు? నీకు తెలిసిన విధంగా నీవే అతివల ధర్మాలు అభవున కెరిగించి సంతోషపెట్టుము. మేము నీ వాక్యామృతాన్ని వీనుల విందుగా ఆస్వాదించి హర్షిస్తాము' అని పలికింది. అప్పుడు ఉమాదేవి ప్రసన్నురాలై పతిముఖారవిందం మీద చూపు నిలిపి (ఇట్లా చెప్పింది).

క. 'దేవా! నీదు ప్రసాద । శ్రీ వచ్చిన యెఱుక సుందరీవిధము భవ
ద్భావంబునకుఁ బ్రియంబుగ । సేవాధర్మంబుఁ దెలియఁ జెప్పెద' ననియెన్. 281

ప్రతిపదార్థం: దేవా! = ప్రభూ!; నీదు ప్రసాదశ్రీన్ = నీ అనుగ్రహసంపత్తిచే; వచ్చిన = లభించిన; ఎఱుకన్ = తెలివితో, జ్ఞానంతో; సుందరీ విధము = స్త్రీల యొక్క తీరు, స్వభావమును; భవత్+భావంబునకున్ = నీ యొక్క చిత్తమునకు; ప్రియంబుగన్ = ఇంపుగా, ఇష్టంగా; సేవాధర్మంబున్ = ఉపచారధర్మాన్ని; తెలియన్+చెప్పెదన్ = నీ వెరుంగునట్లు వచిస్తాను; అనియెన్ = అని చెప్పింది.

తాత్పర్యం: 'ప్రభూ! మీ పరమానుగ్రహంవలన లభించిన తెలివితో స్త్రీల స్వభావాన్ని, వారిసేవాధర్మాన్ని మీ మనస్సునకు ఇంపుగ తెలియ జెప్పుతాను' అని పలికింది.

తే. అనిన విని సురమునులు ప్రియంబుఁ బొంది । రమర గంధర్వ సిద్ధ సాధ్యాంగనా జ
నంబు వినువేడ్క వచ్చి య న్నలినవదన । వెనుక దెసనుండె దేవకీతనయ! యపుడు. 282

ప్రతిపదార్థం: అనినన్ = గౌరి అట్లావచింపగా; సురమునులు = దేవతలు, ఋషులు; విని = ఆలించి; ప్రియంబున్+పొందిరి = సంతోషం చెందారు; దేవకీతనయ = శ్రీకృష్ణా!; అమర = వేల్పులు; గంధర్వ = గంధర్వులు; సిద్ధ = సిద్ధులు; సాధ్య = సాధ్యులు అనే వారి యొక్క; అంగనాజనంబు = స్త్రీ సమూహం; విను వేడ్కన్ = ఉమాదేవి మాటలు వినవలె నన్న కుతూహలంతో; వచ్చి = ఏతెంచి; ఆ+నలిన వదన వెనుక దెసన్ = ఆ పద్మముఖి యొక్క వెనుక వైపు; అపుడు = ఆ సమయాన; ఉండెన్ = ఉన్నది.

తాత్పర్యం: శైలజ మాటలు విని దేవతలు, మునులు హర్షించారు. సురలు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతుల యొక్క వనిత లందరూ ఆమె పలుకులు వినే కుతూహలంతో వచ్చి ఆమె వెనుక వైపు కూర్చొని ఉన్నారు కృష్ణా!

వ. అని చెప్పి య ప్పురుషోత్తము వీనులు వికసిల్లుచుండ నారదుం డిట్లనియె. 283

ప్రతిపదార్థం: అని చెప్పి, ఆ+పురుష+ఉత్తము = ఆ శ్రీకృష్ణ భగవానుడి యొక్క; వీనులు = చెవులు, వికసిల్లుచున్+ఉండన్ = విప్పారగా; వినవలెనని కుతూహల పడుచుండగా; నారదుండు, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: గౌరీదేవి మాటలు వినవలెనని కుతూహలంతో శ్రీకృష్ణుని కర్ణములు విప్పారగా నారదమహర్షి ఇట్లా అన్నాడు.

పార్వతి శివునకుఁ బతివ్రతా ధర్మంబుల తెఱఁ గెఱింగించుట.

క. వనితలుఁ బురుషులుఁ బ్రియమున । దను వినుతింపంగ శైలతనయ సమాక
ర్ణనకౌతుకి యగు నీశా । నునితో మృదురీతి నిట్లనుం గమలేశా! 284

ప్రతిపదార్థం: కమలా+ఈశా = లక్ష్మీ వల్లభా! కృష్ణా!; వనితలున్ = ఆడువారు; పురుషులున్ = మగవారు; ప్రియమునన్ = ఇష్టంగా; తనున్ = తనను; వినుతింపంగన్ = కొనియాడగా, స్తోత్రం చేయగా; శైలతనయ = హిమవంతుడి కూతురైన ఉమాదేవి; సమాకర్ణన కౌతుకి = వినుటయందు కుతూహలం కలవాడైన; ఈశానునితోన్ = శంభుడితో; మృదురీతిన్ = కోమల ఫణితితో; ఇట్లు+అనున్ = ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: స్త్రీలు, పురుషులు ప్రీతితో తనను స్తుతిస్తూ ఉండగా పర్వత రాజపుత్రిక తన పలుకులు వినుటకు కుతూహలపడుతున్న పరమేశ్వరుడితో కోమల కంఠస్వరాన ఇట్లా అన్నది.

సీ. 'ఋతుమతి గాక శుద్ధతయుఁ గల్గినయింతి । కన్య తత్పరిణయ కరణమునకు
నొడయులు విను తల్లియును దండ్రియును దండ్రి । తోఁ బుట్టినతఁడు మాతులుఁడు సోద
రుండును యోగ్యవరునిఁ జూచి వారిలో । నెవ్వరైనను బ్రీతి నిచ్చువారు;
పతి యంతనుండియుఁ బ్రభువు దానికి; నట్లు । గావున నాతండ దైవ మనుచు

తే. నతని మత మూఁది దేవతా పితృ సమర్చ । నములు నతిథి పూజనము సన్మతి సమాచ
రించుచును బతిహితము వాటించి నడపు । సతి పతివ్రత యిహపరసౌఖ్యమహిత. 285

ప్రతిపదార్థం: ఋతుమతి+కాక = పుష్పవతి కాక, సమర్తాడక; శుద్ధతయున్ = పరిశుద్ధత్వం; కల్గిన+ఇంతి = కలిగినటువంటి పిన్నది; కన్య = బాల అని చెప్పబడుతుంది; తత్+పరిణయ కరణమునకున్ = ఆ చిన్నదానికి పెళ్ళి చెయ్యడానికి; తల్లియును = జనని; తండ్రియును = జనకుడున్నూ; తండ్రితోఁ బుట్టిన+అతఁడున్ = తండ్రి యొక్క తోడబుట్టువు అనగా పినతండ్రి, చిన్నాయన, బాబాయి; మాతులుఁడున్ = మేనమామ అనగా తల్లి తోడబుట్టువు; సోదరుండును = ఆ బాలిక యొక్క తోడబుట్టిన వాడు; ఒడయులు = అధికారులు, కర్తలు; యోగ్యవరునిన్ = తగిన మగడిని; చూచి = కనుగొని; వారిలోన్ = పైనుడివిన వారిలో; ఎవ్వరు+ఐననున్ = ఎవ్వరో ఒక్కరు; ప్రీతిన్ = సంతోషంతో; ఇచ్చువారు = వరుడికిచ్చి పెళ్ళి చెయ్యటానికి అర్హులు; దానికిన్ = ఆ కన్నియకు; అంతన్+ఉండియున్ = పెళ్ళి అయినప్పటి నుండి; పతి = భర్తయే; ప్రభువు = నాయకుడు, పాలకుడు; అట్లు+కావునన్ = అందుచేత; ఆతండు+అ = ఆ పెనిమిటియే; దైవము+అనుచున్ = దేవుడంటూ; అతనిమతము+ఊఁది = అతడి ఇష్టము ననుసరించి, అతడి అభిప్రాయం ప్రకారం; దేవతా పితృసమర్చనములు = దేవతల యొక్క పితృదేవతల యొక్క పూజలు; అతిథి పూజనము = అతిథులను ఆదరించుటయు; సన్మతిన్ = మంచి మనస్సుతో; సమాచరించుచును = నిర్వర్తిస్తూ; పతిహితమున్+పాటించి = మగని యొక్క మేలు కోరి; నడపు = సంసార యాత్ర సాగించే; సతి = వనితయే; పతివ్రత = సాధ్వి; ఇహపర సౌఖ్యమహిత = ఆమెయే ఇహపర సుఖాలు పొందటంలోదొడ్డది.

తాత్పర్యం: పుష్పవతి గాక పరిశుద్ధురాలుగా ఉండే పిన్నదాన్ని కన్య అంటారు. ఆ చిన్నదానికి పెళ్ళి చేసే విషయంలో కర్తలు తల్లి, తండ్రి, పినతండ్రి, మేనమామ, అన్నదమ్ములు. వీరిలో ఎవ్వరైనా ఆ బాలికను తగిన పురుషుడి కిచ్చి సంతోషంతో వివాహం జరిపించాలి. పరిణయం జరిగింది మొదలుకొని ఆమెకు పెనిమిటియే సర్వాధికారి. పతినే దైవంగా భావించి అతడి ఇష్టానుసారం ఆమె దేవతల, పితృదేవతల పూజలు, అతిథి పూజలు సద్బుద్ధితో సలుపుతూ మగనిమేలు కోరుతూ సంసారయాత్ర సాగించాలి. అట్లాంటి పడతియే పతివ్రత. అట్టి ఇల్లాలు ఇహపరలోక సుఖాలు చూరగొంటుంది.

వ. ఏతద్విషయం బయిన యొక్క నిదర్శనం బవధరింపుము. 286

ప్రతిపదార్థం: ఏతద్+విషయంబు+అయిన = ఈ స్త్రీ ధర్మమునకు సంబంధించిన; ఒక్కనిదర్శనంబు = ఒక దృష్టాంతం; అవధరింపుము = చిత్తగించవలసింది;

తాత్పర్యం: దేవా! ఈ స్త్రీ ధర్మ విషయకమైన దృష్టాంతం ఒకటున్నది. విన్నవిస్తాను. చిత్తగించ ప్రార్థన.

సీ. బ్రాహ్మణుఁ డొకనికి భార్య లిద్దఱు గల; । రందొక భామిని యతని హితము
నడపెడు నవధాన మెడలి యాతఁడు పంప । కయుఁ దాన సురపితృకార్యపరత
నడచుఁ; దక్కటియింతి నాథుఁ బాటించుచుఁ । దన్మతంబునఁ జేయు ధర్మవిధులు;
వారు ముప్పురు విధివశమున నొక్కట । మృతిఁ బొంది; రా పతివ్రత వరుండు

తే. **చనిన సుగతికిఁ జనెఁ; బెఱవనిత జముఁడు। 'నీకుఁ బోలదు మరలుము నీశరీర**
మునక' యని యాఁగె; నది శోకమున సబాష్ప। యైనఁ గన్గొని యతఁడు దయార్ద్రుఁ డగుచు. 287

ప్రతిపదార్థం: బ్రాహ్మణుఁడు+ఒకనికిన్ = ఒక విప్రుడికి; భార్యలు+ఇద్దఱు = ఇరువురు పత్నులు; కలరు = ఉన్నారు; అందున్ = వారిలో; ఒక భామిని = ఒక చెలువ; అతని హితమున్ = అతడి కిష్టమైన దానిని; నడపెడున్ = సలుపుతుంది; ఆతఁడు = ఆమె భర్త; అవధానము+ఎడలి = ఏకాగ్రత చెడి, జ్ఞప్తి లేక, ఎఱుకమాలి; పంపకయున్ = ఆజ్ఞాపించకున్ననూ, తనను ఆ పనిచేయుమని నియమించకున్ననూ; తాను+అ = తానే, స్వయంగా; సురపితృకార్యపరతన్ = దేవ, పితృదేవతా పూజాదికములైన పనులయందు ఆసక్తితో; నడచున్ = ప్రవర్తిస్తూంటుంది, మెలగుతుంటుంది; తక్కటి+ఇంతి = రెండవపత్ని; నాథున్+పాటించుచున్ = భర్తమాట, భర్త అనుమతి ఆదరిస్తూ, లక్ష్యపెడుతూ; తత్+మతంబునన్ = అతడి ఇష్టానుసారం; ధర్మవిధులు = పుణ్యకార్యాలు; చేయున్ = సల్పుతుంది; వారు మువ్వురున్ = భర్త, భార్యలిద్దరూ; విధివశమునన్ = దైవాజ్ఞకులోనై; ఒక్కట = ఏకకాలమందు; మృతిన్+పొందిరి = మరణించారు; ఆ పతివ్రత = ఆసాధ్వి అనగా రెండవ యిల్లాలు; వరుండు = మగడు; చనినసుగతికిన్ = వెళ్ళిన పుణ్యలోకానికి, స్వర్గానికి; చనెన్ = వెళ్ళింది; పెఱవనితన్ = తక్కిన వెలదిని- అనగా మొదటి భార్యను; జముఁడు = యమధర్మరాజు; నీకున్ = నీకు; పోలదు = తగదు; నీ శరీరమునకు+అ = నీ దేహమునకే; మరలుము = తిరిగిపొమ్ము; అని = అని పలుకుతూ; ఆఁగెన్ = నిలిపినాడు; అది = ఆ మొదటి పెండ్లం; శోకమునన్ = ఏడుపుతో; సబాష్ప+ఐనన్ = కన్నీటి బొట్లతో కూడినది కాగా; కన్గొని = చూచి, అతఁడు = యముడు; దయా+ఆర్ద్రుఁడు+అగుచున్ = కృపారసముతో తడిసిన వాఁడై, దయతో చెమ్మగిల్లిన మనసుకలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ఒకానొక బ్రాహ్మణుడికి ఇద్దరు భార్యలు. వారిలో ఒకతె (తొలిది) మగని కుశలం కోరి, తనను ఈ పనిచేయుమని అతడు నియోగించక పోయినా దేవతలకు, పితృదేవతలకు పూజాదికం నిర్వహించేది. మరి యొకతె (మలిది) పతి మాట జవదాటక అతడి ఆజ్ఞ పడసి పుణ్యకార్యాలు సలిపేది. వారు మువ్వురూ విధివశాత్తు ఏకకాలంలోనే చనిపోయారు. అందులో పెనిమిటి అనుమతితో ధర్మకార్యాలు సలుపుతున్న మలిఇల్లాలు అతడి వెంట పుణ్యలోకానికి వెళ్ళింది. భర్త అనుమతి లేకుండా దేవ పితృపూజలు నిర్వహిస్తున్న తొలి పెళ్ళాన్ని పెనిమిటితో స్వర్గానికి పోకుండా యముడు అడ్డగించి 'నీ శరీరానికి తిరిగి మరలు' మని ఆదేశించాడు. అందుకు ఆమె కన్నీరు మున్నీరుగా విలపించింది. యముడి హృదయం కరుణారసంతో కరిగి పోయింది.

క. **'పతిమతము గొనక ధర్మము। నతివ నడపు టొప్ప; దింకనైనను బతికిన్**
హితము లగువానిఁ జేసిన। నతనిఁ గలయు' దనినఁ జనియె నదియును మరలన్. 288

ప్రతిపదార్థం: పతిమతము+కొనక = భర్త యొక్క అంగీకారం పొందక; ధర్మమున్ = పుణ్యమును; అతివ = పత్ని; నడపుట = చేయటం; ఒప్పదు = తగదు; ఇంకన్+ఐననున్ = ఇక మీదటనైనా; పతికిన్ = భర్తకు; హితములు+అగువానిన్ = ఇష్టములైనవాటిని; చేసినన్ = చేసినట్లయితే; అతనిన్ = యజమానుడిని; కలయుదు = కలిసికొంటావు; అనినన్ = అని యముడు చెప్పగా; అదియును = ఆ తొలిపత్ని; మరలన్ = మళ్ళీ, తిరిగి; చనియెన్ = వెళ్ళింది.

తాత్పర్యం: పెనిమిటి యొక్క అనుమతిలేక పుణ్యకార్యాలు చేయటం భార్యకు తగదు. ఇకనైనా నీ పతి కిష్టములైన కార్యాలను నీవు చేస్తున్నట్లయితే అతడిని కలిసికొనగలవు' అని యమధర్మరాజు చెప్పాడు. ఆయన మాటలు విని ఆమె దేహంతో మరలిపోయింది.

వ. కావునం బతికి ననువ్రత యగుట గృహిణికి ధర్మం' బని పలికి వెండియు. 289

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి, పతికిన్ = భర్తకు, అనువ్రత+అగుట = అనుకూలంగా మెలగటం; గృహిణికిన్ = ఇల్లాలికి; ధర్మంబు = న్యాయం; అని పలికి; వెండియున్ = మరల (పార్వతి శివుడితో ఇట్లా అన్నది అని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: కాబట్టి భర్తకు అనుకూలంగా మెలగటం ఇల్లాలికి ధర్మమని చెప్పి పార్వతి మళ్ళీ.

క. 'లలన యిలువాడి నాథుఁడు । వలచిన చవి వంటకములు వండి యిడి తనుం
గలయఁ దలంచిన మెయికొని । యెలమిం గైసేసి హృదయ మీ వలయు శివా! 290

ప్రతిపదార్థం: శివా! = మహేశ్వరా!; లలన = కాంత; ఇలువాడిన్ = ఇంటి వాడుక చొప్పున; నాథుఁడు = తనపతి; వలచిన = కోరినట్టి; చవివంటకములు = రుచిగల పదార్థాలు; వండి+ఇడి = వండి తినబెట్టి; తన్నున్ = తనను; కలయన్+తలంచినన్ = పొందగోరినచో; మెయికొని = అందుకు అంగీకరించి, ఇష్టపడి; ఎలమిన్ = సంతోషంతో; కైసేసి = అలంకరించుకొని; హృదయము = తన మనస్సు; ఈవలయున్ = సమర్పించవలెను.

తాత్పర్యం: ఇంటి వాడుక ననుసరించి భర్త తన కిష్టములైన వంటకములు వాంఛించినపుడు గృహిణి వండి పెట్టాలి. అతడు తన పొందు కోరినపుడు సంతోషంతో తన సమ్మతి తెలిపి శృంగారించుకొని తన హృదయం ఆతడికి సమర్పించాలి.

తే. పనుల యెడ మాఱుపలుకక యనవధానుఁ । డైన పతిఁ దలఁపించి ధర్మార్థ కలిత
కృతులు నడపుచు, సవతి గల్గినను బోరి । తంబు లే కొక్కటై యున్కి తగవు సతికి. 291

ప్రతిపదార్థం: పనులయెడన్ = కార్యాలపట్ల; మాఱుపలుకక = అడ్డు చెప్పక, ప్రతికూలంగా మాట్లాడక; అనవధానుఁడు +ఐన+పతిన్ = ఏమరిపాటు చెందిన భర్తను; తలఁపించి = కర్తవ్యాన్ని జ్ఞప్తి పరచి; ధర్మ+అర్థ+కలితకృతులు = ధర్మార్థములతో కూడినపనులు అనగా ధర్మమును అర్థమును ఆర్జించుటకు తోడ్పడే పనులు; నడపుచున్ = కొనసాగిస్తూ; సవతి+కల్గినను = సపత్ని ఉన్నను; పోరితంబు లేక = కలహం లేకుండా; ఒక్కటి+ఐ+ఉన్కి = ఆమెతో కలసి మెలసి ఉండటం; సతికిన్ = సాధ్వికి; తగవు = న్యాయం.

తాత్పర్యం: గృహిణి తన భర్త కావించే పనులకు అడ్డుపడరాదు. ఆతడు ఏమరిపాటున కర్తవ్యం మరచి ఉన్నప్పుడు ఆ విషయమును జ్ఞప్తికి తేవాలి. ధర్మార్థసాధకాలైన పనులు కొనసాగేటట్లు చేయాలి. తనకు సవతాలు ఉన్నప్పుడు కలహించక ఆమెతో కలసిమెలసి ఉండాలి. ఇది సతీ ధర్మం.

క. సవతాలికిఁ బతి వలచిన । నవుఁగాకని యతని యిచ్ఛ కనురూపముగాఁ
దివిరి నడచు సతి దైవము; । శివ! యది తగు నెల్ల జనముచే మ్రొక్కుగొనన్. 292

ప్రతిపదార్థం: శివ! = పరమేశ్వరా!; పతి = భర్త; సవతి+ఆలికిన్ = తన సపత్నికి; వలచినన్ = మోహపడితే; అవున్+కాక+అని = అది మంచిదే అని; అతని+ఇచ్ఛకున్ = మగని కోరికకు; అనురూపముగాన్ = తగినట్లుగా, అనుకూలంగా; తివిరి = పూను కొని; నడచు సతి = మెలగే వనిత; దైవము = దేవతయే సుమా! అది = ఆ ఇల్లాలు; ఎల్ల జనముచేన్ = సమస్త ప్రజల చేత; మ్రొక్కు+కొనన్+తగున్ = నమస్కారా లందుకొనడానికి యోగ్యురాలు.

తాత్పర్యం: నాథా! తన మగడు తనను విడిచి తన సవతాలి పొందు కాంక్షించినపుడు చింతించక అది మంచిదే అని అతడి అభిలాషకు అనుకూలంగా మెలగే సతీమణి నిజంగా దేవతయే. ఆమె ప్రజలందరి వందనా లందుకొనటానికి అర్హురాలు.

క. తన చేతికి నిచ్చిన వ । స్తునికాయము నిల్లురువున చొప్పున మగుడం
గొనివచ్చి భార్య పతి దె । మ్మని నప్పుడ యిచ్చుటొప్పు నకపటవృత్తిన్. 293

ప్రతిపదార్థం: తన చేతికిన్, ఇచ్చిన, వస్తునికాయమున్ = వస్తువుల సమూహాన్ని; ఇల్లురువున చొప్పునన్ = ఇల్లడ ధనం మాదిరిగా, కుదువ బెట్టిన వస్తువులరీతిగా, న్యాసధనం పోలికగా; మగుడన్ = తిరిగి; కొని వచ్చి = తీసుక వచ్చి; భార్య = పత్ని; పతి = తన పెనిమిటి; తెమ్ము+అనిన+అప్పుడు+అ = తీసుక రమ్మని చెప్పిన వెనువెంటనే; అకపట వృత్తిన్ = మోసగించక, వంచించక, నిష్కపటమైన బుద్ధితో; ఇచ్చుట = పెనిమిటి కొప్పగించుట; ఒప్పున్ = తగును.

తాత్పర్యం: మగడు తన చేతి కిచ్చిన వస్తువులను అతడు తెమ్మని అడిగిన వెను వెంటనే కుదువ బెట్టిన సొమ్ము మాదిరిగా భద్రంగా వంచనారహితమైన వర్తనతో అతడికి అప్పగించటం భార్యయొక్క ధర్మం.

క. పతి తనకు నేమి యిచ్చిన । నతిముదమునఁ బొందవలయు; నాత్మజుఁ డైనన్
మతిఁ గొంకక యేకాంత । స్థితి నేకాసనత నున్కి సెట్ట ప్రమదకున్. 294

ప్రతిపదార్థం: పతి = భర్త; తనకున్, ఏమి, ఇచ్చినన్; అతివ = స్త్రీ; ముదమునన్+పొందన్+వలయున్ = సంతోషపడవలసి ఉంటుంది; ఆత్మజుఁడు+ఐనన్ = కన్నకుమారుడైనా; మతిన్ = మనస్సులో; కొంకక = సంకోచించక, భయపడక; ఏకాంతస్థితిన్ = ఒంటరిగా ఉన్నప్పుడు, రహస్యంగా ఉన్న చోట; ప్రమదకున్ = స్త్రీకి; ఏక+ఆసన+స్థితి = ఒకే పీఠమందుండటం; చెట్ట = కీడు, హానికరం.

తాత్పర్యం: భర్త తన కేమి ఇచ్చినా భార్య సంతోషంతో స్వీకరించాలి. కడకు కన్నకుమారుడితోనైనా స్త్రీ ఒంటరిగా ఉన్నప్పుడు ఒకే పీఠం మీద జంకు గొంకులు లేకుండా కూర్చొనటం హానికరం.

క. ధని యధనుఁడు రూపసి యొ । ప్పనివాఁడు వివేకి మూఢభావుఁ డరోగుం
డనుగత రోగుఁ డనక యం । గన పతిఁ బాటింపవలయుఁ గామధ్వంసీ! 295

ప్రతిపదార్థం: కామధ్వంసీ! = మన్మథుడిని కాల్చిన వాడా!; ధని = ధనం కలవాడు; అధనుఁడు = ధనంలేని వాడు, దరిద్రుడు; రూపసి = అందగాడు; ఒప్పనివాఁడు = అందం లేనివాడు, కురూపి; వివేకి = తెలివికలవాడు; మూఢభావుఁడు = తెలివిమాలినవాడు; అరోగుండు = రోగం లేనివాఁడు, ఆరోగ్యవంతుడు; అనుగత రోగుఁడు = వెంబడించే రోగాలు కలవాడు, అనారోగ్యవంతుడు; అనక = అని భావించక; అంగన = ఆడుది; పతిన్ = భర్తను; పాటింపన్+వలయున్ = ఆదరించవలెను.

తాత్పర్యం: కాముని సంహరించిన కైలాసవాసా! ధనవంతుడు దరిద్రుడు; రూపవంతుడు రూపహీనుడు; తెలివిగలవాడు తెలివిమాలినవాడు; ఆరోగ్యవంతుడు అనారోగ్యం కలవాడు అని తలంపక ఆడుది తన పెనిమిటిని ఆదరించాలి.

క. **బలిభిక్షము గడప కిడ । న్వలయును దేవపితృ పూజనంబుల కాలం**
బులఁ బతి శుభమందుటఁ ద । త్ఫలంబుగాఁ గోరు టొప్పిదము సతికి శివా! 296

ప్రతిపదార్థం: శివా! = పరమేశ్వరా!; బలి = భూతముల (జంతువుల) కొరకు బలియు; భిక్షమున్ = యాచకులకు బిచ్చమూ; కడపక = లేదు పొమ్మనక; ఇడన్ వలయున్ = ఒసగవలెను; దేవ = దైవతములయొక్క; పితృ = పితృదైవతముల యొక్క; పూజనంబుల కాలంబులన్ = అర్చించే సమయములందు; పతి = తన విభుడు; శుభము+అందుటన్ = మంగళములు పొందటం; తత్+ఫలంబుగాన్ = ఆ దేవ పితృపూజల ఫలంగా; కోరుట = అభిలషించటం; సతికిన్ = పత్నికి; ఒప్పిదము = యుక్తము, యోగ్యము, తగినట్టిది.

తాత్పర్యం: భూతములకు (పశు పక్ష్యాదులకు) ప్రీతిగ బలి సమర్పణ కావించటం, యాచకులకు బిచ్చం పెట్టటం, దేవతలను, పితృదేవతలను పూజించే వేళలందు ఆ పూజాఫలమెల్ల తన భర్తకు శుభములు చేకూర్చటానికి ఉపయుక్తం కావాలని కోరుకొనటం ఇల్లాలి యొక్క ధర్మం.

క. **గతి పతియ చువ్వె భార్యకు; । నతనిఁ గడచినట్టి సత్పరాయణము కృపా**
యుత! కలదే? కావునఁ దా । నతనికి భక్తయగు టిచ్చు నఖిల శుభంబుల్.' 297

ప్రతిపదార్థం: కృపాయుత! = దయతో కూడిన వాడా!; భార్యకున్ = పత్నికి; గతి = దిక్కు; పతియ చువ్వె! = భర్తయే సుమా!; అతనిన్ = మగడిని; కడచిన+అట్టి = మించినట్టి; సత్+పరాయణము = ఉత్తమమైన ఆశ్రయం, పరమప్రాప్యమైన వస్తువు; కలదు+ఏ? = ఉన్నదా? లేదని భావం; కావునన్ = కాబట్టి; తాన్ = తాను; అతనికిన్ = పెనిమిటికి; భక్త+అగుట = భక్తురాలు కావటం, సేవలొనర్చటం; అఖిలశుభంబుల్ = సమస్త మంగళములను; ఇచ్చున్ = లభింపజేస్తుంది.

తాత్పర్యం: దయామయా! భార్యకు భర్తయే దిక్కు. అతడిని మించిన ఉత్తమమైన ఆశ్రయం ఆమెకు మరొక్కటి లేదు. కావున అతడికి సేవకురాలు కావటంవలన సతికి సర్వశుభాలు సమకూడుతాయి.'

వ. **అని చెప్పి య ప్పరమేశ్వరునకుం బార్వతి భార్యల యధర్మంబులు వివరించునదియై యిట్లనియె. 298**

తాత్పర్యం: పార్వతి ఆ విధంగా పలికి శివుడికి భార్యల యొక్క అధర్మాలెట్టివో తెలుపదలచి మళ్ళీ ఇట్లా అన్నది.

పార్వతి శివునకుఁ బతివ్రత కనర్హంబులగు ధర్మంబులఁ దెలుపుట. (సం.13. అను 1.15-4609).

సీ. 'పరమేశ! యాసురి పైశాచి రాక్షసి । యను పేళ్ళు గల వధర్మాంగనలకు;
వ్యభిచారతత్పరత్వంబు వారికి నెల్లఁ । గల; దసురాంశజ క్రౌర్యనిరత,
తనయిచ్చఁ బొలియించు ధనధాన్యములు, చల । హృదయ, భోగపరాత్మ, యీర్ష్య గలదు;
పైశాచి క్రోధన, భర్తృ పుత్రులయందు । నిఃస్నేహ, గృహకార్యనిపుణ గాదు,

తే. కలహశీల; రాక్షసి సయికంబు లేదు, । బొంకువల్కు, నెప్పడు నిద్రవోవు, వీత
లజ్జ; యిందఱు నాథుకులంబువారి । దురిత మొందించి పోదురు నరకమునకు. 299

ప్రతిపదార్థం: పరమేశ! = శంకరా!; అధర్మ+అంగనలకున్ = ధర్మవిరుద్ధములైన పనులు చేసే ఆడువారికి; ఆసురి, పైశాచి, రాక్షసి; అను పేళ్ళు గలవు = అనే పేర్లు ఉన్నాయి; వారికిన్+ఎల్లన్ = పైనుడివిన వారికందరికీ; వ్యభిచారతత్పరత్వంబు = పరపురుషుడితో సంగమించటంలో ఆసక్తి; కలదు = ఉన్నది; అసుర+అంశజ = అసురాంశలో జన్మించిన ఆసురి అనే పేరుగల మగువ; క్రౌర్యనిరత = క్రూరకృత్యాలలో అభిలాష కలిగి ఉంటుంది; ధనధాన్యములు = ధనమూ, ధాన్యమూ; తన+ఇచ్చన్ = తన యిష్ట ప్రకారం; పొలియించున్ = నాశనం చేస్తుంది; చలహృదయ = అతి చంచల స్వభావురాలు, నిలుకడ లేని మనస్సు కలది; భోగపర+ఆత్మ = సుఖాలకు వశమైన చిత్తం కలిగినట్టిది, భోగాలు మరిగినటువంటిది; ఈర్ష్యకలదు = అసూయకలిగినట్టిది; పైశాచి = ఇక పైశాచి అనే పేరుగల అంగన; క్రోధన = కోపస్వభావం కలది; భర్తృ పుత్రుల+అందున్ = తన మగడియందునూ, తన బిడ్డలయందునూ; నిఃస్నేహ = ప్రేమలేనిది; గృహకార్యనిపుణ+కాదు = ఇంటిపనులయందు నేర్పుకలది కాదు; రాక్షసి = రాక్షసి అనే నామధేయం గల పడతి; కలహశీల = తగవులమారి, జగడగొండి; సయికంబు లేదు = అది సూక్ష్మదృష్టిలేనట్టిది; బొంకు = అబద్ధం; పల్కున్ = మాట్లాడుతుంది; ఎప్పుడున్ = అన్ని వేళలందు; నిద్రపోవున్ = నిద్రిస్తుంది; వీతలజ్జ = అది సిగ్గుమాలినది; ఇందఱున్ = ఈ చెప్పిన వారంతా; నాథుకులంబు+వారిన్ = భర్త యొక్క వంశం వారిని; దురితము+ఒందించి = పాపాల పాలు చేసి; నరకమునకున్+పోదురు = నరక లోకానికి వెళ్ళుతారు.

తాత్పర్యం: 'పరమశివా! అధర్మ మార్గంలో చరించే ఆడవాళ్ళు ఆసురి, పైశాచి, రాక్షసి అనే పేర్లు కలిగి ఉన్నారు. వీరంతా పరపురుషుల పొందు వాంఛిస్తుంటారు. వీరు రంకుటాళ్లు. ఆసురి అనే ఆడుది అసురాంశలో జన్మించినట్టిది. అది క్రూరకృత్యాలలో అపేక్ష కలిగి ఉంటుంది. తన ఇష్ట ప్రకారం ధనధాన్యాలను నాశనం చేస్తుంది. దాని మనసు నిలుకడ కలిగి ఉండదు. భోగా లనుభవించటంలో అభిలాష కలిగి ఉంటుంది. అది అసూయాపరురాలు. పైశాచి అనే పేరు వహించి ఉన్న పొలతి కోపిష్ఠిది. పెనిమిటియందు, బిడ్డల యందు దానికి ప్రేముడి లేదు. ఇంటి పనులలో దానికి నేర్పులేదు. రాక్షసి అనే పేరు ధరించిన స్త్రీ కయ్యానికి కాలుద్రవ్వుతుంది; గయ్యాళి; దానికి సూక్ష్మదృష్టిలేదు. అబద్ధాలు చెప్పుతుంది. ఎప్పుడూ నిద్రపోతుంటుంది. అది సిగ్గు విడిచిన చేడె. వీరందరూ భర్త యొక్క వంశంవారినంతా పాపాలకు గురిచేసి తాము నరకం పాలవుతారు.

ఆ. ఎఱుక గలిగి పిదప నేనియుఁ బతిభక్తి । గలిగి ధర్మ మోపి సలిపి శాంతి
గలిగియున్న మున్ను గల పాపములు వాసి । పురుషుతోడ దివికిఁ బోవఁ గంద్రు. 300

ప్రతిపదార్థం: ఎఱుక+కలిగి = జ్ఞానం లభించి, తెలివి గలిగి; పిదపన్+ఏనియున్ = ఆ తరువాతనైనా; పతిభక్తి+కలిగి = భర్తయందు భక్తి జనించి; ఓపి = సమర్థతతో; ధర్మము = పుణ్యమును; సలిపి = ఆచరించి; శాంతి+కలిగి+ఉన్నన్ = శాంత

గుణం కలిగి ఉంటే, అనగా మనసును పరిపరివిధాల పోనీకుండా ఉంటే; మున్ను+కల = పూర్వం సంపాదించినట్టి; పాపములు = దురితాలు; పాసి = తొలగి; పురుషుతోడన్ = మగడితో; దివికిన్ = స్వర్గానికి, పోవన్+కంద్రు = వెళ్ళగలుగుతారు.

తాత్పర్యం: ప్రాణేశ్వరా! అట్టి స్త్రీలు తెలివి గలిగిన తరువాత నయినా పతియందు భక్తి గలిగి పుణ్యకార్యాలు సమర్థతతో సలుపుతూ, మనసును పరిపరి విధాల పోనీక నిగ్రహించి ఉన్నచో మునుపు తాము చేసిన పాపాలన్నీ తొలగి తమ పురుషుడితో స్వర్గానికి వెళ్ళగలరు.

ఆ. అట్లుగాక పతుల యంతిమ సమయంబు । నందుఁ జింతఁ దక్కి యనుమరణము
చేసిరేని సుగతి సిద్ధించుఁ బతి సమే । తంబుగాఁగ నన్నితంబినులకు. 301

ప్రతిపదార్థం: అట్లు+కాక = పైనుడివిన విధంగా కాక; పతుల = భర్తల యొక్క; అంతిమ సమయంబు+అందున్ = మరణకాలంలో; చింతన్ = విచారమును, దుఃఖమును; తక్కి = విడిచి పెట్టి; అనుమరణము+చేసిరి+ఏనిన్ = సహగమనం చేసినట్లయితే- భర్త చితిమంటలలో ప్రవేశించి తామూ బూది అయితే; ఆ+నితంబినులకున్ = ఆ సతీమణులకు; పతి సమేతంబు+ కాఁగన్ = మగలతో కూడ; సుగతి+సిద్ధించున్ = సద్గతి కలుగుతుంది - స్వర్గలోకం లభిస్తుంది.

తాత్పర్యం: మనోహరా! పై చెప్పిన విధంగా పుణ్యకార్యాచరణ చెయ్యలేని స్త్రీలు పతి చనిపోయినపుడు శోకం వదలి సహగమనం చేస్తే - అతడితో చితిమంటలలో ప్రవేశించి శరీరం విడిచిపెడితే - అట్టి సతులకు వారి మగలతో పాటు స్వర్గం సంప్రాప్తిస్తుంది.

క. ద్విజభామినికి నధర్మము । ప్రజఁ గాంచిన పిదప నయ్యపత్యము శోకో
ద్విజితయుఁ బతిభక్తయునై । త్యజించి యనుమరణ నియత యగుట మహేశా!' 302

ప్రతిపదార్థం: మహేశా! = పరమేశ్వరా!; ద్విజభామినికిన్ = బ్రాహ్మణస్త్రీకి; ప్రజన్ = బిడ్డలను; కాంచినపిదపన్ = కనినమీదట; శోక+ఉద్విజితయున్ = దుఃఖంచేత కలత చెందినదియూ, శోక వ్యాకులచిత్తయూ; పతిభక్తయున్+ఐ = భర్తయందు భక్తిగలదై; ఆ+అపత్యమున్ = ఆ బిడ్డను; త్యజించి = వదలి; అనుమరణ నియత+అగుట = భర్తతో సహగమనం చేయటానికి నిర్ణయించుకొన్నది కావటం; అధర్మము = అన్యాయం.

తాత్పర్యం: బ్రాహ్మణ స్త్రీ తనకు సంతానం కలిగిన తరువాత, దుఃఖవ్యాకుల చిత్తంతో, భర్తయందు భక్తి గలదై బిడ్డను వదలి పతితో సహగమనం చేయటం అన్యాయం.'

క. అని చెప్పి గౌరి పతి కి । ట్లను 'నాదగు చాపలమున నఖిలేశ్వర! నిన్
వినిపించితి నేఁ గొన్నివ । చనములు; నీతప్పు నాకు సైఁపుము కరుణన్.' 303

ప్రతిపదార్థం: అని చెప్పి, గౌరి, పతికిన్; ఇట్లు+అనున్ = ఈ లాగున చెప్పింది; అఖిల+ఈశ్వర! = సమస్తమునకూ ప్రభువైన వాడా!; నాదగు చాపలమునన్ (నాది+అగు = నాదగు); నా యొక్క బుద్ధి చాంచల్యం చేత; నేన్ = నేను; కొన్ని వచనములన్ = కొన్ని మాటలను; నిన్+వినిపించితిన్ = నీకు చెప్పాను; ఈ తప్పున్ = ఈ దోషాన్ని; కరుణన్ = కృపతో, నాకున్+సైఁపుము = నా విషయమై సహించుము, మన్నించుము.

తాత్పర్యం: ఉమాదేవి ఆ ప్రకారం పతికి స్త్రీ స్వభావాన్ని గురించి తెలిపి మళ్ళీ ఇట్లా అన్నది. 'జగత్ప్రభూ! నా చాపల్యం కొద్దీ నేను కొన్ని మాటలు తమకు విన్నవించాను. దయతో ఈ తప్పును మన్నించ వేడుతున్నాను.'

క. అని సిగ్గున చెన్నగు నా । నన మించుక వాంచి యెత్తు నగతనయ శివుం
డును మునులును మునిపత్నులు । వినుతించిరి మధురవాక్య విభవం బెసఁగన్. 304

ప్రతిపదార్థం: అని = అట్లు పలికి; సిగ్గునన్ = లజ్జచేత; చెన్ను+అగు = అందగించిన; ఆననమున్ = మొగమును; ఇంచుక వాంచి = కొంచెం క్రిందికి వంచి, (పిదప); ఎత్తు = మీదికెత్తిన; నగతనయన్ = పర్వత పుత్రిని; మధురవాక్య విభవంబు+ఎసఁగన్ = మనోహరమైన మాటల పెంపు సొంపారగా; శివుండు = శంభుడు; మునులును = ఋషులు; ముని పత్నులున్ = ఋషుల భార్యలు; వినుతించిరి = కొనియాడారు;

తాత్పర్యం: ఆ విధంగా పలికి సిగ్గుతో చెలువారిన మోమును కొంచెం వంచి పైకెత్తిన నగరాజపుత్రికను మృత్యుంజయుడు, మునులు, మునుల భార్యలు ప్రస్తుతించారు.

క. సురగంధర్వఖచర కి । న్నర కింపురు షోరగాది నారీజనముల్
పరమప్రీతిని బొగడిరి । పరమేశ్వరి నెలుఁగు లడరఁ బంకజనాభా!' 305

ప్రతిపదార్థం: పంకజనాభా! = పద్మము బొడ్డున గల నారాయణా!; సుర = వేల్పులు; గంధర్వ = గంధర్వులు; ఖచర = ఖేచరులు; కిన్నర = కిన్నరులు; కింపురుష = కింపురుషులు; ఉరగ+ఆది = నాగులు మున్నగు జాతుల యొక్క; నారీజనముల్ = స్త్రీ సమూహాలు; పరమేశ్వరిన్ = గౌరీదేవిని; ఎలుఁగులు+అడరన్ = కంఠధ్వనులు చెలరేగగా; పరమ ప్రీతిన్ = మిక్కుటమైన ఆనందంతో; పొగడిరి = శ్లాఘించారు.

తాత్పర్యం: శ్రీకృష్ణా! దేవతలు, గంధర్వులు, ఖేచరులు, కిన్నరులు, కింపురుషులు, నాగులు మున్నగు దేవతా జాతుల వనితా జనాలు మిక్కిలి సంతోషంతో గొంతులెత్తి గిరిజాదేవిని కొనియాడారు.'

క. అని చెప్పి నారదుం డి । ట్లను న గ్గోవిందుతోడ నప్పుడు ప్రియ మా
ననమునఁ బొదలఁగఁ బార్వతిఁ । గనుఁగొని సర్వేశ్వరుండు గారవ మొప్పన్. 306

ప్రతిపదార్థం: అని చెప్పి = అని వచించి; నారదుండు = నారద మహర్షి; ఆ+గోవిందునితోడన్ = ఆ గోపాలకృష్ణుడితో; ఇట్లు+అనున్ = ఈ విధంగా చెప్పాడు; అప్పుడు = ఆ వేళ; ప్రియము = ప్రేమ; ఆననమునన్ = ముఖమునందు; పొదలఁగన్ = వర్ధిల్లగా; సర్వేశ్వరుండు = శివుడు; పార్వతిన్ = గిరిజను; కనుఁగొని = వీక్షించి; గారవము+ఒప్పన్ = గౌరవభావం హెచ్చుగా.

తాత్పర్యం: అని పలికి నారద మహర్షి వాసుదేవుడితో ఇట్లా అన్నాడు. 'శ్రీకృష్ణా! శివు డప్పుడు ముఖమున సంతోషం దీపించగా ఆదరంతో గౌరీదేవిని వీక్షించి.

క. 'నానీ సంవాదము శుచి । యై నైష్ఠికజనుల కెవ్వఁ డాదర మెసఁగం
గా నలినాక్షీ! చెప్పును । వానికి నిత్యామరత్వ వైభవ మొదవున్. 307

ప్రతిపదార్థం: నలిన+అక్షీ! = పద్మములవంటి నేత్రములు గల గౌరీ!; నానీ సంవాదము = మనఇరువురి యొక్క సంభాషణ; ఎవ్వఁడు = ఎవడు; శుచి+ఐ = పరిశుద్ధుడై; నైష్ఠిక జనులకున్ = నిష్ఠగల మనుజులకు; ఆదరము+ఎసఁగన్+కాన్ = గౌరవం అతిశయించగా; చెప్పును = చెప్పుతాడో; వానికిన్ = అట్టివాడికి; నిత్య+అమరత్వ+వైభవము = శాశ్వతమైన దివ్యత్వ సంపద; ఒదవున్ = లభిస్తుంది.

తాత్పర్యం: 'కమల పత్రాలవంటి కన్నులు గల దేవీ! మనఇద్దరి సంభాషణం ఎవడు పరిశుద్ధుడై గౌరవ బుద్ధితో శ్రద్ధాభక్తులు గల జనులకు చెప్పుతాడో అతడికి శాశ్వతమైన దేవతాత్వ వైభవం లభిస్తుంది.

క. మన సంవాదం బెవ్వరు । వినిరి నియతి నజ్జనులకు విభవముఁ దేజం
బును గీర్తియు నాయువు శ్రీ । యును నారోగ్యంబుఁ గల్గు నుత్పలనయనా!' 308

ప్రతిపదార్థం: ఉత్పలనయనా! = కలువ రేకులవంటి కన్నులుగల దానా! ఓ కలువకంటీ!; మనసంవాదంబు = మన ఇద్దరి సంభాషణ; ఎవ్వరు = ఎవరు; నియతిన్ = భాగ్యవశాన; వినిరి = విన్నారో; ఆ+జనులకున్ = ఆ నరులకు; విభవమున్ = ఉన్నత స్థితీ; తేజంబున్ = శక్తి, ప్రకాశం; కీర్తియున్ = యశస్సు; ఆయువున్ = ఆయుష్యమూ; శ్రీయును = సంపత్తి; ఆరోగ్యంబున్ = అనామయమూ; కల్గున్ = సమకూడుతాయి.

తాత్పర్యం: కలువ రేకులవంటి కన్నులదానా! మన సంవాదం ఎవరు పూర్వజన్మకృత పుణ్యవశాన ఆలకిస్తారో, అటువంటి మనుజులకు ఉన్నతస్థితి; తేజస్సు, యశస్సు, ఆయుస్సు, ఐశ్వర్యమూ, ఆరోగ్యమూ సమకూడుతాయి.'

క. 'అని నిర్దేశించి శివుఁడు । చనియె; శివయుఁ గొలువుతోన చనె; నిద్దెసకుం
జని రన వశమే? యద్భుత । మనిరూప్యం బప్రతర్క్య మది శ్రీ రమణా! 309

ప్రతిపదార్థం: శ్రీరమణా! = ఇందిరావల్లభా! శ్రీకృష్ణా!; అని నిర్దేశించి = అని ఉపదేశించి; శివుఁడు = శంభుడు; చనియెన్ = కొలువు చాలించి వెళ్ళాడు; శివయున్ = శాంభవి కూడ; కొలువు తోన = కొలువుతోడనే; చనెన్ = వెళ్లిపోయింది; ఈ+దెసకున్ = ఈ దిక్కునకు; చనిరి+అనన్ = వారు వెళ్ళారు అని చెప్పుటకు; వశమే? = శక్యమా? కాదని భావం; అది = ఆ పార్వతీ పరమేశ్వరులు ఎచ్చటి కేగినారన్నది; అద్భుతము = ఆశ్చర్యజనకం; అనిరూప్యంబు = నిర్ణయించుటకు వీలుకానిది; అప్రతర్క్యము = ఊహించటానికి సాధ్యపడనిది.

తాత్పర్యం: 'కృష్ణా! ఆ విధంగా ఉపదేశవాక్యాలు చెప్పి పరమేశ్వరుడు వెళ్ళాడు. కొలువు విరియగానే పరమేశ్వరి కూడ వెళ్ళిపోయింది. వారు ఏ దిక్కునకు వెళ్ళారో చెప్పటానికి ఎవరితరమూ కాదు. అది ఆశ్చర్యజనకం. నిర్ణయించుటకూ, ఊహించుటకూ సాధ్యపడని విషయం.'

క. అని పలికి నారదుఁడు 'నా । వినిన కనిన యద్భుతంబు వినిపించితి నీ'
కనియెం గృష్ణుని సభ్యుల । మనంబు లానంద పూర మగ్నము లయ్యెన్. 310

ప్రతిపదార్థం: అని పలికి = అని వచించి; నారదుఁడు = నారద మహర్షి; కృష్ణునిన్ = కృష్ణునుద్దేశించి; నా వినిన = నేను విన్నట్టి; కనిన = చూచినట్టి; అద్భుతంబున్ = వింతను; నీకున్ = నీకు; వినిపించితిన్ = తెల్పినాను; అనియెన్ = అని పలికాడు; సభ్యులమనంబులు = సభలో ఉన్న వారి యొక్క చిత్తములు; ఆనంద పూరమగ్నములు+అయ్యెన్ = సంతోషమనెడు వెల్లువలో మునిగి పోయాయి.

తాత్పర్యం: అట్లా వచించి నారదమహర్షి శ్రీ కృష్ణభగవాను నుద్దేశించి 'నేను విన్నట్టి, చూచినట్టి వింతను నీకు వినిపించాను స్వామీ!' అని పలికాడు. సభలో ఉన్న జనుల మనసులు ఆనంద మనెడు రసప్రవాహంలో మునుకలు వేశాయి.'

వ. అని యిట్లు భీష్ముం డుమామహేశ్వర సంవాదం బనుపుణ్యకథ చెప్పిన ధర్మతనయుండు సోదర సహితంబుగాఁ బ్రమోదరసభరితుండై. 311

ప్రతిపదార్థం: అని+ఇట్లు = అని ఈ ప్రకారం; భీష్ముడు = గాంగేయుడు, ఉమామహేశ్వర సంవాదంబు = పార్వతీ పరమేశ్వరుల పరస్పర సంభాషణ; అను పుణ్యకథ = అనే పవిత్రమైన గాథ; చెప్పినన్ = తెలుపగా; ధర్మతనయుండు = యముని కుమారుడైన యుధిష్ఠిరుడు; సోదర సహితంబుగాన్ = తమ్ములతో కూడ; ప్రమోదరసభరితుండు+ఐ = ఆనందరసంతో నిండిన వాడై.

తాత్పర్యం: అని భీష్ముడు పార్వతీ పరమేశ్వరుల సంవాదమనే పవిత్రగాథను ధర్మనందనుడికి తెలుపగా విని అతడు తనతమ్ములతో పాటు సంతోష రసభరిత హృదయుడయ్యాడు.

భీష్ముఁడు ధర్మజునకుఁ బరప్రాప్తి హేతుభూతం బగు జప విశేషంబు దెలుపుట. (సం.13 అను 17-5).

సీ. అతనికిఁ బ్రణమిల్లి 'యనఘ! పరప్రాప్తి । యెద్దాన సమకూరు? నెఱుఁగఁ జెప్పు'
మనిన నతండు 'నారాయణధ్యాన పూ । జాస్తుతి తత్కథా శ్రవణనిరతి
యమ్మేలు గావించు; నధిప! విద్వజ్జన । సంరక్షణము కల్మషములఁ బాపు;
వేశ్య యొక్కత తొల్లి విద్వాంసు నొకరిని । ముచ్చని తలవరుల్ మోఁదఁ జూచి

తే. 'యితఁడు మావాఁడు మీ రిది యేటి కాగ । డంబు చేసెద?' రని మోక్షణంబు చేసి
యాసుకృతమున బ్రాహ్మణియై జనించెఁ; । దగఁగ నర్చింపు మీవు విద్వజ్జనముల.' 312

ప్రతిపదార్థం: అతనికిన్ = కురుపితామహుడైన భీష్ముడికి; ప్రణమిల్లి = నమస్కరించి; అనఘ! = దోషరహితుడా! ఓ పుణ్యాపురుషా!; పరప్రాప్తి = మోక్షం లభించటం; ఏ+దానన్ = ఏ విధంగా; సమకూడున్ = కలుగుతుందో; ఎఱుఁగన్+చెప్పుము = నాకు తెలిసేటట్లు చెప్పుము; అనినన్ = అని ధర్మజుడు ప్రశ్నించగా; అతండు = భీష్ముడు; అధిప! = ఓ ధర్మరాజా!; నారాయణధ్యాన పూజాస్తుతి = శ్రీ మన్నారాయణుడిని ధ్యానించటం, పూజించటం, స్తోత్రం చెయ్యటం; తత్+కథాశ్రవణనిరతి = ఆ మహానుభావుడి చరిత్రలు వినటంలో ఆసక్తి; ఆ+మేలు = ఆ శ్రేయస్సును; కావించున్ = కలిగిస్తుంది; విద్వత్+జన+సంరక్షణము = పండితులైన వాళ్ళను చక్కగ కాపాడటం అనేది; కల్మషములన్ = పాపాలను; పాపున్ = తొలగిస్తుంది; తొల్లి = మునుపు; వేశ్య ఒక్కత = ఒక బోగముది, పడుపుకత్తె; విద్వాంసున్+ఒకరిని = ఒక ప్రాజ్ఞుడిని; తల వరుల్ = తలారులు, కావలికాండ్రు (గ్రామాలలో, పట్టణాలలో రాత్రులందు దొంగలు పడకుండ గస్తు తిరిగేవాళ్ళు) ముచ్చు+అని = చోరుడని, దొంగ అని; మోఁదన్ = కొట్టగా; చూచి = కనుగొని; ఇతఁడు మావాఁడు; మీరు; ఏటికిన్ = ఎందుకు, ఇది; ఆగడంబు చేసెదరు = చెడ్డపనిచేస్తున్నారు; అని = అని పల్కి; మోక్షణంబు చేసి = ఆ పండితునికి తలారుల నుంచి విముక్తి గలిగించి; ఆ సుకృతమునన్ = ఆ పుణ్యంచేత; బ్రాహ్మణి+ఐ = బ్రాహ్మణ స్త్రీగా; జనించెన్ = పుట్టింది; ఈవు = నీవు; తగఁగన్ = ఒప్పిదంగా; విద్వత్+జనములన్ = పండిత సమూహమును; అర్చింపుము = పూజించుము.

తాత్పర్యం: ధర్మజుడు భీష్ముడికి నమస్కరించి 'పుణ్యాపురుషా! పరమపదం ఏ విధంగా లభిస్తుందో సెలవియ్యం' డని వేడుకొన్నాడు. అందుకు గాంగేయుడు 'కుంతీనందనా! పరమపదం శ్రీమన్నారాయణుడిని ధ్యానించటం, పూజించటం, స్తుతించటం, ఆయన పుణ్యకథలు ఆసక్తితో ఆకర్ణించటం వలన ప్రాప్తిస్తుంది. మోక్షానికి ప్రతి

బంధకమైన దురితాలన్నీ పండితులను సంరక్షించటం వలన తొలగి పోతాయి. పూర్వం ఒక పడుపుకత్తె తలారులు ఒక విద్వాంసుడిని చోరుడని భావించి చావ మోదుతుంటే చూచింది. 'మీరు నిరపరాధిని బాధిస్తున్నారు. ఇతడు మావాడు' అని చెప్పి వారి బారినుంచి ఆ విద్వాంసుడికి విముక్తి కల్గించింది. ఆ పుణ్యఫలంగా ఆమె మరుజన్మలో భూసురకాంతగా పుట్టింది. కనుక నీవు పండితులను సమాదరించుము'.

వ. **అనిన విని యుధిష్ఠిరుండు 'దారిద్ర్య వ్యాధి శోకంబులకు శాంతి సంపాదింపంజాలు జపం బెయ్యది? చెప్పవే' యనుటయు ననిమిషనదీ నందనుండు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను, వినాయక, విశాఖ, వహ్ని, వాయు, చంద్రాదిత్యులను, శక్ర, వరుణ, యమ, కుబేరులను, సురభిని, సముద్రంబులను, గంగాది మహానదులను, మరు దశ్వివసురుద్రాది దేవతలను, బితృదేవతలను, వాలఖిల్యాది సిద్ధులను, వేదవ్యాస వాల్మీకి నారదాగస్త్య గౌతమ కశ్యపాత్రికణ్వాది మహామునులను, రంభాద్యప్సరః స్త్రీలను, ధర్మతపస్సత్యములను, నహో రాత్రంబులను, దారాగ్రహంబులను, నశ్విన్యాది తారకంబులను, మాసర్తు వత్సరంబులను, వైనతేయ కాద్రవేయులను, గాశీక్షేత్ర కురుక్షేత్రాది పుణ్య క్షేత్రంబులను, నైమిశారణ్య దండకారణ్యాది పుణ్యారణ్యంబులను, మేరు హిమవత్కైలాసాది ప్రభూత శైలంబులను, దిఙ్నభోభూములను, బుణ్యభూరుహంబులను, భూసురులను, జక్రవర్తులను, రాజులను, బరమభక్తిం దలంచి, కీర్తించి, నమస్కరించి 'యీ సమూహం బంతయు నన్ను రక్షించి నాకు నాయురారోగ్యైశ్వర్యాభివృద్ధి పరమానందంబు లభినందనపూర్వకంబుగా నిచ్చుఁ గావుత మని యిచ్చఁ గోరి 'యో న్నమో భగవతే వాసుదేవాయ, నమః పురుషోత్తమాయ, నమస్సర్వలోక గురవే, నమస్సర్వలోక పిత్రే, నమ స్సర్వలోక పితామహాయ, నమస్సర్వలోక ప్రపితామహాయ, నమ స్సర్వలోక ప్రధానాయ, నమ స్సర్వలోకేశ్వరాయ, నమ స్సర్వలోక విశిష్టాయ, నమ స్సర్వలోక సుఖప్రదాయ, నమ స్సర్వలోకకర్త్రే, నమ స్సర్వలోకభర్త్రే, నమ స్సర్వలోకహర్త్రే, నమ స్సర్వలోక నిధయే, నమ స్సర్వలోక నిధానాయ, నమ స్సర్వలోకోద్భవకరాయ, నమో విష్ణవే, ప్రభవిష్ణవే' యని పఠించుట మహాజపంబు.** **313**

ప్రతిపదార్థం: అనినన్ విని = అని భీష్ముడు చెప్పగా ఆలకించి; యుధిష్ఠిరుండు = ధర్మజుడు; దారిద్ర్య వ్యాధి శోకంబులకున్ = పేదరికానికి, రోగాలకు, దుఃఖాలకు; శాంతిన్ = ఉపశమనమును; సంపాదింపన్+చాలు = సమకూర్చగలుగునట్టి; జపము = మంత్రజపం; ఏ+అది = (ఎయ్యది) ఏది; చెప్పవు+ఏ = చెప్పవా; అనుటయున్ = అని అడుగగా; అనిమిషనదీనందనుండు = దేవతలనది మందాకిని యొక్క కుమారుడు భీష్ముడు; బ్రహ్మవిష్ణు మహేశ్వరులను = త్రిమూర్తులను; వినాయక = గణపతి; విశాఖ = కుమారస్వామి; వహ్ని = అగ్నిదేవుడు; వాయు = వాయుదేవుడు; చంద్ర+ఆదిత్యులను = చంద్రుడు, సూర్యుడు అనువారిని; శక్ర = ఇంద్రుడు; వరుణ = వరుణుడు; యమ = యముడు; కుబేరులను = ధనాధిపతి కుబేరుడు అనువారలను; సురభిని = కామధేనువును; సముద్రంబులను = సప్తసాగరాలను; గంగా+ఆదిమహానదులను = గంగమొదలైన గొప్పనదులనూ; మరుత్ = సప్తమారుతాలను; అశ్వి = అశ్వినీ పుత్రులు దేవవైద్యులిద్దరినీ; వసు = అష్టవసువులు; రుద్ర = ఏకాదశ రుద్రులు, ఆది = మొదలైన; దేవతలను = వేల్పులను, సురలను; పితృదేవతలను = అర్యముడు మున్నగు పితృదేవతలను; వాలఖిల్య+ఆది+సిద్ధులను = వాలఖిల్యులు మొదలైన ఋషులను; వేదవ్యాస, వాల్మీకి, నారద, అగస్త్య, గౌతమ, కశ్యప, అత్రి; కణ్వ+ఆది = కణ్వుడు మొదలుగాగల; మహామునులను; రంభా+ఆది = రంభ మొదలైన; అప్సరః స్త్రీలను = అప్సరసలను; ధర్మ తపః సత్యములను = ధర్మమును, తపస్సును, సత్యమును; అహః+రాత్రంబులను =

పగళ్ళను, రాత్రులను; తారా గ్రహంబులను = తారలను, నవగ్రహాలను; అశ్వినీ+ఆది తారకంబులను = అశ్విని, భరణి మొదలైన ఇరువదేడు నక్షత్రాలను; మాస+ఋతు(మాసర్తు); చైత్రము, వైశాఖం మున్నగు పన్నెండు నెలలు, వసంతం, గ్రీష్మం మొదలైన ఆరు ఋతువులను; వత్సరంబులను = ప్రభవ, విభవ మొదలైన అరవై సంవత్సరాలను; వైనతేయ = వినతాపుత్రుడైన గరుత్మంతుడు మొదలగు పక్షీంద్రులను; కాద్రవేయులను = కద్రువకొడుకులు వాసుకి, అనంతుడు మున్నగు సర్పరాజులను; కాశీక్షేత్ర; కురుక్షేత్ర; ఆది = మొదలైన, పుణ్యక్షేత్రంబులను = పవిత్ర ప్రదేశాలను; నైమిశ+అరణ్య; దండకా+అరణ్య; ఆది = మొదలైన, పుణ్య+ అరణ్యములను = పావనములైన తపోవనాలను; మేరు = మేరువు; హిమవత్ = హిమవంతం; కైలాస = కైలాసం; ఆది = మున్నగు, ప్రభూతశైలంబులను = ఎత్తైన కొండలను, గొప్ప పర్వతాలను; దిక్+నభస్+భూములను = దిక్కులు, ఆకాశం, భూమి అనువాటిని; పుణ్యభూరుహంబులను = పవిత్రములైన కల్పవృక్షం మొదలైన వృక్షరాజములను; భూసురులను = బ్రాహ్మణులను; చక్రవర్తులను = సార్వభౌములను; రాజులను = నరేశ్వరులనూ; పరమభక్తిన్ = మిక్కిలిభక్తితో; తలంచి = స్మరించి; కీర్తించి = కొనియాడి, పొగడి; నమస్కరించి = మ్రొక్కి; ఈ సమూహంబు+అంతయున్ = పైనుడివిన మొత్తము; నన్నున్ రక్షించి = నన్ను కాపాడి; నాకున్, ఆయుః+ఆరోగ్య+ఐశ్వర్య+అభివృద్ధి పరమ+ఆనందంబులు = ఆయుష్యం, ఆరోగ్యం, సంపదల యొక్క పెంపు, మిక్కుటమైన సంతోషం అనువాటిని; అభినందనపూర్వకంబుగాన్ = సంతోషపురస్సరంగా, ప్రశంసా పూర్వకంగా; ఇచ్చున్+కావుతన్+అని = (ఇచ్చుఁగావుతమని) = ప్రసాదించుగాక అని; ఇచ్చన్ = మనస్సులో; కోరి = కాంక్షించి; ఓమ్+భగవతే వాసుదేవాయ నమః = భగవంతుడైన వాసుదేవుడి కొరకు నమస్కారం; పురుషోత్తమాయ నమః = పురుషోత్తముడికి వందనం; సర్వలోక గురవే నమః = సమస్తలోకములకు గురుడైన వాడికి నమోవాకం; సర్వలోకపిత్రే నమః = ఎల్ల జగములకు తండ్రి అయిన వాడికి ప్రణామం; సర్వలోక పితామహాయ నమః = సకల జగత్తులకు తాత అయినవాడికి అంజలి; సర్వలోక ప్రపితామహాయ నమః = ఎల్లలోకాల తాతకు తండ్రియైనవాడికి (ముత్తాతకు) కేలు మోడ్పు; సర్వలోక ప్రధానాయ నమః = అఖిలలోకాలకు ప్రకృతి అయిన వాడికి ప్రణతి; సర్వలోక+ఈశ్వరాయ నమః = సమస్తలోకాలకు నాథుడయిన వాడికి నమస్సు; సర్వలోక విశిష్టాయ నమః = సమస్త భువనాలతో కూడిన వాడికి మ్రొక్కులు; సర్వలోక సుఖప్రదాయ నమః = అన్ని లోకాలకు సౌఖ్యమొసగువాడికి నమస్కృతి; సర్వలోక కర్త్రే నమః = సమస్త జగములకు కర్త ఎవడో వాడికి జోహారు; సర్వలోకభర్త్రే నమః = అన్ని లోకాలను కాపాడేవాడికి, భరించే వాడికి జోతలు; సర్వలోక హర్త్రే నమః = సమస్త భువనాలను హరించేవాడికి జేజేలు; సర్వలోక నిధయే నమః = సకలలోకాలకు ఆధారమైన వాడికి ప్రణిపాతం; సర్వలోక నిధానాయ నమః = జగములన్నిటికి గుప్తనిధిగా ఉన్న వాడికి అభివాదం; సర్వలోక హితాయ నమః = సమస్త లోకాలకు మిత్రుడైన వాడికి ధన్యవాదం; సర్వలోక హితకరాయ నమః = అన్ని లోకాలకు మేలు చేసేవాడికి కై మోడ్పు; సర్వలోక+ఉద్భవాయ నమః = సమస్త లోకాలకు ఉత్పత్తి స్థానమైన వాడికి చేమోడ్పు; సర్వలోక+ఉద్భవ కరాయ నమః = సమస్తలోకాలను పుట్టించేవాడికి నతి; విష్ణవే, ప్రభ విష్ణవే నమః = వ్యాపనశీలుడికి, సామర్థ్యము, మహిమ కలవాడికి దోసిలొగ్గుతున్నాను; అని = అంటూ; పఠించుట = చదవటం; మహా జపంబు = గొప్పజపం.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు 'తాతా! పేదరికం తొలగటానికి, రోగాలు మానటానికి, దుఃఖాలు తీరటానికి తగిన జప మేదో సెలవియ్యం'డని అర్థించాడు. అపుడు గంగాతనయుడు 'కుంతీ నందనా! బ్రహ్మవిష్ణుమహేశ్వరులనూ, గణపతినీ, కుమారస్వామినీ, అగ్ని వాయుదేవుళ్ళనూ, చంద్రసూర్యులనూ, ఇంద్రవరుణయమ కుబేరులనూ, కామధేనువునూ, సప్తసముద్రాలనూ, గంగ మొదలైన పవిత్ర తీర్థాలనూ, సప్తమరుత్తులనూ (వాయువులనూ), అశ్వినీ దేవతలనూ, అష్టవసువులనూ, ఏకాదశరుద్రులనూ, అర్యముడు మున్నగు

పితృ దేవతలనూ, వాలఖిల్యాది మహర్షులనూ, వ్యాసుడు, వాల్మీకి, నారదుడు, అగస్త్యుడు, గౌతముడు, కశ్యపుడు, అత్రి, కణ్వుడు మున్నగు మౌనీంద్రులనూ, రంభ మొదలైన అచ్చర బోటులనూ, ధర్మము, తపము, సత్యము అనువాటినీ, రాత్రులను, పవళ్లను, తారలను, నవ గ్రహాలను, అశ్విని మొదలైన ఇరువది యేడు నక్షత్రాలనూ, నెలలు, ఋతువులు, సంవత్సరాలుగా ఉన్న కాలమునూ, గరుత్మంతుడు మున్నుగాగల వినతాపుత్రులు పక్షీంద్రులనూ, ఆదిశేషుడు మొదలుగా గాల కద్రువ కొడుకులు సర్పరాజులనూ, కాశీ క్షేత్రం, కురుక్షేత్రం మున్నగు పవిత్ర స్థలాలనూ, నైమిశారణ్యం, దండకారణ్యం మొదలైన పవిత్ర వనభూములనూ, మేరు శైలం, హిమగిరి, కైలాస పర్వతం మొదలైన గొప్పకొండలను, దిక్కులను, ఆకాశాన్ని, ధరణిని, పావనములైన కల్పవృక్షం మున్నగు వనస్పతులనూ, బ్రాహ్మణులనూ, చక్రవర్తులను, రాజులను, మిక్కిలి భక్తితో స్మరించి, స్తుతించి, నమస్కరించి వీరంతా నన్ను కాపాడుదురుగాక! వీరంతా నాకు దీర్ఘాయుష్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం, మిక్కుటమైన సంతోషం మెచ్చుతూ ఇత్తురుగాక!' అని మదిలో ఆకాంక్షించాలి. ఆవల 'వాసుదేవా! పురుషోత్తమా! సమస్త జగద్గురూ! సమస్త లోకాలకు తండ్రి అయిన వాడా! సమస్త లోకాలకు తాత అయినవాడా! సమస్త లోకాలకు ముత్తాత అయినవాడా! సమస్త లోకాలకు ప్రధానమైన వాడా! సమస్త లోకాలకు ప్రభువైనవాడా! సమస్త లోకాలతో కూడినవాడా! సమస్త లోకాలకు సౌఖ్యం ప్రసాదించేవాడా! సమస్త లోకాలకు కర్త అయిన వాడా! సమస్త లోకాలకు భర్త అయిన వాడా! సమస్త లోకాలను హరించేవాడా! సమస్త లోకాలకు ఆధారభూతుడా! సకల లోకాలకు దాపుడుధనంగా ఉన్నవాడా! సకల లోకాలకు చెలికాడా! సకల లోకాలకు మేలు కూర్చేవాడా! సర్వ లోకాలకు ఉత్పత్తిస్థానమైన వాడా! సర్వ లోకాలను జన్మింపజేసేవాడా! అంతట వ్యాపించువాడా! ప్రభావం కలవాడా! నీకు వందనం, అభివందన' మంటూ ఈ మంత్రమును పఠించటం మహాజపం.

విశేషం: సర్వదారిద్ర్యాలనూ, సర్వదుఃఖాలనూ పోగొట్టి మోక్షం ప్రసాదించే మంత్రం చెప్పుమని ధర్మరాజు అడిగినప్పుడు భీష్ముడు విష్ణుమంత్రోపదేశం చేశాడు. భగవన్మంత్రా లనేకం. వాటిల్లో వ్యాపకమంత్రాలు శ్రేష్ఠాలు. భగవంతుడి స్వరూప గుణ చేష్టితాలను సంపూర్ణంగా తెలిపేవి వ్యాపకమంత్రాలు. "నారాయణాయ విద్మహే, వాసుదేవాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్" అని విష్ణు గాయత్రిలో తెల్పబడిన ఆ మూడు మంత్రాలు మాత్రమే శ్రేష్ఠమైనవి.

"యథా సర్వేషు వేదేషు నాస్తి నారాయణా త్పరః,
తథా సర్వేషు మంత్రేషు నాస్తి చాష్టాక్షరాత్పరః."

సకలవేదాలలో నారాయణుడిని మించిన వేల్పులేనట్లే అన్ని మంత్రాలలో అష్టాక్షరిని మించిన మంత్రం లేదు. అనగా 'ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో విష్ణవే', అనే రెంటికన్నా "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ మహామంత్రం పరమోత్తమం.

మంత్రంలో మొదటిపదం ఓంకారం. అదే ప్రణవం. దీనిలో అ,ఉ,మ అనే మూడక్షరా లున్నాయి. ఈ మూడక్షరాలు మూడు కుండలలో ఉన్న దధిని మథించి వెన్నను తీసినట్లుగా ఋగ్యజుస్సామములనే మూడు వేదాలనుండి తీయబడ్డాయి. కనుక ఓంకారం వేదసారం. ఇందులోని అకారం "అవ రక్షణే" అను ధాతువు నుంచి ఏర్పడింది. అది సకల జగత్కారణుడూ, సర్వరక్షకుడూ అయిన లక్ష్మీ వల్లభుడికి వాచక మవుతున్నది. అందుచే అకారమునకు నారాయణుడు అని అర్థం. "అక్షరాణాం అకారోఽస్మి"-- అక్షరాలలో అకారాన్ని నేను అని గీతలో భగవానుడు నుడివాడు. అతడు తన్ను స్మరించే జీవులకు అనర్థాలను తొలగించి అపేక్షితాలను అనుగ్రహిస్తాడు. ప్రణవంలో మొదటి అక్షరం తరువాత రెండవ అక్షరం ఉకారం.

ఉకారం ఏవకారార్థం అనగా అతనికే అంటే అకారవాచ్యుడైన నారాయణుడికే, మరెవ్వరికినీ కాదు, అని అర్థం. మూడవ పదం మకారం. మకారం జీవవాచకం. అనగా జీవుడు మకారశబ్దవాచ్యుడు. అతడు కేవలం నారాయణుడికే చెందినవాడు తప్ప తనకుగాని, మరెవ్వరికిగానీ చెందిన వాడు, సంబంధపడినవాడు కాడని భావం. సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందు పరమాత్మకు కైంకర్యం, సేవ, దాస్యం, చేస్తూ ఉండదగినవాడు జీవుడు అనే అర్థం ప్రణవం వలన గోచరిస్తుంది. ఇక్కడ మరో విషయం గమనించాలి. రక్షకుడు అకారశబ్దవాచ్యుడైన నారాయణు డైనప్పటికినీ, రక్షించబడేటప్పుడు మాతృసంబంధం అనగా లక్ష్మీ సంబంధం జీవుడికి అనుసంధేయం. ఆమె విష్ణువక్షః స్థలాన్ని వీడినప్పుడే అకారమనే అక్షరాన్ని ఎడబాయటం సంభవిస్తుంది. కనుక అకారం నారాయణుడితో పాటు లక్ష్మికి గూడ వాచకమే అవుతుంది.

" అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా"

సూర్యుడిని ప్రభవలె, కాంతి వలె శ్రీరాముడిని వదలి ఉండలేను అని సీతాదేవి -

" అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా"

రవిని వదలి ప్రభవలె జానకిని వదలి నే నుండలేను అని శ్రీరాముడు పలికి ఉన్నారు (శ్రీమద్రామాయణం)

" రాఘవత్వేఽభవ త్సీతా రుక్మిణీ కృష్ణజన్మని,
అన్యేషు చావతారేషు విష్ణో రేషానపాయినీ."

" దేవత్వే దేవ దేహేఽయం మానుషత్వే చ మానుషీ,
విష్ణో ర్దేహానురూపాం వై కరోత్యేషాఽఽత్మన స్తనుమ్."

ఇత్యాది స్తుతులు లక్ష్మీనారాయణులకు ఎడబాటెప్పుడూ లేదని చాటుతున్నాయి. కనుక అకారమునకు విష్ణుసంబంధం చేత లక్ష్మి అనే అర్థం సిద్ధిస్తుంది అని ప్రత్యేకించి చెప్పనిలేదు. ఉకారమునకు లక్ష్మి అనే అర్థం చెప్పడానికి అవధారణార్థమే యుక్తమని పెద్దల నిర్వచనం. అందువలన జీవుడు లక్ష్మీనారాయణు లిద్దరికీ దాస్యవృత్తి నెరపుతూ ఉండవలసిన వాడని తెల్లమవుతుంది.

"ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ద్వాదశాక్షరీమంత్రంలో ఓం తరువాత ప్రయుక్తమైన శబ్దం నమః. దీనిలో న, మః అని రెండు పదాలున్నాయి. అవి నే నున్నది (ఆత్మ, జీవుడు) నాసేవ కొరకు గాదు; పరులసేవ కొరకు గాదు; భగవంతుడి సేవకొరకే - అనే అర్థాన్ని వెల్లడిస్తాయి. నేను నాకు గాని, ఇతరులకు గాని, సంబంధపడిన వాడిని కాను; ఆ పరమాత్మకే సంబంధించిన వాడిని - అని భావిస్తూ జీవుడు తాను సల్పే కైంకర్య రూపమైన కర్మయందు కర్తృత్వ భోక్తృత్వబుద్ధి మాని, పరమాత్ముడే తన పరికరమైన నాచేత తన కైంకర్యమును తానే చేయించుకొంటున్నాడు. తానే దాని ఫల మనుభవిస్తున్నాడు. ఇందులో నాప్రసక్తి ఏమీ లేదు అని భావిస్తూ పరమాత్ముడికి దాస్యం సల్పాలి అని నమశ్శబ్దము యొక్క అర్థతాత్పర్యాలు.

భగవంతుడు, వాసుదేవుడు అను రెండు పదాలు చతుర్థీ విభక్త్యంతాలుగా మారినపుడు భగవతే వాసుదేవాయ అనే విశేషణ విశిష్టమైన భగవన్మంత్రాన్ని ఋషులచే పరికీర్తితమైనదాన్ని కురుపితామహుడు, మహామహుడు భీష్ముడు ధర్మపుత్రుడికి ఉపదేశించాడు. భగవంతుడైన వాసుదేవుడికే తప్ప నాసేవ నా కొరకు గాదు; అన్యులకొరకూ కాదు అని ఆ మంత్రానికి భావం ఏర్పడుతుంది. భగవంతు డనగా జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సులు అనే షాడ్గుణ్యసంపత్తి కలవాడు. వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడనిగాని, తనయందు సమస్తం వసించగా తాను అన్నిటి యందు నివసించేవాడు అనిగాని వాసుదేవుడనే మాటకు అర్థం.

క. **పాపంబులును భయంబులు । నాపదలుం బాయు నిమ్మహాజపమున ధా**
త్రీపాలోత్తమ! శుభములు । ప్రాపించును ధర్మతత్పరత సిద్ధించున్.' **314**

ప్రతిపదార్థం: ధాత్రీపాల+ఉత్తమ = రాజులలో శ్రేష్ఠుడా! ఈ+మహాజపమునన్ = ఈ గొప్ప మంత్రము యొక్క ఆవృత్తి చేత; పాపంబులును = పాతకాలు; భయంబులున్ = భయాలు; ఆపదలున్ = విపత్తులు, కడగండ్లు; పాయున్ = తొలగుతాయి; శుభములు = మంగళములు, ఇహపరసౌఖ్యాలు; ప్రాపించును = సమకూడుతాయి; ధర్మతత్పరత = ధర్మమందు ఆసక్తి; సిద్ధించున్ = లభిస్తుంది.

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడవైన ధర్మజా! ఈ విష్ణుమంత్ర జపంచేత పాతకాలు, భయాలు, కష్టాలు తీరుతాయి. శుభాలు, ఇహపర సౌఖ్యాలు లభిస్తాయి. ధర్మమందు ఆసక్తి కలుగుతుంది.'

వ. **అని యిట్లు గంగాపుత్త్రుం డజాతశత్రునకు సర్వసిద్ధికరం బయిన యిమ్మహాజపం బుపదేశించెనని చెప్పి తదనంతర సత్కథ లాకర్ణింపు మని పలికి జనమేజయునకు వైశంపాయనుం డిట్లనియె.** **315**

ప్రతిపదార్థం: అని; ఇట్లు; గంగా పుత్త్రుండు = గంగాదేవి కుమారుడు భీష్ముడు; అజాతశత్రునకున్ = విరోధులు లేని ధర్మజుడికి; సర్వసిద్ధికరంబు = అన్ని శుభాలు ఇచ్చునట్టి; ఈ+మహా జపంబున్ = ఈ గొప్ప మంత్ర జపాన్ని; ఉపదేశించెన్= బోధించాడు; అని చెప్పి; తత్+అనంతర+సత్కథలు = ఆ పిదప జరిగిన మంచి వృత్తాంతాలు; ఆకర్ణింపుము = ఆలకించుము, వినుము; అని పలికి; జనమేజయునకున్ = శ్రోత అయిన జనమేజయమహారాజునకు; వైశంపాయనుండు= కథకుడైన వ్యాసమహర్షి శిష్యుడు వైశంపాయనుడనే పేరుగల మహర్షి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా భీష్ముడు ధర్మరాజుకు అన్ని శుభాలూ, భోగమోక్షాలూ ప్రసాదించే విష్ణుమంత్రం ఉపదేశించాడు-అని చెప్పి అవతలి కథ వినుమని జనమేజయ మహారాజుతో వైశంపాయన మహర్షి ఇట్లా అన్నాడు.

తే. **'మనుజనాథ! యశేషధర్మములు సర్వ । పావనములు శాంతనవుఁడు బహువిధములఁ**
జెప్ప నిమ్మెయి విని యుధిష్ఠిరుఁడు భక్తి । న మ్మహాత్ముని నిట్లని యడిగె మఱియు. **316**

ప్రతిపదార్థం: మనుజనాథ = జనమేజయమహారాజా!; సర్వపావనములు = అన్ని విధముల పవిత్రము చేయునట్టి; అశేష ధర్మములు = ఎల్లధర్మాలు; శాంతనవుఁడు = శంతను మహారాజు పుత్రుడైన భీష్ముడు; బహువిధములన్ = పలురీతుల; చెప్పన్ = తెల్పగా; ఈ+మెయిన్ = ఈ విధంగా; విని; యుధిష్ఠిరుఁడు = ధర్మజుడు; భక్తిన్ = భక్తితో; ఆ+మహా+ఆత్మునిన్ = ఆ దొడ్డమనసుగల భీష్మడిని; మఱియున్ = ఇంకనూ; ఇట్లు+అని+అడిగెన్ = ఈ విధంగా ప్రశ్నించాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! పాపా లన్నిటిని పోకార్చి పవిత్రమొనర్చు సకలధర్మాలు శంతను పుత్త్రుడైన భీష్ముడు పెక్కు రీతుల చెప్పగా విని మళ్ళీ ధర్మజుడు మహానుభావుడైన గాంగేయుడిని ఇట్లా ప్రశ్నించాడు.

చ. **'అతఁ డొకరుండ లోకముల కన్నిటికిన్ మహనీయమైన దై**
వతముఁ బరాయణంబు నను వైభవ మెవ్వని కొప్పు? నర్చన
స్తుతి రతి నెవ్వనిం గొలిచి శోభన మొందు జనంబు? మేలు నా
నతిశయ మొంది నీకు మతమై చను నెయ్యది ధర్మకోటిలోన్? **317**

ప్రతిపదార్థం: అతఁడు+ఒకరుండు+అ = ఆతడొక్కడే; లోకములకున్+అన్నిటికిన్ = సమస్తలోకాలకు; మహనీయము+ఐన = పరమోత్తమమైన; దైవతము = దైవము; పర+అయనంబున్+అను = పొందదగిన వాడనునట్టి; వైభవము = గొప్పతనము; ఎవ్వనికిన్+ఒప్పున్ = ఎవ్వడికి తగి ఉన్నదో; అర్చన స్తుతిరతిన్ = భక్తితో పూజించటం, గుణములను కీర్తించటం అనే సేవలందు గల ప్రీతితో, ఆసక్తితో; జనంబు = ప్రజ; ఎవ్వనిన్ = ఏ పురుషోత్తముడిని; కొలిచి = భజించి; శోభనము+ఒందున్ = శుభమును పొందునో అనగా భోగమోక్షములు చెందునో; ధర్మకోటిలోన్ = పుణ్యాలన్నింటిలో; ఏ+అది = (ఎయ్యది) ఏది; మేలునాన్ = మంచిదిగా, శ్రేష్ఠమైనదిగా; అతిశయము+ఒంది = ఆధిక్యం చెంది; నీకున్ = నీకు; మతము+ఐ = ఇష్టమై; చనున్? = ఒప్పుతున్నది?

తాత్పర్యం: "పితామహా! లోకము (శాస్త్రాలు) లన్నింటిలో గొప్పదైవం ఎవరు? ఎవడు ఆశ్రయించదగిన మహిమతో విరాజిల్లుతున్నాడు? ఎవడిని భక్తితో పూజించి, ఎవడి గుణాలను కీర్తించి మానవులు శుభములు పొందుతున్నారు? ధర్మా లన్నింటిలో అతిశయించినదై, నీకు సమ్మతమైనదై, మేలు చేకూర్చే ధర్మమేది?

తే. **జపములం దెల్ల నుత్తమ జపము నాఁగ । నంచితంబయి తన్ను జపించు జంతు**
వునకు జన్మసంసార బంధనము లోపి । పాపు నెయ్యది? యెఱిఁగింపు పరమబోధ!' **318**

ప్రతిపదార్థం: పరమబోధ! = ఉత్తమ జ్ఞానం కలవాడా!; జపములందున్+ఎల్లన్ = అన్ని జపాలలో; ఉత్తమ జపమునాఁగన్= శ్రేష్ఠమైన జపమని; అంచితంబు+అయి = ఒప్పిదమై, పూజితమై; తన్నున్ = తనను; జపించు = ఆవృత్తి సల్పునట్టి; జంతువునకున్ = జీవుడికి; జన్మసంసారబంధనములు = జనన మరణరూపమైన సంసారమనే కట్లు; ఓపి = సామర్థ్యం కలిగి; ఏ+అది(ఎయ్యది) = ఏది; పాపున్ = తొలగిస్తుందో; ఎఱిఁగింపు = నాకు తెల్పుము.

తాత్పర్యం: పరమజ్ఞాన సంపన్నుడైన మహాత్మా! జపా లన్నింటిలో శ్రేష్ఠమై, తనను జపించే వారికి జనన మరణ రూప సంసార బంధాలనుండి విముక్తి కలిగించే జపమేదో నాకు తెల్పుము.'

వ. **అని యడిగిన నాభూపతికి భీష్ముం డిట్లనియె.** **319**

తాత్పర్యం: అని ప్రశ్నించిన ప్రభువైన ధర్మరాజుతో భీష్మి డిట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్ర ధ్యానం బవశ్యానుష్ఠేయం బని చెప్పుట. (సం.13-135-4).

సీ. **'అఖిలజగత్ప్రభు వగు దేవదేవు న । నంతునిఁ బురుషోత్తమాభిధాను**
నంచితనామ సహస్రకంబున సంస్తు । తించుచు సంతతోత్థిత మనస్కుఁ
డై యజమానుఁ డవ్యయుఁడైన యాతని । నర్చించుచును దృఢ ధ్యాన నిరతుఁ
డగుచు నమస్కృతి యాచరించుచు ననా । ద్యంతు న విష్ణు నధ్యక్షు నెల్ల

తే. **లోకములకు బ్రహ్మణ్యుఁ ద్రిలోక కీర్తి । వర్ధనుని సర్వధర్మజ్ఞు వరదు లోక**
నాథు భూతభవోద్భవు నమ్మి భక్తిఁ । గొలిచి సర్వదుఃఖంబులఁ దొలఁగఁ ద్రోచు. **320**

ప్రతిపదార్థం: అఖిలజగత్ ప్రభువు+అగు = సమస్తలోకాలకు నాథుడైన; దేవదేవున్ = బ్రహ్మాది దేవత లందరికీ దేవుడైన; అనంతునిన్ = అంతం లేని వైభవం కలవాడిని, దేశకాల వస్తు పరిచ్ఛేదం లేని వాడిని; పురుష+ఉత్తమ+అభిధానున్ =

పురుషోత్తముడనే పేరుగల వాడిని, పరమోదారుడిని; అంచిత = ఒప్పిదమైన; నామ సహస్రకంబునన్ = వేయినామాలతో; సంస్తుతించుచున్ = లెస్సగా కీర్తిస్తూ; సంతత+ఉత్థిత+మనస్కుఁడు+ఐ = ఎల్లప్పుడు పూనికతో కూడిన చిత్తం కలవాడై; యజమానుడు = పూజకుడు, పూజించేవాడు; అవ్యయుఁడు+ఐన = నాశనంగాని, మార్పుగాని లేనివాడైన; ఆతనిన్ = ఆ పరమాత్ముడిని; అర్చించుచును = పూజిస్తూ; దృఢధ్యాన నిరతుఁడు+అగుచున్ = నిశ్చలమైన ధ్యానంలో ఆసక్తి కలవాడై; నమస్కృతి = వందనం; ఆచరించుచున్ = చేస్తూ; అనాద్యంతున్(న+ఆది+అంతున్) = ఆద్యంత శూన్యుడిని, మొదలు తుదిలేని వాడిని; ఆ+విష్ణున్ = సర్వత్రవ్యాపించిన వాడిని; ఎల్లలోకములకున్ = సమస్త భువనములకు; అధ్యక్షున్ = ప్రభువైనవాడిని; సమస్తలోకాలను ప్రత్యక్షంగా తిలకించే వాడిని; బ్రహ్మణ్యున్ = బ్రహ్మకుగాని, బ్రాహ్మణుడికిగాని, తపస్సుకుగాని, వేదానికి గాని హితుడైన వాడిని; త్రిలోక కీర్తి వర్ధనునిన్ = ముల్లోకాలకు కీర్తిని వృద్ధిపొందించేవాడిని; సర్వధర్మజ్ఞున్ = సకలధర్మా లెరిగిన వాడిని; వరదున్ = భక్తులకు వరాలిచ్చేవాడిని; లోకనాథున్ = లోకస్వామిని; భూతభవ+ఉద్భవున్ = జీవులయొక్క సంసారానికి లేదా ఉనికికి కారణమైన వాడిని; నమ్మి = విశ్వసించి; భక్తిన్= భక్తితో; కొలిచి = సేవించి; సర్వదుఃఖంబులన్ = అన్ని చింతలను; తొలఁగన్+త్రోచున్ = దూరంగా గెంటి వేస్తాడు.

తాత్పర్యం: సమస్తలోకాలకు అధిపతియూ, బ్రహ్మాది దేవతలకు దేవుడూ, అంతంలేని వైభవం కలవాడూ, పురుషోత్తముడని ఖ్యాతి వహించినవాడూ అయిన పరమాత్మను వెయ్యి నామాలతో స్తుతిస్తూ ఎల్లప్పుడు పూనిక వహించిన చిత్తంతో గృహస్థుడు ఆద్యంత రహితుడైన ఆ పరమపురుషుడిని పూజిస్తూ, ధ్యానిస్తూ, నమస్కరిస్తూ అంతటా వ్యాపించినవాడున్నూ, భువనా లన్నింటికీ అధ్యక్షుడూ, బ్రహ్మణ్యుడూ, ముల్లోకాలకు కీర్తి పెంచేవాడూ, సకల ధర్మములు ఎరిగినవాడూ, భక్తులకు వరాలిచ్చేవాడూ, జగన్నాథుడూ, జీవుల యొక్క సత్తకు కారణమైనవాడూ అయిన మహాస్వామిని భక్తితో భజించి సకల దుఃఖాలను దూరంగా గెంటి వేయగలడు.

తే. **ప్రస్తుతులఁ బుండరీకాక్షుఁ బరమభక్తిఁ । దగిలి యర్చించుటయ నామతంబు; సర్వ**
ధర్మములకును సమధికతమము నైన । ధర్మ మింత యెఱుంగుము ధర్మతనయ! **321**

ప్రతిపదార్థం: ధర్మతనయ = ధర్మనందనా!; ప్రస్తుతులన్ = స్తోత్రాలతో; పుండరీక+అక్షున్ = తెల్లదామరలవంటి కన్నులుగల వాసుదేవుడిని; పరమభక్తిన్ = మిక్కిలి భక్తితో; తగిలి = ప్రియపడి, ఇష్టపడి; అర్చించుటయ = పూజించటమే; నామతంబు = నా కిష్టం; సర్వధర్మములకును = అన్నిధర్మాలలో; సమధిక తమము+ఐనధర్మము = మిక్కిలి అధికమైన ధర్మం అది; ఇంత+ఎఱుంగుము = ఇది నిజ మని గ్రహించుము.

తాత్పర్యం: ధర్మనందనా! పుండరీక నయనుడైన వాసుదేవుడిని పరమభక్తితో పూజించటమే ధర్మాలన్నిటిలో ఉత్తమమైన ధర్మం. హరిని పూజించటమే నామత మని గ్రహించుము.

సీ. **పరమతేజంబును బరమ పదంబును । బరమైన బ్రహ్మంబుఁ బరపరాయ**
ణముఁ బవిత్రంబులు నాఁ దగువానికి । నెల్లఁ బవిత్రంబు, నెల్ల మంగ
ళంబులకును మంగళంబును, నెల్ల దే । వతలకుఁ బరమదైవతము, భూత
సమితికి నవ్యయజనకుండు నగునట్టి । వాఁ డెవ్వఁ; డెవ్వాని వలనఁ దోఁచు

తే. **నాదియుగము నాగమమున; నంత్యవేళ । నడఁగు నెవ్వానియందుఁ జరాచరములు,**
విశ్వలోక ప్రధానుఁ డవ్విష్ణు వేయు । భవ్యనామంబులును బాపభయహరములు. **322**

ప్రతిపదార్థం: పరమతేజంబును = శ్రేష్ఠమైన తేజస్సును, సమానాధికరహితమైన గొప్పవెలుగు; పరమపదంబును = ఉన్నతమైన స్థానమును; పరము+ఐన బ్రహ్మంబున్ = గొప్పదగు దైవతమును; పరపరాయణమున్ = ముఖ్యమైన ప్రాప్యము, పొందదగిన శ్రేష్ఠమైన వస్తువు; పవిత్రంబులు = పరిశుద్ధికరములు; నాన్+తగు = అనదగిన; వానికిన్+ఎల్లన్ = పదార్థములన్నింటిలో; పవిత్రంబున్ = పరిశుద్ధికరమైనదియు; ఎల్లమంగళంబులకును = సమస్తములైన శుభములకును; మంగళంబును = శుభమును గల్గించునది; ఎల్లదేవతలకున్ = సకల దేవతలకునూ; పరమదైవతమున్ = శ్రేష్ఠమైనదైవమునూ; భూతసమితికిన్ = జీవుల యొక్క సమూహమునకు, ప్రాణికోటికి; అవ్యయజనకుండున్ = శాశ్వతుడైన తండ్రి; అగు+అట్టివాఁడు = ఐనట్టి మహాత్ముఁడు; ఎవ్వఁడు = ఎవడో; ఏ+ వాని వలనన్ = ఏ మహనీయుడివలన; చర+అచరములు = జంగమములు, స్థావరాలు, చేతనములు, అచేతనములు; ఆది యుగము+ఆగమమునన్ = సృష్టి వేళలో; తోఁచున్ = గోచరించునో, ఉత్పన్నమగునో; అంత్యవేళన్ = ప్రళయకాలంలో; ఎవ్వని+అందున్ = ఏ స్వామిలోపల; అడఁగున్ = లీనమగునో, లయించునో; విశ్వలోక ప్రధానుఁడు = సకల ప్రపంచమందు ముఖ్యమైన వాడెవ్వడో; ఆ+విష్ణు = ఆ విష్ణుదేవుడి యొక్క; వేయు = వెయ్యి; సహస్ర సంఖ్యాకమైన; భవ్యనామంబులును= శుభనామములు, మంగళకరములైన పేర్లు; పాపభయహరములు = దురితమును, భయమును తొలగించేవి.

తాత్పర్యం: పరంజ్యోతి స్వరూపుడు; పరమపదాధినాథుడు, పరబ్రహ్మము, మిక్కిలి ఆశ్రయించదగినవాడు, పవిత్రములను పవిత్రీకరించేవాడు, శుభములకెల్ల శుభసంధాయకుడు, సకలదైవతములకు దైవతమయినవాడు, ప్రాణికోటికి వినాశరహితుడైన జనకుడు ఎవడో, ఎవడు చరాచరముల నెల్ల సృష్టిస్తున్నాడో, ప్రళయకాలమందు ~~ఈ~~ భూతజాలమంతా ఎవడిలోపల అణగి ఉంటుందో- సకలజగత్తులలో ప్రధానపురుషుడైన ఆ విష్ణుదేవుడి మంగళకరములైన సహస్రనామాలు జీవుల పాపాలను, భయాలను పటాపంచలు కావిస్తాయి.

తే. **భూరిగుణయోగ విఖ్యాతములును ఋషి స । మాజ పరిగీతములును నై మహిమఁ దనరు**
నమ్మహాత్ముని నామంబు లధికతర వి । భూతికై చెప్పెదను విను భూపవర్య!' **323**

ప్రతిపదార్థం: భూపవర్య! = రాజులలో శ్రేష్ఠుడా!; భూరిగుణయోగ విఖ్యాతములునున్ = గొప్ప సద్గుణముల యొక్క కలయికచే ప్రసిద్ధికాంచినవియూ; ఋషిసమాజ = మంత్రవేత్తలైన ముని సంఘం చేత; పరిగీతములునున్+ఐ = లెస్సగా కీర్తించబడినట్టివై; మహిమన్ = ప్రభావం చేత; తనరు = ఒప్పునట్టి; ఆ+మహా+ఆత్ముని నామంబులు = ఆ పురుషోత్తముడి యొక్క పేరులు; అధికతర విభూతికై = మిక్కుటమగు ఐశ్వర్య మొదవుటకై; చతుర్విధ పురుషార్థ సిద్ధికై, ఆత్మోజ్జీవనమునకై; చెప్పెదను = తెల్పుతాను; విను = ఆలకించుము.

తాత్పర్యం: రాజ వల్లభా! ఉదాత్తగుణముల యొక్క సంబంధముచేత ప్రసిద్ధికెక్కినవీ, మునిసంఘంచేత అత్యాదరంతో కొనియాడబడేవీ, ప్రభావంతో ప్రకాశించునట్టివీ అయిన ఆ మహనీయుడినామాలు మిక్కుటమైన విభూతి సమకూడటం కొరకు నీకు చెప్పుతాను వినుము.

వ. **అని పలికి 'విశ్వంబు విష్ణుండు వషట్కారుండు భూతభవ్యభవత్ప్రభు' వను నివి మొదలైన 'రథాంగపాణి యక్షోభ్యుండు సర్వప్రహరణాయుధుం' దనియెడునివి తుదిగాఁ గల సహస్ర నామంబు లుపన్యసించి.** **324**

ప్రతిపదార్థం: అని పలికి = అని భీష్ముడు వచించి; విశ్వంబు = స్వరూపరూప గుణ విభవైశ్వర్యాదులచే పూర్ణుడు, ప్రపంచస్వరూపుడు;

విష్ణుండు = సమస్తమునందు వ్యాపించిఉండేవాడు, దేశకాలవస్తుపరిచ్ఛేదం లేక అంతట నిండి ఉండేవాడు; వషట్కారుండు = సమస్త లోకాలను తన వశం చేసికొన్నవాడు, యజ్ఞాలలో హోమానికి ఉద్దేశ్యమైనవాడు; భూతభవ్యభవత్ప్రభువు = భూతభవిష్యద్వర్తమాన కాలములనే త్రికాలములలోని సకల పదార్థాలకు ప్రభువైనవాడు; అను+ఇవి = అనునట్టి ఈ నామాలు; మొదలు+ఐన = మొదలుగా కలిగిన; రథాంగపాణి = చక్రము చేతియందు కలవాడు, సుదర్శన చక్రం హస్తమందుకలవాడు; అక్షోభ్యుఁడు = కలత నొందించుటకు సాధ్యపడనివాడు, ఎట్టికలతలు లేనివాడు; సర్వప్రహరణాయుధుండు = భక్త రక్షణకై పంచాయుధాలతో పాటు సకల విధములైన అస్త్రాలు ఆయుధాలుగా కలవాడు, ఆయుధాలనే ప్రశస్తి లేని గోళ్ళుకూడా ఆయుధాలుగా కలిగినవాడు; అనియెడు+ఇవి = అనునట్టి ఈ నామాలు; తుదిగాన్+కల = కడపట కలిగిన; సహస్రనామంబులు = వెయ్యిపేర్లు; ఉపన్యసించి = వక్కాణించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: నారాయణుడి సహస్రనామాలు చెప్పుతాను శ్రద్ధగా ఆకర్ణించు మని పలికి భీష్ముడు విశ్వము, విష్ణుడు, వషట్కారుడు, భూతభవ్య భవత్ప్రభువు అనే నామాలతో ప్రారంభమై రథాంగపాణి, అక్షోభ్యుడు, సర్వప్రహరణాయుధుడు అనే నామాలతో అవసితమయ్యే శ్రీవిష్ణు సహస్రనామాలు ఉగ్గడించాడు.

ఆ. కీర్తనీయుఁడైన కేశవు దివ్యనా । మంబు లివి భవద్ధితంబుఁ గోరి
తరతరంబ కీర్తితంబు లయ్యె నశేష । భంగి వేయుఁ గురునృపాలవర్య! 325

ప్రతిపదార్థం: కురునృపాలవర్య! = కురువంశ ప్రభువులలో శ్రేష్ఠుడా!; కీర్తనీయుఁడు+ఐన = కొనియాడదగినట్టి; కేశవు = శ్రీమన్నారాయణుడి యొక్క; దివ్యనామంబులు+ఇవి = అప్రాకృతములైన నామాలు ఇవియే; భవత్+హితంబున్+కోరి = నీ మేలు నాకాంక్షించి; వేయున్ = వెయ్యింటిని; అశేషభంగిన్ = అన్యూనాతిరిక్తంగా, ఒక్కటి వదలకుండా, పూర్తిగా; తరతరంబు+అ = క్రమక్రమంగా; కీర్తితంబులు+అయ్యెన్ = కొనియాడబడ్డాయి.

తాత్పర్యం: కురువంశరాజులలో ఉత్తముడవైన ధర్మజా! స్తుతికి పాత్రుడైన కేశవుడి యొక్క అప్రాకృతాలైన వెయ్యినామాలివి. వీటిని నీ శ్రేయస్సును కోరి పరిపూర్ణంగా క్రమక్రమంగా నీకు వినిపించాను.

భీష్ముఁడు ధర్మజునకు విష్ణునామ ప్రభావంబుఁ దెలుపుట. (సం.13-135-121).

సీ. విష్ణునామంబులు వేయును నిత్యంబు । వినినఁ బఠించిన మనుజుఁ డిహము
నందుఁ బరమ్మున నశుభంబు నొందక । యత్యంత శుభముల ననుభవించు;
విప్రుండు వేదాంతవిదుఁ డగు, రాజు వి । జయ మొందు, వైశ్యుఁ డక్షయ ధనంబుఁ
బడయు, శూద్రుఁడు సుఖభాగిత వెలయు, ధ । ర్మార్థకామ ప్రజాభ్యర్థి జనులు

తే. గాంతు రయ్యె తెఱంగు; లేకాంత భక్తి । శౌచియై విని కీర్తించి సారయశము
నచల లక్ష్మియు వంశ వర్యతయు మేలి । పెంపుసొంపును గలిగి శోభిల్లు నరుఁడు. 326

ప్రతిపదార్థం: విష్ణునామంబులు వేయును = విష్ణుదేవుడి యొక్క సహస్రనామాలు; నిత్యంబున్ = ప్రతిదినము; వినినన్ = ఇతరులు చదువగా ఆలకించిననూ; పఠించినన్ = తాను చదివిననూ; మనుజుఁడు = నరుడు; ఇహమునందున్ = ఈ లోకంలో; పరమ్మునన్ = పై లోకంలో; అశుభంబున్+ఒందక = అమంగళము, కీడు పొందక; అత్యంత శుభములన్ = కడలేని సౌఖ్యాలను; అనుభవించున్ = అనుభవిస్తాడు; విప్రుండు = భూసురుడు; వేద+అంత+విదుఁడు+అగున్ =

ఉపనిషద్రహస్యాలు తెలిసినవా డవుతాడు; రాజు = క్షత్రియుడు; విజయము+ఒందున్ = జయమును పొందుతాడు; వైశ్యుఁడు = వణిజుడు, వైశ్యకులస్థుడు; అక్షయధనంబున్ = తరుగని సిరిని; పడయున్ = పొందుతాడు; శూద్రుఁడు = శూద్రవర్ణస్థుడు; సుఖభాగితన్ = సౌఖ్యభాజనుడై; సుఖములందు పాలుపంచుకొన్నవాడై; వెలయున్ = విలసిల్లుతాడు; ధర్మ+అర్థ+కామ = ధర్మం, అర్థం, కామం అనే త్రివర్గమునూ; ప్రజా+అభి+అర్థి = సంతానమును అభిలషించేటటువంటి; జనులు = ప్రజలు, ఏకాంత భక్తిన్ = అధికమైన భక్తితో; అయ్యైతెఱంగులు = ఆయా అభిలషితార్థములు; కాంతురు = పొందుతారు; శౌచి+ఐ = పరిశుద్ధుఁడై; విని = శ్రీవిష్ణుసహస్రనామములను ఆలకించి; కీర్తించి = తాను కొనియాడి, పఠించి; సారయశమున్ = స్థిరమైన కీర్తిని; అచల లక్ష్మియున్ = నిలుకడ కలిగిన సంపత్తిని; వంశ వర్యతయున్ = తనకులమందు ప్రాధాన్యమును; మేలి = ఉన్నతమైన; పెంపుసొంపును = గౌరవాతిశయాన్ని; కలిగి = లభించినవాడై; నరుఁడు = మనుజుడు; శోభిల్లున్ = వెలుగొందుతాడు.

తాత్పర్యం: శ్రీ విష్ణు సహస్రనామాలు అనుదినం వినేవాడు, పఠించేవాడు ఈ లోకంలో, పైలోకంలో అశుభాల పాలుగాక అపరిమిత శుభాలు అనుభవిస్తాడు. బ్రాహ్మణుడు నామసహస్రపఠనం చేత వేదాంతవేత్త అవుతాడు. క్షత్రియుడు శాత్రవ జయం పొందుతాడు. వైశ్యుడు ధనసమృద్ధి గలవాడవుతాడు. శూద్రుడు శ్రవణమాత్రంతోనే సుఖాలను పొందుతాడు. ధర్మమును వాంఛించేవాడు ధర్మాన్ని, అర్థమును అభిలషించేవాడు అర్థాన్ని, కామమును కోరేవాడు కామములను, సంతానం కాంక్షించేవాడు సంతతిని అత్యంత భక్తితో విష్ణుసహస్రనామాలను విని, పఠించి పొందగలడు. పరిశుద్ధుడై ఏ నరుడు సహస్రనామాలను శ్రవణం చేస్తాడో, పారాయణం చేస్తాడో ఆతడు స్థిరమైన కీర్తిని, తరుగని సిరిని, కులమందు ప్రాధాన్యమును పడయగలుగుతాడు. ఉన్నత గౌరవాతిశయంతో ఒప్పుతాడు.

సీ. **పురుషోత్తముని నామములు వేయుఁ గీర్తించు । నాతఁ డొక్కెడను భయంబుఁ బొందఁ,**
డమిత వీర్యమునఁ దేజమునఁ గాంతిని బల । రూపగుణంబుల రూఢికెక్కు ,
రోగబంధాపదార్తులకుఁ బఠనమాత్ర । నయ్యయి దురితము లడఁగు, వాసు
దేవాశ్రయుఁడు వాసుదేవ పరాయణుఁ । డును నగుమర్త్యుఁ డవ్వినుతనామ

ఆ. **కము లుపన్యసించి కల్మషంబుల నెల్ల । దొఱఁగి దుర్గతులకుఁ దొలఁగి జన్మ**
మరణములకు రోగ జరలకు నందని । పరమమైన బ్రహ్మపదము నొందు. **327**

ప్రతిపదార్థం: పురుషోత్తముని = శ్రీమన్నారాయణుడి యొక్క; నామములు వేయున్ = వెయ్యినామధేయాలను; కీర్తించు+అతఁడు = కొనియాడునట్టి వాఁడు, పొగడేవాడు, శ్లాఘించేవాడు; ఒక్క+ఎడను = ఏ తావునందు గూడ; భయంబున్ = వెరపును, భీతిని; పొందఁడు = చెందడు; అమిత వీర్యమునన్ = మిక్కిలి పరాక్రమంతోనూ; తేజమునన్ = ప్రతాపంతోనూ; కాంతిన్ = శోభతో, దీప్తితో; బలరూపగుణంబులన్ = శక్తి, సౌందర్యం, సద్గుణములు అనువాటితో; రూఢికిన్+ఎక్కున్ = ప్రసిద్ధిగాంచుతాడు; రోగ+బంధ+ఆపత్+ఆర్తులకున్ = వ్యాధులు, బంధనం, కష్టాలు అనువాటితో బాధపడేవారికి; పఠనమాత్రన్ = సహస్రనామ పారాయణం చేయగానే; అయ్యయి దురితములు = ఆయాపాపాలు; అడఁగున్ = నశిస్తాయి, నిర్మూలమవుతాయి; వాసుదేవ+ఆశ్రయుఁడున్ = వాసుదేవుడిని ఆశ్రయించుకొన్నవాడున్నూ; వాసుదేవ పరాయణుఁడునున్ = వాసుదేవుడిని పరమ గతిగా ఎంచుకొన్నవాడూ, విశ్వసించినవాడూ; అగుమర్త్యుఁడు = అయిన మానవుడు; ఆ+వినుత నామకములు = ఆ మెచ్చ దగిన వెయ్యిపేర్లు; ఉపన్యసించి = ఉగ్గడించి, పేర్కొని; కల్మషంబులన్+ఎల్లన్ = అన్ని దురితాలను, పాతకాలను; తొఱఁ

గి = వీడి; దుర్గతులకున్+ తొలఁగి = దుఃస్థితులకు దూరమై, విపత్తులనుండి విడివడి, ఇడుములు బాసి; జన్మమరణములకున్ = చావు పుట్టుకలకు; రోగజరలకున్ = వ్యాధులకూ, ముసలితనానికీ; అందని = చిక్కని, దొరకని, లోనుగాని; పరమము+ఐన = ఉత్తమమైన; బ్రహ్మపదమున్+ఒందున్ = మోక్షాన్ని పొందుతాడు.

తాత్పర్యం: విష్ణుమూర్తి వెయ్యినామాలను నిత్యం పారాయణ మొనర్చేవాడు ఎక్కడా భయాన్ని పొందడు. మిక్కుటమైన శౌర్యం, ప్రతాపం, శోభ, శక్తి, సౌందర్యం, సద్గుణాలు అనే వాటితో ప్రసిద్ధి చెందుతాడు. శ్రీ విష్ణునామ పఠనంతో రోగాలు వదలుతాయి. చెరనుండి విముక్తి లభిస్తుంది. ఇడుములు తీరుతాయి. నామ పారాయణంవలన ఈ పాతకాలన్నీ నశిస్తాయి. వాసుదేవుడిని ఆశ్రయించుకొన్నవాడు, వాసుదేవుడిని దిక్కుగా ఎంచుకొన్నవాడూ, శ్లాఘింపదగిన ఈ భగవన్నామాలను పఠించి దురితవిహీనుడై, దుఃస్థితులకు దూరమవుతాడు. జననమరణాలకూ, జరావ్యాధులకూ లోనుగాక పరమోత్తమమైన మోక్షపదవిని అందుకొంటాడు.

క. స్మృతి సౌఖ్య క్షాంతి శ్రీ । ధృతి కీర్తులు గలుగు దుర్మతియుఁ గ్రోధము లు
బ్ధతయును మాత్సర్యము లే । వతి పుణ్యత విష్ణుభక్తులైన జనులకున్. 328

ప్రతిపదార్థం: అతిపుణ్యతన్ = అధికమైన పుణ్యం సల్పడంచేత; విష్ణు భక్తులు+ఐన = నారాయణ ప్రేమికులైన; జనులకున్ = నరులకు; స్మృతి = జ్ఞప్తి, ఒరులు చేసిన మేలు మరువకుండటం; సౌఖ్య = సుఖం; క్షాంతి = సహనం, ఓర్పు; శ్రీ = కలిమి; ధృతి = ధైర్యం; కీర్తులు = యశస్సు అనునవి; కలుగున్ = లభిస్తాయి; దుర్మతియున్ = చెడుబుద్ధి; క్రోధము = కినుక, కోపం, ఆగ్రహం; లుబ్ధతయును = పేరాస; మాత్సర్యము = ఓర్వలేనితనం, అసూయ; లేవు = కలుగవు.

తాత్పర్యం: పుణ్యాత్ములైన విష్ణుభక్తులకు ఇతరు లొనర్చిన మేలు మరువకుండటం, సుఖం, సహనం, సంపత్తి, ధైర్యం, యశస్సు అనేవి లభిస్తాయి. చెడుబుద్ధి, కోపం, పేరాస, ఓర్వలేనితనం అనే దుర్గుణాలు ఉండవు.

సీ. చంద్రార్క నక్షత్ర సహిత మైన నభంబు, । సచరాచరోర్వియు, జలనిధులును,
సురదైత్య గంధర్వ గరుడ యక్షోరగ । వ్రజములు హరివశవర్తనములు;
బుద్ధియు నింద్రియములును మనంబు స । త్త్వంబును బలము దేజంబు ధృతియు
క్షేత్రంబుఁ దద్గత క్షేత్రజ వస్తువు । లరయఁగా వాసుదేవాత్మకంబు;

తే. లాగమోదితాచారమయంబు ధర్మ । మచ్యుతుండు తత్ప్రభువు; సాంఖ్యమును యోగ
తంత్రమును శిల్పవేదశాస్త్రములుఁ గర్మ । ములు జనార్దనువలన సముద్భవించె. 329

ప్రతిపదార్థం: చంద్ర+అర్క,నక్షత్ర సహితము+ఐన = సోముడితో, సూర్యుడితో, చుక్కలతో కూడినట్టి; నభంబున్ = ఆకాశం; సచర+అచర+ఉర్వియున్ = చేతనాలతో, అచేతనాలతో కూడిన ధరణీతలం; జలనిధులును = సముద్రాలు; సుర = దేవతలు; దైత్య = రాక్షసులు; గంధర్వ = గంధర్వులు; గరుడ = గరుడులు; యక్ష = యక్షులు; ఉరగ వ్రజములు = సర్పములు అనువాటి యొక్క సమూహాలు; హరివశవర్తనములు = విష్ణున కధీనములైన ప్రవర్తన గలవి; శ్రీహరికి లోబడి మెలగుతుంటాయి; బుద్ధియున్ = బుద్ధి; ఇంద్రియములున్ = జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు; మనంబున్ = మనస్సు; సత్త్వంబును = సత్త్వము; బలమున్ = శక్తి; తేజంబున్ = తేజస్సు; ధృతియున్ = ధైర్యం; క్షేత్రమున్ = శరీరం; తద్గత = దేహంలో ఉన్న; క్షేత్రజవస్తువులు = ఆత్మద్రవ్యములు; అరయన్+కాన్ = ఆలోచించగా; వాసుదేవ+ఆత్మకములు =

నారాయణ స్వరూపాలు; ధర్మము = ధర్మమనే ప్రథమ పురుషార్థం; ఆగమ+ఉదిత = వేదాలలో, ధర్మశాస్త్రాలలో చెప్పబడిన; ఆచారమయంబు = అనుష్ఠానముతో కూడినది; తత్+ప్రభువు = ఆ ధర్మానికి అధీశ్వరుడు; అచ్యుతుడు = నారాయణుడు; సాంఖ్యమును = సాంఖ్యశాస్త్రమును; యోగతంత్రమును = యోగసిద్ధాంతము; శిల్ప వేద శాస్త్రములు = శిల్పము, వేదములు, ఇతిహాసపురాణాలు; కర్మములున్ = కర్మలు; జనార్దనువలనన్ = నారాయణుడివలన; సముద్భవించెన్ = కలిగాయి.

తాత్పర్యం: సూర్యచంద్ర నక్షత్రాలతో గూడిన ఆకాశం, స్థావరాలతో, జంగమాలతో చేరిన భూతలం, సముద్రాలు, దేవతలు, దానవులు, గంధర్వులు, గరుడులు, యక్షులు, సర్పములు మున్నుగా గల్గిన భూతజాలం, విష్ణుదేవుడికి అధీనాలై మెలగుతున్నాయి. బుద్ధి, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, సత్త్వం, శక్తి, తేజస్సు, ధైర్యం, శరీరం, శరీరగతుడైన ఆత్మ-ఈ పదార్థజాతమంతా ఆలోచిస్తే వాసుదేవమయాలే. వేదాలలో, ధర్మశాస్త్రాలలో చెప్పబడిన సదాచారమే, సంప్రదాయమే ధర్మం. ఈ ధర్మానికి ప్రభువు శ్రీమన్నారాయణుడు. సాంఖ్య యోగ సిద్ధాంతాలు, శిల్పం, వేదాలు, ఇతిహాసపురాణాలు, కర్మములు సమస్తమూ జనార్దనుడివలననే సంభవించాయి.

ఆ. విష్ణుఁ డొక్కరుండ వినుము మహాభూతంబు; । దక్కు భూత తతులు పెక్కు గలవు;
సరిఁ ద్రిలోకములను బరఁగి విశ్వంబు భూ । తాత్ముఁ డమ్మహాత్ముఁ డనుభవించు. 330

ప్రతిపదార్థం: విను = ధర్మజా! సావధానుడవై ఆలకించుము; విష్ణుఁడు+ఒక్కరుండు+అ = సర్వజీవాంతర్యామి యైన విష్ణుదేవుడొక్కడే; మహాభూతంబు = గొప్పభూతం; తక్కు = ఇతరములైన, తదన్యములైన; భూత తతులు = భూతముల యొక్క సమూహాలు, జీవజాలాలు; పెక్కు కలవు = అనేకం ఉన్నాయి; సరిన్ = సమానంగా, భేదరహితంగా; త్రిలోకములను = ముజ్జగాలలో; పరఁగి = వ్యాపించి; భూత+ఆత్ముఁడు = భూతస్వరూపుడైనట్టి, భూతములకెల్ల ఆత్మగాఉన్నట్టి; ఆ+మహా+ఆత్ముఁడు = ఆ మహనీయుడైన విష్ణుదేవుడు; విశ్వంబున్+అనుభవించున్ = ప్రపంచమును అనుభవిస్తున్నాడు.

తాత్పర్యం: ధర్మజా! శ్రద్ధాసక్తులతో ఆలకించుము. విష్ణువొక్కడే మహాభూతం. తక్కినవన్నీ చిన్న చిన్న భూతాలు-లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. భూతాత్ముడు, మహాత్ముడు అయిన మహావిష్ణువు ముల్లోకములందు వ్యాపించి లీలా రసాన్ని అనుభవిస్తున్నాడు.

ఆ. వ్యాస సంప్రణీతమైన యీ విష్ణు స్త । వంబు సకలశోభనంబులును సు
ఖములుఁ గోరు పురుషుఁ డమలినబుద్ధిఁ బ । ఠింపవలయు భక్తి పెంపుతోడ. 331

ప్రతిపదార్థం: సకలశోభనంబులును = సమస్తములైన శుభాలను, మంగళములను, సౌభాగ్యాలను; సుఖములున్ = సౌఖ్యాలు; కోరు = వాంఛించే; పురుషుఁడు = నరుడు; అమలిన బుద్ధిన్ = నిర్మలమైన చిత్తంతో; భక్తిపెంపుతోడన్ = అధికమైన భక్తిభావంతో; వ్యాససంప్రణీతము+ఐన = వేదవ్యాసమహర్షిచేత రచించబడిన; ఈవిష్ణుస్తవంబున్ = ఈ శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రాన్ని; పఠింపన్+వలయున్ = తప్పక చదవాలి.

తాత్పర్యం: సమస్త సన్మంగళాలను, సుఖాలను కోరుకునే మానవుడు నిర్మలమైన అంతఃకరణంతో, అధికమైన భక్తి భావంతో శ్రీవేదవ్యాస మహర్షి కృతమైన శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రాన్ని తప్పక చదవాలి.

క. అజు విశ్వాధీశ్వరు స । ర్వజగత్ప్రభవావ్యయ ప్రవర్తనకరు నం
బుజలోచను నెవ్వారలు । భజింతురు పరాభవమునఁ బడ రప్పుణ్యుల్. 332

ప్రతిపదార్థం: అజున్ = పుట్టుకలేని వాడూ, జన్మరహితుడూ; విశ్వ+అధి+ఈశ్వరున్ = ప్రపంచానికి అధిపతియూ; సర్వజగత్ = సమస్త లోకాల యొక్క; ప్రభవ = పుట్టుకను; అవ్యయ ప్రవర్తన = నాశముగాని, శాశ్వతమైన నిర్వహణమును; కరున్ = చేసేవాడునూ అయిన; అంబుజలోచనున్ = పద్మములవంటి నేత్రములుగల మహావిష్ణువును; ఏ+వారలు = ఏ జనులు; భజింతురు = కొలుతురో, సేవింతురో; ఆ+పుణ్యుల్ = ఆ పుణ్యాత్ములు; పరాభవమునన్+పడరు = అవమానం పాలుగారు.

తాత్పర్యం: పుట్టుకలేని వాడున్నూ, ప్రపంచేశ్వరుడున్నూ, సకలభువనాలను సృష్టించేవాడున్నూ, కమలదళముల వంటి కన్నులు గల శ్రీమహావిష్ణువును ఎవరు సేవిస్తారో, అట్టి పుణ్యపురుషులు పరాభవముల పాలుగారు.

క. కావున విష్ణుని పేళ్ళగు । నీ వేయుఁ బఠింపు నీకు నెప్పుడు నాయు
శ్శ్రీవిభవారోగ్యంబులు । భూవర! సిద్ధించుఁ బరమబోధముఁ గలుగున్.' 333

ప్రతిపదార్థం: భూవర! = రాజా!; కావునన్ = కనుక; విష్ణుని పేళ్ళు+అగు = శ్రీహరినామధేయాలైన; ఈవేయున్ = ఈ వెయ్యింటిని; పఠింపు = చదువుము; నీకున్ = నీకు; ఎప్పుడున్ = ఎల్లప్పుడు, సంతతము; ఆయుః = ఆయుష్యము; శ్రీ = సంపద, కలిమి, సిరి; విభవ = వైభవం, గొప్పతనం; ఆరోగ్యములు = అనామయం, వ్యాధిరాహిత్యం; సిద్ధించున్ = లభిస్తాయి; పరమబోధమున్ = ఉత్తమజ్ఞానం; కలుగున్ = సమకూడుతుంది, చేకూరుతుంది.

తాత్పర్యం: ధర్మజా! విష్ణుదేవుడి వెయ్యినామాలను ఎల్లప్పుడూ పఠించుము. పఠిస్తే నీకు దీర్ఘాయుష్యము, ఐశ్వర్యమూ, వైభవమూ, ఆరోగ్యమూ, ఉత్తమ జ్ఞానమూ లభిస్తాయి.'

క. అని యిట్లుపదేశించిన । విని మోదము నెమ్మనమున వెల్లిగొనఁగ బాం
డుని యగ్రసుతుఁడు గాంగే । యున కభివందన మొనర్చి యుచితవినయుఁ డై. 334

ప్రతిపదార్థం: అని, ఇట్లు = అంటూ ఈ ప్రకారం; ఉపదేశించినన్ = భీష్ముడు బోధించగా; విని = ఆలకించి; మోదము = సంతోషం; నెఱ+మనమునన్ = తన నిండు మనస్సులో; వెల్లి+కొనఁగన్ = ప్రవహించగా; పాండుని+అగ్రసుతుఁడు = పాండు మహారాజు యొక్క పెద్దకుమారుడు అయిన ధర్మరాజు; గాంగేయునికిన్ = గంగాపుత్రుడైన దేవవ్రతుడికి, భీష్ముడికి; అభివందనము+ ఒనర్చి = ప్రణామం చేసి, దణ్ణం పెట్టి; ఉచిత వినయుఁడు+ఐ = తగిన అణకువ కలవాడై (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ఈ రీతిగా భీష్ముడు ధర్మజునకు శ్రీవిష్ణుసహస్రనామాలు ఉపదేశించగా ఆలకించి ఆనందం తనమదిలో నిండి ప్రవహించగా పాండుమహారాజుయొక్క జ్యేష్ఠ పుత్రుడైన యుధిష్ఠిరుడు ఆయనకు సాష్టాంగదండప్రణామం చేసి, తగిన వినయంతో.

వ. 'పూజానమస్కారంబులకు నెవ్వరు భాజనంబు? లెవ్వరికిఁ జెట్ట సేసినం జేటు వాటిల్లు? నెవ్వారలు సంతోషించిన శుభంబులు చొప్పడుం? జెప్పవే' యనిన నతం డతని కిట్లనియె. 335

ప్రతిపదార్థం: పూజా నమస్కారంబులకున్ = అర్చించటానికీ, మ్రొక్కటానికీ; ఎవ్వరు; భాజనంబులు = అర్హులు, పాత్రులు, యోగ్యులు, తగినవారు; ఎవ్వరికిన్; చెట్ట+చేసినన్ = కీడు కావిస్తే; చేటు+పాటిల్లున్ = కీడు మూడుతుందో; ఏ+వారలు = ఎవ్వారు; సంతోషించినన్; శుభంబులు; చొప్పడున్ = కలుగునో; చెప్పవు+ఏ? = తెలుపవా?; అనినన్ = అని ధర్మరా జనగా; అతండు = భీష్ముడు; అతనికిన్ = ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పూజించటానికి, నమస్కరించటానికి ఎవరు తగినవారు? ఎవరికి కీడు చేస్తే మనకు కీడు మూడుతుందో, ఎవరిని సంతోషపరిస్తే మనకు శుభాలు సంప్రాప్తిస్తాయో చెప్పవలసింది' అని వేడుకొనగా గాంగేయుడు ధర్మనందనుడికి ఇట్లా బదులు చెప్పాడు.

బ్రాహ్మణ పూజానమస్కారంబులు పరమోత్కృష్టంబు లని చెప్పుట. (సం.13-136-1).

సీ. **'పూజానమస్కారములకుఁ బాత్రములు బ్రా । హ్మణులు; వారలకుఁ గీ డాచరించి**
వాసవుండును జెడు; వారి సంతసమున । నఖిల శుభంబులు నావహిల్లు;
ధర్మసేతువు లోకధారకం బఖిలశా । స్త్ర ప్రవర్తకము విప్రవ్రజంబు;
తపమును వాక్కును ధనము విప్రుల కొక్క । కుడుపు మాత్రన పాపకోటిఁ బాతు;

తే. **రమ్మహాత్ములు చొప్పరు లఖిలమార్గ । ములకు; విను దేవతలు దేవతలకు బాలుఁ**
డజ్ఞుఁ డన లేదు పూజకు నర్హు లనిన । నధిప! వృద్ధులఁ బ్రాజ్ఞుల నడుగనేల?' **336**

ప్రతిపదార్థం: అధిప = రాజా!; బ్రాహ్మణులు = భూసురులు; పూజానమస్కారములకున్ = పూజించటానికీ, నమస్కరించటానికీ; పాత్రములు = తగినవారు, అర్హులు; వారలకున్ = విప్రులకు; కీడు+ఆచరించి = హాని సల్పి; వాసవుండును = దేవేంద్రుడైననూ; చెడున్ = నశిస్తాడు, పాడైపోతాడు; వారి సంతసమునన్ = ఆ బ్రాహ్మణులు ఆనందపడితే; అఖిలశుభంబులున్ = సమస్తమంగళములు; ఆవహిల్లున్ = కలుగుతాయి; విప్రవ్రజంబు = బ్రాహ్మణ సమాజం; ధర్మసేతువు = ధర్మరక్షకం; లోకధారకంబు = లోకమును ధరించునట్టిది, లోకులకు ఆధారమైనట్టిది; అఖిలశాస్త్రప్రవర్తకము = భగవదాజ్ఞలైన వేదశాస్త్ర పురాణాదులను ప్రవర్తింపజేస్తుంది, జనులు అనుసరించేటట్లు చేస్తుంది; విప్రులకున్ = ద్విజులకు; తపమును = తపస్సు; వాక్కును = మాటయు; ధనము = విత్తము; ఒక్కకుడుపుమాత్రన = ఒక పూట వారికి భోజనం పెట్టితే (అన్నదాత యొక్క); పాపకోటిన్ = పాతకాల సమూహాన్ని; పాతురు = తొలగిస్తారు; అఖిలమార్గములకున్ = అన్నిదారులకు; ఆ+మహా+ఆత్ములు = ఆ దొడ్డమనసుగల విప్రులే; చొప్పరులు = దారిచూపేవారు; విను = ధర్మజా! శ్రద్ధగా ఆలకించుము; దేవతలకున్ = వేల్పులకు; దేవతలు = వారే వేల్పులు; బాలుఁడు = పిల్లవాడు; అజ్ఞుఁడు = మూఢుడు; అనన్ లేదు = విప్రుల విషయంలో ఆ ఎన్నిక తగదు; పూజకున్ = ఆరాధనకు; అర్హులు = వారు యోగ్యులు; అనినన్ = అని చెప్పేటపుడు; వృద్ధులన్ = వారిలో పెద్దలను గూర్చి; ప్రాజ్ఞులన్ = పండితులగూర్చి; అడుగన్+ఏల = పూజార్హులని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

తాత్పర్యం: బ్రాహ్మణులు పూజించటానికి, నమస్కరించటానికి యోగ్యులు. వారికి కీడుచేసినచో దేవేంద్రుడయినా చెడకమానడు. వారిని సంతోషపెడితే సకల శుభాలు సమకూడుతాయి. ధర్మ రక్షకులు, లోకోద్ధారకులు, శాస్త్రప్రవర్తకులు వారే సుమా! విప్రులకు వారి తపస్సే, వచనమే ధనం. వారి కొక్కపూట తిండి పెట్టినవారి పాతకరాసు లన్నింటినీ వారు పటాపంచలు కావించగలరు. అన్ని మార్గా లెరిగినవారు కనుక జనులకు మంచిదారి చూపగలవారు వారే. ధర్మపుత్రా! వినుము. దేవతలకు దేవతలు వారే. ద్విజుడు బాలుడైనా, మూఢుడైనా పూజార్హుడే. అటువంటప్పుడు వారిలో పెద్దలయినవారూ, పండితులయినవారూ పూజార్హులని వేరుగా చెప్పవలసిన అక్కర లేదుగదా!'

వ. **అనిన విని యజాతశత్రుండు 'బ్రాహ్మణులఁ బూజించుటవలన విశిష్టంబయిన శుభం బెయ్యది దృష్టం బయ్యు వారలయందు వర్ణనీయం బగు వర్తనం బేమి గానంబడియె నీవిట్లు వారలం గొనియాడె? దెఱింగింపవే' యనుటయు నాపగాపుత్త్రుండు 'పవనార్జున సంవాదం బను నితిహాసంబు విను; మది భవత్ప్రశ్నంబునకు సదుత్తరంబై యుండు' నని పల్కి య జ్జనపతి కిట్లనియె.** **337**

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాత శత్రుండు = ధర్మరాజు; బ్రాహ్మణులన్; పూజించుట వలనన్; విశిష్టంబు+అయిన = శ్రేష్ఠమైన, ప్రత్యేకమైన; శుభంబు; ఏ+అది (ఎయ్యది) = ఎట్టిది; దృష్టంబు+అయ్యున్ = నీచేచూడబడిననూ, నీకు గోచరించినా; వారలయందున్ = ఆ బ్రాహ్మణులందు; వర్ణనీయంబు+అగు = స్తుతించదగిన, మెచ్చదగిన; వర్తనంబు = నడవడి, ప్రవర్తన; ఏమి+కానంబడియెన్ = ఏమి కనిపించింది?; నీవు; ఇట్లు; వారలన్ = ఆ ద్విజులను; కొనియాడెదు? = మెచ్చుకొంటావు? ఎఱింగింపవు+ఏ = తెల్పుమా; అనుటయున్ = అని ధర్మరాజడుగగా; ఆపగాపుత్త్రుండు = నదీసుతుడు-భీష్ముడు; పవన+అర్జున సంవాదంబు = వాయుదేవునకు, కార్తవీర్యార్జునునకు జరిగిన సంభాషణం; అను = అనునట్టి; ఇతిహాసంబున్ = పూర్వ చరిత్రను; వినుము; అది = ఆ కథ; భవత్+ప్రశ్నంబునకున్ = నీ వడిగిన దానికి; సత్+ఉత్తరంబు+ఐ = మంచిసమాధానమై; ఉండున్ = ఉంటుంది; అని పల్కి; ఆ+జనపతికిన్ = రాజైన ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్మ డట్లా పల్కగా విని పాండునందనుడు "పితామహా! బ్రాహ్మణులను పూజించటంవలన ప్రత్యేకమైన శుభం నీ కేమి గోచరించినప్పటికినీ, వారియందు ఇంతగా కొనియాడదగిన నడవడి(చరిత్ర) నీ కేమి కన్పించింది? వారిని నీవు ఇట్లా ఎందుకు మెచ్చుతున్నావో తెల్పు' మని అడిగాడు. అందుకు గంగానందనుడు 'ధర్మజా! పవనార్జున సంవాదమనే ఒక పూర్వగాథ ఉన్నది. అది నీ వడిగిన ప్రశ్నకు సరి అయిన సమాధానం అవుతుంది. వినిపిస్తాను, విను' మని భీష్ముడు ఇట్లా అన్నాడు.

పవన కార్తవీర్యార్జున సంవాదంబు భీష్మండు ధర్మరాజునకుం జెప్పుట. (సం.13-137-2).

సీ. **'అధిప! సహస్రబాహార్జునుఁ డేడుదీ । వులు నేలి యద్భుతబలపరాక్ర**
ములఁ దనర్చి 'మత్సము లెవ్వరును నెందు । లేరని యత్యవలేపయుక్తి
నాడిన నొకభూత మాకాశముననుండి । 'యెఱుఁగక పలికెద; వెల్లవారి
కధికులుగారె ధరామరు' లనవుడు । నతఁడు 'వారలు రాజు నాశ్రయించి

తే. **నడపి కొందురు మనుగడ; పుడమిఱేని । కంటె నె ట్లెక్కుడై? రట్లుఁ గాక యేను**
మనుతుఁ గూర్చినఁ, జెఱుతు నల్గిన సమస్త । భూతముల' నన్న వెఱచి యా భూత మరిగె. **338**

ప్రతిపదార్థం: అధిప! = రాజా! సహస్రబాహా+అర్జునుఁడు = వేయిచేతులు గల కార్తవీర్యార్జునుడు; ఏడు దీవులున్+ఏలి = సప్తద్వీపాలను పాలించి; అద్భుతబలపరాక్రమములన్ = ఆశ్చర్యం కల్గించే శక్తితో, శౌర్యంతో; తనర్చి = ఒప్పి; మత్+సములు = నాకు సమానులు; ఎవ్వరును; ఎందున్; లేరు; అని; అతి+అవలేపయుక్తిన్ = మిక్కుటమైనగర్వంతో కూడినవాడై; ఆడినన్ = పలుకగా; ఒక భూతము = ఒకప్రాణి; ఆకాశమునన్+ఉండి = గగనతలం నుండి; ఎఱుఁగక పలికెదవు = తెలియకుండా మాట్లాడుతున్నావు; ఎల్లవారికిన్ = అందరికి; ధరా+అమరులు = భూసురులు; అధికులుకారు+ఎ = గొప్పవారుగదా!; అనవుడున్ = అని ఆ భూతం పలుకగా; అతఁడు = కార్తవీర్యుడు; వారలు = బ్రాహ్మణులు; రాజున్; ఆశ్రయించి = కనిపెట్టుకొని; మనుగడ = తమజీవనము, బ్రతుకు తెరువు; నడపి కొందురు = సాగించుకొంటారు; పుడమి ఱేనికంటెన్

= భూపతికంటెను; ఎట్లు = ఏ విధంగా; ఎక్కుడు+ఐరి? = అధికులైనారు?; అట్లున్+కాక = అంతేగాక; ఏను = నేను; కూర్చినన్ = ఇష్టపడితే, ప్రియపడితే; సమస్తభూతములన్ = ఎల్లజీవులను; మనుతున్ = రక్షిస్తాను, కాపాడ గలను; అల్గినన్ = కోపం వహిస్తే; చెఱుతున్ = నాశనం చేస్తాను, శిక్షించగలను; అన్నన్ = అని చెప్పగా; వెఱచి = భయపడి; ఆ భూతము; అరిగెన్ = వెళ్ళిపోయింది.

తాత్పర్యం: 'ధర్మనందనా! వేయి చేతులు గల కార్తవీర్యార్జునుడు అనే రాజు సప్తద్వీపాలను పరిపాలించాడు. వింత గొలుపు బలపరాక్రమాలతో వెలుగొందుతూ అతడు ఎందునూ నాకు సమానులు ఎవ్వరూ లేరని మిక్కిలి గర్వంతో పలికాడు. ఆ మాటలు విని ఆకాశంనుండి ఒక భూతం 'నీవు తెలియక మాట్లాడుతున్నావు. అందరికంటె బ్రాహ్మణులు అధికులు కదా!' అని పలికింది. అందు కతడు 'బ్రాహ్మణులు రాజు నాశ్రయించి బ్రతుకుతారు. అట్టివారు రాజుకంటె ఎట్లా అధికులౌతారు? ఆ విషయ మట్లుంచు. నేను ఇష్టపడితే సకల జీవులను సంరక్షించగలను. ఆగ్రహిస్తే అందరినీ అంతం చేయగలను' అన్నాడు. ఆ మాటలకు భయపడి ఆ భూతం అదృశ్యమయింది.

విశేషం: ద్వీపం అనగా నాలుగు దిక్కుల నీళ్ళు గల భూభాగం. ద్వీపాలు ఏడు.
1)జంబూద్వీపం 2)ప్లక్షము 3)కుశము 4)క్రౌంచము 5)శాకము 6)శాల్మలము 7)పుష్కరము.

వ. అట్టియెడం బవనుండు గగనంబున నుండి త న్నెఱింగించికొని యన్నరపతి తోడ. 339

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్ = ఆ భూతం అదృశ్యమైన తర్వాత; పవనుండు = వాయుదేవుడు; గగనంబునన్+ఉండి = ఆకాశస్థలం నుండి; తన్నున్+ఎఱింగించికొని = నేను వాయువును అని పరిచయం చేసికొని; ఆ+నరపతితోడన్ = ఆ రాజుతో, కార్తవీర్యుడితో.

తాత్పర్యం: ఆ భూతం అంతర్ధానమైన పిదప అంబరతలం నుండి అనిలుడు కార్తవీర్యార్జునుడితో (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'భూదేవశక్తిన కాదె రాజులు ప్రజా । రక్ష యొనర్చుట; బ్రాహ్మణులకు
నధికులు గలరె? యహల్యకై యింద్రుండు । గౌతముఁ డలిగిన గాసిఁ బడఁడె?
కుంభసంభవుచేత నంభోధి యడఁగదె? । యనలుండు భృగుశాపహతుఁడు గాఁడె?'
యన విని మఱుమాట యాడక యున్న య । ర్జుననకుఁ బవనుఁ డిట్లనియె మఱియు

తే. 'నాంగిరసవంశ సంభవుం డగు నుచథ్యుఁ । గోరి నిజపుత్రి సోముఁడు గారవమున
నిచ్చె; నా దంపతులు దమయిచ్చ వనము । నందు వసియించి ముని హృదయంబు లలర. 340

ప్రతిపదార్థం: రాజులు = క్షత్రియులు; ప్రజారక్ష+ఒనర్చుట = జనులను పాలించటం, కాపాడటం; భూదేవశక్తిన్+అ+కాదు+ఎ = భూసురుల యొక్క బలం చేతనే కదా! బ్రాహ్మణులకున్ = విప్రులకంటె; అధికులు+కలరు+ఎ? = మించినవా రున్నారా?; అహల్యకై = అహల్య కొరకు; ఇంద్రుఁడు = దేవేంద్రుడు; గౌతముఁడు+అలిగినన్ = గౌతమమహర్షి కినియగా; గాసిన్+పడఁడు+ఎ? = కష్ట మనుభవించలేదా?; కుంభసంభవుచేతన్ = కలశం నుండి జన్మించిన అగస్త్యమహర్షి చేత; అంభోధి = సముద్రం; అడఁగదు+ఎ? = అడుగంటలేదా?, నిర్జలము కాలేదా?; అనలుఁడు = అగ్నిదేవుడు; భృగుశాపహతుఁడు+కాఁ

డు+ఎ? = భృగుమౌని శాపం చేత దెబ్బతినలేదా?; అనన్ విని = అని పవనుడు పల్కగా ఆలకించి; మఱుమాట = ప్రతివచనం; ఆడక+ఉన్న = చెప్పకున్నట్టి; అర్జుననకున్; పవనుఁడు = వాయువు; మఱియున్ = ఇంకనూ; ఇట్లు+అనియెన్; ఆంగిరసవంశసంభవుండు+అగు = అంగిరసమహాముని వంశమునందు జన్మించినవాడైన; ఉచథ్యున్ = ఉచథ్యుడనే పేరుగల విప్రుడిని; కోరి = ఇష్టపడి; సోముఁడు = చంద్రుడు; నిజపుత్రిన్ = తన కొమార్తెను; గారవమునన్ = ఆదరంతో, మన్ననతో; ఇచ్చెన్ = ఇచ్చి పెళ్ళిచేశాడు; ఆ దంపతులు = ఆ భార్యాభర్తలు; తమ+ఇచ్చన్ = తమ ఇష్టప్రకారం; వనము+అందున్ = అరణ్యంలో; వసియించి = నివసించి; మునిహృదయంబులు+అలరన్ = మునీశ్వరుల యొక్క మనసులు ఆనందించే టట్లు. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'రాజులు ప్రజలను సంరక్షించటం బ్రాహ్మణుల శక్తి వలననేకదా! బ్రాహ్మణులకంటె గొప్పవారెవ్వరున్నారు? ఇంద్రు డహల్యను కోరి గౌతమ మహర్షి శాపానికి గురియై బాధ లనుభవించలేదా? కలశసంభవుడైన అగస్త్య మహర్షి సముద్ర జలాలు ఇంకిపోయేటట్లు చేయలేదా? అగ్నిదేవుడు భృగుమహర్షి శాపహతుడు కాలేదా?' అని పల్కగా విని బదులాడక మౌనముద్ర వహించిన కార్తవీర్యుడితో మళ్ళీ అనిలదేవు డిట్లా అన్నాడు. అర్జునా! అంగిరసుడనే మునివంశంలో జన్మించిన ఉచథ్యుడనే వాడికి చంద్రుడు తన పుత్రికనిచ్చి మన్ననతో వివాహమంగళం జరిపించాడు. ఆ భార్యాభర్తలు స్వేచ్ఛగా వనంలో నివసిస్తూ అక్కడి మునీంద్రుల మనస్సులు ఆనందించే టట్లు.

వ. వర్తించునెడ నొక్కనాఁ డమ్ముని యమునానదీస్నానంబునకుం జనుటయు మున్న యవ్వనితం గామించి వేచి తిరుగు వరుణుండు. 341

ప్రతిపదార్థం: వర్తించు+ఎడన్ = వారు వనంలో మెలగుతుండగా; ఒక్కనాఁడు; ఆ+ముని; యమునానదీ స్నానంబునకున్; చనుటయున్ = వెళ్ళగా; మున్ను+అ = అంతకుపూర్వమే; ఆ+వనితన్ = ఆ యువతిని; కామించి = మోహించి, అభిలషించి; వేచి = ఆమె కొరకు కనిపెట్టుకొని; తిరుగు వరుణుండు = సంచరిస్తున్న వరుణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఉచథ్యుడు, అతని పత్ని వనంలో హాయిగ నివసిస్తున్నారు. ఒకనాడు ఉచథ్యుడు యమునలో స్నానమాడటానికి వెళ్ళాడు. అంతకు మునుపే అతని పత్నిని కామించి సమయం కొరకు నిరీక్షిస్తూ తిరుగుతున్న దిక్పతి వరుణుడు.

క. ఎత్తి కొనిపోయి తనపురి। నత్తామరసాక్షి నునిచె; నమ్ముని కడకున్
మెత్తన చని నారదముని। యత్తెఱఁ గెఱిఁగింప నాతఁ డాతనితోడన్. 342

ప్రతిపదార్థం: ఎత్తికొనిపోయి = అపహరించుక వెళ్ళి; తనపురిన్ = తన పట్టణంలో; ఆ తామరస+అక్షిన్ = కమలములవంటి కన్నులు గల ఆ కలికిని; ఉనిచెన్ = ఉంచాడు; ఆ మునికడకున్ = ఆ ఉచథ్యుని దగ్గరకు; నారదముని = నారదయతీంద్రుడు; మెత్తన చని = మెల్లగా వెళ్ళి; ఆ+తెఱఁగు = వరుణుడు అతని చెలినపహరించిన విధం; ఎఱిఁగింపన్ = చెప్పగా; ఆతఁడు = ఉచథ్యుడు; ఆతనితోడన్ = ఆ నారదుడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: వరుణుడు ఉచథ్యుని యొక్క ఉవిదను అపహరించుకొని వెళ్ళి తనపురంలో ఉంచాడు. నారదమహర్షి ఉచథ్యుని చెంత కేగి ఈ విషయం మెల్లగా అతడి చెవిలో వేశాడు. అప్పు డతడు నారదుడితో.

తే. **'తాన దిక్పతి; దన కిట్లు దగునె యొరుని । భార్యఁ గొని పోవ? నీ వేఁగి పలుకు మిట్ల'**
యనినఁ జని నారదుండు సెప్పినను విడువఁ । డయ్యెఁ గామాంధుఁడై సతి నబ్ధివిభుఁడు. **343**

ప్రతిపదార్థం: తాను+అ = ఆ వరుణుడు; దిక్+పతి = పశ్చిమదిశకు పాలకుడు; ఒరుని భార్యన్ = ఇతరుడి ఇల్లాలిని; ఇట్లు = ఈ ప్రకారం; కొనిపోవన్ = తీసికొని వెళ్ళటం; తనకున్+తగునె? = తనవంటి వానికి అర్హమా?, న్యాయమా?; నీవు+ఏగి = నీవు వెళ్ళి; ఇట్లు+అ = ఇపుడు నీతో నేనన్న విధంగా; పలుకుము = చెప్పుము; అనినన్ = అని ఉచథ్యుడు తెల్పగా; నారదుండు; చని; చెప్పినను; కామ+అంధుఁడు+ఐ = కామం చేత కన్నుకాననివాడై, గ్రుడ్డి వాడై; అబ్ధివిభుఁడు = సాగరాలకు అధిపతి అయిన వరుణుడు; సతిన్ = ఆ చెలువను; విడువఁడు+అయ్యెన్ = వదలలేదు.

తాత్పర్యం: 'ఆ వరుణుడు దిక్పాలకుడు. పరుని ఇల్లాలిని ఇట్లా అపహరించుక వెళ్ళటం న్యాయం కాదు అని నీవతని చెంతకు వెళ్ళి చెప్పుము' అని ఉచథ్యుడు కోరగా నారదు డరిగి ఉచథ్యుడి మాటలు వరుణుడికి చెప్పాడు. కాని కామం చేత కన్నుగానని వరుణుడు మునిపత్నిని విడువలేదు.

వ. **విడువకున్న నమ్ముని యుచథ్యుకడకు మగిడి వచ్చి.** **344**

ప్రతిపదార్థం: విడువక+ఉన్నన్; ఆ+ముని = నారదమహర్షి; ఉచథ్యుకడకున్ = ఉచథ్యుని దగ్గరకు, మగిడివచ్చి = తిరిగి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: నారదుడు చెప్పినప్పటికినీ వరుణుడు ఆ పడతిని విడువలేదు. అంతట ఆ ముని మరలి ఉచథ్యుని దగ్గరకు వచ్చి (ఇట్లా అన్నాడు).

సీ. **'ఇంతిఁ దా విడువనియంతియ కాదు, నన్ । బెడతల వట్టి త్రోపించె వరుణుఁ'**
డని చెప్పటయు నల్గి యతఁడు సర్వజలంబు । ద్రావిన వరుణపురంబు ధూళి
మయమైన భయమంది మానినిఁ గొనివచ్చి । యొప్పించి ప్రణమిల్లి తప్పు వాపి
కొని మునికృపఁ గాంచి చనియె నాదిక్పతి; । ధరణీశ! రాజులో ధరణిసురులొ

ఆ. **యెక్కు?' డనిన వినియు నక్కిళ్ళు వడియున్న । యతనితోడ ననిలుఁ డమరు లసుర**
సమితికోడి వచ్చి శరణుసొచ్చిన నగ । స్త్యుండు విజయలక్ష్మి నొసఁగుటయును. **345**

ప్రతిపదార్థం: ఇంతిన్ = మీ కాంతను; తాన్ = తాను, వరుణుడు; విడువని+అంతియ+కాదు = విడిచిపెట్టకుండటం మాత్రమే కాదు; నన్ = నన్ను; పెడతల పట్టి = తలవెనుక పట్టుకొని; త్రోపించెన్ = నెట్టించాడు; అని చెప్పుటయున్ = అని నారదుడు తెల్పగానే; అల్గి = కోపించి; అతఁడు = ఉచథ్యుడు; సర్వజలంబులు+త్రావినన్ = సముద్రంలోని నీరంతా త్రావగా; వరుణపురంబు = సాగరంలో ఉన్న వరుణుడి పట్టణం; ధూళిమయంబు+ఐనన్ = దుమ్ముతో నిండగా, దుమ్ముతో ఆవరింపబడగా, దుమ్ముక్రమ్ముకోగా; భయము+అంది = భీతి చెంది, వెరచి; మానినిన్ = ఉచథ్యుని భార్యను; కొనివచ్చి = తీసికొనివచ్చి; ఒప్పించి = ఆ మునికి అప్పగించి; ప్రణమిల్లి = నమస్కరించి; తప్పు+పాపికొని = తన దోషం తొలగించుకొని; మునికృపన్+కాంచి = ఆ మునీంద్రుడి దయపడసి; ఆ దిక్పతి = దిక్పాలకుడైన వరుణుడు; చనియెన్ = వెళ్ళాడు; ధరణీ+ఈశ! = ఓ భూవల్లభా! కార్తవీర్యార్జునా!; రాజులు+ఒ = భూపతులా?; ధరణీసురులు+ఒ = భూసురులా?; ఎక్కుఁడు = అధికులు;

అనినన్= అని వాయుదేవుడు ప్రశ్నించగా; వినియున్ = ఆలకించి కూడా; నక్కిళ్ళు పడి+ఉన్న = నిరుత్తరుడై ఉన్న; నోటి నుండి మాట రాకున్న; అతనితోడన్ = కార్తవీర్యుడితో; అనిలుఁడు = వాయువు; అమరులు = వేల్పులు, అనిమిషులు, సురులు; అసురసమితికిన్= రక్కసుల గుంపుకు; ఓడివచ్చి = అపజయంపాలై వచ్చి; శరణు+చొచ్చినన్ = ఆశ్రయించగా, కాపాడుమని వేడగా; అగస్త్యుఁడు = అగస్త్యమహర్షి; విజయలక్ష్మిన్ = జయశ్రీని; ఒసఁగుటయున్ = ఆ దేవతలకు లభింపజేయుటయు. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'వరుణుడు నీ పత్నిని విడిచిపెట్టకుండటమేకాదు, ఇక్కడి నుంచి వెళ్ళిపొమ్మని నన్ను మెడబట్టి ముందుకు నెట్టించాడు' అని నారదుడు పలికేసరికి ఉచథ్యుడు ఆగ్రహోదగ్రు డయ్యాడు. సాగరజలా లన్నిటినీ పీల్చివేశాడు. సముద్రగర్భంలో ఉన్న తన పట్టణం బయటపడి దుమ్ముతో ఆవరింపబడగా అతడు భయపడ్డాడు. మునిపత్నిని వెంటబెట్టుకొనివచ్చి సమర్పించి, నమస్కరించి తన తప్పు మన్నించుమని వేడుకొన్నాడు. ఆయన కనికరించగా వరుణుడు సెలవుగైకొని వెళ్ళిపోయాడు. రాజా! రాజులు గొప్పవారా? లేక బ్రాహ్మణులు గొప్పవారా? చెప్పు మని మరుద్దేవుడు మహీపతిని ప్రశ్నించాడు. ఆ మాటలన్నీ కార్తవీర్యుడు వింటూనే ఉన్నాడు. అతడికి నక్కిళ్ళు పడిపోయాయి. మౌనంగా ఉన్నాడు. అనిలుడు మళ్ళీ మాటలకు ఉపక్రమించాడు. అర్జునా! అమరులు అసురుల చేతిలో ఓడిపోయి అగస్త్యమహర్షిని శరణు జొచ్చారు. ఆ మహనీయుడు వేల్పులకు విజయలక్ష్మిని అనుగ్రహించాడు.

వ. గంగా తీరంబునం గ్రతువు లొనరించు గీర్వాణులం బూర్వగీర్వాణులు గాసి చేసిన, వసిష్ఠుని కడకు వారలు వలియం బాఱుదేరం గోపించిన యత్తాపసోత్తముని రోషానల జ్వాలలు సాకారంబులయి యాదైత్యలోకంబు నేర్చుటయుం జెప్పి, యక్కుంభసంభవుండును వసిష్ఠుండును శ్రేష్ఠులగుట రాజుల కొడఁ బాటు గాదోకదే యని ననుం బలుక కున్న యన్నరపతితోడం బవమానుండు మఱియు నిట్లనియె.346

ప్రతిపదార్థం: గంగాతీరంబునన్ = గంగానది ఒడ్డున; క్రతువులు = యాగాలు, యజ్ఞాలు; ఒనరించు = సల్పుతున్న; గీర్వాణులన్ = దేవతలను; పూర్వగీర్వాణులు = రాక్షసులు; గాసిచేసినన్ = బాధించగా; వారలు = వేల్పులు; వసిష్ఠుని కడకున్ = వసిష్ఠమహర్షి దగ్గరకు; వలియన్ = శ్రమతో; పాఱుదేరన్ = పరుగెత్తిరాగా; కోపించిన = రక్కసులపై కినిసిన, ఆగ్రహించిన; ఆ+తాపస+ఉత్తముని = మునులలో శ్రేష్ఠుడైన వసిష్ఠుడి యొక్క; రోష+అనలజ్వాలలు = కోపమనే నిప్పుమంటలు; స+ఆకారంబులు+అయి = రూపుదాల్చినవై; ఆ దైత్యలోకంబున్ = ఆ రాక్షస జనాలను; ఏర్చుటయున్ = దహించుట అనే విషయాన్ని; చెప్పి = నుడివి; ఆ+కుంభసంభవుండును = ఆ అగస్త్యమౌనీంద్రుడూ; వసిష్ఠుండును = వసిష్ఠ మహర్షియూ; శ్రేష్ఠులు+అగుట = ఉత్తములగుట; రాజులకున్ = భూపతులకు; ఒడఁబాటు కాదో కదే = సమ్మతం కాదు కాబోలు; అనిననున్ = అని పల్కిననూ; పలుకక+ఉన్న = బదులు చెప్పకున్న, ప్రత్యుత్తర మీయకున్న; ఆ+నరపతి తోడన్ = ఆ మనుజేంద్రుడితో, రాజుతో; పవమానుండు = వాయువు; మఱియున్ = ఇంకా; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'గంగానది గట్టున యజ్ఞాలు చేస్తున్న దేవతలను రాక్షసులు పీడించగా వారు నొచ్చి వసిష్ఠ మహర్షి దగ్గరకు వలిపడి పరుగెత్తుకొనివచ్చారు. వేల్పుల దురవస్థకు కారణమైన రక్కసులపై ఆ ముని పుంగవునకు కోపం వచ్చింది. ఆయన క్రోధాగ్నిజ్వాలలు ఆ దానవసమూహాన్ని దహించి వేశాయి' అని వాయుదేవుడు వచించి 'కార్తవీర్యా! అగస్త్య వసిష్ఠ మౌనీశ్వరులు తమకంటె శ్రేష్ఠ లగుట రాజులకు సమ్మతం కాదు కాబోలు' అని దెప్పినప్పటికినీ మారుమాటాడకున్న ఆ మహీపతితో మళ్ళీ వాయుదేవు డిట్లా అన్నాడు.

పవనుఁడు కార్తవీర్యార్జునునకు నత్రి ప్రభృతుల మహిమ చెప్పుట. (సం.13-141-1).

సీ. 'ఒకతఱి దేవతలకు దైత్యులకు మహా । రణమయ్యెఁ నప్పోర రాహునస్త్ర
సమితిచే నర్కుండుఁ జంద్రుండు సొలసిన । వెలుఁ గడంగుడుఁ దమ మొలసి వెగడు
పడిన య ద్దివిజుల వడి నంటఁ దాఁకి య । య్యసురలు నొప్పింప నత్రికడకుఁ
బాఱి 'మమ్ముం గావు పరమదయాత్మక!' । యనుడు నతండు చంద్రార్కతనువు

ఆ. లక్షతములు సేసి యసురసైన్యము రూపు । మాపె నిజకటాక్షమాత్రమునన;
యతని నృపులకంటె నధికుఁ డందమొ హీనుఁ । డందమో నిజంబ యధిప! చెపుమ.' 347

ప్రతిపదార్థం: ఒకతఱిన్ = ఒకప్పుడు; దేవతలకున్; దైత్యులకున్ = రాక్షసులకు; మహారణము+అయ్యెన్ = గొప్పయుద్ధం జరిగింది; ఆ+పోరన్ = ఆ సంగ్రామంలో; రాహు+అస్త్రసమితిచేన్ = రాహువు యొక్క బాణాలసమూహం చేత; అర్కుండున్ = సూర్యుడును; చంద్రుండున్ = సోముడునూ; సొలసినన్ = మూర్ఛిల్లగా; వెలుఁగు = కాంతి; అడంగుడున్ = అణగిపోగా, మాయగా; తమము = చీకటి; ఒలసి = వ్యాపించి; వెగడు పడిన = భయపడిన, తల్లడపడిన, చలించిపోయిన; ఆ+దివిజులన్ = ఆ దేవతలను; వడిన్ = వేగంగా; అంటన్+తాకి = వెంట నంటి ఎదుర్కొని, వెంబడించి; మార్కొని; ఆ+అసురలు = ఆ రక్కసులు; నొప్పింపన్ = బాధించగా; అత్రికడకున్ = అత్రిమహర్షి దగ్గరకు; పాఱి = పరుగెత్తిపోయి; పరమ+దయా+ఆత్మక = మిక్కిలి దయతో కూడిన వాడా!; మమ్మున్; కావు = కాపాడుము; అనుడున్ = అని వేడ్కొలనగా; అతండు = అత్రిముని; చంద్ర+ అర్కతనువులు = చంద్ర సూర్యుల దేహాలు; అక్షతములు చేసి = గాయాలు లేనివాటిగా చేసి, గాయాలు మాన్పి; నిజకటాక్షమాత్రమునన = తన చూపులను ప్రసరింపజేయటంచేత; అసుర సైన్యమున్ = రక్కసుల సేనను; రూపుమాపెన్ = నిర్మూలించాడు; అధిప! = ఓ రాజా!; అతనిన్ = అత్రిమహర్షిని; నృపులకంటెన్ = రాజులకంటె; అధికుఁడు+అందము+ఒ? = ఎక్కువవా డందామా? (లేక) హీనుఁడు+అందము+ఓ? = తక్కువవా డందామా?; నిజంబు+అ = సత్యం; చెపుము+అ = తెల్పుమా.

తాత్పర్యం: 'ఒకప్పుడు దేవదానవులకు ఘోరయుద్ధం జరిగింది. ఆ సంగ్రామంలో రాహువు యొక్క బాణాల వలన సూర్యచంద్రులు గాయపడి మూర్ఛపోయారు. వారు మూర్ఛిల్లగా వెలుతురు మాసిపోయి చీకట్లు క్రమ్ముకొన్నాయి. భీతిల్లిన వేల్పులను వెంటనంటి రక్కసులు నొప్పించారు. అంతట దేవతలు అత్రిమహర్షి దగ్గరకు పరుగెత్తిపోయి 'పరమదయామయా! మమ్ము రక్షించు' మని వేడుకొన్నారు. ఆ ముని పుంగవుడు సూర్యచంద్రుల శరీరాల గాయాలు మాన్పి తన దృక్ప్రసారంతో రాక్షససైన్యాన్ని నిర్మూలించాడు. రాజా! అటువంటి అత్రి మహామునిని రాజులందరికంటె ఎక్కువ వాడనవలెనో, తక్కువవా డనవలెనో నీవే నిజం చెప్పుము.'

సీ. అనిన నూరకయున్న యర్జునుతోడ స । దాగతి యిట్లను 'ధరణినాథ!
సురపతి యాశ్వినుల్ సోమపానంబున । కర్హులు గారన్న నాశ్రయంబు
పాటించి వారికై భార్గవచ్యవనుండు । దనమంత్రముల బల్మి ననిమిషులకు
నెగ్గుసేయంగ న య్యింద్రుండు పోటున । వ్రేటున నాతని గీటడంచు

తే. బుద్ధి నొకశైలమును వజ్రమును రయమున । గొని మహోగ్రతఁ గవియ, న మ్మునివరుండు
జలము చల్లిన శైలవజ్రములు దాను । ముడుగఁ బడి య బ్బలారాతి మూర్ఛవోయి. 348

ప్రతిపదార్థం: అనినన్ = అని ప్రభంజనుడు (గాలి) పలుకగా విని; ఊరక+ఉన్న = మాట్లాడకుండ ఉన్నట్టి; అర్జునుతోడన్ = కార్తవీర్యునితో; సదాగతి = వాయువు; ఇట్లు+అనున్ = ఇట్లా అన్నాడు; ధరణినాథ = భూపాలా!; సురపతి = అమరవల్లభుడు; ఆశ్వినుల్ = అశ్వినీ దేవతలు, దేవవైద్యులు; సోమపానంబునకున్ = యజ్ఞాలలో సోమరసం ఆస్వాదించటానికి; అర్హులు+కారు = తగరు; అన్నన్ = అని నుడువగా; ఆశ్రయంబుపాటించి = తనను వారాశ్రయించుటను ఆదరించి; వారికై = ఆ దేవవైద్యులకొరకు; భార్గవచ్యవనుండు = భృగువంశమువాడైన చ్యవనమహర్షి; తనమంత్రముల బల్మిన్ = తన యొక్క మంత్రశక్తితో; అనిమిషులకున్ = దివిజులకు; ఎగ్గు+చేయంగన్ = కీడు సల్పగా; ఆ+ఇంద్రుండు = ఆ సురపతి; పోటునన్ = పొడుచుటచేత; వ్రేటునన్ = నరుకుట చేత; ఆతనిన్ = ఆ చ్యవనుడిని; గీటు+అడంచుబుద్ధిన్ = నిర్మూలించే తలంపుతో; ఒకశైలమును = ఒకగిరినీ; వజ్రమును = వజ్రాయుధాన్ని; రయమునన్+కొని = శీఘ్రంగా గ్రహించి; మహా+ఉగ్రతన్ = మిక్కిలి రౌద్రంగా; కవియన్ = సమీపించగా, మీదికి రాగా; ఆ+ముని వరుండు = ఆ ఋషిశ్రేష్ఠుడు; జలము చల్లినన్ = నీళ్ళు చిలుకగా; శైల వజ్రములున్ = కొండయూ, వజ్రాయుధమూ; తానున్ = తానున్నూ; ముడుగన్+పడి = చేష్టలుడిగి, శక్తి చెడి; ఆ+బల+అరాతి = బలుడనే రాక్షసుడికి శత్రువైన దేవేంద్రుడు; మూర్ఛపోయి = సొమ్మసిల్లి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: తన మాటలకు బదులాడని కార్తవీర్యుడితో సమీరణుడు మళ్ళీ 'నరేంద్రా! దేవేంద్రుడు అశ్వినీ దేవతలు యజ్ఞాలలో సోమపానానికి అనర్హులు' అని అన్నాడు. తనను ఆశ్రయించిన ఆ దేవ వైద్యులకు సాయపడదలచి భృగువంశంలో జన్మించిన చ్యవనమహర్షి తన మంత్రబలంతో దేవతలకు కీడు చేయగా ఇంద్రుడికి కోపం వచ్చింది. చ్యవనుడిని పొడిచిగాని, నరికిగాని చంపదలచి మహేంద్రుడు ఒక పర్వతాన్ని, వజ్రాయుధాన్ని గ్రహించి భయంకరంగా మహర్షి మీదికి ఉరికాడు. ఆ మునీంద్రుడు మంత్రజలం చల్లగా ఆ శైలవజ్రాయుధాలతో పాటు ఇంద్రుడు శక్తి చెడి మూర్ఛిల్లాడు.

వ. ఒక్కింత సేపునకుం దెలిసె; నంతకు నమ్మునివరుండు మదుండను వాని శతయోజన దీర్ఘసహస్రదంతుని సృజించి పంపిన. 349

ప్రతిపదార్థం: ఒక్క+ఇంతసేపునకున్ = కొంచెం సేపటికి; తెలిసెన్ = ఒడలు తెలిసింది; అంతకున్ = అతడు మూర్ఛ నుంచి తేరుకొనే లోపలనే; శతయోజన దీర్ఘ సహస్రదంతునిన్ = నూరామడల పొడవైన వేయి దంతాలు గలవాడిని; మదుండు+అనువానిన్ = మదుడనే పేరుగల వాడిని; సృజించి పంపినన్ = సృష్టించి ఇంద్రునిపైకి పంపగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: మూర్ఛిల్లిన దేవేంద్రుడు కొంచెంసేపటికి తేరుకొన్నాడు. ఆ లోపలనే చ్యవనమహర్షి నూరామడల పొడవైన వెయ్యి పళ్ళుగల మదుడనే వాడిని ఒకడిని సృష్టించి ఇంద్రుడిపైకి పంపాడు.

ఆ. వాఁడు సురగణంబు వాసవుఁ గబళింప । వారు 'శరణుశరణు వరమునీంద్ర!'
యనిన, వారిఁ గాచె న మ్ముని; వారిచ్చి । రపుడు సోమపాన మాశ్వినులకు. 350

ప్రతిపదార్థం: వాఁడు = మదుడనేవాడు; సురగణంబున్ = దివిజ సమూహాన్ని; వాసవున్ = ఇంద్రుడిని; కబళింపన్ =

మ్రింగగా; వారు = ఆ సురలు, దేవేంద్రుడు; వరమునీంద్ర! = ఓ శ్రేష్ఠుడవైన మునీంద్రా!; శరణు శరణు = రక్షించు, రక్షించు; అనినన్ = అని పలుకగా; వారిన్ = వారలను; ఆ+ముని; కాచెన్ = కాపాడినాడు; వారు = ఆ దేవతలు; అపుడు = ఆ వేళ; ఆశ్వినులకున్ = అశ్వినిదేవతలకు; సోమపానము = సోమరసం యజ్ఞాలలో త్రాగే అర్హత; ఇచ్చిరి = కల్పించారు.

తాత్పర్యం: చ్యవన మహర్షిచేత సృజించబడ్డ మదుడు దేవతలను, దేవేంద్రుడిని మ్రింగగా వారు 'మహామునీ! మమ్మ రక్షించు రక్షించు' మని చ్యవన మునిని ప్రార్థించారు. ఆయన కరుణించి వారిని మదుడిబారి నుండి రక్షించాడు. దేవతలు అపుడు యజ్ఞాలలో సోమరసపానార్హత అశ్వినీ దేవతలకు కలిగించారు.

క. **నీ వా చ్యవనుండును ధా । త్రీవరు సరిగామి యెట్లుఁ దెలుప కుడుగుదే?'**
నా వినియు నొక్కమాటయు । నా విభుఁ డాడండ దాని కలయక మఱియున్. **351**

ప్రతిపదార్థం: ఆ చ్యవనుండును = ఆ చ్యవనమహర్షి కూడ; ధాత్రీవరు సరి+కామి = రాజుతో సమానుడు కాకుండటం; ఎట్లున్ = ఏ విధమో; నీవు = నీవు; తెలుపక = చెప్పక; ఉడుగుదు+ఏ? = మానెదవా? నాన్ = అని, గాలిదేవుడు పలుకగా; వినియున్ = విని కూడ; ఆ విభుఁడు = ఆ కార్తవీర్యప్రభువు; ఒక్కమాటయున్ = ఒక్క పలుకు కూడ; ఆడండు+అ = పలుకడు; దానికిన్ = అట్లా బదులు పలుకనందుకు; అలయక = విసుగు చెందక; మఱియున్ = ఇంకనూ. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: అంతటి చ్యవన మహర్షి కూడ రాజుతో సమానుడు కాకపోవటం ఎట్లో చెప్పకుండా మానుతావా?' అని గాలిదేవుడు కార్తవీర్యుడిని ప్రశ్నించాడు. వింటూ కూడ అతడు అందుకు బదులాడ లేదు. వాయుదేవుడు విసుగు చెందక మళ్ళీ మొదలుపెట్టాడు.

వ. **వాయుదేవుం డన్నరదేవు వలని కరుణంజేసి యితని చేటోర్వని వాఁడై.** **352**

ప్రతిపదార్థం: వాయుదేవుండు, ఆ+నరదేవు వలని = ఆ రాజుపైన గల, కరుణన్+చేసి = దయవలన; ఇతని చేటు = ఇతనికి కలిగే కీడు; ఓర్వని వాడు+ఐ = సహించని వాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: వాయుదేవుడు కార్తవీర్యార్జునుడి మీద తనకున్న కృపవలన ఆతడికి కీడు మూడటం సహించలేని వాడై.

సీ. **'అకట! దత్తాత్రేయునకు భక్తి శుశ్రూష । చేసి కాదే యి వ్విశిష్టబల ప**
రాక్రమంబుల నొంది రాజుల కెల్లను । నెక్కుడై తా కృత మేల మఱవ?
విను మీ వొకండవే యనిమిషాది సమస్త । భూతంబులును వృద్ధిఁ బొందు టవని
దివిజులకృపన యీ తెఱఁ గెల్లజనములు । నెఱిఁగిన పని శాంతిఁ గొఱలి విప్ర

తే. **కులము దైవస్వరూపం బగుట మనంబు । నందు దృఢముగ నిల్పి తదాశ్రయమున**
వెలయువాఁడ; వైనను మేలు వినుము నాదు । బుద్ధి' యనవుడు నతఁడు ప్రబోధ మొలసి **353**

ప్రతిపదార్థం: అకట! = అయ్యో!; దత్తాత్రేయునకున్ = దత్తాత్రేయుడికి; భక్తిన్ = భక్తితో; శుశ్రూష = సేవ, సపర్య, పరిచర్య; చేసికాదు+ఏ = సల్పినందువల్లనే గదా; ఈ విశిష్టబలపరాక్రమంబులన్ = ఈ ఉత్తమమైన శక్తిని, శౌర్యమును; ఒంది = పొంది; రాజులకున్+ఎల్లను = భూపతులందరి కంటె; ఎక్కుడు+ఐతి = అధికుడవైనావు; ఆకృతము = గురుసేవాఫలమైన నీ ఉన్నత స్థితిని; మఱవన్+ఏల? = ఎందుకు విస్మరించటం?; వినుము = అర్జునా! వినుము;

ఈవు+ఒకండవు+ఏ? = నీవొక్కడివేనా? కాదు; అనిమిష+ఆది = దేవతలుమున్నుగా కల; సమస్త భూతంబులును = సకల ప్రాణులునూ; వృద్ధిన్+పొందుట = పెంపు వహించుట; అవని దివిజుల కృపన్+అ = భూసురుల యొక్క కారుణ్యం వలననే సుమా! ఈ తెఱఁగు = ఈ విషయం; ఎల్ల జనములున్ = సమస్త ప్రజలు; ఎఱిఁగినపని = తెలిసిన కార్యమే; శాంతిన్+కొఱలి = మనోనిగ్రహంతో ఒప్పారుతూ; విప్రకులము = బ్రాహ్మణవర్ణం; దైవస్వరూపంబు+అగుట = సాక్షాత్ భగవత్స్వరూపం కావటం; మనంబు+అందున్ = హృదయంలో; దృఢముగన్+నిల్పి = గట్టిగా నిలుపుకొని; తత్+ఆశ్రయమునన్ = ఆ భూసురుల యొక్క అండదండలతో; వెలయువాఁడవు+ఐననున్+మేలు = విరాజిల్లువాడ వగుట శ్రేయస్కరం; నాదుబుద్ధి వినుము = నా హితం ఆలకించుము; అనవుడున్ = అని అనిలుడు చెప్పగా; అతఁడు= కార్తవీర్యార్జునుడు; ప్రబోధము+ఒలసి = తెలివినొంది, జ్ఞానం కలిగి; (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'అయ్యో! దత్తాత్రేయులవారిని అఖండ భక్తితో శుశ్రూషించి కదా ఇంతటి మేటి బలపరాక్రమాలు పడసి రాజులందరిలో అధికుడవై అలరారుతున్నావు. నీ ఈ ఉన్నతస్థితికి గురు సేవయే మూలకారణం అనే మాట మరువరాదు. నీవొక్కడివే కాదు దేవతలు మొదలుగాగల సకల జీవరాసులూ వృద్ధిపొందటం బ్రాహ్మణుల కృపవలననే కదా! ఈ విషయం లోకు లందరికీ విదితమే. మనసును స్వాధీనంలో ఉంచుకొని ధరణీసురులు దైవస్వరూపులన్న దృఢభావనతో వారి నాశ్రయించుకొని వర్తించటం నీకు శ్రేయస్కరం. నా హితోపదేశం విను' మని వాయుదేవుడు చెప్పగా కార్తవీర్యుడు తెలివి తెచ్చుకొన్నాడు.

క. 'నీ పనుపు చేసి బ్రదికెద; । నేపు నహంకృతియు విడిచి యెల్లవలన మే
లాపాదించుచు విప్రుల । శ్రీపాదము లాశ్రయించి చెందెద శాంతిన్.' 354

ప్రతిపదార్థం: నీ పనుపు చేసి = నీ ఆజ్ఞను శిరసావహించి; బ్రదికెదన్ = జీవిస్తాను; ఏపున్ = ఆటోపం; అహంకృతియున్ = దురభిమానం, దుర్గర్వం; విడిచి = వదలి; ఎల్లవలనన్ = అందరికినీ అన్ని విధాల; మేలు+ఆపాదించుచున్ = క్షేమం కలిగిస్తూ; విప్రుల = బ్రాహ్మణుల యొక్క; శ్రీపాదములు+ఆశ్రయించి = మంగళకరములైన చరణములను నమ్ముకొని; శాంతిన్+ చెందెదన్ = శాంతిని వహిస్తాను.

తాత్పర్యం: 'నీ ఆజ్ఞను తలదాల్చి, నీవు చెప్పినట్లే మంచిబుద్ధి కలిగి మనుగడ సాగిస్తాను. ఆటోపం, స్వాభిమానం వదలి అందరికి మేలు కలిగిస్తూ బ్రాహ్మణుల శ్రీచరణాలే శరణా లని విశ్వసించి స్వస్థచిత్తంతో మెలగుతాను.'

ఆ. అనిన సంతసిల్లి యనిలుఁ డానృపు 'బుద్ధి । గలిగి బ్రదుకు' మనుచు గారవించి
వీడుకొల్పి చనియె; విప్రులపెం పిట్టి । దని యెఱుంగు కురుకులాగ్రగణ్య! 355

ప్రతిపదార్థం: అనినన్ = అని కార్తవీర్యుడు చెప్పగా; సంతసిల్లి = సంతోషపడి; అనిలుఁడు = వాయుదేవుడు; ఆనృపున్ = ఆ రాజును; బుద్ధి+కలిగి = తెలివి తెచ్చుకొని; బ్రదుకుము = జీవించుము; అనుచున్ = అని పలుకుతూ; గారవించి = ఆదరించి; వీడుకొల్పి = పోయిరమ్మని చెప్పి; చనియెన్ = వాయువు వెళ్ళిపోయాడు; కురుకుల+అగ్రగణ్య! = కౌరవవంశంలో తొలుత పేర్కొనదగినవాడా! ధర్మజా!; విప్రులపెంపు = బ్రాహ్మణుల ఆధిక్యం, గొప్పతనం; ఇట్టిది = ఇటువంటిది; అని+ఎఱుంగు = అని తెలిసికొమ్ము.

తాత్పర్యం: కార్తవీర్యార్జునుడి మాటలకు ఆనందించి అనిలదేవుడు ఆ రాజుతో 'నీవు సద్బుద్ధి గలిగి సుఖంగా జీవించు' మని ఆదరవచనములాడి వెళ్ళుటకు సెలవొసంగి తనదారిని తాను వెళ్ళాడు. 'కురుకులోత్తమా! ధర్మజా!

బ్రాహ్మణుల గొప్పతనం ఇట్టిదని గ్రహించు' మని భీష్ముడన్నాడు.

భీష్ముండు ధర్మజునకుఁ గృష్ణుని ప్రభావం బుపన్యసించుట. (సం.13-143-3).

వ. అనుటయు నవ్విభుండు 'బ్రాహ్మణ మహానుభావం బింకను విన వలతుం జెప్పవే' యనుటయు నప్పుడమితేనికి భీష్ముండు తనకు నింద్రియంబులును వాఙ్మనసంబులు నపుడు దుర్బలంబు లగుట యెఱింగించి 'యినుండు దక్షిణాయనంబు తుది చేరుచు వచ్చె; దేహన్యాసంబు తడవులేమి దోఁచుచున్నది కృష్ణుండు నీకు విప్రజన విశేషంబు వివరించువాఁ' డని పలికి యిట్లనియె. 356

ప్రతిపదార్థం: అనుటయున్ = అని భీష్ముడు పలుకగా; ఆ+విభుండు = ప్రభువైన ధర్మజుడు; బ్రాహ్మణ మహా+అనుభావంబు = విప్రుల యొక్క ప్రభావం, గొప్పతనం; ఇంకను; వినన్; వలతున్ = కోరుతున్నాను; చెప్పవు+ఏ = తెల్పుమా; అనుటయున్ = అని అడుగగా; ఆ+పుడమితేనికిన్ = ఆ భూవల్లభుడికి; భీష్ముండు; తనకున్; ఇంద్రియంబులును = నేత్రాదులైన ఇంద్రియాలు; వాక్+మనసంబులు = వాక్కు, మనస్సు; అపుడు; దుర్బలంబులు = బలహీనములు; అగుట = కావటం, ఎఱింగించి; ఇనుండు = రవి; దక్షిణ+అయనంబు = దక్షిణాయనం యొక్క; తుది = చివర; చేరుచున్+వచ్చెన్ = చేరబోవుతున్నాడు, సమీపిస్తున్నాడు; దేహన్యాసంబు = శరీరం నిల్పుటకు; తడవు లేమి = అలస్యం లేదని; తోఁచుచున్+ఉన్నది = స్ఫురిస్తున్నది; కృష్ణుండు; నీకున్; విప్రజన విశేషంబు = బ్రాహ్మణుల యొక్క ఘనత; వివరించువాఁడు = వక్కాణిస్తాడు, స్పష్టపరుస్తాడు; అని పలికి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా ధర్మజుడు 'బ్రాహ్మణుల గొప్పతనం ఇంకా వినాలని కోరిక కలుగుతున్నది చెప్పవా' అని అడిగాడు. భీష్ముడు తనకు ఇంద్రియాలు, వాక్కూ, మనసూ, బలహీనా లైనవని పలికి 'రాజా! సూర్యుడు దక్షిణాయనం చివరకు చేరబోతున్నాడు. ఇక దేహం నిలవటానికి సమయం లేదని తోస్తున్నది. బ్రాహ్మణ మహిమ నీకు శ్రీకృష్ణ భగవానుడు విశదపరుస్తా' డని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

తే. 'ఏను గృష్ణు నెఱుంగుదు మానవేంద్ర! । యెత్తెఁ గ్రీడావరాహమై యిద్ధరిత్రి;
నిది యొకండును జెప్పఁగా నేల? కృష్ణు । లీలఁ గాదె భూమ్యాది భూతాళి గలిగె. 357

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర! = నరేశ్వరా!; ఏను = నేను; కృష్ణున్; ఎఱుంగుదున్; క్రీడావరాహము+ఐ = ఆటకొఱకు, వినోదం కొరకు సూకర రూపం ధరించిన వాడై; ఈ+ధరిత్రిన్ = ఈ పుడమిని; ఎత్తెన్ = సాగరగర్భం నుండి ఉద్ధరించాడు, తన కోరతో మీది కెత్తాడు; ఇది+ఒకండును = ఇదొక్కటే అని; చెప్పన్+కాన్+ఏల = చెప్పటమెందుకు?; భూమి+ఆది+భూత+ఆలి = ధరణి మొదలైన భూతముల యొక్క సమూహం; కృష్ణులీలన్ = శ్రీకృష్ణ పరమాత్మ యొక్క విలాసం చేతనే; కలిగెన్ = జన్మించింది.

తాత్పర్యం: 'రాజా! శ్రీకృష్ణు డెవరో నాకు బాగా తెలుసు. ఆయన వినోదం కొరకై అలవోకగా సూకరరూపం ధరించి సాగరలీన అయిన ధరను తన దంష్ట్రాగ్రం చేత మీదికెత్తాడు. ఇది ఒక్కటే కాదు; ఇట్లాంటి అద్భుత చర్య లెన్నింటినో ఆ మహానుభావుడు చేశాడు. భూమి మొదలైన భూతజాలం ఈ పురాణపురుషుడి విలాసం వలననే జనించాయి.

వ. కృష్ణుండు. **358**

తాత్పర్యం: ఈ వాసుదేవుడు.

తే. బొడ్డుతామరయందు నొక్క పురుషుఁ డుద్భ । వించునట్లుగఁ జేసి తద్విరచనా ని
భమున నఖిలచరాచర ప్రభవ మయ్యెఁ । నరయ సామాన్యమే కృష్ణు పరమలీల? **359**

ప్రతిపదార్థం: బొడ్డుతామర+అందున్ = తన నాభికమలం నుండి; ఒక్కపురుషుఁడు = బ్రహ్మదేవుడు; ఉద్భవించు+అట్లుగన్+ చేసి = జన్మించేటట్లుగా చేసి; తత్+విరచనానిభమునన్ = ఆ బ్రహ్మసృష్టి అనే నెపంతో; అఖిల = సమస్తమైన; చర+ అచర+ప్రభవము+అయ్యెన్ = చేతనాచేతనముల యొక్క ఉత్పత్తి (పుట్టుక) జరిగింది; అరయన్ = ఆలోచించగా; కృష్ణు పరమలీల = శ్రీకృష్ణ పరమాత్మ యొక్క అద్భుతమైన విలాసం; సామాన్యము+ఏ? = సాధారణమైనదా? కాదని భావం.

తాత్పర్యం: ధర్మజా! తన నాభికమలం నుండి వాసుదేవుడే చతుర్ముఖుడిని పుట్టించాడు. బ్రహ్మసృష్టి అనే మిషతో స్థావరజంగమముల యొక్క పుట్టుక ఏర్పడింది. పరిశీలిస్తే ఇంతకూ మూలమైన శ్రీకృష్ణ లీల సామాన్యమైనది కాదు గదా!

క. విను మెత్తఱి ధర్మంబులు । దనుజులచే బాధఁ బొందుఁ దత్సమయమునన్
జనియించి య ద్దురాత్ములఁ । దునుముం గృష్ణుండు ధర్మధుర్యులఁ గాచున్. **360**

ప్రతిపదార్థం: వినుము = రాజా! ఆలకించుము; ఏ+తఱి = ఎప్పుడు; ధర్మంబులు = ధర్మాలు; దనుజులచేన్ = రాక్షసులచేత, దుర్మార్గులచేత; బాధన్+పొందున్ = గ్లానిని పొందుతాయో; తత్+సమయమునన్ = అట్టివేళలో; జనియించి = అవతరించి; కృష్ణుండు = శ్రీకృష్ణ పరమాత్మ; ఆ+దుర్+ఆత్ములన్ = ఆ చెడు మనస్సుగలవారిని; తునుమున్ = ఖండిస్తాడు, సంహరిస్తాడు; ధర్మధుర్యులన్ = ధర్మాత్ములను; కాచున్ = రక్షిస్తాడు.

తాత్పర్యం: రాజా! శ్రద్ధగా వినుము. ఎప్పు డెప్పుడు ధర్మానికి గ్లాని కలుగుతుందో అప్పుడు దుర్మార్గులను నిర్మూలించటానికి శ్రీకృష్ణుడు అవతరించి ధర్మాత్ములను కాపాడుతాడు.

విశేషం: "యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్." (భగ. 4-7)

ఎప్పుడు ధర్మానికి హాని, అధర్మానికి అభివృద్ధి కలుగుతాయో అప్పుడు నేను అవతరిస్తాను-

అనే గీతా శ్లోకానికి తిక్కన గారి అనువాదం ఎంత సుమనోమనోహరమో పాఠకులు అవలీలగా గుర్తించగలరు.

క. శూలియునుం దాన దిశా । పాలురునుం దాన విశ్వపతియును గురుభూ
పాలవర! తాన కృష్ణుఁడు । కాలము దిక్కులును దాన కలఁ డఖిలములన్. **361**

ప్రతిపదార్థం: కురుభూపాలవర! = కురువంశ రాజులలో శ్రేష్ఠుడా!; శూలియును = శూలధరుడైన శివుడును; తాను+అ = తానే; దిశాపాలురునున్ = దిక్పాలకులునూ; తాను+అ = తానే; విశ్వపతియునున్ = జగన్నాయకుడునూ; తాను+అ = తానే; కాలమున్ = భూతభవిష్యద్వర్తమాన కాలములునూ; దిక్కులునున్ = దశ దిశలునూ; తాను+అ = తానే; అఖిలములన్ =

సమస్తవస్తువులలో; కలఁడు = ఉన్నాడు.

తాత్పర్యం: కురువంశరాజోత్తమా! శ్రీకృష్ణభగవానుడే పరమేశ్వరుడు. అతడే దిక్పాలక స్వరూపుడు. అతడే సర్వజగన్నాథుడు. త్రికాలములునూ, దశదిశలునూ ఆతడే. సమస్తమందును అతడే ఉన్నాడు.

ఆ. అరయఁ గృష్ణుఁ డధ్వరాత్మకుఁ డఖిలాగ । మోక్తమంత్రతంత్ర యుక్తి నతనిఁ
బ్రస్తుతించి మేలు వడయుదు రధ్వర । కర్తలైన జనులు కౌరవేంద్ర! 362

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర! = కురుసార్వభౌమా!; అరయన్ = పరికించగా; కృష్ణుఁడు = శ్రీకృష్ణుడు; అధ్వర+ఆత్మకుఁడు = యజ్ఞస్వరూపుడు; అఖిల+ఆగమ+ఉక్త = సమస్త వేదాలలో చెప్పబడిన; మంత్ర తంత్ర యుక్తిన్ = మంత్ర తంత్రాలతో; అతనిన్ = ఆ సర్వేశ్వరుడిని; ప్రస్తుతించి = కొనియాడి; అధ్వరకర్తలు+ఐన జనులు = యాగాలు సల్పునట్టివారు; మేలు+పడయుదురు = శుభాలు పొందుతారు.

తాత్పర్యం: కురురాజా! వాసుదేవుడు యజ్ఞస్వరూపుడు. ఆ మహనీయుడిని వేదాలలో చెప్పబడిన మంత్ర తంత్రాలతో స్తుతించి యాగనిర్వాహకులు శుభాలు పొందుతారు.

క. చయనంబుల ఋగ్వేదం । బయ మహిత సువర్ణనాముఁ డగు కృష్ణు గుణో
దయము వినుతించు యజ్ఞ । క్రియా నిరతులైన సురలు ప్రీతిం బొందన్. 363

ప్రతిపదార్థం: యజ్ఞ క్రియా నిరతులు+ఐన = యాగకర్మలందు ఆసక్తి గలిగిన; సురలు = అమరులు; ప్రీతిన్+పొందన్ = సంతోషం చెందగా; అయమహిత సువర్ణనాముఁడు+అగు = శుభము లిడుటలో గొప్పవగు మంచి అక్షరాలతో కూడిన పేరుగల (సువర్ణుఁడు); కృష్ణు+గుణ+ఉదయమున్ = శ్రీకృష్ణుడి సద్గుణాల యొక్క అతిశయమును; ఋగ్వేదము; చయనంబులన్ = యాగవిశేషము లందు; వినుతించున్ = స్తుతిస్తుంది.

తాత్పర్యం: యాగకర్మలందు ఆసక్తిగల దేవతలు హర్షించగా, శుభము లిడుటలో దొడ్డదగు బంగారు నామధేయం గల శ్రీకృష్ణుడి గుణాతిశయాన్ని ఋగ్వేదం యాగవిశేషములందు కొనియాడుతుంది.

క. విను ఋగ్వేదము కృష్ణుని । వినుతించుట యరుదె? యఖిలవేదంబులుఁ ద
జ్జనిత విలాసంబులు వే । దనిరూపిత వస్తువుననఁ దాన కుమారా! 364

ప్రతిపదార్థం: కుమారా! = వత్సా!; విను = వినుము; ఋగ్వేదము; కృష్ణునిన్; వినుతించుట = కొనియాడటం; అరుదు+ఎ? = ఆశ్చర్యమా? కాదని భావం; అఖిలవేదంబులున్ = అన్ని వేదాలు; తత్+జనిత+విలాసంబులు = ఆ మహాత్ముడి నుండి పుట్టిన లీలలు కలవి; వేదనిరూపిత వస్తువున్+అనన్ = ఆగమములచే నిశ్చయించబడిన పదార్థమనగా; తాను+అ = తానే, ఆ శ్రీకృష్ణుడే.

తాత్పర్యం: వత్సా! వినుము. ఋగ్వేదం శ్రీకృష్ణుడిని శ్లాఘించటం వింత గాదు; సకల వేదాలు అతడి లీలలను వర్ణించేవే. వేదములచే నిశ్చయించబడిన పరబ్రహ్మవస్తువు ఆ శ్రీకృష్ణుడే.

తే. అగ్నులును యజమానుఁడు నాహుతులును । యాగఫలరూపమును గృష్ణుఁ డని యెఱుంగు;
మిన శశాంకతారకముల నెసఁగు తేజ । ములును గృష్ణమయంబుల భూపవర్య! 365

ప్రతిపదార్థం: అగ్నులును = ఆహవనీయం మున్నగు అగ్నులు; యజమానుఁడున్ = యాగం చేసేవాడు; ఆహుతులునున్ = హోమద్రవ్యాలు, హవిస్సులు; యాగఫలరూపమును = యజ్ఞఫల స్వరూపమునూ; కృష్ణుఁడు+అని; ఎఱుంగుము = గ్రహించుము; ఇన+శశ+అంక+తారకములన్ = సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అనువాటియందు; ఎసఁగు = ఒప్పునట్టి; తేజములును = కాంతులు కూడ; కృష్ణమయంబులు+అ = కృష్ణస్వరూపాలే.

తాత్పర్యం: రాజోత్తమా! యాగాగ్నులు, యాగకర్త, హవిస్సులు, యాగ ఫలస్వరూపమైన వాడూ శ్రీకృష్ణుడే అని గ్రహించుము. సూర్యచంద్ర నక్షత్రములందు ఒప్పుతున్న కాంతులు కృష్ణమయములే సుమా!

క. పరమజ్యోతి యనఁగ ని । ర్జరామర పదం బనంగ సత్యం బన భూ
వర! యమృత మనఁగ దేవకి । వరసుతుఁడు వెలుంగు వేదవర్గము తుదలన్.' 366

ప్రతిపదార్థం: భూవర! = రాజా!; పరమజ్యోతి+అనఁగన్ = పరంజ్యోతి అనగా; నిర్జర+అమర+పదంబు+అనంగన్ = అజరము, అమరము అయినస్థానము, ముసలితనం, చావు అనునవి లేని చోటు అనగా; సత్యంబు+అనన్ = సత్యమనగా; అమృతము+ అనఁగన్ = ముక్తి పథం, మోక్షస్థానం అనగా; దేవకి వరసుతుఁడు = దేవకీ దేవి యొక్క ఉత్తమపుత్రుడు; వేద వర్గముతుదలన్ = వేదాల కొసలైన ఉపనిషత్తులయందు; వెలుంగున్ = ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: పరంజ్యోతి అని, అజరము, అమరము అయిన స్థానమని, సత్యమని, మోక్షమని కొనియాడబడే దేవకీ నందనుడైన శ్రీకృష్ణ భగవానుడు వేదశిఖలైన ఉపనిషత్తులలో దీపిస్తున్నాడు.'

క. అని యి ట్లుపదేశించిన । విని మోదము నొంది పాండువిభునగ్రసుతుం
డనిమిషతటినీ సుతునకు । వినతుండై నెమ్మనమున వేడ్క దలిర్పన్. 367

ప్రతిపదార్థం: అని; ఇట్లు; ఉపదేశించినన్ = శ్రీకృష్ణుడి ప్రభావం గూర్చి బోధించగా; విని; మోదమున్+ఒంది = సంతోషం చెంది; పాండు విభు+అగ్రసుతుండు = పాండుమహారాజుయొక్క పెద్దకొడుకైన ధర్మరాజు; అనిమిషతటినీ సుతునకున్ = దేవనది యొక్క కుమారుడైన భీష్ముడికి; వినతుండు+ఐ = నమస్కరించిన వాడై; నెమ్మనమునన్ (నెఱ+మనమునన్) = నిండుమదిలో; వేడ్క = సంబరం, కుతూహలం; తలిర్పన్ = చిగురించగా. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: అని భీష్ముడు శ్రీకృష్ణుడి ప్రభావం గూర్చి బోధించగా ఆలకించి ధర్మజుడు సంతోషించి గంగానందనుడు భీష్ముడికి నమస్కరించి తన మనస్సులో కుతూహలం రేకెత్తగా.

కృష్ణుడు ధర్మరాజునకు బ్రాహ్మణ ప్రభావంబు చెప్పుట. (సం.13-144-1).

వ. కృష్ణునకుఁ బ్రణమిల్లి 'దేవా! భూదేవ మాహాత్మ్యంబు వినవలతు నానతీయవే' యని వినయసంభృతుం డగుచుఁ బ్రార్థించిన నప్పార్థివుని మీఁదఁ గరుణామృతమయంబగు నాలోకనం బొలయ నద్దేవుం డాదరభరితుండై యిట్లనియె. 368

ప్రతిపదార్థం: కృష్ణునకున్ = వాసుదేవుడికి; ప్రణమిల్లి = నమస్కరించి; దేవా! = ప్రభూ!; భూదేవ మాహాత్మ్యంబున్ = బ్రాహ్మణుల యొక్క ప్రభావం; వినన్+వలతున్ = వినుటకు ఇష్టపడుతున్నాను; ఆనతి+ఈయవు+ఏ? = సెలవియ్యవా?; అని; వినయ సంభృతుండు+అగుచున్ = వినయముతో నిండినవాడై, వినయపూర్ణుడై; ప్రార్థించినన్ = వేడగా; ఆ+పార్థివుని మీఁదన్ = రాజగు ధర్మజునిపై; కరుణా+అమృతమయంబు+అగు = దయ అనెడు సుధారసంతో నిండిన; ఆలోకనంబు = దృష్టి,చూపు; ఒలయన్ = వ్యాపించగా, ప్రసరించగా; ఆ+దేవుండు = ఆ భగవంతుడు; ఆదరభరితుండు+ఐ = ఆదరంతో నిండినవాడై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మజుడు శ్రీకృష్ణుడికి మ్రొక్కి 'స్వామీ! బ్రాహ్మణుల గొప్పతనం వినవలెనని కుతూహలపడుతున్నాను. సెలవియ్యవలసిం' దని వినయంతో వేడుకొన్నాడు. వాసుదేవుడు ఆ రాజచంద్రుడిపై కరుణామృతంతో నిండిన చూపులు ప్రసరింప జేసి ఆదరంతో ఇట్లా అన్నాడు.

క. **'ననుఁ బ్రద్యుమ్నుం డివ్విధ । మున నడిగిన వాని కేను ముద మందుచు నా**
తని హితము గోరి కుంతీ । తనయాగ్రజ! యున్నరూప తగ నిట్లంటిన్. **369**

ప్రతిపదార్థం: కుంతీ తనయ+అగ్రజ! = కుంతీదేవి యొక్క జ్యేష్ఠకుమారుడా!; ననున్ = నన్ను; ప్రద్యుమ్నుండు = ప్రద్యుమ్నుడు; ఈ+విధమునన్ = ఇపుడు నీ వడిగిన చందంగానే; అడిగినన్ = అడుగగా; వానికిన్ = అతడికి; ఏను = నేను; ముదము+అందుచున్ = సంతోషం చెందుతూ; ఆతనిహితము+కోరి = అతడి యొక్క మేలును ఆశించి; ఉన్న రూపు+అ = ఉన్నది ఉన్నట్లుగా; తగన్ = ఒప్పిదంగా; ఇట్లు+అంటిన్ = ఇట్లా చెప్పాను.

తాత్పర్యం: కౌంతేయాగ్రజా! ఇపుడు నీవడిగినట్లే ఇంతకుపూర్వం నాకుమారుడు ప్రద్యుమ్నుడు నన్ను అడిగాడు. అందుకు సంతోషిస్తూ వాని మేలు కోరి ఉన్న దున్నట్లుగా ఇట్లా చెప్పాను.

సీ. **వర్గత్రయము నపవర్గంబు సాధింప । నమర పితృ ప్రీతు లాచరింప**
నైహికసుఖము లుపార్జింపవలసిన । వారికి విప్రుల చేరుగడలు;
దివిజులకైన నాయువు శ్రీయుఁ గీర్తియుఁ । దనరుట తత్ప్రసాదమునఁ జూవె!
యలిగి భస్మము సేయ వలచి పెం పొసఁగంగ । నవనీసురులు శక్తు; లట్టు లగుట

తే. **వారిఁ గోపింపఁ జేయక వారలకుఁ బ్రి । యంబు సేయుచు వారు ప్రహర్ష మొందఁ**
దనకుఁ గలభంగి నిచ్చు నతండు రెండు । భువనములయందుఁ బెంపును బొగడుఁ బడయు. **370**

ప్రతిపదార్థం: వర్గత్రయమున్ = ధర్మార్థకామాలనే మూడు పురుషార్థాలనూ; అపవర్గంబున్ = మోక్షమనే నాల్గవ పురుషార్థాన్నీ; సాధింపన్ = సాధించటానికి, సంపాదించటానికి; అమర = దేవతలకు; పితృ = పితృదేవతలకు; ప్రీతులు+ఆచరింపన్ = సంతోషాలు కల్గించుటకు; ఐహిక సుఖములు = ఈ లోకమందలి సుఖాలు; ఉపార్జింప = పొందుటకు; వలసిన వారికిన్ = అక్కరగల మానవులకు; విప్రులు+అ = బ్రాహ్మణులే; చేరుగడలు = ఆధారభూతులు; దివిజులకున్+ఐనన్ = వేల్పులకైననూ; ఆయువున్ = ఆయుష్యమూ; శ్రీయున్ = కలిమి, సంపదయూ; తనరుట = అతిశయించటం, లభించటం; తత్+ప్రసాదమునన్+ చూవె! = బ్రాహ్మణుల అనుగ్రహం చేతనే సుమా!; అవనీసురులు = బ్రాహ్మణులు; అలిగి = కోపించి; భస్మము+చేయన్ = బూది కావించటానికి, నాశనం చెయ్యటానికి; వలచి = ఇష్టపడి; పెంపు+ఒసఁగంగన్ = వృద్ధికావించటానికి; శక్తులు = సమర్థులు, దక్షులు; అట్టులు+అగుటన్ = అందువలన; వారిన్ = బ్రాహ్మణులను; కోపింపన్+చేయక = అలుగునట్లు చెయ్యక; వారలకున్ = విప్రులకు; ప్రియంబు+చేయుచున్ = హితం సల్పుతూ, మేలు చేకూరుస్తూ; వారు = బ్రాహ్మణులు;

ప్రహర్షము+ఒందన్ = మిక్కిలి సంతోషం పొందేటట్లు; తనకున్ = తనకు; కలభంగిన్ = ఉన్నంతలో; ఇచ్చు+అతండు = దానమొనర్చేవాడు; రెండు భువనముల+అందున్ = ఉభయలోకాలలో, ఇహపరాలలో; పెంపును = అభివృద్ధిని; పొగడున్ = పొగడ్తనూ; పడయున్ = పొందుతాడు.

తాత్పర్యం: ధర్మార్థకామమోక్షాలు అనే చతుర్విధ పురుషార్థాలు సంపాదించటానికి, దేవతలను, పితృదేవతలను సంతృప్తులను చెయ్యటానికి, ఇహలోకసుఖాలు పొందటానికి బ్రాహ్మణులే ఆధారభూతులు. దేవతలకైనా ఆయుస్సు, యశస్సు, సంపత్తీ వారి అనుగ్రహం వలననే కలుగుతాయి. వారు ఆగ్రహిస్తే ఎంతటివారినైనా బూడిద చెయ్యగలరు. అనుగ్రహిస్తే అభివృద్ధి కలిగించగలుగుతారు. కనుక వారికి కోపం తెప్పించక ప్రియం సల్పుతూ వారు హర్షించేటట్లు ఎవడు తన శక్తి కొలది దాన మిస్తాడో అతడు ఇహపరలోకాలలో అభివృద్ధిని, పేరు ప్రఖ్యాతులను పొందుతాడు.

దుర్వాసుఁడు కృష్ణుని మనశ్శుద్ధి పరీక్షించి యనుగ్రహించిన ప్రకారము. (సం.13-144-14).

వ. నా కనిన యాశ్చర్యంబు సెప్పెద నాకర్ణింపుము. స్వతంత్ర ప్రవర్తనుండగు దుర్వాసుండు మనమందిరంబునకు వచ్చి మందహాసంబు సేయుచుఁ, గోపించుచు, సుముఖుం డగుచు, విముఖత్వంబు నొందుచుఁ, గుడువనొల్ల ననుచుఁ, బెక్కండ్రకుం గావించిన కూడు గూర దా నొక్కరుండు భుజించుచు, సెజ్జ నిద్రించుచు' భూమి శయనించుచు, నెందేనిం బోవుచు, మరలి వచ్చుచుఁ బ్రవర్తించుచుండి యొక్కనాఁడు 'కృష్ణా! నాకుం బాయసంబు మీఁద వేడుక పుట్టెడుఁ బెట్టింపవే' యనఁ దత్క్షణంబ కావించినం గొంత కుడిచి, కొంత తన యొడలం బూయు మనినం బూసితి; నచ్చేరువ నున్న రుక్మిణిం జూచి కొంత య క్కాంతమేనం దాన పూసి రథ్యరూపంబుగా రథంబున న ప్పొలఁతిం బూన్చి రథారోహణంబు చేసి, వీథికి వెడలి, యమ్ముద్దియను ములుకోలం బొడుచుచు రథంబు నడిపింప, నాకుం గోపంబు నీర్ష్యయు నించుకయు జనింపకుండె; నేనుం జూచుచుం దోడన నడచితి; నప్పుడు యాదవు లాశ్చర్య కోపభయాయత్త చిత్తులై యనేక ప్రకారంబులం దమలోఁ బలుకుచుం జేయునది లేక కెలంకుల వచ్చుచుండ. 371

ప్రతిపదార్థం: నా+కనిన = నేను చూచిన; ఆశ్చర్యంబు+చెప్పెదన్ = వింత విషయాన్ని చెప్పుతాను; ఆకర్ణింపుము = వినుము; స్వతంత్రప్రవర్తనుండు+అగు = స్వేచ్ఛగా మెలగువాడైన; దుర్వాసుండు; మనమందిరమునకున్ = మనభవనానికి; వచ్చి; మందహాసంబు చేయుచున్ = చిరునవ్వునవ్వుతూ; కోపించుచున్ = కోపపడుతూ; సుముఖుండు+అగుచున్ = అనుకూలుడుగా ఉంటూ, ప్రసన్నుడుగా ఉంటూ; విముఖత్వంబున్+ఒందుచున్ = ప్రతికూలుడుగా మారుతూ; కుడువన్+ఒల్లన్+అనుచున్= భుజించనని చెపుతూ; పెక్కండ్రకున్ = అనేకులకు, పలువురికి; కావించిన = వండిన, సిద్ధపరచిన; కూడు; కూర; తాన్ = తను; ఒక్కరుండు+అ = ఒక్కడే; భుజించుచున్; సెజ్జన్ = శయ్యపై, పడుకపై, పరుపుపై; నిద్రించుచున్; భూమిన్ = కటికనేలమీద; శయనించుచున్ = పండుకొంటూ; ఎందున్+ఏనిన్ = ఎక్కడికైననూ; పోవుచున్, మరలివచ్చుచున్; ప్రవర్తించుచున్+ ఉండి = ఈ ప్రకారం మెలగుతూ ఉన్నవాడై; ఒక్కనాడు; కృష్ణా; నాకున్; పాయసంబుమీఁదన్ = పరమాన్నం మీద; వేడుక పుట్టెడున్ = ఆసక్తి గలిగింది, అభిలాష జనించింది; పెట్టింపవు+ఏ? = తినబెట్టవా?; అనన్; తత్+క్షణంబు+అ = ఆ వెంటనే; కావించినన్ = పాయసాన్ని వండించగా; కొంత; కుడిచి = తిని, ఆరగించి; కొంత; తన+ఒడలన్ = తన శరీరం మీద, తనమేనికి; పూయుము+అనినన్ = రాయుమని చెప్పగా; పూసితిన్ = రాచినాను; ఆ+చేరువన్ = ఆ సమీపమందు; ఉన్న; రుక్మిణిన్; చూచి; కొంత; ఆ+కాంతమేనన్ = ఆమెశరీర మందు; తాను+అ = తానే (దుర్వాసుడే); పూసి = రాచి; రథ్య రూపంబుగాన్ = వాహనంగా, గుర్రంగా; రథంబునన్, ఆ+పొలఁతిన్+పూన్చి = ఆ వనితను కట్టివేసి; రథ+ఆరోహణంబు+చేసి

= తాను రథమెక్కి; వీథికిన్ = వీథులలోనికి; వెడలి = బయలుదేరి; ఆ+ముద్దియను = ఆ మెలతను, ఆ రమణిని, రుక్మిణిని; ములుకోలన్ = ములుగర్రతో; పొడుచుచున్ = పొడుస్తూ; రథంబున్, నడపింపన్ = లాగేటట్లు చేయగా; నాకున్; కోపంబున్, ఈర్ష్యయున్ = అసూయ, ద్వేషమూ; ఇంచుకయున్ = కొంచెం కూడ; జనింపక+ఉండెన్ = కలుగలేదు; నేనున్; చూచుచున్; తోడన = ఆ రథము వెంబడి; నడచితిన్ = వెళ్ళాను; అప్పుడు; యాదవులు; ఆశ్చర్యకోప+భయ+ఆయత్తచిత్తులు+ఐ = అద్భుతం, క్రోధం, భీతి, అను గుణాలకు అధీనమైన మనస్సు కలవారై; అనేక ప్రకారంబులన్ = పలు విధాల; తమలోన్ = తమ మనస్సులలో; పలుకుచున్ = దుర్వాసుడిని గురించి మాట్లాడుతూ; చేయు+అది+లేక = చేసేదేమీ లేక; కెలంకులన్ = ఆ రథానికి ఇరుప్రక్కల; వచ్చుచున్+ఉండన్ = ఆ యాదవులు వస్తూండగా.

తాత్పర్యం: ధర్మజా! నేను చూచిన ఒక అద్భుత విషయాన్ని చెప్పుతాను, వినుము. తన ఇష్టప్రకారం ప్రవర్తించే దుర్వాస మహర్షి ఒకసారి మన యింటికి వచ్చాడు. ఆయన ఒక సమయంలో చిరునవ్వు నవ్వుతూ ఉండేవాడు; మరొకప్పుడు కినుక వహించేవాడు. ఒకప్పుడు అనుకూలుడుగా, ఇంకొకప్పుడు ప్రతికూలుడుగా ఉండేవాడు. ఒక తడవ నేను తిండి తినను అనేవాడు. మరొకప్పుడు పలువురకు వండిన ఆహారమంతా తా నొక్కడే ఆరగించేవాడు. ఒకప్పుడు పరుపులమీద శయనించేవాడు, మరొకప్పుడు కటికనేలమీద పరుండేవాడు. చెప్పకుండ ఎక్కడికో వెళ్ళేవాడు. తిరిగి తనకు తానే వచ్చేవాడు. ఇట్లా ప్రవర్తిస్తూ ఒకరోజు ఆ మహర్షి 'కృష్ణా! నాకు పరమాన్నం మీద మనసుపడింది; పెట్టించవా' అని అడిగాడు. వెంటనే నేను పాయసం వండించాను. ఆయన అందులో కొంచెం తిని, కొంత తన ఒడలికి నన్ను పూయమన్నాడు. నేను పూశాను. ఆ చెంతనే నిలిచి ఉన్న రుక్మిణిని చూచి మహర్షి ఆమె దేహానికి తానే పాయసం పూశాడు. ఆమెను రథానికి గుర్రం మాదిరి కట్టివేసి తాను రథంలో కూర్చొని లాగుమన్నాడు. వీథులలో విహారానికి బయలుదేరాడు. రుక్మిణి రథాన్ని ఈడుస్తూ ఉంటే ములుగర్రతో చోచో అని ఆమెను పొడుస్తూ తేరిని నడిపించాడు. ఆయన ఇంత చేస్తున్నా, నేను ఇదంతా చూస్తున్నా, నాకు మౌని మీద కోపంగాని, ద్వేషంకాని కలుగలేదు. సాక్షిమాత్రుడిగా వీక్షిస్తూ రథంతో నేను నడిచాను. ఈ దృశ్యాన్ని అవలోకిస్తున్న యాదవులకు ఆశ్చర్యమూ, కోపమూ, భయమూ జనించింది. వారు తమలో తాము మహర్షిని గురించి ఏమేమో అనుకొంటూ చేసేది లేక మౌనంగా రథానికి ఇరుప్రక్కల నడిచారు.

ఆ. రథముఁ దివిచి డస్సి రమణి మేదిని మీఁద । మ్రొగ్గ తిలఁగఁ బడిన డిగ్గ నుఱికి
దానిమీఁద ధూళి దాఁ జల్లి వెసఁ బాఱె । నమ్మునీశ్వరుండు యామ్యదిశకు. 372

ప్రతిపదార్థం: రథమున్ = అరదమును, తేరును; తివిచి = లాగి, ఈడ్చి; డస్సి = అలసిపోయి; రమణి = రుక్మిణి; మేదిని మీఁదన్ = నేలపై; మ్రొగ్గతిలఁగన్ = ముందునకు వ్రాలి; పడఁగన్ = ధరపై కూలగా; ఆ+ముని+ఈశ్వరుండు = ఆ దుర్వాసముని శ్రేష్ఠుడు; డిగ్గన్+ఉఱికి = రథమునుండి క్రిందికి దుమికి; దాని మీఁదన్ = రుక్మిణి మీద; తాన్ = తాను; ధూళిన్+చల్లి = దుమ్ముకొట్టి; యామ్యదిశకున్ = దక్షిణ దిక్కునకు; వెసన్ = శీఘ్రంగా; పాఱెన్ = పరుగెత్తి పోయాడు.

తాత్పర్యం: రుక్మిణీదేవి దుర్వాసు డెక్కిన రథాన్ని ఈడ్చి అలసిపోయి ముందుకు వ్రాలి నేలమీద కూలబడింది. అపుడు మునీంద్రుడు స్యందనంనుంచి క్రిందికి దుమికి ధరణిమీద చతికిలబడి ఉన్న రుక్మిణి మీద దుమ్ము చల్లి శీఘ్రంగా దక్షిణదిశకు పరుగెత్తి వెళ్ళాడు.

క. పాఱిన నాతని వెనుకన । పాఱితి; సంప్రార్థనా ప్రభాషణములతోఁ
దేఱి మరలి యమ్ముని 'మిముఁ । గాఱియ వెట్టితిఁ గదే యకట!' యనుచు దయన్. 373

ప్రతిపదార్థం: పాఱినన్ = దుర్వాసు డట్లా పరుగెత్తి వెళ్ళగా; ఆతని వెనుకన = ఆ ముని యొక్క వెంబడినే; పాఱితిన్= నేనూ పరుగెత్తి వెళ్ళాను; సంప్రార్థనా ప్రభాషణములతోన్ = నా యొక్క ప్రార్థనా వాక్యాలతో, నావేడుకునే మాటలతో; తేఱి= ప్రసన్నుడై; మరలి = వెనుకకు మళ్ళి; ఆ+ముని = దుర్వాసుడు; అకట! = అయ్యో!; మిమున్ = మిమ్మల్ని; కాఱియ+పెట్టితిన్+కదే! = కష్టపెట్టానుసుమా!; అనుచున్ = అని పలుకుతూ; దయన్ = కరుణతో. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: దుర్వాసుడు ఆ విధంగా దక్షిణ దిశకు పరుగెత్తి పోగా నేను ప్రార్థనా వాక్యాలతో ఆయన వెంట పరుగెత్తి వెళ్ళాను. నేను తప్పు మన్నించుమని వేడుకొంటూ పల్కిన పల్కులకు ఆయన ప్రసన్నుడై వెనుదిరిగి 'అయ్యో! మిమ్ము బాధించాను గదా!' అని కృపతో.

వ. నన్నుం గనుంగొని 'నీవు కోపంబు జయించితివి. నీకు వరం బిచ్చెదఁ గైకొనుము. 374

ప్రతిపదార్థం: నన్నున్; కనుంగొని = చూచి; నీవు; కోపంబున్; జయించితివి = గెలిచావు; నీకున్; వరంబు; ఇచ్చెదన్; కైకొనుము = గ్రహింపుము, స్వీకరించుము.

తాత్పర్యం: దుర్వాసమహర్షి నన్ను చూచి 'కృష్ణా! నీవు కోపాన్ని జయించావు. నీకు వరమిస్తాను గ్రహించుము'.

ఆ. 'ఎల్లవారుఁ దమకు నెంత గూర్తురు నీకు । నంత గూర్చి నిన్ను ననుసరించు
వారు గాత; లోక వంద్యుండవై యెందు । మాఱులేక యతుల మహిమ మనుము.' 375

ప్రతిపదార్థం: ఎల్లవారున్ = అందరు; తమకున్ = తమకు తామంటే; ఎంత కూర్తురు = ఎంతగా ఇష్టపడతారో, తమ యందు ఎంత ప్రేమ కలిగి ఉంటారో; నీకున్ = నీకును; అంతకూర్చి = అంతగా ఇష్టపడి; నిన్నున్ = నిన్ను; అనుసరించువారు+కాతన్ = అనుసరించేవారు ఔతారు గాక!; లోకవంద్యుండవు+ఐ = లోకుల యొక్క నమస్కారాలు గైకొంటూ; ఎందున్ = ఎచ్చటను; మారులేక = అడ్డులేక, ప్రతిలేక; అతులమహిమన్ = సాటిలేని ప్రభావంతో; మనుము = జీవించుము, వర్థిల్లుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! సమస్త జనులు తమయందు తాము ఎంత ప్రేమ కలిగి ఉంటారో, అనగా తమకు తామంటే ఎంత ప్రియమో, అంత ప్రేమ నీ యందు కలిగి ఉండి నిన్ను అనుసరిస్తారు. నీవు జనుల యొక్క మ్రొక్కులు గైకొంటూ ఎందును ఎదురే లేక సాటిలేని మహిమతో వర్ధిల్లుదువుగాక!'

వ. అని నిర్దేశించి మఱియు నిట్లనియె. 376

ప్రతిపదార్థం: అని; నిర్దేశించి = నిర్ణయించి, నిర్ధారణ చేసి చెప్పి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుర్వాస మహర్షి నిర్ణయపూర్వకంగా వచించి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'నాయంగంబుల నెల్లం । బాయస మతిభక్తిఁ బూసి పాదతలమునం
బూయవు గావునఁ గలుగు న । పాయం బఱకాల నీకు నవిలంఘ్యంబై. 377

ప్రతిపదార్థం: నా అంగంబులన్+ఎల్లన్ = నా అన్ని అవయవములందు; అతిభక్తిన్ = మిక్కిలి భక్తితో, గాఢ ప్రేమతో; పాయసము = పరమాన్నం; పూసి = రాసి, ప్రామి, అలది; పాదతలమునన్ = అరికాలిలో, పాదము యొక్క క్రింది భాగంలో; పూయవు = నీవు పూయలేదు; కావునన్ = కాబట్టి; నీకున్ = నీకు; అఙకాలన్ = పాదతలంలో; అవిలంఘ్యంబు+ఐ = దాటరానిదై; తప్పించుకొన వీలుగానిదై; అపాయంబు = కీడు, చేటు, హాని; కలుగున్ = సంభవిస్తుంది.

తాత్పర్యం: 'నా శరీరమం దంతట పరమభక్తితో పరమాన్నం ప్రామినావు. కాని అరికాలిలో మాత్రం పూయలేదు. కాబట్టి నీకు పాదతలంలో తప్పించుకొన శక్యంగాని హాని కలుగుతుంది.

క. **విను పరమపదప్రాప్తికి । ననుగుణమైయుండుఁ గాన యదియును నశుభం**
బనరాదు; నీవు బ్రాహ్మణ । జనముల యెడ నడపు మిట్టి చందమ యెపుడున్.' **378**

ప్రతిపదార్థం: విను = శ్రీ కృష్ణా! ఆలకించుము; అదియును = నీకు పాదతలంలో కలుగబోయే కీడు; పరమ పదప్రాప్తికిన్ = నీవు శ్రీవైకుంఠం చెందటానికి, అనుగుణము+ఐ = అనుకూలమై, తగినదై; ఉండున్ = ఉంటుంది; కాన = కనుక; అశుభంబు+అనన్+రాదు = అమంగళం అని భావించకూడదు; నీవు; బ్రాహ్మణ జనముల+ఎడన్ = విప్రుల విషయంలో; ఎపుడున్ = ఎల్లప్పుడూ; ఇట్టి చందము+అ = ఈ విధంగానే; నడపుము = ప్రవర్తించవలసినది.

తాత్పర్యం: కృష్ణా! నా పలుకులు వినుము. పాదతలంలో నీకు కలుగనున్న ఆపద నీ వైకుంఠప్రాప్తికి అనుకూలంగానే ఉంటుంది. కనుక ఆ చేటును అమంగళమని భావించకూడదు. నీవు బ్రాహ్మణుల విషయంలో ఈ రీతిగానే భయభక్తులతో ప్రవర్తించుము.'

వ. **అని పలికి రథవహన పరిశ్రాంతయగు మీతల్లిం జూచి 'నీవు సౌందర్య సౌభాగ్యంబుల నప్రతిమానవై మాననీయత్వంబునం గృష్ణుని షోడశ సహస్రాంతఃపుర కాంతలకంటె నెక్కుడగు' మని దీవనయిచ్చి యమ్ముని యంతర్హితుం డయ్యె.** **379**

ప్రతిపదార్థం: అని; పలికి; రథవహన పరిశ్రాంత+అగు = రథం లాగటంవలన బడలిక పొందినట్టి; మీతల్లిన్ = నీ జననిఅగు రుక్మిణిని; చూచి = కనుగొని; నీవు; సౌందర్య సౌభాగ్యంబులన్ = చక్కదనంలో, వైభవంలో; అప్రతిమానవు+ఐ = సాటిలేని దానవై; మాననీయత్వంబునన్ = గౌరవార్హతలో; కృష్ణుని = శ్రీకృష్ణుడి యొక్క; షోడశ సహస్ర+అంతఃపురకాంతలకంటెన్ = పదహారువేలమంది రాణివాసపు రమణుల కంటె; ఎక్కుడు+అగుము = అధికురాలవు కమ్ము; అని; దీవన = ఆశీర్వాదం; ఇచ్చి; ఆ+ముని; అంతర్హితుండు+అయ్యెన్ = అంతర్ధానం చెందాడు.

తాత్పర్యం: అని దుర్వాసుడు పలికి రథాన్ని ఈడ్చి ఈడ్చి అలసిపోయిన మీ అమ్మను జూచి 'నీవు సౌందర్యమునందు, సౌభాగ్యమునందు సాటిలేని దానవై గౌరవార్హతలో శ్రీకృష్ణుడి పదహారువేలమంది రాణులలో అగ్రేసరవై విలసిల్లు' మని ఆశీర్వదించి ఆ మునీంద్రుడు అదృశ్యుడయ్యాడు.

ఆ. **రుక్మిణియును నేను రుచిరసంపద నప్పు । డతిశయిల్లు నస్మ దంగకములఁ**
జూచి కొనుచు మిగులఁ జోద్య మందుచుఁ బ్రియ । మెడఁద నెలకొనంగ నింటి కరిగి. **380**

ప్రతిపదార్థం: రుక్మిణియునున్; నేనున్; రుచిరసంపదన్ = సౌందర్య సంపత్తిచే; అప్పుడు = ఆ వేళ; అతిశయిల్లు =

ఏపారుతున్న; అస్మత్+అంగకములన్ = మా యొక్క దేహాలను; చూచి కొనుచున్ = దర్శించుకొంటూ; మిగులన్ = మిక్కిలి; చోద్యము +అందుచున్ = ఆశ్చర్యపడుతూ; ప్రియము = ప్రేమ; ఎడఁదన్ = హృదయములందు; నెలకొనంగన్ = కుదురుకొనగా, కలుగగా; ఇంటికిన్+అరిగి = గృహమునకు వెళ్ళి (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: రుక్మిణీ, నేనూ మహర్షి దీవన వలన సౌందర్య సమృద్ధితో విలసిల్లుతున్న మా శరీరాలను వీక్షించుకొంటూ, మిక్కిలి ఆశ్చర్యపడుతూ, సంతోషం హృదయములందు నిండగా ఇంటికి వెళ్ళాము.

ఆ. అందు వస్తుచయము మందటికంటెను । బహులమును మనోజ్ఞ భంగికంబు
నగుటఁ జూచి యద్భుతాయత్తచిత్తుల । మైతి; మిట్టివార లవనిసురులు. 381

ప్రతిపదార్థం: అందున్ = ఇంటిలో; వస్తుచయము = వస్తువుల యొక్క సమూహం; ముందటి కంటెను = మునుపున్న వాటి కంటె; బహులమును = అధికంగానూ; మనోజ్ఞ భంగికంబున్ = మనస్సునకు ఇంపు గూర్చునట్టిదిగాను; అగుటన్+చూచి = ఉండటం కనుగొని; అద్భుత+ఆయత్త చిత్తులము+ఐతిమి = ఆశ్చర్యానికి అధీనమైన మనస్సులు కలవారమయ్యాము; అవనిసురులు = పుడమియందలి దేవతలు-బ్రాహ్మణులు; ఇట్టివారలు = ఇటువంటి మహిమకలిగిన వాళ్ళు.

తాత్పర్యం: ప్రద్యుమ్నా! ఇంటిలోని వస్తుసముదాయం మునుపటికంటె ఇనుమిక్కిలిగా ఉండి ఎంతో రమ్యమై కనువిందు చేసింది. వాటిని చూచి మేము ఆశ్చర్య నిమగ్న మానసులమయ్యాము.

క. కావున వారికి భక్తుఁడ । వై వెలయు కుమార!' యనిన నతఁ డట్టిఁడయై
తా వెలసె; నీవు నట్టిఁడ । వై వెలయఁగ వలయుఁ గౌరవాన్వయముఖ్యా!' 382

ప్రతిపదార్థం: కుమార = తనయా! ప్రద్యుమ్నా! ; కావునన్ = కనుక; వారికిన్ = భూసురులకు; భక్తుఁడవు+ఐ = భక్తుండవై; వెలయు = ప్రకాశించుము; అనినన్ = అని నేను చెప్పగా; అతఁడు = మా కుమారుడైన మన్మథుడు; అట్టిఁడు+అ+ఐ = (అట్టిఁడయై) = అట్టివాడే అయి, బ్రాహ్మణభక్తుడై; తాన్ = తాను; వెలసెన్ = వెలుగొందాడు; కౌరవ+అన్వయముఖ్యా! = కురువంశజులలో ప్రధానుడవైనవాడా! ధర్మజా! ; నీవున్ = నీవు కూడ; అట్టిడవు+ఐ = మా కుమారుడు ప్రద్యుమ్నుడి మాదిరి విప్రభక్తుడవై; వెలయఁగన్+వలయున్ = విరాజిల్లవలె సుమా!

తాత్పర్యం: కాబట్టి కుమారా! నీవు బ్రాహ్మణులకు భక్తుడవై ప్రకాశించాలి' అని నేను చెప్పాను. ప్రద్యుమ్నుడు నామాట చొప్పున బ్రాహ్మణులయందు భక్తి గలిగి విరాజిల్లాడు. ధర్మజా! నీవు గూడ మా కుమారుడి వలె విప్రభక్తుడవై వెలుగొందాలి.'

వ. అని చెప్పినం బ్రముదితమానసుం డగుచు నమ్మానవనాథుండు మాధవుతో 'దుర్వాసుండు శర్వాంశ సంభవుం డని విందు; శర్వుని మహిమ విన వలతుం జెప్పవే' యనిన నప్పురుషోత్తముండు భరితాదరుండై. 383

ప్రతిపదార్థం: అని; చెప్పినన్; ఆ+మానవ నాథుండు = ఆ నరేశ్వరుడు (ధర్మరాజు); ప్రముదిత మానసుండు+అగుచున్ = సంతోషించిన మనస్సు కలవాడవుతూ; మాధవుతోన్ = లక్ష్మీ వల్లభుడైన శ్రీకృష్ణుడితో; దుర్వాసుండు; శర్వ+అంశ సంభవుండు = ఈశ్వరాంశలో జన్మించినవాడు; అని; విందున్ = పెద్దలు చెప్పగా వింటున్నాను; శర్వుని మహిమన్ = పరమేశ్వరుడి ప్రభావం; వినన్+వలతున్ = వినవలెనని కోరుతున్నాను; చెప్పవు+ఏ? = ఎరిగించవా? వచింపవా?; అనినన్;

ఆ+పురుష+ఉత్తముండు = పురుషులలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణదేవుడు; భరిత+ఆదరుండు = పూర్ణమైన ఆదరం కలవాడై. (ఆదరము = గౌరవము).

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు చెప్పగా నరేశ్వరుడైన ధర్మజుడు మనస్సులో ఎంతో సంతసించి శ్రీకృష్ణుడితో 'దేవా! దుర్వాసుడు ఈశ్వరాంశలో జన్మించాడని పెద్దలు చెప్పగా వింటున్నాను. పరమశివుడి మహిమలను గూర్చి వినవలెనని కుతూహలపడుతున్నాను. సెలవీయవా' అని అడిగాడు. అందుకు శ్రీకృష్ణుడు ఎంతో ఆదరబుద్ధితో. (తరువాతి పద్యంతో అన్వయం).

కృష్ణుఁడు ధర్మజునకు శివుని మహిమ చెప్పుట. (సం.13-145-3).

ఆ. 'అడుగ వలయుదాని నడిగితి నీవు న । న్నధిప! నామనము ప్రియంబుఁ బొందె;
శివునిఁ దలఁచి మ్రొక్కి శివు దివ్యమహిమ సె । ప్పెద నితాంత విమల హృదయ కమల! 384

ప్రతిపదార్థం: అధిప = రాజా!; అడుగన్ వలయు దానిన్ = అడుగుటకు అర్హమైన విషయమునే; నీవు; నన్నున్; అడిగితి = అడిగావు; నా మనము = నా హృదయం; ప్రియంబున్+పొందెన్ = ప్రీతి వహించింది, సంతోషం చెందింది; నితాంత= మిక్కిలి; విమల= స్వచ్ఛమైన, హృదయ కమల= హృదయమనే పద్మం కలవాడా!; శివునిన్ = మహాదేవుడిని; తలఁచి = స్మరించి; మ్రొక్కి = నమస్కరించి; శివు దివ్యమహిమన్ = పరమేశ్వరుడి యొక్క అప్రాకృతమైన ప్రభావాన్ని; చెప్పెదన్ = తెలుపుతాను.

తాత్పర్యం: 'ధర్మజా! నీవు నన్ను అడుగదగిన విషయమే అడిగావు. ఇందుకు నా మన సెంతో ఆనందించింది. ఆ మహాదేవుడిని ధ్యానించి నమస్కరించి ఆయన దివ్యములైన మహిమలను తెలుపుతాను. నీవు మిక్కిలి పరిశుద్ధమైన అంతఃకరణం కలవాడివి సుమా!

వ. ఏకాగ్రచిత్తుండవై యాకర్ణింపు' మని ధర్మజున కిట్లనియె. 385

ప్రతిపదార్థం: ఏక+అగ్రచిత్తుండవు+ఐ = నిశ్చలమైన మనస్సుకలవాడవై; ఆకర్ణింపుము = వినుము; అని; ధర్మజునకున్; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: ధర్మజా! నిశ్చల బుద్ధితో నే చెప్పునది విను' మని శ్రీకృష్ణుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

క. 'శతరుద్రీయము నే నరుఁ । డతిభక్తిని శివుని మనమునందు నిలిపి యం
చితముగఁ బఠించు సులభం । బతనికి సర్వంబు నిందు నందు నరేంద్రా!' 386

ప్రతిపదార్థం: నర+ఇంద్రా! = మనుజవల్లభా!; ఏ నరుఁడు = ఏ మనుజుడు; శతరుద్రీయమున్ = యజుర్వేదాంతర్గతమైన నమకం అనే మంత్రభాగాన్ని; అతిభక్తిని = మిక్కిలి భక్తితో; శివునిన్ = శంకరుడిని; మనము+అందున్ = హృదయంలో; నిలిపి = నిలుపుకొని, నెలకొల్పి; అంచితముగన్ = ఒప్పిదంగా, యోగ్యంగా; పఠించున్ = చదువునో; అతనికిన్ = ఆ శత రుద్రీయపఠితకు; ఇందున్ = ఈ లోకంలో; అందున్ = పరలోకంలో; సర్వంబున్ = సమస్తమూ; సులభంబు = తేలిక (తేలికగా లభిస్తుంది).

తాత్పర్యం: 'ధర్మజా! ఏ మానవుడు పరమభక్తితో పరమేశ్వరుడిని హృదయంలో నిలుపుకొని శతరుద్రీయాన్ని

(నమకాన్ని) ఒప్పిదంగా పఠిస్తాడో ఆ మనుజుడికి ఇహలోకంలో, పరలోకంలో సమస్త సుఖాలు సులభంగా లభిస్తాయి.'

వ. అని వెండియు. 387

తాత్పర్యం: అని మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'అమరు మహాదేవుఁడను పేరు శివునకు; । నప్పరమునకు మీఁ దరయ లేదు
తత్కోపదృక్కీల ధర్మవిరుద్ధపు । జాతుల నెల్లను సమయఁ జేయు
దేవతల్ మునులు నతి ప్రయత్నంబునఁ । గావించు దక్షయాగమున శివుని
మఱచిన నయ్యజ్ఞ మఱవఱలై పోదె? । భగనేత్రనాశ మాదిగ ననేక

తే. భంగములు రావె? వారి కా ప్రభువు చేత; । శరణు వేఁడిన గావఁడే? కరుణ నట్టి
వారి; నీశు పెం పేమన వచ్చు! మఱియు । వినుము తద్దివ్యలీలలు మనుజనాథ! 388

ప్రతిపదార్థం: మనుజనాథ! = భూపతీ!; శివునకున్ = ఈశ్వరుడికి; మహాదేవుఁడు+అను = మహాదేవుడనే; పేరు = నామం; అమరున్ = ఒప్పుతుంది; తగి ఉన్నది; ఆ+పరమునకున్ = ఆ శ్రేష్ఠుడికంటె; మీఁదు = మించిన వస్తువు; అరయన్ = విచారించగా; లేదు = కలుగదు; తత్+కోపదృక్+కీల = ఆ రుద్రుడి యొక్క కోపపు చూపులనే నిప్పుమంట; ధర్మవిరుద్ధము+జాతులన్+ఎల్లనున్ = ధర్మమునకు వ్యతిరేకమైన తెగలనన్నింటినీ, వేద విహితమైన ఆచారానికి వ్యతిరిక్తములైన అన్ని జాతులనూ; సమయన్+చేయున్ = నాశనం చేస్తుంది; దేవతల్; మునులు; అతిప్రయత్నంబునన్ = మిక్కిలిపూనికతో; కావించు = సలుపుతున్న; దక్షయాగమునన్ = దక్షప్రజాపతి యొక్క యజ్ఞంలో; శివునిన్ = శంకరుడిని; మఱచినన్ = విస్మరించగా, ఆహ్వానించనందున; ఆ+యజ్ఞము = ఆ క్రతువు, అధ్వరము; అఱవఱలు+ఐ+పోదు+ఎ? = భగ్నంకాలేదా? విధ్వంసమై పోయింది గదా!; వారికిన్ = దక్షయజ్ఞంలో పాల్గొన్న వారికి; ఆ ప్రభువుచేతన్ = ఆ జగత్పతి మూలాన; భగనేత్రనాశము = సూర్యుడి కన్ను పోవటం; ఆదిగన్ = మొదలుగా; అనేక భంగములు రావె? = పలువిధములైన అవమానాలు, భయాలు కలుగవా? కలిగినవని తాత్పర్యం; శరణు వేఁడినన్ = కాపాడుమని అర్థించగా; అట్టివారిన్ = అట్లా శరణు జొచ్చినవారిని; కరుణన్ = దయతో; కావఁడు+ఏ? = రక్షించలేదా? రక్షించాడని భావం; ఈశుపెంపు = పరమేశ్వరుని ప్రాభవం, ఆధిక్యం, గొప్పతనం; ఏమి+అనన్+వచ్చున్? = ఎంతని పొగడ గలం?; మఱియున్ = ఇంకను; తత్+దివ్యలీలలు = ఆ మహాదేవుడి యొక్క పరమాద్భుత చర్యలు; వినుము = ఆకర్ణించుము.

తాత్పర్యం: 'కుంతీనందనా! శివుడికి మహాదేవుడనే పేరు ఎంతో తగి ఉన్నది. ఆయనకు పై వాడెవ్వడూ లేడు. అత డనీశుడు. ఆ రుద్రుడి యొక్క కినుక గదిరిన చూపు మంటలతో వేద ధర్మానికి విరుద్ధ ప్రవర్తన గల జాతులన్నీ దగ్ధమయిపోతాయి. ఈశ్వర విరహితంగా దేవతలు, మునులు మిక్కిలి పూనికతో నిర్వర్తించే దక్షుడి యజ్ఞం ధ్వంసం కాలేదా? ఈశ్వరుడు ఆగ్రహించటంవలననే సూర్యుడికి కనులు పోవుట మున్నగు అనర్థాలు ఆ క్రతువులో పాల్గొన్నవారికి కలుగలేదా? ప్రభూ! మమ్ము రక్షించుమని శరణు వేడిన వారిని ఆయన కరుణతో కాపాడలేదా? అట్టి పరమేశ్వరుడి మహిమ వర్ణించటానికి శక్యం కాదు. ఆ మహా దేవుడి దివ్య లీలలు ఇంకా వినుము.

సీ. **ప్రబలదైత్యులు పురత్రయనాయకులు జగ । త్త్రయము నప్రతిమ ప్రతాప లీల**
బాధింప దివిజులు ఫాలలోచనుఁ గాంచి । 'కావుము కృప దేవదేవ! మమ్ముఁ
బశువుల మగు వారిఁ బశుపతి వైన నీ' । వనుచు మహాక్రోశ మాచరింప
నప్పురంబులు మూఁటి నస్త్ర మొక్కటన భ । స్మము గాఁగఁ జేసి యమ్మార్గణంబు

తే. **నంకమున నిడ నది బాలుఁ డైన 'నీతఁ । డెవ్వఁ?' డని చూచి వెఱఁగంది యెల్లసురలు**
వినుతిసేయ బ్రాహ్మణమూర్తి వెలుఁగు నతని । కిడియె దుర్వాసుఁ డనునామ మీశ్వరుండు. **389**

ప్రతిపదార్థం: ప్రబలదైత్యులు = మిక్కిలి బలవంతులైన రక్కసులు; పురత్రయనాయకులు = ఇనుము, వెండి, బంగారం అనే లోహాలతో నిర్మించబడిన మూడు పట్టణాలకు అధిపతులు అయినట్టివారు; జగత్+త్రయమున్ = స్వర్గ మర్త్య పాతాళలోకాలను; అప్రతిమ = సాటిలేని; ప్రతాపలీలన్ = శౌర్యము యొక్క విలాసంతో; బాధింపన్ = పీడించగా; దివిజులు = దేవతలు; ఫాలలోచనున్ = నుదుట కన్ను గల శంకరుడిని; కాంచి = దర్శించి; దేవదేవ! = దేవతలకు అధీశ్వరుడవైన మహేశా!; పశువులము+అగు వారిన్+మమ్మున్ = పశువులుగా ఉన్నట్టి మమ్ములను; పశుపతివి+ఐన+నీవు = పశువులకు పాలకుడవుగా ఉన్న నీవు; కృపన్ = కారుణ్యంతో; కావుము = కాపాడుము; అనుచున్ = అని; మహా+ఆక్రోశము+ఆచరింపన్ = మిక్కిలి వాపోవగా; ఆ+పురంబులు మూఁటిన్ = ఆ త్రిపురాలను; అస్త్రము+ఒక్కటన = ఒక్కమంత్రపూతమైన సాయకంతో; భస్మము+ కాఁగన్+చేసి = బూడిద అగునట్లొనరించి; ఆ+మార్గణంబున్ = ఆ బాణమును; అంకమునన్+ఇడన్ = తన తొడమీద ఉంచుకొనగా; అది = ఆ శరము; బాలుఁడు+ఐనన్ = బాలుడు కాగా; ఈతఁడు+ఎవ్వఁడు+అని = ఈ పసివా డెవడని; చూచి = కనుగొని; వెఱఁగు+అంది = విస్మయపడి; ఎల్లసురలు = అమరులందరూ; వినుతి+చేయన్ = స్తుతించగా, పొగడగా; బ్రాహ్మణమూర్తిన్ = విప్రస్వరూపంతో; వెలుఁగు = ప్రకాశిస్తూన్న; అతనికిన్ = ఆ బాలకుడికి; ఈశ్వరుండు = ఉమాపతి; దుర్వాసుఁడు+అనునామము = దుర్వాసుడనే పేరు; ఇడియెన్ = ఒసగినాడు.

తాత్పర్యం: మిక్కిలి బలవంతులైన త్రిపురాసురులు తమ సాటిలేని బలపరాక్రమాలతో ముల్లోకాలను బాధించసాగారు. అప్పుడు వేల్పులు ముక్కంటిని దర్శించి 'దేవాదిదేవా! మేము పశువులము. మమ్మ పాలించేవాడవు గనుక నీవు పశుపతివి. కనుక కరుణతో మమ్ము కాపాడు' మని బిగ్గరగా మొరపెట్టుకొన్నారు. అంతట మహేశుడు ఆ త్రిపురములను ఒక్క అస్త్రప్రయోగంతో భస్మం చేసి ఆ బాణాన్ని తన తొడపై నిడు కొన్నాడు. ఆ బాణం ఒక బాలుడు కాగా ఇత డెవ్వడని చూచి ఆశ్చర్యచకితులై వేల్పులు వినుతించారు. విప్రరూపంతో వెలుగొందే ఆ బాలుడికి అపుడు శివుడు దుర్వాసుడని నామకరణం చేశాడు.

తే. **అతఁడు సూవె మాయింటికి నరుగుదెంచి । యంత సేసినాఁ' డనవుడు నచ్చెరువును**
భక్తియును మదిఁ బిరిగొనఁ బాండు నగ్ర । సుతుఁడు నిభృతిమై దేవకిసుతునితోడ. **390**

ప్రతిపదార్థం: అతఁడు+చూవె = ఆ దుర్వాసుడేసుమా; మా+ఇంటికిన్ = మా గృహానికి; అరుగుదెంచి = వచ్చి; అంత+ చేసినాఁడు = కొనియాడ తరముగాని మహాద్భుతములు సలిపాడు; అనవుడున్ = అని మాధవుడు పల్కగా; అచ్చెరువును = ఆశ్చర్యమూ; భక్తియును = భక్తియూ; మదిన్ = హృదయంలో; పిరిగొనన్ = అతిశయించగా; పాండు+అగ్రసుతుఁ డు = పాండుమహారాజు పెద్దకొడుకు; నిభృతిమైన్ = అణకువతో, వినయంతో; దేవకిసుతుని తోడన్ = దేవకీదేవి నందనుడైన కేశవుడితో (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఆ దుర్వాసుడే మా గృహానికి వచ్చి అన్ని అద్భుత చేష్టితములు కావించాడు' అని వాసుదేవు డన్నాడు. ధర్మజుడు ఆశ్చర్య మొకవంక, భక్తి మరొకవంక తన మనసులో మల్లడి గొనగా వినయంతో దేవకీ తనయుడితో.

క. 'శివముఖ్యనామములు ప్ర । స్తవనకృతిన్ భోగమోక్షదము లగు నని విం
దు విమలబోధ! యెఱింగిం । పవె వాని నిరుక్తి' ననినఁ బరమప్రీతిన్. 391

ప్రతిపదార్థం: విమలబోధ! = నిర్మలమైన జ్ఞానం కలవాడా!; శివముఖ్యనామములు = శివుని యొక్క ప్రసిద్ధములైన పేళ్ళు; ప్రస్తవనకృతిన్ = స్తోత్ర మొనర్చుటచేత; భోగ మోక్షదములు+అగునని = సౌఖ్యమును, ముక్తిని ప్రసాదిస్తాయని; విందున్ = పెద్దలు చెప్పగా వింటున్నాను; వాని నిరుక్తిన్ = ఆ నామముల యొక్క అర్థాన్ని; ఎఱింగింపవు+ఎ? = తెలుపవా?; అనినన్ = అని యుధిష్ఠిరుడు వేడగా; పరమప్రీతిన్ = మిక్కిలి హర్షంతో (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'పరమేశ్వరుడి ప్రసిద్ధనామాలు స్తోత్రం చేస్తే ఇహపరసుఖాలు కలుగుతాయని విన్నాను. విమలవిజ్ఞాన స్వరూపుడవైన నీవు ఆ పరమశివుడి నామాలను అర్థసహితంగా నా కెరిగింపు' మని ధర్మజుడు వేడగా మిక్కిలి సంతోషించి.

వ. అతం డిట్లనియె. 392

తాత్పర్యం: నారాయణుడు ఈ విధంగా పలికాడు.

క. 'శివదేవు ముట్టఁ గొల్వఁగ । నవనీశ్వర! యతని పేళ్ళ యర్థ మెఱిఁగి సం
స్తవనకృతిఁ గూర్ప నాకై । న విధాతకు నైన నరిది నామదిఁ జూడన్. 393

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర! = భూపాలా!; శివదేవున్ = భగవంతుడైన శివుడిని; ముట్టఁగొల్వఁగన్ = సంపూర్ణంగా సేవించటానికి; అతని పేళ్ళ+అర్థము = ఆ శివనామముల యొక్క అర్థం; ఎఱిఁగి = తెలిసి; సంస్తవన కృతిన్+కూర్పన్ = స్తోత్రకార్యం కావించటం; నామదిన్+చూడన్ = నామనసులో తలపోయగా; నాకున్+ఐనన్ = నాకు గాని; విధాతకున్+ఐనన్ = బ్రహ్మకుగాని; అరిది = అశక్యం.

తాత్పర్యం: 'ధర్మజా! పరమేశ్వరుడిని పరిపూర్ణంగా భజించటం, ఆయన నామాలకు అర్థ మెఱిగి స్తోత్రం సల్పటం పరికించగా నాకు గాని, బ్రహ్మకు గాని శక్యం కాదు.

వ. అయినను. 394

తాత్పర్యం: శక్యం కానప్పటికినీ.

క. నీవిట్లు నన్ను నడిగితి । గావున నా యెఱిఁగి నట్టి గతిఁ జెప్పెద న
ద్దేవాది దేవు వర నా । మావలి విను మచలమైన యవధానముతోన్. 395

ప్రతిపదార్థం: నీవు; ఇట్లు; నన్నున్; అడిగితి = చెప్పుమని అడిగావు; కావునన్; నా+ఎఱిఁగిన+అట్టి+గతిన్ = నేను తెలిసికొన్న విధంగా; ఆ దేవ+ఆదిదేవు = దేవతలకే మొదటి దేవుడైన శంభుడి యొక్క; వర = శ్రేష్ఠములైన; నామ+ఆవలిన్ = పేళ్ళ యొక్క సమూహమును; అచలము+ఐన = చలించనట్టి, స్థిరమైన; అవధానముతోన్ = ఏకాగ్రచిత్తంతో; వినుము = ఆలకించుము.

తాత్పర్యం: నరేశ్వరా! నీవు శంభుడి నామాలు, వాటి అర్థాలు తెల్పుమని నన్ను కోరితివి కనుక నా తెలిసినంతలో ఆ దేవదేవుడి యొక్క ఉత్తమనామావళి వినిపిస్తాను. స్థిరమైన చిత్తంతో శ్రద్ధగా ఆలకించుము.

ఆ. అగ్ని వాయు వాస వాదిత్య వసు మరు । దాదిదేవతా మయాత్ముఁ డైన
శివుని మహిమఁ బ్రీతిఁ జెప్పుట వినుట స । ర్వార్థసాధకంబు లగు నృపాల! 396

ప్రతిపదార్థం: అగ్ని = అగ్నిదేవుఁడు; వాయు = వాయుదేవుడు; వాసవ = దేవేంద్రుడు; ఆదిత్య = ద్వాదశాదిత్యులు; వసు = అష్టవసువులు; మరుత్ = సప్తమారుతములు; ఆది = మొదలుగాగల; దేవమయ+ఆత్ముఁడు+ఐన = దేవతాస్వరూపి అయిన; శివుని మహిమన్ = పరమేశ్వరుడి ప్రభావమును, విభూతులను; ప్రీతిన్ = సంతోషంతో; చెప్పుట = నుడువటం; వినుట = ఆకర్ణించటం; సర్వ+అర్థసాధకంబులు+అగున్ = సమస్తప్రయోజనాలను సమకూర్చునట్టివి కాగలవు.

తాత్పర్యం: ధర్మజా! అనలుడు, అనిలుడు, ఇంద్రుడు, ఆదిత్యులు, వసువులు, మరుత్తులు మున్నుగా గల సర్వదేవతా స్వరూపుడైన శివదేవుడి మాహాత్మ్యమును ప్రీతితో చెప్పుట గాని, వినుట గాని సకలాభీష్టములను సిద్ధింప జేస్తుంది.

కృష్ణుఁడు ధర్మజునకు శివనామ నిర్వచనంబు చెప్పుట. (సం.13-266-1 (కుంభ)).

క. వినుము నరేంద్ర! మహత్త్వం । బున నుండను నీశ్వరత్వమున నఖిల మహా
ముని జనములును మహేశ్వరుఁ । డని కొనియాడ హరుఁ డొప్పు నప్రతిముండై. 397

ప్రతిపదార్థం: నర+ఇంద్ర! = రాజా!; వినుము; మహత్త్వంబునన్ = గొప్పతనంతో; ఈశ్వరత్వమునన్ = ఐశ్వర్యంతో; ఉండను = ఉండటంచేత; అఖిల = సమస్తమైన; మహాముని జనములును = గొప్పమునీశ్వరులు; మహా+ఈశ్వరుఁడు+అని = మహేశ్వరు డంటూ; కొనియాడన్ = వినుతించగా, పొగడగా; అప్రతిముండు+ఐ = తన కెందును సాటిలేనివాడై; హరుఁడు = శివుడు; ఒప్పున్ = విలసిల్లుతున్నాడు.

తాత్పర్యం: రాజేంద్రా! వినుము. గొప్పతనంతో, ఐశ్వర్యంతో విరాజిల్లేవాడు కనుక సకల మునీంద్రులు ఆయనను మహేశ్వరుడని కొనియాడుతుండగా సాటిలేనివాడై సాంబశివుడు ప్రకాశిస్తున్నాడు.

సీ. ఉగ్రత్వమునఁ బ్రతాపోన్నతి రుద్రనా । మము దాల్చె; దేవసంఘమున కెల్ల
మహతినాఁ బొలుపారు మహనీయ దేవత । గావున విను మహాదేవుఁ డయ్యె;
నఖిలసత్కర్మ ఫలాకారశుభములు । సేయు వేడుక కల్మి శివుఁ డనంగఁ
జనియె; సుస్థిరతేజమున వెలుఁ గొందుట । నంచిత స్థాణు సమాఖ్యఁ బరఁగె;

తే. జంగమస్థావరాత్మక సకలభూత । రూపబహుత నొందుట బహురూపనామ
ధేయుఁడై యొప్పె; ధూమ్రపుఁజాయ జటల । వలన ధూర్జటి యనుపేర వఱలె హరుఁడు. 398

ప్రతిపదార్థం: విను = ధర్మజా! వినుము; హరుఁడు = శంభుడు; ఉగ్రత్వమునన్ = భయంకరత్వం చేతనూ; ప్రతాప+ఉన్నతిన్ = పరాక్రమౌన్నత్యం చేతనూ; రుద్రనామమున్+తాల్చెన్ = రుద్రుడను పేరు వహించాడు; దేవసంఘమునకున్+ఎల్లన్ =

దేవతాసమాజాని కంతటికీ; మహతినాన్ = మహతి అనేపేరుతో (దొడ్డవాడనగా); పొలుపు+ఆరు = ప్రకాశించే, ఒప్పారే; మహనీయ దేవతకావునన్ = గొప్ప వేల్పుగనుక; మహాదేవుఁడు+అయ్యెన్ = మహాదేవుడు అనే పేరు ధరించాడు; అఖిలసత్కర్మఫల+ఆకార = అన్ని మంచిపనులకు ఫలస్వరూపములైన; శుభములు = మంగళములు; చేయువేడుక కల్మిన్ = ఒనర్చునట్టి ఉబలాటం కలవాడు గనుక; శివుఁడు+అనఁగన్+చనియెన్ = శివుడనే పేరుతో ఒప్పుతున్నాడు; సుస్థిరతేజమునన్ = మిక్కిలి శాశ్వతమైన కాంతితో; వెలుఁగు+ఒందుటన్ = ప్రకాశిస్తూండటంచేత; అంచితస్థాణుసమాఖ్యన్ = ఒప్పిదమైన స్థాణుడనే నామధేయంతో; పరఁగెన్ = విలసిల్లినాడు; జంగమస్థావర+ఆత్మక = చరాచరాత్మకమైన, చేతనములు, అచేతనములు అనునట్టి; సకల భూత = సమస్త ప్రాణులయొక్క; రూపబహుతన్ = ఆకారబాహుళ్యమును, అనేక రూపాలను; ఒందుటన్ = పొందుటచే; బహురూపనామధేయుఁడు+ఐ = బహురూపుడు అనే పేరు గలిగిన వాడై; ఒప్పెన్ = విరాజితుడైనాడు; ధూమ్రపుఁజాయజటల వలనన్ (ధూమ్రము+చాయ = ధూమ్రపున్+చాయ = ధూమ్రపుఁజాయ) = నలుపుకలిసిన ఎరుపు వన్నె జడలు ధరించిన వాడగుట వలన; ధూర్జటి+అనుపేరన్ = ధూర్జటి అనే ఆహ్వాయంతో; వఱలెన్ = ఒప్పినాడు.

తాత్పర్యం: భీకరత్వం చేతను, పరాక్రమం చేతనూ హరునకు రుద్రుడనే పేరు వచ్చింది. దేవ సమాజమందు దొడ్డవేల్పు కనుక మహాదేవు డయినాడు. సమస్త సత్కర్మములకు ఫలరూపములైన శుభాలను ప్రసాదించే కుతూహలం కలవాడు కనుక శివుడనే పేరు ధరించాడు. సుస్థిర మైన కాంతితో దీపిస్తున్నాడు కనుక ఈయనకు స్థాణుడనే నామం ఏర్పడింది. కదిలేవి, కదలనివి అయిన సకలప్రాణుల యొక్క స్వరూపములు తాల్చుటచే బహురూపుడనే పేరుతో పెంపారుతున్నాడు. పొగవన్నె జటాజూటం ధరించిన వాడు గనుక ధూర్జటి అనే నామంతో విరాజిల్లుతున్నాడు.

ఆ. **వినుము విశ్వు లనఁగఁ జను దేవతలు దన । యంద పొడమి; రట్టు లగుట విశ్వ**
రూపనామకమున దీపితుం డయ్యె నా । త్రిపురమర్దనుండు నృపవరేణ్య! **399**

ప్రతిపదార్థం: నృపవరేణ్య = రాజోత్తమా!; వినుము = ఆకర్ణించుము; ఆ త్రిపురమర్దనుండు = త్రిపురాసురులను సంహరించిన పరమేశ్వరుడు; విశ్వులు+అనఁగన్+చను = విశ్వులు అనే పేరుతో ఒప్పుతున్న; దేవతలు = వేల్పులు; తనయందున్+అ = తనయందే; పొడమిరి = జన్మించారు; అట్టులు+అగుటన్ = అందువలన; విశ్వరూప నామకమునన్ = విశ్వరూపుడు అనే నామధేయంతో; దీపితుండు+అయ్యెన్ = ప్రకాశించాడు.

తాత్పర్యం: త్రిపురాసురులను సంహరించిన ఆ గౌరీపతి యొక్క దేహం నుంచి విశ్వు లనే దేవతలు జన్మించారు కనుక ఆయన విశ్వరూపుడు అనే పేరుతో విలసిల్లుతున్నాడు.

సీ. **బహునేత్రములు మేనఁ బ్రజ్వరిల్లుట సర్వ । తశ్చక్షు రాహ్వయోదాత్త కీర్తిఁ**
బరఁగు; భూతము లెల్లఁ బశువులు దాఁ బతి । గావునఁ బశుపతి నా వెలుంగు;
వృషభస్థుఁడై యున్కి వృషవాహనుఁడు; మృత్యు । వనఁ జనుఁ బ్రాణ పాలాఖ్య సమత
నొంది; వహించు వేదోక్తాభిధానముల్ । మఱియుఁ బెక్కులు; వాని మహిమ వేద

ఆ. **వేత్త లైనవారు వివరించి యన్యోన్య । బోధకత్వమునఁ బ్రభూత సౌఖ్యు**
లగుచు సంతతము శివారామతా నిరూ । ఢాత్ములై చరింతు రధిపముఖ్య! **400**

ప్రతిపదార్థం: అధిపముఖ్య! = రాజులలో ఉత్తముడా!; బహునేత్రములు = అనేక నయనాలు, పెక్కు కన్నులు; మేనన్ = శరీరమందు; ప్రజ్వరిల్లుటన్ = వెలుగొందటం చేత; సర్వతః+చక్షుః+ఆహ్వయ+ఉదాత్తకీర్తిన్ = అంతటా కన్నులు గలవాడు అనే గొప్పయశస్సుతో; పరఁగున్ = ఒప్పుతున్నాడు; భూతములు+ఎల్లన్ = జీవులందరూ; పశువులు = జంతువులు, మృగాలు; తాన్ = అతడు; పతి+కావునన్ = ఆ జీవు లందరికి నాథుడు గనుక; పశుపతి నాన్ = పశుపతి అనే ఆహ్వాయంతో; వెలుంగున్ = ప్రకాశిస్తున్నాడు; వృషభస్థుఁడు+ఐ+ఉన్కిన్ = ఎద్దు మీద ఉండటం చేత; వృషవాహనుఁడు = నందివాహనుడు అని శంభునకు మరొక్క పేరు; మృత్యువు+అనన్+చనున్ = అతడు ప్రాణిదేహాలలో విషమస్థుడైనప్పుడు జీవులపాలిటికి మృత్యువు అని చెప్పదగి ఉన్నాడు; సమతన్+ఒంది = సమస్థితిని పొంది; ప్రాణపాల+ఆఖ్యన్+వహించున్ = ప్రాణపాలుడు (ప్రాణాలను కాపాడేవాడు) అనే నామం ధరిస్తున్నాడు. మఱియున్ = ఇంకనూ; వేద+ఉక్త+అభిధానముల్ = శ్రుతులందు చెప్పబడిన పేళ్ళు; పెక్కులు = అనేకములు ఆయనకు ఉన్నాయి; వాని మహిమన్ = ఆ నామముల యొక్క మాహాత్మ్యమును (ఆ చంద్రశేఖరుడి ప్రభావాన్ని); వేద వేత్తలు+ఐనవారు = వేదార్థము లెరింగినవారు; వివరించి = తేటపరచి; అన్యః+ అన్య+బోధకత్వమునన్ = ఒకరి కొకరు ఉపదేశించుకొంటూ, తెలియ జెప్పుకొనుచూ; ప్రభూత సౌఖ్యులు+అగుచున్ = అధికమైన సుఖం కలవా రవుతూ, మిక్కిలి సుఖవంతు లవుతూ; సంతతము = ఎల్లప్పుడు; శివ+ఆరామతా+నిరూఢ+ఆత్ములు+ఐ = శివుడి యందు క్రీడించుటచే వన్నెకెక్కిన మనసు గలవా రవుతూ; చరింతురు = మెలగుతుంటారు, వర్తిస్తూ ఉంటారు.

తాత్పర్యం: ధర్మజా! అనేక నయనాలు తన దేహంలో కలిగి వెలుగొందటం చేత పరమేశ్వరుడికి 'సర్వతశ్చక్షువు' అనే నామధేయం ఏర్పడింది. జీవు లెల్లరూ పశువులు. తాను ఆ పశువులకు పాలకుడు. కనుక ఆయనకు పశుపతి అనే నామం కలిగింది. నందినెక్కి సంచరించటం చేత అతడు వృషభవాహనుడు అనే పేరు పొందాడు. జీవుల ప్రాణాలు హరించేవాడూ, వారి ప్రాణాలను కాపాడేవాడూ అతడే. ఆగమాలలో ఆ మహనీయుడికి అనేక నామా లున్నవి. వాటి మహిమ వేదవేత్తలైన మహానుభావులు వివరంగా పరస్పరం బోధించుకొంటూ, పరమానందభరితు లవుతూ నిరంతరం శివుడియందే లగ్నమైన పావన మనస్సులతో సంచరిస్తూ ఉంటారు.

విశేషం: భగవద్భక్తు లెట్లా మనుగడ సాగిస్తారో శ్రీమద్భగవద్గీత వెల్లడిస్తుంది.

> "మచ్చిత్తా మద్గత ప్రాణా బోధయన్తః పరస్పరమ్,
> కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ." (భగ. 10-9)

నా భక్తులు నాయందే తమ మనసులను లగ్నం చేసి నన్ను వదలి బ్రతుకలేని వారై తాము అనుభవించిన నా కల్యాణగుణాలను, నా అవతార దివ్య చేష్టితాలను నిత్యం ఒకరి కొకరు బోధించుకొంటూ ఆనందిస్తుంటారు- అని.

క. ఈ నామనిర్వచనములు । మానవుఁడు పఠించినను సమాహితమతియై
వీనుల నించిన సౌఖ్యము । నానందము నిందు నందు నతనికిఁ గల్గున్.' 401

ప్రతిపదార్థం: ఈ నామనిర్వచనములు = ఈ శివనామముల యొక్క అర్థవివరణాలు; మానవుఁడు = నరుఁడు; పఠించినను = చదివినా; సమాహితమతి+ఐ = ఏకాగ్రచిత్తుడై, నిశ్చలమైన మనస్సు గలవాడై; వీనులన్ = చెవులలో; నించినన్ = నిండించినా, ప్రవేశింపజేసినా; సౌఖ్యమున్ = సుఖమునూ; ఆనందమున్ = సంతోషమునూ; ఇందున్ = ఈ లోకంలో; అందున్ = పరలోకంలో అనగా ఇక్కడా అక్కడా; అతనికిన్ = ఆ నరుడికి; కల్గున్ = లభిస్తుంది.

తాత్పర్యం: అర్థమననంతో పరమేశ్వరుడి నామాలు పఠించినా, ఏకాగ్రచిత్తంతో ఆకర్ణించినా ఆ మానవుడికి

ఇహపరలోకాలలో సుఖం, సంతోషం సమకూరుతాయి.

వ. అని చెప్పి మఱియును. 402

తాత్పర్యం: అని పలికి మరల (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'వ్యాసమహాముని లోక హి । తాసక్తిని శివుని విషయమై పఠ్యముగాఁ
జేసె నుపస్థాన మొకటి । యా సమధిక పుణ్యవాక్చయము విను మధిపా! 403

ప్రతిపదార్థం: అధిపా! = రాజా!; వ్యాస మహాముని = శ్రీ వేద వ్యాసమహర్షి; లోకహిత+ఆసక్తిని = జగములకు మేలు చేయవలెనన్న అభిలాషతో; శివుని విషయము+ఐ = ఈశ్వరుడికి సంబంధించి; పఠ్యముగాన్ = పఠించ దగినదిగా; ఉపస్థానము +ఒకటి+చేసెన్ = దరిజేర్చుస్తోత్ర మొకటి కావించాడు; ఆ సమధిక పుణ్యవాక్చయము = ఆ గొప్ప పవిత్ర వాక్కుల సముదాయం; వినుము = ఆలకించుము.

తాత్పర్యం: శ్రీ వేద వ్యాస మహర్షి లోకానికి మేలు గావించవలె నన్న ఆకాంక్షతో పరమ శివునకు సంబంధించి పఠించ దగిన ఒక గొప్ప స్తోత్రం రచించాడు. మిక్కిలి గొప్పవైన ఆ పవిత్ర వచనాలు వినిపిస్తాను. శ్రద్ధగా వినుము.

సీ. సర్వజగన్నిత్యసాక్షి లోకైక శు । భావహమూర్తి నిరామయుండు
ప్రథమ భూతములకుఁ బ్రథమతమంబు ను । దాత్తంబు నయిన భూతంబు శివుఁడు;
దన ముఖంబున నగ్ని జనియించెఁ, దను సభ । క్తిక సమారాధన కృతుల నియతిఁ
బాటించువారికి భవమోక్షణంబు గా । వించు, వేడుక మది నించువాఁడు

తే. వితత చతురాత్మకత్వ విశ్రుతి వహించి । కరుణఁ దత్తత్పదస్థిరా కలన కల్యు
లగు సపర్యారతులకు నయ్యై విధంబు । నీడ్య పదవుల నొసఁగు మహేశ్వరుండు. 404

ప్రతిపదార్థం: సర్వజగత్+నిత్య+సాక్షి = సకల లోకాలకు శాశ్వతుడైన సాక్షియు; లోక+ఏక+శుభ+ఆవహ మూర్తి = జగములకు ముఖ్యంగా శుభాలు కలిగించే స్వరూపం కలవాడూ; నిర్+ఆమయుండు (నిరామయుండు) = రోగ విహీనుడూ; ప్రథమభూతములకున్ = పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం అనే తొట్టతొలుతటి భూతములకు; ప్రథమ తమంబు = మొట్టమొదటిదీ; ఉదాత్తంబు+అయిన = దొడ్డదయిన; భూతంబు = ప్రాణి; శివుఁడు = పరమేశ్వరుడే; తన ముఖంబునన్ = తన యొక్క వదనమునందు; అగ్ని = అనలం; జనియించెన్ = పుట్టింది; తనున్ = గౌరీ వల్లభుడిని; సభక్తిక సమారాధన కృతులన్ = భక్తితో గూడిన పూజాకార్యములను; నియతిన్ = నియమంతో; పాటించువారికిన్ = కావించేవారికి; భవమోక్షణంబు = సంసారంనుండి విముక్తి, జన్మరాహిత్యము; కావించు వేడుకన్ = కలిగించే కుతూహలం; మదిన్ = మనస్సులో; నించువాఁడు = నిండించుకొనేవాడు అతడే; వితత = ఎక్కుడైన; చతుః+ఆత్మకత్వ+విశ్రుతిన్+వహించి = సదాశివాదికమైన నాలుగు స్వరూపాలతో ప్రఖ్యాతిగాంచి; మహేశ్వరుండు = భర్గుడు; కరుణన్ = దయతో; తత్+తత్+పద+ స్థిర+ఆకలన కల్యులు+అగు = ఆయాస్థానాలలో సుస్థిరముగనున్న శుభమూర్తులైన; సపర్యారతులకున్ = తన పూజలందు ఆసక్తి గలవారికి; అయ్యైవిధంబు = ఆయావిధాలైన; ఈడ్యపదవులన్ = పొగడదగిన అధికార స్థానాలను; ఒసఁగున్ = ఇస్తాడు.

తాత్పర్యం: సకల జగత్తులకు నిత్యసాక్షిగా ఉన్నవాడు, సర్వలోకాలకు శుభాలు కలిగించే స్వరూపం కలవాడూ, రోగ రహితుడు, ప్రథమభూతము లని చెప్పబడే భూమి మొదలైన పంచ మహాభూతాలకంటె ముందున్న దొడ్డ భూతం

శ్రీకంఠుడు. తనను నియమం వీడక భక్తితో ఆరాధించే వారికి సంసారవిముక్తి కలిగించవలెననే అభిలాష తన మనసులో నింపుకొని ఉంటాడు నీలగళుడు. సదాశివాది రూప చతుష్టయంతో విఖ్యాతుడైన ఆ మహేశ్వరుడు తనను పూజించటంలో ఆసక్తి గల సుస్థిరపదస్థులైన మంగళమూర్తులకు ఆయావిధాలైన కొనియాడదగిన ఉన్నత పదవులు అనుగ్రహిస్తాడు.

తే. **ఈ యుపస్థాన మచలిత హృదయవృత్తి । నరుఁడు శివలింగ సన్నిధానమున వాక్ని**
రూఢముగఁ జేసి యాయురారోగ్యసకల । కామ్యవైభవైశ్వర్యముల్ గలిగి నెగడు.' **405**

ప్రతిపదార్థం: ఈ+ఉపస్థానము = ఈ దరిజేర్చుస్తోత్రమును; అచలిత హృదయవృత్తిన్ = చలించని మనఃప్రవృత్తితో; నరుఁడు = మనుజుడు; శివలింగ సన్నిధానమునన్ = శివలింగము యొక్క సమక్షంలో; వాక్+నిరూఢముగన్+చేసి = వాక్ప్రసిద్ధముగ పఠించి; ఆయుః+ఆరోగ్య = ఆయుస్సు, ఆరోగ్యం; కామ్య = కోరదగిన; వైభవ+ఐశ్వర్యముల్ = గొప్పతనమూ, సంపద; కలిగి = పొంది; నెగడున్ = వర్ధిల్లగలడు.

తాత్పర్యం: ఈ స్తోత్రమును చలించని మనస్సుతో ఏ మానవుడు శివలింగ సన్నిధిలో వాగ్విధేయ మొనర్చునో ఆతడు ఆయుష్యం, ఆరోగ్యం, ప్రాభవం, సంపద కలిగి వర్ధిల్లగలడు.'

భీష్ముఁడు ధర్మజునకు ధర్మసూక్ష్మ ప్రకారంబు చెప్పుట. (సం.13-147-10).

వ. **అనిన విని యత్యంత సంతోషంబు నొంది కుంతీతనయాగ్రజుండు శాంతనవుతో 'ధర్మంబులు బహుప్రకారంబులు గలవు; పరమానుష్ఠేయంబగు ప్రకారం బెయ్యది? దాని నెఱింగింపవే' యనుటయు నజ్జనపతికి జాహ్నవీనందనుం డిట్లనియె.** **406**

ప్రతిపదార్థం: అనినన్; విని; అత్యంత సంతోషంబున్+ఒంది = మిక్కిలి హర్షమును పొంది; కుంతీతనయ+అగ్రజుండు = కుంతీదేవి కుమారులలో తొలుతపుట్టిన వాడైన ధర్మరాజు; శాంతనవుతోన్ = శంతనుమహారాజు కుమారుడైన భీష్ముడితో; ధర్మంబులు; బహుప్రకారంబులు = పలువిధాలు; కలవు; పరమ+అనుష్ఠేయంబు+అగు = ముఖ్యంగా ఆచరించదగిన; ప్రకారంబు = విధం; ఏ+అది(ఎయ్యది)? = ఏది?; దానిన్; ఎఱింగింపవు+ఏ? = తెలుపవా?; అనుటయున్ = అని అడుగగా; ఆ+జనపతికిన్ = ఆ నరనాథునకు-ధర్మజునకు; జాహ్నవీనందనుండు = జహ్నుమహర్షి కూతురైన గంగాదేవి యొక్క కొడుకు (భీష్ముడు); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కృష్ణుడు చెప్పగా మిక్కిలి సంతసించి ధర్మజుడు భీష్ముడితో 'ధర్మాలు పలువిధాలుగా ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా అనుష్ఠించదగిన ధర్మ మేదో తెల్పు' మని అడుగగా గంగానందనుడు ఆ నరపతితో ఇట్లా అన్నాడు.

ఆ. **ధర్మములకు సంజ్ఞ తద్వేదులగు మహా । త్ములు తగంగఁ జెప్పుదురు నరేంద్ర!**
వినుము కాలపాకమున నది యన్యథా । త్వంబు గలిగి యవిశదత్వ మొందు. **407**

ప్రతిపదార్థం: నర+ఇంద్ర! = రాజా!; ధర్మములకున్ = ధర్మాలకు; సంజ్ఞ = గురుతు; తత్+వేదులు+అగు = ఆ ధర్మం తెలిసిన వారైన; మహా+ఆత్ములు = మహనీయులు; తగంగన్ = యుక్తంగా, ఒప్పిదంగా; చెప్పుదురు = వచిస్తారు; వినుము = ఆలకించుము; కాలపాకమునన్ = కాలం యొక్క మార్పుచేత, కాలం గడువగా గడువగా; అది = ఆ ధర్మం;

అన్యథాత్వంబు+కలిగి = వేరొక తీరును పొంది; అవిశదత్వము+ఒందున్ = అస్పష్టతను చెందుతుంది.

తాత్పర్యం: 'ధర్మజా! ధర్మం ఇట్లాంటి దని ఆ ధర్మస్వరూపం తెలిసిన మహనీయులు మాత్రమే యుక్తంగా చెప్పగలరు. కాల పరిణామం వలన ధర్మం అందుకు భిన్నంగా గోచరిస్తుంది. స్పష్టతను కోల్పోయి మరుగున పడుతుంది.

వ. ఎ ట్లంటేని. 408

తాత్పర్యం: అదెట్లంటివా.

క. అనఘ! యధర్మము ధర్మం । బను మతిఁ బుట్టించుఁ దృణ సమావృతమై ప్ర
న్నని తలము చందమునఁ దోఁ । చిన నూయింబోలె సూక్ష్మచిత్తత లేమిన్. 409

ప్రతిపదార్థం: అనఘ! = పాపరహితుడా!; సూక్ష్మచిత్తత లేమిన్ = పరిశీలనాత్మకమైన సూక్ష్మబుద్ధి లేనందువలన; తృణసమావృతము+ఐ = గడ్డితో కప్పబడినదై; ప్రన్నని తలము చందమునన్ = మిట్టపల్లాలు లేని చక్కని సమప్రదేశంగా; తోఁచిన = స్ఫురించిన; నూయిన్+పోలెన్ = బావివలె, కూపం మాదిరిగా; అధర్మము = అన్యాయం; ధర్మంబు+అనుమతిన్ = న్యాయం అనే తలంపును; పుట్టించున్ = కలిగిస్తుంది.

తాత్పర్యం: పుణ్యపురుషా! పరిశీలనాత్మకమైన సూక్ష్మబుద్ధి లేనందున గడ్డితో కప్పబడిన బావి మిట్టపల్లాలు లేని చక్కని సమప్రదేశంగా తోచేటట్లు ఒక్కొకప్పుడు అధర్మం ధర్మమనే తలంపును కలిగిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. తప్పక కాన్పఁగ లేమిం । జెప్పెడు వారలును దద్విశేషము దప్పం
జెప్పఁగ ధర్మంబు తెరువు । దప్పు నది క్రియాపరులకు దైన్యము దెచ్చున్. 410

ప్రతిపదార్థం: తప్పక = మానక; కాన్పన్+కన్+లేమిన్ = ఇది ధర్మం, ఇది అధర్మం అని చూపలేక పోవటంవలన, గోచరించక పోవటం వలన; చెప్పెడు వారలును = ధర్మం బోధించేవారు కూడ; తత్+విశేషము = ఆ ధర్మం యొక్క ఘనత, ప్రత్యేకత, విలక్షణత్వం; తప్పన్ = తొలగేటట్లు; చెప్పన్+కన్ = తెలుపగా; ధర్మంబుతెరువు = ధర్మము యొక్క పద్ధతి; తప్పున్ = తప్పిపోతుంది; అది = ధర్మసూక్ష్మ మెరుంగని వారి బోధ; క్రియాపరులకున్ = కార్యాలు సల్పేవారికి; దైన్యమున్ = దుఃఖాన్ని; తెచ్చున్ = కలిగిస్తుంది.

తాత్పర్యం: ఇది ధర్మం ఇది అధర్మం అని సరిగా చూపలేక పోవటం వలన, ధర్మబోధ చేసేవారు ఆ ధర్మం యొక్క విలక్షణత్వం తొలగేటట్లు తెలపటం చేత ధర్మం దారితప్పుతుంది. ధర్మసూక్ష్మ మెరుంగని వారి బోధ విని కార్యాచరణకు పూనుకొనే వారికి కడకు దుఃఖమే సంభవిస్తుంది.

వ. కావున ధర్మంబు సూక్ష్మ ప్రకారంబు. 411

తాత్పర్యం: కనుక ధర్మం మిక్కిలి సూక్ష్మమైనది.

క. శ్రుతముఁ బరిత్యాగముఁ గల । మతిమంతుల నడుగు లోభమదమోహసమా
వృత బుద్ధులు గాని సమం । చిత చరితులవలనఁ దెలియు శీలనిరూఢా! 412

ప్రతిపదార్థం: శీలనిరూఢా! = సత్ప్రవర్తనచేత ప్రసిద్ధిగాంచిన ధర్మజా!; శ్రుతమున్ = పెద్దలవలన శాస్త్రముల వినికిడియూ; పరిత్యాగమున్ = వితరణమూ, ఈవీ; కల = కలిగినట్టి; మతిమంతులన్ = బుద్ధిమంతులను; అడుగు = ధర్మ మనగా ఎట్టిదో ప్రశ్నించుము; లోభ = దురాశ, పిసినిగొట్టుతనమూ; మద = గర్వమూ; మోహ = అజ్ఞానమూ, ధర్మ సమ్మూఢత్వమూ అనువానిచే; సమావృతబుద్ధులు = ఆవరించబడిన చిత్తం కలవారు; కాని = కానట్టి; సమంచితచరితుల వలనన్ = పూజించదగిన నడవడిగల మహనీయులవలన; తెలియు = గ్రహించుము.

తాత్పర్యం: మంచి స్వభావం గల ధర్మపుత్రా! పెద్దలవల్ల శాస్త్రముల వినికిడి, వితరణగుణము గల్గిన బుద్ధిమంతుల నడిగి ధర్మస్వరూప మెట్టిదో తెలిసికొమ్ము. దురాశ, దుర్గర్వం, మోహం అనే దుర్గుణాలతో ఆవరించబడిన మనసులుగల వారివలన కాకుండా పవిత్రచరిత్రుల వలననే ధర్మం ఎరుగవలసినది.

క. కామార్థంబులు మోహో । ద్దామత కృత్యంబు లని యెదం గని ధర్మ
స్తోమమునఁ దగులు జనముల । చే మేలుగ నెఱిఁగి కొనుము సిద్ధవివేకా! 413

ప్రతిపదార్థం: సిద్ధవివేకా! = ప్రసిద్ధమైన జ్ఞానం కలవాడా!; కామ+అర్థంబులు = పురుషార్థములలో కామం, అర్థం అనేవి; మోహ+ఉద్దామత+కృత్యంబులు+అని = అజ్ఞానం యొక్క స్వతంత్రకార్యాలని; ఎదన్ = హృదయంలో; కని = ఎరిగి; ధర్మస్తోమమునన్ = ధర్మముల యొక్క సమూహమందు; తగులు = సక్తులైన; జనములచేన్ = జనులచేత; మేలుగన్ = హితవుగా; ఎఱిఁగికొనుము = తెలిసికొమ్ము!

తాత్పర్యం: ప్రశస్తమైన జ్ఞానం గల ధర్మజా! కామము, అర్థమూ అనేవి మోహాతిరేకం వలన జరిగే కార్యాలని మదిలో నెరిగి, ధర్మమం దాసక్తిగల జనుల వలన హితవుగా ధర్మస్వరూపం గ్రహించుము.

తే. అనఘ! యంచిత స్వాధ్యాయమునను యజ్ఞ । మున సమాచారమున నిష్ఠ పొనుఁగుపడక
యుండు నెవ్వారలకు వార లోపి నడపు । నదియ కనుము ధర్మము సూక్ష్మపదము గాఁగ.' 414

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుడా!; అంచిత = ఒప్పిదమైన; స్వాధ్యాయమునను = వేదాధ్యయనమునందునూ; యజ్ఞమునన్ = యజ్ఞము లొనర్చుట యందును; సమాచారమునన్ = అనుష్ఠానమునందును, ప్రవర్తన అందునూ; నిష్ఠ = శ్రద్ధ, నమ్మిక, నిలుకడ; ఏ+వారలకున్ = ఎవ్వరికి; పొనుఁగు+పడక+ఉండున్ = క్షీణించక, మరుగుపడక ఉంటుందో; వారలు = అట్టివారు; ఓపి = నేర్పుతో, సమర్థులై; నడపు+అదియ = సాగించునట్టిదే; ధర్మము సూక్ష్మపదముగాఁగన్ = ధర్మము యొక్క సూక్ష్మంగా; కనుము = తెలియుము.

తాత్పర్యం: దోషరహితుడా! వేదాధ్యయనంలోనూ, యజ్ఞాలను నిర్వహించటంలోనూ, ఆచారంలోనూ శ్రద్ధ ఎవరికి నశించకుండా ఉంటుందో అట్టివారి ఆచరణ ధర్మ సూక్ష్మ మెరిగి చేసేదిగా గ్రహించుము.'

క. అన విని యుధిష్ఠిరుఁడు 'నా । మన మిప్పుడు మీరు సెప్పుమాటల సందే
హ నిరూఢ మయ్యె ధర్మము । గనుఁ గొన వలయుటకు బహుముఖత్వము కల్మిన్. 415

ప్రతిపదార్థం: అనన్; విని; యుధిష్ఠిరుఁడు = ధర్మజుడు; ధర్మము = ధర్మమును; కనుఁగొనవలయుటకున్ = తెలిసికొనటానికి; బహుముఖత్వము కల్మిన్ = అనేక మార్గాలుండటం చేత; నామనము = నా హృదయం; ఇప్పుడు, మీరు; చెప్పుమాటలన్ = వచించే వాక్యాలచేత, నుడివే నుడుగులచేత; సందేహ+నిరూఢము+అయ్యెన్ = సంశయాన్ని మొలకెత్తిస్తున్నది.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా ధర్మరాజు 'పితామహా! మీరు చెప్పే మాటలచేత ధర్మాన్ని తెలిసికొనటానికి మార్గా లనేకం ఉండటం చేత నామనస్సులో ధర్మవిషయమై సందేహపరంపరలు ఉదయిస్తున్నాయి.

క. పారంబు లేని ధర్మా । చారంబున మునుఁగు మాదృశ క్షుద్రులకుం
దీరం బిట్టిది యని తెలి । వార భవాదృశుల తగుదు రర్మిలిఁ జెప్పన్. 416

ప్రతిపదార్థం: పారంబు లేని = ఒడ్డులేని, దరిలేని; ధర్మ+ఆచారంబునన్ = ధర్మానుష్ఠానంలో; మునుఁగు = నిమగ్నులమైన; మాదృశ క్షుద్రులకున్ = మావంటి అల్పులకు; తీరంబు = గట్టు; ఇట్టిది+అని = ఇది అని; తెలివి+ఆరన్ = జ్ఞానముదయించేటట్లు; అర్మిలిన్ = ప్రేమతో, ప్రీతితో; చెప్పన్ = తెలపటానికి; భవాదృశులు+అ = తమవంటివారే; తగుదురు = యోగ్యులు.

తాత్పర్యం: దరిలేని ధర్మానుష్ఠాన సముద్రంలో మునిగి దరి గానక అల్లాడుతున్న మావంటి అల్పులకు ఈ ధర్మసాగరానికి తీర మిది యని సంతోషంతో తెలియ జెప్పడానికి మీవంటి మహాత్ములే తగిఉన్నారు.

తే. ఆగమోక్త విధంబుఁ బ్రత్యక్షమును స । మాచరణముఁ బృథగ్విధ వ్యాకులములు
ధర్మసూక్ష్మత యి మ్మూటఁ దథ్య మిట్టి । దనఁగ రాని యట్లున్నది యనఘచరిత! 417

ప్రతిపదార్థం: అనఘచరిత! = పుణ్యవర్తనుడవైన పితామహా!; ఆగమ+ఉక్త విధంబున్ = వేదమునందు చెప్పబడిన విధమును; ప్రత్యక్షమును = కంటికి కనిపిస్తున్నది, ఎదుటనున్నది, లోకానుభవం; ఆచరణమున్ = పెద్దలనుంచి పరంపరగా వస్తున్నవాడుక; పృథక్+విధ+వ్యాకులములు = వేర్వేరు తీరులతో కలగుండు పడుతున్నవి; ధర్మసూక్ష్మత = ధర్మస్వరూపం; ఈ+మూటన్ = ఆగమోక్తవిధం, ప్రత్యక్షం, ఆచరణం అనే మూటిలో; ఇట్టిది = ఇటువంటిది; తథ్యము = వాస్తవం, సత్యం; అనఁగన్+ రాని+అట్లు+ఉన్నది = అని చెప్పటానికి శక్యం కాకుండా ఉన్నది.

తాత్పర్యం: తాతా! ఆగమోక్తవిధం, ప్రత్యక్షం, ఆచరణ - అని ధర్మం భిన్న భిన్న రీతులతో కలగుండు పడుతున్నది. ఈ మూటిలో ధర్మసూక్ష్మత ఇద మిత్థ మని చెప్పటానికి వీలుకాకుండా ఉన్నది. పుణ్యవర్తనుడవైన నీవు ధర్మసూక్ష్మ మంటే ఎటువంటిదో నాకు తెలుప వలసినది-

వ. అనిన నాపగేయుండు కౌంతేయాగ్రజుతో ని ట్లనియె. 418

ప్రతిపదార్థం: అనినన్; ఆపగేయుండు = నదీనందనుడు-భీష్ముడు; కౌంతేయ+అగ్రజుతోన్= కుంతి కుమారులలో జ్యేష్ఠుడైన ధర్మజుడితో; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడి పలుకులు విని మందాకినీనందనుడైన భీష్ముడు కుంతీజ్యేష్ఠనందనుడైన ధర్మజుడితో ఈ ప్రకారం చెప్పాడు.

క. 'ఇవి మూఁడు దెఱంగులు ధ । ర్మువు సూక్ష్మత నిశ్చయింప ముఖ్యపదంబుల్
దివిరికొని యివియ చూచుట । యవనీశ్వర! పూర్వమునులయందుఁ గలుగుటన్. 419

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర! = భూనాథా!; ధర్మువు సూక్ష్మతన్ = ధర్మము యొక్క సూక్ష్మతను; నిశ్చయింపన్ = నిర్ణయించటానికి; తివిరికొని = పూనుకొని; ఇవియ = ఆగమోక్త విధానం, ప్రత్యక్షం, ఆచరణం అనే వాటినే; చూచుటన్ = దర్శించటం వలననూ; పూర్వమునుల అందున్ = మునుపటి మునీశ్వరుల అందునూ; కలుగుటన్ = ఈ పద్ధతుల అనుసరణం ఉండటం వలననూ; ఇవి మూఁడు తెఱంగులున్ = ఈ మూఁడు విధానాలే; ముఖ్యపదంబుల్ = ధర్మసూక్ష్మ నిర్ణయానికి ప్రధానమైన గుర్తులు.

తాత్పర్యం: 'ధర్మపుత్రా! ధర్మసూక్ష్మ నిర్ణయానికి ఆగమోక్తవిధం, ప్రత్యక్షం, సమాచరణం అనే ఈ మూడు విధానాలే తప్ప మరోదారి ఏదీ లేదు. పూర్వమునీంద్రులు సైతం ధర్మసూక్ష్మ నిర్ణయానికి ఆధారంగా వీటినే గై కొన్నారు.

క. అనుమానింపకు మంధుం । డును నిశ్శంకాత్ముఁడును జడుండును బోలన్
జననాథ! యేను బల్కెద । విని దృఢముగ నూఁదు మింక వేయును నేలా? 420

ప్రతిపదార్థం: జననాథ! = నరవరా!; ఏను పల్కెదన్ = నేను చెప్పుతాను; అంధుండును = గ్రుడ్డివాడును; నిస్+శంకా+ఆత్ముండును = పరమసంశయాత్ముడును; జడుండును = మందబుద్ధిగలవాడు, మూఢుడును; పోలన్ = వీరికి సరిపోలేటట్లు; అనుమానింపకుము = సందేహించవద్దు; విని = నా పలుకు లాలించి; దృఢముగన్ = గట్టిగా; ఊఁదుము = ప్రమాణంగా స్వీకరించుము, అవలంబించు; ఇంకన్ = ఇక; వేయును+ఏలా? = పలుమాట లెందుకు?

తాత్పర్యం: రాజా! గ్రుడ్డివాడు, సంశయాత్ముడు, మూఢుడు- వీరి వలె నీవు సందేహించవద్దు. ఈ ధర్మజిజ్ఞాస మాని నేను చెప్పేమాటలు విని, నా మాటలనే ప్రమాణాలుగా స్వీకరించి, వాటినే గట్టిగా అనుసరించుము. ఇక పలుమాటలతో నీకు పని లేదు సుమా!

క. విమలాత్మ! యహింసయు దా । నము సత్యముఁ గ్రోధవర్జనంబును విను ము
త్తమ ధర్మరాశి యిది ధ । ర్మమునకుఁ బరసీమ దీని మరుపుము మదికిన్. 421

ప్రతిపదార్థం: విమల+ఆత్మ! = ఓ నిర్మలచిత్తుడా!; వినుము = ఆలకించుము; అహింసయున్ = ప్రాణులను బాధించకుండటం; దానము = దానం చేయటం; సత్యమున్ = నిజం పలకటం; క్రోధవర్జనంబును = కోపం వదలటం; ఉత్తమ ధర్మరాశి = మేలైన ధర్మముల యొక్క ప్రోగు; ఇది = ఈ అహింసాదిక సద్గుణ సముదాయం; ధర్మమునకున్ = ధర్మానికి; పరసీమ = తుదిహద్దు; మదికిన్ = నీ మనస్సునకు; దీనిన్ = ఈ గుణరాశిని; మరుపుము = మరుగునట్లు చేయుము; అలవడేటట్లు చేయుము, వశపరచుము.

తాత్పర్యం: పరిశుద్ధమైన మనస్సుగల యుధిష్ఠిరా! అహింస, దానం, సత్యం, కోపరాహిత్యం అనేవి ఉత్తమ ధర్మాలు. ఈ గుణాలు ధర్మానికి పరమావధులు. కనుక నీ మనసు ఈ గుణాలను అనుసరించేటట్లు చేయవలసింది.

తే. బ్రాహ్మణారాధనమునఁ దత్పరుఁడ వగుము; । దక్కు మొండు విచారముల్ ధర్మపుత్త్ర!'
యనిన మానస మానంద మంద నాతఁ । డతని కతిభక్తి వందనం బాచరించి. 422

ప్రతిపదార్థం: ధర్మపుత్త్ర! = యముడి కుమారుడా! బ్రాహ్మణ+ఆరాధనమునన్ = విప్రులను పూజించటంలో; తత్పరుఁడవు+అగుము = ఆసక్తి కలవాడవు కమ్ము; ఒండు విచారముల్ = ఇతరచింతలు, ఆలోచనలు; తక్కుము = విడువుము, మానుము; అనినన్ = అని దేవవ్రతుడు (భీష్ముడు) చెప్పగా; అతఁడు = యుధిష్ఠిరుడు; మానసము = హృదయం; ఆనందము+అందన్ = సంతసం పొందగా; అతనికిన్ = భీష్ముడికి; అతి భక్తిన్ = మిక్కిలి భక్తితో; వందనంబు = నమస్కారం; ఆచరించి = చేసి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మపుత్త్రా! విప్రులను ఆరాధించటంలో ఆసక్తి వహించుము. అన్యచింతలు వదలిపెట్టుము'- అని భీష్ముడు పలికాడు. ధర్మజుడు మనసులో సంతోషించి ఆయనకు మిక్కిలి భక్తితో నమస్కరించాడు.

వ. **'ఎవ్వరు ధర్మంబునెడ నసూయ సేయుదు? రెవ్వరు దాని నుపాసింతు? రెఱింగింపుము. వారి వారి పొందుగతులును విన వలతుం జెప్పు' మనిన నప్పౌరవోత్తమునకు న ప్పురుషసత్తముం డిట్లనియె.** **423**

ప్రతిపదార్థం: ఎవ్వరు = ఏ మనుజులు; ధర్మంబు+ఎడన్ = ధర్మం పట్ల; అసూయ+చేయుదురు = దోషారోపణం చేస్తారో, ద్వేషిస్తారో; ఎవరు = ఏ నరులు; దానిన్ = ఆ ధర్మమును; ఉపాసింతురు = సేవిస్తారో, ఆచరిస్తారో; ఎఱింగింపుము = తెలుపుము; వారి వారి పొందు గతులును = ధర్మాన్ని నిరసించేవారు, దానిని సేవించేవారు పొందే స్థితి గతులను, పుణ్యాపాపాలను; వినన్ వలతున్ = వినవలెనని కోరుతున్నాను; చెప్పుము; అనినన్; ఆ+పౌరవ+ఉత్తమునకున్ = పురువంశంలో పుట్టిన వారిలో శ్రేష్ఠుడైన ఆ ధర్మపుత్త్రుడికి; ఆ+పురుష+సత్తముండు = ఆ మానవోత్తముడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఎవరు ధర్మాలపట్ల అసూయ వహిస్తారో, ఎవ్వరు వాటిని నమ్మి సేవిస్తారో ఆ ఇరుతెగల వారిని గూర్చి, వారికి కలిగే స్థితిగతులను గురించి తెల్పు' మని వేడగా ధర్మజునకు మహామానవుడు భీష్ముడిట్లా అన్నాడు.

సీ. **'వినుము రజస్తమో వికృతులఁ దగిలిన । మానసంబులు గల మానవులకుఁ**
గలుగు ధర్మద్వేషకలనంబు; వారలు । నరకవాసార్హులు ధరణినాథ!
సత్య పరాత్ములు సతతంబు ధర్మ ము । పాసింతు; రూర్ధ్వ లోకాధివాస
మునకు వా రుక్తులు; మునుమును పుట్టిన । సుతుఁడు ధర్మము పద్మజునకు దాని

తే. **పాక సంపద సుమతు లుపార్జితగ ను । పాసనము సేయుదురు తియ్యపంటి పరువ**
మాదరించి తదుపచార మాచరించు । వెరవుగల యట్టి జనముల విధము దోఁప.' **424**

ప్రతిపదార్థం: ధరణినాథ! = భూవల్లభా!; వినుము; రజః+తమః+వికృతులన్(రజస్తమోవికృతులన్) = రజోగుణము యొక్క, తమో గుణము యొక్క వికారములను; తగిలిన = పొందిన; మానసంబులు+కల = మనస్సులు కలిగిన; మానవులకున్ = నరులకు; ధర్మద్వేషకలనంబు = ధర్మమునందు విరోధమనే దోషం; కలుగున్ = సంభవిస్తుంది; వారలు = ఆ ధర్మ విరోధులు; నరకవాస+అర్హులు = నరకలోకంలో నివసించటానికి తగిన వారు; సత్యపర+ఆత్ములు = సత్యమందు ఆసక్తి గల మనసులు కలవారు; సతతంబున్ = ఎల్లప్పుడు; ధర్మమున్ = ధర్మాన్ని; ఉపాసింతురు = సేవిస్తారు; వారు = అట్లాంటి సత్యపరులు; ఊర్ధ్వలోక+అధివాసమునకున్ = స్వర్గభువనంలో నివాసంచెయ్యటానికి; ఉక్తులు = యోగ్యులు; పద్మజునకున్

= కమలము నుండి జన్మించిన బ్రహ్మదేవుడికి; మునుమును పుట్టిన = తొట్టతొలుత జనియించిన; సుతుఁడు = కుమారుడు; ధర్మము = ధర్మం; తియ్యపంటిపరువము = మధురమైన పండు యొక్క పక్వదశను; ఆదరించి = పాటించి, గమనించి; తత్+ఉపచారము+ఆచరించు = దానిని వాడుకొనే పద్ధతులనుసరించే; వెరవు+కల+అట్టి = ఉపాయమెరిగినట్టి; జనులవిధము+ తోఁపన్ = జనులతీరు గోచరించేటట్లు; సుమతులు = సుబుద్ధులు; దాని పాకసంపద = ధర్మము యొక్క పక్వస్థితి; ఉప+ఆర్జిత+కన్ = సంపాదిత అయ్యేటట్లు; ఉపాసనము+చేయుదురు = ఆ ధర్మాన్ని సేవిస్తారు.

తాత్పర్యం: 'ధర్మజా! శ్రద్ధగా వినుము. రజస్తమోగుణవికారం పొందిన మనసులుగల మనుష్యులు ధర్మం మీద పగబూనుతారు. అట్టివారికి నరక లోక నివాసమే గతి. సత్య వ్రతపరాయణులు నిరంతరం ధర్మమునే సేవిస్తారు. వారు స్వర్గలోకనివాససౌఖ్యానికి అర్హులు. ధర్మం బ్రహ్మదేవుడి ప్రథమపుత్రుడు. మధురఫలాలను భుజించటానికి ఉబలాటపడేజనులు దాని పరిపక్వస్థితిని ఎట్లా శ్రద్ధాసక్తులతో, ఆదర బుద్ధితో గమనిస్తూ ఎట్లా ఉపచారాలు చేస్తుంటారో ఆ విధంగానే మంచిబుద్ధికలవారు ధర్మాన్నే ఆశ్రయించి సేవిస్తుంటారు.'

వ. అనినం గౌంతేయాగ్రజుండు శాంతనవుతోడ 'సాధులు నసాధులు నన నెట్టివారు? చెప్పు' మనుటయు నమ్మహాత్ముం డి ట్లనియె. 425

ప్రతిపదార్థం: అనినన్; కౌంతేయ+అగ్రజుండు = కుంతీపుత్రులలో పెద్దవాడు, ధర్మజుడు; శాంతనవుతోడన్ = శంతను పుత్రుడైన భీష్ముడితో; సాధులు = సత్పురుషులు; అసాధులు = దుర్జనులు; అనన్; ఎట్టివారు; చెప్పుము; అనుటయున్ = అని ప్రశ్నించగా; ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డబుద్ధిగలవాడు- భీష్ముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముడి పల్కులు విని ధర్మజుడు ఆ మహనీయుడితో 'సాధువు లనగా ఎటువంటివారు? అసాధువు లనగా ఎటువంటివారు? చెప్పు' మని అడుగగా భీష్ము డిట్లా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మజునకు సాధ్వసాధుజనుల నిరూపించి చెప్పుట. (సం.13-148-8).

సీ. 'తమయంత నెఱుఁగరు ధర్మంబు సదుపదే । శముననుగాన రసాధుజనులు;
ధర్మబోధం బివ్విధంబులు రెంటను । గలిగెడువారు సాధులు; తదీయ
చరితంబు విను; విడువరు మలమూత్రంబు । లర్హంబు గానిచో నధిప! యతిథి
భోజనశిష్టాన్న భోజులు, దెరు విచ్చి । తగినవారలకుఁ బ్రదక్షిణముగ

తే. నరుగుదురు, నడపుదురు సత్యార్జవములు, । శరణు సొచ్చినఁ గాతురు, సురతగుప్తి
పరులు, నిజదారతృప్తులు, గురువినీతు, । లమలహృదయులు, సంతోష మారఁ గలరు.' 426

ప్రతిపదార్థం: అసాధుజనులు = సత్పురుషులు కానివారు, దుర్జనులు; ధర్మంబున్ = ధర్మమును; తమ+అంతన్ = తమకు తామే; ఎఱుఁగరు = తెలియలేరు; సత్+ఉపదేశమునను = పెద్దల యొక్క ఉపదేశం వలన కూడ; కానరు = తెలిసికొనరు, గ్రహించరు; ధర్మబోధంబు = ధర్మోపదేశం; ఈ+విధంబులు రెంటను = తమకు తాముగా గాని, పెద్దలవలనగాని; కలిగెడు వారు = పొందువారు; సాధులు = సజ్జనులు, సత్పురుషులు; తదీయచరితంబున్ = ఆ సత్పురుషుల యొక్క నడవడిని, ప్రవర్తనను; అధిప! = రాజా!; విను = వినుము; అర్హంబు+కానిచోన్ = యోగ్యంగాని తావులో; మలమూత్రంబులు; విడువరు; అతిథి భోజనశిష్ట = అతిథులు భుజించగా మిగిలిన; అన్న భోజులు = అన్నమును భుజించేవారు-సాధుజనులు; తగినవారలకున్

= అర్హులైనవారికి; తెరువు+ఇచ్చి = దారి వదలి; ప్రదక్షిణముగన్ = కుడివైపునకు తిరిగి; అరుగుదురు = వెళ్ళుతారు; సత్య+ఆర్జవములు = సత్యం, ఋజుత్వం (నిష్కాపట్యం); నడపుదురు = కొనసాగిస్తారు; శరణు+చొచ్చినన్ = కాపాడుమని ఆశ్రయిస్తే; కాతురు = రక్షిస్తారు; సురతగుప్తి పరులు = వారు రతి క్రీడ రహస్యంగా సల్పుతారు; నిజదారతృప్తులు = తమ భార్యలయందే సంతృప్తి చెందుతారు; గురువినీతులు = వారు తమగురువులకు విధేయులు; అమల హృదయులు = నిర్మల మనస్కులు; సంతోషము+ఆరన్+కలరు = ఎల్లప్పుడు సంతోషంతో హాయిగా ఉంటారు.

తాత్పర్యం: 'సాధువులు కానివారు ధర్మం తమంతట తాముగాగాని, పెద్దలవలనగాని తెలిసికొనరు. సత్పురుషులు ధార్మికజ్ఞానాన్ని తమంతట తాము గాను, గురువుల వలననూ ఆర్జిస్తారు. ధర్మజా! సత్పురుషుల చరిత్ర ఎటువంటిదో తెలుపుతాను శ్రద్ధతో వినుము. వారు మలమూత్రములను యోగ్యములైన ప్రదేశాలలో విడువరు. అతిథులు భుజించిన పిదప శేషించిన ఆహారాన్ని భుజిస్తారు. అర్హులైనవారికి దారి వదలి ప్రదక్షిణ మొనర్చి వెళ్ళుతారు. సత్యంగా, నిష్కపటంగా ప్రవర్తిస్తారు. శరణు జొచ్చినవారిని సంరక్షిస్తారు. స్త్రీ సంగమం బయటికి పొక్కనీయరు. రహస్యంగా ఉంచుతారు. తమ భార్యలతోనే సంతృప్తి చెందుతారు. గురువుల పట్ల అణకువ కలిగి ఉంటారు. వారు నిర్మల హృదయులు; నిత్యసంతోషులు.'

విశేషం: ధర్మిష్ఠులు (సత్పురుషులు) రాజమార్గాలలో, ఆవులనడుమ, ధాన్యం మధ్య మలమూత్ర విసర్జనం చెయ్యరు. అగ్నిని, వృషభమును, దేవుడిని, గోశాలను, బ్రాహ్మడిని, ధార్మికుడిని, ముసలివాడిని చూచినపుడు వారికి ప్రదక్షిణం చేస్తారు. ఇంకా వృద్ధులకు, భారవాహులకు, ఆడువారికి, బాలురకు, ఆతురులకు, బ్రాహ్మణులకు, గోవులకు, రాజులకు దారి వదులుతారు.

వ. అని వెండియు. 427

తాత్పర్యం: అని మరల.

తే. 'సాధు లింద్రియ విభ్రాంతి సంహరింతు, । రఘముఁ దెలిసి ప్రాయశ్చిత్త మాచరింతు,
రప్రకాశంబుగా ధర్మ మాచరింతు, । రఖిలభూతదయాళుత్వమారఁ గలరు.' 428

ప్రతిపదార్థం: సాధులు = సజ్జనులు; ఇంద్రియ విభ్రాంతిన్ = ఇంద్రియముల యొక్క తొట్రుపాటును, ఇంద్రియవ్యామోహమును; సంహరింతురు = నిర్మూలిస్తారు; అఘమున్ = పాపమును; తెలిసి = ఎరిగి; ప్రాయశ్చిత్తము+ఆచరింతురు = పాపమును పరిహరించే కర్మను కావిస్తారు; అప్రకాశంబుగాన్ = గుట్టుగా, రహస్యంగా, చాటుకొనకుండా; ధర్మము+ఆచరింతురు = ధర్మం సలుపుతారు; అఖిలభూత దయాళుత్వము+ఆరన్+కలరు = సమస్త ప్రాణుల మీద సంపూర్ణంగా కృపచూపుతారు.

తాత్పర్యం: 'సత్పురుషులు ఇంద్రియభ్రాంతిని నిర్మూలిస్తారు. చేసిన పాప మెరిగి ప్రాయశ్చిత్తం చేసికొంటారు. తమ పేరు ప్రకటించుకొనకుండా రహస్యంగా ధర్మం చేస్తారు. సమస్తభూతముల మీద దయా సంపూర్ణులై వెలుగొందుతారు.'

వ. అనిన విని యజాతశత్రుండు శంతనుపుత్త్రుతో నప్రయత్నులకు నర్థంబు సిద్ధించుట గలుగు; ధర్మపరులును నీతివిదులును నైన బలవంతులు బహుమార్గంబులగు సదుపాయంబుల నర్థంబు లాకాంక్షింప సిద్ధింపకుండెడుఁ; గొందఱకు సిద్ధించియు నవి భోగంబుల కుపయోగ్యంబులు గాకుండు; శిక్షలు పెద్ద లేకయుం గొన్ని చిత్తంబులందు విద్య లలవడు; శిక్షితులయ్యును నిర్విద్యు లగుటయుం గలుగుఁ; దేవుళ్ళ

నోసియుం బోట్లం బడియును గొందఱు చావరు; పూరి పుడుక దాఁకి బలాధికులు చచ్చుట చూచెద మిట్లు
గాఁ గతం బేమి? యెఱింగింపవే యనుటయు న మ్మహీపతి కమ్మహాత్ముం డి ట్లనియె. 429

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాత శత్రుండు = ధర్మజుడు; శంతను పుత్త్రుతోన్ = భీష్ముడితో; అప్రయత్నులకున్ = ఎట్టిప్రయత్నం లేని వారికి; అర్థంబు = ధనం; సిద్ధించుట+కలుగున్ = లభించటం సంభవిస్తుంది; ధర్మపరులును = ధర్మమునందు ఆసక్తి కలవారును; నీతివిదులును = నీతి నెరింగినవారును; ఐన బలవంతులు; బహుమార్గంబులు+అగు = పెక్కుదారులు గలిగిన; సత్+ఉపాయంబులన్ = మంచి ఉపాయాలచేత; అర్థంబులు = ధనములు; ఆకాంక్షింపన్ = కోరుతున్నా; సిద్ధింపక+ఉండెడున్ = లభించకుండా ఉంటాయి; కొందఱకున్ = కొంతమందికి; సిద్ధించియున్ = సమకూడికూడా, అవి = ఆ ధనములు; భోగంబులకున్; ఉపయోగ్యంబులు కాక+ఉండున్ = ఉపయోగపడకుండా పోతాయి; శిక్షలు = బోధలు; పెద్దలేకయున్ = ఎక్కువగా ఉండనప్పటికినీ; కొన్ని చిత్తములందున్ = కొందరి మనస్సులలో; విద్యలు = చదువులు; అలవడున్ = అబ్బుతాయి, సిద్ధిస్తాయి; శిక్షితులు+అయ్యును = బోధించబడిన వారైనప్పటికినీ; నిర్విద్యులు+అగుటయున్ = చదువురానివారు కావటం కూడ; కలుగున్ = జరుగుతుంది; తెవుళ్ళన్ = రోగాల వలన; నోసియున్ = నొచ్చియూ, బాధచెందికూడా; పోట్లన్ = దెబ్బలచేత, పొడుపులచేత; పడియును = నొచ్చికూడ; కొందరు; చావరు; పూరిపుడుక = గడ్డిపరక, గడ్డిపోచ; తాఁకి = గ్రుచ్చుకొని; బల+అధికులు = శక్తిసంపన్నులు; చచ్చుట = చావటం; చూచెదము = చూస్తున్నాము; ఇట్లుకాన్ = ఇట్లా జరగటానికి; కతంబు+ఏమి? = కారణమేమిటి?; ఎఱింగింపవు+ఏ = తెలుపవా?; అనుటయున్ = అని ధర్మరా జడుగగా; ఆ+మహీపతికిన్ = ఆ భూభర్తకు (ధర్మజునకు); ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డ మనసు గల భీష్ముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముడి పలుకులు విని ధర్మజుడు, 'తాతా! ఎట్టి ప్రయత్నం లేకుండానే కొందరికి డబ్బు వస్తుంది. ధర్మాత్ములు, నీతిమంతులు అయిన శక్తి సంపన్నులు ఎన్నో మార్గాలలో, ఎన్నో ఉపాయాలతో ధనం సంపాదించటానికి సర్వయత్నాలు చేసినప్పటికినీ వారి కది లభించదు. మరి కొంతమందికి సిరి సమకూడినా సుఖ మనుభవించటానికి ఉపయోగపడదు. గురుబోధ అంతగా లేకపోయినప్పటికీ కొందరికి సులువుగా చదువులు అబ్బుతాయి. కొందరికి అధ్యాపకులు ఎంత బోధించినా ఏ మాత్రం విద్యలు పట్టువడవు. రోగాలతో నొచ్చికూడ, కత్తిపోట్లకు, కఱ్ఱదెబ్బలకు గురి అయికూడ కొందరు చావరు. మరి కొంతమంది బలవంతులు గడ్డిపోచ గ్రుచ్చుకోగా కాలం చేస్తారు. ఇట్టివెన్నో వైపరీత్యాలను చూస్తున్నాము. ఇందుకు కారణ మేమిటో తెలుపవలసింది' అని అడిగిన అజాతశత్రువుకు ఆ భీష్ముడు ఇట్లా అన్నాడు.

శుభాశుభంబులు పూర్వ జన్మ కృత పుణ్యపాపంబులచేఁ గల్గునని చెప్పుట. (సం.13-149-10).

క. 'మొలవం బెట్టని యట్టిది । మొలచునె? తొలుమేని దానముల నానార్థం
బులు సిద్ధించుఁ బ్రయత్నం । బులు లేకయు; నింత నిజము భూపవరేణ్యా! 430

ప్రతిపదార్థం: భూపవరేణ్యా! రాజులలో ఉత్తముడా!; మొలవన్ = మొలచుటకు, చెట్టు చేమలు మొలకెత్తటానికి; పెట్టని+అట్టిది = నేలలో నాటని బీజం; మొలచును+ఎ? = పుట్టుతుందా? పుట్టదని భావం; తొలుమేని దానములన్ = పూర్వజన్మలో చేసిన దానాలచేత; నానా+అర్థంబులు = అనేక ప్రయోజనాలు; ప్రయత్నంబులు లేకయున్ = ఎట్టియత్నాలు చెయ్యకుండానే; సిద్ధించున్ = నెరవేరుతాయి; ఇంత నిజము = ఇది వాస్తవం.

తాత్పర్యం: 'రాజేంద్రా! నేలలో బీజం నాటకుండా మొక్క మొలుస్తుందా? మొలవనే మొలవదు. అట్లే ముందటి జన్మలో చేసిన దానాల వలననే ఎట్టి ప్రయత్నాలు లేకుండానే అన్ని ప్రయోజనాలు నెరవేరుతాయి. ఈ మాట నిజం.

తే. అలఘు తపములు దొలుమేనఁ గలిగెనేని । వెదకి కొనివచ్చు న న్నరు విపులభోగ
ములు పురాకృత వృద్ధసేవల ఫలించు । బుద్ధికలిమియు విద్యలఁ బొలుచుటయును. 431

ప్రతిపదార్థం: అలఘుతపములు = గొప్పతపస్సులు; తొలుమేనన్ = మునుపటి జన్మలో; కలిగెన్+ఏనిన్ = చేసి ఉన్నట్లయితే; ఆ+నరున్ = ఆ మానవుడిని; విపులభోగములు = విస్తారమైన సుఖాలు; వెదకి కొని వచ్చున్ = తాముగా వచ్చి ఆశ్రయిస్తాయి; పురాకృతవృద్ధసేవలన్ = మునుపు చేయబడిన పెద్దల శుశ్రూషవలన; బుద్ధికలిమియున్ = తెలివి కలగటం; విద్యలన్ = చదువులలో; పొలుచుటయున్ = ప్రకాశించటమూ; ఫలించున్ = సిద్ధిస్తాయి.

తాత్పర్యం: ముందటి జన్మలో ఘనతపస్సులు చేసి ఉన్నట్లయితే ఆ మనిషిని విస్తారమైన సుఖాలు వచ్చి వరిస్తాయి. పూర్వం చేసిన పెద్దల సేవ వలననే నరులకు తెలివితేటలు కలుగుతాయి. వారు చదువులలో రాణిస్తారు.

క. తొలుమేన నహింసారుచి । గలిగిన దీర్ఘాయు వొందుఁ గారణభూతం
బులు భూవర! యివి యీ గుణ । ములు లేమియ కీడులకును మూలం బరయన్. 432

ప్రతిపదార్థం: భూవర! = రాజా!; తొలుమేనన్ = మునుపటిపుట్టువులో; అహింసారుచి = అహింసయందు ప్రీతి; కలిగినన్ = ఉన్నట్లయితే; అతడు; దీర్ఘ+ఆయువున్+ఒందున్ = దీర్ఘాయుష్యమును పొందుతాడు; ఇవి = ఈ అహింసాదులు; కారణభూతంబులు = ఇందుకు హేతువులు; ఈ గుణములు లేమియ = ఈ సద్గుణాలు లేకుండటమే; అరయన్ = ఆలోచించగా; కీడులకున్ = ఆపదలకు, అనర్థాలకు; మూలంబు = హేతువు.

తాత్పర్యం: వెనుకటి జన్మలో అహింసయందు ఆసక్తి కలిగి ఉంటే అతడు ఈ జన్మలో దీర్ఘాయుష్మంతుడవుతాడు. యుధిష్ఠిరా! ఈ సద్గుణాలే ఇందుకు హేతువులు. ఇవి లేకుండటమే అన్ని అనర్థాలకు మూలం.

వ. కావున. 433

తాత్పర్యం: ధర్మజా! కనుక.

తే. వినుము దానంబుఁ దపమును వృద్ధసేవ । నము నహింసయు నియత కృత్యములు సర్వ
జనుల కి మ్మహాగుణములు మనమునందు । దృఢముగా నిల్పి నడపుము ధీరవర్య!' 434

ప్రతిపదార్థం: ధీరవర్య! = ధైర్యం కలవారిలో శ్రేష్ఠుడా!; వినుము = ఆలకించుము; దానంబున్ = వితరణ గుణం; తపమును = తపశ్చర్య; వృద్ధసేవనము = పెద్దలకు శుశ్రూష చేయటం; అహింసయున్ = ప్రాణులను బాధించకుండటం; సర్వజనులకున్ = సమస్తప్రజలకు; నియతకృత్యములు = విధిగా ఆచరించదగిన కార్యములు; ఈ+మహాగుణములు = ఈ గొప్పగుణాలను; దృఢముగాన్ = గట్టిగా; మనమునందున్ = మనస్సులో; నిల్పి = నిలుపుకొని; నడపుము = పనులు సాగించుము.

తాత్పర్యం: ధీరోత్తమా! వినుము. దానం, తపస్సు, పెద్దలను సేవించటం, ప్రాణులను హింసించకుండటం, అనేవి సమస్త జనులు విధిగా ఆచరించదగిన కార్యాలు. ఈ దొడ్డ గుణాలను గట్టిగా మనసులో నిలుపుకొని అనుష్ఠించవలసినది.'

వ. అని యుపదేశించి యాపగానందనుండు వెండియుఁ బాండవాగ్రజున కిట్లనియె. 435

తాత్పర్యం: అని బోధించి గంగానదీ పుత్రుడైన భీష్ముడు మళ్ళీ పాండు మహారాజు కుమారులలో జ్యేష్ఠుడైన ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

సీ. 'ఎప్పుడు ధర్మంబునెడ నాదరము గల । వానికిఁ గాలంబు దాన యిచ్చు
ధర్మతత్త్వ ప్రబోధముఁ బరిస్ఫుటముగాఁ; । గావున సుస్థిరభావశుద్ధి
సహిత తప శ్రుత స్నాన దాన జపంబు । లను దేవతా పూజలను నమోఘ
కాలుఁడై వర్తింపఁగా ధర్మయోగంబు । సమకూరు; ధర్మంబు సాధనత్వ

తే. మొంది చేయించికొని చెప్పఁ బొందు నిర్మ । లాత్మకుండు సంసార పారాత్మకంబు
సత్య మజరామరము బోధ నిత్య మచ్యు । తము పరానంద మగు నప్పదంబు ననఘ!' 436

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుడా!; ఎప్పుడున్ = నిరంతరం, అనవరతం; ధర్మంబు+ఎడన్ = ధర్మం పట్ల; ఆదరము+కలవానికిన్ = గౌరవమున్న మనిషికి, అభిలాషగలవాడికి; కాలంబు = కాలమే; ధర్మతత్త్వబోధము = ధర్మస్వరూపజ్ఞానం, ధర్మమిట్లాంటిదనే ఎరుక; పరిస్ఫుటముగాన్ = తేటతెల్లంగా, మిక్కిలి స్పష్టంగా, విశదంగా; తాను+అ = ఆ ధర్మమే; ఇచ్చున్ = కలుగజేస్తుంది, ప్రసాదిస్తుంది; కావునన్ = కనుక; సుస్థిర = నిశ్చలమైన; భావశుద్ధి సహిత = చిత్తశుద్ధితో కూడిన, హృదయనైర్మల్యంతో కూడిన; తపః = తపస్సుచేత; శ్రుత = ధర్మశాస్త్రాల వినికిడిచేత; స్నాన, దాన, జపంబులను = స్నానం, దానం, మంత్ర జపం అనువాటి చేత; దేవతా పూజలను = దైవములను ఆరాధించటంచేత; అమోఘకాలుండు+ఐ = వ్యర్థంగాని కాలం కలవాడై; సమయాన్ని వ్యర్థపరచక; వర్తింపఁగాన్ = ప్రవర్తిస్తే; ధర్మయోగంబు సమకూడున్ = అతడికి ధర్మంతో చేరిక కలుగుతుంది, ధర్మం సంప్రాప్తిస్తుంది; ధర్మంబు = ధర్మం; సాధనత్వము+ఒంది = ఉపకరణమై; చేయించుకొని = తన ప్రచారం చేయించుకొని; చెప్పన్ = స్వరూప జ్ఞానబోధ గావించగా; నిర్మల+ఆత్మకుండు = ఆ కల్మషరహితమైన మనస్సు కలవాడు, ఆపరిశుద్ధ హృదయుడు; సంసారపార+ ఆత్మకంబున్ = భవసాగరానికి ఆవలితీరమైనదీ; సత్యము = సత్యమైనది; అజర+అమరము = ముదిమి, వినాశం లేనిదీ; బోధనిత్యంబు = జ్ఞానంచేత శాశ్వతమైనదీ; అచ్యుతము = జారుపాటులేనిదీ, నాశంలేనిదీ; పర+ఆనందము = పరమానందరూపమైనదీ; అగు = అయినట్టి; ఆపదంబున్ = ఆ స్థానమును, ముక్తిని; పొందున్ = పొందగలడు.

తాత్పర్యం: 'ఎల్లప్పుడూ ధర్మమందు ఆసక్తిగల జనుడికి కాలమే ధర్మతత్త్వ స్వరూప జ్ఞానం స్పష్టంగా కలిగిస్తుంది. కనుక నిశ్చలమైన చిత్తశుద్ధితో తపస్సు, ధర్మశాస్త్రాలశ్రవణం, స్నానం, దానం, మంత్రజపం, దైవారాధనం కాలాన్ని వ్యర్థపుచ్చకుండా యథావిధిగా ఆచరిస్తుంటే అట్టివాడికి ధర్మం సంప్రాప్తిస్తుంది. ఆ ధర్మాన్నే తరణోపాయంగా గైకొని తాను ఆచరిస్తూ, ఇతరులచేత ఆచరింపజేస్తూ, బోధిస్తూ ఉంటే ఆ నిర్మల హృదయుడు సంసారమునకు

ఆవలి గట్టుగ ఉన్నట్టిది, సత్యమైనది, జరామరణాలకు దవ్వైనది, జ్ఞానపూర్ణమూ, వినాశరహితమూ పరమానందరూపమూ అయిన ముక్తిపదాన్ని పొందుతాడు.'

వ. అని నిర్దేశించి మఱియును. 437

తాత్పర్యం: అని నిర్ణయించి చెప్పి ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. 'కను వెలుంగు వేద వ్యాస మునివరుండు । నధిప! కృష్ణుండు నీకుఁ బరాయణంబు
చింత దిగఁ ద్రావి పాలింపు శాంతవృత్తిఁ । బ్రజల; సర్వంబునందును విజయి వగుము.' 438

ప్రతిపదార్థం: అధిప! = రాజా!; నీకున్ = నీకు; వేదవ్యాసమునివరుండు = మునిశ్రేష్ఠుడైన శ్రీవేదవ్యాసుడు; కనువెలుంగు = కంటికి వెలుతురు వంటివాడు, మార్గదర్శకుడు; కృష్ణుండు = శ్రీకృష్ణభగవానుడు; పరాయణంబు = అత్యంత ప్రియమైన ఆశ్రయస్థానం, నీకు దిక్కైన దేవుడు; చింత = విచారమును; దిగన్+త్రావి = వదలిపెట్టి; ప్రజలన్ = జనులను; శాంతవృత్తిన్ = మనోనిగ్రహంతో, మిక్కిలి చల్లగా; పాలింపు = ఏలుము; సర్వంబు+అందును = అన్ని విషయాలలో; విజయివి+అగుము = విజయం పొందుము.

తాత్పర్యం: 'ధర్మజా! నీకు వేదవ్యాసమహర్షి కంటికి వెలుగువంటివాడు. వాసుదేవుడు నీకు ఆరాధ్యదైవం. ఇక చింత వదలి ప్రజలను చల్లగా పరిపాలించుము, కార్యరంగములందు విజయం పొందుము.'

క. అని యిట్లుపదేశించిన । యనిమిషతటినీ తనూజు నతుల వచనమున్
విని మో మలరఁగఁ బులకలు । దనువున జాదుకొన నొప్పె ధర్మజుఁ డధిపా! 439

ప్రతిపదార్థం: అధిపా! = ఓ జనమేజయమహారాజా!; అని = అంటూ; ఇట్లు = ఈ ప్రకారం; ఉపదేశించిన = బోధించినట్టి; అనిమిషతటినీ తనూజు = దేవనదీపుత్రుడైన భీష్ముని యొక్క; అతులవచనముల్ = సాటిలేని మాటలు; విని = ఆలకించి; మోము = ముఖం; అలరఁగన్ = వికాసం చెందగా; పులకలు = గగుర్పాటు; తనువునన్ = శరీరమందు; జాదుకొనన్ = కలుగగా; ధర్మజుఁడు = ధర్మరాజు; ఒప్పెన్ = ప్రకాశించాడు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! ఈ విధంగా బోధించిన దివిజగంగా పుత్రుడైన భీష్ముడి సాటి లేని మాటలు ఆలకించగానే ధర్మపుత్రుడి ముఖం వికసించింది. గగుర్పాటు పొందిన శరీరంతో అతడు ప్రకాశించాడు.

సీ. అపుడు వీక్షించి సత్యవతీ సుతుండు శం । తనునందనునితోడ 'ధర్మజుండు
దెలివొందె భవదుప దేశామృతంబున; । ననుజులుఁ గృష్ణుండు నాప్తసకల
రాజన్యులును ధృతరాష్ట్రుండుఁ దానును । దగ ని న్నుపాసించి దయకుఁ బాత్ర
మయ్యెఁ; వీడ్కొలుపు మియ్యవనీశుఁ; దఱితోడఁ । గ్రమ్మఱ నితఁడు నీ కడకు వచ్చు

ఆ. వాఁడుగాక!' యనిన వాత్సల్యమున నార్ద్ర । మైన చూడ్కి న మ్మహాత్ముఁ డతనిఁ
జూచి 'పురికిఁ జనుము; శుభపరంపరలకు । భాజనంబ వగుము రాజముఖ్య!' 440

ప్రతిపదార్థం: అపుడు = ఆ వేళ; సత్యవతీసుతుండు = సత్యవతి కుమారుడైన వ్యాసమహర్షి; వీక్షించి = చూచి; శంతనునందనునితోడన్ = శంతను మహారాజు పుత్రుడైన భీష్ముడితో; భవత్+ఉపదేశ+అమృతంబునన్ = నీ బోధఅనెడు సుధారసంచేత; ధర్మజుండు; తెలివి+ఒందెన్ = జ్ఞానం పొందినాడు; అనుజులున్ = తోబుట్టువులును; కృష్ణుండున్; ఆప్త సకలరాజన్యులును = హితులైన సమస్తరాజులును, ధృతరాష్ట్రుండున్; తానును = తాను కూడ (ధర్మజుడు); తగన్ = చక్కగా; నిన్నున్; ఉపాసించి = కొలిచి; దయకున్ = నీకృపకు; పాత్రము+అయ్యెన్ = అర్హుడైనాడు; ఈ+అవనీ+ఈశున్ = ఈ భూపతిని; వీడ్కొలుపుము = సెలవిచ్చి పంపుము; తఱితోడన్ = సమయం రాగానే; క్రమ్మఱన్ = మరల; ఇతఁడు = ఈ ధర్మపుత్రుడు; నీ కడకున్ = నీ చెంతకు; వచ్చువాఁడుగాక = రాగలడు; అనినన్ = అని వ్యాసమహర్షి పలుకగా; ఆ+మహా+ఆత్ముఁడు = ఆ భీష్ముడు; వాత్సల్యమునన్ = వాత్సల్యరసంచేత; ఆర్ద్రము+ఐన+చూడ్కిన్ = తడిసిన చూపుచేత; అతనిన్ = ధర్మరాజును; చూచి; రాజముఖ్య= రాజులలో శ్రేష్ఠుడా; పురికిన్ = హస్తినకు; చనుము = వెళ్ళుము; శుభపరంపరలకున్ = శుభములయొక్క వరుసకు, సమూహమునకు; భాజనంబవు+అగుము = పాత్రుడవు కమ్ము.

తాత్పర్యం: అపుడు వ్యాసమహర్షి భీష్ముడిని చూచి, 'ధర్మజుడు నీ ఉపదేశసుధారసం తనివార గ్రోలి జ్ఞానఘనుడైనాడు. సోదరులు, వాసుదేవుడు, మిత్రులైన సమస్తరాజులు, ధృతరాష్ట్రుడు, తానూ చక్కగా నిన్ను సేవించి నీ కృపకు పాత్రమైనాడు. ఇక ఈతనికి సెలవిచ్చి హస్తినకు పంపుము. సమయానికి తిరిగి నీ దగ్గరకు రాగలడు' అని చెప్పాడు. భీష్ముడు వాత్సల్య రసంచేత తడిసిన చూపులతో ధర్మజుడిని వీక్షించి ఓ రాజశ్రేష్ఠుడా! నీవు పురమునకు వెళ్లుము. శుభ పరంపరలు పొందుము'.

భీష్ముఁడు ధర్మజు నూఱడించి కరిపురంబునకుఁ బంపుట. (సం.13-152-5).

వ. అని యనుజ్ఞ చేసి వెండియు. 441

తాత్పర్యం: అని సెల వొసంగి మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'నీ బుద్ధి ధర్మైకనిష్ఠ గావుతను; స । మగ్ర దక్షిణ బహుయజ్ఞములు య
యాతి చందమున శ్రద్ధాన్వితంబుగఁ జేయు; । రాజ ధర్మంబునఁ బ్రకృతి రంజ
నము నాచరింపు; చుట్టములును జెలులును । బండిన వృక్షంబుఁ బక్షి కులము
లెట్లట్ల నిన్నాశ్రయించి సుఖించువా; । రర్కుని యుత్తరాయణము వచ్చు

తే. టరసికొనియుండి నాకడ కరుగుదెమ్ము । పొమ్ము; తల్లియుఁ దమ్ములు భూవరుండు
నీవు సుఖులరై యుండుఁడు నృపవరేణ్య!' । యనుడు నానంద మొంది ధర్మాత్మజుండు. 442

ప్రతిపదార్థం: నృపవరేణ్య! = రాజులలో శ్రేష్ఠుడా!; నీ బుద్ధి = నీ మనస్సు; ధర్మ+ఏకనిష్ఠ+కావుతను = ధర్మమందు ముఖ్యంగా నిలుకడ కలది అగుగాక, కుదురుకొను గాక!; సమగ్ర దక్షిణ = అధిక దక్షిణలుగల; బహుయజ్ఞములు = అనేక యాగాలు; యయాతి చందమునన్ = యయాతి మహారాజువలె; శ్రద్ధా+అన్వితంబుగన్ = విశ్వాససహితంగా; చేయు = సల్పుము; రాజధర్మంబునన్ = రాజు అనుసరించవలసిన ధర్మంతో; ప్రకృతిరంజనము = ప్రజలను సంతోషపెట్టటం, అలరించటం; ఆచరింపుము = కావింపుము, చుట్టములును = బంధువులు; చెలులును = మిత్రులు; పండిన వృక్షంబున్ = ఫలించిన చెట్టును, పండ్ల చెట్టును; పక్షికులములు = పక్షులగుంపులు; ఎట్లు = ఏ విధంగా ఆశ్రయించుకొని ఉంటాయో; అట్లు+అ = ఆ రీతిగానే;

నిన్నున్ = నిన్ను; ఆశ్రయించి = ఆధారం చేసికొని; సుఖించువారు = సుఖంగా ఉంటారుగాక!; అర్కుని = సూర్యుడి యొక్క; ఉత్తర+అయనము+వచ్చుట = మకరరాశిలో ప్రవేశం జరగటం; అరసికొని+ఉండి = కనిపెట్టుకొని ఉండి; నాకడకున్ = నాదగ్గరకు; అరుగుదెమ్ము = రావలసినది; పొమ్ము = ఇపుడు పట్టణానికి వెళ్ళుము; తల్లియున్ = మీ జనని; తమ్ములున్ = నీ సోదరులు; భూవరుండున్ = రాజగు ధృతరాష్ట్రుడును; నీవున్ = నీవు; సుఖులరు+ఐ+ఉండుఁడు = సుఖంగా ఉండండి; అనుడున్ = అని భీష్ముడు చెప్పగా; ధర్మ+ఆత్మజుండు = ధర్మరాజు; ఆనందము+ఒంది = హర్షించి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'నరనాథోత్తమా! నీబుద్ధి ధర్మమందే నిశ్చలంగా నిలుచుగాక! యయాతిమహారాజు వలె భూరిదక్షిణ లిచ్చి అనేక యాగాలు శ్రద్ధావంతుడవై చేయవలసింది. రాజ ధర్మాన్ననుసరించి రాష్ట్రంలోని ప్రజలను సంతోషపెట్టుము. పండ్ల చెట్టును పక్షిసమూహం వలె నిన్నాశ్రయించుకొని ఉన్న నీ చుట్టాలు, నీ మిత్రులు సుఖింతురుగాక! సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన శుభకాలం కనిపెట్టుకొని ఉండి నా దగ్గరకు రావలసింది. ఇపుడు హస్తినాపురికి వెళ్ళుము. నీ తల్లీ, నీ తమ్ముళ్ళూ, నీ తండ్రి ధృతరాష్ట్రుడూ, నీవూ సుఖంగా ఉండండి' అని గాంగేయు డనగానే ధర్మజుడు ఆనందించి-

విశేషం: అలం: ఉపమ.

వ. **'అట్ల చేయువాఁడ' నని సవినయంబుగాఁ బలికి దేవవ్రతునకు దండప్రణామం బాచరించి యిట్లు వీడుకొని.** **443**

ప్రతిపదార్థం: అట్లు+అ = నీవు చెప్పిన విధంగానే; చేయువాఁడన్ = చేయగలను; అని; సవినయంబుగాన్ = అణకువతో కూడేటట్లు; పలికి; దేవవ్రతునకున్ = భీష్ముడికి; దండప్రణామంబు+ఆచరించి = కర్రవలె నేల వ్రాలి నమస్కరించి; ఇట్లు వీడుకొని = ఈ విధంగా భీష్ముడిని వదలి, పోయివచ్చెదనని విన్నవించి బయలుదేరి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'తమరు చెప్పినట్లుగానే నడుచుకొంటా' నని వినయంతో విన్నవించి భీష్ముడికి సాష్టాంగదండప్రణామం చేసి, 'వెళ్ళి వస్తా' నని చెప్పి సెలవు గైకొన్నాడు ధర్మరాజు.

క. **ముని లనుపఁగఁ గృష్ణాదులుఁ । జనుదేరఁగ నాత్మపురికిఁ జనియె ముదితులై**
జను లెదురు కొనఁగఁ బుణ్యాం । గనలును విప్రులును వచ్చి కని దీవనతోన్. **444**

ప్రతిపదార్థం: మునులు = మునీశ్వరులు; అనుపఁగన్ = పోయిరమ్మని పంపగా; కృష్ణ+ఆదులు = ముకుందుడు మున్నగువారు; చనుదేరఁగన్ = వెంటరాగా; ఆత్మపురికిన్ = తననగరానికి; చనియెన్ = ధర్మజుడు వెళ్ళాడు; ముదితులు+ఐ = సంతసించినవారై; జనులు = పురంలోని ప్రజలు; ఎదురుకొనఁగన్ = తనకు ఎదురుగా రాగా, ప్రత్యుత్థానం సల్పగా; పుణ్య+అంగనలును = ముత్తైదువలునూ; విప్రులును = భూసురులును; వచ్చి = చనుదెంచి, అరుదెంచి, తోతెంచి; కని = తనను వీక్షించి; దీవనతోన్ = ఆశీర్వాదంతో. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ధర్మజుడు మునీశ్వరులు తనను పోయి రమ్మని పంపగా వాసుదేవుడు మున్నగువారు వెంటరాగా తన నగరానికి వెళ్ళాడు. సంతోషంతో పురప్రజలు ఎదురుగా వచ్చారు. ముత్తైదువలు, బ్రాహ్మణులు వచ్చి తనను దర్శించి దీవనలతో.

క. సేసలు చల్లఁగ మహిమో । ద్భాసితుఁడై యిట్లు వోయి ధర్మజుఁడు నిజా
వాసంబు సొచ్చి గాంధా । రీసంభావన మొనర్చి ప్రియము దలిర్పన్. 445

ప్రతిపదార్థం: సేసలు చల్లఁగన్ = మంగళాక్షతలు తన శిరంపై చల్లగా; ధర్మజుడు; మహిమ+ఉద్భాసితుఁడు+ఐ = గొప్ప తనంతో, ప్రాభవంతో ప్రకాశిస్తున్నవాడై; ఇట్లుపోయి = ఈ ప్రకారంగా వెడలినవాడై; నిజ+ఆవాసంబు+చొచ్చి = తన ఇంటిలో, ప్రాసాదంలో, మందిరంలో, భవనంలో ప్రవేశించి; గాంధారీ సంభావనము+ఒనర్చి = గాంధారీదేవిని ఆదరించి, ఓదార్చి; ప్రియము+తలిర్పన్ = ప్రేమ చిగురింపగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: మంగళాక్షతలు తన శిరంపై చల్లుతుండగా ధర్మజుడు ప్రాభవంతో దీపిస్తూ బయలుదేరి పురికి విచ్చేసి తన భవనంలో ప్రవేశించాడు. ప్రవేశించగానే తొలుత గాంధారీదేవిని దర్శించి, ఆమె నూరడించాడు. ఆ తరువాత ప్రేమ చిగురింపగా.

ఆ. తల్లి కెఱఁగి ముదము ద్రౌపది కొనరించి । సకలపౌరజనుల జానపదుల
నెలమి యొలయ వీడుకొలిపి భూసురులకు । దానవిధుల సమ్మదం బొనర్చి. 446

ప్రతిపదార్థం: తల్లికిన్ = జనని అయిన కుంతీమహాదేవికి; ఎఱఁగి = నమస్కరించి; ద్రౌపదికిన్ = పాంచాలికి; ముదము = సంతోషం; ఒనరించి = కలిగించి; సకలపౌరజనులన్ = సమస్త పట్టణప్రజలను; జానపదులన్ = గ్రామవాసులను, పల్లెలలో నివసించే జనులనూ; ఎలమి = ప్రీతి; ఒలయన్ = జనింపగా, అతిశయించగా; వీడుకొలిపి = తనను దర్శింపవచ్చిన ఈ జనులందరిని పోయిరండని సాగనంపి; భూసురులకున్ = విప్రులకు; దానవిధులన్ = దానంచేయటం చేత; సమ్మదంబు+ఒనర్చి = సంతోషం సమకూర్చి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మజుడు తన తల్లి అయిన కుంతీ మహాదేవికి నమస్కరించాడు. ద్రౌపదీదేవికి సంతసం కలిగించాడు. తనను దర్శించవచ్చిన నగరవాసులను, పల్లీ వాసులను ఆనందంతో వెళ్ళిరండని సాగనంపి బ్రాహ్మణులను దాన, ధర్మాది విధులచే సంతోషపరిచాడు.

వ. విపతులైన సతులకు సమగ్రధనంబు లొసంగి, ధృతరాష్ట్రునిం బ్రభూత పూజా కరణంబునం బరితుష్టునిం జేసి. 447

ప్రతిపదార్థం: విపతులు+ఐన = భర్తలను కోల్పోయిన; సతులకున్ = స్త్రీలకు; సమగ్రధనంబులు+ఒసంగి = దండిగా విత్తమిచ్చి; ధృతరాష్ట్రునిన్; ప్రభూతపూజాకరణంబునన్ = అధికంగా పూజించటంచేత; సంతుష్టునిన్+చేసి = తృప్తిపరచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మజుడు మగలను పోగొట్టుకున్న మగువలకు అధికంగా ధనము లిచ్చాడు. ధృతరాష్ట్రుడిని మిక్కుటమైన పూజలచేత సంతృప్తిపరిచాడు.

తే. తమ్ములును గృష్ణుఁడును బ్రమోదమునఁ దేల । నమ్మహీశ్వరుఁ డపుడు రాజ్యాభిషేక
మంగళము నొందినట్లు నెమ్మదిఁ దలంచి । గట్టియైన యూఱట పెంపుఁ గాంచి పొలిచె. 448

ప్రతిపదార్థం: తమ్ములును = తోబుట్టువులైన భీమాదులు; కృష్ణుఁడును = మాధవుడునూ; ప్రమోదమునన్+తేలన్ = ఆనందంలో తేలియాడగా; ఆ+మహీ+ఈశ్వరుండు = ఆ భూవల్లభుడు - ధర్మరాజు; అపుడు = ఆ వేళ; రాజ్య+ అభిషేక+ మంగళమున్ = రాజ్యాభిషేక మనే శుభప్రయోజనాన్ని; ఒందిన+అట్లు = పొందినరీతిగా; నెమ్మదిన్+తలంచి = తన నిండు మదిలో భావించి; గట్టి+ఐన+ఊఱట+పెంపున్ = దృఢమైన విశ్రాంతి యొక్క ఆధిక్యమును; కాంచి = పొంది; పొలిచెన్ = స్వస్థచిత్తుడై శోభిల్లాడు.

తాత్పర్యం: తన తోబుట్టువులూ, గోవిందుడూ పరమానందభరితు లౌతూ ఉండగా ధర్మజుడు అపుడు రాజ్యాభిషేక శుభమును పొందిన వాడి వలె తన నిండు మదిలో భావించి మిక్కిలి విశ్రాంతి వహించి విరాజిల్లాడు.

వ. **అట్లు శోభిల్లి వారల నుచిత ప్రకార సమాచరణంబులకుం జన నియోగించి యభ్యంతర మందిరంబున కరిగె; న ట్లజాతశత్రుండు సమ్యగంగీకృత సామ్రాజ్యుం డయి జన సంపూజ్యం బగు చరితంబున సంప్రవర్తిలు చుండఁ బంచాశ ద్వాసరానంతరంబ వాసరపతి యుత్తరాయణగతుం డగుటయు. 449**

ప్రతిపదార్థం: అట్లు; శోభిల్లి = ప్రకాశించి; వారలన్ = తన తమ్ముళ్ళను; ఉచితప్రకార సమాచరణంబులకున్ = తగు విధములైన కార్యాచరణములకు; చనన్ = వెళ్లుటకు; నియోగించి = నియమించి; అభ్యంతరమందిరంబునకున్ = లోపలి సౌధంలోనికి; అరిగెన్ = వెళ్ళాడు; అట్లు = ఆ విధంగా; అజాతశత్రుండు = ధర్మజుడు; సమ్యక్+అంగీకృత సామ్రాజ్యుండు+అయి = చక్కగా సమ్మతించబడిన (స్వీకరించబడిన) సామ్రాజ్యం కలవాడై; జనసంపూజ్యంబు+అగు = ప్రజలచే పూజింపదగిన, గౌరవించదగిన; చరితంబునన్ = ప్రవర్తనతో; సంప్రవర్తిలుచున్+ఉండన్ = మెలగుతుండగా; పంచాశత్+వాసర+అనంతరంబు+అ = యాభైరోజుల తర్వాత; వాసరపతి = దినాధిపతి అయిన సూర్యుడు; ఉత్తర+అయన+గతుండు+అగుటయున్ = ఉత్తరాయణంలో ప్రవేశించినవాడుకాగా;

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు ప్రకాశిస్తూ తన తమ్ముళ్ళను తత్తత్ కాలోచితములైన పనుల నిర్వహణానికి నియమించి తాను లోపలి సౌధం లోనికి వెళ్ళాడు. ఆయన చక్కగా రాజ్య పరిపాలన బాధ్యతలు స్వీకరించి జనాదరణీయమైన ప్రవర్తనతో మెలగుతుండగా యాభై దినముల పిదప సూర్యభగవానుడు ఉత్తరాయణంలో ప్రవేశించాడు.

ధర్మజుఁడు కృష్ణాదులఁ దోడ్కొని భీష్ముని యొద్దకుం బోవుట. (సం.13-153-6).

సీ. **అ క్కౌరవేశ్వరుం డప్పుడు కదలి గాం । ధారిని ధృతరాష్ట్ర ధరణి విభుని**
గొంతిని మున్నిడుకొని కృష్ణుఁ దమ్మునిఁ । దన తమ్ములను విదురుని యుయుత్సు
సంజయులను గృపాచార్యధౌమ్యుల మంత్ర । కోవిదులగు యాజకులను దోడఁ
గొని వస్త్ర చందనాగురు పుష్ప ఫలఘృత । కుండముల్ వట్టించుకొని యనేక

తే. **రత్నములుఁ గాంచనంబుఁ దో రాఁగ నగ్ని । యంచితంబుగఁ దా సంఘటించి యోగ్య**
జన సమానీతముగఁ జేసి సకల పరిజ । నంబుఁ గొల్వ మహావిభవంబు మెఱయ. 450

ప్రతిపదార్థం: ఆ+కౌరవ+ఈశ్వరుండు = ఆ కురువంశ ప్రభువు - ధర్మజుడు; అప్పుడు = అపుడే; కదలి = బయలుదేరి; గాంధారినిన్; ధృతరాష్ట్ర ధరణివిభునిన్ = ధృతరాష్ట్ర మహీపతిని; గొంతినిన్ = కుంతీదేవిని; మున్ను+ఇడుకొని = ముందుంచుకొని; కృష్ణున్ = యదువల్లభుడిని; తమ్మునిన్ = ఆయన అనుజుడైన సాత్యకిని; తన తమ్ములను = తన తోబుట్టువులైన

భీమాదులను; విదురునిన్; యుయుత్సుసంజయులనున్ = ధృతరాష్ట్రుడి కుమారులలో బ్రతికిఉన్న యుయుత్సుడిని, సంజయుడిని; కృప+ఆచార్య ధౌమ్యులన్ = గురువైన కృపాచార్యుడిని, పురోహితుడైన ధౌమ్యుడిని; మంత్రకోవిదులు+అగు = మంత్రవిద్యలందు నిపుణులైన; యాజకులను = యజ్ఞములు చేయించగల ఋత్విక్కులను; తోడన్+కొని = తన వెంట బెట్టుకొని; వస్త్ర = నూతనములైన వస్త్రాలు; చందన = శ్రీగంధం, మంచిగంధపు కొయ్యలు; అగురు = అగురు అనే పరిమళద్రవ్యం, అగురు చెక్కలు; పుష్ప = పూలు; ఫల = పండ్లు; ఘృతకుండముల్ = నేతికడవలు; పట్టించుకొని = మోయించుకొని; అనేక రత్నములున్ = పెక్కు రత్నాలు, మాణిక్యాలు; కాంచనంబున్ = బంగారం; తోన్+రాఁగన్ = తన వెంబడి వస్తుండగా; అగ్ని = నిప్పు; అంచితంబుగన్ = ఒప్పిదంగా, పూజ్యంగా; తాన్ = తాను; సంఘటించి = సమకూర్చి; యోగ్యజన సమానీతముగన్+చేసి = అర్హులైన జనులచే చక్కగా కొనిరాబడుతున్నదిగా ఒనర్చి; సకలపరిజనంబున్ = సమస్త సేవక బృందం; కొల్వన్ = తనను సేవిస్తూ ఉండగా; మహావిభవంబు మెఱయన్ = గొప్ప వైభవం దీపించగా. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: కురువంశరాజులలో మేటి అయిన ధర్మజుడు గాంధారీధృతరాష్ట్రులను, కుంతీదేవిని ముందుంచుకొని శ్రీకృష్ణుడిని, ఆయన తమ్ముడు సాత్యకినీ, తన తమ్ములైన భీమాదులనూ, విదుర సంజయులనూ, ధృతరాష్ట్రుడి పుత్రులలో బ్రతికిఉన్న యుయుత్సుడిని, కృపాచార్యధౌమ్యులనూ, మంత్రవేత్తలైన ఋత్విక్కులనూ వెంటబెట్టుకొని బయలుదేరాడు. నూతన వస్త్రాలు, చందన కాష్ఠములు, అగరు చెక్కలు, పూలు, పండ్లు, నేతికుండలు మోసికొంటూ పరిజనులు వెంటనడిచారు. అనేక మణులు మాణిక్యాలు బంగారం ఆయన వెంట కదలి వచ్చాయి. పవిత్రాగ్నిని యోగ్యజనులు జాగరూకులై తీసికొని వస్తుండగా యుధిష్ఠిరుడు సేవక గణం తనను సేవిస్తుండగా మహా వైభవంతో విరాజిల్లుతూ.

వ. చని భీష్ముని వీరశయనస్థానంబున కనతి దూరంబునం దేరు డిగ్గినం గృష్ణాదులును రథావతరణంబులు చేసిరి; తానును వారును బారాశర్య నారద దేవల ప్రభృతి పరమసంయమి సముపాస్యమానుం డగు న మ్మాననీయుం జేర నరిగి ముని జనంబులకు వినతుం డయి తదభినందితుం డగుచు నా ధర్మనందనుం డయ్యమరనదీనందనునకు నభివందనం బాచరించి సమీచీనధ్యానతత్పరుండైన య ద్దేవవ్రతు నుద్దేశించి. **451**

ప్రతిపదార్థం: చని = వెళ్ళి; భీష్ముని వీరశయన స్థానంబునకున్ = వీరుడైన గాంగేయుడి పడుక ఉన్నచోటికి; అనతి దూరంబునన్ = చేరువలోనే; తేరు+డిగ్గినన్ = స్యందనం నుండి దిగిన వెంటనే; కృష్ణ+ఆదులును = శౌరి మొదలైనవారు; రథ+అవతరణంబులు చేసిరి = తమ తమ తేరుల నుంచి దిగారు; తానును = ధర్మజుడును; వారును = కృష్ణాదులును; పారాశర్య = పరాశర మునీంద్ర పుత్రుడైన వ్యాసుడు; నారద, దేవల ప్రభృతి = నారదుడు, దేవలుడు మొదలగు; పరమ సంయమి = మహామునులచే; సముపాస్యమానుండు+అగు= లెస్సగా సేవించబడుతున్న; ఆ+మాననీయున్ = ఆ గౌరవించదగిన భీష్ముడిని; ఆ ధర్మనందనుండు = ఆ ధర్మరాజు; చేరన్+అరిగి = చెంతకు వెళ్ళి; మునిజనంబులకున్ = యోగులకు; వినతుండు+అయి = నమస్కరించి; తత్+అభినందితుఁడు+అగుచున్ = వారిచే కొనియాడబడుతూ, సంతోషపరచబడినవాడై; ఆ+అమరనదీ నందనునకున్ = ఆ దేవనదీకుమారుడైన భీష్ముడికి; అభివందనంబు+ఆచరించి = ప్రణామం సమర్పించి; సమీచీన ధ్యాన తత్పరుండు+ఐన = ఉచితమైన ధ్యానంలో నిమగ్నుడైన; ఆ+దేవవ్రతున్+ఉద్దేశించి = ఆ భీష్ముడిని గురించి; ఆయన వైపు చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మరాజు మహావీరుడైన భీష్ముడు పరుండి ఉన్న ప్రదేశానికి సమీపంలో రథం దిగాడు. శ్రీకృష్ణుడు మొదలైన వారంతా తమతమ తేరులనుండి దిగారు. అజాతశత్రుడు వారితో కలసి వ్యాసుడు, నారదుడు, దేవలుడు మున్నగు మహర్షులచే సేవించబడుచున్న పూజార్హుడైన శాంతనవుడి చెంతకరిగి ముందు అక్కడి మునులకు నమస్కరించాడు. ఆ మౌనిపుంగవు లందరూ తనను కొనియాడగా పాండవాగ్రణి గంగాపుత్రుడికి ప్రణమిల్లి ధ్యాననిమగ్నుడైన ఆ మహామహు నుద్దేశించి.

తే. 'అనఘ! వచ్చితి ధర్మనందనుఁడఁ; బ్రణతి । యాచరించెద; నాపలు కవధరింప
నవసరంబేని విను సమయంబు వార్చి । యగ్ని మొదలుగఁ దేఁ దగు నట్టివాని. 452

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుడా!; ధర్మనందనుఁడన్ = నేను ధర్మపుత్రుడిని; వచ్చితిన్ = వచ్చాను; ప్రణతి+ఆచరించెదన్ = నమస్కారం చేస్తున్నాను; నా పలుకు = నా మాట; అవధరింపన్ = చిత్తగించటానికి; అవసరంబు+ఏని = అవసరమైతే, సమయం కుదిరితే; విను= ఆలకించవలసినది; సమయంబు వార్చి = ఉత్తరాయణ వేళ కొరకు నిరీక్షించి; అగ్ని మొదలుగన్ = దహనసంస్కారానికి కావలసిన అనలం మొదలుకొని; తేన్+తగు+అట్టివానిన్ = తీసికొనిరాదగినట్టి వస్తువులనెల్ల (తీసుక వచ్చానని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'పుణ్యపురుషా! నేను ధర్మజుడిని; వచ్చాను. నీకు నమస్కరిస్తున్నాను. అవసరమైతే నా మాటలు చిత్తగించ వలెనని వేడుతున్నాను. ఉత్తరాయణం రాగానే అగ్ని మొదలుగా తీసికొని రాదగిన వస్తువుల నెల్ల (తీసికొని వచ్చాను).

సీ. తెచ్చితి, ఋత్విజుల్ వచ్చిరి, హరియు నీ । తనయుఁడు ధృతరాష్ట్రుఁడును, సమస్త
బంధులుఁ గల మహీపతులు విప్రులుఁ బౌర । జనులు నేతెంచిరి సదయహృదయ!
వీరిఁ జూడుము కను విచ్చి' నావుడు నమ్మ । హాత్ముఁ డందఱఁ జూచి యా నృపాలు
కేలు దెమల్చుచు 'మేలు చేసితి దైవ । యోగంబు గాదె నీ వొదవు టరయ

ఆ. మనుజనాథ! మాఘమాసంబు శుక్ల ప । క్షంబు నామనమున సంప్రమోద
మావహిల్లఁ జేసె' నని యభినందించి । యతని కధిక హర్ష మావహించె. 453

ప్రతిపదార్థం: తెచ్చితిన్ = తీసికొని వచ్చాను; ఋత్విజుల్ = పురోహితులు; వచ్చిరి = వచ్చారు; హరియున్ = నారాయణుడును; నీ తనయుఁడు = నీ కుమారుడైన; ధృతరాష్ట్రుఁడును = ధృతరాష్ట్ర మహారాజును; సమస్త బంధులున్ = చుట్టాలందరును, కలమహీపతులున్ = ఉన్న రాజులు; విప్రులున్ = భూసురులు; పౌరజనులున్ = పురవాసులును; ఏతెంచిరి = వచ్చి ఉన్నారు; సదయహృదయ! = దయతో కూడిన మనసుగల పితామహా!; కనువిచ్చి = కన్నులు దెరచి; వీరిన్ = ఈ వచ్చినవారిని; చూడుము = కనుగొనుము; నావుడున్ = అని ధర్మజుడు వచింపగా; ఆ+మహా+ఆత్ముఁడు = ఆ గొప్ప మనసు గల భీష్ముడు; అందఱన్+చూచి = ఎల్లరినీ విలోకించి; ఆ నృపాలుకేలు = రాజైన ధర్మజుడి హస్తం; తెమల్చుచున్ = తన చేతితో పట్టుకొని కదలిస్తూ; మేలు చేసితి = ఉపకార మొనర్చావు; నీవు = నీవు; ఒదవుట = నాకు లభించటం; అరయన్ = ఆలోచించగా; దైవ యోగంబు+అ+కాదు+ఎ? = దైవము యొక్క తోడ్పాటు కాదా?; మనుజనాథ! = ధర్మజా!; మాఘమాసంబు+శుక్లపక్షంబు = మాఘమాసంలోని సితపక్షం; నామనమునన్ = నా హృదయంలో; సంప్రమోదము = మిక్కిలి ఆనందం; ఆవహిల్లన్+చేసెన్ = కలిగించింది; అని; అభినందించి = కొనియాడి; అతనికిన్ = ధర్మరాజుకు; అధికహర్షము = మిక్కుటమైన సంతోషం; ఆవహించెన్ = కలిగించాడు.

తాత్పర్యం: తాతా! తీసికొనిరాదగిన వస్తువు లన్నిటినీ తీసికొని వచ్చాను. మంత్రవేత్తలైన పురోహితులు వచ్చారు. శ్రీకృష్ణుడు, నీ కుమారుడైన ధృతరాష్ట్ర మహారాజు, చుట్టాలు. ఉన్న రాజులూ, బ్రాహ్మణులూ, పౌరులూ వచ్చి ఉన్నారు. ఓ కరుణామయహృదయుడా! వీరినందరినీ కనువిచ్చి చూడు' మని ధర్మజుడు వేడుకొన్నాడు. మహాత్ముడైన గాంగేయుడు వారి నందరిని కలయజూచి, ధర్మతనయుడి కరము తన కరముతో పెనవేసి కదలిస్తూ 'నరేశ్వరా! ఎంతో ఉపకారం చేశావు. నీవు నాకు దైవానుగ్రహం వలననే లభించావు. ఈ మాఘమాస శుక్ల పక్షం నామది కెంతో హర్షం సమకూర్చింది' అని ధర్మజుని కొనియాడి అతడికి అధికానందం చేకూర్చాడు.

వ. తదనంతరంబ ధృతరాష్ట్రునితో నిట్లనియె. 454

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ = ఆ తరువాత; ధృతరాష్ట్రునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ పిదప ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తే. 'వేదశాస్త్ర పరిజ్ఞాన వృద్ధసేవ । నములు గలిగి యశేషధర్మములు నెఱిఁగి
వ్యాసమునిపతి దేవరహస్య మర్థిఁ । జెప్ప విని నిష్కళంకత నొప్పి తనఘ! 455

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుఁడా!; వేదశాస్త్రపరిజ్ఞాన = వేదములందలి, శాస్త్రములందలి విశేషజ్ఞానం; వృద్ధసేవనములు = పెద్దల యొక్క శుశ్రూష; కలిగి = లభించి; అశేషధర్మములున్ = సమస్త ధర్మాలు; ఎఱిఁగి = తెలిసి; వ్యాసమునిపతి = మునీంద్రుడైన వ్యాసులవారు; దేవరహస్యము = దేవతలకు మాత్రమే తెలిసిన రహస్యాన్ని; అర్థిన్ = ప్రీతితో; చెప్పన్ = తెలుపగా; విని = ఆకర్ణించి; నిస్+కళంకతన్ = దోషరాహిత్యంతో, ఎట్టి దోషం లేక; ఒప్పితి = ప్రకాశించావు.

తాత్పర్యం: 'పుణ్యపురుషా! నీవు వేదశాస్త్ర విజ్ఞానం, పెద్దలసేవ కలిగిన వాడివి. అన్ని ధర్మాలు ఎరిగిన వాడివి; వేదవ్యాసమహర్షి ప్రీతితో దేవతలకు మాత్రమే ఎరుగదగిన రహస్యం ఎరిగించగా విని దోషరహితుడవై వెలుగొందుతున్నావు.

క. కావున భవితవ్యములకు । నీ వడలఁగ వలదు; పాండునృపపుత్త్రులు స
ద్భావమునఁ జూడ నేర్చిన । భూవర! తగ నీవు గన్న పుత్త్రులుగారే.! 456

ప్రతిపదార్థం: కావునన్ = కనుక; భవితవ్యములకున్ = జరుగనున్నవాటికై; నీవు; అడలఁగన్+వలదు = భయపడవద్దు; పాండు నృపపుత్త్రులు = పాండురాజు కొడుకులు; సద్+భావమునన్ = మంచితలంపుతో; చూడన్+నేర్చినన్ = నీవు చూడగలిగితే; భూవర! = ఓ రాజా!; తగన్ = యోగ్యంగా; నీవు = నీవు; కన్నపుత్రులు+కారు+ఏ = కనినట్టిబిడ్డలు కారా? కన్న కుమారులే అని భావం.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజా! జరుగనున్న వాటిని గూర్చి నీవు భయపడనక్కరలేదు. మంచితలంపుతో నీవు చూడ గలిగితే నీ తమ్ముడైన పాండురాజు కుమారులు నిజంగా నీకడుపున పుట్టిన బిడ్డలవంటి వారే కదా!

క. వీరిం బరిపాలింపుము; । వీరలశుశ్రూషఁ జిత్త వృత్తి ముదమునం
గూరఁగ ధర్మసుతునిపైఁ । గారుణ్యము గలిగి పనులు గఱపుము నెమ్మిన్. 457

ప్రతిపదార్థం: వీరిన్ = పాండునందనులను; పరిపాలింపుము = కాపాడుము; వీరలశుశ్రూషన్ = వీరిసేవవలన; చిత్తవృత్తి = మనోవ్యాపారం; ముదమునన్ = సంతోషంతో; కూరఁగన్ = నిండగా; ధర్మసుతునిపైన్ = ధర్మపుత్రుడి మీద; కారుణ్యము = కృప; కలిగి = కల్గినవాడవై; నెమ్మిన్ = ప్రీతితో; పనులు+కఱపుము = కర్తవ్యములు బోధింపుము, రాచకార్యముల నెరిగింపుము-

తాత్పర్యం: రాజా! పాండవులను పరిపాలించుము. వీరి సేవలవలన నీ హృదయం ఆహ్లాదంతో నిండగా, ధర్మజుడిపై కృప చూపుము. ప్రీతితో ఇతడికి కర్తవ్యబోధ కావింపుము.

తే. ఏ నెఱుంగుదు నితఁడు నీయెడఁ బ్రియంబు । భక్తియును గల్గి యక్రూరభావుఁ డగుట
నీవు వత్సలత్వమున నీ నృపతిఁ బంచి । పనులు గొనుము కౌరవకుల భారధుర్య! 458

ప్రతిపదార్థం: కౌరవకుల భారధుర్య! = కౌరవవంశ భారమును మోసేవాడా!; ఇతఁడు = ధర్మరాజు; నీ+ఎడన్ = నీ విషయంలో; ప్రియంబు = ప్రేమ; భక్తియును+కల్గి = భక్తియును కలిగి; అక్రూరభావుఁడు+అగుటన్ = క్రూరస్వభావం, కఠినస్వభావం లేనివాడు కావటం; ఏను = నేను; ఎఱుంగుదున్ = తెలియుదును; నీవు = నీవు; వత్సలత్వమునన్ = వాత్సల్యంతో; ఈ నృపతిన్ = ఈ రాజును; పంచి = ఆజ్ఞాపించి; పనులు+కొనుము = సేవలు చేయించుకొమ్ము.

తాత్పర్యం: కురువంశ భారమును వహించే ధృతరాష్ట్రా! ధర్మజుడు నీయెడ ప్రేమ, భక్తి కలవాడని నాకు తెలుసు. ఇతడు కఠిన స్వభావం కలవాడు కాడు. నీవు వాత్సల్యంతో ఈ నృపతిని చూచుకొమ్ము. ఆజ్ఞాపించి ఇతడిచేత సేవలు చేయించుకొమ్ము!

క. విను నీతనయులు దుర్యో । ధనాదు లవినీతిపరు లధర్మజ్ఞులు క్రో
ధను లతిలుబ్ధులు వారల । మనమున నిడి వగవ వలదు మనుజాధీశా!' 459

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా! = నరేశ్వరా!; విను = నా పలుకు లాలకించుము; నీ తనయులు = నీ కుమారులైన; దుర్యోధన+ ఆదులు = దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైనవారు; అవినీతిపరులు = నీతి మాలినవారు; అధర్మజ్ఞులు = ధర్మమెరుంగనివారు; క్రోధనులు = కోప స్వభావులు; అతిలుబ్ధులు = మిక్కిలి దురాశాపరులు; వారలన్ = ఇట్టి వారిని; మనమునన్+ఇడి = మనసులో నిలుపుకొని; వగవన్+వలదు = దుఃఖించవద్దు.

తాత్పర్యం: రాజా! నీ కుమారులు దుర్యోధనుడు మున్నగువారు నీతిమాలిన వాళ్ళు. ధర్మవిహీనులు, కోప స్వభావులు, పరమ దురాశాపరులు; ఇట్లాంటివాళ్ళను మనస్సులో నిలుపుకొని దుఃఖించవద్దు.'

వ. అని పలికి కృష్ణు నాలోకించి. 460

తాత్పర్యం: అని వచించి శ్రీకృష్ణుడిని వీక్షించి. (తరువాతి పద్యంతో అన్వయం)

భీష్ముఁడు శరీరంబు విడుచుటకు శ్రీకృష్ణు ననుజ్ఞఁ గొనుట. (సం.13-153-36).

తే. 'దేవదేవ! జీవాత్మక! దేవవంద్య! । శంఖ చక్ర గదా పద్మ చారుహస్త!
వాసుదేవ! త్రివిక్రమ! వరద! పరమ । పురుష! ప్రణతి యొనర్చెదఁ గరుణఁ జూడు.' 461

ప్రతిపదార్థం: దేవదేవ! = దేవతలకు పతియైనవాడా!; దేవనాయకా! జీవ+ఆత్మక! = జీవస్వరూపుడా, జీవులలో అంతర్యామిగా ఉన్న వాడా!; దేవవంద్య = వేల్పులచేత నమస్కరించబడేవాడా, కొనియాడబడేవాడా!; శంఖచక్రగదాపద్మచారుహస్త = పాంచజన్యమనే శంఖం, సుదర్శన మనే చక్రం, కౌమోదకి అనే గద, పద్మం- అనేవాటిచే సుందరమైన చేతులు కలవాడా!; వాసుదేవ = వసుదేవుడి కుమారుడా!; త్రివిక్రమ = బలిని దానమడిగి ముజ్జగాలు ఆక్రమించినవాడా!; వరద! = భక్తులకు వరములిచ్చేవాడా!; పరమ పురుష! = పురుషులలో ఉత్తమపురుషుడా! పురుషోత్తమా!; ప్రణతి+ఒనర్చెదన్ = నిన్ను స్తోత్రం చేస్తాను; కరుణన్ = కృపతో; చూడు = కనుగొనుము.

తాత్పర్యం: 'దేవదేవా! జీవాత్మకా! వేల్పులచేత నమస్కరించబడేవాడా! శంఖం, చక్రం, గద, పద్మం అనునవి హస్తములందు ధరించినవాడా! వసుదేవనందనా! త్రివిక్రమావతార! పురుషోత్తమా! నిన్ను స్తోత్రం చేస్తున్నాను. నన్ను దయతో చూడుము.'

వ. అనుచు నమస్కరించి. 462

తాత్పర్యం: అని పలుకుతూ నమస్కారం చేసి.

ఆ. 'బలము నీవ నాకు, భక్తుండ నీయెడ, । నాలుబిడ్డ లేని యట్టివాఁడఁ,
గావు నన్ను నధిక కారుణ్యమున నిమ్ము । నుజ్ఞఁ గమలదళమనోజ్ఞనయన!' 463

ప్రతిపదార్థం: కమలదళ మనోజ్ఞనయన! = తామర రేకులవలె అందమైన కన్నులుకలవాడా!; నాకున్ = నాకు; బలము = శక్తి; నీవు+అ = నీవే; నీ+ఎడన్ = నీ విషయంలో; భక్తుండన్ = భక్తుడిని; ఆలు = భార్య; బిడ్డ = చూలు; లేని+అట్టి వాఁడన్ = లేనటు వంటి వాడిని; అధిక కారుణ్యమునన్ = మిక్కిలిదయతో; నన్నున్ = నన్ను; కావు = రక్షించుము; అనుజ్ఞన్+ ఇమ్ము = నేను వెళ్ళటానికి ఉత్తరువు ఒసంగుము.

తాత్పర్యం: 'పద్మపత్రాల వంటి సుందరనేత్రాలు కలవాడా! నాకు నీవే బలం. నేను నీ భక్తుడిని. ఆలూ, చూలూ లేనివాడిని. నన్ను పరమకృపతో పరిరక్షించుము. శరీరయాత్ర ముగించటానికి సెలవియ్యవలసింది.'

వ. అని వెండియు. 464

తాత్పర్యం: అని మరల. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'మాధవ! పాండుకుమార వర్గమునకు । గతి నీవ; రక్షింపు కరుణ మెఱయ;
దుర్బుద్ధియైన యా దుర్యోధనుని తోడఁ । గృష్ణుఁ డెక్కడ నుండు గెలుపు గలుగు

నక్కడి కంటి నేఁ బెక్కుమాఱులు; నట్లు । చెప్పఁగా నా పంపు సేయ కతఁడు

దమవారి నెల్లను సమయించి తానును । సమసె; ని న్నెఱుఁగుదు; నమిత మహిమ

తే. నరుఁడు నారాయణుఁడు నను పరమమునులు । జగము రక్షించుటకుఁ గేలి జన్మ మొంది

సంచరించెద రని పరాశరసుతుండు । నారదుండును జెప్పిరి నాకుఁ దొల్లి.' 465

ప్రతిపదార్థం: మాధవ! = లక్ష్మీనాయకా!; పాండు కుమార వర్గమునకున్ = పాండురాజు యొక్క సుతసమూహానికి; గతి = దిక్కు; నీవు+అ = నీవేనయ్యా!; కరుణమెఱయన్ = కృప వెలయగా; రక్షింపు = వారిని కాపాడుము; దుర్బుద్ధి+ఐన = చెడుబుద్ధి గలవాడైన; ఆ+దుర్యోధనుని తోడన్ = ఆ సుయోధనుడితో; నేన్ = నేను; పెక్కుమాఱులు = పలుసారులు; కృష్ణుఁడు+ఎక్కడన్+ ఉండున్ = శ్రీకృష్ణుడు ఏ పక్షంలో ఉంటాడో; అక్కడికిన్ = ఆ పక్షానికి; గెలుపు+కలుగున్+అంటిన్ = విజయం లభిస్తుందని చెప్పాను; అట్లు చెప్పఁగాన్ = అట్లా చెప్పినప్పటికినీ; నా పంపు+చేయక = నా ఆజ్ఞ ననుసరించక; అతఁడు = ఆ సుయోధనుడు; తమవారిన్; ఎల్లనున్ = అందరినీ; సమయించి = చంపి; తానును+సమసెన్ = తాను కూడ మరణించాడు; నిన్నున్+ఎఱుఁగుదున్ = నీ వెవరో తెలిసికొన్నాను; అమిత మహిమన్ = మిక్కిలి ప్రభావంతో; నరుఁడు = నరుడు; నారాయణుఁడు = నారాయణుడు; అను = అనే పేరులు గల; పరమమునులు = గొప్ప మునీశ్వరులు; జగము రక్షించుటకున్ = లోకాన్ని కాపాడటానికే; కేలిజన్మము+ఒంది = వినోదించుటకు జన్మము లెత్తి, లీలామానుష విగ్రహులై; సంచరించెదరు+అని = విహరిస్తున్నారు, మెలగుతున్నారు అని; పరాశరసుతుండు = పరాశరమహర్షి తనయుడైన, శ్రీ వేదవ్యాసమహర్షి; నారదుండును = బ్రహ్మమానసపుత్రుడైన నారదమహర్షియు; నాకున్ = నాకు; తొల్లి = మునుపు, పూర్వం; చెప్పిరి = తెలిపి ఉన్నారు.

తాత్పర్యం: 'రమావల్లభా! పాండునందనులకు నీవే దిక్కు. వారిని కరుణతో కాపాడుము. దుష్టబుద్ధి అయిన దుర్యోధనుడితో 'కృష్ణుడు ఏ పక్షంలో ఉంటాడో ఆ పక్షమునకు విజయం తథ్య' మని పలుమారు నేను చెప్పాను. పాండవులతో కలసి మెలసి ఉండుమని నేను చెప్పిన మాటలు అతడు వినక యుద్ధ మొనర్చి తమవారినందరిని మరణం పాలుచేసి తుదకు తానుగూడ మరణించాడు. కేశవా! నిన్ను నే నెరుగుదును. మహా మహిమతో నరుడు, నారాయణుడు అనే పరమఋషులు లోక సంరక్షణార్థం లీలామానుష వేషధారులై శ్రీకృష్ణార్జునులుగా చరిస్తున్నారని పరాశరమహర్షి నందనుడైన వ్యాసులవారూ, బ్రహ్మమానసపుత్రుడైన నారదులవారూ నాకు మునుపే చెప్పి ఉన్నారు.'

వ. అనిన విని వాసుదేవుండు దేవవ్రతు వదనం బత్యాదరంబున నాలోకించి. 466

ప్రతిపదార్థం: అనినన్; విని; వాసుదేవుండు; దేవవ్రతువదనంబు = భీష్ముడి ముఖం; అతి+ఆదరంబునన్ = మిక్కిలి మన్ననతో; ఆలోకించి = చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: భీష్ముడి పలుకులు విని శ్రీకృష్ణుడు మిక్కిలి ఆదరంతో ఆయన ముఖం చూచి (ఇట్లా అన్నాడు)

ఆ. 'కీ డొకప్డు లేదు, కృతపుణ్యుఁ డవు, తండ్రి । వలని భక్తి పెంపు గలవు; దానఁ
గాదె బంటుఁ బోలె గాంగేయ! మృత్యువు । నీవశమున నిలిచె నిర్భరముగ. 467

ప్రతిపదార్థం: గాంగేయ! = గంగానందనా!; ఒకప్డు = ఏనాడున్నూ; కీడు = నీ వలన దోషం; లేదు = లేదు; కృతపుణ్యుఁడవు = పుణ్యములు సల్పినట్టివాడివి; తండ్రి వలని = నీ జనకుడియందు; భక్తి పెంపు+కలవు = అమితభక్తి కలిగినట్టివాడవు. దానన్+కాదు+ఎ = ఆ కారణం చేతనే కదా!; బంటున్+పోలెన్ = సేవకుడి వలె; మృత్యువు = మిత్తి; నీ వశమునన్ = నీ అధీనంలో; నిర్భరముగన్+నిలిచెన్ = పూర్తిగా నిలిచింది.

తాత్పర్యం: 'గంగాపుత్రా! నీ వలన ఏనాడూ దోషం లేదు. నీవు పరమ పుణ్యాత్ముడివి. తండ్రియందు మిక్కిలి భక్తి గలవాడివి. కనుకనే బంటువలె అడుగులకు మడుగు లొత్తుతూ మృత్యువు నీ అధీనంలో నిలిచింది.

భీష్ముఁడు శరీరంబు విడిచి నాకలోకగతుం డగుట. (సం.13-153-46).

వ. నీకు నే ననుజ్ఞ యిచ్చితి వసువులం బొందు' మనినం బరమానందంబునం బొంది పాండునందనులను ధృతరాష్ట్రునిం దక్కటి వారలనుం గనుంగొని 'మీచేత ననుజ్ఞాతుండన కదా' యని పలికి, యందఱం గౌఁగిలించుకొని 'యానృశంస్యంబును సత్యంబును నిత్యంబులుగాఁ బాటించి బ్రదుకుం' డని చెప్పి, తాను దొల్లి రాజుల గెల్చి తెచ్చిన ధనంబులు విప్రజనంబుల కిచ్చి, ధర్మతనయుం జూచి 'యెల్ల బ్రాహ్మణులునుం బూజనీయులు; ఋత్విజులు నాచార్యులు వృద్ధులు విశేషించి పూజింప వలయువా' రని నిర్దేశించి యూరకుండి, ధారణానుక్రమంబున సమాహితాత్ముం డయి వాయువుల సన్నిరుద్ధంబు చేసిన నవి యూర్ధ్వగతిం గైకొనియె; నమ్మహాత్ముం డవయవంబులం బ్రాణంబులు వాపికొనుచు వచ్చునయ్యె చోట్లు శల్యరహితంబు లగుచుండె; నట్లగుటం గాంచి కృష్ణాదులగు నఖిలజనంబులు నాశ్చర్యభరితాంతఃకరణు లగుచుఁ గీర్తించి; రా సంయమచతురునిచే సర్వాయతన సన్నిరుద్ధంబై యాత్మ మూర్ధంబు భేదించి మహోల్కాకారంబున నాకసంబున కెగసి కొంతద వ్వరిగి యంత నంతర్హితం బయ్యె; నప్పుడు పుష్పవృష్టి గురిసె, దేవ దుందుభులు మొరసె, నంబరంబున సిద్ధులు సాధ్యులుం బొగడుచుం బ్రమోదంబు నొంది; రిట్లు దేవవ్రతుండు దివంబునకుం జనుటయు. 468

ప్రతిపదార్థం: నీకున్; నేను; అనుజ్ఞ = అనుమతి, సెలవు; ఇచ్చితిన్; వసువులన్ = వసువులనెడు దేవగణమును; పొందుము = చేరుము, కలియుము; అనినన్; పరమ+ఆనందంబునన్+పొంది = మిక్కిలి సంతోషం చెంది; పాండునందనులను = పాండురాజు కుమారులను; ధృతరాష్ట్రునిన్; తక్కటి వారలనున్ = మిగిలిన వారిని; కనుంగొని = చూచి; మీ చేతన్; అనుజ్ఞాతుండను+అ+కదా? = అనుమతించబడినవాడనే గదా?; అని; పలికి; అందఱన్ = ఎల్లరను; కౌఁగిలించుకొని; ఆనృశంస్యంబును = క్రూరత్వం లేకుండుటనూ, అహింసనూ; సత్యంబును = సత్యం పలుకుటనూ; నిత్యంబులుగాన్ = శాశ్వతములుగా; పాటించి = అనుసరించి; బ్రదుకుండు = జీవించండి; అని చెప్పి; తాను; తొల్లి = పూర్వం; రాజులన్; గెల్చి; తెచ్చిన ధనంబులు; విప్రజనంబులకున్ = బ్రాహ్మణసమూహానికి; ఇచ్చి; ధర్మతనయున్+చూచి; ఎల్లబ్రాహ్మణులునున్ =

విప్రులందరూ; పూజనీయులు = పూజించదగినవారు; ఋత్విజులు = యజ్ఞం చేయించే బ్రాహ్మణులు; ఆచార్యులు = గురువులు; వృద్ధులు = ముసలివారు; విశేషించి = ముఖ్యంగా; పూజింపన్ వలయువారు = పూజించదగినవారు; అని; నిర్దేశించి = నిర్ణయంగా చెప్పి; ఊరకుండి = మాట లుడిగి, మాటలు మాని, మిన్నకుండి; ధారణా+అనుక్రమంబునన్ = యోగధారణచేత; సమాహిత+ఆత్ముండు+అయి = నిశ్చలమైన మనస్సు కలవాడయి; వాయువులన్ = ప్రాణాపానాది వాయువులను; సన్నిరుద్ధంబు చేసినన్ = చక్కగా అడ్డగించగా; అవి = ఆ ప్రాణాపానాదివాయువులు; ఊర్ధ్వగతిన్+కైకొనియెన్ = ఊర్ధ్వగమనాన్ని పొందాయి; ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డ మనస్సు గల భీష్ముడు; అవయవంబులన్ = శరీరావయవములందు; ప్రాణంబులు = ప్రాణాలను; పాపి కొనుచున్ = తొలగించుకొంటూ; వచ్చు+అయ్యైచోట్లు = వచ్చునట్టి ఆయా ప్రదేశాలు; శల్యరహితంబులు+ అగుచున్ = శల్యములు లేని వవుతూ; ఉండెన్ = ఉండినవి; అట్లు+అగుటన్ = అట్లాకావటం; కాంచి = చూచి; కృష్ణ+ఆదులు+అగు = శ్రీకృష్ణుడు మొదలైన; అఖిలజనంబులు = ప్రజలందరూ; ఆశ్చర్యభరిత+అంతఃకరణులు+అగుచున్ = అద్భుతరసంతో నిండిన మనస్సులు కలవా రవుతూ; కీర్తించిరి = మెచ్చారు; ఆ+సంయమచతురునిచేన్ = ఇంద్రియనిగ్రహమందు నేర్పరి అయిన భీష్ముడిచే; సర్వ+ఆయతన సన్నిరుద్ధంబు+ఐ = అన్ని అవయవ ద్వారముల యందునూ అడ్డగించబడినదై; ఆత్మ = జీవుడు; మూర్ధంబు = శీర్షం, తల, కపాలం; భేదించి = చీల్చుకొని; మహా+ఉల్కా+ఆకారంబునన్ = గొప్ప అగ్ని కణము యొక్క రూపంతో, గొప్పదివిటీ రూపంతో; ఆకసంబునకున్ = నింగికి; ఎగసి; కొంతదవ్వు = కొంతదూరం; అరిగి = వెళ్ళి; అంతన్ = ఆ పిదప; అంతర్హితంబు+అయ్యెన్ = మాయమయింది; అప్పుడు = ఆ సమయాన; పుష్పవృష్టి = పూలవాన; కురిసెన్; దేవదుందుభులు = వేల్పుల నగారాలు; మొరసెన్ = మ్రోగినవి; అంబరంబునన్ = గగనంలో; సిద్ధులున్, సాధ్యులున్ = ఆ పేరుగల దేవజాతివారు; పొగడుచున్ = భీష్ముడిని శ్లాఘిస్తూ; ప్రమోదంబున్+ఒందిరి = సంతోషించారు; దేవవ్రతుఁడు = భీష్ముడు; దివంబునకున్ = స్వర్గానికి; చనుటయున్ = వెళ్ళగా.

తాత్పర్యం: 'గంగానందనా! వెళ్ళుటకు నిన్ను అనుమతిస్తున్నాను. నీ తోటివారైన వసువులను నీవు కలిసికొమ్ము' అని వాసుదేవుడు పలుకగా భీష్ముడు పరమానందభరితుడయ్యాడు. పాండవులను, ధృతరాష్ట్రుడిని, తక్కిన వారిని చూచి 'మీచేత అనుమతించబడ్డానుగదా!' అని పలికి వారందరినీ కౌగిలించుకొన్నాడు. 'అక్రూరులై, సత్య వచనులై మీరు జీవితం గడపండి' అని వచించి ఆ మహాపురుషుడు పూర్వం తాను రాజులను జయించి తెచ్చిన ధనరాసులను బ్రాహ్మణుల కిచ్చి ధర్మరాజును జూచి 'వత్సా! బ్రాహ్మణు లందరూ పూజ్యులు. వారిలోనూ ముఖ్యంగా ఋత్విక్కులు, గురువులు, వృద్ధులు ఆరాధించదగినవారు' అని గట్టిగా నుడివి మౌనం వహించాడు. యోగధారణచే చిత్తమును నిగ్రహించి ప్రాణాపానాదివాయువుల సంచారాన్ని అడ్డగించగా అవి ఊర్ధ్వముఖంగా పయనించి మూర్ధమును చేరాయి. అపు డా మహనీయుడు ఒక్కొక్క అవయవమునుండి ప్రాణములను తొలగించుకొంటూ రాగా రాగా ఆ స్థానములన్నీ శల్యరహితా లయినాయి. ఇట్లా జరగటం చూచి మధుసూదనుడు మున్నగు సకల జనుల హృదయాలు పరమాశ్చర్యభరితా లయ్యాయి. వారందరూ భీష్ముడిని మిక్కిలి కొనియాడారు. ఇంద్రియాలను అరికట్టటంలో మిగుల సమర్థుడైన భీష్ముడిచే అన్ని అవయవద్వారాల నుండి అడ్డగించబడిన అతడి ఆత్మ శిరస్సు భేదించుకొని గొప్ప అగ్నికణం వలె కనిపిస్తూ మింటికెగసి కొంతదూరం వెళ్ళి ఆ తరువాత అంతర్ధాన మయింది. అపుడు దేవతలు పూలవాన కురిపించారు, నగారాలు మ్రోగించారు. సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతివారు భీష్ముడిని శ్లాఘిస్తూ హర్షించారు. ఆ విధంగా ఆ మహనీయుడు శరీరం విడిచి స్వర్గం చేరిపోయాడు.

పరలోకగతుండైన భీష్మునకు నగ్నిసంస్కారంబు చేయుట. (సం.13-154-8.)

సీ. ధర్మపుత్త్రుండును దమ్ములు విదుర యు । యుత్సులు నగరు కాష్ఠోత్కరంబుఁ
జందన దారు సంచయమును గొని సమ । స్థలి సమంచిత చితి యలఘు భంగి
విరచించి; రయ్యుధిష్ఠిరుఁడును ధృతరాష్ట్రుఁ । డును న మ్మరున్నదీ తనయు పుణ్య
గాత్రంబు సుస్నాన కలితంబు విహితాను । లేపంబుఁ బుష్పదామోపశోభి

తే. తంబు నుత్తమ క్షౌమావృతంబు నుజ్జ్వ । లాభరణ భూషితంబుఁగా నధికభక్తిఁ
జేసి; రప్పుడు సామంబు సెలఁగ హోమ । మాచరించిరి యాజకు లగ్నీ యలర. 469

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుండును; తమ్ములున్; విదుర యుయుత్సులున్ = విదురుడును, యుయుత్సుడును; అగరుకాష్ఠ+ ఉత్కరంబున్ = అగరు చెక్కల యొక్క మొత్తమును; చందనదారు సంచయమును = చందనపు కొయ్యల యొక్క మొత్తమును; కొని = తీసికొని; సమస్థలిన్ = మిట్ట పల్లాలు లేని చదునైన తావులో; సమంచితచితి = ఒప్పిదమైన సొద; అలఘుభంగిన్ = ఘనమైన రీతిలో; విరచించిరి = పేర్చిపెట్టారు; ఆ+యుధిష్ఠిరుఁడును = ఆ ధర్మజుడు; ధృతరాష్ట్రుడును; ఆ+మరుత్+నదీతనయు = ఆ దేవనదీ పుత్త్రుడైన భీష్ముడి యొక్క; పుణ్యగాత్రంబున్ = పావనశరీరాన్ని; సుస్నానకలితంబున్ = మంత్రయుక్తమైన చక్కని స్నానంతో కూడినదిగాను; విహిత+అనులేపంబున్ = తగిన మైపూతలు గలదిగానూ; పుష్పదామ = పూలదండలచే; ఉపశోభితంబున్ = శోభింపజేయబడినదిగానూ; ఉత్తమక్షౌమ+ఆవృతంబున్ = మేలైన పట్టు వస్త్రములచే ఆవరించబడినదిగానూ; ఉజ్జ్వల = ప్రకాశిస్తున్న; ఆభరణ+భూషితంబున్+కాన్ = సొమ్ములచే అలంకరించ బడినదిగానూ; అధికభక్తిన్ = మిక్కిలి భక్తితో; చేసిరి = ఒనర్చిరి; అప్పుడు = ఆ సమయమందు; సామంబు+చెలఁగన్ = సామవేద మంత్రపఠనం అతిశయించగా; యాజకులు = ఋత్విక్కులు; అగ్ని+అలరన్ = అగ్నిహోత్రుడు ఆనందించగా; హోమము+ఆచరించిరి = హోమం చేశారు.

తాత్పర్యం: ధర్మరాజు, అయన తమ్ములు, విదురుడు, యుయుత్సుడు అగరు చందన కాష్ఠాలతో చదునైన ప్రదేశంలో చితిని కడుగొప్పగా పేర్చారు. మిక్కిలి భక్తితో ధర్మజుడు ధృతరాష్ట్రుడు గంగానదీ నందనుడి పవిత్రగాత్రాన్ని స్నానం చేయించారు. ఒడలికి చందనం పూశారు. మేలైన పట్టువస్త్రం చుట్టి పూలదండలతో, మెరిసే ఆభరణాలతో అలంకరించారు. అపుడు సామవేద పఠనం జరిగింది. పురోహితులు అగ్నిదేవుడు హర్షించే టట్లు హోమం చేశారు.

క. కనకములు మణులు భూసుర । జనసం ఘంబున కజాతశత్రుఁడు శ్రద్ధా
వినయప్రీతి యుతంబుగ । ననేకములు వేడ్క నొసఁగె నవహిత మతియై. 470

ప్రతిపదార్థం: అజాతశత్రుఁడు = ధర్మరాజు; అవహితమతి+ఐ = సావధానచిత్తుడై; కనకములు = బంగారం; మణులు = రత్నాలు, మాణిక్యాలు; భూసురజనసంఘంబునకున్ = బ్రాహ్మణసమాజానికి; శ్రద్ధావినయప్రీతియుతంబుగన్ = విశ్వాసమూ, అణకువ, సంతోషం అనే గుణాలతో కూడిన వాడై; అనేకములు = పెక్కులు; వేడ్కన్+ఒసఁగెన్ = ప్రీతితో ఇచ్చాడు.

తాత్పర్యం: అజాతశత్రుడు; సావధానమనస్కుడై శ్రద్ధ, వినయం, సంతోషం అనేగుణాలు ముప్పిరిగొనగా పెక్కుమణులు, బంగారం బ్రాహ్మణ సమూహానికి వేడుకతో ఇచ్చాడు.

వ. తదనంతరంబ. 471

తాత్పర్యం: అటు పిమ్మట.

క. తలదిక్కు గవలుఁ బాదం । బుల దెస ధృతరాష్ట్ర పాండు భూపాగ్రతనూ
జులుఁ బట్టి యధిక విభవో । జ్జ్వల మగు పాడె పయి నిడిరి శవరత్నంబున్. 472

ప్రతిపదార్థం: తలదిక్కు = తలవైపు; కవలు = నకుల సహదేవులు; పాదంబులదెసన్ = కాళ్ళవైపు; ధృతరాష్ట్రపాండు భూప+అగ్రతనూజులున్ = ధృతరాష్ట్రుడు, పాండురాజు యొక్క పెద్దకొడుకు-ధర్మజుడు; పట్టి = పట్టుకొని; అధిక విభవ+ఉజ్జ్వలము+అగు = మిక్కిలి వైభవంతో ప్రకాశిస్తున్న; పాడెపయిన్ = శవవాహనం మీద; శవరత్నంబున్ = శ్రేష్ఠమైన భీష్ముడి శవాన్ని; ఇడిరి = ఉంచారు.

తాత్పర్యం: భీష్ముడి శవాన్ని తల తట్టు నకుల సహదేవులు, కాళ్ళతట్టు ధృతరాష్ట్ర ధర్మజులు పట్టుకొని మిక్కిలి వైభవంతో ఒప్పారుచున్న శవవాహనం మీద ఉంచారు.

వ. అమ్మెయి నన్నలువురును వహించిరి; భీమసేనార్జునులు ధవళచామరంబు లిడిరి; యుయుత్సుం డుత్తమచ్ఛత్రంబు వట్టె; వృద్ధలగు కౌరవ స్త్రీ లాలవట్టంబులు వట్టిరి; ధౌమ్యుండు క్రియా కలాపంబు నడపె; నట్లు సొదసేర్చి దేవవ్రతుని దేహంబు శ్రౌతాగ్ని కాహుతి చేసి బహుకుండంబు లెత్తి ఘృతంబు ప్రయోగించి ప్రజ్వలింపఁ జేసి; రివ్విధంబునం బితృమేధంబు విభవమహితంబును, విధివిహితంబు నుంగా ననుష్ఠించి య క్కొరవు లపసవ్యంబుగాఁ దిరిగి కృష్ణద్వైపాయన నారద దేవల ప్రభృతు లనుగమింప భాగీరథికిం జని సర్వభరతభార్యా సమేతంబుగా న గ్గాంగేయునకుఁ దిలోదక ప్రదానంబు లాచరించి; రట్టి సమయంబున. 473

ప్రతిపదార్థం: ఆ+మెయిన్ = ఆ విధంగా; ఆ+నలువురును = నకులసహదేవులు; ధృతరాష్ట్రుడు, ధర్మరాజు; వహించిరి = పాడెను బుజాల కెత్తుకున్నారు; భీమసేన+అర్జునులు = భీముడు, అర్జునుడు; ధవళచామరంబులు+ఇడిరి = తెల్లని చామరాలతో విసిరారు; యుయుత్సుఁడు; ఉత్తమ+ఛత్రంబు+పట్టెన్ = గొప్పగొడుగును ధరించాడు; వృద్ధలు+అగు = ముదుసళ్ళయిన; కౌరవస్త్రీలు = కురువంశమునకు చెందిన ఆడువారు; ఆలవట్టంబులు+పట్టిరి = గుడ్డతో తయారు చేసిన గుండ్రని విసనకర్రలతో విసిరారు; ధౌమ్యుండు = ధౌమ్యులవారు; క్రియాకలాపంబునడపెన్ = మంత్రతంత్రయుక్తమైన కర్మకాండ జరిపాడు; అట్లు = ఆ విధంగా; దేవవ్రతుని దేహంబున్ = భీష్ముడి యొక్క శరీరాన్ని; సొద+చేర్చి = చితిపై పరుండబెట్టి; శ్రౌత+అగ్నికిన్ = వేదవిహితమైన అనలానికి; ఆహుతి చేసి = హోమద్రవ్యంగా సమర్పించి; మంత్రపూర్వకంగా వేల్చి; బహుకుండంబులు+ఎత్తి = పెక్కు కుంభము లెత్తి, పలుకడవలు ఎత్తి; ఘృతంబు = నెయ్యి; ప్రయోగించి = చితాగ్నిలో క్రుమ్మరించి; ప్రజ్వలింపన్+చేసిరి = గనగన మండేటట్లు కావించారు; ఈ+విధంబునన్ = ఈ రీతిగా; పితృమేధంబు = ప్రేతకార్యం; విభవమహితంబునున్ = వైభవంతో ఒప్పినదిగానూ; విధివిహితంబునున్+కాన్ = శాస్త్ర సమ్మతమైనదిగానూ;

అనుష్ఠించి = ఆచరించి; ఆ+కౌరవులు = ఆ కురువంశ్యులు; అపసవ్యంబుగాన్ = అప్రదక్షిణంగా; తిరిగి = మరలి; కృష్ణద్వైపాయన, నారద, దేవల, ప్రభృతులు = వ్యాసుడు, నారదుడు, దేవలుడు మొదలైనవారు; అనుగమింపన్ = తమ వెంటరాగా; భాగీరథికిన్ = గంగానదికి; చని = వెళ్ళి; సర్వభరత భార్యా సమేతంబుగాన్ = భరతవంశస్థులైన సమస్త కౌరవుల భార్యలతో కూడ; ఆ+గాంగేయునకున్ = గంగాపుత్రుడైన భీష్ముడికి; తిల+ఉదకప్రదానంబులు = నువ్వులు నీళ్ళు వదలటం; ఆచరించిరి = చేశారు; అట్టి సమయంబునన్ = ఆ వేళలో.

తాత్పర్యం: ఆ విధంగా తలవైపు నకులసహదేవులు, కాళ్ళవైపు ధర్మజ ధృతరాష్ట్రులు పాడెను తమ బుజాలపై నిడుకొని మోశారు. భీమార్జునులు వింజామరలతో విసిరారు. యుయుత్సుడు గొప్పగొడుగును పట్టాడు. కౌరవ స్త్రీలలో ముసలివాళ్ళు ఆలవట్టములు ధరించారు. ధౌమ్యుడు కర్మకాండ జరిపాడు. భీష్ముడి శరీరాన్ని చితిపై నుంచి వేదవిహితమైన అగ్నికి ఆహుతి చేశారు. లెక్కలేనన్ని నేతికుండలు చితాగ్ని గనగనమండగా క్రుమ్మరించారు. ఈ రీతిగా శవదహనకార్యం శాస్త్రసమ్మతంగా వైభవోపేతంగా ఆచరించి ఆ కౌరవు లందరూ అప్రదక్షిణంగా మరలి స్నానాలకై గంగకు వెళ్ళారు. వారి వెంట వ్యాసుడు, నారదుడు, దేవలుడు మున్నగు మునిపుంగవులు బయలుదేరారు. కౌరవు లందరూ పత్నీసహితంగా గంగలో మునిగి భీష్ములవారికి నువ్వులు నీళ్ళు వదిలారు. ఆ సమయంలో.

పుత్రశోకాతుర యైన గంగాదేవి కృష్ణాదులం గనుంగొని దుఃఖించుట. (సం.13-154-18.)

సీ. ఉదకంబులందుండి యుత్థితయై శోక । విహ్వలత్వంబున వికల గమన
యగుచు నెమ్మోముపై నశ్రులు గ్రమ్మగాఁ । జనుదెంచి కౌరవసమితి యెదుర
నిలిచి భాగీరథి 'యలఘుండు తన కొడు । కిలఁ బరికింపఁగా నెట్టిభంగి
వాఁడయ్యెఁ? జరితంబుపోఁడిమి మీరెల్ల । నెఱుఁగుదు; రైనను నేను గొంత

తే. సెప్ప వినుఁడు! దృఢ వ్రతశీలుఁ, డమల । బుద్ధి రాజవృత్తాఢ్యుఁడు, భూరికృపుఁడు,
కార్యసంవేది, పితృభక్తి ధుర్యుఁ, డార్య । సమ్మతుండు, విద్యా పరిశ్రమ ఘనుండు. 474

ప్రతిపదార్థం: భాగీరథి = గంగాదేవి; ఉదకంబులందున్+ఉండి = నీళ్ళలో నుండి; ఉత్థిత+ఐ = లేచినదై; శోకవిహ్వలత్వంబునన్ = దుఃఖం చేత అవయవాలు స్వాధీనం తప్పగా; వికలగమన+అగుచున్ = తడబడే నడక గలది అవుతూ; నెమ్మోముపైన్ (నెఱ+మోము) = అందమైన మొగం మీద; అశ్రులు క్రమ్మన్+కాన్ = కన్నీటి బిందువులు ఆవరించగా; చనుదెంచి = వచ్చి; కౌరవసమితి+ఎదురన్+నిలిచి = కౌరవుల సమూహం యొక్క ముందు నిలబడి; తన కొడుకు = తన పుత్రుడైన భీష్ముడు; అలఘుండు = గొప్పవాడు; ఇలన్ = ధరణియందు; పరికింపన్+కాన్ = పరిశీలించగా, తలపోయగా, ఆలోచించగా; ఎట్టిభంగి వాఁడు+అయ్యెన్ = ఎంతగొప్పతీరు తెన్నులు కలవాడయ్యాడు; చరితంబు పోఁడిమిన్ = అతడి ప్రవర్తన యొక్క గొప్పతనం; మీరు+ఎల్లన్ = మీరందరూ; ఎఱుంగుదురు = తెలిసిఉన్నారు; ఐనను = కాని; నేను; కొంత = కొంచెం; చెప్పన్ = తెలుపగా; వినుఁడు = ఆలకించండి; దృఢవ్రతశీలుఁడు = గట్టి పట్టుదల కలవాడు; అమలబుద్ధి = నిర్మలమైన బుద్ధికలవాడు; రాజవృత్త+ఆఢ్యుఁడు = క్షత్రియ ధర్మవర్తనమందు విఖ్యాతుడు; భూరికృపుఁడు = గొప్పదయకలవాడు; కార్యసంవేది = చేయదగిన పని లెరింగిన వాడు; పితృభక్తి ధుర్యుఁడు = పితృభక్తియందు అగ్రేసరుడు; (పితృభక్తి = జనకునియందు గాఢమైన ప్రేమ); ఆర్యసమ్మతుండు = పెద్దలకు ఇష్టుడు, ప్రియమైనవాడు; విద్యా పరిశ్రమ ఘనుఁడు = చదువులందలి

పరిశ్రమచేత దొడ్డవాడు; కష్టపడి విద్యలు నేర్చిన దొడ్డ మనిషి.

తాత్పర్యం: గంగాదేవి జలముల నుండి పైకిలేచి దుఃఖంతో విలవిల్లాడుతూ, తడబడేనడకతో ముఖం నిండా కన్నీళ్ళు నిండగా వచ్చి కౌరవులముందు నిలిచింది. నా తనయుడైన భీష్ముడు గొప్పవాడు. 'ధరణిలో తనంతటివాడు మరొకడు లేడనిపించుకొన్నాడు. ఆతడి నడవడి ఎంత గొప్పదో మీకందరికీ తెలుసు. అయినా, నేను కొంచెం చెప్పుతాను. వినండి; నా కుమారుడు గట్టి పట్టుదల గలవాడు. నిర్మలమైన బుద్ధిగలవాడు. క్షత్రియధర్మశీలి. పరమదయాస్వభావుడు. చేయదగిన పను లెరిగినవాడు. పితృభక్తి యందు అగ్రేసరుడు. పెద్దలందరికీ ప్రియమైనవాడు. అధికంగా విద్యాపరిశ్రమ సల్పినవాడు.

తే. **కాశిరాజ కన్యకలకుఁగాఁ బెనంగి । వానిచే గాసియైరి భూవరులు పలువు**
రంబకై పూని వానిమహాబలంబు । జామదగ్న్యుండుఁ దెరలుపఁ జాల కరిగె.' **475**

ప్రతిపదార్థం: కాశిరాజ కన్యకలకున్+కాన్ = కాశీరాజు కొమార్తెలకై; పెనంగి = పోరాడి; వానిచేన్ = నా కుమారుడు భీష్ముడిచేత; పలువురు భూవరులు = పెక్కుమంది రాజులు; గాసి+ఐరి = కష్టాలపాలయ్యారు; అంబకై = కాశీరాజు కూతురు అంబకొరకు; పూని = యత్నించి; వానిమహాబలంబు = అతడి యొక్క గొప్పశక్తిని; జామదగ్న్యుండు = జమదగ్ని కొడుకైన పరశురాముడు; తెరలుపన్+చాలక = కదిలించలేక; అరిగెన్ = ఓడి వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: నా కుమారుడు తన తమ్ములకొరకై కాశీరాజ పుత్రికలను అంబ, అంబిక, అంబాలికలను తీసికొని వచ్చేటప్పుడు రాజులు అతడితో పోరాడి వెతలపాలయ్యారు. అంబ యొక్క పక్షం వహించి ఎదుర్కొన్న పరశురాముడు నా కుమారుడి బలాన్ని కదిలించలేక భంగపడి తొలగిపొయ్యాడు.'

వ. **అని విలాపంబు చేసి వెండియు.** **476**

తాత్పర్యం: అని రోదించి మరల (ఇట్లా అన్నది అని తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'అంతవాఁడు శిఖండిచే నట్టు లగుట । గనియుఁ బెక్కులు పఱియలు గాక యునికి**
కతనఁ జేసి వజ్రమయంబు గాఁగ నోపు । నని తలంచెద నాడెంద మన్నలార!' **477**

ప్రతిపదార్థం: అన్నలార! = భ్రాతలారా!; అంతవాఁడు = అంతటిశక్తి సంపన్నుడు; శిఖండిచేన్ = శిఖండి అనే ఒక సామాన్యుడి చేత; అట్టులు+అగుట = యుద్ధంలో కూలి శరతల్పగతుడుకావటం; కనియున్ = చూచి కూడ; నా డెందము = నా గుండె; పెక్కులు+పఱియలు కాక = బ్రద్దలు బ్రద్దలుగా పగిలిపోక; ఉనికి కతనన్+చేసి = ఎప్పటి వలె ఉన్నట్టి హేతువును బట్టి; వజ్రమయంబు+కాఁగన్+ఓపున్ = వజ్రంతో తయారు చేసిన దేమో అని; తలంచెదన్ = భావిస్తాను.

తాత్పర్యం: 'అన్నలారా! అంతటి శక్తి సంపన్నుడు సామాన్యుడైన శిఖండిచే కదనమున కూలి శరతల్ప గతుడవటం కంటితో చూచి కూడ నా గుండె బ్రద్దలు కాకుండా ఎప్పటివలె ఉన్నదంటే అందుకు కారణం అది వజ్రంతో నిర్మించబడినదేమో అని భావిస్తాను.'

వ. అని వగచిన గంగాదేవికి దేవకీనందనుం డిట్లనియె. **478**

ప్రతిపదార్థం: అని; వగచిన = శోకించిన; గంగాదేవికిన్; దేవకీనందనుండు = శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుఃఖిస్తున్న గంగాదేవితో శ్రీకృష్ణు డిట్లా అన్నాడు.

పుత్త్రమరణ దుఃఖితయగు గంగను కృష్ణద్వైపాయను లూఱడించుట. (సం.13-154-26).

తే. 'నీవు శోకంబు దక్కుము; నీ సుతుండు । పరమగతి నొందె; శాప సంప్రాప్తిఁ జేసి
వసువు మర్త్యుఁడై వర్తించె; నసదృశప్ర । భావుఁ డాతఁడు; వగపేల దేవి! నీకు? **479**

ప్రతిపదార్థం: దేవి! = అమ్మా!; నీవు; శోకంబు+తక్కుము = దుఃఖం విడువుము; నీ సుతుండు = నీ కుమారుడు; పరమగతిన్+ఒందెన్ = ఉత్తమ లోకం చేరాడు; శాపసంప్రాప్తిన్+చేసి = శాపం పొందినందువలన; వసువు = అష్ట వసువులలో ఒకడు; మర్త్యుఁడు+ఐ = మానవుడై; వర్తించెన్ = ఈ లోకంలో చరించాడు, మెలగాడు; ఆతఁడు = భీష్ముడు; అసదృశ ప్రభావుఁడు = సాటిలేని మహిమ కలవాడు; నీకున్ = నీకు; వగపు+ఏల? = దుఃఖ మెందుకు?

తాత్పర్యం: 'తల్లీ! గంగాభవానీ! నీవు చింతించవద్దు. నీ కుమారుడు వసువులలో చేరిపోయాడు. శాపం పొందిన కారణాన వసువు భీష్ముడనే పేర నరుడై నీ కడుపున జన్మించాడు. ఈ లోకంలో ఇంతకాలం వర్తించాడు. ఇతడు సాటిలేని మహిమ గలవాడు. ఇతడిని గూర్చి శోకించవద్దు.

చ. అతని శిఖండి యేల? యమరాధిపుఁడున్ సమయింపఁ జాలునే
యతఁడు నిజేచ్ఛఁ జేసి నరు నంచిత దివ్య శరంబు లంగసం
గతములు చేసి పాన్పుగ సుఖస్థితి మృత్యువు మాన్చియుండి కీ
ర్త్యతిశయ మొంది తా వలచినప్పుడు వోయె విషాద మేటికిన్?' **480**

ప్రతిపదార్థం: అతనిన్ = భీష్ముడిని; శిఖండి+ఏల? = శిఖండి మాత్రమే కాదు; అమర+అధిపుఁడున్ = దేవేంద్రుడయినా; సమయింపన్+చాలును+ఏ? = సంహరించగలడా? చంపలేడని భావం; అతఁడు = నీ పుత్రుడైన భీష్ముడు; నిజ+ఇచ్ఛన్+చేసి = తన కోరిక ప్రకారం; నరు+అంచిత+దివ్యశరంబులు = అర్జునుడి యొక్క ఒప్పిదమైన దివ్యబాణాలు; అంగసంగతములు+చేసి = తన శరీరమును పొందేటట్లు కావించి; పాన్పుగన్ = ఆ దివ్య శరములే శయ్యగా; సుఖస్థితిన్ = సుఖమునం దునికితో, హాయిగా; మృత్యువున్+మాన్చి = మరణం తొలగించుకొని; ఉండి = ప్రాణాలతో ఉన్నవాడై, జీవించి; కీర్తి+అతిశయము+ఒంది = పేరు పెంపులు వడసి, అధికమైన యశస్సు పొంది; తాన్ = తాను; వలచిన+అప్పుడు = కోరుకొన్నప్పుడే; పోయెన్ = దేహం విడిచాడు; విషాదము+ఏటికిన్? = చింత ఎందుకు?

తాత్పర్యం: 'అమ్మా! గంగాదేవీ! ఒక్క శిఖండి మాత్రమే అనట మెందుకు? ఆ దేవేంద్రు డయినా నీ కుమారుడిని సంహరించగలడా? భీష్ముడు తన ఇష్టప్రకారం అర్జునుడి దివ్యశరాలను తనువు నందు నాటించుకొని, ఆ ఫల్గునుడి దివ్యబాణాలే తనకు పాన్పుగా సుఖంగా పవళించినవాడై మృత్యువును దూరంగా ఉంచి, ధర్మజుడికి సమస్త ధర్మము

లుపదేశించి, పేరు పెంపులు గడించి తాను కోరుకొన్నప్పుడే శరీరాన్ని వదలివేశాడు. తల్లీ! అట్టి ధర్మాత్ముడి కొరకు నీవు శోకించవద్దు.'

వ. అని యూఱడిలం బలికెఁ; గృష్ణద్వైపాయన మునివరుండును బరమాదరణీయతత్పర వచనంబుల నజ్జాహ్నవీదేవికి నానందం బాపాదించెఁ; దదనంతరంబ యాత్మీయ సలిల సాంగత్యంబు నొందు నమ్మందాకినిచేతం గృష్ణాదులు నందఱు జనపతులును ననుజ్ఞాతులు నాశీర్వాద ప్రీతులునై మునులునుం దోడ నడవ నది వెడలి, రని యిట్లు భీష్ముని వృత్తాంతంబు వైశంపాయనుండు జనమేజయునకుఁ జెప్పిన నప్పుడమిఱేఁ 'డిత్తెఱంగున న త్తాతకు వలయు విధానం బాచరించి చరితార్థుండైన యప్పార్థివ ముఖ్యుండు మఱి యెట్టి చందంబునం బ్రవర్తించె? మునీంద్రా! యెఱింగింపవే' యని యడుగుటయు. 481

ప్రతిపదార్థం: అని = అంటూ శ్రీకృష్ణుడు; ఊఱడిలన్ = గంగాదేవి ఉపశాంతి పొందేటట్లు, స్వస్థచిత్త అయ్యేటట్లు; పలికెన్ = వచించాడు; కృష్ణద్వైపాయనమునివరుండును = కృష్ణద్వైపాయనుడు అనే పేరుగల మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసుడును; పరమ+ఆదరణీయతత్పరవచనంబులన్ = మిక్కిలి గౌరవించదగిన భీష్ముడికి సంబంధించిన మాటలచే; ఆ+జాహ్నవీ దేవికిన్ = ఆ గంగాదేవికి; ఆనందంబు = హర్షం; ఆపాదించెన్ = సమకూర్చాడు, కలిగించాడు; తత్+అనంతరంబు+అ = అటు పిమ్మట; ఆత్మీయసలిల సాంగత్యంబున్+ఒందు = తన నీటితో కలయికను పొందునట్టి, తన నీళ్ళలో కలసిపోవుచున్న, లీనమౌతున్న; ఆ+మందాకినిచేతన్ = ఆ భాగీరథిచేత; కృష్ణ+ఆదులు = శ్రీకృష్ణుడు మున్నగువారు; అందఱు జనపతులును = రాజు లెల్లరును; అనుజ్ఞాతులు = వెళ్ళుటకు అనుమతించబడినవారును; ఆశీర్వాద ప్రీతులును+ఐ = ఆమె దీవనల చేత సంతోషించినవారును అయి; మునులునున్ = ఋషులూ; తోడన్ నడవన్ = తమ వెంబడిరాగా; నదిన్+వెడలిరి = నదినుండి బయలుదేరారు; అని; ఇట్లు = ఈ రీతిగా; భీష్ముని; వృత్తాంతంబు = విషయమును; వైశంపాయనుండు = వ్యాసమహర్షి శిష్యుడైన పౌరాణికుడు; జనమేజయునకున్ = పరీక్షిన్మహారాజుపుత్రుడు జనమేజయ మహారాజునకు; చెప్పినన్ = చెప్పగా; ఆ+పుడమిఱేఁడు = ఆ భూపాలుడు-జనమేజయుడు; ఈ+తెఱంగునన్ = ఈ విధంగా; ఆ+తాతకున్ = పితామహుడైన భీష్ముడికి; వలయు విధానంబు+ఆచరించి = చేయదగినపనులన్నీ చేసి; చరితార్థుండు+ఐన = కృతకృత్యుడైన, ధన్యుడైన; ఆ+పార్థివముఖ్యుండు = ఆ రాజోత్తముడు-యుధిష్ఠిరుడు; మఱి+ఎట్టిచందంబునన్ = ఇంకే తీరున; ప్రవర్తించెన్? = మెలగినాడు?; ముని+ఇంద్రా! = ఓ వైశంపాయన మహర్షీ; ఎఱింగింపవు+ఏ = తెల్పుమా; అని; అడుగుటయున్ =అడుగగా.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు వచించి గంగాదేవిని ఊరడించాడు. వ్యాసమహర్షి దుఃఖోపశమన వాక్యాలు పలికి ఆమెకు ఆనందం కలిగించాడు. తరువాత తన జలాలలో విలీనురాలవుతున్న భాగీరథి చేత శ్రీకృష్ణుడు, తక్కిన రాజులు పోయి వచ్చుటకు ఆమె అనుమతి పడసినవారూ, ఆమె దీవనలచే సంతోషపడినవారూ అయి మునులు తమ వెంట నడువగా నది నుంచి నిర్గమించారు' అని భీష్ముడి వృత్తాంతం జనమేజయుడికి వైశంపాయన మహర్షి చెప్పాడు. అప్పుడు జనమేజయుడు వైశంపాయనుడిని చూచి 'మునీశ్వరా! తన పితామహుడైన గాంగేయుడికి జరుపవలసిన ఉత్తర క్రియలు జరిపి కృతకృత్యుడైన ధర్మరాజు తరువాత ఎట్లా ప్రవర్తించాడో తెలుప వేడుతున్నాను' అని ఆయనను అర్థించాడు.

అశ్వాసాంతము

చ. సకరుణ దివ్యచిత్త! పరిశాంత మహత్త్వ విధానవిత్త! ని
ర్వికృత విలాస హృద్య! శ్రుతి విస్తర విస్ఫురణైక వేద్య! పా
వక బహుభవ్యనామ! పరివర్ధన సంక్షయ దూరధామ! వి
శ్వకలిత తోషణా! సుభగ సాత్యవతేయవచో విభూషణా! 482

ప్రతిపదార్థం: సకరుణ = కృపతో కూడిన; దివ్య చిత్త! = అప్రాకృతమైన మనస్సుకలవాడా!; పరిశాంత మహత్త్వ విధానవిత్త! = లోకాలకు ప్రళయాధిక్యం కలిగించే విధానం చేత ప్రసిద్ధుడా!; నిర్వికృత విలాసహృద్య! = వికారరహితములైన లీలలచే మనోహరమైన వాడా!; (షడ్విధపరిణామములు-అస్తి, జాయతే, వర్ధతే, పరిణమతి, అపక్షీయతే, నశ్యతి- ఉండుట, పుట్టుట, పెరుగుట, మారుట, క్షీణించుట, నశించుట అనే మార్పులు లేని విలాసములచే మనోహరమైనవాడా); శ్రుతివిస్తర విస్ఫురణ+ఏక+వేద్య!= వేద బాహుళ్యం యొక్క విజ్ఞానంచేతనే తెలియదగిన వాడా!; పావకబహుభవ్యనామ! = పవిత్రములు గావించునట్టి అనేకములైన మంగళనామములు కలవాడా!; పరివర్ధన సంక్షయ దూరధామ! = వృద్ధిక్షయాలకు దవ్వైన నిలయాలు కలవాడా!; విశ్వకలితతోషణా!= లోకంలో తెలియబడే సంతోషం కలవాడా!; సుభగసాత్యవతేయ వచో విభూషణా! = మధురములైన, (రమణీయములైన) వ్యాసమహర్షి యొక్క వాక్కులకు ఆభరణమైనవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీ హృదయం కృపా భరితం. నీవు జగత్తులకు ప్రళయం కల్పించే ప్రభావంతో ప్రసిద్ధుడివి. షడ్భావ వికారశూన్యుడ వగుటవలన నీ విలాసాలు మనస్సులకు ఇంపు కలిగిస్తాయి. వేద బాహుళ్యము యొక్కవిజ్ఞానంతోనే తెలియదగిన వాడవు నీవు. పావనములైన అనేక నామములు కలవాడివి నీవు. వృద్ధిక్షయాలకు దవ్వైన నిలయాలు కలవాడవు నీవు. అనగా నీ నిలయములైన శ్రీవైకుంఠకైలాసములు వృద్ధిక్షయాలకు దూరములు అని భావం. ప్రపంచమందున్న ఆనందమంతా నీదే. వేదవ్యాస మహర్షి రమణీయ వచనాలకు అలంకారమైన వాడవు నీవే స్వామీ!

క. సత్సేవ్యచరణ! శమవ । ద్వాత్సల్యాభరణ! ధర్మతత్త్వోద్ధరణా!
హృత్సంగతభక్తిక దురి । తోత్సారణధుర్య దృఙ్మయూఖ విసరణా! 483

ప్రతిపదార్థం: సత్+సేవ్య+చరణ! = సజ్జనులచే సేవించబడిన పాదములు కలవాడా!; శమవత్ = శాంతితో కూడిన; వాత్సల్య+ఆభరణ = వాత్సల్యమనే గుణమే భూషణంగా కలవాడా!; ధర్మతత్త్వ+ఉద్ధరణా! = ధర్మతత్త్వమును ఉద్ధరించేవాడా! (కాపాడేవాడా!); హృత్+సంగత+భక్తిక = హృదయమందు పాదుకొన్న భక్తి గలవారల యొక్క; దురిత = పాపాలను; ఉత్సారణ = తొలగత్రోయటం అనే; ధుర్య = భారం వహించే; దృక్+మయూఖ+విసరణా! = చూపులనెడి కిరణముల యొక్క ప్రసారం కలవాడా!

తాత్పర్యం: స్వామీ హరిహరనాథా! సత్పురుషులు నీ పాదపద్మాలను భజిస్తారు. నీవు శాంతియుతమైన వాత్సల్యగుణంచేత (దోషమును భోగ్యముగా స్వీకరించే గుణం) విలసిల్లుతుంటావు. నీ అవతార ప్రయోజనం ధర్మాన్ని ఉద్ధరించటమే. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్, ధర్మసంస్థాప నార్థాయ సంభవామి

యుగే యుగే" అని గీతలో చెప్పినట్లు ధర్మాన్ని కాపాడటమే. భక్తి భరిత హృదయులైన వారి పాపాలను నీ చూపులనెడి కిరణముల యొక్క ప్రసారంతో రూపుమాపుతావు.

మాలిని : **స్మయ విరహిత పూజ్యా! మంత్రగీతాధిరాజ్యా!**
నయన హిమగు సూర్యా! నైష్ఠిక క్షేమధుర్యా!
దయిత భువనరక్షా! దాంతి సంపద్యతాక్షా!
నియమ నికటవర్తీ! నిష్కళానంద మూర్తీ! **484**

ప్రతిపదార్థం: స్మయవిరహితపూజ్యా! = అహంకార రహితులచే పూజింపదగినవాడా! (స్మయము = మదం, అహంకారం, అవలేపం, దర్పం); మంత్రగీత+అధిరాజ్యా! = వేదమంత్రాలచేత గానం చేయబడిన గొప్ప రాజ్యం కలవాడా! అనగా సకలవేదాలు హరిహరనాథుడి రాజ్యాధిపత్యమునే కీర్తిస్తాయని భావం; నయనహిమగు+సూర్యా = నేత్రములుగాఉన్న చంద్రుడు సూర్యుడు కలవాడా! అనగా సూర్యచంద్రులు కుడికన్ను ఎడమకన్నులుగా కలవాడా! (హిమగు = హిమగువు = చంద్రుడు); నైష్ఠిక క్షేమధుర్యా! = వేద ధర్మాన్ని ఆచరించటంలో శ్రద్ధగలవారి యొక్క క్షేమభారమును వహించేవాడా! "అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్" అని గీతలో చెప్పే ఉన్నాడు; దయితభువనరక్షా! = ప్రియమైన లోకరక్షణం కలవాడా! అనగా లోకాలను కాపాడుట యందు ప్రీతికలవాడా!; దాంతిసంపత్+యత+అక్షా! దాంతిసంపత్ = క్లేశములను, కష్టాలను సహించడం అనే సంపదచేత; యత+అక్షా! = నియమించబడిన, లోబరచుకొనబడిన ఇంద్రియాలు (కర్మేంద్రియాలు) గలవాడా!; నియమనికటవర్తీ! = నియమాలకు సమీపమందు మెలగువాడా! అనగా యోగవిద్యాభ్యాసమునకు చేరువలో ఉండే వాడా!, నియమవ్రతశీలురకు సమీపమందే ప్రవర్తించేవాడా!; నిష్కళానందమూర్తీ = పూర్ణానందస్వరూపుడా! (నిస్+కళ = అంశ లేనట్టి)

తాత్పర్యం: దేవా! హరిహరనాథా! అహంకార రహితులు నిన్ను పూజిస్తారు. నీ సామ్రాజ్యాధిపత్య ప్రభావాన్ని వేదాలు కొనియాడుతున్నాయి. చంద్ర సూర్యులు నీ యెడమ కుడి కన్నులు. వైదికాచారపరుల యొక్క యోగక్షేమాల భారం నీవే వహిస్తున్నావు. జగద్రక్షణమందు ఆసక్తి గలవాడవు నీవు. శాంతి దాంతులు కలవాడవు నీవు. నియమ వ్రత శీలుర యొక్క చెంతనే నీవు మెలగుతుంటావు. ప్రభూ! నీవు అఖండానంద స్వరూపుడవు.

విశేషం: మాలిని అనే పేరుగల ఈ వృత్తానికి నాలుగుపాదాలు. ప్రతిపాదంలో వరుసగా "న,న,మ,య,య" అనే గణాలు ఉంటాయి. ప్రతి చరణం యొక్క ఆద్యక్షరంతో ఆచరణంలోని తొమ్మిదో అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ఈ వృత్తానికి ప్రాసనియమం ఉన్నది.

గద్యము : ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందు సర్వంబును బంచమాశ్వాసము.

శ్రీమదాంధ్ర మహాభారతమునందలి యానుశాసనిక పర్వము సమాప్తము.

ప్రతిపదార్థం: ఇది = ఇయ్యది; శ్రీమత్+ఉభయకవిమిత్త్ర = సంపద్యుక్తుడైన ఉభయకవిమిత్త్రుడును (సంస్కృతాంధ్రకవులకు చెలికాడనే బిరుదం వహించినవాడు); కొమ్మన+అమాత్య+పుత్త్ర = కొమ్మన అనే పేరుగల మంత్రి యొక్క కుమారుడు; బుధ+ఆరాధన+విరాజి = పండితులయొక్క పూజలచేత ప్రకాశించేవాడు, పండితులను పూజించటం చేత ప్రకాశించేవాడు

అయిన; తిక్కన సోమయాజి ప్రణీతంబు+అయిన = తిక్కన సోమయాజిచేత రచించబడిన, శ్రీమహాభారతంబునన్ = శుభకరమైన మహాభారతంలోని; ఆనుశాసనిక పర్వంబు+అందున్ = ఆనుశాసనికపర్వంలోని; సర్వంబును = సమస్తమూ; పంచమ+ఆశ్వాసము = ఐదవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది ఉభయకవిమిత్ర బిరుద భాసురుడూ, కొమ్మనమంత్రి కుమారుడూ పండితులయొక్క పూజలచేత ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన ఆనుశాసనిక పర్వంలోని సమస్తమూ పంచమాశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని పంచమాశ్వాసం సమాప్తం.

ఆంధ్రమహాభారతంలోని ఆనుశాసనికపర్వం ముగిసింది.

- - -